శ్రీవేదవ్యాస విరచితం

మార్కండేయ మహాపురాణం

(తెలుగు అనువాదంతో)

అనువాదకులు

మహామహోపాధ్యాయ

ఆచార్య శ్రీపాద సుబ్రహ్మణ్యం

విద్యాప్రవీణ, ఎం.ఎ.(సంస్కృతం), ఎం.ఎ.(తెలుగు), పిహెచ్.డి.

సంపాదకులు


డా॥ ఆకెళ్ళ విభీషణ శర్మ

ఎం.ఎ.(సంస్కృతం), ఎం.ఎ.(తెలుగు), పిహెచ్.డి.

ప్రత్యేకాధికారి

పురాణ ఇతిహాస ప్రాజెక్టు

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి



ప్రచురణ

తిరుమల తిరుపతి దేవస్థానములు

తిరుపతి

2023

MARKANDEYA MAHAPURANAM
(with Telugu Translation)

Translated by
Mahamahopadhyaya
Prof. Sripada Subrahmanyam
Vidya Praveena, M.A. (Sanskrit) and M.A. (Telugu), Ph.D.

Editor
Dr. Akella Vibhishana Sharma
M.A. (Sanskrit) and M.A. (Telugu), Ph.D.

T.T.D. Religious Publications Series No.1433


First Print : 2023

Copies: 500


Published by:
Sri A.V. Dharma Reddy, I.D.E.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati.

Cover Design
Type Setting
Office of the Special Officer, Purana Itihasa Project,
TTD,Tirupati.

Printed at
Tirumala Tirupati Devasthanams Press
Tirupati - 517 507.



శ్రీపద్మావతిఅమ్మవారు శ్రీవేంకటేశ్వరస్వామివారు



వ్యాసాయ విష్ణురూపాయ వ్యాసరూపాయ విష్ణవే ।
నమో వై బ్రహ్మనిధయే వాసిష్ఠాయ నమో నమః ॥

తిరుమల తిరుపతి దేవస్థానములు
పురాణ ఇతిహాస ప్రాజెక్టు
పండితపరిషత్తు
(సలహామండలి)

అధ్యక్షులు

శ్రీ ఎ.వి.ధర్మారెడ్డి గారు ఐ.డి.ఇ.యస్.

కార్యనిర్వహణాధికారి, తి.తి.దేవస్థానములు

సభ్యులు

శ్రీమతి యస్. భార్గవి గారు ఐ.ఏ.యస్.
సంయుక్త కార్యనిర్వహణాధికారిణి
తి.తి.దే.,తిరుపతి

డా॥ కందాడై రామానుజాచార్యులుగారు
విశ్రాంత ప్రాచ్య కళాశాలాధ్యక్షులు
శ్రీవేంకటేశ్వర వేదాంతవర్ధినీ సంస్కృత కళాశాల,
హైదరాబాద్

డా॥ శ్రీపాద సత్యనారాయణమూర్తిగారు
విశ్రాంత ఉపకులపతి
రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠం, తిరుపతి

డా॥ శ్రీపాద సుబ్రహ్మణ్యంగారు
విశ్రాంత సంచాలకులు,
ప్రభుత్వ ఓరియంటల్ మాన్యుస్క్రిప్టు లైబ్రరీ – హైదరాబాద్

డా॥ ధూళిపాళ మహదేవమణిగారు
విశ్రాంత కళాశాలాధ్యక్షులు
ఆంధ్ర యువతీ సంస్కృత కళాశాల, రాజమండ్రి

డా॥ సముద్రాల లక్ష్మణయ్యగారు
పూర్వ ప్రత్యేకాధికారి
పురాణ ఇతిహాస ప్రాజెక్టు, తి.తి.దేవస్థానములు

డా॥ కొంపెల్ల రామసూర్యనారాయణగారు
విశ్రాంత ఆచార్యులు
రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠం – తిరుపతి

డా॥ ఈ.ఏ.శింగరాచార్యులుగారు
విశ్రాంత కళాశాలాధ్యాపకులు
శ్రీవేంకటేశ్వర ప్రాచ్య కళాశాల – తిరుపతి

డా॥ కె. ప్రతాప్‌గారు
విశ్రాంత ఆచార్యులు, సంస్కృత విభాగం
శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం – తిరుపతి

కన్వీనర్

డా॥ ఆకెళ్ళ విభీషణ శర్మ
ప్రత్యేకాధికారి, పురాణ ఇతిహాస ప్రాజెక్టు
తిరుమల తిరుపతి దేవస్థానములు

తిరుమల తిరుపతి దేవస్థానములు

పురాణ ఇతిహాస ప్రాజెక్టు

పరిష్కరణ పరిషత్తు

డా॥ సముద్రాల లక్ష్మణయ్యగారు
పూర్వ ప్రత్యేకాధికారి, పురాణ ఇతిహాస ప్రాజెక్టు,
తిరుమల తిరుపతి దేవస్థానములు,తిరుపతి.

డా॥ కొంపెల్ల రామసూర్యనారాయణగారు
విశ్రాంత ఆచార్యులు
రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠం, తిరుపతి.

డా॥ సూరం శ్రీనివాసులుగారు
విశ్రాంత ప్రాచ్య కళాశాలాధ్యక్షులు
శ్రీ గోరంట్ల వెంకన్న ఓరియంటల్ కాలేజ్
తిమ్మసముద్రం.

డా॥ ధూళిపాళ ప్రభాకర కృష్ణమూర్తిగారు
విశ్రాంత డిస్ట్రిక్ట్ అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్
నిడదవోలు.

డా॥ కలవకొలను కాశీ విశ్వేశ్వరశర్మగారు
సంస్కృతోపన్యాసకులు,
కె.ఎస్.ఎన్.ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల
అనంతపురం.

డా॥ వేదాల వేంకట సీతారామాచార్యులుగారు
విశ్రాంత కళాశాలాధ్యక్షులు
ఎస్.బి.ఎస్. సంస్కృతకళాశాల, పొన్నూరు.

డా॥ శ్రీపాద సత్యనారాయణమూర్తిగారు
విశ్రాంత ఉపకులపతి
రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠం, తిరుపతి.

డా॥ శ్రీపాద సుబ్రహ్మణ్యంగారు
విశ్రాంత సంచాలకులు,
ప్రభుత్వ ఓరియంటల్ మాన్యుస్క్రిప్ట్ లైబ్రరీ,
హైదరాబాద్.

డా॥ పి.పి.వి.డి నాగత్రిశూలపాణిగారు
విశ్రాంత కళాశాలాధ్యక్షులు
ఎస్.ఎస్.బి.ఎన్ డిగ్రీ&పిజి కళాశాల,
అనంతపురం.

శ్రీ గార్లపాటి ప్రభాకరశర్మగారు
విశ్రాంత ప్రిన్సిపాల్, ధర్మప్రబోధ కళాశాల
హిందూ ధర్మప్రచారపరిషత్, తి.తి.దే

కన్వీనర్
డా॥ ఆకెళ్ళ విభీషణ శర్మ
ప్రత్యేకాధికారి, పురాణ ఇతిహాస ప్రాజెక్టు,
తిరుమల తిరుపతి దేవస్థానములు.

విషయానుక్రమణిక





తొలిపలుకు

"ఓం నమో వేంకటేశాయ"

పురాణపురుషుడయిన వ్యాసమహర్షి రచించిన అష్టాదశ పురాణాలను తెలుగులోకి అనువదింపచేసే కార్యక్రమాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం చేపట్టింది. ప్రతి మనిషి ధర్మబద్ధంగా జీవించడానికీ, ఆధ్యాత్మికచింతనను పెంపొందింపచేసుకోవడానికీ పురాణాలు ఉపకరిస్తాయి. ప్రపంచంలోని మానవాళి వారి దైనందినజీవితాలలో పురాణాలలోని ఆయా విషయాలను అన్వయించుకొని శాంతియుతమైన జీవితాన్ని గడుపుకోవచ్చు. "ఇతిహాసపురాణాభ్యాం వేదం సముపబృంహయేత్" అని మహాభారతంలో చెప్పబడింది. రామాయణమహాభారతాది ఇతిహాస గ్రంథాలవల్లా, పురాణాలవల్లా వేదాలలో నిక్షిప్తమైన అనేక అమూల్యమైన విషయాలను తెలుసుకోవచ్చని అర్థం. అందరూ వేదాలను చదివి అర్థం చేసుకోలేరు. అందువల్లే వ్యాసభగవానుడు మనందరిపైన ఉన్న కరుణాదృష్టితో పురాణాలను రచించి మనకు అందించాడు. గృహస్థాశ్రమధర్మాలు, సదాచారవర్ణనం, తల్లిదండ్రులు గురువుల పట్ల ఉండవలసిన భక్తిభావం, అతిథులను గౌరవించడం, పిల్లల పెంపకం, ప్రకృతిపరిరక్షణ, తోటి ప్రాణులపట్ల చూపవలసిన ఔదార్యం, క్షమాగుణం, స్నేహగుణం మొదలయిన ధార్మికవిషయాలను అలవరచుకోవడానికి చిన్నా, పెద్దా తేడా లేకుండా అందరూ తప్పక పురాణాలను చదవాలి. అందుకే ప్రాచీనులు పురాణాలను వేదములకు వెనుబలంగా పరిగణించారు. వాటిని ప్రాణప్రదంగానూ, పరమప్రమాణంగానూ, అక్షయనిధులుగానూ భావించి, రక్షించి మన పూర్వీకులు భద్రంగా వాటిని మనకి అందించారు. కేవలం లౌకిక ప్రయోజనాలే కాక, పారమార్థికమైన పరమపురుషార్థప్రాప్తికి కూడా పురాణాలు దోహదపడతాయి. అయితే సంస్కృతభాషలో రచింపబడిన పురాణాలను అందరూ చదివి అర్థం చేసుకోలేరు. కాబట్టి వీటిని తెలుగులోకి అనువదింపచేయాలని తిరుమల తిరుపతి దేవస్థానం సంకల్పించింది. అందుకు అనుగుణంగానే ప్రసిద్ధపండితులచేత వీటిని అనువదింపచేయడం జరుగుతున్నది.

అష్టాదశపురాణాలలో మార్కండేయపురాణానికి ఒక ప్రత్యేకస్థానం ఉంది. దీనిని ఆమూలాగ్రం చదివినవారికి దీనిలో లేని విషయమంటూ ఏమీ లేదని తప్పక అనిపిస్తుంది. ఒక్క ధార్మికవిషయాలేకాక అన్ని కాలాలకూ అనుగుణంగా సామాజిక స్థితిగతులు ఈ పురాణంలో కనిపిస్తాయి. ముఖ్యంగా మనిషి మేధాశక్తికి అందని మన్వంతరాలవర్ణన ఈ పురాణంలో కనిపిస్తుంది. అంతేకాక సాక్షాత్తు బ్రహ్మవిష్ణుమహేశ్వరుల సమన్వయ రూపంగా భావించే దత్తాత్రేయుని వర్ణన ఈ పురాణంలో లభించడం మరొక విశేషం. ధర్మోపదేశానికి వయస్సుతో నిమిత్తం లేదని చెప్పడానికి సుమతివృత్తాంతమే నిదర్శనం. మహామతి అనే పేరుగల తన తండ్రికి సుమతి అనే పేరుగల కుమారుడు మోక్షాన్ని పొందే మార్గాన్ని ఉపదేశించేదే "పితాపుత్రసంవాద"మనే ఆ వృత్తాంతం. మార్కండేయుడు ఉపదేశించడంవల్ల ఈ పురాణానికి మార్కండేయపురాణమని ప్రసిద్ధి కలిగింది.

సకాలంలో ఇంతటి మహత్తరమైన పురాణాన్ని అనువదించి ఇచ్చిన ప్రసిద్ధ శాస్త్రపండితులు ఆచార్య శ్రీపాద సుబ్రహ్మణ్యంగారినీ, ఈ గ్రంథాన్ని పరిష్కరించిన పరిష్కరణమండలి సభ్యులనూ, ప్రస్తుత పురాణ ఇతిహాస ప్రాజెక్టు ప్రత్యేకాధికారి, డా॥ ఆకెళ్ళ విభీషణశర్మగారినీ ఈ సందర్భంగా నేను అభినందిస్తున్నాను. పాఠకులు ఈ గ్రంథాన్ని చదివి శ్రేయస్సును పొందగలరనీ ఆకాంక్షిస్తున్నాను. కలియుగదైవమయిన శ్రీవేంకటేశ్వరస్వామి అనుగ్రహం అందరికీ లభించాలని ప్రార్థిస్తున్నాను.

ఆళ్ళ వేంకట ధర్మారెడ్డి, ఐ.డి.ఇ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి,
తిరుమల తిరుపతి దేవస్థానములు.



నివేదన

సనాతన భారతీయసంస్కృతిని ప్రతిబింబించే పద్దెనిమిది మహాపురాణాలను అందరికీ అర్థమయ్యేలా సులభ సంస్కృతభాషలో రచించిన విష్ణుస్వరూపుడు శ్రీవ్యాసభగవానుడు. ఇతర వాఙ్మయాలకంటే సంస్కృతవాఙ్మయానికున్న విశిష్టత ఏమిటంటే ధర్మార్థకామమోక్షాలనే చతుర్విధపురుషార్థాలను సంపాదింపచేసే గ్రంథాలు సంస్కృతభాషలో రచింపబడడమే. కర్మకాండ, జ్ఞానకాండ అని రెండుగా విభజింపబడిన వేదాలు సంస్కృతభాషలోనే ఉన్నాయి. అవి భారతీయసనాతనధర్మాన్ని బోధించేవి. వాటిలో కర్మకాండ లౌకికాలౌకికఫలాలను సంపాదింపచేయడమే కాకుండా, మనోనైర్మల్యానికి కూడా కారణభూతమవుతోంది. ఇక రెండవది అయిన జ్ఞానకాండ పరమపురుషార్థమైన మోక్షాన్ని సంపాదింపచేసేది. ఆయుర్వేదం, ఖగోళం, జ్యోతిషం, విజ్ఞానశాస్త్రం మొదలైన ఆధునికవిషయాలెన్నో వేదాలలో నిక్షిప్తమై ఉన్నాయి. అట్టి వేదాలలో ఉన్న అతిరహస్యమైన విషయాలను సామాన్యమానవులకు కూడా అర్థమయ్యేరీతిలో వ్యాసభగవానుడు పురాణాలలో పొందుపరిచాడు. **"ఇతిహాసపురాణాభ్యాం వేదం సముపబృంహయేత్"** అని ఆర్యోక్తి. ఇతిహాసములు, పురాణములవల్లనే వేదార్థాలను బాగుగా ఉపబృంహణం చేయాలి అనగా వేదరహస్యాలను వెలికి తీయాలి అని అర్థం. పుట్టిన ప్రతి మానవునికీ షోడశ (16) సంస్కారాలను నెరవేర్చడం మన భారతీయసంస్కృతిలో ఒక భాగం. వేదాలలో చెప్పబడిన అట్టి సంస్కారాలు పురాణాలలో సులభశైలిలో వివరింపబడడం పురాణాలయొక్క మరో విశిష్టత. తిరుమల తిరుపతి దేవస్థానంలోని పురాణఇతిహాసప్రాజెక్టు పురాణాలను సామాన్యమానవులకు కూడా చేరువచేసే సంకల్పాన్ని చేపట్టింది. తదనుగుణంగా పద్దెనిమిది పురాణాలను సరళంగా ఆంధ్రభాషలో అనువదింపచేయడం జరుగుతున్నది.

పురాణాలు అన్నీ కూడా వాటిలో ప్రతిపాదింపబడిన గొప్ప గొప్ప విషయాల దృష్ట్యా విశిష్టమైనవే. ప్రస్తుత మార్కండేయపురాణం వాటన్నింటిలో కూడా ఒక ప్రత్యేక విశిష్టస్థానాన్ని సంతరించుకొన్నది. అందుకు ప్రధానకారణం దసరానవరాత్రుల్లో భారతీయులు సభక్తికంగా పారాయణ చేసుకొనే **'దుర్గాసప్తశతిభాగం'** మార్కండేయపురాణంలో అంతర్గతం కావడమే. అంతేకాక హరిశ్చంద్రోపాఖ్యానం, దత్తాత్రేయమాహాత్మ్యవర్ణనం, మదాలసోపాఖ్యానం, గృహస్థాశ్రమధర్మనిరూపణం, సదాచారవర్ణనం, యోగసిద్ధి, ఆయా మన్వంతరాలసృష్టి, గంగావతరణవర్ణనం, మధుకైటభసంహారం, ఆదిత్యస్తుతి, బహులాఉత్తములకథ, మానినీ రాజ్యవర్ధనుల వృత్తాంతం, రుచిప్రజాపతి కథ, స్వారోచిషమనుసంభవం మొ॥లగు జనసామాన్యాన్ని ఆకర్షించే ఉపాఖ్యానాలు ఈ పురాణంలో వర్ణింపబడడంవల్ల కూడా ఈ పురాణానికి తక్కిన పురాణాలకంటే ఎంతో ప్రశస్తి లభించింది.

ఈ పురాణాన్ని మార్కండేయమహర్షి చెప్పినందువల్ల ఆయన పేరుతో ఈ పురాణానికి మార్కండేయపురాణమని పేరు వచ్చింది. ఒకానొక సమయంలో వేదవ్యాసమహర్షి శిష్యుడు, గొప్ప తేజస్సంపన్నుడూ అయిన జైమినిమహర్షి మార్కండేయ మహామునిని సమీపించి ఇలా అడిగాడు. "ఓ భగవత్స్వరూపుడా! మహాత్ముడయిన వేదవ్యాసమహర్షి శాస్త్రసిద్ధాంతాలతో పరిపుష్టమైన మహాభారతమనే గొప్ప గ్రంథాన్ని రచించాడు. పంచమవేదస్వరూపమైన అట్టి మహాభారత ఇతిహాసంలో నిగూఢములైన శాస్త్రతత్త్వాలను తెలుసుకోవడానికోసం నేను తమవద్దకు వచ్చాను. నిర్గుణస్వరూపుడు పరమాత్మ అయిన శ్రీకృష్ణుడు మాయామానుష విగ్రహుడుగా అవతరించడమేమిటి? అయిదుగురు పాండుపుత్రులకు ద్రౌపది భార్య కావడమేమిటి? హలాయుధుడయిన

బలరాముడు తీర్థయాత్రలు సాగిస్తున్న సందర్భంలో బ్రహ్మహత్యాదోషానికి ప్రాయశ్చిత్తం చేసుకోవడమేమిటి? మహారథులూ, మహాత్ములూ అయిన ద్రౌపదీపుత్రులు అవివాహితులై అనాథలై వధింపడానికి గల కారణమేమిటి? ఈ ప్రశ్నలన్నింటికీ తగు సమాధానాలు చెప్పవలసిందిగా తమను ప్రార్థిస్తున్నాను" అని.

జైమిని సందేహాలను మార్కండేయుడు సాంతం శాంతంగా విని ఇలా బదులిచ్చాడు. "ఓ జైమినీ! పింగాక్షుడు, వివోధుడు, సుపుత్రుడు, సుముఖుడు అనే నలుగురు ద్రోణమహర్షికుమారులు సదా శాస్త్రచింతనాపరులు, నిగూఢశాస్త్రరహస్యకోవిదులు. కారణవశాన పక్షిజన్మలయిన ఈ నలుగురు వింధ్యారణ్యప్రాంతంలో ఉన్నారు. వారినడిగి నీ సందేహాలకు సమాధానాన్ని తెలుసుకో" అని. ద్రోణపుత్రులకు పక్షిజన్మలేమిటని ప్రశ్నించగా మార్కండేయుడు జైమినికి వివరించి చెప్పాడు. మార్కండేయమహాముని ఆదేశాలననుసరించిన జైమినిమహర్షి ధర్మపక్షులు నివసిస్తున్న వింధ్యపర్వతానికి వెళ్ళి పక్షిరూపులయిన ఆ నలుగురు విప్రకుమారులు చేస్తున్న వేదపఠనాన్ని విన్నాడు. సంభ్రమాశ్చర్యాలకు లోనైన జైమిని వారిని సమీపించి మహాభారత శ్రవణంలో తనకు కలిగిన సంశయాలకు బదులు చెప్పవలసిందిగా కోరాడు. అందుకు బదులుగా ఆ పక్షికుమారులు ఒక్కొక్క ఉపాఖ్యానాన్ని వివరంగా చెప్పారు.

ఇలా ఈ పురాణంలో ఏ ఉపాఖ్యానాన్ని తీసుకున్నా, మనసుకు హత్తుకొనే విధంగానే ఉంటుంది. హరిశ్చంద్రోపాఖ్యానం పాఠకులకు కంటతడి తెప్పించక మానదు. అలాంటి సందర్భాలలో ఆయా రసాల పోషణకై వాడిన సంస్కృత ప్రయోగాలు అద్భుతమని అనిపించక మానదు. హరిశ్చంద్రుడు సత్యవాక్పరిపాలన నిమిత్తమై తన భార్య అయిన చంద్రమతిని ఒక వృద్ధబ్రాహ్మణునికి అమ్మేసిన సందర్భంలో ఒక శ్లోకం –

"తతః స విప్రో నృపతేర్వల్కలాంతే దృఢం ధనమ్ ।
బద్ధ్వా కేశేష్వథాదాయ నృపపత్నీమకర్షయత్ ॥" (8–57)

"అటుపిమ్మట ఆ వృద్ధబ్రాహ్మణుడు హరిశ్చంద్రుని వస్త్రమునందు, హరిశ్చంద్రుని ధనమును మూటకట్టి, ఆ రాజపత్నిని జుట్టు పట్టుకొని ఈడ్చుకొని వెళ్ళెను" అని అర్థం. ఇక్కడ **"అకర్షయత్"** అను ప్రయోగం ఆ సన్నివేశంలో కరుణరసాన్ని పుష్టిచేస్తోంది. తన తల్లిని నిర్దయగా లాగుకొని తీసుకొని పోవడాన్ని చూచిన వారి పుత్రుడు, లోహితాస్యుడు తన తల్లి దగ్గరికి చేరిన సందర్భంలోని ఒక శ్లోకం –

"తమాగతం ద్విజః క్రోధాద్బాలమభ్యాహనత్తదా ।
వదంస్తథాపి సోఽమ్మేతి నైవాముంచత మాతరమ్ ॥" (8–62)

"అప్పుడా వృద్ధబ్రాహ్మణుడు తల్లిదగ్గర చేరిన ఆ కుమారుని కాలితో గట్టిగా తన్నాడు. అయినా ఆ తల్లిని పట్టుకొని అమ్మా! అమ్మా! అని అంగలారుస్తూ ఆ బాలకుడు తన తల్లిని విడువలేదు" అని అర్థం.

కటిక దారిద్ర్యస్థితిలో ఉన్న హరిశ్చంద్రుని విశ్వామిత్రుడు పరీక్షించిన తీరు కరుణరసానికి పరాకాష్ఠగా నిలుస్తుంది. ఇలాగే మిగిలిన ఉపాఖ్యానాలు కూడా ఎంతో రసవత్తరంగా వర్ణింపబడ్డాయి.

ఉపనిషత్తులలో వర్ణింపబడిన ఎన్నో సనాతనధర్మాచారాలను ఆయా ఉపాఖ్యానాలలో వేదవ్యాసుడు నిబద్ధం చేయడం కూడా ఈ పురాణానికున్న మరో వైశిష్ట్యం. "అతిథిదేవో భవ" అని ఉపనిషద్వాక్యాన్ని స్మరింపచేసే ఈ శ్లోకం–

"తస్మాత్పశ్యేహ వత్స! త్వం మాయాం చేద్ద్రష్టుమిచ్ఛసి ।
అనుగ్రాహ్యో భవాన్గేహే బాలో౽ప్యభ్యాగతో గురుః ॥" (22-34)

"ఓ వత్సా! రాకుమారా! ఇంటికి అతిథిరూపముగా వచ్చినవాడు బాలుడయిననూ గురువుతో సమానము గావున నీవు కూడా నాకు గురువుతో సమానము. అందువలన నీవు తప్పక నాచే అనుగ్రహింపదగినవాడవు. మాయారూపమైన మదాలసను చూడగోరినచో ఇదిగో ఇచ్చటనే చూడుము" అని అర్థం. ఇలా అనేక సందర్భాలలో ఈ పురాణంలోని ఉపాఖ్యానాలను చదువుతున్నప్పుడు ఆయా శ్రుతివాక్యాలు తప్పక గుర్తుకు వస్తాయి.

ధర్మపక్షులు జైమినిమహర్షికి ఆయా ఉపాఖ్యానాలను చెప్పు సందర్భంలోనే **'పితాపుత్రసంవాదం'** ఎంతో ఆసక్తిని కల్గించే ఉపాఖ్యానం చెప్పబడింది. పూర్వజన్మస్మృతులు గల సుమతి అనే కుమారుడు తన తండ్రికి వైరాగ్యం కల్గించే విధంగా చెప్పిన వేదాంతవిషయాలు, ప్రతి ఒక్క పాఠకునికీ జ్ఞానవృద్ధిని కల్గిస్తాయనడంలో ఎట్టి సందేహమూ లేదు. తన కుమారుడయిన సుమతి ఉపదేశించిన విధంగా సాంసారిక కాంక్షలను విడిచిపెట్టి కర్తవ్యోపదేశం చేయవలసిందిగా తండ్రి తన కుమారుని కోరుతాడు. ఆ సందర్భంలోనే సుమతి దత్తాత్రేయమాహాత్మ్యాన్ని తన తండ్రికి వర్ణించి చెప్పాడు. ఈ సన్నివేశంలోనే మదాలసోపాఖ్యానం కూడా వస్తుంది. ఈ ప్రకరణంలో సుమతి తన తండ్రికి ఉపదేశించిన గృహస్థాశ్రమధర్మాలు, శ్రాద్ధవిధి, సదాచారవర్ణనం, ధర్మనిరూపణం, ఆత్మవివేకం మొ॥లగు ఎన్నో వైదికాచారాలకు సంబంధించిన ఉపాఖ్యానాలు పాఠకుల జ్ఞానాభివృద్ధికి తప్పక దోహదపడతాయి.

నలభైరెండవ అధ్యాయంలో స్థావరజంగమాత్మకమయిన సృష్టి ఎలా జరిగిందో వర్ణించే సందర్భంలో సాంఖ్యదర్శనసిద్ధాంతం చాలా చక్కగా వివరింపబడింది. ఏబదియవ అధ్యాయం నుంచి స్వాయంభువమన్వంతరం మొ॥లగు మన్వంతరాలు, ఆ మన్వంతరాలలోని దేవతలు, రాజులు, దేవేంద్రుడు మొదలగువారి వివరాలు చాలా విస్తృతంగా వర్ణింపబడ్డాయి. సావర్ణికమన్వంతరాన్ని మార్కండేయుడు క్రౌష్టుకిమునికి వర్ణించి చెప్పే సందర్భంలోనే దేవీమాహాత్మ్యవర్ణనవృత్తాంతం చోటు చేసుకుంది. సురథమహారాజు సుమేధసమునిని – "ఓ భగవత్స్వరూపుడా! మీరు చెప్పిన ఆ మహామాయ ఎవరు? ఆమె ఎలా ఉద్భవించింది? ఆమె చేయు పనులెట్టివి?" అని ప్రశ్నించాడు. అంతట సుమేధసముని దేవీతత్త్వాన్ని చక్కగా అభివర్ణించాడు. డెబ్బైఎనిమిదవ అధ్యాయంలో ఆ ముని మధుకైటభసంహారవృత్తాంతాన్ని వర్ణించి చెప్పాడు. అది మొదలుకొని ఎనభైఏడవ అధ్యాయం శుంభాసురవధ వృత్తాంతము వరకు సుమేధసముని సురథవైశ్యులకు దేవీమాహాత్మ్యాన్ని వర్ణించి చెప్పాడు. డెబైఎనిమిదవ అధ్యాయం నుంచి తొంబదియవ అధ్యాయం వరకుగల భాగమే **దుర్గాసప్తశతిగా** పరిగణింపబడుచున్నది. మిగతా పురాణాలకంటే ఈ పురాణంయొక్క వైశిష్ట్యం ఏమిటంటే ఈ పురాణంలో దేవీసప్తశతిభాగం ఉండటమే. శరన్నవరాత్రులలో శక్త్యాలయాలలో, విధిగా మరి స్మార్తసంప్రదాయాల ఇళ్ళల్లో సప్తశతిగ్రంథపారాయణం అనూచానంగా ఒక సంప్రదాయంగా నిలిచివుంది. ఏడువందల శ్లోకాలున్న భాగమే సప్తశతి. ఈ భాగాన్నే దసరానవరాత్రుల్లో భక్తులు

దేవాలయాల్లో పారాయణం చేస్తున్నారు. ధర్మపక్షులు తన సందేహాలన్నింటినీ నివృత్తి చేసినందుకు జైమినిమహర్షి కృతజ్ఞతలు ప్రకటించుకోవడంతో ఈ పురాణం పూర్తి అవుతుంది.


ఇంతటి మహత్తరపురాణాన్ని అనువదించవలసిందిగా న్యాయ, వ్యాకరణ, వేదాంతపండితులు, మహామహోపాధ్యాయ ఆచార్య శ్రీపాద సుబ్రహ్మణ్యం గారిని కోరడం జరిగింది. వారు సకాలంలో అనువాదాన్ని పూర్తిచేసి మాకు అప్పగించారు. ఇంతకుముందున్న పాఠాలను చూసి అవసరమయిన వాటిని సవరించి ప్రామాణికపాఠాన్ని చాలాచోట్ల వీరు పొందుపరిచారు. ఉదాహరణకు **"కిం తేనాహం ప్రియా విప్ర!"** (58-63) అన్న శ్లోకంలో **"తేనాహం"** అనే పాఠాన్నే తీసుకొని పూర్వవ్యాఖ్యాతలు వ్యాఖ్యానించడం జరిగింది. కాని వీరు **"కిం తే నాహం ప్రియా విప్ర!"** అనువిధంగా పాఠాన్ని సవరించి అనువదించారు. అలాగే మరొకచోట **"నివారితా శంభుపత్న్యా సత్యాసత్యప్రతిశ్రవా"** (61-12) అను శ్లోకంలో **"సత్యాసత్యప్రతిశ్రవా"** అని కలిపి ఆ పాఠంతో వ్యాఖ్య చేయడం జరిగింది. కొన్ని పుస్తకాలలో **"సత్యాఽసత్య..."** అని ప్రశ్లేష పెట్టడం కూడా జరిగింది. కాని ప్రస్తుత అనువాదకులు జాగ్రత్తగా పరిశీలించి "సత్యా సత్యప్రతిశ్రవా" అని పాఠం నిర్ధారించి వ్యాఖ్యానించడం జరిగింది. సతీశబ్దానికి తృతీయావిభక్తి ఏకవచనం "సత్యా" అని తీసుకొని "శంభుపత్నియగు సతీదేవితో" అని వ్యాఖ్యానించడం జరిగింది. మార్కండేయపురాణాన్ని అనువదించడంలో ఆచార్య శ్రీపాద సుబ్రహ్మణ్యంగారి కృషిని టి.టి.డి. పక్షాన నేను అభినందిస్తున్నాను. వారికీ, అలాగే ఈ పురాణాన్ని పరిష్కరించిన పరిష్కరణమండలి సభ్యులకు ధన్యవాదాలు తెలుపుతున్నాను. పురాణ ఇతిహాస ప్రాజక్టులో పరిశోధకులుగా ఉద్యోగిస్తున్న డా॥ సముద్రాల దశరథ గారికీ, ఇతర కార్యాలయ సిబ్బందికీ నా హృదయ పూర్వక ధన్యవాదములు. పాఠకులు లోగడ ప్రచురితమయిన గ్రంథాలలాగానే ఈ గ్రంథాన్ని కూడా తప్పక ఆదరిస్తారని విశ్వసిస్తున్నాను.

-ఆకెళ్ళ విభీషణశర్మ

ప్రత్యేకాధికారి



పురాణ పురుషుడు శ్రీమన్నారాయణుడు



బ్రాహ్మం మూర్ధా హరేరేవ హృదయం పద్మసంజ్ఞకమ్ । వైష్ణవం దక్షిణో బాహుః వాయుర్వామో మహేశితుః ॥
ఊరూ భాగవతం ప్రోక్తం నాభిః స్యాన్నారదీయకమ్ । మార్కండేయం చ దక్షాంఘ్రిః వామో హ్యాగ్నేయముచ్యతే ॥
భవిష్యం దక్షిణో జానుర్విష్ణోరేవ మహాత్మనః । బ్రహ్మవైవర్తసంజ్ఞం తు వామో జానురుదాహృతః ॥
లైంగం తు గుల్ఫకం దక్షం వారాహం వామగుల్ఫకమ్ । స్కాందం పురాణం లోమాని త్వగస్య వామనం స్మృతమ్ ॥
కౌర్మం పృష్ఠం సమాఖ్యాతం మాత్స్యం మేదః ప్రకీర్త్యతే । మజ్జా తు గారుడం ప్రోక్తం బ్రహ్మాండం చాస్థి గీయతే ॥
ఏవమేవాభవద్విష్ణుః పురాణావయవో హరిః ।

పురాణప్రశస్తి

(అష్టాదశపురాణాలు)

మహామహోపాధ్యాయ డా॥ సముద్రాల లక్ష్మణయ్య

వ్యాసాయ విష్ణురూపాయ వ్యాసరూపాయ విష్ణవే ।
నమో వై బ్రహ్మనిధయే వాసిష్ఠాయ నమో నమః ॥

నారాయణం నమస్కృత్య నరం చైవ నరోత్తమమ్ ।
దేవీం సరస్వతీం వ్యాసం తతో జయముదీరయేత్ ॥

అతి ప్రాచీనకాలంలో గురుకులాలలో విద్యనభ్యసించే విద్యార్థులు పదునాలుగు విధాలైన విద్యల నభ్యసించేవారు. ఆ విద్యల నిలా పేర్కొనడం జరిగింది.

అంగాని వేదాశ్చత్వారో మీమాంసా న్యాయవిస్తరః ।
పురాణం ధర్మశాస్త్రం చ విద్యా హ్యేతాశ్చతుర్దశ ॥

శిక్ష, వ్యాకరణం, ఛందస్సు, నిరుక్తం, జ్యోతిషం, కల్పం-అనే ఆరు వేదాంగాలు, ఋగ్యజుస్సామాథర్వణము లనే నాలుగు వేదాలు, మీమాంస, న్యాయం, పురాణం, ధర్మశాస్త్రం-అనేవే పదునాల్గు విద్యలు.

'వేదోఽఖిలో ధర్మమూలం' అన్నట్లు వేదమంతా ధర్మమూలమైనది. వేదోక్తమైన ధర్మాలను గ్రహించడం అందరికీ సాధ్యంకాని పని. అందుచేత వేదాలను విభజించిన వేదవ్యాసుడే వేదార్థాలను సామాన్యులు గూడా గ్రహించడాని కనువుగా పురాణాలను రచించాడు. **అష్టాదశపురాణానాం కర్తా సత్యవతీసుతః** -అను ప్రమాణవచనం కూడా పదునెన్మిది పురాణాల రచయిత సత్యవతీ సుతుడైన వ్యాసుడే అని నిరూపిస్తున్నది.

ఇతిహాసపురాణాభ్యాం వేదం సముపబృంహయేత్ ।
బిభేత్యల్పశ్రుతాద్వేదో మామయం ప్రహరిష్యతి ॥

అల్పజ్ఞుడు తనకు హాని కల్గిస్తాడేమో అని వేదం భయపడుతుంది. అందువల్ల ఇతిహాసాలతోనూ, పురాణాలతోనూ వేదార్థాలను విస్తరింపజేయాలి. ఈ దృష్టితోనే, అనగా అల్పజ్ఞులను దృష్టిలో పెట్టుకొనే వ్యాసుడు వేదార్థాలను పురాణాలద్వారా విస్తరింపజేశాడు. అట్లని పురాణాలు అల్పజ్ఞులకు మాత్రమే పరిమితమైనవి కావు. అధికజ్ఞులు కూడా గ్రహించవలసిన విషయాలు పురాణాలలో ఎన్నో ఉన్నాయి.

వేదం ప్రభువుతో సమానమైనది. శబ్దప్రధానమైన వేదవాణి కర్తవ్యవిషయంలో రాజాజ్ఞను పోలి వుంటుంది. పురాణవచనం మిత్రతుల్యంగా వుంటుంది. అది అర్థప్రధానమై శ్రోతను కర్తవ్యానికి పురికొల్పుతుంది. కావ్యం కాంతాసమ్మితమై సరసంగా బోధించి పాఠకుణ్ణి కర్తవ్యోన్ముఖుణ్ణి చేస్తుంది అని ఆలంకారికులు వేదార్థాలను వివరించే పురాణాలకు మిత్రసాదృశ్యాన్ని ప్రతిపాదించారు.

యద్వేదాత్ప్రభుసమ్మితాదధిగతం శబ్దప్రధానాచ్చిరం
యచ్చార్థప్రవణాత్పురాణవచనాదిష్టం సుహృత్సమ్మితాత్ ।

కాన్తాసమ్మితతయా యయా సరసతామాపాద్య కావ్యశ్రియా
కర్తవ్యే కుతుకీ బుధో విరచితస్తస్యై స్పృహాం కుర్మహే ॥ (ప్రతాపరుద్రీయం)

పురాణాలలో గూడా కావ్యశైలిని పాటించి రసవత్తరంగా కర్తవ్యబోధ కావించిన ఘట్టాలెన్నో ఎడనెడా కానవస్తాయి.

పురాణాలలో పూర్వకాలానికి చెందిన అనేక కథలున్నాయి. కథాకథనం ద్వారా ధర్మస్వరూపం అందులో నిరూపింపబడింది. పురాణకథలు వాగ్వైభవాన్ని ప్రదర్శించడానికి చెప్పినవి కావనీ, విజ్ఞాన వైరాగ్యాలను విస్తరించి చెప్పడానికే ఆ కథలను వివరించడమయిందనీ భాగవతపురాణంలో వ్యాసభగవానుడే చెప్పాడు.

కథా ఇమాస్తే కథితా మహీయసాం
వితాయ లోకేషు యశః పరేయుషామ్ ।
విజ్ఞానవైరాగ్య వివక్షయా విభో!
వచోవిభూతిర్న చ పారమార్థ్యమ్ ॥ (భాగవతం-12-3-14)

ఇక్కడ 'విజ్ఞాన' మంటే వేదవిజ్ఞానమనే గ్రహించాలి.

'వేదాః ప్రతిష్ఠితాస్సర్వే పురాణే నాత్ర సంశయః' పురాణాలలో వేదాలు ప్రతిష్ఠితాలై ఉన్నాయి. ఇందులో సందేహం లేదు. కథల ద్వారా అవి ఆవిష్కృతాలవుతాయి.

పురాణ ప్రాముఖ్యం

యన్నదృష్టం హి వేదేషు తత్సర్వం లక్ష్యతే స్మృతౌ ।
ఉభయోర్యన్న దృష్టం హి తత్పురాణే ప్రతీయతే ॥

వేదాలలో గోచరం కానిదంతా స్మృతులలో కనిపిస్తుంది. శ్రుతి స్మృతులు రెండింటిలో కనిపించనిది పురాణం ద్వారా అవగతం అవుతుంది అన్న ప్రమాణాన్ని బట్టి శ్రుతులలోనూ, స్మృతులలోనూ లేని విషయాలను సైతం విస్తృతరచనావిధానం కల పురాణాలద్వారా గ్రహించవచ్చునని తెలుస్తున్నది. **'పురాణం సర్వశాస్త్రాణాం ప్రథమం బ్రహ్మణా స్మృతమ్'** అన్నట్లు శాస్త్రాలన్నింటిలోను మొదటిదిగా పురాణాన్ని విధాత స్మరించాడని విదితమవుతున్నది. యాగానుష్ఠానసమయంలో పురాణాలు పఠించే సంప్రదాయం కద్దు. ఇంకా పురాణాలలో భగవన్మహిమ, భగవదవతారాలు, భక్తిప్రబోధం, నానావిధాలైన ఆచారాలు, ధర్మాధర్మాలు, సాంఘిక -చారిత్రకాంశాలు, కళలు, వేదాంతతత్త్వాలు, నీతి ఇత్యాదిగా ఎన్నో విషయాలు నిరూపితాలయ్యాయి.

పురాణం ఐహికాముష్మిక సుఖసాధనం. మన సంస్కృతి సంప్రదాయాలను గ్రహించడానికి పురాణజ్ఞానం అవసరం.

పురాణ శబ్ద నిర్వచనం

పురాణం అంటే - పురా భవం ప్రాచీనకాలంలో రచించబడినది అని అర్థం.

పురాఽపి నవం - ప్రాచీనమైనా విషయ విశిష్టతను బట్టి క్రొత్తది అని మరొక అర్థం.

పురా–అణతి–ఆగతానాగతే కథయతీతి పురాణం–అంటే జరిగిన, జరుగనున్న కాలానికి చెందిన విషయాలను వివరించునది అని వేరొక అర్థం.

పురా–పూర్వస్మిన్ జాతమితి పురాణమ్–పూర్వం ఎప్పుడో జరిగిన వృత్తాంతం పురాణం అని భావం.

పురా–అంటే పరంపరను వ్యక్తం చేసేది పురాణం అని మరొక వివరణ.

పురా–ప్రాచీన కాలోదంతం అనక్తీతి పురాణం – పురాతన కాలానికి చెందిన చరిత్రను చెప్పునది పురాణం.

ఇలా పురాణ శబ్దానికి పలు విధాల నిర్వచనం పెద్దలు చెప్పారు.

పురాణోత్పత్తి

అథర్వవేదంలో పురాణ శబ్దం ప్రయుక్తమైంది. యజ్ఞోచ్ఛిష్టంనుండి పురాణం పుట్టినదని అందులో చెప్పబడింది.

ఋచః సామాని ఛందాంసి పురాణం యజుషా సహ ।
ఉచ్ఛిష్టాజ్జజ్ఞిరే సర్వే దివి దేవా దివి శ్రితాః ॥ అథర్వ సంహిత (11-7-24)

నాల్గువేదాల తరువాత ఇక్కడ పురాణోత్పత్తి నిర్దేశించబడింది. పురాణాల ఉనికి వేద సమకాలికమని తెలుస్తున్నది.

అందుచేత వేదసంహితల కాలంలోనే పురాణాలకు చెందిన మూలస్వరూపం రూపొందిందని భావించవచ్చు. బృహదారణ్యకోపనిషత్తులోని ఈ క్రింది వాక్యం గమనార్హం.

"అస్య మహతో భూతస్య నిఃశ్వసితమేతత్ యదృగ్వేదో, యజుర్వేదస్సామవేదోఽథర్వాఙ్గిరసః పురాణం విద్యా ఉపనిషదః శ్లోకాః సూత్రాణి".(2-4-10)

ఈ ఉపనిషద్ వాక్యం వేదాదులతోపాటు పురాణం కూడా పరమాత్మయొక్క నిఃశ్వాసరూపమైనదని వ్యక్తం చేస్తున్నది. దీనివల్ల వేదం ఎంత ప్రాచీనమో పురాణం కూడా అంతే ప్రాచీనమని గ్రహించవచ్చు. ఇక్కడ పురాణ శబ్దం ఏకవచనంలో ప్రయుక్తమైనది. అందుచేత పూర్వం సంక్షిప్తంగా ఉండిన పురాణం కాలక్రమంలో విస్తృతరూపం సంతరించుకొని వివిధ పురాణాలుగా విస్తరించిందని భావించవచ్చు.

భారతీయసంస్కృతిని ప్రతిబింబించే దర్పణాలు పురాణాలు. సామాన్య జనానీకంలో సనాతన ధర్మతత్త్వాన్ని ప్రచారం చేయడంలో అవి ప్రముఖపాత్ర వహించాయి. ఆధునికకాలంలో ప్రాచ్య పండితులేకాక పాశ్చాత్య పండితులు కూడా పురాణాల విశిష్టతను గుర్తించారు. పురాణం అన్న వ్యవహారమే ఇది అతిప్రాచీన సాహిత్యమని తెలియజేస్తుంది.

పురాణాలకంటే భిన్నంగా ఇతిహాసాలను గూడా మన పెద్దలు పేర్కొన్నారు. గతకాలంలో జరిగిన సంఘటనలను తెలిపేవి ఇతిహాసాలు. ఇతి హ+ఆస = ఇతిహాసం అనగా ఇలా పూర్వం జరిగినది–అని అర్థం. పురాణంలోని విషయాలు ఇతిహాసంలోని అంశాలకంటె వ్యాపకంగానూ, విస్తృతంగానూ వుంటాయి.

సాధారణ పురాణాల నుద్దేశించి నిర్దేశించిన సర్గం, ప్రతిసర్గం మొదలైన లక్షణాల కంటె భిన్నమైన వివిధ విషయాలు పురాణాలలో గోచరిస్తాయి. ఉదా: అగ్నిపురాణాన్ని పరిశీలిస్తే వివిధ విద్యలు, పదార్థలక్షణాలు, స్వప్నాలు,

శకున ఫలితాలు, కావ్యనాటక లక్షణాలు, ప్రళయస్వరూపం, నరకం తీరుతెన్నులు, అద్వైత బ్రహ్మతత్త్వం మున్నగు అంశాలు అందులో ఉండడం గమనార్హం. అందుకే అగ్నిపురాణాన్ని 'జ్ఞానకోశం' అన్నారు.

సృష్ట్యారంభంనుండి నేటివరకు సమాజంలోని స్థితిగతులను చెప్పే పురాణాలను శ్రద్ధతో పఠించి పరిశీలించవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. అంతేకాని అవేవో కల్పనాత్మకమైన కథలని ఉపేక్షించడం తగదు. పురాణాలను ఏ దృష్టితో వ్యాసభగవానుడు రచించాడు? అన్న ప్రశ్నకు ఈ క్రింది శ్లోకం సమాధానమిస్తున్నది.

విష్ణోరంశో మునిర్జాతః సత్యవత్యాం పరాశరాత్ ।
పురాణసంహితాం దధ్యౌ తేషాం ధర్మవిధిత్సయా ॥

విష్ణ్వంశంతో జనించిన సత్యవతీ పరాశరుల పుత్రుడగు వ్యాసుడు ధర్మస్వరూప నిరూపణకై పురాణసంహితను రూపొందించాడని భావం.

అంతేకాక శ్రీమన్నారాయణుడు స్వయంగా వ్యాసరూపుడై వేదార్థాల విస్తృతి నపేక్షించి భూతలములో పురాణాలు రచించాడని ఈ క్రింది శ్లోకం నిరూపిస్తున్నది.

విస్తారాయ చ వేదానాం స్వయం నారాయణః ప్రభుః ।
వ్యాసరూపేణ కృతవాన్ పురాణాని మహీతలే ॥

సూతుని ద్వారా ఈ పురాణవాఙ్మయం ప్రచారంలోకి వచ్చింది. నైమిశారణ్య నివాసులైన శౌనకాది మునులు సూతునినుండి ఈ పురాణాలను విన్నారు.

విష్ణువుయొక్క అవయవాలే పురాణాలు

త్రిమూర్తులలో ఒక్కడుగా, స్థితికారకుడుగా, దుష్టశిక్షకుడుగా, శిష్టరక్షకుడుగా, ధర్మసంస్థాపకుడుగా ప్రసిద్ధుడైన శ్రీమహావిష్ణుదేవుని యొక్క అవయవాలుగా పదునెన్మిది పురాణాలను పేర్కొనడం కద్దు. దీన్నిబట్టి ధర్మప్రభువైన అచ్యుతునికీ, ధర్మస్వరూప నిరూపకాలైన పురాణాలకూ కల సామ్యాన్ని గ్రహించవచ్చు. పురాణాలు ఈ క్రిందివిధంగా విష్ణుదేవుని అవయవాలుగా పేర్కొనబడ్డాయి.

బ్రాహ్మం మూర్ధా హరేరేవ హృదయం పద్మసంజ్ఞకమ్ ।
వైష్ణవం దక్షిణో బాహుః వాయుర్వామో మహేశితుః ॥

ఊరూ భాగవతం ప్రోక్తం నాభిః స్యాన్నారదీయకమ్ ।
మార్కండేయం చ దక్షాంఘ్రిః వామో హ్యాగ్నేయముచ్యతే ॥

భవిష్యం దక్షిణో జానుర్విష్ణోరేవ మహాత్మనః ।
బ్రహ్మవైవర్తసంజ్ఞం తు వామో జానురుదాహృతః ॥

లైంగం తు గుల్ఫకం దక్షం వారాహం వామగుల్ఫకమ్ ।
స్కాందం పురాణం లోమాని త్వగస్య వామనం స్మృతమ్ ॥

కౌర్మం పృష్ఠం సమాఖ్యాతం మాత్స్యం మేదః ప్రకీర్త్యతే ।
మజ్జా తు గారుడం ప్రోక్తం బ్రహ్మాండం చాస్థి గీయతే ॥
ఏవమేవాభవద్విష్ణుః పురాణావయవో హరిః ।

దీని తాత్పర్యం ఇది–శ్రీమహావిష్ణువునకు బ్రహ్మపురాణం–శిరస్సు, పద్మపురాణం–హృదయం, విష్ణుపురాణం–దక్షిణహస్తం, వాయుపురాణం–వామహస్తం, భాగవతపురాణం–తొడలు, నారదపురాణం–నాభి, మార్కేండయపురాణం–దక్షిణపాదం, అగ్నిపురాణం–వామపాదం, భవిష్యపురాణం–కుడి మోకాలు, బ్రహ్మవైవర్త పురాణం–ఎడమ మోకాలు, లింగపురాణం–కుడి చీలమండ, వరాహపురాణం–ఎడమ చీలమండ, స్కాంద పురాణం–కేశాలు, వామనపురాణం–చర్మం, కూర్మపురాణం–వీపు, మత్స్యపురాణం–మెదడు, గరుడపురాణం–మజ్జ, బ్రహ్మాండపురాణం–ఎముకలు. ఇలా శ్రీహరి పురాణాలే అవయవాలుగా కల్గి వున్నాడు.

పురాణ సంఖ్య

పురాణాలు మొత్తం పదునెనిమిది. వీటిని ఆ యా పురాణాల పేర్లలో మొదటి అక్షరాన్ని మాత్రం పేర్కొనే ఒక శ్లోకంలో ఇలా చెప్పడమయింది.

మద్వయం భద్వయం చైవ బ్రత్రయం వ చతుష్టయమ్ ।
అనాపలింగ కూస్కాని పురాణాని విదుర్బుధాః ॥

'మ' అనే అక్షరంతో ప్రారంభమయ్యే పురాణాలు రెండు–(1) మత్స్యపురాణం (2) మార్కండేయపురాణం. 'భ' అను అక్షరంతో ప్రారంభమయ్యేవి, రెండు –(1) భాగవతం (2) భవిష్యపురాణం –'బ్ర'తో ప్రారంభమయ్యేవి –మూడు (1) బ్రహ్మపురాణం (2) బ్రహ్మాండపురాణం (3) బ్రహ్మవైవర్త పురాణం –'వ' కారంతో ప్రారంభమయ్యేవి నాల్గు (1) విష్ణుపురాణం (2) వాయుపురాణం (3) వామనపురాణం (4) వరాహపురాణం –అ=అగ్నిపురాణం నా=నారదపురాణం–ప=పద్మపురాణం, లిం=లింగపురాణం, గ=గరుడపురాణం, కూ=కూర్మపురాణం, స్కా=స్కాందపురాణం ఇలా మొత్తం పురాణాల సంఖ్య పదునెన్మిది.

పురాణ విభాగం

పురాణాలను మహాపురాణాలనీ, ఉప పురాణాలనీ రెండు విధాలుగా విభజించడం కద్దు. పైన ప్రథమాక్షర నిర్దేశంతో పేర్కొన్నవన్నీ మహాపురాణాలే. ఈ క్రిందివిధంగా కూడా ఈ పురాణాలను పెద్దలు నిర్దేశించారు.

బ్రాహ్మం పాద్మం వైష్ణవం చ వాయవీయం తథైవ చ ।
భాగవతం నారదీయం మార్కండేయం చ కీర్తితమ్ ॥
ఆగ్నేయం చ భవిష్యం చ బ్రహ్మవైవర్తలింగకే ।
వారాహం చ తథా స్కాందం వామనం కూర్మసంజ్ఞకమ్ ।
మాత్స్యం చ గారుడం తద్వద్బ్రహ్మాండాఖ్యమితి త్రిషట్ ॥

ఈ పదునెన్మిది పురాణాలనూ పద్మపురాణం సాత్త్వికాలు, రాజసాలు, తామసాలు అని మూడు వర్గాలుగా విభజించింది.

సాత్త్వికాలు–

> **వైష్ణవం నారదీయం చ తథా భాగవతం శుభమ్ ।**
> **గారుడం చ తథా పాద్మం వారాహం శుభదర్శనే ॥**

రాజసాలు–

> **బ్రహ్మాండం బ్రహ్మవైవర్తం మార్కండేయం తథైవ చ ।**
> **భవిష్యం వామనం బ్రాహ్మం రాజసాని నిబోధత ॥**

తామసాలు–

> **మాత్స్యం కౌర్మం తథా లైంగం శైవం స్కాందం తథైవ చ ।**
> **ఆగ్నేయం చ షడేతాని తామసాని నిబోధత ॥**

ఇందులో (1) వైష్ణవం (2) నారదీయం (3) భాగవతం (4) గారుడం (5) వారాహం (6) పాద్మం –అనునవి సాత్త్వికపురాణాలు. (1) బ్రహ్మాండం (2) బ్రహ్మవైవర్తం (3) మార్కండేయం, (4) భవిష్యం (5) వామనం (6) బ్రాహ్మం–అనేవి రాజసాలు. (1) మాత్స్యం (2) కౌర్మం (3) లైంగం (4) వాయవీయం (శైవం) (5) స్కాందం (6) అగ్నేయం అనేవి తామసాలు.

ఇలా ఒక్కొక్క వర్గంలో ఆరేసి పురాణాలు లెక్కకు వస్తాయి.

సాత్త్వికపురాణాలు శ్రీమహావిష్ణువు యొక్క ప్రాధాన్యాన్నీ, రాజస పురాణాలు చతుర్ముఖ బ్రహ్మ ప్రాముఖ్యాన్నీ, తామస పురాణాలు శివునియొక్క ఆధిక్యాన్నీ వర్ణిస్తున్నాయి. ఈ ముగ్గురు దేవతలు త్రిమూర్తులుగా ప్రసిద్ధులు.

అన్ని పురాణాలూ ఈ దేవత లందరికీ సమప్రాధాన్యాన్ని ప్రతిపాదించక కొన్ని పురాణాలు ఒక దేవతను ఇతర దేవతల కంటె అధికుడని చెప్పడం యుక్తమా? అనే సంశయం కలుగవచ్చు.

వేదం **'ఏకం సత్ విప్రా బహుధా వదంతి'** అని చెప్పింది. అంటే సద్రూపుడైన పరమాత్మ ఒక్కడే, తత్త్వజ్ఞులు ఆయనను నానా నామరూపాలతో వర్ణిస్తారని భావం. పరబ్రహ్మానికి మూర్తమని, అమూర్తమని రెండు రూపాలు కలవనీ; అందులో మూర్తం క్షరం–అంటే నశించే స్వభావం కలిగినదనీ, అమూర్తం నాశం లేనిదనీ గ్రహించాలి. క్షరాక్షరాలు సకలభూతాలలోనూ సమంగా ఉన్నాయి. అక్షరం పరబ్రహ్మం కాగా, ఈ చరాచరజగత్తు క్షరం అవుతున్నది. ఈ విషయాన్ని విష్ణుపురాణం ఇలా వివరించింది.–

> **ద్వే రూపే బ్రహ్మణస్తస్య మూర్తం చామూర్తమేవ చ ।**
> **క్షరాక్షరస్వరూపే తే సర్వభూతేష్వవస్థితే ।**
> **అక్షరం తత్ పరం బ్రహ్మ క్షరం సర్వమిదం జగత్ ॥**

దీనినిబట్టి పురాణాలలో వర్ణింపబడిన త్రిమూర్తులలో ఒకరు పెద్ద, మరొకరు చిన్న అనే తేడాలు లేవు. ఒకే తత్త్వం మూడు రూపాలతో విరాజిల్లుతున్నది. ఆ దేవతలు నిర్వహించే క్రియలలోని భేదమే వారిని మూడు రూపాలతో నిర్దేశించడానికి హేతువైనది. ఈ సంగతినే విష్ణుపురాణం ఈ విధంగా వివరించింది.

సృష్టిస్థిత్యంతకరణాత్ బ్రహ్మవిష్ణుశివాత్మికామ్ ।
స సంజ్ఞాం యాతి భగవాన్ ఏక ఏవ జనార్దనః ॥

ఒక జనార్దనుడే సృష్టి, స్థితి, లయం – అనే మూడు కార్యాలు నిర్వహించడంవల్ల బ్రహ్మ, విష్ణువు, శివుడు అన్న మూడు సంజ్ఞలు పొందాడని భావం.

ఈ సత్యాన్ని గ్రహిస్తే ఆయా దేవతల పట్ల వైషమ్యం తొలగి సమత్వం నెలకొంటుంది. అందువల్ల త్రిమూర్తుల ప్రభావాలను సమయానుగుణంగా వర్ణించే పురాణాల పట్ల సమన్వయదృష్టినే కలిగివుండాలి.

మహాపురాణాల లాగానే ఉపపురాణాలు గూడా పదునెన్మిది ఉన్నాయని కూర్మపురాణం పేర్కొంటున్నది.

ఆద్యం సనత్కుమారోక్తం నారసింహం తథాఽపరమ్ ।
తృతీయం స్కంద ముద్దిష్టం కుమారేణ తు భాషితమ్ ॥

చతుర్థం శివధర్మాఖ్యం సాక్షాన్నందీశభాషితమ్ ।
దుర్వాససోక్తమాశ్చర్యం నారదోక్తమతః పరమ్ ॥

కపిలం వామనం చైవ తథోశనససేవితమ్ ।
బ్రహ్మాండం వారుణం చాథ కాలికాహ్వయమేవ చ ॥

మాహేశ్వరం తథా సాంబం సౌరం సర్వార్థ సంచయమ్ ।
పరాశరోక్తమపరే మారీచం భాస్కరాహ్వయమ్ ॥

ఉపపురాణాలు–(1) సనత్కుమారోక్తం (2) నారసింహం (3) స్కాందం (4) శివధర్మం (5) దౌర్వాసం (6) నారదోక్తం (7) కాపిలం (8) వామనం (మానవం) (9) ఉశనసఃప్రోక్తం (10) బ్రహ్మాండం (11) వారుణం (12) కాలికా పురాణం (13) మాహేశ్వరం (14) సాంబం (15) సౌరం (16) పరాశరోక్తం (17) మారీచం (18) భాస్కరం (భార్గవం).

కొందరి మతం ప్రకారం ఉపపురాణాల సంఖ్య ముప్పదినాల్గుగా నిర్దిష్టమయింది. వీటికి తోడుగా ఔపపురాణాలు అన్న పేరుతో మరొక పదునెన్మిది పురాణాలను గూడ నిర్దేశించడం కద్దు.

పురాణలక్షణం

సర్గశ్చ ప్రతిసర్గశ్చ వంశో మన్వన్తరాణి చ ।
వంశానుచరితం చేతి పురాణం పంచలక్షణమ్ ॥

సర్గం, ప్రతిసర్గం, వంశం, మన్వంతరాలు, వంశానుచరితం–అని పురాణం ఐదు లక్షణాలు గల్గి యుంటుంది. వీటి సంగ్రహవివరణ ఇది.

1. సర్గం – అవ్యాకృతతత్త్వం నుండి మహత్తత్త్వం, దానినుండి అహంకారతత్త్వం, దానినుండి సూక్ష్మభూతాల సృష్టి.
2. ప్రతిసర్గం – మరీచ్యాదులవల్ల జరిగిన చరాచరసృష్టి.
3. వంశం – ఆ యా ఋషుల, రాజుల వంశాలు.

4. మన్వంతరాలు - మనువుల పరిపాలనకాలంలో జరిగిన విషయాలు మరియు ఆ యా మన్వంతరాలలో సప్తఋషులు, మునులు మొదలగువారి వివరణ.

5. వంశానుచరితం–ఆ యా రాజవంశీయులైన రాజుల పరిపాలన మున్నగువాటికి చెందిన కథలను వివరించడం.

పక్షాంతరంలో పురాణాలకు పది లక్షణాలు గూడా నిర్దేశించడం కద్దు. పైన చెప్పిన ఐదు లక్షణాలు సాధారణ పురాణాల లక్షణం కాగా, క్రింద చెప్పబోయే పది లక్షణాలు మహాపురాణాలకు చెందినవని పెద్దల అభిప్రాయం.

అత్ర సర్గో విసర్గశ్చ స్థానం పోషణమూతయః ।
మన్వంతరేశానకథా నిరోధో ముక్తిరాశ్రయః ॥

సర్గం, విసర్గం, స్థానం, పోషణం, ఊతులు, మన్వంతరాలు, ఈశాన కథలు, నిరోధం, ముక్తి, ఆశ్రయం–అనేవే ఈ పది లక్షణాలు.

వీటి సంగ్రహ వివరణ ఇది–

(1) సర్గం: –భగవత్ప్రేరణతో సత్త్వరజస్తమోగుణాలలో క్షోభ ఏర్పడి పంచభూతాలు, పంచతన్మాత్రలు, ఇంద్రియాలు, అహంకారం, మహత్తత్త్వం జనించడాన్ని సర్గమంటారు.

2) విసర్గం:–విరాట్పురుషునినుండి ఉదయించిన బ్రహ్మ వివిధ చరాచరాలను సృష్టిస్తాడు. ఈ సృష్టినే విసర్గమంటారు.

3) స్థానం:–వినాశోన్ముఖమైన సృష్టిని ఒక మర్యాదలో నిల్పడమే స్థానం.

4) పోషణం:–భగవానుడు దుష్టశిక్షణ, శిష్టరక్షణ కావిస్తాడు. జగత్తుకు మేలు గల్గించే సందేశాన్ని అందిస్తాడు. నామరూపాలతో పుష్టిని కల్గిస్తాడు. దీనిని పోషణమంటారు.

5) ఊతులు:–కర్మవాసనలను ఊతులంటారు.

6) మన్వంతరాలు:–మనువులు మారినప్పుడు మన్వంతరకాలంలో తత్కాలానికి చెందిన అధిపతులు భక్తినీ,ధర్మాన్నీ ప్రబోధించే సంఘటనను మన్వంతరమంటారు.

7) ఈశానకథలు:– భగవదవతారాలు, భక్తులు–వీరికి సంబంధించిన చరిత్రలు.

8) నిరోధం:–జీవోపాధులను తనలో లీనం చేసుకొని భగవానుడు యోగనిద్రాముద్రితుడు కావడమే నిరోధం.

9) ముక్తి:–వేరే రూపాలు వదలి స్వస్వరూపంతో వుండడమే ముక్తి. ప్రకృతినుండి విముక్తి లభించే స్థితి ఇది.

10) ఆశ్రయం:– అధిష్ఠానమే ఆశ్రయం. దీని విశుద్ధికొరకే పై తొమ్మిది లక్షణాలనూ వివరించడం జరిగింది.

పై పది లక్షణాలూ మహాపురాణమైన శ్రీమద్భాగవతానికి చక్కగా అన్వయిస్తాయి. పెద్దలు వ్రాసిన గ్రంథాలలో వాటి సమన్వయాన్ని చూడవచ్చు.

పురాణశ్లోక సంఖ్య

భాగవతంలోని ద్వాదశస్కంధమందలి పదమూడవ అధ్యాయంలో ఆ యా పురాణాలలోని శ్లోకాల సంఖ్య ఈ క్రిందివిధంగా నిర్దేశించడమయింది.

బ్రాహ్మం దశ సహస్రాణి పాద్మం పఞ్చోనషష్టి చ ।
శ్రీవైష్ణవం త్రయోవింశచ్చతుర్వింశతి శైవకమ్ ॥
దశాష్టౌ శ్రీభాగవతం నారదం పఞ్చవింశతిః ।
మార్కండేయం నవాగ్నేయం దశ పఞ్చ చతుశ్శతమ్ ॥
చతుర్దశ భవిష్యం స్యాత్తథా పఞ్చ శతాని చ ।
దశాష్టౌ బ్రహ్మవైవర్తం లైఙ్గమేకాదశైవ తు ॥
చతుర్వింశతి వారాహమేకాశీతిసహస్రకమ్ ।
స్కాందం శతం తథా చైకం వామనం దశ కీర్తితమ్ ॥
కౌర్మం సప్తదశాఽఽఖ్యాతం మాత్స్యం తత్తు చతుర్దశ ।
ఏకోనవింశత్సౌపర్ణం బ్రహ్మాండం ద్వాదశైవ తు ॥
త్రయోదశే పురాణానాం సంఖ్యామాహ యథాక్రమమ్ । **(భాగవతం-12-13-2-9)**

1. బ్రహ్మపురాణం	-	10,000	శ్లోకాలు
2. పద్మపురాణం	-	55,000	,,
3. విష్ణుపురాణం	-	23,000	,,
4. వాయుపురాణం	-	24,000	,,
5. భాగవతపురాణం	-	18,000	,,
6. నారదపురాణం	-	25,000	,,
7. మార్కండేయపురాణం	-	9,000	,,
8. అగ్నిపురాణం	-	15,400	,,
9. భవిష్యపురాణం	-	14,500	,,
10. బ్రహ్మవైవర్తపురాణం	-	18,000	,,
11. లింగపురాణం	-	11,000	,,
12. వరాహపురాణం	-	24,000	,,
13. స్కందపురాణం	-	81,100	,,
14. వామనపురాణం	-	10,000	,,
15. కూర్మపురాణం	-	17,000	,,
16. మత్స్యపురాణం	-	14,000	,,
17. గరుడపురాణం	-	19,000	,,
18. బ్రహ్మాండపురాణం	-	12,000	,,
మొత్తం శ్లోకాలు	-	**4,00,000**	

పురాణాలలో ముఖ్యాంశాలు

పురాణాలు మానవకర్తవ్యాలను నిర్దేశిస్తూ కొన్ని ముఖ్యమైన సందేశాత్మక ప్రబోధాలు కావించాయి. ధర్మాన్ని రక్షించవలసిన ఆవశ్యకత, దానివల్ల కలిగే ప్రయోజనాలను వివిధ కథల ద్వారా అవి విశదీకరించాయి.

విశ్వమంతా భగవన్మయమనీ, మోక్షప్రాప్తికి భక్తి ముఖ్యసాధనమనీ, వివిధ వ్రతాలను వాటికి తగిన కాలాలలో అనుష్ఠించి పవిత్రులు కావాలనీ, పుణ్యక్షేత్రాలను సందర్శించాలనీ, ఆ యా క్షేత్రాలలో ప్రతిష్ఠితులైన దేవతలను ఆరాధిస్తే శుభాలు సిద్ధిస్తాయనీ, పితృదేవతలకు శ్రాద్ధవిధిని తప్పక అనుష్ఠించాలనీ, కర్మఫలం అనుభవించక తప్పదనీ ఇత్యాదిగా పురాణాలు ప్రబోధించే అంశాలు అందరికీ గమనింపదగినవై యున్నాయి.

వర్ణనాశైలి

కవితా రూపంలో గల రచనలను కవులు ఆలంకారిక ప్రక్రియలో కొనసాగిస్తారు. ఈ ప్రక్రియ పాఠకులను ఆకర్షిస్తుంది. యథాతథంగా సాగే కథాకథనంతోపాటు అవసరమైనచోట అలంకార ప్రక్రియనాశ్రయించి కవులు వర్ణన నిర్వహిస్తారు. అతిశయోక్తులను గూడా మేళవిస్తారు. ఉన్నదున్నట్లు చెప్పడం యథాతథకథనం కాగా కథనంలో ఉపమా, రూపకాదులను ఆశ్రయించడం ఒక విశిష్టమైన పద్ధతి. వేదాలలో గూడ ఈ పద్ధతి కనిపిస్తుంది. ఉదాహరణకు కఠోపనిషత్తులో

ఆత్మానం రథినం విద్ధి శరీరం రథమేవ తు ।
బుద్ధిం తు సారథిం విద్ధి మనః ప్రగ్రహమేవ చ ॥

ఇత్యాదిగా శరీరానికి రథరూపకల్పన చేసి ఆత్మను రథికునిగా పేర్కొనడం జరిగింది. సూర్యుని కిరణాలలోని ఏడు రంగులను ఏడు గుర్రాలుగా వర్ణించడం గూడా ఈ ప్రక్రియకు చెందిన విషయమే.

పురాణాలు గూడా ఈ శైలిని విస్తృతంగా అనుకరించాయి. అతిశయోక్తిని గూడా విపులంగా వినియోగించాయి. ఈ పద్ధతి పురాణ వాఙ్మయానికి శోభావహమైం దనడంలో ఏ మాత్రం సందేహం లేదు.

పురాణ ప్రయోజనం

యథా పాపాని పూయన్తే గంగావారివిగాహనాత్ ।
తథా పురాణశ్రవణాద్దురితానాం వినాశనమ్ ॥

గంగాజలంలో స్నానం చేయడంవల్ల పాపాలు నశించినట్లే పురాణశ్రవణంవల్ల దురితాలు నశిస్తాయి.

సదాచారప్రబోధం

యజ్ఞాలు, దానాలు, తపస్సులు ఇత్యాదిగా ఎన్ని చేసినా – సదాచారం లేనివాడు ఆత్మోన్నతి పొందలేడు.

దురాచారో హి పురుషో నేహ నాముత్ర నందతి ।

అన్నట్లు దురాచారుడైన మనుజుడు ఇహపరలోకాలు రెండింటా సుఖానికి దూరమౌతాడు.

ఆచారహీనం న పునన్తి వేదా యద్యప్యధీతాః సహ షడ్భిరంగైః ।

సదాచారం లేనివాడిని వేదాలు గూడా పవిత్రుణ్ణి చేయజాలవు. దురాచారాలు, సదాచారాల స్వరూపాన్ని వివిధ కథల ద్వారా పురాణాలు చక్కగా నిరూపించాయి. రామాయణంలో రామాదివద్వర్తితవ్యం, న రావణాదివత్, –రామాదులవలె ప్రవర్తించాలి కాని, రావణాదులవలె ప్రవర్తించరాదు అన్న విధంగా నీతిప్రబోధం పురాణాలలో రమణీయంగా చేయబడింది.

అందువల్ల పురాణ పఠన శ్రవణాలు సమాజాభ్యున్నతి కల్గిస్తాయి. పూర్వం గ్రామసీమలలో గూడ రాత్రివేళల పౌరాణికులు పురాణ పఠనం కావించి, అందలి విశేషాలను సామాన్య జనులకు బోధించేవారు. ఈ బోధ ప్రజానీకానికి సముచితసంస్కారం కల్గించేది. తద్వారా వారు ఆత్మోన్నతి కల్గించే మార్గంలో నడిచేవారు.

కాలనిర్ణయం

పురాణాల కాలనిర్ణయం అంత సుకరం కాదు. శ్రీ శంకరభగవత్పాదులు మున్నగువారు తమ రచనల్లో పురాణాల నుదాహరించియున్నారు. బాణకవి (క్రీ.శ.625) తన హర్షచరిత్రలో **పురాణేషు వాయుప్రలపితం** అని చెప్పి వాయుపురాణాన్ని ప్రస్తావించాడు.

కలియుగరాజులను నిర్దేశించిన పురాణాలు గూడా ఉన్నాయి. విష్ణుపురాణంలో మౌర్యవంశం పేర్కొనబడింది. మాత్స్యపురాణం–దాక్షిణాత్యులైన ఆంధ్రరాజులను (క్రీ.శ 225) ప్రస్తావించింది. గుప్తరాజుల ప్రస్తావన వాయుపురాణంలో కనిపిస్తున్నది.

లక్ష శ్లోకాలుగల ఇప్పటి మహాభారతం రూపొందకముందే పురాణాల ఉనికిని పరిశోధకులు గుర్తించారు. మహాభారతవక్త అయిన రౌమహర్షణి పురాణాలలో పారంగతుడు. అతని తండ్రిగూడ పౌరాణికుడుగా ప్రసిద్ధుడే. మహాభారతంలో పెక్కు శ్లోకాలు పురాణాంతర్గత శ్లోకాలతో సామ్యం కల్గి వున్నాయి. మహాభారతంలోని కొన్ని ఆఖ్యానాల ప్రాచీన స్వరూపం పురాణాలలో గోచరిస్తున్నది. దీన్ని బట్టి మహాభారతం కంటె పురాణాలు ప్రాచీనమైనవని విశ్వసించవచ్చు.

కౌటిల్యుని అర్థశాస్త్రంలో పురాణ ప్రస్తావన ఉన్నది. అపమార్గగాములైన రాజకుమారులను పురాణోపదేశం ద్వారా సన్మార్గగాములను చేయాలని కౌటిల్యుడు వచించాడు. రాజుకు సంబంధించిన అధికారులలో పౌరాణికుడు గూడా ఒకడని కౌటిల్యుడు పేర్కొన్నాడు. అంచేత కౌటిల్యుని కంటె పురాణాలు ప్రాచీనాలని భావించడం సముచితం. కౌటిల్యుడు క్రీ.పూర్వం తృతీయ శతకం వాడని అనేకుల భావన. అందువల్ల ఆ కాలానికంటె ముందే పురాణాలుండేవని భావించాలి.

గౌతమ–ఆపస్తంబ సూత్రగ్రంథాలలో గూడ పురాణప్రస్తావన వస్తుంది. రాజు శాసనవ్యవస్థలో వేదంతోపాటు పురాణాన్ని గూడా ప్రముఖంగా గ్రహించాలని గౌతముడు చెప్పాడు. అతిప్రాచీన పురాణభాగాలనుండి మూడు శ్లోకాలను ఆపస్తంబ ధర్మసూత్రాలలో ఉదాహరించడం జరిగింది. ఆ శ్లోకాలతో సామ్యం కల శ్లోకాలు నేటి పురాణాలలో లభిస్తున్నాయి. కాబట్టి సూత్రకాలంలో గూడా పురాణ గ్రంథాలుండేవని బోధపడుతున్నది.

మరొక ముఖ్యాంశ మేమంటే అతిప్రాచీనములైన ఉపనిషత్తులలో గూడా పురాణ ప్రస్తావన కలదు, ఛాందోగ్యంలో నారద సనత్కుమారుల సంవాదంలో ఇతర శాస్త్రాలతోపాటు పురాణాలను పేర్కొన్నారు.

"ఋగ్వేదం భగవోఽధ్యేమి యజుర్వేదం సామవేదమాథర్వణం చతుర్థమితిహాస పురాణం పంచమం వేదానాం వేదం" (ఛాందో 7-1-2).

అందుచేత క్రీ.పూ 600 సం॥ పూర్వం పురాణాల నిర్మాణం జరిగిందని పెద్దల భావన. వాటికి మూల భూతమైన పురాణా లిప్పుడు లభించవు.

పురాణాలు ఏ ఒక్క శతాబ్దానికో చెందిన రచనలు కావు. కాలక్రమములో వాటిలో క్రొత్తక్రొత్త అధ్యాయాలు చేర్చడం జరిగింది. గుప్తకాలానికి పురాణాలు నేటిరూపం సంతరించుకొన్నాయని చెప్పవచ్చు.

పురాణ వైశిష్ట్యం

పురాణాలు సామాన్యులకు దుర్బోధమైన వేదార్థాలను వారికవగతమయ్యే రీతిలో కథలు జోడించి చెప్పాయి. ప్రాచీన కాలానికి చెందిన భారతీయ సమాజ స్వరూప స్వభావాలను అర్థం చేసుకోవడానికి పురాణాలే ప్రామాణికమైన ఆధారాలు. ఆనాటి ఋషుల చరిత్రలను మనం పురాణాలనుండే సమగ్రంగా గ్రహించడానికి వీలవుతుంది.

భారతభౌగోళికస్థితి, నదీనదపర్వతాల ఉనికి, వివిధ తీర్థాల స్థితిగతులు, పలువృక్షాలు, జంతువులు- వీటిని గూర్చిన విజ్ఞానం కూడా పురాణాలలో లభిస్తుంది.

పురాణాలను, శిలాశాసనాదులగు ఇతర ప్రామాణికాధారాలతో తులనాత్మకంగా పరిశీలిస్తే గత చరిత్రకు చెందిన అనేక విషయాలు తేటతెల్లమవుతాయి.

కాబట్టి భారతీయులే కాక పాశ్చాత్యులు గూడా పురాణాలను శ్రద్ధతో పరిశోధించి మానవజాతి గతచరిత్రను సమగ్రంగా అవగతం చేసుకోవచ్చు.

ధార్మికంగానూ, ఆధ్యాత్మికంగానూ సామాన్యప్రజలను చైతన్యవంతులను చేయడంలో పురాణాలు నిర్వహించిన పాత్ర ఎంతో గణనీయమైనది. మొత్తం పదునెనిమిది పురాణాలలోని శ్లోకాల సంఖ్య నాల్గు లక్షలని ముందే చెప్పుకొన్నాం. ఇంత విస్తృతమైన గ్రంథరాశి సంస్కృతభాషానిబద్ధమై లభిస్తున్నది.

వేదాలలోని నిగూఢమైన వేదాంతతత్త్వాన్ని సామాన్య జనులకు గూడా అర్థం కావాలనే దృష్టితో ఆఖ్యానాలతోనూ, ఉపాఖ్యానాలతోనూ పురాణాలు వివరించాయి.

ప్రాచీనకాలంలో యజ్ఞాలు నిర్వహించే ప్రదేశాలలో పురాణపఠనం విధిగా నిర్వహింపబడేది. పురాణపఠనం పాపనివారకమనీ, పుణ్యప్రదమనీ ప్రశంసింపబడింది. పౌరాణికులు పురాణాలను పఠిస్తూ ప్రవృత్తి నివృత్తి రూపాలైన రెండు విధాల ధర్మాలనూ ప్రజలకు వివరించేవారు.

పురాణాలను ఆధారంగా చేసుకొని కవులు కావ్యనాటకాదులు విస్తృతంగా రచించారు. భారతీయుల జీవితాలకూ, విశ్వాసాలకూ పురాణాలు శతాబ్దాల తరబడి మార్గనిర్దేశకా లయ్యాయి. వేదార్థాలను అతివిస్తృతస్థాయిలో జనానీకానికి అందజేయడానికి పురాణాలు ముఖ్యసాధనా లయ్యాయి.

వేదాంతతత్త్వాన్ని బోధించడాని కవతరించిన శ్రీశంకర రామానుజాద్యాచార్యులు గూడా అవసరమైన చోట పురాణవచనాలను ప్రమాణాలుగా పేర్కొనియున్నారు.

కర్మ-భక్తి-ధ్యాన-జ్ఞాన యోగాలు మోక్షసౌధాన్ని అధిష్ఠించడానికి సోపానాలు. ఇందులో కలియుగంలో భక్తియొక్కటే సులభమైన తరణోపాయమని పెద్దలు పేర్కొన్నారు.

"కలౌ భక్తిః కలౌ భక్తిః భక్త్యా కృష్ణః పురః స్థితః" అన్నట్లు కలియుగంలో అనన్యభక్తిచేతనే భగవదనుగ్రహం కలుగుతుందన్న సత్యాన్ని భాగవతాది పురాణాలు ప్రహ్లాదచరిత్రాది కథల ద్వారా మనోజ్ఞంగా నిరూపించాయి.

అట్లే గృహస్థులు పాటించవలసిన పలురకాలైన కర్మవిధానాలూ, వ్రతాలూ, వాటివల్ల కలిగే ఫలితాలూ పురాణాలలో ఎడనెడా విశదంగా నిరూపించబడ్డాయి. ఈ విధంగా కర్మయోగ నిరూపణం గూడా పురాణాలలో కనిపిస్తుంది. వివిధ విషయాలతో కూడిన పురాణాలను విజ్ఞానసర్వస్వాలుగా, జ్ఞాననిలయాలుగా భావించవచ్చు.

పురాణాలలో వివిధ ప్రదేశాలలో గల నానాతీర్థాలు, ఆ తీర్థాల ప్రాముఖ్యం, తీర్థయాత్రలవల్ల కలిగే ప్రయోజనాలు మొదలైన విషయాలు పలుచోట్ల వివరింపబడివున్నాయి. తీర్థయాత్రలవల్ల ప్రజలలో ఏకజాతీయతాభావం పెంపొందుతుంది. గతచరిత్రకు సంబంధించిన విజ్ఞానం భావిపురోగతికి దోహదం చేస్తుంది. పురాణాలను క్షుణ్ణంగా పరిశీలిస్తే భారతదేశ గతచరిత్రకు చెందిన ఎన్నో విషయాలు గోచరిస్తాయి. "పురోఽభివృద్ధి గోరువారు పూర్వవృత్తాంతమును మరువరాదు" అని శ్రీమలయాళస్వామి సూక్తి. అందుచేత చారిత్రక పరిశోధకులు పురాణాలను పరిశీలనాత్మకమైన దృష్టితో అధ్యయనం చేయవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. తమ పాలనలో ఎదురయ్యే సమస్యలను ఆనాటి పాలకులు పురాణ వృత్తాంతాలను ప్రమాణంగా పరిగ్రహించి పరిష్కరించేవారు. అందుచేత రాజధర్మ పరిజ్ఞానానికి గూడా పురాణ సారస్వతం ఉపకరిస్తుంది.

పురాణాలలో బోధింపబడిన నీతులను కేవలం హిందూజాతికి మాత్రమే పరిమితాలని భావించరాదు. ప్రపంచజను లందరికీ ఉపయోగపడే శాశ్వత నైతికబోధ లందులో ఉన్నాయి.

ఆధునిక విజ్ఞానశాస్త్రానికి సంబంధించిన పలు అంశాలు పురాణాలలో నిర్దిష్టములై యున్నాయని ఇప్పటి శాస్త్రజ్ఞులలో కొందరి భావన. అందుచేత వైజ్ఞానిక పరిశోధకులకు గూడా పురాణజ్ఞానం అవసరమే.

అతి ప్రాచీన కాలంనుండి నేటివరకూ అమూల్య సారస్వతరూపంలో మనకు ఉపలబ్ధమవుతున్న వాఙ్మయంలో పూర్వోక్తపద్ధతిలో పురాణాలకు గల ప్రాముఖ్యాన్ని గుర్తించి మానవజాతి పురోగతికి వాటిని వినియోగించుకొని సర్వతోముఖమైన శ్రేయస్సును పొందుదుము గాక!

సముద్రాల లక్ష్మణయ్య
పూర్వ ప్రత్యేకాధికారి
పురాణ ఇతిహాస ప్రాజెక్టు - తి.తి.దే.

అష్టాదశపురాణాల సంగ్రహపరిచయం

1. బ్రహ్మపురాణం

పురాణాలలో మొదటిది బ్రహ్మపురాణం. ఇది విష్ణుదేవుని మాహాత్మ్యాన్ని విశదీకరిస్తుంది. ఆ దేవుని శిరస్సుగా వర్ణింపబడిన ఈ పురాణం ధర్మార్థకామమోక్షాలనే చతుర్విధ పురుషార్థాల ప్రాప్తికి తగిన ఉపాయాలను వివరిస్తుంది.

14,000 శ్లోకాలు గల ఈ పురాణంలో పలు ఆఖ్యానాలు, ఉపాఖ్యానాలు ఉన్నాయి. నైమిశారణ్య వర్ణనం, ప్రళయస్వరూపం, హరిశ్చంద్ర సగరాదుల చరిత్రలు, సప్తద్వీపాలు, పార్వతీ స్వయంవరం, సాగరస్నానవిధి, గోదావరీ పవిత్రత, క్షీరసాగరమథనం, దధీచి వృత్తాంతం, వరాహాద్యవతారాలు–ఇత్యాదిగా అనేక విషయాలు ఇందులో నిబంధింపబడి వున్నాయి.

భారతావని, దండకారణ్యం, గంగాదినదుల ప్రాశస్త్యం విస్తృతంగా ఈ పురాణంలో వివరించచడ మయింది.

ప్రతిపురాణంలోనూ తత్త్వాన్నీ, నీతినీ, ధర్మాన్నీ బోధించే కథలు ఉంటాయి. ఈ పురాణంలోని కథలలో 'కందు' మహర్షి కథ ఎంతో ఆసక్తిదాయకంగా ఉన్నది. అతని తపస్సుకు భంగం కల్గించడానికి దేవతలు పంపిన అప్సరస ప్రమ్లోచ దాదాపు 900 సంవత్సరాలు అతనితో విహరించి అతని నియమానికి భంగం కల్గిస్తుంది.

చివరికి తన పొరబాటు గుర్తించిన మహర్షి పురుషోత్తమ క్షేత్రమనే పూరీ జగన్నాథక్షేత్రానికి వెళ్ళి శ్రీ జగన్నాథుని సేవించి ముక్తుడవుతాడు.

తరువాతి కథలలో కార్తవీర్యార్జునుని వృత్తాంతం ప్రముఖమైనది. ఇది మిక్కిలి విస్తృతమైన చరిత్ర. దత్తాత్రేయుని అనుగ్రహంతో సహస్రబాహువులు కల్గి శిష్టరక్షణ కావిస్తూ రావణాదులను జయించి ధర్మబద్ధంగా రాజ్యపాలన గావించిన ఈ రాజు చివరికి తనకంటె బలవంతుడైన పరశురామునిచే వీరమరణం పొందుతాడు. ఏడువందల యాగాలు నిర్వహించినవాడుగా ఈతడు ప్రసిద్ధుడయ్యాడు. విష్ణుతత్త్వం బోధించే పలు విషయాలు ఇంకా ఎన్నో ఈ పురాణంలో గోచరిస్తాయి.

ఇదం యః శ్రద్ధయా నిత్యం పురాణం వేదసమ్మితమ్ ।
యః పఠేచ్ఛృణుయాన్మర్త్యః స యాతి భువనం హరేః ॥

వేదతుల్యమైన ఈ పురాణాన్ని శ్రద్ధతో చదివినవాడు, లేక విన్నవాడు హరినిలయమైన వైకుంఠం చేరుకుంటాడని ఫలశ్రుతి.

2. పద్మపురాణం

మహావిష్ణువుయొక్క హృదయస్థానంతో పోల్చబడిన పురాణమిది. సృష్టి ప్రక్రియ ఆ దేవుని నాభికమలంనుండి జన్మించిన బ్రహ్మద్వారా మొదలయింది. ఆ ప్రక్రియయే ఈ పురాణాని కాధారం. కాన ఇది 'పద్మపురాణ' మనబడింది. ఇందులో 55,000 శ్లోకాలున్నాయి.

సృష్టిఖండం, భూఖండం, స్వర్గఖండం, పాతాళఖండం, ఉత్తరఖండం – అని ఐదు ఖండాలుగా విభజింప బడిన ఇందులో మొత్తం 641 అధ్యాయాలున్నాయి.

కాలపరిమాణం, క్షీరసాగరమథనం, దక్షయాగధ్వంసం, చంద్రవంశం, వామనావతారం, తారకాసుర వృత్తాంతం, నృసింహావతారం, సదాచారం – ఇత్యాదిగా పలువిషయాలను ఈ పురాణం వివరిస్తున్నది.

శరీరవర్ణనం, ఆత్మస్వరూపం, విష్ణుభక్తి మహిమ, కార్తికమాస ప్రాశస్త్యం, దీపావళీమాహాత్మ్యం పూజావిధానాలు, యుగధర్మాలు మున్నగు విషయాలను విపులంగా ఇందులో చూడవచ్చు.

ప్రపంచమంతా శ్రీహరిమయమే అని ఈ పురాణం ఘోషిస్తున్నది. ఇందులో పేర్కొన్న సదాచారాలు అవశ్యం ఆచరింపదగి వున్నాయి.

తల్లిదండ్రుల విశిష్టతను ప్రశంసించి **"మాతరం పితరం తస్మాత్సర్వయత్నేన పూజయేత్"** –సకల ప్రయత్నాలతోనూ తల్లిదండ్రుల నర్చించాలి అని ఈ పురాణం బోధించింది. ఇది **'మాతృదేవో భవ, పితృదేవో భవ'** అన్న శ్రుతివచనానికి వివరణగా ఉన్నది.

ఇంకా ఉసిరికాయకు గల పవిత్రత, దాన్ని సేవించే విధానం విపులంగా ఇందులో పేర్కొనబడింది. అట్లే తులసికి గల ప్రాశస్త్యం కీర్తించబడింది.

పురాణపఠనావశ్యకత, దానివల్ల కలిగే ప్రయోజనం, కలియుగ ధర్మాలు, ఆ యుగంలో స్త్రీపురుషుల స్వభావాలు, జనుల విపరీతప్రవృత్తులు విశదంగా ఇందులో నిరూపింపబడి యుండడం గమనార్హం.

కలియుగంలో ధర్మాత్మకమైన కర్మను మనుజుడు భక్తితో భగవదర్పితంగా ఆచరిస్తే సర్వపాప నిర్ముక్తు డవుతాడని ఈ పురాణం ప్రతిపాదించింది. ఇలా ఏ పురాణాన్ని పరిశీలించినా నానావిధములైన, ఆత్మోన్నతి హేతువులైన, మానవ జీవితాని కవసరములైన పెక్కు విషయాలు విశదీకరింపబడి వున్నాయి.

ఈ పద్మపురాణాన్ని చదివేవారికి, వినేవారికి కోరిన కోర్కెలన్నీ శ్రియఃపతి అనుగ్రహంవల్ల సిద్ధిస్తాయని ఫలశ్రుతి.

యద్యదిష్టం పఠంత్యేతత్ శృణ్వంతి చ ముముక్షవః ।
లభన్తే తత్తదేవాశు ప్రసాదాత్కమలాపతేః ॥

3. విష్ణుపురాణం

శ్రీ మహావిష్ణువు యొక్క దక్షిణబాహువుగా విష్ణుపురాణం వర్ణించబడింది. ఆరు అంశాలుగా విభజింపబడిన ఈ పురాణంలో 126 అధ్యాయాలున్నాయి. విష్ణుధర్మోత్తరంతోగూడ కలుపుకొంటే ఇందలి మొత్తం శ్లోకాలు 23,000. పరాశరమహర్షి మైత్రేయునకు జెప్పిన పురాణ మిది.

ఇరవైనాలుగు తత్త్వాలు, జగదావిర్భావం, కాలస్వరూపం, వరాహావతారం, భూవిభజన, సనకాదుల జననం, స్వాయంభువమనువు పుట్టుక, దక్షపుత్రికల వివాహం, ధ్రువచరిత్ర, నృసింహావతారం, భరతవంశవర్ణన, జడభరతోపాఖ్యానం–ఇత్యాదిగా అనేకాంశాలు ఈ పురాణంలో విశదీకరింపబడ్డాయి.

మరియు బ్రహ్మజ్ఞాన ప్రాశస్త్యం, వేదవిభాగం, బ్రహ్మచర్యాద్యాశ్రమాలు, దేవాసురుల యుద్ధం, సగరవంశవర్ణన, శ్రీకృష్ణావతారం, కలి లక్షణాలు, నామసంకీర్తన ప్రభావం మొదలైన విషయాలు గూడ విపులంగా ఇందులో నిరూపించడమైనది.

వైష్ణవులకు మిక్కిలిగా ఆరాధనీయమైన పురాణమిది. వైష్ణవసిద్ధాంతాలకు మూలభూతమైన గ్రంథం గాన శ్రీభగవద్రామానుజాచార్యులు ఆ సిద్ధాంతప్రచారాన్ని ఈ పురాణాన్ని ఆధారంగా స్వీకరించి నిర్వర్తించారు.

శరణాగతి, భగవద్గుణ కర్మ నామాల గానం, విష్ణ్వర్పణంగా కర్మల ననుష్ఠించడం మొదలగు అంశాలకు ఈ పురాణంలో ప్రాముఖ్యం ఇవ్వడమయింది.

మరియు శ్రవణం, కీర్తనం మున్నగు నవవిధభక్తి మార్గాలు ఇందులో విస్తృతంగా ప్రతిపాదింపబడి వున్నాయి. భాగవతపురాణం లాగా ఈ పురాణం గూడా భక్తియోగానికి ప్రాధాన్యాన్ని ప్రతిపాదించింది.

దేవతలను ఆరాధించేవారిలో అనేకులు శివకేశవులలో భేదాన్ని చూస్తారు. అయితే ఈ పురాణంలో–

అవిద్యామోహితాత్మానః పురుషా భిన్నదర్శినః ।
వదంతి భేదం పశ్యన్తి చావయోరన్తరం హర! ॥

'అవిద్యామోహితులే నీకూ, నాకు భేదం పాటిస్తారు' అని కేశవుడు శివునితో చెప్పాడు. ఈ శివకేశవాభేద సిద్ధాంతం ఇక్కడ గమనార్హం.

ఈ పురాణంలో జడభరతుని వృత్తాంతం మిక్కిలి ఆసక్తిని రేకెత్తించేదిగా వర్ణితమై వున్నది. ఆతని మూడు జన్మలకు సంబంధించిన విశేషాలు గ్రహిస్తే మనలో జ్ఞానవిజ్ఞానాలు వికసిస్తాయి.

యో నరః పఠతే భక్త్యా యః శృణోతి చ సాదరమ్ ।
తావుభౌ విష్ణులోకం హి వ్రజేతాం భుక్తభోగకౌ ॥

అన్నట్లు – భక్తితో దీన్ని పఠించేవాడు, ఆదరంతో వినేవాడూ ఈ లోకంలో భోగాలనుభవించి తుదకు విష్ణుసాన్నిధ్యం చేరగలరని ఫలశ్రుతి.

4. వాయుపురాణం

వాయుదేవుడు శివలీలలను వివరించిన పురాణమిది. అందుచేత దీన్ని 'శివపురాణ' మని కూడా పేర్కొంటారు. **'చతుర్వింశతి సాహస్రం పురాణం'** –అనుటవల్ల ఇందులో 24,000 శ్లోకాలున్నాయని గ్రహించాలి. కాని ఇపుడు మనకు లభించేవి 11,000 శ్లోకాలు మాత్రమే. శ్లోకసంఖ్యలలో ఇట్టి వ్యత్యాసాలు కొన్ని పురాణాలలో కనిపిస్తున్నాయి. ఈ పురాణం మహావిష్ణువుయొక్క వామభుజంగా పేర్కొనబడింది.

ఇందులో (1) ప్రక్రియాపాదం (2) అనుషంగ పాదం (3) ఉపోద్ఘాత పాదం (4) ఉపసంహార పాదం–అని నాలుగు పాదాలున్నాయి.

భూగోళ–ఖగోళాలు, బ్రహ్మాండసృష్టి, యుగధర్మాలు మున్నగు విషయాలతోపాటు కైలాసవర్ణన, గంగావతరణవర్ణన మొదలగు వర్ణనలు గూడా ఇందు గోచరిస్తాయి.

ఇది శైవపురాణం. అయినా సందర్భానుగుణంగా మహావిష్ణువు గూడా ఇందు వర్ణింపబడినాడు.

వివేకవిజ్ఞానాలు కావాలంటే తప్పకుండా పురాణాల అధ్యయనం చేయాలని ఈ పురాణం చెబుతున్నది.

యో విద్యాచ్చతురో వేదాన్ సాంగోపనిషదో నరః ।
న చేత్పురాణం సంవిద్యాన్నైవ స స్యాద్విచక్షణః ॥

నాల్గువేదాలు, వేదాంగాలు, ఉపనిషత్తులు చదివినా పురాణం చదువనివాడు విచక్షణుడు కాలేడని భావం. కాబట్టి పురాణాధ్యయనం ఎంత ముఖ్యమైనదో గ్రహించాలి.

ఈనాడు మనం యోగాభ్యాసాని కెంతో ప్రాముఖ్యం ఇస్తున్నాము. వాయుపురాణంలో యోగాని కవసరమైన ప్రాణాయామాన్ని గూర్చి విపులమైన వివరణ ఉన్నది. బ్రహ్మప్రాప్తికది అవసరం. శాంతి, ప్రశాంతి, దీప్తి, ప్రసాదం–అనే నాల్గు ప్రయోజనాలు దానివల్ల కల్గుతాయని ఈ పురాణం చెబుతున్నది.

ఓంకారోపాసన గూడా ఇందులో చెప్పడమయింది. ఓంకారధ్యానపరులకు శివసాయుజ్యం కల్గుతుందని ఇందులో నిరూపించబడివున్నది.

'రమణకం' అనే దేశంలోని ప్రజలు పదివేల సంవత్సరాలు, 'హిరణ్యకం' లోనివారు పదకొండు వేల సంవత్సరాలు జీవిస్తారంటూ అక్కడి ప్రకృతివిశిష్టతను ఇక్కడ చెప్పడమయింది.

అక్కడి చెట్లు ఫలాలతోపాటు వస్త్రాలనూ, ఆభరణాలను గూడా ప్రసాదిస్తాయని చెప్పడం ఆశ్చర్యావహంగా ఉన్నది. కథాకథనంకంటే ఇట్టి వర్ణనలే ఈ గ్రంథంలో ఎక్కువగా గోచరిస్తాయి.

గయాక్షేత్రప్రాముఖ్యం గూడా ఇందు చెప్పడమయింది. గయను సందర్శించిన పుత్రుడు పితరులకు రక్షకుడనీ, అతణ్ణి చూచి పితరులు హర్షిస్తారనీ ఇక్కడ పేర్కొనబడింది.

ఈ పురాణకీర్తనం శ్రవణం,ధారణ–కీర్తినీ, పూర్ణాయువునూ, పాపనాశాన్నీ కల్గిస్తాయని ఫలశ్రుతి.

ధన్యం యశస్యమాయుష్యం పుణ్యం పాపప్రణాశనమ్ ।
కీర్తనం శ్రవణం చాస్య ధారణం చ విశేషతః ॥

5. శ్రీమద్భాగవతం

శ్రీమహావిష్ణుని ఊరువుగా వర్ణించబడిన శ్రీమద్భాగవతంలో పండ్రెండు స్కంధాలు, 18,000 శ్లోకాలున్నాయి. ఇది భక్తియోగ ప్రాముఖ్యాన్ని కథలతో, ఉపకథలతో వివరించే పురాణం.

'నిగమకల్పతరోర్గళితం ఫలం'–అన్నట్లు వేదమనే కల్పవృక్షంనుండి జారిపడిన పండుగా దీన్ని కీర్తించడమయింది. భక్తితోపాటు జ్ఞానవైరాగ్యాలు గూడా ఇందు నిర్దేశించబడి వున్నాయి.

వేదాలను విభజించిన వ్యాసుడు ధర్మనిరూపకమైన ఒక లక్షశ్లోకాలతో గూడిన మహాభారతం రచించాడు. అయినా మనశ్శాంతి లేక, చింతాక్రాంతు డయ్యాడు. నారదుడాయన చెంతకు వచ్చి 'నీ చింతకు కారణ మేమి?' అని ప్రశ్నించాడు! 'అదేదో నీవే చెప్పు' అని వ్యాసుడన్నాడు.

అపుడు నారదమహర్షి ఊరక ధర్మాలు చెప్పితే చాలదు, విష్ణుకథాప్రధానమైన గ్రంథం రచిస్తే కానీ నీకు మనశ్శాంతి లభించదంటాడు. ఆయన చెప్పినట్లు వ్యాసభగవానుడు భగవంతుని గుణ కర్మ నామాలను కీర్తించే విష్ణుకథలను వర్ణిస్తూ భాగవతం రచించాడు, మనశ్శాంతి పొందాడు. భాగవత రచనకు చెందిన వృత్తాంతమిది.

దీని కథాప్రారంభమిది–పాండవవంశంలో జన్మించిన పరీక్షిత్తు వేటకు వెళ్ళి, అలసిపోయి, తపోనిమగ్నుడైన శమీక మహర్షిని నీళ్ళిమ్మంటాడు. నిర్వికల్పధ్యానంలో ఉన్న ఆ ముని కతని మాట వినిపించదు. కోపించిన రాజు అతని మెడలో సర్పశవాన్ని వేసి శృంగిశాపానికి గురి అవుతాడు. వారం దినాలలో మరణించవలసిన దుఃస్థితి పాలవుతాడు.

అంతట రాజకార్యాలు త్యజించి ప్రాయోపవిష్టుడై ఏడు దినాలలో ముక్తి పొందే ఉపాయమేమి? అని విచారిస్తాడు. అపుడు శుకుడు వచ్చి అందుకు ఉపాయం భాగవత శ్రవణమే అని చెప్పి భాగవత ప్రవచనం కావిస్తాడు.

ఇందులో ధ్రువుడు, జడభరతుడు, అజామిళుడు, దధీచి, ప్రహ్లాదుడు, గజేంద్రుడు, అంబరీషుడు, రంతిదేవుడు మున్నగు భాగవతుల కథలు మనోజ్ఞంగా వివరింపబడివున్నాయి. ఆ కథల ద్వారా విజ్ఞానవైరాగ్యభక్తివిశేషాలు నిరూపితాలయ్యాయి.

దశమస్కంధం ఇందులో అతిముఖ్యమైనది. శ్రీకృష్ణావతార ప్రతిపాదకమైన ఇందులో శ్రీకృష్ణుని లీలలు, ఆయన కావించిన కంసాదుల సంహారం, రుక్మిణీ కల్యాణం, కుచేలాదుల ఉద్ధరణ–ఇత్యాదిగా పలు అంశాలు రసవత్తరంగా చిత్రించబడినాయి.

ముఖ్యంగా గోపికలు కృష్ణుణ్ణి ప్రేమించిన ఘట్టం మనోహరంగా ఉన్నది. మధురభక్తితత్త్వం ఇందులో ప్రతిపాదితమయింది.

పదకొండవ స్కంధంలోని ఉద్ధవగీత ప్రశస్తం. శ్రీకృష్ణుడు అవసానదశలో గావించిన ఆధ్యాత్మిక ప్రబోధమిది. చివరి స్కంధంలో కలి స్వరూపం నిరూపించబడింది. మార్కండేయ చరిత్రను గూడా ఇందులో చూడవచ్చు.

'విద్యావతాం భాగవతే పరీక్షా' అన్నట్లు విద్యావంతుల జ్ఞానవిజ్ఞానాలను భాగవతం ద్వారా పరీక్షించవచ్చు. భగవన్నామసంకీర్తనం సర్వపాపప్రణాశకమని భాగవతం చెప్పింది. భారతావనిలో జన్మించి గూడా భాగవతం విననివారు ఆత్మఘాతకులని పేర్కొనబడ్డారు.

భారతే మానవం జన్మ ప్రాప్య భాగవతం న యైః ।
శ్రుతం పాపపరాధీనైరాత్మఘాతస్తు తైః కృతః ॥

భాగవత శ్రవణ ఫలం ఈ క్రిందిశ్లోకంలో ఇలా పేర్కొనబడింది.

మత్కథావాచనే నిత్యం మత్కథాశ్రవణే రతమ్ ।
మత్కథాప్రీతమనసం నాహం త్యక్ష్యామి తం నరమ్ ॥

'నా కథలు పఠించేవాడు, వినేవాడు, నా కథలచే సంతోషించేవాడు అయిన జనుణ్ణి నేను వదలను' అని శ్రీకృష్ణుడు చెప్పాడు.

6. నారదపురాణం

మహావిష్ణువుయొక్క నాభిస్థానంగా కీర్తింపబడిన పురాణమిది. నారదుడు ఉపదేశించినది కావడం వల్ల 'నారద పురాణం' అనే పేరు దీనికి స్థిరపడింది. ఇందులో ఇరువదియైదువేల శ్లోకాలున్నాయి.

పూర్వఖండం, ఉత్తరఖండం అని ఈ పురాణం రెండు ఖండాలుగా విభక్తమై యున్నది. పూర్వఖండంలో 125, ఉత్తరఖండంలో 82 అధ్యాయాలు ఉన్నాయి.

పురాణాల ప్రశస్తి. శివకేశవుల అభేదం, భక్తికి గల ప్రాముఖ్యం, సదాచార ప్రాశస్త్యం, పౌరాణికుల గురుత్వం–ఇత్యాదులు ఇందులో చక్కగా కీర్తితాలయ్యాయి.

సత్యహరిశ్చంద్రుని గాథ ఇందులో ఉన్నది. అట్లే శ్రీకృష్ణుని ప్రభావం చక్కగా పేర్కొనబడివున్నది. బ్రహ్మాండోత్పత్తి ఎలా జరిగిందో ఇందులో చూడవచ్చు.

విష్ణుభక్తికి గల ప్రాముఖ్యాన్ని వర్ణించే ఈ పురాణంలోని క్రిందిశ్లోకం గమనార్హమై యున్నది–

లోకే స ధన్యః స శుచి స్స విద్వాన్ స ఏవ వక్తా స చ ధర్మశీలః ।
జ్ఞాతా స దాతా స చ సత్యవక్తా యస్యాస్తి భక్తిః పురుషోత్తమాఖ్యే ॥

పురుషోత్తమునిపై భక్తి గలవాడే లోకంలో ధన్యుడు, శుచి, విద్వాంసుడు, ధర్మశీలుడు, జ్ఞాత, దాత, సత్యవక్త అని భావం. భక్తిలేనివాని గుణాలు విలువలేనివని తాత్పర్యం.

ఒక్క భక్తినే కాక తీర్థయాత్రలో సేవించవలసిన తీర్థాల ప్రాశస్త్యాన్ని గూడా ఈ పురాణం విశదీకరించింది. అయోధ్య, మధుర, మాయ, కాశి, కంచి, అవంతిక, ద్వారక–ఈ ఏడు నగరాలు మోక్షప్రదాలని ఈ పురాణం ఉద్ఘాటించింది.

రాజధర్మాలను గూడా ఈ పురాణం వివరించింది. ప్రజారక్షణ, శత్రుసంహారం, న్యాయబద్ధంగా పన్నులు వసూలు చేయడం, గోరక్షణ, అన్న–వస్త్ర గృహాలు అనే కనీసపు సౌకర్యాలను ప్రజలకు కల్గించడం, మద్యనిషేధం–మున్నగు రాజుల కర్తవ్యాలు గూడా ఇందులో నిర్దేశింపబడివున్నాయి.

పరులపై దౌర్జన్యం, వారిని హింసించడం మున్నగు పది పాపాలు పరిహరణీయాలు. వాటి వినాశానికే, 'దశహరా' అని పేరు. దానికి ప్రతీకగానే నేటికీ 'దశరా' పండుగ జరుపుకొంటున్నాము.

భర్తృహరి సుభాషితంవంటి గ్రంథాలలో మనం ఎన్నో సుభాషితాలు చదువుతుంటాం. వాటిని పోలిన పలు సుభాషితాలను మనం ఈ నారదపురాణంలో గూడా చూడవచ్చు.

యః శృణోతి నరో భక్త్యా శ్రావయేద్వా సమాహితః ।
స యాతి బ్రహ్మణో ధామ నాత్ర కార్యా విచారణా ॥

అని ఫలశ్రుతి. ఎవడు భక్తితో ఈ పురాణాన్ని వింటాడో, లేదా వినిపిస్తాడో, అతడు బ్రహ్మలోకం చేరుతాడు. ఇందుకు సందేహం లేదు.

7. మార్కండేయ పురాణం

మునులు తమ సందేహాలను మార్కండేయ మహర్షికి తెల్పగా ఆయన వారి సంశయాలు తొలగిస్తూ చెప్పిన పురాణమిది. విష్ణు భగవానుని దక్షిణపాదంగా ఇది కీర్తింపబడింది. ఇందులో 134 అధ్యాయాలు, తొమ్మిదివేల శ్లోకాలు ఉన్నాయి.

బలరాముని తీర్థయాత్రలు, హరిశ్చంద్రుని వృత్తాంతం, పతివ్రతాస్త్రీల ప్రభావం, కార్తవీర్యార్జునుడు దత్తాత్రేయుని అనుగ్రహం పొందడం, రాజధర్మాలు, యోగశాస్త్రవిషయాలు, ఓంకారనిరూపణ, బ్రహ్మాండోత్పత్తి, దేవీమాహాత్మ్యం, సూర్యవంశవర్ణన ఇత్యాదిగా గల వివిధ విషయాలు ఈ పురాణంలో నిరూపించడమయింది.

దుర్గాదేవి జనుల ననుగ్రహించి వారి కోర్కెలు తీర్చే దేవత. ఆ దేవిని ఆరాధించడంలో సప్తశతీపారాయణం ముఖ్యకర్తవ్యం. ఆ సప్తశతి ఈ పురాణంలోని భాగమే. దేవీనవరాత్ర్యుత్సవాలలో సప్తశతిని పారాయణం చేస్తారు.

మహిళామణులలో కొందరు మహాయోగినులున్నారు. వారిలో మదాలసాదేవి ఒకరు. ఈమెకు సంబంధించిన అద్భుతమైన చరిత్ర ఈ పురాణంలో అతి విపులంగానూ, రమణీయంగానూ నిరూపింపబడివున్నది.

ఋతధ్వజుడనే రాజుయొక్క ధర్మపత్ని మదాలస. ఈమెకు విక్రాంతుడు, సుబాహుడు, అరిమర్దనుడు, అలర్కుడు–అని నల్గురు కుమారులు. ఆమె ఉగ్గుబాలతోపాటు మొదటి ముగ్గురికీ బ్రహ్మవిద్యను గూడా బోధించింది. వారు అధ్యాత్మవిద్యలో ఆరితేరి సంసారవిరక్తులవుతారు. ఋతధ్వజుడు నాల్గవ కుమారుణ్ణి తల్లి వద్ద అధ్యాత్మవిద్యనభ్యసింపనీకుండా లౌకికవిద్యలు బోధించే ఏర్పాటు చేస్తాడు. అవసానదశలో ఆమె అతణ్ణి కూడా సత్సంగప్రభావముతో తత్త్వవేత్తగా రూపొందేటట్లు చేస్తుంది. ఇది ఆ కథా సంగ్రహ సారాంశం.

విష్ణువుయొక్క నాల్గు రూపాలు వాసుదేవ–శేష–ప్రద్యుమ్న–అనిరుద్ధములని ప్రసిద్ధాలు. వీటికి సంబంధించిన వివరణ కూడా ఈ పురాణంలో వస్తుంది.

ఇక ధర్మపక్షులుగా ప్రసిద్ధి వహించిన పక్షుల వృత్తాంతం గూడా మార్కండేయపురాణంలో పేర్కొనబడివున్నది. జైమినిమహర్షి తనకు గల్గిన సంశయాల నన్నింటినీ ఈ పక్షులద్వారానే తొలగించుకొంటాడు.

ఈ పురాణం పుత్రులను మూడురకాలుగా విభజించింది. తండ్రినుండి సంక్రమించిన కీర్తినీ, ధనాన్నీ పెంపొందించేవాడు ఉత్తముడు. పెంపొందించకున్నా పోగొట్టకుండా ఉండేవాడు మధ్యముడు. పోగొట్టుకొనేవాడు అధముడు. ఎంతో చక్కని ప్రబోధమిది.

తండ్రిపేరు చెప్పుకొని కాలం గడపువాడు వ్యర్థజన్ముడు. తండ్రికి కీర్తి తెచ్చేవాడు ఉత్తముడు. ఇలాంటి విషయాలు యుక్తియుక్తంగా ఆసక్తిజనకంగా ఇందులో వివరించబడి వున్నాయి.

శ్రుత్వా తత్పూజయేద్యస్తు పురాణం సప్తమం పునః ।
సర్వపాపవినిర్ముక్తః పునాత్యేవ నిజం కులమ్ ॥

అని ఫలశ్రుతి. ఇది విని దీనిని పూజించేవాడు సకలపాపవిముక్తుడై తన కులాన్ని పావనం చేస్తాడు.

8. అగ్నిపురాణం

అగ్నిదేవుడు వసిష్ఠమహర్షికి ఉపదేశించినదే అగ్నిపురాణం. ఇది విష్ణుదేవుని ఎడమపాదంగా వర్ణింపబడింది. ఇందులో 383 అధ్యాయాలు, 15,400 శ్లోకాలు ఉన్నాయి.

దశావతారాలు ఇందులో వర్ణింపబడ్డాయి. మరియు రామాయణ మహాభారతాలలోని కొన్ని ఘట్టాలు ఇందులో కనిపిస్తాయి.

దేవాలయ నిర్మాణం, సాలగ్రామలక్షణాలు, సూర్యపూజ, శివపూజ, వాస్తుపూజ, చతురాశ్రమధర్మాలు ఈ పురాణంలో పేర్కొనబడివున్నాయి. పలురకాల వ్రతాలు, రాజధర్మాలు, స్వప్న ఫలితాలు, స్త్రీ పురుష లక్షణాలు, ఆయుర్వేద విషయాలు, అద్వైతవేదాంతతత్త్వం ఇత్యాదిగా గల పలువిషయాలు ఈ పురాణంలో కనిపిస్తాయి.

కూర్మావతారవర్ణన సందర్భంలో విష్ణువు దేవతలకు ఎలా ఉపకరించాడో ఇక్కడ మనోజ్ఞంగా చెప్పడమయింది.

ఇక రామాయణ ఘట్టాలలో సుగ్రీవుడు సీతాన్వేషణ విషయంలో అశ్రద్ధ చూపినప్పుడు రాముడతనికి పంపిన తీక్ష్ణపదజాలంతో కూడిన సందేశం పాఠకులలో ఆసక్తిని రేకెత్తిస్తున్నది. రామాయణంలో సీతాపహరణకు రావణుడు మారీచుణ్ణి ప్రేరేపించినప్పుడు మారీచుడు చెప్పిన ఈ క్రిందిశ్లోకం గమనార్హం.

రావణాదపి మర్తవ్యం మర్తవ్యం రాఘువాదపి ।
అవశ్యం యది మర్తవ్యం వరం రామాన్న రావణాత్ ॥

"రావణుని ఆజ్ఞ పాటించకుంటే అతనినుండి చావు తప్పదు. పాటిస్తే రామునిచేత మరణం తప్పదు. రావణునికన్న రామునిచేత మరణించడమే మేలు" అని భావం. ఇలా రామాయణ భారతాదులలోని కొన్ని ఘట్టాలు ఈ పురాణాల్లో కనిపిస్తాయి.

భగవంతు డనే పదానికి ఈ క్రింది శ్లోకంలో ఇచ్చిన నిర్వచనం అర్థవంతంగా ఉంది.

ఉత్పత్తిం ప్రళయం చైవ భూతానామాగతిం గతిమ్ ।
వేత్తి విద్యామవిద్యాం చ స వాచ్యో భగవానితి ॥

సృష్టిస్థితిలయాలు, జీవుల జననమరణాలు, విద్యా విద్యల స్వరూపం సమగ్రంగా ఎరిగినవాడే భగవంతుడు.

ఇక దేవాలయ నిర్మాణానికి చెందిన విశేషాలు కూడా ఈ పురాణంలో లభిస్తున్నాయి. ఆలయనిర్మాణం వల్ల బ్రహ్మహత్యాది దోషాలు కూడా తొలగిపోతాయని చెప్పడం విశేషం.

ఈ పురాణంలో కథలకు అంతగా ప్రాముఖ్యం లేదు కాని విద్యలు, పదార్థ లక్షణాలు, శుభాశుభస్వప్నాలు, శకునాలు, ఇవి మొదలుగాగల అనేక విషయాలు నిరూపింపబడి వున్నాయి. వివిధ శాస్త్రాలకు చెందిన విషయాలు ఇందులో ఉండడం వల్ల ఇదొక విశిష్టమైన పురాణంగా ప్రశంసింపబడుతున్నది. దీని ఫలశ్రుతి యిది–

'ఆగ్నేయం పఠితం ధ్యాతం శుభం స్యాద్భుక్తిముక్తిదమ్'

ఈ ఆగ్నేయ పురాణాన్ని చదివినా, ధ్యానించినా భుక్తిముక్తులు చేకూరుతాయని, శుభం కలుగుతుందని చెప్పడమయినది.

9. భవిష్యపురాణం

విష్ణుదేవుని కుడిమోకాలితో పోల్చబడిన ఈ పురాణంలో 14,500 శ్లోకాలున్నాయి. ఇందలి అధ్యాయాల సంఖ్య 585.

సృష్టివివరణ, పురాణాల ఉత్పత్తి, షోడశసంస్కారాలు. సావిత్రీమాహాత్మ్యం, స్త్రీలక్షణాలు, వివిధ వ్రతాలు ఇందులో వివరించడమయినది. రథసప్తమీ మాహాత్మ్యం, సూర్యుని ప్రభావం, ప్రతిమాలక్షణాలు, ధర్మస్వరూపం, జీమూతవాహనాదుల చరిత్రలు, అన్నదానప్రశస్తి మున్నగు విషయాలు అతివిస్తృతంగా ఇందులో వర్ణించడం జరిగింది.

భర్తపట్ల భార్య, భార్యపట్ల భర్త ప్రవర్తించవలసిన తీరుతెన్నులు చక్కగా ప్రతిపాదింపబడినాయి. సూర్యప్రభావవర్ణనా సందర్భంలో రాజు, దొంగలు, గ్రహాలు, పాములు, పేదరికం, దుఃఖాలు–ఇవేవీ సూర్యానుగ్రహం పొందిన వారిని బాధించవు అని చెప్పడం విశేషం.

ఇక జీవితంలో అతిముఖ్యమైన వివాహాన్ని గురించి వివరిస్తూ సమస్థాయిగలవారిలో జరిగే వివాహాలు శుభకరాలని, తదితరవివాహాలు దుఃఖదాయకాలని ఈ పురాణం చెప్పింది. స్మృతులలో పేర్కొనబడిన వివిధ

వివాహభేదాలు ఇందులో ప్రతిపాదింపబడివున్నాయి. సామాజిక జీవితంలో అత్యావశ్యకాలైన వివాహాది విషయాలను ఈ పురాణంలో ప్రతిపాదించడంవల్ల సంఘశ్రేయస్సుపట్ల పురాణకర్తకు కల అభినివేశమెట్టిదో వ్యక్తమవుతున్నది.

అన్నదాన ప్రాశస్త్యాన్ని పేర్కొంటూ–

"అన్నం వై ప్రాణినాం ప్రాణా అన్నమోజో బలం సుఖమ్ ।
ఏతస్మాత్కారణాత్సద్భిరన్నదః ప్రాణదః స్మృతః ॥

ప్రాణులకు అన్నమే ప్రాణం. అన్నమే ఓజస్సు, బలం, సుఖం. అందుచేత అన్నదాత ప్రాణదాతగా పేర్కొనబడినాడు. ఈ పురాణంలో మరొక విశేషం విక్రమాదిత్యుడికీ, బేతాళునికీ సంబంధించిన కథలు. ఈ కథలు మిక్కిలి లోకప్రసిద్ధి వహించాయి. కథలలో జీవితంలో ఎదురయ్యే గడ్డు సమస్యలను పరిష్కరించే నైతికసూత్రాలు మనోజ్ఞంగా నిరూపింపబడివున్నాయి.

ఈ పురాణానికి ఫలశ్రుతిని వివరిస్తూ గ్రంథకర్త ఇలా అన్నాడు–

యచ్ఛ్రుత్వా సర్వపాపేభ్యో ముచ్యతే మానవో నృప! ।
అశ్వమేధఫలం ప్రాప్య గచ్ఛేద్భానుం న సంశయః ॥

ఈ పురాణం వింటే సకలపాపవిముక్తి చేకూరుతుంది. అశ్వమేధయాగఫలం లభిస్తుంది. చివరికి సూర్య సాయుజ్యప్రాప్తి కలుగుతుంది.

10. బ్రహ్మవైవర్తపురాణం

సావర్ణిమనువు నారదమునీంద్రునికి చెప్పిన పురాణమిది. ఇందులో వరాహమూర్తికి, శ్రీకృష్ణునికి సంబంధించిన విషయాలు ప్రధానంగా ప్రతిపాదించబడివున్నాయి. ఈ పురాణం శ్రీమహావిష్ణువుయొక్క ఎడమ మోకాలుగా కీర్తింపబడింది.

బ్రహ్మఖండం, ప్రకృతిఖండం, గణేశఖండం, శ్రీకృష్ణఖండమని నాలుగు ఖండాలుగా ఇది విభజింపబడివున్నది. అన్ని ఖండాలలోను కలిపి మొత్తం 18,000వేల శ్లోకాలున్నాయి. **'సారభూతం పురాణేషు బ్రహ్మవైవర్తముచ్యతే'** అన్నట్లు ఈ పురాణం పురాణా లన్నింటికీ సారభూతమైనదిగా ప్రశస్తి పొందింది.

బ్రహ్మఖండంలో పరబ్రహ్మవర్ణన చేయబడింది. ప్రకృతిఖండంలో దుర్గాదేవి మున్నగు స్వరూపాలతో ప్రకృతి ఆవిర్భవించడం నిర్దేశించబడింది. గణేశఖండంలో వినాయక చరిత్ర నిబద్ధమైనది. శ్రీకృష్ణఖండంలో దుష్టశిక్షణ, శిష్టరక్షణ, ధర్మస్థాపన మొదలగు అంశాలు పేర్కొనబడ్డాయి.

అతిథిని పూజించవలసిన అవశ్యకతను వివరిస్తూ ఈ పురాణం చెప్పిన విషయమిది–

అపూజితోఽతిథిర్యస్య భవనాద్వినివర్తతే ।
పితృదేవాగ్నయః పశ్చాద్గురవో యాన్త్యపూజితాః ॥

ఏ గృహస్థుని యింట అతిథి ఆదరింపబడడో ఆ యింటినుండి పితరులు, దేవతలు, అగ్నిదేవుడు, గురువులు పూజలను తిరస్కరించి వెళ్ళిపోతారని భావం.

ఇక జన్మకారణమైన తండ్రితోపాటు విద్యాదాత, అన్నదాత, భయమునుంచి కాపాడినవాడు, కన్యాదాత– ఈ నలుగురు కూడ తండ్రులుగానే పేర్కొనబడ్డారు. అట్లే సేవకుడు, శిష్యుడు, పోషితుడు, ఔరసుడు, శరణాగతుడు– ఈ ఐదుగురు పుత్రులుగానే పరిగణింపదగి ఉన్నారు.

ఈ గ్రంథంలో మొదటి పురుషార్థమైన ధర్మముయొక్క ప్రాశస్త్యం ఈ క్రిందివిధంగా ఉగ్గడింపబడింది–

నాస్తి ధర్మాత్పరో బన్ధుర్నాస్తి ధర్మాత్పరం ధనమ్ ।
ధర్మాత్ప్రియతరః కో వా స్వధర్మం రక్ష యత్నతః ॥

“ధర్మంకంటే శ్రేష్ఠుడైన బంధువు లేడు. మేలైన ధనం లేదు. ధర్మంకంటే ప్రియతరమైన దేదీ లేదు. కాన ప్రయత్నంతో ధర్మాన్ని రక్షించాలి.” అని భావం. అట్లే మరొక చోట గురువులో సకలదేవతలూ ఉన్నారని గురుమహిమ ప్రశంసింప బడినది.

పై విషయాలతోపాటు భగవంతుని స్వరూపం, సరస్వతీపూజ, భూదానప్రాశస్త్యం, గంగావతరణం, సంక్షిప్త రామాయణం, తులసీమాహాత్మ్యం, దుర్గోపాఖ్యానం మొదలైన విషయాలు కూడా ఈ పురాణంలో వివరింపబడి వున్నాయి.

ఈ గ్రంథంలో పేర్కొన్న కథలలో ముఖ్యంగా పేర్కొనదగినది వేదవతీ చరిత్ర. కృతయుగంలో వేదవతిగా, త్రేతాయుగంలో సీతగా, ద్వాపరయుగంలో ద్రౌపదిగా వేదవతిని పురాణం వర్ణించింది. తదుపరి పురాణాల కథలలో ఈ వేదవతియే పద్మావతిగా అవతరించి విష్ణుని రూపాంతరమైన వేంకటేశ్వరుణ్ణి చేపట్టినట్లు చెప్పడమయినది.

కశ్యపమహర్షిమానసపుత్రిక జరత్కారువుయొక్క స్తుతి కూడా ఈ పురాణంలోనే లభిస్తున్నది.

శుభదం పుణ్యదం చైవ విఘ్ననిఘ్నకరం పరమ్ ।
హరిదాస్యప్రదం చైవ పరలోకే ప్రహర్షదమ్ ॥

ఇత్యాదిగా ఈ పురాణ పఠనం శుభాన్నీ, పుణ్యాన్నీ, విఘ్నవినాశాన్నీ, హరిదాస్యాన్నీ, పరలోకంలో సంతోషాన్నీ ప్రసాదిస్తుంది అని చెప్పడమైనది.

11. లింగపురాణం

అగ్నిలింగంలో అంతర్గతుడైవున్న శివుడు ఉపదేశించినదే లింగపురాణం. ఇది విష్ణుదేవుని కుడిచీల మండతో పోల్చబడింది. శివుని ప్రభావాన్ని వర్ణించే ఈ పురాణంలో 11,000వేల శ్లోకాలున్నాయి. ఇది పూర్వార్ధమనీ, ఉత్తరార్ధమనీ రెండు భాగాలుగా ఉన్నది. పూర్వార్ధంలో 108, ఉత్తరార్ధంలో 55 కలిపి మొత్తం 163 అధ్యాయాలున్నాయి.

శివుని అవతారాలను ఈ పురాణం విరివిగా వర్ణిస్తున్నది. అందుచేత శైవులు ఈ పురాణాన్ని ప్రముఖంగా ఆదరిస్తారు. అష్టాంగయోగ సహితమైన శివారాధన, విష్ణువు కావించిన శివస్తోత్రం, బ్రహ్మాజననం, లింగార్చనావిధానం, శివునికి చెందిన మానసపూజ, యుగధర్మాలు, సప్తద్వీపాలు, సప్తసాగరాలు, దిక్పాలకుల నగరవర్ణన, చంద్రవంశరాజుల వృత్తాంతం, త్రిపురాసురసంహారం, కైలాసగిరివర్ణన, సదాచారం ఇత్యాదిగా పలు విషయాలు ఈ పురాణంలో అతివిస్తృతంగా ప్రతిపాదింపబడివున్నాయి.

ఇందలి ఉత్తరార్ధంలో పృథివి, జలం, అగ్ని, వాయువు మొదలగు అష్టవిధాలైన శివుని మూర్తుల వివరణ వున్నది. శివభక్తిని ప్రతిపాదించే కథలు కూడా ఈ పురాణంలో చోటు చేసుకొనివున్నాయి.

మృత్యువు సమీపించిన శ్వేతుడు అనే శివభక్తుడు శివుని అనుగ్రహంచేత మరణంనుంచి తప్పించుకొనిన కథ శివారాధనవల్ల కలిగే ఫలితాన్ని వివరిస్తున్నది.

ఇక కాశీక్షేత్రమహిమ ఇందులో విస్తారంగా ప్రతిపాదితమయింది.

కామం భుంజన్ స్వపన్ క్రీడన్ కుర్వన్ని వివిధాః క్రియాః ।
అవిముక్తే త్యజేత్ ప్రాణాన్ జంతుర్మోక్షాయ కల్పతే ॥

భుజిస్తూ, నిద్రిస్తూ, క్రీడిస్తూ, యథేచ్ఛగా వివిధక్రియలాచరిస్తూ కూడ ఈ క్షేత్రంలో మరణిస్తే మోక్షం సిద్ధిస్తుందని ఇందులో చెప్పడమయినది.

అష్టదిక్పాలకులుగా ఇంద్రాదులు ప్రసిద్ధులు. వారు నివసించే నగరాలు క్రమంగా 1. అమరావతి 2.తేజస్విని 3.వైవస్వతి 4.కృష్ణవర్ణ 5. శుద్ధవతి, 6.గన్ధవతి 7.అలక 8.యశోవతి – అనేవి ఈ పురాణంలో పేర్కొనబడ్డాయి.

ఇది శైవపురాణం కాన శివపూజామాహాత్మ్యాన్ని ఘనంగా కీర్తిస్తున్నది. శివానుగ్రహంతోనే పరాశరుడు ఎన్నడో మరణించిన తన తండ్రిని, పినతండ్రులను చూస్తాడు. ఇట్టి విశిష్టమైన కథలతోను, వర్ణనలతోనూ సాగిపోయే లింగపురాణం చాలా ప్రభావోపేతమైనది.

మంచినీతులు చెప్పిన సందర్భాలు కూడా ఈ పురాణంలో లేకపోలేదు. భోగాశను నిరోధించాలనీ, విషయ విచారణచేత అది సాధ్యమనీ, మనోవాక్కాయాలతో వైరాగ్యాన్ని పాటించాలనీ చెప్పే ఈక్రింది శ్లోకం గమనార్హం–

భోగేన తృప్తిర్నైవాస్తి విషయాణాం విచారతః ।
తస్మాద్విరాగః కర్తవ్యః మనసా కర్మణా గిరా ॥

ఈ పురాణపఠన ప్రయోజనాన్ని ఈ క్రిందిశ్లోకం ఇలా చెప్పింది–

యః పఠేచ్ఛృణుయాద్వాఽపి లైంగం పాపహరం నరః ।
స భుక్తభోగో లోకేఽస్మిన్నన్తే శివపురం వ్రజేత్ ॥

పాపహరమైన ఈ పురాణాన్ని చదివేవారు, వినేవారు ఈ లోకంలో ఉన్నంతకాలం సకల భోగాల ననుభవించి కడపట కైలాసం చేరుకోగలరు.

12. వరాహపురాణం

వరాహావతారధారియైన విష్ణుదేవుడు భూదేవికి చెప్పిన పురాణమే వరాహపురాణం. ఇందులో 24వేల శ్లోకాలున్నాయి. విష్ణువుయొక్క ఎడమ చీలమండతో ఈ పురాణాన్ని పోల్చడమయింది. ఇందలి అధ్యాయాల సంఖ్య 215.

నానావిధ సృష్టులు, నారదమునీంద్రుని పూర్వజన్మచరిత్ర, విష్ణుభగవానుని అష్టమూర్తులు, ధర్మవ్యాధుని చరిత్ర, దక్షయాగధ్వంసం, పార్వతీజననం, వినాయకుని పుట్టుక, వివిధవ్రతాలు, వాటి ఫలితాలు, నాలుగు యుగాలు,

అన్నదానప్రాశస్త్యం, వరాహస్వామి భూదేవిని ఉద్ధరించడం, నాచికేతుని వృత్తాంతం ఇత్యాదిగా పలువిషయాలు ఈ పురాణంలోని అంశాలుగా ఉన్నాయి.

అష్టాదశపురాణాల క్రమమూ, వివరణ గూడా ఇందులో నిర్దేశింపబడివున్నది. మహావిష్ణువు తన భక్తులకు అంగరక్షకుడై ఉంటాడన్న విషయం ఈ గ్రంథంలో చెప్పడమయింది.

శ్రీకృష్ణుడు గీతలో **'మమ మాయా దురత్యయా'** అని అంటాడు. 'నా మాయ దాటరానిది' అని దీని అర్థం. భూదేవి 'మాయ' అంటే ఏమిటి? దాని స్వరూపం వివరించుమని విష్ణువును అడుగుతుంది. అందుకా దేవుడు తన మాయాస్వరూపాన్ని ఈ పురాణంలో అతి విస్తృతంగా వివరిస్తాడు.

లోకంలో తరచు సంభవించే అతివృష్టి, అనావృష్టి మున్నగు విపరీత సంఘటనలు, మాయవల్లనే కల్గుతున్నాయనీ, సృష్టిలో క్రమబద్ధంగా జరిగే సూర్యోదయాదులు, పంచభూతాల ప్రవర్తన, మాయాప్రభావం వల్లనే ఏర్పడుతున్నాయనీ ఇక్కడ చెప్పడమయింది.

దానాలన్నింటిలో అన్నదానం ప్రశస్తమయింది. అట్లే మనం వాడే వివిధములైన లోహాలతో నిర్మించబడిన పాత్రలలో రాగిపాత్రలు మేలైనవి అని ఈ పురాణం నిరూపించింది.

ఇంకా ఈ పురాణంలో వివిధతీర్థాల ప్రభావం గూడా వర్ణింపబడివున్నది. ఏ తీర్థాన్ని ఎప్పుడు సేవిస్తే మంచిదో ఇక్కడ వివరించబడివున్నది.

విష్ణుమందిరాలలో సేవలు చేసే వారికి గలిగే ఫలమేమి? అన్న భూదేవి ప్రశ్నకు విష్ణువు అట్టి వివిధ సేవాఫలాలను వివరంగా పేర్కొంటాడు. సకల జగత్తుకు సత్యమే ఆధారం కాన, సత్యాన్ని తప్పక పాటించాలన్న సంగతి ఇందులో చెప్పడమయింది.

ఇక కఠోపనిషత్తులో నాచికేతుని వృత్తాంతం ఇందులో రమ్యంగా ప్రతిపాదితమయింది. ఇంకా ఎన్నో కథాంశాలు ఈ పురాణంలో కనిపిస్తాయి.

శ్రుత్వా తు పూజయేద్యస్తు శాస్త్రం వారాహసంజ్ఞితమ్ ।

సర్వపాపవినిర్ముక్తో విష్ణుసాయుజ్యమాప్రజేత్ ॥

అన్నట్లు దీన్ని ఎవరు శ్రవణం చేసి భక్తితో పూజిస్తారో, వారు సర్వపాపనిర్ముక్తులై విష్ణుసాయుజ్యం పొందుతారని ఫలశ్రుతి.

13. స్కాందపురాణం

స్కందుడనగా శివుని కుమారుడైన కుమారస్వామి. ఆ దేవుని పేరుతో ఈ పురాణం ప్రసిద్ధమయింది. శివుడు స్కందుణ్ణి ఉద్దేశించి చెప్పిన విషయమే ఈ స్కాందపురాణం. తండ్రినుండి విన్న ఈ పురాణాన్ని తరువాత స్కందుడు మునుల కుపదేశిస్తాడు.

'ఏకాశీతిసహస్రం తు స్కాందం సర్వాఘకృంతనం' – అన్నట్లు సకల పాపవిచ్ఛేదకమైన ఈ పురాణంలో 81,000 శ్లోకాలున్నాయి. దీన్ని బట్టి ఇతర పురాణాలకంటె ఇది ఆకృతిలో చాలా పెద్ద పురాణమని తెలుస్తున్నది.

మహావిష్ణుని నెంద్రుకలతో పోల్చబడిన ఈ గ్రంథంలో మహేశ్వరఖండం, వైష్ణవఖండం, బ్రహ్మఖండం, కాశీఖండం, అవంతీఖండం, నాగరఖండం, ప్రభాసఖండం అని ఏడు ఖండాలున్నాయి.

మహేశ్వరఖండంలో కేదారఖండం, కౌమారీ ఖండం, అరుణాచలమాహాత్మ్యం మొదలైన అంశాలున్నాయి. వైష్ణవఖండంలో వేంకటాచల-జగన్నాథక్షేత్రాల మాహాత్మ్యం, బ్రహ్మఖండంలో సేతు మాహాత్మ్యం, ధర్మారణ్య, బ్రహ్మోత్తరఖండాలున్నాయి. కాశీఖండంలో కాశీక్షేత్రప్రభావం విస్తృతంగా వర్ణింపబడి వున్నది. నాగరఖండంలో వివిధ తీర్థాల వర్ణన ఉన్నది. విశ్వకర్మోపాఖ్యానాది కథలు గూడా ఉన్నాయి.

ప్రభాసఖండంలో ద్వారకానగర పరిసరాల ప్రభావం వివరించబడివున్నది. సంహితారూపంలో గూడా ఈ స్కాందపురాణం ప్రసిద్ధమైవున్నది.

సనత్కుమారసంహిత, సూతసంహిత, శంకరసంహిత, వైష్ణవసంహిత, బ్రహ్మసంహిత, సౌరసంహిత అనేవే ఈ సంహితలు.

సూతసంహితలో శివోపాసనాప్రాముఖ్యం కీర్తింపబడివున్నది. కాశీక్షేత్రప్రభావాన్ని వర్ణించే కాశీఖండంలో అయోధ్యాదిక్షేత్రాలలో మరణించినవారు స్వర్లోకసుఖం అనుభవించి తరువాత కాశిలో జన్మించి అక్కడ ముక్తులవుతారని చెప్పడం విశేషం. **'కాశ్యాం తు మరణాన్ముక్తిః'** అన్న మాట గూడా ప్రసిద్ధం.

జీర్ణదేవాలయోద్ధరణ చేసేవారికి కలిగే ఫలాన్ని గూడా ఈ పురాణం వివరించింది. సత్యనారాయణ వ్రతస్వరూపం ఇందలి రేవాఖండంలో నిరూపితమయింది.

ఇంకను రామావతారం, క్షీరసాగరమథనం, గిరిజా కల్యాణం, కుమారోత్పత్తి, ఓంకారప్రభావం, 14 మంది మనువుల వర్ణన ఇత్యాద్యంశాలు ఇందులో గోచరిస్తాయి. అంతే కాక వనభోజనం, కార్తికవైభవం, ఉసిరిక విశిష్టత, ఇత్యాదివిషయాలు గూడా గమనింపదగి వున్నాయి.

సర్వేషామేవ ధర్మాణాం గురుపూజా పరా మతా ।
గురుశుశ్రూషయా సర్వం ప్రాప్నోతి హి న సంశయః ॥

అన్ని ధర్మాలలోనూ గురుపూజ మేలైన ధర్మం. గురుసేవచేత అన్ని ఫలితాలూ పొందవచ్చు అని గురుసేవా ప్రాశస్త్యం పేర్కొనబడింది. రుద్రాక్ష మహిమ కథాకథన పూర్వాంకంగా ఇందులో వివరించబడింది.

పురాణ శ్రవణ ఫలాన్ని ఈ పురాణం 136 శ్లోకాలలో వివరించింది. జ్ఞానదీపాలుగా, భవరోగౌషధాలుగా పురాణాలిందులో కీర్తింపబడివున్నాయి.

14. వామనపురాణం

బ్రహ్మదేవుడు వామనావతార ప్రభావాన్ని కీర్తిస్తూ చెప్పినదే వామనపురాణం. మహావిష్ణుని చర్మంతో దీన్ని పోల్చారు. ఇందలి శ్లోకాలు పదివేలు, అధ్యాయాలు 95.

వైష్ణవధర్మ ప్రతిపాదకమైన ఈ పురాణంలో విష్ణుమందిరాలు, విష్ణుభక్తుల వృత్తాంతాలు అధికంగా కనిపిస్తాయి. ఉత్పత్తి ప్రళయాలు, కామదహనం, ప్రహ్లాదవరదానం, దేవీమాహాత్మ్యం, నానావిధ తీర్థాలు, వినాయక విజయం ఇత్యాద్యంశాలు ఈ పురాణంలో వర్ణించబడివున్నాయి.

వివిధ దేవతలకు చెందిన 25 స్తోత్రాలు ఈ పురాణంలో లభిస్తాయి. దేవతలలో మహావిష్ణువు, ఆయుధాలలో సుదర్శనం, పక్షులలో గరుడుడు, సర్పాలలో వాసుకి, ఈ రీతిగా ఆయా వర్గాలలో మేలైనవారినీ, వస్తువులను కీర్తించే ఇందలి ఘట్టం ఆసక్తిజనకంగా ఉంటుంది.

లోకంలో ఎన్నో పాపాలున్నాయి, కాని అన్నింటినీ మించిన పాపం కృతఘ్నుత్వమని ఈ పురాణం చెబుతున్నది.

నిత్యమూ ఉదయం లేవగానే త్రిమూర్తులు, గ్రహాలూ, సప్తర్షులూ, సప్తలోకాలూ తనకు శుభావహాలు కావాలని ప్రార్థించాలని ఈ గ్రంథం బోధిస్తున్నది.

జీవితంలో ఎన్ని విపత్తు లెదురైనా, షండుడు, మార్జారుడు, ఆఖువు, కుక్కుటుడు, పతితుడు, అపవిద్ధుడు, నగ్నుడు, చండాలుడు, అధముడు-ఇట్టివారిని ఆశ్రయించరాదని ఇందులో చెప్పడమయింది.

మనుజుడు అవశ్యం ఆచరించవలసిన సదాచారాలను 122 శ్లోకాలలో ఈ పురాణం వివరించింది.

పుత్రుడు - శిష్యుడు-వీరిరువురిలో శ్రేష్ఠ దెవరు? అన్న ప్రశ్నకు ఇందులో బ్రహ్మ పుత్రునికంటె శిష్యుడే శ్రేష్ఠుడని సమాధానం చెబుతాడు.

పున్నామ్నో నరకాత్త్రాతి పుత్రస్తేనేహ గీయతే ।
శిష్టపాపహరశ్శిష్య ఇతీయం వైదికీ శ్రుతిః ॥

'పుత్' అనే నరకం నుండి మాత్రమే రక్షించువాడు పుత్రుడు కాగా తక్కిన సకల పాపాలనుండీ కాపాడేవాడు శిష్యుడని భావం.

పాపాలను దూరం చేసుకొనే విధానాన్ని ప్రతిపాదిస్తూ దానికి ఉదాహరణంగా ఇందులో కోశకారుని వృత్తాంతం చక్కగా వర్ణించబడింది. పూర్వజన్మకృతపాపాలు తరువాతి జన్మలో స్మరణకు వస్తాయని ఈ కథ ద్వారా తెలుస్తున్నది.

యే పఠంతి చ శృణ్వంతి తేఽపి యాన్తి పరాం గతిమ్ ।

అన్నట్లు ఈ వామనపురాణం చదివేవారు, వినేవారు ఉత్తమగతిని పొందుతారని ఫలశ్రుతి.

15. కూర్మపురాణం

17000 శ్లోకాలు గల కూర్మపురాణం విష్ణువు యొక్క పృష్ఠంగా వర్ణించబడింది. పూర్వార్థం, ఉత్తరార్థం అని రెండు విభాగాలుగా ఉన్న ఈ పురాణంలో 53+46=99 అధ్యాయాలున్నాయి.

కూర్మరూపంలో ఉన్న విష్ణుదేవుడు మహర్షుల నుద్దేశించి చెప్పిన పురాణమిది. లక్ష్మి-ఇంద్రద్యుమ్నుల సంవాదం, విష్ణువు-మహర్షులకు జరిగిన సంవాదం, సృష్టివిధానం, వర్ణాశ్రమాలు, భృగువంశవర్ణన, యుగధర్మాలు, కాశీప్రయాగక్షేత్రాల మాహాత్మ్యం, సదాచారాలు, ద్వాదశాదిత్యుల వర్ణన-ఇత్యాదిగా గల అనేకాంశాలు ఈ పురాణంలో ఉన్నాయి.

మరీచి, భృగువు, అంగిరసుడు, పులస్త్యుడు. పులహుడు, క్రతువు, దక్షుడు, అత్రి, వసిష్ఠుడు–అనే తొమ్మిదిమంది బ్రహ్మపుత్రులుగా ఇందు పేర్కొనబడినారు. మొదటికాలంలో ప్రజలు సుఖసంతోషాలతో వుండేవారనీ, క్రమంగా రాగద్వేషాలు కారణంగా ప్రజలకు దుఃస్థితి ఏర్పడిందనీ ఈ పురాణం చెబుతున్నది.

ధర్మం ఆచరణీయమనీ, ధర్మంవల్లనే తక్కిన పురుషార్థాలు సిద్ధిస్తాయనీ ఈ పురాణం పేర్కొంటున్నది.

ధర్మాత్సంజాయతే హ్యర్థో ధర్మాత్కామోఽభిజాయతే ।
ధర్మ ఏవాపవర్గాయ తస్మాద్ధర్మం సమాశ్రయేత్ ॥

అనగా ధర్మంనుంచే అర్థ,కామ,మోక్షాలు సిద్ధిస్తాయి. కాన ధర్మాన్ని ఆశ్రయించాలి అని భావం.

శివకేశవులకు భేదం లేదని, భక్తులు ఏఏరూపాలను ఆరాధిస్తారో భగవంతుడు ఆయా రూపాలతోనే వారిని అనుగ్రహిస్తాడని ఈ పురాణంలో చెప్పిన విషయం భగవద్గీతలోని

'యే యథా మాం ప్రపద్యన్తే తాంస్తథైవ భజామ్యహం' అనే వచనానికి అనుగుణంగా ఉన్నది.

స్వధర్మాన్ని త్యజించి చేసే తీర్థయాత్రలవల్ల ప్రయోజనం శూన్యమనీ, దేవాలయాదులను మిక్కిలి పరిశుభ్రంగా ఉంచాలనీ, మూత్రవిసర్జనాదులతో అపరిశుద్ధం చేయరాదనీ, అలాచేయడం పాపహేతువనీ ఈ పురాణం హెచ్చరిస్తున్నది. పుణ్యక్షేత్రాల ప్రాశస్త్యం ఇందులో చక్కగా వివరించబడింది.

వేదాన్ని విభజించేవారు వేదవ్యాసు లనబడతారు. అట్టివారు 26మంది ఉన్నారనీ పరాశరపుత్రుడైన కృష్ణద్వైపాయనుడు చివరివాడనీ ఈ పురాణం చెప్పిన విషయం గమనార్హమై ఉన్నది.

ఇంకను సమాజంలో వున్నవారి కర్తవ్యాలు, గురువులవద్ద ఉండవలసిన తీరుతెన్నులు, పాపాత్ములతో చేసే సాంగత్యంవల్ల కలిగే దోషాలు–ఇత్యాది విషయాలు మిక్కిలి ఆసక్తిదాయకంగా ఈ పురాణంలో చెప్పడమయినది.

ఇందులో వామనావతారానికి సంబంధించిన చరిత్ర చాలా చక్కగా నిరూపించబడివున్నది. భక్తిప్రధానమైన దుర్జయు డనేవాని కథవంటి కొన్ని కథలు పాఠకులకు చక్కని చైతన్యం కలిగిస్తాయి. అట్టివి ఇందులో పలుకథలు వున్నాయి.

ఏతత్కూర్మపురాణం తు చతుర్వర్గఫలప్రదమ్ ।
పఠతాం శృణ్వతాం నృణాం సర్వోత్కృష్టగతిప్రదమ్ ॥

ఈ పురాణం చదివేవారికి, వినేవారికి చతుర్వర్గ ఫలాలు సిద్ధిస్తాయి. సర్వోత్కృష్టగతి కూడా కలుగుతుంది.

16. మత్స్యపురాణం

మహావిష్ణువు మత్స్యరూపుడై వైవస్వతమనువు నుద్దేశించి చెప్పిన పురాణమిది. విష్ణువుయొక్క మెదడుతో దీన్ని పోల్చడమైనది. ఇందులో 14,000 వేల శ్లోకాలున్నాయి. మొత్తం అధ్యాయాల సంఖ్య 283.

ఇందలి ముఖ్య విషయాలివి–మత్స్యావతారవర్ణన, అజాండసృష్టి, సూర్యచంద్రవంశాలు, గయాక్షేత్రవర్ణన, పురూరవుని చరిత్ర, కచదేవయానుల కథ, కార్తవీర్యార్జునుని వృత్తాంతం, కలిధర్మాలు మరియు కృష్ణాష్టమి, అక్షయ తృతీయ, కల్యాణసప్తమి మున్నగు పలువ్రతాల వర్ణన, సప్తద్వీపాల వివరణ, త్రిపురాసురవృత్తాంతం, తారక

వృత్తాంతం మున్నగు విషయాలే కాక రాజధర్మాలు, చతుర్విధ దండోపాయాలు, స్వప్నఫలాలు, వామన వరాహావతారాల వర్ణన ఇత్యాదిగా గల విషయాలు ప్రతిపాదితాంశాలై వున్నాయి.

పుట్టిన ప్రతివాడూ పురుషార్థసాధనకై ప్రయత్నించాలి. అలా చేయనివాని జన్మ వ్యర్థమని ఈ పురాణం నొక్కి వక్కాణిస్తున్నది.

లబ్ధ్వా జన్మ న యః కశ్చిద్ఘటయేత్పౌరుషం నరః ।
జన్మ తస్య వృథా భూతమజన్మా తు విశిష్యతే ॥

శ్రాద్ధకాలంలో పితృదేవతలకు అన్నపానాదులు సమర్పించడాన్ని గూర్చిన విశేషవివరణ యిందులో కనిపిస్తున్నది. శ్రాద్ధ కర్మలు అవశ్యాచరణీయాలని ఇక్కడ పేర్కొనడమైనది.

ఇక కాలమానం గురించి ప్రస్తావిస్తూ బ్రహ్మ, శివుడు, విష్ణువు అను త్రిమూర్తులకు చెందిన వివిధ కాలమానాల విశ్లేషణ ఇందులో చేయబడింది.

1.భృగువు 2.అత్రి 3. వసిష్ఠుడు 4. విశ్వకర్మ 5.మయుడు 6. నారదుడు 7. నగ్నజిత్తు 8. విశాలాక్షుడు 9. పురందరుడు 10. బ్రహ్మ 11. కుమారుడు 12.నందీశుడు 13.శౌనకుడు 14. గర్గుడు 15. వాసుదేవుడు 16. అనిరుద్ధుడు 17. శుకుడు 18. బృహస్పతి అనే ఈ పదునెనిమిది మంది వాస్తుశాస్త్రోపదేశకులుగా ఇందులో పేర్కొనబడినారు.

తల,లలాటం మున్నగు అవయవాల కదలికవల్ల కలిగే ఫలాన్ని కూడా భగవంతుడు ఈ పురాణంలో చెప్పియున్నాడు.

ఇక పితృశ్రాద్ధంవల్ల కలిగే ఫలాన్ని వివరించే కౌశికుడనే విద్యావంతుడు, అతని ఏడుగురు కుమారులకు చెందిన విస్తృతమైన కథ ఇందులో కనిపిస్తున్నది. భక్తిశ్రద్ధలతో ఆచరించిన పితృశ్రాద్ధం గోహత్యను కూడా పోగొడుతుందని ఈ కథలో నిరూపితమయినది. బ్రహ్మదత్తుని కథలో ఆడు చీమ, మగ చీమల మధ్య జరిగే సంభాషణ ఎంతో ఆసక్తిదాయకంగా ఉన్నది.

పతివ్రతల ప్రభావం గురించి చెప్పే ఈ క్రింది శ్లోకం వారిపట్ల గౌరవంతో వుండాలని హెచ్చరిస్తున్నది.

పతివ్రతానాం వచనం ప్రకృష్టం తాసాం తు వాక్యం భవతీహ మిథ్యా ।
న జాతు లోకేషు చరాచరేషు తస్మాత్సదా తాః పరిపూజనీయాః ॥

పతివ్రతల మాట శ్రేష్ఠమైనది. ఎప్పుడును వారి మాట మిథ్య కాదు. అందువల్ల వారు సదా పూజింపదగినవారు.

ఇక ఫలశ్రుతి –

అస్మాత్పురాణాదపి పాదమేకం పఠేత్తు యస్సోఽపి విముక్తపాపః ।
నారాయణాఖ్యం పదమేతి నూనమనంగవద్దివ్యసుఖాని భుంక్తే ॥

ఈ పురాణంలో ఒక్క పాదం చదివినా పాపనివృత్తుడై వైకుంఠం పొందగలడని, సకల దివ్యసుఖాలు అనుభవింపగలడని ఫలశ్రుతి చెబుతున్నది.

17. గరుడపురాణం

విష్ణువాహనమైన గరుడుడు అడిగిన ప్రశ్నలకు విష్ణుదేవుడు చెప్పిన సమాధానాలే గరుడపురాణం. ఇందులో 19వేల శ్లోకాలు గల పూర్వఖండం, ఉత్తరఖండం అనే రెండు ఖండాలున్నాయి.

పూర్వఖండంలో 229, ఉత్తరఖండంలో 35 కలిపి 264 అధ్యాయాలు గల పురాణమిది. విష్ణుదేవుని "మజ్జ" గా ఇది వర్ణించబడింది.

ఈ పురాణంలోని ఉత్తరఖండంలో ప్రేతకల్పం మిక్కిలి ప్రశస్తమైనది. మరణానంతరం జీవుని స్థితిగతులను విస్తృతంగా వివరించే ఘట్టమిది. అందువల్లనే మరణించిన వానియింట పదవ దినంలోగా ఈ పురాణాన్ని పఠించే సంప్రదాయమేర్పడింది.

గరుడపురాణం కేవలం యమలోకవృత్తాంతాన్ని మాత్రమే చెబుతుందని కొందరు భావించడం కద్దు. ఈ భావన తగదు. ఇందలి పూర్వఖండంలో ఈ క్రింద నిర్దేశించబడిన నానావిషయాలున్నాయి.

భగవదవతారాలు, సరస్వత్యుపాసన, విష్ణుదీక్ష, శివార్చనావిధి, సుదర్శనచక్ర పూజావిధానం, సూర్యార్చన, దేవతాప్రతిష్ఠ, నిత్యనైమిత్తిక కామ్యకర్మల వివరణ, పాపప్రాయశ్చిత్తవిధి, నవరత్నాల పరీక్ష, వివిధములైన వ్రతాలు, ఆయుర్వేద వైద్యవిధానాలు మున్నగు అనేక విషయాలు ఈ పురాణంలో గోచరిస్తాయి. పశువుల చికిత్సా విధానం కూడా ఇందులో నిర్దిష్టమైయున్నది.

మానవజీవితానికి అత్యవసరమైన పలు నీతులు గూడా ఈ గ్రంథంలో పేర్కొనబడివున్నాయి. యజమానులు నిష్కారణంగా సేవకులను నిందించరాదన్న ఉపదేశం ఇందులో ఉన్నది. ధనం, జ్ఞానం, రూపం, మిత్రులు–వీరి స్వభావా లెలా ఉండాలో ఇందులో సూచించబడింది.

అర్థేన కిం కృపణహస్తగతేన పుంసాం జ్ఞానేన కిం బహుశఠాకుల సంకులేన ।
రూపేణ కిం గుణ పరాక్రమవర్జితేన మిత్రేణ కిం వ్యసనకాలపరాజ్ముఖేన ॥

కృపణుని చేతి ధనం, మొండి మనిషికి గల జ్ఞానం, గుణపరాక్రమాలులేని రూపం, వ్యసనకాలంలో కనిపించని మిత్రుడు ఉండీ ప్రయోజనం లేదని భావం. కష్టకాలంలో పరిచితవ్యక్తులు సైతం ఎలా తప్పించుకొంటారో సోదాహరణంగా ఈ పురాణం వివరించింది. గృహంలో వుంటూనే ముక్తిని సాధించే విధానం గూడా చెప్పడమయింది.

గరుడ పురాణంలో ఎన్నో కథలున్నాయి. కథలకంటె ఇందలి నీతివచనాలు మనోజ్ఞాలు. ఉదాహరణకు వేలకొలది గోవులలో దూడ తన తల్లిని గుర్తించి అనుసరించినట్లు మనమెంత దూరంగా ఉన్నా మనకర్మ మనల్ని విడువక వెంటాడుతూ వుంటుందని నీతిబోధ.

హయగ్రీవ పూజావిధి, పంచమహాయజ్ఞాలు, రాజలక్షణాలు, సేవకలక్షణాలు, రోగనివారణోపాయాలు మున్నగునవి కూడా ఈ పురాణంలో చూడవచ్చు.

'కీర్తితం పాపశమనం పఠతాం శృణ్వతాం నృణామ్' అనగా ఈ పురాణం చదివేవారు, వినేవారు సకల పాపాల నుండి విడుదల పొందుతారని దీనికి ఫలశ్రుతి చెప్పబడింది.

18. బ్రహ్మాండపురాణం

బ్రహ్మదేవుని సృష్టిని వివరించే పురాణమిది. **"బ్రహ్మాండం చాస్థి గీయతే"** అన్నట్లు విష్ణువుయొక్క ఎముకలుగా ఇది పేర్కొనబడింది. ఇందులో 12,000 శ్లోకాలున్నాయి. బ్రహ్మాండపురాణం పూర్వభాగం, మధ్యభాగం, ఉత్తరభాగమని మూడు భాగాలుగా వున్నది. పూర్వభాగంలో 38, మధ్యభాగంలో 74, ఉత్తరభాగంలో 44, మొత్తం కలిపి 156 అధ్యాయాల గ్రంథమిది. రోమహర్షణుడనే ముని కురుక్షేత్రంలో ఋషులకు చెప్పిన పురాణమిది.

ప్రక్రియాపాదం, అనుషఙ్గపాదం, ఉపోద్ఘాతపాదం, ఉపసంహారపాదమని నాలుగు భాగాలుగా ఈ పురాణం విభజింపబడింది. నైమిశారణ్యవర్ణన, చతుర్ముఖబ్రహ్మ వర్ణనం, వరాహావతారం మున్నగు విషయాలు ప్రక్రియాపాదంలో కనిపిస్తాయి.

తరువాతి పాదంలో చతురాశ్రమ ధర్మాలు, మునుల జన్మవృత్తాంతం, దక్షుడు గావించిన శివనింద, సతీదేవి అగ్నిప్రవేశం, దక్షుడు, శంకరుడు పరస్పరం శపించుకొనడం, ప్రియవ్రతవర్ణన మున్నగు విషయాలతోపాటు సప్తద్వీపాల వర్ణన, సూర్యుని మహిమ, సూర్యుని అధీనంలో ఉండి ఇతర గ్రహాలు సంచరించడం, రాత్రింబవళు ళ్ళు, మాసాలు, ఋతువులు, సంవత్సరాలు, యుగాలు అనబడే కాలానికి సూర్యుడే మూలకారణమని నిరూపించడం, లింగజననం, యుగధర్మాలు, మొదలగు విషయాలు ఇందులో కనిపిస్తాయి.

మూడవదైన ఉపోద్ఘాతపాదంలో సప్తర్షులజననం, నృసింహావతార వర్ణన, కుమారసంభవం, పుణ్యప్రదేశవర్ణన, శ్రాద్ధాలకు ప్రశస్తమైన నదులు, తీర్థాలు, అన్నదానం, గయలో శ్రాద్ధం, మొదలగు విషయాలు నిరూపింపబడి వున్నాయి. పరశురాముని తపస్సు, జమదగ్నిని కార్తవీర్యార్జునుడు హతమార్చడం, జమదగ్నిపునర్జననం, సగర యయాతుల చరిత్ర మున్నగు విషయాలు కనిపిస్తాయి.

చివరిపాదంలో లలితాదేవి వర్ణన, కామాక్షీ మాహాత్మ్యం, దేవీదీక్ష, మొదలైన విషయాలు ఉన్నాయి. ఈ పురాణపఠనఫలం క్రింది విధంగా పేర్కొనబడింది.

య ఇదం కీర్తయేద్వత్స! శృణోతి చ సమాహితః ।
స విధూయేహ పాపాని యాతి లోకమనామయమ్ ॥

బ్రహ్మాండపురాణం పఠించేవాడు, ఏకాగ్రతతో వినేవాడు పాపరహితుడై సర్వోత్తమలోకాలను చేరుకుంటాడు అని భావం.

సముద్రాల లక్ష్మణయ్య
పూర్వ ప్రత్యేకాధికారి
పురాణ ఇతిహాస ప్రాజెక్టు – తి.తి.దే.

మార్కండేయ పురాణ సారాంశం

నారాయణం నమస్కృత్య నరం చైవ నరోత్తమమ్ ।
దేవీం సరస్వతీం వ్యాసం తతో జయముదీరయేత్ ॥

నరనారాయణులకు, సరస్వతీదేవికి, వేదవ్యాసమహామునికి నమస్కరించి, అటుపిమ్మట జయశబ్దనామకమైన మహాభారతాన్ని, పద్దెనిమిది పురాణాలను ప్రవచనం చేయాలని ఆర్యోక్తి. ఇహ పర పురుషార్థాలకు సాధనమైనది ఈ పురాణపఠనం. అంతేకాదు శ్రవణం కూడా. చతుర్విధపురుషార్థాలలో మోక్షం ప్రధానం. మోక్షం లభించాలని చాలామంది కోరుకుంటూ ఉంటారు. కాని మోక్షప్రాప్తికి మానవునికి కావలసిన ప్రధానమైన అర్హత చిత్తశుద్ధి, చిత్తనిర్మలత్వం, చిత్తప్రసన్నత, చిత్తైకాగ్ర్యం లాంటి సుగుణసంపదలు. అలాంటి సుగుణసంపత్తి శ్రద్ధగా పురాణాలను చదివినా కూడా లభిస్తుందని మన పెద్దలు చెబుతారు. పురాణాలలో కర్మల విచారం, ఆత్మవిచారం రెండూ కనిపిస్తాయి గావున పురాణాలు తప్పక ఆదరింపతగ్గవి, చదవతగ్గవి, శ్రవణం చేయతగ్గవి. ఐహికాముష్మికఫలాలు రెండింటికి వారధిలాంటివీ పురాణాలు.

పద్దెనిమిదిపురాణాలలో ఏ పురాణానికున్న వైశిష్ట్యం ఆ పురాణానికుంది. కాని **దేవీనవరాత్రుల్లో పఠింపబడే సప్తశతి పారాయణగ్రంథభాగం** నేటికీ వ్యవహారంలో ఉంది. **దత్తాత్రేయమాహాత్మ్యంలాంటి** విశిష్ట ఉపాఖ్యానాల వల్ల మార్కండేయపురాణం పురాణాలన్నింటిలోనూ ఉత్తమమైనదిగా కీర్తింపబడుతున్నది.

జైమినిమహర్షి మార్కండేయమహామునివద్దకు వచ్చి తనకు కలిగిన ధర్మసందేహాలకు సమాధానం చెప్పవలసిందిగా కోరాడు. అప్పుడు మార్కండేయమహాముని జైమినితో "వేదార్థశాస్త్రార్థాలలో విశేషజ్ఞానం సంపాదించిన ద్రోణుని పుత్రులయిన నలుగురు పక్షికుమారులు నీ సందేహాలన్నింటికి బదులు చెబుతా"రని చెప్పాడు. ద్రోణకుమారులయిన వారికి పక్షిజన్మ ఎలా వచ్చిందో విశదంగా మార్కండేయుడు చెప్పాడు. ఆపై జైమిని ధర్మపక్షులు నివసిస్తున్న వింధ్యపర్వతానికి వెళ్ళి వారితో తాను వచ్చిన పనిని వివరించాడు. "సమస్తలోకాలకు కారణభూతుడై నిర్గుణస్వరూపుడైన వాసుదేవునికి మానవజన్మమేలా" అని ఇలాంటి మహాభారతంలో సంశయాలకు సమాధానం చెప్పవలసిందిగా జైమినిమహర్షి పక్షికుమారుల్ని ప్రార్థించగా, వారు అందుకు బదులుగా ఒక్కొక్క ఉపాఖ్యానాన్ని చెప్పారు. వాటిలో ముందుగా ద్రౌపది పంచభర్తృక కావడానికిగల కారణాన్ని వారు చెప్పారు. బలరామునికి బ్రహ్మహత్యాపాతకం ఎందుకు కలిగిందో వివరించారు. ఇంకా క్రమంగా ఆ ధర్మపక్షులు హరిశ్చంద్రోపాఖ్యానాన్ని చాలా వివరంగా చెప్పాయి. హరిశ్చంద్రుని సత్యవాక్పరిపాలనం ఈ ఉపాఖ్యానంలో చాలా చక్కగా వివరింపబడింది. చివరిలో ఈ ఉపాఖ్యానానికి ఫలశ్రుతిగూడా చెప్పబడింది.

ఏతత్తే సర్వమాఖ్యాతం హరిశ్చంద్రవిచేష్టితమ్ ।
యః శృణోతి సుదుఃఖార్తః స సుఖం మహదాప్నుయాత్ ॥

"ఈ హరిశ్చంద్రోపాఖ్యానాన్ని నీకు వివరంగా చెప్పాము. ఈ కథాభాగాన్ని శ్రవణం చేసినవాడు ఎలాంటి దుఃఖాల్లో ఉన్నను వాటిని పోగొట్టుకొని గొప్ప సుఖాన్ని పొందుతాడ"ని తాత్పర్యం.

ఆ తరువాత ఆడిబకయుద్ధం, మృత్యుదశావర్ణనం, జీవుని గర్భస్థితినిరూపణం, మహారౌరవాదినరక నిరూపణం, పితాపుత్రసంవాదం, స్వర్గప్రాప్తికి కారణమైన ధర్మసూక్ష్మవర్ణనం మొ॥లగు విషయాలు వర్ణింపబడ్డాయి.

పై ఉపాఖ్యానాలను ధర్మపక్షులు జైమినితో విశదం చేస్తున్న సందర్భంలోనే ప్రసక్తానుప్రసక్తంగా పితాపుత్ర సంవాదం కూడా చోటు చేసుకొంది. సుమతియనే కుమారుడు తన తండ్రికి చెప్పిన ధర్మసూక్ష్మాలే ఈ సంవాదంలో ప్రధానమైనవి. సుమతియను కుమారుడు జడుడుగానూ, శాంతుడుగానూ ఉండడం చూచి మహామతి అనే పేరుగల అతని తండ్రి మాటిమాటికీ కుమారునితో వేదాధ్యయనం చేయవలసిందిగానూ, పిమ్మట గృహస్థధర్మం స్వీకరించి యజ్ఞాదులు నిర్వహించి, పుత్రులను గని అటుపిమ్మట వానప్రస్థాశ్రమాన్ని, ఆ తర్వాత సన్న్యాసాశ్రమాన్ని స్వీకరించవలసిందిగానూ చెప్పాడు. అలాంటి సన్న్యాసాశ్రమాన్ని స్వీకరించడంవల్ల పునరావృత్తిరహితమూ, దుఃఖరహితమూ, సచ్చిదానందస్వరూపమూ అయిన బ్రహ్మజ్ఞానసిద్ధి కలుగుతుందని తండ్రి కుమారునికి ఉపదేశించాడు. ఈ విధంగా పుత్రస్నేహంతో మాటిమాటికీ తండ్రి ఉపదేశిస్తుంటే సుమతి నవ్వుతూ "నాకు పదివేల జన్మలనెత్తిన వృత్తాంతాలు జ్ఞాపకంలో ఉన్నాయి. మీరిప్పుడు చెప్పిన వేదాలు, శాస్త్రాలు, శిల్పాది చతుష్షష్టి కళలు మొ॥లగు విద్యలు నేనెన్ని పర్యాయాలు అభ్యసించానో చెప్పతరం కాదు. నేననేక సుఖదుఃఖాలు, వృద్ధిక్షయాలు, రకరకాలయిన నీచమధ్యమోత్తమజన్మలను ఎత్తాను. ఇవన్నీ నాకు స్మృతిపథంలో సజీవంగా ఉన్నాయి. జ్ఞాని అయిన నాకు వేదాలతో ఏమి ప్రయోజనం? నాకు పూర్వజన్మలలో బంధువులు, తల్లిదండ్రులు ఎంతమందో చెప్ప శక్యంగాదు. ఓ తండ్రీ! నేననేకపర్యాయాలు సేవకుడను, రాజును, మహారాజును, దరిద్రుణ్ణి కూడా. నేనెంతమందినో చంపాను, చంపించాను. నన్నుగూడా చంపారు. ఎన్నో దానాలను చేశాను, ఎన్నో దానాల ప్రతిగ్రహణం చేశాను. ఇప్పుడు నీ కుమారునిగా నీ యింట జన్మించాను. నాకు పుట్టినప్పుడే ఈ జ్ఞానం అందడంతో, వేదాలతో ఏమి ప్రయోజనం? నా కెలాంటి కోరికలులేవు. నేను సదా ఆనందస్వరూపుణ్ణి. గుణదోషరహితమైన శాశ్వతమైన బ్రహ్మపదవినే లక్ష్యంగా పరిశ్రమిస్తాను" అని పలికాడు.

తన కుమారుడయిన సుమతి తార్కికంగా చెప్పిన మాటల్ని విని తండ్రి సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యాడు. "నీకు ఇంతటి బ్రహ్మజ్ఞానం ఎలా వచ్చింది" అని ప్రశ్నించి వాటి గురించి వివరంగా చెప్పమని కోరాడు. జనన మరణ ప్రవాహరూపమయిన ఈ సంసారం గురించి వివరించవలసిందిగా కూడా తండ్రి తన కుమారుని కోరాడు. ఈ సందర్భం పురస్కరించుకొని సుమతి అనేక వేదాంతవిషయాలను వర్ణించి చెప్పాడు. మృత్యుదశ, జీవుని గర్భస్థితి, మహారౌరవాది నరకవివరాలు, స్వకృతపాపపుణ్యకర్మల అనుభవం, స్వర్గప్రాప్తికి సంబంధించిన ధర్మసూక్ష్మాల వర్ణన, మొ॥గు అంశాలను తన తండ్రికి వర్ణించి చెప్పాడు.

తన కుమారుడు సుమతి ఉపదేశించిన విధంగా సంసారంలోని కోరికలను పోగొట్టుకొని, తండ్రి తాను చేయవలసిన కర్తవ్యమేమిటో చెప్పమని అడిగాడు. తనను సంసారబంధాలనుండి విముక్తిని చేయవలసిందిగా కూడా కోరాడు. అప్పుడు మహాజ్ఞానసంపన్నుడయిన దత్తాత్రేయుని మాహాత్మ్యాన్ని సుమతి వర్ణించి చెప్పాడు. ఇవన్నీ పుత్రుడు తండ్రికి ఉపదేశించాడని ధర్మపక్షులు జైమినికి బోధించాయి. ఈ సందర్భంలో సుమతి తన తండ్రికి దత్తాత్రేయోపాఖ్యానం, మదాలసోపాఖ్యానం, కువలయాశ్వచరితంలో (కువలయమను అశ్వము కలిగిన

రాకుమారుడైన ఋతధ్వజుని చరితం) కువలయాశ్వుడు పాతాళలోకానికి వెళ్ళడం, పాతాళలోకాధిపతీ, పన్నగేశ్వరుడూ అయిన అశ్వతరుని ద్వారా కువలయాశ్వుడు మరణించిన తన భార్య మదాలసను తిరిగి పొందడం మొదలగు వృత్తాంతాలు అత్యంత మనోహరంగా వర్ణింపబడ్డాయి.

మదాలసా ఋతధ్వజులకు విక్రాంతుడు, సుబాహుడు, శత్రుమర్దనుడు అనే ముగ్గురు కుమారులు జన్మించగా ఆ ముగ్గురికీ బాల్యావస్థనుండే మదాలస ఆత్మతత్త్వాన్ని బోధించింది. వారు ఆత్మజ్ఞానసంపన్నులై విరక్తులై రాజ్యపాలనపట్ల విముఖులయ్యారు. ఇక అలర్కుడనే నాల్గవ కుమారుడు జన్మించినా అతనికి కూడా తల్లియగు మదాలస ఆత్మజ్ఞానం ఉపదేశించడానికి ఉద్యుక్తురాలయ్యింది. ఈ కుమారునికయినా రాజ్యపరిపాలన చేయడానికి అర్హమగునట్లుగా ప్రవృత్తిమార్గం ఉపదేశించవలసిందిగా ఋతధ్వజుడు మదాలసను వేడుకొన్నాడు. ఆమె అలాగే అనుగ్రహించింది. అలర్కుడు యుక్తవయస్కుడు కాగా అతడు తల్లిని "ప్రజలకు హితమైనట్టివి, ప్రజలను రంజింపచేసేవి, ప్రజాపాలనచే ముక్తిని సిద్ధింపచేసేవీ అయిన ధర్మాలను తెలుపవలసిందిగా" కోరాడు. "రాజ్యపట్టాభిషిక్తుడైన రాజు క్షత్రియ ధర్మానుసారంగా ప్రజల్ని రంజింపచేయడమే మొదటి ధర్మం. సమస్తవినాశనానికి మూలమైన వ్యసనాలను త్యజించి, రాజ్యరహస్యాలను బయటకు పొక్కకుండా శత్రువులనుండి తనను తాను కాపాడుకోవడం ముఖ్యకర్తవ్యం. అమాత్యులలో తన వారెవరో, శత్రుపక్షం వారెవరో జాగ్రత్తగా గుర్తించాలి" లాంటి ఎన్నో రాజనీతిధర్మాలను మదాలస తన కుమారుడయిన అలర్కునికి బోధించింది. ఇరవైనాల్గవ అధ్యాయంలోని ఈ విషయాలు ప్రజాపరిపాలకులకు నీతిసూత్రాలుగా ఉపయోగపడతాయి.

ఇంకా 25,26 అధ్యాయాలలో బ్రాహ్మణ క్షత్రియాదుల వర్ణధర్మాలు, గృహస్థవానప్రస్థాది ఆశ్రమధర్మాలు చెప్పబడ్డాయి. 27 నుంచి 30వ అధ్యాయం వరకు గల శ్రాద్ధకల్పంలో శ్రాద్ధకర్మను ఆచరించే విధానం చెప్పబడింది. ఈ పితాపుత్ర సంవాదంలోని భాగంగానే తల్లి అయిన మదాలస తన కుమారుడగు అలర్కునికి సదాచార పద్ధతి, ధర్మసూక్ష్మాలు, ఆత్మ స్వరూపం మొదలైన వేదాంత విషయాలను బోధించడం మనం గమనించవచ్చు. ఈ పేర్కొన్న విషయాలన్నింటినీ 21 నుంచి 35 వరకు గల అధ్యాయాలలో చూడవచ్చు. యోగశాస్త్రానికి సంబంధించిన అనేక విషయాలు యోగానుష్ఠానఫలము, యోగి ఆచరించవలసిన నియమాలు, యోగసిద్ధికి అనుసరించవలసిన మార్గాలు, బ్రహ్మపదమును పొందాలంటే యోగి ఎటువంటి చర్యలను చేపట్టాలి మొదలగు విషయాలు 37, 38 అధ్యాయాలలో చెప్పబడ్డాయి. 39వ అధ్యాయంలో ఓంకారమహిమ, ఓంకారాన్ని జపించినందువలన కలిగే ఫలం, ఓంకారంలోని మాత్రల స్వరూపం మొదలగు విషయాలు చెప్పబడ్డాయి. మనిషియొక్క లక్షణాలను బట్టి ఆయా వ్యక్తి ఎప్పుడు మరణించునో 40వ అధ్యాయంలో దత్తాత్రేయుడు అలర్కునికి చెప్పిన విషయాలను మనం గమనించవచ్చు. ధర్మసింధు, నిర్ణయసింధులాంటి ధర్మశాస్త్ర గ్రంథాల్లో చెప్పబడిన ఎన్నో ధర్మసూక్ష్మాలు ప్రస్తుత పురాణములో పొందుపరచబడ్డాయి.

ఈవిధంగా సుమతి తన తండ్రికి గృహస్థాశ్రమధర్మాలు, శ్రాద్ధకల్పం, సదాచారవర్ణనం, ధర్మనిరూపణం, ఆత్మవివేకం, దత్తాత్రేయాలర్కసంవాదం, యోగనిరూపణం, యోగసిద్ధి మొదలయిన విషయాలను బోధించి అలర్కుని

వృత్తాంతంతో తన ధర్మోపదేశప్రసంగాన్ని పూర్తి చేశాడు. చివరగా "ఓ తండ్రీ! మీరు ముక్తిలాభం కొరకు అత్యుత్తమ యోగులు అయినట్లయితే బ్రహ్మపదాన్ని పొందగలరు. ఆ బ్రహ్మపదాన్ని పొందిన పిమ్మట తిరిగి శోకసాగరంలో పడవలసిన పని ఉండదు" అని బోధించి తాను ముక్తిసాధనకు తగిన ప్రయత్నాన్ని చేస్తానని చెప్పి నిష్క్రమించాడు.

నలభైరెండవ అధ్యాయంనుండి తిరిగి ధర్మపక్షులు జైమినికి ధర్మోపదేశం చేయడం మొదలుపెట్టాయి. జైమిని ధర్మపక్షులను "ఓ ద్విజశ్రేష్ఠులారా! స్థావరజంగమాత్మకమైన ఈ సృష్టి ఎలా కలిగింది? మరి ప్రళయకాలంలో ఏ విధంగా లయమవుతుంది? మన్వంతరాల పుట్టుక ఏవిధంగా కలిగింది? ఈ వివరాలన్నీ చెప్పవలసిందిగా కోరుచున్నాను" అని కోరాడు. ధర్మపక్షులు "ఓ జైమినీ! మునిశ్రేష్ఠుడా! పూర్వము ద్విజపుత్రుడు, శాంతస్వభావుడు, వ్రతస్నాతుడు, ధీమంతుడూ అయిన క్రౌష్టుకియను మునికి మార్కండేయుడు చెప్పిన విషయాలను నీకు చెబుతాము" అని పలికాయి. ఈ విధంగా ఈ నలభైరెండవ అధ్యాయం నుంచి ఈ పురాణం పూర్తి అయ్యేంతవరకు మార్కండేయుడు క్రౌష్టుకిమునికి సృష్టిరహస్యాలు, స్వారోచిషమన్వంతరం మొ॥కొని ఆయా మన్వంతరాల సమగ్రస్వరూపం, దేవీమాహాత్మ్యం, ఆయా ఉపాఖ్యానాలు మొ॥ విషయాలు చెప్పినట్లుగా మనం భావించాలి. మార్కండేయుడు క్రౌష్టుకిమునికి చెప్పిన విషయాలను ధర్మపక్షులు విన్నందున వారు జైమినిమహర్షికి అనువదించి చెప్పినట్లుగా కూడా మనం భావించాలి.

మార్కండేయుడు ముందుగా క్రౌష్టుకిమునికి బ్రహ్మయొక్క ఉత్పత్తి ఎలా జరిగిందో వర్ణించి చెప్పాడు. బ్రహ్మ అంటే హిరణ్యగర్భుడు. ప్రథమజీవుడైన ఆ హిరణ్యగర్భబ్రహ్మ అందరికంటే ముందు ఉండి ప్రళయానంతరం సమస్తజగత్తును తిరిగి వ్యాప్తి గావించాడు. ఈ సృష్టి అంతా పురుషాధిష్ఠితం. అవ్యక్తమయిన ప్రధానంవల్లనే ఈ ప్రపంచం సృష్టింపబడింది. సత్త్వరజస్తమోగుణాత్మకమయిన ఆ ప్రధానమే ప్రకృతి అంటే. సాంఖ్యదర్శనంలోని విషయాలు ఈ నలభైరెండవ అధ్యాయంలో ప్రతిపాదింపబడినట్లు విశదమవుతున్నది. సాంఖ్యశాస్త్రం ప్రకారం అచేతనమయిన ప్రకృతియే ప్రపంచానికి మూలకారణం. అదియే అవ్యక్తమనగా. ఆ ప్రకృతి సత్త్వరజస్తమోగుణాత్మకం కావున దానినుండి ఉద్భవించిన దేవతలు, మనుష్యులు, పశువులు మొ॥గా గల ఈ సృష్టి కూడా హెచ్చుతగ్గులు కలిగిన సత్త్వరజస్తమోగుణాలు కల్గియున్నది. ప్రకృతినుండి మహత్తత్త్వం, దానినుండి అహంకారం, దానినుండి పఞ్చతన్మాత్రలు, వాటినుండి పంచమహాభూతాలు, ఇంద్రియాలు మొదలయిన విధంగా ప్రపంచం సృష్టింపబడినది. ప్రకృతినుండి ఉద్భవించిన ప్రపంచం ప్రళయకాలంలో తిరిగి ప్రకృతిలోనే లీనమవుతుంది. ప్రళయకాలంలో సత్త్వరజస్తమోగుణాలు సామ్యావస్థను కలిగియుంటాయి. ఈ మూడు గుణాలు నిత్యం పరిణామశీలాలు గావున ఆ సమయంలో సత్త్వం సత్త్వంగాను, రజస్సు రజస్సుగాను, తమస్సు తమస్సుగాను పరిణమిస్తాయి. సాంఖ్యసిద్ధాంతం ప్రకారం ప్రకృతి, పురుషుడు ఈ రెండూ సత్యాలే. ప్రకృతిపురుషవివేకసాక్షాత్కారమే మోక్షహేతువు. అచేతనమైన ప్రకృతిలో కర్తృత్వం చెప్పబడింది. చేతనమైన పురుషునిలో చైతన్యం తప్ప కర్తృత్వభోక్తృత్వాది ధర్మాలు ఏమీ లేవు. తామరాకు మీద నీటిబొట్టులాంటివాడు పురుషుడు. సాంఖ్యసిద్ధాంతము అద్వైతవేదాంతానికి పూర్తిగా విరుద్ధం. చేతనరూపమైన ప్రపంచం అచేతనమైన ప్రకృతినుండి పుట్టుట అసంభవం. నిర్గుణపరబ్రహ్మను ఆశ్రయించిన మాయ అనే అవిద్య (అజ్ఞానము) నుండి హిరణ్యగర్భుడు ముందుగా ఉదయించాడని, ఆ హిరణ్యగర్భుడే అవిద్యాసహాయంతో ప్రపంచసృష్టికి కారణభూతుడని వేదాంతం చెబుతుంది. ఆ హిరణ్యగర్భుడే ప్రథమజీవుడు.

సాంఖ్యశాస్త్రమందలి విషయాలు కొన్ని ఈ నలబైరెండవ అధ్యాయంలో ప్రతిపాదింపబడినా, సాంఖ్యసిద్ధాంతమే ఈ పురాణంలో ప్రతిపాదింపబడిందని చెప్పడానికి వీలు లేదు. హిరణ్యగర్భుడనే బ్రహ్మ మొట్టమొదటిగా ఉద్భవించాడని, అవ్యక్తయోని అయిన బ్రహ్మ పుట్టుట తోడనే అతని నాలుగు ముఖాలనుండి నాలుగు వేదాలు మరియు పురాణాలు ఆవిర్భవించాయని ఈ అధ్యాయంలో చెప్పినందువల్లనూ, మరి అక్కడక్కడ ఉన్న ప్రసంగాలవల్లనూ వేదాంతసిద్ధాంతమే మార్కండేయపురాణాభిమతమని భావించవచ్చు.

నలబైమూడవ అధ్యాయంనుండి బ్రహ్మాయుఃప్రమాణనిరూపణం, ప్రాకృతవైకృతసర్గవర్ణనం, సృష్టిప్రకరణం, యజ్ఞానుశాసనం, రుద్రసర్గం ఇవన్నీ వర్ణింపబడ్డాయి. ఏబదియవ అధ్యాయంనుంచి స్వాయంభువమన్వంతరం మొదలగు మన్వంతరాలు వర్ణింపబడ్డాయి. ఆయా మన్వంతరాలప్రమాణం, ఆయా మన్వంతరాలలోని దేవతలు, దేవర్షులు, క్షత్రియులు, దేవేంద్రుడు వీరి వివరాలన్నీ సవిస్తరంగా చెప్పబడ్డాయి. స్వాయంభువం మొదటి మన్వంతరం. స్వారోచిషం రెండవది. ఇంకా ఔత్తమ, తామస, రైవత, చాక్షుషం మొత్తం ఆరు మన్వంతరాలు గడచిపోయాయి. డెబ్బైఏడవ అధ్యాయం వరకు స్వాయంభువమన్వంతరకథనం, జంబూద్వీపవర్ణనం, గంగావతరణవర్ణనం, నద్యాదివర్ణనం, భారతీయకూర్మనివేశం, ఉత్తరకురుకథనం, భువనకోశవర్ణనం, స్వారోచిషమన్వంతరకథారంభం, స్వారోచిషమన్వంతరవృత్తాంతం, నిధివర్ణనం, ఔత్తమమన్వంతరవృత్తాంతం, తామసమన్వంతరవృత్తాంతం, రైవతమన్వంతరవృత్తాంతం, చాక్షుషమన్వంతర వృత్తాంతాలు ఇవన్నీ ఆయా దేవతలు, ఋషులు, రాజులు, దేవేంద్రుడు మొదలయిన వారి వివరాలతో వర్ణింపబడ్డాయి. ఆ పిమ్మట ప్రస్తుతం నడుస్తున్న వైవస్వతమన్వంతర వృత్తాంతం, ఆ వైవస్వతమనువుయొక్క పుత్రులు, దేవతలు, సప్తర్షులు, రాజులు మొదలయిన వారి వృత్తాంతాలన్నీ సవిస్తరంగా చెప్పబడ్డాయి. ఇక్ష్వాకు, నాభాగ, దిష్ట, శర్యాతి, నరిష్యన్త, నాభాగ, దిష్ట, కరూష, పృషధ్రులు ఈ తొమ్మిదిమంది వైవస్వతమనువుయొక్క దీప్తిమంతులు, జగద్విఖ్యాతులూ అయిన పుత్రులు.

సూర్యభగవానునివల్ల ఛాయాదేవి గర్భంనుండి ఉద్భవించిన సావర్ణి ఎనిమిదవ మనువు కాగలడు. కాబోయే అష్టమమనువయిన సావర్ణియొక్క జన్మవృత్తాంతాన్ని మార్కండేయమహాముని క్రౌష్టుకిమునికి వర్ణించి విశదంచేసే సందర్భంలోనే దేవీమాహాత్మ్యం కథనం ఉంది. సురథమహారాజు, సమాధి అనే వైశ్యుడు ఇద్దరు సుమేధసుడను మహర్షియొక్క ఆశ్రమం చేరి తమ కష్టాలను చెప్పుకొన్నారు. సురథమహారాజు ఆ మునితో "ఓ మునిశ్రేష్ఠా! శత్రువుల చేతిలో రాజ్యం పోగొట్టుకొన్న నాకు ఇదంతా భ్రమ అని తెలిసినా ఇంకా రాజ్యంపట్ల మమకారం పోలేదు మరియు ఈ వైశ్యుణ్ణి ఈతని పుత్రులే అవమానించారు. భార్యలు, సేవకులు, బంధువులు ఇతనిని విడిచిపెట్టారు. అయినా ఈ వైశ్యుడు ఇంకనూ తనవారిపట్ల అనురాగం కలిగి ఉన్నాడు. మేమిద్దరం జ్ఞానులమై ఉండి కూడా వివేకాంధులమై మోహావిష్టులు కావడానికి గల కారణమేమి" అని.

అప్పుడు ఆ సుమేధసముని రాజుతో "సంసారస్థితికి మూలకారణమైన మహామాయ ప్రభావంచేత జనులు అజ్ఞానులై మోహమనే బురదగొయ్యిలో పడిపోతున్నారు. జగత్తుకు ప్రభువయిన హరికి భగవతియగు ఆ మహామాయయే యోగనిద్రాస్వరూపంగా ఉన్నది. అదియే జగత్తును మోహింపచేస్తున్నది. ఆ మహామాయయే జ్ఞానుల మనస్సులను బలవంతంగా లాగి మోహంలో పడవేస్తున్నది. ఆ దేవియే ఈ చరాచరజగత్తును ఉత్పన్నం

చేసింది. ఆమెయే ప్రసన్నురాలై మనుష్యులకు ముక్తిప్రదాయినిగా వరాలనిస్తున్నది. ఆ దేవియే సనాతన బ్రహ్మజ్ఞానరూపమైన విద్య. ఆమెయే సంసారబంధానికి హేతువు. ఆమెయే సర్వేశ్వరేశ్వరి" అని పలికాడు.

ముని విశదీకరించిన మాటలను విన్న సురథమహారాజు తిరిగి మునితో "ఓ భగవత్స్వరూపుడా! మీరు చెప్పిన ఆ మహామాయ ఎవరు? ఆమె ఎలా ఉద్భవించింది? ఆమె చేసే పనులెట్టివో ఇంకా చెప్పుము" అని పలికాడు. అంతట సుమేధసముని దేవీతత్త్వాన్ని వర్ణించాడు. డెబ్బదియొనిమిదవ అధ్యాయంలోని మధుకైటభసంహారవృత్తాంతం మొదలుకొని ఎనభైఏడవ అధ్యాయం శుంభాసురవధ వృత్తాంతంవరకు ఆ ముని ఆ సుంథవైశ్యులకు దేవీమాహాత్మ్యాన్ని వర్ణించి చెప్పాడు. మహాసురేంద్రుడయిన శుంభుడు మరణించగా సమస్తదేవగణాలు మిక్కిలి హర్షానందచిత్తులయ్యారు. గంధర్వులు మధురగానం చేయసాగారు. కొంతమంది వాద్యాలు మ్రోగించారు. అప్సరసలు నృత్యం చేయడం మొదలెట్టారు. పుణ్యవాయువులు చల్లగా వీచాయి. సూర్యుడు సుందరమైన కాంతితో ప్రకాశించాడు. ఆరిపోతున్న హోమాగ్ని తిరిగి ప్రజ్వలించింది. దిక్కులలో శాంతిశబ్దాలు వినబడసాగాయి.

రాక్షససంహారం పూర్తి అయిన పిమ్మట దేవతలు దేవేంద్రులను ముందిడుకొని ఆ కాత్యాయినీదేవిని స్తుతింపసాగారు. ఎనభైఎనిమిదవ అధ్యాయంలో దేవతలు చేసిన దేవీస్తోత్రాన్ని సవిస్తరంగా మనం చదివితే ఆ పరమేశ్వరి మన కన్నులముందు ప్రత్యక్షమైనట్లుగా మనకు భావన కలుగుతుంది. దేవతలు చేసిన స్తోత్రానికి సంతోషించి శ్రీదేవి అనుగ్రహించిన వరప్రదానాన్ని మనం ఎనభైతొమ్మిదవ అధ్యాయంలో చూడవచ్చు. "సావధానచిత్తంతో ఏ మానవుడయితే ఈ స్తోత్రాలతో నన్ను స్తుతిస్తాడో నేను వారి సమస్త బాధలను పోగొడతాను. ఇందులో ఏ మాత్రం సంశయం లేదు. మధుకైటభసంహారం, మహిషాసురవధ, శుంభనిశుంభుల సంహారం ఈ వృత్తాంతాలను ఏకాగ్రచిత్తంతో ఎవరయితే భక్తిప్రపత్తులతో అష్టమి, చతుర్దశి మరియు నవమి తిథులలో కీర్తిస్తారో లేక వింటారో వారికి ఏ కొంచెం కూడా పాపాలుగాని ఆపదలుగాని అసలుండవు. ఇంకనూ వారికి దారిద్ర్యం ఏనాడూ కలుగదు, ప్రియజనుల వియోగం కలుగదు. వారికి శత్రువులవల్లగాని, చోరులవల్లగాని, రాజులవల్లగాని భయమనేది ఉండదు. మరియు శస్త్రాలవల్ల, అగ్నివల్ల, జలంవల్లా భయం ఉండదు. అందువల్ల సావధానచిత్తులై నా మాహాత్మ్యాన్ని చదవాలి. భక్తితో విన్నా శుభాలు చేకూరుతాయి. నా యీ మాహాత్మ్యము సర్వోత్తమమైనది. ఏ ఇంటనైతే నా ఈ మాహాత్మ్యాన్ని బాగా పఠిస్తారో నేను ఆ ఇంటిని ఏనాటికీ పరిత్యజించను. హోమకార్యాలలో, ఉత్సవసమయాలలో నా యీ చరిత్ర చదవాలి లేక వినాలి. పూజాసమయంలో తెలిసిగాని తెలియకగానీ ఎవరేమి ఇచ్చినా ప్రసన్నతతో నేను వాటిని స్వీకరిస్తాను. శరత్కాలంలో (శరన్నవరాత్రులందు) ఎవరయితే దేవీమహాపూజను చేస్తారో, నా యీ సంపూర్ణచరిత్రను, నా యీ మాహాత్మ్యాన్ని భక్తియుక్తులై వింటారో వారు సమస్తబాధలనుండి విముక్తులు కావడం మాత్రమేగాక ధన, ధాన్య, పుత్రసమన్వితులవుతారు. వారికి సమస్తశుభాలు సిద్ధిస్తాయి". ఈ కథనంతో ఎనభైతొమ్మిదవ అధ్యాయం పూర్తి అవుతుంది.

ఇటుపైన తొంబదియవ అధ్యాయం. సుమేధసమహర్షి దేవీమాహాత్మ్యాన్ని వర్ణించి సురథవైశ్యులతో ఆపై "ఓ రాజా ! మీకు నేను ఉత్తమమైన దేవీమాహాత్మ్యాన్ని వర్ణించి చెప్పాను. ఈ జగత్తునంతా ధరించిన ఆ దేవియొక్క

ప్రభావం ఇలా ఉంది. ఆమెయే తత్త్వజ్ఞానాన్ని ప్రసాదించే పరమేశ్వరి. ఆమెయే విష్ణుమాయాస్వరూపిణి. ఆమెయే నిన్నూ ఆ వైశ్యుణ్ణీ అలాగే ఇతర వివేకవంతులైన పురుషుల్నీ మోహింపచేస్తున్నది. ఓ మహారాజా ! భగవతి అయిన ఆ మహేశ్వరినే శరణు వేడు. ఆమెను ఆరాధించడంవల్లనే ఆ తల్లి మానవులకు వారి వారి అర్హతలనుబట్టి భోగం, స్వర్గం, మోక్షాలను ప్రసాదిస్తుంది" అని పలికెను.

సుమేధస మహామునియొక్క మాటలను విన్న ఆ సురథమహారాజు ఆ మహానుభావునికి నమస్కరించి తపస్సు ఆచరించడానికి వెళ్ళాడు. మరియు ఆ వైశ్యుడు కూడా తపస్సును ఆచరించడానికి వెళ్ళాడు. ఆ రాజు మరియు వైశ్యుడు ఇరువురు ఆ పరమేశ్వరి దర్శనాన్ని కోరి దేవీసూక్తాన్ని జపిస్తూ తపస్సులో నిమగ్నులయ్యారు. వారిరువురు ఒక నది ఒడ్డున మృత్తికతో (మట్టితో) దేవీవిగ్రహాన్ని తయారుచేసి పుష్పధూపహోమతర్పణాలతో దేవిని పూజించారు. వారు నియతాహారాలతో ఆమెపట్ల మనస్సును లగ్నం చేసి సావధానులై తమ తమ దేహాలనుండి రక్తాన్ని తీసి ఆ రక్తంతో బలి యిచ్చారు. ఈ విధంగా ఇంద్రియనిగ్రహంతో మూడు సంవత్సరాలు దేవిని ఆరాధించడంతో జగద్ధాత్రియగు చండిక సంతుష్టురాలై వారికి ప్రత్యక్షమై "ఓ సురథ వైశ్యులారా! మీరు దేనిని కోరుకొంటారో వాటిని పొందెదరు గాక! మీ తపస్సునకు సంతుష్టురాలనయ్యాను. ఏదేని వరాన్ని కోరుకొనుడు" అని పలికెను.

అంతట సురథమహారాజు మరుసటి జన్మలో అఖండరాజ్యాన్ని మరియు ఈ జన్మలో శత్రువుల్ని వధించి తన రాజ్యాన్ని మరల సంపాదించాలని వరం అడిగాడు. పిమ్మట వైశ్యుడు నిర్వేదంతో "ఇది నాది, ఇది నేను" అను మోహాన్ని నశింపజేసే జ్ఞానాన్ని ప్రసాదించవలసిందిగా వరాన్ని కోరుకొన్నాడు. "ఓ రాజా! నీవు కొద్ది రోజులలో శత్రువులను సంహారంచేసి నీ రాజ్యాన్ని తిరిగి దక్కించుకొంటావు. ఆ తరువాత నీవు ఏనాటికి రాజ్యభ్రష్టుడవు కావు. మరణించిన తరువాత నీవు సూర్యభగవానుని కుమారుడవై జన్మించి భూలోకంలో సావర్ణికనామంతో మనువు కాగలవు. ఓ వైశ్యశ్రేష్ఠా! నీవు కూడా నానుండి సంసిద్ధికొరకు ఏ వరాన్నయితే ప్రార్థించావో ఆ వరాన్ని నీకు ఇస్తున్నాను. నీకు జ్ఞానము కలుగు గాక!" అని పరమేశ్వరి అయిన దుర్గాదేవి పలికి, కోరిన వరాలనిచ్చి అంతర్ధానమయింది. సురథవైశ్యులకు వరప్రదానవృత్తాంతంతో తొంబదియవ అధ్యాయం పరిసమాప్తమవుతుంది.

డెబ్బది ఎనిమిదవ అధ్యాయంనుండి తొంబదియవ అధ్యాయం వరకుగల దేవీమాహాత్మ్యవృత్తాంతభాగమే సప్తశతిపారాయణగ్రంథభాగం. సప్తశతియనగా 700 శ్లోకములు. కానీ ఈ దేవీమాహాత్మ్యవృత్తాంతభాగంలో 589 శ్లోకములు మాత్రమే కనిపిస్తాయి. సప్తశతసంఖ్యను ఈవిధంగా పూరించాలి. ఈ వృత్తాంతభాగంలో "దేవ్యువాచ, ఋషిరువాచ, మార్కండేయ ఉవాచ" మొ॥లగు "ఉవాచ"లను కూడా శ్లోకాలుగా లెక్కించాలి. అట్లే "నమస్తస్యై నమస్తస్యై నమస్తస్యై నమో నమః" అను ద్వితీయార్ధమున్న శ్లోకాన్నికూడా మూడు శ్లోకాలుగా లెక్కించాలి. కొన్ని శ్లోకార్ధభాగాలుగా ఉన్నవి శ్లోకాలుగా లెక్కింపబడ్డాయి. ఈ విధంగా లెక్కిస్తే ఈ దేవీమాహాత్మ్యవృత్తాంతభాగం 700 శ్లోకాల భాగమవుతుంది. ఇదియే సప్తశతిపారాయణగ్రంథభాగం. అష్టాదశపురాణాలలో ప్రస్తుత మార్కండేయపురాణానికి వైశిష్ట్యం సిద్ధించడంలో ఈ పురాణంలోని సప్తశతిభాగమే ప్రధానకారణం. శరన్నవరాత్రులలో ఈ సప్తశతిపారాయణ కొనసాగించడం అందరికీ తెలిసిన విషయమే.

తొంబదిఒకటవ అధ్యాయం ప్రారంభంలో మార్కండేయమహాముని క్రౌష్టుకిమునితో "ఓ మునిశ్రేష్ఠుడా! ఈ సావర్ణికమన్వంతరాన్నిగూర్చి నీకు నేను చెప్పాను. ఈ ప్రసంగంలో దేవీమాహాత్మ్యం, మహిషాసురవధ, మహాయుద్ధంలో మాతృగణాల విజృంభణ, చాముండాదేవియొక్క ఉత్పత్తి, శివదూతియొక్క మాహాత్మ్యం, శుంభనిశుంభుల వధ, మరియు రక్తబీజుని వధ వీటన్నింటినీగూడా నీకు విశదంగా వర్ణించి చెప్పాను. ఇంక జరుగబోయే దక్షపుత్రుడగు తొమ్మిదవ సావర్ణిమనువుయొక్క మన్వంతరాన్ని వర్ణించి చెబుతాను" అని అన్నాడు. ఈ విధంగా తొమ్మిదవ మన్వంతరం మొదలుకొని పదమూడవ మనువు అయిన రౌచ్యునిదాకా ఆయా మన్వంతరాలలోని సప్తర్షులు, రాజులు, ఇంద్రుడు మొ॥గువారి చరిత్రలు తొంబైఒకటవ అధ్యాయంలో చెప్పబడ్డాయి. తొంబైరెండవ అధ్యాయంలో గృహస్థధర్మాలు చెప్పబడ్డాయి. ప్రజాపతియగు రుచి మునివ్రతం ఆచరిస్తూ గృహస్థాశ్రమాన్ని స్వీకరించని కారణాన అతని పితృదేవతలు రుచికి వివాహప్రాశస్త్యాన్ని గురించి, గృహస్థధర్మాల గురించి వివరిస్తారు. ఈ వృత్తాంతంలో అనేకానేక వేదాంతవిషయాలను మనం గమనించవచ్చు. రుచి "ఓ పితృదేవతలారా! వేదంలో కర్మమార్గం అవిద్యగా (అజ్ఞానముగా) చెప్పబడింది కదా! అయినా మీరు నన్నెందుకు కర్మమార్గంలో ప్రవర్తింపచేస్తున్నారు?" అని పలుకుతాడు. అందుకు బదులు పలుకుతూ పితృదేవతలు "నిజమే. కర్మలు అవిద్యారూపంగానే చెప్పబడ్డాయి. కాని జ్ఞానసంపాదనకు చిత్తనైర్మల్యమే కారణం. అందుకు కర్మలు ఉపకరిస్తాయి. విహితకర్మలనాచరించక ఎవరయితే సంయమనం పాటిస్తారో ఆ సంయమనం ముక్తిని ప్రసాదించకపోగా అధోగతికే దారితీస్తుంది. "నేను ఆత్మప్రక్షాళన చేసుకొంటున్నా"నని నీవు అనుకుంటున్నావు. కాని విహితకర్మలను ఆచరించని కారణాన సిద్ధించే పాపాలతో లేపనం పొందుతున్నావు. అందువల్ల విధ్యుక్తప్రకారం వివాహం చేసుకో. లౌకికధర్మాలను అనుష్ఠించక నీవు నీ జన్మను విఫలం చేసుకోవద్దు" అని పలుకుతారు. ఆపై రుచి పితృదేవతలతో "నేను వృద్ధుడనయినందున నాకు కన్యను ఎవరిస్తారు? విశేషించి దరిద్రులు పెళ్ళిచేసుకోవడం మిక్కిలి కష్టతరం" అని చెప్పాడు.

పిమ్మట రుచి ఉద్విగ్నమనస్కుడై కన్యాభిలాషతో భూమండలమంతా తిరిగాడు. బ్రహ్మదేవుని ఆరాధిస్తూ నూరు దివ్యసంవత్సరాలు తపస్సు చేశాడు. బ్రహ్మదేవుడు ప్రసన్నుడై ప్రత్యక్షమై "పితృపూజ నిర్వహించు. పితృదేవతలు సంతోషించి నీ అభీష్టాన్ని నెరవేరుస్తారు. నీవు కోరినట్లుగా భార్యాపుత్రులను వారు అనుగ్రహిస్తారు" అని ఉపాయం చెప్పాడు. ఆపై రుచి పితృదేవతల్ని స్తుతించాడు. తొంబైనాల్గవ అధ్యాయంలో పితృదేవతలు ప్రసన్నమై వరమివ్వడాన్ని మనం గ్రహించగలం. రుచికి ఉద్భవించిన కుమారుడే రౌచ్యుడనే పేరుతో పదమూడవ మనువుగా ప్రసిద్ధిని పొందాడు.

రుచి ప్రోక్తమయిన పితృదేవతల స్తోత్రానికి ఫలం ఇక్కడ చెప్పబడింది. పితృదేవతలు "మాయొక్క ప్రీతిని కోరేవారు ఈ స్తోత్రాన్ని నిరంతరం పఠించాలి. శ్రాద్ధకాలంలో భుజిస్తున్న బ్రాహ్మణుల సమ్ముఖములో కూర్చుండి ఎవరు మా ప్రీతికొరకు ఈ స్తోత్రాన్ని భక్తితో పఠిస్తారో మరియు ఎవరయితే భక్తితో వింటారో వారు మాకు అక్షయమగు శ్రాద్ధాన్ని పెట్టిన ఫలాన్ని పొందుతారు. ఇందుకు సందేహం ఏ మాత్రం లేదు. ఏ ఇంట ఈ స్తోత్రం వ్రాయబడి సదా ఉంచబడునో అక్కడ శ్రాద్ధకాలంలో మేము తప్పక ఉంటాము" అని అంటారు.

తొంబై అయిదవ అధ్యాయంలో రుచికి మాలినియను పేరుగల కన్యతో వివాహం కావడం, వారికి రౌచ్యుడనే పుత్రుడుదయించడం, అతడు పదమూడవ మన్వంతరంకావడం మొదలయిన విషయాలు చెప్పబడ్డాయి. ఇక తొంబైఆరవ అధ్యాయంలో భౌత్యమనువుయొక్క జననం, అతని మన్వంతరమందలి దేవతలు, ఋషులు, రాజులు మొదలయిన విషయాలు చెప్పబడ్డాయి. భూతియను మునిశ్రేష్ఠుడు మిక్కిలి కోపస్వభావంగలవాడు. సంతానము లేనివాడు. అతడు తన సోదరుడయిన సువర్చసుని యజ్ఞాన్ని చూడటానికై వెళ్ళదలచి తన శిష్యుడయిన శాంతితో "ఓ శాంతీ ! నా సోదరుడగు సువర్చసుడు పిలవడంతో నేను అతని యజ్ఞానికి వెళుతున్నాను. నీవు నా ఆశ్రమమందున్న నిత్యాగ్నిహోత్రం నిర్వహించు. అగ్ని చల్లారకుండా రక్షించు" అని పలికాడు. అగ్నిరక్షణార్థమై శాంతి అడవినుండి సమిధలు, పువ్వులు, ఫలాదులను తేవడంలాంటి పనులలో నిమగ్నుడైన సమయంలో ఆ అగ్ని చల్లారిపోయింది. ఆ అగ్ని ఆరిపోవటాన్ని చూచి శాంతి దుఃఖంతో, భయంతో అనేకవిధాలుగా ఆలోచించి అగ్నిదేవుని శరణు వేడాడు. ఆపై శాంతి ఇంద్రియనిగ్రహంతో ఏకాగ్రచిత్తుడై భూమిపై మోకాళ్ళపై నిలచి అగ్నిదేవుని స్తుతింపసాగాడు. ఈ సందర్భంలోనే అగ్నిదేవుని స్తోత్రం చాలా విస్తృతంగా కనబడుతుంది. అగ్నిదేవుడు సంతోషించి వరం కోరుకొమ్మంటే శాంతి "ఓ దేవా ! మా గురువుగారు ఆశ్రమానికి తిరిగి వచ్చినప్పుడు ఈ అగ్నికుండాన్ని తిరిగి అగ్నియుక్తముగా చూచుగాక ! అట్లే నా రెండవ ప్రార్థన ఏమంటే మా గురువుగారికి గుణశీలి అయిన పుత్రుడుదయించుగాక! ఓ అగ్నిదేవా! నాపై మీరు ప్రసన్నులుకావడం చూచి, ఎవరయిన ఈ స్తోత్రంతో మిమ్మల్ని స్తుతిస్తే వారికి కూడా మీరు వరాలను ప్రసాదింతురుగాక !" అని పలుకుతాడు. భూతి తిరిగి వచ్చిన తరువాత జరిగిన వృత్తాంతమంతా శాంతివల్ల తెలుసుకొని శిష్యుని ఆలింగనం చేసుకొని సంపూర్ణవేదాన్ని ప్రసాదిస్తాడు. అనంతరం భూతియొక్క పుత్రునిగా భౌత్యుడనే మనువు జన్మిస్తాడు. ఇతడే పదునాల్గవ మన్వంతరంగా ప్రసిద్ధి చెందాడు.

మార్కండేయమహాముని చెప్పిన విషయాలన్నీ విని క్రౌష్టుకి "ఓ భగవానుడా! మీరు మన్వంతరవిషయాలను చక్కగా చెప్పారు. ఇప్పుడు నేను మీనుండి బ్రహ్మ మొదలుకొని రాజుల సంపూర్ణ వంశాలని వినాలని కోరుకొంటున్నాను" అని అనగానే మార్కండేయుడు క్రౌష్టుకితో "ఓ బ్రాహ్మణశ్రేష్ఠుడా! పూర్వకాలంలో ప్రజాపతియగు బ్రహ్మ అనేకరూపాల ప్రజలను సృష్టించాలనే కోరికతో తన కుడిచేయి బొటనవ్రేలినుండి దక్షుడను వానిని, ఎడమచేయి బొటనవ్రేలినుండి దక్షుని భార్యను సృష్టించాడు. వారికి అదితియనే కన్య జన్మించింది. అదితిగర్భంనుండి కశ్యపునివలన ఆదిత్యుడు జన్మించాడు" అని పలికాడు. ఈ విధంగా మొదలెట్టి క్రౌష్టుకి కోరిక మేరకు సూర్యభగవానుడు మొ॥వారి సంపూర్ణవృత్తాంతాలను మార్కండేయుడు చెబుతాడు. దీనికే వంశానుకీర్తనమని పేరు. ఆపై మార్తాండమాహాత్మ్యం, దివాకరస్తుతి, భానుతనులేఖనం, భానుస్తవం, భానుమాహాత్మ్యం, పృషధ్రవృత్తాంతం, నాభాగోపాఖ్యానం, భలందనవత్సప్రీచరితం, ఖనిత్రచరిత్రం, వివింశచరిత్రం, కరంధమచరిత్రం, అవీక్షితచరిత్రం, అవీక్షితునికి మరుత్తపుత్రోత్పత్తి, దమచరిత్రం, వపుష్మద్వధ మొదలగు వృత్తాంతాలు చెప్పబడ్డాయి.

ఇక చివరి అధ్యాయమయిన నూటముప్పదినాలుగవ అధ్యాయంలో ఈ మార్కండేయపురాణశ్రవణపఠన మాహాత్మ్యఫలం చెప్పబడింది. జైమినిమహర్షితో పక్షులు "ఓ జైమినిమహర్షీ ! ఇప్పుడు మేము నీకు చెప్పినదంతా

బ్రహ్మదేవుడు మార్కండేయమునికి చెప్పాడు. ఈ పురాణం అనాదిసిద్ధమైనది. ఈ పురాణం పవిత్రము, ఆయుర్వర్ధకం, ధర్మార్థకామమోక్షాలను ప్రసాదించేది. ఈ పురాణంయొక్క శ్రవణపఠనాదుల కారణంగా మానవులకు సర్వపాపాలు తొలగిపోతాయి. ఏ మనుష్యుడయినా ఈ మహాపురాణశ్రవణంవల్లగానీ, సభలలో పఠించడంవల్లగానీ సమస్త పాపాలనుండి విడువబడి అంత్యకాలంలో బ్రహ్మలో లీనమౌతాడు" అని పలికినవి.

ఆపై చివరిగా జైమినిమహర్షి పక్షులతో "ఓ మునికుమారులారా! మహాభారతంలో నాకు కలిగిన సందేహాలను మిత్రభావంతో మీరు నివృత్తి చేశారు. ఇంతటి ధర్మసూక్ష్మాలను మీరు తప్ప ఎవరు చెప్పగలరు? మీ తండ్రి పెట్టిన శాపాలవల్ల మీకు ఎంతమాత్రం దుఃఖం లేకుండుగాక!" అని అంటాడు. ఈ విధంగా పక్షిరూపులయిన మునికుమారులు చెప్పిన వచనాలను తలచుకొంటూ జైమినిమహాముని తన ఆశ్రమమానికి తిరిగి వెళ్ళాడు. ఈ విధంగా మార్కండేయమహాపురాణం సమాప్తమవుతుంది.

అష్టాదశపురాణాలలో మిక్కిలి విశిష్టమైన ఈ పురాణాన్ని ఆంధ్రానువాదం చేసే భాగ్యం కల్పించిన తిరుమల తిరుపతి దేవస్థానం కార్యనిర్వహణాధికారి, ప్రత్యేకాధికారిగార్లకు నా కృతజ్ఞతలు తెలుపుకొంటున్నాను. ఇది నా పూర్వజన్మసుకృతమే గాని మరొకటి కాదు. ఈ పురాణంలోని కొన్ని శ్లోకాలలో అన్వయం చేయడం అంత తేలికగా అనిపించలేదు. కొంచెం కష్టమే అయింది. ఇంతకుముందున్న నాకు లభించిన అనువాదాలలో కూడా అలాంటిచోట్ల స్పష్టత కరువవ్వడమో లేక ఆ శ్లోకాలని విడిచిపెట్టడమో గుర్తించాను. అటువంటి శ్లోకాలనుగూడా ముఖ్యంగా వేదాంత విషయాలకు సంబంధించిన వాటిని యథాశక్తిగా యథాబుద్ధిగా అనువదించే ప్రయత్నం చేశాను. విజ్ఞులు వాటిని ఆదరిస్తారని నా విశ్వాసం. కొన్ని సందర్భాలలో అధికపాఠాలను కూడా ప్రామాణికంగా భావించి ఈ గ్రంథంలో చేర్చడం జరిగింది. ఎక్కడైనా అనువాదదోషాలు దొరలివుంటే పండితులు వాటిని సూచిస్తే సరిదిద్దుకుంటాను. శ్రీవేంకటేశ్వరస్వామి అనుగ్రహం, అమ్మవారి దయ, తల్లిదండ్రులు గురువుల ఆశీస్సులు కారణంగానే నేనీ పురాణానువాదాన్ని పూర్తిచేయగలిగానని మనవి చేసుకుంటూ విరమిస్తున్నాను.

సుధీజనవిధేయుడు

శ్రీపాద సుబ్రహ్మణ్యం

మార్కండేయ మహాపురాణం

ప్రథమోఽధ్యాయః - మొదటి అధ్యాయం

వపుశాపవృత్తాంతమ్ - వపుశాపవృత్తాంతం

మంగళశ్లోకములు

యద్యోగిభిర్భవభయార్తివినాశయోగ్యమాసాద్య వందితమతీవ వివిక్తచిత్తైః ।
తద్వః పునాతు హరిపాదసరోజయుగ్మమావిర్భవత్క్రమవిలంఘితభూర్భువః స్వః ॥ 1 ॥

శ్రీమహావిష్ణువు యొక్క పాదపద్మయుగళము సంసారభయదుఃఖములను నశింపచేయుటకు యోగ్యమైనది. వివేకవంతమైన చిత్తముగల యోగులచేత పొందబడి నమస్కరింపబడిన అట్టి పాదపద్మద్వయము మిమ్ములను అందరను పవిత్రము చేయుగాక! ఆ పాదపద్మద్వయము భూలోకము, అంతరిక్షలోకము మరియు స్వర్గలోకములను అతిక్రమించి ఆవిర్భవించినది.

పాయాత్స వః సకలకల్మషభేదదక్షః క్షీరోదకుక్షిఫణిభోగనివిష్టమూర్తిః ।
శ్వాసావధూతసలిలోత్కణికాకరాలః సింధుః ప్రనృత్యమివ యస్య కరోతి సంగాత్ ॥ 2 ॥

సమస్త పాపములను నశింపచేయుటలో సమర్థుడు, క్షీరసముద్రమధ్యభాగమందు ఆదిశేషుని శరీరంపై శయనించువాడు, ఎవని సాంగత్యము కారణముగా ఉచ్ఛ్వాసనిశ్వాసములచే కంపించుచున్న జలబిందుసమూహములచే భయంకరముగా కన్పించుచున్న సముద్రుడు నృత్యము చేయువానివలే కన్పట్టుచున్నాడో అట్టి శ్రీమన్నారాయణుడు మిమ్ములను అందరను రక్షించుగాక!

నారాయణం నమస్కృత్య నరం చైవ నరోత్తమమ్ ।
దేవీం సరస్వతీం వ్యాసం తతో జయముదీరయేత్ ॥ 3 ॥

శ్రీమన్నారాయణునికి, మానవులలో శ్రేష్ఠుడగు నరునికి, సరస్వతీదేవికి, వ్యాసమహామునికి నమస్కరించి అటుపిమ్మట జయశబ్దముచే చెప్పబడు మహాభారతాన్ని, పురాణములను చదువవలెను.

* * *

తపస్స్వాధ్యాయనిరతం మార్కండేయం మహామునిమ్ ।
వ్యాసశిష్యో మహాతేజా జైమినిః పర్యపృచ్ఛత ॥ 1 ॥

వేదవ్యాసుని శిష్యుడు, గొప్ప తేజస్సుగలవాడు అగు జైమినిమహర్షి తపస్సు, వేదాధ్యయనములలో ఎల్లప్పుడూ మునిగియుండు మార్కండేయమహామునిని ఇట్లు ప్రశ్నించెను.

భగవన్ ! భారతాఖ్యానం వ్యాసేనోక్తం మహాత్మనా ।
పూర్ణమస్తమలైః శుభ్రైర్నానాశాస్త్రసముచ్చయైః ॥2॥

జాతిశుద్ధిసమాయుక్తం సాధుశబ్దోపశోభితమ్ ।
పూర్వపక్షోక్తిసిద్ధాంతపరినిష్ఠాసమన్వితమ్ ॥3॥

ఓ భగవత్స్వరూపుడా! మహాత్ముడగు వేదవ్యాసునిచే చెప్పబడిన భారతగ్రంథము పరిశుద్ధములయిన, పాపరహితములయిన అనేకశాస్త్రవిషయములతో పరిపూర్ణమైయున్నది. ఇంకనూ నానివిధములైన జన్మలుగల పవిత్రులైనవారి వర్ణనలతో కూడుకొన్నది, వ్యాకరణశాస్త్రముచే సంస్కరింపబడిన సాధుశబ్దములతో ప్రకాశించుచున్నది, పూర్వపక్షములతోనూ, పరినిష్ఠితములైన సిద్ధాంతములతోనూ కూడుకొన్నట్టిది.

త్రిదశానాం యథా విష్ణుః ద్విపదాం బ్రాహ్మణో యథా ।
భూషణానాం చ సర్వేషాం యథా చూడామణిర్వరః ॥4॥

యథాయుధానాం కులిశమింద్రియాణాం యథా మనః ।
తథేహ సర్వశాస్త్రాణాం మహాభారతముత్తమమ్ ॥5॥

దేవతలలో విష్ణుమూర్తివలే, మానవులలో బ్రాహ్మణునివలే, సమస్త అలంకారములలో శ్రేష్ఠమైన చూడామణివలే, ఆయుధములలో వజ్రాయుధమువలే, ఇంద్రియములలో మనస్సువలే మహాభారతము సమస్తశాస్త్రములలో శ్రేష్ఠమైనది.

అత్రార్థశ్చైవ ధర్మశ్చ కామో మోక్షశ్చ వర్ణ్యతే ।
పరస్పరానుబంధాశ్చ సానుబంధాశ్చ తే పృథక్ ॥6॥

ఈ మహాభారత గ్రంథమందు ధర్మార్థకామమోక్షములనెడు నాలుగు పురుషార్థములు పరస్పరసంబంధము గలవిగానూ, మరియు వేరువేరుగా ఒక్కొక్కటి ఆయా విశేషములు గలవిగానూ వర్ణింపబడుచున్నవి.

ధర్మశాస్త్రమిదం శ్రేష్ఠమర్థశాస్త్రమిదం పరమ్ ।
కామశాస్త్రమిదం చాగ్ర్యం మోక్షశాస్త్రం తథోత్తమమ్ ॥7॥

ఈ మహాభారతగ్రంథము శ్రేష్ఠమగు ధర్మశాస్త్రముగానూ, ఉత్కృష్టమైన అర్థశాస్త్రముగానూ, గొప్పదియగు కామశాస్త్రముగానూ, ఉత్తమమైన మోక్షశాస్త్రముగానూ చెప్పబడుచున్నది.

చతురాశ్రమధర్మాణామాచారస్థితిసాధనమ్ ।
ప్రోక్తమేతత్ మహాభాగ ! వేదవ్యాసేన ధీమతా ॥8॥

ఓ మహాభాగా ! నాలుగు ఆశ్రమాల ధర్మాలు మరియు వాటి ఆచారాలు, స్థితులు, సాధనాలు ఇవియన్నియు బుద్ధిమంతుడగు వేదవ్యాసునిచే ఈ మహాభారతమునందు చెప్పబడినవి.

తథా తాత ! కృతం హ్యేతత్ వ్యాసేనోదారకర్మణా ।
యథా వ్యాప్తం మహాశాస్త్రం విరోధైర్నాభిభూయతే ॥9॥

ఓ మహాభాగా ! ఉదారస్వభావుడగు వేదవ్యాసునిచే రచింపబడిన మహాభారతగ్రంథము మహాశాస్త్రముగా అంతటా వ్యాపించి ఉన్నది. ఇంకనూ ఈ గ్రంథమందు ఎచ్చటా పరస్పరవిరోధవాక్యములు లేనందున ఈ శాస్త్రగ్రంథము తిరస్కరింపబడుట లేదు.

వ్యాసవాక్యజలౌఘేన కుతర్కతరుహారిణా ।
వేదశైలావతీర్ణేన నీరజస్కా మహీ కృతా ॥10॥

మహాభారతమందలి వ్యాసవాక్యములనెడు జలప్రవాహము వేదములనెడు పర్వతములనుండి బయల్వెడలి, కుతర్కములనెడు చెట్లను సమూలముగా పెకిలించుచూ ఈ భారతభూమిని ఎట్టి దోషములు, పాపములు లేకుండా చేసినది.

కలశబ్దమహాహంసం మహాఖ్యానవరాంబుజమ్ ।
కథావిస్తీర్ణసలిలం కార్ష్ణం వేదం మహాహ్రదమ్ ॥11॥

తదిదం భారతాఖ్యానం బహ్వర్థం శ్రుతివిస్తరమ్ ।
తత్త్వతో జ్ఞాతుకామోఽహం భగవంస్త్వాముపస్థితః ॥12॥

ఓ భగవత్స్వరూపుడా ! మధురమైన శబ్దములను చేయు గొప్పహంసలు కలదియు, శ్రేష్ఠమైన కథలనెడు పద్మములు కలదియు, విస్తృతమైన కథలనెడు జలము కలదియు అగు గొప్ప సరస్సు అను పంచమవేదమనెడు ఈ మహాభారత గ్రంథము వేదార్థములను విపులీకరించునదియై, నానా గూఢార్థములు కలదియై ఒప్పుచున్నది. అట్టి ఉత్తమగ్రంథమును తెలుసుకొనగోరి నీవద్దకు వచ్చితిని.

కస్మాత్ మానుషతాం ప్రాప్తో నిర్గుణోఽపి జనార్దనః ।
వాసుదేవో జగత్సూతిస్థితిసంయమకారణమ్ ॥13॥

ప్రపంచముయొక్క సృష్టిస్థితిలయములకు కారణమైన వాసుదేవుడు, జనార్దనుడు అగు శ్రీకృష్ణభగవానుడు నిర్గుణస్వరూపమై ఉండియు ఎందువలన మనుష్యజన్మను పొందెను?

కస్మాచ్చ పాండుపుత్రాణామేకా సా ద్రుపదాత్మజా ।
పంచానాం మహిషీ కృష్ణా హ్యత్ర నః సంశయో మహాన్ ॥14॥

కృష్ణయను పేరుగలదియు, ద్రుపదమహారాజు కుమార్తెయు అగు ద్రౌపదీదేవి ఏ కారణముచేత అయిదుగురికి పట్టమహిషి అయ్యెను? ఈ విషయములో మాకు చాలా సందేహముగా ఉన్నది.

భేషజం బ్రహ్మహత్యాయా బలదేవో మహాబలః ।
తీర్థయాత్రాప్రసంగేన కస్మాచ్చక్రే హలాయుధః ॥15॥

నాగలి ఆయుధముగా గలవాడు, మహాబలవంతుడు అగు బలదేవుడు తీర్థయాత్రలు చేయు సమయమందు బ్రహ్మహత్యాప్రాయశ్చిత్తమును ఎందువలన చేసెను?

కథం చ ద్రౌపదేయాస్తేఽ కృతదారా మహారథాః ।
పాండునాథా మహాత్మానో వధమాపురనాథవత్ ॥16॥

పాండుమహారాజు సహాయముగలవారు, గొప్పవారు, మహారథులు, అవివాహితులు అగు ద్రౌపదీదేవి కుమారులు అనాథలవలె ఎట్లు చంపబడిరి?

ఏతత్సర్వం విస్తరశో మమాఖ్యాతుమిహార్హసి ।
భవంతో మూఢబుద్ధీనామవబోధకరాః సదా ॥17॥

ఈ విషయములనన్నింటిని మీరు నాకు విస్తరముగా చెప్పుటకు తగుదురు. మీరు ఎల్లప్పుడు మందమతులను (అల్పజ్ఞానులను) జ్ఞానవంతులుగా చేయువారు.

ఇతి తస్య వచః శ్రుత్వా మార్కండేయో మహామునిః ।
దశాష్టదోషరహితో వక్తుం సముపచక్రమే ॥18॥

నిద్ర, తంద్ర, భయము, క్రోధము, మోహము, మదము, ఉన్మాదము, ప్రమాదము, విస్మయము, సందేహము, లోభము, అసూయ, మాత్సర్యము, కపటత్వము, మిథ్య, నాస్తికత, ఆగమాదర్శిత్వము, అశిక్ష అను యోగశాస్త్రమందు చెప్పబడిన పద్ధెనిమిది దోషములు లేనివాడు, గొప్ప మునియగు మార్కండేయుడు జైమినిమహర్షి సందేహములను విని, సమాధానము చెప్పుటకు ఉపక్రమించెను.

క్రియాకాలోఽయమస్మాకం సంప్రాప్తో మునిసత్తమ! ।
విస్తారే చాఽపి వక్తవ్యే నైష కాలః ప్రశస్యతే ॥19॥

మార్కండేయుడు ఇట్లు బదులు పలికెను, "ఓ మునిశ్రేష్ఠుడా! మాకు సంధ్యావందనాది నిత్యవిధులను అనుష్ఠించుటకు సమయము సంప్రాప్తమైనది. నీవు అడిగిన ప్రశ్నలకు విస్తరముగా బదులు చెప్పుటకు ఈ సమయము తగినది కాదు."

యే తు వక్ష్యన్తి వక్ష్యేఽద్య తానహం జైమినే ! తవ ।
తథా చ నష్టసందేహం త్వాం కరిష్యన్తి పక్షిణః ॥20॥

ఓ జైమినీ ! నీ సంశయములను పోగొట్టి బదులు చెప్పువారు ఎవరో వారిని గూర్చి చెప్పెదను. పక్షులు నీ సంశయములను అన్నింటినీ పోగొట్టగలవు.

పింగాక్షశ్చ వివోధశ్చ సుపత్రః సుముఖస్తథా ।
ద్రోణపుత్రాః ఖగశ్రేష్ఠాస్తత్త్వజ్ఞాః శాస్త్రచింతకాః ॥21॥

పింగాక్షుడు, వివోధుడు, సుపత్రుడు, సుముఖుడు అను పేర్లుగల ద్రోణమునికుమారులు పక్షులలో శ్రేష్ఠులైనవారు, తత్త్వమును ఎరిగినవారు, శాస్త్రవిచారములను చేయువారు.

వేదశాస్త్రార్థవిజ్ఞానే యేషామవ్యాహతా మతిః ।
వింధ్యకందరమధ్యస్థాః తానుపాస్య చ పృచ్ఛ చ ॥22॥

పక్షిజన్మమును పొంది, వింధ్యపర్వతగుహలలో ఉండు ఆ నలుగురికి వేదశాస్త్రముల విజ్ఞానమందు అడ్డులేని విజ్ఞానము కలదు. వారిని ఉపాసించి వారిని నీ సందేహములను అడుగుము.

ఏవముక్తస్తదా తేన మార్కండేయేన ధీమతా ।
ప్రత్యువాచర్షిశార్దూలో విస్మయోత్ఫుల్లలోచనః ॥23॥

బుద్ధిమంతుడగు మార్కండేయుడు ఇట్లు పలుకగా ఆ మాటలను విని, ఆశ్చర్యముతో వికసించిన నేత్రములు గలవాడై ఆ మునిశ్రేష్ఠుడు జైమిని ఈ విధముగా బదులు పలికెను.

జైమినిరువాచ – జైమిని ఇట్లు పలికెను.

అత్యద్భుతమిదం బ్రహ్మన్ ! ఖగవాగివ మానుషీ ।
యత్ పక్షిణస్తే విజ్ఞానమాపురత్యంతదుర్లభమ్ ॥24॥

ఓ బ్రహ్మస్వరూపుడా! మనుష్యులు మాటలాడు విధముగా పక్షులు మాటలాడుననియు, మిక్కిలి దుర్లభమయిన విజ్ఞానమును పక్షులు పొందెననియు నీవు చెప్పిన విషయము చాలా ఆశ్చర్యకరముగా ఉన్నది.

తిర్యగ్యోన్యాం యది భవస్తేషాం జ్ఞానం కుతోఽభవత్ ।
కథం చ ద్రోణతనయాః ప్రోచ్యన్తే తే పతత్రిణః ॥25॥

పశుపక్ష్యాది జన్మను పొందిన పింగాక్షుడు మొదలగు ఆ నలుగురికి జ్ఞానమెట్లు కలిగెను? ద్రోణుని కుమారులగు ఆ నలుగురు పక్షులని ఏల చెప్పబడుచున్నారు?

కశ్చ ద్రోణః ప్రవిఖ్యాతో యస్య పుత్రచతుష్టయమ్ ।
జాతం గుణవతాం తేషాం ధర్మజ్ఞానాం మహాత్మనామ్ ॥26॥

పింగాక్షుడు మొదలగు నాలుగు పక్షులు కుమారులుగా గల ఆ ప్రసిద్ధుడగు ద్రోణుడు ఎవరు? ధర్మమునెరిగినవారు, మహాత్ములు, గుణవంతులు అగు ఆ నలుగురికి ఇంతటి విజ్ఞానము ఎట్లు కలిగినది?

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడిట్లు బదులు పలికెను.

శ్రుణుష్వావహితో భూత్వా యద్వృత్తం నందనే పురా ।
శక్రస్యాప్సరసాం చైవ నారదస్య చ సంగమే ॥27॥

ఓ జైమినీ! పూర్వము నందనవనమున దేవేంద్రుడు, అప్సరస్త్రీలు, నారదుడు సమావేశమై యుండగా జరిగిన వృత్తాంతమును చెప్పెదము. సావధానుడవై వినుము.

నారదో నందనేఽ పశ్యత్ పుంశ్చలీగణమధ్యగమ్ ।
శక్రం సురాధిరాజానం తన్ముఖాసక్తలోచనమ్ ॥28॥

ఒకసారి నందనవనమందు పురుషులను కోరుకొనే అప్సరసస్త్రీసమూహమధ్యభాగమందు ఉండి, అట్టి స్త్రీల ముఖములను చూచుటలో ఆసక్తమైన నేత్రములు గల, దేవతాధిపతి అయిన దేవేంద్రుని నారదుడు చూచెను.

స తేనర్షివరిష్ఠేన దృష్టమాత్రః శచీపతిః ।
సముత్తస్థౌ స్వకం చాస్మై దదావాసనమాదరాత్ ॥29॥

దేవర్షులలో శ్రేష్ఠుడైన నారదమహామునిచేత చూడబడినంతనే శచీదేవి భర్తయగు దేవేంద్రుడు తన ఆసనమునుండి తటాలున లేచెను. ఇంకను ఆదరముతో తన ఆసనమును నారదుని కిచ్చెను.

తం దృష్ట్వా బలవృత్రఘ్నముత్థితం త్రిదశాంగనాః ।
ప్రణేముస్తాశ్చ దేవర్షిం వినయావనతాః స్థితాః ॥30॥

బలవృత్రులను సంహరించినట్టి, తన ఆసనమునుండి పైకిలేచినట్టి దేవేంద్రుని చూచి, ఆ దేవతాస్త్రీలు కూడా వినయముతో వంగి, నిల్చొని దేవర్షియగు ఆ నారదునికి నమస్కరించిరి.

తాభిరభ్యర్చితస్సోఽ థ ఉపవిష్టే శతక్రతౌ ।
యథార్హకృతసంభాషః కథాశ్చక్రే మనోరమాః ॥31॥

ఆ స్త్రీలచే పూజింపబడిన నారదుడు, ఆ తర్వాత నూరు యాగములు చేసిన దేవేంద్రుడు తన ఆసనమందు కూర్చొనిన పిమ్మట తగినవిధముగా యోగ్యమైన సంభాషణలు జరిపి మనస్సుకు ఆహ్లాదమును కలిగించే కథలను అనగా మాటలను నుడివెను.

తతః కథాన్తరే శక్రస్తమువాచ మహామునిమ్ ।
దేహ్యాజ్ఞాం నృత్యతామాసాం తవ యాభిమతేతి వై ॥32॥

రంభా వా కర్కశా వాథ ఉర్వశ్యథ తిలోత్తమా ।
ఘృతాచీ మేనకా వాఽ పి యత్ర వా భవతో రుచిః ॥33॥

అనంతరము మాటల మధ్యలో ఇంద్రుడు మహామునియగు నారదునితో ఇట్లు పలికెను. "ఓ మహామునీ! ఈ అప్సరస స్త్రీలలో మీకు నచ్చిన ఆమెను నృత్యము చేయవలసిందిగా ఆజ్ఞాపించుడు. రంభ, కర్కశ, ఊర్వశి, తిలోత్తమ, ఘృతాచి, మేనక వీరిలో ఎవరిపై మీకు ప్రీతి ఉన్నదో వారిని ఆజ్ఞాపింపుడు."

ఏతచ్ఛ్రుత్వా ద్విజశ్రేష్ఠో వాచం శక్రస్య నారదః ।
విచింత్యాప్సరసః ప్రాహ వినయావనతాః స్థితాః ॥34॥

ద్విజశ్రేష్ఠుడగు నారదుడు దేవేంద్రుని మాట విని, ఆలోచించి, వినయముతో వంగి నిల్చొనియున్న అప్సరసస్త్రీలతో ఇట్లు పలికెను.

యుష్మాకమిహ సర్వాసాం రూపౌదార్యగుణాధికమ్ ।
ఆత్మానం మన్యతే యా తు సా నృత్యతు మమాగ్రతః ॥35॥

మీలో ఎవరైతే అందము, ఉదారగుణము, సద్గుణములలో తమను తాము గొప్పగా భావించుచున్నారో వారు నా ఎదుట నృత్యము చేయుదురుగాక !

గుణరూపవిహీనాయాః సిద్ధిర్నాట్యస్య నాస్తి వై ।
చార్వధిష్ఠానవత్ నృత్యం నృత్యమన్యద్విడంబనమ్ ॥36॥

సద్గుణసంపత్తి, సౌందర్యము లేని స్త్రీకి నాట్యముయొక్క సిద్ధి లేదు. చక్కటి హావభావములతో కూడుకొన్నది మాత్రమే నృత్యమనిపించుకొనును. అట్లుకాని నృత్యము ఆడంబరమునకు మాత్రమే చేయునట్టిది, అనగా వ్యర్థము.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు పలికెను.

తద్వాక్యసమకాలం చ ఏకైకాస్తా నతాస్తతః ।
అహం గుణాధికా న త్వం న త్వం చాన్యాఽబ్రవీదిదమ్ ॥37॥

నారదుడు అట్లు పలుకగానే ఆ స్త్రీలలో ఒక్కొక్కరు మరొకరికి వంగి వినయముతో పరస్పరము ఇట్లు పలికిరి, "నేనే అందరిలో గుణాధికురాలను నీవు కాదు నీవు కాదు".

తాసాం సంభ్రమమాలోక్య భగవాన్ పాకశాసనః ।
పృచ్ఛ్యతాం మునిరిత్యాహ వక్తా యాం వో గుణాధికామ్ ॥38॥

భగవత్స్వరూపుడగు దేవేంద్రుడు వారిట్లు వాదించుకొనుటను, వారి వేగిరపాటును చూచి ఆ స్త్రీలతో ఇట్లు పలికెను. "మీరు నారదమహామునినే అడుగుడు. మీలో ఎవరు గుణాధికురాలో నారదుడే చెప్పగలడు".

శక్రచ్ఛందానుయాతాభిః పృష్టస్తాభిస్స నారదః
ప్రోవాచ యత్తదా వాక్యం జైమినే తన్నిబోధ మే ॥39॥

ఓ జైమినీ! దేవేంద్రుని అభీష్టానుసారము ఆ అప్సరసస్త్రీలచే అడుగబడిన నారదుడు వారితో ఏమి పలికెనో దానిని నీకు చెప్పెదను, సావధానముగా వినుము.

తపస్యంతం నగేంద్రస్థం యా వః క్షోభయతే బలాత్ ।
దుర్వాససం మునిశ్రేష్ఠం తాం వో మన్యే గుణాధికామ్ ॥40॥

"ఓ దేవతాస్త్రీమూర్తులారా ! ఒక పర్వతమందు తపస్సు ఆచరించుకొనుచున్న దుర్వాసుడను మునిశ్రేష్ఠుని మనస్సును మీలో ఎవరు బలవంతముగా అస్థిరముగా చేయగలరో, అట్టి స్త్రీని నేను మీ అందరిలోను గుణాధికురాలిగా తలచుచున్నాను."

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు పలికెను.

తస్య తద్వచనం శ్రుత్వా సర్వా వేపితకంధరాః ।
అశక్యమేతదస్మాకమితి తాశ్చక్రిరే కథాః ॥41॥

ఆ నారదుని మాటలను విని ఆ అప్సరస స్త్రీలందరూ వణుకుచున్నవారై ఈ కార్యము తమకు శక్యము కాదని తమలో తాము మాటలాడుకొనసాగిరి.

తత్రాప్సరా వపుర్నామ మునిక్షోభణగర్వితా ।
ప్రత్యువాచానుయాస్యామి యత్రాసౌ సంస్థితో మునిః ॥42॥

ఆ అప్సరసస్త్రీలలో వపువు అను అప్సరస ఇంతకుముందే వేరే మునుల మనస్సులను చంచలమైనట్లుగా చేయుటచేత గర్వితురాలై "ఎచ్చటయితే ఆ దుర్వాసముని ఉండెనో అచ్చటకు నేను వెళ్ళెదను" అని బదులు పలికెను.

అద్య తం దేహయంతారం ప్రయుక్తేంద్రియవాజినమ్ ।
స్మరశస్త్రగళద్రశ్మిం కరిష్యామి కుసారథిమ్ ॥43॥

"నేనీరోజు ఆ దూర్వాసమహర్షిని దేహమను రథమును నడుపువానినిగానూ (దేహమందు అభిమానము కలవానినిగానూ), ఇంద్రియములను గుఱ్ఱములను విషయములపై ప్రవర్తింపచేయువానినిగానూ, మన్మథబాణములను ఆయుధములచే చలించిన మనస్సను పగ్గములు గలవానిగానూ, చెడ్డ ఆలోచనలుగల బుద్ధియను సారథిగలవానినిగానూ చేసెదను.

బ్రహ్మా జనార్దనో వాఽపి యది వా నీలలోహితః ।
తమప్యద్య కరిష్యామి కామబాణక్షతాంతరమ్ ॥44॥

బ్రహ్మవిష్ణుమహేశ్వరులలో ఎవరైననూ కావచ్చును. వారిని మన్మథబాణములచే కొట్టబడిన (చలించబడిన) మనస్సుగల వానినిగా చేసెదను."

ఇత్యుక్త్వా ప్రజగామాథ ప్రాలేయాద్రిం వపుస్తదా ।
మునేస్తపఃప్రభావేణ ప్రశాంతశ్వాపదాశ్రమమ్ ॥45॥

ఈవిధముగా పలికి ఆ వపువను పేరుగల అప్సరస దుర్వాసముని తపఃప్రభావము వలన క్రూరజంతువులు పరస్పరవిరోధమును విడిచి పెట్టుటచే ప్రశాంతమైన ఆశ్రమముగల హిమవత్పర్వతమునకు వెళ్ళెను.

సా పుంస్కోకిలమాధుర్యా యత్రాస్తే స మహామునిః ।
క్రోశమాత్రం స్థితా తస్మాదగాయత వరాప్సరాః ॥46॥

అప్సరసస్త్రీలలో శ్రేష్ఠురాలగు వపువు ఆ దుర్వాసమహర్షియుండు ఆశ్రమమునకు క్రోశెడు దూరమందు ఉండి కోకిల స్వరమాధుర్యముతో గానము చేసెను.

తద్గీతధ్వనిమాకర్ణ్య మునిర్విస్మితమానసః ।
జగామ తత్ర యత్రాస్తే సా బాలా రుచిరాననా ॥47॥

ఆ దుర్వాసముని కోకిలకంఠముతో వపువు చేసిన గానమును విని ఆశ్చర్యముతో కూడుకొన్న మనస్సుగలవాడై అందమైన ముఖముగల ఆ వపువు ఉన్నచోటికి వెళ్ళెను.

తాం దృష్ట్వా చారుసర్వాంగీం మునిస్సంస్తభ్య మానసమ్ ।
క్షోభణాయాగతాం జ్ఞాత్వా కోపామర్షసమన్వితః ॥48॥

అందమైన సమస్తావయవాలు కలిగిన ఆ అప్సరసస్త్రీని చూచి దుర్వాసుడు మనస్సును నిగ్రహించుకొన్నవాడై తన మనస్సును క్షోభపెట్టుటకే (చలింపచేయుటకే) ఈమె వచ్చినదని తెలుసుకొని క్రోధము, అసహనములతో కూడుకొన్నవాడు అయ్యెను.

ఉవాచేదం తతో వాక్యం మహర్షిస్తాం మహాతపాః ॥49॥

మహాతపఃసంపన్నుడయిన ఆ దుర్వాసమహర్షి అటుపిమ్మట వపువుతో ఇట్లు పలికెను.

యస్మాత్ దుఃఖార్జితస్యేహ తపసో విఘ్నకారణాత్ ।
ఆగతాసి మదోన్మత్తే మమ దుఃఖాయ ఖేచరి ॥50॥

తస్మాత్ సుపర్ణగోత్రే త్వం మత్క్రోధకలుషీకృతా ।
జన్మ ప్రాప్స్యసి దుష్ప్రజ్ఞే యావద్వర్షాణి షోడశ ॥51॥

ఓ మదోన్మత్తురాలా ! ఆకాశమందు సంచరించుదానా ! ఎంతో కష్టముతో సంపాదించిన తపస్సును విఘ్నపరచుటకై, నాకు కష్టము కలిగించుటకై నీవు నావద్దకు వచ్చితివి. అందువలన ఓ దుష్టబుద్ధిగలదానా ! నా కోపముచేత కలుషీకృతురాలవై (పాపస్పర్శగలదానవై) పదహారుసంవత్సరములపాటు గరుత్మంతుని వంశములో పక్షిజన్మమును పొందెదవుగాక !

నిజరూపం పరిత్యజ్య పక్షిణీరూపధారిణీ ।
చత్వారస్తే చ తనయా జనిష్యంతేఽధమాప్సరాః ॥52॥

ఓ అధమాప్సరా ! నీవు నీ నిజరూపమును వదిలిపెట్టి పక్షిరూపమును ధరించెదవు. నీకు నలుగురు కుమారులు జన్మించెదరు.

అప్రాప్య తేషు చ ప్రీతిం శస్త్రపూతా పునర్దివి ।
వాసమాప్స్యసి వక్తవ్యం నోత్తరం తే కథంచన ॥53॥

వారియందు పుత్రప్రేమను పొందకయే బాణముచే కొట్టబడి చంపబడి పవిత్రురాలవై తిరిగి నీలోకము స్వర్గమునకు పోయెదవుగాక! మారుమాటలాడక వెళ్ళుము. నీకిక ఈ విషయములో బదులు పలుకుటకు ఏమియూ లేదు.

ఇతి వచనమసహ్యం కోపసంరక్తదృష్టిః
చలకరవలయాం తాం మానినీం శ్రావయిత్వా ।

తరలతరతరంగాం గాం పరిత్యజ్య విప్రః
ప్రథితగుణగణౌఘాం సంప్రయాతః ఖగంగామ్ ॥54॥

క్రోధముచే ఎర్రబడిన నేత్రములుగల ఆ దుర్వాసమహర్షి చలించుచున్న చేతివలయములుగలదీ, అభిమానవతీయగు ఆ వపువును గూర్చి సహించుటకు శక్యము గాని శాపమును వినిపించెను. అటుపిమ్మట బ్రాహ్మణుడగు ఆ దుర్వాసుడు మెరియుచున్న మృదువైన తరంగములుగల భూమిని (చతుస్సముద్రవలయిత) విడిచిపెట్టి, ప్రసిద్ధగుణసమూహములు గల ప్రవాహములతో కూడుకొన్న ఆకాశగంగను గూర్చి బయలుదేరెను.

ఇతి శ్రీమార్కండేయ మహాపురాణే వపుశాపకథనం నామ ప్రథమోఽధ్యాయః ॥1॥

శ్రీమార్కండేయ మహాపురాణమందు వపుశాపకథనమను పేరుగల ఒకటవ అధ్యాయం సమాప్తం.



ద్వితీయోఽధ్యాయః – రెండవ అధ్యాయం
చటకోత్పత్తికథనమ్ – చటకోత్పత్తికథనం

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు పలికెను.

అరిష్టనేమిపుత్రోఽభూత్ గరుడో నామ పక్షిరాట్ ।
గరుడస్యాభవత్పుత్రః సంపాతిరితి విశ్రుతః ॥1॥

అరిష్టనేమి యనువానికి పక్షిరాజగు గరుత్మంతుడను కుమారుడు ఉండెను. ఆ గరుత్మంతునికి సంపాతియను పేరుగల ప్రసిద్ధుడైన కుమారుడు ఉండెను.

తస్యాసీత్ సుతశ్శూరః సుపార్శ్వో వాయువిక్రమః ।
సుపార్శ్వతనయః కుంతిః కుంతిపుత్రః ప్రలోలుపః ॥2॥

ఆ సంపాతికి వాయుదేవునితో సమానమైన పరాక్రమముగలవాడు, శౌర్యవంతుడూ అగు సుపార్శ్వుడను కుమారుడుండెను. సుపార్శ్వుని కుమారుడు కుంతియను పేరుగలవాడు. కుంతియొక్క పుత్రుడు ప్రలోలుపుడు.

తస్యాపి తనయావాస్తాం కంకః కంధర ఏవ చ ॥3॥

ఆ ప్రలోపునికి కూడా కంకుడు, కంధరుడు అను ఇద్దరు కుమారులు ఉండిరి.

కంకః కైలాసశిఖరే విద్యుద్రూపేతి విశ్రుతమ్ ।
దదర్శాంబుజపత్రాక్షం రాక్షసం ధనదానుగమ్ ॥4॥

ఆపానాసక్తమమలస్రగ్దామాంబరధారిణమ్ ।
భార్యాసహాయమాసీనం శిలాపట్టేఽమలే శుభే ॥5॥

కంకుడు ఒకనాడు కైలాసపర్వతశిఖరమందు పద్మపత్రములవంటి కన్నులు గలవాడు, కుబేరుని అనుచరుడు, సురాపానమందు ఆసక్తిగలవాడు, పరిశుభ్రమైన పుష్పమాలలు వస్త్రములు ధరించినవాడు, భార్యతో కూడుకొన్నవాడు, మంగళప్రదమూ, నిర్మలమూ అగు శిలాఫలకమందు కూర్చొన్నవాడూ, ప్రసిద్ధుడూ అగు విద్యుద్రూపుడను రాక్షసుని చూచెను.

తద్దృష్టమాత్రం కంకేన రక్షః క్రోధసమన్వితమ్ ।
ప్రోవాచ కస్మాదాయాతస్త్వమితో హ్యండజాధమ ॥6॥

కంకుడు ఆ రాక్షసుని చూచినంత మాత్రమున, కోపముతో కూడుకొన్న విద్యుద్రూపుడను ఆ రాక్షసుడు కంకునితో ఇట్లు పలికెను. గ్రుడ్లనుండి పుట్టినవారిలో అధముడైనవాడా ! నీవిచ్చటకు ఎందుకు వచ్చితివి ?

స్త్రీసన్నికర్షే తిష్ఠంతం కస్మాన్మాముపసర్పసి ।
నైష ధర్మస్సుబుద్ధీనాం మిథో నిష్పాద్య వస్తుషు ॥7॥

భార్యాసమేతుడనై ఉన్న నన్ను నీవెందులకు సమీపించితివి? స్త్రీపురుషులిరువురు ఉన్నట్టి రహస్యప్రదేశమందు ప్రవేశించుట బుద్ధిమంతులైనవారికి ధర్మము కాదు.

కంక ఉవాచ – కంకుడు పలికెను.

సాధారణోఽయం శైలేంద్రో యథా తవ తథా మమ ।
అన్యేషాం చైవ జంతూనాం మమతా భవతోఽత్ర కా ॥8॥

ఈ హిమవత్పర్వతము నీకు ఎట్లో, నాకునూ అట్లే. ఈ పర్వతము మనందరికీ సాధారణమైనది. అంతేకాదు, ఇతరజంతువులకు కూడా ఈ పర్వతము సాధారణమైనది. అట్లయినప్పుడు ఈ పర్వతము నాది యను మమకారము నీకెందులకు?

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు పలికెను.

బ్రువాణమిత్థం ఖడ్గేన కంకం చిచ్ఛేద రాక్షసః ।
క్షరత్క్షతజబీభత్సం విస్ఫురన్తమచేతనమ్ ॥9॥

కంకం వినిహతం శ్రుత్వా కంధరః క్రోధమూర్ఛితః ।
విద్యుద్రూపవధాయాశు మనశ్చక్రేఽణ్డజేశ్వరః ॥10॥

ఈవిధముగా పలుకుచున్న కంకుని విద్యుద్రూపుడను ఆ రాక్షసుడు తన ఖడ్గముతో నరికివేసెను. శిరశ్ఛేదము వలన నెత్తురు ప్రవహించుచుండుటచే కంకుడు భయంకరముగా కన్పట్టుచు అచేతనుడయ్యెను. తన జ్యేష్ఠసోదరుడగు కంకుని మరణవార్త విని పక్షిరాజగు కంధరుడు కోపముతో మూర్ఛనొందినవాడై శీఘ్రముగా విద్యుద్రూపుని చంపవలెనని నిశ్చయించుకొనెను.

స గత్వా శైలశిఖరం కంకో యత్ర హతః స్థితః ।
తస్య సంకలనం చక్రే భ్రాతుర్జ్యేష్ఠస్య ఖేచరః ॥
కోపామర్షవివృత్తాక్షో నాగేంద్ర ఇవ నిశ్వసన్ ॥11॥

కంకుడు ఎచ్చట చచ్చిపడియున్నాడో అచ్చటకు అనగా ఆ హిమవత్పర్వతశిఖరమునకు వెళ్ళి ఆకాశమందు సంచరించునట్టి కంధరుడు క్రోధముచేతను, అసహనముచేతను కన్నులను అన్నివైపులా ద్రిప్పుచు, సర్పమువలె బుసగొట్టుచు తన జ్యేష్ఠసోదరుడగు కంకునికి అంత్యక్రియలను చేసెను.

జగామాథ స యత్రాస్తే భ్రాతృహా తస్య రాక్షసః ।
పక్షవాతేన మహతా చాలయన్ భూధరాన్వరాన్ ॥12॥

గొప్పదియగు తన రెక్కలగాలితో శ్రేష్ఠములైన పర్వతములను కదిపివేయుచూ కంధరుడు తనసోదరుని సంహరించిన రాక్షసుడు ఉన్నచోటికి వెళ్ళెను.

వేగాత్ పయోదజాలాని విక్షిపన్ క్షతజేక్షణః ।
క్షణాత్ క్షయితశత్రుః స పక్షాభ్యాం క్రాంతభూధరః ॥13॥

ఎర్రబడ్డ కన్నులుగలవాడై వేగముతో దట్టమైన మేఘాలను ఎగురకొట్టుచూ, క్షణకాలములో శత్రువులను సంహరించినవాడై ఆ కంధరుడు తన రెక్కల సహాయముతో ఆ హిమవత్పర్వతమును ఆక్రమించెను.

పానాసక్తమతిం తత్ర తం దదర్శ నిశాచరమ్ ।
ఆతామ్రవక్త్రనయనం హేమపర్యంకమాశ్రితమ్ ॥14॥

స్రగ్దామాపూరితశిఖం హరిచందనభూషితమ్ ।
కేతకీపత్రగర్భాభైః దంతైర్ఘోరతరాననమ్ ॥15॥

సురాపానము చేయుటయందు ఆసక్తిగల బుద్ధిగలవాడు; నిశాచరుడు, మద్యపానముచే ఎర్రబడ్డ ముఖము, కన్నులు గలవాడు; బంగారుశయ్యయందు పరుండినవాడు, శిఖయందు పూలమాలలు ధరించినవాడు, శరీరమంతట మంచిగంధము పూసుకొన్నవాడు, కేతకీపత్రములవలే ప్రకాశించుచున్న దంతములతో భయంకరమైన ముఖముగలవాడు, అగు ఆ రాక్షసుని ఆ హిమవత్పర్వతమందు కంధరుడు చూచెను.

వామోరుమాశ్రితాం చాస్య దదర్శాయతలోచనామ్ ।
పత్నీం మదనికాం నామ పుంస్కోకిలకలస్వనామ్ ॥16॥

రాక్షసుని ఎడమతొడపై ఆసీనురాలైనట్టిదీ, విశాలమైననేత్రములు కలదీ, కోకిలకంఠమువలె మధురమైన కంఠము కలదీ అగు రాక్షసపత్ని మదనికను కూడా కంధరుడు చూచెను.

తతో రోషపరీతాత్మా కంధరః కందరస్థితమ్ ।
తమువాచ సుదుష్టాత్మన్నేహి యుధ్యస్వ వై మయా ॥17॥

అంతట మిక్కిలి కోపముతో కంధరుడు పర్వతగుహయందు కూర్చొనియున్న విద్యుద్రూపుడను రాక్షసునితో ఇట్లు పలికెను "ఓరీ మిక్కిలి దుర్మార్గుడా ! రమ్ము, నాతో యుద్ధము చేయుము."

యస్మాజ్జ్యేష్ఠో మమ భ్రాతా విస్రబ్ధో ఘాతితస్త్వయా ।
తస్మాత్ త్వాం మదసంసక్తం నయిష్యే యమసాదనమ్ ॥18॥

నీవు మదోన్మత్తుడవై నా జ్యేష్ఠసోదరుని చంపిన కారణముగా, గర్వముతో కూడుకొన్న నిన్ను యమభవనమునకు పంపెదను.

విశ్వస్తఘాతినాం లోకా యే చ స్త్రీబాలఘాతినామ్ ।
యాస్యసే నిరయాన్ సర్వాన్ తాంస్త్వమద్య మయా హతః ॥19॥

విశ్వాసఘాతకులు వెళ్ళు లోకములు; మరియు స్త్రీలను, చిన్నపిల్లలను చంపినవారు వెళ్ళు లోకములు ఏవిగలవో ఆ లోకములన్నింటికి నీవు నాచే చంపబడి వెళ్ళెదవుగాక !

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు పలికెను.

ఇత్యేవం పతగేంద్రేణ ప్రోక్తం స్త్రీసన్నిధౌ తదా ।
రక్షః క్రోధసమావిష్టం ప్రత్యభాషత పక్షిణమ్ ॥20॥

పక్షిరాజగు కంధరుడు భార్యాసమేతుడైయున్న విద్యుద్రూపుడను రాక్షసునితో ఈవిధముగా పలుకగా, అటుపిమ్మట ఆ రాక్షసుడు క్రోధముతో ఆ పక్షితో ఇట్లు బదులు పలికెను.

యది తే నిహతో భ్రాతా పౌరుషం తద్ధి దర్శితమ్ ।
త్వామప్యద్య హనిష్యేఽహం ఖడ్గేనాఽనేన ఖేచర ॥21॥

ఆకాశమందు సంచరించు ఓ పక్షిరాజా ! నీ సోదరుని చంపి నా పౌరుషమెట్టిదో నీకు చూపితిని. ఈ ఖడ్గముతో ఇప్పుడు నిన్ను కూడా నేను చంపెదను.

తిష్ఠ క్షణం నాత్ర జీవన్ పతగాధమ యాస్యసి ।
ఇత్యుక్త్వాఽంజనపుంజాభం విమలం ఖడ్గమాదదే ॥22॥

"ఓరీ పక్షులలో అధముడా ! క్షణకాలము నిలువుము. నీవు ప్రాణములతో ఇచ్చటనుండి వెళ్ళలేవు" అని పలికి కాటుకవలె ప్రకాశించుచున్న స్వచ్ఛమైన కత్తిని తీసుకొనెను.

తతః పతగరాజస్య యక్షాధిపభటస్య చ ।
బభూవ యుద్ధమతులం యథా గరుడశక్రయోః ॥23॥

అంతట పూర్వము దేవేంద్రునికీ గరుత్మంతునికీ ఎట్లు యుద్ధము జరిగెనో అట్లే పక్షిరాజగు కంధరునికీ, యక్షాధిపుని భటులకూ సాటిలేని యుద్ధము జరిగెను.

తతస్స రాక్షసః క్రోధాత్ ఖడ్గమావిధ్య వేగవత్ ।
చిక్షేప పతగేంద్రాయ నిర్వాణాంగారవర్చసమ్ ॥24॥

అటుపిమ్మట కోపముతో ఆ రాక్షసుడు వేగము కలిగినదీ, బొగ్గువలె నల్లగా ఉన్నట్టిదీ అగు ఖడ్గమును వేగముగా పక్షిరాజుపై విసరివైచెను.

పతగేంద్రశ్చ తం ఖడ్గం కించిదుత్ప్లుత్య భూతలాత్ ।
వక్త్రేణ జగ్రాహ తదా గరుడః పన్నగం యథా ॥25॥

పక్షిరాజు భూతలమునుండి కొంచెం పైకి ఎగిరి గరుత్మంతుడు సర్పమును పట్టుకొనురీతిగా ఆ ఖడ్గమును తన ముక్కుతో గ్రహించెను.

వక్త్రపాదతలైర్భంక్త్వా చక్రే క్షోభమథాండజః ।
తస్మిన్ భగ్నే తతః ఖడ్గే బాహుయుద్ధమవర్తత ॥26॥

అంతట ఆ పక్షిరాజు తన ముక్కు కాళ్ళతో ఆ ఖడ్గమును విరచివేసి ఆ రాక్షసుని చిత్తమందు క్షోభమును కలిగించెను. ఆ ఖడ్గము ముక్కలుముక్కలు కాగా వారిరువురికి బాహుయుద్ధము జరిగెను.

తతః పతగరాజేన వక్షస్యాక్రమ్య రాక్షసః ।
హస్తపాదకరైరాశు శిరసా చ వియోజితః ॥27॥

అంతట ఆ పక్షిరాజగు కంధరుడు ఆ రాక్షసుని వక్షఃస్థలముపై కూర్చొని చేతులను, కాళ్ళను, శిరస్సును ఆ రాక్షసుని దేహము నుండి వేరుచేసెను. అనగా ఆ రాక్షసుని చంపివేసెను.

తస్మిన్వినిహతే సా స్త్రీ ఖగం శరణమభ్యగాత్ ।
కించిత్ సంజాతసంత్రాసా ప్రాహ భార్యా భవామి తే ॥28॥

ఆ రాక్షసుడు అట్లు చంపబడినతరువాత, అతని భార్యయగు మదనిక పక్షిరాజగు కంధరుని శరణుబొందెను. కొంచెం భయపడి ఆమె "నీకు భార్యను అయ్యెదను" అని కంధరునితో పలికెను.

తామాదాయ ఖగశ్రేష్ఠః స్వకం గృహమగాత్ పునః ।
గత్వా స నిష్కృతిం భ్రాతుః విద్యుద్రూపనిపాతనాత్ ॥29॥

పక్షిశ్రేష్ఠుడగు కంధరుడు విద్యుద్రూపుని చంపుటద్వారా తన సోదరునికి నిష్కృతిని గావించి, అటుపిమ్మట మదనికను తీసుకొని తన ఇంటికి వెళ్ళెను.

కంధరస్య చ సా వేశ్మ ప్రాప్యేచ్ఛారూపధారిణీ ।
మేనకాతనయా సుభ్రూః సౌపర్ణరూపమాదదే ॥30॥

మేనకాదేవి పుత్రిక, అందమైన కనుబొమలు గలదీయగు మదనిక కంధరుని ఇంటికి వెళ్ళినపిమ్మట, తనకిష్టమైన రూపమును ధరించు శీలముగల ఆమెకూడా పక్షిరూపమును పొందెను.

తస్యాం స జనయామాస తార్క్షిం నామ సుతాం తదా ।
మునిశాపాగ్నివిప్లుష్టాం వపుమప్సరసాం వరామ్ ॥
తస్యా నామ తదా చక్రే తార్క్షీమితి విహంగమః ॥31॥

అప్పుడా కంధరుడు దుర్వాసమునిశాపాగ్నిచే దహింపబడినదీ, అప్సరసలలో శ్రేష్ఠురాలగు వపువును మదనికయందు పుత్రికగా గనెను. పక్షిరాజు ఆమెకు తార్క్షి యని నామకరణము చేసెను.

మందపాలసుతాశ్చాసన్ చత్వారోఽమితబుద్ధయః ।
జరితారిప్రభృతయో ద్రోణాంతా ద్విజసత్తమాః ॥32॥

ఓ బ్రాహ్మణోత్తములారా ! ఇట్లుండగా మందపాలుడను వానికి మిక్కిలి బుద్ధిమంతులయిన నలుగురు కుమారులు గలరు. వారిలో జరితారి మొదటివాడు, ద్రోణుడు చివరివాడు.

తేషాం జఘన్యో ధర్మాత్మా వేదవేదాంగపారగః ।
ఉపయేమే స తాం తార్క్షీం కంధరానుమతే శుభామ్ ॥33॥

వారిలో చివరివాడగు ద్రోణుడు ధర్మాత్ముడు, ఋగ్వేదము మొదలగు నాలుగు వేదములలోను, శిక్ష మొదలగు ఆరు వేదాంగములలోనూ నిష్ణాతుడు. అతడు కంధరుని అనుమతితో సౌందర్యవతి అయిన తార్క్షిని వివాహమాడెను.

కస్యచిత్ త్వథ కాలస్య తార్క్షీ గర్భమవాప హ ।
సప్తపక్షాహితే గర్భే కురుక్షేత్రం జగామ సా ॥34॥

కొంతకాలమునకు తార్క్షి గర్భమును ధరించెను. గర్భము ధరించిన ఏడు పక్షములు అనగా (మూడుమాసముల పదిహేనురోజులు) పూర్తి అయిన పిమ్మట ఆమె కురుక్షేత్రమునకు వెళ్ళెను.

కురుపాండవయోర్యుద్ధే వర్తమానే సుదారుణే ।
భావిత్వాచ్చైవ కార్యస్య రథమధ్యే వివేశ సా ॥35॥

ఆ సమయమందు కౌరవపాండవుల మధ్య భయంకరమైన యుద్ధము జరుగుచుండెను. జరుగవలసినది అట్లుండుట వలన ఆమె ఆ యుద్ధమందలి రథమధ్యభాగమందు ప్రవేశించెను.

తత్రాపశ్యత యుద్ధం సా సర్వేషాం పృథివీక్షితామ్ ।
శరశక్త్యృష్టిభిర్భీమం యథా దేవాసురం రణమ్ ॥36॥

ఆ కురుక్షేత్రమందు తార్క్షి సమస్తరాజులు శర, శక్తి మొదలగు ఆయుధములతో భయంకరముగా యుద్ధము చేయుట చూచెను. (శర శక్తి + ఋష్టిభిః అని పదచ్ఛేదము, ఋష్టిశబ్దానికి ఖడ్గము లేదా ఆయుధసామాన్యమని అర్థము.)

తత్రాపశ్యత్తదా యుద్ధం భగదత్తకిరీటినోః ।
నిరంతరం శరైరాసీత్ ఆకాశం శలభైరివ ॥37॥

అచ్చట తార్క్షి భగదత్తుడు, అర్జునుల మధ్య జరిగిన యుద్ధమును చూచెను. వారి బాణములచే ఆకాశము ఎడము లేకుండా శలభములచే (మిడతలచే) కప్పబడినదానివలె అయ్యెను.

పార్థకోదండనిర్ముక్తమాసన్నమతివేగవత్ ।
తస్యా భల్లమహిశ్యామం త్వచం చిచ్ఛేద జాఠరీమ్ ॥38॥

మిక్కిలి వేగముతో నల్లత్రాచుపామువలె ఉండి, అర్జునుని కోదండమునుండి బయల్వెడలిన ఒక బాణము తార్క్షి గర్భమును ఛేదించెను.

భిన్నే కోష్ఠే శశాంకాభం భూమావండచతుష్టయమ్ ।
ఆయుషః సావశేషత్వాత్ తూలరాశావివాపతత్ ॥39॥

తార్క్షిగర్భము ఛేదింపబడగా చంద్రప్రకాశము వంటి ప్రకాశము కలిగిన నాలుగు అండములు ఇంకను ఆయుష్షు మిగిలియున్న కారణముగా దూదికుప్పమీద పడినట్లుగా భూమిపై పడెను.

తత్పాతసమకాలం చ సుప్రతీకాద్గజోత్తమాత్ ।
పపాత మహతీ ఘంటా బాణసంఛిన్నబంధనా ॥40॥

ఆ నాలుగు అండములు భూమిపై క్రిందపడిన సమయమందే, అర్జునుడు ప్రయోగించిన బాణముచే బంధములు (గొలుసులు) తెగి సుప్రతీకమను గజశ్రేష్ఠమునుండి గొప్ప ఘంట ఒకటి నేలపై బడెను.

సమం సమంతాత్ ప్రాప్తా తు నిర్భిన్నధరణీతలా ।
ఛాదయంతీ ఖమండాని స్థితాని పిశితోపరి ॥41॥

ఆ గంట నిటారుగా భూమిమీద పడుటచే భూమి బ్రద్దలయ్యెను. ఆ అండములకు ఏ మాత్రము హాని కలుగకుండా రక్షణగా ఆ భూదేవి యుద్ధభూమియందలి మాంసముపై నిలిచియున్న ఆ అండములపై ఆకాశమును కప్పెను. అనగా ఏ వస్తుస్పర్శ లేకుండా వ్యవధానపరచెనని అర్థము.

హతే చ తస్మిన్ నృపతౌ భగదత్తే నరేశ్వరే ।
బహూన్యహాన్యభూద్యుద్ధం కురుపాండవసైన్యయోః ॥42॥

ఆ యుద్ధములో రాజగు భగదత్తుడు మరణించగా, కురుపాండవసైన్యముల మధ్య చాలా రోజులు యుద్ధము జరిగెను.

వృత్తే యుద్ధే ధర్మపుత్రే గతే శాంతనవాంతికమ్ ।
భీష్మస్య గదతోఽశేషాన్ శ్రోతుం ధర్మాన్ మహాత్మనః ॥43॥

అట్లు యుద్ధము ముగిసిన పిమ్మట ధర్మపుత్రుడగు ధర్మరాజు సమస్త ధర్మములను వినుటకు మహాత్ముడగు భీష్మాచార్యుని సమీపమునకు వెళ్ళెను.

ఘంటాగతాని తిష్ఠంతి యత్రాండాని ద్విజోత్తమ ! ।
ఆజగామ తముద్దేశం శమీకో నామ సంయమీ ॥44॥

ఓ ద్విజశ్రేష్ఠుడా ! ఆ సమయమందు గంటచే ఆచ్ఛాదింపబడి రక్షణపొందుచున్న అండములు ఉన్న ప్రదేశమునకు శమీకుడను మునీశ్వరుడు వచ్చెను.

స తత్ర శబ్దమశృణోత్ చిచీకుచీతి వాశతామ్ ।
బాల్యాదస్ఫుటవాక్యానాం విజ్ఞానేఽపి పరే సతి ॥45॥

శమీకుడను ఆ మహర్షి ఆ గంటలో "చిచీకుచీ"యని కూయుచున్న శబ్దమును వినెను. ఆ పక్షిపిల్లలు గొప్ప విజ్ఞానము కలవైననూ బాల్యము కారణముగా అవి పలుకు వాక్యములు అస్పష్టముగా ఉండెను.

అథర్షిః శిష్యసహితో ఘంటాముత్పాట్య విస్మితః ।
అమాతృపితృపక్షాణి శిశుకాని దదర్శ సః ॥46॥

అనంతరము శిష్యులతో కూడుకొన్న ఆ మహర్షి గంటను పైకెత్తి, ఆశ్చర్యముతో జననీజనకులు లేకపోవడమే కాక రెక్కలు కూడా రాని ఆ పక్షిపిల్లలను చూచెను.

తాని తత్ర తథా భూమౌ శమీకో భగవాన్మునిః ।
దృష్ట్వా స విస్మయావిష్టః ప్రోవాచానుగతాన్ ద్విజాన్ ॥47॥

భగవానుడగు శమీకమహాముని అచ్చట ఆ విధముగా నేలమీదపడియున్న ఆ పక్షిపిల్లలను చూచి, ఆశ్చర్యముతో కూడుకొన్నవాడై తనను అనుసరించి వచ్చిన బ్రాహ్మణులతో ఈవిధముగా పలికెను.

సమ్యగుక్తం ద్విజాగ్ర్యేణ శుక్రేణోశనసా స్వయమ్ ।
పలాయనపరం దృష్ట్వా దైత్యసైన్యం సురార్దితమ్ ॥48॥

ఓ ద్విజులారా ! పూర్వము దేవతలచేత హింసింపబడి పారిపోవుచున్న రాక్షససైన్యమునుచూచి, ద్విజశ్రేష్ఠుడగు శుక్రాచార్యుడు స్వయముగా, బాగుగా ఇట్లు పలికెను.

న గంతవ్యం నివర్తధ్వం కస్మాద్వ్రజత కాతరాః ।
ఉత్సృజ్య శౌర్యయశసీ క్వ గతా న మరిష్యథ ॥49॥

“ఓ దైత్యసైనికులారా ! పారిపోకుడు, వెనుకకు మరలుడు, కీర్తిపరాక్రమములను వదిలిపెట్టి పిరికితనముతో ఎందుకు పారిపోవుచున్నారు? ఎచ్చటకు పోయిననూ మీరు మరణించకుండా ఉందురా ఏమి?

నశ్యతో యుధ్యతో వాఽపి తావద్భవతి జీవితమ్ ।
యావద్ధాతాఽసృజత్పూర్వం న యావన్మనసేప్సితమ్ ॥50॥

ముందుగా బ్రహ్మదేవుడు మన కర్మానుసారము తన మనస్సునందు మన మరణమును గూర్చి కోరనంతవరకు నాశముపొందినా, యుద్ధముచేసినా మనము బ్రతికియేయుందుము.

ఏకే మ్రియంతే స్వగృహే పలాయంతోఽపరే జనాః ।
భుజంతోఽన్నం తథైవాపః పిబంతో నిధనం గతాః ॥51॥

కొందరు తమ ఇంటనే మరణింతురు. కొందరు పారిపోవుచూ, కొందరు అన్నము తినుచూ, కొందరు నీళ్ళు త్రాగుచూ మరణించిరి.

విలాసినస్తథైవాన్యే కామయానా నిరామయాః ।
అవిక్షతాంగాః శస్త్రైశ్చ ప్రేతరాజవశంగతాః ॥52॥

అన్యే తపస్యభిరతా నీతాః ప్రేతనృపానుగైః ।
యోగాభ్యాసే రతాశ్చాన్యే నైవ ప్రాపురమృత్యుతామ్ ॥53॥

అటులనే కొందరు విలాసవంతులు, కోరికలుగలవారు, ఏరోగములు లేనివారు, ఆయుధములచే క్షతగాత్రులు కానివారు, భూతపిశాచములు మరియు రాజుల వశమును పొందినవారు, కొందరు తపస్సు ఆచరించుచూ ఉన్నవారు, ప్రేతములు మరియు రాజభటులచే తీసుకొనిపోబడువారు, కొందరు యోగాభ్యాసమందు ఆసక్తులైనవారు వీరెవరూ అమృత్యుతను అనగా చావులేకపోవుటను పొందలేదు. అనగా అవశ్యము మరణించుచున్నారు.

శంబరాయ పురా క్షిప్తం వజ్రం కులిశపాణినా ।
హృదయేఽభిహతస్తేన తథాపి న మృతోఽసురః ॥54॥

పూర్వము దేవేంద్రుడు వజ్రాయుధమును చేతబట్టి ఆ వజ్రాయుధమును శంబరాసురునిపై ప్రయోగించెను. ఆ వజ్రాయుధము ఆ రాక్షసుని వక్షఃస్థలమును కొట్టిననూ ఆ రాక్షసుడు మరణించలేదు.

తేనైవ ఖలు వజ్రేణ తేనైవేంద్రేణ దానవాః ।
ప్రాప్తే కాలే హతా దైత్యాః తత్క్షణాన్నిధనం గతాః ॥55॥

ఆ ఇంద్రుడే ఆ వజ్రాయుధమును ప్రయోగించగా కాలము సమీపించినందున ఆ క్షణమందే రాక్షసులు చంపబడిరి.

విదిత్వైవం న సంత్రాసః కర్తవ్యో వినివర్తత ।
తతో నివృత్తాస్తే దైత్యాస్త్యక్త్వా మరణజం భయమ్ ॥56॥

కావున మీరీ విషయమును తెలుసుకొని భయపడకుడు, వెనుకకు మరలుడు" శుక్రాచార్యుడు పలికిన ఈ మాటలు విని మరణమువలని భయమును వదిలిపెట్టి వెనుకకు మరలిరి.

ఇతి శుక్రవచస్సత్యం కృతమేభిః ఖగోత్తమైః ।
యే యుద్ధేఽపి న సంప్రాప్తాః పంచత్వమతిమానుషే ॥57॥

మిక్కిలి భయంకరమయిన ఇట్టి కురుపాండవయుద్ధమున గూడ మృత్యువును పొందని ఆ పక్షిపిల్లలు శుక్రాచార్యుని వచనమును సత్యమొనర్చినవి.

క్వాండానాం పతనం విప్రాః క్వ ఘంటాపతనం సమమ్ ।
క్వ చ మాంసవసారక్తైర్భూమేరాస్తరణక్రియా ॥58॥

ఓ ద్విజులారా ! ఏకకాలమందు అండములు, గంట భూమియందు పడుట ఎక్కడ? మాంసము, వస, రక్తములచే భూమికి ఆచ్ఛాదనక్రియ ఎక్కడ? (భూమి బ్రద్దలైనందున మాంసవసాదులచే నిండిన భూమియందు ఏకకాలమందు అండములు, గంట భూమిపైపడి అండములు రక్షింపబడుట ఎంతో ఆశ్చర్యకరమైన విషయమని భావము.)

కేఽప్యేతే సర్వథా విప్రా నైతే సామాన్యపక్షిణః ।
దైవానుకూలతా లోకే మహాభాగ్యప్రదర్శినీ ॥59॥

ఓ విప్రులారా! ఈ పక్షిపిల్లలు ఏమైననూ సామాన్యములైనవి గావని తెలియుచున్నది. లోకమున దైవానుకూలమున్నచో మహాభాగ్యములు కలుగుచుండును.

ఏవముక్త్వా స తాన్వీక్ష్య పునర్వచనమబ్రవీత్ ।
నివర్తతాऽऽశ్రమం యాత గృహీత్వా పక్షిబాలకాన్ ॥60॥

ఆ శమీకముని ఈవిధముగా పలికి తన శిష్యులతో మరల ఈవిధముగా పలికెను. "ఓ ద్విజబాలకులారా! ఈ పక్షిశిశువులను తీసుకొని ఆశ్రమమునకు మరలిపొండు."

మార్జారాఖుభయం యత్ర నైషామండజజన్మనామ్ ।
శ్యేనతో నకులాద్వాపి స్థాప్యంతాం తత్ర పక్షిణః ॥61॥

పిల్లులు, ఎలుకలు, డేగలు, ముంగిసలు మొదలగువానివలన ఈ పక్షి పిల్లలకు ఎచ్చట భయముండదో అట్టి ప్రదేశమందు ఈ పక్షిశిశువులను ఉంచుడు.

ద్విజాః! కింవాऽతియత్నేన మార్యంతే కర్మభిః స్వకైః ।
రక్ష్యంతే చాఖిలా జీవా యథైతే పక్షిబాలకాః ॥62॥

ఓ బ్రాహ్మణులారా! మిక్కిలి ప్రయత్నము చేసిననూ ఏమి ప్రయోజనముండును? ఈ పక్షిబాలకులవలె సమస్త జీవులు వారు వారు చేసుకొనిన కర్మల కారణముగా నాశము పొందుదురు లేదా రక్షింపబడుదురు.

తథాపి యత్నః కర్తవ్యో నరైః సర్వేషు కర్మసు ।
కుర్వన్ పురుషకారం తు వాచ్యతాం యాతి నో సతామ్ ॥63॥

అట్లని ఊరుకొనరాదు. సమస్తకర్మలయందు మానవుడు గట్టి ప్రయత్నము చేయవలయును. మానవప్రయత్నము చేసినవారెవరైననూ సత్పురుషుల నిందకు అర్హులు కారు.

ఇతి మునివరచోదితాస్తతస్తే మునితనయాః పరిగృహ్య పక్షిణస్తాన్ ।
తరువిటపసమాశ్రితాలిసంఘం యయురథ తాపసరమ్యమాశ్రమం స్వమ్ ॥64॥

పిమ్మట ఈ విధముగా మునిశ్రేష్ఠునిచే ప్రేరేపింపబడిన ఆ మునిబాలకులు పక్షిశిశువులను తీసుకొని, చెట్ల కొమ్మలను ఆశ్రయించియున్న తుమ్మెదలగుంపుగలదియూ, తపోజనులుండుటచే రమ్యమైనదీయగు తమ ఆశ్రమమునకు వెళ్ళిరి.

స చాపి వన్యం మనసాభికామితం ప్రగృహ్య మూలం కుసుమం ఫలం కుశాన్ ।
చకార చక్రాయుధరుద్రవేధసాం సురేంద్రవైవస్వతజాతవేదసామ్ ॥65॥

అపాంపతేర్గోష్పతివిత్తరక్షిణోః సమీరణస్యాపి తథా ద్విజోత్తమః ।
ధాతుర్విధాతుస్త్వథ వైశ్వదేవికాః శ్రుతిప్రయుక్తా వివిధాస్తు సత్క్రియాః ॥66॥

ద్విజశ్రేష్ఠుడగు ఆ శమీకమహామునియు తన మనస్సుకు ఇష్టమైన ఆ వనమందలి ఫల, మూల, పుష్ప, దర్భలను గ్రహించి ఆశ్రమమునకు వెళ్ళి బ్రహ్మవిష్ణుమహేశ్వరులు, ఇంద్రుడు, యముడు, అగ్ని, వరుణుడు, బృహస్పతి, కుబేరుడు, వాయువు, ధాత, విధాత వీరందరినీ ఆరాధించెను. అటుపిమ్మట వైశ్వదేవమునకు సంబంధించిన వేదోక్తములగు వివిధములయిన సత్క్రియలను గూడ ఆచరించెను.

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే చటకోత్పత్తి కథనం నామ ద్వితీయోఽధ్యాయః ॥2॥

శ్రీ మార్కండేయ మహాపురాణమందు చటకోత్పత్తి కథనమను రెండవ అధ్యాయం సమాప్తం.



తృతీయోఽధ్యాయః - మూడవ అధ్యాయం
వింధ్యప్రాప్తికథనమ్ - వింధ్యప్రాప్తికథనం

మార్కండేయ ఉవాచ - మార్కండేయుడు చెప్పాడు.

అహన్యహని విప్రేంద్ర స తేషాం మునిసత్తమః ।
చకారాఽహారపయసా తథా గుప్త్యా చ పోషణమ్ ॥1॥

ఓ బ్రాహ్మణశ్రేష్ఠుడా! ఆ మునిశ్రేష్ఠుడు ప్రతిదినము ఆహారము, నీరు వీటితోనూ; మరియు రక్షించుటచేతను ఆ పక్షిశిశువులను కాపాడెను.

మాసమాత్రేణ జగ్ముస్తే భానోః స్యందనవర్త్మని ।
కౌతూహలవిలోలాక్షైః దృష్టా మునికుమారకైః ॥2॥

దృష్ట్వా మహీం సనగరాం సాంభోనిధిసరిద్వరామ్ ।
రథచక్రప్రమాణాం తే పునరాశ్రమమాగతాః ॥3॥

ఆ పక్షి శిశువులు ఒకనెల వ్యవధిలోనే సూర్యరథమార్గమందు పయనించినవి. ఆశ్చర్యముతో వికసించిన నేత్రములతో ఆ మునికుమారులు ఆ పక్షిశిశువులను చూచిరి. నగరములు, సముద్రములు, నదులతో కూడి, రథచక్రము యొక్క ప్రమాణము (కొలత) వంటి ప్రమాణముగల భూమినంతటినీ చూచి అనగా ప్రదక్షిణముచేసి ఆ పక్షి శిశవులు తిరిగి ఆశ్రమమునకు వచ్చినవి.

శ్రమక్లాంతాంతరాత్మానో మహాత్మానో వియోనిజాః ।
జ్ఞానం చ ప్రకటీభూతం తత్ర తేషాం ప్రభావతః ॥4॥

యోనిసంభవములు కానివీ, మహత్త్వము కలవీయగు ఆ పక్షిశిశువులు ప్రయాణమువలని శ్రమవలన బడలిక చెందినవి. ఆ మునికుమారుల ప్రభావమువలన అవి జ్ఞానము పొందినవి.

ఋషేశ్శిష్యానుకంపార్థం వదతో ధర్మనిశ్చయమ్ ।
కృత్వా ప్రదక్షిణం సర్వే చరణావభ్యవాదయన్ ॥5॥

ఒకరోజున శిష్యులయందలి అనుగ్రహముతో ఆ శమీకమహర్షి వారికి ధర్మోపదేశము చేయుచుండగా ఆ పక్షులు ఆ మునిపాదములకు నమస్కరించెను.

ఊచుశ్చ మరణాద్ఘోరాన్మోక్షితాస్స్మస్త్వయా మునే ।
ఆవాసభక్ష్యపయసాం త్వం నో దాతా పితా గురుః ॥6॥

పిమ్మట ఆ పక్షులు ఇట్లు పలికినవి. "ఓ మునీ! నీ వలన మేము భయంకరమైన మరణము నుండి తప్పింపబడితిమి. మాకు నివాసము, తినుటకు ఆహారము, పాలు, నీరు ఇచ్చి రక్షించితివి. నీవే మాకు తండ్రివి, గురువు.

గర్భస్థానాం మృతా మాతా పిత్రా నైవాఽపి పాలితాః ।
త్వయా నో జీవితం దత్తం శిశవో యేన రక్షితాః ।7॥

మేము గర్భములో ఉన్నప్పుడే తల్లి చనిపోయినది. తండ్రిచేత మేము రక్షింపబడలేదు. నీచేత మాకు జీవితము ఈయబడినది. నీచేత రక్షింపబడితిమి.

క్షితావక్షతతేజాస్త్వం కృమీణామివ శుష్యతామ్ ।
గజఘంటాం సముత్పాట్య కృతవాన్ దుఃఖరేచనమ్ ॥8॥

నశించని తేజస్సుగల ఓ మునీ! మేము భూమిమీద పడి క్రిములవలె శుష్కించిపోవుచుండగా గజఘంటమును పైకి తీసి, మా దుఃఖమును పోగొట్టితివి.

కథం వర్ధేయురబలాః ఖస్థాన్ ద్రక్ష్యామ్యహం కదా ।
కదా భూమేర్ద్రుమం ప్రాప్తాన్ ద్రక్ష్యే వృక్షాన్తరం గతాన్ ॥9॥

కదా మే సహజా కాన్తిః పాంసునా నాశమేష్యతి ।
ఏషాం పక్షానిలోత్థేన మత్సమీపవిచారిణామ్ ॥10॥

ఇతి చింతయతా తాత! భవతా ప్రతిపాలితాః ।
తే సాంప్రతం ప్రవృద్ధాః స్మః ప్రబుద్ధాః కరవామ కిమ్ ॥11॥

"బలహీనముగా ఉన్న ఈ పక్షిశిశువులు పెరుగుట ఎట్లు? ఇవి ఆకాశములో విహరించుచుండగా ఎప్పుడు చూడగలను? ఈ భూమిమీద ఒక వృక్షమునుండి మరియొక వృక్షముపైకి ఎగురుచుండగా ఎప్పుడు చూడగలను? ఈ పక్షులు నా సమీపమందు సంచరించుచుండగా వాటి రెక్కల గాలిచే పైకి వెడలిన ధూళివలన నా సహజకాంతి ఎప్పుడు నశించునో కదా!" అని ఆలోచించుచున్న నీ చేత ఓ తండ్రీ! మేము రక్షింపబడితిమి. అట్టి మేమిప్పుడు పెరిగి పెద్దవారమైతిమి. జ్ఞానముగలవారమైతిమి. ఇప్పుడు మేము ఏమి చేయవలయునో చెప్పుడు."

ఇత్యృషిర్వచనం తేషాం శ్రుత్వా సంస్కారవత్ స్ఫుటమ్ ।
శిష్యైః పరివృతైస్సర్వైః సహ పుత్రేణ శృఙ్గిణా ॥12॥

కౌతూహలపరో భూత్వా రోమాఞ్చపటసంవృతః ।
ఉవాచ తత్త్వతో బ్రూత ప్రవృత్తేః కారణం గిరః ॥13॥

తన కుమారుడగు శృంగితోనూ, శిష్యులందరితోనూ కూడుకొనియున్న ఆ శమీకమహాముని సంస్కారవంతములు, స్ఫుటములు అగు ఆ పక్షిశిశువుల మాటలను విని, కుతూహలముతో, హర్షముతో రోమములు నిక్కబొడుచుకోగా, ఇట్లు పలికెను. "సత్యము పలుకుడు. మీకిట్టి స్పష్టమైన మనుష్యవాక్కులు సిద్ధించుటకు గల కారణము ఏమి?

కస్య శాపాదియం ప్రాప్తా భవద్భిర్విక్రియా పరా ।
రూపస్య వచసశ్చైవ తన్మే వక్తుమిహార్హథ ॥14॥

మీకు ఎవరి శాపముచే ఇట్టి పక్షిజన్మ ప్రాపమయ్యెను? మీ రూపమునకు, వాక్కులకు వికారమెట్లు సంభవించెను? దానిని మీరు నాకు చెప్ప తగుదురు."

పక్షిణ ఊచుః – పక్షులు పలికాయి.

విపులస్వానితి ఖ్యాతః ప్రాగాసీన్మునిసత్తమః ।
తస్య పుత్రద్వయం జజ్ఞే సుకృషస్తుంబురుస్తథా ॥15॥

ఓ మునీశ్వరా! పూర్వకాలమున విపులస్వానుడను పేరుగల ఒక మునిశ్రేష్ఠుడుండెను. ఆ మునికి సుకృషుడు, తుంబురుడు అను ఇద్దరు కుమారులు జన్మించిరి.

సుకృషస్య వయం పుత్రాశ్చత్వారః సంయతాత్మనః ।
తస్యర్షేర్వినయాచారభక్తినమ్రాః సదైవ హి ॥16॥

జితేంద్రియుడగు ఆ సుకృషునికి మేము నలుగురము పుత్రులము. ఆ ఋషిపట్ల ఎల్లప్పుడు మేము వినయము, సదాచారము, భక్తులతో నమ్రభావము (ఒదిగియుండుట) కలిగి ఉంటిమి.

తపశ్చరణశక్తస్య శాస్యమానేంద్రియస్య చ ।
యథాభిమతమస్మాభిస్తథా తస్యోపపాదితమ్ ॥17॥

సమిత్పుష్పాదికం సర్వం యచ్చ వాఽభ్యవహారికమ్ ।
ఏవం తత్రాథ వసతాం తస్యాస్మాకం చ కాననే ॥18॥

ఆజగామ మహావర్ష్మా భగ్నపక్షో జరాన్వితః ।
ఆతామ్రనేత్రః స్రస్తాత్మా పక్షీ భూత్వా సురేశ్వరః ॥19॥

సత్యశౌచక్షమాచారమతీవోదారమానసమ్ ।
జిజ్ఞాసుస్తమృషిశ్రేష్ఠమస్మచ్ఛాపభవాయ చ ॥20॥

తపస్సును ఆచరించుటలో సమర్థుడై, ఇంద్రియనిగ్రహము కల మా తండ్రికి సమిధలు, పుష్పములు, భోజనసామగ్రి ఇవన్నీ వారి కోరికననుసరించి మాచే కూర్చబడినవి. ఈ విధముగా మేము మా తండ్రిగారి వద్ద అడవిలో నివసించుచుండగా ఒకరోజు దేవేంద్రుడు పెద్దదైన రూపంతో, రెక్కలు విరిగి, ఎర్రని నేత్రములు కలిగి, నీరసించి, వృద్ధపక్షిరూపముతో మా వద్దకు వచ్చెను. సత్యము, శౌచము, క్షమాగుణము, సదాచారము, సద్బుద్ధి, ఉదారగుణము కలిగిన ఆ మునిశ్రేష్ఠుని (సుకృషుని) తెలుసుకొను కోరికతోనూ, మా శాపమునకు నిమిత్తముగానూ ఆ దేవేంద్రుడు మా సమీపమునకు వచ్చెను.

పక్షీ ఉవాచ – పక్షిరూపములోనున్న ఇంద్రుడు చెప్పాడు.

ద్విజేన్ద్ర మాం క్షుధావిష్టం పరిత్రాతుమిహార్హసి ।
భక్షణార్థీ మహాభాగ గతిర్భవ మమాతులా ॥21॥

ఓ ద్విజశ్రేష్ఠుడా! నేను ఆకలిగొనియున్నాను. నన్ను నీవు రక్షించుటకు తగుదవు. ఓ మహాభాగుడా! నేను ఆహారార్థినై యున్నాను. నాకు నీవే పరమగతివి.

వింధ్యస్య శిఖరే తస్మిన్ పత్రిపత్రేరితేన వై ।
పతితోఽస్మి మహాభాగ! శ్వసనేనాఽతిరంహసా ॥22॥

వింధ్యపర్వత శిఖరమందు గరుత్మంతుని రెక్కల వలన బయలుదేరి, మిక్కిలి వేగవంతమైన వాయువుచే నేను క్రిందకు పడిపోయితిని.

సోఽహం మోహసమావిష్టో భూమౌ సప్తాహమస్మృతిః ।
స్థితస్తత్రాఽష్టమేనాఽహ్నా చేతనాం ప్రాప్తవానహమ్ ॥23॥

అట్టి నేను మూర్ఛనొంది భూమిమీద ఏడురోజులవరకు తెలివిలేక ఉంటిని. ఎనిమిదవరోజున తెలివిలోకి వచ్చితిని.

ప్రాప్తచేతాః క్షుధావిష్టో భవన్తం శరణం గతః ।
భక్ష్యార్థీ విగతానన్దో దూయమానేన చేతసా ॥24॥

తెలివినొందినపిమ్మట ఆకలిబాధతో మిమ్ములను శరణుపొందితిని. ఆకలి వలన ఆనందము నశించిన నేను దుఃఖపూరిత హృదయముతో ఏమైనా తినగోరి మిమ్ములను సమీపించితిని.

తత్కురుష్వామలమతే ! మత్త్రాణాయాచలాం మతిమ్ ।
ప్రయచ్ఛ భక్ష్యం విప్రర్షే ! ప్రాణయాత్రాక్షమం మమ ॥25॥

స్వచ్ఛమైన బుద్ధికలవాడా! నన్ను రక్షించుటకు స్థిరమైన ఆలోచన చేయుము. ఓ బ్రాహ్మణమునీ! నా ప్రాణములు నిల్పుకొనుటకు సమర్థమైన ఆహారమును నాకిమ్ము.

య ఏవముక్తః ప్రోవాచ తమిన్ద్రం పక్షిరూపిణమ్ ।
ప్రాణసన్ధారణార్థాయ దాస్యే భక్ష్యం తవేప్సితమ్ ॥26॥

పక్షిరూపములోనున్న ఇంద్రుడీవిధముగా పలుకగా శమీక మహర్షి ఇట్లు పలికెను. నీ ప్రాణములు నిల్చుటకు నీకు ఇష్టమైన ఆహారమును నీకిచ్చెదను.

ఇత్యుక్త్వా పునరప్యేనమపృచ్ఛత్స ద్విజోత్తమః ।
ఆహారః కస్తవార్థాయ ఉపకల్ప్యో భవేన్మయా ।
సచాహ నరమాంసేన తృప్తిర్భవతి మే పరా ॥27॥

ఇట్లు పలికిన ద్విజశ్రేష్ఠుడగు శమీకమహర్షి మరల పక్షిరూపములోనున్న ఇంద్రుని ఇట్లు అడిగెను “నీకొరకు ఎట్టి ఆహారమును నీకు కల్పించవలెను”? “నాకు నరమాంసముతో గొప్ప తృప్తి కలుగు”నని ఆ పక్షి బదులిచ్చెను.

ఋషిః ఉవాచ – శమీక ఋషి చెప్పాడు

కౌమారం తే వ్యతిక్రాన్తమతీతం యౌవనం చ తే ।
వయసః పరిణామస్తే వర్తతే నూనమండజ ॥28॥

“ఓ అండజా! నీ బాల్యావస్థ, యౌవనము రెండూ గడచిపోయినవి. నిశ్చయముగా నీవు వార్ధక్యమందు ప్రవేశించితివి.

యస్మిన్నరాణాం సర్వేషామశేషేచ్ఛా నివర్తతే ।
స కస్మాద్వృద్ధభావేఽపి సునృశంసాత్మకో భవాన్ ॥29॥

వార్ధక్యమందు అందరకు అన్నికోరికలు నశించును. ముసలితనమందు కూడా నీవు ఎందువలన క్రూరస్వభావుడవు అయితివి?

క్వ మానుషస్య పిశితం క్వ వయశ్చరమం తవ ।
సర్వథా దుష్టభావానాం ప్రథమో నోపపద్యతే ॥30॥

నరమాంసమెక్కడ? నీ చరమ వృద్ధభావమెక్కడ? అన్నివిధముల దుష్టభావములు గలవారికి పురుషార్థములలో మొదటిదియగు ధర్మచింతన ఉండదు.

అథవా కిం మయైతేన ప్రోక్తేనాఽస్తి ప్రయోజనమ్ ।
ప్రతిశ్రుత్య సదా దేయమితి నో భావితం మనః ॥31॥

అయిననూ ఈ నా మాటలవలన ఏమి ప్రయోజనము? దేనినైననూ ఇచ్చెదనని మాట ఇచ్చిన పిమ్మట ఆ వస్తువును ఈయవలసినదేయని మా మనోనిశ్చయము.”

ఇత్యుక్త్వా తం స విప్రేంద్రస్తథేతి కృతనిశ్చయః ।
శీఘ్రమస్మాన్సమాహూయ గుణతోఽనుప్రశస్య చ ॥32॥

ఉవాచ క్షుబ్ధహృదయో మునిర్వాక్యం సునిష్ఠురమ్ ।
వినయావనతాన్సర్వాన్ భక్తియుక్తాన్ కృతాఞ్జలీన్ ॥33॥

విప్రులలో శ్రేష్ఠుడై కృతనిశ్చయముగల ఆ ముని ఆ కపటపక్షితో అట్లే అనే పలికి, వెంటనే మమ్ములను పిలిచి, మా గుణములను పొగడుతూ క్షోభించుచున్న హృదయముతో వినయముతో, వంగి, భక్తితో, అంజలి ఘటించియున్న మమ్ములను గూర్చి మిక్కిలి కఠినమైన వాక్యమును ఇట్లు పలికెను.

కృతాత్మానో ద్విజశ్రేష్ఠా ! ఋణైర్ముక్తా మయా సహ ।
జాతం శ్రేష్ఠమపత్యం వో యూయం మమ యథా ద్విజాః ॥34॥

"ఓ ద్విజశ్రేష్ఠులారా! పుత్రులారా! మీరు జన్మను సార్థకము చేసుకొన్నారు. నాకు శ్రేష్ఠులైన విప్రులగు మీరు జన్మించినట్లే, మీకు సత్సంతానము కలిగినది. అందువలన నాతోబాటుగా మీరు కూడా ఋణవిముక్తులైనారు.

గురుః పూజ్యో యది మతో భవతాం పరమః పితా ।
తతః కురుత మే వాక్యం నిర్వ్యలీకేన చేతసా ॥35॥

మీ తండ్రిని మీరు గొప్ప పూజ్యుడైన గురువుగా భావించినచో మీరు ఎట్టి వ్యాకులత లేని మనస్సుతో నా మాటను పాలించుడు."

తద్వాక్యసమకాలం చ ప్రోక్తమస్మాభిరాదృతైః ।
యద్వక్ష్యతి భవాంస్తద్వై కృతమేవావధార్యతామ్ ॥36॥

మా తండ్రి మాటలాడిన వెంటనే ఆదరముతో మేము "ఓ తండ్రీ! నీవు ఏమి పలుకుదువో అది సిద్ధించినట్లేయని నీవు తలచుము" అని పలికితిమి.

ఋషిః ఉవాచ – ఋషి చెప్పాడు.

మామేష శరణం ప్రాప్తో విహంగః క్షుత్తృషాన్వితః ।
యుష్మన్మాంసేన యేనాఽస్య క్షణం తృప్తిర్భవేత వై ॥37॥

తృష్ణాక్షయశ్చ రక్తేన తథా శీఘ్రం విధీయతామ్ ।
తతో వయం ప్రవ్యథితాః ప్రకంపోద్భూతసాధ్వసాః ।
కష్టం కష్టమితి ప్రోచ్య నైతత్కుర్మేతి చాబ్రువన్ ॥38॥

"ఆకలిదప్పులతో కూడుకొన్న ఈ పక్షి నన్ను శరణు పొందినది. మీ మాంసము వలన ఈ పక్షికి క్షణకాలమందే తృప్తి నిశ్చయముగా కలుగును. మీ రక్తము వలన దాహము తీరును. కావున అట్లు శీఘ్రముగా ప్రవర్తించుడు." అంతట మేము మిక్కిలి దుఃఖమునొంది, భయపడుచు, వణకుచు "ఎంత కష్టము! ఎంత కష్టము!" అని పలికి ఈ పనిని మేము చేయజాలమని పలికితిమి.

కథం పరశరీరస్య హేతోర్దేహం స్వకం బుధః ।
వినాశయేద్ఘాతయేద్వా యథా హ్యాత్మా తథా సుతః ॥39॥

ఎంత పండితుడయిననూ ఇతరుల శరీరమును రక్షించుటకై తన శరీరమును ఎట్లు నశింపచేసుకొనును? భగ్నపరచుకొనును? పుత్రుడు తండ్రికి స్వస్వరూపుడే కదా !

పితృదేవమనుష్యాణాం యాన్యుక్తాని ఋణాని వై ।
తాన్యపాకురుతే పుత్రో న శరీరప్రదః సుతః ॥40॥

పితృదేవతలు, దేవతలు, మనుష్యులు వీరియొక్క ఋణములు పుత్రుడు తొలగించును. అంతియేకాని శరీరమును దానముగా నిచ్చువాడు కాదు.

తస్మాన్నైతత్ కరిష్యామో నో చీర్ణం యత్పురాతనైః ।
జీవన్ భద్రాణ్యవాప్నోతి జీవన్ పుణ్యం కరోతి చ ॥41॥

అందువలన మీరడిగినదానిని మేము చేయలేము. పూర్వములో గూడ ఎవరును చేయలేదు. జీవించియున్నచో మంగళములను పొందగలడు మరియు పుణ్యమును ఆచరించగలడు.

మృతస్య దేహనాశశ్చ ధర్మాద్యుపరతిస్తథా ।
ఆత్మానం సర్వతో రక్ష్యమాహుర్ధర్మవిదో జనాః ॥42॥

చనిపోయినవాని శరీరము, ధర్మాదుల ఆచరణము నశించును. అందువలన ధర్మమునెరిగిన జనులు అన్నివిధముల ఆత్మరక్షణము కర్తవ్యమని చెప్పుచున్నారు.

ఇత్థం శ్రుత్వా వచోఽస్మాకం మునిః క్రోధాదివ జ్వలన్ ।
ప్రోవాచ పునరప్యస్మాన్ నిర్దహన్నివ లోచనైః ॥43॥

మేమీవిధముగా పలికిన మాటలను విని, కోపముచే మండిపడుచు మునియగు మా తండ్రి నేత్రములచే దహించుచున్నవానివాలె ఉండి మరల మాతో ఇట్లు పలికెను.

ప్రతిజ్ఞాతం వచో మహ్యం యస్మాన్నైతత్కరిష్యథ ।
తస్మాన్మచ్ఛాపనిర్దగ్ధాః తిర్యగ్యోనౌ ప్రయాస్యథ ॥44॥

నేనీ పక్షిరాజునకు మాట ఇచ్చితిని. నా మాటను మీరు పాలించనందువలన నా శాపముచే దహింపబడినవారై పక్షుల జన్మను పొందుదు.

ఏవముక్త్వా తదా సోఽస్మాన్ తం విహంగమబ్రవీత్ ।
అన్త్యేష్టిమాత్మనః కృత్వా శాస్త్రతశ్చౌర్ధ్వదైహికమ్ ॥45॥

భక్షయస్వ సువిశ్రబ్ధో మామత్ర ద్విజసత్తమ ।
ఆహారీకృతమేతత్తే మయా దేహమిహాత్మనః ॥46॥

ఓ బ్రాహ్మణశ్రేష్ఠుడా! మా తండ్రి మాతో ఇట్లు పలికి, శాస్త్రోక్తప్రకారము ఔర్ధ్వదైహికమగు (మరణానంతరము చేయదగిన) అంత్యేష్టి సంస్కారమును తనకు ఆచరించుకొని ఆ పక్షితో ఇట్లు పలికెను. ఓ పక్షిరాజా! ఎట్టి సంశయములు లేక సావధానముగా నన్ను భక్షించుము. నేను నా శరీరమును నీకు ఆహారముగా చేసితిని.

ఏతావదేవ విప్రస్య బ్రాహ్మణత్వం ప్రచక్ష్యతే ।
యావత్పతగజాత్యగ్ర్య ! స్వసత్యపరిపాలనమ్ ॥47॥

పక్షిజాతియందు అగ్రగణ్యుడా! సత్యవాక్పరిపాలన చేయుటే బ్రాహ్మణునికి బ్రాహ్మణత్వమని చెప్పబడుచున్నది.

న యజ్ఞైర్దక్షిణావద్భిః తత్పుణ్యం ప్రాప్యతే మహత్ ।
కర్మణాన్యేన వా విప్రైః యత్సత్యపరిపాలనాత్ ॥48॥

సత్యవాక్పరిపాలనము వలన బ్రాహ్మణులకు లభించు గొప్ప పుణ్యము దక్షిణలతో కూడుకొన్న యజ్ఞముల వల్లగాని, వేరే ఇతర కర్మలవల్ల గాని లభించదు.

ఇత్యృషేర్వచనం శ్రుత్వా సోఽన్తర్విస్మయనిర్భరః ।
ప్రత్యువాచ మునిం శక్రః పక్షిరూపధరస్తథా॥49॥

పక్షిరూపధారి అయిన ఇంద్రుడు ఋషివాక్యమును విని, మనస్సులో మిక్కిలి ఆశ్చర్యము నిండినవాడై ఆ మునితో ఇట్లు పలికెను.

యోగమాస్థాయ విప్రేంద్ర త్యజేదం స్వం కలేవరమ్ ।
జీవజ్జన్తుం హి విప్రేంద్ర న భక్షామి కదాచన ॥50॥

ఓ బ్రాహ్మణశ్రేష్ఠుడా! యోగమార్గముననుసరించి నీవీ శరీరమును వదిలిపెట్టు. నేనెప్పుడూ కూడా ప్రాణముతోనున్న జంతువును తినుటలేదు.

తస్య తద్వచనం శ్రుత్వా యోగయుక్తోఽభవన్మునిః ।
తం తస్య నిశ్చయం జ్ఞాత్వా శక్రోఽధ్యాహ స్వదేహభృత్ ॥51॥

పక్షియొక్క ఆ మాటను విని ముని యోగమును అవలంబించెను. ఆ మునినిశ్చయమును తెలుసుకొని ఇంద్రుడు పక్షిరూపమును వదిలి, తన యథార్థరూపమును గ్రహించి ఆ మునితో ఇట్లు పలికెను.

భో ! భో ! విప్రేంద్ర బుధ్యస్వ బుద్ధ్వా బోధ్యం బుధాత్మక ।
జిజ్ఞాసార్థం మయాఽయం తే అపరాధః కృతోఽనఘ ॥52॥

ఓ బ్రాహ్మణశ్రేష్ఠుడా ! పండితుడా ! స్వీయబుద్ధితో తెలుసుకొనదగినదానిని నీవు తెలుసుకొనుము. ఓ పాపరహితుడా! కేవలము నిన్ను తెలుసుకొనగోరి నేనీ అపరాధము నాచరించితిని.

తత్ క్షమస్వామలమతే ! కా చేచ్ఛా క్రియతాం తవ ।
పాలనాత్సత్యవాక్యస్య ప్రీతిర్మే పరమా త్వయి ॥53॥

ఓ శుద్ధస్వభావము గలవాడా ! అందువల్ల నీవు నన్ను క్షమించుము. నీ కోరిక ఏమో ఆజ్ఞాపింపుము. నీ సత్యవాక్పరిపాలనచే నీ యందు నాకు గొప్ప సంతోషము కలిగినది.

అద్యప్రభృతి తే జ్ఞానమైన్ద్రం ప్రాదుర్భవిష్యతి ।
తపస్యథ తథా ధర్మే న తే విఘ్నో భవిష్యతి ॥54॥

ఈ రోజునుంచి నీకు ఐంద్రజ్ఞానము ఉద్భవించగలదు. ఇక నీ తపస్సునందునూ, ధర్మమందునూ విఘ్నము కలుగదు.

ఇత్యుక్త్వా తు గతే శక్రే పితా కోపసమన్వితః ।
ప్రణమ్య శిరసాఽస్మాభిః ఇదముక్తో మహామునిః ॥55॥

ఈ విధముగా పలికి దేవేంద్రుడు వెడలిపోగా, కోపముతో కూడుకొన్న మహామునియగు మా తండ్రికి శిరస్సు వంచి, నమస్కరించి, మేము ఇట్లు పలికితిమి.

బిభ్యతాం మరణాత్తాత ! త్వమస్మాకం మహామతే ! ।
క్షన్తుమర్హసి దీనానాం జీవితప్రియతా హి నః ॥56॥

ఓ గొప్పబుద్ధిమంతుడా ! తండ్రీ ! మరణమందు భయముగల దీనులగు మమ్ములను క్షమించుటకు నీవు తగుదువు. మాకు జీవితమందు ఆశ ఉన్నది కదా !

త్వగస్థిమాంససంఘాతే పూయశోణితపూరితే ।
కర్తవ్యా న రతిర్యత్ర తత్రాఽస్మాకమియం రతిః ॥57॥

చర్మము, ఎముకలు, మాంసముతో కూడుకొని, చీము రక్తములతో నిండియున్న ఈ శరీరమందు ఆసక్తి కలిగి యుండరాదు. కాని మాకచ్చటే ప్రీతియున్నది.

శ్రూయతాం చ మహాభాగ యథా లోకో విముహ్యతి ।
కామక్రోధాదిభిర్దోషైః అవశః ప్రబలారిభిః ॥58॥

ఓ మహానుభావుడా ! మిక్కిలి బలముగల శత్రువులగు కామక్రోధాదులనెడు దోషములచేత వశము తప్పిన ఈ లోకము అనగా శరీరము ఎట్లు మోహమునొందుచున్నదో వినుము.

ప్రజ్ఞాప్రాకారసంయుక్తమస్థిస్థూలం పరం మహత్ ।
చర్మభిత్తిమహారోధం మాంసశోణితలేపనమ్ ॥59॥

ఓ తండ్రీ! ఈ శరీరమను పురము ప్రజ్ఞయనెడు ప్రాకారముచే చుట్టబడినది, ఎముకలను స్తంభములు కలిగినది, చర్మమను గోడలే అవరోధముగా గలది (మరెవరూ లోనికి ప్రవేశించకుండా అని భావము), రక్తమాంసములను పూత కలిగినదై ఉన్నది.

నవద్వారం మహాయాసం సర్వతః స్నాయువేష్టితమ్ ।
నృపశ్చ పురుషస్తత్ర చేతనావాననవస్థితః ॥60॥

ఇంకనూ ఈ శరీరమను పురము తొమ్మిదిద్వారములు కలదీ, గొప్ప శ్రమచే నిర్మింపబడినదీ, అన్నివైపుల సిరలు, నరములచే చుట్టబడినది. చైతన్యముగల జీవుడు ఆ పురమునకు రాజు.

మంత్రిణౌ తస్య బుద్ధిశ్చ మనశ్చైవ విరోధినౌ ।
యతేతే వైరనాశాయ తావుభావితరేతరమ్ ॥61॥

ఆ రాజునకు పరస్పరవిరోధముగల బుద్ధి, మనస్సు ఈ రెండూ మంత్రులు. వీరిరువురు ఒకరికొకరు శత్రువులై, పరస్పరము ఒకరినొకరు నశింపచేయుటకు ప్రయత్నము చేయుచుందురు.

నృపస్య తస్య చత్వారో నాశమిచ్ఛన్తి విద్విషః ।
కామః క్రోధస్తథా లోభో మోహశ్చాన్యస్తథా రిపుః ॥62॥

కామము, క్రోధము, లోభము, మోహము అనెడు నలుగురు శత్రువులు తమ శత్రువగు ఆ రాజును నశింపచేయుటకై ప్రయత్నించుచుందురు.

యదా తు స నృపస్తాని ద్వారాణ్యావృత్య తిష్ఠతి ।
సదా సుస్థబలశ్చైవ నిరాతంకశ్చ జాయతే ॥63॥

జాతానురాగో భవతి శత్రుభిర్నాభిభూయతే ॥64॥

ఆ రాజు ఎప్పుడయితే ఆ నవద్వారములను ఆవరించి లేదా బంధించి నిలుస్తాడో, అప్పుడతడు స్వస్థుడై, బలవంతుడై, ఎట్టి క్లేశములు లేక ఉండును. ఇంకను ప్రేమానురాగములు కలిగి శత్రువు లెవరిచేతనూ తిరస్కరింపబడడు.

యదా తు సర్వద్వారాణి వివృతాని స ముఞ్చతి ।
రాగో నామ తదా శత్రుః నేత్రాదిద్వారమృచ్ఛతి ॥65॥

ఎప్పుడయితే జీవుడు ఈ నవద్వారములను తెరచియుంచి బంధించక విడిచిపెట్టునో అప్పుడు రాగమను శత్రువు నేత్రాది నవద్వారములలో ప్రవేశించి వాటిని ఆక్రమించును.

సర్వవ్యాపీ మహాయామః పఞ్చద్వారప్రవేశనః ।
తస్యానుమార్గం విశతి తద్వై ఘోరం రిపుత్రయమ్ ॥66॥

ఈ రాగము అంతట వ్యాపించినది, మిక్కిలి పొడవైనది. ఈ రాగమను శత్రువు నేత్రాది పంచ జ్ఞానేంద్రియములలో ప్రవేశించిన వెంటనే, ఆ రాగము యొక్క మార్గమునను సరించి క్రోధలోభమోహములనెడు తక్కిన ముగ్గురు శత్రువులు ప్రవేశింతురు.

ప్రవిశ్యాథ స వై తత్ర ద్వారైరింద్రియసంజ్ఞకైః ।
రాగః సంశ్లేషమాయాతి మనసా చ సహేతరైః ॥67॥

ఈ రాగమను శత్రువు నేత్రాదినామకములైన ఇంద్రియ ద్వారములగుండా ప్రవేశించి, మనస్సుతో, మిగిలిన ద్వారములతో సంబంధమేర్పరచుకొనును.

ఇంద్రియాణి మనశ్చైవ వశే కృత్వా దురాసదః ।
ద్వారాణి చ వశే కృత్వా ప్రాకారం నాశయత్యథ ॥68॥

ఈ రాగమను శత్రువు జయింపశక్యముకాని ఇంద్రియములను, మనస్సును, నవద్వారములను తన వశమందు ఉంచుకొని ప్రజ్ఞయను ప్రాకారమును నశింపచేయును.

మనస్తస్యాశ్రితం దృష్ట్వా బుద్ధిర్నశ్యతి తత్‌క్షణాత్ ।
అమాత్యరహితస్తత్ర పౌరవర్గోజ్ఝితస్తథా ॥69॥

రిపుర్లబ్ధవివరః స నృపో నాశమృచ్ఛతి ।
ఏవం రాగస్తథా మోహో లోభః క్రోధస్తథైవ చ ॥70॥

ప్రవర్తన్తే దురాత్మానో మనుష్యస్మృతినాశకాః ।
రాగాత్క్రోధః ప్రభవతి క్రోధాల్లోభోఽభిజాయతే ॥71॥

లోభాద్భవతి సమ్మోహః సమ్మోహాత్స్మృతివిభ్రమః ।
స్మృతిభ్రంశాద్బుద్ధినాశో బుద్ధినాశాత్ప్రణశ్యతి ॥72॥

ఏవం ప్రణష్టబుద్ధీనాం రాగలోభానువర్తినామ్ ।
జీవితే చ సలోభానాం ప్రసాదం కురు సత్తమ ॥73॥

ఆ రాగమను శత్రువును ఆశ్రయించినదానినిగా మనస్సును తెలుసుకొనిన ఆ క్షణమందే బుద్ధి నశించును. మనోబుద్ధులను మంత్రులు నశించినందువలన ఆ రాజు మంత్రిరహితుడుగాను, అటుపిమ్మట ప్రజలచేత విడిచిపెట్టబడిన వాడగును. అప్పుడా రాజు శత్రువులచే ఆక్రమింపబడి నాశమునొందగలడు. ఈ విధముగా రాగము, క్రోధము, లోభము, మోహము అను ఈ నాలుగు దుష్టస్వరూపులు మనుష్యునియొక్క స్మృతినాశమును కల్గించునవి కాగలవు. రాగమువలన క్రోధము, క్రోధమువలన లోభము, లోభమువలన సమ్మోహము, సమ్మోహము వలన స్మృతినాశము, స్మృతినాశము వలన బుద్ధినాశము కలుగును. బుద్ధినాశము వలన ఆ జీవుడు నశించును. ఓ సత్పురుషుడా ! ఈ విధముగా రాగలోభాదులను అనుసరించుచూ, బుద్ధినాశమునొంది, జీవించుటయందు ఆశ కలిగిన మమ్ములను అనుగ్రహించుము.

యోఽయం శాపో భగవతా దత్తః స న భవేత్తథా ।
న తామసీం గతిం కష్టాం వ్రజేత్స మునిసత్తమ ॥74॥

ఓ మునిశ్రేష్ఠుడా ! పూజ్యుడవగు నీచేత ఈయబడిన శాపము మాకు లేకుండుగాక! ఈ కష్టదాయకమగు తామసజన్మను (పక్షిజన్మను) పొందకుందుముగాక!

ఋషిః ఉవాచ – ఋషి పలికెను.

యన్మయోక్తం న తన్మిథ్యా భవిష్యతి కదాచన ।
న మే వాగనృతం ప్రాహ యావదద్యేతి పుత్రకాః ॥75॥

ఓ పుత్రులారా ! నేను పలికినది ఎన్నడును అసత్యము కానేరదు. ఇంతవరకు నేను పలికినమాట అసత్యము కాలేదు.

దైవమాత్రం పరం మన్యే ధిక్ పౌరుషమనర్థకమ్ ।
అకార్యం కారితో యేన బలాదహమచిన్తితమ్ ॥76॥

దైవమే అన్నింటికంటే గొప్పదియని తలచుచున్నాను. పురుషకారము అనర్థములను కలిగించునది, నిందార్హమైనది. అట్టి పౌరుషమే బలవంతముగా నాచేత ఆలోచనలేని శాపమను అకార్యమును (చేయరాని పనిని) చేయించినది.

యస్మాచ్చ యుష్మాభిరహం ప్రణిపత్య ప్రసాదితః ।
తస్మాత్తిర్యక్త్వమాపన్నాః పరం జ్ఞానమవాప్స్యథ ॥77॥

మీరు నాకు నమస్కరించి నన్ను ప్రసన్నుని చేసుకొనినారు. అందువలన మీరు పక్షిజన్మను పొందిననూ శ్రేష్ఠమైన జ్ఞానమును పొందగలరు.

జ్ఞానదర్శితమార్గాశ్చ నిర్ధూతక్లేశకల్మషాః ।
మత్ప్రసాదాదసందిగ్ధాః పరాం సిద్ధిమవాప్స్యథ ॥78॥

నా యనుగ్రహముచే జ్ఞానముచే చూపబడిన మార్గమును పొందినవారై, కష్టములను, పాపములను పోగొట్టుకొని, సంశయములు లేనివారై పరమసిద్ధిని పొందెదరు గాక !

ఏవం శప్తాః స్మ భగవన్ పిత్రా దైవవశాత్పురా ।
తతః కాలేన మహతా యోన్యన్తరముపాగతాః ॥79॥

ఓ పూజ్యుడా ! మేమీవిధముగా దైవవశముచే పూర్వము మా తండ్రిచేత శపింపబడితిమి. పిమ్మట చాలాకాలము గడువగా మరియొక యోనియందు జన్మించితిమి. అనగా ఈ విధముగా పక్షులుగా జన్మించితిమి.

జాతాశ్చ రణమధ్యే వై భవతా పరిపాలితాః ।
వయమిత్థం ద్విజశ్రేష్ఠ ఖగత్వం సముపాగతాః ॥80॥

ఓ ద్విజశ్రేష్ఠుడా! యుద్ధస్థలమందు జన్మించిన మమ్ములను మీరు రక్షించితిరి. మేమీ విధముగా పక్షులుగా జన్మించితిమి.

నాస్త్యసావిహ సంసారే యో న దిష్టేన బాధ్యతే ।
సర్వేషామేవ జన్తూనాం దైవాధీనం హి చేష్టితమ్ ॥81॥

ఈ సంసారమందు ప్రారబ్ధకర్మచే దైవవశమువలన బాధింపబడనివాడు ఎవడూ ఉండడు. సమస్తజీవుల కర్మలన్నియు దైవాధీనములైయున్నవి.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

ఇతి తేషాం వచః శ్రుత్వా శమీకో భగవాన్మునిః ।
ప్రత్యువాచ మహాభాగః సమీపస్థాయినో ద్విజాన్ ॥82॥

పూజ్యుడగు శమీకముని ఆ పక్షులు చెప్పిన మాటలను విని, ఆ మహానుభావుడు తన సమీపమందున్న బ్రాహ్మణులతో ఇట్లు పలికెను.

పూర్వమేవ మయా ప్రోక్తం భవతాం సన్నిధావిదమ్ ।
సామాన్యపక్షిణో నైతే కేప్యేతే ద్విజసత్తమాః ॥
యే యుద్ధేఽపి న సంప్రాప్తాః పఞ్చత్వమతిమానుషే ॥83॥

ఓ ద్విజోత్తములారా ! అలౌకికమగు మహాయుద్ధమందు కూడా మరణించక జీవించియున్న ఈ పక్షులు సామాన్యపక్షులు కావని మీవద్ద పూర్వమే మీకు నేను చెప్పితిని.

తతః ప్రీతిమతా తేన తేఽనుజ్ఞాతా మహాత్మనా ।
జగ్ముశ్శిఖరిణాం శ్రేష్ఠం వింధ్యం ద్రుమలతాయుతమ్ ॥84॥

అనంతరము ఆ పక్షులు ప్రీతినొందినవాడు, మహాత్ముడు అగు ఆ శమీక మహర్షిచే అనుజ్ఞను పొంది, చెట్లు లతలచే నిండినదీ, పర్వతములలో శ్రేష్ఠమైనదీ యగు వింధ్యపర్వతమునకు వెళ్ళినవి.

యావదద్య స్థితాస్తస్మిన్నచలే ధర్మపక్షిణః ।
తపస్స్వాధ్యాయనిరతాః సమాధౌ కృతనిశ్చయాః ॥85॥

ఇంతవరకు ఆ ధర్మపక్షులు తపస్సు, వేదాధ్యయనములందు ఆసక్తికలిగి, సమాధియందు నిశ్చితబుద్ధికలిగి ఆ వింధ్యపర్వతమందున్నవి.

ఇతి మునివరలబ్ధసత్క్రియాస్తే మునితనయా విహగత్వమభ్యుపేతాః ॥
గిరివరగహనేఽతిపుణ్యతోయే యతమనసో నివసన్తి వింధ్యపృష్ఠే ॥86॥

ఈ విధముగా మునిశ్రేష్ఠునిచేత సత్కరింపబడిన ఆ మునికుమారులు పక్షిజన్మను పొందిరి. మిక్కిలి పుణ్యవంతములైన జలములు కలిగిన ఆ పర్వతశ్రేష్ఠము యొక్క శిఖరమందు మనోనిగ్రహము కల్గినవై ఆ పక్షులు నివసించుచున్నవి.

ఇతి మార్కండేయ మహాపురాణే వింధ్యప్రాప్తికథనం నామ తృతీయోఽధ్యాయః ॥3॥

శ్రీ మార్కండేయ మహాపురాణమందు వింధ్యప్రాప్తికథనమను మూడవ అధ్యాయం సమాప్తం.



చతుర్థోऽధ్యాయః - నాల్గవ అధ్యాయం
చతుర్వ్యూహావతారవర్ణనమ్ - చతుర్వ్యూహావతారవర్ణనం

మార్కండేయ ఉవాచ - మార్కండేయుడు చెప్పాడు.

ఏవం తే ద్రోణతనయాః పక్షిణో జ్ఞానినోऽభవన్ ।
వసన్తి హ్యచలే విన్ధ్యే తానుపాస్స్వ చ పృచ్ఛ చ ॥1॥

ఓ జైమిని మహర్షీ! ఈ ప్రకారముగా ద్రోణుని కుమారులగు ఆ పక్షులు జ్ఞానము పొందెను. ఆ ధర్మపక్షులు వింధ్యపర్వతమందు నివసించుచున్నవి. నీవు వారిని సేవించి వారినడిగి నీ సందేహములు తీర్చుకొనుము.

ఇత్యృషేర్వచనం శ్రుత్వా మార్కండేయస్య జైమినిః ।
జగామ విన్ధ్యశిఖరం యత్ర తే ధర్మపక్షిణః ॥2 ॥

మార్కండేయమహాముని చెప్పిన మాటలను విని, జైమినిమహర్షి ధర్మపక్షులు నివసించుచున్న వింధ్యపర్వతమునకు వెళ్ళెను.

తన్నగాసన్నభూతశ్చ శుశ్రావ పఠతాం ధ్వనిమ్ ।
శ్రుత్వా చ విస్మయావిష్టః చిన్తయామాస జైమినిః ॥3॥

జైమినిముని ఆ వింధ్యపర్వతసమీపమునకు వెళ్ళగానే ఆ పక్షులు చదువుచున్న వేదపాఠముయొక్క శబ్దమును వినెను. ఆ ధ్వనిని విని ఆశ్చర్యముతో కూడుకొన్నవాడై ఈ విధముగా ఆలోచించెను.

స్థానసౌష్ఠవసంపన్నం జితశ్వాసమవిశ్రమమ్ ।
విస్పష్టమపదోషఞ్చ పఠ్యతే ద్విజసత్తమైః ॥4॥

పక్షిరూపములో నున్న ఈ బ్రాహ్మణ శ్రేష్ఠులచే కంఠతాల్వాది స్థానముల సౌష్ఠవముతో కూడుకొన్నది, శ్వాసను జయించినట్టిది, నిరంతరముగా ఉన్నది, మిక్కిలి స్పష్టమైనది, దోషరహితమైనట్టిదీ అయిన వేదపఠనము గావింపబడుచున్నది.

వియోనిమపి సంప్రాప్తానేతన్మునికుమారకాన్ ।
చిత్రమేతదహం మన్యే న జహాతి సరస్వతీ ॥5॥

ఈ మునికుమారులు తిర్యగ్యోనియందు పక్షిజన్మనెత్తిననూ వీరిని సరస్వతీదేవి విడిచిపెట్టుట లేదు. ఇది చాలా విచిత్రమైనదని నేను తలచుచున్నాను.

బంధువర్గస్తథా మిత్రం యచ్చేష్టమపరం గృహే ।
త్యక్త్వా గచ్ఛతి తత్సర్వం న జహాతి సరస్వతీ ॥6॥

బంధువర్గము, స్నేహితులు, ఇంట ఉన్నది, ఇష్టమైనది అవి యన్నియు మనలను విడిచిపెట్టి వెళ్ళిపోవును. సరస్వతీదేవి మాత్రము విడిచిపెట్టదు.

ఇతి సంచిన్తయన్నేవ వివేశ గిరికన్దరమ్ ।
ప్రవిశ్య చ దదర్శాసౌ శిలాపట్టగతాన్ ద్విజాన్ ॥7॥

ఈ విధముగా ఆలోచించుచు ఆ జైమినిముని ఆ వింధ్యపర్వత గుహాసమీపమునకు వెళ్ళి శిలాఫలకమందు కూర్చొన్న ద్విజబాలకులను చూచెను.

పఠతస్తాన్ సమాలోక్య ముఖదోషవివర్జితాన్ ।
సోఽథ శోకేన హర్షేణ సర్వానేవాఽభ్యభాషత ॥8॥

ఉచ్చారణమందు ఏవిధమైన దోషములు లేక వేదమును పఠించుచున్న ఆ ద్విజులను చూచి, ఆ జైమినిముని శోకహర్షములు గలవాడై వారందరితోనూ ఇట్లు పలికెను.

స్వస్త్యస్తు వో ద్విజశ్రేష్ఠా జైమినిం మాం నిబోధత ।
వ్యాసశిష్యమనుప్రాప్తం భవతాం దర్శనోత్సుకమ్ ॥9॥

ఓ బ్రాహ్మణశ్రేష్ఠులారా ! మీకందరకు శుభము కలుగుగాక ! మీ దర్శనమందలి ఉత్సుకతతో మిమ్ములను సమీపించిన వ్యాసశిష్యుడను నన్ను జైమినిగా మీరు తెలుసుకొనుడు.

మన్యుర్న ఖలు కర్తవ్యో యత్పిత్రాఽతీవ మన్యునా ।
శప్తాః ఖగత్వమాపన్నాః సర్వథా దిష్టమేవ తత్ ॥10॥

మిక్కిలి కోపము కలిగిన తండ్రిచేత శపింపబడి పక్షిజన్మను పొందినందులకు మీరు మీ తండ్రిపై కోపగించవలదు. ఇదియంతయు ప్రారబ్ధకర్మ ఫలమే తప్ప మరొకటి కాదు.

స్ఫీతద్రవ్యే కులే కేచిజ్జాతాః కిల మనస్వినః ।
ద్రవ్యనాశే ద్విజేంద్రాస్తే శబరేణ సుసాన్త్వితాః ॥11॥

మానవంతులగు కొందరు మిక్కిలి ధనికవంశమందు జన్మించెదరు. వారి ద్రవ్యము నశించినపిమ్మట ఆ ద్విజశ్రేష్ఠులు శబరులచే ఆదరింపబడి ఓదార్పును పొందుచున్నారు.

దత్త్వా యాచంతి పురుషా హత్వా వధ్యన్తి చాఽపరే ।
పాతయిత్వా చ పాత్యన్తే త ఏవ తపసః క్షయాత్ ॥12॥

కొందరు పురుషులు తమవద్ద ధనమును దానముచేసి యాచకులగుచున్నారు. కొందరు హత్యచేసి ఇతరులచే చంపబడుచున్నారు. కొందరు కొందరిని క్రిందకు పడవైచి అటుపిమ్మట వారే క్రిందకు త్రోసివేయబడుచున్నారు. ఇదియంతయు తాము ఆచరించిన తపస్సు నశించినందువల్లనే జరుగుచున్నది.

ఏతద్దృష్టం సుబహుశో విపరీతం తథా మయా ।
భావాభావసముచ్ఛేదైరజస్రం వ్యాకులం జగత్ ॥13॥

నేననేక పర్యాయములు ఇట్టి విపరీతసంఘటనలను అట్టివానిని చూచితిని. ఈ విధముగా భావాభావవిశేషములచే ప్రపంచమంతయు నిరంతరము వ్యాకులమై ఉన్నది.

ఇతి సంచిన్త్య మనసా న శోకం కర్తుమర్హథ ।
జ్ఞానస్య ఫలమేతావచ్ఛోకహర్షైరధృష్యతా ॥14॥

ఇట్లు తలచి మీరు మనస్సులో దుఃఖమును పొందకుండా ఉందురు గాక ! శోకహర్షములందు ధైర్యముగానుండుటే జ్ఞానమునకు ఫలము.

తతస్తే జైమినిం సర్వే పాద్యార్ఘ్యాభ్యామపూజయన్ ।
అనామయం చ పప్రచ్ఛుః ప్రణిపత్య మహామునిమ్ ॥15॥

పిమ్మట ఆ ధర్మపక్షులన్నియు ఆ జైమినిమహర్షిని పాద్యము, అర్ఘ్యములచే పూజించిరి. ఆ మహామునికి నమస్కరించి అతని కుశలమును గూర్చి అడిగిరి.

అథోచుః ఖగమాస్సర్వే వ్యాసశిష్యం తపోనిధిమ్ ।
సుఖోపవిష్టం విశ్రాన్తం పక్షానిలహతక్లమమ్ ॥16॥

అటు తరువాత ఆ ధర్మపక్షులు అన్నియు తమ రెక్కలగాలిచే శ్రమ తీరి, విశ్రాంతితో సుఖముగా కూర్చొనియున్న తపోనిధియగు వ్యాసశిష్యునితో ఇట్లు పలికినవి.

పక్షిణ ఊచు – పక్షులు పలికాయి.

అద్య నస్సఫలం జన్మ జీవితం చ సుజీవితమ్ ।
యత్పశ్యామః సురైర్వన్ద్యం తవ పాదాంబుజద్వయమ్ ॥17॥

ఓ మహర్షీ! దేవతలచే నమస్కరింపబడు నీ పాదపద్మద్వయమును మేము దర్శించుకొనుటచే ఈ రోజు మా జన్మ సఫలమైనది. మా జీవితము మంచి జీవితమైనది.

పితృకోపాగ్నిరుద్భూతో యో నో దేహేషు వర్తతే ।
సోఽద్య శాన్తిం గతో విప్ర ! యుష్మద్దర్శనవారిణా ॥18॥

ఓ బ్రాహ్మణుడా ! మా పితృదేవుని కోపమనే అగ్ని మా దేహములందు స్థిరమై ఉన్నది. అది ఇప్పుడు మీ దర్శనజలముచే శాంతించినది.

కచ్చిత్తే కుశలం బ్రహ్మన్నాశ్రమే మృగపక్షిషు ।
వృక్షేష్వథ లతాగుల్మత్వక్సారతృణజాతిషు ॥19॥

ఓ బ్రహ్మస్వరూపుడా ! మీ ఆశ్రమమందు లేళ్ళు, పక్షులు, వృక్షములు, పొదలు, తృణములు మొదనవి అన్నియు క్షేమముగానే ఉన్నవి కదా !

అథవా నైతదుక్తం హి సమ్యగస్మాభిరాదృతైః ।
భవతాం సంగమో యేషాం తేషామకుశలం కుతః ॥20॥

అయిననూ చక్కగా ఆదరింపడిన మేమిట్లడుగుట ఉచితము కాదు. ఎందువలననగా మీతో సంబంధము గలవారికి కుశలము లేకపోవుట ఎట్లు సంభవించును ?

ప్రసాదం చ కురుష్వాత్ర బ్రూహ్యాగమనకారణమ్ ।
దేవానామివ సంసర్గో భవతోఽభ్యుదయో మహాన్ ।
కేనాఽస్మద్భాగ్యగురుణా ఆనీతో దృష్టిగోచరమ్ ॥21॥

ఓ మహర్షీ ! మమ్ములను అనుగ్రహించుము. మీ రాకకు గల కారణమేమో తెలుపుము. దేవతలతోడి సంబంధమువలె నీతోటి సంబంధము గొప్ప అభ్యుదయమును కలిగించును. మా జాతకాలలో భాగ్యస్థానంలోనున్న ఏ గురువుచేత నీవు మా దృష్టిగోచరమునకు తీసుకురాబడినావో చెప్పుము.

జైమినిః ఉవాచ – జైమిని చెప్పాడు.

శ్రూయతాం ద్విజశార్దూలాః ! కారణం యేన కన్దరమ్ ।
వింధ్యస్యేహాగతో రమ్యం రేవావారికణోక్షితమ్ ।
సందేహాన్ భారతే శాస్త్రే తాన్ ప్రష్టుం గతవానహమ్ ॥22॥

ఓ బ్రాహ్మణశ్రేష్ఠులారా ! రేవానదీజలబిందువులచే తడుపబడి సుందరమైన వింధ్యపర్వతగుహకు నేను వచ్చిన కారణమేమో చెప్పెదను, వినుడు. మహాభారతమను శాస్త్రమందు నాకున్న సందేహములను అడిగి తెలుసుకొనుటకు మీ వద్దకు వచ్చితిని.

మార్కండేయం మహాత్మానం పూర్వం భృగుకులోద్వహమ్ ।
తమహం పృష్టవాన్ ప్రాప్య సందేహాన్ భారతం ప్రతి ॥23॥

పూర్వము భృగుకులమునకు ప్రధానభూతుడైన మహాత్ముడగు మార్కండేయమహామునిని చేరి మహాభారతమందు నాకు కలిగిన సందేహములను అడిగితిని.

స చ పృష్టో మయా ప్రాహ సన్తి విన్ధ్యే మహాచలే ।
ద్రోణపుత్రా మహాత్మానస్తే వక్ష్యన్త్యర్థవిస్తరమ్ ॥24॥

నేనీ విధముగా అడుగగా మార్కండేయుడిట్లు బదులు పలికెను. "వింధ్యమహాపర్వతమందు మహాత్ములగు ద్రోణకుమారులు గలరు. వారు నీ ప్రశ్నలకు సవిస్తరముగా సమాధానము చెప్పగలరు."

తద్వాక్యచోదితశ్చేమమాగతోఽహం మహాగిరిమ్ ।
తచ్ఛృణుధ్వమశేషేణ శ్రుత్వా వ్యాఖ్యాతుమర్హథ ॥25॥

మార్కండేయుని మాటలచే ప్రేరేపింపబడిన నేను ఈ వింధ్యమహాపర్వతమునకు వచ్చితిని. నేనడుగబోవు ప్రశ్నలను పూర్తిగా విని, వాటికి సమాధానరూపమైన వ్యాఖ్యానమును చేయుడు.

పక్షిణ ఊచు – పక్షులు పలికాయి.

విషయే సతి వక్ష్యామో నిర్విశంకశ్శృణుష్వ తత్ ।
కథం తన్న వదిష్యామో యదస్మద్బుద్ధిగోచరమ్ ॥26॥

చెప్పుటకు విషయమున్నయెడల తప్పక చెప్పెదము. ఎట్టి సంశయములు లేనివాడవై దానిని నీవు విను. మా బుద్ధికి గోచరమైన సమాధానమును మేము చెప్పకుండ ఎట్లు ఉండెదము ?

చతుర్ష్వపి హి వేదేషు ధర్మశాస్త్రేషు చైవ హి ।
సమస్తేషు తథాఙ్గేషు యచ్చాన్యద్వేదసమ్మితమ్ ॥27॥

ఏతేషు గోచరోఽస్మాకం బుద్ధేర్బ్రాహ్మణసత్తమ ।
ప్రతిజ్ఞాం తు సమావోఢుం తథాపి న హి శక్నుమః ॥28॥

ఓ బ్రాహ్మణశ్రేష్ఠుడా ! నాలుగు వేదములందు, సమస్త వేదాంగములందు, ధర్మశాస్త్రములందు, వేదప్రామాణ్యముగల వేదభిన్నములయిన శాస్త్రములందు ఆయా విషయములు మా బుద్ధికి గోచరమగును. ఈ వైదిక విషయములన్నింటిని మేము ఎరుగుదుము కాని ప్రతిజ్ఞచేసి చెప్పుటకు మాత్రము మేము సమర్థులము కాము.

తస్మాద్వదస్వ విశ్రబ్ధం సందిగ్ధం యద్ధి భారతే ।
వక్ష్యామస్తవ ధర్మజ్ఞ నచేన్మోహో భవిష్యతి ॥29॥

అందువలన మీరు సందేహించకుండా మీకు భారతమందు కలిగిన సందేహములను అడుగుడు. ఓ ధర్మమునెరిగినవాడా ! మాకు మోహము కలగనిచో మేము సమాధానములను చెప్పగలము.

జైమినిః ఉవాచ – జైమిని చెప్పాడు.

సందిగ్ధానీహ వస్తూని భారతం ప్రతి యాని మే ।
శృణుధ్వమమలాస్తాని శ్రుత్వా వ్యాఖ్యాతుమర్హథ ॥30॥

ఓ స్వచ్ఛమైన చిత్తము గలవాడా ! భారతమందు నాకున్న సందిగ్ధవిషయములను చెప్పెదను. వినుడు. వాటిని విని సమాధానములు చెప్పుట మీకు తగును.

కస్మాన్మానుషతాం ప్రాప్తో నిర్గుణోఽపి జనార్దనః ।
వాసుదేవోఽఖిలాధారః సర్వకారణకారణమ్ ॥31॥

నా మొదటి సంశయమేమనగా, సమస్తప్రపంచమునకు ఆధారభూతుడు, సమస్తకారణములకు మూలకారణస్వరూపుడు వాసుదేవుడగు శ్రీకృష్ణుడు గుణరహితుడైననూ మనుష్యజన్మను ఏల పొందెను ?

కస్మాచ్చ పాండుపుత్రాణామేకా సా ద్రుపదాత్మజా ।
పంచానాం మహిషీ కృష్ణా సుమహానత్ర సంశయః ॥32॥

ద్రుపదుని కుమార్తెయగు ద్రౌపది ఎందువలన అయిదుగురు పాండుపుత్రులకు పట్టమహిషి అయినది? ఇది గొప్ప సంశయముగానున్నది.

భేషజం బ్రహ్మహత్యాయా బలదేవో మహాబలః ।
తీర్థయాత్రాప్రసంగేన కస్మాచ్చక్రే హలాయుధః ॥33॥

తీర్థయాత్రలు చేయు సమయమందు మహాబలవంతుడు, నాగలి ఆయుధముగా గలవాడు అగు బలదేవుడు బ్రహ్మహత్యను ఎందులకు చేసెను? తన్నిమిత్తమైన ప్రాయశ్చిత్తమునెట్లు చేసుకొనెను?

కథం చ ద్రౌపదేయాస్తేఽకృతదారా మహారథాః ।
పాండునాథా మహాత్మానో వధమాపురనాథవత్ ॥34॥

ఇంకనూ పాండవసహాయముగలవారు, గొప్పవారు, గొప్పసైన్యము గలవారు అగు ద్రౌపదీకుమారులు వివాహము చేసుకోకుండానే దిక్కులేనివారివలె ఎందుకు చంపబడిరి ?

ఏతత్సర్వం కథ్యతాం మే సందిగ్ధం భారతం ప్రతి ।
కృతార్థోఽహం సుఖం యేన గచ్ఛేయం నిజమాశ్రమమ్ ॥35॥

మహాభారతవిషయములో నాకు కలిగిన ఈ సందేహములకు సమాధానము చెప్పుము. ఈ సమాధానములను తెలుసుకొని కృతార్థుడనై సుఖముగా నా యాశ్రమమునకు వెళ్ళగలను.

పక్షిణ ఊచు – పక్షులు పలికాయి.

నమస్కృత్య సురేశాయ విష్ణవే ప్రభవిష్ణవే ।
పురుషాయాఽప్రమేయాయ శాశ్వతాయాఽవ్యయాయ చ ॥36॥

చతుర్వ్యూహాత్మనే తస్మై త్రిగుణాయాఽగుణాయ చ ।
వరిష్ఠాయ గరిష్ఠాయ వరేణ్యాయాఽమృతాయ చ ॥37॥

యస్మాదణుతరం నాస్తి యస్మాన్నాస్తి బృహత్తరమ్ ।
యేన విశ్వమిదం వ్యాప్తమజేన జగదాదినా ॥38॥

ఆవిర్భావతిరోభావదృష్టాఽదృష్టవిలక్షణమ్ ।
వదంతి యత్సృష్టమిదం తథైవాన్తే చ సంహృతమ్ ॥39॥

బ్రహ్మణే చాదిదేవాయ నమస్కృత్య సమాధినా ।
ఋక్సామాన్యుద్గిరన్వక్త్రైర్యః పునాతి జగత్త్రయమ్ ॥40॥

ప్రణిపత్య తథేశానమేకబాణవినిర్జితైః ।
యస్యాసురగణైర్యజ్ఞా విలుప్యన్తే న యజ్వనామ్ ॥41॥

ప్రవక్ష్యామో మతం కృత్స్నం వ్యాసస్యాద్భుతకర్మణః ।
యేన భారతముద్దిశ్య ధర్మాద్యాః ప్రకటీకృతాః ॥42॥

సురేశ్వరుడు, విష్ణువు, ప్రభవిష్ణువు, పురుషుడు, అప్రమేయుడు, శాశ్వతుడు, అవ్యయుడు, వాసుదేవ సంకర్షణ ప్రద్యుమ్న అనిరుద్ధ రూపములను చతుర్వ్యూహములు గలవాడును, సత్త్వరజస్తమస్సులను మూడు గుణములు గలవాడు, గుణరహితుడు, వరిష్ఠుడు, గరిష్ఠుడు, వరేణ్యుడు, అమృతరూపుడు; దేనికంటే అణుతరము, బృహత్తరము లేదో అట్టి స్వరూపము గలవాడు, జన్మలేనట్టి జగదాదిరూపమైనట్టి ఎవనిచేత ఆవిర్భావతిరోభావ దృష్టాదృష్టవిలక్షణమైన ఈ విశ్వమంతయు వ్యాపించియున్నదో అట్టి స్వరూపుడు, సృష్టిస్థితిలయకారకుడు, ఋక్సామలను తన నాలుగు ముఖములతో ఉచ్చరించుచు ముల్లోకములను పవిత్రము చేయుచున్నవాడు, ఆదిదేవుడు అగు ఆ బ్రహ్మదేవునికి ధ్యానపూర్వకముగా నమస్కరించుచున్నాము. ఇంకనూ రాక్షససైన్యమును ఒకే బాణముతో ఓడించి యజమానుల యజ్ఞములకు విఘ్నములు లేకుండా చేసిన ఆ పరమేశ్వరునికి కూడా నమస్కరించుచున్నాము. అట్లు ప్రణిపాతమునొనర్చి, అద్భుతమైన మహాభారతరచనద్వారా ధర్మార్థకామమోక్షములను చతుర్విధపురుషార్థములను ప్రకటించిన ఆ వ్యాసభగవానుని మతమును సంపూర్ణముగా చెప్పెదము.

ఆపో నారా ఇతి ప్రోక్తా మునిభిస్తత్త్వదర్శిభిః ।
అయనం తస్య తాః పూర్వం తేన నారాయణః స్మృతః ॥43॥

నారమనగా జలమని తత్త్వదర్శులగు మునులచేత చెప్పబడినది. పూర్వము ఆ జలములే అయనము అనగా నివాస స్థానమగుటచే నారాయణుడని చెప్పబడుచున్నాడు.

స దేవో భగవాన్సర్వం వ్యాప్య నారాయణో విభుః ।
చతుర్ధా సంస్థితో బ్రహ్మన్ సగుణో నిర్గుణస్తథా ॥44॥

ఓ బ్రహ్మస్వరూపుడా ! భగవత్స్వరూపుడు, విభువు అగు ఆ నారాయణదేవుడు సమస్తప్రపంచమందు వ్యాపించి నాలుగుమూర్తులుగా విలసిల్లుచున్నాడు. ఆ నారాయణుడు సగుణుడు, నిర్గుణుడు కూడా.

ఏకా మూర్తిరనిర్దేశ్యా శుక్లాం పశ్యంతి తాం బుధాః ।
జ్వాలామాలోపరుద్ధాంగీ నిష్ఠా సా యోగినాం పరా ॥45॥

ఆ నారాయణుని మొదటిమూర్తి వాక్కులచే వర్ణింపశక్యము కానిది. పండితులు ఆ మూర్తిని ప్రకాశరూపముగా చూచుచున్నారు. అగ్నిజ్వాలలను మాలలచే చుట్టబడిన అంగములు కలది ఆ మూర్తి. యోగులకు ఆ మూర్తి పరానిష్ఠ.

దూరస్థా చాన్తికస్థా చ విజ్ఞేయా సా గుణాతిగా ।
వాసుదేవాభిధానోఽసౌ నిర్మమత్వేన దృశ్యతే ॥46॥

గుణములను అతిక్రమించిన ఆ నిర్గుణమూర్తి దూరస్థము, సమీపస్థము కూడా. అదియే వాసుదేవమని వ్యవహరింపబడుచున్నది, మమకారము లేనట్టిది.

రూపవర్ణాదయస్తస్య న భావాః కల్పనామయాః ।
అస్త్యేవ సా సదా శుద్ధా సుప్రతిష్ఠైకరూపిణీ ॥47॥

ఆ వాసుదేవమూర్తియందలి రూపవర్ణాదులు సహజములైన భావములు కావు. కేవలము కల్పనామయములు. ఆ మూర్తి ఎల్లప్పుడు శుద్ధమైనదే, సుప్రతిష్ఠితమైనది, ఏకరూపమైనది.

ద్వితీయా పృథివీం మూర్ధ్నా శేషాఖ్యా ధారయత్యథ ।
తామసీ సా సమాఖ్యాతా తిర్యక్త్వం సముపాశ్రితా ॥48॥

శేషయను పేరుగల రెండవమూర్తి సంకర్షణనామముతో సర్పరూపము ధరించి తన శిరస్సుతో భూమినంతటినీ మోయుచున్నది. ఆ మూర్తి తామసి యని చెప్పబడినది. అనగా తమోగుణప్రధానమైనది. ఇంకను ఆ మూర్తి తిర్యక్త్వమును ఆశ్రయించినది.

తృతీయా కర్మ కురుతే ప్రజాపాలనతత్పరా ।
సత్త్వోద్రిక్తా తు సా జ్ఞేయా ధర్మసంస్థానకారిణీ ॥49॥

ప్రజాపాలనమందు ఆసక్తమైన ప్రద్యుమ్నమను పేరుగల మూడవమూర్తి సమస్తకార్యములను నిర్వహించుచున్నది. సత్త్వప్రధానమైన ఆ మూర్తి ధర్మమును స్థాపించుటయందు కారణమైనదిగా తెలుసుకొనతగినది.

చతుర్థీ జలమధ్యస్థా శేతే పన్నగతల్పగా ।
రజస్తస్యా గుణః సర్గం సా కరోతి సదైవ హి ॥50॥

నాల్గవదియగు అనిరుద్ధమూర్తి శేషశయ్యపై జలమందు శయనించుచున్నది. ఆ మూర్తి రజోగుణప్రధానమై ఎల్లప్పుడు సృష్టికార్యమును చేయుచుండును.

యా తృతీయా హరేర్మూర్తిః ప్రజాపాలనతత్పరా ।
సా తు ధర్మవ్యవస్థానం కరోతి నియతం భువి ॥51॥

ప్రోద్ధూతానసురాన్హన్తి ధర్మవిచ్ఛిత్తికారిణః ।
పాతి దేవాన్ సతశ్చాన్యాన్ ధర్మరక్షాపరాయణాన్ ॥52॥

ప్రజాపాలనమందు ఆసక్తమైన నారాయణుని మూడవమూర్తి ఎల్లప్పుడు భూమిపై ధర్మస్థాపనను చేయుచుండును. ధర్మవినాశమునుగావించు గర్వితులగు అసురులను ఈ మూర్తి సంహరించుచున్నది. దేవతలను, తక్కిన ధర్మరక్షాపరాయణులైన సత్పురుషులను ఈ మూర్తి రక్షించుచున్నది.

యదా యదా హి ధర్మస్య గ్లానిర్భవతి జైమినే ।
అభ్యుత్థానమధర్మస్య తదాత్మానం సృజత్యసౌ ॥53॥

ఓ జైమిని మహర్షీ ! ఎప్పుడెప్పుడయితే ధర్మమునకు హానికలిగి, అధర్మము వృద్ధిచెందునో అప్పుడీ మూర్తి స్వరూపమును ప్రకటించుకొనును.

భూత్వా పురా వరాహేణ తుండేనాపో నిరస్య చ ।
ఏకయా దంష్ట్రయోత్ఖాతా నలినీవ వసుంధరా ॥54॥

ఈ మూర్తియే పూర్వము వరాహరూపము ధరించి తన తుండముతో జలములను నిరసించి, ఒక కోరచే భూమిని కమలమునువలె పైకి లేపెను.

కృత్వా నృసింహరూపం చ హిరణ్యకశిపుర్హతః ।
విప్రచిత్తిముఖాశ్చాన్యే దానవా వినిపాతితాః ॥55॥

ఇంకనూ ఈ మూర్తి నృసింహరూపమును ధరించి హిరణ్యకశిపుని సంహరించినది. ఇంకను విప్రచిత్తి మొదలగు రాక్షసులను సంహరించెను.

వామనాదీంస్తథైవాన్యాన్న సంఖ్యాతుమిహోత్సహే ।
అవతారాంశ్చ తస్యేహ మాథురః సాంప్రతం త్వయమ్ ॥56॥

ఇంకనూ ఈ మూర్తి వామనుడు మొదలగు అవతారములను ధరించెను. ఆ అవతారములను మేము లెక్కింపజాలము. ఆ మూర్తి ఈ సమయమందు మథురానగరమందు శ్రీకృష్ణుడుగా అవతరించియున్నది.

ఇతి సా సాత్త్వికీ మూర్తిరవతారాన్ కరోతి వై ।
ప్రద్యుమ్నేతి చ సా ఖ్యాతా రక్షాకర్మణ్యవస్థితా ॥57॥

సత్త్వగుణప్రధానమైన ఆ మూర్తి ఈ విధముగా ఆయా అవతారములను చేయుచుండును. ప్రద్యుమ్ననామముతో ఆ మూర్తి ప్రసిద్ధమైనది, రక్షించుటయను కర్మయందు సువ్యవస్థితమైనది.

దేవత్వేఽథ మనుష్యత్వే తిర్యగ్యోనౌ చ సంస్థితా ।
గృహ్ణాతి తత్స్వభావం చ వాసుదేవేచ్ఛయా సదా ॥58॥

ఆ ప్రద్యుమ్నమూర్తి దేవతలయందు, మనుష్యులయందు, తిర్యగ్యోనులయందు అవతరించుచు, వాసుదేవుని ఇచ్ఛానుసారముగా ఎల్లప్పుడు ఆయా స్వభావముల నవలంభించుచుండును.

ఇత్యేతత్తే సమాఖ్యాతం కృతకృత్యోఽపి యత్ప్రభుః ।
మానుషత్వం గతో విష్ణుః శృణుష్వాన్యోత్తరం పునః ॥59॥

మేమీ వాసుదేవుని స్వభావమునంతయు నీకు వివరించి చెప్పితిమి. ప్రభువగు వాసుదేవుడు కృతకృత్యుడయిననూ మరల ఎందులకు మనుష్యరూపమును ధరించెనో సమాధానము చెప్పెదము, విను.

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే చతుర్వ్యూహావతారవర్ణనం నామ చతుర్థోఽధ్యాయః ॥4॥

శ్రీ మార్కండేయ మహాపురాణమందు చతుర్వ్యూహావతారవర్ణనమను నాల్గవ అధ్యాయం సమాప్తం.



పంచమోఽధ్యాయః – అయిదవ అధ్యాయం

ఇంద్రవిక్రియా – ఇంద్రవిక్రియ లేదా ద్రౌపదీపఞ్చభర్తృకా కారణనిరూపణం

ధర్మపక్షిణ ఊచుః – ధర్మపక్షులు పలికినవి.

త్వష్టృపుత్రే హతే పూర్వం బ్రహ్మన్నింద్రస్య తేజసః ।
బ్రహ్మహత్యాఽభిభూతస్య పరా హానిరజాయత ॥1॥

ఓ బ్రహ్మస్వరూపుడా! త్వష్టప్రజాపతి కుమారుడగు త్రిశిరుడనువాడు తపస్సు చేయుచుండగా, అతని తపస్సుకు భయపడి ఇంద్రుడతనిని చంపెను. అంతట బ్రహ్మహత్యాపాతకము కారణముగా ఇంద్రుని తేజస్సుకు గొప్ప హాని కలిగెను.

తద్ధర్మం ప్రవివేశాథ శాక్రతేజోఽపచారతః ।
నిస్తేజాశ్చాభవచ్ఛక్రో ధర్మే తేజసి నిర్గతే ॥2॥

అధర్మాచరణము కారణముగా ఇంద్రుని తేజస్సు ధర్మదేవతయందు ప్రవేశించెను. ఇంద్రుని తేజస్సు ధర్మమందు ప్రవేశించినందున ఇంద్రుడు తేజోరహితుడయ్యెను.

తతః పుత్రం హతం శ్రుత్వా త్వష్టా క్రుద్ధః ప్రజాపతిః ।
అవలుఞ్చ్య జటామేకామిదం వచనమబ్రవీత్ ॥3॥

పిమ్మట తన కుమారుని మరణవార్త విని కోపగించిన త్వష్టప్రజాపతి తన శిరస్సునందలి జటనొకదానిని పెరికి ఇట్లు పలికెను.

అద్య పశ్యన్తు మే వీర్యం త్రయో లోకాః సదేవతాః ।
స చ పశ్యతు దుర్బుద్ధిర్బ్రహ్మహా పాకశాసనః ॥4॥

స్వకర్మాభిరతో యేన మత్సుతో వినిపాతితః ।
ఇత్యుక్త్వా కోపరక్తాక్షో జటామగ్నౌ జుహావ తామ్ ॥5॥

"దేవతలతో కూడిన ముల్లోకములు ఇప్పుడు నా పరాక్రమమును చూచునుగాక! ఎవడయితే స్వధర్మాచరణపరాయణుడయిన నాకుమారుని చంపెనో అట్టి దుష్టబుద్ధియగు ఇంద్రుడు కూడా నా పరాక్రమమును చూచునుగాక!" అని పలికి కోపముతో ఎర్రబడిన కండ్లుగల త్వష్టప్రజాపతి ఆ జటను అగ్నియందు హోమము చేసెను.

తతో వృత్రః సముత్తస్థౌ జ్వాలామాలీ మహాసురః ।
మహాకాయో మహాదంష్ట్రో భిన్నాంజనచయప్రభః ॥6॥

ఆ సమయమందు అగ్నివేదికనుండి అగ్నిజ్వాలల సమూహము, గొప్ప శరీరము, పెద్ద కోరలు, కాటుకసమూహము వంటి రూపము కలిగిన వృత్రుడను రాక్షసుడు పైకి లేచెను.

ఇంద్రశత్రురమేయాత్మా త్వష్టృతేజోపబృంహితః ।
అహన్యహని సోఽవర్ధదిషుపాతం మహాబలః ॥7॥

త్వష్టప్రజాపతి తేజస్సువలన వృద్ధిపొందినవాడు, ఊహింపశక్యముగాని ప్రభావముగలవాడు, గొప్పబలవంతుడు, ఇంద్రుని శత్రువూ అగు ఆ రాక్షసుడు రోజురోజుకూ బాణపాతము వంటి ప్రమాణముతో వృద్ధిపొందెను. (బాణమును వదిలినచో వేగముగా ఎంతదూరము పోవునో అంతదూరమునకు ఇషుపాతమని పేరు.)

వధాయ చాత్మనో దృష్ట్వా వృత్రం శక్రో మహాసురమ్ ।
ప్రేషయామాస సప్తర్షీన్సంధిమిచ్ఛన్ భయాతురః ॥8॥

తనను చంపుటకై గొప్పరాక్షసుడగు వృత్రుడు ఉద్భవించెనని తెలుసుకొని, దేవేంద్రుడు భయముతో అతనితో సంధిని కోరుకొనుచూ సప్తర్షులను పంపించెను.

సఖ్యం చక్రుస్తతస్తస్య వృత్రేణ సమయాంస్తథా ।
ఋషయః ప్రీతమనసః సర్వభూతహితే రతాః ॥9॥

సమస్తప్రాణుల హితమందు ఆసక్తిగలవారు, సంతోషముతో నిండిన మనస్సుగలవారు అగు సప్తర్షులు వృత్రాసురుడు, దేవేంద్రుడు వీరిరువురి మధ్య స్నేహమును సంపాదింపచేసి వారిచేత తగిన ప్రతిజ్ఞలు చేయించిరి.

సమయస్థితిముల్లంఘ్య యదా శక్రేణ ఘాతితః ।
వృత్రో హత్యాభిభూతస్య తదా బలమశీర్యత ॥10॥

తాను చేసిన ప్రతిజ్ఞను అతిక్రమించి దేవేంద్రుడు వృత్రాసురుని చంపగా, బ్రహ్మహత్యాకారణముగా ఆ దేవేంద్రుని బలము నష్టమయ్యెను.

తచ్ఛక్రదేహవిభ్రష్టం బలం మారుతమావిశత్ ।
సర్వవ్యాపినమవ్యక్తం బలస్యైవాధిదైవతమ్ ॥11॥

ఆ బలాధిదేవత ఇంద్రుని శరీరమునుండి బయల్వెడలి సర్వవ్యాపియు, కంటికి కనిపించనివాడూ అగు వాయుదేవుని యందు ప్రవేశించెను.

అహల్యాం చ యదా శక్రో గౌతమరూపమాస్థితః ।
ధర్షయామాస దేవేంద్రస్తదా రూపమహీయత ॥12॥

గౌతమమునిరూపమును ధరించి దేవేంద్రుడు అహల్యాదేవిని ఎప్పుడు చెరచెనో, అప్పుడు కూడా ఆతని రూపము నష్టమయ్యెను.

అఙ్గప్రత్యఙ్గలావణ్యం యదతీవ మనోరమమ్ ।
విహాయ దుష్టం దేవేంద్రం నాసత్యావగమత్తతః ॥13॥

మిక్కిలి మనోహరమగు దేవేంద్రుని అంగప్రత్యంగముల సౌందర్యము దుష్టుడగు దేవేంద్రుని విడిచిపెట్టి అశ్వినీకుమారులయందు ప్రవేశించెను.

ధర్మేణ తేజసా త్యక్తం బలహీనమరూపిణమ్ ।
జ్ఞాత్వా సురేశం దైతేయాస్తజ్జయే చక్రురుద్యమమ్ ॥14॥

ధర్మము, తేజస్సు వీటితో విడువబడిన వానినిగానూ, బలహీనుడూ, రూపహీనుడూ గానూ దేవేంద్రుని తెలుసుకొని రాక్షసులు ఆతనిని జయించుట కొరకు ఉద్యమించిరి.

రాజ్ఞాముద్రిక్తవీర్యాణాం దేవేంద్రవిజిగీషవః ।
కులేష్వతిబలా దైత్యా అజాయన్త మహామునే ॥15॥

ఓ జైమినిమహర్షీ! మిక్కిలి బలవంతులగు రాక్షసులు దేవేంద్రుని జయించు కోరికతో మిక్కిలి పరాక్రమశాలురగు రాజుల వంశములందు జన్మించిరి.

కస్యచిత్త్వథ కాలస్య ధరణీ భారపీడితా ।
జగామ మేరుశిఖరం సదో యత్ర దివౌకసామ్ ॥16॥

కొంతకాలము గడచిన పిమ్మట రాక్షసులభారముచే పీడితురాలయిన భూదేవి దేవతల సభాప్రాంగణమున్న మేరుశిఖరమునకు వెళ్ళెను.

తేషాం సా కథయామాస భూరిభారావపీడితా ।
దనుజాత్మజదైత్యోత్థం ఖేదకారణమాత్మనః ॥17॥

అప్పుడు మిక్కిలి రాక్షసభారముచే పీడితురాలయిన భూదేవి రాక్షసులవలన తనకు కలిగిన దుఃఖకారణమును దేవతలకు చెప్పెను.

ఏతే భవద్భిరసురా నిహతాః పృథులౌజసః ।
తే సర్వే మానుషే లోకే జాతా గేహేషు భూభృతామ్ ॥18॥

మీరు చంపిన మిక్కిలి పరాక్రమవంతులగు రాక్షసులు ఇప్పుడు మనుష్యలోకమందు రాజుల ఇండ్లలో జన్మించిరి.

అక్షౌహిణ్యో హి బహులాస్తద్భారార్తా ప్రజామ్యధః ।
తథా కురుధ్వం త్రిదశా యథా శాన్తిర్భవేన్మమ ॥19॥

ఆ రాక్షసులు అక్షౌహిణీసేనలు కలిగియున్నారు. ఆ సేనల భారముచే నేను క్రిందికి క్రుంగిపోవుచున్నాను. ఓ దేవతలారా! నాకు శాంతి ఎట్లు కలుగునో అట్లు చేయుడు.

పక్షిణ ఊచుః – ధర్మపక్షులు ఇట్లు పలికినవి.

తేజోభాగైస్తతో దేవా అవతేరుర్దివో మహీమ్ ।
ప్రజానాముపకారార్థం భూభారహరణాయ చ ॥20॥

ఓ మునిశ్రేష్ఠుడా! అనంతరము ప్రజలకు ఉపకారమొనరించుటకూ భూదేవిభారమును తగ్గించుటకూ దేవతలు తమ తేజోభాగములతో స్వర్గలోకమునుండి భూలోకమందు అవతరించిరి.

యదింద్రదేహజం తేజస్తన్ముమోచ స్వయం వృషః ।
కున్త్యాం జాతో మహాతేజాస్తతో రాజా యుధిష్ఠిరః ॥21॥

అప్పుడు స్వయముగా ధర్మదేవత ఇంద్రునిదేహమువలన పుట్టిన తేజస్సును కుంతీదేవిగర్భమందుంచగా గొప్ప పరాక్రమశాలియగు యుధిష్ఠిరమహారాజు కుంతీదేవియందు జన్మించెను.

బలం ముమోచ పవనస్తతో భీమో వ్యజాయత ।
శక్రవీర్యార్ధతశ్చైవ జజ్ఞే పార్థో ధనఞ్జయః ॥22॥

వాయుదేవుడు తనయందున్న ఇంద్రతేజస్సును కుంతీదేవిగర్భమందుంచగా భీముడు జన్మించెను. ఇంకను ఇంద్రుని తేజస్సుయొక్క సగభాగమువలన కుంతీదేవియందు అర్జునుడు జన్మించెను.

ఉత్పన్నౌ యమలౌ మాద్ర్యాం శక్రరూపౌ మహాద్యుతీ ।
పఞ్చధా భగవానిత్థమవతీర్ణశ్శతక్రతుః ॥23॥

తరువాత ఇంద్రుని రూపలావణ్యతేజస్సులు ధరించిన అశ్వినీదేవతలవలన మాద్రియందు ఇంద్రునిరూపము ధరించి గొప్ప ప్రకాశము కలిగిన కవలలైన నకులసహదేవులు జన్మించిరి. ఈవిధముగా భగవంతుడగు ఇంద్రుడు తన అయిదు అంశములతో అయిదుగురిగా భూలోకమందు జన్మించెను.

తస్యోత్పన్నా మహాభాగా పత్నీ కృష్ణా హుతాశనాత్ ॥24॥

ఆ ఇంద్రుని భార్యయగు శచీదేవి కృష్ణ లేదా ద్రౌపదియను నామధేయముతో అగ్నిహోత్రమునుండి జన్మించెను.

శక్రస్యైకస్య సా పత్నీ కృష్ణా నాన్యస్య కస్యచిత్ ।
యోగీశ్వరాః శరీరాణి కుర్వన్తి బహులాన్యపి ॥25॥

కృష్ణయను నామె ఇంద్రుని భార్యయేగాని, మరొకరి భార్య కాదు. యోగీశ్వరులగు మహానుభావులు తమ యోగప్రభావముచే తమ శరీరములను అనేకవిధములుగా విభజించగలరు.

పఞ్చానామేకపత్నీత్వమిత్యేతత్కథితం తవ ।
శ్రూయతాం బలదేవోఽపి యథా యాతః సరస్వతీమ్ ॥26॥

ఓ మహానుభావా! ద్రౌపదీదేవి అయిదుగురికి ఒక భార్యయగుటయను వృత్తాంతమును నీకు చెప్పితిమి. పిమ్మట నీకు బలదేవుడు సరస్వతీనదీతీరమునకు వెళ్ళుటయను వృత్తాంతమును చెప్పెదము.

ఇతి శ్రీమార్కండేయ మహాపురాణే ఇంద్రవిక్రియా నామ (ద్రౌపదీపఞ్చభర్తృకాకారణనిరూపణం నామ) పఞ్చమోఽధ్యాయః ॥5॥

శ్రీ మార్కండేయ మహాపురాణమందు ఇంద్రవిక్రియ లేదా ద్రౌపదీపంచభర్తృకాకారణనిరూపణమను అయిదవ అధ్యాయం సమాప్తం.

షష్ఠోఽధ్యాయః – ఆరవ అధ్యాయం

బలదేవకృతబ్రహ్మహత్యాకారణమ్ – బలదేవకృతబ్రహ్మహత్యాకారణం

పక్షిణ ఊచుః – ధర్మపక్షులు పలికినవి.

రామః పార్థే పరాం ప్రీతిం జ్ఞాత్వా కృష్ణస్య లాంగలీ ।
చింతయామాస బహుధా కిం కృతం సుకృతం భవేత్ ॥1॥

నాగలి ఆయుధముగా గల బలరాముడు శ్రీకృష్ణునికి అర్జునునియందు గొప్ప ప్రీతియున్నదని గ్రహించి, నేనేమి చేసిన బాగుండునని అనేకవిధములుగా ఆలోచించెను.

కృష్ణేన హి వినా నాఽహం యాస్యే దుర్యోధనాంతికమ్ ।
పాండవాన్వా సమాశ్రిత్య కథం దుర్యోధనం నృపమ్ ॥2॥

జామాతరం తథా శిష్యం ఘాతయిష్యే నరేశ్వరమ్ ।
తస్మాన్న పార్థం యాస్యామి నాఽపి దుర్యోధనం నృపమ్ ॥3॥

నేను శ్రీకృష్ణుని వదిలిపెట్టి దుర్యోధనునివద్దకు వెళ్ళజాలను. పాండవుల పక్షము నాశ్రయించి అల్లుడు, శిష్యుడు, రాజులకు ప్రభువూ అగు దుర్యోధనుని ఎట్లు చంపగలను? అందువలన నేను అర్జునుని వద్దకూ వెళ్ళను. దుర్యోధనుని వద్దకూ వెళ్ళను.

తీర్థేష్వాప్లావయిష్యామి తావదాత్మానమాత్మనా ।
కురూణాం పాండవానాం చ యావదంతాయ కల్పతే ॥4॥

కౌరవులకు, పాండవులకు యుద్ధము పూర్తి అగునంతవరకు నేను స్వయముగా పవిత్రతీర్థములందు స్నానాదులను ఆచరించి ఆత్మశుద్ధిని చేసుకొందును.

ఇత్యామన్త్ర్య హృషీకేశం పార్థదుర్యోధనావపి ।
జగామ ద్వారకాం శౌరిః ససైన్యపరివారితః ॥5॥

బలరాముడీవిధముగా నిశ్చయించుకొని కృష్ణునికి, అర్జునునికి, దుర్యోధనునికి చెప్పి తన సైన్యమును వెంటబెట్టుకొని ద్వారకకు బోయెను.

గత్వా ద్వారవతీం రామో హృష్టపుష్టజనాకులామ్ ।
శ్వో గంతవ్యేషు తీర్థేషు పపౌ పానం హలాయుధః ॥6॥

సంతోషముతోనూ, పుష్టితోనూ నిండిన జనముతో నిండిన ద్వారకానగరమునకు వెళ్ళి హలాయుధుడగు బలరాముడు పర్యటించదగిన తీర్థప్రదేశములందు మద్యపానము చేసెను.

పీతపానో జగామాథ రేవతోద్యానమృద్ధిమత్ ।
హస్తే గృహీత్వా సమదాం రేవతీమప్సరోపమామ్ ॥7॥

మద్యపానము గావించిన బలరాముడు అప్సరసవలె మదముతో కూడుకొన్న రేవతీదేవిని చేయి పట్టుకొని సమృద్ధమగు రేవతోద్యానమునకు వెళ్ళెను.

స్త్రీకదంబకమధ్యస్థో యయౌ మత్తః పదాస్ఖలన్ ।
దదర్శ చ వనం వీరో రమణీయమనుత్తమమ్ ॥8॥

సర్వర్తుఫలపుష్పాఢ్యం శాఖామృగగణాకులమ్ ।
పుణ్యం పద్మవనోపేతం సపల్వలమహావనమ్ ॥9॥

మద్యపానముచే మత్తుడైయున్న వీరుడగు బలరాముడు స్త్రీసమూహము మధ్యలో ఉండి తొట్రుపాటుగల అడుగులు కలవాడై మిక్కిలి శ్రేష్ఠమైనదీ, అందమైనదీ, అన్ని ఋతువులందు ఉద్భవించు ఫలపుష్పములతో నిండినదీ, కపిసమూహములచే నిండినదీ, సరస్సులతో నిండిన ఉద్యానవనములు కలదీ, పద్మవనములతో నిండినదీ, పుణ్యమైనదీయగు గొప్ప అరణ్యమును చూచెను.

స శృణ్వన్ ప్రీతిజననాన్ బహూన్ మదకలాన్ శుభాన్ ।
శ్రోత్రరమ్యాన్ సుమధురాన్ శబ్దాన్ ఖగముఖేరితాన్ ॥10॥

సర్వర్తుఫలభారాఢ్యాన్ సర్వర్తుకుసుమోజ్జ్వలాన్ ।
అపశ్యత్పాదపాంస్తత్ర విహగైరనునాదితాన్ ॥11॥

సంతోషజనకములూ, చెవులకింపైనవీ, మిక్కిలి మధురమైనవీ, మంగళకరమైనవీ అయిన పక్షుల కూజితములను వింటూ బలరాముడు అన్ని ఋతువులందు ఉద్భవించు ఫలపుష్పములతో నిండినవీ, అన్ని ఋతువులందు పూసే పుష్పాలతో కూడినవీ, పక్షుల కిలకిలారావములచే కూడుకొన్నట్టివీ అయిన చెట్లను ఆ అరణ్యమందు చూచెను.

ఆమ్రానామ్రాతకాన్భవ్యాన్ నారికేళాన్ సతిందుకాన్ ।
ఆబిల్వకాంస్తథా జీరాన్ దాడిమాన్ బీజపూరకాన్ ॥12॥

పనసాంల్లకుచాన్మోచాన్నీపాంశ్చాతిమనోహరాన్ ।
పారావతాంశ్చ కంకోలాన్ నలినానమ్లవేతసాన్ ॥13॥

భల్లాకానామలకాంస్తిందుకాంశ్చ మహాఫలాన్ ।
ఇంగుదాన్ కరమర్దాంశ్చ హరీతకవిభీతకాన్ ॥14॥

ఏతానన్యాంశ్చ స తరూన్ దదర్శ యదునందనః ।

మామిడి, ఆమ్రాతకము, గొప్ప కొబ్బరిచెట్లు, తిందుకము, మారేడు, జీర, దానిమ్మ, బీజపూరకము, పనస, లకుచ, మోచ, మిక్కిలి మనోహరములైన నీప, పారావత, కంకోల, నలిన, ఆమ్లవేతస, భల్లాతక, ఉసిరి, మిక్కిలి ఫలవంతములైన తిందుక, ఇంగుద, కరమర్ద, హరీతక, విభీతక మొదలగు చెట్లను ఆ యదునందనుడగు బలరాముడు చూచెను.

తథైవాశోకపున్నాగకేతకీబకులానథ ॥15॥

చంపకాన్ సప్తపర్ణాంశ్చ కర్ణికారాన్సమాలతీన్ ।
పారిజాతాన్ కోవిదారాన్ మందారాన్ బదరాంస్తథా ॥16॥

పాటలాన్ పుష్పితాన్ రమ్యాన్ దేవదారుద్రుమాంస్తథా ।
సాలాంస్తాలాంస్తమాలాంశ్చ కింశుకాన్వంజులాన్వరాన్ ॥17॥

చకోరైః శాతపత్రైశ్చ భృంగరాజైస్తథా శుకైః ।
కోకిలైః కలవింకైశ్చ హారీతైర్జీవజీవకైః ॥18॥

ప్రియపుత్రైశ్చాతకైశ్చ తథాన్యైర్వివిధైః ఖగైః ।
శ్రోత్రరమ్యం సుమధురం కూజద్భిశ్చాప్యధిష్ఠితమ్ ॥19॥

సరాంసి చ మనోజ్ఞాని ప్రసన్నసలిలాని చ ।
కుముదైః పుండరీకైశ్చ తథా నీలోత్పలైః శుభైః ॥20॥

కల్హారైః కమలైశ్చాపి ఆచితాని సమన్తతః ।
కాదంబైశ్చక్రవాకైశ్చ తథైవ జలకుక్కుటైః ॥21॥

కారండవైః ప్లవైర్హంసైః కూర్మైర్మద్గుభిరేవ చ ।
ఏభిశ్చాన్యైశ్చ కీర్ణాని సమంతాజ్జలచారిభిః ॥22॥

క్రమేణేత్థం వనం శౌరిర్వీక్ష్యమాణో మనోరమమ్ ।
జగామానుగతః స్త్రీభిర్లతాగృహమనుత్తమమ్ ॥23॥

అట్లే అశోక, పున్నాగ, మొగలి, పొగడ, సంపెంగ, ఏడాకుల అరటి, గన్నేరు, మాలతి, పారిజాత, కోవిదార, మందార, రేగు, మిక్కిలి పుష్పించిన అందమైన పాటల, దేవదారు, సాల, తాల, తమాల, కింశుక, వంజుల, వృక్షములను చూచెను. అట్లే చకోర, శాతపత్ర, భృంగరాజ, శుక, కోకిల, కలవింక, హరీత, జీవజీవక, ప్రియపుత్ర, చాతక, మిక్కిలి మధురముగా కూయుచున్న అనేకపక్షులను చూచెను. ఇంకను అందమైనవి, శుభ్రమైన జలములు కలిగినవీ అగు అనేక సరస్సులను చూచెను. ఆ సరస్సులు తెల్లకలువలు, నల్లకలువలు, నీలోత్పలములు, నిర్మలములగు జలములు, చెంగల్వపుష్పములు, కమలములతో నిండియుండెను. ఇంకనూ ఆ సరస్సులు కలహంస, చక్రవాక, జలకుక్కుటములతో శోభించుచుండెను. ఇంకను ఆ సరస్సులు కారండవములు, ప్లవములు (నీటికోళ్ళు), హంసలు, తాబేళ్ళు, నీటికప్పలు మొదలగు జలచరజీవరాశులతో నిండియుండెను. శూరవంశమందు జన్మించిన ఆ బలరాముడు మెల్లమెల్లగా అందమైన ఆ వనమును చూచుచూ స్త్రీలతో కూడుకొన్నవాడై సర్వోత్తమమైన లతాగృహమునకు వెళ్ళెను.

స దదర్శ ద్విజాంస్తత్ర వేదవేదాంగపారగాన్ ।
కౌశికాన్ భార్గవాంశ్చైవ భారద్వాజాన్ సగౌతమాన్ ॥24॥

వివిధేషు చ సంభూతాన్ వంశేషు ద్విజసత్తమాన్ ।
కథాశ్రవణబద్ధోత్కాన్ ఉపవిష్టాన్ మహత్సు చ ॥25॥

కృష్ణాజినోత్తరీయేషు కుశేషు చ వృసీషు చ ।
సూతం చ తేషాం మధ్యస్థం కథయానం కథాః శుభాః ॥26॥

పౌరాణికీః సురర్షీణామాద్యానాం చరితాశ్రయాః ।
దృష్ట్వా రామం ద్విజాస్సర్వే మధుపానారుణేక్షణమ్ ॥27॥

మత్తోఽయమితి మన్వానాః సముత్తస్థుస్త్వరాన్వితాః ।
పూజయన్తో హలధరమృతే తం సూతవంశజమ్ ॥28॥

ఆ వనమందు బలరాముడు కౌశిక, భార్గవ, భారద్వాజ, గౌతమ వంశోద్భవులు, వేదవేదాంగ విద్వాంసులు అగు బ్రాహ్మణులను చూచెను. ఇంకను వివిధములగు గొప్ప వంశములందు జన్మించినవారు, కథాశ్రవణమందు కుతూహలముతో గూడిన చిత్తము కలిగి కూర్చొనియున్న బ్రాహ్మణశ్రేష్ఠులను చూచెను. లేడిచర్మములతో నిర్మింపబడిన వస్త్రాసనములందు, దర్భలపైభాగములందు, దర్భాసనములందు కూర్చొనియున్న ద్విజశ్రేష్ఠులను, వారిమధ్యలో మంగళప్రదములైన కథలను చెప్పుచున్న సూతమహర్షిని ఆ బలరాముడు చూచెను. ఆ సూతమహర్షి పురాణసంబంధము కలిగిన ఆద్యులైన దేవర్షుల కథలను చెప్పుచుండెను. మధుపానముచే ఎర్రబడిన కండ్లుగల బలరాముని చూచి, ఇతడు మద్యపానముచే మత్తుడైయున్నాడని తెలుసుకొని వేగిరపాటుతో సూతమహర్షితప్ప మిగిలిన శౌనకాదిమహర్షులు సూతవంశోద్భవుడైన బలరాముని పూజించుచున్నవారై లేచి నిలబడిరి.

తతః క్రోధసమావిష్టో హలీ సూతం మహాబలః ।
నిజఘాన వివృత్తాక్షః క్షోభితాశేషదానవః ॥29॥

అంతట సమస్తరాక్షసులను భయపెట్టినవాడు, గొప్ప బలవంతుడు, నాగలి ఆయుధముగా గలవాడు అగు బలరాముడు సూతమహర్షి తనను అవమానించినట్లుగా భావించి కండ్లను అటునిటు త్రిప్పుచూ కోపముతో కూడుకొన్నవాడై సూతమహర్షిని చంపెను.

అధ్యాస్యతి పదం బ్రాహ్మం తస్మిన్ సూతే నిపాతితే ।
నిష్క్రాంతాస్తే ద్విజాస్సర్వే వనాత్ కృష్ణాజినాంబరాః ॥30॥

బలరామునిచేత చంపబడిన ఆ సూతమహర్షి బ్రహ్మసంబద్ధమైన స్థానమును అధిరోహించగా, నల్ల లేడిచర్మమును ధరించిన ఆ బ్రాహ్మణశ్రేష్ఠులందరూ ఆ అడవినుండి వైదొలగిరి.

అవధూతం తథాత్మానం మన్యమానో హలాయుధః ।
చిన్తయామాస సుమహన్మయా పాపమిదం కృతమ్ ॥31॥

సూతమహర్షిని చంపుటచే బలరాముడు తనను గౌరవహీనునిగా తలచుచున్నవాడై తాను గొప్ప పాపకర్మను ఆచరించితినని తలచెను.

బ్రాహ్మం స్థానం గతో హ్యేష యత్సూతో వినిపాతితః ।
తథా హీమే ద్విజాస్సర్వే మామవేక్ష్య వినిర్గతాః ॥32॥

నాచే చంపబడిన సూతమహర్షి బ్రహ్మభావమును పొందెను. ఇట్టి పాపకర్మను ఆచరించిన నన్ను చూచి బ్రాహ్మణులందరూ ఈ అడవినుండి వెడలిపోయిరి.

శరీరస్య చ మే గంధో లోహస్యేవాఽసుఖావహః ।
ఆత్మానం చాఽవగచ్ఛామి బ్రహ్మఘ్నమివ కుత్సితమ్ ॥33॥

నా శరీరమునుండి దుఃఖమును కల్గించుచున్న లోహగంధము వంటి గంధము వచ్చుచున్నది. దీనికి కారణము బ్రహ్మహత్యను చేయుటయను నీచమైన కార్యమును ఆచరించుటేయని తెలుసుకొనుచున్నాను.

ధిగమర్షం తథా మద్యమతిమానమభీరుతామ్ ।
యైరావిష్టేన సుమహన్మయా పాపమిదం కృతమ్ ॥34॥

అసహనము, మద్యము, దురభిమానము, క్రూరత్వము ఈ గుణములు నిందార్హమైనవి. వాటియందు ఆసక్తిగలవాడనగుటచేతనే నేనీ గొప్ప పాపకార్యమును ఆచరించితిని.

తత్క్షయార్థం కరిష్యామి వ్రతం ద్వాదశవార్షికమ్ ।
స్వకర్మఖ్యాపనం కుర్వన్ ప్రాయశ్చిత్తమనుత్తమమ్ ॥35॥

ఆ పాపపరిహారార్థమై నేను చేసిన పాపమందరికీ చెప్పుచున్నవాడనై మిక్కిలి గొప్పదైన ప్రాయశ్చిత్తముగా పన్నెండు సంవత్సరముల వ్రతమునాచరించెదను.

అథవేయం సమారబ్ధా తీర్థయాత్రా మయాధునా ।
ఏతామేవ ప్రయాస్యామి ప్రతిలోమాం సరస్వతీమ్ ॥36॥

అట్లుకాకపోయిననూ నాచేత తీర్థయాత్ర ఇప్పుడు ఎట్లయిననూ ప్రారంభింపబడినది. కావున ప్రతిలోమయగు సరస్వతీనదిని గూర్చి వెళ్ళెదను.

అతో జగామ రామోఽసౌ ప్రతిలోమాం సరస్వతీమ్ ।
తతః పరం శృణుష్వేమం పాండవేయకథాశ్రయమ్ ॥37॥

కావున ఓ జైమినిమహర్షీ! ఈ బలరాముడు ఇందువలన ప్రతిలోమయగు సరస్వతీనదీతీర్థమునకు వెళ్ళెను. అటుపిమ్మట పాండుకుమారుల కథావృత్తాంతమును వినుము.

ఇతి శ్రీమార్కండేయ మహాపురాణే బలదేవకృతబ్రహ్మహత్యాకారణకథనం నామ షష్ఠోఽధ్యాయః॥6॥

శ్రీమార్కండేయ మహాపురాణమందు బలదేవకృతమైన బ్రహ్మహత్యాకారణకథనమను ఆరవ అధ్యాయం సమాప్తం.

సప్తమోఽధ్యాయః – ఏడవ అధ్యాయం
పాండవేయజననమరణకారణమ్ – పాండవేయజననమరణకారణం

ధర్మపక్షిణ ఊచుః – ధర్మపక్షులు పలికినవి.

హరిశ్చంద్రేతి రాజర్షిరాసీత్త్రేతాయుగే పురా ।
ధర్మాత్మా పృథివీపాలః ప్రోల్లసత్కీర్తిరుత్తమః ॥1॥

పూర్వము త్రేతాయుగమందు హరిశ్చంద్రుడను గొప్ప రాజుండెను. అతడు ధర్మాత్ముడు, భూమండలమును పాలించువాడు, అత్యంత కీర్తిమంతుడు.

న దుర్భిక్షం న చ వ్యాధిర్నాకాలమరణం నృణామ్ ।
నాధర్మరుచయః పౌరాస్తస్మిన్ శాసతి పార్థివే ॥2॥

ఆ రాజు రాజ్యపరిపాలనము చేయుచుండగా ప్రజలకు దుర్భిక్షము (కరువుకాటకములు)గాని, వ్యాధులుగాని, అకాలమరణముగాని లేకుండెను. పురప్రజలు అధర్మమందు ప్రీతిలేనివారై యుండిరి.

బభూవుర్న తథోన్మత్తా ధనవీర్యతపోమదైః ।
నాజాయన్త స్త్రియశ్చైవ కాశ్చిదప్రాప్తయౌవనాః ॥3॥

అట్లే ఆ పురమందలి ప్రజలు ధనము, పరాక్రమము, తపస్సు గర్వములచే ఉన్మత్తులు కాకుండిరి. యౌవనము పొందని స్త్రీలు ఎవరూ లేకుండిరి. అనగా నిత్యయౌవనముతో సంతోషముతో ఉండిరని భావము.

స కదాచిన్మహాబాహురరణ్యేఽనుసరన్ మృగమ్ ।
శుశ్రావ శబ్దమసకృత్ త్రాయస్వేతి చ యోషితామ్ ॥4॥

గొప్ప భుజబలముగల ఆ రాజు ఒకనాడు అడవిలో ఒక లేడిని వేటాడు సమయమందు "రక్షింపుము, రక్షింపుము" అను స్త్రీల శబ్దమును మాటిమాటికి వినెను.

స విహాయ మృగం రాజా మాభైషీరిత్యభాషత ।
మయి శాసతి దుర్మేధాః కోఽయమన్యాయవృత్తిమాన్ ॥5॥

అంతట మహారాజు ఆ లేడిని వదిలిపెట్టి "నేను భూమిని పరిపాలించుచుండగా ఈ అన్యాయప్రవృత్తిగల దుర్బుద్ధి ఎవడు?" అని పలుకుచూ భయపడవలదని మాటలాడెను.

తత్క్రందితానుసారీ చ సర్వారంభవిఘాతకృత్ ।
ఏతస్మిన్నన్తరే రౌద్రో విఘ్నరాట్సమచింతయత్ ॥6॥

ఇంతలో ఆ స్త్రీల ఆక్రందనలను వినుచూ అనుసరించుచున్నవాడు, సమస్త కార్యములను విఘ్నపరచువాడు, రుద్రకుమారుడు, విఘ్నములకు అధిపతియగు విఘ్నేశ్వరుడు ఇట్లు తలపోసెను.

విశ్వామిత్రోఽయమతులం తప ఆస్థాయ వీర్యవాన్ ।
ప్రాగసిద్ధా భవాదీనాం విద్యాః సాధయతి వ్రతీ ॥7॥

సాటిలేని తపస్సును ఆచరించుచున్న పరాక్రమవంతుడగు ఈ విశ్వామిత్రుడు వ్రతమును ఆచరించుచు పూర్వము ఎవరికీ సిద్ధముకాని భవాదివిద్యలను సాధన చేయుచున్నాడు.

సాధ్యమానాః క్షమామౌనచిత్తసంయమినాఽమునా ।
తా వై భయార్తాః క్రన్దన్తి కథం కార్యమిదం మయా ॥8॥

సహనము, మౌనము, చిత్తసంయమనములతో కూడుకొన్న ఈ విశ్వామిత్రమునిచేత సాధింపతలపెట్టిన ఆ విద్యాదేవతలు భయముతో కూడుకొన్నట్టివై రోదించుచున్నవి. ఇప్పుడు నేనెట్లు సహాయపడగలను?

తేజస్వీ కౌశికశ్రేష్ఠో వయమస్య సుదుర్బలాః ।
క్రోశన్త్యేతాస్తథా భీతా దుష్పారం ప్రతిభాతి మే ॥9॥

ఈ విశ్వామిత్రుడత్యంతతేజస్సు గలవాడు. మేమతనికంటే బలహీనులమని భయమునొందిన ఈ విద్యలు ఆక్రోశించుచున్నవి. ఈ కార్యము కష్టసాధ్యమని నాకు తోచుచున్నది.

అథవాఽయం నృపః ప్రాప్తో మా భైరితి వదన్ముహుః ।
ఇమమేవ ప్రవిశ్యాఽశు సాధయిష్యే యథేప్సితమ్ ॥10॥

కానిమ్ము. రాజు మాటిమాటికి భయపడవలదని పలుకుచు ఇచ్చటికి వచ్చినాడు. ఈతని శరీరమందు ప్రవేశించి అభిమతమైన దానిని సాధించిపెట్టెదను.

ఇతి సంచిన్త్య రౌద్రేణ విఘ్నరాజేన వై తతః ।
తేనాఽవిష్టో నృపః కోపాదిదం వచనమబ్రవీత్ ॥11॥

రుద్రుని కుమారుడగు విఘ్నేశ్వరుడు ఈవిధముగా ఆలోచించి అటు పిమ్మట ఆ హరిశ్చంద్రమహారాజు శరీరమందు ప్రవేశించెను. ప్రవేశించిన వెంటనే ఆ రాజు కోపముతో ఇట్లు పలికెను.

కోఽయం బధ్నాతి వస్త్రాన్తే పావకం పాపకృన్నరః ।
బలోష్ణతేజసా దీప్తే మయి పత్యావుపస్థితే ॥12॥

మిక్కిలి వేడిమిగల తేజస్సుతో ప్రకాశించుచున్న పృథివీపతియగు నేను ఉండగా, కొంగున అగ్నిని ముడివేసుకొనుటకు సిద్ధపడుచున్న పాపాత్ముడగు ఈ మానవుడెవరు?

సోఽద్య మత్కారుకాక్షేపవిదీపితదిగంతరైః ।
శరైర్విభిన్నసర్వాంగో దీర్ఘనిద్రాం ప్రవేక్ష్యతి ॥13॥

ఆ నరుడిప్పుడు నా వింటినుండి దిగంతరములవరకు ప్రకాశించుచూ వ్యాపించునట్టి బాణములచే కొట్టబడి, సమస్తావయవములు ఛేదింపబడి, దీర్ఘనిద్రను (మరణమును) పొందగలడు.

విశ్వామిత్రస్తతః క్రుద్ధః శ్రుత్వా తన్నృపతేర్వచః ।
క్రుద్ధే చర్షివరే తస్మిన్నేశుర్విద్యాః క్షణేన తాః ॥14॥

విశ్వామిత్రుడు ఆ హరిశ్చంద్రమహారాజు మాటలను విన్నంతనే కోపముగలవాడయ్యెను. ఆ ఋషిశ్రేష్ఠుడు కోపము చెందిన ఆ మరుక్షణమే ఆ విద్యలన్నియు నశించినవి. విశ్వామిత్రుని నుండి దూరమయ్యెనని భావము.

స చాపి రాజా తం దృష్ట్వా విశ్వామిత్రం తపోనిధిమ్ ।
భీతః ప్రావేపతాత్యర్థం సహసాఽశ్వత్థపర్ణవత్ ॥15॥

ఆ రాజుకూడా తపోనిధియగు ఆ విశ్వామిత్రుని చూచి మిక్కిలి భయమునొంది ఆ వెంటనే రావియాకువలె మిక్కిలి వణకెను.

స దురాత్మన్నితి యదా మునిస్తిష్ఠేతి చాబ్రవీత్ ।
తతః స రాజా వినయాత్ప్రణిపత్యాభ్యభాషత ॥16॥

ఆ విశ్వామిత్రముని "ఓయీ! దుర్మార్గుడా! ఆగుము" అని పలుకగా, ఆ హరిశ్చంద్రరాజు వినయముతో నమస్కరించి ఇట్లు పలికెను.

భగవన్నేష ధర్మో మే నాపరాధో మమ ప్రభో! ।
న క్రోద్ధుమర్హసి మునే! నిజధర్మరతస్య మే ॥17॥

ఓ పూజ్యుడా! ఇది నా ధర్మము. ఓ ప్రభూ! నా తప్పేమీ లేదు. ఓ మునిశ్రేష్ఠుడా! స్వధర్మపరిపాలనము చేయుచున్న నాపై కోపగించుట నీకు తగదు.

దాతవ్యం రక్షితవ్యం చ ధర్మజ్ఞేన మహీక్షితా ।
చాపం చోద్యమ్య యోద్ధవ్యం ధర్మశాస్త్రానుసారతః ॥18॥

భూపరిపాలకుడగు ధర్మమునెరిగిన రాజు ధర్మశాస్త్రోక్తానుసారముగా ధనుర్ధారియై దానమును, రక్షణమును, యుద్ధమును ఆచరించవలెను.

విశ్వామిత్ర ఉవాచ – విశ్వామిత్రుడు పలికాడు.

దాతవ్యం కస్య కే రక్ష్యాః కైర్యోద్ధవ్యం చ తే నృప ।
క్షిప్రమేతత్సమాచక్ష్వ యద్యధర్మభయం తవ ॥19॥

ఓ రాజా! హరిశ్చంద్రుడా! నీకధర్మమందు భయమే ఉన్నచో ఎవరికి దానమీయవలెను? ఎవరు రక్షింపతగినవారు? ఎవరితో యుద్ధము చేయవలెను? అను విషయములను వెంటనే నాకు తెలుపుము.

హరిశ్చంద్ర ఉవాచ – హరిశ్చంద్రుడు చెప్పాడు

దాతవ్యం విప్రముఖ్యేభ్యో యే చాన్యే కృశవృత్తయః ।
రక్ష్యా భీతాః సదా యుద్ధం కర్తవ్యం పరిపన్థిభిః ॥20॥

శ్రేష్ఠులైన బ్రాహ్మణులకు మరియు జీవనాధారము లేని ఇతరులకు దానమీయవలెను. భయపడినవారిని రక్షించవలెను. శత్రువులతో ఎల్లప్పుడు యుద్ధము చేయవలెను.

విశ్వామిత్ర ఉవాచ – విశ్వామిత్రుడు చెప్పాడు.

యది రాజా భవాన్ సమ్యగ్రాజధర్మమవేక్షతే ।
నిర్వేష్టుకామో విప్రోఽహం దీయతామిష్టదక్షిణా ॥21॥

ఓ రాజా! నీవు బాగుగా రాజధర్మమునెరిగినవాడవైనచో మోక్షార్థియైన బ్రాహ్మణుడను నేను. అట్టి నాకు నాకిష్టమైన దక్షిణను ఇమ్ము.

పక్షిణ ఊచుః – ధర్మపక్షులు పలికాయి.

ఏతద్రాజా వచః శ్రుత్వా ప్రహృష్టేనాన్తరాత్మనా ।
పునర్జాతమివాఽత్మానం మేనే ప్రాహ చ కౌశికమ్ ॥22॥

ఓ జైమినిమహర్షీ ! రాజు విశ్వామిత్రుని మాటలను విని హృదయమందు మిక్కిలి సంతోషించినవాడై తనకిది పునర్జన్మయని భావించి విశ్వామిత్రునితో ఇట్లు పలికెను.

ఉచ్యతాం భగవన్యత్తే దాతవ్యమవిశంకితమ్ ।
దత్తమిత్యేవ తద్విద్ధి యద్యపి స్యాత్సుదుర్లభమ్ ॥23॥

ఓ భగవత్స్వరూపుడా ! మీకేమి కావలెనో సందేహించక అడుగుడు. ఎంతటి దుర్లభమైనప్పటికినీ అట్టి వస్తువు నాచే ఇవ్వబడినట్లుగానే మీరు తెలుసుకొనుడు.

హిరణ్యం వా సువర్ణం వా పుత్రః పుత్రీ కలేబరమ్ ।
ప్రాణా రాజ్యం పురం లక్ష్మీర్యదభిప్రేతమాత్మనః ॥24॥

హిరణ్యము, సువర్ణము, పుత్రుడు, కుమార్తె, ఈ నాశరీరము, నా ప్రాణములు, రాజ్యము, పురము, ఐశ్వర్యము వీటిలో మీకేమి కావలయునో తెలుపుడు.

విశ్వామిత్ర ఉవాచ – విశ్వామిత్రుడు చెప్పాడు.

రాజన్! ప్రతిగృహీతోఽయం యస్తే దత్తః ప్రతిగ్రహః ।
ప్రయచ్ఛ ప్రథమం తావద్దక్షిణాం రాజసూయికీమ్ ॥25॥

ఓ రాజా! నీవిచ్చినదానిని ప్రతిగ్రహించితిని, ముందు నాకు రాజసూయయాగమునకు సంబంధించిన దక్షిణనిమ్ము.

రాజోవాచ – రాజు చెప్పాడు.

బ్రహ్మంస్తామపి దాస్యామి దక్షిణాం భవతోఽప్యహమ్ ।
వ్రియతాం ద్విజశార్దూల యస్తవేష్టః ప్రతిగ్రహః ॥26॥

ఓ బ్రహ్మర్షీ! ఆ రాజసూయయాగమునకు సంబంధించిన దక్షిణను గూడ యిచ్చెదను. ఓ బ్రాహ్మణశ్రేష్ఠుడా! నీకిష్టమైన ప్రతిగ్రహమేమో దానిని కోరుకొనుము.

విశ్వామిత్ర ఉవాచ – విశ్వామిత్రుడు చెప్పాడు.

ససాగరాం ధరామేతాం సభూభృద్గ్రామపత్తనామ్ ।
రాజ్యం చ సకలం వీర రథాశ్వగజసంకులమ్ ॥27॥

కోష్ఠాగారం చ కోశం చ యచ్చాన్యద్విద్యతే తవ ।
వినా భార్యాం చ పుత్రం చ శరీరం చ తవానఘ ॥28॥

ధర్మం చ సర్వధర్మజ్ఞ యో యాన్తమనుగచ్ఛతి ।
బహునా వా కిముక్తేన సర్వమేతత్ప్రదీయతామ్ ॥29॥

ఓ వీరుడా ! సాగరములు, పర్వతములు, గ్రామములు, పట్టణములు వీటితో కూడుకొన్న సమస్తభూమిని, రథములు, గజములు వీటితో కూడుకొన్న సమస్తరాజ్యమును నాకిమ్ము. ఇంకను ఓ పుణ్యాత్ముడా! ధనాగారమును, ధనమును నాకిమ్ము. నీ శరీరము, భార్యాపుత్రులు తప్ప నీ వద్ద ఏమేమి ఉన్నదో దానినంతయు నిమ్ము. సమస్తధర్మములనెరిగినవాడా! మరణించు కాలమందు తన వెంట వచ్చు ధర్మమును (పుణ్యమును) నా కిమ్ము. వేయేల? ఈ చెప్పినదానినంతయు నాకిమ్ము.

పక్షిణ ఊచుః – ధర్మపక్షులు చెప్పాయి.

ప్రహృష్టేనైవ మనసా సోఽవికారముఖో నృపః ।
తస్యర్షేర్వచనం శ్రుత్వా తథేత్యాహ కృతాంజలిః ॥30॥

మునిశ్రేష్ఠుడగు విశ్వామిత్రుని మాటలను విని సంతోషముతోనే కూడుకొన్న చిత్తముగలవాడై ముఖమందు ఎట్టి వికారము లేక ఆ హరిశ్చంద్రమహారాజు చేతులు జోడించుకొని అట్లేయని పలికెను.

విశ్వామిత్ర ఉవాచ – విశ్వామిత్రుడు చెప్పాడు.

సర్వస్వం యది మే దత్తం రాజ్యముర్వీ బలం ధనమ్ ।
ప్రభుత్వం కస్య రాజర్షే రాజ్యస్థే తాపసే మయి ॥31॥

ఓ రాజర్షీ! హరిశ్చంద్రుడా ! రాజ్యము, భూమి, బలము, ధనము ఈ సమస్తమూ దానముగా నాకివ్వబడినచో, తాపసుడనగు నేను రాజ్యమందుండగా ప్రభుత్వము (రాజ్యాధికారము) ఎవరిది కాగలదు?

హరిశ్చంద్ర ఉవాచ – హరిశ్చంద్రుడు చెప్పాడు.

యస్మిన్నపి మయా కాలే బ్రహ్మన్ దత్తా వసుంధరా ।
తస్మిన్నపి భవాన్ స్వామీ కిముతాద్య మహీపతిః ॥32॥

ఓ బ్రహ్మస్వరూపుడా ! ఎప్పుడయితే నాచే ఈ భూమంతయు నీకు ఇవ్వబడినదో అప్పుడే నీవు ఈ భూమండలము కంతయు ప్రభువువయితివి. నీవే రాజయితివని చెప్పవలెనా ఏమి?

విశ్వామిత్ర ఉవాచ – విశ్వామిత్రుడు చెప్పాడు.

యది రాజంస్త్వయా దత్తా మమ సర్వా వసుంధరా ।
యత్ర మే విషయే స్వామ్యం తస్మాన్నిష్క్రాంతుమర్హసి ॥33॥

శ్రోణీసూత్రాదిసకలం ముక్త్వా భూషణసంగ్రహమ్ ।
తరువల్కలమాబధ్య పత్న్యా సహ సుతేన చ ॥34॥

ఓ రాజా ! సమస్తభూమి నాకివ్వబడినచో నేను సమస్తరాజ్యమునకు ప్రభువయితిని. కావున నా రాజ్యమునుండి మొలత్రాడు మొదలుగా కలిగిన సమస్త అలంకారములను వదిలి నారచీరలను ధరించి భార్యాపుత్రులతో నీవీ రాజ్యమును విడిచిపెట్టి వెళ్ళవలెను.

పక్షిణ ఊచుః – ధర్మపక్షులు చెప్పాయి.

తథేతి చోక్త్వా కృత్వా చ రాజా గన్తుం ప్రచక్రమే ।
స్వపత్న్యా శైబ్యయా సార్ధం బాలకేనాఽఽత్మజేన చ ॥35॥

ఓ జైమినిమునీ! ఆ హరిశ్చంద్రరాజు అట్లేయని పలికి, విశ్వామిత్రుడు చెప్పినట్లాచరించి తన భార్యయగు శైబ్యతోనూ, తన కొడుకగు చిన్నపిల్లవానితోనూ రాజ్యమును వదిలి వెళ్ళుటకు ఉపక్రమించెను.

వ్రజతః స తతో రుద్ధ్వా పన్థానం ప్రాహ తం నృపమ్ ।
క్వ యాస్యసీత్యదత్వా మే దక్షిణాం రాజసూయికీమ్ ॥36॥

రాజ్యమును వదిలి వెళ్ళుచున్న ఆ హరిశ్చంద్రుని మార్గమును అడ్డగించి విశ్వామిత్రుడు ఆ రాజుతో యిట్లు పలికెను. "రాజసూయయాగమునకు సంబంధించిన దక్షిణను నాకివ్వకుండా నీవెచ్చటకు వెళ్ళెదవు?"

హరిశ్చంద్ర ఉవాచ – హరిశ్చంద్రుడు చెప్పాడు.

భగవన్ ! రాజ్యమేతత్తే దత్తం నిహతకంటకమ్ ।
అవశిష్టమిదం బ్రహ్మన్నద్య దేహత్రయం మమ ॥37॥

ఓ పూజ్యుడా ! ఎట్టి వ్యతిరేకతలు లేని ఈ రాజ్యమంతయు నీకివ్వబడినది. ఓ బ్రహ్మస్వరూపుడా! నేడు నావద్ద మూడు శరీరములు మాత్రమే (తన శరీరము ఒకటి, భార్యాపుత్రుల శరీరములు రెండు, మొత్తం మూడు) మిగిలియున్నవి.

విశ్వామిత్ర ఉవాచ – విశ్వామిత్రుడు చెప్పాడు.

తథాపి ఖలు దాతవ్యా త్వయా మే యజ్ఞదక్షిణా ।
విశేషతో బ్రాహ్మణానాం హన్త్యదత్తం ప్రతిశ్రుతమ్ ॥38॥

ఓ రాజా ! నీవద్ద మూడు శరీరములు మాత్రమే మిగిలియున్ననూ యజ్ఞదక్షిణమాత్రము నాకు ఇవ్వవలసినదే. ప్రత్యేకించి బ్రాహ్మణులకు ఏమైనా ఇచ్చెదమని చెప్పి, ఇవ్వకపోయినచో అట్టి వస్తువు ఎక్కువ నష్టమును కలిగించును.

యావత్తోషో రాజసూయే బ్రాహ్మణానాం భవేన్నృప ।
తావదేవ తు దాతవ్యా దక్షిణా రాజసూయికీ ॥39॥

ఓ రాజా ! రాజసూయయాగమందు ఏమిచ్చినచో బ్రాహ్మణులు సంతోషపడుదురో అంత దక్షిణను వారికి ఇవ్వవలెను.

ప్రతిశ్రుత్య చ దాతవ్యం యోద్ధవ్యం చాతతాయిభిః ।
రక్షితవ్యాస్తథా చార్తాస్త్వయైవ ప్రాక్ ప్రతిశ్రుతమ్ ॥40॥

ఇచ్చెదమని చెప్పినదానిని తప్పక ఇవ్వవలెను. శత్రువులతో యుద్ధము చేయవలెను. కష్టములలోనున్నవారిని రక్షింపవలెను. ఈ విషయములన్నియూ నీవంగీకరించినవే.

హరిశ్చంద్ర ఉవాచ – హరిశ్చంద్రుడు చెప్పాడు.

భగవన్ సాంప్రతం నాస్తి దాస్యే కాలక్రమేణ తే ।
ప్రసాదం కురు విప్రర్షే సద్భావమనుచిన్త్య చ ॥41॥

ఓ భగవంతుడా ! ఇప్పుడు నా వద్ద ఏమియూ లేదు. మరికొంతకాలము తరువాత నీకు దానమిచ్చెదను. ఓ బ్రాహ్మణశ్రేష్ఠుడా ! నాపట్ల మంచి అభిప్రాయమును ఆలోచించి నన్ను అనుగ్రహించుము.

విశ్వామిత్ర ఉవాచ – విశ్వామిత్రుడు చెప్పాడు.

కిం ప్రమాణో మయా కాలః ప్రతీక్ష్యస్తే జనాధిప ।
శీఘ్రమాచక్ష్వ శాపాగ్నిరన్యథా త్వాం ప్రధక్ష్యతి ॥42॥

ఓ జనాధిపా ! రాజా ! నేనెంతకాలమని వేచియుండవలెను? త్వరగా చెప్పుము. లేనిచో నా శాపాగ్ని నిన్ను దహించివేయగలదు.

హరిశ్చంద్ర ఉవాచ – హరిశ్చంద్రుడు చెప్పాడు.

మాసేన తవ విప్రర్షే ప్రదాస్యే దక్షిణాధనమ్ ।
సాంప్రతం నాస్తి మే విత్తమనుజ్ఞాం దాతుమర్హసి ॥43॥

ఓ బ్రాహ్మణశ్రేష్ఠుడా ! నీకు నెలరోజులలో రాజసూయయాగ దక్షిణాధనమునిచ్చెదను. ప్రస్తుతము నావద్ద ధనము లేదు. నాకు అనుజ్ఞనిమ్ము.

విశ్వామిత్ర ఉవాచ – విశ్వామిత్రుడు చెప్పాడు.

గచ్ఛ గచ్ఛ నృపశ్రేష్ఠ ! స్వధర్మమనుపాలయ ।
శివశ్చ తేఽధ్వా భవతు మా సంతు పరిపన్థినః ॥44॥

ఓ రాజశ్రేష్ఠుడా ! పొమ్ము, పొమ్ము. స్వధర్మమును పాలించుము. నీ మార్గము మంగళప్రదమగుగాక ! నీకు శత్రువులు లేకుందురుగాక !

పక్షిణ ఊచుః – ధర్మపక్షులు చెప్పాయి.

అనుజ్ఞాతః స గచ్ఛేతి జగామ వసుధాధిపః ।
పద్భ్యామనుచితా గన్తుమన్వగచ్ఛత తం ప్రియా ॥45॥

అనంతరమా పృథివీపతియగు హరిశ్చంద్రుడు "వెళ్ళుము" అని విశ్వామిత్రుని నుండి అనుజ్ఞను పొంది బయలుదేరెను. నడచుట ఉచితము కాకపోయిననూ అతని భార్య తన భర్తను అనుసరించి వెళ్ళెను.

తం సభార్యం నృపశ్రేష్ఠం నిర్యాన్తం ససుతం పురాత్ ।
దృష్ట్వా ప్రచుక్రుశుః పౌరా రాజ్ఞశ్చైవానుయాయినః ॥46॥

భార్యాపుత్రులతో రాజ్యమును వదిలి వెళ్ళుచున్న ఆ రాజశ్రేష్ఠుని చూచి అతనిని అనుసరించు పురజనులు మిక్కిలి ఆక్రోశించిరి.

హా నాథ ! కిం జహాస్యస్మాన్ నిత్యార్తిపరిపీడితాన్ ।
త్వం ధర్మతత్పరో రాజన్ ! పౌరానుగ్రహకృత్తథా ॥47॥

ఓ నాథా ! ఎల్లప్పుడు బాధలచో పీడింపబడు మమ్ములను ఏల విడిచి వెళ్ళుచున్నావు? ఓ రాజా ! నీవు ధర్మమందు ఆసక్తిగలవాడవు. పురజనులయందు అనుగ్రహము చూపువాడవు.

నయాస్మానపి రాజర్షే ! యది ధర్మమవేక్షసే ।
ముహూర్తం తిష్ఠ రాజేంద్ర ! భవతో ముఖపంకజమ్ ॥48॥

పిబామో నేత్రభ్రమరైః కదా ద్రక్ష్యామహే పునః ।
యస్య ప్రయాతస్య పురో యాన్తి పృష్ఠే చ పార్థివాః ॥49॥

తస్యానుయాతి భార్యేయం గృహీత్వా బాలకం సుతమ్ ।
యస్య భృత్యాః ప్రయాతస్య యాన్త్యగ్రే కుంజరస్థితాః ॥50॥

స ఏష పద్భ్యాం రాజేన్ద్రో హరిశ్చంద్రోఽద్య గచ్ఛతి ।
హా రాజన్ ! సుకుమారం తే సుభ్రు సుత్వచమున్నసమ్ ॥51॥

పథి పాంసుపరిక్లిష్టం ముఖం కీదృగ్భవిష్యతి ।
తిష్ఠ తిష్ఠ నృపశ్రేష్ఠ ! స్వధర్మమనుపాలయ ॥52॥

ఓ రాజశ్రేష్ఠుడా ! నీవు ధర్మమునాలోచించినవాడవయితే మమ్ములను కూడా నీతో తీసుకొని పొమ్ము. ఓ రాజేంద్రా! క్షణకాలమాగుము. మా నేత్రములనెడి తుమ్మెదలతో నీ ముఖపద్మమును త్రాగెదము. మరల నిన్నెప్పుడు చూడగలుగుదుమో కదా! ఏ మహారాజు ప్రయాణము చేయుచుండగా ముందు వెనుకల సామంతరాజులు

నడచుచుందురో అట్టి హరిశ్చంద్రమహారాజును అతని భార్యయగు చంద్రమతి కుమారుడగు చిన్నపిల్లవానిని తీసుకొని అనుసరించి వెళ్ళుచున్నది. ఏ మహారాజు ప్రయాణము చేయుచుండగా ఏనుగులను తీసుకొని సేవకులు ముందు నడచుచుందురో అట్టి రాజశ్రేష్ఠుడగు హరిశ్చంద్రుడు నేడు కాలినడకను వెళ్ళుచున్నాడు. ఓ రాజా ! మిక్కిలి మృదువైనది, అందమైన కనుబొమలు గలది, ఎత్తైన ముక్కుగలది, మార్గమందు ధూళిచేత మలినమైనదీ యగు నీ ముఖము ఇకపైన ఎట్టిది కాగలదో కదా! ఓ రాజశ్రేష్ఠుడా ! నిలువుము, నిలువుము. స్వధర్మపరిపాలనము చేయుము.

ఆనృశంస్యం పరో ధర్మః క్షత్రియాణాం విశేషతః ।
కిం దారైః కిం సుతైర్నాథ ! ధనైర్ధాన్యైరథాపి వా ॥53॥

క్షత్రియులకు విశేషించి ప్రాణులయందు దయచూపుట గొప్ప ధర్మము. ఓ నాథా ! నీవు లేనిచో మాకు భార్యాపుత్ర ధనాదులతో గాని మరి ఏ ఇతర ధాన్యాది వస్తువులతో గాని ఏమి పని?

సర్వమేతత్పరిత్యజ్య ఛాయాభూతా వయం తవ ।
హా నాథ ! హా మహారాజ ! హా స్వామిన్ ! కిం జహాసి నః ॥54॥

మేమీ సమస్తమును వదిలిపెట్టి నీకు నీడగా ఉండెదము. ఓ నాథా ! ఓ మహారాజా! ఓ ప్రభూ ! మమ్మల్ని విడిచిపెట్టుచున్నావా ఏమి?

యత్ర త్వం తత్ర హి వయం తత్సుఖం యత్ర వై భవాన్ ।
నగరం తద్భవాన్ యత్ర స స్వర్గో యత్ర నో నృపః ॥55॥

నీవెచ్చట ఉండెదవో అచ్చటే మేముండెదము. ఎచ్చట నీవు ఉండెదవో అచ్చటే మాకు సుఖము కలదు. ఎచ్చట నీవు ఉండెదవో అదియే మాకు పట్టణము. ఎచ్చట మా రాజు నివసించునో అదియే మాకు స్వర్గము.

ఇతి పౌరవచః శ్రుత్వా రాజా శోకపరిప్లుతః ।
అతిష్ఠత్ స తదా మార్గే తేషామేవానుకంపయా ॥56॥

ఈ పురప్రజల మాటలను విని హరిశ్చంద్రమహారాజు మిక్కిలి దుఃఖమునొందెను. వారియందున్న దయవల్లనే ఆ రాజప్పుడు మార్గమందు కదలక నిలిచెను.

విశ్వామిత్రోఽపి తం దృష్ట్వా పౌరవాక్యాకులీకృతమ్ ।
రోషామర్షవివృత్తాక్షః సమాగమ్య వచోఽబ్రవీత్ ॥57॥

విశ్వామిత్రుడు పురప్రజలమాటలతో వ్యాకులము చెందిన హరిశ్చంద్రుని చూచి కోపము, అసహనములతో కండ్లునటునిటు త్రిప్పుచు అతనిని సమీపించి, ఇట్లు పలికెను.

ధిక్ త్వాం దుష్టసమాచారమనృతం జిహ్మభాషిణమ్ ।
మమ రాజ్యం చ దత్త్వా యః పునః ప్రాక్రష్టుమిచ్ఛసి ॥58॥

దుష్టమైన ఆచారముగలవాడు, అసత్యభాషణముచేయువాడు అగు నీవు నిందింపతగినవాడవు. నాకు రాజ్యమును దానముగా నిచ్చి మరల ఆక్రమించవలెనని కోరుచున్నావు.

ఇత్యుక్తః పరుషం తేన గచ్ఛామీతి స వేపథుః ।
బ్రువన్నేవం యయౌ శీఘ్రమాకర్షన్ దయితాం కరే ॥59॥

ఈ విధముగా విశ్వామిత్రుడు కోపముతో పలుకగా, హరిశ్చంద్రుడు వణకుచు "వెళ్ళిపోవుచున్నాను" అని పలుకుచు తనభార్య చేతిని లాగి బట్టుకొని శీఘ్రముగా అచ్చటినుండి వెళ్ళిపోయెను.

కర్షతస్తాం తతో భార్యాం సుకుమారీం శ్రమాతురామ్ ।
సహసా దండకాష్ఠేన తాడయామాస కౌశికః ॥60॥

కోమలాంగియు, అలసియున్నదీ, చేయిబట్టిలాగి తీసుకొని పోబడుచున్నట్టిదీ అగు హరిశ్చంద్రుని భార్యను విశ్వామిత్రుడు వెనువెంటనే కర్రతో కొట్టెను.

తాం తథా తాడితాం దృష్ట్వా హరిశ్చంద్రో మహీపతిః ।
గచ్ఛామీత్యాహ దుఃఖార్తో నాన్యత్కించిదుదాహరత్ ॥61॥

విశ్వామిత్రునిచేత కొట్టబడిన తన భార్యను చూచి భూపతియగు హరిశ్చంద్రుడు దుఃఖముతో కూడుకొన్నవాడై "వెళ్ళిపోవుచున్నాను" అని మాత్రమే పలికెను. ఇంకేమియూ మాట్లాడలేదు.

అథ విశ్వే తదా దేవా పఞ్చ ప్రాహుః కృపాలవః ।
విశ్వామిత్రః సుపాపోఽయం లోకాన్ కాన్ సమవాప్స్యతి ॥62॥

యేనాయం యజ్వనాం శ్రేష్ఠః స్వరాజ్యాదవరోపితః ।
కస్య వా శ్రద్ధయా పూతం సూతం సోమం మహాఽధ్వరే ॥
పీత్వా వయం ప్రయాస్యామో ముదం మంత్రపురస్సరమ్ ॥63॥

అనంతరము విశ్వేదేవతలయిదుగురు దయగలవారై ఆ సమయమందు ఇట్లుపలికిరి. "ఎవనిచేత గొప్ప యజ్ఞమందు హోమముగావింపబడి, శ్రద్ధకారణముగా పవిత్రమై, మంత్రములచేత సంస్కరింపబడిన సోమరసమును మేము పానముచేసి సంతోషమును పొందుచున్నామో అట్టి యాగములనాచరించువారిలో శ్రేష్ఠుడైన హరిశ్చంద్రుని విశ్వామిత్రుడు రాజ్యభ్రష్టుని గావించెను. అట్టి మిక్కిలి పాపాచరణముగల విశ్వామిత్రుడు ఎట్టిలోకములను పొందునో గదా!"

పక్షిణ ఊచుః – ధర్మపక్షులు ఇట్లు పలికినవి.

ఇతి తేషాం వచః శ్రుత్వా కౌశికోఽతిరుషాన్వితః ।
శశాప తాన్మనుష్యత్వం సర్వే యూయమవాప్స్యథ ॥64॥

ఈ విధముగా ఆ విశ్వేదేవతలయిదుగురు పలికిన మాటలను విని, విశ్వామిత్రుడు మిక్కిలి కోపముచెంది "మీరందరు మనుష్యజన్మను పొందుదురు గాక!" అని వారిని శపించెను.

ప్రసాదితశ్చ తైః ప్రాహ పునరేవ మహామునిః ।
మానుషత్వేఽపి భవతాం భవిత్రీ నైవ సంతతిః ॥65॥

న దారసంగ్రహశ్చైవ భవితా న చ మత్సరః ।
కామక్రోధవినిర్ముక్తా భవిష్యథ సురాః పునః ॥66॥

ఆ విశ్వేదేవతలు వేడుకొనగా అనుగ్రహించినవాడై ఆ మహాముని విశ్వామిత్రుడు తిరిగి ఇట్లు పలికెను. "మీకు మానవజన్మ లభించిననూ మీకు సంతానము లభించదు, భార్యలు లభించరు, మాత్సర్యము (అసూయ) ఉండదు, కామక్రోధములు లేనివారై మరల దేవతలుగా జన్మను పొందెదరు.

తతోఽవతేరురంశైః స్వైర్దేవాస్తే కురువేశ్మని ।
ద్రౌపదీగర్భసంభూతాః పంచ వై పాండునందనాః ॥67॥

అనంతరమా విశ్వేదేవతలు తమ తమ అంశలతో కురువంశమందు ద్రౌపదీదేవి గర్భమందు అయిదుగురు పాండుకుమారులుగా జన్మించిరి.

ఏతస్మాత్కారణాత్ పంచ పాండవేయా మహారథాః ।
న దారసంగ్రహం ప్రాప్తా శాపాత్తస్య మహామునేః ॥68॥

ఏతత్తే సర్వమాఖ్యాతం పాండవేయకథాశ్రయమ్ ।
ప్రశ్నచతుష్టయం గీతం కిమన్యచ్ఛ్రోతుమిచ్ఛసి ॥69॥

ఓ జైమినిమహర్షీ! ఆ విశ్వామిత్రమహర్షి శాపము కారణముగా మహారథులగు ఆ అయిదుగురు పాండవులు వివాహములు లేనివారలయిరి. పాండవులకు సంబంధించిన ఇతివృత్తమంతయు నీకు చెప్పబడినది. నీవడిగిన నాలుగు ప్రశ్నలకు సమాధానము చెప్పితిమి. ఇంకనూ ఏమి మా నుండి వినదలచితివి?

ఇతి శ్రీమార్కండేయ మహాపురాణే పాండవేయజననమరణకారణవివరణం నామ సప్తమోఽధ్యాయః ॥7॥

శ్రీ మార్కండేయ మహాపురాణమందు పాండవేయజననమరణకారణవివరణమను ఏడవ అధ్యాయం సమాప్తం.



అష్టమోఽధ్యాయః - ఎనిమిదవ అధ్యాయం
హరిశ్చంద్రోపాఖ్యానమ్ - హరిశ్చంద్రోపాఖ్యానం

జైమినిః ఉవాచ - జైమిని చెప్పాడు.

భవద్భిరిదమాఖ్యాతం యథాప్రశ్నమనుక్రమాత్ ।
మహత్ కౌతూహలం మేఽస్తి హరిశ్చంద్రకథాం ప్రతి ॥1॥

అహో మహాత్మనా తేన ప్రాప్తం కృచ్ఛ్రమనుత్తమమ్ ।
కచ్చిత్సుఖమనుప్రాప్తం తాదృగేవ ద్విజోత్తమాః ॥2॥

ఓ బ్రాహ్మణశ్రేష్ఠులారా ! నేనడిగిన ప్రశ్నలకు క్రమముననుసరించి మీరు సమాధానములు చెప్పితిరి. హరిశ్చంద్రుని కథను వినుటకు నాకు గొప్ప కుతూహలమున్నది. ఆహా ! మహాత్ముడగు హరిశ్చంద్రునికి అతడికి తగని కష్టము సంప్రాప్తమైనది. మరల యథాప్రకారముగా అతడికి సుఖము లభించెనా? లేదా?

పక్షిణ ఊచుః - ధర్మపక్షులు చెప్పాయి.

విశ్వామిత్రవచః శ్రుత్వా స రాజా ప్రయయౌ శనైః ।
శైబ్యయాఽనుగతో దుఃఖీ భార్యయా బాలపుత్రయా ॥3॥

విశ్వామిత్రుని మాటలను విని ఆ హరిశ్చంద్రరాజు దుఃఖముతో బాలుడగు పుత్రునితోనూ, తన భార్య శైబ్యాదేవితోనూ నెమ్మదిగా బయలు వెడలెను.

స గత్వా వసుధాపాలో దివ్యాం వారాణసీం పురీమ్ ।
నైషా మనుష్యభోగ్యేతి శూలపాణేః పరిగ్రహః ॥4॥

జగామ పద్భ్యాం దుఃఖార్తః సహ పత్న్యాఽనుకూలయా ।
పురీం ప్రవిశ్య దదృశే విశ్వామిత్రముపస్థితమ్ ॥5॥

భూపరిపాలకుడయిన ఆ హరిశ్చంద్రుడు దివ్యమైన కాశీపట్టణమునకు వెళ్ళి, ఈ భూమి పరమేశ్వరునిచే పరిపాలితము గాన మానవులచే అనుభవింపదగినది కాదని తలచి, దుఃఖపడుచు అనుకూలవతి అయిన భార్యతో కలిసి కాశీపట్టణమును ప్రవేశించి అచ్చట ఎదురుగా ఉన్న విశ్వామిత్రుని చూచెను.

తం దృష్ట్వా సమనుప్రాప్తం వినయాఽవనతోఽభవత్ ।
ప్రాహ చైవాంజలిం కృత్వా హరిశ్చంద్రో మహామునిమ్ ॥6॥

హరిశ్చంద్రుడు మహామునియగు విశ్వామిత్రుడు వచ్చుటను చూచి వినయముతో వంగి అంజలి ఘటించి ఇట్లు పలికెను.

ఇమే ప్రాణాః సూతశ్చాయమియం పత్నీ మునే ! మమ ।
యేన తే కృత్యమస్త్యాశు తద్గృహాణార్ఘ్యముత్తమమ్ ॥7॥

యద్వాఽన్యత్కార్యమస్మాభిస్తదనుజ్ఞాతుమర్హసి ॥8॥

ఓ విశ్వామిత్రమహామునీ ! ఇవిగో నా ప్రాణములు, నా కొడుకు, నా భార్య. వీనిలో ఎవరితో నీకు ప్రయోజనమున్నదో అట్టి ఉత్తమమైన అర్ఘ్యమును నీవు శీఘ్రముగా గ్రహించుము. లేనిచో వేరే ఏమైనా మేము చేయవలసియున్నచో దానిని నీవు ఆజ్ఞాపించవచ్చు.

విశ్వామిత్ర ఉవాచ – విశ్వామిత్రుడు చెప్పాడు.

పూర్ణః స మాసో రాజర్షే దీయతాం మమ దక్షిణా ।
రాజసూయనిమిత్తం హి స్మర్యతే స్వవచో యది ॥9॥

ఓ రాజర్షీ ! హరిశ్చంద్రుడా ! నేను తలపెట్టిన రాజసూయయాగ నిమిత్తమై నీవిచ్చిన మాట నీకు గుర్తున్నచో నాకివ్వవలసిన దక్షిణనిమ్ము. నీవడిగిన ఒక నెల గడువు పూర్తి అయినది.

హరిశ్చంద్ర ఉవాచ – హరిశ్చంద్రుడు చెప్పాడు.

బ్రహ్మన్నద్యైవ సంపూర్ణో మాసోఽమ్లానతపోధన ।
తిష్ఠత్యేతద్దినార్ధం యత్తత్ప్రతీక్షస్వ మా చిరమ్ ॥10॥

ఓ బ్రహ్మస్వరూపుడా ! మహాతపోధనుడా ! ఈ రోజే నెలగడువు పూర్తికానున్నది. ఇంకను ఈ రోజులో సగభాగము మిగిలియున్నది గాన నిరీక్షించుము. ఎక్కువ కాలము వేచియుండవలసిన పని లేదు.

విశ్వామిత్ర ఉవాచ – విశ్వామిత్రుడు చెప్పాడు.

ఏవమస్తు మహారాజ ! ఆగమిష్యామ్యహం పునః ।
శాపం తవ ప్రదాస్యామి న చేదద్య ప్రదాస్యసి ॥11॥

ఓ హరిశ్చంద్రమహారాజా ! అట్లే కానిమ్ము. నేను వెళ్ళి మరల వచ్చెదను. ఈ రోజు నాకివ్వవలసిన రాజసూయయాగ దక్షిణను ఇవ్వకపోయినచో నిన్ను శపించగలను.

పక్షిణః ఊచు – ధర్మపక్షులు చెప్పాయి.

ఇత్యుక్త్వా ప్రయయౌ విప్రో రాజాఽచింతయత్తదా ।
కథమస్మై ప్రదాస్యామి దక్షిణా యా ప్రతిశ్రుతా ॥12॥

ఈ విధముగా పలికి విప్రుడగు విశ్వామిత్రుడు వెళ్ళిపోయెను. అప్పుడు రాజు "నేను వాగ్దానము చేసిన దక్షిణను ఎట్లు ఇవ్వగలను" అని ఆలోచించెను.

కుతః పుష్టాని మిత్రాణి కుతోఽర్థః సాంప్రతం మమ ।
ప్రతిగ్రహః ప్రదుష్టో మే నాహం యాయామధః కథమ్ ॥13॥

సంపన్నులైన స్నేహితులు ఎచ్చట ఉన్నారు? ఇప్పుడు నాకు ధనమెచ్చటినుండి వచ్చును? దానముపట్టుట నాకు మిక్కిలి దోషావహము కదా! నేనెట్లు అధోగతిని పొందకుండా ఉండగలను?

కిము ప్రాణాన్ విముఞ్చామి కాం దిశం యామ్యకించనః ।
యది నాశం గమిష్యామి అప్రదాయ ప్రతిశ్రుతమ్ ॥14॥

బ్రహ్మస్వహృత్కృమిః పాపో భవిష్యామ్యధమాధమః ।
అథవా ప్రేష్యతాం యాస్యే వరమేవాఽఽత్మవిక్రయః ॥15॥

ఏమి, నేను ప్రాణములను విడిచిపెట్టుదునా? నిర్ధనుడనైన నేను ఎటుపోగలను? ఇచ్చెదనని మాట ఇచ్చి ఇవ్వకుండా నేను ప్రాణములను విడిచిపెట్టినచో బ్రాహ్మణద్రవ్యమును అపహరించినందువలన కలిగిన పాపముచే అధములలో అధముడను కాగలను. పోనీ నేను ఎవరివద్దనైనా దాసుడను కాగలను. నన్ను నేను అమ్ముకొనుటే శ్రేష్ఠమైన కార్యము.

పక్షిణ ఊచుః – ధర్మపక్షులు చెప్పాయి.

రాజానం వ్యాకులం దీనం చిన్తయానమధోముఖమ్ ।
ప్రత్యువాచ తదా పత్నీ బాష్పగద్గదయా గిరా ॥16॥

ఈ విధముగా చింతించుచూ, అధోముఖుడై దీనముగా వ్యాకులత చెందిన రాజును గూర్చి ఆతని భార్య శైబ్యాదేవి కన్నీళ్ళతో కూడుకొన్న గద్గదస్వరముతో ఇట్లు పలికెను.

త్యజ చిన్తాం మహారాజ ! స్వసత్యమనుపాలయ ।
శ్మశానవద్వర్జనీయో నరః సత్యబహిష్కృతః ॥17॥

ఓ మహారాజా ! విచారించకుము. స్వసత్యపరిపాలనము చేయుము. ఆడినమాట తప్పకుము. సత్యమునుండి బయల్వెడలిన జనుడు శ్మశానమువలె విడిచిపెట్టతగినవాడు.

నాతః పరతరం ధర్మం వదన్తి పురుషస్య తు ।
యాదృశం పురుషవ్యాఘ్ర ! స్వసత్యపరిపాలనమ్ ॥18॥

ఓ పురుషవ్యాఘ్రమా ! మహారాజా ! స్వసత్యపరిపాలనముకంటే శ్రేష్ఠమైన ధర్మమేమీ లేదని పెద్దలు చెప్పుచున్నారు.

అగ్నిహోత్రమధీతం వా దానాద్యాశ్చాఖిలాః క్రియాః ।
భజన్తే తస్య వైఫల్యం యస్య వాక్యమకారణమ్ ॥19॥

కారణమేమీ లేకుండా మాటలాడువాని అనగా అసత్యభాషణము చేయువాని అగ్నిహోత్రము, వేదాధ్యయనము, దానము మొదలగు సమస్త సత్కర్మలు వ్యర్థమే అగుచున్నవి.

సత్యమత్యన్తముదితం ధర్మశాస్త్రేషు ధీమతామ్ ।
తారణాయాఽనృతం తద్వత్ పాతనాయాఽకృతాత్మనామ్ ॥20॥

ధర్మశాస్త్రాలలో బుద్ధిమంతులు పలికిన సత్యము వారిని పాపలోకములనుండి తరింపచేయునది గానూ, పాపాత్ములు పలికిన అసత్యము వారిని పాపలోకములందు పడవేయునదిగానూ చెప్పబడినది.

సప్తాశ్వమేధానాహృత్య రాజసూయం చ పార్థివ ! ।
కృతిర్నామ చ్యుతస్స్వర్గాదసత్యవచనాత్సకృత్ ॥21॥

ఓ మహారాజా ! కృతియను రాజు ఏడు అశ్వమేధయాగములను, ఒక రాజసూయయాగమును ఆచరించి కూడా అసత్యభాషణమువల్ల ఒక్కసారిగా స్వర్గమునుండి జారి క్రిందపడెను.

రాజన్ ! జాతమపత్యం మే ఇత్యుక్త్వా ప్రరురోద హ ।
బాష్పాంబుప్లుతనేత్రాం తామువాచేదం మహీపతిః ॥22॥

ఓ రాజా ! నాకు సంతానము కలిగినది కదా !" అని పలికి హరిశ్చంద్రుని భార్య శైబ్యాదేవి మిక్కిలి ఏడ్చెను కదా! వేడికన్నీళ్ళతో నిండిన నేత్రములు గల ఆమెతో భూపతియగు హరిశ్చంద్రుడిట్లు పలికెను.

హరిశ్చంద్ర ఉవాచ – హరిశ్చంద్రుడు చెప్పాడు.

విముఞ్చ భద్రే ! సంతాపమయం తిష్ఠతి బాలకః ।
ఉచ్యతాం వక్తుకామాసి యద్వా త్వం గజగామిని ! ॥23॥

ఓ కల్యాణీ ! ఈ దుఃఖమును విడిచిపెట్టుము. ఇదిగో నీ కుమారుడిక్కడున్నాడు. ఓ గజగామినీ ! ఏమియో నీవు చెప్పదలచితివి. దానిని నీవు చెప్పుము.

పత్నీ ఉవాచ – హరిశ్చంద్రుని భార్య పలికెను.

రాజన్ ! జాతమపత్యం మే సతాం పుత్రఫలాః స్త్రియః ।
స మాం ప్రదాయ విత్తేన దేహి విప్రాయ దక్షిణామ్ ॥24॥

ఓ రాజా ! నాకు సంతానము కలిగినది. సత్పురుషులకు స్త్రీలు పుత్రులే ఫలము కదా ! కావున నీవు ధనముతో నన్ను ఎవరికైననూ అమ్మి, ఆ ధనమును విప్రుడగు విశ్వామిత్రునికి దక్షిణగానిమ్ము.

పక్షిణ ఊచుః – ధర్మపక్షులు చెప్పాయి.

ఏతద్వాక్యముపశ్రుత్య యయౌ మోహం మహీపతిః ।
ప్రతిలభ్య చ సంజ్ఞాం స విలలాపాతిదుఃఖితః ॥25॥

భార్య పలికిన మాటలను విని హరిశ్చంద్ర మహారాజు మూర్ఛను బొందెను. కొంతసేపటికి తెలివినిబొంది మిక్కిలి దుఃఖించినవాడై విలపించెను.

మహద్దుఃఖమిదం భద్రే! యత్త్వమేవం బ్రవీషి మామ్ ।
కిం తవ స్మితసల్లాపా మమ పాపస్య విస్మృతాః ॥26॥

ఓ మంగళప్రదురాలా ! నీవు పలుకుచున్న మాటలు నాకు మిక్కిలి దుఃఖమును కలిగించుచున్నవి. పాపాత్ముడనైన నేను చిరునవ్వుతో నీవు పలికిన మాటలను మరచితినా ఏమి?

హా! హా! కథం త్వయా శక్యం వక్తుమేతచ్ఛుచిస్మితే ।
దుర్వాచ్యమేతద్వచనం కర్తుం శక్నోమ్యహం కథమ్ ॥27॥

ఓ అందమైన చిరునవ్వుగలదానా! అయ్యో! ఈ మాటలను పలుకుటకు నీవెట్లు సమర్థురాలవయితివి? ఈ మాటలు పలుకరానివి. నీవు చెప్పినట్లు నేనెట్లు చేయగలను?

ఇత్యుక్త్వా స నరశ్రేష్ఠో ధిగ్ధిగిత్యసకృద్బ్రువన్ ।
నిపపాత మహీపృష్ఠే మూర్ఛయాఽభిపరిప్లుతః ॥28॥

మానవులలో శ్రేష్ఠుడగు ఆ హరిశ్చంద్రుడు "అన్యాయము, అన్యాయము" అని మాటిమాటికి పలుకుచూ, తనను తాను నిందించుకొనుచూ మూర్ఛనుబొంది నేలమీద పడిపోయెను.

శయానం భువి తం దృష్ట్వా హరిశ్చంద్రమహీపతిమ్ ।
ఉవాచేదం సకరుణం రాజపత్నీ సుదుఃఖితా ॥29॥

భూపతియగు హరిశ్చంద్రుడు నేలమీద పడియుండుటను చూచి, మిక్కిలి దుఃఖించినదై రాజపత్నియగు శైబ్యాదేవి జాలితో ఇట్లు పలికెను.

పత్నీ ఉవాచ – హరిశ్చంద్రుని భార్య పలికెను.

హా! మహారాజ! కస్యేదమపధ్యానముపస్థితమ్ ।
యత్త్వం నిపతితో భూమౌ రాంకవాస్తరణోచితః ॥30॥

అయ్యో! ఓ మహారాజా! నీకీ విపరీతచింతనము ఎవరివలన సంప్రాప్తించినది? లేడి చర్మము, వెంట్రుకలతో చేయబడిన మెత్తటి శయ్యపై పరుండవలసిన నీవు కటికనేలపై ఏల పడితివి?

యేన కోట్యగ్రశో విత్తం విప్రాణామపవర్జితమ్ ।
స ఏష పృథివీనాథో భూమౌ స్వపితి మే పతిః ॥31॥

కోట్లకొలదీ ధనమును బ్రాహ్మణులకు దానముచేసిన ఈ భూపతియగు నా భర్త నేడు కటికనేలపై నిద్రించుచున్నాడు.

హా! కష్టం కిం తవానేన కృతం దేవ! మహీక్షితా ।
యదింద్రోపేంద్రతుల్యోఽయం నీతః పాపామిమాం దశామ్ ॥32॥

అయ్యో ! ఓ దేవా ! మహారాజా ! ఎవరివలన నీకీ కష్టము సంభవించినది? ఇంద్రుడు, ఉపేంద్రులతో సమానుడైన భూపరిపాలకుడగు ఈ మహారాజు ఇట్టి దురవస్థను పొందెనో కదా !

ఇత్యుక్త్వా సాఽపి సుశ్రోణీ మూర్ఛితా నిపపాత హ ।
భర్తృదుఃఖమహాభారేణాసహ్యేన నిపీడితా ॥33॥

ఈ విధముగా పలికి సుశ్రోణి (అందమైన పిరుదులుగలది)యగు ఆమె కూడా సహింపశక్యముకాని తన భర్తయొక్క దుఃఖ భారముచేత పీడింపబడినదై మూర్ఛితురాలై నేలపై పడెను.

తౌ తథా పతితౌ భూమావనాథౌ పితరౌ శిశుః ।
దృష్ట్వాఽత్యంతక్షుధావిష్టః ప్రాహ వాక్యం సుదుఃఖితః ॥34॥

ఈ విధముగా దిక్కులేనివారై నేలపై పడియున్న తన తల్లిదండ్రులను చూచి, వారి బాలకుడు మిక్కిలి ఆకలిగొన్నవాడై, దుఃఖముతో కూడుకొన్నవాడై ఈ విధముగా పలికెను.

తాత ! తాత ! దదస్వాన్నమంబాంబ ! భోజనం దద ।
క్షున్మే బలవతీ జాతా జిహ్వాగ్రం శుష్యతే తథా ॥35॥

ఓ తండ్రీ! తండ్రీ! నాకు అన్నము పెట్టుము. ఓ అమ్మా! అమ్మా! నాకు భోజనము పెట్టుము. నాకు మిక్కిలి యాకలి యగుచున్నది. అట్లే నా నాలుక ఎండిపోవుచున్నది.

పక్షిణ ఊచుః – ధర్మపక్షులు చెప్పాయి.

ఏతస్మిన్నన్తరే ప్రాప్తో విశ్వామిత్రో మహాతపాః ।
కాలకల్ప ఇవ క్రుద్ధో ధనం సంమార్గితుం తదా ॥
దృష్ట్వా తు తం హరిశ్చంద్రం పతితం భువి మూర్ఛితమ్ ॥36॥

స వారిణా సమభ్యుక్ష్య రాజానమిదమబ్రవీత్ ।
ఉత్తిష్ఠోత్తిష్ఠ రాజేంద్ర ! తాం దదస్వేష్టదక్షిణామ్ ॥37॥

ఋణం ధారయతో దుఃఖమహన్యహని వర్ధతే ।
ఆప్యాయమానః స తదా హిమశీతేన వారిణా ॥38॥

అవాప్య చేతనాం రాజా విశ్వామిత్రమవేక్ష్య చ ।
పునర్మోహం సమాపేదే న చ క్రోధం యయౌ మునిః ॥39॥

ఇంతలో తన ద్రవ్యమును తీసుకొనుటకు మహాతపస్సంపన్నుడయిన విశ్వామిత్రుడు యమధర్మరాజువలె ఉండి మిక్కిలి క్రుద్ధుడై అచ్చటకు వచ్చెను. నేలపై మూర్ఛిల్లి పడియున్న హరిశ్చంద్రుని చూచి, విశ్వామిత్రుడు అతనిపై నీళ్ళను చల్లి, రాజుతో ఇట్లనెను. "ఓ రాజేంద్రా! లెమ్ము లెమ్ము. నాకిష్టమైన దక్షిణను ఇమ్ము, ఋణము

తీసుకొన్నవాని దుఃఖము రోజురోజుకూ పెరుగుచుండును." అప్పుడు రాజు వంటిమీద చల్లబడిన చల్లని నీటిచే తెలివిని బొంది విశ్వామిత్రుని చూడగానే తిరిగి మూర్ఛను పొందెను. అప్పుడు విశ్వామిత్రుడు కోపించలేదు.

స సమాశ్వాస్య రాజానం వాక్యమాహ ద్విజోత్తమః ।
దీయతాం దక్షిణా సా మే యది ధర్మమవేక్షసే ॥40॥

బ్రాహ్మణశ్రేష్ఠుడగు విశ్వామిత్రుడు హరిశ్చంద్రమహారాజును ఓదార్చి ఇట్లు పలికెను. నీవు ధర్మమును పరిపాలించునట్లయిన నా దక్షిణను నాకిమ్ము.

సత్యేనార్కః ప్రతపతి సత్యే తిష్ఠతి మేదినీ ।
సత్యం చోక్తం పరో ధర్మః స్వర్గః సత్యే ప్రతిష్ఠితః ॥41॥

సత్యముతో సూర్యుడు ప్రకాశించుచున్నాడు సత్యమందు భూమి నిలచియున్నది. సత్యమే శ్రేష్ఠమైన ధర్మమని చెప్పబడినది. సత్యమందే స్వర్గలోకము ప్రతిష్ఠింపబడియున్నది.

అశ్వమేధసహస్రం చ సత్యం చ తులయా ధృతమ్ ।
అశ్వమేధసహస్రాద్ధి సత్యమేవ విశిష్యతే ॥42॥

వేయి అశ్వమేధయాగములను, ఒక సత్యమును త్రాసుయందుంచి తూచినచో వేయి అశ్వమేధయాగముల కంటే సత్యమే మిక్కిలి బరువు తూగుచున్నది.

అథవా కిం మమైతేన సామ్నా ప్రోక్తేన కారణమ్ ।
అనార్యే పాపసంకల్పే క్రూరే చానృతవాదిని ॥43॥

అయిననూ అనార్యుడవు (పెద్దమనిషి కానివాడవు), పాపసంకల్పము గలవాడవు, క్రూరుడవు, అసత్యభాషణము చేయువాడవు అగు నీకు నేను ఇట్టి సామవాక్యములను (ఓదార్పు, ధైర్యములను కలిగించు మాటలను) పలుకుట ఎందులకు?

త్వయి రాజ్ఞి ప్రభవతి సద్భావః శ్రూయతామయమ్ ।
అద్య మే దక్షిణాం రాజన్ ! న దాస్యతి భవాన్యది ॥44॥

అస్తాచలం ప్రయాతేఽర్కే శప్స్యామి త్వాం తతో ధ్రువమ్ ।
ఇత్యుక్త్వా స యయౌ విప్రో రాజా చాసీద్భయాతురః ॥45॥

కాన్దిగ్భూతోఽధనో నిస్స్వో నృశంసధనినార్దితః ।
భార్యాఽస్య భూయః ప్రాహేదం క్రియతాం వచనం మమ ॥46॥

నీవు సమర్థుడవయిన రాజు అయినచో నేను చెప్పు ఈ మంచి మాటలను విను. "ఓ రాజా! ఈ రోజు నా దక్షిణను నాకివ్వనిచో సూర్యుడు అస్తమించిన వెంటనే నిన్ను నేను నిశ్చయముగా శపించగలను." అని చెప్పి

విశ్వామిత్రుడు వెళ్ళిపోయెను. అంతట రాజగు హరిశ్చంద్రుడు బెదరి దిక్కుతోచనివాడు, నిర్ధనుడు, తనదంటూ ఏమీ లేనివాడు, దుర్మార్గులు ధనవంతులచే పీడింపబడినవాడు అయ్యెను. ఈ విధముగా విచారగ్రస్తుడైన భర్తతో భార్య "నేను చెప్పినట్లు చేయు"మని మరల పలికెను. ("కాం దిశం యామీతి ఆకులతాం భూతః ప్రాప్తః కాన్దిగ్భూతః" అని వాచస్పత్యము.)

మా శాపానలనిర్దగ్ధః పంచత్వముపయాస్యసి ।
స తయా చోద్యమానస్తు రాజా పత్న్యా పునః పునః ॥47॥

ప్రాహ భద్రే కరోమ్యేష విక్రయం తవ నిర్ఘృణః ।
నృశంసైరపి యత్కర్తుం న శక్యం తత్కరోమ్యహమ్ ॥48॥

యది మే శక్యతే వాణ్యా వక్తుమీదృక్ సుదుర్వచః ।
ఏవముక్త్వా తతో భార్యాం గత్వా నగరమాతురః ॥
బాష్పాపిహితకంఠాక్షస్తతో వచనమబ్రవీత్ ॥49॥

"ఓ నాథా! నీవు విశ్వామిత్రుని శాపమనెడు అగ్నిచే దహింపబడి మరణమును పొందెదవు" అని భార్యచేత మరల మరల ప్రేరేపింపబడినవాడై హరిశ్చంద్రుడు ఇట్లు పలికెను. "ఓ కల్యాణీ! ఏ మాత్రమూ దయలేక నిన్ను నేను అమ్మగలను. ఎంతటి దుర్మార్గులైననూ చేయలేని పనిని నేనిప్పుడు చేసెదను. ఇటువంటి చెప్పరాని మాటలను చెప్పుటకు నా వాక్కు సమర్థమయినచో నేను తప్పక చెప్పెదను" అని భార్యతో పలికి ఆతురతతో వేగముగా నగరమునకు బోయి, కన్నీళ్ళచే మూయబడిన కన్నులు గలవాడై అనంతరమిట్లు పలికెను.

రాజా ఉవాచ – రాజు పలికెను.

భో ! భో ! నాగరికాస్సర్వే శృణుధ్వం వచనం మమ ।
కిం మా పృచ్ఛథ కస్త్వం భో నృశంసోఽహమమానుషః ॥50॥

ఓ నాగరికులారా ! మీరందరు నా మాటను వినుడు. ఏమి నేనెవరని మీరు అడుగుచున్నారా? అయ్యలారా! నేను మానవత్వము లేని దుర్మార్గుడను.

రాక్షసో వాఽతికఠినస్తతః పాపతరోఽపి వా ।
విక్రేతుం దయితాం ప్రాప్తో యో న ప్రాణాంస్త్యజామ్యహమ్ ॥51॥

అట్లు కానిచో రాక్షసుడను. లేనిచో అంతకంటే కఠినహృదయము గలవాడను, పాపిష్ఠివాడిని. ఎందువలననగా నా భార్యను అమ్ముటకు వచ్చిన నేను నా ప్రాణములను విడిచిపెట్టుట లేదు.

యది వః కస్యచిత్కార్యం దాస్యా ప్రాణేష్టయా మమ ।
స బ్రవీతు త్వరాయుక్తో యావత్సంధారయామ్యహమ్ ॥52॥

నా ప్రాణసమానురాలు దాసిగా మీకెవరికయిననూ అవసరమున్నచో నేను బ్రతికియుండగానే తొందరగా చెప్పుడు.

పక్షిణ ఊచుః – ధర్మపక్షులు చెప్పాయి.

అథ వృద్ధో ద్విజః కశ్చిదాగత్యాహ నరాధిపమ్ ।
సమర్పయస్వ మే దాసీమహం క్రేతా ధనప్రదః ॥53॥

అనంతరమొక వృద్ధబ్రాహ్మణుడు వచ్చి "నేను ధనమిచ్చి ఈ దాసిని కొనెదను గావున నాకు సమర్పించుము" అని ఆ మహారాజుతో పలికెను.

అస్తి మే విత్తమస్తోకం సుకుమారీ చ మే ప్రియా ।
గృహకర్మ న శక్నోతి కర్తుమస్మాత్ప్రయచ్ఛ మే ॥54॥

నావద్ద సమృద్ధిగా ధనమున్నది. నా ప్రియురాలు మిక్కిలి సుకుమారి. ఆమె గృహకృత్యములను చేసుకొనలేకపోవుచున్నది. అందువలన ఈమెను నాకిమ్ము.

కర్మణ్యతావయోరూపశీలానాం తవ యోషితః ।
అనురూపమిదం విత్తం గృహాణార్పయ మేఽబలామ్ ॥55॥

నీ భార్యయొక్క కర్మనైపుణ్యము, వయస్సు, రూపము, శీలములకు తగిన ఈ ధనమును తీసుకొనుము. ఈమెను నాకర్పింపుము.

ఏవముక్తస్య విప్రేణ హరిశ్చంద్రస్య భూపతేః ।
వ్యదీర్యత మనో దుఃఖాన్న చైవం కించిదబ్రవీత్ ॥56॥

ఈ విధముగా వృద్ధబ్రాహ్మణుడు పలుకగా హరిశ్చంద్రుని మనస్సు దుఃఖముతో వికలమయ్యెను. ఆ దుఃఖము కారణముగానే హరిశ్చంద్రుడు ఏమియూ పలుకలేకపోయెను.

తతః స విప్రో నృపతేర్వల్కలాంతే దృఢం ధనమ్ ।
బద్ధ్వా కేశేష్వథాదాయ నృపపత్నీమకర్షయత్ ॥57॥

అనంతరమా బ్రాహ్మణుడు సమృద్ధమైన ధనమును రాజుయొక్క నారచీర కొంగునందు కట్టి, రాజపత్నిని జుట్టుపట్టుకొని లాగెను.

రురోద రోహితాశ్వోఽపి దృష్ట్వా కృష్టాం తు మాతరమ్ ।
హస్తేన వస్త్రమాకర్షన్ కాకపక్షధరః శిశుః ॥58॥

చెవులకటునిటు వ్రేలాడుచున్న కేశములుగల ఆ బాలకుడు రోహితాశ్వుడు జుట్టుబట్టుకొని లాగబడిన తన తల్లిని చూచి తన చేతితో ఆమె వస్త్రమును లాగుచూ ఏడ్చెను. ("కాకపక్షః శిరోఽధః కర్ణపార్శ్వస్థే కేశభేదే" అని వాచస్పత్యము).

రాజపత్నీ ఉవాచ – చంద్రమతి పలికెను.

ముఞ్చార్య ముఞ్చ తావన్మాం యావత్పశ్యామ్యహం శిశుమ్ ।
దుర్లభం దర్శనం తాత ! పునరస్య భవిష్యతి ॥59॥

ఓ పూజ్యుడా ! నన్ను ఒకసారి విడువుము, విడువుము. అంతలో ఒకసారి నా బాలకుని చూచెదను. అయ్యా ! ఇప్పుడు నా బాలకుని చూడనిచో తిరిగి వీనిని చూచుట దుర్లభము.

పశ్యైహి వత్స మామేవం మాతరం దాస్యతాం గతామ్ ।
మాం మా స్ప్రాక్షీ రాజపుత్ర ! అస్పృశ్యాహం తవాధునా ॥60॥

ఓ కుమారా ! రమ్ము. దాస్యత్వమును పొందిన నీ తల్లిని చూడుము. ఓ రాజకుమారా ! నన్ను నీవు స్పృశించవలదు. నేనిప్పుడు నీకు తాకదగినదానను కాను.

తతస్స బాలః సహసా దృష్ట్వా కృష్టాం తు మాతరమ్ ।
సమభ్యధావదంబేతి రుదన్నస్రావిలేక్షణః ॥61॥

పిమ్మట ఆ బాలకుడు వేగముగా లాగుకొనిబోవుచున్న తల్లిని చూచి, కన్నీళ్ళతో కలుషితమైన చూపుతో, "అమ్మా! అమ్మా!" అనుచు తల్లివద్దకు పరుగెత్తెను.

తమాగతం ద్విజః క్రోధాత్ బాలమభ్యాహనత్పదా ।
వదంస్తథాపి సోఽంబేతి నైవాముఞ్చత మాతరమ్ ॥62॥

తల్లివద్దకు వచ్చిన యా బాలకుని ఆ వృద్ధబ్రాహ్మణుడు కాలితో గట్టిగా తన్నెను. అయిననూ "అమ్మా ! అమ్మా!" అనుచూ ఆ పిల్లవాడు తల్లిని విడిచిపెట్టలేదు.

రాజపత్న్యువాచ – రాజపత్ని పలికెను.

ప్రసాదం కురు మే నాథ ! క్రీణీష్వేమం చ బాలకమ్ ।
క్రీతాఽపి నాహం భవతో వినైనం కార్యసాధికా ॥63॥

ఓ ప్రభూ ! నాపై అనుగ్రహము చూపుము. ఈ బాలకుని కూడా కొనుము. నేను మాత్రమే నీ చేత కొనబడినదానను అయిననూ నా యీ బాలకుడు లేనిచో నేను ఏ పనులనూ చేయలేను.

ఇత్థం మమాల్పభాగ్యాయాః ప్రసాదసుముఖో భవ ।
మాం సంయోజయ బాలేన వత్సేనేవ పయస్వినీమ్ ॥64॥

ఈ విధముగా మందభాగ్యురాలగు నాపై అనుగ్రహము చూపుము. పాలిచ్చు ఆవును దూడతో కలిపినట్లుగా నన్ను నా బాలకుని దరి చేర్పుము.

బ్రాహ్మణ ఉవాచ – వృద్ధబ్రాహ్మణుడు చెప్పాడు.

గృహ్యతాం విత్తమేతత్తే దీయతాం బాలకో మమ ।
స్త్రీపుంసోర్ధర్మశాస్త్రజ్ఞైః కృతమేవ హి వేతనమ్ ॥
శతం సహస్రం లక్షం చ కోటిమూల్యం తథా పరైః ॥65॥

ఈ ధనమును తీసుకొనుము. నాకు బాలకుని ఇమ్ము. ధర్మశాస్త్రమునెరిగినవారు, తక్కినవారు స్త్రీపురుషులకిచ్చు వేతనమును నూరు, వేయి, లక్ష, కోటి మూల్యముగా చెప్పుచున్నారు.

పక్షిణ ఊచుః – ధర్మపక్షులు చెప్పాయి.

తథైవ తస్య తద్విత్తం బద్ధోత్తరపటే తతః ।
ప్రగృహ్య బాలకం మాత్రా సహైకస్థమబంధయత్ ॥66॥

అనంతరమా బ్రాహ్మణుడు పూర్వపురీతిగానే ఆ ధనమంతయు హరిశ్చంద్రుని ఉత్తరీయపుటంచునగట్టి, బాలకుని తీసుకొని, ఆ బాలకుని తల్లితో గూడా ఒక త్రాటనే గట్టివైచెను.

నీయమానౌ తు తౌ దృష్ట్వా భార్యాపుత్రౌ స పార్థివః ।
విలలాప సుదుఃఖార్తో నిశ్వస్యోష్ణం పునః పునః ॥67॥

ఆ బ్రాహ్మణుని చేత తీసుకొని పోబడుచున్న తన భార్యాపుత్రులను చూచి, హరిశ్చంద్రుడు మిక్కిలి దుఃఖముతో గూడుకొన్నవాడై మరలమరల వేడి నిట్టూర్పులను నిట్టూర్చుతూ, విలపించెను.

హరిశ్చంద్ర ఉవాచ – హరిశ్చంద్రుడు చెప్పాడు.

యాం న వాయుర్న చాఽదిత్యో నేందుర్న చ పృథగ్జనః ।
దృష్టవన్తః పురా పత్నీం సేయం దాసీత్వమాగతా ॥68॥

ఏ నా భార్యను వాయువు, సూర్యుడు, చంద్రుడు గాని, మరి ఏ ఇతరులు గాని, పూర్వమెప్పుడు చూడలేదో అట్టి నా భార్య నేడు దాసీభావమును పొందినది.

సూర్యవంశప్రసూతోఽయం సుకుమారకరాంగులిః ।
సంప్రాప్తో విక్రయం బాలో ధిఙ్మామస్తు సుదుర్మతిమ్ ॥69॥

సూర్యవంశమందు జన్మించినవాడు మిక్కిలి మృదువైన చేతులు, వ్రేళ్ళు కలిగిన ఈ నా బాలుడు అమ్మబడినాడు. మిక్కిలి నీచబుద్ధిగల నేను నింద్యుడను.

హా ప్రియే హా శిశో వత్స మమానార్యస్య దుర్నయైః ।
దైవాధీనాం దశాం ప్రాప్తో న మృతోఽస్మి తథాపి ధిక్ ॥70॥

ఓ ప్రియురాలా ! ఓ శిశువా ! ఓ కుమారా ! అనార్యుడనగు నా చెడు ప్రవర్తనలవలన మీకు దైవాధీనమగు ఇట్టి దుర్దశ సంప్రాప్తమైనది. అయిననూ నేను మరణించలేదనగా నేను నింద్యుడను.

పక్షిణ ఊచుః – ధర్మపక్షులు చెప్పాయి.

ఏవం విలపతో రాజ్ఞః స విప్రోఽన్తరధీయత ।
వృక్షగేహాదిభిస్తుఙ్గైస్తావాదాయ త్వరాన్వితః ॥71॥

రాజు ఈ విధముగా విలపించుచుండగానే ఆ బ్రాహ్మణుడు తొందరగా వారిరువురిని తీసుకొని ఎత్తైన వృక్షములు, గృహములు మొదలగువాని మధ్యలో అంతర్ధానమయ్యెను.

విశ్వామిత్రస్తతః ప్రాప్తో నృపం విత్తమయాచత ।
తస్మై సమర్పయామాస హరిశ్చంద్రోఽపి తద్ధనమ్ ॥72॥

అంతట విశ్వామిత్రుడచ్చటకు వచ్చి రాజును ధనమడిగెను. హరిశ్చంద్రుడు గూడా భార్యాపుత్రులను అమ్మినందువలన లభించిన ఆ ధనమంతయు విశ్వామిత్రునికి సమర్పించెను.

తద్విత్తం స్తోకమాలోక్య దారవిక్రయసంభవమ్ ।
శోకాభిభూతం రాజానం కుపితః కౌశికోఽబ్రవీత్ ॥73॥

భార్యాపుత్రులను అమ్మినందువలన లభించిన ధనమును హరిశ్చంద్రుడు ఇవ్వగా, ఆ ధనమును స్వల్పముగా భావించి, కోపగించిన విశ్వామిత్రుడు విచారగ్రస్తుడైన రాజుతో ఇట్లు పలికెను.

క్షత్రబంధో మమేమాం త్వం సదృశీం యజ్ఞదక్షిణామ్ ।
మన్యసే యది తత్ క్షిప్రం పశ్య త్వం మే బలం పరమ్ ॥74॥

తపసోఽత్ర సుతప్తస్య బ్రాహ్మణస్యామలస్య చ ।
మన్త్రప్రభావస్య చోగ్రస్య శుద్ధస్యాధ్యయనస్య చ ॥75॥

ఓ క్షత్రియబాంధవుడా ! నీవిచ్చిన ఈ ధనమును యజ్ఞదక్షిణకు సరిపోవునదిగా నీవు భావించినట్లయిన శీఘ్రముగా నా గొప్ప బలమును చూచెదవుగాక ! ఇంకనూ బాగుగా ఆచరింపబడిన నా తపస్సుయొక్క, పరిశుద్ధుడనగు బ్రాహ్మణునియొక్క, భయంకరమైన నా ప్రభావముయొక్క, విశుద్ధమైన నా వేదాధ్యయనము యొక్క గొప్ప బలమును నీవు చూచెదవుగాక !

రాజా ఉవాచ – హరిశ్చంద్రుడు చెప్పాడు.

అన్యాం దాస్యామి భగవన్ కాలః కశ్చిత్ప్రతీక్ష్యతామ్ ।
సాంప్రతం నాస్తి విక్రీతా పత్నీ పుత్రశ్చ బాలకః ॥76॥

ఓ పూజ్యుడా ! కొంతకాలము ఆగుము. వేరే మరియొక దక్షిణను ఇచ్చెదను. ప్రస్తుతము నావద్ద ఏమియూ లేదు. నా భార్య అమ్మబడినది. బాలకుడగు పుత్రుడు గూడా అమ్మబడినాడు.

విశ్వామిత్ర ఉవాచ – విశ్వామిత్రుడు చెప్పాడు.

చతుర్భాగః స్థితో యోఽయం దివసస్య నరాధిప ।
ఏష ఏవ ప్రతీక్ష్యో మే వక్తవ్యం నోత్తరం త్వయా ॥77॥

ఓ మహారాజా ! ఇప్పుడు పగటిభాగములో నాల్గవభాగము మాత్రమే మిగిలియున్నది. ఇంతకాలము మాత్రమే నేను వేచియుండెదను. ఇంక నాకేమీ బదులు చెప్పవద్దు.

పక్షిణ ఊచుః – ధర్మపక్షులు చెప్పాయి.

తమేవముక్త్వా రాజేంద్రం నిష్ఠురం నిర్ఘృణం వచః ।
తదాదాయ ధనం తూర్ణం కుపితః కౌశికో యయౌ ॥78॥

ఈ విధముగా రాజశ్రేష్ఠుడగు హరిశ్చంద్రునితో దయాహీనము, గుణహీనమూ అయిన వాక్కును పలికి, కోపముతో కూడుకొనియున్న విశ్వామిత్రుడు ఆ ధనమంతయు తీసుకొని వెడలిపోయెను.

విశ్వామిత్రే గతే రాజా భయశోకాదిమధ్యగః ।
స్వవిక్రియం వినిశ్చిత్య ప్రోవాచోచ్చైరధోముఖః ॥79॥

విశ్వామిత్రుడు వెడలిపోయిన పిమ్మట భయము, దుఃఖము మొదలగు వాటితో కూడుకొన్నవాడై, హరిశ్చంద్రుడు తనను అమ్ముకొనుటను నిశ్చయించుకొని తలద్రించుకొని బిగ్గరగా ఇట్లు పలికెను.

విత్తక్రీతేన యో హ్యర్థీ మయా ప్రేష్యేణ మానవః ।
స బ్రవీతు త్వరాయుక్తో యావత్తపతి భాస్కరః ॥80॥

ఎవరైననూ ధనమిచ్చి కొనుక్కొని నన్ను సేవకునిగా ఉంచుకొనుటకు కోరుకొన్నయెడల సూర్యాస్తమయము అయ్యే లోపలే తొందరగా చెప్పుడు.

అథాఽజగామ త్వరితో ధర్మశ్చండాలరూపధృక్ ।
దుర్గంధో వికృతో రూక్షః శ్మశ్రులో దన్తురో ఘృణీ ॥81॥

కృష్ణో లంబోదరః పింగరూక్షాక్షః పరుషాక్షరః ।
గృహీతపక్షిపుంజశ్చ శవమాల్యైరలంకృతః ॥82॥

కపాలహస్తో దీర్ఘాస్యో భైరవోఽతివదన్ముహుః ।
శ్వగణాభివృత్తో ఘోరో యష్టిహస్తో నిరాకృతిః ॥83॥

అనంతరము చండాలరూపము ధరించిన ధర్మదేవత దుర్గంధము కలిగి, వికృతరూపము కలిగి, స్నేహభావము లేక, ఎత్తైన వంకర దంతములు కలిగి, దయాగుణహీనయై అచ్చటకు వచ్చెను. ఇంకనూ చండాలాకారమును ధరించిన ఆ ధర్మదేవత నల్లనిరంగు కలిగి, పెద్ద పొట్ట కలిగి, పచ్చని కన్నులు కలిగి, వాక్పారుష్యము కలిగి, చేతిలో

పక్షిసమూహము కలిగి, శవములపై వేసిన దండలతో అలంకరింపబడి, చేతిలో పుర్రెలు కలిగి, పొడవైన ముఖము కలిగి, భయంకరరూపము కలిగి, మాటిమాటికి అనవసరసంభాషణము చేయుచూ, చుట్టూ కుక్కలు కలిగి, ఘోరమైన ఆకారము కలిగి, చేతిలో కర్రధరించి, నిరాకృతియై అనగా యజ్ఞయాగాది ధర్మాచరణ లేక ఉండెను.

చండాల ఉవాచ – చండాలుడు చెప్పాడు.

అహమర్థీ త్వయా శీఘ్రం కథయస్వాఽత్మవేతనమ్ ।
స్తోకేన బహునా వాఽపి యేన వై లభ్యతే భవాన్ ॥84॥

నేను కోరుకొనుచున్నాను. నీకెంత ధనమీయవలెనో చెప్పుము. కొంచెమైననూ, ఎక్కువైననూ ఎంత ధనముతో నీవు లభించెదవో చెప్పుము.

పక్షిణ ఊచుః – ధర్మపక్షులు చెప్పాయి.

తం తాదృశమథాఽలక్ష్య క్రూరదృష్టిం సునిష్ఠురమ్ ।
వదన్తమతిదుశ్శీలం కస్త్వమిత్యాహ పార్థివః ॥85॥

భయంకరమైన కన్నులు కలిగి, దయాగుణములేక, అతిభాషణము చేయుచూ, చెడు ప్రవర్తన కలిగియున్న చండాలుని చూచి “నీవెవరవు” అని హరిశ్చంద్రుడు పలికెను.

చండాల ఉవాచ – చండాలుడు చెప్పాడు.

చండాలోఽహమిహ ఖ్యాతః ప్రవీరేతి పురోత్తమే ।
విఖ్యాతో వధ్యవధకో మృతకంబలహారకః ॥86॥

నేను చండాలుడను. ఇచ్చటి పురశ్రేష్ఠమందు ప్రవీరుడను పేరుతో ప్రసిద్ధుడను. చంపబడుటకు నిశ్చయింపబడినవారిని చంపువాడను. చనిపోయినవారిపై వేసే కంబలములను (పైన కప్పే వస్త్రములను) గ్రహించువాడను.

హరిశ్చంద్ర ఉవాచ – హరిశ్చంద్రుడు చెప్పాడు.

నాహం చండాలదాసత్వమిచ్ఛేయం సువిగర్హితమ్ ।
వరం శాపాగ్నినా దగ్ధో న చండాలవశం గతః ॥87॥

అత్యంతనీచకార్యమగు చండాలదాస్యమును నేను కోరుకొనను. చండాలునివద్ద దాసునిగా ఉండుటకంటే విశ్వామిత్రుని శాపాగ్నిచేత దహింపబడుటే శ్రేష్ఠము.

పక్షిణ ఊచుః – ధర్మపక్షులు చెప్పాయి.

తస్యైవం వదతః ప్రాప్తో విశ్వామిత్రస్తపోనిధిః ।
కోపామర్షవివృత్తాక్షః ప్రాహ చేదం నరాధిపమ్ ॥88॥

హరిశ్చంద్రుడు ఈవిధముగా పలుకుచుండగా తపోనిధియగు విశ్వామిత్రుడు అచ్చటకు వచ్చెను. ఇంకనూ కోపము, అసహనములతో కండ్లను గుండ్రముగా త్రిప్పుచూ విశ్వామిత్రుడు నరాధిపుడగు హరిశ్చంద్రునితో ఇట్లు పలికెను.

విశ్వామిత్ర ఉవాచ – విశ్వామిత్రుడు చెప్పాడు.

చండాలోఽయమనల్పం తే దాతుం విత్తముపస్థితః ।
కస్మాన్న దీయతే మహ్యమశేషా యజ్ఞదక్షిణా ॥89॥

ఈ చండాలుడు నీకు అంతులేని ధనమును ఇచ్చుటకు సిద్ధమై వచ్చినాడు. అశేషమైన యజ్ఞదక్షిణను నీవు నాకెందులకీయవు?

హరిశ్చంద్ర ఉవాచ – హరిశ్చంద్రుడు చెప్పాడు.

భగవన్ సూర్యవంశోత్థమాత్మానం వేద్మి కౌశిక! ।
కథం చండాలదాసత్వం గమిష్యే విత్తకాముకః ॥90॥

ఓ పూజ్యుడా ! విశ్వామిత్రమహర్షీ ! నేను సూర్యవంశమందు పుట్టినవాడను. నీకు తెలుసు. ధనమును కోరుకొనుచున్నవాడనై చండాలదాస్యమును ఎట్లు పొందగలను?

విశ్వామిత్ర ఉవాచ – విశ్వామిత్రుడు చెప్పాడు.

యది చండాలవిత్తం త్వమాత్మవిక్రయజం మమ ।
న ప్రదాస్యసి కాలేన శప్స్యామి త్వామసంశయమ్ ॥91॥

నీవు నిన్ను చండాలునికి అమ్ముకొని వచ్చిన ధనమును సకాలములో నాకివ్వనిచో నిస్సంశయముగా నిన్ను శపించగలను.

పక్షిణ ఊచుః – ధర్మపక్షులు చెప్పాయి.

హరిశ్చంద్రస్తతో రాజా చింతాఽవస్థితజీవితః ।
ప్రసీదేతి వదన్ పాదావృషేర్జగ్రాహ విహ్వలః ॥92॥

అంతట హరిశ్చంద్రమహారాజు విచారగ్రస్తమైన జీవితము గలవాడై భయాదులతో వ్యాకులచిత్తుడై "నన్ను అనుగ్రహించుము, శాంతించుము" అని పలుకుచూ విశ్వామిత్ర మహర్షి పాదములను పట్టుకొనెను.

దాసోఽస్మ్యార్తోఽస్మి భీతోఽస్మి త్వద్భక్తశ్చ విశేషతః ।
కురు ప్రసాదం విప్రర్షే ! కష్టశ్చండాలసంకరః ॥93॥

ఓ బ్రహ్మర్షీ ! నేను నీ దాసుడను, ఆర్తుడను, భీతుడను. విశేషించి నీ భక్తుడను. అనుగ్రహించుము. చండాలసాంకర్యము మిక్కిలి కష్టమైనది.

భవేయం విత్తశేషేణ సర్వకర్మకరో వశః ।
తవైవ మునిశార్దూల ! ప్రేష్యశ్చిత్తానువర్తకః ॥94॥

ఓ మునిశ్రేష్ఠుడా ! నీకివ్వవలసిన ధనశేషమును తీర్చుకొనుటకై నీకు వశుడనై, నీ సమస్తకర్మలను నెరవేర్చువాడనై, నీ చిత్తముననుసరించి ప్రవర్తించువాడనై, నీకు దాసుడను కాగలను.

విశ్వామిత్ర ఉవాచ – విశ్వామిత్రుడు చెప్పాడు.

యది ప్రేష్యో మమ భవాంశ్చండాలాయ తతో మయా ।
దాసభావమనుప్రాప్తో దత్తో విత్తార్బుదేన వై ॥95॥

నీవు నాకు దాసుడవయినచో నిన్ను నేను ఈ చండాలునికి అర్బుదసంఖ్యాకములగు (పది కోట్లు) నాణెములకు విక్రయించితిని. అతనికి నీవు దాసుడవయితివి.

హరిశ్చంద్ర ఉవాచ – హరిశ్చంద్రుడు చండాలునితో చెప్పాడు.

యద్యసౌ శక్యతే విప్రః కౌశికః పరితోషితుమ్ ।
తతో గృహాణ మామద్య దాసత్వం తే కరోమ్యహమ్ ॥96॥

నేను నీకు దాసుడనయినచో విప్రుడగు ఈ విశ్వామిత్రుడు సంతోషించునట్లయిన ఇప్పుడే నన్ను గ్రహించుము. నీకు దాసుడనై సేవ చేసెదను.

చండాల ఉవాచ – చండాలుడు చెప్పాడు.

శతయోజనవిస్తీర్ణాం నానాగ్రామైరలంకృతామ్ ।
భూమిం రక్షామయీం కృత్వా దాస్యేఽహం కౌశికం ప్రతి ॥97॥

నూరు యోజనముల విస్తీర్ణము కలిగి, అనేక గ్రామములతో అలంకరింపబడిన భూమిని రక్షణ కలిగినట్లుగా చేసి, విశ్వామిత్రునికి దానముగా ఇచ్చెదను.

పక్షిణ ఊచుః – ధర్మపక్షులు చెప్పాయి.

ఏవముక్తే తదా తేన శ్వపాకో హృష్టమానసః ।
విశ్వామిత్రాయ తద్ద్రవ్యం దత్త్వా బద్ధ్వా నరేశ్వరమ్ ॥98॥

దండప్రహారసంభ్రాంతమతీవ వ్యాకులేంద్రియమ్ ।
ఇష్టబంధువియోగార్తమనయన్నిజపక్కణమ్ ॥99॥

ఈ ప్రకారముగా పలికి సంతుష్టమనస్కుడైన చండాలుడు ఆ ద్రవ్యమునంతయు విశ్వామిత్రునకిచ్చి, నరేశ్వరుడగు హరిశ్చంద్రుని త్రాటితో బంధించెను. ఆ చండాలుడు కర్రతో కొట్టుటచే ఆశ్చర్యమునొందినట్టి,

మిక్కిలి వ్యాకులము చెందిన ఇంద్రియములు కలిగినట్టి, ఇష్టబంధువుల వియోగముచే దుఃఖమునొందినట్టి హరిశ్చంద్రుని తాను నివసించు గూడెమునకు తీసుకొనిపోయెను.

హరిశ్చంద్రస్తతో రాజా వసంశ్చండాలపక్కణే ।
ప్రాతర్మధ్యాహ్నసమయే సాయం చైతదగాయత ॥100॥

బాలా దీనముఖీ దృష్ట్వా బాలం దీనముఖం పురః ।
మాం స్మరత్యసుఖావిష్టా మోచయిష్యతి నౌ నృపః ॥101॥

ఉపాత్తవిత్తో విప్రాయ దత్త్వా విత్తమతోఽధికమ్ ।
న సా మాం మృగశాబాక్షీ వేత్తి పాపతరం శ్రుతమ్ ॥102॥

రాజ్యనాశః సుహృత్త్యాగో భార్యాతనయవిక్రయః ।
ప్రాప్తా చండాలతా చేయమహో దుఃఖపరంపరా ॥103॥

పిమ్మట ఆ హరిశ్చంద్రమహారాజు చండాలుని గూడెంలో నివసిస్తూ ప్రాతర్మధ్యాహ్నసాయంకాలములందు ఇట్లు విలపించెను. "దీనముఖియగు నా భార్య దీనముఖుడగు కుమారుని చూచుచూ సుఖము లేక నన్ను స్మరించుచుండును. ధనమును సంపాదించి మహారాజు విప్రుడగు విశ్వామిత్రునికి మరింత అధికధనమునిచ్చి మనలనిద్దరిని (భార్యాపుత్రులను) దాస్యమునుండి విడిపించగలడని అనుకొంటూ ఉంటుంది. లేడిపిల్ల కన్నులవంటి కన్నులుగల ఆమె (చంద్రమతి) నేను చండాల దాస్యము చేస్తున్న పాపకార్యమును ఎరుగుట లేదు. ఎంత ఆశ్చర్యము! రాజ్యనాశము, మిత్రత్యాగము, భార్యాపుత్రుల విక్రయము, చండాలదాస్యప్రాప్తి ఎన్ని దుఃఖముల పరంపర నాకు ప్రాప్తించెనో కదా!"

ఏవం స నివసన్నిత్యం సస్మార దయితం సుతమ్ ।
భార్యాం చాఽత్మసమావిష్టాం హృతసర్వస్వ ఆతురః ॥104॥

ఈ విధముగా నివసించుచున్న ఆ హరిశ్చంద్రుడు తన సర్వస్వమును పోగొట్టుకొన్నవాడై ప్రియుడైన కుమారుని, తన హృదయమందే స్థానము పొందిన భార్యనూ ఆతురతతో నిత్యమూ స్మరించసాగెను.

కస్యచిత్త్వథ కాలస్య మృతచైలాపహారకః ।
హరిశ్చంద్రోఽభవద్రాజా శ్మశానే తద్వశానుగః ॥105॥

ఇట్లు కొన్నిదినముల పిమ్మట చనిపోయినవారి వస్త్రములను తెచ్చువాడై, చండాలవశవర్తియగు హరిశ్చంద్రుడు శ్మశానమందు కాటికాపరి అయ్యెను.

చండాలేనానుశిష్టశ్చ మృతచైలాపహారిణా ।
శవాఽగమనమన్విచ్ఛన్నిహ తిష్ఠన్ దివానిశమ్ ॥106॥

ఇచ్చుటి కాటికి వచ్చు శవములనన్వేషించుచూ, ఈ శ్మశానమందే రాత్రింబవళ్ళు నివసించుచూ, శవములపై కప్పు వస్త్రములను గ్రహించువానినిగా హరిశ్చంద్రుని చండాలుడు ఆజ్ఞాపించెను.

ఇదం రాజ్ఞేఽపి దేయం చ షడ్భాగం తు శవం ప్రతి ।
త్రయస్తు మమ భాగాః స్యుర్ద్వౌ భాగౌ తవ వేతనమ్ ॥107॥

ఇతి ప్రతిసమాదిష్టో జగామ శివమన్దిరమ్ ।
దిశం తు దక్షిణాం యత్ర వారాణస్యాం స్థితం తదా ॥108॥

“ఒక్కొక్క శవమునకు వచ్చు కాటిసుంకములో ఆరవభాగము రాజుకు ఇవ్వవలెను. మూడు భాగములు నాకివ్వవలెను. రెండు భాగములు నీకు జీతము” అని చండాలుడు చెప్పగా, ఆ చండాలుని ఆజ్ఞను గ్రహించి వారణాసికి దక్షిణదిక్కునందున్న శవమందిరమునకు అనగా శ్మశానమునకు వెళ్ళెను.

శ్మశానం ఘోరసంనాదం శివాశతసమాకులమ్ ।
శవమౌలిసమాకీర్ణం దుర్గంధబహుధూమకమ్ ॥109॥

పిశాచ భూతబేతాలడాకినీయక్షసంకులమ్ ।
మహాగణమహాభూతరవకోలాహలాయుతమ్ ॥110॥

గృధ్రగోమాయుసంకీర్ణం శ్వబృందపరివారితమ్ ।
అస్థిసంఘాతసంకీర్ణం మహాదుర్గంధసంకులమ్ ॥111॥

నానామృతసుహృన్నాదరౌద్రకోలాహలాయుతమ్ ।
హా పుత్ర! మిత్ర! హా బంధో! భ్రాతర్వత్స! ప్రియాద్య మే ॥112॥

హా పతే! భగిని! మాతర్హా మాతుల! పితామహ! ।
మాతామహ! పితః! పౌత్ర! క్వ గతోఽస్యేహి బాంధవ ॥113॥

ఇత్యేవం వదతాం యత్ర ధ్వనిః సంశ్రూయతే మహాన్ ।
యత్ర నేత్రైరనిమిషైః శవా భయమివావిశన్ ॥114॥

నిమీలితైశ్చ నయనైర్బంధుచింతాపథే స్థితాః ।
జ్వలన్మాంసవసామేదశ్చమచ్ఛమితసంకులమ్ ॥115॥

అర్ధదగ్ధాః శవాః శ్యామా వికసద్దంతపంక్తయః ।
హసన్త్యేవాగ్నిమధ్యస్థాః కాయస్యేయం దశా త్వితి ॥116

అగ్నేశ్చటచటాశబ్దో వయసామస్థిపంక్తిషు ।
బాంధవాఽక్రందశబ్దశ్చ పుల్కసేషు ప్రహర్షజః ॥117॥

గాయతాం భూతవేతాలపిశాచగణరక్షసామ్ ।
శ్రూయతే సుమహాన్ ఘోరః కల్పాంత ఇవ నిస్స్వనః ॥118॥

మహామహిషకారీషగోశకృద్రాశిసంకులమ్ ।
తదుత్థభస్మకూటైశ్చ వృతం సాస్థిభిరున్నతైః ॥119॥

నానోపహారస్రగ్దీపకాకవిక్షేపసంకులమ్ ।
అనేకశబ్దబహులం శ్మశానం నరకాయతే ॥120॥

సవహ్నిగర్భైరశివైః శివారుతైర్నినాదితం భీషణరావగహ్వరమ్ ।
భయం భయస్యాప్యుపసంజనైర్భృశం శ్మశానమాక్రందవిరావదారుణమ్ ॥121॥

హరిశ్చంద్రమహారాజు ప్రవేశించిన శ్మశానమెలా ఉన్నదనగా – భయంకరమైన ధ్వనులు కలిగి, వందల కొలదీ నక్కలతో కూడినది, శవముల పుర్రెలతో నిండినదై, దుర్వాసనతో కూడిన అధికమైన పొగ కలదై, పిశాచ, భూత, బేతాళ, డాకినీ, యక్షములతో వ్యాప్తమై, మహాగణ మహాభూత శబ్దముల కోలాహలముతో వ్యాప్తమై, గ్రద్దలు నక్కలతో సంకీర్ణమై, కుక్కల సమూహముతో చుట్టబడినదై, ఎముకలసమూహముతో సంకీర్ణమై, మహాదుర్గంధముతో వ్యాప్తమై, చనిపోయినవారికి సంబంధించిన వారి భయంకరమైన ఏడ్పుల ధ్వనులతో కూడినదై "అయ్యో ! ఓ కుమారుడా ! ఓ స్నేహితుడా ! ఓ బంధువా ! ఓ సోదరుడా ! ఓ వత్సా ! ఓ ప్రియా ! ఓ స్వామీ ! ఓ సోదరీ ! ఓ అమ్మా ! ఓ మామా ! ఓ పితామహా ! (తండ్రియొక్క తండ్రి పితామహుడు) ఓ మాతామహా ! (తల్లియొక్క తండ్రి మాతామహుడు) ఓ తండ్రీ ! ఓ మనుమడా! ఓ బంధుజనమా ! ఈ రోజు మీరెచ్చటకు బోయితిరి? ఒక పర్యాయమిటు రండి" అను ప్రకారముగా గొప్ప ధ్వనులు ఎచ్చట వినబడుచున్నవో అట్టిదై, ఎచ్చట కొన్ని శవములు కన్నులు తెరచియే కనురెప్పవేయకుండా చూచుచున్నట్లుండి భయమును గొల్పుచున్నవో అట్టిదై, ఎచ్చట కొన్ని శవములు కన్నులు మూసుకొని తమ బంధువుల గురించి చింతించుచున్నట్లున్నవో అట్టిదై, శరీరమందలి మాంసవసామేదములు దహింపబడుచుండుటచే ఛమ ఛమయను శబ్దములతో నిండినదై, అగ్నుల మధ్యలో సగభాగము దహింపబడిన శవములు నల్లనివిగా ఉండి దంతముల వరుసలు బైటికి వచ్చుటచే ఈ శరీరమునకెట్టి దురవస్థ పట్టినదియని నవ్వుచున్నవి వలె ఉన్నట్టి శవములు కల్గినట్టిది, వివిధ వయస్సుగల శవముల ఎముకల వరుసలయందు అగ్నినుండి వెడలుచున్న చట చటా శబ్దములు కల్గినట్టిదియు, నీచజాతి మనుష్యులకు సంతోషమును కలిగించు బంధువుల ఆక్రందన ధ్వనులతో కూడినట్టిదియు, సంతోషముతో గానముచేయుచున్న భూతబేతాళ పిశాచగణ రాక్షసులయొక్క భయంకర కల్పాంతధ్వనులవంటి ధ్వనులు గలదియు, మహామహిషముల గోమయరాశులచే సంకులమైనట్టిదియు, ఆ రాశులయందు పెద్దవియగు ఎముకలు, ఆ ఎముకల భస్మములతో నిండినట్టిదియు, కాకులపై విసిరినట్టి వివిధములైన బలులు, మాలలు, దీపములతో సంకులమైనట్టిదియు, వివిధములైన శబ్దములతో నరకమువలే ఉన్నట్టిదియు, వహ్నులతోనూ, భయంకరములైన అమంగళకరములైన ఆడు నక్కల కూతలతోనూ నిండినట్టిది, భయమునకు కూడా భయము గొల్పు విధముగా భయంకరమైన ఆక్రందన ధ్వనులతో కూడినట్టిదిగానూ ఆ శ్మశానముండెను.

స రాజా తత్ర సంప్రాప్తో దుఃఖితః శోచనోద్యతః ।
హా భృత్యాః మంత్రిణో విప్రాః క్వ తద్రాజ్యం విధే గతమ్ ॥122॥

హా శైబ్యే పుత్ర హా బాల మాం త్యక్త్వా మన్దభాగ్యకమ్ ।
విశ్వామిత్రస్య రోషేణ గతాః కుత్రాపి తే మమ ॥123॥

ఇత్యేవం చిన్తయంస్తత్ర చండాలోక్తం పునః పునః ।
మలినో రూక్షసర్వాంగః కేశవాన్ గంధవాన్ ధ్వజీ ॥124॥

లగుడీ కాలకల్పశ్చ ధావంశ్చాపి తతస్తతః ।
అస్మిన్ శవ ఇదం మూల్యం ప్రాప్తం ప్రాప్స్యామి చాప్యుత ॥125॥

ఇదం మమ ఇదం రాజ్ఞే ముఖ్యచండాలకే త్విదమ్ ।
ఇతి ధావన్ దిశో రాజా జీవన్యోన్యన్తరం గతః ॥126॥

హరిశ్చంద్రుడు అట్టి భయంకరమైన శ్మశానమునకు చేరి దుఃఖితుడై మిక్కిలి విచారించసాగెను. "ఓ సేవకులారా! మంత్రులారా ! బ్రాహ్మణులారా ! ఓ దైవమా ! ఆ రాజ్యమెచ్చటకు బోయినది? అయ్యో ఓ శైబ్యా ! ఓ కుమారా ! ఓ బాలకుడా ! దురదృష్టవంతుడనయిన నన్ను వదిలి విశ్వామిత్రుని కోపము కారణముగా మీరెచ్చటకు బోయితిరి?" అను విధముగా చింతించుచూ, చండాలుడు చెప్పిన పనిని మాటిమాటికీ తలచుకొనుచూ హరిశ్చంద్రుడు మలినశరీరము, ఎండిపోయిన దేహము, కేశములు, దుర్గంధము, జెండా, చేతిలో దుడ్డుకర్ర ధరించి యమునివలె ఉండి అటునిటూ పరుగెత్తుచుండెను. ఇంకనూ ఈ శవమునకు ఇంత మూల్యము లభించినది, ఇంకనూ పొందగలను, ఈ భాగము నాకు, ఈ భాగము రాజుకు, ఈ భాగము చండాలముఖ్యునికి అని తలచుచూ, దిక్కులను పట్టి పరుగెత్తుచూ హరిశ్చంద్రుడు జీవించియుండగానే మరియొక యోనియందు ప్రవేశించినవాడాయెను. అనగా మరొక జన్మనెత్తెను.

జీర్ణకర్పటసుగ్రన్థికృతకన్థాపరిగ్రహః ।
చితాభస్మరజోలిప్తముఖబాహూదరాంఘ్రికః ॥127॥

నానామేదోవసామజ్జాలిప్తపాణ్యంగులిః శ్వసన్ ।
నానాశవౌదనకృతాహారతృప్తిపరాయణః ॥128॥

తదీయమాల్యసంశ్లేషకృతమస్తకమండనః ।
న రాత్రౌ న దివా శేతే హాహేతి ప్రవదన్ముహుః ॥129॥

జీర్ణమైన వస్త్రమునకు ముడివేసిన ముంతను ధరించినవాడును, ముఖము, బాహువులు, ఉదరము, పాదములయందు శ్మశానపు భస్మమును పూసుకొన్నవాడును, శవములకు సంబంధించిన వివిధములైన శరీరమందలి మేదోవసామజ్జలచే లేపనము (పూతను) పొందిన పాదములు, వ్రేళ్ళుగలవాడునూ, నిట్టూర్చువాడునూ, వివిధములైన

శవములకు పిండములుగా వేయబడిన ఆహారమును భుజించుచూ తృప్తి పొందినవాడునూ, శవములకు వేయబడిన మాలలను తన శిరస్సునందు అలంకరించుకొనువాడునూ అగు హరిశ్చంద్రుడు భార్యాపుత్రవియోగజనితదుఃఖముచే మాటిమాటికీ హాహాకారమును సలుపుచూ రాత్రిగాని, పగలుగాని నిద్రించుట లేదు.

ఏవం ద్వాదశమాసాస్తు నీతాః శతసమోపమాః ।
స కదాచిన్నృపశ్రేష్ఠః శ్రాంతో బంధువియోగవాన్ ॥130॥

నిద్రాభిభూతో రూక్షాఙ్గో నిశ్చేష్టః సుప్త ఏవ చ ।
తత్రాపి శయనీయే స దృష్టవానద్భుతం మహత్ ॥131॥

హరిశ్చంద్రుడీప్రకారముగా ఆ శ్మశానమందు నివసించుచుండగా నూరు సంవత్సరములవలె పన్నెండు నెలలు గడచినవి. బంధువియోగముగల రాజశ్రేష్ఠుడగు ఆ హరిశ్చంద్రుడు ఒకనాడు అలసిపోయెను. శరీరము కృశించినవాడై చేష్టలేమీ లేక నిద్రించెను. ఆ నిద్రయందు రాజొక అద్భుతమును చూచెను.

శ్మశానాభ్యాసయోగేన దైవస్య బలవత్తయా ।
అన్యదేహేన దత్త్వా తు గురవే గురుదక్షిణామ్ ॥132॥

తదా ద్వాదశవర్షాణి దుఃఖదానాత్తు నిష్కృతిః ।
ఆత్మానం స దదర్శాథ పుల్కసీగర్భసంభవమ్ ॥133॥

శ్మశానమందు నివసించుటయను అలవాటు చేతనూ, దైవము బలవత్తరమగుట చేతనూ ఈ దేహమును విడిచి 'మరొక దేహమును' పొంది గురువగు విశ్వామిత్రునికి దక్షిణనిచ్చినట్లు కలను గాంచెను. అప్పుడు పన్నెండు సంవత్సరములకు దుఃఖము నుండి విముక్తి పొందినట్లు, మరియు తాను చండాలస్త్రీగర్భమందు జన్మించినట్లు కలను గాంచెను.

తత్రస్థశ్చాప్యసౌ రాజా సోఽచింతయదిదం తదా ।
ఇతో నిష్క్రాంతమాత్రో హి దానధర్మం కరోమ్యహమ్ ॥134॥

ఆ హరిశ్చంద్రమహారాజు చండాలస్త్రీగర్భమందున్న సమయమందే ఈ విధముగా ఆలోచించెను. "నేను పుట్టిన వెంటనే దానధర్మములను చేసెదను."

అనంతరం స జాతస్తు తదా పుల్కసబాలకః ।
శ్మశానమృతసంస్కారకరణేషు సదోద్యతః ॥135॥

పిమ్మట ఆ హరిశ్చంద్రుడు చండాలవంశమందు బాలకునిగా జన్మించి శ్మశానమందు చనిపోయినవారికి చేయవలసిన సంస్కారములను చేయుటలో ఎల్లప్పుడు ఉద్యుక్తుడయ్యెను.

ప్రాప్తే తు సప్తమే వర్షే శ్మశానేఽథ మృతో ద్విజః ।
ఆనీతో బంధుభిర్దృష్టస్తేన తత్రాధనో గుణీ ॥136॥

ఆ బాలకునికి ఏడవ సంవత్సరము రాగా, ఒకనాడు గుణవంతుడు, ధనహీనుడూ అగు ఒక చనిపోయిన బ్రాహ్మణుని శవము బంధువుల చేత శ్మశానమునకు తీసుకొని రాబడినది. ఆ శవమును ఆ బాలకుడు చూచెను.

మూల్యార్థినా తు తేనాపి పరిభూతాస్తు బ్రాహ్మణాః ।
ఊచుస్తే బ్రాహ్మణాస్తత్ర విశ్వామిత్రస్య చేష్టితమ్ ॥137॥

ఆ బాలకుడు శవమును తీసుకొని వచ్చిన ఆ బ్రాహ్మణులను కాటిసుంకమునడుగగా అందుకు వారు అవమానమంది, ఆ బాలకుని పూర్వజన్మమందు విశ్వామిత్రుడు చేసిన కృత్యమును వానికి తెలియచెప్పిరి.

పాపిష్ఠమశుభం కర్మ కురు త్వం పాపకారక ! ।
హరిశ్చంద్రః పురా రాజా విశ్వామిత్రేణ పుల్కసః ॥138॥

కృతః పుణ్యవినాశేన బ్రాహ్మణస్వాపనాశనాత్ ।
యదా న క్షమతే తేషాం తైః స శప్తో రుషా తదా ॥139॥

గచ్ఛ త్వం నరకం ఘోరమద్యైవ నరాధమ ।
ఇత్యుక్తమాత్రవచనే స్వప్నస్థః స నృపస్తదా ॥140॥

అపశ్యద్యమదూతాన్వై పాశహస్తాన్భయావహాన్ ।
తైః సంగృహీతమాత్మానం నీయమానం తదా బలాత్ ॥141॥

పశ్యతిస్మ భృశం ఖిన్నో హా మాతః పితరద్య మే ।
ఏవంవాదీ స నరకే తైలద్రోణ్యాం నిపాతితః ॥142॥

క్రకచైః పాట్యమానస్తు క్షురధారాభిరప్యధః ।
అంధే తమసి దుఃఖార్తః పూయశోణితభోజనః ॥143॥

"ఓ పాపాచరణముగలవాడా ! నీవు పాపిష్ఠము, అమంగళకరము అయిన కర్మను చేయుచున్నావా? నీవు పూర్వజన్మలో హరిశ్చంద్రమహారాజువు. నీ పుణ్యము నశించగా బ్రాహ్మణద్రవ్యమును అపహరించుటచే నీవు విశ్వామిత్రునిచే శపింపబడి చండాలుడుగా జన్మించితివి" అని బ్రాహ్మణులు చెప్పిననూ వారి మాటను లెక్కచేయక కాటి సుంకమును గూర్చి నిర్బంధించుటచే, వారు కోపముచెంది బాలకుని "ఓరీ నీచుడా ! ఇప్పుడే నీవు నరకమునకు పోయెదవు గాక!" అని శపించిరి. ఈ విధముగా శపించినంతనే హరిశ్చంద్రుడు స్వప్నమందే నరకమునకు బోయి యమపాశములను ధరించిన యమదూతలను చూచెను. బలాత్కారముగా వారిచేత తీసుకొనిపోబడుచున్న తనను తాను చూచుచున్నవాడై "ఓ తల్లీ ! తండ్రీ" అని మిక్కిలి ఖేదమును పొందెను. ఈ విధముగా ఆ బాలకుడు పలుకుచుండగానే అతడిని యమదూతలు తైలద్రోణియను నరకలోకమందు పడవైచిరి. ఇంకను రంపములు, వాడి యంచులుగల కత్తులతో ఆ బాలకుడు చీల్చబడుచూ, చీమురక్తముల భోజనముగలవాడై, మిక్కిలి దుఃఖార్తుడై, అంధతమస్సను నరకమందు త్రోయబడెను.

సప్తవర్షం మృతాత్మానం పుల్కసత్వే దదర్శ హ ।
దినం దినం తు నరకే దహ్యతే పచ్యతేఽన్యతః ॥144॥

ఖిద్యతే క్షోభ్యతేఽన్యత్ర మార్యతే పాట్యతేఽన్యతః ।
క్షార్యతే దీప్యతేఽన్యత్ర శీతవాతాహతోఽన్యతః ॥145॥

ఈ విధముగా తాను చనిపోయి చండాలజన్మలో ఏడుసంవత్సరముల బాలునిగా హరిశ్చంద్రుడు తనను తాను స్వప్నమందు చూచెను. ప్రతిరోజు నరకమందు దహింపబడుటయు, మరొకచోట కాగిన నూనెయందు ఉడకబెట్టబడుటయు, ఒకచోట దుఃఖింపబడుటయు, మరొకచోట క్షోభింపబడుటయు, ఒకచోట చంపబడుటయు, మరొకచోట చీల్చబడుటయు, ఒకచోట దహింపబడుటయు, మరొకచోట కాల్చబడుటయు, మరొకచోట చల్లనిగాలులతో కొట్టబడుటయు ఇట్లనేక ప్రకారములుగా తనను తాను స్వప్నమందు చూచెను.

ఏకం దినం వర్షశతప్రమాణం నరకేఽభవత్ ।
తథా వర్షశతం తత్ర శ్రావితం నరకే భటైః ॥146॥

ఆ నరకమందు ఒకదినము నూరు సంవత్సరముల పరిమాణము గలది అయ్యెను. ఈ విధముగా నరకమందు యమభటులు నూరు సంవత్సరములు బాలునితో వ్యవహరించిరి.

తతో నిపాతితో భూమౌ విష్ఠాశీ శ్వా వ్యజాయత ।
వాంతాశీ శీతదగ్ధశ్చ మాసమాత్రే మృతోఽపి సః ॥147॥

అటుపిమ్మట భూలోకమందు త్రోయబడిన ఆ బాలకుడు మలమును భుజించు కుక్కగా జన్మించెను. ఇంకను క్రక్కినవాటిని తినుచూ, శీతముచే బాధనొందుచూ ఒకనెల మాత్రము జీవించి ఆ కుక్క మరణించెను.

అథాపశ్యత్ఖరం దేహం హస్తినం వానరం పశుమ్ ।
ఛాగం బిడాలం కంకం చ గామవిం పక్షిణం కృమిమ్ ॥148॥

మత్స్యం కూర్మం వరాహం చ శ్వావిధం కుక్కుటం శుకమ్ ।
శారికాం స్థావరాంశ్చైవ సర్వమన్యాంశ్చ దేహినః ॥149॥

దివసే దివసే జన్మ ప్రాణినః ప్రాణినస్తదా ।
అపశ్యద్దుఃఖసంతప్తో దినం వర్షశతం తథా ॥150॥

అటుపిమ్మట క్రమముగా గాడిద, ఏనుగు, కోతి, మేక, పిల్లి, డేగ, ఎద్దు, గొర్రె, పక్షి, కృమి, చేప, తాబేలు, పంది, లేడి, కోడి, చిలుక, గోరువంక, పాము మొదలగు దేహముగల జంగమప్రాణులుగాను, వృక్షపర్వతాది స్థావర రూపములుగానూ తనను తాను హరిశ్చంద్రుడు స్వప్నమందు చూచెను. ప్రతిదినము ఒక్కొక్క ప్రాణిగా పుడుతూ అనేక ప్రాణులుగా దుఃఖముతో కూడుకొన్నవాడై తాను జన్మించుటను చూచెను. ఈ విధముగా అనేక జన్మలనెత్తుచూ ఒకరోజు నూరుసంవత్సరములతో సమానముగా గన్పట్టుచుండెను.

ఏవం వర్షశతం పూర్ణం గతం తత్ర కుయోనిషు ।
అపశ్యచ్చ కదాచిత్ స రాజా తత్స్వకులోద్భవమ్ ॥151॥

ఈ విధముగా నానావిధములైన కుత్సితయోనులందు జన్మించి, నూరు సంవత్సరములు పూర్తియైనట్లు హరిశ్చంద్రుడు స్వప్నమందు భావించెను. తరువాత ఒకనాడు ఆ రాజు తన కులమందు జన్మించినట్లుగా ఆ స్వప్నమందు చూచెను.

తత్ర స్థితస్య తస్యాపి రాజ్యం ద్యూతేన హారితమ్ ।
భార్యా హృతా చ పుత్రశ్చ స చైకాకీ వనం గతః ॥152॥

అట్లు మరల రాజై రాజ్యమేలుచుండగా (స్వప్నమందు) జూదమందు రాజ్యమును, భార్యాపుత్రులను పోగొట్టుకొని 'ఏకాకియై' అరణ్యమునకు బోయెను.

తత్రాపశ్యత్స సింహం వై వ్యాదితాస్యం భయావహమ్ ।
బిభక్షయిషుమాయాంతం శరభేణ సమన్వితమ్ ॥153॥

ఆ అరణ్యమందు శరభమను జంతువుతోకూడా ఒక సింహము మిక్కిలి భయమును గొల్పుతూ తనను తినుటకు నోరుతెరచి వచ్చుచున్నట్లు చూచెను. (శరభమనగా ఎనిమిదికాళ్ళు కలిగి సింహముకంటే బలముగల్గిన ఒక మృగము.)

పునశ్చ భక్షితః సోఽపి భార్యాం శోచితుముద్యతః ।
హా శైబ్యే ! క్వ గతాస్యద్య మామిహాపాస్య దుఃఖితమ్ ॥154॥

ఇట్లు ఆ సింహముచే భక్షింపబడుచూ భార్యను గురించి "ఓ శైబ్యా ! దుఃఖితుడగు నన్ను విడిచిపెట్టి ఎక్కడకు వెళ్ళితివి?" అని శోకింపసాగెను.

అపశ్యత్పునరేవాపి భార్యాం స్వాం సహ పుత్రకామ్ ।
త్రాయస్వ త్వం హరిశ్చంద్ర ! కిం ద్యూతేన తవ ప్రభో ! ॥155॥

పుత్రస్తే శోచ్యతాం ప్రాప్తో భార్యయా శైబ్యయా సహ ।
స నాపశ్యత్పునరపి ధావమానః పునః పునః ॥156॥

ఇట్లు హరిశ్చంద్రుడు విలపించుచుండగా తిరిగి పుత్రునితోగూడ భార్యను చూచెను. "ఓ స్వామీ ! ఓ హరిశ్చంద్ర మహారాజా ! నన్ను రక్షింపుము. నీకు జూదముతో నేమి లాభము? నీ భార్య శైబ్యతోగూడ నీ కుమారుడు శోచనీయమైన స్థితిని పొందినాడు" అని విలపించుచున్న భార్యను జూచెను. అప్పుడామెకొరకు మరలమరల పరుగెత్తెను గాని ఆమె కనబడలేదు.

అథాపశ్యత్పునరపి స్వర్గస్థః స నరాధిపః ।
నీయతే ముక్తకేశీ సా దీనా వివసనా బలాత్ ॥157॥

హాహావాక్యం ప్రముంచంతీ త్రాయస్వేత్యసకృత్స్వనా ।
అథాపశ్యత్పునస్తత్ర ధర్మరాజస్య శాసనాత్ ॥158॥

ఆక్రందన్త్యంతరిక్షస్థా ఆగచ్ఛేహ నరాధిప ।
విశ్వామిత్రేణ విజ్ఞప్తో యమో రాజంస్తవార్థతః ॥159॥

ఇత్యుక్త్వా సర్పపాశైస్తు నీయతే బలవద్విభుః ।
శ్రాద్ధదేవేన కథితం విశ్వామిత్రస్య చేష్టితమ్ ॥160॥

అనంతరమా రాజు తాను స్వర్గమందున్నట్లు చూచెను. అచ్చట కేశములు సర్దుకొననందున విడువబడి, వస్త్రహీనురాలై, దీనురాలైన తన భార్య బలాత్కారముగా తీసుకొని పోబడుచుండగా చూచెను. విచారముతో హాహాకారమును చేయుచూ, మాటిమాటికి “రక్షించుము” అని పలుకుచున్న తన భార్యను రాజు చూచెను. అటుపిమ్మట మరల రాజు మరొక సంఘటనను చూచెను. యమధర్మరాజు ఆజ్ఞతో అంతరిక్షమందు యమభటులు “ఓ నరాధిపా! నీవిటు రమ్ము ! నీ గురించి యమధర్మరాజు విశ్వామిత్రుని చేత విజ్ఞప్తి చేయబడినాడు” అని గట్టిగా అరచుటను గూడా హరిశ్చంద్రుడు వినెను. యమభటులా విధముగా పలికి ఆ రాజును నాగపాశములచే బంధించి బలాత్కారముగా యమునివద్దకు తీసుకొని వెళ్ళారు. యముడు రాజునకు విశ్వామిత్రుని చర్యలను చెప్పెను.

తత్రాపి తస్య వికృతిర్నాధర్మోత్థా వ్యవర్ధత ।
ఏతాః సర్వా దశాస్తస్య యాః స్వప్నే సంప్రదర్శితాః ॥161॥

సర్వాస్తాస్తేన సంభుక్తా యావద్వర్షాణి ద్వాదశ ।
అతీతే ద్వాదశే వర్షే నీయమానో భటైర్బలాత్ ॥162॥

యమం సోఽపశ్యదాకారాదువాచ చ నరాధిపమ్ ।
విశ్వామిత్రస్య కోపోఽయం దుర్నివార్యో మహాత్మనః ॥163॥

పుత్రస్య తే మృత్యుమపి ప్రదాస్యతి స కౌశికః ।
గచ్ఛ త్వం మానుషం లోకం దుఃఖశేషం చ భుంక్ష్వ వై ॥164॥

స్వర్గలోకమందున్ననూ, అధర్మాచరణవల్ల కలిగే ఎట్టి వికారమూ ఆ రాజుకు కలుగలేదు. ఇట్లు స్వప్నమందు కనిపించిన వివిధములైన దశలన్నింటినీ ఆ రాజు పన్నెండు సంవత్సరములు అనుభవించెను. పన్నెండవసంవత్సరము గడచినంతనే యమభటులు రాజును బలాత్కారముగా యమధర్మరాజువద్దకు తీసుకొనిపోయిరి. రాజు యముని అతని ఆకారమును బట్టి గుర్తించెను. యముడు రాజుతోనిట్లు పలికెను. “ఓ రాజా ! మహాత్ముడగు విశ్వామిత్రుని కోపము దుర్నివార్యమై యున్నది. ఆ కౌశికుడు నీ పుత్రునిగూడా చంపును. కావున నీవు మానవలోకమునకు బోయి దుఃఖశేషమును అనుభవించుము. ఓ రాజశ్రేష్ఠుడా ! మానవలోకమునకు వెళ్ళిన పిమ్మట నీకు శుభము కలుగును.”

వ్యతీతే ద్వాదశే వర్షే దుఃఖస్యాంతే నరాధిపః ।
అంతరిక్షాచ్చ పతితో యమదూతైః ప్రణోదితః ॥165॥

పన్నెండవ సంవత్సరము గడచిన పిమ్మట దుఃఖములు నశించగా నరాధిపుడగు హరిశ్చంద్రుడు యమభటులచే క్రిందికి త్రోయబడి అంతరిక్షము నుండి భూలోకమందు పడెను.

పతితో యమలోకాచ్చ విబుద్ధో భయసంభ్రమాత్ ।
అహెూ కష్టమితి ధ్యాత్వా క్షతే క్షారావసేచనమ్ ॥166॥

యమలోకమునుండి క్రిందకు పడగానే ఆ రోజు భయాశ్చర్యములతో మేలుకొని 'ఆహా ! ఎంతటి కష్టము? పుండుమీద కారము చల్లినట్లున్న'దని తలచెను.

స్వప్నే దుఃఖం మహద్దృష్టం యస్యాన్తో నోపలభ్యతే ।
స్వప్నే దృష్టం మయా యత్తు కిన్తు మే ద్వాదశీః సమాః ॥167॥

గతేత్యపృచ్ఛత్తత్రస్థాన్ పుల్కసాంస్తు స సంభ్రమాత్ ।
నేత్యూచుః కేచిత్తత్రస్థా ఏవమేవాఽపరేఽబ్రువన్ ॥168॥

నేను స్వప్నమందు గొప్ప దుఃఖమును చూచితిని. ఆ దుఃఖమునకు వినాశము కనబడుట లేదు. నేను స్వప్నములో చూచినట్లుగా నాకు పన్నెండు సంవత్సరములు గడచినవా ఏమి? అని అచ్చటున్న చండాలురను హరిశ్చంద్రుడు ప్రశ్నించెను. అచ్చటున్న వారిలో కొందరు పన్నెండు సంవత్సరములు గడచలేదని చెప్పగా కొందరు మాత్రము "అట్లే" అనగా పన్నెండు సంవత్సరములు గడచినవి అని చెప్పిరి.

శ్రుత్వా దుఃఖీ తదా రాజా దేవాన్ శరణమీయవాన్ ।
స్వస్తి కుర్వన్తు మే దేవాః శైబ్యాయా బాలకస్య చ ॥169॥

రాజు వారి మాటలను విని మిక్కిలి దుఃఖించి దేవతలను శరణు వేడెను. 'ఓ దేవతలారా ! నా భార్యాపుత్రులకు మీరు శుభము చేయుదురుగాక !'

నమో ధర్మాయ మహతే నమః కృష్ణాయ వేధసే ।
పరావరాయ శుద్ధాయ పురాణాయావ్యయాయ చ ॥170॥

నమో బృహస్పతే ! తుభ్యం నమస్తే వాసవాయ చ ।
ఏవముక్త్వా స రాజా తు యుక్తః పుల్కసకర్మణి ॥171॥

మహాత్ముడగు ధర్మదేవునికి నమస్కారము. బ్రహ్మస్వరూపుడు, సర్వశ్రేష్ఠుడు, పవిత్రుడు, పురాణస్వరూపుడు, నాశరహితుడూ అగు శ్రీకృష్ణునికి నమస్కారము. ఓ బృహస్పతీ ! నీకు నమస్కారము. ఓ దేవేంద్రా ! నీకు నమస్కారము. అని ఈ విధముగా పలికి రాజగు హరిశ్చంద్రుడు తిరిగి చండాలకర్మయందు నిమగ్నుడయ్యెను.

శవానాం మూల్యకరణే పునర్నష్టస్మృతిర్యథా ।
మలినో జటిలః కృష్ణో లగుడీ విహ్వలో నృపః ॥172॥

నైవ పుత్రో న భార్యా తు తస్య వై స్మృతిగోచరే ।
నష్టోత్సాహో రాజ్యనాశాత్ శ్మశానే నివసంస్తదా ॥173॥

తాను చేసే కాటికాపరివృత్తిలో శవములకు మూల్యమును నిర్ధారించుటలో హరిశ్చంద్రుడు గతములోని స్మృతులను మరచినవాడువలే ఉండెను. మలినుడు, జటలు ధరించినవాడు, నల్లని వర్ణము గలవాడు, చేతియందు దుడ్డుకర్రను ధరించినవాడు, భయాదులవల్ల వ్యాకులత చెందినవాడూ అయి ఆ రాజుండెను. అతని స్మృతిపథమందు భార్యగాని, కుమారుడుగాని లేరు. శ్మశానమందు నివసించు ఆ సమయమందు రాజ్యనాశము కారణముగా హరిశ్చంద్రుని ఉత్సాహము నశించెను.

అథాఽజగామ స్వసుతం మృతమాదాయ లాపినీ ।
భార్యా తస్య నరేంద్రస్య సర్పదష్టం హి బాలకమ్ ॥174॥

అంతట ఆ నరేంద్రుని భార్య శైబ్యాదేవి పాము కరచుటచే చనిపోయిన తన బాలకుని తీసుకొని విలపించుచు శ్మశానమునకు వచ్చెను.

హా వత్స ! హా పుత్ర ! శిశో ! ఇత్థం వై వదతీ ముహుః ।
కృశా వివర్ణా విమనాః పాంశుధ్వస్తశిరోరుహా ॥175॥

కృశించినది, పాలిపోయినశరీరముగలది, మనస్సు అధీనములో లేనిది, దుమ్ముచేత మలినమైన కేశములు గలదీయగు శైబ్యాదేవి అయ్యో వత్సా ! కుమారా ! శిశువా ! అని మాటిమాటికీ పలుకుచూ విలపించసాగెను.

రాజపత్నీ ఉవాచ – రాజుయొక్క భార్య పలికెను.

హా రాజన్నద్య బాలం త్వం పశ్యసీమం మహీతలే ।
రమమాణం పురా దృష్టం దష్టం పుష్టాహినా మృతమ్ ॥176॥

ఓ రాజా ! పూర్వము క్రీడించుచుండగా నీచేత చూడబడిన ఈ నీ బాలకుడు, నేడు బలిసిన పాముచే కరవబడి చనిపోయి నేలపైబడియున్నాడు. చూచుచున్నావు గదా!

తస్యా విలాపశబ్దం తమాకర్ణ్య స నరాధిపః ।
జగామ త్వరితోఽత్రేతి భవితా మృతకంబలః ॥177॥

నరాధిపుడగు ఆ హరిశ్చంద్రమహారాజు ఆమె విలపించుటను విని "ఇచ్చట చనిపోయినవారికి కప్పే వస్త్రము లభించగలదు" అని పలుకుచూ వేగముగా అచ్చటికిబోయెను.

స తాం రోరూయతీం భార్యాం నాభ్యజానాత్తు పార్థివః ।
చిరప్రవాససంతప్తాం పునర్జాతామివాబలామ్ ॥178॥

ఆమె భర్తతో చాల కాలము ఎడబాటువలన దుఃఖించుచున్నది, మరల జన్మనెత్తినదాయన్నట్లున్నది, శక్తిహీనురాలు, మరలమరల రోదించుచున్న తన భార్యను హరిశ్చంద్రమహారాజు గుర్తించలేదు.

సాఽపి తం చారుకేశాన్తం పురా దృష్ట్వా జటాఽలకమ్ ।
నాభ్యజానాన్నృపసుతా శుష్కవృక్షోపమం నృపమ్ ॥179॥

రాజపుత్రియగు శైబ్యాదేవిగూడ తన భర్తను పూర్వము అందమైన కేశములు గలవానిగా చూచియున్నందున, నేడు కేశసంస్కారములేక జటలతోకూడి, ఎండిపోయిన వృక్షమువలె ఉన్న రాజును గుర్తించలేదు.

సోఽపి కృష్ణపటే బాలం దృష్ట్వాఽశీవిషపీడితమ్ ।
నరేంద్రలక్షణోపేతం చిన్తామాప నరేశ్వరః ॥180॥

ఆ హరిశ్చంద్ర మహారాజు కూడా నల్లనివస్త్రముపై ఉంచబడి, సర్పవిషపీడితుడై, రాజలక్షణములుగల తన కుమారుడగు ఆ బాలుని చూచి, మిక్కిలి విచారమును పొందెను.

తస్యాస్యం చంద్రబింబాభం సుభ్రు రమ్యం సమున్నసమ్ ।
నీలాః కేశాః కుంచితాశ్చ సమా దీర్ఘాస్తరంగితాః ॥181॥

రాజీవనేత్రయుగలో బింబోష్ఠపుటసంవృతః ।
చతుర్దంష్ట్రశ్చతుఃకిష్కుః దీర్ఘాస్యో దీర్ఘబాహుకః ॥182॥

చతుర్లేఖకరో మత్స్యయవయుక్తైకపర్వతః ।
శిరాలుపాదో గంభీరః సూక్ష్మత్వక్ త్రివలీధరః ॥183॥

అహో కష్టం నరేంద్రస్య కస్యాప్యేష కులే శిశుః ।
జాతో నీతః కృతాంతేన కామప్యాశాం దురాత్మనా ॥184॥

ఆ బాలకుని ముఖము చంద్రబింబముయొక్క ప్రకాశం వంటి ప్రకాశం గలది, అందమైన కనుబొమలు గలది, అందమైనది, ఎత్తైన ముక్కు గలది, కేశములు నల్లనివి, ఉగరాల జుట్టు గలవి, పొడవైనవి, అలలుదేలినవి. ఇంకనూ ఆ బాలకుడు పద్మపత్రములవంటి కన్నులు, దొండపండువంటి ఎర్రని పెదవులు గలవాడు, నాలుగు దంష్ట్రాకారములగు దంతవిశేషములు, నాలుగు హస్తముల పరిమాణముగల దేహము గలవాడు, పొడవైన ముఖము ఎత్తైన బాహువులు గలవాడు, నాలుగు రేఖలుగలచేయి, పర్వములందు (వ్రేళ్ళకణుపులందు) చేప, యవధాన్యముల ఆకారము గలవాడు (సాముద్రిక శాస్త్రోక్తప్రకారము), గంభీరమైన నాడీమండలముగల పాదములవాడు, పలుచని చర్మము, ఉదరకంఠములందు మూడు మడతలు గలవాడు అగు ఈ బాలకుడు, 'అయ్యో ! ఎంతటి కష్టము, ఏ రాజవంశమందో జన్మించి ఉండవచ్చును. దురాత్ముడగు యముడీ బాలకుని దిక్కులపాలు (దుర్దశకు) చేసెను.'

ఏవం దృష్ట్వా హి తం బాలం మాతురుత్సంగశాయినమ్ ।
స్మృతిమభ్యాగతో బాలో రోహితాశ్వోఽబ్జలోచనః ॥185॥

తల్లి ఒడిలో నిద్రించుచున్నవానివలె ఉన్న ఆ బాలుని చూచి పద్మలోచనుడగు తన పుత్రుడు రోహితాశ్వుడు గుర్తులోనికి వచ్చెను.

సోఽ ప్యేతామేవ మే వత్సో వయోఽ వస్థాముపాగతః ।
నీతో యది న ఘోరేణ కృతాన్తేనాఽ త్మనో వశమ్ ॥186॥

భయంకరమగు ఆ యముడు నా కుమారుని తనవశము చేసుకొననిచో (ప్రాణములు తీయకుండా ఉన్నపక్షములో) నా కుమారుడు కూడా ఇదే వయస్సులో ఉండియుండునని హరిశ్చంద్రుడు భావించెను.

రాజపత్నీ ఉవాచ – రాజుయొక్క భార్య పలికెను.

హా వత్స! కస్య పాపస్య అపధ్యానాదిదం మహత్ ।
దుఃఖమాపతితం ఘోరం యస్యాన్తో నోపలభ్యతే ॥187॥

ఓ కుమారా! నేను ఏ పాపమును ఆచరించితినో? ఇంతటి గొప్ప అంతులేని దారుణమైన దుఃఖము సంప్రాప్తమయ్యెను. ఈ దుఃఖమునకు వినాశము కనబడుట లేదు.

హా నాథ! రాజన్! భవతా మామనాశ్వాస్య దుఃఖితామ్ ।
క్వాపి సంతిష్ఠతా స్థానే విశ్రబ్ధం స్థీయతే కథమ్ ॥188॥

ఓ ప్రభూ! ఓ రాజా! దుఃఖితురాలయిన నన్ను ఓదార్చక ఎచ్చటోఒకచోట ఎట్లు శాంతముగా ఉండగలుగుచున్నావు?

రాజ్యనాశః సుహృత్త్యాగో భార్యాతనయవిక్రయః ।
హరిశ్చంద్రస్య రాజర్షేః కిం విధే న కృతం త్వయా ॥189॥

ఓ బ్రహ్మదేవుడా ! నా భర్తయగు హరిశ్చంద్రునికి రాజ్యనాశము, మిత్రత్యాగము, భార్యాపుత్రుల విక్రయము చేసితివి. రాజర్షియగు నా భర్తకు నీవు చేయనిదేమైనా ఉన్నదా?

ఇతి తస్యా వచః శ్రుత్వా రాజా స్వస్థానతశ్చ్యుతః ।
ప్రత్యభిజ్ఞాయ దయితాం పుత్రం చ నిధనం గతమ్ ॥190॥

కైషా నామ గృహే యుక్తా మమ యోషిద్వరా భవేత్ ।
బాలశ్చ స మృతః కః స్యాదితి రాజా విచారయన్ ॥191॥

కష్టం శైబ్యేయమేషా హి స బాలోయమితీరయన్ ।
రురోద దుఃఖసన్తప్తో మూర్ఛామభిజగామ చ ॥192॥

ఈ విధముగా ఆమె మాటలను విని భార్యను, చనిపోయిన తన పుత్రుని గుర్తించి రాజు తన స్థానమునుండి జారిపడెను (చలించిపోయెను). ఈమె నా భార్య కాక మరి ఎవరు కావచ్చును? చనిపోయిన ఈ బాలకుడు నా

పుత్రుడు కాక మరి ఎవరు కావచ్చును? (నిజముగా వీరిరువురు నా భార్యాపుత్రులే). అని విచారించుచూ ఎంతటి కష్టము? ఈమె శైబ్యయే, ఈ చనిపోయిన బాలుడు నా కుమారుడే అని పలుకుచూ దుఃఖసంతప్తుడై రాజు రోదించెను, మూర్ఛను పొందెను.

సా చ తం ప్రత్యభిజ్ఞాయ తామవస్థాముపాగతమ్ ।
మూర్ఛితా నిపపాతాఽఽర్తా నిశ్చేష్టా ధరణీతలే ॥193॥

రాజపత్నియగు శైబ్య కూడా అట్టి దురవస్థను పొందిన రాజును తన భర్తగా గుర్తించి, ఆర్తురాలై, నిశ్చేష్టురాలై, భూమిపై పడి మూర్ఛిల్లెను.

చేతః స ప్రాప్య రాజేంద్రో రాజపత్నీ చ తౌ సమమ్ ।
విలేపతుః ససంతప్తౌ శోకభారాతిపీడితౌ ॥194॥

మరల కొంతసేపటికి రాజశ్రేష్ఠుడు, రాజపత్ని ఇరువురు మూర్ఛనుండి తేరుకొని శోకభారముచే మిక్కిలి పీడింపబడినవారై సమానముగా విలపించిరి.

రాజా ఉవాచ – రాజు పలికాడు.

హా వత్స ! సుకుమారం తే స్వక్షిభ్రూనాసికాలకమ్ ।
పశ్యతో మే ముఖం దీనం హృదయం కిం న దీర్యతే ॥195॥

అయ్యో కుమారా ! అందమైన కన్నులు, కనుబొమ్మలు, ముక్కు, కేశములచే సుకుమారమైన నీ ముఖమును ఇప్పుడీ విధముగా దీనము, మలినముగా చూచుచున్న నా హృదయము ఏల పగులుట లేదు?

తాత తాతేతి మధురం బ్రువాణం స్వయమాగతమ్ ।
ఉపగుహ్య వదిష్యే కం వత్స వత్సేతి సౌహృదాత్ ॥196॥

తండ్రీ ! తండ్రీ ! అని మధురముగా పలుకుచు స్వయముగా నా వద్దకురాగా, కుమారా ! కుమారా ! యని ప్రేమతో కౌగిలించుకొనిన నేనిప్పుడు ఎవరిని గూర్చి మాట్లాడగలను?

కస్య జానుప్రణీతేన పింగేన క్షితిరేణునా ।
మమోత్తరీయముత్సంగం తథాంగం మలమేష్యతి ॥197॥

ఎవని మోకాళ్ళకు అంటిన పచ్చని ధూళిరేణువులచేత నేడీనాడు నా ఉత్తరీయము, నాతొడలు, నా అవయవములు మలినములు కాగలవు?

అంగప్రత్యంగసంభూతో మనోహృదయనందనః ।
మయా కుపిత్రా హా వత్స ! విక్రీతో యేన వస్తువత్ ॥198॥

నా అంగప్రత్యంగముల నుండి పుట్టినవాడవు, నా మనోహృదయములకు ఆనందమును కలిగింపచేయు వాడవు. నిన్ను వస్తువుమాదిరి అమ్మివేసితిని. నీచమైన తండ్రిని నేను.

హృత్వా రాజ్యమశేషం మే సబాంధవధనం మహత్ ।
దైవాహినా నృశంసేన దష్టో మే తనయస్తతః ॥199॥

క్రూరమైన విధియనెడు సర్పము బంధుజనము, ధనములతో కూడుకొన్న గొప్పదియగు నా సమస్త రాజ్యమును హరించి, అటుపిమ్మట నా కుమారుని కాటు వేసినది.

అహం దైవాహిదష్టస్య పుత్రస్యాననపంకజమ్ ।
నిరీక్షన్నపి ఘోరేణ విషేణాంధీకృతోఽధునా ॥200॥

విధియనెడు సర్పముచే కరువబడిన నా కుమారుని ముఖపద్మమును చూచుచున్న నేను కూడా ఆ సర్పముయొక్క భయంకరమైన విషముచేత నేడు గ్రుడ్డివాడను అయితిని.

ఏవముక్త్వా తమాదాయ బాలకం బాష్పగద్గదః ।
పరిష్వజ్య చ నిశ్చేష్టో మూర్ఛయా నిపపాత హ ॥201॥

కన్నీళ్ళచే బొంగురుపోయిన కంఠముగల హరిశ్చంద్రుడు ఈ విధముగా పలికి, మృతుడైన ఆ బాలకుని తీసుకొని, కౌగలించుకొని, ఏ చేష్టలూ లేనివాడై మూర్ఛిల్లి, భూమిపై పడెను కదా !

రాజపత్నీ ఉవాచ – రాజపత్ని చెప్పినది.

అయం స పురుషవ్యాఘ్రః స్వరేణైవోపలక్ష్యతే ।
విద్వజ్జనమనశ్చంద్రో హరిశ్చంద్రో న సంశయః ॥202॥

ఇతడు ఆ పురుషవ్యాఘ్రుడే అని ఇతని కంఠస్వరమువల్లనే తెలియుచున్నది. ఇతడు విద్వాంసుల మనశ్చంద్రుడగు హరిశ్చంద్రుడే, ఎట్టి సంశయము లేదు.

తథాఽస్య నాసికా తుంగా అగ్రతోఽధోముఖం గతా ।
దంతాశ్చ ముకుళప్రఖ్యాః ఖ్యాతకీర్తేర్మహాత్మనః ॥203॥

ఇంకను ఇతని ముక్కు అగ్రభాగమందు ఎత్తుగా ఉండి క్రిందకు నిల్చినది. ప్రఖ్యాతకీర్తిమంతుడు, మహాత్ముడూ అగు ఇతని దంతముల వరుస మల్లెమొగ్గలవలె ప్రకాశించుచున్నది.

శ్మశానమాగతః కస్మాదద్యైష స నరేశ్వరః ।
అపహాయ పుత్రశోకం సాఽపశ్యత్పతితం పతిమ్ ॥204॥

ఇప్పుడీ మహారాజు శ్మశానమునకు ఏల వచ్చెను? అని తలచుచూ పుత్రశోకమును వదిలి మూర్ఛ చెంది నేలపై పడియున్న భర్తను చూచెను.

ప్రహృష్టా విస్మితా దీనా భర్తృపుత్రాధిపీడితా ।
వీక్షన్తీ సా తతోఽపశ్యద్భర్తృదండం జుగుప్సితమ్ ॥205॥

దీనురాలు, తన భర్త మరియు కుమారుల గురించి మిక్కిలి విచారించుచున్నదీయగు ఆమె తన భర్తను చూడగానే ఆశ్చర్యమునొంది సంతోషించెను. అటుపిమ్మట భర్తచేతిలోని దండమును చూచెను. అదిజుగుప్సను (రోతను) కలిగించుచున్నది.

శ్వపాకార్హం మనో మోహం జగామాఽయతలోచనా ।
ప్రాప్య చేతశ్చ శనకైః సగద్గదమభాషత ॥206॥

విశాలమైన నేత్రములుగల శైబ్యాదేవి చండాలునికి అర్హమైన లక్షణములను తన భర్తయందు చూచి మూర్ఛను బొందెను. పిమ్మట మెల్లమెల్లగా చేతనత్వమును పొంది గద్గదస్వరముతో నిట్లు పలికెను.

ధిక్త్వాం దైవాత్యకరుణం నిర్మర్యాదం జుగుప్సితమ్ ।
యేనాయమమరప్రఖ్యో నీతో రాజా శ్వపాకతామ్ ॥207॥

ఓ దైవమా ! నీవు నింద్యుడవు. ఏలయనగా దేవతాసమానుడైన హరిశ్చంద్రమహారాజును ఏ మాత్రమూ దయ లేక మర్యాద లేక, అసహ్యము కలుగునట్లుగా చండాలునిగా నీవు చేసినావు.

రాజ్యనాశం సుహృత్త్యాగం భార్యాతనయవిక్రయమ్ ।
ప్రాపయిత్వాఽపి నో ముక్తశ్చండాలోఽయం కృతో నృపః ॥208॥

రాజ్యనాశమును, మిత్రత్యాగమును, భార్యాపుత్రుల విక్రయణమును చేసి కూడా నీవు మా మహారాజును చండాలునిగా చేసినావు.

హా రాజన్ ! జాతసంతాపామిత్థం మాం ధరణీతలాత్ ।
ఉత్థాప్య నాద్య పర్యంకమారోహేతి కిముచ్యసే ॥209॥

ఓ మహారాజా ! ఈ విధముగా మిక్కిలి దుఃఖముతోనున్న నన్ను ఈ భూమిపైనుండి పైకి లేవదీసి "నా ఒడిని అధిరోహించుము" అని నీవు నేడు పలుకుట లేదేమి?

నాద్య పశ్యామి తే ఛత్రం శృంగారమథవా పునః ।
చామరం వ్యజనం నాపి కోఽయం విధివిపర్యయః ॥210॥

నేడు నీయందు రాజచ్ఛత్రముగాని, అలంకారములుగాని, చామరముగాని, వింజామరగాని నేను చూచుట లేదు. ఆహా ! ఏమి దైవవైపరీత్యము !

యస్యాగ్రే వ్రజతః పూర్వం రాజానో భృత్యతాం గతాః ।
స్వోత్తరీయైరకుర్వన్త నీరజస్కం మహీతలమ్ ॥211॥

సోఽ యం కపాలసంలగ్నఘటీఘటనిరంతరే ।
మృతనిర్మాల్యసూత్రాంతర్గాఢకేశే సుదారుణే ॥212॥

వసానిష్యందసంశుష్కమహీపుటకమండితే ।
భస్మాంగారార్ధదగ్ధాస్థిమజ్జాసంఘట్టభీషణే ॥213॥

గృధ్రగోమాయునాదార్తనష్టక్షుద్రవిహంగమే ।
చితాధూమాయితరుచా నీలీకృతదిగంతరే ॥214॥

కుణపాఽస్వాదనముదా సంప్రహృష్టనిశాచరే ।
చరత్యమేధ్యే రాజేన్ద్రః శ్మశానే దుఃఖపీడితః ॥215॥

ఎవరయితే రాజకార్యములపై ప్రయాణమై వెళ్ళుచుండగా అతనికి ముందుభాగమందు మిగిలిన సామంతరాజులు సేవకులుగా మారి తమ ఉత్తరీయములచే అచ్చటి భూమిని ధూళిలేకుండా శుభ్రము చేయుచుండిరో అట్టి హరిశ్చంద్రమహారాజు నేడు దుఃఖపీడితుడై శ్మశానమందు ఒంటరిగా తిరుగుచున్నాడు. ఆ శ్మశానము కపాలములు, కుండలు, ముంతలు, శవములపై వేసిన పువ్వులు, దండలు, కేశములు మొదలగు వాటితో భయంకరముగా ఉన్నది. ఇంకను మృతుల శరీరములనుంచి పైకి చిమ్ముచున్న కొవ్వు, ఎండిపోయిన కాష్ఠములు, పువ్వులు, చితియందలి భస్మము, బొగ్గులు, సగముకాలిన శవములు, ఎముకలు వీటితో నిండి భయంకరముగా ఉన్నది. ఇంకను గ్రద్దలు, డేగలు, నక్కలు, ధ్వని చేయుచుండగా భయముతో చిన్నచిన్న పక్షులు పారిపోవుచున్నవి. చితిమంటల పొగలచే దిక్కులన్నియు నీలవర్ణమును బొందినవి. ఇంకను ఆ శ్మశానమందు నిశాచరులగు రాక్షసులు మాంసభక్షణముచే సంతోషముగా ఉన్నారు.

ఏవముక్త్వా సమాశ్లిష్య కంఠం రాజ్ఞో నృపాత్మజా ।
కష్టశోకశతాధారా విలలాపాఽర్తయా గిరా ॥216॥

రాజసుతయగు శైబ్యాదేవి ఈ విధముగా పలికి, రాజు కంఠమును ఆలింగనము చేసుకొని, వందలకొలదీ కష్టములు శోకములకు ఆధారభూతమై, దుఃఖపూరితమైన వాక్కుతో విలపించెను.

రాజపత్నీ ఉవాచ – రాజపత్ని పలికెను.

రాజన్ ! స్వప్నోఽథ తథ్యం వా యదేతన్మన్యతే భవాన్ ।
తత్కథ్యతాం మహాభాగ ! మనో వై ముహ్యతే మమ ॥217॥

ఓ మహారాజా ! నేను చూచున్నదంతయు స్వప్నమా లేక నిజమా? ఓ మహాభాగా ! ఆ విషయమునంతయు నాకు చెప్పుము. నా మనస్సు మోహముతో నిండియున్నది.

యద్యేతదేవం ధర్మజ్ఞ నాస్తి ధర్మే సహాయతా ।
తథైవ విప్రదేవాదిపూజనే పాలనే భువః ॥218॥

ఓ ధర్మజ్ఞుడా ! ఈ నే చూచునదంతయు నిజమే అయినచో ధర్మదేవతయందు సహాయముచేయు ధర్మము లేదు. అట్లే విప్రులను, దేవతలను పూజించుటయందు, రాజ్యపాలన చేయుటయందు గూడా సహాయము లభించదు.

నాస్తి ధర్మః కుతస్సత్యమార్జవం చానృశంసతా ।
యత్ర త్వం ధర్మపరమః స్వరాజ్యాదవరోపితః ॥219॥

ఇట్లయినచో ధర్మము, సత్యము, సచ్ఛీలత, దయాస్వభావము ఎచ్చటున్నవని చెప్పగలము? ఎందువలననగా ధర్మమే పరమార్థమని భావించిన నిన్ను ఆ ధర్మమే రాజ్యభ్రంశుని గావించినది.

ఇతి తస్యా వచః శ్రుత్వా నిశ్వస్యోష్ణం సగద్గదమ్ ।
కథయామాస తన్వంగ్యా యథా ప్రాప్తా శ్వపాకతా ॥220॥

తన భార్య పలికిన మాటలను విని, హరిశ్చంద్రుడు గొంతు బొంగురుపోయి, వేడి నిట్టూర్పులు విడిచి, తాను చండాలుడగుటకు, కాటికాపరియగుటకు గల కారణమును ఆమెకు చెప్పెను.

రుదిత్వా సాఽపి సుచిరం నిశ్వస్యోష్ణం చ దుఃఖితా ।
స్వపుత్రమరణం భీరుర్యథావృత్తం న్యవేదయత్ ॥221॥

ధైర్యము నశించిన ఆమె కూడా చాలాసేపు రోదించి, వేడినిట్టూర్పులు విడిచి దుఃఖితురాలయ్యెను. అటుపిమ్మట ఆమె తమ కుమారుడగు రోహితాస్యుడెట్లు మరణించెనో చెప్పెను.

శ్రుత్వా రాజా తదా వాక్యం నిపపాత మహీతలే ।
మృతస్య పుత్రస్య తదా జిహ్వయా లేలిహన్ముఖమ్ ॥222॥

ఆమె చెప్పిన మాటలను విని, ఆ రాజు భూమిపై పడెను. ఇంకను చనిపోయిన తన కుమారుని ముఖమును నాలుకతో నాకుటను ప్రారంభించెను.

రాజా ఉవాచ – రాజు చెప్పాడు.

యమస్య భిక్షాం యాచావః కృపణౌ పుత్రగర్ధినౌ ।
తస్మాచ్ఛీఘ్రం వ్రజావోఽద్య పుత్రో యత్ర ప్రియో గతః ॥223॥

పుత్రుని కోరుకొనువారమగు మన మిరువురము పుత్రభిక్షను పెట్టుమని యమధర్మరాజును యాచించెదము. అందువలన ప్రియమైన మన పుత్రుడు పోయిన చోటుకే మనమూ పోయెదము.

ప్రియే న రోచయే దీర్ఘకాలం క్లేశముపాసితుమ్ ।
నాఽత్మాయత్తశ్చ తన్వంగి ! పశ్య మే మందభాగ్యతామ్ ॥224॥

ఓ ప్రియురాలా ! ఎక్కువకాలము కష్టములను సహించుటను నేనిష్టపడను. నా యాత్మ గూడా నా స్వాధీనమందు లేదు. ఓ కృశించినదానా ! నా దురదృష్టమెట్టిదో చూడుము.

చండాలేనాననుజ్ఞాతః ప్రవేక్ష్యే జ్వలనం యది ।
చండాలదాసతాం యాస్యే పునరప్యన్యజన్మని ॥225॥

చండాలుని అనుమతి లేకుండా యమలోకమునకు వెళ్ళుటకై నేను అగ్నిప్రవేశము చేసినచో రాబోవు జన్మయందు మరల నేను చండాలదాసునిగానే జన్మించవలసియుండును.

నరకే చ పతిష్యామి కీటకః కృమిభోజనః ।
వైతరణ్యాం మహాపూయవసాసృక్స్నాయుపిచ్ఛిలే ॥226॥

ఇంకనూ క్రిమికీటకములు భుజించుచు, కీటకమునై నరకమందు పడగలను. మలము, రక్తము, క్రొవ్వు, నరములతో పూరితమైన వైతరణీనదిలో పడగలను.

అసిపత్రవనే ప్రాప్య ఛేదం ప్రాప్స్యామి దారుణమ్ ।
తాపం ప్రాప్స్యామి వా ప్రాప్య మహారౌరవరౌరవౌ ॥227॥

అసిపత్రవనమందు ప్రవేశించి దారుణముగా ముక్కలు ముక్కలుగా అవ్వగలను. రౌరవ మహారౌరవ నరకములనుబొంది, తాపమును పొందగలను.

మగ్నస్య దుఃఖజలధౌ పారః ప్రాణవియోజనమ్ ।
ఏకోఽపి బాలకో యోఽయమాసీద్వంశకరః సుతః ॥228॥

దుఃఖమను సముద్రమందు మునిగిన నాకు ప్రాణత్యాగమే దుఃఖమునకు పరమావధియని తోచుచున్నది. వంశోద్ధారకుడగు నా కుమారబాలకుడు ఒక్కడూ ఎట్టి స్థితిని బొందెనో కదా !

మమ దైవాంబువేగేన మగ్నస్సోఽపి బలీయసా ।
కథం ప్రాణాన్విముంచామి పరాయత్తోఽస్మి దుర్గతః ॥229॥

మన కుమారుడగు రోహితాస్యుడు గూడా దైవమను నీళ్ళయొక్క వేగమువలన కాలసముద్రమందు మునిగిపోయెను కదా ! చండాలుని యాజ్ఞ ప్రకారము నడచుకోవలసిన నేను పరాయత్తుడను, దుర్గతిగలవాడను అగుటచే అతనియాజ్ఞ లేకుండ ప్రాణములనెట్లు వదలగలను?

అథవా నార్తినా క్లిష్టో నరః పాపమవేక్షతే ।
తిర్యక్త్వేనాపి తద్దుఃఖం నాసిపత్రవనే తథా ॥230॥

అయిననూ బాధలలో నున్న మానవుడు పాపములను చూడడు. అంతేగాక పశుపక్ష్యాదిజన్మబొందిననూ, అసిపత్రవనమందైననూ పొందే దుఃఖము పుత్రవియోగదుఃఖముతో సమానము కాదు.

వైతరణ్యాం కుతస్తాదృగ్యాదృశం పుత్రవిప్లవే ।
సోఽహం సుతశరీరేణ దీప్యమానే హుతాశనే ॥231॥

నిపతిష్యామి తన్వంగి ! క్షంతవ్యం కుకృతం మమ ।
అనుజ్ఞాతా చ గచ్ఛ త్వం విప్రవేశ్మ శుచిస్మితే ॥232॥

పుత్రవియోగమువలన కలుగునంత దుఃఖము వైతరణి మొదలగు నరకములందు కూడా ఉండదు. అందువలన నేను ప్రకాశించుచున్న అగ్నియందు పుత్రుని శరీరముతోబాటుగా పడెదను. ఓ తన్వంగీ! నా దుష్కర్మలను క్షమించుము. ఓ శుచిస్మితా! నాచేత అనుమతింపబడినదానవై బ్రాహ్మణగృహమునకు వెళ్ళుము.

మమ వాక్యం చ తన్వంగి ! నిబోధాఽదృతమానసా ।
యది దత్తం యది హుతం గురవో యది తోషితాః ॥233॥

పరత్ర సంగమో భూయాత్పుత్రేణ సహ చ త్వయా ।
ఇహ లోకే కుతస్త్వేతద్భవిష్యతి తవేంగితమ్ ॥234॥

ఓ తన్వంగీ ! నాయందు ఆదరముగల మనస్సుగలదానవై నేను చెప్పుదానిని తెలుసుకొనుము. నేనే గనుక దానము చేసినవాడను, హోమము చేసినవాడను, గురువులను సంతోషపెట్టినవాడను అయినచో మరుసటి జన్మమందు తప్పనిసరిగా నీతోనూ, కుమారునితోనూ నాకు కలయిక కలుగగలదు. ఈ లోకమందయితే నీ కిష్టమయిన ఇట్టి సంగమమెట్లు సంభవించగలదు?

త్వయా సహ మమ శ్రేయో గమనం పుత్రమార్గణే ।
యన్మయా హసతా కించద్రహస్యే వా శుచిస్మితే ॥235॥

అశ్లీలముక్తం తత్సర్వం క్షంతవ్యం మమ యాచతః ।
రాజపత్నీతి గర్వేణ నావజ్ఞేయః స తే ద్విజః ॥
సర్వయత్నేన తే తోష్యః స్వామీ దైవతవచ్ఛుభే ॥236॥

ఇప్పుడు నీతోడి సమాగమము కంటే పుత్రుని పొందుటకు మార్గమును అన్వేషించుటే నాకు శ్రేయఃకరము. (అందువలన నేనుకూడా మృతుడైన పుత్రునితో సహా అగ్నిప్రవేశము చేసి యమధర్మరాజుని పుత్రుని కొరకు యాచించెదను.) ఓ అందమైన చిరునవ్వుగలదానా ! నేను నవ్వుచూ లేదా రహస్యసమయమందు అశ్లీలముగా నేనేమైనా మాట్లాడియున్నచో యాచించుచున్న నన్ను మన్నించుము. ఇంకను నీవు రాజపత్నివను గర్వముతో నీవిప్పుడు యజమానిని నిరాదరణ చేయకుము. ఓ మంగళస్వరూపురాలా ! దైవతముతో సమానముగా అన్ని ప్రయత్నములతోనూ నీ ప్రభువు సంతోషపెట్టదగినవాడు.

రాజపత్నీ ఉవాచ – రాజపత్ని పలికెను.

అహమప్యత్ర రాజర్షే ! దీప్యమానే హుతాశనే ।
దుఃఖభారాఽసహాఽద్యైవ సహ యాస్యామి వై త్వయా ॥237॥

సహ స్వర్గం చ నరకం సహైవాఽవాం హి భుంక్ష్వహే ।
శ్రుత్వా రాజా తదోవాచ ఏవమస్తు పతివ్రతే ॥238॥

ఓ రాజర్షీ ! ఈ దుఃఖభారమును సహింపజాలని నేను కూడా నీతోబాటుగానే మండుచున్న చితిలో ప్రవేశించగలను. స్వర్గమును గాని నరకమును గాని కలిసియే మనమిరువురము అనుభవించెదము గాక ! భార్య పలికిన ఆ మాటలను విని "ఓ పతివ్రతా ! అట్లే కానిమ్ము" అని హరిశ్చంద్రమహారాజు పలికెను.

పక్షిణ ఊచుః – ధర్మపక్షులు చెప్పాయి.

తతః కృత్వా చితాం రాజా ఆరోప్య తనయం స్వకమ్ ।
భార్యయా సహితశ్చాసౌ బద్ధాంజలిపుటస్తదా ॥239॥

చింతయన్ పరమాత్మానమీశం నారాయణం హరిమ్ ।
హృత్కోటరగుహాసీనం వాసుదేవం సురేశ్వరమ్ ॥
అనాదినిధనం బ్రహ్మ కృష్ణం పీతాంబరం శుభమ్ ॥240॥

ఓ జైమినిమునీ ! అంతట హరిశ్చంద్రమహారాజు చితిని ఏర్పరచి, తన పుత్రుని మృతశరీరమును అందుంచి, భార్యతో కూడుకొన్నవాడై అంజలి జోడించి పరమాత్మను, పరమేశ్వరుని, నారాయణుని, హరిని, హృదయగుహయందు నివాసమున్న వాసుదేవుని, దేవతలకధిపతియైన ఇంద్రుని, ఆద్యంతములు లేని బ్రహ్మమును, కృష్ణుని, శుభములనిచ్చు విష్ణుమూర్తిని తలచుచున్నవాడై యుండెను.

తస్య చిన్తయమానస్య సర్వే దేవాః సవాసవాః ।
ధర్మం ప్రముఖతః కృత్వా సమాజగ్ముస్త్వరాన్వితాః ॥241॥

ఆగత్య సర్వే ప్రోచుస్తే భో భో రాజన్ శృణు ప్రభో ।
అయం పితామహస్సాక్షాద్ధర్మశ్చ భగవాన్ స్వయమ్ ॥242॥

సాధ్యాశ్చ విశ్వే మరుతో లోకపాలాస్సచారణాః ।
నాగాస్సిద్ధాస్సగంధర్వా రుద్రాశ్చైవ తథాశ్వినౌ ॥233॥

ఏతే చాన్యే చ బహవో విశ్వామిత్రస్తథైవ చ ।
విశ్వత్రయేణ యో మిత్రం కర్తుం వై నాశకత్ పురా ॥244॥

విశ్వామిత్రస్తు తే మైత్రీమిష్టం చాఽహర్తుమిచ్ఛతి ।
ఆరురోహ తతః ప్రాప్తా ధర్మః శక్రోఽథ గాధిజః ॥245॥

హరిశ్చంద్రుడిట్లు బ్రహ్మవిష్ణుమహేశ్వరులను వివిధదేవతలను మనస్సునందు ధ్యానించుచుండగా, దేవేంద్రునితోగూడా సమస్తదేవతలు ధర్మదేవతను ముందుంచుకొని శీఘ్రముగా రాజువద్దకు వచ్చిరి. వారందరూ వచ్చి ఈ విధముగా పలికిరి. "ఓ రాజా ! ఓ ప్రభూ ! మేము చెప్పు ఈ మాటను వినుము. ఇతడు సాక్షాత్తు బ్రహ్మదేవుడు. ఇతడు స్వయముగా ధర్మదేవుడు. ఇంకను వీరందరు సాధ్యులు, విశ్వేదేవతలు, మరుత్తులు,

లోకపాలకులు, చారణులు, నాగులు, సిద్ధులు, గంధర్వులు, రుద్రులు, అశ్వినీదేవతలు. వీరేగాక ఇంకా ఎందరో దేవతలు, విశ్వామిత్రుడు ఇచ్చటకు వచ్చి ఉన్నారు. పూర్వము ముల్లోకములవారితో స్నేహమును చేయుటకు సమర్థుడు కాని విశ్వామిత్రుడు నేడు నీతో మైత్రిని చేయుటకు, నీకిష్టమైనదానిని నెరవేర్చుటకు కోరుకొనుచున్నాడు". ఇట్లు దేవతలు పలికిన వెంటనే ధర్మదేవత, దేవేంద్రుడు, గాధిపుత్రుడగు విశ్వామిత్రుడు రాజువద్దకు ఏతెంచిరి.

ధర్మ ఉవాచ – ధర్మదేవత పలికెను.

మా రాజన్ ! సాహసం కార్షీర్ధర్మోఽహం త్వాముపాగతః ।
తితిక్షాదమసత్త్వాద్యైః స్వగుణైః పరితోషితః ॥246॥

ఓ రాజా! తొందరపడి సాహసమేమీ చేయకుము. ధర్మదేవతను నేను నీవద్దకు వచ్చియున్నాను. నీయొక్క సహనము, ఇంద్రియనిగ్రహము, సత్త్వము మొదలగు గుణములతో నేను సంతోషించితిని.

ఇంద్ర ఉవాచ – ఇంద్రుడు చెప్పాడు.

హరిశ్చంద్ర మహాభాగ ప్రాప్తః శక్రోఽస్మి తేఽన్తికమ్ ।
త్వయా సభార్యాపుత్రేణ జితా లోకాస్సనాతనాః ॥247॥

ఆరోహ త్రిదివం రాజన్ భార్యాపుత్రసమన్వితః ।
సుదుష్ప్రాపం నరైరన్యైర్జితమాత్మీయకర్మభిః ॥248॥

ఓ హరిశ్చంద్రా ! ఓ మహాభాగా ! నేను దేవేంద్రుడను, నీ సమీపమునకు వచ్చాను. నీవు భార్యాపుత్రులతో కూడినవాడవై శాశ్వతలోకములనన్నింటిని జయించితివి. ఓ రాజా ! నీవు భార్యాపుత్రసమేతుడవై స్వర్గలోకమును అధిరోహించుము. అది ఇతరజనులకు లభింపశక్యము కానిది, స్వీయపుణ్యకర్మలచే జయింపబడునది.

పక్షిణ ఊచుః – ధర్మపక్షులు చెప్పాయి.

తతోఽమృతమయం వర్షమపమృత్యువినాశనమ్ ।
ఇంద్రః ప్రాసృజదాకాశాచ్చితాస్థానగతః ప్రభుః ॥249॥

పుష్పవర్షం చ సుమహద్దేవదుందుభినిస్స్వనమ్ ।
తతస్తతో వర్తమానే సమాజే దేవసంకులే ॥250॥

పిమ్మట దేవతల అధిపతియగు ఇంద్రుడు చితిపై పరుండియున్న మృతబాలకుని వద్దకు వెళ్ళి, అపమృత్యువును నశింపచేయు అమృతమయవర్షమును కురిపించెను. అంతేగాక దేవతలు దుందుభులు మ్రోగించుచుండగా, దేవతాగణమంతా చేరి ఉండగా ఇంద్రుడు గొప్ప పుష్పవర్షమును కూడా కురిపించెను.

సముత్తస్థౌ తతః పుత్రో రాజ్ఞస్తస్య మహాత్మనః ।
సుకుమారతనుస్స్వస్థః ప్రసన్నేంద్రియమానసః ॥251॥

అంతట రాజపుత్రుడగు రోహితాస్యుడు సుకుమారశరీరముగలవాడై ప్రసన్నమైన ఇంద్రియములు, మనస్సుగలవాడై, స్వస్థుడై చితినుండి పైకి లేచెను.

తతో రాజా హరిశ్చంద్రః పరిష్వజ్య సుతం క్షణాత్ ।
సభార్యః సుశ్రియా యుక్తో దివ్యమాల్యాంబరాన్వితః ॥252॥

పిమ్మట హరిశ్చంద్రమహారాజు ఆ వెంటనే తన కుమారుని ఆలింగనము చేసుకొని భార్యతోనూ, సంపదలతోనూ కూడుకొన్నవాడై దివ్యములైన మాలలతో కూడుకొన్నవాడాయెను.

స్వస్థః సంపూర్ణహృదయో ముదా పరమయా యుతః ।
బభూవ తత్క్షణాదింద్రో భూయశ్చైనమభాషత ॥253॥

అప్పుడు హరిశ్చంద్రుడు స్వస్థతనుపొంది, సంపూర్ణసంతృప్తహృదయము కలిగి, పరమమైన సంతోషముతో నిలిచెను. ఆ వెంటనే మరల ఇంద్రుడు హరిశ్చంద్రునితో నిట్లు పలికెను.

సభార్యస్త్వం సపుత్రశ్చ ప్రాప్స్యసే సద్గతిం పరామ్ ।
సమారోహ మహాభాగ ! నిజానాం కర్మణాం ఫలైః ॥254॥

నీవు భార్యాపుత్రులతో కూడా ఉత్తమములగు సద్గతులను పొందగలవు. ఓ మహాభాగా ! నీవు చేసుకొన్న పుణ్యకర్మల ఫలముల కారణముగా స్వర్గమును అధిరోహించుము.

హరిశ్చంద్ర ఉవాచ – హరిశ్చంద్రుడు చెప్పాడు.

దేవరాజాననుజ్ఞాతః స్వామినా శ్వపచేన వై ।
అగత్వా నిష్కృతిం తస్య నాఽరోక్ష్యేఽహం సురాలయమ్ ॥255॥

ఓ దేవరాజా ! ఇంద్రా ! నా ప్రభువగు చండాలుని యాజ్ఞ పొందక, అతనివద్ద ఋణవిముక్తిని పొందక నేను స్వర్గలోకమును అధిరోహించజాలను.

ధర్మ ఉవాచ – ధర్మదేవత పలికెను.

తవైనం భావినం క్లేశమవగమ్యాఽత్మమాయయా ।
ఆత్మా శ్వపాకతాం నీతో దర్శితం తచ్చ చాపలమ్ ॥256॥

ఓ రాజా ! నీకు రాబోయే కష్టమును తెలుసుకొని, నా మాయచేతనే నేను చండాలరూపమును ధరించి, చాపల్యముతో కూడిన నా ప్రవర్తనను నీకు చూపించితిని.

ఇంద్ర ఉవాచ:– ఇంద్రుడు చెప్పాడు.

ప్రార్థ్యతే యత్పరం స్థానం సమస్తైర్మనుజైర్భువి ।
తదారోహ హరిశ్చంద్ర స్థానం పుణ్యకృతాం నృణామ్ ॥257॥

ఓ హరిశ్చంద్రా ! భూలోకమందలి సమస్తమానవులచేత కోరుకొనబడునదై పుణ్యాత్ములగు మానవుల ఉత్కృష్టస్థానమైన స్వర్గమును అధిరోహించుము.

హరిశ్చంద్ర ఉవాచ – హరిశ్చంద్రుడు చెప్పాడు.

దేవరాజ నమస్తుభ్యం వాక్యం చైతన్నిబోధ మే ।
ప్రసాదసుముఖం యత్త్వాం బ్రవీమి ప్రశ్రయాన్వితః ॥258॥

ఓ దేవరాజా ! దేవేంద్రా ! నీకు నమస్కారము. వినయపూర్వకముగా ప్రసన్నుడవగు నీకు చెప్పు ఈ మాటలను గ్రహించుము.

మచ్ఛోకమగ్నమనసః కోసలానగరే జనాః ।
తిష్ఠంతి తానపోహ్యాద్య కథం యాస్యామ్యహం దివమ్ ॥259॥

అయోధ్యావాసులగు జనులు నా గురించి శోకమందు మునిగియున్నారు. వారిని వదిలి నేడు స్వర్గమునకు నేనెట్లు వెళ్ళగలను?

బ్రహ్మహత్యా గురోర్ఘాతో గోవధః స్త్రీవధస్తథా ।
తుల్యమేభిర్మహాపాపం భక్తత్యాగేఽప్యుదాహృతమ్ ॥260॥

బ్రహ్మహత్య, గురుహత్య, గోహత్య, మరియు స్త్రీహత్య చేసినట్లయిన ఎట్టి పాపము కలుగునో అట్టి పాపముతో సమానమైన పాపమే భక్తులను విడిచిపెట్టినచో కూడా కలుగునని పెద్దలు చెప్పుచున్నారు.

భజన్తం భక్తమత్యాజ్యమదుష్టం త్యజతస్సుఖమ్ ।
నేహ నాముత్ర పశ్యామి తస్మాచ్ఛక్ర దివం వ్రజ ॥261॥

దైవమును కొలుచువాడు, విడువబడుటకు తగనివాడు, సజ్జనుడు అగు భక్తుని విడిచిపెట్టువానికి ఇహపరలోకములందు సుఖమును నేను చూచుట లేదు. అందువలన ఓ దేవేంద్రా! నీవొక్కడివే స్వర్గమునకు పొమ్ము.

యది తే సహితాస్స్వర్గం మయా యాన్తి సురేశ్వర ।
తతోఽహమపి యాస్యామి నరకం వాఽపి తైస్సహ ॥262॥

ఓ దేవేంద్రా ! నాతో గూడా అయోధ్యావాసులుగూడా స్వర్గమునకు వచ్చునట్లయిన నేను కూడా వారితో స్వర్గమునకు వెళ్ళెదను. లేనిచో వారితో నరకమునకైననూ బోయెదను.

ఇంద్ర ఉవాచ – ఇంద్రుడు చెప్పాడు.

బహూని పుణ్యపాపాని తేషాం భిన్నాని వై పృథక్ ।
కథం సంఘాతభోగ్యత్వం భూయస్స్వర్గమవాప్స్యసి ॥263॥

ఓ రాజా ! అయోధ్యాపురజనుల పుణ్యపాపములు వేరువేరుగా ఉన్నవి. ఒక్కవిధముగా లేవు. అట్టి జనసమూహముతో స్వర్గమెట్లు అనుభవింపదగును? ఇప్పుడు నీవు స్వర్గమును అధిరోహణము చేయనిచో తిరిగి ఎప్పుడు స్వర్గమును పొందగలవు?

హరిశ్చంద్ర ఉవాచ – హరిశ్చంద్రుడు చెప్పాడు.

శక్ర భుంక్తే నృపో రాజ్యం ప్రభావేణ కుటుంబినామ్ ।
యజతే చ మహాయజ్ఞైః కర్మ పౌర్తం కరోతి చ ॥264॥

ఓ దేవేంద్రా ! కుటుంబికుల ప్రభావము చేతనే రాజు రాజ్యమును అనుభవించును. గొప్పయజ్ఞయాగాది కర్మలను నిర్వర్తించును. వాపీకూపతటాకాది నిర్మాణములను చేయును.

తచ్చ తేషాం ప్రభావేణ మయా సర్వమనుష్ఠితమ్ ।
ఉపకర్తౄన్ న సంత్యక్ష్యే తానహం స్వర్గలిప్సయా ॥265॥

నేను చేసిన సర్వపుణ్యకార్యములు ఆ పురజనుల ప్రభావము వల్లనే ఆచరింపబడినవి. స్వర్గమును పొందవలెనను కోరికతో నాకుపకారము చేసినవారిని విడువజాలను.

తస్మాద్యన్మమ దేవేశ ! కించిదస్తి సుచేష్టితమ్ ।
దత్తమిష్టమథో జప్తం సామాన్యం తైస్తదస్తు నః ॥266॥

అందువలన ఓ దేవేంద్రా! నేను చేసిన దానము, నేను ఆచరించిన యజ్ఞయాగాదులు, నేను చేసిన జపములు వంటి పుణ్యకార్యములేమైనా యున్నచో వాటి ఫలము ఆ పురజనులతో సమానముగా నాకు చెందును గాక !

బహుకాలోపభోగ్యం హి ఫలం యన్మమ కర్మణః ।
తదస్తు దినమప్యేకం తైః సమం త్వత్ప్రసాదతః ॥267॥

నేను ఆచరించిన సుకృతకర్మకు చాలాకాలము అనుభవింపదగిన ఫలమున్నచో ఆ ఫలము నీ అనుగ్రహముతో నా పురజనులతోబాటుగా ఒక్క రోజు అయినను చాలును.

పక్షిణ ఊచుః – ధర్మపక్షులు చెప్పాయి.

ఏవం భవిష్యతీత్యుక్త్వా శక్రస్త్రిభువనేశ్వరః ।
ప్రసన్నచేతా ధర్మశ్చ విశ్వామిత్రశ్చ గాధిజః ॥268॥

గత్వాఽఽశు నగరం సర్వే చాతుర్వర్ణ్యసమాయుతమ్ ।
హరిశ్చంద్రస్య నికటే ప్రోవాచ విబుధాధిపః ॥269॥

ఆగచ్ఛంతు జనాశ్శీఘ్రం స్వర్గలోకం సుదుర్లభమ్ ।
ధర్మప్రసాదాత్ సంప్రాప్తం సర్వైర్యుష్మాభిరేవ తు ॥270॥

విమానకోటిసంబద్ధం స్వర్గలోకాన్మహీతలమ్ ।
గత్వాఽ యోధ్యాజనం ప్రాహ దివమారుహ్యతామితి ॥271॥

ఓ హరిశ్చంద్రమహారాజా ! నీవు దలచినట్లే కాగలదని చెప్పి త్రిలోకాధిపతియగు దేవేంద్రుడు, ప్రసన్నచిత్తుడగు ధర్మదేవుడు, గాధిపుత్రుడగు విశ్వామిత్రుడు ముగ్గురునూ శీఘ్రముగా నాలుగువర్ణములుగల జనముతో కూడుకొన్న అయోధ్యానగరమునకు వెళ్ళిరి. వారిలో దేవతల అధిపతియగు దేవేంద్రుడు హరిశ్చంద్రునికి వినిపించునట్లుగా ఇట్లు పలికెను. "జనులందరు శీఘ్రముగా ఇచ్చటకు రండు, పొందుటకు కష్టసాధ్యమైన స్వర్గలోకము ధర్మదేవతయనుగ్రహముచే మీ అందరితోబాటుగా హరిశ్చంద్రునికి సంప్రాప్తమైనది." ఆ సమయమున కోట్లకొలది విమానములు భూలోకమునకు వచ్చినవి. అప్పుడు ఇంద్రుడు అయోధ్యాపురజనులందరితో "స్వర్గమును అధిరోహించుడు" అని మరల చెప్పెను.

తదేంద్రస్య వచశ్శ్రుత్వా ప్రీత్యా తస్య చ భూపతేః ।
ఆనీయ రోహితాశ్వం చ విశ్వామిత్రో మహాతపాః ॥272॥

అయోధ్యాఖ్యే పురే రమ్యే సోఽభ్యషించన్నృపాత్మజమ్ ।
దేవైశ్చ మునిభిస్సిద్ధైరభిషిచ్య నరాధిపః ॥273॥

రాజ్ఞా సహ తదా సర్వే హృష్టపుష్టసుహృజ్జనాః ।
సపుత్రభృత్యదారాస్తే దివమారురుహుర్జనాః ॥274॥

అప్పుడు ఇంద్రుని మాట విని సంతోషముతో మహాతపస్వియగు విశ్వామిత్రుడు ఆ భూపతియొక్క కుమారుడగు రోహితాశ్వుని తీసుకొని వచ్చెను. హరిశ్చంద్రకుమారుడగు ఆ రోహితాశ్వునికి విశ్వామిత్రుడు అందమైన అయోధ్యానగరమందు రాజ్యపట్టాభిషేకము చేసెను. పిమ్మట నరాధిపతియగు హరిశ్చంద్రుడు తన కుమారుని పట్టాభిషిక్తుని గావించెను. అటుపిమ్మట అయోధ్యాపురజనులు హర్షముతో గూడిన చిత్తముగలవారై పుత్రభృత్యకళత్రసమేతముగా హరిశ్చంద్రునితోబాటు స్వర్గాధిరోహణము చేసిరి.

పదే పదే విమానాత్తే విమానమగమన్నరాః ।
తదా సంభూతహర్షోఽసౌ హరిశ్చంద్రశ్చ పార్థివః ॥275॥

సంప్రాప్య భూతిమతులాం విమానైః స మహీపతిః ।
ఆసాంచక్రే పురాకారే వప్రప్రాకారసంవృతే ॥276॥

అడుగడుగున విమానములు వచ్చియుండుటచే ఆ పురప్రజలు ఒక విమానము నుండి మరియొక విమానమునకు బోవుచుండిరి. అప్పుడు హరిశ్చంద్రమహారాజు ఆనందించి, సాటిలేని ఐశ్వర్యమును పొంది, ఆ పురప్రజలు అధిష్ఠించిన విమానములతో బాటు వప్రప్రాకారములతో చుట్టబడిన పట్టణాకారమును బోలిన స్వర్గలోకమును పొందెను.

తతస్తస్యర్ధిమాలోక్య శ్లోకం తత్రోశనా జగౌ ।
దైత్యాచార్యో మహాభాగస్సర్వశాస్త్రార్థతత్త్వవిత్ ॥277॥

అంతట సమస్తశాస్త్రముల అర్థతత్త్వమునెరిగినవాడు, రాక్షసగురువు, మహానుభావుడు అగు ఉశనస్ దేవత (అనగా శుక్రాచార్యుడు) ఆ హరిశ్చంద్ర మహారాజు సమృద్ధిని చూచి ఒక శ్లోకమును పాడెను.

శుక్ర ఉవాచ – శుక్రాచార్యుడు చెప్పాడు.

హరిశ్చంద్రసమో రాజా న భూతో న భవిష్యతి ।
యశ్చైతచ్ఛృణుయాద్భక్త్యా నైరంతర్యేణ మానవః ॥278॥

తేన వేదాః పురాణాని సర్వే మంత్రాస్సుసంగ్రహాః ।
తుష్టాస్స్యుః పుష్కరే తీర్థే ప్రయాగే సింధుసాగరే ॥279॥

దేవాలగారే కురుక్షేత్రే వారాణస్యాం విశేషతః ।
విషువద్గ్రహణే చైవ యత్ఫలం జపతో లభేత్ ॥280॥

హరిశ్చంద్రునితో సమానమైన రాజు ఇంతవరకు లేదు, ఈ పైన పుట్టబోడు. ఏ మానవుడయితే ఈ హరిశ్చంద్రోపాఖ్యానమును భక్తితో ఎల్లప్పుడు వింటాడో అతనిచేత వేదాలు, పురాణాలు, సమస్తమంత్రాలు సులభంగా గ్రహింపబడి సంతుష్టిని పొందుతాయి. ఇంకనూ పుష్కరతీర్థములు, ప్రయాగ, సింధుసాగరము, దేవాలయములు, కురుక్షేత్రము, వారాణసి, సంక్రమణము వంటి పుణ్యతిథులయందు జపముచేసిన ఫలము ఈ ఉపాఖ్యానమును విన్నచో లభించును.

తత్ఫలం ద్విగుణం చైవ సంయతాత్మా శృణోతి యః ।
శ్రుత్వా చ పూజయేద్భక్త్యా పురాణజ్ఞం ద్విజోత్తమమ్ ॥281॥

గోభూహిరణ్యవస్త్రైశ్చ తథైవాన్నేన జైమినే ।
యేనైవం యత్కృతం పుణ్యం తచ్ఛక్యం న మయోదితుమ్ ॥282॥

అహో తితిక్షామాహాత్మ్యమహో దానఫలం మహత్ ।
యదా గతో హరిశ్చంద్రః పురీం చేంద్రత్వమాప్తవాన్ ॥283॥

ఏ నరుడయితే ఇంద్రియనిగ్రహము కలిగి భక్తిశ్రద్ధలతో ఈ ఉపాఖ్యానమును వింటాడో అతడికి రెండు రెట్లు పుణ్యఫలము లభించును. ఓ జైమినిమహర్షీ ! ఈ హరిశ్చంద్రోపాఖ్యానమును విని ద్విజశ్రేష్ఠుడగు అట్టి పురాణవక్తను గోవులు, భూమి, బంగారము, వస్త్రములు, అన్నము వీటిని దానము చేసి పూజించవలెను. ఈ విధముగా చేసినవారి పుణ్యము ఎంత గొప్పదో నేను వర్ణించి చెప్పజాలను. ఆహా ! త్యాగము చేయవలెనను కోరిక ఎంత ప్రభావము గలది? ఆహా ! దానఫలము ఎంత గొప్పది? ఎందువలననగా ఇట్టి తితిక్షాదానములచేతనే హరిశ్చంద్రుడు తన పురజనులతో సహా స్వర్గపురికి వెళ్ళినవెంటనే ఇంద్రపదవిని పొందెను.

పక్షిణ ఊచుః – ధర్మపక్షులు చెప్పాయి.

ఏతత్తే సర్వమాఖ్యాతం హరిశ్చంద్రవిచేష్టితమ్ ।
యః శృణోతి సుదుఃఖార్తః స సుఖం మహదాప్నుయాత్ ॥284॥

స్వర్గార్థీ ప్రాప్నుయాత్స్వర్గం పుత్రార్థీ పుత్రమాప్నుయాత్ ।
భార్యార్థీ ప్రాప్నుయాద్భార్యాం రాజ్యార్థీ రాజ్యమాప్నుయాత్ ॥285॥

ఓ జైమినిమునీ ! హరిశ్చంద్రుడు చేసిన పుణ్యకార్యములనన్నింటినీ నీకు చెప్పితిమి. గొప్పదుఃఖములతో కూడినవాడైననూ ఎవడయితే ఇట్టి హరిశ్చంద్రోపాఖ్యానమును వినునో అతడు సమస్తదుఃఖములను పోగొట్టుకొని గొప్ప సుఖమును పొందగలడు. ఇంకనూ ఈ కథాశ్రవణముచే స్వర్గమును కోరుకొనువాడు స్వర్గమును, పుత్రులను కోరుకొనువాడు పుత్రులను, భార్యను కోరుకొనువాడు భార్యను, రాజ్యమును కోరుకొనువాడు రాజ్యమును పొందగలడు.

అతః పరం కథాశేషం శ్రూయతాం మునిసత్తమ ।
విపాకో రాజసూయస్య పృథివీక్షయకారణమ్ ॥
తద్విపాకనిమిత్తం చ యుద్ధమాడిబకం మహత్ ॥286॥

ఓ జైమినిమునీ ! ఇప్పుడు ఆ తర్వాత జరిగిన కథాశేషము అనగా రాజసూయయాగమును నిర్వర్తించుటవలన కలిగిన పృథివీక్షయకారణమగు ఫలము, దానివలన సంభవించిన ఆడిబకయుద్ధము (పక్షివిశేషము మరియు కొంగలమధ్య యుద్ధము) వీటిని చెప్పెదము వినుము.

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే హరిశ్చంద్రోపాఖ్యానం నామ అష్టమోఽధ్యాయః ॥8॥

శ్రీ మార్కండేయ మహాపురాణమందు హరిశ్చంద్రోపాఖ్యానమను ఎనిమిదవ అధ్యాయం సమాప్తం.



నవమోఽధ్యాయః – తొమ్మిదవ అధ్యాయం
ఆడిబకయుద్ధమ్ – ఆడిబకయుద్ధం
(పక్షివిశేషం లేదా మత్స్యవిశేషం మరియు కొంగల మధ్య యుద్ధం)

పక్షిణ ఊచుః – ధర్మపక్షులు చెప్పాయి.

రాజ్యచ్యుతే హరిశ్చంద్రే గతే చ త్రిదశాలయమ్ ।
నిశ్చక్రామ మహాతేజా జలవాసాత్పురోహితః ॥1॥

వసిష్ఠో ద్వాదశాబ్దాన్తే గంగాపర్యుషితో మునిః ।
శుశ్రావ చ సమస్తం తు విశ్వామిత్రవిచేష్టితమ్ ॥2॥

హరిశ్చంద్రస్య నాశం చ రాజ్ఞశ్చోదారకర్మణః ।
చండాలసంప్రయోగం చ భార్యాతనయవిక్రయమ్ ॥3॥

ఓ జైమినిమహర్షీ! హరిశ్చంద్రుడు రాజ్యభ్రష్టుడై స్వర్గమునకు వెళ్ళినపిమ్మట గొప్ప తేజశ్శాలి, పురోహితుడూ అగు వసిష్ఠమహర్షి తపోనిమిత్తమైన జలనివాసము నుండి బయటకు వచ్చెను. పన్నెండు సంవత్సరములవరకు గంగయందుండి తపస్సు చేసి ఆ తపస్సమాధినుండి బయటకు వచ్చిన పిమ్మట ఆ వసిష్ఠమహాముని విశ్వామిత్రుడు ఆచరించిన చెడు చేష్టలను అనగా ఉదారస్వభావముగల హరిశ్చంద్రమహారాజుయొక్క రాజ్యభ్రంశము, చండాలునితో సంబంధము, తన భార్యాపుత్రులను అమ్ముకొనుట వంటి సమస్త కర్మలను వినెను.

స శ్రుత్వా సుమహాభాగః ప్రీతిమానవనీపతౌ ।
చకార కోపం తేజస్వీ విశ్వామిత్రమృషిం ప్రతి ॥4॥

భూపతియగు హరిశ్చంద్రమహారాజునందు మిక్కిలి ప్రీతిగల తేజోవంతుడగు ఆ వసిష్ఠమహర్షి విశ్వామిత్రుని చెడు చేష్టలన్నింటినీ విని అతనిపట్ల కోపముగలవాడయ్యెను.

వసిష్ఠ ఉవాచ – వసిష్ఠుడు చెప్పాడు.

మమ పుత్రశతం తేన విశ్వామిత్రేణ ఘాతితమ్ ।
తత్రాపి నాభవత్ క్రోధస్తాదృశో యాదృశోఽద్య మే ॥5॥

శ్రుత్వా నరాధిపమిమం స్వరాజ్యాదవరోపితమ్ ।
మహాత్మానం మహాభాగం దేవబ్రాహ్మణపూజకమ్ ॥6॥

తన రాజ్యమునుండి భ్రష్టుడు గావింపబడినవాడు, మహాత్ముడు, మహాభాగుడు, దేవతలు బ్రాహ్మణులను పూజించువాడునూ అగు హరిశ్చంద్రమహారాజును గురించి విన్న పిమ్మట నాకెంతటి కోపము కలుగుచున్నదో అంతటి కోపము విశ్వామిత్రుడు నా నూరుగురు కుమారులను చంపినప్పుడు కూడా రాలేదు.

యస్మాత్స సత్యవాక్ఛాంతః శత్రావపి విమత్సరః ।
అనాగాశ్చైవ ధర్మాత్మా అప్రమత్తో మదాశ్రయః ॥7॥

సపత్నీభృత్యపుత్రస్తు ప్రాపితోఽన్యాం దశాం నృపః ।
స రాజ్యాచ్చ్యావితోఽనేన బహుశశ్చ ఖిలీకృతః ॥8॥

తస్మాద్దురాత్మా బ్రహ్మద్విడ్యజ్వినామవరోపకః ।
మచ్ఛాపోపహతో మూఢః స బకత్వమవాప్స్యసి ॥9॥

సత్యమును పలుకువాడు, శాంతస్వభావుడు, శత్రువుపట్లగూడ మాత్సర్యము లేనివాడు, పాపరహితుడు, ధర్మాత్ముడు, ప్రమత్తుడు కానివాడు, నన్ను ఆశ్రయించినవాడు అగు హరిశ్చంద్ర మహారాజు విశ్వామిత్రునిచేత భార్యాపుత్ర సమేతముగా కష్టదశను పొందింపబడి రాజ్యమునుండి భ్రంశము గావింపబడినాడు, నీచమైన స్థితిని పొందింపబడినవాడయ్యెను. అట్టి దురాత్ముడు, బ్రహ్మద్వేషి, యాగము చేయువారికి విఘ్నములు కలిగించువాడు, మూఢుడు అగు విశ్వామిత్రుడు నా శాపము చేత కొట్టబడి కొంగగా జన్మించగలడు.

పక్షిణ ఊచుః – పక్షులు చెప్పాయి.

శ్రుత్వా శాపం మహాతేజా విశ్వామిత్రోఽపి కౌశికః ।
త్వమప్యాడిర్భవస్వేతి ప్రతిశాపమయచ్ఛత ॥10॥

కుశికవంశోద్భవుడు, గొప్ప తేజస్సంపన్నుడూ అగు విశ్వామిత్రుడు కూడా వసిష్ఠమహర్షి శాపమును విని "నీవు కూడా ఆడి జన్మను పొందుదువుగాక" (అనగా పక్షివిశేషము లేదా మత్స్యవిశేషముగా పుట్టెదవు గాక) అని ప్రతిశాపమిచ్చెను.

అన్యోన్యశాపాత్తౌ ప్రాప్తౌ తిర్యక్త్వం పరమద్యుతీ ।
వసిష్ఠః స మహాతేజా విశ్వామిత్రశ్చ కౌశికః ॥11॥

గొప్ప తేజస్సంపన్నులగు వసిష్ఠమహర్షి, విశ్వామిత్రమహర్షి ఇరువురూ శ్రేష్ఠమైన ప్రకాశముగలవారై పరస్పరశాపము కారణముగా తిర్యగ్జన్మను పొందిరి.

అన్యజాతిసమాయోగం గతావప్యమితౌజసౌ ।
యుయుధాతేఽతిసంరబ్ధౌ మహాబలపరాక్రమౌ ॥12॥

అమితమగు తేజస్సుతోకూడిన వసిష్ఠవిశ్వామిత్రులు తిర్యగ్జన్మను పొందిననూ మహాబలపరాక్రమములు గలవారై మిక్కిలి సంరంభముతో పరస్పరము యుద్ధము చేసుకొనిరి.

యోజనానాం సహస్రే ద్వే ప్రమాణేనాఽడిరుచ్ఛ్రితః ।
షణ్ణవత్యధికం బ్రహ్మన్ సహస్రత్రితయం బకః ॥13॥

ఓ బ్రహ్మస్వరూపుడా! ఆడిపక్షి రెండువేల యోజనముల ప్రమాణముతో వృద్ధిపొందగా, బకము మూడువేలతొంభైఆరు యోజనముల ప్రమాణముతో వృద్ధిపొందెను.

తౌ తు పక్షప్రహారాభ్యామన్యోన్యస్యోరువిక్రమౌ ।
ప్రహరన్తౌ భయం తీవ్రం ప్రజానాం చక్రతుస్తదా ॥14॥

మిక్కిలి అధికమైన పరాక్రమముగల ఆ రెండు పక్షులు పరస్పరము తమ రెక్కల దెబ్బలచే ఒకరినొకరు కొట్టుకొనుచూ ప్రజలకు తీవ్రమైన భయమును కలిగించినవయ్యెను.

విధూయ పక్షాణి బకో రక్తోద్వృత్తాక్షిరాహనత్ ।
ఆడిం సోఽప్యున్నతగ్రీవో బకం పద్భ్యామతాడయత్ ॥15॥

బకము గుడ్లనెర్రజేసినదై రెక్కలను విదల్చుచు ఆడిపక్షిని రెక్కలతో కొట్టెను. ఆ ఆడిపక్షి కూడా ఎత్తైన మెడ కలదై తన పాదములతో బకమును కొట్టెను.

తయోః పక్షానిలాపాస్తాః ప్రపేతుర్గిరయో భువి ।
గిరిప్రపాతాభిహతా చకంపే చ వసుంధరా ॥16॥

వాటి రెక్కల గాలిచే విసిరికొట్టబడిన పర్వతములు భూమిపై పడినవి. పర్వతములు తనపై పడినందువలన కొట్టబడిన భూదేవి కంపించెను.

క్ష్మా కంపమానా జలధీనుద్వృత్తాంబూంశ్చకార చ ।
ననామ చైకపార్శ్వేన పాతాలగమనోన్ముఖీ ॥17॥

భూదేవి కంపించుచున్నదై సముద్రములను ఉప్పొంగిన జలములు కలిగినట్టివిగా చేసెను. పాతాళమును గూర్చి వెళ్ళుటకు ఉన్ముఖురాలైన ఆ భూమి ఒక ప్రక్కకు ఒరిగెను.

కేచిద్గిరినిపాతేన కేచిదంబోధివారిణా ।
కేచిన్మహీసంచలనాత్ ప్రయయుః ప్రాణినః క్షయమ్ ॥18॥

ఆ సమయమందు కొందరు ప్రాణులు పర్వతములు పడుటచేతనూ, కొందరు సముద్రజలముల కారణముగానూ, కొందరు భూకంపమువల్లనూ నాశమును పొందిరి.

ఇతి సర్వం పరిత్రస్తం హాహాభూతమచేతనమ్ ।
జగదాసీత్ సుసంభ్రాన్తం పర్యస్తక్షితిమండలమ్ ॥19॥

ఈ విధముగా సమస్తప్రపంచము భయమునొందినదై హాహాకారములతో అచేతనమై మూర్ఛిల్లి విపరీతస్థితిగల భూమండలము కల్గినదయ్యెను.

హా వత్స హా కాంత శిశో ప్రయాహ్యేషోఽస్మి సంస్థితః ।
హా ప్రియే కాంత శైలోఽయం పతత్యాశు పలాయతామ్ ॥20॥

ఇత్యాకులీకృతే లోకే సంత్రాసవిముఖే తదా ।
సురైః పరివృతస్సర్వైరాజగామ పితామహః ॥21॥

"ఓ కుమారా ! ఓ కాంతా ! ఓ శిశువా ! నీవు శీఘ్రముగా పారిపొమ్ము. నేనీ యవస్థలోనుంటిని. ఓ ప్రియురాలా! ఓ కాంతా ! ఈ పర్వతము పడిపోవుచున్నది. శీఘ్రముగా పారిపొండు." ఈ విధముగా జనులందరూ

భీతచిత్తులై విలపించుచూ ఒకరికొకరు సంబంధములేనివారైయుండగా బ్రహ్మదేవుడు దేవతలందరితోనూ కూడుకొన్నవాడై ఆ యుద్ధప్రదేశమునకు వచ్చెను.

ప్రత్యువాచ చ విశ్వేశస్తావుభావతికోపితౌ ।
యుద్ధం వాం విరమత్వేతల్లోకాః స్వాస్థ్యం ప్రజంతు చ ॥22॥

బ్రహ్మదేవుడు మిక్కిలి కోపముతో కూడుకొన్న వారిరువురిని గూర్చి (ఆడిబక రూపములలోనున్న వసిష్ఠవిశ్వామిత్రులను గూర్చి) ఇట్లు పలికెను. "మీ ఇరువురి యుద్ధము విరమింపబడుగాక ! ఈ లోకములన్నియూ స్వస్థతను (యథాతథస్థితిని) పొందుగాక !"

శృణ్వన్తావపి తౌ వాక్యం బ్రహ్మణోఽవ్యక్తజన్మనః ।
కోపామర్షసమావిష్టౌ యుయుధాతే న తస్థతుః ॥23॥

వ్యక్తముకాని పుట్టుకగల ఆ బ్రహ్మదేవుని వాక్యమును విన్నా కూడా కోపము మరియు అసహనములతో కూడుకొన్న ఆ ఇరువురూ యుద్ధము చేయుచునే యుండిరి. యుద్ధమును ఆపకుండిరి.

తతః పితామహో దేవస్తం దృష్ట్వా లోకసంక్షయమ్ ।
తయోశ్చ హితమన్విచ్ఛంస్తిర్యగ్భావమపానుదత్ ॥24॥

అంతట పితామహుడగు బ్రహ్మదేవుడు లోకనాశమును కల్గించుచున్న ఆ యుద్ధమును చూచి, వారిరువురికి హితమును చేయగోరి వారిరువురియందున్న తిర్యగ్భావమును (పక్షిజన్మను) పోగొట్టెను.

తతస్తౌ పూర్వదేహస్థౌ ప్రాహ దేవః ప్రజాపతిః ।
వ్యుదస్తే తామసే భావే వసిష్ఠకౌశికర్షభౌ ॥25॥

అంతట తామసభావము నశించి తమ పూర్వదేహమును పొందిన ఆ వసిష్ఠవిశ్వామిత్రులను గూర్చి బ్రహ్మదేవుడిట్లు పలికెను.

ఏహి వత్స వసిష్ఠ త్వం త్వం చ కౌశికసత్తమ ।
తామసం భావమాశ్రిత్య ఈదృగ్యుద్ధం చికీర్షితమ్ ॥26॥

ఓ వత్సా ! వసిష్ఠా ! నీవిటురమ్ము. ఓ వత్సా ! విశ్వామిత్రుడా ! నీవు కూడా ఇటు రమ్ము. తామసభావము కారణముగానే మీరిరువురు ఇట్టి యుద్ధమును చేయదలచితిరి.

రాజసూయవిపాకోఽయం హరిశ్చంద్రస్య భూపతేః ।
యువయోర్విగ్రహశ్చాయం పృథివీక్షయకారకః ॥27॥

మీ ఇరువురి యుద్ధము మరియు హరిశ్చంద్రమహారాజుయొక్క రాజసూయయాగము ఈ భూలోకనాశమునకు కారణమగుచున్నది. (రాజులందరనూ ఓడించుటే లక్ష్యముగాగల రాజసూయయాగమువలన కూడా ప్రజలకు కష్టములు కలుగునని భావము).

న చాపి కౌశికశ్రేష్ఠస్తస్య రాజ్ఞోఽపరాధ్యతి ।
స్వర్గప్రాప్తికరో బ్రహ్మన్నుపకారపదే స్థితః ॥28॥

ఓ బ్రహ్మర్షీ ! వసిష్ఠా ! కౌశికశ్రేష్ఠుడగు విశ్వామిత్రుడు ఈ హరిశ్చంద్రమహారాజుకు ఎట్టి అపరాధము చేయలేదు. అంతేగాక హరిశ్చంద్రునికి స్వర్గమును పొందింపచేసి ఉపకారము చేయు స్థానమందు విశ్వామిత్రుడు నిలిచినాడు.

తపోవిఘ్నస్య కర్తారౌ కామక్రోధవశం గతౌ ।
పరిత్యజత భద్రం వో బ్రాహ్మం హి ప్రచురం బలమ్ ॥29॥

మీరిరువురు కామక్రోధములకు వశులై మీ తపోవిఘ్నమునకు మీరే కారకులైనారు. కావున కామక్రోధములను విడిచిపెట్టుడు. మీ ఇరువురికి శుభము కలుగుగాక ! బ్రహ్మసంబంధమైన బలమే (తపోబలమే) గొప్పది కదా !

ఏవముక్తౌ తతస్తేన లజ్జితౌ తావుభావపి ।
క్షమయామాసతుః ప్రీత్యా పరిష్వజ్య పరస్పరమ్ ॥30॥

ఈ విధముగా బ్రహ్మదేవుడు పలుకగా వారిరువురూ సిగ్గుపడి ప్రీతితో ఒకరినొకరు కౌగలించుకొని పరస్పరము క్షమించుకొనిరి.

తతస్సురైర్వంద్యమానో బ్రహ్మా లోకం నిజం యయౌ ।
వసిష్ఠోఽప్యాత్మనః స్థానం కౌశికోఽపి స్వమాశ్రమమ్ ॥31॥

అంతట దేవతలచే నమస్కరింపబడుచున్న బ్రహ్మదేవుడు తన స్థానమునకు తాను వెళ్ళెను. వసిష్ఠుడు కూడా తన స్థానమునకు వెళ్ళెను. విశ్వామిత్రుడు కూడా తన ఆశ్రమమునకు వెళ్ళెను.

ఏతదాడిబకం యుద్ధం హరిశ్చంద్రకథాం తథా ।
కథయిష్యన్తి యే మర్త్యాః సమ్యక్ శ్రోష్యన్తి చైవ యే ॥32॥

తేషాం పాపాపనోదం తు శ్రుతం హ్యేవ కరిష్యతి ।
న చైవ విఘ్నకార్యాణి భవిష్యంతి కదాచన ॥33॥

ఏ మానవులు ఈ ఆడిబకయుద్ధవృత్తాంతమును, అట్లే హరిశ్చంద్రుని కథను చెప్పుదురో లేదా బాగుగా వినెదరో వారి పాపములన్నియూ విన్నంతమాత్రమునే పటాపంచలగును. మరి ఎన్నడూ విఘ్నములు సంభవించవు.

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే ఆడిబకయుద్ధం నామ నవమోఽధ్యాయః ॥9॥

శ్రీ మార్కండేయ మహాపురాణమందు ఆడిబకయుద్ధమను తొమ్మిదవ అధ్యాయం సమాప్తం.



దశమోఽధ్యాయః - పదియవ అధ్యాయం
మృత్యుదశావర్ణనమ్ - మృత్యుదశావర్ణనం

జైమినిరువాచ - జైమిని చెప్పాడు.

సంశయం ద్విజశార్దూలాః ప్రబ్రూత మమ పృచ్ఛతః ।
ఆవిర్భావతిరోభావౌ భూతానాం యత్ర సంస్థితౌ ॥1॥

కథం సంజాయతే జంతుః కథం వా స వివర్ధతే ।
కథం వోదరమధ్యస్థస్తిష్ఠత్యంగనిపీడితః ॥2॥

నిష్క్రాంతిముదరాత్ప్రాప్య కథం వా వృద్ధిమృచ్ఛతి ।
ఉత్క్రాంతికాలే చ కథం చిద్భావేన వియుజ్యతే ॥3॥

కృత్స్నో మృతస్తథాశ్నాతి ఉభే సుకృతదుష్కృతే ।
కథం తే చ తథా తస్య ఫలం సంపాదయన్త్యుత ॥4॥

కథం న జీర్యతే తత్ర పిండీకృత ఇవాశయే ।
స్త్రీకోష్ఠే యత్ర జీర్యన్తే భుక్తాని సుగురూణ్యపి ॥5॥

భక్ష్యాణి తత్ర నో జంతుర్జీర్యతే కథమల్పకః ।
కథం భోక్తా స సర్వస్య కర్మణస్సుకృతస్య వై ॥6॥

ఏతన్మే బ్రూత సకలం సందేహోక్తివివర్జితమ్ ।
తదేతత్ పరమం గుహ్యం యత్ర ముహ్యన్తి జంతవః ॥7॥

ఓ ద్విజశ్రేష్ఠులారా ! సమస్తప్రాణుల ఆవిర్భావ తిరోభావములు అనగా జననమరణములు ఎట్లు కలుగుచున్నవను సంశయము నాకు గలదు. ప్రశ్నించుచున్న నాకు దయతో సమాధానము చెప్పుడు. జీవుడెట్లు పుట్టుచున్నాడు? ఎట్లు వృద్ధి పొందుచున్నాడు? తల్లి గర్భమందుండి ఆమె అవయవములచే రాపిడిని పొంది ఎట్లు ఆ బాధను సహించుచున్నాడు? తల్లి గర్భమునుండి వెలుపలికి వచ్చిన పిమ్మట ఎట్లు వృద్ధిని పొందుచున్నాడు? మరణకాలమందు జీవునికి ప్రాణవియోగమెట్లు కలుగుచున్నది? జీవుడు మరణించిన పిమ్మట పుణ్యపాపములను రెండింటిని ఎట్లు అనుభవించుచున్నాడు? ఆ పుణ్యపాపములు జీవుడు మరణించిన పిమ్మట ఆ రెంటి ఫలములను ఎట్లు పొందింపచేయుచున్నవి? స్త్రీ గర్భమందు అనేక ఘనపదార్థములు భుజింపబడి జీర్ణమగుచున్నవి. అట్లుండగా స్త్రీగర్భమందు మృదువుగానూ, పిండాకారముగానూ ఉన్న జీవుడు ఎందులకు జీర్ణమగుటలేదు? అనగా నశించుట లేదు? స్త్రీ గర్భాశయమందు తినబడ్డ సమస్త పదార్థములు జీర్ణమగుచుండగా అల్పపరిమాణముగల జీవుడెందులకు జీర్ణము కాబడుట లేదు? ఇంకనూ జీవుడెట్లు సుకృతదుష్కృత కర్మల ఫలమును అనుభవించుచున్నాడు? ఓ ద్విజశ్రేష్ఠులారా! ఈ సంశయములనన్నింటిని పోగొట్టువిధముగా మీరు నాకు చెప్పగోరుచున్నాను. సమస్తప్రాణులు ఈ విషయమందే మోహమును చెందుచున్నారు.

పక్షిణ ఊచుః – ధర్మపక్షులిట్లు పలికాయి.

ప్రశ్నభారోఽ యమతులస్త్వయాఽ స్మాసు నివేశితః ।
దుర్జ్ఞేయస్సర్వభూతానాం భావాభావసమాశ్రితః ॥8॥

తం శృణుష్వ మహాభాగ ! యథా ప్రాహ పితుః పురా ।
పుత్రః పరమధర్మాత్మా సుమతిర్నామ నామతః ॥9॥

ఓ మహానుభావుడా ! సమస్తప్రాణుల జన్మమరణములకు సంబంధించిన సాటిలేని నీవడిగిన ప్రశ్న మిక్కిలి భారముతో కూడినది అనగా గొప్పది. అట్టి ప్రశ్నభారమును మాయందు మోపినావు. అయినను బదులు చెప్పెదము. పూర్వము సుమతియను పేరుగల గొప్ప ధర్మాత్ముడగు ఒక పుత్రుడు తనతండ్రితో పలికిన విషయములను నీకు మేము చెప్పెదము, శ్రద్ధతో వినుడు.

బ్రాహ్మణో భార్గవః కశ్చిత్ సుతమాహ మహామతిః ।
కృతోపనయనం శాంతం సుమతిం జడరూపిణమ్ ॥10॥

గొప్ప బుద్ధిశాలి, భృగువంశములో జన్మించినవాడూ అగు ఒకానొక తండ్రియగు బ్రాహ్మణుడు ఉపనయన సంస్కారములు పొంది, జడునిగా కన్పించుచున్న సుమతియను పేరుగల తనకుమారునితో ఇట్లు పలికెను.

వేదానధీష్వ సుమతే ! యథానుక్రమమాదితః ।
గురుశుశ్రూషణే వ్యగ్రో భైక్షాన్నకృతభోజనః ॥11॥

ఓ కుమారా ! సుమతీ ! గురుసేవాతత్పరుడవై, భిక్షవలన లభించిన అన్నమును భుజించుచూ క్రమముననుసరించి ముందుగా వేదములను అధ్యయనము చేయుము.

తతో గార్హస్థ్యమాదాయ చేష్ట్వా యజ్ఞాననుత్తమాన్ ।
ఇష్టముత్పాదయాఽ పత్యమాశ్రయేథా వనం తతః ॥12॥

అటుపిమ్మట గృహస్థధర్మమునవలంబించి, మిక్కిలి గొప్పవయిన యజ్ఞములను అనుష్ఠించి, ఇష్టులయిన పుత్రులను కని, అనంతరము వానప్రస్థాశ్రమమును అవలంబించుము.

వనస్థశ్చ తతో వత్స ! పరివ్రాడ్ నిష్ప్రతిగ్రహః ।
ఏవమాప్స్యసి తద్బ్రహ్మ యత్ర గత్వా న శోచసి ॥13॥

ఓ కుమారా ! సుమతీ ! వానప్రస్థాశ్రమమును స్వీకరించిన పిమ్మట పరిగ్రహమేమీ చేయక అనగా ఇతరులిచ్చే దానములను స్వీకరించక సన్న్యాసాశ్రమమును స్వీకరించుము. ఇట్లు చేసినచో ఎచ్చట శోకములు శాశ్వతముగా నశించునో అట్టి బ్రహ్మస్థానమును నీవు పొందెదవు.

పక్షిణ ఊచుః – ధర్మపక్షులు పలికాయి.

ఇత్యేవముక్తో బహుశో జడత్వాన్నాహ కించన ।
పితాఽపి తం సుబహుశః ప్రాహ ప్రీత్యా పునః పునః ॥14॥

సుమతి తండ్రి ఈ విధముగా అనేకపర్యాయములు చెప్పిననూ జడుడగుటచే సుమతి ఏమియూ మాటలాడలేదు. అయిననూ తండ్రి పుత్రప్రేమతో తన కుమారుని గూర్చి మాటిమాటికి ముందు చెప్పిన విషయమునే మరల చెప్పెను.

ఇతి పిత్రా సుతస్నేహాత్ ప్రలోభి మధురాక్షరమ్ ।
స చోద్యమానో బహుశః ప్రహస్యేదమథాబ్రవీత్ ॥15॥

పుత్రునియందలి ప్రేమతో తండ్రి ఈ విధముగా తియ్యని మాటలతో ప్రలోభపెట్టుచూ, మాటిమాటికీ ప్రేరేపించగా సుమతి నవ్వుచూ ఇట్లు పలికెను.

తాతైతద్బహుశోఽభ్యస్తం యత్త్వయాఽద్యోపదిశ్యతే ।
తథైవాన్యాని శాస్త్రాణి శిల్పాని వివిధాని చ ॥16॥

ఓ తండ్రీ ! మీరిప్పుడు చేయుచున్న ఉపదేశము, అట్లే ఎన్నో శిల్పాదిశాస్త్రాలు వీటినన్నింటిని నేను ఎన్నోసార్లు అభ్యసించితిని.

జన్మనామయుతం సాగ్రం మమ స్మృతిపథం గతమ్ ।
ఉత్పన్నజ్ఞానబోధస్య వేదైః కిం మే ప్రయోజనమ్ ।
నిర్వేదాః పరితోషాశ్చ క్షయవృద్ధ్యుదయే రతాః ॥17॥

శత్రుమిత్రకళత్రాణాం వియోగాస్సంగమాస్తథా ।
మాతరో వివిధా దృష్టాః పితరో వివిధాస్తథా ॥18॥

అనుభూతాని సౌఖ్యాని దుఃఖాని చ సహస్రశః ।
బాన్ధవా బహవః ప్రాప్తాః పితరశ్చ పృథగ్విధాః ॥19॥

విణ్మూత్రపిచ్ఛిలే స్త్రీణాం తథా కోష్ఠే మయోషితమ్ ।
పీడాశ్చ సుభృశం ప్రాప్తా రోగాణాం చ సహస్రశః ॥20॥

నాకు పదివేల జన్మల వృత్తాంతములు గుర్తున్నవి. ఇప్పటికే జ్ఞానము సిద్ధించిన నాకు వేదముల అధ్యయనముతో పని లేదు. వృద్ధి వినాశములందు సంతోషవిచారములు, శత్రువులు స్నేహితులు భార్యలు వీరితో సంయోగవియోగములు, అనేకమంది తల్లులు వీటినన్నింటిని గతజన్మలలో నేను చూచితిని. ఎన్నో వేల సుఖదుఃఖములను నేను అనుభవించితిని. అనేకమంది బంధువులు, తండ్రులను నేను పొందితిని. ఇంకనూ మలమూత్రాదులచే నిండిన స్త్రీ గర్భములందు నేనెన్నిసార్లు నివసించితినో, ఎన్ని క్లేశములను అనుభవించితినో, ఎన్ని రోగములను పొందితినో చెప్పనలవి కాదు.

గర్భదుఃఖాన్యనేకాని బాలత్వే యౌవనే తథా ।
వృద్ధతాయాం తథాప్తాని తాని సర్వాణి సంస్మరే ॥21॥

ఎన్నో గర్భదుఃఖములను, బాల్యము యౌవనము వార్ధక్యములందు అనుభవించిన ఎన్నో విషయములను స్మరించుచున్నాను.

బ్రాహ్మణక్షత్రియవిశాం శూద్రాణాం చాఽపి యోనిషు ।
పునశ్చ పశుకీటానాం మృగాణామథ పక్షిణామ్ ॥22॥

తథైవ రాజభృత్యానాం రాజ్ఞాం చాఽహవశాలినామ్ ।
సముత్పన్నోఽస్మి గేహేషు తథైవ తవ వేశ్మని ॥23॥

బ్రాహ్మణక్షత్రియవైశ్యశూద్రయోనులందు, పశుకీటాదియోనులందు, పక్షిమృగయోనులందు ఎన్నో జన్మలను నేను పొందితిని. అట్లే రాజసేవకుల ఇండ్లయందు, యోధులగు రాజుల ఇండ్లయందు నేనెన్నో పర్యాయములు జన్మించితిని. అట్లే నేనిప్పుడు నీయింట జన్మించితిని.

భృత్యతాం దాసతాం చైవ గతోఽస్మి బహుశో నృణామ్ ।
స్వామిత్వమీశ్వరత్వం చ దరిద్రత్వం తథా గతః ॥24॥

అనేక పర్యాయములు నేను రాజులకు సేవకుడను, దాసుడను అయితిని. అట్లే నేను ప్రభువును, అధికారిని అయితిని. ఇంకనూ దారిద్ర్యమును కూడా ఎన్నోసార్లు పొందితిని.

హతం మయా హతశ్చాన్యైర్ఘాతం మే ఘాతితం తథా ।
దత్తం మమాన్యైరన్యేభ్యో మయా దత్తమనేకశః ॥25॥

నేనెంతమందినో చంపితిని. ఇతరులచేత చంపబడితిని. చంపుటలు, చంపించబడుటలు నాకెన్నో గలవు. నాకెంతమందో దానములు చేసిరి. నేనెంతమందికో దానములు చేసితిని.

పితృమాతృసుహృద్భ్రాతృకళత్రాదికృతేన చ ।
తుష్టోఽసకృత్తథా దైన్యమశ్రుధౌతాననో గతః ॥26॥

తల్లులు, తండ్రులు, స్నేహితులు, సోదరులు, భార్యలు ఈ మొదలగు వారివలన నేనెన్నిసార్లు సంతోషమును పొందితినో అట్లే దుఃఖమువలన దైన్యమువలన కలిగిన కన్నీళ్ళచే కడుగబడిన ముఖము గలవాడను కూడా అయితిని.

ఏవం సంసారచక్రేఽస్మిన్ భ్రమతా తాత సంకటే ।
జ్ఞానమేతన్మయా ప్రాప్తం మోక్షసంప్రాప్తికారకమ్ ॥27॥

ఓ తండ్రీ! ఈ విధముగా దుఃఖహేతువగు సంసారచక్రమందు తిరిగి తిరిగి తుట్టతుదకు మోక్షహేతువగు ఈ జ్ఞానమును పొందితిని.

విజ్ఞాతే యత్ర సర్వోఽ యమృగ్యజుస్సామసంజ్ఞితః ।
క్రియాకలాపో విగుణో న సమ్యక్ప్రతిభాతి మే ॥28॥

ఇట్లు మోక్షహేతువగు ఆత్మజ్ఞానము లభించుటచే ఋగ్వేదము యజుర్వేదము సామవేదము పేర్లు గల కర్మకాండయంతయు వ్యర్థమనియే నాకు బాగుగా తోచుచున్నది. జ్ఞానము వల్లనే మోక్షము లభించును గాని యజ్ఞయాగాది కర్మలవల్ల కాదని అభిప్రాయము.

తస్మాదుత్పన్నబోధస్య వేదైః కిం మే ప్రయోజనమ్ ।
గురువిజ్ఞానతృప్తస్య నిరీహస్య సదాత్మనః ॥29॥

అందువలన జ్ఞానము సిద్ధించినట్టి, సమ్యక్జ్ఞానముతో సంతృప్తిని పొందినట్టి, కోరికలు లేనట్టి, సద్రూపుడనయినట్టి నాకు వేదములతో ఏమి ప్రయోజనము?

షట్ప్రకారక్రియాదుఃఖసుఖహర్షరసైశ్చ యత్ ।
గుణైశ్చ వర్జితం బ్రహ్మ తత్ ప్రాప్స్యామి పరం పదమ్ ॥30॥

ఆరు విధములగు కర్మలు, దుఃఖము, సుఖము, హర్షము, రసము, గుణములు వీటితో సంబంధములేనట్టి పరమపదమైన బ్రహ్మమును నేను పొందగలను.

రసహర్షభయోద్వేగ క్రోధామర్షజవాగురా ।
విజ్ఞాతా నృమృగగ్రాహిసంఘపాశశతాకులా ॥31॥

ఆనందము, సంతోషము, భయము, ఉద్వేగము, క్రోధము, అసహనము వీటి కారణముగా వేటనిమిత్తమైన మృగబంధన పాశములలో చిక్కినవాడు జీవుడు. ("మృగయార్థం మృగబంధనపాశాదౌ వాగురా" అమరః). ఇంకనూ వందలకొలదీ నరమృగశ్యేన సమూహములచే జీవుడు పీడింపబడినవాడు.

తస్మాద్యాస్యామ్యహం తాత త్యక్త్వేమాం దుఃఖసంతతిమ్ ।
త్రయీధర్మమధర్మాఢ్యం కిం పాపఫలసన్నిభమ్ ॥32॥

అందువలన ఓ తండ్రీ ! ఈ జన్మమరణ ప్రవాహరూపమైన దుఃఖసమూహమును విడిచిపెట్టి నేను వెళ్ళెదను. వేదములచే ప్రతిపాదింపబడుచున్న యజ్ఞయాగాది ధర్మము (కర్మలు) వస్తుతః అధర్మరూపముగానూ పాపఫలములను ఇచ్చునట్టిదిగానూ నాకు కన్పట్టుచున్నది. కర్మలు బంధరూపమగు సంసారమును పొందించునేగాని, మోక్షమును పొందింపజాలవని అభిప్రాయము.

పక్షిణ ఊచుః – ధర్మపక్షులు చెప్పాయి.

తస్య తద్వచనం శ్రుత్వా హర్షవిస్మయగద్గదమ్ ।
పితా ప్రాహ మహాభాగః స్వసుతం హృష్టమానసః ॥33॥

కుమారుడగు సుమతి పలికిన ఆ మాటలను విని ఆనందాశ్చర్యములతో గద్గదస్వరము కలిగినవాడు, సంతోషముతో ప్రసన్నమైన చిత్తము కలిగినవాడూ అగు మహాభాగుడైన తండ్రి ఇట్లు పలికెను.

పితోవాచ – తండ్రి పలికాడు.

కిమేతద్వదసే వత్స కుతస్తే జ్ఞానసంభవః ।
కేన తే జడతా పూర్వమిదానీం చ ప్రబుద్ధతా ॥34॥

ఓ కుమారా ! నీవు ఏమి పలుకుచున్నావు? నీకీ బ్రహ్మజ్ఞానము ఎట్లు సంభవించినది? నీకు పూర్వమెందులకు జడత్వము కలిగినది? ఇప్పుడెందువలన జ్ఞానోదయమైనది?

కిన్ను శాపవికారోఽయం మునిదేవకృతస్తవ ।
యత్తే జ్ఞానం తిరోభూతమావిర్భావముపాగతమ్ ॥35॥

నీకిట్టి బ్రహ్మజ్ఞానము మునులు, దేవతలు ఇచ్చిన శాపముచే మరుగుబడి ఇప్పుడు మరల వెలుగులోకి వచ్చినదా ఏమి?

పుత్ర ఉవాచ – పుత్రుడు పలికాడు.

శృణు తాత యథావృత్తం మమేదం సుఖదుఃఖదమ్ ।
యశ్చాహమాసమన్యస్మిన్ జన్మన్యస్మృత్పరం తు యత్ ॥36॥

ఓ తండ్రీ ! నాకు సుఖదుఃఖములనిచ్చినట్టి పూర్వజన్మ వృత్తాంతము అనగా మొదటి జన్మవృత్తాంతము అట్లే వేరే జన్మలలో ఎవరినైయుంటినో అదియంతయు చెప్పెదను వినుము.

అహమాసం పురా విప్రో న్యస్తాత్మా పరమాత్మని ।
ఆత్మవిద్యావిచారేషు పరాం నిష్ఠాముపాగతః ॥37॥

నేను పూర్వజన్మమునందు ఒక బ్రాహ్మణుడను. ఆ బ్రాహ్మణజన్మయందు నేను పరమాత్మయందు లీనుడనై ఆత్మవిద్యా విచారములందు గొప్ప నిష్ఠను పొందితిని.

సతతం యోగయుక్తస్య సతతాభ్యాససంగమాత్ ।
సత్సంయోగాత్ స్వస్వభావాద్విచారవిధిశోధనాత్ ॥38॥

తస్మిన్నేవ పరా ప్రీతిర్మమాసీద్యుంజతస్సదా ।
ఆచార్యతాం చ సంప్రాప్తః శిష్యసందేహహృత్తమః ॥39॥

ఎల్లప్పుడు యోగమందు చిత్తమును లగ్నము చేసిన నాకు నిరంతరము అట్టి యోగమును అభ్యాసము చేసినందువల్లనూ, సత్పురుషుల సంగము వల్లనూ, నాయొక్క సహజస్వభావముచేతనూ, తత్త్వమస్యాది వాక్యముల విచారవిధులను శోధించుటచేతనూ, నిరంతరము ఏకాగ్రచిత్తుడనగుటచేతనూ ఆ పరమాత్మయందు మాత్రమే ప్రీతి కలిగినది. అంతట శిష్యసందేహములను నివారించగలుగు ఆచార్యత్వముగూడా నాయందు సంప్రాప్తించినది.

తతః కాలేన మహతా ఐకాన్తికముపాగతః ।
అజ్ఞానాకృష్టసద్భావో విపన్నశ్చ ప్రమాదతః ॥40॥

పిమ్మట కొంతకాలము గడచిన పిమ్మట నిశ్చయముగా ఏకాగ్రతను పొందితిని. మరల అజ్ఞానములో బడి అశ్రద్ధవలన ఆపదలలో బడితిని.

ఉత్క్రాన్తికాలాదారభ్య స్మృతిలోపో న మేఽభవత్ ।
యావదబ్దం గతం చైవ జన్మనాం స్మృతిమాగతమ్ ॥41॥

నా మరణకాలమునుండి నాకెన్నడూ స్మృతిలోపము (గడచిన సంఘటనలను మరచుట) జరుగలేదు. ఒక సంవత్సరకాలము గడచినంతనే నా పూర్వజన్మలన్నియూ నా స్మృతిపథమునకు వచ్చినవి.

పూర్వాభ్యాసేన తేనైవ సోఽహం తాత జితేంద్రియః ।
యతిష్యామి తథా కర్తుం న భవిష్యే యథా పునః ॥42॥

ఓ తండ్రీ ! పూర్వమందలి నా యోగాభ్యాసము వల్లనే ఇంద్రియములను జయించినవాడనై మరల జన్మ లేని విధముగా ప్రయత్నించెదను.

జ్ఞాన దానఫలం హ్యేతద్యజ్జాతిస్మరణం మమ ।
న హ్యేతత్ప్రాప్యతే తాత త్రయీధర్మాశ్రితైర్నరైః ॥43॥

ఓ తండ్రీ ! నాయొక్క జ్ఞానదానముల ఫలమే నా యీ పూర్వజన్మల స్మరణము. వేదములందలి కర్మలను మాత్రము ఆచరించు మానవులకు ఇట్టి పూర్వజన్మస్మరణము కలుగదు.

సోఽహం పూర్వాశ్రమాదేవ నిష్ఠాధర్మముపాశ్రితః ।
ఏకాంతిత్వముపాగమ్య యతిష్యామ్యాత్మమోక్షణే ॥44॥

అట్టి నేను పూర్వజన్మలందు ఆర్జించిన యోగనిష్ఠయను ధర్మమును ఆశ్రయించి, చిత్తమందు ఏకాగ్రతను సంపాదించి పరమపురుషార్థమైన మోక్షముకొరకు ప్రయత్నించెదను.

తద్బ్రూహి త్వం మహాభాగ ! యత్తే సాంశయికం హృది ।
ఏతావతాపి తే ప్రీతిముత్పాద్యానృణ్యమాప్నుయామ్ ॥45॥

అందువలన ఓ తండ్రీ ! మహానుభావుడా ! నీ మనస్సులోని సంశయములన్నింటిని తెలుపుము. వాటికన్నింటికి బదులు పలికి నీకు సంతోషమును కల్గింపచేసి పితృఋణమును తీర్చుకొనెదను.

పక్షిణ ఊచుః – ధర్మపక్షులు చెప్పాయి.

పితా ప్రాహ తతః పుత్రం శ్రద్దధత్ తస్య తద్వచః ।
భవతా యద్వయం పృష్టాః సంసారగ్రహణాశ్రయమ్ ॥46॥

ఓ జైమిని మహర్షీ ! తన కుమారుడగు సుమతి చెప్పిన మాటలందు అతని తండ్రి శ్రద్ధ వహించెను. పిమ్మట జన్మమరణప్రవాహాత్మకమైన సంసారమును పొందుటను గూర్చి నీవు మమ్ములనడిగిన విషయమునే సుమతి యొక్క తండ్రి కూడా సుమతిని గూర్చి అడిగెను.

పుత్ర ఉవాచ – కుమారుడగు సుమతి పలికాడు.

శృణు తాత యథా తత్త్వమనుభూతం మయాఽసకృత్ ।
సంసారచక్రమజరం స్థితిర్యస్య న విద్యతే ॥47॥

ఓ తండ్రీ ! అస్థిరమైన ఈ సంసారచక్రమందు పడి అనేకమార్లు నేను అనుభవించిన యథార్థవృత్తాంతమును నీకు చెప్పెదను, వినుము.

సోఽహం వదామి తే సర్వం తవైవానుజ్ఞయా పితః ।
ఉత్క్రాంతికాలాదారభ్య యథా నాన్యో వదిష్యతి ॥48॥

ఓ తండ్రీ ! నా మరణకాలము దగ్గరనుంచి జరిగిన వృత్తాంతములన్నియు మీ యనుజ్ఞతో ఇతరులెవరూ చెప్పలేనిరీతిగా తమకు చెప్పెదను.

ఊష్మా ప్రకుపితః కాయే తీవ్రవాయుసమీరితః ।
భినత్తి మర్మస్థానాని దీప్యమానో నిరింధనః ॥49॥

శరీరమందలి వేడిమి తీవ్రమైన వాయుసంచారముచే ప్రకోపించినదై ఇంధనములేకయే మండుచున్నదై మర్మావయవములన్నింటినీ మరణకాలమందు భేదించును అనగా బాధపెట్టును.

ఉదానో నామ పవనస్తతశ్చోర్ధ్వం ప్రవర్తతే ।
భుక్తానామంబుభక్ష్యాణామధోగతినిరోధకృత్ ॥50॥

ఇంకనూ శరీరమందలి ఉదానమను వాయువు, త్రాగిన, భుజించిన నీరు, ఆహారములను క్రిందికిబోకుండా నిరోధించి శరీరమందు ఉపరిభాగమందు సంచరించును. (ప్రాణవియోగసమయమందు ఇట్లు సంభవించును.)

తతో యేనాంబుదానాని కృతాన్యన్నరసాస్తథా ।
దత్తాస్స తస్య ఆహ్లాదమాపది ప్రతిపద్యతే ॥51॥

ఎవరయితే జలదానము అన్నదానములను చేసియున్నారో, వారు పూర్వోక్తరీతిగా మరణకాలమందు కష్టమననుభవించక సుఖముగా ఉందురు. అనగా అనాయాసమరణమును పొందెదరు.

అన్నాని యేన దత్తాని శ్రద్ధాపూతేన చేతసా ।
సోఽపి తృప్తిమవాప్నోతి వినాఽప్యన్నేన వై తదా ॥52॥

ఎవరయితే జీవితకాలమందు శ్రద్ధచే పవిత్రమైన మనస్సుతో అన్నదానమును చేసియున్నారో వారు కూడా మరణకాలమందు అన్నము లేకపోయినా నిశ్చయముగా తృప్తిని పొందెదరు.

యేనానృతాని నోక్తాని ప్రీతిభేదః కృతో న చ ।
ఆస్తిక(శ్శద్దధానశ్చ స సుఖం మృత్యుమృచ్ఛతి ॥53॥

ఎవరయితే అసత్యములను పలుకలేదో, స్నేహితులమధ్య కలహములను కలిగించలేదో అట్టి ఆస్తిక్యబుద్ధి, శ్రద్ధ కలిగినవాడు సుఖముగా అనగా అనాయాసముగా మరణమును పొందును.

దేవబ్రాహ్మణపూజాయాం యే రతా నోఽనసూయవః ।
శుక్లా వదాన్యా హ్రీమంతస్తే నరాస్సుఖమృత్యవః ॥54॥

ఎవరయితే దేవతలను, బ్రాహ్మణులను పూజించుటయందు ఆసక్తి కలిగియున్నారో, అసూయారహితులైయున్నారో, ఇంకనూ శుద్ధచిత్తులై, దానస్వభావము, లజ్జాగుణము కలిగియున్నారో అట్టి మానవులు అనాయాస మరణమును పొందెదరు.

యో న కామాన్న సంరంభాన్న ద్వేషాద్ధర్మముత్సృజేత్ ।
యథోక్తకారీ సౌమ్యశ్చ స సుఖం మృత్యుమృచ్ఛతి ॥55॥

ఎవడయితే కోరికలవలన, క్రోధద్వేషములవలన ధర్మమును విడిచిపెట్టడో, తాను చెప్పిన ప్రకారము ఆచరించునో, మృదుస్వభావము కలిగియుండునో అట్టివాడు అనాయాసమరణమును పొందును.

అవారిదాయినో దాహం క్షుధాం చానన్నదాయినః ।
ప్రాప్నువంతి నరాః కాలే తస్మిన్ మృత్యావుపస్థితే ॥56॥

దప్పికగొన్నవారికి జలమునీయనివారు, ఆకలిగొన్నవారికి అన్నముపెట్టనివారు మరణకాలమాసన్నమయినపుడు ఆకలిదప్పులతో బాధపడెదరు.

శీతం జయంతి ధనదాస్తాపం చందనదాయినః ।
ప్రాణఘ్నీం వేదనాం కష్టాం యేచాఽనుద్వేగకారిణః ॥57॥

చలికాలములో నిప్పుకొరకు కట్టెలనిచ్చువారు, వేసవికాలములో చల్లదనము కొరకు గంధపుచెక్కలనిచ్చువారు, ప్రాణులకు ఉద్వేగమును అనగా దుఃఖమును కలిగించనివారు మృత్యుకాలమందు క్రమముగా శైత్యమును, తాపమును, ప్రాణములనుపోగొట్టు క్లేశమును జయించెదరు అనగా పోగొట్టుకొనెదరు.

మోహాజ్ఞానప్రదాతారః ప్రాప్నువన్తి మహద్భయమ్ ।
వేదనాభిరుదగ్రాభిః ప్రపీడ్యన్తేఽధమా నరాః ॥58॥

మోహమును (భ్రాంతిని), అజ్ఞానమును కలిగించు అధమమానవులు మరణకాలమందు గొప్ప భయమును పొందుదురు. ఇంకను భరింపశక్యముకాని బాధలతో పీడింపబడెదరు.

కూటసాక్షీ మృషావాదీ యశ్చాసదనుశాస్తి వై ।
తే మోహమృత్యవస్సర్వే తథాఽన్యే వేదనిందకాః ॥59॥

అబద్ధపుసాక్ష్యము చెప్పువాడు, అసత్యములను పలుకువాడు, అధర్మమును బోధించువాడు, వేదములను నిందించువారు వీరందరు మోహముచేత అనగా అజ్ఞానముచేత మరణమును పొందెదరు.

విభీషణాః పూతిగంధాః కూటముద్గరపాణయః ।
ఆగచ్ఛన్తి దురాత్మానో యమస్య పురుషాస్తదా ॥60॥

అట్టి మరణకాలమందు భయంకరులు, దుర్వాసనకలిగినవారు, లోహముతో తయారుచేయబడిన కూటములు, ముద్గరములు ఆయుధముగా కలిగినవారు, దురాత్ములూ అగు యమదూతలు వచ్చెదరు.

ప్రాప్తేషు దృక్పథం తేషు జాయతే తస్య వేపథుః ।
క్రందత్యవిరతం సోऽథ భ్రాతృమాతృసుతానథ ॥61॥

మరణకాలమందు ఆ యమదూతలు కంటపడగానే ఆ నరుని శరీరము భయముతో వణుకుచుండును. అంతట ఆ నరుడు తన సోదరులు, తల్లి, కుమారులను తలచుచు రోదించుచుండును.

సాऽస్య వాగస్ఫుటా తాత ఏకవర్ణా విభావ్యతే ।
దృష్టిశ్చ భ్రామ్యతే త్రాసాత్ శ్వాసాచ్ఛుష్యత్యథాऽననమ్ ॥62॥

ఓ తండ్రీ ! ఆ సమయమందు మాటలు అస్పష్టముగా నుండును. పదేపదే ఒకే మాటను ఉచ్చరించుచుండును. భయమువలన దృష్టి భ్రమించుచుండును. ఆయాసమువలన ముఖము శుష్కించుచుండును.

ఊర్ధ్వశ్వాసాన్వితస్సోऽథ దృష్టిభంగసమన్వితః ।
తతస్స వేదనావిష్టస్తచ్ఛరీరం విముంచతి ॥63॥

అనంతరమా జీవుడు ఊర్ధ్వశ్వాసకలిగినవాడై చూపు లోపించినవాడగును. అంతట ఆ నరుడు దుఃఖముతో కూడుకొన్నవాడై తన శరీరమును విడిచిపెట్టును అనగా మరణించును.

వాయ్వగ్రసారీ తద్రూపం దేహమన్యత్ప్రపద్యతే ।
తత్కర్మజం యాతనార్థం న మాతృపితృసంభవమ్ ।
తత్ప్రమాణవయోऽవస్థాసంస్థానైః ప్రాగ్భవం యథా ॥64॥

భయంకరమైనవాయువులచే ముందుకు సాగింపబడుచున్నవాడై, తాను చేసుకొన్న పుణ్యాపాపకర్మలఫలమును అనుభవించుటకై తల్లిదండ్రులనుండి పుట్టనట్టి శరీరమును అనగా సూక్ష్మశరీరమును పొందును. ఆ లింగశరీరము పూర్వజన్మశరీరమందలి పరిమాణము, వయస్సు యొక్క అవస్థాసంస్థానములు వీటితో సమానముగా ఉండునట్టిది అగును.

తతో దూతో యమస్యాऽశు పాశైర్బధ్నాతి దారుణైః ।
దండప్రహారసంభ్రాన్తం కర్షతే దక్షిణాం దిశమ్ ॥65॥

అటుపిమ్మట యమదూత శీఘ్రముగా కఠినమైన త్రాళ్ళతో ఆ నరుని బంధించును. కఱ్ఱలతో కొట్టబడుటచే సంభ్రాంతచిత్తుడగు ఆ నరుని యమదూత దక్షిణదిక్కుకు తీసుకొని పోవును.

కుశకంటకవల్మీకశంకుపాషాణకర్కశే ।
తథా ప్రదీప్తజ్వలనే క్వచిచ్ఛ్వభ్రశతోత్కటే ॥66॥

ప్రదీప్తాదిత్యతప్తేన దహ్యమానేన దంశుభిః ।
కృష్యతే యమదూతైశ్చ శివాసన్నాదభీషణైః ॥67॥

ఇంకనూ కుశమను గడ్డి, ముళ్ళు, పుట్టలు, శంకువులు, పాషాణములచే కఠినమైనట్టిదియు, మండుచున్నమంటలు గలదియు, వందలకొలదీ శ్వభ్రములు అనగా గుంటలు కలదియు, మండుచున్న సూర్యునిచే దహింపబడుచున్నట్టిదియు అగు ప్రదేశమునకు ఆ నరుడు దుష్టభయంకరములైన నక్కల అరుపులు గల యమదూతలచే ఈడ్చుకొనిపోబడును.

వికృష్యమాణస్తైర్ఘోరైర్భక్ష్యమాణః శివాశతైః ।
ప్రయాతి దారుణే మార్గే పాపకర్మా యమక్షయమ్ ॥68॥

ఇట్లు పాపకర్మలాచరించిన జీవుడు భయంకరరూపులైన యమదూతలచే లాగుకొనిపోవబడుచూ, వందలకొలది ఆడునక్కలచే తినబడుచూ భయంకరమైన మార్గమందు యమలోకమునకు వెళ్ళును.

ఛత్రోపానత్ప్రదాతారో యే చ వస్త్రప్రదా నరాః ।
తే యాన్తి మనుజా మార్గం తం సుఖేన తథాన్నదాః ॥69॥

ఏ మానవులయితే గొడుగు, పాదరక్షలు, వస్త్రములు, అన్నమును దానము చేసెదరో వారు యమలోకమార్గమునకు సుఖముగా వెళ్ళెదరు.

విమానైః సోజ్జ్వలైర్యాన్తి భూమిదానప్రదా నరాః ।
ఏవం క్లేశాననుభవన్నవశః పాపపీడితః ॥
నీయతే ద్వాదశాహేన ధర్మరాజపురం నరః ॥70॥

ఏ నరులు భూదానము చేసెదరో వారు ప్రకాశించుచున్న విమానములలో ప్రయాణించెదరు. ఈ విధముగా పాపములచే పీడింపబడిన నరుడు క్లేశములను అనుభవించుచు వశము తప్పినవాడై చనిపోయిన పన్నెండవరోజున యమపురికి యమభటులచే తీసుకొనిపోబడును.

కలేవరే దహ్యమానే మహాన్తం దాహమృచ్ఛతి ।
తాడ్యమానే తథైవార్తిం ఛిద్యమానే చ దారుణామ్ ॥71॥

పార్థివశరీరము దహింపబడుచుండగా జీవుడు గొప్ప వేడిమిని అనుభవించును. యమదూతలచే ఆ శరీరము కొట్టబడుచుండగానూ, ముక్కలు ముక్కలుగా చేయబడుచుండగానూ విపరీతమైన బాధను పొందును.

క్లిద్యమానే చిరతరం జంతుర్దుఃఖమవాప్నుతే ।
స్వేన కర్మవిపాకేన దేహాన్తరగతోఽపి సన్ ॥72॥

ఈ దేహము నీటియందు తడుపబడుచుండగా జీవుడు స్థూలశరీరమును వదిలి సూక్ష్మశరీరమును పొందినప్పటికినీ తాను చేసుకొన్న కర్మల కారణముగా చాలకాలము దుఃఖమును పొందుచున్నాడు.

తత్ర యద్బాంధవాస్తోయం ప్రయచ్ఛంతి తిలైస్సహ ।
యచ్చ పిణ్డం ప్రయచ్ఛంతి నీయమానస్తదశ్నుతే ॥73॥

మరణించిన పిమ్మట యమదూతలచే యమలోకమునకు తీసుకొనిపోబడుచుండగా జీవుడు బంధువులిచ్చిన తిలలతో కూడిన నీటిని, పిండమును గ్రహించి భుజించును.

తైలాభ్యంగో బాంధవానామంగసంవాహనం చ యత్ ।
తేన చాప్యాయతే జంతుర్యచ్చాశ్నన్తి స్వబాంధవాః ॥74॥

మృతుని శరీరమునకు తైలము పట్టించుట, అవయవములను పట్టుకొని మోయుట వీటిద్వారా మరణించిన జీవుడు సుఖమును పొందును. ఇంకను అతని బంధువులు తృప్తిగా తినుటవల్లగూడా ఆ జీవుడు సంతసమును పొందును.

భూమౌ స్వపద్భిర్నాత్యంతం క్లేశమాప్నోతి బాంధవైః ।
దానం దదద్భిశ్చ తథా జంతురాప్యాయతే మృతః ॥75॥

ఇంకనూ బంధువులు నేలమీద పరుండినందువల్ల, దానములు చేయుటవల్ల మరణించిన జీవుడు సంతసమును పొందును.

నీయమానస్స్వకం గేహం ద్వాదశాహం స పశ్యతి ।
ఉపభుఙ్క్తే తథా దత్తం తోయపిణ్డాదికం భువి ॥76॥

మరణించిన పిమ్మట పంద్రెండవరోజున యమదూతలు అతడిని అతడి గృహమునకు తీసుకొనిరాగా, భూలోకమందు తనకీయబడిన జలాహారములను ఆ మరణించిన జీవుడు గ్రహించి భుజించును.

ద్వాదశాహాత్పరం ఘోరమావాసం భీషణాకృతిమ్ ।
యామ్యం పశ్యత్యథో జంతుః కృష్యమాణః పురం తతః ॥77॥

పంద్రెండు రోజులు పూర్తి అయిన పిమ్మట యమదూతలచే యమపురికి తీసుకొనిపోబడుచూ ఘోరము, భయంకరమైనదీయగు యమప్రదేశమును చూచును.

గతమాత్రోఽతిరక్తాక్షం భిన్నాంజనచయప్రభమ్ ।
మృత్యుకాలాంతకాదీనాం మధ్యే పశ్యతి వై యమమ్ ॥78॥

దంష్ట్రాకరాళవదనం భ్రుకుటీదారుణాకృతిమ్ ।
విరూపైర్భీషణైర్వక్త్రైర్వృతం వ్యాధిశతైః ప్రభుమ్ ॥79॥

దణ్డాసక్తం మహాబాహుం పాశహస్తం సుభైరవమ్ ।
తన్నిర్దిష్టాం తతో యాతి గతిం జంతుశ్శుభాశుభామ్ ॥80॥

యమపురమునకు వెళ్ళినంతనే ఆ జీవుడు మృత్యువు, కాలుడు, అంతకుడు మొ॥వారి మధ్య ఉన్నట్టివాడూ, మిక్కిలి ఎఱ్ఱని కన్నులు కలిగినవాడూ, చెదరిన కాటుకసమూహము వంటి కాంతిగలవాడూ, కోరలు ఎత్తైన దంతములు గలవాడూ, భయంకరమైన కనుబొమలు కలిగినవాడూ, వికృతరూపము కల్గిన భయంకరమైనవారితోనూ, వందలకొలదీ వ్యాధులతోనూ చుట్టబడినవాడూ, దండించుటయందు ఆసక్తి కల్గినవాడూ, ఎత్తైనభుజములు కల్గినవాడూ, చేతియందు యమపాశమును ధరించినవాడూ, భయంకరమైన ఆకారము కల్గినవాడూ అగు యమధర్మరాజును చూచును. అటు పిమ్మట యమధర్మరాజు నిర్దేశించిన విధముగా మంగళమైనదిగానీ, అమంగళమైనదిగానీ ఏదేని ఫలమును పొందును.

రౌరవే కూటసాక్షీ తు యాతి యశ్చానృతీ నరః ।
బ్రహ్మఘ్నో హత్యయా దష్టో గోఘ్నశ్చ పితృఘాతకః ॥81॥

క్షేత్రదారాపహారీ చ సీమానిక్షేపహారకః ।
గురుపత్న్యభిగామీ చ కన్యాగామీ తథైవ చ ॥82॥

అబద్ధపుసాక్ష్యము చెప్పినవాడూ, అసత్యములను చెప్పినవాడూ, బ్రాహ్మణుని చంపుటచే బ్రహ్మహత్యాదోషము కల్గినవాడూ, గోవులను చంపినవాడూ, తల్లిదండ్రులను చంపినవాడూ, ఇతరుల భూములను భార్యలను అపహరించినవాడూ, పొలముల హద్దులను తన పొలములలో కలుపుకొనువాడూ, గురుపత్నిని పొందినవాడూ, కన్యను కామించి పొందినవాడూ అగు మానవుడు అట్లే రౌరవమను నరకమందు పడును.

తస్య స్వరూపం గదతో రౌరవస్య నిశామయ ।
యోజనానాం సహస్రే ద్వే రౌరవో హి ప్రమాణతః ॥
జానుమాత్రప్రమాణశ్చ తతశ్చాభ్రస్సుదుస్తరః ॥83॥

ఆ రౌరవమను నరకముయొక్క స్వరూపమును చెప్పెదను, వినుము. ఆ రౌరవము రెండువేల యోజనముల ప్రమాణము కలిగియుండును. ఇంకనూ మోకాలు లోతుగలదీ, దాటుటకు మిక్కిలి కష్టమైనదీయగు పెద్ద గొయ్యి ఉండును.

తత్రాఙ్గారచయోపేతం కృతం చ ధరణీసమమ్ ।
జాజ్వల్యమానస్తీవ్రేణ తాపితాఙ్గారభూమినా ॥84॥

ఆ గొయ్యి భూమి పైభాగమువరకు మండుచున్న బొగ్గులతో కప్పబడియుండును. మంటలచే వేడెక్కిన భూమి కల్గినందున ఆ గొయ్యిలోని మంట మిక్కిలి ప్రకాశించుచుండును.

తన్మధ్యే పాపకర్మాణం విముఞ్చన్తి యమానుగాః ।
స దహ్యమానస్తీవ్రేణ వహ్నినా తత్ర ధావతి ॥85॥

ఆ మండుచున్న గొయ్యిలోనికి యమదూతలు పాపకర్మలాచరించిన ఆ నరుని విడిచిపెట్టెదరు. తీవ్రమైన నిప్పులచే కాల్చబడుచూ ఆ మానవుడు అటునిటు పరుగెత్తుచుండును.

పదే పదే చ పాదోఽస్య శీర్యతే జీర్యతే పునః ।
అహోరాత్రేణోద్ధరణం పాదన్యాసం చ గచ్ఛతి ॥86॥

మాటిమాటికి ఆ జీవుని పాదము తగులబడి శిథిలమైపోవును. రాత్రింబవళ్ళు ఆ మంటలో నుంచి తన పాదమును పైకి తీయుట, తిరిగి పాదమును ఆ మంటలో ఉంచుట చేయుచుండును.

ఏవం సహస్రముత్తీర్ణో యోజనానాం విముచ్యతే ।
తతోఽన్యత్పాపశుద్ధ్యర్థం తాదృఙ్నిరయమృచ్ఛతి ॥87॥

ఈ విధముగా వేయి యోజనములు దాటిన పిమ్మట జీవుడు ఆ నరకమునుండి ముక్తుడగును. అటుపిమ్మట పాపశుద్ధికొరకు ఆ జీవుడు తిరిగి నిరయము (సంతోషములు లేనిది) అను పేరుగల మరొక నరకమును పొందును.

తతస్సర్వేషు నిస్తీర్ణః పాపీ తిర్యక్త్వమశ్నుతే ।
కృమికీటపతంగేషు శ్వాపదే మశకాదిషు ॥88॥

గత్వా గజద్రుమాద్యేషు గోష్వశ్వేషు తథైవ చ ।
అన్యాసు చైవ పాపాసు దుఃఖదాసు చ యోనిషు ॥89॥

మానుష్యం ప్రాప్య కుబ్జో వా కుత్సితో వామనోఽపి వా ।
చండాలపుల్కసాద్యాసు నరో యోనిషు జాయతే ॥90॥

పాపాత్ముడైన ఆ నరుడు అన్ని నరకములనుంచి విముక్తుడై పశుపక్ష్యాది జన్మను పొందును. ఇంకనూ కృములు, కీటములు, పక్షులు, శ్వాపదములు (హింసాత్మక జంతువులు), దోమలు మొ॥లగు యోనులందు జన్మించును. ఇంకనూ ఆ పాపాత్ముడు ఏనుగులు, చెట్లు మొ॥వానియందు, గోవులు, ఎద్దులు, గుర్రములు, ఇంకనూ దుఃఖమునిచ్చు అనేక పాపయోనులందు జన్మించును. చివరకు మనుష్యజన్మను పొందిననూ గూనివాడు, నీచుడు, పొట్టివాడుగా జన్మించును. అట్లే చండాల, సంకర యోనులందు జన్మించును.

అవశిష్టేన పాపేన పుణ్యేన చ సమన్వితః ।
తతశ్చారోహణీం జాతిం శూద్రవైశ్యనృపాదికామ్ ॥91॥

విప్రదేవేంద్రతా చాపి కదాచిదవరోహణీమ్ ।
ఏవం తు పాపకర్మాణో నరకేషు పతన్త్యధః ॥92॥

తిరిగి మిగిలిన పాపపుణ్యములతో కూడుకొన్నవాడై ఆరోహణక్రమముతో శూద్ర, వైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ, దేవేంద్ర జాతులందు జన్మించును. (ఒకదానికంటే మరొకటి మెరుగైన జాతియని అభిప్రాయము.) అట్లే అవరోహణక్రమముతో కూడా దేవేంద్రజాతి నుంచి శూద్రజాతివరకు కూడా ఆయా యోనులను పొందును. ఈ విధముగా పాపకర్మల నాచరించినవారు ఆయా నరకలోకములందు పడుచున్నారు.

యథా పుణ్యకృతో యాన్తి తన్మే నిగదతశ్శృణు ।
తే యమేన వినిర్దిష్టాం యాతి పుణ్యాం గతిం నరాః ॥93॥

ప్రగీతగంధర్వగణైః ప్రనృత్తాప్సరసాం గణైః ।
హారనూపురమాధుర్యశోభితాన్యుత్తమాని చ ॥94॥

ప్రయాన్త్యాశు విమానాని నానాదివ్యస్రగుజ్జ్వలామ్ ।
తస్మాచ్చ ప్రచ్యుతా రాజ్ఞామన్యేషాం చ మహాత్మనామ్ ॥95॥

జాయన్తే చ కులే తత్ర సద్వృత్తపరిపాలకాః ।
భోగాన్ సంప్రాప్నువన్త్యగ్ర్యాంస్తతో యాన్త్యూర్ధ్వమన్యథా ॥96॥

అవరోహిణీం చ సంప్రాప్య పూర్వవద్యాన్తి మానవాః ।
ఏతత్తే సర్వమాఖ్యాతం యథా జన్తుర్విపద్యతే ॥
అతశ్శృణుష్వ విప్రర్షే! యథా గర్భం ప్రపద్యతే ॥97॥

పుణ్యకర్మలనాచరించినవారు ఎట్టి గతిని పొందెదరో చెప్పెదను, వినుము. వారు యమధర్మరాజు నిర్దేశించిన పుణ్యగతిని పొందెదరు. ఆ పుణ్యలోకములు గానముచేయుచున్న గంధర్వగణములతోనూ, నాట్యము చేయుచున్న అప్సరసల సమూహములతోనూ కూడినట్టివి. ఇంకనూ హారనూపురమాధుర్యములతో ప్రకాశించుచున్నవీ, ఉత్తమములూ, నానావిధములైన దివ్యపుష్పమాలలచే ఉజ్జ్వలములూ అయిన విమానములు ఆ పుణ్యకర్ములను ఉత్తమలోకములకు గొని పోవుటకు అచ్చటకు వచ్చును. ఇట్లు పుణ్యకర్ములు ఉత్తమమైన స్వర్గాదిలోకములకు వెళ్ళి పుణ్యము నశించినపిమ్మట ఆ లోకములనుండి క్రిందకు జారిపడినవారై రాజులు, మహాత్ముల ఇండ్లలో వారి యోనులందు జన్మించెదరు. ఆ పుణ్యాత్ములు సదాచారపరిపాలకులై ఆ కులములందు ఉద్భవించెదరు. ఇంకనూ శ్రేష్ఠములైన అనేకభోగములననుభవించి క్రమముగా ఊర్ధ్వగతులను పొందెదరు. అట్లుకానిచో (అనగా పుణ్యము కంటే పాపము ఎక్కువ కల్గినవారు) తిరిగి పూర్వమువలే ఆ మానవులు అవరోహణక్రమమును పొంది మనుష్యాది జన్మలనెత్తెదరు. ఓ తండ్రీ! జీవుడు మరణించిన పిమ్మట ఎట్లు ఆపదలను పొందునో అదియంతయు తమకు వివరముగా చెప్పితిని. విప్రశ్రేష్ఠుడవగు ఓ తండ్రీ! ఇటుపైన జీవుడు తల్లి గర్భమందు ఎట్లు ప్రవేశించునో చెప్పదను, వినుము.

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే పితాపుత్రసంవాదే మృత్యుదశావర్ణనం నామ దశమోఽధ్యాయః ॥10॥

శ్రీ మార్కండేయ మహాపురాణమందు పితాపుత్రసంవాదమందు మృత్యుదశావర్ణనమనెడు *పదియవ అధ్యాయం సమాప్తం.*

ఏకాదశోఽధ్యాయః – పదునొకొండవ అధ్యాయం
గర్భస్థితివర్ణనమ్ – జీవుని గర్భస్థితి వర్ణనం

పుత్ర ఉవాచ – కుమారుడు చెప్పాడు.

నిషేకం మానవస్త్రీణాం బీజం ప్రోక్తం రజస్యథ ।
విముక్తమాత్రో నరకాత్ స్వర్గాద్వాపి ప్రపద్యతే ॥1॥

ఓ తండ్రీ ! నిషేకకాలమందు (స్త్రీపురుషులసంభోగకాలమందు) మానవ స్త్రీలరజస్సునందు ఉంచబడిన బీజమందు స్వర్గమునుండిగాని నరకమునుండి గాని విడువబడినవాడు ప్రవేశించును.

తేనాభిభూతం తత్స్థైర్యం యాతి బీజం ద్వయం పితః ।
కలలత్వం బుద్బుదత్వం తతః పేశిత్వమేవ చ ॥2॥

ఓ తండ్రీ ! స్త్రీరజస్సు, పురుషవీర్యము ఈ రెండు పరస్పరసంయోగముచే స్థైర్యమునుపొంది మొదట నురుగుగానూ, అటుపిమ్మట బుడగగానూ, ఆ తర్వాత చిన్న మాంసపుముద్ద యాకారము గలదిగానూ యగును.

పేశ్యాస్తథా యథా బీజాదంకురాది సముద్భవః ।
అంగానాం చ తథోత్పత్తిః పఞ్చానామనుభాగశః ॥3॥

బీజమునుండి అంకురములు మొలకెత్తినట్లు శుక్రశోణితసంభవమగు ఆ మాంసపుముద్దనుండి క్రమముగా అయిదు అవయవములుద్భవించును.

ఉపాంగాన్యంగులీనేత్రనాసాస్యశ్రవణాని చ ।
ప్రరోహం యాన్తి చాఙ్గేభ్యస్తద్వత్తేభ్యో నఖాదికమ్ ॥4॥

తరువాత ఉపాంగములు అనగా వ్రేళ్ళు, కళ్ళు, ముక్కు, ముఖము, చెవులు, పూర్వము చెప్పబడిన అయిదు అవయవములు పుట్టును. అట్లే ఆ ఉపాంగములనుండి గోళ్ళు మొదలగునవి పుట్టును.

త్వచి రోమాణి జాయన్తే కేశాశ్చైవ తతః పరమ్ ।
సమం సమృద్ధిమాయాతి తేనైవోద్భవకోశకః ॥5॥

అటు పిమ్మట చర్మమునందు రోమములు, కేశములు ఉత్పన్నములగును. ఆయాకోశములతో బాటుగా గర్భము సమానముగా వృద్ధి పొందుచుండును.

నారికేళఫలం యద్వత్ సకోశం వృద్ధిమృచ్ఛతి ।
తద్వత్ప్రయాత్యసౌ వృద్ధిం సకోశోఽధోముఖః స్థితః ॥6॥

కొబ్బరికాయ అవయవములతోబాటు వృద్ధిని పొందినట్లు గర్భమందలి జీవుడు గూడా అధోముఖుడై కోశములతో బాటు వృద్ధిని పొందును.

తలే తు జానుపార్శ్వాభ్యాం కరౌ న్యస్య స వర్ధతే ।
అంగుష్ఠౌ చోపరి న్యస్తౌ జన్వోరగ్రే తథాఙ్గులీ ॥7॥

జీవుడు శిరస్సును క్రిందకు ఉంచి గర్భమందుండగా, ఆ గర్భము యొక్క ఉపరిభాగమందు మోకాళ్ళు, ప్రక్కభాగములతో సహా చేతులను ఉంచి వృద్ధినొందును. బొటనవ్రేళ్ళు, మిగిలినవ్రేళ్ళు జానువుల అగ్రభాగమందుంచబడినవి.

జానుపృష్ఠే తథా నేత్రే జానుమధ్యే చ నాసికా ।
స్ఫిచౌ పార్ష్ణిద్వయస్థౌ చ బాహూజంఘే బహిః స్థితే ॥8॥

మోకాళ్ళ వెనుకభాగమందు కళ్ళు, మోకాళ్ళ మధ్యభాగమందు ముక్కు, స్ఫిక్కులు రెండు (పిర్రలు) పృష్ఠభాగములందు, బాహువులు పిక్కలు బహిర్భాగమందు ఉంచబడినవి.

ఏవం వృద్ధిం క్రమాద్యాతి జంతుః స్త్రీగర్భసంస్థితః ।
అన్యసత్త్వోదరే జన్తోర్యథా రూపం తథాస్థితః ॥9॥

ఈ విధముగా జీవుడు స్త్రీగర్భమందున్నవాడై క్రమముగా వృద్ధిని పొందును. ఇతరుల గర్భమందు ఉన్న ఆ జీవుడు వారి రూపము వంటి రూపమును పొందును.

కాఠిన్యమగ్నినా యాతి భుక్తపీతేన జీవతి ।
పుణ్యాపుణ్యాశ్రయమయీ స్థితిర్జన్తోస్తథోదరే ॥10॥

స్త్రీగర్భమందలి జఠరాగ్నిచే పిండము కాఠిన్యమును పొందును అనగా గట్టిపడును. తల్లి తిన్న త్రాగిన ఆహారముల వల్లనే జీవుడు జీవించును అనగా ప్రాణధారణ చేయును. జీవుడు తాను చేసుకొన్న పాపపుణ్యముల కారణముగానే వివిధములైన గర్భవాసములను పొందును.

నాడీ చాప్యాయనీ నామ నాభ్యాం తస్య నిబధ్యతే ।
స్త్రీణాం తథాన్త్రశుషిరే సా నిబద్ధోపజాయతే ॥11॥

గర్భమందున్న జీవుని నాభియందు "ఆప్యాయని" అను పేరుగల ఒక నాడి నిబద్ధమై యుండును. ఆ నాడి ఆ స్త్రీయొక్క అంత్రశుషిరమందు (పొట్టభాగమందలి ఛిద్రము) సంలగ్నమైయుండును.

క్రామన్తి భుక్తపీతాని స్త్రీణాం గర్భోదరే యథా ।
తైరాప్యాయితదేహోఽసౌ జన్తుర్వృద్ధిముపైతి వై ॥12॥

స్త్రీగర్భమందలి ఆ అంత్రశుషిరముద్వారా తల్లి త్రాగిన తినిన యన్ని పదార్థములు ఆ జీవుని చేరును. వాటివలన ఆ జీవుడు పోషింపబడి వృద్ధిని పొందును.

స్మృతిం తత్ర ప్రయాన్త్యస్య బహ్వ్యః సంసారభూమయః ।
తతో నిర్వేదమాయాతి పీడ్యమాన ఇతస్తతః ॥13॥

ఆ స్త్రీగర్భమందుండగా జీవునికి తన జన్మవృత్తాంతములు అనేకములు గుర్తుకు వచ్చును. అందువలన ఆ గర్భమందు ఇటునటు పీడింపబడుతూ గొప్ప వైరాగ్యమును పొందును.

పునర్నైవం కరిష్యామి ముక్తమాత్ర ఇహోదరాత్ ।
తథా తథా యతిష్యామి గర్భం నాప్స్యామ్యహం యథా ॥14॥

ఇతి చిన్తయతే స్మృత్వా జన్మదుఃఖశతాని వై ।
యాని పూర్వానుభూతాని దైవభూతాని యాని వై ॥15॥

"ఈ గర్భమునుండి బయల్వెడలిన పిమ్మట మరల ఇట్టి దుష్కర్మలను ఆచరించను. మరల పుట్టుకలేని విధముగా ప్రయత్నించెదను" అని పూర్వజన్మలలో అనుభవించినవీ, దైవమువలన సంప్రాప్తించినవీ అయిన వందల దుఃఖములను జ్ఞప్తికి తెచ్చుకొని విచారించును.

తతః కాలక్రమాజ్జంతుః పరివర్తత్యధోముఖః ।
నవమే దశమే వాఽపి మాసి సఞ్జాయతే తతః ॥16॥

అటుపిమ్మట కాలక్రమముగా ఆ జీవుడు అధోముఖుడై పరివర్తనముచెంది అనగా అవయవములు వృద్ధి చెంది తొమ్మిది లేదా పదియవ మాసమందు జన్మించును.

నిష్క్రామ్యమాణో వాతేన ప్రాజాపత్యేన పీడ్యతే ।
నిష్క్రామ్యతే చ విలపన్ హృది దుఃఖనిపీడితః ॥17॥

స్త్రీగర్భము నుండి బయటపడు సమయమందు ప్రాజాపత్యమను పేరుగల వాయువుచే పీడింపబడినవాడగును. హృదయమందలి దుఃఖముచే పీడింపబడి విలపించుచు తల్లి గర్భమునుండి ఆ జీవుడు బయటకు వచ్చును.

నిష్క్రాంతశ్చోదరాన్మూర్ఛామసహ్యాం ప్రతిపద్యతే ।
ప్రాప్నోతి చేతనాం చాసౌ వాయుస్పర్శసమన్వితః ॥18॥

తల్లిగర్భమునుండి బయల్వెడలిన వెంటనే సహింపశక్యముగాని మూర్ఛను (తెలివి తప్పుటను) పొందును. అనంతరము బాహ్యవాయుస్పర్శచే చైతన్యమును పొందును.

తతస్తం వైష్ణవీ మాయా సమాస్కన్దతి మోహినీ ।
తయా విమోహితాత్మాఽసౌ జ్ఞానభ్రంశమవాప్నుతే ॥19॥

తల్లి గర్భమునుండి బయటపడి చైతన్యమును పొందిన వెంటనే ఆ జీవుని మోహమును కల్గించు వైష్ణవియను మాయ ఆవరించును. ఆ మాయచే మోహితుడై పూర్వజన్మస్మృతులనన్నింటిని పోగొట్టుకొనును.

భ్రష్టజ్ఞానో బాలభావం తతో జన్తుః ప్రపద్యతే ।
తతః కౌమారకావస్థాం యౌవనం వృద్ధతామపి ॥20॥

గర్భమందు తనకున్న పూర్వజన్మస్మృతులన్నీ నశించిన పిమ్మట ఆ జీవుడు బాలభావమును పొందును. అటుపిమ్మట క్రమముగా కౌమార, యౌవన, వార్ధక్యావస్థలను పొందును.

పునశ్చ మరణం తద్వజ్జన్మ చాఽప్నోతి మానవః ।
తతః సంసారచక్రేఽస్మిన్ భ్రామ్యతే ఘటియన్త్రవత్ ॥21॥

మానవుడు తిరిగి మరణించును, అటులనే మరల జన్మనెత్తును. ఈ విధముగా ఘటీయంత్రమువలే ఈ సంసారచక్రమందు జీవుడు భ్రమించును. కాలమును తెలుపుయంత్రమే ఘటీయంత్రము. ఆ యంత్రము పగలు తరువాత రాత్రి, రాత్రి తరువాత పగలు, మరల రాత్రి ఈ విధముగా సమయమును తెలియజేయును. అట్లే ప్రకృతమందు కూడా.

కదాచిత్స్వర్గమాప్నోతి కదాచిన్నిరయం నరః ।
నిరయం చైవ స్వర్గం చ కదాచిచ్చ మృతోఽశ్నుతే ॥22॥

జీవుడు ఒకప్పుడు స్వర్గమును పొందును, ఒకప్పుడు నరకమును పొందును. ఈవిధముగా మరణించిన పిమ్మట మానవుడు స్వకర్మానుసారముగా స్వర్గనరకములకు వెళ్ళుచుండును.

కదాచిదత్రైవ పునర్జాతః స్వం కర్మ సోఽశ్నుతే ।
కదాచిద్భుక్తకర్మా చ మృతః స్వల్పేన గచ్ఛతి ॥23॥

ఒకప్పుడు మానవుడు మరల ఈ మనుష్యలోకమందు జన్మించి తాను చేసుకున్న కర్మలను అనుభవించును. స్వకర్మఫలభోగము పూర్తి అయిన పిమ్మట స్వల్పకాలమునకే మరణమును పొందును.

కదాచిదల్పైశ్చ తతో జాయతేఽత్ర శుభాశుభైః ।
స్వర్లోకే నరకే వాఽపి భుక్తప్రాయో ద్విజోత్తమ ॥24॥

ఓ బ్రాహ్మణశ్రేష్ఠుడా ! అల్పములైన పుణ్యాపాపకర్మల కారణముగా ఒకప్పుడు స్వర్గలోకమందుగాని నరకలోకమందుగాని కర్మఫలమును అనుభవించి ఈ మనుష్యలోకమందు జన్మనెత్తును.

నరకేషు మహద్దుఃఖమేతద్యత్స్వర్గవాసినః ।
దృశన్తే తాత ! మోదన్తే పాత్యమానాశ్చ నారకాః ॥25॥

నరకలోకమునందు క్రిందకు పడద్రోయబడిన జీవులు గొప్ప దుఃఖమును అనుభవించుచున్నారు. స్వర్గలోకమందు నివసించు జీవుడు సంతోషము కల్గినవారుగా కన్పట్టుచున్నారు.

స్వర్గేఽపి దుఃఖమతులం యదారోహణకాలతః ।
ప్రభృత్యహం పతిష్యామీత్యేవం మనసి వర్తతే ॥26॥

నరకాంశ్చైవ సంప్రేక్ష్య మహద్దుఃఖమవాప్యతే ।
ఏతాం గతిమహం గన్తేత్యహర్నిశమనిర్వృతః ॥27॥

స్వర్గలోకమునకు వెళ్ళిన మరుక్షణమునుంచి "పుణ్యక్షయమయిన పిమ్మట క్రిందకు పడిపోయెదను కదా"యని మనస్సులో అమితమయిన దుఃఖము కలుగుచుండును. గొప్ప దుఃఖమును అనుభవించుచున్న నరకలోకవాసులను చూచి "నేను కూడా ఇట్టి దుఃస్థితిని పొందెదను కదా"యని రాత్రింబవళ్ళు సంతోషములేక గొప్ప దుఃఖమును పొందుచుండును.

గర్భవాసే మహద్దుఃఖం జాయమానస్య యోనితః ।
జాతస్య బాలభావే చ వృద్ధత్వే దుఃఖమేవ చ ॥28॥

కామేర్ష్యాక్రోధసంబంధం యౌవనం చాతిదుస్సహమ్ ।
దుఃఖప్రాయా వృద్ధతా చ మరణే దుఃఖముత్తమమ్ ॥29॥

కృష్యమాణశ్చ యామ్యైశ్చ నరకేషు చ పాత్యతః ।
పునశ్చ గర్భో జన్మాథ మరణం నరకస్తథా ॥30॥

గర్భమందు నివసించుటచే గొప్ప దుఃఖము, పుట్టబోవునప్పుడు స్త్రీయోనినుండి బయటకు వచ్చునప్పుడు దుఃఖము, పుట్టిన తరువాత బాల్యమందు, వృద్ధాప్యమందు దుఃఖము కలుగుచునేయుండును. కామము, ఈర్ష్య, క్రోధము వీటి సంబంధమున్నందువలన యౌవనము సహింపశక్యముగాని దుఃఖము కల్గినది. వార్ధక్యము ఇంచుమించు దుఃఖమే కల్గినది. ఇక మరణమందు చాలా ఎక్కువ దుఃఖము కలుగును. అప్పుడు యమదూతలు జీవుని బంధించి ఈడ్చుకొనిపోయి నరకలోకమందు పడవైతురు. మరల స్త్రీగర్భమందు పడుట, పుట్టుట, చచ్చుట కలుగుచుండును.

ఏవం సంసారచక్రేఽస్మిన్ జన్తవో ఘటియంత్రవత్ ।
భ్రామ్యన్తే ప్రాకృతైర్బన్ధైర్బద్ధ్వా వధ్యన్తి చాసకృత్ ॥31॥

నాస్తి తాత సుఖం కించిదత్ర దుఃఖశతాకులే
తస్మాన్మోక్షాయ యతతా కథం సేవ్యా మయా త్రయీ ॥32॥

ఈ విధముగా ఈ సంసారచక్రమందు ప్రాణులు ఘటియంత్రమువలే తిరుగాడుచుందురు. అవిద్యాబంధములచే బంధింపబడి మాటిమాటికి చంపబడుదురు. అందువలన ఓ తండ్రీ ! వందల కొలదీ దుఃఖములచే నిండిన ఈ సంసారమందు కొంచెము కూడా సుఖము లేదు. అందువలన మోక్షము కొరకు ప్రయత్నము చేయుచున్న నేను ధర్మార్థకామములను మూడింటిని ఎట్లు సేవించగలను?

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే పితాపుత్రసంవాదే గర్భస్థితివర్ణనం నామ ఏకాదశోఽధ్యాయః ॥11॥

శ్రీ మార్కండేయ మహాపురాణమందు పితాపుత్రసంవాదమందు జీవుని గర్భస్థితివర్ణనమను పదునొకండవ అధ్యాయం సమాప్తం.



ద్వాదశోఽధ్యాయః - పంద్రెండవ అధ్యాయం
మహారౌరవాదినరకాఖ్యానమ్ - మహారౌరవాది నరక నిరూపణం

పితా ఉవాచ - తండ్రి పలికాడు.

> **సాధు వత్స త్వయాఽఖ్యాతం సంసారగహనం పరమ్ ।**
> **జ్ఞానప్రదానసంభూతం సమాశ్రిత్య మహాఫలమ్ ॥1॥**
>
> **తత్ర తే నరకాస్సర్వే యథా వై రౌరవస్తథా ।**
> **వర్ణితాస్తాన్ సమాచక్ష్వ విస్తరేణ మహామతే ॥2॥**

ఓ కుమారా ! జ్ఞానదాయకమగు మహాఫలమునిచ్చునట్టి సంసారనిగూఢతత్త్వమును నీవు చక్కగా చెప్పితివి. నీవు వర్ణించి చెప్పిన రౌరవాది నరకములను గూర్చి సవిస్తరముగా చెప్పుము.

పుత్ర ఉవాచ - కుమారుడు పలికాడు.

> **రౌరవస్తే సమాఖ్యాతః ప్రథమం నరకో మయా ।**
> **మహారౌరవసంజ్ఞం తు శృణుష్వ నరకం ప్రతి ॥3॥**

తండ్రీ ! నీకు మొదట రౌరవనరకమును గూర్చి చెప్పితిని. ఇప్పుడు మహారౌరవమను పేరుగల నరకమును గూర్చి చెప్పెదను వినుము.

> **అగమ్యాగమనే యే చ అభక్ష్యభక్షణే రతాః ।**
> **మిత్రద్రోహకరాశ్చైవ స్వామివిస్రంభఘాతకాః ॥4॥**
>
> **పరదారరతాశ్చైవ స్వదారపరివర్జినః ।**
> **మార్గభంగకరా యే చ తడాగారామభేదకాః ॥5॥**
>
> **ఏతేఽన్యే చ దురాచారా దహ్యన్తే తత్ర కింకరైః ।**
> **యోజనానాం సహస్రాణి సప్తపఞ్చ సమన్తతః ॥6॥**
>
> **తత్తాపతప్తా సా సర్వా ప్రోద్యద్విద్యుత్సమప్రభా ।**
> **విభాత్యతిమహారౌద్రా దర్శనస్పర్శనాదిషు ॥7॥**

పొందగూడని స్త్రీలను పొందుటయందు, తినగూడని పదార్థములను తినుటయందు ఆసక్తికల్గినవారు, మిత్రద్రోహమునకు ఒడిగట్టువారు, స్వామివిశ్వాసఘాతకులు, ఇతరుల భార్యలను పొందాలనే కోరికగలవారు, తమ భార్యలను వదిలిపెట్టువారు, మార్గమును పాడుచేయువారు, చెరువులు, తోటలను పాడుచేయువారు, వీరుగాక ఇతర దురాచారులు అందరూ ఆ మహారౌరవనరకమందు యమకింకరులచే అగ్నిలో కాల్చబడతారు. ఈ మహారౌరవనరకము పన్నెండువేల యోజనముల విస్తీర్ణము కలిగి, దాని భూమి రాగితో చేయబడియుండును. ఆ తామ్రభూమిక్రింద అగ్నిదేవుడుండి పైనున్న వారిని దహించుచుండును. ఆ అగ్నిదేవునిచే తపింపబడిన ఆ తామ్రమయభూమి మెరయుచున్న

మెరుపులతో సమానమైన కాంతి కలదై, దర్శించుట, స్పృశించుట మొదలగు ఇంద్రియవిషయములందు మిక్కిలి భయంకరమైనదియై ప్రకాశించుచుండును.

తస్యాం బద్ధః కరాభ్యాం చ పద్భ్యాం చైవ యమానుగైః ।
ముచ్యతే పాపకృన్మధ్యే లుంఠ్యమానస్స గచ్ఛతి ॥8॥

ఆ మండుచున్న మహారౌరవనరకభూమియందు ఆ పాపాచరణము గల జీవుడు యమకింకరులచే చేతులు, కాళ్ళు బంధింపబడి విడువబడును. అట్టి జీవుడు ఆ మండుచున్న భూమిమధ్యలో దొర్లుచుండును.

కాకైర్బకైర్వృకోలూకైర్వృశ్చికైర్మశకైస్తథా ।
భక్ష్యమాణస్తథా గృధ్రైర్ద్రుతం మార్గే వికృష్యతే ॥9॥

కాకులు, కొంగలు, తోడేళ్ళు, గుడ్లగూబలు, తేళ్ళు, దోమలు, రాబందులు వీటిచే తినబడుచూ ఆ మహారౌరవమార్గమందు పాపాచరణముగల జీవుడు ఈడ్చుకొని తీసుకొనిపోబడును.

దహ్యమానః పితర్మాతర్భ్రాతస్తాతేతి చాఽఽకులః ।
వదత్యసకృదుద్విగ్నో న శాన్తిమధిగచ్ఛతి ॥10॥

మండుచున్న ఆ మహారౌరవనరకభూమియందు దహించబడుచూ, వ్యాకులచిత్తుడై, ఉద్విగ్నుడై ఓ తండ్రీ! ఓ తల్లీ! ఓ సోదరుడా! అని పలుకుచూ రోదించుచు, శాంతి లేకయుండును.

ఏవం తస్మాన్నరైర్మోక్షో హ్యతిక్రాంతైరవాప్యతే ।
వర్షాయుతాయుతైః పాపం యైః కృతం దుష్టబుద్ధిభిః ॥11॥

వేలవేల సంవత్సరములనుంచి పాపాచరణగావించిన దుష్టబుద్ధులు ఆ మహారౌరవనరకమందు బాధలను అనుభవించిన పిమ్మట ఆ నరకమునుండి విముక్తులగుదురు.

తథాఽఽన్యస్తు తమో నామ సోఽఽతిశీతః స్వభావతః ।
మహారౌరవవద్దీర్ఘస్తథాతితమసాఽఽవృతః ॥12॥

దీని తరువాత మిక్కిలి అంధకారముతో ఆవరింపబడిన తమస్సనుపేరుగల నరకము గలదు. ఇది స్వభావసిద్ధముగా మిక్కిలి శీతలముగా నుండును. మహారౌరవనరకమువలె ఈ నరకము గూడా దీర్ఘప్రమాణము గలదైయుండును.

గోవధశ్చ కృతో యేన భ్రాతౄణాం ఘాత ఏవ చ ।
అబన్నబాలఘాతీ చ నీయతే శీతసఙ్కరే ॥13॥

ఎవరైతే గోవులను, సోదరులను, బాలురను చంపితిరో నీటిని అన్నమును అపహరించితిరో వారు అతిశీతలమైన ఈ తమస్సను నరకమందు పడవేయబడుదురు.

శీతార్తాస్తత్ర ధావంతి నరాస్తమసి దారుణే ।
పరస్పరం సమాసాద్య పరిరభ్యాఽఽశ్రయన్తి చ ॥14॥

దుస్సహమైన చల్లదనముచే పీడింపబడినవారై ఆ నరులు కటికచీకటిగల ఆ నరకమందు కళ్ళు కనబడక ఇటునటు పరుగెత్తుచుందురు. ఇంకను చలిచే ఒకరినొకరు కౌగలించుకొని పరస్పరాశ్రయమును పొందుదురు.

దంతాస్తేషాం చ భజ్యన్తే శీతార్తిపరికంపితాః ।
క్షుత్తృష్ణే ప్రబలా తత్ర తథైవాన్యేఽప్యుపద్రవాః ॥15॥

వారి దంతములు ఊడిపోవును. సహింపశక్యముగాని శైత్యముచే వణుకుచుందురు. ఆ తమస్సను నరకమందు ఆకలిదప్పులు మిక్కుటముగానుండును. అట్లే మరియెన్నో ఉపద్రవములచ్చట సంభవించును.

హిమఖణ్డవహో వాయుర్భినత్త్యస్థీని దారుణః ।
మజ్జాసృగ్గలితం తస్మాదశ్నువన్తి క్షుధాన్వితాః ॥16॥

మంచుముక్కలను మోయుచున్నదీ, మిక్కిలి సహింపశక్యము కానిదీయగు వాయువు ఆ తమస్సను నరకమందు ఎముకలను విరగ్గొట్టుచుండును. అందువలన మాంసము, రక్తము బయటకు వచ్చి కారుచుండగా, ఆకలిగొన్న ఆ జీవులు వాటినే తినుచుందురు.

లేలిహ్యమానా భ్రామ్యన్తే పరస్పరసమాగమే ।
ఏవం తత్రాపి సుమహాన్ క్లేశస్తమసి మానవైః ॥17॥

ప్రాప్యతే బ్రాహ్మణశ్రేష్ఠ యావద్దుష్కృతసంక్షయః ।
నికృన్తన ఇతి ఖ్యాతస్తతోఽన్యో నరకోత్తమః ॥18॥

ఆ నరకమందు ఒకరినొకరు కౌగలించుకొని ఒకరి శరీరమును మరియొకరు నాకుచూ తిరుగాడుచుందురు. ఓ బ్రాహ్మణశ్రేష్ఠుడా ! పాపులు వారి పాపక్షయమగునంతవరకు గొప్ప క్లేశములను అనుభవించెదరు. దీని తరువాత నికృన్తనమను మరియొక గొప్ప నరకము ప్రసిద్ధమైనది గలదు.

తస్మిన్ కులాలచక్రాణి భ్రామ్యన్త్యవిరతం పితః ।
అదృష్టం దృష్టవద్బ్రూయాదశ్రుతం శ్రుతమేవ చ ॥19॥

ఏకాక్షరం గురుం యస్తు దురాచారో న మన్యతే ।
న శృణోతి గురోర్వాక్యం శాస్త్రవాక్యం తథైవ చ ॥20॥

ఏతే పాపా దురాచారాస్తత్ర తైర్యమపురుషైః ।
తేష్వారోప్య నికృత్యన్తే కాలసూత్రేణ మానవాః ॥21॥

యమానుగాంగుళిస్థేన ఆపాదతలమస్తకమ్ ।
న చైషాం జీవితభ్రంశో జాయతే ద్విజసత్తమ ॥22॥

ఓ తండ్రీ ! నికృన్తనమను ఆ నరకమందు ఎల్లప్పుడు కుండలను తయారుచేయు కుమ్మరివాని చక్రములు తిరుగుచుండును. ఎవరయితే చూడనిదానిని చూచినట్లు, విననిదానిని వినునట్లు చెప్పెదరో, ఓమ్ అను మంత్రమును ఉపదేశించు గురువును ఏ దురాచారసంపన్నుడు గౌరవించడో, ఎవరయితే గురువుల ఉపదేశములను శాస్త్రము చెప్పిన విషయములను వినరో అట్టి దురాచార సంపన్నులగు పాపాత్ములను యమపురుషులు ఆ కుమ్మరిచక్రములందుంచి తమ చేతివ్రేళ్ళయందున్న కాలసూత్రమను ఆయుధముతో వారిని కాళ్ళ నుండి శిరస్సు వరకు ముక్కలుముక్కలుగా నరికి వేసెదరు. అయిననూ ఓ బ్రాహ్మణశ్రేష్ఠుడా ! వారు మరణమును పొందక జీవించియే యుందురు.

ఛిన్నాని తేషాం శతశః ఖణ్డాన్యైక్యం వ్రజన్తి చ ।
ఏవం వర్షసహస్రాణి ఛిద్యన్తే పాపకర్మిణః ॥23॥

తావద్యావదశేషం వై తత్పాపం హి క్షయం గతమ్ ।
అప్రతిష్ఠం చ నరకం శృణుష్వ గదతో మమ ॥24॥

ఇట్లు ముక్కలు ముక్కలుగా చేయబడిననూ మరల అవి యన్నియు ఏకమగును. ఈ ప్రకారము పాపాచరణము గలవారు వేయి సంవత్సరములు ఛేదింపబడుదురు. వారి పాపములు నశించునంతవరకు వారా నికృన్తనమను నరకమందే ఉందురు. ఇటుపైన అప్రతిష్ఠమను పేరుగల నరకమును గూర్చి చెప్పెదము వినుము.

యత్రస్థైర్నారకైర్దుఃఖమసహ్యమనుభూయతే ।
స్వధర్మరతవిప్రాణాం విఘ్నం యస్తు సమాచరేత్ ॥25॥

స్వధర్మమును ఆచరించు బ్రాహ్మణులకు ఎవరయితే విఘ్నములను కలిగించెదరో వారు అప్రతిష్ఠమను నరకమును పొందెదరు. ఈ నరకమును పొందినవారు అచ్చట సహింపశక్యముగాని దుఃఖమును అనుభవించుచుందురు.

స బద్ధైర్దారుణైః పాశైర్నీయతే చక్రసఙ్కరైః ।
తాన్యేవ తత్ర చక్రాణి ఘటీయన్త్రాణి చాన్యతః ॥26॥

దుఃఖస్య హేతుభూతాని పాపకర్మకృతాం నృణామ్ ।
చక్రేష్వారోపితాః కేచిద్భ్రామ్యన్తే తత్ర మానవాః ॥27॥

చక్రములందు బంధింపబడిన భయంకరమైన త్రాళ్ళచే ఆ జీవుడు ఆ నరకమునకు తీసుకొని పోబడును. అచ్చట చక్రములు, ఘటీయంత్రములు ఉండును. పాపకర్ములగు జీవులకు అవి దుఃఖహేతువులగును. ఆ చక్రములందు ఉంచబడి కొందరు మానవులు త్రిప్పబడుదురు.

యావద్వర్షసహస్రాణి న తేషాం స్థితిరన్తరా ।
ఘటీయన్త్రేషు చైవాన్యే బద్ధస్తోయే యథా ఘటీ ॥28॥

వేయిసంవత్సరములవరకు పాపకర్ములా నరకమందు ఉండెదరు. ఇది తప్ప మరొకస్థితి వారికుండదు. పాత్ర జలమందు మునిగినట్లుగా ఆ జీవుని ఘటీయంత్రమందు బంధింతురు.

భ్రామ్యన్తే మానవా రక్తముద్గిరన్తః పునః పునః ।
అంత్రైర్ముఖే వినిష్క్రాన్తైర్నేత్రైరగ్రావలంబిభిః ॥29॥

దుఃఖాని తే ప్రాప్నువన్తి యాన్యసహ్యాని జన్తుభిః ।
అసిపత్రవనం నామ నరకం శృణు చాపరమ్ ॥30॥

తమ తమ ముఖములనుండి నరములు బయటకు రాగా, కళ్ళు బయటకువచ్చి ముందుకు వ్రేలాడుతుండగా ఆ పాపకర్ములా నరకమందు రక్తమును వాంతి చేసుకొందురు. ప్రాణులు సహింపశక్యముగాని దుఃఖములను వారు పొందెదరు. అసిపత్రవనమను మరొక నరకమును గూర్చి చెప్పెదను వినుము.

యోజనానాం సహస్రం యో జ్వలదగ్న్యాస్తృతావనిః ।
బ్రహ్మచారివ్రతానాం చ తపసాం విఘ్నమాచరేత్ ॥31॥

అసిపత్రవనం యాన్తి యే సదోద్వేగకారిణః ।
తప్తాః సూర్యకరైశ్చణ్డైర్యత్రాతీవ సుదారుణైః ॥32॥

ఈ నరకము మండుచున్న అగ్నిచే కప్పివేయబడిన భూమి గలదై వేయి యోజనముల విస్తీర్ణము కలిగియుండును. బ్రహ్మచారుల వ్రతములకు, తపస్విజనులాచరించు తపస్సులకు విఘ్నములను కలిగించువారు, ఇతరులను మానసికముగా హింసించువారు ఈ అసిపత్రవనమను నరకమునకు బోయెదరు. ఈ నరకమందు మిక్కిలి సహింపశక్యముగాని సూర్యకిరణములచే పాపాత్ములు దహింపబడుదురు.

ప్రపతన్తి సదా తత్ర ప్రాణినో నరకౌకసః ।
తన్మధ్యే చ వనం రమ్యం స్నిగ్ధపత్రం విభావ్యతే ॥33॥

నరకవాసులగు నరులు ఎల్లప్పుడు తమ పాపముల కారణముగా ఆ అసిపత్రవనమను నరకమందు పడుదురు. ఆ నరకమధ్యభాగమందు దట్టమైన ఆకులతో నిండిన సుందరమైన వనమొకటి గలదు.

పత్రాణి తత్ర ఖడ్గానాం ఫలాని ద్విజసత్తమ ।
శ్వానశ్చ తత్ర సబలాః స్వనన్త్యయుతశోభితః ॥34॥

మహావక్త్రా మహాదంష్ట్రా వ్యాఘ్రా ఇవ భయానకాః ।
తతస్తద్వనమాలోక్య శిశిరచ్ఛాయమగ్రతః ॥35॥

ప్రయాన్తి ప్రాణినస్తత్ర తృట్తాపపరిపీడితాః ।
హా మాతర్హా తాత ఇతి క్రన్దన్తో౽తీవ దుఃఖితాః ॥36॥

దహ్యమానాంఘ్రియుగలా ధరణీస్థేన వహ్నినా ।
తేషాం గతానాం తత్రాసిపత్రపాతీ సమీరణః ॥37॥

ప్రవాతి తేన పాత్యన్తే తేషాం ఖడ్గాస్తథోపరి ।
తతః పతన్తి తే భూమౌ జ్వలత్పావకసఞ్చయే ॥38॥

లేలిహ్యమానే చాతీవ వ్యాప్తాశేషమహీతలే ।
సారమేయాస్తతశ్శీఘ్రం శాతయన్తి శరీరతః ॥39॥

తేషామఙ్గాని రుదతాం త్వచశ్చాతీవ భీషణాః ।
అసిపత్రవనం తాత ! మయైతత్కీర్తితం తవ ॥40॥

ఓ బ్రాహ్మణశ్రేష్ఠుడా! ఆ అసిపత్రవనమందలి ఆకులు ఖడ్గము మున్నగు ఆయుధములనుండి రక్షించే డాలువలె ఉంటాయి. ఆ వనమందు కుక్కలు పెద్దపులులవలే భయంకరమైన రూపము కలిగి మిక్కిలి బలము కలిగియుండును. పెద్ద పెద్ద ముఖములు, కోరలు కలిగిన అట్టి కుక్కలతో ఆ దేశము శోభాయమానముగా ఉండును. ఆకలిదప్పులచే పీడితులయిన ప్రాణులు ఆ వనమును, చల్లని నీడలను చూచి ఆశతో ఓ తండ్రీ! ఓ తల్లీ! అని ఆక్రందనము చేయుచూ మిక్కిలి దుఃఖితులై ఆ అసిపత్రవనమును గూర్చి వెళ్ళెదరు. అయితే భూమిపై ఉన్న అగ్నిచేత వారి రెండు పాదములు దహింపబడుచుండును. ఆ వనమందు వీచు గాలివలన కత్తులు వారిపై పడుచుండును. అంతటవారు అగ్నిమయమైన ఆ భూమిపై క్రిందకు పడిపోవుదురు. ఆ సమయమందు ఏడ్చుచున్న వారి అవయవములను, చర్మములను భయంకరమైన కుక్కలు ఛిన్నాభిన్నము చేయును. ఓ తండ్రీ ! అసిపత్రవనమను నరకమును గూర్చి నీకు వర్ణించి చెప్పితిని.

అతః పరం భీమతరం తప్తకుంభం నిబోధ మే ।
సమన్తతస్తప్తకుంభా వహ్నిజ్వాలాసమావృతాః ॥41॥

జ్వలదగ్నిచయోత్తప్తాస్తైలాయశ్చూర్ణపూరితాః ।
తేషు దుష్కృతకర్మాణో యామ్యైః క్షిప్తాస్త్వధోముఖాః ॥42॥

ఇటుపైన మిక్కిలి భయంకరమైన తప్తకుంభమను నరకమును గూర్చి చెప్పెదను, వినుము. అన్నివైపులా అగ్నిజ్వాలలతో ఆవరింపబడిన వేడెక్కిన పెద్దపెద్ద పాత్రలుండును. ఆ కుంభములు వహ్నిజ్వాలలచే మరుగుచున్న నూనె, ఇనుపపొడి వీటితో నిండినవి. అట్టి కుంభములలో పాపకర్ములను యమదూతలు తలక్రిందులుగా పడవేయుదురు.

దూషయేద్ధర్మశాస్త్రాణి యే చాన్యే తీర్థదూషకాః ।
భుక్తభోగాం తు యో నారీమిష్యమాణాం ప్రియాం శుభామ్ ॥43॥

అదృష్టామపి దోషేణ త్యజతే మూఢచేతనః ।
తే సమానీయ పచ్యన్తే లోహకుంభేషు శీఘ్రతః ॥44॥

క్వాథ్యన్తే విస్ఫుటద్గాత్రా జ్వలన్మజ్జాజలావిలాః ।
స్ఫుటత్కపాలనేత్రాస్థిచ్ఛిద్యమానా విభీషణైః ॥45॥

గృధ్రైరుత్పాట్య ముచ్యన్తే పునస్తేష్వేవ వేగితైః ।
పునస్సిమసిమాయన్తే తైలేనైక్యం వ్రజన్తి చ ॥46॥

ద్రవీభూతైః శిరోగాత్రస్నాయుమాంస త్వగస్థిభిః ।
తతో యామ్యైర్భటైరాశు దర్వీఘట్టనఘట్టితాః ॥47॥

కృతావర్తే మహాతైలే మథ్యన్తే పాపకర్మిణః ।
ఏష తే విస్తరేణోక్తస్తప్తకుంభో మయా పితః ॥48॥

ఎవరయితే ధర్మశాస్త్రములను దూషించెదరో, తీర్థప్రదేశములను పాడు చేయుదురో, తాను ఇష్టపడి అనుభవించిన మంగళస్వరూపురాలయిన ప్రియురాలగు స్త్రీని ఎట్టి దోషములేకనే మూఢబుద్ధియై విడిచిపెట్టునో అట్టి పాపకర్ములు శీఘ్రముగా ఈ లోహకుంభములందు పడవేయబడుదురు, ఉడకబెట్టబడుదురు. అప్పుడు వారి దేహములందలి చీము నెత్తురు జలము మొదలగునవి యన్నియు దహింపబడును. వారి శరీరములు పగిలిపోవుచుండును. భయంకరమైన గ్రద్దలు వారి శరీరములను చీల్చి, వారి కపాలములను, కళ్ళను, ఎముకలను విరగ్గొట్టి వేగముగా వారిని ఈ లోహకుంభములలో పడవైచును. ఆ దేహములు ఆ లోహకుంభములలో సిమసిమలాడుతూ ఉడకబెట్టబడి ఆ మరుగుచున్న తైలములో ఐక్యమును పొందును. వారి శిరస్సులు, శరీరములు, నరములు, మాంసము, చర్మము, ఎముకలు ద్రవరూపముగా పరిణమించగా, యమభటులు ఆ వెంటనే పెద్దపెద్ద గరిటెలతో ఆ ద్రవమును కలియబెట్టుదురు. ఈ విధముగా సుడులు తిరుగుచున్న ఆ మహాతైలమందు పాపకర్ములు మథింపబడుదురు అనగా హింసింపబడుదురు. ఓ తండ్రీ! తప్తకుంభమను ఈ నరకమును గూర్చి నీకు విస్తరముగా నేను చెప్పితిని.

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే పితాపుత్రసంవాదే మహారౌరవాదినరకాఖ్యానం నామ ద్వాదశోఽధ్యాయః॥12॥

శ్రీ మార్కండేయ మహాపురాణమందు పితాపుత్రసంవాదమందు మహారౌరవాది నరకనిరూపణమను పంద్రెండవ అధ్యాయం సమాప్తం.



త్రయోదశోऽధ్యాయః – పదమూడవ అధ్యాయం
పితాపుత్రసంవాదః – తండ్రీకొడుకులసంవాదం

పుత్ర ఉవాచ – కుమారుడు పలికాడు.

అహం వైశ్యకులే జాతో జన్మన్యస్మాత్తు సప్తమే ।
సమతీతే గవాం రోధం నిపానే కృతవాన్ పురా ॥1॥

ఓ తండ్రీ ! ఈ జన్మనుండి పూర్వము ఏడవజన్మలో నేను వైశ్యకులమందు జన్మించితిని. ఒకప్పుడు గోవులు నీళ్ళు త్రాగుచుండగా వాటిని నేను నిరోధించితిని.

విపాకాత్కర్మణస్తస్య నరకం భృశదారుణమ్ ।
సంప్రాప్తోऽగ్నిశిఖాపూర్ణమయోముఖఖగాకులమ్ ॥2॥

యంత్రపీడనగాత్రాసృక్ప్రవాహోద్భూతకర్దమమ్ ।
వికృష్యమాణదుష్కర్మి తన్నిపాతరవాకులమ్ ॥3॥

పాత్యమానస్య మే తత్ర సాగ్రం వర్షశతం గతమ్ ।
మహాతాపార్తితప్తస్య తృష్ణాదాహాన్వితస్య చ ॥4॥

అట్టి దుష్కర్మఫలితముగా మిక్కిలి భయంకరమైన నరకము నాకు సంభవించినది. ఆ నరకము అగ్నిశిఖలతో కూడుకొని, ఇనుపముక్కులు కలిగిన పక్షులతో కూడుకొని, యంత్రములందు నలుగుటచే శరీరములనుండి కారుచున్న రక్తముతో కూడుకొని, ఈడ్చుకొని రాబడుచున్న పాపాత్ములతో కూడుకొని, వారి ఆర్తనాదములతో కూడుకొనియున్నది. అట్టి నరకమందు నేను పడవేయబడితిని. అచ్చట గొప్ప వేడిమితో తప్తుడనై ఆకలిదప్పులతో కూడుకొన్న నాకు నూరు సంవత్సరములు గడచినవి.

తత్రాహ్లాదకరః సద్యః పవనః సుఖశీతలః ।
కరంభవాలుకాకుంభమధ్యస్థే వై సమాగమః ॥5॥

ఇట్లుండగా ఒకరోజు కరంభవాలుకా కుంభముయొక్క మధ్యభాగము నుండి ఆహ్లాదమును, సుఖమును కలిగించు గాలి వీచినది. (రుచికరమైన పదార్థములను వండుచున్న పెద్ద పాత్రయే కరంభవాలుకా కుంభము. ఆ పాత్రనుంచి నోరూరించే సుగంధభరితమైన గాలి వీచుచున్నదని అర్థము.)

అకస్మాదేవ భోస్తాత ! నరరత్నం సమాగతమ్ ।
తత్సంపర్కాదశేషాణాం నాభవద్యాతనా నృణామ్ ॥
మమ చాపి యథా స్వర్గే స్వర్గిణాం నిర్వృతిః పరా ॥6॥

ఓ తండ్రీ ! ఇంతలో హఠాత్తుగా అచ్చటికి ఒక మానవశ్రేష్ఠుడు వచ్చెను. అతనితో సమాగమము వలన అచ్చటి నరులకు ఎట్టి బాధలు కలుగలేదు. నాకు కూడా స్వర్గలోకవాసులకు ఎట్టి సుఖము కలుగునో అట్టి సుఖము కలిగినది.

కిమేతదితి చాహ్లాదవిస్తారస్తిమితేక్షణైః ।
దృష్టమస్మాభిరాసన్నం నరరత్నమనుత్తమమ్ ॥7॥

ఇట్లుండుటకు కారణమేమని మేము సంతోషముతో కళ్ళార్పకుండా చూచుచున్న మాకు మిక్కిలి శ్రేష్ఠుడైన మానవుడొకడు మా సమీపమందు గన్పట్టెను.

యామ్యశ్చ పురుషో ఘోరో దండహస్తోల్లసత్ప్రభః ।
పురతో దర్శయన్మార్గమిత ఏహీతి చ బ్రువన్ ॥8॥

భయంకరరూపము కలిగిన యమభటుడొకడు చేతియందు ధరించిన దండముచే మిక్కిలి ప్రకాశము కలిగినవాడై "ఇటు రమ్ము" అని పలుకుచూ ఆ నరశ్రేష్ఠునికి ముందు మార్గమును చూపించుచుండెను.

తతస్తే జన్తవస్సర్వే మత్వా తద్దర్శనాత్సుఖమ్ ।
ఊచుః ప్రాఞ్జలయో భూపం క్షణమాత్రం స్థితో భవ ॥9॥

త్వద్గాత్రసఙ్గీ పవనో హ్యస్మాకం సుఖకారకః ।
తతోఽసౌ నరకాభ్యాశే ఉపవిష్టః కృపాన్వితః ॥10॥

అప్పుడు అక్కడున్న సర్వప్రాణులు ఆతని దర్శనమాత్రముచేతనే సుఖము కలుగుచున్నదని తలచి చేతులు జోడించి "క్షణమాత్రము ఇచ్చటనే ఉండుడు. మీ శరీరసంబంధముతో బయల్వెడలుచున్న గాలి మాకెంతో సుఖమును కలిగించుచున్నది" అని ఆ మానవుని గూర్చి పలికిరి. అంతట ఆ పురుషుడు దయతో కూడుకొన్నవాడై నరకసమీపమందు నిలచెను.

పురుషస్స తదా దృష్ట్వా యాతనాశతసంకులమ్ ।
నరకం ప్రాహ తం యామ్య కింకరం కృపయాన్వితః ॥11॥

అప్పుడా పురుషుడు వందలకొలదీ యాతనలచే నిండిన నరకమును చూచి ఆ యమదూతతో ఇట్లు పలికెను.

పురుష ఉవాచ – పురుషుడు పలికాడు.

భో యామ్య పురుషాచక్ష్వ కిం మయా దుష్కృతం కృతమ్ ।
యేనేదం యాతనాభీమం ప్రాప్తోఽస్మి నరకం పరమ్ ॥12॥

ఓ యమకింకరుడా ! ఓ పురుషుడా ! నేనేమి పాపము చేయుటచే ఇంతటి భయంకరమైనట్టి నరకమును పొందినానో నాకు చెప్పుము.

విపశ్చిదితి విఖ్యాతో జనకానామహం కులే ।
జాతో విదేహవిషయే సమ్యఙ్మనుజపాలకః ॥13॥

నేను విదేహదేశమందు జనకులవంశమందు పుట్టితిని, పండితునిగానూ, బాగుగా ప్రజలను పరిపాలించువానిగానూ ప్రఖ్యాతిని పొందితిని.

చాతుర్వర్ణ్యం స్వధర్మస్థం కృత్వా సంరక్షితం మయా ।
ధర్మతో ధర్మకల్పేన మనునాఽత్ర యథా పురా ॥14॥

నాలుగు వర్ణములవారిని వారివారి ధర్మమందు ప్రవర్తించునట్లుగా చేసి వారిని రక్షించితిని. పూర్వము ధర్మసమానుడయిన స్వాయంభువ మనువు ఆచరించినట్లుగా నేను ధర్మమును ఆచరించితిని.

యజ్ఞైర్మయేష్టం బహుభిర్ధర్మతః పాలితా మహీ ।
నోత్సృష్టశ్చైవ సంగ్రామో నాతిథిర్విముఖో గతః ॥15॥

నేను అనేకయజ్ఞములనాచరించితిని. ధర్మబద్ధముగా భూమిని పరిపాలించితిని. నేనెన్నడూ యుద్ధమును విడిచి పారిపోలేదు. నానుండి అతిథులెవరూ నిరాశచెంది వెనుతిరగలేదు.

పితృదేవర్షిభృత్యాశ్చ న చాపచారితా మయా ।
మహాతాపార్తితప్తస్య తృష్ణాదాహార్దితస్య చ ॥16॥

సర్వస్య జీవభూతస్య కృతం త్రాణం సదా మయా ।
కృతా స్పృహా చ న మయా పరస్త్రీవిభవాదిషు ॥17॥

పితృదేవతలు, దేవర్షులు, సేవకులు ఎవరినీ నేను ఎన్నడూ అవమానించలేదు. మహాతాపముచేతనూ, ఆకలిదప్పులచేతనూ పీడింపబడిన సమస్తప్రాణికోటిని నేను రక్షించితిని. ఇతరుల భార్యలయందుగాని, సంపదలయందుగాని నేనెట్టి కోరికనూ చూపలేదు.

పర్వకాలేషు పితరస్తిథికాలేషు దేవతాః ।
పురుషం స్వయమాయాన్తి నిపానమివ ధేనవః ॥18॥

నీటిని త్రాగుటకై జలపాత్రవద్దకు గోవులన్నియూ గుమిగూడి వచ్చినట్లుగా అమావాస్యాది పర్వకాలమందు పితృదేవతలు, ఆయా తిథికాలములందు దేవతలు స్వయముగా నావద్దకు వచ్చుచుండిరి.

యతస్తే విముఖా యాన్తి నిఃస్వస్య గృహమేధినః ।
తస్మాదిష్టశ్చ పూర్తశ్చ ధర్మౌ ద్వావపి నశ్యతః ॥19॥

ఆత్మీయతాభావములేని గృహయజమాని వద్దనుంచి పితృదేవతలు, అగ్న్యాది దేవతలు నిరాశులై వెనుదిరిగిపోయినచో ఆ కారణముగా ఆ యజమాని ఆచరించిన యజ్ఞములు, నూతులు త్రవ్వించుట మొదలగు పుణ్యకార్యములు నశించి పోవును అనగా వ్యర్థమై పోవును.

పితృనిశ్వాసవిధ్వస్తం సప్తజన్మార్జితం ధనమ్ ।
త్రిజన్మప్రభవం దైవో నిశ్వాసో హన్త్యసంశయమ్ ॥20॥

పితృదేవతలను అవమానపరచినచో ఏడుజన్మలనుంచి సంపాదించుకొన్న పుణ్యము నష్టమై పోవును. దేవతలను అవమానపరచినచో మూడు జన్మలనుంచి సంపాదించుకొన్న పుణ్యము నష్టమై పోవును. ఇందులో సందేహము లేదు.

తస్మాద్దైవే చ పిత్రే చ నిత్యమేవ హితోఽభవమ్ ।
సోఽహం కథమిమం ప్రాప్తో నరకం భృశదారుణమ్ ॥21॥

అందువలన పితృదేవతల విషయమందు, అగ్ని మొదలగు దేవతల విషయమందు నేనెల్లప్పుడు హితాచరణ కల్గియుంటిని. అట్టి నేను ఇంతటి మిక్కిలి భయంకరమైన నరకమును ఎట్లు పొందితిని?

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే పితాపుత్రసంవాదే త్రయోదశోఽధ్యాయః ॥13॥

శ్రీ మార్కండేయ మహాపురాణమందు పితాపుత్రసంవాదమను పదమూడవ అధ్యాయం సమాప్తం.



చతుర్దశోఽధ్యాయః – పదునాల్గవ అధ్యాయం

స్వకృతకర్మభుక్తికథనం–తానుచేసిన కర్మల ఫలమును అనుభవించుటను గూర్చి చెప్పుట

పుత్ర ఉవాచ – పుత్రుడు చెప్పాడు.

ఇతి పృష్టస్తదా తేన శృణ్వతాం నో మహాత్మనా ।
ఉవాచ పురుషో యామ్యో ఘోరోఽపి ప్రశ్రితం వచః ॥1॥

ఈ విధముగా ప్రశ్నింపబడిన ఆ యమకింకర పురుషుడు భయంకరరూపముదాల్చి కూడా వింటున్న మాతో వినయముతో ఇట్లు పలికెను.

యమకింకర ఉవాచ – యమకింకరుడు చెప్పాడు.

మహారాజ యథాత్థ త్వం తథైతన్నాత్ర సంశయః ।
కిన్తు స్వల్పం కృతం పాపం భవతా స్మారయామి తత్ ॥2॥

ఓ మహారాజా! నీవు పలికినది నిజము. ఇందులో సందేహము లేదు. కాని నీవు కొద్ది పాపమును చేసినావు. దానిని నీకు గుర్తుకు తెచ్చెదను.

వైదర్భీ తవ యా పత్నీ పీవరీ నామ నామతః ।
ఋతుమత్యా ఋతుర్వంధ్యస్త్వయా తస్యాః కృతః పురా ॥3॥

సుశోభనాయాం కైకేయ్యామాసక్తేన తతో భవాన్ ।
ఋతువ్యతిక్రమాత్ప్రాప్తో నరకం ఘోరమీదృశమ్ ॥4॥

హోమకాలే యథా వహ్నిరాజ్యపాతమవేక్షతే ।
ఋతౌ ప్రజాపతిస్తద్వద్బీజపాతమవేక్షతే ॥5॥

నీకు పూర్వము విదర్భదేశమందు జన్మించిన పీవరియను భార్య గలదు. ఆమెకు ఒకనాడు ఋతుకాలము సంప్రాప్తించగా నీవు ఆమె ఋతువును వ్యర్థము చేసితివి. (భర్తను పొందవలెనని కోరుకొనుటే ఋతుకాలమనగా). నీవు ఆ సమయమందు కేకయదేశమందు జన్మించిన సుశోభనయను పేరుగల వేరే స్త్రీయందు ఆసక్తుడవైయుంటివి. అందువల్లనే నీవు నీ భార్యను పట్టించుకోలేదు. నీవీ విధముగా ఋతువును అతిక్రమించినందున నీకిట్టి ఘోరమైన నరకము సంభవించినది. హోమము ఆచరించునప్పుడు వహ్నిదేవుడు ఆజ్యమును అనగా నేయి మొదలగు హోమద్రవ్యములను కోరుకొనునో అట్లే ప్రజాపతి స్త్రీల ఋతుకాలమందు బీజపతనమును (పురుషుల వీర్యపాతమును) అభిలషించును.

యస్తముల్లంఘ్య ధర్మాత్మా కామేష్వాసక్తిమాన్భవేత్ ।
స తు పిత్ర్యాదృణాత్పాపమవాప్య నరకం పతేత్ ॥6॥

ఏ ధర్మాత్ముడయితే స్త్రీల ఋతువును వ్యర్థము చేసి వేరే కోరికలయందు ఆసక్తి కలిగియుంటాడో అతడు పితృఋణము తీర్చనందున పాపమును పొంది నరకమందు పడును.

ఏతావదేవ తే పాపం నాన్యత్కించన విద్యతే ।
తదేహ్యేగచ్ఛ పుణ్యానాముపభోగాయ పార్థివ ॥
ఏతచ్ఛ్రుత్వా తు రాజర్షిః కృపయా జనకోఽబ్రవీత్ ॥7॥

ఓ మహారాజా ! నీ వింతమాత్రమే పాపమును చేసితివి. ఇది తప్ప వేరే ఏ ఇతరపాపములను చేయలేదు. కావున నీ పుణ్యములను అనుభవించుటకై నీవిటురమ్ము. ఈ మాటలను విని రాజర్షియగు ఆ జనకుడు జాలితో ఇట్లు పలికెను.

రాజ ఉవాచ – రాజు పలికెను.

యాస్యామి దేవానుచర ! యత్ర త్వం మాం నయిష్యసి ।
కించిత్పృచ్ఛామి తన్మే త్వం యథావద్వక్తుమర్హసి ॥8॥

ఓ యమపురుషుడా ! నీవు నన్ను ఎక్కడకు తీసుకొనిబోయెదవో నేను అక్కడకే వచ్చెదను. కాని నిన్ను నేను కొంచెము అడిగెదను. దానిని ఉన్నది ఉన్నట్లుగా సమాధానము చెప్పుటకు తగుదువు.

వజ్రతుండాస్త్వమీ కాకాః పుంసాం నయనహారిణః ।
పునః పునశ్చ నేత్రాణి తద్వదేషాం భవన్తి హి ॥9॥

వజ్రమువంటి ముక్కులుగల ఈ కాకులు జీవుల కళ్ళను పొడిచివేయుచున్నవి. మరల వారి నేత్రములు యథాప్రకారము పుట్టుకొనివచ్చుచున్నవి.

కిం కర్మ కృతవన్తశ్చ కథయైతజ్జుగుప్సితమ్ ।
హరన్త్యేషాం తథా జిహ్వాం జాయమానాం పునర్నవామ్ ॥10॥

వీరెట్టి జుగుప్సితములగు పాపకర్మలను చేసితిరో చెప్పుము. వారి నాలుకలను తెగక్రొట్టిననూ అవి మరల క్రొత్తగా పుట్టుకొని వచ్చుచున్నవి.

కరపత్రేణ పాట్యన్తే కస్మాదేతేఽతిదుఃఖితాః ।
కరంభవాలుకాస్థాశ్చ తథైతే క్వాథ తైలగాః ॥11॥

మిక్కిలి దుఃఖమునొందిన వీరు ఎందువలన రంపాలతో కోయబడుచున్నారు? ఎందువలన పెద్దపెద్ద పాత్రలందు, యంత్రములందు పడవేయబడి పీడింపబడుచున్నారు? ఎందువలన కాగుచున్న నూనెయందు పడవేయబడుచున్నారు?

అయోముఖైః ఖగైశ్చైవ కృష్యన్తే కింవిధా వద ।
విశ్లిష్టదేహబంధార్తిమహారావవిరావిణః ॥12॥

ఇనుపముక్కులు కలిగిన పక్షులచే ఎందువలన పొడవబడుచున్నారు? శరీరమందలి కలిసియున్న అవయవాలు విడగొట్టబడి అరచుచూ ఏడ్చుచూ పెద్ద పెద్ద రోదన ధ్వనులు చేయుచున్న వీరు ఎట్టి పాపములు చేసిరో చెప్పుము.

అయశ్చంచూనిపాతేన సర్వాంగక్షతవిక్షతాః ।
కిమేతే నిస్స్వనంతోఽపి తుద్యన్తేఽహర్నిశం నరాః ॥13॥

ఇనుపముక్కులచే పొడవబడి, సమస్త అవయవములు ముక్కలు ముక్కలుగా చేయబడినట్టి ఈ జీవులు బాధచే గట్టిగా అరచుచున్ననూ రాత్రింబవళ్ళు ఎందుకు బాధింపబడుచున్నారు?

ఏతాశ్చాన్యాశ్చ దృశ్యన్తే యాతనాః పాపకర్మిణామ్ ।
యేన కర్మవిపాకేన తన్మమోద్దేశతో వద ॥14॥

ఇవియేగాక ఈ పాపాచరణులయొక్క వేరే యాతనలు కూడా కన్పట్టుచున్నవి. వీరాచరించిన ఆ పాపపు కర్మలేమో నాకు కొంచెము చెప్పుము.

యమకింకర ఉవాచ – యమపురుషుడు పలికాడు.

యన్మాం పృచ్ఛసి భూపాల ! పాపకర్మఫలోదయమ్ ।
తత్తేఽహం సంప్రవక్ష్యామి సంక్షేపేణ యథాతథమ్ ॥15॥

ఓ మహారాజా ! పాపకర్మల ఫలితమెట్టిదో నీవు నన్ను అడిగితివి గావున నేను దానిని ఉన్నది ఉన్నట్లు సంక్షేపముగా చెప్పెదను.

పుణ్యాపుణ్యే హి పురుషః పర్యాయేణ సమశ్నుతే ।
భుఞ్జతశ్చ క్షయం యాతి పాపం పుణ్యమథాపి వా ॥16॥

పురుషుడు క్రమముగా పాపపుణ్యముల ఫలముననుభవించును. అనుభవించుటచేతనే పాపముగాని పుణ్యముగాని క్షయమునొందుచున్నది.

న తు భోగాదృతే పుణ్యం పాపం వా కర్మ మానవః ।
పరిత్యజతి భోగాచ్చ పుణ్యాపుణ్యే నిబోధ మే ॥17॥

అంతేగాని అనుభవించకుండా ఏ కర్మయూ మానవుని విడిచిపెట్టదు. భోగమువల్లనే పాపపుణ్యకర్మలు మానవుని విడిచిపెట్టునని తెలుసుకొనుము. (కర్మలు మోక్షమునకు ప్రతిబంధకము గావున కర్మలు నశిస్తేనే గాని మోక్షము సిద్ధించదు. ఆ కర్మలు అనుభవించుట మాత్రము చేతనే నశిస్తాయని భావము.)

దుర్భిక్షాదేవ దుర్భిక్షం క్లేశాత్ క్లేశం భయాద్భయమ్ ।
మృతేభ్యః ప్రమృతా యాన్తి దరిద్రాః పాపకర్మిణః ॥18॥

పాపాచరణముగల జీవులు దరిద్రులై తామాచరించిన దుర్భిక్షమును కలిగించు కర్మలవలన దుర్భిక్షమును, క్లేశజనకములగు కర్మలవలన క్లేశములను, భయమును కలిగించు కర్మలవలన భయమును, మరణహేతుకమైన (మరణమనగా భయము) కర్మలవలన మరణమును పొందుచున్నారు.

గతిం నానావిధాం యాన్తి జన్తవః కర్మబంధనాత్ ।
ఉత్సవాదుత్సవం యాన్తి స్వర్గాత్ స్వర్గం సుఖాత్సుఖమ్ ॥19॥

శ్రద్దధానాశ్చ దాన్తాశ్చ ధనదాః శుభకారిణః ।
వ్యాఘ్రకుంజరదుర్గాణి సర్పచోరభయాని తు ॥20॥

హతాః పాపేన గచ్ఛంతి పాపినః కిమతః పరమ్ ।
సుగంధిమాల్యసద్వస్త్రసాధుయానాసనాశనాః ॥21॥

స్తూయమానాస్సదా యాన్తి పుణ్యైః పుణ్యాటవీష్వపి ।
అనేకశతసాహస్రజన్మసంచయసంచితమ్ ॥22॥

పుణ్యాపుణ్యం నృణాం తద్వత్ సుఖదుఃఖాంకురోద్భవమ్ ।
యథా బీజం హి భూపాల ! పయాంసి సమవేక్షతే ॥23॥

పుణ్యాపుణ్యే తథా కాలదేశాన్యకర్మకారకమ్ ।
స్వల్పం పాపం కృతం పుంసాం దేశకాలోపపాదితమ్ ॥24॥

పాదన్యాసకృతం దుఃఖం కంటకోత్థం ప్రయచ్ఛతి ।
తత్ప్రభూతతరం స్థూలశంకుకీలకసంభవమ్ ॥25॥

పాపపుణ్యకర్మలనెడి బంధములవలన జీవులు నానావిధములైన ఫలములను పొందుచున్నారు. శ్రద్ధావంతులు, ఇంద్రియనిగ్రహముగలవారు, ధనమునిచ్చువారు, శుభకర్మలుచేయువారు ఉత్సవములకు కారణభూతమైన కర్మలను ఆచరించుటచే ఉత్సవములను, స్వర్గహేతుకమైన అగ్నిహోత్రాది కర్మలను ఆచరించుటచే స్వర్గమును, సుఖహేతుకమైన కర్మలను ఆచరించుటచే సుఖమును పొందుచున్నారు. ఇక పాపకర్మలచే కొట్టబడిన పాపాచరణముగల జీవులు పులి, ఏనుగు, వృక్షాదిరూపమైన దట్టమైన అడవులుగానూ జన్మనెత్తుచున్నారు. ఇంకనూ వారు సర్పములవలన, దొంగలవలన భయమును పొందుచున్నారు. ఇంతకు మించి ఏమున్నది? పుణ్యకర్మలను ఆచరించినవారు మంచిగంధముతో కూడిన మాలలను, మంచి బట్టలను, చక్కని వాహనములను, ఆసనములను, మృష్టాన్నభోజనములను కలిగి తమ పుణ్యకార్యముల కారణముగా పుణ్యాటవీ ప్రాంతములందైననూ ఎల్లప్పుడూ స్తుతింపబడుచూ వెళ్ళెదరు. ఇట్లు అనేకమైన వందలకొలదీ వేలకొలదీ జన్మలయందు సంగ్రహింపబడిన సంచితకర్మలు పుణ్యకర్మలయితే సుఖమను మొలకకు కారణమగును. పాపకర్మలయితే దుఃఖమను మొలకకు కారణమగును. ఓ మహారాజా ! ఏవిధముగా అయితే విత్తనము నీటిని అపేక్షించునో అట్లే సుఖదుఃఖములను మొలకలు ఉద్భవించుటకు అవి పుణ్యపాపకర్మలను అపేక్షించును. పుణ్యపాపములిట్లు కాలము, దేశము, ఆయాకర్మలు వీటిని అనుసరించి జరుగుచుండును. పురుషుని పాపము స్వల్పమైననూ దేశకాలానుసారముగా అనుభవించవలసియుండును. ముళ్ళమీద కాలు పడినందువలన ఆ ముళ్ళు స్వల్పమైననూ దుఃఖమును కల్గించును. అదే పెద్దవియగు లావుపాటి మేకులు, సూదులు గ్రుచ్చుకొనినచో హెచ్చు దుఃఖమును కల్గించును. (స్వల్ప కర్మ అయిననూ, అధికకర్మ అయిననూ ఆయా కర్మల ఫలమును ఆయా దేశకాలములందు ఈశ్వరుడే కలుగజేయునని ఉపనిషత్ సిద్ధాంతము.)

దుఃఖం యచ్ఛతి తద్వచ్చ శిరోరోగాదిదుస్సహమ్ ।
అపథ్యాశనశీతోష్ణశ్రమతాపాదికారకమ్ ॥26॥

తినకూడని పదార్థములను తినుటవల్లనూ శీతము, ఉష్ణము, శ్రమ, తాపము మొదలగు కారణములవల్లనూ తలనొప్పి మొదలగు భరింపరాని దుఃఖములు సంభవించును.

తథాఽన్యోన్యమపేక్షంతే పాపాని ఫలసంగమే ।
ఏవం మహాన్తి పాపాని దీర్ఘరోగాదికాః క్రియాః ॥27॥

తద్వచ్ఛస్త్రాగ్నికృచ్ఛ్రార్తిబంధనాదిఫలాయ వై ।
స్వల్పం పుణ్యం శుభం గంధం హేలయా సంప్రయచ్ఛతి ॥28॥

స్పర్శం వాఽప్యథవా శబ్దం రసం రూపమథాపి వా ।
చిరాద్గురుతరం తద్వన్మహాన్తమపి కాలజమ్ ॥29॥

ఈ విధముగా పాపములు ఆయా ఫలములను ఇచ్చుటలో ఒకదానితో మరొకటి అపేక్షించును. అట్లే జీవుడు తానాచరించిన మహాపాపముల కారణముగా దీర్ఘరోగాదులను అనుభవించును. ఇంకను శస్త్రములు, అగ్ని, విపత్తులు, క్లేశములు, బంధనములు మొదలగు ఫలములను జీవుడు తానాచరించిన పాపకర్మల కారణముగా పొందును. జీవుడు తాను స్వల్పమైన పుణ్యకర్మను ఆచరించిననూ శుభకరములైనట్టి శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములనెడు అయిదు విషయములను పొందును. అధికపుణ్యము కారణముగా కాలక్రమముగా గొప్ప సుఖములను పొందును.

ఏవం చ సుఖదుఃఖాని పుణ్యాపుణ్యోద్భవాని వై ।
భుంజానోఽనేకసంసారసంభవానీహ తిష్ఠతి ॥30॥

ఈ విధముగా పుణ్యపాపకర్మల వలన ఉద్భవించిన సుఖదుఃఖములను అనేక జన్మల ఫలములను అనుభవించుచు ఈ సంసారచక్రమందు నిలచును. (జ్ఞానము సిద్ధించినచో పుణ్యపాపకర్మలన్నియూ నశించి మోక్షము సిద్ధించును. అంతవరకు తానాచరించిన పుణ్యపాపకర్మల మూలంగా సుఖదుఃఖములను అనుభవించుచూ జన్మమరణప్రవాహాత్మకమైన సంసారచక్రమందు తిరుగాడవలసిందేయని భావము.)

జాతిదేశావరుద్ధాని జ్ఞానాజ్ఞానఫలాని చ ।
తిష్ఠన్తి తత్ర పుక్తాని లింగమాత్రేణ చాత్మని ॥31॥

మనుష్యజన్మనెత్తిన జీవుడు తన జీవనకాలమందు కొంత జ్ఞానమును సంపాదించుకొనవచ్చును. లేదా అజ్ఞానము కారణముగా కర్మలను ఆచరించియుండవచ్చును. వాటి ఫలములను ఆయా జన్మలయందు ఆయా దేశములందు అనుభవించవలసియున్నది. ఈ దేహము నశించినా కూడా లింగశరీరము అనగా సూక్ష్మశరీరమందు (మోక్షము సిద్ధించువరకూ మానవుడు ఆచరించిన పుణ్యపాపకర్మల ఫలములను అనుభవించుటకై జీవాత్మతో

అనువర్తించే శరీరమే లింగశరీరమనగా.) జీవాత్మకు సంబంధము లేకుండా ఈ పుణ్యపాపఫలములు నిలచియేయుండును.

కర్మణా మనసా వాచా న కదాచిత్ క్వచిన్నరః ।
అకుర్వన్ పాపకం కర్మ పుణ్యం వాఽప్యవతిష్ఠతే ॥32॥

ఏ మానవుడూ కూడా తన కర్మలవల్లను, మనస్సువల్లనూ, వాక్కు వల్లనూ పాపకర్మలనుగాని, పుణ్యకర్మలనుగాని చేయకుండా ఉండజాలడు. అనగా ప్రతీ మానవుడూ కూడా ఎంతో కొంత పుణ్యపాపకర్మలను చేయుచునే యుండును గావున వాటి ఫలము అనుభవించవలసిందేయని భావము.

యద్యత్ ప్రాప్నోతి పురుషః సుఖం దుఃఖమథాపి వా ।
ప్రభూతమథవా స్వల్పం విక్రియకారి చేతసః ॥33॥

పురుషుడు తాను చేసుకొన్న పుణ్యపాపకర్మల వలన సుఖమునైననూ పొందవచ్చును లేదా దుఃఖమునైననూ పొందవచ్చును. అది కూడా ఎక్కువైననూ కావచ్చును, తక్కువైననూ కావచ్చును. ఏది అయిననూ అది మనస్సునందు వికారమును మాత్రము పొందుతునే యుండును. (అనగా మనస్సు బాహ్య విషయములందు ప్రసరించుటచే మోక్షానికి ప్రతిబంధకమైన బాహ్యవృత్తులు కలుగుచునే యుండునని భావము.)

తావతా తస్య పుణ్యం వా పాపం వాఽప్యథ చేతరత్ ।
ఉపభోగాత్ క్షయం యాతి భుజ్యమానమివాశనమ్ ॥34॥

ఏవమేతే మహాపాపం యాతనాభిరహర్నిశమ్ ॥35॥

క్షపయన్తి నరా ఘోరం నరకాన్తవివర్తినః ।
తథైవ రాజన్ పుణ్యాని స్వర్గలోకేఽమరైస్సహ ॥36॥

గన్ధర్వసిద్ధాప్సరసాం గీతాద్యైరుపభుఞ్జతే ।
దేవత్వే మానుషత్వే చ తిర్యక్త్వే చ శుభాశుభమ్ ॥37॥

పుణ్యపాపోద్భవం భుఙ్క్తే సుఖదుఃఖోపలక్షణమ్ ।
యత్త్వం పృచ్ఛసి మాం రాజన్ యాతనాః పాపకర్మణామ్ ॥38॥

కేన కేనేతి పాపేన తత్తే వక్ష్యామ్యశేషతః ।
దుష్టేన చక్షుషా దృష్టాః పరదారా నరాధమైః ॥39॥

మానసేన చ దుష్టేన పరద్రవ్యం చ సస్పృహైః ।
వజ్రతుణ్డాః ఖగాస్తేషాం హరన్త్యేతే విలోచనే ॥40॥

తినబడిన యన్నము జీర్ణమగుట చేతనే నశించినట్లు పుణ్యపాపములేవియైననూ అనుభవించుటచేత మాత్రమే నశించును. రాత్రింబవళ్ళు యాతనలచేతనే (కర్మఫలమును అనుభవించుట చేతనే) నరకమందున్న ఈ జీవులందరూ

తాము చేసిన మహాపాపములను పోగొట్టుకొనుచున్నారు. అట్లే ఓ రాజా ! దర్శపూర్ణమాసాది పుణ్యకర్మలను ఆచరించినవారు స్వర్గలోకమందు దేవతలతో సహా గంధర్వులు, సిద్ధులు, అప్సరసలు వీరియొక్క గీతాదులతో సుఖములను అనుభవించుచున్నారు. పుణ్యపాప కర్మలవలన సంభవించిన సుఖదుఃఖములనెడు శుభాశుభరూపమైన ఫలమును దేవతలుగాగాని, మనుష్యులుగాగాని, పశువులుగా గాని జన్మించి అనుభవించుచున్నారు. ఓ రాజా ! పాపకర్ముల యాతనలు ఏ ఏ పాపములచేత సంభవించునో వాటిని నీకు వివరముగా చెప్పెదను. ఇతరుల భార్యలను దోషభూయిష్ఠమైన కళ్ళతో చూచినట్టి, ఇతరుల ద్రవ్యములను ఆశించినట్టి నీచమానవుల కళ్ళను వజ్రతుల్యములైన ముక్కులతో ఈ పక్షులు పెరికివేయును.

పునఃపునశ్చ సంభూతిరక్ష్ణోరేషాం భవత్యథ ।
యావతోఽక్షినిమేషాంస్తు పాపమేభిర్నృభిః కృతమ్ ॥41॥

తావద్వర్షసహస్రాణి నేత్రార్తిం ప్రాప్నువన్త్యుత ।
అసచ్ఛాస్త్రోపదేశాస్తు యైర్దత్తా యైశ్చ మంత్రితాః ॥42॥

సమ్యగ్దృష్టేర్వినాశాయ రిపూణామపి మానవైః ।
యైః శాస్త్రమన్యథా ప్రోక్తం యైరసద్వాగుదాహృతా ॥43॥

వేదదేవద్విజాతీనాం గురోర్నిందా చ యైః కృతా ।
హరన్తి తేషాం జిహ్వాశ్చ జాయమానాః పునఃపునః ॥44॥

తావతో వత్సరానేతే వజ్రతుండాః సుదారుణాః ।

ఈ నేత్రములు మరల మరల బుట్టుచుండును. ఇంకను ఈ మానవులు ఎన్ని కనురెప్పల సంఖ్యతో పాపములను చేసిరో అన్ని వేల సంవత్సరాలు నేత్రబాధను పొందెదరు. ఇంకను ఎవరయితే అవైదికశాస్త్రాలను ఉపదేశించిరో మరియు వాటిలోని విషయాలను సలహా చెప్పిరో, ఇంకను ఎవరయితే శత్రువులైనా సరే వారి మంచి దృష్టిని మరల్చుటకై శాస్త్రములకు విపరీతార్థములను చెప్పిరో, ఇంకను ఎవరయితే చెడ్డమాటలను పలికితిరో, ఇంకను ఎవరయితే వేదములను, దేవతలను, ద్విజులను, గురువులను నిందించితిరో వారి అందరి నాలుకలు ఛేదింపబడును, మరల మరల పుట్టుచుండును. ఎన్ని మారులు వారీ పాపములను చేసితిరో అన్ని సంవత్సరములు వజ్రమువంటి ముక్కులుగల గ్రద్దలచే మిక్కిలి భయంకరమైన బాధలను పొందుదురు.

మిత్రభేదం తథా పిత్రా పుత్రస్య స్వజనస్య చ ॥45॥

యజ్వోపాధ్యాయయోః మాత్రా సుతస్య సహచారిణః ।
భార్యాపత్యోశ్చ యే కేచిద్భేదం చక్రుర్నరాధమాః ॥46॥

త ఇమే పశ్య పాట్యన్తే కరపత్రేణ పార్థివ ।
పరోపతాపకా యే చ యే చాఽహ్లాదనిషేధకాః ॥47

తాలవృన్తానిలస్థానచందనోశీరహారిణః ।
ప్రాణాన్తికం దదుస్తాపమదుష్టానాం చ యేఽధమాః ॥48॥

కరంభవాలుకాసంస్థాస్త ఇమే పాపభాగినః ।

మిత్రులకు పరస్పరము విరోధమును అట్లే తండ్రీకొడుకులకు, బంధువులమధ్య, యజమాని ఉపాధ్యాయుల మధ్య, తల్లీకొడుకులమధ్య, తన తోటివారి మధ్య, భార్యాభర్తలమధ్య ఏ నీచులయితే విరోధమును కలిగించిరో వారు రంపముతో కోయబడుదురు. ఇంకను ఎవరయితే ఇతరులకు దుఃఖములను కలిగించెదరో, ఇతరుల సంతోషమునకు అడ్డు తగిలెదరో, తాటియాకుల విసనకర్ర, గాలి, చోటు, గంధము, వట్టివేళ్ళు వీటిని అపహరించెదరో, ఇంకను ఏ నీచులయితే సన్మార్గులకు ప్రాణములను హరించునట్టి గొప్ప తాపమును కలిగించెదరో వారందరు పెద్ద పెద్ద జలపాత్రలందు యంత్రములందు పడవేయబడుచున్నారు.

భుఙ్క్తే శ్రాద్ధం తు యోఽన్యస్య నరోఽన్యేన నిమంత్రితః ॥49॥

దైవే వాఽప్యథవా పైత్ర్యే స ద్విధా కృష్యతే ఖగైః ।

దేవతాసంబంధమైనదిగానీ, పితృసంబంధమైనదిగానీ ఒకరి శ్రాద్ధమునకు ఆహ్వానింపబడిన మానవుడు మరొకరి శ్రాద్ధభోజనమును తిన్నట్లయితే అతడు పక్షులచేత రెండుగా చీల్చబడును.

మర్మాణి యస్తు సాధూనామసద్వాగ్భిర్నికృన్తతి ॥50॥
తమిమే తుదమానాస్తు ఖగాస్తిష్ఠన్త్యవారితాః ।

ఎవరయితే చెడ్డమాటలతో సత్పురుషుల మర్మావయవములను నరికివేయుదురో అట్టి పురుషుని పక్షులు నిస్సంకోచముగా చీల్చివేయుచున్నవి.

యః కరోతి చ పైశున్యమన్యవాగన్యథామతిః ॥51॥

పాట్యతే హి ద్విధా జిహ్వా తస్యేత్థం నిశితైః క్షురైః ।

మనస్సులో వేరు, మాటలో వేరుగా కొండెములు చెప్పువాని నాలుక పదునైన కత్తులతో రెండుగా చీల్చబడుచున్నది.

మాతాపిత్రోర్గురూణాం చ యేఽవజ్ఞాం చక్రురుద్ధతాః ॥52॥

త ఇమే పూయవిణ్మూత్రగర్తే మజ్జన్త్యధోముఖాః ।

గర్వితులై తల్లిదండ్రులను గురువులను అవమానపరచినవారు చీము మలములతో నిండిన గుంటలలో తలక్రిందులుగా చేయబడి మునుగుచున్నారు.

దేవతాతిథిభూతేషు భృత్యేష్వభ్యాగతేషు చ ॥53॥

అభుక్తవత్సు యేఽశ్నన్తి తద్వత్ పిత్రగ్నిపక్షిషు ।
దుష్టాస్తే పూయనిర్యాసభుజః సూచీముఖాస్తు తే ॥54॥

జాయన్తే గిరివర్ష్మాణః పశ్యైతే యాదృశా నరాః ।

దేవతలు, అతిథులు, పంచమహాభూతాలు, సేవకులు, అభ్యాగతులు వీరు భుజించకుండానే ఎవరయితే భోజనము చేయుదురో, అట్లే పితృదేవతలు, అగ్నిదేవుడు, పక్షులు వీటియందు కూడా పూర్వమువలెనే అనగా వారు తినకుండానే తినెదరో అట్టి దుర్మార్గులు సూచీముఖులై అనగా సర్పము వంటి ఆకారముగలవారై (సూచీముఖ శబ్దానికి సర్పమని అర్థము వాచస్పత్యంలో చెప్పబడింది) చీము, శ్లేష్మములను తినుచున్నారు. ఇంకను పర్వతాకారముగల శరీరము కల్గియుందురు. అట్టి నరులు వీరే చూడుము.

ఏకపంక్త్యా తు యే విప్రమథవేతరవర్ణజమ్ ॥55॥

విషమం భోజయన్తీహ విడ్భుజస్త ఇమే యథా ।
ఏకసార్థం ప్రయాతం యే నిస్స్వమర్థార్థినం నరమ్ ॥56॥

అపాస్య స్వాన్నమశ్నన్తి త ఇమే శ్లేష్మభోజినః ।
గోబ్రాహ్మణాగ్నయస్పృష్టా యైరుచ్ఛిష్టైర్నరేశ్వర ॥57॥

తేషామేతేఽగ్నికుండేషు ప్రజ్వలత్స్వాహితా కరాః ।
సూర్యేందుతారకా దృష్టా యైరుచ్ఛిష్టైస్తు కామతః ॥58॥

తేషాం యామ్యైర్నరైర్నేత్రే న్యస్తో వహ్నిస్సమిధ్యతే ।

ఒకే పంక్తియందు కూర్చొనియున్న బ్రాహ్మణునికిగాని, ఇతరవర్ణముల వారికిగాని ఎక్కువతక్కువలతో (అనగా తనతో సమానముగా కాకుండా) భోజనము పెట్టువారు మలమును భుజించుచున్నారు. తనతోబాటుగా ప్రయాణము చేయుచున్న ధనహీనుడు లేదా ధనమును యాచించుచున్న మానవుని కాదని భోజనము చేయువారు శ్లేష్మమును తినువారు అగుచున్నారు. ఓ రాజా ! ఎవరయితే ఎంగిలి చేతులతో గోవులను, బ్రాహ్మణులను, అగ్నిని స్పృశింతురో వారి చేతులు మండుచున్న అగ్నికుండములందు ఉంచబడుచున్నవి. ఎవరయితే ఉచ్ఛిష్టులై సూర్యుడు, చంద్రుడు, నక్షత్రములను చూచిరో వాళ్ళ కళ్ళయందు యమపురుషులు అగ్నిని ఉంచి మండించుచున్నారు.

గావోఽగ్నిర్జననీ విప్రో జ్యేష్ఠభ్రాతా పితా స్వసా ॥59॥

జామయో గురవో వృద్ధా యైః స్పృష్టాస్తు పదా నృభిః ।
బద్ధాంఘ్రయస్తే నిగడైర్లోహైరగ్నిప్రతాపితైః ॥60॥

ఏ మానవులయితే కాళ్ళతో గోవులను, అగ్నిని, తల్లిని, బ్రాహ్మణుని, అన్నను, తండ్రిని, సోదరిని, కోడలిని, గురువులను, వృద్ధులను తాకుతారో వారి పాదాలు అగ్నిమయమైన ఇనుపసంకెళ్ళతో బంధింపబడతాయి.

అంగారరాశిమధ్యస్థాస్తిష్ఠన్త్యా జానుదాహినః ।
పాయసం కృసరం ఛాగం దైవాన్నాని చ యాని వై ॥61॥

భుక్తాని యైరసంస్కృత్య తేషాం నేత్రాణి పాపినామ్ ।
నిపాతితానాం భూపృష్ఠే ఉద్వృత్తాక్షినిరీక్షతామ్ ॥62॥

సందంశైః పశ్య కృష్యంతే నరైర్యామ్యైర్ముఖాత్తతః ।

ఇంకనూ ఆ పాపాత్ములు తొడలపర్యంతము అగ్నిరాశులయందు ఉంచబడి దహింపబడుచున్నారు. పాయసము, పులగము, మేకమాంసము, దేవతలకు ఉద్దేశింపబడిన అన్నపదార్థములు వీటిని సంస్కరించకుండానే ఎవరు తింటారో, భూమిపై పడియున్నట్టి, కండ్లను త్రిప్పుచూ చూచుచున్నట్టి పాపాత్ములకళ్ళను యమపురుషులు వారి ముఖముల నుండి తాళ్ళతో బయటకు లాగివేయుచున్నారు, చూడుము.

గురుదేవద్విజాతీనాం వేదానాం చ నరాధమైః ॥63॥

నిందా నిశామితా యైశ్చ పాపానామభినందతామ్ ।
తేషామయోమయాన్ కీలాన్ అగ్నివర్ణాన్ పునఃపునః ॥64॥

కర్ణేషు పూరయన్త్యేతే యామ్యా విలపతామపి ।
యైః ప్రపాదేవవిప్రౌకోదేవాలయసభాః శుభాః ॥65॥

భుక్త్వా విధ్వంసమానీతాః క్రోధలోభానువర్తిభిః ।
తేషామేతైః శితైః శస్త్రైర్ముహుర్విలపతాం త్వచః ॥66॥

పృథక్ కుర్వన్తి వై యామ్యాః శరీరాదతిదారుణాః ।

ఏ నీచమానవులు గురువులు, దేవతలు, ద్విజులు, వేదములను నిందించెదరో, పాపములను అభినందించెదరో వారి చెవులందు వారెంతగా విలపించుచున్నా యమపురుషులు ఇనుపమేకులను గ్రుచ్చెదరు. ఇంకనూ మిక్కిలి ప్రకాశవంతమైన చలివేంద్రములు, దేవాలయములు, బ్రాహ్మణగృహములు, సభలు వీటిని అనుభవించి ఎవరు నాశనము చేసిరో అట్టి పాపాత్ములను వారెంతగా విలపించుచున్నా వారి చర్మములను భయంకరమైన యమపురుషులు శరీరముల నుండి వేరుచేయుచున్నారు.

గోబ్రాహ్మణార్కమార్గాస్తు యేఽవమేహన్తి మానవాః ॥67॥

తేషామేతాని కృష్యన్తే గుదేనాఽఽంత్రాణి వాయసైః ।
దత్త్వా కన్యాం య ఏకస్మై ద్వితీయాయ ప్రయచ్ఛతి ॥68॥

స త్వేవం నైకధా ఛిన్నః క్షారనద్యాం ప్రవాహ్యతే ।
స్వపోషణపరో యస్తు పరిత్యజతి మానవః ॥69॥

పుత్రభృత్యకళత్రాదిబంధువర్గమకించనమ్ ।
దుర్భిక్షే సంగమే వాఽపి సోఽప్యేవం యమకింకరైః ॥70॥

ఉత్కృత్య దత్తాని ముఖే స్వమాంసాన్యశ్నుతే క్షుధా ।
శరణాగతాన్యస్త్యజతి లోభాదుత్కోచజీవికః ॥71॥

సోఽ ప్యేవం యంత్రపీడాభిః పీడ్యంతే యమకింకరైః ।
సుకృతం యే ప్రయచ్ఛన్తి యావజ్జన్మకృతం నరాః ॥72॥

తే పిష్యన్తే శిలామేషైర్యథైతే పాపకర్మిణః ।

గోవులు, బ్రాహ్మణులు, సూర్యుడు సంచరించు మార్గములందు మూత్రవిసర్జనము చేసిన మానవుల గుదస్థానములందు కాకులు పొడుచుచు నరములను పీకుచున్నవి. ఎవరయితే తన కన్యను ఒకరికి ఇచ్చి మరల ఇంకొకరికి ఇచ్చునో అతడిని యమదూతలు క్షారనదియందు (నరకమందలి ఉప్పుతో కూడినట్టి ఒకానొక నదీవిశేషమే క్షారనదియనగా) ప్రవహింపచేయుదురు. తనను పోషించుకొనుటయందు మాత్రము తత్పరుడై ధనహీనులైన తన పుత్రులు, సేవకులు, భార్య మొదలగు వారిని దుర్భిక్షసమయమందుగాని, కలిసియున్న సమయమందుగాని విడిచిపెట్టునో అతడిని యమకింకరులు అతడి ముఖమునుంచే మాంసఖండములను పీకివేసి అతడి చేతికి ఇచ్చెదరు. వాటిని ఆకలితో ఆ పాపి తినుచుండును. ఎవరయితే లోభముతో ఉత్కోచముతో జీవనమును గడుపునో (తనకున్న అడ్డులను తొలగించుకొని, అన్యాయముగా తన పనిని నెరవేర్చుకొనుటకై ఇవ్వజూపిన ధనమే ఉత్కోచమనగా. అదియే లంచము.) ఇంకనూ తనవద్దకు వచ్చిన శరణాగతులను విడిచిపెట్టునో అట్టివానిని యమకింకరులు యంత్రములలో వేసి పీడించెదరు. ఇంకనూ ఏ మానవులయితే తమ జీవితకాలములో సంపాదించుకొన్న సుకృతమును ధనాశతో ఇతరులకు ఇచ్చెదరో (పుణ్యాత్ముల పుణ్యము శాపాదికారణముల వలన తరిగిపోవుట విశ్వామిత్రాది దృష్టాంతములందు ప్రసిద్ధమే.) అట్టి పాపకర్ములను యమకింకరులు పెద్దపెద్ద రాళ్ళతో నుగ్గునుగ్గు చేయుదురు.

న్యాసాపహారిణో బద్ధాః సర్వగాత్రేషు బంధనైః ॥73॥

కృమివృశ్చికకాకోలైర్భుజ్యన్తేఽ హర్నిశం నరాః ।
క్షుత్క్షామాః తృట్పతజ్జిహ్వాతాలవో వేదనాతురాః ॥74॥

దాచియుంచమని ఇచ్చిన ద్రవ్యమును (న్యాసమును) ఎవరు దొంగలించెదరో వారిని శరీరమంతటిని త్రాళ్ళతో బంధించుచున్నారు. ఇంకను వారు రాత్రింబవళ్ళు పురుగులు, తేళ్ళు, సర్పములు మొదలగు క్రూరమృగములచే తినబడుచున్నారు. అంతేగాక బాధలను అనుభవించుచు ఆకలిదప్పులచే వారి నాలుకలు, దవడలు ఎండిబోవుచున్నవి.

దివామైథునినః పాపా పరదారభుజశ్చ యే ।
తథైవ కంటకైస్తీక్ష్ణైరాయసైః పశ్య శాల్మలిమ్ ॥75॥
ఆరోపితా విభిన్నాంగాః ప్రభూతాసృక్స్రవావిలాః ।
మూషాయామపి పశ్యైతాన్ ధ్మాయమానాన్యమానుగైః ॥76॥

పురుషైః పురుషవ్యాఘ్ర పరదారావమర్శినః ।

ఎవరు పగలు మైథునమును అనగా స్త్రీ సంభోగమును చేయు స్వభావముగలవారో, ఇతరుల భార్యలను అనుభవించెదరో అట్టి పాపాత్ములను యమపురుషులు ఇనుపముళ్ళతో కూడుకొన్న బూరుగుచెట్లకు కట్టివేసి వారి

అవయవములను వేరువేరుగా చేయుచున్నారు. దానివలన మిక్కిలి రక్తప్రవాహములు వారి శరీరములనుండి స్రవించుచున్నవి. ఇంకను ఓ పురుష వ్యాఘ్రమా ! ఓ రాజా ! ఇతరుల భార్యలను అవమానపరచినవారిని యమపురుషులు కాలిన మూసయందు పడవైచి వారిమీద నిప్పులు పడునట్లు నోటితో గట్టిగా ఊదుచున్నారు.

ఉపాధ్యాయమధఃకృత్వా స్తబ్ధో యోఽధ్యయనం నరః ॥77॥

గృహ్ణాతి శిల్పమథవా సోఽప్యేవం శిరసా శిలామ్ ।

బిభ్రత్ క్లేశమవాప్నోతి జనమార్గేఽతిపీడితః ॥78॥

క్షుత్క్షామోఽహర్నిశం భారపీడావ్యథితమస్తకః ।

ఎవరయితే ఎట్టి సంకోచము లేకుండా గురువును క్రింద కూర్చోబెట్టి అధ్యయనము చేయునో లేదా శిల్పాది కళలను గ్రహించునో అట్టి నరుడు జనులు పోవు మార్గమందు నెత్తిమీద పెద్ద బండరాయిని మోసుకొనిపోవుచు మిక్కిలి పీడింపబడినవాడై దుఃఖములను పొందుచున్నాడు. ఇంకను అంతటి బరువును మోయుటచేత శిరస్సునందు చాలా నొప్పిని పొందుచు రాత్రింబవళ్ళు ఆకలిదప్పులతో అలమటించుచున్నాడు.

మూత్రశ్లేష్మపురీషాణి యైరుత్సృష్టాని వారిణి ॥79॥

త ఇమే శ్లేష్మవిణ్మూత్రదుర్గంధం నరకం గతాః ।
పరస్పరం చ మాంసాని భక్షయన్తి క్షుధాఽన్వితాః ॥80॥

భుక్తం నాతిథ్యవిధినా పూర్వమేభిః పరస్పరమ్ ।

ఎవరయితే నీటియందు మూత్రశ్లేష్మపురీషములను విడిచిపెట్టునో వారు వాటితోనే నిండియున్న దుర్గంధభరితమైన నరకమును పొందుచున్నారు. ఇంకను ఆకలిగొన్నవారై ఒకళ్ళనొకళ్ళను పీక్కొని తినుచున్నారు. వీరు పూర్వజన్మమందు ఆతిథ్యవిధిని పాటించకుండా అనగా అతిథులకు భోజనము పెట్టకుండా భోజనము చేసినవారు. కనుకనే మరణించిన పిమ్మట ఇట్టి క్లేశములను అనుభవించుచున్నారు.

అపవిద్ధాస్తు యైర్వేదా వహ్నయశ్చాఽఽహితాగ్నిభిః ॥81॥
త ఇమే శైలశృంగాగ్రాత్ పాత్యన్తేఽధః పునఃపునః ।

ఎవరయితే వేదములను అవమానపరచితిరో, ఏ ఆహితాగ్నులయితే (నిత్యము అగ్నిహోత్రము చేయువారు ఆహితాగ్నులు) వహ్నులను అవమానపరచితిరో ఈ వీరందరు మరల మరల పర్వతశిఖరమునుండి క్రిందకు త్రోసివేయబడుచున్నారు.

పునర్భూపతయో జీర్ణా యావజ్జీవన్తి యే నరాః ॥82॥

ఇమే కృమిత్వమాపన్నా భక్ష్యన్తేఽత్ర పిపీలికైః ।
నీచప్రతిగ్రహాదానాద్యాజనాన్నిత్యసేవనాత్ ॥83॥

పాషాణమధ్యకీటత్వం నరస్సతతమశ్నుతే ।

ఏ మానవులయితే వివాహితస్త్రీని పెండ్లిచేసుకొని ఆమెతో జీవితాంతము కాపురము చేయుదురో వారు పురుగులై పుట్టి చీమలచే తినబడుచున్నారు. (పునర్భవతి జాయాత్వేన ఇతి పునర్భూః అని వాచస్పత్యము). ఇంకను ఎవరయితే నీచులవద్ద దానము పట్టితిరో, నీచులచేత యాగములు చేయించితిరో, నీచులను సేవించితిరో వారు రాళ్ళమధ్య పురుగుగా అనేకమార్లు పుట్టుచున్నారు.

పశ్యతో భృత్యవర్గస్య మిత్రస్యాఽ ప్యతిథేస్తథా ॥84॥

ఏకో మిష్టాన్నభుగ్భుజ్క్తే జ్వలదంగారసంచయమ్ ।
వృకైర్భయంకరైః పృష్ఠం నిత్యమస్యోపభుజ్యతే ॥85॥

పృష్ఠమాంసం నృపైతేన యతో లోకస్య భక్షితమ్ ।

ఎవరయితే సేవకులు, స్నేహితులు, అతిథులు చూస్తుండగా వారికి పెట్టకుండా మృష్టాన్నము తింటాడో అతడు మండుచున్న నిప్పుల బొగ్గులను తింటాడు. ఓ రాజా ! ఎందువలననగా ఈ పాపి లోకమందలి జనులయొక్క వెనుకభాగమందలి మాంసమును తిన్నాడో (దొంగదెబ్బ తీయుట అని అర్థము) అందువలన భయంకరమైన తోడేళ్ళు ఈ పాపియొక్క వెనుకభాగమందలి మాంసమును తినుచున్నవి.

అంధోఽ థ బధిరో మూకో భ్రామ్యతేఽ త్ర క్షుధాతురః ॥86॥

అకృతజ్ఞోఽ ధమః పుంసాముపకారిషు వర్తతే ।
అయం కృతఘ్నో మిత్రాణామపకారీ సుదుర్మతిః ॥87॥

తప్తకుంభే నిపతితో విలపన్యాతి శోషణమ్ ।
కరంభవాలుకాం తస్మాత్తతో యంత్రావపీడనమ్ ॥88॥

అసిపత్రవనం తస్మాత్కరపత్రేణ పాటనమ్ ।
కాలసూత్రే తథా చ్ఛేదమనేకాశ్చైవ యాతనాః ॥89॥

ఏ అధముడయితే ఉపకారము చేసినవారిపట్ల కృతజ్ఞత లేకుండా ఉంటాడో అట్టి మానవుడు ఆకలితో పీడింపబడినవాడై గ్రుడ్డివానిగానూ, చెవిటివానిగానూ, మూగవానిగానూ ఈ నరకమందు తిరుగాడుచుండును. ఇంకనూ ఇట్టి నరాధముడు, స్నేహితులకు అపకారము చేయు నీచమైన బుద్ధిగల కృతఘ్నుడు సలసలా కాగిన నూనె పాత్రయందు పడి విలపించుచు ఎండిపోవును. అటుపిమ్మట పెద్ద పెద్ద వంటపాత్రలందు, అటుపిమ్మట తిరుగుతున్న యంత్రములందు పడవేయబడి ఆ నరాధముడు పీడింపబడుచున్నాడు. ఇంకనూ అసిపత్రవనమను నరకమందు పడవేయబడి రంపములవంటి ఆకులతో కోయబడుచున్నాడు. అట్లే కాలసూత్రమను నరకమందు చీల్చబడి అనేకయాతనలను అనుభవించుచున్నాడు.

ప్రాప్య నిష్కృతిమేతస్మాన్న వేద్మి కథమేష్యతి ।
శ్రాద్ధే సంగతినో విప్రాః సముపోష్య పరస్పరమ్ ॥90॥

దుష్టా హి నిస్సృతం ఫేనం సర్వాఙ్గేభ్యః పిబన్తి వై ।
సువర్ణస్తేయీ విప్రఘ్నః సురాపో గురుతల్పగః ॥91॥

అధశ్చోర్ధ్వం చ దీప్తాగ్నౌ దహ్యమానాః సమన్తతః ॥92॥

తిష్ఠన్త్యబ్దసహస్రాణి సుబహూని తతః పునః ।
జాయన్తే మానవాః కుష్ఠక్షయరోగాదిచిహ్నితాః ॥93॥

మృతాః పునశ్చ నరకం పునర్జాతాశ్చ తాదృశమ్ ।
వ్యాధిమృచ్ఛన్తి కల్పాన్తపరిమాణం నరాధిప ॥94॥

గోఘ్నో న్యూనతరం యాతి నరకేఽథ త్రిజన్మని ।
తథోపపాతకానాం స సర్వేషామితి నిశ్చయః ॥95॥

నరకప్రచ్యుతా యాన్తి యైర్యైర్విహితపాతకైః ।
ప్రయాన్తి యోనిజాతాని తన్మే నిగదతః శృణు ॥96॥

ఈ విధముగా పాపాత్ములు ఇట్టి నరకమందు పడి ఎట్లు బైటపడుదురో నేనెరుగకున్నాను. శ్రాద్ధకాలమందు దుష్టులైన బ్రాహ్మణులు సమావేశమై ఉపవాసము చేసి అనగా భోజనము చేయక ("ఉపవాసం కృత్వా ఉపోష్య" అని వ్యుత్పత్తి. శ్రాద్ధకాలమందు పితృదేవతల తృప్తికొరకై బ్రాహ్మణులు భోజనము చేయవలెను. అట్లు చేయకపోవుట ధర్మవిరుద్ధము) తమ తమ అవయవములనుండి బయల్వెడలిన నురుగును పరస్పరము త్రాగుచున్నారు. (ఇచ్చట నురుగు అనగా నోటి నుండి బయల్వెడే ఉమ్మి కావచ్చును లేదా చెమటరూపమైన జలబిందువులు కావచ్చును.) అట్టివారూ మరియు బంగారమును దొంగలించినవాడు, బ్రాహ్మణులను చంపినవాడు, మద్యమును సేవించినవాడు, గురువుల శయ్యను ఆక్రమించినవాడు వీరందరూ మండుచున్న అగ్నులందు క్రిందా పైనా దహింపబడుచున్నారు. ఓ మహారాజా ! ఈ విధముగా వారు వేలకొలదీ సంవత్సరాలు దుఃఖములను అనుభవించుచూ అటుపిమ్మట కుష్ఠురోగము, క్షయరోగము మొదలగు రోగములతో కూడుకొని మానవులుగా పుట్టుచున్నారు. మరల మరణించి నరకమందు ప్రవేశించి దుఃఖములను అనుభవించి మరల అట్టి జన్మను పొంది క్లేశములను పొందుచున్నారు. ఈ విధముగా కల్పాంతము వరకు జరుగుతూనే యుండును. గోహత్య చేసినవానికి, ఇంకను అట్టి పాపములను ఆచరించినవారికి కనీసము మూడుజన్మలవరకు నరకలోకమునకు బోవుట నిశ్చయము. ఓ మహారాజా! నరకలోకవాసము పూర్తి అయిన పిమ్మట ఆయా పాపములను ఆచరించిన మానవులు ఎట్టి జన్మలనెత్తెదరో చెప్పెదను, వినుము.

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే పితాపుత్రసంవాదే యమకింకరసంవాదే స్వకృతకర్మభుక్తికథనం నామ చతుర్దశోఽధ్యాయః ॥14॥

శ్రీ మార్కండేయ మహాపురాణమందు పితాపుత్రసంవాదమందలి రాజయమకింకరసంవాదమందు తాను చేసిన కర్మల ఫలమును అనుభవించుటను గూర్చి చెప్పుటయను పదునాల్గవ అధ్యాయం సమాప్తం.



పఞ్చదశోऽధ్యాయః – పదునైదవ అధ్యాయం
నరకస్థోద్ధారవర్ణనమ్ – నరకవాసులనుద్ధరించుట

యమకింకర ఉవాచ – యమకింకరుడు చెప్పాడు.

పతితాత్ప్రతిగృహ్యాऽథ ఖరయోనిం వ్రజేద్ద్విజః ।
నరకాత్ప్రతిముక్తస్తు క్రిమిః పతితయాజకః ॥1॥

ఓ మహారాజా ! దుర్మార్గునివద్ద దానము పట్టిన ద్విజుడు గాడిదజన్మను పొందును. దుర్మార్గులచేత యజ్ఞము చేయించినవాడు నరకమునుండి బయల్వెడలిన పిమ్మట పురుగు జన్మను పొందును.

ఉపాధ్యాయవ్యలీకం తు కృత్వా శ్వా భవతి ద్విజః ।
తజ్జాయాం మనసా వాచా తద్ద్రవ్యం వాऽపి కామయేత్ ॥2॥

ఉపాధ్యాయులపట్ల అసభ్యముగా ప్రవర్తించిననూ, ఉపాధ్యాయుల భార్యలనుగానీ, ఉపాధ్యాయుల ధనమును గానీ మనఃపూర్వకముగా అయిననూ, మాటతో అయిననూ కోరుకొన్నచో అట్టి ద్విజుడు కుక్కజన్మను పొందును.

గర్దభో జాయతే జన్తుః పిత్రోశ్చాప్యవమానకః ।
మాతాపితరావాక్రుశ్య సారికా సంప్రజాయతే ॥3॥

తల్లిదండ్రులను అవమానము చేసినవాడు గాడిదజన్మను పొందును. మరియూ తల్లిదండ్రులను నిందించినవాడు గోరువంకగా జన్మించును.

భ్రాతుః పత్న్యవమాన్తా చ కపోతత్వం ప్రపద్యతే ।
తావేవ పీడయిత్వా తు కచ్ఛపత్వం ప్రపద్యతే ॥4॥

సోదరుని భార్యను అవమానపరచినవాడు పావురముగా జన్మించును. వారిరువురిని పీడించినవాడు తాబేలుగా జన్మించును.

భర్తృపిండముపాశ్నన్యస్తదిష్టం న నిషేవతే ।
సోऽపి మోహమాపన్నో జాయతే వానరో మృతః ॥5॥

తన ప్రభువు ఆహారమును భుజించుచూ ఎవరయితే అతని ఇష్టమును ఆచరించడో అతడు అజ్ఞానము పొంది చనిపోయిన పిమ్మట కోతిగా జన్మించును.

న్యాసాపహర్తా నరకాద్విముక్తో జాయతే కృమిః ।
అసూయకశ్చ నరకాన్ముక్తో భవతి రాక్షసః ॥6॥

దాచియుంచమని ఇచ్చిన ద్రవ్యమును తిరిగి ఇవ్వక ఎవరయితే దొంగలించునో అతడు నరకమునుండి విముక్తుడైన పిమ్మట పురుగుగా జన్మించును. అసూయ గుణము కలవాడు నరకమునుండి బయల్వెడలిన పిమ్మట రాక్షసునిగా జన్మించును.

విశ్వాసహన్తా చ నరో మీనయోనౌ ప్రజాయతే ।
ధాన్యం యవాంస్తిలాన్మాషాన్కులత్థాన్సర్షపాంశ్చణాన్ ॥7॥

కలాయాన్కలమాన్ముద్గాన్గోధూమానతసీస్తథా ।
సస్యాన్యన్యాని వా హృత్వా మోహాజ్జంతురచేతనః ॥8॥

సంజాయతే మహావక్త్రో మూషికో బభ్రుసన్నిభః ।
పరదారాభిమర్శాత్తు వృకో ఘోరోఽభిజాయతే ॥9॥

విశ్వాసఘాతకుడైన మానవుడు చేపగా పుట్టును. ధాన్యము, యవలు, తిలలు, మినుములు, కులత్థములు (ధాన్యవిశేషము), ఆవాలు, శనగలు, కలాయములు, కలమలు, పెసలు, గోధుమలు, అవిశలు, ఇంకనూ ఇతరములగు ధాన్యములను అజ్ఞానముచే చైతన్యమును కోల్పోయి అపహరించిన మానవుడు పెద్ద నోరు కలిగి, ముంగిసలాగా ఉండి ఎలుకగా బుట్టును. ఇతరుల భార్యలను కోరుకొన్నవాడు భయంకరమైన తోడేలు జన్మనెత్తును.

శ్వా సృగాలో బకో గృధ్రో వ్యాలః కంకస్తథా క్రమాత్ ।
భ్రాతృభార్యాం చ దుర్బుద్ధిర్యో ధర్షయతి పాపకృత్ ॥10॥

పుంస్కోకిలత్వమాప్నోతి స చాపి నరకాచ్చ్యుతః ।
సఖిభార్యాం గురోర్భార్యాం రాజభార్యాం చ పాపకృత్ ॥11॥

ప్రధర్షయిత్వా పాపాత్మా సూకరో జాయతే నరః ।
యజ్ఞదానవివాహానాం విఘ్నకర్తా భవేత్కృమిః ॥12॥

దుర్బుద్ధియగు ఏ పాపాత్ముడు తన సోదరుని భార్యను బెదిరించి కామించునో అట్టి పాపాచరణముగలవాడు వరుసగా కుక్క, నక్క, కొంగ, గ్రద్ద, పాము, రాబందుల జన్మనెత్తును. ఇంకను ఆ నరుడు నరకమునుండి విముక్తుడైన పిమ్మట పురుషకోకిల జన్మనెత్తును. స్నేహితుని భార్యను, గురువు భార్యను, రాజు భార్యను ఎవరయితే కామించునో అట్టి పాపాచరణము గలవాడు పంది జన్మనెత్తును. యజ్ఞము, దానము, వివాహములకు ఆటంకము కలిగించినవాడు పురుగు జన్మనెత్తును.

పునర్దాతా చ కన్యాయాః కృమిరేవోపజాయతే ।
దేవతాపితృవిప్రాణామదత్త్వా యోఽన్నమశ్నుతే ॥13॥

ప్రముక్తో నరకాత్సోఽపి వాయసః సంప్రజాయతే ।
జ్యేష్ఠం పితృసమం వాఽపి భ్రాతరం యోఽవమన్యతే ॥14॥

నరకాత్సోఽపి విభ్రష్టః క్రౌఞ్చయోనౌ ప్రజాయతే ।
శూద్రశ్చ బ్రాహ్మణీం గత్వా కృమియోనౌ ప్రజాయతే ॥15॥

తస్యామపత్యముత్పాద్య కాష్ఠాన్తః కీటకో భవేత్ ।
సూకరః కృమికో ముద్గుశ్చణ్డాలశ్చ ప్రజాయతే ॥16॥

ఒకరికి ఇచ్చిన తన కన్యను తిరిగి మరొకరికి ఇచ్చినచో పురుగుగానే పుట్టును. దేవతలు, పితృదేవతలు, బ్రాహ్మణులకు పెట్టకుండా ఎవరయితే భోజనము చేయునో అతడు నరకము నుండి ముక్తుడైన పిమ్మట కాకిగా పుట్టును. తండ్రితో సమానుడైన జ్యేష్ఠసోదరుని ఎవరు అవమానపరచునో అతడు నరకమునుండి విముక్తుడైగూడా క్రౌఞ్చపక్షిగా (బెగ్గురుపక్షి) జన్మించును. బ్రాహ్మణస్త్రీని సంగమించిన శూద్రుడు పురుగుగా జన్మించును. అట్టి బ్రాహ్మణస్త్రీయందు సంతానమును పుట్టించి ఆ శూద్రుడు కట్టెలయందు కీటకముగా జన్మించును. తరువాత క్రమముగా పంది, పురుగు, నీటికాకి, చండాల జన్మలను పొందును.

అకృతజ్ఞోஉధమః పుంసాం విముక్తో నరకాన్నరః ।
కృతఘ్నః కృమికః కీటః పతంగో వృశ్చికస్తథా ॥17॥

మత్స్యస్తు వాయసః కూర్మః పుల్కసో జాయతే తతః ।
అశస్త్రం పురుషం హత్వా నరస్సఞ్జాయతే ఖరః ॥
కృమిః స్త్రీవధకర్తా చ బాలహన్తా చ జాయతే ॥18॥

మానవులలో కృతజ్ఞతలేని అధముడు నరకమునుండి విముక్తుడై క్రమముగా పురుగు, కీటకము, పక్షి, తేలు, చేప, కాకి, తాబేలు జన్మలెత్తి చివరకు చండాలజన్మను పొందును. చేతిలో ఆయుధములు లేని పురుషుని చంపినచో గాడిదగా జన్మించును. స్త్రీలను, పిల్లలను చంపినవాడు పురుగుగా జన్మించును.

భోజనం చోరయిత్వా తు మక్షికా జాయతే నరః ।
తత్రాప్యస్తి విశేషో వై భోజనస్య శృణుష్వ తత్ ॥19॥

భోజనమును దొంగలించినవాడు ఈగగా పుట్టును. అందులోనూ భోజనమును దొంగలించుట విషయములో విశేషమున్నది, వినుము.

హృత్వా దుగ్ధం తు మార్జారో జాయతే నరకాచ్చ్యుతః ।
తిలపిణ్యాకసమ్మిశ్రమన్నం హృత్వా తు మూషకః ॥20॥

ఘృతం హృత్వా తు నకులః కాకో మద్గురజామిషమ్ ।
మత్స్యమాంసాపహృత్కాకః శ్యేనో మేషామిషాపహృత్ ॥21॥

చిరీవాకస్త్వపహృతే లవణే దధ్ని వా కృమిః ।
చోరయిత్వా పయశ్చాపి బలాకా సంప్రజాయతే ॥22॥

యస్తు చోరయతే తైలం తైలపాయీ స జాయతే ।
మధు హృత్వా నరో దంశోஉపూపం హృత్వా పిపీలికా ॥23॥

చోరయిత్వా హవిష్యాన్నం జాయతే గృహగోధికా ।
ఆసనం చోరయిత్వా తు తిత్తిరిత్వమవాప్నుయాత్ ॥24॥

పాలును అపహరించిన మానవుడు నరకమునుండి విముక్తుడైన పిమ్మట పిల్లిగానూ, తెలకపిండితో కూడుకొన్న అన్నమును అపహరించినవాడు ఎలుకగానూ, నెయ్యిని అపహరించినవాడు ముంగిసగానూ, మేకమాంసమును అపహరించినవాడు కాకిగానూ, చేపమాంసమును అపహరించినవాడు కాకిగానూ, గొర్రెమాంసమును అపహరించినవాడు డేగగానూ, ఉప్పును దొంగలించినచో చిరీవాకముగానూ అనగా పక్షివిశేషముగానూ, పెరుగును అపహరించినచో పురుగుగానూ, పాలను అపహరించినచో కొంగగానూ జన్మించును. నూనెను దొంగిలించినచో గబ్బిలముగానూ, తేనెను అపహరించినచో అడవియీగగానూ, అప్పములను అపహరించినచో చీమగానూ, యజ్ఞసంబంధము కలిగిన అన్నమును అపహరించినచో బల్లిగానూ, మద్యమును దొంగలించినచో తిత్తిరిపక్షిగానూ జన్మించును.

అయో హృత్వా తు పాపాత్మా వాయసః సంప్రజాయతే ।
పాత్రే కాంశ్యేఽపి హారీతః కపోతో రౌప్యభాజనే ॥25॥

హృత్వా తు కాఞ్చనం భాండం కృమియోనౌ ప్రజాయతే ।
కౌశేయం చోరయిత్వా తు చక్రవాకత్వమృచ్ఛతి ॥26॥

కోశకారశ్చ కౌశేయే హృతే వస్త్రేఽభిజాయతే ।
దుకూలే శార్ఙ్గకః పాపో హృతే చైవాంశుకే శుకః ॥27॥

ఋక్షశ్చైవావికం హృత్వా వస్త్రం క్షౌమం చ జాయతే ।
కార్పాసికే హృతే క్రౌఞ్చో వహ్నేర్హర్తా బకః ఖరః ॥28॥

మయూరో వర్ణకాన్ హృత్వా పత్రశాకం చ జాయతే ।
జీవజ్జీవకతాం యాతి రక్తవస్త్రాపహృన్నరః ॥29॥

ఇనుమును దొంగలించిన పాపాత్ముడు కాకిజన్మనెత్తును. కంచుపాత్రను దొంగలించినవాడు ఆకుపచ్చని పావురముగానూ, వెండిపాత్రనపహరించినవాడు పావురముగానూ, బంగారుపాత్రను అపహరించినవాడు పురుగుగానూ జన్మించెదరు. నేసిన వస్త్రమును అపహరించినచో చక్రవాకపక్షిగానూ, పట్టువస్త్రమునపహరించినచో పట్టుపురుగుగానూ జన్మించును. ఆయా వస్త్రములను అపహరించినవారు ఒకానొకపక్షి విశేషముగానూ, చిలుకగానూ జన్మింతురు. ఊలువస్త్రములను, పట్టువస్త్రములను అపహరించినవారు ఎలుగుబంటిగానూ, దూది దారాలతో నిర్మితమైన వస్త్రమును అపహరించినచో క్రౌంచపక్షిగానూ, అగ్నులను అపహరించినచో కొంగగానూ, మరియు గాడిదగానూ జన్మింతురు. వివిధ వర్ణములు (రంగులు) గల వస్త్రములను అపహరించినవారు నెమలిగానూ, లేదా పక్షివిశేషముగానూ జన్మింతురు. ఎర్రని వస్త్రమును అపహరించిన మానవుడు చకోరపక్షిగానూ జన్మించును.

ఛుచ్ఛున్దరీ శుభాన్గన్ధాన్వాసో హృత్వా శశో భవేత్ ।
ఖఞ్జః పలాలహరణే కాష్ఠహృద్ఘుణకీటకః ॥30॥

పుష్పాపహృద్దరిద్రస్తు పఙ్గుర్యానాపహృన్నరః ।
శాకహర్తా చ హారీతస్తోయహర్తా చ చాతకః ॥31॥

భూమిహృన్నరకాన్ గత్వా రౌరవాదీన్ సుదారుణాన్ ।
తృణగుల్మలతావల్లీత్వక్సారతరుతాం క్రమాత్ ॥32॥

ప్రాప్య క్షీణాల్పపాపస్తు నరో భవతి వై తతః ।
వృషస్య వృషణౌ ఛిత్త్వా షంఢత్వం ప్రాప్నుయాన్నరః ॥33॥

పరిహృత్య తథా భూయో జన్మనామేకవింశతిః ।
కృమిః కీటః పతంగో వా పక్షీ తోయచరో మృగః ॥34॥

గోత్వం చ ప్రాప్య చాండాలపుల్కసాదిజుగుప్సితమ్ ।
పఙ్గ్వన్ధో బధిరః కుష్ఠీ యక్ష్మణా చ ప్రపీడితః ॥35॥

ముఖరోగాక్షిరోగైశ్చ గుదరోగైశ్చ బాధ్యతే ।
అపస్మారీ చ భవతి శూద్రత్వం చ స గచ్ఛతి ॥36॥

ఏష ఏవ క్రమో దృష్టో గోసువర్ణాదిహారిణామ్ ।
విద్యాపహారిణాం చైవ నిష్క్రయభ్రంశినాం గురోః ॥37॥

మంగళకరములైన సుగంధద్రవ్యములను అపహరించినవాడు ఛుచ్ఛుందరి అనగా ఎలుకగాను (ఛు ఛు అను శబ్దమును చేయునది గావున ఛుచ్ఛుందరీ శబ్దమునకు ఆడు ఎలుక అని అర్థము), వస్త్రములను అపహరించినవాడు చెవులపిల్లిగాను, ధాన్యపుగడ్డిని అపహరించినవాడు కుంటివానిగాను, కట్టెలను అపహరించినవాడు కట్టెలను భక్షించు పురుగుగాను అనగా చెదపురుగుగాను, పుష్పములను దొంగలించువాడు దరిద్రుడుగాను, వాహనములను అపహరించువాడు కుంటివానిగాను, శాకములను (కూరగాయలను) అపహరించినవాడు హారీతముగానూ (ఆకుపచ్చని పిట్టగానూ), నీటిని అపహరించినవాడు చాతకపక్షిగాను జన్మించును. భూమిని దొంగలించినవాడు రౌరవము మొదలగు భయంకరమైన నరకములకు వెళ్ళి అచ్చటనుండి విముక్తుడైన పిమ్మట వరుసగా గడ్డి, పొదలు, లతలు, తీగలు, త్వక్సారమను వృక్షవిశేషము, చెట్లు రూపముగా జన్మనెత్తును. అటుపిమ్మట కొద్దిపాపము క్షీణించినవారై మానవునిగా జన్మనెత్తును. ఎద్దుయొక్క వృషణములను కోసినవాడు నపుంసకుడిగా జన్మించును. ఈ విధముగా ఇరువది ఒక్కసార్లు నపుంసకునిగా బుట్టి అటుపిమ్మట క్రమముగా పురుగు, కీటకము, మిడత, పక్షి, నీటిలో సంచరించు చేప మొదలగునవి, మృగము, ఎద్దు జన్మలను పొంది, అటుపిమ్మట నీచమైన చండాలజన్మ, పుల్కసజన్మను (బ్రాహ్మణునికి క్షత్రియ స్త్రీయందు పుట్టినవాడు పుల్కసుడు) పొందును. అటుపిమ్మట ఆ నరుడు కుంటి, గ్రుడ్డి, చెవిటి, కుష్ఠ క్షయరోగములతో మిక్కిలి పీడితుడై ముఖరోగములు (నోరుకు సంబంధించినవి), అక్షిరోగములు (కంటికి సంబంధించినవి), గుదరోగములను (మలద్వారమునకు సంబంధించినవి) పొందును. ఇంకను ఆ పాపి అపస్మారరోగము కలవాడగును. అటుపిమ్మట శూద్రునిగా జన్మనెత్తును. బంగారమును అపహరించినవారికి, విద్యను అపహరించినవారికి, గురుదక్షిణను ఈయనివారికి ఈ చెప్పబడిన క్రమముతోనే జన్మలు వచ్చును.

జాయామన్యస్య పారక్యాం పురుషః ప్రతిపాదయేత్ ।
ప్రాప్నోతి షంఢతాం మూఢో యాతనాభ్యః పరిచ్యుతః ॥38॥

తన భార్యను పరపురుషునికి అప్పగించిన మూఢుడు నరకలోకమందలి యాతనలనుండి విముక్తుడైన పిమ్మట నపుంసకునిగా జన్మించును.

యః కరోతి నరో హోమమసమిద్ధే హుతాశనే ।
సోఽజీర్ణఘనదుఃఖార్తో మందాగ్నిరభిజాయతే ॥39॥

అగ్నిహోత్రమందు అగ్ని ఇంకా సమిధలచే రాజుకోకుండానే ఎవరయితే హోమకార్యములను నిర్వర్తించునో అట్టి మానవుడు విపరీతమైన అజీర్ణవ్యాధికలవాడగును. ఇంకను అతని దేహమందలి జఠరాగ్ని తిన్న పదార్థములను జీర్ణము చేయుటలో అసమర్థమై రోగములకు హేతువగును.

పరనిందా కృతఘ్నత్వం పరమర్మోపఘట్టనమ్ ।
నైష్ఠుర్యం నిర్ఘృణత్వం చ పరదారోపసేవనమ్ ॥40॥

పరస్వహరణాశా చ దేవతానాం చ కుత్సనమ్ ।
నికృత్యా వంచనా నౄణాం కార్పణ్యం చ నౄణాం వధః ॥41॥

యాని చ ప్రతిషిద్ధాని తద్వృత్తిం చ ప్రశంసతామ్ ।
ఉపలక్షణాని జానీయాన్ముక్తానాం నరకాదను ॥42॥

ఇతరులను నిందించుట, ఉపకారము చేసినవారిపట్ల కృతజ్ఞత లేకుండుట, ఇతరుల రహస్యములను బట్టబయలు చేయుట, కఠినముగా మాటలాడుట, దయాగుణము లేకుండుట, ఇతరుల భార్యలను పొందుట, ఇతరుల ద్రవ్యములను పొందాలనే ఆశ, దేవతలను నిందించుట, మోసముతో ప్రజలను వంచించుట, దీనస్వభావము, మనుష్యులను చంపుట, చేయకూడని పనులను ప్రశంసించుట ఈ గుణములన్నియు నరకమునుండి ఈ లోకమందు తిరిగి బుట్టినవారి గుణములుగా తెలియవలెను.

దయా భూతేషు సద్భావః పరలోకం ప్రతి క్రియా ।
సత్యా భూతహితా చోక్తిర్వేదప్రామాణ్యదర్శనమ్ ॥43॥

గురుదేవర్షిసిద్ధర్షిపూజనం సాధు సంగమః ।
సత్క్రియాఽభ్యసనం మైత్రీ చైతద్బుధ్యేత పండితః ॥44॥

అన్యాని చైవ సద్ధర్మక్రియాభూతాని యాని చ ।
స్వర్గచ్యుతానాం లింగాని పురుషాణామపాపినామ్ ॥45॥

ఇక ప్రాణులయందు దయకలిగియుండుట, ప్రాణులయందు సద్భావము కలిగియుండుట, స్వర్గాదిలోకములు పొందుటకు యజ్ఞయాగాది విహితకర్మలను ఆచరించుట, సత్యమునే మాటలాడుట, ప్రాణులకు మేలు చేకూర్చే మాటలను మాటలాడుట, వేదములు ప్రమాణమేయను బుద్ధి కల్గియుండుట, గురువులు దేవర్షులు సిద్ధర్షులు

వీరిని పూజించుట, సత్పురుషులతో సహవాసము, మంచి పనులను చేయుటను అలవరచుకొనుట, స్నేహగుణము, ధర్మకార్యములను ఆచరించు పనులు ఇవియన్నియు స్వర్గమునుండి ముక్తులైన పాపాత్ములుకానివారి గుణములుగా పండితుడు తెలుసుకొనవలెను.

ఏతదుద్దేశతో రాజన్ ! భవతః కథితం మయా ।
స్వకర్మఫలభోక్తౄణాం పుణ్యానాం పాపినాం తథా ॥46॥

తదేహ్యన్యత్ర గచ్ఛామో దృష్టం సర్వం త్వయాఽధునా ।
త్వయా చ దృష్టో నరకస్తదేహ్యన్యత్ర గమ్యతామ్ ॥47॥

ఓ మహారాజా ! పుణ్యాత్ములు, పాపాత్ములు వారి వారి ఫలములను అనుభవించుటను గూర్చి నీకు నేను ఉద్దేశపూర్వకముగా (తప్పక చెప్పాలనే తలంపుతో) చెప్పితిని. నీవిప్పుడు నరకమును చూచితివిగదా ! రమ్ము, మరొకచోటికి వెళ్ళెదము.

పుత్ర ఉవాచ – కుమారుడు తండ్రితో పలికాడు.

తతస్తమగ్రతః కృత్వా స రాజా గన్తుముద్యతః ।
తతశ్చ సర్వైరుత్కృష్టం యాతనాస్థాయిభిర్నృభిః ॥48॥

పిమ్మట ఆ మహారాజు ఆ యమదూతను ముందిడుకొని వెళ్ళుటకు ఉద్యమించగా, యాతనలను అనుభవించుచున్న నరకలోకమందలి జనులు ఇట్లు పలికిరి.

ప్రసాదం కురు భూపేతి తిష్ఠ తావన్ముహూర్తకమ్ ।
త్వదఙ్గసఙ్గీ పవనో మనో హ్లాదయతే హి నః ॥49॥

పరితాపం చ గాత్రేషు పీడాం బాధాం చ కృత్స్నశః ।
అపహన్తి నరవ్యాఘ్ర కృపాం కురు మహీపతే ॥50॥

ఓ మహారాజా ! మమ్ములను అనుగ్రహించుము. క్షణకాలము నిలువుము. నీ అవయవాలతో సంబంధము కలిగి వీచుచున్న గాలి మమ్ములను ఆహ్లాదపరచుచున్నది. ఓ పురుషవ్యాఘ్రుడా ! ఓ మహారాజా ! ఆ వాయువు మా అవయవాలయందు కలుగుచున్న పీడను, బాధను పోగొట్టుచున్నది. మాయందు దయ యుంచుము.

ఏతచ్ఛ్రుత్వా వచస్తేషాం తం యామ్యం పురుషం తతః ।
పప్రచ్ఛ కథమేతేషామాహ్లాదో మయి తిష్ఠతి ॥51॥

కిం మయా కర్మ తత్పుణ్యం మర్త్యలోకే మహత్ కృతమ్ ।
ఆహ్లాదదాయినీ వృష్టిర్యస్యేయం తదుదీరయ ॥52॥

ఆ నరకలోకవాసుల మాటలను విని ఆ మహారాజు యమపురుషుని ఇట్లు ప్రశ్నించెను. నేనిచ్చటుండగా వీరికెట్లు ఆహ్లాదము కలుగుచున్నది? వీరికాహ్లాదము కలిగించునంతటి మహాపుణ్యము మానవలోకమందు నేనేమి చేసితినో చెప్పుము.

యామ్య ఉవాచ – యమపురుషుడు చెప్పాడు.

పితృదేవాతిథిప్రేష్యశిష్టేనాన్నేన తే తనుః ।
పుష్టిమభ్యాగతా యస్మాత్ తద్గతం చ మనో యతః ॥53॥

తతస్త్వద్గాత్రసంసర్గీ పవనో హ్లాదదాయకః ।
పాపకర్మకృతో రాజన్ ! యాతనా న ప్రబాధతే ॥54॥

పితృదేవతలు, అగ్న్యాదిదేవతలు, అతిథులు, సేవకులు వీరు తిన్న తర్వాత మిగిలిన అన్నమును భుజించుటచేత నీ శరీరము పుష్టిని బొందినది. నీ మనస్సు కూడా వారియందే లగ్నమైనది. అందువల్ల నీ శరీరసంసర్గమును పొందిన వాయువు ఈ పాపకర్ములకు ఆనందమునిచ్చుచున్నది. నరకయాతనలు వీరిని బాధించుట లేదు.

అశ్వమేధాదయో యజ్ఞాస్త్వయేష్టా విధివద్యతః ।
తతస్త్వద్దర్శనాద్యామ్యా యంత్రశస్త్రాగ్నివాయసాః ॥55॥

పీడనచ్ఛేదదాహాదిమహాదుఃఖస్య హేతవః ।
మృదుత్వమాగతా రాజంస్తేజసోపహృతాస్తవ ।56॥

అశ్వమేధము మొదలగు యజ్ఞములను నీవు శాస్త్రోక్తప్రకారము ఆచరించితివి. యమలోకసంబంధము కలిగిన యంత్రములు, శస్త్రములు, అగ్నులు, గునపములు మొదలగునవి పీడించుట, ముక్కలుముక్కలుగా చేయుట, దహించివేయుట మొదలగు మహాదుఃఖమునకు కారణములు. అయినప్పటికీ నీ దర్శనమాత్రముచేతనే ఓ రాజా! నీ తేజస్సుచేత వాటి శక్తి తగ్గిపోయి మృదుస్వభావము కలిగినవి అయినవి, నరకలోకవాసులనెవరినీ బాధించుట లేదు.

రాజోవాచ – రాజు పలికాడు.

న స్వర్గే బ్రహ్మలోకే వా తత్సుఖం ప్రాప్యతే నరైః ।
యదార్తజన్తునిర్వాణదానోత్థమితి మే మతిః ॥57॥

యది మత్సన్నిధావేతాన్యాతనా న ప్రబాధతే ।
తతో భద్రముఖాఽత్రాహం స్థాస్యే స్థాణురివాచలః ॥58॥

ఈ నరకలోకమందు బాధలను అనుభవించుచున్న వారికి సుఖమునిచ్చు ఇంతటి సుఖమును మానవులు స్వర్గలోకమందు, బ్రహ్మలోకమందు గాని పొందుట లేదని నా అభిప్రాయము. ఓ భద్రముఖా ! యమకింకరుడా ! ఒకవేళ నా సాన్నిధ్యము మాత్రము చేతనే వీరిని నరకయాతనలు బాధించుట లేదన్నచో నేనిచ్చటే పర్వతమువలే కదలకుండా నిలిచియుండెదను.

యమపురుష ఉవాచ – యమపురుషుడు పలికాడు.

ఏహి రాజేంద్ర గచ్ఛామి నిజపుణ్యసమార్జితాన్ ।
భుంక్ష్వ భోగాంస్తు భుజ్యన్తు యాతనాః పాపకర్మిణః ॥59॥

ఓ మహారాజా ! రమ్ము, వెళ్ళెదము. నీ పుణ్యముతో నీవు సంపాదించుకొన్న స్వర్గాదిభోగములను అనుభవించుము. ఈ పాపకర్ములు వారివారి యాతనలను అనుభవించనీ !

రాజోవాచ – రాజు పలికాడు.

తస్మాన్న తావద్యాస్యామి యావదేతే సుదుఃఖితాః ।
మత్సన్నిధానాత్సుఖినో భవన్తి నరకౌకసః ॥60॥

మిక్కిలి దుఃఖమునొందుచున్న ఈ నరకవాసులు నా సాన్నిధ్యము కారణముగా సుఖవంతులు అగుచున్న కారణముగా నేనిచ్చటనుండి వెళ్ళను.

ధిక్తస్య జీవితం పుంసః శరణార్థినమాగతమ్ ।
యో నార్తమనుగృహ్ణాతి వైరిపక్షమపి ధ్రువమ్ ॥61॥

శత్రుపక్షమందున్నా శరణని దగ్గరకు వచ్చిన ఆర్తజనులను ఎవరు కాపాడరో అట్టి పురుషుని జీవితము నిందింపతగినది.

యజ్ఞదానతపాంసీహ పరత్ర చ న భూతయే ।
భవన్తి తస్య యస్యార్తపరిత్రాణే న మానసమ్ ॥62॥

ఆర్తజనులను రక్షించుటలో ఎవరి మనస్సు లగ్నము కాదో అట్టి పురుషుడు ఆచరించిన యజ్ఞదానతపస్సులు ఈ లోకమందు గాని పరలోకమందుగాని ఐశ్వర్యమునీయజాలవు.

నరస్య యస్య కఠినం మనో బాలాతురాదిషు ।
వృద్ధేషు చ న తం మన్యే మానుషం రాక్షసో హి సః ॥63॥

చిన్నపిల్లలు, దుఃఖితులు, వృద్ధులు వీరిపట్ల ఎవరి మనస్సు కఠినముగా ఉండునో అతడిని మనిషిగా నేను భావించుట లేదు. అతడు రాక్షసుడే కదా !

ఏషాం మత్సన్నికర్షాత్తు యదగ్నిపరితాపజమ్ ।
తథోగ్రగన్ధజం వాఽపి దుఃఖం నరకసంభవమ్ ॥64॥

క్షుత్పిపాసోద్భవం దుఃఖం యచ్చ మూర్ఛాప్రదం మహత్ ।
వినాశమేతి తద్భద్ర ! మన్యే స్వర్గసుఖాత్పరమ్ ॥65॥

ప్రాప్స్యన్తే తే యది సుఖం బహవో దుఃఖితే మయి ।
కిం వా ప్రాప్తం మయా న స్యాత్తస్మాత్త్వం వద మా చిరమ్ ॥66॥

ఓ భద్రుడా ! నరకలోకవాసము వల్ల సంభవించు అగ్నితాపము వలని దుఃఖముగానీ, భరింపశక్యముగాని వాసనవల్ల వచ్చు దుఃఖముగానీ, ఆకలిదప్పులవల్ల వచ్చు దుఃఖముగానీ, మూర్ఛవలన కలుగు దుఃఖముగానీ నా సాన్నిధ్యము కారణముగా నశించినచో అది స్వర్గసుఖముకంటే కూడా ఉత్కృష్టమైన సుఖమని నేను భావించుచున్నాను. నేను దుఃఖితుడను అయినా నరకలోకవాసులగు వారు సుఖమును పొందినారన్నచో నేనిక పొందనిది ఏమున్నది? అందువలన నీవిక ఏమీ పలుకవద్దు.

యామ్య ఉవాచ – యమపురుషుడు పలికాడు.

ఏష ధర్మశ్చ శక్రశ్చ త్వాం నేతుం సముపాగతాః ।
అవశ్యమస్మాద్గన్తవ్యం తస్మాత్పార్థివ గమ్యతామ్ ॥67॥

ఓ రాజా ! ఈ ధర్మదేవుడు, దేవేంద్రుడు నిన్ను తీసుకొని వెళ్ళుటకు వచ్చినారు. ఈ చోటునుంచి మనము తప్పనిసరిగా వెళ్ళవలసియున్నది. కావున నాతో రమ్ము.

ధర్మ ఉవాచ – ధర్మదేవుడు పలికాడు.

నయామి త్వామహం స్వర్గం త్వయా సమ్యగుపాసితః ।
విమానమేతదారుహ్య మా విలంబస్వ గమ్యతామ్ ॥68॥

నీవు బాగుగా పుణ్యకర్మలనాచరించితివి. నిన్ను నేను స్వర్గమునకు తీసుకొనిబోయెదను. ఈ విమానమును అధిరోహించుము. ఆలస్యము చేయకుము, నాతో రమ్ము.

రాజోవాచ – రాజు పలికాడు.

నరకే మానవా ధర్మ ! పీడ్యమానాః సహస్రశః ।
త్రాహీత్యమీ క్రన్దన్తి మామతో న వ్రజామ్యహమ్ ॥69॥

ఓ ధర్మదేవుడా ! వేల కొలది మానవులు నరకలోకమందు బాధలను అనుభవించుచున్నారు. వీరందరు రక్షించుమని నన్ను గూర్చి ఆక్రందనము చేయుచున్నారు. అందువలన నేనిచ్చటినుండి వెళ్ళజాలను.

ఇంద్ర ఉవాచ – ఇంద్రుడు పలికాడు.

కర్మణా నరకప్రాప్తిరేషాం పాపిష్ఠకర్మణామ్ ।
స్వర్గస్త్వయాఽపి గన్తవ్యో నృప పుణ్యేన కర్మణా ॥70॥

ఓ రాజా ! పాపకర్మలను ఆచరించిన వీరికి వారి పాపకర్మల కారణముగా నరకము ప్రాప్తించినది. నీవు ఆచరించిన పుణ్యకర్మలచే నీకు స్వర్గము ప్రాప్తించినది. అందువలన నీవు స్వర్గమునకు బోవలయును.

రాజోవాచ – రాజు చెప్పాడు.

యది జానాసి ధర్మ ! త్వం త్వం వా దేవ! శతక్రతో ! ।
మమ యావత్ప్రమాణం తు శుభం తద్వక్తుమర్హథ ॥71॥

ఓ ధర్మదేవుడా ! ఓ దేవేంద్రుడా ! నేను ఆచరించిన శుభకర్మల ప్రమాణమెంతయో మీ ఇరువురిలో ఎవరు ఎరిగిననూ నాకు చెప్పగోరుచున్నాను.

ధర్మ ఉవాచ – ధర్మదేవుడు పలికాడు.

అబ్బిందవో యథాఽంభోధౌ యథా వా దివి తారకాః ।
యథా వా వర్షతో ధారా గంగాయాం సికతా యథా ॥72॥

అసంఖ్యేయా మహారాజన్నానాయోనిషు జన్తవః ।
తథా తవాఽపి పుణ్యస్య సంఖ్యా నైవోపపద్యతే ॥73॥

ఓ మహారాజా! సముద్రమందు నీటి బిందువులను, ఆకాశమందు నక్షత్రాలను, వర్షమందలి ధారలను, గంగానదిలోని ఇసుకరేణువులను, అనేకయోనులందు రకరకాలైన జన్మలనెత్తు ప్రాణులను ఎట్లు లెక్కించలేమో అట్లే నీ పుణ్యకర్మల సంఖ్యను కూడా చెప్పుట సాధ్యము కాదు.

అనుకంపామిమామద్య నరకేష్విహ కుర్వతా ।
తదేవ శతసాహస్రసంఖ్యానీతం త్వయా నృప ॥74॥

ఓ రాజా ! ఈ నరకలోకవాసులందు నీవు జాలిని చూపించుటచే ఇంతవరకు నీకున్న పుణ్యము నూరువేల రెట్లుగా వృద్ధిని పొందినది.

తద్గచ్ఛ త్వం నృపశ్రేష్ఠ తద్భోక్తుమమరాలయమ్ ।
ఏతే తు నరకే పాపం క్షపయన్తు స్వకర్మజమ్ ॥75॥

కావున ఓ రాజశ్రేష్ఠుడా ! నీ పుణ్యఫలముననుభవించుటకు నీవు స్వర్గమునకు వెళ్ళుము. ఈ పాపకర్ములు ఈ నరకలోకమందు దుఃఖములననుభవించి తామాచరించిన కర్మలవల్ల కలిగిన పాపములను నశింపచేసుకొందురు గాక !

రాజోవాచ – రాజు పలికాడు.

కథం స్పృహాం కరిష్యన్తి మత్సంపర్కాయ మానవాః ।
యది మత్సన్నిధావేషాముత్కర్షో నోపపద్యతే ॥76॥

తస్మాద్యత్సుకృతం కించిన్మమాస్తి త్రిదశాధిప ! ।
ముచ్యన్తాం తేన నరకాత్ పాపినో యాతనాగతాః ॥77॥

ఓ దేవేంద్రా! నా సన్నిధిలో ఈ నరకలోకవాసులకు సుఖము కలగనిచో వీరెందుకు నా సంబంధమును కోరుకుంటారు? అందువలన నేనాచరించిన పుణ్యము ఏ కొద్దిపాటియున్ననూ దానితో యాతనలను అనుభవించుచున్న ఈ పాపకర్ములు నరకలోకమునుండి విముక్తులగుదురు గాక !

ఇంద్ర ఉవాచ – ఇంద్రుడు చెప్పాడు.

ఏవమూర్ధ్వతరం స్థానం త్వయా ప్రాప్తం మహీపతే ।
ఏతాంస్తు నరకాత్పశ్య విముక్తాన్ పాపకర్మిణః ॥78॥

ఓ మహారాజా ! నీవిట్లు పలుకుటచే నీ పుణ్యఫలము అధికమైనందున నీవు మరింత ఉన్నతమైన స్థానమును పొందితివి. నీ పుణ్యమును ఈ నరకలోకవాసులకు నీవిచ్చుటచే నరకలోకమునుండి విముక్తిని పొందిన ఈ పాపకర్ములను చూడుము.

పుత్ర ఉవాచ – పుత్రుడు పలికాడు.

తతోఽపతత్ పుష్పవృష్టిస్తస్యోపరి మహీపతేః ।
విమానం చాధిరోప్యైనం స్వర్లోకమనయద్ధరిః ॥79॥

అంతట ఆ మహారాజుపైన పుష్పవర్షము కురిసినది. హరి (దేవేంద్రుడు) మహారాజును విమానముపై ఎక్కించుకొని స్వర్గలోకమునకు తీసుకొనిబోయెను.

అహం చాన్యే చ యే తత్ర యాతనాభ్యః పరిచ్యుతాః ।
స్వకర్మఫలనిర్దిష్టం తతో యోన్యన్తరం గతాః ॥80॥

నేను మరియు మిగిలినవారు ఆ నరకలోకమందలి యాతనల నుండి విడిపడిన పిమ్మట మా మా కర్మల ఫలము ఆధారముగా వేరే వేరే జన్మలను పొందితిమి.

ఏవమేతే సమాఖ్యాతా నరకా ద్విజసత్తమ! ।
యేన యేన చ పాపేన యాం యాం యోనిముపైతి వై ॥81॥

ఓ బ్రాహ్మణశ్రేష్ఠుడా ! ఏ ఏ పాపము కారణముగా ఏ ఏ జన్మను పొందెదరో అట్టి నరకములను గూర్చి నీకు నేను చెప్పితిని.

తత్తత్సర్వం సమాఖ్యాతం యథా దృష్టం మయా పురా ।
పురాఽనుభవజం జ్ఞానమవాప్య కథితం తవ ॥
అతఃపరం మహాభాగ! కిమన్యత్కథయామి తే ॥82॥

ఓ మహాభాగా ! పూర్వజన్మజ్ఞానమును పొంది నేను పూర్వజన్మలలో చూచినదంతయు నీకు చెప్పితిని. దీని తరువాత నీకింకేమి చెప్పవలయునో చెప్పుము.

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే పితాపుత్రసంవాదే నరకస్థోద్ధారవర్ణనం నామ పఞ్చదశోఽధ్యాయః ॥15॥

శ్రీ మార్కండేయ మహాపురాణమందు తండ్రీకొడుకుల సంవాదమందలి నరకవాసులనుద్ధరించుటయను పదునైదవ అధ్యాయం సమాప్తం.

షోడశోఽధ్యాయః – పదునారవ అధ్యాయం
దత్తాత్రేయమాహాత్మ్యవర్ణనమ్ – దత్తాత్రేయమాహాత్మ్యవర్ణనం

పితా ఉవాచ – తండ్రి పలికాడు.

కథితం మే త్వయా వత్స సంసారస్య వ్యవస్థితమ్ ।
స్వరూపమపి దేహస్య ఘటీయంత్రవదవ్యయమ్ ॥1॥

తదేవమేతదఖిలం మమావగతమీదృశమ్ ।
కిం మయా వద కర్తవ్యమేవమస్మిన్ వ్యవస్థితే ॥2॥

ఓ కుమారా! ఈ సంసారముయొక్క స్వరూపస్వభావములను గూర్చి నీవు చెప్పితివి. అట్లే ఘటీయంత్రమువలే (గడియారపుముల్లు ఎచ్చటి నుండి ఆరంభమై పయనించునో మరల అచ్చటకు చేరును) ఈ దేహము యొక్క స్థితి కూడా మోక్షము సిద్ధించువరకు జన్మమరణ ప్రవాహమనే అనాదిస్వభావము కలిగినది. నీవు చెప్పినదంతయు నాకు తెలిసినది. ఇట్లుండగా నేనేమి చేయవలయునో చెప్పుము.

పుత్ర ఉవాచ :– కుమారుడు చెప్పాడు.

యది మద్వచనం తాత శ్రద్దధాస్యవిశంకితః ।
తత్పరిత్యజ్య గార్హస్థ్యం వానప్రస్థమనా భవ ॥3॥

తమనుష్ఠాయ విధివద్విహాయాగ్నిపరిగ్రహమ్ ।
ఆత్మన్యాత్మానమాధాయ నిర్ద్వంద్వో నిష్పరిగ్రహః ॥4॥

ఏకాన్తశీలో వశ్యాత్మా భవ భిక్షురతంద్రితః ।
తత్ర యోగపరో భూత్వా బాహ్యస్పర్శవివర్జితః ॥5॥

తతః ప్రాప్స్యసి తం యోగం దుఃఖసంయోగభేషజమ్ ।
ముక్తిహేతుమనౌపమ్యమనాఖ్యేయమసంజ్ఞితమ్ ॥6॥

తత్సంయోగాన్న తే యోగో భూయో భూతైర్భవిష్యతి ।

ఓ తండ్రీ! ఎట్టి సందేహమూ లేకుండా నా మాటను నీవు విశ్వసించినయెడల ఈ గృహస్థాశ్రమమును విడిచిపెట్టి వానప్రస్థాశ్రమమును స్వీకరించుటయందు నీ మనస్సును లగ్నము చేయుము. విధ్యుక్తప్రకారము వానప్రస్థాశ్రమమును స్వీకరించి, గృహస్థాశ్రమమునకు యోగ్యములైన అగ్నులను విడిచిపెట్టి, పరమాత్మయందు మనస్సును లగ్నము చేయుము. శీతోష్ణములు, సుఖదుఃఖములు మొదలగు ద్వంద్వములందు భేదబుద్ధిని విడిచి అనగా సమభావమును వహించి పరిగ్రహమును (దానము పట్టుటను) విడిచిపెట్టుము. ఏకాంతశీలుడవై అనగా జీవబ్రహ్మైక్యబుద్ధితో మనస్సును బాహ్యవిషయములందు ప్రసరింపచేయక స్వాధీనమందుంచుకొని అలసత్వమును విడిచి భిక్షువుగా అగుము. అనగా ప్రాపంచికవిషయములను విడిచి సన్న్యాసాశ్రమమును స్వీకరించుము. అచ్చట బాహ్యవిషయములందు స్పర్శ లేక యోగమును వహించుము అనగా బాహ్యవిషయకచిత్తవృత్తులను నిరోధించుము.

అంతట నీవు దుఃఖసంసర్గమునకు ఔషధమువంటి అనగా దుఃఖములను పోగొట్టే యోగమును పొందగలవు. అట్టి యోగమే ముక్తికి కారణము, సాటిలేనిది, మాటలలో వర్ణించలేనిది, ఇదియని చెప్పుటకు వీలులేనిది. అట్టి యోగముతో సంయోగము కారణముగా ఇక నీకు పంచభూతాత్మకమైన సంసారముతో యోగము (సంబంధము) కలుగదు.

పితా ఉవాచ – తండ్రి పలికాడు.

వత్స యోగం మమాచక్ష్వ ముక్తిహేతుమతఃపరమ్ ॥7॥

యేన భూతైః పునర్భూతో నేదృగ్దుఃఖమవాప్నుయామ్ ।
యత్రాఽసక్తిపరస్యాఽఽత్మా మమ సంసారబంధనైః ॥8॥

ఓ కుమారా ! ఇటుపైన ఇక ముక్తికి కారణమైన యోగమును నాకు చెప్పుము. పంచభూతములతో సంబంధము కలిగిన జన్మను పొంది, మరల ఇట్టి సంసారదుఃఖమును ఏ యోగమువలన నేను పొందనో, ఈ సంసారబంధనముల కారణముగా సంసారము కల్గుచుండుటచే వాటిని పోగొట్టుకొనుటకు ఏ యోగమునందు నా మనస్సు లగ్నము కావలెనో అట్టి యోగమును నాకుపదేశించుము.

నేతి యోగమయోగోఽపి తం యోగమధునా వద ।
సంసారాదిత్యతాపార్తివిప్లుష్యద్దేహమానసమ్ ॥9॥

బ్రహ్మజ్ఞానాంబుశీతేన సిఞ్చ మాం వాక్యవారిణా ।
అవిద్యాకృచ్ఛ్రసర్పేణ దష్టం తద్విషపీడితమ్ ॥10॥

స్వవాక్యామృతదానేన మాం జీవయ పునర్మృతమ్ ।
పుత్రదారగృహక్షేత్రమమత్వనిగడార్దితమ్ ॥11॥

మాం మోచయేష్టసద్భావవిజ్ఞానోద్ఘాటనైశ్చిరమ్ ।

నిజముగా ప్రపంచము లేదు, బ్రహ్మమొక్కటే సత్యము అని సంసారబంధములనుండి సంబంధములేకుండా చేయు యోగశాస్త్రమును గూర్చి నాకిప్పుడు చెప్పుము. సంసారమనెడు సూర్యుని తాపముచే తపించి దహింపబడుచున్న దేహము మనస్సులు గల నన్ను బ్రహ్మజ్ఞానమనెడు జలమందలి చల్లదనము కలిగిన నీ వాక్యములనెడు జలముచే తడుపుము. అవిద్యయనెడు సర్పముచే కరువబడి ఆ సర్పవిషయముచే పీడింపబడి మరణించిన నన్ను నీ వాక్యామృతమును ప్రసాదించి బ్రతికించుము. పుత్రులు, భార్య, గృహములు, భూములు, వీటియందు నాది అను భావమనెడు ఇనుపసంకెళ్ళచే బంధింపబడిన నన్ను ఇష్టసద్భావవిజ్ఞానములతో తెరిపించి విడిపించుము.

పుత్ర ఉవాచ – కుమారుడు పలికాడు.

శృణు తాత యథా యోగో దత్తాత్రేయేణ ధీమతా ॥12॥

అలర్కాయ పురా ప్రోక్తః సమ్యక్ పృష్టేన విస్తరాత్ ।

ఓ తండ్రీ ! పూర్వము అలర్కుడు దత్తాత్రేయుని భక్తిశ్రద్ధలతో అడుగగా, జ్ఞానియగు దత్తాత్రేయుడు అలర్కునికి ఉపదేశించిన యోగమును చెప్పెదను, వినుము.

పితోవాచ – తండ్రి అడిగెను.

దత్తాత్రేయః సుతః కస్య కథం వా యోగముక్తవాన్ ।
కశ్చాలర్కో మహాభాగో యో యోగం పరిపృష్టవాన్ ॥13॥

ఓ కుమారా ! దత్తాత్రేయుడు ఎవని కుమారుడు? ఎట్లు యోగమునుపదేశించెను? యోగమును గూర్చి అడిగిన మహానుభావుడగు అలర్కుడెవరు?

పుత్ర ఉవాచ – కుమారుడు చెప్పాడు.

కౌశికో బ్రాహ్మణః కశ్చిత్ప్రతిష్ఠానేఽభవత్పురే ॥14॥

సోఽన్యజన్మకృతైః పాపైః కుష్ఠరోగాతురోఽభవత్ ।
తం తథా వ్యాధితం భార్యా పతిం దేవమివాఽర్చయత్ ॥15॥

పూర్వము ప్రతిష్ఠానమను పట్టణమందు కౌశికుడను ఒకానొక బ్రాహ్మణుడుండెను. అతడు గతజన్మలలో చేసిన పాపాల కారణంగా కుష్ఠరోగగ్రస్తుడయ్యెను. అట్టి వ్యాధితో పీడింపబడిన భర్తను భార్య దేవునివలే పూజించుచుండెను.

పాదాభ్యంగాంగసంవాహస్నానాచ్ఛాదనభోజనైః ।
శ్లేష్మమూత్రపురీషాసృక్ప్రవాహక్షాళనేన చ ॥16॥

రహస్యేవోపచారేణ ప్రియసంభాషణేన చ ।
సతతం పూజ్యమానోఽపి తయాఽతీవ వినీతయా ॥17॥

అతితీవ్రప్రకోపత్వాన్నిర్భర్త్సయతి దారుణః ।
తథాఽపి ప్రణతా సాధ్వీ తమమన్యత దైవతమ్ ॥18॥

కాళ్ళుపట్టుట, శరీరావయవములన్నింటినీ సంరక్షించుట, స్నానము చేయించుట, బట్టలు తొడుగుట, భోజనముపెట్టుట, రోగము కారణముగా ఉద్భవించిన శ్లేష్మము, మలమూత్రములు, కారుతున్న రక్తము వీటిని శుభ్రముగా కడుగుట, ఏకాంతసమయమందు ఉపచారములను ప్రియసంభాషణములను సలుపుట ఇట్టి సేవలద్వారా మిక్కిలి వినయవంతురాలైన భార్యచేత ఎల్లప్పుడూ పూజింపబడుతున్నా కూడా భర్తయగు కౌశికుడను ఆ బ్రాహ్మణుడు మిక్కిలి కోపము కలిగిన వాడగుటచే దుర్మార్గుడై ఆమెను బెదిరించుచుండెను. అయిననూ పతివ్రతయగు ఆమె మిక్కిలి వినయముతో తన భర్తను దైవమని తలంచుచుండెను.

తం తథాఽప్యతిబీభత్సం సర్వశ్రేష్ఠమమన్యత ।
అచంక్రమణశీలోఽపి స కదాచిద్ద్విజోత్తమః ॥19॥

ప్రాహ భార్యాం నయస్వేతి త్వం మాం తస్యా నివేశనమ్ ।
యా సా వేశ్యా మయా దృష్టా రాజమార్గే గృహే సతా ॥20॥

మిక్కిలి భయంకరముగా తన భర్త ప్రవర్తించుచున్నప్పటికినీ ఆమె తన భర్తయే అందరిలోనూ గొప్పవాడని భావించెను. అతడొకనాడు నడచుటకు కూడా శక్తి లేనప్పటికీ తన భార్యను ఇటుల ఆజ్ఞాపించెను. "నేను గృహమందుండగా రాజమార్గమందు వెళ్ళుచున్న ఒక వేశ్యను చూచితిని. నీవు నన్ను ఆమె ఇంటికి తీసుకొని వెళ్ళుము.

తాం మే ప్రాపయ ధర్మజ్ఞే సైవ మే హృది వర్తతే ।
దృష్టా సూర్యోదయే బాలా రాత్రిశ్చేయముపాగతా ॥21॥

ఓ పతివ్రతాధర్మమునెరిగినదానా ! ఆమెను నాకు పొందింపచేయుము. ఆమెయే నా హృదయమందు నిలిచియున్నది. సూర్యోదయసమయమందు నేనామెను చూచితిని. ఇప్పుడు రాత్రిగూడా అయినది."

దర్శనానంతరం సా మే హృదయాన్నాపసర్పతి ।
యది సా చారు సర్వాంగీ పీనశ్రోణిపయోధరా ॥22॥

నోపగూహతి తన్వఙ్గీ తన్మాం ద్రక్ష్యతి వై మృతమ్ ।
వామః కామో మనుష్యాణాం బహుభిః ప్రాప్య చేతసః ॥23॥

మమాశక్తిశ్చ గమనే సంకులం ప్రతిభాతి మే ।
తత్తదా వచనం శ్రుత్వా భర్తుః కామాతురస్య సా ॥24॥

తత్పత్నీ వ్యాకులా జాతా మహాభాగా పతివ్రతా ।
గాఢం పరికరం బద్ధ్వా శుల్కమాదాయ చాధికమ్ ॥25॥

స్కన్ధే భర్తారమారోప్య జగామ మృదుగామినీ ।
నిశి మేఘావృతే వ్యోమ్ని చలద్విద్యుచ్చ దృశ్యతే ॥26॥

ఓ ధర్మజ్ఞురాలా ! "ఆమెను చూచినప్పటినుంచీ ఆమె నా హృదయమునుండి తొలగిపోవుట లేదు. సర్వాంగసుందరి, బలిసిన పిరుదులు స్తనములు కలిగనదీ అయిన ఆ అందగత్తె నన్ను ఆలింగనము చేసుకొననిచో నా మరణమును నీవు చూడగలవు. మనుష్యుల హృదయములందు ప్రవేశించి మన్మథుడు విరుద్ధమైన ఆలోచనలు కల్గించును. నేను స్వయముగా వెళ్ళుటకు నాకు శక్తి లేదు. ఇది నాకు విషమస్థితిగా తోచుచున్నది." కామపీడితుడైన తన భర్తయొక్క మాటలను విని పతివ్రత మరియు మహానుభావురాలగు ఆమె వ్యాకులచిత్తురాలాయెను. అయిననూ తన భర్త కోరికను తీర్చుటకు ఆమె నిశ్చయించుకొని వేశ్యకిచ్చుటకై అధిక ధనమును తీసుకొని తన భర్తను భుజముపై ఎక్కించుకొని మెల్లమెల్లగా వెళ్ళెను. ఆ అంధకారమందు ఆకాశము మేఘములచే కప్పబడియుండెను, మెరుపులు మెరియుచుండెను.

రాజమార్గే ప్రియం భర్తుశ్చికీర్షన్తీ ద్విజాంగనా ।
పథి శూలే తథా ప్రోతమచోరం చోరశంకయా ॥27॥

మాండవ్యమతిదుఃఖార్తమంధకారే చ స ద్విజః ।
పత్నీస్కంధసమారూఢశ్చాలయామాస కౌశికః ॥28॥

వామాంగేనాథ సంక్రుద్ధో మాండవ్యస్తమువాచ హ ।
యేనాహమేవమత్యర్థం దుఃఖితశ్చాలితో వృథా ॥29॥

ఇత్థం కష్టమనుప్రాప్తః స పాపాత్మా నరాధమః ।
సూర్యోదయేఽవశః ప్రాణైర్వియోక్ష్యతి న సంశయః ॥30॥

భాస్కరాలోకనాదేవ స వినాశమవాప్స్యతి ।
తస్య భార్యా తతః శ్రుత్వా తం శాపమతిదారుణమ్ ॥31॥

ప్రోవాచ వ్యథితా సూర్యో నైవోదయముపేష్యతి ।
తతః సూర్యోదయాభావాదభవత్సన్తతా నిశా ॥32॥

రాజమార్గమందు తన భర్తకు ప్రియమును చేకూర్చవలెనని ఆ ద్విజుని భార్య కోరుకొనుచుండెను. ఇట్లు బోవుచుండగా ఆ రాజమార్గమందు శూలమందు తగుల్కొనబడి మిక్కిలి దుఃఖార్తుడైయున్న మాండవ్యడను పేరుగల మహామునిని ఆ అంధకారమందు దొంగకాకపోయిననూ దొంగయని ఆ కౌశికబ్రాహ్మణుడు శంకించెను. అట్లు శంకించిన కౌశికుడు ఆ మునిని తన ఎడమచేతితో త్రోసివేసెను. అంతట మిక్కిలి కోపగించిన ఆ మహాముని ఆ కౌశికునితో "నిష్కారణముగా దుఃఖితుడనైయున్న నన్ను చలింపచేసి కష్టమును పొందింపచేసిన పాపాత్ముడగు ఆ నరాధముడు సూర్యోదయము కాగానే వశముతప్పి ప్రాణములను విడువగలడు, ఇందు సంశయము లేదు. సూర్యుని చూచినంతనే ఆ పాపాత్ముడు మరణించగలడు" అని పలికెను. అంతట ఆ కౌశికుని భార్య మిక్కిలి భయంకరమైన ఆ శాపమును విని మిక్కిలి దుఃఖించినదై "సూర్యోదయము కాకుండుగాక !" అని పలికెను. ఇట్లు ఆమె శపించుటచే సూర్యోదయము కాకుండుటచే ఎల్లవేళలా రాత్రిగానే యుండెను.

బహూన్యహః ప్రమాణాని తతో దేవా భయం యయుః ।
నిస్స్వాధ్యాయవషట్కారం స్వధాస్వాహావివర్జితమ్ ॥33॥

కథన్ను ఖల్విదం సర్వం న గచ్ఛేత్సంక్షయం జగత్ ।
అహోరాత్రవ్యవస్థాయా వినా మాసర్తుసంక్షయః ॥34॥

తత్సంక్షయాన్న త్వయనే జ్ఞాయేతే దక్షిణోత్తరే ॥35॥

రాత్రిగానే చాలారోజులు గడిచిపోవుచుండుటచే దేవతలు భయమును పొందిరి. వారిట్లు భావించిరి. "వేదాధ్యయనము సలుపకుండా, స్వాహాస్వధాకారములతో కూడుకొన్న యజ్ఞాద్యాచరణము లేకుండా ఈ ప్రపంచము వినాశము కాకుండా ఎట్లుండగలదు? అవి లేకుండా తప్పక వినాశము చెందును కదా ! రాత్రింబవళ్ళ వ్యవస్థ

లేకుండా నెలలు, ఋతువులు వీటి వ్యవస్థ నశించును. అవి నశించగా దక్షిణాయనము, ఉత్తరాయణము ఇవి తెలియబడవు.

వినా చాయనవిజ్ఞానం కాలః సంవత్సరః కుతః ।
పతివ్రతాయా వచనాన్నోద్గచ్ఛతి దివాకరః ॥36॥

అయనముల విజ్ఞానము లేకుండా అనగా సగము సంవత్సరము ఉత్తరాయణము, సగము సంవత్సరము దక్షిణాయనము అను జ్ఞానము లేకుండా సంవత్సరకాలమిది అని ఎట్లు తెలియబడును? పతివ్రత మాట కారణముగా సూర్యుడు ఉదయించుట లేదు.

సూర్యోదయం వినా నైవ స్నానదానాదికాః క్రియాః ।
అగ్నేర్విహరణం చైవ క్రత్వభావశ్చ లక్ష్యతే ॥37॥

సూర్యోదయము లేకుండా స్నానము, దానము మొదలగు క్రియలు సంభవించవు. అవి లేకపోతే అగ్నికార్యములు, యజ్ఞయాగాదులు నిర్వహింపబడవు.

న కాలేన వినా చేష్టిర్న చ యజ్ఞాదికాః క్రియాః ।
నశ్యన్తి సర్వభూతాని తమోభూతే చరాచరే ॥38॥

కాలజ్ఞానము లేకుండా ఇష్టులు, యజ్ఞయాగాదిక్రియలు సంభవించవు. ఈ చరాచర ప్రపంచమంతయు అంధకారమందు మునిగిపోగా సమస్తప్రాణులు నశించును.

నైవాప్యాయనమస్మాకం వినా హోమేన జాయతే ।
వయమాప్యాయితా మర్త్యైర్యజ్ఞభాగైర్యథోచితైః ॥39॥

హోమకార్యములు లేనిచో మనకు తృప్తి కలుగదు. యథోచితముగా మానవులచే అర్పింపబడిన యజ్ఞభాగములచే అనగా హోమద్రవ్యములనెడు హవిస్సులచే మనము సంతృప్తులము అగుచున్నాము (దేవతలు పలుకుచున్న మాటలివి).

వృష్ట్యాదినాఽనుగృహ్ణీమో మర్త్యాన్ సస్యాభివృద్ధయే ।
నిష్పాదితాస్వోషధీషు మర్త్యా యజ్ఞైర్యజన్తి నః ॥40॥

సస్యాదులను అభివృద్ధిపరచుటకై మనము వృష్ట్యాదులద్వారా మానవులను అనుగ్రహించుచున్నాము. సస్యాదిరూపమైన ఔషధులు ఉత్పన్నము కాగా మానవులు మనలను గూర్చి యజ్ఞములను చేయుచున్నారు.

ఏవం వయం ప్రయచ్ఛామః కామాన్యజ్ఞాదిపూజితాః ।
అధో హి వర్షామ వయం మర్త్యాశ్చోర్ధ్వం ప్రవర్షిణః ॥41॥

మానవులు ఆచరించిన యజ్ఞయాగాదులచే పూజింపబడిన మనము వారి కోరికలను తీర్చెదము. మనము క్రిందికి వర్షించుచుండగా వారు హవిస్సులనిచ్చుటద్వారా పైకి వర్షించుచున్నారు.

తోయవర్షేణ హి వయం హవిర్వర్షేణ మానవాః ।
యేఽస్మాకం న ప్రయచ్ఛన్తి నిత్యనైమిత్తికీః క్రియాః ॥42॥

క్రతుభాగం దురాత్మానః స్వయం వాఽశ్నన్తి లోలుపాః ।
వినాశాయ వయం తేషాం తోయసూర్యాగ్నిమారుతాః ॥43॥

క్షితిం చ సందూషయామః పాపానామపకారిణామ్ ।
దుష్టతోయాదిదోషేణ తేషాం దుష్కృతకర్మణామ్ ॥44॥

ఉపసర్గాః ప్రవర్తన్తే మరణాయ సుదారుణాః ॥

ఆ విధముగా జలమును వర్షించుటచేత మనము, హవిస్సులను వర్షించుటచేత మానవులు సంతృప్తిని చెందుచున్నారు. నిత్యనైమిత్తకమైన కర్మలను ఆచరించక ఏ దుర్మార్గులయితే మనకు క్రతుభాగములైన హవిస్సులను ఇవ్వరో లేదా లోభముతో వారే స్వయముగా భుజించెదరో అట్టి అపకారముచేయు స్వభావముగల పాపాత్ములను నశింపచేయుటకై మేము భూమి, జలము, తేజస్సు, వాయువు, సూర్యుడు (ప్రకృతమందు ఆకాశము) అను పంచమహాభూతములను కలుషితము చేయుచున్నాము. అట్టి దుష్టములైన పంచమహాభూతములచే సంబంధమును పొందినవారై నీచమైన స్వభావముగల ఆ దుష్టకర్ములు మరణమును పొందుచున్నారు.

యే త్వస్మాన్ ప్రీణయిత్వా తు భుఞ్జతే శేషమాత్మనా ॥45॥
తేషాం పుణ్యతమాన్ లోకాన్ వితరామో మహాత్మనామ్ ।

తన్నాస్తి సర్వమేతద్ధి న చోపాయవ్యవస్థితమ్ ॥46॥
కథం ను దినసఙ్గః స్యాదన్యోన్యమవదన్ సురాః ।

కాని ఎవరయితే మనలను సంతోషపెట్టి మనకు ఆహారము సమర్పించిన పిమ్మట మిగిలిన ఆహారమును తినెదరో అట్టి మహాత్ములకు స్వర్గాది పుణ్యలోకములను ప్రదానము చేయుచున్నాము. కాని ప్రస్తుతము సూర్యోదయము కాకపోవుటచే అట్లు ఏమీ జరుగుట లేదు. ఇదియంతయు మనము ఉపాయమును ఆలోచించుటచే సిద్ధించతగినది కాదు. ఎట్లు సూర్యోదయమగునో కదా !" యని దేవతలు పరస్పరము మాటలాడుకొనిరి.

తేషామేవ సమేతానాం యజ్ఞవ్యుచ్ఛిత్తిశంకినామ్ ॥47॥

దేవానాం వచనం శ్రుత్వా ప్రాహ దేవః ప్రజాపతిః ।
తేజః పరం తేజసైవ తపసా చ తపస్తథా ॥48॥

ప్రశామ్యత్యమరాస్తస్మాచ్ఛృణుధ్వం వచనం మమ ।
పతివ్రతాయా మాహాత్మ్యాన్నోద్గచ్ఛతి దివాకరః ॥49॥

తస్య చానుదయాద్ధానిర్మర్త్యానాం భవతాం యథా ।
తస్మాత్పతివ్రతామత్రేరనసూయాం తపస్వినీమ్ ॥50॥

ప్రసాదయత వై పత్నీం భానోరుదయకామ్యయా ।

యజ్ఞయాగాదికర్మలు నశించునని సందేహించుచున్న దేవతల మాటలను విని బ్రహ్మదేవుడు ఇట్లు పలికెను. తేజస్సుచేతనే తేజస్సు, తపస్సుచేతనే తపస్సు శాంతించును. ఓ దేవతలారా ! అందువలన మీరు నా మాటను వినుడు. పతివ్రతయగు కౌశికబ్రాహ్మణభార్యయొక్క గొప్పదనమువలన అనగా ఆమె మాటయొక్క ప్రభావము వలన సూర్యుడు ఉదయించుట లేదు. సూర్యుడు ఉదయించని కారణముగా మర్త్యులగు (మరణస్వభావముగల) మీకు అందరకు హాని కలుగుచున్నది. అందువలన సూర్యోదయముకొరకై మీరందరు అత్రిమహాముని భార్య, తపస్విని, మహాపతివ్రతయగు అనసూయాదేవిని ప్రార్థించి ప్రసన్నము చేసుకొనుడు.

పుత్ర ఉవాచ – కుమారుడు పలికాడు.

తైస్సా ప్రసాదితా గత్వా ప్రాహేష్టం వ్రియతామితి ॥
అయాచన్త దినం దేవా భవత్వితి యథా పురా ॥51॥

దేవతలచే ప్రసన్నురాలు గావింపబడిన ఆ అనసూయాదేవి “మీకిష్టమైన వరమును కోరుకొను”మని దేవతలతో పలికెను. “పూర్వమువలే పగలు ఉండుగాక”యని దేవతలు ఆమెను కోరుకొనిరి.

అనసూయా ఉవాచ – అనసూయాదేవి పలికెను.

పతివ్రతాయా మాహాత్మ్యం న హీయేత కథం త్వితి ॥52॥

సమ్మాన్య తాం తథా సాధ్వీం తథా ప్రేష్యామ్యహం సురాః ।
యథా పునరహోరాత్రసంస్థానముపజాయతే ॥53॥

యథా చ తస్యాః స పతిర్న శాపాన్నాశమేష్యతి ।

ఓ దేవతలారా ! పతివ్రతాప్రభావమెప్పటికినీ క్షీణించదు. సాధ్వియగు ఆ పతివ్రతను గౌరవించి పంపెదను. మరల రాత్రింబవళ్ళ వ్యవస్థ కలుగునట్లు చేసెదను. ఆమె భర్త మునిశాపము కారణముగా మరణించకుండా ఉండునట్లు చేసెదను.

పుత్ర ఉవాచ – కుమారుడు పలికాడు.

ఏవముక్త్వా సురాంస్తస్యా గత్వా సా మందిరం శుభా ॥54॥

ఉవాచ కుశలం పృష్ట్వా ధర్మం భర్తుస్తథాఽఽత్మనః ।
కచ్చిన్నందసి కల్యాణి స్వభర్తుః సుఖదాయినీ ॥55॥

ఈ విధముగా దేవతలతో పలికి మంగళస్వరూపురాలగు అనసూయాదేవి ఆ పతివ్రత (కౌశికుని భార్య) ఇంటికి వెళ్ళెను. ఆమెయొక్క మరియు ఆమె భర్తయొక్క ధర్మకార్యములనుగూర్చి, వారి కుశలమును గూర్చి అడిగెను. ఓ కల్యాణీ! భర్తకు సుఖమునిచ్చు నీవు సుఖముగానే ఉన్నావు కదా !

కచ్చిచ్చాఖిలదేవేభ్యో మన్యసే హ్యధికం పతిమ్ ।
భర్తుః శుశ్రూషణాదేవ మయా ప్రాప్తం మహత్ఫలమ్ ॥56॥

దేవతలకంటే కూడా నీ భర్తనే అధికముగా భావించుచున్నావు కదా ! ఎందువలననగా నా భర్తయగు అత్రి మహర్షికి సేవ చేసినందువల్లనే నాకు గొప్ప ఫలము లభించినది.

సర్వకామఫలావాప్తిః పత్యుః శుశ్రూషణాత్ స్త్రియాః ।
పఞ్చర్ణాని మనుష్యేణ సాధ్వి ! దేయాని సర్వదా ॥57॥

స్త్రీలకు తమ భర్తలను సేవించినందువల్లనే సమస్తకోరికలు వాటి ఫలములు సిద్ధించును. ఓ సాధ్వీ ! మానవుడు తాను చేసిన అయిదు ఋణములను తప్పక తీర్చవలసిందే ! (ఋషులు, అగ్న్యాది దేవతలు, పితృదేవతలు, విప్రులు, అతిథులు వీరికి సంబంధించిన ఋణములే అయిదు ఋణములు.)

తథాఽఽత్మవర్ణధర్మేణ కర్తవ్యో ధనసఞ్చయః ।
ప్రాప్తశ్చార్థస్తథా పాత్రే వినియోజ్యో విధానతః ॥58॥

తన జాతికి సంబంధించిన ధర్మమునసరించి మానవుడు ధనమును కూడబెట్టవలెను. అట్లు లభించిన ధనమును యోగ్యుడైన వానియందు వినియోగము చేయవలెను.

సత్యార్జవతపోదానదయాయుక్తో భవేత్సదా ।
క్రియా చ శాస్త్రనిర్దిష్టా రాగద్వేషవివర్జితా ॥59॥

కర్తవ్యాఽహరహః శ్రద్ధాపురస్కారేణ స్వశక్తితః ।
స్వజాతివిహితానేవం లోకాన్ ప్రాప్నోతి మానవః ॥60॥

క్లేశేన మహతా సాధ్వి ప్రాజాపత్యాదికాన్ క్రమామ్ ।

నిజము పలుకుట, సత్క్రమప్రవర్తన, తపస్సు, దానము, దయలతో మానవుడెల్లప్పుడు కూడుకొని యుండవలెను. రాగద్వేషములను విడిచిపెట్టి శాస్త్రోక్తకర్మలను తన శక్తిననుసరించి శ్రద్ధతో చేయవలెను. ఓ సాధ్వీ! అట్లు ఆచరించువాడు తన జాతికి విధింపబడిన ప్రాజాపత్యాదిలోకములను క్రమముగా మిక్కిలి కష్టముతో పొందుచున్నాడు.

స్త్రియశ్చైవం సమస్తస్య నరైర్దుఃఖార్జితస్య వై ॥61॥

పుణ్యస్యార్ధాపహారిణ్యః పతిశుశ్రూషయైవ హి ।
నాస్తి స్త్రీణాం పృథగ్యజ్ఞో న శ్రాద్ధం నాప్యుపోషితమ్ ॥62॥

భర్తుః శుశ్రూషయైవైతాన్ లోకానిష్టాన్ జయన్తి హి ।
తస్మాత్సాధ్వి మహాభాగే పతిశుశ్రూషణం ప్రతి ॥
త్వయా మతిః సదా కార్యా యతో భర్తా పరా గతిః ॥63॥

స్త్రీలు తమ భర్తలు ఎంతో కష్టపడి సంపాదించిన పుణ్యమందలి సగభాగమును కేవలము పతిసేవలవల్లనే గ్రహించుచున్నారు. స్త్రీలకు ప్రత్యేకముగా యజ్ఞములుగాని, శ్రాద్ధములుగాని, ఉపవాసములుగాని విధింపబడలేదు. స్త్రీలు కేవలము తమ భర్తలకు చేయు సేవలవల్లనే తమకిష్టమైన లోకములను పొందుచున్నారు. అందువల్ల ఓ సాధ్వీ! ఓ మహాభాగురాలా ! నీవు ఎల్లప్పుడు భర్తృసేవయందే మనస్సును లగ్నము చేయవలెను. స్త్రీలకు పతియే ప్రత్యక్షదైవము మరియు పరమగతి. అనగా అతడికి మించి దైవము లేదు.

యద్దేవేభ్యో యచ్చ పిత్రాదికేభ్యః కుర్యాద్భర్తాఽభ్యర్చనం సత్క్రియాం చ ।
తస్యార్ధం వై కేవలానన్యచిత్తా నారీ భుఙ్క్తే భర్తృశుశ్రూషయైవ ॥64॥

దేవతలకు, పిత్రాదిదేవతలకు తన భర్త ఆచరించిన పూజలు, సత్కారములు ఏవి గలవో వాటివల్ల లభించిన పుణ్యములో నిశ్చయముగా సగభాగమును మరొకరియందు లగ్నముకాని మనస్సుగల స్త్రీ కేవలము తన భర్తకు చేసిన శుశ్రూషవల్లనే అనుభవించుచున్నది.

పుత్ర ఉవాచ – కుమారుడు పలికాడు.

తస్యాస్తద్వచనం శ్రుత్వా ప్రతిపూజ్య తదాదరాత్ ।
ప్రత్యువాచాత్రిపత్నీం తామనసూయామిదం వచః ॥65॥

అత్రిమహర్షిభార్యయగు అనసూయాదేవి పలికినమాటలను విని ఆమెయందలి ఆదరముతో ఆమెను పూజించి పతివ్రత అయిన కౌశికుని భార్య ఇట్లు బదులు పలికెను.

ధన్యాఽస్మ్యనుగృహీతాఽస్మి దైవస్యాప్యవలోకతః ।
యన్మే ప్రకృతికల్యాణి శ్రద్ధాం వర్ధయసే పునః ॥66॥

ఓ స్వభావసిద్ధమైన మంగళదాయిని ! నేను ధన్యురాలను అయితిని. దేవతలు గూడా నాయందు అనుగ్రహదృష్టిని ప్రసరింపచేయుటచే నేను అనుగ్రహింపబడితిని. తిరిగి నా పతివ్రతాధర్మమందు శ్రద్ధను వృద్ధిపరచుచున్నావు.

జానామ్యేతన్న నారీణాం కచ్చిత్పతిసమాగతిః ।
తత్ప్రీతిశ్చోపకారాయ ఇహ లోకే పరత్ర చ ॥67॥

భర్తను సేవించుట కంటే వేరైన ధర్మమేదీ స్త్రీలకు లేదని నేను ఎరుగుదును. భర్తకు సంతోషమును కల్గింపచేయుటే ఇహలోకమందు పరలోకమందు ఉపకారమును కల్గించును.

పతిప్రసాదాదిహ చ ప్రేత్య చైవ యశస్వినీ ।
నారీ సుఖమవాప్నోతి నార్యా భర్తా హి దైవతమ్ ॥68॥

యశస్సుగల్గిన స్త్రీ భర్తయొక్క అనుగ్రహముచేతనే ఈ లోకమందును పరలోకమందును సుఖమును పొందుచున్నది. స్త్రీకి భర్తయే దైవము కదా !

సా త్వం బ్రూహి మహాభాగే ప్రాప్తాయా మమ మందిరమ్ ।
ఆర్యాయాః కిం ను కర్తవ్యం మయాஉஉర్యేణాపి వా శుభే ॥69॥

ఓ మహానుభావురాలా ! ఓ శుభస్వరూపురాలా ! నా మందిరమునకు నీవు వచ్చిన కారణమేమో చెప్పుము. పూజ్యురాలవగు నీకు నేను గాని నా భర్తగాని చేయదగిన పని ఏమైనా యున్నయెడల చెప్పుము, నెరవేర్చెదము.

అనసూయా ఉవాచ:– అనసూయాదేవి పలికెను.

ఏతే దేవాః సహేంద్రేణ మాముపాగమ్య దుఃఖితాః ।
త్వద్వాక్యాపాస్తసత్కర్మదిననక్తనిరూపణాః ॥70॥

నీ వాక్యముననుసరించి లోకమందు సత్కర్మలు, రాత్రింబవళ్ళ వ్యవస్థ నశించినది. అందువలన మిక్కిలి దుఃఖించినవారై ఈ దేవతలందరు దేవేంద్రునితో సహా నా వద్దకు వచ్చి దుఃఖించిరి.

యాచన్తేஉహర్నిశాసంస్థాం యథావదవిఖండితామ్ ।
అహం తదర్థమాయాతా శృణు చైతద్వచో మమ ॥71॥

వీరందరు యథాప్రకారముగా విచ్ఛిన్నము కాని రాత్రింబవళ్ళ వ్యవస్థను కోరుకొనుచున్నారు. నేను అందుకొరకే వచ్చితిని. ఈ నా మాటలను వినుము.

దినాభావాత్సమస్తానామభావో యాగకర్మణామ్ ।
తదభావాత్సురాః పుష్టిం నోపయాన్తి తపస్విని ॥72॥

ఓ తపస్వినీ ! పగలు కనిపించని కారణముగా యాగకర్మలన్నియు నిలిచిపోయినవి. యాగకర్మలు లేనందున హవిస్సులు లభించక దేవతలు పుష్టిని పొందుట లేదు.

అహ్నశ్చైవ సముచ్ఛేదాదుచ్ఛేదః సర్వకర్మణామ్ ।
తదుచ్ఛేదాదనావృష్ట్యా జగదుచ్ఛేదమేష్యతి ॥73॥

పగలు నశించినచో సమస్తకర్మలు నశించును. అవి నశించినచో వర్షములు పడనందున ప్రపంచమంతయు నాశము పొందగలదు.

తత్త్వమిచ్ఛసి ధైర్యేణ జగదుద్ధర్తుమాపదః ।
ప్రసీద సాధ్వి లోకానాం పూర్వవద్వర్తతాం రవిః ॥74॥

ఈ ఆపదనుండి ప్రపంచమును ఉద్ధరించుటకు నీవు కోరుకొన్న యెడల ఓ సాధ్వీ! ఈ లోకములననుగ్రహించుము. సూర్యుడు పూర్వము వలే ఉదయించుగాక !

బ్రాహ్మణ్యువాచ – బ్రాహ్మణస్త్రీ పలికెను.

మాండవ్యేన మహాభాగే ! శప్తో భర్తా మమేశ్వరః ।
సూర్యోదయే వినాశం త్వం ప్రాప్స్యసీత్యతిమన్యునా ॥75॥

ఓ మహానుభావురాలా ! మిక్కిలి కోపము వహించిన మాండవ్యమునిచేత నా భర్త "నీవు సూర్యోదయమయిన వెంటనే మరణించెదవు" అని శపింపబడెను.

అనసూయ ఉవాచ – అనసూయాదేవి పలికెను.

యది తే రోచతే భద్రే తతస్త్వద్వచనాదహమ్ ।
కరోమి పూర్వవద్దేహం భర్తారం వచనాత్తవ ॥76॥

మయాఽపి సర్వథా స్త్రీణాం మాహాత్మ్యం వరవర్ణిని ।
పతివ్రతానామారాధ్యమితి సమ్మానయామి తే ॥77॥

ఓ మంగళస్వరూపురాలా ! నీ కిష్టమయినయెడల నీ మాటప్రకారము సూర్యోదయము కానిమ్ము. నీ భర్త శరీరమును పూర్వమువలే ఉండునట్లు చేసెదను. ఓ శ్రేష్ఠురాలా ! స్త్రీల గొప్పదనమును నేను అన్నివిధముల ఎరుగుదును. పతివ్రతలు ఆరాధింపతగినవారు గావున నిన్ను గౌరవించుచున్నాను.

పుత్ర ఉవాచ – కుమారుడు పలికాడు.

తథేత్యుక్తే తథా సూర్యమాజుహావ తపస్వినీ ।
అనసూయాఽర్ఘ్యముద్యమ్య దశార్ధరాత్రే తదా నిశి ॥78॥

బ్రాహ్మణస్త్రీ నీవు చెప్పినట్లే చేయుమని అనసూయాదేవితో పలికెను. అంతట తపస్సంపన్నురాలగు అనసూయాదేవి పదవరాత్రియందలి అర్ధరాత్రిసమయమందు అర్ఘ్యమును తీసుకొని సూర్యభగవానుని ఆహ్వానించెను.

తతో వివస్వాన్ భగవాన్ ఫుల్లపద్మారుణాకృతిః ।
శైలాధిరాజముదయమారురోహోరుమండలః ॥79॥

అంతట సూర్యభగవానుడు వికసించిన పద్మమువంటి ఎర్రని రంగు కలిగినవాడై ఉదయాచలమును గొప్ప సూర్యమండలముతో అధిరోహించెను.

సమనన్తరమేవాస్యా భర్తా ప్రాణైర్వ్యయుజ్యత ।
పపాత చ మహీపృష్ఠే పతన్తం జగృహే చ సా ॥80॥

ఆ వెంటనే ఆ పతివ్రతాస్త్రీయొక్క భర్త ప్రాణములను విడిచెను. భూభాగమందు పడిపోవుచున్న తన భర్తను ఆమె పట్టుకొనెను.

అనసూయా ఉవాచ – అనసూయాదేవి పలికెను.

న విషాదస్త్వయా భద్రే కర్తవ్యః పశ్య మే బలమ్ ।
పతిశుశ్రూషయాఽవాప్తం తపసః కిం చిరేణ మే ॥81॥

ఓ మంగళస్వరూపురాలా ! విచారించవద్దు. పతిసేవవలన నేను సంపాదించిన బలమెంతటిదో చూడుము. పతిసేవకు మించిన తపస్సు ఎక్కడిది?

తథా భర్తృసమం నాన్యమపశ్యం పురుషం క్వచిత్ ।
రూపతః శీలతో బుద్ధ్యా వాఙ్మాధుర్యాదిభూషణైః ॥82॥

తేన సత్యేన విప్రోఽయం వ్యాధిముక్తః పునర్యువా ।
ప్రాప్నోఽనుజీవితం భార్యాసహాయః శరదాం శతమ్ ॥83॥

యథా భర్తృసమం నాన్యమహం పశ్యామి దైవతమ్ ।
తేన సత్యేన విప్రోఽయం పునర్జీవత్వనామయః ॥84॥

కర్మణా మనసా వాచా భర్తురారాధనం ప్రతి ।
యథా మమోద్యమో నిత్యం తథాఽయం జీవతాద్ద్విజః ॥85॥

రూపము, శీలము, బుద్ధి, వాక్కు, మాధుర్యము మొదలగు అలంకారములతో నా భర్తతో సమానమైన పురుషునెవ్వరినీ నేను చూడలేదు. ఇట్లు నిశ్చయముగా నేను నమ్మినది నిజమే అయితే ఈ బ్రాహ్మణుడు వ్యాధినుండి ముక్తుడై మరల యువకుడై భార్యాసహాయుడై నూరుసంవత్సరములు జీవించుగాక! నా భర్తతో సమానముగా వేరే ఏ ఇతరపురుషుని దైవముగా నేను నమ్మని మాట నిజమే అయినచో ఈ బ్రాహ్మణుడు ఏ రోగములూ లేక మరల జీవించుగాక ! మనోవాక్కాయకర్మలచే నేను నా భర్తను ఆరాధించుట యను ఉద్యమము ఎల్లప్పుడూ కల్గినదానిని అయినచో ఈ బ్రాహ్మణుడు మరల జీవించుగాక !

పుత్ర ఉవాచ – కుమారుడు పలికాడు.

తతో విప్రః సముత్తస్థౌ వ్యాధిముక్తః పునర్యువా ।
స్వాభాభిర్భాసయన్వేశ్మ వృందారక ఇవాజరః ॥86॥

అంతట ఆ కౌశికబ్రాహ్మణుడు వ్యాధినుండి ముక్తుడై మరల యవ్వనమును పొంది జరామరణములు లేని దేవతవలే తన దివ్యదేహకాంతులతో గృహమును ప్రకాశింపచేయుచూ లేచి నిలబడెను.

తతోఽపతత్ పుష్పవృష్టిర్దేవవాద్యాని సస్వనుః ।
లేభిరే చ ముదం దేవా అనసూయామథాబ్రువన్ ॥87॥

అంతట అచ్చట పుష్పవర్షము కురిసెను. దేవవాద్యములు మ్రోగినవి. దేవతలు సంతోషమును పొందిరి. అటుపిమ్మట వారు అనసూయాదేవితో ఇట్లు పలికిరి.

వరం వృణీష్వ కల్యాణి దేవకార్యం మహత్ కృతమ్ ।
ఆదిత్యోదయసద్భావాద్వరం వరయ సువ్రతే ॥88॥

త్వయా యస్మాత్తతో దేవా వరదాస్తే తపస్విని ।

ఓ మంగళస్వరూపురాలా ! నీవు దేవతలకొరకు గొప్ప కార్యమును నెరవేర్చితివి. కావున వరము కోరుకొనుము. ఓ గొప్ప వ్రతమును ఆచరించుదానా ! సూర్యోదయమును కలిగింపచేసిన కారణముగా వరమును కోరుకొనుము. ఓ తపమును ఆచరించుదానా ! నీవు దేవకార్యమును సిద్ధింపచేసినందుకు దేవతలు నీకు వరమునివ్వవలెనని భావించుచున్నారు. కావున వరమును కోరుకొనుము.

అనసూయా ఉవాచ – అనసూయాదేవి పలికాడు.

యది దేవాః ప్రసన్నా మే పితామహపురోగమాః ॥89॥

వరదా వరయోగ్యా చ యద్యహం భవతాం మతా ।
తద్యాన్తు మమ పుత్రత్వం బ్రహ్మవిష్ణుమహేశ్వరాః ॥90॥

యోగం చ ప్రాప్నుయాం భర్తృసహితా క్లేశముక్తయే ।

బ్రహ్మతో కూడుకొన్న మీరందరు దేవతలు నా పట్ల ప్రసన్నులైనచో, నేను వరములనిచ్చుదాననని, వరములు పొందుటకు యోగ్యురాలనని మీకు సమ్మతమైనచో బ్రహ్మవిష్ణుమహేశ్వరులు నాకు పుత్రులుగా అగుగాక! దుఃఖములను పోగొట్టుకొనుటకు భర్తృసహితురాలైన నేను యోగసిద్ధిని పొందునుగాక !

పుత్ర ఉవాచ – కుమారుడు పలికాడు.

ఏవమస్త్వితి దేవాస్తాం బ్రహ్మవిష్ణుశివాదయః ॥91॥

ఉక్త్వా జగ్ముర్యథాన్యాయమనుమాన్య తపస్వినీమ్ ।
తతః కాలే బహుతిథే ద్వితీయో బ్రహ్మణః సుతః ॥92॥

స్వభార్యాం భగవానత్రిరనసూయామపశ్యత ।
ఋతుస్నాతాం సువర్చాఙ్గీం లోభనీయతమాకృతిమ్ ॥93॥

బ్రహ్మవిష్ణుశివాది దేవతలు అట్లేయని పలికి (అనసూయాదేవి అడిగిన వరములనొసంగి) ఆ తపస్వినిని యథోచితముగా సత్కరించి వెడలిపోయిరి. పిమ్మట చాలారోజులు గడచిన తరువాత బ్రహ్మదేవుని రెండవ కుమారుడగు అత్రిభగవానుడు ఋతుస్నాత, అందమైన అవయవములు గలది, వశపరచుకొను ఆకారముగలదీయగు తన భార్య అయిన అనసూయాదేవిని చూచెను.

సకామో మనసా భేజే స మునిస్తామనిన్దితామ్ ।
తస్యాభిపశ్యతస్తాం తు వికారో యోఽభ్యజాయత ॥94॥

తమపోవాహ పవనస్తిర్యగూర్ధ్వం చ వేగవాన్ ।
బ్రహ్మరూపం చ శుక్లాభం పతమానం సమన్తతః ॥95॥

సోమరూపం రజోరూపం దిశస్తం జగృహుర్దశ ।
స సోమో మానసో జజ్ఞే తస్యామత్రేః ప్రజాపతేః ॥96॥

కామముతో కూడుకొన్న ఆ అత్రిమహాముని ఏ దోషమూలేని తన భార్యను మనస్సుతో కోరుకొనెను. ఆమెను అట్లు చూచుచున్న ఆ మునికి వికారము కలిగెను అనగా వీర్యస్ఖలనము జరిగెను. మిక్కిలి వేగము కలిగిన వాయుదేవుడు బ్రహ్మరూపము, తెల్లని కాంతి కలిగినదీ అయిన ఆ వీర్యమును పైకీ, క్రిందకీ, అన్నివైపులా పడువిధముగా మోసుకొనిపోయెను. అట్లు అన్నివైపులా పడుచున్న సోమరూపమూ, రజోరూపమూ అయిన ఆ వీర్యమును ఆకాశమందలి పది దిక్కులు గ్రహించగా ఆ అత్రిమహర్షివలన అనసూయాదేవియందు మానసపుత్రుడగు చంద్రుడు ఉద్భవించెను. ఈ పుట్టుకయే బ్రహ్మాంశము, రజోగుణసంపన్నము.

పుత్రః సమస్తతత్త్వానామాయురాధార ఏవ చ ।
తుష్టేన విష్ణునా జజ్ఞే దత్తాత్రేయో మహాత్మనా ॥97॥

స్వశరీరాత్సముత్పన్నః సత్త్వోద్రిక్తో ద్విజోత్తమః ।
దత్తాత్రేయ ఇతి ఖ్యాతః సోఽనసూయాస్తనం పపౌ ॥98॥

విష్ణురేవావతీర్ణోఽసౌ ద్వితీయోఽత్రేః సుతోఽభవత్ ।

సమస్తతత్త్వములకు ఆయుర్దాయకారకుడు, ఆధారమూ అగు దత్తాత్రేయుడను పుత్రుడు మహాత్ముడూ, సంతుష్టుడూ అగు విష్ణువువల్ల జన్మించెను. తన శరీరమునుండే పుట్టినవాడూ, సత్త్వగుణముయొక్క ఉత్కర్ష కలిగినవాడు, బ్రాహ్మణశ్రేష్ఠుడూ అగు ఆ కుమారుడు దత్తాత్రేయుడని ప్రసిద్ధిని పొంది అనసూయాదేవి స్తన్యమును పానము జేసెను. సాక్షాత్తు విష్ణుమూర్తియే దత్తాత్రేయుడుగా అవతరించినాడు. ఇతడు అనసూయాదేవికి రెండవ కుమారుడాయెను. ఈ పుట్టుకయే విష్ణ్వంశము, సత్త్వగుణసంపన్నము.

సప్తాహాత్ప్రచ్యుతో మాతురుదరాత్ కుపితో యతః ॥99॥

హైహయేంద్రముపావృత్తమపరాధ్యన్తముద్ధతమ్ ।
దృష్ట్వాఽత్రౌ కుపితః సద్యో దగ్ధుకామః స హైహయమ్ ॥100॥

గర్భవాసమహాయాసదుఃఖామర్షసమన్వితః ।
దుర్వాసాస్తమసా యుక్తో రుద్రాంశః సోఽభ్యజాయత ॥101॥

హైహయదేశాధిపతి అత్రిమహామునిపట్ల అపరాధములను చేయుచు, ఉద్ధతస్వభావము కలిగి విరుద్ధప్రవర్తన కల్గియున్నాడు. అట్టి హైహయాధిపతిని దహింపచేయవలెనని కోరికతో కుపితుడైన రుద్రుడు తన తల్లియగు అనసూయాదేవి గర్భమునుండి ఏడు రోజులలోనే దుర్వాసునిగా జన్మించెను. ఇతడు సహింపశక్యముగాని గర్భవాసమనెడు గొప్ప ఆయాసరూపమైన దుఃఖముతో కూడుకొన్నవాడై తమోగుణముయొక్క ఉత్కర్షతో రుద్రాంశరూపముగా జన్మించెను. ఈ పుట్టుకయే రుద్రాంశము, తమోగుణసంపన్నము.

ఇతి పుత్రత్రయం తస్యా జజ్ఞే బ్రహ్మేశవైష్ణవమ్ ।
సోమో బ్రహ్మాఽభవద్విష్ణుర్దత్తాత్రేయోఽభ్యజాయత ॥102॥

దుర్వాసాః శఙ్కరో జజ్ఞే వరదానాద్దివౌకసామ్ ।

ఈ విధముగా బ్రహ్మవిష్ణుశంకరులు ముగ్గురు కుమారులుగా అనసూయాదేవికి జన్మించిరి. దేవతలు అనసూయాదేవికిచ్చిన వరము కారణముగా బ్రహ్మ చంద్రునిగాను, విష్ణువు దత్తాత్రేయునిగానూ, శంకరుడు దుర్వాసునిగానూ జన్మించిరి.

సోమః స్వరశ్మిభిః శీతైర్వీరుదౌషధిమానవాన్ ॥103॥

ఆప్యాయయన్ సదా స్వర్గే వర్తతే స ప్రజాపతిః ।
దత్తాత్రేయః ప్రజాః పాతి దుష్టదైత్యనిబర్హణాత్ ॥104॥

శిష్టానుగ్రహకృద్యోగీ జ్ఞేయశ్చాంశః స వైష్ణవః ।
నిర్దహత్యవమన్తారం దుర్వాసా భగవానజః ॥105॥

రౌద్రభావం సమాశ్రిత్య దృఙ్మనోవాగ్భిరుద్ధతః ।

ప్రజాపతియగు చంద్రుడు, తన చల్లని కిరణములచే లతలకు, ఔషధులకు, మానవులకు సాంత్వనము చేకూర్చుతూ ఎల్లప్పుడూ స్వర్గమందు ఉండును. దుష్టులగు రాక్షసులను చంపుటద్వారా దత్తాత్రేయుడు ప్రజలను రక్షించును. శిష్టులపై అనుగ్రహము చూపు దత్తాత్రేయుడు విష్ణువుయొక్క అంశగా తెలియవలెను. పుట్టుకలేనివాడూ, పూజ్యుడూ అగు దుర్వాసుడు తనను అవమానపరచినవానిని దహించివేయును. ఇతడు చూపులు, మనస్సు వాక్కులు వీటితో రౌద్రభావమును పొంది ఉద్ధతుడైయుండును.

సోమత్వం భగవానత్రిః పునశ్చక్రే ప్రజాపతిః ॥106॥

దత్తాత్రేయోఽపి విషయాన్ యోగస్థో దదృశే హరిః ।
దుర్వాసాః పితరం త్యక్త్వా మాతరం చోత్తమం వ్రతమ్ ॥107॥

ఉన్మత్తాఖ్యం సమాశ్రిత్య పరిబభ్రామ మేదినీమ్ ।

ప్రజాపతి, పూజ్యుడూ అగు అత్రిమహాముని సోముని మరల ఉద్భవింపచేసెను. (అట్లు ఉద్భవింపచేసినందువలన చంద్రుడు ద్విగుణీకృతుడాయెనని భావించవలెను). సాక్షాత్ నారాయణస్వరూపుడగు దత్తాత్రేయుడు యోగమందు నిలచి కాలత్రయమందలి విషయములను చూచెను. దుర్వాసుడు తల్లిదండ్రులను వదిలి ఉన్మత్తమను గొప్ప వ్రతమును (బయటకు తన స్వభావమును ప్రకటింపచేయక చేయు వ్రతము) ఆశ్రయించి భూలోకమంతా సంచరించెను.

మునిపుత్రవృతో యోగీ దత్తాత్రేయోఽప్యసఙ్గితామ్ ॥108॥

అభీప్సమానః సరసి నిమమజ్జ చిరం విభుః ।
తథాపి తం మహాత్మానమతీవ ప్రియదర్శనమ్ ॥109॥

తత్యజుర్న కుమారాస్తే సరసస్తీర్థసంశ్రయాః ।
దివ్యే వర్షశతే పూర్ణే యదా తే న త్యజన్తి తమ్ ॥110॥

తత్ప్రీత్యా సరసస్తీరం సర్వే మునికుమారకాః ।
తతో దివ్యాంబరధరాం సురూపాం సునితంబినీమ్ ॥111॥

నారీమాదాయ కల్యాణీముత్తతార జలాన్మునిః ।
స్త్రీసన్నికర్షిణం హ్యేతే పరిత్యక్ష్యన్తి మామితి ॥112॥

మునిపుత్రాస్తతో యోగే స్థాస్యామీతి విచిన్తయన్ ।

మునికుమారులతో చుట్టబడిన మహాయోగీ సర్వవ్యాపకుడూ అగు దత్తాత్రేయుడు కూడా లౌకికప్రపంచముతో అసంగమును (సంబంధము లేకుండుటను) కోరుకొనుచున్నవాడై చాలాకాలము సరస్సునందు మునిగియుండెను. అయిననూ ఆ మునికుమారులు ఆ సరస్సు తీర్థమందే నిలచినవారై మిక్కిలి ప్రియదర్శనముగల ఆ మహాత్ముని విడిచిపెట్టలేదు. ఆ మహాయోగియందలి ప్రీతితో ఆ మునిపుత్రులందరూ నూరు దివ్యసంవత్సరములు గడచిననూ ఆ సరస్సు తీరమును విడిచిపెట్టలేదు. అంతట అందమైన కటిప్రదేశముకలిగినదీ, సౌందర్యవతీ, దివ్యమైన వస్త్రములను ధరించినదీయగు ఒక మంగళస్వరూపిణియగు స్త్రీని గ్రహించి ఆ దత్తాత్రేయముని సరస్సునుండి పైకి లేచెను. "స్త్రీసంబంధము కల్గిన నన్ను ఈ మునికుమారులు తప్పక విడిచిపెట్టెదరు, అప్పుడు నేను మరల యోగమందు నిలచెదను" అని ఆ మహాముని తలపోసెను.

తథాపి తే మునిసుతా న త్యజన్తి యదా మునిమ్ ॥113॥

తతస్సహ తయా నార్యా మద్యపానమథాకరోత్ ।
సురాపానరతం తేన సభార్యం తత్యజుస్తతః ॥114॥

గీతవాద్యాదివనితాభోగసంసర్గదూషితమ్ ।
మన్యమానా మహాత్మానం తయా సహ బహిష్క్రియమ్ ॥115॥

నావాప దోషం యోగీశో వారుణీం స పిబన్నపి ।
అంతావసాయివేశ్మాంతర్మాతరిశ్వా స్పృశన్నివ ॥116॥

సురాం పిబన్ సపత్నీకస్తపస్తేపే స యోగవిత్ ।
యోగీశ్వరశ్చింత్యమానో యోగిభిర్ముక్తికాంక్షిభిః ॥117॥

అయిననూ ఆ మునికుమారులు దత్తాత్రేయమహామునిని ఎప్పుడైతే విడువలేదో అప్పుడు దత్తాత్రేయుడు ఆ స్త్రీతో కలిసి మద్యమును సేవించెను. సురాపానమందు ఆసక్తుడైనవాడూ, భార్యతో కూడినవాడూ అయిన ఆ

దత్తాత్రేయమహామునిని మునికుమారులు విడిచిపెట్టిరి. అంతట గీతవాద్యాదులు, స్త్రీ సంభోగము వీటితో సంబంధము కల్గినట్టివానిగానూ, స్పర్శనాదిబాహ్యవ్యాపారములు కల్గినట్టివానిగానూ కనిపించుటచేత ఆ దత్తాత్రేయుని దోషములు కల్గినవానిగా అజ్ఞానముతో ఆ మునికుమారులు భావించిరి. కాని వాస్తవముగా యోగీశ్వరుడైన దత్తాత్రేయుడు మద్యమును త్రాగుచున్నప్పటికీ ఎట్టి దోషమును పొందలేదు. చండాలగృహములందు సంచరించుచున్న వాయుదేవుడు వారితో స్పర్శ కలిగినప్పటికీ ఎట్లు దోషభూయిష్ఠుడుకాడో అట్లే దత్తాత్రేయుడు కూడా ఎట్టి దోషములను పొందలేదు. భార్యతో కూడి మద్యమును సేవించుచూ ఆ యోగవేత్త తపస్సును ఆచరించెను. మోక్షమును కోరుకొనుచున్న యోగులు ఆతనిని యోగీశ్వరుడని తలపోసిరి.

పుత్ర ఉవాచ – కుమారుడు పలికాడు.

కస్యచిత్త్వథ కాలస్య కార్తవీర్యోఽర్జునో బలీ ।
కృతవీర్యే దివం యాతే మంత్రిభిస్సపురోహితైః ॥118॥

పౌరైశ్చాత్మాభిషేకార్థం సమాహూతోఽబ్రవీదిదమ్ ।
నాహం రాజ్యం కరిష్యామి మంత్రిణో నరకోత్తరమ్ ॥119॥

యదర్థం గృహ్యతే శుల్కం తదనిష్పాదయన్ వృథా ।
పణ్యానాం ద్వాదశం భాగం భూపాలాయ వణిగ్జనః ॥120॥

దత్త్వాఽత్మరక్షిభిర్మార్గే రక్షితో యాతి దస్యుతః ।
గోపాశ్చ ఘృతతక్రాదేః షడ్భాగం చ కృషీవలాః ॥121॥

దత్త్వాన్యద్భూభుజేర్దద్యుర్యది భాగం తతోఽధికమ్ ।
పణ్యాదీనామశేషాణాం వణిజః గృహ్ణతస్తతః ॥122॥

అగ్నిహోత్రం తపస్సత్యం వేదానాం చైవ సాధనమ్ ।
ఆతిథ్యం వైశ్వదేవం చ ఇష్టమిత్యభిధీయతే ॥123॥

వాపీకూపతడాగాని దేవతాయతనాని చ ।
అన్నప్రదానమర్థిభ్యః పూర్తమిత్యభిధీయతే ॥124॥

ఇష్టాపూర్తవినాశాయ తద్రాజ్ఞశ్చౌరకర్మిణః ।

కొంతకాలమునకు బలవంతుడగు కార్తవీర్యార్జునుడు తన తండ్రియగు కృతవీర్యుడు స్వర్గస్థుడు కాగా తన పట్టాభిషేకము కొరకు మంత్రులు పురోహితులు, పురజనుల చేత ఆహ్వానింపబడెను. అట్లు ఆహ్వానింపబడిన కార్తవీర్యార్జునుడు ఇట్లు పలికెను. ఓ మంత్రులారా ! నరకమునకు దారితీయు రాజ్యమును నేను పరిపాలించను. నేనెందుకొరకయితే పన్నులను ప్రజలనుండి గ్రహించుచున్నానో ఆ ప్రయోజనమును నేను నెరవేర్చకపోతే రాజ్యపాలనము చేయుట వ్యర్థము. వ్యాపారములు చేయువారు వారు అమ్మినవస్తువులకు సంబంధించి లభించిన

మొత్తములో పన్నెండవభాగమును రాజుకు సమర్పించినందువలన రక్షకభటులు వారిని మార్గమందు దుర్మార్గులనుండి రక్షించుచున్నారు. (తాను పన్నులను గ్రహించిననూ తాను స్వయముగా రక్షణకార్యమును వహించుట లేదని రాజు అభిప్రాయము కావచ్చును.) గోపాలకులు తాము అమ్మిన నెయ్యి, మజ్జిగ మొదలగు పదార్థములు, రైతులు తాము పండించిన సస్యాదులు వీటియందు ఆరవ భాగమును, తమ భూమిని రక్షించినందువలన మరికొంత భాగమును పన్నులుగా సమర్పించుచున్నారు. ("భూభుజి" శబ్దమునకు భూమిని రక్షించుట అను అర్థము స్వీకరింపబడినది. పాలనార్థకమైన "భుజ" ధాతువుయొక్క నిర్దేశమిది.) ఈ విధముగా ఆయా వ్యాపారవేత్తలనుండి ఆయా అమ్ముకునే సమస్తవస్తువులను గ్రహించి కూడా తాను చేయవలసిన పనిని నెరవేర్చకపోతే ఆ రాజు చోరకర్మ (దొంగతనము చేయుట) కల్గినవాడే అగును. అట్టి పాపకర్మ కారణముగా అతడి ఇష్టాపూర్తములు అనగా తన పూర్వపుణ్యములు నశించును. ఇష్టాపూర్తములేవో వివరింపబడుచున్నవి. అగ్నిహోత్రము, తపస్సు, సత్యము, వేదాధ్యయనముచేయుట, ఆతిథ్యమిచ్చుట, వైశ్వదేవము (భోజనముపెట్టుట) వీటికి ఇష్టమని పేరు. దిగుడుబావులు, నూతులు, చెరువులు, దేవాలయములను నిర్మించుట, అవసరమయినవారికి భోజనము పెట్టుట వీటికి పూర్తమని పేరు.

యదన్యైః పాల్యతే లోకస్తద్వృత్త్యన్తరసంశ్రితః ॥125॥

గృహ్ణతో బలిషడ్భాగం నృపతేర్నరకో ధ్రువమ్ ।
నిరూపితమిదం రాజ్ఞః పూర్వై రక్షణవేతనమ్ ॥126॥

అరక్షంశ్చోరతశ్చోరస్తద్ధనం నృపతేర్భవేత్ ।
తస్మాద్యది తపస్తప్త్వా ప్రాప్తో యోగిత్వమీప్సితమ్ ॥127॥

భువః పాలనసామర్థ్యయుక్త ఏకో మహీపతిః ।
పృథివ్యామస్త్రభృన్నాద్యాప్యహమేవర్ధిసంయుతః ॥128॥

తతో భవిష్యే నాత్మానం కరిష్యే పాపభాగినమ్ ।

రాజు తాను పాలించక, ఇతరులచే పరిపాలింపచేస్తూ, తాను మరొక వృత్తిని అవలంబించి ప్రజలనుండి వారి సంపాదనలో ఆరవభాగమును పన్నుగా గ్రహించునట్లయితే అట్టి రాజునకు నిశ్చయముగా నరకలోకము సంప్రాప్తించును. ప్రజలను రక్షించుటకే వారి వద్ద నుండి రాజులు వేతనరూపముగా పన్నులను గ్రహింతురని పూర్వీకులైన రాజులవలన నిరూపింపబడినది. దొంగలబారినుండి రక్షించక ప్రజలనుండి ధనమును గ్రహించినచో అట్టి రాజుయొక్క ధనము దొంగసొమ్ము కాగలదు. అందువలన తపస్సును ఆచరించి అభిమతమైన యోగమును సంపాదించిన శస్త్రధారి అయిన రాజు మాత్రమే ఈ భూమండలమును పాలించుటకు సమర్థుడు కాగలడు. నాకింకను ఇటువంటి బుద్ధి (సంపద లేదా సామర్థ్యము) సిద్ధించలేదు. అందువలన ఇట్టి పరిస్థితిలో నేను రాజ్యపాలనము చేసి పాపిని కాలేను.

తస్య తం నిశ్చయం జ్ఞాత్వా మంత్రిమధ్యస్థితోఽబ్రవీత్ ॥129॥

గర్గో నామ మహాబుద్ధిర్మునిర్భూపవయోఽతిగః ।
భక్త్యా తు కృపయాఽఽవిష్టస్తం తోషయితుమర్హతి ॥130॥

యద్యేవం కర్తుకామస్త్వం రాజ్యం సమ్యక్ ప్రశాసితుమ్ ।
తతః శృణుష్వ మే వాక్యం కురుష్వ చ నృపాత్మజ ॥131॥

రాజుయొక్క ఆ నిశ్చయమును తెలుసుకొన్న మహాబుద్ధిమంతుడు, రాజుకంటే వయస్సులో పెద్దవాడు, మునీ యగు గర్గుడు అను మహానుభావుడు మంత్రులమధ్యలో ఉండెను. రాజుపట్ల తనకున్న భక్తి కారణముగా రాజుపట్ల జాలితో ఆ గర్గుడు రాజును సంతోషపెట్టదలచి ఇట్లు పలికెను. "ఓ మహారాజా ! రాజ్యమును చక్కగా పరిపాలించుటకై నీవిట్లు చేయదలచినచో నా మాటను విని అట్లు ఆచరించుము.

దత్తాత్రేయం మహాత్మానం సహ్యద్రోణీకృతాశ్రమమ్ ।
తమారాధయ భూపాల ! పాతి యో భువనత్రయమ్ ॥132॥

యోగయుక్తం మహాత్మానం సర్వత్ర సమదర్శినమ్ ।
విష్ణోరంశం జగద్ధాతురవతీర్ణం ధరాతలే ॥133॥

యమారాధ్య సహస్రాక్షః ప్రాప్తవాన్ పదమాత్మనః ।
హృతం దురాత్మభిర్దైత్యైర్జఘాన చ దితేః సుతాన్ ॥134॥

ఓ మహారాజా ! మహాత్ముడు, సహ్యాద్రిపర్వతమందు ఆశ్రమమును ఏర్పరచుకొన్నవాడు, ముల్లోకములను పరిపాలించువాడు, యోగమును అవలంబించినవాడు, అంతట సమభావము కల్గినవాడు, జగద్రక్షకుడూ అయిన విష్ణుమూర్తియొక్క అంశము, మరియు భూలోకమందు అవతరించినవాడూ అగు దత్తాత్రేయమహాత్ముని ఆరాధించుము. దత్తాత్రేయమహామునిని ఆరాధించియే దేవేంద్రుడు రాక్షసులచే అపహరింపబడిన తన ఇంద్రపదవిని తిరిగి పొందెను. మరియు దితి కుమారులగు రాక్షసులను సంహరించెను.

అర్జున ఉవాచ – కార్తవీర్యార్జునుడు పలికాడు.

కథమారాధితో దేవైర్దత్తాత్రేయః ప్రతాపవాన్ ।
కథం వాఽపహృతం దైత్యైరింద్రత్వం ప్రాప వాసవః ॥135॥

ప్రతాపవంతుడగు దత్తాత్రేయమహర్షి దేవతలచే ఎట్లు ఆరాధింపబడెను? రాక్షసులు అపహరించిన ఇంద్రపదవిని తిరిగి దేవేంద్రుడు ఎట్లు పొందెను?

గర్గ ఉవాచ – గర్గముని పలికాడు.

దైత్యానాం దేవతానాం చ యుద్ధమాసీత్సుదారుణమ్ ।
దైత్యానామీశ్వరే జంభే దేవానాం చ శచీపతౌ ॥136॥

రాక్షసులకు ప్రభువు జంభాసురుడు, దేవతలకు ప్రభువు దేవేంద్రుడు ఉండగా దేవతలకు, రాక్షసులకు భయంకరమైన యుద్ధము జరిగెను.

తేషాం తు యుధ్యమానానాం దివ్యః సంవత్సరో గతః ।
తతో దేవాః పరాభూతా దైత్యా విజయినోఽభవన్ ॥137॥

వారిట్లు యుద్ధము చేయుచుండగా దివ్యమైన సంవత్సరకాలము గడిచిపోయెను. ఆ యుద్ధమందు దేవతలు ఓడిపోయిరి. రాక్షసులు జయమును పొందిరి.

విప్రచిత్తిముఖైర్దేవా దానవైస్తే పరాజితాః ।
పలాయనకృతోత్సాహా నిరుత్సాహా ద్విషజ్జయే ॥138॥

బృహస్పతిముపాగమ్య దైత్యసైన్యవధేప్సవః ।
అమంత్రయన్త సహితా వాలఖిల్యైః సహర్షిభిః ॥139॥

విప్రచిత్తి మొదలగు రాక్షసులచేత దేవతలందరు ఓడింపబడిరి. శత్రువులగు రాక్షసులను జయించుటయందు ఉత్సాహము లేనివారై, పారిపోవుటయందే ఉత్సాహముగలవారై దేవతలు రాక్షససైన్యమును వధించుటయందు కోరికగలవారై వాలఖిల్యుడు మొదలగు మహర్షులతో కూడుకొని బృహస్పతిని చేరి అతడి సహాయమును కోరిరి.

బృహస్పతిరువాచ – బృహస్పతి పలికాడు.

దత్తాత్రేయం మహాభాగమత్రేః పుత్రం తపోధనమ్ ।
వికృతాఽచరణం భక్త్యా సంతోషయితుమర్హథ ॥140॥

స వో దైత్యవినాశాయ వరదో దాస్యతే వరమ్ ।
తతో హనిష్యథ సురాః ! సహితాన్ దైత్యదానవాన్ ॥141॥

ఓ దేవతలారా ! అత్రిమహర్షి కుమారుడు, తపస్సే ధనముగా గలవాడు, వికృతచేష్టలు గలవాడు అగు దత్తాత్రేయమహానుభావుని భక్తితో మీరు సంతోషపెట్టుటకు తగినవారు. ఆ దత్తాత్రేయమహర్షి రాక్షససంహారముకొరకు మీకు వరమును ఈయగలడు. అంతట మీరు దైత్యులను దానవులను వధించగలరు.

గర్గ ఉవాచ – గర్గముని పలికాడు.

హన్తుం శక్తా న సన్దేహో దత్తాత్రేయప్రసాదతః ।
ఇత్యుక్తాస్తే తదా జగ్ముర్దత్తాత్రేయాఽఽశ్రమం సురాః ॥142॥

"దత్తాత్రేయమహాముని అనుగ్రహమువలన రాక్షసులను చంపుటకు మేము సమర్థులము కాగలము. ఇందులో సందేహము లేదు" అని పలికి దేవతలు అటుపిమ్మట దత్తాత్రేయమహర్షి ఆశ్రమమునకు వెళ్ళిరి.

దదృశుశ్చ మహాత్మానం క్షాంతం లక్ష్మ్యా సమన్వితమ్ ।
ఉద్గీయమానం గన్ధర్వైః సురాపానరతం మునిమ్ ॥143॥

సహనస్వభావముగలవాడు, లక్ష్మీదేవితో కూడుకొన్నవాడు, మహాత్ముడు, గంధర్వులచే గానము చేయబడుచున్నవాడు, మద్యపానమందు ఆసక్తుడూ అయిన దత్తాత్రేయమహామునిని దేవతలు చూచిరి.

తే తస్య గత్వా ప్రణతిం చక్రుః సర్వార్థసాధనీమ్ ।
భక్త్యా తస్యోపజహ్రుశ్చ మద్యపస్య సురాదికమ్ ॥144॥

ఆ దేవతలు దత్తాత్రేయమహర్షి చెంతకు చేరి, సమస్త కార్యములను సిద్ధింపచేసే నమస్కారమును ఆచరించిరి. మద్యపానము చేయుచున్న ఆ మహామునికి భక్తితో ఆ దేవతలు మద్యము మొదలగు పదార్థములను సమకూర్చిరి.

తిష్ఠన్తమనుతిష్ఠన్తి యాన్తం యాన్తి దివౌకసః ।
ఆరాధయామాసురధః స్థితాస్తిష్ఠన్తమాసనే ॥145॥

దేవతలు ఆ దత్తాత్రేయమహాముని నిలబడియుండగా నిలబడిరి. నడుచుచున్నయెడల నడచుచుండిరి. ఆసనమందు కూర్చొనియుండగా క్రిందిభాగమందు కూర్చొండిరి. ఈ విధముగా దేవతలు దత్తాత్రేయమహామునిని ఆరాధించిరి.

స ప్రాహ దేవాన్ ప్రణతాన్ దత్తాత్రేయః కిమిష్యతే ।
మత్తో భవద్భిర్యేనేయం శుశ్రూషా క్రియతే మమ ॥146॥

దత్తాత్రేయమహర్షి నమస్కరించియున్న దేవతలతో ఇట్లు పలికెను. "మీరు నా నుండి ఏమి కోరుకొనుచున్నారు? ఎందువలన మీరు నాకీ సేవలను చేయుచున్నారు?"

దేవా ఊచుః – దేవతలు చెప్పారు.

దానవైర్మునిశార్దూల జంభాద్యైర్భూర్భువాదికమ్ ।
హృతం త్రైలోక్యమాక్రమ్య క్రతుభాగాశ్చ కృత్స్నశః ॥147॥

తద్వధే కురు బుద్ధిం త్వం పరిత్రాణాయ నోఽనఘ ।
త్వత్ప్రసాదాదభీప్సామః పునః ప్రాప్తుం త్రివిష్టపమ్ ॥148॥

ఓ మునిశ్రేష్ఠుడా! జంభుడు మొదలగు రాక్షసులు భూర్భువాది లోకములనన్నింటిని ఆక్రమించారు. ఈ ముల్లోకములను ఆక్రమించి యజ్ఞభాగములను అపహరించారు. ఓ పాపరహితుడా! మమ్ములను రక్షించుటకై అట్టి రాక్షసులను చంపుటకు నీవు నిశ్చయము చేయుము. నీ అనుగ్రహము వలన మరల మేము స్వర్గమును అధిరోహించవలెనని కోరుకొనుచున్నాము.

దత్తాత్రేయ ఉవాచ – దత్తాత్రేయ మహర్షి పలికాడు.

మద్యాసక్తోఽహముచ్ఛిష్టో న చైవాహం జితేంద్రియః ।
కథమిచ్ఛథ మత్తోఽపి దేవాః శత్రుపరాభవమ్ ॥149॥

ఓ దేవతలారా ! నేను సురాపానమందు ఆసక్తిగలవాడను. అపవిత్రుడను. ఇంద్రియములను జయించినవాడను కాను. అటువంటప్పుడు నానుండి శత్రుపరాజయము జరగాలని మీరెట్లు కోరుకొనుచున్నారు?

దేవా ఊచుః – దేవతలు చెప్పారు.

అనఘస్త్వం జగన్నాథ ! న లేపస్తవ విద్యతే ।
విద్యాక్షాళనశుద్ధాంతర్నివిష్టజ్ఞానదీధితే ॥150॥

ఓ జగత్ప్రభూ ! నీవు పాపరహితుడవు. నీకు పాపములతో సంసర్గము ఎంతమాత్రము లేదు. ఓ అంతఃకరణప్రవిష్ట జ్ఞానప్రకాశస్వరూపుడా ! నీవు జ్ఞానము చేత అజ్ఞానము నశించగా శుద్ధమైన అంతఃకరణము గలవాడవు.

దత్తాత్రేయ ఉవాచ – దత్తాత్రేయముని చెప్పాడు.

సత్యమేతత్సురా విద్యా మమాస్తి సమదర్శినః ।
అస్యాస్తు యోషితస్సంగాదహముచ్ఛిష్టతాం గతః ॥151॥

స్త్రీసంభోగోఽతిదుఃఖాయ సాతత్యేనోపసేవితః ।
ఏవముక్తాస్తతో దేవాః పునర్వచనమబ్రువన్ ॥152॥

ఓ దేవతలారా ! నేను విద్యావంతుడను అను మాట నిజము. మీరు అంతట సమదర్శనము గలవారు. కాని ఈ స్త్రీ సంసర్గమువలన నేను అపవిత్రుడను అయితిని. నిరంతరము అనుభవింపబడుచున్న స్త్రీసంభోగము మిక్కిలి దుఃఖమునకు కారణము. దత్తాత్రేయమహర్షి ఇట్లు పలుకగా దేవతలు మరల ఇట్లు పలికిరి.

దేవా ఊచుః – దేవతలు చెప్పారు.

అనఘేయం మునిశ్రేష్ఠ ! జగన్మాతా న దుష్యతి ।
యా సా విద్యా తవ విభో ! సర్వజ్ఞస్య హృది స్థితా ॥153॥

యథాంశుమాలా సూర్యస్య ద్విజచండాలసంగినీ ।
న దుష్యతి జగన్నాథ ! తథేయం వరవర్ణినీ ॥154॥

ఓ మునిశ్రేష్ఠుడా! ఈమె పాపరహితురాలు. ఈమె జగన్మాత. ఎట్టి పాపములతోనూ దూషితురాలు కాదు. సర్వజ్ఞుడవగు నీ హృదయమందు నిలిచిన మహావిద్యాస్వరూపురాలు. ఏ విధముగా అయితే సూర్యుని కిరణముల సమూహము ద్విజులతో సంసర్గము కలిగినా, చండాలురతో సంసర్గము కలిగినా దోషయుక్తము కాదో అట్లే మిక్కిలి శ్రేష్ఠురాలగు ఈమె కూడా ఎట్టి పాపస్పర్శ కలిగినది కాదు.

గర్గ ఉవాచ – గర్గముని పలికాడు.

ఏవముక్తస్తతో దేవైర్దత్తాత్రేయోఽబ్రవీదిదమ్ ।
ప్రహస్య త్రిదశాన్ సర్వాన్ యద్యేతద్భవతాం మతమ్ ॥155॥

తదాహూయాసురాన్ సర్వాన్ యుద్ధాయ సురసత్తమాః ।
ఇహాఽనయత మద్దృష్టిగోచరం మా విలంబ్యతామ్ ॥156॥

మద్దృష్టిపాతహుతభుక్ప్రక్షీణబలచేతసః ।
యేన నాశమశేషాస్తే ప్రయాన్తి మమ దర్శనాత్ ॥157॥

దేవతలు ఈ విధముగా పలుకగా, దత్తాత్రేయమహాముని నవ్వి దేవతలందరితో ఈ విధముగా పలికెను. ఓ శ్రేష్ఠులైన దేవతలారా! మీకిట్లే సమ్మతమైనచో రాక్షసులనందరిని యుద్ధమునకు ఆహ్వానించి నా ముందర ఉంచండి. ఆలస్యము చేయవలదు. నాయొక్క దృష్టిపాతమను అగ్నిచే రాక్షసులు క్షీణించిన బలము గలవారగుదురు. నన్ను చూచినంతమాత్రముచేతనే వారందరు నశించగలరు.

గర్గ ఉవాచ – గర్గముని చెప్పాడు.

తస్య తద్వచనం శ్రుత్వా దేవైర్దైత్యా మహాబలాః ।
ఆహవాయ సమాహూతా జగ్ముర్దేవగణాశ్రమమ్ ॥158॥

దత్తాత్రేయమహర్షి చెప్పిన మాటలు విని ఆ ప్రకారమే దేవతలు మహాబలవంతులగు రాక్షసులను యుద్ధమునకు ఆహ్వానించిరి. అంతట రాక్షసులు దేవతలున్నచోటికి బోయిరి.

తే హన్యమానా దైతేయైర్దేవాస్సర్వే భయాతురాః ।
దత్తాత్రేయాఽశ్రమం జగ్ముః సమస్తాః శరణార్థినః ॥159॥

రాక్షసులు ఆ యుద్ధములో దేవతలను చంపుచుండగా వారందరు మిక్కిలి భయమునొంది శరణు వేడుతూ దత్తాత్రేయమహాముని ఆశ్రమమునకు వెళ్ళిరి.

తమేవ వివిశుర్దైత్యాః కాలయన్తో దివౌకసః ।
దదృశుస్తం మహాత్మానం దత్తాత్రేయం మదాలసమ్ ॥160॥

దేవతలు దత్తాత్రేయమునియొక్క ఆశ్రమమునే ప్రవేశించిరి. అచ్చట మద్యపానముచే మత్తుడైయున్న మహాత్ముడైన దత్తాత్రేయమహామునిని ఆ రాక్షసులు చూచిరి.

వామపార్శ్వస్థితామిష్టామశేషజగతశ్శుభామ్ ।
భార్యాం చాస్య సుచార్వఙ్గీం లక్ష్మీమిందునిభాననామ్ ॥161॥

నీలోత్పలాభనయనాం పీనశ్రోణిపయోధరామ్ ।
సుదతీం మధురాభాషాం సర్వయోషిద్గుణైర్యుతామ్ ॥162॥

దృష్ట్వాఽగ్రతస్తదా దైత్యాః సాభిలాషమనోభవాః ।
న శేకురుద్ధతా దైత్యా మనసా వోఢుమాతురాః ॥163॥

త్యక్త్వా దేవాన్ స్త్రియం తాం తు హర్తుకామా హతౌజసః ।
ప్రేరితాస్తేన పాపేన హ్యాసక్తాస్తే తతోఽభవన్ ॥164॥

స్త్రీరత్నమేతత్రైలోక్యసారం చేద్విదితం భవేత్ ।
కృతకృత్యాస్తతస్సర్వే ఇతి నో భావితం మనః ॥165॥

తస్మాత్సర్వే సముత్క్షిప్య శిబికాయాం సురార్దనాః ।
ఆరోప్య స్వమధిష్ఠానం నయామ ఇతి నిశ్చితాః ॥166॥

దత్తాత్రేయమహామునిని చూచిన పిమ్మట రాక్షసులు ఆ దత్తాత్రేయ మహామునియొక్క ఎడమభాగమందున్నట్టిదియు, సమస్తజగత్తుకు మంగళస్వరూపురాలు, అందమైన అవయవములు కలిగినట్టిదీ చంద్రబింబమువంటి ప్రకాశము కలిగినట్టిదీ, నల్లని కలువవంటి కాంతిమంతమైన కన్నులు గలదీ, లావైన కటిభాగము వక్షోజములు గలదీ, అందమైన దంతములు గలదీ, మధురముగా మాటలాడునదీ, స్త్రీకి ఉండవలసిన సమస్తగుణములు కలదీయగు దత్తాత్రేయమహాముని భార్యను లక్ష్మీదేవిని చూచిరి. అంతట రాక్షసులు ఆమెయందు కోరికగలవారై కామాతురులై గర్వితులై మనస్సును నిగ్రహించుటకు సమర్థులు కాలేకపోయిరి. అంతట ఇంద్రియనిగ్రహము తప్పిన రాక్షసులు దేవతలనందరినీ విడిచిపెట్టి, ఆ స్త్రీమూర్తిని అపహరించవలెనను కోరికను పొంది, నశించిన బలపరాక్రమములుగలవారై, తాము చేసిన పాపములచేత ప్రేరేపింపబడి ఆ స్త్రీయందు ఆసక్తులైరి. ఇంకను "ముల్లోకములకు సారమైనట్టి ఈ స్త్రీరత్నమును పొందినట్లయిన మనమందరము కృతకృత్యులము కాగలమని మన మనస్సు భావనచేయుచున్నది. అందువలన మనమందరు దైత్యులము ఈ స్త్రీ రత్నమును పల్లకియందు ఎక్కించుకొని మనచోటికి వెళ్ళెదము" అని ఆ రాక్షసులు నిశ్చయించుకొనిరి.

గర్గ ఉవాచ – గర్గముని చెప్పాడు.

సానురాగాస్తతస్తే తు మునేరన్తికమాగమన్ ।
తస్య తాం యోషితం సాధ్వీం సముత్క్షిప్య స్మరాతురాః ॥167॥

శిబికాయాం సమారోప్య సహితా దైత్యదానవాః ।
శిరస్సు శిబికాం కృత్వా స్వస్థానాభిముఖా యయుః ॥168॥

ఆ స్త్రీరత్నమందలి కోరికతో ఆ రాక్షసులు దత్తాత్రేయమునివద్దకు వచ్చిరి. మన్మథపీడితులైన ఆ దైత్యదానవులందరు ఆ పతివ్రతా స్త్రీరత్నమును ఎత్తుకొని పల్లకియందుంచి, ఆ పల్లకిని తమ శిరస్సులపై పెట్టుకొని మోయుచూ తమ తమ నివాసస్థానములకు వెళ్ళిరి.

దత్తాత్రేయస్తదా దేవాన్ విహస్యేదమథాబ్రవీత్ ।
దిష్ట్యా చ హన్త దైత్యానామేషా లక్ష్మీః శిరోగతా ॥
సప్తస్థానాన్యతిక్రమ్య లయమన్యముపేష్యతి ॥169॥

అటుపిమ్మట దత్తాత్రేయమహర్షి చిరునవ్వు నవ్వుచూ దేవతలతో ఇట్లు పలికెను. ఓహో ! అదృష్టవశాత్తు ఈ లక్ష్మీదేవి రాక్షసుల నెత్తిపై ఎక్కినది. లక్ష్మీదేవికి ఏడు స్థానములున్నవి. వాటిని అతిక్రమించిన వెంటనే ఈమె రాక్షసులను విడిచిపెట్టిపోగలదు. మరియొకరిని పొందగలదు.

దేవా ఊచుః – దేవతలు పలికారు.

కథయస్వ జగన్నాథ ! కేషు స్థానేష్వవస్థితా ।
పురుషస్య ఫలం కిం వా ప్రయచ్ఛత్యథ నశ్యతి ॥170॥

ఓ జగత్ప్రభూ ! ఏడు లక్ష్మీనివాసస్థానములు ఏమో చెప్పండి. ఏఏ స్థానములందుండి లక్ష్మీదేవి పురుషునకు ఫలమునిచ్చునో, మరియు ఫలమునీయక తొలగిపోవునో వివరించండి.

దత్తాత్రేయ ఉవాచ – దత్తాత్రేయమహర్షి చెప్పాడు.

నృణాం పాదస్థితా లక్ష్మీర్నిలయం సంప్రయచ్ఛతి ।
సక్థ్నోశ్చ సంస్థితా వస్త్రం రత్నం నానావిధం వసు ॥171॥

కలత్రదా గుహ్యసంస్థా క్రోడస్థాఽపత్యదాయినీ ।
మనోరథాన్ పూరయతి పురుషాణాం హృది స్థితా ॥172॥

లక్ష్మీర్లక్ష్మీవతాం శ్రేష్ఠా కంఠస్థా కంఠభూషణమ్ ।
అభీష్టబంధుదారైశ్చ తథాఽశ్లేషం ప్రవాసిభిః ॥173॥

మృష్టాన్నం వాక్యలావణ్యమాజ్ఞామవితథాం తథా ।
ముఖస్థితా కవిత్వం చ యచ్ఛత్యుదధిసంభవా ॥174॥

శిరోగతా సంత్యజతి తతోఽన్యం యాతి చాఽశ్రయమ్ ।
సేయం శిరోగతా దైత్యాన్ పరిత్యజతి సాంప్రతమ్ ॥175॥

లక్ష్మీదేవి పాదస్థానమందున్నచో నివసించుటకు స్థానమునిచ్చును. తొడలయందున్నచో వస్త్రములు, రత్నములు, నానావిధములైన సంపదలను ఇచ్చును. గుహ్య (రహస్య లేదా ఆచ్ఛాదనయోగ్యమైన) ప్రదేశములందున్నచో భార్యనిచ్చును. క్రోడభాగమందు అనగా రెండు భుజముల మధ్యభాగమైన మెడయందున్నచో సంతానమునిచ్చును. పురుషుల హృదయమందున్నచో కోరికలను తీర్చును. లక్ష్మీవంతులలో శ్రేష్ఠురాలైన ఈ లక్ష్మీదేవి కంఠమందున్నచో కంఠభూషణములను ఏర్పరచును. అంతేగాక తమకిష్టమైన బంధువులు, భార్య, దూరమందున్నవారు వీరితో ఎడబాటు లేకుండా చేయును. క్షీరసముద్రమందు ఉద్భవించిన లక్ష్మీదేవి ముఖస్థానమందున్నచో రుచికరమైన భోజనము, ప్రియభాషిత్వము, తామిచ్చిన ఆదేశములు వ్యర్థము కాకుండుట, కవిత్వము వీటినిచ్చును. శిరస్సుపై ఉన్నచో అట్టివానిని వదిలివెళ్ళిపోవును, మరియొకరిని ఆశ్రయించును. ఇప్పుడీ లక్ష్మీదేవి రాక్షసుల నెత్తిపై ఉన్నందున వారిని విడిచిపెట్టివెళ్ళిపోగలదు.

ప్రగృహ్యాస్త్రాణి వధ్యన్తాం తస్మాదేతే సురారయః ।
న భేతవ్యం భృశం త్వేతే మయా నిస్తేజసః కృతాః ॥176॥

పరదారావమర్శాచ్చ దగ్ధపుణ్యా హతౌజసః ।
తస్మాదేతేఽభిహన్యన్తాం భవద్భిరవిశంకితైః ॥177॥

అందువలన ఓ దేవతలారా ! మీరు అస్త్రశస్త్రములను గ్రహించి దేవవిరోధులైన రాక్షసులను సంహరించండి. భయపడవలదు. వీరు నాచేత మిక్కిలి తేజోహీనులుగా చేయబడినారు. ఇతరుల భార్యను కాంక్షించుటచే వీరు పుణ్యము నశించినవారు, పరాక్రమము నశించినవారు అయినారు.

గర్గ ఉవాచ – గర్గముని చెప్పాడు.

తతస్తే వివిధైరస్త్రైర్వధ్యమానాః సురారయః ।
శిరస్సు లక్ష్మ్యాఽప్యాక్రాన్తా వినేశురితి నః శ్రుతమ్ ॥178॥

అంతట దేవతలచే దేవశత్రువులైన రాక్షసులు చంపబడుతున్నవారైరి. వారి శిరస్సులందు ఆక్రమించినందువలన వారు నశించిరని కూడా మేము వింటిమి.

లక్ష్మీశ్చోత్పత్య సంప్రాప్తా దత్తాత్రేయం మహామునిమ్ ।
స్తూయమానా సురైస్సేంద్రైర్దైత్యనాశాన్ముదాన్వితైః ॥179॥

పిమ్మట రాక్షసనాశము కారణముగా సంతోషముతో కూడుకొన్న దేవతలచేత స్తుతింపబడుచున్నదై లక్ష్మీదేవి రాక్షసశిరస్సులనుండి దుమికి దత్తాత్రేయమహామునిని చేరినది.

ప్రణిపత్య తతో దేవా దత్తాత్రేయం మహామునిమ్ ।
జయ కృష్ణ జగన్నాథ దైత్యాంతక హర ప్రభో ॥180॥

నారాయణాచ్యుతానంత వాసుదేవాక్షయాజర ।
త్వత్ప్రసాదాత్సుఖం లక్ష్మీ రాజ్యం సంపజ్జనార్దన ॥181॥

శార్ఙ్గధన్వంశ్చక్రపాణే భక్తానాం నిత్యవత్సల ।
ఇతి స్తుత్వా నాకపృష్ఠం యథాపూర్వం గతాస్సురాః ॥182॥

తథా త్వమపి రాజేంద్ర యదిచ్ఛసి యథేప్సితమ్ ।
ప్రాప్తమైశ్వర్యమతులం తూర్ణమారాధయస్వ తమ్ ॥183॥

అటు పిమ్మట దేవతలు దత్తాత్రేయమహామునికి నమస్కరించి "ఓ జగన్నాథా! కృష్ణా! రాక్షససంహారకా, పరమశివా! జగత్ప్రభూ! నారాయణా! అచ్యుతా! అనంతా! వాసుదేవా! అక్షయా! అజరా! జనార్దనా! శార్ఙ్గము ధనస్సుగా గలవాడా! చక్రపాణీ। భక్తులపట్ల ఎల్లప్పుడు వాత్సల్యము చూపువాడా ! నీ అనుగ్రమువల్లనే సుఖము, ధనము, రాజ్యము, సంపదలు మాకు సమకూరినవి" అని స్తుతించి పూర్వమువలే స్వర్గమును అధిరోహించిరి. ఓ రాజేంద్రా! అట్లే నీవు కూడా నీకిష్టమైన దానిని పొందవలెనని కోరుకొన్నచో, సాటిలేని సంపదలను కోరుకొన్నచో శీఘ్రముగా ఆ దత్తాత్రేయమహామునిని ఆరాధింపుము.

ఇతి శ్రీమార్కండేయ మహాపురాణే శ్రీ దత్తాత్రేయమాహాత్మ్యవర్ణనం నామ షోడశోఽధ్యాయః ॥16॥

శ్రీమార్కండేయ మహాపురాణమందు శ్రీ దత్తాత్రేయమాహాత్మ్యవర్ణనమను పదునారవ అధ్యాయం సమాప్తం.

సప్తదశోఽధ్యాయః – పదునేడవ అధ్యాయం
దత్తాత్రేయోపాఖ్యానం – దత్తాత్రేయోపాఖ్యానం

పుత్ర ఉవాచ – పుత్రుడు పలికాడు.

> **ఇత్యృషేర్వచనం శ్రుత్వా కార్తవీర్యో నరేశ్వరః ।**
> **దత్తాత్రేయాఽఽశ్రమం గత్వా తం భక్త్యా సమపూజయత్ ॥1॥**
>
> **పాదసంవాహనాద్యేన అర్ఘ్యార్ఘ్యాహరణేన చ ।**
> **స్రక్చందనాదిగంధాంబుఫలాద్యానయనేన చ ॥2॥**
>
> **తథాన్నసాధనైస్తస్య ఉచ్ఛిష్టాపోహనేన చ ।**
> **పరితుష్టో మునిర్భూపం తమువాచ తథైవ సః ॥3॥**
>
> **యథైవోక్తాః పురా దేవా మద్యభోజ్యాది కుత్సనమ్ ।**
> **స్త్రీ చేయం మమ పార్శ్వస్థేత్యేతద్భోగానుకుత్సితః ॥4॥**
>
> **సదైవాహం న మామేవమవరోద్ధుం త్వమర్హసి ।**
> **అశక్తముపకారాయ శక్తమారాధయస్వ భోః ॥5॥**

మహారాజగు కార్తవీర్యార్జునుడు ఆ ఋషి చెప్పిన మాటలను విని దత్తాత్రేయమహాముని ఆశ్రమానికి వెళ్ళి ఆ మునిని కాళ్ళుపట్టుటచేతను, అర్ఘ్యపాద్యాదులనిచ్చుటచేతను, పుష్పమాలలు మంచిగంధము, జలము, ఫలములను తీసుకొనివచ్చి ఇచ్చుటచేతను, భోజనమునకు కావలసిన వ్యంజనాదులను సమకూర్చుటచేతను, ఆ ముని ఎంగిలిని కడుగుట చేతను భక్తితో పూజించెను. రాజు చేసిన సపర్యలకు సంతోషమును పొందిన దత్తాత్రేయమహాముని రాజుతో ఇట్లు పలికెను. "ఓ రాజా ! దేవతలు చెప్పినట్లుగా తినకూడని త్రాగకూడని మద్యభోజ్యాదులను నేను సేవించువాడను. నా ప్రక్కనే స్త్రీ కూడా ఉన్నది. ఈ కారణములచేత ఆయా భోగములచేత ఎల్లప్పుడు నిందింపతగిన ప్రవృత్తిగలవాడను, భోగములను అనుభవించుచున్న నన్ను ఇట్లు ఆటంకపరచుట నీకు తగదు. నీకు ఉపకారము చేయుటకు సమర్థుడను కాను. సమర్థుడైన వానిని ఆరాధించుము."

పుత్ర ఉవాచ – పుత్రుడు పలికాడు.

> **తేనైవముక్తో మునినా స్మృత్వా గర్గవచశ్చ తత్ ।**
> **ప్రత్యువాచ ప్రణమ్యైనం కార్తవీర్యస్తతోఽర్జునః ॥6॥**

దత్తాత్రేయుడిట్లు చెప్పగా వినిన ఆ కార్యవీర్యార్జున మహారాజు గర్గముని చెప్పిన మాటలను గుర్తుకు తెచ్చుకొని దత్తాత్రేయమహామునికి నమస్కరించి ఇట్లు పలికెను.

అర్జున ఉవాచ – కార్తవీర్యార్జునుడు చెప్పాడు.

> **దేవస్త్వం హి పురాణో యః స్వాం మాయాం సముపాశ్రితః ॥7॥**

అనఘస్త్వం తథైవేయం దేవీ సర్వభవారణిః ।
ఇత్యుక్తః ప్రీతిమాన్ దేవో భూయస్తం ప్రత్యువాచ హ ॥8॥

కార్తవీర్యం మహావీర్యం వశీకృతమహీతలమ్ ।
వరం వృణీష్వ గుహ్యం మే త్వయా నామ యదీరితమ్ ॥9॥

"నీవు దేవుడవు, పురాణపురుషుడవు. స్వయముగా మాయను ఆశ్రయించి ఉన్నవాడవు. నీవు పాపరహితుడవు. అట్లే నీ ప్రక్కనున్న ఈ మహాదేవి కూడా సమస్తసంసారమునకు అరణి వంటిది. (అరణి యనగా అగ్నిని పుట్టించు కాష్ఠము)". రాజు పలికిన ఆ మాటలను విని సంతోషించిన దత్తాత్రేయమహాముని గొప్ప బలవంతుడు, భూమండలాన్ని వశపరచుకొన్నవాడు అగు కార్తవీర్యార్జునునితో మరల ఇట్లు పలికెను. "అతిరహస్యమైన నా నామమును నీవు ఉచ్చరించుటచే ఏదేని వరమును కోరుకొనుము."

తేన తుష్టిః పరా జాతా త్వయ్యద్య మమ పార్థివ ।
యే చ మాం పూజయిష్యన్తి గంధమాల్యాదిభిర్నరాః ॥10॥

మాంసమద్యోపహారైశ్చ మృష్టాన్నైశ్చాత్మసమ్మతైః ।
లక్ష్మ్యా సమేతం గీతైశ్చ బ్రాహ్మణానాం తథార్చనైః ॥11॥

వాద్యైర్మనోరమైర్వీణావేణుశుభాదిభిస్తథా ।
తేషామహం పరాం పుష్టిం పుత్రదారధనాదికీమ్ ॥12॥

ప్రదాస్యామ్యవధూతశ్చ హనిష్యామ్యవమన్యతామ్ ।
స త్వం వరయ భద్రం మే వరం యం మనసేచ్ఛసి ॥13॥

ప్రసాదసుముఖస్తేఽహం గుహ్యనామప్రకీర్తనాత్ ।

ఓ రాజా ! అందువలన నేడు నీయందు అత్యంతప్రీతి కలిగినది. ఏ మానవులయితే నన్ను గంధము, పుష్పమాలలతో పూజించెదరో, నాకిష్టమైన విందుభోజనములతోనూ మాంసమద్యోపహారములతోనూ నన్ను సంతృప్తిపరచెదరో, లక్ష్మీసమేతుడనైన నన్ను గీతములతోనూ, బ్రాహ్మణుల పూజలతోనూ ఆరాధించెదరో, మనోహరములైన వీణావేణు శుభాది వాద్యవిశేషములతో నన్ను సేవించెదరో అట్టి వారికి పుత్రదారధనాదులను ఇచ్చుటద్వారా గొప్పసంతోషమును కలిగింప చేసెదను. అవధూతనగు నేను నన్ను అవమానించినవారిని చంపివేసెదను. నన్ను పూజించి సంతృప్తిపరచిన నీవు నాకొరకు (నా సంతృప్తికొరకు) ఏదేని శుభప్రదమైన వరమును కోరుకొనుము. నా రహస్యనామములను నీవు సంకీర్తనచేయుటచే నీపట్ల అనుగ్రహబుద్ధి కలిగియున్నాను.

కార్తవీర్య ఉవాచ – కార్తవీర్యుడు చెప్పాడు.

యది దేవ ప్రసన్నస్త్వం తత్ప్రయచ్ఛర్ద్ధిముత్తమామ్ ॥14॥

యథా ప్రజాః పాలయేయం న చాధర్మమవాప్నుయామ్ ।
పరానుస్మరణం జ్ఞానమప్రతిద్వంద్వతాం రణే ॥15॥

ఓ దేవా ! నీవు నాపట్ల ప్రసన్నుడవయినచో ఉత్తమమైన సమృద్ధిని ప్రసాదించుము. అధర్మమును లేదా పాపమును పొందకుండు విధముగా ప్రజలను పరిపాలించునట్లు అనుగ్రహించుము. శత్రువులను ఎప్పటికప్పుడు గుర్తించు జ్ఞానమును, యుద్ధమునందు నాకెవరూ ఎదురు లేకుండు విధమును ప్రసాదించుము.

సహస్రమాప్తుమిచ్ఛామి బాహూనాం లఘుతాగుణమ్ ।
అసంగా గతయస్సన్తు శైలాకాశాంబుభూమిషు ॥16॥

పాతాలేషు చ సర్వేషు వధశ్చాప్యధికాన్నరాత్ ।
తథామార్గప్రవృత్తస్య సన్తు సన్మార్గదేశికాః ॥17॥

సన్తు మేఽతిథయః శ్లాఘ్యాః విత్తం వాఽన్యత్తథాఽక్షయమ్ ।
అనష్టద్రవ్యతా రాష్ట్రే మమానుస్మరణేన చ ॥18॥

త్వయి భక్తిశ్చ దేవాస్తు నిత్యమవ్యభిచారిణీ ॥19॥

ఇంకను తేలికపాటి గుణము కలిగిన వేయి బాహువులను పొందగోరుచున్నాను. పర్వతములు, ఆకాశము, జలము, భూమి, పాతాళలోకములు వీటి అన్నింటియందు నా ప్రవృత్తులన్నియు అవ్యాహతములు కాగోరుచున్నాను. నా మరణమును ఉత్తముడైన మానవునివల్ల పొందగోరుచున్నాను. నేనెప్పుడయినా మార్గము తప్పి అనగా అధర్మమార్గమందు ప్రవర్తించినట్లయిన నాకు సన్మార్గమును బోధించు ఉత్తమగురువులుందురుగాక! నా అతిథులందరు పొగడబడువారు కాగాక! ఎవరి ధనము గానీ, మరి ఏ ఇతర సంపదలు గానీ నశించకుండా ఉండుగాక! నా రాష్ట్రమందు నన్ను స్మరించినంతమాత్రమున ఎవరి ద్రవ్యమూ నష్టము కాకుండా ఉండుగాక ! (నా యందలి భయముచే ఎవ్వరూ దొంగతనము చేయకుందురు గాక!) ఓ దేవా! నీ యందలి నా భక్తి ఎల్లప్పుడు అచంచలమై ఉండుగాక!

దత్తాత్రేయ ఉవాచ – దత్తాత్రేయమహర్షి పలికాడు.

య ఏతే కీర్తితాస్సర్వే తాన్వత్స సమవాప్స్యసి ।
మత్ప్రసాదాత్ప్రభవితా చక్రవర్తిత్వమైశ్వరమ్ ॥20॥

ఓ వత్సా ! నీవు కోరుకొన్నవాటినన్నింటినీ పొందగలవు. నా అనుగ్రహముచే నీకు ఈశ్వరసంబద్ధమైన చక్రవర్తిత్వము లభించగలదు.

పుత్ర ఉవాచ – కుమారుడు చెప్పాడు.

ప్రణిపత్య తతస్తస్మై దత్తాత్రేయాయ సోఽర్జునః ।
ఆనీయ ప్రకృతీః సమ్యగభిషేకమగృహ్ణత ॥
ఆగతాశ్చాపి గంధర్వాస్తథైవాప్సరసాం గణాః ॥21॥

ఋషయశ్చ వసిష్ఠాద్యా మేర్వాద్యాః పర్వతాస్తథా ।
గంగాద్యాస్సరితస్సర్వాః సముద్రా రత్నసంభవాః ॥22॥

ప్లక్షాద్యాశ్చ తథా వృక్షా దేవా వై వాసవాదయః ।
వాసుకిప్రముఖా నాగా అభిషేకార్థమాగతాః ॥23॥

తార్క్ష్యాద్యా పక్షిణశ్చైవ పౌరా జానపదాస్తథా ।
సంభారాస్సంభృతాస్సర్వే దత్తాత్రేయప్రసాదతః ॥24॥

అథ సంజ్వాల్య తైర్వహ్నిం దేవైర్బ్రహ్మాదిభిస్సహ ।
నారాయణేనాభిషిక్తో దత్తాత్రేయస్వరూపిణా ॥25॥

సముద్రైశ్చ నదీభిశ్చ ఋషిభిశ్చాభిషేచితః ।

అంతట ఆ కార్తవీర్యార్జునుడు దత్తాత్రేయమహామునికి నమస్కరించి తన రాజ్యమందలి సమస్తప్రజలను ఆహ్వానించి రాజ్యపట్టాభిషేకమును స్వీకరించెను. ఆ సమయమందు పట్టాభిషేకమహోత్సవమునకు గంధర్వులు, అప్సరసలు, వసిష్ఠుడు మొదలగు ఋషులు, మేరువు మొదలగు పర్వతములు, గంగ మొదలగు నదులు, రత్నములకు నిలయములైన సముద్రములు, ప్లక్షములు మొదలగు చెట్లు, దేవేంద్రుడు మొదలగు దేవతలు, వాసుకి మొదలగు సర్పములు, గరుత్మంతుడు మొదలగు పక్షులు, పట్టణవాసులు, పల్లెవాసులు అందరు ఉపస్థితులైరి. దత్తాత్రేయమహాముని అనుగ్రహమువలన సమస్తసంభారములు (కావలసిన వస్తువులు) కూర్చబడినవి. పట్టాభిషేకమునకు వచ్చిన బ్రహ్మాదులు దేవతలతో కూడా అగ్నిదేవుని ప్రజ్వలింపచేయగా దత్తాత్రేయస్వరూపుడైన విష్ణుమూర్తిచేత కార్తవీర్యార్జునుడు రాజ్యపట్టాభిషిక్తుడు కాబడెను. ఇంకను సముద్రములు, నదులు, ఋషులు వీరందరిచేత కూడా పట్టాభిషిక్తుడు కాబడెను.

ఆఘోషయామాస తదా స్థితో రాజ్యే స హైహయః ॥26॥

దత్తాత్రేయాత్పరామృద్ధిమవాప్యాతిబలాన్వితః ।
అద్యప్రభృతి యశ్శస్త్రం మామృతేఽన్యో గ్రహీష్యతి ॥27

హన్తవ్యః స మయా దస్యుః పరహింసారతోఽపి వా ।
ఇత్యాజ్ఞప్తేన తద్రాజ్యే కశ్చిదాయుధభృన్నరః ॥28॥

తమృతే పురుషవ్యాఘ్రం బభూవోరుపరాక్రమమ్ ।
స ఏవ గ్రామపాలోఽభూత్ పశుపాలస్స ఏవ చ ॥29॥

క్షేత్రపాలస్స ఏవాఽసీత్ ద్వితీయో న చ రక్షితా ।
తపస్వినాం పాలయితా సార్థపాలశ్చ సోఽభవత్ ॥30॥

హైహయాధిపతి అయిన కార్తవీర్యార్జునుడు పట్టాభిషిక్తుడై తన రాజ్యమందు ఈ విధముగా చాటింపు వేసెను. "దత్తాత్రేయమహాముని అనుగ్రహమువలన కార్తవీర్యార్జునుడు పట్టాభిషిక్తుడై మిక్కిలి ఉత్కృష్టమైన ఐశ్వర్యమును పొంది అత్యంతబలసంపన్నుడయ్యెను. ఈ రోజునుంచి నేను తప్ప మరి ఎవరయినా ఆయుధములను ధరించినచో

అతడు వధింపతగినవాడు కాగలడు. ఇంకనూ ఇతరులకు హింస తలపెట్టే శత్రువు కూడా చంపదగినవాడే.” ఈ విధముగా కార్తవీర్యార్జునుడు ఆజ్ఞాపించగా, మిక్కిలి పరాక్రమవంతుడు, పురుషవ్యాఘ్రమూ అగు కార్తవీర్యార్జునుడు తప్ప మరెవరూ ఆయుధములను ధరించలేదు. ఆ మహారాజే గ్రామపాలుడు, పశుపాలుడు, క్షేత్రపాలుడు, తపోజనులను రక్షించువాడు, అర్థపాలుడు సమస్తమూ అయ్యెను. ఇతడు తప్ప మరెవరూ రక్షించువారు లేరు.

దస్యువ్యాలాగ్నిశస్త్రారిభయేష్వబ్ధౌ నిమజ్జతామ్ ।
అన్యాసు చైవ మగ్నానామాపత్సు పరవీరహా ॥31॥

స ఏవ సంస్మృతః సద్యః సముద్ధర్తాఽభవన్నృణామ్ ।
అనష్టద్రవ్యతా చాఽసీత్ తస్మింశ్చాసతి పార్థివే ॥32॥

దుర్మార్గులు, సర్పములు, నిప్పు, ఆయుధములు, శత్రువులు వీరివల్ల భయముపొందినవారు, సముద్రమందు మునిగిపోతున్నవారు (జలప్రమాదము పొందినవారు), వేరే ఇతర ఆపదలందు చిక్కుకొన్నవారు వీరందరూ శత్రుసంహారకుడగు కార్తవీర్యార్జుననినే తమ రక్షణకొరకు స్మరించుకొనిరి. వెంటనే ఆ మహారాజు అందరినీ రక్షించువాడాయెను. ఆ మహారాజు రాజ్యమును పరిపాలించుచుండగా ఎవ్వరూ ఎవరి ద్రవ్యమునూ పోగొట్టుకొనలేదు, అనగా దొంగతనములు జరుగలేదు.

తేనేష్టం బహుభిర్యజ్ఞైః సమాప్తవరదక్షిణైః ।
తపశ్చ తప్తం సుమహత్ సంగ్రామే వాఽతిచేష్టితమ్ ॥33॥

తస్యర్ధిమహిమానం చ దృష్ట్వా ప్రాహాఽంగిరా మునిః ।
న నూనం కార్తవీర్యస్య గతిం యాస్యన్తి పార్థివాః ॥34॥

యజ్ఞైర్దానైస్తపోభిర్వా సంగ్రామే చాతిచేష్టితైః ।
దత్తాత్రేయాద్దినే యస్మిన్ సంప్రాప్తర్ధిర్నరేశ్వరః ॥35

తస్మిన్ తస్మిన్ దినే యాగం దత్తాత్రేయస్య సోఽకరోత్ ।
తథైవ చ ప్రజాస్సర్వాస్తస్మిన్నహని భూపతే ॥36॥

తస్యర్ధిం పరమాం దృష్ట్వా యాగం చక్రుః సమాధినా ।
ఇత్యేతత్తస్య మాహాత్మ్యం దత్తాత్రేయస్య ధీమతః ॥37॥

ఆ మహారాజు అనేక యజ్ఞములను ఆచరించెను. ఆ యజ్ఞములు సమాప్తములు కాగానే కోరిన దక్షిణలిచ్చెను. గొప్ప తపస్సునాచరించెను. యుద్ధమందు శత్రుసంహారక చేష్టలను ఆచరించెను. ఆ కార్తవీర్యమహారాజుయొక్క ఐశ్వర్యమును చూచి అంగిరామహర్షి “యజ్ఞములు, దానములు, తపస్సులు, సంగ్రామమందలి అసమాన చేష్టలు వీటితో ఏ రాజులు గూడా నిశ్చయముగా కార్తవీర్యార్జుననితో సమానులు కాలేరు” అని పలికెను. నరేశ్వరుడగు కార్తవీర్యార్జునుడు ఏ రోజయితే దత్తాత్రేయమహర్షి అనుగ్రహము వలన సమృద్ధిని పొందెనో ఆ రోజే దతాత్రేయుని గురించి యాగమును నిర్వహించెను. ఓ రాజా ! అదేవిధముగా ప్రజలందరూ కూడా ఆ మహారాజు ఐశ్వర్యమును

చూసి గొప్ప నిష్ఠతో యాగమును ఆచరించిరి. జ్ఞానియగు దత్తాత్రేయమహాముని గొప్పతనము ఇట్టిది.

విష్ణోశ్చరాచరగురోరనంతస్య మహాత్మనః ।
ప్రాదుర్భావః పురాణేషు కథ్యతే శార్ఙ్గధన్వనః ॥38॥
అనంతస్యాప్రమేయస్య శంఖచక్రగదాభృతః ।
ఏతస్య పరమం రూపం యశ్చింతయతి మానవః ॥39॥
స సుఖీ స చ సంసారాత్ సముత్తీర్ణోఽచిరాద్భవేత్ ।

సాక్షాత్తు నారాయణుడు, చరాచర ప్రపంచముకంతటికినీ గురువు, అంతములేనివాడు, శార్ఙ్గధన్వి అయిన దత్తాత్రేయమహాముని ప్రాదుర్భావము పురాణములలో చెప్పబడుచున్నది. అనంతుడు, అప్రమేయుడు, శంఖచక్రగదాధారి అయిన ఈ దత్తాత్రేయమహాముని రూపమును ఏ మానవుడయితే మనస్సులో చింతించునో అతడు సుఖవంతుడు కాగలడు. ఇంకను అచిరకాలములోనే సంసారబంధములనుండి విముక్తుడు కాగలడు.

సదైవ వైష్ణవానాం చ భక్త్యాఽహం సులభోఽస్మి భోః ॥40॥
పత్రపుష్పఫలేనాహం పూజితో మోక్షదోఽస్మి వై ।
ఇత్యేవం యస్య వై వాచః తం కథం నాశ్రయేజ్జనః ॥41॥

"ఓ జనులారా ! విష్ణుభక్తులందరికీ ఎల్లప్పుడు వారి భక్తి కారణముగా సులభుడను అనగా పొందతగినవాడను కాగలను. పత్రపుష్పఫలములతో నన్ను పూజించినవారికి నేను నిశ్చయముగా మోక్షమునిచ్చెదను" అను పలుకు ఆ దత్తాత్రేయమహాత్ముని ఎవరు ఆశ్రయించకుండా ఉండెదరు?

అధర్మస్య వినాశాయ ధర్మాధారార్థమేవ చ ।
అనాదినిధనో దేవః కరోతి స్థితిపాలనమ్ ॥42॥

అధర్మమును వినాశము చేయుటకు, ధర్మమునకు ఆధారముగా ఉండుటకొరకు ఆద్యంతములు లేని ఆ దత్తాత్రేయదేవుడు సంసారముయొక్క స్థితిపాలనములను చేయుచుండును.

తథైవ జన్మ చాఖ్యాతమాలర్కం కథయామి తే ।
యథా చ యోగః కథితో దత్తాత్రేయేణ తస్య వై ॥
పితృభక్తస్య రాజర్షేరలర్కస్య మహాత్మనః ॥43॥

అట్లే ఓ తండ్రీ! అలర్కుడను రాజర్షియొక్క జన్మవృత్తాంతమును నీకు నేను చెప్పెదను. పితృభక్తుడు, మహాత్ముడు, రాజర్షియగు అలర్కునికి దత్తాత్రేయమహాముని ఎట్లు యోగమును ఉపదేశించెనో నీకు నేను చెప్పెదను."

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే దత్తాత్రేయోపాఖ్యానం నామ సప్తదశోఽధ్యాయః ॥17॥

శ్రీ మార్కండేయ మహాపురాణమందు దత్తాత్రేయోపాఖ్యానమను పదునేడవ అధ్యాయం సమాప్తం.

అష్టాదశోఽధ్యాయః – పద్దెనిమిదవ అధ్యాయం
మదాలసోపాఖ్యానే కువలయాశ్వచరితమ్ – మదాలసోపాఖ్యానమందలి కువలయాశ్వచరితం

పుత్ర ఉవాచ – పుత్రుడు పలికాడు.

ప్రాగ్బభూవ మహావీర్యః శత్రుజిన్నామ పార్థివః ।
తుతోష యస్య యజ్ఞేషు సోమావాప్త్యా పురందరః ॥1॥

పూర్వము గొప్ప బలశాలియగు శత్రుజిత్తను పేరుగల రాజుండెను. అతడాచరించిన యజ్ఞములందు సోమరసము లభించుటచే దేవేంద్రుడు సంతసించెను.

తస్యాత్మజో మహావీర్యో బభూవారివిదారణః ।
నామ్నా ఋతధ్వజః ఖ్యాతః సర్వలక్షణసంయుతః ॥2॥

మహావీర్యసంపన్నుడు, శత్రుసంహారకుడు, సమస్తరాజలక్షణములతో కూడుకొన్నవాడు, ఋతధ్వజుడను పేరుతో ప్రసిద్ధమైన కుమారుడు ఆ శత్రుజిత్తను రాజుకుండెను.

బుద్ధివిక్రమలావణ్యైర్గురుశుక్రాశ్వినాం సమః ।
స సమానవయోబుద్ధిసత్త్వవిక్రమచేష్టితైః ॥3॥

జ్ఞానము, పరాక్రమము, అందము ఈ గుణములతో ఆ ఋతధ్వజుడను రాజకుమారుడు గురు, శుక్ర, అశ్వినీ దేవతలతో సమానముగా ఉండెను. అతడు వయస్సుకు తగినట్లుగా జ్ఞాన బలపరాక్రమములతో కూడుకొన్న చేష్టలు కలిగియుండెను.

నృపపుత్రో నృపసుతైర్నిత్యమాస్తే సమావృతః ।
కదాచిచ్ఛాస్త్రసద్భావ వివేకకృతనిశ్చయః ॥4॥

కదాచిత్కావ్యసంలాపగీతనాటకసంభవైః ।
తథైవాక్షవినోదైశ్చ శస్త్రాస్త్రవినయేషు చ ॥5॥

యోగ్యో నియుద్ధనాగాశ్వస్యన్దనాభ్యాసతత్పరః ।
రేమే నృపేన్ద్రపుత్రోఽసౌ నరేన్ద్రతనయైర్వృతైః ॥6॥

ఆ రాజకుమారుడగు ఋతధ్వజుడు ఎల్లప్పుడు రాజకుమారులతో కూడుకొనియుండెను. ఒకప్పుడు శాస్త్రచర్యలతో సిద్ధించిన వివేకజ్ఞానము కలిగియుండెను. ఒకప్పుడు కావ్యవిషయములందలి చర్చలు, గీతములు, నాటకములు, పాచికలాడుట ఈ కార్యములతో ఆ రాజకుమారుడు నిమగ్నమైయుండెను, శస్త్రములు, అస్త్రములు, వినయసంపదలందు యోగ్యుడై ఉండెను. ఇంకను యుద్ధమునకు అవసరమైన సర్పములు, ఏనుగులు, గుర్రములు, రథములు వీటికి సంబంధించిన విషయములను అభ్యసించుటయందు ఆసక్తుడైయుండెను. రాజకుమారుడగు ఈ ఋతధ్వజుడు పై విషయములను కలిగియుండి ఎల్లప్పుడు ఇతరరాజకుమారులతో కలిసిమెలిసియుండెను.

యథైవ హి దివా తద్వద్రాత్రావపి ముదా యుతః ।
తేషాం తు క్రీడతాం తత్ర ద్విజభూపవిశాం సుతాః ॥7॥

సమానవయసః ప్రీత్యా రన్తుమాయాన్త్యనేకశః ।
కస్యచిత్త్వథ కాలస్య నాగలోకాన్మహీతలమ్ ॥8॥

కుమారావాగతౌ నాగౌ పుత్రావశ్వతరస్య తు ।
బ్రహ్మరూపప్రతిచ్ఛన్నౌ తరుణౌ ప్రియదర్శనౌ ॥9॥

పగటి సమయమందువలే, రాత్రివేళల్లోకూడా ఆ రాజకుమారుడు ఇతరరాకుమారులతో ఆయా చర్చలతో సంతోషముగానుండెను. వారంతా ఇట్లు క్రీడించుచుండగా ఆ రాజకుమారులతో సమానమైన వయస్సుగల బ్రాహ్మణక్షత్రియవైశ్యుల కుమారులు ఇతరులు కూడా చాలామార్లు రాకుమారులతో క్రీడించుటకై వచ్చుచుండిరి. ఇట్లుండగా కొంతకాలమునకు నాగలోకమునుండి భూలోకమునకు అశ్వతరుడను నాగరాజు యొక్క కుమారులిరువులు వచ్చిరి. వారు ఇరువురు యుక్తవయస్సు కలిగి, అందమైన రూపము కలిగి, బ్రాహ్మణబాలకుల రూపమును ధరించియుండిరి.

తౌ తైర్నృపసుతైస్సార్ధం తథైవాన్యైర్ద్విజాత్మజైః ।
వినోదైర్వివిధైస్తత్ర తస్థతుః ప్రీతిసంయుతౌ ॥10॥

ఆ ఇరువురు నాగకుమారులు, ప్రీతితో కూడుకొన్నవారై ఇతర రాకుమారులతోనూ, ఇతర బ్రాహ్మణపుత్రులతోనూ వినోదముగా వివిధములైన ఆటలాడుకొనుచూ ఉండిరి.

సర్వే చ తే నృపసుతాస్తే చ బ్రహ్మవిశాం సుతాః ।
నాగరాజాత్మజౌ తౌ చ స్నానసంవాహనాదికామ్ ॥11॥

వస్త్రగంధాన్నసంయుక్తాం చక్రుర్భోగభుజిక్రియామ్ ।
అహన్యహన్యనుప్రాప్తే తౌ చ నాగకుమారకౌ ॥12॥

ఆజగ్మతుర్ముదా యుక్తౌ ప్రీత్యా సూనోర్మహీపతేః ।

ఆ రాజకుమారులందరు, బ్రాహ్మణవైశ్యకుమారులు, ఆ ఇరువురు నాగరాజకుమారులు వారందరు కలిసి స్నానమునాచరించుట, ఒకరినొకరు పైకెత్తుకొని మోయుట మొదలగు పనులను చేయుచు వినోదించుచుండిరి. ఇంకను కలిసి మెలిసి వస్త్రములను ధరించుట, గంధము పూసుకొనుట, అన్నము తినుట వంటి పనులను ఆచరించుచు భోగములను అనుభవించుచున్నారు, భోజనము చేయుచున్నారు. రోజులు గడచుచుండగా ఆ నాగకుమారిలిరువురు ఆ రాకుమారుడగు ఋతధ్వజుని పట్ల మిక్కిలి ప్రీతిని కలిగియుండిరి.

స చ తాభ్యాం నృపసుతః పరం నిర్వాణమాప్తవాన్ ॥13॥ ।

వినోదైర్వివిధైర్హాస్యసంలాపాదిభిరేవ చ ।
వినా తాభ్యాం న బుభుజే న సస్నౌ న పపౌ మధు ॥14॥

న రేమే న చ జగ్రాహ శాస్త్రాణ్యాత్మగుణర్ధయే ।

ఋతధ్వజుడను ఆ రాకుమారుడు గూడ పరాచికాలాడుకొనుట, ఒకరినొకరు ప్రీతితో మాటలాడుకొనుట మొదలగు వివిధములైన వినోదములతో ఆ నాగకుమారులిరువురితో గూడి గొప్ప ఆనందముననుభవించెను. ఆ ఇరువురు నాగకుమారులు లేకుండగా ఆ రాజకుమారుడు భోజనము చేయలేదు, స్నానము చేయలేదు, మధుపానము చేయలేదు, క్రీడించలేదు, తన జ్ఞానాభివృద్ధికొరకు శాస్త్రములను గ్రహించలేదు.

రసాతలే చ తౌ రాత్రిం వినా తేన మహాత్మనా ॥15॥

నిశ్శ్వాసపరమౌ నీత్వా జగ్మతుస్తం దినే దినే ।

మహాత్ముడగు ఆ రాజకుమారుడు లేకుండగా రాత్రివేళల్లో పాతాళలోకమందు ఆ నాగకుమారులిరువురు నిట్టూర్పులతో కూడుకొన్నవారై సమయమును గడిపిరి. తిరిగి పగటివేళల్లో రాకుమారునివద్దకు వచ్చుచుండిరి.

మర్త్యలోకే పరా ప్రీతిర్భవతోః కేన పుత్రకౌ ॥16॥

సహేతి చ ప్రలపితౌ తావుభౌ నాగదారకౌ ।
దృష్టయోరత్ర పాతాలే బహూని దివసాని మే ॥17॥

దివా రజన్యామేవోభౌ పశ్యామి ప్రియదర్శనౌ ।

“ఓ కుమారులారా ! మీకు భూలోకమందు ఎవరివలన ఇంతటి సంతోషము కలుగుచున్నది? మీరు పగటి సమయమందు కనబడి చాలారోజులు గడచినవి. ప్రియమైన దర్శనముగల మిమ్ములను రాత్రివేళల్లో మాత్రమే చూచుచున్నాను.”

జడ ఉవాచ – జడుడు పలికాడు.

ఇతి పిత్రా స్వయం పృష్టౌ ప్రణిపత్య కృతాఞ్జలీ ॥18॥
ప్రత్యూచతుర్మహాభాగావురగాధిపతేః సుతౌ ।

తండ్రి ఈ విధముగా అడుగగా నాగరాజు కుమారులిరువురు దోసిలి ఘటించి నమస్కరించి ఈ విధముగా బదులు పలికిరి.

పుత్రౌ ఊచతుః – కుమారులిరువురు ఇట్లు పలికిరి.

పుత్రః శత్రుజితస్తాత నామ్నాఖ్యాత ఋతధ్వజః ॥19॥

రూపవానార్జవోపేతః శూరో మానీ ప్రియంవదః ।
అనావృతకథో వాగ్మీ విద్వాన్మైత్రో గుణాకరః ॥20॥

మాన్యమానయితా ధీమాన్ హ్రీమాన్ వినయభూషణః ।
తస్యోపచారసంప్రీతిసంభోగాపహృతం మనః ॥21॥

ఓ తండ్రీ ! శత్రుజిత్తుకు ఋతధ్వజుడను పేరుతో ప్రసిద్ధమైన రాకుమారుడు గలడు. అతడు రూపవంతుడు, మృదుస్వభావముగలవాడు, పరాక్రమముగలవాడు, అభిమానముగలవాడు, ప్రియముగా మాటలాడువాడు, ఎట్టి రహస్యములు లేక మాకు అన్ని విషయములు చెప్పువాడు, ప్రశస్తమైన మాటలను మాటలాడువాడు, విద్వాంసుడు, స్నేహగుణముగలవాడు, సద్గుణములకు నిలయమైనవాడు, గౌరవార్హమైనవారిని గౌరవించువాడు, బుద్ధిమంతుడు, లజ్జాగుణము కలిగినవాడు, వినయమే భూషణముగా గలవాడు. ఆ రాకుమారుడు ఆచరించే ఉపచారములు, ప్రీతిభోగములచే మా మనస్సు ఆకర్షింపబడినది.

నాగలోకేఽన్యలోకే వా న రతిం విందతే పితః ।।
తద్వియోగేన నౌ తాత ! నిశా పాతాలశీతలా ॥22॥

పరితాపాయ తత్సంగశ్చాహ్లాదాయ రవిర్దివా ।

ఓ తండ్రీ ! నాగలోకమందుగాని మరి యే ఇతరలోకమందుగాని ఆ రాకుమారునితో కలిగే ఆనందము కలుగుట లేదు. ఓ తండ్రీ ! ఆ రాకుమారుని వియోగము కలిగినచో పాతాలలోకమందలి చల్లని రాత్రికూడా వేడిగా అనిపించుచున్నది. ఆ రాకుమారునితో సాంగత్యము కలిగినచో సూర్యతాపముకలిగిన పగలు కూడా ఆహ్లాదమును కలిగించుచున్నది.

పితా ఉవాచ – తండ్రి పలికాడు.

పుత్రః పుణ్యవతో ధన్యః స యస్యైవం భవద్విధైః ॥23॥

పరోక్షస్యాపి గుణిభిః క్రియతే గుణకీర్తనమ్ ।
సన్తి శాస్త్రవిదోఽశీలాః సన్తి మూర్ఖాః సుశీలినః ॥24॥

ఎవరయితే పరోక్షమందు కూడా మీవంటి గుణవంతులచేత సద్గుణములతో కీర్తింపబడుతున్నాడో అట్టి పుణ్యవంతుని కుమారుడే (ప్రకృతములో ఋతధ్వజుడను రాకుమారుడు) ధన్యుడు. శాస్త్రపండితులు కొందరు శీలసంపన్నులుగా లేరు. కొందరు శీలసంపన్నులు మూర్ఖులుగా కూడా అనగా శాస్త్రము చదవనివారుగా కూడా కనిపించుచున్నారు. అనగా శాస్త్రము, శీలము ఈ రెండూ తప్పనిసరిగా ఒకచోట ఉండవలెనను నియమము లేదని భావము.

శాస్త్రశీలే సమం మన్యే యస్మిన్ ధన్యతరం తు తమ్ ।
యస్య మిత్రగుణాన్ మిత్రాణ్యమిత్రాశ్చ పరాక్రమమ్ ॥25॥

కథయన్తి సదా సత్సు పుత్రవాంస్తేన వై పితా ।
తస్యోపకారిణః కచ్చిద్భవద్భ్యామభివాంఛితమ్ ॥26॥

కించిన్నిష్పాదితం వత్సౌ పరితోషాయ చేతసః ।

పరోక్షమందు ఎవరి గుణములను స్నేహితులు కీర్తించెదరో, శత్రువులు గూడా ఎవరి పరాక్రమమును గూర్చి చెప్పెదరో, ఎవరిలో శాస్త్రశీలములు సమానముగా ఉండునో వారు ధన్యులని నేను తలచుచున్నాను. అట్టి సద్గుణములు కలిగిన కుమారుడు గల తండ్రియే తండ్రి. ఓ కుమారులారా ! అట్టి సద్గుణములు కలిగి ఉపకార స్వభావము కలిగిన రాకుమారునికి అతడి మనఃప్రీతికొరకై అతడికిష్టమైన దానిని మీరేమైనా నెరవేర్చితిరా?

స ధన్యో జీవితం తస్య తస్య జన్మసు జన్మనః ॥27॥

యస్యార్థినో న విముఖా మిత్రార్థే న చ దుర్బలః ।
మద్గృహే యత్సువర్ణాది రత్నం వాహనమాసనమ్ ॥28॥

యద్వాన్యత్ప్రీతయే తస్య తద్దేయమవిశఙ్కయా ।
ధిక్తస్య జీవితం పుంసో మిత్రాణామపకారిణః ॥29॥

ప్రతిరూపమకుర్వన్యో జీవామీత్యవగచ్ఛతి ।
ఉపకారం సుహృద్వర్గేష్వపకారం చ శత్రుషు ॥30॥

నృమేఘో వర్షతి ప్రాజ్ఞస్తస్యేచ్ఛన్తి సదోన్నతిమ్ ।

ఎవనివద్దకు యాచకులు వచ్చి నిరాశతో వెనుతిరగరో, ఎవడు మిత్రుని ప్రయోజనములను నెరవేర్చుటలో సంకోచించడో అతడే ధన్యుడు. అట్టివాని జన్మయే అన్ని జన్మలలోనూ ధన్యము. మన ఇంట ఉన్న బంగారము, రత్నములు, వాహనములు, ఆసనములు మొదలగునవి ఏమైననూ ఆ రాజకుమారునికి ప్రీతిని కలిగించునట్లయినచో వాటిని మీరు నిస్సంకోచముగా ఆ రాకుమారునికి ఇవ్వవచ్చును. స్నేహితులకు అపకారము తలపెట్టు వారి జీవితము వ్యర్థము. ఇంకను ఎవరయితే మిత్రులకు ఉపకారము చేయక తాను జీవించియేయున్నానని భావించునో అట్టివాని జీవితము కూడా వ్యర్థమే. స్నేహితులయందు ఉపకారమును, శత్రువులందు అపకారమును పురుషమేఘములు వర్షించును. జ్ఞానులు ఎల్లప్పుడు స్నేహితుల ఔన్నత్యమును కోరుకొనుచుందురు.

పుత్రావూచతుః ఉవాచ – కుమారులు చెప్పారు.

కిం తస్య కృతకృత్యస్య కర్తుం శక్యేత కేనచిత్ ॥31॥

యస్య సర్వార్థినో గేహే సర్వకామైః సదార్చితాః ।
యాని రత్నాని తద్గేహే పాతాలే తాని నః కుతః ॥32॥

వాహనాసనయానాని భూషణాన్యంబరాణి చ ।
విజ్ఞానం యచ్చ తత్రాస్తి తదన్యత్ర న విద్యతే ॥33॥

ప్రాజ్ఞానామప్యసౌ తాత సర్వసన్దేహహృత్తమః ।
ఏకం తస్యాస్తి కర్తవ్యమసాధ్యం తచ్చ నో మతమ్ ॥34॥

హిరణ్యగర్భగోవిన్దశర్వాదీనాం వరాదృతే ।

ఎవని యింట యాచకులందరు తమ ఇష్టములను పొందుటద్వారా పూజింపబడ్డారో అట్టి కృతకృత్యుడైన వానికి ఎవ్వరు ఏమి చేయగలరు? అతని యింట ఉన్న రత్నములు, వాహనములు, ఆసనములు, యానములు, భూషణములు, వస్త్రములు పాతాలలోకమందు మనకెక్కడున్నవి? అతనికున్నంత విజ్ఞానము మరెవ్వనియందు లేదు. ఓ తండ్రీ ! జ్ఞానుల సందేహాలను గూడ నివృత్తిచేయగల సమర్థుడు ఆ రాజకుమారుడు. ఒక్కటి మాత్రము అతనికి మనము చేయదగినది ఉన్నది. కాని బ్రహ్మవిష్ణుమహేశ్వరుల వరము లేక ఆ కార్యమును సాధించుట మనకు శక్యము గాదని మా అభిప్రాయము.

పితో ఉవాచ – తండ్రి పలికాడు.

తథాపి శ్రోతుమిచ్ఛామి తస్య యత్కార్యముత్తమమ్ ॥35॥

అసాధ్యమథవా సాధ్యం కించాసాధ్యం విపశ్చితామ్ ।
దేవత్వమమరేశత్వం తత్పూజ్యత్వం చ మానవాః ॥36॥

ప్రయాన్తి వాంఛితం చాన్యత్ దృఢం యే వ్యవసాయినః ।
నావిజ్ఞాతం న చాగమ్యం నాప్రాప్యం దివి చేహ వా ॥37॥

ఉద్యతానాం మనుష్యాణాం యతచిత్తేంద్రియాత్మనామ్ ।
యోజనానాం సహస్రాణి యాతి గచ్ఛన్ పిపీలికః ॥38॥

అగచ్ఛన్వైనతేయోఽపి పదమేకం న గచ్ఛతి ।
క్వ భూతలం క్వ చ ధ్రౌవ్యం స్థానం యత్ ప్రాప్నువాన్ ధ్రువః ॥39॥

ఉత్తానపాదనృపతేః పుత్రః సద్భూమిగోచరః ।
తత్కథ్యతాం మహాభాగౌ కార్యవాన్యేన పుత్రకౌ ॥40॥

స భూపాలసుతః సాధుర్యేనానృణ్యం లభేత వామ్ ।

అయినప్పటికీ అసాధ్యమైనా, సాధ్యమైనా ఆ రాకుమారునికి చేయదగిన ఆ ఉత్తమకార్యమేమో వినవలెనని కోరుచున్నాను. ఇంకను జ్ఞానవంతులకు అసాధ్యమేమున్నది? దృఢమైన ప్రయత్నముగల మానవులు దేవత్వము, దేవేంద్రత్వము, దేవపూజ్యత్వము మరియు వేరే తమకిష్టమైనదానిని పొందుచున్నారు. అట్లే పట్టుదలగా ప్రయత్నించే వారికి, ఇంద్రియమనస్సులను నిగ్రహించినవారు అగు పురుషులకు ఈ లోకమందుగాని, స్వర్గలోకమందుగాని తెలియనిదిగాని, చేరరానిదిగాని, పొందరానిదిగాని ఏమియు ఉండదు. చీమయిననూ నడక ప్రారంభించినట్లయిన వేయి యోజనముల దూరమును కూడా చేరగలదు. నడక ప్రారంభించనట్లయిన గరుత్మంతుడయినా ఒక్క అడుగు కూడా ముందుకు వెళ్ళలేడు. భూలోకమందే ఉండు ఉత్తానపాదమహారాజు కుమారుడగు ధ్రువుడు ధ్రువలోకమును (అంతరిక్షమును) పొందెను. భూలోకమెక్కడ? ధ్రువలోకమెక్కడ? అందువలన ఓ కుమారులారా ! ఓ మహాభాగులారా! కావున ఆ రాకుమారుడు ఎట్టి కార్యమును అపేక్షించుచున్నాడో చెప్పండి. మిత్ర ఋణమును మీరు పోగొట్టుకొందురు గాక ! అట్టి రాకుమారుడగు మీ స్నేహితుడు సాధుపురుషుడు.

పుత్రావూచతుః – కుమారులు పలికారు.

తేనాఖ్యాతమిదం తాత పూర్వవృత్తం మహాత్మనా ॥41॥

కౌమారకే యథా తస్య వృత్తం సద్వృత్తశాలినః ।
తస్య శత్రుజితం తాత పూర్వం కశ్చిద్ద్విజోత్తమః ॥42॥

గాలవోఽభ్యాగమద్ధీమాన్ గృహీత్వా తురగోత్తమమ్ ।
ప్రత్యువాచ చ రాజానం సముపేత్యాశ్రమం మమ ॥43॥

ఓ తండ్రీ ! మహాత్ముడగు ఋతధ్వజుడను ఆ రాకుమారుడు తన బాల్యమందు జరిగిన పూర్వవృత్తాంతమును నాకు చెప్పెను. సచ్ఛీలుడయిన ఆ రాకుమారుని తండ్రి శత్రుజిత్తు. పూర్వము ఒకానొకప్పుడు బుద్ధిమంతుడయిన గాలవుడను బ్రాహ్మణశ్రేష్ఠుడు శ్రేష్ఠమైన గుర్రమునొకదానిని తీసుకొని ఆ రాకుమారుని తండ్రి అయిన శత్రుజిత్తువద్దకు ఆ రాకుమారుని ఆశ్రమమునకు వచ్చి ఇట్లు పలికెను.

కోఽపి దైత్యాధమో రాజన్ విధ్వంసయతి పాపకృత్ ।
తత్తద్రూపం సమాస్థాయ సింహే భవనచారిణామ్ ॥44॥

అన్యేషాం చాతికాయానామహర్నిశమకారణాత్ ।

ఓ రాజా ! (ఇది శత్రుజిత్తుకు సంబోధనము). ఎట్టి కారణము లేకుండానే పాపాత్ముడగు ఒక రాక్షసాధముడు అడవియందు సంచరించే సింహము, ఏనుగు మొదలగు వాని రూపములను, మరియు వేరే భయంకరమైన పెద్దశరీరముగలవారి రూపములను ధరించి రాత్రింబవళ్ళు మా వ్రతాచరణములకు భంగమును కలిగించుచున్నాడు.

సమాధిధ్యానయుక్తస్య మౌనవ్రతరతస్య చ ॥45॥

తథా కరోతి విఘ్నాని యథా నేచ్ఛామి పార్థివ ।
దగ్ధుం కోపాగ్నినా సద్యః సమర్థాస్తం వయం న తు ॥46॥

దుఃఖార్జితస్య తపసో వ్యయమిచ్ఛామి పార్థివ ।

ఓ రాజా! నేను యోగసమాధియందు, ధ్యానమందు నిమగ్నమైనప్పుడు, మౌనవ్రతమందు ఆసక్తుడనయినప్పుడు ఆ రాక్షసుడు నాకు ఇష్టములేని విధముగా విఘ్నములను కలిగించుచున్నాడు. తపస్సు ఆచరించు మేము మా కోపాగ్నితో అట్టి రాక్షసాధములను భస్మము చేయుటకు సమర్థులమే. అయినను కష్టముతో సంపాదించిన తపస్సును మేము నష్టపరచుటకు ఇష్టపడకున్నాము.

ఏకదా మయా రాజన్నతినిర్విణ్ణచేతసా ॥47॥

తత్క్లేశితేన నిశ్వాసో నిరీక్ష్యాంబరముజ్ఝితః ।
తతోఽంబరతలాత్సద్యః పతితోఽయం తురంగమః ॥48॥

ఓ రాజా! ఆ రాక్షసాధముని కారణముగా నేను ఒకనాడు మిక్కిలి దుఃఖితుడనైయున్నప్పుడు, ఆ రాక్షసుడు పెట్టు కష్టముల వలన ఆకాశమును చూచి వేటి నిట్టూర్పును విడిచిపెట్టితిని. ఆ వెంటనే ఆకాశమునుండి ఈ గుఱ్ఱము క్రిందకు పడినది.

వాక్చాశరీరిణీ ప్రాహ నరనాథ ! శృణుష్వ తత్ ।
అశ్రాన్తస్సకలం భూమేర్వలయం తురగోత్తమః ॥49॥

సమర్థః క్రాంతుమర్కేణ తవాయం ప్రతిపాదితః ।
పాతాలాంబరతోయేషు నాస్య ప్రతిహతా గతిః ॥50॥

ఓ మహారాజా ! (గాలవముని శత్రుజిన్మహారాజుకు చేసిన సంబోధనమిది). అంతట ఆకాశవాణి నాతో పలికిన పలుకులను చెప్పెదను వినుము. "ఈ శ్రేష్ఠమైన గుఱ్ఱము ఎట్టి శ్రమ లేకుండియే సూర్యునితోబాటు భూమండలమంతటిని తిరిగి వచ్చుటకు సమర్థమైనది. అట్టి గుఱ్ఱము నీకు (అనగా గాలవమునికి) ఇవ్వబడుచున్నది. పాతాలము, ఆకాశము, జలములందు అడ్డులేని గమనము కలిగినది ఈ గుఱ్ఱము.

సమస్తదిక్షు వ్రజతో న సంగః పర్వతేషు చ ।
యతో భూవలయం సర్వమశ్రాంతోఽయం చరిష్యతి ॥51॥

తతః కువలయో నామ్నా ఖ్యాతిం లోకేషు యాస్యతి ।
క్లిశ్నాత్యహర్నిశం పాపో యశ్చ త్వాం దానవాధమః ॥52॥

తమప్యేనం సమారుహ్య ద్విజశ్రేష్ఠ హనిష్యతి ।
శత్రుజిన్నామ భూపాలస్తస్య పుత్ర ఋతధ్వజః ॥53॥

ప్రాప్యైతదశ్వరత్నం చ ఖ్యాతిమేతేన యాస్యతి ।

"సమస్తదిక్కులందు సంచరించుచున్నప్పటికీ ఈ గుఱ్ఱమునకు పర్వతాలతోగాని మరి ఏ ఇతరమైనవాటితోగాని సంసర్గము లేదు. అనగా అవి అడ్డు రావు. ఎట్టి శ్రమ లేకయే భూమండలమంతటియందు సంచరించును గావునే ఈ గుఱ్ఱము లోకములందు కువలయమను ప్రసిద్ధిని పొందగలదు. ఓ బ్రాహ్మణశ్రేష్ఠుడా ! (గాలవమునికి సంబోధనమిది). శత్రుజిత్తను మహారాజు ఒకడు గలడు. అతని కుమారుడే ఋతధ్వజుడు. ఏ రాక్షసాధముడయితే నిన్ను (అనగా గాలవమునిని) రాత్రింబవళ్ళు కష్టములను పెట్టుచున్నాడో ఆ రాక్షసాధముణ్ణి ఆ ఋతధ్వజుడను రాకుమారుడు ఈ శ్రేష్ఠమైన అశ్వమును అధిరోహించి చంపివేసి మిక్కిలి ప్రసిద్ధిని పొందగలడు." (ఇంతవరకు ఆకాశవాణి గాలవమునితో పలికిన పలుకులు పూర్తి అయినవి).

సోఽహం త్వామనుసంప్రాప్తస్తపసో విఘ్నకారిణమ్ ॥54॥
త్వం నివారయ భూపాల ! భాగభృఙ్నృపతిర్యతః ।

తదేతదశ్వరత్నం తే మయా భూప నివేదితమ్ ॥55॥

పుత్రమాజ్ఞాపయ తథా యథా ధర్మో న లుప్యతే ।

ఓ మహారాజా ! (గాలవముని శత్రుజిన్మహారాజుకు చేసిన సంబోధనమిది). అట్టి నేను నిన్ను సమీపించితిని. నా తపస్సుకు విఘ్నములను కలిగించునట్టి ఆ రాక్షసాధముణ్ణి సంహరించుము. ఎందువలననగా రాజు మేమార్జించిన సంపదలలో (తపస్సులలో) కూడా భాగమును గ్రహించువాడు కదా ! ఓ మహారాజా ! ఇట్టి అశ్వరత్నమును నేను నీకు ఇచ్చుచున్నాను. ధర్మమునకు లోపము కలుగకుండు విధముగా ఆ రాక్షసాధముణ్ణి సంహరించుటకై నీ కుమారుని (ఋతధ్వజుని) ఆజ్ఞాపింపుము.

స తస్య వచనాద్రాజా తం వై పుత్రమృతధ్వజమ్ ॥56॥
తదశ్వరత్నమారోప్య కృతకౌతుకమఙ్గలమ్ ।

స ప్రైషయత ధర్మాత్మా గాలవేన సమం తదా ॥57॥
స్వమాశ్రమపదం సోఽపి తమాదాయ యయౌ మునిః ॥58॥

అప్పుడు ధర్మాత్ముడగు ఆ రాజు శత్రుజిత్తు గాలవముని మాటలననుసరించి తన కుమారుడగు ఋతధ్వజునికి మంగళకార్యములను ఆచరింపచేసి అతడిని ఆ అశ్వరత్నమందు ఆరోపింపచేసి గాలవుని వెంట పంపించెను. ఆ ముని కూడా ఆ కుమారుని తీసుకొని తన ఆశ్రమమునకు వెళ్ళెను.

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే మదాలసోపాఖ్యానే కువలయాశ్వీయే అష్టాదశోఽధ్యాయః ॥18॥

శ్రీ మార్కండేయ మహాపురాణమందు మదాలసోపాఖ్యానమందలి కువలయాశ్వచరితమను పద్దెనిమిదవ అధ్యాయం సమాప్తం.



ఏకోనవింశోఽధ్యాయః – పంతొమ్మిదవ అధ్యాయం
కువలయాశ్వవివాహచరితమ్ – కువలయాశ్వుని వివాహ వృత్తాంతం

పితా ఉవాచ – తండ్రి పలికాడు.

గాలవేన సమం గత్వా నృపపుత్రేణ తేన యత్ ।
కృతం తత్కథ్యతాం పుత్రౌ విచిత్రాయుధయోధినా ॥1॥

ఓ కుమారులారా ! విచిత్రములైన ఆయుధములతో యుద్ధము చేయు స్వభావముగల ఆ ఋతధ్వజుడను రాకుమారుడు గాలవమునితో వెళ్ళి ఏమి చేసెనో మీరు చెప్పుడు.

పుత్రావూచతుః – కుమారులు పలికారు.

స గాలవాశ్రమే రమ్యే తిష్ఠన్ భూపాలనన్దనః ।
సర్వవిఘ్నోపశమనం చకార బ్రహ్మవాదినామ్ ॥2॥

ఆ రాకుమారుడు మనోహరమగు ఆ గాలవమునియొక్క ఆశ్రమమందు నివసించుచున్నవాడై వేదవేత్తలగు మునులందరికీ ఎట్టి విఘ్నములు లేకుండా చేసెను.

వీరం కువలయాశ్వం తం వసన్తం గాలవాశ్రమే ।
మదావలేపోపహతో నాజానాద్దానవాధమః ॥3॥

వీరుడైన ఆ కువలయాశ్వుడు (కువలయమనుపేరుగల గుర్రముగల ఋతధ్వజుడు) గాలవముని ఆశ్రమములో నివసించుచున్నాడను విషయమును మదంతో గర్వంతో నశించిన బుద్ధిగల ఆ రాక్షసాధముడు తెలుసుకొనలేకపోయెను.

తతస్తం గాలవం విప్రం సంధ్యోపాసనతత్పరమ్ ।
సౌకరం రూపమాస్థాయ ప్రధర్షయితుమాగమత్ ॥4॥

అంతట ఆ రాక్షసుడు పంది రూపమును ధరించి సంధ్యోపాసనయందు ఆసక్తుడైనట్టి ఆ బ్రాహ్మణుడైన గాలవమునిని ఎదిరించుటకు ఆ మునియొక్క ఆశ్రమమునకు వచ్చెను.

మునిశిష్యైరథోత్కృష్టే శీఘ్రమారుహ్య తం హయమ్ ।
అన్వధావద్వరాహం తం నృపపుత్రః శరాసనీ ॥5॥

ఆజఘాన చ బాణేన చంద్రార్ధాకారవర్చసా ।
ఆకృష్య బలవచ్చాపం చారుచిత్రోపశోభితమ్ ॥6॥

నారాచాభిహతః శీఘ్రమాత్మత్రాణపరో మృగః ।
గిరిపాదపసంబాధాం సోఽత్యక్రామన్మహాటవీమ్ ॥7॥

అంతట గాలవమునిశిష్యులు గట్టిగా కేకలు వేయగా ఆ రాజకుమారుడగు ఋతధ్వజుడు బాణములను చేతబూని ఆ గుర్రమును వెంటనే అధిరోహించి ఆ వరాహమున్నచోటికి పరుగెత్తెను. మిక్కిలి చిత్రముగా

ప్రకాశించుచున్న బలీయమైన వింటిని లాగి అర్ధచంద్రాకారతేజస్సుతో ప్రకాశించుచున్న బాణముతో ఆ రాక్షసుని కొట్టెను. లోహమయమయిన బాణముతో కొట్టబడిన ఆ క్రూరజంతువు ఆ వెంటనే తనను తాను రక్షించుకొనుటకై పర్వతాలు, చెట్లతో దట్టముగా ఉండి ప్రవేశించుటకు కూడా వీలుకాని ఆ మహారణ్యమును దాటి పారిపోయెను.

తమన్వధావద్వేగేన తురగోఽసౌ మనోజవః ।
చోదితో రాజపుత్రేణ పితురాదేశకారిణా ॥8॥

మనస్సుతో సమానమైన వేగముగల ఆ కువలయమను పేరుగల గుర్రము తండ్రి ఆజ్ఞను పరిపాలించునట్టి ఆ రాకుమారునిచేత ప్రేరేపింపబడినదై వేగముగా ఆ రాక్షసుని అనుసరించి పరుగెత్తెను.

అతిక్రమ్యాథ వేగేన యోజనాని సహస్రశః ।
ధరణ్యాం వివృతే గర్తే నిపపాత లఘుక్రమః ॥9॥

పిమ్మట ఆ రాక్షసాధముడు వేలకొలది యోజనములను వేగముగా ప్రయాణించి, వేగముతో చూచుకొనక తెరచికొనియున్న గోతిలో పడిపోయెను.

తస్యానన్తరమేవాఽథ స చాశ్వీ నృపతేః సుతః ।
నిపపాత మహాగర్తే తిమిరౌఘసమావృతే ॥10॥

అశ్వారూఢుడయిన ఆ రాకుమారుడు గూడా ఆ రాక్షసుని వెంబడిస్తూ కటిక చీకటిగా ఉన్న ఆ గోతిలోనే పడిపోయాడు.

తతో నాదృశ్యత మృగః స తస్మిన్రాజసూనునా ।
ప్రకాశం చ స పాతాలమపశ్యత్తత్ర చార్చిషా ॥11॥

అక్కడ ఆ క్రూరమృగము రాకుమారునికి కనిపించలేదు. ఆ రాకుమారుడక్కడ కాంతులు విరజిమ్మే పాతాలలోకమును కూడా చూచెను.

తతోఽపశ్యత్స సౌవర్ణం ప్రాసాదశతసంకులమ్ ।
పురందరపురప్రఖ్యం పురం ప్రాకారశోభితమ్ ॥12॥

అనంతరము వందలకొలదీ బంగారు భవనములతో కూడుకొన్నదీ, అందమైన ప్రాకారములతో (ప్రహరగోడలు) ప్రకాశించుచున్నదీ అమరావతీనగరంవలె ఉన్నదీ అయిన పట్టణమును చూచెను.

తత్ప్రవిశ్య చ నాపశ్యత్తత్ర కంచిన్నరం పురే ।
భ్రమతా చ తతో దృష్టా తత్ర యోషిత్త్వరాన్వితా ॥13॥

ఆ పట్టణంలో ప్రవేశించిన ఆ రాజకుమారుడికి అక్కడ మనుష్యులెవ్వరూ కనపడలేదు. కాని ఆ పట్టణంలో తిరుగుతూ హడావిడి పడుతున్న ఒక స్త్రీ (చెలికత్తె) కనబడింది.

సా పృష్టా తేన తన్వఙ్గీ ప్రస్థితా క్వేతి కస్య వా ।
నోవాచ కించిత్ప్రాసాదమారురోహ చ భామినీ ॥14॥

నీవెవరవు, ఎక్కడికి వెళ్ళుచున్నావు అని ఆ స్త్రీని రాకుమారుడు ప్రశ్నించెను. కాని ఆమె ఏమీ బదులివ్వకుండగానే మేడపైకి వెళ్ళిపోయింది.

సోఽప్యశ్వమేకతో బద్ధ్వా తామేవానుససార వై ।
విస్మయోత్ఫుల్లనయనో నిశ్శంకో నృపతేస్సుతః ॥15॥

ఆ రాకుమారుడు కూడా గుర్రమునొకచోట బంధించి, ఆశ్చర్యముతో వికసించిన కన్నులు గలవాడై, ఎంతమాత్రం సంశయించకుండా ఆ స్త్రీనే అనుసరించి వెళ్ళెను.

తతోఽపశ్యత్సువిస్తీర్ణే పర్యంకే సర్వకాంచనే ।
నిషణ్ణాం కన్యకామేకాం కామయుక్తాం రతిం యథా ॥16॥

విస్పష్టేందుముఖీం సుభ్రూం పీనశ్రోణీపయోధరామ్ ।
బింబాధరౌష్ఠీం తన్వంగీం నీలోత్పలవిలోచనామ్ ॥17॥

రక్తతుంగనఖాం శ్యామాం మృదుతామ్రకరాంఘ్రికామ్ ।
కరభోరుం సుదశనాం నీలసూక్ష్మస్థిరాలకామ్ ॥18॥

అంతట ఆ రాకుమారుడు వికసించిన చంద్రునివంటి ముఖంగలదీ, అందమైన కనుబొమలు గలదీ, బలిసిన పిరుదులు వక్షోజములు గలదీ, దొండపండువంటి పెదవులు గలదీ, సన్నని శరీరము గలదీ, నల్లని కలువవంటి కన్నులు గలదీ, ఎర్రని ఎత్తైన గోళ్ళు గలదీ, నవయౌవనవతి, తామ్రవర్ణమువంటి వర్ణముగల హస్తములు పాదములు గలదీ, ఏనుగుతొండమువంటి తొడలుగలదీ, అందమైన దంతములు గలదీ, నల్లని సన్నని కదలకయున్న ముంగురులు కలదీ అయిన ఒక కన్యకను చూసాడు. ఆమె బంగారపు ఆసనంమీద కూర్చొని ఉంది. శృంగారసౌందర్యంతో రతీదేవివలే ఉంది.

తాం దృష్ట్వా చారుసర్వాంగీమనంగాంగలతామివ ।
సోఽమన్యత్పార్థివసుతస్తాం రసాతలదేవతామ్ ॥19॥

అందమైన సమస్త అవయవములు గలదీ, మన్మథలతలా ఉన్న ఆ సుందరిని జూచి రాజకుమారుడు ఆమెను పాతాలలోకముయొక్క దేవతయా అన్నట్లు తలచెను.

సా చ దృష్ట్వైవ తం బాలా నీలకుఞ్చితమూర్ధజమ్ ।
పీనోరస్స్కన్ధబాహుం తమమంస్త మదనం శుభా ॥20॥

మంగళస్వరూపురాలగు ఆ కన్యకయు నల్లని ఉంగరాలజుట్టుతో, బలిసిన వక్షఃస్థలము, భుజములు, బాహువులతో ఉన్న ఆ రాకుమారుణ్ణి జూచి అతడు మన్మథుడనియే తలపోసింది.

ఉత్తస్థౌ చ శుభాచారా చిత్తక్షోభమవాప సా ।
లజ్జావిస్మయదైన్యానాం సద్యస్తన్వీ వశంగతా ॥21॥

అంతేకాదు శుభాచారాలుకల ఆ సుందరి అతణ్ణిచూసి సిగ్గుపడుతూ ఆశ్చర్యపడుతూ దీనంగా లేచి నిలబడింది. ఎంతో కలత చెందింది కూడా.

కోఽయం దేవోఽథ యక్షోఽను గంధర్వో వోరగోఽపి వా ।
విద్యాధరో వా సంప్రాప్తః కృతపుణ్యాపతిర్నరః ॥22॥

ఎవరితడు? ఇచ్చటకు వచ్చిన ఇతడు దేవుడా? యక్షుడా? గంధర్వుడా? నాగలోకవాసియగు సర్పమా? విద్యాధరుడా? లేక పుణ్యస్త్రీభర్తయా?

ఏవం విచిన్త్య బహుధా నిశ్శ్వస్య చ మహీతలే ।
ఉపవిశ్య తదా భేజే సా మూర్ఛామ్మదిరేక్షణా ॥23॥

ఈ విధముగా మత్తెక్కిన కన్నులు గల ఆ కన్యక అనేకపర్యాయములాలోచించి, నిట్టూర్పులను విడిచి, నేలపై కూర్చొని మూర్ఛబోయెను.

సోఽపి కామశరాఘాతమవాప్య నృపతేస్సుతః ।
తాం సమాశ్వాసయామాస న భేతవ్యమితి బ్రువన్ ॥24॥

శత్రుజిన్మహారాజుయొక్క కుమారుడగు ఆ ఋతధ్వజుడను రాకుమారుడు కూడా మన్మథబాణములచే కొట్టబడినవాడై, ఆ కన్యకను భయపడవలదని ఓదార్చెను.

సా చ స్త్రీ యదా దృష్టా పూర్వం తేన మహాత్మనా ।
తాలవృంతముపాదాయ పర్యవీజయదాకులా ॥25॥

మహాత్ముడగు ఆ రాకుమారునిచే పూర్వము చూడబడిన ఆ కన్యక స్నేహితురాలు (చెలికత్తె) వ్యాకులచిత్తురాలై ఒక విసనకర్రను తీసుకొని ఆ కన్యకను వీచసాగెను.

సమాశ్వస్తా తదా పృష్టా తేన సా మోహకారణమ్ ।
కించిల్లజ్జాన్వితా బాలా తస్యై సఖ్యై న్యవేదయత్ ॥26॥

ఆ చెలికత్తెచే ఓదార్చబడినదై ఆ కన్యక, మోహమునకు గల కారణమును అడుగుటచే కొంచెము సిగ్గుతో కూడినదై అందుకు గల కారణమును ఆమె తన స్నేహితురాలికి చెప్పెను.

సా చాస్మై కథయామాస నృపపుత్రాయ విస్తరాత్ ।
మోహస్య కారణం సర్వం తద్దర్శనసముద్భవమ్ ॥27॥

యథా తయా సమాఖ్యాతం తద్వృత్తాంతం చ భామినీ ।

రాకుమారుని చూచినందువలన కలిగిన మోహమునకు గల కారణమంతటినీ ఆ చెలికత్తె రాకుమారునికి విస్తృతముగా చెప్పెను. అట్లే ఆ కన్యక వృత్తాంతమంతటినీ కూడా ఆ చెలికత్తె ఈ విధముగా చెప్పెను.

సఖ్యువాచ – చెలికత్తె చెప్పెను.

విశ్వావసురితి ఖ్యాతో దివి గంధర్వరాట్ప్రభో ॥28॥

తస్యేయమాత్మజా సుభ్రూర్నామ్నాఖ్యాతా మదాలసా ।
వజ్రకేతోః సుతశ్చోగ్రో దానవోఽరివిదారణః ॥29॥

పాతాలకేతుర్విఖ్యాతః పాతాలాంతరసంశ్రయః ।

ఓ ప్రభూ ! స్వర్గమందు విశ్వావసువని ప్రసిద్ధిపొందిన గంధర్వరాజొకడు గలడు. మదాలసయను పేరుతో ప్రసిద్ధురాలగు అందమైన కనుబొమలు గల ఈమె ఆ విశ్వావసుని కుమార్తె. శత్రుసంహారకుడూ, వజ్రకేతుని కుమారుడూ అగు పాతాలకేతువను రాక్షసుడు పాతాలమందు నివసించుచున్నాడు.

తేనేయముద్యానగతా కృత్వా మాయాం తమోమయీమ్ ॥30॥

అపహృత్య సమానీతా బాలేయం దుష్టబుద్ధినా ।
ఆగామిన్యాం త్రయోదశ్యాముద్వక్ష్యతి కిలాసురః ॥31॥

ఆమె ఒకనాడు ఉద్యానవనమునకు వెళ్ళగా దుష్టబుద్ధిగల ఆ రాక్షసుడు మాయతో చీకటిని సృష్టించి ఆమెను అపహరించి ఇచ్చటకు తీసుకొని వచ్చెను. వచ్చే త్రయోదశినాడు ఆ రాక్షసుడు ఈమెను వివాహము చేసుకొనునట.

స తు నార్హతి చార్వఙ్గీం శూద్రో వేదశ్రుతిం యథా ।
అతీతే చ దినే బాలాం చాత్మవ్యాపాదనోద్యతామ్ ॥32॥

సురభిః ప్రాహ నాయం త్వాం ప్రాప్స్యతే దానవాధమః ।
మర్త్యలోకమనుప్రాప్త య ఏనం భేత్స్యతే శరైః ॥33॥

స తే భర్తా మహాభాగే హ్యచిరేణ భవిష్యతి ।

శూద్రుడు వేదశ్రవణమునకు అర్హుడు కానట్లుగా, ఆ రాక్షసుడు సౌందర్యవతియగు ఈమెను పెండ్లాడుటకు అర్హుడు కాడు. క్రిందటిరోజున ఆత్మహత్యకు పాల్పడిన ఈమెను వారించుచూ సురభి (కామధేనువు) ఇట్లు పలికెను. "ఓ మహాభాగురాలా ! రాక్షసాధముడు నిన్ను పొందలేడు. మనుష్యలోకమునుండి వచ్చినవాడు బాణములతో ఈ రాక్షసాధముని వధించగలడు. అచిరకాలంలో అతడే నీకు భర్త కాగలడు" అని.

అహం త్వస్యాః సఖీ నామ్నా కుండలేతి మనస్వినీ ॥34॥

సుతా వింధ్యవతః పత్నీ వీరపుష్కరమాలినః ।
హతే భర్తరి శుంభేన తీర్థాత్తీర్థమనువ్రతా ॥35॥

చరామి దివ్యయా గత్యా పరలోకార్థముద్యతా ।
పాతాలకేతుర్దుష్టాత్మా వారాహం వపురాస్థితః ॥36॥

కేనాపి విద్ధో బాణేన మునీనాం త్రాణకారణే ।
తథాహం తత్త్వతోఽన్విష్య త్వరితాహమిహాగతా ॥37॥

సత్యమేవ స కేనాపి తాడితో దౌష్ట్యమాచరన్ ।
ఇయం చ మూర్ఛామగమద్యేన తత్కారణం శృణు ॥38॥

అభిమానవంతురాలగు నేను కుండలయను పేరుగలదానిని, ఈ కన్యకయొక్క చెలికత్తెను. నేను వింధ్యవంతుని కుమార్తెను, వీరుడైన పుష్కరమాలియొక్క భార్యను. శుంభాసురుడు నా భర్తను వధించగా వ్రతాచరణలో, పారమార్థికమును పొందవలెనను ప్రయత్నములో దివ్యమైన గమనముగలదాననై ఒక తీర్థమునుండి మరొక తీర్థమునకు సంచరించుచున్నాను. వరాహరూపమును ధరించిన దుర్మార్గుడైన పాతాలకేతువను రాక్షసుని మునులను రక్షించుటకై ఎవరో బాణముతో కొట్టిరి. అంతట నేను నిజమును తెలుసుకొని తొందరగా ఇచ్చుటకు వచ్చితిని. దుష్టత్వమునాచరించుచున్న ఆ రాక్షసుడు ఎవరిచేతనో కొట్టబడి చంపబడినాడు. ఇది నిజము. ఇక ఈ కన్యక ఎందువలన మూర్ఛను (మోహమును) పొందినదో చెప్పెదను. వినుము.

త్వయి ప్రీతిమతీ బాలా దర్శనాదేవ మానవ ।
దేవపుత్రోపమే చారువాక్యరూపాదిశాలిని ॥39॥

భార్యా చాన్యస్య విహితా యేన విద్ధస్స దానవః ।
ఏతస్మాత్కారణాన్మోహం మహాన్తమియమాగతా ॥40॥

ఓ మానవుడా! నిన్ను చూచినంతనే ఈ బాల దేవపుత్రునితో సమానత్వము, మనోహరములయిన వాగ్రూపములు గల నీయందు ప్రీతిగలది అయ్యెను. కాని ఈ రాక్షసుని ఎవరు చంపిరో అట్టివాడే అతనికి ఈమె భార్య కావలసియున్నది. అందువల్లనే ఈమె గొప్ప మోహమును పొందినది.

యావజ్జీవం చ తన్వఙ్గీ దుఃఖమేవోపభోక్ష్యతి ।
త్వయ్యస్యా హృదయం రాగి భర్తా చాన్యో భవిష్యతి ॥41॥

యావజ్జీవమతో దుఃఖం సురభ్యా నాన్యథా వచః ।
అహం త్వస్యాః ప్రభో ప్రీత్యా దుఃఖితాఽత్ర సమాగతా ॥42॥

నీవు తప్ప ఇతరుడు భర్తయైనచో ఈ సుందరాంగి జీవితాంతము దుఃఖమునే పొందగలదు. నీయందు ఈమె హృదయము అనురాగభరితమైయున్నది. మరొకడు భర్త కావచ్చును. అందువల్ల బ్రతికియున్నంతకాలము ఈమె దుఃఖమునే పొందగలదు. సురభియొక్క మాటలు వ్యర్థములు కానేరవు. ఓ ప్రభూ ! ఈమెయందలి ప్రీతితో దుఃఖితురాలనై నేనిచ్చుటకు వచ్చితిని.

యతో విశేషో నైవాస్తి స్వసఖీనిజదేహయోః ।
యద్యేషాఽభిమతం వీరం పతిమాప్నోతి శోభనా ॥43॥

తతస్త్వహం తపః కుర్యాం నిర్వ్యలీకేన చేతసా ।
త్వం తు కో వా కిమర్థం వా సంప్రాప్తోఽత్ర మహామతే ॥44॥

దేవో దైత్యోఽను గంధర్వః పన్నగః కిన్నరోఽపి వా ।
న హ్యత్ర మానుషగతిర్న చేద్వృజ్మానుషీ గతిః ॥45॥

తత్త్వమాఖ్యాహి కోఽసి త్వం యథైవావితథం మయా ।

నా స్నేహితురాలు, నా దేహము ఈ రెంటికీ భేదము లేదు గావున నేనింతగా దుఃఖించుచుంటిని. మంగళస్వరూపురాలగు ఈమె తనకిష్టమైన వీరుని భర్తగా పొందినట్లయిన, నేను ఎట్టి వ్యాకులత లేని చిత్తముతో తపస్సును చేసుకొనగలను. ఓ బుద్ధిమంతుడా! నీవెవరవు? ఇచ్చటకెందులకు వచ్చితివి? నీవు దేవుడివా? రాక్షసుడివా? గంధర్వుడివా? నాగరాజువా? కిన్నరుడివా? ఇచ్చటికి మనుష్యులెవరూ ప్రవేశించలేరు. నీవంటి మనుష్యశరీరము ఇచ్చట ఉండదు. నేను నిజమును చెప్పినట్లుగ నీవు కూడా నిజమునే పలుకుము. నీవెవరవో చెప్పుము.

కువలయాశ్వ ఉవాచ – కువలయాశ్వుడు పలికాడు.

యన్మాం పృచ్ఛసి ధర్మజ్ఞే కస్త్వం కిం వా సమాగతః ॥46॥

తచ్ఛృణుష్వామలప్రజ్ఞే కథయామ్యాదితస్తవ ।
రాజ్ఞః శత్రుజితః పుత్రః పిత్రా సంప్రేషితః శుభే ॥47॥

ఓ ధర్మమునెరిగినదానా! నీవెవరవు, ఎందుకువచ్చినావని నీవు నన్ను అడుగుచున్నావు. ఓ స్వచ్ఛమైన జ్ఞానముగలదానా! క్రమముగా మొదటినుంచి నా వృత్తాంతమును చెప్పెదను, విను. ఓ శుభస్వరూపురాలా! శత్రుజిత్తను రాజుయొక్క కుమారుడను. నా తండ్రి నన్ను పంపినాడు.

మునిరక్షణముద్దిశ్య గాలవాశ్రమమాగతః ।
కుర్వతో మమ రక్షాం చ మునీనాం ధర్మచారిణామ్ ॥48॥

విఘ్నార్థమాగతః కోఽపి సౌకరం వపురాస్థితః ।
మయా స విద్ధో బాణేన చంద్రార్ధాకారవర్చసా ॥49॥

అపక్రాన్తోఽతివేగేన తమస్యనుగతో హయీ ।
పపాత సహసా గర్తే సక్రోధోఽశ్వశ్చ మామకః ॥50॥

మునులను రక్షించుటకై నేను గాలవమున్యాశ్రమమునకు వచ్చితిని. ధర్మాచారపరాయణులైన మునులను నేను రక్షించుచుండగా వరాహరూపమును ధరించిన ఒకానొకడు మునులకు విఘ్నమును కల్గించుటకై వచ్చెను. అర్ధచంద్రాకారతేజస్సుతో ప్రకాశించుచున్న బాణముతో అతడు నాచేత కొట్టబడినాడు. అతడు మిక్కిలి వేగముతో

చీకటియందు దాటి వెళ్ళిపోగా, నేను అశ్వారూఢుడనై అతడిని అనుసరించితిని. అంతట అతడు ఒక గోతిలో పడగా, క్రోధముతో కూడుకొన్న నేను, నా గుర్రము ఇరువురము కూడా గోతిలో పడితిమి.

సోఽహమశ్వం సమారూఢస్తమస్యేకః పరిభ్రమన్ ।
ప్రకాశమాసాదితవాన్దృష్టావి చ భవతీ మయా ॥51॥

పృష్టా చ న చ మే కించిద్భవత్యా దత్తముత్తరమ్ ।
త్వాం చైవానుప్రవిష్టోఽహమిమం ప్రాసాదముత్తమమ్ ॥52॥

ఇత్యేతత్కథితం సత్యం న దేవోఽహం న దానవః ।
న పన్నగో న గంధర్వః కిన్నరో వా శుచిస్మితే ॥53॥

సమస్తాః పూజ్యపక్షా వై దేవాద్యా మమ కుండలే ।
మనుష్యోఽస్మి విశంకా తే న కర్తవ్యాఽత్ర కర్హిచిత్ ॥54॥

అటు పిమ్మట నేను అశ్వమునధిరోహించి చీకటియందు ఒంటరిగా సంచరించుచుండగా వెలుతురును పొందితిని. అంతట నిన్ను నేను చూచి అడిగితిని. కాని నీవేమి సమాధానమూ ఇవ్వలేదు. నిన్నే అనుసరించుచూ ఉత్తమమైన ఈ భవనమును ప్రవేశించితిని. ఈ నేను చెప్పినదంతయు నిజము. నేను దేవుడను కాను, రాక్షసుడను కాను, నాగరాజును కాను, గంధర్వుడను కాను, కిన్నరుడను కాను. ఓ అందమైన చిరునవ్వుగలదానా! కుండలా! దేవతలు మొదలుగాగల వారందరు నాకు పూజ్యులే. నేను మానవుడను. ఈ విషయమందు నీకెట్టి సందేహమూ వలదు.

పుత్రావూచతుః – కుమారులు చెప్పారు.

తతః ప్రహృష్టా సా కన్యా సఖీవదనముత్తమమ్ ।
లజ్జాజడం వీక్షమాణా కించిన్నోవాచ భామినీ ॥55॥

ఓ తండ్రీ ! అంతట మిక్కిలి సంతోషించిన ఆ కన్యక మదాలస సిగ్గుతో జడమైనదీ, ఉత్తమమైనదీ అయిన తన స్నేహితురాలి ముఖమును చూచుచున్నదై ఏమియు పలుకలేదు.

తత్సఖీ పునరప్యేనాం ప్రహృష్టా ప్రత్యువాచ హ ।
యథావత్కథితం తేన సురభ్యా వచనానుగమ్ ॥56॥

అంతట ఆ చెలికత్తె మిక్కిలి సంతోషించినదై తిరిగి ఆ కన్యకతో "సురభియొక్క మాటను అనుసరించువిధముగా ఈతడు యథార్థమునే చెప్పెను" అని పలికెను.

కుండలా ఉవాచ – కుండల (చెలికత్తె) పలికెను.

వీర! సత్యమసందిగ్ధం భవతాఽభిహితం వచః ।
నాన్యత్ర హృదయం హ్యస్యా దృష్ట్వా ధైర్యం ప్రయాస్యతి ॥57॥

ఓ వీరుడా! నీవు ఎట్టి సందేహము లేక నిజమునే పలికితివి. కానిచో మరియొకరిని చూచి, ఈమె హృదయము అట్టి వేరేవానియందు ధైర్యమును పొందలేదు కదా!

చంద్రమేవాధికా కాన్తిః సముపైతి రవిం ప్రభా ।
భూతిర్ధన్యం ధృతిర్ధీరం క్షాన్తిరభ్యేతి చోత్తమమ్ ॥58॥

మిక్కిలి అధికమైన కాంతి చంద్రుడినే పొందును. అట్లే తేజస్సు సూర్యుని, ఐశ్వర్యము ధన్యపురుషుని, ధైర్యము ధీరుని, ఓర్పు ఉత్తమపురుషుని పొందును.

త్వయైవ విద్ధోఽసందిగ్ధం స పాపో దానవాధమః ।
సురభిస్సా గవాం మాతా కథం మిథ్యా వదిష్యతి? ॥59॥

నిస్సందేహముగా నీవే పాపియగు ఆ రాక్షసాధముణ్ణి సంహరించితివి. గోమాతయగు ఆ సురభి అసత్యమునెట్లు పలుకును?

తద్ధన్యేయం సభాగ్యా చ త్వత్సంబంధమవేత్య వై ।
కురుష్వ వీర యత్కార్యం విధినైవ సమాహితమ్ ॥60॥

ఓ వీరుడా! ఈ కారణముచేత నీతోడి సంబంధమును పొంది ఈ కన్యక ధన్యురాలు, భాగ్యవంతురాలు అయినది. శాస్త్రోక్తప్రకారము చేయవలసినది చేయుము.

పుత్రావూచతుః – కుమారులు చెప్పారు.

పరవానహమిత్యాహ రాజపుత్రస్సదా పితుః ।
సా చ తం చిన్తయామాస తుంబురుం తత్కులే గురుమ్ ॥61॥

అంతట శత్రుజిత్తుయొక్క పుత్రుడు ఋతధ్వజుడను ఆ రాకుమారుడు "నేనిపుడు ఇతరుల సొత్తు అయితిని" అని పలికెను. ఆ కుండల కూడా వారి కులగురువగు తుంబురుని స్మరించెను.

స చాపి తత్క్షణాత్ ప్రాప్తో నిగృహీతసమిత్కుశః ।
మదాలసాయాః సంప్రీత్యా కుండలాగౌరవేణ చ ॥62॥

ఆ తుంబురుడు కూడా ఆ క్షణమందే సమిధలు, దర్భలను చేతబట్టుకొని మదాలసయందలి ప్రీతితోనూ, కుండలయందలి గౌరవముతోనూ వారివద్దకు వచ్చెను.

ప్రజ్వాల్య పావకం హుత్వా మంత్రవిత్కృతమంగలామ్ ।
వైవాహికే విధౌ కన్యాం ప్రతిపాద్య యథాగతమ్ ॥63॥

జగామ తపసే ధీమాన్ స్వమాశ్రమపదం తతః ।
సా చాహ తాం సఖీ బాలాం కృతార్థాస్మి వరాననే ॥64॥

సంయుక్తామమునా దృష్ట్వా త్వామహం రూపశాలినీమ్ ।
తపస్తప్స్యే౽హమతులం నిర్వ్యలీకేన చేతసా ॥65॥

తీర్థాంబుధౌతపాపా చ భవిత్రీ నేదృశీ యథా ।

మంత్రవేత్తయగు ఆ తుంబరుడు అగ్నిని ప్రజ్వలింపచేసి, అందు హోమము చేసి, శాస్త్రోక్త వివాహవిధి ననుసరించి మంగళాలంకృత అయిన ఆ కన్యకను ఆ రాకుమారునికిచ్చి వివాహము చేసెను. అటుపిమ్మట ధీమంతుడయిన ఆ తుంబరుడు తపస్సును ఆచరించుకొనుటకై తిరిగి తన యాశ్రమమునకు వెళ్ళిపోయెను. చెలికత్తెయగు ఆ కుండల కూడా బాలయగు మదాలసతో ఇట్లు పలికెను. "ఓ అందమైన ముఖముగలదానా ! రూపవతియగు నీవు ఈ రాకుమారునితో సంయోగమును పొందుటను చూచి నేను కృతార్థురాలనయితిని. ఇక ఎట్టి చీకాకు లేని మనస్సుతో గొప్పగా తపస్సునాచరించుకొనెదను. తిరిగి నేనిట్టి స్థితిని అనగా వైధవ్యమును పొందకుండు విధముగా తీర్థజలములందు స్నానమాచరించి పాపములను పోగొట్టుకొనెదను.

కుండలోవాచ – కుండల పలికెను.

తం చాహ రాజపుత్రం సా ప్రశ్రయోపనతం వచః ॥66॥

గంతుకామా నిజసఖీ స్నేహవిక్లబభాషిణీ ।
పుంభిరప్యమితప్రజ్ఞే నోపదేశో భవద్విధే ॥67॥

దాతవ్యః కిముత స్త్రీభిరతో నోపదిశామి తే ।
కింత్వస్యాస్తనుమధ్యాయాః స్నేహాకృష్టేన చేతసా ॥68॥

త్వయా విశ్రంభితా చాస్మి స్మారయామ్యరిసూదన ।

ఆ కుండల అక్కడనుండి వెళ్ళదలచినదై స్నేహితురాలిమీద ఉన్న ప్రేమతో కొంచెం దుఃఖిస్తూ వినయవంతుడైన ఆ రాజకుమారునితో ఇలా అంది. ఓ అమితమైన ప్రజ్ఞ కలిగినవాడా ! రాజకుమారుడా ! నీవంటివారికి ప్రాజ్ఞపురుషులు కూడా ఉపదేశము చేయనవసరము లేదు. ఇక స్త్రీలు ఉపదేశించవలసిన అవసరమున్నదా ఏమి? అందువలన నీకు నేనెట్టి ఉపదేశమును చేయను. అయిననూ సన్నని నడుముగల ఈమె యందు నాకున్న స్నేహము కారణముగా నీకు తెలిసిన విషయమునే నీకు గుర్తు చేసెదను. నీయందు నాకు విశ్వాసమును నీవే పాదుకొల్పితివి కదా !

భర్తవ్యా రక్షితవ్యా చ భార్యా హి పతినా సదా ॥69॥

ధర్మార్థకామసంసిద్ధ్యై భార్యా భర్తుః సహాయినీ ।
యా చ భార్యా చ భర్తా చ పరస్పరమనువ్రతౌ ॥70॥

తదా ధర్మార్థకామానాం త్రయాణామపి సంగతమ్ ।
కథం భార్యామృతే ధర్మమర్థం వా పురుషః ప్రభో ॥71॥

ప్రాప్నోతి కామమర్థం వా తస్యాం త్రితయమాహితమ్ ।
తథైవ భర్తారమృతే భార్యా ధర్మాదిసాధనే ॥72॥

న సమర్థా త్రివర్గోఽయం దాంపత్యం సముపాశ్రితః ।

భర్తచేత ఎల్లప్పుడు భార్య పోషింపతగినది, రక్షింపతగినది. ధర్మార్థకామములు సిద్ధించుటకై భర్తకు భార్య సహాయురాలిగా ఉండును. భార్యాభర్తలిరువురు పరస్పరము ఒకరినొకరు అనుసరించువారై ఉన్నప్పుడు ధర్మార్థకామములనెడు ఈ మూడు (త్రివర్గము) సిద్ధించును. ఓ ప్రభూ ! రాకుమారా ! భార్య లేకుండగా పురుషుడు ధర్మార్థకామములను ఎట్లు పొందగలడు? ఈ త్రివర్గము ఆమెయందే నిహితమైయున్నది. అట్లే భర్తలేకుండగా ధర్మాదులను ఆచరించుటలో భార్య సమర్థురాలు కాదు. ఈ త్రివర్గము దాంపత్యము నాశ్రయించియున్నది.

దేవతాపితృభృత్యానామతిథీనాం చ పూజనమ్ ॥73॥

న పుంభిః శక్యతే కర్తుమృతే భార్యాం నృపాత్మజ ।
ప్రాప్తోఽపి చార్థో మనుజైరానీతోఽపి నిజం గృహమ్ ॥74॥

క్షయమేతి వినా భార్యాం కుభార్యాసంగ్రహేఽపి వా ।
కామస్తు తస్య నైవాస్తి ప్రత్యక్షేణోపలక్ష్యతే ॥75

ఓ రాకుమారా ! దేవతలు, పితృదేవతలు, సేవకులు, అతిథులు వీరిని పూజించుట భార్య లేకుండా పురుషులకు సాధ్యము కాదు. స్వగృహమునకు ఆయా మానవులు సంపదలను తీసుకొచ్చిననూ భార్య లేనిచో అవి నాశమునే పొందగలవు. అట్లే దుష్టబుద్ధిగల భార్యవల్లనూ సంపదలు నశించును. అట్టి పురుషునికి ఎట్టి కోరికలు నెరవేరకపోవుట లోకములో ప్రత్యక్షముగా కనిపించుచున్నది.

దంపత్యోః సహ ధర్మేణ త్రయీధర్మమవాప్నుయాత్ ।
పుత్రాణాం యోనిరన్యా వై నాన్యతో భార్యయా వినా ॥
పితౄన్ పుత్రైస్తథైవాన్నసాధనైరతిథీనపి ॥76॥

పూజాభిరమరాంస్తద్వత్ సాధ్వీం భార్యాం నరోఽవతి ।
స్త్రియాశ్చాపి వినా భర్త్రా ధర్మకామార్థసంతతిః ॥77॥

నైవ తస్మాత్త్రివర్గోఽయం దాంపత్యమధిగచ్ఛతి ।
ఏతన్మయోక్తం యువయోర్గమిష్యామి యథేప్సితమ్ ॥78॥

వర్ధ త్వమనయా సార్ధం ధనపుత్రసుఖాయుషా ।

దంపతులు పరస్పరము ధర్మమునాచరించుటచేత త్రివర్గధర్మమును పొందెదరు. పుత్రులను పొందుటకు భార్యయే కారణము. భార్య లేనిచో పుత్రులను పొందుట సాధ్యము కాదు. పుత్రులచే తండ్రులను, అన్నము మొదలగు సాధనములచే అతిథులను, పూజలతో దేవతలను రక్షించునట్లుగా ఉత్తమురాలగు భార్యను మానవుడు

రక్షించును. భర్తలేకుండా స్త్రీకి ధర్మార్థకామములు సిద్ధించవు. అందువల్ల ఈ త్రివర్గము దాంపత్యము వల్లనే సిద్ధించును. నేనీ విషయములను మీరిరువురికి చెప్పితిని. నా అభీష్టస్థానమునకు వెళ్ళెదను. ఈమెతో గూడ నీవు ధనపుత్రసుఖాయుర్దాయములతో వర్ధిల్లుము.

పుత్రావూచతుః – కుమారులు చెప్పారు.

ఇత్యుక్త్వా సంపరిష్వజ్య స్వసఖీం తం నమస్య చ ॥79॥

జగామ దివ్యయా గత్యా యథాభిప్రేతమాత్మనః ।

ఈ విధముగా పలికి కుండలయను చెలికత్తె తన స్నేహితురాలగు మదాలసను కౌగలించుకొని, రాజకుమారుడగు ఋతధ్వజునికి నమస్కరించి తన అభీష్టస్థానమునకు దివ్యగమనముతో వెళ్ళెను.

సోఽపి శత్రుజితః పుత్రస్తామారోప్య తురంగమమ్ ॥80॥

నిర్గన్తుకామః పాతాలాద్విజ్ఞాతో దనుసంభవైః ।
తతస్తైస్సహసోత్కృష్టం హ్రియతే హ్రియతే త్వితి ॥81॥

కన్యారత్నం యదానీతం దివః పాతాలకేతునా ।

శత్రుజిత్తుకుమారుడగు ఆ ఋతధ్వజుడను రాకుమారుడు గూడా మదాలసను గుర్రముపై ఎక్కించుకొని పాతాలమునుండి వెళ్ళవలెనని తలచెను. అంతట ఈ విషయమును తెలుసుకొన్న దానవులు, "స్వర్గమునుండి పాతాలకేతువుచే తీసుకొనిరాబడిన కన్యారత్నమును ఎవరో దొంగలించుకొని పోవుచున్నా"రని బిగ్గరగా అరచిరి.

తతః పరిఘనిస్త్రింశగదాశూలశరాయుధమ్ ॥82॥

దానవానాం బలం ప్రాప్తం సహ పాతాలకేతునా ।
తిష్ఠ తిష్ఠేతి జల్పన్తస్తే తదా దానవోత్తమాః ॥83॥

శరవర్షైస్తథా శూలైర్వవర్షుర్నృపనందనమ్ ।
స తు శత్రుజితః పుత్రస్తతస్తాన్ ప్రతివీర్యవాన్ ॥84॥

చిచ్ఛేద శరజాలేన ప్రహసన్నివ లీలయా ।

అంతట పరిఘలు (ఇనుప గునపాలు), ఖడ్గములు, గదలు, శూలములు, బాణములు మొదలగు ఆయుధములతో కూడిన రాక్షససైన్యము పాతాలకేతువుతో సహా అచ్చటకు వచ్చినది. అప్పుడా రాక్షసశ్రేష్ఠులు నిలు, నిలు అని బిగ్గరగా అరస్తూ బాణవర్షములనూ, శూలములనూ ఆ రాకుమారునిపై వర్షించిరి. అప్పుడా బలవంతుడైన రాకుమారుడు నవ్వుతూ బాణములతో అవలీలగా ఆ రాక్షసులందరినీ తునాతునకలు చేసెను.

క్షణేన పాతాలతలమసిశక్త్యృష్టిసాయకైః ॥85॥

ఛిన్నైః సంఛన్నమత్యర్థమృతధ్వజశరోత్కరైః ।
తతోఽస్త్రం త్వాష్ట్రమాదాయ చిక్షేప ప్రతిదానవాన్ ॥86॥

క్షణకాలమందే ఆ పాతాలప్రదేశమంతయు కత్తులు, శక్తి ఆయుధములు, రెండువైపులా పదునున్న ఖడ్గములు, బాణములు, మిక్కిలి అధికముగా ఋతధ్వజుడు ప్రయోగించిన బాణసమూహములు వీటితో కప్పివేయబడెను. అటుపిమ్మట ఋతధ్వజుడు త్వాష్ట్రమను అస్త్రముతో ఆ రాక్షసులందరినీ చంపివేసెను.

తేన తే దానవాస్సర్వే సహ పాతాలకేతునా ।
జ్వాలామాలాఽతితీవ్రేణ స్ఫుటదస్థిచయాస్తదా ॥87॥

నిర్దగ్ధాః కాపిలం తేజః సమాసాద్యేవ సాగరాః ।

అంతట పాతాలకేతువుతో సహా ఆ రాక్షసులందరూ మిక్కిలి తీవ్రమైన అగ్నిజ్వాలలతో మండింపబడి ఎముకుల ప్రోగులుగా తయారయిరి. కపిలమహర్షితేజస్సువలన సగరపుత్రులు భస్మమయినట్లుగా ఆ రాక్షసులందరూ భస్మమయిరి. (సమాసాద్య + ఇవ = సమాసాద్యేవ)

తతస్స రాజపుత్రోఽరీన్నిహత్యాసురసత్తమాన్ ॥88॥

స్త్రీరత్నేన సమం తేన సమాగచ్ఛత్పితుఃపురమ్ ।
ప్రణిపత్య చ తత్సర్వం స తు పిత్రే న్యవేదయత్ ॥89॥

పాతాలగమనం చైవ కుండలాయాశ్చ దర్శనమ్ ।
తద్వన్మదాలసాప్రాప్తిం దానవైశ్చాపి సంగరమ్ ॥90॥

వధశ్చ తేషామస్త్రేణ పునరాగమనం తథా ।

అంతట ఆ రాజపుత్రుడు శత్రువులగు ఆ రాక్షసులందరినీ చంపి మదాలసయను ఆ స్త్రీరత్నముతో గూడ తన తండ్రియగు శత్రుజిత్తుయొక్క నగరమునకు వచ్చెను. తన తండ్రికి నమస్కరించి ఆ రాకుమారుడు జరిగిన వృత్తాంతమునంతటినీ అనగా పాతాలలోకగమనము, కుండలను చూచుట, అట్లే మదాలసను పొందుట, దానవులతో యుద్ధము, ఆయుధములతో వారిని సంహరించుట, తిరిగి ఇంటికి చేరుట అను వృత్తాంతమును తన తండ్రికి నివేదించెను.

ఇతి శ్రుత్వా పితా తస్య చరితం చారుచేతసః ॥91॥

ప్రీతిమానభవచ్చైనం పరిష్వజ్యాహ చాత్మజమ్ ।
సత్పుత్రేణ త్వయా పుత్ర తారితోఽహం మహాత్మనా ॥92॥

భయేభ్యో మునయస్త్రాతా యేన సద్ధర్మచారిణా ।
మత్పూర్వైః ఖ్యాతిమానీతం మయా విస్తారితం పునః ॥93॥

పరాక్రమవతా వీర త్వయా తద్బహులీకృతమ్ ।

మంచిమనసుగల తన కుమారుడగు ఋతధ్వజుని వృత్తాంతమును విని అతడి తండ్రియగు శత్రుజిత్తు సంతోషించి, తన కుమారుని కౌగలించుకొని ఇట్లు పలికెను. "ఓ కుమారా ! మహాత్ముడైన సత్పుత్రుడవగు నీ చేత

నేను తరింపబడితిని. సద్ధర్మాచరణముగల నీచేత మునులు రక్షింపబడినారు. మన పూర్వీకులు మన వంశమునకు కీర్తిని తెచ్చిపెట్టినారు. నేనా కీర్తిని విస్తరింపచేసితిని. ఓ వీరుడా ! నీవా కీర్తిని బహుళముగా అనగా మిక్కిలి అధికముగా చేసినావు.

యదుపాత్తం యశః పిత్రా ధనం వీర్యమథాపి వా ॥94॥

తన్న హాపయతే యస్తు స నరో మధ్యమః స్మృతః ।
తద్వీర్యాదధికం యస్తు పునరన్యత్ స్వశక్తితః ॥95॥

నిష్పాదయతి తం ప్రాజ్ఞా వదన్తి నరముత్తమమ్ ।
యః పిత్రా సముపాత్తాని ధనవీర్యయశాంసి వై ॥96॥

న్యూనతాం నయతి ప్రాజ్ఞాస్తమాహుః పురుషాధమమ్ ।

తండ్రిచేత సంపాదింపబడిన కీర్తిని, ధనమును, పరాక్రమమును ఏ పుత్రుడయితే నష్టపరచడో అతడు మధ్యమపుత్రుడిగా చెప్పబడుచున్నాడు. ఎవరయితే తన శక్తికొలదీ తన తండ్రి పరాక్రమముకంటే అధికమైన పరాక్రమమును సంపాదిస్తాడో అట్టి పుత్రుని ఉత్తమమానవుడు లేదా ఉత్తమకుమారుడని జ్ఞానులు చెప్పుచున్నారు. ఎవరయితే తన తండ్రి సంపాదించిన ధనపరాక్రమకీర్తులను న్యూనపరచునో అట్టి కుమారుని పురుషాధముడని అనగా నీచమైన పురుషుడని బుద్ధిమంతులు చెప్పుచున్నారు.

తన్మయా బ్రాహ్మణత్రాణం కృతమాసీద్యథా త్వయా ॥97॥

పాతాలగమనం యచ్చ యచ్చాసురవినాశనమ్ ।
ఏతదభ్యధికం వత్స తేన త్వం పురుషోత్తమః ॥98॥

తద్ధన్యోఽస్మ్యథవా న త్వహమేవ గుణాధికః ।
త్వాం పుత్రమీదృశం ప్రాప్య శ్లాఘ్యం పుణ్యవతామపి ॥99॥

ఓ కుమారా ! నీవు బ్రాహ్మణులను రక్షించినట్లే నేను కూడా బ్రాహ్మణులను రక్షించితిని. కాని పాతాలలోకమునకు వెళ్ళుట, రాక్షసులను సంహరించుట వీటిని నీవు నాకంటే అధికముగా చేసినావు. అందువలన నీవు పురుషోత్తముడవు. అందువలన నేను ధన్యుడనయితిని. పుణ్యవంతులచేత కూడా కొనియాడదగిన నీవంటి పుత్రుని పొంది నేనే కాదు నీవు కూడా గుణాధికుడవయితివి.

న సత్పుత్రకృతాం ప్రీతిమన్యః ప్రాప్నోతి మానవః ।
పుత్రేణ నాతిశయితో యః ప్రజ్ఞాదానవిక్రమైః ॥100॥

ధిక్తస్య జన్మ యః పిత్రా లోకే విజ్ఞాయతే నరః ।
యత్పుత్రాత్ ఖ్యాతిమభ్యేతి తస్య జన్మ సుజన్మనః ॥101॥

ఏ మానవుడయితే సత్పుత్రుడు కారణముగా ప్రీతిని పొందడో, ఇంకనూ పుత్రుడాచరించిన ప్రజ్ఞాదాన పరాక్రమములతో అతిశయిల్లడో, ఇంకనూ ఏ తండ్రి వల్ల ఏ కుమారుడు లోకమందు కీర్తిని పొందునో అట్టి

మానవుని జన్మ నింద్యమైనది. ఏ తండ్రి కుమారుని వల్లనే కీర్తిని పొందుతాడో అట్టి వాని జన్మమే సార్థకమైన నిజమైన జన్మము.

ఆత్మజ్ఞానీ యతో ధన్యో మధ్యో పితృపితామహైః ।
మాతృపక్షేణ మాత్రా చ ఖ్యాతిం యాతి నరాధమః ॥102॥

ఎవరయితే స్వయముగా ఆత్మజ్ఞానము కలిగి ప్రసిద్ధుడో అతడే ధన్యుడు. ఎవరయితే తండ్రితాతలవలన కీర్తిని పొందుతాడో అతడు మధ్యముడు. ఎవరయితే మాతృపక్షములోని వారివలన గానీ, తల్లివలనగానీ కీర్తిని పొందుతాడో అతడు అధమమానవుడు.

తత్పుత్ర ధనవీర్యైస్త్వం వివర్ధస్వ సుఖేన చ ।
గంధర్వతనయా చేయం మా వియుజ్యతు వై త్వయా ॥103॥

కావున ఓ కుమారా ! నీవు ధనపరాక్రమములతోనూ, సుఖముతోనూ వర్ధిల్లుము. ఈ గంధర్వకుమార్తె నీతో ఎట్టి వియోగమును పొందకుండుగాక !

ఇతి పిత్రా బహువిధం ప్రియముక్త్వా పునఃపునః ।
పరిష్వజ్య స్వమావాసం సభార్యః స విసర్జితః ॥104॥

స తయా భార్యయా సార్ధం రేమే తత్ర పితుః పురే ।
అన్యేషు చ తథోద్యానవనపర్వతసానుషు ॥105॥

శ్వశ్రూశ్వశురయోః పాదౌ ప్రణిపత్య చ సా శుభా ।
ప్రాతః ప్రాతస్తతస్తేన ప్రణిపత్య సుమధ్యమా ॥106॥

ఈ విధముగా తండ్రియగు శత్రుజిత్తు తన కుమారుడగు ఋతధ్వజునికి మరలమరల ప్రియవాక్యములను పలికి, అతడిని ఆలింగనము చేసుకొని అతడిని భార్యతో కూడా అతడి నివాసమునకు పంపించివేసెను. తన తండ్రి పట్టణమందు, మరియు ఉద్యానవనములు, పర్వతశిఖరములందు తన భార్యతోకూడి ఆ రాకుమారుడు విహరించి ఆనందించెను. మంగళస్వరూపురాలు, అందమైన నడుముగలదీయగు ఆ గంధర్వకుమార్తె మదాలస అత్తమామలకు ఉదయమే పాదాభివందనముచేసి, అటుపిమ్మట నిత్యము తన భర్తతో కూడి ఆనందించెను.

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే కువలయాశ్వీయే ఏకోనవింశోఽధ్యాయః ॥19॥

శ్రీ మార్కండేయ మహాపురాణమందు కువలయాశ్వచరితమందలి కువలయాశ్వుని వివాహవృత్తాంతమను పంతొమ్మిదవ అధ్యాయం సమాప్తం.



వింశోఽధ్యాయః – ఇరువదియవ అధ్యాయం
కువలయాశ్వచరితమ్ – కువలయాశ్వుని వృత్తాంతం

నాగపుత్రావూచతుః – నాగకుమారులు పలికారు.

తతః కాలే బహుతిథే గతే రాజా పునస్సుతమ్ ।
ప్రాహ గచ్ఛాశు విప్రాణాం త్రాణాయ చర మేదినీమ్ ॥1॥

అటు పిమ్మట చాలాకాలము గడువగా శత్రుజిత్తు మహారాజు మరల కుమారునితో "బ్రాహ్మణులను రక్షించుటకు శీఘ్రమే భూమండలమందు సంచరించుము." అని పలికెను.

అశ్వమేతం సమారుహ్య ప్రాతః ప్రాతర్దినే దినే ।
ఆబాధా ద్విజముఖ్యానామన్వేష్టవ్యా సదైవ హి ॥2॥

ఇంకను తండ్రి కుమారునితో "నీవు ప్రతిదినము ఉదయమే ఈ గుర్రమునధిరోహించి బ్రాహ్మణశ్రేష్ఠుల బాధలను ఎల్లప్పుడు అన్వేషించవలెను.

దుర్వృత్తాః సన్తి శతశో దానవాః పాపబుద్ధయః ।
తేభ్యో న స్యాద్యథా బాధా మునీనాం త్వం తథా కురు ॥3॥

దుష్టమైన ప్రవర్తనగలవారు, పాపబుద్ధిగలవారు వందలకొలదీ రాక్షసులు గలరు. వారి వలన మునులకు బాధ కలుగకుండు విధముగా ప్రవర్తించుము" అని పలికెను.

స తథోక్తస్తథా పిత్రా తథా చక్రే నృపాఽత్మజః ।
పరిక్రమ్య మహీం కృత్స్నాం వవన్దే చరణౌ పితుః ॥4॥

అహన్యహని సంప్రాప్తే పూర్వాహ్ణే నృపనందనః ।
తతశ్చ శేషం దివసం తథా రేమే సుమధ్యయా ॥5॥

తండ్రి అట్లు పలుకగా ఆ రాకుమారుడు తండ్రి చెప్పినట్లే చేసెను. ప్రతీరోజు ఉదయమే భూమండలమును అంతటినీ సంచరించి తన తండ్రి పాదములకు నమస్కరించసాగెను. ఇక రోజులో మిగిలిన సగభాగమును అందమైన నడుముగల తన భార్య మదాలసతో రమించసాగెను.

ఏకదా తు చరన్ సోఽథ దదర్శ యమునాతటే ।
పాతాలకేతోరనుజం తాళకేతుం కృతాశ్రమమ్ ॥6॥

ఆ రాకుమారుడీవిధముగా భూమండలమును సంచరించుచుండగా ఒకరోజు అతడు పాతాలకేతుని తమ్ముడగు తాళకేతుడను వాడు యమునానదీతీరమందు ఆశ్రమమును నిర్మించుకొనియుండుటను చూచెను.

మాయావీ దానవస్సోఽథ మునిరూపం సమాశ్రితః ।
స ప్రాహ రాజపుత్రం తం పూర్వవైరమనుస్మరన్ ॥7॥

మాయావియగు ఆ దానవుడు మునివేషమును ధరించినవాడై రాకుమారునితో గల పూర్వవైరమును స్మరించుకొనుచూ అతనితో ఇట్లు పలికెను.

రాజపుత్ర ! బ్రవీమి త్వాం తత్కురుష్వ యదీచ్ఛసి ।
న చ తే ప్రార్థనాభంగః ప్రాయః సత్యప్రతిశ్రవ ॥8॥

ఓ రాకుమారా ! నీకు నేను చెప్పునది నీకిష్టమైనచో దానిని నీవు ఆచరించుము. ఓ సత్యప్రతిజ్ఞా ! నీవు ఇంచుమించు ఎవరి ప్రార్థననూ వ్యర్థము చేయలేదు.

యక్ష్యే యజ్ఞేన ధర్మాయ కర్తవ్యాశ్చ మయేష్టయః ।
చింతయే తత్ర కర్తవ్యా నాస్తి మే దక్షిణా యతః ॥9॥

తతః ప్రయచ్ఛ మే వీర ! దక్షిణార్థే స్వభూషణమ్ ।
యదేతత్కంఠలగ్నం తే రక్ష చేమం మమాశ్రమమ్ ॥10॥

ఓ రాకుమారా ! ధర్మము కొరకు నేను యజ్ఞమును నిర్వర్తించెదను. చాలా ఇష్టులను కూడా నేను ఆచరించవలసియున్నది. కాని నావద్ద యజ్ఞములో ఋత్విక్కులకు దక్షిణనిచ్చుటకు ధనము లేదు. అందువలన యజ్ఞమునెట్లు ఆచరించవలెనాయని ఆలోచించుచున్నాను. కావున నీవు దక్షిణలకొరకై నీ కంఠమందు నీవు ధరించిన అలంకారమును నాకిమ్ము. యజ్ఞము పూర్తియగునంతవరకు నా ఆశ్రమమును రక్షించుచుండుము.

యావదంతర్జలే దేవం వరుణం యాదసాం పతిమ్ ।
వైదికైర్వారుణైర్మంత్రైః ప్రజానాం పుష్టిహేతుకైః ॥11॥

అభిష్టూయ త్వరాయుక్తః సమభ్యేమీతి వాదినమ్ ।
తం ప్రణమ్య తతః ప్రాదాత్స తస్మై కంఠభూషణమ్ ॥12॥

నేను నీటియందుండి ప్రజలకు పుష్టిని కలిగించు వైదికమైన వరుణదేవతాకమంత్రములతో జలప్రాణిప్రభువైన వరుణదేవుని స్తవనము చేసి (తపస్సునాచరించి) తిరిగి నేను శీఘ్రముగా వచ్చెదను అని పలికిన ఆ కపటమునికి నమస్కరించి ఆ రాకుమారుడు తన కంఠహారమును అతడికి ఇచ్చివేసెను.

ప్రాహ చైనం భవాన్యాతు నిర్వ్యలీకేన చేతసా ।
స్థాస్యామి తావదత్రైవ తవాశ్రమసమీపతః ॥13॥

మరల ఆ రాకుమారుడు కపటమునియగు ఆ తాళకేతునితో ఇట్లు పలికెను. ఎట్టి చింత లేకుండా మీరు వెళ్ళుడు. మీరు వచ్చునంతవరకు మీ ఆశ్రమసమీపములో ఇచ్చటనే ఉండెదను.

తవాఽదేశాన్మహాభాగ ! యావదాగమనం తవ ।
న తేఽత్ర కశ్చిదాబాధాం కరిష్యతి మయి స్థితే ॥14॥

ఓ మహానుభావుడా ! మీరు వచ్చునంతవరకు మీ ఆజ్ఞననుసరించి నేనిచ్చటనే యుండెదను. నేనిచ్చట యుండగా నీకెవరునూ హాని తలపెట్టరు.

విశ్రబ్ధస్త్వం మునిశ్రేష్ఠ ! కురుష్వ చ మనోగతమ్ ।
ఏతదుక్తస్తతస్తేన స మమజ్జ నదీజలే ॥15॥

ఓ మునిశ్రేష్ఠుడా ! నీవు నాయందు విశ్వాసముంచి నీ మనోఽభీష్టము ప్రకారము ఆచరించుము. ఈ విధముగా ఆ రాకుమారుడు పలుకగా ఆ కపటముని నీటియందు మునిగెను.

అరక్షత్సోఽపి తస్యైవ మాయావిహితమాశ్రమమ్ ।
గత్వా జలాశయాత్తస్మాత్తాలకేతుశ్చ తత్పురమ్ ॥16॥

మదాలసాయాః ప్రత్యక్షమన్యేషాం చైతదుక్తవాన్ ।

ఆ రాకుమారుడు కూడా మాయతో నిర్మించిన ఆ కపటముని ఆశ్రమమును రక్షించెను. పిమ్మట ఆ కపటముని తాళకేతువు ఆ జలాశయమునుండి బయటకు వచ్చి ఆ రాకుమారుని పట్టణమునకు వెళ్ళి మదాలస మరియు ఇతరుల ముందర ప్రత్యక్షమై ఇట్లు పలికెను.

వీరః కువలయాశ్వోఽసౌ మమాశ్రమసమీపతః ॥17॥

కేనాపి దుష్టదైత్యేన కుర్వన్ రక్షాం తపస్వినామ్ ।
యుధ్యమానో యథాశక్తి నిఘ్నన్ బ్రహ్మద్విషో యుధి ॥18॥

మాయామాశ్రిత్య పాపేన భిన్నః శూలేన వక్షసి ।
మ్రియమాణేన తేనేదం దత్తం మే కంఠభూషణమ్ ॥19॥

"వీరుడైన ఈ కువలయాశ్వుడు నా ఆశ్రమసమీపమందుండి తపోజనులను రక్షించుచూ యుద్ధమందు బ్రహ్మద్వేషులగు రాక్షసులను సంహరించుచుండెను. ఇట్లుండగా ఒకానొక పాపాత్ముడగు రాక్షసుడు మాయతో ఆ రాకుమారుని వక్షఃస్థలమందు పొడిచెను. చనిపోతూ ఆ రాకుమారుడు ఈ కంఠహారమును నాకిచ్చెను.

ప్రాపితశ్చాగ్నిసంయోగం తరువేశ్మసు తాపసైః ।
కృతార్తహేషాశబ్దో వై త్రస్తః సాశ్రువిలోచనః ॥20॥

నీతస్సోఽశ్వశ్చ తేనైవ దానవేన దురాత్మనా ।
ఏతన్మయా నృశంసేన దృష్టం దుష్కృతకారిణా ॥21॥

చనిపోయిన ఆ రాకుమారుని తాపసజనులు చెట్లసమూహమందు దహనసంస్కారములు చేసిరి. అంతట భయపడిన ఆ గుర్రము ఆర్తనాదము చేసి కన్నీళ్ళను విడువగా, దుష్టుడైన ఆ రాక్షసుడు ఆ గుర్రమును తనవెంట తీసుకొనిపోయెను. దుష్టకార్యములనాచరించు దుర్మార్గుడైన ఆ రాక్షసుడాచరించిన ఈ కార్యములనన్నింటినీ నేను చూచితిని.

యదత్రానంతరం కృత్యం కురుష్వోత్తరకాలికమ్ ।
హృదయాశ్వాసనం చైతద్గృహ్యతాం కంఠభూషణమ్ ॥22॥

నాస్మాకం హి సువర్ణేన కృత్యమస్తి తపస్వినామ్ ।
ఇత్యుక్త్వోత్సృజ్య తద్భూమౌ స జగామ యథాగతమ్ ॥23॥

ఇప్పుడు మీరు మరణించిన రాకుమారునికి చేయదగిన అపరకర్మలను చేయుడు. మీ హృదయములకు ఓదార్పును కలిగించు ఈ కంఠహారమును తీసుకొనుడు. ఎందువలననగా తపోజనులమగు మాకు బంగారముతో పని లేదు" అని పలికి ఆ కపటముని ఆ కంఠహారమును అచ్చటే భూమిపై విడిచిపెట్టి తాను వచ్చిన దారినే పోయెను.

నిపపాత జనస్సోఽథ శోకార్తో మూర్ఛయాఽతురః ।
క్షణేన చేతనాం ప్రాప్య సర్వాస్తా నృపయోషితః ॥24॥

రాజపత్న్యశ్చ రాజా చ విలేపురతిదుఃఖితాః ।
మదాలసా తు తద్దృష్ట్వా తదీయం కంఠభూషణమ్ ॥25॥

తత్యాజ సుప్రియాన్ ప్రాణాన్ శ్రుత్వా వినిహతం ప్రియమ్ ।
తతః పురే మహాక్రందః పౌరాణాం భవనేష్వభూత్ ॥26॥

యథైవ తస్య నృపతేః స్వగృహే సమవర్తత ।

అంతట అచ్చటి జనులందరూ విచారగ్రస్తులై మూర్ఛిల్లిరి. క్షణకాలమందే తిరిగి చైతన్యమును పొంది ఆ రాజగృహమందలి స్త్రీలు, రాజభార్యలు, రాజు అందరూ మిక్కిలి దుఃఖించినవారై విలపించిరి. మదాలస అయితే తన భర్త కంఠహారమును చూచి, ప్రియుడైన తన భర్త మరణించెనని విని, తన ప్రియమైన ప్రాణములను విడిచిపెట్టెను. అంతట రాజగృహమందు దుఃఖముతో ఎంతటి ఆక్రందనదము కలిగినదో అంతటి ఆక్రందనధ్వనులు రాజపురమందు, పురజనుల ఇండ్లలోనూ సంభవించినవి.

రాజా చ తాం మృతాం దృష్ట్వా వినా భర్త్రా మదాలసామ్ ॥27॥
ప్రత్యువాచ జనం సర్వం విమృశ్య స్వస్థమానసః ।

శత్రుజిన్మహారాజు కూడా భర్తృవియోగముచే మరణించిన ఆ మదాలసను చూచి మనస్సుకు స్వస్థతను చేకూర్చుకొని అచ్చటి జనులందరితోనూ ఇట్లు పలికెను. మీరు ఏడ్వవలదు.

న రోదితవ్యం పశ్యామి భవతామాత్మనస్తథా ॥28॥

సర్వేషామేవ సంచిన్త్య సంబంధానామనిత్యతామ్ ।
కిం ను శోచామి తనయం కిం ను శోచామ్యహం స్నుషామ్ ॥29॥

విమృశ్య కృతకృత్యత్వాన్మన్యేఽశోచ్యావుభావపి ।

ఓ జనులారా ! నా వారితో సంబంధమయినా, మీవారితో సంబంధమయినా శాశ్వతము కాదని విచారించి మీరు ఏడవవలదు. నేను నా కుమారుని గురించి దుఃఖించవలెనా? లేక నా కోడలిని గురించి దుఃఖించవలెనా?

విచారించగా వారిరువురు కూడా కృతకృత్యులు అనగా ధన్యజీవులే గావున వారిరువురూ విచారింపదగినవారు కారు.

మచ్ఛుశ్రూషుర్మద్వచనాద్ద్విజరక్షణతత్పరః ॥30॥

ప్రాప్తో మేఽద్య సుతో మృత్యుం కథం శోచ్యః స ధీమతామ్ ।
అవశ్యం యాతి యద్దేహం తద్ద్విజానాం కృతే యది ॥31॥

మమ పుత్రేణ సంత్యక్తం నన్వభ్యుదయకారి తత్ ।

నా మాటను ఆలకించు నా కుమారుడు నా మాటప్రకారము బ్రాహ్మణులను రక్షించుటయందు ఆసక్తుడై ఈనాడు మృత్యువును పొందెను. అందువలన జ్ఞానులకు అతడు ఎట్లు దుఃఖింపతగినవాడు కాగలడు? నా కుమారుడు విడిచిపెట్టినట్లుగా ఎవరిదేహమయితే ద్విజరక్షణము కొరకు విడిచిపెట్టబడుతుందో అట్టి దేహము నిజముగా అభ్యుదయహేతువు కదా !

ఇయం చ సత్కులోత్పన్నా భర్తర్యేవమనువ్రతా ॥32॥

కథం తు శోచ్యా నారీణాం భర్తురన్యన్న దైవతమ్ ।
అస్మాకం బాంధవానాం చ తథాన్యేషాం దయావతామ్ ॥33॥

శోచ్యా హ్యేషా భవేదేవం యది భర్త్రా వియోగినీ ।
యా తు భర్తృవధం శ్రుత్వా తత్క్షణాదేవ భామినీ ॥34॥

భర్తారమనుయాతేయం న శోచ్యాఽతో విపశ్చితామ్ ।
తాః శోచ్యా యా వియోగిన్యః సహ భర్త్రా కులాంగనాః ॥35॥

మంచి వంశమందు పుట్టినదై తన భర్తయందిట్టి అనురాగము కలిగి సహగమనమను వ్రతము కలిగిన ఈ నా కోడలు ధీమంతులకు ఎట్లు శోచనీయురాలు కాగలదు? స్త్రీలకు భర్తకు మించిన దైవము లేదు. భర్తతో వియోగము చెంది కూడా ప్రాణములను ధరించినట్లయిన ఈమె మాకు, మా బంధువర్గమునకు, ఇంకనూ దయామయులైన ఇతరులకు శోచనీయురాలు అయి ఉండేది. కాని ఈమె అనగా ఈ నా కోడలు తన భర్త మరణవార్త వాని ఆ క్షణమందే తన భర్తను అనుసరించి తాను కూడా పరలోకగమనము చేసినందున బుద్ధిమంతులకు ఈమె శోచనీయురాలు కాదు. తమ భర్తలతో వియోగము చెంది కూడా జీవించియున్నట్టి కులస్త్రీలే శోకింపతగినవారు.

కష్టభ్రాన్త్యా న గచ్ఛన్తి కష్టదాస్స్యుః కులాత్మనోః ।
భర్తుర్వియోగస్త్వనయా నానుభూతః కృతజ్ఞయా ॥36॥

కొందరు స్త్రీలు కష్టమనుకొని భ్రాంతితో తమ భర్తలు మరణించిననూ ప్రాణములను త్యజించరు. అట్టివారు తమకు, తమ వంశము వారికి దుఃఖములను కలుగజేయుచున్నారు.

దాతారం సర్వసౌఖ్యానామిహ చాముత్ర చోభయోః ।
లోకయోః కా హి భర్తారం నారీ మన్యేత మానుషమ్ ॥37॥

ఇహలోకమందు, పరలోకమందు లేదా రెండు లోకములందు సమస్త సుఖములనిచ్చునట్టి భర్తను ఏ స్త్రీ మనుష్యమాత్రునిగా తలచును?

న స శోచ్యో న చైవేయం నాయం తజ్జననీ న చ ।
త్యజతా బ్రాహ్మణార్థాయ ప్రాణాన్ సర్వే స్మ తారితాః ॥38॥

నా కుమారుడు గాని, నా కోడలు గాని, ఈ నేను గాని, అతడి తల్లి గాని (అనగా నా భార్య గాని) ఎవరమూ కూడా శోకింపదగినవారము కాము. బ్రాహ్మణుల కొరకై ప్రాణములను విడిచిపెట్టు నా కుమారుని వలన మేమందరము తరింపబడితిమి.

విప్రాణాం మమ ధర్మస్య గతస్స తు మహామతిః ।
ఆనృణ్యమర్ధభుక్తస్య త్యాగాద్దేహస్య మే సుతః ॥39॥

నడివయస్సులోనే మరణించుటచే అర్ధభుక్తమైన దేహమును త్యజించినందువలన గొప్ప జ్ఞాని అయిన నా కుమారుడు బ్రాహ్మణులకు, నాకు, ధర్మదేవతకు ఋణమును తీర్చుకొనెను.

మాతుస్సతీత్వం మద్వంశవైమల్యం శౌర్యమాత్మనః ।
సంగ్రామే సంత్యజన్ ప్రాణాన్ సోఽవిందద్ద్విజరక్షణాత్ ॥40॥

బ్రాహ్మణులను రక్షించుటకొరకు యుద్ధమందు ప్రాణములను విడిచిపెట్టిన నా కుమారుడు తన తల్లికి గొప్ప స్త్రీమూర్తిత్వమును, నా వంశమునకు స్వచ్ఛతను, తనకు పరాక్రమమును ఆపాదించెను.

తతః కువలయాశ్వస్య మాతా భర్తురనంతరమ్ ।
శ్రుత్వా పుత్రవధం తాదృక్ ప్రాహ హృష్టా తు తం పతిమ్ ॥41॥

ద్విజరక్షణనిమిత్తమైన తన కుమారుని మరణమును గూర్చి విని సంతోషించినదై కువలయాశ్వుని తల్లి తన భర్త మాటలాడిన పిమ్మట తన భర్తతో ఇట్లు పలికెను.

న మే మాత్రా న మే స్వస్రా ప్రాప్తా ప్రీతిర్నృపేదృశీ ।
శ్రుత్వా మునిపరిత్రాణే హతం పుత్రం యథా మయా ॥42॥

ఓ మహారాజా ! మునిజనులను రక్షించుట కొరకై నా పుత్రుడు మరణించెనని విన్న నేను ఎట్టి సంతోషమును పొందితినో అట్టి సంతోషమును నేను నా తల్లివలన గాని, నా సోదరివలన గాని పొందలేదు.

శోచతాం బ్రాహ్మణానాం యే నిస్స్వనేనాతిదుఃఖితాః ।
మ్రియన్తే వ్యాధినా క్లిష్టాస్తేషాం మాతా వృథా ప్రజా ॥43॥

బ్రాహ్మణులు మరియు తన బంధువర్గము దుఃఖించుచుండగా ఎవరయితే ఎట్టి ప్రతీకారము చేయక తాము కూడా మిక్కిలి దుఃఖితులై యుందురో, వ్యాధులతోనూ, క్లేశములతోనూ మరణింతురో అట్టి వారి తల్లి సార్థకజన్మురాలు కాదు.

సంగ్రామే యుధ్యమానా యేఽభీతా గోద్విజరక్షణే ।
క్షుణ్ణాః శస్త్రైర్విపద్యన్తే త ఏవ భువి మానవాః ॥44॥

గోవులను, బ్రాహ్మణులను రక్షించుటకై ఎవరైతే నిర్భయముగా సంగ్రామమందు యుద్ధము చేయుచూ ఆయా శస్త్రములతో కొట్టబడి మరణింతురో వారే నిజమైన మానవులు అనగా సార్థకమైన జన్మ గలవారు.

అర్థినాం మిత్రవర్గస్య విద్విషాం చ పరాఙ్ముఖః ।
యో న యాతి పితా తేన పుత్రీ మాతా చ వీరసూః ॥45॥

యాచకులకు, స్నేహితులకు, శత్రువులకు ఎవరయితే వెనుతిరగడో అట్టివానితో తండ్రి పుత్రవంతుడగును, తల్లి వీరమాతయగును.

గర్భక్లేశః స్త్రియో మన్యే సాఫల్యం భజతే తదా ।
యదాఽరివిజయీ వా స్యాత్ సంగ్రామే వా హతస్సుతః ॥46॥

ఏ కుమారుడయితే యుద్ధమందు శత్రువులను జయించి మరలి వచ్చునో లేదా వీరమరణము పొందునో అట్టి కుమారుని వల్లనే తల్లికి గర్భక్లేశము సఫలమగుచున్నది.

పుత్రావూచతుః – కుమారులు పలికారు.

తతస్స రాజా సంస్కారం పుత్రపత్నీమలంభయత్ ।
నిర్గమ్య చ బహిస్స్నాతో దదౌ పుత్రాయ చోదకమ్ ॥47॥

అంతట ఆ శత్రుజిన్మహారాజు తన కుమారుని భార్యకు (కోడలికి) దహనసంస్కారములు చేసెను. పిమ్మట బయటకు వెళ్ళి స్నానమాచరించి తన కుమారునికి తర్పణములాచరించెను.

తాలకేతుశ్చ నిర్గమ్య తథైవ యమునాజలాత్ ।
రాజపుత్రమువాచేదం ప్రణయాన్మధురం వచః ॥48॥

అట్లే కపటమునివేషధారియగు తాళకేతువుగూడా యమునానదీజలమునుండి బయటకు వచ్చి రాజపుత్రునితో స్నేహపూర్వకముగా మధురవాక్కులనిట్లు పలికెను.

గచ్ఛ భూపాలపుత్ర త్వం కృతార్థోఽహం కృతస్త్వయా ।
వాంఛితం తు కృతం కార్యం త్వయ్యత్రావిచలే స్థితే ॥49॥

ఓ రాకుమారా ! నీవిక వెళ్ళుము. నీవలన నేను కృతార్థుడనయితిని. నీవిచ్చట కదలకుండా ఉన్నందున నా మనోఽభీష్టము నెరవేరినది.

వారుణం యజ్ఞకార్యం చ జలేశస్య మహాత్మనః ।
తన్మయా సాధితం సర్వం యన్మమాఽసీదభీప్సితమ్ ॥50॥

జలాధిపతియగు వరుణదేవుని యజ్ఞకార్యము పూర్తి అయినది. నేను కోరుకొన్నది నెరవేరినది.

ప్రణిపత్య స తం ప్రాగాద్రాజపుత్రః పురం పితుః ।
సమారుహ్య తమేవాశ్వం సుపర్ణానిలవిక్రమమ్ ॥51॥

అంతట ఆ రాకుమారుడు ఆ మాయామునికి నమస్కరించి ఆ అశ్వమునధిరోహించి గరుత్మంతుని వేగముతో సమానమైన వేగము కలిగినవాడై తన తండ్రి పట్టణమునకు వెళ్ళెను.

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే కువలయాశ్వీయే వింశోఽధ్యాయః ॥20॥

శ్రీ మార్కండేయ మహాపురాణమందు కువలయాశ్వచరితం అనే ఇరువదియవ అధ్యాయం సమాప్తం.



ఏకవింశోఽధ్యాయః – ఇరువదియొకటవ అధ్యాయం

కువలయాశ్వస్య పాతాలలోకగమనం–కువలయాశ్వుడు పాతాలలోకమునకు వెళ్ళుట

నాగపుత్రావూచతుః – నాగకుమారులు పలికారు.

స రాజపుత్రః సంప్రాప్య వేగాదాత్మపురం తతః ।
పిత్రోర్వవందిషుః పాదౌ దిదృక్షుశ్చ మదాలసామ్ ॥1॥

ఋతధ్వజుడను ఆ రాకుమారుడు తన తల్లిదండ్రులకు నమస్కారము చేయు కోరికగలవాడై మరియు తన భార్యయగు మదాలసను చూడవలెనని కోరికగలవాడై వేగముగా తన పట్టణమును పొందెను (పొంది).

స దదర్శ తదుద్విగ్నమప్రహృష్టముఖం పురమ్ ।
పునశ్చ విస్మితాకారం ప్రహృష్టవదనం పునః ॥2॥

అన్యముత్ఫుల్లనయనం దిష్ట్యా దిష్ట్యేతి వాదినమ్ ।
పరిష్వజన్తమన్యోన్యమతికౌతూహలాన్వితమ్ ॥3॥

అచ్చట ఆ రాకుమారుడు ముందుగా ఉద్వేగము మరియు సంతోషము లేని ముఖములు గల పురజనులను చూచెను. ఆ వెంటనే మరల వికసించిన మరియు సంతోషముతో కూడిన ముఖములు గల పురజనులను చూచెను. ఇంకను వికసించిన నేత్రములుగలవారిని, ఇది మన భాగ్యము, భాగ్యము అని మాటలాడువారిని, ఒకరినొకరు కౌగలించుకొనువారిని, మిక్కిలి కుతూహలము గలవారిని ఆ రాకుమారుడు చూచెను.

స రాజపుత్రో మిత్రం తు ఉత్ఫుల్లనయనం శుభమ్ ।
ఆలిలిఙ్గ తదా కాలే సౌహృదేన పరేణ చ ॥4॥

వికసించిన నేత్రములు గలవాడు, మంగళస్వరూపుడు అగు ఆ రాజపుత్రుడు అప్పుడు మిక్కిలి ప్రేమతో అందరినీ గుర్తించి పలుకరించెను.

తతః పౌరాస్తదాలోక్య దిష్ట్యా దిష్ట్యేతి వాదినః ।
చిరంజీవోరుకల్యాణ హతాస్తే పరిపన్థినః ॥5॥

పిత్రోః ప్రహ్లాదయ మనస్తథాస్మాకమకంటకః ।
ఇత్యేవం వాదిభిః పౌరైః పురః పృష్ఠే చ సంవృతః ॥6॥

తత్క్షణప్రభవానందః ప్రవివేశ పితుః పురమ్ ।

అంతట పురజనులందరు తమ మిత్రుని, అతని సౌహార్దమును చూచి ఇది మన భాగ్యము, భాగ్యము అని పలుకుచుండిరి. ఓ రాకుమారా! చిరకాలము జీవించుము. ఓ కల్యాణగుణములుగలవాడా! నీ శత్రువులందరు సంహరింపబడినారు. తల్లిదండ్రుల మనస్సును ఆహ్లాదపరచుము. మాకెట్టి కష్టములు లేకుండా చూడుము. ఈ విధముగా పలుకుచున్న పురజనులచేత ముందు, వెనుక చుట్టబడినవాడై, ఆ రాకుమారుడు ఆ క్షణమందు కలిగిన ఆనందముగలవాడై తన తండ్రి పట్టణమును ప్రవేశించెను.

పితా చ తం పరిష్వజ్య మాతా చాన్యే చ బాంధవాః ॥7॥

చిరంజీవోరుకల్యాణ దదౌ చాస్మై తదాశిషః ।
ప్రణిపత్య తతస్సోఽథ కిమేతదితి విస్మితః ॥8॥

పప్రచ్ఛ పితరం చాథ సోఽస్మై సర్వం తదుక్తవాన్ ।

ఆ రాకుమారుని తల్లిదండ్రులు, మిగిలిన బంధువులు అందరు అతడిని ఆలింగనము చేసుకొని, ఓ శుభయోగములు గలవాడా! చిరకాలము జీవించుము అని పలుకుచు ఆ రాకుమారుని ఆశీర్వదించిరి. అంతట ఆ రాకుమారుడు వారందరికి నమస్కరించి ఆశ్చర్యమగ్నుడై "ఇదియంత ఏమి" అని తండ్రిని అడిగెను. ఇంకను ఆ రాకుమారుడు ఆ కపటమునివృత్తాంతమునంతయు తన తండ్రికి చెప్పెను.

స భార్యాం తాం మృతాం శ్రుత్వా హృదయేష్టాం మదాలసామ్ ॥9॥

పితరౌ చ పురా దృష్ట్వా లజ్జాశోకవిమధ్యగః ।
చింతయామాస సా బాలా మాం శ్రుత్వా నిధనం గతమ్ ॥10॥

తత్యాజ జీవితం సాధ్వీ ధిఙ్మాం నిష్ఠురమానసమ్ ।
నృశంసోఽహమనార్యోఽహం వినా తాం మృగలోచనామ్ ॥11॥

మత్కృతే నిధనం ప్రాప్తాం యజ్జీవామ్యతినిర్ఘృణః ।

తన హృదయమునకు ఇష్టురాలైన తన భార్య మదాలసయొక్క మరణవార్తను విని, ఎదుట ఉన్న తల్లిదండ్రులను చూచి ఆ రాకుమారుడు సిగ్గు, విచారములతో నిండిపోయెను. ఇంకను ఆ రాకుమారుడు ఇట్లు చింతించెను. నేను మరణించానని విని పతివ్రతయగు నా భార్య ప్రాణములను విడిచిపెట్టినది. మిక్కిలి క్రూరహృదయుడను, నీచుడను, దయారహితుడను అగు నేను మాత్రము లేడికన్నుల వంటి కన్నులుగలదీ, నా కొరకై ప్రాణములను విడిచినదీ అగు నా భార్య లేకుండా ఇంకను జీవించియున్నాను అనగా క్రూరమైన హృదయముగల నేను నిందింపతగినవాడనే.

పునస్స చిన్తయామాస పరిసంస్తభ్య మానసమ్ ॥12॥

మోహోద్గమమపాస్యైవం నిశ్శ్వస్యోచ్ఛ్వస్య చాతురః ।
మృతేతి సా మన్నిమిత్తం త్యజామి యది జీవితమ్ ॥13॥

కిం మయోపకృతం తస్యాః శ్లాఘ్యమేతత్తు యోషితామ్ ।
యది రోదిమి వా దీనం హా ప్రియేతి వదన్ముహుః ॥14॥

తథాప్యశ్లాఘ్యమేతన్నో వయం హి పురుషాః కిల ।
అథ శోకజడో దీనోఽస్రజా హీనోఽబలాన్వితః ॥15॥

విపక్షస్య భవిష్యామి తతః పరిభవాస్పదమ్ ।

తిరిగి ఆ రాకుమారుడు మనస్సు దిటవు చేసుకొని, మోహమును విడనాడి, మనోవిచారముచే వేడినిట్టూర్పులను విడచుచు ఇట్లు చింతించసాగెను. నా భార్య నా కొరకే మరణించుటచే నేనొకవేళ జీవితమును విడిచిపెట్టినచో ఆమెకేమి ఉపకారము చేసినట్లగును? అట్లు ఆచరించుట కొంతమంది స్త్రీలకు నచ్చినది కావచ్చును, కాని నా భార్యకేమీ ఉపకారము చేసినట్లు కాదు. లేదా నేను "ఓ ప్రియురాలా! ఓ ప్రియురాలా!" అని మాటిమాటికి విలపించుచు దీనముగా విలపించినట్లయిన అది కూడా మాకు ప్రశంసింపతగిన కార్యము కాదు. ఎందువలననగా మేము పురుషులము కదా! ఒకవేళ నేను దుఃఖముతో జడుడనై, దీనుడనై రక్తహీనతతో బలము లేనివాడనై అయినట్లయిన అప్పుడు నేను శత్రువులకు అవమానింపదగినవాడను కాగలను.

మయాఽరిశాతనాత్కార్యం రాజ్ఞః శుశ్రూషణం పితుః ॥16॥

జీవితం తస్య చాయత్తం సంత్యాజ్యం తత్కథం మయా ।
కిన్త్వత్ర మేఽన్యత్కర్తవ్యం త్యాగో భోగస్య యోషితః ॥17॥

స చాపి నోపకారాయ తన్వంగ్యాః కిన్తు సర్వథా ।
మయాఽనృశంస్యం కర్తవ్యం నాపకార్యుపకారి వా ॥18॥

యా మదర్థేఽత్యజత్ప్రాణాంస్తదర్థేఽల్పమిదం మమ ।

శత్రువులను సంహరించుట, మహారాజగు తండ్రిని సేవించుట నా కర్తవ్యము. నా జీవితము నా తండ్రి అధీనమందున్నది. అందువలన నేనెట్లు జీవితమును విడిచిపెట్టగలను? కాని నేనిప్పుడు నా భార్యకు ఉపకారమును చేయునట్టిదికాకపోయినా స్త్రీభోగమును విడిచిపెట్టెదను. ఉపకారము చేసినా, అపకారము చేసినా నేనిప్పుడు క్రూరస్వభావము లేకుండుటను చేసెదను. నా కొరకు ప్రాణములను విడిచిపెట్టిన నా భార్యకొరకు నేను చేయునది స్వల్పము మాత్రమే.

నాగపుత్రావూచతుః – నాగకుమారులు పలికారు.

ఇతి కృత్వా మతిం సోఽథ నిష్పాద్యోదకదానికమ్ ॥19॥

క్రియాశ్చానన్తరం కృత్వా ప్రత్యువాచ ఋతధ్వజః ।
యది సా మమ తన్వఙ్గీ న స్యాద్భార్యా మదాలసా ॥20॥

అస్మిన్జన్మని నాన్యా మే భవిత్రీ సహచారిణీ ।
తామృతే మృగశాబాక్షీం గంధర్వతనయామహమ్ ॥21॥

న భోక్ష్యే యోషితం కాంచిదితి సత్యం మయోదితమ్ ।

ఋతధ్వజుడీ విధముగా మనస్సునందు నిశ్చయించుకొని, తన భార్యకు ఉదకదానము మొదలగు అపరకర్మలనాచరించి ఈ విధముగా పలికెను. ఒకవేళ అందమైన అవయవములుగల మదాలస ఈ జన్మలో నాకు భార్య కాకపోయినచో, మరొక స్త్రీ ఎవరూ నాకీ జన్మలో సహధర్మచారిణి కాలేరు. లేడిపిల్ల కన్నులువంటి

కన్నులుగలదీ, గంధర్వకుమార్తె అయిన ఆమె లేకుండా మరొక స్త్రీని ఎవరినీ నేను అనుభవించను. ఇది నేను పలికిన నిజము.

సధర్మచారిణీం పత్నీం తాం ముక్త్వా గజగామినీమ్ ॥22॥

కాంచిన్నాన్యాం కరిష్యామి తేన సత్యం మయోదితమ్ ।
ఏవం సర్వాన్పరిత్యజ్య స్త్రీభోగాంస్తాత సర్వదా ॥23॥

క్రీడన్నాస్తే సమం తుల్యైర్వయస్యైః శీలసంపదా ।
ఏతత్తస్య పరం కార్యం తాత తత్కేన సాధ్యతే ॥24॥

కర్తుమత్యంతదుష్ప్రాప్యమీశ్వరైః కిముతేతరైః ।

గజగమనమువంటి గమనముగల సహధర్మచారిణి అయిన తన భార్యను వదిలి మరొక స్త్రీని ఎవరినీ వివాహమాడను. ఇది నేను పలికిన నిజము. ఈ విధముగా పలికి ఓ తండ్రీ! ఋతధ్వజరాకుమారుడు సమస్త స్త్రీభోగములను అన్నివేళలా విడిచిపెట్టి తన సమవయస్కులైన స్నేహితులతో శీలసంపదతో క్రీడించుచూ ఉండెను. ఓ తండ్రీ! మదాలసప్రాప్తియను ఈ కార్యము ఎట్లు సాధ్యమగును? దేవతలకు కూడా సంభవము కాని ఈ కార్యము ఇతరులకెట్లు సాధ్యమగును?

జడ ఉవాచ – జడుడు పలికాడు.

ఇతి వాక్యం తయోశ్శ్రుత్వా విమర్శమగమత్పితా ॥25॥

విమృశ్య చాహ తౌ పుత్రౌ నాగరాట్ ప్రహసన్నివ ।
యద్యశక్యమితి శ్రుత్వా న కరిష్యన్తి మానవాః ॥26॥

కర్మణ్యుద్యమముద్యోగహాన్యా హానిస్తతః పరమ్ ।
ఆరభేత నరః కర్మ స్వపౌరుషమహాపయన్ ॥27॥

నిష్పత్తిః కర్మణాం దైవే పౌరుషే చ వ్యవస్థితా ।
తస్మాదహం తథా యత్నం కరిష్యే పుత్రకార్యతః ॥28॥

తపశ్చర్యాం సమాస్థాయ యథైతత్సాధ్యతేఽచిరాత్ ।

నాగకుమారులు పలికిన ఆ మాటలను విని తండ్రియగు నాగరాజు ఆలోచింపసాగెను. ఆలోచించినవాడై పిమ్మట ఆ నాగరాజు నవ్వుచున్నవానివలే తన కుమారులతో ఇట్లు పలికెను. ఏ పనినైననూ ఇది సాధ్యము కాదని మానవులు చేయకుండా ఊరకుండినచో అట్టి ప్రయత్నహాని వలన ఎంతో హాని అనగా నష్టము కలుగును. అందువలన పురుషుడు తన పౌరుషమును (పురుషప్రయత్నమును) విడనాడక ఆయా పనులను ఆరంభించవలెను. ఆ కర్మల సిద్ధి దైవాధీనము మరియు పురుషప్రయత్నాధీనము అయి ఉన్నది. అందువలన నేను నా కుమారుల కార్యము నిమిత్తమై తపస్సునారంభించి తొందరగా కార్యము సిద్ధించునటుల ప్రయత్నము చేసెదను.

పుత్ర ఉవాచ – కుమారుడు పలికాడు.

ఏవముక్త్వా స నాగేంద్రః ప్లక్షావతరణం గిరేః ॥29॥

తీర్థం హిమవతో గత్వా తపస్తేపే సుదుశ్చరమ్ ।
తుష్టావ వాగ్భిరిష్టాభిస్తత్ర దేవీం సరస్వతీమ్ ॥30॥

తన్మనా నియతాహారో భూత్వా త్రిషవణాప్లుతః ।

ఆ నాగేంద్రుడు ఇట్లు పలికి హిమాలయపర్వతమందలి ప్లక్షావతరణమను తీర్థమునకు వెళ్ళి కఠోరమైన తపస్సునాచరించెను. అచ్చట సరస్వతీదేవిని తనకభీష్టమైన వాక్కులతో ఆమెయందే మనస్సును లగ్నము చేసి, నియతమైన ఆహారమును గ్రహించుచు, త్రికాలసంధ్యను ఆచరించుచు స్తుతించెను.

అశ్వతర ఉవాచ – అశ్వతరుడు (నాగరాజు) పలికెను.

జగద్ధాత్రీమహం దేవీమారిరాధయిషుశ్శుభామ్ ॥31॥

స్తోష్యే ప్రణమ్య శిరసా బ్రహ్మయోనిం సరస్వతీమ్ ।
సదసద్దేవి యత్కించిన్మోక్షబంధార్థవత్పదమ్ ॥32॥

తత్సర్వం త్వయ్యసంయోగం యోగవద్దేవి సంస్థితమ్ ।
త్వమక్షరం పరం దేవి యత్ర సర్వం ప్రతిష్ఠితమ్ ॥33॥

అక్షరం పరమం బ్రహ్మ జగచ్చైతత్ క్షరాత్మకమ్ ।
దారుణ్యవస్థితో వహ్నిర్భౌమాశ్చ పరమాణవః ॥34॥

తథా త్వయి స్థితం బ్రహ్మ జగచ్చేదమశేషతః ।

జగజ్జనని, మంగళస్వరూపురాలు అగు సరస్వతీదేవిని నేను ఆరాధించదలచితిని. బ్రహ్మనుండి ఉద్భవించిన ఆ సరస్వతీదేవికి శిరస్సు వంచి నమస్కరించి స్తుతించెదను. ఓ దేవీ! మోక్షము, సంసారబంధము ఈ రెంటికీ కారణభూతములైన సదసత్ పదార్థములు వస్తుతః నీయందు లేకపోయినా నీయందు ఉన్నట్లు భాసించుచున్నవి. ఓ దేవీ! నీవు అక్షరస్వరూపురాలవు. నీయందే సమస్తమూ అనగా అక్షరరూపమగు బ్రహ్మము మరియు నాశస్వభావముగల ప్రపంచమూ నెలకొనియున్నవి. కట్టెలయందు వహ్ని, భూసంబంధమైన పరమాణువులు అంతర్గతముగా ఉన్నట్లుగా ఎట్టి శేషమూ లేకుండగా ఈ సమస్త ప్రపంచమంతయు నీయందే నిలిచియున్నది.

ఓంకారాక్షరసంస్థానం యత్తే దేవి స్థిరాస్థిరమ్ ॥35॥

తత్ర మాత్రాత్రయం సర్వమస్తి యద్దేవి నాస్తి చ ।
త్రయో లోకాస్త్రయో దేవాస్త్రైవిద్యం పావకత్రయమ్ ॥36॥

త్రీణి జ్యోతీంషి వర్గాశ్చ త్రయో ధర్మాదయస్తథా ।

త్రయో గుణాస్త్రయః శబ్దాస్త్రయో దోషాస్తథాశ్రమాః ॥37॥

త్రయః కాలాస్తథావస్థాః పితరోఽహర్నిశాదయః ।
ఏతన్మాత్రాత్రయం దేవి తవ రూపం సరస్వతి ॥38॥

ఓ దేవీ! చరాచరాత్మకమైన ఈ ప్రపంచమంతయు నీ స్వరూపమైన ఓంకారమను అక్షరమందు నెలకొనియున్నది. ఆ అక్షరబ్రహ్మమందు అకార ఉకార మకారములనెడు మూడు మాత్రలు ఉన్నవి. ఓ సరస్వతీ! ఓ దేవీ! నీయందున్నట్లు అగుపించుచున్న ఈ ప్రపంచమంతయు నిజముగా లేదు. ఈ మూడులోకములు, ముగ్గురు మూర్తులు, మూడు అగ్నులు, మూడు జ్యోతిస్సులు, మూడు వర్గములు, మూడు ధర్మములు, సత్త్వాది మూడు గుణములు, మూడు శబ్దములు, మూడు దోషములు, మూడు ఆశ్రమములు, మూడు కాలములు, జాగరాది మూడు అవస్థలు, పితృదేవతలు, రాత్రింబవళ్ళు ఇవియన్నియు నీ రూపమైన మూడు మాత్రల స్వరూపమే.

విభిన్నదర్శినామాద్యా బ్రహ్మణో హి సనాతనా ।
సోమసంస్థా హవిఃసంస్థాః పాకసంస్థాశ్చ సప్త యాః ॥39॥

తాస్త్వదుచ్చారణాద్దేవి క్రియన్తే బ్రహ్మావాదిభిః ।
అనిర్దేశ్యం తథా చాన్యదర్ధమాత్రాశ్రితం పరమ్ ॥40॥

అవికార్యక్షయం దివ్యం పరిణామవివర్జితమ్ ।
తవైవ చ పరం రూపం యన్న శక్యం మయేరితుమ్ ॥41॥

ఓ దేవీ! వేరువేరు సంప్రదాయములు గలవారికి నీవు బ్రహ్మకంటే కూడా ఆద్యురాలు మరియు సనాతనురాలివి (ప్రాచీనమైనదానివి). ఏడు సోమసంస్థలు, ఏడు హవిస్సంస్థలు, ఏడు పాకసంస్థలు అను యజ్ఞములను నీ నామోచ్చారణము చేతనే బ్రహ్మవేత్తలు ఆచరించుచున్నారు. ఓ దేవీ! నీ రూపము ఓంకారమందలి అర్ధమాత్రను ఆశ్రయించియున్నది. (అ,ఉ,మ్ అను మూడు అక్షరముల సంయోగమే ఓంకారము. అందు చివరి అక్షరము మకారము హల్లు, అర్ధమాత్ర గలది. ఆ హల్లునకు రుద్రుడు, మహేశ్వరి రెండు అర్థములు గలవు). ఆ రూపము ఇట్టిది అని వర్ణించుటకు వీలులేనిది. మిక్కిలి శ్రేష్ఠమైనది, ఎట్టి వికారములు లేనిది, నాశము లేనిది, దివ్యమైనది, ఎట్టి మార్పు లేనిది. అట్టి నీ పరమైన రూపమును నేను ఉచ్చరించలేను.

న చాస్యేన న వా జిహ్వాతాల్వోష్ఠాదిభిరుచ్యతే ।
ఇంద్రోఽపి వసవో బ్రహ్మా చంద్రార్కౌ జ్యోతిరేవ చ ॥42॥

విశ్వావాసం విశ్వరూపం విశ్వేశం పరమేశ్వరమ్ ।
సాంఖ్యవేదాన్తవేదోక్తం బహుశాఖాస్థిరీకృతమ్ ॥43॥

అనాదిమధ్యనిధనం సదసన్నః సదేవ తు ।
ఏకం త్వనేకమప్యేకం భవభేదసమాశ్రితమ్ ॥44॥

అనాఖ్యం షడ్గుణాఖ్యం చ షట్కాఖ్యం త్రిగుణాశ్రయమ్ ।
నానాశక్తిమతామేకం శక్తివైభావికం పరమ్ ॥45॥

సుఖాసుఖమహత్ సౌఖ్యం రూపం తవ విభావ్యతే ।
ఏవం దేవి త్వయా వ్యాప్తం సకలం నిష్కలం జగత్ ॥46॥

ఓ దేవీ! నీ రూపమును నోరు, నాలుక, దవడలు, పెదవులు మొదలగునవి ఆయా వర్ణోత్పత్తి స్థానములతో వర్ణించుటకు సాధ్యము కాదు. ఇంద్రుడు, వసువులు, బ్రహ్మ, సూర్యచంద్రులు, అగ్ని అన్నియు నీ రూపమే. నీ రూపము విశ్వమంతా వ్యాప్తమైనది, ప్రపంచస్వరూపము, విశ్వమును పరిపాలించునట్టిది, పరమేశ్వరసంబంధము కలది, సాంఖ్యము, వేదములు, ఉపనిషత్తులలో వర్ణింపబడినట్టిది, అనేక వేదశాఖలలో నిర్ణయింపబడినట్టిది, ఆద్యంతములు మరియు నాశము లేనిది, సదసద్రూపము, మాకు మాత్రము ఎప్పుడూ సద్రూపమే అయినది, ఒక్కటే అయినా అనేకము, సంసారమందలి ఆయా ఉపాధుల కారణముగా భిన్నమైనట్టిది, వర్ణింపశక్యము కానిది, షడ్గుణములచే వర్ణింపబడునట్టిది, సత్త్వరజస్తమోగుణములకు ఆశ్రయమైనది, నానాశక్తులు కల్గినవాటియందు ఏకము (భిన్నములలో అభిన్నము), ఉత్కృష్టమైన శక్తివిభవస్వరూపము, గొప్పదియగు సుఖదుఃఖస్వరూపము, నిత్యానందరూపముగా తలచబడుచున్నది. ఈ విధముగా ఓ దేవీ! ఈ సమస్త ప్రపంచము నీచేత వ్యాపింపబడియున్నది.

అద్వైతావస్థితం బ్రహ్మ యచ్చ ద్వైతే వ్యవస్థితమ్ ॥

యేఽర్థా నిత్యా యే వినశ్యన్తి చాన్యే యే వా స్థూలా యే చ సూక్ష్మాచ్చ సూక్ష్మాః ।
యే వా భూమౌ యేఽన్తరిక్షేఽన్యతో వా తేషాం సత్యం త్వత్త ఏవోపలబ్ధిః ॥47॥

అద్వైతస్థితియందలి బ్రహ్మము, ద్వైతస్థితియందలి బ్రహ్మము, నిత్యమైన పదార్థములు, అనిత్యమైన పదార్థములు, స్థూలమైన వస్తువులు, అతిసూక్ష్మమైన వస్తువులు, భూలోకమందుగాని అంతరిక్షలోకమందుగాని మరి ఏ ఇతర లోకములలో గాని ఉండే వస్తువులు వీటియన్నింటి సత్యము లేదా తత్త్వము నీవల్లనే తెలియును.

యచ్చామూర్తం యచ్చ మూర్తం సమస్తం యద్వా భూతేష్వేకమేకం చ కించిత్ ।
యద్దివ్యేఽస్తి క్ష్మాతలే ఖేఽన్యతో వా తత్సంబంధం త్వత్స్వరైర్వ్యంజనైశ్చ ॥48॥

మూర్తము, అమూర్తము ఈ రెండింటి స్వరూపమైన సమస్త ప్రపంచము, సమస్తభూతములందలి ఒక్కొక్క భాగము, స్వర్గమందుగాని, భూలోకమందుగాని, ఆకాశమందుగాని, మరెచ్చటగాని ఉన్నవీ అగు వీటి అన్నింటియొక్క సంబంధము అనగా జ్ఞానము నీ స్వరవ్యంజనములవల్లనే కలుగుచున్నది.

జడ ఉవాచ – జడుడు పలికాడు.

ఏవం స్తుతా తదా దేవీ విష్ణోర్జిహ్వా సరస్వతీ ।
ప్రత్యువాచ మహాత్మానం నాగమశ్వతరం తతః ॥49॥

ఈ విధముగా నాగరాజగు అశ్వతరునిచే స్తుతింపబడిన విష్ణుజిహ్వయగు సరస్వతీదేవి అటుపిమ్మట ఆ మహాత్మునితో ఇట్లు పలికెను.

సరస్వత్యువాచ – సరస్వతీదేవి పలికింది.

వరం తే కంబలభ్రాతః ప్రయచ్ఛామ్యురగాధిప ।
తదుచ్యతాం ప్రదాస్యామి యత్తే మనసి వర్తతే ॥50॥

కంబలుని సోదరుడవు ఓ నాగరాజా! నీకేమి వరము కావలయునో చెప్పుము, దానిని ఇచ్చెదను. నీ మనస్సులో ఉన్న కోరిక ఏమిటో చెప్పుము, ఇచ్చెదను.

అశ్వతర ఉవాచ – నాగరాజగు అశ్వతరుడు పలికాడు.

సాహాయ్యం దేవి! దేహి త్వం పూర్వం కంబలమేవ చ ।
సమస్తస్వరసంబద్ధముభయోః సంప్రయచ్ఛ చ ॥51॥

ఓ సరస్వతీదేవీ! ముందుగా కంబలునికీ, నాకునూ సహాయము చేయుము. మాకిరువురికిని స్వరసంబంధమైన జ్ఞానమును ప్రసాదింపుము.

సరస్వత్యువాచ – సరస్వతీదేవి పలికింది.

సప్తస్వరా గ్రామరాగాః సప్త పన్నగసత్తమ ।
గీతకాని చ సప్తైవ తావత్యశ్చాపి మూర్ఛనాః ॥52॥

తానాశ్చైకోనపంచాశత్తథా గ్రామత్రయం చ యత్ ।
ఏతత్సర్వం భవాన్వేత్తా కంబలశ్చైవ తేఽనఘ ॥53॥

ఓ నాగరాజా! ఓ పాపరహితుడా! ఏడు స్వరములు, ఏడు గ్రామరాగములు, ఏడు గీతములు, ఏడు మూర్ఛనములు, నలభైతొమ్మిది తానములు, మూడు గ్రామములు ఇవన్నియూ నీసోదరుడగు కంబలునికి, నీకునూ బాగుగా తెలియును.

జ్ఞాస్యతే మత్ప్రసాదేన భుజగేంద్ర పరం తథా ।
చతుర్విధం పరం తాలం త్రిప్రకారం లయత్రయమ్ ॥54॥

గతిత్రయం తథా తాలం మయా దత్తం చతుర్విధమ్ ।
ఏతద్భవాన్ మత్ప్రసాదాత్పన్నగేంద్రాపరం చ యత్ ॥55॥

ఓ నాగేంద్రా! నా అనుగ్రహముచేత ఇంకను నీకు మరిన్ని విశేషాలు తెలియగలవు. నా దయచేత నీకు నాలుగు విధములైన తాళములు, మూడు విధములైన లయలు, మూడు విధములైన గతులు తెలియగలవు.

ఆస్యాన్తర్గతమాయత్తం స్వరవ్యంజనయోశ్చ యత్ ।
తదశేషం మయా దత్తం భవతః కంబలస్య చ ॥56॥

ముఖమందలి ఉచ్చారణకు సంబంధించి, స్వరవ్యంజనములతో కూడినట్టి ఈ సంగీతపరిజ్ఞానమునంతయు నీకూ, కంబలునికీ ఇరువురికీ ఇచ్చితిని.

యథా నాన్యస్య భూలోకే పాతాలే వాఽపి పన్నగ ।
ప్రణేతారౌ భవన్తౌ చ సర్వస్యాద్య భవిష్యతః ॥57॥

పాతాలే దేవలోకే చ భూర్లోకే చైవ పన్నగౌ ।

ఓ నాగాధిపా! మీ ఇరువురికి నేను సంగీతపరిజ్ఞానమును ఇచ్చినట్లుగా భూలోకమందుగాని, పాతాలలోకమందుగాని మరెవరికీ నేను ఇవ్వలేదు. అందువలన సర్పములగు మీరివురు సమస్త సంగీతశాస్త్రమునకు భూలోకమందు, పాతాలలోకమందు, స్వర్గలోకమందునూ రచయితలు కాగలరు.

జడ ఉవాచ – జడుడు పలికాడు.

ఇత్యుక్త్వా సా తదా దేవీ సర్వజిహ్వా సరస్వతీ ॥58॥

జగామాదర్శనం సద్యో నాగస్య కమలేక్షణా ।
తయోశ్చ తద్యథావృత్తం భ్రాత్రోః సర్వమజాయత ॥59॥

విజ్ఞానముభయోరగ్ర్యం పదతాలస్వరాదికమ్ ॥

సమస్తజనులకు జిహ్వారూపిణి, పద్మములవంటి కన్నులు గలదీయగు సరస్వతీదేవి ఇట్లు పలికి అచ్చటినుండి అంతర్ధానమయ్యెను. ఆ ఇరువురు సోదరులకూ సరస్వతీదేవి వరప్రభావముచే ఆమె చెప్పినట్లుగానే సమస్తసంగీత పరిజ్ఞానము కలిగెను. ఆ ఇరువురికీ పదము, తాళము, స్వరము మొదలగు వాటికి సంబంధించిన సంపూర్ణపరిజ్ఞానము సిద్ధించెను.

తతః కైలాసశైలేంద్రశిఖరస్థితమీశ్వరమ్ ॥60॥

గీతకైస్సప్తభిర్నాగౌ తంత్రీలయసమన్వితైః ।
ఆరిరాధయిషూ దేవమనంగాంగహరం హరమ్ ॥61॥

అటు పిమ్మట కైలాసపర్వతశిఖరమందు ఉన్నవాడు, మన్మథసంహారకుడు, పాపహరుడూ అగు పరమేశ్వరుని ఆ సర్పములు ఇరువురు తంత్రీలయములతో కూడుకొన్నట్టి సప్తగీతములతో ఆరాధించవలెనని కోరికగలవారైరి.

ప్రచక్రతుః పరం యత్నముభే సంహతవాక్కలౌ ।
ప్రాతర్నిశాయాం మధ్యాహ్నే సంధ్యయోశ్చాపి తత్పరౌ ॥62॥

అంతట ఆ ఇరువురు పరమేశ్వరునియందే మనస్సు లగ్నము చేసి ఒకే వాక్కు మరియు కళ కలిగి ఉదయము, మధ్యాహ్నము, సంధ్యాకాలము, రాత్రి అన్ని సమయములందు ఆ పరమేశ్వరుని గూర్చి గొప్ప ఆరాధన చేసిరి.

తతః కాలేన మహతా స్తూయమానో వృషధ్వజః ।
తుతోష గీతకైస్తౌ చ ప్రాహ సంగృహ్యతాం వరః ॥63॥

అంతట ఆ ఇరువురిచే ఎంతో కాలము స్తుతింపబడిన వృషభధ్వజుడగు (ఎద్దు వాహనముగా కలిగిన) ఆ పరమేశ్వరుడు వారి గీతములచే మిక్కిలి సంతసించి ఏదేని వరము కోరుకొనవలసిందిగా పలికెను.

తతః ప్రణమ్యాశ్వతరః కంబలేన సమం తదా ।
విజ్ఞాపయన్మహాదేవం శితికంఠముమాపతిమ్ ॥64॥

అటుపిమ్మట కంబలునితో కూడుకొన్న అశ్వతరుడు, శితికంఠుడూ మరియు ఉమాపతీయగు మహాదేవునికి ఇట్లు విన్నవించెను.

యది నౌ భగవన్ ప్రీతో దేవదేవ త్రిలోచన ।
తతో యథాభిలషితం వరమేనం ప్రయచ్ఛ నౌ ॥65॥

ఓ దేవదేవుడా! మూడుకన్నులు గలవాడా! భగవత్స్వరూపుడా! మా ఇరువురిపట్ల నీకు ప్రీతి కలిగినట్లయిన మా ఇద్దరికీ అభీష్టమైన ఈ వరమునిమ్ము.

మృతా కువలయాశ్వస్య పత్నీ దేవ మదాలసా ।
తేనైవ వయసా సద్యో దుహితృత్వం ప్రయాతు మే ॥66॥

ఓ దేవా! కువలయాశ్వుని భార్యయగు మదాలస చనిపోయినప్పుడు ఎంత వయస్సు కలిగి ఉన్నదో అంతటి వయస్సు గల కుమార్తెను నాకు వెంటనే ప్రసాదించుము.

జాతిస్మరా యథాపూర్వం తద్వత్ క్షాన్తిసమన్వితా ।
యోగినీ యోగమాతా చ జాయతాం వచనాత్తవ ॥67॥

అట్లు నాకు జన్మించిన మదాలస మీ అనుగ్రహముచే మీ మాట ప్రకారము పూర్వమువలెనే తన జన్మముయొక్క జ్ఞానము కలదియై క్షమాగుణము కలదియై, యోగిని మరియు యోగమాత అగునుగాక!

ఈశ్వర ఉవాచ – ఈశ్వరుడు చెప్పాడు.

యథోక్తం పన్నగశ్రేష్ఠ సర్వమేతద్భవిష్యతి ।
మత్ప్రసాదాదసందిగ్ధం శృణు చేదం భుజంగమ ॥68॥

ఓ సర్పశ్రేష్ఠుడా! నీవు అడిగినదంతయు నా అనుగ్రహముచే ఎట్టి సందేహము లేక సిద్ధించును. మరియు నేను చెప్పు మరొక విషయమును గూడ వినుము.

శ్రాద్ధావసానే ప్రాశ్నీథా మధ్యమం పిండమాత్మనా ।
కామం చేమామనుధ్యాయన్ కురు త్వం పితృపూజనమ్ ॥69॥

నీవు మదాలసను సంకల్పించి పితృశ్రాద్ధమును (తండ్రి చేయవలసిన శ్రాద్ధకర్మను) ఆచరించుము. శ్రాద్ధకర్మ ముగిసిన వెంటనే మూడు పిండములలో మధ్యలో ఉన్న పిండమును భక్షించుము. ఈ విధముగా నీవు ఈమెను గురించి ధ్యానము చేయుచు పితృకార్యమును నెరవేర్చుము.

తత్క్షణాదేవ సా సుభ్రూర్భవతో మధ్యమాత్ఫణాత్ ।
సముత్పత్స్యతి కల్యాణీ తథారూపా యథా మృతా ॥70॥

అట్లు భుజించిన క్షణమందే అందమైన కనుబొమలు కలిగి, మంగళస్వరూపిణియై, ప్రాణత్యాగసమయమందు ఎట్టి రూపము కలిగి ఉన్నదో అట్టి రూపము కలిగిన ఆమె (మదాలస) నీ మధ్యభాగమందలి పడగనుండి ఉద్భవించును.

స్వయమేవోపభుఙ్క్ష్వ తతస్సర్వం భవిష్యతి ।
ఉత్పత్స్యతే తతస్సా తు సత్యం వై మధ్యమాత్ఫణాత్ ॥71॥

నీవీ ప్రకారముగా స్వయముగా ఆ పిండమును భుజించిన పిమ్మట ఆమె తప్పక నీ మధ్యభాగమందలి పడగనుండి పుట్టగలదు. ఇది నిజము, తప్పక జరుగును.

ఏతచ్ఛ్రుత్వా తతస్తౌ తు ప్రణిపత్య మహేశ్వరమ్ ।
రసాతలమనుప్రాప్తౌ పరితోషసమన్వితౌ ॥72॥

పరమేశ్వరుని ఈ మాటలను విని కంబలుడు, అశ్వతరుడు ఇరువురు మహేశ్వరునికి నమస్కరించి, సంతోషముతో నిండినవారై పాతాళలోకమునకు చేరిరి.

తథా చ కృతవాన్ శ్రాద్ధం స నాగః కంబలానుజః ।
పిండం చ మధ్యమం తద్వత్ యథావదుపభుక్తవాన్ ॥73॥

కంబలుని సోదరుడగు అశ్వతరుడను ఆ నాగశ్రేష్ఠుడు మహేశ్వరుడు చెప్పినట్లుగానే శ్రాద్ధకర్మను ఆచరించి, మధ్యమపిండమును యథోక్త ప్రకారముగా భుజించెను.

ఉపభుక్తే తతః పిండే తస్య సా తనుమధ్యమా ।
జజ్ఞే నిశ్వసతస్సద్యస్తద్రూపా మధ్యమాత్ఫణాత్ ॥74॥

ఆ నాగరాజు అట్లు ఆ మధ్యమపిండమును భుజించిన వెంటనే అందమైన నడుముగల మదాలస పూర్వరూపమును కల్గియే బుసలుకొట్టు ఆ మధ్యమపడగనుండి జన్మించెను.

న చాపి కథయామాస కస్యచిత్స భుజంగమః ।
అంతర్గృహే తాం సుదతీం స్త్రీభిర్గుప్తామధారయత్ ॥75॥

పన్నగశ్రేష్ఠుడగు ఆ అశ్వతరుడు ఎవ్వరికినీ ఈ విషయమును చెప్పలేదు. అందమైన పళ్ళవరుసగల ఆ మదాలసను అంతఃపురమందు అచ్చుటి స్త్రీల రక్షణలో ఉంచెను.

తౌ చానుదినమాగత్య పుత్రౌ నాగపతేస్సుఖమ్ ।
ఋతుధ్వజేన సహితౌ చిక్రీడాతేఽమరావివ ॥76॥

నాగరాజగు అశ్వతరుని కుమారులిరువురూ ప్రతీరోజూ వచ్చి దేవకుమారులవలే ఋతుధ్వజునితో కూడినవారై క్రీడించుచుండిరి.

ఏకదా తు స తౌ ప్రాహ స నాగోఽశ్వతరో ముదా ।
తన్మయా పూర్వముక్తం తు క్రియతే కిన్ను తత్తథా ॥77॥

ఒకనాడు అశ్వతరుడు సంతోషముతో తన కుమారులిద్దరితో ఇట్లు పలికెను. "నేను పూర్వము మీతో చెప్పినవిధముగా ఎందుకు చేయుటలేదు?"

స రాజపుత్రో యువయోరుపకారీ మమాంతికమ్ ।
కిం ను నానీయతే వత్సావుపకారాయ మానదః ॥78॥

ఓ కుమారులారా! ఆ రాకుమారుడు మీ ఇరువురికీ ఎంతో ఉపకారము చేసినవాడు కదా! అట్టి మానధనుడైన రాకుమారుని తిరిగి ఉపకారము చేయుటకు నా వద్దకు మీరు ఎందుకు తీసుకువచ్చుట లేదు?

ఏవముక్తౌ పునస్తేన పుత్రౌ స్నేహవతా తు తౌ ।
గత్వా తస్య పురం సఖ్యా రేమాతే తేన ధీమతా ॥79॥

ఈ విధముగా తమ తండ్రియగు అశ్వతరుడు ప్రేమతో ఇట్లు చెప్పగా, ఆ కుమారులిరువురూ స్నేహితుడగు ఆ రాకుమారుని పట్టణమునకు వెళ్ళి బుద్ధిమంతుడగు అతనితో క్రీడించసాగిరి. (రేమే- రేమాతే- రేమిరే అని క్రియాపదప్రయోగము. సఖ్యుః + రేమాతే = సఖ్యా రేమాతే అని సంధి.)

తతః కువలయాశ్వం తం కృత్వా కించిత్కథాన్తరమ్ ।
అబ్రూతాం ప్రణిపాతేన స్వగృహగమనం ప్రతి ॥80॥

అటుపిమ్మట కొంత తడవు మాటలాడుకొన్న పిమ్మట, ఆ నాగకుమారులు సగౌరవముగా ఆ రాకుమారుని తమ ఇంటికి అనగా పాతాళలోకమునకు రావలసిందిగా ఆహ్వానించిరి.

తావాహ నృపపుత్రోఽసౌ నన్విదం భవతోర్గృహమ్ ।
ధనవాహనవస్త్రాది యన్మదీయం తదేవ వామ్ ॥81॥

ఆ రాకుమారుడు ఆ నాగకుమారులిరువురితో "ఈ గృహము మీ గృహమే కదా! నాకు సంబంధించిన ధనవాహనవస్త్రాదులన్నియూ మీవే కదా!

యస్య వాం వాంఛితం దాతుం ధనం రత్నమథాపి వా ।
తద్దీయతాం ద్విజసుతౌ యది వాం ప్రణయో మయి ॥82॥

ఓ ద్విజకుమారులారా! ఎవరికి ఏమి ఇష్టమో ధనముగాని, రత్నముగాని, దానినంతయూ వారికి మీరు ఇవ్వవచ్చును. నాయందు మీకు స్నేహమున్నచో మీరట్లు ఆచరించుడు.

ఏతావతాహం దైవేన వంచితోఽస్మి దురాత్మనా ।
యద్భవద్భ్యాం మమత్వం నో మదీయే క్రియతాం గృహే ॥83॥

మీరింతవరకు నా గృహమందలి వస్తువులందు మమత్వమును (అనగా నాది అని అనుకొనుటను) చేయకపోవుటను చూచుచుండగా, దురాత్ముడగు దైవముచే నేనింతవరకు వంచింపబడినానని తలచుచున్నాను.

యది వాం మే ప్రియం కార్యమనుగ్రాహ్యోఽస్మి వా యది ।
తద్ధనే మమ గేహే చ మమత్వమనుకల్ప్యతామ్ ॥84॥

మీరొకవేళ నాకు ప్రియకార్యమును తలపెట్టినా, లేక నాయందు అనుగ్రహము చూపవలెనని తలపెట్టినా నాధనమందు, ఇంటియందు మమత్వమును కల్పించుకొనుడు. అనగా నా సంపదలన్నియూ మావేయని మీరు భావించుడు.

యువయోర్యన్మదీయం తన్మామకం యువయోః స్వయమ్ ।
ఏతత్సర్వం విజానీథ సఖా ప్రాణో బహిశ్చరః ॥85॥

మీకు సంబంధించినది అంతయూ నాదే. నాకు సంబంధించినదంతయు కూడా మీదేయని తెలుసుకొనుడు. స్నేహితుడనగా బయటి ప్రాణము.

పునర్నైవం విభిన్నార్థం వక్తవ్యం ద్విజసత్తమౌ ।
మత్ప్రసాదపరౌ ప్రీత్యా శాపితౌ హృదయేన మే ॥86॥

ఓ ద్విజశ్రేష్ఠులారా! మరల మీరెన్నడు ఇది నాది, ఇది నీది అను భేదభావముతో మాటలాడుట తగదు. సంతోషముతో నాయందు అనుగ్రహబుద్ధి కలిగియుండుడు. ఇది నేను హృదయపూర్వకముగా మీపట్ల మాటలాడిన మాటలు.

తతస్స్నేహార్ద్రవదనౌ తావుభౌ నాగనందనౌ ।
ఊచతుర్నృపతేః పుత్రం కించిత్ప్రణయకోపితమ్ ॥87॥

అంతట స్నేహముతో చెమ్మగిల్లిన ముఖములుగల ఆ నాగకుమారులు ఇరువురు కొద్దిగా ప్రేమతో కోపగించిన రాకుమారునితో ఇట్లు పలికిరి.

ఋతుధ్వజ న సందేహో యథైవాహ భవానిదమ్ ।
తథైవ చాస్మన్మనసి నాత్ర చింత్యమతోఽన్యథా ॥88॥

ఓ ఋతుధ్వజుడా! నీవు పలికినదానిలో ఎంతమాత్రము సందేహము లేదు. నీ మనస్సులోనున్నట్లుగానే మా మనస్సులో కూడా ఉన్నది. అందువలన ఈ విషయమందు మరొకవిధముగా తలచవద్దు.

కింత్వావయోః సమం పిత్రా ప్రోక్తమేతన్మహాత్మనా ।
ద్రష్టుం కువలయాశ్వం తమిచ్ఛామీతి పునః పునః ॥89॥

కాని మహాత్ముడగు మా తండ్రికూడా కువలయాశ్వుని (అనగా నిన్ను) చూడవలెనని మాటిమాటికీ కోరుకొనుచున్నాడు.

తతః కువలయాశ్వోఽథ సముత్థాయ వరాసనాత్ ।
యథాహ తాతేతి వదన్ ప్రణామమకరోద్భువి ॥90॥

ఆ మాట వినినంతనే కువలయాశ్వుడు తన ఉత్తమాసనము నుండి వెంటనే లేచి "మీ తండ్రిగారు చెప్పినట్లే చేసెదము" అని పలుకుచూ నేలపై సాగిలబడి ప్రణామము చేసెను.

కువలయాశ్వ ఉవాచ :- కువలయాశ్వుడు పలికాడు.

ధన్యోఽహమతిపుణ్యోఽహం కోఽన్యోఽస్తి సదృశో మయా ।
యత్తాతో మామభిద్రష్టుం కరోతి ప్రవణం మనః ॥91॥

నేను ధన్యుడను, మిక్కిలి పుణ్యవంతుడను. నాతో సమానులెవరున్నారు? ఎందువలననగా మీ తండ్రిగారు నన్ను చూచుటకు మనస్సులో భావించెను కదా!

తదుత్తిష్ఠత గచ్ఛామ తాతాజ్ఞాం క్షణమప్యహమ్ ।
నాతిక్రాన్తుమిహేచ్ఛామి పద్భ్యాం తస్య శపామ్యహమ్ ॥92॥

కావున లెండు, పోవుదము. తండ్రిగారి ఆజ్ఞను క్షణకాలము ఆలస్యము చేయుటకు కూడా నాకు అంగీకారము కాదు. వారి పాదసాక్షిగా చెప్పుచున్నాను.

జడ ఉవాచ – జడుడు చెప్పాడు.

ఏవముక్త్వా యయౌ సోఽథ సహ తాభ్యాం నృపాత్మజః ।
ప్రాప్తశ్చ గౌతమీం పుణ్యాం నిర్గమ్య నగరాద్బహిః ॥93॥

ఈ విధముగా పలికి, రాకుమారుడగు కువలయాశ్వుడు ఆ ఇరువురు నాగకుమారులతో బయలుదేరెను. నగరమునుండి బయటకు వెడలి పుణ్యనదియగు గౌతమిని చేరెను.

తన్మధ్యేన యయుస్తే వై నాగేంద్రనృపనందనాః ।
మేనే చ రాజపుత్రోఽసౌ పారే తస్యాస్తయోర్గృహమ్ ॥94॥

ఆ నదీమధ్యమార్గముద్వారా ఆ రాకుమారుడు, నాగకుమారులు పయనమయిరి. ఆ నదీతీరమందే వారి గృహము కలదని కూడా రాకుమారుడు భావించెను.

తతశ్చాకృష్య పాతాలం తాభ్యాం నీతో నృపాత్మజః । ।
పాతాలే దదృశే చోభౌ స పన్నగకుమారకౌ ॥95॥

ఫణామణికృతోద్యోతౌ వ్యక్తస్వస్తికలక్షణౌ ।
విలోక్య తౌ సురూపాంగౌ విస్మయోత్ఫుల్లలోచనః ॥96

విహస్య చాబ్రవీత్ప్రేమ్ణా సాధు భో ద్విజసత్తమౌ ।
కథయామాసతుస్తౌ తు పితరం పన్నగేశ్వరమ్ ॥97॥

శాంతమశ్వతరం నాగం మాననీయం దివౌకసామ్ ।

ఆ నాగకుమారులిరువురు ఆ రాకుమారుని చేయి పట్టుకొని పాతాళలోకమునకు తీసుకొని వెళ్ళిరి. రాకుమారుడు పాతాళలోకమందు ఆ ఇరువురు నాగకుమారులను పడగలను కలిగి, పడగలయందున్న మణులతో ప్రకాశము కలిగి, స్వస్తికచిహ్నములు కలిగి ఉన్నవారిగా చూచెను. అట్లు అందమైన రూపము కలిగిన వారిరువురిని చూచి రాకుమారుడు విస్మయముతో విప్పారిన నేత్రములు కలిగినవాడై, "ఓ బ్రాహ్మణశ్రేష్ఠులారా! చాలా బాగున్నది" అని నవ్వి ప్రేమతో పలికెను. ఆ ఇరువురు నాగకుమారులు శాంతుడు, దేవతలకు గౌరవార్హుడు, సర్పమూ అయిన తమ తండ్రియగు అశ్వతరునితో కువలయాశ్వుని రాకను గురించి చెప్పిరి.

రమణీయం తతోఽపశ్యత్ పాతాలం స నృపాత్మజః ॥98॥

కుమారైస్తరుణైర్వృద్ధైరురగైరుపశోభితమ్ ।
తథైవ నాగకన్యాభిః క్రీడన్తీభిరితస్తతః ॥99॥

చారుకుండలహారాభిస్తారాభిర్గగనం యథా ।
గీతశబ్దైస్తథాఽన్యత్ర వీణావేణుస్వరానుగైః ॥100॥

మృదంగపణవాఽఽతోద్యహారి వేశ్మశతాకులమ్ ।
వీక్షమాణః స పాతాలం యయౌ శత్రుజితః సుతః ॥101॥

సహ తాభ్యామభీష్టాభ్యాం పన్నగాభ్యామరిందమః ।

అటుపిమ్మట శత్రుజిత్తు కుమారుడు, రాకుమారుడూ అగు కువలయాశ్వుడు పాతాళలోకమును చూచుచూ వెళ్ళెను. ఆ పాతాళలోకము ఎలా ఉన్నదనగా బాలక, యువక, వృద్ధ సర్పములతో నిండి ప్రకాశించుచున్నది. ఇంకనూ అందమైన చెవి ఆభరణములతోను, హారములతోనూ అలంకరింపబడి ఇటునటు క్రీడించుచున్న నాగకన్యలతో, నక్షత్రముతో కూడుకొన్న ఆకాశమువలే, శోభిల్లుచుండెను. ఇంకను వీణ, వేణువు వీటి స్వరములకు అనుగుణమైన గీతములతో నిండియుండెను. ఇంకను మృదంగము, పణవము (పటహము), ఆతోద్యము (వీణాదివాద్యములు) వీటి ధ్వనులతో మనస్సును హరించునట్టి వందలకొలదీ భావనములతో నిండియుండెను. తన స్నేహితులగు నాగకుమారులతో కలిసి శత్రుసంహారకుడగు కువలయాశ్వుడు అట్టి పాతాళలోకమును చూచుచూ వెళ్ళెను.

తతః ప్రవిశ్య తే సర్వే నాగరాజనివేశనమ్ ॥102॥

దదృశుస్తం మహాత్మానమురగాధిపతిం స్థితమ్ ।
దివ్యమాల్యాంబరధరం మణికుండలభూషణమ్ ॥103॥

స్వచ్ఛముక్తాఫలలతాహారిహారోపశోభితమ్ ।
కేయూరిణం మహాభాగమాసనే సర్వకాఞ్చనే ॥104॥

మణివిద్రుమవైదూర్యజాలాంతరితరూపకే ।
స తాభ్యాం దర్శితస్తస్య తాతోఽస్మాకమసావితి ॥105॥

అటుపిమ్మట వారందరు దివ్యములైన మాలలు, వస్త్రములను ధరించినట్టియు, మణికుండలములచే అలంకరింపబడినట్టియు, స్వచ్ఛములైన ముత్యాలహారములచే ప్రకాశించుచున్నట్టియు, కరకంకణములచే అలంకరింపబడినట్టియు, అంతా బంగారముచే తయారుచేయబడినట్టిదీ, మణివిద్రుమవైఢూర్యములసమూహముచే నిర్మితమైనట్టిదీ అయిన ఆసనమందు ఆసీనుడైనట్టియు, గొప్ప భాగ్యవంతుడూ, మహాత్ముడూ అగు నాగాధిపతిని చూచిరి. ఆ నాగకుమారులిరువురూ "ఇతడే మా తండ్రి"యని ఆ రాకుమారునికి ఆ వ్యక్తిని చూపించిరి.

వీరః కువలయాశ్వోఽయం పిత్రే చాఽసౌ నివేదితః ।
తతో ననామ చరణౌ నాగేంద్రస్య ఋతధ్వజః ॥106॥

"ఇతడు వీరుడగు కువలయాశ్వుడను రాకుమారుడు" అని తమ తండ్రికి నాగకుమారులు రాకుమారుని గూర్చి పరిచయం చేసిరి. అంతట ఆ రాకుమారుడగు ఋతధ్వజుడు ఆ నాగేంద్రుని పాదములకు నమస్కరించెను.

సముత్థాయ బలాత్ గాఢం స నాగః పరిషస్వజే ।
మూర్ధ్ని చైవముపాఘ్రాయ చిరం జీవేత్యువాచ హ ॥107॥

నాగాధిపతియగు అశ్వతరుడు ఆ రాకుమారుని బలవంతముగా పైకి లేవనెత్తి గట్టిగా ఆలింగనము చేసుకొనెను. ఇంకను అతని తలపై ముద్దుపెట్టుకుని "చిరంజీవ" (చిరకాలము జీవించుము) అని ఆశీర్వదించెను.

నిహతామిత్రవర్గశ్చ పిత్రోః శుశ్రూషణం కురు ।
వత్స! ధన్యస్య కథ్యన్తే పరోక్షస్యాపి తే గుణాః ॥108॥

ఓ వత్సా! శత్రుసంహారకుడవై తల్లిదండ్రులను సేవింపుము. నీ పరోక్షమందు కూడా నీ గుణములు పలువురిచే కొనియాడబడుచున్నవి.

భవతో మమ పుత్రాభ్యామాభ్యాం యే మే నివేదితాః ।
తదేతైరేవ వర్ధేథాః మనోవాక్కాయచేష్టితైః ॥109॥

నా కుమారులు ఏ నీ గుణములను నాకు నివేదించిరో, ఆ గుణములచేతనే మనోవాక్కాయచేష్టితములతో అనగా త్రికరణశుద్ధిగా ఆచరించి వర్ధిల్లుము.

జీవితం గుణినః శ్లాఘ్యం జీవన్నపి మృతోఽగుణీ ।
గుణవాన్నిర్వృతిం పిత్రోః శత్రూణాం హృదయే జ్వరమ్ ॥110॥

గుణవంతుని జీవితము కొనియాడదగినది. ప్రాణములతో ఉన్ననూ గుణహీనుడు చనిపోయినవానితో సమానము. గుణవంతుడు తల్లిదండ్రులకు సంతోషమును కలిగించును. శత్రువుల హృదయమందు జ్వరమును అనగా తాపమును కలిగించును.

కరోత్యాత్మహితం కుర్వన్ విశ్వాసం చ మహాజనే ।
దేవతాః పితరో విప్రా మిత్రార్థివిభవాదయః ॥111॥

బాంధవాశ్చ తథేచ్ఛన్తి జీవితం గుణినశ్చిరమ్ ।
పరవాదనివృత్తానాం దుర్గతేషు దయావతామ్ ॥112॥

గుణినాం సఫలం జన్మ సంశ్రితానాం విపద్గతైః ।

గుణవంతుడు ఆత్మహితమును చేసుకొనును అనగా తన శ్రేయస్సు కొరకు సత్కర్మలను ఆచరించును. మహాజనులయందు నమ్మకమును పాదుకొల్పును. దేవతలు, పితృదేవతలు, బ్రాహ్మణులు, స్నేహితులు, యాచకులు, సంపన్నులు మొదలగువారు ఇంకనూ బంధువులు గుణవంతునికి చిరాయుర్దాయమును కోరుకొనెదరు. ఇతరుల నిందలకు పాత్రులు కానివారు, కష్టాలలో ఉన్నవారిపట్ల దయగలవారు, ఆపదలలో ఉన్నవారిని రక్షించువారు అగు గుణవంతుల జన్మ సార్థకమైనది.

పుత్ర ఉవాచ – పుత్రుడు పలికాడు.

ఏవముక్త్వా స తం వీరం పుత్రావిదమథాబ్రవీత్ ॥113॥
పూజాం కువలయాశ్వస్య కర్తుకామో భుజఙ్గమః ॥

ఈ విధముగా నాగరాజగు అశ్వతరుడు వీరుడగు ఆ రాకుమారునితో ఇట్లు పలికి, కువలయాశ్వునికి పూజను అనగా అతిథిసత్కారములను చేయదలచి ఇట్లు పలికెను.

స్నానాదిక్రమం కృత్వా సర్వమేవ యథాక్రమమ్ ॥114॥

మధుపానాదిసంభోగమాహారం చ యథేప్సితమ్ ।
తతః కువలయాశ్వేన హృదయోత్సవభూతయా ॥115॥

కథయా స్వల్పకం కాలం స్థాస్యామో హృష్టచేతసః ।
అనుమేనే చ తం మౌనీ వచః శత్రుజితస్సుతః ॥116॥

తథా చకార చ పతిః పన్నగానాముదారధీః ॥117॥

మనమందరము దినచర్యప్రకారము స్నానాదులను ఆచరించి, మధుపానాదులు, సంభోగము, భోజనము మొదలగువాటిని ఆచరించి, మనకిష్టమైనవాటినన్నింటినీ అనుభవించి అటుపిమ్మట కువలయాశ్వునితో మనస్సుకు ఆనందాన్ని కలిగించే కథలతో సంతోషముగా కాలమును గడిపెదము. ఈ మాటలకు శత్రుజిత్తు యొక్క కుమారుడగు

కువలయాశ్వుడు మౌనముగా అంగీకరించెను. సర్పములపట్ల ఔదార్యముగల ఆ నాగరాజైన అశ్వతరుడు తాను చెప్పినట్లుగానే అన్నింటినీ ఆచరించెను.

సమేత్య తైరాత్మజభూపనందనైర్మహోరగాణామధిపః స సత్యవాక్ ।
ముదా యుతోఽన్నాని మధూని చాత్మవాన్ యథోపజోషం బుభుజే స భోగభాక్ ॥118॥

సత్యమైన వాక్కులుగలవాడు, ఆత్మజ్ఞానముగలవాడు, భోగములను అనుభవించువాడు, శ్రేష్ఠమైన నాగములకు అధిపతీయగు ఆ అశ్వతరుడు తన కుమారులతోనూ, ఆ రాకుమారునితోనూ కలిసి సంతోషముతో నిండినవాడై భోజ్యములను, మధువులను తమ ఆనందమునకు తగినట్లుగా అనుభవించెను.

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే కువలాయశ్వస్య పాతాళప్రవేశో నామ ఏకవింశోఽధ్యాయః ॥21॥

శ్రీమార్కండేయ మహాపురాణమందు కువలయాశ్వుని పాతాళప్రవేశమను ఇరువదియొకటవ అధ్యాయం *సమాప్తం.*



ద్వావింశోఽధ్యాయః - ఇరువదిరెండవ అధ్యాయం
పునర్మదాలసాం ప్రాప్య పాతాలాన్నిర్గమః -
తిరిగి మదాలసనుపొంది పాతాళలోకమునుంచి మరలుట

పుత్ర ఉవాచ - పుత్రుడు పలికాడు.

కృతాహారం మహాత్మానమధిపం పవనాశినామ్ ।
ఉపాసాం చక్రిరే పుత్రౌ భూపాలతనయస్తథా ॥1॥

ఆ నాగకుమారులిరువురు, మరియు ఆ రాకుమారుడు తమకు ఆహారమును ఇచ్చినవాడును, మహాత్ముడు, సర్పములకు అధిపతీయగు ఆ భూపాలుని అనగా అశ్వతరుడను నాగరాజును సేవించుచుండిరి.

కథాభిరనురూపాభిః ప్రహృష్టాత్మా భుజంగమః ।
ప్రీతిం సంజనయామాస పుత్రసఖ్యురువాచ హ ॥2॥

యోగ్యములైన పరస్పర సంభాషణలతో సంతోషముతో నిండిన నాగరాజగు అశ్వతరుడు తన కుమారుల స్నేహితుడగు కువలయాశ్వునికి సంతోషమును కలిగించి ఇట్లు పలికెను.

తవ భద్ర సుఖం బ్రూహి గేహమభ్యాగతస్య యత్ ।
కర్తవ్యముత్సృజాశంకాం పితరీవ సుతో మయి ॥3॥

ఓ మంగళస్వరూపుడా! మా ఇంటికి అతిథిగా వచ్చిన నీకు ఏమి సుఖమును నేను ఆచరించవలెనో చెప్పుము. సందేహమును వీడుము. తండ్రిపట్ల కుమారుడు ఆచరించు విధముగా నాపట్ల ప్రవర్తించుము.

హిరణ్యం వా సువర్ణం వా వస్త్రం వాహనమాసనమ్ ।
యద్వాఽభిమతమత్యర్థం దుర్లభం తచ్ఛృణుష్వ మామ్ ॥4॥

బంగారముగాని, వెండిగాని, వస్త్రముగాని, వాహనముగాని, ఆసనముగాని, అట్లు కానిచో నీకు మిక్కిలి ఇష్టమైనది ఏదో దానినిగాని అట్టిది దుర్లభమని నీవు భావించిననూ నన్ను నీవు అడుగుము.

కువలయాశ్వ ఉవాచ - కువలయాశ్వుడు చెప్పాడు.

భవత్ప్రసాదాద్భగవన్ సువర్ణాది గృహే మమ ।
పితురస్తి మమాద్యాపి న కించిత్కార్యమీదృశైః ॥5॥

ఓ పూజ్యుడా! తమ అనుగ్రహముచేత మా తండ్రిగారి యింట సువర్ణము మొదలగు సమస్త వస్తువులు ఉన్నవి. నాకు నేటికినీ ఇట్టి వస్తువులతో పని లేదు.

తాతే వర్షసహస్రాయుః శాసతీమాం వసుంధరామ్ ।
తథైవ త్వయి పాతాళం న మే యాచ్ఞోన్ముఖం మనః ॥6॥

నా తండ్రి వేయి సంవత్సరములీ భూమిని పరిపాలించుచుండగా, అట్లే నీవు పాతాళమును పరిపాలించుచుండగా నా మనస్సు యాచించుటకిష్టపడదు.

తే సుభాగ్యాస్సుపుణ్యాశ్చ యేషాం పితరి జీవతి ।
తృణం కోటిసమం విత్తం తారుణ్యం విత్తకోటిషు ॥7॥

ఎవరి తండ్రి జీవించియుండునో వారు మిక్కిలి అదృష్టవంతులు, మిక్కిలి పుణ్యవంతులు. అట్టివారికి సంపదలు తృణప్రాయములు. యౌవనమే గొప్పసంపద.

మిత్రాణి తుల్యశిష్టాని తద్వద్దేహమనామయమ్ ।
జనే వా ధ్రియతే విత్తం యౌవనం కింతు నాస్తి మే ॥8॥

నా స్నేహితులు నాకు తగినవారు, శిష్టాచారసంపన్నులు. నా దేహము ఎట్టి రోగములూ లేనిది. ఈ జనునియందు (అనగా నాయందు) ధనము, యౌవనము ధరింపబడియున్నవి. నాకు లేనిది ఏమున్నది?

అసత్యర్థే నృణాం యాచ్ఞాప్రవణం జాయతే మనః ।
సత్యశేషే కథం యాచ్ఞాం మమ జిహ్వా కరిష్యతి ॥9॥

లేని వస్తువును యాచించుటయందు మనస్సు మిక్కిలి ఉత్సుకత కలిగియుండును. సమస్తవస్తువులు సిద్ధించియున్నప్పుడు జిహ్వ (నాలుక) యాచించుటను ఎట్లు చేయును?

యైర్న చింత్యం ధనం కిఞ్చిన్మమ గేహేఽస్తి నాస్తి వా ।
పితృబాహుతరుచ్ఛాయాం సంశ్రితాః సుఖినో హి తే ॥10॥

తండ్రిబాహువులను వృక్షముయొక్క నీడను ఆశ్రయించినవారు నిజముగా సుఖవంతులు. వారు తమ యింట ధనమున్నదా లేదా యని చింతించవలసిన అవసరము లేదు.

యే తు బాల్యాత్ ప్రభృత్యేవ వినా పిత్రా కుటుంబినః ।
తే సుఖాస్వాదవిభ్రంశాన్ మన్యే ధాత్రైవ వంచితాః ॥11॥

ఎవరయితే బాల్యమునుండియే తండ్రి లేకుండగా జీవితమును గడుపుచున్నారో అట్టివారిని సుఖానుభవము లేనివారుగాను, విధిచేత వంచింపబడినట్లుగానూ తలచెదను.

తద్వయం తత్ప్రసాదేన ధనరత్నాదిసంచయమ్ ।
పితృభక్తాః ప్రయచ్ఛామః కామతో నిత్యమర్థినామ్ ॥12॥

అందువలన పితృభక్తులమైన మేము దైవానుగ్రహముచే ధనరత్నాది సమూహములను యాచకులకు వారి ఇష్టానుసారముగా స్వేచ్ఛగా ఇచ్చుచున్నాము.

తత్సర్వమిహ సంప్రాప్తం యదంఘ్రియుగలం తవ ।
మచ్చూడామణినా ఘృష్టం యచ్చాంగస్పర్శమాప్తవాన్ ॥13॥

మీ పాదములను నా శిరోరత్నముచే తాకించుటవలన తమ అవయముల స్పర్శ నాకు లభించినది. అందువలన నాకు సర్వసంపదలు సిద్ధించినవి.

పుత్ర ఉవాచ – పుత్రుడు పలికాడు.

ఇత్యేవం ప్రశ్రితం వాక్యముక్తః పన్నగసత్తమః ।
ప్రాహ రాజసుతం ప్రీత్యా పుత్రయోరుపకారిణమ్ ॥14॥

ఈ విధముగా ఎంతో వినయవిధేయతలతో ఆ రాకుమారుడు ఆ నాగరాజుతో పలుకగా, తన కుమారులకు ఉపకారమునాచరించు ఆ రాకుమారునితో ప్రీతితో అశ్వతరుడిట్లు పలికెను.

యది రత్నసువర్ణాది మత్తోఽవాప్తుం న తే మనః ।
యద్యన్మనసః ప్రీత్యై బ్రూహి తత్తే దదామ్యహమ్ ॥15॥

ఓ రాకుమారా! నా నుండి రత్నసువర్ణాదులను పొందుటకు నీ మనస్సు ఇష్టపడనిచో, నీ మనస్సుకు ఇష్టమైనదేదో చెప్పుము, దానిని నేను నీకిచ్చెదను.

కువలయాశ్వ ఉవాచ – కువలయాశ్వుడు పలికాడు.

భగవంస్త్వత్ప్రసాదేన ప్రార్థితస్య గృహే మమ ।
సర్వమస్తి విశేషేణ సంప్రాప్తం తవ దర్శనాత్ ॥16॥

ఓ పూజ్యుడా! నీ అనుగ్రహముచేత నీచేత ప్రార్థింపబడిన నాయొక్క ఇంటియందు సమస్తము ఉన్నవి. ఇప్పుడు నీ దర్శనభాగ్యముచేత అదియంతయు విశేషఫలప్రదమయినది.

కృతకృత్యోఽస్మి చైతేన సఫలం జీవితం మమ ।
యదంగసంశ్లేషమితస్తవ దేవస్య మానుషః ॥17॥

మనుష్యమాత్రుడనయిన నాకు దేవతామూర్తివైన నీయొక్క అవయవస్పర్శ లభించినది. ఇంతమాత్రముచేతనే నేను కృతకృత్యుడనయితిని. నా జీవితము ఫలవంతమైనది.

మమోత్తమాంగే త్వత్పాదరజసా యదిహాస్పదమ్ ।
కృతం తేనైవ న ప్రాప్తం కిం మయా పన్నగేశ్వర ॥18॥

ఓ నాగరాజా! నా శిరస్సునందు నీ పాదధూళి పడినంత మాత్రముననే సమస్తము నాకు సిద్ధించినది. నాకిక సిద్ధించనిది అంటూ ఏమి ఉండును?

యది త్వవశ్యం దాతవ్యో వరో మే మనసేప్సితః ।
తత్పుణ్యకర్మసంస్కారో హృదయాన్మా వ్యపైతు మే ॥19॥

నాకు నాకిష్టమైనదానిని వరముగా మీరు తప్పక ఇవ్వదలచినట్లయిన, నా హృదయమునుండి నా పుణ్యకర్మల సంస్కారము తొలగకుండ ఉండుగాక!

సువర్ణమణిరత్నాది వాహనం గృహమాసనమ్ ।
స్త్రియోఽన్నపానం పుత్రాశ్చ చారుమాల్యానులేపనమ్ ॥20॥

ఏతే చ వివిధా భోగా గీతవాద్యాదికం చ యత్ ।
సర్వమేతన్మమ మతం ఫలం పుణ్యవనస్పతేః ॥21॥

బంగారము, మణులు, రత్నములు మొదలగునవి, వాహనము, గృహము, ఆసనము, స్త్రీలు, అన్నపానాదులు, పుత్రులు, సుగంధభరిత పుష్పమాలలను ధరించుట, సుగంధములను పూసుకొనుట, గీతవాద్యాదులు ఇట్టి అనేకవిధములైన భోగములన్నియూ పుణ్యమనెడు వృక్షముయొక్క ఫలములనియే అని నా విశ్వాసము.

తస్మాన్నరేణ తన్మూలసేకే యత్నః కృతాత్మనా ।
కర్తవ్యః పుణ్యసక్తానాం న కించిద్భువి దుర్లభమ్ ॥22॥

అందువలన ధన్యజీవియగు మానవుడు అట్టి పుణ్యవృక్షముయొక్క మూలభాగమును జలములతో తడుపుటకు యత్నించవలెను. పుణ్యకర్మలయందు ఆసక్తిగలవారికి ఈ లోకమందు దుర్లభమైనది ఏదీ లేదు.

అశ్వతర ఉవాచ – అశ్వతరుడు పలికాడు.

ఏవం భవిష్యతి ప్రాజ్ఞ తవ ధర్మాశ్రితా మతిః ।
సత్యం చైతత్ఫలం సర్వం ధర్మస్యోక్తం యథా త్వయా ॥23॥

జ్ఞానివగు ఓ రాజకుమారా! నీవన్నట్లే కాగలదు. తన బుద్ధి ఎల్లప్పుడును ధర్మమును ఆశ్రయించియే యుండును. నీవు చెప్పినట్లుగా సమస్తభోగములు ధర్మము అనగా పుణ్యకార్యముల ఫలమే.

తథాప్యవశ్యం మద్గేహమాగతేన త్వయాఽధునా ।
గ్రాహ్యం యన్మానుషే లోకే దుష్ప్రాపం భవతో మతమ్ ॥24॥

అయినను నీవిప్పుడు మా యింటికి వచ్చితివి గావున మానవలోకమందు దుర్లభమైనదీ, నీకిష్టమైనదీ అయిన ఏదేని ఒకదానిని తప్పక గ్రహించవలెను.

పుత్ర ఉవాచ – పుత్రుడు పలికాడు.

తస్య తద్వచనం శ్రుత్వా స తదా నృపనందనః ।
ముఖావలోకనం చక్రే పన్నగేశ్వరపుత్రయోః ॥25॥

ఆ రాజకుమారుడు అశ్వతరుడు పలికిన మాటలను విని, ఆ నాగరాజుయొక్క పుత్రులవైపు చూచెను.

తతస్తౌ ప్రణిపత్యోభౌ రాజపుత్రస్య యన్మతమ్ ।
తత్పితుః సకలం వీరౌ కథయామాసతుస్స్ఫుటమ్ ॥26॥

అంతట ఆ నాగకుమారులిరువురు తండ్రికి నమస్కరించి రాజకుమారుని యభీష్టమేమో దానిని పూర్తిగా స్పష్టముగా తమ తండ్రికి నివేదించిరి.

తాతాఽస్య పత్నీ దయితా శ్రుత్వేమం వినిపాతితమ్ ।
అత్యజద్దయితాన్ ప్రాణాన్ విప్రలబ్ధా దురాత్మనా ॥27॥

తేనాఽపి కృతవైరేణ దానవేన కుబుద్ధినా ।
గంధర్వరాజస్య సుతా నామ్నాఽఖ్యాతా మదాలసా ॥28॥

ఓ తండ్రీ! తన భర్త (అనగా ఈ రాకుమారుడు) చనిపోయాడని ఒక దుర్మార్గుని కపటపూరితమైన మాటలను విని ఈ రాకుమారుని భార్య తన ప్రియమైన ప్రాణములను వదిలెను. వీరిపట్ల విరోధముగల దుష్టబుద్ధియగు ఒకానొక రాక్షసుడీ పనిని చేసెను. ఈమె గంధర్వరాజు కుమార్తె, మదాలస అను పేరు గలది.

కృతజ్ఞోఽయం తతస్తాత! ప్రతిజ్ఞాం కృతవానిమామ్ ।
నాఽన్యా భార్యా భవిత్రీ మే వర్జయిత్వా మదాలసామ్ ॥29॥

ఓ తండ్రీ! తన భార్య మరణించినదని తెలిసిన పిమ్మట ఆమె పట్ల కృతజ్ఞతాపూర్వకముగా, ఈ రాకుమారుడు “మదాలసను విడిచి మరొక స్త్రీ నాకు భార్య కాజాలదు” అని ప్రతిజ్ఞను చేసెను.

ద్రష్టుం తాం చారుసర్వాఙ్గీమయం వీరో ఋతధ్వజః ।
తాత! వాంఛతి యద్యేతత్ క్రియతే తత్కృతం భవేత్ ॥30॥

వీరుడైన రాజకుమారుడగు ఈ ఋతధ్వజుడు మనోహరములైన సమస్త అవయవములు గల తన భార్యను చూడవలెనని కోరుచున్నాడు. అది చేసినయెడల అతని కోరికను తీర్చినట్లగును.

అశ్వతర ఉవాచ – అశ్వతరుడు పలికాడు.

భూతైర్వియోగినో యోగస్తాదృశైరేవ తాదృశః ।
కథమేతద్వినా స్వప్నం మాయాం వా శంబరోదితామ్ ॥31॥

పంచమహాభూతములతో వియోగమును పొందిన పిమ్మట అనగా మరణించిన పిమ్మట తిరిగి పూర్వదేహమును చూచుట స్వప్నము లేదా శంబరుడను రాక్షసుని మాయ ఈ రెండూ తప్ప మరెట్లు సంభవించును?

పుత్ర ఉవాచ – పుత్రుడు పలికాడు.

ప్రణిపత్య భుజంగేశం పుత్రః శత్రుజితస్తతః ।
ప్రత్యువాచ మహాత్మానం ప్రేమలజ్జాసమన్వితః ॥32॥

శత్రుజిత్తు కుమారుడగు ఆ రాకుమారుడు నాగరాజుకు నమస్కరించి ప్రేమ, సిగ్గుతో కూడుకొన్నవాడై ఆ మహాత్మునితో ఇట్లు పలికెను.

మాయామయీమప్యధునా మమ తాతో మదాలసామ్ ।
యది దర్శయతే మన్యే పరం కృతమనుగ్రహమ్ ॥33॥

ఈ సమయమందు తండ్రియగు మీరు మాయారూపకముగా అయిననూ నా మదాలసను నాకు చూపినట్లయిన తామెంతో నాపట్ల అనుగ్రహము చూపినట్లుగా తలచెదను.

అశ్వతర ఉవాచ – అశ్వతరుడు పలికాడు.

తస్మాత్పశ్యేహ వత్స! త్వం మాయాం చేద్ద్రష్టుమిచ్ఛసి ।
అనుగ్రాహ్యో భవాన్గేహే బాలోఽప్యభ్యాగతో గురుః ॥34॥

ఓ వత్సా! రాకుమారా! ఇంటికి అతిథిరూపముగా వచ్చినవాడు బాలుడయిననూ గురువుతో సమానము గావున నీవు కూడా నాకు గురువుతో సమానము. అందువలన నీవు తప్పక నాచే అనుగ్రహింపదగినవాడవు. మాయారూపమైన మదాలసను చూడగోరినచో ఇదిగో ఇచ్చటనే చూడుము.

పుత్ర ఉవాచ – పుత్రుడు పలికాడు.

ఆనయామాస నాగేంద్రో గృహే గుప్తాం మదాలసామ్ ।
దర్శయామాస చ తదా రాజపుత్రాయ తాం శుభామ్ ॥35॥

నాగాధిపతియగు అశ్వతరుడు తన భవనమందు తనచే రహస్యముగా దాచి ఉంచబడిన శుభలక్షణయగు మదాలసను రాకుమారునికి చూపించెను.

తేషాం సమ్మోహనార్థాయ జజల్ప చ తతః స్ఫుటమ్ ।
సేయం న వేత్తి తే భార్యా రాజపుత్ర మదాలసా ॥36॥

అచ్చట ఉన్నవారిని మభ్యపెట్టుటకై మంత్రములు పఠించినట్లు నటించి స్పష్టముగా ఓ రాజకుమారా ! ఈమె నీ భార్యయగు మదాలస అవునా కాదాయని అశ్వతరుడు ఋతధ్వజుని అడిగెను.

జడ ఉవాచ – జడుడు పలికాడు.

స దృష్ట్వా తాం తదా తన్వీం తత్క్షణాద్విగతత్రపః ।
ప్రియేతి తామభిముఖం యయౌ వాచముదీరయన్ ॥37॥

నివారయామాస చ తం నాగః సోఽశ్వతరస్త్వరన్ ।

పిమ్మట రాజకుమారుడగు ఋతధ్వజుడు సుందరియైన ఆమెను చూచినంతనే సిగ్గును విడిచి "ప్రియా!"యని పలుకుచూ ఆమెకు అభిముఖముగా వెళ్ళెను. నాగరాజగు అశ్వతరుడు వెంటనే అతనిని నివారించెను.

అశ్వతర ఉవాచ – అశ్వతరుడు పలికాడు.

మాయేయం పుత్ర మా స్ప్రాక్షీః ప్రాగేవ కథితం తవ ॥38॥

అంతర్ధానముపైత్యాశు మాయా సంస్పర్శనాదిభిః ।
తతః పపాత మేదిన్యాం స తు మూర్ఛాపరిప్లుతః ॥39॥

ఓ కుమారా! ఈమె మాయారూపముతోనున్న మదాలసయని నీకు ముందే చెప్పితిని. ఈమెను స్పృశించుట మొదలగు పనులను చేసినచో మాయారూపముననున్న మదాలస వెంటనే అంతర్ధానము చెందగలదు (అనగా మాయమై పోవును). ఆ మాటలను విన్నవెంటనే రాజకుమారుడు మూర్ఛను పొంది నేలపై పడెను.

హా ప్రియేతి వదన్ సోఽథ చింతయామాస భామినీమ్ ।
మోహో మమాయం నో వేతి నాలం ప్రత్యయవానహమ్ ॥40॥

హా! ప్రియురాలా! అని పలుకుచూ ఆ రాకుమారుడు తన భార్యను గురించి “ఇది నాయొక్క చిత్తవిభ్రమమా? లేక నిజమా? నేను ఏది సత్యమో తెలుసుకొనలేకున్నాను” అని చింతించసాగెను.

అహో మమేత్యహం చేతి బలం ప్రత్యయయోర్మహత్ ।
యేనాఽహం పాతనోఽరీణాం వినా శస్త్రం నిపాతితః ॥41॥

ఆహా! ఇది నాది, ఇది నేను అను జ్ఞానముల బలము ఎంత గొప్పది? (ఆ జ్ఞానములు వస్తుతః మిథ్యాభూతములని భావము). శత్రువులను కూల్చు నేను అట్టి జ్ఞానములవల్లనే కదా! శత్రువుల ఆయుధప్రయోగము లేకుండానే నేలపై కూలబడ్డాను.

మమేతి దర్శితాఽనేన మిథ్యా మాయేతి విస్ఫుటమ్ ।
వాయ్వంబుతేజసాం భూమేరాకాశస్య చ చేష్టయా ॥42॥

పృథివి, జలము, తేజస్సు, వాయువు, ఆకాశము అను పంచభూతముల సాక్షిగా ఈ నాగరాజుచే మాయా కల్పితమైన మదాలస స్పష్టముగా చూపబడినది.

పుత్ర ఉవాచ – కుమారుడు పలికాడు.

తతః కువలయాశ్వం స సమాశ్వాస్య భుజంగమః ।
కథయామాస తత్సర్వం మృతసంజీవనాదికమ్ ॥43॥

అంతట ఆ నాగాధిపతి కువలయాశ్వుని ఓదార్చి మరణించిన మదాలస మరల ఏ విధముగా బ్రతికినదో ఆ వృత్తాంతమంతయు సవివరముగా చెప్పెను.

తతః ప్రహృష్టః ప్రతిలభ్య కాన్తాం ప్రణమ్య నాగం నిజమాజగామ ।
సంస్తూయమానః స్వపురం తమశ్వమారుహ్య సంచిన్తితమభ్యుపేతమ్ ॥44॥

అటు పిమ్మట తనకిష్టురాలైన భార్యను పొందుటచే కువలయాశ్వుడు మిక్కిలి సంతోషించెను. తరువాత ఆ నాగరాజుకు ప్రణమిల్లి ఆ కువలయాశ్వుడు అందరితోనూ స్తుతింపబడుతూ స్మరణమాత్రముచేతనే ప్రత్యక్షమైన తన గుర్రమును అధిరోహించి తన పట్టణమునకు వెళ్ళెను.

శృణుయాద్భక్తిపూర్వం యో నైరంతర్యేణ మానవః ।
వేదఘోషఫలం తేన ప్రాప్తం వై భువి దుర్లభమ్ ॥45॥

సంప్రాప్నోతి సుఖం నిత్యం సర్వకామసమన్వితః ।
లోకే చ దుర్లభం తస్య నాస్తి కించిన్న విద్యతే ॥46॥

ఈ కువలయాశ్వచరితమును ఏ మానవుడు ఎల్లప్పుడూ భక్తిపూర్వకముగా వినునో అతడికి భూలోకమందు దుర్లభమైన వేదపారాయణఫలము సిద్ధించును. ఇంకను సమస్త కోరికలు సిద్ధించి నిత్యసుఖమును పొందును. అతడికి ఈ లోకమందు దుర్లభమైనదంటూ ఏదీ ఉండదు.

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే మదాలసోపాఖ్యానే పునర్మదాలసాం ప్రాప్య పాతాలాన్నిర్గమో నామ ద్వావింశోఽధ్యాయః ॥22॥

శ్రీ మార్కండేయ మహాపురాణమందు మదాలసోపాఖ్యానమందలి తిరిగి మదాలసను పొంది పాతాళలోకం నుంచి మరలుటయను ఇరవైరెండవ అధ్యాయం సమాప్తం.



త్రయోవింశోఽధ్యాయః - ఇరువదిమూడవ అధ్యాయం

ప్రవృత్తిమార్గానుశాసనమ్ - ప్రవృత్తిమార్గానుశాసనం

పుత్ర ఉవాచ - కుమారుడు పలికాడు.

ఆగమ్య స్వపురం సోఽథ పిత్రోః సర్వమశేషతః ।
కథయామాస తన్వఙ్గీ యథా ప్రాప్తా పునర్మృతా ॥1॥

రాకుమారుడగు ఋతధ్వజుడు తన పురమునకు చేరుకొని, మరణించి తిరిగి బ్రతికిన సుందరాంగియగు మదాలస వృత్తాంతమును తన తల్లిదండ్రులకు చెప్పెను.

ననామ సాఽపి చరణౌ శ్వశ్రూశ్వశురయోః శుభా ।
స్వజనం చ యథాపూర్వం వందనాఽశ్లేషణాదిభిః ॥2॥

పూజయామాస తన్వఙ్గీ యథాన్యాయం యథావయః ।
తతో మహోత్సవో జజ్ఞే పౌరాణాం తత్ర వై పురే ॥3॥

శుభలక్షణములు గలదీ, సుందరాంగీయగు మదాలస కూడా తన అత్తమామలకు నమస్కరించెను. నమస్కరించుట, కౌగలించుకొనుట మొదలగు చేష్టలద్వారా తన బంధువర్గమునందరినీ వారి వారి యోగ్యతానుసారముగాను, వయస్సు ఆధారముగాను పూజించెను. అటుపిమ్మట ఆ పట్టణమందు పురజనుల మహోత్సవము జరిగెను.

ఋతధ్వజశ్చ సుచిరం తయా రేమే సుమధ్యయా ।
నిర్ఝరేషు చ శైలానాం నిమ్నగాపులినేషు చ ॥4॥

కాననేషు చ రమ్యేషు వనేషూపవనేషు చ ।
పుణ్యక్షయం వాంఛమానా సాఽపి కామోపభోగతః ॥5॥

సహ తేనాఽతికాన్తాసు రేమే రమ్యాసు భూమిషు ।

ఋతధ్వజుడు అందమైన నడుముగల మదాలసతో చాలాకాలము పర్వతములనుండి జారుచున్న సెలయేళ్ళయందు, నదీతటములందు, అందమైన అడవులు, వనములు, ఉపవనములందు రమించసాగెను. మదాలసకూడా కోరికలను అనుభవించుట ద్వారా పుణ్యక్షయమును కోరుకొనుచున్నదై తన భర్తతో మిక్కిలి మనోహరమైన, అందమైన భూములందు రమించెను.

తతః కాలేన మహతా శత్రుజిత్స నరాధిపః ॥6॥

సమ్యక్ ప్రశాస్య వసుధాం కాలధర్మముపేయివాన్ ।
తతః పౌరా మహాత్మానం పుత్రం తస్య ఋతధ్వజమ్ ॥7॥

అభ్యషిఞ్చత రాజానముదారాచారచేష్టితమ్ ।
సమ్యక్ పాలయతస్తస్య ప్రజాః పుత్రానివౌరసాన్ ॥8॥

మదాలసాయాః సంజజ్ఞే పుత్రః ప్రథమజస్తతః ।
తస్య చక్రే పితా నామ విక్రాన్త ఇతి ధీమతః ॥9॥

అంతట చాలా కాలము గడచిన పిమ్మట జనులను పరిపాలించే ఆ శత్రుజిత్తు భూమిని బాగుగా పరిపాలించి కాలధర్మమునొందెను. అంతట పురజనులు శత్రుజిత్తు కుమారుడు, సదాచారసంపన్నుడు, మహాత్ముడూ అగు ఋతధ్వజునికి రాజ్యపట్టాభిషేకము చేసిరి. అతడును ప్రజలను తన కన్నబిడ్డలవలే పరిపాలించుసమయమందు తన భార్యయగు మదాలసయందు ప్రథమపుత్రుడు జన్మించెను. తండ్రియగు ఋతధ్వజుడు బుద్ధిమంతుడగు ఆ బాలునికి విక్రాంతుడని పేరుపెట్టెను.

తుతుషుస్తేన వై భృత్యా జహాస చ మదాలసా ।
సా వై మదాలసాపుత్రం బాలముత్తానశాయినమ్ ॥10॥

ఉల్లాపనచ్ఛలేనాహ రుదమానమవిస్వరమ్ ।

మదాలసాఋతధ్వజులకు పుత్రసంతానము కలుగుటచే భృత్యులందరూ సంతోషించిరి. మదాలసకూడా చిరునవ్వునవ్వెను. తన కుమారుడు లేచి నిలబడుటను, తిరిగి క్రిందకు పడిపోవుటను చూచి, ఇంకను గుక్కపెట్టి ఏడ్చుచుండుటను చూచి మదాలస ఈ విధముగా సముదాయించసాగినది.

శుద్ధోఽసి రే తాత ! న తేఽస్తి నామ కృతం తే కల్పనయాఽధునైవ ।
పంచాత్మకం దేహమిదం న తేఽస్తి నైవాఽస్య త్వం రోదిషి కస్య హేతోః ॥11॥

ఓ కుమారా ! నీవు పరిశుద్ధుడవు. నీవు పుట్టినప్పుడు నామమంటూ లేదు. ఇప్పుడే నీకొక నామము కల్పింపబడినది. ఈ కనిపించే శరీరము పృథివ్యాదిపంచభూతములతో నిర్మితమైనది. ఆత్మస్వరూపుడవగు నీకు దేహముతో సంబంధము లేదు. ఈ దేహమునకు నీవు చెందినవాడవు కావు. అందువలన ఏ కారణముచే నీవు ఏడ్చుచున్నావు?

న వా భవాన్రోదితి వై స్వజన్మా శుద్ధోఽయమాసాద్య మహీసమూహమ్ ।
వికల్ప్యమానో వివిధైర్గుణార్థై ర్గుణాశ్చ భౌతాః సకలేంద్రియేషు ॥12॥

అట్లు కానిచో, పరిశుద్ధుడవగు నీవు (ఆత్మ అసంగము కావున) ఈ భూమిపై పడి జన్మనెత్తుటచే సంసారబంధముల కారణముగా ఏడ్చుచున్నావు కాబోలు. భూతసంబంధముగల గుణములన్నియు సమస్త ఇంద్రియములందు స్థానమేర్పరచుకొన్నవి. అనగా ఆయా గుణములు, అట్టి గుణములుగల వస్తువులు ఇంద్రియగ్రాహ్యములగుచున్నవి. అట్టి వివిధములైన గుణములు, అర్థములచే నీవు సందిగ్ధావస్థలో ఉన్నావు. అనగా ఏది సత్యమో, అసత్యమో తెలుసుకొనలేకున్నావు.

భూతాని భూతైః పరిదుర్బలాని వృద్ధిం సమాయాన్తి యథేహ పుంసః ।
అన్నాంబుపానాదిభిరేవ కస్య న తేఽస్తి వృద్ధిర్న చ తేఽస్తి హానిః ॥13॥

అన్నజలపానాదులవల్ల దేహము వృద్ధి చెందినట్లుగా, దుర్బలములైన పృథివ్యాది భూతములు ఇతరభూతముల సంబంధముచే బలమునుపొంది పురుషునికి శరీరపుష్టిని కలిగించుచున్నవి. యథార్థముగా ఆత్మస్వరూపుడవగు నీకు వృద్ధీ లేదు, నాశమూ లేదు.

త్వం కంచుకే శీర్యమాణే నిజేఽస్మింస్తస్మిన్ స్వదేహే మూఢతాం మా వ్రజేథాః ।
శుభాశుభైః కర్మభిర్దేహమేతన్మదాదిమూఢైః కంచుకస్తే పినద్ధః ॥14॥

పైన ధరించే వస్త్రమువంటిది ఈ దేహము. అట్టి ఈ దేహము నశించినప్పుడు మిగిలినది ఏదో అదియే నీవు. కావున అట్టి దేహమందు మూఢత్వమును అనగా నాదియను భావనను పొందవలదు. పాపపుణ్యకర్మలవలన ఈ దేహము నిర్మితమైనది. అట్టి దేహము నిన్ను కట్టివేసినది. అనగా స్వస్వరూపమును తెలియకుండా చేసినది.

తాతేతి కించిత్తనయేతి కించిదంబేతి కించిద్దయితేతి కించిత్ ।
మమేతి కించిన్న మమేతి కించిద్భౌతం సంఘం బహుధా మా లపేథాః ॥15॥

ఇతడు నా తండ్రియని, నా కుమారుడని, నా తల్లియని, నా భార్యయని, ఇది నాది, ఇది నాది కాదు అను రీతిగా పంచభూతముల సమూహరూపమైన వస్తువులను, యథార్థముకానట్టి వాటిని ప్రలపించుట నీకు తగదు. (ఆత్మ అసంగము అనగా దేనితోనూ సంబంధము లేనట్టిది. అట్టి ఆత్మస్వరూపుడగు తనకు తల్లి, తండ్రి అను రీతిగా సంబంధము కల్పించుట మిథ్యారోపము మాత్రమేయని భావము.)

దుఃఖాని దుఃఖోపగమాయ భోగాన్ సుఖాయ జానాతి విమూఢచేతాః ।
తాన్యేవ దుఃఖాని పునః సుఖాని జానాతి విద్వానవిమూఢచేతాః ॥16॥

దుఃఖములైనవి (ఇష్టముకానివని భావించబడేవి) దుఃఖమును కలిగించునని, భోగములు సుఖమును కలిగించునని అజ్ఞాని భావించుచున్నాడు. కాని, ఏవి దుఃఖములుగా భావించబడినవో అవే మరల సుఖములుగా అగుచున్నవని అజ్ఞానమును వీడిన విద్వాంసుడు తెలుసుకొనుచున్నాడు. (పరమాత్మ ఒక్కటే నిత్యసుఖస్వరూపము. లౌకిక విషయములేవియూ నిత్యసుఖమును కలిగించవని భావము.)

హాసోఽస్థిసందర్శనమక్షియుగ్మమత్యుజ్జ్వలం యత్కలుషం వసాయాః ।
కుచాదిపీనం పిశితం ఘనం తత్ స్థానం రతేః కిం నరకో న యోషిత్ ॥17॥

స్త్రీయొక్క చిరునవ్వు అనగా లోనున్న ఎముకలు కనిపించుటే. ప్రకాశించు నేత్రద్వయము కాలుష్యముతో నిండిన మాంసమే. ఆమె యొక్క స్తనద్వయము మాంసపుముద్దయే. సంభోగమునకు స్థానమైన స్త్రీ నరకమునకు కారణము కాదా ఏమి?

యానం క్షితౌ యానగతశ్చ దేహో దేహేఽపి చాన్యః పురుషో నివిష్టః ।
మమత్వముర్వ్యాం న తథా యథా స్వే దేహేఽభిమాత్రం చ విమూఢతైషా ॥18॥

భూమియందు యానము (బండి), ఆ యానమందు దేహము, ఆ దేహమందు వేరొక పురుషుడు అనగా ఆత్మ నివసించును. ఈ లోకమందు మమత్వముండు విధముగా, స్వస్వరూపమందు మమత్వముండదు. (తానే

ఆత్మస్వరూపమయినప్పుడు తనయొక్క ఆత్మయని భావించుట యుక్తము కాదని భావము). దేహమందు ఆత్మాభిమానము అజ్ఞానమే తప్ప మరొకటి కాదు.

త్యజ ధర్మమధర్మం చ ఉభే సత్యానృతే త్యజ ।
ఉభే సత్యానృతే త్యక్త్వా యేన త్యజసి తత్త్యజ ॥19॥

ధర్మాధర్మములు, సత్యాసత్యములు వీటినన్నింటినీ విడిచిపెట్టుము. (ఇవి యన్నియు కర్మరూపములు. కర్మలు అవి పాపకర్మలయినా పుణ్యకర్మలయినా మోక్షమునకు ప్రతిబంధకములే). వీటినన్నింటినీ విడిచిపెట్టిన పిమ్మట, వీటిని దేనికారణముగా విడిచిపెట్టినావో అట్టిదానిని కూడా (అనగా దేహమును) విడిచిపెట్టుము.

వర్ధమానం సుతం సా తు రాజపత్నీ దినే దినే ।
తముల్లాపాదినా బోధమనయన్నిర్మలాత్మకమ్ ॥20॥

ఆవిధముగా రాజపత్నియగు మదాలస పెరిగి పెద్దవుతున్న స్వచ్ఛమైన స్వభావముగల తన కుమారునికి సముదాయించుటద్వారా హితబోధను చేసెను.

యథా యథా బలం లేభే యథా లేభే మతిం పితుః ।
తథా తథాఽఽత్మబోధం చ సోఽవాపన్మాతృభాషితైః ॥21॥

ఏవిధముగా అయితే తన తండ్రి వలన బలమును, బుద్ధిని ఆ కుమారుడు పొందెనో అట్లే తన తల్లి హితవచనములచే ఆత్మజ్ఞానమును కూడా పొందెను.

ఇత్థం తయా స తనయో జన్మప్రభృతి బోధితః ।
చకార న మితం ప్రాజ్ఞో గార్హస్థ్యం ప్రతి నిర్మమః ॥22॥

ఈ విధముగా తాను పుట్టినది మొదలుకొని ఆ కుమారుడు తన తల్లిద్వారా ఉపదేశములను పొందినందున, జ్ఞానోదయము కలిగి సంసారమందు మమత్వము తొలగినవాడై గృహస్థాశ్రమమందు తన బుద్ధిని లగ్నము చేయలేదు.

ద్వితీయోఽస్యాస్సుతో జజ్ఞే తస్య నామాఽకరోత్పితా ।
సుబాహురయమిత్యుక్తే సా జహాస మదాలసా ॥23॥

అటుపిమ్మట ఈమెకు రెండవ కుమారుడు జన్మించెను. అతడికి తండ్రి సుబాహువను పేరు పెట్టగా మదాలస చిరునవ్వు నవ్వెను.

తమప్యేవం యథా పూర్వం బాలముల్లాపవాదినీ ।
ప్రాహ బాల్యాత్స చ ప్రాప తథా బోధం మహామతిః ॥24॥

ఆ కుమారునికి కూడా మదాలస పూర్వము వలెనే సముదాయించుట ద్వారా హితవాక్యములను పలికెను. ఆ బాలుడు కూడా గొప్పజ్ఞానముగలవాడై ఆత్మజ్ఞానమును పొందెను.

తృతీయం తనయం జాతం తం రాజా శత్రుమర్దనమ్ ।
యదాఽహ తేన సా సుభ్రూర్జహాసాఽతిచిరం పునః ॥25॥

పిమ్మట మూడవ కుమారుడు జన్మించగా అతడికి రాజు శత్రుమర్దనుడని పేరు పెట్టెను. అంతట ఆమె మరల చాలాసేపు నవ్వుతూనే యుండెను.

తథైవ సోఽపి తన్వంగ్యా బాలత్వాదేవ బోధితః ।
క్రియాశ్చకార నిష్కామో న కించిత్ఫలకారణమ్ ॥26॥

సుందరాంగియగు ఆ మదాలస పూర్వము వలెనే ఆ మూడవ కుమారునికి కూడా బాల్యమునుంచే ఆత్మజ్ఞానమును బోధించెను. అతడు కూడా ఎటువంటి కోరికలూ లేక, ఎట్టి ఫలమును ఉద్దేశించకుండా ఆయా క్రియలను నిర్వర్తింపసాగెను.

చతుర్థస్య సుతస్యాథ చికీర్షుర్నామ భూపతిః ।
దదర్శ తాం శుభాచారామీషద్ధాసాం మదాలసామ్ ॥27॥

తరువాత నాల్గవ కుమారుడు జన్మించగా, అతడికి రాజగు ఋతధ్వజుడు పేరు పెట్టవలెనని ఇచ్ఛగించెను. ఆ సమయమందు ఆ రాజు మంగళాచరణము కలిగినదీ, కొద్దిగా నవ్వుచున్నట్టిదీ యగు మదాలసను చూచెను.

తామాహ రాజా హసతీం కించిత్కౌతూహలాన్వితః ।
క్రియమాణేఽసకృన్నామ్ని కథ్యతాం హాస్యకారణమ్ ॥28॥

ఈ విధముగా నవ్వుచున్నట్టి ఆమెను చూచి రాజు కొంచెము కుతూహలము కలిగినవాడై ప్రతీసారీ నామకరణము చేయునపుడు నవ్వుటకు గల కారణమేమని యడిగెను.

విక్రాన్తశ్చ సుబాహుశ్చ యథాఽన్యః శత్రుమర్దనః ।
శోభనానీతి నామాని తాని మన్యే కృతాని వై ॥29॥

విక్రాంతుడు, సుబాహువు, తరువాతివాడికి శత్రుమర్దనుడనీ, ఈ మూడు పేర్లు శుభప్రదమైనవనీ తలచి ఆ విధముగా పేర్లు పెట్టితిని.

యోగ్యాని క్షత్రబంధూనాం శౌర్యాటోపయుతాని చ ।
అసన్త్యేతాని వై భద్రే యది తే మనసి స్థితమ్ ॥30॥

తదస్య క్రియతాం నామ చతుర్థస్య సుతస్య మే ।

క్షత్రియులకు శౌర్యదర్పయుక్తములైన పేర్లు యోగ్యములైనవి. ఓ కల్యాణీ ! ఈ పేర్లు యుక్తము కావని నీవు భావించినచో ఈ నా నాల్గవ కుమారునికి నీవే పేరును పెట్టుము.

మదాలసా ఉవాచ – మదాలస పలికినది.

మయాజ్ఞా భవతః కార్యా మహారాజ యథాత్థ మామ్ ॥31॥

తథా నామ కరిష్యామి చతుర్థస్య సుతస్య తే ।
అలర్క ఇతి ధర్మజ్ఞః ఖ్యాతిం లోకే గమిష్యతి ॥32॥

కనీయానేష తే పుత్రో మతిమాంశ్చ భవిష్యతి ।

ఓ మహారాజా ! నీ ఆజ్ఞ నాచే పరిపాలింపదగినది. నీవు నాతో చెప్పినట్లుగానే నీ నాల్గవకుమారునికి పేరు పెట్టెదను. ఇతడు అలర్కుడను పేరుతో ధర్మమునెరిగినవాడై ఈ భూలోకమందు కీర్తిని పొందగలడు. చివరి పుత్రుడగు ఇతడు గొప్ప జ్ఞాని కాగలడు.

పుత్ర ఉవాచ – పుత్రుడు పలికాడు.

తచ్ఛ్రుత్వా నామ పుత్రస్య కృతం మాత్రా మహీపతిః ॥33॥

అలర్క ఇత్యసంబద్ధం ప్రహస్యేదమథాబ్రవీత్ ।
భవత్యా యదిదం నామ మత్పుత్రస్య కృతం శుభే ॥34॥

కిమీదృశమసంబద్ధమర్థః కోఽస్య మదాలసే ।

తల్లిచేత కుమారునికి పెట్టబడిన "అలర్కుడు" అను సంబంధములేని పేరును విని రాజు నవ్వి ఇట్లు పలికెను. ఓ శుభప్రదురాలా ! నా కుమారునికి నీవు అసంబద్ధమైన పేరును ఏల పెట్టితివి? ఓ మదాలసా ! ఈ పేరుకు అర్థమేమి?

మదాలసా ఉవాచ – మదాలస పలికినది.

కల్పనేయం మహారాజ కృతా సా వ్యావహారికీ ॥35॥

త్వత్కృతానాం తథా నామ్నాం శృణు భూప నిరర్థతామ్ ।
వదన్తి పురుషాః ప్రాజ్ఞా వ్యాపినం పురుషం సతః ॥36॥

ఓ మహారాజా ! కేవలము అలర్కుడని పేరు కల్పన మాత్రమే, వ్యవహారము కొరకు ఉద్దేశించబడినది. ఓ భూపాలా! నేను అర్థము లేని పేరు పెట్టినట్లే నీవు పెట్టిన పేర్లు కూడా నిరర్థకములే. ఎట్లో వినుము. ప్రాజ్ఞులగు పురుషులు పరమాత్మను సద్రూపుడని, సర్వవ్యాపియని చెప్పుచున్నారు.

క్రాన్తిశ్చ గతిరుద్దిష్టా దేశాద్దేశాన్తరం తు యా ।
సర్వగో న ప్రయాతీహ వ్యాపీ దేహేశ్వరో యతః ॥37॥

తతో విక్రాంతసంజ్ఞేయం మతా మమ నిరర్థికా ।

క్రాంతియనగా గమనమని, అనగా ఒక దేశము నుండి మరొక దేశమునకు వెళ్ళుటయని అర్థము. సర్వగామీ, సర్వేశ్వరుడూ అగు పరమాత్మకు గమనము సంభవించదు గావున మొదటి కుమారునికి పెట్టిన విక్రాంతుడను పేరు నిరర్థకమనియే నా యభిప్రాయము.

సుబాహురితి యా సంజ్ఞా కృతాఽన్యస్య సుతస్య తే ॥38॥
నిరర్థా సాఽప్యమూర్తస్య పురుషస్య మహీపతే ।

ఓ మహారాజా ! రెండవపుత్రునికి మీరు సుబాహువని ఏ పేరు పెట్టితిరో అదికూడా నిరర్థకమే. నిరాకారుడైన పరమాత్మ రూపము లేనివాడు కదా! బాహువులుండుట ఎట్లు సంభవించును?

పుత్రస్య యత్కృతం నామ తృతీయస్యారిమర్దనః ॥39॥

మన్యే తచ్చాప్యసంబద్ధం శృణు వాఽప్యత్ర కారణమ్ ।
ఏక ఏవ శరీరేషు సర్వేషు పురుషో యదా ॥40॥

తదాఽస్య రాజన్ కశ్శత్రుః కో వా మిత్రమిహేష్యతే ।
భూతైర్భూతాని మర్ద్యన్తే అమూర్తో మర్ద్యతే కథమ్ ॥41॥

మూడవ కుమారునికి అరిమర్దనుడని ఏ పేరుపెట్టితిరో అది కూడా అసంబద్ధమైన నామమనియే నేను తలచుచున్నాను. అందుకు కారణమేమో చెప్పెదను వినుము. సమస్త శరీరములందు (జీవులందు) ఒకే పరమాత్మయున్నందున, ఓ రాజా! ఎవరు శత్రువు? ఎవరు స్నేహితుడు? మూర్తములైన భూతములు భూతములచే మర్దించబడును (అణచివేయబడును) గాని మూర్తముకాని పరమాత్మ ఎట్లు మర్దింపబడును?

క్రోధాదీనాం పృథగ్భావాత్కల్పనేయం నిరర్థికా ।
యది సంవ్యవహారార్థమసన్నామ ప్రకల్ప్యతే ॥42॥

నామ్ని కస్మాదలర్కాఖ్యే నైరర్థ్యం భవతో మతమ్ ।

ఆత్మ నిర్విశేషము గావున క్రోధాదులు ఆత్మధర్మములు గావు. అందువలన ఈ కల్పన అనగా సంబద్ధార్థములుగల పేర్లను పెట్టుట అంతయూ నిరర్థకమే. వ్యవహారము కొరకు మాత్రమే పేర్లను పెట్టవలసివచ్చినచో, అర్థరహితమైన పేరును పెట్టుట కూడా యుక్తమే. అందువలన అలర్కుడను పేరు నిరర్థకమని నీవు భావించుట ఎందులకు?

ఏవముక్తస్తయా సాధు మహిష్యా స మహీపతిః ॥43॥

తథేత్యాహ మహాబుద్ధిర్దయితాం తథ్యవాదినీమ్ ।
తం చాపి సా సుతం సుభ్రూర్యథాపూర్వం సుతాంస్తథా ॥44॥

మదాలస ఈ విధముగా రాజుతో సాధువాక్యములను పలుకగా గొప్ప బుద్ధిమంతుడగు మహారాజగు ఋతధ్వజుడు సత్యమును పలుకు తన భార్యతో అట్లేయని పలికెను. ఆ మదాలస ఆ నాల్గవ కుమారునికి కూడా పూర్వమువలెనే మిగిలిన ముగ్గురు కుమారులకు ఉపదేశించినట్లుగానే ఆత్మజ్ఞానమునుపదేశించెను.

ప్రాహావబోధజననం తామువాచ స పార్థివః ।
కరోషి కిమిదం మూఢే మమాభావాయ సంతతే ॥45॥

దుష్టావబోధదానేన యథా పూర్వసుతేషు మే ।
యది తే మత్ప్రియం కార్యమనుగ్రాహ్యం వచో మమ ॥46॥

తదేనం తనయం మార్గే ప్రవృత్తం సన్నియోజయ ।
కర్మమార్గః సముచ్ఛేదం నైవ దేవి గమిష్యతి ॥47॥

అంతట ఆ మహారాజు మదాలసతో ఇట్లు పలికెను. "ఓ మూధురాలా! పెద్దకుమారులగు ముగ్గురికి దుష్టమైన బోధను చేసినట్లుగా ఈ చిన్నకుమారునికి కూడా వంశాభివృద్ధికి ప్రతికూలమైన ఇట్టి ఉపదేశమును ఎందులకు చేయుచున్నావు? నీవొకవేళ నాకు ప్రియమును చేయదలచినట్లయిన, నేను చెప్పు మాటను వినుము. ఈ నా నాల్గవకుమారుని నివృత్తిమార్గమందు కాక, ప్రవృత్తిమార్గమందు నియోగించుము. ఓ దేవీ! అప్పుడు కర్మమార్గము నశించకుండా ఉండును.

పితృపిండనివృత్తిశ్చ నైవ సాధ్వి ! భవిష్యతి ।
పితరో దేవలోకస్థాస్తథా తిర్యక్త్వమాగతాః ॥48॥

తద్వన్మనుష్యతాం యాతా భూతవర్గేషు యే స్థితాః ।
సపుణ్యానసపుణ్యాంశ్చ క్షుత్క్షామాంస్తృట్పరిప్లుతాన్ ॥49॥

పిండోదకప్రదానేన నరః కర్మణ్యవస్థితః ।
సదాఽప్యాయయతే సుభ్రూస్తద్వద్దేవతాతిథీనపి ॥50॥

ఓ సాధ్వీ ! అట్లు చిన్నకుమారుని ప్రవృత్తిమార్గమందు ప్రవర్తింపజేయుటవలన పితృదేవతలకు పిండప్రదానము ఆగిపోవుట కూడా జరుగదు. పితృదేవతలు, స్వర్గలోకమందున్నవారు, పశుపక్ష్యాదులు, అట్లే భూతవర్గములందు మనుష్యులుగా జన్మించినవారు, పుణ్యవంతులు, పుణ్యవంతులు కానివారు, ఆకలిదప్పులచే బాధపడుతున్నవారు, ఎవరు గలరో వారందరికీ కర్మలను ఆచరించు మానవుడు పిండోదకములను సమర్పించుట ద్వారా వారిని తృప్తి పరచును. ఓ అందమైన కనుబొమలు గలదానా! అదేవిధముగా దేవతలకు, అతిథులకు ఎల్లప్పుడు అవసరమైనవాటిని సమర్పించి వారిని తృప్తి పరచును.

దేవైర్మనుష్యైః పితృభిః ప్రేతైర్భూతైః సగుహ్యకైః ।
వయోభిః కృమిభిః కీటైర్నర ఏవోపజీవ్యతే ॥51॥

దేవతలు, మనుష్యులు, పితృదేవతలు, ప్రేతములు, భూతములు, యక్షులు, పక్షులు, కృమికీటకములు ఇవియన్నియు మానవుని ఆశ్రయించియే జీవించుచున్నవి.

తస్మాత్తన్వంగి మే పుత్రం యత్కార్యం క్షత్రయోనిభిః ।
ఐహికాముష్మికాయాలం తత్కర్మ ప్రతిపాదయ ॥52॥

అందువలన ఓ సుందరాంగీ! క్షత్రియులకు ఏది చేయదగియున్నదో, మరియు ఇహలోకపరలోకములందు ఫలమునిచ్చుటకు ఏది యోగ్యమై ఉన్నదో అట్టి కర్మను నా యీ కుమారునికి ఉపదేశించుము.

తేనైవముక్తా సా సాధ్వీ వరనారీ మదాలసా ।
అలర్కం నామ తనయం ప్రోవాచోల్లాపవాదినీ ॥53॥

పతివ్రత మరియు నారీరత్నమగు మదాలస తన భర్తమాటలను విని, అలర్కుడను పేరుగల తన కుమారుని సముదాయించుచు ఇట్లు పలికెను.

పుత్ర! వర్ధస్వ మే భర్తుర్మనో నన్దయ కర్మభిః ।
ఐహికాముష్మికఫలం తత్సమ్యక్పరిపాలయ ॥
మిత్రాణాముపకారాయ దుర్హృదాం నాశనాయ చ ॥54॥

ఓ కుమారా ! నీవు వర్ధిల్లుము. సత్కర్మలను ఆచరించుట ద్వారా నా భర్త మనస్సును ఆనందింపచేయుము. స్నేహితులకు ఉపకారము చేయుటకు, శత్రువులను నశింపచేయుటకు ఇహలోకపరలోకములకు చెందిన కర్మల ఫలమును బాగుగా పరిపాలించుము.

ధన్యోఽసి రే యో వసుధామశత్రురేకశ్చిరం పాలయితాసి పుత్ర ।
తత్పాలనాదింద్రసమోపభోగ్యం ధర్మం ఫలం ప్రాప్స్యసి చామరత్వమ్ ॥55॥

ఓ కుమారా ! నీవు ధన్యుడవు. నీవు శత్రువులు లేనివాడవై చిరకాలము నీవొక్కడివే ఈ భూమండలమును పరిపాలించుము. నీ పరిపాలనచే ఇంద్రసమాన భోగములను, ధర్మమును, ధర్మఫలమైన అమరత్వమును పొందెదవు.

ధరామరాన్ పర్వసు తర్పయేథాః సమీహితం బంధుషు పూరయేథాః ।
హితం పరస్మై హృది చిన్తయేథాః మనః పరస్త్రీషు నివర్తయేథాః ॥56॥

భూలోకదేవతలగు బ్రాహ్మణులను పర్వదినములందు సంతృప్తిపరచుచుండుము. బంధుజనుల కోరికలను తీర్చుచుండుము. ఇతరులకు మేలు చేయవలెనని మనస్సునందు ఆలోచన చేయుచుండుము. పరస్త్రీలయందు మనస్సును మరల్చుచుండుము.

సదా మూరారిం హృది చింతయేథాః తద్ధ్యానతోఽన్తః షడరీఞ్జయేథాః ।
మాయాం ప్రబోధేన నివారయేథా హ్యనిత్యతామేవ విచిన్తయేథాః ॥57॥

ఎల్లప్పుడు ఆ విష్ణుమూర్తిని హృదయమందు చింతించుచుండుము. ఆ విష్ణుమూర్తి ధ్యానముతో అరిషడ్వర్గమును జయించుము. జ్ఞానముద్వారా మాయను నివారించుము. సంసారము అనిత్యమని చింతించుచుండుము.

అర్థాగమాయ క్షితిపాఞ్జయేథా యశోఽర్జనాయార్థమపి వ్యయేథాః ।
పరాపవాదశ్రవణాద్బిభీథా విపత్సముద్రాజ్జనముద్ధరేథాః ॥58॥

ధనము సంపాదించుటకొరకు రాజులను జయించుము. కీర్తిని సంపాదించుటకు ఆ ధనమును ఖర్చు చేయుము. ఇతరులమీద నిందలను వినుటకు భయము చెందుము. ఆపదయనెడు సముద్రమునుండి జనులను ఉద్ధరించుము.

యజ్ఞైరనేకైర్విబుధానజస్రమన్నైర్ద్విజాన్ప్రీణయ సంశ్రితాంశ్చ ।
స్త్రియశ్చ కామైరతులైశ్చిరాయ యుద్ధైరరీంస్తోషయితాసి వీర ॥59॥

అనేకవిధములైన యజ్ఞముల ద్వారా దేవతలను ఎల్లప్పుడు సంతోషపరచుము. భోజనము పెట్టుట ద్వారా ద్విజులను, ఆశ్రయించినవారిని సంతోషపరచుము. చిరకాలము కోరికలను తీర్చుటద్వారా స్వీయస్త్రీజనమును సంతృప్తిపరచుము. ఓ వీరుడా! యుద్ధములను చేయుట ద్వారా శత్రువులను సంతోషపరచుము.

బాలో మనో నన్దయ బాంధవానాం గురోస్తథాఽజ్ఞాకరణైః కుమారః ।
స్త్రీణాం యువా సత్కులభూషణానాం వృద్ధో వనే వత్స వనేచరాణామ్ ॥60॥

ఓ వత్సా! బాలుడవై బంధుజనుల మనస్సును ఆనందింపచేయుము. కుమారుడవై గురువుల ఆజ్ఞను పరిపాలించుట ద్వారా, వారిని ఆనందింపచేయుము. మంచి వంశమందు పుట్టి ఆ వంశమునకే అలంకారప్రాయమైన స్త్రీలపట్ల యువకుడవై వారిని ఆనందింపచేయుము. వృద్ధుడవై అడవియందు వనేచరులకు తృప్తిని కలుగజేయుము.

రాజ్యం కుర్వన్ సుహృదో నందయేథాః సాధూన్ రక్షంస్తాత యజ్ఞైర్యజేథాః ।
దుష్టాన్నిఘ్నన్వైరిణశ్చాజిమధ్యే గోవిప్రార్థే వత్స మృత్యుం భజేథాః ॥61॥

ఓ కుమారా ! రాజ్యమును చక్కగా పరిపాలించుచూ స్నేహితులను ఆనందింపచేయుము. ఓ తండ్రీ! కుమారా! సత్పురుషులను రక్షించుచు యజ్ఞములను ఆచరించుము. యుద్ధభూములందు దుర్మార్గులైన శత్రువులను సంహరించుము. ఓ వత్సా ! గోవులు, బ్రాహ్మణుల కొరకు మరణమును పొందుటకైనా వెనుకాడకుము.

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే ప్రవృత్తిమార్గానుశాసనం నామ త్రయోవింశోఽధ్యాయః ॥23॥

శ్రీ మార్కండేయ మహాపురాణమందు ప్రవృత్తిమార్గానుశాసనమను ఇరువదిమూడవ అధ్యాయం సమాప్తం.



చతుర్వింశోఽధ్యాయః – ఇరువదినాల్గవ అధ్యాయం
మదాలసోపాఖ్యానమ్ – మదాలసోపాఖ్యానం

పుత్ర ఉవాచ – పుత్రుడు పలికాడు.

ఏవముల్లాప్యమానస్తు స తు మాత్రా దినే దినే ।
వవృధే వయసా బాలో బుద్ధ్యా చాలర్కసంజ్ఞితః ॥1॥

ప్రతీరోజు తల్లి ఆటలాడించుమిషతో ఈవిధముగా ఉపదేశించుచుండగా అలర్కుడను పేరుగల ఆ బాలుడు వయస్సుతోనూ, బుద్ధితోనూ పెరుగసాగెను.

స కౌమారకమాసాద్య ఋతధ్వజసుతస్తదా ।
కృతోపనయనః ప్రాజ్ఞః ప్రణిపత్యాహ మాతరమ్ ॥2॥

ఋతధ్వజుని కుమారుడగు అలర్కుడు కౌమారావస్థను పొంది, ఉపనయనసంస్కారమును పొంది ప్రాజ్ఞుడై తల్లికి నమస్కరించి ఇట్లు పలికెను.

మయా యదంబ కర్తవ్యమైహికాముష్మికాయ వై ।
సుఖాయ వద తత్సర్వం ప్రశ్రయావనతస్య మే ॥3॥

ఓ తల్లీ ! ఇహలోకపరలోకములలో సుఖమునొందుటకై నేనేమి చేయవలెనో దానినంతటినీ వినయముతో వంగియున్న నాకు చెప్పుము.

మమార్థం చైవ ధర్మార్థం ప్రజానాం చైవ యద్ధితమ్ ।
శ్రేయసే యచ్చ తత్సర్వం ప్రజారంజనమాదితః ॥4॥

నాకు, ధర్మముకొరకు, ప్రజలకొరకు ఏది హితమో దానిని, అట్లే శ్రేయస్సును కలిగించుదానిని, ప్రజలను సంతోషపెట్టుదానిని, దానినంతనూ నాకు చెప్పుము.

మదాలసా ఉవాచ – మదాలస పలికింది.

వత్స రాజ్యాభిషిక్తేన ప్రజారంజనమాదితః ।
కర్తవ్యమవిరోధేన స్వధర్మశ్చ మహీభృతామ్ ॥5॥

ఓ కుమారా! రాజ్యాభిషిక్తుడవై ప్రజారంజనము మొదలగు పనులను ధర్మవిరోధము లేకుండగా చేయవలెను. అదియే రాజుల ధర్మము.

వ్యసనాని పరిత్యజ్య సత్యమూలహరాణి వై ।
ఆత్మా రిపుభ్యః సంరక్ష్యో బహిర్మంత్రవినిర్గమాత్ ॥6॥

సత్యముయొక్క మూలములను నశింపచేయునట్టి వ్యసనములను విడిచిపెట్టి, తనను తాను శత్రువులనుండి రక్షించుకొనవలెను. రాజ్యరహస్యములను బయటకు పొక్కనీయకూడదు.

దుష్టాదుష్టాంశ్చ జానీయాదమాత్యానరిదోషతః ।
అష్టధా నాశమాప్నోతి స్వచక్రాత్స్యన్దనాద్యథా ॥7॥

మంత్రులలో దుష్టులెవరో, మంచివారెవరో శత్రుదోషము కారణముగా తెలుసుకొనవలెను. లేనిచో వక్రమైన (వంకర) గమనముగల రథమునుండి జారిపడిపోయినట్లుగా ఎనిమిది విధములైన నాశమును పొందును.

తథా రాజాప్యసందిగ్ధం బహిర్మంత్రవినిర్గమాత్ ।
చరైశ్చరాస్తథా శత్రోరన్వేష్టవ్యాః ప్రయత్నతః ॥8॥

అట్లే రాజ్యరహస్యములను బయటకు వెల్లడించిన రాజుకూడా ఎట్టి సందేహము లేకుండా నాశమునొందును. శత్రువుల పక్షమందు ఎవరున్నారో వారిని తమ గూఢచారులద్వారా ప్రయత్నించి తెలుసుకొనవలెను.

విశ్వాసో న తు కర్తవ్యో రాజ్ఞా మిత్రాప్తబంధుషు ।
కార్యయోగాదమిత్రేషు విశ్వసీత నరాధిపః ॥9॥

రాజు తన మిత్రులను, ఆప్తులను, బంధువులను అతిగా విశ్వసించరాదు. కార్యమును బట్టి నరాధిపతి ఒక్కొక్కప్పుడు శత్రువులందు కూడా నమ్మకముంచవలెను.

స్థానవృద్ధిక్షయజ్ఞేన షాడ్గుణ్యవిదితాత్మనా ।
భవితవ్యం నరేంద్రేణ న కామవశవర్తినా ॥10॥

రాజు స్థానవృద్ధిక్షయములను ఎరిగి ఉండవలెను. సంధి, విగ్రహ, యాన, ఆసన, ద్వైధీభావ, సంశ్రయములను షడ్గుణములను ఎరిగియుండవలెను. నరేంద్రుడెన్నడూ కామవశుడై యుండరాదు.

ప్రాగాత్మమంత్రిణశ్చైవ తతో భృత్యా మహీభృతా ।
జ్ఞేయాశ్చానంతరం పౌరా విరుధ్యేత తతోఽరిభిః ॥11॥

ముందుగా తన మంత్రులను, అటుపిమ్మట తన సేవకులను, ఆ తర్వాత పురజనులను గురించి తెలుసుకొనవలెను. ఆ తర్వాతే శత్రువులను విరోధించవలెను.

యస్త్వేతానవిజిత్యైవ వైరిణో విజిగీషతే ।
సోఽజితాత్మా జితామాత్యః శత్రువర్గేణ బాధ్యతే ॥12॥

ఎవరయితే ముందుగా అమాత్యాదులను జయించకుండానే శత్రువులను జయించాలని కోరుకుంటాడో, అతడు తాను జయమునొందక అమాత్యులచే జయింపబడి శత్రువులచే బాధింపబడును.

తస్మాత్కామాదయః పూర్వం జేయాః పుత్ర మహీభృతా ।
తజ్జయే హి జయో రాజ్ఞో రాజా నశ్యతి తైర్జితః ॥13॥

అందువలన రాజు మొదట కామాదులను జయించవలెను. వాటిని జయించినప్పుడే రాజుకి జయము నిశ్చయము. అట్లు కానిచో కామాదులచే జయింపబడి రాజు నాశమునొందును.

కామః క్రోధశ్చ లోభశ్చ మదో మానస్తథైవ చ ।
హర్షశ్చ శత్రవో హ్యేతే నాశాయ కుమహీభృతామ్ ॥14॥

కామము, క్రోధము, లోభము, మదము (మోహము), గర్వము, హర్షము అనునవి శత్రువులు. ఇవి చెడ్డ పరిపాలన సాగించు రాజుల నాశనమునకు కారణమగును.

కామప్రసక్తమాత్మానం స్మృత్వా పాండుం నిపాతితమ్ ।
నివర్తయేత్తథా క్రోధాదనుహ్రాదం హతాత్మజమ్ ॥15॥

కామమునకులోనై నశించిన పాండుమహారాజును, క్రోధమునకు లోనై తన పుత్రుని కోల్పోయిన అనుహ్రాదుని (హిరణ్యకశిపుని కుమారుడు), స్మరించి రాజు తనను కామక్రోధములనుండి మరలించుకొనవలెను.

హతమైలం తథా లోభాన్మదాద్వేనం ద్విజైర్హతమ్ ।
మానాదనాయుషః పుత్రం హతం హర్షాత్పురఞ్జయమ్ ॥16॥

లోభమువలన ఐలుడు(పురూరవుడు) నశించెను. మదము వలన వేనుడు (అంగుని కుమారుడు) ద్విజుడు చంపబడెను. మానము వలన అనాయుషుని పుత్రుడు (బాలి) చంపబడెను. హర్షము (మితిమీరిన సంతోషము) వలన పురంజయుడు చంపబడెను.

ఏభిర్జితైర్జితం సర్వం మరుత్తేన మహాత్మనా ।
స్మృత్వా వివర్జయేదేతాన్ షడ్ దోషాంశ్చ మహీపతిః ॥17॥

మహాత్ముడగు మరుత్తమహారాజు ఈ కామాదిశత్రువులను జయించి సమస్తలోకములను అవలీలగా జయించెను. ఈవిధముగా కామాదులకు లోనైనవారు నశించిన విషయాన్ని, కామాదులకు లోను కాని వారు జయించిన విషయాన్ని స్మరణకు తెచ్చుకొని రాజు ఈ కామాది అరిషడ్వర్గమును విడిచిపెట్టవలెను.

కాకకోకిలభృఙ్గాణాం బకవ్యాలశిఖండినామ్ ।
హంసకుక్కుటలోహానాం శిక్షేత చరితం నృపః ॥18॥

కాకి, కోయిల, తుమ్మెద, కొంగ, సర్పము, నెమలి, హంస, కోడి, లోహము వీటివలన రాజు శిక్షణ పొందవలెను. (కాకి ఏకాగ్రచిత్తముతో ఉండునట్లు రాజు ఉండవలెను. కోకిలవలే పరులను ఆకర్షించవలెను. తుమ్మెదవలే శత్రువశము కాకుండ ఉండవలెను. కొంగవలే తీక్ష్ణదృష్టి కలిగి యుండవలెను. సర్పము విషముచే సంహరించునట్లుగా రాజు తన బలముచే శత్రువులను సంహరించవలెను. నెమలి పింఛమును విస్తరించునట్లుగా రాజు తన సంపదను విస్తరింపచేయవలెను. హంసవలే గుణదోషగ్రాహి కావలెను. కోడివలే సమయపాలన చేయవలెను. లోహమువలే సమయానుసారముగా కఠినముగా ఉండవలెను.)

కౌశికస్య క్రియాం కుర్యాద్విపక్షే మనుజేశ్వరః ।
చేష్టాం పిపీలికానాం చ కాలే భూపః ప్రదర్శయేత్ ॥19॥

రాజు శత్రువుల పట్ల గుడ్లగూబవలే ఆడంబరము లేక ప్రవర్తించి వారిని నశింపచేయవలెను. తగు సమయమందు చీమలదండు వలే ప్రవర్తించవలెను. (చీమలు తాము ఒక్కొక్కటే చేయలేని పనిని సమూహముగా ఏర్పడి చిన్న చిన్న వస్తువులను మోసుకొని వెళ్ళును.)

జ్ఞేయాగ్నివిస్ఫులింగానాం బీజచేష్టా చ శాల్మలేః ।
చంద్రసూర్యస్వరూపం చ నీత్యర్థం పృథివీక్షితా ॥20॥

అగ్నివిస్ఫులింగములవలే, బూరుగుచెట్టు విత్తనములవలే, చంద్రసూర్యులవలే రాజు రాజనీతిని ప్రదర్శించవలెను.

బంధకీపద్మశరభశూలికాగుర్విణీస్తనాత్ ।
ఏవం సామ్నా చ భేదేన ప్రదానేన చ పార్థివః ॥21॥

దండేన చ ప్రకుర్వీత నీత్యర్థం పృథివీక్షితా ।
ప్రజ్ఞా నృపేణ వా దేయా తథా చండాలయోషితః ॥22॥

వ్యభిచారిణియగు స్త్రీ, పద్మము, శరభమృగము, శూలము, గర్భిణీస్త్రీస్తనము, వీరివలన నరపతి శిక్షణ పొందవలెను. (వ్యభిచారిణి పురుషుల చిత్తమును చూరగొనినట్లు రాజు ప్రజల చిత్తమును రంజింపచేయవలెను. పద్మము వలే అందరినీ ఆహ్లాదపరచవలెను. ఎనిమిది పాదములు గల శరభమృగము వలే పరాక్రమమును ప్రదర్శించవలెను. శూలమువలే ఒకేసారి శత్రువులను పొడిచి చంపవలెను. గర్భిణీస్త్రీ స్తనము పుట్టబోవు శిశువునకు పాలను సంగ్రహించునట్లు, రాజు భవిష్యత్తు కొరకు ధనమును కూడబెట్టవలెను.) అదేవిధముగా రాజు సామ, దాన, భేద, దండ ఉపాయములను రాజనీతిని పాటించుటకొర్కై అనుసరించవలెను. పురాణాదులలో చండాలస్త్రీలు కూడా ఉపదేశము చేయగల సామర్థ్యముగలవారని చెప్పబడినది. అట్లే రాజు కూడా జ్ఞానోపదేశము చేయవలెను.

శక్రార్కయమసోమానాం తద్వద్వాయోర్మహీపతిః ।
రూపాణి పఞ్చ కుర్వీత మహీపాలనకర్మణి ॥23॥

ఇంద్రుడు, సూర్యుడు, యముడు, చంద్రుడు, వాయువులను అయిదింటి రూపములను రాజు రాజ్యపాలనమందు ధరించవలెను.

యథేంద్రశ్చతురో మాసాన్వార్యోఘేణైవ భూతలమ్ ।
ఆప్యాయయేత్తథా లోకాన్పరిచారైర్మహీపతిః ॥24॥

ఎట్లయితే ఇంద్రుడు సంవత్సరంలో నాలుగు నెలలు జలధారలచే భూతలమును సంతృప్తి పరచునో అట్లే రాజు కూడా సమస్తజనులను పరిచారములచే అనగా వారికి కావలసినవాటిని సమకూర్చుటచే సంతృప్తి పరచవలెను.

మాసానష్టౌ యథా సూర్యస్తోయం హరతి రశ్మిభిః ।
సూక్ష్మేణైవాభ్యుపాయేన తథా శుల్కాదినా నృపః ॥25॥

సూర్యుడు ఏ విధముగా అయితే సంవత్సరంలో ఎనిమిది నెలలు తన కిరణములచే నీటిని గ్రహించునో, అట్లే రాజు కూడా ప్రజలకు ఇబ్బంది కలగకుండా వారినుండి పన్నులను గ్రహించవలెను.

యథా యమః ప్రియద్వేష్యౌ ప్రాప్తే కాలే నియచ్ఛతి ।
తథా ప్రియాఽప్రియే రాజా దుష్టాదుష్టే సమో భవేత్ ॥26॥

ఎట్లయితే యముడు మరణకాలము సంప్రాప్తమైనప్పుడు ప్రియులను, ద్వేష్యులను ఇరువురిని సమభావముతో గ్రహించునో అట్లే రాజు కూడా ప్రియము, అప్రియము ఈ రెంటియందు, మంచి, చెడ్డ ఈ రెంటియందు సమభావమును వహించవలెను.

పూర్ణేందుమాలోక్య యథా ప్రీతిమాన్ జాయతే నరః ।
ఏవం యత్ర ప్రజాస్సర్వా నిర్వృతాస్తచ్ఛశివ్రతమ్ ॥27॥

పూర్ణచంద్రుని చూచి జనులెట్లు ప్రీతి కలిగినవారగుదురో అట్లే ప్రజలందరు తనను చూచి సంతోషించునట్లు రాజుండవలెను. అదియే శశివ్రతమనగా.

మారుతస్సర్వభూతేషు నిగూఢశ్చరతే యథా ।
ఏవం చరేన్నృపశ్చారైః పౌరామాత్యారిబంధుషు ॥28॥

వాయువు సమస్తభూతములందు పైకెవరికీ కనిపించకుండా గూఢముగా ఎట్లు ప్రవర్తించునో అట్లే రాజు కూడా పౌరులు, మంత్రులు, శత్రువులు, బంధువులు వీరిపట్ల గూఢచారుల సలహాప్రకారము రహస్యముగా ప్రవర్తించవలెను.

న లోభార్థైర్న కామార్థైర్నార్థార్థైర్యస్య మానసమ్ ।
పదార్థైః కృష్యతే ధర్మాత్స రాజా స్వర్గమృచ్ఛతి ॥29॥

ఏ రాజుయొక్క మనస్సయితే అర్థకామములచేత, లోభములచేత, మరి ఏ ఇతర వస్తువులచేత ఆకర్షింపబడదో కేవలము ధర్మముచేత మాత్రమే ఆకర్షింపబడునో అట్టి రాజు స్వర్గమును పొందును.

ఉత్పథగ్రాహిణో మూఢాన్ స్వధర్మాచ్చలితాన్నరాన్ ।
యః కరోతి నిజే ధర్మే స రాజా స్వర్గమృచ్ఛతి ॥30॥

చెడు మార్గములందు ప్రవర్తించు మూర్ఖులను, స్వధర్మమునుండి చ్యుతులైన మానవులను ఎవరయితే తిరిగి వారివారి ధర్మమందు ప్రవర్తింపచేయునో అట్టి రాజు స్వర్గమునధిరోహించును.

వర్ణధర్మా న సీదన్తి యస్య రాష్ట్రే తథాఽశ్రమాః ।
రాజ్ఞస్తస్య సుఖం తాత ! పరత్రేహ చ శాశ్వతమ్ ॥31॥

ఓ వత్సా! ఏ రాజుయొక్క రాజ్యమందు బ్రాహ్మణక్షత్రియాది వర్ణధర్మములు బ్రహ్మచర్యము, గార్హస్థ్యము మొదలగు ఆశ్రమధర్మములు చెడకుండా ఉండునో అట్టి రాజుకు ఇహలోకపరలోకములలో శాశ్వతసుఖము లభించును.

ఏతద్రాజ్ఞః పరం కృత్యం తథైతద్వృద్ధికారణమ్ ।
స్వధర్మే స్థాపనం నృణాం చాల్యతే న కుబుద్ధిభిః ॥32॥

సమస్తజనులను వారి వారి ధర్మములలో నిలబెట్టుట, దుర్మార్గులవలన చలింపకుండుట ఇది రాజుకు మొదటి కర్తవ్యము, వృద్ధికి హేతువు కూడా.

పాలనేనైవ భూతానాం కృతకృత్యో మహీపతిః ।
సమ్యక్పాలయితా భాగం ధర్మస్యాప్నోతి వై యతః ॥33॥

రాజు ప్రజలను చక్కగా పరిపాలించుటవలననే కృతకృత్యుడగును. అట్లు చక్కగా పరిపాలించువాడు ధర్మములో కొంత భాగము గ్రహించినవాడగును.

ఏవమాచరతే రాజా చాతుర్వర్ణ్యస్య రక్షణమ్ ।
స సుఖీ విహరత్యేష శక్రస్యైతి సలోకతామ్ ॥34॥

ఈ విధముగా ఏ రాజయితే బ్రాహ్మణ క్షత్రియ వైశ్యశూద్రాత్మకమైన చాతుర్వర్ణ్యమును పరిరక్షిస్తూ ప్రజలను పరిపాలించునో అట్టిరాజు ఇహలోకమందు పరమసుఖమును పొందును, పరలోకమందు ఇంద్రలోకము లభించును.

ఇతి శ్రీ మార్కండేయమహాపురాణే మదాలసోపాఖ్యానే చతుర్వింశోఽధ్యాయః ॥24॥

శ్రీ మార్కండేయమహాపురాణమందు మదాలసోపాఖ్యానమనెడు ఇరువదినాల్గవ అధ్యాయం సమాప్తం.



పఞ్చవింశోఽధ్యాయః - ఇరువదియైదవ అధ్యాయం
మదాలసానుశాసనమ్ - మదాలసానుశాసనం

పుత్ర ఉవాచ - పుత్రుడు పలికాడు.

తన్మాతుర్వచనం శ్రుత్వా సోఽలర్కో మాతరం పునః ।
పప్రచ్ఛ వర్ణధర్మాంశ్చ ధర్మాన్యే చాశ్రమేషు చ ॥1॥

ఈ విధముగా తల్లి చెప్పిన మాటలను విని మరల అలర్కుడు వర్ణధర్మములు, ఆశ్రమధర్మములను గూర్చి తల్లిని ప్రశ్నించెను.

అలర్క ఉవాచ - అలర్కుడు పలికాడు.

కథితోఽయం మహాభాగే రాజ్యతంత్రాశ్రితస్త్వయా ।
మమ ధర్మోఽహమిచ్ఛామి శ్రోతుం వర్ణాశ్రమాత్మకమ్ ॥2॥

ఓ పూజ్యురాలా ! నీవు రాజధర్మములను గూర్చి చెప్పితివి. ఇప్పుడు వర్ణధర్మములను, ఆశ్రమధర్మములను వినుటకు కోరుచున్నాను.

మదాలసా ఉవాచ - మదాలస పలికింది.

దానమధ్యయనం యజ్ఞో బ్రాహ్మణస్య త్రిధోదితః ।
ధర్మో నాన్యశ్చతుర్థోఽస్తి ధర్మస్తస్యాపదం వినా ॥3॥

ఓ కుమారా! దానము, అధ్యయనము, యజ్ఞము ఈ మూడు బ్రాహ్మణధర్మములైయున్నవి. ఆపత్కాలమందు తప్ప, ఈ మూడింటికంటే వేరైన నాల్గవ ధర్మము ఏమీ లేదు.

యాజనాఽధ్యాపనే శుద్ధస్తథా పుత్ర ! ప్రతిగ్రహః ।
ఏతత్సమ్యక్సమాఖ్యాతం త్రితయం చాస్య జీవికా ॥4॥

పరిశుద్ధమైన అంతఃకరణముగలవాడై యజ్ఞము చేయించుట, శిష్యులకు వేదముల అధ్యయనమును చేయించుట, దానము పట్టుట ఈ మూడు బ్రాహ్మణులకు జీవికగా (జీవనాధారముగా) చెప్పబడినవి.

దానమధ్యయనం యజ్ఞాః క్షత్రియస్యాప్యయం త్రిధా ।
ధర్మః ప్రోక్తః క్షితే రక్షా శస్త్రాజీవశ్చ జీవికా ॥5॥

దానము, అధ్యయనము, యజ్ఞములు చేయుట ఈ మూడూ క్షత్రియునికి కూడా ధర్మములు. భూమిని రక్షించుట, శస్త్రములతో జీవనము సాగించుట క్షత్రియునికి జీవికగా చెప్పబడినవి.

దానమధ్యయనం యజ్ఞో వైశ్యస్యాపి త్రిధైవ సః ।
వాణిజ్యం పాశుపాల్యం చ కృషిశ్చైవాస్య జీవికా ॥6॥

దానము, అధ్యయనము, యజ్ఞములాచరించుట ఈ మూడూ వైశ్యునికి కూడా ధర్మములు. వ్యాపారముచేయుట, పశువులను పాలించుట, వ్యవసాయము వైశ్యునికి జీవికగా చెప్పబడినవి.

దానం యజ్ఞోఽథ శుశ్రూషా ద్విజాతీనాం త్రిధా మయా ।
వ్యాఖ్యాతః శూద్రధర్మోఽపి జీవికా కారుకర్మజా ॥7॥

తద్వద్ద్విజాతిశుశ్రూషా పోషణం క్రయవిక్రయైః ।
వర్ణధర్మాస్త్విమే ప్రోక్తాః శ్రూయతామాశ్రమాశ్రయాః ॥8॥

దానము, యజ్ఞము, ద్విజులను సేవించుట ఈ మూడు శూద్రధర్మములుగా నాచే చెప్పబడినవి. శిల్పకర్మ, ద్విజాతులవారిని సేవించుట, క్రయవిక్రయములతో పోషించుకొనుట శూద్రజాతివారికి జీవికగా చెప్పబడినవి. ఇంతవరకు వర్ణధర్మములు నాచే చెప్పబడినవి. ఇక ఆశ్రమధర్మములను చెప్పెదను, వినుము.

స్వవర్ణధర్మాత్సంసిద్ధిం నరః ప్రాప్నోతి న చ్యుతః ।
ప్రయాతి నరకం ప్రేత్య ప్రతిషిద్ధనిషేవణాత్ ॥9॥

తమతమ వర్ణధర్మములనుండి చ్యుతిని పొందక వాటిని పాటించిన మానవుడు మోక్షమును పొందును. తమ వర్ణధర్మములు కానట్టి ప్రతిషిద్ధమైన వాటిని సేవించిన మానవుడు చనిపోయిన పిమ్మట నరకమునకు వెళ్ళును.

యావత్తు నోపనయనం క్రియతే వై ద్విజన్మనః ।
కామచేష్టోక్తిభక్షస్తు తావద్భవతి పుత్రక ॥10॥

ఓ కుమారా! ద్విజాతులవారికి సంబంధించినవారికి ఉపనయనము కానంతవరకు వారు తమ ఇచ్ఛానుసారము ఆహారాదులయందు ప్రవర్తించవచ్చును.

కృతోపనయనస్సమ్యగ్బ్రహ్మచారీ గురోర్గృహే ।
వసేత తత్ర ధర్మోఽస్య కథ్యతే తన్నిబోధ మే ॥11॥

ఇక ఉపనయనముగావింపబడిన బ్రహ్మచారి గురుకులమందు నివసించవలెను. అచ్చట అతని ధర్మమేమో చెప్పెదను, వినుము.

స్వాధ్యాయోఽథాగ్నిశుశ్రూషా స్నానం భిక్షాటనం తథా ।
గురోర్నివేద్య తచ్చాద్యమనుజ్ఞాతేన సర్వదా ॥12॥

వేదాధ్యయనము, అగ్నిసేవ, స్నానము, భిక్షను ఆచరించుట, భిక్షాటనముచే సంపాదించిన ఆహారమును ఎల్లప్పుడు గురువుగారికి నివేదించి వారి ఆజ్ఞానుసారము భుజించుట ఇవి బ్రహ్మచారి ధర్మములు.

గురోః కర్మణి సోద్యోగః సమ్యక్ ప్రీత్యుపపాదకః ।
తేనాఽహూతః పఠేచ్చైవ తత్పరో నాఽన్యమానసః ॥13॥

గురువుగారు చెప్పిన పనులను చేయుట, వారికి సంతోషమును కలిగించుట, గురువుగారు ఆహ్వానించిన పిమ్మటే అధ్యయనము చేయుట, అధ్యయనమందు మాత్రమే మనస్సును లగ్నము చేసి ఇతరములందు మనస్సు లగ్నము చేయకుండుట బ్రహ్మచారి ధర్మములు.

ఏకం ద్వౌ సకలాన్వాపి వేదాన్ ప్రాప్య గురోర్ముఖాత్ ।
అనుజ్ఞాతో వరాం దత్త్వా దక్షిణాం గురవే తతః ॥14॥

గార్హస్థ్యాశ్రమకామస్తు గృహస్థాశ్రమమావసేత్ ।
వానప్రస్థాశ్రమం వాఽపి చతుర్థం వేచ్ఛయాఽత్మనః ॥15॥

ఒకటిగాని, రెండుగాని లేదా సకల వేదములను గురువుద్వారా అధ్యయనము చేసి, వారి అనుమతిని పొంది, వారికి యుక్తమైన గురుదక్షిణను సమర్పించి గార్హస్థ్య ఆశ్రమమును కోరుకొన్నట్లయిన గృహస్థాశ్రమమును అనగా వివాహమును పొందవలెను. లేదా తన ఇచ్ఛానుసారము వానప్రస్థాశ్రమమునుగాని లేదా నాల్గవది అయిన సన్న్యాసాశ్రమమునుగాని స్వీకరించవలెను.

తథైవ వా గురోర్గేహే ద్విజో నిష్ఠామవాప్నుయాత్ ।
గురోరభావే తత్పుత్రే తచ్ఛిష్యే తత్సుతం వినా ॥16॥

శుశ్రూషుర్నిరభిమానో బ్రహ్మచర్యాశ్రమే వసేత్ ।
ఉపావృత్తస్తతస్తస్మాద్గృహస్థాశ్రమకామ్యయా ॥17॥

తతోఽసమానర్షికులాం తుల్యాం భార్యామరోగిణీమ్ ।
ఉద్వహేన్న్యాయతోఽవ్యంగాం గృహస్థాశ్రమకారణాత్ ॥18॥

అట్లు కానిచో నైష్ఠిక బ్రహ్మచారియై గురువుగారి గృహమందే నివసింపవలెను. గురువు లేనిచో గురుపుత్రునివద్ద, గురుపుత్రుడు లేనిచో గురుశిష్యునివద్ద అభిమానరహితుడై సేవచేసుకొనుచు బ్రహ్మచర్యాశ్రమమందు నివసించవలెను. మరల గృహస్థాశ్రమమందు కోరిక కలిగినచో అచ్చటినుండి వెనుతిరిగి, సమాన ఋషులు, సమాన గోత్రము కానట్టిదీ, తనకు అనురూపమైనట్టిదీ, రోగరహితురాలూ, వికృతమైన అవయవములు లేనట్టిదీ అయిన కన్యను గృహస్థాశ్రమము కారణముగా విధ్యుక్తప్రకారము వివాహమాడవలెను.

స్వకర్మణా ధనం లబ్ధ్వా పితృదేవాతిథీంస్తథా ।
సమ్యక్ సంప్రీణయేద్భక్త్యా పోషయేచ్చాశ్రితాంస్తథా ॥19॥

తనకు విధింపబడిన కర్మలను ఆచరించుటద్వారా ధనమును సంపాదించి పితృదేవతలను, అతిథులను బాగుగా సంతృప్తి పరచవలెను. తనను ఆశ్రయించినవారిని భక్తిపూర్వకముగా పోషించవలెను.

భృత్యాత్మజాన్ జామయోఽథ దీనార్థిపతితానపి ।
యథాశక్త్యాన్నదానేన వయాంసి పశవస్తథా ॥20॥

భృత్యులను, తనకు జన్మించినవారిని, తన తోబుట్టువులను, దీనులను, యాచకులను, పతితులను, పక్షులను, పశువులను యథాశక్తిగా అన్నముపెట్టుటద్వారా పోషించవలెను.

ఏష ధర్మో గృహస్థస్య ఋతావభిగమస్తథా ।
పఞ్చయజ్ఞవిధానం తు యథాశక్తి న హాపయేత్ ॥21॥

ఋతుకాలమందు భార్యాసంగమము, పితృదేవతాది పంచయజ్ఞములను విడిచిపెట్టకుండా విధిప్రకారము ఆచరించుట గృహస్థుని ధర్మములు.

పితృదేవతాతిథిజ్ఞాతిభుక్తశేషం స్వయం నరః ।
భుఞ్జీత చ సమం భృత్యైర్యథావిభవమాత్మనః ॥22॥

పితృదేవతలు, దేవతలు, అతిథులు, జ్ఞాతులు వీరు భుజించిన పిమ్మట ఆ భుక్తశేషమును మానవుడు తాను స్వయముగా భుజించవలెను. అట్లే తన సంపదలననుసరించి తన సేవకులతో కలిసి భుజించవలెను. (వారికెవరికీ పెట్టకుండా తాను తినకూడదని భావము.)

ఏష తూద్దేశతః ప్రోక్తో గృహస్థస్యాశ్రమో మయా ।
వానప్రస్థస్య ధర్మం తే కథయామ్యవధార్యతామ్ ॥23॥

నేను సంక్షిప్తముగా గృహస్థాశ్రమ ధర్మములను చెప్పితిని. వానప్రస్థాశ్రమధర్మములను చెప్పెదను వినుము.

అపత్యసంతతిం దృష్ట్వా ప్రాజ్ఞో దేహస్య చానతిమ్ ।
వానప్రస్థాశ్రమం గచ్ఛేదాత్మనః శుద్ధికారణాత్ ॥24॥

బుద్ధిమంతులైనవారు తన అపత్యసంతానమును చూచి, దేహము నశ్వరమగుటనుకూడా చూచి ఆత్మను శుద్ధి చేసుకొనుటకై వానప్రస్థాశ్రమమునకు వెళ్ళవలెను.

తత్రారణ్యోపభోగశ్చ తపోభిశ్చాత్మకర్షణమ్ ।
భూమౌ శయ్యా బ్రహ్మచర్యం పితృదేవాతిథిక్రియాః ॥25॥

వానప్రస్థాశ్రమమందు వనమందు లభించినవాటిని ఆహారముగా తీసుకొనుచు, తపస్సుచేత ఆత్మనిగ్రహము కలిగి, నేలపై శయనించుచు, బ్రహ్మచర్యము నవలంబించి పితృదేవతలు, దేవతలు, అతిథులకు సంబంధించిన క్రియలను అనుష్ఠించుచుండవలెను.

హోమస్త్రిషవణస్నానం జటావల్కలధారణమ్ ।
మౌనాదికరణం చైవ వన్యస్నేహనిషేవణమ్ ॥26॥

హోమము, మూడువేళలయందు స్నానము (త్రిసంధ్యానుష్ఠానము), జటలు, నారచీరలను ధరించుట, మౌనాదులను ఆచరించుట, అడవిలోనున్నవారితో స్నేహమునాచరించుట వానప్రస్థాశ్రమ ధర్మములు.

ఇత్యేష పాపశుద్ధ్యర్థమాత్మనశ్చోపకారకః ।
వానప్రస్థాశ్రమస్తస్మాద్భిక్షోస్తు చరమోఽపరః ॥27॥

ఈ విధముగా పాపములను కడుగుకొనుటకు, తనకు తాను ఉపకారము చేసుకొనుటకు ఈ వానప్రస్థాశ్రమము ఉద్దేశించబడినది. భిక్షువుగా అగుట అనగా సన్న్యాసాశ్రమము చివరిది అనగా నాల్గవ ఆశ్రమము.

చతుర్థస్య స్వరూపం తు శ్రూయతామాశ్రమస్య తమ్ ।
యచ్చ ధర్మోఽస్య ధర్మజ్ఞైః ప్రోక్తస్తాత మహాత్మభిః ॥28॥

సన్న్యాసమనెడు నాల్గవ ఆశ్రమముయొక్క స్వరూపమును చెప్పెదను వినుము. ఓ వత్సా ! ధర్మమునెరిగిన మహాత్ములు ఈ ఆశ్రమధర్మములను వేటిని చెప్పితిరో వాటిని చెప్పెదను.

సర్వసంగపరిత్యాగో బ్రహ్మచర్యమకోపతా ।
జితేంద్రియత్వమావాసే నైకస్మిన్వసతిశ్చిరమ్ ॥29॥

సర్వసంగపరిత్యాగము (ప్రాపంచిక విషయములతో సంబంధమును త్రెంచుకొనుట), బ్రహ్మచర్యము, కోపము లేకుండుట, ఇంద్రియములను జయించుట, ఒకే నివాసమందు చాలాకాలము నివసించకుండుట సన్న్యాసాశ్రమ ధర్మములు.

అనారంభస్తథాహారే భిక్షాన్నం చైకకాలికమ్ ।
ఆత్మజ్ఞానావబోధశ్చ తథా చాఽత్మావలోకనమ్ ॥30॥

కర్మలను ఆచరించకుండుట, ఒకేసారి భిక్షను ఆచరించి అన్నమును భుజించుట, ఆత్మజ్ఞానమును సిద్ధింపచేసుకొనుట, ఆత్మదర్శనము ఇవి సన్న్యాసాశ్రమ ధర్మములు.

చతుర్థే త్వాశ్రమే ధర్మో మయాఽయం తే నివేదితః ।
సామాన్యమన్యవర్ణానామాశ్రమాణాం చ మే శృణు ॥31॥

నాల్గవది అయిన సన్న్యాసాశ్రమధర్మములను నీకు నేను చెప్పితిని. మిగిలిన వర్ణముల, ఆశ్రమముల సామాన్యవిధులను చెప్పెదను వినుము.

సత్యం శౌచమహింసా చ అనసూయా తథా క్షమా ।
ఆనృశంస్యమకార్పణ్యం సంతోషశ్చాష్టమో గుణః ॥32॥

ఏతే సంక్షేపతః ప్రోక్తా ధర్మా వర్ణాశ్రమేషు చ ।
ఏతేషు నిత్యధర్మేషు నిత్యం తిష్ఠేత్సమన్తతః ॥33॥

సత్యము, శౌచము, అహింస, అసూయలేకుండుట, ఓర్పు, దయ, జాలి, ఎనిమిదవ గుణము సంతోషము ఇవి అన్ని వర్ణములవారికి, అన్ని ఆశ్రమములవారికి ధర్మములుగా సంక్షేపముగా చెప్పబడినవి. ఈ నిత్యధర్మములందు అన్నింటియందు మానవుడెల్లప్పుడు నిష్ఠ కలిగియుండవలెను.

స యాతి బ్రహ్మలోకం హి యావదింద్రాశ్చతుర్దశ ।
యశ్చోల్లంఘ్య స్వకం ధర్మం స్వవర్ణాశ్రమసంజ్ఞితమ్ ॥34॥

నరోఽన్యథా ప్రవర్తేత స దండ్యో భూభృతో భవేత్ ।
యే చ స్వధర్మసంత్యాగాత్ పాపం కుర్వన్తి మానవాః ॥35॥

ఉపేక్షతస్తాన్నృపతేరిష్టాపూర్తం ప్రయాత్యధః ।
తస్మాద్రాజ్ఞా ప్రయత్నేన సర్వే వర్ణాః స్వధర్మతః ॥36॥

ప్రవర్తన్తేఽన్యథా దండ్యాః స్థాప్యాశ్చైవ స్వకర్మసు ॥37॥

పైన చెప్పబడిన సత్యశౌచాదిగుణములను ఎనిమిదింటిని పాటించు మానవుడు పదునాలుగురు ఇంద్రులు ఉన్నంతవరకు అనగా చతుర్దశ భువనాత్మకమైన సృష్టి ఉన్నంతవరకు బ్రహ్మలోకమందు నివసించును. అచ్చట చతుర్దశభువనాధిపతి అయిన హిరణ్యగర్భుని మహావాక్యోపదేశమును పొంది అతడితో సహా మోక్షమును పొందును. ఎవరయితే తమతమ వర్ణధర్మములను, ఆశ్రమధర్మములను ఉల్లంఘించి వ్యతిరేకముగా ప్రవర్తించునో అతడిని రాజు శిక్షించవలెను. ఎవరయితే స్వధర్మములను పాటించక పాపములను చేసెదరో, వారిని శిక్షించక ఉపేక్షించే రాజు తన ఇష్టాపూర్తమును (బావులు త్రవ్వించుట మొదలగు పుణ్యకార్యముల ద్వారా సంపాదించుకొన్న పుణ్యమును) పోగొట్టుకొనును. అందువలన అన్ని వర్ణముల వారు తమ తమ ధర్మములందు ప్రవర్తించునట్లుగా రాజు ప్రయత్నించవలెను. అట్లు వారు ప్రవర్తించనిచో రాజు వారిని దండించి వారి వారి కర్మలయందు ప్రవర్తించునట్లుగా ఉంచవలెను.

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే మదాలసానుశాసనం నామ పంచవింశోఽధ్యాయః ॥25॥

శ్రీ మార్కండేయ మహాపురాణమందు మదాలసానుశాసనము ఇరువదియైదవ అధ్యాయం సమాప్తం.



షడ్వింశోఽధ్యాయః - ఇరువదియారవ అధ్యాయం
గృహస్థాశ్రమధర్మనిరూపణమ్ - గృహస్థాశ్రమధర్మనిరూపణం

అలర్క ఉవాచ - అలర్కుడు చెప్పాడు.

యత్కార్యం పురుషేణేహ గార్హస్థ్యమనువర్తతా ।
బంధశ్చ స్యాదకరణే క్రియాయాం యస్య చోన్నతిః ॥1॥

ఉపకారాయ యన్నౄణాం యచ్చ వర్జ్యం గృహే సతామ్ ।
యథా చ క్రియతే తన్మే యథా యత్ పృచ్ఛతో వద ॥2॥

ఓ తల్లీ ! గార్హస్థ్య ఆశ్రమమును అనుసరిస్తున్న పురుషుడు ఏమి చేయవలెనో, ఏమి చేయకపోయినచో సంసార బంధములు కలుగునో, దేనిని ఆచరించినచో వృద్ధి కలుగునో, మానవులకు ఏది ఉపకారమును కలిగించునో, ఇండ్లలో దేనిని విడిచిపెట్టవలెనో, ఏదైన కార్యమును ఏరీతిగా చేయవలెనో ఈ విషయములన్నియు ప్రశ్నించుచున్న నాకు విపులముగా చెప్పుము.

మదాలసా ఉవాచ - మదాలస పలికింది.

వత్స ! గార్హస్థ్యమాస్థాయ నరస్సర్వమిదం జగత్ ।
పుష్ణాతి తేన లోకాంశ్చ స జయత్యభివాంఛితమ్ ॥3॥

ఓ కుమారా ! నరుడు గృహస్థాశ్రమమును పొంది ఈ సమస్త ప్రపంచమును పోషించును. అందువలన సమస్త లోకములను జయించును అనగా తనకభీష్టమైన స్వర్గాదిలోకములను పొందును. తాను కోరుకొన్నది పొందును.

పితరో మునయో దేవా భూతాని మనుజాస్తథా ।
కృమికీటపతంగాశ్చ వయాంసి పశవోఽసురాః ॥4॥

గృహస్థముపజీవన్తి తతస్తృప్తిం ప్రయాన్తి చ ।
ముఖం చాస్య నిరీక్షన్తే అపి నో దాస్యతీతి వై ॥5॥

పితృదేవతలు, మునులు, దేవతలు, పంచమహాభూతములు, మానవులు, కృమికీటక శలభాదులు, పక్షులు, పశువులు, అసురులు వీరందరు గృహస్థుని ఆశ్రయించి జీవనము సాగించుచున్నారు, అందువలన తృప్తిని పొందుచున్నారు. వీరందరు "గృహస్థుడు మనకు అన్నము పెట్టును కదా !"యని గృహస్థుని ముఖమువైపు నిరీక్షించుచుందురు.

సర్వస్యాధారభూతేయం వత్స ! ధేనుస్త్రయీమయీ ।
యస్యాం ప్రతిష్ఠితం విశ్వం విశ్వహేతుశ్చ యా మతా ॥6॥

ఓ కుమారా ! గోవు సమస్తప్రపంచమునకు ఆధారభూతము. ఋగ్యజుస్సామాత్మకమైన మూడు వేదములు కలిగియున్నది. ధేనువునందు సమస్త విశ్వము ప్రతిష్ఠితమైయున్నది. సమస్త ప్రపంచమునకు గోవే కారణము.

ఋక్పృష్ఠాఽసౌ యజుర్మధ్యా సామవక్త్రశిరోధరా ।
ఇష్టాపూర్తవిషాణా చ సాధుసూక్తతనూరుహా ॥7॥

ఈ గోవుకు ఋగ్వేదము పృష్ఠభాగము, యజుర్వేదము మధ్యభాగము, సామవేదము ముఖము మరియు మెడభాగము. ఇష్టాపూర్తము అనగా పుణ్యకర్మలు ఆ గోవు కొమ్ములు. సాధువాక్యములు ఆమె వెంట్రుకలు.

శాంతిపుష్టిశకృన్మూత్రా వర్ణపాదప్రతిష్ఠితా ।
ఆజీవ్యమానా జగతాం సాఽక్షయా నాఽపచీయతే ॥8॥

శాంతిపుష్టికర్మలు ఆ గోవు మలమూత్రములు. బ్రాహ్మణక్షత్రియాది నాలుగు వర్ణములనే నాలుగు పాదములపై ఈ గోవు ప్రతిష్ఠితమైయున్నది అనగా ఆధారపడియున్నది. సమస్తలోకములకు జీవనాధారము, క్షయములేనిది, నాశము లేనిది.

స్వాహాకారో స్వధాకారో వషట్కారశ్చ పుత్రక ।
హన్తకారస్తథైవాన్యస్తస్యాః స్తనచతుష్టయమ్ ॥9॥

ఓ కుమారా ! స్వాహాకారము, స్వధాకారము, వషట్కారము, హన్తకారము ఈ నాలుగు గోవుయొక్క నాలుగు స్తనములు.

స్వాహాకారం స్తనం దేవాః పితరశ్చ స్వధామయమ్ ।
మునయశ్చ వషట్కారం దేవభూతసురేతరాః ॥10॥

హన్తకారం మనుష్యాశ్చ పిబంతి సతతం స్తనమ్ ।
ఏవమాప్యాయయత్యేషా దేవాదీనఖిలాంస్త్రయీ ॥11॥

స్వాహాకారమను స్తనము నుండి దేవతలు, స్వధాకారమను స్తనమునుండి పితృదేవతలు, వషట్కారమను స్తనమునుండి మునులు, హన్తకారమను స్తనము నుండి దేవతలు, భూతములు, అసురులు, మానవులు పాలను త్రాగుచున్నారు. ఈ విధముగా వేదత్రయీరూపమైన ధేనువు దేవతలు మొదలగు వారందరికీ తృప్తిని కలుగజేయుచున్నది.

ఏతద్వత్స చతుష్కం తు నరస్తనచతుష్టయే ।
న నియుంజ్యాద్యథాకాలం తేన స్యుస్తే విమానితాః ॥12॥

ఓ కుమారా ! ఈ విధముగా నాలుగు స్తనములనుండి స్రవించు పాలను దేవాది నాలుగువిధములవారికి ఉచితరీతిగా వినియోగించకపోతే ఆ దేవాదిగణములు అవమానింపబడినవారగుదురు.

దేవాదీనఖిలాన్యేషు సన్తర్పయతి మానవః ।
తేషాముచ్ఛేదకర్తా యః పురుషోఽత్యన్తపాపకృత్ ॥13॥

మానవుడు దేవాది చతుర్విధగణములను వేటియందు (ఏ నాలుగు స్తనములందైతే) సంతృప్తి పరచునో, అట్టివానిని నశింపచేసిన పురుషుడు మహాపాపియగును. (గోవును చంపినవాడు మహాపాపియని భావము).

స తమస్యన్ధతామిస్రే తామిస్రే చ నిమజ్జతి ।
యస్త్వేతాం మానవో ధేనుం స్వైర్వత్సైరమరాదిభిః ॥14॥

ప్రాపయత్యుచితే కాలే స స్వర్గాయోపపద్యతే ।

అట్టి పాపి అజ్ఞానమందు, అంధతామిస్రము, తామిస్రము అను నరకములందు మునిగిపోవును. ఏ మానవుడయితే ఈ ధేనువును ఆమె సంతానముతో ఉచితకాలమందు పొందింపచేయునో (పాలు త్రాగే దూడలను గిత్తలను సకాలమందు గోవువద్దకు తీసుకువెళ్ళి పాలు త్రాగించినచో అనియర్థము), అట్టి మానవుడు స్వర్గమును పొందగలడు.

తస్మాత్పుత్ర మనుష్యేణ దేవర్షిపితృమానవాః ॥15॥

భూతాని చానుదినం పోష్యాణి స్వతనుర్యథా ।

అందువలన ఓ కుమారా ! మానవుడు ఎంతో శ్రద్ధగా తన శరీరమును పోషించుకొను విధముగా, దేవతలను, ఋషులను, పితృదేవతలను, మానవులను, భూతములను (సమస్త ప్రాణులను) ఎల్లప్పుడూ పోషించుచుండవలెను.

తస్మాత్ స్నాతః శుచిర్భూత్వా దేవర్షిపితృతర్పణమ్ ॥16॥

ప్రజాపతేస్తథైవాద్భిః కాలే కుర్యాత్సమాహితః ।
సుమనోగంధధూపైశ్చ దేవానభ్యర్చ్య మానవః ॥17॥

తతోఽగ్నేస్తర్పణం కుర్యాద్దద్యాచ్చ బలిమిత్యథ ।
బ్రహ్మణే గృహమధ్యే తు విశ్వేదేవేభ్య ఏవ చ ॥18॥

ధన్వంతరిం సముద్దిశ్య ప్రాగుదీచ్యాం బలిం క్షిపేత్ ।
ప్రాచ్యాం శక్రాయ యామ్యాయాం యమాయ బలిమాహరేత్ ॥19॥

ప్రతీచ్యాం వరుణాయాథ సోమాయోత్తరతో బలిమ్ ।
దద్యాద్ధాత్రే విధాత్రే చ బలిం ద్వారే గృహస్య చ ॥20॥

అందువలన స్నానముచేసి, శుచియై, సమాహితచిత్తుడై దేవతలు, ఋషులు, పితృదేవతలు, ప్రజాపతికి నీళ్ళతో తర్పణము చేయవలెను. మానవుడు సుగంధభరితమైన పుష్పములతో దేవతలను పూజించి తర్వాత అగ్నికి

తర్పణము అనగా అగ్నికార్యములు చేయవలెను. అటుపిమ్మట బలిప్రదానము చేయవలెను. తన ఇంటి మధ్యభాగమందలి ఈశాన్యభాగమందు బ్రహ్మకు, విశ్వేదేవతలకు, ధన్వంతరికి వారినుద్దేశించి బలిప్రదానము చేయవలెను. తూర్పుదిక్కునందు ఇంద్రునికి, దక్షిణదిక్కునందు యమునికి బలిప్రదానము చేయవలెను. పశ్చిమదిక్కునందు వరుణదేవునికి, ఉత్తరదిక్కునందు చంద్రునికి బలిప్రదానము చేయవలెను. గృహద్వారమందు ధాతకు, విధాతకు బలిప్రదానము చేయవలెను.

అర్యమ్ణేఽథ బహిర్ద్వాద్గృహేభ్యశ్చ సమన్తతః ।
నక్తంచరేభ్యో భూతేభ్యో బలిమాకాశతో హరేత్ ॥21॥

ఇంటిబయట అన్నివైపుల అర్యమునికి బలిదానము చేయవలెను. రాత్రిసంచరించే భూతములకు ఆకాశమందు బలిదానము చేయవలెను.

పితౄణాం నిర్వపేచ్చైవ దక్షిణాభిముఖః స్థితః ।
గృహస్థస్తత్పరో భూత్వా సుసమాహితమానసః ॥22॥

తతస్తోయముపాదాయ తేషామాచమనాయ వై ।
స్థానేషు నిక్షిపేత్ ప్రాజ్ఞస్తాస్తా ఉద్దిశ్య దేవతాః ॥23॥

పితృదేవతలనుద్దేశించి చేయు కార్యములు దక్షిణాభిముఖముగా కూర్చొని చేయవలెను. ప్రాజ్ఞుడైన గృహస్థుడు ఆ కార్యమందు మాత్రమే మనస్సును లగ్నము చేసి ఏకాగ్రచిత్తుడై ఆయా దేవతలు ఆచమనము చేయుటకై ఆయా దేవతలనుద్దేశించి ఆయా నిర్దిష్టస్థానములందు జలమును ధారపోయవలెను.

ఏవం గృహబలిం కృత్వా గృహే గృహపతిశ్శుచిః ।
ఆప్యాయనాయ భూతానాం కుర్యాదుత్సర్గమాదరాత్ ॥24॥

ఈ విధముగా గృహయజమాని శుచియై గృహమందు బలిదానము చేసి ప్రాణుల తృప్తికొరకై ఆదరముతో ఉత్సర్గమును (ఇష్టమైన ఆయా వస్తువులను విడిచిపెట్టుటను) చేయవలెను.

శ్వభ్యశ్చ శ్వపచేభ్యశ్చ వయోభ్యశ్చాఽవపేద్భువి ।
వైశ్వదేవం హి నామైతత్సాయం ప్రాతరుదాహృతమ్ ॥25॥

కుక్కలకు, చండాలజాతివారికి, పక్షులకు ఆయాపదార్థములను నేలపై విడువవలెను. ప్రాతఃకాలము, సాయంకాలము రెండుపూటలా చేయు ఈ బలిప్రదానమునే వైశ్వదేవమందురు.

ఆచమ్య చ తతః కుర్యాత్ప్రాజ్ఞో ద్వారాఽవలోకనమ్ ।
ముహూర్తస్యాష్టమం భాగముదీక్ష్యో హ్యతిథిర్భవేత్ ॥26॥

అటుపిమ్మట ప్రాజ్ఞుడగు గృహస్థుడు ఆచమనము చేసి తన గుమ్మము వద్ద ముహూర్తకాలముయొక్క ఎనిమిదవ భాగము పర్యంతము అతిథులెవరైనా వచ్చుచున్నారాయని నిరీక్షించవలెను.

అతిథిం తత్ర సంప్రాప్తమన్నాద్యేనోదకేన చ ।
సంపూజయేద్యథాశక్తి గంధపుష్పాదిభిస్తథా ॥27॥

ఒకవేళ ఆ సమయమందు అతిథి వచ్చినట్లయిన అతడికి అన్నము, ఇతర భక్ష్యపదార్థములు, జలము, గంధపుష్పాదులు వీటినన్నింటిని తన శక్తికొలదీ ఇచ్చి, ఆ అతిథిని బాగుగా పూజించవలెను.

న మిత్రమతిథిం కుర్యాన్నైకగ్రామనివాసినమ్ ।
అజ్ఞాతకులనామానం తత్కాలసముపస్థితమ్ ॥28॥

బుభుక్షుమాగతం శ్రాన్తం యాచమానమకించనమ్ ।
బ్రాహ్మణం ప్రాహురతిథిం కుర్యాన్నైకగ్రామనివాసినమ్ ॥29॥

తన స్నేహితునిగాని లేదా తనతోపాటు గ్రామంలో నివసించేవానినిగాని అతిథిగా పరిగణించరాదు. ఎవని కులనామములు తెలియవో, ఎవరు భోజనకాలమందు ఉపస్థితులవుతారో, ఎవరు భోజనము చేయవలెనని కోరుకొనునో, ఎవరు అలసి వచ్చునో, ఎవరు నిర్ధనుడై యాచకుడై వచ్చునో అట్టి బ్రాహ్మణుని సహగ్రామనివాసి కానివానిని అతిథిగా చెప్పుచున్నారు.

న పృచ్ఛేద్గోత్రచరణం స్వాధ్యాయం చాఽపి పండితః ।
శోభనాఽశోభనాకారం తం మన్యేత ప్రజాపతిమ్ ॥30॥

పండితుడైన గృహస్థుడు తన ఇంటికి అతిథిగా వచ్చినవానిని గోత్రమునుగాని, వేదశాఖనుగాని, వేదాధ్యయమును గూర్చిగాని అడుగరాదు. సురూపి అయినా కురూపి అయినా తన ఇంటికి వచ్చిన అతిథిని ప్రజాపతిగా భావించవలెను.

అనిత్యం హి స్థితో యస్మాత్తస్మాదతిథిరుచ్యతే ।
తస్మింస్తృప్తే నృయజ్ఞోత్థాదృణాన్ముచ్యేద్గృహాశ్రమీ ॥31॥

తిథివారనక్షత్రములసంబంధములేక వచ్చి, కొంతకాలముండి వెళ్ళిపోవుగాడుగావున అతిథియని చెప్పబడుచున్నాడు. ఇంటికి వచ్చిన అతిథి తృప్తి చెందినట్లయిన ఆ గృహయజమాని నృయజ్ఞంనిమిత్తకమైన (నృయజ్ఞమనగా అతిథిపూజనము) ఋణం నుండి విముక్తుడగును.

తస్యాదత్త్వా తు యో భుంక్తే స్వయం కిల్బిషభుఙ్నరః ।
స పాపం కేవలం భుంక్తే పురీషం చాఽన్యజన్మని ॥32॥

ఎవరయితే ఇంటికి వచ్చిన అతిథికి అన్నము పెట్టక తాను స్వయముగా భుజించునో అట్టి మానవుడు కేవలము పాపమును భుజించిన వాడగును. మరుసటి జన్మమందు మలమూత్రాదులను భుజించును.

అతిథిర్యస్య భగ్నాశో గృహాత్ప్రతినివర్తతే ।
స దత్త్వా దుష్కృతం తస్మై పుణ్యమాదాయ గచ్ఛతి ॥33॥

ఏ యజమాని ఇంటినుండి అతిథి నిరాశతో వెనుతిరుగునో అట్టి యజమానికి ఆ అతిథి తన పాపమును ఇచ్చివేసి ఆ యజమానియొక్క పుణ్యమును గ్రహించి వెడలిపోవును.

అప్యంబుశాకదానేన యచ్చాప్యశ్నాతి స స్వయమ్ ।
పూజయేత నరశ్శక్త్యా తేనైవాతిథిమాదరాత్ ॥34॥

జలమునుగాని, శాకమునుగాని, మరి ఏ ఇతర పదార్థమునుగాని యజమాని తాను స్వయముగా భుజించునో అట్టిదానిని గృహస్థుడు తన శక్తికొలదీ ఆదరముతో అతిథికి ఇచ్చి పూజించవలెను.

కుర్యాచ్చాహరహః శ్రాద్ధమన్నాద్యేనోదకేన చ ।
పితౄనుద్దిశ్య విప్రాంశ్చ భోజయేద్విప్రమేవ వా ॥35॥

నిత్యము జలము మరియు అన్నాదులచే గృహస్థుడు తన ఇంట శ్రాద్ధకర్మను ఆచరించవలెను. గతించిన తన తండ్రులనుద్దేశించి చాలామంది బ్రాహ్మణులకు గాని లేదా ఒక్క బ్రాహ్మణునికి గాని భోజనమును పెట్టవలెను.

అన్నస్యాగ్రం తదుధృత్య బ్రాహ్మణాయోపపాదయేత్ ।
భిక్షాం చ యాచితాం దద్యాత్ పరివ్రాడ్బ్రహ్మచారిణామ్ ॥36॥

గృహస్థుడు తన ఇంటికి వచ్చిన బ్రాహ్మణునికి అన్నముయొక్క పైభాగమును తీసి పెట్టవలెను. సన్న్యాసులు లేదా బ్రహ్మచారులు యాచించినయెడల భిక్షను వేయవలెను.

గ్రాసప్రమాణా భిక్షా స్యాదగ్రం గ్రాసచతుష్టయమ్ ।
అగ్రం చతుర్గుణం ప్రాహుర్హంతకారం ద్విజోత్తమాః ॥37॥

ఒక గ్రాసమును (ముద్ద) భిక్షయని, నాలుగు గ్రాసములను అగ్రమని, నాలుగు అగ్రములను హంతకారమని బ్రాహ్మణశ్రేష్ఠులు చెప్పుచున్నారు.

భోజనం హన్తకారం వా అగ్రం భిక్షామథాపి వా ।
అదత్త్వా తు న భోక్తవ్యం యథావిభవమాత్మనః ॥38॥

తన శక్తికొలదీ హంతకారపరిమాణముగాని, అగ్రముగాని, భిక్షను గాని ఇవ్వక గృహస్థుడు భోజనము చేయరాదు.

పూజయిత్వాఽతిథీన్ ఇష్టాన్ జ్ఞాతీన్బంధూంస్తథార్థినః ।
వికలాన్బాలవృద్ధాంశ్చ భోజయేచ్చాతురాంస్తథా ॥39॥

తన ఇంటికి వచ్చిన అతిథులను పూజించి వారికి భోజనము పెట్టిన పిమ్మట తనకిష్టమైన జ్ఞాతులకు, బంధువులకు, యాచకులకు, అంగవైకల్యముగలవారికి, బాలురుకు, వృద్ధులకు, అస్వస్థులకు భోజనము పెట్టవలెను.

వాఞ్ఛతే క్షుత్పరీతాత్మా యచ్చాన్యోఽన్నమకిఞ్చనః ।
కుటుంబినా భోజనీయః స్వసమం విభవే సతి ॥40॥

ఆకలిగొన్నవారు ఎవరైనా యాచించినచో, ధనహీనులు ఎవరయినా అన్నమునడిగినచో, సంపద ఉన్నయెడల తనతో సమానముగా గృహస్థుడు భోజనమును పెట్టవలెను.

శ్రీమంతం జ్ఞాతిమాసాద్య యో జ్ఞాతిరవసీదతి ।
సీదతా యత్కృతం తేన తత్పాపం స సమశ్నుతే ॥41॥

శ్రీమంతుడైన జ్ఞాతి వద్దకు వెళ్ళి ఏ జ్ఞాతి అయితే నిరాశతో వెనుతిరుగునో, అట్టి నిరాశచెందినవాని పాపమును ఆ శ్రీమంతుడైన జ్ఞాతి పొందుచున్నాడు.

సాయం చైష విధిః కార్యః పూర్వోక్తం తత్ర చాతిథిమ్ ।
పూజయేచ్చ యథాశక్తి శయనాసనభోజనైః ॥42॥

సాయంకాలమందు కూడా ఈ అతిథిసత్కారవిధులను నెరవేర్చవలెను. ఆ సమయమందు వచ్చిన అతిథిని తన శక్తికొలదీ శయనము, ఆసనము, భోజనములను ఇచ్చుట ద్వారా ఆ గృహయజమాని పూజించవలెను.

ఏవముద్వహతస్తాత గార్హస్థ్యం భారమాస్థితమ్ ।
స్కంధే విధాతా దేవాశ్చ పితరశ్చ మహర్షయః ॥43॥

శ్రేయోభివర్షిణస్సర్వే భవన్త్యతిథిబాంధవాః ।
పశుపక్షిమృగాస్తృప్తా యే చాన్యే సూక్ష్మకీటకాః ॥44॥

ఓ కుమారా ! ఈ విధముగా గార్హస్థ్యభారమును తన భుజస్కంధములపై వేసుకొని మోయు యజమానికి విధాత, దేవతలు, పితృదేవతలు, మహర్షులు, శ్రేయస్సునుకోరువారు, పశుపక్షిమృగాలు, మిగిలిన సూక్ష్మకీటకములు అన్నీ క్షేమమును కోరును.

గాథాశ్చాత్ర మహాభాగ స్వయమత్రిరగాయత ।
తాః శృణుష్వ మహాభాగ గృహస్థాశ్రమసంస్థితాః ॥45॥

ఓ మహాభాగా ! మహానుభావుడైన అత్రిమహర్షి తాను స్వయముగా గృహస్థాశ్రమసంబంధమైన గాథలను చెప్పెను. వాటిని చెప్పెదను, వినుము.

దేవాన్పితౄంశ్చాఽతిథీంశ్చ తద్వత్సంపూజ్య బాన్ధవాన్ ।
జామయశ్చ గురూంశ్చైవ గృహస్థే విభవే సతి ॥46॥

గృహస్థుడు సంపన్నుడైనచో దేవతలను, పితృదేవతలను, అతిథులను, బంధుజనులను, తన తోబుట్టువులను, గురువులను బాగుగా పూజించవలెను.

శ్వభ్యశ్చ శ్వపచేభ్యశ్చ వయోభ్యశ్చావపేద్భువి ।
వైశ్వదేవం హి నామైతత్కుర్యాత్సాయం తథా దినే ॥47॥

కుక్కలు, చండాలురు, పక్షులు వీటికి నేలపై వాటికి కావలసిన ఆహారమును వేయవలెను. వైశ్వదేవమని పిలవబడే ఈ కార్యమును పగటిపూట మరల సాయంకాలము చేయవలెను.

మాంసమన్నం తథా శాకం గృహే యచ్చోపసాధితమ్ ।
న చ తత్స్వయమశ్నీయాద్విధివద్యన్న నిర్వపేత్ ॥48॥

మాంసము, అన్నము, శాకము, లేదా ఇంట్లో సిద్ధము గావింపబడిన ఏ పదార్థమునైననూ విధ్యుక్తప్రకారము వినియోగించకుండా తాను స్వయముగా భుజించరాదు.

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే మదాలసోపాఖ్యానే గృహస్థాశ్రమధర్మనిరూపణే షడ్వింశోऽధ్యాయః ॥26॥

శ్రీ మార్కండేయ మహాపురాణమందలి మదాలసోపాఖ్యానమందలి గృహస్థాశ్రమధర్మనిరూపణమందు ఇరవై ఆరవ అధ్యాయం సమాప్తం.



సప్తవింశోఽధ్యాయః - ఇరువదిఏడవ అధ్యాయం
నైమిత్తికాది శ్రాద్ధకల్పః - నైమిత్తికాదిశ్రాద్ధకల్పం

మదాలసా ఉవాచ - మదాలస పలికింది.

నిత్యం నైమిత్తికం చైవ నిత్యనైమిత్తికం తథా ।
గృహస్థస్య త్రిధా కర్మ తన్నిశామయ పుత్రక ॥1॥

ఓ కుమారా ! నిత్యము, నైమిత్తికము, నిత్యనైమిత్తికము అని గృహస్థునికి మూడు కర్మలు చెప్పబడినవి. ఈ మూడింటి గురించి చెప్పెదను, వినుము.

పంచయజ్ఞాశ్రితం నిత్యం యదేతత్కథితం తవ ।
నైమిత్తికం తథా చాన్యత్పుత్రజన్మక్రియాదికమ్ ॥2॥

పంచయజ్ఞములనుగూర్చి నీకు నేను చెప్పినది ఏది కలదో వాటికే నిత్యకర్మలని పేరు. పుత్రులు జన్మించుట మొదలగువానిని గూర్చి చేయు కర్మలకు నైమిత్తికములని పేరు.

నిత్యనైమిత్తికం జ్ఞేయం పర్వశ్రాద్ధాది పండితైః ।
తత్ర నైమిత్తికం వక్ష్యే శ్రాద్ధమాభ్యుదయం తవ ॥3॥

అమావాస్యాది పర్వములందు ఆచరించు శ్రాద్ధాది కర్మలను నిత్యనైమిత్తికములుగా పండితులచే తెలుసుకొనదగినవి. వాటిలో మొదట నీకు నైమిత్తికమగు అభ్యుదయశ్రాద్ధమును గూర్చి చెప్పెదను, వినుము.

పుత్రజన్మని యత్కార్యం జాతకర్మ సమం నరైః ।
వివాహాదౌ చ కర్తవ్యం సర్వం సమ్యక్ క్రమోదితమ్ ॥4॥

పుత్రుడు జన్మించినపుడు మానవులు జాతకర్మలను ఆచరించునట్లే వివాహాదులందు కూడా క్రమానుసారముగా ఆయా విధులను ఆచరించవలెను.

పితరశ్చాత్ర సంపూజ్యాః ఖ్యాతా నాందీముఖాస్తు యే ।
పిండాశ్చ దధి సమ్మిశ్రాన్ దద్యాద్యవసమన్వితాన్ ॥5॥

ఉదఙ్ముఖః ప్రాఙ్ముఖో వా యజమానస్సమాహితః ।
వైశ్వదేవ విహీనం తత్ కేచిదిచ్ఛన్తి మానవాః ॥6॥

వివాహాదికార్యములందు నాందీముఖమను పేరుగల కర్మలను పితృదేవతలను ఉద్దేశించి శాస్త్రోక్తప్రకారము చేయవలెను. ఆ సమయంలో యజమాని సమాహితచిత్తుడై తూర్పుదిక్కు ముఖముగాగాని, ఉత్తరదిక్కుముఖముగాగాని కూర్చొని పితరులనుద్దేశించి పెరుగుతో మిశ్రితమైన, యవలతో కూడుకొన్న పిండములను దానము చేయవలెను. ఈ సమయమందు కొందరు వైశ్వదేవబలిదానము అవసరము లేదని చెప్పుచున్నారు.

యుగ్మాశ్చాత్ర ద్విజాః కార్యాస్తే పూజ్యాశ్చ ప్రదక్షిణమ్ ।
ఏతం నైమిత్తికం వృద్ధౌ తథాఽన్యచ్చౌర్ధ్వదైహికమ్ ॥7॥

ఈ కార్యమందు ఇద్దరు బ్రాహ్మణులకు ప్రదక్షిణము చేసి పూజించవలెను. నైమిత్తికకర్మ వృద్ధికొరకు ఆచరింపబడుచున్నది. మరొక కర్మ ఔర్ధ్వదైహికము అనగా చనిపోయిన పిమ్మట ఆచరింపబడునది.

మృతాహని తు కర్తవ్యమేకోద్దిష్టం శృణుష్వ తత్ ।
దైవహీనం తథైకార్ఘ్యం తథైవైకపవిత్రకమ్ ॥8॥

పైన చెప్పబడిన కర్మయందు చనిపోయినరోజున ఏకోద్దిష్టమను కర్మను చేయవలెను. ఆ విధానమును వినుము. ఈ కర్మను దైవహీనముగా చేయవలెను. ఒక్కటే అర్ఘ్యమునివ్వవలెను. ఏకపవిత్రమునే ధరించవలెను.

ఆవాహనం న కర్తవ్యమగ్నౌ కరణవర్జితమ్ ।
ప్రేతస్య పిణ్డమేకం చ దద్యాదుచ్ఛిష్టసన్నిధౌ ॥9॥

ఆవాహనముగాని, అగ్నియందు కార్యములుగాని ఉండవు. ఉచ్ఛిష్టసన్నిధిలో ఒక్క పిండమును మాత్రమే పెట్టవలెను.

తిలోదకం చాఽపసవ్యం తన్నామస్మరణాన్వితమ్ ।
అక్షయ్యమముకస్యేతి స్థానే విప్రవిసర్జనే ॥10॥

మరియు చనిపోయినవాని నామమును సంకల్పించి అతనికి అక్షయలోకములు కలుగవలెనని విప్రవిసర్జనస్థానమందు అపసవ్యముగా తిలోదకతర్పణము చేయవలెను.

అభిరమ్యతామితి బ్రూయాద్బ్రూయుస్తేఽభిరతాః స్మ హ ।
ప్రతిమాసం భవేదేతత్ కార్యమావత్సరాన్నరైః ॥11॥

కర్త బ్రాహ్మణులతో "అభిరమ్యతామ్" అని చెప్పవలెను. బ్రాహ్మణులు "అభిరతా స్మః" అని ప్రతివచనము చెప్పవలెను. ఇట్లు మానవులు సంవత్సరం పూర్తి అగునంతవరకు ప్రతినెలా చేయవలెను.

అథ సంవత్సరే పూర్ణే యదా వా క్రియతే నరైః ।
సపిండీకరణం కార్యం తస్యాపి విధిరుచ్యతే ॥12॥

సంవత్సరం పూర్తి అయిన పిమ్మట సపిండీకరణము చేయవలెను. దాని విధానమును చెప్పుచున్నాను, వినుము.

తచ్చాపి దైవరహితమేకార్ఘ్యైకపవిత్రకమ్ ।
నైవాగ్నౌ కరణం తత్ర తచ్చావాహనవర్జితమ్ ॥13॥

ఈ సపిండీకరణము కూడా దైవవిహీనము, ఒక అర్ఘ్యము, ఒక పవిత్రకము గలది.అగ్నియందు కార్యములు లేనిది, ఆవాహనము లేనిది.

అపసవ్యం చ తత్రాపి భోజయేదయుజో ద్విజాన్ ।
విశేషస్తత్ర చాన్యోఽస్తి ప్రతిమాసం క్రియాధికః ॥14॥

తం కథ్యమానమేకాగ్రో వదన్త్యా మే నిశామయ ।
తిలగంధోదకైర్యుక్తం కుర్యాత్పాత్రచతుష్టయమ్ ॥15॥

కుర్యాత్పితౄణాం త్రితయమేకం ప్రేతస్య పుత్రక ।
పాత్రత్రయే ప్రేతపాత్రమర్ఘ్యం చైవ ప్రసేచయేత్ ॥16॥

యే సమానా ఇతి జపన్ పూర్వవచ్ఛేషమాచరేత్ ।

బేసిసంఖ్యగల బ్రాహ్మణులను అపసవ్యముగా భుజింపచేయవలెను. ప్రతినెలా చేసే క్రియకంటే అధికమైన విశేషమొకటి ఉన్నది, దానిని నేను చెప్పుచున్నాను, సావధానచిత్తుడవై వినుము. ఓ కుమారా ! తిల, గంధ, ఉదకములతో కూడుకొన్న నాలుగు పాత్రలను స్థాపించవలెను. వాటిలో మూడు పితృదేవతలకు ఒకటి చనిపోయినవానికి ఉద్దేశించబడినవి. ఆ మూడు పాత్రలందు ప్రేతపాత్ర అర్ఘ్యమును కలుపవలెను. "యే సమానా" అను మంత్రమును జపించుచూ పూర్వము చెప్పిన విధముగా మిగిలిన కర్మను చేయవలెను.

స్త్రీణామప్యేవమేవైతదేకోద్దిష్టముదాహృతమ్ ॥17॥

సపిండీకరణం తాసాం పుత్రాభావే న విద్యతే ।
ప్రతిసంవత్సరం కార్యమేకోద్దిష్టం నరైః స్త్రియాః ॥18॥

మృతాహని యథాన్యాయం నృణాం యద్వదిహోదితమ్ ।

స్త్రీల విషయంలో కూడా ఈ ప్రకారముగానే ఏకోద్దిష్టవిధానము చేయవలెను. వారికి పుత్రులు లేనిచో సపిండీకరణ విధానము లేదు. ప్రతిసంవత్సరం చనిపోయినరోజు శాస్త్రోక్తప్రకారం పురుషులకు చేయుచున్నట్లుగానే స్త్రీలకు కూడా శ్రాద్ధకార్యమును నిర్వర్తించవలెను.

పుత్రాభావే సపిండాస్తు తదభావే సహోదకాః ॥19॥

మాతుః సపిండా యే చ స్యుర్యేఽన్యే మాతుస్సహోదకాః ।
కుర్యురేవం విధిం సమ్యగపుత్రస్య సుతాసుతాః ॥20॥

పుత్రులు లేనిచో తన తల్లియొక్క సపిండులు, సపిండులు లేనిచో సహోదకులు, పురుషునికివలే స్త్రీకి కూడా శ్రాద్ధకర్మను చేయవలెను. ఈ విధముగా పుత్రసంతానములేనిచో తన కుమార్తెయొక్క కొడుకులు ఈ కార్యమును బాగుగా నిర్వర్తించవలెను.

కుర్యుర్మాతామహాయైవం పుత్రికాతనయాస్తథా ।
ద్వ్యాముష్యాయణసంజ్ఞాస్తు మాతామహపితామహాన్ ॥21॥

పూజయేయుర్యథాన్యాయం శ్రాద్ధైర్నైమిత్తికైరపి ।
సర్వాభావే స్త్రియః కుర్యుః స్వభర్తౄణామమంత్రకమ్ ॥22॥

మాతామహునికి పుత్రులు లేనిపక్షమున కుమార్తె కొడుకులు (దౌహిత్రులు) శ్రాద్ధకర్మను నిర్వర్తించవలెను. కర్మకాండను చేయు ఇట్టి దౌహిత్రులకు ద్వ్యాముష్యాయణులని పేరు. ఎవ్వరూలేనిచో తమ భర్తలకు స్త్రీలే మంత్రరహితముగా కర్మలను చేయవలెను.

తదభావే స నృపతిః కారయేత్ స్వకుటుంబినా ।
తజ్జాతీయైర్నరైః సమ్యగ్దాహాద్యాః సకలాః క్రియాః ॥23॥

సర్వేషామేవ వర్ణానాం బాంధవో నృపతిర్యతః ।
ఏతాస్తే కథితా వత్స నిత్యా నైమిత్తికాః క్రియాః ॥24॥

చనిపోయినవారికి భార్యకూడా లేనిచో రాజు తన కుటుంబస్థులచే కర్మను చేయించవలెను. ఆ చనిపోయినవారి సజాతీయపురుషులద్వారా దహనాదికర్మలను చేయించవలెను. సమస్తవర్ణములవారికీ రాజే బంధువుగాన రాజే ఇట్టి కార్యమును నిర్వర్తింపచేయవలెను. ఓ కుమారా! నిత్యములు, నైమిత్తికములు అయిన క్రియలను గూర్చి నీకు నేను చెప్పితిని.

క్రియాం శ్రాద్ధాశ్రయామన్యాం నిత్యనైమిత్తికీం శృణు ।
దర్శస్తత్ర నిమిత్తం వై కాలశ్చంద్రక్షయాత్మకః ॥

నిత్యతాం నియతః కాలస్తస్య సంసూచయత్యథ ॥25॥

శ్రాద్ధకర్మను ఆశ్రయించిన మరొక నిత్యనైమిత్తికక్రియను గూర్చి వినుము. అట్టి శ్రాద్ధక్రియయందు చంద్రక్షయమను అమావాస్య నిమిత్తము. అట్టి నియతమైన కాలము ఆ కర్మకు నిత్యత్వమును సూచించును.

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే మదాలసోపాఖ్యానే అలర్కానుశాసనే గార్హస్థ్యకథనే నైమిత్తికాదిశ్రాద్ధకల్పో నామ సప్తవింశోఽధ్యాయః ॥27॥

శ్రీ మార్కండేయ మహాపురాణమందు మదాలసోపాఖ్యానమందలి అలర్కానుశాసనమందు గార్హస్థ్య ఆశ్రమధర్మకథనమందలి నైమిత్తికాదిశ్రాద్ధకల్పమనెడు ఇరవైఏడవ అధ్యాయం సమాప్తం.



అష్టవింశోऽధ్యాయః - ఇరువైఎనిమిదవ అధ్యాయం
శ్రాద్ధకల్పః - శ్రాద్ధకల్పం

మదాలసా ఉవాచ - మదాలస పలికింది.

సపిండీకరణాదూర్ధ్వం పితుర్యః ప్రపితామహః ।
సుత లేపభుజో యాతి ప్రలుప్తపితృపిండకః ॥1॥

ఓ కుమారా! సపిండీకరణము పూర్తి అయిన పిమ్మట చనిపోయిన తన తండ్రియొక్క ప్రపితామహుడు (ముత్తాత నాల్గవతరంవారు) ఎవరు గలరో అతనికి సపిండీకరణమందు అధికారము లేదు. అతడు పితృపిండము లోపించినవాడై లేపభుక్ లేదా లేపభాక్ అగును. అనగా పిండశేషము కలిగినవాడగును.

తేషామన్యశ్చతుర్థో యః పుత్ర లేపభుజాన్నభుక్ ।
సోऽపి సంబంధతో హీనముపభోగం ప్రపద్యతే ॥2॥

ఓ కుమారా! ముందు చెప్పినట్లుగా వారిలో నాల్గవవారు పిండభుక్ కాకుండ, లేపమును భుజించుట ద్వారా అన్నభుక్ ఎవరుగలరో వారు ఇక పిండములతో సంబంధము లేకుండా భోగమునకు సమీపముగా ఉందురు.

పితా పితామహశ్చైవ తథైవ ప్రపితామహః ।
పిండసంబంధినో హ్యేతే విజ్ఞేయాః పురుషాస్త్రయః ॥3॥

తండ్రి, తాత, ముత్తాత ఈ ముగ్గురు పురుషులు మాత్రమే పిండ సంబంధము కలిగి సపిండులైయున్నారని తెలియదగినది.

లేపసంబంధినశ్చాన్యే పితామహపితామహాత్ ।
ప్రభృత్యుక్తాస్త్రయస్తేషాం యజమానశ్చ సప్తమః ॥4॥

పైన చెప్పినవారిలో ముత్తాతయొక్క తండ్రి, తాత, ముత్తాతలు లేపసంబంధము మాత్రము కల్గియున్నారు (పిండ సంబంధము లేదు). వీరికందరికీ యజమాని ఏడవవాడైయున్నాడు. (ప్రస్తుతం కర్మకాండచేస్తూ బ్రతికియున్న పుత్రుడు, గృహస్థుడు).

ఇత్యేష మునిభిః ప్రోక్తః సంబంధస్సాప్తపౌరుషః ।
యజమానాత్ప్రభృత్యూర్ధ్వమనులేపభుజస్తథా ॥5॥

ఈ విధముగా యజమాని లగాయతు ముగ్గురు అనులేపభుజుల వరకు మొత్తం ఏడుగురికి సాప్తపౌరుష సంబంధము స్థిరముగా ఉండునని మునీశ్వరులు చెప్పుచున్నారు.

తతోऽన్యే పూర్వజాః స్వర్గే యే చాऽన్యే నరకౌకసః ।
యే చ తిర్యక్త్వమాపన్నా యే చ భూతాదిసంస్థితాః ॥6॥

తాన్సర్వాన్యజమానో వై శ్రాద్ధం కుర్వన్యథావిధి ।
సమాప్యాయయతే వత్స యేన యేన శృణుష్వ తత్ ॥7॥

పైన చెప్పిన వారికంటే భిన్నులైన పూర్వపురుషులు అనగా స్వర్గవాసులైన పూర్వపురుషులు, నరకవాసులైన పూర్వపురుషులు, పశుపక్ష్యాది జన్మనెత్తినవారు, భూతాదులయందున్నవారు వారందరికీ గృహస్థు అయినవాడు ఏఏ ప్రకారముగా విధ్యుక్తరీతితో శ్రాద్ధమునాచరించి తృప్తిని కలిగించునో చెప్పెదను, వినుము.

అన్నప్రకిరణం యత్తు మనుష్యైః క్రియతే భువి ।
తేన తృప్తిముపాయాన్తి యే పిశాచత్వమాగతాః ॥8॥

పూర్వపురుషులలో పిశాచులుగా జన్మనెత్తినవారికి భూమిమీద అన్నమును వెదజల్లినచో వారు తృప్తిని పొందెదరు.

యదంబుస్నానవస్త్రోత్థం భూమౌ పతతి పుత్రక ।
తేన యే తరుతాం ప్రాప్తాస్తేషాం తృప్తిః ప్రజాయతే ॥9॥

ఓ కుమారా! స్నానము చేసిన వస్త్రమును పిండినందువలన భూమిపైపడిన జలములచే వృక్షజన్మనెత్తినవారికి తృప్తి కలుగును.

యాస్తు గాత్రాంబుకణికాః పతన్తి ధరణీతలే ।
తాభిరాప్యాయనం తేషాం యే దేవత్వం కులే గతాః ॥10॥

శరీరముపైనుండి భూమిపై జారిపడిన నీటిబిందువులచే కులమందు దేవతలుగా జన్మించినవారు తృప్తిని పొందెదరు.

ఉద్ధృతేష్వథ పిండేషు యాశ్చాన్నకణికా భువి ।
తాభిరాప్యాయనం తేషాం యే తిర్యక్త్వం కులే గతాః ॥11॥

పిండోద్వాసనసమయమందు పిండములను పైకెత్తినప్పుడు నేలపై పడిన అన్నకణములచే కులమందు తిర్యగ్యోనియందు అనగా పశుపక్ష్యాది జన్మనెత్తినవారు తృప్తిని పొందెదరు.

యే వా దగ్ధాః కులే బాలాః క్రియాఽయోగ్యా హ్యసంస్కృతాః ।
విపన్నాస్తేఽన్నవికిరసమ్మార్జనజలాశినః ॥12॥

ఎవరయితే శాస్త్రోక్తవిధులను ఆచరించుటకు యోగ్యులుకాక, సంస్కరింపబడక మంటల్లో పడినందువలన దహింపబడి ప్రాణత్యాగము చేయుదురో అట్టి విపన్నులైన బాలురు భూమిపై వెదజల్లబడిన అన్నమును, పాత్రను కడుగుటచేత నేలపైబడిన నీటిని గ్రహించుటచేత తృప్తినందెదరు.

భుక్త్వా చాఽచామతాం యచ్చ జలం యచ్చాంఘ్రిశోధనే ।
బ్రాహ్మణానాం తథైవాన్యే తేన తృప్తిం ప్రయాన్తి వై ॥13॥

పిశాచత్వమనుప్రాప్తాః క్రిమికీటత్వమేవ యే ।
ఏవం యో యజమానస్య యశ్చ తేషాం ద్విజన్మనామ్ ॥14॥

కశ్చిజ్జలాన్నవిక్షేపః శుచిరుచ్ఛిష్ట ఏవ వా ।
తేన తేన కులే తత్ర తత్తద్యోన్యంతరం గతాః ॥15॥

ప్రయాంత్యాప్యాయనం వత్స సమ్యక్ శ్రాద్ధక్రియావతామ్ ।

శ్రాద్ధ బ్రాహ్మణులు, మిగిలినవారు భోజనముచేసి నోరుకడుగుకొని పుక్కిలించిన నీటి వల్లను, పాదప్రక్షాళనము చేసుకొన్న నీటిచేతను, పిశాచజన్మనెత్తినవారు, క్రిమికీటకములుగా జన్మించినవారు తృప్తినందెదరు. ఓ కుమారా! అట్లే విధి ప్రకారము శ్రాద్ధకర్మను ఆచరించుచున్న యజమానిగాని, ద్విజులుగాని భూమిపై వెదజల్లిన అన్నము, నీరు ఏవిగలవో అవి శుద్ధములైననూ, ఉచ్ఛిష్టములు (ఎంగిలివి) అయిననూ వాటిచేత ఆ కులమందలివారు వేరే వేరే జన్మనెత్తినవారు తృప్తినందుచున్నారు.

అన్యాయోపార్జితైరర్థైర్యచ్ఛ్రాద్ధం క్రియతే నరైః ॥16

తృప్యన్తే తేన చాండాలపుల్కసాద్యాసు యోనిషు ।
ఏవమాప్యాయనం వత్స బహూనామపి బాంధవైః ॥17॥

శ్రాద్ధం కుర్వద్భిరన్నాంబుశాకైరపి హి జాయతే ।
తస్మాచ్ఛ్రాద్ధం నరో భక్త్యా శాకైరపి యథావిధి ॥18॥

కుర్వీత కుర్వతః శ్రాద్ధం కులే కశ్చిన్న సీదతి ।

అక్రమపద్ధతులలో సంపాదించిన ధనముతో ఎవరు శ్రాద్ధమును నిర్వహించెదరో అట్టి శ్రాద్ధమువలన చండాలపుల్కసాది నిమ్నజాతులలో పుట్టిన తన వంశమందలి పూర్వీకులు తృప్తినందెదరు. ఓ కుమారా! ఈ విధముగా బంధుజనము అన్నజలశాకములతో నిర్వహించే శ్రాద్ధకర్మవలన చాలామంది పూర్వీకులు తృప్తిని పొందుచున్నారు. అందువలన మానవుడు భక్తితో శాకములతో యథావిధిగా పితరులకు శ్రాద్ధమును నిర్వహించవలెను. ఈ విధముగా నిర్వహించేవారి కులమందు ఎవ్వరూ దుఃఖములను పొందరు.

తస్య కాలానహం వక్ష్యే నిత్యనైమిత్తికాత్మకాన్ ॥19॥

విధినా యేన చ నరైః క్రియతే తన్నిబోధ మే ।
కార్యం శ్రాద్ధమమావాస్యాం మాసి మాస్యుడుపక్షయే ॥20॥

ఓ కుమారా! ఇప్పుడు శ్రాద్ధముయొక్క నిత్యనైమిత్తిక కాలములగూర్చి చెప్పెదను, వినుము. అట్లే ఏ విధిప్రకారము శ్రాద్ధమును అనుష్ఠించవలెనో దానిని కూడా చెప్పెదను, నా వలన తెలుసుకొనుము. ప్రతి నెలా చంద్రుని కాంతి క్షీణించును. అప్పుడు అమావాస్య తిథియగును. ప్రతీనెలా అమావాస్యనాడు పితరులకు శ్రాద్ధమును పెట్టవలెను.

తథాష్టకాస్వప్యవశ్యమిష్టకాలాన్నిబోధ మే ।
విశిష్టబ్రాహ్మణప్రాప్తౌ సూర్యేందుగ్రహణేఽ యనే ॥21॥

విషువద్రవిసంక్రాంతివ్యతీపాతేషు పుత్రక ।
శ్రాద్ధార్హద్రవ్యసంపత్తౌ తథా దుస్స్వప్నదర్శనే ॥22॥

జన్మర్క్షగ్రహపీడాసు శ్రాద్ధం కుర్వీత చేచ్ఛయా ।
విశిష్టః శ్రోత్రియో యోగీ వేదవిజ్జ్యేష్ఠసామగః ॥23॥

త్రిణాచికేతః శ్రుతవాన్విహితవ్రతకారకః ।
త్రిణాచికేతస్త్రిమధుస్త్రిసుపర్ణః షడంగవిత్ ॥24॥

దౌహిత్ర ఋత్విక్ జామాతా స్వస్రీయః శ్వశురస్తథా ।
పంచాగ్నికర్మనిష్ఠశ్చ తపోనిష్ఠోఽ థ మాతులః ॥25॥

మాతాపితృపరాశ్చైవ శిష్యసంబంధిబాన్ధవాః ।
ఏతే ద్విజోత్తమాః శ్రాద్ధే సమస్తాః కేతనక్షమాః ॥26॥

అట్లే పౌషమాఘఫాల్గునమాసములందలి కృష్ణపక్షసప్తమి మొదలుకొని నవమి వరకుగల (ఈ మూడురోజులకు అష్టకలని వ్యవహారము) అష్టకలయందు కూడా శ్రాద్ధకర్మను నిర్వహించవలెను. ఇంకను విద్వాంసులైన బ్రాహ్మణులు లభించినప్పుడు, సూర్యచంద్ర గ్రహణములందు, ఉత్తరాయణమందు, విషువత్పుణ్యకాలమందు, రవిసంక్రమణమందు, వ్యతీపాతమందు, శ్రాద్ధయోగ్యములగు వస్తువులు లభించినప్పుడు, దుస్స్వప్నములు వచ్చినప్పుడు, జన్మనక్షత్రమందు, గ్రహపీడలు సంభవించినప్పుడు స్వేచ్ఛతో శ్రాద్ధకర్మను నిర్వర్తించవలెను. విశిష్టుడయిన శ్రోత్రియుడు, యోగి, వేదవేత్త, జ్యేష్ఠసామను గానము చేయువాడు, త్రిణాచికేతుడు (మూడు అగ్నులు కలవాడు), విద్వాంసుడు, విధిప్రోక్తములైన వ్రతములను ఆచరించువాడు, త్రిమధువు, త్రిసుపర్ణుడు, షడంగవేత్త, దౌహిత్రుడు, ఋత్విక్కు, జామాత, మేనల్లుడు, పంచాగ్నికర్మనిష్ఠుడు, తపోనిష్ఠుడు, మేనమామ, తల్లిదండ్రులయందు భక్తిగలవారు, శిష్యులు, సంబంధీకులు, బంధువులు, ఇట్టి బ్రాహ్మణశ్రేష్ఠులు శ్రాద్ధకర్మయందు ఆహ్వానింపబడుటకు అర్హులు.

అవకీర్ణస్తథా రోగీ న్యూనాంగస్త్వధికాంగకః ।
పౌనర్భవస్తథా కాణః కుండో గోలోఽ థ పుత్రక ॥27॥

మిత్రధ్రుక్కునఖీ కుష్ఠీ శ్యావదన్తో నిరాకృతిః ।
అభిశస్తస్తథా స్తేయః పిశునః సోమవిక్రయీ ॥28॥

కన్యాదూషయితా వైద్యో గురుపిత్రోస్తథోజ్ఝకః ।
భృతకాధ్యాపకోఽ మిత్రం పరదుష్టాపతిస్తథా ॥29॥

వేదోజ్ఝశ్చాగ్నిసంత్యాగీ వృషలాపత్యదూషితః ।
యథాఽన్యే చ వికర్మస్థా వర్జ్యాః పైత్ర్యేషు వై ద్విజాః ॥30॥

బ్రహ్మచర్యాదిరహితుడు, రోగవంతుడు, తక్కువ అవయవాలు కలిగినవాడు, ఎక్కువ అవయవాలు కలిగినవాడు, విధవను పెండ్లిచేసుకొనగా ఆమెయందు పుట్టినవాడు, గ్రుడ్డివాడు, కుండుడు అనగా భర్త బ్రతికి ఉండగా జారునివలన జన్మించినవాడు, గోళుదు అనగా భర్త మరణించిన పిమ్మట జారుని వలన జన్మించినవాడు, మిత్రద్రోహి, వంకరగోళ్ళు గలవాడు, కుష్ఠరోగి, నల్లని దంతములుగలవాడు, రూపములేనివాడు (కురూపి), తన తండ్రిచే శపించబడినవాడు, దొంగ, లోభి, సోమవిక్రయము చేయువాడు (సోమమనగా ఒకానొక లత, యజ్ఞమందు ఉపయోగింపబడేది. దానిని అమ్మువాడని అర్థం), కన్యను చెరచినవాడు, వైద్యవృత్తిలో ఉన్నవాడు, గురువులను తల్లిదండ్రులను వదిలిపెట్టినవాడు, వేతనం తీసుకొని చదువు చెప్పువాడు, శత్రువు, ఇంతకుముందే పెండ్లి అయిన స్త్రీయొక్క భర్త, వేదములను విడిచిపెట్టినవాడు, అగ్నిహోత్రమును విడిచిపెట్టినవాడు, శూద్రస్త్రీయందు సంతానమును పొందినవాడు, వీరే కాక నీచమైన కర్మలను చేయు బ్రాహ్మణులను పితృకర్మలయందు ఆహ్వానించరాదు.

నిమంత్రయేత పూర్వేద్యుః పూర్వోక్తాన్ద్విజసత్తమాన్ ।
దైవే నియోగే పిత్ర్యే చ తాంస్తథైవోపకల్పయేత్ ॥31॥

శ్రాద్ధకర్మకు ముందురోజు పూర్వము చెప్పబడిన బ్రాహ్మణశ్రేష్ఠులను దేవతలకు, పితృదేవతలకు ఉద్దేశింపబడిన ఈ కర్మకొరకు ఆహ్వానించవలెను.

తైశ్చ సంయమిభిర్భావ్యం యశ్చ శ్రాద్ధం కరిష్యతి ।
శ్రాద్ధం దత్త్వా చ భుక్త్వా చ మైథునం యోఽనుగచ్ఛతి ॥32॥

పితరస్తు తయోర్మాసం తస్మిన్రేతసి శేరతే ।
గత్వా చ యోషితం శ్రాద్ధే యో భుంక్తే యస్తు గచ్ఛతి ॥33॥

రేతోమూత్రకృతాహారాస్తం మాసం పితరస్తయోః ।
తస్మాత్తు ప్రథమం కార్యం ప్రాజ్ఞేనోపనిమంత్రణమ్ ॥34॥

శ్రాద్ధభోక్తలైన బ్రాహ్మణులు సంయమనం పాటించవలెను. అనగా మౌనంగా ఉండవలెను. శ్రాద్ధకర్త శ్రాద్ధకర్మను ఆచరించి, శ్రాద్ధభోక్త శ్రాద్ధభోజనమును చేసి స్త్రీసంభోగము చేసినయెడల వారిద్దరి పితృదేవతలు ఒక నెలరోజులపాటు వారి రేతస్సునందు శయనింతురు. ఇక వారిద్దరు ముందుగా స్త్రీసంభోగమును చేసి అటుపిమ్మట చెప్పినవిధముగా శ్రాద్ధమందు ప్రవర్తించినట్లయిన వారి పితృదేవతలు ఒక నెలరోజులపాటు రేతస్సు, మూత్రములను ఆహారముగా చేసుకొని ఉందురు. అందువలన ఇటువంటి సంఘటనలు జరగకుండా బుద్ధిమంతుడైన శ్రాద్ధమును పెట్టువాడు ముందురోజే శ్రాద్ధబ్రాహ్మణులను ఆహ్వానించవలెను.

అప్రాప్తౌ తద్దినే చాపి వర్జ్యా యోషిత్ప్రసంగినః ।
భిక్షార్థమాగతాన్వాపి కాలే సంయమినో యతీన్ ॥35॥

భోజయేత్త్రణిపాతాద్యైః ప్రసాద్య యతమానసః ।
యథైవ శుక్లపక్షాద్వై పితౄణామసితః ప్రియః ॥36॥

తథాపరాహ్ణః పూర్వాహ్ణాత్పితౄణామతిరిచ్యతే ।

బ్రాహ్మణశ్రేష్ఠులు శ్రాద్ధదినమందు దొరకకపోయిననూ, స్త్రీసంబంధము గలవారిని ఎప్పటికినీ ఆహ్వానించరాదు. సకాలమందు భిక్షకొరకు వచ్చినప్పటికీ, మనోనిగ్రహముగల అట్టి యతులను నమస్కారాదులచే ప్రసన్నము చేసుకొని, నిగ్రహింపబడిన మనస్సుగల యజమాని వారిని భుజింపచేయవలెను. పితృదేవతలకు శుక్లపక్షముకంటే కృష్ణపక్షము ప్రియమైనట్లు, పూర్వాహ్ణము కంటే అపరాహ్ణము ప్రియమైనది.

సంపూజ్య స్వాగతేనైతానభ్యుపేతాన్గృహే ద్విజాన్ ॥37॥

పవిత్రపాణిరాచాన్తానాసనేషూపవేశయేత్ ।

శ్రాద్ధకర్త పవిత్రపాణియై ద్విజులను స్వాగతముతో బాగుగా పూజించి, వారిని ఆచమింపచేసి ఆసనములందు కూర్చుండబెట్టవలెను.

పితౄణామయుజః కామం యుగ్మాన్దైవే ద్విజోత్తమాన్ ॥38॥

ఏకైకం వా పితౄణాం చ దేవానాం చ స్వశక్తితః ।
తథా మాతామహానాం చ తుల్యం వా వైశ్వదైవికమ్ ॥39॥

పృథక్తయోస్తథా చాఽన్యే కేచిదిచ్ఛన్తి మానవాః ।

పితృస్థానమందు బేసిసంఖ్యలో, విశ్వేదేవస్థానమందు సరిసంఖ్యలో బ్రాహ్మణశ్రేష్ఠులను అర్చించవలెను. తమ సామర్థ్యముననుసరించి పితృస్థానమందు, విశ్వేదేవస్థానమందు కూడా ఒక్కొక్క బ్రాహ్మణశ్రేష్ఠుని అర్చించవలెను. మాతామహుల శ్రాద్ధమందు కూడా ఈ ప్రకారముగానే వైశ్వదేవ విధానము నిర్దిష్టమైయున్నది. అట్లు ఒక్కవిధముగా కాక వేరువేరుగా ఆచరించవలెనని కొందరు చెప్పుచున్నారు.

ప్రాఙ్ముఖాన్ దైవసంకల్పాన్ పిత్ర్యాన్ కుర్యాదుదఙ్ముఖాన్ ॥40॥

తథా మాతామహానాం చ విధిరుక్తో మనీషిభిః ।
విష్టరార్థే కుశాన్దత్త్వా సంపూజ్యార్ఘ్యాదినా తతః ॥41॥

పవిత్రకాణి దత్త్వా వై తేభ్యోఽనుజ్ఞామవాప్య చ ।
కుర్యాదావహనం ప్రాజ్ఞో దేవానాం మంత్రతో ద్విజః ॥42॥

దేవతలస్థానమందు ఉద్దేశించబడిన బ్రాహ్మణులను తూర్పుముఖముగాను, పితరులకు ఉద్దేశించబడిన బ్రాహ్మణులను ఉత్తరముఖముగాను కూర్చుండబెట్టవలెను. అట్లే మాతామహుల శ్రాద్ధకార్య విధానములను పండితులు చెప్పియున్నారు. ఆసనముకొరకు దర్భలను ఇవ్వవలెను. పిమ్మట బ్రాహ్మణులను అర్ఘ్యాదులతో పూజించి, పవిత్రకములను ఇచ్చి, వారి అనుమతిని పొంది ప్రాజ్ఞుడైన ద్విజుడు విశ్వేదేవ దేవతలను ఆవాహనము చేయవలెను అనగా ఆహ్వానించవలెను.

యవాంభోభిస్తతశ్చార్ఘ్యం దత్త్వా వై వైశ్వదేవికమ్ ।
గంధమాల్యాది ధూపంచ దత్త్వా సమ్యక్ సదీపకమ్ ॥43॥

అపసవ్యం పితౄణాం చ సర్వమేవోపకల్పయేత్ ।
దర్భాంశ్చ ద్విగుణాన్దత్త్వా తేభ్యోఽనుజ్ఞామవాప్య చ ॥44॥

మంత్రపూర్వం పితౄణాం చ కుర్యాదావహనం బుధః ।
అపసవ్యం తథైవార్ఘ్యం యవార్థే చ తథా తిలైః ॥45॥

నిష్పాదయేన్మహాభాగ పితౄణాం ప్రీణనే రతః ।
అగ్నౌ కార్యమనుజ్ఞాతః కురుష్వేతి తతో ద్విజైః ॥46॥

జుహుయాద్వ్యంజనక్షారవర్జమన్నం యథావిధి ।

యవలతోను, జలములతోను కూడుకొన్న అర్ఘ్యమును విశ్వేదేవదేవతలకిచ్చి, ఇంకనూ బాగుగా దీపముతో కూడుకొన్న గంధము, మాలలు, ధూపమును ఇచ్చి పితృదేవతలకు సమస్తకర్మలను చేయవలెను. అనంతరము రెట్టింపుగా దర్భలనిచ్చి, వారియాజ్ఞను తీసుకొని మంత్రపూర్వకముగా పండితుడు పితృదేవతలను ఆవహనము చేయవలెను. ఓ మహాభాగుడా! ఈ సమయమందు పితృదేవతల సంతుష్టియందు ఆసక్తిగలవాడై ప్రాచీనావీతయై అనగా జంధ్యమును అపసవ్యముగా చేసుకొని యవతిలలతో కూడిన అర్ఘ్యమునీయవలెను. అటు పిమ్మట బ్రాహ్మణుల అనుజ్ఞను తీసుకొని అగ్నికార్యము చేయవలెను. అగ్నికార్యమందు శాస్త్రోక్తప్రకారము వ్యంజన లవణములు లేని అన్నమును హోమము చేయవలెను.

అగ్నయే కవ్యవాహనాయ స్వాహేతి ప్రథమాహుతిః ॥47॥

సోమాయ వై పితృమతే స్వాహేత్యన్యా తథా భవేత్ ।
యమాయ ప్రేతపతయే స్వాహేతి తృతీయాహుతిః ॥48॥

హుతావశిష్టం దద్యాచ్చ భాజనేషు ద్విజన్మనామ్ ।
భాజనాలంభనం కృత్వా దత్త్వా చాన్నం యథావిధి ॥49॥

యథాసుఖం జుషధ్వం భోరితి వాచ్యమనిష్ఠురమ్ ।
భుఞ్జీరశ్చ తతస్తేఽపి తచ్చిత్తా మౌనినస్సుఖమ్ ॥50॥

"అగ్నయే కవ్యవాహనాయ స్వాహా" అనగా హోమద్రవ్యములను పితృదేవతలకు అందించు అగ్నిని ప్రసన్నము చేసుకొనుటకు ఈ అన్నమును ఇచ్చుచున్నాను. అను అర్థముగల మంత్రమును జపిస్తూ మొదటి ఆహుతిని ఇవ్వవలెను. "సోమాయ వై పితృమతే స్వాహా" (పితృదేవతలతో కూడుకొన్న సోమునికి స్వాహా") అను మంత్రమును జపిస్తూ రెండవ ఆహుతిని ఇవ్వవలెను. "యమాయ ప్రేతపతయే స్వాహా" (ప్రేతాత్మల ప్రభువయిన యమునికి స్వాహా") అను మంత్రమును జపిస్తూ మూడవ ఆహుతిని ఇవ్వవలెను. హోమము చేయగా మిగిలిన

అన్నమును బ్రాహ్మణుల భోజనపాత్రలందు ఉంచవలెను. సర్వపదార్థములు ఉంచిన ఆ భోజనపాత్రను స్పృశించి "యథాసుఖం జుషధ్వం భోః" (సుఖముగా భోజనమును చేయుడు) అని మృదువచనములను పలుకవలెను. అప్పుడు బ్రాహ్మణులు ఏకాగ్రచిత్తులై మౌనముగా సుఖముగా భోజనము చేయుదురు.

యద్యదిష్టతమం తేషాం తత్తదన్నమసత్వరమ్ ।
అక్రుధ్యంశ్చ నరో దద్యాత్ సంస్తవేన ప్రలోభయేత్ ॥51॥

ఏ భోజనపదార్థములు భోక్తలకు ప్రియమగునో అట్టి భోజనపదార్థములను మెల్లమెల్లగా క్రోధములేనివాడై ఆ పదార్థములందు రుచిని కలిగించునటుల ప్రవర్తించుచు, స్తుతించుచు ఆ పదార్థములను శ్రాద్ధ బ్రాహ్మణులకు వడ్డించవలెను.

రక్షోఘ్నాంశ్చ జపేన్మంత్రాంస్తిలైశ్చ వికిరేన్మహీమ్ ।
సిద్ధార్థకైశ్చ రక్షార్థం శ్రాద్ధం హి ప్రచురచ్ఛలమ్ ॥52॥

రక్షోఘ్నమంత్రములను అనగా రాక్షసులను చంపునట్టి మంత్రములను జపించవలెను. భూమియందు అన్నివైపులా నువ్వులు చల్లవలెను. శ్రాద్ధరక్షణార్థమై ఆవాలను కూడా చల్లవలెను. ఎందువలననగా శ్రాద్ధము మిక్కిలి విఘ్నములు లేదా ప్రతిబంధకములు కలిగియుండును.

పృష్టైస్తృప్తైశ్చ తృప్తాః స్థః తృప్తాస్స్మ ఇతి వాదిభిః ।
అనుజ్ఞాతో నరస్త్వన్నం వికిరేద్భువి సర్వతః ॥53॥

"తృప్తాః స్థః" "మీరు తృప్తిగా భోజనము చేసితిరా?" అని అడగవలెను. అందుకు బదులుగా బ్రాహ్మణులు "తృప్తాః స్మః" "మేము తృప్తిని పొందితిమి" అని బదులు చెప్పవలెను. అప్పుడు వారియొక్క అనుమతిని తీసుకొని భూమియందు అన్నము చల్లవలెను.

తద్వదాచమనార్థాయ దద్యాదంభస్సకృత్సకృత్ ।
అనుజ్ఞాం చ తతః ప్రాప్య యతవాక్కాయమానసః ॥54॥

సతిలేన తతోఽన్నేన పిండాన్సర్వేణ పుత్రక ।
పితౄనుద్దిశ్య దర్భేషు దద్యాదుచ్ఛిష్టసన్నిధౌ ॥55॥

అప్పుడప్పుడు ఆచమనము కొరకు నీటిని ఇవ్వవలెను. ఓ కుమారా! పిమ్మట మనోవాక్కాయములను నిగ్రహించినవాడై ఆ బ్రాహ్మణుల అనుమతిని పొంది తిలలతో కూడిన అన్నపిండమును తండ్రులను ఉద్దేశించి ఉచ్ఛిష్టముయొక్క (బ్రాహ్మణులు భోజనము చేసిన పాత్రల) సమీపమందు దర్భలపై ఉంచవలెను.

పితృతీర్థేన తోయం చ దద్యాత్తేభ్యస్సమాహితః ।
పితౄన్సంచిన్త్య తద్భక్త్యా యజమానో నృపాత్మజ ॥56॥

ఓ రాకుమారా! సమాహితచిత్తుడై శ్రాద్ధయజమాని పితృదేవతలను తలచుకొని పితృదేవతలయందలి భక్తితో వారికి పితృతీర్థముచే జలమును ఇవ్వవలెను.

తద్వన్మాతామహానాం చ దద్యాత్పిండాన్యథావిధి ।
గంధమాల్యాదిసంయుక్తాన్ దద్యాదాచమనం తతః ॥57॥

అటులనే మాతామహులనుద్దేశించి కూడా శాస్త్రోక్తప్రకారము పిండప్రదానము చేయవలెను. అటుపిమ్మట గంధమాల్యాదులతో కూడుకొన్న ఆచమనమునివ్వవలెను.

దత్త్వా చ దక్షిణాం శక్త్యా సుస్వధాస్త్వితి తాన్వదేత్ ।
తైశ్చ తుష్టైస్తథేత్యుక్త్వా వాచయేద్వైశ్వదైవికాన్ ॥58॥

ప్రీయన్తామితి భద్రం వో విశ్వేదేవా ఇతీరయేత్ ।
తథేతి చోక్తే తైర్విప్రైః ప్రార్థనీయాస్తదాశిషః ॥59॥

అనంతరము తన శక్తికొలదీ శ్రాద్ధభోక్తలకు దక్షిణలిచ్చి "సుస్వధాః తు" "సంతృప్తులైనారు కదా!" అని వారిని గురించి పలుకవలెను. సంతుష్టులైన బ్రాహ్మణులు "తథా" అట్లేయని చెప్పవలెను. అనంతరము విశ్వేదేవదేవతలనుద్దేశించి "ప్రీయంతామ్ ఇతి భద్రం వో విశ్వేదేవాః" ఓ విశ్వేదేవతలారా! మీరు సంతుష్టి చెందెదరుగాక! మీకు కల్యాణమగుగాక!" అని పలుకవలెను. ఆ బ్రాహ్మణులు "తథా" అట్లేయని పలుకగా వారినుండి ఆశీస్సులను కోరవలెను.

విసర్జయేత్ప్రియాణ్యుక్త్వా ప్రణిపత్య చ భక్తితః ।
ఆద్వారమనుగచ్ఛేచ్చ ఆగచ్ఛేచ్చానుమోదితః ॥60॥

తరువాత ప్రియవచనములు పలికి, భక్తితో అందరికీ నమస్కరించి ద్వారమువరకు వారివెంట వెళ్ళవలెను, వారి అనుమతిని తీసుకొని లోపలకు తిరిగి రావలెను.

తతో నిత్యక్రియాం కుర్యాద్భోజయేచ్చ తథాతిథీన్ ।
నిత్యక్రియాం పితౄణాం చ కేచిదిచ్ఛన్తి సత్తమాః ॥61॥

న పితౄణాం తథైవాఽన్యే శేషం పూర్వవదాచరేత్ ।
పృథక్పాకేన చేత్యన్యే కేచిత్పూర్వం చ పూర్వవత్ ॥62॥

పిమ్మట శ్రాద్ధయజమాని తానాచరించవలసిన నిత్యకర్మలను ఆచరించి అతిథులను భుజింపచేయవలెను. కొందరు పితృదేవతలకు నిత్యకర్మలను ఆచరించవలెనని, కొందరు ఆచరించరాదని చెప్పుచున్నారు. అవశిష్టకర్మను పూర్వమువలే శాస్త్రోక్తప్రకారము ఆచరించవలెను. కొందరి మతము ప్రకారము వేరే వంటచేసి పితృకార్యము చేయవలెనని, కొందరు చేయకూడదని చెప్పుచున్నారు.

తతస్తదన్నం భుఞ్జీత సహ భృత్యాదిభిర్నరః ।
ఏవం కుర్వీత ధర్మజ్ఞః శ్రాద్ధం పిత్ర్యం సమాహితః ॥63॥

యథా వా ద్విజముఖ్యానాం పరితోషోఽభిజాయతే ।
త్రీణి శ్రాద్ధే పవిత్రాణి దౌహిత్రం కుతపస్తిలాః ॥64॥

అటు పిమ్మట శ్రాద్ధయజమాని భృత్యాదులతో కలిసి భుజించవలెను. ఈ విధముగా ధర్మమునెరిగినవాడు సమాహితచిత్తుడై ఏవిధముగా శ్రాద్ధ బ్రాహ్మణులు సంతోషించెదరో ఆవిధముగా శ్రాద్ధకర్మను ఆచరించవలెను. శ్రాద్ధకార్యమందు మూడు వస్తువులు (1) దౌహిత్రము (కుమార్తెకు సంబంధించినవారు అనగా మనుమడు మొదలగువారు) (2) కుతపము (పగటిభాగమందలి మొత్తం పదిహేను ముహూర్తాంశములలో ఎనిమిదవ ముహూర్తాంశము, అపరాహ్నకాలము) (3) తిలలు పవిత్రములుగా చెప్పబడినవి.

వర్జ్యాని చాహుర్విప్రైశ్చ కోపోఽధ్వగమనం త్వరా ।
రాజతం చ తథా పాత్రం శస్తం శ్రాద్ధేషు పుత్రక ॥65॥

రజతస్య తథా కార్యం దర్శనం దానమేవ వా ।
రజతే హి స్వధా దుగ్ధా పితృభిః శ్రూయతే మహీ ॥66॥

తస్మాత్పితౄణాం రజతమభీష్టం ప్రీతివర్ధనమ్ ॥67॥

కోపము, ప్రయాణము, తొందర ఈ మూడు శ్రాద్ధకర్మయందు విడిచిపెట్టదగినవి. ఓ కుమారా! శ్రాద్ధకార్యములందు వెండిపాత్ర శ్రేష్ఠమైనది. రజతదర్శనముగాని రజతదానముగాని శ్రాద్ధమందు ఉచితమైయున్నవి. పితృదేవతలు రజతపాత్రయందు భూమినుండి స్వధను (హోమద్రవ్యములను) పితికెదరని వినబడుచున్నది. అందువలన పితృదేవతలకు రజతము ఇష్టము మరియు సంతోషమును వృద్ధిచేయునదగును.

ఇతి శ్రీమార్కండేయ మహాపురాణే అలర్కానుశాసనే శ్రాద్ధకల్పో నామ అష్టవింశోఽధ్యాయః ॥28॥

శ్రీమార్కండేయ మహాపురాణమందు అలర్కోపదేశమందు శ్రాద్ధకల్పమను ఇరువదిఎనిమిదవ అధ్యాయం సమాప్తం.



ఏకోనత్రింశోऽధ్యాయః – ఇరువదితొమ్మిదవ అధ్యాయం
శ్రాద్ధకల్పః – శ్రాద్ధకల్పం

మదాలసా ఉవాచ – మదాలస పలికింది.

అతః పరం శృణుష్వేమం పుత్ర భక్త్యా యదాహృతమ్ ।
పితౄణాం ప్రీతయే యద్యద్వర్జ్యం వా ప్రీతికారకమ్ ॥1॥

ఓ కుమారా! పితృదేవతల ప్రీతికొరకు భక్తిపూర్వకముగా ఏ పదార్థములను సమర్పించవలెనో, వేటిని విడిచిపెట్టవలెనో, ఏ పదార్థములు వారికి ప్రీతిని కలిగించునో చెప్పెదను, వినుము.

మాసం తృప్తిః పితౄణాం చ హవిష్యాన్నేన జాయతే ।
మాసద్వయం మత్స్యమాంసైస్తృప్తిం యాన్తి పితామహాః ॥2॥

హోమముగావింపబడిన అన్నముచే పితృదేవతలకు ఒక నెలరోజుల వరకు తృప్తి కలుగును. పితామహులు మత్స్యమాంసములచే (చేప మాంసము) రెండు నెలలు తృప్తి చెందెదరు.

త్రీన్మాసాన్హారిణం మాంసం విజ్ఞేయం పితృతృప్తయే ।
పుష్ణాతి చతురో మాసాన్ శాశస్య పిశితం పితౄన్ ॥3॥

మూడు నెలలు లేడిమాంసముచే పితృదేవతలు తృప్తి చెందెదరు. కుందేటి మాంసముచే వారు నాలుగు నెలలు తృప్తి చెందెదరు.

శాకునం వై పఞ్చ మాసాన్ షణ్మాసాన్ సూకరామిషమ్ ।
ఛాగలం సప్త వై మాసానైణేయం చాష్టమాసికీమ్ ॥4॥

కరోతి తృప్తిం నవ వై రురోర్మాంసం న సంశయః ।
గవయస్యామిషం తృప్తిం కరోతి దశమాసికీమ్ ॥5॥

పితృదేవతలు పక్షిమాంసముచే అయిదునెలలు, పందిమాంసముచే ఆరునెలలు, మేక లేదా గొర్రెమాంసముచే ఏడునెలలు, ఐణేయమాంసముచే (ఏణమనగా నల్లలేడి, దాని మాంసమని అర్థము) ఎనిమిది నెలలు, దుప్పిమాంసముచే తొమ్మిది నెలలు, గవయమాంసముచే (గవయమనగా గోవులాంటి మృగవిశేషము) పది నెలలు తృప్తి చెందెదరు, ఇందు సందేహము లేదు.

తథైకాదశమాసాంస్తు ఔరభ్రం పితృతృప్తిదమ్ ।
సంవత్సరం తథా గవ్యం పయః పాయసమేవ వా ॥6॥

గొఱ్ఱెమాంసముచే పదకొండు నెలలు, ఆవుపాలు, పెరుగు, పరమాన్నముచే సంవత్సరకాలము పితృదేవతలు తృప్తి పొందెదరు.

వార్ధీణసామిషం లోహం కాలశాకం తథా మధు ।
దౌహిత్రామిషమన్యచ్చ దత్తమాత్మకులోద్భవైః ॥7॥

అనన్తాం వై ప్రయచ్ఛన్తి తృప్తిం గౌరీ సుతస్తథా ।
పితౄణాం నాత్ర సన్దేహో గయాశ్రాద్ధం చ పుత్రక ॥8॥

ఓ కుమారా! వార్ధీణసమనే మృగవిశేషముయొక్క మాంసము (గొర్రెలలో ఒకజాతి వార్ధీణసము), లోహము (చందనాదులు), కాలశాకము (కృష్ణతులసి లేదా శాకవిశేషము), తేనె, దౌహిత్రునిచే ఇవ్వబడిన మాంసము, తన వంశమందు జన్మించిన వారిచ్చిన ఏదేని వస్తువుగాని, అట్లే గౌరి (తులసి లేదా పసుపు), సుతము (పిండబడిన సోమరసము మొదలగునవి), గయాక్షేత్రంలో పెట్టబడిన శ్రాద్ధము ఇవన్నియు పితృదేవతలకు తృప్తిని కలిగించును. ఇందు సంశయము లేదు.

రాజశ్యామాకశ్యామాకౌ తద్వచ్చైవ ప్రశాతికా ।
నీవారాః పౌష్కరాశ్చైవ వన్యాని పితృతృప్తయే ॥9॥

యవవ్రీహిసగోధూమతిలముద్గాః ససర్షపాః ।
ప్రియంగవః కోద్రవాశ్చ నిష్పావాశ్చాతిశోభనాః ॥10॥

మిక్కిలి శోభనములైన రాజశ్యామాకము, శ్యామాకము, ప్రశాతిక, నీవారము, పౌష్కరములు, (ఇవి అన్నియు అడవిలో లభించే ధాన్యవిశేషములు) పితృదేవతలకు తృప్తిని కలిగించును. అట్లే యవలు, వ్రీహులు, గోధుమలు, నువ్వులు, పెసలు, ఆవాలు, కొఱ్ఱలు, కోద్రవములు, అనుములు మొదలైన ధాన్యవిశేషములు పితృదేవతలకు తృప్తిని కలిగించును.

వర్జ్యా మర్కటకాః శ్రాద్ధే రాజమాషాస్తథాణవః ।
విప్రూషికా మసూరాశ్చ శ్రాద్ధకర్మణి గర్హితాః ॥11॥

లశునం గృంజనం చైవ పలాండుః పిండమూలకమ్ ।
కరంభం యాని చాన్యాని హీనాని రసవర్ణతః ॥12॥

గాంధారికమలాబూని లవణాన్యూషరాణి చ ।
ఆరక్తా యే చ నిర్యాసాః ప్రత్యక్షలవణాని చ ॥13॥

శ్రాద్ధకార్యమందు మర్కటకములు (మత్స్యవిశేషములు), రాజమాషములు (ఎఱ్ఱ మినుములు), అణువులు (ధాన్యవిశేషములు) విప్రూషికములు (ధాన్యవిశేషములు), మసూరములు (ధాన్యవిశేషములు), ఇవియన్నియు నిందింపతగినవి గాన, విడిచిపెట్టతగినవి. ఇంకను లశునము (ఉల్లి, వెల్లుల్లి), గృంజనము (ఎఱ్ఱ ఉల్లి), పలాండువు (లశున విశేషము), పిండమూలకము (దుంప విశేషము), కరంభము (పెరుగు కలిపిన పేలాలు), రంగు రుచి లేనివి, గాంధారికము (శాకవిశేషము లేదా ధాన్యవిశేషము), మలాబు (సొరకాయ), లవణములు, ఊషరములు, ఎఱ్ఱనివి, జిగురు కలవి, ఉప్పుతో కలిసిపోయిన వస్తువులు ఇవియన్నియు కూడా శ్రాద్ధకార్యమందు విడిచిపెట్ట తగినవి.

వర్జయేత్తాని వై శ్రాద్ధే యచ్చ వాచా న శస్యతే ।
యచ్చాప్యుత్కోచతః ప్రాప్తం పతితాద్యదుపార్జితమ్ ॥14॥

అన్యాయకన్యాశుల్కోత్థం ద్రవ్యం చాత్ర విగర్హితమ్ ।
దుర్గన్ధి ఫేనిలం చాంబు తథైవాల్పతరోదకమ్ ॥15॥

ఇంకను ఉచ్చారణకు పలుకరానివి, అన్యాయముగా సంపాదించినవి, పతితులచే (పాపులచే) సంపాదింపబడినవి, అన్యాయముగా కన్యాశుల్కముచే లభించిన ద్రవ్యము, దుర్వాసన కలిగినట్టి నురుగుతో కూడుకొన్న జలము, అల్పజలము ఇవియన్నియు నిందింపతగినవి కావున శ్రాద్ధకార్యమందు విడిచిపెట్టతగినవి.

న లభేద్యత్ర గౌస్తృప్తిం నక్తం యచ్చాప్యుపాహృతమ్ ।
యచ్చ సర్వాపచోత్సృష్టం యచ్చాభోజ్యనిపానజమ్ ॥16॥

తద్వర్జ్యం సలిలం తాత సదైవ పితృకర్మణి ।
మార్గమావికమౌష్ట్రే చ సర్వమేకశఫం చ యత్ ॥17॥

మాహిషం చామరం చైవ ధేన్వా గోశ్చాప్యనిర్దశమ్ ।
పిత్రర్థం మే ప్రయచ్ఛస్వేత్యుక్త్వా యచ్చాప్యుపాహృతమ్ ॥18॥

వర్జనీయం సదా సద్భిస్తత్పయః శ్రాద్ధకర్మణి ।

ఓ తండ్రీ! (ఓ కుమారా!) గోవుకు తృప్తిని కల్గించనిది, రాత్రివేళల్లో సంపాదించిన వస్తువు, అందరూ వంట చేసుకొన్నపిమ్మట మిగిలిపోయిన వస్తువులు, త్రాగడానికి యోగ్యము కాని నీరు ఇవియన్నియు శ్రాద్ధకర్మలందు విడువతగినవి. ఇంకను ఇప్పుడు చెప్పబోయే వాటియొక్క పాలను శ్రాద్ధకర్మయందు వినియోగించరాదు. అవి ఏవియనగా మృగము (మృగసంబంధి మార్గము), గొర్రె, ఒంటె, ఒకే గిట్ట కలిగిన పశువులు, గేదె, చమరీమృగము, అప్పుడే మొదటిసారి ప్రసవించిన ఆవులు వీటికి సంబంధించిన పాలు మరియు అనిర్దశమైన గోవుల పాలు (ఆశౌచమున్నవారు అనిర్దశ శబ్దానికి అర్థం. వారికి సంబంధించిన గోవులపాలు అని అర్థం), అట్లే "శ్రాద్ధకార్యము కొరకు నాకు పాలు ఇమ్ము" అని అడిగి సంపాదించుకొన్న పాలు ఏది కలదో దానిని సజ్జనులు శ్రాద్ధకర్మలందు త్యజించవలెను.

వర్జ్యా జంతుమతీ రూక్షా క్షితిః ప్లుష్టా తథాగ్నినా ॥19॥

అనిష్టా దుష్టశబ్దోగ్రా దుర్గంధా శ్రాద్ధకర్మణి ।
కులాపమానకాః శ్రాద్ధే వ్యాయుజ్య కులహింసకాః ॥20॥

కులాధమో బ్రహ్మహా చ తథా వై రోగిణోఽన్యజాః ।
నగ్నాః పాతకినశ్చైవ ఘ్నన్తి దృష్ట్వా పితృక్రియామ్ ॥21॥

అపుమానపవిద్ధశ్చ కుక్కుటో గ్రామసూకరః ।
శ్వా చైవ హన్తి శ్రాద్ధాని యాతుధానాశ్చ దర్శనాత్ ॥22॥

క్రిమికీటకాదులతో నిండినదీ, తడి లేక పరుషముగా ఉన్నదీ, అగ్నిచే వ్యాప్తమైనదీ, దుర్గంధముతో కూడినదీ అయిన భూమిని శ్రాద్ధకర్మయందు విడిచిపెట్టవలెను. ఇంకనూ కులమును అవమానించువారు, తాము శ్రాద్ధకార్యమందు పాల్గొనక కులమును హింసించువారు, కులమందలి అధములనూ, బ్రహ్మహత్యచేసినవారూ, రోగగ్రస్తులు, తక్కువజాతివారు, దిగంబరులు, పాపాచరణగలవారు తమ చెడుదృష్టితో పితృకార్యమును నష్టపరిచెదరు. ఇంకనూ నపుంసకుడు, గాయపడినవాడు, కోడి, గ్రామసూకరము, కుక్క, రాక్షసులు వీరు కూడా తమ దృష్టి చేతనే శ్రాద్ధకార్యమును నష్టపరిచెదరు.

తస్మాత్ సుసంవృతో దద్యాత్తిలైశ్చ వికిరేన్మహీమ్ ।
ఏవం రక్షా భవేచ్ఛ్రాద్ధే కృతా తాతోభయోరపి ॥23॥

అందువలన బాగుగ గమనించి శ్రాద్ధదానములను ఆచరించవలెను, భూమిపై నువ్వులను చల్లవలెను. ఈ విధముగా ఆచరించినందువలన ఓ తండ్రీ! శ్రాద్ధకర్తకు, శ్రాద్ధభోక్తకూ ఇరువురికీ క్షేమము కలుగును.

శావసూతకిసంస్పృష్టం దీర్ఘరోగిభిరేవ చ ।
పతితైర్మలినైశ్చైవ పుష్ణాతి న పితామహాన్ ॥24॥

జాతాశౌచము, మృతాశౌచముగలవారు, దీర్ఘరోగముగలవారు, పతితులు (పాపాత్ములు), మలినస్వభావము గలవారు వీరిచే స్పృశింపబడి ఇవ్వబడిన వస్తువు పితృదేవతలను సంతృప్తిపరచదు.

వర్జనీయం తథా శ్రాద్ధే సదోదక్యాదిదర్శనమ్ ।
చండశౌండసమాభాషా యజమానేన చాదరాత్ ॥25॥

అట్లే శ్రాద్ధకార్యమందు ఎప్పుడూ కూడా బహిష్టు అయిన స్త్రీని చూడరాదు. అట్లే నీచస్వభావముగలవారితోనూ, మద్యపానము చేసినవారితోనూ శ్రాద్ధకర్మను నిర్వహించు యజమాని మాటలాడరాదు.

కేశకీటావపన్నం చ తథా శ్వభిరవేక్షితమ్ ।
పూతిపర్యుషితం చైవ వార్తాక్యభిషవాంస్తథా ॥26॥

వర్జనీయం హి వై శ్రాద్ధే తథా వస్త్రానిలాహతమ్ ।

వెంట్రుకలు, క్రిమికీటకాదులతో కూడుకొన్న ద్రవ్యమును, కుక్కలు చూచిన పదార్థములను, దుర్గంధము కలిగిన వస్తువులను, వంకాయలను, సోమరసపానమును, ఆయా వస్త్రములచే (మడిబట్టలు కానివి) కూడుకొన్నవి, గాలిచే కొట్టుకురాబడినవీ అయిన వాటిని శ్రాద్ధకర్మయందు విడువవలెను.

శ్రద్ధయా పరయా దత్తం పితౄణాం నామగోత్రతః ॥27॥

యదాహారాశ్చ తే జాతాస్తదాహారత్వమేతి తత్ ।
తస్మాచ్ఛ్రద్ధాయుతం పాత్రే యచ్ఛ త్వం పితృకర్మణి ॥28॥

తథా తచ్చైవ దాతవ్యం పితౄణాం తృప్తిమిచ్ఛతా ।

పితృదేవతల నామగోత్రముల ప్రకారము వారికి శ్రద్ధతో నివేదించినవి మరియు ఆహారపదార్థములు అన్నియు ఆహారరూపముగా పరిణామము చెందును. అందువలన ఓ కుమారా! పితృకార్యమందు యోగ్యుడైన వ్యక్తికి శ్రద్ధతో ఆయా వస్తువులను ప్రసాదించుము. అట్లే పితృదేవతల తృప్తిని కోరువాడవై వారికి ఇష్టమైన వస్తువులను శ్రాద్ధకర్మయందు నివేదించుము.

యోగినశ్చ సదా శ్రాద్ధే భోజనీయా విపశ్చితా ॥29॥

యోగాధారా హి పితరస్తస్మాత్తాన్భోజయేత్సదా ।
బ్రాహ్మణానాం సహస్రస్య యోగీ త్వగ్రాసనీ యది ॥30॥

యజమానం చ భోక్తౄంశ్చ నౌరివాంభసి తారయేత్ ।

శ్రాద్ధకర్మయందు పండితుడైన శ్రాద్ధకర్త యోగులకు భోజనము పెట్టవలెను. పితృదేవతలు యోగము ఆధారముగా గలవారు కదా! అందువలన ఎల్లప్పుడు వారికి భోజనము సమర్పించవలెను. వేలకొలది బ్రాహ్మణులకు బదులుగా ఒక్క యోగికి శ్రాద్ధకర్మయందు అగ్రాసనమును సమర్పించినచో ఆ యోగి ఆ శ్రాద్ధయజమానిని, శ్రాద్ధభోక్తలను సముద్రమందలి నావవలే తరింపచేయును.

పితృగాథాస్తథైవాత్ర శ్రూయన్తే బ్రహ్మవాదిభిః ॥31॥

యా గీతాః పితృభిః పూర్వమైలస్యాసన్మహీపతేః ।
కదా నస్సంతతావగ్ర్యః కస్యచిద్భవితా సుతః ॥32॥

యో యోగిభుక్తశేషాన్నైర్భువి పిణ్డం ప్రదాస్యతి ।
గయాయామథవా పిణ్డం ఖడ్గమాంసం మహాహవిః ॥33॥

కాలశాకం తిలాఢ్యం వా కృసరం మాసతృప్తయే ।
వైశ్వదేవ్యం చ సౌమ్యం చ ఖడ్గమాంసం పరం హవిః ॥34॥

విషాణవర్జ్యఖడ్గాప్త్యామాసూర్యాన్నాశయామహే ।

పూర్వకాలమందు మహీపతియగు పురూరవుని (ఇలాదేవియొక్క కుమారుడు ఐలుడు పురూరవుడు) ఉద్దేశించి పితృదేవతలు గానము చేసిన ఏ గీతములు కలవో అట్టి పితృదేవతలకు సంబంధించిన గాథలు ఈ శ్రాద్ధకార్యమందు వినబడుచున్నవి. అట్టి గాథలు ఎట్లున్నవనగా : మనలో ఎవరికి సర్వోత్తముడైన కుమారుడు కలుగునో కదా! (వంశమందు కుమారుడు పుట్టినచో తమకు తర్పణములిచ్చునని పితృదేవతల ఆశయము). పుట్టబోయే ఆ కుమారుడు యోగులు భోజనము చేయగా మిగిలిన అన్నముతో భూమియందు మనకెన్నడు పిండప్రదానము చేయునో కదా! లేక గయాక్షేత్రమందు ఖడ్గమృగముయొక్క మాంసముతో హవిస్స్వరూపమైన పిండప్రదానము చేయునో కదా! కాలశాకముతో (ఒకానొక శాకవిశేషము), నువ్వులతోనూ సమ్మిళితమైన కృసరమును

(అన్నవిశేషము) మనకు నెలనెలా తృప్తికొరకై ఎన్నడు సమర్పించునో కదా! విశ్వేదేవతలకు సమర్పించబడిన ద్రవ్యము, సోమరసవిశిష్టమైనది, గొప్ప హవిస్సు అయినట్టి ఖడ్గమాంసము వీటిని మనకెన్నడు ప్రదానము చేయునో కదా! కొమ్ములు లేనట్టి ఖడ్గమృగముల మాంసమును సూర్యుడు ఉదయించు కాలము వరకూ కూడా మేము భుజించము.

తథా వర్షాత్రయోదశ్యాం మఘాసు చ యథావిధి ॥35॥

మధుసర్పిస్సమాయుక్తపాయసం దక్షిణాయనే ।
తస్మాత్సంపూజయేద్భక్త్యా స్వపితౄన్యతమానసః ॥
కామానభీప్సన్సకలాన్ పాపాచ్చాత్మవిమోచనమ్ ॥36॥

వసూన్ రుద్రాంస్తథాదిత్యాన్నక్షత్రగ్రహతారకాః ।
ప్రీణయన్తి మనుష్యాణాం పితరః శ్రాద్ధతర్పితాః ॥37॥

ఆయుః ప్రజాం ధనం విద్యాం స్వర్గం మోక్షం సుఖాని చ ।
ప్రయచ్ఛన్తి తథా రాజ్యం పితరః శ్రాద్ధతర్పితాః ॥38॥

అట్లే సంవత్సరమందలి త్రయోదశి తిథియందు, మఘానక్షత్రయుక్తకాలమందు తేనె పేలాలతో కూడిన పాయసమును దక్షిణాయనమందు శాస్త్రోక్తప్రకారము పితృదేవతలకు సమర్పించవలెను. అందువలన మనస్సును స్వాధీనమందుంచుకొని భక్తితో పితృదేవతలను పూజించవలెను. ఇట్లు ఆచరించినందువలన సమస్తములైన కోరికలను శ్రాద్ధయజమాని పొందును. పాపములనుండి కూడా దూరమగును. శ్రాద్ధవిధిచే సంతృప్తిని పొందిన పితృదేవతలు శ్రాద్ధవిధిని ఆచరించినవారిని సంతోషపరచెదరు. ఇంకను ఆయుర్దాయమును, సంతానమును, ధనమును, విద్యను, స్వర్గమును, మోక్షమును, సుఖమును, రాజ్యమును శ్రాద్ధమును ఆచరించినవారికి ప్రసాదించెదరు.

ఏతత్తే కథితం పుత్ర శ్రాద్ధకర్మ యథోదితమ్ ।
కామ్యానాం శ్రూయతాం వత్స శ్రాద్ధానాం తిథికీర్తనమ్ ॥39॥

ఓ కుమారా! శాస్త్రోక్తప్రకారము నీకు శ్రాద్ధకర్మను గూర్చి వివరించితిని. ఇప్పుడు కామ్యములైన శ్రాద్ధకర్మలను గూర్చి వాటిని ఆచరించవలసిన తిథులను గూర్చి చెప్పెదను, వినుము.

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే అలర్కానుశాసనే శ్రాద్ధకల్పో నామ ఏకోనత్రింశోఽధ్యాయః ॥29॥

శ్రీ మార్కండేయ మహాపురాణమందు అలర్కోపదేశమందలి శ్రాద్ధకల్పమను ఇరువదితొమ్మిదవ అధ్యాయం సమాప్తం.



త్రింశోఽధ్యాయః - ముప్పదియవ అధ్యాయం
శ్రాద్ధకల్పః - శ్రాద్ధకల్పం

మదాలసా ఉవాచ - మదాలస పలికింది.

ప్రతిపద్ధనలాభాయ ద్వితీయా ద్విపదప్రదా ।
వరార్థినీ తృతీయా తు చతుర్థీ శత్రునాశినీ ॥1॥

అమావాస్య వెళ్ళిన పిమ్మట మొదటిరోజగు పాడ్యమినాడు శ్రాద్ధకార్యమునాచరించినచో ధనలాభము కలుగును. విదియనాడు ఆచరించినచో సంపత్తి, తదియనాడు ఆచరించినచో వరసిద్ధి, చవితినాడు ఆచరించినచో శత్రునాశనము కలుగును.

శ్రియం ప్రాప్నోతి పఞ్చమ్యాం షష్ఠ్యాం పూజ్యో భవేన్నరః ।
రాజాధిపత్యం సప్తమ్యామష్టమ్యాం వృద్ధిముత్తమామ్ ॥2॥

పంచమితిథినాడు శ్రాద్ధకార్యమునాచరించినచో సంపదలు ప్రాప్తించును. షష్ఠినాడు ఆచరించిన మానవుడు పూజింపబడును. సప్తమినాడు ఆచరించినచో రాజ్యమందు ఆధిపత్యము, అష్టమినాడు ఆచరించినచో ఉత్తమమైన సమృద్ధి కలుగును.

స్త్రియో నవమ్యాం ప్రాప్నోతి దశమ్యాం పూర్ణకామతామ్ ।
వేదాంస్తథాప్నుయాత్సర్వానేకాదశ్యాం క్రియాపరః ॥3॥

నవమినాడు శ్రాద్ధమునాచరించినచో స్త్రీలాభము, దశమినాడు ఆచరించినచో సమస్త కోరికలు సిద్ధించును. ఏకాదశినాడు శ్రాద్ధక్రియను ఆచరించినచో సమస్తవేదములను పొందును.

ద్వాదశ్యాం జయలాభం చ ప్రాప్నోతి పితృపూజకః ।
ప్రజాం బుద్ధిం పశూన్వృద్ధిం స్వాతంత్ర్యం పుష్టిముత్తమామ్ ॥4॥

ద్వాదశినాడు పితృకార్యమునాచరించినవాడు జయలాభము, సంతానము, బుద్ధి, పశుసమృద్ధి, స్వాతంత్ర్యము, ఉత్తమమైన పుష్టి కలుగును.

దీర్ఘమాయుస్తథైశ్వర్యం కుర్వాణస్తు త్రయోదశీమ్ ।
అవాప్నోతి న సన్దేహో శ్రాద్ధం శ్రద్ధాపరో నరః ॥5॥

త్రయోదశితిథినాడు శ్రద్ధతో శ్రాద్ధకార్యమునాచరించినవాడు గొప్ప ఆయుర్దాయమును, ఐశ్వర్యమును పొందును. ఇందులో సందేహము లేదు.

యథాసంభావితాన్నేన శ్రద్ధాసంపత్సమన్వితః ।
వికృత్యా పితరో యస్య మృతాః శస్త్రేణ వా హతాః ॥6॥

తేన కార్యం చతుర్దశ్యాం తేషాం తృప్తిమభీప్సతా ।

విధ్యుక్తప్రకారము భోజనముపెట్టి శ్రద్ధయనెడు సంపద కలిగినవాడు మరియు ఎవని తల్లితండ్రులు రోగముతోకాని లేదా ఆయుధప్రహారముచేతగానీ మరణించిరో అట్టివాడు చతుర్దశినాడు తల్లిదండ్రుల తృప్తినిగోరి శ్రాద్ధకార్యము నాచరించవలెను.

శ్రాద్ధం కుర్వన్నమావాస్యాం యత్నేన పురుషశ్శుచిః ॥7॥

సర్వాన్ కామానవాప్నోతి స్వర్గం చానన్త్యమశ్నుతే ।
కృత్తికాసు పితౄనర్చన్ స్వర్గం ప్రాప్నోతి మానవః ॥8॥

ప్రయత్నపూర్వకముగా శుచియై అమావాస్యతిథినాడు శ్రాద్ధకార్యమును ఆచరించినవాడు సమస్తకోరికలను పొందుటయేగాక, అక్షయమగు స్వర్గమును కూడా పొందును. కృత్తికానక్షత్రమందు పితృదేవతలను పూజించిన మానవుడు స్వర్గమును పొందును.

అపత్యకామో రోహిణ్యాం సౌమ్యే తేజస్వితాం లభేత్ ।
శౌర్యమార్ద్రాసు చాప్నోతి క్షేత్రాది చ పునర్వసౌ ॥9॥

సంతానమును కోరుకొనువాడు రోహిణీనక్షత్రమందు శ్రాద్ధమును పెట్టవలెను. శుభగ్రహములు గల సోమసంబద్ధమైన కాలమందు శ్రాద్ధమును ఆచరించినచో తేజస్సును, ఆర్ద్రానక్షత్రకాలమందు ఆచరించినచో పరాక్రమమును, పునర్వసు నక్షత్రకాలమందు ఆచరించినచో భూలాభమును పొందును.

పుష్టిం పుష్యే సదాభ్యర్చ్య ఆశ్లేషాసు వరాన్సుతాన్ ।
మఘాసు స్వజనశ్రైష్ఠ్యం సౌభాగ్యం ఫల్గునీషు చ ॥10॥

పుష్యమినక్షత్రకాలమందు శ్రాద్ధమును ఆచరించినచో పుష్టిని, ఆశ్లేషనక్షత్రకాలమందు ఆచరించినచో ఉత్తమమైన కుమారులను, మఘానక్షత్రకాలమందు ఆచరించినచో తమ సంబంధీకులకు శ్రేష్ఠత్వము, ఫల్గునీనక్షత్రకాలమందు ఆచరించినచో సౌభాగ్యము లభించును.

ప్రదానశీలో భవతి సాపత్యశ్చోత్తరాసు వై ।
ప్రయాతి శ్రేష్ఠతాం సత్సు హస్తే శ్రాద్ధపరో నరః ॥11॥

ఉత్తరాఫల్గునీనక్షత్రకాలమందు శ్రాద్ధకార్యమును ఆచరించినవాడు దానశీలుడు, సంతానవంతుడు కాగలడు. హస్తానక్షత్రకాలమందు ఆచరించిన మానవుడు సజ్జనులలో శ్రేష్ఠమైనవాడు కాగలడు.

రూపయుక్తస్తు చిత్రాసు తథాపత్యాన్యవాప్నుయాత్ ।
వాణిజ్యలాభదా స్వాతిర్విశాఖా పుత్రకామదా ॥12॥

చిత్తానక్షత్రకాలమందు శ్రాద్ధవిధిని ఆచరించినవాడు రూపవంతుడు, సంతానము కలిగినవాడు కాగలడు. స్వాతినక్షత్ర కాలమందు ఆచరించినచో వ్యాపారలాభము, విశాఖానక్షత్ర కాలమందు ఆచరించినచో పుత్రులను పొందగలరు.

కుర్వన్తశ్చానురాధాసు లభన్తే చక్రవర్తితామ్ ।
ఆధిపత్యం చ జ్యేష్ఠాసు మూలే చారోగ్యముత్తమమ్ ॥13॥

అనూరాధానక్షత్రకాలమందు శ్రాద్ధకార్యమును ఆచరించినవాడు చక్రవర్తి కాగలడు. జ్యేష్ఠానక్షత్రకాలమందు ఆచరించినవాడు ఆధిపత్యమును, మూలానక్షత్రకాలమందు ఆచరించినవాడు ఉత్తమమైన ఆరోగ్యమును పొందును.

ఆషాఢాసు యశఃప్రాప్తిరుత్తరాసు విశోకతామ్ ।
శ్రవణేన శుభాన్ లోకాన్ ధనిష్ఠాసు ధనం మహత్ ॥14॥

పూర్వాషాఢనక్షత్రకాలమందు శ్రాద్ధమును ఆచరించినవాడు కీర్తిని పొందును. ఉత్తరాషాఢ నక్షత్రకాలమందు ఆచరించినవాడు మంచి లోకములను, ధనిష్ఠానక్షత్రకాలమందు ఆచరించినవాడు గొప్ప ధనమును పొందును.

వేదవేద్యా చాభిజితి భిషక్సిద్ధిం చ వారుణే ।
అజావికం ప్రోష్ఠపదే విద్యాగావస్తథోత్తరే ॥15॥

అభిజిన్నక్షత్రకాలమందు శ్రాద్ధమును ఆచరించినవాడు వేదవిద్యను పొందును. శతభిషానక్షత్రకాలమందు ఆచరించినచో వైద్యమందు సిద్ధిని, పూర్వాభాద్రకాలమందు ఆచరించినచో గొర్రెలు మేకలను, ఉత్తరాభాద్ర కాలమందు ఆచరించినచో విద్యను గోవులను పొందును.

రేవతీషు తథా కుప్యమశ్వినీషు తురంగమాన్ ।
శ్రాద్ధం కుర్వంస్తథాప్నోతి భరణీష్వాయురుత్తమమ్ ॥16॥

తస్మాత్కామ్యాని కుర్వీత ఋక్షేష్వేతేషు తత్త్వవిత్ ॥17॥

రేవతీనక్షత్రకాలమందు పితృకార్యమును ఆచరించినవాడు సువర్ణరజతములకంటే వేరైన తేజోధాతువిశేషములను పొందును. అశ్వినీనక్షత్రకాలమందు శ్రాద్ధమును ఆచరించినచో గుఱ్ఱములను, భరణీనక్షత్రకాలమందు శ్రాద్ధమును ఆచరించినచో ఉత్తమమైన ఆయుర్దాయమును పొందును. అందువలన తత్త్వమునెరిగినవాడు ఈ కాలములందన్నింటియందు కామ్యశ్రాద్ధములను ఆచరించవలెను.

ఇతి శ్రీమార్కండేయ మహాపురాణే మదాలసోపాఖ్యానే అలర్కానుశాసనే శ్రాద్ధకల్పో నామ త్రింశోఽధ్యాయః ॥30॥

శ్రీమార్కండేయ మహాపురాణమందు మదాలసోపాఖ్యానమందలి అలర్కానుశాసనమందు శ్రాద్ధకల్పమను ముప్పదియవ అధ్యాయం సమాప్తం.



ఏకత్రింశోఽధ్యాయః - ముప్పదిఒకటవ అధ్యాయం
సదాచారవర్ణనమ్ - సదాచారవర్ణనం

మదాలసా ఉవాచ - మదాలస పలికింది.

ఏవం పుత్ర గృహస్థేన దేవతాః పితరస్తథా ।
సంపూజ్య హవ్యకవ్యాభ్యామన్నేనాతిథిబాంధవాః ॥1॥

భూతాని భృత్యా వికలాః పశుపక్షిపిపీలికాః ।
భిక్షవో యాచమానాస్తు యే చాన్యే వసతా గృహే ॥2॥

సదాచారవతా తాత ! సాధునా గృహమేధినా ।
పాపం భుఙ్క్తే సముల్లఙ్ఘ్య నిత్యం నైమిత్తికీః క్రియాః ॥3॥

ఓ కుమారా! ఈ విధముగా గృహస్థుడు హవ్యమను పేరుగల అన్నముతో దేవతలను, కవ్యమను పేరుగల అన్నముతో పితృదేవతలను, అన్నముతో అతిథులను బంధువులను పూజించవలెను. అట్లే భూతములు, సేవకులు, అంగవైకల్యముగలవారు, పశువులు, పక్షులు, చీమలు, భిక్షువులు, తమ ఇంట నివసించువారు వీరిలో ఎవరైనా దేనినైనను యాచించినచో వారిని అన్నాదులతో సదాచారముగల సాధువైన గృహస్థుడు అర్చించవలెను. నిత్యనైమిత్తిక క్రియలను ఉల్లంఘించు మానవుడు పాపమును అనుభవించును.

అలర్క ఉవాచ - అలర్కుడు చెప్పాడు.

కథితం మే త్వయా మాతర్నిత్యం నైమిత్తికం చ యత్ ।
నిత్యం నైమిత్తికం చైవ త్రివిధం కర్మ పౌరుషమ్ ॥4॥

సదాచారమహం శ్రోతుమిచ్ఛామి కులనందిని ।
యం కుర్వన్ సుఖమాప్నోతి పరత్రేహ చ మానవః ॥5॥

ఓ తల్లీ! నీవు నాకు నిత్యము, నైమిత్తికము, నిత్యనైమిత్తికము అను పురుషోచితక్రియలను మూడింటిని గూర్చి చెప్పితివి. ఓ కులమునకు ఆనందమును కలిగించుదానా! దేనిని ఆచరించినచో మానవుడు ఇహపరలోకములందు సుఖమును పొందునో అట్టి సదాచారమును నీనుండి వినగోరుచున్నాను.

మదాలసా ఉవాచ - మదాలస పలికింది.

గృహస్థేన సదా కార్యమాచారపరిపాలనమ్ ।
న హ్యాచారవిహీనస్య సుఖమత్ర పరత్ర వా ॥6॥

గృహస్థుడు ఎల్లప్పుడు సదాచారమును పాటించుచుండవలెను. ఆచారమును పాటించనివానికి ఇహలోక పరలోకములందు సుఖము లేదు.

యజ్ఞదానతపాంసీహ పురుషస్య న భూతయే ।
భవన్తి యస్సదాచారం సముల్లఙ్ఘ్య ప్రవర్తతే ॥7॥

ఎవరయితే సదాచారమును అతిక్రమించి ప్రవర్తించునో అతనికి అతడాచరించు యజ్ఞదానతపస్సులు సంపదలను ఇవ్వవు.

దురాచారో హి పురుషో నేహాయుర్విన్దతే మహత్ ।
కార్యో యత్నస్సదాచారే ఆచారో హన్త్యలక్షణమ్ ॥8॥

దురాచారముగల పురుషుడు సంపూర్ణాయుర్దాయమును పొందలేడు. ఎల్లప్పుడు సదాచారమందు ప్రయత్నము చేయవలెను. సదాచారము చెడు లక్షణములను తొలగించును.

తస్య స్వరూపం వక్ష్యామి సదాచారస్య పుత్రక ।
సమాహితమనాః శ్రుత్వా తథైవ పరిపాలయ ॥9॥

ఓ కుమారా! సదాచారముయొక్క స్వరూపమును నేనిప్పుడు చెప్పెదను. దానిని నీవు ఏకాగ్రచిత్తుడవై విని అట్లే పరిపాలించుము.

త్రివర్గసాధనే యత్నః కర్తవ్యో గృహమేధినా ।
తత్సంసిద్ధౌ గృహస్థస్య సిద్ధిరత్ర పరత్ర చ ॥10॥

గృహస్థుడు ధర్మార్థకామములనెడు త్రివర్గమును సాధించుటలో యత్నించవలెను. త్రివర్గము సిద్ధించిన పిమ్మట ఇహలోకపరలోకములందు సిద్ధి లభించును.

పాదేనార్థస్య పారత్ర్యం కుర్యాత్సంచయమాత్మవాన్ ।
అర్థేన చాత్మభరణం నిత్యనైమిత్తికాన్వితమ్ ॥11॥

పాదం చాత్మార్థమాయస్య మూలభూతం వివర్ధయేత్ ।
ఏవమాచరతః పుత్ర అర్థః సాఫల్యమృచ్ఛతి ॥12॥

తత్త్వవేత్తయగు మానవుడు తాను సంపాదించుకొన్న సంపదలో నాల్గవభాగమును ఉత్తమ పరలోక ప్రాప్తినిమిత్తమై వెచ్చించవలెను. సగభాగమును తనను తాను పోషించుకొనుటకు, నిత్యనైమిత్తిక కార్యములను నెరవేర్చుటకు వెచ్చించవలెను. మిగిలిన నాల్గవభాగమును మూలధనరూపముగా వృద్ధి చేయవలెను. ఓ కుమారా! ఈవిధముగా ఆచరించుటవలన అర్థము అనగా సంపద సాఫల్యమును పొందును.

తద్వత్పాపనిషేధార్థం ధర్మః కార్యో విపశ్చితా ।
పరత్రార్థం తథా చాన్యః కామ్యోఽత్రైవ ఫలప్రదః ॥13॥

అట్లే పాపములను పోగొట్టుకొనుటకు పండితుడు ధర్మమును అనుష్ఠించవలెను. నిష్కామకర్మలు పరలోకమందు ఫలమునిచ్చును. కామ్యకర్మలు ఈ లోకమందే ఫలమునిచ్చును.

ప్రత్యవాయభయాత్కామస్తథాన్యశ్చావిరోధవాన్ ।
ద్విధా కామో నిగదితస్త్రివర్గోఽస్యావిరోధతః ॥14॥

పరస్పరానుబన్ధాంశ్చ సర్వానేతాన్విచిన్తయేత్ ।

ప్రత్యవాయము (పాపము) కలుగునను భయము కారణముగా నిష్కామకర్మలు, కామ్యకర్మలు వీటికి విరోధములేకుండా చూడవలెను. కామము, త్రివర్గమునకు విరోధములేని కామము అని కామము రెండు విధములు. వీటినన్నింటిని ఒకదానితో ఒకటి ముడిపడియున్నవానిగా తెలుసుకొనవలెను.

విపరీతానుబన్ధాంశ్చ ధర్మాదీంస్తాన్ శృణుష్వ మే ॥15॥

ధర్మో ధర్మానుబన్ధార్థో ధర్మో నాత్మార్థబాధకః ।
ఉభాభ్యాం చ ద్విధా కామస్తేన తౌ చ ద్విధా పునః ॥16॥

పూర్వోక్తమునకు వైపరీత్యముతో ముడిపడియున్న ధర్మాదులను చెప్పెదను, వినుము. ధర్మముకొరకు ధర్మమునాచరించుట, స్వీయమునకు వ్యాఘాతమును కల్గించని ధర్మమునాచరించుట, పై రెంటిచేతను కామము రెండు విధములు, మరియు కామముచేత పై రెండు మరల ఒక్కొక్కటి రెండేసి విధములు.

బ్రాహ్మే ముహూర్తే బుధ్యేత ధర్మార్థౌ చానుచిన్తయేత్ ।
కాయక్లేశాంశ్చ తన్మూలాన్ వేదతత్త్వార్థమేవ చ ॥17॥

ఉత్థాయావశ్యకం కృత్వా కృతశౌచః సమాహితః ।
సముత్థాయ తథాచమ్య ప్రాఙ్ముఖో నియతశ్శుచిః ॥18॥

పూర్వాం సంధ్యాం సనక్షత్రాం పశ్చిమాం సదివాకరామ్ ।
ఉపాసీత యథాన్యాయం నైనాం జహ్యాదనాపది ॥19॥

బ్రాహ్మీముహూర్తమందు మేల్కొని ధర్మార్థములను, తన్మూలకములైన కాయక్లేశములను మరియు వేదతత్త్వార్థమును బాగుగా చింతన చేయవలెను. తిరిగి నిద్రలేచిన పిమ్మట ఆవశ్యకములైన కాలకృత్యములను తీర్చుకొని శౌచమును పొంది ఏకాగ్రచిత్తుడై ఆచమనము చేసి తూర్పుదిక్కున ముఖముండునట్లు శుచియై కూర్చుండవలెను. నక్షత్రములుండగా ఉదయాన్నే ప్రాతస్సంధ్యను ఆచరించవలెను. అదేవిధంగా ఇంకనూ పశ్చిమాన సూర్యుడు ఉండగానే సాయంసంధ్యను ఆచరించవలెను. ఆపదలు ఏమీ లేనిచో తప్పనిసరిగా విధ్యుక్తప్రకారము సంధ్యోపాసనమును చేయవలెనేగాని విడువరాదు.

అసత్ప్రలాపమనృతం వాక్పారుష్యం చ వర్జయేత్ ।
అసచ్ఛాస్త్రమసద్వాదమసత్సేవాం చ పుత్రక ॥20॥

ఓ కుమారా! దుర్మార్గులతో మాట్లాడుట, అసత్యమాడుట, పరుషముగా మాటలాడుట, దుష్టశాస్త్రములు (నాస్తికములు), దుష్టవాదములు, దుష్టులను సేవించుట వీటిని త్యజించవలెను.

సాయం ప్రాతస్తథా హోమం కుర్వీత నియతాత్మవాన్ ।
నోదయాస్తమయే బింబముదీక్షేత వివస్వతః ॥21॥

ఆత్మనిగ్రహము, ఏకాగ్రత కలిగి ప్రాతఃకాలమందు సాయంకాలమందు హోమమును ఆచరించవలెను. ఉదయించు సమయమందు మరియు అస్తమించు సమయమందు సూర్యబింబమును చూడరాదు.

కేశప్రసాధనాదర్శదర్శనం దన్తధావనమ్ ।
పూర్వాహ్ణ ఏవ కుర్వీత దేవతానాం చ తర్పణమ్ ॥22॥

జుట్టును ముడివేసుకొనుట, అద్దములో చూచుకొనుట, పళ్ళు తోముకొనుట, దేవతలకు తర్పణములిచ్చుట ఈ పనులన్నియు పూర్వాహ్ణమందే చేయవలెను.

గ్రామావసథతీర్థానాం క్షేత్రాణాం చైవ వర్త్మని ।
న మూత్రమనుతిష్ఠేత న కృష్టే న చ గోవ్రజే ॥23॥

గ్రామమందు, ఆవసథము అనగా విశ్రాంతి తీసుకొను స్థలములందు, తీర్థములందు, పుణ్యక్షేత్రములందు, మార్గమందు, దున్నిన పొలమందు, గోవులుండు ప్రదేశములందు మూత్రవిసర్జనము చేయరాదు.

నగ్నాం పరస్త్రియం నేక్షేన్న పశ్యేదాత్మనః శకృత్ ।
ఉదక్యాదర్శనం స్పర్శో వర్జ్యం సంభాషణం తథా ॥24॥

ఇతర స్త్రీలను నగ్నముగా చూడరాదు. తాను విడిచిన మలమును చూడరాదు. ఋతుమతియైన స్త్రీని చూచుటగాని, తాకుటగాని, అట్లే ఆమెతో మాటలాడుటగాని చేయరాదు. అట్టి కార్యములను విడిచిపెట్టవలెను.

నాప్సు మూత్రం పురీషం వా నిష్ఠీవం న సమాచరేత్ ।
నాధితిష్ఠేచ్ఛకృన్మూత్రం కేశభస్మకపాలికాః ॥25॥

జలమందు మలమూత్రాదులను విడిచిపెట్టుట, ఉమ్మివేయుట చేయరాదు. మలమూత్రములు, కేశములు, భస్మ, పుర్రెలు వీటిపై కూర్చొనరాదు.

తుషాంగారాస్థిచూర్ణాని రజోవస్త్రాణి కానిచిత్ ।
నాధితిష్ఠేత్తథా ప్రాజ్ఞః పథి పత్రాణి వా భువి ॥26॥

బుద్ధిమంతుడైన మానవుడు ధాన్యపుపొట్టు, బొగ్గులు, ఎముకలు, ఆయా చూర్ణములు, ధూళితో కూడుకొన్న వస్త్రములు, మార్గమందలి ఆకులు లేదా పక్షుల రెక్కలు వీటిపై కూర్చొనరాదు.

పితృదేవమనుష్యాణాం భూతానాం చ తథార్చనమ్ ।
కృత్వా విభవతః పశ్చాద్గృహస్థో భోక్తుమర్హతి ॥27॥

గృహస్థుడు తన సంపదననుసరించి పితరులు, దేవతలు, మనుష్యులు, పంచమహాభూతాలు వీటిని అర్చించి అటుతర్వాత భోజనము చేయవలెను.

ఉదఙ్ముఖః ప్రాఙ్ముఖో వా స్వాచాన్తో వాగ్యతశ్శుచిః ।
భుఞ్జీతాన్నం చ తచ్చిత్తో హ్యన్తర్జానుః సదా నరః ॥28॥

ఉత్తరముఖముగా గాని, తూర్పుముఖముగా గాని కూర్చుండి, ఆచమనము చేసి, వాక్కును నియంత్రించుకొని, శుచియై రెండు మోకాళ్ళమధ్య ముఖమునుంచుకొని మానవుడు ఎల్లప్పుడు భోజనము చేయవలెను.

ఉపఘాతమృతే దోషం నాన్నస్యోదీరయేద్బుధః ।
ప్రత్యక్షం లవణం వర్జ్యమన్నమత్యుష్ణమేవ చ ॥29॥

హాని కల్గించే సందర్భం తప్ప మరెన్నడునూ పండితుడైనవాడు అన్నమును దూషించరాదు. ప్రత్యక్షముగా లవణము కన్పించిననూ, ఎక్కువగా వేడి కల్గియున్ననూ అట్టి అన్నమును విడిచిపెట్టవలెను.

న గచ్ఛన్నైవ తిష్ఠన్వై విణ్మూత్రోత్సర్గమాచరన్ ।
కుర్వీత నైవ చాచామేన్న కిఞ్చిదపి భక్షయేత్ ॥30॥

నడుస్తూ, నిలిచియుండి, మలమూత్రములను విడుస్తూ దేనినీ త్రాగరాదు, తినరాదు.

ఉచ్ఛిష్టో నాలపేత్కించిత్ స్వాధ్యాయం చ వివర్జయేత్ ।
గాం బ్రాహ్మణం తథా చాగ్నిం స్వమూర్ధానం చ న స్పృశేత్ ॥31॥

ఎంగిలి శరీరముతో ఎవరితోనూ మాటలాడరాదు, వేదాధ్యయనమును విడిచిపెట్టవలెను, అట్లే గోవును, బ్రాహ్మణులను, అగ్నిని, తన శిరస్సునూ తాకరాదు.

న చ పశ్యేద్రవిం నేన్దుం న నక్షత్రాణి కామతః ।
భిన్నాసనం తథా శయ్యాం భాజనం చ వివర్జయేత్ ॥32॥

ఇంకను ఎంగిలి శరీరముతో తన ఇష్టానుసారముగా సూర్యుని, చంద్రుని, నక్షత్రములను చూడరాదు. విరిగిన ఆసనము, విరిగిన శయ్య, విరిగిన పాత్రలను విడిచిపెట్టవలెను.

గురూణామాసనం దేయమభ్యుత్థానాది సత్కృతమ్ ।
అనుకూలం తథాఽఽలాపమభివాదనపూర్వకమ్ ॥33॥

వెంటనే లేచి నిల్చొని సత్కారముతో గురువులకు ఆసనమును ఇవ్వవలెను. నమస్కారపూర్వకముగా గురువులతో అనుకూలమైన సంభాషణ చేయవలెను.

తథానుగమనం కుర్యాత్ప్రతికూలం న సంలపేత్ ।
నైకవస్త్రశ్చ భుఞ్జీత న కుర్యాద్దేవతాఽర్చనమ్ ॥34॥

గురువులు తిరిగి వెళ్ళు సమయమందు వారిని అనుసరించి వెళ్ళవలెను. వారికి ప్రతికూలముగా ఏమియూ మాట్లాడరాదు. ఒకే వస్త్రమును ధరించి భోజనముగాని దేవతార్చనగాని చేయరాదు.

న గర్హయేద్ద్విజాన్నాగ్నౌ మేహం కుర్వీత బుద్ధిమాన్ ।
న స్నాయీత నరో నగ్నో న శయీత కదాచన ॥35॥

ద్విజులను ఎన్నడూ నిందించరాదు. బుద్ధిమంతుడైనవాడు అగ్నియందు మలమూత్రాలను విడువరాదు. నగ్నముగా స్నానము చేయరాదు మరియు నగ్నముగా నిద్రించరాదు.

న పాణిభ్యాముభాభ్యాం చ కణ్డూయేత శిరస్తథా ।
న చాఽభీక్ష్ణం శిరస్స్నానం కార్యం నిష్కారణం నరైః ॥36॥

రెండు చేతులతో తలను గోక్కొనరాదు. కారణములేకుండా మానవులు తరచుగా తలస్నానము చేయరాదు.

శిరస్స్నాతశ్చ తైలేన నాఙ్గం కిఞ్చిదపి స్పృశేత్ ।
అనధ్యాయేషు సర్వేషు స్వాధ్యాయం చ వివర్జయేత్ ॥37॥

తలస్నానము చేసిన పిమ్మట నూనెతో తన అవయవమును దేనినీ స్పృశించరాదు. అమావాస్య, పాడ్యమి మొదలగు అనధ్యాయదివసములందు వేదాధ్యయనము చేయరాదు.

బ్రాహ్మణానలగోసూర్యాన్న మేహేత కదాచన ।
ఉదఙ్ముఖో దివా రాత్రావుత్సర్గం దక్షిణాముఖః ॥38॥

ఆబాధాసు యథాకామం కుర్యాన్మూత్రపురీషయోః ।

బ్రాహ్మణుడు, అగ్ని, సూర్యుడు వీరికి ఎదురుగా ఎప్పుడూ మలమూత్రాలను విడువరాదు. పగలు ఉత్తరాభిముఖుడై, రాత్రి దక్షిణాభిముఖుడై మలమూత్రాదులను విడువవలెను. ఆపత్కాలమందు ఇచ్ఛానుసారముగా మలమూత్రాదులను విడువవచ్చును.

దుష్కృతం న గురోర్బ్రూయాత్ క్రుద్ధం చైనం ప్రసాదయేత్ ॥39॥

పరీవాదం న శృణుయాదన్యేషామపి కుర్వతామ్ ।

గురువుయొక్క పాపమును పైకి చెప్పరాదు. గురువు కోపగించినచో ప్రసన్నునిగా చేయవలెను. ఎవరైననూ గురువును నిందించుచున్నచో అట్టి నిందలను వినరాదు.

పన్థా దేయో బ్రాహ్మణానాం రాజ్ఞో దుఃఖాతురస్య చ ॥40॥

విద్యాధికస్య గుర్విణ్యా భారార్తస్య యవీయసః ।
మూకాంధబధిరాణాం చ మత్తస్యోన్మత్తకస్య చ॥41॥

పుంశ్చల్యా కృతవైరస్య బాలస్య పతితస్య చ ।

బ్రాహ్మణులు, రాజు, దుఃఖముతో ఉన్నవాడు, విద్యాధికుడు, గర్భవతి, బరువును మోయుచున్నవాడు, యువకుడు, మూగవాడు, గ్రుడ్డివాడు, చెవిటివాడు, ఉన్మత్తుడు, పిచ్చివాడు, వేశ్య, శత్రువు, బాలుడు, పతితుడు వీరందరికీ దారినీయవలెను.

దేవాలయం చైత్యతరుం తథైవ చ చతుష్పథమ్ ॥42॥

విద్యాధికం గురుం చైవ బుధః కుర్యాత్ప్రదక్షిణమ్ ।

దేవమందిరము, బౌద్ధవృక్షము, నాలుగురోడ్ల కూడలి, విద్యాధికుడు, గురువు వీరికి పండితుడైనవాడు ప్రదక్షిణము చేయవలెను.

ఉపానద్వస్త్రమాల్యాది ధృతమన్యైర్న ధారయేత్ ॥43॥

ఉపవీతమలంకారం కరకం చైవ వర్జయేత్ ।
ప్రశస్తాని చ కర్మాణి కుర్వాణా దీర్ఘజీవినః ॥44॥

ఇతరులు ధరించిన చెప్పులు, వస్త్రములు, పుష్పమాలలు, జందెము, అలంకారము, కమండలము వీటిని విడిచిపెట్టవలెను. ప్రశస్తములైన కర్మలను ఆచరించుచున్నవారు దీర్ఘాయుర్దాయము కలిగినవారగుచున్నారు.

చతుర్దశ్యాం తథాష్టమ్యాం పఞ్చదశ్యాం చ పర్వసు ।
తైలాభ్యంగం తథా భోగం యోషితశ్చ వివర్జయేత్ ॥45॥

చతుర్దశి, అష్టమి, పౌర్ణమి, అమావాస్య, పర్వదినములందు తైలాభ్యంగస్నానము, స్త్రీసంభోగము వీటిని విడిచిపెట్టవలెను.

న క్షిప్తపాదజంఘశ్చ ప్రాజ్ఞస్తిష్ఠేత్కదాచన ।
న చాపి విక్షిపేత్ పాదౌ పాదం పాదేన నాక్రమేత్ ॥46॥

బుద్ధిమంతుడగు పురుషుడు పాదములను, తొడలను చాపుకొని కూర్చొనరాదు. రెండు పాదములను జాడించుటగాని, ఒకపాదముపై మరొక పాదమునుంచి నొక్కుకొనుటగాని చేయరాదు.

మర్మాభిఘాతమాక్రోశం పైశున్యం చ వివర్జయేత్ ।
దంబాభిమానతైక్ష్ణ్యాని న కుర్వీత విచక్షణః ॥47॥

మర్మావయవములను పీడించుట, ఇతరులను నిందించుట, చాడీలు చెప్పుట వీటిని విడిచిపెట్టవలెను. ఇంకను బుద్ధిమంతుడైన పురుషుడు గొప్పలు చెప్పుట, అహంకారము, తీక్ష్ణబుద్ధి వీటిని ప్రదర్శించరాదు.

మూర్ఖోన్మత్తవ్యసనినో విరూపాన్మాయినస్తథా ।
న్యూనాంగాంశ్చాధికాంగాంశ్చ నోపహాసేన దూషయేత్ ॥
పరస్య దణ్డం నోద్యచ్ఛేచ్ఛిక్షార్థం పుత్రశిష్యయోః ॥48॥

మూర్ఖులు, ఉన్మత్తులు, వ్యసనపరులు, వికృతరూపులు, మాయ చేయు స్వభావముగలవారు, తక్కువ అవయవములు గలవారు, ఎక్కువ అవయవములు గలవారు వీరిని హేళనచేసి దూషించరాదు. ఇతరులను దండించరాదు. విద్యోపదేశము కొరకు పుత్రులను, శిష్యులను దండించరాదు.

తద్వన్నోపవిశేత్ ప్రాజ్ఞః పాదేనాక్రమ్య చాసనమ్ ।
సంయావం కృసరం మాంసం నాత్మార్థముపసాదయేత్ ॥49॥

అట్లే బుద్ధిమంతుడైనవాడు కాళ్ళు పైకెత్తి కూర్చొనరాదు. (పెద్దలముందు అవినయముతో ప్రవర్తించరాదని అర్థం). నెయ్యి పాలు బెల్లం వీటితో కలిపి పక్వము చేసిన గోధుమపిండి (సంయావము), తిలలు తండులముతో పక్వమైన ఆహారము (కృసరము), మాంసము వీటిని తనకొరకు మాత్రమే సిద్ధము చేయరాదు.

సాయం ప్రాతశ్చ భోక్తవ్యం కృత్వా చాతిథిపూజనమ్ ।
ఉదఙ్ముఖః ప్రాఙ్ముఖో వా వాగ్యతో దన్తధావనమ్ ॥50॥

కుర్వీత సతతం వత్స వర్జయేద్వర్జ్యవీరుధః ।

సాయంకాలము, ప్రాతఃకాలములందు అతిథులను పూజించిన తర్వాతే భోజనము చేయవలెను. ఓ కుమారా! ఉత్తరదిక్కువైపుగాని తూర్పుదిక్కువైపుగాని తిరిగి నిషిద్ధములైన కాష్ఠములను విడిచి, మాటలాడక దంతధావనము చేసుకొనవలెను.

నోదక్ఛిరాః స్వపేజ్జాతు న చ ప్రత్యక్ఛిరా నరః ॥51॥
శిరస్యగస్త్యమాస్థాయ శయీతాథ పురందరమ్ ।

ఉత్తరదిక్కువైపు, పశ్చిమదిక్కువైపు తలపెట్టుకొని నిద్రించరాదు. మిగిలిన దిక్కులవైపు పరుండి నిద్రించవలెను.

న తు గంధవతీష్వప్సు స్నాయీత న తథా నిశి ॥52॥
ఉపరాగే పరం స్నానమృతే దినముదాహృతమ్ ।

సుగంధభరిత జలములందు స్నానము చేయరాదు. మరియు రాత్రివేళ స్నానము చేయరాదు. కేవలం సూర్యచంద్ర గ్రహణకాలములందు మాత్రమే రాత్రివేళల్లో స్నానము చేయవలెను.

అపమృజ్యాన్న చాస్నాతో గాత్రాణ్యంబరపాణిభిః ॥53॥

న చాపి ధూనయేత్కేశాన్ వాససీ న చ ధూనయేత్ ।
నానులేపనమాదద్యాదస్నాతః కర్హిచిద్బుధః ॥54॥

స్నానము చేయకుండా వస్త్రములతోను, చేతులతోనూ తన శరీరావయవములను శుద్ధిచేసుకొనరాదు. స్నానము చేయకుండా కేశములనుగాని, వస్త్రములను గాని విదిలించరాదు. పండితుడైనవాడు స్నానము చేయకుండా సుగంధద్రవ్యములను పూసుకొనరాదు.

న చాపి రక్తవాసాః స్యాచ్చిత్రాసితధరోఽపి వా ।
న చ కుర్యాద్విపర్యాసం వాససోర్నాపి భూషణే ॥55॥

వర్జ్యం చ విదశం వస్త్రమత్యంతోపహతం చ యత్ ।

ఎరుపురంగు, చిత్రవర్ణము, నలుపురంగు గల వస్త్రములను ధరించరాదు. వస్త్రములను గాని, అలంకారములనుగాని విపర్యాసముగా ధరించరాదు. అంచులేని జీర్ణమైన చినిగిన వస్త్రములను ధరించరాదు.

కేశకీటావపన్నం చ క్షుణ్ణం శ్వభిరవేక్షితమ్ ॥56॥

అవలీఢావపన్నం చ సారోద్ధరణదూషితమ్ ।
పృష్ఠమాంసం వృథామాంసం వర్జ్యమాంసం చ పుత్రక ॥57॥

న భక్షయీత సతతం ప్రత్యక్షలవణాని చ ।
వర్జ్యం చిరోషితం పుత్ర భక్తం పర్యుషితం చ యత్ ॥58॥

పిష్టశాకేక్షుపయసాం వికారా నృపనందన ।
తథా మాంసవికారాశ్చ తే చ వర్జ్యాశ్చిరోషితాః ॥59॥

కేశములతోను క్రిమికీటకాదులతోను కూడుకొన్నది, పాడైనది, కుక్కలు చూచిన లేదా నాకబడినది, సారము తీయబడినది, దూషితమైనది, పృష్ఠమాంసము, వృథామాంసము, వర్జనీయ మాంసము, ప్రత్యక్షలవణము ఈ పదార్థములను భుజించరాదు. ఓ కుమారా! అట్లే చాలాకాలము నిల్వ ఉన్నది, పాసిపోయినదీ అయిన అన్నమును భుజించరాదు. ఓ రాజకుమారా! నిల్వ కారణముగా వికారము చెందిన పిండి, కూరలు, చెరకు, పాలు, చిరకాలము నిల్వచేయబడిన మాంసవికారములు వీటిని విడిచిపెట్టవలెను.

ఉదయాస్తమనే భానోః శయనం చ వివర్జయేత్ ।
నాస్నాతో నైవ సంవిష్టో న చైవాన్యమనా నరః ॥60॥

న చైవ శయనే నోర్వ్యాముపవిష్టో న శబ్దవత్ ।
న చైకవస్త్రో న వదన్ ప్రేక్షతామప్రదాయ చ ॥61॥

భుఞ్జీత పురుషః స్నాతః సాయం ప్రాతర్యథావిధి ।

సూర్యోదయకాలమందు, సూర్యాస్తమయకాలమందు నిద్రించరాదు. స్నానము చేయకుండా, నిద్రిస్తూ అన్యమనస్కముగా, శయ్యపై కూర్చొని, వట్టినేలపై కూర్చొని, ధ్వని చేయుచూ, ఏకవస్త్రధారియై, మాట్లాడుతూ, చూచువారికి భోజనము పెట్టకుండా ఏ మానవుడూ భుజించరాదు. సాయంకాలము, ప్రాతఃకాలము యథావిధిగా స్నానమాచరించి పురుషుడు భోజనము చేయవలెను.

పరదారా న గన్తవ్యాః పురుషేణ విపశ్చితా ॥62॥

ఇష్టాపూర్తాయుషాం హన్త్రీ పరదారగతిర్నృణామ్ ।
న హీదృశమనాయుష్యం లోకే కిఞ్చన విద్యతే ॥63॥

యాదృశం పురుషస్యేహ పరదారాభిమర్శనమ్ ।

బుద్ధిమంతుడైన పురుషుడు ఎన్నడునూ పరుల భార్యలతో సంగమించరాదు. పరస్త్రీగమనము వలన మనుష్యుల ఇష్టాపూర్తములు (అనగా అగ్నిహోత్రాది కార్యములు నిర్వర్తించినందువలన కలిగిన పుణ్యము ఇష్టము. పూర్తమనగా బావులు చెరువులు తవ్వించినందువలన కలిగిన పుణ్యము) నశించును. మరియు ఆయుర్దాయము తరిగిపోవును. పరస్త్రీగమనము వలన ఏవిధముగా ఆయుఃక్షీణము కలుగునో, అట్టి పాపము ఈ లోకమందు మరొకటి లేదు.

దేవార్చనాగ్నికార్యాణి తథా గుర్వభివాదనమ్ ॥64॥

కుర్వీత సమ్యగాచమ్య తద్వదన్నభుజిక్రియామ్ ।
అఫేనాభిరగంధాభిరద్భిరచ్ఛాభిరాదరాత్ ॥65॥

ఆచమేత్పుత్ర! పుణ్యాభిః ప్రాఙ్ముఖో వాఽ ప్యుదఙ్ముఖః ।

దేవతలను పూజించుట, అగ్నికార్యములు, గురువులకు నమస్కరించుట నిత్యము చేయవలెను. బాగుగా ఆచమనము చేసి అన్నమును భుజించవలెను. ఓ కుమారా ! నురుగులేని, ఎట్టివాసనలేని, స్వచ్ఛమైన, పవిత్రమైన జలముతో ఆదరముగా తూర్పుదిక్కువైపు గాని, ఉత్తరదిక్కువైపుగాని తిరిగి ఆచమనము చేయవలెను.

అన్తర్జలాదావసథాద్వల్మీకాన్మూషికస్థలాత్ ॥66॥
కృతశౌచావశిష్టాచ్చ వర్జయేత్ పఞ్చ వై మృదః ।

నీటిలోపల ఉన్నట్టి, పుట్టలో ఉన్నట్టి, ఎలుక కన్నములో ఉన్నట్టి, శౌచక్రియలు చేయగా మిగిలినట్టి ఈ అయిదు విధముల మట్టిని గ్రహించరాదు.

ప్రక్షాల్య హస్తౌ పాదౌ చ సమభ్యుక్ష్య సమాహితః ॥67॥

అన్తర్జానుస్తథాచామేత్ త్రిశ్చతుర్వా పిబేదపః ।
పరిమృజ్య ద్విరాస్యాన్తం ఖాని మూర్ధానమేవ చ ॥68॥

సమ్యగాచమ్య తోయేన క్రియాం కుర్వీత వై శుచిః ।
దేవతానామృషీణాం చ పితౄణాం చైవ యత్నతః ॥69॥

సమాహితమనా భూత్వా కుర్వీత సతతం నరః ।

చేతులను, కాళ్ళను శుభ్రముగా కడుగుకొని, ఏకాగ్రచిత్తుడై సంస్కారార్థమై వాటిపై నీళ్ళుచల్లి, తొడలను లోపలికి దగ్గరగా తీసుకొని మూడుమారులు లేక నాలుగుమారులు ఆచమించి నీళ్ళను త్రాగవలెను. రెండుమారులు ముఖము, ఇంద్రియములు, శిరస్సును శుభ్రము చేసి శుచియై బాగుగా నీటితో ఆచమనము చేయవలెను. ఈ విధముగా ప్రయత్నపూర్వకముగా ఏకాగ్రచిత్తముతో దేవతలు, పితరులు, ఋషుల కార్యములను మనుష్యుడు ఎల్లప్పుడు నిర్వర్తించవలెను.

క్షుత్వా నిష్ఠీవ్య వాసశ్చ పరిధాయాఽచమేద్బుధః ॥70॥

క్షుతేఽవలీఢే వాన్తే చ తథా నిష్ఠీవనాదిషు ।
కుర్యాదాచమనం స్పర్శం గోపృష్ఠస్యార్కదర్శనమ్ ॥71॥

కుర్వీతాలంబనం చాపి దక్షిణశ్రవణస్య వై ।
యథా విభవతో హ్యేతత్పూర్వాభావే తతః పరమ్ ॥72॥

అవిద్యమానే పూర్వోక్తే ఉత్తరప్రాప్తిరిష్యతే ।
న కుర్యాద్దంతసంఘర్షం నాత్మనో దేహతాడనమ్ ॥73॥

తుమ్మిన తరువాత, ఉమ్మిన తరువాత, వస్త్రములను ధరించిన తరువాత పండితుడైనవాడు ఆచమనము చేయవలెను. తుమ్ముట, నాకుట, వాంతిచేసుకొనుట, ఉమ్మివేయుట ఈ మొదలగు పనుల పిమ్మట ఆచమనము, గోపృష్ఠభాగమును స్పృశించుట, సూర్యదర్శనము మరియు కుడి చెవిని తాకుట చేయవలెను. ఈ పనులలో మొదటిది లేనిచో రెండవది ఈ క్రమముగా శక్త్యనుసారము చేయవలెను. ఈ చెప్పిన ఆచమనాదులలో పూర్వము సిద్ధించనిచో ఉత్తరమందు (అనంతరము) చెప్పబడినది సమ్మతమని చెప్పబడుచున్నది. దంతములను కొరుకుట, తన శరీరమును కొట్టుకొనుట చేయరాదు.

స్వప్నాధ్యాపనభోజ్యాని స్వాధ్యాయం చ వివర్జయేత్ ।
సంధ్యాయాం మైథునం చాపి తథా ప్రస్థానమేవ చ ॥74॥

సంధ్యాసమయములందు నిద్రించుట, విద్యను బోధించుట, తినుట, వేదాధ్యయనము, సంభోగము, ప్రయాణము వీటిని చేయరాదు.

పూర్వాహ్ణే తాత దేవానాం మనుష్యాణాం చ మధ్యమే ।
భక్త్యా తథాపరాహ్ణే చ కుర్వీత పితృపూజనమ్ ॥75॥

ఓ కుమారా ! భక్తిపురస్సరముగా పూర్వాహ్ణకాలమందు దేవతలను, మధ్యాహ్న కాలమందు మనుష్యులను, అపరాహ్ణ కాలమందు పితృదేవతలను పూజించవలెను.

శిరఃస్నాతశ్చ కుర్వీత దైవం పైత్ర్యమథాపి వా ।
ప్రాఙ్ముఖోదఙ్ముఖో వాఽపి శ్మశ్రుకర్మ చ కారయేత్ ॥76॥

తలస్నానము చేసి దైవకార్యములను, పితృకార్యములను నిర్వర్తించవలెను. తూర్పుదిక్కువైపుగాని, ఉత్తరదిక్కువైపుగాని తిరిగి క్షౌరకర్మలు చేయించుకొనవలెను.

వ్యఙ్గాం వివర్జయేత్కన్యామకులాం చాపి రోగిణీమ్ ।
వికృతాం పిఙ్గలాం చైవ వాచాలాం సర్వదూషితామ్ ॥77॥

వికృతమైన అంగములు కలది, సద్వంశమందు పుట్టనిది, రోగగ్రస్తురాలు, కురూపి పింగళవర్ణము (బూడిదరంగు) కలది, ఎక్కువగా మాట్లాడునది, సమస్తదోషములతో దూషితురాలూ అగు కన్యను విడిచిపెట్టవలెను అనగా పరిణయమాడరాదు.

అవ్యఙ్గాఙ్గీం సౌమ్యనామ్నీం సర్వలక్షణలక్షితామ్ ।
తాదృశీముద్వహేత్కన్యాం శ్రేయఃకామో నరస్సదా ॥78॥

శ్రేయస్సును కోరు మానవుడు సర్వాంగపూర్ణురాలు, సౌమ్యనామము కలది, సర్వలక్షణభూషితురాలు అయిన కన్యను పరిణయమాడవలెను.

ఉద్వహేత్పితృమాత్రోశ్చ సప్తమీం పఞ్చమీం తథా ।
రక్షేద్దారాన్ త్యజేదీర్ష్యాం దివా చ స్వప్నమైథునే ॥79॥

తల్లిదండ్రులయొక్క ఏడు, ఐదు తరములకు చెందినట్టి కన్యను వివాహమాడవలెను. భార్యను రక్షించవలెను, ఈర్ష్యను వదిలిపెట్టవలెను. పగలు నిద్ర, సంభోగములను విడిచిపెట్టవలెను.

పరోపతాపకం కర్మ జన్తుపీడాం చ వర్జయేత్ ।
ఉదక్యా సర్వవర్ణానాం వర్జ్యా రాత్రిచతుష్టయమ్ ॥80॥

ఇతరులకు బాధను కల్గించునట్టి పనులను, జీవహింసను విడిచిపెట్టవలెను. అన్ని కులములవారు నాలుగు రాత్రులపాటు ఋతుమతియగు స్త్రీతో సంభోగము చేయరాదు.

స్త్రీజన్మపరిహారార్థం పఞ్చమీమపి వర్జయేత్ ।
తతష్షష్ఠ్యాం వ్రజేద్రాత్ర్యాం శ్రేష్ఠా యుగ్మాసు పుత్రక ॥81॥

ఓ కుమారా! ఏ పురుషుడు కుమార్తె పుట్టుటకు ఇష్టపడడో అట్టి వ్యక్తి తన భార్య ఋతుకాలానంతరము ఐదవరాత్రి కూడా విడిచిపెట్టవలెను. అటుపిమ్మట ఆరవరోజు రాత్రి భార్యతో సంగమించవలెను. సరిసంఖ్యగల రాత్రిదినములలో ఆరవరోజు రాత్రి సంగమించుటే శ్రేష్ఠము.

పర్వాణి వర్జయేన్నిత్యమృతుకాలేఽపి యోషితః ।
తస్మాన్నిత్యం నరో గచ్ఛేచ్ఛేషయుగ్మాసు పుత్రక ॥82॥

అమావాస్య మొదలగు పర్వదినములు, మరియు స్త్రీల ఋతుకాలము వీటియందు స్త్రీసంగమమును విడిచిపెట్టవలెను. అందువలన ఓ కుమారా! మానవుడెల్లప్పుడు మిగిలిన యుగ్మరాత్రులందు స్త్రీ సంభోగమును ఆచరించవలెను.

యుగ్మాసు పుత్రా జాయన్తే స్త్రియోఽయుగ్మాసు రాత్రిషు ।
తస్మాద్యుగ్మాసు పుత్రార్థీ సంవిశేత సదా నరః ॥83॥

తన భార్య ఋతుకాలము నుండి నాల్గురాత్రులు గడిచిన పిమ్మట సరిసంఖ్యగల రాత్రులందు భార్యాసంభోగమును ఆచరించినచో పుత్రులు, బేసిసంఖ్యగల రాత్రులందు ఆచరించినచో కుమార్తెలు పుట్టెదరు. అందువలన పుత్రార్థియగు మానవుడు ఎల్లప్పుడు యుగ్మరాత్రులందు స్త్రీసంగమమునాచరించవలెను.

విధర్మిణోఽహ్ని పూర్వాహ్ణే సంధ్యాకాలే చ షణ్డకాః ।
క్షురకర్మణి వాన్తే చ స్త్రీసంభోగే చ పుత్రక ॥84॥

స్నాయీత చైలవాన్ప్రాజ్ఞః కటభూమిముపేత్య చ ।

పూర్వాహ్ణకాలమందు స్త్రీసంభోగమునాచరించినచో ధర్మము తప్పినవారు, సంధ్యాకాలమందు ఆచరించినచో నపుంసకులు ఉద్భవించెదరు. ఓ కుమారా ! క్షౌరకర్మలు, వమనము, స్త్రీసంభోగము, స్మశానమునకు వెళ్ళుట ఈ పనులను చేసినచో బుద్ధిమంతుడగు పురుషుడు వస్త్రధారియై స్నానమునాచరించవలెను.

దేవవేదద్విజాతీనాం సాధుసభ్యమహాత్మనామ్ ॥85॥

గురోః పతివ్రతానాం చ తథా యజ్వితపస్వినామ్ ।
పరీవాదం న కుర్వీత పరిహాసం చ పుత్రక ॥86॥

కుర్వతామవినీతానాం న శ్రోతవ్యం కథంచన ।

దేవతలు, వేదములు, ద్విజులు, సాధువులు, సభ్యులు, మహాత్ములు, గురువులు, పతివ్రతలు, యజ్ఞశీలురు, తపోజనులు వీరిని పరుషముగా మాటలాడుటగాని పరిహాసము చేయుటగాని చేయరాదు. అట్లు పరిహాసము చేయుచున్న అవినీతుల మాటలను ఎన్నడునూ వినరాదు.

దేవపిత్ర్యాతిథేయాశ్చ క్రియాః కుర్వీత వై బుధః ॥87॥

స్వాధ్యాయం చాపి కుర్వీత యథాశక్త్యా హ్యతన్ద్రితః ।
నోత్కృష్టశయ్యాసనయోః నాపకృష్టస్య చారుహేత్ ॥88॥

న చామాంగల్యవేషః స్యాన్న చామాంగల్యవాగ్భవేత్ ।
ధవలాంబరసంవీతః సితపుష్పవిభూషితః ॥89॥

బుద్ధిమంతుడైనవాడు దేవతలు, పితృదేవతలు, అతిథులు వీరిని పూజించి వారికి తగిన కార్యములను ఆచరించవలెను. శక్తికొలదీ ఆలస్యము లేక బద్ధకములేనివాడై వేదాధ్యయనము చేయవలెను. తనకంటే గొప్పవారియొక్క లేదా తక్కువ వారియొక్క శయ్యను, ఆసనమును అధిష్ఠించరాదు. అమంగళకరమైన వేషధారణ మరియు అమంగళకరమైన మాటలను విడిచిపెట్టవలెను. తెల్లని వస్త్రములు మరియు తెల్లని పువ్వులను ధరించవలెను.

నోద్ధతోన్మత్తమూఢైశ్చ నావినీతైశ్చ పండిత ।
గచ్ఛేన్మైత్రీం న చాశీలైర్న చ చౌర్యాదిదూషితైః ॥90॥

ఓ కుమారా ! ఉద్ధతులు (గర్వము లేదా అహంభావము గలవారు), ఉన్మత్తులు, మూర్ఖులు, వినయసంపద లేనివారు వీరితోనూ, ఇంకనూ మంచి శీలము లేనివారు, దొంగతనము మొదలగు దోషములచేత దూషింపబడినవారు వీరితోనూ స్నేహము చేయరాదు.

న చాతివ్యయశీలైశ్చ న లుబ్ధైర్నాపి వైరిభిః ।
నానృతకైస్తథా క్రూరైః సహాసీత కదాచన ॥
న బంధకీభిర్న న్యూనైర్బంధకీపతిభిస్తథా ॥91॥

సార్ధం న బలిభిః కుర్యాన్న చ న్యూనైర్న నిందితైః ।
న సర్వశఙ్కిభిర్నిత్యం న చ దైవపరైర్నరైః ॥92॥

అవసరానికి మించి ధనమును వ్యయము చేయు స్వభావము గలవారు, లోభగుణముగలవారు, శత్రువులు, అసత్యమాడువారు, దుర్మార్గులు, వ్యభిచారము చేయు స్త్రీలు, తనకంటే తక్కువవారు, వ్యభిచారిణుల భర్తలు, తనకంటే బలవంతులు, నిందితులైన తక్కువవారు, ఎల్లప్పుడు శంకించే స్వభావము గలవారు, దైవమునే నమ్ముకొని తమపనిని నిర్వర్తించనివారు అయిన మానవులతో ఎన్నడునూ సహవాసము చేయరాదు.

కుర్వీత సాధుభిర్మైత్రీం సదాచారావలంబిభిః ।
ప్రాజ్ఞైరపిశునైః శక్తైః కర్మణ్యుద్యోగభాగిభిః ॥93॥

సదాచారమును అవలంబించు సాధుపురుషులతో స్నేహమును చేయవలెను. అట్లే కొండెములు చెప్పని నీతిమంతులైన ప్రాజ్ఞులు, శక్తిమంతులు, తమ విధులను సక్రమముగా నిర్వర్తించువారు వీరితోనూ స్నేహము చేయవలెను.

వేదవిద్యావ్రతస్నాతైః సహాసీత సదా బుధః ।
సుహృద్దీక్షితభూపాలస్నాతకశ్వశురైస్సహ ।
ఋత్విగాదీన్ షడర్ఘార్హానర్చయేచ్చ గృహాగతాన్ ॥94॥

వేదవిద్యను అభ్యసించువారు, ఆయా వ్రతములను ఆచరించువారు, స్నానముచేసిన పిమ్మటే జపహోమాది కర్మలను ఆచరించువారితో ఎల్లప్పుడు పండితుడైనవాడు సహవాసము చేయవలెను. తన ఇంటికి వచ్చిన పూజనీయులగు స్నేహితులు, యజ్ఞాదులను నిర్వర్తించిన దీక్షితులు, రాజులు, స్నాతకవ్రతమాచరించినవారు (వేదాధ్యయనము చేసిన పిమ్మట గురువుయొక్క అనుమతితో గార్హస్థ్య ఆశ్రమమును స్వీకరించుట స్నాతకవ్రతము), మామగారు (పిల్లనిచ్చిన తండ్రి), ఋత్విక్కులు ఈ ఆరుగురిని యథోచితముగా పూజించవలెను.

యథా విభవతః పుత్ర ద్విజాన్ సంవత్సరోషితాన్ ।
అర్చయేన్మధుపర్కేణ యథాకాలమతంద్రితః ॥95॥

తిష్ఠేచ్చ శాసనే తేషాం శ్రేయస్కామో ద్విజోత్తమః ।
న చ తాన్వివదేద్ధీమానాక్రుష్టశ్చాపి తైస్సదా ॥96॥

ఓ కుమారా! మానవుడు తన గృహమందు సంవత్సరకాలము నివసించిన బ్రాహ్మణులను తన శక్తికొలదీ మానవుడు అలసత్వము లేక తగిన కాలమందు మధుపర్కముతో (యథోచిత వస్త్రములతో) పూజించవలెను. ద్విజులలో శ్రేష్ఠుడైనవాడు, తన శ్రేయస్సును కోరుకొనువాడూ అగు మానవుడు అట్టి బ్రాహ్మణుల ఆజ్ఞననుసరించి నడచుకొనవలెను. వారు కోపగించినా వారితో ఎన్నడునూ వాదనకు దిగరాదు.

సమ్యగ్గృహార్చనం కృత్వా యథాస్థానమనుక్రమాత్ ।
సంపూజయేత్తతో వహ్నిం దద్యాచ్చైవాహుతీః క్రమాత్ ॥97॥

ప్రథమం బ్రహ్మణే దద్యాత్ప్రజానాం పతయే తతః ।
తృతీయం చైవ గుహ్యేభ్యః కశ్యపాయ తథాపరామ్ ॥98॥

తతో౽నుమతయే దత్త్వా దద్యాద్గృహబలిం తతః ।
పూర్వం ఖ్యాతో మయా యస్తే నిత్యకర్మక్రియావిధిః ॥99॥

బాగుగా తన ఇంటిని అలంకరించుకొని, ఆయా దేవతలను ఆయా తగిన స్థానములలో క్రమముననుసరించి ప్రతిష్ఠ చేసి వహ్నిని పూజించవలెను. అటుపిమ్మట క్రమముగా మొదటిగా బ్రహ్మకు, అటుపిమ్మట ప్రజాపతికి, ఆహుతులను ఇవ్వవలెను. అటుపిమ్మట మూడవ ఆహుతి గుహ్యదేవగణములకు, తర్వాత కశ్యపునికి, ఆ తర్వాత అనుమతికి (శుక్లచతుర్దశీయుత పూర్ణిమతిథియందు) ఆహుతులను ఇవ్వవలెను. అటుపిమ్మట గృహబలిని (వైశ్వదేవమందు ఆయా ప్రాణులకు గృహమందు ఇవ్వవలసిన బలి అనగా ఆహారము) ఇవ్వవలెను. ఓ కుమారా! ఇట్టి నిత్యకర్మక్రియావిధి నీకు ఇంతకుముందే వివరించబడినది.

వైశ్వదేవం తతః కుర్యాద్బలయస్తత్ర మే శృణు ।
యథాస్థానవిభాగం తు దేవానుద్దిశ్య వై పృథక్ ॥100॥

అటుపిమ్మట విశ్వేదేవదేవతలకు ఆహుతులను ఇవ్వవలెను. ఆయా స్థానముల విభాగముననుసరించి ఆయా ప్రాణులకు, విడిగా ఆయా దేవతలకు ఇవ్వవలసిన ఆ బలులను గూర్చి (ఆహారములు) చెప్పెదను, వినుము.

పర్జన్యాద్భ్యో ధరిత్ర్యై చ దద్యాచ్చ మణికే త్రయమ్ ।
తతో ధాతుర్విధాతుశ్చ దద్యాద్ద్వారే గృహస్య తు ॥
వాయవే చ ప్రతిదిశం దిగ్భ్యః ప్రాచ్యాదితః క్రమాత్ ॥101॥

మేఘజలములు, భూమి, మణిక ఈ మూడింటికి మూడు ఆహుతులను ఈయవలెను. పిమ్మట ధాత విధాత వీరికి గృహద్వారమందు బలిని ఇవ్వవలెను. వాయుదేవునికి, ప్రాచీ మొదలుకొని క్రమముగా దిక్కులన్నింటికి బలిని ఇవ్వవలెను.

బ్రహ్మణే చాన్తరిక్షాయ సూర్యాయ చ యథాక్రమమ్ ।
విశ్వేభ్యశ్చైవ దేవేభ్యో విశ్వభూతేభ్య ఏవ చ ॥102॥

బ్రహ్మదేవునికి, అంతరిక్షమునకు, సూర్యునికి, విశ్వేదేవదేవతలకు, విశ్వభూతములకు క్రమముగా బలిని ఇవ్వవలెను.

ఉషసే భూతపతయే దద్యాచ్చోత్తరతస్తతః ।
స్వధా నమ ఇతీత్యుక్త్వా పితృభ్యశ్చాపి దక్షిణే ॥103॥

ఉషస్సు, భూతపతి ఈ ఇరువురికి ఉత్తరదిక్కునందు బలిప్రదానము చేయవలెను. పిమ్మట "స్వధా నమః" అను వాక్యమును ఉచ్చరించుచు దక్షిణదిక్కునందు పితృదేవతలకు బలిని ఇవ్వవలెను.

కృత్వాపసవ్యం వాయవ్యాం యక్ష్మైతత్తేతి భాజనాత్ ।
అన్నావశేషమిచ్ఛన్వై తోయం దద్యాద్యథావిధి ॥104॥

అపసవ్యమును చేసుకొని వాయవ్యదిక్కునందు "ఓ యక్ష్మా ! ఇది నీకు" అని చెప్పుచూ విధ్యుక్తప్రకారము కోరికననుసరించి మిగిలిన అన్నమును, పాత్రనుండి నీటిని దానముగా ఇవ్వవలెను. (యక్ష్మ అనగా క్షయరోగము).

తతోఽన్నాగ్రం సముద్ధృత్య హన్తకారోపకల్పనమ్ ।
యథావిధి యథాన్యాయం బ్రాహ్మణాయోపపాదయేత్ ॥105॥

అటు పిమ్మట అన్నముయొక్క అగ్రభాగమును తీసుకొని హన్తకారముయొక్క సంకల్పము చేసి యథావిధిగా మరియు యథాన్యాయముగా బ్రాహ్మణులకు ఇవ్వవలెను.

కుర్యాత్కర్మాణి తీర్థేన స్వేన స్వేన యథావిధి ।
దేవాదీనాం తథా కుర్యాద్బ్రాహ్మణేనాచమనక్రియామ్ ॥106॥

విధ్యుక్తప్రకారము ఆయా మానవుడు తమ తమ తీర్థయోగములందు కార్యములను నిర్వహించవలెను. అట్లే దేవతాదులనుద్దేశించి బ్రాహ్మణుడు ఆచమనక్రియను నిర్వహించవలెను.

అఙ్గుష్ఠోత్తరతో రేఖా పాణేర్యా దక్షిణస్య తు ।
ఏతద్బ్రాహ్మమితి ఖ్యాతం తీర్థమాచమనాయ వై ॥107॥

కుడిచేయి బొటనవ్రేలునకు ఉత్తరభాగమందున్న రేఖ ఏది కలదో ఆ భాగము బ్రహ్మతీర్థమని కీర్తింపబడినది. ఈ తీర్థము ద్వారా ఆచమనము చేయవలెను.

తర్జన్యఙ్గుష్ఠయోరన్తః పైత్రం తీర్థముదాహృతమ్ ।
పితౄణాం తేన తోయాది దద్యాన్నాందీముఖాదృతే ॥108॥

తర్జని (చూపుడువ్రేలు) మరియు బొటనవ్రేలు ఈ రెంటి మధ్య ఉన్న భాగమునకు పితృతీర్థమని పేరు. ఈ తీర్థము ద్వారా నాందీముఖశ్రాద్ధము తప్ప మిగిలిన కార్యములందు పితృదేవతలకు జలమునీయవలెను.

అఙ్గుల్యగ్రే తథా దైవం తేన దివ్యక్రియావిధిః ।
తీర్థం కనిష్ఠికామూలే కాయం తేన ప్రజాపతేః ॥109॥

బొటనవ్రేలుకు అగ్రభాగమందున్న తీర్థము దైవతీర్థమని వ్యవహరింపబడుచున్నది. ఈ తీర్థముద్వారా దేవతాకార్యములను నిర్వహించవలెను. చిటికెనవ్రేలు మూలభాగమందున్న ప్రదేశమునకు కాయతీర్థమని వ్యవహారము. దీనితో ప్రజాపతికి తర్పణములను ఇవ్వవలెను.

ఏవమేభిః సదా తీర్థైర్దేవానాం పితృభిస్సహ ।
సదా కార్యాణి కుర్వీత నాన్యతీర్థేన కర్హిచిత్ ॥110॥

ఈ విధముగా నిర్దేశింపబడిన ఆయా తీర్థములద్వారా ఎల్లప్పుడు దేవతాకార్యములు, పితృకార్యములను నిర్వర్తించవలెను. వేరే తీర్థముల ద్వారా నిర్వర్తించరాదు.

బ్రాహ్మేణాచమనం శస్తం పిత్ర్యం పైత్రేణ సర్వదా ।
దేవతీర్థేన దేవానాం ప్రాజాపత్యం నిజేన చ ॥111॥

నాందీముఖానాం కుర్వీత ప్రాజ్ఞః పిండోదకక్రియామ్ ।
ప్రాజాపత్యేన తీర్థేన యచ్చ కిఞ్చిత్ప్రజాపతేః ॥112॥

బ్రహ్మతీర్థము ద్వారా ఆచమనము చేయుట ప్రశస్తమైనది. పితృతీర్థము ద్వారా పితృకార్యములు, దేవతీర్థముద్వారా దేవతాకార్యములు, ప్రజాపతికి సంబంధించిన కార్యములు స్వీయతీర్థము (కాయతీర్థము) ద్వారా నిర్వర్తించవలెను.

యుగపజ్జలమగ్నిం చ బిభృయాన్న విచక్షణః ।
గురుదేవాన్ప్రతి తథా న చ పాదౌ ప్రసారయేత్ ॥113॥

బుద్ధిమంతుడైనవాడు ఒకేసారి జలమును, అగ్నిని ధరించరాదు. గురుదేవుల ముందు పాదములను చాచుకొనరాదు.

నాచక్షీత ధయన్తీం గాం జలం నాఞ్జలినా పిబేత్ ।
శౌచకాలేషు సర్వేషు గురుష్వల్పేషు వా పునః ॥114॥

న విలంబేత శౌచార్థం న ముఖేనానలం ధమేత్ ।

పాలిచ్చుచుండగా గోవును చూడరాదు. దోసిలితో నీళ్ళను త్రాగరాదు. అధికమయిననూ, కొంచెమైననూ సమస్త శౌచకాలములందు శౌచము నిమిత్తమై ఆలస్యము చేయరాదు. శౌచక్రియలను వెంటనే చేయవలెను. నోటితో నిప్పును ఊది ప్రజ్వలింపచేయరాదు.

తత్ర పుత్ర న వస్తవ్యం యత్ర నాస్తి చతుష్టయమ్ ॥115॥

ఋణప్రదాతా వైద్యశ్చ శ్రోత్రియః సజలా నదీ ।
జితామిత్రో నృపో యత్ర బలవాన్ధర్మతత్పరః ॥116॥

తత్ర నిత్యం వసేత్ ప్రాజ్ఞః కుతః కున్నృపతేస్సుఖమ్ ।

అప్పు ఇచ్చువాడు, వైద్యుడు, పండితుడు, నీళ్ళు పారుతున్న నది ఈ నాలుగు ఏ ప్రదేశమందు ఉండవో ఆ ప్రదేశమందు నివసించరాదు. శత్రువులను జయించినవాడు, బలవంతుడు, ధర్మశీలుడు అయిన రాజు ఎచ్చట ఉండునో అచ్చట బుద్ధిమంతుడైనవాడు నివసించవలెను. దుష్టుడైన రాజువలన సుఖమెక్కడిది?

యత్రాప్రధృష్యో నృపతిర్యత్ర సస్యవతీ మహీ ॥117॥

పౌరాః సుసంయతా యత్ర సతతం న్యాయవర్తినః ।
యత్రామత్సరిణో లోకాస్తత్ర వాసః సుఖోదయః ॥118॥

తిరస్కరింపబడని పరాక్రమముగల రాజు, సస్యశ్యామలమైన భూమి, సక్రమమైన ప్రవర్తన కలిగి న్యాయబద్ధముగా ప్రవర్తించు జనులు, ఈర్ష్యాసూయలు లేని ప్రజలు ఎచ్చట నివసించెదరో అట్టి ప్రదేశమందు నివసించుట వలన సుఖము కలుగును.

యస్మిన్ కృషీవలా రాష్ట్రే ప్రాయశో నాతిభోగినః ।
యత్రౌషధాన్యశేషాణి వసేత్తత్ర విచక్షణః ॥119॥

ఏ రాష్ట్రమందు రైతులు తరచుగా మిక్కిలి భోగములేక జీవింతురో, ఇంకను అసంఖ్యాకముగా ఔషధములు లభించునో అచ్చట బుద్ధిమంతుడైనవాడు నివసించవలెను.

తత్ర పుత్ర న వస్తవ్యం యత్రైతత్ త్రితయం సదా ।
జిగీషుః పూర్వవైరశ్చ జనశ్చ సతతోత్సవః ॥120॥

వసేన్నిత్యం సుశీలేషు సహవాసిషు పండితః ।
ఇత్యేతత్ కథితం పుత్ర మయా తే హితకామ్యయా ॥121॥

ఓ కుమారా! ఎచ్చట జయించాలని కోరికగలవారు, పూర్వశత్రువులు, ఎల్లప్పుడు లౌకిక సుఖంలో తేలియాడువారు ఈ ముగ్గురు ఉందురో అట్టి ప్రదేశమందు నివసించరాదు. బుద్ధిమంతుడైనవాడు మంచి ప్రవర్తన కలిగిన తోటివారితో నివసించవలెను. ఓ కుమారా! నీ హితమును కోరి నేనీ విషయములన్నింటిని చెప్పితిని.

ఇతి శ్రీమార్కండేయ మహాపురాణే అలర్కానుశాసనే సదాచారవర్ణనం నామ ఏకత్రింశోఽధ్యాయః ॥31॥

శ్రీ మార్కండేయ మహాపురాణమందు అలర్కానుశాసనమందలి సదాచారవర్ణనమను ముప్పది యొకటవ అధ్యాయం సమాప్తం.



ద్వాత్రింశోఽధ్యాయః - ముప్పదిరెండవ అధ్యాయం
ధర్మాధర్మనిరూపణమ్ - ధర్మాధర్మనిరూపణం

మదాలసా ఉవాచ - మదాలస చెప్పింది.

అతఃపరం శృణుష్వ త్వం వర్జ్యావర్జ్యప్రతిక్రియామ్ ।
భోజ్యమన్నం పర్యుషితం స్నేహాక్తం చిరసంభృతమ్ ॥1॥

అస్నేహాశ్చాపి గోధూమయవగోరసవిక్రియాః ।
శశకః కచ్ఛపో గోధా శ్వావిత్ఖడ్గోఽథ పుత్రక ॥2॥

భక్ష్యా హ్యేతే తథా వర్జ్యౌ గ్రామశూకరకుక్కుటౌ ।
పితృదేవాదిశేషం చ శ్రాద్ధే బ్రాహ్మణకామ్యయా ॥3॥

ప్రోక్షితం చౌషధార్థం చ ఖాదన్మాంసం న దుష్యతి ।

ఓ కుమారా! ఇటుపైన వర్జ్యములు, అవర్జ్యములు అనగా విడిచిపెట్టతగినవి మరియు గ్రహింపతగినవి అగు పదార్థముల ప్రతిక్రియను గూర్చి చెప్పెదను, వినుము. కొంతకాలము నిల్వయుంచినది, తైలముతో కూడినది, చాలకాలము తర్వాత సంపాదింపబడినదీ అగు అన్నము తినతగినది. అట్లే తైలసిక్తముకాని గోధుమపదార్థములు, యవలు, విరిగినపాలు వీటిని భుజించవచ్చును. అట్లే కుందేలు, తాబేలు, గోధ (సర్పవిశేషము), శ్వావిత్ (జంతువిశేషము), ఖడ్గమృగము, వీటిని భక్షించవచ్చును. గ్రామసూకరము, గ్రామకుక్కుటము వీటిని తినరాదు, విడిచిపెట్టవలెను. శ్రాద్ధమందలి పితృశేషము, దేవతాశేషములను బ్రాహ్మణులు ఇచ్ఛగించినచో భుజించవచ్చును. యజ్ఞములందు సంస్కారార్థమై వినియోగించిన మాంసమును, ఔషధార్థమైన మాంసమును తినవచ్చును. అట్లు తిన్ననూ ఎట్టి దోషములు అంటవు.

శంఖాశ్మస్వర్ణరూప్యాణాం రజ్జూనామథ వాససామ్ ॥4॥

శాకమూలఫలానాం చ తథా విదలచర్మణామ్ ।
మణివజ్రప్రవాలానాం తథా ముక్తాఫలస్య చ ॥5॥

గాత్రాణాం చ మనుష్యాణామంబునా శౌచమిష్యతే ।
తథాయసానాం తోయేన గ్రావ్ణః సంఘర్షణేన చ ॥6॥

శంఖము, రాళ్ళు, బంగారము, వెండి, త్రాడు, వస్త్రము, కూరలు, దుంపలు, ఫలములు, విదలవస్తువులు (పగిలినవి), చర్మము, మణులు, వజ్రములు, పగడములు, ముత్యములు, మానవశరీరము వీటిని నీటితో శుద్ధము చేయవలెను. ఇనుపపాత్రలను నీటితో, రాళ్ళను రాపిడితో శుద్ధము చేయవలెను.

సస్నేహానాం చ భాండానాం శుద్ధిరుష్ణేన వారిణా ।
శూర్పధాన్యాజినానాం చ ముసలోలూఖలస్య చ ॥7॥

సంహతానాం చ వస్త్రాణాం ప్రోక్షణాత్సఞ్చయస్య చ ।
వల్కలానామశేషాణామంబుమృచ్ఛౌచమిష్యతే ॥8॥

నూనె అంటిన పాత్రలను వేడినీటితో శుద్ధిచేయవలెను. చేటయందలి ధాన్యము, లేడిచర్మము, రోకలి, రోలు, దళసరి వస్త్రములు వీటిని జలప్రోక్షణముతో శుద్ధము చేయవలెను. అన్నిరకముల నారబట్టలను నీటితోనూ, మట్టితోనూ శుద్ధము చేయవలెను.

తృణకాష్ఠౌషధీనాం చ ప్రోక్షణాచ్ఛుద్ధిరిష్యతే ।
ఆవికానాం సమస్తానాం కేశానాం చాపి మేధ్యతా ॥9॥

సిద్ధార్థకానాం కల్కేన తిలకల్కేన వా పునః ।
సాంబునా తాత భవతి ఉపఘాతవతాం సదా ॥10॥

ఓ కుమారా! గడ్డి, కట్టెలు ఔషధులు వీటిని కూడా నీటిని చల్లి శుద్ధిచేయవలెను. గొర్రెల ఊలుతో తయారయిన వస్తువులు పవిత్రములే. తెల్లని ఆవాలను కల్కముతోను (నూనెతో కూడిన పదార్థము), తిలకల్కముతోనూ (తిలలతో కూడిన పదార్థము) యుక్తపరచి శుద్ధము చేయవలెను. కొంతభాగము నశించిన లేదా పాడైన వస్తువులను నీటితో శుద్ధము చేయవలెను.

తథా కార్పాసికానాం చ విశుద్ధిర్జలభస్మనా ।
నాగదన్తాస్థిశృఙ్గాణాం తత్క్షణాచ్ఛుద్ధిరిష్యతే ॥
పునః పాకేన భాండానాం పార్థివానాం చ మేధ్యతా ॥11॥

నూలుతో తయారయిన వస్త్రములను జలముతోనూ, భస్మముతోను శుద్ధిపరచవలెను. ఏనుగుదంతములు, ఎముకలు, కొమ్ములు వీటికి వెంటనే శుద్ధి కోరబడుచున్నది. ఎలా ఉన్నాయో అట్లే వాటికి శుద్ధి అంగీకరింపబడుచున్నదని ఆశయము. మట్టిపాత్రలను రెండవసారి నిప్పుల కొలిమిలో పెట్టి శుద్ధిపరచవలెను.

శుచిర్భైక్షం కారుహస్తైః పణ్యం యచ్చ ప్రసారితమ్ ।
యోషిన్ముఖం బాలముఖమాత్మవృద్ధముఖం తథా ॥12॥

రథ్యాగతమవిజ్ఞాతం దాసవర్గాదినాహృతమ్ ।
వాక్ప్రశస్తం చిరాతీతమనేకాన్తరితం లఘు ॥13॥

అతిప్రభూతం బాలం చ వృద్ధాతురవిచేష్టితమ్ ।
కర్మాన్తాఙ్గారశాలాశ్చ స్తనంధయసుతాః స్త్రియః ॥14॥

అభ్యస్య చ తథా వాపః ప్రవన్త్యోఽగన్ధబుద్బుదాః ।

భిక్షను ఆచరించి సంపాదించిన ఆహారము, శిల్పి తయారుచేసి అమ్మకానికి పెట్టిన వస్తువులు, స్త్రీముఖము, బాలుర ముఖము, తన ముఖము, వృద్ధుల ముఖము, మార్గమందు పడియున్న తెలియని వస్తువులు, దాసజనము

తీసుకువచ్చిన వస్తువులు, వాక్కుచేత ప్రశంసింపబడినది, చాలాకాలము గడచినది, చాలామంది చేత దాచబడినది, లాఘవము కలిగినది, మిక్కిలి హెచ్చు అయినది, వయస్సులో చిన్నది, వృద్ధులు మరియు ఆతురతగలవారి చేష్టలు, వంట పూర్తిఅయిన పిమ్మట వంటిల్లు, పాలిచ్చు స్త్రీలు, ప్రవహిస్తున్న నీరు, గంధము లేని నీటి బుడగలు ఇవియన్నియు సహజశుద్ధములే.

భూమిర్విశుధ్యతే కాలాద్దాహమార్జనగోక్రమైః ॥15॥

లేపాదుల్లేఖనాత్సేకాద్వేశ్మసమ్మార్జనార్చనాత్ ।
కేశకీటావపన్నేఽన్నే గోఘ్రాతే మక్షికాన్వితే ॥16॥

మృదంబుభస్మనా తాత ప్రోక్షితవ్యం విశుద్ధయే ।
ఔదుంబరాణామమ్లేన క్షారేణ త్రపుసీసయోః ॥17॥

వ్యర్థపదార్థములను దహించుటచేతను, ఊడ్చుటచేతను, గోసంచారము చేతను భూమి శుభ్రమగుచున్నది. అట్లే గోమయముతో అలకడంచేత, అవసరమైనచోట త్రవ్వుటచేత, కడుగుటచేత, దేవతార్చనముచేత గృహమును శుభ్రము చేయవలెను. ఓ తండ్రీ! (కుమారా!) వెంట్రుకలు, క్రిములచేత కూడుకొన్నది, గోవు వాసన చూచినది, ఈగలతో కూడుకొన్నదీ అయిన అన్నమును శుద్ధము చేయుటకు ఆ అన్నముపై మట్టి, నీరు, భస్మములను చల్లవలెను. రాగితో చేయబడిన వస్తువులను చింతపండుతోను, త్రపుసీసములను ఉప్పుతోను శుభ్రము చేయవలెను.

భస్మాంబుభిశ్చ కాంస్యానాం శుద్ధిః ప్లావో ద్రవస్య చ ।
అమేధ్యాక్తస్య మృత్తోయైర్గంధాపహరణేన చ ॥18॥

అన్యేషాం చైవ తద్ద్రవ్యైర్వర్ణగంధాపహారతః ।

కంచుపాత్రలను భస్మము, జలములతో శుద్ధిచేయవలెను. ప్రవహించే నీరు పవిత్రము. మలమూత్రాదులతో కూడుకొన్న వస్తువులను మట్టిజలములతోనూ మరియు వాటి దుర్గంధమును పోగొట్టుటద్వారాను శుద్ధము చేయవలెను. ఇంకనూ అటువంటి వస్తువులను రంగు వాసనలను పోగొట్టుట ద్వారా మట్టినీరుతో శుభ్రము చేయవలెను.

చాండాలైరంత్యజైశ్చైవ మ్లేచ్ఛైరస్పృశ్యజాతిభిః ॥19॥

స్పృష్టమక్షాలితం ధాన్యమనర్హం సర్వకర్మణి ।
ద్రోణాదధస్తు యద్ధాన్యం తస్యాయం విధిరుచ్యతే ॥20॥

ద్రోణాదూర్ధ్వం తు యద్ధాన్యం ప్రోక్షణాదేవ శుధ్యతి ।
రథ్యాసు పతితం ధాన్యం దృష్ట్వా యత్నేన వన్దయేత్ ॥21॥

ఉద్ధృత్య మూర్ధ్నా చాదద్యాల్లక్ష్మీర్నశ్యతి చాన్యథా ।

చండాలురు, సంకరజాతివారు, మ్లేచ్ఛులు, అస్పృశ్యులు వీరిచే ముట్టబడిన ధాన్యమును కడుగకపోయినచో, అట్టి ధాన్యము సమస్త కర్మలందు అర్హము కాదు. ద్రోణపరిమాణముకంటే తక్కువగా ఉన్న ధాన్యవిషయమందే ఇట్టి నియమము చెప్పబడినది. ఇక ద్రోణపరిమాణముకంటే ఎక్కువగా ఉన్నచో అట్టి ధాన్యమును నీళ్ళు చల్లుటద్వారా శుద్ధి చేయవలెను. నడిచే దారియందు పడియున్న ధాన్యమును చూచినచో ప్రయత్నపూర్వకముగా నమస్కారము చేసి, పైకి తీసుకొని శిరస్సునందు ధరించవలెను. లేనిచో సంపదలు నశించును.

శుచి గోతృప్తికృత్తోయం ప్రకృతిస్థం మహీగతమ్ ॥22॥

తథా మాంసం చ చండాలక్రవ్యాదాదినిపాతితమ్ ।
రథ్యాగతం చ చేలాది తాత వాతాచ్ఛుచి స్మృతమ్ ॥23॥

భూమిమీద యథాతథ స్థితిలో ఉన్నట్టిదై గోవులను సంతృప్తిపరిచే జలము శుద్ధమైనది. అట్లే చండాలురు, మాంసభుక్కులు వీరిచేత చంపబడిన జీవుల మాంసము కూడా శుద్ధమని చెప్పబడుచున్నది. ఇంకను ఓ కుమారా! మార్గమందు పడిన వస్త్రములు గాలిచేతనే శుద్ధములగుచున్నవి.

రజోఽగ్నిరశ్వో గౌశ్ఛాయారశ్మయః పవనో మహీ ।
విప్రుషో మక్షికాద్యాశ్చ దుష్టసంగాదదోషిణః ॥24॥

ధూళి, అగ్ని, గుర్రము, గోవు, నీడ, కిరణములు, గాలి, భూమి, నీటిబిందువులు, ఈగలు మొదలగునవి దుష్టసంపర్కము కలిగినవి అయినప్పటికినీ వాటికెట్టి దోషమూ లేదు.

అజాశ్వౌ ముఖతో మేధ్యౌ న గోర్వత్సస్య చాననమ్ ।
మాతుః ప్రస్రవణం మేధ్యం శకునిః ఫలపాతనే ॥25॥

మేక, గుర్రముల ముఖములు పవిత్రములు. గోవు, దూడ వీటి ముఖములు పవిత్రములు కావు. తల్లిపాలు పవిత్రము. పక్షులు తిని పడవేసిన ఫలములు పవిత్రములు.

ఆసనం శయనం యానం నావః పథి తృణాని చ ।
సోమసూర్యాంశుపవనైః శుధ్యన్తే తాని పణ్యవత్ ॥26॥

ఆసనము, శయనము, యానము, నావలు, మార్గమందలి గడ్డి, ఈ వస్తువులు, ఆపణమందు అమ్మకము కొరకు ఉంచిన వస్తువులవలె, సూర్యచంద్రుల కిరణములు మరియు గాలి సోకి శుద్ధమగుచున్నవి.

రథ్యా ప్రసర్పణే స్నానే క్షుతపానాన్నకర్మసు ।
ఆచామేత యథాన్యాయం వాసో విపరిధాయ చ ॥27॥

మార్గమందు నడిచివచ్చిన పిమ్మట, స్నానము ఆచరించిన పిమ్మట, తుమ్ముట, ద్రవద్రవ్యములను త్రాగుట, భోజనము చేయుట ఈ పనులు జరిగిన పిమ్మట వస్త్రములను మార్చుకొని శాస్త్రోక్త ప్రకారము ఆచమనము చేయవలెను.

స్పృష్టానామప్యసంస్పృశ్యైర్వ్యిరథ్యా కర్దమాంభసామ్ ।
పంకేష్టరచితానాం చ మేధ్యతా వాయుసంగమాత్ ॥28॥

దారియందలి బురద, నీరు ఇవి తాకరాని వస్తువులతో కలిసి స్పృశింపబడిననూ అవి పవిత్రములే. అపవిత్రములు కావు. అట్లే బురద, ఇటుకలచే తయారు అయిన వస్తువులు గాలి సోకుటద్వారా పవిత్రములగును.

ప్రభూతోపహతాదన్నాదగ్రముద్ధృత్య సన్త్యజేత్ ।
శేషస్థప్రోక్షణం కుర్యాదాచమ్యాద్భిస్తథా మృదా ॥29॥

అన్నపుసమూహము ఏ విధముగానైనా దూషితమైనచో, ఆ రాసియొక్క పైభాగమును కొంత తీసి విడిచిపెట్టవలెను. నీటితోను, మట్టితోను ఆచమనము చేసి ఆ అన్నపురాసియొక్క మిగిలిన భాగమును ప్రోక్షణము చేసి శుద్ధము చేయవలెను.

ఉపవాసస్త్రిరాత్రం తు దుష్టభక్ష్యాశినో భవేత్ ।
అజ్ఞాతే జ్ఞానపూర్వం తు తద్దోషోపశమేన తు ॥30॥

తెలియకగాని లేక తెలిసిగాని దుష్టమైన ఆహారమును భుజించినచో ఆ దోషమును పోగొట్టుకొనుటకై మూడు రాత్రులు ఉపవాసము చేయవలెను.

ఉదక్యాశ్వశృగాలాదీన్ సూతికాన్త్యావసాయినః ।
స్పృష్ట్వా స్నాయీత శౌచార్థం తథైవ మృతహారిణః ॥31॥

ఋతుమతియైన స్త్రీ, కుక్క, నక్క, సూతిక (అప్పుడే ప్రసవించిన స్త్రీ), చండాలుడు మరియు శవవాహకులను స్పృశించినచో శుద్ధికొరకు స్నానమును ఆచరించవలెను.

నారం స్పృష్ట్వాఽస్థి సస్నేహం స్నాతః శుధ్యతి మానవః ।
ఆచమ్యైవ తు నిస్స్నేహం గామాలభ్యార్కమీక్ష్య వా ॥32॥

రక్తాదులతో కూడియున్న ఎముకలను తాకిన మానవుడు శుద్ధికొరకై స్నానము ఆచరించవలెను. అట్లుకాక ఎండిన ఎముకలను తాకినచో ఆచమనము చేసిననూ, గోవును స్పృశించుటచేతనూ, సూర్యుని చూచుటచేతనూ, శుద్ధము కాగలడు.

న లంబయేత్తథైవాసృక్ ష్ఠీవనోద్వర్తనాని చ ।
నోద్యానాదౌ వికాలేషు ప్రాజ్ఞస్తిష్ఠేత్కదాచన ॥33॥

రక్తము, ఉమ్మి, శరీరముపై పైపైపూతలు వీటిని ఆలంబనముగా చేసుకొనరాదు అనగా ధరించరాదు. కాలము కాని కాలమందు బుద్ధిమంతుడగు పురుషుడు ఉద్యానాదులందు నిలవరాదు.

న చాలపేజ్జనద్విష్టాం వీరహీనాం తథా స్త్రియమ్ ।
గృహాదుచ్ఛిష్టవిణ్మూత్ర పాదాంభాంసి క్షిపేద్బహిః ॥34॥

జనులచే నిందింపబడినదీ, వీరులైన భర్త లేదా పుత్రులు లేనిదీ అయిన స్త్రీతో సంభాషించరాదు. ఉచ్ఛిష్టము (తినివేయగా మిగిలిన భోజ్యపదార్థములు), రక్తము, మలమూత్రములు, కాళ్ళుకడిగిన నీరు వీటిని ఇంటినుంచి బయటకు పారవేయవలెను.

పఞ్చపిణ్డాననుద్ధృత్య న స్నాయాత్పరవారిణా ।
స్నాయీత దేవఖాతేషు గంగాహ్రదసరిత్సు చ ॥35॥

పంచపిండములను పైకి తీయకుండా అట్టి జలమందు స్నానము నాచరించరాదు. అటుపిమ్మటే పవిత్రజలములందు, గంగానదిలో, చెరువులలో, నదులలో స్నానము చేయవలెను.

దేవతాపితృసచ్ఛాస్త్రయజ్ఞమంత్రాదినిన్దకైః ।
కృత్వా తు స్పర్శనాలాపం శుధ్యేతార్కావలోకనాత్ ॥36॥

దేవతలను, పితృదేవతలను, ఆస్తికదర్శనములను, యజ్ఞములను, మంత్రములను మొ॥వారిని నిందించువారిని ముట్టుకొన్ననూ, లేదా వారితో మాటలాడిననూ శుద్ధి చేసుకొనుటకై సూర్యుని దర్శించవలెను.

అవలోక్య తథోదక్యామన్త్యజం పతితం శవమ్ ।
విధర్మి సూతికాషణ్డవివస్త్రాన్త్యావసాయినః ॥37॥

మృతనిర్యాతకాశ్చైవ పరదారరతాశ్చ యే ।
ఏతదేవ హి కర్తవ్యం ప్రాజ్ఞైః శోధనమాత్మనః ॥38॥

అట్లే బహిష్టు అయిన స్త్రీ, కులహీనులు, ధర్మభ్రష్టులు, శవము, ధర్మము తప్పినవారు, అప్పుడే ప్రసవించిన స్త్రీ, నపుంసకుడు, దిగంబరులు, తక్కువ కులములో పుట్టినవారు, సంస్కారములు చేయకుండా చనిపోయినవారిని వదిలివేయువారు, పరుల భార్యలందు ప్రీతిగలవారు ఎవరు గలరో వారిని స్పృశించినను లేదా వారితో మాటలాడిననూ అట్టివారు సూర్యదర్శనమువల్లనే శుద్ధులగుదురు.

అభోజ్యసూతికాషణ్డమార్జారాఖుశ్వకుక్కుటాన్ ।
పతితావిద్ధచండాలమృతహారాంశ్చ ధర్మవిత్ ॥39॥

సంస్పృశ్య శుధ్యతే స్నానాదుదక్యాగ్రామసూకరౌ ।
తద్వచ్చ సూతికాశౌచదూషితౌ పురుషావపి ॥40॥

తినకూడని పదార్థములు, అప్పుడే ప్రసవించిన స్త్రీ, నపుంసకుడు, పిల్లి, ఎలుక, కుక్క, కోడి, ధర్మభ్రష్టులు, ధర్మము తప్పినందున శిక్షింపబడినవారు, చండాలురు, శవములను మోయువారు, ఋతుకాలమందున్న స్త్రీ, గ్రామమందలి పంది, నవప్రసూతయగు స్త్రీ, ఆశౌచముగల పురుషుడు ఇట్టివారిని తాకిననూ, లేదా ఇట్టివారితో మాటలాడిననూ అట్టివారు సూర్యదర్శనమువల్లనే పరిశుద్ధులగుదురు.

అతఃపరం శృణుష్వ త్వం స్త్రీధర్మాన్నను విస్తరాత్ ।
ఉదుంబరే వసేన్నిత్యం భవానీ సర్వదేవతా ॥41॥

తతస్సా ప్రత్యహం పూజ్యా గంధపుష్పాక్షతాదిభిః ।

ఓ కుమారా! ఇటుపైన నీకు విస్తారముగా స్త్రీ ధర్మములను చెప్పెదను, వినుము. ఉదుంబర (మేడి) వృక్షమందు సర్వదేవతాస్వరూపిణియగు భవానీదేవి నివసించును. అందువలన గంధపుష్పఅక్షతాదులతో నిత్యము ఆమెను పూజించవలెను.

అశూన్యా దేహలీ కార్యా ప్రాతఃకాలే విశేషతః ॥42॥

యస్య శూన్యా భవేత్ సా తు శూన్యం తస్య కులం భవేత్ ।
పాదస్య స్పర్శనం తత్ర అసంపూజ్య చ లంఘనమ్ ॥43॥

కుర్వన్నరకమాప్నోతి తస్మాత్తత్పరివర్జయేత్ ।

ఇంటిగడపను ఎప్పుడూ శూన్యముగా అనగా ఎట్టి అలంకరణలూ లేకుండా ఉంచరాదు. ముఖ్యముగా ప్రాతఃకాలమందు గడప మరియు వాకిలి భాగమును సమ్మార్జనము చేసి అలంకరించవలెను. ఎవరి గడప శూన్యముగానే ఉండునో అట్టివారి వంశము కూడా ఎట్టి అభివృద్ధి లేకుండా శూన్యముగానే ఉండును. గడపను కాలితో త్రొక్కిననూ, ఎట్టి పూజలూ లేకుండా దాటిననూ అట్టివ్యక్తి నరకమును పొందును. కావున అట్లు చేయరాదు.

ప్రాతఃకాలే స్త్రియా కార్యం గోమయేనాఽనులేపనమ్ ॥44॥

ప్రత్యహం సదనే తస్మాన్నైవ దుఃఖాని పశ్యతి ।
స్పృశన్తి రశ్మయో యస్య గృహం సమ్మార్జనాదృతే ॥45॥

భవన్తి విముఖాస్తస్య పితరో దేవమాతరః ।

ఉదయాన్నే స్త్రీలు ఇంటివాకిలిని గోవుపేడతో అలకవలెను. ప్రతీరోజు ఏ ఇంటిని ఇట్లు చేసెదరో ఆ ఇంట దుఃఖములు కలుగవు. ఎవరి ఇంట ఊడ్చకుండా సూర్యకిరణములు పడునో ఆ ఇంట పితృదేవతలు, దేవమాతలు విముఖులుగా ఉందురు.

నిశాయాః పశ్చిమే యామే ధాన్యసంస్కరణాదికమ్ ॥46॥

కురుతే యా తు మోహేన వంధ్యా జన్మని జన్మని ।
సంధ్యాకాలే తు సంప్రాప్తే మార్జనం న కరోతి యా ॥47॥

భర్తృహీనా భవేత్సా తు నిస్స్వా జన్మని జన్మని ।

రాత్రి మూడుగంటల జామునందు ధాన్యమును దంచుట మొదలగు పనులను తెలియక ఏ స్త్రీ చేయునో అట్టి స్త్రీ జన్మజన్మలకు గొడ్రాలిగా జన్మించును. సంధ్యాకాలమందు ఏ స్త్రీ ఇంటిని ఊడ్చదో అట్టి స్త్రీ పతిహీనురాలు అగును, అంతేకాక జన్మజన్మలకు పేదరాలిగా జన్మించును.

అకృతస్వస్తికాం యా తు కామలిప్తాం చ మేదినీమ్ ॥48॥

తస్యాః స్త్రియః వినశ్యన్తి విత్తమాయుర్యశస్తథా ।

ఏ స్త్రీ వాకిలి శుభ్రము చేసి ముగ్గులు పెట్టదో మరియు తనకిష్టము వచ్చినట్లు అశ్రద్ధగా లేపనము అనగా అలుకుట చేయునో అట్టి స్త్రీ యొక్క ధనము, ఆయుర్దాయము, కీర్తి నశించును.

మార్జనీ చుల్లి కాష్ఠీవద్దృషదశ్చోపలం తథా ॥49॥
నాక్రమేదంఘ్రిణా జాతు పుత్రదారధనక్షయాత్ ।

చీపురు, వంటచేయుటకు అగ్నిని స్థాపించు స్థానము (చుల్లి), వంటచేయుటకు కాష్ఠములను స్థాపించు స్థానము, తదర్థమై పాషాణములు వీటిని పాదములతో తాకరాదు. అట్లు చేసినచో సంతానము, భార్య, ధనము నశించును.

ఉలూఖలం చ ముసలం తథా చైవ తు ఘర్షణమ్ ॥50॥
పదాక్రమణాత్పాపీయాన్నాప్నోత్యుత్తమతాం గతిమ్ ।

చేట, తిరగలి, రోలు, రోకలిబండ వీటిని అవసరములేకుండా వత్తిడి చేయుటగాని, పాదములతో తన్నుటగాని చేసినచో అట్టి వ్యక్తి ఉత్తములు పొందే పుణ్యలోకములను పొందదు.

భిన్నాసనం యోగపట్టం తథైవ మృగచర్మ చ ॥51॥
కృష్ణావికం తథా తాత వర్జయేత్పుత్రవాన్ గృహీ ।

ఓ కుమారా ! విరిగిన ఆసనము, యోగులు ధరించే లేదా కూర్చునే వస్త్రవిశేషము, లేడిచర్మము, నల్లని కంబళి వీటిని పుత్రవంతుడైన గృహస్థుడు ఉపయోగించరాదు, విడిచిపెట్టవలెను.

దక్షిణాభిముఖో యస్తు విదిక్సమ్ముఖ ఏవ చ ॥52॥
కేశాన్ సంస్కురుతే మర్త్యో ధననాశం చ విన్దతి ।

అనూఢస్తు న కుర్వీత భుక్త్వా దన్తవిశోధనమ్ ॥53॥

దక్షిణాభిముఖముగాను, నైఋతి మొదలగు విదిక్స్థానములందు ఏ మానవుడైతే కేశసంస్కారమును చేసుకొనునో అట్టి మానవుడు ధననాశమును పొందును. పెండ్లికానివాడు భోజనము చేసిన పిమ్మట పండ్లను తోమరాదు.

పాదుకారోహణం చైవ తిలైశ్చాపి సతర్పణమ్ ।
న జీవత్పితృకః కుర్యాదర్ధకక్షోత్తరీయకమ్ ॥54॥

పాదుకలను ధరించుట, నువ్వులతో తర్పణములిచ్చుట, అర్ధవస్త్రమును కప్పుకొనుట ఇట్టి పనులను తండ్రి బ్రతికియున్నవాడు చేయరాదు.

దర్శశ్రాద్ధం న కుర్వీత దర్శస్నానం కథంచన ।
పాదుకారోహణం చైవ యోగపట్టకమేవ చ ॥55॥

న జీవత్పితృకః కుర్యాద్గయాశ్రాద్ధం తథైవ చ ।

అమావాస్యనాడు శ్రాద్ధమునాచరించుట, దానికి సంబంధించిన స్నానము చేయుట, పాదుకలను ధరించుట, యోగపట్టమును ధరించుట, గయాక్షేత్రములో శ్రాద్ధము పెట్టుట ఇట్టి పనులను తండ్రి బ్రతికియున్నవాడు ఆచరించరాదు.

దీపభాండమయీ చ్ఛాయా విభీతకకురంటజా ॥56॥
వర్జనీయా సదా పుత్ర యది జీవితుమిచ్ఛతి ।

ఓ కుమారా ! పాత్రలో నూనెపోసి దీపమును వెలిగించగా సంభవించిన నీడను, తాటిచెట్లు, కురంట వృక్షములు వీటివల్ల కలిగిన నీడను జీవించాలనే కోరిక గలవాడు ఎల్లప్పుడు విడిచిపెట్టవలెను.

అధోవస్త్రేణ యో వాయుం కురుతే శిరసి ద్విజ ॥57॥
స్థాలేన చర్మశూర్పాభ్యాం సుకృతం తస్య నశ్యతి ।

ఓ బ్రాహ్మణకుమారా! ఎవరయితే తాను క్రిందకు ధరించిన వస్త్రమును పైకెత్తి తలకు తగులునట్లుగా విసరుకొనునో, ఇంకను అన్నము తినుటకు కావలసిన ఆధారము, చర్మము, చాట వీటితోనూ విసరుకొనునో అట్టివాని పుణ్యము నశించును.

అలర్క ఉవాచ – అలర్కుడు పలికాడు.

భవత్యా కీర్తితా భోజ్యా యయేతే సూతికాదయః ॥58॥
అమీషాం శ్రోతుమిచ్ఛామి తత్త్వతో లక్షణాని హ ।

ఓ తల్లీ ! నీవు సూతికాది భోజ్యముల గురించి చెప్పినవాటి విషయమై వాటి యథార్థలక్షణాలను నీనుండి వినగోరుచున్నాను. (యే + ఏతే = యయేతే)

మదాలసా ఉవాచ – మదాలస పలికింది.

బ్రహ్మణీ బ్రహ్మణస్యేహ యాఽవరోధత్వమాగతా ॥59॥
తావుభౌ సూతికేత్యుక్తౌ తయోరన్నం విగర్హితమ్ ।

బ్రాహ్మణుడు, బ్రాహ్మణుని భార్య వీరిరువురికి ఆశౌచాది అవరోధము సంభవించినప్పుడు వారిరువురు సూతికలని చెప్పబడుచున్నారు. వారి అన్నము నిందింపతగినది.

న జుహోత్యుచితే కాలే నాశ్నాతి న దదాతి చ ॥60॥
పితృదేవార్చనాద్ధీనః షణ్డః స పరిగీయతే ।

ఎవరయితే ఉచితకాలమందు హోమాదికార్యములను నిర్వర్తించడో, భోజనము చేయడో, దానము చేయడో ఇంకను దేవతలను మరియు పితృదేవతలను పూజించడో అట్టివాడు షండుడు అనగా నపుంసకుడని పిలవబడుచున్నాడు.

దంభార్థే యజతే యశ్చ తప్యతే చ తపస్తథా ॥61॥
న పరార్థమిహేత్యుక్తః స మార్జారస్స్మృతో బుధైః ।

ఎవరయితే పారమార్థికము కొరకు కాకుండా ఆడంబరము కొరకు యజ్ఞయాగాదులను చేయునో, తపస్సు ఆచరించునో అట్టివానిని మార్జాలమని (పిల్లియని) పండితులు చెప్పుచున్నారు.

విభవే సతి నైవాత్తి న దదాతి జుహోతి చ ॥62॥
తమాహురాఖుస్తస్యాన్నం భుక్త్వా కృచ్ఛ్రేణ శుధ్యతి ।

సంపదలున్ననూ తాను అనుభవించక దానము మరియు యజ్ఞయాగాదులను ఆచరించడో అట్టివానిని ఆఖువు అనగా ఎలుకయని పిలుచుచున్నారు. అతని అన్నము తిన్నవాడు వ్రతాచరణచేతనే శుద్ధుడగును.

సమాగతానాం మర్త్యానాం పక్షపాతం సమాశ్రయేత్ ॥63॥
తమాహుః కుక్కుటం దేవాస్తస్యాప్యన్నం విగర్హితమ్ ।

ఎవరయితే తనవద్దకు వచ్చినవారిని సమబుద్ధితో కాకుండా పక్షపాతబుద్ధితో చూచునో అట్టివానిని దేవతలు కుక్కుటము అనగా కోడియని పిలుచుచున్నారు. అతని అన్నము కూడా నిందింపతగినదే.

స్వధర్మం యస్సముచ్ఛిద్య పరధర్మం సమాశ్రయేత్ ॥64॥
అనాపది చ విద్వద్భిః పతితః పరికీర్తితః ।

ఎట్టి ఆపదలు లేకున్నను ఎవరయితే తన ధర్మమును విడిచిపెట్టి, పరధర్మమును ఆశ్రయించునో అట్టి వ్యక్తి పతితుడు లేదా ధర్మభ్రష్టుడని విద్వాంసులు చెప్పుచున్నారు.

దేవత్యాగీ గురుత్యాగీ గురుపత్న్యుజ్ఝకస్తథా ॥65॥
గోబ్రాహ్మణస్త్రీవధకృదపవిద్ధః ప్రచక్షతే ।

దేవతలను, గురువులను, గురుపత్నిని సేవించకుండా విడిచిపెట్టువాడు మరియు గోవు, బ్రాహ్మణులు, స్త్రీలు వీరిని చంపువాడు పాపి లేదా అపవిత్రుడని పిలుచుచున్నారు.

యేషాం కులే న వేదోఽస్తి న శాస్త్రం నైవ చ వ్రతమ్ ॥66॥
తే నగ్నాః కీర్తితాస్సద్భిస్తేషామన్నం విగర్హితమ్ ।

ఎవరి కులమందు వేదాధ్యయనము, శాస్త్రాధ్యయనములు ఉండవో వ్రతాచరణములు ఉండవో అట్టివారిని నగ్నులని సత్పురుషులు పిలుచుచున్నారు. వారి అన్నము నిందింపతగినది, భుజించరాదు.

ఆశాకర్తుస్త్వదాతా చ దాతుశ్చ ప్రతిషేధకః ॥67॥
శరణాగతం యస్త్యజతి స చండాలో నరాధమః ।

ఆశ చూపి దానము చేయనివాడు, దానము చేయువానిని దానము చేయవద్దని నిషేధించువాడు, శరణుజొచ్చిన వారిని విడిచిపెట్టువాడు అతడే మనుష్యులలో అధముడు, చండాలుడని పిలవబడుచున్నాడు.

యో బాంధవైః పరిత్యక్తః సాధుభిర్బ్రాహ్మణైరపి ॥68॥
కుణ్డాశీ యశ్చ తస్యాన్నం భుక్త్వా చాంద్రాయణం చరేత్ ।

ఎవరినయితే బంధువులు, సాధువులు, బ్రాహ్మణులు విడిచిపెట్టితిరో, ఇంకను ఎవరయితే అధముల ఇంట భోజనము చేయునో అట్టివారియొక్క అన్నమును తిన్నచో ఆ పాపమును పోగొట్టుకొనుటకై చాంద్రాయణ వ్రతమును ఆచరించవలెను.

యో నిత్యకర్మణో హానిం కుర్యాన్నైమిత్తికస్య చ ।
భుక్త్వాన్నం తస్య శుద్ధ్యై చ త్రిరాత్రోపోషితో నరః ॥69॥

ఎవరయితే నిత్యనైమిత్తిక కర్మలకు హాని కలిగించునో అతని ఇంట అన్నమును తిన్న మానవుడు శుద్ధిని పొందుటకై మూడు రాత్రులు ఉపవాసము చేయవలెను.

యస్య చానుదినం హానిర్గృహే నిత్యస్య కర్మణః ।
యశ్చ బ్రాహ్మణసంత్యక్తః కిల్బిషీ స నరాధమః ॥70॥

ఎవని ఇంటియందు ప్రతిరోజు నిత్యకర్మలకు హాని కలుగునో మరియు ఎవడు బ్రాహ్మణులచే విడువబడినాడో అతడు పాపి మరియు మానవులలో అధముడు.

నిత్యస్య కర్మణో హానిం న కుర్వీత కదాచన ।
తస్య త్వకరణే బంధః కేవలం మృతజన్మసు ॥71॥

దశాహం బ్రాహ్మణస్తిష్ఠేద్దానహోమాదివర్జితః ।
క్షత్రియో ద్వాదశాహం చ వైశ్యో మాసార్ధమేవ చ ॥72॥

శూద్రస్తు మాసమాసీత నిత్యకర్మవివర్జితః ।
రోగగ్రహాదివిధినా నిత్యకర్మవిధిచ్యుతః ॥73॥

పాదకృచ్ఛ్రం తతః కృత్వా గాం దత్త్వా శుద్ధిమాప్నుయాత్ ।
తతః పరం నిజం కర్మ కుర్యుస్సర్వే యథోదితమ్ ॥74॥

నిత్యకర్మలకు హానిని ఎప్పుడునూ కలిగించరాదు. నిత్యకర్మలను అనుష్ఠించనిచో పుట్టుట గిట్టుటయను సంసారమందు బంధము మాత్రమే కలుగును. (బంధమనగా సంసారము, మోక్షము సిద్ధించదని అర్థము.) జాతాశౌచము మరణాశౌచములందు బ్రాహ్మణుడు పదిరోజులు దానహోమాదులు లేకుండా ఉండవలెను. క్షత్రియుడు పన్నెండురోజులు, వైశ్యుడు పదిహేను రోజులు, శూద్రుడు నెలరోజులు ఉండవలెను. రోగములు, గ్రహపీడలు కల్గినప్పుడు నిత్యకర్మలను అనుష్ఠించనివాడు పాదకృచ్ఛ్రవ్రతమును ఆచరించి, గోదానముచేసి శుద్ధిని పొందవలెను. అటుపిమ్మట తమకు విధింపబడిన కర్మలను అందరు తప్పక ఆచరించవలెను.

ప్రేతాయ సలిలం దేయం బహిర్గేహాచ్చ గోత్రికైః ।
ప్రథమేఽహ్ని తృతీయే వా సప్తమే నవమే తథా ॥75॥

భస్మాస్థిచయనం కార్యం చతుర్థే గోత్రికైర్దినే ।
ఊర్ధ్వం సంచయనాత్తేషామఙ్గస్పర్శో విధీయతే ॥76॥

సోదకైస్తు క్రియాస్సర్వాః కార్యాస్సంచయనాత్పరమ్ ।
స్పర్శ ఏవ సపిండానాం మృతాహని తథోభయోః ॥77॥

సమానగోత్రికులు ఇంటిబయట (చెరువులు, కాలువలు, నదులు మొదలగుచోట్ల) ప్రేతకు అనగా చనిపోయిన వ్యక్తికి మొదటి, మూడవ, ఏడవ, తొమ్మిదవ దినములందు జలదానము చేయవలెను. నాల్గవదినము పగటిపూట వారు భస్మము, ఎముకలను ప్రోగు చేయవలెను. ప్రోగు చేసిన తరువాత తమ అవయవములను తాము స్పృశించవలెను. సంచయనము తరువాత సహోదకులు సమస్త విధులను నెరవేర్చవలెను. చనిపోయినరోజు సపిండులను సహోదకులను, సగోత్రికులను స్పృశించుట మాత్రము చేయవలెను.

వృక్షాహిగోదంష్ట్రిశస్త్రతోయోద్బంధనవహ్నిషు ।
విషప్రపాతాదిమృతే ప్రాయోఽనాశకయోరపి ॥78॥

బాలే దేశాన్తరస్థే చ తథా ప్రవ్రజితే మృతే ।
సద్యశ్శౌచమథాన్యైశ్చ త్ర్యహముక్తమశౌచకమ్ ॥79॥

నైవౌర్ధ్వదైహికం కార్యం న చ కార్యోదకక్రియా ।

చెట్లు, పాములు, పశువులు, కోరలు కలిగిన క్రూరమృగములు, ఆయుధములు, నీరు, ఉరి, నిప్పు, విషము పైనుండి క్రిందకు పడుట, తపస్సు మొదలగు వ్రతములను ఆచరించుట, ఉపవాసము చేయుట మొదలగు కారణముల వలన ఎవరైనా తమ వారు మరణించినచో ఇంకను పసిపిల్లలు, దేశాంతరమందు ఉన్నవారు, సన్న్యసించినవారు మరణించినచో స్నానము ఆచరించినచో వెంటనే శౌచము (శుద్ధి) కలుగును. ఇతరులు అయితే మూడురోజులు ఆశౌచముండునని, అటుపిమ్మటే శుద్ధి కలుగునని చెప్పుచున్నారు. ఈ విధముగా మరణించినవారికి ఔర్ధ్వదైహిక క్రియలు మరియు జలదానములు ఉండవు.

గర్భస్రావే తథైవోక్తం పూర్ణకాలేన శుధ్యతి ॥80॥

బ్రాహ్మణానామహోరాత్రం క్షత్రియాణాం దినత్రయమ్ ।
షడ్రాత్రమపి వైశ్యానాం శూద్రాణాం ద్వాదశాహ్నికమ్ ॥81॥

గర్భస్రావము జరిగినప్పుడు కూడా ముందు చెప్పిన రీతిగానే ఆశౌచమును పాటించవలెను. విధ్యుక్తప్రకారము ఆశౌచకాలము ముగిసిన పిమ్మట శుద్ధుడగును. ఇట్టి సందర్భములో బ్రాహ్మణులకు ఒక రోజు, క్షత్రియులకు మూడురోజులు, వైశ్యులకు ఆరురోజులు, శూద్రులకు పన్నెండు రోజులు ఆశౌచము ముగిసిన పిమ్మట వారు శుద్ధులగుదురు.

సపిండానాం సపిండస్తు మృతేఽన్యస్మిన్మృతో యది ।
పూర్వాశౌచసమాఖ్యాతైః కార్యా తస్య దినైః క్రియా ॥82॥

తమవారు ఒకరు మరణించినప్పుడు ఆ కారణముగా కలిగిన అశౌచమందు తమ సపిండులెవరైనా మరణించిన సందర్భములో పూర్వము సంభవించిన ఆ ఆశౌచదినములనుండే ఆ రెండవవాని కర్మకాండను నిర్వహించవలెను.

ఏష ఏవ విధిర్దృష్టో జన్మన్యపి హి సూతకే ।
సపిండానాం సపిండేషు యథావత్సోదకేషు చ ॥83॥

జాతాశౌచమందు కూడా ఇట్టి శుద్ధిక్రియ తమ సపిండులకు, సమానోదకులకు వర్తించును.

జాతే పుత్రే పితుః స్నానం సచైలం తు విధీయతే ।
మృతే హి సర్వబంధూనామిత్యాహ భగవాన్ భృగుః ॥84॥

కొడుకు పుట్టినప్పుడు తండ్రి సచైలస్నానము (అనగా తాను ధరించిన వస్త్రములతో స్నానము) చేయవలెనని, మరణించినచో బంధువులందరు సచేలస్నానము చేయవలెనని భగవానుడైన భృగువు చెప్పెను.

తత్రాపి యది చాన్యస్మిన్ జాతే జాయేత చాపరః ।
తత్రాపి శుద్ధిరుద్దిష్టా పూర్వజన్మవతో దినైః ॥85॥

ఒకరు జన్మించిన పిమ్మట మరియొకరు జన్మించినయెడల మొదటివాని కొరకు చేసిన శుద్ధి రెండవవాని విషయములోనూ వర్తించును.

దశద్వాదశమాసార్ధమాససంఖ్యైర్దినైర్గతైః ।
స్వాః స్వాః కర్మక్రియాః కుర్యుః సర్వే వర్ణా యథావిధి ॥86॥

బ్రాహ్మణక్షత్రియాది సర్వవర్ణములవారును విధిననుసరించి పదిరోజులు, పన్నెండురోజులు, పదిహేనురోజులు, నెలరోజులు చనిపోయిన తమవారికి కర్మకాండలను నిర్వర్తించవలెను.

ప్రేతముద్దిశ్య కర్తవ్యమేకోద్దిష్టం తతఃపరమ్ ।
సపిండీకరణం చైవ కార్యమావత్సరాన్నరైః ॥87॥

తిరిగి ప్రేతనుద్దేశించి ఏకోద్దిష్టశ్రాద్ధమును (ఒక ప్రేతను ఉద్దేశించి చేసే కార్యము ఏకోద్దిష్టము) నిర్వర్తించవలెను, మరియు సంవత్సరమునకు సపిండీకరణమును మానవులు చేయవలెను.

తతః పితృత్వమాపన్నే దర్శపూర్ణాదిభిస్త్రిభిః ।
ప్రీణయంస్తస్య కర్తవ్యం యథాశ్రుతినిదర్శనమ్ ॥88॥

పితృదేవతగా రూపొందిన ఆ ప్రేతకు వేదోక్తానుసారముగా దర్శపూర్ణాదులగు మూడు యాగములతో ప్రీతిని కలిగించవలెను.

దానాని చైవ దేయాని బ్రాహ్మణేభ్యో మనీషిభిః ।
యద్యదిష్టతమం లోకే యచ్చాస్య దయితం గృహే ॥89॥

తత్తద్గుణవతే దేయం తదేవాక్షయమిచ్ఛతా ।
ప్రేతం ప్రేతం సముద్దిశ్య భూమిధేన్వాదికం స్వకమ్ ॥90॥

దద్యాద్యేనాస్య సంప్రీతాః పితరస్సన్తి పుత్రక ।

ఇంకను పండితులైనవారు బ్రాహ్మణులకు వివిధ దానములను చేయవలెను. లోకమందు ఇష్టమైన వస్తువులు ఏవి కలవో ఇంకను తన ఇంటియందు ప్రియమైన వస్తువు ఏది కలదో అట్టి వస్తువులను అక్షయసిద్ధికోరువాడు గుణవంతునికి దానము చేయవలెను. ఆయా ప్రేతను ఒక్కొక్కరిని ఉద్దేశించి తన స్వంతమైన భూమి, గోవులు మొదలగువాటిని దానము చేయవలెను. ఓ కుమారా! ఇట్లు దానము చేయుటవలన పితృదేవతలకు సంతోషము కలుగును.

పూర్ణైస్తు దివసైఃస్పృష్ట్వా సలిలం వాహనాయుధమ్ ॥91॥

ప్రతోదదండౌ చ తథా సమ్యగ్వర్ణాః కృతక్రియాః ।
స్వవర్ణధర్మనిర్దిష్టముపాదానం తథా క్రియాః ॥92॥

కుర్యుస్సమస్తాశ్శుచినః పరత్రేహ చ భూతినా ।
అధ్యేతవ్యా త్రయీ నిత్యం భవితవ్యం విపశ్చితా ॥93॥

ఓ కుమారా! ఆశౌచము పూర్తి అయిన పిమ్మట కర్మకాండను నిర్వర్తించిన ఆయా వర్ణములవారు నీరు, వాహనము, ఆయుధము, కొరడా, దండము వీటిని స్పృశించవలెను. అటుపిమ్మట తమ తమ ధర్మానుసారముగా కార్యములను చేపట్టవలెను. పవిత్రులై ఐహిక, ఆముష్మిక సంపదలను ఇచ్చునట్టి కార్యములను చేయవలెను. పండితుడైనవాడు నిత్యము వేదాధ్యయనము చేయవలెను.

ధర్మతో ధనమాహార్యం యష్టవ్యం చాపి యత్నతః ।
యచ్చాపి కుర్వతో నాత్మా జుగుప్సామేతి పుత్రక ॥94॥

ఓ కుమారా! ధర్మబద్ధముగా ధనమును సంపాదించవలెను. ప్రయత్నపూర్వకముగా యజ్ఞయాగాదులను అనుష్ఠించవలెను. ఏ కర్మను ఆచరించినచో ఆత్మకు నింద కలుగదో అట్టి కర్మను ఆచరించవలెను.

తత్కర్తవ్యమశంకేన యన్న గోప్యం మహాజనే ।
ఏవమాచరతో వత్స పురుషస్య గృహే సతః ।
ధర్మార్థకామసంప్రాప్త్యా పరత్రేహ చ శోభనమ్ ॥95॥

ఎట్టి కార్యము గొప్పవారివద్ద రహస్యముగా ఉంచదగినది కాదో అట్టి కార్యమును నిస్సంశయముగా ఆచరించవలెను. ఓ కుమారా! గృహస్థులు ఈ విధముగా ఆచరించినందువలన వారి ఇండ్లయందు ధర్మార్థకామములు లభించుటయే గాక అట్టి గృహస్థులకు ఇహలోకపరలోకములందు కల్యాణము సిద్ధించును.

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే అలర్కానుశాసనే ధర్మనిరూపణం నామ ద్వాత్రింశోఽధ్యాయః ॥32॥

శ్రీమార్కండేయ మహాపురాణమందు అలర్కానుశాసనమందలి ధర్మనిరూపణమను ముప్పదిరెండవ అధ్యాయం *సమాప్తం.*

త్రయస్త్రింశోఽధ్యాయః - ముప్పదిమూడవ అధ్యాయం
మదాలసోపాఖ్యానం - మదాలసోపాఖ్యానం

జడ ఉవాచ - జడుడు పలికాడు.

స ఏవమనుశిష్టస్సన్ మాత్రా సంప్రాప్య యౌవనమ్ ।
ఋతధ్వజసుతశ్చక్రే సమ్యగ్దారపరిగ్రహమ్ ॥1॥

ఈ విధముగా తల్లిచేత ఉపదేశింపబడిన ఋతధ్వజకుమారుడగు అలర్కుడు యౌవనమును పొంది శాస్త్రోక్తప్రకారముగా వివాహము చేసుకొనెను.

పుత్రాంశ్చోత్పాదయామాస యజ్ఞైశ్చాప్యయజద్విభుః ।
పితుశ్చ సర్వకాలేషు చకారాజ్ఞానుపాలనమ్ ॥2॥

పిమ్మట అలర్కుడు పుత్రులను గనెను. యజ్ఞములను చేసెను. అన్నివేళల తన తండ్రి ఆజ్ఞననుసరించి నడువసాగెను.

తతః కాలేన మహతా సంప్రాప్య చరమం వయః ।
చక్రేఽభిషేకం పుత్రస్య తస్య రాజ్యే ఋతధ్వజః ॥3॥

భార్యయా సహధర్మాత్మా యియాసుస్తపసే వనమ్ ।
అవతీర్ణో మహీరక్షో మహాభాగో మహీపతిః ॥4॥

చాలాకాలము గడచిన పిమ్మట మహానుభావుడు, భూపతియగు ఋతధ్వజుడు వార్ధక్యమును పొంది తన భార్యతో కూడా తపస్సు ఆచరించుటకు వనమునకు వెళ్ళదలచి, తన కుమారుడగు అలర్కుని పట్టాభిషిక్తుని గావించెను.

మదాలసా చ తనయం ప్రాహేదం పశ్చిమం వచః ।
కామోపభోగసంసర్గప్రహాణాయ సుతస్య వై ॥5॥

చివరిసారిగా మదాలస తన కుమారునికి కామములందు, భోగములందు వైరాగ్యమును కలిగించుటకై ఇట్లు పలికెను.

మదాలసోవాచ - మదాలస పలికింది.

యదా దుఃఖమసహ్యం తే ప్రియబంధువియోగజమ్ ।
శత్రుబాధోద్భవం వాపి విత్తనాశాత్మసంభవమ్ ॥6॥

భవేత్తత్కుర్వతో రాజ్యం గృహధర్మావలంబినః ।
దుఃఖాయతనభూతో హి మమత్వాలంబనో గృహీ ॥7॥

తదాస్మాత్పుత్ర నిష్కృష్య మద్దత్తాదంగులీయకాత్ ।
వాచ్యం తే శాసనం పట్టే సూక్ష్మాక్షరనివేశితమ్ ॥8॥

ఓ కుమారా ! స్నేహితులు, బంధువులు వీరి వియోగముచే భరింపరాని దుఃఖము కలిగినప్పుడు, శత్రువులు బాధించినప్పుడుగాని ధననాశము వల్లగాని తనకు దుఃఖము కలిగినప్పుడు, గృహస్థధర్మములను పాటించుచు మమకారముతో గృహస్థుడవై రాజ్యపరిపాలనము చేయుచుండగా ఏదేని దుఃఖము కలిగినప్పుడు నీవు నేనిచ్చు ఈ ఉంగరము నుండి చిన్న చిన్న అక్షరములతో వ్రాయబడిన శాసనపత్రమును బయటకు తీసి చదివి తదనుసారముగా ఆచరించుము.

జడ ఉవాచ – జడుడు పలికాడు.

ఇత్యుక్త్వా ప్రదదౌ తస్మై సౌవర్ణం సాంగులీయకమ్ ।
ఆశిషశ్చాపి యా యోగ్యాః పురుషస్య గృహే సతః ॥9॥

ఈ విధముగా పలికి అలర్కుని తల్లియగు మదాలస అతనికి సువర్ణాంగులీయకమును ఇచ్చెను. ఇంకను గృహస్థులైనవారికందరికీ తగిన విధముగా ఆశీర్వచనములను పలికెను.

తతః కువలయాశ్వోఽసౌ సా చ దేవీ మదాలసా ।
పుత్రాయ దత్త్వా తద్రాజ్యం తపసే కాననం గతౌ ॥10॥

పిమ్మట రాజగు కువలయాశ్వుడు, దేవియగు మదాలస వీరిరువురు తమ కుమారుడగు అలర్కునికి రాజ్యమునిచ్చి తపస్సు ఆచరించుటకు అడవికి వెళ్ళిరి.

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే మదాలసోపాఖ్యానం నామ త్రయస్త్రింశోఽధ్యాయః ॥33॥

శ్రీమార్కండేయ మహాపురాణమందు మదాలసోపాఖ్యానమనే ముప్పదిమూడవ అధ్యాయం సమాప్తం.



చతుస్త్రింశోఽధ్యాయః – ముప్పదినాల్గవ అధ్యాయం
పితాపుత్రసంవాదే ఆత్మవివేకః – పితాపుత్రసంవాదమందలి ఆత్మవివేకం

జడ ఉవాచ – జడుడు పలికాడు.

సోఽప్యలర్కో యథాన్యాయం పుత్రవన్ముదితాః ప్రజాః ।
పాలయామాస ధర్మాత్మా స్వే స్వే కర్మణ్యవస్థితాః ॥1॥

ధర్మాత్ముడైన ఆ అలర్కుడు కూడా న్యాయముననుసరించి ప్రజలను పుత్రులవలే పరిపాలించుటచే ప్రజలందరు పరమానందమును పొందిరి. ఇంకను వారు తమకు విధింపబడిన కర్మలయందు ప్రవర్తించియుండిరి.

దుష్టేషు దండం శిష్టేషు సమ్యక్చ పరిపాలనమ్ ।
కుర్వన్పరాం ముదం లేభే ఇయాజ చ మహామఖైః ॥2॥

అలర్కుడు దుష్టులను దండించుచు, సజ్జనులయందు తగురీతిగా బాగుగా పరిపాలించుచు అమితానందమును పొందెను. మరియు అనేక ప్రకారములైన గొప్ప యజ్ఞములను చేసెను.

అజాయన్త సుతాశ్చాస్య మహాబలపరాక్రమాః ।
ధర్మాత్మానో మహాత్మానో విమార్గపరిపన్థినః ॥3॥

మిక్కిలి బలపరాక్రమములు గలవారు, ధర్మాత్ములు, మహాత్ములు, చెడుమార్గమందు ప్రవర్తించువారిని చంపువారునూ అగు కుమారులు అలర్కునికి జన్మించిరి.

చకార సోఽర్థం ధర్మేణ ధర్మమర్థేన వా పునః ।
తయోశ్చైవావిరోధేన బుభుజే విషయానపి ॥4॥

అలర్కుడు ధర్మబద్ధముగా సంపదలను సమకూర్చుకొనెను. అట్టి అర్థముతో తిరిగి ధర్మాచరణ గావించెను. ఆ రెంటికీ విరోధము లేకుండువిధముగా విషయములను అనుభవించెను.

ఏవం బహూని వర్షాణి తస్య పాలయతో మహీమ్ ।
ధర్మార్థకామసక్తస్య జగ్మురేకమహర్యథా ॥5॥

ఈ విధముగా ధర్మార్థకామములననుసరించి భూమిని పరిపాలించుచున్న అలర్కునికి అనేక సంవత్సరములు ఒక్కరోజుతో సమానముగా గడచిపోయెను.

వైరాగ్యం నాస్య సంజజ్ఞే భుఞ్జతో విషయాన్ ప్రియాన్ ।
న చాప్యలమభూత్తస్య ధర్మార్థోపార్జనం ప్రతి ॥6॥

ప్రియమైన విషయములను అనుభవించుచుండగా అలర్కునికి వాటిపట్ల వైరాగ్యము కలుగలేదు. అనగా ఇష్టముగానే అనుభవించుచుండెను. అట్లే ధర్మార్థములను సంపాదించుటయందు “ఇక చాలును” అను భావము అతడికి కలుగలేదు. అనగా వాటి విషయమందు కోరిక ఎక్కువగా ఉండెను.

తం తథా భోగసంసర్గం ప్రమత్తమజితేంద్రియమ్ ।
సుబాహుర్నామ శుశ్రావ భ్రాతా తస్య వనేచరః ॥7॥

సుబాహుడను పేరుగల అలర్కుని సోదరుడు మొదటినుంచి వనవాసము చేయుచుండెను. అతడు భోగలాలసుడు, ప్రమత్తుడు, జితేంద్రియుడు కానివాడూ అగు తన సోదరుడగు అలర్కుని గూర్చి వినెను.

తం బుబోధయిషుః సోఽథ చిరం ధ్యాత్వా మహామతిః ।
తద్వైరిసంశ్రయం తస్య శ్రేయోఽమన్యత భూపతేః ॥8॥

అంతట గొప్ప బుద్ధిమంతుడగు సుబాహువు తన సోదరుడగు అలర్కునికి తత్త్వోపదేశము చేయుటకు చాలాకాలము ఆలోచించి అలర్కుని శత్రువులను ఆశ్రయించుటయే భూపతియగు అలర్కునికి శ్రేయోదాయకమని తలచెను.

తతస్స కాశిభూపాలముదీర్ణబలవాహనమ్ ।
స్వరాజ్యమాప్తుమాగచ్ఛద్బహుశః శరణం కృతీ ॥9॥

పిమ్మట కార్యకుశలుడగు సుబాహువు తిరిగి తాను తన రాజ్యమును పొందుటకు మిక్కిలి సేనాబలము, వాహన బలము కలిగిన కాశీభూపాలుని పలుమారులు శరణు వేడెను.

సోఽపి చక్రే బలోద్యోగమలర్కం ప్రతి పార్థివః ।
దూతం చ ప్రేషయామాస రాజ్యమస్మై ప్రదీయతామ్ ॥10॥

కాశీరాజు కూడా అలర్కునికి ప్రతికూలముగా సేనలను సమాయత్తపరచి ఒక దూతద్వారా "సుబాహునికి రాజ్యమునిచ్చివేయుము" అని సమాచారమును పంపించెను.

సోఽపి నైచ్ఛత్తదా దాతుమాజ్ఞాపూర్వం స్వధర్మవిత్ ।
ప్రత్యువాచ చ తం దూతమలర్కః కాశిభూభృతః ॥11॥

క్షత్రియధర్మమునెరిగిన అలర్కుడు ఈ విషయమునంగీకరింపక కాశీరాజుయొక్క దూతద్వారా ఇట్లు బదులు పంపెను.

మామేవాభ్యేత్య హార్దేన యాచతాం రాజ్యమగ్రజః ।
నాక్రాంత్యా సంప్రదాస్యామి భయేనాల్పామపి క్షితిమ్ ॥12॥

నా అన్నగారు నావద్దకువచ్చి హృదయపూర్వకముగా రాజ్యమునిమ్మని యాచించవలెను. ఆక్రమణభయంతో నేను కొద్దిపాటి భూమిని కూడా నా అన్నగారికి ఇవ్వను.

సుబాహురపి నో యాచ్ఞాం చకార మతిమాంస్తదా ।
న ధర్మః క్షత్రియస్యేతి యాచ్ఞా వీర్యధనో హి సః ॥13॥

బుద్ధిమంతుడగు సుబాహువు తన తమ్ముని యాచించలేదు. యాచించుట క్షత్రియధర్మము కాదు. సుబాహువు పరాక్రమమే ధనముగా గలవాడు.

తతస్సమస్తసైన్యేన కాశీశః పరివారితః ।
ఆక్రాన్తుమభ్యగాద్రాష్ట్రమలర్కస్య మహీపతేః ॥14॥

అనంతరము ఆ కాశీప్రభువు తన సమస్తసైన్యముతో కూడుకొన్నవాడై మహీపతియగు అలర్కుని వశపరచుకొనుటకు అతనిపై దండెత్తెను.

అనంతరైశ్చ సంశ్లేషమభ్యేత్య తదనంతరమ్ ।
తేషామన్యతమైర్భృత్యైస్సమాక్రమ్యానయద్వశమ్ ॥15॥

పిమ్మట తన సామంతరాజులతో కలిసి కాశీప్రభువు వారి భృత్యువులతో కూడుకొన్నవాడై అలర్కునిపై దండెత్తి అతడిని వశపరచుకొనెను.

అపీడయంశ్చ సామంతాంస్తస్య రాష్ట్రోపరోధనైః ।
తథా దుర్గాన్తపాలాంశ్చ చక్రే చాటవికాన్వశే ॥16॥

ఆ అలర్కుని సామంతరాజులను పీడించకుండా, అతడి రాజ్యమునందు ప్రతిబంధములను కలిగించుచు, దుర్గ పాలురను, ఆటవిక పురుషులను కాశీరాజు వశపరచుకొనెను.

కాంశ్చిచ్చోపప్రదానేన కాంశ్చిద్భేదేన పార్థివాన్ ।
సామ్నైవాన్యాన్వశం నిన్యే నిభృతాస్తస్య యేఽభవన్ ॥17॥

కొందరికి లంచములనిచ్చుట ద్వారా, కొంతమంది రాజులకు పరస్పర భేదము కల్పించుట ద్వారా, అలర్కుని పట్ల ప్రేమగలవారిని సామోపాయము ద్వారా (మంచి మాటలు చెప్పి లొంగతీసుకొనుట) ఆ కాశీరాజు వారినందరినీ వశపరచుకొనెను.

తతస్సోఽల్పబలో రాజా పరచక్రావపీడితః ।
కోశక్షయమవాపోచ్చైః పురం చారుధ్యతారిణా ॥18॥

ఈ విధముగా క్షీణబలుడైన అలర్కుడను ఆ రాజు శత్రుసైన్యముచే పీడింపబడినవాడై తన ధనాగారము క్షీణించుటను పొందెను. అంతేకాక తన పట్టణము శత్రువులచే ఆక్రమింపబడెను.

ఇత్థం సంపీడ్యమానస్తు క్షీణకోశో దినే దినే ।
విషాదమాగాత్పరమం వ్యాకులత్వం చ చేతసః ॥19॥

ఈ విధముగా పీడింపబడినవాడై అలర్కుడు రోజురోజుకీ ధనాగారము క్షీణించుచుండగా మిక్కిలి దుఃఖమును పొందెను. మనోవ్యాకులత్వమును కూడా పొందెను.

ఆర్తిం స పరమాం ప్రాప్య తత్సస్మారాంగులీయకమ్ ।
యదుద్దిశ్య పురా ప్రాహ మాతా తస్య మదాలసా ॥20॥

అలర్కుడు ఈ విధముగా గొప్ప దుఃఖమును పొంది, తన తల్లియగు మదాలస పూర్వము చెప్పిన అంగులీయక విషయమును జ్ఞప్తికి తెచ్చుకొనెను.

తతస్స్నాతశ్శుచిర్భూత్వా వాచయిత్వా ద్విజోత్తమాన్ ।
నిష్కృష్య శాసనం తస్మాద్దదృశే ప్రస్ఫుటాక్షరమ్ ॥21॥

పిమ్మట అతడు స్నానమాచరించి పవిత్రుడై బ్రాహ్మణోత్తముల ద్వారా స్వస్తివచనములను చెప్పించి ఆ శాసనమును బయటకు తీసి అందు స్ఫుటమైన అక్షరములుగల వాక్యములను చూచెను.

తత్రైవ లిఖితం మాత్రా వాచయామాస పార్థివః ।
ప్రకాశపులకాఙ్గో౽సౌ ప్రహర్షోత్ఫుల్లలోచనః ॥22॥

ఆ శాసనమందు తన తల్లిచేత వ్రాయబడిన విషయమును రాజగు ఆ అలర్కుడు చదివింపచేసెను. అతని శరీరము పులకించినది మరియు సంతోషముతో అతని నేత్రములు వికసించినవి.

సంగః సర్వాత్మనా త్యాజ్యః స చేత్త్యక్తుం న శక్యతే ।
స సద్భిస్సహ కర్తవ్యః సతాం సంగో హి భేషజమ్ ॥23॥

అన్నివిధాలా సంబంధబాంధవ్యములను విడిచిపెట్టవలెను. అట్లు విడిచిపెట్టుట సాధ్యము కానిచో సత్పురుషులతోనే సాంగత్యమును చేయవలెను. ఎందువలననగా సజ్జనులతో సాంగత్యము ఔషధము వంటిది.

కామస్సర్వాత్మనా హేయో హాతుం చేచ్ఛక్యతే న సః ।
ముముక్షాం ప్రతి తత్కార్యం సైవ తస్యాపి భేషజమ్ ॥24॥

అన్నివిధములైన కోరికలను విడిచిపెట్టవలెను. ఒకవేళ అట్లు విడిచిపెట్టుట సాధ్యము కానిచో మోక్షమందు మాత్రము కోరిక కల్గియుండుట ఉత్తమము. అదియే ఆ పురుషునికి ఔషధము వంటిది.

వాచయిత్వా తు బహుశో నృణాం శ్రేయః కథం త్వితి ।
ముముక్షయేతి నిశ్చిత్య సా చ తత్సంగతో యతః ॥25॥

తతస్స సాధుసంపర్కం చిన్తయన్ పృథివీపతిః ।
దత్తాత్రేయం మహాభాగమగచ్ఛత్పరమార్తిమాన్ ॥26॥

ఈ విధముగా తల్లి ఇచ్చిన శాసనమును మాటిమాటికి చదివింపచేసి మానవులకు శ్రేయస్సు ఎట్లు సిద్ధించునో కదా యని ఆలోచించి ముముక్ష (మోక్షేచ్ఛ) వల్లనే శ్రేయస్సు సిద్ధించునని నిశ్చయించెను. అట్టి ముముక్ష సాధుపురుషుల సాంగత్యమువల్లనే సిద్ధించునుగావున పృథివీపతియగు అలర్కుడు సజ్జనసాంగత్యము గురించి ఆలోచించసాగెను. పిమ్మట మిక్కిలి దుఃఖాతురుడైన ఆ అలర్కుడు మహానుభావుడగు దత్తాత్రేయుని గూర్చి వెళ్ళెను.

తం సమేత్య మహాత్మానమకల్మషమసఙ్గినమ్ ।
ప్రణిపత్యాభిసంపూజ్య యథాన్యాయమభాషత ॥27॥

మహాత్ముడు, ఎట్టి కల్మషములూ లేనివాడు, అసంగుడూ అగు ఆ దత్తాత్రేయునికి నమస్కరించి, పూజించి అలర్కుడు న్యాయముననుసరించి ఇట్లు పలికెను. ("అసంగో హ్యయం పురుషః" అని శ్రుతివాక్యము)

బ్రహ్మన్ కురు ప్రసాదం మే శరణ్యః శరణార్థినామ్ ।
దుఃఖాపహారం కురు మే దుఃఖార్తస్యాతికామినః ॥28॥

ఓ బ్రహ్మస్వరూపుడా ! నా యందు అనుగ్రహము చూపుము. శరణన్నవారికి మీరే శరణ్యము అనగా దిక్కు. మిక్కిలి విషయభోగలాలసుడనూ, దుఃఖపీడితుడనూ అగు నాయొక్క దుఃఖములను పోగొట్టుము.

దత్తాత్రేయ ఉవాచ – దత్తాత్రేయుడు పలికాడు.

దుఃఖాపహారమద్యైవ కరోమి తవ పార్థివ ।
సత్యం బ్రూహి కిమర్థం తే దుఃఖం తత్ పృథివీపతే ॥29॥

ఓ రాజా ! ఈ రోజే నీయొక్క దుఃఖములను పోగొట్టెదను. ఓ పృథివీపతీ ! నిజము పలుకుము. ఎందువలన నీకు దుఃఖము కలిగినది.

జడ ఉవాచ – జడుడు పలికాడు.

ఇత్యుక్తశ్చిన్తయామాస స రాజా తేన ధీమతా ।
త్రివిధస్యాపి దుఃఖస్య స్థానమాత్మానమేవ చ ॥30॥

ఈ విధముగా జ్ఞానియగు దత్తాత్రేయుడు పలుకగా, అలర్కుడు ఆధ్యాత్మిక, ఆధిదైవిక, ఆధిభౌతికములగు మూడు విధములైన దుఃఖములను గురించి, తన గురించి ఆలోచించసాగెను.

స విమృశ్య చిరం రాజా పునః పునరుదారధీః ।
ఆత్మానమాత్మనా ధీరః ప్రహస్యేదమథాబ్రవీత్ ॥31॥

ధీరుడైనవాడూ మరియు ఉదారమైన బుద్ధిగలవాడూ అగు రాజైన అలర్కుడు మరల మరల చిరకాలము ఆత్మను స్వయముగా విమర్శ చేసి అటుపిమ్మట నవ్వుచూ ఇట్లు పలికెను.

నాహముర్వీ న సలిలం న జ్యోతిరనిలో న చ ।
నాకాశం కిం తు శారీరం సమేత్య సుఖమిష్యతే ॥32॥

నేను భూమిని కాను, జలమును కాను, తేజస్సును కాను, వాయువును కాను, ఆకాశమును కాను. కాని శరీరమందుండు జీవభావమును పొందిన నాచేత సుఖము కోరబడుచున్నది.

న్యూనాతిరిక్తతాం యాతి పఞ్చకేఽస్మిన్ సుఖాసుఖమ్ ।
యది స్యాన్మమ కిం న స్యాదన్యస్థేఽపి హితం మయి ॥33॥

పాంచభౌతికమైన అశాశ్వతమైన ఈ శరీరమందు సుఖదుఃఖములు ఒకప్పుడు ఎక్కువగా ఉండవచ్చును, ఒకప్పుడు తక్కువగా ఉండవచ్చును. ఈ సుఖదుఃఖములు ఈ శరీరగతమైన నాయందున్నచో, మరొక శరీరమును ధరించిన నాయందు కూడా ఉండవచ్చును.

నిత్యప్రభూతసద్భావే న్యూనాధిక్యాన్నతోన్నతే ।
తథా చ మమతా త్యక్తా విశేషేణోపలభ్యతే ॥34॥

పుట్టుట, గిట్టుట ద్వారా ఎల్లప్పుడు ఉత్పన్నమయ్యే ఈ శరీరమందలి సుఖదుఃఖముల న్యూనాధిక్యభావము కారణముగా స్వస్వరూపమగు జీవునియందు తక్కువ ఎక్కువల భావము కలుగుచున్నది. (వస్తుతః దేహధర్మములైన ఈ భావములు జీవాత్మయందు లేవు. జీవుడనగా పరబ్రహ్మస్వరూపమే కదా!) ఇట్టి భ్రాంతిని తొలగించుకొనుటకు సుఖదుఃఖములందు మమత్వము అనగా నాది యను భావము విడిచిపెట్టబడినది. అందువలన ఆ జీవస్వరూపము విశేషముగా అనగా దేహభిన్నముగా గోచరమగుచున్నది.

తన్మాత్రావస్థితే సూక్ష్మే తృతీయాంశే చ పశ్యతః ।
తథైవ భూతసద్భావం శారీరం కిం సుఖాసుఖమ్ ॥35॥

స్థూలశరీరము లింగశరీరములకంటే భిన్నమైన మూడవదగు పంచతన్మాత్రావస్థితమైన సూక్ష్మశరీరమందు కూడా ఇట్టి సుఖదుఃఖములు కనబడుచుండగా అవి శారీరుడగు జీవునికి సంబంధించినవా ఏమి?

మనస్యవస్థితం దుఃఖం సుఖం వా మానసం చ యత్ ।
యతస్తతో న మే దుఃఖం సుఖం వా న హ్యహం మనః ॥36॥

దుఃఖముగాని సుఖముగాని మనస్సునందు ఉన్నచో అవి మానసములైనందున, ఆ రెండూ నాకు సంబంధించినవి కావు. ఎందువలననగా నేను మనస్సును కాదు కదా! జీవుడనగా దేహేంద్రియాదులకంటే భిన్నుడు కదా!

నాహంకారో న చ మనో బుద్ధిర్నాహం యతస్తతః ।
అన్తఃకరణజం దుఃఖం పారక్యం మమ తత్కథమ్ ॥37॥

నేను అహంకారమును కాను, మనస్సును కాను, బుద్ధిని కాను. అందువలన అన్తఃకరణధర్మమైన దుఃఖము పరకీయమైనది కదా! అది నాకు చెందినది ఎట్లగును? నేను అనగా జీవుడను, చిత్స్వరూపుడను. (పరస్య ఇదం పారక్యమ్)

నాహం శరీరం న మనో యతోఽహం పృథక్ఛరీరాన్మనసస్తథాహమ్ ।
తత్సన్తు చేతస్యథవాఽపి దేహే సుఖాని దుఃఖాని చ కిం మమాత్ర ॥38॥

నేను శరీరమును కాను, మనస్సును కాను. అందువలన నేను శరీరముకంటే, మనస్సుకంటే భిన్నుడను, సుఖములు గాని దుఃఖములు గాని మనస్సునందో లేక దేహమందో ఉండనీ, అవి నాకెట్లు చెందగలవు?

రాజ్యస్య వాంఛాం కురుతేఽప్రజోఽస్య దేవస్య చేత్పంచమయస్స రాశిః ।
గుణప్రవృత్త్యా మమ కిం ను తత్ర తత్స్థః స చాహం చ శరీరతోఽన్యః ॥39॥

రాజ్యమును కోరుకొనుచున్నది ఎవరు? ఈ కనబడుచున్న ప్రభువు (అశాశ్వతమైన దేహాదిరూపము)నకు సంబంధించిన అప్రజుడు (ప్రజుడనగా పుట్టుక గలవాడు ప్రభువని అర్థము. అప్రజుడు అనగా పుట్టుక లేని ఆత్మ) రాజ్యమును కోరుకొనుచున్నాడని చెప్పుట కుదరదు. పాంచభౌతికమైనది అశాశ్వతమైన కనిపించే ఈ దేహము. దానితో అప్రజుడు ఎట్లు సంబంధించినవాడు కాగలడు? అట్టి శరీరమందు మాత్రమే పంచ మహాభూతముల గుణములు సంక్రమించుటచే, ఆ విషయమందు నాకేమి సంబంధము? (నేను అనగా ఆత్మస్వరూపము). నేను ఆ శరీరమందలి హృదయాకాశమందు ఉన్నవాడిని గావున ఆ శరీరము నేను కాను. ఆ శరీరము కంటే భిన్నుడను.

న యస్య హస్తాదికమప్యశేషం మాంసం న చాస్థీని శిరావిభాగః ।
కస్తస్య నాగాశ్వరథాది కోశైః స్వల్పోఽపి సంబంధ ఇహాస్తి పుంసః ॥40॥

ఈ కనిపించే నావి అనిపించే అశేషమైన హస్తాదులు, మాంసము, ఎముకలు, నాడీవిభాగము వీటితో దేనితోనూ కూడా ఏ జీవాత్మకు సంబంధము లేదో, అప్పుడు గజములు, గుర్రములు, రథములు మున్నగు బాహ్యకోశములతో ఈ జీవునికి స్వల్పసంబంధమైనా ఎక్కడిది?

తస్మాన్న మేఽరిర్న చ మేఽస్తి దుఃఖం న మే సుఖం నాపి పురం న కోశమ్ ।
న చాశ్వనాగాదిబలం న తస్య నాన్యస్య వా కస్యచిద్వా మమాస్తి ॥41॥

అందువలన శుద్ధచైతన్యస్వరూపుడనైన నాకు శత్రువులు లేరు, దుఃఖము లేదు, సుఖము లేదు, పట్టణము లేదు, ధనాగారము లేదు, అశ్వగజాదిబలము లేదు. ఇతరులకు సంబంధించిన ఏదియూ కూడా నాకు లేదు.

యథా ఘటీకుంభకమండలుస్థమాకాశమేకం బహుధా హి దృష్టమ్ ।
తథా సుబాహుః స చ కాశిపోఽహం మన్యే చ దేహేషు శరీరభేదైః ॥42॥

ఘటము, కుంభము, కమండులము మొదలగు వానియందున్న ఆకాశము భిన్నభిన్నములుగా ఘటాకాశము, కుంభాకాశము, కమండల్వాకాశము మొదలగు రీతిగా గోచరించుచున్నది. ఘటకుంభాది ఉపాధిభేదము కారణముగానే ఆ ఒక్కటే ఆకాశము వేరువేరుగా గోచరించుచున్నది. యథార్థముగా ఆకాశము అనేకము కాదు ఒక్కటే. అట్లే ఆత్మ ఒక్కటే ఐనా ఉపాధిభూతములైన ఆయా శరీరముల భేదము కారణముగానే సుబాహువనీ, కాశీరాజు అనీ వేరువేరు విధముగా వ్యవహరింపబడుచున్నది. అంతేకానీ ఆత్మ అనేకము కాదు, ఒక్కటే.

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే పితాపుత్రసంవాదే ఆత్మవివేకో నామ చతుస్త్రింశోఽధ్యాయః ॥34॥

శ్రీ మార్కండేయ మహాపురాణమందలి పితాపుత్రసంవాదమందలి ఆత్మవివేకమను ముప్పదినాల్గవ అధ్యాయం *సమాప్తం.*



పంచత్రింశోఽధ్యాయః - ముప్పది అయిదవ అధ్యాయం
దత్తాత్రేయాలర్కసంవాదః - దత్తాత్రేయుడు, అలర్కుల సంవాదం

జడ ఉవాచ - జడుడు పలికాడు.

దత్తాత్రేయం తతో విప్రం ప్రణిపత్య స పార్థివః ।
ప్రత్యువాచ మహాత్మానం ప్రశ్రయావనతో వచః ॥1॥

పిమ్మట భూపరిపాలకుడగు ఆ అలర్కుడు మహాత్ముడు, విప్రుడు అగు దత్తాత్రేయునితో వినయపూర్వకముగా నమస్కరించి ఇట్లు పలికెను.

సమ్యక్ప్రపశ్యతో బ్రహ్మన్ మమ దుఃఖం న కించన ।
అసమ్యగ్దర్శినో మగ్నాః సర్వదైవాఽసుఖార్ణవే ॥2॥

ఓ బ్రహ్మస్వరూపుడా! సమ్యగ్జ్ఞానము (ఆత్మజ్ఞానము) కలిగిన నాకు ఇప్పుడు ఎట్టి దుఃఖమూ లేదు. ఇక ఆత్మజ్ఞానము పొందని జనులు దుఃఖసాగరమందు ఎల్లవేళలా మునిగియున్నారు.

యస్మిన్యస్మిన్మమత్వేన బుద్ధిః పుంసః ప్రజాయతే ।
తతస్తతస్సమాదాయ దుఃఖాన్యేవ ప్రయచ్ఛతి ॥3॥

ఏ ఏ వస్తువునందు పురుషునికి మమత్వబుద్ధి అనగా ఇది నాది అను జ్ఞానముండునో అట్టి వస్తువు ఆ పురుషుని ఆకర్షించి దుఃఖములనే ఇచ్చుచున్నది.

మార్జారభక్షితే దుఃఖం యాదృశం గృహకుక్కుటే ।
న తాదృఙ్మమతాశూన్యే కలవిఙ్కేఽథ మూషికే ॥4॥

తన ఇంటియందు పెంచుకొనుచున్న కోడిని పిల్లి భక్షించినచో ఎట్టి దుఃఖము కలుగుచున్నదో అట్టి దుఃఖము మమతాభావము అనగా ఇది నాదియను భావము లేని పిచ్చుకలాంటి చిన్న చిన్న పక్షులను గాని లేదా ఎలుకనుగాని తిన్నచో కలుగుట లేదు.

సోఽహం న దుఃఖీ న సుఖీ యతోఽహం ప్రకృతేః పరః ।
యో భూతాభిభవో భూతైః సుఖదుఃఖాత్మకో హి సః ॥5॥

అట్టి నేను సుఖవంతుడనూ కాను, దుఃఖవంతుడనూ కాను. నేను ప్రకృతికి (అజ్ఞానము లేదా మాయ) అతీతుడను. ఎవరయితే పంచమహాభూతములచే కొట్టబడుచున్నారో అనగా వాటికి లోను అవుతున్నారో వారే సుఖదుఃఖములను పొందుచున్నారు.

దత్తాత్రేయ ఉవాచ - దత్తాత్రేయుడు పలికాడు.

ఏవమేతన్నరవ్యాఘ్ర యథైతద్వ్యాహృతం త్వయా ।
మమేతి మూలం దుఃఖస్య న మమేతి చ నిర్వృతిః ॥6॥

ఓ నరశ్రేష్ఠుడా ! నీవు చెప్పినది నిజము. ఆయా వస్తువులందు మమతాభావమే అనగా నాది యనుకొనుటయే దుఃఖములకు మూలము, మమతాభావము లేకపోవుట నిత్యానందము.

మత్ప్రశ్నాదేవ తం జ్ఞానముత్పన్నమిదముత్తమమ్ ।
మమేతి ప్రత్యయో యేన క్షిప్తః శాల్మలితూలవత్ ॥7॥

నా ప్రశ్నవల్లనే నీయందు ఇట్టి ఉత్తమమైన జ్ఞానము ఉద్భవించినది. అట్టి జ్ఞానమువల్లనే ఆయా వస్తువులందలి మమతాభావము బూరుగుదూదివలే ఎగురకొట్టబడినది.

అహమిత్యంకురోత్పన్నో మమేతి స్కంధవాన్మహాన్ ।
గృహక్షేత్రోచ్చశాఖశ్చ పుత్రదారాదిపల్లవః ॥8॥

"నేను బ్రాహ్మణుడను", "నేను క్షత్రియుడను" మొదలగు "అహం" ప్రతీతియే అజ్ఞానమను బీజమువల్ల పుట్టిన మొలక. అట్టి మొలకవల్ల "ఇది నా ఇల్లు, వీరు నా భార్యాపుత్రులు" మొదలగు రీతిగా "మమ"యనెడు ప్రాను కలిగిన పెద్ద వృక్షము పుట్టినది. ఆ వృక్షము గృహక్షేత్రములనెడు (క్షేత్రమనగా పొలము) పెద్ద కొమ్మలు, పుత్రదారాదులను చిగుళ్ళు (దారాః = భార్య) కలిగియున్నది.

ధనధాన్యమహాపత్రో నైకకాలప్రవర్ధితః ।
పుణ్యాపుణ్యాగ్రపుష్పశ్చ సుఖదుఃఖమహాఫలః ॥9॥

ఆ వృక్షానికి ధనధాన్యాలే పెద్ద పెద్ద ఆకులు. అవి క్రమక్రమంగా పెరిగాయే తప్ప ఒక్క కాలంలోనే పెరిగినవి కావు. పుణ్యాపుణ్యములే ప్రధానపుష్పాలు. సుఖదుఃఖాలే పెద్ద ఫలాలు.

అపవర్గపథవ్యాపీ మూఢసంపర్కసేచనః ।
విధిత్సాభృఙ్గమాలాఢ్యోఽకృత్యజ్ఞానమహాతరుః ॥10॥

ఈ వృక్షము అపవర్గమార్గమందు అంతటా వ్యాపించినది. (అపవర్గమనగా మోక్షము. మోక్షమార్గమందు వెళ్ళుటకు వీలులేకుండా ఆ మార్గమంతా ఈ సంసారవృక్షము వ్యాపించినదని అర్థము). మూర్ఖుల సంపర్కమే సేచనముగా కలిగినది (సేచనమనగా నీళ్ళతో తడుపుటయని అర్థము). విధిత్సయనగా ఆయా పనులు చేయాలని, వాటి ఫలాలు పొందాలనే కోరిక. అట్టి విధిత్సయను తేనెటీగల సమూహముతో కూడుకొన్నది ఆ వృక్షము. అకృత్యముల జ్ఞానమే ఆ పెరిగిన మహావృక్షము.

సంసారాధ్వపరిశ్రాన్తా యే తచ్ఛాయాం సమాశ్రితాః ।
భ్రాన్తిజ్ఞానసుఖాధీనాస్తేషామాత్యన్తికం కుతః ॥11॥

ఏ మానవులయితే సంసారమార్గమందు ప్రయాణించి అలసిపోయి అట్టి సంసారవృక్షముయొక్క నీడను ఆశ్రయించారో ఇంకనూ నిజముకాని సుఖమునకు బానిసలయ్యారో వారికి శాశ్వతదుఃఖనివృత్తియనెడు మోక్షము ఎట్లు సిద్ధించును?

యైస్తు సత్సంగపాషాణశితేన మమతాతరుః ।
ఛిన్నో విద్యాకుఠారేణ తే గతాస్తేన వర్త్మనా ॥12॥

ప్రాప్య బ్రహ్మవనం శీతం నీరజస్కమకంటకమ్ ।
ప్రాప్నువన్తి పరాం ప్రాజ్ఞా నిర్వృతిం వృత్తివర్జితాః ॥13॥

సజ్జనసాంగత్యమనే పాషాణమందు పదును పెట్టబడిన విద్యయనెడు గొడ్డలిచే మమత్వమనే ఈ మహావృక్షము ఎవరిచేత నరికివేయబడినదో వారు అట్టి విద్యామార్గముద్వారా రజోవిహీనము (దుమ్ము ధూళి లేనిది), ముళ్ళు లేనిది, చల్లనిదీ అయిన బ్రహ్మమను వనమును ప్రవేశించెదరు. అట్లు ప్రవేశించిన జ్ఞానులు మనోవ్యాపారరహితులై పరనిర్వృతిని (మోక్షమును) పొందుచున్నారు.

భూతేంద్రియమయం స్థూలం న త్వం రాజన్న చాప్యహమ్ ।
న తన్మాత్రం మయా వాచ్యం నైవాన్తఃకరణాత్మకౌ ॥14॥

ఓ రాజా ! పంచమహాభూతాలు, ఇంద్రియాలతో కూడుకొన్న ఈ స్థూలదేహము ఏది కలదో అది నీవూ కాదు, నేనూ కాదు, నేను చెప్పే సూక్ష్మములైన పంచతన్మాత్రల స్వరూపము మనమిరువురమూ కాము. అట్లే మనమిరువురము అన్తఃకరణస్వరూపములము కాము. (యథార్థముగా మనము ఆ శుద్ధచైతన్యస్వరూపులమే అని భావము.)

కం వా పశ్యామి రాజేంద్ర ప్రధానమిదమావయోః ।
యతః పరో హి క్షేత్రజ్ఞసంఘాతో హి గుణాత్మకః ॥15॥

ఓ రాజేంద్రా ! మనమిరువురియందు నెలకొనియున్న ప్రధానమైన ఆ పరబ్రహ్మమునే (క శబ్దానికి బ్రహ్మమని అర్థము) నేను చూచుచున్నాను. క్షేత్రజ్ఞులగు జీవుల సంఘాతస్వరూపము, ఆనందాది గుణస్వరూపమూ అగు ఆ పరబ్రహ్మము ఈ కనిపించే దేహముల కంటే అతీతము. (ఆ పరబ్రహ్మమునకు జీవులు ఖిల్యభావము అనగా ఉప్పుముద్దవంటివారు. ఆ బ్రహ్మము ఆనందాదిస్వరూపమేగాని, ఆనందాదులు కల్గినవాడు కాడు.)

మశకోదుమ్బరేషీకాముఞ్జమత్స్యాంభసాం యథా ।
ఏకత్వేఽపి పృథగ్భావస్తథా క్షేత్రాత్మనోర్నృప ॥16॥

ఓ రాజా ! దోమలు, ఉదుంబరవృక్షము ఈ రెండు మరియు ఇషీక, ముంజగడ్డి ఈ రెండు మరియు చేపలు, జలము ఈ రెండు ఇవి ఎప్పుడూ కలిసియేయున్నందున ఆ జంటలకు ఏకత్వమున్ననూ వస్తుతః పృథగ్భావము అనగా భిన్న భిన్నమగుట ఎట్లు కలదో అట్లే దేహము మరియు ఆత్మలకు కూడా భేదమే తప్ప ఐక్యము లేదు.

అలర్క ఉవాచ – అలర్కుడు పలికాడు.

భగవంస్త్వత్ప్రసాదేన మమావిర్భూతముత్తమమ్ ।
జ్ఞానం ప్రధానచిచ్ఛక్తివివేకకరమీదృశమ్ ॥17॥

ఓ భగవత్స్వరూపుడా! నీ అనుగ్రహముచే ప్రధానము (మాయ) మరియు చిచ్ఛక్తి (పరబ్రహ్మ) ఈ రెంటికీ భేదమును కలిగించు ఇట్టి ఉత్తమమైన జ్ఞానము నాకు ఆవిర్భవించినది.

కిన్త్వత్ర విషయాక్రాన్తే స్థైర్యవత్త్వం న చేతసి ।
న చాపి వేద్మి ముచ్యేయం కథం ప్రకృతిబంధనాత్ ॥18॥

కాని విషయములందు ఆసక్తమైన నా మనస్సునందు స్థిరత్వము లభించుట లేదు. ఈ మాయాబంధములనుండి ఎట్లు విడిపడెదనో ఎరుగకున్నాను.

కథం న భూయాం భూయశ్చ కథం నిర్గుణతామియామ్ ।
కథం చ బ్రహ్మణైకత్వం వ్రజేయం శాశ్వతేన వై ॥19॥

తన్మే యోగం తథా బ్రహ్మన్ ప్రణతాయాభియాచతే ।
సమ్యగ్బ్రూహి మహాప్రాజ్ఞ సత్సంగో హ్యుపకృన్నృణామ్ ॥20॥

ఎట్లు తిరిగి జన్మనెత్తనో, తిరిగి ఎట్లు నిర్గుణపరబ్రహ్మభావమును పొందెదనో, ఎట్లు బ్రహ్మైక్యమును శాశ్వతముగా పొందెదనో ఓ బ్రహ్మస్వరూపుడా! అట్టి యోగమును ప్రణామములు ఆచరించినట్టి, యాచించునట్టి నాకు బాగుగా ఉపదేశించుము. ఓ మహాప్రాజ్ఞుడా! సజ్జనసాంగత్యము మానవులకు ఉపకారమును చేకూర్చును కదా!

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే దత్తాత్రేయాలర్కసంవాదే పంచత్రింశోఽధ్యాయః సమాప్తః ॥35॥

శ్రీ మార్కండేయ మహాపురాణమందు దత్తాత్రేయాలర్కసంవాదమను ముప్పది అయిదవ అధ్యాయం సమాప్తం.



షట్త్రింశోఽధ్యాయః - ముప్పదియారవ అధ్యాయం
యోగనిరూపణమ్ - యోగనిరూపణం

దత్తాత్రేయ ఉవాచ - దత్తాత్రేయుడు పలికాడు.

జ్ఞానపూర్వో వియోగో యోఽజ్ఞానేన సహ యోగినః ।
సా ముక్తిర్బ్రహ్మణా చైక్యమనైక్యం ప్రాకృతైర్గుణైః ॥1॥

యోగులకు జ్ఞానము వలన ఏ అజ్ఞాననాశము కలిగినదో అదియే మోక్షమనగా. బ్రహ్మముతో ఐక్యము చెందుట, ప్రాకృతగుణములతో అనగా ప్రకృతికి చెందిన సత్త్వరజస్తమోగుణములతో ఐక్యము చెందకపోవుట మోక్షమనబడును.

యోగే చ శక్తిర్విదుషా యేన శ్రేయః పరం భవేత్ ।
ముక్తిర్యోగాత్తథా యోగః సమ్యగ్జ్ఞానాన్మహీపతే ॥
సఙ్గదోషోద్భవం దుఃఖం మమత్వాసక్తచేతసామ్ ॥2॥

యోగమందలిశక్తివల్లనే పరశ్రేయస్సు అనగా మోక్షము సిద్ధించుచున్నది. ఓ రాజా! యోగమువలన మోక్షము, ఆత్మజ్ఞానమువలన యోగము సిద్ధించుచున్నవి. మమత్వము (ఇది నాది, ఇది నేను మొదలగునవి)నందు ఆసక్తి కలిగిన వారికి అట్టి నిత్యముకానట్టి కల్పిత వస్తువులతో సంబంధమువల్లనే దుఃఖము పుట్టుచున్నది. (స్వస్వరూపమైన పరబ్రహ్మస్వరూపమే తాను అనగా జీవుడు. "అసంగో హ్యయం పురుషః" అను శ్రుతి పరమాత్మకు దేనితోనూ సంబంధము లేదని చెప్పుచున్నది. అందువలన తాను కూడా పరబ్రహ్మస్వరూపమే గావున తనకు బాహ్యవస్తువులతో సంబంధము కల్పించుకొనుట అజ్ఞానప్రయుక్తమే అని అర్థము.)

తస్మాత్సఙ్గం ప్రయత్నేన ముముక్షుః సంత్యజేన్నరః ।
సఙ్గాభావే మమేత్యస్యాః ఖ్యాతేర్హానిః ప్రజాయతే ॥3॥

అందువలన మోక్షమును కోరువాడు ప్రయత్నపూర్వకముగా ఏ విషయములతోనూ సాంగత్యము పెట్టుకొనరాదు. సమస్త విషయములతోనూ సాంగత్యము పోయినచో "మమ" (ఇది నాది) అను జ్ఞానము నశించును. మోక్షమునకు మార్గము సుగమమగును.

నిర్మమత్వం సుఖాయైవ వైరాగ్యాద్దోషదర్శనమ్ ।
జ్ఞానాదేవ చ వైరాగ్యం జ్ఞానం వైరాగ్యపూర్వకమ్ ॥4॥

మమత్వబుద్ధి అనగా ఇది నాది అనుకొనుట. అట్టి మమత్వబుద్ధి లేకపోవుటయే నిర్మమత్వము లేదా మమతారాహిత్యము. అదియే సుఖమునకు అనగా నిర్విశేషానందమునకు కారణము. ఆయా వస్తువులందు వైరాగ్యము కలిగినచో ఆ వస్తువులందు దోషదర్శనము (ఆ వస్తువులు అశాశ్వతములు అని తెలుసుకొనుట) సంభవించును. జ్ఞానము వలన వైరాగ్యము కలుగును. వైరాగ్యము వలన కూడా జ్ఞానము పుట్టును.

తద్గృహం యత్ర వసతిస్తద్భోజ్యం యేన జీవతి ।
యన్ముక్తయే తదేవోక్తం జ్ఞానమజ్ఞానమన్యథా ॥5॥

ఎచ్చట నివాసము సంభవించునో అదియే గృహము. దేనిని తిన్నందువలన జీవించుచున్నాడో అదియే భోజ్యవస్తువు. దేనివలన మోక్షము సిద్ధించునో అదియే జ్ఞానమని చెప్పబడినది. కానిచో అది అజ్ఞానమే అగును.

ఉపభోగేన పుణ్యానామపుణ్యానాం చ పార్థివ ।
కర్తవ్యమితి నిత్యానామకామకరణాత్తథా ॥6॥

అసఞ్చయాదపూర్వస్య క్షయాత్పూర్వార్జితస్య చ ।
కర్మణో బన్ధమాప్నోతి శరీరం చ పునః పునః ॥
కర్మణా మోక్షమాప్నోతి వైపరీత్యేన తస్య తు ॥7॥

ఓ రాజా ! పుణ్యకర్మలైనా పాపకర్మలైనా కర్మలు మోక్షమునకు ప్రతిబంధకములు. ఎందువలననగా అవియన్నియు అజ్ఞానకార్యములే కదా ! అందువలన పుణ్యకర్మలను, అపుణ్యకర్మలను భోగముతో పరిసమాప్తి చేయవలెను. తనకు విధింపబడిన నిత్యకర్మలను కామనారహితముగా ఆచరించవలెను. క్రొత్తకర్మలను ఆచరించకపోవుట, పూర్వార్జితమైన (ఇంతకుముందే చేయబడిన) కర్మలను నశింపజేసుకొనుట చేయవలెను. శరీరమను బంధము కర్మలవల్లనే కలుగుచున్నది. అందుకు వైపరీత్యముతో అనగా కర్మపరిత్యాగముతో మోక్షమును మానవుడు పొందుచున్నాడు.

ఏతత్తే కథితం జ్ఞానం యోగం చేమం నిబోధ మే ।
యం ప్రాప్య బ్రాహ్మణో యోగీ శాశ్వతాన్నాన్యతాం వ్రజేత్ ॥8॥

ఓ రాజా ! నీకు నేను చెప్పిన యోగమును గూర్చి బాగుగా తెలుసుకొనుము. అట్టి యోగమును పొందిన యోగి పరబ్రహ్మమును పొందగలడు. మరొకదానిని పొందడు.

ప్రాగేవాత్మాత్మనా జేయో యోగినాం స హి దుర్జయః ।
కుర్వీత తజ్జయే యత్నం తస్యోపాయం శృణుష్వ మే ॥9॥

ముందుగా ఆత్మను ఆత్మతోనే జయించవలెను. అనగా తనను పరబ్రహ్మస్వరూపముగా తెలుసుకొనవలెను. యోగులకు అది మిక్కిలి కష్టసాధ్యమైనది. ఆ జయమందు యత్నమును చేయవలెను. దానికి ఉపాయము చెప్పెదను వినుము.

ప్రాణాయామైర్దహేద్దోషాన్ ధారణాభిశ్చ కిల్బిషమ్ ।
ప్రత్యాహారేణ విషయాన్ ధ్యానేనానీశ్వరాన్గుణాన్ ॥10॥

అష్టాంగయోగమందలి ప్రాణాయామములచేత దోషములను భస్మము చేయవలెను. ధారణలచే పాపములను, ప్రత్యాహారముచే విషయములను, ధ్యానముచే అనీశ్వరగుణములను దహించివేయవలెను.

యథా పర్వతధాతూనాం ధ్మాతానాం దహ్యతే మలమ్ ।
తథేన్ద్రియకృతా దోషా దహ్యన్తే ప్రాణనిగ్రహాత్ ॥11॥

పర్వతములందలి ధాతువులు (లోహములు) మండించబడగా వాటి మలములు అనగా దోషాలు ఎట్లు దహించివేయబడుచున్నవో అట్లే ఆయా చక్షురాది ఇంద్రియాలచే చేయబడిన దోషాలు ప్రాణాయామములచే దహించివేయబడుచున్నవి.

ప్రథమం సాధనం కుర్యాత్ ప్రాణాయామస్య యోగవిత్ ।
ప్రాణాపాననిరోధస్తు ప్రాణాయామ ఉదాహృతః ॥12॥

యోగమునెరిగినవాడు ముందుగా ప్రాణాయమము కొరకు సాధన చేయవలెను. ప్రాణవాయువు, అపానవాయువులను నిరోధించగలుగుటే ప్రాణాయామమని చెప్పబడినది.

లఘుమధ్యోత్తరీయాఖ్యః ప్రాణాయామస్త్రిధోదితః ।
తస్య ప్రమాణం వక్ష్యామి తదలర్క శృణుష్వ మే ॥13॥

లఘువు, మధ్యమము, ఉత్తరీయము అని ప్రాణాయామము మూడు విధములుగా చెప్పబడినది. ఓ అలర్కుడా! ఆ మూడింటి ప్రమాణము ఎంతో చెప్పెదను, వినుము.

లఘుర్ద్వాదశమాత్రస్తు ద్విగుణస్స తు మధ్యమః ।
త్రిగుణాభిస్తు మాత్రాభిరుత్తమః పరికీర్తితః ॥14॥

లఘు ప్రాణాయామము పన్నెండు మాత్రల కాలము పరిమాణము కలిగినది. మధ్యమము రెండింతలు అనగా ఇరవై నాలుగు మాత్రల కాలపరిమాణము కలది. ఉత్తరీయము అనగా ఉత్తమ ప్రాణాయామము మూడు రెట్లు అనగా ముప్ఫైఆరు మాత్రల కాలము పరిమాణముగా గలది. అనగా అంతంత కాలము శ్వాసను నిరోధించవలెనని అర్థము.

నిమేషోన్మేషణే మాత్రాకాలో లఘ్వక్షరస్తథా ।
ప్రాణాయామస్య సంఖ్యార్థం స్మృతో ద్వాదశమాత్రికః ॥15॥

కన్నుమూయుట, తెరచుటలకు పట్టే కాలము మాత్రాకాలమని చెప్పబడుచున్నది. ఈ ప్రకారము పన్నెండు మాత్రల కాలమైనచో లఘుప్రాణాయామము అగుచున్నది.

ప్రథమేన జయేత్ స్వేదం మధ్యమేన చ వేపథుమ్ ।
విషాదం హి తృతీయేన జయేద్దోషాననుక్రమాత్ ॥16॥

మొదటి ప్రాణాయామముతో స్వేదమును (చెమటను), రెండవ ప్రాణాయామముతో వణకుటను, మూడవ ప్రాణాయామముతో విషాదమును క్రమముగా జయించవలెను.

మృదుత్వం సేవ్యమానాస్తు సింహశార్దూలకుఞ్జరాః ।
యథా యాన్తి తథా ప్రాణో వశ్యో భవతి యోగినః ॥17॥

సేవించగా సేవించగా సింహము, పులి, ఏనుగు వంటి క్రూరమృగములు కూడా మృదుస్వభావమును (అనగా చెప్పినట్లు వినుట) ఎట్లు పొందుచున్నవో అట్లే యోగుల ప్రాణము కూడా (ప్రాణవాయువు) వారికి వశమగుచున్నది.

వశ్యం మత్తం యథేచ్ఛాతో నాగం నయతి హస్తిపః ।
తథైవ యోగీ ఛన్దేన ప్రాణం నయతి సాధితమ్ ॥18॥

మదించిన ఏనుగును మావటివాడు తన వశము చేసుకొని తన ఇచ్ఛానుసారము ఎట్లు నడిపించునో అట్లే యోగి స్వేచ్ఛగా ప్రాణాయామముద్వారా సాధించిన (జయించిన) ప్రాణమును తన వశములో పెట్టుకొని నడిపించగలడు.

యథా హి సాధితస్సింహో మృగాన్ హన్తి న మానవాన్ ।
తద్వన్నిషిద్ధపవనః కిల్బిషం న నృణాం తనుమ్ ॥19॥

తస్మాద్యుక్తః సదా యోగీ ప్రాణాయామపరో భవేత్ ।

తాను వశపరచుకొన్న, తన స్వాధీనమందు ఉంచుకొనబడిన సింహము మృగములను చంపునే గాని మానవులను చంపదు. అట్లే నిషేధింపబడిన లేదా నిరోధింపబడిన వాయువు మానవుల పాపములను నశింపచేయునే గాని వారి శరీరమును నశింపచేయదు. అందువలన యోగి ఎల్లప్పుడు ప్రాణాయామమును అనుష్ఠించుచూ ఉండవలెను.

శ్రూయతాం ముక్తిఫలదం తస్యావస్థా చతుష్టయమ్ ॥20॥

ధ్వస్తిః ప్రాప్తిస్తథా సంవిత్ప్రసాదశ్చ మహీపతే ।
స్వరూపం శృణు చైతేషాం కథ్యమానమనుక్రమాత్ ॥21॥

ముక్తియను ఫలమునిచ్చు ప్రాణాయామముయొక్క నాలుగు అవస్థలను గూర్చి చెప్పెదను, వినుము. ధ్వస్తి, ప్రాప్తి, సంవిత్ మరియు ప్రసాదము ఈ నాలుగు ప్రాణాయామముయొక్క అవస్థలు. వాటి స్వరూపమును క్రమముగా చెప్పెదను, వినుము.

కర్మణామిష్టదుష్టానాం జాయతే ఫలసంక్షయః ।
చేతసోఽపకషాయత్వం యత్ర సా ధ్వస్తిరుచ్యతే ॥22॥

ఏ అవస్థయందు ఇష్టములు, దుష్టములూ అయిన కర్మల ఫలము నశించునో మరియు చిత్తమునందలి మాలిన్యము తొలగిపోవునో అట్టి అవస్థ ధ్వస్తియనబడును.

ఐహికాముష్మికాన్ కామాన్ లోభమోహాత్మకాన్ స్వయమ్ ।
నిరుధ్యాస్తే సదా యోగీ ప్రాప్తిస్సా సార్వకాలికీ ॥23॥

ఏ అవస్థయందు ఐహికములు (ఈ లోకమునకు సంబంధించినవి), ఆముష్మికములు (పరలోకమునకు సంబంధించినవి) అయిన లోభమోహాత్మకములయిన కోరికలను తాను స్వయముగా నిరోధించి యోగి ఉంటాడో అట్టి అవస్థ సార్వకాలికమైన ప్రాప్తియనబడును.

అతీతానాగతానర్థాన్విప్రకృష్టతిరోహితాన్ ।
విజానాతీన్దుసూర్యర్క్షగ్రహాణాం జ్ఞానసమ్పదా ॥24॥

తుల్యప్రభావస్తు యదా యోగీ ప్రాప్నోతి సంవిదమ్ ।
తదా సంవిదితి ఖ్యాతా ప్రాణాయామస్య సా స్థితిః ॥25॥

ఏ అవస్థయందు గడచిపోయినవి, రాబోయేవి, దూరమందున్నవి, కనిపించకుండా ఉన్నవీ అయిన విషయాలను కూడా యోగి తెలుసుకుంటాడో ఇంకనూ సూర్యచంద్రులు, నక్షత్రాలు, గ్రహాలు వీటిని గురించిన జ్ఞానమును పొంది వాటితో సమానమైన ప్రభావము కలిగియుంటాడో అట్టి అవస్థ ప్రాణాయామముయొక్క సంవిత్ అవస్థ అని చెప్పబడుచున్నది.

యాన్తి ప్రసాదం యేనాస్య మనః పఞ్చ చ వాయవః ।
ఇన్ద్రియాణీన్ద్రియార్థాశ్చ స ప్రసాద ఇతి స్మృతః ॥26॥

ఏ అవస్థయందు యోగియొక్క మనస్సు, ప్రాణాది పంచవాయువులు, చక్షురాది ఇంద్రియాలు, శబ్దాది ఇంద్రియవిషయాలు పరిశుద్ధములగునో లేదా శాంతించునో అట్టి అవస్థ ప్రసాదమని చెప్పబడుచున్నది.

శృణుష్వ చ మహీపాల ప్రాణాయామస్య లక్షణమ్ ।
యుఞ్జతశ్చ సదా యోగం యాదృగ్విహితమాసనమ్ ॥27॥

ఓ రాజా ! ప్రాణాయామముయొక్క లక్షణము మరియు యోగానుష్ఠానము చేయువానికి ఎట్టి ఆసనము విధింపబడినదో దానిని చెప్పెదను వినుము.

పద్మమర్ధాసనం చాపి తథా స్వస్తికమాసనమ్ ।
ఆస్థాయ యోగం యుఞ్జీత కృత్వా చ ప్రణవం హృది ॥28॥

పద్మాసనము, అర్ధాసనము, స్వస్తికాసనము ఈ మొదలగు ఆసనములను అవలంబించి హృదయమందు ఓంకార ప్రణవమంత్రమును జపించుచు యోగమును అనుష్ఠించవలెను.

సమస్సమాసనో భూత్వా సంహృత్య చరణావుభౌ ।
సంవృతాస్యస్తథైవోరూ సమ్యగ్విష్టభ్య చాగ్రతః ॥29॥

పార్ష్ణిభ్యాం లిఙ్గవృషణావస్పృశన్ ప్రయతః స్థితః ।
కిఞ్చిదున్నామితశిరా దంతైర్దంతాన్న సంస్పృశేత్ ॥30॥

సరిగా, కదలకుండా సమమైన ఆసనమందు కూర్చొని, తన రెండు పాదములను ముడుచుకొని, నోటిని మూసుకొని, రెండు తొడలను బాగుగా అగ్రభాగమందు ఉండునటుల చేసి ఉండవలెను. తన కాలిముడుసులకు

లింగము, వృషణములు తగులకుండా ఉండునటుల యత్నపూర్వకముగా ఉండవలెను. కొంచెము తలపైకెత్తి ఉండవలెను. దంతములతో దంతములను స్పృశించరాదు.

సంపశ్యన్నాసికాగ్రం స్వం దిశశ్చానవలోకయన్ ।
రజసా తమసో వృత్తిం సత్త్వేన రజసస్తథా ॥31॥

సంభాధ్య నిర్మలే సత్త్వే స్థితో యుఞ్జీత యోగవిత్ ।

ఇంకను తన ముక్కు అగ్రభాగమును మాత్రమే చూస్తూ ఉండవలెను. దిక్కులను చూడరాదు. యోగవేత్త రజోగుణముచే తమోగుణమును, సత్త్వగుణముచే రజోగుణముచే కప్పివేసి (అనగా వాటి వ్యాపారములను లేకుండా చేసి) నిర్మలమైన సత్త్వగుణమందు మాత్రమే ఆసీనుడు కావలెను.

ఇంద్రియాణీంద్రియార్థేభ్యః ప్రాణాదీన్మన ఏవ చ ॥32॥

నిగృహ్య సమవాయేన ప్రత్యాహారముపక్రమేత్ ।
యస్తు ప్రత్యాహరేత్కామాన్సర్వాఙ్గానీవ కచ్ఛపః ॥33॥

సదాఽఽత్మరతిరేకస్థః పశ్యత్యాత్మానమాత్మని ।
స బాహ్యాభ్యంతరం శౌచం నిష్పాద్యాఽఽకంఠనాభితః ॥34॥

పూరయిత్వా బుధో దేహం ప్రత్యాహారముపక్రమేత్ ।

శబ్దాది ఇంద్రియవిషయాలనుండి చక్షుశ్శ్రోత్రాది ఇంద్రియాలను, ప్రాణాదులను, మనస్సును నిగ్రహించి ప్రత్యాహారమను యోగాంగమందు ప్రవృత్తుడు కావలెను. తాబేలు తన అవయవములన్నింటిని ఎట్లు బయటకు కనిపించకుండా దగ్గరగా ముడుచుకొనునో అట్లే ఎవరయితే సమస్త వాంఛలను ప్రత్యాహారపరచి (ప్రవృత్తి లేకుండా ఒక్కచోటకు చేర్చి) ఎల్లప్పుడు ఆత్మధ్యానమందే మునిగి తనయందు పరబ్రహ్మమును మాత్రమే చూచుకొనునో, అట్టి యోగి లోపల బయటా కూడా కంఠము నుండి నాభిప్రదేశము వరకు దేహమంతటా శౌచమును నింపి ప్రత్యాహారయోగమును అనుష్ఠించవలెను.

ప్రాణాయామా దశ ద్వౌ చ ధారణా సాభిధీయతే ॥35॥
ద్వే ధారణే స్మృతే యోగే యోగిభిస్తత్త్వదృష్టిభిః ।

పన్నెండువిధములైన ప్రాణాయామములు ధారణయని చెప్పబడుచున్నవి. యోగమందు తత్త్వదర్శులచేత ధారణ రెండువిధములుగ చెప్పబడినది.

తథా వై యోగయుక్తస్య యోగినో నియతాత్మనః ॥36॥

సర్వే దోషాః ప్రణశ్యన్తి స్వస్థశ్చైవోపజాయతే ।
వీక్షతే చ పరం బ్రహ్మ ప్రాకృతాంశ్చ గుణాన్ పృథక్ ॥37॥

వ్యోమాదిపరమాణూంశ్చ తథాత్మానమకల్మషమ్ ।

యోగానుష్ఠానము చేయుచు ఆత్మనిగ్రహముగల యోగియొక్క సమస్తదోషములు నశించుచున్నవి. అట్టి యోగి స్వస్థుడు అగుచున్నాడు, ఇంకను పరబ్రహ్మసాక్షాత్కారము పొందుచున్నాడు, మరియు శబ్దాది ప్రాకృత గుణములను ఆకాశమునుండి పరమాణుపర్యంతము ఆయా వస్తువులను బ్రహ్మముకంటే వేరుగా చూచుచున్నాడు. స్వస్వరూపమును ఎట్టి కల్మషములు లేనిదానిగా చూచుచున్నాడు.

ఇత్థం యోగీ యతాహారః ప్రాణాయామపరాయణః ॥38॥

జితాం జితాం శనైర్భూమిమారోహేత యథా గృహమ్ ।
దోషాన్ వ్యాధీంస్తథా మోహమాక్రాన్తా భూరనిర్జితా ॥39॥

వివర్ధయతి నారోహేత్తస్మాత్ భూమిమనిర్జితామ్ ।
ప్రాణానాముపసంరోధాత్ ప్రాణాయామ ఇతి స్మృతః ॥40॥

ఈ విధముగా యోగి నియతాహారముగలవాడై, ప్రాణాయామపరాయణుడై నెమ్మదిగా తన ఇంటిని పొందినట్లుగా, జయింపబడిన భూమిని అధిరోహించవలెను. (యోగులు నివసించేదీ, యోగానుష్ఠానము చేయబడ్డదీ అయిన భూమి జయింపబడినది, ఎట్టి కల్మషములు లేనిదని అర్థము) ఇక జయింపబడని భూమి దోషములను, వ్యాధులను, అజ్ఞానమును వృద్ధిచేయును గావున అట్టి భూమిని అధిరోహించరాదు. దేనిద్వారా ప్రాణాపానాది అయిదు వాయువులు నిగ్రహింపబడుచున్నవో దానినే ప్రాణాయామమని చెప్పుచున్నారు.

ధారణేత్యుచ్యతే చేయం ధార్యతే యన్మనో యయా ।
శబ్దాదిభ్యః ప్రవృత్తాని యదక్షాణి యతాత్మభిః ॥41॥

ప్రత్యాహ్రియన్తే యోగేన ప్రత్యాహారస్తతః స్మృతః ।

దేనిచేతనైతే మనస్సు ధరింపచేయబడుచున్నదో అనగా నిగ్రహింపబడుచున్నదో దానినే ధారణయందురు. ఇంద్రియనిగ్రహముగల యోగులు ఆయా శబ్దాది విషయములందు ప్రవృత్తమైన ఇంద్రియాలను శబ్దాదివిషయములనుండి ప్రత్యాహరింపచేయుచున్నారు అనగా మరలించుచున్నారుగావున అట్టి అవస్థయే ప్రత్యాహారమని చెప్పబడినది.

ఉపాయశ్చాత్ర కథితో యోగిభిః పరమర్షిభిః ॥42॥

యేన వ్యాధ్యాదయో దోషా న జాయన్తే హి యోగినః ।
యథా తోయార్థినస్తోయం యంత్రనాలాదిభిశ్శనైః ॥43॥

ఆపిబేయుస్తథా వాయుం పిబేద్యోగీ జితశ్రమః ।
ప్రాఙ్నాభ్యాం హృదయే చాథ తృతీయే చ తథోరసి ॥44॥

కంఠే ముఖే నాసికాగ్రే నేత్రభ్రూమధ్యమూర్ధసు ।
కిఞ్చ తస్మాత్పరస్మింశ్చ ధారణా పరమా స్మృతా ॥45॥

దశైతే ధారణాః ప్రాప్య ప్రాప్నోత్యక్షరసామ్యతామ్ ।

యోగులకు వ్యాధి మొదలగు దోషములు కలుగకుండు విధముగా పరమర్షులైన యోగులు ఈ ధారణాత్మక ప్రత్యాహారమందు ఉపాయములను చెప్పినారు. జలమును త్రాగాలనుకునే వ్యక్తులు పాత్రలు, కుళాయిలు మొదలగు సాధనములద్వారా నెమ్మదిగా జలమును త్రాగినట్లుగా శ్రమను జయించిన యోగి కూడా నెమ్మదిగా వాయువును త్రాగవలెను. అనగా నెమ్మదిగా లోనికి తీసుకొనవలెను. ముందుగా నాభియందు, ఆ తరువాత ముఖమందు, నాసికాగ్రభాగమందు, నేత్రములందు, భ్రూమధ్యభాగమందు, శిరస్సునందు, చివరగా పరబ్రహ్మమునందు మనస్సును ధరింపచేయుట అనగా నిలకడగా ఉంచుకొనుట ధారణయని చెప్పబడినది. ఈ విధముగా నాభి మొదలగు దేశభేదముచే పది విధములైన ధారణను పొందిన యోగి అక్షరసామ్యమును అనగా పరబ్రహ్మైక్యమును పొందుచున్నాడు.

నాధ్మాతః క్షుధితః శ్రాన్తో న చ వ్యాకులచేతనః ॥46॥

యుఞ్జీత యోగం రాజేంద్ర యోగీ సిద్ధ్యర్థమాదృతః ।
నాతిశీతే న చోష్ణే వై న ద్వంద్వే నానిలాత్మకే ॥47॥

కాలేష్వేతేషు యుఞ్జీత న యోగం ధ్యానతత్పరః ।
స శబ్దాగ్నిజలాభ్యాశే జీర్ణగోష్ఠే చతుష్పథే ॥48॥

శుష్కపర్ణచయే నద్యాం శ్మశానే ససరీసృపే ।
సభయే కూపతీరే వా చైత్యవల్మీకసఞ్చయే ॥49॥

దేశేష్వేతేషు తత్త్వజ్ఞో యోగాభ్యాసం వివర్జయేత్ ।
సత్త్వస్యానుపపత్తౌ చ దేశకాలం వివర్జయేత్ ॥50॥

నాసతో దర్శనం యోగే తస్మాత్తత్పరివర్జయేత్ ।

ఓ రాజేంద్రా! శబ్దము చేయువాడు, ఆకలిగొన్నవాడు, అలసటచెందినవాడు, వ్యాకులమైన చిత్తముగలవాడు యోగమును అనుష్ఠించరాదు. యోగమును అనుష్ఠించువాడు యోగసిద్ధికొరకు మిక్కిలి శీతల ప్రదేశమందు, వేడి ప్రదేశమందు, సుఖదుఃఖ శీతోష్ణాది ద్వంద్వములందు, వేగముగా గాలి వీచుచున్నప్పుడు ఈ కాలప్రదేశములందు ధ్యానతత్పరుడై యోగమును అనుష్ఠించరాదు. ధ్వని బాగా వచ్చు దేశమందు, అగ్ని మరియు జలముల సమీపమందు, జీర్ణమైన గోశాలయందు, నాలుగు దారుల కూడలియందు, ఎండిన ఆకులతో నిండిన ప్రదేశమందు, నదియందు, శ్మశానమందు, పాములతో కూడిన ప్రదేశమందు, భయమునుగొల్పు ప్రదేశమందు, నూతిగట్టునందు, నాస్తిక బౌద్ధారామములందు, పుట్టలు కలిగిన ప్రదేశములందు తత్త్వజ్ఞుడైన యోగి యోగాభ్యాసమును విడిచిపెట్టవలెను. సత్త్వగుణములు కనిపించనిచో అట్టి దేశకాలములను కూడా విడిచిపెట్టవలెను. యోగమును అనుష్ఠించు కాలమందు చెడువస్తువులను, చూడకూడని వస్తువులను చూడరాదు. కావున యోగానుష్ఠానకాలమందు అట్టి వస్తువులను విడిచిపెట్టవలెను.

దోషానేతాననాదృత్య మూఢత్వాద్యో యునక్తి వై ॥51॥

విఘ్నాయ తస్య వై దోషా జాయన్తే తన్నిబోధ మే ।
బాధిర్యం జడతా లోపః స్మృతేర్మూకత్వమంధతా ॥52॥

జ్వరశ్చ జాయతే సద్యస్తత్తదజ్ఞానయోగినః ।

పైన చెప్పిన విధముగా ఆయా దోషములను లెక్కచేయక మూర్ఖముగా ఎవరయితే యోగాభ్యాసము చేయునో వారియందు అనేకదోషాలు ఉత్పన్నమై అతడు చేయు కార్యములందు విఘ్నములను కలుగచేయును. వాటిని గూర్చి చెప్పెదను, వినుము. అజ్ఞానముతో యోగానుష్ఠానము చేయు అట్టి యోగికి చెవిటితనము, జడత్వము (ఏ పనీ చేయలేకపోవుట), స్మృతిలోపము (మరచిపోవుట), మూగతనము, గ్రుడ్డితనము, మరియు తత్క్షణమే జ్వరము కలుగును.

ప్రమాదాద్యోగినో దోషా యద్యేతే స్యుశ్చికిత్సితమ్ ॥53॥

తేషాం నాశాయ కర్తవ్యం యోగినాం తన్నిబోధ మే ।
స్నిగ్ధాం యవాగూమత్యుష్ణాం భుక్త్వా తత్రైవ ధారయేత్ ॥54॥

వాతగుల్మప్రశాంత్యర్థముదావర్తే తథోదరే ।
యవాగూం వాపి పవనం వాయుగ్రన్థిం ప్రతిక్షిపేత్ ॥55॥

ప్రమాదవశమున యోగికి ఈ అన్ని దోషములు సంభవించిన యెడల వాటి నాశము ఎట్లు కలుగునో తెలుసుకోవాలనే కోరిక ఉన్నచో చెప్పెదను వినుము. బాగుగా ఉడికించిన వేడిగా ఉన్న యవాగును (గంజిని) తిని మనస్సును ఏదేని ఒక వస్తువునందు స్థిరముగా ఏకాగ్రముగా ఉంచుకొనవలెను. వాతము, గుల్మము, ఉదరసంబంధ రోగములు శాంతించుటకు యవాగును భక్షించవలెను. దీనివలన వాయుసంబంధమైన రోగములను పోగొట్టుకొనవలెను.

తద్వత్కంపే మహాశైలం స్థిరం మనసి ధారయేత్ ।
విఘాతే వచసో వాచం బాధిర్యే శ్రవణేంద్రియమ్ ॥56॥

యథైవామ్రఫలం ధ్యాయేత్తృష్ణార్తో రసనేంద్రియమ్ ।

అట్లే కంపము (శరీరము వణకుట) కలిగినప్పుడు పెద్ద పర్వతమందు స్థిరముగా మనస్సును నిలుపవలెను. మాటలాడుటకు విఘాతము కలిగినప్పుడు వాగింద్రియమందు, చెవిటితనము వచ్చినప్పుడు శ్రవణేంద్రియమందు మనస్సును స్థిరముగా నిలుపవలెను. రసనేంద్రియము (నాలుక) దాహముతో తడి ఆరిపోయినప్పుడు మామిడిపండునందు మనస్సును స్థిరముగా నిలిపినట్లే పైవాటియందు కూడా నిలుపవలెను. (ఈ విధముగా చేయుటవలన ఆయా బాధలు వాటియందు దృష్టి లేనందున కొంత ఉపశమించునని భావము.)

యస్మిన్యస్మిన్ రుజా దేహే తస్మింస్తదుపకారిణీమ్ ॥57॥

ధారయేద్ధారణాముష్ణే శీతాం శీతే చ దాహినీమ్ ।
కీలం శిరసి సంస్థాప్య కాష్ఠం కాష్ఠేన తాడయేత్ ॥58॥
లుప్తస్మృతేః స్మృతిస్సద్యో యోగినస్తేన జాయతే ।
ద్యావాపృథివ్యౌ వాయ్వగ్నీ వ్యాపినావపి ధారయేత్ ॥59॥

అమానుషాత్ సత్త్వజాద్వా బాధాస్త్వితి చికిత్సితమ్ ।

ఈ విధముగా దేహమందలి ఏ ఏ భాగమందు వ్యాధులు కలుగునో అచ్చట ఆ వ్యాధి పోగొట్టుకొనుటకై తదుపకారకమైన యోగమును అనుష్ఠించవలెను. అధికమైన శీతలమందు తానున్నచో ఆ బాధను పోగొట్టుకొనుటకై ఉష్ణమందు ధారణచేయవలెను. అట్లే అగ్నియందు తానున్నచో ఆ బాధను పోగొట్టుకొనుటకై శీతలమందు ధారణ చేయవలెను. మేకును నెత్తిమీద పెట్టుకొని కట్టెతో మరొక కట్టెను దెబ్బకొట్టినచో జ్ఞాపకశక్తిపోయిన యోగికి వెంటనే స్మరణము అనగా జ్ఞాపకశక్తివచ్చును. వాయువు వ్యాపించిన ఆకాశమును, అగ్ని వ్యాపించిన పృథివిని కూడా స్మృతికొరకు ధారణ చేయవలెను. మానవేతరములనుండి, సత్త్వగుణమువలన పుట్టినదానినుంచీ కూడా వాటిని ధారణ చేయుట వలన ముందు చెప్పిన బాధలు తొలగిపోవును.

అమానుషం సత్త్వమన్తర్యోగినం ప్రవిశేద్యది ॥60॥

వాయ్వగ్నిం ధారణేనైనం దేహసంస్థం వినిర్దహేత్ ।
ఏవం సర్వాత్మనా రక్షా కార్యా యోగవిదా నృప ॥61॥

ధర్మార్థకామమోక్షాణాం శరీరం సాధనం యతః ।

అమానుషమైన సత్త్వము యోగిహృదయమందు ప్రవేశించినయెడల దేహమందున్న వాటిని వాయువును అగ్నిని ధారణ చేయుటవలన దహించివేయవచ్చును. ఈ విధముగా ఓ రాజా ! యోగవేత్త తనను తాను అన్నివిధాలా రక్షించుకొనవలెను, ఎందువలననగా ధర్మార్థకామమోక్షములనెడు చతుర్విధపురుషార్థములకు శరీరమే ముఖ్యసాధనము కదా !

ప్రవృత్తిలక్షణాఖ్యానాద్యోగినో విస్మయాత్తథా ।
విజ్ఞానం విలయం యాతి తస్మాద్గోప్యాః ప్రవృత్తయః ॥62॥

తానేమి పని చేయదలచుకున్నాడో దానిని ముందే వెల్లడించుటగాని, లేదా ఆ పని ఏదో తెలిసే విధంగా ఆశ్చర్యాన్ని ప్రకటించడంగాని చేసినచో యోగియొక్క విజ్ఞానము నష్టమైపోవుచున్నది. అనగా అతని కార్యములు చెడిపోవుచున్నవి. అందువలన ప్రవృత్తులు అనగా తాను చేయబోయే పనులను రహస్యముగా ఉంచవలెను.

అలౌల్యమారోగ్యమనిష్ఠురత్వం గంధః శుభో మూత్రపురీషమల్పమ్ ।
కాన్తిః ప్రసాదః స్వరసౌమ్యతా చ యోగప్రవృత్తేః ప్రథమం హి చిహ్నమ్ ॥63॥

చంచలస్వభావము లేకుండుట, ఆరోగ్యము, కఠినముగా మాటలాడుకుండుట, దేహమునందు సుగంధ ప్రసారము, తక్కువగా మూత్రపురీషములను విసర్జించుట, కాంతి, ప్రసాదము అనగా ఎదుటివారిని ఆహ్లాదపరచే గుణము, మధురముగానూ మృదువుగానూ మాటలాడుట ఇవియన్నియు యోగప్రవృత్తికి మొదటి చిహ్నములు.

అనురాగం జనో యాతి పరోక్షే గుణకీర్తనమ్ ।
న బిభ్యతి చ సత్త్వాని సిద్ధేర్లక్షణముత్తమమ్ ॥64॥

అనురాగముతో ఏ జనుడయితే ఇతరుల పరోక్షమందు కూడా వారి గుణములను ప్రశంసించునో ఇంకనూ ఏ ప్రాణులకూ భయపడడో అతడి యోగసిద్ధి ఉత్తమమైనదిగా భావించవలెను.

శీతోష్ణాదిభిరత్యుగ్రైర్యస్య బాధా న విద్యతే ।
న భీతిమేతి చాన్యేభ్యస్తస్య సిద్ధిరుపస్థితా ॥65॥

మిక్కిలి అధికమైన శీతము, ఉష్ణము మొదలగు వానివలన ఎవరికి బాధ కలుగదో మరియు ఎవరు ఇతరులకు భయపడరో అట్టివారికి సంపూర్ణమైన యోగసిద్ధి కలిగినదని తెలుసుకొనుము.

ఇతి శ్రీమార్కండేయ మహాపురాణే జడోపాఖ్యానే యోగనిరూపణం నామ షట్త్రింశోఽధ్యాయః ॥36॥

శ్రీమార్కండేయ మహాపురాణమందలి జడోపాఖ్యానమందు యోగనిరూపణమను ముప్పదియారవ అధ్యాయం సమాప్తం.



సప్తత్రింశోऽధ్యాయః – ముప్పదిఏడవ అధ్యాయం
యోగసిద్ధిః – యోగసిద్ధి

దత్తాత్రేయ ఉవాచ – దత్తాత్రేయుడు పలికాడు.

ఉపసర్గాః ప్రవర్తన్తే దృష్టే హ్యాత్మని యోగినః ।
యే తాంస్తే సంప్రవక్ష్యామి సమాసేన నిబోధ మే ॥1॥

యోగులకు ఆత్మదర్శనమైనప్పుడు అట్టి ఆత్మయందు కొన్ని ఉపద్రవములు లేదా యోగమునకు అడ్డంకులు ఏర్పడును. వాటిని గూర్చి సంక్షేపముగా చెప్పెదను, వినుము.

కామ్యాః క్రియాస్తథా కామాన్ మానుషానభివాంఛతి ।
స్త్రియో దానఫలం విద్యాం మాయాం కుప్యం ధనం దివమ్ ॥2॥

దేవత్వమమరేశత్వం రసాయనవయః క్రియామ్ ।
మరుత్ప్రతనం యజ్ఞం జలాగ్న్యావేశనం తథా ॥3॥

శ్రాద్ధానాం సర్వదానానాం ఫలాని నియమాంస్తథా ।
తథోపవాసాత్పూర్తాచ్చ దేవతాభ్యర్చనాదపి ॥4॥

తేభ్యస్తేభ్యశ్చ కర్మభ్య ఉపసృష్టోऽభివాంఛతి ।
చిత్తమిత్థం వర్తమానం యత్నాద్యోగీ నివర్తయేత్ ॥5॥

స్వర్గసాధనములైన అగ్నిహోత్రాది కామ్యక్రియలు, మానవసంబంధమైన కోరికలు, స్త్రీలు, దానఫలము, విద్య, మాయ, సువర్ణము, వెండి అను ధనము, స్వర్గము, దేవతాభావము, దేవేంద్రభావము, ఔషధఫలమైన యవ్వనము, గాలులలో దూకుట, యజ్ఞము, జలము అగ్నులందు ప్రవేశించగల శక్తి, శ్రాద్ధములు మరియు సమస్తదానముల ఫలములు, ధర్మసంబంధమైన కార్యములు, ఉపవాసముండుట, నూతులు చెరువులు తవ్వించుట అను పూర్తక్రియలు, దేవతలను పూజించుట మొదలగు ఆయా కర్మల ఫలములను ఆశించుచు, ఆయా కర్మలతో ప్రతిబంధింపబడిన యోగానుష్ఠానముగల యోగి ఈ విధమైన చిత్తమును ప్రయత్నముతో యోగమువైపు మరలించవలెను.

బ్రహ్మసజ్గిమనః కుర్వన్నుపసర్గాత్ప్రముచ్యతే ।
ఉపసర్గైర్జితైరేభిరుపసర్గాస్తతః పునః ॥6॥

యోగినః సంప్రవర్తన్తే సాత్త్వరాజసతామసాః ।
ప్రాతిభః శ్రావణో దైవో భ్రమావర్తౌ తథాపరౌ ॥7॥

పంచైతే యోగినాం యోగవిఘ్నాయ కటుకోదయాః ।

తన మనస్సును బ్రహ్మమునందు లగ్నము చేసినచో పై ఉపద్రవములనుండి విముక్తుడగును. పైన చెప్పబడిన ఉపద్రవములనుండి ముక్తుడైననూ, మరల సాత్త్వము, రాజసము, తామసము అను ఉపసర్గలు (యోగప్రతిబంధకాలు)

యోగికి పుట్టుచునే యుండును. వానిలో ప్రాతిభము, శ్రావణము, దైవము, భ్రమ, ఆవర్తము అను అయిదు విధములైన ఉపద్రవములు యోగులయొక్క యోగమును విఘ్నపరచుటకు భయంకరరూపముతో ఆవిర్భవించును.

వేదార్థాః కావ్యశాస్త్రార్థా విద్యాశిల్పాన్యశేషతః ॥8॥

ప్రతిభాన్తి యదస్యేతి ప్రాతిభస్స తు యోగినః ।

అశేషములైన వేదార్థములు, కావ్యశాస్త్రార్థములు, శాస్త్రవిద్యలు, చిత్రకళలు మొదలగు శిల్పవిద్యలు మొదలగు ఉపసర్గలు యోగాభ్యాసము చేయు సమయమందు యోగికి స్ఫురించుచుండును. అట్టి ఉపసర్గకు ప్రాతిభమని పేరు. (వేదాధ్యయనము మొదలగువాటిని తప్పక చేయవలసియున్నను, యోగానుష్ఠానమందు ఏకాగ్రత అవసరము కావున వేదార్థము మొదలగునవి అప్పుడు భాసించుట ఉపద్రవమే అని భావించవలెను.)

శబ్దార్థానఖిలాన్వేత్తి శబ్దం గృహ్ణాతి చైవ యత్ ॥9॥

యోజనానాం సహస్రేభ్యః శ్రావణస్సోఽభిధీయతే ।

సమస్తములైన శబ్దార్థములను యోగాభ్యాస సమయమందు యోగి తెలుసుకొనుచుండును. అట్లే సహస్రయోజనముల దూరమునుండి కూడా శబ్దమును యోగానుష్ఠానసమయమందు యోగి వినుచుండును. అటువంటి ఉపద్రవమునకు శ్రావణమని పేరు.

సమన్తాద్వీక్షతే చాష్టౌ స యథా దేవయోనయః ॥10॥

ఉపసర్గం తమప్యాహుర్దైవమున్మత్తవద్బుధాః ।

యోగానుష్ఠానమందు యోగి ఎనిమిది దిక్కులందు అంతట దేవతలవలే, ఉన్మత్తునివలే సమస్తమును చూచునో అట్టి ఉపద్రవమును పండితులు దైవమని చెప్పుచున్నారు.

భ్రామ్యతే యన్నిరాలంబం మనో దోషేణ యోగినః ॥11॥

సమస్తాచారవిభ్రంశాద్భ్రమస్స పరికీర్తితః ।

సమస్త సదాచారములను పాటించని కారణముగా ఎప్పుడయితే యోగియొక్క మనస్సు ఆశ్రయము లేకుండగా నున్న దోషము వలన అటునిటు తిరుగుచుండునో అట్టి ఉపద్రవము భ్రమయని చెప్పబడినది.

ఆవర్త ఇవ తోయస్య జ్ఞానావర్తో యదాకులః ॥12॥

నాశయేచ్చిత్తమావర్త ఉపసర్గస్స ఉచ్యతే ।

నీటిసుడులువలే వ్యాకులతతో జ్ఞానము కూడా స్థిరముగా ఉండక అటునిటు పరిభ్రమించుచుండునో (జ్ఞానము నిశ్చయాత్మకముగా కాకుండా, సందిగ్ధముగా ఉండుట), మరియు ఆ కారణముగా చిత్తమును నాశపరచునో అట్టి ఉపసర్గ లేదా ఉపద్రవము ఆవర్తమని చెప్పబడుచున్నది.

ఏతైర్నాశితయోగాస్తు సకలా దేవయోనయః ॥13॥

ఉపసర్గైర్మహాఘోరైరావర్తన్తే పునఃపునః ।
ప్రావృత్య కంబలం శుక్లం యోగీ తస్మాన్మనోమయమ్ ॥14॥

శరీరమండలే దృష్ట్వా గురుజ్ఞానం తతో హి యత్ ।
జ్ఞానపూర్వోఽపి యో యోగో జ్ఞాతవ్యో వై విపశ్చితా ॥15॥

చిన్తయేత్పరమం బ్రహ్మ కృత్వా తత్ప్రవణం మనః ।

పైన పేర్కొనబడిన ఉపసర్గల ప్రభావముచే యోగభ్రష్టులైన దేవయోనులు (యోగమును విడిచి స్వర్గసాధనములైన యజ్ఞాదులను ఆచరించుటచే దేవతాజన్మ ఎత్తినవారని అర్థము) అట్టి మహాభయంకరమైన అయిదు విధములయిన ఉపసర్గలచే మరల మరల సంసారమందు జన్మనెత్తుచున్నారు. అందువలన యోగి మనోమయమైన తెల్లని కంబళిని కప్పుకొని పరబ్రహ్మమునందు మనస్సును నిలిపి ఆ పరబ్రహ్మమునే ధ్యానించుచుండవలెను. తన శరీరమండలమందు గురుజ్ఞానమును (యోగానికి ప్రతిబంధకమైన ముందు చెప్పిన విధముగా ఆయా జ్ఞానాలను) చూచి, పండితుడైన యోగి ఇంతకుముందే లౌకిక జ్ఞానము సిద్ధించినా బ్రహ్మజ్ఞానము కొరకు బ్రహ్మమునందే మనస్సు నిలుపవలెను.

యోగయుక్తస్సదా యోగీ లఘ్వాహారో జితేన్ద్రియః ॥16॥

సూక్ష్మాస్తు ధారణాస్సప్త భూరాద్యా మూర్ధ్ని ధారయేత్ ।
ధరిత్రీం ధారయేద్యోగీ తత్సౌక్ష్మ్యం ప్రతిపద్యతే ॥17॥

ఆత్మానం మన్యతే చోర్వీం తద్గంధం చ జహాతి సః ।
తథైవాప్సు రసం సూక్ష్మం తద్వద్రూపం చ తేజసి ॥18॥

స్పర్శం వాయౌ తథా తద్వద్బిభ్రతస్తస్య ధారణామ్ ।
వ్యోమ్నః సూక్ష్మాం ప్రవృత్తిం చ శబ్దం తద్వజ్జహాతి సః ॥19॥

మనసా సర్వభూతానాం మనస్యావిశతే యదా ।
మానసీం ధారణాం బిభ్రన్మనః సూక్ష్మం చ జాయతే ॥20॥

యోగమును అనుష్ఠించు యోగి ఎల్లప్పుడు తక్కువ ఆహారమును తీసుకుంటూ ఇంద్రియములను జయించినవాడై ఉండాలి. భూరాది సప్తవిధములైన సూక్ష్మపదార్థములను (పృథివ్యాది పంచతన్మాత్రలు మరియు మనోబుద్ధులు) తన మెదడునందు యోగి ధారణ చేయవలెను. భూమిని ధారణ చేసినందున దాని సూక్ష్మభావమును యోగి తెలుసుకొనగలడు. భూమిని తానుగా భావించినందున దానియందు గంధమనే గుణమును యోగి విడిచిపెట్టగలడు. అట్లే జలమును ధారణ చేసినందున జలమందలి సూక్ష్మత్వమును తెలుసుకొనుటయేగాక, దానియందున్న రసగుణమును విడిచిపెట్టగలడు. అట్లే తేజస్సును ధారణ చేసినందున దానియందున్న సూక్ష్మత్వమును

తెలుసుకొనుటయేగాక, దానియందున్న రూపమనే గుణమును విడిచిపెట్టగలడు. అట్లే వాయువును ధారణచేసినందున దానియందున్న సూక్ష్మత్వమును తెలుసుకొనుటయేగాక దానియందున్న స్పర్శగుణమును విడిచిపెట్టగలడు. అట్లే ఆకాశమును ధారణ చేసినందున దానియందున్న సూక్ష్మప్రవృత్తిని విడిచిపెట్టగలడు. ఎప్పుడయితే యోగి తన మనస్సుతో సమస్తభూతములయందు ప్రవేశిస్తాడో అప్పుడు తన మనస్సును అచ్చట ధారణ చేసినందున అతని మనస్సు సూక్ష్మము కాగలదు.

తద్వద్బుద్ధిమశేషాణాం సత్త్వానామేత్య యోగవిత్ ।
పరిత్యజతి సంప్రాప్య బుద్ధిసౌక్ష్మ్యమనుత్తమమ్ ॥21॥

అట్లే సమస్తప్రాణుల బుద్ధులందు ప్రవేశించి యోగవేత్త మిక్కిలి ఉత్తమమైన బుద్ధిసూక్ష్మత్వమును సంపాదించి వాటి అన్నింటితోనూ సంబంధమును విడిచిపెట్టును.

పరిత్యజతి సూక్ష్మాణి సప్త త్వేతాని యోగవిత్ ।
సమ్యగ్విజ్ఞాయ యోఽలర్క! తస్యావృత్తిర్న విద్యతే ॥22॥

ఓ అలర్కుడా ! ఈ విధముగా యోగవేత్త పృథివ్యాది సప్తసూక్ష్మపదార్థములను బాగుగా తెలుసుకొని వాటిని విడిచిపెట్టగలడు. ఇక వాటితో సంబంధము పోయినందున అట్టి యోగికి మోక్షము సిద్ధించగా సంసారమందు ఇక పునర్జన్మ ఉండదు.

ఏతాసాం ధారణానాం తు సప్తానాం సౌక్ష్మ్యమాత్మవాన్ ।
దృష్ట్వా దృష్ట్వా తతస్సిద్ధిం త్యక్త్వా త్యక్త్వా పరాం వ్రజేత్ ॥23॥

ఈ విధముగా యోగవేత్త భూరాది సప్తపదార్థముల ధారణ వలన వాటి సూక్ష్మత్వమును ఎరిగి, వాటినన్నిటిని విడిచి పరాత్మక సిద్ధిని అనగా మోక్షమును పొందగలడు.

యస్మిన్యస్మింశ్చ కురుతే భూతే రాగం మహీపతే ।
తస్మింస్తస్మిన్సమాసక్తిం సంప్రాప్య స వినశ్యతి ॥24॥

ఓ రాజా! ఏ ఏ భూతపదార్థమందు యోగి రాగమును అనగా వాటిని ధ్యానమును చేయునో, వాటినన్నింటితోనూ యోగి సంబంధమును పొంది వినాశము చెందగలడు.

తస్మాద్విదిత్వా సూక్ష్మాణి సంసక్తాని పరస్పరమ్ ।
పరిత్యజతి యో దేహీ స పరం ప్రాప్నుయాత్పదమ్ ॥25॥

అందువలన ఏ జీవుడయితే పరస్పరసంబద్ధములైన భూరాది సూక్ష్మపదార్థములతో తన కెట్టి సంబంధమూ లేదని తెలుసుకొని వాటిని విడిచిపెట్టునో అట్టి జీవి పరమపదమును అనగా పరబ్రహ్మైక్యమును పొందును.

ఏతాన్యేవ తు సంధాయ సప్త సూక్ష్మాణి పార్థివ ।
భూతాదీనాం వినాశోఽత్ర సద్భావజ్ఞస్య ముక్తయే ॥26॥

ఓ రాజా! ఈ సప్తవిధములైన సూక్ష్మములను బాగుగా తెలుసుకొన్న యోగికి ఆ భూతపదార్థములు తమ ఉనికిని కోల్పోయినందున అసంగత్వము సిద్ధించినందున మోక్షము లభించును.

గంధాదిషు సమాసక్తిం సంప్రాప్య స వినశ్యతి ।
పునరావర్తతే భూప స బ్రహ్మోపరమానుషమ్ ॥27॥

ఓ రాజా! ఎవరయితే గంధాది గుణములయందు ఆసక్తులవుతారో వారు నశించెదరు. తిరిగి బ్రహ్మపదముకంటే భిన్నమైన మానుషజన్మనెత్తెదరు. జననమరణ ప్రవాహమందు కొట్టుమిట్టాడెదరని భావము.

(ఇంతవరకు విదేహముక్తుల విషయం ప్రతిపాదించబడినదని, ఇటుపైన ప్రకృతిలయుల విషయం చెప్పబడుచున్నదని తెలియుచున్నది.)

సప్తైతే ధారణా యోగీ సమతీత్య యదిచ్ఛతి ।
తస్మింస్తస్మింల్లయం సూక్ష్మే భూతే యాతి నరేశ్వర ॥28॥

ఓ రాజా ! పై భూరాది సప్తవిధములైన ధారణలను స్వస్వరూపముగా భావించి ఎవరయితే కోరుకుంటారో వారు ఆ సూక్ష్మభూతములందే లయమును పొందుతారు.

దేవానామసురాణాం వా గంధర్వోరగరక్షసామ్ ।
దేహేషు లయమాయాతి సఙ్గం నాప్నోతి చ క్వచిత్ ॥29॥

దేవతలు, రాక్షసులు, గంధర్వులు, సర్పములు, రాక్షసులు వీటి దేహములందు పూర్వము చెప్పబడినవారు లయమును పొందుతారు. వేరేవాటితో సంబంధము వారికి ఉండదు.

అణిమా లఘిమా చైవ మహిమా ప్రాప్తిరేవ చ ।
ప్రాకామ్యం చ తథేశిత్వం వశిత్వం చ తథాపరమ్ ॥30॥

యత్ర కామావసాయిత్వం గుణానేతాంస్తథైశ్వరాన్ ।
ప్రాప్నోత్యష్టౌ నరవ్యాఘ్ర పరం నిర్వాణసూచకాన్ ॥31॥

ఓ రాజశ్రేష్ఠుడా! అణిమ, లఘిమ, మహిమ, ప్రాప్తి, ప్రాకామ్యము, ఈశిత్వము, వశిత్వము, కామావసాయిత్వము అను అష్టవిధములైన ఈశ్వరసంబద్ధమైనట్టియు, పరమైన సుఖాన్ని సూచించునట్టియు గుణాలను అట్టి యోగి పొందగలడు.

సూక్ష్మాత్సూక్ష్మతమోఽణీయాన్ శీఘ్రత్వం లఘిమా గుణః ।
మహిమాశేషపూజ్యత్వాత్ ప్రాప్తిర్నాప్రాప్యమస్య యత్ ॥32॥

ప్రాకామ్యమస్య వ్యాపిత్వాదీశిత్వం చేశ్వరో యతః ।
వశిత్వాద్వశిమా నామ యోగినః సప్తమో గుణః ॥33॥

యత్రేచ్ఛాస్థానమప్యుక్తం తత్ర కామావసాయితా ।
ఐశ్వర్యకారణైరేభిర్యోగినః ప్రోక్తమష్టధా ॥34॥

సూక్ష్మములలో మిక్కిలి సూక్ష్మమైనది "అణీయాన్" అని చెప్పబడుచున్నది. శీఘ్రత్వము లఘిమయను గుణము. అశేషజనులచే పూజింపబడుట మహిమయని చెప్పబడును. ఏదీ కూడా లభించకపోవుట అనునది ఉండదో అది ప్రాప్తి. సమస్తమందు వ్యాపించి ఉండుట ప్రాకామ్యగుణము. సమస్తమునకు ప్రభువగుటే ఈశిత్వమనగా. సమస్తము తన వశమందుండుట వశిత్వము లేదా వశిమయను గుణము. ఇది యోగికి ఏడవ గుణము. తన ఇచ్ఛానుసారము గమనము చేయుట లేదా కోరుకొన్నది ప్రతీదీ సంభవించుట కామావసాయిత్వము. ఐశ్వర్యమునకు కారణములైన ఈ ఎనిమిది యోగికి చెప్పబడినవి.

ముక్తిసంసూచకం భూప పరం నిర్వాణమాత్మనః ।
తతో న జాయతే నైవ వర్ధతే న వినశ్యతి ॥35॥

నాపి క్షయమవాప్నోతి పరిణామం న గచ్ఛతి ।
ఛేదం క్లేదం తథా దాహం శోషం భూరాదితో న చ ॥36॥

భూతవర్గాదవాప్నోతి శబ్దాద్యైర్హ్రియతే న చ ।
న చాస్య సన్తి శబ్దాద్యాస్తద్భోక్తా తైర్న యుజ్యతే ॥37॥

ఓ రాజా! యోగి ఈ ఎనిమిది ఐశ్వర్యగుణములు పొందుట ముక్తిసూచకము మరియు పరనిర్వాణము (మోక్షము) లభించుటయని అర్థము. అటుపిమ్మట మరల ఆ యోగి పుట్టడు, వృద్ధి చెందడు, వినాశము చెందడు, క్షయమును పొందడు, పరిణామము అనగా మార్పు కూడా చెందడు. (ఇచ్చట నిరుక్తకారుడు చెప్పిన షడ్భావ వికారములు యోగసిద్ధిని పొందిన యోగికి ఉండవని చెప్పబడినది). అట్లే భూరాది లోకముల వల్లను, పంచమహాభూతముల వల్లను అట్టియోగికి ఛేదనము, చెమట, మంట, ఎండిపోవుట కలుగవు. శబ్దాదులవలన అపహరింపబడడు. (శబ్దాది విషయములకు లొంగడు అని అర్థము). ఆ యోగికి శబ్దాది విషయములుండవు. వాటిని అనుభవించువానికి (అనుభవించువానివలే ఉన్నవానికి) వాటితో ఎటువంటి సంబంధమూ ఉండదు.

యథా హి కనకం ఖణ్డమపద్రవ్యవదగ్నినా ।
దగ్ధశేషం ద్వితీయేన ఖణ్డేనైక్యం వ్రజేన్నృప ॥38॥

న విశేషమవాప్నోతి తద్వద్యోగాగ్నినా యతిః ।
నిర్దగ్ధదోషస్తేనైక్యం ప్రయాతి బ్రహ్మణా సహ ॥39॥

ఓ రాజా! ఎట్లయితే సువర్ణఖండముకానట్టి ఇతర ద్రవ్యముతో కలిసియున్న సువర్ణఖండమును అగ్నియందు కరిగించగా వేరుగా మిగిలిన ఆ శుద్ధసువర్ణఖండము వేరే ఇతర శుద్ధసువర్ణఖండముతో ఐక్యమగునో అట్లే యోగాగ్ని వలన శబ్దాది విషయములన్నీ దగ్ధమైనందున యోగి ఇక ఎట్టి విశేషములను పొందజాలడు. ఎట్టి విశేషములు లేనట్టి ఆ యోగి నిర్విశేష పరబ్రహ్మముతో ఐక్యమును పొందును.

యథాగ్నిరగ్నౌ సంక్షిప్తః సమానత్వమనుప్రజేత్ ।
తదాఖ్యస్తన్మయో భూతో న గృహ్యేత విశేషతః ॥40॥

పరేణ బ్రహ్మణా తద్వత్ ప్రాప్యైక్యం దగ్ధకిల్బిషః ।
యోగీ యాతి పృథగ్భావం న కదాచిన్మహీపతే ॥41॥

యథా జలం జలేనైక్యం నిక్షిప్తముపగచ్ఛతి ।
తథాత్మా సామ్యమభ్యేతి యోగినః పరమాత్మని ॥42॥

ఓ రాజా! అగ్నియందు పడవేయబడిన అగ్ని అగ్నియే యైనట్లు, ఆ పరబ్రహ్మస్వరూపమును పొందిన యోగి ఇక ఎట్టి విశేషములను గ్రహించజాలడు. అదేవిధముగా పాపములు నశించినట్టి యోగి కూడా పరబ్రహ్మస్వరూపమే కాగలడు. పరబ్రహ్మము కంటే వేరు కాడు. జలము జలమందు ప్రవేశించగా జలముతో ఐక్యమైనట్లు యోగియొక్క ఆత్మ కూడా పరమాత్మయందు ఐక్యమును పొందుచున్నది.

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే యోగసిద్ధిర్నామ సప్తత్రింశోఽధ్యాయః ॥37

శ్రీ మార్కండేయ మహాపురాణమందలి యోగసిద్ధియను ముప్పదిఏడవ అధ్యాయం సమాప్తం.



అష్టత్రింశోఽధ్యాయః - ముప్పది ఎనిమిదవ అధ్యాయం
యోగిచర్యాకథనమ్ - యోగిచర్యాకథనం

అలర్క ఉవాచ - అలర్కుడు చెప్పాడు.

భగవన్యోగినశ్చర్యాం శ్రోతుమిచ్ఛామి తత్త్వతః ।
బ్రహ్మవర్త్మన్యనుసరన్యథా యోగీ న సీదతి ॥1॥

ఓ పూజ్యుడా ! యథార్థముగా యోగియొక్క ఆచరణ ఎట్లుండునో, మరియు బ్రహ్మమార్గమును అనుసరించు ఆ యోగి ఎట్లు క్లేశములను పొందడో నీ నుండి వినవలెనని కోరుచున్నాను.

దత్తాత్రేయ ఉవాచ - దత్తాత్రేయుడు చెప్పాడు.

మానాపమానౌ యావేతౌ ప్రత్యుద్వేగకరౌ నృణామ్ ।
తావేవ విపరీతార్థౌ యోగినస్సిద్ధికారకౌ ॥2॥

మానాపమానౌ యావేతౌ తావేవాహుర్విషామృతే ।
అపమానోఽమృతం తత్ర మానస్తు విషమం విషమ్ ॥3॥

గౌరవము, అవమానము ఈ రెండు మానవులకు ఉద్వేగమును కలిగించును. అనగా గౌరవము సంతోషమును, అవమానము దుఃఖమును కలిగించును. కాని, ఈ రెండు యోగికి వ్యతిరేకార్థములై యోగసిద్ధికి కారణము లగుచున్నవి. యోగికి ఆ రెండు వరుసగా విషామృతములు అగుచున్నవి.

చక్షుఃపూతం న్యసేత్పాదం వస్త్రపూతం జలం పిబేత్ ।
సత్యపూతాం వదేద్వాణీం బుద్ధిపూతం చ చిన్తయేత్ ॥4॥

తన కంటితో చూచి పవిత్రమైన స్థలమందు పాదమును మోపవలెను. వస్త్రముతో వడగొట్టబడిన నీటిని త్రాగవలెను. సత్యముచేత పవిత్రమైన వాక్కులనే పలుకవలెను. జ్ఞానముచేత పవిత్రమైన విషయమునే ధ్యానించవలెను.

ఆతిథ్యశ్రాద్ధయజ్ఞేషు దేవయాత్రోత్సవేషు చ ।
మహాజనేషు సిద్ధ్యర్థం న గచ్ఛేద్యోగవిత్ క్వచిత్ ॥5॥

యోగవేత్త అయినవాడు ఎచ్చటా ఆతిథ్యమును స్వీకరించరాదు. శ్రాద్ధములకు, యజ్ఞములకు, దేవయాత్రలకు, ఉత్సవాలకు వెళ్ళరాదు. తన కార్యసిద్ధికొరకు గొప్పవారి వద్దకు వెళ్ళరాదు.

వ్యస్తే విధూమే వ్యఙ్గారే సర్వస్మిన్ భుక్తవజ్జనే ।
అటేత యోగవిద్భైక్ష్యం న తు తేష్వేవ నిత్యశః ॥6॥

ఏ ఇళ్ళలో అయితే పొగలు లేవో, అగ్నులు చల్లారినవో, అందరూ భోజనము చేసినారో ఆ ఇళ్ళలో యోగవేత్త భిక్షాటనము చేయవలెను. ప్రతీరోజూ వాటిలో ఒకేచోట భిక్షాటనము చేయరాదు.

యథైవమవమన్యన్తే జనాః పరిభవన్తి చ ।
తథా యుక్తశ్చరేద్యోగీ సతాం వర్త్మ న దూషయన్ ॥7॥

జనులు అవమానము చేసినా, పరాభవము చేసినా యోగి వాటినన్నింటినీ భరిస్తూ, సజ్జనుల మార్గాన్ని దూషించకుండా సంచరించవలెను.

భైక్ష్యం చరేద్గృహస్థేషు యాయావరగృహేషు చ ।
శ్రేష్ఠా తు ప్రథమా చేతి వృత్తిరస్యోపదిశ్యతే ॥8॥

గృహస్థుల ఇళ్ళలోనూ, భిక్షాటనచేయువారి ఇళ్ళలోనూ యోగవేత్త భిక్షను పొందవలెను. ఈ రెంటిలో మొదటిదే శ్రేష్ఠమైన భిక్షావృత్తియని చెప్పబడినది.

అథ నిత్యం గృహస్థేషు శాలీనేషు చరేద్యతిః ।
శ్రద్దధానేషు దాన్తేషు శ్రోత్రియేషు మహాత్మసు ॥9॥

అత ఊర్ధ్వం పునశ్చాపి అదుష్టాపతితేషు చ ।
భైక్ష్యచర్యా వివర్ణేషు జఘన్యా వృత్తిరిష్యతే ॥10॥

ఏ గృహస్థులయితే వినయము మరియు లజ్జాస్వభావముగలవారో, శ్రద్ధ కలవారో, ఇంద్రియనిగ్రహము, సహనము కలవారో, వేదవేత్తలో, మహాత్ములో, దుష్టులు పతితులు కానివారో అటువంటివారి ఇళ్ళలో యోగవేత్త భిక్షాటనము చేయవలెను. సంకరజాతి వర్ణముల వారి ఇళ్ళలో భిక్షావృత్తి నీచమైనదిగా చెప్పబడుచున్నది.

భైక్ష్యం యవాగూం తక్రం వా పయో యావకమేవ వా ।
ఫలం మూలం ప్రియఙ్గుం వా కణపిణ్యాకసక్తవః ॥11॥

ఇత్యేతే చ శుభాహారా యోగినాం సిద్ధికారకాః ।
తత్ ప్రయుఞ్జ్యాత్ మునిర్భక్త్యా పరమేణ సమాధినా ॥12॥

భిక్షాటన చేయు యోగవేత్తకు యవాగు (గంజి), మజ్జిగ, పాలు, యావకము (ఒకానొక ధాన్యవిశేషముతో చేయబడిన ఆహారము), పళ్ళు, కందమూలములు, ప్రియంగు (కొర్రలు), కణ (జీలకర్ర), పిణ్యాకము (తెలికపిండి)లను ధాన్యవిశేషములు, పేలాలు మున్నగు భైక్ష్యపదార్థములు యోగసిద్ధిని కలిగించే శుభప్రదమైన ఆహారములుగా చెప్పబడినవి. శ్రేష్ఠమైన యోగసమాధిని పొంది భక్తితో, యోగవేత్త ఆ పదార్థములను భుజించవలెను.

అపః పూర్వం సకృత్ప్రాశ్య తూష్ణీం భూత్వా సమాహితః ।
ప్రాణాయేతి తతస్తస్య ప్రథమా హ్యాహుతిః స్మృతా ॥13॥

అపానాయ ద్వితీయా తు సమానాయేతి చాపరా ।
ఉదానాయ చతుర్థీ స్యాద్వ్యానాయేతి చ పఞ్చమీ ॥14॥

ప్రాణాయామైః పృథక్ కృత్వా శేషం భుఞ్జీత కామతః ।
అపః పునః సకృత్ప్రాశ్య ఆచమ్య హృదయం స్పృశేత్ ॥15॥

ముందుగా ఒకసారి జలపానము చేసి మౌనముగా సావధానచిత్తుడై "ప్రాణాయ స్వాహా" అని చెప్పి ఆహుతిగా గ్రహించవలెను. ఇదియే అయిదు ఆహుతులలో మొదటి ఆహుతిగా స్మరింపబడినది. పిమ్మట "అపానాయ

స్వాహా” అని చెప్పి రెండవ ఆహుతిని గ్రహించవలెను. తరువాత “సమానాయ స్వాహా” అని చెప్పి మూడవ ఆహుతిని గ్రహించవలెను. పిమ్మట “ఉదానాయ స్వాహా” అని నాలుగవ ఆహుతిని గ్రహించవలెను. అటుపిమ్మట “వ్యానాయ స్వాహా” అని చెప్పి అయిదవ ఆహుతిని గ్రహించవలెను. ఈ విధముగా అయిదు ఆహుతులను వేరువేరుగా గ్రహించి ప్రాణాయామమాచరించి తన ఇచ్ఛానుసారము మిగిలిన అన్నమును భుజించవలెను. భోజనానంతరము ఒకసారి జలపానము చేసి ఆచమనము చేసి హృదయమును స్పృశించవలెను.

అస్తేయం బ్రహ్మచర్యం చ త్యాగో௨లోభస్తథైవ చ ।
వ్రతాని పఞ్చ భిక్షూణామహింసా పరమాణి వై ॥16॥

అస్తేయము (దొంగతనము చేయకుండుట), బ్రహ్మచర్యము, త్యాగము, లోభము లేకపోవుట, అహింస ఈ అయిదు యోగులకు పరమవ్రతములు.

అక్రోధో గురుశుశ్రూషా శౌచమాహారలాఘవమ్ ।
నిత్యస్వాధ్యాయ ఇత్యేతే నియమాః పరికీర్తితాః ॥17॥

క్రోధము లేకుండుట, గురుజనులను సేవించుట, శౌచము, అల్పాహారము, నిత్యము వేదాధ్యయనము ఈ అయిదు యోగికి నియమములుగా చెప్పబడినవి.

సారభూతముపాసీత జ్ఞానం యత్కార్యసాధకమ్ ।
జ్ఞానానాం బహుతా యేయం యోగవిఘ్నకరీ హి సా ॥18॥

సారభూతము, కార్యసాధకమూ అయిన జ్ఞానమును ఉపాసించవలెను. ఇతర అనేక జ్ఞానములను ఆలోచించుట యోగమునకు విఘ్నమును కలిగించును.

ఇదం జ్ఞేయమిదం జ్ఞేయమితి యస్తృషితశ్చరేత్ ।
అపి కల్పసహస్రేషు నైవ జ్ఞేయమవాప్నుయాత్ ॥19॥

“ఇది తెలుసుకొనతగినది”, “ఇది తెలుసుకొనతగినది” అని దాహముగొన్నవానివలే అటునిటు తిరిగినచో వెయ్యి కల్పములైనా యోగి జ్ఞేయపదార్థమును పొందలేడు.

త్యక్తసంగో జితక్రోధో లఘ్వాహారీ జితేంద్రియః ।
విధాయ బుద్ధ్యా ద్వారాణి మనో ధ్యానే నివేశయేత్ ॥20॥

ఇతర వస్తువులన్నింటితోనూ సంబంధమును వదిలిపెట్టి క్రోధము లేనివాడై, అల్పమైన ఆహారమును భుజించుచు, ఇంద్రియములను జయించిన యోగి తన బుద్ధితో ఇంద్రియద్వారములను నిగ్రహించి మనస్సును ధ్యానమందు నిలుపవలెను.

శూన్యేష్వేవావకాశేషు గుహాసు చ వనేషు చ ।
నిత్యయుక్తస్తదా యోగీ ధ్యానం సమ్యగుపక్రమేత్ ॥21॥

నిర్జన ప్రదేశములందు, గుహలయందు, వనములయందు నిత్యము యోగాభ్యాసపరుడై యోగి బాగుగా ధ్యానమునకు ఉపక్రమించవలెను.

వాగ్దండః కర్మదండశ్చ మనోదండశ్చ తే త్రయః ।
యస్యైతే నియతా దండాః స త్రిదండీ మహాయతిః ॥22॥

వాగ్దండము, కర్మదండము, మనోదండము ఈ మూడు దండములు ఎవరికి తప్పనిసరిగా ఉండునో అతడు త్రిదండియని, మహాయతియని చెప్పబడుచున్నాడు.

సర్వమాత్మమయం యస్య సదసజ్జగదీదృశమ్ ।
గుణాగుణమయం తస్య కః ప్రియః కో నృపాఽప్రియః ॥23॥

ఓ రాజా ! సద్రూపము, అసద్రూపమూ, సద్గుణములతోనూ, అసద్గుణములతోనూ నిండినదీ అయిన ఈ ప్రపంచము సమస్తము ఎవరికి ఆత్మమయమో అట్టివానికి ఏది ప్రియము? ఏది అప్రియము? అట్టివానికి సర్వమూ సమానమే గావున ప్రియాప్రియభేదము ఉండదని అర్థము.

విశుద్ధబుద్ధిః సమలోష్ఠకాంచనః సమస్తభూతేషు సమస్సమాహితః ।
స్థానం పరం శాశ్వతమవ్యయం చ యతిర్హి గత్వా న పునః ప్రజాయతే ॥24॥

పరిశుద్ధమైన జ్ఞానము గలవాడు, రాయి బంగారములందు సమానమైన బుద్ధిగలవాడు, సమస్త భూతములను సమానముగా భావించువాడు, సమాహితచిత్తుడూ అగు యోగి పరము, శాశ్వతము, నాశములేనిది అయిన బ్రహ్మపదమును పొంది తిరిగి సంసారమందు జన్మించడు.

వేదాచ్ఛ్రేష్ఠాః సర్వయజ్ఞక్రియాశ్చ యజ్ఞాజ్జాప్యం జ్ఞానమార్గశ్చ జప్యాత్ ।
జ్ఞానాద్ధ్యానం సంగరాగవ్యపేతం తస్మిన్ ప్రాప్తే శాశ్వతస్యోపలబ్ధిః ॥25॥

వేదములకంటే సమస్తయజ్ఞక్రియలు (యజ్ఞములను అనుష్ఠించుట) శ్రేష్ఠములు. యజ్ఞముల కంటే జపము శ్రేష్ఠము. జపముకంటే జ్ఞానమార్గము శ్రేష్ఠము. జ్ఞానముకంటే సంగము (సంబంధము), రాగము(కోరిక) లేని ధ్యానము శ్రేష్ఠము. అట్టి ధ్యానయోగము సిద్ధించినచో శాశ్వతమైన బ్రహ్మపదము లభించును.

సమాహితో బ్రహ్మపరోఽప్రమాదీ శుచిస్తథైకాన్తరతిర్యతేంద్రియః ।
సమాప్నుయాద్యోగమిమం మహాత్మా విముక్తిమాప్నోతి తతస్స్వయోగతః ॥26॥

ఏకాగ్రచిత్తుడు, బ్రహ్మపరాయణుడు, ప్రమాదములు లేనివాడు, పరిశుద్ధుడు, ఒకే వస్తువునందు మనస్సును నిలుపువాడు, ఇంద్రియములను స్వాధీనమందు ఉంచుకొన్నవాడు, మహాత్ముడూ అగు యోగవేత్త ఇట్టి యోగమును అనుష్ఠించవలెను. అంతట ఆ యోగవేత్త తన యోగానుష్ఠానము కారణముగా ముక్తిని పొందుచున్నాడు.

ఇతి శ్రీమార్కండేయ మహాపురాణే యోగిచర్యాకథనం నామ అష్టత్రింశోఽధ్యాయః ॥38॥

శ్రీ మార్కండేయ మహాపురాణమందలి యోగిచర్యా కథనమను ముప్పదిఎనిమిదవ అధ్యాయం సమాప్తం.

ఏకోనచత్వారింశోஉధ్యాయః - ముప్పదితొమ్మిదవ అధ్యాయం
ఓంకారవర్ణనమ్ - ఓంకారవర్ణనం

దత్తాత్రేయ ఉవాచ - దత్తాత్రేయుడు పలికాడు.

ఏవం యో వర్తతే యోగీ సమ్యగ్యోగవ్యవస్థితః ।
న స వ్యావర్తితుం శక్యో జన్మాన్తరశతైరపి ॥1॥

ఈ విధముగా ఏ యోగి అయితే బాగుగా యోగమందు నిష్ఠుడై ఉండునో అట్టి యోగిని వందల జన్మలకైనను యోగము నుండి మరలించుట సాధ్యము కాదు.

దృష్ట్వా చ పరమాత్మానం ప్రత్యక్షం విశ్వరూపిణమ్ ।
విశ్వపాదశిరోగ్రీవం విశ్వేశం విశ్వభావనమ్ ॥2॥

తత్ప్రాప్తయే మహత్పుణ్యమోమిత్యేకాక్షరం జపేత్ ।
తదేవాధ్యయనం తస్య స్వరూపం శృణ్వతః పరమ్ ॥3॥

ప్రత్యక్షప్రమాణగమ్యుడు, విశ్వరూపుడు, విశ్వమంతా పాదములు శిరస్సు మెడ వ్యాపించినవాడు, విశ్వేశ్వరుడు, విశ్వభావనుడు అగు పరమాత్మదర్శనము చేసుకొని ఆ పరమాత్మతో ఐక్యమును పొందుటకై "ఓమ్" అను ఏకాక్షరమును జపించవలెను. ఆ ఓంకారముయొక్క పరస్వరూపమును వినుచున్న ఆ యోగికి అట్లు జపించుటే అధ్యయనము.

అకారశ్చ తథోకారో మకారశ్చాక్షరత్రయమ్ ।
ఏతాస్తిస్రః స్మృతా మాత్రాః సాత్త్వరాజసతామసాః ॥4॥

నిర్గుణా యోగిగమ్యాన్యా చార్ధమాత్రోర్ధ్వసంస్థితా ।
గాంధారీతి చ విజ్ఞేయా గాంధారస్వరసంశ్రయా ॥5॥

ఓంకారమందు అకారము, ఉకారము, మకారము మూడు అక్షరములు గలవు. ఇవి వరుసగా సాత్త్వికము, రాజసము, తామసము అను మాత్రలుగా స్మరింపబడినవి. ఈ ఓమ్ అను అక్షరమునకు ఊర్ధ్వభాగమందు నిర్గుణస్వరూపమూ, యోగులకు మాత్రము తెలియబడేది అయిన మరొక అర్ధమాత్ర ఉన్నది. గాంధారస్వరము కలిగిన ఆ అర్ధమాత్ర గాంధారియని తెలుసుకొనదగినది.

పిపీలికాగతిస్పర్శా ప్రయుక్తా మూర్ధ్ని లక్ష్యతే ।
యథా ప్రయుక్త ఓంకారః ప్రతినిర్యాతి మూర్ధని ॥6॥

ఏవిధముగా అయితే ఓంకారము ప్రయోగింపబడినదై శిరస్సును చేరునో అట్లే ఈ అర్ధమాత్ర చీమయొక్క గతిస్పర్శల వంటి గతిస్పర్శలు కలిగి ప్రయోగింపబడినదై శిరస్సునందు తెలియబడును.

తథోంకారమయో యోగీ త్వక్షరే త్వక్షరో భవేత్ ।
ప్రాణో ధనుః శరో హ్యాత్మా బ్రహ్మ వేధ్యమనుత్తమమ్ ॥7॥

అప్రమత్తేన వేద్ధవ్యం శరవత్తన్మయో భవేత్ ।

ఓంకారము ఉచ్చరింపబడినదై శిరస్సును చేరుటచే ఓంకారమయుడైన యోగి అక్షరమగు పరబ్రహ్మతో ఐక్యము చెందును. అతడి ప్రాణమే ధనుస్సు. తాను లేదా తన ఆత్మయే బాణము. మిక్కిలి ఉత్తమమైన బ్రహ్మమే ఛేదింపతగిన లక్ష్యము. ఆ బ్రహ్మమందే తన్మయుడై అప్రమత్తుడై తాననే బాణముతో లక్ష్యమగు బ్రహ్మమును కొట్టవలెను అనగా పొందవలెను.

ఓమిత్యేతత్త్రయో వేదాస్త్రయో లోకాస్త్రయోఽగ్నయః ॥8॥

విష్ణుర్బ్రహ్మా హరశ్చైవ ఋక్సామాని యజూంషి చ ।
మాత్రాః సార్ధాశ్చ తిస్రశ్చ విజ్ఞేయాః పరమార్థతః ॥9॥

తత్ర యుక్తస్తు యో యోగీ స తల్లయమవాప్నుయాత్ ।

మూడున్నరమాత్రలు కలిగిన ఈ ఓమ్ అను అక్షరమును ఋగ్యజుస్సామాత్మకమైన మూడు వేదములు గాను, మూడు లోకములు గాను, మూడు అగ్నులు గాను, విష్ణు బ్రహ్మ హరరూపములుగాను పరమార్థదృష్టితో తెలుసుకొనవలెను. అట్టి ఓంకారముతో యుక్తమైన యోగి ఆ ఓంకారమందు లయమును చెందగలడు.

అకారస్త్వథ భూర్లోక ఉకారశ్చోచ్యతే భువః ॥10॥

సవ్యంజనో మకారశ్చ స్వర్లోకః పరికల్ప్యతే ।
వ్యక్తా తు ప్రథమా మాత్రా ద్వితీయాఽవ్యక్తసంజ్ఞితా ॥11॥

మాత్రా తృతీయా చిచ్ఛక్తిరర్ధమాత్రా పరం పదమ్ ।
అనేనైవ క్రమేణైతా విజ్ఞేయా యోగభూమయః ॥12॥

ఓమిత్యుచ్చారణాత్సర్వం గృహీతం సదసద్భవేత్ ।

అకారము భూర్లోకముగా, ఉకారము భువర్లోకముగా, వ్యంజనమగు మకారము స్వర్లోకముగా పరిగణింపబడుచున్నవి. వీటిలో మొదటి మాత్రకు వ్యక్తమని, రెండవమాత్రకు అవ్యక్తమని, మూడవమాత్రకు చిచ్ఛక్తియని పేరు. ఇక అర్ధమాత్ర పరమపదమైన బ్రహ్మస్థానము. ఈ క్రమముతోనే ఈ మాత్రలను యోగభూములుగా తెలుసుకొనవలెను. ఓమ్ అను అక్షరమును ఉచ్చరించుటచేత సదసద్రూపము అంతయు గ్రహింపబడుచున్నది.

హ్రస్వా తు ప్రథమా మాత్రా ద్వితీయా దైర్ఘ్యసంయుతా ॥13॥
తృతీయా చ ప్లుతార్ధాఖ్యా వచసః సా న గోచరా ।

మొదటి మాత్ర హ్రస్వము, రెండవ మాత్ర దీర్ఘము, మూడవ మాత్ర ప్లుతస్వరూపమై ఉన్నది. అర్ధమాత్రయొక్క స్వరూప వర్ణనము చేయుట సాధ్యము కాదు.

ఇత్యేతదక్షరం బ్రహ్మ పరమోంకారసంజ్ఞితమ్ ॥14॥

యస్తు వేద నరస్సమ్యక్తథా ధ్యాయతి వా పునః ।
సంసారచక్రముత్సృజ్య త్యక్తత్రివిధబంధనః ॥15॥

ప్రాపోన్తి బ్రహ్మణి లయం పరమే పరమాత్మని ।
అక్షీణకర్మబంధశ్చ జ్ఞాత్వా మృత్యుమరిష్టతః ॥16॥

ఉత్క్రాన్తికాలే సంస్మృత్య పునర్యోగిత్వమృచ్ఛతి ।
తస్మాదసిద్ధయోగేన సిద్ధయోగేన వా పునః ॥
జ్ఞేయాన్యరిష్టాని సదా యేనోత్క్రాన్తౌ న సీదతి ॥17॥

ఓంకారమను పేరుగలది, అక్షరస్వరూపమూ అగు పరబ్రహ్మమును ఎవరయితే తెలుసుకొని ధ్యానముచేస్తాడో అట్టి వ్యక్తి సంసారచక్రమును వదిలిపెట్టి, మూడువిధములైన బంధములను (పుత్రధనలోకైషణలు) విడిచిపెట్టి పరబ్రహ్మస్వరూపమైన పరమాత్మయందు లీనమగును. ఏ యోగికయితే ఇంకనూ కర్మబంధములు నశించలేదో అట్టి వ్యక్తి అరిష్టము వలన మృత్యువును తెలుసుకొని, మరణకాలమందు జాతిస్మృతి కలవాడై మరల యోగిగా పుట్టును. అందువలన సిద్ధయోగము చేతకాని, అసిద్ధయోగము చేతకాని తన అరిష్టములనన్నింటినీ యోగి తెలుసుకొనవలెను. దీనివలన మరణకాలమందు ఎట్టి దుఃఖములకు లోను కాడు.

ఇతి శ్రీమార్కండేయమహాపురాణే యోగధర్మే ఓంకారవర్ణనం నామ ఏకోనచత్వారింశోఽధ్యాయః ॥39॥

శ్రీమార్కండేయమహాపురాణమందు యోగధర్మమందలి ఓంకారవర్ణనమను ముప్పదితొమ్మిదవ అధ్యాయం *సమాప్తం.*



చత్వారింశోఽధ్యాయః – నలుబదవ అధ్యాయం

అలర్కనిర్వేదః – అలర్కుని నిర్వేదం

దత్తాత్రేయ ఉవాచ – దత్తాత్రేయుడు పలికాడు.

అరిష్టాని మహారాజ శృణు వక్ష్యామి తాని తే ।
యేషామాలోకనాన్మృత్యుం నిజం జానాతి యోగవిత్ ॥1॥

ఓ మహారాజా ! ఇప్పుడు నీకు అరిష్టములను గూర్చి చెప్పెదను, వినుము. వాటిని తెలుసుకొన్నందువలన యోగవేత్త తనకు మృత్యువు ఎప్పుడు సంభవించునో తెలుసుకొనును.

దేవమార్గం ధ్రువం శుక్రం సోమచ్ఛాయామరుంధతీమ్ ।
యో న పశ్యేన్న జీవేత్స నరః సంవత్సరాత్పరమ్ ॥2॥

ఎవరయితే దేవమార్గమును, ధ్రువుని, శుక్రుని, చంద్రుని నీడను, అరుంధతిని చూడలేదో అట్టి మానవుడు ఒక సంవత్సరము తరువాత జీవించలేడు.

అరశ్మిబింబం సూర్యస్య వహ్నిం చైవాంశుమాలినమ్ ।
దృష్ట్వైకాదశమాసేభ్యో నరో నోర్ధ్వం తు జీవతి ॥3॥

సూర్యబింబాన్ని కిరణాలు లేనట్టిదిగాను, నిప్పుకు చుట్టూ జ్వాలలచక్రము గలదిగానూ ఎవరు చూచునో అట్టి మానవుడు పదకొండు నెలలు దాటిన పిమ్మట జీవించడు.

వాన్తే మూత్రపురీషే చ యస్స్వర్ణం రజతం తథా ।
ప్రత్యక్షం కురుతే స్వప్నే జీవేత్స దశమాసికమ్ ॥4॥

ఎవరయితే స్వప్నమందు వాంతి మరియు మూత్రపురీషాలలో బంగారమును, వెండిని చూచునో అతడు అప్పటి నుంచి పదినెలలు మాత్రమే జీవించును.

దృష్ట్వా ప్రేతపిశాచాదీన్ గంధర్వనగరాణి చ ।
సువర్ణవర్ణాన్వృక్షాంశ్చ నవమాసాన్స జీవతి ॥5॥

ఏ నరుడయితే ప్రేతపిశాచాదులను, గంధర్వనగరములను, బంగారురంగు కలిగిన వృక్షములను చూచునో అట్టి మానవుడు అప్పటినుంచి తొమ్మిది నెలలు మాత్రమే జీవించును.

స్థూలః కృశః కృశః స్థూలో యోఽకస్మాదేవ జాయతే ।
ప్రకృతేశ్చ నివర్తేత తస్యాయుశ్చాష్టమాసికమ్ ॥6॥

ఎవరయితే అకస్మాత్తుగా స్థూలకాయుడు కృశించిపోవునో మరియు కృశించినవాడు స్థూలకాయుడగునో అతడు ప్రకృతిసంబంధమైన కృత్యములనుండి దూరమగుటయేకాక అతడు ఎనిమిది మాసములు మాత్రమే జీవించును.

ఖండం యస్య పదం పార్ష్ణ్యాం పాదస్యాగ్రే చ వా భవేత్ ।
పాంసుకర్దమయోర్మధ్యే సప్తమాసాన్స జీవతి ॥7॥

ఎవరి కాలిమడమగాని, కాలిముందుభాగముగాని మట్టి బురదల్లో పడినందున విరుగునో అట్టివాడు ఏడు నెలలు జీవించును.

గృధ్రః కపోతః కాకోలో వాయసో వాపి మూర్ధని ।
క్రవ్యాదో వా ఖగో నీలః షణ్మాసాయుఃప్రదర్శకః ॥8॥

గ్రద్ద, పావురము, కాకవిశేషము (మాలకాకి), కాకి, మాంసభక్షకపక్షివిశేషము(డేగ), నల్లని పక్షి (కాటుకపిట్ట) ఇవి గాని శిరస్సునందు పడినచో అట్టి వ్యక్తి ఆరునెలల ఆయుర్దాయము గలవాడగును.

హన్యతే కాకపంక్తీభిః పాంసువర్షేణ వా నరః ।
స్వాం ఛాయామన్యథా దృష్ట్వా చతుః పఞ్చ స జీవతి ॥9॥

ఎవరయితే కాకుల వరుసలతోగాని, ధూళివర్షముచేత గాని కొట్టబడతాడో ఇంకనూ తన శరీరముయొక్క నీడను విపరీతముగా చూస్తాడో అట్టి మానవుడు నాలుగు లేదా అయిదు నెలలు జీవించును.

అనభ్రే విద్యుతం దృష్ట్వా దక్షిణాం దిశమాశ్రితామ్ ।
రాత్రావిన్ద్రధనుశ్చాపి జీవితం హి త్రిమాసికమ్ ॥10॥

ఎవరు దక్షిణదిక్కునందు మేఘములు లేకుండా మెరుపులను చూస్తాడో ఇంకను రాత్రివేళ ఇంద్రధనుస్సును చూస్తాడో అతడు మూడునెలలు మాత్రమే జీవించును.

ఘృతే తైలే తథాఽదర్శే తోయే వా నాత్మనస్తనుమ్ ।
యః పశ్యేదశిరస్కాం వా మాసాదూర్ధ్వం న జీవతి ॥11॥

నెయ్యి, నూనె, అద్దం, జలం వీటిలో ఎవరికి తమ శరీరము కనిపించదో, లేదా తలలేని మొండెం మాత్రం కనిపిస్తుందో అట్టి వ్యక్తి ఒక నెలకు మించి జీవించడు.

యస్య బస్తసమో గంధో గాత్రే శవసమోఽపి వా ।
తస్యార్ధమాసికం జ్ఞేయం యోగినో నృప! జీవితమ్ ॥12॥

ఓ రాజా ! ఎవని శరీరమందు మేక లేదా శవముయొక్క వాసన వంటి వాసన సంభవించునో అట్టి వ్యక్తి పదిహేను రోజులు మాత్రమే జీవించును.

యస్య వై స్నాతమాత్రస్య హృత్పాదమవశుష్యతే ।
పిబతశ్చ జలం శోషో దశాహం సోఽపి జీవతి ॥13॥

స్నానమాచరించిన వెంటనే ఎవరి వక్షఃస్థలము మరియు పాదములు ఎండిపోవునో మరియు నీళ్ళు త్రాగినా దాహం తీరక గొంతు ఎండిపోవునో అట్టి వ్యక్తి పదిరోజులు జీవించును.

సంభిన్నో మారుతో యస్య మర్మస్థానాని కృన్తతి ।
హృష్యతే నాంబుసంస్పర్శాత్తస్య మృత్యురుపస్థితః ॥14॥

తెరలు తెరలుగా వచ్చిన గాలి ఎవని మర్మస్థానములను ఛేదించునో మరియు నీటిని స్పృశించినా ఎవరికి రోమాంచము కలుగదో అట్టి వ్యక్తికి మృత్యుకాలము సమీపించినదని తెలియవలెను.

ఋక్షవానరయానస్థో గాయన్యో దక్షిణాం దిశమ్ ।
స్వప్నే ప్రయాతి తస్యాపి న మృత్యుః కాలమిచ్ఛతి ॥15॥

ఎలుగుబంటి, కోతి, వాహనము వీటిపై ఎక్కి పాడుచూ దక్షిణదిక్కువైపు పోతున్నట్లుగా ఎవరయితే స్వప్నమందు చూస్తారో వారిపట్ల మృత్యువు సమయమును కోరదు అనగా మృత్యువు వారికి మిక్కిలి దగ్గరగా ఆసన్నమైనదని అర్థము.

రక్తకృష్ణాంబరధరా గాయన్తీ హసతీ చ యమ్ ।
దక్షిణాశాం నయేన్నారీ స్వప్నే సోఽపి న జీవతి ॥16॥

ఎరుపు నలుపు వస్త్రాలను ధరించిన స్త్రీ పాడుచూ నవ్వుచూ స్వప్నంలో ఎవరినయితే దక్షిణదిక్కువైపు తీసుకుపోతుందో అట్టి వ్యక్తి ఎక్కువకాలం జీవించదు.

నగ్నం క్షపణకం స్వప్నే హసమానం మహాబలమ్ ।
ఏవం సంవీక్ష్య వల్గన్తం విద్యాన్మృత్యుముపస్థితమ్ ॥17॥

మహాబలవంతుడు దిగంబరుడూ అయిన సన్న్యాసి నవ్వుతూ గెంతుతున్నట్లుగా స్వప్నంలో ఎవరు చూస్తారో అట్టి వ్యక్తికి మృత్యువు సమీపించిందని తెలియవలెను.

ఆమస్తకతలాద్యస్తు నిమగ్నం పంకసాగరే ।
స్వప్నే పశ్యత్యథాత్మానం స సద్యో మ్రియతే నరః ॥18॥

ఏ పురుషుడయితే తనను శిరఃపర్యంతము బురదలో కూరుకుపోయినట్లుగా చూచునో అతడు వెంటనే మరణించును.

కేశాంగారాంస్తథా భస్మ భుజంగాన్నిర్జలాం నదీమ్ ।
దృష్ట్వా స్వప్నే దశాహాత్తు మృత్యురేకాదశే దినే ॥19॥

కేశములు, నిప్పు, భస్మము, సర్పాలు, ఎండిపోయిన నది వీటిని స్వప్నంలో చూచిన వ్యక్తి పదిరోజుల పిమ్మట పదకొండవ రోజున మరణించును.

కరాలైర్వికటైః కృష్ణైః పురుషైరుద్యతాయుధైః ।
పాషాణైస్తాడితస్స్వప్నే సద్యో మృత్యుం లభేన్నరః ॥20॥

భయంకరమైన, వికటాకారము కలిగిన, ఆయుధములు చేత ధరించిన నల్లని వ్యక్తులు తనని రాళ్ళతో కొట్టినట్లు ఎవరయితే స్వప్నంలో చూచెదరో అట్టి వ్యక్తికి వెంటనే మృత్యువు సంభవించును.

సూర్యోదయే యస్య శివా క్రోశన్తీ యాతి సమ్ముఖమ్ ।
విపరీతం పరీతం వా స సద్యో మృత్యుమృచ్ఛతి ॥21॥

సూర్యోదయకాలమందు ఏ వ్యక్తి ఎదుట ఆడుగ్రద్ద అరచుచు తన చుట్టూగాని, అడ్డంగా గానీ తిరుగునో అట్టి వ్యక్తి వెంటనే మృత్యువును పొందును.

యస్య వై భుక్తమాత్రస్య హృదయం బాధ్యతే క్షుధా ।
జాయతే దన్తఘర్షశ్చ స గతాయుర్న సంశయః ॥22॥

ఎవరికయితే తిన్నవెంటనే మరల ఆకలి బాధించునో, దంతాలు రాపిడికి గురి అవునో అతని ఆయుర్దాయము క్షీణించినట్లే, ఇందు సంశయము లేదు.

దీపగంధం న యో వేత్తి త్రస్యత్యహ్ని తథా నిశి ।
నాత్మానం పరనేత్రస్థం వీక్షతే న స జీవతి ॥23॥

ఎవరయితే దీపముయొక్క వాసనను గ్రహించలేడో, రాత్రింబవళ్ళు భయమునకు లోను అవునో, ఎదుటివారి కళ్ళలో తన ప్రతిబింబమును చూడలేదో అతడికి మరణము ఆసన్నమైనదని తెలియవలెను.

శక్రాయుధం చార్ధరాత్రే దివా గ్రహగణాంస్తథా ।
దృష్ట్వా మన్యేత సంక్షీణమాత్మజీవితమాత్మవిత్ ॥24॥

ఎవరయితే అర్ధరాత్రి సమయమందు ఇంద్రధనుస్సును చూచునో, పగలు ఆయా గ్రహములను చూచునో అట్టి ఆత్మవేత్త జీవితము క్షీణాయుర్దాయము కలిగినదని ఎరుగవలెను.

నాసికా వక్రతామేతి కర్ణయోర్నమనోన్నతీ ।
నేత్రం చ వామం స్రవతి యస్య తస్యాయురుద్గతమ్ ॥25॥

ఎవరి ముక్కు వంకర అగునో, చెవులు పైకి క్రిందకి అగుచుండునో, ఎడమ కన్నునుండి కన్నీళ్ళు కారుచుండునో అతని ఆయుర్దాయము తీరినదని తెలియవలెను.

ఆరక్తతామేతి ముఖం జిహ్వా వా శ్యామతాం యదా ।
తదా ప్రాజ్ఞో విజానీయన్మృత్యుమాసన్నమాత్మనః ॥26॥

ముఖము ఎర్రనిరంగులోను, నాలుక నల్లని రంగులోనూ మారినచో బుద్ధిమంతుడైన అట్టి పురుషుడు తనకు మరణము ఆసన్నమైనదని తెలుసుకొనవలెను.

ఉష్ట్రరాసభయానేన యస్స్వప్నే దక్షిణాం దిశమ్ ।
ప్రయాతి తం చ విజానీయాత్సద్యో మృత్యుం నరేశ్వర ॥27॥

ఓ రాజా! ఎవడు ఒంటెనుగాని, గాడిదనుగాని బండి ఎక్కి స్వప్నమందు దక్షిణదిక్కువైపు వెళ్ళునో అతడికి మృత్యువు ఆసన్నమైనదని తెలియవలెను.

పిధాయ కర్ణౌ నిర్ఘోషం న శృణోత్యాత్మసంభవమ్ ।
నశ్యతే చక్షుషో జ్యోతిర్యస్య సోఽపి న జీవతి ॥28॥

ఎవరయితే తన చెవులు మూసినప్పుడు తాను మాట్లాడే శబ్దములను వినలేరో మరియు ఎవరి కన్నులయందలి ప్రకాశము నశించిపోవునో అట్టి వ్యక్తి మరణించును.

పతతో యస్య వై గర్తే స్వప్నే ద్వారం పిధీయతే ।
న చోత్తిష్ఠతి యశ్శ్వభ్రాత్తదన్తం తస్య జీవితమ్ ॥29॥

ఎవరయితే స్వప్నంలో గోతిలో పడి బయటకు వచ్చుటకు వీలులేక ద్వారము మూసికొనిపోవునో, ఇంకనూ ఆ రంధ్రమునుండి బయటకు రాలేదో అతడి ఆయుర్దాయము తీరినదని తలచవలెను. (శ్వభ్రశబ్దానికి ఛిద్రమని అర్థం)

ఊర్ధ్వా చ దృష్టిర్న చ సంప్రతిష్ఠా రక్తా పునస్సంపరివర్తమానా ।
ముఖస్య చోష్మా శిశిరా చ నాభిః శంసతి పుంసామపరం శరీరమ్ ॥30॥

ఎవరి దృష్టి పైభాగమందు నిలువక రక్తవర్ణము కలిగి మాటిమాటికి చంచలమైయుండునో, ముఖము వేడిగాను, బొడ్డు చల్లగాను ఉండునో అట్టివాడు వేరొక శరీరమును ధరించనున్నాడని అనగా మరణమునకు ఆసన్నమైనాడని తెలియవలెను.

స్వప్నేఽగ్నిం ప్రవిశేద్యస్తు న చ నిష్క్రమతే పునః ।
జలప్రవేశాదపి వా తదన్తం తస్య జీవితమ్ ॥31॥

ఎవరయితే స్వప్నమందు అగ్నిలోగాని, నీటిలోగాని ప్రవేశించి తిరిగి పైకి రాలేడో అట్టివాని జీవితము అంతమైనట్లు భావించవలెను.

యశ్చాభిహన్యతే దుష్టైర్భూతై రాత్రావథో దివా ।
స మృత్యుం సప్తరాత్రాన్తే నరః ప్రాప్నోత్యసంశయమ్ ॥32॥

ఎవరయితే రాత్రిగాని పగలుగాని దుష్టభూతాలతో దెబ్బలుతినునో అతడు ఆ రోజునుంచి ఏడురాత్రులు గడచిన వెంటనే నిస్సంశయముగా మృత్యువును పొందగలడు.

స్వవస్త్రమమలం శుక్లం రక్తం పశ్యత్యథోఽసితమ్ ।
యః పుమాన్ మృత్యుమాసన్నం తస్యాపి హి వినిర్దిశేత్ ॥33॥

తాను ధరించిన తెల్లని స్వచ్ఛమైన వస్త్రమును ఎరుపు నలుపు వర్ణములు కలదిగా ఎవరు చూచునో అట్టి వ్యక్తికి మరణము ఆసన్నమైనదని తెలియవలెను.

స్వభావవైపరీత్యం తు ప్రకృతేశ్చ విపర్యయః ।
కథయన్తి మనుష్యాణాం సమాసన్నౌ యమాన్తకౌ ॥34॥

ఎవరి స్వభావములో వైపరీత్యము అగుపించునో, ప్రకృతియొక్క విపర్యయములు కలుగునో అట్టి మనుష్యులను యముడు మృత్యుదేవత సమీపించారని తెలియవలెను.

యేషాం వినీతః సతతం యేఽస్య పూజ్యతమా మతాః ।
తానేవ చావజానాతి తానేవ చ వినిన్దతి ॥35॥

దేవాన్నార్చయతే వృద్ధాన్ గురూన్విప్రాంశ్చ నిన్దతి ।
మాతాపిత్రోర్న సత్కారం జామాతౄణాం కరోతి చ ॥36॥

యోగినాం జ్ఞానవిదుషామన్యేషాం చ మహాత్మనామ్ ।
ప్రాప్తే తు కాలే పురుషైస్తద్విజ్ఞేయం విచక్షణైః ॥37॥

మరణసమయము ఆసన్నమైనప్పుడు ఈ చెప్పబోవువిధంగా ఆయా వ్యక్తి ప్రవర్తిస్తాడని మానవులు తెలుసుకొనవలెను. ఎవరిపట్ల ఎల్లప్పుడూ వినయవిధేయతలతో ఏ పురుషుడయితే ఇంతవరకూ ఉన్నాడో మరియు ఎవరు ఆ పురుషునికి పూజింపతగినవారో అట్టివారినే ఆ పురుషుడు అవమానించును, నిందించును. ఆ వ్యక్తి దేవతలను పూజింపడు. పెద్దవారిని, గురువులను, బ్రాహ్మణులను నిందించును. తల్లిదండ్రులను, అల్లుళ్ళను, యోగులను, జ్ఞానులను, విద్వాంసులను, మహాత్ములను గౌరవించడు. ఇటువంటి వ్యక్తికి మరణము ఆసన్నమైనదని తెలియవలెను.

యోగినాం సతతం యత్నాదరిష్టాన్యవనీపతే ।
సంవత్సరాన్తే తద్జ్ఞేయం ఫలదాని దివానిశమ్ ॥38॥

ఓ రాజా! ఈ అరిష్టములనన్నింటిని గూర్చి యోగిగణాలు ప్రయత్నపూర్వకంగా తెలుసుకొనియుండవలెను. ఈ అరిష్టములన్నియు సంవత్సరాంతమందు పగలుగాని, రాత్రిగాని ఫలితము కలుగజేయును.

విలోక్యావిశదా చైషాం ఫలపంక్తిః సుభీషణా ।
విజ్ఞాయ కార్యో మనసి స చ కాలో నరేశ్వర ॥39॥

జ్ఞాత్వా కాలం చ తం సమ్యగభయస్థానమాశ్రితః ।
యుఞ్జీత యోగీ కాలోఽసౌ యథా నాస్యాఫలో భవేత్ ॥40॥

ఓ రాజా ! ఈ అరిష్టములయొక్క భయంకరమైనట్టి విశదము కానట్టి ఫలముల వరుస ఏది కలదో అవి సంభవించే కాలమును తెలుసుకొని యోగి తన మనస్సునందు ఉంచుకొనవలెను. అట్లు తెలుసుకొని అభయస్థానమును ఆశ్రయించి ఆ కాలము వ్యర్థము కాకుండా ఉండువిధంగా యోగి యోగానుష్ఠానమును చేయవలెను.

దృష్ట్వారిష్టం తథా యోగీ త్యక్త్వా మరణజం భయమ్ ।
తత్స్వభావం తదాలోక్య కాలో యావద్విపాకదః ॥41॥

తస్య భాగే తథైవాహ్నో యోగం యుఞ్జీత యోగవిత్ ।
పూర్వాహ్ణే చాపరాహ్ణే చ మధ్యాహ్నే చాపి తద్దినే ॥42॥

యత్ర వా రజనీభాగే తదరిష్టం నిరీక్షితమ్ ।
తత్రైవ తావద్యుఞ్జీత యావత్ప్రాప్తం హి తద్దినమ్ ॥43॥

ఆ విధంగా యోగి తన అరిష్టములను తెలుసుకొని, మరణమువల్ల కలిగే భయాన్ని విడిచి ఆ దుష్ఫలితాలు వాటి స్వభావమేనని తెలుసుకొనవలెను. దుష్ఫలితాలనిచ్చే ఆ కాలము ప్రాప్తించునంతలో యోగవేత్త ఆ రోజులో ఏదో ఒకభాగము యోగానుష్ఠానము చేయవలెను. ఆ రోజు పూర్వాహ్ణమందుగాని, అపరాహ్ణమందుగాని, మధ్యాహ్నమందుగాని, రాత్రి సమయమందుగాని ఆ అరిష్టము సంభవించువేళ యోగానుష్ఠానము చేయుచుండవలెను.

తతస్త్యక్త్వా భయం సర్వం జిత్వా యం కాలమాత్మవాన్ ।
తత్రైవావసథే స్థిత్వా యత్ర వా స్థైర్యమాత్మనః ॥44॥

యుఞ్జీత యోగం నిర్జిత్య త్రీన్ గుణాన్ పరమాత్మని ।
తన్మయశ్చాత్మనా భూత్వా చిద్వృత్తిమపి సన్త్యజేత్ ॥45॥

తతః పరమనిర్వాణమతీంద్రియమగోచరమ్ ।
యద్బుద్ధేర్యన్నచాఖ్యాతుం శక్యతే తత్సమశ్నుతే ॥46॥

ఆ సమయమందు ఆత్మనిగ్రహము కలిగి భయమును విడిచి, విషయములనన్నింటినీ జయించి ఆ గృహమందే కాని లేక ఎచ్చట ఆత్మస్థైర్యము లభించునో అచ్చట కాని యోగమును అనుష్ఠానము చేయవలెను. సత్త్వరజస్తమోగుణములను జయించవలెను. పరమాత్మయందు తన్మయుడై తత్స్వరూపుడై మనోవృత్తులనన్నింటినీ విడిచిపెట్టవలెను. అటుపిమ్మట ఆ యోగవేత్త అతీంద్రియము, ప్రమాణగోచరము కానట్టిది, తన బుద్ధిద్వారా చెప్పుటకు శక్యము కానట్టిదీ అయిన పరమపురుషార్థమైన మోక్షమును పొందును.

ఏతత్సర్వం సమాఖ్యాతం తవాలర్క యథార్థవత్ ।
ప్రాప్స్యసే యేన తద్బ్రహ్మ సంక్షేపాత్తన్నిబోధ మే ॥47॥

ఓ అలర్కుడా ! యథార్థమైన రీతిలో ఇదియంతయు నీకు చెప్పబడినది. ఇక ఆ పరబ్రహ్మమును నీవెట్లు పొందగలిగెదవో సంక్షేపముగా చెప్పెదను వినుము.

శశాంకరశ్మిసంయోగాచ్చంద్రకాంతమణిః పయః ।
సముత్సృజతి నాయుక్తః సోపమా యోగినః స్మృతా ॥48॥

చంద్రకిరణముల సంయోగముచేతనే చంద్రకాంతమణి నీటిని విడుచును. అట్టి సంయోగము లేనిచో విడువదు. ఇదియే యోగికి ఉపమగా చెప్పబడినది. అనగా అదేవిధంగా యోగవేత్త యోగానుష్ఠానపరుడైనప్పుడే యోగసిద్ధిని పొందునని భావము.

యథార్కరశ్మిసంయోగాదర్కకాన్తో హుతాశనమ్ ।
ఆవిష్కరోతి నైకః సన్నుపమా సాపి యోగినః ॥49॥

సూర్యకిరణముల సంయోగము చేతనే సూర్యకాంతమణి అగ్నిని పుట్టించును. అట్టి సంయోగము లేనిచో పుట్టించదు. ఇది కూడా యోగికి రెండవ ఉపమగా చెప్పబడినది.

పిపీలికాఖునకులగృహగోధాకపిఞ్జలాః ।
వసన్తి స్వామివద్గేహే ధ్వస్తే యాన్తి తతోఽన్యతః ॥50॥

దుఃఖం తు స్వామినో ధ్వంసే తస్య తేషాం న కిఞ్చన ।
వేశ్మనో యత్ర రాజేంద్ర సోపమా యోగసిద్ధయే ॥51॥

ఓ రాజా ! చీమలు, ఎలుకలు, ముంగిసలు, బల్లులు, పిచ్చుకలు గృహయజమానివలే ఆ గృహమందు నివసించును. ఆ గృహము నశించినచో అవియన్నియు మరొకచోటికి పోవును. ఆ గృహము నశించినచో ఆ గృహయజమానికి మాత్రమే దుఃఖముగాని వాటికి కాదు. యోగసిద్ధికి ఇది కూడా మూడవ ఉపమగా చెప్పబడినది.

మృద్దేహికాల్పదేహాపి ముఖాగ్రేణాప్యణీయసా ।
కరోతి మృద్భారచయముపదేశః స యోగినః ॥52॥

మట్టి దేహంగా గలదీ, మిక్కిలి అల్పమైన దేహము గలదీ అయిన చీమ మొదలగునవి చాలా చిన్నది అయిన నోటితో పెద్ద మట్టిగుట్టను నిర్మించును. అదియే యోగికి ఉపదేశముగా భావించవలెను.

పశుపక్షిమనుష్యాద్యైః పత్రపుష్పఫలాన్వితమ్ ।
వృక్షం విలుప్యమానం తు దృష్ట్వా సిద్ధ్యన్తి యోగినః ॥53॥

ఆకులు, పువ్వులు, పళ్ళతో కూడుకొన్న వృక్షమును పశుపక్షిమనుష్యాదులు నష్టపరచుటను చూచి యోగులు యోగసిద్ధిని పొందుచున్నారు. పరోపకారముకొరకే జీవించవలెనను ధర్మమును తెలుసుకొనుచున్నారని భావము.

రురుశావవిషాణాగ్రమాలక్ష్య తిలకాకృతిమ్ ।
సహ తేన వివర్ధన్తం యోగీ సిద్ధిమవాప్నుయాత్ ॥54॥

నల్లచారలదుప్పియొక్క లేతకొమ్ములు తిలకాకృతిలో అనగా నువ్వుగింజలవలే నల్లగా ఉండి క్రమంగా ఆ మృగముతోబాటు పెరుగుటను చూచి యోగి సిద్ధిని పొందవలెను. నెమ్మది నెమ్మదిగా అభ్యాసమును చేయుటచే యోగి యోగసిద్ధిని పొందగలడని భావము.

ద్రవపూర్ణముపాదాయ పాత్రమారోహతో భువః ।
తుంగమంగం విలోక్యోచ్చైర్విజ్ఞాతం కిం న యోగినా ॥55॥

జలాదులతో నిండిన పాత్రను మోయుచూ నేలపైనుంచి పైకి లేచుసమయమందు ఆ మోయుచున్న శరీరావయవములు కూడా పైకి లేచుటను చూచి యోగి నేర్చుకోలేదా ఏమి? అనగా ఒకే స్థానమందు దృష్టిని కేంద్రీకరించుటచేత యోగికి అజ్ఞాతమగు విషయమేమియు ఉండదని భావం.

సర్వస్వే జీవనాయాలం నిఖాతే పురుషస్య యా ।
చేష్టాం తాం తత్త్వతో జ్ఞాత్వా యోగినః కృతకృత్యతా ॥56॥

జీవించుట కొరకు పర్యాప్తమైన సంపదలను గొయ్యి త్రవ్వి దానిలో భద్రపరచు మానవుని యొక్క చేష్టను తెలుసుకొన్న యోగి తన యోగమందు కృతకృత్యుడైనట్లు భావించవలెను.

తద్గృహం యత్ర వసతి తద్భోజ్యం యేన జీవతి ।
యేన సంపద్యతే చార్థస్తత్సుఖం మమతాత్ర కా ॥57॥

ఎచ్చట నివసించునో అదియే ఇల్లు. దేనితో జీవించునో అదియే భోజ్యపదార్థము. దేనితో ధనము సంపాదింపబడునో అదియే సుఖము. కావున ఈ విషయమందు మమత అనునది ఎక్కడిది?

అభ్యర్థితోఽపి తైః కార్యం కరోతి కరణైర్యథా ।
తథా బుద్ధ్యాదిభిర్యోగీ పారక్యైః సాధయేత్పరమ్ ॥58॥

ఆయా ఇంద్రియములచేత సుఖముననుభవించుటకు అభ్యర్థింపబడిన పురుషుడు వాటిచేతనే తదర్థమై తన కార్యములను చేయుచున్నట్లుగానే యోగి స్వర్గాదిపరలోకసాధనమందు హితములైన బుద్ధ్యాదుల చేతనే పరబ్రహ్మమును పొందవచ్చును.

జడ ఉవాచ – జడుడు చెప్పాడు.

తతః ప్రణమ్యాత్రిపుత్రమలర్కస్స మహీపతిః ।
ప్రశ్రయావనతో వాక్యమువాచాతిముదాన్వితః ॥59॥

అంతట మహీపతియగు ఆ అలర్కుడు అత్రిపుత్రుడగు దత్తాత్రేయునికి నమస్కరించి వినయముతో వంగి నమస్కరించి మిక్కిలి సంతోషముతో కూడుకొన్నవాడై ఇట్లు పలికెను.

దిష్ట్యా దేవైరిదం బ్రహ్మన్ పరాభిభవసంభవమ్ ।
ఉపపాదితమత్యుగ్రం ప్రాణసందేహదం భయమ్ ॥60॥

ఓ బ్రహ్మస్వరూపుడా ! శత్రువుల తిరస్కారము లేదా పరాభవము చేత కలిగేదీ, ప్రాణములకు సందేహాన్ని కలిగించేదీ, అతిభయంకరమైనదీ అయిన ప్రాణభయము నా అదృష్టవశముచేత దేవతలచేత నాకు కల్పింపబడినది.

దిష్ట్యా కాశిపతేర్భూరిబలసంపత్పరాక్రమః ।
యదుచ్ఛేదాదిహాయాతః స యుష్మత్సంగదో మమ ॥61॥

కాశీరాజుకు మిక్కిలి అధికమైన బలము సంపదలు పరాక్రమము సంభవించుట నా భాగ్యము. అతడు నన్ను ఆక్రమించుట వల్లనే నాకు మీ సాంగత్యము లభించినది.

దిష్ట్యా మందబలశ్చాహం దిష్ట్యా భృత్యాశ్చ మే హతాః ।
దిష్ట్యా కోశః క్షయం యాతో దిష్ట్యాఽహం భీతిమాగతః ॥62॥

నేను క్షీణించిన బలము గలవాడనగుట నా అదృష్టము. నా భాగ్యము చేతనే నా సేవకులు చంపబడ్డారు. నా అదృష్టము చేత నా ధనాగారము క్షీణించినది. నా అదృష్టము చేతనే నాకు భయము కల్గినది.

దిష్ట్యా త్వత్పాదయుగలం మమ స్మృతిపథం గతమ్ ।
దిష్ట్యా త్వదుక్తయస్సర్వా మమ చేతసి సంస్థితాః ॥63॥

నా అదృష్టవశముచేతనే మీ పాదద్వయం నా స్మృతిపథమందు నిలిచినది. నా భాగ్యముచేతనే మీ వాక్కులన్నియు నా హృదయమందు నిలిచినవి.

దిష్ట్యా జ్ఞానం మమోత్పన్నం భవతశ్చ సమాగమాత్ ।
భవతా చైవ కారుణ్యం దిష్ట్యా బ్రహ్మన్ కృతం మయి ॥64॥

ఓ బ్రహ్మస్వరూపుడా ! మీతో సాంగత్యము కలుగుటచేత అదృష్టవశముచే నాకు జ్ఞానము ఉత్పన్నమైనది. నా అదృష్టము కారణముగానే మీరు నాయందు దయ చూపినారు.

అనర్థోఽప్యర్థతాం యాతి పురుషస్య శుభోదయే ।
తథేదముపకారాయ వ్యసనం సంగమాత్తవ ॥65॥

పురుషునికి శుభప్రదమైన సమయము ఆసన్నమైనప్పుడు అనర్థము కూడా అర్థముగా పరిణమించును. నాకు సంభవించిన క్లేశములు మీతో సాంగత్యమును కలిగించుట ద్వారా నాకు ఉపకారము కొరకే అయినవి.

సుబాహురుపకారీ మే స చ కాశిపతిః ప్రభో ।
తయోః కృతేఽహం సంప్రాప్తో యోగీశ భవతోఽన్తికమ్ ॥66॥

ఓ ప్రభూ! సుబాహువు, నాపై దండెత్తిన కాశీరాజు ఇద్దరూ నాకు ఉపకారము చేసినవారైనారు. ఓ యోగీశ్వరా! వారివల్లనే నేను మీ సన్నిధిని పొందినాను.

సోఽహం తవ ప్రసాదాగ్నినిర్దగ్ధాజ్ఞానకిల్బిషః ।
తథా యతిష్యే యేనేదృజ్ భూయో న దుఃఖభాజనమ్ ॥67॥

మీ అనుగ్రహమనెడు అగ్నిచేత నా అజ్ఞానపాపాలు దగ్ధమైనవి. తిరిగి ఇట్టి దుఃఖములను ఎట్లు పొందకుందునో అట్లు ప్రయత్నము చేసెదను.

పరిత్యజిష్యే గార్హస్థ్యమార్తిపాదపకాననమ్ ।
త్వత్తోఽనుజ్ఞాం సమాసాద్య జ్ఞానదాతుర్మహాత్మనః ॥68॥

జ్ఞానప్రదాత, మహాత్ములూ అగు తమరి అనుజ్ఞను పొంది దుఃఖములనెడు వృక్షములు గల వనము వంటి గృహస్థాశ్రమమును విడిచిపెట్టెదను.

దత్తాత్రేయ ఉవాచ – దత్తాత్రేయుడు పలికాడు.

గచ్ఛ రాజేంద్ర భద్రం తే యథా తే కథితం మయా ।
నిర్మమో నిరహంకారస్తథా చర విముక్తయే ॥69॥

ఓ రాజేంద్రా! ఇక వెళ్ళుము. నీకు కల్యాణమగుగాక! నేను నీకు చెప్పినట్లుగా మమకారము, అహంకారములు లేక ముక్తి కొరకు ఆచరించుము.

జడ ఉవాచ – జడుడు చెప్పాడు.

ఏవముక్తః ప్రణమ్యైనమాజగామ త్వరాన్వితః ।
యత్ర కాశిపతిర్భ్రాతా సుబాహుశ్చాస్య సోఽగ్రజః ॥70॥

దత్తాత్రేయుడు ఇట్లు చెప్పిన తరువాత అలర్కుడు వారికి నమస్కరించి తొందరగా కాశీరాజు మరియు అన్నగారగు సుబాహువు ఉన్నచోటికి వచ్చెను.

సముత్పత్య మహాబాహుం సోఽలర్కః కాశిభూపతిమ్ ।
సుబాహోరగ్రతో వీరమువాచ ప్రహసన్నివ ॥71॥

ఆ అలర్కుడు ఎత్తైన భుజముగలవాడైన కాశీరాజువద్దకు వచ్చి, సుబాహువు ఎదురుగా ఆ వీరునితో నవ్వుచున్నట్లుగా ఉండి ఇట్లు పలికెను.

రాజ్యకాముక కాశీశ భుజ్యతాం రాజ్యమూర్జితమ్ ।
యథా చ రోచతే తద్వత్ సుబాహోః సంప్రయచ్ఛ వా ॥72॥

రాజ్యాన్ని కోరుకొనేవాడా! ఓ కాశీరాజా! సమృద్ధమగు ఈ రాజ్యమును అనుభవించుము. నీకు ఇష్టము వచ్చినట్లుగా చేయుము. లేదా రాజ్యాన్ని సుబాహువుకు ఇమ్ము.

కాశిరాజ ఉవాచ – కాశీరాజు చెప్పాడు.

కిమలర్క పరిత్యక్తం రాజ్యం తే సంయుగం వినా ।
క్షత్రియస్య న ధర్మోఽయం భవాంశ్చ క్షత్రధర్మవిత్ ॥73॥

ఓ అలర్కుడా! యుద్ధము చేయకుండా ఏల రాజ్యమును విడుచుచుంటివి? క్షత్రియునికి ఇది ధర్మము కాదు. నీవునూ క్షత్రియధర్మమును ఎరిగినవాడవు.

నిర్జితామాత్యవర్గస్తు త్యక్త్వా మరణజం భయమ్ ।
సందధీత శరం రాజా లక్ష్యముద్దిశ్య వైరిణమ్ ॥74॥

అమాత్యులందరినీ గెలిచి అనగా వారిని తన చెప్పుచేతలలో ఉంచుకొని రాజు మరణభయమును వదిలి శత్రువుపై బాణమును సంధించవలెను.

తం జిత్వా నృపతిర్భోగాన్ యథాభిలషితాన్వరాన్ ।
భుఞ్జీత పరమం సిద్ధ్యై యజేత చ మహామఖైః ॥75॥

శత్రువును ఓడించి రాజు తనకిష్టమైన శ్రేష్ఠమైన భోగాలను అనుభవించవలెను. పరమసిద్ధిని పొందుటకు గొప్ప యజ్ఞములను ఆచరించవలెను.

అలర్క ఉవాచ – అలర్కుడు చెప్పాడు.

ఏవమీదృశకం వీర మమాప్యాసీన్మనః పురా ।
సాంప్రతం విపరీతార్థం శృణు చాప్యత్ర కారణమ్ ॥76॥

ఓ వీరుడా! నాకునూ ఇట్టి మనస్సు పూర్వము ఉండెను. కాని ఇప్పుడు దానికి వ్యతిరేకంగా నా మనసు మారినది. దానికి కారణమును చెప్పెదను, వినుము.

యథాஉయం భౌతికస్సంఘస్తథాన్తఃకరణం నృణామ్ ।
గుణాస్తు సకలాస్తద్వదశేషేష్వేవ జంతుషు ॥77॥

ఏ విధముగా అయితే ఈ శరీరము పృథివ్యాది భూతముల సముదాయరూపమో అట్లే మనుష్యుల అన్తఃకరణము కూడా భూతముల స్వరూపమే. అట్లే సమస్త ప్రాణులందు సకలగుణములు అట్టివే.

చిచ్ఛక్తిరేక ఏవాయం యదా నాన్యోஉస్తి కశ్చన ।
తదా కా నృపతేஉజ్ఞానాన్మిత్రారిప్రభుభృత్యతా ॥78॥

ఓ కాశీరాజా! చైతన్యశక్తి ఒక్కటే సత్యమైయున్నది. అదియే పరబ్రహ్మము. దానికంటే భిన్నమైన సత్యపదార్థము ఏమీలేదు. అటువంటప్పుడు అజ్ఞానకల్పితమైన స్నేహితులు, శత్రువులు, ప్రభువులు, సేవకులు మొదలగు కాల్పనిక ప్రపంచము ఎక్కడిది?

తన్మయా దుఃఖమాసాద్య త్వద్భయోద్భవముత్తమమ్ ।
దత్తాత్రేయప్రసాదేన జ్ఞానం ప్రాప్తం నరేశ్వర ॥79॥

ఓ రాజా ! నీవలని భయముచేత పుట్టిన గొప్ప దుఃఖమును పొంది నేను శరణువేడిన దత్తాత్రేయుని అనుగ్రహముచేత జ్ఞానవంతుడనైతిని.

నిర్జితేంద్రియవర్గస్తు త్యక్త్వా సంగమశేషతః ।
మనో బ్రహ్మణి సంధాస్యే తజ్జయే పరమో జయః ॥80॥

ఇంద్రియాలను జయించి, అన్నింటితోనూ సాంగత్యాన్ని విడిచిపెట్టి నా మనస్సును పరబ్రహ్మమందు అనుసంధానము చేసెదను. అట్లు అనుసంధానము చేయుటలో జయము పొందుటే గొప్ప జయము.

సంసాధ్యమన్యత్తత్సిద్ధ్యై యతః కిఞ్చిన్న విద్యతే ।
ఇంద్రియాణి చ సంయమ్య తతస్సిద్ధిం నియచ్ఛతి ॥81॥

బ్రహ్మైక్యసిద్ధికి ఇంద్రియాలను నిగ్రహించుటకంటే సాధింపతగిన మరొకటి ఏదీ లేనందున ఇంద్రియాలను జయించి అట్టి సిద్ధిని పొందవలెను.

సోఽహం న తేఽరిర్న మమాసి శత్రుః సుబాహురేషో న మమాపకారీ ।
దృష్టం మయా సర్వమిదం యథాత్మా అన్విష్యతాం భూప రిపుస్త్వయాఽన్యః ॥82॥

ఓ రాజా ! అట్టి నేను నీకు శత్రువును కాను. నీవు నాకు శత్రువు కావు. ఈ సుబాహువు నాకెట్టి అపకారమూ చేయలేదు. ఈ విషయాలనన్నింటినీ నేను బాగుగా ఎరిగితిని. అందువలన నీవు మరొక శత్రువును వెతుక్కొనుము. ("ఏషో న" అనునది వ్యాకరణవిరుద్ధప్రయోగము. "ఏష న" అని ఉండవలెను.)

ఇత్థం స తేనాభిహితో నరేంద్రో హృష్టస్సముత్థాయ తతస్సుబాహుః ।
దిష్ట్యేతి తం భ్రాతరమభినంద్య కాశీశ్వరం వాక్యమిదం బభాషే ॥83॥

ఈ విధముగా అలర్కుడు పలుకగా ఆ కాశీరాజు సంతోషించెను. పిమ్మట సుబాహువు సంతోషముతో పైకి లేచి తన సోదరుడగు అలర్కుని అభినందించి కాశీశ్వరునితో ఇట్లు పలికెను.

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే అలర్కనిర్వేదో నామ చత్వారింశోఽధ్యాయః ॥40॥

శ్రీ మార్కండేయ మహాపురాణమందు అలర్కనిర్వేదమను నలుబదియవ అధ్యాయం సమాప్తం.



ఏకచత్వారింశోఽధ్యాయః - నలుబది ఒకటవ అధ్యాయం
జడోపాఖ్యానమ్ - జడోపాఖ్యానం

సుబాహురువాచ - సుబాహువు చెప్పాడు.

యదర్థం నృపశార్దూల త్వామహం శరణం గతః ।
తన్మయా సకలం ప్రాప్తం యాస్యామి త్వం సుఖీ భవ ॥1॥

ఓ రాజవ్యాఘ్రమా! ఎందుకొరకైతే నిన్ను నేను శరణు వేడితినో అదంతయు నాకు సిద్ధించినది గావున నేను వెళ్ళుచున్నాను. నీవు సుఖముగా ఉండుము.

కాశిరాజ ఉవాచ - కాశీరాజు చెప్పాడు.

కిం నిమిత్తం భవాన్ ప్రాప్తో నిష్పన్నోఽర్థశ్చ కస్తవ ।
సుబాహో తన్మమాచక్ష్వ పరం కౌతూహలం హి మే ॥2॥

ఓ సుబాహువా! నీవెందుకు నావద్దకు వచ్చితివి? నీకు సిద్ధించిన ఫలమేది? ఆ విషయములను నాకు చెప్పుము. నాకు వినవలెనని చాలా కుతూహలముగా ఉన్నది.

సమాక్రాన్తమలర్కేణ పితృపైతామహం మహత్ ।
రాజ్యం దేహీతి నిర్జిత్య త్వయాహమభిచోదితః ॥3॥

తండ్రి తాతలకు సంబంధించిన గొప్ప రాజ్యమును అలర్కుడు ఆక్రమించాడని, అలర్కుని జయించి నా రాజ్యమును నాకు ఇప్పించమని నీవు నన్ను ప్రేరేపించితివి.

తతో మయా సమాక్రమ్య రాజ్యమస్యానుజస్య తే ।
ఏతత్తే బలమానీతం తద్భుఙ్క్ష్వ స్వకులోచితమ్ ॥4॥

అందువలన నేను నీ తమ్ముని రాజ్యమును నీకు సమర్పించితిని. కావున నీ కులమునకు తగ్గట్లుగా నీవు ఆ రాజ్యమును అనుభవించుము.

సుబాహురువాచ - సుబాహువు చెప్పాడు.

కాశిరాజ నిబోధ త్వం యదర్థమయముద్యమః ।
కృతో మయా భవాంశ్చైవ కారితోఽత్యన్తముద్యమమ్ ॥5॥

ఓ కాశీరాజా ! ఎందువలన నేనీ ప్రయత్నమును చేసితినో, ఇంత గొప్ప ఉద్యమమును నీచేత నేనెందుకు చేయించితినో చెప్పెదను, తెలుసుకొనుము.

భ్రాతా మమాయం గ్రామ్యేషు సక్తో భోగేషు తత్త్వవిత్ ।
విమూఢౌ బోధవన్తౌ చ భ్రాతరావగ్రజౌ మమ ॥6॥

తయోర్మమ చ యన్మాత్రా బాల్యే స్తన్యం యథా ముఖే ।
తథావబోధో విన్యస్తః కర్ణయోరవనీపతే ॥7॥

నా ఈ సోదరుడు అలర్కుడు తత్త్వవేత్త అయినప్పటికీ సాంసారికభోగాలయందు ఆసక్తుడై యున్నాడు. నా అన్నలు ఇరువురు మూఢులైనప్పటికినీ జ్ఞానవంతులుగానే యున్నారు. ఎందువలననగా ఓ రాజా ! వారికీ నాకూ కూడా మా తల్లి నోటికి స్తన్యము అందించినట్లుగా మా చెవులలో తత్త్వమును ఉపదేశించెను.

తయోర్మమ చ యన్మాత్రా బాల్యే స్తన్యం యథా ముఖే ।
ప్రకాశ్యం మనసా నీతాస్తే మాత్రా నాఽస్య పార్థివ ॥8॥

ఓ రాజా ! మానవులు తెలుసుకొనదగిన విషయములను మాతల్లి మా ఇరువురు అన్నలకు, నాకూ మనస్సులో నిలిచిపోయేవిధంగా బోధించింది. మా తమ్మునికి అట్లు బోధ జరుగలేదు.

యథైకమర్థే యాతానామేకస్మిన్నవసీదతి ।
దుఃఖం భవతి సాధూనాం తథాస్మాకం మహీపతే ॥9॥

ఓ కాశీరాజా ! ఏదో ఒక పని నిమిత్తమై వెళ్ళినవారిలో ఒకనికి కష్టము కలిగినచో మిగిలిన సాధుజనులకు దుఃఖము కలుగునట్లుగా మాకునూ దుఃఖము కలిగినది.

గార్హస్థ్యమోహమాపన్నే సీదత్యస్మిన్నరేశ్వర ।
సంబంధిన్యస్య దేహస్య బిభ్రతి భ్రాతృకల్పనామ్ ॥10॥

తతో మయా వినిశ్చిత్య దుఃఖాద్వైరాగ్యభావనా ।
భవిష్యతీత్యస్య భవానిత్యుద్యోగాయ సంశ్రితః ॥11॥

ఓ రాజా ! నా తమ్ముడగు అలర్కుడు అజ్ఞానంతో గృహస్థాశ్రమమోహమందు పడి దుఃఖించుచుండగా, నా యీ శరీరమందు సోదరభావము నిండినది. అంతట నేను క్లేశములతోనే వైరాగ్యభావన సిద్ధించునని నిశ్చయించుకొని ఈ ప్రయత్నముకొరకే నిన్ను నేను ఆశ్రయించితిని.

తదస్య దుఃఖాద్వైరాగ్యం సంబోధాదవనీపతే ।
సముద్భూతం కృతం కార్యం భద్రం తేఽస్తు వ్రజామ్యహమ్ ॥12॥

ఓ కాశీరాజా ! అలర్కునికి జ్ఞానోదయము కలిగి వైరాగ్యము ఉద్భవించినది. నేను అనుకొన్న కార్యము సిద్ధించినది. నీకు కల్యాణమగుగాక ! నేను వెళ్ళెదను.

ఉష్ట్వా మదాలసాగర్భే పీత్వా తస్యాస్తథా స్తనమ్ ।
నాన్యనారీసుతైర్యాతం వర్త్మ యాత్వితి పార్థివ ॥13॥

విచార్య తన్మయా సర్వం యుష్మత్సంశ్రయపూర్వకమ్ ।
కృతం తచ్చాపి నిష్పన్నం ప్రయాస్యే సిద్ధయే పునః ॥14॥

ఓ రాజా ! మా తల్లియగు మదాలస గర్భమందు నివసించి, ఆమెవద్ద స్తన్యమును త్రాగి నా సోదరుడగు అలర్కుడు ఇతర సాధారణ స్త్రీల పుత్రులు పయనించే మార్గమందు ప్రయాణించకుండుగాక ! అని ఆలోచించి నేను మిమ్ములను ఆశ్రయించి నేనీ పనిని చేసితిని. ఆ కార్యము కూడా నెరవేరినది. ఇక నేను తిరిగి నా కార్యసిద్ధికొరకు వెళ్ళెదను.

ఉపేక్ష్యతే సీదమానః స్వజనో బాంధవస్సుహృత్ ।
యైర్నరేంద్ర న తాన్మన్యే సేంద్రియా వికలా హి తే ॥15॥

ఓ రాజా ! తమవారు, బంధువులు, స్నేహితులు వీరిలో ఎవరైనా బాధపడుచున్నచో అట్టివారిని విడిచిపెట్టినవాడు ఇంద్రియసహితుడైనా కూడా వానిని ఇంద్రియరహితునిగానే నేను భావించుచున్నాను.

సుహృది స్వజనే బన్ధౌ సమర్థే యోఽవసీదతి ।
ధర్మార్థకామమోక్షేభ్యో వాచస్తే తత్ర న త్వసౌ ॥16॥

సమర్థులైన స్నేహితులు, స్వజనులు, బంధువులు ఉండగా ఎవడయితే క్లేశములను పొందునో అందుకు ఆ సుహృజ్జనులే ధర్మార్థకామమోక్షములనుండి పతితులగుదురేకాని క్లేశములను పొందువాడు కాదు.

ఏతత్త్వత్సంగమాద్భూప మయా కార్యం మహత్కృతమ్ ।
స్వస్తి తేఽస్తు గమిష్యామి జ్ఞానభాగ్భవసత్తమ ॥17॥

ఓ రాజా ! నీ సహకారముతోనే నేనీ గొప్పకార్యమును నెరవేర్చితిని. నీకు మంగళమగుగాక ! జ్ఞానవంతుడవు అగుము. నేను వెళ్ళెదను.

కాశిరాజ ఉవాచ – కాశీరాజు చెప్పాడు.

ఉపకారస్త్వయా సాధోరలర్కస్య కృతో మహాన్ ।
మమోపకారాయ కథం న కరోషి స్వమానసమ్ ॥18॥

మీరు సాధుపురుషుడైన అలర్కునికి గొప్ప ఉపకారము చేసితిరి. మరి నాకు ఉపకారము చేయుటకు ఎందువలన మీరు మీ మనస్సును లగ్నము చేయుటలేదు?

ఫలదాయీ సతాం సద్భిః సఙ్గమో నాఫలో యతః ।
తస్మాత్త్వత్సంశ్రయాద్యుక్తా మయా ప్రాప్తా సమున్నతిః ॥19॥

సజ్జనులతో సాంగత్యము మంచి ఫలములను చేకూర్చును. అట్టి సాంగత్యము ఎన్నడూ నిష్ఫలము కానేరదు. అందువలన నీతోటి సాంగత్యము వలన నాకు గొప్ప ఔన్నత్యము ప్రాప్తించినది.

సుబాహురువాచ – సుబాహువు చెప్పాడు.

ధర్మార్థకామమోక్షాఖ్యం పురుషార్థచతుష్టయమ్ ।
తత్ర ధర్మార్థకామాస్తే సకలో హీయతేఽపరః ॥20॥

ఓ రాజా ! ధర్మము, అర్థము, కామము, మోక్షము అని నాలుగు పురుషార్థములు కలవు. అందు నీకు ధర్మార్థకామములు ఇప్పటికే సిద్ధించినవి. ఇక మోక్షము ఒక్కటే నీకు లోపించుచున్నది.

తత్తే సంక్షేపతో వక్ష్యే తదిహైకమనాః శృణు ।
శ్రుత్వా చ సమ్యగాలోచ్య యతేథాః శ్రేయసే నృప ॥21॥

ఓ రాజా ! అందువలన మోక్షలాభమును గూర్చి నీకు సంక్షేపముగా చెప్పెదను. సావధానచిత్తుడవై వినుము. విని బాగుగా ఆలోచించి శ్రేయస్సు అనగా మోక్షము కొరకు ప్రయత్నించుము.

మమేతి ప్రత్యయో భూప న కార్యోఽహమితి త్వయా ।
సమ్యగాలోచ్య ధర్మో హి ధర్మాభావే నిరాశ్రయః ॥22॥

ఓ కాశీరాజా ! నేను, నాది అను జ్ఞానమును వీడుము. అట్లు బాగుగా ఆలోచించుటే ధర్మము. ధర్మమే లేనిచో ఆశ్రయరహితుడవు కాగలవు.

కో వాఽహమితి సంజ్ఞేయమిత్యాలోచ్య త్వయాఽత్మనా ।
బాహ్యాన్తర్గతమాలోచ్యమాలోచ్యాఽపరరాత్రిషు ॥23॥

నీ అంతట నీవు బాగుగా ఆలోచించి "నేనెవరిని" అని తెలుసుకొనవలెను. రాత్రిశేషసమయములందు బాహ్య విషయములు, అంతరవిషయములను గూర్చి ఆలోచించుము.

అవ్యక్తాది విశేషాన్తమవికారమచేతనమ్ ।
వ్యక్తాఽవ్యక్తం త్వయా జ్ఞేయం జ్ఞాతా కశ్చాహమిత్యుత ॥24॥

అవ్యక్తము అనగా ప్రకృతి ప్రపంచమునకు మూలకారణము. అదియే మహదాదులకు కూడా కారణము. విశేషములు అనగా ఆ అవ్యక్తమువలన పుట్టిన కార్యములు వ్యక్తములు. అవ్యక్తము మొదటిదిగాను, విశేషములు చివరివిగాను తెలుసుకొనవలెను. అందు అవ్యక్తము వికారము లేనిది మరియు అచేతనమైనది. అదియే ప్రకృతియనగా. దానినుంచే మహదాది వికారములు ఉద్భవించినవి. అవియే విశేషములనగా. ఈ విధముగా వ్యక్తావ్యక్తములనునవి ఏవి కలవో వాటినన్నింటినీ నీవు తెలుసుకొనవలెను. వ్యక్తావ్యక్తములకంటే భిన్నుడైన పురుషుడివే నీవు గావున "నేను ఎవరు" అని కూడా నీవు తెలుసుకొనవలెను.

ఏతస్మిన్నేవ విజ్ఞాతే విజ్ఞాతమఖిలం త్వయా ।
అనాత్మన్యాత్మవిజ్ఞానమస్వే స్వమితి మూఢతా ॥25॥

ఈ విషయము నీకు తెలిసినచో నీకు సమస్తమూ తెలిసినట్లే. అనాత్మపదార్థములు అనగా వ్యక్తావ్యక్తములను ఆత్మగా భావించుటే అనగా తాను కానిదానియందు తానని తలచుటయే అజ్ఞానమనగా.

సోఽహం సర్వగతో భూప లోకసంవ్యవహారతః ।
మయేదముచ్యతే సర్వం త్వయా పృష్టో వ్రజామ్యహమ్ ॥26॥

ఓ రాజా ! అట్టి నేను పరమాత్మస్వరూపుడను, సర్వవ్యాపకుడను. కేవలము లోకవ్యవహారము దృష్టితోనే నీవు అడుగుట, నేను చెప్పుట జరిగినది. ఇక నేను వెళ్ళుచున్నాను.

ఏవముక్త్వా యయౌ ధీమాన్ సుబాహుః కాశిభూమిపమ్ ।
కాశిరాజోఽపి సంపూజ్య సోఽలర్కం స్వపురం యయౌ ॥27॥

బుద్ధిమంతుడగు సుబాహువు కాశీరాజునుగూర్చి ఈ విధముగా పలికి తాను వెళ్ళెను. కాశీరాజు కూడా అలర్కుని పూజించి తన పట్టణమునకు వెళ్ళెను.

అలర్కోఽపి సుతం జ్యేష్ఠమభిషిచ్య నరాధిపమ్ ।
వనం జగామ సంత్యక్తసర్వసఙ్గస్స్వసిద్ధయే ॥28॥

అలర్కుడు కూడా తన జ్యేష్ఠకుమారుని రాజ్యాభిషిక్తుని చేసి సమస్తమును విడిచిపెట్టి ఆత్మసిద్ధికై అనగా మోక్షప్రాప్తికై అడవికి వెళ్ళెను.

తతః కాలేన మహతా నిర్ద్వంద్వో నిష్పరిగ్రహః ।
ప్రాప్య యోగర్ధిమతులాం పరం నిర్వాణమాప్తవాన్ ॥29॥

తిరిగి చాలా కాలము గడచిన పిమ్మట ద్వంద్వభావములను విడిచి, ఎట్టి దానములను స్వీకరించక సాటిలేని యోగసంపత్తిని పొంది గొప్ప నిర్వాణపదమును అనగా మోక్షహేతువైన సమాధిస్థితిని పొందెను.

పశ్యన్ జగదిదం సర్వం సదేవాసురమానుషమ్ ।
పాశైర్గుణమయైర్బద్ధం బధ్యమానం చ నిత్యశః ॥30॥

పుత్రాదిభ్రాతృపుత్రాదిస్వపారక్యాదిభావితైః ।
ఆకృష్యమాణం కరణైర్దుఃఖార్తం భిన్నదర్శనమ్ ॥31॥

అజ్ఞానపఙ్కగర్భస్థమనుద్ధారం మహామతిః ।
ఆత్మానం చ సముత్తీర్ణం గాథామేతామగాయత ॥32॥

ఈ సమస్తప్రపంచము దేవతలు, రాక్షసులు, మనుష్యులతో కూడుకొన్నదై, సత్త్వరజస్తమోగుణములనెడు పాశములతో బంధింపబడి ఇప్పటికీ నిత్యమూ బంధింపబడుచున్నది. ఇంకను ఈ ప్రపంచము తనవారు, ఇతరులు అనువిధముగా భావించబడి తన సంతానము, సోదరులు, సోదరుల సంతానము మొదలగు వారిచేత ఆకర్షింపబడుచు, నేత్రాది ఇంద్రియములచే దుఃఖభూయిష్ఠమై భిన్నభిన్నరుచులు కలిగియున్నది. ఇంకను అజ్ఞానమనెడు బురదయందు మునిగి ఉద్ధరించుటకు వీలులేకుండా ఈ ప్రపంచము ఉన్నది. అట్టి ప్రపంచమును, ఉద్ధరింపబడిన తననూ ఒకసారి చూచుకొని ఈ విధముగా గానము చేసెను.

అహో కష్టం యదస్మాభిః పూర్వం రాజ్యమనుష్ఠితమ్ ।
ఇతి పశ్చాన్మయా జ్ఞాతం యోగాన్నాస్తి పరం సుఖమ్ ॥33॥

అహెూ ! మేము ముందుగా రాజ్యపరిపాలనము చేయుటచే ఎంత కష్టముననుభవించితిమోగదా ! అటుపిమ్మటే యోగమునకు మించిన గొప్ప సుఖము లేదని తెలిసికొనగలిగితిని.

పుత్ర ఉవాచ – పుత్రుడు చెప్పాడు.

తాతైనం త్వం సమాతిష్ఠ ముక్తయే యోగముత్తమమ్ ।
ప్రాప్స్యసే యేన తద్బ్రహ్మ యత్ర గత్వా న శోచసి ॥34॥

ఓ తండ్రీ ! ముక్తిని పొందుటకై నీవు ఉత్తమమైన యోగమును అనుష్ఠించుము. అట్టి యోగమును అనుష్ఠించుట ద్వారా నీవు బ్రహ్మపదమును పొందెదవు. అట్టి బ్రహ్మపదమును పొందిన పిమ్మట నీకు శోకము ఉండదు.

తతోऽహమపి యాస్యామి కిం యజ్ఞైః కిం జపేన మే ।
కృతకృత్యస్య కరణం బ్రహ్మభావాయ కల్పతే ॥35॥

అందువలన నేను కూడా వెళ్ళెదను. యజ్ఞములతోను, జపములతోనూ నాకేమి పని? కృతకృత్యుడైనవాని సాధనములన్నియు బ్రహ్మభావమును పొందుటకే సమర్థములగును.

తతోऽనుజ్ఞామవాప్యాహం నిర్ద్వంద్వో నిష్పరిగ్రహః ।
ప్రయతిష్యే తథా ముక్తౌ యథా యాస్యామి నిర్వృతిమ్ ॥36॥

అందువలన నేను మీవద్ద అనుమతిని పొంది, ద్వంద్వభావములను విడిచి, దానములను స్వీకరించుట మాని నిత్యానందమును పొందు విధముగా ముక్తికొరకు ప్రయత్నించెదను. (ఇచ్చట ముక్తియనగా సంసారబంధములను పోగొట్టుకొనుటయని అర్థము.)

పక్షిణ ఊచుః – పక్షులు చెప్పాయి.

ఏవముక్త్వా స పితరం ప్రాప్యానుజ్ఞాం తతశ్చ సః ।
బ్రహ్మన్ జగామ మేధావీ పరిత్యక్తపరిగ్రహః ॥37॥

ఓ బ్రహ్మస్వరూపుడా ! ఈ విధముగా బుద్ధిమంతుడైన జడుడు తన తండ్రితో పలికి, తండ్రివద్ద అనుమతిని పొంది పరిగ్రహమును అనగా దానములను స్వీకరించుటను పరిత్యజించి వెళ్ళెను.

సోऽపి తస్య పితా తద్వత్క్రమేణ సుమహామతిః ।
వానప్రస్థం సమాస్థాయ చతుర్థాశ్రమమభ్యగాత్ ॥38॥

గొప్ప బుద్ధిమంతుడైన జడుని తండ్రి కూడా జడునివలే క్రమముగా వానప్రస్థాశ్రమమును గ్రహించి తదనంతరం నాల్గవ ఆశ్రమము అనగా సన్న్యాసాశ్రమమును గ్రహించెను.

తత్రాత్మజం సమాసాద్య హిత్వా బంధం గుణాదికమ్ ।
ప్రాప సిద్ధిం పరాం ప్రాజ్ఞస్తత్కాలోపాత్తసన్మతిః ॥39॥

తన కుమారుని సాంగత్యము వలన ఆయా గుణములతో కూడుకొన్న సంసార బంధములను విడిచి జ్ఞానియగు జడుని తండ్రి ఆ సమయమందు ఆత్మజ్ఞానమును పొంది గొప్ప సిద్ధిని పొందెను.

ఏతత్తే కథితం బ్రహ్మన్ యత్పృష్టా భవతా వయమ్ ।
సువిస్తరం యథావచ్చ కిమన్యచ్ఛ్రోతుమిచ్ఛసి ॥40॥

ఓ బ్రహ్మస్వరూపుడా ! నీవు మమ్ములను అడిగిన విషయమును గురించి విస్తరముగా యథాప్రకారముగా చెప్పితిమి. ఇక వేరే దేనిని గురించి వినవలెనని కోరుకొనుచున్నావో చెప్పుము.

యశ్చైతచ్ఛృణుయాద్విప్ర ! పఠేద్వా సుసమాహితః ॥41॥

యదశ్వమేధావభృథస్నాతః ప్రాప్నోతి వై ఫలమ్ ।
సకలం తదవాప్నోతి శ్రుత్వైతన్మునిసత్తమ ॥42॥

ఏతత్సంసారభ్రమణపరిత్రాణమనుత్తమమ్ ।
అలర్కాత్రేయసంవాదమశుభాన్ముచ్యతే నరః ॥43॥

ఓ బ్రాహ్మణుడా ! ఎవరు ఈ ఉపాఖ్యానమును ఏకాగ్రచిత్తముతో చదివెదరో లేక వినెదరో వారు అశ్వమేధయాగమును ఆచరించి, యాగానంతరము చేయు అవభృథస్నానమును చేసి ఆ యాగఫలమును పొందును. ఓ మునిశ్రేష్ఠుడా ! ఈ ఉపాఖ్యానమును విన్నవారు జననమరణ ప్రవాహరూపమైన ఈ సంసారమందు తిరుగాడుట లేక గొప్ప రక్షణను పొందెదరు. ఇంకను ఈ అలర్కాత్రేయ సంవాదమను ఉపాఖ్యానమును విన్న మానవుడు అమంగళములనుండి విముక్తిని పొందును.

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే పితాపుత్రసంవాదే జడోపాఖ్యానే ఏకచత్వారింశోఽధ్యాయః ॥41॥

శ్రీ మార్కండేయ మహాపురాణమందు పితాపుత్రసంవాదమందలి జడోపాఖ్యానమందు నలుబదిఒకటవ అధ్యాయం సమాప్తం.



ద్విచత్వారింశోఽధ్యాయః - నలుబదిరెండవ అధ్యాయం
బ్రహ్మోత్పత్తిః - బ్రహ్మోత్పత్తి

జైమినిరువాచ - జైమిని చెప్పాడు.

సమ్యగేతన్మమాఖ్యాతం భవద్భిర్ద్విజసత్తమాః ।
ప్రవృత్తం చ నివృత్తం చ ద్వివిధం కర్మ వైదికమ్ ॥1॥

ఓ ద్విజశ్రేష్ఠులారా! ప్రవృత్తము, నివృత్తము అను రెండు విధములైన వైదిక కర్మలను గూర్చి మీరు నాకు బాగుగా ఉపదేశించిరి. (స్వర్గాదిఫలములను కలిగింపచేసే కర్మలు ప్రవృత్తిమార్గమునకు సంబంధించినవి. మోక్షమును కలిగింపచేసే ఉపాసనాది కర్మలు నివృత్తిమార్గమునకు సంబంధించినవి.)

అహో పితృప్రసాదేన భవతాం జ్ఞానమీదృశమ్ ।
యేన తిర్యక్త్వమప్యేతత్ప్రాప్య మోహస్తిరస్కృతః ॥2॥

ఎంత ఆశ్చర్యము! మీ తండ్రిగారి అనుగ్రహముతో మీకిట్టి గొప్ప జ్ఞానము సిద్ధించినది. అందువల్లనే పక్షిజన్మను పొంది కూడా మీయందు మోహము (అజ్ఞానము) నశించినది.

ధన్యా భవంతః సంసిద్ధ్యై ప్రాగవస్థా స్థితం యతః ।
భవతాం విషయోద్భూతైర్న మోహైశ్చాల్యతే మనః ॥3॥

పక్షిజన్మను పొందిననూ పూర్వావస్థయందే ఉండుటవలన మీరు ధన్యజీవులు. ఆయా విషయములతో సంబంధమువలన కలిగే మోహములతో మీ మనస్సు చలించదు. అనగా మీ మనస్సు విషయములందు ప్రసరించదు.

దిష్ట్యా భగవతా తేన మార్కండేయేన ధీమతా ।
భవన్తో వై సమాఖ్యాతాః సర్వసందేహహృత్తమాః ॥4॥

నా అదృష్టముకొలదీ జ్ఞానవంతుడగు మార్కండేయమహర్షి సమస్త సందేహములను తీర్చు గొప్పవారగు మిమ్ములను గూర్చి నాకు చెప్పెను.

సంసారేఽస్మిన్మనుష్యాణాం భ్రమతామతిసంకటే ।
భవద్విధైస్సమం సఙ్గో జాయతే నాఽతపస్వినామ్ ॥5॥

మిక్కిలి భయంకరమైన ఈ సంసారమందు తిరిగే మనుష్యులు తపస్సంపన్నులు కాకపోయినచో అట్టి వారికి మీబోటి మహాత్ములతో సాంగత్యము లభించదు.

యద్యహం సఙ్గమాసాద్య భవద్భిర్జ్ఞానదృష్టిభిః ।
న స్యాం కృతార్థస్తన్నూనం న మేఽన్యత్ర కృతార్థతా ॥6॥

జ్ఞాననేత్రములుగల మీతో సాంగత్యము పొంది కూడా నేను కృతార్థుడను కాకపోయినచో మరెక్కడ నాకు కృతార్థత లభించును? (కృతార్థత అనగా ఇష్టసిద్ధి).

ప్రవృత్తే చ నివృత్తే చ భవతాం జ్ఞానకర్మణి ।
మతిమస్తమలాం మన్యే యథా నాన్యస్య కస్యచిత్ ॥7॥

ప్రవృత్తి, నివృత్తులను కలిగించే వరుసగా కర్మలు మరియు జ్ఞానమందు మరెవ్వరికీ లేనివిధంగా మీయొక్క బుద్ధి అస్తమించిన మలములు కలిగినదానినిగా నేను భావించుచున్నాను.

యది త్వనుగ్రహవతీ మయి బుద్ధిర్ద్విజోత్తమాః ।
భవతాం తత్సమాఖ్యాతుమర్హథేదమశేషతః ॥8॥

ఓ ద్విజశ్రేష్ఠులారా ! నాయందు మీ బుద్ధి అనుగ్రహము కలిగినదే అయినచో నేనడిగే దానిని సంపూర్ణముగా చెప్పుటకు మీరు అర్హులు.

కథమేతత్సముద్భూతం జగత్ స్థావరజఙ్గమమ్ ।
కథం చ ప్రళయం కాలే పునర్యాస్యతి సత్తమాః ॥9॥

ఓ బ్రాహ్మణశ్రేష్ఠులారా ! ఈ కనిపించే స్థావరజంగమాత్మకమైన ప్రపంచము ఎట్లు పుట్టినది? తిరిగి దానికి ఎట్లు ప్రళయము అనగా నాశము సంభవించును? (స్థావరమనగా కదలనిది, జంగమమనగా కదిలేది అని అర్థము).

కథం చ వంశా దేవర్షిపితృభూతాదిసంభవాః ।
మన్వన్తరాణి చ కథం వంశానుచరితం చ యత్ ॥10॥

దేవతలు, ఋషులు, పితృదేవతలు, భూతములు మొదలగు వాటి పుట్టుక కలిగిన ఆయా వంశములు ఎట్లు ఉద్భవించినవి? ఎట్లు మన్వంతరముల (వేరే సృష్టుల) ఉద్భవము కలుగుచున్నది? ఆయా వంశముల పూర్వోత్తర విభాగము, వాటి చరిత్ర ఎట్టిది?

యావత్యః సృష్టయశ్చైవ యావన్తః ప్రళయాస్తథా ।
యథా కల్పవిభాగశ్చ యా చ మన్వంతరస్థితిః ॥11॥

యథా చ క్షితిసంస్థానం యత్ప్రమాణం చ వై భువః ।
యథాస్థితి సముద్రాద్రి నిమ్నగాః కాననాని చ ॥12॥

భూర్లోకాదిశ్చ లోకానాం గణః పాతాలసంశ్రయః ।
గతిస్తథార్కసోమాదిగ్రహర్క్షజ్యోతిషామపి ॥13॥

శ్రోతుమిచ్ఛామ్యహం సర్వమేతదాభూతసంప్లవమ్ ।
ఉపసంహృతే చ యచ్ఛేషం జగత్యస్మిన్భవిష్యతి ॥14॥

ఎన్ని సృష్టులు ఉన్నాయో, ప్రళయములు ఎన్ని ఉన్నాయో, కల్పముల విభాగము ఎటులున్నదో, మన్వంతరాల స్థితి ఎట్టిదో, ఈ భూమి ఎటుల నిలుచుచున్నదో, ఈ భూమియొక్క ప్రమాణము (విస్తీర్ణము) ఎంతో, సముద్రములు

పర్వతములు నదులు అడవులు వీటి స్థితి ఎట్టిదో, భూర్లోకము స్వర్గలోకము పాతాళము ఈ లోకముల సమూహము ఎట్టిదో, సూర్యచంద్రులు నక్షత్రములు జ్యోతిస్సులు వీటి గమనము ఎట్టిదో వీటి ప్రళయపర్యంతము వీటన్నింటిని గూర్చి వినవలెనని కోరుచున్నాను. జగత్తు ప్రళయము చెందిన పిమ్మట ఇక ఏమి మిగులునో దానిని గురించి కూడా మీ నుండి వినవలెనని కోరుచున్నాను.

పక్షిణ ఊచుః – పక్షులు చెప్పాయి.

ప్రశ్నభారోఽయమతులో యస్త్వయా మునిసత్తమ ।
పృష్టస్తం తే ప్రవక్ష్యామస్తచ్ఛృణుష్వేహ జైమినే ॥15॥

ఓ జైమినీ! మునిశ్రేష్ఠుడా! నీవడిగిన ప్రశ్న మిక్కిలి భారవంతమైనది. నీవడిగినదానిని గూర్చి చెప్పెదను, వినుము.

మార్కండేయేన కథితం పురా క్రౌష్టుకయే యథా
ద్విజపుత్రాయ శాంతాయ వ్రతస్నాతాయ ధీమతే ॥16॥

బ్రాహ్మణకుమారుడు, శాంతస్వభావుడు, వ్రతస్నాతుడు (విద్యను పూర్తిచేసి వ్రతాచరణ చేసినవాడు), జ్ఞానవంతుడు అగు క్రౌష్టుకి మునికి పూర్వము మార్కండేయమహర్షి చెప్పిన విషయములను నీకు చెప్పెదము, వినుము.

మార్కండేయం మహాత్మానముపాసీనం ద్విజోత్తమైః ।
క్రౌష్టుకిః పరిపప్రచ్ఛ యదేతత్ పృష్టవాన్ ప్రభో ॥17॥

ఓ ప్రభూ! ద్విజశ్రేష్ఠులచేత పూజింపబడు మహాత్ముడైన మార్కండేయుని క్రౌష్టుకి నీవడిగిన విషయమును గూర్చియే అడిగెను.

తస్య చాఽకథయత్ప్రీత్యా యన్మునిర్భృగునందనః ।
తత్తే ప్రకథయిష్యామః శృణు త్వం ద్విజసత్తమ ॥18॥

ప్రణిపత్య జగన్నాథం పద్మయోనిం పితామహమ్ ।
జగద్యోనిం స్థితం సృష్టౌ స్థితౌ విష్ణుస్వరూపిణమ్ ॥
ప్రళయే చాన్తకర్తారం రౌద్రం రుద్రస్వరూపిణమ్ ॥19॥

ఓ బ్రాహ్మణశ్రేష్ఠుడా! ఈ సృష్టికి కారణభూతుడైనవాడు, పద్మసంభవుడు, పితామహుడు అగు బ్రహ్మకు నమస్కరించి, ప్రపంచము నిలబడుటకు కారణభూతుడైన విష్ణుమూర్తికి నమస్కరించి, ప్రళయకాలమందు ప్రపంచమంతటినీ అంతమొందించు రౌద్రాకారముగల రుద్రస్వరూపుడైన పరమేశ్వరునికీ నమస్కరించి (సృష్టిస్థితిలయకారకులైన బ్రహ్మవిష్ణుమహేశ్వరులకు నమస్కరించి), భృగుపుత్రుడైన మార్కండేయముని క్రౌష్టుకికి చెప్పిన విషయములను చెప్పెదము, వినుము.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

ఉత్పన్నమాత్రస్య పురా బ్రహ్మణోఽవ్యక్తజన్మనః ।
పురాణమేతద్వేదాశ్చ ముఖేభ్యోఽనువినిస్సృతాః ॥20॥

పూర్వకాలమందు అవ్యక్తజన్ముడగు బ్రహ్మ పుట్టినవెంటనే అతడి నాలుగు ముఖములనుండి అష్టాదశ పురాణములు, నాలుగు వేదములు బయల్వెడలినవి.

పురాణసంహితాశ్చక్రుర్బహులాః పరమర్షయః ।
వేదానాం ప్రవిభాగశ్చ కృతస్తైస్తు సహస్రశః ॥21॥

గొప్ప ఋషులు పురాణములు, సంహితలు వేదములను వేలకొలదీ అనేక శాఖలుగా విభజించిరి.

ధర్మం జ్ఞానం చ వైరాగ్యమైశ్వర్యం చ మహాత్మనః ।
తస్యోపదేశేన వినా న హి సిద్ధం చతుష్టయమ్ ॥22॥

ధర్మము, జ్ఞానము, వైరాగ్యము, ఐశ్వర్యము ఈ నాలుగు మహాత్ముని ఉపదేశము లేకుండా సిద్ధించవు.

వేదాన్సప్తర్షయస్తస్మాజ్జగృహుస్తస్య మానసాః ।
పురాణం జగృహుశ్చాద్యా మునయస్తస్య మానసాః ॥23॥

ఆ బ్రహ్మయొక్క మనస్సు నుండి పుట్టిన సప్తర్షులు బ్రహ్మనుండి వేదములను గ్రహించిరి. మిగిలిన మానస ఋషులు పురాణములను గ్రహించిరి.

భృగోః సకాశాచ్చ్యవనస్తేనోక్తం చ ద్విజన్మనామ్ ।
ఋషిభిశ్చాపి దక్షాయ ప్రోక్తమేతన్మహాత్మభిః ॥24॥

భృగువునుండి చ్యవనుడు పురాణములను గ్రహించగా, ఆ చ్యవనుడు వాటిని ద్విజులకు బోధించెను. మహాత్ములగు ఋషులు దక్షునికి పురాణములను బోధించెను.

దక్షేణ చాపి కథితమిదమాసీత్తదా మమ ।
తత్తుభ్యం కథయామ్యద్య కలికల్మషనాశనమ్ ॥25॥

అప్పుడు దక్షుడు నాకు పురాణములను బోధించెను. కావున నేనిప్పుడు కలిపాపములను పోగొట్టు పురాణములను నీకు బోధించెదను.

సర్వమేతన్మహాభాగ శ్రూయతాం మే సమాధినా ।
యథా శ్రుతం మయా పూర్వం దక్షస్య గదతో మునే ॥26॥

ఓ మునీ! మహాభాగా! పూర్వము దక్షుడు చెప్పగా విన్నదానిని అంతటిని నీకు చెప్పెదను, శ్రద్ధగా వినుము.

**ప్రణిపత్య జగద్యోనిమజమవ్యయమాశ్రయమ్ ।
చరాచరస్య జగతో ధాతారం పరమం పదమ్ ॥27॥**

**బ్రహ్మాణమాదిపురుషముత్పత్తిస్థితిసంయమే ।
యత్కారణమనౌపమ్యం యత్ర సర్వం ప్రతిష్ఠితమ్ ॥28॥**

**తస్మై హిరణ్యగర్భాయ లోకతంత్రాయ ధీమతే ।
ప్రణమ్య సమ్యగ్వక్ష్యామి భూతవర్గమనుత్తమమ్ ॥29॥**

**మహదాద్యం విశేషాన్తం సవైరూప్యం సలక్షణమ్ ।
ప్రమాణైః పఞ్చభిర్గమ్యం స్రోతోభిః షడ్భిరన్వితమ్ ॥30॥**

**పురుషాధిష్ఠితం నిత్యమనిత్యమివ చ స్థితమ్ ।
తచ్ఛ్రూయతాం మహాభాగ పరమేణ సమాధినా ॥31॥**

జగత్తుకు కారణభూతుడు, జన్మరహితుడు, వినాశము లేనివాడు, చరాచరప్రపంచమునకు ఆశ్రయభూతుడు, బ్రహ్మలోకమనెడు పరమపదమును ధరించువాడు, ఆదిపురుషుడు, ఉత్పత్తి స్థితి ప్రళయములకు కారణభూతుడు, సాటి లేనివాడు, తనయందు సర్వము ప్రతిష్ఠితమైనట్టివాడు, లోకమును నడిపించువాడు, జ్ఞానవంతుడూ అగు హిరణ్యగర్భునికి నమస్కరించి గొప్పది అయిన భూతవర్గమును గూర్చి నీకు చెప్పెదను. మహత్తు మొదలుకొని విశేషముల వరకు కల్గినదీ, సారూప్యవైరూప్యములు కలదీ, అయిదు ప్రమాణములచేత తెలియబడునదీ, ఆరు స్రోతస్సులు అనగా మార్గములతో కూడినదీ, పురుషాధిష్ఠితమూ, నిత్యమూ అనిత్యముగనూ ఉన్నదీ ఆ భూతవర్గము. ఆ భూతవర్గమును గురించి చెప్పెదను, గొప్ప ఏకాగ్రతతో వినుము.

**ప్రధానం కారణం యత్తదవ్యక్తాఖ్యం మహర్షయః ।
యదాహుః ప్రకృతిం సూక్ష్మాం నిత్యాం సదసదాత్మికామ్ ॥32॥**

**ధ్రువమక్షయ్యమజరమమేయం నాన్యసంశ్రయమ్ ।
గంధరూపరసైర్హీనం శబ్దస్పర్శవివర్జితమ్ ॥33॥**

**అనాద్యంతం జగద్యోనిం త్రిగుణప్రభవాప్యయమ్ ।
అసాంప్రతమవిజ్ఞేయం బ్రహ్మాగ్రే సమవర్తత ॥34॥**

**ప్రలయస్యాను తేనేదం వ్యాప్తమాసీదశేషతః ।
గుణసామ్యాత్తతస్తస్మాత్ క్షేత్రజ్ఞాధిష్ఠితాన్మునే ॥35॥**

ఓ మునీ ! ఈ ప్రపంచముకంతటికినీ అవ్యక్తమని చెప్పబడే ప్రధానమును కారణముగా మహర్షులు చెప్పుచున్నారు. ఆ ప్రధానమే ప్రకృతియని కూడా వ్యవహరింపబడుచున్నది. ఆ ప్రకృతి అన్నింటికంటే సూక్ష్మము, సదసద్రూపము, నిత్యము, నాశము లేనిది, వార్ధక్యము అనగా వికారము లేనిది, అపరిచ్ఛిన్నము, దేనినీ ఆశ్రయించనిది, గంధరూపరసములు లేనిది, శబ్దస్పర్శలు లేనిది, ఆద్యంతములు లేనిది, జగత్తుకు కారణభూతమైనది,

సత్త్వరజస్తమోగుణస్వరూపము, ఆ మూడు గుణములచే ఉత్పన్నమయ్యే మహదాది జగద్రూపకార్యనాశము గలది, నూతనము కానిది, తెలియబడేది కానిది, బ్రహ్మస్వరూపమూ అగు ఈ ప్రధానము సృష్టికి పూర్వమే ఉన్నది. ఈ ప్రపంచము ప్రళయము చెందిన పిమ్మట, కారణభూతమైన ఈ ప్రకృతితోనే ప్రపంచమంతా వ్యాప్తమైయున్నది. (అనగా కార్యరూపమైన ప్రపంచము నశించినా, ఆ ప్రపంచము ప్రకృతియను కారణరూపముగానే అవస్థితమై యున్నది). క్షేత్రజ్ఞుడైన పురుషాధిష్ఠితమైన ఆ ప్రకృతినుండే సత్త్వరజస్తమోగుణసామ్యము కలిగిన ప్రపంచము పుట్టుచున్నది. (ఇచ్చట సాంఖ్యసిద్ధాంతము చెప్పబడినది. వేదాంతమతములో హిరణ్యగర్భుడనే అపరబ్రహ్మ సృష్టికారణముగా చెప్పబడినది. ఆ బ్రహ్మ స్థానములో సాంఖ్యమతమందు ప్రధానము చెప్పబడినది.)

యథా బీజం త్వచా తద్వదవ్యక్తేనావృతో మహాన్ ।
సాత్త్వికో రాజసశ్చైవ తామసశ్చ త్రిధోదితః ॥37॥

విత్తనము ఏ విధముగా అయితే పై చర్మముతో కప్పబడి ఉండునో, అదేవిధముగా మహత్తత్త్వము (సాంఖ్యమతము ప్రకారము బుద్ధితత్త్వమని అర్థము) అవ్యక్తమైన ప్రధానముతో ఆవరింపబడి ఉండును. ఈ మహత్తత్త్వము సాత్త్వికము, రాజసము, తామసము అని మూడు విధములు.

తతస్తస్మాదహంకారస్త్రివిధో వై వ్యజాయత ।
వైకారికస్తైజసశ్చ భూతాదిశ్చ స తామసః ॥38॥

ఆ మహత్తత్త్వమునుండి వైకారికము, తైజసము, తామసమను భూతాది అను మూడు విధములగు అహంకారము పుట్టినది. (వైకారికమనగా సాత్త్వికమని, తైజసమనగా రాజసమని అర్థము.)

మహతా చాఽవృతస్సోఽపి యథాఽవ్యక్తేన వై మహాన్ ।
భూతాదిస్తు వికుర్వాణః శబ్దతన్మాత్రకం తతః ॥39॥

అవ్యక్తమగు ప్రధానముతో మహత్తత్త్వము ఆవరింపబడినట్లే, అహంకారము కూడా మహత్తత్త్వముచేత ఆవరింపబడినది. భూతాది లేదా తామస అహంకారతత్త్వము వికారము చెందుచు శబ్దస్పర్శరూపరసగంధ పంచ తన్మాత్రలను (సూక్ష్మ పంచభూతములు) పుట్టించినది.

ససర్జ శబ్దతన్మాత్రాదాకాశం శబ్దలక్షణమ్ ।
ఆకాశం శబ్దమాత్రం తు భూతాదిశ్చావృణోత్తతః ॥40॥

శబ్దతన్మాత్ర నుండి శబ్దము గుణముగా గల ఆకాశము పుట్టెను. శబ్దతన్మాత్ర కలిగిన ఆకాశమును భూతాది (తామసమైన) అహంకారము ఆవరించినది.

స్పర్శతన్మాత్రమేవేహ జాయతే నాత్ర సంశయః ।
బలవాన్ జాయతే వాయుస్తస్య స్పర్శగుణో మతః ॥41॥

పిమ్మట స్పర్శతన్మాత్ర అహంకారమునుండి పుట్టినది. ఇందులో సంశయము లేదు. ఆ స్పర్శతన్మాత్ర నుండి స్థూల వాయువు పుట్టుచున్నది. ఆ వాయువు స్పర్శ గుణముగా కలది.

**వాయుశ్చాపి వికుర్వాణో రూపమాత్రం ససర్జ హ ।
జ్యోతిరుత్పద్యతే వాయోస్తద్రూపగుణముచ్యతే ॥42॥**

వాయువు వికారము చెందుచూ రూపతన్మాత్రను పుట్టించెను. అట్టి వాయువు వలన రూపగుణము కలిగిన జ్యోతిస్సు (తేజస్సు) పుట్టుచున్నది.

**స్పర్శమాత్రస్తు వై వాయురూపమాత్రం సమావృణోత్ ।
జ్యోతిశ్చాపి వికుర్వాణం రసమాత్రం ససర్జ హ ॥43॥**

స్పర్శతన్మాత్ర వాయురూపతన్మాత్రను ఆవరించినది. జ్యోతిస్సు కూడా వికారము చెందుచూ రసతన్మాత్రను పుట్టించెను.

**సంభవన్తి తతో హ్యాపశ్చాసన్వై తా రసాత్మికాః ।
రసమాత్రం తు తా హ్యాపో రూపమాత్రం సమావృణోత్ ॥44॥**

ఆ రసతన్మాత్ర నుండి రసాత్మకమైన జలము పుట్టినది. ఆ రసతన్మాత్ర జలముయొక్క రూపతన్మాత్రను ఆవరించినది.

**ఆపశ్చాపి వికుర్వత్యో గంధమాత్రం ససర్జిరే ।
సంఘాతో జాయతే తస్మాత్తస్య గంధో గుణో మతః ॥45॥**

జలములు కూడా వికారము చెందుచూ గంధతన్మాత్రను పుట్టించినవి. ఆ గంధతన్మాత్ర నుండి పృథివి పుట్టినది.ఆ పృథివి యొక్క గుణమే గంధము.

**తస్మింస్తస్మింస్తు తన్మాత్రం తేన తన్మాత్రతా స్మృతా ।
అవిశేషవాచకత్వాదవిశేషాస్తతశ్చ తే ॥46॥**

ఈ విధముగా ఆకాశము మొదలగు ఆయా భూతములందు శబ్దతన్మాత్ర మొదలగు ఆయా పంచతన్మాత్రలు గలవు. అందువల్లనే ఆయా భూతతన్మాత్రలుగా (ఆకాశతన్మాత్ర, వాయుతన్మాత్ర మొదలగునవి) ఆ పంచతన్మాత్రలు స్మరింపబడినవి. సూక్ష్మములైన ఆకాశాది పంచతన్మాత్రల వల్లనే స్థూలములైన ఆకాశాది పంచ మహాభూతములు ఉత్పన్నములైనవి. ఈ పంచతన్మాత్రలు శబ్దాదివిశేషములు కల్గినవి కావు కనుకనే అవిశేషములని చెప్పబడుచున్నవి.

**న శాన్తా నాపి ఘోరాస్తే న మూఢాశ్చావిశేషతః ।
భూతతన్మాత్రసర్గో౽యమహంకారాత్తు తామసాత్ ॥47॥**

ఎట్టి విశేషములు లేనందువల్లనే శబ్దతన్మాత్ర మొదలగు పంచతన్మాత్రలు శాన్తములు, ఘోరములు, మూఢములు కావు. అనగా సత్త్వాదులయొక్క గుణములు పంచతన్మాత్రలందు సంక్రమించవు. తామసమైన అహంకారము వల్లనే ఈ భూతతన్మాత్రల సృష్టి జరిగినది.

**వైకారికాదహంకారాత్సత్త్వోద్రిక్తాత్తు సాత్త్వికాత్ ।
వైకారికః ససర్గస్తు యుగపత్సంప్రవర్తతే ॥48॥**

సత్త్వగుణము ఉద్రిక్తము కాగా, రజస్తమోగుణములు అణచివేయబడగా అట్టి సాత్త్వికాహంకారము నుండి ఒకేసారి వైకారికసృష్టి ప్రవర్తమగును. (వైకారికమనగా సాత్త్వికమని అర్థము.)

బుద్ధీంద్రియాణి పఞ్చైవ పఞ్చ కర్మేంద్రియాణి చ ।
తైజసానీంద్రియాణ్యాహుర్దేవా వైకారికా దశ ॥49॥

అయిదు జ్ఞానేంద్రియములు, అయిదు కర్మేంద్రియములు ఈ పది తైజసములైన ఇంద్రియములు. ఈ పదింటికి అధిష్ఠాతృదేవతలు సాత్త్వికులు అనగా సత్త్వగుణసంపన్నులు.

ఏకాదశం మనస్తత్ర దేవా వైకారికాః స్మృతాః ।
శ్రోత్రం త్వక్చక్షుషీ జిహ్వా నాసికా చైవ పఞ్చమీ ॥50॥

శబ్దాదీనామవాప్త్యర్థం బుద్ధియుక్తాని వక్ష్యతే ।

మనస్సు పదకొండవ ఇంద్రియము. ఈ మొత్తం పదకొండు ఇంద్రియాలకు అధిష్ఠాతలైన దేవతలు వైకారికులు లేదా సాత్త్వికులని చెప్పబడుచున్నారు. ఈ పదకొండు ఇంద్రియాలలో శ్రోత్రము, త్వక్కు, చక్షుస్సు, రసనము, ఘ్రాణము ఈ అయిదు శబ్దాదిగుణములను గ్రహించుచుండుటచే జ్ఞానేంద్రియములని వ్యవహరింపబడుచున్నవి.

పాదౌ పాయురుపస్థశ్చ హస్తౌ వాక్పఞ్చమీ భవేత్ ॥51॥
గతిర్విసర్గో హ్యానందః శిల్పం వాక్యం చ కర్మ తత్ ।

పాదములు, పాయువు (మలమూత్రాదులు విసర్జించు స్థానము), ఉపస్థ (జననేంద్రియము), హస్తములు, వాక్కు ఈ అయిదు కర్మేంద్రియములని చెప్పబడుచున్నవి. వీటికి వరుసగా గమనము, విడిచిపెట్టుట, ఆనందము, పనిచేయుట, మాటలాడుట అనునవి అయిదు కర్మలు.

ఆకాశం శబ్దమాత్రం తు స్పర్శమాత్రం సమావిశత్ ॥52॥

ద్విగుణో జాయతే వాయుస్తస్య స్పర్శో గుణో మతః ।
రూపం తథైవావిశతః శబ్దస్పర్శగుణావుభౌ ॥53॥

త్రిగుణస్తు తతశ్చాగ్నిః స శబ్దస్పర్శరూపవాన్ ।
శబ్దః స్పర్శశ్చ రూపం చ రసమాత్రం సమావిశత్ ॥54॥

తస్మాచ్చతుర్గుణా హ్యాపో విజ్ఞేయాస్తే రసాత్మికాః ।
శబ్దః స్పర్శశ్చ రూపం చ రసో గంధం సమావిశత్ ॥55॥

సంహతా గంధమాత్రేణ ఆవృణ్వంస్తే మహీమిమామ్ ।
తస్మాత్పంచగుణా భూమిః స్థూలా భూతేషు దృశ్యతే ॥56॥

ఒక్క శబ్దతన్మాత్రవలన పుట్టిన ఆకాశము శబ్దము మాత్రమే గుణముగా కలది. శబ్దతన్మాత్రతోబాటు స్పర్శతన్మాత్ర వలన వాయువు పుట్టిన కారణముగా వాయువునందు శబ్దము, స్పర్శ రెండు గుణములుండును.

అయితే వాయువు స్పర్శగుణము ప్రధానముగా కలది. శబ్దము అప్రధానము. శబ్దతన్మాత్ర, స్పర్శతన్మాత్రలతోబాటు రూపతన్మాత్ర వలన అగ్ని పుట్టిన కారణముగా అగ్నిలో శబ్దస్పర్శరూపములను మూడు గుణములుండును. ఆ మూడింటిలో రూపమే ప్రధానము. శబ్దస్పర్శలు అప్రధానములు. శబ్దతన్మాత్ర, స్పర్శతన్మాత్ర, రూపతన్మాత్రలతో బాటు రసతన్మాత్ర వలన జలము పుట్టిన కారణముగా జలము శబ్దస్పర్శరూపరసములను నాలుగు గుణములు కలది. ఆ నాల్గింటిలో రసమే ప్రధానముగా జలమందుండును. శబ్దస్పర్శ రూపములు అప్రధానములు. శబ్దతన్మాత్ర, స్పర్శతన్మాత్ర, రూపతన్మాత్ర, రసతన్మాత్రలతో బాటు గంధతన్మాత్ర వలన పుట్టిన కారణముగా పృథివి శబ్దస్పర్శరూపరసగంధములను అయిదు గుణములు కలది. అయినను పృథివి గంధము ప్రధానగుణముగా కలది. శబ్దస్పర్శ రూపరసములు అప్రధానములు.

శాన్తా ఘోరాశ్చ మూఢాశ్చ విశేషాస్తేన తే స్మృతా ।
పరస్పరానుప్రవేశాద్ధారయన్తి పరస్పరమ్ ॥57॥

శబ్దతన్మాత్ర మొదలగు పంచతన్మాత్రలు వలన ఉద్భవించిన ఆకాశము మొదలగు స్థూలభూతములు అయిదు శాంతములు, ఘోరములు, మూఢములని విశేషములుగా చెప్పబడుచున్నవి. అవి ఒకదానిలో మరొకటి పరస్పరము ప్రవేశించుటచే, ఒకదానిని మరొకటి ధరించుచున్నవి.

భూమేరన్తస్త్విదం సర్వం లోకాలోకం ఘనావృతమ్ ।
విశేషాశ్చేంద్రియగ్రాహ్యా నియతత్వాచ్చ తే స్మృతాః ॥58॥

ఈ భూమియందే లోపల ఈ సమస్తలోకములు (ప్రత్యక్షములు, అప్రత్యక్షములు) అన్నీ దట్టముగా ఇమిడియున్నవి. ఆకాశము మొదలగు ఈ అయిదు విశేషములు శబ్దాది విశిష్టములుగా నియతమైయున్నందున ఆ విశేషములు కూడా ఇంద్రియగ్రాహ్యములని చెప్పబడుచున్నవి.

గుణం పూర్వస్య పూర్వస్య ప్రాప్నువన్త్యుత్తరోత్తరమ్ ।
నానావీర్యాః పృథగ్భూతాః సప్తైతే సంహతిం వినా ॥59॥

నాశక్నువన్ ప్రజాః స్రష్టుమసమాగమ్య కృత్స్నశః ।

మహత్తు, అహంకారము, పంచతన్మాత్రలు (విశేషములు) ఈ ఏడు తత్త్వములు క్రమముగా పూర్వమందున్నవాటియొక్క గుణములను, తరువాతివి పొందించుకొనును. ఈ ఏడు పరస్పర సంయోగము లేనంతవరకు ప్రజలను (లోకములను) సృష్టించుటలో సమర్థములు కావు.

సమేత్యాన్యోన్యసంయోగమన్యోన్యాశ్రయిణశ్చ తే ॥60॥

ఏకసంఘాతచిహ్నాశ్చ సంప్రాప్యైక్యమశేషతః ।
పురుషాధిష్ఠితత్వాచ్చ అవ్యక్తానుగ్రహేణ చ ॥61॥

మహదాద్యా విశేషాన్తా హ్యండముత్పాదయన్తి తే ।
జలబుద్బుదవత్తత్ర క్రమాద్వై వృద్ధిమాగతమ్ ॥62॥

మహత్తు మొదలుకొని విశేషముల వరకు ఈ ఏడు తత్త్వములు పరస్పరము సంయోగముచెంది, పరస్పరము ఆశ్రయము పొంది, ఒకే సంఘాతరూపమైన చిహ్నము కలిగి, సంపూర్ణముగా ఐక్యభావమును పొంది పురుషాధిష్ఠితమైన కారణముగానూ, అవ్యక్తమగు ప్రకృతియొక్క అనుగ్రహము చేతనూ అండమును (బ్రహ్మాండమును) పుట్టించుచున్నవి. నీటి బుడగవంటి ఈ అండము (అనిత్యమైనది) క్రమక్రమముగా వృద్ధిచెందును.

భూతేభ్యోఽణ్డం మహాబుద్ధే బృహత్తదుదకేశయమ్ ।
ప్రాకృతేఽణ్డే వివృద్ధః సన్ క్షేత్రజ్ఞో బ్రహ్మసంజ్ఞితః ॥63॥

ఓ గొప్ప బుద్ధిమంతుడా ! పంచమహాభూతములవలన వృద్ధిచెంది, పెద్దది అయిన ఆ అండము, జలమందు స్థితిని పొంది ఉన్నది. ప్రకృతి వికారమైన ఆ అండము వృద్ధి చెందుచు క్షేత్రజ్ఞుడను పేరు, బ్రహ్మయను పేరు కలిగియున్నది. (ఈ బ్రహ్మ హిరణ్యగర్భుడను పేరుగల ఆదిజీవుడు, కార్యబ్రహ్మయని ఎరుగవలెను. ఈ కార్యబ్రహ్మకంటే పరబ్రహ్మము వేరైనది.)

స వై శరీరీ ప్రథమః స వై పురుష ఉచ్యతే ।
ఆదికర్తా చ భూతానాం బ్రహ్మాగ్రే సమవర్తత ॥64॥

అతడే శరీరధారియగు ప్రథమజీవుడని, అతడే పురుషుడని చెప్పబడుచున్నాడు. అతడే భూతములనన్నింటిని మొదటిగా సృష్టించినవాడు. సృష్టిప్రారంభమందు అతడు ఒక్కడే ఉన్నాడు.

తేన సర్వమిదం వ్యాప్తం త్రైలోక్యం సచరాచరమ్ ।
మేరురస్యానుసంభూతో జరాయుశ్చాపి పర్వతాః ॥65॥

ఆ ఆదిజీవునిచేతనే స్థావరజంగమాత్మకమైన ముల్లోకములన్నియు వ్యాపింపబడినవి. అతడిని అనుసరించే సమస్తమును ఆవరించి రక్షణభూతమైన మేరుపర్వతము ఉద్భవించినది. పిమ్మట మిగిలిన పర్వతములు ఉద్భవించినవి.

సముద్రా గర్భసలిలం తస్యాండస్య మహాత్మనః ।
తస్మిన్నండే జగత్సర్వం సదేవాసురమానుషమ్ ॥66॥

ద్వీపాద్యద్రిసముద్రాశ్చ సజ్యోతిర్లోకసంగ్రహః ।

గొప్పది అయిన ఆ అండమునకు గర్భమందలి జలమనగా సముద్రములే. ఆ అండమందు దేవతలు, రాక్షసులు, మనుష్యులతో కూడుకొన్న ఈ ప్రపంచమంతా నిండియున్నది. అట్లే ద్వీపములు మొదలగునవి, పర్వతములు, సముద్రములు, తేజోలోకములు ఆ అండమందు నిండియున్నవి.

జలానిలానలాకాశైస్తతో భూతాదినా బహిః ॥67॥
వృతమణ్డం దశగుణైరేకైకత్వేన తైః పునః ।
మహతా తత్ప్రమాణేన సహైవానేన వేష్టితః ॥68॥

మహాంస్తైస్సహితస్సర్వైరవ్యక్తేన సమావృతః ।
ఏభిరావరణైరణ్డం సప్తభిః ప్రాకృతైర్వృతమ్ ॥69॥

అన్యోన్యమావృత్య చ తా అష్టౌ ప్రకృతయస్స్థితాః ।

జలము, వాయువు, అగ్ని, ఆకాశము, భూతాది అనగా తామసాహంకారము ఇవియన్నియు పదేసిరెట్లు ఆ అండముయొక్క బయటిభాగమును ఆవరించినవి. ఆ అండముయొక్క ప్రమాణమంతటి ప్రమాణము కలిగిన (ప్రమాణమనగా పరిమాణమని అర్థము) మహత్తత్త్వము చేత ఈ అండము చుట్టబడినది. వీటియన్నింటిచేత కూడుకొన్న ఆ గొప్ప అండము జగత్తునకు ప్రధానకారణమైన అవ్యక్తమగు ప్రకృతిచేత ఆవరింపబడినది. ప్రకృతికార్యములైన ఈ ఏడు ఆవరణలచేత (శబ్దతన్మాత్రాది పంచతన్మాత్రలు, మహత్తు, అహంకారము) ఈ అండము ఆవరింపబడినది. అండమును, పరస్పరము ఆవరించి ఆ ఎనిమిది ప్రకృతులు ఉన్నవి. (ప్రకృతి కార్యములైన మహదాదులు ఏడు మరియు ప్రకృతి మొత్తం ఎనిమిది. కార్యకారణములకు అభేదము గావున ఆ ఏడు కూడా ప్రకృతులుగా చెప్పబడినవి.)

ఏషా సా ప్రకృతిర్నిత్యా తదన్తః పురుషశ్చ సః ॥70॥
బ్రహ్మాఖ్యః కథితో యస్తే సమాసాచ్ఛ్రూయతాం పునః ।

యథా మగ్నో జలే కశ్చిదున్మజ్జన్ జలసంభవమ్ ॥71॥

వలయం క్షిపతి బ్రహ్మా స తథా ప్రకృతిర్విభుః ।

అవ్యక్తం క్షేత్రముద్దిష్టం బ్రహ్మా క్షేత్రజ్ఞ ఉచ్యతే ॥72॥

ఏతత్సమస్తం జానీయాత్ క్షేత్రక్షేత్రజ్ఞలక్షణమ్ ।

ఇత్యేష ప్రాకృతస్సర్గః క్షేత్రజ్ఞాధిష్ఠితస్తు సః ॥

అబుద్ధిపూర్వః ప్రథమః ప్రాదుర్భూతస్తడిద్యథా ॥73॥

ఆ అండమునకు కారణభూతమైన ప్రకృతి (అవ్యక్తమగు ప్రధానము) నిత్యము. ఆ ప్రకృతియందు లేదా ఆ ప్రకృతి కార్యమగు అండమందు లోన ఉన్న ఆ పురుషుడే బ్రహ్మయని చెప్పబడుచున్నాడు. తిరిగి ఆ బ్రహ్మను గురించి సంక్షిప్తముగా చెప్పెదను వినుము. ఏవిధముగా అయితే జలమందు మునిగిన ఎవరైననూ ఆ జలమువల్ల సంభవించిన వలయమును ఛేదించి బయటకు వచ్చెదరో, అట్లే బ్రహ్మకూడా ఆ అండమను వలయమును ఛేదించి బయటకు వచ్చును. ఆ బ్రహ్మయే ప్రకృతి అని చెప్పబడుచున్నాడు. అవ్యక్తమగు ప్రకృతి క్షేత్రమని చెప్పబడుచున్నది. బ్రహ్మ క్షేత్రజ్ఞుడని చెప్పబడుచున్నాడు. ఈ విధముగా క్షేత్రక్షేత్రజ్ఞవిభాగమునంతటినీ నీవు తెలుసుకొనవలెను. ప్రకృతివల్ల పుట్టిన సృష్టియంతయు క్షేత్రజ్ఞుడగు పురుషుని ఆశ్రయించి ఉన్నది. ఈ విధముగా మొదటి సృష్టి మెరుపులాగా బుద్ధిపూర్వకముగా కాకుండానే జరిగినది.

ఇతి శ్రీమార్కండేయ మహాపురాణే బ్రహ్మోత్పత్తిర్నామ ద్విచత్వారింశోఽధ్యాయః ॥42॥

శ్రీ మార్కండేయ మహాపురాణమందలి బ్రహ్మోత్పత్తియను నలుబదిరెండవ అధ్యాయం సమాప్తం.

త్రిచత్వారింశోఽధ్యాయః - నలుబదిమూడవ అధ్యాయం

బ్రహ్మాయుఃప్రమాణకథనమ్ - బ్రహ్మాయుర్దాయప్రమాణకథనం

క్రౌష్టుకిరువాచ - క్రౌష్టుకి చెప్పాడు.

భగవంస్త్వణ్డసంభూతిర్యథావత్కథితా మమ ।
బ్రహ్మాణ్డే బ్రహ్మణో జన్మ తథా చోక్తం మహాత్మనః ॥1॥

ఓ పూజ్యుడా! యథాప్రకారముగా అండము ఎట్లు పుట్టుచున్నదో, ఆ బ్రహ్మాండమందు మహాత్ముడగు బ్రహ్మ ఎట్లు పుట్టుచున్నాడో వర్ణించి చెప్పితివి.

ఏతదిచ్ఛామ్యహం శ్రోతుం త్వత్తో భృగుకులోద్భవ ।
యదా న సృష్టిర్భూతానామస్తి కిం ను న చాస్తి వా ॥

కాలే వై ప్రలయస్యాన్తే సర్వస్మిన్నుపసంహృతే ॥2॥

భృగుకులమందు జన్మించిన ఓ మార్కండేయమహర్షీ! ప్రళయకాలమందు ఈ సమస్తజగత్తు ఉపసంహరింపబడగా అనగా నశించగా, సృష్టిలేని ఆ కాలమందు ఏమైనా ఉన్నదా? లేదా? ఈ విషయమును నీ ద్వారా వినవలెనని కోరుకొనుచున్నాను.

మార్కండేయ ఉవాచ - మార్కండేయుడు చెప్పాడు.

యదా తు ప్రకృతౌ యాతి లయం విశ్వమిదం జగత్ ।
తదోచ్యతే ప్రాకృతోఽయం విద్వద్భిః ప్రతిసంచరః ॥3॥

ఎప్పుడయితే ఈ ప్రపంచమంతయు తనకు కారణభూతమైన ప్రకృతియందు లీనమగునో అప్పుడు ఈ ప్రపంచమునకు ప్రళయము జరిగినదని విద్వాంసులు చెప్పుచున్నారు.

స్వాత్మన్యవస్థితేఽవ్యక్తే వికారే ప్రతిసంహృతే ।
ప్రకృతిః పురుషశ్చైవ సాధర్మ్యేణావతిష్ఠతః ॥4॥

వికారస్వరూపమైన ఈ ప్రపంచమంతయు ప్రళయముచెందగా, అవ్యక్తమగు ప్రకృతి ఎట్టి కార్యములను పుట్టించనందున స్వస్వరూపమందు అవస్థితమగును. ఆ సమయమందు ప్రకృతి, పురుషుడు ఈ ఇరువురు సాధర్మ్యముతో అనగా ఒకేవిధముగా ఉండెదరు. (ప్రళయకాలమందు ప్రకృతికి కర్తృత్వముండదు. అందువలన సహజముగానే కర్తృత్వము లేని పురుషునితో సమానముగా ప్రకృతి కూడా ఉండునని భావము.)

తదా తమశ్చ సత్త్వం చ సమత్వేన గుణౌ స్థితౌ ।
అనుద్రిక్తావనూనౌ చ ఓతప్రోతౌ పరస్పరమ్ ॥5॥

ఆ సమయమందు అనగా ప్రళయకాలమందు సత్త్వగుణము, తమోగుణము ఉద్రేకము చెందక, న్యూనత్వము చెందక పరస్పరము ఓతప్రోతభావము చెంది సమస్థితిని కలిగియుండును. (రజోగుణము ప్రవృత్తిని కల్గించునది

కావున దానినిచ్చట ఉదాహరించలేదు.) ఉద్రేకము చెందుట అనగా వృద్ధి చెందుట అని అర్థము. న్యూనత్వము అనగా అణచబడుట అని అర్థము. ప్రళయకాలమందు సత్త్వతమోగుణములకు ఆ రెండు స్వభావములు ఉండవు. ఓతప్రోతభావము చెందుట అనగా నిలువుగానూ అడ్డంగానూ దారాలు నేయబడుట అని అర్థము. ఆ విధముగానే సత్త్వతమోగుణములు కూడా ఉండునని ఆశయము.

తిలేషు వా యథా తైలం ఘృతం పయసి వా స్థితమ్ ।
తథా తమసి సత్త్వే చ రజోఽప్యనుసృతం స్థితమ్ ॥6॥

తిలలయందు నూనె, పాలయందు నెయ్యి ఉన్నట్లే సత్త్వము, తమోగుణములందు రజోగుణము వాటిననుసరించి ఉన్నది.

ఉత్పత్తిర్బ్రహ్మణో యావదాయుర్వై ద్విపరార్థికమ్ ।
తావద్దినం పరేశస్య తత్సమా సంయమే నిశా ॥

బ్రహ్మయొక్క ఆయుఃపరిమాణము రెండు పరార్ధముల కాలము. సృష్టికారకుడగు బ్రహ్మకు పగలు ఆ ఆయుర్దాయపరిమాణము గలది. రాత్రి కూడా అంతే పరిమాణము గలది.

అష్టౌ యుగసహస్రాణి అహోరాత్రం ప్రజాపతేః ।
అనేనైవ తు మానేన శతం బ్రహ్మా స జీవతి ॥

ఎనిమిది యుగసహస్రములు ప్రజాపతిబ్రహ్మకు రాత్రింబవళ్ళు. ఈ పరిమాణముతోనే బ్రహ్మ నూరు సంవత్సరములు జీవించును.

పితామహశతేనైవ విష్ణోర్మానం విధీయతే ।
నిమేషార్ధేన శంభోస్తు సహస్రాణి చతుర్దశ ॥
వినశ్యన్తి తథా విష్ణోరసంఖ్యాతాః పితామహాః ॥7॥

నూరుగురు బ్రహ్మల ఆయుఃపరిమాణముతో విష్ణువుయొక్క పరిమాణము చెప్పబడుచున్నది. శివునియొక్క అర్ధనిముషకాలమందు పదునాలుగువేల బ్రహ్మలు పుట్టుట గిట్టుట కూడా జరుగును. అట్లే విష్ణువుయొక్క అర్ధనిముషకాలమందు కూడా. ఈ విధముగా సృష్టికర్తలగు బ్రహ్మలు లెక్కలేనన్నివారు.

అహర్ముఖే ప్రబుద్ధస్తు జగదాదిరనాదిమాన్ ।
సర్వహేతురచింత్యాత్మా పరః కోఽప్యపరక్రియః ॥8॥

పగలు మెలకువగా ఉన్న ఆ కార్యబ్రహ్మ జగత్తుకు ఆదిభూతుడు. ఇతని కంటే ముందు ఎవరూ లేరు. ఇతడు సమస్తమునకు కారణము. విచారింపతగినవాడు కాదు. జీవులందరికంటే ఉత్కృష్టుడు, ఇతరుల పనులను నెరవేర్చువాడు. కార్యబ్రహ్మ ఆదిపురుషుడు గావున ఇతడి గురించి విచారించవలసిన పని లేదని భావము.

ప్రకృతిం పురుషం చైవ ప్రవిశ్యాశు జగత్పతిః ।
క్షోభయామాస యోగేన పరేణ పరమేశ్వరః ॥9॥

జగత్ప్రభువగు పరమేశ్వరుడు ప్రకృతిపురుషులయందు ప్రవేశించి గొప్పదియగు యోగముతో వారిని క్షోభపెట్టసాగెను. క్షోభపెట్టుటయనగా అల్లకల్లోలము చేయుటయని అర్థము.

యథా మదో నవస్త్రీణాం యథా వా మాధవానిలః ।
అనుప్రవిష్టః క్షోభాయ తథాసౌ యోగమూర్తిమాన్ ॥10॥

ఏ విధముగా అయితే మదము, వసంతవాయువు నవయువతులందు ప్రవేశించి వారిని క్షోభపెట్టునో (మనస్సును వ్యాకులపరచునో) అట్లే యోగస్వరూపుడగు పరమేశ్వరుడు కూడా ప్రకృతిపురుషులలో ప్రవేశించి వారిని వ్యాకులపరచును.

ప్రధానే క్షోభ్యమాణే తు స దేవో బ్రహ్మసంజ్ఞితః ।
సముత్పన్నోఽణ్డకోశస్థో యథా తే కథితం మయా ॥11॥

ప్రధానము క్షోభింపబడగా అనగా వ్యాకులపరుపబడగా ఆ పరమేశ్వరుడు బ్రహ్మయనుపేరుతో అండకోశమందుండి పుట్టుచున్నాడు. ఈ వృత్తాంతమును నీకు నేను చెప్పితిని.

స ఏవ క్షోభకః పూర్వం స క్షోభ్యః ప్రకృతేః పతిః ।
స సంకోచవికాసాభ్యాం ప్రధానత్వేఽపి సంస్థితః ॥12॥

అతడే ముందుగా క్షోభపెట్టువాడు అనగా కలతపెట్టువాడు. అతడే ప్రకృతికి ప్రభువై కలతపెట్టబడువాడు కూడా, అతడే సంకోచవికాసములతో ప్రధానముయొక్క స్థితిని పొందుచున్నాడు.

ఉత్పన్నః స జగద్యోనిరగుణోఽపి రజోగుణమ్ ।
భుఞ్జన్ ప్రవర్తతే సర్గే బ్రహ్మత్వం సముపాశ్రితః ॥13॥

జగత్తుకు కారణభూతుడయిన ఆ పరమేశ్వరుడు గుణరహితుడైననూ రజోగుణమును అవలంబించి బ్రహ్మభావమును పొంది సృష్టి చేయుటకు ప్రవర్తించుచున్నాడు.

బ్రహ్మత్వే స ప్రజాః సృష్ట్వా తతస్సత్త్వాతిరేకవాన్ ।
విష్ణుత్వమేత్య ధర్మేణ కురుతే పరిపాలనమ్ ॥14॥

ఆ పరమాత్మ బ్రహ్మభావమును పొంది ప్రజలను సృష్టించి, అటుపిమ్మట సత్త్వగుణము అధికముగా పొంది విష్ణురూపమును ధరించి ధర్మబద్ధముగా లోకపరిపాలన చేయును.

తతస్తమోగుణోద్రిక్తో రుద్రత్వే చాఖిలం జగత్ ।
ఉపసంహృత్య వై శేతే త్రైలోక్యం త్రిగుణోఽగుణః ॥15॥

అనంతరము తమోగుణము అధికమగుటచే ఆ పరమాత్మ రుద్రస్వరూపమును పొంది సమస్త ప్రపంచమును నశింపచేసి ముల్లోకములందు శయనించును. ఈ విధముగా నిర్గుణస్వరూపుడైననూ, సత్త్వరజస్తమోగుణములను భజించెను.

యథా ప్రాగ్వ్యాపకః క్షేత్రీ పాలకో లావకస్తథా ।
తథా స సంజ్ఞామాప్నోతి బ్రహ్మవిష్ణుహరాత్మికామ్ ॥16॥

ఏ విధముగా అయితే ముందుగా సర్వవ్యాపియై ఆ పరమాత్మ ప్రపంచమును సృజించి, పరిపాలించి, నశింపచేసినందున, ఆవిధముగానే వరుసగా బ్రహ్మవిష్ణుమహేశ్వరులను పేర్లను పొందెను.

బ్రహ్మత్వే సృజతే లోకాన్ రుద్రత్వే సంహరత్యపి ।
విష్ణుత్వే చాప్యుదాసీనస్తిస్రోऽవస్థాః స్వయంభువః ॥17॥

ఆ పరమాత్మ బ్రహ్మత్వధర్మమును పొంది లోకములను సృష్టించుచున్నాడు, రుద్రత్వమను ధర్మమును పొంది సంహారము చేయుచున్నాడు, విష్ణుత్వమను ధర్మమును పొంది ఉదాసీనుడై లోకరక్షణ గావించుచున్నాడు. ఈ విధముగా స్వయంభూ అగు పరమాత్మకు మూడు అవస్థలు సంభవించినవి.

రజో బ్రహ్మా తమో రుద్రో విష్ణుః సత్త్వం జగత్పతిః ।
ఏత ఏవ త్రయో దేవా ఏత ఏవ త్రయో గుణాః ॥18॥

జగత్ప్రభువగు ఆ పరమాత్మ రజోగుణుడై బ్రహ్మగాను, తమోగుణుడై రుద్రుడిగాను, సత్త్వగుణుడై విష్ణువుగాను వ్యవహరింపబడుచున్నారు. ఈ ముగ్గురే దేవుళ్ళు, ఈ మూడే గుణాలు.

అన్యోన్యమిథునా హ్యేతే అన్యోన్యాశ్రయిణస్తథా ।
క్షణం వియోగో న హ్యేషాం న త్యజన్తి పరస్పరమ్ ॥19॥

ఈ మూడుగుణములు పరస్పరము ఒకదానిని మరొకటి అపేక్షిస్తూ, ఆశ్రయిస్తూ ఉంటాయి. క్షణకాలము కూడా వీటికి మరొకదానితో వియోగము ఉండదు. ఒకదానిని మరొకటి విడిచిపెట్టదు.

ఏవం బ్రహ్మా జగత్పూర్వో దేవదేవశ్చతుర్ముఖః ।
రజోగుణం సమాశ్రిత్య స్రష్టృత్వే స వ్యవస్థితః ॥20॥

ఈ విధముగా దేవదేవుడు, చతుర్ముఖుడూ అగు ఆ పరబ్రహ్మ ప్రపంచసృష్టికి ముందే అవస్థితుడై, రజోగుణమును ఆశ్రయించి ప్రపంచమునకు స్రష్ట అయ్యెను.

హిరణ్యగర్భో దేవాదిరనాదిరుపచారతః ।
భూపద్మకర్ణికాసంస్థో బ్రహ్మాగ్రే సమజాయత ॥21॥

బ్రహ్మవిష్ణుమహేశ్వరులు ముగ్గురు దేవుళ్ళలో హిరణ్యగర్భుడను బ్రహ్మ మొదటివాడు. ఇతడు కూడా అండమునుండి పుట్టినందున, ఇతనియందు అనాదియను వ్యవహారము అనగా పుట్టుకలేనివాడని వ్యవహారము గౌణమే గాని ముఖ్యము కాదు. భూపద్మకర్ణికయందున్నవాడై ఆ హిరణ్యగర్భుడు సృష్టిప్రారంభమందు ముందుగా పుట్టెను.

తస్య వర్షశతం త్వేకం పరమాయుర్మహాత్మనః ।
బ్రాహ్మేణైవ హి మానేన తస్య సంఖ్యాం నిబోధ మే ॥22॥

మహాత్ముడగు ఆ హిరణ్యగర్భుని ఆయుర్దాయము బ్రాహ్మీమానముచే నూరు సంవత్సరములు. వాని సంఖ్యను చెప్పెదను, తెలుసుకొనుము.

నిమేషైర్దశభిః కాష్ఠా తథా పఞ్చభిరుచ్యతే ।
కలాస్త్రింశచ్చ వై కాష్ఠా ముహూర్తం త్రింశదేవ తాః ॥23॥

పదిహేను నిమేషముల కాలము కాష్ఠయనబడును. (కనురెప్పకాలము నిమేషము). ముప్పది కాష్ఠముల కాలము ఒక కళ. ముప్పది కళలు ఒక ముహూర్తము.

అహోరాత్రం ముహూర్తానాం నృణాం త్రింశత్తు వై స్మృతమ్ ।
అహోరాత్రైశ్చ త్రింశద్భిః పక్షౌ ద్వౌ మాస ఉచ్యతే ॥24॥

మానవులకు ముప్పై ముహూర్తముల కాలము ఒకరాత్రి, ఒక పగలుగా అనగా ఒకరోజుగా చెప్పబడినది. ముప్పై అహోరాత్రములు (రోజులు) రెండు పక్షములనిగాని లేదా ఒక నెలయనిగాని చెప్పబడుచున్నది.

తైః షడ్భిరయనం వర్షం ద్వేఽయనే దక్షిణోత్తరే ।
తద్దేవానామహోరాత్రం దినం తత్రోత్తరాయణమ్ ॥25॥

ఆరు నెలలు ఒక అయనమని చెప్పబడుచున్నది. దక్షిణాయనము, ఉత్తరాయణము అని అయనములు రెండుగా చెప్పబడుచున్నవి. ఈవిధముగా మానవునకు ఒక సంవత్సరకాలం దేవతలకు ఒక అహోరాత్రమౌతుంది. అందులో ఉత్తరాయణం దేవతలకు ఒక పగలు అవుతుంది.

దివ్యైర్వర్షసహస్రైస్తు కృతత్రేతాదిసంజ్ఞితామ్ ।
చతుర్యుగం ద్వాదశభిస్తద్విభాగం శృణుష్వ మే ॥26॥

పన్నెండువేల దివ్యసంవత్సరాల పరిమాణముచే కృతయుగము, త్రేతాయుగము మొదలగు పేర్లు కలిగిన నాలుగు యుగముల విభాగమును చెప్పెదను, వినుము.

చత్వారి తు సహస్రాణి వర్షాణాం కృతముచ్యతే ।
శతాని సంధ్యా చత్వారి సంధ్యాంశశ్చ తథావిధః ॥27॥

నాలుగువేల దివ్య సంవత్సరాలు కృతయుగమని చెప్పబడుచున్నది. దానికి నాలుగువందల సంవత్సరాలు సంధ్య, నాలుగువందల సంవత్సరాలు సంధ్యాంశము అగును.

త్రేతా త్రీణి సహస్రాణి దివ్యాబ్దానాం శతత్రయమ్ ।
తస్య సంధ్యా సమాఖ్యాతా సంధ్యాంశశ్చ తథావిధః ॥28॥

మూడువేల దివ్య సంవత్సరాలు త్రేతాయుగమని చెప్పబడుచున్నది. మూడువందల సంవత్సరాలు దానికి సంధ్య, అట్లే సంధ్యాంశము కూడా మూడువందల సంవత్సరాలు.

ద్వాపరం ద్వే సహస్రే తు వర్షాణాం ద్వే శతే తథా ।
తస్య సంధ్యా సమాఖ్యాతా సంధ్యాంశశ్చ తథావిధః ॥29॥

రెండువేల దివ్యసంవత్సరాలు ద్వాపరయుగమని చెప్పబడుచున్నది. దానికి రెండువందల సంవత్సరాలు సంధ్య, అట్లే సంధ్యాంశము కూడా రెండువందల సంవత్సరాలు.

కలిః సహస్రం దివ్యానామబ్దానాం ద్విజసత్తమ ।
సంధ్యా సంధ్యాంశకశ్చైవ శతకౌ సముదాహృతౌ ॥30॥

ఓ ద్విజశ్రేష్ఠుడా ! ఒక వేయి దివ్యసంవత్సరాలు కలియుగమని చెప్పబడుచున్నది. దానికి ఒక వంద సంవత్సరాలు సంధ్య. అట్లే సంధ్యాంశము కూడా ఒక వంద సంవత్సరాలు.

ఏషా ద్వాదశసాహస్రీ యుగాఖ్యా కవిభిః కృతా ।
ఏతత్సహస్రగుణితమహో బ్రాహ్మముదాహృతమ్ ॥31॥

ఈ విధముగా కవులు నాలుగు యుగముల పరిమాణమును పన్నెండువేల దివ్య సంవత్సరాలుగా చెప్పిరి. (యుగాల పరిమాణము పదివేల దివ్య సంవత్సరాలు, యుగాల సంధ్యా, సంధ్యాంశాల పరిమాణము రెండువేల దివ్య సంవత్సరాలు. మొత్తం పన్నెండువేల దివ్యసంవత్సరాలు.) దీనికి వెయ్యిరెట్లు సంవత్సరాలు బ్రహ్మకు ఒక రోజు.

బ్రహ్మణో దివసే బ్రహ్మన్మనవః స్యుశ్చతుర్దశ ।
భవంతి భాగశస్తేషాం సహస్రం తద్విభజ్యతే ॥32॥

ఓ బ్రహ్మస్వరూపుడా ! బ్రహ్మయొక్క ఆ ఒక్కరోజునందు పదునాలుగురు మనువులు పుట్టెదరు. పూర్వము చెప్పిన ఆ వేయి భాగాలుగా ఆ పదునాలుగురు మనువులకు విభజింపబడుతుంది.

దేవాస్సప్తర్షయః సేంద్రా మనుస్తత్సూనవో నృపాః ।
మనునా సహ సృజ్యన్తే సంహ్రియన్తే చ పూర్వవత్ ॥33॥

ఇంద్రాదిదేవతలు, సప్తర్షులు, మనువు, అతడి పుత్రులగు రాజులు మనువుతోబాటు సృష్టింపబడుచున్నారు. అట్లే పూర్వము వలే వారు సంహరింపబడుచున్నారు కూడా.

చతుర్యుగానాం సంఖ్యాతా సాధికా హ్యేకసప్తతిః ।
మన్వంతరం తస్య సంఖ్యాం మానుషాబ్దైర్నిబోధ మే ॥34॥

డెబ్భైఒక పర్యాయములు నాలుగు యుగాలు పూర్తి అయిన కాలము ఒక మన్వంతరమని చెప్పబడుచున్నది. దాని సంఖ్యను మానుష సంవత్సరాలలో చెప్పెదను, వినుము.

త్రింశత్కోట్యస్తు సంపూర్ణాః సంఖ్యాతా సంఖ్యయా ద్విజ ।
సప్తషష్టిస్తథాన్యాని నియుతాని చ సంఖ్యయా ॥35॥

వింశతిశ్చ సహస్రాణి కాలోఽయం సాధికం వినా ।
ఏతన్మన్వంతరం ప్రోక్తం దివ్యైర్వర్షైర్నిబోధ మే ॥36॥

ముప్పైకోట్ల, అరవైఏడులక్షల, ఇరవైవేల మానుషసంవత్సరాలే ఒక మన్వంతరము యొక్క పరిమాణము. ఇందు ఆధిక్యమేమీ లేదు. ఈ విధముగా మన్వంతరముయొక్క కాలపరిమాణము మానుషసంవత్సరాలలో నీకు చెప్పబడినది. ఇక దివ్యసంవత్సరాలలో దీని పరిమాణము చెప్పెదను, వినుము.

అష్టౌ శతసహస్రాణి దివ్యయా సంఖ్యయా యుతమ్ ।
ద్విపంచాశత్తథాన్యాని సహస్రాణ్యధికాని తు ॥37॥

చతుర్దశగుణో హ్యేష కాలో బ్రాహ్మమహః స్మృతమ్ ।
తస్యాన్తే ప్రలయః ప్రోక్తో బ్రాహ్మో నైమిత్తికో బుధైః ॥38॥

ఎనిమిదివందలవేల దివ్యసంవత్సరములు, ఇంకను ఏభైరెండు వేల దివ్య వర్షములు అధికముగాను ఎంతకాలమో అనగా ఎనిమిది లక్షల ఏభైరెండువేల దివ్యసంవత్సరములు ఒక మన్వంతరకాలపరిమాణము. (నాలుగు యుగాల కాలపరిమాణం మానుషసంవత్సరాలలో 43,20,000 మానుషసంవత్సరాలు. దీనికి 71 రెట్లు అనగా 30,67,20,000 మానుషసంవత్సరాలు ఒక మన్వంతరకాలపరిమాణం. ఇక నాలుగు యుగాల కాలపరిమాణం దివ్యసంవత్సరాలలో 12,000 దివ్యసంవత్సరాలు. దీనికి 71 రెట్లు అనగా 8,52,000 దివ్య సంవత్సరాలు ఒక మన్వంతర కాలపరిమాణం.) దానికి అనగా అట్టి రెండు విధాలైన మన్వంతరానికి పదునాలుగు రెట్ల పరిమాణము కలిగిన కాలము బ్రహ్మకు పగటిదినము. పగలు పూర్తి అయిన పిమ్మట, అదే పరిమాణము కలిగిన కాలము ఆయా జీవుల నిమిత్తానుసారముగా ఏర్పడు ప్రళయముగా పండితులచే చెప్పబడినది. అదే బ్రహ్మకు రాత్రియనగా.

భూర్లోకోఽథ భువర్లోకః స్వర్లోకస్తన్నివాసినః ।
తదా వినాశమాయాన్తి మహర్లోకశ్చ తిష్ఠతి ॥39॥

తద్వాసినోఽపి తాపేన జనలోకం ప్రయాన్తి వై ।
ఏకార్ణవే చ త్రైలోక్యే బ్రహ్మా స్వపితి వై నిశి ॥40॥

భూర్లోకము, భువర్లోకము, స్వర్గలోకము మరియు ఆ మూడులోకాలలో నివసించేవారు అందరూ ప్రళయకాలమందు వినాశము చెందెదరు. మహర్లోకము మాత్రము అట్లే ఉండును. మహర్లోక నివాసులు తాపము (వేడిల) కారణముగా అచ్చట ఉండలేక జనలోకమునకు వెళ్ళెదరు. ఈ విధముగా ముల్లోకములు ప్రళయము చెంది ఒక సముద్రాకారముగా పరిణమించగా రాత్రిభాగమందు బ్రహ్మ నిద్రించును.

తత్ప్రమాణైవ సా రాత్రిస్తదన్తే సృజ్యతే పునః ।
ఏవం తు బ్రహ్మణో వర్షమేకం వర్షశతం తు తత్ ॥41॥

బ్రహ్మకు పగలు ఎంత కాలప్రమాణముగలదో అంతే ప్రమాణము (అనగా పరిమాణము) కలది రాత్రి కూడా. రాత్రి గడచిన పిమ్మట తిరిగి సృష్టికార్యము ఆరంభమగును. ఈ విధముగా బ్రహ్మయొక్క ఒక సంవత్సరము గడచును. ఇట్లు వందసంవత్సరముల కాలము బ్రహ్మయొక్క ఆయుర్దాయము.

శతం హి తస్య వర్షాణాం పరమిత్యభిధీయతే ।
పఞ్చాశద్భిస్తథా వర్షైః పరార్ధమితి కీర్త్యతే ॥42॥

ఏకమస్య పరార్ధం తు వ్యతీతం ద్విజసత్తమ ।
యస్యాన్తేఽభూన్మహాకల్పః పాద్మ ఇత్యభివిశ్రుతః ॥43॥

ద్వితీయస్య పరార్ధస్య వర్తమానస్య వై ద్విజ ।
వారాహ ఇతి కల్పోఽయం ప్రథమః పరికల్పితః ॥44॥

ఓ బ్రాహ్మణశ్రేష్ఠుడా ! బ్రహ్మయొక్క ఆయుర్దాయము నూరు సంవత్సరములు పరమని చెప్పబడును. ఆ నూరులో ఏభై సంవత్సరములు ఒక పరార్ధమని చెప్పబడుచున్నది. ఈ విధముగా బ్రహ్మయొక్క ఒక పరార్ధము గడచిపోయినది. దాని చివర పాద్మమను పేరుగల మహాకల్పము ఉపస్థితమైనది. ఓ బ్రాహ్మణుడా ! ప్రస్తుతము రెండవ పరార్ధము జరుగుచున్నది. దీనికే వారాహకల్పమని పేరు ఇదే ప్రథమకల్పముగా కల్పింపబడినది.

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే బ్రహ్మాయుఃప్రమాణకథనం నామ త్రిచత్వారింశోఽధ్యాయః ॥43॥

శ్రీ మార్కండేయ మహాపురాణమందలి బ్రహ్మాయుర్దాయప్రమాణకథనమను నలుబదిమూడవ అధ్యాయం సమాప్తం.



చతుశ్చత్వారింశోఽధ్యాయః - నలుబదినాల్గవ అధ్యాయం
ప్రాకృతవైకృతసర్గవర్ణనమ్ - ప్రాకృతవైకృతసృష్టివర్ణనం

క్రౌష్టుకిరువాచ - క్రౌష్టుకి చెప్పాడు.

యథా ససర్జ వై బ్రహ్మా భగవానాదికృత్ప్రజాః ।
ప్రజాపతిః పతిర్దేవస్తన్మే విస్తరతో వద ॥1॥

భగవత్స్వరూపుడు, ఆదికర్త, ప్రజాపతి, ప్రభువు, దేవుడు అగు బ్రహ్మ ఏ విధముగా ప్రజలను ఉత్పన్నము చేసెనో విస్తరముగా చెప్పుము.

మార్కండేయ ఉవాచ - మార్కండేయుడు చెప్పాడు.

కథయామ్యేష తే బ్రహ్మన్ ససర్జ భగవాన్యథా ।
లోకకృచ్ఛాశ్వతః కృత్స్నం జగత్ స్థావరజంగమమ్ ॥2॥

ఓ బ్రహ్మస్వరూపుడా ! లోకసృష్టికారకుడు, శాశ్వతుడు, భగవత్స్వరూపుడూ అగు బ్రహ్మదేవుడు ఈ సమస్త స్థావరజంగమాత్మక ప్రపంచమును ఎట్లు సృష్టించెనో చెప్పెదను, వినుము.

పాద్మాఽవసానసమయే నిశాసుప్తోత్థితః ప్రభుః ।
సత్త్వోద్రిక్తస్తదా బ్రహ్మా శూన్యం లోకమవైక్షత ॥3॥

పాద్మమను కల్పముయొక్క అవసానసమయమందు ఉద్రిక్తమైన (అనగా మిగతా రెండు గుణములు అణచివేయబడి సత్త్వగుణము అధికముగాగలదని అర్థము) సత్త్వగుణముగల ప్రభువగు బ్రహ్మ రాత్రియందు నిద్రించి, నిద్రలేచి శూన్యముగా ఉన్న ఈ లోకమును చూచెను.

ఇమం చోదాహరన్త్యత్ర శ్లోకం నారాయణం ప్రతి ।
బ్రహ్మస్వరూపిణం దేవం జగతః ప్రభవాప్యయమ్ ॥4॥

బ్రహ్మస్వరూపుడు, దేవుడు, జగత్తుయొక్క ఉత్పత్తిప్రళయములకు కారణభూతుడూ అగు నారాయణుని గూర్చి మానవులు ఈ శ్లోకమును చెప్పుచున్నారు.

ఆపో నారా ఇతి ప్రోక్తా ఆపో వై నరసూనవః ।
తాసు శేతే స యస్మాచ్చ తేన నారాయణః స్మృతః ॥5॥

జలములు నారములని చెప్పబడుచున్నవి. జలములు నరసంతానము. ఎవరు వాటియందు శయనించునో అతడు నారాయణుడని చెప్పబడుచున్నాడు.

విబుద్ధః సలిలే తస్మిన్విధాయాన్తర్గతాం మహీమ్ ।
అనుమానాత్సముద్ధారం కర్తుకామస్తదా క్షితేః ॥6॥

అకరోత్స తనూరన్యాః కల్పాదిషు యథా పురా ।
మత్స్యకూర్మాదికాస్తద్వద్వారాహం వపురాస్థితః ॥7॥

వేదయజ్ఞమయం దివ్యం వేదయజ్ఞమయో విభుః ।
రూపం కృత్వా వివేశాప్సు సర్వగః సర్వసంభవః ॥8॥

నారాయణుడు మేల్కొని ఆ జలమందు పృథివి (భూమి) మునిగియున్నదని తెలుసుకొని, ఆ పృథివిని పైకి ఉద్ధరించవలెనని కోరికతో పూర్వకల్పాలలో మత్స్యకూర్మాది శరీరములను ధరించినట్లుగా, ఈ కల్పంలో వారాహశరీరమును (వరాహమనగా పంది) ధరించెను. పిమ్మట వేదయజ్ఞస్వరూపుడూ, విభుడూ, సర్వవ్యాపకుడూ, సర్వసంభవుడూ అగు ఆ నారాయణుడు వేదయజ్ఞస్వరూపమైన దివ్యరూపమును ధరించి నీటిలో ప్రవేశించెను.

సముద్ధృత్య చ పాతాలాన్ముమోచ సలిలే భువమ్ ।
జనలోకస్థితైః సిద్ధైశ్చింతమానో జగత్పతిః ॥9॥

జనలోకమందున్న సిద్ధులచే కీర్తింపబడుతుండగా జగత్ప్రభువగు ఆ నారాయణుడు పాతాళలోకమునుండి భూమిని పైకి లేవనెత్తి నీటియందు విడిచిపెట్టెను.

తస్యోపరి జలౌఘస్య మహతీ నౌరివ స్థితా ।
విస్తృతత్వాత్తు దేహస్య న మహీ యాతి సంప్లవమ్ ॥10॥

ఆ నీటిమీద భూమి జలప్రవాహమందున్న గొప్ప నావవలే ఉండెను. భూమియొక్క శరీరము విస్తృతమగుటచే ఆ భూమి నీటిలో మునిగిపోలేదు.

తతః క్షితిం సమీకృత్య పృథివ్యాం సోఽసృజద్గిరీన్ ।
ప్రాక్సర్గే దహ్యమానే తు సదా సంవర్తకాగ్నినా ॥11॥

తేనాగ్నినా విశీర్ణాస్తే పర్వతా భువి సర్వశః ।
శైలా ఏకార్ణవే మగ్నా వాయునాపస్తు సంహతాః ॥12॥

నిషక్తా యత్ర యత్రాసంస్తత్ర తత్రాచలాభవన్ ।

అటుపిమ్మట నారాయణుడు భూమిని సమానముగా చేసి, దాని మీద పర్వతాలను సృష్టించెను. ప్రళయాగ్నిచేత పూర్వపు సృష్టి అంతా దహింపబడగా భూమిపై ఉన్న సమస్త పర్వతాలు బూడిద కాబడి సముద్రమందు మునిగిపోయినవి. ఆ సముద్రజలములన్నీ వాయువుచేత చెల్లాచెదరు చేయబడినవి. ఎచ్చటెచ్చట అయితే ఆ పర్వతాలు మునిగిపోయాయో, మరల అచ్చటచ్చటే అవి సృష్టింపబడినవి.

భూవిభాగం తతః కృత్వా సప్తద్వీపోపశోభితమ్ ॥13॥

భూరాద్యాంశ్చతురో లోకాన్ పూర్వవత్సమకల్పయత్ ।
సృష్టిం చిన్తయతస్తస్య కల్పాదిషు యథా పురా ॥14॥

అబుద్ధిపూర్వకస్తస్మాత్ ప్రాదుర్భూతస్తమోమయః ।

పిమ్మట సప్తద్వీపములతో శోభించునట్టి పృథివీవిభాగమును చేసి భూర్లోకము మొదలగు నాలుగు లోకములను పూర్వమువలెనే సృష్టించెను. పూర్వపు కల్పాదులలో చేయబడిన సృష్టిని ఆలోచించుచుండగానే, అతనినుండి అబుద్ధిపూర్వకముగానే (అనగా ఆయా ప్రాణుల కర్మానుసారముగా) తమోమయము అనగా ప్రచురమైన అజ్ఞానమనే అంధకారము ఉద్భవించినది. (ముందుగా అజ్ఞానము పుట్టి ఆ తరువాత అజ్ఞానము వలన ఈ ప్రపంచము ఉద్భవించినదని సిద్ధాంతము).

తమో మోహో మహామోహస్తామిస్రో హ్యన్ధసంజ్ఞితః ॥15॥

అవిద్యా పఞ్చపూర్వైషా ప్రాదుర్భూతా మహాత్మనః ।
పఞ్చధావస్థితః సర్గో ధ్యాయతోఽప్రతిబోధవాన్ ॥16॥

తమస్సు, మోహము, మహామోహము, తామిస్రము, అంధతామిస్రము అను అయిదు విధములైన అవిద్య ఆ మహాత్ముని నుండి పుట్టినది. ఈ విధముగా ధ్యానము చేయుచున్న నారాయణుని నుండి ప్రతిబోధ లేని అనగా చైతన్యరహితమైన సృష్టి అయిదు విధాలుగా ఉన్నది.

బహిరన్తశ్చాప్రకాశః సంవృతాత్మా నగాత్మకః ।
ముఖ్యా నగా యతశ్చోక్తా ముఖ్యసర్గస్తతః స్వయమ్ ॥17॥

చైతన్యములేని ఆ సృష్టి పర్వతస్వరూపమై, స్వరూపము కప్పబడి, చలనము లేక, లోన బయటా కూడా ప్రకాశము లేక ఉన్నది. మొదటిగా ఉత్పన్నమైనందున, ముఖ్యమైన అచేతనమైన ఆ అవిద్యనుండి ముఖ్య సృష్టి జరిగినది. ముఖ్యసృష్టి అనగా మొదటి సృష్టి అని అర్థము.

తం దృష్ట్వాఽసాధకం సర్గమమన్యదపరం పునః ।
తస్యాభిధ్యాయతస్సర్గం తిర్యక్స్రోతో హ్యవర్తత ॥18॥

అసాధకమైన ఆ మొదటి సృష్టిని చూచి, సాధకమైన మరొక సృష్టిని గూర్చి ఆలోచించుచున్న ఆ నారాయణుని వలన తిర్యక్ స్రోతము అనగా పశుపక్ష్యాదుల సృష్టి జరిగినది. (తిర్యక్ స్రోతః ఆహారసంచారః యస్య సః తిర్యక్ స్రోతః పశుపక్ష్యాదిరర్థః).

యస్మాత్తిర్యక్ ప్రవృత్తిస్సా తిర్యక్స్రోతస్తతః స్మృతః ।
పశ్వాదయస్తే విఖ్యాతాస్తమఃప్రాయా హ్యవేదినః ॥19॥

పశుపక్ష్యాదులు తిన్న అన్నం వాటి ఉదరమందు అడ్డముగా సంచరించునందున, పశుపక్ష్యాదులు తిర్యక్స్రోతమని చెప్పబడినది. తమోగుణము ప్రధానముగా కలిగి, జ్ఞానము లేని పశువులు మున్నగునవి తిర్యక్ స్రోతములుగా ప్రసిద్ధి చెందినవి.

ఉత్పథగ్రాహిణశ్చైవ తేఽజ్ఞానే జ్ఞానమానినః ।
అహంకృతా అహంమానా అష్టావింశద్విధాత్మకాః ॥20॥

అజ్ఞానమువలన సక్రమముకాని మార్గమందు నడచునట్టి ఆ పశుపక్ష్యాదులు "అహమ్" అను దేహాత్మబుద్ధి కలిగియున్నవి. అవి ఇరవైఎనిమిది విధములు.

అన్తఃప్రకాశాస్తే సర్వే ఆవృతాస్తు పరస్పరమ్ ।
తమప్యసాధకం మత్వా ధ్యాయతోఽన్యస్తతోఽభవత్ ॥21॥

తిర్యక్స్రోతములగు ఆ పశుపక్ష్యాదులు అన్నియు లోపల జ్ఞానప్రకాశముగలవై, అజ్ఞానావృతములైయున్నవి. రెండవదియగు ఆ తిర్యక్స్రోతముల సృష్టిని గూర్చి కూడా అసాధకముగా తలచి ధ్యానించుచుండగా, ఆ నారాయణుని నుండి మరొక సృష్టి ఉద్భవించెను.

ఊర్ధ్వస్రోతస్తృతీయస్తు సాత్త్వికోర్ధ్వమవర్తత ।
తే సుఖప్రీతిబహులా బహిరన్తస్త్వనావృతాః ॥22॥

ఆ మూడవసృష్టియే ఊర్ధ్వస్రోతమని చెప్పబడుచున్నది. ఈ సృష్టిలో సత్త్వగుణము ప్రధానముగా గలవారు ఉన్నతమైన స్థాయియందు ఉండెదరు. వారు మిక్కిలి సుఖసంతోషములు కలవారై లోన, బయటా కూడా అంధకారముతో ఆవరింపబడక ఉండెదరు.

ప్రకాశా బహిరన్తశ్చ ఊర్ధ్వస్రోతః సముద్భవాః ।
తుష్టాత్మనస్తృతీయస్తు దేవసర్గో హి స స్మృతః ॥23॥

ఊర్ధ్వస్రోతస్సనెడు ఈ ఉత్తమసృష్టినుండి ఉద్భవించినవారు లోనా, బయటా కూడా ప్రకాశము కలిగినవారైయున్నారు. సంతృప్తిచెందిన పరమాత్మనుండి ఉద్భవించిన ఈ మూడవ సృష్టి దేవసర్గము లేదా దేవసృష్టియని స్మరింపబడినది.

తస్మిన్ సర్గేఽభవత్ ప్రీతిర్నిష్పన్నే బ్రహ్మణస్తదా ।
తతోఽన్యం స తదా దధ్యౌ సాధకం సర్గముత్తమమ్ ॥24॥

ఆ దేవసర్గము ఉత్పన్నముకాగా బ్రహ్మకు సంతసము కలిగెను. అటుపిమ్మట బ్రహ్మ ఉత్తమము, యజ్ఞయాగాది క్రతువులకు సాధకమూ అయిన మరొక సృష్టికొరకు చింతించెను.

తథాభిధ్యాయతస్తస్య సత్యాభిధ్యాయినస్తతః ।
ప్రాదుర్బభౌ తదావ్యక్తాదర్వాక్స్రోతస్తు సాధకః ॥25॥

అట్లు ఆలోచించుచుండగా సత్యమును అభిధ్యానించు ఆ బ్రహ్మద్వారా అవ్యక్తమునుండి సాధకమగు అర్వాక్స్రోతము ఉద్భవించినది. (ఇంద్రియప్రధానము ఈ అర్వాక్స్రోతమను సృష్టి.) (ఊర్ధ్వగామి స్రోతస్సు (రేతస్సు) కలిగిన సృష్టి ఊర్ధ్వస్రోతము. అధోగామి స్రోతస్సు కలిగిన సృష్టి అర్వాక్స్రోతము.) అర్వాక్స్రోతము నాల్గవసృష్టి.

యస్మాదర్వాగ్వ్యవర్తన్త తతోఽర్వాక్ స్రోతసస్తు తే ।
తే చ ప్రకాశబహులాస్తమోద్రిక్తా రజోఽధికాః ॥26॥

సత్యమార్గము కాకుండా తద్భిన్నమార్గమందు నడుచువారు గావున వారు అర్వాక్స్రోతము నుండి ఉద్భవించినారు. వారు సత్త్వరజోగుణములు అధికముగా గలవారై తమోగుణముచే ఉద్రేకింపబడినారు.

తస్మాత్తే దుఃఖబహులా భూయో భూయశ్చ కారిణః ।
ప్రకాశా బహిరన్తశ్చ మనుష్యాః సాధకాశ్చ తే ॥27॥

అందువలన వారు దుఃఖములే అధికముగా గలవారు, ఎల్లప్పుడూ ఏదో ఒక కార్యమును చేయువారు. ఇంకనూ లోనా బయటా కూడా ప్రకాశగుణము కలిగిన అట్టివారు మనుష్యులని కార్యసాధకులని చెప్పబడుచున్నారు.

పఞ్చమోఽనుగ్రహః సర్గః స చతుర్ధా వ్యవస్థితః ।
విపర్యయేణ సిద్ధ్యా చ శాన్త్యా తుష్ట్యా తథైవ చ ॥28॥

నివృత్తం వర్తమానం చ తేఽర్థం జానన్తి పునః ।

అయిదవ సృష్టి అనుగ్రహమను పేరుగలది. ఈ సృష్టి విపర్యయము (భ్రాంతి), సిద్ధి, శాంతి, తుష్టియని నాలుగు విధములుగా ఉన్నది. ఈ సృష్టియందున్నవారు గడచినట్టి, వర్తమానమైనట్టి విషయముల పరిజ్ఞానము గలవారు.

భూతాదికానాం భూతానాం షష్ఠః సర్గః స ఉచ్యతే ॥29॥

తే పరిగ్రాహిణస్సర్వే సంవిభాగరతాస్తథా ।
చోదనాశ్చాప్యశీలాశ్చ జ్ఞేయా భూతాదికాశ్చ తే ॥30॥

భూతాది మరియు భూతముల సృష్టి ఆరవదిగా చెప్పబడుచున్నది. అవియన్నియు పరిగ్రహించు స్వభావము అనగా మరొక కార్యమును పుట్టించు స్వభావము గలవి మరియు పరస్పరసంవిభాగస్వభావము గలవి. వీటిలో భూతాదులు చలన స్వభావము గలవి మరియు ఆప్యశీలముగలవి (ఆప్యశబ్దానికి జలసంబంధము కలవియనిగాని పొందింపబడుట అనిగాని అర్థము). భూతాదియనగా అహంకారతత్త్వము. ఆకాశాది పంచమహాభూతములే భూతములు. (చోదనాః + చ + అపి + ఆశీలాః + చ అని పదచ్ఛేదము).

ప్రథమో మహతః సర్గో విజ్ఞేయో బ్రహ్మణస్తు సః ।
తన్మాత్రాణాం ద్వితీయస్తు భూతసర్గః స ఉచ్యతే ॥31॥

మహత్తత్త్వము యొక్క సృష్టియే మొదటిసృష్టి. అది బ్రహ్మవలన జరిగినదని తెలుసుకొనవలెను. శబ్దతన్మాత్ర మొదలగు పంచతన్మాత్రల సృష్టి రెండవసృష్టి భూతసర్గమని చెప్పబడుచున్నది.

వైకారికస్తృతీయస్తు సర్గశ్చైన్ద్రియకః స్మృతః ।
ఇత్యేష ప్రాకృతః సర్గః సంభూతో బుద్ధిపూర్వకః ॥32॥

వికారముల సృష్టియే మూడవసృష్టిగా చెప్పబడుచున్నది. ఆ వికారములన్నియూ ఇంద్రియగ్రాహ్యములు. ఇదియే ప్రాకృతసర్గము బుద్ధిపూర్వకముగా (ఆయా ఇంద్రియాల వలన పుట్టు జ్ఞానము కల్గినట్టిదై) ఉద్భవించినది.

ముఖ్యః సర్గశ్చతుర్థస్తు ముఖ్యా వై స్థావరాః స్మృతాః ।
తిర్యక్‌స్రోతస్తు యః ప్రోక్తస్తిర్యగ్యోన్యః స పఞ్చమః ॥33॥

నాల్గవసృష్టి ముఖ్యమని పేరుగలది. ఆ సృష్టిలో స్థావరపదార్థములు (చలనములేని పర్వతాదులు) ముఖ్యములు. తిర్యక్‌స్రోతస్సు లేదా తిర్యగ్యోనులు అయిదవ సర్గము.

తథోర్ధ్వస్రోతసాం షష్ఠో దేవసర్గస్తు స స్మృతః ।
తతోఽర్వాక్‌స్రోతసాం సర్గః సప్తమః స తు మానుషః ॥34॥

ఊర్ధ్వస్రోతస్సు ఆరవసృష్టి. ఇదియే దేవసర్గము లేదా దేవతల సృష్టిగా చెప్పబడుచున్నది. అటు తర్వాత అర్వాక్‌స్రోతస్సు ఏడవసృష్టి. ఇది మానవుల సృష్టి.

అష్టమోఽనుగ్రహః సర్గః సాత్త్వికస్తామసశ్చ సః ।
పఞ్చైతే వైకృతాః సర్గాః ప్రాకృతాస్తు త్రయః స్మృతాః ॥35॥

అనుగ్రహము ఎనిమిదవ సృష్టి. ఇది సత్త్వగుణము మరియు తమోగుణము ప్రధానముగా గలది. ఈ అయిదు వైకృతసర్గలు. ప్రాకృతసర్గలు మూడూ ఆరంభమందు చెప్పబడినవి.

ప్రాకృతో వైకృతశ్చైవ కౌమారో నవమః స్మృతః ।
ఇత్యేతే వై సమాఖ్యాతా నవ సర్గాః ప్రజాపతేః ॥36॥

ప్రాకృతా వైకృతాశ్చైవ జగతో మూలహేతవః ।
సృజతో జగదీశస్య కిమన్యచ్ఛ్రోతుమిచ్ఛసి ॥37॥

ప్రాకృతము, వైకృతము ఈ రెండూ తొమ్మిదవసర్గముగా చెప్పబడినవి. ఈ విధముగా తొమ్మిది సర్గలు ప్రజాపతివలన ఉద్భవించినవి. ఈ ప్రాకృతవైకృత సృష్టులే జగత్తుకు మూలకారణములు. జగత్ప్రభువు వీటి ఉత్పత్తికి కారణము. ఇంకను ఏమి వినవలెనని కోరుకొనుకొంటివి?

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే ప్రాకృతవైకృతసర్గవర్ణనం నామ చతుశ్చత్వారింశోఽధ్యాయః ॥44॥

శ్రీ మార్కండేయ మహాపురాణమందలి ప్రాకృతవైకృతసర్గవర్ణనమను నలుబదినాల్గవ అధ్యాయం సమాప్తం.



పఞ్చచత్వారింశోఽధ్యాయః - నలుబదిఐదవ అధ్యాయం
సృష్టిప్రకరణమ్ - సృష్టిప్రకరణం

క్రౌష్టుకిరువాచ - క్రౌష్టుకి చెప్పాడు.

సమాసాత్ కథితా సృష్టిః సమ్యగ్భగవతా మమ ।
దేవాదీనాం భవం బ్రహ్మన్విస్తరాత్తు బ్రవీహి మే ॥1॥

ఓ బ్రహ్మస్వరూపుడా ! పూజ్యుడవగు నీవు సంక్షిప్తముగా సృష్టిని గూర్చి చెప్పితివి. విస్తారముగా దేవతలు మున్నగువారి జన్మను గూర్చి చెప్పుము.

మార్కండేయ ఉవాచ - మార్కండేయుడు చెప్పాడు.

కుశలాకుశలైర్బ్రహ్మన్భావితాః పూర్వకర్మభిః ।
ఖ్యాత్యా తయా హ్యనిర్ముక్తాః ప్రళయే హ్యుపసంహృతాః ॥2॥

ఓ బ్రహ్మస్వరూపుడా! పూర్వము ఆచరించిన పుణ్యపాపకర్మల వలననే ప్రాణులకు తిరిగి జన్మ అనగా పుట్టుక కలుగును. వారి కర్మల కారణముగానే ప్రళయకాలమందు ఉపసంహరింపబడినా ముక్తులు కాలేరు.

దేవాద్యాః స్థావరాన్తాశ్చ ప్రజా బ్రహ్మంశ్చతుర్విధాః ।
బ్రహ్మణః కుర్వతః సృష్టిం జజ్ఞిరే మానసాస్తదా ॥3॥

ఓ బ్రహ్మస్వరూపుడా! దేవతలు మొదలుకొని స్థావరములవరకు, నాలుగువిధములైన ప్రజలను తన మనస్సంకల్పము ద్వారా బ్రహ్మ సృష్టించవలెనని సంకల్పించెను.

తతో దేవాసురపితౄన్ మానుషాంశ్చ చతుష్టయమ్ ।
సిసృక్షురంభస్యేతాని స్వమాత్మానమయూయుజత్ ॥4॥

పిమ్మట దేవతలు, రాక్షసులు, పితృదేవతలు, మనుష్యులు ఈ నాలుగు విధములైన వారిని సృష్టించవలెనను కోరికతో బ్రహ్మ తనను తాను నీటియందు సంయోగపరచెను.

యుక్తాత్మనస్తమోమాత్రా ఉద్రిక్తాభూత్ప్రజాపతేః ।
సిసృక్షోర్జఘనాత్పూర్వమసురా జజ్ఞిరే తతః ॥5॥

అంతట యోగమందున్న ప్రజాపతినుండి తమోమాత్ర (తమోగుణము) ఉద్రిక్తముకాగా, సృష్టించవలెనను కోరిక కలిగిన అతడి జఘనప్రదేశమునుండి రాక్షసులు ఉద్భవించిరి.

ఉత్ససర్జ తతస్తాం తు తమోమాత్రాత్మికాం తనుమ్ ।
సాఽపవిద్ధా తనుస్తేన సద్యో రాత్రిరజాయత ॥6॥

అటుపిమ్మట ఆ ప్రజాపతి ఆ తమోమాత్రాత్మకమైన శరీరమును విడిచిపెట్టెను. అతడిచేత విడిచిపెట్టబడిన ఆ తమోమాత్ర రాత్రిగా ఉద్భవించెను.

అన్యాం తనుముపాదాయ సిసృక్షుః ప్రీతిమాప సః ।
సత్త్వోద్రేకాస్తతో దేవా ముఖతస్తస్య జజ్ఞిరే ॥7॥

సృష్టి చేయవలెనను కోరిక కలిగిన ప్రజాపతి మరొక శరీరమును పొంది ప్రీతిని (సత్త్వముయొక్క గుణము ప్రీతి) పొందెను. అంతట సత్త్వగుణము ప్రధానముగా కలిగిన దేవతలు ఆ బ్రహ్మముఖమునుండి ఉద్భవించిరి.

ఉత్ససర్జ చ భూతేశస్తనుం తామప్యసౌ విభుః ।
సా చాఽపవిద్ధా దివసం సత్త్వప్రాయమజాయత ॥8॥

భూతేశుడు, సర్వవ్యాపకుడూ అగు బ్రహ్మ ఆ శరీరమును కూడా విడిచిపెట్టెను. విడిచిపెట్టబడిన ఆ శరీరము సత్త్వప్రధానమైన పగటిని పుట్టించెను.

సత్త్వమాత్రాత్మికామేవ తతోఽన్యాం జగృహే తనుమ్ ।
పితృవన్మన్యమానస్య పితరస్తస్య జజ్ఞిరే ॥9॥

అటుపిమ్మట ప్రజాపతి మరొక, సత్త్వ ప్రధానమైన శరీరమును స్వీకరించెను. తండ్రిగా భావింపబడుతున్న ప్రజాపతియొక్క అట్టి శరీరమునుండి పితృదేవతలు ఉద్భవించిరి.

సృష్ట్వా పితౄనుత్ససర్జ తనుం తామపి స ప్రభుః ।
సా చోత్సృష్టాఽభవత్సంధ్యా దిననక్తాన్తరస్థితా ॥10॥

ప్రభువగు ఆ ప్రజాపతి ఆ విధముగా పితరులను సృష్టించి ఆ శరీరమును కూడా విడిచిపెట్టెను. విడిచిపెట్టబడిన ఆ శరీరము రాత్రింబవళ్ళ మధ్యలో ఉండు సంధ్యగా ఉద్భవించెను.

రజోమాత్రాత్మికామన్యాం తనుం భేజేఽథ స ప్రభుః ।
తతో మనుష్యాః సంభూతా రజోమాత్రసముద్భవాః ॥11॥

అటుపిమ్మట ప్రభువగు ఆ ప్రజాపతి రజోగుణప్రధానమైన మరొక శరీరమును స్వీకరించెను. ఆ శరీరమునుండి రజోగుణ ప్రధానులైన మనుష్యులు ఉద్భవించిరి.

సృష్ట్వా మనుష్యాన్స విభురుత్ససర్జ తనుం తతః ।
జ్యోత్స్నా సమభవత్సా చ నక్తాన్తేఽహర్ముఖే చ యా ॥12॥

ప్రజాపతి మనుష్యులను సృష్టించి అటు పిమ్మట ఆ శరీరమును విడిచిపెట్టెను. విడిచిపెట్టబడిన ఆ శరీరము రాత్రికి చివర, పగటికి మొదటిభాగమందలి జ్యోత్స్నగా ఉద్భవించెను.

ఇత్యేతాస్తనవస్తస్య దేవదేవస్య ధీమతః ।
ఖ్యాతా రాత్ర్యహనీ చైవ సంధ్యా జ్యోత్స్నా చ వై ద్విజ ॥13॥

ఓ బ్రాహ్మణుడా! ఈ విధముగా దేవదేవుడు, ధీమంతుడు అగు బ్రహ్మయొక్క ఈ శరీరములు రాత్రింబవళ్ళుగాను, సంధ్యగాను, జ్యోత్స్నగాను ఉద్భవించినవి.

జ్యోత్స్నా సంధ్యా తథైవాహః సత్త్వమాత్రాత్మకం త్రయమ్ ।
తమోమాత్రాత్మికా రాత్రిః సా వై తస్మాత్తమోఽధికా ॥14॥

జ్యోత్స్న, సంధ్య, పగలు ఈ మూడు సత్త్వగుణప్రధానములు. రాత్రి తమోగుణాత్మకముగావున తమస్సు అధికముగా గలది.

తస్మాద్దేవా దివా రాత్రావసురాస్తు బలాన్వితాః ।
జ్యోత్స్నాగమే చ మనుజాః సంధ్యాయాం పితరస్తథా ॥15॥

భవంతి బలినోఽధృష్యా విపక్షాణాం న సంశయః ।
తద్విపర్యయమాసాద్య ప్రయాన్తి చ విపర్యయమ్ ॥16॥

అందువలన దేవతలు పగటియందు, రాక్షసులు రాత్రియందు, మనుష్యులు ప్రాతస్సంధ్యయందు, పితృదేవతలు సాయంసంధ్యయందు బలవంతులగుదురు. ఇంకను శత్రువులచేతిలో ఓడింపబడరు. ఆ చెప్పబడిన సమయాలకంటే భిన్న సమయాలలో అయితే వారి శక్తి క్షీణించును.

జ్యోత్స్నా రాత్ర్యహనీ సంధ్యా చత్వార్యేతాని వై ప్రభోః ।
బ్రహ్మణస్తు శరీరాణి త్రిగుణోపసృతాని తు ॥17॥

జ్యోత్స్న, రాత్రి, పగలు, సంధ్య ఈ నాలుగు ప్రభువైన బ్రహ్మయొక్క శరీరములు, సత్త్వరజస్తమోగుణ విశిష్టములు.

చత్వార్యేతాన్యథోత్పాద్య తనుమన్యాం ప్రజాపతిః ।
రజస్తమోమయీం రాత్రౌ జగృహే క్షుతృడన్వితః ॥18॥

ప్రజాపతి ఈ నాలుగు శరీరములను యథోక్తప్రకారము ఉత్పత్తి చేసి, రాత్రియందు ఆకలిదప్పులతో కూడుకొన్నవాడై రజస్తమోగుణములతో కూడుకొన్న మరొక శరీరమును గ్రహించెను.

తదంధకారే క్షుత్క్షామానసృజద్భగవానజః ।
విరూపాన్ శ్మశ్రులానత్తుమారబ్ధాస్తే చ తాం తనుమ్ ॥19॥

ఆ అంధకారమందు పుట్టుకలేని ఆ బ్రహ్మదేవుడు కరువుకాటకములను, వికృతరూపముగలవారిని, మీసము గడ్డములు గలవారిని సృష్టించెను. అంతట వారు పూర్వోక్తమగు ఆ శరీరమును తినుటకు ఆరంభించిరి.

రక్షామ ఇతి తేభ్యోఽన్యే య ఊచుస్తే తు రాక్షసాః ।
ఖాదామ ఇతి యే చోచుస్తే యక్షా యక్షణాద్ద్విజ ॥20॥

ఓ బ్రాహ్మణుడా ! వారిలో కొందరు ఎవరయితే "రక్షించెదము" అని పలికారో వారు రాక్షసులని, "తినెదము" అని ఎవరయితే పలికారో వారు యక్షులని చెప్పబడ్డారు.

తాన్ దృష్ట్వా హ్యప్రియేణాస్య కేశాః శీర్యన్త వేధసః ।
సమారోహణహీనాశ్చ శిరసో బ్రహ్మణస్తు తే ॥21॥

సర్పణాత్తేఽభవన్సర్పా హీనత్వాదహయః స్మృతాః ।
సర్పాన్సృష్ట్వా తతః క్రోధాత్ క్రోధాత్మానో వినిర్మమే ॥22॥

వర్ణేన కపిలేనోగ్రాస్తే భూతాః పిశితాశనాః ।

వారందరినీ చూచుటచేత బ్రహ్మకు సంతోషము కలుగనందున అతడి కేశములు హింసింపబడినవి. అంతట బ్రహ్మయొక్క శిరస్సునుండి ఊడి క్రిందపడి, అటునిటు కదలాడుట (సర్పణము) చేత సర్పములు అయినవి. శిరస్సు నుండి హీనము చెందుటచే (వియోగము కల్గుటచే) అహియని పేరు కల్గినవి అయినవి. అట్టి సర్పములను చూచి క్రోధమును పొంది క్రోధస్వభావము కల్గినవాటిని సృష్టించెను. అవి కపిలవర్ణము కలిగి, ఉగ్రస్వభావము కలిగి, మాంసము తినునవి (రాక్షసజాతికి చెందినవి) అయినవి.

ధ్యాయతో గాం తతస్తస్య గంధర్వా జజ్ఞిరే సతః ॥23॥
జజ్ఞిరేఽపి తతో వాచం గంధర్వాస్తేన తే స్మృతాః ।

అటు పిమ్మట గోవును లేదా భూమిని ధ్యానించుచుండగా ఆ ప్రజాపతినుండి గంధర్వులు ఉద్భవించిరి. గీతిరూపములైన లేదా స్తుతిరూపములైన గోశబ్దార్థమగు వాక్కులను ధరించుటచేత కూడా వారు గంధర్వులని చెప్పబడిరి. ("గాః = స్తుతిరూపాః గీతిరూపా వా వాచః ధారయతీతి గంధర్వః" అని వాచస్పత్యము).

అష్టాస్వేతాసు సృష్టాసు దేవయోనిషు స ప్రభుః ॥24॥

తతః స్వదేహతోఽన్యాని వయాంసి పశవోఽసృజత్ ।
ముఖతోఽజాః ససర్జాథ వక్షసశ్చావయోఽసృజత్ ॥25॥

గాశ్చైవోదరతో బ్రహ్మా పార్శ్వాభ్యాం చ వినిర్మమే ।
పద్భ్యాం చాశ్వాన్స మాతఙ్గాన్ రాసభాన్ శశకాన్ మృగాన్ ॥26॥

ఉష్ట్రానశ్వతరాంశ్చైవ నానారూపాశ్చ జాతయః ।
ఓషధ్యః ఫలమూలిన్యో రోమభ్యస్తస్య జజ్ఞిరే ॥27॥

ఏవం పశ్వోషధీః సృష్ట్వా హ్యయజచ్చాధ్వరే విభుః ।
తస్మాదాదౌ తు కల్పస్య త్రేతాయుగముఖే తదా ॥28॥

ఈ విధముగా ప్రభువగు ఆ ప్రజాపతి ఎనిమిది విధములైన దేవయోనులను సృష్టించి (దేవతలు, వారి శత్రుగణములు, గంధర్వులు, యక్షులు, పితరులు, సర్పములు, రాక్షసులు, పిశాచజాతివారు ఈ ఎనిమిదిమంది మనుష్యేతరులు దేవగణమని ప్రసిద్ధిని పొందినవారు. వాచస్పత్యం), అటుపిమ్మట తన దేహమునుండి పక్షులను పశువులను సృష్టించెను. ప్రజాపతి తన ముఖమునుండి మేకలను, వక్షఃస్థలమునుండి (రొమ్ముభాగము) గొర్రెలను,

ఉదరము మరియు ప్రక్కభాగముల నుండి గోవులను, పాదములనుండి గుఱ్ఱాలను, ఏనుగులను, గాడిదలను, కుందేళ్ళను, లేళ్ళను, ఒంటెలను, గాడిదకు ఆడగుఱ్ఱమందు పుట్టిన అశ్వతరములను సృష్టించెను. నానావిధములయిన ఓషధులను, ఫలములనిచ్చు చెట్లను ఆ ప్రజాపతి తన వెంట్రుకలనుండి సృష్టించెను. ఈ విధముగా పశువులను, ఓషధులను సృష్టించి విభువగు ఆ ప్రజాపతి వాటిని కల్పాదిలో త్రేతాయుగారంభమందు యజ్ఞమందు హెూమము చేసెను.

గౌరజః పురుషో మేషో హ్యశ్వాశ్వతరగర్దభాః ।
ఏతాన్ గ్రామ్యాన్ పశూనాహురారణ్యాంశ్చ నిబోధ మే ॥29॥

గోవు, మేక, గొఱ్ఱె, గుఱ్ఱము, అశ్వతరము, గాడిద ఈ పశువులను గ్రామ్యములందురు. ఇక ఆరణ్యజంతువులను గూర్చి చెప్పెదను, వినుము.

శ్వాపదం ద్విఖురం హస్తీ వానరాః పక్షిపంచమాః ।
ఔదకాః పశవః షష్ఠాః సప్తమాస్తు సరీసృపాః ॥30॥

వ్యాఘ్రము మొదలగు క్రూరమృగములు, ద్విఖురములు (క్రూరజంతువిశేషము), ఏనుగులు, కోతులు, అయిదవదియగు పక్షులు, జలమందు సంచరించు చేపలు మొ॥లగు ఆరవదియగు పశువులు, ప్రాకెడు పాము మొదలగు ఏడవదియగు జంతువులు ఈ ఏడును అడవిలో నివసించు జంతువులు.

గాయత్రీం చ తృచం చైవ త్రివృత్సామరథన్తరమ్ ।
అగ్నిష్టోమం చ యజ్ఞానాం నిర్మమే ప్రథమాన్ముఖాత్ ॥31॥

ప్రజాపతి తన ముందుభాగమందున్న మొదటి ముఖమునుండి గాయత్రీమంత్రమును, సమానఛందస్కములైన మూడు ఋక్కుల సమాహారమును, త్రివృత్‌ను అనగా తేజస్సు జలము అన్నములను, రథన్తరసామమంత్రమును, అగ్నిష్టోమయజ్ఞమును ఉత్పన్నము చేసెను.

యజూంషి త్రైష్టుభం ఛందః స్తోమం పఞ్చదశం తథా ।
బృహత్సామ తథోక్థం చ దక్షిణాదసృజన్ముఖాత్ ॥32॥

యజుర్మంత్రములను, త్రిష్టుభ్‌ఛందస్సును, పదిహేనువిధములైన స్తుతిపరమైన మంత్రములను, బృహత్సామను, స్తోత్రమంత్రములను ఉక్థములను ప్రజాపతి తన దక్షిణముఖమునుండి సృష్టించెను.

సామాని జగతీచ్ఛన్దః స్తోమం పఞ్చదశం తథా ।
వైరూపమతిరాత్రం చ నిర్మమే పశ్చిమాన్ముఖాత్ ॥33॥

సామమంత్రములు, జగతీచ్ఛందస్సు, పదిహేనువిధములైన స్తోమము, వైరూపమను సామవిశేషము, అతిరాత్రము (యాగవిశేషము) వీటిని ప్రజాపతి తన పశ్చిమముఖమునుండి సృష్టించెను.

ఏకవింశమథర్వాణమాప్తోర్యామాణమేవ చ ।
ఆనుష్టుభం స వైరాజముత్తరాదసృజన్ముఖాత్ ॥34॥

ఇరవైఒక్కటి అథర్వణమంత్రములు, ఆపోర్యామమంత్రములు, అనుష్టుప్ మరియు విరాజఛందస్సులు వీటిని ప్రజాపతి తన ఉత్తరముఖమునుండి సృష్టించెను.

విద్యుతోఽశనిమేఘాశ్చ రోహితేంద్రధనూంషి చ ।
వయాంసి చ ససర్జాదౌ కల్పస్య భగవాన్విభుః ॥35॥

మేఘమండలి మెరుపులు, ఉరుములు, మేఘాలు, ఎర్రని ఇంద్రధనుస్సులు, పక్షులు వీటినన్నింటినీ భగవత్స్వరూపుడూ విభువూ అగు బ్రహ్మ కల్పాదిలో సృష్టించెను.

ఉచ్చావచాని భూతాని గాత్రేభ్యస్తస్య జజ్ఞిరే ।
సృష్ట్వా చతుష్టయం పూర్వం దేవాసురపితౄన్ప్రజాః ॥36॥

తతోఽసృజత్ స భూతాని స్థావరాణి చరాణి చ ।
యక్షాన్ పిశాచాన్గంధర్వాన్ తథైవాప్సరసాం గణాన్ ॥37॥

నరకిన్నరరక్షాంసి వయః పశుమృగోరగాన్ ।
అవ్యయం చ వ్యయం చైవ యదిదం స్థాణుజంగమమ్ ॥38॥

పెద్దవి, చిన్నవి యగు ఆయా భూతములు ప్రజాపతియొక్క శరీరమునుండి ఉద్భవించినవి. ప్రజాపతి ముందుగా దేవతలు, రాక్షసులు, పితరులు, ప్రజలు ఈ నాలుగు విధములైనవారిని సృష్టించి, అటుపిమ్మట స్థావరజంగమాత్మకమైన భూతములు, యక్షులు, పిశాచములు, గంధర్వులు, అప్సరసల సమూహములు, మానవులు, కిన్నరులు, రాక్షసులు, పక్షులు, పశువులు, మృగములు, పాములు, నశించేవి నశించనవీయగు స్థావరజంగములు వీటినన్నింటినీ సృష్టించెను.

తేషాం యే యాని కర్మాణి ప్రాక్సృష్టేః ప్రతిపేదిరే ।
తాన్యేవ ప్రతిపద్యన్తే సృజ్యమానాః పునఃపునః ॥39॥

సృష్టికి పూర్వము ఆయా ప్రాణుల కర్మలెట్టివిగలవో అట్టి కర్మలను బట్టియే నానావిధములైన ఆయా ప్రాణులు పుట్టుచున్నవి.

హింస్రాహింస్రే మృదుక్రూరే ధర్మాధర్మావృతానృతే ।
తద్భావితాః ప్రపద్యన్తే తస్మాత్తత్తస్య రోచతే ॥40॥

హింసాశీలురు, అహింసాశీలురు, మృదుస్వభావులు, క్రూరస్వభావులు, ధర్మాధర్మములు, సత్యాసత్యములు ఇవియన్నియు ఆయాప్రాణుల కర్మానుసారముగానే పొందింపబడుచున్నవి. అందువల్లనే ఆయా జన్మమందే ఆయా ప్రాణులకు ప్రీతి. (ధర్మాధర్మౌ + ఋతానృతే అని పదచ్ఛేదము.)

ఇంద్రియార్థేషు భూతేషు శరీరేషు చ స ప్రభుః ।
నానాత్వం వినియోగం చ ధాతైవ యద్వ్యధాత్ స్వయమ్ ॥41॥

ఆయా ఇంద్రియవిషయములందు, భూతములందు, శరీరములందు వైవిధ్యము, వినియోగములను ఆ ప్రజాపతియే స్వయముగా విధించెను.

నామరూపం చ భూతానాం కృత్యానాం చ ప్రపంచనమ్ ।
వేదశబ్దేభ్య ఏవాదౌ దేవాదీనాం చకార సః ॥42॥

ఆయా భూతములయొక్క నామరూపములను, చేయవలసిన విధులను దేవతలు మొదలగువారికి కల్పాదిలో వైదికశబ్దములతోనే నిర్మాణము చేసెను.

ఋషీణాం నామధేయాని యాశ్చ దేవేషు సృష్టయః ।
శర్వర్యన్తే ప్రసూతానామన్యేషాం చ దదాతి సః ॥43॥

ఋషులపేర్లు, దేవతలసృష్టి ఏవిగలవో వాటికి, రాత్రి చివరిభాగమందు ఉత్పన్నమైన వేరే వాటికి ఆ ప్రజాపతి పేర్లను పెట్టెను.

యథర్త్తావృతులిఙ్గాని నానారూపాణి పర్యయే ।
దృశ్యన్తే తాని తాన్యేవ తథా భావా యుగాదిషు ॥44॥

ఆయా ఋతువుల కాలంలో ఏవయితే ఆయా ఋతుచిహ్నాములు కనిపిస్తాయో, అట్లే ఆయా ఋతువుల మార్పు సమయంలో ఏవయితే వివిధరూపాలు కనిపిస్తాయో అవే చిహ్నాలు, రూపాలు ఆయా అన్నియుగాల ఆరంభకాలంలో అనువర్తిస్తాయి.

ఏవంవిధాః సృష్టయస్తు బ్రహ్మణోఽవ్యక్తజన్మనః ।
శర్వర్యన్తే ప్రబుద్ధస్య కల్పే కల్పే భవన్తి వై ॥45॥

అవ్యక్తజన్ముడగు బ్రహ్మనుండి ఈ విధమైన సృష్టులన్నియు రాత్రి పూర్తి అయిన పిమ్మట ఆ బ్రహ్మ మేల్కొన్నపిమ్మట అన్ని కల్పములందు జరుగుచున్నవి.

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే సృష్టిప్రకరణే పఞ్చచత్వారింశః అధ్యాయః సమాప్తః ॥45॥

శ్రీ మార్కండేయ మహాపురాణమందు సృష్టిప్రకరణమందు నలుబదిఅయిదవ అధ్యాయం సమాప్తం.



షట్చత్వారింశోఽధ్యాయః – నలుబదియారవ అధ్యాయం
సృష్టిప్రకరణమ్ – సృష్టిప్రకరణం

క్రౌష్టుకిరువాచ – క్రౌష్టుకి పలికాడు.

అర్వాక్స్రోతస్తు కథితో భవతా యస్తు మానుషః ।
బ్రహ్మన్విస్తరతో బ్రూహి బ్రహ్మా సమసృజద్యథా ॥1॥

యథా చ వర్ణానసృజద్యద్గుణాంశ్చ మహామతే ।
యచ్చ యేషాం స్మృతం కర్మ విప్రాదీనాం వదస్వ తత్ ॥2॥

ఓ బ్రహ్మస్వరూపుడా! మనుష్యుల సృష్టికి సంబంధించిన అర్వాక్స్రోతస్సు అను సృష్టి మీచేత చెప్పబడినది. ఓ గొప్ప బుద్ధిమంతుడా! ఏ విధముగా బ్రహ్మ వారిని సృష్టించెను, బ్రాహ్మణక్షత్రియవైశ్యశూద్ర వర్ణములను ఏవిధముగా సృష్టించెను, బ్రాహ్మణాదులకు ఎట్టి కర్మలను నిర్దేశించెను ఈ విషయములను గూర్చి వివరముగా చెప్పుము.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

బ్రహ్మణః సృజతః పూర్వం సత్యాభిధ్యాయినస్తథా ।
మిథునానాం సహస్రం తు ముఖాత్సోఽథాసృజన్మునే ॥3॥

ఓ మునీ ! సత్యమునే ధ్యానించు బ్రహ్మ సృష్టిసమయమందు ముందుగా వేయి జంటలను తన ముఖమునుండి సృష్టించెను.

జాతాస్తే హ్యుపపద్యన్తే సత్త్వోద్రిక్తాః స్వతేజసః ।
సహస్రమన్యద్వక్షఃస్థో మిథునానాం ససర్జ హ ॥4॥

ఆ పుట్టిన వారందరు స్వయంప్రకాశముగలవారై, సత్త్వగుణోద్రేకము గలవారై యున్నారు. బ్రహ్మ తిరిగి మరొక వేయి జంటలను తన వక్షఃస్థలమునుండి సృష్టించెను.

తే సర్వే రజసోద్రిక్తాః శుష్మిణశ్చాప్యమర్షిణః ।
ససర్జాన్యత్సహస్రం తు ద్వంద్వానామూరుతః పునః ॥5॥

ఆ పుట్టిన వారందరు రజోగుణప్రధానులై పరాక్రమవంతులుగానూ, అసహనముతో క్రోధస్వభావులుగానూ అయిరి. తిరిగి బ్రహ్మ తన తొడలనుండి మరొక వేయి జంటలను సృష్టించెను.

రజస్తమోభ్యాముద్రిక్తా ఈహాశీలాస్తు తే స్మృతాః ।
పద్భ్యాం సహస్రమన్యచ్చ మిథునానాం ససర్జ హ ॥6॥

వారందరు రజస్తమోగుణములచే ఉద్రేకింపబడినవారై, ఈర్ష్యాగుణము కలిగియున్నారు. తిరిగి బ్రహ్మ తన పాదములనుండి మరొక వేయి జంటలను సృష్టించెను.

ఉద్రిక్తాస్తమసా సర్వే నిశ్శ్రీకా హ్యల్పతేజసః ।
తతస్సంఘర్షమాణాస్తే ద్వంద్వోత్పన్నాస్తు ప్రాణినః ॥7॥

అన్యోన్యం హృచ్ఛయావిష్టా మైథునాయోపచక్రముః ।
తతః ప్రభృతి కల్పేఽస్మిన్మిథునానాం హి సంభవః

వారందరు తమోగుణముచే ఉద్రేకింపబడినవారు, సంపదలు లేనివారు, అల్పతేజస్సు కలిగినవారు. అంతట జంటలుగా పుట్టిన ఆ ప్రాణులందరు పరస్పరసంఘర్షణకు లోనై, మన్మథతాపముపొంది, మైథునము అనగా సంభోగమందు ప్రవృత్తులైరి. అప్పటినుండి ఈ కల్పమందు మిథునముల (జంటల) ఉత్పత్తి జరిగినది. ("హృదయే శేతే ఇతి హృచ్ఛయః" అని వ్యుత్పత్తిచే హృచ్ఛయశబ్దానికి మన్మథుడని అర్థం," మిథునేన స్త్రీపుంసాభ్యాం నిర్వృత్తం మైథునమ్" అని మైథునశబ్దానికి వ్యుత్పత్తి).

మాసి మాస్యార్తవం యత్తు న తదాసీత్తు యోషితామ్ ।
తస్మాత్తదా న సుషువుః సేవితైరపి మైథునైః ॥9॥

ఆ కాలమందు నెలనెలా రావలసిన ఋతుక్రమము స్త్రీలకు రాలేదు. అందువలన మైథునము ఆచరించిననూ వారికి సంతానము కలుగలేదు.

ఆయుషోఽన్తే ప్రసూయన్తే మిథునాన్యేవ తాః సకృత్ ।
కులికం కులికా చైవ ఉత్పద్యన్తే ముమూర్షతామ్ ।
తతః ప్రభృతి కల్పేఽస్మిన్మిథునానాం హి సంభవః ॥10॥

ఆ జంటలే ఆయుర్దాయము చివరికాలమందు మరణసమయమందు తమ తమ కులములందు ఒకసారి ప్రసవించుచుండిరి. అప్పటినుండి ఈ కల్పమందు మిథునముల (జంటల) ఉత్పత్తి జరిగినది.

ధ్యానేన మనసా తాసాం ప్రజానాం జాయతేఽసకృత్ ।
శబ్దాదిర్విషయః శుద్ధః ప్రత్యేకం పఞ్చలక్షణః ॥11॥

ధ్యానముతోనూ, మనస్సుతోనూ ఆ ప్రజలకు పలుమార్లు అయిదు జ్ఞానేంద్రియములకు విషయములైన శబ్దాదులు అనగా శబ్దస్పర్శరూపరసగంధములు ఆకాశాది పంచమహాభూతములకు చెందినవి ఉత్పన్నమైనవి.

ఇత్యేషా మానుషీ సృష్టిర్యా పూర్వం వై ప్రజాపతేః ।
తస్యాన్వవాయసంభూతా యైరిదం పూరితం జగత్ ॥12॥

ఈ విధముగా ప్రజాపతియొక్క మొదటి మానుషసృష్టి జరిగినది. ఆ ప్రజాపతివల్లనే ప్రజలు మొ॥వారు పుట్టారు, వారిచేతనే ఈ జగత్తంతా పూరింపబడినది.

సరిత్సరః సముద్రాంశ్చ సేవన్తే పర్వతానపి ।
తాస్తదా హ్యల్పశీతోష్ణా యుగే తస్మింశ్చరన్తి వై ॥13॥

నదులు, సరస్సులు, సముద్రములు, పర్వతములను ఆ ప్రజలు సేవించుచుండిరి (అనుభవించుచుండిరి లేదా పూజించుచుండిరి). ఆ యుగమందు వారు అల్పమైన శీతోష్ణములు గలవారై సంచరించుచున్నారు.

తృప్తిం స్వాభావికీం ప్రాప్తా విషయేషు మహామతే ! ।
న తాసాం ప్రతిఘాతోఽస్తి న ద్వేషో నాపి మత్సరః ॥14॥

ఓ గొప్ప బుద్ధిమంతుడా ! శబ్దాదివిషయములందు సహజమైన తృప్తిని ఆ యుగమందలి ప్రజలు పొందారు. వారిలో పరస్పరము దెబ్బతీసుకొనుటగాని, శత్రుత్వముగాని, అసూయగాని లేవు.

పర్వతోదధిసేవిన్యో హ్యనికేతాస్తు సర్వశః ।
తా వై నిష్కామచారిణ్యో నిత్యం ముదితమానసాః ॥15॥

వారు పర్వతములు, సముద్రములను సేవించుచున్నవారై, ఎట్టి నివాసస్థానము లేకుండా అంతట నివసించువారై, ఎట్టి కోరికలు లేక సంచరించువారై, ఎల్లప్పుడు సంతోషముతో నిండిన హృదయము గలవారై ఉన్నారు.

పిశాచోరగరక్షాంసి తథా మత్సరిణో జనాః ।
పశవః పక్షిణశ్చైవ నక్రా మత్స్యాః సరీసృపాః ॥16॥

అవారకా హ్యణ్డజా వా తే హ్యధర్మప్రసూతయః ।
న మూలఫలపుష్పాణి నార్తవా వత్సరాణి చ ॥17॥

పిశాచములు, పాములు, రాక్షసులు, అసూయగల జనులు, పశువులు, పక్షులు, మొసళ్ళు, చేపలు, పాకే జంతువులు, గ్రుడ్లనుండి పుట్టిన జంతువులు ఇవి ఏవీ కల్పాదిలో పుట్టిన ప్రజలను ప్రతిబంధించలేదు. ఏలయనగా అవియన్నియు అధర్మము వలన ఉద్భవించినవి కదా ! కందమూలాదులు, పండ్లు, పుష్పాలు, ఋతువులు, సంవత్సరాలు ఇవి ఏవియూ ఆ కాలమందు లేవు.

సర్వకాలసుఖః కాలో నాత్యర్థం ఘర్మశీతతా ।
కాలేన గచ్ఛతా తేషాం పిత్రా సిద్ధిరజాయత ॥18॥

ఆ ప్రజలు నివసించే కాలమంతయు సుఖకరమే. అధికమైన వేడిగాని, శీతలముగాని లేవు. కాలము గడచుచుండగా వారికి తమకు జనకుడైన ఆ ప్రజాపతివల్ల సిద్ధి కలిగినది.

తతశ్చ తేషాం పూర్వాహ్ణే మధ్యాహ్నే చ వితృప్తతా ।
పునస్తథేచ్ఛతాం తృప్తిరనాయాసేన సాఽభవత్ ॥19॥

ఇంకనూ పూర్వాహ్ణమందుగాని, మధ్యాహ్నమందుగాని వారికి తృప్తి కలుగనియెడల కోరుకున్నంతమాత్రానే ఎట్టి శ్రమా లేకుండానే వారికి తృప్తి కలిగినది.

ఇచ్ఛతాం చ తథాయాసో మనసః సమజాయత ।
అపాం సౌక్ష్మ్యం తతస్తాసాం సిద్ధిర్నామ్నా రసోల్లసా ॥20॥

సమజాయత చైవాన్యా సర్వకామప్రదాయినీ ।
అసంస్కార్యైః శరీరైశ్చ ప్రజాస్తాః స్థిరయౌవనాః ॥21॥

ఏదేని కోరుకొన్నవారికి ఆయాసము అనగా మిక్కిలి యత్నము మనస్సునకు కలిగినది. అనగా శారీరక యత్నము లేకుండానే మనస్సంకల్పము చేతనే కార్యములు సిద్ధించినవి. రసవంతములైన జలములందు సూక్ష్మత్వమను ధర్మమున్నది. అందువలన వారి సిద్ధియంతయు రసోల్లాసమై సమస్త అభీష్టములను ప్రదానము చేయునట్టిదిగా ఉన్నది. ఎట్టి విధ్యుక్తసంస్కారములు లేని శరీరములతో ఆ ప్రజలందరు స్థిరమైన యౌవనము కలిగియున్నారు.

తాసాం వినా తు సంకల్పం జాయన్తే మిథునాః ప్రజాః ।
సమం జన్మ చ రూపం చ మ్రియన్తే చైవ తాః సమమ్ ॥22॥

వారియొక్క సంకల్పము లేకుండానే జంటలైన ప్రజలు పుట్టుచుండిరి. వారి పుట్టుకరూపములు సమానముగా ఉండును. అట్లే వారు ఒకవిధంగానే మరణము పొందెదరు.

అనిచ్ఛాద్వేషసంయుక్తా వర్తన్తే తు పరస్పరమ్ ।
తుల్యరూపాయుషః సర్వా అధమోత్తమతాం వినా ॥23॥

ఆ ప్రజలు పరస్పరము కోరికలు, ద్వేషము లేనివారై ఉందురు. సమానమైన ఆకారము, ఆయుర్దాయములు కలిగి ఒకే విధముగా ఉందురు. అనగా కొందరు అధములు కొందరు ఉత్తములు అను రీతిగా ఉండరు.

చత్వారి తు సహస్రాణి వర్షాణాం మానుషాణి తు ।
ఆయుః ప్రమాణం జీవన్తి న చ క్లేశాద్విపత్తయః ॥24॥

జంటలుగా జన్మించిన ఆ ప్రజలు నాలుగువేల మానుషసంవత్సరములు ఆయుర్దాయప్రమాణముగా కలిగి జీవించెదరు. క్లేశములవలన ఎట్టి విపత్తులు వారికి సంభవించవు.

క్వచిత్ క్వచిత్ పునస్సాభూత్ క్షితిర్భాగ్యేన సర్వశః ।
కాలేన గచ్ఛతా నాశముపయాన్తి యథా ప్రజాః ॥25॥

తథా తాః క్రమశో నాశం జగ్ముః సర్వత్ర సిద్ధయః ।

భూమి అంతటా భాగ్యముతో నిండినది ఆయెను. కాలము గడుచుచుండగా ప్రజలు ఎట్లు నాశము పొందెదరో అట్లే అంతటా సిద్ధులు కూడా నశించును.

తాసు సర్వాసు నష్టాసు నభసః ప్రచ్యుతా రసాః ॥26॥

పయసః కల్పవృక్షాస్తే సంభూతా గృహసంస్థితాః ।
సర్వే ప్రత్యుపభోగాశ్చ తాసాం తేభ్యః ప్రజా యతః ॥27॥

వర్తయన్తి స్మ తేభ్యస్తాః త్రేతాయుగముఖే తదా ।

ఆ సిద్ధులన్నియు నశించగా ఆకాశమునుండి అమృతజలములు జారినవి. ఆ జలములు ఆయా గృహములందుండు విధముగా కల్పవృక్షములయినవి. అందరికీ అవి భోగములను కల్పించినవి. ఆ కల్పవృక్షములనుండి పుట్టిన ఆ ప్రజలందరు త్రేతాయుగము ఆరంభమందు ఉండిరి.

తతః కాలేన వై రాగస్తాసామాకస్మికో ఒభవత్ ॥28॥

మాసి మాస్యార్తవోత్పత్త్యా గర్భోత్పత్తిః పునఃపునః ।
రాగోత్పత్త్యా తతస్తాసాం వృక్షాస్తే గృహసంస్థితాః ॥29॥

ప్రణేశురపరే చాసంశ్చతుశ్శాఖా మహీరుహాః ।
వస్త్రాణి చ ప్రసూయన్తే ఫలేష్వాభరణాని చ ॥30॥

అటుపిమ్మట కాలక్రమంగా ఆ ప్రజలకు ఆకస్మికముగా రాగము అనగా కోరిక ఉద్భవించెను. నెల నెలా స్త్రీలకు ఋతుక్రమము సంభవించినందున అనేకమార్లు గర్భోత్పత్తి కూడా కలిగెను. అంతట వారికి రాగోత్పత్తి కారణముగా వారి ఇండ్లయందున్న కల్పవృక్షములు నశించినవి. పిమ్మట నాలుగు కొమ్మలుగల చెట్లు ఉద్భవించినవి. ఆ చెట్ల పండ్లు వస్త్రములను, ఆభరణములను ప్రసవించుచున్నవి (పుట్టించుచున్నవి).

తేష్వేవ జాయతే తేషాం గంధవర్ణరసాన్వితమ్ ।
అమాక్షికం మహావీర్యం పుటకే పుటకే మధు ॥31॥

తేన తా వర్తయన్తి స్మ ముఖే త్రేతాయుగస్య వై ।

వాసన, రంగు, రసములతో కూడుకొన్నట్టిదీ, తేనెటీగలు లేనట్టిదీ, గొప్ప బలమునిచ్చునదీ అగు తేనె ఆ ఫలములందలి ప్రతి పొరలోను పుట్టుచున్నది. త్రేతాయుగ ప్రారంభమందు అప్పటి ప్రజలు ఆ తేనెను త్రాగుచు జీవితమును గడిపెడివారు.

తతః కాలాన్తరేణైవ పునర్లోభాన్వితాస్తు తాః ॥32॥

వృక్షాంస్తాః పర్యగృహ్ణన్త మమత్వావిష్టచేతసః ।
నేశుస్తేనాపచారేణ తే హి తాసాం మహీరుహాః ॥33॥

అటుపిమ్మట కాలక్రమముననుసరించి ఆ ప్రజలు మరల లోభగుణము కలిగి ఆ చెట్లయందు మమత్వబుద్ధి కలిగి ఆ చెట్లను గ్రహించిరి లేదా పట్టుకొనిరి. అంతట వారు చేసిన అపచారము కారణముగా ఆ చెట్లు నశించినవి. (అసంగమైన ఆత్మయందు మమత్వబుద్ధి అనగా ఇది నాదియను వ్యవహారము అజ్ఞానకల్పితమని ఆశయము).

తతో ద్వంద్వాన్యజాయన్త శీతోష్ణక్షున్ముఖాని వై ।
తాస్తద్ద్వన్ద్వాపఘాతార్థం చక్రుః పూర్వం పురాణి తు ॥34॥

అటుపిమ్మట శీతోష్ణములు, ఆకలిదప్పులు మొదలగు ద్వంద్వములు పుట్టినవి. ప్రజలు వాటిని పోగొట్టుకొనుటకై పురములను నిర్మించుకొనిరి.

మరుధన్వసు దుర్గేషు పర్వతేషు దరీషు చ ।
సంశ్రయన్తి చ దుర్గాణి వార్క్షం పార్వతమౌదకమ్ ॥35॥

నిర్జలప్రదేశములందు, నడచుటకు క్లేశమును కలిగించు దుర్గభూములందు, పర్వతములందు, గుహలందు పురములను ఏర్పరచుకొని ఆ ప్రజలు, వార్క్షము, పార్వతము, ఔదకము అను పేర్లుగల మూడు దుర్గములను ఆశ్రయించసాగిరి.

కృత్రిమం చ తథా దుర్గం మిత్వా మిత్వాఽఽత్మనోఽఙ్గులైః ।
మానార్థాని ప్రమాణాని తాస్తు పూర్వం ప్రచక్రిరే ॥36॥

తమ వ్రేళ్ళ పరిమాణముతోనే కొలిచి నాల్గవది అయిన కృత్రిమమైన దుర్గమును ఆ ప్రజలు నిర్మించుకొనసాగిరి. పరిమాణము అనగా కొలతకొరకు ఆ ప్రజలు ముందుగా ప్రమాణములను (కొలత సాధనములను) నిర్మించుకొనిరి. అవి చెప్పబడుచున్నవి.

పరమాణుః పరం సూక్ష్మం త్రసరేణుర్మహీరజః ।
వాలాగ్రం చైవ లిక్షాం చ యూకాం చాథ యవోదరమ్ ॥37॥

క్రమాదష్టగుణాన్యాహుర్యవానష్టౌ తథాఙ్గులమ్ ।
షడఙ్గులం పదం తచ్చ వితస్తిర్ద్విగుణం స్మృతమ్ ॥38॥

ద్వే వితస్తీ తథా హస్తో బ్రాహ్మతీర్థాదివేష్టితః ।
చతుర్హస్తం ధనుర్దణ్డో నాడికాయుగమేవ చ ॥39॥

క్రోశో ధనుః సహస్రే ద్వౌ గవ్యూతిస్తచ్చతుర్గుణమ్ ।
ప్రోక్తం చ యోజనం ప్రాజ్ఞైః సంఖ్యానార్థమిదం పరమ్ ॥40॥

మిక్కిలి సూక్ష్మమైన పరమాణువు, త్ర్యణుకము, భూసంబద్ధమైన ధూళి, వెంట్రుక అగ్రభాగము, పరిమాణవిశేషములైన లిక్ష, యూక, యవోదరములు, ఎనిమిది యవల పరిమాణముగల అంగుళము, ఆరు అంగుళాల పదము, దానికి రెండింతల పరిమాణముగల వితస్తి (ఒక జానెడు), బ్రాహ్మతీర్థాదులతో చుట్టబడిన రెండు వితస్తిల పరిమాణముగల హస్తము, నాలుగు హస్తముల పరిమాణముగల ధనుర్దండము లేదా నాడికాయుగము, రెండువేల ధనుర్దండముల పరిమాణముగల గవ్యూతి, నాలుగింతల గవ్యూతి పరిమాణము గల యోజనము ఇవియన్నియు కొలచుటకు సాధనములుగా బుద్ధిమంతులచే చెప్పబడినవి.

చతుర్ణామథ దుర్గాణాం స్వసముత్థాని త్రీణి తు ।
చతుర్థం కృత్రిమం దుర్గం తచ్చక్రుర్యత్నతస్తు వై ॥41॥

ముందు చెప్పబడిన నాలుగు దుర్గములలో మొదటి మూడు స్వతస్సిద్ధముగా ఏర్పడినవి. నాల్గవది అయిన కృత్రిమ దుర్గము ప్రయత్నపూర్వకముగా ప్రజలచే నిర్మించబడినది.

పురం చ ఖేటకం చైవ తద్వద్ద్రోణీముఖం ద్విజ ।
శాఖానగరకం చాపి తథా ఖర్వటకం ద్రమీ ॥42॥

గ్రామసంఘోషవిన్యాసం తేషు చావసథాన్ పృథక్ ।
సోత్సేధవప్రకారం చ సర్వతః పరిఖావృతమ్ ॥43॥

ఓ బ్రాహ్మణుడా ! పురము, ఖేటకము, ద్రోణీముఖము, శాఖానగరకము, ఖర్వటకము, ద్రమి, గ్రామము, సంఘోషము అను స్థానములను నిర్మించుకొని ఆ ప్రజలు వేరువేరుగా నివాసస్థానములను ఏర్పరచుకొనిరి. వాటిచుట్టూ ఎత్తైన ప్రాకారములను, పరిఖలను (కందకములను) కూడా నిర్మించుకొనిరి.

యోజనార్ధార్ధవిష్కమ్భమష్టభాగాయతం పురమ్ ।
ప్రాగుదక్ప్రవణం శస్తం శుద్ధవంశబహిర్గమమ్ ॥44॥

ఎచ్చట యోజనముయొక్క అర్ధార్ధము అనగా నాల్గవభాగము పొడవు, ఎనిమిదిభాగములు వెడల్పు ఉండునో అట్టి ప్రదేశమునకు పురమని పేరు. దానికి తూర్పు, ఉత్తర భాగములందు నీరు ప్రవహించు భాగము ప్రశస్తము మరియు పరిశుద్ధమైన వంశమందలి వారిచే నివసింపబడినది.

తదర్ధేన తథా ఖేటం తత్పాదేన చ ఖర్వటమ్ ।
న్యూనం ద్రోణీముఖం తస్మాదష్టభాగేన చోచ్యతే ॥45॥

ఆ పురమందలి సగభాగము కలిగిన ప్రదేశము ఖేటమని, నాల్గవ భాగము కలిగిన ప్రదేశము ఖర్వటమని, ఎనిమిదవ భాగముతో న్యూనమైనచో ద్రోణీముఖమని వ్యవహరింపబడును.

ప్రాకారపరిఖాహీనం పురం ఖర్వటముచ్యతే ।
శాఖానగరకం చాన్యన్మంత్రిసామంతభుక్తిమత్ ॥46॥

ప్రహరీగోడలు, కందకాలు లేని పురము ఖర్వటమని పిలువబడుచున్నది. మంత్రులు, సామంతులు, తినుబండారాలు కలిగిన ప్రాంతమే శాఖానగరకమని చెప్పబడుచున్నది.

తథా శూద్రజనప్రాయాః స్వసమృద్ధకృషీవలాః ।
క్షేత్రోపభోగభూమధ్యే వసతిర్గ్రామసంజ్ఞితా ॥47॥

ఎచ్చటయితే శూద్రులు, స్వయంసమృద్ధులైన రైతులు పొలములలో నివసించెదరో అట్టి ప్రాంతమునకు గ్రామమని పేరు.

అన్యస్మాన్నగరాదేర్యా కార్యముద్దిశ్య మానవైః ।
క్రియతే వసతిః సా వై విజ్ఞేయా వసతిర్నరైః ॥48॥

వేరే నగరాల నుంచి ఏదేని పనిమీద వచ్చి మానవులు నివాసము చేయు ప్రదేశము వసతియని తెలియదగినది.

దుష్టప్రాయో వినా క్షేత్రైః పరభూమిచరో బలీ ।
గ్రామ ఏవం ద్రమీసంజ్ఞో రాజవల్లభసంశ్రయః ॥49॥

పొలములు లేనట్టిదీ, దుష్టులతో ఆక్రమింపబడినదీ, ఇతరులభూములను గ్రహించేవారితో కూడినదీ, బలవంతులతో కూడినదీ, రాజుకు ఇష్టమైనవారు నివసించునట్టిదీ అగు గ్రామమునకు ద్రమి యని పేరు.

శకటారూఢభాండైశ్చ గోపాలైర్విపణం వినా ।
గోసమూహైస్తథా ఘోషో యత్రేచ్ఛాభూమికేతనః ॥50॥

గోసమూహములతో కూడుకొన్నట్టిదీ, బండ్లమీది పాత్రలు కలిగిన గోపాలకులతో కూడుకొన్నట్టిదీ, అమ్మకాలు లేనిదీ అగు ప్రాంతము ఘోషమని చెప్పబడుచున్నది.

త ఏవం నగరాదీంస్తు కృత్వా వాసార్థమాత్మనః ।
నికేతనాని ద్వంద్వానాం చక్రుశ్శీతోపశమాయ వై ॥51॥

వారీ విధముగా తమ నివాసార్థమై నగరాదులను నిర్మించి, ఆయా జంటలు నివసించుటకై గృహములను కూడా నిర్మించిరి.

గృహాకారా యథాపూర్వం తేషామాసన్మహీరుహాః ।
తథా సంస్మృత్య తత్సర్వం చక్రుర్వేశ్మాని తాః ప్రజాః ॥52॥

పూర్వము వృక్షములు ఏ విధముగా అయితే గృహస్వరూపములుగా ఉండెనో అదే విధముగా ఆ సమస్తమును గుర్తు చేసుకొని ఆ ప్రజలు గృహములను నిర్మించిరి.

వృక్షస్యైవం గతాః శాఖాస్తథైవం చ పరాగతా ।
నతాశ్చైవోన్నతాశ్చైవ తద్వచ్ఛాఖాః ప్రచక్రిరే ॥53॥

వృక్షముయొక్క కొమ్మలు ఒక్కొక్కవైపు వ్యాపించినట్లు క్రిందికి మీదికి కూడా వ్యాపించి ఉంటాయి. అట్లే ఆ ప్రజలు తాము కట్టిన ఇండ్లయందు శాఖలను అనగా ఆయా భాగములను నిర్మించిరి.

యాః శాఖాః కల్పవృక్షాణాం పూర్వమాసన్ద్విజోత్తమ ।
తా ఏవ శాఖా గేహానాం శాలాత్వం తేన తాసు తత్ ॥54॥

ఓ ద్విజశ్రేష్ఠుడా ! ఏ కొమ్మలయితే కల్పవృక్షములందు పూర్వము ఉండెనో ఆ శాఖలే ఆ ప్రజలు నిర్మించిన ఇండ్లకు గదులు అయినవి.

కృత్వా ద్వంద్వోపఘాతం తే వార్తోపాయమచిన్తయన్ ।
నష్టేషు మధునా సార్ధం కల్పవృక్షేష్వశేషతః ॥55॥

ఈ విధముగా గృహములను నిర్మించుకొన్న ఆ ప్రజలు శీతోష్ణాదిద్వంద్వములను పోగొట్టుకొనిరి. పిమ్మట మధుయుక్తములైన కల్పవృక్షములన్నియు నిశ్శేషముగా నష్టమైపోయినందున జీవనోపాయమును గూర్చి ఆలోచించుట ప్రారంభించిరి.

విషాదవ్యాకులాస్తా వై ప్రజాస్తృష్ణాక్షుధార్దితాః ।
తతః ప్రాదుర్బభౌ తాసాం సిద్ధిస్త్రేతాముఖే తదా ॥56॥

అంతట ఆ ప్రజలు విషాదముతో వ్యాకులమైన చిత్తముగలవారు, ఆకలిదప్పులతో బాధనొందినవారు అయిరి. పిమ్మట త్రేతాయుగ ప్రారంభమందు వారికి సిద్ధి ప్రాదుర్భవించినది.

వార్తా స్వసాధితా హ్యన్యా వృష్టిస్తాసాం నికామతః ।
తాసాం వృష్ట్యుదకానీహ యాని నిమ్నగతాని వై ॥57॥

వృష్ట్యావరుద్ధైరభవన్ స్రోతఃఖాతాని నిమ్నగాః ।
యే పురస్తాదపాం స్తోకా ఆపన్నాః పృథివీతలే ॥58॥

వారి జీవనమును వారే స్వయముగా సాధించుకొనగలిగిరి. వారి ఇష్టానుసారమే వృష్టి సంభవించినది. పల్లానికి జారినట్టి ఆ వర్షపు జలములు వృష్టిచేత అడ్డగింపబడి అచ్చటే లోతైన ప్రవాహములుగా సంతరించుకొన్నవి. ఆ ప్రవాహములే పూర్వము భూమి మీద చిన్న చిన్న నీటి ప్రవాహములుగా ఉండెడివి.

తతో భూమేశ్చ సంయోగాదోషధ్యస్తాస్తదాభవన్ ।
అఫాలకృష్టాశ్చానుప్తా గ్రామ్యారణ్యాశ్చతుర్దశ ॥59॥

ఋతుపుష్పఫలాశ్చైవ వృక్షా గుల్మాశ్చ జజ్ఞిరే ।
ప్రాదుర్భావస్తు త్రేతాయామాద్యోఽయమౌషధస్య తు ॥60॥

అంతట ఆ జలములతో భూమికి సంయోగము ఏర్పడి అనేకరకములైన ఓషధులు అనగా చెట్లు ఉద్భవించినవి. ఎవ్వరూ దున్నకుండానే, నాటకుండానే పధ్నాలుగు రకాల చెట్లు ఉత్పన్నమైనవి. ఆ యా ఋతువులననుసరించి పువ్వులు పండ్లతో నిండిన చెట్లు, పొదలు సిద్ధించినవి. త్రేతాయుగమందు ఓషధుల మొట్టమొదటి ప్రాదుర్భావమిదే.

తేనౌషధేన వర్తన్తే ప్రజాస్త్రేతాయుగే మునే ।
రాగలోభౌ సమాసాద్య ప్రజాశ్చాకస్మికౌ తదా ॥61॥

ఓ మునీ! త్రేతాయుగమందు ఆ ప్రజలు అప్పుడే ఉద్భవించిన రాగలోభములను ఆశ్రయించి పూర్వము చెప్పబడిన ఓషధులతో జీవనము సాగించిరి.

తతస్తాః పర్యగృహ్ణన్త నదీక్షేత్రాణి పర్వతాన్ ।
వృక్షగుల్మౌషధీశ్చైవ మాత్సర్యాచ్చ యథాబలమ్ ॥62॥

పిమ్మట ఆ ప్రజలు వారి వారి బలముననుసరించి మాత్సర్యమును (ద్వేషభావమును) వహించి నదులు, క్షేత్రములు, పర్వతములు, చెట్లు, పొదలు, ఓషధులను ఆక్రమించిరి.

తేన దోషేణ తా నేశురోషధ్యో మిషతాం ద్విజ ।
అగ్రసద్భూర్యుగపత్తాస్తదౌషధ్యో మహామతే ॥63॥

ఆ ప్రజల దోషము కారణముగా వారు చూచుచుండగానే ఆ ఓషధులన్నియు నశించినవి. ఓ బుద్ధిమంతుడా! భూమి ఆ ఓషధులనన్నింటిని ఆహారముగా చేసుకొనెను.

పునస్తాసు ప్రణష్టాసు విభ్రాన్తాస్తాః పునః ప్రజాః ।
బ్రహ్మాణం శరణం జగ్ముః క్షుధార్తాః పరమేష్ఠినమ్ ॥64॥

ఆ ఓషధులన్నియు నష్టమైపోగా ఆశ్చర్యమునొందిన ఆ ప్రజలు ఆకలిచే పీడింపబడినవారై పరమేష్ఠియగు బ్రహ్మదేవుని శరణువేడిరి.

స చాపి తత్త్వతో జ్ఞాత్వా తదా గ్రస్తాం వసుంధరామ్ ।
వత్సం కృత్వా సుమేరుం తు దుదోహ భగవాన్విభుః ॥65॥

ఓషధులనన్నింటిని ఆభూమి మ్రింగివేసిన విషయాన్ని తెలుసుకొని, సర్వవ్యాపకుడూ భగవత్స్వరూపుడూ అగు ఆ బ్రహ్మదేవుడు సుమేరుపర్వతాన్ని ఆ భూమికి దూడగా చేసి ఆ భూమిని పితికెను.

దుగ్ధేయం గౌస్తదా తేన సస్యాని పృథివీతలే ।
జజ్ఞిరే తాని బీజాని గ్రామ్యారణ్యాస్తు తాః పునః ॥66॥

ఔషధ్యః ఫలపాకాన్తా గణాః సప్తదశ స్మృతాః ।
వ్రీహయశ్చ యవాశ్చైవ గోధూమా అణవస్తిలాః ॥67॥

ప్రియఙ్గవః కోవిదారాః కోరదూషాః సతీనకాః ।
మాషా ముద్గా మసూరాశ్చ నిష్పావాః సకులత్థకాః ॥68॥

ఆఢక్యశ్చణకాశ్చైవ శణాః సప్తదశ స్మృతాః ।
ఇత్యేతా ఓషధీనాం తు గ్రామ్యాణాం జాతయః పురా ॥69॥

ఆ బ్రహ్మదేవుడు భూమిని పితకగా ఈ భూమిమీద నానావిధములైన సస్యములు, బీజములు (గింజలు) ఉద్భవించెను. ఫలములనిచ్చు ఓషధులుగా ఆ బీజములు గ్రామములందు, అరణ్యములందు పరిణమించినవి. ఆ ఓషధులు పదిహేడు రకములుగా చెప్పబడినవి. అవి వరుసగా వరిధాన్యము, యవలు, గోధుమలు, నువ్వులు, ఆవాలు, ప్రియంగు ధాన్యవిశేషములు (కొఱ్ఱలు), కోవిదారములు, కోరదూషములు (ఆళ్ళు), సతీనకములు (పెసలు), మినుములు, ముద్గములు, మసూరములు (చిఱుసెనగలు), నిష్పావములు (అనుములు), సకులత్థకములు, ఆఢకులు, చణకములు (సెనగలు), శణములు అని. ఇవియన్నియు గ్రామ్య ఓషధుల జాతి విశేషములు.

ఓషధ్యో యజ్ఞియాశ్చైవ గ్రామ్యారణ్యాశ్చతుర్దశ ।
వ్రీహయశ్చ యవాశ్చైవ గోధూమా అణవస్తిలాః ॥70॥

ప్రియంగుషష్ఠా వై హ్యేతే సప్తమాస్తు కులత్థకాః ।
శ్యామాకాస్త్వథ నీవారా జర్తిలాః సగవేధుకాః ॥71॥

కురువిన్దా మర్కటకాస్తథా వేణుయవాశ్చ యే ।
గ్రామ్యారణ్యాః స్మృతా హ్యేతా ఓషధ్యశ్చ చతుర్దశ ॥72॥

గ్రామ్యములు, ఆరణ్యములగు ఓషధులు యజ్ఞకార్యమందు ఉపయోగించునవి పధ్నాలుగు రకములు. అవి వరుసగా వ్రీహులు, యవలు, గోధుమలు, నువ్వులు, ఆవాలు, ఆరవదియగు ప్రియంగు ధాన్యము, ఏడవదియగు కులత్థకములు, శ్యామాకములు, నీవారములు, జర్తిలములు (అడవి నువ్వులు), గవేధుకములు (అడవి గోధుమలు), కురువిన్దలు, మర్కటకములు, వెదురుధాన్యములు అని. ఈ పధ్నాలుగు ఓషధులు గ్రామ్యములుగాను, ఆరణ్యములుగాను చెప్పబడినవి.

యదా ప్రసృష్టా ఓషధ్యో న ప్రరోహన్తి తాః పునః ।
తతస్స తాసాం వృద్ధ్యర్థం వార్తోపాయం చకార హ ॥73॥

ఒకసారి బ్రహ్మదేవునిచే స్వయముగా సృష్టింపబడిన ఓషధులు తిరిగి మొలకెత్తలేదు. అప్పుడు బ్రహ్మదేవుడు వాటి వృద్ధికొరకు ప్రజల జీవనోపాయముకొరకు ఆలోచన చేసెను.

బ్రహ్మా స్వయంభూర్భగవాన్ హస్తసిద్ధిం చ కర్మజామ్ ।
తతః ప్రభృత్యథౌషధ్యః కృష్టపచ్యాస్తు జజ్ఞిరే ॥74॥

అంతట భగవత్స్వరూపుడు, స్వయంభువు అగు బ్రహ్మదేవుడు కర్మలవలన అనగా ఆయా పనులవల్ల పుట్టే హస్తసిద్ధిని (చేతుల ద్వారా నెరవేరే కార్యసిద్ధి లేదా చేతులందు ఫలజనకమైన సిద్ధిని) చేసెను. అప్పటినుండి భూమిని దున్నుటద్వారా లభించే ఓషధులు ఉత్పన్నమైనవి.

సంసిద్ధాయాం తు వార్తాయాం తతస్తాసాం స్వయం ప్రభుః ।
మర్యాదాం స్థాపయామాస యథాన్యాయం యథాగుణమ్ ॥75॥

ప్రజల జీవనోపాయము నెరవేరగా, ప్రభువగు బ్రహ్మదేవుడు స్వయముగా ఆ ప్రజలకు న్యాయానుగుణముగానూ, వారి గుణానుసారముగానూ హద్దులను అనగా నియమములను స్థాపించెను.

వర్ణానామాశ్రమాణాం చ ధర్మాన్ ధర్మభృతాం వర ।
లోకానాం సర్వవర్ణానాం సమ్యగ్ధర్మార్థపాలినామ్ ॥76॥

ప్రాజాపత్యం బ్రాహ్మణానాం స్మృతం స్థానం క్రియావతామ్ ।
స్థానమైన్ద్రం క్షత్రియాణాం సంగ్రామేష్వపలాయినామ్ ॥77॥

వైశ్యానాం మారుతం స్థానం స్వధర్మమనువర్తతామ్ ।
గాంధర్వం శూద్రజాతీనాం పరిచర్యానువర్తినామ్ ॥78॥

అష్టాశీతిసహస్రాణామృషీణామూర్ధ్వరేతసామ్ ।
స్మృతం తేషాం తు యత్ స్థానం తదేవ గురువాసినామ్ ॥79॥

సప్తర్షీణాం తు యత్ స్థానం స్మృతం తద్వై వనౌకసామ్ ।
ప్రాజాపత్యం గృహస్థానాం న్యాసినాం బ్రహ్మణః క్షయమ్ ।
యోగినామమృతం స్థానమితి వై స్థానకల్పనా ॥80॥

ఓ ధర్మపరాయణులలో గొప్పవాడా! బ్రాహ్మణక్షత్రియాది ఆయా వర్ణములవారికి, గార్హస్థ్యము సన్న్యాసము మొదలగు ఆయా ఆశ్రమముల వారికి, ధర్మార్థములను పరిపాలించు సమస్తప్రజలకు బ్రహ్మదేవుడు ధర్మములను నిర్దేశించెను. బ్రాహ్మణులకు ప్రాజాపత్యమును, యుద్ధమందు పారిపోనట్టి క్షత్రియులకు ఐంద్రస్థానమును, స్వీయధర్మమును పరిపాలించు వైశ్యులకు మారుతస్థానమును, సేవాపరాయణులగు శూద్రులకు గాంధర్వస్థానమును నియమించెను. ఎనభైఎనిమిదివేల పవిత్రులగు ఋషులకు ఎట్టి స్థానము స్మరింపబడినదో అట్టి స్థానమే గురుకులవాసులకు కల్పింపబడినది. సప్తర్షులకు ఎట్టి స్థానము స్మరింపబడినదో అట్టి స్థానమే వనవాసులకు కల్పింపబడినది. గృహస్థులకు ప్రాజాపత్యస్థానము, సన్న్యాసులకు బ్రహ్మలోకప్రాప్తి (క్షి నివాసగత్యోః అను తౌదాదికధాతువునుండి క్షయశబ్దము నిష్పన్నమైనది), యోగులకు అమృతమైన మోక్షసిద్ధి కల్పించబడినది.

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే సృష్టిప్రకరణే షట్చత్వారింశోఽధ్యాయః ॥46॥

శ్రీ మార్కండేయ మహాపురాణమందలి సృష్టిప్రకరణమను నలుబదిఆరవ అధ్యాయం సమాప్తం.



‘

సప్తచత్వారింశోఽధ్యాయః – నలుబదియేడవ అధ్యాయం

యక్ష్మానుశాసనమ్ – యక్ష్మానుశాసనం

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

తతోఽభిధ్యాయతస్తస్య జజ్ఞిరే మానసీః ప్రజాః ।
తచ్ఛరీరసముత్పన్నైః కార్యైస్తైః కారణైస్సహ ॥1॥

ఆ బ్రహ్మదేవుడు ధ్యానములో ఉండగా అతడి శరీరమునుండి ఉత్పన్నములైన కార్యకారణములతో కూడుకొని మానసప్రజలు బ్రహ్మదేవుని నుండి ఉత్పన్నమయ్యారు.

క్షేత్రజ్ఞాః సమవర్తన్త గాత్రేభ్యస్తస్య ధీమతః ।
తే సర్వే సమవర్తన్త యే మయా ప్రాగుదాహృతాః ॥2॥

జ్ఞానియగు బ్రహ్మదేవుని అవయవములనుండి క్షేత్రజ్ఞులు అనగా జీవులు ఉత్పన్నమయిరి. వారందరి గురించి నేనింతకుముందే నీకు చెప్పితిని.

దేవాద్యాః స్థావరాన్తాశ్చ త్రైగుణ్యవిషయాః స్మృతాః ।
ఏవం భూతాని సృష్టాని స్థావరాణి చరాణి చ ॥3॥

దేవతలు మొ॥కొని స్థావరములవరకు (చెట్లు, పర్వతములు మొదలగు కదలని పదార్థాలు) సృష్టింపబడినవి అన్నీ కూడా సత్త్వరజస్తమోగుణసంపన్నములుగా స్మరింపబడినవి. ఈ విధముగా స్థావరజంగమాత్మకమైన భూతములు బ్రహ్మదేవునిచే సృష్టింపబడినవి.

యదాస్య తాః ప్రజాస్సర్వా న వ్యవర్ధన్త ధీమతః ।
అథాన్యాన్మానసాన్పుత్రాన్ సదృశానాత్మనోఽసృజత్ ॥4॥

తాను సృష్టించిన ప్రజలు అందరు ఎప్పుడైతే వృద్ధి చెందలేదో అప్పుడు బ్రహ్మదేవుడు తనతో సమానమైన మానసపుత్రులను సృష్టించెను.

భృగుం పులస్త్యం పులహం క్రతుమఙ్గిరసం తథా ।
మరీచిం దక్షమత్రిం చ వసిష్ఠం చైవ మానసమ్ ॥5॥

నవ బ్రహ్మాణ ఇత్యేతే పురాణే నిశ్చయం గతాః ।

భృగువు, పులస్త్యుడు, పులహుడు, క్రతువు, అంగిరసుడు, మరీచి, దక్షుడు, అత్రి, వసిష్ఠుడు ఈ తొమ్మిదిమంది బ్రహ్మదేవుని మానసపుత్రులుగా పురాణములందు నిశ్చయింపబడిరి.

తతోఽసృజత్పునర్బ్రహ్మా రుద్రం క్రోధాత్మసంభవమ్ ॥6॥

సంకల్పం చైవ ధర్మం చ పూర్వేషామపి పూర్వజమ్ ।
సనందనాదయో యే చ పూర్వం సృష్టాః స్వయంభువా ॥7॥

అటు పిమ్మట బ్రహ్మదేవుడు క్రోధముతో కూడిన తన శరీరము నుండి రుద్రుని ఉత్పన్నము చేసెను. అన్నింటికంటే ముందు సంకల్పమును, ధర్మమును ఉత్పన్నము చేసెను. ముందుగా స్వయంభు అగు బ్రహ్మ సనందనుడు మొ॥గు వారిని సృష్టించెను.

న తే లోకేషు సజ్జన్తో నిరపేక్షాః సమాహితాః ।
సర్వే తేఽ నాగతజ్ఞానా వీతరాగా విమత్సరాః ॥8॥

ఆ సనందనాదులు లోకవ్యవహారములందు నిమగ్నులు కారు. దేనినీ అపేక్షించరు. ఎల్లప్పుడూ ఏకాగ్రచిత్తులై ఉందురు. వారందరు భవిష్యత్తును ఎరిగినవారు, కోరికలు మాత్సర్యము లేనివారు.

తేష్వేవం నిరపేక్షేషు లోకసృష్టౌ మహాత్మనః ।
బ్రహ్మణోఽ భూన్మహాక్రోధః తత్రోత్పన్నోఽ ర్కసన్నిభః ॥9॥

అర్ధనారీనరవపుః పురుషోఽ తిశరీరవాన్ ।
విభజాత్మానమిత్యుక్త్వా స తదాఽ న్తర్దధే తతః ॥10॥

మహాత్ముడగు బ్రహ్మదేవుని సృష్టియందు ఆ సనందనాదులు నిరపేక్షులై ఉండగా అనగా పట్టించుకోకుండా ఆసక్తిలేనివారై ఉండగా బ్రహ్మదేవునికి మహాక్రోధము కలిగెను. ఆ మహాక్రోధమునుండి సూర్యునితో సమానమైన, సగము స్త్రీ సగము పురుషుడు శరీరము కలిగి పెద్ద శరీరము కలిగిన పురుషుడు జన్మించెను. పిమ్మట బ్రహ్మదేవుడు "నీ శరీరమును రెండుగా విభజించుము" అని ఆ పురుషునితో పలికి అంతర్ధానము చెందెను.

స చోక్తో వై పృథక్ స్త్రీత్వం పురుషత్వం తథాఽ కరోత్ ।
బిభేద పురుషత్వం చ దశధా చైకధాం తు సః ॥11॥

ఈ విధముగా బ్రహ్మదేవునిచేత ఆదేశించబడిన ఆ పురుషుడు తన దేహమును స్త్రీపురుషులుగా వేరువేరుగా చేసెను. అందులో పురుషత్వమును అనగా పురుషరూపమును పదకొండు విధములుగా విభజించెను.

సౌమ్యాసౌమ్యైస్తథా శాన్తైః పుంస్త్వం స్త్రీత్వం చ స ప్రభుః ।
బిభేద బహుధా దేవః పురుషైరమితైశ్శితైః ॥12॥

అటు పిమ్మట ప్రభువగు బ్రహ్మదేవుడు స్త్రీపురుషరూపములను సౌమ్యములు, క్రూరములు, శాన్తములు, పురుషులు, తెలుపు, నలుపు మొ॥లగు అనగా రూపములుగా విభజించెను.

తతో బ్రహ్మాత్మసంభూతం పూర్వం స్వాయంభువం ప్రభుః ।
ఆత్మనః సదృశం కృత్వా ప్రజాపాల్యే మనుం ద్విజ ॥13॥

శతరూపాం చ తాం నారీం తపోనిర్ధూతకల్మషామ్ ।
స్వాయంభువో మనుర్దేవః పత్నీత్వే జగృహే విభుః ॥14॥

ఓ ద్విజుడా ! పిమ్మట ప్రభువగు బ్రహ్మదేవుడు తన నుండి జన్మించిన, తనతో సమానమైన స్వాయంభువుడు అగు మనువును ప్రజాపరిపాలకునిగా చేసెను. ఇంకను తపస్సులచేత పాపములను పోగొట్టుకొనిన శతరూపయను

స్త్రీని కూడా సృష్టించగా ఆమెను విభువు, దేవుడూ అగు స్వాయంభువమనువు భార్యగా స్వీకరించెను. (స్వయంభూ అగు బ్రహ్మనుండి జన్మించినవాడు స్వాయంభువుడు)

తస్మాచ్చ పురుషాత్పుత్రౌ శతరూపా వ్యజాయత ।
ప్రియవ్రతోత్తానపాదౌ ప్రఖ్యాతావాత్మకర్మభిః ॥15॥

ఆ స్వాయంభువపురుషుని వలన శతరూప, తమ కర్మలవలన ప్రఖ్యాతులైన ప్రియవ్రతుడు, ఉత్తానపాదుడు అను ఇద్దరు కుమారులను కనెను.

కన్యే ద్వే చ తథాకూతిం ప్రసూతిం చ తతః పితా ।
దదౌ ప్రసూతిం దక్షాయ తథాకూతిం రుచేః పురా ॥16॥

ఇద్దరు కుమారులనేకాక శతరూప ఆకూతి, ప్రసూతియను ఇద్దరు కుమార్తెలను కూడా కనెను. అంతట తండ్రియగు స్వాయంభువమనువు ప్రసూతిని దక్షునికి, ఆకూతిని ప్రజాపతియగు రుచికి ఇచ్చి పెండ్లి చేసెను.

ప్రజాపతిః స జగ్రాహ తయోర్యజ్ఞః సదక్షిణః ।
పుత్రో జజ్ఞే మహాభాగ దంపతీమిథునం తతః ॥17॥

ప్రజాపతియగు రుచికి ఆకూతియందు యజ్ఞుడు అను కుమారుడు, దక్షిణయను కుమార్తె కలిగిరి. ఓ మహాభాగా! వీరిరువురు అనగా యజ్ఞుడు, దక్షిణలు దాంపత్యభావమును వహించిరి.

యజ్ఞస్య దక్షిణాయాం తు పుత్రా ద్వాదశ జజ్ఞిరే ।
యామా ఇతి సమాఖ్యాతా దేవాః స్వాయంభువేఽన్తరే ॥18॥

తస్య పుత్రాస్తు యజ్ఞస్య దక్షిణాయాం సుభాస్వరాః ।

యజ్ఞునికి దక్షిణయందు పన్నెండుగురు కుమారులు కలిగిరి. వారు స్వాయంభువమన్వంతరమందు యాములను దేవతలుగా ప్రసిద్ధి పొందిరి. దక్షిణయందు పుట్టినవారైన ఆ యజ్ఞపురుషుని పుత్రులు మిక్కిలి తేజస్సుగలవారు.

ప్రసూత్యాం చ తథా దక్షశ్చతస్రో వింశతిస్తథా ॥19॥

ససర్జ కన్యాస్తాసాం చ సమ్యఙ్నామాని మే శృణు ।
శ్రద్ధా లక్ష్మీర్ధృతిస్తుష్టిః పుష్టిర్మేధా క్రియా తథా ॥20॥

బుద్ధిర్లజ్జా వపుః శాన్తిః సిద్ధిః కీర్తిస్త్రయోదశీ ।
పత్న్యర్థే ప్రతిజగ్రాహ ధర్మో దాక్షాయణీః ప్రభుః ॥21॥

అట్లే దక్షప్రజాపతివలన ప్రసూతియందు ఇరువదినలుగురు కన్యలు జన్మించిరి. వారి పేర్లను చెప్పెదను, శ్రద్ధగా వినుము. వారు వరుసగా శ్రద్ధ, లక్ష్మి, ధృతి, తుష్టి, పుష్టి, మేధ, క్రియ, బుద్ధి, లజ్జ, వపు, శాంతి, సిద్ధి, కీర్తి అను పదముగ్గురు కన్యలు. ఈ పదముగ్గురు కన్యలను ధర్ముడు తన భార్యలుగా స్వీకరించెను.

తాభ్యః శిష్టా యవీయస్య ఏకాదశ సులోచనాః ।
ఖ్యాతిః సత్యథ సంభూతిః స్మృతిః ప్రీతిస్తథా క్షమా ॥22॥
సన్నతిశ్చానసూయా చ ఊర్జా స్వాహా స్వధా తథా ।

మిగిలిన పదునొకండు మంది వయస్సులో చిన్నవారైన కన్యలు అందమైనవారు. వారు వరుసగా ఖ్యాతి, సతి, సంభూతి, స్మృతి, ప్రీతి, క్షమ, సన్నతి, అనసూయ, ఊర్జ, స్వాహ, స్వధ, అను పేర్లు గలవారు.

భృగుర్భవో మరీచిశ్చ తథా చైవాఙ్గిరా మునిః ॥23॥

పులస్త్యః పులహశ్చైవ క్రతుశ్చ ఋషయస్తథా ।
వసిష్ఠోఽత్రిస్తథా వహ్నిః పితరశ్చ యథాక్రమమ్ ॥24॥

ఖ్యాత్యాద్యా జగృహుః కన్యా మునయో మునిసత్తమాః ।

మునిశ్రేష్ఠులైన భృగువు, భవుడు(శివుడు), మరీచి, అంగిరసుడు, పులస్త్యుడు, పులహుడు, క్రతువు, వసిష్ఠుడు, అత్రి, వహ్ని, పితృదేవతలు వరుసగా ఖ్యాతి మొదలగు పదునొకండు కన్యలను వివాహమాడిరి.

శ్రద్ధా కామం శ్రీశ్చ దర్పం నియమం ధృతిరాత్మజమ్ ॥25॥

సంతోషం చ తథా తుష్టిర్లోభం పుష్టిరజాయత ।
మేధా శ్రుతం క్రియా దణ్డం నయం వినయమేవ చ ॥26॥

బోధం బుద్ధిస్తథా లజ్జా వినయం వపురాత్మజమ్ ।
వ్యవసాయం ప్రజజ్ఞే వై క్షేమం శాన్తిరసూయత ॥27॥

సుఖం సిద్ధిర్యశః కీర్తిరిత్యేతే ధర్మయోనయః ।
కామాదతిముదం హర్షం ధర్మపౌత్రమసూయత ॥28॥

ముందుగా చెప్పబడిన పదముగ్గురు కన్యలలో శ్రద్ధ కామమును, లక్ష్మి దర్పమును, ధృతి నియమమును, తుష్టి సంతోషమును, పుష్టి లోభమును, మేధ శ్రుతము అనగా వేదవిద్యను, క్రియ దండము నీతి వినయములను, బుద్ధి బోధను, లజ్జ వినయమును, వపువు వ్యవసాయమును, శాంతి క్షేమమును, సిద్ధి సుఖమును, కీర్తి యశస్సును ఉత్పన్నము చేసిరి. కామము మొదలగు ఈ పదముగ్గురు ధర్మునికి శ్రద్ధ మొదలగు పదముగ్గురియందు జన్మించిరి. కామమువలన అతిముదముగల హర్షుడను పేరుగలవానిని శ్రద్ధ ప్రసవించినది. ఈ హర్షుడు ధర్మునికి పౌత్రస్థానీయుడు.

హింసా భార్యా త్వధర్మస్య తస్యాం జజ్ఞే తథానృతమ్ ।
కన్యా చ నిరృతిస్తస్యాం సుతౌ ద్వౌ నరకం భయమ్ ॥29॥

మాయా చ వేదనా చైవ మిథునం ద్వయమేతయోః ।

అధర్ముని భార్య హింస. ఆమె గర్భమునుండి అనృతుడు అను పుత్రుడు, నిరృతియను కుమార్తె ఉద్భవించిరి. నిరృతికి నరకుడు, భయుడు అను ఇద్దరు పుత్రులు జన్మించిరి. వీరిరువురికి వరుసగా మాయ, వేదన యనువారు మిథునములు అనగా భార్యలు.

తయోర్జజ్ఞేఽథ వై మాయా మృత్యుం భూతాపహారిణమ్ ॥30॥

వేదనాఽత్మసుతం చాపి దుఃఖం జజ్ఞేఽథ రౌరవాత్ ।
మృత్యోర్వ్యాధిజరాశోకతృష్ణాక్రోధాశ్చ జజ్ఞిరే ॥31॥

దుఃఖోద్భవాః స్మృతా హ్యేతే సర్వే వాధర్మలక్షణాః ।
నైషాం భార్యాస్తి పుత్రో వా సర్వే తే హ్యూర్ధ్వరేతసః ॥32॥

ఆ ఇరువురిలో మాయ ప్రాణులను హరించు మృత్యువును ప్రసవించినది. వేదన రౌరవునినుండి దుఃఖమను కుమారుని ప్రసవించినది. మృత్యువు వలన వ్యాధి, ముసలితనము, శోకము, తృష్ణ, క్రోధములు పుట్టినవి. అట్లుకాక అధర్మలక్షణములు గల అవియన్నియు దుఃఖమువలన పుట్టినవిగా కూడా స్మరింపబడినవి. వీరందరు ఊర్ధ్వరేతస్సులు అనగా నైష్ఠికబ్రహ్మచర్యము వహించినవారు గావున వీరికి భార్యలు గాని సంతానము గాని లేరు.

నిరృతిశ్చ తథా చాన్యా మృత్యోర్భార్యాఽభవన్మునే ।
అలక్ష్మీర్నామ తస్యాం చ మృత్యోః పుత్రాశ్చతుర్దశ ॥33॥

అలక్ష్మీపుత్రకా హ్యేతే మృత్యోరాదేశకారిణః ।
వినాశకాలేషు నరాన్భజన్త్యేతే శృణుష్వ తాన్ ॥34॥

ఓ మునీ! మృత్యువుకు నిరృతియను మరొక భార్య కూడా ఉన్నది. ఆమెయే అలక్ష్మియని పేరుగలది. ఆమెయందు మృత్యువుకు పదునాలుగురు కుమారులు కలిగిరి. వారు అలక్ష్మీపుత్రకులని ప్రసిద్ధిని పొందిరి. వీరందరు తమ తండ్రియగు మృత్యువు ఆజ్ఞను పరిపాలించువారు. ప్రాణుల వినాశకాలమందు వీరందరు ప్రాణులను ఎట్లు ఆశ్రయింతురో చెప్పెదను, వినుము.

ఇంద్రియేషు దశస్వేతే తథా మనసి చ స్థితాః ।
స్వే స్వే నరం స్త్రియం వాఽపి విషయే యోజయన్తి హి ॥35॥

వీరు ప్రాణుల పది ఇంద్రియములందు (అయిదు జ్ఞానేంద్రియాలు, అయిదు కర్మేంద్రియాలు) నివసించువారై, స్త్రీపురుషులను ఆయా విషయములందు లగ్నము చేసెదరు.

అథేన్ద్రియాణి చాఽక్రమ్య రాగక్రోధాదిభిర్నరాన్ ।
యోజయన్తి యథా హానిం యాన్త్యధర్మాదిభిర్ద్విజ ॥36॥

ఓ ద్విజుడా! ఇంకను వారు ప్రాణుల ఇంద్రియాలను ఆక్రమించి రాగక్రోధాదులతో మానవులను సంయోగింపచేసెదరు. అందువలన వారు అధర్మాదుల వలన హానిని పొందెదరు.

అహంకారగతాశ్చాన్యే తథాఽన్యే బుద్ధిసంశ్రితాః ।
వినాశాయ నరస్త్రీణాం యతన్తే మోహసంశ్రితాః ॥37॥

కొందరు ప్రాణుల అహంకారమందుండి, కొందరు బుద్ధియందుండి, మోహమును ఆశ్రయించి స్త్రీపురుషుల వినాశము కొరకు ప్రయత్నించెదరు.

తథైవాన్యో గృహే పుంసాం దుస్సహో నామ విశ్రుతః ।
క్షుత్క్షామోఽధోముఖో నగ్నశ్చీరీ కాకసమస్వనః ॥38॥

మరొకడు ఇండ్లలో పురుషుల గృహములలో నివసించువాడు, దుస్సహుడను పేరుతో ప్రసిద్ధుడైనవాడు, ఆకలితో క్షీణించినవాడు, క్రిందకు వంచిన ముఖము గలవాడు, దిగంబరుడు, చినిగినబట్ట ధరించినవాడు, కాకి గొంతువంటి గొంతు (కంఠస్వరము) గలవాడు ఉన్నాడు.

స సర్వాన్ ఖాదితుం సృష్టో బ్రహ్మణా తమసో నిధిః ।
దంష్ట్రాకరాళమత్యర్థం వివృతాస్యం సుభైరవమ్ ॥39॥

తమత్తుకామమాహేదం బ్రహ్మా లోకపితామహః ।
సర్వబ్రహ్మమయః శుద్ధః కారణం జగతోఽవ్యయః ॥40॥

అంధకారమునకు స్థానమైన ఆ దుస్సహుడు సమస్తమును భక్షించుటకొరకే బ్రహ్మచేత సృష్టించబడ్డాడు. పెద్ద పెద్ద భయంకరమైన కోరలు కలిగి, నోరు తెరచుకొని, భయానకరూపము కలిగి, సమస్తమును భక్షించుటకు సిద్ధమైన ఆ దుస్సహుని గూర్చి లోకపితామహుడు, సర్వబ్రహ్మమయుడు, పరిశుద్ధుడు, జగత్కారణుడు, నాశము లేనివాడు అగు బ్రహ్మదేవుడు ఇట్లు పలికెను.

బ్రహ్మోవాచ – బ్రహ్మ చెప్పాడు.

నాఽత్తవ్యం తే జగదిదం జహి కోపం శమం వ్రజ ।
త్యజైనాం తామసీం వృత్తిమపాస్య రజసః కలామ్ ॥41॥

ఓ దుస్సహుడా ! ఈ జగత్తునంతయు నీవు భక్షించుట నీకు తగదు. కోపమును విడువుము, శాంతస్వభావమును వహించుము. తామసస్వభావమును, రజోగుణముయొక్క అంశను విడువుము.

దుస్సహ ఉవాచ – దుస్సహుడు చెప్పాడు.

క్షుత్క్షామోఽస్మి జగన్నాథ పిపాసుశ్చాపి దుర్బలః ।
కథం తృప్తిమియాం నాథ భవేయం బలవాన్ కథమ్ ।
కశ్చాశ్రయో మమాఖ్యాహి వర్తేయం యత్ర నిర్వృతః ॥42॥

ఓ జగన్నాథా! ఆకలిచే కృశించితిని. దాహముచే దుర్బలుడను అయితిని. ఓ నాథా! ఏ విధముగా తృప్తిని పొందగలను? ఎట్లు బలవంతుడను కాగలను? నాకు దిక్కెవరు? ఎచ్చట నేను సంతోషముగా ఉండగలను?

బ్రహ్మోవాచ – బ్రహ్మ చెప్పాడు.

తవాశ్రయో గృహం పుంసాం జనశ్చాధార్మికో బలమ్ ।
పుష్టిర్నిత్యక్రియాహాన్యా భవాన్ వత్స గమిష్యతి ॥43॥

ఓ వత్సా! పురుషుల గృహమే నీకు ఆశ్రయము. అధార్మికమైన జనమే నీకు బలము. జనుల నిత్యక్రియలను నష్టపరచుట చేతనే నీకు పుష్టి కలుగును.

లూతాః స్ఫోటాశ్చ తే వస్త్రమాహారం చ దదామి తే ।
క్షుతకీటావపన్నం చ తథా శ్వభిరవేక్షితమ్ ॥44॥

భగ్నభాండగతం తద్వన్ముఖవాతోపశామితమ్ ।
ఉచ్ఛిష్టాపక్వమస్విన్నమవలీఢమసంస్కృతమ్ ॥45॥

భగ్నాసనస్థితైర్భుక్తమాసన్నాగతమేవ చ ।
విదిఙ్ముఖం సంధ్యయోశ్చ నృత్యవాద్యస్వనాకులమ్ ॥46॥

ఉదక్యోపహతం భుక్తముదక్యా దృష్టమేవ చ ।
యచ్చోపఘాతవత్కించిద్భక్ష్యం పేయమథాపి వా ॥47॥

ఏతాని తవ పుష్ట్యర్థమన్యచ్చాపి దదామి తే ।

కీటములు, కాలినపుళ్ళు, నీకు శరీరముపై కప్పుకొనే వస్త్రములు. నీకు ఆహారమును కూడా ఇచ్చుచున్నాను. అది ఏమి అనగా తుమ్ములతోనూ, కీటములతోను సంబంధం కలిగినది, కుక్కలు చూచినది, పగిలిన పాత్రలందు ఉంచబడినది, నోటితో ఊదుతూ చల్లబరచిన ఆహారపదార్థములు, ఎంగిలి చేసినవి, సరిగా ఉడకనివి, పూర్తిగా ఉడకక కఠినముగా ఉన్నది, నాకబడినది, సంస్కరింపబడనిది, విరిగిన ఆసనములపై కూర్చొని తినబడినది, కూర్చొన్న ఆసనములపై పడినది ("ఆసన్దిగతం" అని పాఠాంతరము), సంధ్యాసమయాల్లో నిషిద్ధమైన దిక్కున కూర్చొని తినబడినది, నృత్యవాద్యధ్వనులతో కూడుకొని ఏకాగ్రత లేక తినబడినది, ఋతుకాలమందు స్త్రీచే తినబడిన లేదా చూడబడిన పదార్థములు, పాడయిన ఘనపదార్థములు గాని ద్రవపదార్థములుగాని ఇవి అన్నియు నీకు పుష్టికారకములగును. ఈ పదార్థములే గాక ఇంకనూ మరికొన్ని పదార్థములను నీ పుష్టికొరకు ఇచ్చెదను.

అశ్రద్ధయా హుతం దత్తమస్నాతైర్యదవజ్ఞయా ॥48॥

యన్నామ్బుపూర్వకం క్షిప్తమనాత్మీకృతమేవ చ ।
త్యక్తుమావిష్కృతం యత్తు దత్తం చైవాతివిస్మయాత్ ॥49॥

దుష్టం క్రుద్ధార్తదత్తం చ యక్ష్మన్ ప్రాప్స్యసి తత్ఫలమ్ ।

ఓ యక్ష్మా ! శ్రద్ధ లేకుండా హోమము చేయబడినది, స్నానము చేయక అవమానపరచు ధోరణితో ఈయబడినది, జలసంస్కారము లేక ఈయబడినది, తనదిగా భావించబడనిది అనగా దానముగా ఈయబడిన

నిరుపయోగవస్తువులు, పారవేయాలని భావించబడిన వస్తువులు, సహజముగా కాక అతివిస్మయముతో ఈయబడిన వస్తువులు, దోషభూయిష్ఠమైనది, కోపముతోనూ, బాధతోను దానముగా ఈయబడిన వస్తువులు వీటి ఫలమును నీవు పొందగలవు.

యచ్చ పౌనర్భవః కిఞ్చిత్కరోత్యాముష్మికం క్రమమ్ ॥50॥

యచ్చ పౌనర్భవా యోషిత్తద్యక్ష్మ తవ తృప్తయే ।
కన్యాశుల్కోపధానాయ సముపాస్తే ధనక్రియాః ॥51॥

తథైవ యక్ష్మ పుష్ట్యర్థ్యమసచ్ఛాస్త్రక్రియాశ్చ యాః ।
యచ్చార్థనిర్వృతౌ కిఞ్చిదధీతం యన్న సత్యతః ॥52॥

తత్సర్వం తవ కామాంశ్చ దదామి తవ సిద్ధయే ।

(ముందు పౌనర్భవః, పౌనర్భవా శబ్దములకు అర్థము చెప్పబడుచున్నది. భర్త వదిలివేసిన స్త్రీకిగాని, విధవకుగాని పుట్టినవాడు పౌనర్భవుడు. అట్లు పుట్టిన స్త్రీ పౌనర్భవ.) ఓ యక్ష్మా ! పౌనర్భవుడుగాని, పౌనర్భవస్త్రీగాని పరలోక సంబంధమైన కార్యములు ఆచరించినట్లయిన, అట్టి కార్యములు నీకు తృప్తిని కలిగించును. కన్యాశుల్కము కొరకై ధనసంపాదనార్థమై ఆచరింపబడే కార్యములు, అట్లే శాస్త్రవిరుద్ధముగా ఆచరింపబడే కార్యములు, భోగముకొరకు మాత్రమే చదువబడిన విద్య, శాస్త్రముకొరకు చదువబడనట్టి విద్య వీటినన్నింటినీ సిద్ధిని పొందించుటకై నీకు ఇచ్చెదను. ఈ విధముగా నీ కోరికలనన్నింటినీ తీర్చెదను.

గుర్విణ్యభిగమే సంధ్యా నిత్యకార్యవ్యతిక్రమే ॥53॥

అసచ్ఛాస్త్రక్రియాలాపదూషితేషు చ దుస్సహ ।
తవాభిభవసామర్థ్యం భవిష్యతి సదా నృషు ॥54॥

ఓ దుస్సహా ! గర్భవతులగు స్త్రీలతో సంభోగించువారు, నిత్యకార్యములు అతిక్రమింపబడిన సంధ్యాసమయము గలవారు, నాస్తికదర్శనములు చెప్పువాటిని ఆచరిస్తూ దూషింపబడినవారు అట్టి జనులను ఎదుర్కొనే సామర్థ్యము నీకు లభించగలదు.

పంక్తిభేదే వృథాపాకే పాకభేదే తథా కృతే ।
నిత్యం చ గేహకలహే భవితా వసతిస్తవ ॥55॥

పంక్తిభేదమందు (ఒకచోట కూర్చోపెట్టవలసినవాళ్ళని అలా కూర్చోపెట్టక అందరినీ కలిపి కూర్చోపెట్టుట), వ్యర్థముగా వంట చేయుచోట, పాకభేదమందు (వంటను పాడుచేయుట), ఇంటి తగవులు ఎల్లప్పుడు ఉండే ప్రదేశమందు నీ నివాసమెల్లప్పుడు ఉండును.

అపోష్యమాణే చ తథా భృత్యగోవాహనాదికే ।
అసంధ్యాభ్యుక్షితాగారే కాలే త్వత్తో భయం నృణామ్ ॥56॥

సేవకులు, బండ్లను మోయు ఎద్దులు మున్నగు జంతువులు ఎచ్చట ఆహారముతో పోషింపబడవో మరియు సంధ్యాసమయానికి ఎచ్చట ఇల్లు శుభ్రము చేయబడదో అచ్చట జనులకు నీవలన భయం కలుగును.

నక్షత్రగ్రహపీడాసు త్రివిధోత్పాతదర్శనే ।
అశాంతికపరాన్మర్త్యాన్నరానభిభవిష్యసి ॥57॥

నక్షత్రములు, గ్రహాలవల్ల పీడలు సంభవించినప్పుడు, ఆధ్యాత్మిక ఆధిదైవిక ఆధిభౌతికములైన మూడు విధములగు ఉత్పాతములు (అరిష్టములు) సంభవించినప్పుడు ఏ మానవులయితే వాటిని దూరము చేసుకొనుటకు శాంతులు జరుపరో అట్టివారిని నీవు కనుమరుగు చేయుదువు.

వృథోపవాసినో మర్త్యా ద్యూతస్త్రీషు సదా రతాః ।
త్వద్భాషణోపకర్తారో బైడాలవ్రతికాశ్చ యే ॥58॥

వ్యర్థముగా ఉపవాసము చేయువారు, జూదమందు, పరాయి స్త్రీలయందు ఆసక్తిగలవారు, నీ మాటననుసరించి ఉపకారములు చేయువారు, మతమూఢవిశ్వాసములుగలవారు ఎవరు గలరో వారిని నీవు ఎదుర్కొని వశపరచుకొన గలవు.

అబ్రహ్మచారిణాధీతమిజ్యా చావిదుషా కృతా ।
తపోవనే గ్రామ్యభుజాం తథైవానిర్జితాత్మనామ్ ॥59॥

బ్రాహ్మణక్షత్రియవిశాం శూద్రాణాం చ స్వకర్మతః ।
పరిచ్యుతానాం యా చేష్టా పరలోకార్థమీప్సతామ్ ॥60॥

తస్యాశ్చ యత్ఫలం సర్వం తత్తే యక్షన్ భవిష్యతి ।
అన్యచ్చ తే ప్రయచ్ఛామి పుష్ట్యర్థం సంనిబోధ తత్ ॥61॥

ఓ యక్ష్మా! బ్రహ్మచారులు కానివారు చేసిన వేదాధ్యయనము, పండితుడు కానివాడు చేసిన యాగము, తపోవనమందు ఉంటూ కందమూలాదులు భుజించక గ్రామమందలి వస్తువులను సంపాదించి భుజించువారు, మనోనిగ్రహము లేనివారు, బ్రాహ్మణక్షత్రియవైశ్యశూద్రులు తమకు విధింపబడిన కర్మలనుండి భ్రష్టులై ఉత్తమలోకముల కొరకు యత్నించువారు వాటి అన్నింటి ఫలము, నీకు కలుగగలదు. ఇంతే కాక నీ పుష్టికొరకు మరొకదానిని కూడా ఇచ్చెదను, బాగుగా తెలుసుకొనుము.

భవతో వైశ్వదేవాన్తే నామోచ్చారణపూర్వకమ్ ।
ఏతత్తవేతి దాస్యన్తి భవతో బలిమూర్జితమ్ ॥62॥

యః సంస్కృతాశీ విధివచ్ఛుచిరన్తస్తథా బహిః ।
అలోలుపో జితస్త్రీకస్తద్గేహమపవర్జయ ॥63॥

ఎవరు వైశ్వదేవముయొక్క చివర (వైశ్వదేవమనగా ఇంటికి వచ్చిన అతిథులను దేవతలుగా భావించి వారికి భోజనము పెట్టుట) నీ పేరును పలికి "ఇది నీ కొరకు" అని గొప్ప బలిని ఇచ్చెదరో, ఎవరయితే సంస్కరింపబడిన

అన్నమును తినునో, ఎవరయితే విధిప్రకారము లోన బయటాకూడా పరిశుద్ధుడై ఉండునో, ఎవరయితే లోభగుణము లేకుండా ఉండునో, ఇంకనూ ఎవరయితే మన్మథవికారములు లేక స్త్రీలను జయించునో అట్టివారి ఇళ్ళను నీవు విడిచిపెట్టుము.

పూజ్యన్తే హవ్యకవ్యాభ్యాం దేవతాః పితరస్తథా ।
జామయోఽతిథయశ్చాపి తద్గేహం యక్ష్మ వర్జయ ॥64॥

ఓ యక్ష్మా ! ఎచ్చటయితే ఇంద్రాది దేవతలు మరియు పితృదేవతలు హవ్యకవ్యములతో (ఇంద్రాదిదేవతలకిచ్చు హోమద్రవ్యములు హవ్యము, పితృదేవతలకిచ్చు హోమద్రవ్యములు కవ్యము) పూజింపబడుదురో అట్లే ఎచ్చటయితే కులస్త్రీలు, అతిథులు పూజింపబడుదురో అట్టివారి ఇళ్ళను విడిచిపెట్టుము. వారి జోలికి వెళ్ళవద్దు.

యత్ర మైత్రీ గృహే బాలవృద్ధయోషిన్నరేషు చ ।
తథా స్వజనవర్గేషు గృహం తచ్చాపి వర్జయ ॥65॥

ఏ ఇంటియందయితే చిన్నపిల్లలు, వృద్ధులు, స్త్రీపురుషులు, జనులు, తమ ఇంటివారు వీరందరు స్నేహముతో కలిసిమెలసి యుందురో అట్టి గృహమును నీవు విడిచిపెట్టుము.

యోషితోఽభిమతా యత్ర న బహిర్గమనోత్సుకాః ।
లజ్జాన్వితాః సదా గేహం యక్ష్మ తత్పరివర్జయ ॥66॥

ఓ యక్ష్మా ! ఏ ఇంట స్త్రీలు తృప్తి కలిగినవారై అందరికీ ఇష్టులై, బయటి ప్రదేశములకు వెళ్ళుటకు ఇష్టపడరో సిగ్గు కలిగియుందురో అట్టి ఇంటిని ఎల్లవేళల నీవు విడిచిపెట్టుము.

వయః సంబంధయోగ్యాని శయనాన్యశనాని చ ।
యత్ర గేహే త్వయా యక్ష్మ తద్వర్జ్యం వచనాన్మమ ॥67॥

ఓ యక్ష్మా ! ఏ ఇంటియందయితే శయనములు, భోజనములు ఆ యా వయస్సుగలవారికి, తన తోటివారికి యోగ్యముగా ఉంటాయో అట్టి ఇంటిని నీవు నా మాటప్రకారము విడిచిపెట్టుము.

యత్ర కారుణికా నిత్యం సాధుకర్మణ్యవస్థితాః ।
సామాన్యోపస్కరైర్యుక్తాస్త్యజేథా యక్ష్మ తద్గృహమ్ ॥68॥

ఏ ఇంట మనుష్యులు కరుణ స్వభావము కలిగి ఎల్లప్పుడు సత్కర్మలను ఆచరించుటయందు నిమగ్నులగుదురో, ఇంటి అవసరాలకు కావలసిన సామాన్యమైన సామగ్రి కలిగియుందురో అట్టి ఇంటిని నీవు విడిచిపెట్టుము.

యత్రాసనస్థాస్తిష్ఠత్సు గురువృద్ధద్విజాతిషు ।
న తిష్ఠన్తి గృహం తచ్చ వర్జ్యం యక్ష్మ త్వయా సదా ॥69॥

ఓ యక్ష్మా ! ఏ ఇంట గురువులు, వృద్ధులు, ద్విజులు ఆసనములందు కూర్చొనియుండగా మిగిలినవారు మర్యాదపూర్వకముగా కూర్చొనక నిల్చునేయుందురో అట్టి గృహమును నీవు ఎల్లప్పుడు విడిచిపెట్టవలెను.

తరుగుల్మాదిభిర్ద్వారం న విద్ధం యస్య వేశ్మనః ।
మర్మభేదో న వా పుంసస్త్వచ్ఛ్రేయో భవనం న తే ॥70॥

ఎవరి ఇంటి ద్వారము చెట్లు, పొదలు మొ॥వానితో మూయబడకుండా ఉండునో, మరియు ఆ ఇంట పురుషులు తమ మర్మావయవములను గట్టిగా తాకరో అట్టి భవనము నీకు శ్రేయస్కరము కాదు.

దేవతాపితృభృత్యానామతిథీనాం చ వర్తనమ్ ।
యస్యావశిష్టేనాన్నేన పుంసస్తస్య గృహం త్యజ ॥71॥

ఏ ఇంట పురుషుడు దేవతలకు, పితృదేవతలకు, సేవకులకు, అతిథులకు భోజనసమారాధన గావించి ఆ మిగిలిన అన్నమును తాను తినునో అట్టి గృహమును నీవు విడిచిపెట్టుము.

సత్యవాక్యాన్ క్షమాశీలానహింస్రాన్నానుతాపినః ।
పురుషానీదృశాన్యక్ష్మ త్యజేథాశ్చానసూయకాన్ ॥72॥

ఎవరయితే సత్యమునే పలుకుదురో, ఓర్పు స్వభావముగా గలవారో, ఎవ్వరినీ హింసించనివారో, ఎవ్వరికీ తాపము కలుగజేయరో, అసూయ లేనివారో ఇట్టి పురుషులను నీవు విడిచిపెట్టుము.

భర్తృశుశ్రూషణే యుక్తామసత్స్త్రీసఙ్గవర్జితామ్ ।
కుటుంబభర్తృశేషాన్నపుష్టాం చ త్యజ యోషితామ్ ॥73॥

ఏ స్త్రీ అయితే తన భర్త సేవయందే నిమగ్నమగునో, చెడు స్త్రీలతో సాంగత్యము చేయదో, తన కుటుంబజనులు మరియు భర్త తిన్న తర్వాతనే తాను తిని పుష్టికలిగినది అగునో అట్టి స్త్రీని విడిచిపెట్టుము.

యజనాధ్యయనాభ్యాసదానాసక్తమతిం సదా ।
యాజనాధ్యాపనాదానకృతవృత్తిం ద్విజం త్యజ ॥74॥

యజ్ఞము వేదాధ్యయనములను మాటిమాటికి ఆచరించు స్వభావము గలవాడు, దానము చేయుటయందు ఆసక్తి కలిగిన బుద్ధిగలవాడు, యజ్ఞములను చేయించువాడు, వేదాధ్యాపనము చేయువాడు, ఇతరులవద్ద దానము స్వీకరించి జీవనము గడుపువాడు అగు బ్రాహ్మణుని నీవు విడిచిపెట్టుము.

దానాధ్యయనయజ్ఞేషు సదోద్యుక్తం చ దుస్సహ ।
క్షత్రియం త్యజ సచ్ఛుల్కశస్త్రాజీవాత్తవేతనమ్ ॥75॥

ఓ దుస్సహా! దానము, అధ్యయనము, యజ్ఞములందు ఎల్లప్పుడు ఉద్యుక్తుడైనవాడు, ఆయుధములను ప్రయోగించుట ద్వారా జీవనము గడుపుచూ వేతనము పొందువాడూ అగు క్షత్రియుని విడిచిపెట్టుము.

త్రిభిః పూర్వగుణైర్యుక్తం పాశుపాల్యవణిజ్యయోః ।
కృషేశ్చావాప్తవృత్తిం చ త్యజ వైశ్యమకల్మషమ్ ॥76॥

పూర్వము చెప్పిన మూడు గుణములు కలిగియుండి పశుపాలనము, వ్యాపారము మరియు వ్యవసాయముల ద్వారా జీవనము గడుపుచూ పాపరహితులైన వైశ్యులను నీవు విడిచిపెట్టుము.

దానేజ్యాద్విజశుశ్రూషాతత్పరం యక్ష్మ సంత్యజ ।
శూద్రం చ బ్రాహ్మణాదీనాం శుశ్రూషావృత్తిపోషకమ్ ॥77॥

ఓ యక్ష్మా! దానము, యజ్ఞము, బ్రాహ్మణసేవలయందు ఆసక్తి కలిగినవాడు మరియు బ్రాహ్మణులను సేవించుటద్వారా జీవనము గడుపు శూద్రుని గూడా విడిచిపెట్టుము.

శ్రుతిస్మృత్యవిరోధేన కృతవృత్తిం గృహే గృహీ ।
యత్ర తత్ర చ తత్పత్నీ తస్యైవానుగతాత్మికా ॥78॥

యత్ర పుత్రో గురోః పూజాం దేవానాం చ తథా పితుః ।
పత్నీ చ భర్తుః కురుతే తత్రాలక్ష్మీభయం కుతః ॥79॥

ఏ ఇంటియందు గృహస్థుడు శ్రుతిస్మృతులకు విరోధము లేకుండా తన జీవనమును గడుపుకొనునో ఇంకనూ అతడి భార్య అతడినే అనుసరించుచుండునో మరియు ఏ ఇంట కుమారుడు గురువులకు, దేవతలకు, తండ్రికి పూజను సల్పునో భార్య భర్తను అనుసరించి ప్రవర్తించుచుండునో అట్టి ఇంట అలక్ష్మీభయము (దరిద్రదేవతాభయము) ఎట్లుండును?

సదానులిప్తం సంధ్యాసు గృహమంబు సముక్షితమ్ ।
కృతపుష్పబలిం యక్ష్మ న త్వం శక్నోషి వీక్షితుమ్ ॥80॥

ఓ యక్ష్మా! ఏ ఇల్లు మూడువేళలా నీళ్ళు వేసి అలుకబడునో మరియు ఏ ఇంట పుష్పాలు బలులు ఇవ్వబడునో అట్టి ఇంటిని నీవు చూచుటకు కూడా సమర్థుడవు కావు.

భాస్కరాదృష్టశయ్యాని నిత్యాగ్నిసలిలాని చ ।
సూర్యావలోకదీపాని లక్ష్మ్యా గేహాని భాజనమ్ ॥81॥

ఏ ఇంట సూర్యుడు శయ్యను చూడడో, ఎల్లప్పుడు అగ్ని జలములు సమృద్ధిగా ఉండునో సూర్యకాంతిచే వస్తువులు ప్రకాశింపబడునో అట్టి గృహములు లక్ష్మీనిలయములు.

యత్రోక్షా చందనం వీణా ఆదర్శో మధుసర్పిషీ ।
విషాజ్యతామ్రపాత్రాణి తద్గృహం న తవాశ్రయః ॥82॥

ఏ ఇంట ఎద్దు, గంధము, వీణ, అద్దము, తేనె, నేయి, విషము (అనారోగ్యము విరుగుడుకు సాధనమైనది), ఆజ్యము, రాగిపాత్రలు ఉండునో అట్టి ఇల్లు నీకు ఆశ్రయము కాదు.

యత్ర కంటకినో వృక్షా యత్ర నిష్పావవల్లరీ ।
భార్యా పునర్భూర్వల్మీకస్తద్యక్ష్మ తవ మందిరమ్ ॥83॥

ఓ యక్ష్మా ! ఏ ఇంట ముళ్ళు కలిగిన చెట్లు నిష్పావలత (అనుములలత), రెండవ వివాహము చేసుకొన్న స్త్రీ మరియు పుట్ట ఉంటాయో అట్టి ఇల్లే నీకు మందిరము.

యస్మిన్ గృహే నరాః పఞ్చ స్త్రీత్రయం తావతీశ్చ గాః ।
అంధకారేంధనాగ్నిశ్చ తద్గృహం వసతిస్తవ ॥84॥

ఏ ఇంట అయిదుగురు పురుషులు, ముగ్గురు స్త్రీలు, మూడు ఆవులు, అంధకారమయమయిన కట్టెలయందలి అగ్ని ఉంటాయో అట్టి ఇల్లే నీకు నివాసస్థానము.

ఏకచ్ఛాగం ద్విబాలేయం త్రిగవం పఞ్చమాహిషమ్ ।
షడశ్వం సప్తమాతఙ్గం గృహం యక్ష్మాశు శోషయ ॥85॥

ఓ యక్ష్మా ! ఏ ఇంట ఒక మేక, రెండు గాడిదలు, మూడు ఎద్దులు, అయిదు గేదెలు, ఆరు గుర్రాలు, ఏడు ఏనుగులు ఉంటాయో అట్టి ఇంటిని వెంటనే నాశనము చేయుము.

కుద్దాలదాత్రపిటకం తద్వత్ స్థాల్యాదిభాజనమ్ ।
యత్ర తత్రైవ క్షిప్తాని తవ దద్యుః ప్రతిశ్రయమ్ ॥86॥

ఏ ఇంట గునపము, కొడవలి, సంచి, గిన్నెలు మొ॥ పాత్రలు ఇటునటు విసిరివేయబడి ఉండునో అట్టి ఇంటివారు నీకు ఆశ్రయమును ఈయగలరు.

ముసలోలూఖలే స్త్రీణామాస్యా తద్వదుదుంబరే ।
అవస్కరే మంత్రణం చ యక్ష్మ తదుపకృత్తవ ॥87॥

ఓ యక్ష్మా! ఏ ఇంట స్త్రీలు రోలు, రోకలి మీద మరియు గడప మీద కాలుపెట్టుకొని కూర్చొని ఉంటారో మరియు మలమూత్రాదులు విసర్జించు సమయంలో రహస్యభాషణము గావిస్తారో అట్టి ఇల్లు నీకు ఉపకారమును కలిగించును.

లంఘ్యన్తే యత్ర ధాన్యాని పక్వాపక్వాని వేశ్మని ।
తద్వచ్ఛాస్త్రాణి తత్ర త్వం యథేష్టం చర దుస్సహ ॥88॥

ఓ దుస్సహా ! ఏ ఇంట పక్వమైన లేదా అపక్వమైన ధాన్యములను దాటి నడచెదరో అట్లే శాస్త్రములను సక్రమంగా అధ్యయనం చేయరో అట్టి ఇంట నీవు స్వేచ్ఛగా సంచరించుము.

స్థాలీపిధానే యత్రాగ్నిర్దత్తో దర్వీఫలేన వా ।
గృహే తత్ర హి రిష్టానామశేషాణాం సమాశ్రయః ॥89॥

ఏ ఇంట గిన్నెలను మూయు పళ్ళెముపై నిప్పు ఉంచబడుతుందో, గరిటెలతో వేరేవారికి నిప్పు ఈయబడుతుందో అట్టి ఇల్లు సమస్త అరిష్టములకు ఆశ్రయము.

మానుషాస్థిగృహే యత్ర దివారాత్రం మృతస్థితిః ।
తత్ర యక్ష్మ తవ వాసస్తథాన్యేషాం చ రక్షసామ్ ॥90॥

ఓ యక్ష్మా ! ఏ ఇంట మనుష్యుల ఎముకలు ఉంటాయో, రాత్రింబవళ్ళు శవం ఉంచబడుతుందో ఆ ఇల్లు నీకు మరియు రాక్షసులకు నివాసస్థానము.

అదత్త్వా భుఞ్జతే యే వై బంధోః పిణ్డం తథోదకమ్ ।
సపిండాన్ సోదకాంశ్చైవ తత్కాలే తాన్నరాన్ భజ ॥91॥

ఎవరి ఇంట ఏ మనుష్యులైతే సపిండులకు, సహోదకులకు పెట్టకుండా ఎవరయితే తన బంధువుల పిండమును, ఉదకమును స్వీకరిస్తారో అట్టి మనుష్యులను నీవు ఆశ్రయించుము.

యత్ర పద్మమహాపద్మౌ సురభిర్మోదకాశినీ ।
వృషభైరావతౌ యత్ర కల్ప్యన్తే తద్గృహం త్యజ ॥92॥

ఏ ఇంట పద్మము, మహాపద్మములు అనగా నిధి విశేషములు ఉండునో, సురభి (గోవు) మోదకములను తినుటకు ఇష్టపడునో, ఎద్దు ఏనుగులు ఉండునో అట్టి ఇంటిని నీవు విడిచిపెట్టుము.

అశస్త్రా దేవతా యత్ర సశస్త్రాశ్చాహవం వినా ।
కల్ప్యన్తే మనుజైరర్చ్యాస్తత్పరిత్యజ మన్దిరమ్ ॥93॥

ఏ ఇంట ఆయుధములు లేనివారు, దేవతలు, యుద్ధప్రయోజనం లేకుండా ఆయుధధారులూ ఉంటారో, అట్టి మందిరమును నీవు విడిచిపెట్టుము.

పౌరజానపదైర్యత్ర ప్రాక్ప్రసిద్ధమహోత్సవాః ।
క్రియన్తే పూర్వవద్గేహే న త్వం తత్ర గృహే చర ॥94॥

పూర్వము ప్రసిద్ధముగా ఉన్నట్టి గొప్ప ఉత్సవములను ప్రస్తుతము పురప్రజలు, గ్రామప్రజలు పూర్వమువలెనే ఏ ఇండ్లలో నిర్వర్తిస్తారో అట్టి ఇండ్లలో నీవు సంచరించవద్దు.

శూర్పవాతఘటాంభోభిః స్నానం వస్త్రాంబువిప్రుషైః ।
నఖాగ్రసలిలైశ్చైవ తాన్యాహి హతలక్షణాన్ ॥95॥

ఎవరయితే చాటలతో గాలిని వీచుకొందురో, కుండలతో నీళ్ళు పోసుకొని స్నానము చేయుదురో, తడిబట్టలనుంచి జారుతున్న నీటి బిందువులతో స్నానము చేయుదురో, గోళ్ళ అగ్రభాగముల నుండి జారుతున్న నీళ్ళతో స్నానము చేయుదురో అట్టి నీచమానవులను నీవు ఆశ్రయింపుము.

దేశాచారాన్ సమయాన్ జ్ఞాతిధర్మం ।
జపం హోమం మఙ్గలం దేవతేష్టిమ్ ।

సమ్యక్ శౌచం విధివల్లోకవాదాన్
పుంసస్త్వయా కుర్వతో మాస్తు సఙ్గః ॥96॥

ఏ మానవుడయితే దేశాచారములను, సంప్రదాయములను, జ్ఞాతులపట్ల అనుసరించవలసిన ధర్మమును, జపము హెూమము మంగళకార్యములను ఆచరించునో, దేవతలకు యజ్ఞములను నిర్వర్తించునో, బాగుగా పరిశుభ్రతను పాటించునో, లోకవాదములను యథాప్రకారము ఆచరించునో అట్టి పురుషునితో నీకు సాంగత్యము వలదు.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

ఇత్యుక్త్వా దుస్సహం బ్రహ్మా తత్రైవాన్తరధీయత ।
చకార శాసనం సోఽపి తథా పంకజజన్మనః ॥97॥

బ్రహ్మదేవుడు దుస్సహునితో ఈ విధముగా పలికి అచ్చటే అంతర్ధానమయ్యెను. దుస్సహుడు కూడా బ్రహ్మదేవుని ఆజ్ఞను అనుసరించెను.

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే యక్ష్మానుశాసనం నామ సప్తచత్వారింశోఽధ్యాయః ॥47॥

శ్రీ మార్కండేయ మహాపురాణమందలి యక్ష్మానుశాసనమను నలుబదిఏడవ అధ్యాయం సమాప్తం.



అష్టచత్వారింశోఽధ్యాయః – నలుబదిఎనిమిదవ అధ్యాయం
దౌఃసహోత్పత్తిసమాపనమ్ – దుస్సహుని సంతానోత్పత్తియను ప్రకరణసమాప్తి

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

దుఃసహస్యాభవద్భార్యా నిర్మార్ష్టిర్నామ నామతః ।
జాతా కలేస్తు భార్యాయామృతౌ చాణ్డాలదర్శనాత్ ॥1॥

దుస్సహునికి నిర్మార్ష్టియను పేరుగల భార్య కలదు. కలిపురుషుని భార్య ఋతుకాలమందు చండాలపురుషుని చూచుటచే ఆమెకు నిర్మార్ష్టి జన్మించినది.

తయోరపత్యాన్యభవన్ జగద్వ్యాపీని షోడశ ।
అష్టౌ కుమారాః కన్యాశ్చ తథాష్టావతిభీషణాః ॥2॥

వారిరువురికి అనగా నిర్మార్ష్టిదుస్సహులకు ప్రపంచమంతా వ్యాపించునట్టి పదహారుమంది సంతానము కలిగిరి. మిక్కిలి భయంకరమైన ఆకారముగల ఆ పదహారుమంది సంతానములో ఎనిమిదిమంది కుమారులు, ఎనిమిదిమంది కుమార్తెలు గలరు.

దన్తాకృష్టిస్తథోక్తిశ్చ పరివర్తస్తథాపరః ।
అంగధ్రుక్ఛకునిశ్చైవ గండప్రాన్తరతిస్తథా ॥3॥

గర్భహా సస్యహా చాన్యః కుమారాస్తనయా తయోః ।
కన్యాశ్చాన్యాస్తథైవాష్టౌ తాసాం నామాని మే శృణు ॥4॥

నియోజికా వై ప్రథమా తథైవాన్యా విరోధినీ ।
స్వయంహారకరీ చైవ భ్రామణీ ఋతుహారికా ॥5॥

స్మృతిబీజహరే చాన్యే తయోః కన్యే సుదారుణే ।
విద్వేషణ్యష్టమీ నామ కన్యా లోకభయావహా ॥6॥

దన్తాకృష్టి, తథోక్తి, పరివర్త, అంగధ్రుక్, శకుని, గండప్రాంతరతి, గర్భహా, సస్యహా అను పేర్లు గలవారు ఎనిమిదిమంది కుమారులు. ఇక ఎనిమిది కన్యల పేర్లను చెప్పెదను, వినుము. నియోజిక, విరోధిని, స్వయంహారకరి, భ్రామణి, ఋతుహారిక, స్మృతిహర, బీజహర, విద్వేషణి అను పేర్లుగలవారు కుమార్తెలు. వారిలో స్మృతిహర బీజహరలు మిక్కిలి భయంకరులు. ఎనిమిదవ కన్య అయిన విద్వేషణి సమస్తలోకములకు భయమును గలిగించునది.

ఏతాసాం కర్మ వక్ష్యామి దోషప్రశమనం చ యత్ ।
అష్టానాం చ కుమారాణాం శ్రూయతాం ద్విజసత్తమ ॥7॥

ఓ ద్విజశ్రేష్ఠుడా ! ఈ ఎనిమిదిమంది కన్యలు, ఎనిమిదిమంది కుమారులు చేయుపనులను గూర్చి, ఆ దోషముల పరిహారములను గూర్చి చెప్పెదను వినుము.

దన్తాకృష్టిః ప్రసూతానాం బాలానాం దశనస్థితః ।
కరోతి దన్తసంఘర్షం చికీర్షుర్దుఃసహాగమమ్ ॥8॥

దన్తాకృష్టియనువాడు అప్పుడే పుట్టిన చిన్నపిల్లల దంతములయందు (దంతస్థానములందు) ఉండి వాటికి రాపిడిని చేసి బాధపెట్టును. అంతేకాక దుస్సహుని రాకను కూడా కోరుకొనును.

తస్యోపశమనం కార్యం సుప్తస్య సితసర్షపైః ।
శయనస్యోపరిక్షిప్తైర్మానుషైర్దశనోపరి ॥9॥

సౌవర్చలౌషధీస్నానాత్తథా సచ్ఛాస్త్రకీర్తనాత్ ।
ఉష్ట్రకంటకగంగాస్థిక్షౌమవస్త్రవిధారణాత్ ॥10॥

అట్టి బాధ ఉపశమించుటకొరకు నిద్రించుచున్న బాలకుని శయ్యమీద, దంతముల మీద తెల్ల ఆవాలను చల్లవలెను. సువర్చలదేశమందు ఉద్భవించిన నల్లని ఉప్పు సౌవర్చలము (వాచస్పత్యముననుసరించి). అట్టి సౌవర్చలముతోను, ఓషధులతోనూ స్నానము చేయించవలెను. సత్ శాస్త్రములను అనగా ఆస్తికదర్శనములను వినిపించేటట్లుగా చదువవలెను. ఒంటె, ముళ్ళు, గంగయందలి ఎముకలు, పట్టుబట్టలపై ధరింపచేయుట (తాకించుట) ద్వారా ఈ బాధకు ఉపశమనము లభించును.

తిష్ఠత్యన్యకుమారస్తు తథాస్త్విత్యసకృద్బ్రువన్ ।
శుభాశుభే నృణాం యుఙ్క్తే తథోక్తిస్తచ్చ నాన్యథా ॥11॥

రెండవ కుమారుడు తథోక్తియనువాడు. ఇతడు “తథాస్తు” అట్లే అగుగాక అని మాటిమాటికి పలుకుచుండును. ఇతడు మానవులను శుభాశుభవిషయములందు నియోగించుచుండును. ఇది సత్యము.

తస్మాదదుష్టం మంగల్యం వక్తవ్యం పండితైస్సదా ।
దుష్టే శ్రుతే తథైవోక్తే కీర్తనీయో జనార్దనః ॥12॥

చరాచరగురుర్బ్రహ్మా యా యస్య కులదేవతా ।

అట్టి దోషమును పరిహరించుటకై పండితులు ఎల్లప్పుడు దోషరహితములైన మంగళవాక్యములను పలుకవలెను. దుష్టములైనవాటిని వినినగాని పలికినగాని ఆ పాపపరిహారార్థమై జనార్దనుని కీర్తించవలెను. చరాచరప్రపంచమునకు గురువైన బ్రహ్మనుగాని, లేక ఎవరికి ఎవరు కులదేవతయో అట్టి కులదేవతను గాని కీర్తించవలెను. (మంగల్యం, మాంగల్యం రెండు శబ్దములూ సాధువులే)

అన్యగర్భే పరాం గచ్ఛన్ సదైవ పరివర్తయన్ ॥13॥

రతిమాప్నోతి వాక్యం చ వివక్షోరన్యదేవ యత్ ।
పరివర్తకసంజ్ఞేయం తస్యాపి సితసర్షపైః ॥14॥

రక్షోఘ్నమంత్రజప్యైశ్చ రక్షాం కుర్వీత సత్త్వవిత్ ।

పరివర్తకుడను మూడవవాడు ఒక స్త్రీగర్భమును మరొక స్త్రీలోకి మార్పుచేయుచూ ఆనందమును పొందును. అంతేకాక ఒక వ్యక్తి మాట్లాడదలచిన వాక్యములను మరొక వ్యక్తిచేత మాట్లాడించును. ఈ దోషమును తొలగించుటకు కూడా తెల్ల ఆవాలను చల్లవలెను. అంతేకాక రాక్షసులను సంహరింపచేయునట్టి మంత్రజపములతోనూ జ్ఞాని అయినవాడు ఆ దోషమును పరిహరించవలెను.

అన్యశ్చానిలవత్ నృణామంగేషు స్ఫురణోదితమ్ ॥15॥
శుభాశుభం సమాచష్టే కుశైస్తస్యాంగతాడనమ్ ।

అంగధ్రుక్కను నాల్గవ కుమారుడు వాయువేగమువంటి వేగముతో మనుష్యుల అంగములు అదరునట్లు చేసి శుభాశుభములకు కల్గింపచేయును. ఈ దోషమును పరిహరించుటకై ఆ బాధను అనుభవించుచున్న వ్యక్తియొక్క శరీరమును దర్భలతో కొట్టవలెను.

కాకాదిపక్షిసంస్థో௨న్యః శ్వాదేరంగగతో௨పి వా ॥16॥
శుభాశుభం చ శకునిః కుమారో௨న్యో బ్రవీతి వై ।

శకునియను పేరుగల అయిదవ కుమారుడు కాకి మొ॥లగు పక్షులయందుగాని, కుక్క మొ॥లగు జంతువుల అవయవములందు గాని ఉండి శుభాశుభములను పలుకుచుండును.

తత్రాపి దుష్టే వ్యాక్షేపః ప్రారంభత్యాగ ఏవ చ ॥17॥
శుభే ద్రుతతరం కార్యమితి ప్రాహ ప్రజాపతిః ।

ఆ శుభాశుభవాక్యములందు కూడా అమంగళములైనవాటి విషయమందు తలపెట్టిన పనిని ఆలస్యము చేయుటగాని లేదా విడిచిపెట్టుటగాని చేయవలెను. మంగళములైనవాటి విషయమందు శీఘ్రముగా ఆ పనిని చక్కపెట్టవలెనని ప్రజాపతి చెప్పాడు.

గండాంతేషు స్థితశ్చాన్యో ముహూర్తార్థం ద్విజోత్తమ ॥18॥
సర్వారంభాం కుమారో௨త్తి శమం తస్య నిశామయ ।

ఓ ద్విజశ్రేష్ఠుడా ! గండప్రాంతరతియను ఆరవ కుమారుడు అర్ధముహూర్తకాలము గండప్రాంతములందు (బుగ్గలు) ఉండి సమస్త కార్యారంభములను నశింపచేయును. ఆ దోషపరిహారమును చెప్పెదను వినుము.

విప్రోక్త్యా దేవతాస్తుత్యా మూలోత్థాతేన చ ద్విజ ॥19॥

గోమూత్రసర్షపస్నానైస్తదృక్షగ్రహపూజనైః ।
పునశ్చ ధర్మోపనిషత్కరణైః శాస్త్రదర్శనైః ॥20॥

అవజ్ఞయా జన్మనశ్చ ప్రశమం యాతి గండవాన్ ।

ఓ ద్విజుడా ! బ్రాహ్మణ వాక్యములచేత, దేవతాస్తుతిచేత, గోమూత్రము, తెల్లఆవాలు వీటితో స్నానము చేయుటవలన, నక్షత్రములు, గ్రహములకు పూజలు సల్పుట ద్వారా, ధర్మము ఉపనిషత్తులను పఠించుట ద్వారా,

శాస్త్రవిచారములచేత, గండప్రాంతరతియొక్క జన్మను నిందించుట ద్వారా ఆ గండప్రాంతరతి శాంతించును. అనగా అతడివలన బాధలు కలుగవు.

గర్భే స్త్రీణాం తథాన్యస్తు కలలాశీ సుదారుణః ॥21॥

తస్య రక్షా సదా కార్యా నిత్యం శౌచనిషేవణాత్ ।
ప్రసిద్ధమంత్రవిఖనాచ్ఛస్తమాల్యాదిధారణాత్ ॥22॥

విశుద్ధగేహావసనాదనాయాసాచ్చ వై ద్విజ ।

ఓ బ్రాహ్మణుడా! గర్భహా అను ఏడవ కుమారుడు భయంకరస్వభావము గలవాడై స్త్రీల గర్భములందలి గర్భాశయములను నాశనము చేయును. స్త్రీలు అతనిబారినుండి రక్షించుకొనుటకు నిత్యము బాహ్య ఆంతరశౌచమును పాటించవలెను. ఇంకను ప్రసిద్ధములైన మంత్రములను వ్రాయుట వలన, ప్రశస్తమైన మాలలు మొ॥ వాటిని ధరించుటవలన, పరిశుభ్రమైన ఇంటియందు నివసించుటవలన, ఆయాసము అనగా అతియత్నము లేనందువలన కూడా అతని బారినుండి తప్పించుకొనవచ్చును.

తథైవ సస్యహా చాన్యః సస్యర్ధిముపహన్తి యః ॥23॥

తస్యాపి రక్షాం కుర్వీత జీర్ణోపానద్విధారణాత్ ।
తథాపసవ్యగమనాచ్చండాలస్య ప్రవేశనాత్ ॥24॥

బహిర్బలిప్రదానాచ్చ సోమాంబుపరికీర్తనాత్ ।

అట్లే ఎనిమిదవ కుమారుడగు సస్యహా సస్యసమృద్ధిని అనగా పాడిపంటలను నాశనము చేయును. అతని బారినుండి రక్షించుకొనుటకై జీర్ణములైన పాదరక్షలను ధరించవలెను. అపసవ్యముగా నడువవలెను. చండాలురను తన ఇంటియందు ప్రవేశింపచేయవలెను. బయట బలులను ఈయవలెను. సోమరసమును కీర్తించవలెను.

పరదారపరద్రవ్యహరణాదిషు మానవాన్ ॥25॥

నియోజయతి చైవాన్యాన్ కన్యా సా చ నియోజికా ।
తస్యాః పవిత్రపఠనాత్ క్రోధలోభాదివర్జనాత్ ॥26॥

నియోజయతి మామేష విరోధాచ్చ వివర్జనాత్ ।
ఆక్రుష్టోఽన్యేన మన్యేత తాడితో వా నియోజికా ॥27॥

నియోజయత్యేనమితి న గచ్ఛేత్తద్వశం బుధః ।
పరదారాదిసంసర్గే చిత్తమాత్మానమేవ చ ॥28॥

నియోజయత్యత్ర సా మామితి ప్రాజ్ఞో విచిన్తయేత్ ।

ఇక ఎనిమిది కన్యలలో మొదటి కన్య నియోజిక. ఆమె ఇతరుల భార్యలను, ఇతరుల వస్తువులను దొంగలించు విధముగా మానవులను ఆయాపనులందు నియోగపరచును. ఆమె బారినుండి రక్షించుకొనుటకు పవిత్ర గ్రంథములను

పరించవలెను. క్రోధలోభాదులను విడిచిపెట్టవలెను. నియోజికే తనను అట్టి పనులందు నియోగించుచున్నదని భావించవలెను. ఎవరైనా తనను పట్టి లాగినా కొట్టినా వారితో విరోధమును పెట్టుకొనకూడదు. ఇతరుల భార్యలను పొందాలనే కోరికగల మనస్సును, తననూ కూడా ఆ నియోజికే నియోగించుచున్నదని బుద్ధిమంతుడైనవాడు భావించవలెను.

విరోధం కురుతే చాన్యా దంపత్యోః ప్రీయమాణయోః ॥29॥

బంధూనాం సుహృదాం పిత్రోః పుత్రైః సావర్ణికైశ్చ యా ।
విరోధినీ సా తద్రక్షాం కుర్వీత బలికర్మణా ॥30॥

తథాతివాదసహనాచ్ఛాస్త్రాచారనిషేవణాత్ ।

రెండవ కన్య పేరు విరోధిని. ఈమె పరస్పరానురాగము గల దంపతుల మధ్య విరోధమును కలిగింపచేయును. అట్లే బంధువుల మధ్య, స్నేహితులమధ్య పరస్పరము విరోధమును కలిగింపచేయును. అట్లే తండ్రీకొడుకులమధ్య విరోధమును కలిగింపచేయును. తమ బంధువులనుండి తమకు విరోధమును పుట్టించును. ఈమె బారినుండి రక్షించుకొనుటకు ఆయా ప్రాణులకు బలులను (ఆహారమును) ఈయవలెను. అట్లే తమను గూర్చి వ్యతిరేకముగా మాట్లాడిననూ సహించవలెను. శాస్త్రములందు చెప్పబడిన ఆచారములను పాటించవలెను.

ధాన్యం ఖలాద్గృహాద్గోష్ఠాత్పయః సర్పిస్తథాపరా ॥31॥

సమృద్ధిమృద్ధిమద్ద్రవ్యాదపహన్తి చ కన్యకా ।
సా స్వయంహారికేత్యుక్తా సదాన్తర్ధానతత్పరా ॥32॥

మహానసాదర్ధసిద్ధమన్నాగారస్థితం తథా ।
పరివిష్యమాణం సదా సార్ధం భుఙ్క్తే చ భుఙ్క్తా ॥33॥

ఉచ్ఛేషణం మనుష్యాణాం హరత్యన్నం చ దుర్హరా ।
కర్మాన్తాగారశాలాభ్యః సిద్ధ్యుద్ధీ హరతి ద్విజ ॥34॥

గోస్త్రీస్తనేభ్యశ్చ పయఃక్షీరహారీ సదైవ సా ।
దధ్నో ఘృతం తిలాత్తైలం సురాగారాత్తథా సురామ్ ॥35॥

రాగం కుసుంభకాదీనాం కార్పాసాత్సూత్రమేవ చ ।
సా స్వయంహారికా నామ హరత్యవిరతం ద్విజ ॥36॥

మూడవ కన్యపేరు స్వయంహారకరి లేదా స్వయంహారిక. ఈమె ఖలములనుండి అనగా ధాన్యాగారములనుండి ధాన్యమును నశింపచేయును. అట్లే ఆయా ఇళ్ళ నుండి పాలు, నేతిని నాశనము చేయును. ఇళ్ళలో చేసే కర్మలు పూర్తికాగానే ఇంటిశాలలనుండి సమృద్ధిని, సంపదనీ హరించుతుంది.. ఎల్లప్పుడూ కనిపించకుండా ఉండే ఆమె స్వయంహారికయని చెప్పబడుచున్నది. సగము వండిన పదార్థములను, అన్నాగారము

నుండి అన్నమును నాశనము చేయును. అట్లే వడ్డించిన పదార్థములను భోక్తతో సహా ఈమె కూడా భోజనము చేయును. ఈమెను అదుపుచేయుట సాధ్యము కాదు. ఓ బ్రాహ్మణుడా! ఆయా మానవులు తినగా మిగిలిన ఆహారపదార్థములను ఈమె అపహరించును. అట్లే ఆయా మానవులు ఆచరించిన కర్మలు, కార్యాగారములు, వారి నివాసస్థానములనుండి ఫలసిద్ధులను, సమృద్ధులను కూడా ఈమె అపహరించును. గోవులు, స్త్రీల స్తనములనుండి పాలను హరించును. ఓ ద్విజుడా ! పెరుగునుండి నేతిని, తిలల నుండి తైలమును, కల్లుకుండల నుండి కల్లును, కుసుంభకాది పుష్పముల నుండి వాటి రంగును, ప్రత్తి నుండి దారమును స్వయంహారికయను పేరుగల ఈమె ఎల్లప్పుడూ హరించుచుండును.

కుర్యాచ్ఛిఖణ్డినోర్ద్వంద్వం రక్షార్థం కృత్రిమాం స్త్రియమ్ ।
రక్షైశ్చైవ గృహే లేఖ్యా వర్జ్యా చోచ్ఛిష్టతా తథా ॥37॥

హెూమాగ్నిదేవతాధూపభస్మనా చ పరిష్క్రియా ।
కార్యా క్షీరాదిభాండానామేవం తద్రక్షణం స్మృతమ్ ॥38॥

స్వయంహారిక బారినుండి రక్షించుకొనుటకు రెండు నెమళ్ళ చిత్రమును, ఒక కృత్రిమ స్త్రీ చిత్రమును, రక్షార్థమై గీసి ఇంటియందు ఉంచవలెను. ఈ విధముగా చేయుటద్వారా ఆమె పరిహరింపదగినది. హెూమములందు అగ్నిలో ఆ యా దేవతలను ఉద్దేశించి ఆ యా హెూమద్రవ్యములను సమర్పించుట వలన ఉద్భవించిన ధూపము, భస్మముల ద్వారా ప్రతిక్రియను చేసుకొనవలెను. ఈ విధముగా పాలతో నిండిన పాత్రలు మొ॥వాటిని రక్షించుకొనవలెనని చెప్పబడినది.

ఉద్వేగం జనయత్యన్యా ఏకస్థాననివాసినః ।
పురుషస్య తు యా ప్రోక్తా భ్రామణీ సా తు కన్యకా ॥39॥

నాల్గవ కన్య పేరు భ్రామణి. ఆమె ఒకేచోట నివసించే పురుషునికి ఉద్వేగమును (భయభ్రాంతులను) కలిగింపచేయును.

తస్యాథ రక్షాం కుర్వీత విక్షిప్తైః సితసర్షపైః ।
ఆసనే శయనే చోర్వ్యాం యత్రాస్తే స తు మానవః ॥40॥

చిన్తయేచ్చ నరః పాపా మామేషా దుష్టచేతనా ।
భ్రామయత్యసకృజ్జప్యం భువః సూక్తం సమాధినా ॥41॥

భ్రామణి బారినుండి రక్షించుకొనుటకై ఆ మానవుడు ఎచ్చట నివసించునో అచ్చట ఆసనమందు, శయ్యపైన, భూమిమీద తెల్లని ఆవాలను చల్లవలెను. "పాపాత్మురాలు, దుష్టస్వభావురాలూ అగు ఈమె నన్నీ విధముగా బాధించుచున్నది" అని పలుమార్లు ఏకాగ్రచిత్తముతో భూసూక్తమును జపించవలెను.

స్త్రీణాం పుష్పం హరత్యన్యా ప్రవృత్తం సా తు కన్యకా ।
తథా ప్రవృత్తం సా జ్ఞేయా దుస్సహా ఋతుహారికా ॥42॥

అయిదవ కన్య పేరు ఋతుహారిక. ఆమె స్త్రీలయొక్క నెలసరి ఋతుక్రమమును హరించును. అట్లు హరించుతున్నదానిని సహించుటకు శక్యము కాని ఆమె ఋతుహారికయని తెలియవలెను.

కుర్వీత తీర్థదేవౌకశ్చైత్యపర్వతసానుషు ।
నదీసంగమఖాతేషు స్నపనం తత్ప్రశాన్తయే ॥43॥

మంత్రవిద్భూతతత్త్వజ్ఞః పర్వసూషసి చ ద్విజ ।
(తేషాం తు పూజనం కార్యం ధూపవర్త్యుపహారకైః)
చికిత్సాజ్ఞశ్చ వై వైద్యః సంప్రయుక్తైర్వరౌషధైః ॥44॥

ఓ ద్విజుడా ! ఋతుహారిక బారినుండి రక్షించుకొనుటకై తీర్థములు, దేవస్థానములు, మందిరములు, ఎత్తైన పర్వతప్రాంతములు, నదీసంగమప్రదేశములు, లోతైన ప్రదేశములందు స్నానమాచరించవలెను. మంత్రవేత్త, భూతతత్త్వమును ఎరిగినవాడు ఆయా పర్వములందు ప్రాతఃకాలమందు స్నానమాచరించవలెను. ధూపదీపాది ఉపహారములతో ఆ తీర్థాదులను పూజించవలెను. చికిత్సాశాస్త్రమునెరిగిన వైద్యుడు ఆయా ఓషధులను ప్రయోగించవలెను.

స్మృతిం చాపహరత్యన్యా ప్రవృత్తాం సా తు కన్యకా ।
అథాప్రవృత్తా సా జ్ఞేయా నృణాం సా స్మృతిహారికా ॥45॥

వివిక్తదేశసేవిత్వాత్తస్యాశ్చోపశమో భవేత్ ।

స్మృతిహర లేదా స్మృతిహారిక ఆరవ కన్య. ఆమె స్మరణలో ఉన్న విషయములను అపహరించును అనగా మరచునట్లు చేయును. మానవుల స్మృతిని హరించునట్టి ఆమె అప్రవృత్తగా (అనగా కంటికి కనిపించనదిగా) తెలియదగినది.

బీజాపహారిణీ చాన్యా స్త్రీపుంసోరతిభీషణా ।
మేధ్యాన్నభోజనైః స్నానైస్తస్యాశ్చోపశమో భవేత్ ॥46॥

బీజాపహారిణి అనునామె ఏడవ కన్య స్త్రీపురుషులపట్ల మిక్కిలి భయంకరముగా ప్రవర్తించును. పవిత్రమైన అన్నమును భుజించుట, స్నానమును ఆచరించుట వలన ఆమెను శాంతింపచేయవచ్చును.

దారుణా సా దురాచారా దారుణం కురుతే భయమ్ ।
తత్ప్రశాన్త్యై ప్రకుర్వీత ద్విజానామర్చనం శుభమ్ ॥47॥

ఆ బీజాపహారిణి భయంకరమైన స్వభావము కలిగి, చెడ్డ ఆచారములు కలిగి భయమును కలిగించు పనులను చేయును. ఆమెను శాంతింపచేయుట కొరకు బ్రాహ్మణులను పూజించుట శుభప్రదమైనది.

అష్టమీ ద్వేషణీ నామ కన్యా లోకభయావహా ।
యా కరోతి జనద్విష్టం నరం నారీమథాపి వా ॥48॥

మధుక్షీరఘృతాక్తాంస్తు శాన్త్యర్థం హోమయేత్తిలాన్ ।
కుర్వీత మిత్రవిందాం చ తథేష్టిం తత్రశాన్తయే ॥49॥

విద్వేషిణి లేదా ద్వేషిణి ఎనిమిదవ కన్య. ఈమె లోకమునకు భయమును కలిగించును. స్త్రీ పురుషుల మధ్య ద్వేషమును కలిగింపచేయును. ఈమెను శాంతింపచేయుటకు తేనె పాలతో కలిసిన తిలలను హోమము చేయవలెను. మిత్రవిందయను యజ్ఞమును కూడా ఆమెను శాంతింపచేయుటకు ఆచరించవలెను.

ఏతేషాం తు కుమారాణాం కన్యానాం ద్విజసత్తమ ।
అష్టత్రింశదపత్యాని తేషాం నామాని మే శృణు ॥50॥

ఓ బ్రాహ్మణశ్రేష్ఠుడా ! ఈ ఎనిమిది కుమారులకు మరియు ఎనిమిదిమంది కుమార్తెలకు ముప్పై ఎనిమిది మంది సంతానము కలిగిరి. వారి పేర్లను చెప్పెదను, వినుము.

దన్తాకృష్టేరభూత్కన్యా విజల్పా కలహా తథా ।
అవజ్ఞానృతదుష్టోక్తిర్విజల్పా తత్రశాన్తయే ॥51॥

తామేవ చిన్తయేత్ప్రాజ్ఞః ప్రయతశ్చ గృహీ భవేత్ ।

విజల్ప, కలహయను ఇరువురు కుమార్తెలు దన్తాకృష్టికి కలిగిరి. అందు విజల్ప అవమానపరచుట, అబద్ధమాడుట, దుష్టముగా మాటలాడుటవంటి పనులను చేయును. ఆమెను శాంతపరచుటకొరకై గృహస్థుడు ఆమెనే చింతించుచు ఆత్మనిగ్రహము కలిగి ఉండవలెను.

కలహా కలహం గేహే కరోత్యవిరతం నృణామ్ ॥52॥

కుటుంబనాశహేతుః సా తత్రశాన్తిం నిశామయ ।
దూర్వాంకురాన్ మధుఘృతక్షీరాక్తాన్ బలికర్మణి ॥53॥

విక్షిపేజ్జుహుయాచ్చైవానలం మిత్రం చ కీర్తియేత్ ।
భూతానాం మాతృభిః సార్ధం బాలకానాం తు శాన్తయే ॥54॥

విద్యానాం తపసాం చైవ సంయమస్య యమస్య చ ।
కృష్యాం వాణిజ్యలాభే చ శాన్తిం కుర్వన్తు మే సదా ॥55॥

పూజితాశ్చ యథాన్యాయం తుష్టిం గచ్ఛన్తు సర్వశః ।
కూష్మాణ్డా యాతుధానాశ్చ యే చాన్యే గణసంజ్ఞితాః ॥56॥

మహాదేవప్రసాదేన మహేశ్వరమతేన చ ।
సర్వ ఏతే నృణాం నిత్యం తుష్టిమాశు వ్రజన్తు తే ॥57॥

తుష్టాః సర్వం నిరస్యన్తు దుష్కృతం దురనుష్ఠితమ్ ।
మహాపాతకజం సర్వం యచ్చాన్యద్విఘ్నకారణమ్ ॥58॥

తేషామేవ ప్రసాదేన విఘ్నా నశ్యన్తు సర్వశః ।
ఉద్వాహేషు చ సర్వేషు వృద్ధికర్మసు చైవ హి ॥59॥

పుణ్యానుష్ఠానయోగేషు గురుదేవార్చనేషు చ ।
జపయజ్ఞవిధానేషు యాత్రాసు చ చతుర్దశ ॥60॥

శరీరారోగ్యభోగ్యేషు సుఖదానధనేషు చ ।
వృద్ధబాలాతురేష్వేవ శాన్తిం కుర్వన్తు మే సదా ॥61॥

సోమాంబుపౌ తథాంభోభిః సవితా చానిలానలౌ ।

కలహయను రెండవ కుమార్తె ఎల్లప్పుడు ఆ యా ఇళ్ళలోని జనుల మధ్య కలహమును పుట్టించును. ఆమె కుటుంబనాశనమునకు కారణము. ఆమెను శాంతపరచుట ఎట్లో చెప్పెదను, వినుము. తేనె, నేయి, పాలతో కలిసిన గరికెయొక్క చిగుళ్ళను బలికర్మయందు హోమము చేయవలెను. అగ్నిని, మిత్రవిందను కీర్తించవలెను. తల్లులతో సహా చిన్నపిల్లల రక్షణకొరకు పంచమహాభూతములు, విద్యలు, తపస్సు, సంయమము, యమము వీటిని కీర్తించవలెను. నాయొక్క కృషియందు వ్యాపార లాభాలలోనూ శాంతిని చేయుదురుగాక! విధిప్రకారము పూజింపబడిన దేవతలు, రాక్షసులు, ఆయా గణములకు సంబంధించినవారు వీరందరు మహాదేవుని అనుగ్రహముతో, మహాదేవుని అభీష్టం ప్రకారము శీఘ్రముగా సంతుష్టిని చెందుదురుగాక ! సంతుష్టులైన వారందరు పాపములను, దుష్టకార్యములను, గొప్ప పాపముల ఫలితములను, విఘ్నకారణములను నశింపచేయుదురు గాక! వారి అనుగ్రహమువల్లనే అంతటా విఘ్నములు నశించుగాక ! వివాహములందు, సమస్తవృద్ధికార్యములందు, పుణ్యకార్యములందు, గురువుల దేవతల పూజయందు, జపము యజ్ఞములను ఆచరించుటయందు, పదునాలుగు విధములైన యాత్రలయందు, శరీరారోగ్యము భోగ్యపదార్థములందు, సుఖము దానము ధనములందు, ఆ సంతుష్టులైన వారందరు నాకు శాంతిని ప్రసాదింతురుగాక! అని భావించవలెను. చంద్రుడు (సోమశబ్దానికి కుబేరుడు, యముడు, వాయువు మొ॥లగు అర్థాలు కూడా ఉన్నాయి), వరుణుడు, సముద్రుడు, సూర్యుడు, అగ్ని, వాయువు వీరందరు కూడా నాకు శాంతిని ప్రసాదింతురుగాక అని భావించవలెను.

తథోక్తేః కలజిహ్వోఽభూత్పుత్రస్తాలనికేతనః ॥62॥

స యేషాం రసనాసంస్థస్తానసాధూన్ వివాదయేత్ ।

రెండవ కుమారుడైన తథోక్తికి కలజిహ్వుడను కొడుకు గలడు. అతడు తాటిచెట్లే నివాసముగా గలవాడు. అతడు ఎవరి నాలుకల మీద ఉండి చెడ్డగా మాట్లాడించునో అట్టివారిని శాంతపరచవలెను. తద్వారా తథోక్తిని శాంతపరచి అతడి బారినుంచి రక్షించుకొనవలెనని భావము.

పరివర్తసుతౌ ద్వౌ తు విరూపవికృతౌ ద్విజ ॥63॥

తౌ తు వృక్షాద్రిపరిఖాప్రాకారాంభోధిసంశ్రయౌ ।
గుర్విణ్యాః పరివర్తన్తౌ కురుతః పాదపాదిషు ॥64॥

క్రౌష్టుకే పరివర్తః స్యాద్గర్భస్యాన్యోదరాత్తతః ।
న వృక్షం చైవ నైవాద్రిం న ప్రాకారం మహోదధిమ్ ॥65॥

పరిఖాం వా సమాక్రామేదబలా గర్భధారిణీ ।

ఓ బ్రాహ్మణుడా ! పరివర్తుడను మూడవ కుమారునికి విరూపుడు, వికృతుడు అను ఇద్దరు పుత్రులు గలరు. వారు చెట్లు, పర్వతములు, కందకములు, ప్రాకారములు, సముద్రము వీటిని ఆశ్రయించి ఉందురు. ఓ క్రౌష్టుకి ఋషీ ! ఆయా చెట్లవద్ద గర్భిణీస్త్రీలు నడచునప్పుడు ఒక గర్భవతీస్త్రీ ఉదరమందున్న గర్భమును మరొక గర్భవతీస్త్రీ ఉదరమందు ప్రవేశపెట్టి ఇటూ అటూ పరివర్తనము చేయుదురు. అందువలన గర్భవతులగు స్త్రీలు వృక్షమునుగాని, పర్వతమునుగాని, ప్రాకారమునుగాని, సముద్రమునుగాని, అగడ్తనుగాని (కందకము) ఆశ్రయించి యుండరాదు.

అంగధ్రుక్తనయం లేభే పిశునం నామ నామతః ॥66॥
సోఽస్థిమజ్జాగతః పుంసాం బలమత్త్యజితాత్మనామ్ ।

అంగధ్రుక్కు అను నాల్గవ కుమారుడు పిశునుడను పేరుగల పుత్రుని పొందెను. అతడు పురుషుల ఎముకలు, మాంసములందుండి, ఆత్మనిగ్రహములేనివారి బలమును భక్షించును. (బలమ్ +అత్తి +అజితాత్మనామ్ అని పదవిభాగము)

శ్యేనకాకకపోతాంశ్చ గృధ్రోలూకౌ చ వై సుతాన్ ॥67॥
అవాప శకునిః పఞ్చ జగృహుస్తాన్సురాసురాః ।

శకునియను అయిదవ కుమారునికి డేగ, కాకి, పావురము, గ్రద్ద, గుడ్లగూబయను అయిదుగురు పుత్రులు పుట్టిరి. వారిని దేవతలు, రాక్షసులు గ్రహించిరి.

శ్యేనం జగ్రాహ మృత్యుశ్చ కాకం కాలో గృహీతవాన్ ॥68॥

ఉలూకం నిర్ఋతిశ్చైవ జగ్రాహాతిభయావహమ్ ।
గృధ్రం వ్యాధిస్తదీశోఽథ కపోతం చ స్వయం యమః ॥69॥

ఏతేషామేవ చైవోక్తాః భూతాః పాపోపపాదనే ।

మృత్యువు శ్యేనమును, కాలము కాకమును, నిర్ఋతి అతిభయంకరమైన ఉలూకమును, వ్యాధి గృధ్రమును, వ్యాధికి ప్రభువైన యముడు కపోతమును గ్రహించిరి. ఈ శ్యేనాదులే పాపమును పుట్టించుటలో హేతువులు.

తస్మాచ్ఛ్యేనాదయో యస్య నిలీయేయుః శిరస్యథ ॥70॥

తేనాత్మరక్షణాయాలం శాన్తిం కుర్యాద్ద్విజోత్తమ ।
గేహే ప్రసూతిరేతేషాం తద్వన్నీడ నివేశనమ్ ॥71॥

నరస్తం వర్జయేద్గేహం కపోతాక్రాంతమస్తకమ్ ।
శ్యేనః కపోతో గృధ్రశ్చ కాకోలూకౌ గృహే ద్విజ ॥72॥

ప్రవిష్టః కథయేదన్తం వసతాం తత్ర వేశ్మని ।
ఈదృక్పరిత్యజేద్గేహం శాన్తిం కుర్యాచ్చ పణ్డితః ॥73॥

స్వప్నేఽపి హి కపోతస్య దర్శనం న ప్రశస్యతే ।

ఓ బ్రాహ్మణశ్రేష్ఠుడా! అందువలన ఎవని శిరస్సుపై ఈ శ్యేనాదులు వ్రాలునో అతడు తన ప్రాణరక్షణము కొరకై శాంతికార్యములను చేసుకొనవలెను. ఏ ఇంటిలో శ్యేనాదులు పిల్లలను పెట్టునో, అట్లే గూడు కట్టుకొనునో, ఏ ఇంటి పై కప్పుమీద పావురము వ్రాలునో అట్టి ఇంటిని మానవుడు విడిచిపెట్టవలెను. ఓ బ్రాహ్మణుడా! డేగ, పావురము, గ్రద్ద, కాకి, గుడ్లగూబ ఏ ఇంట ప్రవేశించునో ఆ ఇంట్లోని వారి మరణము సూచింపబడును. అట్టి ఇంటిని పండితుడైన వాడు విడిచిపెట్టి శాంతులను చేసుకొనవలెను. కలలో కూడా పావురమును చూచుట మంచిది కాదు.

షడపత్యాని కథ్యన్తే గణ్డప్రాన్తరతేస్తథా ॥74॥

స్త్రీణాం రజస్యవస్థానం తేషాం కాలాంశ్చ మే శృణు ।
చత్వార్యహాని పూర్వాణి తథైవాన్యత్త్రయోదశమ్ ॥75॥

ఏకాదశం తథైవాన్యదన్యదపత్యం తస్య వై దినే ।
అన్యద్దినాభిగమనే శ్రాద్ధదానే తథాపరే ॥76॥

పర్వస్వథాన్యత్తస్మాత్తు వర్జ్యాన్యేతాని పణ్డితైః ।

గణ్డప్రాన్తరతియను ఆరవ కుమారునికి ఆరుగురు పుత్రులు చెప్పబడుచున్నారు. స్త్రీల రజఃకాలమందు వారు ఆరుగురు నివసించెదరు. వారు ఎప్పుడెప్పుడు నివసించెదరో చెప్పెదను, వినుము. ఆ ఆరుగురిలో ఒకడు రజోదర్శనము పిమ్మట మొదటి నాలుగురోజులు, మరొకడు పదమూడవరోజు, మరొకడు పదునొకండవ రోజు, మరొకడు సూర్యోదయ కాలమందు, మరొకడు శ్రాద్ధమందలి దానకార్యములందు, చివరి ఆరవవాడు పర్వకాలములందు వసించును. కాబట్టి పండితులు ఈ రోజులందు స్త్రీ సంభోగమును విడిచిపెట్టవలెను.

గర్భహన్తుః సుతో నిఘ్నో మోహినీ చాపి కన్యకా ॥77॥

ప్రవిశ్య గర్భమత్త్యేకో భుక్త్వా మోహయతేఽపరా ।
జాయన్తే మోహనాత్తస్యాః సర్పమణ్డూకకచ్ఛపాః ॥78॥

సరీసృపాణి చాన్యాని పురీషమథవా పునః ।
షణ్మాసాద్గుర్విణీం మాంసమశ్నువానామసంయతామ్ ॥79॥

వృక్షచ్ఛాయాశ్రయాం రాత్రావథవా త్రిచతుష్పథే ।
శ్మశానకటభూమిష్ఠాముత్తరీయవివర్జితామ్ ॥80॥

రుద్యమానాం నిశీథేఽథ ఆవిశేత్తామిమౌ స్త్రియమ్ ।

గర్భహా లేదా గర్భహన్తయను ఏడవ కుమారునికి నిఘ్నుడనుపుత్రుడు, మోహినియనుకుమార్తెగలరు. స్త్రీల గర్భమందు ప్రవేశించి నిఘ్నుడు గర్భమును తినివేయును. మోహిని కూడా గర్భమును తిని మోహపరచును. ఆమె మోహపరచినందున పాము, కప్ప, తాబేలు, తేలు మొ॥నవి ఉద్భవించును. లేదా మలమూత్రాదులు ఉద్భవించును. మాంసమును భుజించునట్టిది, ఆత్మనిగ్రహము లేనట్టిది, రాత్రియందుగాని మూడు లేదా నాలుగు రోడ్ల కూడలియందు గాని చెట్టు నీడను ఆశ్రయించినట్టిది, శ్మశానమందలి కటమందు (చాప) గాని భూమియందుగాని ఉన్నట్టిదీ, పైన వస్త్రము కప్పుకోనట్టిదీ, అర్ధరాత్రియందు ఏడ్చుచున్నట్టిదీ అయిన ఆరునెలల గర్భవతీ స్త్రీని ఇరువురు అనగా నిఘ్నుడు, మోహిని ప్రవేశించెదరు.

సస్యహన్తుస్తథైవైకః క్షుద్రకో నామ నామతః ॥81

సస్యర్ధిం స సదా హన్తి లబ్ధ్వా రన్ధ్రం శృణుష్వ తత్ ।
అమంగల్యదినారంభే సుతృప్తో వపతే చ యః ॥82॥

క్షేత్రేష్వనుప్రవేశం వై కరోత్యన్తోపసంగిషు ॥83॥
అమంగల్యదినారంభం మంగలానాం చ వర్జయేత్ ।

(మహద్భయం ప్రయచ్ఛన్తి యత్ర వై తత్ప్రసంగిషు)
తస్మాత్కల్పః సుప్రశస్తే దినేఽభ్యర్చ్య నిశాకరమ్ ॥84॥

కుర్యాదారంభముప్తిం చ హృష్టస్తుష్టః సహాయవాన్ ।

సస్యహా లేదా సస్యహన్తయను ఎనిమిదవ కుమారునికి క్షుద్రకుడను పేరు గల ఒక కొడుకు గలడు. అతడు అవకాశమును కనిపెట్టి సస్యసంపదను పాడు చేయును. ఆ విషయమును చెప్పెదను వినుము. ఎవరయితే అమంగళమైన రోజులలో తృప్తిగా పొలములందు ప్రవేశించి నాటులు నాటునో అట్టివాని పొలములందు క్షుద్రకుడు ప్రవేశించి అచ్చటి వరి మొ॥లగు పంటలను పాడు చేయును. అందువలన అమంగళమైన రోజులలో శుభకార్యములను ఆరంభించరాదు. అట్టి సందర్భములలో క్షుద్రకుడు గొప్ప భయమును కలిగించును. అందువలన మిక్కిలి ప్రశస్తమైన దినమందు చంద్రుని పూజించి, తృప్తిసంతోషములు కలిగినవాడై మరొకరి సహాయముతో మంగళకార్యములను ఆరంభించవలెను. పొలమందు నాటులను నాటవలెను.

నియోజికేతి యా కన్యా దుస్సహస్య మయోదితా ॥85॥

జాతం ప్రచోదికాసంజ్ఞం తస్యాః కన్యాచతుష్టయమ్ ।
మత్తోన్మత్తప్రమత్తాస్తు నరాన్నారీస్తు తాః సదా ॥86॥

సమావిశన్తి నాశాయ చోదయన్తీహ దారుణమ్ ।
అధర్మం ధర్మరూపేణ కామం చాకామరూపిణమ్ ॥87॥

అనర్థం చానర్థరూపేణ మోక్షం చామోక్షరూపిణమ్ ।
దుర్వినీతాన్వినా శౌచం దర్శయన్తి పృథఙ్నరాన్ ॥88॥

భ్రంశత్యాభిః ప్రవిష్టాభిః పురుషార్థాత్ పృథఙ్నరః ।
తాసాం ప్రవేశశ్చ గృహే సంధ్యృక్షేషు హ్యుదుంబరే ॥89॥

ధాత్రే విధాత్రే చ బలిర్యత్ర కాలే న దీయతే ।
భుంజతాం పిబతాం వాపి సంగిభిర్జల విప్రుషైః ॥90॥

నరనారీషు సంక్రాంతిస్తాసామాశ్వభిజాయతే । (తాసామ్ + ఆశు + అభిజాయతే)

ఓ ద్విజుడా! దుస్సహునికి నియోజిక అను (మొదటి) కన్య ఉద్భవించినదని నీకు నేను చెప్పితిని. ఆమెకు "ప్రచోదిక" అను పేరుగల నల్గురు కుమార్తెలు గలరు. వారంతా మత్తులు, ఉన్మత్తులు మరియు ప్రమత్తులు. వారెల్లప్పుడు స్త్రీపురుషులను ఆవహించి వారి నాశము కొరకు వారు పాపకర్మలను చేయువిధముగా వారిని ప్రేరేపించెదరు. ఆ కన్యలు నలుగురు అధర్మమును ధర్మ రూపముగాను, లౌకికమైన పాపహేతువయిన కామమును అకామముగాను, అనర్థమును అర్థముగాను, మోక్షమును మోక్షముకానిదానిగానూ శౌచములేని వినయము లేని నరులకు చూపించెదరు. ఈ విధముగా ఆ కన్యలు నరులలో ప్రవేశించుటచేత ఆ పురుషుడు చతుర్విధపురుషార్థముల నుండి భ్రంశము చెందును. ఆ నలుగురు కన్యలు ఆయా ఇండ్లలో సంధికాలమందు నక్షత్రోదయసమయంలో ప్రవేశించెదరు. ఏ ఇంట ధాతకు, విధాతకు తగిన కాలంలో బలిని ఇవ్వరో అట్టి ఇంట ఆ కన్యలు ప్రవేశించెదరు. తినేటప్పుడు, త్రాగేటప్పుడు ఆ ఎంగిలి పదార్థములు గాని, నీటి బొట్లుగాని ఎవరి శరీరం మీద పడతాయో అట్టి స్త్రీ పురుషులను శీఘ్రంగా ఈ కన్యలు ప్రవేశించి వారిని కష్టాలకు గురి చేస్తారు.

విరోధిన్యాస్త్రయః పుత్రాశ్చోదకో గ్రాహకస్తథా ॥91॥

తమఃప్రచ్ఛాదకశ్చాన్యస్తత్స్వరూపం శృణుష్వ మే ।
ప్రదీపతైలసంసర్గదూషితే లంఘితే ఖలే ॥92॥

ముసలోలూఖలే యత్ర పాదుకే వాసనే స్త్రియః ।
శూర్పదాత్రాదికం యత్ర పదాకృష్టం తథాసనమ్ ॥93॥

యత్రోపలిప్తే నాభ్యర్చ్య విహారః క్రియతే గృహే ।
దర్వీముఖేన యత్రాగ్నిరాహృతోఽన్యత్ర నీయతే ॥94॥

విరోధినీసుతాస్తత్ర విజృమ్భన్తే ప్రచోదితాః ।

దుస్సహుని రెండవ కన్య విరోధిని. ఆమెకు చోదకుడు, గ్రాహకుడు, తమఃప్రచ్ఛాదకుడు అను ముగ్గురు కొడుకులు జన్మించిరి. వారి స్వరూపమును చెప్పెదను, వినుము. దీపమందలి నూనె సంబంధం వల్ల దూషింపబడినవీ,

తృణీకరింపబడినవీ అయిన ధాన్యాగారము, యజ్ఞమందలి ఉత్తరవేది, రోలు, రోకలి స్త్రీలు ధరించే పాదరక్షలు మరియు వారు ధరించే రెండు వస్త్రాలు ఏ గృహమందయితే ఉంటాయో అచ్చట ఈ ముగ్గురు పుత్రులు నివసిస్తారు. (అలా నివసించి విజృంభించి ఆ ఇంటిలోనివారికి బాధలు కలుగచేస్తారని భావము.) ఎచ్చట చేట, కొడవలి, కూర్చొనే ఆసనము వీటిని కాలితో తాకుతారో అట్టి గృహమందు కూడా వీరు నివసిస్తారు. ఏ ఇంట పేడతో అలికి శుభ్రము చేసికూడా దేవుని ప్రతిష్ఠలేక పూజలు సల్పక నివసిస్తారో అట్టి ఇంట కూడా వీరు నివసిస్తారు. అట్లే గరిటెతో నిప్పును తీసుకొని మరొకచోటికి తీసుకువెడతారో అట్టిచోట కూడా ఈ విరోధినీపుత్రులు ప్రేరేపింపబడి విజృంభిస్తారు.

ఏకో జిహ్వాగతః పుంసాం స్త్రీణాం చాలీకసత్యవాన్ ॥95॥

చోదకో నామ స ప్రోక్తః పైశున్యం కురుతే గృహే ।

ఆ ముగ్గురు పుత్రులలో ఒకడు మొదటివాడు స్త్రీపురుషుల నాలుకపై ఉండి అసత్యమును సత్యముగా పలికించును. అతడే చోదకుడను పేరు గలవాడు. ఆ గృహమందు పైశున్యమును అనగా చాడీలు చెప్పించుటను చేయును.

అవదానగతశ్చాన్యః శ్రవణస్థోఽతిదుర్మతిః ॥96॥

కరోతి గ్రహణం తేషాం వచసాం గ్రాహకస్తు సః ।

మరొకడు రెండవవాడు ఏకాగ్రబుద్ధితో స్త్రీపురుషుల చెవిలో ఉండి మిక్కిలి దుర్బుద్ధిగలవాడై, వారి మాటలను గ్రహిస్తూ వారిని తన వశమందు ఉంచుకొనును. అనగా ఇతరుల మాటలను వేరే మాటలుగా మార్పుచేసి అట్టి మాటలను వినిపింపచేయునని ఆశయము. అతడే గ్రాహకుడను పేరు గలవాడు.

ఆక్రమ్యాన్యో మనో నృణాం తమసాచ్ఛాద్య దుర్మతిః ॥97॥

క్రోధం జనయతే యస్తు తమఃప్రచ్ఛాదకస్తు సః ।

మరొకడు దుర్బుద్ధి కలిగిన మూడవవాడు మనుష్యుల మనస్సును ఆక్రమించి అజ్ఞానముతో ఆవరింపచేసి వారిలో క్రోధమును పుట్టించును. అతడే తమఃప్రచ్ఛాదకుడను పేరు గలవాడు.

స్వయంహార్యాస్తు చౌర్యేణ జనితం తనయత్రయమ్ ॥98॥

సర్వహార్యర్థహారీ చ వీర్యహారీ తథైవ చ ।
అనాచాన్తగృహేష్వేతే మన్దాచారగృహేషు చ ॥99॥

అప్రక్షాలితపాదేషు ప్రవిశత్సు మహాసనమ్ ।
ఖలేషు గోష్ఠేషు వై ద్రోహా యేషు గృహేషు వై ॥100॥
తేషు సర్వే యథాన్యాయం విహరన్తి రమన్తి చ ।

దుస్సహుని మూడవ కన్యపేరు స్వయంహారి. ఈమె దొంగతనము కారణముగా ముగ్గురు కుమారులను పుట్టించినది. అనగా అధర్మమార్గంలో పుట్టించిందని ఆశయము. వీరు వరుసగా సర్వహారి, అర్ధహారి, వీర్యహారి అను పేర్లు గలవారు. ఆచమనము అనగా విధ్యుక్తప్రకారము భోజనానికి ముందు తరువాతా కూడా నీటిని తీసుకోవడమని అర్థం. అట్టి ఆచమనము లేని గృహాలలోను, చెడు ఆచారములు కలిగిన గృహాలలోను, కాళ్ళు కడుగకుండా వంటింట్లో ప్రవేశించే గృహాలలోను, ధాన్యాగారాలు పశుశాలలయందు ద్రోహము చేయుటగల గృహాలలోను ఈ ముగ్గురు పుత్రులు స్వేచ్ఛగా విహరిస్తారు, ఆ గృహస్థులకు కష్టాలను కలుగజేసి ఆనందిస్తారు.

భ్రామణ్యాస్తనయస్త్వేకః కాకజంఘు ఇతి స్మృతః ॥101॥

తేనావిష్టో రతిం సర్వో నైవ ప్రాప్నోతి వై మునే ।
భుఞ్జన్యో గాయతే మైత్రే గాయతే హసతే చ యః ॥102॥

సంధ్యామైథునినం చైవ నరమావిశతి ద్విజ ।

దుస్సహుని నాల్గవ కన్యపేరు భ్రామణి, ఆమెకు కాకజంఘుడను కుమారుడు గలడు. ఓ మునీ ! అతడు ఎవరిని ఆవహిస్తాడో వారికి సంతోషము కలుగదు. ఓ బ్రాహ్మణుడా ! భోజనము చేస్తూ ఎవరయితే మౌనంగా ఉండక మాటలాడతాడో ఇంకనూ స్నేహితునితో మాటలాడుతూ నవ్వుతాడో అట్టి మానవుని కాకజంఘుడు ఆవహిస్తాడు. అట్లే సంధ్యాకాలమందు ఎవరయితే సంభోగము చేయుదురో అట్టివారిని కూడా కాకజంఘుడు ఆవహిస్తాడు. ("మిత్రమేవ మైత్రః" అని వాచస్పత్యం. మైత్రశబ్దానికి మిత్రుడని అర్థం "గై శబ్దే" అనే ధాతువు నుంచి "గాయతే" అను శబ్దం ఏర్పడింది.)

కన్యాత్రయం ప్రసూతా సా యా కన్యా ఋతుహారిణీ ॥103॥

ఏకా కుచహరా కన్యా అన్యా వ్యఞ్జనహారికా ।
తృతీయా తు సమాఖ్యాతా కన్యకా జాతహారిణీ ॥104॥

దుస్సహుని అయిదవ కన్యపేరు ఋతుహారిణి. ఆమె ముగ్గురు కుమార్తెలను పుట్టించినది. వారు ముగ్గురు వరుసగా కుచహర, వ్యంజనహారిక, జాతహారిణి అను పేర్లు గలవారు.

యస్యా న క్రియతే సర్వః సమ్యగ్వైవాహికో విధిః ।
కాలాతీతోఽథవా తస్యా హరత్యేకా కుచద్వయమ్ ॥105॥

ఏ కన్యకయితే శాస్త్రోక్తప్రకారము వివాహము జరుపబడదో లేక సమయము అతిక్రమించిన తరువాత జరుపబడుతుందో అట్టి కన్యయొక్క రెండు స్తనములను కుచహర హరించును.

సమ్యక్ శ్రాద్ధమదత్వా చ తథానభ్యర్చ్య మాతృకాః ।
వివాహితాయాః కన్యాయా హరతి వ్యఞ్జనం తథా ॥106॥

శ్రాద్ధాది కార్యములు బాగుగా చేయక, తల్లిని పూజింపక వివాహము చేసుకొన్న కన్యయొక్క మర్మావయవములను వ్యఞ్జనహారిక హరించును.

**అగ్న్యంబుశూన్యే చ తథా విధూపే సూతికాగృహే ।
అదీపశస్త్రముసలే భూతి సర్షపవర్జితే ॥107॥**

**అనుప్రవిశ్య సా జాతమపహృత్యాత్మసంభవమ్ ।
క్షణప్రసవినీబాలం తత్రైవోత్సృజతే ద్విజ ॥108॥**

**సా జాతహారిణీ నామ సుఘోరా పిశితాశనా ।
తస్మాత్సంరక్షణం కార్యం యత్నతః సూతిగాగృహే ॥109॥**

ఓ బ్రాహ్మణుడా ! ఏ సూతికా గృహమందు అనగా ప్రసవించిన స్త్రీ ఉన్న గృహమందు అగ్ని, జలము, ధూపము, దీపము, ఆయుధము, రోకలి, విభూతి, ఆవాలు ఉండవో అట్టి గృహమును ప్రవేశించి ఆ స్త్రీకి పుట్టినవానిని అపహరించి మరల ఆ బాలింతరాలి బిడ్డను అచ్చటే వదిలిపెట్టి వెళ్ళునో ఆమెయే జాతహారిణి. ఆమె మిక్కిలి దారుణమైన స్వభావము గలది, మాంసమును తినునది. అందువలన ప్రసూతిగృహమందు మిక్కిలి యత్నముతో బిడ్డలను రక్షించవలెను.

**స్మృతిం చాప్రయతానాం చ శూన్యాగారనిషేవణాత్ ।
అపహన్తి సుతస్తస్యాః ప్రచండో నామ నామతః ॥110॥**

దుస్సహుని ఆరవకన్య స్మృతిహారిణి. శూన్యగృహమందు నివసించుటచేత మనస్సుకు ఏకాగ్రత లేనివారి స్మృతిని ఆమె నష్టపరచును. అన్నీ మరచునట్లు చేయునని అర్థం. ఆమెకు ప్రచండుడను పేరుగల కొడుకు గలడు.

**పౌత్రేభ్యస్తస్య సంభూతాః లీకాః శతసహస్రశః ।
చణ్డాలయోనయశ్చాష్టౌ దండపాశాతిభీషణాః ॥111॥**

**క్షుధావిష్టాస్తతో లీకాస్తాశ్చ చండాలయోనయః ।
అభ్యధావన్త చాన్యోన్యమత్తుకామాః పరస్పరమ్ ॥112॥**

**ప్రచండో వారయిత్వా తు యాస్తాశ్చండాలయోనయః ।
సమయే స్థాపయామాస యాదృశే తాదృశం శృణు ॥113॥**

అతడి పౌత్రులవలన వందలు, వేలు లీకులు (ఒక విధమైన హానిని కలిగించు ప్రాణులు), ఎనిమిదిమంది చండాలయోనులు ఉద్భవించిరి. వారందరు దండపాశములను ధరించి మిక్కిలి భయంకరమైన ఆకారము గలవారై ఆకలిగొన్నవారు. అందువలన వారందరు ఆకలి తీర్చుకొనుటకై ఒకరినొకరు తినుటకు ప్రవర్తించసాగిరి. ప్రచండుడు వారిని వారించి చండాలయోనులను ఒక అంగీకారమునకు తెచ్చెను. అది ఎట్టిదో చెప్పెదను, వినుము.

**అద్యప్రభృతి లీకానామావాసం యో హి దాస్యతి ।
దణ్డం తస్యాహమతులం పాతయిష్యే న సంశయః ॥114॥**

ఈ రోజునుంచి లీకులకు ఎవరయితే ఆశ్రయము ఇచ్చెదరో వారిని ఊహించని విధంగా భయంకరముగా శిక్షించెదను. ఇందు సందేహము లేదు.

చండాలయోన్యావసథే లీకా యా ప్రసవిష్యతి ।
తస్యాశ్చ సంతతిః పూర్వా సా చ సద్యో న శిష్యతి ॥115॥

చండాలయోనులగు వారి గృహములందు ఏ ఆడు లీకురాలు ప్రసవిస్తుందో ఆమె సంతానము, ఆమె ఇరువురూ మిగలరు అనగా నశించెదరు.

ప్రసూతే కన్యకే ద్వే తు స్త్రీపుంసోర్బీజహారిణీ ।
వాతరూపామరూపాం చ తస్యాః ప్రహరణం తు తే ॥116॥

దుస్సహుని ఏడవ కుమార్తె బీజహారిణి. ఆమె స్త్రీపురుషుల బీజమును అనగా సంతానమును పుట్టించే సామర్థ్యమును హరించును. ఆమె వాతరూప, అరూప అను ఇద్దరు కన్యలను ఉత్పన్నము చేసెను. ఆమె మనుష్యులను హింసించు విధమెట్టిదో చెప్పెదను, వినుము.

వాతరూపా నిషేకాన్తే సా యస్మై క్షిపతే సుతమ్ ।
స పుమాన్వాతశుక్రత్వం ప్రయాతి వనితాపి వా ॥117॥

స్త్రీపురుషుల సంభోగము వలన నిషేకము జరిగిన పిమ్మట (స్త్రీయోనియందు పురుషుడు తన వీర్యమును చిలకరించుట నిషేకము) గర్భధారణానంతరము ఆ స్త్రీ లేదా పురుషునికి వాతశుక్రత్వమను వ్యాధిని వాతరూప కలిగించును.

తథైవ గచ్ఛతః సద్యో నిర్బీజత్వమరూపయా ।
అస్నాతాశీ నరో యో వై తథైవ పిశితాశనః ॥118॥

పూర్వోక్తసందర్భమందే ఏ పురుషుడయితే స్నానము చేయకుండా భోజనము చేయునో, మాంసమును భుజించునో అట్టి పురుషునికి అరూపయను రెండవ కుమార్తె నిర్బీజత్వమును అనగా సంతానోత్పత్తిసామర్థ్యము లేకపోవుటను కలిగించును.

విద్వేషణీ తు యా కన్యా భ్రుకుటీకుటిలాననా ।
తస్య ద్వౌ తనయౌ పుంసామపకారప్రకాశకౌ ॥119॥

దుస్సహుని ఎనిమిదవ కుమార్తె విద్వేషిణి. కనుబొమలు ముడుచుకొని, వంకరయైన ముఖము కలిగినది ఈమె. పురుషులకు అపకారము చేయునట్టి ఇద్దరు కుమారులు ఈమెకు కలిగిరి.

నిర్బీజత్వం నరో యాతి నారీ వాఽఽశౌచవర్జితా ।
పైశున్యాభిరతం లోలమసజ్జలనిషేవణమ్ ॥120॥

పురుషద్వేషిణం చైతౌ నరమాక్రమ్య తిష్ఠతః ।
మాత్రా భ్రాత్రా తథా మిత్రైరభీష్టైః స్వజనైః పరైః ॥121॥

విద్విష్టో నాశమాయాతి పురుషో ధర్మతోఽర్థతః ।
ఏకస్తు స్వగుణాన్ లోకే ప్రకాశయతి పాపకృత్ ॥122॥

ద్వితీయస్తు గుణాన్మైత్రీం లోకస్థామపకర్షతి ।
ఇత్యేతే దౌఃసహాః సర్వే యక్ష్మణః సంతతావథ ।
పాపాచారాః సమాఖ్యాతా యైర్వ్యాప్తమఖిలం జగత్ ॥123॥

పురుషుడయిననూ, స్త్రీ అయిననూ ఆశౌచమును విడిచిపెట్టినచో (తమ జ్ఞాతులు మరణించినచో పదిరోజులు ఆశౌచమును పాటించవలెను) నిర్బీజత్వమును అనగా సంతానోత్పత్తి సామర్థ్యమును పోగొట్టుకుందురు. పైశున్యమునందు (పైశున్యమనగా చాడీలు చెప్పు స్వభావము) ప్రీతి గలవాడు, విషయవాంఛలు కలిగినవాడు, దుష్టమైన నీటిని సేవించువాడు, పురుషులను ద్వేషించువాడు అగు మానవుని ఈ విద్వేషిణీపుత్రులిరువురూ ఆక్రమించియుండెదరు. తల్లి, సోదరుడు, స్నేహితులు, ఇష్టులైన జనులు వీరిచేత ద్వేషింపబడిన మనుష్యుడు ధర్మము అర్థములనుండి నాశనమును పొందును. విద్వేషిణీపుత్రులలో ఒకడు పాపకర్మలను ఆచరిస్తూ తన దుష్ట గుణములను లోకమందు ప్రకాశింపచేయును. రెండవవాడు కూడా తన దుష్ట గుణములను ప్రకాశింపచేస్తూ లోకమందలి మైత్రిని నశింపచేయును. ఈ విధముగా యక్ష్మసంతతిలో దౌస్సహులు (దుస్సహుని సంతానము) పాపాచరణము గలవారై ఈ ప్రపంచమంతా వ్యాపించి ఉండిరి.

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే దౌస్సహోత్పత్తిసమాపనం నామాష్టచత్వారింశోఽధ్యాయః ॥48॥

శ్రీ మార్కండేయ మహాపురాణమందలి దుస్సహుని సంతానోత్పత్తియను ప్రకరణసమాప్తియను నలుబది ఎనిమిదవ అధ్యాయం సమాప్తం.



ఏకోనపఞ్చాశత్తమోఽధ్యాయః - నలుబదితొమ్మిదవ అధ్యాయం
రుద్రసర్గః - రుద్రసర్గం

మార్కండేయ ఉవాచ - మార్కండేయుడు చెప్పాడు.

ఇత్యేష తామసః సర్గో బ్రహ్మణోఽవ్యక్తజన్మనః ।
రుద్రసర్గం ప్రవక్ష్యామి తన్మే నిగదతః శృణు ॥1॥

అవ్యక్తమైన జన్మగల బ్రహ్మదేవుని తామససృష్టిని గూర్చి నేను నీకు చెప్పితిని. ఇప్పుడు నీకు రుద్రసర్గమును గూర్చి (రుద్రుని వలన జరిగిన సృష్టిని గూర్చి) చెప్పెదను, వినుము.

తనవశ్చ తథైవాష్టౌ పత్న్యః పుత్రాశ్చ తే తథా ।
కల్పాదావాత్మనస్తుల్యం సుతం ప్రధ్యాయతః ప్రభోః ॥2॥

తనతో సమానమైన పుత్రుని గూర్చి ధ్యానించుచున్న బ్రహ్మదేవునికి ఎనిమిది మంది పుత్రులు కలిగిరి. వారికి భార్యలు, సంతానము కూడా కలిగిరి.

ప్రాదురాసీదథాఙ్కేఽస్య కుమారో నీలలోహితః ।
రురోద సుస్వరం సోఽథ ద్రవంశ్చ ద్విజసత్తమ ॥3॥

ఓ బ్రాహ్మణశ్రేష్ఠుడా ! కల్పాదిలో బ్రహ్మదేవుడు అట్లు ధ్యానించుచుండగా అతని ఒడిలో నలుపు ఎరుపు శరీరము గల కుమారుడొకడు ఉద్భవించెను. అతడు పరుగుతీయుచూ తియ్యని కంఠస్వరముతో ఏడ్చెను.

కిం రోదిషీతి తం బ్రహ్మా రుదంతం ప్రత్యువాచ హ ।
నామ దేహీతి తం సోఽథ ప్రత్యువాచ జగత్పతిమ్ ॥4॥

"ఎందులకు ఏడ్చుచున్నావు" అని ఆ ఏడ్చుచున్న బాలుని బ్రహ్మ ప్రశ్నించెను. అంతట ఆ బాలుడు జగత్ప్రభువగు బ్రహ్మదేవుని "నాకు పేరును ఇమ్ము" అని పలికెను.

బ్రహ్మోవాచ - బ్రహ్మ చెప్పాడు.

రుద్రస్త్వం దేవ నామ్నాసి మా రోదీర్ధైర్యమావహ ।
ఏవముక్తస్తతః సోఽథ సప్తకృత్వో రురోద హ ॥5॥

"నీవు రుద్రదేవుడను పేరు గలవాడవు. ఏడ్వవలదు. ధైర్యమును వహించుము" అని బ్రహ్మదేవుడు పలుకగా తిరిగి ఆ బాలుడు ఏడుసార్లు ఏడ్చెను.

తతోఽన్యాని దదౌ తస్మై సప్త నామాని వై ప్రభుః ।
స్థానాని చైషామష్టానాం పత్నీః పుత్రాంశ్చ వై ద్విజ ॥6॥

ఓ బ్రాహ్మణుడా ! అంతట బ్రహ్మదేవుడు ఇంకను వేరే ఏడు పేర్లను అతనికి ఇచ్చెను. మొత్తం ఆ ఎనిమిదిమందికి ఎనిమిది స్థానములను, భార్యాబిడ్డలను కూడా బ్రహ్మదేవుడు ప్రసాదించెను.

భవం శర్వం తథేశానం తథా పశుపతిం ప్రభుః ।
భీమముగ్రం మహాదేవమువాచ స పితామహః ॥7॥

చక్రే నామాన్యథైతాని స్థానాన్యేషాం చకార హ ।
సూర్యో జలం మహీ వహ్నిర్వాయురాకాశమేవ చ ॥8॥

దీక్షితో బ్రాహ్మణః సోమ ఇత్యేతాస్తనవః క్రమాత్ ।
సువర్చలా తథైవోమా వికేశీ చాపరా స్వధా ॥9॥

స్వాహా దిశస్తథా దీక్షా రోహిణీ చ యథాక్రమమ్ ।
సూర్యాదీనాం ద్విజశ్రేష్ఠ రుద్రాద్యైర్నామభిః సహ ॥10॥

శనైశ్చరస్తథా శుక్రో లోహితాఙ్గో మనోజవః ।
స్కన్దః సర్గోఽథ సన్తానో బుధశ్చానుక్రమాత్సుతాః ॥11॥

ముందు చెప్పిన రుద్రుడు అను పేరుతోబాటుగా, భవుడు, శర్వుడు, ఈశానుడు, పశుపతి, భీముడు, ఉగ్రుడు, మహాదేవుడు అని ఏడు పేర్లను బ్రహ్మదేవుడు పలికెను. (మొత్తం ఎనిమిది పేర్లు.) ఈ విధముగా ఎనిమిది పేర్లను ప్రసాదించి ఆ ఎనిమిదిమందికి వరుసగా సూర్యుడు, జలము, భూమి, వహ్ని, వాయువు, ఆకాశము, యజ్ఞమునాచరించిన బ్రాహ్మణుడు, చంద్రుడు అను ఎనిమిది స్థానములను ప్రసాదించెను. ఈ ఎనిమిదిమంది రుద్రాదులకు లేదా సూర్యాదులకు వరుసగా సువర్చల, ఉమ, వికేశి, స్వధ, స్వాహా, దిశ, దీక్ష, రోహిణి అను ఎనిమిదిమంది భార్యలు గలరు. ఓ బ్రాహ్మణశ్రేష్ఠుడా! సూర్యాదులు ఎనిమిదిమందికి రుద్రాది అష్టనామములతో సహా వరుసగా శనైశ్చరుడు, శుక్రుడు, లోహితాంగుడు, మనోజవుడు, స్కందుడు, సర్గుడు, సన్తానుడు, బుధుడు అను ఎనిమిదిమంది కుమారులు జన్మించిరి. (తనవః = స్త్రీలు లేదా భార్యలు)

ఏవం ప్రకారో రుద్రోఽసౌ సతీం భార్యామవిన్దత ।
దక్షకోపాచ్చ తత్యాజ సా సతీ స్వాం కలేవరమ్ ॥12॥

ఈ విధమైన రుద్రుడు సతీదేవిని భార్యగా పొందెను. దక్షునిపై కోపము కారణముగా ఆమె తన శరీరమును విడిచిపెట్టెను.

హిమవద్దుహితా సాఽభూన్మేనాయాం ద్విజసత్తమ ।
తస్యా భ్రాతా తు మైనాకః సఖాంభోధేరనుత్తమః ॥13॥

ఉపయేమే పునశ్చైనామనన్యాం భగవాన్భవః ।

ఓ బ్రాహ్మణశ్రేష్ఠుడా ! హిమవంతునికి మేనకాదేవియందు కుమార్తెగా అనగా పార్వతీదేవిగా ఆ సతీదేవి జన్మించెను. ఆమెయొక్క సోదరుడు మైనాకుడనువాడు సముద్రునికి గొప్ప స్నేహితుడు. భగవంతుడైన భవుడు తిరిగి పార్వతీదేవిని వివాహమాడెను. భవునికి ఈమె మాత్రమే భార్య.

దేవౌ ధాతావిధాతారౌ భృగోః ఖ్యాతిరసూయత ౹౹14౹౹
శ్రియం చ దేవదేవస్య పత్నీ నారాయణస్య యా ౹

భృగుమహర్షియొక్క భార్యయగు ఖ్యాతి ధాతవిధాతలను ఇరువురు దేవస్వరూపులగు కుమారులకు జన్మనిచ్చెను. అట్లే లక్ష్మీదేవియను కుమార్తెకు కూడా జన్మనిచ్చెను. ఆమెయే విష్ణుమూర్తియొక్క భార్య.

ఆయతిర్నియతిశ్చైవ మేరోః కన్యే మహాత్మనః ౹౹15౹౹

భార్యే ధాతావిధాత్రోస్తే తయోర్జాతౌ సుతావుభౌ ౹
ప్రాణశ్చైవ మృకండుశ్చ పితా మమ మహాయశాః ౹౹16౹౹

మనస్విన్యామహం తస్మాత్పుత్రో వేదశిరా మమ ౹
ధూమ్రవత్యాం సమభవత్ప్రాణస్యాపి నిబోధ మే ౹౹17౹౹

మహాత్ముడగు మేరువునకు ఆయతి, నియతియను ఇద్దరు కన్యలు జన్మించిరి. ధాత విధాతలకు ఆ ఇరువురు భార్యలయిరి. వారికి వరుసగా ప్రాణుడు, మృకండుడు అను ఇరువురు పుత్రులు ఉదయించిరి. గొప్ప కీర్తిగల మృకండుడే నా తండ్రి. మృకండునికి మనస్వినియందు నేను (బ్రహ్మ) జన్మించితిని. నాకు ధూమ్రవతియందు వేదశిరుడనే కుమారుడు జన్మించాడు. ఇక ప్రాణుని సంతానము గూర్చి కూడా చెప్పెదను, వినుము.

ప్రాణస్య ద్యుతిమాన్పుత్ర ఉత్పన్నస్తస్య చాత్మజః ౹
అజరాశ్చ తయోః పుత్రాః పౌత్రాశ్చ బహవోఽభవన్ ౹౹18౹౹

ప్రాణునికి ద్యుతిమంతుడను పుత్రుడు కలిగెను. ప్రాణునికి అజరుడను పుత్రుడు కూడా కలిగెను. వీరిరువురికి అనగా అజరద్యుతిమంతులకు అనేకమంది పుత్రులు, పౌత్రులు జన్మించిరి.

పుత్రీ మరీచేః సంభూతిః పౌర్ణమాసమసూయత ౹
విరజాః పర్వతశ్చైవ తస్య పుత్రౌ మహాత్మనః ౹౹19౹౹

తయోః పుత్రాంస్తు వక్ష్యేఽహం వంశసంకీర్తనే ద్విజ ౹

మరీచునియొక్క భార్యయగు సంభూతి పౌర్ణమాసుని ప్రసవించెను. మహాత్ముడగు అతనికి విరజుడు, పర్వతుడు అను ఇద్దరు కుమారులు జన్మించిరి. ఓ బ్రాహ్మణుడా ! వంశసంకీర్తన సందర్భముగా వారి ఇరువురి కుమారులను గూర్చి చెప్పెదను.

స్మృతిశ్చాఙ్గిరసః పత్నీ ప్రసూతా కన్యకాస్తథా ౹౹20౹౹
సినీవాలీ కుహూశ్చైవ రాకా చానుమతిస్తథా ౹

అంగిరసుని భార్య స్మృతి సినీవాలి, కుహు, రాక, అనుమతి అను నలుగురు కుమార్తెలకు జన్మనిచ్చెను.

అనసూయా తథైవాత్రేర్జజ్ఞే పుత్రానకల్మషాన్ ౹౹21౹౹

సోమం దుర్వాససం చైవ దత్తాత్రేయం చ యోగినమ్ ।

అత్రి భార్యయగు అనసూయ పాపరహితులగు సోముడు, దుర్వాసుడు, యోగియగు దత్తాత్రేయుడు ముగ్గురికి జన్మనిచ్చెను.

ప్రీత్యాం పులస్త్యభార్యాయాం దత్తోఽన్యస్తత్సుతోఽభవత్ ॥22॥

పూర్వజన్మని సోఽగస్త్యః స్మృతః స్వాయంభువేఽన్తరే ।

పులస్త్యుని భార్యయగు ప్రీతికి దత్తుడను కుమారుడు జన్మించెను. ఇతడే పూర్వజన్మమందు అనగా స్వాయంభువమన్వంతరమందు అగస్త్యునిగా స్మరింపబడెను.

కర్దమశ్చార్వవీరశ్చ సహిష్ణుశ్చ సుతత్రయమ్ ॥23॥
క్షమా తు సుషువే భార్యా పులహస్య ప్రజాపతేః ।

ప్రజాపతియగు పులహుని భార్య అయిన క్షమాదేవి కర్దముడు, అర్వవీర్యుడు, సహిష్ణువు అను ముగ్గురు పుత్రులను ప్రసవించెను.

క్రతోస్తు సన్నతిర్భార్యా వాలఖిల్యానసూయత ॥24॥
షష్టిర్యాని సహస్రాణి ఋషీణామూర్ధ్వరేతసామ్ ।

క్రతువుయొక్క భార్యయగు సన్నతి అరవైవేలమంది ఊర్ధ్వరేతస్సులగు వాలఖిల్య ఋషులకు జన్మనిచ్చెను.

ఊర్జాయాం తు వసిష్ఠస్య సప్తాజాయన్త వై సుతాః ॥25॥

రజో గాత్రోర్ధ్వబాహుశ్చ సబలశ్చానఘస్తథా ।
సుతపాః శుక్ల ఇత్యేతే సర్వే సప్తర్షయః స్మృతాః ॥26॥

వసిష్ఠునికి ఊర్జాదేవియందు రజుడు, గాత్రుడు, ఊర్ధ్వబాహువు, సుబలుడు, అనఘుడు, సుతపస్సు, శుక్లుడు అను ఏడుగురు కుమారులు జన్మించిరి. వీరు సప్తర్షులుగా స్మరింపబడుచున్నారు.

యోఽసావగ్నిరభిమానీ బ్రాహ్మణస్తనయోఽగ్రజః ।
తస్మాత్స్వాహా సుతాన్ లేభే త్రీనుదారౌజసో ద్విజ ॥27॥

పావకం పవనం చైవ శుచిం చాపి జలాశినమ్ ।
తేషాం తు సంతతావన్యే చత్వారింశచ్చ పఞ్చ చ ॥28॥

కథ్యన్తే బహుశశ్చైతే పితాపుత్రత్రయం చ యత్ ।
ఏవమేకోనపఞ్చాశద్వర్జయాః పరికీర్తితాః ॥29॥

ఓ బ్రాహ్మణుడా ! బ్రహ్మదేవుని పెద్ద కుమారుడు అగ్నిదేవుడు. ఇతడు అభిమానవంతుడు. అతనివలన స్వాహాదేవి మిక్కిలి పరాక్రమవంతులగు ముగ్గురు పుత్రులను ప్రసవించెను. వారు పావకుడు, పవనుడు, జలము

అను ముప్వురను అంతట వ్యాపింపచేయు శుచి అనువారలు. వారి సంతానము నలభైఅయిదుమంది. తండ్రి, అతడి ముగ్గురు పుత్రులు, ఈ నలభై అయిదుమంది మొత్తం నలభైతొమ్మిదిమంది ఎవరిచేతనూ జయింపశక్యము కానివారిగా కీర్తింపబడినారు.

పితరో బ్రహ్మణా సృష్టా యే వ్యాఖ్యాతా మయా తవ ।
అగ్నిష్వాత్తా బర్హిషదోஉనగ్నయః సాగ్నయశ్చ యే ॥30॥

తేభ్యః స్వధా సుతే జజ్ఞే మేనాం వై ధారిణీం తథా ।

తే ఉభే బ్రహ్మవాదిన్యౌ యోగిన్యౌ చాప్యుభే ద్విజ ॥31॥

ఓ బ్రాహ్మణుడా ! బ్రహ్మదేవుని వలన పితృదేవతలు సృష్టింపబడ్డారని నీకు వ్యాఖ్యానించి చెప్పితిని. వారు అగ్నిష్వాత్తులు, బర్హిషదులు, అగ్నిరహితులు, అగ్నిసహితులు అనువారు. వారివలన స్వధాదేవి మేన, ధారిణియను ఇద్దరు కుమార్తెలను ప్రసవించెను. వారిరువురు బ్రహ్మవాదినులు మరియు యోగినులు.

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే రుద్రసర్గాభిధానో నామ ఏకోనపఞ్చాశత్తమోஉధ్యాయః ॥49॥

శ్రీ మార్కండేయ మహాపురాణమందలి రుద్రసర్గాభిధానమను నలుబదితొమ్మిదవ అధ్యాయం సమాప్తం.



పఞ్చాశత్తమోఽధ్యాయః - ఏబదియవ అధ్యాయం
భువనకోశే స్వాయంభువమన్వంతర కథనమ్ - భువనకోశమందు స్వాయంభువమన్వంతర కథనం

క్రౌష్టుకిరువాచ - క్రౌష్టుకి పలికాడు.

స్వాయంభువం త్వయా ఖ్యాతమేతన్మన్వంతరం చ యత్ ।
తదహం భగవన్ సమ్యక్ శ్రోతుమిచ్ఛామి కథ్యతామ్ ॥1॥

మన్వంతరప్రమాణం చ దేవా దేవర్షయస్తథా ।
యే చ క్షితీశా భగవన్ దేవేంద్రశ్చైవ యస్తథా ॥2॥

ఓ పూజ్యుడా ! స్వాయంభువమన్వంతరము గూర్చి నీవు చెప్పితివి. ఇంకనూ ఆ మన్వంతరముయొక్క కాలపరిమాణము ఎట్టిదో, దానిని మరియు ఆ మన్వంతరముయొక్క దేవతలు, దేవర్షులు, రాజులు, దేవేంద్రుడు వారిని గూర్చి నీ ద్వారా వినవలెనని కోరుచున్నాను, చెప్పుము.

మార్కండేయ ఉవాచ - మార్కండేయుడు చెప్పాడు.

మన్వంతరాణాం సంఖ్యాతా సాధికా హ్యేకసప్తతిః ।
మానుషేణ ప్రమాణేన శృణు మన్వంతరం చ మే ॥3॥

త్రింశత్కోట్యస్తు సంఖ్యాతా సహస్రాణి చ వింశతిః ।
సప్తషష్టిస్తథాన్యాని నియుతాని చ సంఖ్యయా ॥4॥

మన్వంతరప్రమాణం చ ఇత్యేతత్సాధికం వినా ।
అష్టౌ శతసహస్రాణి దివ్యయా సంఖ్యయా స్మృతమ్ ॥5॥

ద్విపఞ్చాశత్తథాన్యాని సహస్రాణ్యధికాని చ ।

డెబ్బైఒక్క పర్యాయములు నాలుగుయుగాలు పూర్తి అయిన కాలము ఒక మన్వంతరమని చెప్పబడుచున్నది. దాని సంఖ్యను మానుషసంవత్సరాలలో చెప్పెదను, వినుము. ముప్పైకోట్ల, అరవైఏడులక్షల, ఇరవైవేల మానుషసంవత్సరాలే ఒక మన్వంతరముయొక్క పరిమాణము. ఇందు ఆధిక్యమేమీ లేదు. ఇక దివ్యసంవత్సరములతో మన్వంతర కాలపరిమాణము చెప్పెదను, వినుము. ఎనిమిదివందలవేల సంవత్సరాలు అనగా ఎనిమిదిలక్షల సంవత్సరాలు మరియు ఏభైరెండువేల సంవత్సరాల మొత్తం ఎనిమిదిలక్షల ఏభైరెండువేల దివ్యసంవత్సరాలు ఒక మన్వంతరకాల పరిమాణం.((1) నాలుగు యుగాల కాలపరిమాణం దివ్యసంవత్సరాలలో 12,000 దివ్యసంవత్సరాలు. దీనికి డెబ్బైఒక్కరెట్లు అనగా 8,52,000 దివ్యసంవత్సరాలు ఒక మన్వంతరకాలపరిమాణం. (2) ఇక నాలుగు యుగాల కాలపరిమాణం మానుషసంవత్సరాలలో 43,20,000 మానుషసంవత్సరాలు. దీనికి డెబ్బైఒక్క రెట్లు అనగా 30,67,20,000 మానుషసంవత్సరాలు ఒక మన్వంతరకాలపరిమాణం. ఈ విధంగా మన్వంతరకాల పరిమాణం దివ్యసంవత్సరాలలోనూ, మానుష సంవత్సరాలలోనూ తెలియదగినది. (ఈ విషయం 43వ అధ్యాయం 34-38 శ్లోకాలలో కూడా చెప్పబడినది)

స్వాయంభువో మనుః పూర్వం మనుః స్వారోచిషస్తథా ॥6॥

ఔత్తమస్తామసశ్చైవ రైవతశ్చాక్షుషస్తథా ।
షడేతే మనవోఽతీతాస్తథా వైవస్వతోఽధునా ॥7॥

స్వాయంభువ మనువు మొట్టమొదటిగా ఉన్నవాడు. అటుపిమ్మట స్వారోచిషము, ఔత్తమము, తామసము, రైవతము, చాక్షుషము అను అయిదుగురు మనువులు మొత్తం ఆరుగురు మనువులు గడిచిపోయిరి. ప్రస్తుతము వైవస్వతమనువు లేదా వైవస్వతమన్వంతరము గడచుచున్నది.

సావర్ణాః పఞ్చ రౌచ్యాశ్చ భౌత్యాశ్చాగమినస్త్వమీ ।

ఏతేషాం విస్తరం భూయో మన్వంతరపరిగ్రహే ॥8॥

వక్ష్యే దేవానృషీంశ్చైవ దేవేంద్రాః పితరశ్చ యే ।
ఉత్పత్తిసంగ్రహం బ్రహ్మన్ శ్రూయతామస్య సంతతిః ॥9॥

యచ్చ తేషామభూత్ క్షేత్రం తత్పుత్రాణాం మహాత్మనామ్ ।

అయిదు సావర్ణమన్వంతరములు, రౌచ్యభౌత్యమన్వంతరములు రాబోవు మన్వంతరములు. ఆ యా మన్వంతరములకు సంబంధించిన దేవతలు, ఋషులు, దేవేంద్రులు, పితరులు వీరి గురించి విస్తారముగా నీకు చెప్పెదను. సంగ్రహముగా మన్వంతరములయొక్క ఉత్పత్తి, వాటి సంతానము, వాటి స్థానములు, స్వాయంభువాది మన్వంతరములకు పుట్టిన మహాత్ములగు పుత్రులు ఈ విషయములను గూర్చి కూడా నీకు నేను చెప్పెదను, వినుము.

మనోః స్వాయంభువస్యాసన్ దశ పుత్రాస్తు తత్సమాః ॥10॥

యైరియం పృథివీ సర్వా సప్తద్వీపా సపర్వతా ।
సముద్రాఽఽకరవతీ ప్రతివర్షం నివేశితా ॥11॥

స్వాయంభువేఽన్తరే పూర్వమాద్యే త్రేతాయుగే తథా ।
ప్రియవ్రతస్య పుత్రైస్తైః పౌత్రైః స్వాయంభువస్య చ ॥12॥

స్వాయంభువమనువుకు అతనితో సమానులైన పదిమంది పుత్రులు కలిగిరి. సప్తద్వీపములతోనూ, పర్వతములతోనూ, రత్నాకరసముద్రములతోనూ కూడుకొన్న ఈ భూమండలము ఆ పదిమంది పుత్రులచేత ఆయా ద్వీపానుసారముగా అధిష్ఠింపబడినది. స్వాయంభువమన్వంతరమందు కృతత్రేతాయుగములందు ప్రియవ్రతుని పుత్రులతోనూ, స్వాయంభువుని పౌత్రులతోనూ మొట్టమొదటిగా ఈ భూమి అధిష్ఠింపబడినది. (వర్ష శబ్దానికి ద్వీపమని అర్థం).

ప్రియవ్రతాత్ప్రజావత్యాం వీరాత్కన్యా వ్యజాయత ।
కన్యా సా తు మహాభాగ కర్దమస్య ప్రజాపతేః ॥13॥

కన్యే ద్వే దశపుత్రాంశ్చ సమ్రాట్ కుక్షీ చ తే ఉభే ।
తయోర్వై భ్రాతరః శూరాః ప్రజాపతిసమా దశ ॥14॥

ఆగ్నీధ్రో మేధాతిథిశ్చ వపుష్మాంశ్చ తథాపరః ।
జ్యోతిష్మాన్ ద్యుతిమాన్ భవ్యః సవనః సప్త ఏవ తే ॥15॥

మేధాగ్నిబాహుమిత్రాస్తు త్రయో యోగపరాయణాః ।
జాతిస్మరా మహాభాగా న రాజ్యాయ మనో దధుః ॥16॥

వీరుడగు ప్రియవ్రతుని వలన ప్రజాపతియందు ఒక కన్య జన్మించినది. ఆ కన్య కర్దమప్రజాపతివలన ఇద్దరు కుమార్తెలను, పదిమంది కుమారులను ప్రసవించినది. సమ్రాట్, కుక్షి ఆ ఇరువురు కన్యలు. ఆ ఇరువురి కన్యల పదిమంది సోదరులు ప్రజాపతితో సమానమైన పరాక్రమము గలవారు. ఆ పదిమందిలో ఆగ్నీధ్రుడు, మేధాతిథి, వపుష్మంతుడు, జ్యోతిష్మంతుడు, ద్యుతిమంతుడు, భవ్యుడు, సవనుడు ఈ ఏడుగురే రాజ్యపరిపాలమందు మనస్సును నిల్పిరి. మేధ, అగ్నిబాహుడు, మిత్రుడు ఈ ముగ్గురు నిత్యము యోగమందు ఆసక్తిగలవారు, పూర్వజన్మ విషయములను గుర్తెరిగినవారు, మహానుభావులు. వీరు రాజ్యపరిపాలనమందు మనస్సును నిలుపలేదు.

ప్రియవ్రతోఽభ్యషిఞ్చత్తాన్ సప్త సప్తసు పార్థివాన్ ।
ద్వీపేషు తేన ధర్మేణ ద్వీపాంశ్చైవ నిబోధ మే ॥17॥

ప్రియవ్రతుడు ఆ ఏడుగురు పుత్రులను ఏడు ద్వీపములకు ఏడుగురు రాజులుగా ధర్మబద్ధంగా పట్టాభిషిక్తులను గావించెను.

జంబూద్వీపే తథాగ్నీధ్రం రాజానం కృతవాన్ పితా ।
ప్లక్షద్వీపేశ్వరశ్చాపి తేన మేధాతిథిః కృతః ॥18॥

శాల్మలేస్తు వపుష్మన్తం జ్యోతిష్మన్తం కుశాహ్వయే ।
క్రౌఞ్చద్వీపే ద్యుతిమన్తం భవ్యం శాకాహ్వయేశ్వరమ్ ॥19॥

పుష్కరాధిపతిం చాపి సవనం కృతవాన్సుతమ్ ।

తండ్రియగు ప్రియవ్రతుడు ఆగ్నీధ్రుని జంబూద్వీపమునకు రాజును గావించెను. మేధాతిథిని ప్లక్షద్వీపమునకు రాజును చేసెను. వపుష్మంతుని శాల్మలిద్వీపానికి రాజును చేసెను. జ్యోతిష్మంతుని కుశద్వీపానికి రాజును చేసెను. ద్యుతిమంతుని క్రౌంచద్వీపానికి రాజును చేసెను. భవ్యుని శాకద్వీపానికి, సవనుని పుష్కరద్వీపానికి ప్రభువులుగా చేసెను.

మహావీతో ధాతకిశ్చ పుష్కరాధిపతేః సుతౌ ॥20॥
ద్విధా కృత్వా తయోర్వర్షం పుష్కరే సన్న్యవేశయత్ ।

పుష్కరద్వీపాధిపతియగు సవనునికి మహావీతుడు, ధాతకి యను ఇరువురు పుత్రులు గలరు. సవనుడు పుష్కరద్వీపాన్ని రెండుగా విభజించి వారిరువురిని ఆ సగభాగములందు ప్రభువులుగా నియమించెను.

భవ్యస్య పుత్రాః సప్తాసన్నామతస్తాన్నిబోధ మే ॥21॥

జలదశ్చ కుమారశ్చ సుకుమారో మణీవకః ।
కుశోత్తరోఽథ మేధావీ సప్తమస్తు మహాద్రుమః ॥22॥

తన్నామకాని వర్షాణి శాకద్వీపే చకార సః ।

శాకద్వీపాధిపతియగు భవ్యునికి ఏడుగురు కుమారులు ఉద్భవించిరి. వారి పేర్లు వరుసగా జలదుడు, కుమారుడు, సుకుమారుడు, మణీవకుడు, కుశోత్తరుడు, మేధావి, మహాద్రుముడు అనువారలు. శాకద్వీపాన్ని ఏడుగా విభజించి ఆ ఏడుభాగములకు ఆ ఏడుగురిని తండ్రియగు భవ్యుడు ప్రభువులుగా నియమించెను. ఆ ఏడు భాగములను జలద్వీపము మొ॥ విధముగా ఆ ఏడుగురి పేర్లతో పేర్లను రాజు పెట్టెను.

తథా ద్యుతిమతః సప్త పుత్రాస్తాంస్తు నిబోధ మే ॥23॥
కుశలో మనుగశ్చోష్ణః ప్రాకారశ్చార్థకారకః ।

మునిశ్చ దుందుభిశ్చైవ సప్తమః పరికీర్తితః ॥24॥

తేషాం స్వనామధేయాని క్రౌఞ్చద్వీపే తథాఽభవన్ ।

అట్లే ద్యుతిమంతునికి ఏడుగురు కుమారులు జన్మించిరి. వారిని గూర్చి చెప్పెదను, తెలుసుకొనుము. కుశలుడు, మనుగుడు, ఉష్ణుడు, ప్రాకారుడు, అర్థకారకుడు, ముని, దుందుభి అనువారలు ఆ ఏడుగురు కుమారులు. ద్యుతిమంతుడు క్రౌంచద్వీపమును ఏడు భాగములుగా విభజించి ఆ ఏడుగురికి ఇచ్చెదను. ఆ ఏడు భాగములూ కూడా కుశలద్వీపము మొ॥విధముగా వారి పేర్లతో ప్రసిద్ధికెక్కెను.

జ్యోతిష్మతః కుశద్వీపే పుత్రనామాంకితాని వై ॥25॥

తస్యాపి సప్త పుత్రాస్తు జ్ఞేయాస్తేఽపి మహౌజసః ।
తత్రాపి సప్త వర్షాణి తేషాం నామాని మే శృణు ॥
ఉద్భిదం వైష్ణవం చైవ సురథం లంబనం తథా ॥26॥

ధృతిమత్ప్రాకరం చైవ కపిలం చాపి సప్తమమ్ ।

కుశద్వీపాధిపతియగు జ్యోతిష్మంతునికి గొప్ప బలపరాక్రమములు కలిగిన ఏడుగురు కుమారులు జన్మించిరి. ఆ ద్వీపము కూడా ఏడుగా విభజింపబడి ఆ ఏడుగురికి ఇవ్వబడెను. ఆ భాగములు ఆ ఏడుగురి కుమారుల పేర్లతో ప్రసిద్ధికెక్కెను. అవి వరుసగా ఉద్భిదము, వైష్ణవము, సురథము, లంబనము, ధృతిమత్తు, ప్రాకరము, కపిలము అనునవి.

వపుష్మతః సుతాః సప్త శల్మవేశస్య చాభవన్ ॥27॥

శ్వేతశ్చ హరితశ్చైవ జీమూతో రోహితస్తథా ।
వైద్యుతో మానసశ్చైవ కేతుమాన్ సప్తమస్తథా ॥28॥

తథైవ శాల్మలే తేషాం సమనామాని సప్త వై ।

శల్మలద్వీపాధిపతియగు వపుష్మంతునికి ఏడుగురు కుమారులు జన్మించిరి. వారు వరుసగా శ్వేతుడు, హరితుడు, జీమూతుడు, రోహితుడు, వైద్యుతుడు, మానసుడు, కేతుమంతుడు అనువారలు. వపుష్మంతుడు తన శల్మలద్వీపాన్ని ఏడుగా విభజించి ఆ ఏడుగురికి ఇవ్వగా ఆ ఏడు భాగములు వారి పేర్లతో ప్రసిద్ధికెక్కెను.

సప్త మేధాతిథేః పుత్రాః ప్లక్షద్వీపేశ్వరస్య వై ॥29॥

యేషాం నామాంకితైర్వర్షైః ప్లక్షద్వీపస్తు సప్తధా ।
పూర్వం శాకభవం వర్షం శిశిరం తు సుఖోదయమ్ ॥30॥

ఆనందం చ శివం చైవ క్షేమకం చ ధ్రువం తథా ।

ప్లక్షద్వీపాధిపతియగు మేధాతిథికి ఏడుగురు కుమారులు జన్మించిరి. మేధాతిథి తన ప్లక్షద్వీపాన్ని ఏడుగా విభజించి తన ఏడుగురు కుమారులకు ఇవ్వగా ఆ భాగములు వారి పేర్లతో ప్రసిద్ధికెక్కెను. అవి వరుసగా శాకభవము, శిశిరము, సుఖోదయము, ఆనందము, శివము, క్షేమకము, ధ్రువము అను పేర్లతో ప్రసిద్ధికెక్కెను.

ప్లక్షద్వీపాదిభూతేషు శాకద్వీపాన్తిమేషు వై ॥31॥

జ్ఞేయః పఞ్చసు ధర్మశ్చ వర్ణాశ్రమవిభాగజః ।
నిత్యః స్వాభావికశ్చైవ అహింసాఽవిధివర్జితః ॥32॥

పఞ్చస్వేతేషు వర్షేషు సర్వసాధారణః స్మృతః ।

ప్లక్షద్వీపము మొ॥కొని శాకద్వీపమువరకు ఉన్న అయిదు ద్వీపాలలో వర్ణాశ్రమవిభాగాన్ని అనుసరించి పాలించబడుచున్నదని తెలుసుకొనవలెను. ఇంకను అది నిత్యము, స్వాభావికము, అహింసారూపముగా ఉన్నది. విధ్యుక్తప్రకారమే ధర్మమున్నదిగాని విధిభిన్నముగా లేదు. ధర్మము ఈ అయిదు ద్వీపాలలో సర్వసాధారణముగా అనగా అంతటా స్మరింపబడినది.

ఆగ్నీధ్రాయ పితా పూర్వం జంబూద్వీపం దదౌ ద్విజ ॥33॥

తస్య పుత్రా బభూవుర్హి ప్రజాపతిసమా నవ ।
జ్యేష్ఠో నాభిరితి ఖ్యాతస్తస్య కింపురుషోఽనుజః ॥34॥

హరివర్షస్తృతీయస్తు చతుర్థోఽభూదిలావృతః ।
వశ్యశ్చ పఞ్చమః పుత్రో హిరణ్యః షష్ఠ ఉచ్యతే ॥35॥

కురుస్తు సప్తమస్తేషాం భద్రాశ్వశ్చాష్టమః స్మృతః ।
నవమః కేతుమాలశ్చ తన్నామ్నా వర్షసంస్థితిః ॥36॥

ఓ బ్రాహ్మణుడా ! మొట్టమొదటిగా తండ్రియగు ప్రియవ్రతుడు ఆగ్నీధ్రునికి జంబూద్వీపమును ఇచ్చెను. ప్రజాపతితో సమానులైన తొమ్మిదిమంది కుమారులు అతనికి జన్మించిరి. అందరిలోను పెద్దవాడు నాభియను పేరుగలవాడు. అతని తమ్ముడు కింపురుషుడు. మూడవ పుత్రుడు హర్షవర్షుడు. నాల్గవవాడు ఇలావృతుడు. అయిదవవాడు వశ్యుడు. ఆరవవాడు హిరణ్యుడు. ఏడవవాడు కురువు. ఎనిమిదవవాడు భద్రుడు. తొమ్మిదవవాడు కేతుమాలుడు. వారి పేర్లతోనే అనగా నాభిద్వీపము మొ॥ పేర్లతోనే జంబూద్వీపము తొమ్మిది భాగములుగా విభజింపబడినది.

యాని కింపురుషాద్యాని వర్జయిత్వా హిమాహ్వయమ్ ।
తేషాం స్వభావతః సిద్ధిః సుఖప్రాయా హ్యయత్నతః ॥37॥

విపర్యయో న తేష్వస్తి జరామృత్యుభయం న చ ।
ధర్మాధర్మౌ న తేష్వాస్తాం నోత్తమాధమమధ్యమాః ॥38॥

న వై చతుర్యుగావస్థా నాశ్రమా ఋతవో న చ ।

హిమద్వీపాన్ని విడిచిపెట్టి కింపురుషాది ద్వీపములలో ప్రాణులకు యత్నము లేకయే సుఖముగా అన్నీ సిద్ధించుచున్నవి. వారి అభీష్టానికి వ్యతిరేకముగా ఏమీ లేదు. వార్ధక్యము, మరణములవలన భయము లేదు. ధర్మాధర్మములు లేవు, ఉత్తమ మధ్యమ అధమ విభాగము లేదు. నాలుగు యుగాల వ్యవస్థ లేదు, ఆశ్రమాలు లేవు, ఋతువులు లేవు.

ఆగ్నీధ్రసూనోర్నాభేస్తు ఋషభోఽభూత్సుతో ద్విజ ॥39॥

ఋషభాద్భరతో జజ్ఞే వీరః పుత్రశతాద్వరః ।
సోఽభిషిచ్య ఋషభః పుత్రం మహాప్రావ్రాజ్యమాస్థితః ॥40॥

తపస్తేపే మహాభాగః పులహాశ్రమసంశ్రయః ।
హిమాహ్వం దక్షిణం వర్షం భరతాయ పితా దదౌ ॥41॥

తస్మాత్తు భారతం వర్షం తస్య నామ్నా మహాత్మనః ।

ఓ బ్రాహ్మణుడా! ఆగ్నీధ్రుని కుమారుడగు నాభికి ఋషభుడను పుత్రుడు ఉదయించెను. ఋషభుని వలన నూరుగురు పుత్రుల కంటే కూడా శ్రేష్ఠుడైన, వీరుడైన భరతుడు జన్మించెను. ఋషభుడు తన కుమారుడగు భరతుని రాజ్యాభిషిక్తుని గావించి తాను గొప్ప సన్న్యాసమును స్వీకరించెను. పులహాశ్రమమందు ఉండి మహాభాగుడైన ఋషభుడు తపస్సును ఆచరించెను. దక్షిణమందలి హిమద్వీపమును భరతునికి తండ్రి ఇచ్చెను. అందువల్లనే మహాత్ముడగు భరతుని పేరుతో ఆ ద్వీపము భారతవర్షము లేదా భారతద్వీపమని స్మరింపబడినది.

భరతస్యాన్వభూత్పుత్రః సుమతిర్నామ ధార్మికః ॥42॥

తస్మిన్ రాజ్యం సమావేశ్య భరతోఽపి వనం యయౌ ।
ఏతేషాం పుత్రపౌత్రైస్తు సప్తద్వీపా వసుంధరా ॥43॥

ప్రియవ్రతస్య పుత్రైస్తు భుక్తా స్వాయంభువేఽన్తరే ।
ఏష స్వాయంభువః సర్గః కథితస్తే ద్విజోత్తమ ॥44॥
పూర్వమన్వంతరే సమ్యక్ కిమన్యత్కథయామి తే ॥45॥

భరతునికి సుమతియను పేరుగల ధర్మాచరణగల పుత్రుడు ఉదయించెను. అతనికి రాజ్యభారము అప్పగించి భరతుడు కూడా వనములకు వెళ్ళెను. స్వాయంభువమన్వంతరకాలమందు ప్రియవ్రతుని పుత్రులు, పౌత్రులతో సప్తద్వీపములుగల భూమండలము అనుభవింపబడినది. ఓ బ్రాహ్మణశ్రేష్ఠుడా! ఈ స్వాయంభువసర్గముగూర్చి నీకు నేను చెప్పితిని. ఈ మొట్టమొదటి మన్వంతరమందలి విషయములను ఇంకను నీకు ఏమి చెప్పవలెను? (చెప్పవలసినదంతయు చెప్పితినని భావము.)

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే భువనకోశే స్వాయంభువమన్వంతరకథనం నామ పఞ్చాశత్తమోఽధ్యాయః ॥50॥

శ్రీ మార్కండేయ మహాపురాణమందలి భువనకోశమందు స్వాయంభువమన్వంతరకథనమను ఏబదియవ అధ్యాయం సమాప్తం.



ఏకపఞ్చాశత్తమోఽధ్యాయః - ఏబదిఒకటవ అధ్యాయం
జంబూద్వీపవర్ణనమ్ - జంబూద్వీపవర్ణనం

క్రౌష్టుకిరువాచ - క్రౌష్టుకి పలికాడు.

కతి ద్వీపాః సముద్రా వా పర్వతా వా కతి ద్విజ ।
కియన్తి చైవ వర్షాణి తేషాం నద్యశ్చ కా మునే ॥1॥

మహాభూతప్రమాణం చ లోకాలోకం తథైవ చ ।
పర్యాసం పరిమాణం చ గతిం చంద్రార్కయోరపి ॥2॥
ఏతత్ప్రబ్రూహి మే సర్వం విస్తరేణ మహామునే ॥3॥

ఓ మునిశ్రేష్ఠుడా ! మొత్తం ద్వీపములు ఎన్ని? సముద్రములు, పర్వతములు ఎన్ని? ఆ యా భూభాగములెన్ని? నదులు ఎన్ని? మహాభూతముల పరిమాణమెంత? లోకాలోక పర్వతముల ప్రమాణము ఎంత? (సూర్యరశ్మి పడే పర్వతాలు లోకములు, సూర్యరశ్మి పడని పర్వతభాగాలు అలోకాలు). సూర్యచంద్రుల పరిమాణము, గమనములు ఎట్టివి? ఓ మహామునీ ! ఇదంతయు విస్తరముగా నాకు చెప్పుము.

మార్కండేయ ఉవాచ - మార్కండేయుడు చెప్పాడు.

శతార్ధకోటివిస్తారా పృథివీ కృత్స్నశో ద్విజ ।
తస్యాః సంస్థానమఖిలం కథయామి శృణుష్వ తత్ ॥4॥

ఓ బ్రాహ్మణుడా ! ఏబదికోట్ల యోజనముల విస్తారము కలిగినది ఈ భూమండలము. (8వ శ్లోకాన్ని అనుసరించి యోజనపదమిచ్చుట చేర్చబడినది.) దానియొక్క సంపూర్ణమైన కూర్పు ఎట్టిదో చెప్పెదను, వినుము.

యే తే ద్వీపా మయా ప్రోక్తా జంబుద్వీపాదయో ద్విజ ।
పుష్కరాన్తా మహాభాగ శృణ్వేషాం విస్తరం పునః ॥5॥

ఓ మహానుభావుడా ! జంబూద్వీపము మొ॥కొని పుష్కరద్వీపమువరకు ఏ ద్వీపముల గురించి అయితే నీకు చెప్పితినో వాటి విస్తృతి ఎట్టిదో చెప్పెదను, వినుము.

ద్వీపాత్తు ద్విగుణో ద్వీపో జంబుః ప్లక్షోఽథ శాల్మలిః ।
కుశః క్రౌంచస్తథా శాకః పుష్కరద్వీప ఏవ చ ॥6॥

జంబు, ప్లక్ష, శాల్మలి, కుశ, క్రౌంచ, శాక, పుష్కర ద్వీపములు ఒక ద్వీపము కంటే మరొక ద్వీపము రెండు రెట్లు ఎక్కువ.

లవణేక్షుసురాసర్పిర్దధిక్షీరజలాబ్ధిభిః ।
ద్విగుణైర్ద్విగుణైర్వృద్ధ్యా సర్వతః పరివేష్టితాః ॥7॥

లవణ, ఇక్షు, సురా, సర్పిస్, దధి, క్షీర, జల సముద్రములు ఒకదానికంటే మరొకటి రెండు రెట్లు వృద్ధిభావమును పొంది యున్నవి. అట్టి సముద్రములచే పూర్వోక్త జంబ్వాది ద్వీపములు చుట్టబడియున్నవి.

జంబూద్వీపస్య సంస్థానం ప్రవక్ష్యేఽహం నిబోధ మే ।
లక్షమేకం యోజనానాం వృత్తో విస్తారదైర్ఘ్యతః ॥8॥

జంబూద్వీపముయొక్క కూర్పును గూర్చి నీకు నేను చెప్పెదను, వినుము. పొడవు, వెడల్పులలో ఒక లక్ష యోజనముల విస్తీర్ణము కలిగియున్నది.

హిమవాన్ హేమకూటశ్చ నిషధో మేరురేవ చ ।
నీలః శ్వేతస్తథా శృంగీ సప్త తద్వర్షపర్వతాః ॥9॥

హిమవత్, హేమకూట, నిషధ, మేరు, నీల, శ్వేత, శృంగి ఈ ఏడు ఆ ద్వీపానికి సంబంధించిన పర్వతాలు.

ద్విలక్షయోజనాఽఽయామౌ మధ్యే తత్ర మహాచలౌ ।
తయోర్దక్షిణతో యౌ తు యౌ తథోత్తరతో గిరీ ॥10॥

దశభిర్దశభిర్న్యూనైః సహస్రైస్తే పరస్పరమ్ ।
ద్విసాహస్రోచ్ఛ్రయాః సర్వే తావద్విస్తారిణశ్చ తే ॥11॥

సముద్రాన్తఃప్రవిష్టాశ్చ షడస్మిన్వర్షపర్వతాః ।

ఆ ద్వీపానికి మధ్యభాగమందు రెండు లక్షల యోజనముల విస్తీర్ణము గల రెండు పెద్ద పర్వతములు ఉన్నవి. ఆ రెంటికి దక్షిణభాగమందు రెండు, ఉత్తరభాగమందు రెండు పర్వతప్రాంతములున్నవి. ఆ రెండేసి పర్వతప్రాంతాలు పరస్పరము పదేసి వేలయోజనాల తక్కువ విస్తీర్ణంతో ఉన్నవి. ఆ చెప్పబడిన పర్వతాలన్నీ రెండువేల యోజనాల ఎత్తు కలిగి ఉన్నవి. అంతే పరిమాణంతో వైశాల్యం కూడా కలిగి ఉన్నవి. సముద్రములోన కూడా ఆరు వర్షపర్వతాలు (జంబూద్వీపానికి సంబంధించిన పర్వతాలు) వ్యాపించి ఉన్నవి.

దక్షిణోత్తరతో నిమ్నా మధ్యే తుఙ్గా యథా క్షితిః ॥12॥

వేద్యర్ధే దక్షిణే త్రీణి త్రీణి వర్షాణి చోత్తరే ।
ఇలావృతం తయోర్మధ్యే చంద్రార్ధాకారవత్ స్థితమ్ ॥13॥

తతః పూర్వేణ భద్రాశ్వం కేతుమాలం చ పశ్చిమే ।
ఇలావృతస్య మధ్యే తు మేరుః కనకపర్వతః ॥14॥

ఆ ద్వీపానికి దక్షిణ ఉత్తరభాగములందు భూమి క్రిందకు, మధ్యభాగమందు పైకి (ఎత్తైనదిగా) వ్యాపించియున్నది. ఆ భూమికి దక్షిణ సగభాగమందు మూడు, ఉత్తర సగభాగమందు మూడు ద్వీపప్రాంతములు వ్యాపించియున్నవి. ఆ దక్షిణోత్తరద్వీపప్రాంతముల మధ్య ఇలావృతమను ద్వీపప్రాంతము వ్యాపించియున్నది. అది అర్ధచంద్రాకారము వలే ఉన్నది. దీనికి పూర్వదిక్కులో భద్రాశ్వము, పశ్చిమదిక్కులో కేతుమాలము అను ద్వీపప్రాంతములున్నవి. ఇలావృతానికి మధ్యభాగమందు మేరువను పేరుగల బంగారు పర్వతమున్నది.

చతురాశీతిసాహస్రస్తస్యోచ్ఛ్రాయో మహాగిరేః ।

ప్రవిష్టః షోడశాధస్తాద్విస్తారః షోడశైవ తు ॥15॥

ఆ సుమేరుమహాపర్వతముయొక్క ఎత్తు ఎనభైనాలుగు యోజనములు. ఆ పర్వతము క్రిందికి పదహారువేల యోజనాలు వ్యాపించి ఉన్నది. అంతే పదహారువేల యోజనాల విస్తీర్ణము కలిగినది.

శరావసంస్థితత్వాచ్చ ద్వాత్రింశన్మూర్ధ్ని విస్తృతః ।
శుక్లః పీతోఽసితో రక్తః ప్రాచ్యాదిషు యథాక్రమమ్ ॥16॥

ఈ సుమేరు పర్వతము మూకుడువలే ఉన్నందున ముప్ఫైరెండు యోజనాల విస్తీర్ణముతో మధ్యభాగము అనగా శిఖరభాగము ఉన్నది. ఈ పర్వతము యొక్క తూర్పు మొ॥లగు నాలుగు దిక్కులు యథాక్రమముగా తెలుపు, పసుపు, నీలము, ఎరుపు వర్ణములు కలిగియున్నవి.

విప్రో వైశ్యస్తథా శూద్రః క్షత్రియశ్చ స్వవర్ణతః ।
తస్యోపరి తథైవాష్టౌ పుర్యో దిక్షు యథాక్రమమ్ ॥17॥

తస్యోపరి సభా దివ్యాః పూర్వాదిషు క్రమేణ తు ।
ఇంద్రాదిలోకపాలానాం తన్మధ్యే బ్రహ్మణః సభా ॥
యోజనానాం సహస్రాణి చతుర్దశ సముచ్ఛ్రితా ॥18॥

బ్రాహ్మణక్షత్రియవైశ్యశూద్రులు తమ తమ వర్ణానుసారముగా అచ్చట ఉండిరి. దానియొక్క పైభాగమందు తూర్పు మొ॥లగు అష్టదిక్కులందు అష్టదిక్పాలకుల పురములు, వారి దివ్యములైన సభాగారములు ఉన్నవి. మధ్యభాగమందు పదునాలుగువేల యోజనముల విస్తీర్ణముగల బ్రహ్మసభ ఉన్నది.

అయుతోచ్ఛ్రాయస్తస్యాధస్తథా విష్కంభపర్వతః ।
ప్రాచ్యాదిషు క్రమేణైవ మందరో గంధమాదనః ॥19॥

విపులశ్చ సుపార్శ్వశ్చ కేతుపాదపశోభితాః ।
కదంబో మందరే కేతుర్జంబుర్వై గంధమాదనే ॥20॥

విపులే చ తథాశ్వత్థః సుపార్శ్వే చ వటో మహాన్ ।
ఏకాదశశతాయామా యోజనానామిమే నగాః ॥21॥

దీనికి క్రిందిభాగమందు పదివేల యోజనముల పరిమాణంలో ఎత్తైన విష్కంభపర్వతమున్నది. తూర్పు మొ॥లగు నాలుగు దిక్కులందు క్రమముగా మందరము, గంధమాదనము, విపులము, సుపార్శ్వము అను నాలుగు పర్వతములు దీప్తిమంతములైన వృక్షములతో శోభ కలిగియున్నవి. మందరపర్వతమందు కదంబము, గంధమాదనపర్వతమందు నేరేడు, విపులపర్వతమందు రావి, సుపార్శ్వపర్వతమందు పెద్దదియగు మఱ్ఱియను వృక్షములున్నవి. ఈ పర్వతముల ప్రమాణము పదకొండు వందల యోజనములు.

జఠరో దేవకూటశ్చ పూర్వస్యాం దిశి పర్వతౌ ।
ఆనీలనిషధావేతౌ పరస్పరనిరన్తరౌ ॥22॥

ఆ మేరుపర్వతానికి తూర్పుదిక్కునందు జఠర దేవకూట పర్వతములున్నవి. ఈ రెండు నీలనిషధ పర్వతములవరకు ఎట్టి వ్యవధానము లేక పరస్పరము కలిసియున్నవి.

నిషధః పరియాత్రశ్చ మేరోః పార్శ్వే తు పశ్చిమే ।
యథా పూర్వౌ తథా చైతావానీలనిషధాయతౌ ॥23॥

మేరుపర్వతానికి పశ్చిమదిక్కునందు నిషధ పరియాత్ర పర్వతాలు వ్యాపించి ఉన్నవి. ఇవి జఠరదేవకూటములవలే నీల నిషధపర్వతాల వరకు మధ్యలో ఎట్టి వ్యవధానము లేక వ్యాపించి ఉన్నవి.

కైలాసో హిమవాంశ్చైవ దక్షిణేన మహాచలౌ ।
పూర్వపశ్చాయతావేతావర్ణవాన్తర్వ్యవస్థితౌ ॥24॥

కైలాసహిమత్పర్వతాలు దక్షిణదిక్కునందు వ్యాపించి ఉన్నవి. ఇవి పూర్వపశ్చిమాలవరకు వ్యాపించి సముద్రము మధ్యభాగమువరకు ప్రవిష్టములై ఉన్నవి.

శృంగవాన్ జారుధిశ్చైవ తథైవోత్తరపర్వతౌ ।
యథైవ దక్షిణే తద్వదర్ణవాన్తర్వ్యవస్థితౌ ॥25॥

శృంగవత్ జారుధి పర్వతాలు మేరుపర్వతానికి ఉత్తరదిక్కునందు వ్యాపించి ఉన్నవి. దక్షిణదిక్కునందు వ్యాపించిన కైలాసహిమవత్పర్వతాల వలే ఈ రెండు కూడా సముద్రము లోపలవరకు వ్యాపించి ఉన్నవి.

మర్యాదా పర్వతా హ్యేతే కథ్యతేఽష్టౌ ద్విజోత్తమ ।
హిమవద్ధేమకూటాదిపర్వతానాం పరస్పరమ్ ॥26॥

నవయోజనసాహస్రం ప్రాగుదగ్దక్షిణోత్తరమ్ ।
మేరోరిలావృతే తద్వదన్తరే వై చతుర్దిశమ్ ॥27॥

ఓ బ్రాహ్మణుడా ! జఠరము మొ॥ జారుధివరకు ఈ ఎనిమిది పర్వతాలు హద్దులుగా చెప్పబడుచున్నవి. హిమవత్, హేమకూటాది పర్వతాల తొమ్మిదివేల యోజనాల విస్తీర్ణము తూర్పు, పశ్చిమ, దక్షిణ, ఉత్తరదిక్కుల వరకు వ్యాపించి ఉన్నది. ఇలావృతమందలి మధ్యభాగములో మేరుపర్వతముకూడా అట్లే నాలుగు దిక్కులవరకు అంతటి విస్తీర్ణముతో వ్యాపించి ఉన్నది.

ఫలాని యాని వై జంబ్వా గంధమాదనపర్వతే ।
గజదేహప్రమాణాని పతన్తి గిరిమూర్ధని ॥28॥

తేషాం స్రావాత్ప్రభవతి ఖ్యాతా జంబూనదీతి వై ।
యత్ర జాంబూనదం నామ కనకం సంప్రజాయతే ॥29॥

సా పరిక్రమ్య వై మేరుం జంబూమూలం పునర్నదీ ।
విశతి ద్విజశార్దూల పీయమానా జనైశ్చ తైః ॥30॥

ఓ బ్రాహ్మణశ్రేష్ఠుడా ! గంధమాదనపర్వతమందు జంబూ (నేరేడు) వృక్షముయొక్క ఏనుగు అంత పరిమాణముగల పండ్లు ఆ పర్వతశిఖరమందు పడుచుండును. వాటి పండ్లరసము క్రిందికి జారుటచే ఆ నది జాంబూనదియని ప్రసిద్ధికెక్కినది. ఆ నది మేరుపర్వతాన్ని చుట్టి ఉండి తిరిగి జంబూవృక్షముయొక్క మూలభాగాన్ని ప్రవేశించుచున్నది. అచ్చట ఉండు జనులు ఆ నదీజలమును త్రాగుచున్నారు.

భద్రాశ్వేఽశ్వశిరా విష్ణుర్భారతే కూర్మసంస్థితిః ।
వరాహః కేతుమాలే చ మత్స్యరూపస్తథోత్తరే ॥31॥

తేషు నక్షత్రవిన్యాసాదృషయః సమవస్థితాః ।
చతుర్ష్వపి ద్విజశ్రేష్ఠ గ్రహాభిభవపాఠకాః ॥32॥

ఓ బ్రాహ్మణశ్రేష్ఠుడా ! విష్ణుమూర్తి భద్రాశ్వమందు గుఱ్ఱము శిరస్సుగా కలిగినవాడును (హయగ్రీవునిగాను), భారతమందు కూర్మరూపముగాను (తాబేలు), కేతుమాలమందు వరాహరూపముగాను (పంది), ఉత్తరమందు మత్స్యరూపముగాను (చేప) అవతారము కలిగి ఉన్నాడు. (భద్రాశ్వము మొ॥నవి జంబూద్వీపప్రాంతాలుగా 50వ అధ్యాయం 33-36 శ్లోకాలలో చెప్పబడినవి.) ఆ నాలుగు ద్వీపప్రాంతములందు ఆయా నక్షత్రాల విన్యాసాన్నిబట్టి ఋషులు అనగా ప్రాపంచిక విషయాలు, ("ఋష గతౌ" అను ధాతువునుండి ఋషిశబ్దం ఉత్పన్నమైందని భావించాలి.) సంభవించుచున్నవి. అచ్చట ప్రజలు గ్రహాల స్థితిగతులను అధ్యయనం చేయుచున్నారు.

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే భువనకోశే జంబూద్వీపవర్ణనం నామ ఏకోనపఞ్చాశత్తమోఽధ్యాయః ॥51॥

శ్రీ మార్కండేయ మహాపురాణమందలి భువనకోశమందు జంబూద్వీపవర్ణనమను ఏబదిఒకటవ అధ్యాయం సమాప్తం.



ద్విపఞ్చాశత్తమోఽధ్యాయః – ఏబదిరెండవ అధ్యాయం
జంబూద్వీపాన్తర్గతఖండవర్ణనమ్ – జంబూద్వీపాన్తర్గతఖండవర్ణనం

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

శైలేషు మన్దరాద్యేషు చతుర్ష్వపి ద్విజోత్తమ ।
వనాని యాని చత్వారి సరాంసి చ నిబోధ మే ॥1॥

ఓ బ్రాహ్మణశ్రేష్ఠుడా ! మందరము మొ॥లగు నాలుగు పర్వతములందు ఏఏ అడవులు కలవో, ఏఏ సరస్సులు కలవో వాటిని గూర్చి చెప్పెదను, వినుము.

పూర్వే చైత్రరథం నామ దక్షిణే నన్దనం వనమ్ ।
వైభ్రాజం పశ్చిమే శైలే సావిత్రం చోత్తరాచలే ॥2॥

ఆ పర్వతాల తూర్పుదిక్కునందు చైత్రరథము, దక్షిణదిక్కునందు నందనము, పశ్చిమదిక్కునందు వైభ్రాజము, ఉత్తరదిక్కునందు సావిత్రము అను పేర్లుగల అడవులు ఉన్నవి.

అరుణోదం సరః పూర్వే మానసం దక్షిణే తథా
శీతోదం పశ్చిమే మేరోర్మహాభద్రం తథోత్తరే ॥3॥

ఆ పర్వతాల తూర్పుభాగమునందు అరుణోదము, దక్షిణభాగమునందు మానసము, పశ్చిమభాగమునందు శీతోదము, ఉత్తరభాగమునందు మహాభద్రమను సరస్సులు ఉన్నవి.

శీతార్తశ్చక్రముఞ్జశ్చ కులీరోశ్వశ్చ కఙ్గవాన్ ।
మణిశైలోఽథ వృషవాన్మహానీలీ భవాచలః ॥4॥

సుబిన్దుర్మన్దరో వేణుస్తామసో నిషధస్తథా ।
దేవశైలశ్చ పూర్వేణ మన్దరస్య మహాచలః ॥5॥

ఆ పర్వతాల తూర్పుభాగమునందు శీతార్తము, చక్రముంజము, కులీరము, అశ్వము, కంగవత్తు, మణిశైలము, వృషవత్తు, మహానీలి, భవాచలము, సుబిందువు, మందరము, వేణువు, తామసము, నిషధము, దేవశైలము అను గొప్ప పర్వతాలు ఉన్నవి.

త్రికూటః శిఖరాద్రిశ్చ కలింగోఽథ పతంగకః ।
రుచకః సానుమాంశ్చాద్రిస్తామ్రకోఽథ విశాఖవాన్ ॥6॥

శ్వేతోదరః సమూలశ్చ వసుధారశ్చ రత్నవాన్ ।
ఏకశృంగో మహాశైలో రాజశైలః పిపాఠకః ॥7॥

పంచశైలోఽథ కైలాసో హిమవాంశ్చాచలోత్తమః ।
ఇత్యేతే దక్షిణే పార్శ్వే మేరోః ప్రోక్తా మహాచలాః ॥8॥

త్రికూటము, శిఖరము, కలింగము, పతంగకము, రుచకము, సానుమత్, తామ్రకము, విశాఖవత్, శ్వేతోదరము, సమూలము, వసుధార, రత్నవత్, ఏకశృంగము, మహాశైలము, రాజశైలము, పిపాఠకము, పంచశైలము, కైలాసము, హిమవత్ ఈ గొప్ప పర్వతములన్నియు మేరుపర్వతానికి దక్షిణదిగ్భాగమందున్నవి.

సురక్షః శిశిరాక్షశ్చ వైదూర్యః పింగళస్తథా ।
పింజరోఽథ మహాభద్రః సురసః కపిలో మధుః ॥9॥

అంజనః కుక్కుటః కృష్ణః పాండురశ్చాచలోత్తమః ।
సహస్రశిఖరశ్చాద్రిః పారియాత్రః సశృంగవాన్ ॥10॥

పశ్చిమేన తథా మేరోర్విష్కంభాత్పశ్చిమాద్బహిః ।
ఏతేఽచలాః సమాఖ్యాతాః శృణుష్వాన్యాంస్తథోత్తరాన్ ॥11॥

సురక్షము, శిశిరాక్షము, వైదూర్యము, పింగళము, పింజరము, మహాభద్రము, సురసము, కపిలము, మధువు, అంజనము, కుక్కుటము, కృష్ణము, పర్వతశ్రేష్ఠమగు పాండురము, సహస్రశిఖరము, పారియాత్రము, శృంగవత్ ఈ పర్వతములన్నియు మేరుపర్వతానికి పశ్చిమదిగ్భాగమందున్నవి. పశ్చిమమందున్న విష్కంభపర్వతానికి వెలుపల ఆ మేరుపర్వతమున్నది. ఇక మేరుపర్వతానికి ఉత్తరదిగ్భాగమందున్న పర్వతాలను గూర్చి చెప్పెదను, వినుము.

శంఖకూటోఽథ వృషభో హంసనాభస్తథాచలః ।
కపిలేంద్రస్తథా శైలః సానుమాన్నీల ఏవ చ ॥12॥

స్వర్ణశృంగః శాతశృంగః పుష్పకో మేఘపర్వతః ।
విరజాక్షో వరాహాద్రిర్మయూరో జారుధిస్తథా ॥13॥

ఇత్యేతే కథితా బ్రహ్మన్ మేరోరుత్తరతో నగాః ।

ఓ బ్రహ్మస్వరూపుడా ! శంఖకూటము, వృషభము, హంసనాభము, కపిలేంద్రము, సానుమత్, నీలము, స్వర్ణశృంగము, శాతశృంగము, పుష్పకము, మేఘపర్వతము, విరజాక్షము, వరాహాద్రి, మయూరము, జారుధి ఈ పర్వతములన్నియు మేరుపర్వతానికి ఉత్తరదిగ్భాగమందు ఉన్నట్టివిగా చెప్పబడినవి.

ఏతేషాం పర్వతానాం తు ద్రోణ్యోఽతీవ మనోహరాః ॥14॥

వనైరమలపానీయైః సరోభిరుపశోభితాః ।
తాసు పుణ్యకృతాం జన్మ మనుష్యాణాం ద్విజోత్తమ ॥15॥

ఓ బ్రాహ్మణశ్రేష్ఠుడా ! ఈ పర్వతాల మధ్య పారుతున్న సెలయేళ్ళు మిక్కిలి మనోహరములైనవి. ఇంకనూ అవి స్వచ్ఛమైన జలములతోకూడుకొన్న అడవులు, సరస్సులతో మిక్కిలి శోభాయుక్తములై ఉన్నవి. అచ్చట పుణ్యము చేసుకొన్నవారే జన్మించెదరు.

ఏతే భౌమా ద్విజశ్రేష్ఠ స్వర్గాః స్వర్గగుణాధికాః ।
న తాసు పుణ్యపాపానామపూర్వాణాముపార్జనమ్ ॥16॥

పుణ్యోపభోగ ఏవోక్తో దేవానామపి తాస్వపి ।

ఓ బ్రాహ్మణశ్రేష్ఠుడా ! ఈ పర్వతప్రాంతములన్నియు భూలోకస్వర్గములుగా చెప్పబడుచున్నవి. అవి దేవతానివాసమైన స్వర్గముకంటే కూడా అధికగుణములు కలిగియున్నవి. అచ్చట నివాసమున్నవారికి క్రొత్తగా పుణ్యపాపములను సంపాదించుట ఉండదు. అచ్చట దేవతలకు కూడా పుణ్యమును అనుభవించుట మాత్రమే ఉండును.

శీతాన్తాద్యేషు చైతేషు శైలేషు ద్విజసత్తమ ॥17॥

విద్యాధరాణాం యక్షాణాం కిన్నరోరగరక్షసామ్ ।
దేవానాం చ మహావాసా గంధర్వాణాం చ శోభనాః ॥18॥

సభాః పుర్యో మనోజ్ఞాశ్చ సదైవోపవనైర్యుతాః ।
సరాంసి చ మనోజ్ఞాని సర్వర్తుసుఖదోఽనిలః ॥19॥

న చైతేషు క్లమో బాధా వైమనస్యం చ కుత్రచిత్ ।

ఓ బ్రాహ్మణశ్రేష్ఠుడా ! శీతాంతము మొ॥ ఈ పర్వతములందు విద్యాధరులు, యక్షులు, కిన్నరులు, సర్పములు, రాక్షసులు, దేవతలు గంధర్వులు వీరందరి నివాసస్థానములు సభలు పట్టణములు కలవు. అవియన్నియు మనోహరములై ఎల్లప్పుడు ఉపవనములతో కూడియుండును. అచ్చటి సరస్సులు మిక్కిలి మనోహరములైనవి. ఇచ్చటి గాలులు అన్ని ఋతువులందు సుఖమునిచ్చునట్టివి. ఈ ప్రాంతములందు ఎచ్చటా కూడా ప్రజలకు ఎట్టి బాధలుగాని, మానసిక చింతలు గాని లేవు.

తదేతత్పార్థివం పద్మం చతుష్పత్రం మయోదితమ్ ॥20॥

భద్రాశ్వభారతాదీని పత్రాణ్యస్య చతుర్దిశమ్ ।
భారతం నామ యద్వర్షం దక్షిణేన మయోదితమ్ ॥21॥

తత్కర్మభూమిర్నాన్యత్ర సంప్రాప్తిః పుణ్యపాపయోః ।
ఏతత్ప్రధానం విజ్ఞేయం యత్ర సర్వం ప్రతిష్ఠితమ్ ॥22॥

అస్మాత్స్వర్గాపవర్గౌ చ మానుష్యనారకావపి ।
తిర్యక్త్వమథవాప్యన్యన్నరః ప్రాప్నోతి వై ద్విజ ॥23॥

ఓ బ్రాహ్మణుడా ! ఈ విధముగా నాలుగు ఆకులతో కూడుకొన్న భూలోకపద్మమును గూర్చి నీకు నేను చెప్పితిని. భద్రాశ్వము, భారతము మొ॥ నాలుగు ప్రాంతములు నాలుగు దిక్కులందు గల నాలుగు పత్రములు.

దక్షిణదిగ్భాగమందు భారతవర్షమను ఏ ద్వీపప్రాంతమును గూర్చి నీకు నేను చెప్పితినో అదియే కర్మభూమి. ఇది తప్ప, మరెచ్చటా కూడా పుణ్యపాపములకు అవకాశము లేదు. అంతయు సుప్రతిష్ఠితమైన ఈ భూమినే ప్రధానభూమిగా తెలుసుకొనవలెను. ఇచ్చట జన్మించిన మానవుడే స్వర్గమునుగాని, మోక్షమునుగాని, సంసారమునుగాని, నరకమునుగాని, పశుపక్ష్యాది జన్మమును గాని పొందుచున్నాడు.

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే భువనకోశే జంబూద్వీపాన్తర్గతఖండవర్ణనం నామ ద్విపఞ్చాశత్తమోఽధ్యాయః ॥52॥

శ్రీమార్కండేయ మహాపురాణమందలి భువనకోశమందు జంబూద్వీపాన్తర్గత ఖండవర్ణనమను ఏబదిరెండవ అధ్యాయం సమాప్తం.



త్రిపఞ్చాశత్తమోఽధ్యాయః – ఏబదిమూడవ అధ్యాయం

గంగావతరణవర్ణనమ్ – గంగావతరణవర్ణనం

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

ధరాధారం జగద్యోనేః పదం నారాయణస్య చ ।
తతః ప్రవృత్తా యా దేవీ గంగా త్రిపథగామినీ ॥1॥

సా ప్రవిశ్య సుధాయోనిం సోమమాధారమంభసామ్ ।
తతః సంవర్ధమానార్కరశ్మిసంగతిపావనీ ॥2॥

పపాత మేరుపృష్ఠే చ సా చతుర్ధా తతోయయౌ ।
మేరుకూటతటాన్తేభ్యో నిపతన్తీ వివర్తితా ॥3॥

వికీర్యమాణసలిలా నిరాలంబా పపాత సా ।
మన్దరాద్యేషు పాదేషు ప్రవిభక్తోదకా సమమ్ ॥4॥

చతుర్ష్వపి పపాతాంబువిభిన్నాంఘ్రిశిలోచ్చయా ।

జగత్తుకు కారణభూతుడగు నారాయణుని పాదము ఈ భూమండలానికి అంతటికి ఆధారభూతమైనది. అచ్చట నుంచి త్రిపథగామినియగు (మూడు లోకాలలో ప్రవహించునది) గంగ బయల్వెడలినది. పిమ్మట ఆ గంగ అమృతానికి ఉత్పత్తి స్థానము, జలములకు ఆధారభూతమూ అగు చంద్రుని ప్రవేశించినది. పిమ్మట ఆ గంగానది వృద్ధి పొందుచూ, సూర్యకిరణములను తన సంపర్కముచే పవిత్రము చేయుచూ మేరుపర్వతముపై పడినది. అచ్చటి నుంచి నాలుగు ధారలుగా విభజింపబడి నాలుగు దిక్కులవైపు వెళ్ళెను. మేరుపర్వతము అంచులనుండి జారి పడుచూ, చెల్లాచెదరైన జలములు కలిగిన ఆ గంగ ఆశ్రయము లేక మందరము మొ॥లగు నాలుగు పర్వతాల పాదములపై, విభజింపబడిన జలములు కలిగినదై పడెను. ఆ జలపాతములవలన ఆ పర్వతాల బండరాళ్ళ మూలాలనుంచి పగిలినవి ఆయెను. ఆ విధముగా పగులకొట్టుచు మందరము మొ॥లగు నాలుగు పర్వతాలయందు ఆ గంగానది మేరుపర్వతము పైనుంచి క్రిందికి జారి పడెను.

పూర్వా సీతేతి విఖ్యాతా యయౌ చైత్రరథం వనమ్ ॥5॥

తత్ప్లావయిత్వా చ యయౌ వరుణోదం సరోవరమ్ ।
శీతాన్తం చ గిరిం తస్మాత్ తతశ్చాన్యాన్గిరీన్ క్రమాత్ ॥6॥

గత్వా భువం సమాసాద్య భద్రాశ్వే జలధిం గతా ।

తూర్పు వైపు ప్రవహించే ఆ గంగానదీ ప్రవాహము “సీత” అనుపేరుతో ప్రసిద్ధమై చైత్రరథమను పేరుగల వనమును ప్రవేశించెను. ఆ వనమును దాటి, వరుణోదమను సరోవరములోనికి వెళ్ళెను. అచ్చటినుంచి శీతాన్తమను పర్వతమును, అచ్చటినుంచి క్రమముగా మిగిలిన పర్వతములను అతిక్రమించి, భూలోకమందు ప్రవేశించి భద్రాశ్వవర్షము నుండి సముద్రమందు ప్రవేశించెను.

తథైవాలకనందాఖ్యా దక్షిణే గన్ధమాదనే ॥7॥

మేరుపాదే వనం గత్వా నన్దనం దేవనన్దనమ్ ।
మానసం చ మహావేగాత్ ప్లావయిత్వా సరోవరమ్ ॥8॥

ఆసాద్య శైలరాజానం రమ్యం త్రిశిఖరం గతా ।
తస్మాచ్చ పర్వతాన్సర్వాన్ దక్షిణే యే క్రమోదితాః ॥9॥

"అలకనంద" అను పేరుగల ఆ గంగానదియొక్క రెండవ ప్రవాహము దక్షిణదిక్కునందలి గంధమాదనపర్వతమందు ప్రవహించి, మేరుపర్వతముయొక్క పాదస్థానమందలి దేవతలకు సంతోషకరమైన నందనవనమును ప్రవేశించెను. అచ్చటినుంచి గొప్ప వేగముతో మానససరోవరమును ప్రవహింపచేసి అచ్చటినుంచి పర్వతరాజమగు మూడు శిఖరాలు గల రమ్యపర్వతమును చేరెను. అచ్చటినుంచి కూడా దక్షిణదిక్కునందుగల పర్వతాలనన్నింటిని క్రమముగా చేరెను.

తాన్ ప్లావయిత్వా సంప్రాప్తా హిమవన్తం మహాగిరిమ్ ।
దధార తత్ర తాం శంభుర్న ముమోచ వృషధ్వజః ॥10॥

ఆ పర్వతప్రాంతములనన్నింటినీ ప్రవహింపచేసి ఆ గంగానదీ ప్రవాహము హిమవత్ మహాపర్వతమును చేరెను. అచ్చట ఎద్దువాహనముగా గల పరమశివుడు ఆ గంగానదీ ప్రవాహమును గట్టిగా పట్టుకొనెను, విడిచిపెట్టలేదు.

భగీరథేనోపవాసైః స్తుత్యా చారాధితో విభుః ।
తత్ర ముక్తా చ శర్వేణ సప్తధా దక్షిణోదధిమ్ ॥11॥

ప్రవివేశ త్రిధా ప్రాచ్యాం ప్లావయన్తీ మహానదీ ।
భగీరథరథస్యాను స్రోతసైకేన దక్షిణామ్ ॥12॥

భగీరథుడు ఉపవాసములచేతను, స్తోత్రముల చేతను సర్వవ్యాపకుడగు ఆ పరమశివుని ఆరాధించగా, ఆ పరమశివుడు గంగానదిని విడిచిపెట్టెను. అంతట ఆ మహానది ఏడు ధారలుగా దక్షిణ సముద్రమును ప్రవేశించెను. అట్లే ఆ మహానది మూడు ధారలుగా తూర్పుదిక్కును ప్రవహింపచేస్తూ, ఒక ధార దక్షిణమువైపు భగీరథుని రథమునను సరించి ప్రవహించెను.

తథైవ పశ్చిమే పాదే విపులే సా మహానదీ ।
సుచక్షురితి విఖ్యాతా వైభ్రాజం సా వనం యయౌ ॥13॥

శీతోదం చ సరస్తస్మాత్ ప్లావయన్తీ మహానదీ ।
తస్మాత్ క్రమేణ చాద్రీణాం శిఖరేషు నిపత్య సా ॥
సుచక్షుఃపర్వతః ప్రాప్తా తతశ్చ త్రిశిఖం గతా ॥14॥

కేతుమాలం సమాసాద్య ప్రవిష్టా దక్షిణోదధిమ్ ॥15॥

అట్లే ఆ మహానది పశ్చిమదిగ్భాగమందు విపులపర్వతమందు జారి సుచక్షువను పేరుతో ప్రసిద్ధిని పొంది, వైభ్రాజమను అడవియందు ప్రవేశించెను. పిమ్మట ఆ మహానది శీతోదమను అడవియందు ప్రవేశించెను. పిమ్మట ఆ మహానది శీతోదమను సరస్సును ప్రవహింపచేసి, అచ్చటినుండి క్రమముగా ఆయా పర్వతశిఖరములందు పడినదై, సుచక్షువుయొక్క ఒకభాగము నుండి ప్రాప్తించినదై త్రిశిఖ పర్వతమందు జారెను. పిమ్మట కేతుమాలపర్వతమును పొందినదై దక్షిణసముద్రమందు కలిసెను.

గత్వోత్తరాం దిశం గంగా దివ్యా సా చ మహానదీ ।
తస్మాచ్చ ఋషభాదీంశ్చ క్రమాదుత్తరజాన్నగాన్ ॥

సుపార్శ్వం తు తథైవాద్రిం మేరుపాదం హి సా గతా ।
భద్రసోమేతి విఖ్యాతా సా యయౌ సవితుర్వనమ్ ॥16॥

తత్ ప్లావయన్తీ సంప్రాప్తా మహాభద్రం సరోవరమ్ ।
తతశ్చ శంఖకూటం సా ప్రయాతా వై మహానదీ ॥17॥

తస్మాచ్చ వృషభాదీన్ సా క్రమాత్ ప్రాప్య శిలోచ్చయాన్ ।
మహార్ణవమనుప్రాప్తా ప్లావయిత్వోత్తరాన్కురూన్ ॥18॥

ఆ తరువాత ఆ మహానది ఉత్తరదిక్కువైపు వెళ్ళి అచ్చటినుంచి ఉత్తరదిక్కులో ఉద్భవించిన ఋషభాది పర్వతములందు ప్రవేశించెను. ఈ నాల్గవ ధార మేరుపర్వతముయొక్క పాదస్థానమందున్న సుపార్శ్వపర్వతమును గూర్చి వెళ్ళెను. అచ్చట ఆ మహానది "భద్రసోమ"యను పేరుతో ప్రసిద్ధిని పొంది సవితృవనమందు ప్రవేశించెను. ఆ వనమును ప్రవహింపచేయుచూ మహాభద్రమను సరోవరమును ప్రేశించెను. అచ్చటినుంచి ఆ మహానది శంఖకూటమను పర్వతమును, అచ్చటి నుంచి పెద్ద పెద్ద బండరాళ్ళు కలిగిన వృషభాది పర్వతములను ప్రవేశించెను. పిమ్మట ఉత్తరభాగమందలి కురుదేశములను ప్రవహింపచేస్తూ మహాసముద్రమందు ప్రవేశించెను.

ఏవమేషా మయా గంగా కథితా తే ద్విజర్షభ ।
జంబూద్వీపనివేశశ్చ వర్షాణి చ యథాతథమ్ ॥19॥

వసన్తి తేషు సర్వేషు ప్రజాః కింపురుషాదిషు ।
సుఖప్రాయా నిరాతంకా న్యూనతోత్కర్షవర్జితాః ॥20॥

ఓ బ్రాహ్మణశ్రేష్ఠుడా ! నీకీ విధముగా గంగానదీ వృత్తాంతమును చెప్పితిని. అట్లే ఉన్నది ఉన్నట్లుగా జంబూద్వీపము, జంబూద్వీపవర్షములు (ప్రాంతములు) గూర్చి చెప్పితిని. అచ్చట అనగా కింపురుషము మొ॥లగు జంబూద్వీప ప్రాంతములందు అన్నిచోట్ల ప్రజలు సుఖవంతులై, ఎట్టి రోగములు లేక, హెచ్చుతగ్గులు లేక ఉండిరి.

నవస్వపి చ వర్షేషు సప్త సప్తకులాచలాః ।
ఏకైకస్మింస్తథా దేశే నద్యశ్చాద్రివినిఃసృతాః ॥21॥

తొమ్మిది జంబూద్వీపప్రాంతములందు ఏడు కులపర్వతములున్నవి. వాటిలో ఒక్కొక్కదేశమందు నదులు పర్వతములనుండి జారుతున్న జలములు గలవి.

యాని కింపురుషాద్యాని వర్షాణ్యష్టౌ ద్విజోత్తమ ।
తేషూద్భిజ్జాని తోయాని నైవం వార్యత్ర భారతే ॥22॥

వార్క్షీస్వాభావికీ దేశ్యా తోయోత్థా మానసీ తథా ।
కర్మజా చ నృణాం సిద్ధిర్వర్షేష్వేతేషు చాష్టసు ॥23॥

కామప్రదేభ్యో వృక్షేభ్యో వార్క్షీ సిద్ధిః స్వభావజా ।
స్వాభావికీ సమాఖ్యాతా తృప్తిర్దేశ్యా చ దైశికీ ॥24॥

అపాం సౌక్ష్మ్యాచ్చ తోయోత్థాధ్యానోపేతాచ్చ మానసీ ।
ఉపాసనాదికార్యాత్తు కర్మజా సాప్యుదాహృతా ॥25॥

న చైతేషు యుగావస్థా నాధయో వ్యాధయో న చ ।
పుణ్యాపుణ్యసమారంభా నైవ తేషు ద్విజోత్తమ ॥26॥

ఓ బ్రాహ్మణశ్రేష్ఠుడా ! కింపురుషము మొ॥లగు ఎనిమిది ఏ జంబూద్వీపవర్షములను గూర్చి నీకు నేను చెప్పితినో వాటియందు కేవలము భూమినుంచి జలములు సిద్ధించును. భారతవర్షమందు అట్లు లేదు. (అచ్చట మేఘములు వర్షించవలెనని అభిప్రాయము.) ఈ ఎనిమిది వర్షములందు మానవులయొక్క సిద్ధి (అనగా తాము కోరుకున్నది సిద్ధించుట) ఆరు విధములుగా ఉన్నది. అవి వరుసగా వార్క్షి, స్వాభావికి, దేశ్య, తోయోత్థ, మానసి, కర్మజ అని. కోరిన కోరికలను ఇచ్చు వృక్షముల వలన కలుగు సిద్ధి వార్క్షి సిద్ధి. స్వభావము వలన అనగా వేరే కారణమేమీ లేకుండానే కలుగు సిద్ధి స్వాభావికీసిద్ధి, అదియే తృప్తి. ఆ యా దేశమందు కలిగిన సిద్ధి దేశ్యా సిద్ధి. జలమందలి సౌక్ష్మ్యగుణము కారణముగా కలుగు సిద్ధి తోయోత్థా సిద్ధి. ధ్యానముద్వారా సిద్ధించు సిద్ధి మానసీ సిద్ధి. ఆ యా దేవతల ఉపాసనల వల్ల కలిగే సిద్ధి కర్మజా సిద్ధి. ఈ ఎనిమిది వర్షములందు యుగవిభజన, శారీరక మానసిక వ్యాధులు, పాపపుణ్యములు ఇవేమీ ఉండవు.

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే గంగావతరణవర్ణనం నామ త్రిపఞ్చాశత్తమోఽధ్యాయః ॥53॥

శ్రీ మార్కండేయ మహాపురాణమందలి గంగావతరణవర్ణనమను ఏబదిమూడవ అధ్యాయం సమాప్తం.



చతుఃపఞ్చాశత్తమోఽధ్యాయః - ఏబదినాల్గవ అధ్యాయం
నద్యాదివర్ణనమ్ - నదులు మొదలగువాటి వర్ణన

క్రౌష్టుకిరువాచ - క్రౌష్టుకి చెప్పాడు.

భగవన్ కథితం త్వేతజ్జంబూద్వీపం సమాసతః ।
యదేతద్భవతా ప్రోక్తం కర్మ నాన్యత్ర పుణ్యదమ్ ॥1॥

పాపాయ వా మహాభాగ వర్జయిత్వా తు భారతమ్ ।
ఇతః స్వర్గశ్చ మోక్షశ్చ మధ్యశ్చాన్తశ్చ గమ్యతే ॥2॥

న ఖల్వన్యత్ర మర్త్యానాం భూమౌ కర్మ విధీయతే ।
తస్మాద్విస్తరశో బ్రహ్మన్మమ తద్భారతం వద ॥3॥

యే చాస్య భేదా యావన్తో యథావత్ స్థితిరేవ చ ।
వర్షోఽయం ద్విజశార్దూల యే చాస్మిన్దేశపర్వతాః ॥4॥

ఓ భగవత్స్వరూపుడా ! జంబూద్వీపమును గురించి సమగ్రముగా నీవు చెప్పితివి. ఓ మహాభాగుడా ! ఈ భారతవర్షము తప్ప మరెచ్చటా కూడా కర్మ పాపపుణ్యములనీయజాలదని చెప్పితివి. ఈ భారతవర్షమందే స్వర్గముగాని, మోక్షముగాని, సంసారముగాని ప్రయత్నపూర్వకముగా లభించునని తెలియుచున్నది. భారతదేశమందు తప్ప మరెచ్చటా మరణశీలురగు వారికి అనగా జన్మించినవారికి కర్మలు విధింపబడుట లేదు గదా ! అందువలన ఓ బ్రహ్మస్వరూపుడా! విస్తృతముగా అట్టి భారతవర్షమును గూర్చి నాకు చెప్పుము. ఆ వర్షమందు ఎన్ని విధాలైన భేదములున్నవి, దాని యథార్థస్థితి ఏమి? అచ్చట ఎన్ని దేశములు (భూభాగములు), పర్వతములు ఉన్నవి? అను విషయములను ఓ ద్విజశ్రేష్ఠుడా ! నాకు వివరించుము.

భారతస్యాస్య వర్షస్య నవభేదాన్నిబోధ మే ।
సముద్రాన్తరితా జ్ఞేయాస్తే త్వగమ్యా పరస్పరమ్ ॥5॥

ఓ బ్రాహ్మణశ్రేష్ఠుడా ! జంబూద్వీపాన్తర్గతమైన ఈ భారతవర్షమందు తొమ్మిది భేదములున్నవి. అవియన్నియు సముద్రముచే ఆచ్ఛాదింపబడియున్నవని తెలుసుకొనవలెను. అవి పరస్పరము ఒక్కొక్కటి విడివిడిగా తెలియబడేవి కావు.

ఇంద్రద్వీపః కశేరూమాంస్తామ్రవర్ణో గభస్తిమాన్ ।
నాగద్వీపస్తథా సౌమ్యో గాంధర్వో వారుణస్తథా ॥6॥

అయం తు నవమస్తేషాం ద్వీపః సాగరసంవృతః ।
యోజనానాం సహస్రం వై ద్వీపోఽయం దక్షిణోత్తరమ్ ॥7॥

ఇంద్రద్వీపము, కశేరూమద్ద్వీపము, తామ్రవర్ణద్వీపము, గభస్తిమద్ద్వీపము, నాగద్వీపము, సౌమ్యద్వీపము, గాంధర్వద్వీపము, వారుణద్వీపము ఈ ఎనిమిదీ మరియు తొమ్మిదవ ద్వీపము సముద్రములచే చుట్టబడిన ప్రకృత భరతద్వీపము. ఈ ద్వీపము దక్షిణోత్తరములందు వెయ్యి యోజనముల వరకు వ్యాపించి ఉన్నది.

పూర్వే కిరాతా యస్యాన్తే పశ్చిమే యవనాస్తథా ।
బ్రాహ్మణాః క్షత్రియా వైశ్యాః శూద్రాశ్చాన్తఃస్థితా ద్విజ ॥8॥

ఇజ్యాధ్యాయవాణిజ్యాద్యైః కర్మభిః కృతపావనాః ।

తేషాం సంవ్యవహారశ్చ ఏభిః కర్మభిరిష్యతే ॥9॥

స్వర్గాపవర్గప్రాప్తిశ్చ పుణ్యం పాపం చ వై తదా ।

ఓ బ్రాహ్మణుడా ! ఈ ద్వీపమునకు పూర్వదిక్కునందు కిరాతులు, పశ్చిమదిక్కునందు యవనులు, మధ్యభాగమందు బ్రాహ్మణక్షత్రియవైశ్యశూద్రులు గలరు. వారందరు యజ్ఞములు, వేదాధ్యయనము, వాణిజ్యము మొ॥లగు తమకు విధింపబడిన కర్మలనాచరించుచూ పవిత్రులైయుందురు. ఈ కర్మలద్వారానే వారికి సంబంధించిన వ్యవహారములన్నీ ఉండును. ఈ భరతద్వీపమందే స్వర్గమోక్షములు లభించుట, పాపపుణ్యసముపార్జనము ఉండును.

మహేన్ద్రో మలయః సహ్యః శుక్తిమానృక్షపర్వతః ॥10॥
విన్ధ్యశ్చ పారియాత్రశ్చ సప్తైవాత్ర కులాచలాః ।

మహేంద్రము, మలయము, సహ్యము, శుక్తిమత్తు, ఋక్షపర్వతము, వింధ్యము, పారియాత్రము ఈ ఏడు ఈ ద్వీపము కులపర్వతములుగా ప్రసిద్ధమై ఉన్నవి.

తేషాం సహస్రశ్చాన్యే భూధరా యే సమీపగాః ॥11॥

విస్తారోచ్ఛ్రాయిణో రమ్యా విపులాశ్చిత్రసానవః ।
కోలాహలః స వైభ్రాజో మన్దరో దర్దురాచలః ॥12॥

వాతస్వనో వైద్యుతశ్చ మైనాకః స్వరసస్తథా ।
తుఙ్గప్రస్థో నాగగిరీ రోచనః పాణ్డురాచలః ॥13॥

పుష్పో గిరిర్దుర్జయన్తో రైవతోఽర్బుద ఏవ చ ।
ఋష్యమూకః సగోమన్తః కూటశైలః కృతస్మరః ॥14॥

శ్రీపర్వతశ్చకోరశ్చ శతశోఽన్యే చ పర్వతాః ।
తైర్విమిశ్రా జనపదా మ్లేచ్ఛాశ్చార్యాశ్చ భాగశః ॥15॥

ఆ ఏడు కులపర్వతముల సమీపమందు వేలకొలదీ వెడల్పైన, ఎత్తైన, అందమైన, విశాలమైన, భిన్న భిన్న వర్ణములు కలిగిన వేరే పర్వతాలు కలవు. కోలాహలము, వైభ్రాజము, మందరము, దర్దురము, వాతస్వనము,

వైద్యుతము, మైనాకము, స్వరసము, తుంగప్రస్థము, నాగగిరి, రోచనము, పాండురము, పుష్పము, దుర్జయంతము, రైవతము, అర్బుదము, ఋష్యమూకము, గోమన్తము, కూటశైలము, కృతస్మరము, శ్రీపర్వతము, చకోరము, ఇంకను వందల కొలదీ అట్టి పర్వతాలు కలవు. ఈ పర్వతప్రాంతాలయందు జానపదులు, మ్లేచ్ఛులు, ఆర్యులు వారి వారి విభాగానుసారముగా కలిసి యుండిరి.

తైః పీయన్తే సరిచ్ఛ్రేష్ఠా యాస్తాః సమ్యక్ నిబోధ మే ।
గంగా సరస్వతీ సింధుశ్చంద్రభాగా తథాపరా ॥16॥

యమునా చ శతద్రుశ్చ వితస్తేరావతీ కుహూః ।
గోమతీ ధూతపాపా చ బాహుదా చ దృషద్వతీ ॥17॥

విపాశా దేవికా రంక్షుర్నిశ్చీరా గణ్డకీ తథా ।
కౌశికీ చాపగా విప్ర హిమవత్పాదనిఃసృతాః ॥18॥

ఓ బ్రాహ్మణుడా ! ఆ ప్రజలందరు ఏ శ్రేష్ఠమైన నదుల నీళ్ళను త్రాగెదరో అట్టి నదులను గూర్చి చెప్పెదను, తెలుసుకొనుము. గంగ, సరస్వతి, సింధు, చంద్రభాగ, యమున, శతద్రు, వితస్త, ఇరావతి, కుహు, గోమతి, ధూతపాప, బాహుద, దృషద్వతి, విపాశ, దేవిక, రంక్షు, నిశ్చీర, గండకి, కౌశికి ఈ నదులన్నియు హిమవత్పర్వతముయొక్క పల్లపుభాగములనుండి ప్రవహించుచున్నవి.

వేదస్మృతిర్వేదవతీ వృత్రఘ్నీ సింధురేవ చ ।
వేణా సానన్దనా చైవ సదానీరా మహీ తథా ॥19॥

పారా చర్మణ్వతీ నూపీ విదిశా వేత్రవత్యపి ।
క్షిప్రా హ్యవన్తీ చ తథా పారియాత్రాశ్రయాః స్మృతాః ॥20॥

వేదస్మృతి, వేదవతి, వృత్రఘ్ని, సింధు, వేణ, ఆనందన, సదానీర, మహి, పార, చర్మణ్వతి, నూపి, విదిశ, వేత్రవతి, క్షిప్ర, అవన్తి ఈ నదులన్నియు పారియాత్రాపర్వతములనుండి ప్రవహించుచున్నవి.

శోణో మహానదశ్చైవ నర్మదా సురథాద్రిజా ।
మన్దాకినీ దశార్ణా చ చిత్రకూటా తథాపరా ॥21॥

చిత్రోత్పలా సతమసా కరమోదా పిశాచికా ।
తథాన్యా పిప్పలా శ్రోణీర్విపాశా వంజులా నదీ ॥22॥

సుమేరుజా శుక్తిమతీ సకులీ త్రిదివాక్రముః ।
ఋక్షపాదప్రసూతా వై తథాన్యా వేగవాహినీ ॥23॥

శోణ, మహానద, నర్మద, సురథ, అద్రిజ, మందాకిని, దశార్ణ, చిత్రకూట, చిత్రోత్పల, తమస, కరమోద, పిశాచిక, పిప్పల, శ్రోణి, విపాశ, వంజుల, సుమేరుజ, శుక్తిమతి, సకులి, త్రిదివ, అక్రము, వేగవాహిని ఈ నదులన్నియు ఋక్షపర్వతప్రాంతములనుండి ప్రవహించుచున్నవి.

క్షిప్రా పయోష్ణీ నిర్వింధ్యా తాపీ చ నిషధావతీ ।
వేణ్యా వైతరణీ చైవ సినీవాలీ కుముద్వతీ ॥24॥

కరతోయా మహాగౌరీ దుర్గా చాన్తఃశివా తథా ।
వింధ్యపాదప్రసూతాస్తా నద్యః పుణ్యజలాః శుభాః ॥25॥

క్షిప్ర, పయోష్ణి, నిర్వింధ్య, తాపి, నిషధావతి, వేణ్య, వైతరణి, సినీవాలి, కుముద్వతి, కరతోయ, మహాగౌరి, దుర్గ, అన్తఃశివ ఈ నదులన్నియు పుణ్యజలములు కలిగినవి మరియు మంగళకరములైనవి. ఈ నదులన్నియు వింధ్యపర్వత ప్రాంతములనుండి పుట్టినవి.

గోదావరీ భీమరథీ కృష్ణా వేణ్యా తథాపరా ।
తుంగభద్రా సుప్రయోగా వాహ్యా కావేర్యథాపగా ॥26॥

సహ్యపాదవినిష్క్రాన్తా ఇత్యేతాః సరిదుత్తమాః ।

గోదావరి, భీమరథి, కృష్ణ, వేణ్య, తుంగభద్ర, సుప్రయోగ, వాహ్య, కావేరి ఈ శ్రేష్ఠమైన నదులన్నియు సహ్యపర్వతభాగములనుండి ఉత్పన్నమైనవి.

కృతమాలా తామ్రపర్ణీ పుష్పజా సూత్పలావతీ ॥27॥
మలయాద్రిసముద్భూతా నద్యః శీతజలాస్త్విమాః ।

కృతమాల, తామ్రపర్ణి, పుష్పజ, సూత్పలావతి ఈ నదులన్నియు చల్లని జలములు కలిగినవి. ఈ నదులన్నియు మలయపర్వతమునుండి ఉత్పన్నమైనవి.

పితృసోమర్షికుల్యా చ ఇక్షుకా త్రిదివా చ యా ॥28॥
లాంగూలినీ వంశకరా మహేన్ద్రప్రభవాః స్మృతాః ।

ఋషికుల్య, కువరి, మందగ, మందవాహిని, కుశ, పలాశిని ఈ నదులన్నియు శుక్తిమత్పర్వతమునుండి పుట్టినవి.

సర్వాః పుణ్యాః సరస్వత్యః సర్వా గంగాః సముద్రగాః ॥30॥
విశ్వస్య మాతరః సర్వాః సర్వపాపహరాః స్మృతాః ।

ఈ చెప్పబడిన పుణ్యనదులన్నియు సముద్రమందు కలియుచున్నవి. ఇవియన్నియు ప్రపంచమునకు తల్లివంటివి. అన్నియు సమస్తపాపములను పోగొట్టునవి.

అన్యాః సహస్రశోక్తాః క్షుద్రనద్యో ద్విజోత్తమ ॥31॥

ప్రావృట్కాలవహాః కాశ్చిత్సర్వకాలవహాశ్చ యాః ।

ఓ బ్రాహ్మణశ్రేష్ఠుడా ! ఈ చెప్పిన నదులేకాక, చిన్న చిన్న నదులు వేరే వేలకొలదీ కలవు. వాటిలో కొన్ని వర్షాకాలములో మాత్రమే పారును. మరికొన్ని సమస్త కాలములందు పారును.

మత్స్యాశ్వకూటాః కుల్యాశ్చ కున్తలాః కాశికోశలాః ॥32॥

అర్బుదాశ్చ కలింగాశ్చ మలకాశ్చ వృకైః సహ ।
మధ్యదేశ్యా జనపదా ప్రాయశోఽమీ ప్రకీర్తితాః ॥33॥

మత్స్య, అశ్వకూట, కుల్య, కున్తల, కాశి, కోశల, అర్బుద, కలింగ, మలక, వృకదేశములు ఇంచుమించు భారతవర్షమందు మధ్యభాగమందు ఉన్నట్టివిగా చెప్పబడినవి.

సహ్యస్య చోత్తరే యస్తు గోదావరీ నదీ ।
పృథివ్యామపి కృత్స్నాయాం స ప్రదేశో మనోరమః ॥34॥

గోవర్ధనపురం రమ్యం భార్గవస్య మహాత్మనః ।

సహ్యపర్వతముయొక్క ఉత్తరదిక్కునందు గోదావరీనది ప్రవహించు ప్రదేశము ఏది కలదో అది సమస్తభూమణ్డలమందు ఆహ్లాదకరమైనది. అచ్చట మహాత్ముడగు భార్గవునియొక్క అందమైన గోవర్ధనపురమున్నది.

బాహ్లీకా వాటధానాశ్చ ఆభీరా కాలతోయకాః ॥35॥

అపరాన్తాశ్చ శూద్రాశ్చ పహ్లవాశ్చర్మఖణ్డికాః ।
గాంధారా యవనాశ్చైవ సింధుసౌవీరమద్రకాః ॥36॥

శతద్రుజాః కలింగాశ్చ పారదా హారభూషికాః ।
మాఠరా బహుభద్రాశ్చ కైకేయా దశమాలికాః ॥37॥

క్షత్రియోపనివేశాశ్చ వైశ్యశూద్రకులాని చ ।

బాహ్లీక, వాటధాన, ఆభీర, కాలతోయక, అపరాన్త, శూద్ర, పహ్లవ, చర్మఖండిక, గాంధార, యవన, సింధు, సౌవీర, మద్రక, శతద్రుజ, కలింగ, పారద, హారభూషిక, మాఠర, బహుభద్ర, కైకేయ, దశమాలిక ఈ ద్వీపప్రాంతములన్నీ క్షత్రియ, వైశ్య, శూద్రనివాసస్థానములు.

కాంబోజా దరదాశ్చైవ బర్బరా అంగలౌకికాః ॥38॥
చీనాశ్చైవ తుషారాశ్చ పహ్లవా బాహ్యతోదరాః ।

ఆత్రేయాశ్చ భరద్వాజాః పుష్కలాశ్చ కశేరుకాః ॥39॥

లంపాకాశ్శూలకారాశ్చ చులికా జాగుడైస్సహ ।
ఔపధాశ్చానిమద్రాశ్చ కిరాతానాం చ జాతయః ॥40॥

కాంబోజ, దరద, బర్బర, అంగలౌకిక, చీన, తుషార, పహ్లవ ఈ ప్రాంతాలకు సంబంధించిన ప్రజలు బాహ్యదేశ ప్రజలుగా చెప్పబడుచున్నారు. ఆత్రేయ, భరద్వాజ, పుష్కల, కశేరుక, లంపాక, శూలకార, చులిక, జాగుడ, ఔపధ, అనిమద్ర ఈ ప్రాంతప్రజలు కిరాతజాతికి సంబంధించినవారుగా చెప్పబడుచున్నారు.

తామసా హంసమార్గాశ్చ కాశ్మీరాస్తు గణాస్తథా ।
శూలికాః కుహకాశ్చైవ ఊర్ణా దార్వాస్తథైవ చ ॥41॥

ఏతే దశ హ్యుదీచ్యాస్తు ప్రాచ్యాన్ దేశాన్నిబోధ మే ।

పూర్వము చెప్పబడిన జాతుల వారు ముగ్గురు, మరియు తామస, హంసమార్గ, కాశ్మీర, శూలిక, కుహక, ఊర్ణ, ద్వారప్రాంతప్రజలు మొత్తం పది విధములైన ప్రజలు ఉత్తరదిక్కునకు చెందినవారు. ఇక తూర్పుదిగ్భాగమునకు చెందిన ప్రజలను గూర్చి చెప్పెదను, వినుము.

అభ్రారకా ముద్గరకా అన్తర్గిరిబహిర్గిరాః ॥42॥

తథా ప్లవంగా రంగేయా మాలదా మలవర్తికాః ।
బ్రాహ్మోత్తరాః ప్రవిజయా భార్గవా గేయమల్లకాః ॥43॥

ప్రాగ్జ్యోతిషాశ్చ మద్రాశ్చ విదేహాస్తామ్రలిప్తకాః ।
మల్లా మగధగోమేదా ప్రాచ్యా జనపదాః స్మృతాః ॥44॥

అభ్రారక, ముద్గరక, అంతర్గిరి, బహిర్గిరి, ప్లవంగ, రంగేయ, మాలద, మలవర్తిక, బ్రాహ్మోత్తర, ప్రవిజయ, భార్గవ, గేయమల్లక, ప్రాగ్జ్యోతిష, మద్ర, విదేహ, తామ్రలిప్తక, మల్ల, మగధ, గోమేధ ఈ ప్రాంతప్రజలందరు తూర్పుదిగ్భాగమునకు చెందిన ప్రజలుగా చెప్పబడినారు.

అథాపరే జనపదా దక్షిణాపథవాసినః ।
పాండ్యాశ్చ కేరలాశ్చైవ చోలాః కున్యాస్తథైవ చ ॥45॥

శైలూషా మూషికాశ్చైవ కుమారా వానవాసకాః ।
మహారాష్ట్రా మాహిషికాః కలింగాశ్చైవ సర్వశః ॥46॥

ఆభీరాస్సహ వైశిక్యా ఆటవ్యాశ్శబరాశ్చ యే ।
పులిన్దా విన్ధ్యమాలేయా వైదర్భా దండకైస్సహ ॥47॥

పౌరికా మౌలికాశ్చైవ అశ్మకా భోగవర్ధనాః ।
నైషికాః కున్తలా ఆన్ధ్రా అద్భిదా వనదారకాః ॥48॥

దాక్షిణాత్యాస్త్వమీ దేశా అపరాంస్తాన్నిబోధ మే ।

ఇక దక్షిణాపథమందు (దక్షిణ దిగ్భాగమందు) నివసించు ప్రజల గురించి చెప్పెదను, వినుము. పాండ్య, కేరల, చోల, కున్య, శైలూష, మూషిక, కుమార, వానవాసక, మహారాష్ట్ర, మాహిషిక, కలింగ, ఆభీర, వైశిక్య,

ఆటవ్య, శబర, పులింద, వింధ్యమాలేయ, వైదర్భ, దండక, పౌరిక, మౌలిక, అశ్మక, భోగవర్ధన, నైషిక, కున్తల, ఆంధ్ర, అద్భిద, వనదారక, ఈ ప్రాంతప్రజలు దాక్షిణాత్యులని చెప్పబడుచున్నారు. ఈ దేశములే దక్షిణదిక్కునందు గల దేశములు. ఇప్పుడు పశ్చిమదిగ్భాగమందలి దేశములను గూర్చి చెప్పెదను, వినుము.

సూర్యారకాః కాలిబలా దుర్గాశ్చామీ కటైస్సహ ॥49॥

పులిన్దాశ్చ సుమీనాశ్చ రూపపాః స్వాపదైస్సహ ।
తథా కురుమినశ్చైవ సర్వే చైవ కఠాక్షరాః ॥50॥

కారస్కరా లోహజంఘా వాజేయా రాజభద్రకాః ।
తోసలాః కోసలాశ్చైవ త్రైపురా విదిశస్తథా ॥
తుషారాస్తుంబురుశ్చైవ సర్వే చైవ కరస్కరాః ॥
నాసిక్యావాశ్చ యే చాన్యే యే చైవోత్తరనర్మదాః ॥51॥

భీరుకచ్ఛాః సమాహేయాః సహ సారస్వతైరపి ।
కాశ్మీరాశ్చ సురాష్ట్రాశ్చ ఆవన్త్యాశ్చార్బుదైస్సహ ॥52॥

ఇత్యేతే హ్యపరాన్తాశ్చ శృణు విన్ధ్యానివాసినః ।

సూర్యారక, కాలిబల, దుర్గ, కట, పులిన్ద, సమీన, రూపప, స్వాపద, కురుమి, కఠాక్షర, కారస్కర, లోహజంఘ, వాజేయ, రాజభద్రక, తోసల, కోసల, త్రైపుర, విదిశ్, తుషార, తుంబురు, కరస్కర, నాసిక్యావ, భీరుకచ్ఛ, సమాహేయ, సారస్వత, కాశ్మీర, సురాష్ట్ర, ఆవన్త్య, అర్బుద ఈ ప్రాంతప్రజలందరు పశ్చిమదిగ్భాగమునకు చెందినవారు. ఇక వింధ్యపర్వతాలయందు నివసించువారి గురించి చెప్పెదను, వినుము.

సరజాశ్చ కురూషాశ్చ కేరలాశ్చోత్కలైః సహ ॥53॥

ఉత్తమర్ణాశ్చ దశార్ణాశ్చ భోజ్యాః కిష్కిన్ధకైస్సహ ।
తుంబురాస్తుంబులాశ్చైవ పటవో నైషధైః సహ ॥54॥

అన్నజాస్తుష్టికారాశ్చ వీరహోత్రా హ్యవన్తయః ।
ఏతే జనపదాస్సర్వే విన్ధ్యపృష్ఠనివాసినః ॥55॥

సరజ, కరూష, కేరళ, ఉత్కల, పటు, నైషధ, అన్నజ, తుష్టికార, వీరహోత్ర, అవన్తి ఈ దేశప్రజలందరు వింధ్యపర్వతప్రాంతాలయందు నివసించువారు.

అతో దేశాన్ ప్రవక్ష్యామి పర్వతాశ్రయిణశ్చ యే ।
నీహారా హంసమార్గాశ్చ కురవో గుర్గణాః ఖసాః ॥56॥

కుంతప్రావరణాశ్చైవ ఊర్ణా దార్వాః సకృత్రకాః ।
త్రిగర్తా గాలవాశ్చైవ కిరాతాస్తామసైః సహ ॥57॥

తరువాత పర్వతములను ఆశ్రయించి ఉన్న దేశాలను గూర్చి నీకు చెప్పెదను. నీహార, హంసమార్గ, కురు, గుర్గణ, ఖస, కుంతప్రావరణ, ఊర్ణ, దార్వ, సకృత్రక, త్రిగర్త, గాలవ, కిరాత, తామస ఈ దేశాలు పర్వతాలను ఆశ్రయించి ఉన్నవి.

కృతత్రేతాదికశ్చాత్ర చతుర్యుగకృతో విధిః ।
ఏతత్తు భారతం వర్షం చతుస్సంస్థానసంస్థితమ్ ॥58॥

ఈ భారతవర్షమందు కృతము, త్రేతము మొ॥లగు నాలుగు యుగాల విభజన ఉన్నది. నాలుగు సంస్థానములుగా ఈ భారతవర్షము చేయబడినది.

దక్షిణాపరతో హ్యస్య పూర్వేణ చ మహోదధిః । ।
హిమవానుత్తరేణాస్య కార్ముకస్య యథా గుణః ॥59॥

దక్షిణ, పశ్చిమ, పూర్వదిక్కులలో ఈ భారతవర్షమునందు మహాసముద్రము ఉన్నది. ఉత్తరదిక్కునందు హిమవత్పర్వతము ధనుస్సు ఆకారములో ఉన్నది.

తదేతద్భారతం వర్షం సర్వబీజం ద్విజోత్తమ ।
బ్రహ్మత్వమమరేశత్వం దేవత్వం మర్త్యతాం తథా ॥60॥

ఓ బ్రాహ్మణశ్రేష్ఠుడా ! ఈ భారతవర్షము సమస్తమునకు బీజస్థానము అనగా ఉత్పత్తిస్థానము. బ్రహ్మత్వము, ఇంద్రత్వము, దేవత్వము, మనుష్యత్వము అన్నింటికి ఈ భారతవర్షము నిలయస్థానము.

మృగపశ్వప్సరోయోనిస్తద్వత్సర్వే సరీసృపాః ।
స్థావరాణాం చ సర్వేషామితో బ్రహ్మన్ శుభాశుభైః ॥61॥

ప్రయాన్తి కర్మభూర్బ్రహ్మన్నాన్యలోకేషు విద్యతే ।
దేవానామపి విప్రర్షే సదా ఏష మనోరథః ॥62॥

అపి మానుష్యమాప్స్యామో దేవత్వాత్ప్రచ్యుతాః క్షితౌ ।

ఓ బ్రహ్మస్వరూపుడా ! మృగములు, పశువులు, జలమందు పుట్టే జంతువులు, తేళ్ళు, పాములు మొ॥ పాకుతూ వెళ్ళే జంతువులు, స్థావరప్రాణులు అన్నింటికీ ఈ భారతవర్షము జన్మస్థానము. ఈ భారతవర్షమందు జన్మించి, మరణించిన పిమ్మట ఆయా ప్రాణులు తమ శుభాశుభకర్మలతో (పాపపుణ్యములతో) పరలోకగమనము చేసెదరు. ఓ బ్రహ్మస్వరూపుడా! ఈ భారతవర్షము కర్మభూమి. ఈ విధమైన భూమి ఇతరలోకాలలో ఎచ్చటా లేదు. ఓ విప్రర్షీ! స్వర్గలోకానుభవము పూర్తి అయిన పిమ్మట దేవత్వము నశించినవారు తిరిగి భూలోకమందు మానవజన్మనెత్తవలెనని కోరుకొనెదరు.

మనుష్యః కురుతే తత్తు యన్న శక్యం సురాసురైః ॥63॥

తత్కర్మనిగడగ్రస్తైః స్వకర్మఖ్యాపనోత్సుకైః ।
న కిఞ్చిత్ క్రియతే కర్మ సుఖలేశోపబృంహితైః ॥64॥

మనుష్యులు చేయదగిన కర్మలను దేవతలు, రాక్షసులు చేయలేరు. కర్మలనే సంకెళ్ళతో బంధింపబడిన మానవులు తాము ఆచరించిన కర్మలను గొప్పగా చెప్పుకొనుటలో ఉత్సాహము కలిగినవారై ఆ కర్మవలన పుట్టిన కొద్దిపాటి సుఖమును పొంది ఇక కర్మలను ఆచరించుటలేదు.

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే నద్యాదివర్ణనం నామ చతుఃపఞ్చాశత్తమోऽధ్యాయః ॥54॥

శ్రీ మార్కండేయ మహాపురాణమందలి నద్యాదివర్ణనమను ఏబదినాల్గవ అధ్యాయం సమాప్తం.



పఞ్చపఞ్చాశత్తమోఽధ్యాయః – ఏభైఅయిదవ అధ్యాయం
భారతీయకూర్మనివేశః – భారతీయకూర్మనివేశం

క్రౌష్టకిరువాచ – క్రౌష్టకి చెప్పాడు.

భగవన్ కథితం సమ్యగ్భవతా భారతం మమ ।
సరితః పర్వతా దేశా యే చ తత్ర వసన్తి వై ॥1॥

కిన్తు కూర్మస్త్వయా పూర్వం భారతే భగవాన్ హరిః ।
కథితస్తస్య సంస్థానం శ్రోతుమిచ్ఛామ్యశేషతః ॥2॥

ఓ పూజ్యుడా ! ఈ భారతవర్షములో ఉన్నట్టి నదులు, పర్వతాలు, అచ్చట నివసించు ప్రజలు ఈ విషయాలను గూర్చి నీవు బాగుగా చెప్పితివి. కాని పూజ్యుడగు విష్ణుమూర్తి కూర్మరూపమును అనగా తాబేలు రూపమును భారతవర్షమందు ధరించెనని పూర్వము నీవు నాకు చెప్పితివి. ఆ కూర్మరూపమును గురించి సంపూర్ణముగా నీనుండి వినవలెనని కోరుచున్నాను.

కథం స సంస్థితో దేవః కూర్మరూపీ జనార్దనః ।
శుభాశుభం మనుష్యాణాం వ్యజ్యతే చ తతః కథమ్ ॥3॥

కూర్మరూపమును ధరించిన భగవంతుడగు విష్ణుమూర్తి ఎటులుండెను? అతనివలన మనుష్యులకు శుభాశుభములు ఎట్లు కలుగుచుండెను? అతని ముఖము, పాదములు ఎటులుండెను? ఈ విషయములన్నింటినీ సంపూర్ణముగా నాకు చెప్పుము.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

ప్రాఙ్ముఖో భగవాన్దేవః కూర్మరూపీ వ్యవస్థితః ।
ఆక్రమ్య భారతం వర్షం నవభేదమిదం ద్విజ ॥4॥

నవధా సంస్థితే న్యస్య నక్షత్రాణి సమన్తతః ।
విషయాశ్చ ద్విజశ్రేష్ఠ యే సమ్యక్ తాన్నిబోధ మే ॥5॥

ఓ బ్రాహ్మణశ్రేష్ఠుడా ! కూర్మరూపమును ధరించిన భగవంతుడగు నారాయణుడు తొమ్మిది విధములుగా ఉన్న ఈ భారతవర్షమును ఆక్రమించి తూర్పుముఖముగా నివసించెను. ఈ తొమ్మిది విభాగములందు అంతట నక్షత్రములు నివేశింపబడెను. వాటిగురించి, అచ్చట ఉన్న ఆయా విషయాల గురించి చెప్పెదను, వినుము.

వేదిమద్రారిమాణ్డవ్యాః శాల్వా నీపాస్తథా శకాః ।
ఉజ్జిహానాస్తథా వత్స ఘోషసంఖ్యాస్తథా ఖశాః ॥6॥

మధ్యే సారస్వతా మత్స్యాః శూరసేనాః సమాథురాః ।
ధర్మారణ్యా జ్యోతిషికా గౌరగ్రీవా గుడాశ్మకాః ॥7॥

వైదేహకాః సపాంచాలాః సంకేతాః కంకమారుతాః ।
కాలకోటిసపాషండాః పారియాత్రనివాసినః ॥8॥

కాపింజలాః కురోర్బాహ్యాస్తథైవోదుంబరా జనాః ।
గజాహ్వయాశ్చ కూర్మస్య జనా మధ్యనివాసినః ॥9॥

కృత్తికారోహిణీసౌమ్యా ఏతేషాం మధ్యవాసినామ్ ।
నక్షత్రత్రితయం విప్ర శుభాశుభవిపాకదమ్ ॥10॥

ఓ విప్రుడా ! వేది, మద్రారి, మాణ్డవ్య, శాల్వ, నీప, శక, ఉజ్జిహాన, ఘోషసంఖ్య, ఖశ, సారస్వత, మత్స్య, శూరసేన, మాథుర, ధర్మారణ్య, జ్యోతిషిక, గౌరగ్రీవ, గుడాశ్మక, వైదేహక, పాంచాల, సంకేత, కంకమారుత, కాలకోటి, పాషండ, పారియాత్ర పర్వతాలలో నివసించువారు, కాపింజల, కురుబాహ్య, ఉదుంబర, గజహ్వయ ఈ దేశాల ప్రజలందరు కూర్మముయొక్క మధ్యభాగమందు నివసించువారు. కృత్తిక, రోహిణి, సౌమ్యనక్షత్రాలు ఈ మధ్యవాసులగు ప్రజల నక్షత్రాలు. ఇవి ప్రజలకు శుభాశుభఫలములనిచ్చును.

వృషధ్వజోఽఞ్జనశ్చైవ జంబ్వాఖ్యో మానవాచలః ।
శూర్పకర్ణో వ్యాఘ్రముఖో ముర్వరః కర్వటాశనః ॥11॥

తథా చంద్రేశ్వరాశ్చైవ ఖశాశ్చ మగధాస్తథా ।
శిబయో మైథిలాః శుభ్రాస్తథా వదనదన్తురాః ॥12॥

ప్రాగ్జ్యోతిషాః సలౌహిత్యాః సాముద్రాః పురుషాదకాః ।
పూర్ణోత్కటో భద్రగౌరస్తథోదయగిరిర్ద్విజ ॥13॥

కాశయో మేఖలా ముష్టాస్తామ్రలిప్తైకపాదపాః ।
వర్ధమానా కోశలాశ్చ ముఖే కూర్మస్య సంస్థితాః ॥14॥

రౌద్రం పునర్వసుః పుష్యో నక్షత్రత్రితయం ముఖే ।

ఓ బ్రాహ్మణుడా ! వృషధ్వజ, అంజన, జంబు, మానవాచల, శూర్పకర్ణ, వ్యాఘ్రముఖ, ముర్వర, కర్వటాశన, చంద్రేశ్వర, ఖశ, మగధ, శిబి, మైథిల, శుభ్ర, వదనదంతుర, ప్రాగ్జ్యోతిష, లౌహిత్య, సాముద్ర, పురుషాదక, పూర్ణోత్కట, భద్రగౌర, ఉదయగిరి, కాశయ, మేఖల, ముష్ట, తామ్రలిప్త, ఏకపాదప, వర్ధమాన, కోసల, ఈ దేశాల ప్రజలందరు కూర్మముయొక్క ముఖమందు ఉన్నవారు. రౌద్ర, పునర్వసు, పుష్యనక్షత్రాలు ఆ ముఖమందు ఉన్నవి.

పాదే తద్దక్షిణే దేశాః క్రౌష్టుకే వదతః శృణు ॥15॥

కలింగవంగజఠరాః కోశలా మూషికాస్తథా ।
చేదయశ్చోర్ధ్వకర్ణాశ్చ మత్స్యాన్ధ్రా వింధ్యవాసినః ॥16॥

విదర్భా నారికేలాశ్చ ధర్మద్వీపాస్తథైలికాః ।
వ్యాఘ్రగ్రీవా మహాగ్రీవాస్త్రైపురాః శ్మశ్రుధారిణః ॥17॥

కైష్కింధ్యా హైమకూటాశ్చ నిషధాః కటకస్థలాః ।
దశార్ణా హారికా నగ్నా నిషధాః కాకులాలకాః ॥18॥

తథైవ పర్ణశబరాః పాదే వై పూర్వదక్షిణే ।
ఆశ్లేషర్క్షం తథా పైత్ర్యం ఫాల్గున్యః ప్రథమాస్తథా ॥19॥

నక్షత్రత్రితయం పాదమాశ్రితం పూర్వదక్షిణమ్ ।

ఓ క్రౌష్టుకీ ! ఆ కూర్మముయొక్క దక్షిణపాదమందు గల దేశాలను గూర్చి చెప్పెదను, వినుము. కలింగ, వంగ, జఠర, కోశల, మూషిక, చేది, ఊర్ధ్వకర్ణ, మత్స్య, ఆంధ్ర, వింధ్యనివాసులు, విదర్భ, నారికేల, ధర్మద్వీప, ఐలిక, వ్యాఘ్రగ్రీవ, మహాగ్రీవ, త్రైపుర, శ్మశ్రుధారి, కైష్కింధ్య, హైమకూట, నిషధ, కటకస్థల, దశార్ణ, హారిక, నగ్న, నిషధ, కాకులాలక, పర్ణశబర ఈ దేశాల ప్రజలందరు కూర్మముయొక్క పూర్వదక్షిణపాదమందు అనగా కుడిపాదముయొక్క తూర్పుభాగమందు కలరు. ఆశ్లేష, పైత్ర్య, మొదటి ఫాల్గుని నక్షత్రాలు ఆ పూర్వదక్షిణపాదమును ఆశ్రయించి ఉన్నవి.

లంకా కాలాజినాశ్చైవ శైలికా నికటాస్తథా ॥20॥

మహేంద్రమలయాద్రౌ చ దర్దురే చ వసన్తి యే ।
కర్కోటకవనే యే చ భృగుకచ్ఛాః సకొంకణాః ॥21॥

సర్వాశ్చైవ తథాభీరా వేణ్యాస్తీరనివాసినః ।
అవన్తయో దాసపురాస్తథైవాకారిణో జనాః ॥22॥

మహారాష్ట్రా సకర్ణాటా గోనర్దాశ్చిత్రకూటకాః ।
చోలాః కౌలగిరాశ్చైవ క్రౌంచద్వీపజటాధరాః ॥23॥

కావేరీ ఋష్యమూకస్థా నాసిక్యాశ్చైవ యే జనాః ।
శంఖశుక్త్యాదివైదూర్యశైలప్రాంతచరాశ్చ యే ॥24॥

తథా వారిచరాః కోలాశ్చర్మపట్టనివాసినః ।
గణబాహ్యాః పరాః కృష్ణాద్వీపవాసనివాసినః ॥25॥

సూర్యాద్రౌ కుముదాద్రౌ చ వసన్తి తథా జనాః ।
రౌద్రస్వనాః సపిశికాస్తథా యే కర్మనాయకాః ॥26॥

దక్షిణాః కౌరుషా యే చ ఋషికాస్తాపసాశ్రమాః ।
ఋషభాః సింహలాశ్చైవ తథా కాంచీనివాసినః ॥27॥

త్రిలింగాః కుంజరదరీకచ్ఛవాసాశ్చ యే జనాః ।
తామ్రపర్ణీ తథా కుక్షిరితి కూర్మస్య దక్షిణః ॥28॥

పాల్గున్యశ్చోత్తరాహస్తశ్చిత్రా చర్క్షత్రయం ద్విజ ।
కూర్మస్య దక్షిణే కుక్షౌ బాహ్యపాదస్తథాపరమ్ ॥29॥

లంక, కాలాజిన, శైలిక, నికటదేశములందలి ప్రజలు మహేంద్ర, మలయాద్రి, దర్దురపర్వతాలయందు నివసించే ప్రజలు, కర్కోటకవనమందలి ప్రజలు, భృగుకచ్ఛ, కొంకణ, ఆభీరదేశములందరి ప్రజలు, వేణీనదీ తీరమందు నివసించే ప్రజలు, అవన్తి, దాసపుర, ఆకారి, మహారాష్ట్ర, కర్ణాట, గోనర్ద, చిత్రకూట, చోళ, కోలగిరి, క్రౌంచద్వీప, జటాధర, కావేరి, ఋష్యమూక, నాసిక దేశములందలి ప్రజలు, శంఖుశుక్తి మొ॥లగు వైడూర్యపర్వతప్రాంతాలలో నివసించే ప్రజలు, వారిచర, కోల, చర్మపట్ట దేశాలలో నివసించే ప్రజలు, గణబాహ్య, పర దేశాలలో నివసించే ప్రజలు, కృష్ణాద్వీపమందు నివసించే ప్రజలు, సూర్యాద్రి కుముదాద్రులయందు నివసించే ప్రజలు, రౌద్రస్వన, పిశిక, కర్మనాయక, దక్షిణదేశ గత కౌరుష,ఋషిక, తాపసాశ్రమ, ఋషభ, సింహల, కాంచి, త్రిలింగ, కుంజరదరి, తామ్రపర్ణి ఈ ప్రాంతాలలోని ప్రజలు వీరందరు కూర్మముయొక్క దక్షిణకుక్షియందు అనగా కడుపుయొక్క కుడిభాగమందు నెలకొనియున్నారు. ఓ బ్రాహ్మణుడా! ఉత్తరఫాల్గుని, హస్త, చిత్ర నక్షత్రములు కూర్మముయొక్క ఈ దక్షిణకుక్షిభాగమందు నెలకొనియున్నవి. ఇక కుడిపాదముయొక్క మరొకభాగము గురించి చెప్పెదను, వినుము. (15-19 శ్లోకాలలో కూర్మ పాదముయొక్క పూర్వదక్షిణ భాగమందుగల ప్రజలను గూర్చి చెప్పడం జరిగింది).

కాంబోజాః పహ్లవాశ్చైవ తథైవ వడవాముఖాః ।
తథా చ సింధుసౌవీరాః సానర్తా వనితాముఖాః ॥30॥

ద్రావణాస్సార్గిగాః శూద్రాః కర్ణప్రాధేయబర్బరాః ।
కిరాతాః పారదాః పాండ్యాస్తథా పారశవాః కలాః ॥31॥

ధూర్తకాః హైమగిరికాః సింధుకాలకవైరతాః ।
సౌరాష్ట్రా దరదాశ్చైవ ద్రావిడాశ్చ మహార్ణవాః ॥32॥

ఏతే జనపదాః పాదే స్థితా వై దక్షిణేఽపరే ।
స్వాత్యో విశాఖా మైత్రం చ నక్షత్రత్రయమేవ చ ॥33॥

కాంబోజ, పహ్లవ, వడవాముఖ, సింధు, సౌవీర, ఆనర్త, వనితాముఖ, ద్రావణ, సార్గిగ, శూద్ర, కర్ణప్రాధేయ, బర్బర, కిరాత, పారద, పాండ్య, పారవశవ, కల, ధూర్తక, హైమగిరిక, సింధు, కాలక, వైరత, సౌరాష్ట్ర, దరద, ద్రావిడ, మహార్ణవ ఈ దేశాల ప్రజలు కూర్మముయొక్క పశ్చిమదక్షిణపాదమందు అనగా కుడిపాదముయొక్క మరొక భాగమందు అనగా పశ్చిమభాగమందు నెలకొనియున్నారు. స్వాతి, విశాఖ, మైత్ర (అనూరాధ) నక్షత్రాలు ఈ భాగమందు నెలకొనియున్నవి.

మణిమేఘక్షురాద్రిశ్చ ఖంజయోఽస్తగిరిస్తథా ।
అపరాన్తికా నోహ్యాశ్చ శాన్తికా విప్రశస్తకాః ॥34॥

కొంకణాః పఞ్చనదకా వమనా హ్యవరాస్తథా ।
తారక్షురా హ్యంగతకాః శర్కరాః శాల్మవేశ్మకాః ॥35॥

గురుస్వరాః ఫాల్గునకా వేణుమత్యాం చ యే జనాః ।
తథా ఫల్గులుగా ఘోరా గురుహాశ్చ కలాస్తథా ॥36॥

ఏకేక్షణా వాజికేశా దీర్ఘగ్రీవాస్సచూలికాః ।
అశ్వకేశాస్తథా పుచ్ఛే జనాః కూర్మస్య సంస్థితాః ॥37॥

ఐన్ద్రం మూలం తథాషాఢానక్షత్రత్రయమేవ చ ।

మణిమేఘ, క్షురాద్రి, ఖంజయ, అస్తగిరి, అపరాన్తిక, నోహ్య, శాన్తిక, విప్రశస్తక, కొంకణ, పంచనదక, వమన, అవర, తారక్షుర, అంగతక, శర్కర, శాల్మవేశ్మక, గురుస్వర, ఫాల్గునక దేశాలలో నివసించే ప్రజలు, వేణుమతీ నదీతీరమందు నివసించే ప్రజలు, ఫల్గులుక, ఘోర, గురుహ, కల, ఏకేక్షణ, వాజికేశ, దీర్ఘగ్రీవ, చూలిక, అశ్వకేశ, ఈ ప్రాంతాల ప్రజలు వీరందరూ కూర్మముయొక్క తోకభాగమందు నెలకొనియున్నారు. ఐంద్ర (జ్యేష్ఠ), మూల, ఆషాఢ ఈ మూడు నక్షత్రాలు ఈ భాగమందు నెలకొనియున్నవి.

మాణ్డవ్యాశ్చణ్డఖారాశ్చ అశ్వకాలనదాస్తథా ॥38॥

కుశాతా లడహాశ్చైవ స్త్రీబాహ్యా బాలికాస్తథా ।
నృసింహా వేణుమత్యాం చ బలావస్థాస్తథాపరే ॥39॥

ధర్మబద్ధాస్తథోలూకా ఉరుకర్మస్థితా జనాః ।
తథా ఫల్గులకా ఘోరా ఘురలా హేమతారకాః ॥
ఏకేక్షణా వాజికోశా దీర్ఘపాదాస్తథైవ చ ।
వామే పరే జనాః పాదే స్థితాః కూర్మస్య భాగురే ॥40॥

ఆషాఢశ్రవణే జైవ ధనిష్ఠా యత్ర సంస్థితా ।

ఓ భాగురీ ! మాండవ్య, చండఖార, అశ్వకాలనద, కుశాత, లడహ, స్త్రీబాహ్య, బాలిక, నృసింహ దేశాలలోని ప్రజలు, వేణుమతీ నదీతీరమందలి ప్రజలు, బలావస్థ, ధర్మబద్ధ, ఉలూక, ఉరుకర్మ ప్రాంతాలలోని ప్రజలు, ఫల్గులక, ఘోర, ఘురల, హేమతారక, ఏకేక్షణ, వాజికోశ, దీర్ఘపాద దేశాలలోని ప్రజలు కూర్మముయొక్క ఎడమపాదమందు నెలకొనియున్నారు. ఆషాఢ, శ్రవణ, ధనిష్ఠ ఈ మూడు నక్షత్రాలు ఈ భాగమందు నెలకొనియున్నవి.

కైలాసో హిమవాంశ్చైవ ధనుష్మాన్వసుమాంస్తథా ॥41॥

క్రౌంచాః కురుబకాశ్చైవ క్షుద్రవీణాశ్చ యే జనాః ।
రసాలయాః సకైకేయా భోగప్రస్థాస్సయామునాః ॥42॥

అన్తర్ద్వీపాస్త్రిగర్తాశ్చ ఆగ్నీజ్యాః సార్దనా జనాః ।
తథైవాశ్వముఖాః ప్రాప్తాశ్చిబిడాః కేశధారిణః ॥43॥

దాసేరకా వాటధానాః శవధానాస్తథైవ చ ।
పుష్కలాధమకైరాతాస్తథా తక్షశిలాశ్రయాః ॥44॥

అంబష్ఠా మాలవా మద్రా వేణుకాః సవదన్తికాః ।
పింగలా గానకలహా హూణాః కోహలకాస్తథా ॥45॥

మాండవ్యా భూతియువకాః శాతకా హేమతారకాః ।
యశోమత్యాః సగాంధారాః ఖరసా గరరాశయః ॥46॥

యౌధేయా దాసమేయాశ్చ రాజన్యాః స్యామకాస్తథా ।
క్షేమధూర్తాశ్చ కూర్మస్య వామకుక్షిముపాశ్రితాః ॥47॥

వారుణం చాత్ర నక్షత్రం తద్వత్ప్రోష్ఠపదాద్వయమ్ ।

కైలాస, హిమవత్, ధనుష్మత్, వసుమత్, క్రౌంచ, కురుబక, క్షుద్రవీణ, రసాలయ, కైకేయ, భోగప్రస్థ, యామున, అంతర్ద్వీప, త్రిగర్త, ఆగ్నీజ్య, అర్దన, అశ్వముఖ, ప్రాప్త, చిబిడ, కేశధారి, దాసేరక, వాటధాన, శవధాన, పుష్కల, అధమ, కైరాత దేశాలలోని ప్రజలు, తక్షశిలయందలి ప్రజలు, అంబష్ఠ, మాలవ, మద్ర, వేణుక, వదన్తిక, పింగళ, గానకలహ, హూణ, కోహలక, మాండవ్య, భూతియువక, శాతక, హేమతారక, యశోమత్య, గాంధార, ఖరస, గరరాశి, యౌధేయ, దాసమేయ, రాజన్య, స్యామక, క్షేమధూర్త ఈ ప్రాంతాలలోని ప్రజలు కూర్మముయొక్క ఎడమ కుక్షిభాగమును ఆశ్రయించి ఉన్నారు. వారుణ (శతభిష), ప్రోష్ఠపదాద్వయ (పూర్వాభాద్ర, ఉత్తరాభాద్ర) నక్షత్రాలు ఈ భాగమును ఆశ్రయించి ఉన్నవి.

యేన కిన్నరరాజ్యం చ పశుపాలం సకీచకమ్ ॥48॥

కాశ్మీరకం తథా రాష్ట్రమభిసారజనస్తథా ।
దరదాస్త్వంగణాశ్చైవ కులటా వనరాష్ట్రకాః ॥49॥

సైరిష్టా బ్రహ్మపురకాస్తథైవ వనవాహ్యకాః ।
కిరాతకౌశికా నన్దా జనాః పహ్లవలోలనాః ॥50॥

దార్వా దామరకాశ్చైవ కురుటాశ్చాన్నదారకాః ।
ఏకపదాః ఖసా ఘోషాః స్వర్గభౌమానవద్యకాః ॥51॥

తథా సయవనా హిఙ్గాశ్చీరప్రావరణాశ్చ యే ।
త్రినేత్రాః పౌరవాశ్చైవ గంధర్వాశ్చ ద్విజోత్తమ ॥52॥

పూర్వోత్తరం కూర్మస్య పాదమేతే సమాశ్రితాః ।
రేవత్యశ్చాశ్విదైవత్యం యామ్యం చర్క్షమితి త్రయమ్ ॥53॥

తత్ర పాదే సమాఖ్యాతం పాకాయ మునిసత్తమ ।

ఓ బ్రాహ్మణశ్రేష్ఠుడా ! కిన్నరరాజ్యము, పశుపాల, కీచక, కాశ్మీర, అభిసార, దరణ, అంగణ, కులట, వనరాష్ట్రక, సైరిష్ఠ, బ్రహ్మపురక, వనవాహ్యక, కిరాత, కౌశిక, నంద, పహ్లవ, లోలన, దార్వ, దామరక, కురుట, అన్నదారక, ఏకపాద, ఖశ, ఘోష, స్వర్గ, భౌమ, అనవద్య, యవన, హింగ, చీరప్రావరణ, త్రినేత్ర, పౌరవ, గంధర్వ ఈ దేశములలో నివసించే ప్రజలు కూర్మపాదముయొక్క పూర్వోత్తరభాగమును అనగా ఉత్తరభాగముయొక్క తూర్పుభాగమును ఆశ్రయించియున్నారు. రేవతి, అశ్విని, యామ్య (భరణి) నక్షత్రాలు ఈ పాదభాగమును ఆశ్రయించి ఉన్నవి. అవి ప్రజలు తాము చేసుకున్న కర్మల ఫలములనిచ్చును.

దేశేష్వేతేషు చైతాని నక్షత్రాణ్యపి వై ద్విజ ॥54॥

ఏతత్పీడా అమీ దేశాః పీడ్యన్తే యే క్రమోదితాః ।
యాన్తి చాభ్యుదయం విప్ర గ్రహైః సమ్యగవస్థితైః ॥55॥

యస్యర్క్షస్య పతిర్యో వై గ్రహస్తద్భావతో భయమ్ ।
తద్దేశస్య మునిశ్రేష్ఠ తదుత్కర్షే శుభాగమః ॥56॥

ఓ బ్రాహ్మణుడా ! కూర్మమందు అవస్థితములైన దేశాలు, ఆ దేశాలలో అవస్థితములైన నక్షత్రాలు ఏవో అవి చెప్పబడినవి. ఆ నక్షత్రాలు లేదా వానికి అధిపతులైన గ్రహాలు పీడింపబడినప్పుడు అనగా ఉండవలసిన స్థానమందు ఉండనప్పుడు ఈ దేశాలు (లేదా ఈ దేశాలలోని ప్రజలు) కూడా పీడింపబడుచున్నవి. ఆ గ్రహాలు బాగుగా అనగా ఉండవలసిన స్థానమందు ఉన్నప్పుడు ఆ దేశాలు అభ్యుదయమును పొందుచున్నవి. అందువలన ఓ మునిశ్రేష్ఠుడా! ఆ గ్రహాలవల్లనే భయము, వాటికి ఉత్కర్ష కలిగినప్పుడు శుభము ప్రజలకు కలుగుచున్నవి.

ప్రత్యేకం దేశసామాన్యం నక్షత్రగ్రహసంభవమ్ ।
భయం లోకస్య భవతి శోభనం వా ద్విజోత్తమ ॥57॥

స్వర్క్షైరశోభనైర్జన్తోః సామాన్యమితి భీతిదమ్ ।
గ్రహైర్భవతి పీడోత్థమల్పాయాసమశోభనమ్ ॥58॥

ఓ బ్రాహ్మణుడా ! కూర్మమందు అవస్థితములైన దేశాలు ఒకే విధమైనవి అయినప్పటికీ అచ్చట అవస్థితములైన నక్షత్రగ్రహాల గతుల వల్లనే ఆయా ప్రజలకు భయము లేదా మంగళము కలుగుచున్నవి. అశోభనములైన

నక్షత్రగ్రహాలవల్లనే ప్రజలకు భీతి కలుగుచున్నది. అట్టి అనుకూలముగా లేని గ్రహాలవల్లనే లేదా అవి పీడింపబడుటవల్లనే కొద్దిపాటి కారణము చేతనే ప్రజలకు అమంగళము సంభవించుచున్నది.

తథైవ శోభనః పాకో దుఃస్థితైశ్చ తథా గ్రహైః ।
అల్పోపకారాయ నృణాం దేశజ్ఞైరుదితో బుధైః ॥59॥

ద్రవ్యే గోష్ఠేఽథ భృత్యేషు సుహృత్సు తనయేషు వా ।
భార్యాయాం చ గ్రహే దుఃస్థే భయం పుణ్యవతాం నృణామ్ ॥60॥

ఆత్మన్యథాల్పపుణ్యానాం సర్వత్రైవాతిపాపినామ్ ।
నైకత్రాపి హ్యపాపానాం భయమస్తి కదాచన ॥61॥

అట్లే గ్రహాలు అనుకూలముగా లేనప్పుడు కూడా అట్టి మానవులకు ఆయా కర్మలవలన సత్ఫలితాలు లభించుట కొరకు, కొద్దిపాటి ఉపకారము సంభవించుట కొరకు గ్రహాల గమనము నెరిగిన పండితులు గ్రహశాంతులను గూర్చి చెప్పుచున్నారు. గ్రహాలు ప్రతికూలంగా ఉన్నప్పుడు పుణ్యవంతులకు కూడా ద్రవ్యం, గోష్ఠం, భృత్యులు, స్నేహితులు, సంతానం, భార్య వీరి గురించి భయం కలుగుచున్నది. ఇక అల్పపుణ్యము కలిగి అధికపాపము కలిగిన వారికి తమయందే తమకు భయము కలుగుచున్నది. పాపమే లేని వారికి తమయందు గాని, తమకు చెందిన వారియందు గాని భయమెన్నడూ కలుగుట లేదు.

దిగ్దేశజనసామాన్యం నృపసామాన్యమాత్మజమ్ ।
నక్షత్రగ్రహసామాన్యం నరో భుఙ్క్తే శుభాశుభమ్ ॥62॥

పరస్పరాభిరక్షా చ గ్రహదౌఃస్థ్యేన జాయతే ।
ఏతేభ్య ఏవ విప్రేన్ద్ర శుభహానిస్తథాఽశుభైః ॥63॥

మానవుడు శుభాశుభములను అనుభవించుట ఆయా దిగ్దేశములు, ఆయా జనులు, ఆయా రాజులు, ఆయా నక్షత్రగ్రహాలు వీటివల్ల కలుగును. లేదా తనవల్లనే గాని సంభవించును. తనను తాను రక్షించుకొనే సామర్థ్యము లేక ఒకరినొకరు రక్షించుకొనే పరిస్థితి కూడా ఈ గ్రహాల దుఃస్థితివల్లనే కలుగును. కావున ఓ బ్రాహ్మణశ్రేష్ఠుడా ! నేను చెప్పిన ఈ కారణములవల్లనే శుభము నశించుట, అశుభములు సంభవించుట జరుగుచుండును.

యదేతత్కౌర్మసంస్థానం నక్షత్రేషు మయోదితమ్ ।
ఏతత్తు దేశసామాన్యమశుభం శుభమేవ చ ॥64॥

తస్మాద్విజ్ఞాయ దేశర్క్షం గహప్రీడాం తథాత్మనః ।
కుర్వీత శాన్తిం మేధావీ లోకవాదాంశ్చ సత్తమ ॥65॥

ఓ బ్రాహ్మణశ్రేష్ఠుడా ! ఆయా దేశాలతో కూడుకొన్న నక్షత్రాలయందు కూర్మభగవానుని సంస్థానమును గూర్చి నీకు నేను చెప్పితిని. అట్టి దేశసామాన్యమే మనుష్యులకు శుభము మరియు అశుభములను కలుగచేయుచున్నది.

అందువలన దేశనక్షత్రములను బాగుగా తెలుసుకొని బుద్ధిమంతుడు ఆ యా గ్రహశాంతులను చేసుకొనవలెను. లోకవాదములను కూడా పరిశీలించవలెను. (లోకవాదములనగా తరువాతి శ్లోకంలో చెప్పబడుచున్నది).

ఆకాశాద్దేవతానాం చ దైత్యాదీనాం చ దౌర్హృదాః ।
పృథ్వ్యాం పతన్తి తే లోకే లోకవాదా ఇతి శ్రుతాః ॥66॥

ఆకాశమునుండి దేవతలు, రాక్షసాదులయొక్క శత్రువులు ఎవరైతే ఈ భూమిపై పడుచున్నారో వారే లోకవాదులని చెప్పబడినారు.

తాం తథైవ బుధః కుర్యాల్లోకవాదాన్న హాపయేత్ ।
తేషాం తత్కరణాన్నృణాం యుక్తో దుష్టాగమక్షయః ॥67॥

అట్టి లోకవాదుల బారినుండి తప్పించుకొనుటకు మానవులు ఆయా గ్రహశాంతులను చేసుకొనవలెను. లోకవాదులను నిర్లక్ష్యము లేదా అశ్రద్ధ చేయరాదు. వారికి అట్లు శాంతులను జరిపించినందువలన మానవులకు దుష్టవిషయముల నాశము కలుగును.

శుభోదయం ప్రహాణిం చ పాపానాం ద్విజసత్తమ ।
ప్రజ్ఞాహానిం ప్రకుర్యుస్తే ద్రవ్యాదీనాం చ కుర్వతే ॥68॥

తస్మాచ్ఛాన్తిపరః ప్రాజ్ఞో లోకవాదరతస్తథా ।
లోకవాదాంశ్చ శాంతీశ్చ గ్రహపీడాసు కారయేత్ ॥69॥

ఓ బ్రాహ్మణశ్రేష్ఠుడా ! ఆ లోకవాదుల వల్లనే శుభము కలుగుట, పాపములు నశించుట ప్రభావితములగుచున్నవి. ఆయా వస్తువులను నిర్మించువాని బుద్ధిని ఈ లోకవాదులు నశింపజేయును. అందువలన శాంతిని కోరుకొను బుద్ధిమంతుడు గ్రహపీడలను నివారించుకొనుటకు లోకవాదులకు, ఆయా గ్రహాలకు శాంతిని తప్పక చేయవలెను.

అద్రోహోనుపవాసాంశ్చ శస్తం దేవాదివన్దనమ్ ।
జపో హోమస్తథా దానం స్నానం క్రోధాదివర్జనమ్ ॥70॥

ఇంకను గ్రహపీడా నివారణార్థమై ఎవరికినీ ద్రోహము తలపెట్టరాదు. ఉపవాసములను ఆచరించవలెను. దేవతలకు నమస్కారము చేయవలెను. జపము, హోమము, దానము, స్నానము వీటన్నింటినీ కామక్రోధాదులు లేకుండా ఆచరించవలెను.

అద్రోహం సర్వభూతేషు మైత్రీం కుర్యాచ్చ పండితః ।
వర్జయేదసతీం వాచమతివాదాంస్తథైవ చ ॥71॥

గ్రహపూజాం చ కుర్వీత సర్వపీడాసు మానవః ।
ఏవం శామ్యన్త్యశేషాణి ఘోరాణి ద్విజసత్తమ ॥72॥

ప్రయతానాం మనుష్యాణాం గ్రహర్క్షోత్థాన్యశేషతః ।

జ్ఞాని అయినవాడు సమస్తప్రాణులయందు ద్రోహబుద్ధి లేకుండా మైత్రిని ఆచరించవలెను. అసత్యవాక్కులను విడిచిపెట్టవలెను. అతివాదములను అనగా వివాదములను, అప్రియకఠోర వాక్కులను విడిచిపెట్టవలెను. ఆయా లోకవాదపీడలు, గ్రహపీడలు సంభవించినప్పుడు మానవుడు ఆయా గ్రహములకు పూజను ఆచరించవలెను. ఓ బ్రాహ్మణశ్రేష్ఠుడా ! ఈ విధముగా ఆచరించుటచే లెక్కలేనన్ని భయంకరమైన పీడలు దూరమైపోవును. ఇంద్రియనిగ్రహము కలిగిన మనుష్యులకు గ్రహములు, నక్షత్రాలవల్ల పీడలన్నియు నశించును.

ఏష కూర్మో మయా ఖ్యాతో భారతే భగవాన్విభుః ॥73॥

నారాయణో హ్యచిన్త్యాత్మా యత్ర సర్వం ప్రతిష్ఠితమ్ ।
అత్ర దేవాః స్థితాః సర్వే ప్రతినక్షత్రసంశ్రయాః ॥74॥

భారతవర్షమందుగల భగవత్స్వరూపుడూ, సర్వవ్యాపకుడూ అగు కూర్మనారాయణుడు నాచేత వివరంగా చెప్పబడినాడు. ఈ కూర్మనారాయణుడు మన ఆలోచనలకు అందనివాడు, అతనియందే సమస్తజగత్తు ఆశ్రితమైయున్నది. ఆయా నక్షత్రాలకు ఆశ్రయమైన దేశాలను ఆశ్రయించుకొని సమస్తదేవతలు ఆ కూర్మమందే నెలకొనియున్నారు.

తథా మధ్యే హుతవహః పృథ్వీ సోమశ్చ వై ద్విజ ।
మేషాదయస్త్రయో మధ్యే ముఖే ద్వౌ మిథునాదికౌ ॥75॥

ప్రాగ్దక్షిణే తథా పాదే కర్కిసింహౌ వ్యవస్థితౌ ।
సింహకన్యాతులాశ్చైవ కుక్షౌ రాశిత్రయం స్థితమ్ ॥76॥

తులాథ వృశ్చికశ్చోభౌ పాదే దక్షిణపశ్చిమే ।
పృష్ఠే చ వృశ్చికేనైవ సహ ధన్వీ వ్యవస్థితః ॥77॥

వాయవ్యే చాస్య వై పాదే ధనుర్గ్రాహాదికం త్రయమ్ ।
కుంభమీనౌ తథైవాస్య ఉత్తరాం కుక్షిమాశ్రితౌ ॥78॥

మీనమేషౌ ద్విజశ్రేష్ఠ పాదే పూర్వోత్తరే స్థితౌ ।

ఓ బ్రాహ్మణుడా ! నారాయణుడగు ఆ కూర్మముయొక్క మధ్యభాగమందు అగ్ని, భూమి, చంద్రుడు నెలకొనియున్నారు. మేషము మొ॥లగు మూడు రాశులు వాని మధ్యభాగమందు, మిథునము మొ॥లగు రెండు రాశులు వాని ముఖమందు నెలకొనియున్నవి. కూర్మపాదముయొక్క దక్షిణపు తూర్పుభాగమందు కర్కాటకసింహరాశులు ఉన్నవి. కూర్మముయొక్క కుక్షి (కడుపు) భాగమందు సింహము, కన్య, తుల అను మూడు రాశులు ఉన్నవి. కూర్మపాదముయొక్క దక్షిణపు పశ్చిమభాగమందు తుల, వృశ్చికరాశులు ఉన్నవి. కూర్మముయొక్క వీపుభాగమందు వృశ్చికము, ధనుస్సు రాశులు ఉన్నవి. కూర్మపాదముయొక్క ఉత్తరపుపశ్చిమభాగమందు ధనుస్సు మరియు మకరాది

రాశిత్రయము ఉన్నవి. కుంభమీనరాశులు కూర్మముయొక్క కుక్షియొక్క ఉత్తరభాగమందు ఉన్నవి. ఓ బ్రాహ్మణశ్రేష్ఠుడా! కూర్మముయొక్క ఉత్తరపు తూర్పుభాగమందు మీనమేషములను రెండు రాశులు ఉన్నవి.

కూర్మే దేశాస్తథర్క్షాణి దేశేష్వేతేషు వై ద్విజ ॥79॥

రాశయశ్చ తథర్క్షేషు గ్రహరాశిష్వవస్థితాః ।
తస్మాద్గ్రహర్క్షపీడాసు దేశపీడాం వినిర్దిశేత్ ॥80॥

తత్ర స్నాత్వా ప్రకుర్వీత దానహోమాదికం విధిమ్ ।
స ఏష వైష్ణవః పాదో బ్రహ్మన్మధ్యే గ్రహస్య యః ॥81॥

(నారాయణాఖ్యోఽచిన్త్యాత్మా కారణం జగతః ప్రభుః ।)

ఓ బ్రాహ్మణుడా ! కూర్మమందు అవస్థితములైన దేశాలు, ఆ దేశాలలో అవస్థితములైన నక్షత్రాలు, నక్షత్రాలలో అవస్థితములైన రాశులు, రాశులలో అవస్థితములైన గ్రహాలు ఇవి యన్నియు నాచేత వివరింపబడినవి. అందువలన ఆయా గ్రహములు, నక్షత్రాలు పీడింపబడినపుడు అనగా అవి ఉండవలసిన స్థానాలలో ఉండనప్పుడు ఆయాదేశాలకు పీడ అనగా కష్టము సంభవించినదని గ్రహనక్షత్రాదిజ్ఞానము కలిగినవాడు తెలుపవలెను. అట్టి పరిస్థితులలో స్నానమాచరించి విధ్యుక్తప్రకారము దానహోమాదులను నిర్వర్తించవలెను. ఓ బ్రహ్మస్వరూపుడా ! ఆయా గ్రహాల మధ్యభాగమందు అవస్థితమైన లేదా ఆయా గ్రహాలతో ఆవరింపబడిన ఆ కూర్మపాదమే విష్ణుపాదముగా తెలియవలెను.

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే భారతీయకూర్మనివేశో నామ పఞ్చపఞ్చాశత్తమోఽధ్యాయః ॥55॥

శ్రీ మార్కండేయ మహాపురాణమందు భారతీయకూర్మనివేశమను ఏభై అయిదవ అధ్యాయం సమాప్తం.



షట్పఞ్చాశత్తమోఽధ్యాయః – ఏభైఆరవ అధ్యాయం
ఉత్తరకురుకథనమ్ – ఉత్తరకురుకథనం

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

ఏవం తు భారతం వర్షం యథావత్కథితం మునే ।
కృతం త్రేతా ద్వాపరం చ తథా తిష్యం చతుష్టయమ్ ॥1॥

ఓ మునీ ! ఈ భారతవర్షమునంతటినీ ఉన్నది ఉన్నట్లుగా వర్ణించితిని. కృత, త్రేతా, ద్వాపర కలియుగాలు నాలుగు ఈ భారతవర్షమందు కలవు.

అత్రైవైతద్యుగానాం తు చాతుర్వర్ణ్యం చ వై ద్విజ ।
చత్వారి త్రీణి ద్వే చైవ తథైకం చ శరచ్ఛతమ్ ॥2॥

జీవన్త్యత్ర నరా బ్రహ్మన్ కృతత్రేతాదిషు క్రమాత్ ।

ఓ బ్రాహ్మణుడా ! ఈ భారతవర్షమందే బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రులను నాలుగు వర్ణముల భేదమున్నది. ఇచ్చట కృతత్రేతాద్వాపరకలియుగాలలో క్రమముగా నాలుగువందలు, మూడువందలు, రెండువందలు, ఒకవంద సంవత్సరాలు జీవింతురు.

దేవకూటస్య పూర్వస్య శైలేన్ద్రస్య మహాత్మనః ॥3॥
పూర్వేణ యత్ స్థితం వర్షం భద్రాశ్వం తన్నిబోధ మే ।

దేవకూటమను గొప్ప పర్వతశ్రేష్ఠము తూర్పుదిక్కునందు గలదు. ఆ పర్వతానికి తూర్పుదిక్కునందు భద్రాశ్వమను వర్షము గలదు. ఇప్పుడు ఆ వర్షమును గురించి చెప్పెదను, వినుము.

శ్వేతపర్ణశ్చ నీలశ్చ శైవాలశ్చాచలోత్తమః ॥4॥

కౌరంజః పర్ణశాలాగ్రః పఞ్చైతే తు కులాచలాః ।
తేషాం ప్రసూతిరన్యే యే బహవః క్షుద్రపర్వతాః ॥5॥

తైర్విశిష్టా జనపదా నానారూపాస్సహస్రశః ।
తతః కుముదసంకాశాః శుద్ధసానుసుమంగలాః ॥6॥

ఇత్యేవమాదయోఽన్యేఽపి శతశోఽథ సహస్రశః ।

శ్వేతపర్ణము, నీలము, పర్వతశ్రేష్ఠమైన శైవాలము, కౌరంజము, పర్ణశాలాగ్రము ఈ అయిదు ఈ భద్రాశ్వవర్షమందు గల కులపర్వతములు. మరియు ఆ కులపర్వతాలనుండి ఉత్పన్నమైన అనేక చిన్న చిన్న పర్వతాలు కూడా ఈ వర్షమందు ఉన్నవి. వాటితో కూడుకొన్న అనేకవిధములైన జనపదములు (గ్రామాలు) కూడా వేలకొలదీ ఉన్నవి. అవియన్నియు కలువలవలే ఉండి, పవిత్రమైన పర్వతప్రాంతాలు కలిగియున్నవి. ఈ విధముగా ఇంకనూ వందలకొలదీ, వేలకొలదీ వేరే జనపదాలు కూడా ఈ భారతవర్షమందు కలవు.

సీతా శంఖావతీ భద్రా చక్రవర్త్రాదికాస్తథా ॥7॥

నద్యోఽత్ర బహ్వ్యో విస్తీర్ణాః శీతతోయౌఘవాహికాః ।

ఈ భద్రాశ్వవర్షమందు సీత, శంఖవతి, భద్ర, చక్రవర్త మొ॥లగు ఎన్నో నదులు శీతలజలప్రవాహములు గలవై విస్తరించి ప్రవహించుచున్నవి.

అత్ర వర్షే నరాః శంఖశుద్ధహేమసమప్రభాః ॥8॥

దివ్యసంగమినః పుణ్యా దశవర్షశతాయుషః ।
అధమోత్తమం న తేష్వస్తి సర్వే తే సమదర్శనాః ॥9॥

తితిక్షాదిభిరష్టాభిః ప్రకృత్యాత్మగుణైర్యుతాః ।

ఈ భద్రాశ్వవర్షమందు మనుష్యులు శంఖమువలే పరిశుద్ధులై, బంగారముతో సమానమైన కాంతిగలవారై, దివ్యపురుషులతో సాంగత్యము గలవారై, పుణ్యశీలురై, వేయిసంవత్సరాలు జీవించువారై ఉండిరి. వారిలో ఉత్తమాధమభేదము లేదు. వారందరూ ఒకేవిధమైన దర్శనము (ప్రవృత్తి) గలవారు మరియు తితిక్ష మొ॥లగు ఎనిమిదివిధములైన స్వభావసిద్ధములై ఆత్మగుణములతో కూడుకొన్నవారు.

తత్రాప్యశ్వశిరా దేవశ్చతుర్బాహుర్జనార్దనః ॥10॥

శిరోహృదయమేఢ్రాంఘ్రిహస్తైశ్చాక్షిత్రయాన్వితః ।
తస్యాప్యథైవం విషయా విజ్ఞేయా జగతః ప్రభోః ॥11॥

ఆ భద్రాశ్వవర్షమందు గుర్రముయొక్క శిరస్సుగలవాడు, నాలుగు భుజములు గలవాడు భగవత్స్వరూపుడగు నారాయణుడు గలడు. అతడు తల, హృదయము, పురుషచిహ్నములు, పాదములు, చేతులు, మూడుకన్నులు వీటితో కూడుకొనియున్నాడు. జగత్ప్రభువగు ఆ హయగ్రీవుడు అన్ని విషయములను ఎరిగినవాడు.

కేతుమాలమతో వర్షం నిబోధ మమ పశ్చిమమ్ ।
విశాలః కంబలః కృష్ణో జయన్తో హరిపర్వతః ॥12॥

విశోకో వర్ధమానశ్చ సప్తైతే కులపర్వతాః ।
అన్యే సహస్రశః శైలా యేషు లోకగణః స్థితః ॥13॥

ఇటుపైన పశ్చిమదిగ్భాగమందున్న కేతుమాల వర్షమును గూర్చి చెప్పెదను, తెలుసుకొనుము. విశాలము, కంబలము, కృష్ణము, జయన్తము, హరిపర్వతము, విశేకము, వర్ధమానము ఈ ఏడు ఈ వర్షమందున్న కులపర్వతములు. ఇవిగాక వేలకొలదీ వేరే పర్వతాలు కూడా ఉన్నవి. అచ్చట అనేకమంది ప్రజలు నివసించుచున్నారు.

మౌలయస్తే మహాకాయాః శాకపోతకరంభకాః ।
అచ్చులప్రముఖాశ్చాపి వసన్తి శతశో జనాః ॥14॥

యే పిబన్తి మహానద్యో వంక్షుశ్యామాం స్వకంబలామ్ ।
అమోఘాం కామినీం శ్యామాం తథైవాన్యాస్సహస్రశః ॥15॥

వందలకొలదీ ఆ ప్రజలు మౌలి, మహాకాయ, శాకపోత, కరంభక, అచ్చుల మొ॥ పేర్లతో ప్రసిద్ధులై చెప్పబడిన ఆ పర్వతప్రాంతాలలో నివసించుచున్నారు. వంక్షుశ్యామ, స్వకంబల, అమోఘ, కామిని, శ్యామ అను మహానదులే కాక ఇంకనూ వేలకొలదీ నదులు ఆ పర్వతప్రాంతాలలో ప్రవహించుచున్నవి. ఆ చెప్పబడిన ప్రజలు ఈ మహానదుల జలమును త్రాగుచున్నారు.

అత్రాప్యాయుః సమం పూర్వైరత్రాపి భగవాన్ హరిః ।
వరాహరూపీ పాదాస్యహృత్పృష్ఠే పార్శ్వతస్తథా ॥16॥

ముఖే నాసాదతశ్చైవ కంఠతః పుచ్ఛతస్తథా ।
త్రినక్షత్రయుతే దేశే నక్షత్రాణి యుతాని చ ॥
ఇత్యేతత్కేతుమాలం తే కథితం మునిసత్తమ ॥17॥

ఈ కేతుమాలవర్షమందు కూడా ప్రజలు భద్రాశ్వవర్షమందలి ప్రజలవలే ఆయుర్దాయము కలిగి జీవించుచున్నారు. ఈ వర్షమందు భగవత్స్వరూపుడగు శ్రీహరి వరాహరూపమును ధరించి వరాహమువలే పాదములు, ముఖము, హృదయము, వెనుకభాగము ప్రక్కభాగములు, ముఖము, ముక్కు, దంతములు, కంఠము తోక అను అవయవములను ధరించియున్నాడు. మూడు నక్షత్రాలు కలిగిన ఈ దేశము నక్షత్రాలతో కూడ ప్రకాశించుచున్నది. ఓ మునిశ్రేష్ఠుడా ! ఈ విధముగా నీకు కేతుమాలవర్ణమును గూర్చి నేను చెప్పితిని.

అతఃపరం కురూన్వక్ష్యే నిబోధేహ మమోత్తరాన్ ।
తత్ర వృక్షా మధుఫలా నిత్యపుష్పఫలోపగాః ॥18॥

వస్త్రాణి చ ప్రసూయన్తే ఫలేష్వాభరణాని చ ।
సర్వకామప్రదాస్తే హి సర్వకాలఫలప్రదాః ॥19॥

భూమిర్మణిమయీ వాయుః సుగంధః సర్వదా సుఖః ।
జాయన్తే మానవాస్తత్ర దేవలోకపరిచ్యుతాః ॥20॥

ఇటుపైన ఉత్తరకురుదేశముయొక్క వృత్తాంతమును చెప్పెదను, తెలుసుకొనుము. అచ్చట వృక్షములు మధురమైన ఫలములు కలిగి ఎల్లవేళలా పుష్పఫలములతో నిండియుండును. అవి వస్త్రములను ఉత్పన్నము చేయును. ఫలములందు ఆభరణములను పొదిగి యుండును. ఆ వృక్షములు సమస్త కోరికలను సిద్ధింపచేయును, ఎల్లవేళలా ఫలములనిచ్చును. అచ్చటి భూమి మణులతో నిండియుండును. వాయువు సుగంధభరితమై సుఖకరముగా ఉండును. తాము చేసుకొన్న పుణ్యఫలము పూర్తి అయిన దేవలోకమునుండి జారినవారు ఆ దేశమందు మానవులుగా జన్మింతురు.

మిథునాని ప్రసూయన్తే సమకాలస్థితాని వై ।
అన్యోన్యమనురక్తాని చక్రవాకోపమాని చ ॥21॥

చతుర్దశ సహస్రాణి తేషాం సార్ధాని వై స్థితిః ।

ఆ దేశమందు జన్మించిన మానవులు భార్యాభర్తలుగా జంటలుగా జన్మింతురు. వారు ఒకే కాలమందు ఉన్నట్టివారు. చక్రవాకములవలే పరస్పరము ప్రీతి కలిగి ఉందురు. వారు పదునాలుగువేల అయిదువందల సంవత్సరములు జీవింతురు.

చంద్రకాన్తశ్చ శైలేన్ద్రః సూర్యకాన్తస్తథాపరః ॥22॥

తస్మిన్ కులాచలే వర్షే తన్మధ్యే చ మహానదీ ।
భద్రసోమా ప్రయాత్యుర్వ్యాం పుణ్యామలజలౌఘినీ ॥23॥

పర్వతశ్రేష్ఠమైన చంద్రకాంతము, మరొక పర్వతము సూర్యకాన్తము ఈ రెండు కులపర్వతాలు కలిగిన ఆ ఉత్తరకురుదేశమందు ఉన్నవి. ఆ దేశమందలి మధ్యభాగమందు భద్రసోమయను మహానది పుణ్యస్వచ్ఛజలప్రవాహములతో భూప్రాంతమందు ప్రవహించుచున్నది.

సహస్రశస్తథైవాన్యా నద్యో వర్షేఽపి చోత్తరే ।
తథాన్యాః క్షీరవాహిన్యో ఘృతవాహిన్య ఏవ చ ॥24॥

దధ్నో హ్రదాస్తథా తత్ర తథాన్యే చానుపర్వతాః ।
అమృతాస్వాదకల్పాని ఫలాని వివిధాని చ ॥25॥

వనేషు తేషు రమ్యాణి శతశోఽథ సహస్రశః ।

అట్లే వేలకొలదీ ఇతర నదులు కూడా ఉత్తరకురుప్రాంతమందున్నవి. అట్లే కొన్ని పాలను ప్రవహింపచేసే నదులు, నెయ్యిని ప్రవహింపచేసే నదులు, పెరుగును ప్రవహింపచేసే నదులు కూడా అచ్చట ఉన్నవి. పర్వతాలను అనుసరించి ప్రవహించే నదులు కూడా అచ్చట ఉన్నవి. అమృతము వంటి అనేక విధములైన వందలకొలదీ, వేలకొలదీ ఫలములు రమణీయములైన అచ్చటి వనములలో ఉన్నవి.

తత్రాపి భగవాన్విష్ణుః ప్రాక్ఛిరా మత్స్యరూపవాన్ ॥26॥

విభక్తో నవధా విప్ర నక్షత్రాణాం త్రయం త్రయమ్ ।
దేశాస్తత్రాపి నవధా విభక్తా మునిసత్తమ ॥27॥

చన్ద్రద్వీపః సముద్రే చ భద్రద్వీపస్తథాపరః ।
తత్రాపి పుణ్యో విఖ్యాతః సముద్రాన్తర్మహామునే ॥28॥

ఇత్యేతత్కథితం బ్రహ్మన్ కురువర్షం మయోత్తరమ్ ।
శృణు కింపురుషాదీని వర్షాణి గదతో మమ ॥29॥

ఆ ఉత్తరకురువర్షమందు భగవంతుడగు విష్ణుమూర్తి తూర్పువైపు తలను ఉంచి చేపరూపమును ధరించి ఉండెను. బ్రాహ్మణుడా ! అచ్చట నక్షత్రములు మూడు మూడుగా మొత్తం తొమ్మిది విధములుగా విభజింపబడినవి. ఓ మునిశ్రేష్ఠుడా! అచ్చటి దేశములు కూడా తొమ్మిది విధములుగా విభజింపబడినవి. ఓ మహాముని! సముద్రమధ్యభాగమందు చంద్రద్వీపము, భద్రద్వీపము, పుణ్యద్వీపములు ఉన్నవి. ఓ బ్రహ్మస్వరూపుడా! ఈ విధముగా నాచేత ఉత్తరకురువర్షము వర్ణించి చెప్పబడినది. ఇటుపైన కింపురుషము మొ॥లగు వర్షములను గూర్చి చెప్పెదము, వినుము.

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే ఉత్తరకురుకథనం నామ షట్పంచాశత్తమోఽధ్యాయః ॥56॥

శ్రీ మార్కండేయ మహాపురాణమందలి ఉత్తరకురుకథనమను ఏభైఆరవ అధ్యాయం సమాప్తం.



సప్తపఞ్చాశత్తమోఽధ్యాయః - ఏభైఏడవ అధ్యాయం
భువనకోశవర్ణనమ్ - భువనకోశవర్ణనం

మార్కండేయ ఉవాచ - మార్కండేయుడు చెప్పాడు.

యత్తు కింపురుషం వర్షం తత్ప్రవక్ష్యామ్యహం ద్విజ ।
తత్రాయుర్దశసాహస్రం పురుషాణాం వపుష్మతామ్ ॥1॥

అనామయాద్యశోకాశ్చ నరా యత్ర తథా స్త్రియః ।
ప్లక్షః ఖణ్డశ్చ యత్రోక్తః సుమహాన్నందనోపమః ॥2॥

తస్య తే వై ఫలరసం పిబన్తః పురుషాస్సదా ।
స్థిరయౌవననిష్పన్నాః స్త్రియశ్చోత్పలగన్ధికాః ॥3॥

ఓ బ్రాహ్మణుడా ! కింపురుషమను వర్షమును గూర్చి చెప్పెదను, వినుము. ఆ దేశములో శరీరధారులగు పురుషుల ఆయుర్దాయము పదివేల సంవత్సరాలు. అచ్చట స్త్రీపురుషులందరు ఎట్టి రోగములుగాని ఎట్టి దుఃఖములు గాని లేనివారు. అచ్చట నందనవనంలో సమానమైన ప్లక్షఖండమను గొప్ప వనమొకటి కలదు. అచ్చటి వృక్షముల పండ్లరసమును త్రాగుచు పురుషులు నిత్యయౌవనము కలిగియున్నారు. స్త్రీలు పద్మముతో సమానమైన సుగంధము కలిగియున్నారు.

అతఃపరం కింపురుషాద్ధరివర్షం ప్రచక్షతే ।
మహారజతసంకాశా జాయన్తే తత్ర మానవాః ॥4॥

దేవలోకచ్యుతాస్సర్వే దేవరూపాశ్చ సర్వశః ।
హరివర్షే నరాస్సర్వే పిబన్తీక్షురసం శుభమ్ ॥5॥

న జరా బాధతే తత్ర న జీర్యన్తే చ కర్హిచిత్ ।
తావన్తమేవ తే కాలం జీవన్త్యథ నిరామయాః ॥6॥

ఇటుపైన కింపురుషవర్షవర్ణనము తర్వాత హరివర్షము గురించి చెప్పబడుచున్నది. ఈ దేశమందు మానవులు గొప్ప వెండితో సమానమైన రంగు కలిగియుందురు. దేవలోకమునుండి భ్రష్టులైనవారు ఈ హరివర్షమందు జన్మించి అన్నివిధముల దేవరూపులై ఉందురు. ఈ హరివర్షమందు మానవులందరు మంగళకరమైన చెరుకురసమును త్రాగుచున్నారు. అచ్చట ముసలితనము ఎవరినీ బాధించదు. ఎవ్వరూ కూడా వార్ధక్యముతో బాధపడరు. జీవించినంతకాలం ఎట్టి రోగములు లేక జీవింతురు.

మేరువర్షం మయా ప్రోక్తం మధ్యమం యదిలావృతమ్ ।
న తత్ర సూర్యస్తపతి న తే జీర్యన్తి మానవాః ॥7॥

లభన్తే నాఽఽత్మలాభం చ రశ్మయశ్చంద్రసూర్యయోః ।
నక్షత్రాణాం గ్రహాణాం చ మేరోస్తత్ర పరా ద్యుతిః ॥8॥

వర్షములన్నింటిలో మధ్యభాగమందున్న వర్షము ఇలావృతమను మేరువర్షమును గూర్చి నీకు నేను చెప్పితిని. అచ్చట సూర్యుడు ప్రకాశించడు. అచ్చటి మానవులు వార్ధక్యము లేక యౌవనము కలిగియుందురు. సూర్యచంద్రుల కిరణాలు అచ్చట ఉదయించవు. నక్షత్రాలు, గ్రహాలు మరియు మేరుపర్వతముయొక్క గొప్ప కాంతి ఆ మేరువర్షమందు ఉండును.

పద్మప్రభాః పద్మగన్ధా జంబూఫలరసాశినః ।
పద్మపత్రాయతాక్షాస్తు జాయన్తే తత్ర మానవాః ॥9॥

వర్షాణాం తు సహస్రాణి తత్రాప్యాయుస్త్రయోదశ ।
శరావాకారసంస్తారో మేరుమధ్యే ఇలావృతే ॥10॥

మేరుస్తత్ర మహాశైలస్తదాఖ్యాతమిలావృతమ్ ।

ఆ మేరువర్షమందలి జనులు పద్మముల వంటి కాంతిగలవారై పద్మముల గంధము కలిగియుందురు. వారు జంబూఫలముల (నేరేడుపండ్లు) రసమును త్రాగుచుందురు. అచ్చట మానవులు పద్మపు రేకులవలే విశాలమైన నేత్రములు కలిగి జన్మించెదరు. ఆ వర్షమందు కూడా మానవుల ఆయుర్దాయము పదమూడువేల సంవత్సరాలు. ఇలావృతమను పేరుగల ఆ మేరుపర్వత మధ్యభాగము మూకుడు ఆకారముతో ఉండును. ఆ మేరువర్షమందు మేరువను పేరుగల గొప్ప పర్వతము కలదు. అదియే ఇలావృతమని ప్రసిద్ధి చెందినది.

రమ్యకం వర్షమస్మాచ్చ కథయిష్యే నిబోధ తమ్ ॥11॥

వృక్షస్తత్రాపి చోత్తుఙ్గో న్యగ్రోధో హరితచ్ఛదః ।
తస్యాపి తే ఫలరసం పిబన్తో వర్తయన్తి వై ॥12॥

వర్షాయుతాయుషస్తత్ర నరాస్తత్ఫలభోగినః ।
రతిప్రధానవిమలా జరాదౌర్గన్ధ్యవర్జితాః ॥13॥

మేరు వర్షము తర్వాత రమ్యకవర్షమును గూర్చి చెప్పెదను, వినుము. అచ్చట న్యగ్రోధమను (మర్రి) పేరుగల ఎత్తైన చెట్టు ఆకుపచ్చని ఆకులు కలిగియుండును. ఆ వర్షమందు నివసించు ప్రజలు ఆ చెట్టు పండ్లరసమును త్రాగుచుందురు. అచ్చటి మానవులు పదివేల సంవత్సరములు ఆయుర్దాయము కలిగి, విషయసుఖములను అనుభవించుచుందురు. వారు సంభోగప్రధానులై స్వచ్ఛత కలిగియుందురు. వారు ముసలితనము, దుర్గంధములు లేక జీవింతురు.

తస్మాదథోత్తరం వర్షం నామ్నా ఖ్యాతం హిరణ్మయమ్ ।
హిరణ్వతీ నదీ యత్ర ప్రభూతకమలోజ్జ్వలా ॥14॥

మహాబలాః సతేజస్కా జాయన్తే తత్ర మానవాః ।
మహాకాయా మహాసత్త్వా ధనినః ప్రియదర్శనాః ॥15॥

రమ్యకవర్షము తరువాత ఉత్తరదిగ్భాగమందు ఒక వర్షము హిరణ్మయవర్షమను పేరుతో ప్రసిద్ధమైయున్నది. అచ్చట కమలములతో ఉజ్జ్వలముగా ప్రకాశించుచున్న హిరణ్వతియను పేరు గల నది కలదు. ఆ వర్షమందు మానవులు గొప్ప బలము, తేజస్సు కలిగి జన్మించెదరు. ఇంకను వారు పెద్ద శరీరము, గొప్ప సత్త్వగుణము, ధనము, ప్రియదర్శనము కలిగియుందురు.

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే భువనకోశవర్ణనం నామ సప్తపఞ్చాశత్తమోஉధ్యాయః ॥57॥

శ్రీ మార్కండేయ మహాపురాణమందలి భువనకోశవర్ణనమను ఏభైఏడవ అధ్యాయం సమాప్తం.



అష్టపఞ్చాశత్తమోఽధ్యాయః – ఏభైఎనిమిదవ అధ్యాయం
స్వారోచిషే మన్వన్తరే బ్రాహ్మణవాక్యమ్ – స్వారోచిషమన్వంతరమందు బ్రాహ్మణవాక్యం

క్రౌష్టుకిరువాచ – క్రౌష్టుకి చెప్పాడు.

కథితం భవతా సమ్యగ్యత్పృష్టోఽసి మహామునే ।
భూసముద్రాదిసంస్థానం ప్రమాణాని తథా గ్రహాః ॥1॥

తేషాం చైవ ప్రమాణం యన్నక్షత్రాణాం చ సంస్థితిః ।
భూరాదయస్తథా లోకాః పాతాలాన్యఖిలాన్యపి ॥2॥

స్వాయంభువం తథాఖ్యాతం మునే మన్వంతరం మమ ।
తదన్తరాణ్యహం శ్రోతుమిచ్ఛే మన్వంతరాణి వై ॥
మన్వంతరాధిపాన్ దేవానృషీంస్తత్తనయాన్నృపాన్ ॥3॥

ఓ మహామునీ! నిన్ను నేను అడుగగా నీవు భూమి, సముద్రము మొదలగువాని స్థితి, వాటి పరిమాణము గురించి బాగుగా చెప్పితివి. ఇంకను గ్రహములు, వాటి పరిమాణము, నక్షత్రాల స్థితి, భూర్లోకము, మొదలగు లోకములు, పాతాలము మొదలగు సమస్త లోకములు వాటిగురించి కూడా నీవు నాకు బాగుగా చెప్పితివి. అట్లే ఓ మునీ! స్వాయంభువమన్వంతరము కూడా నీచేత బాగుగా చెప్పబడినది. ఇప్పుడు నేను ఆ తరువాతి మన్వంతరములను గురించి, వాటికి అధిపతులు, దేవతలు, ఋషులు, వారి కుమారులైన రాజులను గురించి నీ నుండి వినవలెనని కోరుకొనుచున్నాను.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

మన్వంతరం మయాఖ్యాతం తవ స్వాయంభువం చ యత్ ।
స్వారోచిషాఖ్యమన్యత్తు శృణు తస్మాదనన్తరమ్ ॥4॥

స్వాయంభువమన్వంతరము గురించి నీకు నాచేత చెప్పబడినవి. ఇప్పుడు స్వారోచిషమను పేరుగల మరొక మన్వంతరము స్వాయంభువమన్వంతరము కంటే తరువాతిది ఏది కలదో దాని గురించి చెప్పెదను, వినుము.

కశ్చిద్ద్విజాతిప్రవరః పురేఽభూదరుణాస్పదే ।
వరుణాయాస్తటే విప్రో రూపేణాత్యశ్వినావపి ॥5॥

మృదుస్వభావః సద్వృత్తో వేదవేదాంగపారగః ।
సదాతిథిప్రియో రాత్రావాగతానాం సమాశ్రయః ॥6॥

తస్య బుద్ధిరియం త్వాసీదహం పశ్యే వసున్ధరామ్ ।
అతిరమ్యవనోద్యానాం నానానగరశోభితామ్ ॥7॥

మృదువైన స్వభావముగలవాడు, సదాచారపరాయణుడు, వేదవేదాంగపారంగతుడు, ఎల్లప్పుడు అతిథులయందు ప్రీతిగలవాడు, రాత్రివేళ ఇంటికి వచ్చినవారికి ఆశ్రయము కల్పించువాడు, అశ్వినీదేవతలకంటే

కూడా సౌందర్యవంతుడూ అగు ఒకానొక బ్రాహ్మణశ్రేష్ఠుడు అరుణాస్పదమను నగరమందు వరుణానది ఒడ్డున నివసించుచుండెను. "మిక్కిలి మనోహరములైన ఉద్యానవలనములు కలిగినదీ, అనేక నగరాలతో శోభిల్లుచున్నట్టిదియూ అగు ఈ భూమండలమునంతటినీ నేను చూచెదను గాక" అని ఆ బ్రాహ్మణునికి ఆలోచన కలిగెను.

అథాగతోఽ తిథిః కశ్చిత్కదాచిత్తస్య వేశ్మని ।
నానౌషధిప్రభావజ్ఞో మంత్రవిద్యావిశారదః ॥8॥

పిమ్మట ఒకానొకనాడు అనేక ఔషధాల ప్రభావము నెరిగినవాడును, మంత్రవిద్యయందు పాండిత్యము గలవాడునూ అగు ఒకానొక అతిథి ఆ బ్రాహ్మణుని ఇంటికి వచ్చెను.

అభ్యర్థితస్తు తేనాసౌ శ్రద్ధాపూతేన చేతసా ।
తస్యాచఖ్యౌ సదేశాంశ్చ రమ్యాణి నగరాణి చ ॥9॥

నదీవనాని శైలాంశ్చ పుణ్యాన్యాయతనాని చ ।

ఆ బ్రాహ్మణుడు అభ్యర్థించగా, ఆ వచ్చిన అతిథి ఆ బ్రాహ్మణునికి అనేక దేశములు, అందమైన నగరములు, నదులు, వనములు, పర్వతములు, పుణ్యప్రదేశములను గూర్చి చెప్పెను.

స తతో విస్మయావిష్టః ప్రాహ తం ద్విజసత్తమమ్ ॥10॥

అనేకదేశదర్శిత్వేనాతిశ్రమసమన్వితః ।
త్వం నాతివృద్ధో వయసా నాతివృత్తశ్చ యౌవనాత్ ॥
కథమల్పేన కాలేన పృథివీమటసి ద్విజ ॥11॥

అంతట మిక్కిలి విస్మయముతో కూడుకొన్న ఆ బ్రాహ్మణుడు ఆ వచ్చిన ద్విజశ్రేష్ఠుడగు అతిథిని గూర్చి ఇట్లు పలికెను. "ఓ బ్రాహ్మణుడా ! అనేక దేశములను చూచి వచ్చినందువలన నీవు మిక్కిలి శ్రమతో కూడుకొనియున్నావు. నీవు మిక్కిలి ముసలివాడవు కావు, యౌవనము నుంచి అతిక్రమించినవాడవూ కావు. ఎట్లు తక్కువ కాలములో ఈ భూమండలమంతటినీ తిరుగగలుగుచున్నావు?"

బ్రాహ్మణ ఉవాచ – అతిథి బ్రాహ్మణుడు చెప్పాడు.

మంత్రౌషధి ప్రభావేణ విప్రాప్రతిహతా గతిః ।
యోజనానాం సహస్రం హి దినార్ధేన వ్రజామ్యహమ్ ॥12॥

ఓ బ్రాహ్మణుడా ! మంత్రాలు, ఓషధులు వీటి ప్రభావం చేత నా గమనమునకు అడ్డులేదు. సగం రోజులోనే వేయి యోజనాల దూరము ప్రయాణము చేయగలను.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

తతః స విప్రస్తం భూయః ప్రత్యువాచేదమాదరాత్ ।
శ్రద్దధానో వచస్తస్య బ్రాహ్మణస్య విపశ్చితః ॥13॥

అంతట ఆ బ్రాహ్మణుడు పండితుడగు ఆ అతిథిబ్రాహ్మణుడు చెప్పిన మాటయందు నమ్మకముంచి తిరిగి ఇట్లు పలికెను.

మమ ప్రసాదం భగవన్ కురు మంత్రప్రభావజమ్ ।
ద్రష్టుమేతాం మమ మహీమతీవేచ్ఛా ప్రవర్తతే ॥14॥

ఓ పూజ్యుడా ! నీ మంత్రప్రభావముతో నన్ను అనుగ్రహించుము. ఈ భూమండలమును చూడవలెనని నాకు మిక్కుటమైన కోరిక గలదు.

ప్రాదాత్స బ్రాహ్మణశ్చాస్మై పాదలేపముదారధీః ।
అభియన్త్రయామాస దిశం తేనాఖ్యాతాం చ యత్నతః ॥15॥

అంతట ఉదారబుద్ధిగల ఆ అతిథిబ్రాహ్మణుడు అరుణాస్పదనగరవాసియగు ఆ బ్రాహ్మణునికి పాదలేపమునిచ్చెను. ఆ బ్రాహ్మణుడు తాను వెళ్ళదలచిన దిక్కును చూపించగా, ఆ దిక్కును ప్రయత్నపూర్వకముగా ఆ అతిథిబ్రాహ్మణుడు అభిమంత్రించెను.

తేనానులిప్తపాదోఽథ స ద్విజో ద్విజసత్తమ ।
హిమవన్తమగాద్ద్రష్టుం నానాప్రస్రవణాన్వితమ్ ॥16॥

సహస్రం యోజనానాం హి దినార్ధేన వ్రజామి యత్ ।
ఆయాస్యామీతి సంచిన్త్య తదర్ధేనాపరేణ హి ॥17॥

ఓ బ్రాహ్మణశ్రేష్ఠుడా ! (మార్కండేయుడు క్రౌష్టుకిని సంబోధించిన పదమిది.) పిమ్మట ఆ అతిథి ఆ బ్రాహ్మణుని పాదములకు పాదలేపనము (ఔషధము) పూయగా, ఆ బ్రాహ్మణుడు "వేయి యోజనములన దూరమును సగం రోజులోనే వెళ్ళి, మిగిలిన సగం రోజులో తిరిగి ఇంటికి రాగలను" అని ఆలోచించి అనేక ప్రవాహములతో కూడుకొన్న హిమవత్పర్వతమును చూచుటకు వెళ్ళెను.

సంప్రాప్తో హిమవత్పృష్ఠం నాతిశ్రాన్తతనుర్ద్విజ ।
విచచార తతస్తత్ర తుహినాచల భూతలే ॥18॥

పాదాక్రాన్తేన తస్యాథ తుహినేన విలీయతా ।
ప్రక్షాలితః పాదలేపః పరమౌషధిసంభవః ॥19॥

ఓ బ్రాహ్మణుడా ! అధికమైన శ్రమ ఏమీ లేకుండానే ఆ బ్రాహ్మణుడు హిమవత్పర్వత అగ్రభాగమును చేరెను. ఆ మంచుపర్వతముయొక్క ఉపరిభాగమందు ఆ బ్రాహ్మణుడు ఇటునటూ తిరుగసాగెను. అంతట గొప్ప ఔషధములతో సిద్ధించిన ఆ బ్రాహ్మణుని ఆ పాదలేపనము ఆ మంచునీటి కారణముగా కడిగివేయబడెను. అనగా పాదలేపనము పోయినదని అర్థం.

తతో జడగతిః సోఽథ ఇతశ్చేతశ్చ పర్యటన్ ।
దదర్శాతిమనోజ్ఞాని సానూని హిమభూభృతః ॥20॥

అంతట గమనమందు వేగము లేక జడత్వము కలిగి ఆ బ్రాహ్మణుదు ఇటునటూ తిరుగుచూ మిక్కిలి మనోహరములయిన ఆ హిమవత్పర్వతశిఖరములను చూచెను.

సిద్ధ గంధర్వజుష్టాని కిన్నరాభిరతాని చ ।
క్రీడావిహారరమ్యాణి దేవాదీనామితస్తతః ॥21॥

దివ్యాప్సరోగతశతైరాకీర్ణాన్యవలోకయన్ ।
నాతృప్యత ద్విజశ్రేష్ఠః ప్రోద్భూతపులకో మునే ॥22॥

ఓ మునీ ! సిద్ధులు, గంధర్వులచే సేవింపబడినవి, కిన్నరులచే ప్రీతితో విహరింపబడినవి, వందలకొలదీ దివ్యాప్సరలచే సంకులమైనట్టివీ అగు దేవతల సుందరములైన క్రీడావిహారస్థలములను ఆ బ్రాహ్మణశ్రేష్ఠుదు చూచుచూ పులకించిన శరీరము గలవాడై ఇంకనూ తృప్తిని పొందలేదు.

క్వచిత్ప్రస్రవణాద్భ్రష్టజలపాతమనోరమమ్ ।
ప్రనృత్యచ్ఛిఖికేకాభిరన్యతశ్చ నినాదితమ్ ॥23॥

దాత్యూహకోయష్టికాద్యైః క్వచిచ్చాతిమనోహరైః ।

పుంస్కోకిలకలాలాపైః శ్రుతిహారిభిరన్వితమ్ ॥24॥

ప్రఫుల్లతరుగన్ధేన వాసితానిలవీజితమ్ ।
ముదా యుక్తః స దదృశే హిమవన్తం మహాగిరిమ్ ॥25॥

ఎత్తైన శిఖరములనుంచి జలములు క్రింద బండరాళ్ళపై పడుటచే భ్రష్టములైన అనగా చెల్లాచెదరైన జలపాతములచే మనోహరముగా ఉన్నట్టిదియు, మరొకచోట పురి విప్పి నాట్యము చేయుచున్న నెమళ్ళ ధ్వనులచే నిండినదీ, దాత్యూహములు (జలకాక పక్షులు) కోయష్టిపక్షులు మొ॥ మనోహరములైన పక్షులచే నిండినట్టిదియు, పుంస్కోకిలల శ్రవణసుభగములయిన మధురధ్వనులచే కూడినట్టిదియు, వికసించిన చెట్ల పుష్పాల సుగంధభరిత వాయువులు కలిగినట్టిదియు అగు హిమవత్ మహాపర్వతమును సంతోషముతో నిండిన హృదయముగలవాడై ఆ బ్రాహ్మణశ్రేష్ఠుదు చూచెను.

దృష్ట్వా చైతం ద్విజసుతో హిమవన్తం మహాచలమ్ ।
శ్వో ద్రక్ష్యామితి సంచిన్త్య మతిం చక్రే గృహం ప్రతి ॥26॥

అట్టి హిమవత్ మహాపర్వతమును ఆ బ్రాహ్మణకుమారుదు చూచి "రేపు మరల చూచెదను" అని మనస్సులో భావించి తిరిగి ఇంటికి వెళ్ళుటకు సిద్ధమయ్యెను.

విభ్రష్టపాదలేపోథ చిరేణ జడితక్రమః ।
చిన్తయామాస కిమిదం మయాऽజ్ఞానాదనుష్ఠితమ్ ॥27॥

యది ప్రలేపో నష్టో మే విలీనో హిమవారిణా ।
శైలోऽతిదుర్గమశ్చాయం దూరం చాహమిహాగతః ॥28॥

ప్రయాస్యామి క్రియాహానిమగ్నిశుశ్రూషణాదికమ్ ।
కథమత్ర కరిష్యామి సంకటం మహదాగతమ్ ॥29॥

ఇదం పరమిదం రమ్యమిత్యస్మిన్వరపర్వతే ।
సక్తదృష్టిరహం తృప్తిం న యాస్యేఽబ్దశతైరపి ॥30॥

కిన్నరాణాం కలాలాపాః సమన్తాచ్ఛ్రోత్రహారిణః ।
ప్రఫుల్లతరుగన్ధాంశ్చ ఘ్రాణమత్యన్తమృచ్ఛతి ॥31॥

సుఖస్పర్శస్తథా వాయుః ఫలాని రసవన్తి చ ।
హరన్తి ప్రసభం చేతో మనోజ్ఞాని సరాంసి చ ॥32॥

ఏవం గతే తు పశ్యేయం యది కంచిత్తపోనిధిమ్ ।
స మమోపదిశేన్మార్గం గమనాయ గృహం ప్రతి ॥33॥

అంతట నశించిన పాదలేపముగలవాడై, చాలదూరము నడచుటచే మందగించిన గమనము కలవాడై మనస్సులో ఇట్లు చింతించెను. "అజ్ఞానముతో నేనేమి చేసితిని? ఈ పాదలేపనము హిమవత్సర్వత మంచునీటితో నశించి కరిగిపోయినచో ఇచ్చటినుండి వెళ్ళుట చాల కష్టము. ఈ పర్వతమును దాటి వెళ్ళుట మిక్కిలి కష్టము. ఇంటి నుంచి చాల దూరము వచ్చితిని. అగ్నికార్యములనెట్లు నెరవేర్చగలను? దైనందిన కార్యములను ఎట్లు నిర్వహించగలను? వాటికి లోపము సంభవించగలదు. వాటిని ఇచ్చట ఎట్లు నిర్వహించగలను? పెద్ద సంకటపరిస్థితి ప్రాప్తించినది. ఈ పర్వతశ్రేష్ఠమందు ఇదియంతయు ఎంతో మనోహరముగా ఉన్నది. ఈ రమ్యమైన ప్రదేశాలయందు తగుల్కొన్న దృష్టిగల నేను ఇచ్చట వందలకొలదీ సంవత్సరాలు ఉన్నా తృప్తిని పొందలేను. (ఇంకా ఇంకా చూడాలనిపిస్తుందని భావం.) కిన్నరుల మధురసంభాషణలు అంతటా నా శ్రోత్రేంద్రియమును ఆకర్షించుచున్నవి. వికసించిన చెట్ల పుష్పాల గంధమును గూర్చి నా ఘ్రాణేంద్రియము ఆకర్షితమగుచున్నది. ఇచ్చటి వాయువు సుఖస్పర్శ కలిగియున్నది. ఫలములు మధురముగా ఉన్నవి. మనోహరములైన సరస్సులు బలవంతముగా నా మనస్సును హరించుచున్నవి. ఈ పరిస్థితులలో ఎవరైనా ఒక తపోజనుని చూచెదను. ఆ తపోధనజనుడే నేను నా ఇంటికి వెళ్ళుటకు మార్గమును ఉపదేశించగలడు.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

స ఏవం చిన్తయన్విప్రో బభ్రామ చ హిమాచలే ।
భ్రష్టపాదౌషధిబలో వైక్లవం పరమం గతః ॥34॥

ఆ విప్రశ్రేష్ఠుడు ఈ విధముగా చింతించుచు ఆ హిమాలయపర్వతమందు ఇటునటూ తిరిగెను. పాదలేపనము కరిగిపోవుటచే నశించిన ఓషధిబలముగలవాడై మిక్కిలి వ్యాకులచిత్తుడయ్యెను.

తం దదర్శ భ్రమన్తం చ మునిశ్రేష్ఠం వరూథినీ ।
వరాప్సరా మహాభాగా మౌలేయా రూపశాలినీ ॥35॥

ఆ విధముగా తిరుగుచున్న ఆ మునిశ్రేష్ఠుని అప్సరసల్లో శ్రేష్ఠురాలు, అందగత్తె, మహానుభావురాలు మూలి యొక్క కుమార్తెయగు వరూథిని చూచెను.

తస్మిన్దృష్టే తతస్సాభూద్ద్విజవర్యే వరూథినీ ।
మదనాకృష్టహృదయా సానురాగా హి తత్క్షణాత్ ॥36॥

ఆ బ్రాహ్మణశ్రేష్ఠుని చూడగానే వరూథిని మన్మథవశురాలై, ఆ క్షణమందే ఆ విప్రునియందు అనురాగము కలిగినదాయెను.

చిన్తయామాస కో న్వేష రమణీయతమాకృతిః ।
సఫలం మే భవేజ్జన్మ యది మాం నావమన్యతే ॥37॥

"ఇంతటి గొప్ప సౌందర్యవంతుడు ఇతడెవరు? ఇతడు నన్ను తిరస్కరించకున్నచో నా జన్మ సఫలమగును" అని వరూథిని మనస్సులో తలచెను.

అహోఽస్య రూపమాధుర్యమహోఽస్య లలితా గతిః ।
అహో గంభీరతా దృష్టేః కుతోఽస్య సదృశో భువి ॥38॥

ఆహా ! ఏమి ఇతని రూపసౌందర్యము ? ఆహా! ఏమి ఇతని లలితమైన నడక ! ఆహా ! ఏమి ఇతని చూపుల గాంభీర్యము ! ఇతనితో సాటియైనవాడు ఈ భూలోకమందు ఎచ్చట ఉన్నాడు?

దృష్ట్వా దేవాస్తథా దైత్యాః సిద్ధగన్ధర్వపన్నగాః ।
కథమేకోఽపి నాస్త్యస్య తుల్యరూపో మహాత్మనః ॥39॥

చూడగా దేవతలు, దైత్యులు, సిద్ధులు, గంధర్వులు, పన్నగులు వీరిలో ఏ ఒక్కరూ కూడా ఈ మహాత్మునితో సమానమైన రూపము కలిగినవారు కారు.

యథాహమస్మిన్మయ్యేష సానురాగస్తథా యది ।
భవేదత్ర మయా కార్యస్తత్కృతః పుణ్యసఞ్చయః ॥40॥

నేను ఇతనియందు ఎట్లు అనురాగము కలిగినదానను అయితినో అట్లే ఇతడు కూడా నాయందు అనురాగము కలిగినవాడు అయినచో నా పుణ్యరాశి అంతయు సఫలమైనట్లుగా భావించెదను.

యద్యేష మయి సుస్నిగ్ధాం దృష్టిమద్య నిపాతయేత్ ।
కృతపుణ్యా న మత్తోఽన్యా త్రైలోక్యే వనితా తతః ॥41॥

ఒకవేళ ఈ బ్రాహ్మణశ్రేష్ఠుడు ప్రేమపూర్వకమైన చూపును నాయందు ప్రసరింపచేసినచో నాకంటే పుణ్యవతియగు మరొక స్త్రీ ఈ ముల్లోకాలయందు ఉండదు.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

ఏవం సంచిన్తయన్తీ సా దివ్యయోషిత్స్మరాతురా ।
ఆత్మానం దర్శయామాస కమనీయతరాకృతిమ్ ॥42॥

ఈ విధముగా చింతించుచూ ఆ దివ్యాంగన మన్మథపీడితురాలై తన సుందరాకృతిని ఆ విప్రునికి చూపించెను.

తాం తు దృష్ట్వా ద్విజసుతశ్చారురూపాం వరూథినీం
సోపచారం సమాగమ్య వాక్యమేతదువాచ హ ॥43॥

ఆ బ్రాహ్మణకుమారుడు సౌందర్యవతియగు వరూథిని చూచి మర్యాదపూర్వకముగా ఆమె చెంతచేరి ఇట్లు పలికెను.

కా త్వం కమలగర్భాభే కస్య కిం వాఽనుతిష్ఠసి ।
బ్రాహ్మణోఽహమిహాయాతో నగరాదరుణాస్పదాత్ ॥44॥

ఓ కమలగర్భప్రకాశముగలదానా ! నీవెవరవు? నీవిక్కడ ఏమి చేయుచున్నావు? బ్రాహ్మణుడను నేను అరుణాస్పదనగరము నుండి ఇచ్చటకు వచ్చినాను.

పాదలేపోఽత్ర మే ధ్వస్తో విలీనో హిమవారిణా ।
యస్యానుభావాదత్రాహమాగతో మదిరేక్షణే ॥45॥

ఓ మత్తములైన (మదించిన) చూపులు గలదానా ! ఏ పాదలేపనము కారణముగా నేనిక్కడకు రాగలిగితినో అట్టి పాదలేపనము మంచునీటిచేత కరిగిపోయి నశించినది.

వరూథిన్యువాచ – వరూథిని పలికెను.

మౌలేయాహం మహాభాగా నామ్నా ఖ్యాతా వరూథినీ ।
విచరామి సదైవాత్ర రమణీయే మహాచలే ॥46॥

నేను మూలియనువాని కుమార్తెను మౌలేయను. నాపేరు వరూథిని. ఈ మనోహరమైన గొప్ప హిమవత్పర్వతమందు ఎల్లప్పుడు సంచరించుచుందును.

సాహం త్వద్దర్శనాద్విప్ర కామవైక్లవ్యతాం గతా ।
ప్రశాధి యన్మయా కార్యం త్వదధీనాస్మి సాంప్రతమ్ ॥47॥

ఓ బ్రాహ్మణుడా ! అట్టి నేను నిన్ను చూసి మన్మథవశురాలను అయితిని. నేనేమి చేయవలెనో ఆజ్ఞాపింపుము. నేనిప్పుడు నీవశమయితిని.

బ్రాహ్మణ ఉవాచ – బ్రాహ్మణుడు చెప్పాడు.

యేనోపాయేన గచ్ఛేయం నిజగేహం శుచిస్మితే ।
తన్మమాచక్ష్వ కల్యాణి హానిర్నోఽఖిలకర్మణామ్ ॥48॥

నిత్యనైమిత్తికానాం తు మహాహానిర్ద్విజన్మనః ।
భవత్యతస్త్వం హే భద్రే మాముద్ధర హిమాలయాత్ ॥49॥

ఓ శుభ్రమైన చిరునవ్వుగలదానా ! ఏ ఉపాయముతో నేను నా ఇంటికి వెళ్ళగలనో అట్టి ఉపాయమును నాకు చెప్పుము. ఓ కల్యాణీ ! నిత్యనైమిత్తికములగు సమస్తకర్మల హాని (నాశము) బ్రాహ్మణులకు గొప్ప హానియే అగును. అనగా వారికి చాలా అనిష్టమును కలుగజేయును. అందువలన ఓ భద్రురాలా ! ఈ హిమాలయ పర్వతమునుంచి నన్ను ఉద్ధరించుము అనగా వెనుకకు పంపుము.

ప్రశస్యతే న ప్రవాసో బ్రాహ్మణానాం కదాచన ।
అపరాధ్యతి మే భీరు దేశదర్శనకౌతుకమ్ ॥50॥

బ్రాహ్మణులకు ప్రవాసము (పరదేశమందుండుట) ఎప్పుడూ ప్రశస్తము కాదు. ఓ భీరురాలా ! ఈ సుందరదేశదర్శన కూతూహలమే అపరాధమును కలిగించినది.

సతో గృహే ద్విజాగ్ర్యస్య నిష్పత్తిః సర్వకర్మణామ్ ।
నిత్యనైమిత్తికానాం చ హానిరేవం ప్రవాసినః ॥51॥

బ్రాహ్మణుడు తన ఇంటివద్ద ఉన్నప్పుడే సమస్తకర్మలు నెరవేర్చబడును. ప్రవాసమందు ఉన్నచో నిత్యనైమిత్తికకర్మలకు నాశము కలుగును.

సా త్వం కిం బహునోక్తేన తథా కురు యశస్విని ।
యథా నాస్తఙ్గతే సూర్యే పశ్యామి నిజమాలయమ్ ॥52॥

ఓ యశస్వినీ ! ఎక్కువ చెప్పనేల? సూర్యుడు అస్తమించకుండా ఉన్నంతలోనే నేను నా ఇంటిని చూచువిధముగా నీవు చేయుము. అనగా ఈ హిమాలయపర్వతమునుండి నా ఇంటికి పంపించుము.

వరూథిన్యువాచ – వరూథిని పలికెను.

మైవం బ్రూహి మహాభాగ మాభూత్స దివసో మమ ।
మాం పరిత్యజ్య యత్ర త్వం నిజగృహముపైష్యసి ॥53॥

ఓ మహానుభావుడా ! నీవిట్లు పలుకవద్దు, నన్ను వదిలిపెట్టి నీవు నీ ఇంటికి వెళ్ళుట అను రోజు నాకు రావద్దు.

అహో రమ్యతరః స్వర్గో న యతో ద్విజనందన ।
అతో వయం పరిత్యజ్య తిష్ఠామోఽత్ర సురాలయమ్ ॥54॥

ఓ బ్రాహ్మణశ్రేష్ఠుడా ! ఈ హిమాలయపర్వతముకంటే స్వర్గముకూడా మనోహరము కాదు. అందువలన స్వర్గమును విడిచి మనమిచ్చటే ఉండెదము.

స త్వం సహ మయా కాన్త ! కాన్తేఽత్ర తుహినాచలే ।
రమమాణో న మర్త్యానాం బాంధవానాం స్మరిష్యసి ॥55॥

ఓ సుందరుడా ! అట్టి నీవు సుందరమైన హిమాలయపర్వతమందు ఆనందముననుభవించుచు నీ బంధువులను కూడా నీవు స్మరించవు.

స్రజో వస్త్రాణ్యలంకారాన్ భక్ష్యభోజ్యానులేపనమ్ ।
దాస్యామ్యత్ర తథాహం తే స్మరేణ వశగా హృతా ॥56॥

పుష్పమాలలు, వస్త్రములు, అలంకారములు, భక్ష్యభోజ్యములు, అనులేపనములు వీటన్నింటిని నీకిచ్చెదను. మన్మథపీడితురాలనై నేను నీకు వశమైతిని కదా !

వీణావేణుస్వనం గీతం కిన్నరాణాం మనోరమమ్ ।
అంగాహ్లాదకరో వాయురుష్ణాన్నముదకం శుచి ॥57॥

మనోఽభిలషితా శయ్యా సుగంధమనులేపనమ్ ।
ఇహాసతో మహాభాగ గృహే కిం తే నిజేఽధికమ్ ॥58॥

ఓ మహానుభావుడా ! కిన్నరులకు ఆహ్లాదకరమైన వీణావేణుధ్వనులతో కూడుకొన్న గీతము, శరీరమునకు ఆహ్లాదాన్ని కల్గించునట్టి గాలి, వేడి అన్నము, శుభ్రమైన నీరు, మనస్సుకు నచ్చిన శయ్య, శరీరానికి పూసుకొనే సుగంధద్రవ్యాలు ఇవన్నియు నీకిచ్చట లభించును. నీ స్వగృహంలో ఇంతకంటే అధికము ఏమున్నది?

ఇహాసతో నైవ జరా కదాచిత్తే భవిష్యతి ।
త్రిదశానామియం భూమిర్యౌవనోపచయప్రదా ॥59॥

ఇచ్చట ఉండగా నీకు ముసలితనము ఎన్నడూ రాదు, ఎందువలననగా యౌవనమును వృద్ధిచేయునట్టి దేవతల భూమియే ఈ హిమవత్పర్వతము.

ఇత్యుక్త్వా సానురాగా సా సహసా కమలేక్షణా ।
ఆలిలింగ ప్రసీదేతి వదన్తీ కలమున్మనాః ॥60॥

ఆ బ్రాహ్మణునియందుగల అనురాగముతో కమలములవంటి నేత్రములు కలిగిన ఆ వరూధిని ఇట్లు పలికి ఆ బ్రాహ్మణుని కౌగలించుకొనెను. మనస్సు స్వాధీనమందు లేనిదై ఆమె "నన్ను అనుగ్రహించుము" అని పలికెను.

మా మాం స్ప్రాక్షీర్వ్రజాన్యత్ర దుష్టే యస్సదృశస్తవ ।
మయాన్యథా యాచితా త్వమన్యథైవాభ్యుపైషి మామ్ ॥61॥

ఓ దుష్టురాలా ! నన్ను ముట్టుకొనవలదు. నీకు తగినవానివద్దకు నీవు పొమ్ము. నేను ఒకవిధముగా నిన్ను యాచిస్తే, నీవు మరొకవిధముగా నన్ను సమీపించితివి.

సాయం ప్రాతర్హుతం హవ్యం లోకాన్యచ్ఛతి శాశ్వతాన్ ।
త్రైలోక్యమేతదఖిలం మూఢే హవ్యే ప్రతిష్ఠితమ్ ॥
తముపాయం సమాచక్ష్వ యేన యామి స్వమాలయమ్ ॥62॥

ఓ మూఢురాలా ! ప్రాతఃకాలము, సాయంకాలములలో హుతము అనగా హోమము చేయబడిన ద్రవ్యమే శాశ్వతలోకములను ప్రసాదించుచున్నది. ఈ ముల్లోకములు హవ్యమందే అనగా హోమద్రవ్యమందే ప్రతిష్ఠితములై ఉన్నవి. కావున ఏ ఉపాయముతో నేను నా ఇంటిని చేరగలనో అట్టి ఉపాయమును చెప్పుము.

వరూథిన్యువాచ – వరూథిని పలికెను.

కిం తే నాహం ప్రియా విప్ర రమణీయో న కిం గిరిః ।
గంధర్వాన్ కిన్నరాదీంశ్చ త్యక్త్వాభీష్టో హి కస్తవ ॥63॥

ఓ బ్రాహ్మణుడా ! ఏమి నీకు నేను ఇష్టము కాలేదా? ఏమి ఈ పర్వతము మనోహరముగా లేదా? గంధర్వులను, కిన్నరులను విడిచి ఇక నీకు నచ్చినవారెవరు?

నిజమాలయమప్యస్మాత్ భవాన్ యాస్యత్యసంశయమ్ ।
స్వల్పకాలం మయా సార్ధం భుంక్ష్వ భోగాన్సుదుర్లభాన్ ॥64॥

నీవు నీ ఇంటికి కూడా ఇచ్చటినుంచి నిస్సంశయముగా వెళ్ళగలవు. దుర్లభమైనట్టి భోగములను నాతోబాటు కొద్దికాలము అనుభవించుము.

బ్రాహ్మణ ఉవాచ – బ్రాహ్మణుడు చెప్పాడు.

అభీష్టా గార్హపత్యాద్యాః సతతం మే త్రయోఽగ్నయః ।
రమ్యం మమాగ్నిశరణం వేదీ విష్టరిణీ ప్రియా ॥65॥

గార్హపత్యము, ఆహవనీయము, దక్షిణాగ్ని అను మూడు అగ్నులు ఎల్లప్పుడు నాకు అభీష్టములు. అగ్న్యాధానగృహము (అగ్నిహోత్రగృహము) ఎంతో అందమైనది. దర్భలతో పరచబడిన యజ్ఞవేదియే నాకు ప్రియమైనది. (అగ్నిశరణశబ్దానికి అగ్న్యాధానగృహము, అగ్నిహోత్రగృహము అను అర్థములు వాచస్పత్యమందు ఈయబడినవి. విష్టరశబ్దానికి దర్భలసమూహమని అర్థం. విష్టరం కలిగినది విష్టరిణి)

వరూథిన్యువాచ – వరూథిని పలికెను.

అష్టావాత్మగుణా యే హి తేషామాదౌ దయా ద్విజ ।
తాం కరోషి కథం న త్వం మయి సద్ధర్మపాలక ॥66॥

త్వద్విముక్తా న జీవామి తథా ప్రీతిమతీ త్వయి ।
నైతద్వదామ్యహం మిథ్యా ప్రసీద కులనన్దన ॥67॥

ఓ బ్రాహ్మణుడా ! దయ, క్షాన్తి, అనసూయ, శౌచం, అనాయాసం, మంగళం, అకార్పణ్యం, అస్పృహ అను ఎనిమిది ఆత్మగుణాలలో దయ మొదటి గుణం కదా ! ఓ సద్ధర్మపరిపాలక ! నీవెందుకు అట్టి దయాగుణమును నాయందు చూపుటలేదు? నీవు నన్ను విడిచిపెట్టినయెడల నేను బ్రతకలేను. నీపట్ల అంతటి ప్రీతి నాకు కలదు. ఓ కులనందనా ! నేను అసత్యమును పలుకుటలేదు. నన్ను అనుగ్రహించుము.

బ్రాహ్మణ ఉవాచ – బ్రాహ్మణుడు చెప్పాడు.

యది ప్రీతిమతీ సత్యం నోపచారాద్బ్రవీషి మామ్ ।
తదుపాయం సమాచక్ష్వ యేన యామి స్వమాలయమ్ ॥68॥

నిజముగా నీకు నాయందు ప్రీతియే యున్నచో ఇట్టి ఉపచారవాక్యములను నీవు మాట్లాడవు. (అసత్యవాక్యములతో సంతోషపెట్టుట ఉపచారమని వాచస్పత్యం.) ఏ ఉపాయముతో నేను స్వగృహమును చేరెదనో అట్టి ఉపాయమును చెప్పుము.

వరూథిన్యువాచ – వరూథిని పలికెను.

నిజమాలయమప్యస్మాద్భవాన్యాస్యత్యసంశయమ్ ।
స్వల్పకాలం మయా సార్ధం భుంక్ష్వ భోగాన్ సుదుర్లభాన్ ॥69॥

ఇచ్చటినుంచి నీవు నీ ఇంటికి తప్పక వెళ్ళగలవు. ఇందు సందేహము లేదు. లభింపశక్యముగాని భోగములను కొద్దికాలము నాతోబాటు అనుభవింపుము.

బ్రాహ్మణ ఉవాచ – బ్రాహ్మణుడు చెప్పాడు.

న భోగార్థాయ విప్రాణాం శస్యతే హి వరూథిని ।
ఇహ క్లేశాయ విప్రాణాం చేష్టా ప్రేత్య ఫలప్రదా ॥70॥

భోగములకొరకు బ్రాహ్మణులు ఆతురపడుట శ్రేయస్కరము కాదు. అట్టి చేష్టలు విప్రులకు ఈ జన్మయందు దుఃఖములనిచ్చును. చనిపోయినపిమ్మట మరుసటిజన్మయందు అందుకు తగినఫలమును అనగా చెడ్డ ఫలమును ఇచ్చును.

వరూథిన్యువాచ – వరూథిని పలికెను.

సంత్రాణం మ్రియమాణాయా మమ కృత్వా పరత్ర తే ।
పుణ్యస్యైవ ఫలం భావి భోగాశ్చాన్యత్ర జన్మని ॥71॥

ఏవం చ ద్వయమప్యత్ర తవోపచయకారణమ్ ।
ప్రత్యాఖ్యానాదహం మృత్యుం త్వం చ పాపమవాప్స్యసి ॥72॥

చనిపోవుటకు సిద్ధముగా ఉన్న నన్ను రక్షించినచో ఆ పుణ్యము రాబోవు జన్మమందు నా వలన నీకు లభించును. అట్టి పుణ్యమువలని భోగాలు కూడా నీకు పరజన్మమందు సిద్ధించగలవు. ఈ విధముగా నా కోరికను

మన్నించి నన్ను రక్షించినందువలన ఈ రెండు నీ అభివృద్ధికి కారకములగును. నన్ను నిరాకరించినచో నేను మరణమును పొందెదను, నీవు పాపమును పొందెదవు.

బ్రాహ్మణ ఉవాచ – బ్రాహ్మణుడు చెప్పాడు.

పరస్త్రియం నాభిలషేదిత్యూచుర్గురవో మమ ।
తేన త్వాం నాభివాంఛామి కామం విలప శుష్య వా ॥73॥

పరస్త్రీని కోరరాదు అని మా గురువులు చెప్పిరి. అందువలన నిన్ను నేను కోరుకొనుటలేదు. నీ ఇష్టప్రకారం విలపించుము, లేదా శుష్కించుము (ప్రాణత్యాగము చేయుము).

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

ఇత్యుక్త్వా స మహాభాగః స్పృష్ట్వాపః ప్రయతః శుచిః ।
ప్రాహేదం ప్రణిపత్యాగ్నిం గార్హపత్యముపాంశునా ॥74॥

భగవన్ గార్హపత్యాగ్నే యోనిస్త్వం సర్వకర్మణామ్ ।
త్వత్త ఆహవనీయోఽగ్నిర్దక్షిణాగ్నిశ్చ నాన్యతః ॥75॥

యుష్మదాప్యయనాద్దేవా వృష్టిసస్యాదిహేతవః ।
భవన్తి సస్యాదఖిలం జగద్భవతి నాన్యతః ॥76॥

ఈ విధముగా పలికి మహానుభావుడగు ఆ బ్రాహ్మణుడు నీటిని స్పృశించి అనగా ఆచమనము చేసి ఇంద్రియనిగ్రహము కలిగినవాడై పరిశుద్ధుడై గార్హపత్యాగ్నికి నమస్కరించి ఉపాంశుజపముతో (పెదవులను కదుపుతూ అల్పస్వరంతో నెమ్మదిగా మంత్రాలను ఉచ్చరించుట ఉపాంశుజపము) ఈ విధముగా పలికెను. "ఓ భగవంతుడా! గార్హపత్యాగ్నీ ! సమస్త కర్మలకు నీవే కారణభూతుడవు. నీవల్లనే ఆహవనీయాగ్ని, దక్షిణాగ్ని ఉద్భవించుచున్నవి. ఇతరులవల్ల కాదు. నీవు ప్రసన్నత చెంది ప్రవృత్తమైనందువల్లనే (సహాయపడినందువల్లనే) దేవతలు వర్షము, వరిపంట మొ॥వాటికి కారణభూతులగుచున్నారు. వరి మొ॥ పంటల వల్లనే ఈ ప్రపంచమంతయు నిలుచుచున్నది, మరియొకరివల్ల కాదు.

ఏవం త్వత్తో భవత్యేతద్యేన సత్యేన వై జగత్ ।
తథాఽహమద్య స్వం గేహం పశ్యేయం సతి భాస్కరే ॥77॥

యథా వై వైదికం కర్మ స్వకాలే నోజ్ఝితం మయా ।
తేన సత్యేన పశ్యేయం గృహస్థోఽథ దివాకరమ్ ॥78॥

యథా చ న పరద్రవ్యే పరదారే చ మే మతిః ।
కదాచిత్ సాభిలాషాఽభూత్తథైతత్ సిద్ధిమేతు మే ॥79॥

ఈ విధముగా ఈ జగత్తంతయు నీ వల్లనే ప్రతిష్ఠితమగుచున్నది. ఈ సత్యముద్వారానే నేను ఈరోజు సూర్యుడు అస్తమించకుండా ఇంకా ఉదయిస్తూ ఉండగానే నా ఇంటిని చూడగలను. నిర్దిష్టకాలమందు వైదికకర్మలు నాచేత విడువబడకుండా ఉండునంతలోనే నా ఇంటిలోనే నేను ఉండి సూర్యుని నిజముగా చూచెదను. పరుల వస్తువులందు, పరుల భార్యలందు నా ఆలోచన, అభిలాష ఎప్పుడూ లేకపోవుట ఎట్లు నిజమో అట్లే అట్టి సద్గుణమే నాకు కార్యసిద్ధిని ప్రసాదించుగాక !

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే స్వారోచిషే మన్వన్తరే బ్రాహ్మణవాక్యం నామ అష్టపఞ్చాశత్తమోஉధ్యాయః ॥58॥

శ్రీ మార్కండేయ మహాపురాణమందు స్వారోచిషమన్వంతరమందు బ్రాహ్మణవాక్యమను ఏభైఎనిమిదవ అధ్యాయం సమాప్తం.



ఏకోనషష్టితమోఽధ్యాయః - ఏభైతొమ్మిదవ అధ్యాయం

స్వారోచిషమన్వన్తరమ్ - స్వారోచిషమన్వంతరం

మార్కండేయ ఉవాచ - మార్కండేయుడు చెప్పాడు.

ఏవం తు వదతస్తస్య ద్విజపుత్రస్య పావకః ।
గార్హపత్యః శరీరే తు సన్నిధానమథాకరోత్ ॥1॥

తేన చాధిష్ఠితః సోఽథ ప్రభామండలమధ్యగః ।
వ్యదీపయత తం దేశం మూర్తిమానివ హవ్యరాట్ ॥2॥

తస్యాస్తు సుతరాం తత్ర తాదృగ్రూపే ద్విజన్మని ।
అనురాగోఽభవద్విప్రం పశ్యన్త్యా దేవయోషితః ॥3॥

ఈ విధముగా పలుకుతుండగనే ఆ బ్రాహ్మణకుమారుని శరీరమందు గార్హపత్యాగ్ని ప్రవేశించెను. గార్హపత్యాగ్నిచే అధిష్ఠితుడైన ఆ బ్రాహ్మణకుమారుడు కాంతిమండలము మధ్యభాగమందు ఉన్నవాడై మూర్తీభవించిన అగ్నిదేవునివలె ఆ దేశమును తానే స్వయముగా ప్రకాశింపచేయసాగెను. అట్టి ప్రకాశవంతమైనరూపముగల ఆ బ్రాహ్మణుని చూడగానే దేవకన్యయగు ఆ వరూథినికి ఆ బ్రాహ్మణునిపై మరింత అనురాగము కలిగెను.

తతః సోఽధిష్ఠితస్తేన హవ్యవాహేన తత్క్షణాత్ ।
యథాపూర్వం తథా గన్తుం ప్రవృత్తో ద్విజనందనః ॥4॥

జగామ చ త్వరాయుక్తస్తయా సాస్రం నిరీక్షితః ।
ఆదృష్టిపాతాత్తన్వఙ్గ్యా నిఃశ్వాసోత్కంపికన్ధరమ్ ॥5॥

తతః క్షణేనైవ తదా నిజగేహమవాప్య సః ।
యథా ప్రోక్తం ద్విజశ్రేష్ఠశ్చకార సకలాః క్రియాః ॥6॥

ఆ గార్హపత్యాగ్నిచే అధిష్ఠితుడైన ఆ బ్రాహ్మణుడు ఆ క్షణమందే పూర్వమువలే స్వగృహమునకు వెళ్ళుటకు సిద్ధమయ్యెను. కన్నీళ్ళతో నిండిన వరూథిని నిట్టూర్పులచే కంపించిన గ్రీవాభాగము (మెడ) కలిగినది ఆయెను. అట్టి సుందరియగు వరూధినిచే ఆమె చూడగలిగినంతవరకు ఆ బ్రాహ్మణుడు చూడబడి వేగముగా వెళ్ళెను. అంతట క్షణకాలములోనే ఆ బ్రాహ్మణశ్రేష్ఠుడు తన ఇంటిని చేరి శాస్త్రోక్తప్రకారము తాను చేయవలసిన శాస్త్రవిహితకర్మలను ఆచరించెను.

అథ సా చారుసర్వాఙ్గీ తత్రాసక్తాత్మమానసా ।
నిశ్వాసపరమా నిన్యే దినశేషం తథా నిశామ్ ॥7॥

పిమ్మట సర్వాంగసుందరి అయిన వరూథిని ఆ బ్రాహ్మణకుమారునియందు లగ్నమైన మనస్సు కలిగినదై దీర్ఘమైన నిట్టూర్పులను విడుచుచున్నదై ఆ పగటి మిగిలిన భాగమును అట్లే రాత్రిని గడిపెను.

నిశ్వసన్త్యనవద్యాఙ్గీ హాహేతి రుదతీ ముహుః ।
మన్దభాగ్యేతి చాత్మానం నినింద మదిరేక్షణా ॥8॥

న విహారే న చాహారే రమణీయే న వా వనే ।
న కన్దరేషు రమ్యేషు సా బబన్ధ తదా రతిమ్ ॥9॥

చకార రమమాణే చ చక్రవాకయుగే స్పృహామ్ ।
ముక్తా తేన వరారోహా నినిన్ద నిజయౌవనమ్ ॥10॥

నిట్టూర్పులను విడచుచున్నదీ, నింద్యములుకాని అవయవములు గలదీ అగు వరూథిని హాహాయనుచు మాటిమాటికి ఏడ్చుచు మత్తెక్కిన కన్నులుగల ఆమె తాను మందభాగ్యురాలనని తనను తాను నిందించుకొనెను. విహారమందుగాని, ఆహారమందుగాని, అందమైన ఉద్యానవనమందుగాని, అందమైన గుహలయందు గాని ఆమె ప్రీతిని పొందలేదు. రమించుచున్న చక్రవాకపక్షుల జంటను చూచి ఆమెకు కూడా రమించుటయందు కోరిక కలిగెను. ఆ బ్రాహ్మణకుమారునిచే విడువబడిన ప్రశస్తమైన నితంబభాగము (కటి ప్రదేశము) కలిగిన ఆమె తన యౌవనమును (వ్యర్థము కదా యని) నిందించుకొనెను.

క్వాగతాహమిమం శైలం దుష్టదైవబలాత్కృతా ।
క్వ చ ప్రాప్తః స మే దృష్టేర్గోచరం తాదృశో నరః ॥11॥

యదద్య స మహాభాగో న మే సంగముపైష్యతి ।
తత్కామాగ్నిరవశ్యం మాం క్షపయిష్యతి దుస్సహః ॥12॥

రమణీయమభూద్యత్తత్ పుంస్కోకిలనినాదితమ్ ।
తేన హీనం తదేవైతద్దహతీవాద్య మామలమ్ ॥13॥

దుష్టదైవమునకు వశీభూతురాలనై ఎచ్చటికీ పర్వతప్రాంతమునకు నేను వచ్చితిని? అట్టి సుందరుడగు పురుషశ్రేష్ఠుడు ఎచ్చట నా దృష్టిపథమున గోచరుడైనాడు? ఒకవేళ ఆ గొప్ప పురుషుడు నేడు నాతో సంగమించనియెడల భరింపశక్యముగాని ఆ మన్మథాగ్ని తప్పక నన్ను దహించివేయగలదు. ఏ పురుషకోకిలల మధురధ్వనులు ఇంతకు పూర్వం నాకు రమణీయములు (శ్రవణసుభగములు) అయినవో అవే మధురధ్వనులు ఆ పురుషశ్రేష్ఠుడు లేనందున నన్నిప్పుడు దహించుచున్నవా అన్నట్లున్నవి.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

ఇత్థం సా మదనావిష్టా జగామ మునిసత్తమమ్ ।
వవృధే చ తదా రాగస్తస్యాస్తస్మిన్ ప్రతిక్షణమ్ ॥14॥

ఈ విధముగా మన్మథపీడితురాలైన ఆ వరూథిని ఆ మునిసత్తమునియందు (బ్రాహ్మణకుమారునియందు) మనస్సును లగ్నము చేసెను. అప్పుడు క్షణక్షణము అతనియందు ఆమెకుగల అనురాగము వృద్ధిచెందెను.

కలిర్నామ్నా తు గన్ధర్వః సానురాగో నిరాకృతః ।
తయా పూర్వమభూత్సోఽథ తదవస్థాం దదర్శ తామ్ ॥15॥

ఇంతకు పూర్వము కలియను పేరుగల గంధర్వుడొకడు ఈమెయందు అనురాగము కలిగియుండెను. కాని అతడు వరూథినిచే నిరాకరింపబడినాడు. అతడిప్పుడు ఈమెయొక్క ఇట్టి మన్మథావస్థను చూచెను.

స చిన్తయామాస తదా కిం న్వేషా గజగామినీ ।
నిశ్వాసపవనమ్లానా గిరావత్ర వరూథినీ ॥16॥

"వేడి నిట్టూర్పులచే వాడిపోయియున్న, గజముయొక్క గమనమువంటి గమనము కలిగియున్న, ఈ పర్వతమందున్న ఈమె వరూథినియే కదా !" అని ఆ గంధర్వుడు చింతింపసాగెను.

మునిశాపక్షతా కిం ను కేనచిత్కిం విమానితా ।
బాష్పవారిపరిక్లిన్నమియం ధత్తే యతో ముఖమ్ ॥17॥

ఏ మునిశాపముచేనైనా ఈమె పీడింపబడినదా ఏమి? లేక ఎవరిచేతనైనా అవమానింపబడినదా? ఎందువలననగా ఈమె ముఖము వేడి కన్నీళ్ళను ధరించుచున్నది.

తతస్స దధ్యౌ సుచిరం తమర్థం కౌతుకాత్కలిః ।
జ్ఞాతవాంశ్చ ప్రభావేణ సమాధేస్స యథాతథమ్ ॥18॥

చాలాసేపు ఇట్లు యోచించిన పిమ్మట ఆ విషయమును తెలుసుకొనగోరి కుతూహలముతో ధ్యానమగ్నుడయ్యెను. సమాధిప్రభావముతో ఆ విషయమును అనగా వరూథిని ఎందుకు దుఃఖించుచున్నదో అను విషయమును ఉన్నది ఉన్నట్లుగా తెలుసుకొనెను.

పునస్స చిన్తయామాస తద్విజ్ఞాయ మునే కలిః ।
మమోపపాదితం సాధు భాగ్యైరేతత్పురా కృతైః ॥19॥

మయ్యేషా సానురాగేణ బహుశః ప్రార్థితా సతీ ।
నిరాకృతవతీ సేయమద్య ప్రాప్యా భవిష్యతి ॥20॥

మానుషే సానురాగేయం తత్ర తద్రూపధారిణి ।
రంస్యతే మయ్యసన్దిగ్ధం కిం కాలేన కరోమి తత్ ॥21॥

ఓ క్రౌష్టుకిమునీ ! కలి ఆ విషయమును యథాతథముగా తెలుసుకొని మరల ఈ విధముగా ఆలోచించెను. "నేనింతకుముందు చేసిన పుణ్యకార్యముల ఫలముచే అభిలషించిన కార్యము సిద్ధించినది. నేను ఈమెయందు అనురాగము కలిగి అనేకమార్లు ప్రార్థించిననూ నన్ను నిరాకరించిన ఈమె ఇప్పుడు నాకు లభ్యమగును. మానవుడగు ఆ బ్రాహ్మణకుమారుని పట్ల ఈమె అనురాగవతియై యున్నది. ఇప్పుడు నేను ఆ బ్రాహ్మణుని రూపమును ధరించినచో నాయందు నిస్సంశయముగా అనురాగవతియగును. ఆలస్యమెందులకు? ఇప్పుడే ఆ పని చేసెదను. (తద్రూపధారిన్ శబ్దానికి సప్తమీఏకవచనప్రయోగము. "తద్రూపధారిణి" అని. 'తద్రూపధారిణి మయి" అని అన్వయము.)

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

ఆత్మప్రభావేణ తతస్తస్య రూపం ద్విజన్మనః ।
కృత్వా చచార యత్రాస్తే నిషణ్ణా సా వరూథినీ ॥22॥

అటుపిమ్మట తన శక్తిప్రభావముచే కలి ఆ బ్రాహ్మణుని రూపమును ధరించి ఆ వరూథిని ఎచ్చట కలదో అచ్చట సంచరించెను.

సా తం దృష్ట్వా వరారోహా కిఞ్చిదుత్ఫుల్లలోచనా ।
సమేత్య ప్రాహ తన్వఙ్గీ ప్రసీదేతి పునః పునః ॥23॥

ముని వేషములో ఉన్న కలిని చూచి వికసించిన నేత్రములుగలదీ, సుందరాంగీయగు వరూథిని అతడిని సమీపించి "నన్ను అనుగ్రహించుము" అని మాటిమాటికి పలికెను.

త్వయా త్యక్తా న సన్దేహః పరిత్యక్ష్యామి జీవితమ్ ।
తత్రాధర్మః కష్టతరః క్రియాలోపో భవిష్యతి ॥24॥

నీవు నన్ను విడిచిపెట్టినట్లయిన నేను మరణించెదను. ఇందు సందేహము లేదు. అప్పుడు నీకు గొప్ప అధర్మము కలుగును. అప్పుడు యజ్ఞయాగాది వైదికకర్మలకు లోపము సంభవించును.

మయా సమేత్య రమ్యేఽస్మిన్ మహాత్మన్ వనకన్దరే ।
మత్పరిత్రాణజం ధర్మమవశ్యం ప్రతిపత్స్యసే ॥25॥ ॥25॥

ఓ మహాత్ముడా! అందమైన ఈ వనమందలి గుహలలో నాతో సంగమించి, నన్ను రక్షించినచో, అందువలన కలుగు ధర్మము నీకు తప్పక కలుగగలదు.

ఆయుషః సావశేషం మే నూనమస్తి మహామతే ।
నివృత్తస్తేన నూనం త్వం హృదయాహ్లాదకారకః ॥26॥

ఓ గొప్ప బుద్ధిమంతుడా! నాకింకా ఆయుర్దాయశేషము ఉన్నది. అందువల్లనే నీవు తిరిగి నావద్దకు వచ్చితివి. నిజముగా నీవు హృదయమునకు ఆహ్లాదమును కలిగించువాడవు.

కలిరువాచ – కలి పలికాడు.

కిం కరోమి క్రియాహానిర్భవత్యత్ర సతో మమ ।
త్వమప్యేవంవిధం వాక్యం బ్రవీషి తనుమధ్యమే ॥27॥

ఓ సన్నని నడుము కలదానా ! నేనేమి చేయుదును? ఇచ్చట నేను ఉండినయెడల నాకు వైదికక్రియల లోపము కలుగును. అయిననూ ఈవిధమైన ప్రార్థనావాక్యములను నీవు పలికితివి.

తదహం సంకటం ప్రాప్తో యద్బ్రవీమి కరోషి తత్ ।
యది స్యాత్సంగమో మేఽద్య భవత్యా సహ నాన్యథా ॥28॥

అందువలన నేను సంకటస్థితిలో పడితిని. నేను చెప్పిన విధముగా నీవు చేసినచో నీతో నాకు నేడు సంగమము కలుగును. లేనిచో కలుగదు.

వరూథిన్యువాచ – వరూథిని పలికింది.

ప్రసీద యద్బ్రవీషి త్వం తత్కరోమి న తే మృషా ।
బ్రవీమ్యేతదనాశఙ్కం యత్తత్కార్యం మయాఽధునా ॥29॥

నన్ను అనుగ్రహించుము. నీవు చెప్పినట్లే నేను చేయుదును. ఇందు అబద్ధము లేదు. నిస్సంశయముగా పలుకుచున్నాను. నేనిప్పుడు ఏమి చేయవలెనో చెప్పుము. ఆచరించెదను.

కలిరువాచ – కలి పలికాడు.

నాద్య సంభోగసమయే ద్రష్టవ్యోఽహం త్వయా వనే ।
నిమీలితాక్ష్యాః సంసర్గస్తవ సుభ్రు మయా సహ ॥30॥

ఓ అందమైన కనుబొమలు గలదానా! ఈ వనమందు నీతో నేను సంభోగించు సమయమందు నీవు నన్ను చూడరాదు. నీవు కళ్ళు మూసుకొని నాతో సంగమించవలెను.

వరూథిన్యువాచ – వరూథిని పలికింది.

ఏవం భవతు భద్రం తే యథేచ్ఛసి తథాఽస్తు తత్ ।
మయా సర్వప్రకారం హి వశే స్థేయం తవాధునా ॥31॥

అట్లే అగుగాక! నీకు కల్యాణమగుగాక! నీవు కోరినట్లే అగుగాక! అన్నివిధాలా నేనిప్పుడు నీకు వశీభూతురాలను అయితిని.

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే స్వారోచిషే మన్వంతరే ఏకోనషష్టితమోఽధ్యాయః ॥59॥

శ్రీ మార్కండేయ మహాపురాణమందు స్వారోచిషమన్వంతరమను ఏభైతొమ్మిదవ అధ్యాయం *సమాప్తం.*



షష్టితమోఽధ్యాయః – అరువదవ అధ్యాయం
స్వారోచిషమన్వన్తరమ్ – స్వారోచిషమన్వంతరం

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

తతః సహ తయా సోఽథ రరామ గిరిసానుషు ।
ఫుల్లకాననహృద్యేషు మనోజ్ఞేషు సరస్సు చ ॥1॥

కన్దరేషు చ రమ్యేషు నిమ్నగాపులినేషు చ ।
మనోజ్ఞేషు తథాఽన్యేషు దేశేషు ముదితో ద్విజ ॥2॥

వహ్నినాధిష్ఠితస్యాసీద్యద్రూపం తస్య తేజసా ।
అచిన్తయద్భోగకాలే నిమీలితవిలోచనా ॥3॥

ఓ బ్రాహ్మణుడా ! పిమ్మట మునివేషధారియగు ఆ కలి వరూథినితో పర్వతశిఖరములయందు, మనోహరములగు వికసించిన పుష్పములు గల వనములందు, మనోహరములైన సరస్సులందు, సుందరములైన పర్వతగుహలయందు, ఆయా నదుల ఇసుకతిన్నెలయందు, ఇంకా మనోహరములయిన వేరే ఇతర ప్రదేశములందు సంతోషముతో రమించెను అనగా ఆనందములను అనుభవించెను. వహ్నితో అధిష్ఠితుడైన ఆ బ్రాహ్మణకుమారుడు ఎట్టి తేజోరూపము గలవాడో అట్టి తేజోవంతుని ఆ వరూథిని కలితో సంభోగకాలమందు తలచుకొనెను.

తతః కాలేన సా గర్భమవాప మునిసత్తమ ।
గంధర్వవీర్యతో రూపం చిన్తనాచ్చ ద్విజన్మనః ॥4॥

ఓ మునిశ్రేష్ఠుడా ! పిమ్మట కొంతకాలమునకు వరూథిని గంధర్వుడగు ఆ కలియొక్క వీర్యముచే గర్భమును ధరించెను. సంభోగకాలమందు ఆ బ్రాహ్మణకుమారుని తేజోరూపమును తలచుటచే ఆమెయొక్క గర్భముకూడా అట్టి తేజోరూపమును పొందినది.

తాం గర్భధారిణీం సోఽథ సాన్త్వయిత్వా వరూథినీమ్ ।
విప్రరూపధరో యాతస్తయా ప్రీత్యా విసర్జితః ॥5॥

విప్రరూపధారియగు ఆ గంధర్వుడు గర్భవతియగు వరూథినితో సాంత్వనవాక్యములను పలికి, ప్రీతిపూర్వకముగా ఆమె అనుజ్ఞను పొంది, ఆమెను విడిచి వెళ్ళిపోయెను.

జజ్ఞే స బాలో ద్యుతిమాన్ జ్వలన్నివ విభావసుః ।
స్వరోచిభిర్యథా సూర్యో భాసయన్ సకలా దిశః ॥6॥

స్వరోచిభిర్యతో భాతి భాస్వానివ స బాలకః ।
తతః స్వరోచిరిత్యేవం నామ్నా ఖ్యాతో బభూవ సః ॥7॥

పిమ్మట వరూథినికి అగ్నిదేవునివలే ప్రకాశించే కుమారుడు జన్మించెను. సూర్యభగవానుడు ఎట్లయితే తన కిరణకాంతులతో సమస్త దిక్కులను ప్రకాశింపచేయునో అట్లే ఆ బాలుడు తన ప్రకాశముతో అంతటినీ

ప్రకాశింపచేయసాగెను. సూర్యభగవానుడు ఎట్లయితే తన కిరణములతోనే తాను ప్రకాశించునో అట్లే ఆ బాలుడు కూడా తన కిరణములతోనే తాను ప్రకాశించెను. (ఆ బాలుని ప్రకాశింపచేయుటకు మరొక ప్రకాశముయొక్క అవసరము లేదని అర్థం.) అందువల్లనే స్వరోచి (స్వరోచిస్సు) అను పేరుతో ప్రసిద్ధిని పొందెను.

వవృధే చ మహాభాగో వయసాఽనుదినం తథా ।
గుణౌఘైశ్చ యథా బాలః కలాభిః శశలాఞ్ఛనః ॥8॥

స జగ్రాహ ధనుర్వేదం వేదాంశ్చైవ యథాక్రమమ్ ।
విద్యాశ్చైవ మహాభాగస్తదా యౌవనగోచరః ॥9॥

చంద్రుని కళలు ఏ విధముగా శుక్లపక్షమునందు దినదినప్రవర్ధమానమగునో అట్లే ఆ బాలుని గుణసమూహములు కూడా ప్రతిదినము వయస్సుననుసరించి వృద్ధిపొందెను. ఆ బాలుడు క్రమానుసారముగా ధనుర్వేదము, చతుర్వేదములు, చతుర్దశవిద్యలను గ్రహించెను. పిమ్మట ఆ బాలుడు యౌవనదశకు చేరుకొనెను.

మన్దరాద్రౌ కదాచిత్స విచరంశ్చారుచేష్టితః ।
దదర్శైకాం తదా కన్యాం గిరిప్రస్థే భయాతురామ్ ॥10॥

సుందరమైన చేష్టలు గల ఆ స్వరోచి ఒకనాడు మందరపర్వతమందు విహరించుచుండగా ఆ పర్వతప్రాంతమందు భయాతురురాలైన ఒక కన్యను చూచెను.

త్రాయస్వేతి నిరీక్ష్యైనం సా తదా వాక్యమబ్రవీత్ ।
మా భైషీరితి స ప్రాహ భయవిప్లుతలోచనామ్ ॥11॥

ఆ కన్య అతడిని చూచి "రక్షించుము" అని పలికెను. భయముతో ఉపద్రవము (సహజస్థితి లేకపోవుట) చెందిన కన్నులుగల ఆమెను భయపడవలదని స్వరోచి పలికెను.

కిమేతదితి తేనోక్తే వీరవాక్యే మహాత్మనా ।
తతః సా కథయామాస శ్వాసక్షేపప్లుతాక్షరమ్ ॥12॥

"ఇది ఏమి? ఎందుకు భయపడుచున్నావు" అని మహాత్ముడగు స్వరోచి వీరోచితవాక్యమును పలుకగా, ఆ కన్య ఊపిరి గట్టిగా పీల్చుతూ విడగొట్టిన మాటలతో ఇట్లు చెప్పనారంభించెను.

కన్యోవాచ – కన్య పలికింది.

అహమిన్దీవరాఖ్యస్య సుతా విద్యాధరస్య వై ।
నామ్నా మనోరమా జాతా సుతాయాం మరుధన్వనః ॥13॥

నేను ఇందీవరుడను పేరుగల విద్యాధరుని కుమార్తెను. నా పేరు మనోరమ. నేను మరుధన్వుని కుమార్తె గర్భమందు జన్మించితిని. (మరుధన్వుని కూతురు నా తల్లి.)

మన్దారవిద్యాధరజా సఖీ మమ విభావరీ ।
కలావతీ చాప్యపరా సుతా పారస్య వై మునేః ॥14॥

మందారుడను పేరుగల విద్యాధరుని కుమార్తె విభావరి, పారమునియొక్క కుమార్తె కలావతి ఈ ఇరువురు నా స్నేహితురాండ్రు.

తాభ్యాం సహ మయా యాతం కైలాసతటముత్తమమ్ ।
తత్ర దృష్టో మునిః కశ్చిత్తపసాఽతికృశాకృతిః ॥15॥

ఆ ఇరువురి స్నేహితురాండ్రతో నేనొకనాడు ఉత్తమమైన కైలాసపర్వతప్రాంతమునకు వెళ్ళితిని. అచ్చట తపస్సువలన మిక్కిలి కృశించిన దేహముగల ఒక మునిని చూచితిని.

క్షుత్క్షామకంఠో నిస్తేజా దూరపాతాక్షితారకః ।
మయావహసితః క్రుద్ధః స తదా మాం శశాప హ ॥16॥

ఆకలిబాధతో నీరసించిన కంఠము గలవాడు, తేజస్సు నశించినవాడు, లోపలికిపోయిన కన్నులు కలవాడు అగు అట్టి మునిని నేను పరిహసించితిని. అంతట కోపగించిన ఆ ముని నన్ను శపించెను.

క్షామక్షామస్వరః కిఞ్చిత్ కంపితాధరపల్లవః ।
త్వయావహసితో యస్మాదనార్యే దుష్టతాపసి ॥17॥

తస్మాత్త్వామచిరేణైవ రాక్షసోఽభిభవిష్యతి ।

నీరసించిన కంఠస్వరముగలవాడు, వణకుచున్న చిగురుటాకులవంటి పెదవులు కలవాడు అగు ఆ ముని "ఓ దుష్టురాలా! దుష్టతాపసీ! నీవు నన్ను పరిహసించితివి గావున తొందరలోనే రాక్షసుడొకడు నిన్ను పరాభవించగలడు" అని నన్ను శపించెను.

దత్తే శాపే మత్సఖీభ్యాం స తు నిర్భర్త్సితో మునిః ॥18॥

ధిక్తే బ్రాహ్మణ్యమక్షాన్త్యా హతం తే నిఖిలం తపః ।
అమర్షణైర్ధర్షితోఽసి తపసా నాతికర్శితః ॥19॥

క్షాన్త్యాస్పదం వై బ్రాహ్మణ్యం క్రోధసంయమనం తపః ।
ఏతచ్ఛ్రుత్వా దదౌ శాపం తయోరప్యమితద్యుతిః ॥20॥

ఏకస్యాః కుష్ఠమఙ్గేషు భావ్యన్యస్యాస్తథా క్షయః ।
తయోస్తథైవ తజ్జాతం యథోక్తం తేన తత్క్షణాత్ ॥21॥

ఆ ముని నన్నిట్లు శపించగా నా స్నేహితురాండ్రు ఆ మునిని "నీ బ్రాహ్మణ్యము నిందింపతగినది. సహనగుణము లేనందున నీ తపస్సు అంతయు నశించినది. నీ క్రోధము కారణముగా నీవు అసహనమునకు లోనైతివి. తపస్సుల కారణముగా నీవు కృశించలేదు. బ్రాహ్మణ్యమనగా క్షమాగుణమునకు నిలయము. కోపమును

అణగఁద్రొక్కుకొనుటే తపస్సనగా" అని దుర్భాషలాడిరి. అమితమైన ప్రకాశము కలిగిన ఆ ముని వారి దుర్భాషలను విని ఒకరికి కుష్ఠురోగము మరొకరికి క్షయరోగము వచ్చువిధముగా వారిరువురినీ కూడా శపించెను. ఆ క్షణమందే వారిరువురికీ ఆ రోగములు సంప్రాప్తించెను.

మమాప్యేవం మహద్రక్షః సముపైతి పదానుగమ్ ।
న శృణోషి మహానాదం తస్యాదూరేఽపి గర్జతః ॥22॥

ఆ ముని నన్ను శపించినవిధంగా కూడా పెద్ద రాక్షసుడు నా వెంటబడుచున్నాడు. నా సమీపమందే గర్జించుచున్న ఆ రాక్షసుని గొప్ప ధ్వనిని నీవు వినుటలేదా ఏమి?

తృతీయమద్య దివసం యన్మే పృష్ఠం న ముఞ్చతి । ।
అస్త్రగ్రామస్య సర్వస్య హృదయజ్ఞాఽహమద్య తే ॥23॥

తం ప్రయచ్ఛామి మాం రక్ష రక్షసోఽస్మాన్మహామతే ।
ప్రాదాత్స్వాయంభువస్యాదౌ స్వయం రుద్రః పినాకధృక్ ॥24॥

స్వాయంభువో వసిష్ఠాయ సిద్ధవర్యాయ దత్తవాన్ ।
తేనాపి దత్తం మన్మాతుః పిత్రే చిత్రాయుధాయ వై ॥25॥

ప్రాదాదౌద్వాహికం సోఽపి మత్పిత్రే శ్వశురః స్వయమ్ ।
మయాపి శిక్షితం వీర సకాశాద్బాలయా పితుః ॥26॥

హృదయం సకలాస్త్రాణామశేషరిపునాశనమ్ ।
తదిదం గృహ్యతాం శీఘ్రమశేషాస్త్రపరాయణమ్ ॥27॥

తతో జహి దురాత్మానమేనం రాక్షసమాగతమ్ ॥28॥

నేటికి మూడవరోజు. ఏ విధముగాను అతడు నన్ను విడచుట లేదు. సమస్త అస్త్రముల హృదయమునెరిగిన నేను ఈ ప్రసిద్ధమైన అస్త్రమును నీకు ఇచ్చుచున్నాను. ఓ గొప్ప బుద్ధిమంతుడా ! ఈ ఆయుధముతో ఆ రాక్షసుని బారి నుండి నన్ను రక్షింపుము. ఈ అస్త్రమును మునుపు పినాకపాణియగు పరమేశ్వరుడు స్వాయంభువమనువుకు ఇచ్చియుండెను. సిద్ధులలో శ్రేష్ఠుడగు వసిష్ఠునికి ఆ అస్త్రమును స్వాయంభువమనువు ఇచ్చెను. ఆ వసిష్ఠుడు కూడా ఆ అస్త్రమును నా తల్లితండ్రి అనగా నా మాతామహుడగు చిత్రాయుధుడనువానికి ఇచ్చెను. అతడు కూడా ఆ అస్త్రమును నా తండ్రికి వివాహసమయమందు ఇచ్చెను. ఓ వీరుడా ! బాల్యమునందే నేను నా తండ్రివద్ద అస్త్రవిద్యను అభ్యసించితిని. ఈ అస్త్రము సమస్త అస్త్రములకు హృదయము వంటిది. సమస్త శత్రువులను నాశనము చేయునది. సమస్త అస్త్రములు చేయు కార్యమును ఈ ఒక్క అస్త్రమే చేయగలదు. అట్టి అస్త్రమును శీఘ్రముగా గ్రహింపుము. దీనితో నా వెంట పడుచున్న దుర్మార్గుడగు ఈ రాక్షసుని చంపుము.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

తథేత్యుక్తే తతస్తేన వార్యుపస్పృశ్య తస్య తత్ ।
అస్త్రాణాం హృదయం ప్రాదాత్ సరహస్యనివర్తనమ్ ॥29॥

స్వరోచి అట్లేయని పలుకగా, ఆమె (మనోరమ) జలస్పర్శ గావించి (పరిశుద్ధురాలై) ఆ గొప్ప అస్త్రమును మంత్రపూర్వకముగా మంత్రరహస్యమును నివృత్తము చేసి అతడికి ఇచ్చెను.

ఏతస్మిన్నన్తరే రక్షస్తత్తదాభీషణాకృతిః ।
నర్దమానం మహానాదమాజగామ త్వరాఽన్వితమ్ ॥30॥

ఇంతలో భయంకరమైన ఆకారముగల ఆ రాక్షసుడు పెద్ద ధ్వనితో గర్జించుచూ వేగముగా అచ్చటికి వచ్చెను.

మయాఽభిభూతా కిం త్రాణముపైతి ద్రుతమేహి మే ।
భక్షాయ కిం చిరేణేతి బ్రువాణం తద్దదర్శ సః ॥31॥

"నాచేత ఆక్రమింపబడిన నీవు రక్షింపబడెదవా ఏమి? వేగముగా నేను తినుటకై నీవు నావద్దకు రా! ఆలస్యమెందులకు" అని పలుకుచున్న రాక్షసుని స్వరోచి చూచెను.

స్వరోచిశ్చిన్తయామాస దృష్ట్వా తం సముపాగతమ్ ।
గృహ్ణాత్యేష వచః సత్యం తస్యాస్త్వితి మహామునేః ॥32॥

మనోరమను సమీపించిన రాక్షసుని చూచి "ఈ రాక్షసుడు ఈమెను తప్పక పట్టుకొనును. శపించిన ఆ మహామునియొక్క మాటలు సత్యము గానీ !" అని స్వరోచి తనలో తలచెను.

జగ్రాహ సముపేత్యైనాం త్వరయా సోఽపి రాక్షసః ।
త్రాహి త్రాహీతి కరుణం విలపన్తీం సుమధ్యమామ్ ॥33॥

స్వరోచి ఇట్లు ఆలోచించుచుండగనే, ఆ రాక్షసుడు కూడా వేగముగా వచ్చి "రక్షించుము, రక్షించుము" అని దీనముగా విలపించుచున్న అందమైన నడుముగల ఆమెను పట్టుకొనెను.

తతః స్వరోచిః సంక్రుద్ధశ్చణ్డాస్త్రమతిభైరవమ్ ।
దృష్ట్వా నివేశ్య తద్రక్షో దదర్శానిమిషేక్షణః ॥34॥

పిమ్మట స్వరోచి మిక్కిలి క్రోధముగలవాడై ధనుస్సునందు అత్యంత భయంకరమగు ప్రచండాస్త్రమును ఎక్కుపెట్టి, కళ్ళు మూయకుండా తదేకదృష్టితో ఆ రాక్షసునివైపు చూసెను.

తదాభిభూతః స తదా తాముత్సృజ్య నిశాచరః ।
ప్రసీద శామ్యతామస్త్రం శ్రూయతాం చేత్యభాషత ॥35॥

అంతట తిరస్కరింపబడిన ఆ రాక్షసుడు ఆమెను విడిచిపెట్టి "అనుగ్రహించుము, ఆయుధము ఉపశమింపబడుగాక! నా మాటను వినుము" అని స్వరోచితో పలికెను.

మోక్షితోఽహం త్వయా శాపాదతిఘోరాన్మహాద్యుతే ।
ప్రదత్తాదతితీవ్రేణ బ్రహ్మమిత్రేణ ధీమతా ॥36॥

ఓ గొప్ప ప్రకాశము గలవాడా ! జ్ఞానియగు బ్రహ్మమిత్రుడు ఇచ్చిన మిక్కిలి తీవ్రమైనదీ, భయంకరమైనదీయగు శాపమునుండి నీ వలన నేను విడిపింపబడ్డాను.

ఉపకారో న మే త్వత్తో మహాభాగాధికోఽపరః ।
యేనాహం సుమహాకష్టాన్మహాశాపాద్విమోక్షితః ॥37॥

మీతో సమానముగా నాకు ఉపకారము చేయువారు మరొకరు ఎవరూ లేరు. ఎందువలననగా గొప్ప కష్టమును కలిగించు పెద్ద శాపమునుండి మీరు నన్ను విముక్తుణ్ణి గావించితిరి.

స్వరోచిరువాచ – స్వరోచి పలికాడు.

బ్రహ్మమిత్రేణ మునినా కిం నిమిత్తం మహాత్మనా ।
శప్తస్త్వం కీదృశశ్చైవ శాపో దత్తోఽభవత్పురా ॥38॥

మహాత్ముడగు బ్రహ్మమిత్రమునివలన నీవెందుకు శపింపబడినావు? పూర్వము ఆ మునిచేత నీకెట్టి శాపము ఇవ్వబడినది?

రాక్షస ఉవాచ – రాక్షసుడు చెప్పాడు.

బ్రహ్మమిత్రోఽష్టధా భిన్నమాయుర్వేదమధీతవాన్ ।
త్రయోదశాధికారం చ ప్రగృహ్యాథర్వణో ద్విజః ॥39॥

అహం చేన్దీవరాక్షేతి ఖ్యాతోఽస్యా జనకోఽభవమ్ ।
విద్యాధరపతేః పుత్రో నలనాభస్య ఖడ్గినః ॥40॥

మయా చ యాచితః పూర్వం బ్రహ్మమిత్రోఽభవన్మునిః ।
ఆయుర్వేదమశేషం మే భగవన్దాతుమర్హసి ॥41॥

యదా తు బహుశో వీర ప్రశ్రయావనతస్య మే ।
న ప్రాదాద్యాచితో విద్యామాయుర్వేదాత్మికాం మమ ॥42॥

శిష్యేభ్యో దదతస్తస్య మయాన్తర్ధానగేన హి ।
ఆయుర్వేదాత్మికా విద్యా గృహీతాఽభూత్తదానఘ ॥43॥

గృహీతాయాం తు విద్యాయాం మాసైరష్టాభిరన్తరాత్ ।
మమాతిహర్షాదభవద్ధాసోఽతీవ పునః పునః ॥44॥

బ్రాహ్మణుడగు బ్రహ్మమిత్రుడు పదమూడు విభాగములు కలిగిన అధర్వణవేదమును బాగుగా గ్రహించి, ఎనిమిది భాగములుగా విభజింపబడిన ఆయుర్వేదమును అధ్యయనము చేసెను. నేను ఇందీవరుడను పేరుతో ప్రసిద్ధుడైనవాడను. ఈమెకు నేను తండ్రిని. విద్యాధర ప్రభువు, ఖడ్గధారీయగు నలనాభుని పుత్రుడను. "ఆయుర్వేద శాస్త్రమును నాకు సంపూర్ణముగా ప్రసాదించండి" అని నేను పూర్వం బ్రహ్మమిత్రమునిని యాచించితిని. ఓ వీరుడా ! వినయవిధేయతలతో మాటిమాటికీ యాచించినప్పటికీ గూడా ఆ ముని ఆయుర్వేదవిద్యను నాకు ప్రసాదించలేదు. ఓ పాపరహితుడా ! ఆ ముని తమ శిష్యులకు ఆయుర్వేదవిద్యను ప్రదానము చేయు సమయమందు నేను మాటుగా దాగియుండి ఆయుర్వేదవిద్యను గ్రహించితిని. ఎనిమిది మాసములలోపల ఆయుర్వేదవిద్యనభ్యసించిన తరువాత నేను మిక్కిలి ఆనందమును పొందితిని మరియు సంతోషముతో మాటిమాటికీ నవ్వుచుంటిని.

ప్రత్యభిజ్ఞాయ మాం హాసాన్మునిః కోపసమన్వితః ।
వికంపికంధరః ప్రాహ మామిదం పరుషాక్షరమ్ ॥45॥

అప్పుడా ముని నా నవ్వుకు కారణమును తెలుసుకొని కోపగించినవాడై, కంపించుచున్న స్వరముతో నన్నుగురించి పరుషముగా ఇట్లు మాట్లాడెను.

రాక్షసేనేవ యస్మాన్మే త్వయాऽదృశ్యేన దుర్మతే ।
హృతా విద్యాऽవహాసశ్చ మామవజ్ఞాయ వై కృతః ॥46॥

ఓ దుర్బుద్ధిగలవాడా ! నీవు రాక్షసునివలే అదృశ్యమై ఈ విద్యను గ్రహించితివి. మరియు నన్ను అవమానపూర్వకముగా పరిహసించితివి.

తస్మాత్త్వం రాక్షసః పాప మచ్ఛాపేన నిరాకృతః ।
భవిష్యసి న సన్దేహః సప్తరాత్రేణ దారుణః ॥47॥

ఓ పాపీ ! ఈ కారణముచేత నా శాపమువలన నీవు నిరాకరింపబడి అనగా నీ శక్తిని కోల్పోయి ఏడు రాత్రులలోనే భయంకరమైన రాక్షసుడవు కాగలవు.

ఇత్యుక్తే ప్రణిపాతాద్యైరుపచారైః ప్రసాదితః ।
స మామాహ పునర్విప్రస్తత్క్షణాత్ మృదుమానసః ॥48॥

యన్మయోక్తమవశ్యం తద్భావి గన్ధర్వ! నాన్యథా ।
కిన్తు త్వం రాక్షసో భూత్వా పునః స్వం ప్రాప్స్యసే వపుః ॥49॥

నష్టస్మృతిర్యదా క్రుద్ధః స్వమపత్యం చిఖాదిషుః ।
నిశాచరత్వే గన్తాసి తదస్త్రానలతాపితః ॥50॥

పునః సంజ్ఞామవాప్య స్వామవాప్స్యసి నిజం వపుః ।
తథైవ స్వమధిష్ఠానం లోకే గన్ధర్వసంజ్ఞితే ॥51॥

ఆ ముని నన్నిట్లు శపించగా నేను ఆయన పాదములపై బడి అనేక ఉపచారములతో ఆయన ప్రసన్నుడగు విధముగా చేసితిని. అప్పుడా మునిబ్రాహ్మణుడు వెంటనే ప్రసన్నుడై తిరిగి ఇట్లు పలికెను. ఓ గంధర్వుడా ! నేను పలికినది తప్పక జరిగి తీరును. దీనికి తిరుగు లేదు. అయినా నీవు మొదట రాక్షసుడవై, అటుపిమ్మట తిరిగి నీ శరీరమును నీవు పొందెదవు. నీవు రాక్షసత్వము పొందిన వెంటనే నీ యథార్థ గంధర్వజన్మస్మృతులనన్నిటినీ మరచినవాడవై, క్రోధమునకు వశమై నీ కుమార్తెనే నీవు తినాలనే కోరిక గలవాడవు అగుదువు. పిమ్మట నీవు ఆమె అస్త్రాగ్నిచే తాపము చెందినవాడవై మరల నీవు నీ యథార్థగంధర్వజన్మస్మృతులు గలవాడవై నీ యథార్థగంధర్వరూపమును, గంధర్వలోకమందు నీ అధికారమును పొందగలవు.

సోఽహం త్వయా మహాభాగ ! మోక్షితోఽస్మ్యమహాభయాత్ ।
నిశాచరత్వాద్యద్వీర! తేన మే ప్రార్థనాం కురు ॥52॥

ఓ మహానుభావుడా ! అట్టి నేను ఈ భయంకరమైన రాక్షసరూపమునుండి నీచేత విడిపింపబడితిని. ఓ వీరుడా ! అందువలన నా ప్రార్థనను మన్నింపుము.

ఇమాం తే తనయాం భార్యాం ప్రయచ్ఛామి ప్రతీచ్ఛ తామ్ ।
ఆయుర్వేదశ్చ సకలస్త్వష్టాఙ్గో యో మయా తతః ॥
మునేః సకాశాత్ సంప్రాప్తస్తం గృహ్ణీష్వ మహామతే ॥53॥

ఓ గొప్ప బుద్ధిమంతుడా ! ఈ నా కుమార్తెను నీకు భార్యగా ఇచ్చుచున్నాను. అందుకు అంగీకరించి స్వీకరించుము. అంతేగాక ఆ మునినుండి నేను అభ్యసించిన అష్టాంగమైన సంపూర్ణ ఆయుర్వేదవిద్యను కూడా నీకు ప్రసాదించుచున్నాను, గ్రహించుము.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

ఇత్యుక్త్వా ప్రదదౌ విద్యాం స చ దివ్యాంబరోజ్జ్వలః ।
స్రగ్భూషణధరో దివ్యం పౌరాణం వపురాస్థితః ॥54॥

దత్త్వా విద్యాం తతః కన్యాం స దాతుముపచక్రమే ।
తమాహ సా తదా కన్యా జనితారం స్వరూపిణమ్ ॥55॥

దివ్యములైన వస్త్రములచే ప్రకాశించుచున్నవాడునూ, పుష్పమాలలు ఆభరణములను ధరించినవాడునూ, తన పూర్వరూపమగు దివ్యమైన గంధర్వరూపమును పొందిన వాడునూ అగు ఆ గంధర్వుడు ఇట్లు పలికి స్వరోచికి ఆయుర్వేద విద్యను ప్రదానము చేసెను. ఆ విద్యను ప్రదానము చేసిన పిమ్మట తన కుమార్తెను అతనికిచ్చుటకు ఉపక్రమించెను. అంతట ఆ కన్య (మనోరమ) నిజరూపధారియగు తన తండ్రితో ఇట్లు పలికెను.

అనురాగో మమాప్యత్ర తాతాతీవ మహాత్మని ।
దర్శనాదేవ సంజాతో విశేషేణోపకారిణి ॥56॥

కిన్త్వేషా మే సఖీ సా చ మత్కృతే దుఃఖపీడితే ।
అతో నాభిలషే భోగాన్భోక్తుమేతేన వై సమమ్ ॥57॥

పురుషైరపి నో శక్యా కర్తుమిత్థం నృశంసతా ।
స్వభావరుచిరైర్మాదృక్కథం యోషిత్కరిష్యతి ॥58॥

సాఽహం యథా తే దుఃఖార్తే మత్కృతే కన్యకే పితః ।
తథా స్థాస్యామి దుఃఖార్తా తచ్ఛోకానలతాపితా ॥59॥

ఓ తండ్రీ ! నాకు విశేషముగా ఉపకారము చేసిన ఈ మహాత్ముని చూచినంతనే ఇతనియందు నాకు కూడా మిక్కిలి ప్రేమ కలిగినది. కాని నా ఇద్దరు స్నేహితురాండ్రు నా కారణమున దుఃఖముననుభవించుచున్నారు. అందువలన ఈతనితో కూడి భోగములను అనుభవించుటకు నేను అభిలషించుటలేదు. పురుషులు కూడా ఇట్టి కఠినమైనదానిని ఆచరించలేరు. అటువంటప్పుడు సహజముగా మృదుస్వభావముగల నావంటి స్త్రీ ఎట్లు ఆచరించగలదు? ఓ తండ్రీ ! కన్యకలగు నా స్నేహితురాండ్రు నా కొరకు ఏవిధముగా దుఃఖముననుభవించుచున్నారో అట్లే నేను కూడా వారి దుఃఖాగ్నిచే సంతాపమును పొందుచూ వారివలే ఉండెదను.

స్వరోచిరువాచ – స్వరోచి చెప్పాడు.

ఆయుర్వేదప్రసాదేన తే కరిష్యే పునర్నవే ।
సఖ్యౌ తవ మహాశోకం సముత్సృజ సుమధ్యమే ॥60॥

ఓ అందమైన నడుముగలదానా ! ఆయుర్వేదవిద్యయొక్క అనుగ్రహముచే నీ ఇద్దరు చెలికత్తెలను మరల క్రొత్తవారిగా అనగా రోగవిముక్తలైన వారగునట్లుగా చేసెదను. కావున ఈ గొప్ప దుఃఖమును విడిచిపెట్టుము.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

తతః పిత్రా స్వయం దత్తాం తాం కన్యాం సవిధానతః ।
ఉపయేమే గిరౌ తస్మిన్ స్వరోచిశ్చారులోచనామ్ ॥61॥

దత్త్వాం తు తాం తదా కన్యామభిసాన్త్వ్య చ భావినీమ్ ।
జగామ దివ్యయా గత్యా గంధర్వః స్వపురం తతః ॥62॥

అంతట ఆమె తండ్రిచే స్వయముగా ఇవ్వబడిన అందమైన కనులుగల ఆ కన్యను అనగా మనోరమను శాస్త్రోక్తప్రకారము స్వరోచి ఆ మందరపర్వతమందు వివాహము చేసుకొనెను. తనచే వివాహమందు దానముగా ఇవ్వబడిన మంచి హృదయముగల తన కుమార్తెయగు మనోరమను ఓదార్చి ఆ గంధర్వుడు దివ్యమైన గమనముతో తన పట్టణమునకు వెళ్ళెను.

స చాపి సహితస్తన్వ్యా తదుద్యానం తదా యయౌ ।
కన్యకాయుగళం యత్ర తచ్చాపోత్థగదాతురమ్ ॥63॥

తతస్తయోః స తత్త్వజ్ఞో రోగఘ్నైరౌషధై రసైః ।
చకార నీరుజే దేహే స్వరోచిరపి రాజతః ॥64॥

తతోఽతిశోభనే కన్యే విముక్తే వ్యాధితః శుభే ।
స్వకాన్త్యా జ్యోతిదిగ్భాగం చక్రాతే తన్మహీధరమ్ ॥65॥

స్వరోచి కూడా సుందరాంగియగు తన భార్యతో కూడి ఏ ఉద్యానవనమందయితే మునిశాపముచే రోగగ్రస్తులై పడియున్న కన్యకలు ఇద్దరూ ఉన్నారో ఆ ఉద్యానవనమునకు వెళ్ళెను. పిమ్మట ఆయుర్వేదశాస్త్రతత్త్వమునెరిగిన ఆ స్వరోచి రోగనాశకములైన రసౌషధములతో ఆ ఇద్దరు కన్యకల దేహములను రోగము లేనివానివిగా చేసెను. అంతట వ్యాధులనుండి విముక్తలైన అత్యంతరూపవతులగు ఆ ఇద్దరు కన్యకలు తమ శరీరావయవకాంతులతో ఆ పర్వతమందలి సమస్త దిక్కులను దీప్తిమంతములను చేసిరి.

ఇతి శ్రీమార్కండేయమహాపురాణే స్వారోచిషే మన్వన్తరే షష్టితమోఽధ్యాయః ॥60॥

శ్రీ మార్కండేయమహాపురాణమందలి స్వారోచిషమన్వంతరమను అరువదవ అధ్యాయం సమాప్తం.



ఏకషష్టితమోஉధ్యాయః – అరువది ఒకటవ అధ్యాయం
స్వారోచిషమన్వన్తరమ్ – స్వారోచిషమన్వంతరం

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

> **ఏవం విముక్తరోగా తు కన్యకా తం ముదాన్వితా ।**
> **స్వరోచిషమువాచేదం శృణుష్వ వచనం ప్రభో! ॥1॥**

మనోరమయొక్క ఇద్దరు చెలికత్తెలలో మొదటి ఆమె తనకు శాపమువలన సంభవించిన రోగము నుండి విముక్తురాలై సంతోషముతో కూడుకొన్నదై స్వరోచితో ఇట్లు పలికెను. "ఓ ప్రభూ! నా మాటను వినుడు".

> **మన్దారవిద్యాధరజా నామ్నా ఖ్యాతా విభావరీ ।**
> **ఉపకారిన్ స్వమాత్మానం ప్రయచ్ఛామి ప్రతీచ్ఛ మామ్ ॥2॥**

> **విద్యాం చ తుభ్యం దాస్యామి సర్వభూతరుతాని తే ।**
> **యయాభివ్యక్తిమేష్యన్తి ప్రసాదప్రవణో భవ ॥3॥**

నేను మందారుడను పేరుగల విద్యాధరుని కుమార్తెను. నాపేరు విభావరి. ఓ ఉపకారము చేసినవాడా! నా ఆత్మను మీకు సమర్పించుచున్నాను. నన్ను విశ్వసింపుము. ఏ విద్యవలన అన్ని ప్రాణుల ధ్వనుల (శబ్దముల) భావము తెలియునో అట్టి విద్యను మీకు ఇచ్చుచున్నాను. దయతో స్వీకరింపుము.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

> **ఏవమస్త్వితి తేనోక్తే ధర్మజ్ఞేన స్వరోచిషా ।**
> **ద్వితీయా తు తదా కన్యా ఇదం వచనమబ్రవీత్ ॥4॥**

ధర్మమునెరిగిన స్వరోచి "అట్లే అగుగాక!" అని పలుకగా రెండవ కన్య (స్నేహితురాలు) ఈ విధముగా పలికెను.

> **కుమారబ్రహ్మచార్యాసీత్ పారో నామ పితా మమ ।**
> **బ్రహ్మర్షిస్సుమహాభాగో వేదవేదాంగపారగః ॥5॥**

బాల్యమునందే బ్రహ్మచర్యమునవలంబించినవాడు, వేదవేదాంగాలలో నిష్ణాతుడు, మహానుభావుడు, బ్రహ్మర్షియగు "పారు"డను పేరు గలవాడు నా తండ్రి.

> **తస్య పుంస్కోకిలాలాపరమణీయే మధౌ పురా ।**
> **ఆజగామాప్సరోஉభ్యాశం ప్రఖ్యాతా పుఞ్జికస్థలా ॥6॥**

పుంస్కోకిలల రమణీయధ్వనులతో కూడుకొన్న వసంతకాలమందు పుంజికస్థలయను ప్రసిద్ధురాలైన అప్సరస నా తండ్రి సమీపమునకు వచ్చెను. (పుంస్కోకిల+ఆలాప = పుంస్కోకిలాలాప)

కామవైక్లవ్యతాం నీతః స తదా మునిపుఙ్గవః ।
తత్సంయోగేఽహముత్పన్నా తస్యామత్ర మహాచలే ॥7॥

ఆ మునిశ్రేష్ఠుడు ఆ సమయమందు కామమునకు లోనయ్యెను. పిమ్మట అతని సంయోగమువలన ఆ అప్సరసకు ఈ మహాపర్వతమందు నేను జన్మించితిని.

విహాయ మాం గతా సా చ మాతాఽస్మిన్నిర్జనే వనే ।
బాలామేకాం మహీపృష్ఠే వ్యాలశ్వాపదసంకులే ॥8॥

సర్పములు క్రూరజంతువులతో నిండిన ఈ నిర్జనవనమందు నన్ను ఒంటరిగా విడిచిపెట్టి నా తల్లి వెళ్ళిపోయెను.

తతః కలాభిః సోమస్య వర్ధన్తీభిరహఃక్షయే ।
ఆప్యాయమానాఽహరహో వృద్ధిం యాతాఽస్మి సత్తమ! ॥9॥

ఓ మహానుభావుడా! అప్పుడు శుక్లపక్షమందు పెరుగుచున్న చంద్రుని కళలతోబాటు నేను కూడా పరిపుష్టురాలనై, రోజురోజుకు వృద్ధిని పొందనారంభించితిని.

తతః కలావతీత్యేతన్మమ నామ మహాత్మనా ।
గృహీతాయాః కృతం పిత్రా గంధర్వేణ శుభాత్మనా ॥10॥

అంతట మహాత్ముడూ, శుభస్వరూపుడూ, గంధర్వుడూ అగు నా తండ్రి నాకు "కళావతి"యను పేరుపెట్టెను.

న దత్తాఽహం తదా తేన యాచితేన మహాత్మనా ।
దేవారిణా నిశాసుప్తస్తతో మే ఘాతితః పితా ॥11॥

గొప్ప రాక్షసుడొకడు నన్ను ఇమ్మని అడుగగా, నా తండ్రి అందుకు ఒప్పుకొనక అతడికి నన్ను (వివాహార్థమై) ఇవ్వలేదు. అంతట రాత్రివేళ నిద్రించుచున్న నా తండ్రి ఆ రాక్షసునిచేత చంపబడినాడు.

తతోఽహమతినిర్వేదాదాత్మవ్యాపాదనోద్యతా ।
నివారితా శంభుపత్న్యా సత్యా సత్యప్రతిశ్రవా ॥12॥

అంతట నేను మిక్కిలి దుఃఖితురాలనై, దృఢప్రతిజ్ఞ గలదాననై ప్రాణములను విడుచుటకు ఉద్యుక్తురాలను అయితిని. ఆ సమయమందు పరమేశ్వరుని భార్య అయిన సతీదేవిచే నేను వారింపబడితిని.

మా శుచః సుభ్రు! భర్తా తే మహాభాగో భవిష్యతి ।
స్వరోచిర్నామ పుత్రశ్చ మనుస్తస్య భవిష్యతి ॥13॥

ఆజ్ఞాం చ నిధయస్సర్వే కరిష్యన్తి తవాదృతాః ।
యథాభిలషితం విత్తం ప్రదాస్యన్తి చ తే శుభే ॥14॥

**యస్యా వత్సే ప్రభావేణ విద్యాయాస్తాం గృహాణ మే ।
పద్మినీ నామ విద్యేయం మహాపద్మాభిపూజితా ॥15॥**

**ఇత్యాహ మాం దక్షసుతా సతీ సత్యపరాయణా ।
స్వరోచిస్త్వం ధ్రువం దేవీ నాన్యథా సా వదిష్యతి ॥16॥**

**సా౽హం ప్రాణప్రదాయాద్య తాం విద్యాం స్వం తథా వపుః ।
ప్రయచ్ఛామి ప్రతీచ్ఛ తం ప్రసాదసుముఖో భవ ॥17॥**

దక్షుని కుమార్తె, సత్యపరాయణురాలూ అగు సతీదేవి నాతో ఇట్లు పలికెను. "ఓ అందమైన కనుబొమలు గలదానా! దుఃఖించవలదు. స్వరోచియను పేరుగల ఒక మహానుభావుడు నీకు భర్త కాగలడు. మనువు అను పేరుగల కుమారుడు మీకు జన్మించగలడు. ఆదరింపబడిన నిధులన్నియు నీ ఆజ్ఞను పాలించగలవు. ఓ మంగళస్వరూపురాలా ! నీవు కోరుకున్న సంపదను ఆ నిధులు ప్రసాదించగలవు. ఓ కుమారీ ! ఏ విద్యాప్రభావముతో నిధిగణాలన్నియు నీ ఆజ్ఞానువర్తులగునో అట్టి మహాపద్మాభిపూజితయగు పద్మినియను పేరుగల విద్యను నా నుండి గ్రహించుము" అని. అందువలన నీవు నిశ్చయముగా స్వరోచివే. సందేహము లేదు. దేవి ఎన్నటికీ అసత్యమాడదు. అట్టి నేను ప్రాణప్రదాతయగు తమకు ఆ విద్యను, నా శరీరమును ఇచ్చుచున్నాను. దయతో గ్రహింపుడు. మీరు నాయందు ప్రసన్నత చెంది నన్ను అనుగ్రహింపుడు.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పుచున్నాడు.

**ఏవమస్త్వితి తామాహ స తు కన్యాం కలావతీమ్ ।
విభావర్యాః కలావత్యాః స్నిగ్ధదృష్ట్యా౽నుమోదితః ॥18॥**

**జగ్రాహ చ తతః పాణీ స తయోరమరద్యుతిః ।
నదత్సు దేవతూర్యేషు నృత్యన్తీష్వప్సరస్సు చ ॥19॥**

అనంతరము స్వరోచి "అట్లే అగుగాక!" అని కళావతితో పలికెను. ప్రేమమయమైన చూపులుగల విభావరీకళావతుల ఆమోదముతో దేవకాంతిగల స్వరోచి వారిరువురిని పెండ్లియాడెను. దేవతలు మంగళవాద్యములను మ్రోగించిరి. అప్సరసలు నృత్యము చేసిరి.

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే స్వారోచిషే మన్వన్తరే ఏకషష్టితమో౽ధ్యాయః ॥61॥

శ్రీ మార్కండేయ మహాపురాణమందలి స్వారోచిషమన్వంతరవృత్తాంతమను అరువదియొకటవ అధ్యాయం సమాప్తం.



ద్విషష్టితమోఽధ్యాయః - అరువదిరెండవ అధ్యాయం
స్వారోచిషమన్వన్తరమ్ - స్వారోచిషమన్వంతరం

మార్కండేయ ఉవాచ - మార్కండేయుడు చెప్పాడు.

తతః స తాభిః సహితః పత్నీభిరమరద్యుతిః ।
రరామ తస్మిన్ శైలేన్ద్రే రమ్యకాననసిర్ఝరే ॥1॥

సర్వోపభోగరత్నాని మధూని మధురాణి చ ।
నిధయః సముపాజగ్ముః పద్మిన్యా వశవర్తినః ॥2॥

స్రజో వస్త్రాణ్యలంకారాన్ గంధాఢ్యమనులేపనమ్ ।
ఆసనాన్యతిశుభ్రాణి కాఞ్చనాని యథేచ్ఛయా ॥3॥

సౌవర్ణాని మహాభాగ కరకాన్భాజనాని చ ।
తథా శయ్యాశ్చ వివిధా దివ్యైరాస్తరణైర్యుతాః ॥4॥

ఏవం స తాభిః సహితో దివ్యగన్ధాధివాసితే ।
రరామ స్వరుచిర్భాభిర్భాసితే వరపర్వతే ॥5॥

పిమ్మట దివ్యతేజోవంతుడగు ఆ స్వరోచి తన భార్యలతో కూడుకొన్నవాడై, అందమైన అడవులు సెలయేళ్ళు కలిగిన ఆ పర్వతశ్రేష్ఠమందు విహరించసాగెను. పద్మినీవిద్యాప్రభావముచే నిధిగణాలన్నియు అతని వశమయ్యెను. సమస్త భోగములను అనుభవించుటకు వివిధములైన రత్నములు, మధురములైన మద్యములు, పుష్పమాలలు, వస్త్రములు, అలంకారములు, శ్రేష్ఠమైన సుగంధానులేపనములు, మిక్కిలి శుభ్రమైన బంగారు నిర్మితములైన ఆసనములు, యథేచ్ఛగా బంగారం వెండిలతో నిర్మితములైన పాత్రలు, వివిధములైన శయ్యలు, దివ్యములైన తివాచీలు వీటన్నింటినీ ఆ నిధిగణాలు వారికి ప్రసాదించినవి. ఈ విధముగా స్వరోచి తన ముప్వురు భార్యలతో కూడుకొన్నవాడై దివ్యగంధాదులకు నిలయము, స్వీయకాంతులతో ప్రకాశించునట్టిది, శ్రేష్ఠపర్వతమూ అగు ఆ హిమాలయపర్వతమందు భోగములను అనుభవించెను.

తాశ్చాపి సహ తేనేతి లేభిరే ముదముత్తమామ్ ।
రమమాణా యథా స్వర్గే తథా తత్ర శిలోచ్చయే ॥6॥

ఆ ముప్వురు భార్యలు కూడా స్వర్గమందు ఆనందముననుభవించునట్లుగా ఆ పర్వతశ్రేష్ఠమందు స్వరోచితోబాటు గొప్ప సంతోషమును పొందిరి.

కలహంసీ జగాదైకాం చక్రవాకీం జలే సతీమ్ ।
తస్య తాసాం చ లలితే సంబంధే చ స్పృహావతీ ॥7॥

ధన్యోఽయమతిపుణ్యోఽయం యోఽయం యౌవనగోచరః ।
దయితాభిః సహైతాభిః భుఙ్క్తే భోగానభీప్సితాన్ ॥8॥

సన్తి యౌవనినః శ్లాఘ్యాః తత్పత్న్యో నాతిశోభనాః ।
జగత్యామల్పకాః పత్న్యః పత్న్యః పతయశ్చాతిశోభనాః ॥9॥

అభీష్టా కస్యచిత్కాన్తా కాన్తః కస్యాశ్చిదీప్సితః ।
పరస్పరానురాగాఢ్యం దాంపత్యమతిదుర్లభమ్ ॥10॥

ధన్యోఽయం దయితాభీష్టో హ్యేతాశ్చాస్యాతివల్లభాః ।
పరస్పరానురాగో హి ధన్యానామేవ జాయతే ॥11॥

అట్టి సమయమందు స్వరోచి మరియు అతని ముప్వురు భార్యలయొక్క పరస్పర లలితసంబంధమును చూచి మిక్కిలి ఆనందించి ఒక ఆడు రాజహంస జలమందున్న ఆడు చక్రవాకముతో ఇట్లు పలికెను “అనురాగవతులైన తన భార్యలతో తనకిష్టమైన భోగములను అనుభవించుచున్న యౌవనమందున్న ఈ యువకుడు ఎంతో ధన్యుడు, మిక్కిలి పుణ్యాత్ముడు. ప్రపంచమునందు రూపముకలిగిన కొనియాడదగిన భర్తలు అనేకులుందురు. కాని వారి భార్యలు మాత్రము అంతటి సౌందర్యము కలిగియుండరు. భార్యాభర్తలిరువురు రూపవంతులై యుండుట అరుదు. ఎచ్చటైనా ఒకానొకపురుషునికి తన భార్య ఇష్టురాలై ఉండును. అట్లే ఒకానొక స్త్రీకి తన భర్త ఇష్టమై ఉండును. కాని పరస్పరానురాగము కలిగిన దాంపత్యము మిక్కిలి దుర్లభము. అనురాగవతులైన భార్యలు కలిగిన ప్రియతముడగు ఈ యువకుడు ధన్యుడు. అట్లే ఈ ముప్వురు భార్యలు కూడా ఇతనికి మిక్కిలి ప్రియురాండ్రు. పరస్పరానురాగము ధన్యజీవులకే లభిస్తుంది.

ఏతన్నిశమ్య వచనం కలహంసీసమీరితమ్ ।
ఉవాచ చక్రవాకీ తాం నాతివిస్మితమానసా ॥12॥

రాజహంసి మాటలాడిన మాటలను విని పెద్దగా విస్మయము చెందని మనస్సుగల చక్రవాకి ఇట్లు పలికెను.

నాయం ధన్యో యతో లజ్జా నాన్యస్త్రీసన్నికర్షతః ।
అన్యాం స్త్రియమయం భుఙ్క్తే న సర్వాస్వస్య మానసమ్ ॥13॥

చిత్తానురాగ ఏకస్మిన్నధిష్ఠానే యతః సఖి ।
తతోఽతిప్రీతిమానేష భార్యాసు భవితా కథమ్ ॥14॥

ఏతా న దయితాః పత్యుర్నైతాసాం దయితః పతిః ।
వినోదమాత్రమేవైతా యథా పరిజనోఽపరః ॥15॥

ఓ సఖీ ! ఈ స్వరోచి ధన్యుడుగాడు. ఒక భార్య సమీపమందు మరియొక భార్యతో రమించుచున్నాడు. ఈతనికి ఎంతమాత్రము సిగ్గు లేదు. ఈతనికి భార్యలందరియందును సమానమగు అభిలాష లేదు. మనస్సునందలి అనురాగము ఒక భార్యయందు మాత్రమే స్థిరమైయున్నవేళ ఇతడు భార్యలందరిపట్ల సమానమైన ప్రీతిగలవాడు ఎట్లగును? ఈ భార్యలందరు ఇతనికి ప్రియురాండ్రుకారు. మరియు ఈ భర్త వీరికందరికి ప్రియతముడు కాడు. ఏ విధముగా అయితే ఇతర పరిజనుల వలన తాత్కాలికమైన వినోదము మనస్సుకు ప్రాపించునో అట్లే ఈ ముప్వురు భార్యలందు గూడా ఈతడికి అట్టి వినోదము మాత్రమే లభించుచున్నది.

ఏతాసాం చ యదీష్టోయం తత్కిం ప్రాణాన్న ముఞ్చతి ।
ఆలిజ్గత్యపరాం కాన్తాం ధ్యాతో వై కాన్తయాన్యయా ॥16॥

ఈ ముప్వురు భార్యలందు ఒకే విధమైన ఇష్టమైన భావము కలిగియున్నయెడల, స్వరోచి ప్రాణములను విడిచిపెట్టకుండా ఉంటాడా యేమి? (ఏ మనుష్యునికీ అట్టి భావము అసంభవమని ఆశయము.) వేరే భార్య ఈతనిని అభిలషించు సమయమందు అతడు వేరే భార్యను ఆలింగనము చేయుచున్నాడు. (అందువలన వీరియందు పరస్పరానురాగము కలిగిన దాంపత్యబంధము లేదని అభిప్రాయము.)

విద్యాప్రదానమూల్యేన క్రీతో హ్యేష సుభృత్యవత్ ।
ప్రవర్తతో న హి ప్రేమ సమం బహ్వీషు తిష్ఠతి ॥17॥

ఈతని భార్యలు తమ తమ విద్యలను ఈతనికి దానమిచ్చినందున ఈతడు వారికి అమ్ముడుపోయినాడు. అందువలన మంచి సేవకునివలే ప్రవర్తించు ఇతనికి బహుభార్యలందు సమానమైన ప్రేమ ఉండదు కదా !

కలహంసి పతిర్ధన్యో మమ ధన్యాऽహమేవ చ ।
యస్యైకస్యాం చిరం చిత్తం యస్యాశ్చైకత్ర సంస్థితమ్ ॥18॥

ఓ సఖీ ! కలహంసీ ! నా భర్త ధన్యుడు, నేనునూ ధన్యురాలను. ఎందువలననగా నా భర్తకు ఒకరియందే అనగా నాయందే మనస్సు స్థిరమైనది. అలాగే నాకు ఒకరియందే అనగా నా భర్తయందే చిత్తము స్థిరమైనది.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

సర్వసత్త్వరుతజ్ఞోऽసౌ స్వరోచిరపరాజితః ।
నిశమ్య లజ్జితో దధ్యౌ సత్యమేవ హి నానృతమ్ ॥19॥

సమస్తప్రాణుల ధ్వనుల భావాలను ఎరిగిన, ఎన్నడూ ఓటమిని ఎరుగని స్వరోచి కలహంసి చక్రవాకిపక్షుల సంభాషణను విని సిగ్గుపడి “వీరు మాటలాడినది నిజమే కదా ! అసత్యము కాదు” అని మనస్సులో భావించెను.

తతో వర్షశతే యాతే రమమాణో మహాగిరౌ ।
రమమాణః సమం తాభిర్దదర్శ పురతో మృగమ్ ॥20॥

సుస్నిగ్ధపీనావయవం మృగీయూథవిహారిణమ్ ।
వాసితాభిః స్వరూపాభిః మృగీభిః పరివారితమ్ ॥21॥

పిమ్మట ఆ మహాపర్వతమందు తన భార్యలతో విహరించుచున్న స్వరోచికి నూరు సంవత్సరములు గడచిపోయెను. ఆ విధముగా విహరించుచుండగా తన ఎదుటనే ఆ స్వరోచి మృదువైన బలిష్ఠమైన అవయవములు కల్గినట్టి, ఆడులేళ్ళ సమూహముతో విహరించుచున్నట్టి, సుగంధభరితమైన ఆడులేళ్ళతో చుట్టుముట్టబడినట్టి ఒక మగలేడిని చూచెను.

ఆకృష్టఘ్రాణపుటకా జిఘ్రన్తీస్తాస్తతో మృగీః ।
ఉవాచ స మృగోఽలం వో లజ్జాత్యాగేన గమ్యతామ్ ॥22॥

నాఽహం స్వరోచిస్తచ్ఛీలో న చైవాహం సులోచనాః ।
నిర్లజ్జాః బహవః సన్తి తాదృశాస్తత్ర గచ్ఛత ॥23॥

ఏకా త్వనేకానుగతా యథా హాసాస్పదం జనే ।
అనేకాభిస్తథైవైకో భోగదృష్ట్యా నిరీక్షితః ॥24॥


తస్య ధర్మక్రియాహానిరహన్యహని జాయతే ।
సక్తోఽన్యభార్యయా చాన్యకామాసక్తః సదైవ సః ॥25॥

యస్తాదృశోఽన్యస్తచ్ఛీలః పరలోకపరాఙ్ముఖః ।
తం కామయత భద్రం వో నాహం తుల్యః స్వరోచిషా ॥26॥

ఆ ఆడులేళ్ళు కామముతో తమ ముక్కురంధ్రములను దగ్గరగా చాపి ఆ మగలేడిని వాసన చూడసాగెను. అంతట తత్త్వమునెరిగిన ఆ మగలేడి వారితో ఇట్లు పలికెను. "మీకీ సిగ్గు లేకపోవుట ఇక చాలును. ఇటనుండి వెళ్ళుడు. నేను స్వరోచినిగాను. స్వరోచిస్వభావము గలవాడనూ కాను. ఓ అందమైన కన్నులు గలవారా ! సిగ్గులేనివారు చాలామంది ఉన్నారు. అట్టివారి దగ్గరికి వెళ్ళండి. ఒక స్త్రీ అనేకులచే అనుసరింపబడితే ఎట్లు పరిహాసము చెందునో అట్లే చాలామంది స్త్రీలచే భోగదృష్టి కలిగిన ఒక పురుషుడు చూడబడినప్పుడు కూడా అతడు పరిహాసాస్పదుడగును. అట్టి పురుషునికి నిత్యమూ ధర్మలోపము కలుగుతుంది. పరభార్యచేత కోరబడినవాడు, ఇతరుల భార్యలందు కోరిక కలిగినవాడు, అట్టి స్వభావము కలిగిన పరలోకచింతన లేనివాడు ఎవడైతే ఉన్నాడో అతడిని కోరుకొనుడు. మీకు కల్యాణమగుగాక ! నేను స్వరోచివంటివాడను కాను.

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే స్వారోచిషే మన్వన్తరే ద్విషష్టితమోఽధ్యాయః ॥62॥

శ్రీ మార్కండేయ మహాపురాణమందలి స్వారోచిషమన్వంతరమను అరువదిరెండవ అధ్యాయం సమాప్తం.



త్రిషష్టితమోऽధ్యాయః - అరువదిమూడవ అధ్యాయం
స్వారోచిషమన్వన్తరమ్ - స్వారోచిషమన్వంతరం

మార్కండేయ ఉవాచ - మార్కండేయుడు చెప్పాడు.

ఏవం నిరస్యమానాస్తా హరిణేన మృగాఙ్గనాః ।
శ్రుత్వా స్వరోచిరాత్మానం మేనే స పతితం యథా ॥1॥

త్యాగే చకార చ మనః స తాసాం మునిసత్తమ! ।
చక్రవాకీమృగప్రోక్తో మృగచర్యాజుగుప్సితః ॥2॥

సమేత్య తాభిర్భూయశ్చ వర్ధమానమనోభవః ।
ఆక్షిప్తనిర్వేదకథో రేమే వర్షశతాని షట్ ॥3॥

కిన్తు ధర్మావిరోధేన కుర్వన్ధర్మాశ్రితాః క్రియాః ।
భుఙ్క్తే స్వరోచిర్విషయాన్ సహ తాభిరుదారధీః ॥4॥

ఈ విధముగా ఆడులేళ్ళు మగలేడిచేత నిరసింపబడినవి. ఆ మగలేడి ఆడులేళ్ళకు చేసిన హితబోధను విని స్వరోచి తనను పతితునిగా భావించెను. ఓ మునిశ్రేష్ఠుడా ! ఆడుచక్రవాకము పలికిన పలుకులను మగలేడి పలికిన పలుకులను విన్న స్వరోచి తన పశువృత్తికి జుగుప్స చెందినవాడై తన భార్యలను వదిలివేయాలని మనస్సులో తలచెను. కాని తిరిగి వారిని కలిసినప్పుడు కామవాంఛలు ప్రవృద్ధమై, వైరాగ్యకథలను ప్రక్కకు పెట్టి ఆరువందల సంవత్సరాలు వారితో రమించెను. అయిననూ ఉదారబుద్ధిగల స్వరోచి ధర్మమునకు విరోధము కలుగకుండా ధర్మబద్ధమైన కర్మలను ఆచరిస్తున్నవాడై, తన భార్యలతో కూడి విషయభోగములను అనుభవించెను.

తతశ్చ జజ్ఞిరే తస్య త్రయః పుత్రాః స్వరోచిషః ।
విజయో మేరునన్దశ్చ ప్రభావశ్చ మహాబలః ॥5॥

పిమ్మట స్వరోచికి విజయుడు, మేరునందుడు, గొప్ప బలశాలియైన ప్రభావుడు అను ముగ్గురు కుమారులు జన్మించిరి.

మనోరమా చ విజయం ప్రాసూతేన్దీవరాత్మజా ।
విభావరీ మేరునన్దం ప్రభావం చ కలావతీ ॥6॥

ఇన్దీవరుడను విద్యాధరుని కుమార్తెయగు మనోరమ విజయుని, విభావరి మేరునందుని, కలావతి ప్రభావుని ప్రసవించెను.

పద్మినీ నామ యా విద్యా సర్వభోగోపపాదికా ।
స తేషాం తత్ప్రభావేణ పితా చక్రే పురత్రయమ్ ॥7॥

సమస్తభోగములను ప్రసాదించెడి పద్మినియను ఏ విద్యగలదో అట్టి విద్యాప్రభావముచే తండ్రియగు స్వరోచి ఆ ముగ్గురు కుమారులకు మూడు పట్టణములను నిర్మించెను.

ప్రాచ్యాం తు విజయం నామ కామరూపే నగోత్తమే ।
విజయాయ సుతాయాదౌ స దదౌ పురముత్తమమ్ ॥8॥

తూర్పుదిక్కున కామరూపమను పర్వతశ్రేష్ఠమందు "విజయ" నామధేయము కలిగిన (విజయపురము) పట్టణమును నిర్మించి, స్వరోచి ఆ శ్రేష్ఠమైన పట్టణమును మొదటిగా తన కొడుకైన విజయునికిచ్చెను.

ఉదీచ్యాం మేరునన్దస్య పురీం నన్దవతీమితి ।
ఖ్యాతాం చకార ప్రోత్తుఙ్గవప్రప్రాకారమాలినీమ్ ॥9॥

ఉత్తరదిక్కున ఎత్తైన అగడ్తలు, ప్రాకారములు, గోడలు కలిగిన నందవతియను పేరుగల ప్రసిద్ధపట్టణమును స్వరోచి నిర్మించి మేరునందునికిచ్చెను.

కలావతీసుతస్యాపి ప్రభావస్య నివేశితమ్ ।
పురం తాలమితి ఖ్యాతం దక్షిణాపథమాశ్రితమ్ ॥10॥

దక్షిణదిక్కున తాలమను పేరుతో ప్రసిద్ధమైన పట్టణమును నిర్మించి స్వరోచి తనకు కళావతియందు జన్మించిన ప్రభావునికి ఇచ్చెను.

ఏవం నివేశ్య పుత్రాన్స పురేషు పురుషర్షభః ।
రేమే తాభిః సమం విప్ర మనోజ్ఞాస్వద్రిభూమిషు ॥11॥

ఓ బ్రాహ్మణుడా ! ఈ విధముగా పురుషశ్రేష్ఠుడగు ఆ స్వరోచి తన ముగ్గురు పుత్రులను మూడు పురములందు ప్రవేశింపచేసి ఆ పర్వతభూములందు తన ప్రియురాండ్రగు భార్యలతో కూడా రమించెను.

ఏకదా తు గతోఽరణ్యే విహరన్స ధనుర్ధరః ।
చకర్ష ధనురాలోక్య వరాహమతిదూరగమ్ ॥12॥

ఒకనాడు ధనుర్ధారియై అరణ్యమునకు వెళ్ళి అచ్చట విహరించుచుండగా మిక్కిలి దూరమందున్న ఒక వరాహమును చూచి విల్లునెక్కుపెట్టెను.

అథాహ కాచిదభ్యేత్య తం తదా హరిణాఙ్గనా ।
మయ్యేవ పాత్యతాం బాణః ప్రసీదేతి పునః పునః ॥13॥

కిమనేన హతేనాద్య మమాశు వినిపాతయ ।
త్వయా నిపాతితో బాణో దుఃఖాన్మాం మోక్షయిష్యతి ॥14॥

అదే సమయమందు ఆడులేడి అచ్చటకు వచ్చి స్వరోచితో మాటిమాటికీ ఇట్లు చెప్పసాగెను. "నా యందే ఆ బాణమును విడువుము. నన్ను అనుగ్రహింపుము. ఇప్పుడీ వరాహము మరణించినందువలన ఏమి ప్రయోజనము? అందుచేత శీఘ్రముగా నాపై బాణమును ప్రయోగించుము. నీచే విడువబడిన ఆ బాణము నన్ను దుఃఖమునుండి విడిపింపగలదు."

స్వరోచిరువాచ – స్వరోచి చెప్పాడు.

న తే శరీరం సరుజమస్మాభిరుపలక్ష్యతే ।
కిన్ను తత్కారణం యేన త్వం ప్రాణాన్ హాతుమిచ్ఛసి ॥15॥

నీ శరీరము ఏ విధముగానూ రోగగ్రస్తమైనట్లు కనిపించుట లేదు. నీవు ఎందులకు ప్రాణత్యాగము చేయవలెనని కోరుచున్నావు?

మృగీ ఉవాచ – ఆడులేడి పలికింది.

అన్యాస్వాసక్తహృదయే యస్మింశ్చేతః కృతాస్పదమ్ ।
మమ తేన వినా మృత్యురౌషధం కిమిహాపరమ్ ॥16॥

ఇతర స్త్రీలయందు ఎవని హృదయము ఆసక్తమైయున్నదో అట్టివానియందు నా హృదయము ఆసక్తమైయున్నది. అతడు లభించనిచో నాకు మరణమే ఔషధము. మరియొక ఉపాయము లేదు.

స్వరోచిరువాచ – స్వరోచి చెప్పాడు.

కస్త్వాం నాభిలషేద్భీరు! సానురాగాఽసి కుత్ర వా ।
యదప్రాప్తౌ నిజాన్ ప్రాణాన్ పరిత్యక్తుం వ్యవస్యసి ॥17॥

ఓ భీరులారా ! (పిరికిదానాయని అర్థం). ఎవడు నిన్ను కోరకుండా ఉంటాడు? ఎవనిపట్ల నీవు అనురాగము కలిగియున్నావు? ఎవనిని పొందలేక నీవు ప్రాణములను విడిచిపెట్టుటకు నిశ్చయించితివి?

మృగ్యువాచ – ఆడులేడి పలికింది.

త్వామేవేచ్ఛామి భద్రం తే త్వయా మేఽపహృతం మనః ।
వృణోమ్యహమతో మృత్యుం మయి బాణో నిపాత్యతామ్ ॥18॥

నిన్నే నేను కోరుకొనుచున్నాను. నీకు కల్యాణమగుగాక ! నీ చేత నా మనస్సు అపహరింపబడినది. అందుచేతనే నేను మృత్యువును కోరుకొనుచున్నాను. నాయందు బాణమును ప్రయోగించుము.

స్వరోచిరువాచ – స్వరోచి చెప్పాడు.

త్వం మృగీ చంచలాపాఙ్గీ నరరూపధరా వయమ్ ।
కథం త్వయా సమం యోగో మద్విధస్య భవిష్యతి ॥19॥

చంచలమైన కన్నులుగల ఆడులేడివి నీవు. మేము మనుష్యరూపమును ధరించినవారము. నావంటివానికి నీతో సమాగమము ఎట్లు సంభవించును?

మృగ్యువాచ – ఆడులేడి పలికింది.

యది సాపేక్షితం చిత్తం మయి తే మాం పరిష్వజ ।
యది వా సాధు చిత్తం తే కరిష్యామి యథేప్సితమ్ ॥20॥

ఏతావతా౽హం భవతా భవిష్యామ్యతిమానితా ।

నాయందు మీ మనస్సు లగ్నమైనచో నన్ను కౌగలించుకొనుడు. మీ చిత్తము నాపట్ల మంచి స్వభావము కలిగియున్నచో నీకిష్టమైన దానిని నేను నెరవేర్చగలను. ఇంతమాత్రముచేత నేను నీ వలన మిక్కిలి సమ్మానితురాలనగుదును.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు

ఆలిలిఙ్గ తతస్తాం స స్వరోచిర్హరిణాఙ్గనామ్ ॥21॥

తేన చాలిఙ్గితా సద్యః సాభూద్దివ్యవపుర్ధరా ।
తతః సవిస్మయావిష్టః కా త్వమిత్యభాషత ॥22॥

అంతట ఆ స్వరోచి ఆ ఆడులేడిని ఆలింగనము చేసుకొనెను. అతనిచే ఆలింగనము చేసుకొనబడిన ఆ ఆడులేడి ఆ వెంటనే దివ్యశరీరమును ధరించినదాయెను. అంతట ఆశ్చర్యమునకులోనై స్వరోచి "నీవెవరవు" అని పలికెను.

సా చాస్మై కథయామాస ప్రేమలజ్జాజడాక్షరమ్ ।
అహమభ్యర్థితా దేవైః కాననస్యాస్య దేవతా ॥23॥

ఉత్పాదనీయో హి మనుస్త్వయా మయి మహామతే! ।
ప్రీతిమత్యాం మయి సుతం భూలోకపరిపాలకమ్ ॥24॥

తముత్పాదయ దేవానాం త్వామహం వచనాద్వదే ।

ఆ ఆడులేడి కూడా ప్రేమతో కూడిన సిగ్గుగలదై గద్గదస్వరముతో ఇట్లు పలికెను. "ఓ గొప్ప బుద్ధిమంతుడా! నేనీ వనమునకు అధిదేవతను. నేను దేవతలచేత అభ్యర్థింపబడితిని. నాయందు మీరు మనువును జన్మింపచేయవలెను. "నీయందు అనురాగము కలిగిన నాయందు భూలోకపరిపాలకుడగు కుమారుని జన్మింపచేయుము" అని దేవతల మాటగా నిన్ను నేను అడుగుచున్నాను.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

తతః స తస్యాం తనయం సర్వలక్షణలక్షితమ్ ॥25॥

తేజస్వినమివాత్మానం జనయామాస తత్క్షణాత్ ।

పిమ్మట స్వరోచి ఆ వనదేవతయందు వెంటనే సమస్త సద్గుణసంపన్నుడు, తనవలే తేజోవంతుడూ అగు కుమారుని ఉత్పన్నము చేసెను.

జాతమాత్రస్య తస్యాథ దేవవాద్యాని సస్వనుః ॥
జగుర్గన్ధర్వపతయో ననృతుశ్చాప్సరోగణాః ॥26॥

సిషిచుః శీకరైర్మేఘా ఋషయశ్చ తపోధనాః ॥27॥

దేవాశ్చ పుష్పవర్షం చ ముముచుశ్చ సమన్తతః ।
తస్య తేజః సమాలోక్య నామ చక్రే పితా స్వయమ్ ॥28॥

ద్యుతిమానితి యేనాస్య తేజసా భాసితా దిశః ।
స బాలో ద్యుతిమాన్నామ మహాబలపరాక్రమః ॥29॥

స్వరోచిషః సుతో యస్మాత్తస్మాత్స్వారోచిషోఽభవత్ ।

ఆ పుత్రుడు పుట్టగానే దేవదుందుభులు మ్రోగెను. గంధర్వపతులు గానము చేసిరి. అప్సరసలు నాట్యము చేసిరి. మేఘములు చల్లని జలములతో ఆ ప్రదేశములను తడిపినవి. ఋషులు తపస్సే ధనముగా గలవారైరి. దేవతలు ఆ ప్రదేశమంతటా పుష్పవర్షమును కురిపించిరి. ఆ కుమారుని తేజస్సును చూచి తండ్రియగు స్వరోచి స్వయంగా ఆ కుమారునికి ద్యుతిమంతుడని పేరు పెట్టెను. అతడి ప్రకాశము కారణముగా దిక్కులన్నీ ప్రకాశించినందున ఆ బాలుడు ద్యుతిమంతుడను సార్థకనామధేయము గలవాడు, గొప్ప బలపరాక్రమములు గలవాడు అయ్యెను. స్వరోచియొక్క కుమారుడైనందున ఆ బాలుడు స్వారోచిషుడను ప్రసిద్ధినందెను.

స చాపి విచరన్ రమ్యే కదాచిత్ గిరినిర్ఝరే ॥30॥

స్వరోచిర్దదృశే హంసం నిజపత్నీసమన్వితమ్ ।
ఉవాచ స తదా హంసీం సాభిలాషాం పునః పునః ॥31॥

ఉపసంహ్రియతామాత్మా చిరం తే క్రీడితం మయా ।
కిం సర్వకాలం భోగైస్తే ఆసన్నం చరమం వయః ॥32॥

పరిత్యాగస్య కాలో మే తవ చాపి జలేచరి! ।

ఆ స్వరోచి కూడా ఒకనాడు సుందరమైన కొండసెలయేళ్ళ ప్రాంతములందు విహరించుచుండగా తన భార్యతో (హంసితో) విహరించుచున్న ఒక మగ హంసను చూచెను. మాటిమాటికి తన భర్తపై అభిలాష కలిగియున్న హంసితో హంస ఇట్లు పలికెను. "ఓ నీటియందు సంచరించుదానా! నిన్ను నీవు నిగ్రహించుకొనుము. నీతో నేను చాలాకాలం క్రీడించితిని. జీవించియున్నంతకాలం భోగములను అనుభవించవలెనా ఏమి? నీకు వార్ధక్యము సమీపించినది. విషయభోగములను విడిచిపెట్టుటకు తగిన సమయము నీకునూ నాకునూ సంప్రాప్తించినది.

హంస్యువాచ – హంసి పలికింది.

అకాలః కో హి భోగానాం సర్వం భోగాత్మకం జగత్ ॥33॥

యజ్ఞాః క్రియన్తే భోగార్థం బ్రాహ్మణైః సంయతాత్మభిః ।
దృష్టాదృష్టాంస్తథా భోగాన్ వాంఛమానా వివేకినః ॥34॥

దానాని చ ప్రయచ్ఛన్తి పూర్తాన్ ధర్మాంశ్చ కుర్వతే ।
స త్వం నేచ్ఛసి కిం భోగాన్ భోగశ్చేష్టఫలం నృణామ్ ॥35॥

వివేకినాం తిరశ్చాం చ కిం పునః సంయతాత్మనామ్ ।

అనుభవించుటకు కాలము, అకాలము అని ఏమి కలదు? ఈ ప్రపంచమంతా భోగమయము. ఆత్మను స్వాధీనమందు ఉంచుకొన్న బ్రాహ్మణులు కూడా భోగముల కొరకు యజ్ఞాది కర్మలను చేయుచున్నారు. అట్లే వివేకము కలిగినవారు కూడా ఐహికాముష్మికఫలములను కోరుతూ దానములను చేయుచున్నారు, బావులు నిర్మించుట మొ॥లగు ధర్మకార్యములను అనుష్ఠించుచున్నారు. అట్టి నీవు భోగములను కోరుకొనుటలేదా ఏమి? వివేకవంతులగు మనుష్యులకు, పక్షులకు, ఆత్మనిగ్రహము గలవారికి, అందరికీ భోగము తామాచరించిన కర్మఫలమే కదా !

హంస ఉవాచ – మగహంస పలికింది.

భోగేష్వాసక్తచిత్తానాం పరమార్థాన్వితా మతిః ।
భవిష్యతి కదా సఙ్గముపేతానాం చ బన్ధుషు ॥36॥

పుత్రమిత్రకలత్రేషు సక్తాస్సీదన్తి జన్తవః ।
సరఃపఙ్కార్ణవే మగ్నా జీర్ణా వనగజా ఇవ ॥37॥

కిం న పశ్యసి వా భద్రే జాతసఙ్గం స్వరోచిషమ్ ।
ఆబాల్యాత్కామసంసక్తం మగ్నస్నేహాంబుకర్దమే ॥38॥

ఎవరి మనస్సు భోగములందు ఆసక్తి కలిగియుండునో అట్టివారికి పారమార్థికచింతన ఎప్పుడు సిద్ధించును? బంధువులు, పుత్రులు, స్నేహితులు, భార్యలందు ఆసక్తిగల ప్రాణులు సరస్సునందలి బురదలో కూరుకుపోయిన వనగజములతో సమానముగా దుఃఖమును అనుభవించువారు. ఓ మంగళస్వరూపురాలా ! బాల్యమునుండి కోరికలకు వశమై, స్నేహమనెడు బురదయందు మునిగి, భార్యలందు మనస్సు లగ్నము చేసిన స్వరోచిని నీవు చూచుట లేదా ఏమి?

యౌవనేఽతీవ భార్యాసు సాంప్రతం పుత్రనప్తృషు ।
స్వరోచిషో మనో మగ్నముద్ధారం ప్రాప్స్యతే కుతః ॥39॥

నాహం స్వరోచిషస్తుల్యః స్త్రీవశ్యో వా జలేచరి ।
వివేకవాంశ్చ భోగానాం నివృత్తోఽస్మి చ సాంప్రతమ్ ।40॥

యౌవనమందు భార్యలందు, ఇప్పుడు పుత్రులు మనుమలందు నిమగ్నమైయున్న స్వరోచి మనస్సు ఎట్లు ఉద్ధరింపబడగలదు? ఓ నీటియందు సంచరించుదానా ! నేను స్వరోచితో సదృశుడను గాను, స్త్రీలకు వశమైనవాడనూ గాను. వివేకబుద్ధి కలిగి నేనిప్పుడు భోగములనుండి నివృత్తుడనైతిని.

మార్కండేయ ఉవాచ - మార్కండేయుడు చెప్పాడు.

స్వరోచిరేతదాకర్ణ్య జాతోద్వేగః ఖగేరితమ్ ।
ఆదాయ భార్యాస్తపసే యయావన్యత్తపోవనమ్ ॥41॥

తత్ర తప్త్వా తపో ఘోరం సహ తాభిరుదారధీః ।
జగామ లోకానమలాన్నివృత్తాఖిలకల్మషః ॥42॥

పక్షి పలికిన మాటలను విన్న స్వరోచి ఉద్విగ్నమనస్కుడై భార్యలతో తపస్సు చేయుటకు తపోవనమునకు వెళ్ళెను. అక్కడ ఉదారబుద్ధిగల స్వరోచి తన భార్యలతో గూడా ఘోరమైన తపస్సునాచరించి సకల పాపములనుండి విముక్తుడై పుణ్యలోకములకు వెళ్ళెను.

ఇతి శ్రీ మార్కండేయమహాపురాణే స్వారోచిషే మన్వంతరే త్రిషష్టితమోఽధ్యాయః ॥63॥

శ్రీ మార్కండేయమహాపురాణమందలి స్వారోచిషమన్వంతరమను అరువదిమూడవ అధ్యాయం సమాప్తం.



చతుఃషష్టితమోఽధ్యాయః – అరువదినాల్గవ అధ్యాయం
స్వారోచిషమన్వన్తర కథాసమాప్తిః – స్వారోచిషమన్వంతరం కథాసమాప్తి

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

తతః స్వారోచిషం నామ్నా ద్యుతిమన్తం ప్రజాపతిమ్ ।
మనుం చకార భగవాంస్తస్య మన్వన్తరం శృణు ॥1॥

తత్రాన్తరే తు యే దేవా మునయస్తత్సుతాశ్చ యే ।
భూపాలాః క్రౌష్టుకే యే తాన్గదతస్త్వం నిశామయ ॥2॥

స్వారోచిషుడు లేక ద్యుతిమంతుడు అను పేరుగల ప్రజాపతిని భగవానుడు మనువుగా చేసెను. అతని మన్వంతరమును గూర్చి వినుము. ఓ క్రౌష్టుకిమునీ ! ఆ స్వారోచిషమన్వంతరమందు ఏ దేవతలు, మునులు, వారి పుత్రులు, రాజులు ఉన్నారో వారిని గురించి చెప్పెదను, వినుము.

దేవాః పారావతాస్తత్ర తథైవ తుషితా ద్విజ ।
స్వారోచిషేఽన్తరే చేన్ద్రో విపశ్చిదితి విశ్రుతః ॥3॥

ఊర్జస్తంబస్తథా ప్రాణో దత్తోఽలిర్ఋషభస్తథా ।

నిశ్చరశ్చార్వవీరశ్చ తత్ర సప్తర్షయోఽభవన్ ॥4॥

చైత్ర కింపురుషాద్యాశ్చ సుతాస్తస్య మహాత్మనః ।
సప్తాసన్ సుమహావీర్యాః పృథివీపరిపాలకాః ॥5॥

ఓ ద్విజుడా! ఆ స్వారోచిషమన్వంతరమందు పారావతులు, తుషితులు వీరే దేవతలుగా ప్రసిద్ధిచెందారు. ఇంద్రుడు విపశ్చిత్ అనుపేరుతో ప్రసిద్ధుడైనాడు. ఊర్జ, తంబ, ప్రాణ, దత్తోలి (పులస్త్యముని), ఋషభ, నిశ్చర, అర్వవీర అనువారు సప్తర్షులుగా ప్రసిద్ధులైనారు. చైత్రుడు, కింపురుషుడు మొ॥లగు మహాబలవంతులు, పృథివీపరిపాలకులూ అగు ఏడుగురు పుత్రులు ఆ మనువుకు జన్మించిరి.

తస్య మన్వంతరం యావత్తావత్తద్వంశవిస్తరే ।
భుక్తేయమవనిః సర్వా ద్వితీయం వై తదన్తరమ్ ॥6॥

ఎంతవరకు ఆతని మన్వంతరము ఉండెనో అంతవరకు ఆతని వంశమందలి రాజులందరూ భూమిని అనుభవించిరి. మన్వంతరములందు స్వారోచిషమన్వంతరము రెండవది.

స్వరోచిషస్తు చరితం జన్మ స్వారోచిషస్య చ ।
నిశమ్య ముచ్యతే పాపైః శ్రద్దధానో హి మానవః ॥7॥

ఈ స్వరోచియొక్క చరిత్ర, స్వారోచిషమనువుయొక్క జన్మవృత్తాంతము ఈ రెంటినీ శ్రద్ధాసక్తులతో వినిన మానవులు పాపములనుండి విముక్తులగుదురు.

శ్రీ మార్కండేయ మహాపురాణే స్వారోచిషమన్వన్తరకథాసమాప్తిర్నామ చతుఃషష్టితమోఽధ్యాయః ॥64॥

శ్రీ మార్కండేయమహాపురాణమందలి స్వారోచిషమన్వంతరకథాసమాప్తియను అరువదినాల్గవ అధ్యాయం సమాప్తం.

పఞ్చషష్టితమోఽధ్యాయః - అరువదిఐదవ అధ్యాయం
నిధివర్ణనమ్ - నిధివర్ణనం

క్రౌష్టుకిరువాచ - క్రౌష్టుకి పలికాడు.

భగవన్! కథితం సర్వం విస్తరేణ త్వయా మమ ।
స్వరోచిషస్తు చరితం జన్మ స్వారోచిషస్య తు ॥1॥

ఓ పూజ్యుడా ! స్వరోచియొక్క చరిత్ర స్వారోచిషునియొక్క జన్మవృత్తాంతము నీవు నాకు విస్తారపూర్వకముగా చెప్పితివి.

యా తు సా పద్మినీ నామ విద్యా భోగోపపాదికా ।
తత్సంశ్రయా యే నిధయస్తాన్మే విస్తరతో వద ॥2॥

అష్టౌ యే నిధయస్తేషాం స్వరూపం ద్రవ్యసంస్థితిః ।
భవతాభిహితం సమ్యక్ఛ్రోతుమిచ్ఛామ్యహం గురో! ॥3॥

కాని సమస్త భోగములను ప్రదానము చేయునట్టి పద్మినియను విద్యను ఆశ్రయించినట్టి ఏ నిధులు గలవో వాటి గురించి విస్తారముగా నాకు చెప్పుము. ఓ గురువర్యా ! మీరు ప్రస్తావించిన ఎనిమిది విధములైన నిధులేవి గలవో వాటి స్వరూపము, వాటి ద్రవ్యసంస్థితి మీనుండి బాగుగా వినవలెనని కోరుకొనుచున్నాను.

మార్కండేయ ఉవాచ - మార్కండేయుడు చెప్పాడు.

పద్మినీ నామ యా విద్యా లక్ష్మీస్తస్యాశ్చ దేవతా ।
తదాధారాశ్చ నిధయస్తన్మే నిగదతః శృణు ॥4॥

పద్మినియను పేరుగల విద్యయొక్క అధిష్ఠానదేవత లక్ష్మీదేవి. అట్టి విద్యను ఆశ్రయించిన ఎనిమిది విధములైన నిధులనుగూర్చి చెప్పెదను, వినుము.

యత్ర పద్మమహాపద్మౌ తథా మకరకచ్ఛపౌ ।
ముకున్దో నన్దకశ్చైవ నీలః శంఖోఽష్టమో నిధిః ॥5॥

సత్యామృద్ధౌ భవన్త్యేతే సిద్ధిస్తేషాం హి జాయతే ।
ఏతే హ్యష్టౌ సమాఖ్యాతా నిధయస్తవ క్రౌష్టుకే ॥6॥

ఓ క్రౌష్టుకీ ! పద్మ, మహాపద్మ, మకర, కచ్ఛప, ముకుంద, నందక, నీల, శంఖములను ఈ ఎనిమిది నిధులు పద్మినీ విద్యను ఆశ్రయించియున్నవి. సమృద్ధి నెరవేరుచుండ ఈ ఎనిమిది నిధుల సిద్ధి కలుగుచున్నది. ఈ అష్టవిధములగు నిధులనుగూర్చి నీకు నేను చెప్పితిని.

దేవతానాం ప్రసాదేన సాధుసంసేవనేన చ ।
ఏభిరాలోకితం విత్తం మానుషస్య సదా మునే ॥7॥

ఓ క్రౌష్టుకిమునీ ! దేవతల అనుగ్రహమువలన, సజ్జనులను సేవించుట వలన మానవులకెల్లప్పుడు ఈ నిధులవలన సంపదలు కలుగుచుండును.

యాదృక్ స్వరూపం భవతి తన్మే నిగదతః శృణు ।
పద్మో నామ నిధిః పూర్వం స యస్య భవతి ద్విజ ॥8॥

స తస్య తత్సుతానాం చ తత్పౌత్రాణాం చ నిత్యశః ।
దాక్షిణ్యసారః పురుషస్తేన చాధిష్ఠితో భవేత్ ॥9॥

సత్త్వాధారో మహాభాగో యతోఽసౌ సాత్త్వికో నిధిః ।
సువర్ణరూప్యతామ్రాదిధాతూనాం చ పరిగ్రహమ్ ॥10॥

కరోత్యతితరాం సోఽథ తేషాం చ క్రయవిక్రయమ్ ।
కరోతి చ తథా యజ్ఞాన్ దక్షిణాం చ ప్రయచ్ఛతి ॥11॥
(సంపాదయతి కామాంశ్చ సర్వానేవ యథాక్రమమ్)

సభాం దేవనికేతాంశ్చ స కారయతి తన్మనాః ।

ఓ బ్రాహ్మణుడా ! పద్మమను పేరుగల నిధి ఎవనికి సిద్ధించునో ఆ నిధి వానికి, వాని పుత్రులకు, వాని మనుమలకూ కూడా ఎల్లప్పుడూ సిద్ధించుచునేయుండును. పద్మమను ఈ నిధి సత్త్వగుణసంపన్నము. అందువలన ఈ నిధిచేత అధిష్ఠితుడైన పురుషుడు ఉదారబుద్ధికలిగి, సత్త్వగుణసంపన్నుడైన మహానుభావుడగును. ఈ నిధి కల్గిన పురుషుడు బంగారము, వెండి, రాగి మొ॥లగు ధాతువులను పొందును. వాటిని కొనుట, అమ్ముటలను కూడా చేయును. అట్లే యజ్ఞములను ఆచరించును, దక్షిణలను ఇచ్చును. యథాక్రమముగా అన్ని కోరికలను సంపాదింపచేసుకొనును, మరియు ఏకాగ్రచిత్తుడై సభలు, దేవాలయములను నిర్మించును.

సత్త్వాధారో నిధిశ్చాన్యో మహాపద్మ ఇతి శ్రుతః ॥12॥

సత్త్వప్రధానో భవతి తేన చాధిష్ఠితో నరః ।
కరోతి పద్మరాగాదిరత్నానాం చ పరిగ్రహమ్ ॥13॥

మౌక్తికానాం ప్రవాలానాం తేషాం చ క్రయవిక్రయాన్ ।
దదాతి యోగశీలేభ్యస్తేషామావసథాంస్తథా ॥14॥

స కారయతి తచ్ఛీలః స్వయమేవ చ జాయతే ।
తత్ప్రసూతాస్తథాశీలాః పుత్రపౌత్రక్రమేణ చ ॥15॥

పూర్వర్ధిమాత్రః సప్తాసౌ పురుషాంశ్చ న ముఞ్చతి ।

మహాపద్మమను రెండవ నిధి సత్త్వగుణమునకు ఆశ్రయమైనది. అందువలన ఈ నిధి కల్గిన పురుషుడు సత్త్వగుణము ప్రధానముగా కలిగినవాడగును. ఈ మహాపద్మనిధిచేత ఆశ్రితుడైన పురుషుడు పద్మరాగము మొ॥లగు

రత్నములను ప్రోగు చేయును. ముత్యములు, పగడములను కొనుట అమ్ముటలను కూడా చేయును. యోగమే ప్రధానముగా గలవారికి వాటిని దానముగా ఇచ్చును. వారికి వసతి గృహములను కట్టించి ఇచ్చును. ఈ మహాపద్మనిధిసంపన్నుడు స్వయముగానే యోగశీలుడు అగును. అతనికి జన్మించిన పుత్రపౌత్రాదులు కూడా యోగశీలురు అగుదురు. ఈ మహాపద్మనిధి పూర్వజన్మసుకృతమువలన లభించి ఏడు తరములవారిని విడిచిపెట్టకుండా ఉండును.

తామసో మకరో నామ నిధిస్తేనావలోకితః ॥16॥

పురుషోఽథ తమః ప్రాయః సుశీలోఽపి హి జాయతే ।
బాణఖడ్గర్ష్టిధనుషాం చర్మణాం చ పరిగ్రహమ్ ॥17॥

దంశనానాం చ కురుతే యోఽతిమైత్రీ చ రాజభిః ।
దదాతి శౌర్యవృత్తీనాం భూభుజాం యే చ తత్ప్రియాః ॥18॥

క్రయవిక్రయే చ శస్త్రాణాం నాన్యత్ర ప్రీతిమేతి చ ।
ఏతస్యైవ భవత్యేష నరస్య న సుతానుగః ॥19॥

ద్రవ్యార్థం దస్యుతో నాశం సంగ్రామే వాఽపి స వ్రజేత్ ।

మకరమను మూడవ నిధి తామసమగును. తమోగుణము ప్రధానముగా కలిగిన పురుషునిచే ఈ నిధి పొందబడును. ఈ నిధిని అధిష్ఠించిన పురుషుడు తరచుగా తమోగుణము కలిగినవాడగును. అట్టి పురుషుడు మంచి శీలము కలిగినవాడుగా కూడా జన్మించును. ఆ పురుషుడు బాణములు, ఖడ్గములు, ఆయుధములు, ధనుస్సులు, డాలు వీటిని ధరించినవాడగును. దంతములతో కొరుకుట అను స్వభావముగలవాడగును. రాజులతో మిక్కిలి స్నేహము చేయును. శౌర్యవృత్తిగల రాజులకు వారికి ప్రియమైనవి ఏవో వాటిని ఇచ్చును. ఆయుధములను కొనుట అమ్ముటలయందు ప్రీతిగలవాడగునేగాని వేరొకదానియందు కాదు. ఈ నిధి ఈ ఒక్క పురుషునికేగాని తన పుత్రపౌత్రాదులకు అనువర్తించదు. ఈ నిధిని అధిష్ఠించిన పురుషుడు ద్రవ్యములను ఆశించిన దుష్టులచే సంహరింపబడును లేదా యుద్ధమందు నశించును.

కచ్ఛపశ్చ నిధిర్యోఽసౌ నరస్తేనాభివీక్షితః ॥20॥

తమఃప్రధానో భవతి యతోఽసౌ తామసో నిధిః ।
వ్యవహారానశేషాంస్తు పుణ్యజాతైః కరోతి చ ॥21॥

కర్మస్థానఖిలాంశ్చైవ న విశ్వసితి కస్యచిత్ ।
సమస్తాని యథాఙ్గాని సంహరత్యేవ కచ్ఛపః ॥22॥

తథావిష్టభ్య రత్నాని తిష్ఠత్యాకులమానసః ।
న దదాతి న భుఙ్క్తే చ తద్వినాశభయాకులః ॥23॥

నిధానముర్వ్యాం కురుతే నిధిస్సోఽ ప్యేకపూరుషః ।

కచ్ఛపమను పేరుగల నాల్గవ నిధి తామసనిధిగా చెప్పబడుచున్నది. అందువలన ఈ నిధి ఏ మానవుని ఆశ్రయించునో ఆ మానవుడు తమోగుణ ప్రధానుడగును. అట్టి మానవుడు పుణ్యజనులతో బాటు సమస్త వ్యవహారములను నిర్వర్తించును. అట్లే సమస్త పుణ్యకర్మలను కూడా వారితో బాటు నిర్వర్తించును. ఎవరిపైనా నమ్మకముంచడు. తాబేలు ఏ విధముగా అయితే తన అవయవములను దగ్గరగా ముడుచుకొనునో అట్లే ఈ నిధి కలిగిన మానవుడు రత్నములను గుప్తముగా దాచుకొని వ్యాకులచిత్తుడై ఉండును. తన సంపదలు నశించిపోతాయేమోనను భయముతో వాటిని ఎవరికీ దానమీయడు, తాను అనుభవించడు. నేలపై వసించును. ఈ నిధి కూడా తనకు మాత్రమే చెందునుగాని, తన వంశములోని పుత్రపౌత్రాదులకు చెందదు.

రజోగుణమయశ్చాన్యో ముకున్దో నామ యో నిధిః ॥24॥

నరోఽ వలోకితస్తేన తద్గుణో భవతి ద్విజ ।
వీణావేణుమృదఙ్గానామాతోద్యస్య పరిగ్రహమ్ ॥25॥

కరోతి గాయతాం విత్తం నృత్యతాం చ ప్రయచ్ఛతి ।
వన్దిమాగధసూతానాం విటానాం లాస్యపాఠినామ్ ॥26॥

దదాత్యహర్నిశం భోగాన్ భుఙ్క్తే తైశ్చ సమం ద్విజ ।
కులటాసు రతిశ్చాస్య భవత్యన్యైశ్చ తద్విధైః ॥27॥

ప్రయాతి సఙ్గమేకం చ యం నిధిర్భజతే నరమ్ ।

ఓ బ్రాహ్మణుడా ! ముకుందమను పేరుగల అయిదవ నిధి రజోగుణముతో కూడియుండును. ఈ నిధిచేత చూడబడిన (కూడుకొనిన) మానవుడు రజోగుణము ప్రధానముగా కలిగియుండును. ఈ మానవుడు వీణ, వేణువు, మృదంగము, ఆతోద్యము (వాద్యవిశేషములు)లను పరిగ్రహించును. గాయకులకు, నర్తకులకు ధనమునిచ్చును. వందిమాగధులు, సూతులు, విటులు, లాస్యమును (నాట్యవిశేషము) నేర్పించువారు వీరందరికి రాత్రింబవళ్ళు భోగములనిచ్చును. ఓ బ్రాహ్మణుడా ! వారితో సమానముగా తాను కూడా అనుభవించును. ఈ నిధితో కూడుకొన్న మానవునకు కులటలయందు (వేశ్యలు), అట్టి స్వభావముగల ఇతరులయందు ప్రీతి కలుగును. ఈ నిధి ఎవరిని సేవించునో అట్టివానికి ఒక్కనికి మాత్రమే లభించును గాని తన వంశములోని పుత్రపౌత్రాదులకు అనువర్తించదు.

రజస్తమోమయశ్చాన్యో నందో నామ మహానిధిః ॥28॥

ఉపైతి స్తంభమధికం నరస్తేనావలోకితః ।
సమస్తధాతురత్నానాం పుణ్యధాన్యాదికస్య చ ॥29॥

పరిగ్రహం కరోత్యేష తథైవ క్రయవిక్రయమ్ ।
ఆధారః స్వజనానాం చ ఆగతాభ్యాగతస్య చ ॥30॥

సహతే నాపమానోక్తిం స్వల్పం వాఽపి మహామునే ।
స్తూయమానశ్చ మహతీం ప్రీతిం బధ్నాతి యచ్ఛతి ॥31॥

యం యమిచ్ఛతి వై కామం మృదుత్వముపయాతి చ ।

ఓ మహామునీ! "నంద" అనుపేరుగల ఆరవ మహానిధి రజోగుణతమోగుణములతో నిండియుండును. ఈ నిధి ఏ మనుష్యుని చూచునో అతడు అధికమైన స్థిరత్వమును పొందును. ఈ మనుష్యుడు సమస్తధాతువులు, రత్నములు, శ్రేష్ఠమైన ధాన్యాదులను పరిగ్రహించును మరియు వాటి కొనుట అమ్ముటలను చేయును. తన కుటుంబసభ్యులకు, అతిథులకు ఆశ్రయముగా ఉండును. కొంచెం కూడా అవమానకరవాక్కులను సహించడు. ఎవరైనా స్తుతిస్తే గొప్ప సంతోషమును పొందును, వారికి వారు తమ ఇష్టప్రకారము కోరుకొన్న వస్తువులను ఇచ్చును. వారిపట్ల మృదుస్వభావుడై ఉండును.

బహ్వ్యో భార్యా భవన్త్యస్య సూతిమత్యోఽతిశోభనాః ॥32॥

భజతే సప్త చ నరాన్నిధిర్నందోఽనువర్తతే ।
ప్రవర్ధమానోఽథ నరమష్టభాగేన సత్తమ ॥33॥

దీర్ఘాయుష్ట్వం చ సర్వేషాం పురుషాణాం ప్రయచ్ఛతి ।
బన్ధూనామేవ భరణం యే చ దూరాదుపాగతాః ॥34॥

తేషాం కరోతి వై నన్దః పరలోకే న చాదృతః ।
భవత్యస్య న చ స్నేహః సహవాసిషు జాయతే ॥35॥

పూర్వమిత్రేషు శైథిల్యం ప్రీతిమన్యైః కరోతి చ ।

ఓ మునిశ్రేష్ఠుడా ! నందనిధిచేత అధిష్ఠితుడైన పురుషునికి మిక్కిలి అందమైనట్టి, ప్రసవించుట అను ధర్మము కలిగినట్టి చాలామంది భార్యలు ఉండెదరు. నందనిధి ఆయా మానవునియందు క్రమముగా ఎనిమిదవ వంతు చొప్పున పెరుగుచూ ఏడు తరాల పర్యంతము వెంటనంటియుండును. తననాశ్రయించిన మానవులకు నందనిధి దీర్ఘాయుర్దాయము నిచ్చును. ఈ నందనిధితో కూడుకొన్న మానవునే గాక, దూరదేశములనుండి వచ్చిన ఆ మానవుని బంధువర్గమువారిని కూడా ఈ నందనిధి పోషించును. ఇట్టి మానవుడు పరలోకములలో ఆదరింపబడడు. తనతో సహవాసము చేయువారిపట్ల ఇతనికి స్నేహముండదు. పూర్వస్నేహితులయందు ప్రీతి తగ్గును. క్రొత్తవారియందు ప్రీతి కలుగును.

తథైవ సత్త్వరజసీ యో బిభర్తి మహానిధిః ॥36॥

స నీలసంజ్ఞస్తత్సంగీ నరస్తచ్ఛీలవాన్భవేత్ ।
వస్త్రకార్పాసధాన్యాదిఫలపుష్పపరిగ్రహమ్ ॥37॥

ముక్తావిద్రుమశంఖానాం శుక్త్యాదీనాం తథా మునే ।
కాష్ఠాదీనాం కరోత్యేష యచ్చాన్యజ్జలసంభవమ్ ॥38॥

క్రయవిక్రయమన్యేషాం నాన్యత్ర రమతే మనః ।
తడాగాన్ పుష్కరిణ్యోథ తథారామాన్ కరోతి చ ॥39॥

బన్ధం చ సరితాం వృక్షాంస్తథారోపయతే నరః ।
అనులేపనపుష్పాదిభోగభుగ్వాభిజాయతే ॥40॥

త్రిపౌరుషశ్చాపి నిధిర్నీలో నామైష జాయతే ।

ఓ క్రౌష్టుకిమునీ ! నీలమనుపేరుగల ఏడవ మహానిధి సత్త్వరజోగుణములను కలిగియుండును. ఆ నీలనిధితో సంసర్గము కలిగిన మానవుడు ఆ నిధిస్వభావమే కలిగియుండును అనగా సత్త్వరజోగుణములు కల్గియుండును. వస్త్రములు, ప్రత్తి, ధాన్యాదిసస్యములు, ఫలపుష్పములు, ముత్యములు, పగడములు, శంఖములు, ముత్యపుచిప్పలు, కాష్ఠాదులు, జలమందు ఉద్భవించే పదార్థములు వీటిని నీలనిధిసంపన్నుడైన పురుషుడు పరిగ్రహించును. ఈ చెప్పబడిన వస్తువుల కంటే భిన్నమైన వస్తువులయందు కొనుట అమ్ముటలను సాగించును. ఇతరవిషయములందు ఇతనికి మానసికప్రీతి కలుగదు. ఈ నిధిసంపన్నుడైన పురుషుడు చెరువులు, పుష్కరిణులు, విశ్రాంతిగృహములను నిర్మించును. నదులపై వంతెనలు కట్టించును. వృక్షములను నాటించును. సుగంధద్రవ్యాలు, పుష్పాది భోగ్యవస్తువులను అనుభవించువానిగా జన్మించును. మూడు తరములవరకు ఈ నిధి అనువర్తించును.

రజస్తమోమయశ్చాన్యః శంఖసంజ్ఞో హి యో నిధిః ॥41॥

తేనాపి నీయతే విప్ర తద్గుణిత్వం నిధీశ్వరః ।
ఏకస్యైవ భవత్యేష నరం నాన్యముపైతి చ ॥42॥

యస్య శంఖో నిధిస్తస్య స్వరూపం క్రౌష్టుకే శృణు ।
ఏక ఏవాత్మనా మృష్టమన్నం భుఙ్క్తే తథామ్బరమ్ ॥43॥

కదన్నభుక్పరిజనో న చ శోభనవస్త్రధృక్ ।
న దదాతి సుహృద్భార్యాభ్రాతృపుత్రస్నుషాదిషు ॥44॥

స్వపోషణపరః శంఖీ నరో భవతి సర్వదా ।

ఓ బ్రాహ్మణుడా ! శంఖమను పేరుగల ఎనిమిదవ నిధి రజోగుణము, తమోగుణములతో కూడియుండును. ఆ నిధికి ప్రభువైన మానవుడు ఆ రజస్తమోగుణములతో కూడినవాడగును. ఈ శంఖనిధి ఒక పురుషునికి మాత్రమే చెందును గాని, తన వంశస్థులకు అనువర్తించదు. ఓ క్రౌష్టుకిమునీ ! ఎవరిని శంఖనిధి ఆశ్రయించియుండునో అతని స్వరూపమును చెప్పెదను, వినుము. అట్టి మానవుడు తానొక్కడు మాత్రమే పరిశుద్ధమైన భోజనమును తినును, శ్రేష్ఠమైన వస్త్రములను ధరించును. తన పరిజనులు మాత్రం నింద్యమైన భోజనమును తినెదరు, శోభనమైన వస్త్రములను ధరించరు. స్నేహితులు, భార్య, సోదరులు, కొడుకులు, కోడళ్ళు వీరికి ఎవరికీ అట్టి శ్రేష్ఠమైన వస్తువులనీయడు. ఈ శంఖనిధిని పొందిన మానవుడు ఎల్లప్పుడు కేవలము తనను తాను పోషించుకొనుటయందు మాత్రమే ఆసక్తిగలవాడై యుండును.

ఇత్యేతే నిధయః ఖ్యాతా నరాణామర్ధదేవతాః ॥45॥

మిశ్రావలోకనాన్మిశ్రాః స్వభావఫలదాయినః ।
యథాఽఖ్యాతస్వభావస్తు భవత్యేవ విలోకనాత్ ॥
సర్వేషామాధిపత్యే చ శ్రీరేషాం ద్విజ పద్మినీ ॥46॥

ఓ బ్రాహ్మణుడా ! మనుష్యులలో సంపదనిచ్చే దేవతలుగా ఈ ఎనిమిది నిధులు నా చేత వర్ణించి చెప్పబడినవి. ఆ నిధులు మిశ్రదృష్టి కలిగియున్నయెడల వాటివల్ల సిద్ధించే ఫలములుగూడా అందుకు అనుగుణముగానే యుండును. వాటి స్వభావముననుసరించే తగిన ఫలములనిచ్చును. ఆ నిధుల దృష్టిపడినచో నేను వర్ణించినట్లే ఫలములనిచ్చుటలో ఆయా స్వభావములు కలిగియుండును. సమస్త నిధులకు ఆధిపత్యమును వహించు దేవతగా ఈ పద్మినీవిద్య ఉండును.

ఇతి శ్రీ మార్కండేయమహాపురాణే నిధివర్ణనం నామ పఞ్చషష్టితమోఽధ్యాయః ॥65॥

శ్రీ మార్కండేయమహాపురాణమందు నిధివర్ణనమను అరువదిఐదవ అధ్యాయం సమాప్తం.



షట్షష్టితమోఽధ్యాయః – అరువదిఆరవ అధ్యాయం
ఔత్తరమన్వన్తరే ఋషిదర్శనమ్ – ఔత్తరమన్వంతరమందు ఋషిదర్శనం

క్రౌష్టుకిరువాచ – క్రౌష్టుకి పలికాదు.

విస్తరాత్కథితం బ్రహ్మన్మమ స్వారోచిషం త్వయా ।
మన్వన్తరం తథైవాష్టౌ యే పృష్టా నిధయో మయా ॥1॥

స్వాయంభువం పూర్వమేవ మన్వన్తరముదాహృతమ్ ।
మన్వన్తరం తృతీయం మే కథయోత్తమసంజ్ఞితమ్ ॥2॥

ఓ బ్రహ్మస్వరూపుడా ! మీరు స్వారోచిషమన్వంతరమును గూర్చి విస్తృతముగా చెప్పితిరి. అట్లే నేనడిగిన ఎనిమిది నిధులను గూర్చి కూడా విస్తృతముగా చెప్పితిరి. స్వాయంభువమన్వంతరమును గూర్చి మీరు ముందుగానే చెప్పితిరి. ఇప్పుడు మూడవది అయిన ఉత్తమమను పేరుగల మన్వంతరమును గూర్చి చెప్పుడు.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

ఉత్తానపాదపుత్రోఽభూదుత్తమో నామ నామతః ।
సురుచ్యాస్తనయః ఖ్యాతో మహాబలపరాక్రమః ॥3॥

సురుచియను రాణిగర్భమందు ఉత్తానపాదుడను రాజుకు గొప్ప బలపరాక్రమములు కలిగిన లోకవిఖ్యాతి చెందిన ఉత్తముడను కుమారుడు జన్మించెను.

ధర్మాత్మా చ మహాత్మా చ పరాక్రమధనో నృపః ।
అతీత్య సర్వభూతాని బభౌ భానుపరాక్రమః ॥4॥

ధర్మాత్ముడు, మహాత్ముడు, పరాక్రమమే ధనముగా గలవాడు అయిన ఉత్తమమహారాజు సమస్తభూతములను మించి సూర్యునితో సమానముగా తేజస్సను పరాక్రమముగలవాడై ప్రకాశించెను.

సమః శత్రౌ చ మిత్రే చ పరే పుత్రే చ ధర్మవిత్ ।
దుష్టే చ యమవత్సాధౌ సోమవచ్చ మహామునే ॥5॥

ఓ క్రౌష్టుకి మహామునీ ! ధర్మవేత్త అయిన ఆ ఉత్తమమహారాజు శత్రువులందు, స్నేహితులయందు, పరులయందు, తన పుత్రులందు సమదృష్టి కలిగియుండెను. దుష్టులందు యమునివలే ఉగ్రప్రకృతితోను, సాధుపురుషులయందు చంద్రునివలే సౌమ్యప్రకృతితోనూ ఉండెను.

బాభ్రవ్యాం బహులాం నామ ఉపయేమే స ధర్మవిత్ ।
ఉత్తానపాదతనయః శచీమింద్ర ఇవోత్తమః ॥6॥

ఇంద్రుడు శచీదేవిని వివాహమాడినవిధముగా, ఉత్తానపాదపుత్రుడగు ధర్మవేత్త అయిన ఆ ఉత్తమమహారాజు బభ్రుకుమార్తె అయిన బహుళయను కన్యను వివాహమాడెను.

తస్యామతీవ తస్యాసీద్ద్విజవర్య మనస్సదా ।
స్నేహవచ్ఛశినో యద్వద్రోహిణ్యాం నిహితాస్పదమ్ ॥7॥

ఓ బ్రాహ్మణశ్రేష్ఠుడా ! రోహిణీదేవియందు చంద్రుని మనస్సు ఏవిధముగా అత్యంతాసక్తి కలిగియుండెనో అట్లే బహుళయందు ఉత్తముని మనస్సు కూడా మిక్కిలి ఆసక్తి కలిగియుండెను.

అన్యప్రయోజనాసక్తిముపైతి న హి తన్మనః ।
స్వప్నే చైవ తదాలంబి మనోఽభూత్తస్య భూభృతః ॥8॥

ఆ ఉత్తముని మనస్సు బహుళయందు కాక మరే ఇతరస్త్రీలయందు ఆసక్తము కాలేదు. భూపరిపాలకుడగు అతని మనస్సు స్వప్నమందు కూడా ఆమెయందు మాత్రమే లగ్నమాయెను.

స చ తస్యాః సుచార్వఙ్గ్యా దర్శనాదేవ పార్థివః ।
దదాహ లోచనైర్గాత్రే గాత్రస్పర్శశ్చ తన్మయః ॥9॥

అందమైన అవయవములు కలిగిన ఆమెను రాజు చూచినంతనే, తన కన్నులతో అతడి దేహమునందు మన్మథతాపమును పుట్టించెను. ఇక ఆమెయొక్క అవయవస్పర్శ రాజుకు తన్మయత్వమును కలిగించెను.

శ్రోత్రోద్వేగకరం వాక్యం ప్రియమప్యవనీపతేః ।
తస్యాపి భూరి సన్మానం మేనే పరిభవం తతః ॥10॥

ఆ ఉత్తమమహారాజుయొక్క ప్రియవాక్యములు గూడా రాణి చెవులకు ఉద్వేగమును అనగా పట్టరాని దుఃఖమును కలిగించెను. అతడు మిక్కిలి గౌరవించిననూ ఆమె తనను అవమానించినట్లుగా భావించెను.

అవమేనే స్రజం దత్తాం శుభాన్యాభరణాని చ ।
ఉత్తస్థావర్ధపీతేవ పిబతోఽస్య వరాసవమ్ ॥11॥

తన భర్త ఇచ్చిన పూలదండలను, మంగళకరములైన ఆభరణములను ఆమె ప్రేమయని భావించక అవమానముగా భావించెను. తనతోబాటు అతడు శ్రేష్ఠమైన మద్యమును త్రాగునప్పుడు సగము మాత్రమే త్రాగినట్లుగా అచ్చటనుంచి లేచి వెళ్ళిపోయెను.

భుఞ్జతా చ నరేన్ద్రేణ క్షణమాత్రం కరే ధృతా ।
బుభుజే స్వల్పకం భక్ష్యం ద్విజ! నాతిముదావతీ ॥12॥

ఓ బ్రాహ్మణుడా ! ఆ నరేంద్రుడు భోజనము చేయుచూ క్షణకాలము ఆమె చేయి పట్టుకొని తినమని ప్రార్థించినా ఆమె అనిష్టముగానే కొంచెము మాత్రమే భుజించెడిది.

ఏవం తస్యానుకూలస్య నానుకూలా మహాత్మనః ।
ప్రభూతతరమత్యర్థం చక్రే రాగం మహీపతిః ॥13॥

ఈ విధముగా మహాత్ముడగు ఆ భూపతి ఉత్తముడు తన భార్యపట్ల అనుకూలముగా ఉన్నప్పటికీ ఆమె మాత్రము అతడిపట్ల అనుకూలముగా లేదు. అయినా కూడా ఆమెపై అతడు మిక్కిలి అనురాగము కలిగియుండెను.

అథ పానగతో భూపః కదాచిత్తాం మనస్వినీమ్ ।
సురాభృతం పానపాత్రం గ్రాహయామాస సాదరః ॥14॥

పశ్యతాం భూమిపాలానాం వారముఖ్యాసమన్వితః ।
ప్రగీయమానో మధురైర్గేయగాయనతత్పరైః ॥15॥

సా తు నేచ్ఛతి తత్పాత్రమాదాతుం తత్పరాఙ్ముఖీ ।
సమక్షమవనీశానాం తతః క్రుద్ధః స పార్థివః ॥16॥

ఉవాచ ద్వాఃస్థమాహూయ నిశ్వసన్నురగో యథా ।
నిరాకృతస్తయా దేవ్యా ప్రియయా పతిరప్రియః ॥17॥

ద్వాఃస్థేనాం దుష్టహృదయామాదాయ విజనే వనే ।
పరిత్యజాశు నైతత్తే విచార్యం వచనం మమ ॥18॥

పిమ్మట ఒకనాడు మద్యము సేవించిన ఆ నరేంద్రుడు ఆదరముతో మద్యముతో నిండిన పానపాత్రను అభిమానవతియైన ఆమె చేతికిచ్చెను (చేతికీయబూనెను). ఆ సమయమందు రాజు వేరే రాజులందరూ చూచుచుండిరి. ఇంకనూ ఆ రాజు వారాంగనలతో కూడియుండెను. గాయకులు మధురగీతాలతో రాజు సమీపమందు గానము చేయుచుండిరి. కాని రాజుపట్ల విముఖురాలైయున్న ఆమె వేరే రాజులు చూచుచుండగా ఆ పానపాత్రను గ్రహించుటకు ఇష్టపడలేదు. అంతట ప్రియురాలగు దేవిచేత నిరాకరింపబడిన అప్రియుడగు రాజు పామువలే బుసలుకొట్టుచూ (గట్టిగా వేడి నిట్టూర్పులు విడుస్తూ) కోపముతో కూడుకొన్నవాడై ద్వారపాలకుని పిలిచి ఇట్లు పలికెను. "ఓ ద్వారపాలకుడా ! దుష్టహృదయురాలగు ఈమెను నిర్జనారణ్యమందు శీఘ్రముగా విడిచిపెట్టుము. ఈ నా వచనము మంచిచెడ్డలను గూర్చి నీవు ఆలోచించవద్దు."

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

తతో నృపస్య వచనమవిచార్యమవేక్ష్య సః ।
ద్వాఃస్థస్తత్యాజ తాం సుభ్రూమారోప్య స్యన్దనే వనే ॥19॥

అంతట మంచిచెడ్డలు ఆలోచించుటకు అర్హము కాని రాజవచనమును విని ద్వారపాలకుడు అందమైన కనుబొమలు గల ఆమెను రథమునెక్కించుకొని అడవిలో విడిచిపెట్టెను.

సా చ తం విపినే త్యాగం నీతా తేన మహీభృతా ।
అపశ్యమానా తం మేనే పరం కృతమనుగ్రహమ్ ॥20॥

రాజుచేత అడవియందు విడిచిపెట్టబడిన ఆమె ఇక అతనిని చూడనట్టిదై, అతడు తనకు గొప్ప అనుగ్రహము చేసినట్లుగా భావించెను.

సోఽపి తత్రానురాగార్తిదహ్యమానాత్మమానసః ।
ఔత్తానపాదిర్భూపాలో నాన్యాం భార్యామవిన్దత ॥21॥

ఉత్తానపాదుని పుత్రుడగు ఉత్తముడను ఆ రాజు కూడా తనభార్యయగు బహుళయందలి అనురాగాతిశయము వలన కలిగిన శోకాగ్నిచే దహింపబడిన దేహమనస్సులు కలవాడై మరియొక భార్యను ఎవరినీ గ్రహించలేదు.

సస్మార తాం సుచార్వఙ్గీమహర్నిశమనిర్వృతః ।
చకార చ నిజం రాజ్యం ప్రజా ధర్మేణ పాలయన్ ॥22॥

అసంతుష్టమనస్సుగల ఆ రాజు రాత్రింబవళ్ళు శోభనాఙ్గి అయిన తన భార్యనే స్మరింపసాగెను. రాజధర్మము ననుసరించి ప్రజలను పరిపాలించుచూ రాజ్యపాలన కొనసాగించెను.

ప్రజాః పాలయతస్తస్య పితుః పుత్రానివౌరసాన్ ।
ఆగత్య బ్రాహ్మణః కశ్చిదిదమాహార్తమానసః ॥23॥

తన కడుపున పుట్టిన బిడ్డలను తండ్రి రక్షించువిధముగా ఆ రాజు రాజ్యపరిపాలన కొనసాగించుచుండగా, ఒకనాడు దుఃఖించిన హృదయముగల ఒకానొక బ్రాహ్మణుడు రాజువద్దకు వచ్చి ఇట్లు పలికెను.

మహారాజ! భృశార్తోఽస్మి శ్రూయతాం గదతో మమ ।
నృణామార్తిపరిత్రాణమన్యతో న నరాధిపాత్ ॥24॥

ఓ మహారాజా ! నేను మిక్కిలి కష్టములో ఉన్నాను. నేను చెప్పు మాటలు వినుము. మనుష్యుల కష్టాలను తొలగించుట రాజు వల్లనే జరుగునుకాని ఇతరులవల్ల కాదు.

మమ భార్యా ప్రసుప్తస్య కేనాప్యపహృతా నిశి ।
గృహద్వారమనుద్ఘాట్య తాం సమానేతుమర్హసి ॥25॥

నేను రాత్రి నిద్రించుసమయమందు ఇంటి తలుపులు తెరవకుండానే ఎవరో నా భార్యను అపహరించిరి. ఇప్పుడు నీవు నా భార్యను తీసుకువచ్చుటకు తగుదువు.

రాజోవాచ – రాజు చెప్పాడు.

న వేత్సి కేనాపహృతా క్వ వా నీతా తు సా ద్విజ! ।
యతామి విగ్రహే కస్య కుతో వాఽప్యానయామి తామ్ ॥26॥

ఓ బ్రాహ్మణుడా ! నీ భార్యను ఎవరు అపహరించిరో నీవు ఎరుగవు. ఎచ్చటకు తీసుకొనిపోబడినదో కూడా నీవు ఎరుగవు. అట్లయినప్పుడు నేను ఎవరితో విరోధము చేయుదును? ఎచ్చటినుంచి ఆమెను తీసుకొనిరాగలను?

బ్రాహ్మణ ఉవాచ – బ్రాహ్మణుడు చెప్పాడు.

తథైవ స్థగితే ద్వారి ప్రసుప్తస్య గృహే మమ ।
హృతా హి భార్యా కిం కేనేత్యేతద్విజ్ఞాయతే భవాన్ ॥27॥

త్వం రక్షితా నో నృపతే షడ్భాగాదానవేతనః ।
ధర్మస్య తేఽతో నిశ్చిన్తాః స్వపన్తి మనుజాః నిశి ॥28॥

ఓ మహారాజా ! ఇంటి తలుపులు మూసినవి మూసినట్లు ఉండగానే నేను నిద్రించియున్న సమయమందు నా భార్య అపహరింపబడినది. ఎవరు ఎందువలన అపహరించిరో మీరే ఎరుగవలెను. మీరే మమ్ములను రక్షించువారు. మేము సంపాదించుదానిలో ఆరవ భాగమును మీరు వేతనముగా తీసుకొనుచున్నారు. అందువలన మానవులందరు ధర్మము విషయములో ఎట్టి చింత లేకుండా రాత్రులందు నిద్రపోవుచున్నారు.

రాజోవాచ – రాజు చెప్పాడు.

న తే దృష్టా మయా భార్యా యాదృగ్రూపా చ దేహతః ।
వయశ్చైవ సమాఖ్యాహి కింశీలా బ్రాహ్మణీ చ తే ॥29॥

ఓ బ్రాహ్మణుడా ! నేనెన్నడూ నీ భార్యను చూడలేదు. ఆమె శరీరముయొక్క రూపము ఎట్టిదో, వయస్సు ఎంతో, ఆమె స్వభావమెట్టిదో తెలుపుము.

బాహ్మణ ఉవాచ – బ్రాహ్మణుడు చెప్పాడు.

కఠోరనేత్రా సాత్యుచ్చా హ్రస్వబాహుః కృశాననా ।
విరూపరూపా భూపాల! న నిన్దామి తథైవ తామ్ ॥30॥

ఓ మహారాజా ! నా భార్య తీక్ష్ణమైన కన్నులు గలది, ఎత్తైనది, పొట్టి భుజములు గలది, నీరసించిన ముఖముగలది, మరియు వికృత రూపము గలది, ఆమె రూపమును వర్ణించితినే గాని నిందించుటలేదు.

వాచి భూపాతిపరుషా న సౌమ్యా సా చ శీలతః ।
ఇత్యాఖ్యాతా మయా భార్యా సా కరాలనిరీక్షణా ॥31॥

ఓ మహారాజా ! నా భార్య పరుషముగా మాటలాడునది, సౌమ్యస్వభావము కలది కాదు. భయమును గొల్పు చూపులు గలది. ఈ విధముగా నా భార్య రూపమును వర్ణించి చెప్పితిని.

మనాగతీతం భూపాల! తస్యాశ్చ ప్రథమం వయః ।
తాదృగ్రూపా హి మే భార్యా సత్యమేతన్మయోదితమ్ ॥32॥

ఓ మహారాజా ! నా భార్య యౌవనదశ కొద్దిగా గడచిపోయెను. అట్టి రూపముగలది నా భార్య. నేను నిజమునే చెప్పితిని.

రాజోవాచ – రాజు చెప్పాడు.

అలం తే బ్రాహ్మణ తయా భార్యామన్యాం దదామి తే ।
సుఖాయ భార్యా కల్యాణీ దుఃఖహేతుర్హి తాదృశీ ॥33॥

అల్పా కురూపతా విప్ర కారణం శీలముత్తమమ్ ।
రూపశీలవిహీనా యా త్యాజ్యా తేఽన్యేన సా హృతా ॥34॥

ఓ బ్రాహ్మణుడా ! ఈ నీ భార్య ఇక చాలును. వేరొక భార్యను నీకిచ్చెదను. కల్యాణగుణములు కలిగిన భార్య సుఖమునకు కారణమగును. అల్పపరిమాణము కలిగి వికృతరూపము కలిగిన అట్టి భార్య దుఃఖమునకు కారణమే అగును. ఎందువలననగా మంచి స్వభావమే సుఖ హేతువు. రూపశీలములు లేనట్టి, వేరొకనిచే అపహరింపబడినట్టి నీ భార్య నీచే విడువతగినది.

బ్రాహ్మణ ఉవాచ :– బ్రాహ్మణుడు చెప్పాడు.

రక్ష్యా భార్యా మహీపాల ఇతి చ శ్రుతిరుత్తమా ।
భార్యాయాం రక్ష్యమాణాయాం ప్రజా భవతి రక్షితా ॥35॥

ఓ మహారాజా ! "భార్య రక్షింపతగినది" అను ఉత్తమమైన శ్రుతివాక్యము గలదు. భార్య రక్షింపబడితే సంతానము రక్షింపబడినది అగును.

ఆత్మా హి జాయతే తస్య సా రక్ష్యాఽతో నరేశ్వర ।
ప్రజాయాం రక్ష్యమాణాయామాత్మా భవతి రక్షితః ॥36॥

ఓ మహారాజా ! ఆత్మయే అనగా తానే భార్యగర్భమందు జన్మించును. అందువలన భార్య రక్షింపతగినది. సంతానము రక్షింపబడితే తాను రక్షింపబడినవాడగును.

తస్యామరక్ష్యమాణాయాం భవితా వర్ణసఙ్కరః ।
స పాతయేన్మహీపాల పూర్వాన్ స్వర్గాదధః పితౄన్ ॥37॥

ఓ రాజా ! భార్య రక్షింపబడనట్లయితే వేరే స్త్రీసాంగత్యము వలన వర్ణసంకరము ఏర్పడును. అట్టి వర్ణసంకరము పూర్వపు పితృదేవతలను స్వర్గమునుండి క్రిందకు పడవేయును.

అనుజ్ఞాయ గురుం రాజన్దత్త్వాన్యాం జాతవేదసే ॥38॥

సమిధం తు మయా భార్యా వృతేయం కర్కశా యతః ।
కథమేతాం విహాయాన్యభార్యయా సహ సఞ్చరే ॥39॥

ఓ రాజా ! గురువుల అనుమతితో అగ్నియందు సమిధలను వ్రేల్చి కర్కశస్వభావము కలిగిన ఈ భార్య నాచే వరింపబడినది. అట్టి ఈ నా భార్యను విడిచి వేరొక భార్యతో ఎట్లు సంచరించగలను?

గృహ్యాధర్మో యతో బ్రహ్మ ప్రాప్యతే శాశ్వతం నరైః ।
పూర్వోఢయా తు ధర్మేణ గృహీ కుర్వన్న సీదతి ॥40॥

వేరొక స్త్రీతో కాక తన భార్యతో జీవనము సాగించుటే గృహస్థధర్మము. పుణ్యకార్యములనాచరించిన అట్టి మానవులే శాశ్వతబ్రహ్మలోకమును పొందుచున్నారు. తాను ముందుగా వివాహము చేసుకొన్న భార్యతో ధర్మకార్యములను ఆచరించే గృహస్థుడు ఎట్టి క్లేశములను పొందదు.

త్యక్త్వా తాం చ క్రియాం కుర్వన్నైవ కర్మఫలం లభేత్ ।
అగ్నినా సహ యా నూనం సా జగామ గృహం శుభా ॥41॥

తాను వివాహము చేసుకొన్న భార్యను వదిలిపెట్టి ఆయా ధర్మకార్యములను ఆచరించువానికి కర్మఫలము లభించదు. అగ్నిసాక్షిగా తాను వివాహమాడిన భార్యయే ఇంటికి శుభములను ప్రసాదించునది అగును. ఇది నిజము.

ధర్మస్య గ్రహణే సా తు పూర్వోఢైవ ప్రశస్యతే ।
శఠాయాచరణాత్తస్యా జాయతే వర్ణసఙ్కరః ॥42॥

ధర్మమునాచరించుటలో తాను ముందుగా వివాహమాడిన భార్యయే కొనియాడతగినది. ఆమెపట్ల దుష్టబుద్ధితో ఆచరించినచో వర్ణసాంకర్యమేర్పడును.

ధర్మహానిశ్చానుదినమభార్యస్య భవేన్మమ ।
నిత్యక్రియాణాం విభ్రంశాత్ స చాపి పతనాయ మే ॥43॥

నేను భార్యారహితుడనయినచో నిత్యము నాకు ధర్మహాని కలుగును. నిత్యకార్యములకు హాని కలిగినచో అది నా పతనమునకు కారణము కాగలదు.

తస్యాం చ పృథివీపాల భవిత్రీ మమ సన్తతిః ।
తవ షడ్భాగదాత్రీ సా భవిత్రీ ధర్మహేతుకీ ॥44॥

ఓ రాజా ! ధర్మబద్ధముగా నేను వివాహమాడిన భార్యయందు నాకు సంతానము కలుగగలదు. అట్టి పుట్టబోయే సంతానమే నాకు ఆరవభాగమును ఇచ్చునది కాగలదు, మరియు ధర్మకార్యములను ఆచరించుటకు కారణము కాగలదు.

తదేతత్తే మయా ఖ్యాతా పత్నీ యా మే హృతా ప్రభో ।
తాం సమానయ రక్షాయాం భవానధికృతో యతః ॥45॥

ఓ ప్రభూ ! ఈ నే చెప్పిన కారణములచే, అపహరింపబడిన నా భార్యను తిరిగి తీసుకొని రమ్ము. ఎందువలననగా ప్రజలను రక్షించుటలో నీకే అధికారము కలదు.

మార్కండేయ ఉవాచ :- మార్కండేయుడు చెప్పాడు.

స తస్యైవం వచః శ్రుత్వా విమృశ్య చ నరేశ్వరః ।
సర్వోపకరణైర్యుక్తమారురోహ మహారథమ్ ॥46॥

ఆ బ్రాహ్మణుడు చెప్పిన మాటలు విని, బాగుగా ఆలోచించుకొని ఆ రాజు అన్ని సాధనాలతో నిండియున్న గొప్ప రథమును అధిష్ఠించెను.

ఇతశ్చేతశ్చ తేనాసౌ పరిబభ్రామ మేదినీమ్ ।
దదర్శ చ మహారణ్యే తాపసాశ్రమముత్తమమ్ ॥47॥

ఆ బ్రాహ్మణునితో రాజు ఇటునటూ భూమిచుట్టూ తిరిగెను. ఒక గొప్ప అరణ్యమందు ఒక గొప్ప ముని ఆశ్రమమును చూచెను.

అవతీర్య చ తత్రాసౌ ప్రవిశ్య దదృశే మునిమ్ ।
కౌశ్యాం బృష్యాం సమాసీనం జ్వలన్తమివ తేజసా ॥48॥

ఆ రాజు అచ్చట దిగి ఆ మున్యాశ్రమమును ప్రవేశించి అచ్చట దర్భాసనమందు కూర్చొన్నట్టి, తన తేజస్సుతో మండుచున్న అగ్నివలే ఉన్నట్టి ఒక మునిని చూచెను.

స దృష్ట్వా నృపతిం ప్రాప్తం సముత్థాయ త్వరాఽన్వితః ।
సమ్మాన్య స్వాగతేనైవ శిష్యమాహార్ఘ్యమానయ ॥49॥

రాజు రాగానే, అతడిని చూచిన ముని వెంటనే లేచి స్వాగతవచనములతో రాజును సమ్మానించి శిష్యునితో అర్ఘ్యమును (కాళ్ళు కడుగుకొందుకు నీళ్ళు, పూజాద్రవ్యములు అర్ఘ్యము) తీసుకొని రమ్మని చెప్పెను.

తమాహ శిష్యః శనకైర్దాతవ్యోఽర్ఘ్యోఽస్య కిం మునే! ।
తదాజ్ఞాపయ సఞ్చిన్త్య తవాజ్ఞాం హి కరోమ్యహమ్ ॥50॥

అది విని శిష్యుడు నెమ్మదిగా తన గురువుతో ఇట్లు పలికెను. "ఓ మునివర్యా ! ఈ రాజుకు అర్ఘ్యము ఇవ్వవలెనా ఏమి? మీరు బాగుగా ఆలోచించి చెప్పుడు. మీ ఆజ్ఞను తప్పక నేను పాటించెదను.

తతోఽవగతవృత్తాన్తో భూపతేస్తస్య స ద్విజః ।
సంభాషాసనదానేన చక్రే సమ్మానమాత్మవాన్ ॥51॥

అంతట రాజు వృత్తాంతమునెరిగిన జ్ఞానవంతుడైన ఆ బ్రాహ్మణముని సంభాషణము చేయుట, ఆసనమునిచ్చుట వరకే ఆ రాజును సమ్మానించెను.

ఋషిరువాచ - ఋషి చెప్పాడు.

కిం నిమిత్తమిహాయాతో భవాన్ కిం తే చికీర్షితమ్ ।
ఉత్తానపాదతనయం వేద్మి త్వాముత్తమం నృప ॥52॥

ఓ రాజా ! నీవెందులకు ఇచ్చటకు వచ్చితివి? నీకేమి కావలయును? నీవు ఉత్తానపాదుని కుమారుడగు ఉత్తముడను పేరుగలవాడవని నేను ఎరుగుదును.

రాజా ఉవాచ – రాజు చెప్పాడు.

బ్రాహ్మణస్య గృహాద్భార్యా కేనాప్యపహృతా మునే ।
అవిజ్ఞాతస్వరూపేణ తామన్వేష్టుమిహాగతః ॥53॥

పృచ్ఛామి యత్తే తన్మే త్వం ప్రణతస్యానుకంపయా ।
అభ్యాగతస్యాథ గృహం భగవన్! వక్తుమర్హసి ॥54॥

ఓ మునివర్యా! ఒక బ్రాహ్మణుని భార్య ఎవరిచేతనో దొంగలింపబడినది. ఆమె స్వరూపమును తెలియని నేను ఆమెను అన్వేషించు నిమిత్తమై ఇచ్చటకు వచ్చితిని. ఓ పూజ్యుడా! తమకు నమస్కరించుచున్న నాయందు దయయుంచి, తన గృహమునకు అతిథిగా వచ్చిన నేను ఒక విషయమును అడుగదలచితిని. దానిని చెప్పుటకు మీరు తగుదురు.

ఋషిరువాచ – ఋషి చెప్పాడు.

పృచ్ఛ మామవనీపాల యత్ప్రష్టవ్యమశఙ్కితః ।
వక్తవ్యం చేత్తవ మయా కథయిష్యామి తత్త్వతః ॥55॥

ఓ రాజా ! నీవు అడుగదలచిన విషయమును ఎట్టి సంశయము లేకుండా అడుగుము. చెప్పదగినది ఏదైనా ఉంటే తప్పక నిజమునే చెప్పెదను.

రాజోవాచ – రాజు చెప్పాడు.

గృహాగతాయ యో మహ్యం ప్రథమే దర్శనే మునే ।
త్వయా సముద్యతో దాతుం కథం సోఽర్ఘ్యో నివారితః ॥56॥

ఓ మునిశ్రేష్ఠుడా ! నేను మీ గృహమునకు రాగానే నన్ను చూచిన వెంటనే నాకు అర్ఘ్యమిచ్చుటకు మీరు ఉద్యుక్తులైరి. కాని తిరిగి దానిని ఇచ్చుట మానివేసితిరి, కారణమేమి?

ఋషిరువాచ – ఋషి చెప్పాడు.

త్వద్దర్శనేన రభసాదాజ్ఞప్తోఽయం మయా నృప ।
యదా తదాఽహమేతేన శిష్యేణ ప్రతిబోధితః ॥57॥

ఓ రాజా ! నిన్ను చూచినతోడనే తొందరలో ఈ నా శిష్యుని అర్ఘ్యమును తీసుకొని రమ్మని ఆజ్ఞాపించితిని. కాని ఆ వెంటనే నా శిష్యునిచేత తెలియజెప్పబడితిని.

ఏష వేత్తి జగత్యత్ర మత్ప్రసాదాదనాగతమ్ ।
యథాఽహం సమతీతం చ వర్తమానం చ సర్వతః ॥58॥

నేనెట్లయితే భూతభవిష్యద్వర్తమానవిషయములను అన్నింటిని ఎరుగుదునో అట్లే ఈ నా శిష్యుడు కూడా నా అనుగ్రహముచే ఈ ప్రపంచమందు సమస్తవిషయములను ఎరుగును.

ఆలోచ్యాజ్ఞాపయేత్యుక్తే తతో జ్ఞాతం మయాఽపి తత్ ।
తతో న దత్తవానర్ఘ్యమహం తుభ్యం విధానతః ॥59॥

"విచారించి ఆజ్ఞాపించుడు" అని నా శిష్యుడు చెప్పగానే నాకు కూడా విషయం తెలిసినది. అందువలన విధ్యుక్తప్రకారం నీకు నేను అర్ఘ్యమును ఇవ్వలేదు.

సత్యం రాజంస్త్వమర్ఘ్యార్హః కులే స్వాయంభువస్య చ ।
తథాఽపి నార్ఘ్యయోగ్యం త్వాం మన్యామో వయముత్తమమ్ ॥60॥

ఓ రాజా ! స్వాయంభువుని కులమందు జన్మించిన నీవు నిజముగా అర్ఘ్యమునకు అర్హుడవే. అయిననూ ఉత్తమనామధేయుడవగు నిన్ను అర్ఘ్యమునకు యోగ్యునిగా మేము తలచుట లేదు.

రాజోవాచ – రాజు చెప్పాడు.

కిం కృతం హి మయా బ్రహ్మన్ జ్ఞానాదజ్ఞానతోఽపి వా ।
యేన త్వత్తోఽర్ఘ్యమర్హామి నాహమభ్యాగతశ్చిరాత్ ॥61॥

ఓ బ్రహ్మస్వరూపుడా ! చాలాకాలమునకు అతిథిగా మీ వద్దకు వచ్చిన నేను అర్ఘ్యమునకు అర్హుడను కాలేకపోవుచున్నాను. తెలిసీ, తెలియక నేనేమి దోషమును ఆచరించితిని?

ఋషిరువాచ – ఋషి చెప్పాడు.

కిం విస్మృతం తే యత్పత్నీ త్వయా త్యక్తా చ కాననే ।
పరిత్యక్తస్తయా సార్ధం త్వయా ధర్మో నృపాఖిలః ॥62॥

ఓ రాజా! నీవు నీ భార్యను అడవులలో విడిచిపెట్టితివను విషయం మరచితివా ఏమి? ఆమెతోబాటు ధర్మము కూడా నీచేత విడువబడినది.

పక్షేణ కర్మణో హాన్యా ప్రయాత్యస్పృశ్యతాం నరః ।
కిమత్ర వార్షికీ యస్య హానిస్తే నిత్యకర్మణః ॥63॥

ఒక పక్షము రోజులు (పదిహేను రోజులు) ఎవరు తనకు విధింపబడిన శ్రౌతకర్మలను త్యజింతురో అట్టి మానవుడు అంటరానివాడే అగును. ఒక సంవత్సరం నుండి నిత్యకర్మలను విడిచిపెట్టిన నీ విషయం చెప్పవలెనా ఏమి?

పత్న్యానుకూలయా భావ్యం యథాఽశీలేఽపి భర్తరి ।
దుఃశీలాఽపి తథా భార్యా పోషణీయా నరేశ్వర ॥64॥

ఓ రాజా ! భర్త శీలవంతుడు కాకపోయినా ఎట్లు భార్య భర్తకు అనుకూలవతియై ఉండవలెనో అట్లే దుష్టస్వభావము కలిగిన భార్య కూడా భర్తచే పోషింపతగినదే.

ప్రతికూలా హి సా పత్నీ తస్య విప్రస్య యా హృతా ।
తథాఽపి ధర్మకామోఽసౌ త్వాముద్యోతితవాన్నృప ॥65॥

ఓ రాజా! అపహరింపబడిన ఆ బ్రాహ్మణుని భార్య అతనికి ప్రతికూలమే అయినప్పటికీ, ధర్మకార్యములు చేయవలెనను కోరిక కలిగిన ఆ బ్రాహ్మణుడు ఆమెను వెదికి తెచ్చిపెట్టవలసిందిగా నిన్ను ప్రేరేపించినాడు.

చలతః స్థాపయస్యన్యాన్ స్వధర్మేషు మహీపతే ।
త్వాం స్వధర్మాద్విచలితం కోఽపరః స్థాపయిష్యతి ॥66॥

ఓ రాజా ! ధర్మభ్రష్టులైన వారిని నీవు వారి వారి ధర్మములందు నిలబెట్టెదవు. నీవే ధర్మభ్రష్టుడవైనచో నిన్నెవరు ధర్మమందు నిలబెట్టెదరు?

(ద్వీపే కడఙ్గరీయే వా రాజ్ఞి చాన్యాయవర్తిని ।
పాపకృత్సు చ విద్వత్సు నియన్తా జన్తురత్ర కః ॥)

ద్వీపము అనగా పులి కడంగరీయముగా (తృణకాష్ఠాదులు కడంగరము. వాటిని భక్షించే ఎద్దు మొ॥ జంతువులు కడంగరీయములు) వైపరీత్యముతో మారినప్పుడు, రాజు అన్యాయముగా వ్యవహరించినప్పుడు, విద్వాంసులు పాపకార్యములను చేయునప్పుడు ఇక రక్షించే ప్రాణి ఎవరు?

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

విలక్ష్యః స మహీపాల ఇత్యుక్తస్తేన ధీమతా ।
తథేత్యుక్త్వా చ పప్రచ్ఛ హృతాం పత్నీం ద్విజన్మనః ॥67॥

ఆ రాజు అర్ఘ్యాదులకు అర్హుడు కాదని జ్ఞానియగు ఆ ఋషి పలికెను. అంతట ఆ రాజు అట్లే అగుగాక అని పలికి అపహరింపబడిన ఆ బ్రాహ్మణుని భార్యను గురించి అడిగెను.

భగవన్! కేన నీతా సా పత్నీ విప్రస్య కుత్ర వా ।
అతీతానాగతం వేత్తి జగత్యవితథం భవాన్ ॥68॥

ఓ పూజ్యుడా ! మీరు ప్రపంచమందలి భూతభవిష్యద్విషయములను అన్నింటిని ఎరుగుదురు. ఆ బ్రాహ్మణుని భార్యను ఎవరు అపహరించిరి? ఎచ్చట ఉంచిరి? దయతో చెప్పుడు.

ఋషిరువాచ – ముని చెప్పాడు.

తాం జహారాద్రితనయో బలాకో నామ రాక్షసః ।
ద్రక్ష్యతే చాద్య తాం భూప ఉత్పలావతకే వనే ॥69॥

గచ్ఛ సంయోజయాశు త్వం భార్యయా హి ద్విజోత్తమమ్ ।
మా పాపాస్పదతాం యాతు త్వమివాసౌ దినే దినే ॥70॥

ఓ రాజా ! ఆ విప్రుని భార్యను అద్రిపుత్రుడగు బలాకుడను రాక్షసుడు అపహరించెను. ఉత్పలావతకమను అడవియందు ఆమె నీకు కనిపించగలదు. ఇక నీవు వెళ్ళుము. వెంటనే నీవు ఆ బ్రాహ్మణుని అతని భార్యతో కలుపుము. నీవలే ఆ బ్రాహ్మణుడు రోజురోజుకూ నిత్యకర్మలను ఆచరించనందువలన వచ్చు పాపమును పొందకుండు గాక !

ఇతి శ్రీ మార్కండేయమహాపురాణే ఔత్తమే మన్వన్తరే ఋషిదర్శనం నామ షట్షష్టితమోఽధ్యాయః ॥66॥

శ్రీ మార్కండేయమహాపురాణమందలి ఔత్తమమన్వన్తరమందలి ఋషిదర్శనమను అరువదిఆరవ అధ్యాయం సమాప్తం.



సప్తషష్టితమోఽధ్యాయః - అరువదిఏడవ అధ్యాయం

ఔత్తమమన్వన్తరే బ్రాహ్మణభార్యానయనమ్ -

ఔత్తమమన్వంతరమందు బ్రాహ్మణ భార్యను తిరిగి తీసుకొనివచ్చుట

మార్కండేయ ఉవాచ - మార్కండేయుడు చెప్పాడు.

అథారురోహ స్వరథం ప్రణిపత్య మహామునిమ్ ।
తేనాఖ్యాతం వనం తచ్చ ప్రయయావుత్పలావతమ్ ॥1॥

పిమ్మట ఆ ఉత్తముడు ఆ గొప్ప మునికి నమస్కరించి తన రథమునెక్కి, ఆ ముని చెప్పిన ఉత్పలావతమను అడవిని గూర్చి వెళ్ళెను.

యథాఖ్యాతస్వరూపాం చ భార్యాం భర్త్రా ద్విజస్య తామ్ ।
భక్షయన్తీం దదర్శాథ శ్రీఫలాని నరేశ్వరః ॥2॥

ద్విజుడగు భర్త తన భార్యయొక్క ఎట్టి రూపమును చెప్పెనో, అట్టి రూపముగల ద్విజపత్నిని శ్రీఫలములను (మారేడు) తినుచున్న ఆమెను ఆ రాజు చూచెను.

పప్రచ్ఛ చ కథం భద్రే త్వమేతద్వనమాగతా ।
స్ఫుటం బ్రవీహి వైశాలేరపి భార్యా సుశర్మణః ॥3॥

ఆ రాజు ఆ ద్విజపత్నిని ఇట్లు అడిగెను. "ఓ భద్రురాలా ! నీవెట్లు ఈ అడవికి వచ్చితివి? నీవు విశాలుని పుత్రుడగు సుశర్మయొక్క భార్యవు అవునా కాదా స్పష్టముగా చెప్పుము.

బ్రాహ్మణ్యువాచ - ఆ బ్రాహ్మణపత్ని ఇట్లు చెప్పెను.

సుతాఽహమతిరాత్రస్య ద్విజస్య వనవాసినః ।
పత్నీ విశాలపుత్రస్య యస్య నామ త్వయోదితమ్ ॥4॥

నేను అడవిలో నివసించు అతిరాత్రుడను బ్రాహ్మణుని కుమార్తెను. విశాలుని పుత్రునియొక్క భార్యను. అతడి పేరును నీవు ఉచ్చరించితివి.

సాఽహం హృతా బలాకేన రాక్షసేన దురాత్మనా ।
ప్రసుప్తా భవనస్యాన్తర్భ్రాతృమాతృవియోజితా ॥5॥

అట్టి నేను నా ఇంట నిద్రించుచుండగా, నన్ను నా తల్లి, సోదరులనుండి వియోగపరచి దుర్మార్గుడైన బలాకుడను రాక్షసుడు అపహరించి నన్ను ఇచ్చటకు తెచ్చినాడు.

భస్మీభవతు తద్రక్షో యేనాస్మ్యేవం వియోజితా ।
మాత్రా భ్రాతృభిరన్యైశ్చ తిష్ఠామ్యత్ర సుదుఃఖితా ॥6॥

నా తల్లి, సోదరులు, ఇతరులనుండి వియోగపరచి నన్ను ఎవడైతే అపహరించి ఇచ్చటకు తెచ్చినాడో ఆ రాక్షసుడు భస్మమైపోగాక ! ఒంటరిదాననై నేనిచ్చట దుఃఖించుచున్నాను.

అస్మిన్వనేఽతిగహనే యేనానీయాహముజ్ఝితా ।
న వేద్మి కారణం కిం తన్నోపభుఙ్క్తే న ఖాదతి ॥7॥

ఈ దట్టమైన అడవిలోకి ఈ రాక్షసుడు నన్ను తెచ్చి విడిచినాడు. ఏ కారణముచేత ఇట్లు చేసెనో నాకు తెలియదు. నన్ను ఆ రాక్షసుడు అనుభవించనూ లేదు, తిననూ లేదు.

రాజోవాచ – రాజు చెప్పాడు.

అపి తజ్జ్ఞాయతే రక్షస్త్వాముత్సృజ్య క్వ వై గతమ్ ।
అహం భర్త్రా తవైవాత్ర ప్రేషితో ద్విజనన్దిని! ॥8॥

ఓ బ్రాహ్మణపత్నీ ! ఆ రాక్షసుడు నిన్నిచ్చట విడిచిపెట్టి ఎచ్చటకు వెళ్ళెనో నీకు తెలియునా? నీభర్త పంపగా నేనిచ్చటకు వచ్చినాను.

బాహ్మణ్యువాచ – ఆ బ్రాహ్మణపత్ని ఇట్లు చెప్పెను.

అస్యైవ కాననస్యాన్తః స తిష్ఠతి నిశాచరః ।
ప్రవిశ్య పశ్యతు భవాన్న బిభేతి తతో యది ॥9॥

ఈ రాక్షసుడు ఈ అడవిలోపలనే ఉన్నాడు. నీవు ఆ రాక్షసుని వలన భయపడకపోతే ఈ అడవిలోకి ప్రవేశించి చూడుము.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

ప్రవివేశ తతః సోఽథ తయా వర్త్మని దర్శితే ।
దదృశే పరివారేణ సమవేతం చ రాక్షసమ్ ॥10॥

దృష్టమాత్రే తతస్తస్మిన్ త్వరమాణః స రాక్షసః ।
దూరాదేవ మహీం మూర్ధ్నా స్పృశన్ పాదాన్తికం యయౌ ॥11॥

ఆ బ్రాహ్మణపత్ని దారి చూపించగా ఆ రాజు అడవిలోనికి ప్రవేశించి, స్వీయపరిజనముతో కూడుకొనియున్న రాక్షసుని చూచెను. ఆ రాజును చూచినంతనే త్వరత్వరగా ఆ రాక్షసుడు లేచి దూరమునుంచే భూమిని శిరస్సుతో తాకుచూ ఆ రాజు పాదములవద్దకు వెళ్ళెను.

రాక్షస ఉవాచ – రాక్షసుడు చెప్పాడు.

మమాత్రాగచ్ఛతా గేహం ప్రసాదస్తే మహాన్ కృతః ।
ప్రశాధి కిం కరోమ్యేష వసామి విషయే తవ ॥12॥

ఓ రాజా ! నీవు మా గృహమునకు వచ్చుట ద్వారా మాకు గొప్ప అనుగ్రహమును కలుగజేసితివి. నేనే నీకేమి చేయవలెనో ఆజ్ఞాపింపుము. నేను నీ ఆజ్ఞకు లోబడి నివసించుచున్నాను.

అర్ఘ్యం చేమం ప్రతీచ్ఛ త్వం స్థీయతాం చేదమాసనమ్ ।
వయం భృత్యా భవాన్ స్వామీ దృఢమాజ్ఞాపయస్వ మామ్ ॥13॥

ఈ అర్ఘ్యమును స్వీకరించుము. ఈ ఆసనమును అధిష్ఠించుము. మేము సేవకులము, మీరు ప్రభువు, నిశ్చయముగా నన్ను ఆజ్ఞాపింపుము.

రాజోవాచ – రాజు చెప్పాడు.

కృతమేవ త్వయా సర్వం సర్వా మేఽపచతిః కృతా ।
కిమర్థం బ్రాహ్మణవధూస్త్వయా నీతా నిశాచర ॥14॥

నేయం సురూపా సన్త్యన్యా భార్యార్థం చేద్ధృతా త్వయా ।
భక్ష్యార్థం చేత్కథం నాత్తా త్వయైతత్కథ్యతాం మమ ॥15॥

ఓ రాక్షసుడా ! నీవు చేయవలసిన అతిథిసత్కారములను అన్నింటిని చేసితివి. నాకు అర్ఘ్యమునిచ్చి పూజను కూడా ఒనర్చితివి. ఎందువలన బ్రాహ్మణభార్యను తీసుకొని వచ్చితివి? ఈమె సౌందర్యవతి కాదు. భార్యగా చేసుకొనుటకు అని కూడా భావించుటకు వీలు లేదు. ఎందువలననగా నీకు చాలామంది రూపవతులైన భార్యలున్నారు. ఈమెను భక్షించుటకొరకు అన్నట్లయితే మరి ఎందుకు నీవు భక్షించలేదు? కావున నాకీ విషయమును వివరించి చెప్పుము.

రాక్షస ఉవాచ – రాక్షసుడు చెప్పాడు.

న వయం మానుషాహారా అన్యే తే నృప రాక్షసాః ।
సుకృతస్య ఫలం యత్తు తదశ్నీమో వయం నృప ॥16॥

ఓ రాజా ! మేము మనుష్యులను తినువారము కాము. అట్టి రాక్షసులు వేరే ఉన్నారు. మేము చేసుకొన్న పుణ్యముయొక్క ఫలమునే మేము భుజించెదము.

(సుకృతస్య ఫలం యత్తు తత్తే వక్ష్యామ్యహం నృప ।
రాక్షసీం యోనిమాపన్నః క్రూరాం లోకభయంకరీమ్ ॥)

(ఓ రాజా ! నేను చేసుకొన్న పుణ్యముయొక్క ఫలమేమో దానిని నీకు నేను చెప్పెదను. నేను క్రూరమైట్టి, లోకమునకు భయమును కల్గించునట్టి రాక్షసజన్మను పొందితిని.)

స్వభావం చ మనుష్యాణాం యోషితాం చ విమానితాః ।
నామిషం చ సమశ్నీమో న వయం జన్తుఖాదకాః ॥17॥

అవమానమునకు లేదా కష్టములకు గురి అయిన మేము పురుషులు, స్త్రీలు వీరి స్వభావమును తినెదము (అపహరించెదము). మాంసమును తినువారము కాము. మేము బ్రతికియున్న ప్రాణులను తినువారమూ కాము.

యదస్మాభిర్నృణాం క్షాన్తిర్భుక్తా క్రుధ్యన్తి తే తదా ।
భుక్తే దుష్టే స్వభావే చ గుణవన్తో భవన్తి చ ॥18॥

మేము ఒకవేళ మానవుల క్షమాగుణమును భుజించినట్లయితే వారు కోపస్వభావము కలిగినవారు అగుదురు. వారి దుష్టస్వభావమును మేము భుజించినచో వారు గుణవంతులగుదురు.

సన్తి నః ప్రమదా భూప రూపేణాప్సరసాం సమాః ।
రాక్షస్యస్తాసు తిష్ఠత్సు మానుషీషు రతిః కథమ్ ॥19॥

ఓ రాజా ! రూపమున అప్సరసలతో సమానమైన రాక్షస భార్యలు మాకు కలరు. వారు ఉండగా మాకు మనుష్యస్త్రీలయందు ప్రీతి ఎట్లు కలుగును?

రాజోవాచ – రాజు చెప్పాడు.

యద్యేషా నోపభోగాయ నాహారాయ నిశాచర ।
గృహం ప్రవిశ్య విప్రస్య తత్కిమేషా హృతా త్వయా ॥20॥

ఓ రాక్షసుడా ! ఈ బ్రాహ్మణభార్య నీవు అనుభవించుటకొరకూ కాదు, భక్షించుటకొరకూ కాదు. అయినప్పుడు ఎందువలన ఆ బ్రాహ్మణుని ఇంటిలోనికి ప్రవేశించి ఈమెను అపహరించి తెచ్చితివి?

రాక్షస ఉవాచ – రాక్షసుడు చెప్పాడు.

మంత్రవిత్స ద్విజశ్రేష్ఠో యజ్ఞే యజ్ఞే గతస్య మే ।
రక్షోఘ్నమంత్రపఠనాత్కరోత్యుచ్చాటనం నృప ॥21॥

ఓ రాజా ! మంత్రవేత్త అయిన ఆ బ్రాహ్మణుడు నేను ఆహారము కొరకై ఏ యజ్ఞమునకు వెళ్ళినా కూడా రక్షోఘ్న మంత్రమును (రాక్షసులను యజ్ఞప్రదేశమందు లేకుండా చేయు మంత్రమే రక్షోఘ్నమంత్రము) పఠించి నన్ను అచ్చటినుంచి ఉచ్చాటన చేయుచున్నాడు అనగా తరిమికొట్టుచున్నాడు.

వయం బుభుక్షితాస్తస్య మంత్రోచ్చాటనకర్మణా ।
క్వ యామః సర్వయజ్ఞేషు స ఋత్విగ్భవతి ద్విజః ॥22॥

ఆ బ్రాహ్మణుని మంత్రోచ్చాటనకర్మచే మేము ఆహారము దొరకక ఆకలిగొన్నవారము అయితిమి. మేమెచ్చటికని వెళ్ళవలెను? ఎందువలననగా ఆ బ్రాహ్మణుడే సమస్తయజ్ఞములందు ఋత్విక్కుగా (యాగమును చేయించువానిగా) వ్యవహరించుచున్నాడు.

తతోఽస్మాభిరిదం తస్య వైకల్యముపపాదితమ్ ।
పత్న్యా వినా పుమానిజ్యాకర్మయోగ్యో న జాయతే ॥23॥

అందువలన మేము ఈ బ్రాహ్మణునికి భార్యావియోగమును కలిగించితిమి. భార్యాహీనుడయిన పురుషుడు యజ్ఞయాగాది కర్మలకు అర్హుడు కాదు.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

వైకల్యోచ్చారణాత్తస్య బ్రాహ్మణస్య మహామతేః ।
తతః స రాజాతిభృశం విషణ్ణః సమజాయత ॥24॥

గొప్ప బుద్ధిమంతుడయిన ఆ బ్రాహ్మణుని వైకల్యమునుగూర్చి రాక్షసుడు పలుకగా, ఆ ఉత్తముడను రాజు మిక్కిలి దుఃఖమును పొందెను.

వైకల్యమేష విప్రస్య వదన్మామేవ నిన్దతి ।
అనర్హమర్ఘ్యస్య చ గాం సోఽప్యాహ మునిసత్తమః ॥25॥

ఈ రాక్షసుడు బ్రాహ్మణుని వైకల్యము గురించి మాటలాడుచూ నన్నే నిందించుచున్నాడు. ఆ మునిశ్రేష్ఠుడు కూడా నేను అర్ఘ్యద్రవ్యమునకు అర్హుడను కానని ఆ మాటను చెప్పినాడు. (గో శబ్దానికి వాక్కు అర్థం చెప్పుకోవాలి).

వైకల్యం తస్య విప్రస్య రాక్షసోఽప్యాహ మే యథా ।
అపత్నీకతయా సోఽహం సంకటం మహదాస్థితః ॥26॥

నేను భార్యావికలుడను అయిన విధముగా ఆ బ్రాహ్మణుడు భార్యావికలుడైన విషయాన్ని ఆ రాక్షసుడు కూడా చెప్పాడు. ఇప్పుడు భార్యారహితుడనైనందున గొప్ప సంకటస్థితిని పొందినాను.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

ఏవం చిన్తయతస్తస్య పునరప్యాహ రాక్షసః ।
ప్రణామనమ్రో రాజానం బద్ధాఞ్జలిపుటో మునే ॥27॥

నరేంద్రాజ్ఞాప్రదానేన ప్రసాదః క్రియతాం మమ ।
భృత్యస్య ప్రణతస్యేత్థం యుష్మద్విషయవాసినః ॥28॥

ఓ క్రౌష్టుకిమునీ ! ఈ విధముగా ఆ ఉత్తముడను రాజు ఆలోచించుచుండగా చేతులు జోడించి నమస్కరించి ఆ రాక్షసుడు తిరిగి ఇట్లు పలికెను. "ఓ మహారాజా ! మీరు పరిపాలించుచున్న రాజ్యమందు నివసించుచూ తమ ఆజ్ఞకు లోబడియున్న ఈ సేవకుని తగు విధముగా ఆజ్ఞాపించి అనుగ్రహింపుడు."

రాజోవాచ – రాజు చెప్పాడు.

స్వభావం వయమశ్నీమస్త్వయోక్తం యన్నిశాచర ।
తదర్థినో వయం యేన కార్యేణ శృణు తన్మమ ॥29॥

ఓ రాక్షసుడా ! "మేము మనుష్యుల స్వభావమును తినెదము" అని నీవు చెప్పితివి. అందువలన నీవు మాకు ఎట్టి కార్యమును నెరవేర్చవలెనో చెప్పెదము వినుము."

అస్యాస్త్వయాద్య బ్రాహ్మణ్యా దౌఃశీల్యముపభుజ్యతామ్ ।
యేన త్వయాత్తదౌఃశీల్యా తద్వినీతా భవేదియమ్ ॥30॥

నీవిప్పుడు ఈ బ్రాహ్మణస్త్రీయొక్క దుష్టస్వభావమును భుజించివేయుము. అందువలన నీచేత తినివేయబడిన దుష్టస్వభావము కలిగిన ఈమె వినీతురాలు (సుగుణవతి) కాగలదు.

నీయతాం యస్య భార్యేయం తస్య వేశ్మ నిశాచర ।
అస్మిన్ కృతే కృతం సర్వం గృహమభ్యాగతస్య మే ॥31॥

ఓ రాక్షసుడా ! ఈమె ఎవనియొక్క భార్యయో అతని గృహమునకు ఈమెను చేర్చుము. ఈ కార్యమును నీవు నెరవేర్చినట్లయిన నీ ఇంటికి అతిథిగా వచ్చిన నాయొక్క కార్యమునంతటినీ నీవు నెరవేర్చినవాడవు కాగలవు.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

తతః స రాక్షసస్తస్యాః ప్రవిశ్యాన్తః స్వమాయయా ।
భక్షయామాస దౌఃశీల్యం నిజశక్త్యా నృపాజ్ఞయా ॥32॥

అంతట ఆ రాక్షసుడు తన మాయాబలముచే ఆ బ్రాహ్మణస్త్రీయొక్క హృదయమందు ప్రవేశించి రాజాజ్ఞననుసరించి తన శక్తితో ఆమెయొక్క దుష్టస్వభావమును భక్షించివేసెను.

దౌఃశీల్యేనాతిరౌద్రేణ పత్నీ తస్య ద్విజన్మనః ।
తేన సా సంపరిత్యక్తా తమాహ జగతీపతిమ్ ॥33॥

అప్పుడు అతిప్రచండమైన దుష్టస్వభావముచే విడువబడినదై ఆ బ్రాహ్మణుని భార్య రాజుతో ఇట్లు చెప్పెను.

స్వకర్మఫలపాకేన భర్తుస్తస్య మహాత్మనః ।
వియోజితాఽహం తద్ధేతురయమాసీన్నిశాచరః ॥34॥

ఓ రాజా ! నేను చేసుకొన్న కర్మల ఫలితముగానే మహాత్ముడగు నా భర్తతో నాకు వియోగము కలిగినది. ఈ రాక్షసుడు అందు నిమిత్తమాత్రుడు మాత్రమే.

నాస్య దోషో న వా తస్య మమ భర్తుర్మహాత్మనః ।
మమైవ దోషో నాన్యస్య స్వకృతం హ్యుపభుజ్యతే ॥35॥

నాకు భర్తతో వియోగము కలుగుటలో ఈ రాక్షసుని దోషమేమీ లేదు. అట్లే మహాత్ముడగు నా భర్తయొక్క దోషమూ లేదు. దోషమంతా నాదే. ఇతరులది ఎవరిదీ కాదు. నేను చేసుకొన్న కర్మఫలితమును అనుభవించుచున్నాను.

అన్యజన్మని కస్యాపి విప్రయోగః కృతో మయా ।
సోఽయం మయాఽప్యుపగతః కో దోషోఽస్య మహాత్మనః ॥36॥

నేను వెనుకటి జన్మమందు ఎవరికో వియోగము కలిగించియుండవచ్చును. అందువల్లనే అట్టి వియోగము నాకీ జన్మమందు సంప్రాప్తించినది. ఈ విషయములో ఈ నిశాచరుని తప్పేమున్నది?

రాక్షస ఉవాచ – రాక్షసుడు చెప్పాడు.

ప్రాపయామి తవాదేశాదిమాం భర్తృగృహం ప్రభో ।
యదన్యత్కరణీయం తే తదాజ్ఞాపయ పార్థివ ॥37॥

ఓ ప్రభూ ! నీ ఆజ్ఞచే ఈమెను ఈమె భర్తయొక్క గృహమునకు చేర్చెదను. ఓ రాజా ! నీకేమైనా నేను చేయవలసిన కార్యమున్నచో ఆజ్ఞాపింపుడు.

రాజోవాచ – రాజు చెప్పాడు.

అస్మిన్కృతే కృతం సర్వం త్వయా మే రజనీచర ।
ఆగన్తవ్యం చ తే వీర కార్యకాలే స్మృతేన మే ॥38॥

ఓ రాక్షసుడా ! నీవీ పని అనగా ఈమెను ఈమె భర్తృగృహమునకు చేర్చుట అను పనిని నెరవేర్చినచో సమస్తకార్యములను నెరవేర్చినట్లే. ఓ వీరుడా ! ఏదైనా అవసరము కలిగినప్పుడు నేను నిన్ను స్మరించగానే ఉపస్థితుడవు అగుము.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

తథేత్యుక్త్వా తు తద్రక్షస్తామాదాయ ద్విజాఙ్గనామ్ ।
నిన్యే భర్తృగృహం శుద్ధాం దౌఃశీల్యాపగమాత్తదా ॥39॥

ఆ రాక్షసుడు అట్లేయని పలికి దుష్టస్వభావము నశించుటచే పరిశుద్ధురాలైన ఆ బ్రాహ్మణస్త్రీని గ్రహించి ఆమె భర్తయొక్క ఇంటికి తీసుకొని వెళ్ళెను.

ఇతి శ్రీమార్కండేయమహాపురాణే ఔత్తమమన్వన్తరే బ్రాహ్మణభార్యానయనం నామ సప్తషష్టితమోఽధ్యాయః॥67॥

శ్రీ మార్కండేయమహాపురాణమందు ఔత్తమమన్వంతరమందలి బ్రాహ్మణభార్యానయనమను (బ్రాహ్మణభార్యను తిరిగి తీసుకొని వచ్చుటయను) అరువదియేడవ అధ్యాయం సమాప్తం.



అష్టషష్టితమోఽధ్యాయః - అరువది ఎనిమిదవ అధ్యాయం
ఔత్తమమన్వన్తరవృత్తాన్తమ్ - ఔత్తమమన్వంతరవృత్తాంతం

మార్కండేయ ఉవాచ - మార్కండేయుడు చెప్పాడు.

తాం ప్రేషయిత్వా రాజాఽపి స్వభర్తృగృహమఙ్గనామ్ ।
చిన్తయామాస నిశ్శ్వస్య కిమత్ర సుకృతం భవేత్ ॥1॥

రాజు కూడా ఆ బ్రాహ్మణస్త్రీని ఆమె భర్తయొక్క గృహమునకు పంపించి దీర్ఘముగా నిట్టూర్చి "నేను చేయవలసిన మంచి పని ఏమి?" అని చింతించసాగెను.

అనర్ఘయోగ్యతా కష్టం స యామాహ మహామనాః ।
వైకల్యం విప్రముద్దిశ్య తథాహాయం నిశాచరః ॥2॥

మహాత్ముడగు ఆ ముని నాతో "భార్యావియోగకారణముగా నీకు అర్ఘ్యమును పొందుటకు అర్హత లేదు" అని ఏ వాక్కును పలికెనో అట్లే ఈ రాక్షసుడు కూడా ఆ బ్రాహ్మణుని దృష్టిలో పెట్టుకొని భార్యావియోగమువలన కలుగు వైకల్యమును గూర్చి చెప్పెను.

సోఽహం కథం కరిష్యామి త్యక్తా పత్నీ మయా హి సా ।
అథవా జ్ఞానదృష్టిం తం పృచ్ఛామి మునిసత్తమమ్ ॥3॥

అట్టి నేను ఇప్పుడు ఏమి చేయవలెను? నాచేత భార్య విడిచిపెట్టబడినది కదా ! లేనిచో నేను జ్ఞానదృష్టి కలిగిన ఆ మునిశ్రేష్ఠుడినే తగిన ఉపాయమును అడిగెదను.

సఞ్చిన్త్యేత్థం స భూపాలః సమారుహ్య చ తం రథమ్ ।
యయౌ యత్ర స ధర్మాత్మా త్రికాలజ్ఞో మహామునిః ॥4॥

ఈ విధముగా ఆలోచించి ఆ ఉత్తమమహారాజు రథమునెక్కి భూతభవిష్యద్వర్తమానములనెరిగిన ధర్మాత్ముడగు ఆ మహామునియున్న చోటికి వెళ్ళెను.

అవరుహ్య రథాత్సోఽథ తం సమేత్య ప్రణమ్య చ ।
యథావృత్తం సమాచఖ్యౌ రాక్షసేన సమాగమమ్ ॥5॥

బ్రాహ్మణ్యా దర్శనం చైవ దౌఃశీల్యాపగమం తథా ।
ప్రేషణం భర్తృగేహే చ కార్యమాగమనే చ యత్ ॥6॥

ఆ రాజు రథము దిగి ఆ మునిని సమీపించి నమస్కరించి రాక్షసుని కలియుట, బ్రాహ్మణస్త్రీని చూచుట, ఆమె దుష్టస్వభావము నశించుట, ఆమె భర్త ఇంటికి ఆమెను పంపుట, వీటినన్నింటినీ జరిగినది జరిగినట్లుగా చెప్పెను. తాను వచ్చిన పనినిగూర్చి కూడా చెప్పెను.

ఋషిరువాచ – ఋషి చెప్పాడు.

జ్ఞాతమేతన్మయా పూర్వం యత్కృతం తే నరాధిప ।
కార్యమాగమనే చైవ మత్సమీపే తవాఖిలమ్ ॥7॥

ప్రష్టుం మామిహ కిం కార్యం మయేత్యుద్విగ్నమానసః ।
త్వమాగతో మహీపాల శృణు కార్యం చ యత్త్వయా ॥8॥

ఓ మహారాజా ! నీవు మునుపు చేసిన పనులను, నావద్దకు నీవు వచ్చిన పని ఇవి అన్నియు నాకు తెలియును. ఓ రాజా ! "నేనిప్పుడు ఏమి చేయవలెను" అని ఉద్వేగము చెందిన మనస్సుతో నన్ను అడుగుటకు నీవిక్కడకు వచ్చితివి. నీవిప్పుడు ఏమి చేయవలెనో చెప్పెదను, వినుము.

పత్నీ ధర్మార్థకామానాం కారణం ప్రబలం నృణామ్ ।
విశేషతశ్చ ధర్మస్య స త్యక్తస్త్యజతా హి తామ్ ॥9॥

ధర్మార్థకామములను మూడు పురుషార్థములను ఆచరించుటలో మానవులకు ముఖ్యకారణము భార్యయే. ప్రత్యేకించి ధర్మమునాచరించుటలో ఆమెయే ప్రధానకారణము. ఆమెను విడిచిపెట్టినచో, ధర్మమే విడిచిపెట్టబడినది అగును.

అపత్నీకో నరో భూప న యోగ్యో నిజకర్మణామ్ ।
బ్రాహ్మణః క్షత్రియో వాపి వైశ్యః శూద్రోఽపి వా నృప ॥10॥

ఓ రాజా! భార్యారహితుడైన మానవుడు తనకు విధింపబడిన కర్మలను ఆచరించుటకు యోగ్యుడు కాడు. ఓ రాజా! అట్టివాడు బ్రాహ్మణక్షత్రియవైశ్యశూద్రులలో ఎవరైనా కావచ్చును. స్వీయకర్మలను అనుష్ఠించుటలో అర్హుడు కాడు.

త్యజతా భవతా పత్నీం న శోభనమనుష్ఠితమ్ ।
అత్యాజ్యో హి యథా భర్తా స్త్రీణాం భార్యా తథా నృణామ్ ॥11॥

నీవు నీ భార్యను విడిచిపెట్టి మంచి చేయలేదు. స్త్రీలకు భర్త ఎట్లు విడువతగినవాడు కాదో అట్లే పురుషులకు భార్య విడిచిపెట్టతగినది కాదు.

రాజోవాచ – రాజు చెప్పాడు.

భగవన్! కిం కరోమ్యేష విపాకో మమ కర్మణామ్ ।
నానుకూలానుకూలస్య యస్మాత్త్యక్తా తతో మయా ॥12॥

ఓ పూజ్యుడా ! ఏమి చేయుదును? ఇది నా కర్మల ఫలము. నేను ఆమెపట్ల అనుకూలముగా ఉన్నప్పటికీ ఆమె అనుకూలముగా లేనందున నేనామెను విడిచిపెట్టితిని.

యద్యత్కరోతి తత్క్షాన్తం దహ్యమానేన చేతసా ।
భగవంస్తద్వియోగాతివిభీతేనాన్తరాత్మనా ॥13॥

ఓ పూజ్యుడా ! ఆమె నాకు ప్రతికూలముగా ఏమి ఆచరించినా దహించుచున్న మనస్సుతోనూ, ఆమెతో వియోగము కలుగుతుందేమో అన్న భయంతోనూ నేను అన్నింటినీ సహించితిని.

సాంప్రతం తు వనే త్యక్తా న వేద్మి క్వ ను సా గతా ।
భక్షితా వాపి విపినే సింహవ్యాఘ్రనిశాచరైః ॥14॥

ఇప్పుడయితే ఆమె నాచేత అడవులలో విడిచిపెట్టబడినది. ఆమె ఎక్కడికి పోయినదో నేను ఎరుగను. అడవులలో సింహములు, పులులు, రాక్షసులచే తినివేయబడినది అయినా కావచ్చును.

ఋషిరువాచ – ఋషి చెప్పాడు.

న భక్షితా సా భూపాల సింహవ్యాఘ్రనిశాచరైః ।
సా త్వవిప్లుతచారిత్రా సాంప్రతం తు రసాతలే ॥15॥

ఓ రాజా ! ఆమె సింహములు, వ్యాఘ్రములు, రాక్షసులచే భక్షింపబడలేదు. ఆమె ఇప్పుడు పరిశుద్ధమైన చరిత్ర గలదై పాతాళలోకమున నివసించుచున్నది.

రాజోవాచ – రాజు చెప్పాడు.

సా నీతా కేన పాతాలమాస్తే సాఽదూషితా కథమ్ ।
అత్యద్భుతమిదం బ్రహ్మన్ యథావద్వక్తుమర్హసి ॥16॥

ఓ బ్రహ్మస్వరూపుడా ! ఆమె ఎవరిచేత పాతాళలోకమునకు తీసుకొనివెళ్ళబడినది? అదూషితురాలై అచ్చట ఎట్లు నివసించుచున్నది? ఇదియంతయు మిక్కిలి ఆశ్చర్యముగా ఉన్నది. కావున ఉన్నది ఉన్నట్లు నీవు చెప్పుటకు తగుదువు.

ఋషిరువాచ – ఋషి చెప్పాడు.

పాతాలే నాగరాజోఽస్తి ప్రఖ్యాతశ్చ కపోతకః ।
తేన దృష్టా త్వయా త్యక్తా భ్రమమాణా మహావనే ॥17॥

పాతాళలోకమందు కపోతకుడను ప్రసిద్ధుడైన నాగరాజొకడు గలడు. అడవిలో అటునిటూ తిరుగుచుండగా నీ భార్య అతనిచే చూడబడినది.

సా రూపశాలినీ తేన సానురాగేణ పార్థివ ।
వేదితార్థేన పాతాలం నీతా సా యువతీ తదా ॥18॥

ఓ రాజా ! అందమైన నీ భార్యయందు అనురాగము కలిగిన ఆ నాగరాజు తన అభిప్రాయమును చెప్పి అప్పుడు ఆ యువతిని పాతాళలోకమునకు తీసుకొని వెళ్ళెను.

తతస్తస్య సుతా సుభ్రూర్నందా నామ మహీపతే ।
భార్యా మనోరమా చాస్య నాగరాజస్య ధీమతః ॥19॥

ఓ రాజా ! బుద్ధిమంతుడైన ఆ నాగరాజుకు అందమైన కనుబొమలు కలిగిన నందయను పేరు కలిగిన కూతురు, మనోరమయను భార్య గలరు.

తయా మాతుః సపత్నీయం సా భవిత్రీతి శోభనా ।
దృష్ట్వా స్వగేహం సా నీతా గుప్తా చాన్తఃపురే శుభా ॥20॥

మంగళస్వరూపురాలైన ఆమె (ఉత్తముని భార్య) తన తల్లికి సవతి కాగలదని భావించి నాగరాజుకుమార్తెయగు నంద ఆమెను తన ఇంటికి తీసుకొనివెళ్ళి అన్తఃపురమునందు రహస్యముగా ఉంచెను.

యదా తు యాచితా నన్దా న దదాతి నృపోత్తరమ్ ।
మూకా భవిష్యతీత్యాహ తదా తాం తనయాం పితా ॥21॥

ఓ రాజా ! నాగరాజు తన కుమార్తె నందవద్దకు వచ్చి ఆ సుందరినిమ్మని యాచించెను. కాని ఆమె ఏమీ బదులు ఈయనందున కోపగించిన నాగరాజు తన కుమార్తెను "నీవు మూగదానివి అగుదువు గాక" అని శపించెను.

ఏవం శప్తా సుతా తేన సా చాస్తే తత్ర భూపతే ।
నీతా తేనోరగేన్ద్రేణ ధృతా తత్సుతయా సతీ ॥22॥

ఓ రాజా ! ఈ విధముగా తండ్రిచేత శపింపబడి నంద మూగ అయ్యెను. నాగరాజుచేత పాతాళమునకు తీసుకొనిపోబడిన నీ భార్య పతివ్రతగా నంద సంరక్షణలో ఉన్నది.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

తతో రాజా పరం హర్షమవాప్య తమపృచ్ఛత ।
ద్విజవర్యం స్వదౌర్భాగ్యకారణం దయితాం ప్రతి ॥23॥

అంతట ఆ రాజు గొప్ప సంతోషమును పొంది తన భార్యపట్ల తనకు కలిగిన దురదృష్టమునకు కారణమును ఆ మునిశ్రేష్ఠుని అడిగెను.

రాజోవాచ – రాజు చెప్పాడు.

భగవన్ సర్వలోకస్య మయి ప్రీతిరనుత్తమా ।
కిన్తు తత్కారణం యేన స్వపత్నీ నాతివత్సలా ॥24॥

ఓ పూజ్యుడా ! సమస్త జనులకు నా యందు గొప్ప ప్రీతి ఉన్నది. కాని నా భార్యమాత్రము నాయందు అనురాగము కలది కాదు. ఇందుకు కారణమేమి?

మమ చాసావతీవేష్టా ప్రాణేభ్యోఽపి మహామునే ।
సా చ మాం ప్రతి దుశ్శీలా బ్రూహి తత్కారణం ద్విజ ॥25॥

ఓ మహామునీ ! నా ప్రాణములకంటెనూ నా భార్య నాకు ఇష్టురాలు. అయిననూ ఆమె నా పట్ల దుష్టస్వభావము కలిగినది ఆయెను. ఓ బ్రాహ్మణుడా ! అందుకు కారణమేమో చెప్పుము.

ఋషిరువాచ – ఋషి చెప్పాడు.

పాణిగ్రహణకాలే త్వం సూర్యభౌమశనైశ్చరైః ।
శుక్రవాచస్పతిభ్యాం చ తవ భార్యావలోకితా ॥26॥

తన్ముహూర్తేఽభవచ్చంద్రస్తస్యాః సోమసుతస్తథా ।
పరస్పరవిపక్షౌ తౌ తతః పార్థివ తే భృశమ్ ॥27॥

తద్గచ్ఛ త్వం స్వధర్మేణ పరిపాలయ మేదినీమ్ ।
పత్నీసహాయః సర్వాశ్చ కురు ధర్మవతీః క్రియాః ॥28॥

ఓ రాజా ! నీవు వివాహమందు పాణిగ్రహణము చేయు సమయమందు రవి, మంగళ, శనైశ్చరుల దృష్టి నీపై ఉన్నది. శుక్ర, బృహస్పతుల దృష్టి నీ భార్యపై ఉన్నది. ఆ సమయమందు చంద్రుడు మీకు, బుధుడు మీ భార్యకు అనుకూలముగా ఉండిరి. వీరిరువురు పరస్పరశత్రువులు కావున నీకు భార్యవలన అనుకూలత లభించలేదు. అందువలన ఇక నీవు వెళ్ళుము. స్వీయధర్మముతో భూమిని పరిపాలించుము. భార్యాసహితుడవై ధర్మబద్ధమైన కార్యములను అన్నింటినీ అనుష్ఠించుము.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

ఇత్యుక్తే ప్రణిపత్యైనమారుహ్య స్యన్దనం తతః ।
ఉత్తమః పృథివీపాల ఆజగామ నిజం పురమ్ ॥29॥

ఆ మునిశ్రేష్ఠుడు ఇట్లు పలుకగా భూపాలకుడగు ఉత్తముడు ఆ మునికి నమస్కరించి, తన రథమునెక్కి తన పట్టణమునకు తిరిగి వచ్చెను.

ఇతి శ్రీ మార్కండేయమహాపురాణే ఔత్తమమన్వన్తరే అష్టషష్టితమోఽధ్యాయః ॥68॥

శ్రీ మార్కండేయమహాపురాణమందలి ఔత్తమమన్వంతరవృత్తాంతమను అరువదిఎనిమిదవ అధ్యాయం సమాప్తం.



ఏకోనసప్తతితమోఽధ్యాయః – అరువదితొమ్మిదవ అధ్యాయం
ఔత్తమమన్వన్తరవృత్తాన్తః – ఔత్తమమన్వంతరవృత్తాంతం

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

తతః స్వనగరం ప్రాప్య తం దదర్శ ద్విజం నృపః ।
సమేతం భార్యయా చైవ శీలవత్యా ముదాఽన్వితమ్ ॥1॥

అంతట ఉత్తమమహారాజు తన నగరమునకు చేరుకొని, శీలవతియగు భార్యతో కూడుకొని సంతోషముగా ఉన్న ఆ బ్రాహ్మణుని చూచెను.

బ్రాహ్మణ ఉవాచ – బ్రాహ్మణుడు చెప్పాడు.

రాజవర్య కృతార్థోఽస్మి యతో ధర్మో హి రక్షితః ।
ధర్మజ్ఞేనేహ భవతా భార్యామానయతా మమ ॥2॥

ఓ రాజశ్రేష్ఠుడా ! నేను కృతార్థుడనైతిని. ఎందువలననగా ధర్మమునెరిగిన నీవు నా భార్యను తిరిగి తీసుకొనివచ్చుట ద్వారా నా ధర్మము రక్షింపబడినది.

రాజోవాచ – రాజు చెప్పాడు.

కృతార్థస్త్వం ద్విజశ్రేష్ఠ నిజధర్మానుపాలనాత్ ।
వయం సంకటినో విప్ర యేషాం పత్నీ న వేశ్మని ॥3॥

ఓ బ్రాహ్మణశ్రేష్ఠుడా ! నీవు నీ ధర్మాన్ని పాటించుటద్వారా నీవు కృతార్థుడవైతివి. నా భార్య నా యింట లేనందున నేను సంకటస్థితియందు పడితిని.

బ్రాహ్మణ ఉవాచ – బ్రాహ్మణుడు చెప్పాడు.

నరేన్ద్ర సా హి విపినే భక్షితా శ్వాపదైర్యది ।
క్రోధస్య వశమాగమ్య ధర్మో నావేక్షితస్త్వయా ।
అలం తయా కిమన్యస్యా న పాణిర్గృహ్యతే త్వయా ।
సన్తి రాజ్ఞాం గృహే కన్యాః శోభనా నృపనందన ॥4॥

ఓ మహారాజా ! నీవు క్రోధమునకు వశీభూతుడవై ధర్మమును చూడలేదు. నీ భార్య అడవులలో క్రూరమృగములచే తినివేయబడి మరణించి ఉండవచ్చును. ఆమె లేకపోతే పోనీ, వేరొక స్త్రీతో పాణిగ్రహణము నీవెందుకు చేయుటలేదు? రాజాస్థానమందు అందమైన కన్యలు అనేకమంది కలరు.

రాజోవాచ – రాజు చెప్పాడు.

న భక్షితా మే దయితా శ్వాపదైః సా హి జీవతి ।
అవిదూషితచారిత్రా కథమేతత్కరోమ్యహమ్ ॥5॥

నా భార్య ఎట్టి క్రూరమృగములచేతనూ భక్షించబడలేదు. పరిశుద్ధమైన చారిత్రముతో ఆమె జీవించియేయున్నది. ఇప్పుడు నేనెట్లు ఆచరించవలెను?

బ్రాహ్మణ ఉవాచ – బ్రాహ్మణుడు చెప్పాడు.

యది జీవతి తే భార్యా న చైవ వ్యభిచారిణీ ।
అపత్నీకత్వతో జన్మ కిం పాపం క్రియతే త్వయా ॥6॥

ఒకవేళ నీ భార్య ఇప్పటివరకు అవ్యభిచారిణియై జీవించియే యున్నచో నీవు పత్నీరహితుడవై జీవించుచూ ఎందువలన పాపము చేయుచున్నావు?

రాజోవాచ – రాజు చెప్పాడు.

ఆనీతాఽపి హి సా విప్ర ప్రతికూలా సదైవ మే ।
దుఃఖాయ న సుఖాయాలం తస్యా మైత్రీ న వై మయి ॥

ఓ బ్రాహ్మణుడా ! నేను నా భార్యను తీసుకువచ్చిననూ ఆమె ఎల్లప్పుడూ నాకు ప్రతికూలముగానే ఉండును. ఆమెతో సాంగత్యము దుఃఖమునే కల్గించునుగాని సుఖమును కల్గించదు. ఆమెకు నాయందు స్నేహభావము లేదు గదా!

యథా తే బ్రాహ్మణీ విప్ర వశగా తవ సుందరీ ।
తథా త్వం కురు యత్నం మే యథా సా వశగామినీ ॥7॥

ఓ బ్రాహ్మణుడా ! ఎట్లయితే సుందరియైన నీ భార్య నీకు వశమైయున్నదో అట్లే నా భార్య కూడా నాకు వశమైయుండునట్లుగా అనగా నామాట వినునట్లుగా నీవు ప్రయత్నము చేయుము.

బ్రాహ్మణ ఉవాచ – బ్రాహ్మణుడు చెప్పాడు.

త్వయి సంప్రీతయే తస్యా వరేష్టిరుపకారిణీ ।
క్రియతే మిత్రకామైర్యా మిత్రవిన్దాం కరోమి తామ్ ॥8॥

ఓ రాజా ! నీ భార్యకు నీయందు ప్రీతి కల్గింపచేయుటకు శ్రేష్ఠమైనట్టిదీ, నీకు ఉపకారము కల్గింపచేయునట్టిదీ అయిన యజ్ఞమునొకదానిని చేసెదను. స్నేహమును కోరువారు చేసే ఆ యజ్ఞమే మిత్రవిన్దయను పేరుగల యజ్ఞము. దానిని నేను నీకొరకు అనుష్ఠించెదను.

అప్రీతయోః ప్రీతికరీ సా హి సంజననీ పరమ్ ।
భార్యాపత్యోర్మనుష్యేన్ద్ర తాం తవేష్టిం కరోమ్యహమ్ ॥9॥

ఓ మానవశ్రేష్ఠుడా ! పరస్పరము ప్రీతిలేనివారికి వారిమధ్య ఈ ఇష్టి (మిత్రవిన్దయను యజ్ఞము) ప్రీతిని ఉత్పన్నము చేయును. ముఖ్యముగా భార్యాభర్తలమధ్య పరస్పరానురాగమును కల్గించును. అట్టి యజ్ఞమును నీ కొరకు నేను ఆచరించెదను.

యత్ర తిష్ఠతి సా సుభ్రూస్తవ భార్యా మహీపతే ।
తస్మాదానీయతాం సా తే పరాం ప్రీతిముపైష్యతి ॥10॥
(తస్యాస్తవ హితార్థాయ ధర్మో యత్ర న సీదతి ॥)

ఓ రాజా ! శోభనమైన కీర్తి కలిగిన నీ భార్య ఎచ్చట ఉన్నదో అచ్చటినుంచి తీసుకొని రమ్ము. ఆమె నీకు గొప్ప సంతోషమును కల్గించగలదు. దీనిచే ధర్మం నశించదు.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

ఇత్యుక్తః స తు సంభారానశేషానవనీపతిః ।
ఆనినాయ చకారేష్టిం స చ తాం ద్విజసత్తమః ॥11॥

ఆ బ్రాహ్మణుడీ విధముగా చెప్పగా ఆ రాజు యజ్ఞమునకు కావలసిన సామగ్రినంతటినీ తెచ్చెను. ఆ బ్రాహ్మణశ్రేష్ఠుడు కూడా ఆ యజ్ఞమును ఆచరించెను.

సప్తకృత్వః స తు తదా చకారేష్టిం పునఃపునః ।
తస్య రాజ్ఞో ద్విజశ్రేష్ఠో భార్యాసంపాదనాయ వై ॥12॥

ఆ బ్రాహ్మణశ్రేష్ఠుడు ఉత్తమమహారాజు తిరిగి అతని భార్యను సంపాదించు నిమిత్తమై మరల మరల ఏడు పర్యాయములు మిత్రవిన్దయాగమును చేసెను.

యదారోపితమైత్రీం తామమన్యత మహామునిః ।
స్వభర్తరి తదా విప్రస్తమువాచ నరాధిపమ్ ॥13॥

ఎప్పుడయితే ఆ మహాముని ఆ రాజమహిషిని తన భర్తయగు రాజునందు అనురాగవతి అయినట్లుగా భావించెనో, అప్పుడు ఆ బ్రాహ్మణుడు రాజుతో ఇట్లు పలికెను.

ఆనీయతాం నరశ్రేష్ఠ యా తవేష్టాత్మనోఽన్తికమ్ ।
భుంక్ష్వ భోగాంస్తయా సార్ధం యజ యజ్ఞాంస్తథాదృతః ॥14॥

ఓ మానవశ్రేష్ఠుడా ! నీకిష్టురాలైన నీ భార్యను నీ సమీపమునకు తెచ్చుకొనుము. ఆమెతో కూడా భోగములను అనుభవించుము. అట్లే ఆమెచే ఆదరింపబడినవాడవై యజ్ఞములను అనుష్ఠించుము.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

ఇత్యుక్తస్తేన విప్రేణ భూపాలో విస్మితస్తదా ।
సస్మార తం మహావీర్యం సత్యసన్ధం నిశాచరమ్ ॥15॥

ఈ విధముగా మునిశ్రేష్ఠుడగు ఆ బ్రాహ్మణుడు పలుకగా, రాజు మిక్కిలి ఆశ్చర్యము పొందినవాడై గొప్పబలవంతుడు, సత్యమునే మాటలాడువాడునూ అగు ఆ రాక్షసుని స్మరించెను.

స్మృతస్తేన తదా సద్యః సముపేత్య నరాధిపమ్ ।
కిం కరోమీతి సోఽ ప్యాహ ప్రణిపత్య మహామునే ॥16॥

ఓ మహామునీ ! స్మరించిన వెంటనే ఆ రాక్షసుడు అచ్చట ప్రత్యక్షమై రాజుకు నమస్కరించి రాజుతో "నేనేమి చేయవలయును" అని పలికెను.

తతస్తేన నరేంద్రేణ విస్తరేణ నివేదితే ।
గత్వా పాతాలమాదాయ రాజపత్నీముపాయయౌ ॥17॥

పిమ్మట ఆ ఉత్తమమహారాజు వివరముగా చెప్పిన పిమ్మట, ఆ రాక్షసుడు పాతాళలోకమునకు వెళ్ళి రాజభార్యను తీసుకొని వచ్చెను.

ఆనీతా చాతిహార్దేన సా దదర్శ తదా పతిమ్ ।
ఉవాచ చ ప్రసీదేతి భూయో భూయో ముదాఽ న్వితా ॥18॥

రాక్షసునిచేత తీసుకొని రాబడిన ఆ రాజభార్య మిక్కిలి సౌహార్దముతో తన భర్తను చూచెను. సంతోషముతో మాటిమాటికీ "అనుగ్రహించుము" అని పలికెను.

తతః స రాజా రభసా పరిష్వజ్యాహ మానినీమ్ ।
ప్రియే ప్రసన్న ఏవాహం భూయోఽ ప్యేవం బ్రవీషి కిమ్ ॥19॥

అనంతరమా రాజు ఉత్సుకతతో అభిమానవతియగు తన భార్యను ఆలింగనము చేసుకొని ఇట్లు పలికెను. "ఓ ప్రియురాలా ! నేను ప్రసన్నుడనుగానే యుంటిని. నీవు పదే పదే "ప్రసన్నుడవు అగుము" అని ఏల పలుకుచున్నావు?

పత్న్యువాచ – రాజపత్ని పలికింది.

యది ప్రసాదప్రవణం నరేన్ద్ర మయి తే మనః ।
తదేతదభియాచే త్వాం తత్కురుష్వ మమార్హణమ్ ॥20॥

ఓ మానవశ్రేష్ఠుడా ! నీ మనస్సు అనుగ్రహబుద్ధిగలదైనచో నిన్ను నేనొక కోరికను కోరెదను. నాపై ఆదరసూచకముగా ఆ కోరికను నెరవేర్చుము.

రాజోవాచ – రాజు చెప్పాడు.

నిశ్శఙ్కం బ్రూహి మత్తో యద్భవత్యా కిఞ్చిదీప్సితమ్ ।
తదలభ్యం న తే భీరు తవాయత్తోఽ స్మి నాన్యథా ॥21॥

ఓ భీరులారా ! నీకిష్టమైన విషయమును నిస్సంశయముగా కోరుకొనుము. నీవు తప్పక దానిని పొందెదవు. నీకు నేను సర్వథా అధీనుడను. అది నిజము.

పత్న్యువాచ – రాజపత్ని చెప్పింది.

మదర్థం తేన నాగేన సుతా శప్తా సఖీ మమ ।
మూకా భవిష్యసీత్యాహ సా చ మూకత్వమాగతా ॥22॥

నాగరాజు కుమార్తెయగు నా స్నేహితురాలు నా కారణముగా నాగరాజుచేత "మూగదానివి కాగలవు" అని శపింపబడినది. అంతట ఆమెకు మూగతనము సంప్రాప్తించినది.

తస్యాః ప్రతిక్రియాం ప్రీత్యా మమ శక్నోతి చేద్భవాన్ ।
వాగ్విఘాతప్రశాన్త్యర్థం తతః కిం న కృతం మమ ॥23॥

మీరు నాయందలి ప్రేమతో ఆమెయొక్క మూగతనము పోవుటకు అందులకై ప్రతీకారము చేయుటయందు సమర్థులైనచో నాకు మీరు అన్నీ సమకూర్చినట్లే. ఇక సమకూర్చనిది ఏమున్నది?

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

తతస్స రాజా తం విప్రమాహాస్మిన్ కీదృశీ క్రియా ।
తన్మూకతాపనోదాయ స చ తం ప్రాహ పార్థివమ్ ॥24॥

అంతట ఆ రాజు "నాగరాజుకుమార్తె మూగతనము పోవుటకు ప్రతిక్రియ ఏమున్నది?" అని ఆ బ్రాహ్మణుని అడిగెను. అంతట ఆ బ్రాహ్మణుడు రాజుతో ఇట్లు పలికెను.

బ్రాహ్మణ ఉవాచ – బ్రాహ్మణుడు చెప్పాడు.

భూప సారస్వతీమిష్టిం కరోమి వచనాత్తవ ।
పత్నీ తవేయమానృణ్యం యాతు తద్వాక్ప్రవర్తనాత్ ॥25॥

ఓ రాజా ! మీ మాట ప్రకారం సారస్వతియను యాగమును చేయుదును. అందువలన నాగరాజు కుమార్తెయొక్క మూగతనము పోయి నీ భార్య ఋణవిముక్తురాలగును.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

ఇష్టిం సారస్వతీం చక్రే తదర్థం స ద్విజోత్తమః ।
సారస్వతాని సూక్తాని జజాప చ సమాహితః ॥26॥

ఆ బ్రాహ్మణోత్తముడు నాగరాజు కుమార్తెయొక్క మూగతనమును పోగొట్టుటకు సారస్వతీ ఇష్టిని అనుష్ఠించెను. ఇంకనూ ఏకాగ్రచిత్తుడై సరస్వతీదేవతాకసూక్తములను జపించెను.

తతః ప్రవృత్తవాక్యాం తాం గర్గః ప్రాహ రసాతలే ।
ఉపకారః సఖీభర్త్రా కృతోఽయమతిదుష్కరః ॥27॥

అనంతరము గర్గముని పాతాళలోకమందు మాటలాడుశక్తిని పొందిన నాగకన్యతో ఇట్లు పలికెను. "నీ స్నేహితురాలి భర్త నీకీ మిక్కిలి దుష్కరమైన ఉపకారమును చేసెను".

ఇత్థం జ్ఞానం సమాసాద్య నన్దా శీఘ్రగతిః పురమ్ ।
తతో రాజ్ఞీం పరిష్వజ్య స్వసఖీమురగాత్మజా ॥28॥

తం చ సంస్తూయ భూపాలం కల్యాణోక్త్యా పునః పునః ।
ఉవాచ మధురం నాగీ కృతాసనపరిగ్రహా ॥29॥

నాగరాజుకుమార్తెయగు నంద ఈ విషయము తెలిసినవెంటనే శీఘ్రగమనము కలదై ఆ ఉత్తమమహారాజు నగరమును పొంది, తన స్నేహితురాలగు మహారాణిని కౌగలించుకొని, ఆ మహారాజు కల్యాణగుణములను మాటిమాటికి స్తుతించి, ఆసనమును పరిగ్రహించి మధురవాక్కులను ఈ విధముగా పలికెను.

ఉపకారః కృతో వీర భవతా యో మమాధునా ।
తేనాస్మ్యాకృష్టహృదయా యద్బ్రవీమి శృణుష్వ తత్ ॥30॥

ఓ వీరుడా ! నీవిప్పుడు నాకు ఏ ఉపకారమునైతే (మాటలాడుశక్తిని) చేసితివో, దానివలన ఆకర్షితురాలనై నేను చెప్పబోవు మాటలను వినుము.

తవ పుత్రో మహావీర్యో భవిష్యతి నరాధిప ।
తస్యాప్రతిహతం చక్రమస్యాం భువి భవిష్యతి ॥31॥

సర్వార్థశాస్త్రతత్త్వజ్ఞో ధర్మానుష్ఠానతత్పరః ।
మన్వన్తరేశ్వరో ధీమాన్భవిష్యతి స వై మనుః ॥32॥

ఓ మహారాజా ! గొప్ప బలపరాక్రమములుగలవాడవైన పుత్రుడు నీకు జన్మించగలడు. అతడు ఈ భూమండలమందు తిరుగులేని రాజ్యపరిపాలనము కొనసాగించును. ఇంకను ఆ పుట్టబోయే కుమారుడు సమస్తములైన రాజనీతిశాస్త్రము మొ॥లగు శాస్త్రముల మర్మమునెరిగి, ధర్మానుష్ఠానతత్పరుడై, మన్వంతరమునకు ప్రభువైన బుద్ధిమంతుడు కాగలడు. అతడే మనువు.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

ఇతి దత్త్వా వరం తస్మై నాగరాజసుతా తతః ।
సఖీం తాం సంపరిష్వజ్య పాతాలమగమన్మునే ॥33॥

ఓ క్రౌష్టుకిమునీ ! నాగరాజపుత్రికయగు నంద ఈ విధముగా ఉత్తమమహారాజుకు వరమిచ్చి, తన స్నేహితురాలగు మహారాణిని కౌగలించుకొని పాతాళలోకమునకు వెళ్ళిపోయెను.

తత్ర తస్య తయా సార్ధం రమతః పృథివీపతేః ।
జగామ కాలః సుమహాన్ ప్రజాః పాలయతస్తథా ॥34॥

పిమ్మట పృథివీపతియగు ఉత్తమమహారాజు అనుకూలవతియగు తన భార్యతో భోగములననుభవించుచూ, ప్రజాపరిపాలనము కొనసాగించుచుండగా గొప్ప కాలము (అధికమైన కాలము) గడచిపోయెను.

తతః స తస్యాం తనయో జజ్ఞే రాజ్ఞో మహాత్మనః ।
పౌర్ణమాస్యాం యథా కాన్తశ్చన్ద్రః సంపూర్ణమండలః ॥35॥

పిమ్మట మహాత్ముడగు ఆ మహారాజుకు తన భార్యయందు కుమారుడు, పూర్ణిమయందు పదహారు కళలతో కూడిన చంద్రుడు సంపూర్ణమండలమును ప్రకాశింపచేయుచూ ఉదయించినట్లుగా, జన్మించెను.

తస్మిన్ జాతే ముదం ప్రాపుః ప్రజాః సర్వాః సహామరాః ।
దేవదుందుభయో నేదుః పుష్పవృష్టిః పపాత చ ॥36॥

ఉత్తమమహారాజు దంపతులకు పుత్రుడు జన్మించగానే సమస్తప్రజలు దేవతలతో సహా అందరూ సంతోషమును పొందిరి. దేవదుందుభులు మ్రోగినవి. పుష్పవృష్టి కురిసినది.

తస్య దృష్ట్వా వపుః కాన్తం భవిష్యం శీలమేవ చ ।
ఔత్తమశ్చేతి మునయో నామ చక్రుః సమాగతాః ॥37॥

ఆ కుమారుని కాంతిమంతమైన శరీరమును, ముందుముందు తెలిసే గొప్ప స్వభావమును చూచి అచ్చటకు వచ్చిన మునులు ఆ కుమారునికి ఔత్తముడని నామకరణము చేసిరి.

జాతోఽయముత్తమే వంశే బాలః కాలే తథోత్తమే ।
ఉత్తమావయవస్తేన ఔత్తమోఽయం భవిష్యతి ॥38॥

ఈ జన్మించిన బాలుడు ఉత్తమ వంశమందు, ఉత్తమకాలమందు, ఉత్తమావయవములు కలవాడై జన్మించినందున ఔత్తముడు కాగలడు.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

ఉత్తమస్య సుతః సోఽథ నామ్నా ఖ్యాతస్తథౌత్తమః ।
మనురాసీత్తత్ప్రభావో భాగురే శ్రూయతాం మమ ॥39॥

ఓ భాగురీ ! (ఓ క్రౌష్టుకీ !) ఉత్తముని కుమారుడు గావున కూడా అతని పుత్రుడు ఔత్తముడని ప్రసిద్ధిజెందెను. అతడే మనువయ్యెను. అతడి ప్రభావమెట్టిదో చెప్పెదను, వినుము.

ఉత్తమాఖ్యానమఖిలం జన్మ చైవౌత్తమస్య యః ।
నిత్యం శృణోతి విద్వేషం స కదాచిన్న గచ్ఛతి ॥40॥

ఇష్టదారైస్తథా పుత్రైర్బన్ధుభిర్వా కదాచన ।
వియోగో నాస్య భవితా శృణ్వతః పఠతోఽపి వా ॥41॥

ఉత్తముని సమస్త వృత్తాంతమును, అతని కుమారుడగు ఔత్తముని జన్మవృత్తాంతమును ఎవరు నిత్యము వినెదరో అతడు ఎట్టి విద్వేషమును పొందడు. ఇంకను అట్టి వృత్తాంతములు చదివినా, విన్నా అట్టి వ్యక్తి తనకిష్టురాలగు భార్య, పుత్రులు, బంధువులతో ఎన్నడూ వియోగము చెందడు.

తస్య మన్వన్తరం బ్రహ్మన్వదతో మమ విస్తరాత్ ।
శ్రూయతాం తత్ర యశ్చేన్ద్రో యే చ దేవాస్తథర్షయః ॥42॥

ఓ బ్రహ్మస్వరూపుడా ! ఆ ఔత్తముని మన్వంతరమును గూర్చి, ఆ మన్వంతరమందున్న ఇంద్రుడు, దేవతలు, ఋషులను గూర్చి విస్తారముగా చెప్పెదను, వినుము.

ఇతి శ్రీ మార్కండేయమహాపురాణే ఔత్తమమన్వన్తరే ఏకోనసప్తతితమోఽధ్యాయః ॥69॥

శ్రీ మార్కండేయమహాపురాణమందలి ఔత్తమమన్వంతరమను అరువదితొమ్మిదవ అధ్యాయం సమాప్తం.



సప్తతితమోఽధ్యాయః – డెబ్బదియవ అధ్యాయం
ఔత్తమమన్వన్తరమ్ – ఔత్తమమన్వంతరం

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

మన్వన్తరే తృతీయేఽస్మిన్నౌత్తమస్య ప్రజాపతేః ।
దేవానింద్రమృషీన్ భూపాన్నిబోధ గదతో మమ ॥1॥

ఓ మునిశ్రేష్ఠుడా ! ఔత్తమప్రజాపతియొక్క మూడవ మన్వంతరమందు ఉన్నట్టి దేవతలు, ఇంద్రుడు, ఋషులు, రాజులను గూర్చి చెప్పెదను, వినుము.

స్వధామానస్తథా దేవా యథానామానుకారిణః ।
సత్యాఖ్యశ్చ ద్వితీయోఽన్యస్త్రిదశానాం తథా గణః ॥2॥

తృతీయే తు గణే దేవాః శివాఖ్యా మునిసత్తమ ।
శివాః స్వరూపతస్తే తు శ్రుతాః పాపప్రణాశనాః ॥3॥

ప్రతర్దనాఖ్యశ్చ గణో దేవానాం మునిసత్తమ ।
చతుర్థస్తత్ర కథిత ఔత్తమస్యాన్తరే మనోః ॥4॥

వశవర్తినః పఞ్చమేఽపి దేవాస్తత్ర గణే ద్విజ ।
యథాఖ్యాతస్వరూపాస్తు సర్వ ఏవ మహామునే ॥5॥

ఏతే దేవగణాః పఞ్చ స్మృతా యజ్ఞభుజస్తథా ।

ఓ మునిశ్రేష్ఠుడా ! "స్వధామ" అను పేరుగల దేవతాగణము మొదటిది. వారు తమ పేర్లకు అనుగుణముగా వ్యవహరించెదరు. ముప్పైమంది దేవతలతో ప్రసిద్ధమైన రెండవ దేవతాగణము "సత్య" అను పేరుతో ప్రసిద్ధమైనది. "శివ" అను పేరుతో ప్రసిద్ధమైన దేవతాగణము మూడవది. వారు మంగళస్వరూపులు మరియు పాపములను నశింపచేయువారుగా ప్రసిద్ధిని పొందారు. ఓ మునిశ్రేష్ఠుడా ! ఔత్తముని మన్వంతరమందు నాల్గవ దేవతాగణము "ప్రతర్దన" అను పేరుతో ప్రసిద్ధమైనది. ఓ బ్రాహ్మణుడా ! "వశవర్తి" అను పేరుతో ప్రసిద్ధమైన దేవతాగణము అయిదవది. వారందరూ తమ నామములకు అనుగుణమైన స్వభావము కలవారు. ఈ అయిదు గుణములకు చెందిన దేవతలు యజ్ఞములందు ఇవ్వబడే హోమద్రవ్యములను భుజించెదరు.

మన్వన్తరే మనుశ్రేష్ఠే సర్వే ద్వాదశకా గణాః ॥6॥

తేషామింద్రో మహాభాగస్త్రైలోక్యస్యేశ్వరోఽభవత్ ।
శతం క్రతూనామాహృత్య సుశాన్తిర్నామ నామతః ॥7॥

యస్యోపసర్గనాశాయ నామాక్షరవిభూషితా ।
అద్యాపి మానవైర్గాథా గీయతే తు మహీతలే ॥8॥

సుశాన్తిర్దేవరాట్ కాన్తః సుశాంతిం సంప్రయచ్ఛతి ।
సహితః శివసత్యాద్యైస్తథైవ వశవర్తిభిః ॥9॥

మనువులందరిలో శ్రేష్ఠమైన ఈ మూడవ మన్వంతరమందు దేవతాగణములన్నీ కలిపి పన్నెండు కలవు. వారికందరికీ "సుశాంతి" అనుపేరుతో ప్రసిద్ధుడైన ఇంద్రుడు (ప్రభువు) నూరు అశ్వమేధయాగములను చేసి ముల్లోకములకు అధిపతి అయ్యెను. దేవతల అధిపతి అయిన ఆ సుశాంతియొక్క నామాక్షరములతో విభూషితమైన గాథను ఈతిబాధలను పోగొట్టుకొనుటకు మానవులు ఇప్పటికీ భూలోకమందు పాడుకొనుచున్నారు. శివసత్యాది దేవతాగణములు మరియు వశవర్తి దేవతాగణములతో కూడుకొన్న ఆ సుశాంతియను దేవప్రభువు మిక్కిలి శాంతిని ప్రసాదించుచున్నాడు.

అజః పరశుచిర్దివ్యో మహాబలపరాక్రమః ।
పుత్రాస్తస్య మనోరాసన్విఖ్యాతాస్త్రిదశోపమాః ॥10॥

అజుడు, పరశుచి, మహాబలపరాక్రమవంతుడైన దివ్యుడు అను ప్రసిద్ధులు, దేవతలతో సమానమైన వారు అయిన ముగ్గురు కుమారులు ఆ ఔత్తమునికి జన్మించిరి.

తత్ప్రసూతిసంభవైర్భూమిః పాలితాఽభూన్నరేశ్వరైః ।
యావన్మన్వన్తరం తస్య మనోరుత్తమతేజసః ॥11॥

ఎప్పటివరకు ఆ ఔత్తమమనువుయొక్క మన్వంతరముండెనో అప్పటివరకు అతడి వంశోద్భవులైన మరియు మిక్కిలి పరాక్రమవంతులైన సంతానము మహారాజులుగా ఈ భూమండలములను పరిపాలించిరి.

చతుర్యుగానాం సంఖ్యాతా సాధికా హ్యేకసప్తతిః ।
కృతత్రేతాదిసంజ్ఞాని యాన్యుక్తాని పురా మయా ॥12॥

ఆ మనువుయొక్క నాలుగు యుగములందు కృతత్రేతాది నామములతో డెబ్బైఒక్కయుగములు నేను పూర్వము చెప్పినవిధముగా గణింపబడినవి.

స్వతేజసా హి తపసో వరిష్ఠస్య మహాత్మనః ।
తనయాశ్చాన్తరే తస్మిన్ సప్త సప్తర్షయోఽభవన్ ॥13॥

తన తపోబలపరాక్రమములచే శ్రేష్ఠుడూ మహాత్ముడూ అయిన ఆ మనువుకు ఏడుగురు కుమారులు సప్తర్షులుగా ఆ మన్వంతరమందు ఉద్భవించిరి. (సప్తర్షిశబ్దం సంజ్ఞావాచకం).

తృతీయమేతత్కథితం తవ మన్వన్తరం మయా ।
తామసస్య చతుర్థం తు మనోరన్తరముచ్యతే ॥14॥

వియోనిజన్మనో యస్య యశసా ద్యోతితం జగత్ ।
జన్మ తస్య మనోర్బ్రహ్మన్ శ్రూయతాం గదతో మమ ॥15॥

అతీంద్రియమశేషాణాం మనూనాం చరితం తథా ।
తథా జన్మాపి విజ్ఞేయం ప్రభావశ్చ మహాత్మనామ్ ॥16॥

ఓ బ్రహ్మస్వరూపుడా ! నేను నీకు మూడవది అయిన ఔత్తమమన్వంతరమును గూర్చి వర్ణించి చెప్పితిని. ఇక నాల్గవది అయిన తామసమన్వంతరమును గూర్చి చెప్పెదను వినుము. వియోనిజన్మ కలిగిన ఆ తామసమనువుయొక్క కీర్తిచేత ఈ జగత్తంతా ప్రకాశింపబడినది. ఆ మనువుయొక్క జన్మవృత్తాంతముగూర్చి చెప్పెదను, వినుము. అసంఖ్యాకములైన మనువుల చరిత్ర ఇంద్రియగోచరము కాదు. మహాత్ములైన వారియొక్క జన్మవృత్తాంతము, వారి మహిమ తెలియదగినవి.

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే ఔత్తమమన్వన్తరం నామ సప్తతితమోఽధ్యాయః ॥70॥

శ్రీ మార్కండేయ మహాపురాణమందలి ఔత్తమమన్వంతరమను డెబ్బదియవ అధ్యాయం సమాప్తం.



ఏకసప్తతితమోఽధ్యాయః - డెబ్బది ఒకటవ అధ్యాయం
తామసమన్వంతరవృత్తాంతః - తామసమన్వంతరవృత్తాంతం

మార్కండేయ ఉవాచ - మార్కండేయుడు చెప్పాడు.

రాజాఽభూద్భువి విఖ్యాతః స్వరాష్ట్రో నామ వీర్యవాన్ ।
అనేకయజ్ఞకృత్ప్రాజ్ఞః సంగ్రామేష్వపరాజితః ॥1॥

అనేకయజ్ఞములు చేసినవాడు, జ్ఞానసంపన్నుడు, యుద్ధములలో ఓటమినెరుగనివాడు, బలపరాక్రమములు కలిగినవాడూ అగు స్వరాష్ట్రుడను పేరుగల జగద్విఖ్యాతి చెందిన ఒక రాజు భూలోకమందు ఉండెను.

తస్యాయుః సుమహద్దత్తం సూర్యేణ సుమహాద్యుతేః ।
(పురా భగవతా విప్ర మంత్రిణారాధితేన వై) ॥
పత్నీనాం చ శతం తస్య ధన్యానామభవద్ద్విజ ॥2॥

ఓ బ్రాహ్మణుడా ! ఆ రాజుయొక్క మంత్రులు ఆరాధించగా, పూర్వము మహాద్యుతిమంతుడగు సూర్యభగవానుడు ఆ రాజుకు దీర్ఘాయుర్దాయమును ప్రసాదించెను. ఓ బ్రాహ్మణుడా ! ఆ రాజుకు ధన్యురాండ్రగు నూరుగురు భార్యలు కలరు.

తస్య దీర్ఘాయుషః పత్న్యో నాతిదీర్ఘాయుషో మునే ।
కాలేన జగ్ముర్నిధనం భృత్యమంత్రిజనాస్తథా ॥3॥

ఓ క్రౌష్టుకిమునీ ! దీర్ఘాయుర్దాయము కలిగిన ఆ రాజుయొక్క భార్యలు మాత్రము దీర్ఘాయుర్దాయము కలిగినవారు కానందున వారు యథాకాలమందు మరణించిరి. అట్లే సేవకులు, మంత్రులు కూడా యథాకాలమందు మరణమును పొందిరి.

స భార్యాభిస్తథా ముక్తో భృత్యైశ్చ సహజన్మభిః ।
ఉద్విగ్నచేతాః సంప్రాప వీర్యహానిమహర్నిశమ్ ॥4॥

ఆ విధముగా తన భార్యలతోనూ, సేవకులతోనూ, తనతోటివారితోనూ వియోగముచెందిన ఆ రాజు ఉద్విగ్నమనస్కుడై ప్రతిదినము వీర్యము నశించినవాడాయెను.

తం వీర్యహీనం నిభృతైర్భృత్యైస్త్యక్తం సుదుఃఖితమ్ ।
అనన్తరో విమర్దాఖ్యో రాజ్యాచ్చ్యావితవాంస్తదా ॥5॥

వీర్యము నశించినవాడు, నమ్మకమైన సేవకులచే విడువబడినవాడు, మిక్కిలి దుఃఖించినవాడు అగు స్వరాష్ట్రుడను ఆ రాజును ఆ సమయమందు విమర్దుడను మరొక రాజు రాజ్యచ్యుతిని గావించెను.

రాజ్యాచ్చ్యుతః సోఽపి వనం గత్వా నిర్విణ్ణమానసః ।
తపస్తేపే మహాభాగో వితస్తాపులినే స్థితః ॥6॥

రాజ్యచ్యుతుడైన మహానుభావుడగు ఆ రాజు కూడా అడవికి వెళ్ళి నిర్వేదము చెందిన మనస్సు గలవాడై వితస్తానది ఒడ్డున తపస్సును ఆచరించెను.

గ్రీష్మే పఞ్చతపా భూత్వా వర్షాస్వభ్రావకాశకః ।
జలశాయీ చ శిశిరే నిరాహారో యతవ్రతః ॥7॥

తతస్తపస్యతస్తస్య ప్రావృట్కాలే మహాన్ ప్లవః ।
బభూవానుదినం మేఘైర్వర్షద్భిరనుసన్తతమ్ ॥8॥

పంచాగ్నుల నడుమ గ్రీష్మకాలమందు, మేఘములతో ఆచ్ఛన్నమైన ప్రదేశములో వర్షాకాలమందు, నీటిమధ్యలో శిశిరకాలమందు ఆహారము స్వీకరించక ఇంద్రియనిగ్రహముతో తపోవ్రతమును ఆచరించుచున్న ఆ స్వరాష్ట్రరాజుకు వర్షాకాలమందు పెద్ద వరద వచ్చెను. నిత్యము మేఘములు ఏర్పడి, ఎట్టి విరామమూ లేక వర్షములు ఆ సమయమందు కురిసినవి.

న దిగ్విజ్ఞాయతే పూర్వా దక్షిణా వా న పశ్చిమా ।
నోత్తరా తమసా సర్వమనులిప్తమివాభవత్ ॥9॥

అంతటి వరద ఏర్పడిన ఆ సమయమందు తూర్పు, పడమర, ఉత్తర, దక్షిణ దిక్కులు ఎంతమాత్రము తెలియుట లేదు. ఆ ప్రదేశమంతా అంధకారముతో నిండిపోయినట్లైనది.

తతోఽతిపూరేణ నృపః స నద్యా ప్రేరితస్తటమ్ ।
ప్రార్థయన్నపి నావాప హ్రియమాణోఽతివేగినా ॥10॥

ప్రవాహముతో నిండిన ఆ నదిచేత నెట్టబడిన రాజు ఒడ్డుకు చేరుటకు ఎంత ప్రయత్నించినా, మిక్కిలి వేగము కారణముగా కొట్టుకుపోబడినందున ఒడ్డుకు చేరలేకపోయెను.

అథ దూరే జలౌఘేన హ్రియమాణో మహీపతిః ।
ఆససాద జలే రౌహీం స పుచ్ఛే జగృహే చ తామ్ ॥11॥

పిమ్మట ఆ రాజు దూరమందు జలప్రవాహముచే హరింపబడినవాడై, ఆ జలమందు రౌహీమృగమును చేరి, ఆ ఆడమృగము తోకను పట్టుకొనెను.

తేన ప్లవేన స యయావూహ్యమానో మహీతలే ।
ఇతశ్చేతశ్చాన్ధకారే ఆససాద తటం తతః ॥12॥

ఆ జలప్రవాహముచే కొట్టుకుపోబడి భూభాగమును చేరి అంధకారముతో నిండిన ఆ ప్రాంతమందు ఒడ్డును చేరెను.

విస్తారితపంకమత్యర్థం దుస్తరం స నృపస్తరన్ ।
తథైవ కృష్యమాణోఽన్యద్రమ్యం వనమవాప సః ॥13॥

దాటుటకు కష్టముగా ఉన్న విస్తరించిన బురదను ఆ రాజు కష్టపడి దాటుచూ, ఆ బురదచేత లాగబడుతూ ఒక సుందరమైన అడవిని చేరెను.

తత్రాన్ధకారే సా రౌహీ చకర్ష వసుధాధిపమ్ ।
పుచ్ఛే లగ్నం మహాభాగం కృశం ధమనిసన్తతమ్ ॥14॥

ఆ చీకటిలో తన తోకను పట్టుకొనేయున్న మహానుభావుడైన ఆ రాజును ఆ రౌహీమృగము గట్టిగా లాగిపట్టి అతడి నాడులసమూహమును స్పృశించినది.

తస్యాశ్చ స్పర్శసంభూతామవాప ముదముత్తమామ్ ।
సోఽన్ధకారే భ్రమన్ భూపో మదనాకృష్టమానసః ॥15॥

ఆ ఆడమృగముయొక్క స్పర్శచేత మన్మథపీడితుడై ఆరాజు ఆ అంధకారమందు ఇటునటూ తిరుగుచూ ఆ స్పర్శవల్ల కలిగిన గొప్ప సుఖమును పొందెను.

విజ్ఞాయ సానురాగం తం పృష్ఠస్పర్శనతత్పరమ్ ।
నరేన్ద్రం తం వృషస్యన్తం సా మృగీ తమువాచ హ ॥16॥

రాజు తన వీపును స్పృశించుచూ, తనపట్ల కోరికకల్గి, కాముకుడై యున్నాడని తెలుసుకొన్న ఆడమృగము ఆ మహారాజుతో ఇట్లు పలికెను.

కిం పృష్ఠం వేపథుమతా కరేణ స్పృశసే మమ ।
అన్యథైవాస్య కార్యస్య సంజాతా నృప తే గతిః ॥17॥

ఓ రాజా! వణకుచున్న చేతితో నా వీపును ఎందుకు స్పృశించుచున్నావు? ఈ చేష్ట అన్యవిధముగా తెలియుచున్నది.

నాస్థానే వా మనో యాతం నాగమ్యాహం తవేశ్వర ।
కిన్తు త్వత్సఙ్గమే విఘ్నమేష లోలః కరోతి మే ॥18॥

ఓ ప్రభూ! ఎచ్చటకి మనస్సు వెళ్ళకూడదో అచ్చటికి నీ మనస్సు వెళ్ళినది. నీకు నేను పొందతగనిదానను కాను. కాని నీ తోటి సమాగమమందు ఈ లోలుడు విఘ్నమును కలుగజేయుచున్నాడు.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

ఇతి శ్రుత్వా వచస్తస్యా మృగ్యాశ్చ జగతీపతిః ।
జాతకౌతూహలో రౌహీమిదం వచనమబ్రవీత్ ॥19॥

ఆ ఆడమృగము పలికిన మాటలను విని ఆ మహారాజు కుతూహలముతో ఆమెనిట్లు ప్రశ్నించెను.

కా త్వం బ్రూహి మృగీ వాక్యం కథం మానుషవద్వదేత్ ।
కశ్చైవ లోలో యో విఘ్నం త్వత్సఙ్గే కురుతే మమ ॥20॥

నీవెవరవు? చెప్పుము. ఒక ఆడమృగము మనుష్యవాక్కులతో ఎట్లు పలుకగలదు? నీ తోటి సమాగమమందు విఘ్నములను కలుగజేయుచున్న ఆ లోలుడు ఎవరు?

మృగ్యువాచ – ఆడమృగము పలికింది.

అహం తే దయితా భూప ప్రాగాసముత్పలావతీ ।
భార్యాశతాగ్రమహిషీ దుహితా దృఢధన్వనః ॥21॥

ఓ రాజా ! నేను ఉత్పలావతియను పేరుగలదానను, నీకు పూర్వం ప్రియురాలను, నీ వందమంది భార్యలలో పట్టమహిషిని, దృఢధన్వుని కుమార్తెను.

రాజోవాచ – రాజు చెప్పాడు.

కిన్తు యావత్కృతం కర్మ యేనేమాం యోనిమాగతా ।
పతివ్రతా ధర్మపరా సా చేత్థం కథమీదృశీ ॥22॥

నీవు ఎట్టి కార్యము చేయుటచే నీకిట్టి జన్మ కలిగినది? నా భార్య పతివ్రత, ధర్మపరాయణురాలూ అయి కూడా నీ కిట్టి దశ ఎందువలన కలిగినది?

మృగ్యువాచ – ఆడమృగము చెప్పింది.

అహం పితృగృహే బాలా సఖీభిః సహితా వనమ్ ।
రన్తుం గతా దదర్శైకం మృగం మృగ్యా సమాగతమ్ ॥23॥

నేను నా తండ్రిగారి యింటియందు బాల్యావస్థయందు నా స్నేహితురాండ్రతో కలిసి అడవికి వెళ్ళితిని. అచ్చట ఒక ఆడమృగముతో సంభోగించదలచిన ఒక మగ మృగమును చూచితిని. (ఈ శ్లోకమునుంచి "నేను" అనగా ఆడమృగము రూపములో ఉన్న ఉత్పలావతియను పట్టమహిషియని తెలియవలెను.)

తతః సమీపవర్తిన్యా మయా సా తాడితా మృగీ ।
మయా త్రస్తా గతాన్యత్ర క్రుద్ధః ప్రాహ తతో మృగః ॥24॥

పిమ్మట ఆ సమీపమందే ఉన్న నేను ఆ ఆడమృగమును బెదిరించి కొట్టితిని. అంతట ఆ ఆడమృగము భయపడి మరొకచోటికి వెళ్ళిపోయెను. ఆ కారణముచే కోపగించిన ఆ మగమృగము ఇట్లు పలికెను.

మూఢే కిమేవం మత్తాఽసి ధిక్తే దౌఃశీల్యమీదృశమ్ ।
ఆధానకాలో యేనాయం త్వయా మే విఫలీకృతః ॥25॥

ఓ మూర్ఖురాలా! నీవెందుకు ఇట్లు మదించినదానవైనావు? నీకిట్టి దుష్టస్వభావము నిందింపతగినది. ఎందువలననగా నేను చేయు ఈ గర్భాధానకాలము నీచేత విఫలముగా చేయబడినది.

వాచం శ్రుత్వా తతస్తస్య మానుషస్యేవ భాషతః ।
భీతా తమబ్రువం కోఽసీత్యేతాం యోనిముపాగతః ॥26॥

మనుష్యునివలే మాటలాడుచున్న ఆ మృగముయొక్క మాటలను విని నేను భయముచెంది "నీవెవరవు? ఎందువలన నీకీ మృగజన్మ ప్రాప్తించినది" అని ఆ మృగమును అడిగితిని.

తతః స ప్రాహ పుత్రోఽహమృషేర్నిర్వృతిచక్షుషః ।
సుతపా నామ మృగ్యాం తు సాభిలాషో మృగోఽభవమ్ ॥27॥

అంతట ఆ మగ మృగము ఇట్లు పలికెను. "నేను నిర్వృతిచక్షుస్సు అను పేరుగల మునియొక్క కుమారుడను. సుతపయని నా పేరు. నేనీ ఆడమృగమందు కోరిక కలిగి మగమృగము రూపము ధరించితిని.

ఇమాం చానుగతః ప్రేమ్ణా వాంఛితశ్చానయా వనే ।
త్వయా వియోజితా దుష్టే తస్మాచ్ఛాపం దదామి తే ॥28॥

ప్రేమతో నేనీ ఆడమృగమును అనుసరించితిని. ఈ వనమందు ఈ ఆడమృగము కూడా నన్ను అభిలషించినది. కానీ "ఓ దుష్టురాలా! నీచేత ఆ ఆడమృగము వియోగమును చెందినది. అందువల్లనే నీకు శాపమునిచ్చుచున్నాను."

మయా చోక్తం తవాజ్ఞానాదపరాధః కృతో మునే ।
ప్రసాదం కురు శాపం మే న భవాన్ దాతుమర్హతి ॥29॥

నేనిట్లు పలికితిని. ఓ మునీ ! నీవెవరివో తెలియక నేనీ అపరాధమును చేసితిని. నన్ను అనుగ్రహించుము. నన్ను శపించుట నీకు తగదు.

ఇత్యుక్తః ప్రాహ మాం సోఽపి మునిరిత్థం మహీపతే ।
న ప్రయచ్ఛామి శాపం తే యద్యాత్మానం దదాసి మే ॥30॥

నేనీ విధముగా మాటలాడగా, ఆ ముని కూడా (ప్రస్తుతము మగమృగము రూపములో ఉన్న ముని) నాతో ఇట్లు పలికెను. ఓ రాజా ! (రాజనగా స్వరాష్ట్రుడను రాజు) నిన్ను నీవు నాకు సమర్పించుకొన్నచో నీకు శాపమునివ్వను.

మయా చోక్తం మృగీ నాహం మృగరూపధరా వనే ।
లప్స్యసేఽన్యాం మృగీం తావన్మయి భావో నివర్త్యతామ్ ॥31॥

నేనప్పుడు ఇట్లు చెప్పితిని. నేను మృగమునూ కాను, మృగరూపధారిణినీ కాను. ఈ అడవియందు నీకు మరొక ఆడమృగము లభించును. నాయందలి కోరికను పోగొట్టుకొనుము.

ఇత్యుక్తః కోపరక్తాక్షః స ప్రాహ స్ఫురితాధరః ।
నాహం మృగీ త్వయేత్యుక్తం మృగీ మూఢే భవిష్యసి ॥32॥

ఈ విధముగా నేను పలుకగా కోపముతో ఎఱ్ఱబడిన కనులు, అదురుచున్న పెదవులు గలవాడై ఆ ముని ఇట్లు పలికెను. ఓ మూఢురాలా ! నేను మృగమును కానని పలికితివి. అందువలన మృగమే అగుదువు గాక!

తతో భృశం ప్రవ్యథితా ప్రణమ్య మునిమబ్రువమ్ ।
స్వరూపస్థమతిక్రుద్ధం ప్రసీదేతి పునఃపునః ॥33॥

అంతట నేను మిక్కిలి వ్యథ చెందినదాననై, మృగరూపమును విడిచి తన పూర్వపు మునిరూపమును పొందినట్టి మరియు మిక్కిలి కోపముతో కూడుకొన్నట్టి ఉన్న ఆ మునిని మాటిమాటికీ "నాయందు ప్రసన్నుడవు కమ్ము" అని పలికితిని.

బాలానభిజ్ఞా వాక్యానాం తతః ప్రోక్తమిదం మయా ।
పితర్యసతి నారీభిర్వ్రియతే హి పతిః స్వయమ్ ॥34॥

సతి తాతే కథం చాహం వృణోమి మునిసత్తమ ।
సాపరాధాథవా పాదౌ ప్రసీదేషా నమామ్యహమ్ ॥35॥

ప్రసీదేతి ప్రసీదేతి ప్రణతాయాం మహామతే ।
ఇత్థం లాలప్యమానాయాః స ప్రాహ మునిపుఙ్గవః ॥36॥

ఇంకనూ నేనిట్లు ఆ మునితో పలికితిని. "ఓ మునిశ్రేష్ఠుడా ! నేను వయస్సులో చిన్నదానను, ఎట్లు మాట్లాడవలెనో తెలిసినదానను కాను. అందువలన నేనట్లు పలికితిని. తండ్రిలేనిచో స్త్రీలు తాము స్వయముగా తమ భర్తను వరించవచ్చును. నా తండ్రి జీవించియుండగా నేనెట్లు స్వయముగా పతిని వరించగలను? అయిననూ అపరాధము చేసిన నేను మీ పాదములను పట్టి నమస్కరించుచున్నాను. మీరు నన్ను అనుగ్రహించుడు. ఓ బుద్ధిమంతుడా ! (స్వరాష్ట్రమహారాజుకు సంబోధన ఇది.) అనుగ్రహించుము, అనుగ్రహించుము అని మాటిమాటికీ నమస్కరించుచూ ఆలపించుచున్న నాతో ఆ మునిశ్రేష్ఠుడు ఇట్లు పలికెను.

న భవత్యన్యథా ప్రోక్తం మమ వాక్యం కదాచన ।
మృగీ భవిష్యసి మృతా వనేఽస్మిన్నేవ జన్మని ॥37॥

మృగత్వే చ మహాబాహుస్తవ గర్భముపైష్యతి ।
లోలో నామ మునేః పుత్రః సిద్ధవీర్యస్య భామిని ॥38॥

జాతిస్మరా భవిత్రీ త్వం తస్మిన్గర్భముపాగతే ।
స్మృతిం ప్రాప్య తథా వాచం మానుషీమీరయిష్యసి ॥39॥

తస్మిఞ్జాతే మృగత్వాత్త్వం విముక్తా పతినార్చితా ।
లోకానవాప్స్యసి ప్రాప్యా యే న దుష్కృతకర్మభిః ॥40॥

సోఽపి లోలో మహావీర్యః పితృశత్రూన్నిపాత్య వై ।
జిత్వా వసున్ధరాం కృత్స్నాం భవిష్యతి తతో మనుః ॥41॥

ఓ భామినీ ! నేను పలికిన మాటలు ఎన్నటికీ వ్యర్థము కావు. నీవు మరణించిన పిదప రాబోవు జన్మయందు ఇదే అడవిలో నీవు ఆడమృగముగా పుట్టెదవు. అట్టి మృగరూపములో ఉండగానే, సిద్ధవీర్యుడగు ఒక మునియొక్క కుమారుడు లోలుడను పేరుగలవాడు నీ గర్భమందు ప్రవేశించును. అతడు నీ గర్భమును పొందగానే నీకు పూర్వజన్మ వృత్తాంతములన్నియు జ్ఞాపకమునకు వచ్చును. అట్టి పూర్వజన్మస్మృతులను పొంది నీవు మనుష్యవాక్కులతో మాట్లాడగలవు. నీ గర్భమందు ప్రవేశించినవాడు జన్మించగానే నీవు మృగరూపమును విడిచి, నీ భర్తచేత ఆదరింపబడినదానవై, పాపాత్ములైన వారిచేత పొంద శక్యము కానట్టి ఉత్తమలోకములను పొందగలవు. గొప్ప పరాక్రమశాలియగు ఆ లోలుడు కూడా తన తండ్రియొక్క శత్రువులందరినీ హతమార్చి, ఈ సమస్తభూమండలమును జయించి అటు పిమ్మట మనువు కాగలడు.

ఏవం శాపమహం లబ్ధ్వా మృతా తిర్యక్త్వమాగతా ।
త్వత్సంస్పర్శాచ్చ గర్భోఽసౌ సంభూతో జఠరే మమ ॥42॥

అతో బ్రవీమి నాస్థానే తవ యాతం మనో మయి ।
న చాప్యగమ్యా గర్భస్థో లోలో విఘ్నం కరోత్యసౌ ।43॥

ఈ విధముగా నేను శాపమును పొంది, మృగముగా జన్మించి, నీచేతి స్పర్శవలన ఈ లోలుడు నా జఠరమందు గర్భముగా ప్రవేశించినాడు. అందువలన నేను ఈ విధముగా పలుకుచున్నాను. "అయోగ్యస్త్రీయందు నీ మనస్సు ప్రసరించలేదు, నేను నీకు పొందతగనిదాననూ కాను, కానీ నీతోటి సమాగమమందు నా గర్భమందున్న ఈ లోలుడు విఘ్నపరచుచున్నాడు" అని.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

ఏవముక్తస్తతః సోఽపి రాజా ప్రాప్య పరాం ముదమ్ ।
పుత్రో మమారీన్ జిత్వేతి పృథివ్యాం భవితా మనుః ॥44॥

"నాకు కలగబోయే కుమారుడు నా శత్రువులను జయించి ఈ భూమండలమందు మనువు కాగలడు" అని తెలుసుకొన్న రాజు కూడా గొప్ప సంతోషమును పొందెను.

తతస్తం సుషువే పుత్రం సా మృగీ లక్షణాన్వితమ్ ।
తస్మిఞ్జాతే చ భూతాని సర్వాణి ప్రయయుర్ముదమ్ ॥45॥

పిమ్మట ఆ ఆడమృగము మంచి లక్షణాలతో కూడుకొన్న కుమారుని ప్రసవించెను. ఆ బాలకుడు జన్మించగానే సమస్తభూతములు ఆనందమును పొందెను.

విశేషతశ్చ రాజాసౌ పుత్రే జాతే మహావనే ।
సా విముక్తా మృగీ శాపాత్ప్రాప లోకాననుత్తమాన్ ॥46॥

ఆ గొప్ప అడవియందు తనకు పుత్రుడు జన్మించగానే విశేషించి రాజు గొప్ప ఆనందమును పొందెను. ఆ ఆడమృగము కూడా శాపవిముక్తురాలై శ్రేష్ఠమైన లోకములను పొందెను.

తతస్తస్సర్షయః సర్వే సమేత్య మునిసత్తమ ।
అవేక్ష్య భావినీమృద్ధిం నామ చక్రుర్మహాత్మనః ॥47॥

తామసీం భజమానాయాం యోనిం మాతర్యజాయత ।
తమసా చావృతే లోకే తామసోஉయం భవిష్యతి ॥48॥

ఓ మునిశ్రేష్ఠుడా ! అనంతరము ఋషులందరు వచ్చి మహాత్ముడగు ఆ బాలకుని భవిష్యత్కాలిక సమృద్ధిని చూచి ఆ బాలకునికి నామకరణము చేసిరి. వారిట్లు నుడివిరి. తామసయోనిని పొందిన తల్లి గర్భమునుండి పుట్టిన కారణముగానూ మరియు తమస్సుచేత (చీకటిచేత) ఆవరింపబడిన లోకమందు పుట్టిన కారణముగానూ ఈ బాలకుడు తామసుడను పేరుతో విఖ్యాతిని పొందును.

తతస్స తామసస్తేన పిత్రా సంవర్ధితో వనే ।
జాతబుద్ధిరువాచేదం పితరం మునిసత్తమ ॥49॥

ఓ మునిశ్రేష్ఠుడా ! పిమ్మట ఆ తామసుడు ఆ అడవియందు తన తండ్రిచేత పెరిగి పెద్దవాడై, జ్ఞానముద్భవించిన పిమ్మట తన తండ్రితో ఇట్లు పలికెను.

కస్త్వం తాత కథం వాஉహం పుత్రో మాతా చ కా మమ ।
కిమర్థమాగతశ్చ త్వమేతత్సత్యం బ్రవీహి మే ॥50॥

ఓ తండ్రీ ! మీరెవరు? నేనెట్లు మీ కుమారుడనయితిని? నా తల్లి ఎవరు? మీరెందువలన ఇచ్చటకు వచ్చితిరి? ఈ విషయములన్నియు సత్యము తెలుపుము.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

తతః పితా యథావృత్తం స్వరాజ్యచ్యావనాదికమ్ ।
తస్యాచష్టే మహాబాహుః పుత్రస్య జగతీపతిః ॥51॥

అంతట మహాబాహువు, జగత్తునకు అధిపతీయగు తండ్రి తాను రాజ్యభ్రష్టుడగుట మొదలగు విషయములను ఉన్నదున్నట్లుగా తన కొడుకుకు వివరించి చెప్పెను.

శ్రుత్వా తత్సకలం సోஉపి సమారాధ్య చ భాస్కరమ్ ।
అవాప దివ్యాన్యస్త్రాణి ససంహారాణ్యశేషతః ॥52॥

పుత్రుడగు తామసుడు కూడా తన తండ్రియగు స్వరాష్ట్రుడు చెప్పిన విషయములను అన్నింటిని విని, సూర్యదేవుని ఆరాధించి శత్రుసంహారకములగు సమస్త దివ్యాస్త్రములను పొందెను.

కృతాస్త్రస్తానరీన్ జిత్వా పితురానీయ చాన్తికమ్ ।
అనుజ్ఞాతాన్ముమోచాథ స చ స్వం ధర్మమాస్థితః ॥53॥

అస్త్రములను గ్రహించిన ఆ తామసుడు శత్రువులనందరినీ జయించి, వారిని తన తండ్రివద్దకు తీసుకొని వచ్చెను. తన తండ్రి అనుమతించగా తామసుడు వారినందరినీ విడిచిపెట్టెను. ఈ విధముగా తామసుడు తన ధర్మమును తాను రక్షించుకొనెను.

పితాऽపి తస్య స్వాన్ లోకాన్ తపోయజ్ఞసమార్జితాన్ ।
విసృష్టదేహః సంప్రాప్తో దృష్ట్వా పుత్రముఖం సుఖమ్ ॥54॥

తామసుని తండ్రియగు స్వరాష్ట్రుడు కూడా తన కుమారుని ఆనందభరితమైన ముఖమును చూచి సంతృప్తితో దేహమును విడిచి తానాచరించిన తపోయజ్ఞములచే సంపాదించుకొన్న ఉత్తమలోకములను పొందెను.

జిత్వా సమస్తాం పృథివీం తామసాఖ్యః స పార్థివః ।
తామసాఖ్యో మనురభూత్తస్య మన్వన్తరం శృణు ॥55॥

యే దేవాస్తత్పతిర్యశ్చ దేవేన్ద్రో యే తథర్షయః ।
యే పుత్రాశ్చ మనోస్తస్య పృథివీపరిపాలకాః ॥56॥

తామసుడను పేరుగల ఆరాజు సమస్త భూమండలమును జయించి తామసనామధేయముగల మనువయ్యెను. అతని మన్వంతరమును గూర్చి అనగా ఆ మన్వంతరమందు గల దేవతలు, వారికి ప్రభువగు దేవేంద్రుడు, ఋషులు, భూపరిపాలకులైన ఆ మనువుయొక్క కుమారులు వీరిని గూర్చి చెప్పెదను, వినుము.

సత్యాస్తథాన్యే సుధియః సురూపా హరయస్తథా ।
ఏతే దేవగణాస్తత్ర సప్తవింశతికా మునే ॥57॥

ఓ మునీ ! సత్య, సుధీ, సురూప, హరి అను ఇరవైఏడుగురు దేవగణములు ఆ మన్వంతరమందు గలరు.

మహాబలో మహావీర్యః శతయజ్ఞోపలక్షితః ।
శిఖిరిన్ద్రస్తథా తేషాం దేవానామభవద్విభుః ॥58॥

గొప్ప బలపరాక్రమములు గలవాడు, నూరుయజ్ఞములను ఆచరించినవాడు అగు శిఖియను పేరుగల ఇంద్రుడు ఆ దేవతలకు ప్రభువయ్యెను.

జ్యోతిర్ధర్మా పృథుః కావ్యశ్చైత్రోऽగ్నిర్బలకస్తథా ।
పీవరశ్చ తథా బ్రహ్మన్ సప్త సప్తర్షయోऽభవన్ ॥59॥

ఓ బ్రహ్మస్వరూపుడా ! జ్యోతిర్ధర్మ, పృథు, కావ్య, చైత్ర, అగ్ని, బలక, పీవర అను ఏడుగురు ఆ తామసమన్వన్తరమందు సప్తర్షులైరి.

నరః క్షాన్తిః శాన్తదాన్తజానుజంఘాదయస్తథా ।
పుత్రాస్తు తామసస్యాసన్ రాజానః సుమహాబలాః ॥60॥

నర, క్షాన్తి, శాన్త, దాన్త, జాను, జంఘ మొ॥లగు మిక్కిలి పరాక్రమవంతులైన రాజులు ఆ తామసమనువుకు కుమారులైరి.

ఇత్యేతత్తామసం విప్ర మన్వన్తరముదాహృతమ్ ।
యః పఠేచ్ఛృణుయాద్వాపి తమసా స న బాధ్యతే ॥61॥

ఓ బ్రాహ్మణుడా ! ఈ విధముగా నేను తామసమన్వంతరమును గూర్చి నీకు వివరించి చెప్పితిని. ఎవరయితే ఈ వృత్తాంతమును చదివెదరో లేక వినెదరో వారు అజ్ఞానమను చీకటిచే బాధింపబడరు.

ఇతి శ్రీమార్కండేయమహాపురాణే తామసమన్వన్తరే ఏకసప్తతితమోఽధ్యాయః ॥71॥

శ్రీమార్కండేయమహాపురాణమందలి తామసమన్వన్తరమను డెబ్బైఒకటవ అధ్యాయం సమాప్తం.



ద్విసప్తతితమోఽధ్యాయః - డెబ్బది రెండవ అధ్యాయం
రైవతమన్వన్తరమ్ - రైవతమన్వంతరం

మార్కండేయ ఉవాచ - మార్కండేయుడు చెప్పాడు.

పఞ్చమోఽపి మనుర్బ్రహ్మన్ రైవతో నామ విశ్రుతః ।
తస్యోత్పత్తిం విస్తరశః శృణుష్వ కథయామి తే ॥1॥

ఓ బ్రహ్మస్వరూపుడా ! రైవతుడను పేరుగల ప్రసిద్ధుడైన అయిదవ మనువు గలడు. అతడి జన్మవృత్తాంతమును నీకు వివరముగా చెప్పెదను, వినుము.

ఋషిరాసీన్మహాభాగ ఋతవాగితి విశ్రుతః ।
తస్యాపుత్రస్య పుత్రోఽభూద్రేవత్యన్తే మహాత్మనః ॥2॥

ఓ మహాభాగుడా ! ఋతవాక్కను పేరుగల ప్రసిద్ధుడైన ఋషి ఒకడు గలడు. మహాత్ముడగు ఆ ఋషికి ముందు పుత్రులు లేకుండెను. తరువాత రేవతీనక్షత్రముయొక్క చివరి భాగమునందు పుత్రుడొకడు జన్మించెను.

స తస్య విధివచ్చక్రే జాతకర్మాదికాః క్రియాః ।
తథోపనయనాదీంశ్చ స చాశీలోఽభవన్మునే ॥3॥

ఓ మునీ ! ఆ ఋషి తన కుమారునికి శాస్త్రోక్తప్రకారము జాతకర్మాదిక్రియలు, ఉపనయనాది కర్మలు జరిపించెను. కాని ఆ పుత్రుడు మంచి శీలము లేనివాడు ఆయెను.

యతః ప్రభృతి జాతోఽసౌ తతః ప్రభృతి సోఽప్యృషిః ।
దీర్ఘరోగపరామర్శమవాప మునిపుఙ్గవ ॥4॥

ఓ మునిశ్రేష్ఠుడా ! ఆ బాలుడు జన్మించినప్పటినుంచీ ఆ ఋషి కూడా దీర్ఘరోగగ్రస్తుడయ్యెను.

మాతా తస్య పరామార్తిం కుష్ఠరోగాదిపీడితా ।
జగామ స పితా చాస్య చిన్తయామాస దుఃఖితః ॥5॥

కిమేతదితి సోఽప్యస్య పుత్రోఽప్యత్యన్తదుర్మతిః ।
జగ్రాహ భార్యామన్యస్య మునిపుత్రస్య సమ్ముఖీమ్ ॥6॥

ఆ బాలుని తల్లి కూడా కుష్ఠరోగపీడితురాలై గొప్ప బాధను అనుభవించెను. అంతట ఆ బాలుని తండ్రి మిక్కిలి దుఃఖగ్రస్తుడై "ఎందులకిట్లు జరిగినది?" అని చింతించసాగెను. మిక్కిలి దుష్టబుద్ధికలిగిన ఆ కుమారుడు కూడా వేరొక మునిపుత్రుడు చూచుచుండగనే అతడి భార్యను హరించెను.

తతో విషణ్ణమనసా ఋతవాగిదముక్తవాన్ ।
అపుత్రతా మనుష్యాణాం శ్రేయసే న కుపుత్రతా ॥7॥

అంతట ఋతవాగృషి దుఃఖితమనస్కుడై ఇట్లనుకొనెను. "మానవులకు దుష్టుడైన పుత్రుడు కలుగుట కంటే అసలు పుత్రులు లేకుండుట శ్రేయస్కరము."

కుపుత్రో హృదయాయాసం సర్వదా కురుతే పితుః ।
మాతుశ్చ స్వర్గసంస్థాంశ్చ స్వపితౄన్ పాతయత్యధః ॥8॥

దుష్టుడైన పుత్రుడు ఎల్లప్పుడు తల్లిదండ్రులకు మనస్సుకు దుఃఖమును కలుగజేయును. మరియు స్వర్గమందలి పితృదేవతలను అధోలోకములలో పడవేయును.

సుహృదాం నోపకారాయ పితౄణాం చ న తృప్తయే ।
పిత్రోర్దుఃఖాయ ధిగ్జన్మ తస్య దుష్కృతకర్మణః ॥9॥

దుష్టుడైన పుత్రునివలన మిత్రులకు ఉపకారము కలుగదు. పితృదేవతలకు తృప్తి కలుగదు. తల్లిదండ్రులకు దుఃఖమే కలుగును. అట్టి దుష్టకార్యములను ఆచరించు కుపుత్రుని జన్మ నింద్యమైనది.

ధన్యాస్తే తనయా యేషాం సర్వలోకాభిసమ్మతాః ।
పరోపకారిణః శాన్తాః సాధుకర్మణ్యనువ్రతాః ॥10॥

ఎవరి పుత్రులు సమస్తజనులచే ఆదరింపబడతారో, పరోపకారము చేయు స్వభావము గలవారో, శాంతస్వభావులో, సత్కర్మాచరణమందు అనురక్తులైయుంటారో అట్టివారు ధన్యులు.

అనిర్వృతం తథా మన్దం పరలోకపరాఙ్ముఖమ్ ।
నరకాయ న సద్గత్యై కుపుత్రాలంబి జన్మ నః ॥11॥

దుష్టులైన పుత్రులను ఆశ్రయముగా చేసుకొన్న మన జన్మ సంతోషమును కలుగజేయదు. మందగమనము కల్గియుండును. పరలోకములపట్ల ఆసక్తియుండదు. నరకమునకు కారణమగునే కాని సద్గతులు పొందుటకు కాదు.

కరోతి సుహృదాం దైన్యమహితానాం తదా ముదమ్ ।
అకాలే చ జరాం పిత్రోః కుసుతః కురుతే ధ్రువమ్ ॥12॥

దుష్టుడైన పుత్రుడు సుహృజ్జనులకు దుఃఖమును, శత్రువులకు సంతోషమును కలుగజేయును. వార్ధక్యమునకు తగిన వయస్సు కాకపోయినా కూడా తల్లిదండ్రులకు నిశ్చయముగా వార్ధక్యమును సంపాదించి పెట్టును.

మార్కండేయ ఉవాచ - మార్కండేయుడు చెప్పాడు.

ఏవం సోఽత్యన్తదుష్టస్య పుత్రస్య చరితైర్మునిః ।
దహ్యమానమనోవృత్తిర్వృత్తం గర్గమపృచ్ఛత ॥13॥

ఈ విధముగా ఆ ఋతవాగృషి మిక్కిలి దుర్మార్గుడైన తన పుత్రుని చేష్టలచే దహింపబడుచున్న మనస్సుగలవాడై, కాలజ్ఞానమునెరిగిన గర్గుని ఇట్లు అడిగెను.

ఋతవాగువాచ – ఋతవాక్కు చెప్పాడు.

సువ్రతేన పురా వేదా గృహీతా విధివన్మయా ।
సమాప్య వేదాన్విధివత్కృతో దారపరిగ్రహః ॥14॥

శాస్త్రవిధ్యుక్త ప్రకారము ముందుగా నేను సత్కర్మపరాయణుడనై వేదములను అభ్యసించితిని. వేదాధ్యయనము పూర్తి అయిన పిమ్మట విధిపూర్వకముగా భార్యను స్వీకరించితిని.

సదారేణ క్రియాః కార్యాః శ్రౌతాః స్మార్తా వషట్క్రియాః ।
న మే న్యూనాః కృతాః కాశ్చిద్యావదద్య మహామునే ॥15॥

ఓ మహామునీ ! భార్యాసమేతుడనై శ్రౌతస్మార్తవషట్క్రియలను పూర్తిగా ఆచరించితిని. ఇప్పటివరకు ఆ కార్యములను చేయుటలో ఎట్టి లోటు చేయలేదు.

గర్భాధానవిధానేన న కామమనురుధ్యతా ।
పుత్రార్థం జనితశ్చాయం పున్నామ్నో బిభ్యతా మునే ॥16॥

ఓ మునీ ! పుత్రోత్పత్తి కొరకైన గర్భాధానవిధానముననుసరించి పున్నామనరకమునుంచి తప్పించుకొనుటకై ఈ కుమారుడు నాచే పుట్టింపబడ్డాడే గాని కామముచే గాదు.

సోఽయం కిమాత్మదోషేణ మమ దోషేణ వా మునే ।
అస్మద్దుఃఖావహో జాతో దౌఃశీల్యాద్బన్ధుశోకదః ॥17॥

ఓ మునీ ! దుష్టస్వభావము కలిగి బంధుజనమునకు, మాకూ దుఃఖమును కల్గించునట్టి ఇట్టి కుమారుడు పుట్టుటకు కారణము అతడి దోషమా లేక మా దోషమా?

గర్గ ఉవాచ – గర్గుడు చెప్పాడు.

రేవత్యన్తే మునిశ్రేష్ఠ జాతోఽయం తనయస్తవ ।
తేన దుఃఖాయతే దుష్టే కాలే యస్మాదజాయత ॥18॥

ఓ మునిశ్రేష్ఠుడా ! ఈ నీ కుమారుడు చెడ్డది అయిన రేవతీనక్షత్రశేష కాలమందు పుట్టినందువలన నీకు దుఃఖమును కల్గించుచున్నాడు.

న తేఽపచారో నైవాస్య మాతుర్నాయం కులస్య తే ।
తస్య దౌఃశీల్యహేతుత్వం రేవత్యన్తముపాగతమ్ ॥19॥

ఇది నీ తప్పు కాదు, ఇతడి తల్లి తప్పుకాదు, నీ వంశముయొక్క తప్పూ కాదు. రేవతీశేషభాగమందు జన్మించుటే ఇతడి దుష్టస్వభావమునకు కారణము.

ఋతవాగువాచ – ఋతవాక్కు చెప్పాడు.

యస్మాన్మమైకపుత్రస్య రేవత్యన్తసముద్భవమ్ ।
దౌఃశీల్యమేతత్సా తస్మాత్పతతామాశు రేవతీ ॥20॥

రేవతీనక్షత్రముయొక్క అంతిమభాగమందు జన్మించినందువల్లనే నా ఒక్కగానొక్క కుమారునికి ఇట్టి దుష్టస్వభావము సంప్రాప్తించినందున ఆ రేవతీ నక్షత్రము వెంటనే క్రిందకు పడిపోవుగాక !

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

తేనైవం వ్యాహృతే శాపే రేవత్యృక్షం పపాత హ ।
పశ్యతః సర్వలోకస్య విస్మయావిష్టచేతసః ॥21॥

ఋతవాగృషి ఈ విధముగా శపించగా ఆశ్చర్యమునొందిన సమస్తజనులు చూచుచుండగనే రేవతీనక్షత్రము క్రిందకు పడిపోయెను.

రేవత్యృక్షం చ పతితం కుముదాద్రౌ సమన్తతః ।
భాసయామాస సహసా వనకన్దరనిర్ఝరాన్ ॥22॥

ఆ రేవతీనక్షత్రము పైనుంచి కుముదపర్వతముపై పడి, ఆ పర్వతమందు అంతటా వ్యాపించియున్న అడవులు, గుహలు, సెలయేళ్ళు అన్నింటినీ వెంటనే ప్రకాశింపచేసెను.

కుముదాద్రిశ్చ తత్పాతాత్ ఖ్యాతో రైవతకోఽభవత్ ।
అతీవ రమ్యః సర్వస్యాం పృథివ్యాం పృథివీధరః ॥23॥

కుముదపర్వతము మీద రేవతీనక్షత్రము పడినందున ఆ పర్వతము రైవతకమను పేరుతో ప్రసిద్ధిచెందెను. ఆ పర్వతము సమస్త భూమండలము మీద మిక్కిలి మనోహరముగా ఉండెను.

తస్యర్క్షస్య తు యా కాన్తిర్జాతా పఙ్కజినీ సరః ।
తతో జజ్ఞే తదా కన్యా రూపేణాతీవ శోభనా ॥24॥

ఆ నక్షత్రము యొక్క కాంతియే పద్మముల సరస్సుగా పరిణమించెను. ఆ సరస్సునుండి మిక్కిలి సౌందర్యవతి అయిన ఒక కన్య ఉద్భవించెను.

రేవతీకాన్తిసంభూతాం తాం దృష్ట్వా ప్రముచో మునిః ।
తస్యా నామ చకారేత్థం రేవతీ నామ భాగురే ॥25॥

ఓ భాగురిమునీ ! రేవతీనక్షత్రకాంతితో జన్మించిన ఆ కన్యను చూచి ప్రముచముని ఆమెకు రేవతియను పేరు పెట్టెను.

పోషయామాస చైవైతాం స్వాశ్రమాభ్యాససంభవామ్ ।
ప్రముచః స మహాభాగస్తస్మిన్నేవ మహాచలే ॥26॥

తన ఆశ్రమసమీపమందు జన్మించిన ఆ కన్యను ఆ కుముదమహాపర్వతమందే మహానుభావుడైన ఆ ప్రముచముని పెంచసాగెను.

తాం తు యౌవనినీం దృష్ట్వా కన్యకాం రూపశాలినీమ్ ।
స మునిశ్చిన్తయామాస కోఽస్యా భర్తా భవేదితి ॥27॥

రూపవతియగు ఆ కన్య యౌవనవంతురాలగుట చూచి ఆ ప్రముచముని "ఈమెకెవరు భర్త కాగలడు?" అని ఆలోచించసాగెను.

ఏవం చిన్తయతస్తస్య యయౌ కాలో మహామునే ।
న చాససాద సదృశం వరం తస్యా మహామునిః ॥28॥

ఓ మహామునీ ! ఈ విధముగా ఆలోచించుచుండగా ఆ మునికి చాలా కాలము గడచిపోయెను. అయినా ఆ మునికి తగిన వరుడు లభించలేదు.

తతస్తస్యా వరం ప్రష్టుమగ్నిం స ప్రముచో మునిః ।
వివేశ వహ్నిశాలాం వై పృష్టస్తం ప్రాహ హవ్యభుక్ ॥29॥

ఆమెకు తగిన వరుడు ఎవరో అగ్నిదేవుని అడిగి తెలుసుకొనుటకు ఆ ప్రముచముని వహ్నిశాలను ప్రవేశించెను. ప్రముచముని అడుగగా ఆ అగ్నిదేవుడు ఇట్లు పలికెను.

మహాబలో మహావీర్యః ప్రియవాగ్ధర్మవత్సలః ।
దుర్గమో నామ భవితా భర్తా హ్యస్యా మహీపతిః ॥30॥

గొప్ప బలపరాక్రమములు గలవాడు, ప్రియమైన వాక్కులను పలుకువాడు, ధర్మపరాయణుడూ అగు దుర్గముడను రాజు ఈమెకు భర్త కాగలడు.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

అనన్తరశ్చ మృగయాప్రసజ్గేనాగతో మునే ।
తస్యాశ్రమపదం ధీమాన్ దుర్గమః స నరాధిపః ॥31॥

ప్రియవ్రతాన్వయభవో మహాబలపరాక్రమః ।
పుత్రో విక్రమశీలస్య కాలిన్దీజఠరోద్భవః ॥32॥

ఓ మునీ ! ఆ వెంటనే వేటాడుటయను సందర్భమును పురస్కరించుకొని ప్రియవ్రతవంశమందు జన్మించినవాడు, గొప్ప బలపరాక్రమములు గలవాడు, విక్రమశీలుని కుమారుడు, కాలిన్దీగర్భమందు జన్మించినవాడు బుద్ధిమంతుడూ అగు దుర్గముడను మహారాజు ఆ ప్రముచముని ఆశ్రమమందు ప్రవేశించెను.

ప్రవిశ్యాశ్రమపదం తాం తన్వీం జగతీపతిః ।
అపశ్యమానస్తమృషిం ప్రియేత్యామన్త్ర్య పృష్టవాన్ ॥33॥

జగత్ప్రభువగు ఆ దుర్గమమహారాజు ఆ ఆశ్రమమందు ప్రవేశించి, ప్రముచఋషిని చూడనివాడై, ఆ కన్యను "ఓ ప్రియురాలా!" అని సంబోధించి ఇట్లడిగెను.

రాజోవాచ – రాజు చెప్పాడు.

క్వ గతో భగవానస్మదాశ్రమాన్మునిపుఙ్గవః ।
తం ప్రణేతుమిహేచ్ఛామి తత్త్వం ప్రబ్రూహి శోభనే ॥34॥

ఓ మంగళస్వరూపురాలా ! మునిశ్రేష్ఠుడు ఈ ఆశ్రమమునుంచి ఎచ్చటకు వెళ్ళినాడు? ఆ మునికి ఇచ్చట నమస్కరించవలెనని కోరుచున్నాను. సత్యము పలుకుము.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

అగ్నిశాలాం గతో విప్రస్తచ్ఛ్రుత్వా తస్య భాషితమ్ ।
ప్రియేత్యామన్త్రణం చైవ నిశ్చక్రామ త్వరాన్వితః ॥35॥

అగ్నిశాలకు వెళ్ళిన బ్రాహ్మణుడగు ఆ ప్రముచముని ఆ రాజు పలికిన పలుకులను, "ఓ ప్రియురాలా !" అని సంబోధించుటనూ విని తొందరగా ఆశ్రమమునకు వచ్చెను.

స దదర్శ మహాత్మానం రాజానం దుర్గమం మునిః ।
నరేన్ద్రచిహ్నసహితం ప్రశ్రయావనతం పురః ॥36॥

మహాత్ముడూ, రాజచిహ్నములు కలిగినవాడూ, తనముందు వినయముతో వంగినవాడూ అగు దుర్గమమహారాజును ఆ ప్రముచముని చూచెను.

తస్మిన్దృష్టే తతః శిష్యమువాచ స తు గౌతమమ్ ।
గౌతమానీయతాం శీఘ్రమర్ఘోఽస్య జగతీపతేః ॥37॥

ఏకస్తావదయం భూపశ్చిరకాలాదుపాగతః ।
జామాతా చ విశేషేణ యోగ్యోఽర్ఘస్య మతో మమ ॥38॥

ప్రముచముని దుర్గమరాజును చూడగనే గౌతముడను పేరుగల శిష్యునితో ఇట్లు పలికెను. "ఓ గౌతమా ! ఈ జగత్ప్రభువుకు వెంటనే అర్ఘ్యమును తీసుకొని రమ్ము. ఈ రాజు ఒక్కడే చాలకాలము తర్వాత ఇచ్చటకు వచ్చినాడు. విశేషించి ఇతడు మన యింటి అల్లుడు. ఇతడు మనమిచ్చు అర్ఘ్యమును గ్రహించుటకు యోగ్యుడని నా అభిప్రాయము.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

తతః స చిన్తయామాస రాజా జామాతృకారణమ్ ।
వివేద చ న తన్మౌనీ జగృహేఽర్ఘం చ తన్నృపః ॥39॥

అంతట ఆ రాజు ప్రముచముని తనను “అల్లుడు” అనుటకు గల కారణమేమో చింతింపనారంభించెను. కాని ఏమియు అర్థము కాలేదు. మౌనము వహించి ఆ రాజు ముని ఇచ్చిన అర్ఘ్యమును గ్రహించెను.

తమాసనగతం విప్రో గృహీతార్ఘం మహామునిః ।
స్వాగతం ప్రాహ రాజేన్ద్రమపి తే కుశలం గృహే ॥40॥

కోశే బలేఽథ మిత్రేషు భృత్యామాత్యే నరేశ్వర ।
తథాత్మని మహాబాహో యత్ర సర్వం ప్రతిష్ఠితమ్ ॥41॥

పత్నీ చ తే కుశలినీ యత ఏవానుతిష్ఠతి ।
పృచ్ఛామ్యస్యాస్తతో నాహం కుశలిన్యోఽపరాస్తవ ॥42॥

ఆసనమును గ్రహించిన, అర్ఘ్యమును స్వీకరించిన ఆ దుర్గమరాజేంద్రునికి ప్రముచమహాముని స్వాగతము పలికెను. ఓ రాజా ! ఓ మహాబాహూ ! నీకు కుశలమే కదా ! నీ కోశాగారము, సైన్యబలము, స్నేహితులు, సేవకులు, మంత్రులు, సమస్తమునకు ఆధారభూతుడవైన నీవు అందరూ కుశలమే కదా ! ఇచ్చట నీ భార్య క్షేమముగానే ఉన్నది. అందువలన ఆమె కుశలవృత్తాంతమును నేను అడుగుట లేదు. మిగిలిన నీ భార్యలందరూ క్షేమమే కదా !

రాజోవాచ – రాజు చెప్పాడు.

త్వత్ప్రసాదాదకుశలం న క్వచిన్మమ సువ్రత ।
జాతకౌతూహలశ్చాస్మి మమ భార్యాత్ర కా మునే ॥43॥

ఓ సువ్రతుడా ! ఓ మునీ ! మీ దయవలన నాకు ఎటువంటి క్షామము లేదు. ఈ ప్రదేశమందు నాకు భార్య ఎవరున్నారు? ఈ విషయమును తెలుసుకొనవలెనని కుతూహలముగా ఉన్నది.

ఋషిరువాచ – ముని చెప్పాడు.

రేవతీ సుమహాభాగా త్రైలోక్యస్యాపి సున్దరీ ।
తవ భార్యా వరారోహా తాం త్వం రాజన్న వేత్సి కిమ్ ॥44॥

ఓ రాజా ! రేవతియను గొప్ప మహాభాగురాలు, ముల్లోకములకు సున్దరి, అందమైన నితంబభాగము కలదీయగు నీ భార్యను నీవు ఎరుగవా ఏమి?

రాజోవాచ – రాజు చెప్పాడు.

సుభద్రాం శాన్తతనయాం కావేరీతనయాం విభామ్ ।
సురాష్ట్రజాం సుజాతాం చ కదంబాం చ వరూథజామ్ ॥45॥

విపాఠాం నన్దినీం చైవ వేద్మి భార్యాం గృహే ద్విజ ।
తిష్ఠన్తి మే న భగవన్రేవతీం వేద్మి కా న్వియమ్ ॥46॥

ఓ బ్రాహ్మణుడా ! సుభద్ర, శాన్తతనయ, కావేరీతనయ, సురాష్ట్రదేశమందు జన్మించిన సుజాత, వరూథతనయయగు కదంబ, విపాఠ, నన్దిని వీరందరు నా భార్యలు. వీరందరిని నేను ఎరుగుదును. వీరు నా గృహమందే ఉన్నారు. ఓ పూజ్యుడా ! ఈ రేవతియను ఆమెను మాత్రము నేను ఎరుగను. ఎవరీమె?

ఋషిరువాచ – ఋషి చెప్పాడు.

ప్రియేతి సాంప్రతం యేయం త్వయోక్తా వరవర్ణినీ ।
కిం విస్మృతం తే భూపాల శ్లాఘ్యేయం గృహిణీ తవ ॥47॥

ఓ రాజా ! ఇప్పుడే నీవు మిక్కిలి సౌందర్యవతియగు ఈ కన్యను "ఓ ప్రియురాలా !" అని సంబోధించితివి. మరచితివా ఏమి? ఈ నీ గృహిణి శ్లాఘనీయురాలు.

రాజోవాచ – రాజు చెప్పాడు.

సత్యముక్తం మయా కిన్తు భావో దుష్టో న మే మునే ।
నాత్ర కోపం భవాన్కర్తుమర్హత్యస్మాసు యాచితః ॥48॥

ఓ మునీ ! నిజమే, నేనిట్లు పలికితిని. కాని నా మాటలందు చెడ్డ స్వభావమేమీ లేదు. ఈ విషయమందు నాపై మీరు కోపగించవద్దని మిమ్ములను ప్రార్థించుచున్నాను.

ఋషిరువాచ – ఋషి చెప్పాడు.

యత్త్వం బ్రవీషి భూపాల న భావస్తవ దూషితః ।
వ్యాజహార భవానేతద్వహ్నినా నృప చోదితః ॥49॥

ఓ రాజా ! నీవు చెప్పినట్లే నీయందెట్టి దుష్టస్వభావమూ లేదు. ఓ రాజా ! నీవు అగ్నిదేవుని ప్రేరణతోనే ఇట్లు పలికితివి.

మయా పృష్టో హుతవహః కోఽస్యా భర్తేతి పార్థివ ।
భవితా తేన చాప్యుక్తో భవానేవాద్య వై వరః ॥50॥

ఓ రాజా ! "ఈమెకెవరు భర్త కాగలర"ని నేను అగ్నిదేవుని అడుగగా, నీవే ఈమెకు ఈరోజు పెండ్లికొడుకు కాగలవని అగ్నిదేవుడు బదులిచ్చెను.

తద్గృహ్యతాం మయా దత్తా తుభ్యం కన్యా నరాధిప ।
ప్రియేత్యామన్త్రితా చేయం విచారం కురుషే కథమ్ ॥51॥

ఓ మరాహాజా ! అందువలన నాచే ఈయబడిన ఈ కన్యను నీవు పరిగ్రహించుము. ఈమె నీచే "ప్రియురాలా" అని కూడా సంబోధించబడినది. ఇక ఈ విషయములో నీవెందుకు విచారము చేయుచుంటివి?

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

తతోఽసావభవన్మౌనీ తేనోక్తః పృథివీపతిః ।
ఋషిస్తథోద్యతః కర్తుం తస్యా వైవాహికం విధిమ్ ॥52॥

ఋషి ఆ విధముగా పలుకగా పృథివీపరిపాలకుడగు ఆ రాజు మౌనమును వహించెను. అంతట ఆ ముని ఆ కన్యకు వివాహసంబంధమైన విధులను నిర్వర్తించుటకు ఉద్యుక్తుడయ్యెను.

తముద్యతం సా పితరం వివాహాయ మహామునే ।
ఉవాచ కన్యా యత్కించిత్ప్రశ్రయావనతాననా ॥53॥

ఓ క్రౌష్టుకిమహామునీ ! వివాహవిధులను నిర్వర్తించుటకు ఉద్యుక్తుడైన తండ్రితో వినయముతో తలవంచుకొని ఆ కన్య కొంచెము ఇట్లు పలికెను.

యది మే ప్రీతిమాంస్తాత ప్రసాదం కర్తుమర్హసి ।
రేవత్యృక్షే వివాహం మే తత్కరోతు ప్రసాదితః ॥54॥

ఓ తండ్రీ ! నాయందు మీకు ప్రీతియున్నచో నాయందు ప్రసన్నభావమును చూపుటకు మీరు తగుదురు. నన్ను అనుగ్రహించి రేవతీనక్షత్రయుక్తకాలమందు నాకు వివాహమును చేయుడు.

ఋషిరువాచ – ఋషి చెప్పాడు.

రేవత్యృక్షం న వై భద్రే చన్ద్రయోగి వ్యవస్థితమ్ ।
అన్యాని సన్తి ఋక్షాణి సుభ్రు వైవాహికాని తే ॥55॥

ఓ అందమైన కనుబొమలు గలదానా ! ఓ మంగళస్వరూపురాలా ! రేవతీనక్షత్రము చంద్రయోగము కలదై యుండలేదు. రేవతీనక్షత్రము తప్ప మిగిలిన నక్షత్రములన్నియు నీ వివాహవిధికి శ్రేష్ఠములైయున్నవి.

కన్యోవాచ – కన్య చెప్పింది.

తాత తేన వినా కాలో విఫలః ప్రతిభాతి మే ।
వివాహో విఫలే కాలే మద్విధాయాః కథం భవేత్ ॥56॥

ఓ తండ్రీ ! ఆ రేవతీనక్షత్రసంబంధము లేని కాలము నా వివాహవిధికి విఫలమని నాకు తోచుచున్నది. నా వంటి కన్యకు వివాహము విఫలకాలమందు ఎట్లు జరుగగలదు?

ఋషిరువాచ – ఋషి చెప్పాడు.

ఋతవాగితి విఖ్యాతస్తపస్వీ రేవతీం ప్రతి ।
చకార కోపం క్రుద్ధేన తేనర్క్షం వినిపాతితమ్ ॥57॥

ఋతవాక్కుడను పేరుగల ప్రసిద్ధుడైన తపస్వి కోపములో ఆ నక్షత్రమును ఆకాశమునుండి క్రిందికి పడవేసెను.

మయా చాస్మై ప్రతిజ్ఞాతా భార్యేతి మదిరేక్షణా ।
న చేచ్ఛసి వివాహం త్వం సంకటం నః సమాగతమ్ ॥58॥

మదిరేక్షణయగు నీవు ఇతడికి భార్యవు కాగలవని నాచే ప్రతిజ్ఞ చేయబడినది. కాని నీవీ సమయమందు వివాహము చేసుకొనుటకు ఇష్టపడుట లేదు. మాకు సంకటస్థితి ప్రాప్తించినది.

కన్యోవాచ – కన్య చెప్పింది.

ఋతవాక్ స మునిస్తాత కిమేవం తప్తవాంస్తపః ।
న త్వయా మమ తాతేన బ్రహ్మబన్ధోః సుతాస్మి కిమ్? ॥59॥

ఓ తండ్రీ ! ఋతవాక్కను ఆ ముని ఇందుకోసమే తపస్సు ఆచరించెనా ఏమి? నా తండ్రియగు నీవు అట్టి తపస్సును ఆచరించలేదు కదా ! నేను బ్రహ్మబంధువు యొక్క కుమార్తెనా ఏమి? (ఆచారరహితుడైన బ్రాహ్మణుడు బ్రహ్మబంధువనగా).

ఋషిరువాచ – ఋషి చెప్పాడు.

బ్రహ్మబంధోః సుతా న త్వం బాలే నైవ తపస్వినః ।
సుతా త్వం మమ యో దేవాన్కర్తుమన్యాన్సముత్సహే ॥60॥

ఓ బాలా ! నీవు బ్రహ్మబంధువుయొక్క కుమార్తెవూ కావు, ఒక తపోజనుని కుమార్తెవూ కావు. సామాన్యులను దేవతలుగా అనగా విశిష్టపురుషులుగా చేయుటకు ఇష్టపడే ఒక ఋషియొక్క కుమార్తెవు నీవు.

కన్యోవాచ – కన్య పలికింది.

తపస్వీ యది మే తాతస్తత్కిమృక్షమిదం దివి ।
సమారోప్య వివాహో మే తదృక్షే క్రియతే న తు ॥61॥

నా తండ్రి అట్టి తపస్వి అయినచో ఆ రేవతీనక్షత్రమును ఆకాశమందు నిలిపి ఆ నక్షత్రకాలమందు నా వివాహమును ఎందుకు చేయుట లేదు?

ఋషిరుచ – ఋషి చెప్పాడు.

ఏవం భవతు భద్రం తే భద్రే ప్రీతిమతీ భవ ।
ఆరోపయామీన్దుమార్గే రేవత్యృక్షం కృతే తవ ॥62॥

ఓ కల్యాణీ ! నీవు చెప్పినట్లే అగుగాక ! నీకు కల్యాణమగుగాక ! సంతోషము కలిగినదానివైయుండుము. నీకొరకు ఆకాశమార్గమందు రేవతీనక్షత్రమును నిలిపెదను.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

తతస్తపఃప్రభావేణ రేవత్యృక్షం మహామునిః ।
యథాపూర్వం తథా చక్రే సోమయోగి ద్విజోత్తమ ॥63॥

ఓ బ్రాహ్మణశ్రేష్ఠుడా ! అంతట ఆ మహాముని తన తపః ప్రభావముతో రేవతీనక్షత్రమును పూర్వమువలే చంద్రునితో సంయోగపరచి ఆకాశమందు నిలిపెను.

వివాహం చైవ దుహితుర్విధివన్మన్త్రయోగినమ్ ।
నిష్పాద్య ప్రీతిమాన్భూయో జామాతరమథాబ్రవీత్ ॥64॥

తన కుమార్తెకు శాస్త్రోక్తప్రకారము మంత్రములతో వివాహమును జరిపించి ఆ ఋషి సంతోషించెను. తిరిగి తన అల్లునితో ఇట్లు పలికెను.

ఋషిరువాచ – ఋషి చెప్పాడు.

ఔద్వాహికం తే భూపాల కథ్యతాం కిం దదామ్యహమ్ ।
దుర్లభ్యమపి దాస్యామి మమాప్రతిహతం తపః ॥65॥

ఓ రాజా ! వివాహసందర్భంగా ఏమైననూ నీవు కోరుకొనుము. నీకేమి ఇవ్వవలెనో చెప్పుము. ఎంతటి దుర్లభమైన వస్తువయినా ఇచ్చెదను. నా తపస్సుకు అడ్డు లేదు.

రాజోవాచ – రాజు చెప్పాడు.

మనోః స్వాయంభువస్యాహముత్పన్నః సంతతౌ మునే ।
మన్వంతరాధిపం పుత్రం త్వత్ప్రసాదాద్వృణోమ్యహమ్ ॥66॥

ఓ మునిశ్రేష్ఠుడా ! స్వాయంభువమనువుయొక్క వంశమందు నేను జన్మించితిని. నీ అనుగ్రహము వలన మన్వంతరమునకు అధిపతి కాగల కుమారుని నేను కోరుకొనుచున్నాను.

ఋషిరువాచ – ఋషి చెప్పాడు.

భవిష్యత్యేష తే కామో మనుస్త్వత్తనయో మహీమ్ ।
సకలాం భోక్ష్యతే భూప ధర్మవిచ్చ భవిష్యతి ॥67॥

ఓ రాజా ! నీ కోరిక సిద్ధించగలదు. నీ కుమారుడు మనువు అయి ఈ సమస్త భూమండలమును అనుభవించగలడు, ధర్మవేత్త కూడా కాగలడు.

మార్కండేయ ఉవాచ :– మార్కండేయుడు చెప్పాడు

తామాదాయ తతో భూపః స్వమేవ నగరం యయౌ ।
తస్మాదజాయత సుతో రేవత్యాం రైవతో మనుః ॥68॥

అటు పిమ్మట ఆ రాజు తన భార్యను తీసుకొని తన పట్టణమునకు వెళ్ళెను. ఆ రాజుకు తన భార్యయగు రేవతీదేవియందు రైవతుడను పేరు గల మనువు జన్మించెను.

సమేతః సకలైర్ధర్మైర్మానవైరపరాజితః ।
విజ్ఞాతాఖిలశాస్త్రార్థో వేదవిద్యార్థశాస్త్రవిత్ ॥69॥

ఆ రైవతుడు సకల ధర్మములను అనుష్ఠించుచూ, మానవులెవరి చేతిలోనూ పరాజితుడు కానివాడై, సమస్తశాస్త్రార్థములను ఎరిగినవాడై, వేదములు, చతుర్దశ విద్యలు, అర్థశాస్త్రములందు జ్ఞానము గలవాడాయెను.

తస్య మన్వన్తరే దేవాన్మునిదేవేన్ద్రపార్థివాన్ ।
కథ్యమానాన్మయా బ్రహ్మన్నిబోధ సుసమాహితః ॥70॥

ఓ బ్రహ్మస్వరూపుడా ! అతని మన్వంతరమందున్న దేవతలు, మునులు, దేవేంద్రుడు, రాజులు వీరిని గూర్చి చెప్పెదను, సావధానచిత్తుడవై వినుము.

సుమేధసస్తత్ర దేవాస్తథా భూతనయా ద్విజ ।
వైకుంఠశ్చామితాభాశ్చ చతుర్దశ చతుర్దశ ॥71॥

ఓ బ్రాహ్మణుడా ! ఆ మన్వంతరమందలి దేవతలు సుమేధస్సులు, భూతనయులు, వైకుంఠులు, అమితాభస్సులు అనుపేర్లు కలిగి పదునాలుగు, పదునాలుగు సంఖ్యగలవారు.

తేషాం దేవగణానాం తు చతుర్ణామపి చేశ్వరః ।
నామ్నా విభురభూదింద్రః శతయజ్ఞోపలక్షకః ॥72॥

ఆ నాలుగు విధములైన దేవగణములకు నూరు యజ్ఞములు ఆచరించిన విభుడను పేరుగల ఇంద్రుడు అధిపతిగా ఉండెను.

హిరణ్యలోమా వేదశ్రీరూర్ధ్వబాహుస్తథాపరః ।
వేదబాహుః సుధామా చ పర్జన్యశ్చ మహామునిః ॥73॥

వసిష్ఠశ్చ మహాభాగో వేదవేదాంగపారగః ।
ఏతే సప్తర్షయశ్చాసన్ రైవతస్యాన్తరే మనోః ॥74॥

హిరణ్యలోముడు, వేదశ్రీ, ఊర్ధ్వబాహువు, వేదబాహువు, సుధామ, మహామునియగు పర్జన్యుడు, వేదవేదాంగపారంగతుడు మహానుభావుడూ అయిన వసిష్ఠుడు ఈ ఏడుగురు రైవత మన్వంతరమందు సప్తర్షులుగా నుండిరి.

బలబంధుర్మహావీర్యః సుయష్టవ్యస్తథాపరః ।
సత్యకాద్యాస్తథైవాసన్ రైవతస్య మనోః సుతాః ॥75॥

బలబంధువు, మహావీర్యుడు, సుయష్టకుడు, సత్యకుడు మొ॥వారు రైవతమనువుయొక్క పుత్రులుగా ఉండిరి.

రైవతాన్తాస్తు మనవః కథితా యే మయా తవ ।
స్వాయంభువాశ్రయా హ్యేతే స్వారోచిషమృతే మనుమ్ ॥76॥

రైవతుని వరకు నా చేత చెప్పబడిన మనువులందరూ స్వారోచిషమనువు తప్ప మిగిలినవారందరూ స్వాయంభువమనువు నాశ్రయించినవారు.

య ఏషాం శృణుయాన్నిత్యం పఠేదాఖ్యానముత్తమమ్ ।
విముక్తః సర్వపాపేభ్యో లోకం ప్రాప్నోత్యభీప్సితమ్ ॥77॥

ఎవరయితే ఈ మనువుల ఉత్తమమైన ఉపాఖ్యానమును వినునో, చదువునో అట్టివారు సమస్త పాపములనుండి విముక్తులై తమకిష్టమైన లోకములను పొందెదరు.

ఇతి శ్రీమార్కండేయమహాపురాణే రైవతమన్వన్తరే ద్విసప్తతితమోఽధ్యాయః ॥72॥

శ్రీ మార్కండేయమహాపురాణమందలి రైవతమన్వంతరమను డెబ్బదిరెండవ అధ్యాయం సమాప్తం.



త్రిసప్తతితమోఽధ్యాయః - డెబ్బదిమూడవ అధ్యాయం
షష్ఠమన్వన్తరమ్ - ఆరవ మన్వంతరం

మార్కండేయ ఉవాచ - మార్కండేయుడు చెప్పాడు.

ఇత్యేతత్కథితం తుభ్యం పఞ్చమం మన్వన్తరం మయా ।
చాక్షుషస్య మనోః షష్ఠం శ్రూయతామిదమన్తరమ్ ॥1॥

ఓ బ్రాహ్మణశ్రేష్ఠుడా ! ఈ విధముగా అయిదవ మన్వంతరమును గూర్చి నీకు నేను చెప్పితిని. ఇప్పుడు ఆరవ చాక్షుషమన్వంతరమును గూర్చి చెప్పెదను, వినుము.

అన్యజన్మని జాతోఽసౌ చక్షుషః పరమేష్ఠినః ।
చాక్షుషత్వమతస్తస్య జన్మన్యస్మిన్నపి ద్విజ ॥2॥

ఓ ద్విజుడా ! వేరే జన్మమందు ఇతడు పరమేష్ఠియగు బ్రహ్మదేవుని చక్షుస్సులనుండి పుట్టినందున, ఈ జన్మమందు కూడా చాక్షుషుడని పేరు కలిగెను.

అనమిత్రస్య రాజర్షేర్భద్రా భార్యా మహాత్మనః ।
జజ్ఞే సుతం సువిద్వాంసం శుచిం జాతస్మరం విభుమ్ ॥3॥

మహాత్ముడైన అనమిత్రుడను పేరుగల రాజర్షియొక్క భద్రయను పేరుగల భార్య గొప్ప విద్వాంసుడు, శౌచము గలవాడు, జాతిస్మరుడూ అగు విభువను పేరుగల కుమారుని ప్రసవించెను.

జాతం మాతా నిజోత్సఙ్గే స్థితముల్లాప్య తం పునః ।
పరిష్వజతి హార్దేన పునరుల్లాపయత్యథ ॥4॥

తనకు జన్మించిన, తన ఒడిలో కూర్చొనియున్న కుమారుని ఆనందముతో ఆలింగమును చేసుకొని తల్లి లాలింపసాగెను.

జాతిస్మరః స జాతో వై మాతురుత్సఙ్గమాస్థితః ।
జహాస తం తదా మాతా సంక్రుద్ధా వాక్యమబ్రవీత్ ॥5॥

తల్లి ఒడిలో కూర్చొనియున్న ఆ బాలకుడు పూర్వజన్మవృత్తాంతమునెరిగినవాడై నవ్వెను. అప్పుడు కోపగించిన తల్లి ఇట్లు పలికెను.

భీతాస్మి కిమిదం వత్స హాసో యద్వదనే తవ ।
అకాలబోధః సంజాతః కచ్చిత్పశ్యసి శోభనమ్ ॥
తన్మాతుర్వచనం శ్రుత్వా ప్రహస్యేదమథాబ్రవీత్ ॥6॥

ఓ కుమారా ! నీ ముఖమందలి నవ్వు కారణముగా నేను భయపడితిని. అకాలబోధను (ప్రస్తుత సందర్భానికి, కాలానికి తగని జ్ఞానమును) పొందినవాడవై నీవు మంగళప్రదమైనదానిని దేనినైనా చూచుచున్నావా ఏమి? తన తల్లి మాటను విని నవ్వుకొని ఆ కుమారుడిట్లు పలికెను.

పుత్ర ఉవాచ – కుమారుడు పలికెను.

మామత్తుమిచ్ఛతి పురో మార్జారీ కిం న పశ్యసి ।
అన్తర్ధానగతా చేయం ద్వితీయా జాతహారిణీ ॥7॥

నా ముందే నన్ను భక్షించాలని కోరుచున్న ఈ ఆడు పిల్లిని నీవు చూచుట లేదా ఏమి? రెండవ ఆడు పిల్లి జాతహారిణి (పుట్టిన పిల్లలను భక్షించేది) ఇచ్చటే కనిపించకుండా అంతర్ధానమైయున్నది, దాగుకొనియున్నది.

పుత్రప్రీత్యా చ భవతీ సహార్దా మామవేక్షతీ ।
ఉల్లాప్యోల్లాప్య బహుశః పరిష్వజతి మాం యతః ॥8॥

ఉద్భూతపులకా స్నేహసంభవాస్రావిలేక్షణా ।
తతో మమాగతో హాసః శృణు చాప్యత్ర కారణమ్ ॥9॥

నాపైన పుత్రప్రేమతో నీవు ఆనందముతో నన్ను చూచుచున్నదానవై లాలించి లాలించి పలుమార్లు ఆలింగనము చేసుకొనుచున్నావు. రోమములు నిక్కబొడిచి స్నేహముతో సంభవించిన కన్నీళ్ళతో అడ్డగింపబడిన చూపు కలిగినదానవై నీవు ఉన్నావు. అందువలన నాకు నవ్వు వచ్చినది. ఇందుకు కారణమును చెప్పెదను, వినుము.

స్వార్థే ప్రసక్తా మార్జారీ ప్రసక్తం మామవేక్షతే ।
తథాన్తర్ధానగా చైవ ద్వితీయా జాతహారిణీ ॥10॥

ఈ ఆడపిల్లి, రెండవవైపు అదృశ్యమై దాగుకొనియున్న మరొక పిల్లి స్వార్థమందు ప్రసక్తములై నన్ను చూచుచున్నవి.

స్వార్థాయ స్నిగ్ధహృదయే యథైవేతే మమోపరి ।
ప్రవృత్తే స్వార్థమాస్థాయ తథైవ ప్రతిభాసి మే ॥11॥

ఈ రెండు పిల్లులూ నాయెడల స్వార్థముతో స్నేహభావము కలిగిన హృదయములు కలవై, నన్ను గూర్చి ఎట్లు ప్రవృత్తములు అగుచున్నవో అట్లే నీవు కూడా స్వార్థభావమును పొంది నాయందు ప్రవర్తించుచున్నావని నాకు తోచుచున్నది.

కిన్తు మదుపభోగాయ మార్జారీ జాతహారిణీ ।
త్వం తు క్రమేణోపభోగ్యం మత్తః ఫలమభీప్ససి ॥12॥

ఈ ఆడపిల్లి, జాతహారిణియగు మరొక పిల్లి నన్ను అనుభవించుటకొరకు నా పట్ల ప్రవృత్తములగుచున్నవి. కాని నీవు మాత్రము కాలక్రమేణ నావలన సిద్ధించే అనుభవింపతగిన ఫలమును కోరుకొనుచున్నావు.

న మాం జానాసి కోఽప్యేష న చైవోపకృతం మయా ।
సంగతం నాతికాలీనం పఞ్చసప్తదినాత్మకమ్ ॥13॥

తథాపి స్నిహ్యసే సాస్రా పరిష్వజసి చాప్యతి ।
తాతేతి వత్స భద్రేతి నిర్వ్యలీకం బ్రవీషి మామ్ ॥14॥

నేనెవరినో నీవు ఎరుగవు. నేను నీకెట్టి ఉపకారమూ చేయలేదు. మన ఇరువురికి పరిచయము చాలకాలము నుండి లేదు. కేవలము అయిదు, ఏడు దినముల పరిచయము కలిగిన నన్ను ప్రేమించుచున్నావు, ఆనందబాష్పములతో నన్ను మిక్కిలి కౌగలించుకొనుచున్నావు. ఓ తండ్రీ ! ఓ కుమారా ! ఓ భద్రా ! అని నీవు నన్ను ప్రేమతో సంబోధించి మాటలాడుచున్నావు.

మాతోవాచ – తల్లి చెప్పింది.

న త్వాఽహముపకారార్థం వత్స ప్రీత్యా పరిష్వజే ।
న చేదేతద్భవత్ప్రీత్యై పరిత్యక్తాస్మ్యహం త్వయా ॥15॥

స్వార్థో మయా పరిత్యక్తో యస్త్వత్తో మే భవిష్యతి ।
ఇత్యుక్త్వా సా తముత్సృజ్య నిష్క్రాన్తా సూతికాగృహాత్ ॥16॥

ఓ కుమారా ! నేను ఉపకారమును ఆశించి నిన్ను ఆలింగనము చేసుకొనుట లేదు. ఈ ఆలింగనముద్వారా నిన్ను లాలించుట నీకు సంతోషమును కలిగించనట్లయితే నేను నిన్ను విడిచిపెట్టెదను. నీవలన నాకు సిద్ధించబోవు స్వార్థమునంతటినీ నేను విడిచిపెట్టితిని అని పలికి ఆమె ఆ బాలుని అచ్చటే విడిచిపెట్టి ప్రసూతిగృహమునుంచి వెడలిపోయినది.

జడాఙ్గబాహ్యకరణం శుద్ధాన్తఃకరణాత్మకమ్ ।
జహార తం పరిత్యక్తం సా తదా జాతహారిణీ ॥17॥

అప్పుడే ప్రసవించిన ఆ బాలుని సాకేవారు ఎవరూ లేనందున ఆ బాలుని దేహము, బాహ్యేంద్రియములు జడభూతములైనవి. ఆ బాలుని అన్తఃకరణము ఎట్టి కల్మషములూ లేకుండా పరిశుద్ధముగా ఉన్నది. విడిచిపెట్టబడిన అట్టి బాలుని ఆ సమయమందు జాతహారిణి (రెండవ ఆడపిల్ల) అపహరించెను.

సా హిత్వా తం తదా బాలం విక్రాన్తస్య మహీభృతః ।
ప్రసూతపత్నీశయనే న్యస్య తస్యాదదే సుతమ్ ॥18॥

తమప్యన్యగృహే నీత్వా గృహీత్వా తస్య చాత్మజమ్ ।
తృతీయం భక్షయామాస సా క్రమాజ్జాతహారిణీ ॥19॥

హృత్వా హృత్వా తృతీయం తు భక్షయత్యతినిర్ఘృణా ।
కరోత్యనుదినం సా తు పరివర్తం తథాన్యయోః ॥20॥

అప్పుడు ఆ జాతహారిణి ఆ బాలకుని గ్రహించి, విక్రాన్తమహీపాలుని అప్పుడే ప్రసవించిన భార్యాశయ్యయందు ఆ బాలుని ఉంచి క్రొత్తగా జన్మించిన ఆమె పుత్రుని అపహరించెను. ఆ బాలుని కూడా వేరే గృహమునకు

తీసుకొని వెళ్ళి అచ్చట ఉంచి, ఆ ఇంట క్రొత్తగా జన్మించిన పుత్రుని హరించి, చివరకు ఆ మూడవ బాలుని భక్షించెను. ఈ విధముగా మిక్కిలి దయాహృదయము లేని ఆ జాతహారిణి నిత్యమూ క్రొత్తగా జన్మించిన బాలకులను హరించి మొదటి ఇద్దరిని మార్చి మూడవ బాలుని తినుచుండెడిది.

విక్రాన్తోఽపి తతస్తస్య సుతస్యైవ మహీపతిః ।
కారయామాస సంస్కారాన్రాజన్యస్య భవన్తి యే ॥21॥

అటుపిమ్మట విక్రాంతుడను ఆ మహీపతి క్షత్రియబాలునికి ఎట్టి సంస్కారములుండునో అట్టి సంస్కారములను ఆ పరివర్తనము చెందిన బాలకునికి కూడా చేయించెను.

ఆనందేతి చ నామాస్య పితా చక్రే విధానతః ।
ముదా పరమయా యుక్తో విక్రాన్తః స నరాధిపః ॥22॥

ఆ విక్రాంత మహీపతి మిక్కిలి ఆనందభరితుడై శాస్త్రోక్తవిధిననుసరించి ఆ బాలకునికి ఆనందుడని నామకరణము చేసెను.

కృతోపనయనం తం తు గురురాహ కుమారకమ్ ।
జనన్యాః ప్రాగుపస్థానం క్రియతాం చాభివన్దనమ్ ॥23॥

ఉపనయనసంస్కారమును పొందిన ఆ కుమారునితో గురువుగారు "ముందుగా తల్లి వద్దకు వెళ్ళి నమస్కారము చేయుము" అని చెప్పెను.

స గురోస్తద్వచః శ్రుత్వా విహస్యైవమథాబ్రవీత్ ।
వన్ద్యా మే కతమా మాతా జననీ పాలనీ ను కిమ్ ॥24॥

గురువుగారి మాటలను విని ఆనందుడు నవ్వుకొని ఇట్లు పలికెను. "కన్నతల్లికి వందనము చేయవలెనా, లేక పెంచిన తల్లికి వందనము చేయవలెనా?"

గురురువాచ – గురువు చెప్పాడు.

నన్వియం తే మహాభాగ జనిత్రీ జారుజాత్మజా ।
విక్రాన్తస్యాగ్రమహిషీ హైమినీ నామ నామతః ॥25॥

ఓ మహానుభావా ! జారుజాత్మజురాలు, విక్రాంతునియొక్క పట్టమహిషి, హైమినియను పేరుగల ఈమె నీ తల్లి కదా !

ఆనంద ఉవాచ – ఆనందుడు చెప్పాడు.

ఇయం జనిత్రీ చైత్రస్య విశాలగ్రామవాసినః ।
విప్రాగ్ర్యబోధపుత్రస్య యోఽస్యాం జాతోఽన్యతోఽగమమ్ ॥26॥

విశాలగ్రామనివాసీ మరియు విప్రశ్రేష్ఠుడగు బోధుని కుమారునిగానూ భావించబడుచున్న చైత్రుని తల్లియే ఈమె. ఈమె గర్భమునుంచే ఆ చైత్రుడు జన్మించెను. నేను మరొకచోట జన్మించితిని.

గురురువాచ – గురువు చెప్పాడు.

కుతస్త్వం కథయానంద చైత్రః కో వా త్వయోచ్యతే ।
సంకటం మహదాభాతి క్వ జాతోஉత్ర బ్రవీషి కిమ్ ॥27॥

ఓ ఆనందా ! నీవెచ్చటినుంచి వచ్చితివి? నీవు చెప్పే ఆ చైత్రుడు ఎవరు? ఇది గొప్ప సంకటస్థితిగా కనిపించుచున్నది. నీవెచ్చట జన్మించితివో చెప్పెదవా ఏమి?

ఆనంద ఉవాచ – ఆనందుడు చెప్పాడు.

జాతోహమనమిత్రస్య క్షత్రియస్య గృహే ద్విజ ।
తత్పత్న్యాం గిరిభద్రాయామాదదే జాతహారిణీ ॥28॥

తయాత్ర ముక్తో హైమిన్యాం గృహీత్వా చ సుతం చ సా ।
బోధస్య ద్విజముఖ్యస్య గృహే నీతవతీ పునః ॥29॥

భక్షయామాస చ సుతం తస్య బోధద్విజన్మనః ।
స తత్ర ద్విజసంస్కారైః సంస్కృతో హైమినీసుతః ॥30॥

వయమత్ర మహాభాగ సంస్కృతా గురుణా త్వయా ।
మయా తవ వచః కార్యముపైమి కతమాం గురో ॥31॥

ఓ బ్రాహ్మణుడా ! నేను అనమిత్రుడను పేరుగల క్షత్రియుని గృహమందు అతని భార్య గిరిభద్రయొక్క గర్భమందు జన్మించితిని. నన్ను అచ్చటినుంచి జాతహారిణి అపహరించి ఈ ప్రదేశమందు (హైమిని వద్ద) ఉంచినది. మరియు హైమిని పుత్రుని హరించి ద్విజశ్రేష్ఠుడగు బోధుని ఇంట ఉంచినది. ఇంకను ఆ జాతహారిణి ద్విజోత్తముడగు బోధుని పుత్రుని భక్షించివేసినది. హైమినీసుతుడగు ఆ బాలకుడు ఆ బోధుని ఇంట ద్విజసంస్కారములచే సంస్కరింపబడెను. గురువైన నీచేత మేమిచ్చట సంస్కరింపబడితిమి. గురువులైన మీ వాక్కు పరిపాలింపతగినది. ఏ తల్లికి నమస్కారము చేయవలెనో చెప్పుడు.

గురురువాచ – గురువు చెప్పాడు.

అతీవ గహనం వత్స సంకటం మహదాగతమ్ ।
న వేద్మి కిఞ్చిన్మోహేన భ్రమన్తీవ హి బుద్ధయః ॥32॥

ఓ కుమారా ! మిక్కిలి విషమమైన గొప్ప సంకటస్థితి సంప్రాప్తించినది. ఏమియు తెలియుట లేదు. మోహకారణముచే బుద్ధులు (ఆలోచనలు) భ్రమించుచున్నవానివలే ఉన్నవి.

ఆనంద ఉవాచ – ఆనందుడు చెప్పాడు.

మోహస్యావసరః కోఽత్ర జగత్యేవం వ్యవస్థితే ।
కః కస్య పుత్రో విప్రర్షే కో వా కస్య న బాన్ధవః ॥33॥

ఓ బ్రాహ్మణశ్రేష్ఠుడా ! ఈ ప్రపంచమంతయు పరమేశ్వరునిచే ఈ విధముగా వ్యవస్థితము కాగా, ఈ విషయమందు మోహమునకు అవసరమేమున్నది? ఎవరు ఎవరికి పుత్రుడు? ఎవరు ఎవరికి బంధువు కాదు?

ఆరభ్య జన్మనో నౄణాం సంబంధిత్వముపైతి యః ।
అన్యసంబంధినో విప్ర మృత్యునా సన్నివర్తితాః ॥34॥

ఓ బ్రాహ్మణుడా ! మనిషి పుట్టుక దగ్గరనుంచి తోటి మానవులతో సంబంధమును పెట్టుకొనుట ప్రారంభించును. అట్టి తనతో సంబంధమున్న వేరే వారు మృత్యువు కారణముగా తనను విడిచిపెట్టి లోకమునుండి మరలుచున్నారు.

అత్రాపి జాతస్య సతః సంబంధా యోఽస్య బాన్ధవైః ।
సోఽప్యస్తమన్తే దేహస్య ప్రయాత్యేషోఽఖిలక్రమః ॥35॥

అంతేకాక మనిషి తాను పుట్టిన పిమ్మట బంధువులతో సంబంధము ఏర్పరచుకొనును. అట్టి తాను కూడా మరణించును. ఇది సంసారమందలి నిత్యమూ జరిగే ఒక క్రమము లేదా ప్రక్రియ.

అతో బ్రవీమి సంసారే వసతః కో న బాన్ధవః ।
కో వాపి సతతం బంధుః కిం వో విభ్రామ్యతే మతిః ॥36॥

అందువలన నేను చెప్పుచున్నాను, ఈ సంసారమందు నివసించువానికి ఎవరు బంధువుకారు? ఎప్పటికీ తోడుండే బంధువెవరు? మీ బుద్ధి ఎందువలన భ్రమించుచున్నది?

పితృద్వయం మయా ప్రాప్తమస్మిన్నేవ హి జన్మని ।
మాతృద్వయం చ కిం చిత్రం యదన్యద్దేహసంభవే ॥37॥

ఈ జన్మమందే నాకు ఇద్దరు తండ్రులు, ఇద్దరు తల్లులూ సంప్రాప్తించినారు. రాబోవు జన్మమందు పూర్వముకంటే వేరే విధముగా సంభవించుట చిత్రమా ఏమి? వివిధజన్మలందు వివిధప్రకారములు సంభవించుట సహజమేయని ఆశయము.

సోఽహం తపః కరిష్యామి త్వయా యో హ్యస్య భూపతేః ।
విశాలగ్రామతః పుత్రశ్చైత్ర ఆనీయతామిహ ॥38॥

కావున నేనిప్పుడు సంసారమును విడిచి తపస్సు ఆచరించెదను. నీవిప్పుడు విశాలగ్రామమునుండి ఈ రాజుయొక్క కుమారుని (చైత్రనామధేయము గలవానిని) ఇచ్చుటకు తీసుకొని రమ్ము.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

తతః స విస్మితో రాజా సభార్యః సహ బన్ధుభిః ।
తస్మాన్నివర్త్య మమతామనుమేనే వనాయ తమ్ ॥39॥

అంతట తన భార్యతోనూ బంధువులతోనూ కూడినవాడైన ఆ రాజు ఆశ్చర్యమునొందినవాడై ఆ కుమారునియందు మమకారమును వీడి అతడు తపస్సు ఆచరించుటకు అడవులకు వెళ్ళుటకు అనుమతించెను.

చైత్రమానీయ తనయం రాజ్యయోగ్యం చకార సః ।
సమ్మాన్య బ్రాహ్మణం యేన పుత్రబుద్ధ్యా స పాలితః ॥40॥

అటుపిమ్మట విక్రాంతమహీపతి తన కుమారుడగు చైత్రుని విశాలగ్రామమునుండి రప్పించి, ఏ బ్రాహ్మణుడయితే ఇంతవరకు చైత్రుని తన కుమారునిగా భావించి పెంచి పెద్దచేసెనో అట్టి బోధుడను పేరుగల బ్రాహ్మణుని సమ్మానించి చైత్రుని రాజ్యపట్టాభిషిక్తుని గావించెను.

సోఽప్యానన్దస్తపస్తేపే బాల ఏవ మహావనే ।
కర్మణాం క్షపణార్థాయ విముక్తేః పరిపన్థినామ్ ॥41॥

బాలుడైయుండగానే ఆ ఆనందుడు ఆ గొప్ప అరణ్యమందు మోక్షమునకు ప్రతిబంధకముగా నిలిచే కర్మలను నశింపచేసుకొనుటకు తపస్సును ఆచరించెను.

తపస్యన్తం తతస్తం చ ప్రాహ దేవః ప్రజాపతిః ।
కిమర్థం తప్యసే వత్స తపస్తీవ్రం వదస్వ తత్ ॥42॥

తపస్సును ఆచరించుచున్న ఆ బాలకుని బ్రహ్మదేవుడు "ఓ వత్సా ! నీ వెందులకు తీవ్రమైన తపస్సును ఆచరించుచున్నావో చెప్పుము" అని ప్రశ్నించెను.

ఆనంద ఉవాచ – ఆనందుడు చెప్పాడు.

ఆత్మనః శుద్ధికామోఽహం కరోమి భగవంస్తపః ।
బంధాయ మమ కర్మాణి యాని తత్క్షపణోన్ముఖః ॥43॥

ఓ పూజ్యుడా ! సంసారబంధములకు కారణమైన కర్మలను నశింపచేసుకొనదలచి నేను ఆత్మశుద్ధికొరకు తపస్సును ఆచరించుచున్నాను.

బ్రహ్మోవాచ – బ్రహ్మ చెప్పాడు.

క్షీణాధికారో భవతి ముక్తియోగ్యో న కర్మవాన్ ।
సత్వాధికారవాన్ ముక్తిమవాప్స్యతి తతో భవాన్ ॥44॥

భవతా మనునా భవ్యం షష్ఠేన వ్రజ తత్కురు ।
అలం తే తపసా తస్మిన్కృతే ముక్తిమవాప్స్యసి ॥45॥

కర్మలయందు ఎవరికి అధికారము నశించునో అతడే మోక్షము పొందుటకు అర్హుడగును. కర్మలను ఆచరించువాడు మోక్షమును పొందడు. సత్త్వాధికారము అనగా ఆత్మధ్యానము గల మానవుడు ముక్తిని పొందగలడు. అందువలన, నీవిపుడు ఆరవ మనువు కావలెను. వెళ్ళుము, అందుకు తగినట్లుగా ఆచరించుము. (ఇప్పుడే మోక్షమునకు ప్రయత్నించవద్దని ఆశయము). నీకిక తపస్సు చాలును. దానిని ఆచరించినచో ముక్తినే పొందగలవు. (ఆరవ మనువుగా వ్యవహరించే అవకాశముండదు.)

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

ఇత్యుక్తో బ్రహ్మణా సోఽపి తథేత్యుక్త్వా మహామతిః ।
తత్కర్మాభిముఖో యస్తు తపసో విరరామ హ ॥46॥

బ్రహ్మదేవుడు ఈ విధముగా పలుకగా, బుద్ధిమంతుడగు ఆ ఆనందుడు అట్లేయని పలికి, అట్టి కర్మాచరణయందు ఆసక్తుడై తపస్సునుండి విరమించుకొనెను.

చాక్షుషేత్యాహ తం బ్రహ్మా తపసో వినివర్తయన్ ।
పూర్వం నామ్నా బభూవాథ ప్రఖ్యాతశ్చాక్షుషో మనుః ॥47॥

బ్రహ్మదేవుడు ఆ ఆనందుని తపస్సునుండి నివృత్తుని గావించి అతడిని "ఓ చాక్షుష!" అని పూర్వపు నామధేయముతో సంబోధించెను. అతడు చాక్షుషమనువను పేరుతో ప్రఖ్యాతిని పొందెను.

ఉపయేమే విదర్భాం స సుతాముగ్రస్య భూభృతః ।
తస్యాం చోత్పాదయామాస పుత్రాన్ ప్రఖ్యాతవిక్రమాన్ ॥48॥

ఆ చాక్షుషుడు ఉగ్రుడను పేరుగల రాజుయొక్క కుమార్తెయగు విదర్భను వివాహము చేసుకొని, ఆమె గర్భమునుండి ప్రఖ్యాతులైన విక్రమశాలురగు పుత్రులను పుట్టించెను.

తస్య మన్వంతరేశస్య యేఽన్తరే త్రిదశా ద్విజ ।
యే చర్షయస్తథైవేన్ద్రో యే సుతాశ్చాస్య తాన్ శృణు ॥49॥

ఓ బ్రాహ్మణుడా ! ఆ మన్వంతరాధిపతియగు చాక్షుషుని మన్వంతరమందు ఏ ఏ దేవతలు, ఏ ఏ ఋషులు, ఏ ఇంద్రుడు, ఏ ఏ సంతానములు ఉండిరో వారిని గూర్చి చెప్పెదను, వినుము.

ఆప్యా నామ సురాస్తత్ర తేషామేకోఽష్టకో గణః ।
ప్రఖ్యాతకర్మణాం విప్ర యజ్ఞే హవ్యభుజామయమ్ ॥50॥

ఓ విప్రుడా ! ఆ చాక్షుషమన్వంతరమందలి దేవతలు "ఆప్య" అను పేరుగలవారు. ఎనిమిదిమందితో ఒక గణముగా వారిలో కొందరు ఏర్పడిరి. వారు ప్రసిద్ధమైన కర్మలను ఆచరించువారుగాను మరియు యజ్ఞమందలి హోమద్రవ్యములను తినువారుగాను ఉన్నారు.

ప్రఖ్యాతబలవీర్యాణాం ప్రభామండలదుర్దృశామ్ ।
ద్వితీయశ్చ ప్రసూతాఖ్యో దేవానామష్టకో గణః ॥51॥

ఆ దేవతలలో రెండవ అష్టకగణము ప్రసూత అను పేరుతో ప్రసిద్ధమైనది. వారు ప్రఖ్యాతమైన బలపరాక్రమములు గలవారు, ప్రభామండలగతులైనందున చూడ శక్యముగానివారు.

తథైవాష్టక ఏవాన్యో భవ్యాఖ్యో దేవతాగణః ।
చతుర్థశ్చ గణస్తత్ర యూథగాఖ్యస్తథాష్టకః ॥52॥

మరొక అష్టక దేవతాగణము మూడవది భవ్యమను పేరుతో ప్రసిద్ధిని పొందింది. నాల్గవ అష్టక దేవతాగణము యూథగమను పేరుతో ప్రసిద్ధిని పొందింది.

లేఖసంజ్ఞాస్తథైవాన్యే తత్ర మన్వన్తరే ద్విజ ।
పఞ్చమే చ గణే దేవాస్తత్సంజ్ఞా హ్యమృతాశినః ॥53॥

ఓ బ్రాహ్మణుడా ! లేఖయను పేరుతో మిగిలిన దేవతలు ప్రసిద్ధులైరి. అట్టి అయిదవ గణమందలి దేవతలు అమృతమును భుజించువారు.

శతం క్రతూనామాహృత్య యస్తేషామధిపోఽభవత్ ।
మనోజవస్తథైవేన్ద్రః సంఖ్యాతో యజ్ఞభాగభుక్ ॥54॥

నూరు యజ్ఞములను ఆచరించి ఆ దేవతలకు అధిపతి అయిన ఇంద్రుడు మనోజవుడను పేరుతో ప్రసిద్ధుడైనవాడు, యజ్ఞభాగములను భుజించువాడు.

సుమేధా విరజాశ్చైవ హవిష్మానున్నతో మధుః ।
అతినామా సహిష్ణుశ్చ సప్తాసన్నితి చర్షయః ॥55॥

సుమేధ, విరజ, హవిష్మత్, ఉన్నత, మధు, అతినామ, సహిష్ణు ఈ ఏడుగురు చాక్షుషమన్వంతరమందు ఋషులుగా ఉండిరి.

ఉరూపురుశతద్యుమ్నప్రముఖాః సుమహాబలాః ।
చాక్షుషస్య మనోః పుత్రాః పృథివీపతయోఽభవన్ ॥56॥

ఉరు, పురు, శతద్యుమ్న ప్రభృతులు ప్రసిద్ధులైన గొప్పబలవంతులు చాక్షుషమనువుయొక్క కుమారులు ఈ భూమండలములకు రాజులైరి అనగా పరిపాలించిరి.

ఏతత్తే కథితం షష్ఠం మయా మన్వన్తరం ద్విజ ।
చాక్షుషస్య తథా జన్మ చరితం చ మహాత్మనః ॥57॥

ఓ బ్రాహ్మణుడా ! ఈ చాక్షుషమన్వంతరమును గూర్చి నీకు నేను చెప్పితిని. అట్లే మహాత్ముడగు చాక్షుషుని పుట్టుక, చరిత్రలను గూర్చి కూడా నీకు నేను చెప్పితిని.

సాంప్రతం వర్తతే యోఽయం నామ్నా వైవస్వతో మనుః ।
సప్తమో యేఽన్తరే తస్య దేవాద్యాస్తాన్ శృణుష్వ మే ॥58॥

ఇప్పుడు ప్రస్తుతము వైవస్వతమను ఏడవ మన్వంతరము ఏది కలదో దానికి సంబంధించిన దేవతలను మొ॥లగు వారిని గూర్చి చెప్పెదను, వినుము.

య ఇదం కీర్తయేద్ధీమాంశ్చాక్షుషస్యాన్తరం భువి ।
శృణుతే చ లభేత్పుత్రానారోగ్యసుఖసంపదమ్ ॥59॥

ఏ బుద్ధిమంతుడయితే ఈ భూలోకమందు చాక్షుషమన్వంతరమును కీర్తించునో, వినునో అట్టివాడు పుత్రులను, ఆరోగ్యసుఖసంపదలను పొందును.

ఇతి శ్రీ మార్కండేయమహాపురాణే షష్ఠమన్వన్తరం నామ త్రిసప్తతితమోఽధ్యాయః ॥73॥

శ్రీమార్కండేయమహాపురాణమందలి ఆరవ మన్వంతరమను డెబ్బదిమూడవ అధ్యాయం సమాప్తం.



చతుఃసప్తతితమోఽధ్యాయః – డెబ్బదినాల్గవ అధ్యాయం
వైవస్వతమన్వన్తరవృత్తాంతః – వైవస్వతమన్వంతరవృత్తాంతం

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

మార్తండస్య రవేర్భార్యా తనయా విశ్వకర్మణః ।
సంజ్ఞా నామ మహాభాగ తస్యాం భానురజీజనత్ ॥1॥

మనుం ప్రఖ్యాతయశసమనేకజ్ఞానపారగమ్ ।
వివస్వతః సుతో యస్మాత్తస్మాద్వైవస్వతస్తు సః ॥2॥

సూర్యభగవానుడగు మార్తండుని భార్య సంజ్ఞయను పేరు కలిగినది. ఆమె విశ్వకర్మని కుమార్తె. సంజ్ఞయందు సూర్యభగవానుడు తన వీర్యముచే మనువును పుట్టించెను. ఆ మనువు ప్రఖ్యాతమైన కీర్తి గలవాడు, అనేక శాస్త్రజ్ఞానములందు పారంగతుడు, వివస్వంతుని కుమారుడు. వివస్వంతుని కుమారుడు గావున ఆ మనువుకు వైవస్వతుడను ప్రసిద్ధి కలిగెను.

సంజ్ఞా చ రవిణా దృష్టా నిమీలయతి లోచనే ।
యతస్తతః సరోషోఽర్కః సంజ్ఞాం నిష్ఠురమబ్రవీత్ ॥3॥

సూర్యదేవుడు ఎప్పుడు తన భార్యయగు సంజ్ఞను చూచునో అప్పుడు సంజ్ఞాదేవి తన కన్నులను మూసుకొనుచుండెడిది. అంతట కోపగించినవాడై సూర్యదేవుడు సంజ్ఞాదేవితో ఇట్లు నిష్ఠురవాక్కులను పలికెను.

మయి దృష్టే సదా యస్మాత్కురుషే నేత్రసంయమమ్ ।
తస్మాజ్జనిష్యసే మూఢే ప్రజాసంయమనం యమమ్ ॥4॥

ఓ మూఢురాలా ! నేను చూసినప్పుడల్లా నీవు ఎందువలన నేత్రములను బంధించుచున్నావో అనగా మూసుకొనుచున్నావో అందువలన నీవు ప్రజలను తన పాశములతో బంధించునట్టి యమునికి జన్మనీయగలవు.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

తతః సా చపలాం దృష్టిం దేవీ చక్రే భయాకులా ।
విలోలితదృశం దృష్ట్వా పునరాహ చ తాం రవిః ॥5॥

అంతట ఆ సంజ్ఞాదేవి భయకంపితురాలై సూర్యదేవుని చపలదృష్టితో (చంచలదృష్టితో) చూడసాగెను. అట్లు చపలదృష్టి కలిగిన ఆమెను చూచి సూర్యదేవుడు మరల ఇట్లు పలికెను.

యస్మాద్విలోలితా దృష్టిర్మయి దృష్టే త్వయాధునా ।
తస్మాద్విలోలాం తనయాం నదీం త్వం ప్రసవిష్యసి ॥6॥

ఎందువల్లనయితే నీవిప్పుడు నన్ను చంచలమైన దృష్టితో చూచుచున్నావో, అందువలన నీవు చంచలస్వభావముగల నదిని కుమార్తెగా ప్రసవించగలవు.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

తతస్తస్యాం తు సంజజ్ఞే భర్తృశాపేన తేన వై ।
యమశ్చ యమునా చేయం ప్రఖ్యాతా సుమహానదీ ॥7॥

అంతట భర్తయొక్క శాపము కారణముగా సంజ్ఞాదేవికి యముడు, మిక్కిలి ప్రసిద్ధిని పొందిన గొప్ప నది యమున జన్మించిరి.

సాపి సంజ్ఞా రవేస్తేజః సేహే దుఃఖేన భామినీ ।
అసహన్తీ చ సా తేజశ్చిన్తయామాస వై తదా ॥8॥

సంజ్ఞయను పేరుగల ఆ భామిని మిక్కిలి కష్టముతో సూర్యదేవుని తేజస్సును సహించెను. ఇక ఆ తేజస్సును సహింపలేని కారణముచే ఆమె ఇట్లు చింతింపసాగెను.

కిం కరోమి క్వ గచ్ఛామి క్వ గతాయాశ్చ నిర్వృతిః ।
భవేన్మమ కథం భర్తా కోపమర్కశ్చ నైష్యతి ॥9॥

ఏమి చేయుదును? ఎచ్చటకు వెళ్ళుదును? ఎచ్చటకు వెళ్ళిన నాకు నిర్వృతి అనగా మనస్సుకు సంతోషము కలుగును? ఏ విధముగా నా భర్తయగు సూర్యదేవుడు నాపై కోపగించకుండా ఉండును?

ఇతి సఞ్చిన్త్య బహుధా ప్రజాపతిసుతా తదా ।
బహు మేనే మహాభాగా పితృసంశ్రయమేవ సా ॥10॥

ఈ విధముగా ప్రజాపతికుమార్తెయగు మహాభాగురాలు అయిన సంజ్ఞాదేవి తన తండ్రి ఇంటికి వెళుటయే మేలుగా తలచెను.

తతః పితృగృహే గన్తుం కృతబుద్ధిర్యశస్వినీ ।
ఛాయామయీమాత్మతనుం నిర్మమే దయితాం రవేః ॥11॥

యశస్వినియగు ఆ సంజ్ఞాదేవి తన తండ్రి ఇంటికి వెళ్ళుటకు నిశ్చయించుకొని, సూర్యదేవుని కొరకు ప్రియురాలిని ఛాయారూపములో తన శరీరమును నిర్మించెను.

తాం చోవాచ త్వయా వేశ్మన్యత్ర భానోర్యథా మయా ।
తథా సమ్యగపత్యేషు వర్తితవ్యం యథా రవౌ ॥12॥

పృష్టయాఽపి న వాచ్యం తద్ధైతద్గమనం మమ ।
సైవాస్మి నామ సంజ్ఞేతి వాచ్యమేతత్సదా వచః ॥13॥

ఇంకనూ సంజ్ఞాదేవి ఛాయాదేవితో ఇట్లు పలికెను. "ఈ సూర్యదేవుని ఇంట నేనెట్లు ఉంటినో అట్లే నీవు కూడా ఉండవలెను. సూర్యునిపట్ల వ్యవహరించినట్లే సంతానముపట్ల కూడా వ్యవహరించవలెను. సూర్యుడు అడిగినా కూడా నేను వెళ్ళిపోయిన విషయాన్ని నీవు చెప్పరాదు. ఆ సంజ్ఞాదేవినే నేను అని ఎల్లప్పుడూ నీవు చెప్పవలెను."

ఛాయాసంజ్ఞోవాచ – ఛాయాసంజ్ఞ పలికింది.

ఆకేశగ్రహణాద్దేవి ఆశాపాచ్చ వచస్తవ ।
కరిష్యే కథయిష్యామి వృత్తం తు శాపకర్షణాత్ ॥14॥

ఓ దేవీ ! నా జుట్టుపట్టి లాగనంతవరకు, నాకు శాపమివ్వనంతవరకు నీ మాట ప్రకారమే చేసెదను. కాని శాపము మరియు కేశకర్షణ జరిపినప్పుడు సంపూర్ణవృత్తాంతమును చెప్పెదను.

ఇత్యుక్తా సా తదా దేవీ జగామ భవనం పితుః ।
దదర్శ తత్ర త్వష్టారం తపసా ధూతకల్మషమ్ ॥15॥

ఈ విధముగా చెప్పబడిన ఆ సంజ్ఞాదేవి తన తండ్రి ఇంటికి వెళ్ళెను. తపస్సు ఆచరించుటచే పాపములను పోగొట్టుకొన్న తన తండ్రియగు త్వష్టను అనగా విశ్వకర్మను చూచెను.

బహుమానాచ్చ తేనాపి పూజితా విశ్వకర్మణా ।
తస్థౌ పితృగృహే సా తు కంచిత్కాలమనిన్దితా ॥16॥

ఆ విశ్వకర్మ కూడా ఎంతో గౌరవముతో తన కుమార్తెయగు సంజ్ఞాదేవిని ఆదరించెను. అనిందితురాలగు ఆమె తన తండ్రి ఇంట కొద్దికాలముండెను.

తతస్తాం ప్రాహ చార్వఙ్గీం పితా నాతిచిరోషితామ్ ।
స్తుత్వా చ తనయాం ప్రేమబహుమానపురస్సరమ్ ॥17॥

అటుపిమ్మట కొద్దికాలము మాత్రమే తన ఇంట ఉన్న సుందరాంగియగు తన కుమార్తెతో తండ్రి విశ్వకర్మ అత్యంత స్నేహభావముతోనూ, ప్రేమబహుమానములతోనూ కూడుకొన్న మాటలను ఇట్లు పలికెను.

త్వాం తు మే పశ్యతో వత్సే దివాని సుబహూన్యపి ।
ముహూర్తార్ధసమాని స్యుః కిన్తు ధర్మో విలుప్యతే ॥18॥

ఓ కుమారీ ! నిన్ను నేను చాలా రోజులనుంచి చూచుచున్నా ఆ రోజులన్నీ అర్ధముహూర్తకాలముతో సమానమైనవి. అయినా (నీవు నా ఇంట ఉండడం నాకు ఆనందకరమయినా) ధర్మము మాత్రము లోపించుచున్నది.

బాన్ధవేషు చిరం వాసో నారీణాం న యశస్కరః ।
మనోరథో బాన్ధవానాం నార్యా భర్తృగృహే స్థితిః ॥19॥

బంధుజనుల ఇళ్ళలో స్త్రీలు (పరుల భార్యలు) చాలకాలము నివసించుట కీర్తికరము కాదు. నారీజనులు భర్తల ఇండ్లలోనే నివసించాలని బంధుజనుల కోరిక.

సా త్వం త్రైలోక్యనాథేన భర్త్రా సూర్యేణ సఙ్గతా ।
పితృగృహే చిరం కాలం వస్తుం నార్హసి పుత్రికే ॥20॥

సా త్వం భర్తృగృహం గచ్ఛ తుష్టోఽహం పూజితాసి మే ।
పునరాగమనం కార్యం దర్శనాయ శుభే మమ ॥21॥

ఓ పుత్రీ ! ముల్లోకములకు నాథుడగు సూర్యుని నీవు భర్తగా పొందితివి. తండ్రి ఇంట చాల కాలము నివసించుట నీకు తగదు. ఓ మంగళప్రదురాలా ! కావున నీవు నీ భర్త ఇంటికి వెళ్ళుము. నేను సంతుష్టుడనైనాను. నా వలన నీవు సమ్మానితురాలవు అయినావు. నన్ను చూచుటకు మరల నీవు రావలెను.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

ఇత్యుక్తా సా తదా పిత్రా తథేత్యుక్త్వా చ సా మునే ।
సంపూజయిత్వా పితరం జగమాథోత్తరాన్కురూన్ ॥22॥

ఓ మునీ ! తండ్రి విశ్వకర్మ ఇట్లు పలుకగా సంజ్ఞాదేవి "అట్లే అగుగాక" అని పలికి తండ్రిని చక్కగా పూజించి ఉత్తరకురుదేశములకు వెళ్ళెను.

సూర్యతాపమనిచ్ఛన్తీ తేజసస్తస్య బిభ్యతీ ।
తపశ్చచార తత్రాపి బడవారూపధారిణీ ॥23॥

సూర్యతాపమును కోరనట్టిది, సూర్యుని తేజస్సుచే భయము చెందినదీ అగు సంజ్ఞాదేవి ఆ దేశములందు ఆడుగుర్రము యొక్క రూపమును ధరించి తపస్సు చేయనారంభించెను.

సంజ్ఞేయమితి మన్వానో ద్వితీయాయామహస్పతిః ।
జనయామాస తనయౌ కన్యాం చైకాం మనోరమామ్ ॥24॥

సూర్యదేవుడు తన ఇంట ఉన్న ఛాయాదేవిని సంజ్ఞాదేవిగా తలచి ఆ రెండవభార్యయందు ఇద్దరు పుత్రులను, మనస్సుకు ఆహ్లాదమును కలిగించే అందమైన కుమార్తెను ఉత్పన్నము చేసెను.

ఛాయాసంజ్ఞా త్వపత్యేషు యథా స్వేష్వతివత్సలా ।
తథా న సంజ్ఞాకన్యాయాం పుత్రయోశ్చాన్వవర్తత ॥25॥

చాయాసంజ్ఞ తన సంతానమందు ఎట్లు వాత్సల్యము కలిగియున్నదో అట్లు సంజ్ఞాదేవియొక్క కుమార్తెయందు, కుమారులందు వాత్సల్యము కలిగియుండలేదు.

లాలనాద్యుపభోగేషు విక్షేపమనువాసరమ్ ।
మనుస్తత్క్షాన్తవానస్యా యమస్తస్యా న చక్షమే ॥26॥

లాలించుట మొ॥లగు ఉపభోగములందు ఆమె నిత్యము భిన్నభావమును చూపుచుండెను. మనువయితే అట్టి భావములను సహించెనుగాని, యముడు మాత్రము సహించలేకపోయెను.

తాడనాయ చ వై కోపాత్పాదస్తేన సముద్యతః ।
తస్యాః పునః క్షాన్తిమతా న తు దేహే నిపాతితః ॥27॥

ఆమెను తన్నుటకు యముడు కోపముతో కాలిని పైకెత్తెను. కాని ఓర్పు వహించి ఆమెయొక్క దేహమును పాదతాడన చేయక శాంతించెను.

తతః శశాప తం కోపాచ్ఛాయాసంజ్ఞా యమం ద్విజ ।
కిఞ్చిత్ప్రస్ఫురమాణోష్ఠీ విచలత్పాణిపల్లవా ॥28॥

ఓ బ్రాహ్మణుడా ! అంతట ఛాయాసంజ్ఞ అదరుచున్న పెదవులు గలదై, చలించుచున్న చిగుళ్ళవంటి చేతులు గలదై కోపముతో యముని శపించెను.

పితుః పత్నీమమర్యాదం యన్మాం తర్జయసే పదా ।
భువి తస్మాదయం పాదస్తవాద్యైవ పతిష్యతి ॥29॥

నీ తండ్రి భార్యనగు నన్ను గౌరవమీయకుండా కాలితో అదలించితివి. అందువలన నీ పాదము ఇప్పుడే భూమిపై తెగి పడగలదు.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

ఇత్యాకర్ణ్య యమః శాపం మాత్రా దత్తం భయాతురః ।
అభ్యేత్య పితరం ప్రాహ ప్రణిపాతపురస్సరమ్ ॥30॥

తల్లి ఈ విధముగా ఇచ్చిన శాపమును విన్న యముడు భయముతో కూడుకొన్నవాడై, తండ్రి వద్దకు వెళ్ళి సాష్టాంగప్రణామపురస్సరముగా ఇట్లు పలికెను.

యమ ఉవాచ – యముడు చెప్పాడు.

తాతైతన్మహదాశ్చర్యం న దృష్టమితి కేనచిత్ ।
మాతా వాత్సల్యముత్సృజ్య శాపం పుత్రే ప్రయచ్ఛతి ॥31॥

ఓ తండ్రీ ! తల్లి పుత్రవాత్సల్యమును విడిచి పుత్రునికి శాపమిచ్చుట గొప్ప ఆశ్చర్యముగా ఉన్నది. ఎప్పుడునూ ఎవరునూ ఇట్టి విషయమును చూచియుండరు.

యథా మనుర్మమాచష్టే నేయం మాతా తథా మమ ।
విగుణేష్వపి పుత్రేషు న మాతా విగుణా భవేత్ ॥32॥

మనువు నాతో చెప్పిన విధముగా ఈ తల్లి నా పట్ల అట్లు ప్రవర్తించుట లేదు. (మనువు క్షమాగుణముతో ఉండెనని ఇంతకు ముందు చెప్పబడినది. అందువలన ఆ తల్లి మనువుపట్ల అట్టి క్రోధస్వభావము కలిగి ఉ ండకపోవచ్చును.) పుత్రులు చెడ్డగుణములు కలవారై ఉన్ననూ, అట్టివారిపట్ల కూడా తల్లి ఎన్నడునూ విపరీతస్వభావము కలిగియుండదు.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

యమస్యైతద్వచః శ్రుత్వా భగవాంస్తిమిరాపహః ।
ఛాయాసంజ్ఞాం సమాహూయ పప్రచ్ఛ క్వ గతేతి సా ॥33॥

చీకట్లను తొలగించు సూర్యభగవానుడు యమునియొక్క ఈ మాటలను విని ఛాయాదేవిని పిలిచి, "సంజ్ఞాదేవి ఎచ్చటకు వెళ్ళెను?" అని అడిగెను.

సా చాహ తనయా త్వష్టురహం సంజ్ఞా విభావసో ।
పత్నీ తవ త్వయాపత్యాన్యేతాని జనితాని మే ॥34॥

ఓ సూర్యభగవానుడా ! నేను త్వష్టప్రజాపతియగు విశ్వకర్మయొక్క కుమార్తెను, సంజ్ఞాదేవిని, నీ భార్యను. నీ వలన నాయందు ఈ సంతానము జన్మించెను.

ఇత్థం వివస్వతః సా తు బహుశః పృచ్ఛతో యదా ।
నాచచక్షే తతః క్రుద్ధో భాస్వాంస్తాం శప్తుముద్యతః ॥35॥

సూర్యభగవానుడు ఈ విధముగా చాలా పర్యాయములు అడిగిననూ ఆమె యథార్థమును ఎప్పుడయితే చెప్పలేదో అప్పుడు కోపగించిన సూర్యుడు ఆమెను శపించుటకు ఉద్యుక్తుడయ్యెను.

తతః సా కథయామాస యథావృత్తం వివస్వతః ।
విదితార్థశ్చ భగవాన్ జగామ త్వష్టురాలయమ్ ॥36॥

అంతట ఛాయాదేవి ఉన్నది ఉన్నట్లుగా సూర్యభగవానునికి చెప్పెను. సూర్యభగవానుడు విషయమును తెలుసుకొన్నవాడై విశ్వకర్మ ఇంటికి వెళ్ళెను.

తతస్స పూజయామాస తదా త్రైలోక్యపూజితమ్ ।
భాస్వన్తం పరయా భక్త్యా నిజగేహముపాగతమ్ ॥37॥

అటుపిమ్మట విశ్వకర్మ తన ఇంటికి వచ్చినవాడు, ముల్లోకములకు పూజ్యుడు, ప్రకాశయుక్తుడూ అగు సూర్యభగవానుని గొప్ప భక్తితో పూజించెను.

సంజ్ఞాం పృష్టస్తదా తస్మై కథయామాస విశ్వకృత్ ।
ఆగతైవేహ మే వేశ్మ భవతః ప్రేషితేతి వై ॥38॥

సూర్యభగవానుడు విశ్వకర్మను సంజ్ఞాదేవిని గురించి అడుగగా, విశ్వకర్మ సూర్యభగవానునితో "సంజ్ఞాదేవి నా ఇంటికి వచ్చినది, నేనామెను నీ వద్దకే పంపితిని" అని చెప్పెను.

దివాకరః సమాధిస్థో వడవారూపధారిణీమ్ ।
తపశ్చరన్తీం దదృశే ఉత్తరేషు కురుష్వథ ॥39॥

అప్పుడు సూర్యభగవానుడు సమాధిస్థితియందు నిలిచి ఆడగుఱ్ఱము రూపము ధరించి, ఉత్తరకురుదేశములందు తపస్సు ఆచరించుచున్న సంజ్ఞాదేవిని చూచెను.

సౌమ్యమూర్తిః శుభాకారో మమ భర్తా భవేదితి ।
అభిసంధిశ్చ తపసో బుబుధేఽస్యా దివాకరః ॥40॥

"నా భర్త సౌమ్యస్వభావుడు మరియు సుందరాకారుడూ అగుగాక" అన్న కోరికతో తపస్సు ఆచరించుచున్న సంజ్ఞాదేవిని సూర్యభగవానుడు చూచెను.

శాతనం తేజసో మేఽద్య క్రియతామితి భాస్కరః ।
తం చాహ విశ్వకర్మాణం సంజ్ఞాయాః పితరం ద్విజ ॥41॥

ఓ బ్రాహ్మణుడా! "నా తేజస్సును క్షీణింపచేయుడు" అని సూర్యదేవుడు సంజ్ఞాదేవి తండ్రియగు విశ్వకర్మతో పలికెను.

సంవత్సరభ్రమేస్తస్య విశ్వకర్మా రవేస్తతః ।
తేజసః శాతనం చక్రే స్తూయమానశ్చ దైవతైః ॥42॥

అనంతరము ఆ విశ్వకర్మ సంవత్సరగతికి కారణభూతుడైన సూర్యభగవానునియొక్క తేజస్సును దేవతలు స్తుతించుచుండగా క్షీణింపచేసెను.

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే వైవస్వతమన్వంతరే చతుఃసప్తతితమోఽధ్యాయః ॥74॥

శ్రీ మార్కండేయ మహాపురాణమందలి వైవస్వతమన్వంతరమను డెబ్బదినాలుగవ అధ్యాయం సమాప్తం.



పఞ్చసప్తతితమోఽధ్యాయః – డెబ్బది అయిదవ అధ్యాయం
వైవస్వతోత్పత్తివృత్తాంతః – వైవస్వతోత్పత్తివృత్తాంతం

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

తతస్తం తుష్టువుర్దేవాస్తదా దేవర్షయో రవిమ్ ।
వాగ్భిరీడ్యమశేషస్య త్రైలోక్యస్య సమాగతాః ॥1॥

అనంతరము దేవతలు, దేవర్షులు ఆ సమయమందు సమస్త ముల్లోకములకు స్తుతింపదగినవాడైన సూర్యభగవానుని తమ వాక్కులతో స్తుతించిరి.

దేవా ఊచుః – దేవతలు చెప్పారు.

నమస్తే ఋక్స్వరూపాయ సామరూపాయ తే నమః ।
యజుఃస్వరూపరూపాయ సామ్నాం ధామవతే నమః ॥2॥

ఋగ్వేదస్వరూపుడవు, సామవేదస్వరూపుడవు, యజుర్వేదస్వరూపుడవు, సామవేదమంత్రములకు నిలయుడవూ అయిన నీకు నమస్కారము.

జ్ఞానైకధామభూతాయ విశుద్ధాయామలాత్మనే ।
శుద్ధజ్యోతిః స్వరూపాయ విశుద్ధాయామలాత్మనే ॥
చక్రిణే శంఖినే ధామ్నే శార్ఙ్గిణే పద్మినే నమః ॥3॥

జ్ఞానమునకు ఏకైక ఆధారభూతుడవు, అంధకారమును పోగొట్టినవాడవు, శుద్ధప్రకాశస్వరూపుడవు, పరిశుద్ధుడవు, మలరహితస్వరూపుడవూ అగు నీకు నమస్కారము. శంఖము, చక్రము, శార్ఙ్గమను విల్లు, పద్మములు వీటికన్నింటికీ మరియు సమస్తలోకములకూ ఆధారభూతుడవయిన నీకు నమస్కారము.

వరిష్ఠాయ వరేణ్యాయ పరస్మై పరమాత్మనే ।
నమోఽఖిలజగద్వ్యాపిస్వరూపాయాత్మమూర్తయే ॥4॥

మిక్కిలి గొప్పవాడవు, సర్వప్రధానుడవు, సర్వశ్రేష్ఠుడవు, పరమాత్మస్వరూపుడవు, ప్రపంచమంతటా వ్యాపించిన స్వరూపము గలవాడవు, ఆత్మస్వరూపుడవూ అగు నీకు నమస్కారము.

సర్వకారణభూతాయ నిష్ఠాయై జ్ఞానచేతసామ్ ॥5॥

సమస్త ప్రపంచమునకు కారణస్వరూపుడవు, జ్ఞానసంపన్నులకు మానవులకు నిష్ఠాస్వరూపుడవూ (స్థానస్వరూపుడవూ) అగు నీకు నమస్కారము.

నమః సూర్యస్వరూపాయ ప్రకాశాత్మస్వరూపిణే ।
భాస్కరాయ నమస్తుభ్యం తథా దినకృతే నమః ॥6॥

సూర్యస్వరూపుడవు, ప్రకాశాత్మస్వరూపుడవు, భాస్కరుడవు, దినకరుడవూ అగు నీకు నమస్కారము.

శర్వరీహేతవే చైవం సంధ్యాజ్యోత్స్నాకృతే నమః ।
త్వం సర్వమేతద్భగవన్ జగదుద్భ్రమతా త్వయా ॥7॥

ఓ పూజ్యుడా ! ఓ భగవత్స్వరూపుడా ! రాత్రికి కారణభూతుడవు, సంధ్యాకాలమునకు, ప్రకాశమునకు కారణభూతుడవూ అగు నీకు నమస్కారము. ఈ సమస్తప్రపంచమునూ నడిపించుచున్న నీవే సమస్తస్వరూపుడవు.

భ్రమత్యావిద్ధమఖిలం బ్రహ్మాణ్డం సచరాచరమ్ ।
త్వదంశుభిరిదం స్పృష్టం సర్వం సంజాయతే శుచిః ॥8॥

స్థావరజంగమాత్మకమైన సమస్త బ్రహ్మాండము నీచేతనే పట్టుకొనబడి గుండ్రముగా తిరుగుచున్నది. నీ కిరణాలతో స్పృశింపబడిన ఈ సమస్తప్రపంచము పరిశుద్ధమగుచున్నది.

క్రియతే త్వత్కరైః స్పర్శాజ్జలాదీనాం పవిత్రతా ।
హోమదానాదికో ధర్మో నోపకారాయ జాయతే ॥9॥

తావద్యావన్న సంయోగి జగదేతత్త్వదంశుభిః

జలాదులు నీ కిరణములచే స్పృశింపబడే పవిత్రములగుచున్నవి. ఈ సమస్తప్రపంచము నీ కిరణములతో సంయోగము పొందనంతవరకు హోమము, దానము మొ॥గా గల ధర్మము ఉపకారము చేయుటకు సమర్థము కాజాలదు.

ఋచస్తే సకలా హ్యేతా యజూంష్యేతాని చాన్యతః ॥10॥
సకలాని చ సామాని నిపతన్తి త్వదఙ్గతః ।

ఈ సమస్త ఋఙ్మంత్రములు, తద్భిన్నములైన యజుర్మంత్రములు, సమస్తములైన సామమంత్రములు నీ అవయవములనుంచే ఆవిర్భవించుచున్నవి.

ఋఙ్మయస్త్వం జగన్నాథ త్వమేవ చ యజుర్మయః ॥11॥
యతః సామమయశ్చైవ తతో నాథ త్రయీమయః ।

ఓ జగన్నాథా ! సూర్యభగవానుడా ! నీవే ఋఙ్మయుడవు, యజుర్మయుడవు, సామమయుడవు అయినందున ఓ నాథా ! నీవు వేదత్రయీమయుడవు.

త్వమేవ బ్రహ్మణో రూపం పరం చాపరమేవ చ ॥12॥

మూర్తామూర్తస్తథా సూక్ష్మః స్థూలరూపస్తథా స్థితః ।
నిమేషకాష్ఠాదిమయః కాలరూపః క్షయాత్మకః ॥
ప్రసీద స్వేచ్ఛయా రూపం స్వతేజఃశమనం కురు ॥13॥

నీవే బ్రహ్మరూపుడవు (కార్యబ్రహ్మ హిరణ్యగర్భుడు), పరుడవూ అపరుడవూ నీవే, అట్లే సూక్ష్మరూపుడవూ స్థూలరూపుడవూ అయియున్నావు, నిమేషకాష్ఠాదికాలమయుడవు, నాశస్వభావము కలిగిన కాలరూపుడవు

ఓ సూర్యభగవానుడా ! నీకిష్టమైన రూపముతో శాంతించుము. నీ గొప్ప తేజస్సును శమింపజేయుము. (సూర్యతేజస్సు సహింపశక్యముగా లేదని భావము).

ఇదం స్తోత్రవరం రమ్యం శ్రోతవ్యం శ్రద్ధయా నరైః ।
శిష్యో భూత్వా సమాధిస్థో దత్త్వా దేయం గురోరపి ॥14॥

ఈ మనోహరమైన సూర్యస్తోత్రమును శ్రద్ధతో మానవులు వినవలెను. సమాధిస్థితియందుండి, తాను శిష్యుడిగా మారి (అనగా గురుశిష్యభావమనెడు భేదభావమును విడిచి), గురువు తనవద్ద ఉన్నవారికి ఈ స్తోత్రమును ఉపదేశించవలెను.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

ఏవం సంస్తూయమానస్తు దేవైర్దేవర్షిభిస్తథా ।
ముమోచ స్వం తదా తేజస్తేజసాం రాశిరవ్యయః ॥15॥

ఈ విధముగా దేవతలచేతనూ, దేవర్షులచేతనూ స్తుతింపబడిన అవ్యయస్వరూపుడగు (నాశము లేనివాడు) సూర్యభగవానుడు తన తేజోరాశిని విడిచిపెట్టెను.

యత్తస్య ఋఙ్మయం తేజో భవితా తేన మేదినీ ।
యజుర్మయేనాపి దివం స్వర్గః సామమయం రవేః ॥16॥

ఆ సూర్యభగవానునియొక్క ఋఙ్మంత్రమయమైన తేజస్సు పృథివి ఆయెను. యజుర్మయమైన తేజస్సు ఆకాశము ఆయెను. సామమయమైన తేజస్సు స్వర్గము ఆయెను.

శాతితాస్తేజసో భాగా యే త్వష్ట్రా దశ పంచ చ ।
త్వష్ట్రైవ తేన శర్వస్య కృతం శూలం మహాత్మనా ॥17॥

చక్రం విష్ణోర్వసూనాం చ శంకవోఽథ సుదారుణాః ।
పావకస్య తథా శక్తిః శిబికా ధనదస్య చ ॥18॥

అన్యేషామసురారీణామస్త్రాణ్యుగ్రాణి యాని వై ।
యక్షవిద్యాధరాణాం చ తాని చక్రే స విశ్వకృత్ ॥19॥

త్వష్టప్రజాపతి (విశ్వకర్మ) ఆ సూర్యభగవానునియొక్క పదిహేను తేజోభాగములను ఆ సూర్యభగవానుని నుండి వేరుచేసెను. మహాత్ముడగు ఆ త్వష్టప్రజాపతే ఆ తేజోభాగములనుండి పరమేశ్వరునికి శూలమును తయారు చేసెను. విష్ణువుకు చక్రమును తయారు చేసెను. వసువులకు (దేవతా విశేషరూపులు) మిక్కిలి దారుణములైన శంకువులను చేసెను. అగ్నిదేవునికి శక్తిగా మలచెను. కుబేరునికి పల్లకిని చేసెను. మిగిలిన రాక్షసశత్రువులైన దేవగణములకు, యక్షులకు, విద్యాధరులకు ఉగ్రములైన అస్త్రములను చేసెను.

తతశ్చ షోడశం భాగం బిభర్తి భగవాన్విభుః ।
తత్తేజః పంచదశధా శాతితం విశ్వకర్మణా ॥20॥

ఆ సూర్యభగవానుని తేజస్సులోని పదిహేను భాగములను విశ్వకర్మ వేరుపరచి శూలాదులను నిర్మించెను. అందువలన ఇక మిగిలిన పదహారవ తేజోభాగమును మాత్రమే భగవత్స్వరూపుడూ, సర్వవ్యాపకుడూ అగు సూర్యభగవానుడు భరించెను. (అందువలన సూర్యభగవానుని దేవతలు, దేవర్షులు చూడగలిగిరని ఆశయము.)

తతోఽశ్వరూపధృగ్భానురుత్తరానగమత్కురూన్ ।
దదృశే తత్ర సంజ్ఞాం చ వడవారూపధారిణీమ్ ॥21॥

అటు పిమ్మట సూర్యభగవానుడు అశ్వరూపమును ధరించి ఉత్తరకురుదేశములకు వెళ్ళెను. అచ్చట ఆడగుర్రము రూపమును ధరించిన సంజ్ఞాదేవిని చూచెను.

సా చ దృష్ట్వా తమాయాన్తం పరపుంసో విశంకయా ।
జగామ సమ్ముఖం తస్య పృష్ఠరక్షణతత్పరా ॥22॥

ఆడగుర్రము రూపములో ఉన్న ఆ సంజ్ఞాదేవి ఆ వచ్చుచున్నవానిని చూచి పరపురుషుడేమోనను శంకతో తన పృష్ఠ (వెనుక) భాగమును రక్షించుకొనుటలో ఆసక్తురాలై అతనికి ఎదురుగా వెళ్ళెను.

తతశ్చ నాసికాయోగం తయోస్తత్ర సమేతయోః ।
నాసత్యదస్రౌ తనయావశ్వీవక్త్రవినిర్గతౌ ॥23॥

అంతట ఒక్కచోట కలుసుకొన్న ఆ ఇద్దరి నాసికలు కలిసెను. ఆ కారణముగా ఆ ఆడగుర్రము ముఖమునుండి నాసత్య, దస్ర అను పేర్లుగల ఇద్దరు పుత్రులు జన్మించిరి.

రేతసోఽన్తే చ రేవన్తః ఖడ్గీ చర్మీ తనుత్రధృక్ ।
అశ్వారూఢస్సముద్భూతో బాణతూణసమన్వితః ॥24॥

ఆ వీర్యముయొక్క శేషభాగమునుండి ఖడ్గము, కవచము, డాలు వీటిని ధరించినవాడు, బాణతూణీరములతో కూడినవాడు, అశ్వమును అధిరోహించినవాడూ అగు రేవంతుడను పుత్రుడు జన్మించెను.

తతః స్వరూపమతులం దర్శయామాస భానుమాన్ ।
తస్యైషా చ సమాలోక్య స్వరూపం ముదమాదదే ॥25॥

అంతట సూర్యభగవానుడు తనయొక్క సమస్తరూపమును ఆ సంజ్ఞాదేవికి చూపించెను. ఆమె కూడా అతడి రూపమును చూచి సంతసించెను.

స్వరూపధారిణీం చేమామానినాయ నిజాశ్రమమ్ ।
సంజ్ఞాం భార్యాం ప్రీతిమతీం భాస్కరో వారితస్కరః ॥26॥

తన వేడిమిద్వారా భూమినుండి జలములను సంగ్రహించు ఆ సూర్యభగవానుడు స్వస్వరూపమును ధరించినదీ, ప్రీతిమంతురాలూ అగు తన భార్యయగు సంజ్ఞాదేవిని తన ఇంటికి తీసుకొని పోయెను.

తతః పూర్వసుతో యోఽస్యాః సోఽభూద్వైవస్వతో మనుః ।
ద్వితీయశ్చ యమః శాపాద్ధర్మదృష్టిరభూత్సుతః ॥27॥

అటు పిమ్మట ఈమెయొక్క జ్యేష్ఠకుమారుడు వైవస్వతమనువు ఆయెను. రెండవ కుమారుడు యముడు శాపకారణముగా ధర్మదృష్టి కలవాడాయెను.

కృమయో మాంసమాదాయ పాదతోఽస్య మహీతలే ।
పతిష్యన్తీతి శాపాన్తం తస్య చక్రే పితా స్వయమ్ ॥28॥

కృమికీటకాలు ఈ యముని పాదమునుండి మాంసమును గ్రహించి భూమిమీద పడతాయని తండ్రియగు భాస్కరుడు తన కుమారుడగు యమునికి కలిగిన శాపానికి ప్రతీకారము చేసెను. (ఆ విధంగా కృములు భూమిపై పడినందున యముని పాదమే భూమినీద పడినట్లు అవుతుందని ఆశయము.)

ధర్మదృష్టిర్యతశ్చాసౌ సమో మిత్రే తథాఽహితే ।
తతో నియోగం తం యామ్యే చకార తిమిరాపహః ॥29॥

తన కుమారుడు స్నేహితులందు, శత్రువులందూ ఒకేవిధముగా ధర్మదృష్టి కలిగి ప్రవర్తించుచుండుటచే చీకట్లను పోగొట్టు సూర్యభగవానుడు అతడిని యమపదవియందు నియమించెను.

యమునా చ నదీ జజ్ఞే కలిందాంతరవాహినీ ।
అశ్వినౌ దేవభిషజౌ కృతౌ పిత్రా మహాత్మనా ॥30॥

యమున అను పేరుగల కన్య నదీరూపంగా కళిందపర్వతమధ్యదేశమందు ప్రవహించసాగెను. మరియు అశ్వినీకుమారులిరువురూ మహాత్ముడగు తండ్రిచేత దేవతలకు వైద్యులుగా నియమింపబడిరి.

గుహ్యకాధిపతిత్వే చ రేవన్తోఽపి నియోజితః ।
ఛాయాసంజ్ఞాసుతానాం చ నియోగః శ్రూయతాం మమ ॥31॥

రేవంతుడను కుమారుడు కూడా గుహ్యకులకు అధిపతిగా నియమింపబడెను. ఛాయాసంజ్ఞయొక్క కుమారులు ఏ విధంగా నియమింపబడ్డారో చెప్పెదను, వినుము.

పూర్వజస్య మనోస్తుల్యశ్ఛాయాసంజ్ఞాసుతోఽగ్రజః ।
తతః సావర్ణికీ సంజ్ఞామవాప తనయో రవేః ॥32॥

ఛాయాసంజ్ఞయొక్క పెద్ద కుమారుడు ముందుగా జన్మించిన మనువుతో సదృశుడుగా ఉండెను. అందువలన సూర్యుని కుమారుడగు అతడు సావర్ణికుడను పేరును పొందెను.

భవిష్యతి మనుః సోఽపి బలిరిన్ద్రో యదా తదా ।
శనైశ్చరో గ్రహాణాం చ మధ్యే పిత్రా నియోజితః ॥33॥

ఆ కుమారుడు కూడా ఎప్పుడయితే బలి ఇంద్రుడగునో అప్పుడు మనువు కాగలడు. గ్రహముల మధ్యలో శనైశ్చరుడు తండ్రిచేత నియమింపబడెను.

తయోస్తృతీయా కన్యా తు తపతీ నామ సా కురుమ్ ।
నృపాత్సంవరణాత్పుత్రమవాప మనుజేశ్వరమ్ ॥34॥

ఛాయాదేవిసూర్యుల మూడవ సంతానమగు తపతియను పేరుగల కుమార్తె సంవరణుడను పేరుగల రాజువలన నరాధిపతియగు కురువను పేరుగల కుమారునికి జన్మనిచ్చెను.

తస్య వైవస్వతస్యాహం మనోః సప్తమమన్తరమ్ ।
కథయామి సుతాన్భూపాన్ఋషీన్దేవాన్ సురాధిపమ్ ॥35॥

ఆ ఏడవ వైవస్వతమనువుయొక్క పరిపాలన గురించి మరియు అతడి కుమారులు, రాజులు, ఋషులు, దేవతలు, దేవతాధిపతి వీరిని గురించి చెప్పెదను వినుము.

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే వైవస్వతమన్వంతరే వైవస్వతోత్పత్తిర్నామ పంచసప్తతితమోఽధ్యాయః ॥75॥

శ్రీ మార్కండేయ మహాపురాణమందలి వైవస్వతమన్వంతరమందలి వైవస్వతోత్పత్తియను పేరుగల డెబ్బదిఐదవ అధ్యాయం సమాప్తం.



షట్సప్తతితమోఽధ్యాయః - డెబ్బదిఆరవ అధ్యాయం
వైవస్వతమన్వంతరవృత్తాన్తః - వైవస్వతమన్వంతరవృత్తాంతం

మార్కండేయ ఉవాచ - మార్కండేయుడు చెప్పాడు.

ఆదిత్యా వసవో రుద్రాః సాధ్యా విశ్వే మరుద్గణః ।
భృగవోఽఙ్గిరసశ్చాష్టౌ యత్ర దేవగణాః స్మృతాః ॥1॥

ఆదిత్యులు, వసువులు, రుద్రులు, సాధ్యులు, విశ్వేదేవతలు, మరుత్తులు, భృగువులు, అంగిరసులు అను ఎనిమిది విధములైన దేవగణములు ఈ వైవస్వతమన్వంతరమందు స్మరింపబడినారు.

ఆదిత్యా వసవో రుద్రాః విజ్ఞేయాః కశ్యపాత్మజాః ।
సాధ్యాశ్చ వసవో విశ్వే ధర్మపుత్రగణాస్త్రయః ॥2॥

భృగోస్తు భృగవో దేవాః పుత్రా హ్యఙ్గిరసః సుతాః ।
ఏష సర్గశ్చ మారీచో విజ్ఞేయః సాంప్రతాధిపః ॥3॥

ఆదిత్యవసురుద్రులు కశ్యపుని సంతానముగా తెలుసుకొనవలెను. సాధ్యవసువిశ్వేదేవతలు ధర్ముని ముప్వురు పుత్రగణములుగా తెలుసుకొనవలెను. భృగువులు అను దేవతలు భృగువుయొక్క సంతానముగా తెలుసుకొనవలెను. అంగిరోగణాలు అంగిరసుని పుత్రులుగా తెలుసుకొనవలెను. ఈ వైవస్వతమన్వంతరమే ప్రస్తుతమన్వంతరమని, దీనిని మారీచసర్గమని తెలియవలెను.

ఊర్జస్వీ నామ చైవేన్ద్రో మహాత్మా యజ్ఞభాగభుక్ ।
అతీతానాగతా యే చ వర్తన్తే సాంప్రతం చ యే ॥4॥

సర్వే తే త్రిదశేన్ద్రాస్తు విజ్ఞేయాస్తుల్యలక్షణాః ।
సహస్రాక్షాః కులిశినః సర్వ ఏవ పురందరాః ॥5॥

మఘవన్తో వృషాః సర్వే శృఙ్గిణో గజగామినః ।
తే శతక్రతవః సర్వే భూతాభిభవతేజసః ॥6॥

ధర్మాద్యైః కారణైః శుద్ధైరాధిపత్యగుణాన్వితాః ।
భూతభవ్యభవన్నాథాః శృణు చైతత్త్రయం ద్విజ ॥7॥

భూర్లోకోఽయం స్మృతా భూమిరన్తరిక్షం దివః స్మృతమ్ ।
దివ్యాఖ్యశ్చ తథా స్వర్గస్త్రైలోక్యమితి గద్యతే ॥8॥

ఓ బ్రాహ్మణుడా ! ఈ మన్వంతరమందు ఊర్జస్వియనుపేరుగల మహాత్ముడు ఇంద్రుడై యజ్ఞభాగములైన హోమద్రవ్యములను భుజించువాడు అయ్యెను. గడచిపోయిన, రాబోవు, మరియు ప్రస్తుతమున్న దేవేంద్రులందరూ సమానమైన లక్షణములు గలవారిగా తెలియవలెను. వారందరు వేయి కన్నులు గలవారు, వజ్రాయుధము గలవారు,

శత్రుపురములను నశింపచేసినవారు, పూజింపబడినవారు లేదా ధనసంపదలు కలిగినవారు, అందరూ శృంగములు కలిగిన వృషభస్వరూపులు, గజగమనము వంటి గమనము గలవారు, నూరు యజ్ఞములను చేసినవారు, సమస్తభూతములను తిరస్కరించగలిగిన తేజస్సు గలవారు, శుద్ధములైన ధర్మాది కారణములచే (అట్టి ధర్మాదులు కలిగియుండుటచే) ఆధిపత్యగుణము కలిగినవారు, భూతభవిష్యద్వర్తమానములకు ప్రభువులు. ఇప్పుడు ముల్లోకముల విభాగమును చెప్పెదను, వినుము. భూర్లోకము పృథివిగా స్మరింపబడినది. అంతరిక్షము ఆకాశముగా స్మరింపబడినది. స్వర్గలోకము దివ్యలోకముగా స్మరింపబడినది.

అత్రిశ్చైవ వసిష్ఠశ్చ కశ్యపశ్చ మహానృషిః ।
గౌతమశ్చ భరద్వాజో విశ్వామిత్రోఽథ కౌశికః ॥9॥

తథైవ పుత్రో భగవానృచీకస్య మహాత్మనః ।
జమదగ్నిస్తు సప్తైతే మునయోఽత్ర తథాన్తరే ॥10॥

అత్రి, వసిష్ఠుడు, మహాఋషియగు కశ్యపుడు, గౌతముడు, భరద్వాజుడు, కుశికపుత్రుడగు (కౌశికుడు) విశ్వామిత్రుడు, మహాత్ముడగు ఋచీకుని కుమారుడు పూజ్యుడూ అగు జమదగ్ని ఈ ఏడుగురు ఈ వైవస్వతమన్వంతరమందు సప్తర్షులుగా నుండిరి.

ఇక్ష్వాకుర్నాగభశ్చైవ ధృష్టః శర్యాతిరేవ చ ।
నరిష్యన్తశ్చ విఖ్యాతో నాభాగో దిష్ట ఏవ చ ॥11॥

కరూషశ్చ పృషధ్రశ్చ వసుమాంల్లోకవిశ్రుతః ।
మనోర్వైవతస్యైతే నవ పుత్రాః ప్రకీర్తితాః ॥12॥

ఇక్ష్వాకువు, నాగభుడు, ధృష్టుడు, శర్యాతి, విఖ్యాతుడైన నరిష్యంతుడు, నాభాగుడు, దిష్టుడు, కరూషుడు, సంపదలు కలిగిన లోకప్రసిద్ధుడగు పృషధ్రుడు ఈ తొమ్మిదిమంది వైవస్వతమనువుయొక్క కుమారులుగా కీర్తింపబడినారు.

వైవస్వతమిదం బ్రహ్మన్ కథితం తే మయాన్తరమ్ ।
అస్మిన్ శ్రుతే నరః సద్యః పఠితే చైవ సత్తమ ॥
ముచ్యతే పాతకైః సర్వైః పుణ్యం చ మహదశ్నుతే ॥13॥

ఓ బ్రహ్మస్వరూపుడా ! ఈ వైవస్వతమన్వంతరమును గూర్చి నీకు వర్ణించి చెప్పితిని. ఓ మునిశ్రేష్ఠుడా ! దీనిని విన్నవారు, చదివినవారు సమస్తపాపములనుండి విముక్తులగుదురు. గొప్ప పుణ్యమును కూడా పొందెదరు.

ఇతి శ్రీ మార్కండేయమహాపురాణే వైవస్వతమన్వంతరే షట్సప్తతితమోఽధ్యాయః ॥76॥

శ్రీమార్కండేయమహాపురాణమందలి వైవస్వతమన్వంతరమను డెబ్బదిఆరవ అధ్యాయం సమాప్తం.



సప్తసప్తతితమోఽధ్యాయః – డెబ్బదిఏడవ అధ్యాయం

సావర్ణికమన్వంతరమ్ – సావర్ణికమన్వంతరం

క్రౌష్టుకిరువాచ – క్రౌష్టుకి చెప్పాడు.

స్వాయంభువాద్యాః కథితాః సప్తైతే మనవో మమ ।
తదన్తరేషు యే దేవా రాజానో మునయస్తథా ॥1॥

అస్మిన్కల్పే సప్త యేఽన్యే భవిష్యన్తి మహామునే ।
మనవస్తాన్ సమాచక్ష్వ తథా దేవాదయశ్చ యే ॥2॥

ఓ మార్కండేయమహామునీ ! స్వాయంభువుడు మొ॥లగు మనువులను గూర్చి మీరు నాకు చెప్పినారు. అట్లే వారి మన్వంతరములందు ఉన్నట్టి దేవతలు, రాజులు, మునులు వీరిని గురించి కూడా మీరు చెప్పినారు. ఈ కల్పమందు ఏడుగురు మనువులు ఉండెదరు కదా ! వారిని గురించి మరియు వారి సమయమందు ఉండే దేవతలను గురించి నాకు చెప్పుడు.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

కథితస్తవ సావర్ణిశ్ఛాయాసంజ్ఞాసుతశ్చ యః ।
పూర్వజస్య మనోస్తుల్యః స మనుర్భవితాష్టమః ॥3॥

పూర్వమందు జన్మించిన మనువుతో సమానమైనట్టివాడు, ఛాయాసంజ్ఞయొక్క కుమారుడూ అగు సావర్ణిని గురించి నీకు నేను చెప్పితిని. అతడే ఎనిమిదవ మనువు కాగలడు.

రామో వ్యాసో గాలవశ్చ దీప్తిమాన్ కృప ఏవ చ ।
ఋష్యశృఙ్గస్తథా ద్రోణస్తత్ర సప్తర్షయోఽభవన్ ॥4॥

రాముడు, వ్యాసుడు, గాలవుడు, దీప్తిమంతుడు, కృపుడు, ఋష్యశృంగుడు, ద్రోణుడు ఈ ఏడుగురు ఈ మన్వంతరమందు సప్తర్షులుగా నుందురు.

సుతపాశ్చామితాభాశ్చ ముఖ్యాశ్చైవ త్రిధా సురాః ।
వింశకః కథితాశ్చైషాం త్రయాణాం త్రిగుణో గణః ॥5॥

సుతప, అమితాభ, ముఖ్య అను పేర్లుగల మూడు విధములైన దేవతలు గలరు. ఈ మూడువిధములైన దేవతలకు ఒక్కొక్కరికి ప్రత్యేకముగా ఇరువదిమంది దేవతలు గలరు. వీరందరు సత్త్వరజస్తమోగుణసంపన్నులు.

తపస్తపశ్చ శక్రశ్చ ద్యుతిర్జ్యోతిః ప్రభాకరః ।
ప్రభాసో దయితో ధర్మస్తేజో రశ్మిశ్చ వక్రతుః ॥6॥

ఇత్యాదికస్తు సుతపా దేవానాం వింశకో గణః ।
ప్రభుర్విభుర్విభాసాద్యస్తథాన్యో వింశకో గణః ॥7॥

సురాణామమితానాం తు తృతీయమపి మే శృణు ।
తమో దాన్త ఋతః సోమో విన్నాద్యాశ్చైవ వింశతిః ॥8॥

ముఖ్యా హ్యేతే సమాఖ్యాతా దేవా మన్వన్తరాధిపాః ।
మారీచస్యైవ తే పుత్రాః కాశ్యపస్య ప్రజాపతేః ॥9॥

భవిష్యాశ్చ భవిష్యన్తి సావర్ణస్యాన్తరే మనోః ।

ఈ మన్వంతరమందు తపస్తప, శక్ర, ద్యుతి, జ్యోతిస్, ప్రభాకర, ప్రభాస, దయిత, ధర్మ, తేజస్, రశ్మి, వక్రతు మొ॥వారు సుతపస్సులు, దేవతల మొదటి ఇరువది గణము. ప్రభు, విభు, విభాస మొ॥వారు అమితాభుని ఇరువది గణము. ఇక మూడవ (ముఖ్య) గణమును గురించి చెప్పెదను, వినుము. తమస్, దాన్త, ఋత, సోమ, విన్త మొ॥ ఇరవైమంది దేవతలు ముఖ్యుడను పేరుగలవానికి సంబంధించినవారు. వీరందరు మరీచితనయుడగు మారీచ కాశ్యపప్రజాపతియొక్క పుత్రులు. వీరందరు సావర్ణమన్వంతరమందు దేవతలుగా ఉండెదరు.

తేషామింద్రో భవిష్యస్తు బలిర్వైరోచనిర్మునే ॥10॥

పాతాల ఆస్తే యోఽద్యాపి దైత్యః సమయబన్ధనః ।
విరజాశ్చార్వవీరశ్చ నిర్మోహః సత్యవాక్కృతిః ॥
విష్ణ్వాద్యాశ్చైవ తనయాః సావర్ణస్య మనోర్నృపాః ॥11॥

ఓ మునీ ! ఆ దేవతలందరికీ విరోచనుని పుత్రుడగు వైరోచని బలి ఇంద్రుడు కాగలడు. ఆ దైత్యరాజు ఇప్పటికీ ప్రతిజ్ఞాపాశముచే పాతాళమందే ఉన్నాడు. విరజ, అర్వవీర్య, నిర్మోహ, సత్యవాక్, కృతి, విష్ణు మొ॥ సావర్ణమనువుయొక్క కుమారులు రాజులు కాగలరు.

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే సావర్ణికే మన్వన్తరే సప్తసప్తతితమోఽధ్యాయః ॥77॥

శ్రీ మార్కండేయ మహాపురాణమందలి సావర్ణికమన్వంతరమందలి డెబ్బదిఏడవ అధ్యాయం *సమాప్తం.*



అష్టసప్తతితమోఽధ్యాయః – డెబ్బదిఎనిమిదవ అధ్యాయం
దేవీసప్తశతి – దేవీసప్తశతి
దేవీమాహాత్మ్యమ్ – దేవీమాహాత్మ్యం
మధుకైటభవధః – మధుకైటభరాక్షసులను సంహరించుట

ఓం నమశ్చణ్డికాయై – ఓం చండికాదేవికి నమస్కారము.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

సావర్ణిః సూర్యతనయో యో మనుః కథ్యతేఽష్టమః ।
నిశామయ తదుత్పత్తిం విస్తారాద్గదతో మమ ॥1॥

సూర్యుని పుత్రుడగు సావర్ణి ఎనిమిదవ మనువుగా చెప్పబడుచున్నాడు. అతడి జన్మవృత్తాంతమును విస్తారముగా చెప్పెదను, వినుము.

మహామాయానుభావేన యథా మన్వన్తరాధిపః ।
స బభూవ మహాభాగః సావర్ణిస్తనయో రవేః ॥2॥

మహామాయారూపిణి అయిన భగవతియొక్క అనుగ్రహమువలన సూర్యుని పుత్రుడగు మహానుభావుడైన సావర్ణి ఎట్లు మన్వంతరాధిపతి అయ్యెనో చెప్పెదను, వినుము.

స్వారోచిషేఽన్తరే పూర్వం చైత్రవంశసముద్భవః ।
సురథో నామ రాజాఽభూత్సమస్తే క్షితిమణ్డలే ॥3॥

రెండవ స్వారోచిషమన్వంతరమందు పూర్వము చైత్రవంశమందు ఉద్భవించిన సురథుడను పేరుగలవాడు సమస్త భూమండలమందు రాజుగా ఉండెను.

తస్య పాలయతః సమ్యక్ప్రజాః పుత్రానివౌరసాన్ ।
బభూవుః శత్రవో భూపాః కోలావిధ్వంసినస్తదా ॥4॥

ఆ సురథమహారాజు ప్రజలను తన కడుపున పుట్టిన పుత్రులవలే బాగుగా పరిపాలించుచుండగా, అతడికి కోలావిధ్వంసులను శత్రురాజులు సంభవించిరి.

తస్య తైరభవద్యుద్ధమతిప్రబలదణ్డినః ।
న్యూనైరపి స తైర్యుద్ధే కోలావిధ్వంసిభిర్జితః ॥5॥

మిక్కిలి ప్రబలమైన దండము కలిగిన ఆ సురథమహారాజుకు కోలావిధ్వంసిరాజులతో యుద్ధము జరిగెను. కోలావిధ్వంసిరాజులు తక్కువసంఖ్యలోనే ఉన్ననూ, వారిచేతిలో సురథుడు ఓడిపోయెను.

తతః స్వపురమాయాతో నిజదేశాధిపోఽభవత్ ।
ఆక్రాన్తః స మహాభాగస్తైస్తదా ప్రబలారిభిః ॥6॥

అంతట సురథుడు తన పట్టణమునకు తిరిగివచ్చి తిరిగి తన రాజ్యమును పరిపాలించసాగెను. అప్పుడు బలవంతులైన శత్రువులచే ఆ సురథమహాభాగుడు ఆక్రమింపబడినాడు.

అమాత్యైర్బలిభిర్దుష్టైర్దుర్బలస్య దురాత్మభిః ।
కోశో బలం చాపహృతం తత్రాపి స్వపురే తతః ॥7॥

ఆ తరువాత తన పురమునందు బలవంతులూ, దుష్టులూ, దురాత్ములూ అగు మంత్రులచేత దుర్బలుడైన సురథమహారాజుయొక్క కోశాగారము, సైన్యబలము అపహరింపబడినది.

తతో మృగయావ్యాజేన హృతస్వామ్యః స భూపతిః ।
ఏకాకీ హయమారుహ్య జగామ గహనం వనమ్ ॥8॥

అటు పిమ్మట తన రాజ్యమంతయు అపహరింపబడుటచే ఆ సురథమహారాజు ఒంటరిగా వేటయను నెపముతో గుర్రమునెక్కి దట్టమైన అడవులలోనికి వెళ్ళెను.

స తత్రాశ్రమమద్రాక్షీద్ద్విజవర్యసుమేధసః ।
ప్రశాన్తశ్వాపదాకీర్ణం మునిశిష్యోపశోభితమ్ ॥9॥

ఆ రాజు అచ్చట బ్రాహ్మణశ్రేష్ఠుడైన సుమేధసుడను మునియొక్క ఆశ్రమమును చూచెను. ఆ ఆశ్రమము శాంతస్వభావము కలిగిన క్రూరమృగములతో వ్యాపించియున్నది. ఇంకనూ మునులతోనూ, శిష్యులతోనూ శోభించుచున్నది.

తస్థౌ కఞ్చిత్స కాలం చ మునినా తేన సత్కృతః ।
ఇతశ్చేతశ్చ విచరంస్తస్మిన్మునివరాశ్రమే ॥10॥

అప్పుడు ఆరాజు ఆ మునిశ్రేష్ఠుని ఆశ్రమమందు ఇటునటూ సంచరించుచూ కొద్దికాలము అచ్చటే ఉండెను. ఆ ముని అతనిని బాగుగా సత్కరించెను.

సోఽచిన్తయత్తదా తత్ర మమత్వాకృష్టమానసః ।
మత్పూర్వైః పాలితం పూర్వం మయా హీనం పురం హి తత్ ॥
మద్భృత్యైస్తైరసద్వృత్తైర్ధర్మతః పాల్యతే న వా ॥11॥

ఆ ఆశ్రమమందు సురథమహారాజు మమకారముచే ఆకర్షింపబడిన మనస్సు కలవాడై "నా పూర్వజులచే పూర్వము పరిపాలింపబడిన రాజ్యము ఇప్పుడు నేను లేకుండా అయినది, దురాచారము కలిగిన నా సేవకులచే ధర్మబద్ధముగా పరిపాలింపబడుచున్నదో లేదో" అని చింతించెను.

న జానే సుప్రధానో మే శూరో హస్తీ సదా మదః ।
మమ వైరివశం యాతః కాన్భోగానుపలప్స్యతే ॥12॥

ఎల్లప్పుడూ మదముతో నిండి, మిక్కిలి ప్రధానమైన, శూరత్వము కలిగిన నా ఏనుగు శత్రువులకు వశమై ఎట్టి భోగములను అనుభవించుచున్నదో నేను ఎరుగను.

యే మమానుగతా నిత్యం ప్రసాదధనభోజనైః ।
అనువృత్తిం ధ్రువం తేఽద్య కుర్వన్త్యన్యమహీభృతామ్ ॥13॥

ఎల్లప్పుడు నా అనుగ్రహము, నేనిచ్చు ధనభోజనములు వీటితో పూర్వము నన్ను అనుసరించినవారందరు ప్రస్తుతము ఇతరరాజులను నిశ్చయముగా అనుసరించుచున్నారు.

అసమ్యగ్వ్యయశీలైస్తైః కుర్వద్భిః సతతం వ్యయమ్ ।
సఞ్చితః సోఽతిదుఃఖేన క్షయం కోశో గమిష్యతి ॥14॥

చెడు పద్ధతులలో ఎల్లప్పుడూ ధనమును వ్యయపరచు స్వభావము కలిగిన వారివలన మిక్కిలి కష్టముతో ప్రోగుచేసి యుంచిన కోశాగారము నష్టమై పోగలదు.

ఏతచ్చాన్యచ్చ సతతం చిన్తయామాస పార్థివః ।
తత్ర విప్రాశ్రమాభ్యాశే వైశ్యమేకం దదర్శ సః ॥15॥

ఆ సురథమహారాజు ఈ విషయములను, వేరే విషయములను ఎల్లప్పుడూ చింతించుచూ ఉండసాగెను. ఆ మున్యాశ్రమసమీపమందు ఆ రాజు వైశ్యుడిని ఒకడిని చూచెను.

స పృష్టస్తేన కస్త్వం భో హేతుశ్చాగమనేఽత్ర కః ।
సశోక ఇవ కస్మాత్త్వం దుర్మనా ఇవ లక్ష్యసే ॥16॥

ఆ రాజు వైశ్యుని ఇట్లు అడిగెను. "ఓయీ ! నీవెవరవు? ఇచ్చటకు వచ్చుటలో కారణమేమి? శోకముతో కూడి, దుఃఖితమనస్సు గలవానివలే ఎందుకు కనిపించుచున్నావు?"

ఇత్యాకర్ణ్య వచస్తస్య భూపతేః ప్రణయోదితమ్ ।
ప్రత్యువాచ స తం వైశ్యః ప్రశ్రయావనతో నృపమ్ ॥17॥

ప్రేమపురస్సరముగా రాజు పలికిన మాటలను విని ఆ వైశ్యుడు మిక్కిలి వినమ్రుడై రాజుతో ఇట్లు పలికెను.

సమాధిర్నామ వైశ్యోఽహముత్పన్నో ధనినాం కులే ।
పుత్రదారైర్నిరస్తశ్చ ధనలోభాదసాధుభిః ॥18॥

నేను సమాధియను పేరుగల వైశ్యుడను, ధనవంతుల కులములో బుట్టితిని. ధనమందలి లోభముతో దుష్టులైన నా భార్యాబిడ్డలు నన్ను ఇంటినుండి వెళ్ళగొట్టిరి.

విహీనః స్వజనైర్దారైః పుత్రైరాదాయ మే ధనమ్ ।
వనమభ్యాగతో దుఃఖీ నిరస్తశ్చాప్తబన్ధుభిః ॥19॥

బంధువులు, భార్య, పుత్రులు నా ధనమును తీసుకొని నన్ను గెంటివేయుటచే, భార్యాపుత్ర బంధుజనవిహీనుడనై, ఆప్తబంధువులతో కూడా నిరసింపబడినవాడనై దుఃఖముతో ఈ అడవికి వచ్చితిని.

సోఽహం న వేద్మి పుత్రాణాం కుశలాకుశలాత్మికామ్ ।
ప్రవృత్తిం స్వజనానాం చ దారాణాం చాత్ర సంస్థితః ॥20॥

నా బిడ్డలు, బంధుజనము, భార్య వీరి క్షేమసమాచారమును నేను ఎరుగను. వారిప్పుడేమి చేయుచున్నారో నేను ఎరుగను. నేను మాత్రమిచ్చట ఉన్నాను.

కిం ను తేషాం గృహే క్షేమమక్షేమం కిం ను సాంప్రతమ్ ।
కథం తే కిం ను సద్వృత్తా దుర్వృత్తాః కిం ను మే సుతాః ॥21॥

ఇంట వారిప్పుడు క్షేమముగా ఉన్నారో లేదో? వారెట్లున్నారో? నా పుత్రులు సదాచరణ కలిగి ఉన్నారో లేక దురాచరణ కలిగి ఉన్నారో? ఇదేమీ నేను ఎరుగను.

రాజోవాచ – రాజు పలికాడు.

యైర్నిరస్తో భవాంల్లుబ్ధైః పుత్రదారాదిభిర్ధనైః ।
తేషు కిం భవతః స్నేహమనుబధ్నాతి మానసమ్ ॥22॥

ధనము కారణముగా లోభగుణము కలిగిన భార్యాబిడ్డలతో నీవు నిరసింపబడ్డావు, అనగా గెంటివేయబడ్డావు. అట్టి వారియందు నీ మనస్సు స్నేహమును కోరుకొనుచున్నదా ఏమి?

వైశ్య ఉవాచ – వైశ్యుడు చెప్పాడు.

ఏవమేతద్యథా ప్రాహ భవానస్మద్గతం వచః ।
కిం కరోమి న బధ్నాతి మమ నిష్ఠురతాం మనః ॥23॥

నేను అనుకున్నట్లే నీవు కూడా పలికితివి. కాని నేనేమి చేయుదును? నా మనస్సు అటువంటి నా వారిపట్ల కఠినభావమును వహించుట లేదు.

యైః సన్త్యజ్య పితృస్నేహం ధనలుబ్ధైర్నిరాకృతః ।
పతీస్వజనహార్దం చ హార్ది తేష్వేవ మే మనః ॥24॥

ధనమందలి ఆశతో పితృప్రేమను విడిచిపెట్టిన నా పుత్రులచే నేను నిరాకరింపబడినాను. భార్య, బంధుజనము విషయములో కూడా నేనట్లే నిరాకరింపబడినాను. అయినా, నా మనస్సు వారియందే సౌహార్దము కలిగియున్నది.

కిమేతన్నాభిజానామి జానన్నపి మహామతే ।
యత్ప్రేమప్రవణం చిత్తం విగుణేష్వపి బన్ధుషు ॥25॥

ఓ బుద్ధిమంతుడా ! ప్రతికూలురైన నా బంధుజనముపట్ల నా మనస్సు ఎందులకు ప్రేమను పొందుచున్నదో నేను ఎరుగకున్నాను. తెలిసిననూ తత్త్వము అర్థము కాకున్నది.

తేషాం కృతే మే నిశ్వాసో దౌర్మనస్యం చ జాయతే ।
కరోమి కిం యన్న మనస్తేష్వప్రీతిషు నిష్ఠురమ్ ॥26॥

వారికొరకు నాకు దీర్ఘనిశ్వాసము, మనఃఖేదము కలుగుచున్నవి. నాయందు ప్రేమను జూపనివారిపట్ల నా మనస్సు కాఠిన్యమును వహించుట లేదు. నేనేమి చేయవలెను?

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

తతస్తౌ సహితౌ విప్ర తం మునిం సముపస్థితౌ ।
సమాధిర్నామ వైశ్యోఽసౌ స చ పార్థివసత్తమః ॥27॥

ఓ విప్రుడా ! అటుపిమ్మట సురథమహారాజు, సమాధియను వైశ్యుడు ఇద్దరును కలిసి ఆ మునివద్దకు వెళ్ళిరి.

కృత్వా తు తౌ యథాన్యాయం యథార్హం తేన సంవిదమ్ ।
ఉపవిష్టౌ కథాః కాశ్చిచ్చక్రతుర్వైశ్యపార్థివౌ ॥28॥

వారిరువురు అనగా రాజును వైశ్యుడును యథోచితముగా జ్ఞానియగు మునిని గౌరవించి, అచ్చటే కూర్చుండి సంభాషణలను కొనసాగించిరి. (శ్లోకమందలి "తేన" అనుపదమునకు అర్హతను ఆపాదించు పూజాద్రవ్యముతో అని అర్థము చెప్పుకొనవలెను.)

రాజోవాచ – రాజు చెప్పాడు.

భగవంస్త్వామహం ప్రష్టుమిచ్ఛామ్యేకం వదస్వ తత్ ।
దుఃఖాయ యన్మే మనసః స్వచిత్తాయత్తతాం వినా ॥29॥

ఓ భగవత్స్వరూపుడా ! నా మనస్సు నా అధీనములో లేకుండా దుఃఖించుచున్నది. ఆ విషయమై మిమ్ములను ఒక విషయమును అడుగవలెనని కోరుకొనుచున్నాను, దానిని తెలియచెప్పుడు.

మమత్వం గతరాజ్యస్య రాజ్యాంగేష్వఖిలేష్వపి ।
జానతోఽపి యథాఽజ్ఞస్య కిమేతన్మునిసత్తమ ॥30॥

రాజ్యమును పోగొట్టుకొన్న నాకు అన్ని విషయములు తెలిసియుండి కూడా అజ్ఞానికి వలే సమస్తరాజ్యాంగములందు ఇంకను మమకారము కలుగుచున్నది. ఓ మునిశ్రేష్ఠుడా ! ఇది ఎందువలన?

అయం చ నికృతః పుత్రైర్దారైర్భృత్యైస్తథోజ్ఝితః ।
స్వజనేన చ సంత్యక్తస్తేషు హార్దీ తథాప్యతి ॥31॥

మరియు ఈ వైశ్యుడు భార్యాపుత్రులచేతనూ, సేవకులచేతను అవమానింపబడినాడు. స్వజనులచేత విడువబడినాడు. అయిననూ వారిపట్ల అనురాగము కలిగియున్నాడు.

ఏవమేష తథాహం చ ద్వావప్యత్యన్తదుఃఖితౌ ।
దృష్టదోషేఽపి విషయే మమత్వాకృష్టమానసౌ ॥32॥

ఈ విధముగా నేను, ఈ వైశ్యుడు మేమిరువురమూ ఆ యా లౌకికవిషయములందు దోషదృష్టి కలిగినవారమైననూ, మమత్వము (నాది అను భావన) చేత ఆకర్షిపబడిన మనస్సు గలవారమై మిక్కిలి దుఃఖమును పొందుచున్నాము.

తత్కిమేతన్మహాభాగ యన్మోహో జ్ఞానినోరపి ।
మమాస్య చ భవత్యేషా వివేకాన్ధస్య మూఢతా ॥33॥

ఓ మహానుభావుడా ! లౌకికవిషయములెటువంటివో తెలిసినవారమైననూ, మాకిరువురికి వాటిపట్ల మోహము ఎందుకు కలుగుచున్నది? వివేకము నశించిన అంధునికి కలిగే మూఢత్వము మాకిరువురికి కలుగుచున్నది.

ఋషిరువాచ – ఋషి చెప్పాడు.

జ్ఞానమస్తి సమస్తస్య జన్తోర్విషయగోచరే ।
విషయాశ్చ మహాభాగ యాన్తి చైవం పృథక్పృథక్ ॥34॥

ఓ మహాభాగుడా ! విషయములకు సంబంధించిన సమస్తజ్ఞానము అనగా వాటి స్వరూపస్వభావముల జ్ఞానము సమస్తప్రాణులకు కలదు. అనగా అవి క్షణికానందమును మాత్రమే ఇస్తాయని ప్రాణులు ఎరుగుదురు. అవి ప్రాణులను భిన్నభిన్న రీతులలో పొందుచున్నవి. అనగా కొందరు వాటిపట్ల ఆసక్తిని విడిచిపెట్టెదరు, కొందరు విడిచిపెట్టలేరు.

దివాన్ధాః ప్రాణినః కేచిద్రాత్రావన్ధాస్తథాపరే ।
కేచిద్దివా తథా రాత్రౌ ప్రాణినస్తుల్యదృష్టయః ॥35॥

కొంతమంది ప్రాణులు పగలు చూడలేరు. కొంతమంది రాత్రి చూడలేరు. కొంతమంది రాత్రీ పగలూ కూడా చూడలేరు. కొంతమంది రాత్రీ పగలూ కూడా సమదృష్టి కలిగి యుండెదరు. (ఇచ్చట చూచుట అనగా విషయముల స్వభావమును గ్రహించగలుగుట అని అర్థము.)

జ్ఞానినో మనుజాః సత్యం కిం ను తే న హి కేవలమ్ ।
యతో హి జ్ఞానినః సర్వే పశుపక్షిమృగాదయః ॥36॥

మనుష్యులు జ్ఞానవంతులనునది సత్యము. కాని వారు మాత్రమే జ్ఞానులు కారు. ఎందువలననగా పశు పక్షిమృగాదులు అన్నీ జ్ఞానము కలిగిన ప్రాణులే.

జ్ఞానం చ తన్మనుష్యాణాం యత్తేషాం మృగపక్షిణామ్ ।
మనుష్యాణాం చ యత్తేషాం తుల్యమన్యత్తథోభయోః ॥37॥

మృగములు, పక్షులకూ ఉండు విషయజ్ఞానము మానవులకూ ఉన్నది. మానవులకున్న విషయజ్ఞానము మృగములు, పక్షులకూ కూడా సమానముగా ఉన్నది. (శంకరభగవత్పాదులు బ్రహ్మసూత్రాల జిజ్ఞాసాధికరణం అధ్యాసభాష్యంలో "చేతిలో పచ్చగడ్డి పట్టుకొని వస్తున్న మనుష్యులను చూచి పశువులు దగ్గరికొస్తాయని, అదే ఖడ్గాదులు పట్టుకొని వస్తున్న వారిని చూచి పారిపోతాయని, మానవులు కూడా అలాగే ప్రవర్తిస్తారు కాబట్టి వారు పశువులవంటివారే" అని చెప్పడం జరిగింది. దీనివలన మానవుల జ్ఞానము, పశుపక్ష్యాదుల జ్ఞానము ఒకేవిధమైనదని తెలియుచున్నది.)

జ్ఞానేఽపి సతి పశ్యైతాన్ పతఙ్గాన్ శావచఞ్చుషు ।
కణమోక్షాదృతాన్ మోహాత్పీడ్యమానానపి క్షుధా ॥38॥

లౌకికవిషయముల గురించి జ్ఞానమున్ననూ, ఈ తల్లిపక్షులు ఆకలితో పీడింపబడుతున్నా కూడా అజ్ఞానముతో (ఈ భార్యాపుత్రులు నావారు, నాకు మేలు చేస్తారు అన్న అజ్ఞానముతో) తమ పిల్లల నోళ్ళలో ఆహారకణములను విడుచుటలో ఆదరము కలవై ఉన్నవి, వాటిని చూడుము.

మానుషా మనుజవ్యాఘ్ర సాభిలాషాః సుతాన్ప్రతి ।
లోభాత్ప్రత్యుపకారాయ నన్వేతాన్కిం న పశ్యసి ॥39॥

ఓ మనుజవ్యాఘ్రుడా ! మహారాజా ! మానవులు తమ పుత్రులు తమకు మేలు చేస్తారనే లోభముతో ప్రత్యుపకారమును ఆశించి వారి పట్ల మిక్కిలి ప్రేమ కలిగియున్నారు. వారిని నీవు చూచుట లేదా? (అంత్యకాలమందు భగవంతుడు తప్ప భార్యాపుత్రులు ఎటువంటి మేలు చేయలేరని ఆశయము.)

తథాపి మమతావర్తే మోహగర్తే నిపాతితాః ।
మహామాయాప్రభావేణ సంసారస్థితికారిణా ॥40॥

అయినా కూడా మమత్వముచేత (నాది అనుభావన) ఆవరింపబడిన మోహమనే పెద్ద గొయ్యిలో సంసారస్థితికి కారణభూతమైన మహామాయయొక్క (మూలావిద్య) ప్రభావముచేత పడివేయబడినారు.

తన్నాత్ర విస్మయః కార్యో యోగనిద్రా జగత్పతేః ।
మహామాయా హరేశ్చైషా తయా సమ్మోహ్యతే జగత్ ॥41॥

కాబట్టి ఈ విషయమందు ఆశ్చర్యము చెందవలసిన అవసరము లేదు. జగత్ప్రభువగు విష్ణుమూర్తియొక్క యోగనిద్రాస్వరూపిణియగు మహామాయవలన ఈ జగత్తు అంతా సమ్మోహితమగుచున్నది.

జ్ఞానినామపి చేతాంసి దేవీ భగవతీ హి సా ।
బలదాకృష్య మోహాయ మహామాయా ప్రయచ్ఛతి ॥42॥

మహామాయాస్వరూపిణి, భగవతీయగు ఆ దేవి జ్ఞానుల మనస్సులను బలవంతముగా లాగి మోహమందు పడవేయుచున్నది.

తయా విసృజ్యతే విశ్వం జగదేతచ్చరాచరమ్ ।
సైషా ప్రసన్నా వరదా నృణాం భవతి ముక్తయే ॥43॥

ఆ దేవియే స్థావరజంగమాత్మకమయిన ఈ ప్రపంచమును సృజించుచున్నది. మనుష్యులకు వరములనిచ్చు ఆమె వారికి పరమపురుషార్థమైన ముక్తిని ప్రసాదించుచున్నది.

సా విద్యా పరమా ముక్తేర్హేతుభూతా సనాతనీ ।
సంసారబన్ధహేతుశ్చ సైవ సర్వేశ్వరేశ్వరీ ॥44॥

పరవిద్యారూపిణి, ముక్తికి కారణభూతురాలు, సనాతనీయగు ఆ దేవి సంసారబంధమునకు కారణము. ఆమెయే సర్వేశ్వరునికి కూడా ప్రభురూపురాలు.

రాజోవాచ – రాజు చెప్పాడు.

భగవన్ కా హి సా దేవీ మహామాయేతి యాం భవాన్ ।
బ్రవీతి కథముత్పన్నా కర్మ చాస్యాశ్చ కిం ద్విజ ॥45॥

ఓ పూజ్యుడా ! మహామాయయని నీవు చెప్పిన ఆ దేవి ఎవరు? ఆమె ఎట్లు ఉత్పన్నమైనది? ఓ బ్రాహ్మణుడా! ఆమె చేయు పనులు ఎట్టివి?

యత్ప్రభావా హి సా దేవీ యత్స్వరూపా యదుద్భవా ।
తత్సర్వం శ్రోతుమిచ్ఛామి త్వత్తో బ్రహ్మవిదాం వర ॥46॥

ఓ బ్రహ్మవేత్తలలో శ్రేష్ఠుడా ! ఆమెపై ఎవరి ప్రభావమున్నది, ఆమెయొక్క స్వరూపమెట్టిది? ఆమె దేనినుంచి ఉద్భవించినది అదియంతయు నీనుండి వినవలెనని కోరుచున్నాను.

ఋషిరువాచ – ఋషి చెప్పాడు.

నిత్యైవ సా జగన్మూర్తిస్తయా సర్వమిదం తతమ్ ।
తథాపి తత్సముత్పత్తిర్బహుధా శ్రూయతాం మమ ॥47॥

జగన్మూర్తియగు ఆ దేవి నిత్యము, శాశ్వతమైనది. అనగా ఆమెకు ఉత్పత్తివినాశములు లేవు. ఆమెచేతనే ఈ జగత్తంతా వ్యాపింపబడినది. అయినా లోకోపకారము కొరకు ఆమెకు చాలావిధములైన ఉత్పత్తులు (అవతారములు) గలవు, వాటిని గురించి చెప్పెదను, వినుము.

దేవానాం కార్యసిద్ధ్యర్థమావిర్భవతి సా యదా ।
ఉత్పన్నేతి తదా లోకే సా నిత్యాఽప్యభిధీయతే ॥48॥

దేవతల కార్యమును సిద్ధింపచేయుటకు ఆమె ఎప్పుడు ఆవిర్భవించునో అప్పుడు లోకమందు ఆమె నిత్యురాలైనప్పటికీ "జన్మించినది" అని చెప్పబడుచున్నది.

యోగనిద్రాం యదా విష్ణుర్జగత్యేకార్ణవీకృతే ।
ఆస్తీర్య శేషమభజత్కల్పాన్తే భగవాన్ప్రభుః ॥49॥

తదా ద్వావసురౌ ఘోరౌ విఖ్యాతౌ మధుకైటభౌ ।
విష్ణుకర్ణమలోద్భూతౌ హన్తుం బ్రహ్మాణముద్యతౌ ॥50॥

కల్పాంతమందు (ప్రళయకాలమందు) ఈ జగత్తంతా జలమయము అయినప్పుడు భగవంతుడూ, ప్రభువూ అగు విష్ణుమూర్తి శేషశయ్యను విస్తారపరచి యోగనిద్రను వహించెను. ఆ సమయమందు విష్ణుమూర్తియొక్క చెవియందలి మలమునుండి ఉద్భవించిన మధుకైటభులను ఇరువురు భయంకరమైన ప్రఖ్యాతులైన రాక్షసులు బ్రహ్మదేవుని చంపుటకు ఉద్యుక్తులైరి.

స నాభికమలే విష్ణోః స్థితో బ్రహ్మా ప్రజాపతిః ।
దృష్ట్వా తావసురౌ చోగ్రౌ ప్రసుప్తం చ జనార్దనమ్ ॥51॥

తుష్టావ యోగనిద్రాం తామేకాగ్రహృదయస్థితః ।
ప్రబోధనార్థాయ హరేర్హరినేత్రకృతాలయామ్ ॥52॥

విష్ణుమూర్తియొక్క నాభికమలమందున్న ప్రజాపతియగు బ్రహ్మదేవుడు భయంకరస్వరూపులైన ఆ ఇద్దరు రాక్షసులను మరియు నిద్రించుచున్న జనార్దనుని చూచెను. పిమ్మట ఏకాగ్రచిత్తుడై బ్రహ్మదేవుడు హరినేత్రములందు ఆశ్రయమును పొందిన ఆ యోగనిద్రను హరిని మేల్కొల్పునిమిత్తమై స్తుతించెను.

బ్రహ్మోవాచ – బ్రహ్మదేవుడు పలికెను.

విశ్వేశ్వరీం జగద్ధాత్రీం స్థితిసంహారకారిణీమ్ ।
స్తౌమి నిద్రాం భగవతీం విష్ణోరతులతేజసః ॥53॥

ఈ జగత్తుయొక్క సృష్టిస్థితిలయములకు కారణభూతురాలు, విశ్వేశ్వరి, భగవతి, అసమానతేజస్సంపన్నుడైన విష్ణుమూర్తియొక్క యోగనిద్రాస్వరూపిణి అయిన దేవిని స్తుతించుచున్నాను.

త్వం స్వాహా త్వం స్వధా త్వం హి వషట్కారః స్వరాత్మికా ।
సుధా త్వమక్షరే నిత్యే త్రిధా మాత్రాత్మికా స్థితా ॥54॥

నీవు స్వాహాస్వరూపిణివి, స్వధాస్వరూపిణివి, నీవే వషట్కారము, నీవు ఉదాత్తాది స్వరస్వరూపురాలవు, నీవు అమృతము, నీవు కూటస్థమగు పరబ్రహ్మమందు త్రిమాత్రాస్వరూపిణివిగా (ఓమ్) ఉన్నావు.

అర్ధమాత్రా స్థితా నిత్యా యాऽనుచ్చార్యా విశేషతః ।
త్వమేవ సంధ్యా సావిత్రీ త్వం దేవీ జననీ పరా ॥55॥

నీవు నిత్యమైన అర్ధమాత్రాస్వరూపురాలవై ఉన్నావు, ప్రత్యేకముగా ఉచ్చరింపతగినదానవు కావు, నీవే సంధ్యవు, సావిత్రివి, నీవే పరాజననివి అనగా పరాశక్తివి.

త్వయైతద్ధార్యతే విశ్వం త్వయైతత్ సృజ్యతే జగత్ ।
త్వయైతత్పాల్యతే దేవి త్వమత్స్యన్తే చ సర్వదా ॥56॥

ఓ దేవీ ! నీ చేతనే ఎల్లప్పుడు ఈ ప్రపంచము ధరింపబడుచున్నది (నిలబడుచున్నది), నీచేతనే సృష్టింపబడుచున్నది, నీ చేతనే, పరిపాలింపబడుచున్నది, నీవే కల్పాంతమందు నీ జగత్తును భక్షించుచున్నావు అనగా నాశపరచుచున్నావు. (అత్సి + అన్తే = అత్స్యన్తే, అద భక్షణే ఇతి ధాతుః)

విసృష్టౌ సృష్టిరూపా త్వం స్థితిరూపా చ పాలనే ।
తథా సంహృతిరూపాన్తే జగతోఽస్య జగన్మయే ॥57॥

జగత్తంతా సంచరించు ఓ దేవీ ! ఈ జగత్తుయొక్క సృష్టికాలమందు సృష్టిరూపము గలదానవు, పాలించు కాలమందు స్థితిరూపము గలదానవు, సంహార కాలమందు సంహృతిరూపము గలదానవు. (జగత్ మయతే ఇతి జగన్మయా। సంబోధనమందు హే జగన్మయే)

మహావిద్యా మహామాయా మహామేధా మహాస్మృతిః ।
మహామోహా భగవతీ మహాదేవీ మహేశ్వరీ ॥58॥

ప్రకృతిస్త్వం చ సర్వస్య గుణత్రయవిభావినీ ।
కాళరాత్రిర్మహారాత్రిర్మోహరాత్రిశ్చ దారుణా ॥59॥

ఓ దేవీ ! మహావిద్య, మహామాయ, మహామేధ, మహాస్మృతి, మహామోహ, భగవతి, మహాదేవి, మహేశ్వరి, ప్రకృతి, సమస్త ప్రాణకోటికి సత్త్వరజస్తమోగుణములను ఆపాదించుదానవు, కాళరాత్రి, మహారాత్రి, భయంకరమైన మోహరాత్రి వీటి స్వరూపమే నీవు.

త్వం శ్రీస్త్వమీశ్వరీ త్వం హ్రీస్త్వం బుద్ధిర్బోధలక్షణా ।
లజ్జా పుష్టిస్తథా తుష్టిస్త్వం శాన్తిః క్షాన్తిరేవ చ ॥60॥

నీవు లక్ష్మివి, నీవు పరమేశ్వరివి, నీవు వినయస్వరూపిణివి, బోధ లక్షణముగాగల బుద్ధివి, లజ్జారూపిణివి, పుష్టివి, తుష్టివి, శాన్తివి, క్షాన్తివి (క్షమారూపిణివి).

ఖడ్గినీ శూలినీ ఘోరా గదినీ చక్రిణీ తథా ।
శంఖినీ చాపినీ బాణా భుశుండీ పరిఘాయుధా ॥61॥

నీవు ఖడ్గము, శూలము, ఘోరస్వభావము, గద, చక్రము, శంఖము, చాపము (విల్లు), బాణము, భుశు ండి (ఆయుధ విశేషము), పరిఘాయుధము ఇవి కలిగినదానవు.

సౌమ్యా సౌమ్యతరాశేషసౌమ్యేభ్యస్త్వతిసున్దరీ ।
పరాపరాణాం పరమా త్వమేవ పరమేశ్వరీ ॥62॥

నీవు సౌమ్యస్వభావము కలిగినదానవు, మిక్కిలి సౌమ్యురాలవు, పూర్తిగా సౌమ్యము కలిగిన వారిపట్ల మిక్కిలి సౌందర్యవతివి, పరాపరములకంటే ఉత్కృష్టురాలవు, నీవే పరమేశ్వరివి.

యచ్చ కిఞ్చిత్ క్వచిద్వస్తు సదసద్వాఽఖిలాత్మకే ।
తస్య సర్వస్య యా శక్తిః సా త్వం కిం స్తూయసే మయా ॥63॥

ఓ దేవీ ! సర్వస్వరూపురాలా ! సద్రూపమైన వస్తువైనా, అసద్రూపమైన వస్తువైనా వాటియొక్క శక్తివి నీవే. అట్టి నిన్ను ఎట్లు స్తుతింపను?

యయా త్వయా జగత్స్రష్టా జగత్పాత్యత్తి యో జగత్ ।
సోఽపి నిద్రావశం నీతః కస్త్వాం స్తోతుమిహేశ్వరః ॥64॥

ప్రపంచముయొక్క సృష్టిసృష్టిలయకారకుడైన విష్ణుమూర్తిని గూడా నీవు యోగనిద్రావశమును చేసితివి. అట్టి నిన్ను స్తుతించుటకు ఎవడు సమర్థుడు?

విష్ణుః శరీరగ్రహణమహమీశాన ఏవ చ ।
కారితాస్తే యతోఽతస్త్వాం కః స్తోతుం శక్తిమాన్భవేత్ ॥65॥

విష్ణువు, నేను (బ్రహ్మ), ఈశ్వరుడు వీరు ముగ్గురును నీవు శరీరధారులుగా చేసితివి. అట్టి నిన్ను స్తుతించుటకు ఎవడు శక్తిమంతుడు కాగలడు?

సా త్వమిత్థం ప్రభావైః స్వైరుదారైర్దేవి సంస్తుతా ।
మోహయైతౌ దురాధర్షావసురౌ మధుకైటభౌ ॥66॥

ఓ దేవీ ! అట్టి నీవు ప్రభావము కలిగిన మా ఉదారవాక్యములచే స్తుతింపబడినదానవై, ఎదిరింపశక్యముకాని మధుకైటభులను ఈ ఇద్దరు రాక్షసులను మోహింపచేయుము.

ప్రబోధం చ జగత్స్వామీ నీయతామచ్యుతో లఘు ।
బోధశ్చ క్రియతామస్య హన్తుమేతౌ మహాసురౌ ॥67॥

జగత్ప్రభువగు విష్ణుమూర్తిని నెమ్మదిగా నిద్రలేపుము. ఈ గొప్ప రాక్షసులిరువురిని చంపుటకు విష్ణుమూర్తికి బోధను కలుగజేయుము.

ఋషిరువాచ – ఋషి చెప్పాడు.

ఏవం స్తుతా తదా దేవీ తామసీ తత్ర వేధసా ।
విష్ణోః ప్రబోధనార్థాయ నిహన్తుం మధుకైటభౌ ॥68॥

నేత్రాస్యనాసికాబాహుహృదయేభ్యస్తథోరసః ।
నిర్గమ్య దర్శనే తస్థౌ బ్రహ్మణోఽవ్యక్తజన్మనః ॥69॥

ఉత్తస్థౌ చ జగన్నాథస్తయా ముక్తో జనార్దనః ।
ఏకార్ణవే హి శయనాత్తతః స దదృశే చ తౌ ॥70॥

మధుకైటభౌ దురాత్మానావతివీర్యపరాక్రమౌ ।
క్రోధరక్తేక్షణౌ హన్తుం బ్రహ్మాణం జనితోద్యమౌ ॥71॥

తమోగుణప్రధానురాలైన అనగా యోగనిద్రాస్వరూపిణియగు దేవి బ్రహ్మదేవునిచేత ఈ విధముగా స్తుతింపబడి, మధుకైటభ రాక్షస సంహారము కొరకు విష్ణువును మేల్కొల్పదలచెను. విష్ణుమూర్తియొక్క నేత్రములు, ముఖము, ముక్కు, బాహువులు, హృదయము, వక్షఃస్థలముల నుండి బయల్వెడలి దేవి అవ్యక్తజన్ముడగు బ్రహ్మదేవునికి కనిపించుటకు అచ్చట నిలిచెను. యోగనిద్రచేత విడువబడిన విష్ణుమూర్తి సముద్రమందలి శేషశయ్యనుంచి బయటకు వచ్చెను. అటు పిమ్మట దుర్మార్గులు, మిక్కిలి బలపరాక్రమములు కలిగినవారు, కోపముతో ఎఱ్ఱబడిన కన్నులు గలవారు, బ్రహ్మదేవుని చంపుటకు ఉద్యమించిన వారూ అగు మధుకైటభరాక్షసులను విష్ణుమూర్తి చూచెను.

సముత్థాయ తతస్తాభ్యాం యుయుధే భగవాన్హరిః ।
పఞ్చవర్షసహస్రాణి బాహుప్రహరణో విభుః ॥72॥

భగవంతుడూ సర్వవ్యాపకుడూ అగు విష్ణుమూర్తి శయ్యపైనుంచి పైకి లేచి అయిదువేల సంవత్సరాలు తన బాహువులతో యుద్ధము చేసెను.

తావప్యతిబలోన్మత్తౌ మహామాయావిమోహితౌ ।
ఉక్తవన్తౌ వరోఽస్మత్తో వ్రియతామితి కేశవమ్ ॥73॥

ఆ ఇరువురు రాక్షసులు తమ బలముచే ఉన్మత్తులై, మహామాయచేత అనగా దేవిచేత మోహము చెందినవారై "మా నుండి వరమును కోరుకొనుము" అని విష్ణుమూర్తితో పలికిరి.

శ్రీ భగవానువాచ – భగవంతుడగు శ్రీహరి పలికాడు.

భవేతామద్య మే తుష్టౌ మమ వధ్యావుభావపి ।
కిమన్యేన వరేణాత్ర ఏతావద్ధి వృతం మయా ॥74॥

మీరిరువురు నాయందు సంతుష్టులు కండి. నా చేతిలో మీరిరువురు మరణము పొందవలెను. ఇంతమాత్రము నేను వరము కోరితిని. ఇంతకు మించి వేరే వరముతో నాకేమి ప్రయోజనము?

ఋషిరువాచ – ఋషి చెప్పాడు.

వఞ్చితాభ్యామితి తదా సర్వమాపోమయం జగత్ ।
విలోక్య తాభ్యాం గదితో భగవాన్ కమలేక్షణః ॥75॥

ప్రీతౌ స్వస్తవ యుద్ధేన శ్లాఘ్యస్త్వం మృత్యురావయోః ।
ఆవాం జహి న యత్రోర్వీ సలిలేన పరిప్లుతా ॥76॥

మేమిరువురము ఈ విధముగా హరిచే వంచింపబడితిమి అని ఆ రాక్షసులిరువురు భావించిరి. అప్పుడు ఈ ప్రపంచమంతా జలమయమైయుండుట చూచి వారు భగవంతుడు, కమలములవంటి కన్నులు గలవాడూ అగు శ్రీహరితో ఇట్లు పలికిరి. "నీతో యుద్ధము చేసి మేము సంతుష్టులమైతిమి. మా యిరువురికి నీవే మృత్యువగుట శ్లాఘింపతగినది. ఏ భూభాగమయితే జలమయము కాకుండా ఉన్నదో అచ్చట మమ్ములను చంపుము."

ఋషిరువాచ – ఋషి చెప్పాడు.

తథేత్యుక్త్వా భగవతా శంఖచక్రగదాభృతా ।
కృత్వా చక్రేణ వై ఛిన్నే జఘనే శిరసీ తయోః ॥77॥

"అట్లేయగుకాక" అని పలికి శంఖచక్రగదాధారియగు భగవంతుడైన శ్రీహరి వారిరువురిని తన నడుముభాగముమీద కూర్చొండబెట్టుకొని తన సుదర్శనచక్రముతో వారి శిరస్సులను ఖండించి వేసెను.

ఏవమేషా సముత్పన్నా బ్రహ్మణా సంస్తుతా స్వయమ్ ।
ప్రభావమస్యా దేవ్యాస్తు భూయః శృణు వదామి తే ॥78॥

ఈ విధముగా దేవి ఉత్పన్నమైనది, బ్రహ్మదేవునిచేత స్వయముగా స్తుతింపబడినది. ఈ దేవియొక్క ప్రభావమును ఇంకను చెప్పెదను, వినుము.

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే సావర్ణికే మన్వంతరే దేవీమాహాత్మ్యే మధుకైటభవధో నామ అష్టసప్తతితమోఽధ్యాయః ॥78॥

శ్రీ మార్కండేయ మహాపురాణమందలి సావర్ణికమన్వంతరమందలి దేవీమాహాత్మ్యమందు మధుకైటభరాక్షసులను సంహరించుటయను డెబ్బదిఎనిమిదవ అధ్యాయం సమాప్తం.



ఏకోనాశీతితమోఽధ్యాయః – డెబ్బదితొమ్మిదవ అధ్యాయం
దేవీమాహాత్మ్యమ్ – దేవీమాహాత్మ్యం

ఋషిరువాచ – ఋషి చెప్పాడు.

దేవాసురమభూద్యుద్ధం పూర్ణమబ్దశతం పురా ।
మహిషేఽసురాణామధిపే దేవానాం చ పురన్దరే ॥1॥

మహిషుడు రాక్షసులకు అధిపతిగాను, ఇంద్రుడు దేవతలకు అధిపతిగాను ఉన్న సమయమందు పూర్వము దేవాసురయుద్ధము ఒక నూరు సంవత్సరములు జరిగెను.

తత్రాసురైర్మహావీర్యైర్దేవసైన్యం పరాజితమ్ ।
జిత్వా చ సకలాన్దేవానింద్రోఽభూన్మహిషాసురః ॥2॥

ఆ యుద్ధమందు దేవతలసైన్యము రాక్షసుల చేతిలో ఓడిపోయెను. దేవతలను జయించి మహిషాసురుడు ఇంద్రుడయ్యెను.

తతః పరాజితా దేవాః పద్మయోనిం ప్రజాపతిమ్ ।
పురస్కృత్య గతాస్తత్ర యత్రేశగరుడధ్వజౌ ॥3॥

అంతట ఓడిపోయిన దేవతలు పద్మమందు ఉద్భవించినవాడు, ప్రజాపతీయగు బ్రహ్మదేవుని వెంటబెట్టుకొని ఎచ్చటయితే పరమేశ్వరుడు, విష్ణుమూర్తి ఉన్నారో అచ్చటకు వెళ్ళిరి.

యథావృత్తం తయోస్తద్వన్మహిషాసురచేష్టితమ్ ।
త్రిదశాః కథయామాసుర్దేవాభిభవవిస్తరమ్ ॥4॥

దేవతలు శివకేశవులిరువురికి జరిగినది జరిగినట్లుగా మహిషాసురచేష్టలను, దేవతల పరాజయవృత్తాంతమును వివరముగా చెప్పిరి.

సూర్యేన్ద్రాగ్న్యనిలేన్దూనాం యమస్య వరుణస్య చ ।
అన్యేషాం చాధికారాన్స స్వయమేవాధితిష్ఠతి ॥5॥

సూర్యుడు, ఇంద్రుడు, అగ్ని, వాయువు, చంద్రుడు, యముడు, వరుణుడు మరియు ఇతర దేవతల అధికారములను ఆ మహిషాసురుడు ఆక్రమించి అధిష్ఠించినాడు.

స్వర్గాన్నిరాకృతాః సర్వే తేన దేవగణా భువి ।
విచరన్తి యథా మర్త్యా మహిషేణ దురాత్మనా ॥6॥

దుర్మార్గుడగు ఆ మహిషాసురునిచే స్వర్గమునుండి భూలోకములోనికి గెంటివేయబడిన దేవతలు భూలోకమందు మానవులవలే సంచరించుచున్నారు.

ఏతద్వః కథితం సర్వమమరారివిచేష్టితమ్ ।
శరణం వః ప్రపన్నాః స్మో వధస్తస్య విచిన్త్యతామ్ ॥7॥

దేవతలకు శత్రువులైన రాక్షసుల చేష్టలను అన్నింటినీ మీకు వివరముగా చెప్పితిమి. మేము మీ శరణుజొచ్చితిమి. ఆ రాక్షసుని చంపుటను గూర్చి ఆలోచించుడు.

ఋషిరువాచ – ఋషి చెప్పాడు.

ఇత్థం నిశమ్య దేవానాం వచాంసి మధుసూదనః ।
చకార కోపం శంభుశ్చ భ్రుకుటీకుటిలాననౌ ॥8॥

ఈ విధముగా విష్ణుమూర్తి మరియు శివుడు దేవతల మాటలను విని ముడిపడిన కనుబొమలు కలిగిన ముఖములు గలవారై కోపమును వహించిరి.

తతోఽతికోపపూర్ణస్య చక్రిణో వదనాత్తతః ।
నిశ్చక్రామ మహత్తేజో బ్రహ్మణః శంకరస్య చ ॥9॥

అంతట మిక్కిలి కోపము వహించిన విష్ణుమూర్తి, శివుడు, బ్రహ్మల ముఖముల నుండి గొప్ప తేజస్సు బయటకు వచ్చెను.

అన్యేషాం చైవ దేవానాం శక్రాదీనాం శరీరతః ।
నిర్గతం సుమహత్తేజస్తచ్చైక్యం సమగచ్ఛత ॥10॥

అట్లే ఇంద్రాది దేవతల శరీరములనుండి కూడా గొప్ప తేజస్సు బయటకు వచ్చెను. అట్లు ఉద్భవించిన తేజస్సులన్నీ ఏకమయ్యెను అనగా ఒక సమూహముగా మారెను.

అతీవ తేజసః కూటం జ్వలన్తమివ పర్వతమ్ ।
దదృశుస్తే సురాస్తత్ర జ్వాలావ్యాప్తదిగన్తరమ్ ॥11॥

మండుచున్న పర్వతమువలే ఉన్నట్టిదీ, దిక్కులన్నీ వ్యాపించిన జ్వాలలు కలిగినదీ అయిన ఆ తేజఃకూటమును ఆ దేవతలందరూ చూచిరి.

అతులం తత్ర తత్తేజః సర్వదేవశరీరజమ్ ।
ఏకస్థం తదభూన్నారీ వ్యాప్తలోకత్రయం త్విషా ॥12॥

సమస్త దేవదేవతలశరీరములనుండి ఉద్భవించిన అనుపమానమైన ఆ తేజస్సంతా ఏకీకృతమై, ముల్లోకములను వ్యాపించిన ఆ తేజస్సు ఒక స్త్రీరూపమును ధరించెను.

యదభూచ్ఛాంభవం తేజస్తేనాజాయత తన్ముఖమ్ ।
యామ్యేన చాభవన్ కేశా బాహవో విష్ణుతేజసా ॥13॥

మహేశ్వరుని నుండి ఉద్భవించిన ఆ తేజస్సు నుండి ఆ స్త్రీ యొక్క ముఖము ఉత్పన్నమయ్యెను. యముని నుండి ఉద్భవించిన తేజస్సు నుండి ఆమెకు కేశములు ఉద్భవించినవి. విష్ణుతేజస్సునుండి ఆమెకు బాహువులు ఉద్భవించినవి.

సౌమ్యేన స్తనయోర్యుగ్మం మధ్యమైన్ద్రేణ చాభవత్ ।
వారుణేన చ జఙ్ఘోరూ నితంబస్తేజసా భువః ॥14॥

చంద్రుని తేజస్సుచే ఆమెకు స్తనద్వయము, ఇంద్రుని తేజస్సుచే మధ్యప్రదేశము (నడుము), వరుణుని తేజస్సుచే పిక్కలు, తొడలు, భూదేవతయొక్క తేజస్సుచే నితంబము (పిరుదులు) ఆమెకు ఉద్భవించినవి.

బ్రహ్మణస్తేజసా పాదౌ తదఙ్గుల్యోఽర్కతేజసా ।
వసూనాం చ కరాఙ్గుల్యః కౌబేరేణ చ నాసికా ॥15॥

బ్రహ్మదేవుని తేజస్సు వలన ఆమె పాదములు, సూర్యతేజస్సువలన ఆమె పాదముల వ్రేళ్ళు, వసుదేవతల తేజస్సుచేత ఆమెచేతి వ్రేళ్ళు, కుబేరుని తేజస్సువలన ఆమె ముక్కు ఉద్భవించినవి.

తస్యాస్తు దన్తాః సమ్భూతాః ప్రాజాపత్యేన తేజసా ।
నయనత్రితయం జజ్ఞే తథా పావకతేజసా ॥16॥

ప్రజాపతితేజస్సువలన ఆమె దంతములు ఉద్భవించినవి. అగ్నిదేవుని తేజస్సువలన ఆమె మూడు కన్నులు ఉద్భవించినవి.

భ్రువౌ చ సంధ్యయోస్తేజః శ్రవణావనిలస్య చ ।
అన్యేషాం చైవ దేవానాం సంభవస్తేజసాం శివా ॥17॥

రెండు సంధ్యల తేజస్సువలన ఆమె కనుబొమలు, వాయుదేవుని తేజస్సువలన ఆమె రెండు చెవులు ఉద్భవించినవి. ఇంకనూ ఇతర దేవతల తేజస్సులవల్లనూ మంగళమయిాదేవి ఉద్భవించినది.

తతః సమస్తదేవానాం తేజోరాశిసముద్భవామ్ ।
తాం విలోక్య ముదం ప్రాపురమరా మహిషార్దితాః ॥18॥

మహిషాసురునిచే పీడింపబడిన దేవతలు సమస్త దేవదేవతల తేజోరాశివలన ఉద్భవించిన ఆ దేవిని చూచి మిక్కిలి సంతోషమును పొందిరి.

తతో దేవా దదుస్తస్యై స్వాని స్వాన్యాయుధాని చ ।
ఊచుర్జయ జయేత్యుచ్చైర్జయస్తీం తే జయైషిణః ॥19॥

అటు పిమ్మట దేవదేవతలందరు ఆమెకు తమతమ ఆయుధములను ఇచ్చిరి. జయమును కోరు ఆ దేవతలు జయమునిచ్చు ఆ దేవినిగూర్చి బిగ్గరగా జయజయధ్వానములు చేసిరి.

శూలం శూలాద్వినిష్కృష్య దదౌ తస్యై పినాకభృత్ ।
చక్రం చ దత్తవాన్ కృష్ణః సముత్పాట్య స్వచక్రతః ॥20॥

పినాకధారియగు పరమశివుడు తన శూలమునుండి మరొక శూలమును బయటకులాగి ఆమెకు ఇచ్చెను. కృష్ణుడు తన చక్రమునుండి మరొక చక్రమును ఉత్పన్నము చేసి ఆమెకు ఇచ్చెను.

శంఖం చ వరుణః శక్తిం దదౌ తస్యై హుతాశనః ।
మారుతో దత్తవాంశ్చాపం బాణపూర్ణే తథేషుధీ ॥21॥

వరుణుడు ఆమెకు శంఖమునిచ్చెను. అగ్నిదేవుడు శక్తిని ఇచ్చెను. వాయువు వింటిని, బాణములతో నిండిన అమ్ములపొదిని ఇచ్చెను.

వజ్రమిన్ద్రః సముత్పాట్య కులిశాదమరాధిపః ।
దదౌ తస్యై సహస్రాక్షో ఘంటామైరావతాద్గజాత్ ॥22॥

దేవతల అధిపతి అయిన ఇంద్రుడు తన వజ్రాయుధము నుండి మరొక వజ్రాయుధమును పెకిలించి ఆమెకు ఇచ్చెను. ఇంకను సహస్రాక్షుడగు ఆ దేవేంద్రుడు తన వాహనమైన ఐరావతమను ఏనుగునుండి గంటను తీసి ఇచ్చెను.

కాలదణ్డాద్యమో దణ్డం పాశం చాంబుపతిర్దదౌ ।
ప్రజాపతిశ్చాక్షమాలాం దదౌ బ్రహ్మా కమండలుమ్ ॥23॥

యముడు కాలదండమునుండి మరొక దండమును ఉత్పన్నము చేసి ఇచ్చెను. వరుణుడు పాశమును, ప్రజాపతి అక్షమాలను, బ్రహ్మదేవుడు కమండలమును ఇచ్చెను.

సమస్తరోమకూపేషు నిజరశ్మీన్దివాకరః ।
కాలశ్చ దత్తవాన్ ఖడ్గం తస్యై చర్మ చ నిర్మలమ్ ॥24॥

సూర్యుడు తన కిరణములను ఆమెయొక్క శరీరమందలి వెంట్రుకల లోతుభాగములందు ప్రసరింపచేసెను. కాలుడు తన ఖడ్గమును, నిర్మలమైన చర్మము అనగా కవచమును ఇచ్చెను.

క్షీరోదశ్చామలం హారమజరే చ తథామ్బరే ।
చూడామణిం తథా దివ్యం కుండలే కటకాని చ ॥25॥

అర్ధచంద్రం తథా శుభ్రం కేయూరాన్సర్వబాహుషు ।
నూపురౌ విమలౌ తద్వత్ గ్రైవేయకమనుత్తమమ్ ॥
అంగులీయకరత్నాని సమస్తావంగులీషు చ ॥26॥

క్షీరోదకుడగు సముద్రుడు స్వచ్ఛమైన హారమును, నాశములేని రెండు వస్త్రములను, దివ్యమైన చూడామణిని, కుండలములను (చెవి ఆభరణములు), కటకములను (గాజులు) ఇచ్చెను. అంతేకాక స్వచ్ఛమైన అర్ధచంద్రుని,

సమస్తబాహువులందు ధరింపతగినట్టి కేయూరములను (కడియములు), స్వచ్ఛమైన నూపురములను (కాలి అందెలు), అనుపమానమైన కంఠహారమును, అన్ని వ్రేళ్ళయందు ధరింపతగినట్టి రత్నాల అంగుళీయకములను (ఉంగరాలు) పాలసముద్రుడు ఆమెకు ఇచ్చెను.

విశ్వకర్మా దదౌ తస్యై పరశుం చాతినిర్మలమ్ ।
అస్త్రాణ్యనేకరూపాణి తథాఽభేద్యం చ దంశనమ్ ॥27॥

విశ్వకర్మ మిక్కిలి నిర్మలమైన గొడ్డలి ఆయుధమును, వివిధరకములైన అస్త్రములను, ఛేదింపశక్యముగాని కవచమును ఆమెకు ఇచ్చెను.

అమ్లానపఙ్కజాం మాలాం శిరస్యురసి చాపరామ్ ।
అదదాజ్జలనిధిస్తస్యై పఙ్కజం చాతిశోభనమ్ ॥28॥

వాడిపోని పద్మముల మాలను శిరస్సునందు ధరించుటకు సముద్రుడు ఆమెకు ఇచ్చెను. అట్లే వక్షఃస్థలమందు ధరించుటకు కూడా మరొక అటువంటి మాలను ఇచ్చెను. అత్యంతము శోభాయమానమైన ఒక పద్మమును కూడా సముద్రుడు దేవికి ఇచ్చెను.

హిమవాన్వాహనం సింహం రత్నాని వివిధాని చ ।
దదావశూన్యం సురయా పానపాత్రం ధనాధిపః ॥29॥

హిమవంతుడు సింహవాహనమును మరియు అనేకవిధములైన రత్నములను ఆమెకు ఇచ్చెను. కుబేరుడు సురతో నిండిన పాత్రను దేవికి ఇచ్చెను.

శేషశ్చ సర్వనాగేశో మహామణివిభూషితమ్ ।
నాగహారం దదౌ తస్యై ధత్తే యః పృథివీమిమామ్ ॥30॥

ఈ సమస్తభూమండలమును ధరించునట్టి, సమస్త సర్పములకు అధిపతీ అయిన ఆదిశేషుడు గొప్ప మణులచే అలంకరింపబడిన నాగహారమును ఆమెకు ఇచ్చెను.

అన్యైరపి సురైర్దేవీ భూషణైరాయుధైస్తథా ।
సమ్మానితా ననాదోచ్చైః సాట్టహాసం ముహుర్ముహుః ॥31॥

ఇతరదేవతలు కూడా దేవికి వివిధరకములైన భూషణములను ఆయుధములను ఇచ్చిరి. ఈ విధముగా దేవదేవతలచే సమ్మానింపబడిన దేవి అట్టహాసముతో మాటిమాటికి గర్జింపసాగెను.

తస్యా నాదేన ఘోరేణ కృత్స్నమాపూరితం నభః ।
అమాయతాతిమహతా ప్రతిశబ్దో మహానభూత్ ॥32॥

ఆమెయొక్క భయంకరమైన గర్జన ఆకాశమంతయు వ్యాపించెను. మిక్కిలి పెద్దదైనట్టి అంతటా వ్యాపించుచున్న ఆ గర్జనవలన ప్రతిధ్వని కూడా చాలా గొప్పది ఆయెను. (అమా + అయతా = అమాయతా। సహార్థమందు అమా

అను అవ్యయము. అయధాతువుకంటే శతృప్రత్యయము చేస్తే అయత్ అను శబ్దం ఏర్పడుతుంది. అమాయత్ శబ్దం కంటే తృతీయావిభక్తి ఏకవచనరూపం “అమాయతా” అని.)

చుక్షుభుః సకలా లోకాః సముద్రాశ్చ చకమ్పిరే ।
చచాల వసుధా చేలుః సకలాశ్చ మహీధరాః ॥33॥

ఆ దేవియొక్క గర్జనవలన సమస్తలోకములు క్షోభించినవి. సముద్రములు కంపించినవి. భూమి చలించినది. పర్వతములు చలించినవి.

జయేతి దేవాశ్చ ముదా తామూచుః సింహవాహినీమ్ ।
తుష్టువుర్మునయశ్చైనాం భక్తినమ్రాత్మమూర్తయః ॥34॥

దేవదేవతలు అందరు సంతోషముతో సింహవాహినియగు దేవితో “జయమగుగాక” అని పలికిరి. మునులు భక్తితో వంగినవారై దేవిని స్తుతించిరి.

దృష్ట్వా సమస్తం సంక్షుబ్ధం త్రైలోక్యమమరారయః ।
సన్నద్ధాఖిలసైన్యాస్తే సముత్తస్థురుదాయుధాః ॥35॥

ముల్లోకములన్నియు ఈవిధముగా క్షోభించుటను చూచి దేవతాశత్రువులైన రాక్షసులు సమస్తసేనలను సన్నద్ధము చేసుకొన్నవారై ఆయుధములను పైకెత్తి పట్టుకొని పైకి లేచిరి.

ఆః కిమేతదితి క్రోధాదాభాష్య మహిషాసురః ।
అభ్యధావత తం శబ్దమశేషైరసురైర్వృతః ॥36॥

ఆహా ! ఏమిది? అని కోపముతో మహిషాసురుడు పలికి, రాక్షసులందరితోనూ కూడుకొన్నవాడై ఆ గర్జింపుశబ్దము ఎచ్చటనుంచి వచ్చినదో అటువైపు పరుగెత్తెను.

స దదర్శ తతో దేవీం వ్యాప్తలోకత్రయాం త్విషా ।
పాదాక్రాన్త్యానతభువం కిరీటోల్లిఖితాంబరామ్ ॥37॥

క్షోభితాశేషపాతాలాం ధనుర్జ్యానిఃస్వనేన తామ్ ।
దిశో భుజసహస్రేణ సమన్తాద్వ్యాప్య సంస్థితామ్ ॥38॥

తన కాంతితో ముల్లోకములను వ్యాపించినదియు, తన పాదములతో భూమిని అదుముచున్నదియు, కిరీటముతో ఆకాశమును తాకుచున్నట్టిదియు, తన వింటినారి ధ్వనితో పాతాళలోకమునంతయు క్షోభింపచేయుచున్నదియు, తన వేయి భుజములతో సమస్త దిక్కులను వ్యాపించినదియూ అగు శ్రీదేవిని ఆ మహిషాసురుడు చూచెను.

తతః ప్రవవృతే యుద్ధం తయా దేవ్యా సురద్విషామ్ ।
శస్త్రాస్త్రైర్బహుధా ముక్తైరాదీపితదిగన్తరమ్ ॥39॥

అంతట రాక్షసులకు ఆ దేవితో యుద్ధము ప్రారంభమయ్యెను. యుద్ధమందు వారు విడిచిపెట్టిన శస్త్రములతోను, అస్త్రములతోనూ దిగ్భాగములన్నియు ప్రకాశవంతములైనవి.

మహిషాసురసేనానీశ్చిక్షురాఖ్యో మహాసురః ।
యుయుధే చామరశ్చాన్యైశ్చతురఙ్గబలాన్వితః ॥40॥

మహిషాసురసేనానియగు గొప్ప రాక్షసుడు చిక్షురుడనువాడు దేవితో యుద్ధము చేసెను. అట్లే చతురంగబలముతో కూడుకొన్న చామరుడను రాక్షసుడు కూడా దేవితో యుద్ధము చేసెను.

రథానామయుతైః షడ్భిరుదగ్రాఖ్యో మహాసురః ।
అయుధ్యతాయుతానాం చ సహస్రేణ మహాహనుః ॥41॥

అరువదివేల రథములతో ఉదగ్రుడను గొప్ప రాక్షసుడు, మహాహనుమనామధేయము కలిగిన మరొక రాక్షసుడు ఒక కోటి రథములతో దేవితో యుద్ధము చేసెను.

పఞ్చాశద్భిశ్చ నియుతైరసిలోమా మహాసురః ।
అయుతానాం శతైః షడ్భిర్బాష్కలో యుయుధే రణే ॥42॥

గొప్ప రాక్షసుడైన అసిలోముడు అయిదు కోట్ల రథములను సైన్యమును తీసుకొని వచ్చి దేవితో యుద్ధము చేసెను. బాష్కలుడను రాక్షసుడు అరవైలక్షల రథములతో వచ్చి దేవితో యుద్ధము చేసెను.

గజవాజిసహస్రౌఘైరనేకైరుగ్రదర్శనః ।
వృతో రథానాం కోట్యా చ యుద్ధే తస్మిన్నయుధ్యత ॥43॥

ఉగ్రదర్శనుడను రాక్షసుడు అనేకవేల ఏనుగులతోను, గుర్రములతోనూ, కోటి రథములతోనూ వచ్చి ఆ యుద్ధమందు దేవితో యుద్ధము చేసెను.

బిడాలాఖ్యో మహాదైత్యః పఞ్చాశద్భిరథాయుతైః ।
యుయుధే సంయుగే తత్ర రథానాం పరివారితః ॥44॥

బిడాలుడను గొప్ప రాక్షసుడు ఐదులక్షల రథములతోనూ సైన్యముతోనూ కూడుకొన్నవాడై ఆ యుద్ధమందు దేవితో యుద్ధము చేసెను.

వృతః కాలో రథానాం చ రణే పఞ్చాశతాయుతైః ।
యుయుధే సంయుగే తత్ర తావద్భిః పరివారితః ॥45॥

కాలుడను రాక్షసుడు ఆ యుద్ధమందు అయిదు లక్షల రథములతో అంతేసంఖ్య కలిగిన సైన్యముతోనూ కూడుకొన్నవాడై దేవితో యుద్ధము చేసెను.

అన్యే చ తత్రాయుతశో రథనాగహయైర్వృతాః ।
యుయుధే సంయుగే దేవ్యా సహ తత్ర మహాసురాః ॥46॥

ఇంకనూ అనేకమంది మిగిలిన గొప్ప రాక్షసులు వేలకొలదీ రథములు, ఏనుగులు, గుర్రములతో కూడుకొన్నవారై ఆ యుద్ధమందు దేవితోకూడా యుద్ధము చేసిరి.

కోటికోటిసహస్రైస్తు రథానాం దన్తినాం తథా ।
హయానాం చ వృతో యుద్ధే తత్రాభూన్మహిషాసురః ॥47॥

వేలకోట్లకొలదీ రథములను, ఏనుగులను, గుర్రములను వెంటబెట్టుకొని మహిషాసురుడు ఆ రణరంగమునకు వచ్చెను.

తోమరైర్భిన్దిపాలైశ్చ శక్తిభిర్ముసలైస్తథా ।
యుయుధుః సంయుగే దేవ్యా ఖడ్గైః పరశుపట్టిశైః ॥48॥

ఆ రాక్షసులు ఆయుధవిశేషములైన తోమరములు, భిన్దిపాలములు, శక్తి, ముసలములు, ఖడ్గములు, పరశు, పట్టిశములతో దేవితో యుద్ధము చేసిరి.

కేచిచ్చ చిక్షిపుః శక్తీః కేచిత్పాశాంస్తథాఽపరే ।
దేవీం ఖడ్గప్రహారైస్తు తే తాం హన్తుం ప్రచక్రముః ॥49॥

కొంతమంది శక్తి ఆయుధములను విసిరి, కొందరు పాశములను ఆయుధములను ప్రయోగించిరి. వారందరు ఖడ్గముల దెబ్బలతో దేవిని చంపుటకు ఉపక్రమించిరి.

సాఽపి దేవీ తతస్తాని శస్త్రాణ్యస్త్రాణి చణ్డికా ।
లీలయైవ ప్రచిచ్ఛేద నిజశస్త్రాస్త్రవర్షిణీ ॥50॥

అంతట ఆ చండికాదేవి తనయొక్క శస్త్రములను అస్త్రములను రాక్షసులపై వర్షింపచేయుచూ, రాక్షసులు ప్రయోగించిన ఆ శస్త్రాస్త్రములనన్నింటినీ ముక్కలు ముక్కలు చేసివేసెను. (ఖడ్గాది ఆయుధములను విడిచిపెట్టినచో అస్త్రములని, విడిచిపెట్టనిచో శస్త్రములనీ వాటికి వ్యవహారము, వాచస్పత్యం.)

అనాయస్తాననా దేవీ స్తూయమానా సురర్షిభిః ।
ముమోచాసురదేహేషు శస్త్రాణ్యస్త్రాణి చేశ్వరీ ॥51॥

ఆయాసరహితమైన ముఖము కలిగిన దేవి దేవతలచేతను, రాక్షసులచేతనూ స్తుతింపబడుచున్నదై, ఆ పరమేశ్వరి రాక్షసులశరీరములపై శస్త్రములను, అస్త్రములను విడిచిపెట్టెను.

సోఽపి క్రుద్ధో ధుతసటో దేవ్యా వాహనకేసరీ ।
చచారాసురసైన్యేషు వనేష్వివ హుతాశనః ॥52॥

దేవియొక్క వాహనమైన సింహము కూడా జూలు విదిల్చి కోపముతో కూడుకొన్నదై, అడవులలో అగ్ని సంచరించినట్లుగా రాక్షససైన్యములమీద సంచరించెను.

నిశ్వాసాన్ముముచే యాంశ్చ యుధ్యమానా రణేఽమ్బికా ।
త ఏవ సద్యః సంభూతా గణాః శతసహస్రశః ॥53॥

రాక్షసులతో యుద్ధము చేయుచున్న అంబికాదేవి రణరంగమందు విడిచిపెట్టిన వందల కొలదీ, వేలకొలదీ నిశ్వాసములు సైన్యగణములుగా ఉద్భవించినవి.

యుయుధుస్తే పరశుభిర్భిన్దిపాలాసిపట్టిశైః ।
నాశయన్తోఽసురగణాన్దేవీశక్త్యుపబృంహితాః ॥54॥

దేవీప్రభావముచే ఉద్భవించిన ఆ సైన్యగణాలు ఆయుధవిశేషములైన పరశు, భిన్దిపాల, అసి, పట్టిశములతో రాక్షససేవలను నాశనము చేయుచూ యుద్ధము చేసిరి.

అవాదయన్త పటహాన్గణాః శంఖాంస్తథాపరే ।
మృదంగాంశ్చ తథైవాన్యే తస్మిన్యుద్ధమహోత్సవే ॥55॥

దేవివలన ఉద్భవించిన ఆ సేనలలో కొందరు పటహములను, కొందరు శంఖములను, కొందరు మృదంగములను ఆ యుద్ధమహోత్సవమందు వాయించిరి.

తతో దేవీ త్రిశూలేన గదయా శరవృష్టిభిః ।
ఖడ్గాదిభిశ్చ శతశో నిజఘాన మహాసురాన్ ॥56॥

పిమ్మట దేవి త్రిశూలముతోనూ, గదాయుధముతోనూ, బాణపువర్షములతోనూ, ఖడ్గాదులతోనూ వందలకొలదీ గొప్ప గొప్ప రాక్షసులను చంపివేసెను.

పాతయామాస చైవాన్యాన్ ఘంటాస్వనవిమోహితాన్ ।
అసురాన్భువి పాశేన బద్ధ్వా చాన్యానకర్షయత్ ॥57॥

ఆ దేవి తనయొక్క ఘంటానాదముచే మోహము చెందిన కొందమంది రాక్షసులను క్రిందికి పడద్రోసి చంపివేసెను. అట్లే కొంతమంది రాక్షసులను త్రాడుతో బంధించి భూమిమీదికి ఈడ్చివేసెను.

కేచిద్ద్విధాకృతాస్తీక్ష్ణైః ఖడ్గపాతైస్తథాఽపరే ।
విపోథితా నిపాతేన గదయా భువి శేరతే ॥58॥

కొంతమంది రాక్షసులు తీక్ష్ణములైన ఖడ్గముల దెబ్బలతో రెండుగా చీల్చబడిరి. కొంతమంది రాక్షసులు గదాయుధపు దెబ్బలవలన నరికివేయబడి భూమిపై నిద్రించుచున్నారు.

వేముశ్చ కేచిద్రుధిరం ముసలేన భృశం హతాః ।
కేచిన్నిపతితా భూమౌ భిన్నాః శూలేన వక్షసి ॥59॥

కొంతమంది రాక్షసులు ముసలమను ఆయుధముచే మిక్కిలి ఎక్కువగా చంపబడి రక్తమును గ్రక్కుకొనిరి. ఆ దేవియొక్క శూలముతో కొంతమంది రాక్షసులు తమ వక్షఃస్థలములందు చీల్చబడిరి.

నిరన్తరశరౌఘేణ కృత్తాః కేచిద్రణాజిరే ।
శైలానుకారిణః ప్రాణాన్ముముచుస్త్రిదశార్దనాః ॥60॥

ఎడతెరిపిలేని బాణసమూహములను దేవి ప్రయోగించుటచే పర్వతములవలే ఉన్న ఆ దేవతాశత్రువులైన రాక్షసులు కొందరు ఆ యుద్ధప్రదేశమందు ఛేదింపబడి చంపబడిరి.

కేషాంచిద్బాహవశ్ఛిన్నాశ్ఛిన్నగ్రీవాస్తథాఽపరే ।
శిరాంసి పేతురన్యేషామన్యే మధ్యే విదారితాః ॥61॥

కొంతమంది రాక్షసుల భుజములు, మెడలు ఛేదింపబడినవి. కొందమంది రాక్షసుల తలలు క్రింద పడినవి. కొంతమంది శరీరములు మధ్యగా చీల్చబడినవి.

విచ్ఛిన్నజంఘాస్త్వపరే పేతురుర్వ్యాం మహాసురాః ।
ఏకబాహ్వక్షిచరణాః కేచిద్దేవ్యా ద్విధా కృతాః ॥62॥

కొందరి గొప్పరాక్షసుల పిక్కలు విచ్ఛిన్నములై వారు నేలపై పడిరి. కొంతమంది రాక్షసులు రెండుగా చీల్చబడి, ఒక్కొక్క భాగము ఒక్కొక్క భుజము, కన్ను, పాదములు కలిగినవి అయ్యెను.

ఛిన్నేఽపి చాన్యే శిరసి పతితాః పునరుత్థితాః ।
కబన్ధా యుయుధుర్దేవ్యా గృహీతపరమాయుధాః ॥63॥

కొంతమంది రాక్షసుల తలలు ఛేదింపబడిననూ, వారు తిరిగి పైకి లేచి, గొప్ప ఆయుధములను చేతబూని దేవితో యుద్ధము చేసిరి.

ననృతుశ్చాపరే తత్ర యుద్ధే తూర్యలయాశ్రితాః ।
కబన్ధాశ్ఛిన్నశిరసః ఖడ్గశక్త్యృష్టిపాణయః ॥64॥

కొంతమంది రాక్షసులు తలలు పోగొట్టుకొని, ఆయుధవిశేషములైన ఖడ్గము, శక్తి, ఉష్టి వీటిని చేతియందు ధరించి, ఆయా వాద్యముల లయను అనుసరించి ఆ యుద్ధమందు నాట్యము చేసిరి. (వికృత చేష్టలు)

తిష్ఠ తిష్ఠేతి భాషన్తో దేవీమన్యే మహాసురాః ।
రుధిరౌఘవిలుప్తాఙ్గాః సంగ్రామే లోమహర్షణే ॥65॥

కొంతమంది గొప్ప రాక్షసులు రోమాంచమును కలిగించు ఆ సంగ్రామమందు రక్తప్రవాహముతో లోపించిన అవయవములు కలిగినవారై దేవిని గూర్చి "నిలువుము, నిలువుము" అని పలుకసాగిరి.

పాతితై రథనాగాశ్వైరసురైశ్చ వసున్ధరా ।
అగమ్యా సాఽభవత్తత్ర యత్రాభూత్స మహారణః ॥66॥

రోమాంచకమైన ఆ మహాసంగ్రామము ఏ ప్రదేశమందు జరిగెనో, ఆ ప్రదేశము పడగొట్టబడిన రథములు, ఏనుగులు, గుర్రములు, రాక్షసులతో నిండిపోయినది. ఆ భూప్రాంతమునకు వెళ్ళుటకు ఎవరుకునూ వీలు కాకున్నది.

**శోణితౌఘా మహానద్యః సద్యస్తత్ర విసుస్రువుః ।
మధ్యే చాసురసైన్యస్య వారణాసురవాజినామ్ ॥67॥**

ఆ యుద్ధమందు వెనువెంటనే రాక్షససైన్యము మధ్యలోనూ, ఏనుగులు రాక్షసులు గుఱ్ఱముల మధ్యలోనూ రక్తప్రవాహములు కలిగిన గొప్పనదులు ప్రవహించినవి.

**క్షణేన తన్మహాసైన్యమసురాణాం తథాఽమ్బికా ।
నిన్యే క్షయం యథా వహ్నిస్తృణదారుమహాచయమ్ ॥68॥**

అంబికాదేవి రాక్షసుల ఆ గొప్ప సైన్యమును క్షణకాలమందు, నిప్పు గడ్డి కాష్ఠముల సమూహమును క్షణకాలమందు భస్మము చేసినట్లుగా, నాశము చేసెను.

**స చ సింహో మహానాదముత్సృజన్ ధుతకేసరః ।
శరీరేభ్యోఽమరారీణామసూనివ విచిన్వతి ॥69॥**

**దేవ్యా గణైశ్చ తైస్తత్ర కృతం యుద్ధం మహాసురైః ।
యథైనాం తుష్టువుర్దేవాః పుష్పవృష్టిముచో దివి ॥70॥**

జూలు విదిల్చిన ఆ సింహము కూడా బిగ్గరగా గర్జించుచూ దేవతాశత్రువులైన రాక్షసుల శరీరముల నుండి ప్రాణములను హరించుచుండగా, దేవీగణములకు గొప్ప రాక్షసులకు నడుమ గొప్ప యుద్ధము సంభవించెను. స్వర్గమందలి దేవతలు పుష్పవృష్టిని కురిపించుచూ దేవిని స్తుతించిరి.

(విచిన్వతి : చిఞ్ చయనే అను ధాతువుయొక్క శతృప్రత్యయాంతరూపమైన విచిన్వత్ శబ్దముపై సప్తమీవిభక్తి ఏకవచనరూపము "విచిన్వతి" అని. "సింహే" అను సప్తమ్యన్తపదమును అధ్యాహారము చేయవలెను.)

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే సావర్ణికే మన్వంతరే దేవీమాహాత్మ్యే ఏకోనాశీతితమోఽధ్యాయః ॥79॥

శ్రీ మార్కండేయ మహాపురాణమందలి సావర్ణికమన్వంతరమందలి దేవీమాహాత్మ్యమందు డెబ్బదితొమ్మిదవ అధ్యాయం సమాప్తం.



అశీతితమోఽధ్యాయః - ఎనభైయవ అధ్యాయం
మహిషాసురవధః - మహిషాసురవధ

ఋషిరువాచ - ఋషి చెప్పాడు.

> **నిహన్యమానం తత్సైన్యమవలోక్య మహాసురః ।**
> **సేనానీశ్చిక్షురః కోపాద్యయౌ యోద్ధుమథామ్బికామ్ ॥1॥**

తమ సమస్తసేనలు చంపబడుటను చూచి గొప్పరాక్షసుడు, సేనానీయగు చిక్షురుడు కోపముతో యుద్ధము చేయుటకై అంబికాదేవి సమీపమునకు వచ్చెను.

> **స దేవీం శరవర్షేణ వవర్ష సమరేఽసురః ।**
> **యథా మేరుగిరేః శృంగం తోయవర్షేణ తోయదః ॥2॥**

మేఘము మేరుపర్వతశిఖరమందు ఎట్లు జలవర్షమును వర్షించునో అట్లే ఆ చిక్షురాసుడు యుద్ధమందు అంబికాదేవిపై బాణవర్షమును కురిపించెను.

> **తస్య ఛిత్త్వా తతో దేవీ లీలయైవ శరోత్కరాన్ ।**
> **జఘాన తురగాన్బాణైర్యన్తారం చైవ వాజినామ్ ॥3॥**

అంతట అంబికాదేవి లీలామాత్రముతో (అనాయాసముగా) ఆ చిక్షురుడు ప్రయోగించిన బాణసమూహములను ముక్కలు ముక్కలుగా చేసి, తన బాణములతో అశ్వములను, అశ్వసారథిని చంపివేసెను.

> **చిచ్ఛేద చ ధనుః సద్యో ధ్వజం చాతిసముచ్ఛ్రితమ్ ।**
> **వివ్యాధ చైనం గాత్రేషు ఛిన్నధన్వానమాశుగైః ॥4॥**

ఇంకను ఆ దేవి చిక్షురాసురుని ధనుస్సును, మిక్కిలి ఎత్తైన జెండాను ఛిన్నము చేసెను. విరిగిన ధనుస్సు కలిగిన చిక్షురుని అవయవములను గాయపరచెను.

> **స ఛిన్నధన్వా విరథో హతాశ్వో హతసారథిః ।**
> **అభ్యధావత తాం దేవీం ఖడ్గచర్మధరోఽసురః ॥5॥**

ధనుస్సు, రథము, అశ్వములు, రథసారథి వీటినన్నింటినీ పోగొట్టుకొన్న చిక్షురాసురుడు కత్తి, డాలు పట్టుకొని ఆ దేవివైపు పరుగెత్తెను.

> **సింహమాహత్య ఖడ్గేన తీక్ష్ణధారేణ మూర్ధని ।**
> **ఆజఘాన భుజే సవ్యే దేవీమప్యతివేగవాన్ ॥6॥**

పదునైన కత్తితో చిక్షురాసురుడు సింహముయొక్క శిరస్సుపై కొట్టి, మిక్కిలి వేగముతో దేవియొక్క ఎడమభుజముపై కొట్టెను.

> **తస్యాః ఖడ్గో భుజం ప్రాప్య పఫాల నృపనన్దన ।**
> **తతో జగ్రాహ శూలం స కోపాదరుణలోచనః ॥7॥**

ఓ రాజా ! చిక్షురాసురుడు ప్రయోగించిన బాణము దేవియొక్క భుజమును తాకి తునాతునకలయ్యెను. అంతట కోపముతో ఎరుపెక్కిన కన్నులు గల ఆ చిక్షురుడు శూలమును గ్రహించెను.

చిక్షేప చ తతస్తత్తు భద్రకాల్యాం మహాసురః ।
జాజ్వల్యమానం తేజోభీ రవిబింబమివాంబరాత్ ॥8॥

పిమ్మట గొప్ప రాక్షసుడైన ఆ చిక్షురుడు, ఆకాశమందు తేజస్సులతో ప్రజ్వలించుచున్న సూర్యబింబమువలే ఉన్న ఆ శూలమును భద్రకాళిపై విసిరెను.

దృష్ట్వా తదా పతచ్ఛూలం దేవీ శూలమముంచత ।
తేనే తచ్ఛతధా నీతం శూలం స చ మహాసురః ॥9॥

తనపై శూలము పడుటను చూచి దేవి తన శూలమును విడిచెను. అంతట చిక్షురుడు ప్రయోగించిన శూలము, ఆ చిక్షురుడూ నూరు ముక్కలైరి.

హతే తస్మిన్మహావీర్యే మహిషస్య చమూపతౌ ।
ఆజగామ గజారూఢశ్చామరస్త్రిదశార్దనః ॥10॥

మహిషాసురుని సేనాపతి, మహాబలవంతుడూ అగు ఆ మహిషాసురుడు మరణించగా, దేవతాశత్రువైన చామరుడను రాక్షసుడు ఏనుగుపైనెక్కి ఆ యుద్ధభూమికి వచ్చెను.

సోఽపి శక్తిం ముమోచాథ దేవ్యాస్తామంబికా ద్రుతమ్ ।
హుంకారాభిహతాం భూమౌ పాతయామాస నిష్ప్రభామ్ ॥11॥

ఆ చామరుడు కూడా దేవిపైకి శక్తియను ఆయుధమును వదిలెను. వెంటనే అంబికాదేవి తన హుంకారముచే వెనుకకు తిరిగి కొట్టబడినదీ, ప్రభాహీనమైనదీ అయిన ఆ శక్తిని భూమిపై పడవేసెను.

భగ్నాం శక్తిం నిపతితాం దృష్ట్వా క్రోధసమన్వితః ।
చిక్షేప చామరః శూలం బాణైస్తదపి సాఽచ్ఛినత్ ॥12॥

తాను ప్రయోగించిన శక్తియను ఆయుధము విరిగి నేలపై పడుటను చూచి చామరుడు క్రోధముతో కూడుకొన్నవాడై శూలమును దేవిపై వదిలెను. ఆ శూలమును కూడా దేవి విచ్ఛిన్నము చేసెను.

తతః సింహః సముత్పత్య గజకుంభాన్తరే స్థితః ।
బాహుయుద్ధేన యుయుధే తేనోచ్చైస్త్రిదశారిణా ॥13॥

అంతట దేవియొక్క వాహనమగు సింహము ఎగిరి, చామరుడు అధిష్ఠించిన ఏనుగు కుంభమధ్యభాగమందు నిలిచినదై, దేవతాశత్రువైన ఆ చామరునితో బాహుయుద్ధము చేసెను.

యుధ్యమానౌ తతస్తౌ తు తస్మాన్నాగాన్మహీం గతౌ ।
యుయుధాతేఽతిసంరబ్ధౌ ప్రహారైరతిదారుణైః ॥14॥

పరస్పరము యుద్ధము చేయుచున్న ఆ ఇరువురు అనగా సింహము, చామరుడూ ఏనుగుమీదనుంచి భూమిపైకి వచ్చి మిక్కిలి సంరంభముతో అత్యంతము దారుణములైన దెబ్బలతో యుద్ధము చేయసాగిరి.

తతో వేగాత్ఖముత్పత్య నిపత్య చ మృగారిణా ।
కరప్రహారేణ శిరశ్చామరస్య పృథక్కృతమ్ ॥15॥

పిమ్మట మృగములకు శత్రువయిన సింహము వేగముగా ఆకాశమును గూర్చి ఎగిరి, క్రిందకు దూకి తన చేతి దెబ్బలతో ఆ చామరాసురుని తలను వేరు చేసెను, అనగా చంపివేసెను.

ఉదగ్రశ్చ రణే దేవ్యా శిలావృక్షాదిభిర్హతః ।
దన్తముష్టితలైశ్చైవ కరాలశ్చ నిపాతితః ॥16॥

ఉదగ్రుడను రాక్షసుడు కూడా బండరాళ్ళు, చెట్లు మొ॥ వాటితో ఆ యుద్ధమందు దేవిచేత చంపబడినాడు. కరాలుడను రాక్షసునికూడా దేవి తన దంతములతోనూ, ముష్టిఘాతములతోను (పిడిగుద్దులు) చంపివేసెను.

దేవీ క్రుద్ధా గదాపాతైశ్చూర్ణయామాస చోద్ధతమ్ ।
బాష్కలం భిన్దిపాలేన బాణైస్తామ్రం తథాన్ధకమ్ ॥17॥

అంబికాదేవి కోపగించినదై గదాయుధపు దెబ్బలతో ఉద్ధతుడను రాక్షసుని పిండి పిండి చేసెను. అట్లే భిన్దిపాలమను ఆయుధముతో బాష్కలుని, బాణములతో తామ్రుని, అన్ధకుని చంపివేసెను.

ఉగ్రాస్యముగ్రవీర్యం చ తథైవ చ మహాహనుమ్ ।
త్రినేత్రా చ త్రిశూలేన జఘాన పరమేశ్వరీ ॥18॥

ఉగ్రాస్యుడు, ఉగ్రవీర్యుడు, మహాహనువు ఈ ముగ్గురు రాక్షసులను త్రినేత్రయగు పరమేశ్వరీదేవి త్రిశూలముతో చంపివేసెను.

దుర్ధరం దుర్ముఖం చోభౌ శరైర్నిన్యే యమక్షయమ్ ।
కాలం చ కాలదణ్డేన కాలరాత్రిరపాతయత్ ॥19॥

కాళరాత్రియగు ఆ దేవి దుర్ధరుడు, దుర్ముఖుడు అను ఇరువురు రాక్షసులను బాణములతో యమలోకమునకు సాగనంపెను. అట్లే కాలుడను రాక్షసుని కాలదండముతో చంపివేసెను.

ఉగ్రదర్శనమత్యుగ్రైః ఖడ్గపాతైరతాడయత్ ।
అసినైవాసిలోమానమచ్ఛిదత్సా రణోత్సవే
గణైః సింహేన దేవ్యా చ జయక్ష్వేడా కృతోత్సవైః ॥20॥

మిక్కిలి భయంకరమైన ఖడ్గప్రహారములతో ఉగ్రదర్శుని కొట్టి చంపెను. ఆ రణోత్సవమందు దేవి అసిలోముడను రాక్షసుని కత్తితో నరికి చంపెను. దేవీసైన్యగణములు, సింహము మరియు అంబికాదేవి రణోత్సవముతోబాటు జయజయధ్వానములు చేసిరి.

ఏవం సంక్షీయమాణే తు స్వసైన్యే మహిషాసురః ।
మాహిషేణ స్వరూపేణ త్రాసయామాస తాన్గణాన్ ॥21॥

ఈ విధముగా తన సైన్యము క్షీణించుచుండుటను చూచి మహిషాసురుడు తన మాహిషరూపముతో (గేదె) ఆ దేవీసేనాగణములను భయపెట్టెను.

కాంశ్చిత్తుణ్డప్రహారేణ ఖురక్షేపైస్తథాపరాన్ ।
లాంగూలతాడితాంశ్చాన్యాన్ శృంగాభ్యాం చ విదారితాన్ ॥22॥

వేగేన కాంశ్చిదపరాన్నాదేన భ్రమణేన చ ।
నిశ్వాసపవనేనాన్యాన్ పాతయామాస భూతలే ॥23॥

ఆ మహిషము తన ముట్టె దెబ్బలతో కొందరిని, గిట్టల దెబ్బలతో కొందరిని, తోకపు దెబ్బలతో కొందరిని, కొమ్ములతో చీల్చివేయబడిన కొందరిని, వేగముతో కొందరిని, శబ్దధ్వనులు అటునిటూ తిరుగుటల వలన కొందరిని, తన నిశ్వాసములతో (ముక్కునుండి గాలి బయటకు వదులుట) మరి కొందరిని భూమిపైకి పడవేసెను.

నిపాత్య ప్రమథానీకమభ్యధావత సోఽసురః ।
సింహం హన్తుం మహాదేవ్యాః కోపం చక్రే తతోఽమ్బికా ॥24॥

ఆ మహిషాసురుడు తన మహిషరూపముతో ఆ దేవీసైన్యగణములను భూమిపైకి పడద్రోసి, ఆ మహాదేవియొక్క వాహనమైన సింహమును చంపుటకు పరుగెత్తెను. అంతట అంబికాదేవి మిక్కిలి కోపగించెను.

సోఽపి కోపాన్మహావీర్యః ఖురక్షుణ్ణమహీతలః ।
శృంగాభ్యాం పర్వతానుచ్చైశ్చిక్షేప చ ననాద చ ॥25॥

గొప్ప బలవంతుడైన ఆ మహిషాసురుడు కూడా తన గిట్టలతో భూమిని గీరుచూ కోపము వహించి తన కొమ్ములతో పర్వతములను పైకెత్తి ఆ దేవి పైకి మరియు దేవీసేనాగణములపైకి విసిరెను, గర్జించెను.

వేగభ్రమణవిక్షుణ్ణా మహీ తస్య వ్యశీర్యత ।
లాంగూలేనాహతశ్చాబ్ధిః ప్లావయామాస సర్వతః ॥26॥

వేగముగా ఆ మహిషాసురుడు అటునిటూ తిరుగుటచే భూమి చూర్ణమయ్యెను. తోకచే కొట్టబడిన సముద్రము అంతటా ప్రవహించెను.

ధుతశృంగవిభిన్నాశ్చ ఖణ్డం ఖణ్డం యయుర్ఘనాః ।
శ్వాసానిలాస్తాః శతశో నిపేతుర్నభసోఽచలాః ॥27॥

ఇటునటూ కంపించుచున్న కొమ్ములచే మేఘములు చెల్లాచెదరై ముక్కలు ముక్కలు అయ్యెను. ఆ మహిషాసురుని శ్వాసవాయువులచే వందలకొలదీ పర్వతములు ఆకాశమునుండి విరిగి క్రిందపడెను.

ఇతి క్రోధసమాధ్మాతమాపతన్తం మహాసురమ్ ।
దృష్ట్వా సా చణ్డికా కోపం తద్వధాయ తదాకరోత్ ॥28॥

ఈ విధముగా మిక్కిలి కోపముతో నిండి సమీపమునకు వచ్చుచున్న ఆ మహారాక్షసుని చూచి ఆ చండికాదేవి అతడిని చంపుటకు కోపముతో నిశ్చయించెను.

సా క్షిప్త్వా తస్య వై పాశం తం బబన్ధ మహాసురమ్ ।
తత్యాజ మాహిషం రూపం సోఽపి బద్ధో మహామృధే ॥29॥

ఆ దేవి ఆ మహిషాసురునివైపు పాశమును (త్రాడురూపములో నున్న అస్త్రము) విసిరి అతడిని బంధించెను. అంతట బంధింపబడిన ఆ రాక్షసుడు ఆ గొప్పయుద్ధమందు మహిషరూపమును వదిలిపెట్టెను.

తతః సింహోఽభవత్సద్యో యావత్తస్యామ్బికా శిరః ।
ఛినత్తి తావత్పురుషః ఖడ్గపాణిరదృశ్యత ॥30॥

ఆ వెనువెటనే ఆ రాక్షసుడు సింహముగా మారెను. సింహరూపములో ఉన్న ఆ రాక్షసుని శిరస్సును అంబికాదేవి ఛేదించునంతలో ఆ రాక్షసుడు చేతియందు ఖడ్గమును ధరించి పురుషాకారమును ధరించెను.

తత ఏవాశు పురుషం దేవీ చిచ్ఛేద సాయకైః ।
తం ఖడ్గచర్మణా సార్ధం తతః సోఽభూన్మహాగజః ॥31॥

వెంటనే అంబికాదేవి ఆ రాక్షసుని అతడి ఖడ్గము, శరీరకవచములతో సహా బాణములతో ఛేదించెను (ముక్కలు చేసెను). అంతట ఆ రాక్షసుడు గొప్ప ఏనుగు రూపమును ధరించెను.

కరేణ చ మహాసింహం తం చకర్ష జగర్జ చ ।
కర్షతస్తు కరం దేవీ ఖడ్గేన నిరకృన్తత ॥32॥

గజాకారములో ఉన్న ఆ మహిషాసురుడు తొండముతో దేవియొక్క వాహనమైన గొప్ప సింహమును లాగెను, గర్జించెను. అట్లు లాగుచున్న ఆ రాక్షసుని తొండమును దేవి తన ఖడ్గముతో నరికివేసెను.

తతో మహాసురో భూయో మహిషం వపురాశ్రితః ।
తథైవ క్షోభయామాస త్రైలోక్యం సచరాచరమ్ ॥33॥

అంతట ఆ గొప్ప రాక్షసుడు తిరిగి మాహిషరూపమును ధరించి పూర్వమువలే చరాచరజగత్తుతో కూడుకొన్న ముల్లోకములను క్షోభింపచేసెను.

తతః క్రుద్ధా జగన్మాతా చణ్డికా పానముత్తమమ్ ।
పపౌ పునః పునశ్చైవ జహాసారుణలోచనా ॥34॥

అంతట కోపగించిన జగన్మాతయగు చండికాదేవి శ్రేష్ఠమైన మధువును మాటిమాటికి పానముచేసి ఎఱ్ఱబడిన కన్నులు కలదై నవ్వెను.

ననర్ద చాసురః సోఽపి బలవీర్యమదోద్ధతః ।
విషాణాభ్యాం చ చిక్షేప చణ్డికాం ప్రతి భూధరాన్ ॥35॥

ఆ రాక్షసుడు కూడా బలపరాక్రమములతోనూ, మదముతోనూ గర్వితుడై తన కొమ్ములతో చండికాదేవివైపు పర్వతములను విసిరికొట్టెను.

సా చ తాన్ ప్రహితాంస్తేన చూర్ణయన్తీ శరోత్కరైః ।
ఉవాచ తం మదోద్ధూతముఖరాగాకులాక్షరమ్ ॥36॥

చండికాదేవి తన బాణములతో ఆ రాక్షసుడు తనపై విసురుచున్న పర్వతములను నుగ్గునుగ్గు చేయుచూ, మధుపానము చేయుటవలన ఎఱ్రబడిన ముఖముకలదై అస్పష్టమైన వర్ణోచ్చారణ కలదై ఇట్లు పలికెను.

దేవ్యువాచ – దేవి పలికెను.

గర్జ గర్జ క్షణం మూఢ మధు యావత్పిబామ్యహమ్ ।
మయా త్వయి హతేఽత్రైవ గర్జిష్యన్త్యాశు దేవతాః ॥37॥

ఓరీ మూర్ఖుడా ! నేను ఎంతవరకు మధువును త్రాగెదనో అంతవరకు క్షణకాలము గర్జించుము. (నీవు గర్జించే సమయము ఇంత మాత్రమే అని ఆశయము.) నేను నిన్ను వధించిన పిమ్మట దేవతలందరూ ఇచ్చటే గర్జించగలరు.

ఋషిరువాచ – ఋషి చెప్పాడు.

ఏవముక్త్వా సముత్పత్య సారూఢా తం మహాసురమ్ ।
పాదేనాక్రమ్య కంఠే చ శూలేనైనమతాడయత్ ॥38॥

ఈ విధముగా పలికి ఆ చండికాదేవి ఎగిరి ఆ మహారాక్షసునిపైకి ఎక్కి కూర్చొనెను. తన పాదములతో త్రొక్కి, అతని కంఠమును శూలముతో పొడిచెను.

తతః సోఽపి పదాక్రాన్తస్తయా నిజముఖాత్తతః ।
అర్ధనిష్క్రాన్త ఏవాసీద్దేవ్యా వీర్యేణ సంవృతః ॥39॥

అంతట ఆ రాక్షసుడు దేవి పాదములచే ఆక్రమింపబడినవాడై, దేవియొక్క పరాక్రమముచే ఆవరింపబడినవాడై తన ముఖమునుండి సగము భాగము బయటకు వచ్చెను. (మొండెము మాత్రము బయటకు వచ్చెనని ఆశయము.)

అర్ధనిష్క్రాన్త ఏవాసౌ యుధ్యమానో మహాసురః ।
తయా మహాసినా దేవ్యా శిరశ్ఛిత్త్వా నిపాతితః ॥40॥

సగము శరీరము మాత్రమే బయటకు వచ్చిన ఆ రాక్షసుడు ఇంకనూ దేవితో యుద్ధము చేయుచుండెను. దేవి తన గొప్ప కత్తితో ఆ రాక్షసుని శిరస్సును నరికివేసి క్రిందకు పడవేసెను.

ఏవం స మహిషో నామ ససైన్యః ససుహృద్గణః ।
త్రైలోక్యం మోహయిత్వా తు తయా దేవ్యా వినాశితః ॥41॥

ఈ విధముగా ఆ మహిషాసురుడు తన సైన్యముతోనూ, సుహృద్గణములతోనూ కూడా ముల్లోకములను మోహింపచేసి ఆ దేవిచేత చంపబడెను.

త్రైలోక్యస్థైస్తదా భూతైర్మహిషే వినిపాతితే ।
జయేత్యుక్తం తతః సర్వైః సదేవాసురమానవైః ॥42॥

మహిషాసురుడు దేవిచేత చంపబడగా ముల్లోకమందలి ప్రాణులు దేవతలు, రాక్షసులు (కొందరు), మానవులతో సహా అందరు ఆ సమయమందు జయజయధ్వానములు చేసిరి.

తతో హాహాకృతం సర్వం దైత్యసైన్యం ననాశ తత్ ।
ప్రహర్షం చ పరం జగ్ముః సకలా దేవతాగణాః ॥43॥

అటు పిమ్మట హాహాకారములు చేసిన సమస్త రాక్షససైన్యము నశింపబడినది. సమస్తదేవతాగణములు గొప్ప సంతోషమును పొందిరి.

తుష్టువుస్తాం సురా దేవీం సహ దివ్యైర్మహర్షిభిః ।
జగుర్గన్ధర్వపతయో ననృతుశ్చాప్సరోగణాః ॥44॥

స్వర్గవాసులు, మహర్షులతో సహా దేవతలు దేవిని స్తుతించిరి. గంధర్వపతులు గానము చేసిరి. అప్సరసలు నాట్యము చేసిరి.

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే దేవీమాహాత్మ్యే మహిషాసురవధో నామ అశీతితమోఽధ్యాయః ॥80॥

శ్రీ మార్కండేయ మహాపురాణమందలి దేవీమాహాత్మ్యమందలి మహిషాసురవధయను ఎనభైయవ అధ్యాయం సమాప్తం.



ఏకాశీతితమో౽ధ్యాయః – ఎనభైఒకటవ అధ్యాయం
దేవీమాహాత్మ్యే దేవీస్తుతిః – దేవీమాహాత్మ్యమందు దేవీస్తుతి

ఋషిరువాచ – ఋషి చెప్పాడు.

తతః సురగణాః సర్వే దేవ్యా ఇంద్రపురోగమాః ।
స్తుతిమారేభిరే కర్తుం నిహతే మహిషాసురే ॥1॥

అటు పిమ్మట దేవిచేత మహిషాసురుడు చంపబడగా ఇంద్రుడు మొ॥లగు సమస్త దేవతలు దేవియొక్క స్తుతిని చేయుటకు ఆరంభించిరి.

శక్రాదయః సురగణా నిహతే౽తివీర్యే తస్మిన్దురాత్మని సురారిబలే చ దేవ్యా ।
తాం తుష్టువుః ప్రణతినమ్రశిరోధరాంసా వాగ్భిః ప్రహర్షపులకోద్గమచారుదేహాః ॥1॥

మిక్కిలి బలవంతుడు, దుర్మార్గుడు, దేవతాశత్రువులకు బలమూ అయిన ఆ మహిషాసురుడు దేవిచేత చంపబడగా, ఇంద్రాది దేవతాగణములు దేవికి నమస్కరించుచూ వంగిన శిరస్సు మొ॥ అవయములు గలవారై, సంతోషముతో పులకింతవలన అందమైన దేహము గలవారై వాక్కులతో దేవిని స్తుతించిరి.

దేవా ఊచుః – దేవతలు పలికిరి.

దేవ్యా యయా తతమిదం జగదాత్మశక్త్యా నిశ్శేషదేవగణశక్తిసమూహమూర్త్యా ।
తామంబికామఖిలదేవమహర్షిపూజ్యాం భక్త్యా నతాః స్మ విదధాతు శుభాని సా నః ॥3॥

సమస్త దేవతాగణముల శక్తిసమూహమును ఆకారముగా దాల్చినట్టి ఏ దేవిచేతనైతే తన శక్తితో ఈ ప్రపంచమంతయు విస్తారము చెందినదో, అట్టి సమస్త దేవమహర్షులచే పూజింపబడునట్టి అంబికాదేవికి వంగి నమస్కరించుచున్నాము. ఆ దేవి మాకు సమస్త మంగళములను చేకూర్చుగాక !

యస్యాః ప్రభావమతులం భగవాననన్తో బ్రహ్మా హరశ్చ న హి వక్తుమలం బలం చ ।
సా చణ్డికా౽ఖిలజగత్పరిపాలనాయ నాశాయ చాశుభభయస్య మతిం కరోతు ॥4॥

ఏ దేవియొక్క అసామాన్యమైన ప్రభావమును, బలమును వర్ణించుటకు భగవంతుడగు విష్ణుమూర్తి, బ్రహ్మ, శంకరుడు సమర్థులు కారో అట్టి చండికాదేవి సమస్తప్రపంచమును రక్షించుటకు, అమంగళభయములను నశింపచేయుటకు సంకల్పించుగాక !

యా శ్రీః స్వయం సుకృతినాం భవనేష్వలక్ష్మీః పాపాత్మనాం కృతధియాం హృదయేషు బుద్ధిః ।
శ్రద్ధా సతాం కులజనప్రభవస్య లజ్జా తాం త్వాం నతాః స్మః పరిపాలయ దేవి విశ్వమ్ ॥5॥

ఏ దేవి పుణ్యవంతుల ఇండ్లలో లక్ష్మీదేవి స్వరూపిణియో, పాపాత్ముల ఇండ్లలో అలక్ష్మీస్వరూపిణియో, జ్ఞానవంతుల హృదయమందు బుద్ధిస్వరూపిణియో, మంచివారిపట్ల శ్రద్ధాస్వరూపిణియో, మంచివంశమందు పుట్టినవారిపట్ల లజ్జాస్వరూపిణియో, అట్టి పరమేశ్వరికి వంగి నమస్కరించుచున్నాము. ఓ దేవీ ! ఈ ప్రపంచమును రక్షించుము.

కిం వర్ణయామ తవ రూపమచిన్త్యమేతత్ కిఞ్చాతివీర్యమసురక్షయకారి భూరి ।
కిం చాహవేషు చరితాని తవాద్భుతాని సర్వేషు దేవ్యసురదేవగణాదికేషు ॥6॥

ఓ దేవీ ! ఊహించుటకు కూడా శక్యము కాని నీ రూపమును ఏమని వర్ణించగలము? రాక్షసనాశము చేయునట్టి మిక్కిలి అధికమైన నీ గొప్ప పరాక్రమమును ఎట్లు వర్ణించగలము? దేవాసురుల యుద్ధములందు ఆశ్చర్యమును గొలుపు నీ ప్రవృత్తులను ఎట్లు వర్ణించగలము?

హేతుస్సమస్తజగతాం త్రిగుణాపి దోషైర్న జ్ఞాయసే హరిహరాదిభిరప్యపారా ।
సర్వాశ్రయాఖిలమిదం జగదంశభూతమవ్యాకృతా హి పరమా ప్రకృతిస్త్వమాద్యా ॥7॥

ఓ దేవీ ! నీవు సమస్తలోకములకు కారణభూతురావు.సాటిలేని సత్త్వరజస్తమోగుణాత్మకురాలవైన నిన్ను హరిహరాదులు కూడా వారి దోషకారణముగా తెలియలేకున్నారు. సమస్తమునకు ఆశ్రయభూతమైన ఈ జగత్తంతా నీయొక్క అంశయే. అవ్యాకృతమైన శ్రేష్ఠమైన ఆద్యప్రకృతిస్వరూపురాలవు నీవే. (వ్యాకృతము ప్రపంచము.)

యస్యాస్సమస్తసురతాః సముదీరణేన తృప్తిం ప్రయాన్తి సకలేషు మఖేషు దేవి ।
స్వాహాసి వై పితృగణస్య చ తృప్తిహేతురుచ్చార్యసే త్వమత ఏవ జనైః స్వధా చ ॥8॥

ఓ దేవీ ! యజ్ఞములన్నింటయందును నీ నామోచ్చారణముచే సమస్తదేవతాగణములు తృప్తిని పొందుచున్నారు. నీవే స్వాహారూపము. పితృదేవతల తృప్తికి కారణము నీవే. అందువల్లనే ప్రజలు నిన్ను స్వధాయని ఉచ్చరించుచున్నారు.

యా ముక్తిహేతురవిచిన్త్య మహావ్రతా త్వమభ్యస్యసే సునియతేంద్రియతత్త్వసారైః ।
మోక్షార్థిభిర్మునిభిరస్తసమస్తదోషైర్విద్యాసి సా భగవతీ పరమా హి దేవి ॥9॥

ఓ దేవీ ! ముక్తికి కారణభూతురాలవు మహావ్రతస్వరూపురాలవూ అయిన నిన్ను ఇంద్రియనిగ్రహము కలిగి, తత్త్వమునెరిగి, అస్తమించిన సమస్త దోషములు కలిగీయున్న మోక్షమును కోరువారు కొలుచుచున్నారు. భగవతియగు నీవు పరావిద్యస్వరూపురాలవు.

శబ్దాత్మికా సువిమలర్గ్యజుషాం నిధానముద్గీథరమ్యపదపాఠవతాం చ సామ్నామ్ ।
దేవీ త్రయీ భగవతీ భవభావనాయ వార్తాసి సర్వజగతాం పరమార్తిహన్త్రీ ॥10॥

ఓ దేవీ ! నీవు శబ్దస్వరూపురాలవు అనగా పరావాగ్రూపురాలవు. స్వచ్ఛమైన ఋక్కులకు, యజుస్సులకు నిలయువైనదానవు. గానరూపమై అవయవభేదమైన ఉద్గీథముల రమ్యమైన పదపాఠము కలిగిన సామవేదమంత్రములకు ఆశ్రయమైనదానవు. పూజ్యురాలవగు నీవు వేదస్వరూపురాలవు. జగత్తుయొక్క స్థితి ఉత్పత్తులకు కారణమైనదానవు. సమస్త లోకములయొక్క బాధలను తొలగించుదానవు.

మేధాసి దేవి విదితాఖిలశాస్త్రసారా దుర్గాసి దుర్గభవసాగరనౌరసఙ్గా ।
శ్రీః కైటభారిహృదయైకకృతాధివాసా గౌరీ త్వమేవ శశిమౌళికృతప్రతిష్ఠా ॥11॥

ఓ దేవీ ! నీవు బుద్ధిస్వరూపిణివి. సమస్తశాస్త్రముల సారమును ఎరిగినదానవు. నీవు దుర్గాదేవివి. మిక్కిలి కష్టమైన సంసారమనే సముద్రమునకు నౌకా స్వరూపిణివి. దేనితోను సంగము అనగా సంబంధము లేనిదానివి. నీవు లక్ష్మీదేవివి. కైటభుడను రాక్షసుని సంహరించిన విష్ణుమూర్తి హృదయమందే నివాసమును ఏర్పరచుకొన్నదానివి. నీవే గౌరీదేవివి. శిరస్సునందు చంద్రుడు ఆభరణముగా కలిగిన శివునియందు నివాసమును (అర్ధాంగిగా) ఏర్పరచుకొన్నదానవు.

ఈషత్సహాసమమలం పరిపూర్ణచంద్రబింబానుకారి కనకోత్తమకాన్తి కాంతమ్ ।
అత్యద్భుతం ప్రహృతమాత్తరుషా తథాపి వక్త్రం విలోక్య సహసా మహిషాసురేణ ॥12॥

దృష్ట్వా తు దేవి కుపితభృకుటీకరాళముద్యచ్ఛశాంకసదృశచ్ఛవి యన్న సద్యః ।
ప్రాణాన్ముమోచ మహిషస్తదతీవ చిత్రం కైర్జీవ్యతే హి కుపితాన్తకదర్శనేన ॥13॥

ఓ దేవీ ! చిరునవ్వు కలది, నిర్మలమైనది, పూర్ణచంద్రబింబము వంటిది, ఉత్తమమైన బంగారు కాంతి కలది, అందమైనది, మిక్కిలి అద్భుతమైనదీ యగు నీ మోము క్రోధముతో నిండియున్నది. అయినప్పటికీ కోపముతో ముడివేయబడిన కనుబొమలు కలిగి, ఉదయించుచున్న చంద్రకాంతి కలిగిన నీ భయంకరమైన మోమును చూచి కూడా మహిషాసురుడు ప్రాణములను విడిచిపెట్టకుండుట మిక్కిలి ఆశ్చర్యకరముగా ఉన్నది. కోపగించిన యమధర్మరాజును చూచి ఎవరు ప్రాణములతో జీవించగలరు?

దేవి ప్రసీద పరమా భవతీ భవాయ సద్యో వినాశయసి కోపవతీ కులాని ।
విజ్ఞాతమేతదధునైవ యదస్తమేతన్నీతం బలం సువిపులం మహిషాసురస్య ॥14॥

ఓ దేవీ ! శ్రేష్ఠురాలవగు నీవు మా క్షేమము కొరకు అనుగ్రహించుము. కోపము కలిగినదానవైనచో ఆయా కులములను వెంటనే నీవు నశింపచేసెదవు. మహిషాసురుని అతివిస్తారమైన సైన్యము ఇప్పుడే నీచేత నాశము చేయబడినదని తెలిసినది.

తే సమ్మతా జనపదేషు ధనాని తేషాం యేషాం యశాంసి న చ సీదతి ధర్మవర్గః ।
ధన్యాస్త ఏవం నిభృతాత్మజభృత్యదారా యేషాం సదాభ్యుదయదా భవతీ ప్రసన్నా ॥15॥

ఆ యా దేశములందు నీ అనుగ్రహమువలన పుణ్యాత్ములు గౌరవింపబడుచున్నారు. వారికి సంపదలు, కీర్తులు లభించుచున్నవి. వారి ధర్మసమూహము ఎన్నడూ నశింపకున్నది. పుత్రులు, సేవకులు, భార్యలతో కూడుకొనియున్న వారందరు ధన్యులు. వారిపట్ల నీవు ప్రసన్నురాలవై ఎల్లప్పుడు వారికి అభ్యుదయమును ఇచ్చుచున్నావు.

ధర్మ్యాణి దేవి సకలాని సదైవ కర్మాణ్యాదృతః ప్రతిదినం సుకృతీ కరోతి ।
స్వర్గం ప్రయాతి చ తతో భవతీప్రసాదాల్లోకత్రయేఽపి ఫలదా నను దేవి తేన ॥16॥

ఓ దేవీ ! పుణ్యవంతుడైనవాడు నీచేత ఆదరింపబడి నిత్యము ధర్మబద్ధమైన కర్మలను ఆచరించుచున్నాడు. పిమ్మట నీ అనుగ్రహముచే స్వర్గమునకు వెళ్ళుచున్నాడు. అందువలన నిజముగా ముల్లోకములందు ఉన్నవారికి ఫలమునిచ్చుదానవు నీవే. (తేన = అందువలన).

దుర్గే స్మృతా హరసి భీతిమశేషజన్తోః స్వస్థైః స్మృతా మతిమతీవ శుభాం దదాసి ।
దారిద్ర్యదుఃఖభయహారిణి కా త్వదన్యా సర్వోపకారకరణాయ సదార్ద్రచిత్తా ॥17॥

ఓ దుర్గాదేవీ ! నిన్ను స్మరించినంతనే సమస్తజనుల భయమును నీవు పోగొట్టుచున్నావు. స్వస్థులైనవారిచే (దేవియందు చిత్తమును నిలిపినవారు) స్మరింపబడి నీవు వారికి మంగళకరమైన బుద్ధిని ప్రసాదించుచున్నావు. దారిద్ర్యము, దుఃఖము, భయము వీటిని పారద్రోలు ఓ దేవీ ! నీవు గాక మరెవరు ఎల్లప్పుడు ఆర్ద్రమైన చిత్తము కలిగి అందరకు ఉపకారము చేయుటకు సమర్థులగుదురు?

ఏభిర్హతైర్జగదుపైతి సుఖం తథైతే కుర్వన్తు నామ నరకాయ చిరాయ పాపమ్ ।
సంగ్రామమృత్యుమధిగమ్య దివం ప్రయాన్తు మత్వేతి నూనమహితాన్వినిహంసి దేవి ॥18॥

ఓ దేవీ ! "ఈ మహిషాసురసైన్యము చంపబడితే ప్రపంచానికి సుఖం చేకూరుతుంది. వీరు చిరకాలము పాపకారములను ఆచరిస్తే ఆచరించనీ ! అయినా యుద్ధమందు మరణమును పొంది స్వర్గమును పొందనీ !" అని తలచి నిజముగా నీవు దుష్టులైన వీరిని చంపినావు. (నూనమ్ + అహితాన్ + వినిహంసి అని పదచ్ఛేదము.)

దృష్ట్వైవ కిం న భవతీ ప్రకరోతి భస్మ సర్వాసురానరిషు యత్ప్రహిణోషి శస్త్రమ్ ।
లోకాన్ ప్రయాన్తు రిపవోఽపి హి శస్త్రపూతా ఇత్థం మతిర్భవతి తేష్వహితేషు సాధ్వీ ॥19॥

ఓ దేవీ ! దృష్టిమాత్రముచేతనే నీవీ సమస్తరాక్షసులను భస్మము చేయలేవా ఏమి? (తప్పక చేయగలవు). ఈ శత్రువులందు నీవు శస్త్రములను ప్రయోగించుట శత్రువులు కూడా ఆ శస్త్రముల స్పర్శచే పవిత్రులై మంచి లోకములకు వెళ్ళుగాక అని ఆ దుర్మార్గులందు కూడా నీకు సద్బుద్ధి కలిగినది.

ఖడ్గప్రభానికరవిస్ఫురణైస్తథోగ్రైః శూలాగ్రకాన్తినివహేన దృశోఽసురాణామ్ ।
యన్నాగతా విలయమంశుమదిన్దుఖణ్డయోగ్యాననం తవ విలోకయతాం తదేతత్ ॥20॥

ఓ దేవీ ! నీ ఖడ్గముయొక్క సహింపశక్యముకాని కాంతిపుంజముల ప్రసారము చేతను, నీ శూలముయొక్క అగ్రభాగకాంతిసమూహములచేతను రాక్షసుల చూపులకు విలయము (నాశము) సంభవించలేదంటే అందుకు కారణము చంద్రబింబమువంటి కిరణయుక్తమైన యోగ్యమైన నీ మోమును చూచుటయే కారణము.

దుర్వృత్తవృత్తశమనం తవ దేవి శీలం రూపం తథైతదవిచిన్త్యమతుల్యమన్యైః ।
వీర్యం చ హన్తృ హృతదేవపరాక్రమాణాం వైరిష్వపి ప్రకటితైవ దయా త్వయేత్థమ్ ॥21॥

ఓ దేవీ ! నీ స్వభావము దుర్మార్గుల దురాచారమును నశింపచేయునట్టిది. నీ రూపము ఎవరికీ కూడా ఆలోచనకు అందనట్టిది, సాటిలేనిది. నీ పరాక్రమము దేవతల పరాక్రమమును హరించువారిని చంపునట్టిది. శత్రువులందు కూడా దయను నీవీ విధముగా ప్రకటించితివి.

కేనోపమా భవతు తేఽస్య పరాక్రమస్య రూపం చ శత్రుభయకార్యతిహారి కుత్ర ।
చిత్తే కృపా సమరనిష్ఠురతా చ దృష్టా త్వయ్యేవ దేవి వరదే భువనత్రయేఽపి ॥22॥

ఓ దేవీ ! నీ పరాక్రమమును దేనితో పోల్చ శక్యమగును? దేనితోనూ పోల్చుటకు శక్యము కాదని ఆశయము. నీ రూపము శత్రువులకు భయమును గొల్పునది, మిక్కిలి అందమైనదీ కూడా. ఇట్టి రూపము ఎచ్చట ఉండును? ఎచ్చటా సంభవించదని ఆశయము. ఓ వరములనిచ్చుదానా ! నీ చిత్తమందు దయాగుణము, యుద్ధనిమిత్తమైన నిష్ఠుర స్వభావము ఈ రెండు ఈ ముల్లోకములందు నీయందు మాత్రమే కనిపించుచున్నవి.

త్రైలోక్యమేతదఖిలం రిపునాశనేన త్రాతం త్వయా సమరమూర్ధని తేఽపి హత్వా ।
నీతా దివం రిపుగణా భయమప్యపాస్తమస్మాకమున్మాదసురారిభవం నమస్తే ॥23॥

ఓ దేవీ ! శత్రువులను నాశము చేసి నీవు ఈ సమస్తమైన ముల్లోకములను రక్షించితివి. మరియు రణరంగమందు శత్రుగణములను చంపి వారిని స్వర్గమునకు తీసుకువెళ్ళితివి. ఉన్మత్తులైన రాక్షసులను శత్రువులనుండి మాయొక్క భయమును పారద్రోలితివి. నీకు నమస్కారము.

శూలేన పాహి నో దేవి పాహి ఖడ్గేన చాంబికే ।
ఘంటాస్వనేన నః పాహి చాపజ్యానిఃస్వనేన చ ॥24॥

ఓ దేవీ ! నీ శూలముచే మమ్ములను రక్షింపుము. ఓ అంబికా ! ఖడ్గముతో మమ్ములను రక్షింపుము. ఘంటానాదముతోనూ ధనుష్టంకారముతోనూ మమ్ములను కాపాడుము.

ప్రాచ్యాం రక్ష ప్రతీచ్యాం చ చణ్డికే రక్ష దక్షిణే ।
భ్రామణేనాత్మశూలస్య ఉత్తరస్యాం తథేశ్వరి ॥25॥

ఓ పరమేశ్వరీ ! నీ శూలమును త్రిప్పి తూర్పు, పశ్చిమ, దక్షిణ ఉత్తరదిక్కులయందు అంతటా మమ్ములను రక్షించుము.

సౌమ్యాని యాని రూపాణి త్రైలోక్యే విచరన్తి తే ।
యాని చాత్యన్తఘోరాణి తై రక్షాస్మాంస్తథా భువమ్ ॥26॥

ఈ ముల్లోకములందు నీయొక్క సౌమ్యమైన రూపములు మరియు మిక్కిలి భయంకరమైన రూపములు సంచరించుచున్నవో, వాటితో మమ్ములను మరియు ఈ భూలోకమును రక్షించుము.

ఖడ్గశూలగదాదీని యాని చాస్త్రాణి తేఽమ్బికే ।
కరపల్లవసఙ్గీని తైరస్మాన్రక్ష సర్వతః ॥27॥

ఓ అంబికా ! లతల చిగుళ్ళవలే మిక్కిలి మృదువైన నీ చేతిని ఆశ్రయించిన ఖడ్గము, శూలము, గద మొ॥లగు అస్త్రములు ఏవి కలవో వాటితో మమ్ములను అంతటా రక్షించుము.

ఋషిరువాచ – ఋషి చెప్పాడు.

ఏవం స్తుతా సురైర్దివ్యైః కుసుమైః నన్దనోద్భవైః ।
అర్చితా జగతాం ధాత్రీ తథా గన్ధానులేపనైః ॥28॥

ఈ విధముగా దేవతలచే స్తుతింపబడిన సమస్తలోకములను ధరించు ఆ జగదంబిక నందనవనమందు పూసిన పువ్వులతోనూ, గంధలేపనములతోనూ ఆ దేవతలచే పూజింపబడినది.

భక్త్యా సమస్తై స్త్రిదశైర్దివ్యధూపైః సుధూపితా ।
ప్రాహ ప్రసాదముఖీ సమస్తాన్ ప్రణతాన్ సురాన్ ॥29॥

సమస్తదేవతలచేత దివ్యధూపములతో సుధూపితమైన (ధూపము వేయబడిన లేదా పూజింపబడిన) ఆ దేవి నమస్కరించిన సమస్తదేవతలను గూర్చి వారియందలి అనుగ్రహముతో ఇట్లు పలికెను.

శ్రీదేవ్యువాచ – శ్రీదేవి పలికెను.

వ్రియతాం త్రిదశాః సర్వే యదస్మత్తోఽభివాంఛితమ్ ।
దదామ్యహమతిప్రీత్యా స్తవైరేభిః సుపూజితా ॥30॥

కర్తవ్యమపరం యచ్చ దుష్కరం తన్న విద్మహే ।
ఇత్యాకర్ణ్య వచో దేవ్యాః ప్రత్యూచుస్తే దివౌకసః ॥31॥

"నానుండి మీరు ఏమి కోరుకొనవలెనని తలచుచున్నారో దానిని సమస్తదేవతలు కోరుకొనుగాక ! ఈ మీ స్తోత్రములచే బాగుగా పూజింపబడిన నేను మిక్కిలి సంతోషముతో మీరు కోరుకొన్నదానిని ఇచ్చెదను. మీకు నేను చేయదగినది ఏమైనా ఉన్నచో దానిని నేను దుష్కరముగా భావించుట లేదు." దేవి పలికిన మాటలను విని దేవతలు తిరిగి ఇట్లు పలికిరి.

దేవా ఊచుః – దేవతలు పలికారు.

భగవత్యా కృతం సర్వం న కించిదవశిష్యతే ।
యదయం నిహతః శత్రురస్మాకం మహేశ్వరి ॥32॥

ఓ మహేశ్వరీ ! మా శత్రువగు మహిషాసురుని సంహరించి చేయవలసిన కార్యమునంతయు నీవు నెరవేర్చితివి. ఇక మాకు చేయవలసినది ఏమియూ మిగలలేదు.

యది చాపి వరో దేయస్త్వయాస్మాకం మహేశ్వరి ।
సంస్మృతా సంస్మృతా త్వం నో హింసీథాః పరమాపదః ॥33॥

ఓ మహేశ్వరీ ! ఇంకనూ నీవు మాకు వరమీయదలచినచో, మేము నిన్ను స్మరించినంతమాత్రమునే మా ఆపదలను నీవు తొలగించుము.

యశ్చ మర్త్యః స్తవైరేభిస్త్వాం స్తోష్యత్యమలాననే ।
తస్య విత్తర్ధి విభవైర్ధనదారాదిసంపదామ్
వృద్ధయేఽస్మత్ప్రసన్నా త్వం భవేథాః సర్వదాంబికే ॥34॥

ఓ స్వచ్ఛమైన మోము గలదానా ! అంబికాదేవీ ! ఏ మానవుడయితే ఈ స్తోత్రములతో నిన్ను స్తుతించునో అట్టివానికి ధనము, సమృద్ధి, మహత్త్వములతో ధనము, భార్య మొ॥లగు సంపదలను ఇచ్చి మాయందు అనుగ్రహము కలిగిన నీవు వారి వృద్ధికి కారణమగుగాక !

ఋషిరువాచ – ఋషి చెప్పాడు.

ఇతి ప్రసాదితా దేవైర్జగతోఽర్థే తథాత్మనః ।
తథేత్యుక్త్వా భద్రకాలీ బభూవాన్తర్హితా నృప ॥35॥

ఓ రాజా ! ఈ విధముగా ముల్లోకముల కొరకు తమ కొరకు దేవతలు వేడుకొనగా భద్రకాళీదేవి అట్లేయని పలికి అంతర్ధానమయ్యెను.

ఇత్యేతత్కథితం భూప సంభూతా సా యథా పురా ।
దేవీ దేవశరీరేభ్యో జగత్త్రయహితైషిణీ ॥36॥

ఓ రాజా! ముల్లోకములకు హితమును కోరు ఆ దేవి పూర్వము ఆ యా దేవదేవతల శరీరము నుండి ఎట్లు ఉద్భవించెనో నీకు నేను చెప్పితిని.

పునశ్చ గౌరీదేహాత్సా సముద్భూతా యథాఽభవత్ ।
వధాయ దుష్టదైత్యానాం తథా శుంభనిశుంభయోః ॥37॥

రక్షణాయ చ లోకానాం దేవానాముపకారిణీ ।
తచ్ఛృణుష్వ మయా ఖ్యాతం యథావత్కథయామి తే ॥38॥

దుష్టులగు రాక్షసులను మరియు శుంభనిశుంభులను ఇరువురు రాక్షసులను చంపుటకై, ముల్లోకములను రక్షించుటకై దేవతలకు ఉపకారము చేయు జగదంబిక మరల పార్వతీదేవి దేహమునుండి ఎట్లు ఉద్భవించెనో చెప్పెదను, వినుము.

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే దేవీమాహాత్మ్యే దేవీస్తుతిర్నామ ఏకాశీతితమోఽధ్యాయః ॥81॥

శ్రీ మార్కండేయ మహాపురాణమందలి దేవీమాహాత్మ్యమందలి దేవీస్తుతియను ఎనభైఒకటవ అధ్యాయం సమాప్తం.



ద్వ్యశీతితమోఽధ్యాయః – ఎనభైరెండవ అధ్యాయం
దేవీమాహాత్మ్యే దేవదూతసంవాదః – దేవీమాహాత్మ్యమందు దేవీదూతసంవాదం

ఋషిరువాచ – ఋషి చెప్పాడు.

పురా శుంభనిశుంభాభ్యామసురాభ్యాం శచీపతేః ।
త్రైలోక్యం యజ్ఞభాగాశ్చ హృతా మదబలాశ్రయాత్ ॥1॥

పూర్వము శుంభుడు, నిశుంభుడు అను ఇరువురు రాక్షసులు మదబలములతో దేవేంద్రుని ముల్లోకముల అధికారమును, దేవతల యజ్ఞభాగములను (హవిస్సులను) అపహరించిరి.

తావేవ సూర్యతాం తద్వదధికారం తథైన్దవమ్ ।
కౌబేరమథ యామ్యం చ చక్రాతే వరుణస్య చ ॥2॥

ఆ ఇరువురు రాక్షసులే సూర్యచంద్రకుబేరయమవరుణ దేవతల అధికారమును అపహరించి వారి కార్యములను నిర్వహించసాగిరి.

తావేవ పవనర్ధిం చ చక్రతుర్వహ్నికర్మ చ ।
అన్యేషాం చాధికారాన్సః స్వయమేవాధితిష్ఠతి ॥
తతో దేవా వినిర్ధూతా భ్రష్టరాజ్యాః పరాజితాః ॥3॥

ఆ ఇరువురు రాక్షసులే వాయుదేవుని, వహ్నిదేవుని మరియు ఇతర దేవతల అధికారములను అపహరించి స్వయముగా వారి స్థానములందు నిలిచియున్నారు. అంతట ఆ దేవతలు ఆశ్రయమును పోగొట్టుకొన్నవారై, రాజ్యభ్రష్టులై ఆ రాక్షసులచేతిలో పరాజయము పాలైరి.

హృతాధికారాస్త్రిదశాస్తాభ్యాం సర్వే నిరాకృతాః ।
మహాసురాభ్యాం తాం దేవీం సంస్మరన్త్యపరాజితామ్ ॥4॥

అధికారమును పోగొట్టుకొని, ఆ ఇరువురి రాక్షసుల చేతిలో ఓటమి పాలైన దేవతలందరూ అపరాజితయగు ఆ పరమేశ్వరిని స్మరించసాగిరి.

తయాస్మాకం వరో దత్తో యథాపత్సు స్మృతాఖిలాః ।
భవతాం నాశయిష్యామి తత్క్షణాత్పరమాపదః ॥5॥

ఇతి కృత్వా మతిం దేవా హిమవన్తం నగేశ్వరమ్ ।
జగ్ముస్తత్ర తతో దేవీం విష్ణుమాయాం ప్రతుష్టువుః ॥6॥

"ఆపదలు వచ్చినప్పుడు నన్ను స్మరించినచో వెంటనే మీ సమస్త ఆపదలను నేను నశింపచేసెదను" అని దేవి మనకు వరము ప్రసాదించినది అని ఆలోచించి దేవతలందరు పర్వతరాజమైన హిమవత్పర్వతమునకు వెళ్ళిరి. అచ్చట విష్ణుమాయారూపిణియగు పరమేశ్వరిని స్తుతించిరి.

దేవా ఊచుః – దేవతలు పలికారు

నమో దేవ్యై మహాదేవ్యై శివాయై సతతం నమః ।
నమః ప్రకృత్యై భద్రాయై నియతాః ప్రణతాః స్మ తామ్ ॥7॥

దేవికి నమస్కారము. మహాదేవి, శివాదేవికి ఎల్లప్పుడు నమస్కారము. ప్రకృతిస్వరూపురాలు, మంగళస్వరూపురాలు అగు దేవికి ఎల్లప్పుడు నమస్కారమును ఆచరించుచున్నాము.

రౌద్రాయై నమో నిత్యాయై గౌర్యై ధాత్ర్యై నమో నమః ।
నమో జగత్ప్రతిష్ఠాయై దేవ్యై కృత్యై నమో నమః ॥8॥

రౌద్ర, నిత్య, గౌరి, ధాత్రియగు దేవికి నమస్కారము. జగత్తుకంతకూ ఆధారభూతురాలు కృతిరూపిణి అయిన దేవికి నమస్కారము.

జ్యోత్స్నాయై చంద్రరూపిణ్యై సుఖాయై సతతం నమః ।
కల్యాణ్యై ప్రణతామృద్ధ్యై సిద్ధ్యై కూర్మ్యై నమో నమః ॥9॥

జ్యోత్స్న, చంద్రరూపిణి, సుఖారూపిణియగు దేవికి నమస్కారము. కల్యాణి, ఋద్ధి, సిద్ధి, కూర్మి దేవికి నమస్కారము.

నైరృత్యై భూభృతాం లక్ష్మ్యై శర్వాణ్యై తే నమో నమః ।
దుర్గాయై దుర్గపారాయై సారాయై సర్వకారిణ్యై ॥
ఖ్యాత్యై తథైవ కృష్ణాయై ధూమ్రాయై సతతం నమః ॥10॥

నైరృతి, రాజులకు సంపదరూపమైన అదృష్టదేవతయగు లక్ష్మి, శర్వాణి అయిన ఓ దేవీ ! నీకు నమస్కారము. దుర్గ, దుర్గపార (కష్టములను దాటించునది), సార, సర్వకారిణి, ఖ్యాతి, కృష్ణ, ధూమ్రయగు దేవికి ఎల్లప్పుడు నమస్కారము.

అతిసౌమ్యాతిరౌద్రాయై నమస్తస్యై నమో నమః ।
నమో జగత్ప్రతిష్ఠాయై దేవ్యై కృత్యై నమో నమః ॥11॥

అతిసౌమ్యురాలు, అతిరౌద్రస్వభావురాలు అయిన దేవికి నమస్కారము. జగత్తుకు ఆశ్రయభూతురాలు, కృతిరూపిణియగు దేవికి నమస్కారము.

యా దేవీ సర్వభూతేషు విష్ణుమాయేతి శబ్దితా ।
నమస్తస్యై నమస్తస్యై నమస్తస్యై నమో నమః ॥12॥

సర్వప్రాణులయందు విష్ణుమాయయను పేరుతో నెలకొనియున్న దేవికి నమస్కారము, నమస్కారము, నమస్కారము, నమస్కారము.

యా దేవీ సర్వభూతేషు చేతనేత్యభిధీయతే ।
నమస్తస్యై నమస్తస్యై నమస్తస్యై నమో నమః ॥13॥

సమస్తప్రాణులయందు చేతన అను పేరుతో నెలకొనియున్న దేవికి నమస్కారము, నమస్కారము, నమస్కారము, నమస్కారము.

యా దేవీ సర్వభూతేషు బుద్ధిరూపేణ సంస్థితా ।
నమస్తస్యై నమస్తస్యై నమస్తస్యై నమో నమః ॥14॥

సర్వప్రాణులయందు బుద్ధిరూపముతో నెలకొనియున్న దేవికి నమస్కారము, నమస్కారము, నమస్కారము, నమస్కారము.

యా దేవీ సర్వభూతేషు నిద్రారూపేణ సంస్థితా ।
నమస్తస్యై నమస్తస్యై నమస్తస్యై నమో నమః ॥15॥

సర్వప్రాణులయందు నిద్రారూపముగా నెలకొనియున్న దేవికి నమస్కారము, నమస్కారము, నమస్కారము, నమస్కారము.

యా దేవీ సర్వభూతేషు క్షుధారూపేణ సంస్థితా ।
నమస్తస్యై నమస్తస్యై నమస్తస్యై నమో నమః ॥16॥

సర్వప్రాణులయందు ఆకలిరూపముగా నెలకొనియున్న దేవికి నమస్కారము, నమస్కారము, నమస్కారము, నమస్కారము.

యా దేవీ సర్వభూతేషు ఛాయారూపేణ సంస్థితా ।
నమస్తస్యై నమస్తస్యై నమస్తస్యై నమో నమః ॥17॥

సర్వప్రాణులయందు ఛాయారూపములో నెలకొనియున్న దేవికి నమస్కారము, నమస్కారము, నమస్కారము, నమస్కారము.

యా దేవీ సర్వభూతేషు శక్తిరూపేణ సంస్థితా ।
నమస్తస్యై నమస్తస్యై నమస్తస్యై నమో నమః ॥18॥

సర్వప్రాణులయందు శక్తిరూపముతో నెలకొనియున్న దేవికి నమస్కారము, నమస్కారము, నమస్కారము, నమస్కారము.

యా దేవీ సర్వభూతేషు తృష్ణారూపేణ సంస్థితా ।
నమస్తస్యై నమస్తస్యై నమస్తస్యై నమో నమః ॥19॥

సర్వప్రాణులయందు తృష్ణా (దాహము) రూపముతో నెలకొనియున్న దేవికి నమస్కారము, నమస్కారము, నమస్కారము, నమస్కారము.

యా దేవీ సర్వభూతేషు క్షాన్తిరూపేణ సంస్థితా ।
నమస్తస్యై నమస్తస్యై నమస్తస్యై నమో నమః ॥20॥

సర్వప్రాణులయందు క్షాన్తి (సహనము) రూపముతో నెలకొనియున్న దేవికి నమస్కారము, నమస్కారము, నమస్కారము, నమస్కారము.

యా దేవీ సర్వభూతేషు జాతిరూపేణ సంస్థితా ।
నమస్తస్యై నమస్తస్యై నమస్తస్యై నమో నమః ॥21॥

సర్వప్రాణులయందు జాతిరూపముతో నెలకొనియున్న దేవికి నమస్కారము, నమస్కారము, నమస్కారము, నమస్కారము.

యా దేవీ సర్వభూతేషు లజ్జారూపేణ సంస్థితా ।
నమస్తస్యై నమస్తస్యై నమస్తస్యై నమో నమః ॥22॥

సర్వప్రాణులయందు లజ్జా (సిగ్గు) రూపముతో నెలకొనియున్న దేవికి నమస్కారము, నమస్కారము, నమస్కారము, నమస్కారము.

యా దేవీ సర్వభూతేషు శాన్తిరూపేణ సంస్థితా ।
నమస్తస్యై నమస్తస్యై నమస్తస్యై నమో నమః ॥23॥

సర్వప్రాణులయందు శాంతిరూపముతో నెలకొనియున్న దేవికి నమస్కారము, నమస్కారము, నమస్కారము, నమస్కారము.

యా దేవీ సర్వభూతేషు శ్రద్ధారూపేణ సంస్థితా ।
నమస్తస్యై నమస్తస్యై నమస్తస్యై నమో నమః ॥24॥

సర్వప్రాణులయందు శ్రద్ధారూపముతో నెలకొనియున్న దేవికి నమస్కారము, నమస్కారము, నమస్కారము, నమస్కారము.

యా దేవీ సర్వభూతేషు కాన్తిరూపేణ సంస్థితా ।
నమస్తస్యై నమస్తస్యై నమస్తస్యై నమో నమః ॥25॥

సర్వప్రాణులయందు కాంతి రూపముతో నెలకొనియున్న దేవికి నమస్కారము, నమస్కారము, నమస్కారము, నమస్కారము.

యా దేవీ సర్వభూతేషు లక్ష్మీరూపేణ సంస్థితా ।
నమస్తస్యై నమస్తస్యై నమస్తస్యై నమో నమః ॥26॥

సర్వప్రాణులయందు లక్ష్మీరూపముతో నెలకొనియున్న దేవికి నమస్కారము, నమస్కారము, నమస్కారము, నమస్కారము.

యా దేవీ సర్వభూతేషు ధృతిరూపేణ సంస్థితా ।
నమస్తస్యై నమస్తస్యై నమస్తస్యై నమో నమః ॥27॥

సర్వప్రాణులయందు ధృతి (ఆధారము) రూపముతో నెలకొనియున్న దేవికి నమస్కారము, నమస్కారము, నమస్కారము, నమస్కారము.

యా దేవీ సర్వభూతేషు వృత్తిరూపేణ సంస్థితా ।
నమస్తస్యై నమస్తస్యై నమస్తస్యై నమో నమః ॥28॥

సర్వప్రాణులయందు వృత్తిరూపముతో నెలకొనియున్న దేవికి నమస్కారము, నమస్కారము, నమస్కారము, నమస్కారము.

యా దేవీ సర్వభూతేషు స్మృతిరూపేణ సంస్థితా ।
నమస్తస్యై నమస్తస్యై నమస్తస్యై నమో నమః ॥29॥

సర్వప్రాణులయందు స్మృతిరూపముతో నెలకొనియున్న దేవికి నమస్కారము, నమస్కారము, నమస్కారము, నమస్కారము.

యా దేవీ సర్వభూతేషు దయారూపేణ సంస్థితా ।
నమస్తస్యై నమస్తస్యై నమస్తస్యై నమో నమః ॥30॥

సర్వప్రాణులయందు దయారూపముతో నెలకొనియున్న దేవికి నమస్కారము, నమస్కారము, నమస్కారము, నమస్కారము.

యా దేవీ సర్వభూతేషు నీతిరూపేణ సంస్థితా ।
నమస్తస్యై నమస్తస్యై నమస్తస్యై నమో నమః ॥31॥

సర్వప్రాణులయందు నీతిరూపముతో నెలకొనియున్న దేవికి నమస్కారము, నమస్కారము, నమస్కారము, నమస్కారము.

యా దేవీ సర్వభూతేషు తుష్టిరూపేణ సంస్థితా ।
నమస్తస్యై నమస్తస్యై నమస్తస్యై నమో నమః ॥32॥

సర్వప్రాణులయందు తుష్టి (సంతోషము) రూపముతో నెలకొనియున్న దేవికి నమస్కారము, నమస్కారము, నమస్కారము, నమస్కారము.

యా దేవీ సర్వభూతేషు పుష్టిరూపేణ సంస్థితా ।
నమస్తస్యై నమస్తస్యై నమస్తస్యై నమో నమః ॥33॥

సర్వప్రాణులయందు పుష్టిరూపముతో నెలకొనియున్న దేవికి నమస్కారము, నమస్కారము, నమస్కారము, నమస్కారము.

యా దేవీ సర్వభూతేషు మాతృరూపేణ సంస్థితా ।
నమస్తస్యై నమస్తస్యై నమస్తస్యై నమో నమః ॥34॥

సర్వప్రాణులయందు మాతృరూపముతో నెలకొనియున్న దేవికి నమస్కారము, నమస్కారము, నమస్కారము, నమస్కారము.

యా దేవీ సర్వభూతేషు భ్రాన్తిరూపేణ సంస్థితా ।
నమస్తస్యై నమస్తస్యై నమస్తస్యై నమో నమః ॥35॥

సర్వప్రాణులయందు భ్రాంతిరూపముతో నెలకొనియున్న దేవికి నమస్కారము, నమస్కారము, నమస్కారము, నమస్కారము.

ఇంద్రియాణామధిష్ఠాత్రీ భూతానామఖిలేషు యా ।
భూతేషు సతతం వ్యాప్త్యై తస్యై దేవ్యై నమో నమః ॥36॥

సర్వప్రాణుల ఇంద్రియాలకు ఆధారభూతురాలు మరియు సమస్తప్రాణులయందు ఎల్లప్పుడు వ్యాపించియున్న దేవికి నమస్కారము.

చితిరూపేణ యా కృత్స్నమేతద్వ్యాప్య స్థితా జగత్ ।
నమస్తస్యై నమస్తస్యై నమస్తస్యై నమో నమః ॥37॥

సమస్తప్రపంచమందు సంపూర్ణముగా చితిరూపముతో (చైతన్యము) వ్యాపించియున్న దేవికి నమస్కారము, నమస్కారము, నమస్కారము, నమస్కారము.

స్తుతా సురైః పూర్వమభీష్టసంశ్రయాత్తథా సురేన్ద్రేశదినేశసేవితా ।
కరోతు సా నః శుభహేతురీశ్వరీ శుభాని భద్రాణ్యభిహన్తు చాపదః ॥38॥

తమ అభీష్టసిద్ధికొరకు పూర్వకాలమందు దేవతలచే స్తుతింపబడినదీ, దేవేంద్రుడు శివుడు సూర్యులచే సేవింపబడినదీయగు మంగళకారిణి అయిన పరమేశ్వరి మాకు శుభములను, మంగళములను చేకూర్చుగాక ! ఆపదలను పోగొట్టుగాక !

యా సాంప్రతం చోద్ధతదైత్యతాపితైరస్మాభిరీశా చ సురైర్నమస్యతే ।
యా చ స్మృతా తత్క్షణమేవ హన్తి నః సర్వాపదో భక్తివినమ్రమూర్తిభిః ॥39॥

గర్వితులైన రాక్షసులచే బాధలను పొందిన దేవతలమగు మాచే ఇప్పుడు ఏ దేవి అయితే ప్రభురూపిణిగా నమస్కరింపబడుచున్నదో, ఇంకనూ భక్తితో వంగియున్న మాచే స్మరింపబడినట్టి ఆ దేవి మా ఆపదలను బాపుగాక!

ఋషిరువాచ – ఋషి పలికాడు.

ఏవం స్తవాభియుక్తానాం దేవానాం తత్ర పార్వతీ ।
స్నాతుమభ్యాయయౌ తోయే జాహ్నవ్యా నృపనన్దన ॥40॥

ఓ రాజా ! ఈ విధముగా స్తోత్రములు చేసిన దేవతలున్న ఆ ప్రదేశమునకు గంగానదీజలములందు స్నానమునాచరించుటకు పార్వతీదేవి వచ్చెను.

సాఽబ్రవీత్తాన్సురాన్సుభ్రూర్భవద్భిః స్తూయతేఽత్ర కా ।
శరీరకోశతశ్చాస్యాః సముద్భూతాఽబ్రవీచ్ఛివా ॥41॥

అందమైన కనుబొమలు కలిగిన ఆ పార్వతీదేవి దేవతలతో "మీరు స్తుతించుచున్న ఆ దేవి ఎవర"ని పలికెను. అంతట ఆమె శరీరమునుండి ఉద్భవించిన మంగళస్వరూపిణియగు దేవి ఇట్లు పలికెను.

స్తోత్రం మమైతత్క్రియతే శుంభదైత్యనిరాకృతైః ।
దేవైః సమస్తైః సమరే నిశుంభేన పరాజితైః ॥42॥

శుంభుడను రాక్షసునిచే నిరాకరింపబడినవారు, నిశుంభుడను రాక్షసునిచే యుద్ధమందు ఓడినవారూ అగు దేవతలు నన్ను గూర్చి స్తోత్రము చేయుచున్నారు.

శరీరకోశాద్యత్తస్యాః పార్వత్యా నిస్సృతాఽమ్బికా ।
కౌశికీతి సమస్తేషు తతో లోకేషు గీయతే ॥43॥

పార్వతీదేవియొక్క శరీరకోశమునుండి ఉద్భవించుటచే ఆ అంబికాదేవి సమస్తలోకములందు కౌశికియని కీర్తింపబడుచున్నది.

తస్యాం వినిర్గతాయాం తు కృష్ణాఽభూత్సాపి పార్వతీ ।
కాలికేతి సమాఖ్యాతా హిమాచలకృతాశ్రయా ॥44॥

అట్లు ఉద్భవించిన అంబికాదేవి నల్లనిశరీరముగలది అయ్యెను. పార్వతీదేవి కూడా అట్లే కృష్ణవర్ణముగలదై, హిమాచలపర్వతము ఆశ్రయముగా గలదై కాళికయను పేరుతో ప్రసిద్ధినందెను.

తతోఽమ్బికాం పరం రూపం బిభ్రాణాం సుమనోహరమ్ ।
దదర్శ చణ్డో ముణ్డశ్చ భృత్యౌ శుంభనిశుంభయోః ॥45॥

అటుపిమ్మట మిక్కిలి మనోహరమైన శ్రేష్ఠమైన రూపమును ధరించిన అంబికాదేవిని శుంభనిశుంభ రాక్షససేవకులైన చండుడు, ముండుడు చూచిరి.

తాభ్యాం శుంభాయ చాఖ్యాతా అతీవ సుమనోహరా ।
కాప్యాస్తే స్త్రీ మహారాజ భాసయన్తీ హిమాచలమ్ ॥46॥

వారిరువురు శుంభునివద్దకు వెళ్ళి ఇట్లు చెప్పిరి. "ఓ మహారాజ! మిక్కిలి అందగత్తె మరియు హిమాలయపర్వతమును ప్రకాశింపచేయుచున్నదీయగు ఒకానొక స్త్రీ ఇచ్చట ఉన్నది. (కా + అపి + ఆస్తే = కాప్యాస్తే)

నైవ తాదృక్క్వచిద్రూపం దృష్టం కేనచిదుత్తమమ్ ।
జ్ఞాయతాం కాప్యసౌ దేవీ గృహ్యతాం చాసురేశ్వర ॥47॥

ఓ రాక్షసప్రభూ ! ఇట్టి గొప్పరూపమును ఎవరూ చూచియుండరు. ఆ దేవి ఎవరో తెలుసుకొని నీవా యువతిని గ్రహించుము.

స్త్రీరత్నమతిచార్వఙ్గీ ద్యోతయన్తీ దిశస్త్విషా ।
సా తు తిష్ఠతి దైత్యేన్ద్ర తాం భవాన్ద్రష్టుమర్హతి ॥48॥

ఓ రాక్షసేంద్రా ! ఆ స్త్రీరత్నము మిక్కిలి అందమైన అవయవములు గలదీ, తన కాంతిచేత దిక్కులను ప్రకాశింపచేయుచున్నదీ అయి ఉన్నది. నీవామెను చూచుటకు అర్హుడవు.

యాని రత్నాని మణయో గజాశ్వాదీని వై ప్రభో ।
త్రైలోక్యే తు సమస్తాని సాంప్రతం తాని గృహే ॥49॥

ఓ ప్రభూ ! ముల్లోకములందు శ్రేష్ఠములయిన రత్నములు, మణులు, ఏనుగులు, గుర్రములు మొ॥లగు సమస్త వస్తువులు నీ గృహమందున్నవి.

ఐరావతః సమానీతో గజరత్నం పురన్దరాత్ ।
పారిజాతతరుశ్చాయం తథైవోచ్చైఃశ్రవా హయః ॥50॥

గజరత్నమైన ఐరావతము ఇంద్రునివద్దనుంచి నీ ఇంటికి తీసుకురాబడినది. అట్లే పారిజాతవృక్షము, ఉచ్చైఃశ్రవమను గుర్రము కూడా తీసుకొని రాబడినవి.

విమానం హంససంయుక్తమేతత్తిష్ఠతి తేఽఙ్గణే ।
రత్నభూతమిహానీతం యదాసీద్వేధసోఽద్భుతమ్ ॥51॥

అద్భుతమైనదీ, రత్నమువంటిదీ (శ్రేష్ఠమైనదీ), హంసలతో కూడుకొన్నదీ అయిన బ్రహ్మదేవుని విమానము నీ ఇంటివాకిలియందు ఉంచబడినది.

నిధిరేష మహాపద్మః సమానీతో ధనేశ్వరాత్ ।
కిఞ్జల్కినీం దదౌ చాబ్ధిర్మాలామమ్లానపఙ్కజామ్ ॥52॥

కుబేరునివద్దనుంచి మహాపద్మమను గొప్ప నిధి నీ ఇంటికి తీసుకు రాబడినది. సముద్రుడు వాడని పద్మములు గల కింజల్కిని అను పేరుగల మాలను నీకు సమర్పించెను.

ఛత్రం తే వారుణం గేహే కాంచనస్రావి తిష్ఠతి ।
తథాయం స్యన్దనవరో యః పురాసీత్ప్రజాపతేః ॥53॥

బంగారమును ప్రవహింపచేయు వరుణుని గొడుగు నీవద్ద ఉన్నది. అట్లే మునుపు ప్రజాపతివద్ద ఉన్న శ్రేష్ఠమైన రథము నీ వద్ద ఉన్నది.

మృత్యోరుత్క్రాన్తిదా నామ శక్తిరీశ త్వయా హృతా ।
పాశః సలిలరాజస్య భ్రాతుస్తవ పరిగ్రహే ॥54॥

మృత్యుదేవతయొక్క ఉత్క్రాన్తితయను పేరుగల శక్తి నీచేత అపహరింపబడినది. వరుణుని పాశము నీ సోదరుడగు నిశుంభుని వద్ద ఉన్నది.

నిశుంభస్యాబ్ధిజాతాశ్చ సమస్తా రత్నజాతయః ।
వహ్నిశ్చాపి దదౌ తుభ్యమగ్నిః శౌచే చ వాససీ ॥55॥

సముద్రమందు పుట్టిన సమస్త రత్నజాతులు నీ సోదరుడగు నిశుంభుని వద్ద ఉన్నవి. అగ్నిదేవత కూడా వహ్నిచే పరిశుద్ధి చేయబడిన రెండు వస్త్రములను నీకు ఇచ్చినది.

ఏవం దేత్యేన్ద్ర రత్నాని సమస్తాన్యాహృతాని తే ।
స్త్రీరత్నమేషా కల్యాణీ త్వయా కస్మాన్న గృహ్యతే ॥56॥

ఓ రాక్షసేంద్రా ! ఈ విధముగా సమస్తరత్నములు నీ కొరకు తీసుకురాబడినవి. స్త్రీరత్నమగు ఈ కల్యాణి ఎందువల్ల నీచేత గ్రహింపబడుట లేదు?

ఋషిరువాచ – ఋషి చెప్పాడు.

నిశమ్యేతి వచః శుంభః స తదా చణ్డముణ్డయోః ।
ప్రేషయామాస సుగ్రీవం దూతం దేవ్యా మహాసురః ॥57॥

చండముండులయొక్క ఈ మాటలను విని గొప్ప రాక్షసుడయిన శుంభుడు అప్పుడు సుగ్రీవుడను దూతను దేవి వద్దకు పంపెను.

శుంభ ఉవాచ – శుంభుడు చెప్పాడు.

ఇతి చేతి చ వక్తవ్యా సా గత్వా వచనాన్మమ ।
యథా చాభ్యేతి సంప్రీత్యా తథా కార్యం త్వయా లఘు ॥58॥

నీవు దేవివద్దకు వెళ్ళి నేను చెప్పినట్లుగా చెప్పుము. నాయందు ప్రీతి కలిగి ఏ విధముగా నా వద్దకు వచ్చునో అట్లు జాగ్రత్తగా కార్యమును నిర్వహించుము.

స తత్ర గత్వా యత్రాస్తే శైలోద్దేశే౽తిశోభనే ।
తాం చ దేవీం తతః ప్రాహ శ్లక్ష్ణం మధురయా గిరా ॥59॥

ఆ సుగ్రీవుడను దూత మిక్కిలి సుందరమైన ఆ పర్వతప్రాంతమందు దేవి ఎచ్చట ఉండెనో అచ్చటకు వెళ్ళి మధురవాక్కులతో గౌరవముగా ఆ దేవినిగూర్చి ఇట్లు పలికెను.

దూత ఉవాచ – దూత చెప్పాడు.

దేవి దైత్యేశ్వరః శుంభస్త్రైలోక్యే పరమేశ్వరః ।
దూతోఽహం ప్రేషితస్తేన త్వత్సకాశమిహాగతః ॥60॥

ఓ దేవి ! రాక్షసరాజగు శుంభుడు ముల్లోకములకు ప్రభువైయున్నాడు. అతనిచేత దూతగా పంపబడిన నేను నీ వద్దకు వచ్చితిని.

అవ్యాహతాజ్ఞః సర్వాసు యః సదా దేవయోనిషు ।
నిర్జితాఖిలదైత్యారిః స యదాహ శృణుష్వ తత్ ॥61॥

దేవయోనులందు అనగా సమస్తదేవతలందు తన ఆజ్ఞకు తిరుగులేనివాడు, సమస్తరాక్షసులను జయించినవాడూ అగు ఆ శుంభుడు ఏమి చెప్పెనో వినుము.

మమ త్రైలోక్యమఖిలం మమ దేవా వశానుగాః ।
యజ్ఞభాగానహం సర్వానుపాశ్నామి పృథక్ పృథక్ ॥62॥

ఈ ముల్లోకములన్నీ నావే. దేవతలందరు నా ఆజ్ఞకు లోబడియున్నారు. వేరువేరుగా యజ్ఞభాగములనన్నింటిని నేనే తినుచున్నాను.

త్రైలోక్యే వరరత్నాని మమ వశ్యాన్యశేషతః ।
తథైవ గజరత్నం చ హృతం దేవేన్ద్రవాహనమ్ ॥63॥

ఈ ముల్లోకమందలి వరరత్నములన్నీ పూర్తిగా నా వశమందున్నవి. అట్లే గజరత్నమైన దేవేంద్రుని వాహనము ఐరావతము నాచే అపహరింపబడినది.

క్షీరోదమథనోద్భూతమశ్వరత్నం మమామరైః ।
ఉచ్చైఃశ్రవససంజ్ఞం తు ప్రణిపత్య సమర్పితమ్ ॥64॥

క్షీరసముద్రమును చిలికినప్పుడు ఉద్భవించిన ఉచ్చైఃశ్రవసమను అశ్వరత్నమును దేవతలు నాకు నమస్కరించి సమర్పించిరి.

యాని చాన్యాని దేవేషు గంధర్వేషూరగేషు చ ।
రత్నభూతాని భూతాని తాని మయ్యేవ శోభనే ॥65॥

ఓ శోభనమైనదానా ! ఇవేగాక గంధర్వులు, ఉరగులు (నాగదేవతలు) అగు దేవతలందు ఉన్నట్టి రత్నములవంటి శ్రేష్ఠమైన వస్తువులన్నీ నావద్దే ఉన్నవి.

స్త్రీరత్నభూతాం త్వాం దేవి లోకే మన్యామహే వయమ్ ।
సా త్వమస్మానుపాగచ్ఛ యతో రత్నభుజో వయమ్ ॥66॥

ఓ దేవీ ! లోకమందలి స్త్రీలందరిలో రత్నమువంటి దానినిగా నిన్ను మేము భావించుచున్నాము. మేము రత్నములను అనుభవించువారము గావున అట్టి నీవు మావద్దకు చేరుము.

మాం వా మమానుజం వాపి నిశుంభమురువిక్రమమ్ ।
భజ త్వం చంచలాపాఙ్గి రత్నభూతాసి వై యతః ॥67॥

ఓ చంచలమైన చూపులుగలదానా ! నన్నుగాని, నా తమ్ముడైన మహావీర్యవంతుడగు నిశుంభుని గాని సేవించుము (సమీపించుము). ఎందువలననగా నీవు రత్నమువంటిదానవు కదా !

పరమైశ్వర్యమతులం ప్రాప్స్యసే మత్పరిగ్రహాత్ ।
ఏతద్బుద్ధ్యా సమాలోచ్య మత్పరిగ్రహతాం వ్రజ ॥68॥

నన్ను చేపట్టినందువలన సాటిలేని గొప్ప ధనసంపదలను పొందగలవు. ఈ బుద్ధితో (ఆలోచనలతో) నా దరి చేరుము.

ఋషిరువాచ – ఋషి చెప్పాడు.

ఇత్యుక్తా సా తదా దేవీ గంభీరాన్తఃస్మితా జగౌ ।
దుర్గా భగవతీ భద్రా యయేదం ధార్యతే జగత్ ॥69॥

ఏ దేవిచేతనైతే ఈ సమస్తప్రపంచము ధరింపబడుచున్నదో భగవతి భద్రయగు ఆ దుర్గాదేవి గంభీరముగా తనలోనే నవ్వుకొని అప్పుడిట్లు పలికెను.

సత్యముక్తం త్వయా నాత్ర మిథ్యా కిఞ్చిత్త్వయోదితమ్ ।
త్రైలోక్యాధిపతిః శుంభో నిశుంభశ్చాపి తాదృశః ॥70॥

నీవు నిజము పలికితివి. నీవు పలికినదానిలో అసత్యము ఏ కొంచెమూ లేదు. శుంభుడు ముల్లోకములకు అధిపతియే. నిశుంభుడు కూడా అట్టివాడే.

కిం త్వత్ర యత్ప్రతిజ్ఞాతం మిథ్యా తత్క్రియతే కథమ్ ।
శ్రూయతామల్పబుద్ధిత్వాత్ప్రతిజ్ఞా యా కృతా పురా ॥71॥

అయినప్పటికీ, పూర్వము నేనేమి ప్రతిజ్ఞ చేసితినో దానిని నేనెట్లు అసత్యము చేయగలను? పూర్వము నేను చేసిన ప్రతిజ్ఞను నీకు తెలియనందున చెప్పెదను, వినుము.

యో మాం జయతి సంగ్రామే యో మే దర్పం వ్యపోహతి ।
యో మే ప్రతిబలో లోకే స మే భర్తా భవిష్యతి ॥72॥

ఎవరయితే యుద్ధమందు నన్ను జయించెదరో, ఎవరయితే నా గర్వమును అణచెదరో, ఎవరయితే ఈ లోకమందు నాతో సమానమయిన బలము గలవారో అట్టివాడే నాకు భర్త కాగలదు. (ఇది నేను పూర్వము చేసిన ప్రతిజ్ఞ)

తదా గచ్ఛతు శుంభోఽత్ర నిశుంభో వా మహాసురః ।
మాం జిత్వా కిం చిరేణాత్ర పాణిం గృహ్ణాతు మే లఘు ॥73॥

అందువలన గొప్ప రాక్షసుడయిన శుంభుడుగాని, నిశుంభుడు గాని ఇచ్చటకు వచ్చెదరు గాక ! ఇక ఆలస్యమెందులకు? నన్ను జయించి సులభముగా నన్ను సులభముగా పెండ్లాడెదరు గాక !

దూత ఉవాచ – దూత చెప్పాడు.

అవలిప్తాసి మైవం త్వం దేవి బ్రూహి మమాగ్రతః ।
త్రైలోక్యే కః పుమాన్ తిష్ఠేదగ్రే శుంభనిశుంభయోః ॥74॥

ఓ దేవీ ! నీవు చాలా గర్వించియున్నావు. నాముందు నీవిట్లు పలుకవలదు. ఈ ముల్లోకములలోనూ ఏ పురుషుడు శుంభనిశుంభుల యెదుట నిలువగలడు?

అన్యేషామపి దైత్యానాం సర్వే దేవా న వై యుధి ।
తిష్ఠన్తి సమ్ముఖా దేవి కిం పునః స్త్రీ త్వమేకికా ॥75॥

శుంభనిశుంభుల మాట దూరముగా ఉంచుము. మిగిలిన రాక్షసులముందు కూడా యుద్ధమందు సమస్తదేవతలు నిలువజాలరు. ఇక ఏకాకివి, స్త్రీవీ అయిన నీమాట చెప్పవలెనా ఏమి?

ఇంద్రాద్యాః సకలా దేవాస్తస్థుర్యేషాం న సంయుగే ।
శుంభాదీనాం కథం తేషాం స్త్రీ ప్రయాస్యసి సమ్ముఖమ్ ॥76॥

ఇంద్రుడు మొ॥లగు సకలదేవతలు యుద్ధమందు శుంభాదుల యెదుట నిలువజాలరు. అట్లయినప్పుడు ఒక స్త్రీ వారి యెదుటకు ఎట్లు వెళ్ళగలదు?

సా త్వం గచ్ఛ మయైవోక్తా పార్శ్వం శుంభనిశుంభయోః ।
కేశాకర్షణనిర్ధూతగౌరవా మా గమిష్యసి ॥77॥

అట్టి నీవు నేను చెప్పినట్లు శుంభనిశుంభుల సమీపమునకు వెళ్ళుము. నిన్ను జుట్టుపట్టుకొని లాగుకొని వెళ్ళినచో నీ గౌరవము నశించును. ఆ విధముగా గౌరవము పోగొట్టుకొని వెళ్ళవలదు.

శ్రీదేవ్యువాచ – శ్రీదేవి చెప్పింది.

ఏవమేతద్బలీ శుంభో నిశుంభశ్చాతివీర్యవాన్ ।
కిం కరోమి ప్రతిజ్ఞా మే యదనాలోచితా పురా ॥78॥

అవును, నిజమే. శుంభుడు అట్టి బలవంతుడే, నిశుంభుడు కూడా అట్టి బలవంతుడే. ఏమి చేయుదును? పూర్వము నేను ఆలోచించకుండా ప్రతిజ్ఞ చేసితిని.

స త్వం గచ్ఛ మయైవోక్తం యదేతత్సర్వమాదృతః ।
తదాచక్ష్వాసురేన్ద్రాయ స చ యుక్తం కరోతు తత్ ॥79॥

అందువలన నీవు శుంభునివద్దకు పొమ్ము. నేను చెప్పునదంతయు ఆదరముతో విని రాక్షసరాజగు శుంభునికి చెప్పుము. ఆ శుంభుడు కూడా ఏది యుక్తమని తలచునో దానిని చేయుగాక !

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే దేవీమాహాత్మ్యే దేవీదూతసంవాదో నామ ద్వ్యశీతితమోఽధ్యాయః ॥82॥

శ్రీ మార్కండేయ మహాపురాణమందలి దేవీమాహాత్మ్యమందలి దేవీదూతసంవాదమను ఎనభైరెండవ అధ్యాయం సమాప్తం.



త్ర్యశీతితమోఽధ్యాయః – ఎనభైమూడవ అధ్యాయం
దేవీమాహాత్మ్యే ధూమ్రలోచనవధః – దేవీమాహాత్మ్యమందు ధూమ్రలోచనవధ

ఋషిరువాచ – ఋషి చెప్పాడు.

ఇత్యాకర్ణ్య వచో దేవ్యాః స దూతోఽమర్షపూరితః ।
సమాచష్టే సమాగమ్య దైత్యరాజాయ విస్తరాత్ ॥1॥

దేవి ఈ ప్రకారముగా పలికిన పలుకులను విని ఆ దూత మిక్కిలి కోపముతో కూడుకొన్నవాడై రాక్షసరాజగు శుంభుని వద్దకు వచ్చి జరిగినదంతయు విస్తరముగా చెప్పెను.

తస్య దూతస్య తద్వాక్యమాకర్ణ్యాసురరాట్ తతః ।
సక్రోధః ప్రాహ దైత్యానామధిపం ధూమ్రలోచనమ్ ॥2॥

ఆ దూత పలికిన మాటలను విని రాక్షసరాజు మిక్కిలి కోపము కలిగినవాడై రాక్షసాధిపుడైన ధూమ్రలోచనునితో ఇట్లు పలికెను.

హే ధూమ్రలోచనాశు త్వం స్వసైన్యపరివారితః ।
తామానయ బలాద్దుష్టాం కేశాకర్షణవిహ్వలామ్ ॥3॥

ఓ ధూమ్రలోచనుడా ! నీవు స్వీయసైన్యముతో కూడుకొన్నవాడవై వెళ్ళి, జుట్టుపట్టి లాగుటచే దుఃఖితురాలు అగునట్టిదియు, దుష్టురాలూ అగు ఆ స్త్రీని శీఘ్రముగా తీసుకొని రమ్ము.

తత్పరిత్రాణదః కశ్చిద్యది వోత్తిష్ఠతే పరః ।
స హన్తవ్యోఽమరో వాపి యక్షో గన్ధర్వ ఏవ వా ॥4॥

ఆమెను పరిరక్షించుటకై ఇతరుడెవడైననూ ప్రయత్నించినచో, అతడు దేవతలలోనివాడుగాని, యక్షుడుగాని, గంధర్వుడు గాని ఎవడైననూ వానిని సంహరించుము.

ఋషిరువాచ – ఋషి చెప్పాడు.

తేనాజ్ఞప్తస్తతః శీఘ్రం స దైత్యో ధూమ్రలోచనః ।
వృతః షష్ట్యా సహస్రాణామసురాణాం ద్రుతం యయౌ ॥5॥

శుంభునిచే ఆజ్ఞాపింపబడిన ఆ ధూమ్రలోచనరాక్షసుడు అరవైవేల రాక్షససైన్యముతో కూడుకొన్నవాడై దేవి ఉన్నచోటుకు శీఘ్రముగా వెళ్ళెను.

స దృష్ట్వా తాం తతో దేవీం తుహినాచలసంస్థితామ్ ।
జగాదోచ్చైః ప్రయాహీతి మూలం శుంభనిశుంభయోః ॥6॥

పిమ్మట ధూమ్రలోచనుడు హిమాచలపర్వతమందు నిలిచియున్నట్టి ఆ దేవిని చూచి "శుంభనిశుంభులవద్దకు నడువుము" అని బిగ్గరగా పలికెను.

న చేత్ప్రీత్యాద్య భవతీ మద్భర్తారముపైష్యసి ।
తతో బలాన్నయామ్యేష కేశాకర్షణవిహ్వలామ్ ॥7॥

నీవిప్పుడు సంతోషముతో మా ప్రభువును చేరనట్లయితే నిన్ను నేను బలవంతముగా జుట్టుపట్టి ఈడ్చుకొని తీసుకొని వెళ్ళెదను.

శ్రీదేవ్యువాచ – శ్రీదేవి పలికింది.

దైత్యేశ్వరేణ ప్రహితో బలవాన్ బలసంవృతః ।
బలాన్నయసి మామేవం తతః కిం తే కరోమ్యహమ్ ॥8॥

రాక్షసరాజుచే పంపబడిన నీవు బలవంతుడివి, సైన్యముతో కూడుకొన్నవాడివి. అట్టి నీవు బలవంతముగా తీసుకొని పోయినచో నేనేమి చేయగలను?

ఋషిరువాచ – ఋషి చెప్పాడు.

ఇత్యుక్తః సోఽభ్యధావత్తామసురో ధూమ్రలోచనః ।
హుంకారేణైవ తం భస్మ సా చకారామ్బికా తతః ॥9॥

దేవి ఇట్లు పలుకగా, రాక్షసుడగు ఆ ధూమ్రలోచనుడు ఆమెమీదికి పరుగెత్తి పోయెను. అంతట అంబికాదేవి హుంకారము చేయటమాత్రము చేతనే ఆ రాక్షసుని భస్మము చేసెను.

అథ క్రుద్ధం మహాసైన్యమసురాణాం తథామ్బికా ।
వవర్ష సాయకైస్తీక్ష్ణైస్తథా శక్తిపరశ్వధైః ॥10॥

అంతట కోపముతోనిండియున్న ఆ రాక్షసుల గొప్ప సైన్యముపైకి అంబికాదేవి తీక్ష్ణములైన బాణములను, శక్తి ఆయుధమును, గొడ్డళ్ళను వర్షించెను.

తతో ధుతసటః కోపాత్కృత్వా నాదం సుభైరవమ్ ।
పపాతాసురసేనాయాం సింహో దేవ్యాస్తు వాహనః ॥11॥

అంతట దేవియొక్క వాహనమైన ధుతసటమను సింహము కోపముతో బిగ్గరగా భయమునుగొల్పు విధముగా గర్జించి ఆ రాక్షససైన్యముపై ఉరికెను.

కాంశ్చిత్కరప్రహారేణ దైత్యానాస్యేన చాపరాన్ ।
ఆక్రమ్య చరణేనాన్యాన్నిజఘాన మహాసురాన్ ॥12॥

కొంతమంది ఆ గొప్ప రాక్షసులను తన చేతితోనూ, కొంతమందిని తన నోటితోనూ, కొంతమందిని పాదములతోనూ ఆ సింహము ఆక్రమించి చంపివేసెను.

కేషాఞ్చిత్పాటయామాస నఖైః కోష్ఠాని కేసరీ ।
తథా తలప్రహారేణ శిరాంసి కృతవాన్ పృథక్ ॥13॥

కొంతమంది రాక్షసుల ఉదరమధ్యభాగములను ఆ సింహము గోళ్ళతో చీల్చివేసెను. కొంతమంది తలలను దెబ్బలను కొట్టుటద్వారా శరీరమునుండి వేరు చేసెను.

విచ్ఛిన్నబాహుశిరసః కృతాస్తేన తథాఽపరే ।
పపౌ చ రుధిరం కోష్ఠాదన్యేషాం ధుతకేసరః ॥14॥

కొంతమంది రాక్షసుల బాహువులను శిరస్సులను ఆ సింహము నరికివేసెను. ఇంకనూ జూలును విదిల్చిన ఆ సింహము మరికొంతమంది రాక్షసుల ఉదరములను చీల్చి రక్తమును త్రాగెను.

క్షణేన తద్బలం సర్వం క్షయం నీతం మహాత్మనా ।
తేన కేసరిణా దేవ్యా వాహనేనాతికోపినా ॥15॥

మిక్కిలి కోపము వహించిన దేవీవాహనమైన ఆ గొప్ప సింహము క్షణకాలములోనే ఆ రాక్షససైన్యమును నశింపచేసెను.

శ్రుత్వా తమసురం దేవ్యా నిహతం ధూమ్రలోచనమ్ ।
బలం చ క్షయితం కృత్స్నం దేవీకేసరిణా తతః ॥16॥

చుకోప దైత్యాధిపతిః శుంభః ప్రస్ఫురితాధరః ।
ఆజ్ఞాపయామాస చ తౌ చణ్డముణ్డౌ మహాసురౌ ॥17॥

దేవి చేతిలో ధూమ్రలోచనరాక్షసుడు చంపబడ్డాడని, దేవీవాహనమగు సింహముచేత సమస్తసైన్యము నశింపచేయబడినదనీ విని, రాక్షసాధిపతియగు శుంభుడు అదరుచున్న పెదవులు గలవాడై మిక్కిలి కోపగించెను. చండుడు, ముండుడు అను ఇరువురు గొప్ప రాక్షసులను ఇట్లు ఆజ్ఞాపించెను.

హే చణ్డ హే ముణ్డ బలైర్బహుభిః పరివారితౌ ।
గచ్ఛతం తత్ర కృత్వా చ సా సమానీయతాం లఘు ॥18॥

కేశేష్వాకృష్య బద్ధ్వా వా యది వః సంశయో యుధి ।
తదాశేషాయుధైః సర్వైరసురైర్వినిహన్యతామ్ ॥19॥

తస్యాం హతాయాం దుష్టాయాం సింహే చ వినిపాతితే ।
శీఘ్రమాగమ్యతాం బద్ధ్వా గృహీత్వా తామథామ్బికామ్ ॥20॥

ఓ చండుడా ! ఓ ముండుడా ! గొప్ప అసురసైన్యముతో కూడుకొన్నవారై ఆ దేవి ఉన్నచోటుకు వెళ్ళి ఆమెను శీఘ్రముగా తీసుకొని రండు. జుట్టుపట్టుకొనిగాని, బంధించిగాని తీసుకొని రండు. యుద్ధమందు ఆ విధముగా చేయుటకు సంశయము కలిగినచో సమస్త ఆయుధములతోనూ, సమస్త రాక్షసులతోనూ మీరామెను చంపివేయుడు. ఈ విధముగా దుష్టురాలైన ఆమె చంపబడగా, సింహము కూడా చంపబడగా ఆ అంబికను (మృతశరీరమను అభిప్రాయము) బంధించి పట్టుకొని శీఘ్రముగా రండు.

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే దేవీమాహాత్మ్యే ధూమ్రలోచనవధో నామ త్ర్యశీతితమోఽధ్యాయః ॥83॥

శ్రీ మార్కండేయ మహాపురాణమందలి దేవీమాహాత్మ్యమందలి ధూమ్రలోచనవధయను ఎనభైమూడవ అధ్యాయం సమాప్తం.

చతురశీతితమోఽధ్యాయః - ఎనభైనాల్గవ అధ్యాయం
దేవీమాహాత్మ్యే చణ్డముణ్డవధః - దేవీమాహాత్మ్యమందు చండముండుల సంహారం

ఋషిరువాచ - ఋషి చెప్పాడు.

ఆజ్ఞప్తాస్తే తతో దైత్యాశ్చణ్డముణ్డపురోగమాః ।
చతురఙ్గబలోపేతా యయురభ్యుద్యతాయుధాః ॥1॥

శుంభునిచే ఆజ్ఞాపింపబడిన ఆ రాక్షసులు చండుని ముండుని ముందు ఉంచుకొని, చతురంగబలములతో కూడుకొని, ఆయుధములను చేతబూని ఆ యుద్ధప్రదేశమునకు వెళ్ళిరి.

దదృశుస్తే తతో దేవీమీషద్ధాసాం వ్యవస్థితామ్ ।
సింహస్యోపరి శైలేన్ద్రశృఙ్గే మహతి కాఞ్చనే ॥2॥

అటుపిమ్మట ఆ రాక్షసులు కొద్దిగా చిరునవ్వు నవ్వినట్టిదియు, సింహవాహనమును అధిష్ఠించినట్టిదియూ అగు ఆ అంబికాదేవిని సువర్ణమయమైనదీ గొప్పదీయగు ఆ హిమాచలపర్వతశిఖరమందు చూచిరి.

తే దృష్ట్వా తాం సమాదాతుముద్యమం చక్రురుద్యతాః ।
ఆకృష్టచాపాసిధరాస్తథాన్యే తత్సమీపగాః ॥3॥

ఆమెను చూచిన కొందరు రాక్షసులు ఆమెను గ్రహించుటకై ఉద్యమించిరి. మరికొంతమంది రాక్షసులు ఎక్కుపెట్టబడిన విల్లమ్ములను, కత్తులను ధరించి ఆ దేవిని సమీపించిరి.

తతః కోపం చకారోచ్చైరమ్బికా తానరీన్ప్రతి ।
కోపేన చాస్యా వదనం మషీవర్ణమభూత్తదా ॥4॥

అంతట అంబికాదేవి ఆ రాక్షసులపట్ల కోపము వహించెను. కోపముతో ఆమె ముఖము నల్లని వర్ణము గలదయ్యెను.

భృకుటీకుటిలాత్తస్యా లలాటఫలకాద్ద్రుతమ్ ।
కాలీ కరాలవదనా వినిష్క్రాన్తాసిపాశినీ ॥5॥

ముడివేయబడిన కనుబొమలు కలిగిన ఆమె నుదుటిభాగమునుండి శీఘ్రముగా భయంకరమైన ముఖముగలదీ, ఖడ్గపాశాయుధములను ధరించినదియగు కాళికాదేవి ఉద్భవించెను.

విచిత్రఖట్వాఙ్గధరా నరమాలావిభూషణా ।
ద్వీపిచర్మపరీధానా శుష్కమాంసాతిభైరవా ॥6॥

అతివిస్తారవదనా జిహ్వాలలనభీషణా ।
నిమగ్నారక్తనయనా నాదాపూరితదిఙ్ముఖా ॥7॥

సా వేగేనాభిపతితా ఘాతయన్తీ మహాసురాన్ ।
సైన్యే తత్ర సురారీణామభక్షయత్తద్బలమ్ ॥8॥

విచిత్రమైనట్టి ఆయుధవిశేషమైన ఖట్వాఙ్గమును ధరించినట్టిదియు (శివునియొక్క అస్త్రవిశేషము ఖట్వాఙ్గమని వాచస్పత్యం), పుర్రెల మాలను ధరించినట్టిదియు, పులిచర్మమును ధరించినట్టిదియు, శుష్కించిన మాంసము కలదియగుటచే మిక్కిలి భయంకరమైనట్టిదియు, మిక్కిలి విస్తారమైన మోము కల్గినట్టిదియు, నాలుకను బయటకు పెట్టుటచే భయమును గొల్పుచున్నట్టిదియు, ఎర్రని లోతైన కన్నులు కలదియు, తన గర్జనలతో దిగ్భాగములను పూరించుచున్నట్టిదియు, అయిన ఆ కాళికాదేవి గొప్ప గొప్ప రాక్షసులను చంపుచూ, ఆ రాక్షససేనాబలమును భక్షించివేసెను.

పార్ష్ణిగ్రాహాంకుశగ్రాహయోధఘంటాసమన్వితాన్ ।
సముదాయైకహస్తేన ముఖే చిక్షేప వారణాన్ ॥9॥

సైన్యము వెనుక నడచుచున్నట్టివియు, అంకుశములను చేతబూనిన మావటివాళ్ళతో కూడినట్టివియు, యుద్ధమందలి గంటలను ధరించినట్టివియూ అగు ఏనుగులను ఆ చెప్పినవాటితోబాటుగా కాళికాదేవి తన నోటిలో వేసుకొనెను.

తథైవ యోధం తురగై రథం సారథినా సహ ।
నిఃక్షిప్య వక్త్రే దశనైశ్చర్వయన్త్యతిభైరవమ్ ॥10॥

అట్లే గుర్రములు, రథము, రథసారథితో సహా సైన్యమును తన నోటిలో వేసుకొని ఆ కాళికాదేవి మిక్కిలి భయంకరముగా నములుచుండెను.

ఏకం జగ్రాహ కేశేషు గ్రీవాయామథ చాపరమ్ ।
పాదేనాక్రమ్య చైవాన్యమురసాన్యమపోథయత్ ॥11॥

కాళికాదేవి ఒకరిని జుట్టు పట్టుకొని, మరొకరిని మెడ పట్టుకొని, మరొకరిని కాళ్ళతో త్రొక్కి, మరొకరిని తన వక్షఃస్థలముతో దెబ్బకొట్టి చంపివేసెను.

తైర్ముక్తాని చ శస్త్రాణి మహాస్త్రాణి తథాసురైః ।
ముఖేన జగ్రాహ రుషా దశనైర్మథితాన్యపి॥12॥

ఆ రాక్షసులు విడిచిపెట్టుచున్న శస్త్రములను, గొప్ప గొప్ప అస్త్రములను కోపముతో కాళికాదేవి నోటితో గ్రహించి కరకర నములుచుండెను.

బలినాం తద్బలం సర్వమసురాణాం దురాత్మనామ్ ।
మమర్దాభక్షయచ్చాన్యానన్యాంశ్చాతాడయత్తథా ॥13॥

దుర్మార్గులైన రాక్షసులయొక్క బలవంతులతో కూడుకొన్న సైన్యమును ఈ ప్రకారముగా మర్దించెను. కొందరిని భక్షించెను. కొందరిని దెబ్బలతో కొట్టి నశింపచేసెను.

అసినా నిహతాః కేచిత్ కేచిత్ఖట్వాఙ్గతాడితాః ।
జగ్ముర్వినాశమసురా దన్తాగ్రాభిహతా రణే ॥14॥

కొంతమంది రాక్షసులు కత్తిచే చంపబడిరి. కొందరు ఖట్వాంగమను ఆయుధవిశేషముచే చంపబడిరి. కొందరు యుద్ధమందు దేవియొక్క దంతపుకొనలచే కొరకబడి చంపబడిరి.

క్షణేన తన్మహాసైన్యమసురాణాం నిపాతితమ్ ।
దృష్ట్వా చణ్డోఽభిదుద్రావ తాం కాలీమతిభీషణామ్ ॥15॥

క్షణకాలమందు ఆ రాక్షసమహాసైన్యము దేవిచేత నశింపచేయబడినది. ఇట్లు నాశమగుటను చూచి చండుడు మిక్కిలి భయమునుగొల్పుచున్న కాళికాదేవివైపు పరుగెత్తెను.

శరవర్షైర్మహాభీమైర్భీమాక్షీం తాం మహాసురః ।
ఛాదయామాస చక్రైశ్చ ముణ్డక్షిప్తైః సహస్రశః ॥16॥

భయమునుగొల్పు నేత్రములు కలిగిన ఆ కాళికాదేవిని మిక్కిలి భయంకరమైన బాణవర్షములతోనూ, వేలకొలది ముండాసురుడు ప్రయోగించిన చక్రములతోనూ చండాసురుడు కప్పివేసెను.

తాని చక్రాణ్యనేకాని విశమానాని తన్ముఖమ్ ।
బభుర్యథార్కబింబాని సుబహూని ఘనోదరమ్ ॥17॥

అనేక సూర్యబింబములు మేఘమధ్యభాగమందు ప్రవేశించినట్లుగా ఆ చక్రములనేకములు దేవి నోటిలో ప్రవేశించుచుండెను.

తతో జహాసాతిరుషా భీమం భైరవనాదినీ ।
కాలీ కరాలవక్త్రాన్తర్దుర్దర్శదశనోజ్జ్వలా ॥18॥

అటుపిమ్మట మిక్కిలి క్రోధముతో భయంకరమైన శబ్దమును చేయుచూ, భయంకరమైన నోటిలో చూడశక్యముగాని కాంతులీనుచున్న దంతపంక్తి కలిగిన ఆ కాళికాదేవి మిక్కిలి భయంకరముగా నవ్వెను.

ఉత్థాయ చ మహాసింహం దేవీ చణ్డమధావత ।
గృహీత్వా చాస్య కేశేషు శిరస్తేనాసినాచ్ఛినత్ ॥19॥

కాళికాదేవి గొప్ప సింహమును అధిష్ఠించి చండాసురుని వైపు పరుగెత్తి, వాని జుట్టు పట్టుకొని, కత్తితో వాని శిరస్సును నరికెను.

ఛిన్నే శిరసి దైత్యేన్ద్రశ్చక్రే నాదం సుభైరవమ్ ।
తేన నాదేన మహతా త్రాసితం భువనత్రయమ్ ॥20॥

తన తల నరకబడగా, రాక్షసాధిపతి అయిన ఆ చండుడు భయంకరమైన గొప్ప ధ్వనిని చేసెను. అట్టి గొప్ప ధ్వని కారణముగా ముల్లోకములు భయమునకు లోనయ్యెను.

అథ ముణ్డోఽభ్యధావత్తాం దృష్ట్వా చణ్డం నిపాతితమ్ ।
తమప్యపాతయద్భూమౌ ఖట్వాఙ్గాభిహతం రుషా ॥21॥

అంతట, చండుడు క్రింద పడిపోవుటను చూచి, ముండాసురుడు కాళికాదేవివైపు పరుగెత్తెను. అతడిని కూడా దేవి కోపముతో ఖట్వాంగమను ఆయుధవిశేషముతో చంపి క్రింద పడవేసెను.

హతశేషం తతః సైన్యం దృష్ట్వా చణ్డం నిపాతితమ్ ।
ముణ్డం చ సుమహావీర్యం దిశో భేజే భయాతురమ్ ॥22॥

చావగా మిగిలిన రాక్షససైన్యము గొప్ప పరాక్రమవంతులైన చండుడు, ముండుడు ఇరువురు రాక్షసాధిపతులు చచ్చి క్రిందపడిపోవుటను చూచి భయముతో నాలుగు దిక్కులవైపు పరుగెత్తెను.

శిరశ్చణ్డస్య కాలీ సా గృహీత్వా మౌణ్డమేవ చ ।
ప్రాహ ప్రచణ్డాట్టహాసమిశ్రమభ్యేత్య చణ్డికామ్ ॥23॥

మయా తవాత్రోపహృతౌ చణ్డముణ్డౌ మహాపశూ ।
యుద్ధయజ్ఞే స్వయం శుమ్భం నిశుమ్భం చ హనిష్యసి ॥24॥

కాళికాదేవి చండముండుల శిరస్సులను చేతిలో పట్టుకొని వికటాట్టహాసముతో చండికాదేవి వద్దకు వచ్చి ఇట్లు పలికెను. "చండముండులను ఇద్దరు గొప్ప పశువులను చంపి నీ వద్దకు తీసుకు వచ్చితిని. ఈ యుద్ధమనెడు యజ్ఞమందు నీవే స్వయముగా శుంభనిశుంభులను చంపగలవు."

ఋషిరువాచ – ఋషి చెప్పాడు.

తావానీతౌ తతో దృష్ట్వా చణ్డముణ్డౌ మహాసురౌ ।
ఉవాచ కాలీం కల్యాణీ లలితం చణ్డికా వచః ॥25॥

చండముండులను ఇరువురు గొప్ప రాక్షసులను కాళికాదేవి చంపి తన వద్దకు తీసుకువచ్చుటను చూచి, కల్యాణి అయిన చణ్డికాదేవి కాళికాదేవితో మృదువైన మాటలను ఇట్లు పలికెను.

శ్రీదేవ్యువాచ :– శ్రీదేవి పలికెను.

యస్మాచ్చణ్డం చ ముణ్డం చ గృహీత్వా త్వముపాగతా ।
చాముణ్డేతి తతో లోకే ఖ్యాతా దేవీ భవిష్యసి ॥26॥

నీవు చండుని, ముండుని సంహరించి వారిని తీసుకొని ఇచ్చటికి వచ్చినందున, నీవు లోకమందు చాముణ్డాదేవిగా ప్రసిద్ధిని పొందగలవు.

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే దేవీమాహాత్మ్యే చణ్డముణ్డవధో నామ చతురశీతితమోఽధ్యాయః ॥84॥

శ్రీ మార్కండేయ మహాపురాణమందు దేవీమాహాత్మ్యమందలి చండముండుల సంహారమను ఎనభైనాల్గవ అధ్యాయం సమాప్తం.



పఞ్చాశీతితమోఽధ్యాయః - ఎనభైఐదవ అధ్యాయం
దేవీమాహాత్మ్యే రక్తబీజవధః - దేవీమాహాత్మ్యమందు రక్తబీజుని సంహారం

ఋషిరువాచ - ఋషి చెప్పాడు.

చణ్డే చ నిహతే దైత్యే ముణ్డే చ వినిపాతితే ।
బహులేషు చ సైన్యేషు క్షయితేష్వసురేశ్వరః ॥1॥

తతః కోపపరాధీనచేతాః శుమ్భః ప్రతాపవాన్ ।
ఉద్యోగం సర్వసైన్యానాం దైత్యానామాదిదేశ హ ॥2॥

చండముండులు చంపబడుటను, మిక్కిలి అధికమైన రాక్షససైన్యము నశించిపోవుటను చూచి రాక్షసప్రభువైన శుంభుడు కోపముతో స్వాధీనమందులేని చిత్తముగలవాడై ప్రతాపముగలవాడై, సమస్తరాక్షససైన్యములకు వారు చేయవలసిన పనిని ఇట్లు ఆజ్ఞాపించెను.

అద్య సర్వబలైర్దైత్యాః షడశీతిరుదాయుధాః ।
కంబూనాం చతురశీతిర్నిర్యాన్తు స్వబలైర్వృతాః ॥3॥

ఎనభై ఆరుమంది రాక్షసులు ఆయుధములను చేతబూని (లేదా ఉదాయుధనామధేయులు) సమస్త సైన్యములను వెంటబెట్టుకొని, అట్లే కంబునామధేయులగు ఎనభైనాలుగుమంది రాక్షసులు తమ సైన్యములను వెంటనిడుకొని యుద్ధమునకు బయలుదేరుగాక !

కోటివీర్యాణి పఞ్చాశదసురాణాం కులాని వై ।
శతం కులాని ధూమ్రాణాం నిర్గచ్ఛన్తు మమాజ్ఞయా ॥4॥

కోటివీర్యనామధేయము కలిగిన ఏభై రాక్షసకులములు, ధూమ్రనామధేయము కలిగిన వంద రాక్షసకులములు నా ఆజ్ఞతో యుద్ధమునకు బయలుదేరుగాక !

కాలకా దౌర్హృదా మౌర్యాః కాలకేయాస్తథాసురాః ।
యుద్ధాయ సజ్జా నిర్యాన్తు ఆజ్ఞయా త్వరితా మమ ॥5॥

కాలక, దౌర్హృద, మౌర్య, కాలకేయ నామధేయులగు రాక్షసులు నా ఆజ్ఞతో శీఘ్రముగా యుద్ధమునకు సన్నద్ధులు కండు.

ఇత్యాజ్ఞాప్యాసురపతిః శుమ్భో భైరవశాసనః ।
నిర్జగామ మహాసైన్యసహస్రైర్బహుభిర్వృతః ॥6॥

ఈ విధముగా ఆజ్ఞాపించి భయంకరమైన శాసనముగల శుంభాసురుడు వేలకొలదీ రాక్షససైన్యములతో కూడుగొన్నవాడై యుద్ధమునకు బయలుదేరెను.

ఆయాన్తం చణ్డికా దృష్ట్వా తత్సైన్యమతిభీషణమ్ ।
జ్యాస్వనైః పూరయామాస ధరణీగగనాన్తరమ్ ॥7॥

మిక్కిలి భయంకరమైన రాక్షససైన్యము వచ్చుచుండుటను చూచి, చణ్డికాదేవి భూమ్యాకాశములనంతటినీ తన వింటినారిధ్వనులతో పూరించెను.

స చ సింహో మహానాదమతీవ కృతవాన్నృప ।
ఘంటాస్వనేన తన్నాదమంబికా చాప్యబృంహయత్ ॥8॥

ఓ రాజా ! దేవియొక్క వాహనమైన సింహము కూడా గొప్ప శబ్దమును చేసెను. ఆ గొప్ప శబ్దమును అంబికాదేవి తన ఘంటానాదముతో మరింత ఇనుమడింపచేసెను.

ధనుర్జ్యాసింహఘంటానాం నాదాపూరితదిఙ్ముఖా ।
నినాదైర్భీషణైః కాలీ జిగ్యే విస్తారితాననా ॥9॥

వింటినారి, సింహము, గంట వీటి ధ్వనులచే పూరింపబడిన దిగ్భాగములు కలిగిన కాళికాదేవి నోరు బయటకు తెరచి భయంకరమైన ధ్వనులను చేసెను.

తన్నినాదముపశ్రుత్య దైత్యసైన్యైశ్చతుర్దిశమ్ ।
దేవీ సింహస్తథా కాలీ శరౌఘైః పరివారితాః ॥10॥

నాలుగు దిక్కులయందు వ్యాపించిన ఆ ధ్వనులను విన్న రాక్షససేనలు చణ్డికాదేవిని, సింహమును, కాళికాదేవిని బాణసమూహములతో చుట్టుముట్టాయి.

ఏతస్మిన్నన్తరే భూప ! వినాశాయ సురద్విషమ్ ।
భవాయామరసింహానామతివీర్యబలాన్వితా ॥11॥

ఓ రాజా ! ఈ సమయమందు రాక్షసనాశముకొరకు, దేవతల క్షేమముకొరకు దేవి మిక్కిలి బలపరాక్రమములతో కూడియుండెను.

బ్రహ్మేశగుహవిష్ణూనాం తథేన్ద్రస్య చ శక్తయః ।
శరీరేభ్యో వినిష్క్రమ్య తద్రూపైశ్చణ్డికాం యయుః ॥12॥

ఆ సమయమందు బ్రహ్మ, శివుడు, కుమారస్వామి, విష్ణువు, దేవేంద్రుల శక్తులు వారివారి శరీరములనుండి బయల్వెడలి ఆయా దేవదేవతల రూపములను ధరించి చణ్డికాదేవి వద్దకు వచ్చెను.

యస్య దేవస్య యద్రూపం యథా భూషణవాహనమ్ ।
తద్వదేవ హి తచ్ఛక్తిరసురాన్యోద్ధుమాయయౌ ॥13॥

ఏ దేవునియొక్క ఏ రూపమో, భూషణములు వాహనము ఏవో అవే రూపభూషణవాహనములతో ఆ దేవునియొక్క శక్తి రాక్షసులతో యుద్ధము చేయుటకు వచ్చెను.

హంసయుక్తవిమానస్థా సాక్షసూత్రకమణ్డలుః ।
ఆయాతా బ్రహ్మణః శక్తిర్బ్రహ్మాణీ సాఽభిధీయతే ॥14॥

హంసతోకూడుకొన్న విమానమందున్నదీ, అక్షమాల, కమండలములను ధరించినట్టిదీయగు బ్రహ్మయొక్క శక్తి వచ్చెను. ఆ బ్రహ్మయొక్క శక్తియే బ్రహ్మాణి యని పిలవబడుచున్నది.

మాహేశ్వరీ వృషారూఢా త్రిశూలవరధారిణీ ।
మహాహివలయా ప్రాప్తా చన్ద్రలేఖావిభూషణా ॥15॥

మహేశ్వరునియొక్క శక్తి మాహేశ్వరి వృషభవాహనమందు అధిష్ఠించి, శ్రేష్ఠమైన త్రిశూలమును ధరించి, గొప్ప సర్పమును కంకణముగా ధరించి, చంద్రలేఖ అలంకారముగా కలిగి వచ్చెను.

కౌమారీ శక్తిహస్తా చ మయూరవరవాహనా ।
యోద్ధుమభ్యాయయౌ దైత్యానమ్బికా గుహరూపిణీ ॥16॥

చేతియందు శక్తి ఆయుధముగా కలిగి, శ్రేష్ఠమైన నెమలి వాహనముగా కలిగి, గుహరూపిణి అయిన అంబికాదేవి కౌమారియను శక్తిరూపిణి రాక్షసులతో యుద్ధము చేయుటకు వచ్చెను.

తథైవ వైష్ణవీ శక్తిర్గరుడోపరి సంస్థితా ।
శంఖచక్రగదాశార్ఙ్గఖడ్గహస్తాఽభ్యుపాయయౌ ॥17॥

అట్లే విష్ణువుయొక్క శక్తి వైష్ణవి గరుడవాహనమును అధిష్ఠించి, శంఖము, చక్రము, గద, శార్ఙ్గమను విల్లు, ఖడ్గములను చేతియందు ధరించి రాక్షసులతో యుద్ధము చేయుటకు వచ్చెను.

జజ్ఞే వారాహమతులం రూపం యా బిభ్రతీ హరేః ।
శక్తిః సాప్యాయయౌ తత్ర వారాహీం బిభ్రతీం తనుమ్ ॥18॥

విష్ణుమూర్తినుండి అసామాన్యమైన వారాహరూపము ఏది ఉద్భవించెనో ఆ రూపమును ధరించునట్టిది అనగా వారాహి శరీరమును ధరించునట్టి వారాహియను శక్తి కూడా అచ్చటకు వచ్చెను.

నారసింహీ నృసింహస్య బిభ్రతీ సదృశం వపుః ।
ప్రాప్తా తత్ర సటాక్షేపక్షిప్తనక్షత్రసంహతిః ॥19॥

నృసింహునియొక్క సదృశమైన శరీరమును ధరించునట్టి నారసింహీశక్తి తన జూలును విదుల్చుటచే ఇటునటూ చలించుచున్న నక్షత్రసమూహమును ఆభరణముగా ధరించి అచ్చటకు వచ్చెను.

వజ్రహస్తా తథైవైన్ద్రీ గజరాజోపరి స్థితా ।
సహస్రనయనా ప్రాప్తా యథా శక్తిస్తథైవ సా ॥20॥

అట్లే ఇంద్రునియొక్క శక్తి గజరాజమగు ఐరావతమును అధిష్ఠించియున్నదై, వేయి కన్నులు కలిగి, ఇంద్రునివలే ఉన్నట్టి ఐన్ద్రీశక్తి అచ్చటకు వచ్చెను.

తతః పరివృతస్తాభిరీశానో దేవశక్తిభిః ।
హన్యన్తామసురాః శీఘ్రం మమ ప్రీత్యాహ చణ్డికామ్ ॥21॥

అటుపిమ్మట దేవదేవతల శక్తులతో కూడుకొన్న పరమేశ్వరుడు "నా ప్రీతికొరకు రాక్షసులు వెంటనే చంపబడుగాక" అని చండికాదేవితో పలికెను.

తతో దేవీశరీరాత్తు వినిష్క్రాన్తాఽతిభీషణా ।
చణ్డికా శక్తిరత్యుగ్రా శివాశతనినాదినీ ॥22॥

పిమ్మట అంబికాదేవి శరీరమునుండి మిక్కిలి భయంకరమైనట్టిది, నూరు నక్కలు చేయు ధ్వని వంటి ధ్వనిని చేయుచున్నదీ, మిక్కిలి ఉగ్రమైనదీయగు చండికాశక్తి ఉద్భవించినది.

సా చాహ ధూమ్రజటిలమీశానమపరాజితా ।
దూతత్వం గచ్ఛ భగవన్ పార్శ్వం శుంభనిశుంభయోః ॥23॥

ధూమ్రవర్ణముగల జటలు కలిగిన పరమేశ్వరునితో ఓటమినెరుగని చండికాదేవి ఇట్లు పలికెను. "ఓ పూజ్యుడా! నీవు దూతగా శుంభనిశుంభల వద్దకు వెళ్ళుము."

బ్రూహి శుంభం నిశుంభం చ దానవావతిగర్వితౌ ।
యే చాన్యే దానవాస్తత్ర యుద్ధాయ సముపస్థితాః ॥24॥

మిక్కిలి గర్వించియున్న శుంభనిశుంభులను రాక్షసులతోనూ, యుద్ధము చేయటకు వచ్చి మిగిలిన రాక్షసులతోనూ ఈ విధముగా నీవు చెప్పుము.

త్రైలోక్యమిన్ద్రో లభతాం దేవాః సన్తు హవిర్భుజః ।
యూయం ప్రయాత పాతాలం యది జీవితుమిచ్ఛథ ॥25॥

ఇంద్రుడు ముల్లోకముల రాజ్యమును పొందవలెను. దేవతలు హోమద్రవ్యములను భుజించువారు కావలెను. మీకు (రాక్షసులకు) జీవించాలనే కోరిక ఉన్నట్లయితే యుద్ధమును మాని పాతాళలోకమునకు వెళ్ళిపొండు.

బలావలేపాదథ చేద్భవన్తో యుద్ధకాంక్షిణః ।
తదా గచ్ఛత తృప్యన్తు మచ్ఛివాః పిశితేన వః ॥26॥

ఇంకనూ మీరు బలగర్వముతో యుద్ధము చేయాలనే కోరిక కలిగియున్నట్లయితే అట్లే కానిండు. నాకు సంబంధించిన నక్కలు మీ మాంసముతో తృప్తిని పొందుగాక !

యతో నియుక్తో దౌత్యేన తయా దేవ్యా శివః స్వయమ్ ।
శివదూతీతి లోకేఽస్మింస్తతః సా ఖ్యాతిమాగతా ॥27॥

చణ్డికాదేవిచేత దూత్యకార్యముతో (దూతగా) శివుడు స్వయముగా నియమింపబడినందున, ఆమె శివదూతియని లోకమందు ప్రసిద్ధిని పొందినది.

తేఽపి శ్రుత్వా వచో దేవ్యాః శర్వాఖ్యాతం మహాసురాః ।
అమర్షాపూరితా జగ్ముర్యత్ర కాత్యాయనీ స్థితా ॥28॥

దేవి చెప్పిన మాటలను శర్వుడు (శివుడు) చెప్పగా విని ఆ గొప్ప రాక్షసులు క్రోధముతో నిండినవారై కాత్యాయనీదేవి ఉన్న చోటికి వెళ్ళిరి.

తతః ప్రథమమేవాగ్రే శరశక్త్యృష్టివృష్టిభిః ।
వవర్షురుద్ధతామర్షాస్తాం దేవీమమరారయః ॥29॥

అంతట వెనువెంటనే మొదటిగా గర్వముతోనూ, కోపముతోనూ కూడుకొన్న రాక్షసులు బాణములు, శక్తి, ఋష్టి ఆయుధముల వర్షములను దేవిపై వర్షించిరి.

సా చ తత్ప్రహితాన్బాణాన్ శూలశక్తిపరశ్వథాన్ ।
చిచ్ఛేద లీలయాధ్మాతధనుర్ముక్తైర్మహేషుభిః ॥30॥

ఆ రాక్షసులు ప్రయోగించిన బాణములు, శూలములు, శక్తి, గొడ్డళ్ళు ఆయుధములను చండికాదేవి ధనుస్సు ఎక్కుపెట్టి వదులుచున్న పెద్దపెద్ద బాణములతో లీలగా అనగా ఎట్టి శ్రమ, ప్రయత్నవిశేషమూ లేకుండగా చీల్చివేసెను.

తస్యాగ్రతస్తథా కాలీ శూలపాతవిదారితాన్ ।
ఖట్వాఙ్గపోథితాంశ్చారీన్ కుర్వతీ వ్యచరత్తదా ॥31॥

అదే సమయమందు చండికాదేవి అగ్రభాగమందు నిలిచి కాళికాదేవి శత్రువులను శూలములతో పొడిచి చీల్చుచూ, ఖట్వాఙ్గమను ఆయుధవిశేషముతో నశింపచేయుచూ ఆ యుద్ధరంగమందు సంచరించెను.

కమణ్డలుజలాక్షేపహతవీర్యాన్ హతౌజసః ।
బ్రహ్మాణీ చాకరోచ్ఛత్రూన్యేన యేన స్మ ధావతి ॥32॥

బ్రహ్మాణీశక్తి శత్రువులున్న చోట్లకు పరుగెత్తి తన కమండలమందలి జలమును వారిపై చల్లి, వారిని పరాక్రమహీనులుగానూ, తేజోహీనులుగానూ చేసెను.

మాహేశ్వరీ త్రిశూలేన తథా చక్రేణ వైష్ణవీ ।
దైత్యాన్ జఘాన కౌమారీ తథా శక్త్యాతికోపనా ॥33॥

మాహేశ్వరీశక్తి త్రిశూలముతోనూ, వైష్ణవీశక్తి చక్రముతోనూ, మిక్కిలి క్రుద్ధురాలైన కౌమారీశక్తి శక్తితోనూ అనేకమంది రాక్షసులను సంహరించెను.

ఐన్ద్రీ కులిశపాతేన శతశో దైత్యదానవాః ।
పేతుర్విదారితాః పృథ్వ్యాం రుధిరౌఘప్రవర్షిణః ॥34॥

ఐన్ద్రీశక్తి వజ్రాయుధముతో వందలకొలదీ రాక్షసశత్రువులను చంపుటచే వారు చీల్చబడినవారై రక్తప్రవాహములను వర్షించుచూ (క్రక్కుచూ) భూమిపై పడిరి.

తుణ్డప్రహారవిధ్వస్తా దంష్ట్రాగ్రక్షతవక్షసః ।
వారాహమూర్త్యా న్యపతన్ చక్రేణ చ విదారితాః ॥35॥

వారాహమూర్తి తన ముట్టె లేదా మూతితో దెబ్బలను కొట్టుటవల్లనూ, తన కోరల అగ్రభాగములతో రాక్షసుల వక్షోభాగములను నశింపచేయుట వల్లనూ, తన సుదర్శనచక్రముతో చీల్చుటవల్లనూ, రాక్షసులనేకమంది ప్రాణములను వదిలి భూమిపై బడిరి.

నఖైర్విదారితాంశ్చాన్యాన్ భక్షయన్తీ మహాసురాన్ ।
నారసింహీ చచారాజౌ నాదాపూర్ణదిగన్తరా ॥36॥

నారసింహీశక్తి తన గోళ్ళతో ఇతర రాక్షసులను చీల్చుచూ, గొప్పగొప్ప రాక్షసులను భక్షించుచూ నాలుగు దిగ్భాగములను తన గర్జనధ్వనులతో పూరించుచూ యుద్ధరంగమందు సంచరించెను.

చణ్డాట్టహాసైరసురాః శివదూత్యభిదూషితాః ।
పేతుః పృథివ్యాం పతితాంస్తాంశ్చఖాదాథ సా తదా ॥37॥

తన భయంకరమైన అట్టహాసములతో శివదూతి (చండికాదేవి) రాక్షసులను దూషింపజేయగా అనగా నశింపచేయగా, వారు భూమిపై బడిరి. అప్పుడు భూమిపైబడిన ఆ రాక్షసులను దేవి భక్షించెను. (పతితాన్ + తాన్ + చఖాద + అథ)

ఇతి మాతృగణం క్రుద్ధం మర్దయన్తం మహాసురాన్ ।
దృష్ట్వాఽభ్యుపాయైర్వివిధైర్నేశుర్దేవారిసైనికాః ॥38॥

ఈ విధముగా కోపముతో నిండిన మాతృగణము (బ్రహ్మాణి మొ॥లగు శక్తుల సమూహము) వివిధోపాయములతో గొప్ప గొప్ప రాక్షసులను చీల్చి చెండాడుటలను చూచి రాక్షససైనికులు నశించిరి.

పలాయనపరాన్దృష్ట్వా దైత్యాన్మాతృగణార్దితాన్ ।
యోద్ధుమభ్యాయయౌ క్రుద్ధో రక్తబీజో మహాసురః ॥39॥

మాతృగణముచే పీడింపబడిన రాక్షసులు యుద్ధరంగమునుండి పారిపోవుటను చూచి కోపముతో కూడిన రక్తబీజుడగు గొప్ప రాక్షసుడు దేవితో యుద్ధము చేయుటకు వచ్చెను.

రక్తబిన్దుర్యదా భూమౌ పతత్యస్య శరీరతః ।
సముత్పతతి మేదిన్యాస్తత్ప్రమాణో మహాసురః ॥40॥

రక్తబీజరాక్షసుని శరీరమునుండి ఒక్క రక్తబిందువు భూమిమీద పడినవెంటనే ఆ బిందువునుండి ఆ రాక్షసుని ఆకృతిలో సమానమైన గొప్ప రాక్షసుడు పుట్టుచుండెను.

యుయుధే స గదాపాణిరిన్ద్రశక్త్యా మహాసురః ।
తతశ్చైన్ద్రీ స్వవజ్రేణ రక్తబీజమతాడయత్ ॥41॥

గదను చేతియందు ధరించిన గొప్ప రాక్షసుడగు ఆ రక్తబీజుడు ఇంద్రశక్తియగు ఐన్ద్రితో యుద్ధము చేసెను. అంతట ఆ ఐన్ద్రీశక్తి తన వజ్రాయుధముతో రక్తబీజుని కొట్టెను.

కులిశేనాహతస్యాశు బహు సుస్రావ శోణితమ్ ।
సముత్తస్థుస్తతో యోధాస్తద్రూపాస్తత్పరాక్రమాః ॥42॥

వజ్రాయుధముతో కొట్టబడిన ఆ రక్తబీజుని నుండి వెంటనే చాలా రక్తము స్రవించెను. ఆ రక్తప్రవాహమునుండి రక్తబీజుని రూపముతోనూ పరాక్రమముతోనూ సమానులైన అనేకమంది యోధులు ఉత్పన్నమై పైకి లేచిరి.

యావన్తః పతితాస్తస్య శరీరాద్రక్తబిన్దవః ।
తావన్తః పురుషా జాతాస్తద్వీర్యబలవిక్రమాః ॥43॥

ఆ రక్తబీజుని శరీరమునుండి ఎన్ని రక్తబిన్దువులు నేలమీద పడ్డాయో అంతమంది పురుషులు ఆ రక్తబీజుని బలపరాక్రమములు కలిగినవారు ఉత్పన్నమైరి.

తే చాపి యుయుధుస్తత్ర పురుషా రక్తసంభవాః ।
సమం మాతృభిరత్యుగ్రం శస్త్రపాతాతిభీషణమ్ ॥44॥

ఆ రక్తబీజుని రక్తమునుండి పుట్టిన ఆ పురుషులు కూడా మాతృరూపములైన శక్తులతో శస్త్రములను ప్రయోగించుటద్వారా మిక్కిలి భయంకరమైన యుద్ధమును చేసిరి.

పునశ్చ వజ్రపాతేన క్షతమస్య శిరో యదా ।
వవాహ రక్తం పురుషాస్తతో జాతాః సహస్రశః ॥45॥

తిరిగి వజ్రాయుధపు దెబ్బతో రక్తబీజుని శిరస్సు పగలగా రక్తము ప్రవహించెను. ఆ రక్తమునుండి వేలకొలది పురుషులు మరల ఉత్పన్నమైరి.

వైష్ణవీ సమరే చైనం చక్రేణాభిజఘాన హ ।
గదయా తాడయామాస ఐన్ద్రీ తమసురేశ్వరమ్ ॥46॥

వైష్ణవీశక్తి ఆ రక్తబీజుని సుదర్శనచక్రముతో వధించెను. ఐన్ద్రీశక్తి ఆ రాక్షసేశ్వరుని గదతో దెబ్బకొట్టెను.

వైష్ణవీచక్రభిన్నస్య రుధిరస్రావసంభవైః ।
సహస్రశో జగద్వ్యాప్తం తత్ప్రమాణైర్మహాసురైః ॥47॥

వైష్ణవీచక్రముతో పగిలిన తలనుండి రక్తపుటేరులు ప్రవహించగా ఆ రక్తము నుండి ఆ రక్తబీజుని ఆకారంతో సమానమైన ఆకారము కలిగిన వేలకొలదీ రాక్షసులు పుట్టారు. వారితో ఈ జగత్తంతా వ్యాపించినది.

శక్త్యా జఘాన కౌమారీ వారాహీ చ తథాసినా ।
మాహేశ్వరీ త్రిశూలేన రక్తబీజం మహాసురమ్ ॥48॥

కౌమారీశక్తి శక్తి ఆయుధముతోనూ, వారాహీశక్తి కత్తితోనూ, మాహేశ్వరీశక్తి త్రిశూలముతోనూ ఆ రక్తబీజుడను గొప్ప రాక్షసుని వధించిరి.

స చాపి గదయా దైత్యః సర్వా ఏవాహనత్పృథక్ ।
మాతౄః కోపసమావిష్టో రక్తబీజో మహాసురః ॥50॥

ఆ రక్తబీజుడను మహారాక్షసుడు కూడా కోపముతో కూడుకొన్నవాడై వేరువేరుగా ఆ శక్తిరూపిణులైన మాతృగణములను గదతో తాడించెను (దెబ్బ కొట్టెను).

తస్యాహతస్య బహుధా శక్తిశూలాదిభిర్భువి ।
పపాత యో వై రక్తౌఘస్తేనాసన్ శతశోఽసురాః ॥50॥

అనేక ప్రకారములుగా శక్తిశూలాదులతో కొట్టబడిన ఆ రక్తబీజునినుండి క్రిందకు పడిన రక్తప్రవాహము నుండి వందల కొలదీ రాక్షసులుద్భవించిరి.

తైశ్చాసురాసృక్సంభూతైరసురైః సకలం జగత్ ।
వ్యాప్తమాసీత్తతో దేవా భయమాజగ్మురుత్తమమ్ ॥51॥

ఆ రక్తబీజుని రక్తమునుండి ఉద్భవించిన రాక్షసులతో జగత్తంతా వ్యాపించిపోయెను. అంతట దేవతలు గొప్ప భయమును పొందిరి.

తాన్విషణ్ణాన్సురాన్ దృష్ట్వా చణ్డికా ప్రాహ సత్వరా ।
ఉవాచ కాలీం చాముణ్డే విస్తీర్ణం వదనం కురు ॥52॥

ఆ విధముగా భయముతో నిండిన దేవతలను చూచి చండికాదేవి వెంటనే కాళికాదేవితో ఇట్లు పలికెను. ఓ చాముండా ! నీ నోటిని విస్తరింపచేయుము.

మచ్ఛస్త్రపాతసంభూతాన్రక్తబిన్దూన్మహాసురాన్ ।
రక్తబీజాత్ప్రతీచ్ఛ త్వం వక్త్రేణానేన వేగినా ॥53॥

నా శస్త్రప్రహారములచే ఉద్భవించిన రక్తబీజుని రక్తబిందువులనెడు గొప్ప రాక్షసులను నీవీ విస్తారము చెందిన నోటితో వేగముగా గ్రహించుము.

భక్షయన్తీ చర రణే తదుత్పన్నాన్మహాసురాన్ ।
ఏవమేష క్షయం దైత్యః క్షీణరక్తో గమిష్యతి ॥54॥

ఆ విధముగా రక్తబీజుని రక్తమునుండి ఉద్భవించిన గొప్ప రాక్షసులను తినుచున్నదానవై నీవు యుద్ధరంగమందు సంచరించుము. ఈ విధముగా ఈ రాక్షసుడు రక్తము క్షీణించి నాశము చెందును.

ఋషిరువాచ – ఋషి చెప్పాడు.

ఇత్యుక్త్వా తాం తతో దేవీ శూలేనాభిజఘాన తమ్ ।
ముఖేన కాలీ జగృహే రక్తబీజస్య శోణితమ్ ॥55॥

ఈ విధముగా చణ్డికాదేవి కాళికాదేవితో పలికి శూలముతో రక్తబీజుని పొడిచెను. ఆ రక్తబీజుని శరీరము నుండి కారుచున్న రక్తమును కాళికాదేవి తన నోటితో గ్రహించెను.

తతోఽసావాజఘానాథ గదయా తత్ర చణ్డికామ్ ।
న చాస్యా వేదనాం చక్రే గదాపాతోఽల్పికామపి ॥56॥

అంతట రక్తబీజుడు తన గదతో చండికాదేవిని దెబ్బకొట్టెను ఆ గదాప్రహారము కొంచెము కూడా దేవికి నొప్పిని కల్గించలేదు.

తస్యాహతస్య దేహాత్తు బహు సుస్రావ శోణితమ్ ।
యతస్తతః స్వవక్త్రేణ చాముణ్డా సంప్రతీచ్ఛతి ॥57॥

ఈ విధముగా చండికాదేవిచే కొట్టబడిన రక్తబీజుని దేహము నుండి ఎటునుంచి రక్తము ప్రవహించెనో అటునుంచే చాముండాదేవి తన నోటితో ఆ రక్తమును గ్రహించుచుండెను.

ముఖే సముద్గతా యేఽస్యా రక్తపాతాన్మహాసురాః ।
తాంశ్చఖాదాథ చాముణ్డా పపౌ తస్య చ శోణితమ్ ॥58॥

రక్తబీజుని రక్తపాతమువలన ఉద్భవించిన గొప్ప రాక్షసులు కాళికాదేవి నోటిలో పడగా వారిని ఆమె భక్షించెను. ఆ రాక్షసుని రక్తమును కూడా త్రాగెను.

దేవీ శూలేన చక్రేణ బాణైరసిభిరిష్టిభిః ।
జఘాన రక్తబీజం తం చాముణ్డాపీతశోణితమ్ ॥59॥

చణ్డికాదేవి శూలముతోనూ, చక్రముతోనూ, బాణములతోనూ, కత్తులతోనూ, ఖడ్గాదులతోనూ చాముండాదేవిచే త్రాగబడిన రక్తము కలిగిన రక్తబీజుని చంపెను.

స పపాత మహీపృష్ఠే శస్త్రసంఘాతితో హతః ।
నీరక్తశ్చ మహీపాల రక్తబీజో మహాసురః ॥60॥

ఓ రాజా ! శస్త్రసమూహముచే చంపబడిన ఆ రక్తబీజమహారాక్షసుడు రక్తహీనుడై నేలపై పడి ప్రాణములను వదిలెను.

తతస్తే హర్షమతులమవాపుస్త్రిదశా నృప ।
తేషాం మాతృగణో మత్తో ననర్తాసృఙ్మదోద్ధతః ॥61॥

ఓ రాజా ! అనంతరము దేవతలు అమితమైన ఆనందమును పొందిరి. దేవదేవతల నుండి ఉద్భవించిన శక్తిరూపమైన మాతృగణము రాక్షసుల రక్తమును త్రాగుటచే మదించి నృత్యము చేసెను.

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే దేవీమాహాత్మ్యే రక్తబీజవధోనామ పఞ్చాశీతితమోఽధ్యాయః ॥75॥

శ్రీ మార్కండేయ మహాపురాణమందలి దేవీమాహాత్మ్యమందలి రక్తబీజుని సంహారమను ఎనభైఅయిదవ అధ్యాయం సమాప్తం.



షడశీతితమోఽధ్యాయః – ఎనభైఆరవ అధ్యాయం
దేవీమాహాత్మ్యే నిశుంభవధః – దేవీమాహాత్మ్యమందు నిశుంభుని సంహారం

రాజోవాచ – రాజు పలికాడు.

విచిత్రమిదమాఖ్యాతం భగవన్భవతా మమ ।
దేవ్యాశ్చరితమాహాత్మ్యం రక్తబీజవధాశ్రితమ్ ॥1॥

భూయశ్చేచ్ఛామ్యహం శ్రోతుం రక్తబీజే నిపాతితే ।
చకార శుంభో యత్కర్మ నిశుంభశ్చాతికోపనః ॥2॥

ఓ పూజ్యుడా ! రక్తబీజవధకు సంబంధించిన అద్భుతమైన ఈ దేవీచరిత్రమాహాత్మ్యమును మీరు నాకు చెప్పితిరి. రక్తబీజుడు చంపబడిన తరువాత, శుంభుడు మరియు మిక్కిలి కోపస్వభావముగల నిశుంభుడు ఏమి చేసిరో దానిని మరల వినవలెనని కోరుచున్నాను.

ఋషిరువాచ – ఋషి చెప్పాడు.

చకార కోపమతులం రక్తబీజే నిపాతితే ।
శుంభాసురో నిశుంభశ్చ హతేష్వన్యేషు చాహవే ॥3॥

అనంతరము, రక్తబీజుడు మరియు తమ రాక్షససైన్యమూ యుద్ధమందు చంపబడుటను చూచి, శుంభనిశుంభ రాక్షసులు మిక్కిలి క్రుద్ధులైరి.

హన్యమానం మహాసైన్యం విలోక్యామర్షముద్వహన్ ।
అభ్యధావన్నిశుంభోఽథ ముఖ్యయాఽసురసేనయా ॥4॥

తమ గొప్ప సైన్యము చంపబడుచుండుటను చూచి శుంభాసురుడు మిక్కిలి కోపమును వహించి ముఖ్యమైన రాక్షససేనను వెంటబెట్టుకొని యుద్ధమునకు పరుగెత్తెను.

తస్యాగ్రతస్తథా పృష్ఠే పార్శ్వయోశ్చ మహాసురాః ।
సందష్టౌష్ఠపుటాః క్రుద్ధా హన్తుం దేవీముపాయయుః ॥5॥

ఆ శుంభునికి ముందు, వెనుక, ప్రక్కభాగములందు గొప్ప గొప్ప రాక్షసులు నిలిచి పెదవులు కొరుకుకొనుచూ మిక్కిలి కోపముతో దేవిని చంపుటకు దేవిని సమీపించిరి.

ఆజగామ మహావీర్యః శుంభోఽపి స్వబలైర్వృతః ।
నిహన్తుం చణ్డికాం కోపాత్కృత్వా యుద్ధం తు మాతృభిః ॥6॥

గొప్ప బలపరాక్రమములు కలిగిన శుంభాసురుడు కూడా తన సైన్యమును వెంటనిడుకొని మాతృగణములతో యుద్ధము చేసి దేవిని సంహరించుటకై అత్యంతకోపముతో వచ్చెను.

తతో యుద్ధమతీవాసీద్దేవ్యాః శుంభనిశుంభయోః ।
శరవర్షమతీవోగ్రం మేఘయోరివ వర్షతోః ॥7॥

వర్షించుచున్న రెండు మేఘములవలే దేవికి మరియు శుంభనిశుంభరాక్షసులకు మధ్య బాణవర్షముతో భయంకరమైన గొప్ప యుద్ధము జరిగెను.

చిచ్ఛేదాస్తాన్ శరాంస్తాభ్యాం చణ్డికా స్వశరోత్కరైః ।
తాడయామాస చాఙ్గేషు శస్త్రౌఘైరసురేశ్వరౌ ॥8॥

శుంభనిశుంభులచేత బాగుగా ప్రయోగింపబడిన బాణములను చణ్డికాదేవి తన బాణసమూహములతో ఛేదించెను. ఇంకనూ తన శస్త్రసమూహములతో ఆ ఇరువురు రాక్షసాధిపతుల అవయములందు దెబ్బలు కొట్టెను. ("ఆస్త" శబ్దానికి ద్వితీయావిభక్తి బహువచనరూపం "ఆస్తాన్" బాగుగా ప్రయోగింపబడినవని అర్థం)

నిశుంభో నిశితం ఖడ్గం చర్మ చాదాయ సుప్రభమ్ ।
అతాడయన్మూర్ధ్ని సింహం దేవ్యా వాహనముత్తమమ్ ॥9॥

నిశుంభుడు వాడి అయిన ఖడ్గమును, మిక్కిలి కాంతిమంతమైన కవచమును ధరించి యుద్ధమందు దేవీవాహనమైన గొప్ప సింహమును తలపై బాదెను.

తాడితే వాహనే దేవీ క్షురప్రేణాసిముత్తమమ్ ।
నిశుంభస్యాశు చిచ్ఛేద చర్మ చాప్యష్టచన్ద్రకమ్ ॥10॥

నిశుంభుడు దేవీవాహనమును మోదగా, దేవి క్షురప్రమను ఆయుధముతో నిశుంభునియొక్క గొప్ప కత్తిని ముక్కలు ముక్కలు చేసెను. ఇంకను ఎనిమిది చంద్రులతో చిత్రింపబడిన అతడి కవచమును కూడా దేవి విచ్ఛిన్నము చేసెను.

ఛిన్నే చర్మణి ఖడ్గే చ శక్తిం చిక్షేప సోఽసురః ।
తామప్యస్య ద్విధా చక్రే చక్రేణాభిముఖాగతమ్ ॥11॥

తన కవచము, ఖడ్గము విచ్ఛిన్నము కాగా, ఆ నిశుంభుడు శక్తి ఆయుధమును దేవిపై ప్రయోగించెను. తనకెదురుగా వచ్చుచున్న ఆ ఆయుధమును కూడా దేవి రెండు ముక్కలు చేసెను.

కోపాధ్మాతో నిశుంభోఽథ శూలం జగ్రాహ దానవః ।
ఆయాన్తం ముష్టిపాతేన దేవీ తచ్చాప్యచూర్ణయత్ ॥12॥

అంతట కోపమును వహించిన నిశుంభుడు శూలమును గ్రహించెను. తన వద్దకు వచ్చుచున్న ఆ ఆయుధమును కూడా తన పిడికిలిదెబ్బతో దేవి పిండి పిండి చేసెను.

అథాదాయ గదాం సోఽపి చిక్షేప చణ్డికాం ప్రతి ।
సాఽపి దేవ్యా త్రిశూలేన భిన్నా భస్మత్వమాగతా ॥13॥

అటు పిమ్మట నిశుంభుడు గదాయుధమును గ్రహించి, చణ్డికవైపు విసిరెను. ఆ గద కూడా చణ్డికాదేవి తన త్రిశూలముతో ముక్కలు ముక్కలు చేయగా, అది భస్మమయ్యెను.

తతః పరశుహస్తం తమాయాన్తం దైత్యపుఙ్గవమ్ ।
ఆహత్య దేవీ బాణౌఘైరపాతయత భూతలే ॥14॥

అనంతరము గొడ్డలి ఆయుధమును గ్రహించి తనవైపు వచ్చుచున్న ఆ రాక్షసాధిపతియగు నిశుంభుని చణ్డికాదేవి బాణసమూహములతో గాయపరచి నేలపై పడవేసెను.

తస్మిన్నిపతితే భూమౌ నిశుంభే భీమవిక్రమే ।
భ్రాతర్యతీవ సంక్రుద్ధః ప్రయయౌ హన్తుమంబికామ్ ॥15॥

భయమునుగొల్పు పరాక్రమముగల తన సోదరుడైన నిశుంభుడు భూమిపై పడిపోగా అత్యంతక్రోధము కలిగిన శుంభుడు అంబికను చంపుటకు బయలుదేరెను.

స రథస్థస్తదాఽత్యుచ్చైర్గృహీతపరమాయుధైః ।
భుజైరష్టాభిరతులైర్వ్యాప్యాశేషం బభౌ నభః ॥16॥

ఆ శుంభుడు రథమందు ఉన్నవాడై, మిక్కిలి పొడవైనవి, ఆయుధములను గ్రహించినవీ, సాటిలేనివీ అయిన ఎనిమిది భుజములతో ఆకాశమంతా వ్యాపించి ప్రకాశించెను.

తమాయాన్తం సమాలోక్య దేవీ శంఖమవాదయత్ ।
జ్యాశబ్దం చాపి ధనుషశ్చకారాతీవ దుస్సహమ్ ॥17॥

తన మీదకు వచ్చుచున్న ఆ శుంభుని చూచి అంబికాదేవి శంఖమును పూరించెను. ఇంకను సహింపశక్యము గాని వింటినారిధ్వనిని చేసెను.

పూరయామాస కకుభో నిజఘంటాస్వనేన చ ।
సమస్తదైత్యసైన్యానాం తేజోవధవిధాయినా ॥18॥

సమస్తరాక్షససేనల తేజస్సును అపహరించే తన ఘంటానాదముతో చణ్డికాదేవి దిక్కులనన్నింటినీ పూరించెను.

తతః సింహో మహానాదైస్త్యాజితేభమహామదైః ।
పూరయామాస గగనం గాం తథైవ దిశో దశ ॥19॥

అటుపిమ్మట ఏనుగుల గొప్ప మదమును అణచునట్టి దేవీవాహనమైన సింహము తన గర్జనలతో భూమ్యాకాశములను అలాగే దశదిశలను వ్యాపింపజేసింది.

తతః కాలీ సముత్పత్య గగనం క్ష్మామతాడయత్ ।
కరాభ్యాం తన్నినాదేన ప్రాక్స్వనాస్తే తిరోహితాః ॥20॥

అనంతరము కాళికాదేవి ఆకాశముపైకి ఎగిరి, క్రిందకు దుమికి తన రెండు చేతులతో భూమిని చరచెను. ఆ విధముగా చరచుటవలన కలిగిన శబ్దముచే ఇంతకు ముందు సంభవించిన ధ్వనులన్నియూ తిరోహితములయ్యెను అనగా అల్పమయ్యెను.

అట్టాట్టహాసమశివం శివదూతీ చకార హ ।
తైః శబ్దైరసురాస్త్రేసుః శుంభః కోపం పరం యయౌ ॥21॥

శివదూతియగు చండిక కూడా అమంగళకారియగు వికటాట్టహాసమును చేసెను. ఆ శబ్దముల వలన రాక్షసులంతా భయపడగా, శుంభుడు మిక్కిలి కోపగించెను.

దురాత్మన్ తిష్ఠ తిష్ఠేతి వ్యాజహారామ్బికా యదా ।
తదా జయేత్యభిహితం దేవైరాకాశసంస్థితైః ॥22॥

ఓ దుర్గార్గుడా ! నిలువుము, నిలువుము అని అంబికాదేవి పలికినంతనే, ఆకాశమందున్న దేవతలు "జయమును పొందుము" అని పలికిరి.

శుంభేనాగత్య యా శక్తిర్ముక్తా జ్వాలాతిభీషణా ।
ఆయాన్తీ వహ్నికూటాభా సా నిరస్తా మహోల్కయా ॥23॥

శుంభుడు ముందుకు వచ్చి మిక్కిలి భయంకరమైన జ్వాలారూపమైన శక్తిని ప్రయోగించగా, వహ్నిసమూహమువలె ప్రకాశించుచూ తనపైకి వచ్చుచున్న ఆ శక్తిని అంబికాదేవి మహోల్కయను ఆయుధవిశేషముచే త్రిప్పికొట్టెను.

సింహనాదేన శుంభస్య వ్యాప్తం లోకత్రయాన్తరమ్ ।
నిర్ఘాతనిస్వనో ఘోరో జితవానవనీపతే ॥24॥

ఓ రాజా ! శుంభుడు సింహనాదముతో గొప్పగా గర్జించగా, ఆ ధ్వని ముల్లోకములను వ్యాపించెను. కాని దేవీప్రభావముచే ఆకాశమందు ఉద్భవించిన మెరుపులధ్వని ఆ శుంభుడు చేసిన సింహనాదమును జయించెను (తిరస్కరించెను).

శుంభముక్తాన్ శరాన్దేవీ శుంభస్తత్ప్రహితాన్ శరాన్ ।
చిచ్ఛేద స్వశరైరుగ్రైః శతశోఽథ సహస్రశః ॥25॥

వందలకొలదీ, వేలకొదీ శుంభుడు విడిచిన బాణములను దేవి తన ఉగ్రరూపమైన బాణములతో విచ్ఛిన్నము చేసెను. అట్లే దేవి విడిచిన బాణములను కూడా శుంభుడు విచ్ఛిన్నము చేసెను.

తతః సా చణ్డికా క్రుద్ధా శూలేనాభిజఘాన తమ్ ।
స తదాభిహతో భూమౌ మూర్ఛితో నిపపాత హ ॥26॥

అంతట క్రుద్ధురాలైన చణ్డికాదేవి శుంభుని తన శూలముతో పొడిచి గాయపరచెను. ఆ విధముగా కొట్టబడ్డ శుంభుడు మూర్ఛచెంది నేలపై పడిపోయెను.

తతో నిశుంభః సంప్రాప్య చేతనామాత్తకార్ముకః ।
ఆజఘాన శరైర్దేవీం కాలీం కేసరిణం తథా ॥27॥

అంతట నిశుంభుడు చేతనత్వమును పొంది విల్లమ్ములను ధరించి బాణములతో అంబికాదేవిని, ఆమె వాహనమైన సింహమును కొట్టెను.

పునశ్చ కృత్వా బాహూనామయుతం దనుజేశ్వరః ।
చక్రాయుధేన దితిజశ్ఛాదయామాస చణ్డికామ్ ॥28॥

తిరిగి రాక్షసాధిపతి అయిన నిశుంభుడు పదివేల బాహువులను ధరించి చక్రాయుధముతో చణ్డికాదేవిని కప్పివేసెను.

తతో భగవతీ క్రుద్ధా దుర్గా దుర్గతినాశినీ ।
చిచ్ఛేద తాని చక్రాణి స్వశరైః సాయకాంశ్చ తాన్ ॥29॥

అంతట దుర్గతిని నశింపచేయు భగవతి అయిన దుర్గాదేవి క్రుద్ధురాలై తన బాణములతో నిశుంభుడు ప్రయోగించిన చక్రములను, బాణములను కూడా త్రుంచివేసెను.

తతో నిశుంభో వేగేన గదామాదాయ చణ్డికామ్ ।
అభ్యధావత వై హన్తుం దైత్యసేనాసమావృతః ॥30॥

అటుపిమ్మట నిశుంభుడు వేగముగా గదాయుధమును గ్రహించి రాక్షససేనాపరివృతుడై, చణ్డికాదేవిని చంపుటకు పరుగెత్తెను.

తస్యాపతత ఏవాశు గదాం చిచ్ఛేద చణ్డికా ।
ఖడ్గేన శితధారేణ స చ శూలం సమాదదే ॥31॥

తనపైకి వచ్చుచున్న ఆ గదాయుధమును చండికాదేవి మిక్కిలి వాడియైన తన ఖడ్గముతో విచ్ఛిన్నము చేసెను. అంతట నిశుంభుడు శూలమును గ్రహించెను.

శూలహస్తం తమాయాన్తం నిశుంభమమరార్దనమ్ ।
హృది వివ్యాధ శూలేన వేగావిద్ధేన చణ్డికా ॥32॥

దేవతలకు దుఃఖాన్ని కలిగించే నిశుంభాసురుడు శూలాన్ని చేత్తోపట్టుకొని తనపైకి వస్తుండగా చండికాదేవి తన శూలంతో అతని హృదయంలో పొడిచింది.

భిన్నస్య తస్య శూలేన హృదయాన్నిఃసృతోఽపరః ।
మహాబలీ మహావీర్యస్తిష్ఠేతి పురుషో వదన్ ॥33॥

దేవియొక్క శూలముతో నిశుంభుడు చీల్చబడగా, అతని హృదయమునుండి గొప్ప బలవంతుడూ, గొప్ప పరాక్రమవంతుడూ అగు మరొక పురుషుడు "నిలువుము"అని పలుకుచూ ఉద్భవించెను.

తస్య నిష్క్రామతో దేవీ ప్రహస్య స్వనవత్తతః ।
శిరశ్చిచ్ఛేద ఖడ్గేన తతోఽసావపతద్భువి ॥34॥

అతడా విధముగా ఉద్భవించగా, అంబికాదేవి పెద్దగా నవ్వి తన ఖడ్గముతో ఆ పురుషుని శిరస్సును నరికెను. అంతట ఆ పురుషుడు నేలపై బడెను. అనగా నిశుంభుడు మరణించెను.

తతః సింహశ్చఖాదోగ్రదంష్ట్రాక్షుణ్ణశిరోధరాన్ ।
అసురాంస్తాంస్తథా కాలీ శివదూతీ తథాపరాన్ ॥35॥

అంతట దేవీవాహనమైన సింహము తన వాడియైన కోరలతో ముక్కలుగా చేయబడిన శిరస్సులు గల రాక్షసులను భక్షించెను. శివదూతి అయిన చణ్డికాదేవి మరికొంతమంది రాక్షసులను భక్షించెను.

కౌమారీశక్తినిర్భిన్నాః కేచిన్నేశుర్మహాసురాః ।
బ్రహ్మాణీమన్త్రపూతేన తోయేనాన్యే నిరాకృతాః ॥36॥

కౌమారీశక్తిచే తునకలై కొంతమంది రాక్షసులు నశించిరి. బ్రహ్మాణీశక్తిమంత్రముతో పవిత్రమైన జలమును చల్లగా మరికొంతమంది రాక్షసులు నశించిరి.

మాహేశ్వరీత్రిశూలేన భిన్నాః పేతుస్తథాపరే ।
వారాహీతుణ్డఘాతేన కేచిచ్చూర్ణీకృతా భువి ॥37॥

మాహేశ్వరీశక్తియొక్క త్రిశూలముతో చీల్చబడి కొంతమంది రాక్షసులు నేలపైబడిరి. వారాహీశక్తియొక్క ముట్టె దెబ్బలతో మరికొంతమంది నుగ్గు నుగ్గు అయి నేలపై బడిరి.

ఖణ్డం ఖణ్డం చ చక్రేణ వైష్ణవ్యా దానవాః కృతాః ।
వజ్రేణ చైన్ద్రీహస్తాగ్రవిముక్తేన తథాఽపరే ॥38॥

వైష్ణవీశక్తి ప్రయోగించిన చక్రాయుధమువలన కొంతమంది రాక్షసులు ముక్కలు ముక్కలు అయిరి. ఐన్ద్రీశక్తి ప్రయోగించిన వజ్రాయుధముతో మరికొంతమంది నశించిరి.

కేచిద్వినేశురసురాః కేచిన్నష్టా మహాఽహవాత్ ।
భక్షితాశ్చాపరే కాలీశివదూతీమృగాధిపైః ॥39॥

కొంతమంది రాక్షసులు వారంతటవారే (భయమువలన) నశించిరి. కొంతమంది యుద్ధము కారణముగా మరణించిరి. మరికొంతమంది రాక్షసులు కాళికాదేవి, శివదూతి, సింహములచే భక్షింపబడిరి.

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే దేవీమాహాత్మ్యే నిశుంభవధవర్ణనం నామ షడశీతితమోఽధ్యాయః ॥86॥

శ్రీ మార్కండేయ మహాపురాణమందలి దేవీమాహాత్మ్యమందలి నిశుంభవధవర్ణనమను ఎనభైఆరవ అధ్యాయం సమాప్తం.

సప్తాశీతితమోఽధ్యాయః – ఎనభైఏడవ అధ్యాయం

దేవీమాహాత్మ్యే శుంభవధః – దేవీమాహాత్మ్యమందు శుంభుని సంహరించుట

ఋషిరువాచ – ఋషి చెప్పాడు.

నిశుంభం నిహతం దృష్ట్వా భ్రాతరం ప్రాణసమ్మితమ్ ।
హన్యమానం బలం చైవ శుంభః క్రుద్ధోఽబ్రవీద్వచః ॥1॥

బలావలేపాద్దుష్టే త్వం మా దుర్గే గర్వమావహ ।
అన్యాసాం బలమాశ్రిత్య యుధ్యసే యాఽతిమానినీ ॥2॥

ప్రాణసమానుడయిన తన సోదరుడగు నిశుంభుడు మరియు తన రాక్షససేనలు చంపబడుటను చూచి శుంభుడు కోపముతో దేవితో ఇట్లు పలికెను. "మదించినందున ఓ దుష్టురాలా ! ఓ దుర్గా ! నీవు బలవంతురాలనని గర్వించకుము. అభిమానవతియగు నీవు ఇతరుల బలములనాశ్రయించి యుద్ధము చేయుచున్నావు.

శ్రీదేవ్యువాచ – శ్రీదేవి పలికింది.

ఏకైవాహం జగత్యత్ర ద్వితీయా కా మమాపరా ।
పశ్యైతా దుష్ట మయ్యేవ విశన్త్యో మద్విభూతయః ॥3॥

ఓ దుష్టుడా ! ఈ జగత్తులో ఉన్నది నేనొక్కదానినే. నాకంటే వేరే ఎవరున్నారు? చూడుము, నా విభూతులగు ఈ శక్తులన్నియు నా యందే ప్రవేశించి లీనమగుచున్నవి.

ఋషిరువాచ – ఋషి చెప్పాడు.

తతః సమస్తాస్తా దేవ్యో బ్రహ్మాణీప్రముఖా లయమ్ ।
తస్యా దేవ్యాస్తనౌ జగ్మురేకైవాసీత్తదామ్బికా ॥4॥

పిమ్మట దేవియొక్క బ్రహ్మాణి మొ॥లగు శక్తులన్నియు ఒక్కటై ఆ దేవియొక్క తనువునందు (శరీరమునందు) ప్రవేశించినవి. అంతట అంబికాదేవి ఒక్కతే అయ్యెను.

శ్రీదేవ్యువాచ – శ్రీదేవి పలికింది.

అహం విభూత్యా బహుభిరిహ రూపైర్యదాస్థితా ।
తత్సంహృతం మయైకైవ తిష్ఠామ్యాజౌ స్థిరో భవ ॥5॥

నా విభూతియొక్క అనేకరూపములతో నిలిచిన నేను, ఆ రూపములన్నియు ఏకమై ఇప్పుడు ఒక్కదానిగానే ఉన్నాను. ఇక నీవు యుద్ధమందు స్థిరముగా (స్థిరబుద్ధితో) ఉండుము.

ఋషిరువాచ – ఋషి చెప్పాడు.

తతః ప్రవవృతే యుద్ధం దేవ్యాః శుమ్భస్య చోభయోః ।
పశ్యతాం సర్వదేవానామసురాణాం చ దారుణమ్ ॥6॥

అటు పిమ్మట దేవతలు, రాక్షసులు చూచుచుండగా అంబికాదేవి, శుంభాసురుల మధ్య భయంకరమైన యుద్ధము సంభవించెను.

శరవర్షైః శితైః శస్త్రైస్తథా చాస్త్రైః సుదారుణైః ।
తయోర్యుద్ధమభూద్భూయః సర్వలోకభయంకరమ్ ॥7॥

బాణవర్షములచేతను, వాడియైన శస్త్రములచేతను, భయంకరమైన అస్త్రములచేతనూ తిరిగి వారిరువురిమధ్య సమస్తలోకములకు భయమును కలిగించే యుద్ధము జరిగెను.

దివ్యాన్యస్త్రాణి శతశో ముముచే యాన్యథాంబికా ।
బభఞ్జ తాని దైత్యేన్ద్రస్తత్ప్రతీఘాతకర్తృభిః ॥8॥

అంబికాదేవి వందలకొలదీ విడిచిపెట్టిన దివ్యాస్త్రములను వాటిని నిర్వీర్యము చేయు ఆయుధములతో శుంభాసురుడు భగ్నము చేసెను.

ముక్తాని తేన చాస్త్రాణి దివ్యాని పరమేశ్వరీ ।
బభఞ్జ లీలయైవోగ్రహుంకారోచ్చారణాదిభిః ॥9॥

ఆ శుంభాసురుడు ప్రయోగించిన దివ్యాస్త్రములను పరమేశ్వరి లీలామాత్రముతో తన ఉగ్రమైన హుంకారములను ఉచ్చరించుట మొ॥ వానిచేత భగ్నపరచెను.

తతః శరశతైర్దేవీమాచ్ఛాదయత సోఽసురః ।
సా చ తత్కుపితా దేవీ ధనుశ్చిచ్ఛేద చేషుభిః ॥10॥

అటుపిమ్మట ఆ శుంభాసురుడు వందలకొలదీ బాణములతో అంబికాదేవిని కప్పివేసెను. అంతట కుపితురాలైన అంబికాదేవి తన బాణములతో అతని ధనుస్సును విరిచెను.

భిన్నే ధనుషి దైత్యేన్ద్రస్తథా శక్తిమథాదదే ।
చిచ్ఛేద దేవీ చక్రేణ తామప్యస్య కరే స్థితామ్ ॥11॥

తన విల్లు విరిగిపోగా రాక్షసేంద్రుడైన శుంభాసురుడు శక్తి ఆయుధమును గ్రహించెను. చేతియందున్న ఆ శక్తిని కూడా అంబికాదేవి తన చక్రముతో నష్టపరచెను.

తతః ఖడ్గముపాదాయ శతచన్ద్రం చ భానుమత్ ।
అభ్యధావత తాం హన్తుం దైత్యానామధిపేశ్వరః ॥12॥

అటుపిమ్మట రాక్షసాధిపతి అయిన శుంభాసురుడు ఖడ్గమును, ప్రకాశవంతమైన శతచన్ద్రమను కవచమును లేదా నూరుచంద్రుల చిత్రములు కలిగిన కవచమును గ్రహించి అంబికాదేవిని సంహరించుటకు పరుగెత్తెను. (కవచమనగా డాలు)

తస్యాపతత ఏవాశు ఖడ్గం చిచ్ఛేద చణ్డికా ।
ధనుర్ముక్తైః శితైర్బాణైశ్చర్మ చార్కకరామలమ్ ॥13॥

తనమీదకు వచ్చుచున్న ఆ ఖడ్గమును శీఘ్రముగా అంబికాదేవి విచ్ఛిన్నము చేసెను. తన వింటినుండి వదిలిన తీక్ష్ణమైన బాణములతో సూర్యకాంతి కలిగి స్వచ్ఛమైన ఆ కవచమును కూడా దేవి నాశము చేసెను.

అశ్వాంశ్చ పాతయామాస రథం సారథినా సహ ।
హతాశ్వః స తదా దైత్యశ్ఛిన్నధన్వా విసారథిః ॥
జగ్రాహ ముద్గరం ఘోరమంబికానిధనోద్యతః ॥14॥

అంబికాదేవి సారథితో సహా రథమును గుర్రములను భగ్నము చేసెను. అశ్వములను, సారథిని, ధనుస్సును పోగొట్టుకొన్న ఆ శుంభాసురుడు అంబికాదేవిని చంపుటయందు ఉద్యుక్తుడై భయంకరమైన ముద్గరాయుధమును (రోకలిబండవంటిది) గ్రహించెను.

చిచ్ఛేదాపతతస్తస్య ముద్గరం నిశితైః శరైః ।
తథాఽపి సోఽభ్యధావత్తాం ముష్టిముద్యమ్య వేగవాన్ ॥15॥

తనపైకి వచ్చుచున్న ఆ ముద్గరమును వాడియైన బాణములతో దేవి విచ్ఛిన్నము చేసెను. అయినప్పటికీ ఆ శుంభాసురుడు వేగముతో పిడికిలి బిగించి దేవిమీదకు పరుగెత్తెను.

స ముష్టిం పాతయామాస హృదయే దైత్యపుఙ్గవః ।
దేవ్యాస్తం చాపి సా దేవీ తలేనోరస్యతాడయత్ ॥16॥

రాక్షసశ్రేష్ఠుడైన శుంభుడు పిడికిలితో దేవి వక్షఃస్థలమందు కొట్టెను. దేవి కూడా అరచేతితో అతని వక్షఃస్థలమందు దెబ్బకొట్టెను.

తలప్రహారాభిహతో నిపపాత మహీతలే ।
స దైత్యరాజః సహసా పునరేవ తథోత్థితః ॥17॥

దేవియొక్క అరచేతి దెబ్బతో రాక్షసరాజైన శుంభాసురుడు నేలపై పడెను. పడికూడా వెంటనే తిరిగి పైకి లేచెను.

ఉత్పత్య చ ప్రగృహ్యోచ్చైర్దేవీం గగనమాస్థితః ।
తత్రాపి సా నిరాధారా యుయుధే తేన చణ్డికా ॥18॥

పైకి ఎగిరి దేవితోబాటు ఆకాశమందు శుంభుడు నిలిచెను. అచ్చట కూడా చండికాదేవి ఎట్టి ఆధారమూ లేక శుంభునితో యుద్ధము చేసెను.

నియుద్ధం ఖే తదా దైత్యశ్చణ్డికా చ పరస్పరమ్ ।
చక్రతుః ప్రథమం సిద్ధమునివిస్మయకారకమ్ ॥19॥

అప్పుడు శుంభాసురుడు, చణ్డికాదేవి పరస్పరము మొదటిగా ఆకాశమందు సిద్ధులకు, మునులకు ఆశ్చర్యమును గొల్పునట్టి బాహుయుద్ధమును చేసిరి. (నియుద్ధశబ్దానికి బాహుయుద్ధమని అర్థం. వాచస్పత్యం).

తతో నియుద్ధం సుచిరం కృత్వా తేనామ్బికా సహ ।
ఉత్పాత్య భ్రామయామాస చిక్షేప ధరణీతలే ॥20॥

ఈ విధముగా అంబికాదేవి చాలాకాలము శుంభాసురునితో బాహుయుద్ధము చేసి, అతడిని పైకిలేపి గిరగిరా త్రిప్పి ఆకాశమునుండి భూమిపైకి విసిరివేసెను.

స క్షిప్తో ధరణీం ప్రాప్య ముష్టిముద్యమ్య వేగతః ।
అభ్యధావత దుష్టాత్మా చణ్డికానిధనేచ్ఛయా ॥21॥

విసిరివేయబడిన దుష్టాత్ముడగు ఆ శుంభాసురుడు భూమియందు పడి, మిక్కిలి వేగముతో పిడికిలి బిగించి చండికాదేవిని సంహరించవలెనను కోరికతో ఆమెవైపు పరుగెత్తెను.

తమాయాన్తం తతో దేవీ సర్వదైత్యజనేశ్వరమ్ ।
జగత్యాం పాతయామాస భిత్త్వా శూలేన వక్షసి ॥22॥

తనపైకి వచ్చుచున్న రాక్షసాధిపతి అయిన ఆ శుంభాసురుని అంబికాదేవి శూలముతో వక్షఃస్థలమందు పొడిచి నేలపై పడవేసెను.

స గతాసుః పపాతోర్వ్యాం దేవీశూలాగ్రవిక్షతః ।
చాలయన్సకలాం పృథ్వీం సాబ్ధిద్వీపాం సపర్వతామ్ ॥23॥

అంబికాదేవి శూలాగ్రముచే చీల్చబడి, ప్రాణములను పోగొట్టుకొన్న శుంభాసురుడు సముద్రములు, ద్వీపములు, పర్వతములతో కూడుకొన్న సమస్త పృథివిని కంపింపజేయుచూ నేలపై పడెను.

తతః ప్రసన్నమఖిలం హతే తస్మిన్దురాత్మని ।
జగత్స్వాస్థ్యమతీవాప నిర్మలం చాభవన్నభః ॥24॥

దుర్మార్గుడగు ఆ శుంభాసురుడు మరణించగా సమస్త ప్రపంచము ప్రసన్నమై స్వస్థతను (దుఃఖములు లేకపోవుటను) పొందెను. ఆకాశము నిర్మలమయ్యెను.

ఉత్పాతమేఘాః సోల్కాః యే ప్రాగాసంస్తే శమం యయుః ।
సరితో మార్గవాహిన్యస్తథా శుంభే నిపాతితే ॥25॥

శుంభుడు జీవించి ఉండగా ఉత్పాతములతో (ప్రకృతివైపరీత్యాలతో) కూడుకొన్నవీ, అశుభసూచకములైన ఉల్కలతో కూడుకొన్నవీ అయిన మేఘములు ఉండెను. అవి ఇప్పుడు శుంభాసురుడు మరణించగా శమించినవి అనగా అదృశ్యమయ్యెను. అట్లే నదులు కూడా తమ తమ యథాస్థానములందు ప్రవహింపసాగెను.

తతో దేవగణాస్సర్వే హర్షనిర్భరమానసాః ।
బభూవుర్నిహతే తస్మిన్గన్ధర్వా లలితం జగుః ॥26॥

పిమ్మట శుంభాసురుడు మరణించగా సమస్త దేవగణాలు సంతోషముతో నిండిన మనస్సులు కలవారైరి. అట్లే గంధర్వులు లలితముగా గానము చేసిరి.

అవాదయంస్తథైవాన్యే ననృతుశ్చాప్సరోగణాః ।
వవుః పుణ్యాస్తథా వాతాః సుప్రభోఽభూద్దివాకరః ॥27॥

మరికొంతమంది వాద్యములను ప్రయోగించిరి. అప్సరసలు నాట్యము చేసిరి. పవిత్రములైన గాలులు వీచినవి. సూర్యుడు శోభనమైన కాంతిని ధరించెను.

జజ్వలుశ్చాగ్నయః శాన్తాః శాన్తదిగ్జనితస్వనాః ॥28॥

శాంతించిన అగ్నులు ప్రజ్వలించినవి. దిగ్భాగములన్నియు శాంతిని ప్రకటించు ధ్వనులు కలిగినవి అయ్యెను.

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే దేవీమాహాత్మ్యే శుంభవధోనామ సప్తాశీతితమోఽధ్యాయః ॥87॥

శ్రీ మార్కండేయ మహాపురాణమందలి దేవీమాహాత్మ్యమందలి శుంభుని సంహరించుటయను ఎనభైఏడవ అధ్యాయం సమాప్తం.



అష్టాశీతితమోఽధ్యాయః – ఎనభైఎనిమిదవ అధ్యాయం
దేవీమాహాత్మ్యే దేవీస్తోత్రం నారాయణీస్తుతిః – దేవీస్తోత్రం– నారాయణీస్తుతి

ఋషిరువాచ – ఋషి చెప్పాడు.

దేవ్యా హతే తత్ర మహాఽసురేన్ద్రే సేన్ద్రాః సురా వహ్నిపురోగమాస్తామ్ ।
కాత్యాయనీం తుష్టువురిష్టలాభాద్వికాశివక్త్రాబ్జవికాశితాశాః ॥1॥

మహారాక్షసాధిపతి అయిన శుంభాసురుడు దేవిచేత చంపబడగా, ఇంద్రునితో కూడుకొన్న దేవతలు వహ్నిదేవతను ముందు ఉంచుకొని తమ అభీష్టము నెరవేరినందున దీప్తిమంతములైన ముఖపద్మములతో దిక్కులను ప్రకాశింపచేయుచూ కాత్యాయనీదేవిని స్తుతించిరి.

దేవా ఊచుః – దేవతలు పలికారు.

దేవి ప్రపన్నార్తిహరే ప్రసీద ప్రసీద మాతర్జగతోఽఖిలస్య ।
ప్రసీద విశ్వేశ్వరి పాహి విశ్వం త్వమీశ్వరీ దేవి చరాచరస్య ॥2॥

శరణుజొచ్చినవారి ఆపదలను పోగొట్టుదానా ! ఓ దేవీ ! అనుగ్రహించుము. సమస్తజగత్తుకు జననీ ! అనుగ్రహించుము. ఓ విశ్వేశ్వరీ ! మాపై దయ చూపుము. ఈ సమస్తప్రపంచమును రక్షించుము. ఓ దేవీ ! ఈ చరాచరజగత్తుకంతటికీ నీవు పాలకురాలవు.

ఆధారభూతా జగతస్త్వమేకా మహీస్వరూపేణ యతః స్థితాసి ।
అపాం స్వరూపస్థితయా త్వయైతదాప్యాయతే కృత్స్నమలంఘ్యవీర్యే ॥3॥

లంఘింపశక్యముకాని (ఎదిరించుటకు వీలు లేని) పరాక్రమము గలదానా ! ఓ దేవీ ! భూమిస్వరూపముతో నీవు ఉన్న కారణంగా నీవు మాత్రమే ఈ జగత్తుకు ఆశ్రయమైనదానవు. జలస్వరూపముగా ఉన్న నీచే ఈ జగత్తంతయు తృప్తి పరుపబడుచున్నది.

త్వం వైష్ణవీ శక్తిరనన్తవీర్యా విశ్వస్య బీజం పరమాసి మాయా ।
సమ్మోహితం దేవి సమస్తమేతత్త్వం వై ప్రసన్నా భువి ముక్తిహేతుః ॥4॥

ఓ దేవీ ! నీవు వైష్ణవీశక్తివి. అనంతమైన పరాక్రమము గలదానవు. ప్రపంచమునకు బీజభూతమైన గొప్ప మాయాస్వరూపిణివి నీవే. నీవల్లనే ఈ సమస్తప్రపంచము సమ్మోహితమగుచున్నది. ముక్తికి కారణభూతురాలవయిన నీవు ప్రసన్నురాలవు కమ్ము.

విద్యాః సమస్తాస్తవ దేవి భేదాః స్త్రియః సమస్తాః సకలం జగచ్చ ।
త్వయైకయా పూరితమంబయైతత్ కా తే స్తుతిః స్తవ్యపరా పరోక్తిః ॥5॥

ఓ దేవీ ! సమస్తవిద్యలూ నీ ప్రతిరూపాలే. అట్లే సమస్తస్త్రీలు నీ స్వరూపాలే. ఈ జగత్తంతయూ తల్లివైన నీచేతనే వ్యాపింపబడియున్నది. నిన్ను స్తుతించుటకు మాటలెక్కడివి?

సర్వభూతా యదా దేవి భుక్తిముక్తిప్రదాయినీ ।
త్వం స్తుతా స్తుతయే కా వా భవన్తి పరమోక్తయః ॥6॥

ఓ దేవీ ! భుక్తినీ ముక్తినీ ప్రదానముచేయు నీవు సమస్తస్వరూపురాలవు. అట్లయినప్పుడు కేవలం స్తుతించుటకొరకే స్తుతిగాని, నిజముగా నిర్గుణపరబ్రహ్మస్వరూపురాలవయిన నిన్ను స్తుతించుటకు మాటలెక్కడివి?

సర్వస్య బుద్ధిరూపేణ జనస్య హృది సంస్థితే ।
స్వర్గాపవర్గదే దేవి నారాయణి నమోఽస్తు తే ॥7॥

స్వర్గమోక్షములను ఇచ్చుదానా ! ఓ దేవి ! సమస్తజనులందలి హృదయమందు బుద్ధిరూపముతో ఉన్నదానా! ఓ నారాయణీ ! నీకు నమస్కారము.

కలాకాష్ఠాదిరూపేణ పరిణామప్రదాయినీ ! ।
విశ్వస్యోపరతౌ శక్తే నారాయణి నమోఽస్తు తే ॥8॥

కలాకాష్ఠాది కాలరూపముతో ఆయా పరిణామములను (ఫలితములను) ప్రసాదించుదానా ! ఈ ప్రపంచము ప్రళయము చెందుటలో శక్తిస్వరూపురాలా ! ఓ నారాయణీ ! నీకు నమస్కారము.

సర్వమంగలమాంగల్యే శివే సర్వార్థసాధికే ।
శరణ్యే త్ర్యంబకే గౌరి నారాయణి నమోఽస్తుతే ॥9॥

సమస్తమంగళముల, మాంగల్యముల స్వరూపురాలా ! మంగళస్వరూపురాలా ! సమస్త ప్రయోజనములను సాధించుపెట్టుదానా ! శరణన్నవారిని రక్షించుదానా ! మూడు కన్నులు గలదానా ! గౌరీ ! నారాయణీ ! నీకు నమస్కారము.

సృష్టిస్థితివినాశానాం శక్తిభూతే సనాతని ।
గుణాశ్రయే గుణమయే నారాయణి నమోఽస్తు తే ॥10॥

సృష్టిస్థితిప్రళయములను చేయుటలో సమర్థురాలా ! అన్ని కాలములందు ఉండుదానా ! గుణములకు ఆశ్రయమైనదానా ! గుణములు కలిగినదానా ! నారాయణీ ! నీకు నమస్కారము.

శరణాగతదీనార్తపరిత్రాణపరాయణే ।
సర్వస్యార్తిహరే దేవి నారాయణి నమోఽస్తు తే ॥11॥

శరణుజొచ్చినవారిని, దీనులను, ఆపదలలో ఉన్నవారిని రక్షించు స్వభావము గలదానా ! సమస్త జనుల కష్టములను పోగొట్టుదానా ! ఓ దేవీ ! నారాయణీ ! నీకు నమస్కారము.

హంసయుక్తవిమానస్థే బ్రహ్మాణీరూపధారిణి ।
కౌశాంభఃక్షరికే దేవి నారాయణి నమోఽస్తు తే ॥12॥

హంసతో కూడుకొన్న విమానమందు ఉన్నదానా ! బ్రహ్మాణీశక్తిరూపమును ధరించినదానా ! కుశలతో (దర్భలతో) కూడిన పవిత్రజలమును చల్లుదానా ! దేవీ ! నారాయణీ ! నీకు నమస్కారము.

త్రిశూలచంద్రాహిధరే మహావృషభవాహిని ।
మాహేశ్వరీస్వరూపేణ నారాయణి నమోఽస్తు తే ॥13॥

త్రిశూలమును, చంద్రుణ్ణి, సర్పములను ధరించినదానా ! మహావృషభము (గొప్ప ఎద్దు) వాహనముగా కలిగినదానా! మాహేశ్వరీశక్తిస్వరూపముతో ఉన్నదానా ! నారాయణీ ! నీకు నమస్కారము.

మయూరకుక్కుటవృతే మహాశక్తిధరేఽనఘే ।
కౌమారీరూపసంస్థానే నారాయణి నమోఽస్తు తే ॥14॥

మయూరకుక్కుటములతో ఆవరింపబడినదానా ! మహాశక్తిని ధరించినదానా ! పాపరహితురాలా! కౌమారీశక్తిరూపమును ధరించినదానా ! నారాయణీ ! నీకు నమస్కారము.

శంఖచక్రగదాశార్ఙ్గగృహీతపరమాయుధే ।
ప్రసీద వైష్ణవీరూపే నారాయణి నమోఽస్తు తే ॥15॥

శంఖము, చక్రము, గద, శార్ఙ్గము (విల్లు)లను శ్రేష్ఠమైన ఆయుధములను గ్రహించినదానా! వైష్ణవీశక్తిస్వరూపురాలా! అనుగ్రహించుము. ! నారాయణీ ! నీకు నమస్కారము.

గృహీతోగ్రమహాచక్రే దంష్ట్రోద్ధతవసుంధరే ।
వరాహరూపిణి శివే నారాయణి నమోఽస్తు తే ॥16॥

ఉగ్రమైన మహాచక్రమును గ్రహించినదానా ! కోరలతో భూమిని పైకి ఎత్తినదానా ! వరాహరూపమును ధరించినదానా! మంగళస్వరూపురాలా ! నారాయణీ ! నీకు నమస్కారము.

నృసింహరూపేణోగ్రేణ హన్తుం దైత్యాన్ కృతోద్యమే ।
త్రైలోక్యత్రాణసహితే నారాయణి నమోఽస్తు తే ॥17॥

ఉగ్రమైన నృసింహరూపముతో రాక్షసులను చంపుటకు ఉద్యమించినదానా ! ముల్లోకములను రక్షించుదానా! నారాయణీ ! నీకు నమస్కారము.

కిరీటిని మహావజ్రే సహస్రనయనోజ్జ్వలే ।
వృత్రప్రాణహరే చైన్ద్రి నారాయణి నమోఽస్తు తే ॥18॥

ఓ కిరీటధారిణీ ! గొప్ప వజ్రాయుధమును ధరించినదానా ! వేయి కన్నులతో ప్రకాశించుచున్నదానా ! వృత్రాసురుని వధించినదానా ! ఐన్ద్రీశక్తిస్వరూపురాలా ! నారాయణీ ! నీకు నమస్కారము.

శివదూతీస్వరూపేణ హతదైత్యే మహాబలే ।
ఘోరరూపే మహారావే నారాయణి నమోఽస్తు తే ॥19॥

శివదూతీస్వరూపముతో రాక్షసులను వధించినదానా ! గొప్పబలము కలిగినదానా ! భయంకరమైన రూపము కలిగినదానా ! గొప్ప ధ్వనులను చేయుదానా ! నారాయణీ ! నీకు నమస్కారము.

దంష్ట్రాకరాలవదనే శిరోమాలావిభూషణే ।
చాముణ్డే ముణ్డమథనే నారాయణి నమోఽస్తు తే ॥20॥

కోరలతో భయంకరమైన ముఖము కలిగినదానా ! పుఱ్ఱెల మాల ఆభరణముగా కలిగినదానా ! చాముణ్డాదేవీ! ముండాసురుని వధించినదానా ! నారాయణీ ! నీకు నమస్కారము.

లక్ష్మి లజ్జే మహావిద్యే శ్రద్ధే పుష్టే స్వధే ధ్రువే ।
మహారాత్రే మహామాయే నారాయణి నమోఽస్తు తే ॥21॥

ఓ లక్ష్మీ ! లజ్జాస్వరూపురాలా ! మహావిద్యా ! శ్రద్ధా ! పుష్టీ ! స్వధా ! ధ్రువా ! మహారాత్రీ ! మహామాయా! నారాయణీ ! నీకు నమస్కారము.

మేధే సరస్వతి వరే భూతి బాభ్రవి తామసి ।
నియతే త్వం ప్రసీదేశే నారాయణి నమోఽస్తుతే ॥22॥

ఓ బుద్ధిస్వరూపురాలా ! సరస్వతీ ! శ్రేష్ఠురాలా ! ఐశ్వర్యస్వరూపురాలా ! బాభ్రవీ ! తామసీ ! ఆత్మనిగ్రహము కలిగినదానా ! ఈశ్వరీ ! నీవు మాపై అనుగ్రహము చూపుము. ! నారాయణీ ! నీకు నమస్కారము.

సర్వతః పాణిపాదాన్తే సర్వతోఽక్షిశిరోముఖే ।
సర్వతః శ్రవణఘ్రాణే నారాయణి నమోఽస్తు తే ॥23॥

దిగ్భాగములవరకు వ్యాపించిన కాళ్ళు చేతులు కలిగినదానా ! అంతట కళ్ళు, శిరస్సు, ముఖము వ్యాపించినదానా! అంతట చెవి, ముక్కు ఇంద్రియములు వ్యాపించినదానా ! నారాయణీ ! నీకు నమస్కారము.

సర్వస్వరూపే సర్వేశే సర్వశక్తిసమన్వితే ।
భయేభ్యస్త్రాహి నో దేవి దుర్గే దేవి నమోఽస్తు తే ॥24॥

సమస్తస్వరూపురాలా ! సమస్తమునకు ప్రభుత్వమును వహించినదానా ! సమస్త శక్తులతో కూడుకొన్నదానా ! మమ్ములను భయములనుండి రక్షించుము. ఓ దుర్గా ! దేవీ ! నీకు నమస్కారము.

ఏతత్తే వదనం సౌమ్యం లోచనత్రయభూషితమ్ ।
పాతు నః సర్వభీతిభ్యః కాత్యాయని నమోఽస్తు తే ॥25॥

మూడు కన్నులతో అలంకరింపబడిన ఈ నీ ముఖము సౌమ్యమైనది. మమ్ములను అన్ని భయములనుండి రక్షించుము. కాత్యాయనీ ! నీకు నమస్కారము.

జ్వాలాకరాలమత్యుగ్రమశేషాసురసూదనమ్ ।
త్రిశూలం పాతు నో భీతేర్భద్రకాలి నమోఽస్తు తే ॥26॥

జ్వాలలచేత భయంకరముగా ఉన్నది, మిక్కిలి తీక్షమైనది, సమస్తరాక్షసులను సంహరించునట్టిదీ అగు త్రిశూలము మమ్ములను భయమునుండి రక్షించుగాక ! భద్రకాళీ ! నీకు నమస్కారము.

హినస్తి దైత్యతేజాంసి స్వనేనాపూర్య యా జగత్ ।
సా ఘంటా పాతు నో దేవి పాపేభ్యో నః సుతానివ ॥27॥

ఓ దేవి ! తన ఘంటానాదముతో జగత్తంతటినీ పూరించి, రాక్షసుల తేజస్సులను నాశనము చేయునట్టి గంట మమ్ములను పాపములనుండి పుత్రులను రక్షించునట్లుగా రక్షించుగాక.

అసురాసృగ్వసాపఙ్కచర్చితస్తే కరోజ్జ్వలః ।
శుభాయ ఖడ్గో భవతు చణ్డికే త్వాం నతా వయమ్ ॥28॥

రాక్షసుల రక్తము మాంసములతో పూయబడిన, నీ చేతియందు ప్రకాశించుచున్న ఖడ్గము మాకు శుభములనిచ్చుగాక! ఓ చండికాదేవీ ! నీకు మేము నమస్కరించుచున్నాము.

రోగానశేషానపహంసి తుష్టా రుష్టా తు కామాన్సకలానభీష్టాన్ ।
త్వామాశ్రితానాం న విపన్నరాణాం త్వామాశ్రితా హ్యాశ్రయతాం ప్రయాన్తి ॥29॥

ఓ దేవీ ! నీవు సంతుష్టురాలవైనచో సమస్తరోగములను నశింపచేసెదవు. కోపగించినచో సమస్త అభీష్టములైన కోరికలను నశింపచేసెదవు. నిన్నాశ్రయించిన మానవులకు ఆపదలు లేవు. నిన్ను ఆశ్రయించినవారు వేరేవారికి ఆశ్రయమునిచ్చువారిగా అయ్యెదరు.

ఏతత్కృతం యత్కదనం త్వయాద్య ధర్మద్విషాం దేవి మహాసురాణామ్ ।
రూపైరనేకైర్బహుధాఽత్మమూర్తిం కృత్వాఽమ్బికే తత్ప్రకరోతి కాన్యా ॥30॥

ఓ అంబికాదేవీ ! ధర్మమును ద్వేషించు గొప్ప రాక్షసులను నీవు నీ రూపమును అనేక విధములుగా చేసి నేడు సంహరించితివి. నీవు తప్ప మరెవరు ఇట్లు చేయగలరు?

విద్యాసు శాస్త్రేషు వివేకదీపేష్వాద్యేషు వాక్యేషు చ కా త్వదన్యా ।
మమత్వగర్తేఽతిమహాన్ధకారే విభ్రామయత్యేతదతీవ విశ్వమ్ ॥31॥

వివేకజ్ఞానమును కలిగించుటలో దీపమువంటి చతుర్దశవిద్యలు, న్యాయవ్యాకరణాది శాస్త్రములు మరియు అతిప్రాచీనమైన వేదాదివిద్యలు వీటిలో నిన్ను మించిన వారెవరున్నారు? మమత్వమను (ఇది నాదియను ఆధ్యాసికభావన) గొప్ప అంధకారస్వరూపమైన (అంధకారమనగా అజ్ఞానము) ఈ సంసారమందు ఈ ప్రపంచమును అధికముగా నీవు త్రిప్పుచున్నావు.

రక్షాంసి యత్రోగ్రవిషాశ్చ నాగా యత్రారయో దస్యుబలాని యత్ర ।
దావానలో యత్ర తథాబ్ధిమధ్యే తత్ర స్థితా త్వం పరిపాసి విశ్వమ్ ॥32॥

ఓ దేవీ ! ఎచ్చటయితే రాక్షసులు, క్రూరవిషసర్పములు ఉండునో, ఎచ్చటయితే శత్రువులు, దుష్టులు ఉందురో, ఎచ్చటయితే సముద్రమధ్యమందు దావానలము (బడబాగ్ని) ఉండునో అచ్చట అంతను నీవు ఉండి ఈ ప్రపంచమును రక్షించుచున్నావు.

విశ్వేశ్వరీ త్వం పరిపాసి విశ్వం విశ్వాత్మికా ధారయసీతి విశ్వమ్ ।
విశ్వేశవన్ద్యా భవతీ భవన్తి విశ్వాశ్రయా యే త్వయి భక్తినమ్రాః ॥33॥

ఓ దేవీ ! ఈ విశ్వమునకంతటికిని నీవు ఈశ్వరివై విశ్వమును రక్షించుచున్నావు. నీవు విశ్వస్వరూపమై విశ్వమును అంతటినీ ధరించుచున్నావు. విశ్వేశ్వరునికి కూడా నీవు పూజనీయురాలవై ఉన్నావు. ఎవరయితే బ్రహ్మవిష్ణుమహేశ్వరులు ఈ విశ్వమునకు ఆశ్రయభూతులుగా ఉన్నారో వారందరు నీ యందలి భక్తిచేత నీముందు వంగియున్నారు.

దేవి ప్రసీద పరిపాలయ నోఽరిభీతేర్నిత్యం యథాసురవధాదధునైవ సద్యః ।
పాపాని సర్వజగతాం ప్రశమం నయాశు ఉత్పాతపాకజనితాంశ్చ మహోపసర్గాన్ ॥34॥

ఓ దేవీ ! మమ్ములను అనుగ్రహించుము. శత్రుభీతినుండి మమ్ములను ఎల్లప్పుడు, ఇప్పుడు రాక్షససంహారముతో వెంటనే మమ్ములను రక్షించినట్లుగా, రక్షించుము. శీఘ్రముగా సమస్తలోకముల పాపములను శమింపచేయుము. ఉత్పాతములు పక్వస్థితికి వచ్చినందువల్ల ఏర్పడే అతివృష్టి అనావృష్టి మొ॥లగు ఉపద్రవములను కూడా నశింపచేయుము.

ప్రణతానాం ప్రసీద త్వం దేవి విశ్వార్తిహారిణి ।
త్రైలోక్యవాసినామీడ్యే లోకానాం వరదా భవ ॥35॥

ఓ దేవీ ! విశ్వముయొక్క ఆపదలనన్నింటినీ హరించుదానా ! నీవు మమ్ములను అనుగ్రహించుము. ముల్లోకవాసులందరిచే పూజింపబడుదానా ! ఈ లోకములన్నింటికీ వరములనీయుము.

శ్రీదేవ్యువాచ – శ్రీదేవి పలికింది.

వరదాఽహం సురగణాః వరం యం మనసేచ్ఛథ ।
తం వృణుధ్వం ప్రయచ్ఛామి జగతాముపకారకమ్ ॥36॥

ఓ దేవతలారా ! నేను ఎల్లప్పుడు వరములనిచ్చుదానను. మనఃపూర్వకముగా మీరు ఏ వరమును కోరుకొందురో దానిని మీరు కోరుకొనుడు. లోకములకుపకారము కల్గించునట్టి అట్టి వరమును నేను తప్పక ఇచ్చెదను.

దేవా ఊచుః – దేవతలు పలికారు.

సర్వబాధాప్రశమనం త్రైలోక్యస్యాఖిలేశ్వరి ।
ఏవమేతత్త్వయా కార్యమస్మద్వైరివినాశనమ్ ॥37॥

సమస్తప్రపంచమునకు ఈశ్వరివి అయిన ఓ దేవీ ! ముల్లోకముల సమస్తబాధలను శమింపచేయుము. ఇప్పుడు రాక్షసులను సంహరించినట్లుగా ఎల్లప్పుడు మా శత్రువినాశమును గావించుము.

శ్రీదేవ్యువాచ – శ్రీదేవి పలికింది.

వైవస్వతేఽన్తరే ప్రాప్తే అష్టావింశతితమే యుగే ।
శుంభో నిశుంభశ్చైవాన్యావుత్పత్స్యేతే మహాసురౌ ॥38॥

వైవస్వతమన్వంతరమందు ఇరువదిఎనిమిదవ యుగము వచ్చినప్పుడు శుంభుడు, నిశుంభుడు అను వేరే ఇతర రాక్షసులిరువురు జన్మింతురు.

నన్దగోపకులే జాతా యశోదాగర్భసంభవా ।
తతస్తౌ నాశయిష్యామి విన్ధ్యాచలనివాసినీ ॥39॥

అప్పుడు నేను నందగోపకులమందు యశోదాదేవిగర్భమందు జన్మించి వింధ్యపర్వతమందు నివాసము కలిగినదాననై ఆ ఇరువురు రాక్షసులను సంహరించెదను.

పునరప్యతిరౌద్రేణ రూపేణ పృథివీతలే ।
అవతీర్య హనిష్యామి వైప్రచిత్తాంస్తు దానవాన్ ॥40॥

మరల నేను మిక్కిలి భయంకరమైన రూపముతో ఈ భూమిమీద అవతరించి వైప్రచిత్తులను రాక్షసులను సంహరించెదను.

భక్షయన్త్యాశ్చ తానుగ్రాన్ వైప్రచిత్తాన్సుదానవాన్ ।
రక్తా దన్తా భవిష్యన్తి దాడిమీకుసుమోపమాః ॥41॥

తతో మాం దేవతాః స్వర్గే మర్త్యలోకే చ మానవాః ।
స్తువన్తో వ్యాహరిష్యన్తి సతతం రక్తదన్తికామ్ ॥42॥

భయంకరులైన ఆ గొప్పరాక్షసులైన వైప్రచిత్తులను నేను భక్షించుకాలమందు నా దంతములు దానిమ్మపూవులవలే రక్తవర్ణము కల్గినవి అగును. అందువలన స్వర్గలోకమందలి దేవతలు, మర్త్యలోకమందలి మానవులు ఎల్లప్పుడు రక్తదన్తికయను నామముతో నన్ను స్తుతించెదరు.

భూయశ్చ శతవార్షిక్యామనావృష్ట్యామనంభసి ।
మునిభిః సంస్తుతా భూమౌ సంభవిష్యామ్యయోనిజా ॥43॥

మరల నూరుసంవత్సరాలపాటు వర్షములులేక జలముయొక్క లేమి కలిగినప్పుడు మునులచేత స్తుతింపబడిన నేను ఈ భూలోకమందు అయోనిజగా జన్మించెదను.

తతః శతేన నేత్రాణాం నిరీక్షిష్యామి యన్మునీన్ ।
కీర్తయిష్యన్తి మనుజాః శతాక్షీమితి మాం తతః ॥44॥

అప్పుడు నేను నూరు కండ్లతో మునులను చూచుచూ కాపాడెదను. అందువలన అటు పిమ్మట మానవులు నన్ను శతాక్షియను నామముతో కీర్తించెదరు.

తతో౽హమఖిలం లోకమాత్మదేహసముద్భవైః ।
భరిష్యామి సురాః శాకైరావృష్టైః ప్రాణధారకైః ॥45॥

శాకంభరీతి విఖ్యాతిం తదా యాస్యామ్యహం భువి ।
తత్రైవ చ వధిష్యామి దుర్గమాఖ్యం మహాసురమ్ ।
దుర్గాదేవీతి విఖ్యాతం తన్మే నామ భవిష్యతి ॥46॥

ఓ దేవతలారా ! అటు పిమ్మట నేను నా శరీరమునుండి ఉత్పన్నములై వర్షములవలన సిద్ధించిన ప్రాణధారకములైన శాకములతో (కాయగూరలు) ఈ సమస్తలోకమును భరించెదను. అందువలన ఈ భూలోకమందు శాకంభరియను విఖ్యాతిని పొందగలను. అదే సమయమందు నేను దుర్గనామధేయము కలిగిన గొప్ప రాక్షసుని సంహరించెదను. అందువలన దుర్గాదేవియను ప్రసిద్ధనామము నాకు కలుగగలదు.

పునశ్చాహం యదా భీమం రూపం కృత్వా హిమాచలే ।
రక్షాంసి భక్షయిష్యామి మునీనాం త్రాణకారణాత్ ॥47॥

తదా మాం మునయః సర్వే స్తోష్యన్త్యానమ్రమూర్తయః ।
భీమాదేవీతి విఖ్యాతం తన్మే నామ భవిష్యతి ॥48॥

మరల నేను మునులను రక్షించుట అను కారణముతో హిమాచలపర్వతమందు భయంకరమైన రూపమును వహించి రాక్షసులను భక్షించెదను. అప్పుడు మునులందరూ నన్ను వంగి నమస్కరించినవారై స్తుతించెదరు. అందువల్లనే భీమాదేవియను ప్రసిద్ధనామము నాకు సంభవించగలదు.

యదా౽రుణాఖ్యస్త్రైలోక్యే మహాబాధాం కరిష్యతి ।
తదాహం భ్రామరం రూపం కృత్వా౽సంఖ్యేయషట్పదమ్ ॥49॥

త్రైలోక్యస్య హితార్థాయ వధిష్యామి మహాసురమ్ ।
భ్రామరీతి చ మాం లోకాస్తదా స్తోష్యన్తి సర్వతః ॥50॥

ఎప్పుడయితే అరుణుడను పేరు గల గొప్ప రాక్షసుడు ముల్లోకములకు బాధలను కలిగించునో అప్పుడు నేను అసంఖ్యాకములైన తుమ్మెదల రూపమును ధరించి ముల్లోకముల హితమును కోరి ఆ గొప్ప రాక్షసుని సంహరించెదను. అప్పుడు లోకములన్నియు నన్ను భ్రామరీదేవి అను పేరుతో స్తుతిస్తాయి.

ఇత్థం యదా యదా బాధా దానవోత్థా భవిష్యతి ।
తదా తదా౽వతీర్యాహం కరిష్యామ్యరిసంక్షయమ్ ॥51॥

ఈ విధముగా రాక్షసులవలన బాధలు కల్గినప్పుడల్లా నేను అవతరించి శత్రునాశమును కావించెదను.

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే దేవీమాహాత్మ్యే దేవీస్తోత్రం నారాయణీస్తుతిర్నామ అష్టాశీతితమో౽ధ్యాయః ॥88॥

శ్రీ మార్కండేయ మహాపురాణమందలి దేవీమాహాత్మ్యమందలి దేవీస్తోత్రం – నారాయణీస్తుతియను ఎనభైఎనిమిదవ అధ్యాయం సమాప్తం.

ఏకోననవతితమోఽధ్యాయః – ఎనభైతొమ్మిదవ అధ్యాయం
దేవీమాహాత్మ్యే దేవతానాం దేవీవరప్రదానమ్ – దేవతలకు దేవీవరప్రదానం

శ్రీదేవ్యువాచ – శ్రీదేవి పలికింది.

ఏభిః స్తవైశ్చ మాం నిత్యం స్తోష్యతే యః సమాహితః ।
తస్యాహం సకలాం బాధాం నాశయిష్యామ్యసంశయమ్ ॥1॥

ఈ స్తోత్రములతో ఎవరయితే ఏకాగ్రచిత్తుడై ఎల్లప్పుడు నన్ను స్తుతించునో అతడి సమస్త బాధలను నేను నశింపచేసెదను. ఇందు సంశయము లేదు.

మధుకైటభనాశం చ మహిషాసురఘాతనమ్ ।
కీర్తయిష్యన్తి యే తద్వధం చ శుంభనిశుంభయోః ॥2॥

అష్టమ్యాం చ చతుర్దశ్యాం నవమ్యాం చైకచేతసః ।
స్తోష్యన్తి చైవ యే భక్త్యా మమ మాహాత్మ్యముత్తమమ్ ॥3॥

న తేషాం దుష్కృతం కిఞ్చిద్దుష్కృతోత్థా న చాపదః ।
న భవిష్యతి దారిద్ర్యం న చైవేష్టవియోజనమ్ ॥4॥

శత్రుతో న భయం తేషాం దస్యుతో వా న రాజతః ।
న శస్త్రానలతోయౌఘాత్ కదాచిత్సంభవిష్యతి ॥5॥

మధుకైటభసంహారము, మహిషాసురవధ, శుంభనిశుంభవధ ఈ వృత్తాంతములను ఏ జనులయితే ఏకాగ్రచిత్తులై అష్టమి, నవమి, చతుర్దశి తిథులయందు కీర్తించెదరో ఇంకనూ ఉత్తమమైన నా మాహాత్మ్యమును భక్తితో స్తుతించెదరో వారికెట్టి పాపములుగాని, పాపములవల్ల కలిగే ఆపదలు గాని సంభవించవు. ఇంకను వారికి దారిద్ర్యము గాని, ఇష్టమైన వస్తువులు లేదా వ్యక్తులనుండి వియోగముగాని కలుగదు. ఇంకను వారికి శత్రువులవల్లగాని, దుష్టజనులవల్లగాని, రాజులవల్లగాని, శస్త్రములు, అగ్ని, జలప్రవాహములవల్లగాని భయమెన్నడూ కలుగదు.

తస్మాన్మమైతన్మాహాత్మ్యం పఠితవ్యం సమాహితైః ।
శ్రోతవ్యం చ సదా భక్త్యా పరం స్వస్త్యయనం మహత్ ॥6॥

అందువలన ఏకాగ్రచిత్తులై జనులు నా ఈ మాహాత్మ్యమును ఎల్లప్పుడు భక్తితో చదువవలెను, వినవలెను. అట్టి వారికి గొప్ప శుభము కలుగును.

ఉపసర్గానశేషాంస్తు మహామారీసముద్భవాన్ ।
తథా త్రివిధముత్పాతం మాహాత్మ్యం శమయేన్మమ ॥7॥

కలరా మొ॥లగు మహామారి వ్యాధులవలన కలుగు అనేక ఉపద్రవాలను, మరియు ఆధ్యాత్మిక, ఆధిభౌతిక, ఆధిదైవికములగు మూడు విధాలైన ఉత్పాతములను నా మాహాత్మ్యము శమింపచేయును.

యత్రైతత్పఠ్యతే సమ్యక్ నిత్యమాయతనే మమ ।
సదా న తద్విమోక్ష్యామి సాన్నిధ్యం తత్ర మే స్థితమ్ ॥8॥

ఏ స్థానమందైతే బాగుగా నా యీ మాహాత్మ్యగాథను పఠించెదరో, అట్టి స్థానమును నేనెన్నడూ విడిచిపెట్టను. అచ్చటనే నా సాన్నిధ్యము ఉండును.

బలిప్రదానే పూజాయామగ్నికార్యే మహోత్సవే ।
సర్వం మమైతచ్చరితముచ్చార్యం శ్రావ్యమేవ చ ॥9॥

బలిప్రదానసమయమందు, పూజయందు, అగ్నికార్యమందు, గొప్ప ఉత్సవాలయందు నా యీ చరిత్రను చదువవలెను, వినవలెను.

జానతాఽజానతా వాఽపి బలిం పూజాం తథా కృతామ్ ।
ప్రతీచ్ఛిష్యామ్యహం ప్రీత్యా వహ్నిహోమం తథా కృతమ్ ॥10॥

మనుష్యులు తెలిసి చేసినా, తెలియక చేసినా వారి బలిపూజలను, అగ్నియందు చేయబడిన హోమమును నేను సంతోషముతో స్వీకరించెదను.

శరత్కాలే మహాపూజా క్రియతే యా చ వార్షికీ ।
తస్యాం మమైతన్మాహాత్మ్యం శ్రుత్వా భక్తిసమన్వితః ॥11॥

సర్వబాధావినిర్ముక్తో ధనధాన్యసమన్వితః ।
మనుష్యో మత్ప్రసాదేన భవిష్యతి న సంశయః ॥12॥

శరత్కాలమందు ఆచరింపబడు వార్షికమహాపూజయందు నా ఈ మాహాత్మ్యమును భక్తితో కూడుకొని ఏ మానవుడయితే వినునో అట్టి మానవుడు నా అనుగ్రహముతో సమస్తబాధలనుండి విముక్తుడగును. ధనధాన్యములతో కూడుకొన్నవాడగును. ఇందు ఎట్టి సంశయమూ లేదు.

శ్రుత్వా మమైతన్మాహాత్మ్యం తథోత్పత్తీః పృథక్ శుభాః ।
పరాక్రమాంశ్చ యుద్ధేషు జాయతే నిర్భయః పుమాన్ ॥13॥

నా యీ మాహాత్మ్యమును, యుద్ధములందు సంభవించిన నాయొక్క శుభాలను పరాక్రమాలను విన్న మానవుడు భయరహితుడగును.

రిపవః సంక్షయం యాన్తి కల్యాణం చోపపద్యతే ।
నన్దతే చ కులం పుంసాం మాహాత్మ్యం మమ శృణ్వతామ్ ॥14॥

నా మాహాత్మ్యమును విన్నవారి శత్రువులు నశించెదరు. వారికి శుభములు కలుగును. వారి కులము ఆనందించును.

శాన్తికర్మణి సర్వత్ర తథా దుఃస్వప్నదర్శనే ।
గ్రహపీడాసు చోగ్రాసు మాహాత్మ్యం శృణుయాన్మమ ॥15॥

శాంతికర్మలందు, చెడ్డకలలు వచ్చిన సమయమందు, మిక్కిలి అధికమైన గ్రహపీడలు సంభవించినపుడు నా మాహాత్మ్యమును వినవలెను.

ఉపసర్గాః శమం యాన్తి గ్రహపీడాశ్చ దారుణాః ।
దుఃస్వప్నం చ నృభిర్దృష్టం సుస్వప్నముపజాయతే ॥16॥

దేవీమాహాత్మ్యమును విన్నవారికి ఉపద్రవములు, భయంకరమైన గ్రహపీడలు తొలగిపోవును. మానవులు చూచే చెడ్డకలలు ఇక సంభవించవు. మంచి స్వప్నములు సంభవించును.

బాలగ్రహాభిభూతానాం బాలానాం శాన్తికారకమ్ ।
సంఘాతభేదం చ నృణాం మైత్రీకరణముత్తమమ్ ॥17॥

ఈ మాహాత్మ్యము బాలగ్రహములచే పీడింపబడిన బాలురకు శాంతిని కలుగజేయును. మానవులమధ్య మిత్రత్వము నశించినచో తిరిగి ఉత్తమమైన మిత్రత్వమును కలిగించును.

దుర్వృత్తానామశేషాణాం బలహానికరం పరమ్ ।
రక్షోభూతపిశాచానాం పఠనాదేవ నాశనమ్ ॥18॥

చెడు అలవాట్లు కలిగిన సమస్తజనులయొక్క బలమును ఈ దేవీమహత్త్వము నశింపచేయును. ఈ మాహాత్మ్యవృత్తాంతమును విన్నంతనే రాక్షసులు, భూతములు, పిశాచముల నాశము కలుగును.

సర్వం మమైతన్మాహాత్మ్యం మమ సన్నిధికారకమ్ ॥19॥

ఈ నా మాహాత్మ్యమంతయు నా సాన్నిధ్యమును పొందుటకు కారణము.

పశుపుష్పార్ఘ్యధూపైశ్చ గన్ధదీపైస్తథోత్తమైః ।
విప్రాణాం భోజనైర్హోమైః ప్రోక్షణీయైరహర్నిశమ్ ॥20॥

అన్యైశ్చ వివిధైర్భోగైః ప్రదానైర్వత్సరేణ యా ।
ప్రీతిర్మే క్రియతే సాస్మిన్ సకృదుచ్చరితశ్రుతే ॥21॥

పశువులు, పుష్పములు, అర్ఘ్యములు, ధూపములు, ఉత్తమములైన గంధదీపములు వీటిని సమర్పించుట, బ్రాహ్మణులకు భోజనము పెట్టుట, హోమములు, నిత్యము పవిత్రజలములను చల్లుట, ఇంకను అనేకవిధములైన భోగములు, దానములు వీటినన్నింటిని ఒక సంవత్సరకాలము ఆచరించినందున నాకు కలిగే ప్రీతి నా మాహాత్మ్యమును ఒక్కసారి విన్నంతమాత్రముచేతనే నాకు కలుగును.

శ్రుతం హరతి పాపాని తథాఽరోగ్యం ప్రయచ్ఛతి ।
రక్షాం కరోతి భూతేభ్యో జన్మనాం కీర్తనం మమ ॥22॥

నా మాహాత్మ్యమును విన్నంతనే పాపములు తొలగును. ఆరోగ్యమును కూడా ప్రసాదించును. నా అవతారములను కీర్తించినంతనే ప్రాణులకు రక్షణ కలుగును.

యుద్ధేషు చరితం యన్మే దుష్టదైత్యనిబర్హణమ్ ।
తస్మిన్ శ్రుతే వైరికృతం భయం పుంసాం న జాయతే ॥23॥

యుద్ధములందు దుష్టులైన రాక్షసులను సంహరించుట అను నా చరితమును విన్నంతనే మానవులకు శత్రువులవల్ల ఎట్టి భయమూ కలుగదు.

యుష్మాభిః స్తుతయో యాశ్చ యాశ్చ బ్రహ్మర్షిభిః కృతాః ।
బ్రహ్మణా చ కృతా యాస్తాః ప్రయచ్ఛన్తి శుభాం గతిమ్ ॥24॥

దేవతలగు మీరు చేసిన స్తుతులు, బ్రహ్మర్షులు చేసిన స్తుతులు, బ్రహ్మదేవుడు చేసిన స్తుతులు ఇవి అన్నియు శుభములనిచ్చును.

అరణ్యే ప్రాన్తరే వాపి దావాగ్నిపరివారితః ।
దస్యుభిర్వా యుతః శూన్యే గృహీతో వాపి శత్రుభిః ॥25॥

సింహవ్యాఘ్రానుయాతో వా వనే వా వనహస్తిభిః ।
రాజ్ఞా క్రుద్ధేన చాజ్ఞప్తే వధ్యే బన్ధగతోఽపి వా ॥26॥

ఆఘూర్ణితో వా వాతేన స్థితః పోతే మహార్ణవే ।
పతత్సు చాపి శస్త్రేషు సంగ్రామే భృశదారుణే ॥27॥

సర్వబాధాసు ఘోరాసు వేదనాభ్యర్దితోఽపి వా ।
స్మరన్మమైతచ్చరితం నరో ముచ్యేత సంకటాత్ ॥28॥

అడవులందుగాని, చెట్లనీడలులేని మార్గమందుగాని తీవ్రమైన అగ్నిచేత చుట్టబడినవాడు, నిర్జనప్రదేశములందు దుష్టజనుల సంగమమేర్పడిన వాడు, శత్రువుల చేతిలో చిక్కినవాడు, సింహములు పులుల కంటబడినవాడు, అరణ్యమందు అడవిఏనుగులబారిన పడినవాడు, కోపగించినరాజుచే మరణశిక్షపడినవాడు లేదా కారాగారములో పడినవాడు, పెనుగాలిచే కొట్టబడినవాడు, కల్లోలితమైన గొప్ప సముద్రమందు చిన్న నావపై ఉన్నవాడు, భయంకరమైన యుద్ధమందు తనపై ఆయుధములు పడుతున్నవాడు, తీవ్రమైన సమస్తబాధలందు దుఃఖముతో కూడుకొన్నవాడు అయిన ఏ మానవుడైనా నా మాహాత్మ్యచరిత్రను స్మరించినంత మాత్రమునే బాధలనుండి విముక్తుడగును.

మమ ప్రభావాత్సింహాద్యా దస్యవో వైరిణస్తథా ।
దూరాదేవ పలాయన్తే స్మరతశ్చరితం మమ ॥29॥

నా ప్రభావము (మహిమ) చేత నా మాహాత్మ్యచరిత్రమును విన్నంతనే క్రూరమృగములైన సింహాదులు, దుష్టజనులు, శత్రువులు దూరముగా పరుగెత్తెదరు.

ఋషిరువాచ – ఋషి చెప్పాడు.

ఇత్యుక్త్వా సా భగవతీ చణ్డికా చణ్డవిక్రమా ।
పశ్యతామేవ దేవానాం తత్రైవాన్తరధీయత ॥30॥

ఈ విధముగా పలికి శత్రువులకు మిక్కిలి భయమును కల్గించు పరాక్రమము కలిగిన భగవతియగు చణ్డికాదేవి దేవతలందరు చూచుచుండగనే అచ్చటే అంతర్ధానమయ్యెను.

తేఽపి దేవ్యా నిరాతంకాః స్వాధికారాన్యథా పురా ।
యజ్ఞభాగభుజః సర్వే చక్రుర్వినిహతారయః ॥31॥

ఆ దేవతలందరూ కూడా చణ్డికాదేవివలన భయమును తొలగించుకొన్నవారై, సంహరింపబడిన శత్రువులు గలవారై తమ తమ హోమద్రవ్యములను భుజించుచు పూర్వమువలే తమ తమ అధికారములను పొందిరి.

దైత్యాశ్చ దేవ్యా నిహతే శుమ్భే దేవరిపౌ యుధి ।
జగద్విధ్వంసకే తస్మిన్మహోగ్రేఽతులవిక్రమే ॥
నిశుమ్భే చ మహావీర్యే శేషాః పాతాలమాయయుః ॥32॥

యుద్ధమందు ప్రపంచానికి విధ్వంసము కలిగించువాడు, గొప్ప ఉగ్రస్వభావము కలవాడు, అనుపమానమైన పరాక్రమము గలవాడు అయిన శుంభాసురుడు, మహావీర్యవంతుడూ అయిన నిశుంభాసురుడు మరణించగా, మిగిలిన రాక్షసులు పాతాళలోకమునకు వెళ్ళిరి.

ఏవం భగవతీ దేవీ సా నిత్యాఽపి పునః పునః ।
సంభూయ కురుతే భూప జగతః పరిపాలనమ్ ॥33॥

ఓ రాజా ! ఈ విధముగా భగవతియగు దేవి నిత్యస్వరూపురాలైననూ మరల మరల ఆయా జన్మలను గ్రహించి ఈ జగత్తును పరిపాలించుచున్నది.

తయైతన్మోహ్యతే విశ్వం సైవ విశ్వం ప్రసూయతే ।
సా యాచితా చ విజ్ఞానం తుష్టా బుద్ధిం ప్రయచ్ఛతి ॥34॥

ఆ దేవివల్లనే ఈ ప్రపంచమంతా మోహము చెందుచున్నది. ఆమెయే ఈ విశ్వమును పుట్టించుచున్నది. మనచేత ప్రార్థించబడిన ఆమె విజ్ఞానమును, ప్రసన్నురాలు కాబడినచో బుద్ధిని ఇచ్చుచున్నది.

వ్యాప్తం తయైతత్సకలం బ్రహ్మాణ్డం మనుజేశ్వర ।
మహాకాల్యా మహాకాలే మహామారీస్వరూపయా ॥35॥

ఓ నరాధిపతీ ! మహాకాలమందు మాహామారీస్వరూపమైన మహాకాళిగా దేవిచేత ఈ బ్రహ్మాండమంతా వ్యాపింపబడినది.

సైవ కాలే మహామారీ సైవ సృష్టిర్భవత్యజా ।
స్థితిం కరోతి భూతానాం సైవ కాలే సనాతనీ ॥36॥

దేవియే కాలమందు మహామారీస్వరూపిణి. ఆమెయే పుట్టుకలేని సృష్టిస్వరూపిణి. ఆమెయే శాశ్వతురాలై కాలమందు ప్రాణులను రక్షించును.

భవకాలే నృణాం సైవ లక్ష్మీః వృద్ధిప్రదా గృహే ।
సైవాభావే తథాఽలక్ష్మీర్వినాశాయోపజాయతే ॥37॥

ఆమె ఉన్న గృహమందు ఆ దేవియే మనుష్యులకు వృద్ధినిచ్చు లక్ష్మీదేవి. ఆమెలేని గృహమందు అలక్ష్మీస్వరూపురాలై ఆ దేవి ఆ ఇంటి వినాశమునకు కారణభూతురాలగును.

స్తుతా సంపూజితా పుష్పైర్గన్ధధూపాదిభిస్తథా ।
దదాతి విత్తం పుత్రాంశ్చ మతిం ధర్మే గతిం శుభామ్ ॥38॥

స్తుతింపబడి, పుష్పగంధధూపాలతో బాగుగా పూజింపబడిన చణ్డికాదేవి ధనమును, పుత్రులను, బుద్ధిని, ధర్మమందు మంగళకరమైన ప్రవృత్తిని ప్రసాదించును.

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే దేవీమాహాత్మ్యే దేవతానాం దేవీవరప్రదానం నామ ఏకోననవతితమోఽధ్యాయః ॥ 89॥

శ్రీ మార్కండేయ మహాపురాణమందలి దేవీమాహాత్మ్యమందలి దేవతలకు దేవీవరప్రదానమను ఎనభైతొమ్మిదవ అధ్యాయం సమాప్తం.



నవతితమోఽధ్యాయః – తొంబదియవ అధ్యాయం

దేవీమాహాత్మ్యే సురథవైశ్యయోః దేవీవరప్రదానమ్ – సురథవైశ్యులకు దేవీవరప్రదానం

ఋషిరువాచ – ఋషి చెప్పాడు.

ఏతత్తే కథితం భూప దేవీమాహాత్మ్యముత్తమమ్ ।
ఏవం ప్రభావా సా దేవీ యయేదం ధార్యతే జగత్ ॥1॥

ఓ రాజా ! ఉత్తమమైన ఈ దేవీమాహాత్మ్యమును గూర్చి చెప్పితిని. ఈ జగత్తునంతా ధరించుచున్న దేవియొక్క ప్రభావమిట్టిది.

విద్యా తథైవ క్రియతే భగవద్విష్ణుమాయయా ।
తథా త్వమేష వైశ్యశ్చ తథైవాన్యే వివేకినః ॥
మోహ్యన్తే మోహితాశ్చైవ మోహమేష్యన్తి చాపరే ॥2॥

భగవంతుడగు విష్ణుమూర్తియొక్క మాయచేతనే ఆయా మానవుల విజ్ఞానము మోహింపచేయబడుచున్నది. అట్లే నీవూ, ఈ వైశ్యుడు, అట్లే కొంతమంది వివేకవంతులు (ఇంకనూ తత్త్వజ్ఞానము పొందనివారు) మోహింపచేయబడుచున్నారు. కొంతమంది మోహింపచేయబడ్డారు. మరికొంతమంది మోహింపచేయబడగలరు.

తాముపైహి మహారాజ శరణం పరమేశ్వరీమ్ ।
ఆరాధితా సైవ నృణాం భోగస్వర్గాపవర్గదా ॥3॥

ఓ మహారాజా ! నీవు ఆ పరమేశ్వరినే శరణు వేడుకొనుము. ఆరాధింపబడిన ఆ దేవి మానవులకు సాంసారికభోగములను, స్వర్గమును, మోక్షమునూ ఇచ్చును.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

ఇతి తస్య వచః శ్రుత్వా సురథః స నరాధిపః ।
ప్రణిపత్య మహాభాగం తమృషిం సంశితవ్రతమ్ ॥4॥

నిర్విణ్ణోఽతిమమత్వేన రాజ్యాపహరణేన చ ।
జగామ సద్యస్తపసే స చ వైశ్యో మహామునే ॥5॥

సందర్శనార్థమంబాయా నదీపులినసంస్థితః ।
స చ వైశ్యస్తపస్తేపే దేవీసూక్తం పరం జపన్ ॥6॥

ఓ మహామునీ ! ఈ విధముగా ఆ ఋషి చెప్పిన మాటలను విని ప్రజాపరిపాలకుడైన ఆ రాజు కఠోరతపోవ్రతములను ఆచరించు ఆ మునికి నమస్కరించి మిక్కిలి మమకారము కలిగియున్నందున, రాజ్యాపహరణము కారణముగా నిర్వేదము చెందినవాడై వెంటనే తపస్సు ఆచరించుటకు వెళ్ళెను. ఆ వైశ్యుడు కూడా అంబాదేవి దర్శనార్థమై నదిఒడ్డున ఇసుకతిన్నెలపై నిలిచి గొప్పది అయిన దేవీసూక్తమును జపించుచూ తపస్సు ఆచరించెను.

తౌ తస్మిన్ పులినే దేవ్యాః కృత్వా మూర్తిం మహీమయీమ్ ।
అర్హణాం చక్రతుస్తస్యాః పుష్పధూపాగ్నితర్పణైః ॥7॥

రాజు, వైశ్యుడు ఆ ఇరువురు ఆ నది ఒడ్డున దేవియొక్క మట్టి ప్రతిమను తయారుచేసి పుష్పములు, ధూపము, అగ్ని, తర్పణములతో ఆ దేవికి పూజను చేసిరి.

నిరాహారౌ యతాత్మానౌ తన్మనస్కౌ సమాహితౌ ।
దదతుస్తౌ బలిం చైవ నిజగాత్రాసృగుక్షితమ్ ॥8॥

ఆహారమును భుజించక, ఆత్మ నిగ్రహము కలిగి, దేవియందే మనస్సును నిలిపి ఏకాగ్రచిత్తులై, తమశరీరమునుండి గ్రహించిన రక్తముతో తడుపబడిన బలిపదార్థములను దేవికి సమర్పించిరి.

ఏవం సమారాధయతోస్త్రిభిర్వర్షైర్యతాత్మనోః ।
పరితుష్టా జగద్ధాత్రీ ప్రత్యక్షం ప్రాహ చణ్డికా ॥9॥

ఈ విధముగా ఆత్మనిగ్రహము కలిగిన రాజు, వైశ్యుడు ఇరువురు మూడు సంవత్సరములు బాగుగా దేవిని ఆరాధించగా జగత్తులకు ఆశ్రయురాలయిన చండికాదేవి సంతోషించి ప్రత్యక్షమై ఇట్లు పలికెను.

శ్రీదేవ్యువాచ – శ్రీదేవి చెప్పింది.

యత్ప్రార్థ్యతే త్వయా భూప త్వయా చ కులనన్దన ।
మత్తస్తత్ప్రాప్యతే సర్వం పరితుష్టా దదామి తత్ ॥10॥

ఓ రాజా ! ఓ కులనన్దనా ! మీరిరువురు ప్రార్థించినదానినంతయు నానుండి పొందగలరు. సంతుష్టురాలనైన నేను దానిని ఇచ్చెదను.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

తతో వవ్రే నృపో రాజ్యమవిభ్రంశ్యగ్రజన్మని ।
అత్రైవ చ నిజం రాజ్యం హతశత్రుబలం బలాత్ ॥11॥

సోఽపి వైశ్యస్తతో జ్ఞానం వవ్రే నిర్విణ్ణమానసః ।
మమేత్యహమితి ప్రాజ్ఞః సంగవిచ్యుతికారకమ్ ॥12॥

అంతట రాజు రాబోవు జన్మమందు భ్రంశము చెందనట్టిదిగానూ, ఈ జన్మమందు తన బలముచే నశింపచేయబడిన శత్రుబలము కల్గినట్టిదిగానూ అయిన రాజ్యమును కోరుకొనెను. జ్ఞానవంతుడయిన వైశ్యుడు నిర్వేదము చెందిన మనస్సు గలవాడై "ఇది నాది, ఇది నేను" అను విధముగా కలిగే సంగమును నశింపచేయునట్టి ఆత్మజ్ఞానమును కోరుకొనెను. "అసంగో హ్యయం పురుషః" అను శ్రుతి పరమాత్మ దేనితోనూ సంసర్గము లేనివాడని చెప్పుచున్నది.

శ్రీదేవ్యువాచ – శ్రీదేవి చెప్పింది.

స్వల్పైరహోభిర్నృపతే స్వం రాజ్యం ప్రాప్స్యసే భవాన్ ।
హత్వా రిపూనస్ఖలితం తవ తత్ర భవిష్యతి ॥13॥

మృతశ్చ భూయః సంప్రాప్య జన్మ దేవాద్వివస్వతః ।
సావర్ణికో నామ మనుర్భవాన్భువి భవిష్యతి ॥14॥

ఓ రాజా ! కొద్ది రోజులలోనే నీవు నీ రాజ్యమును పొందగలవు. శత్రువులందరినీ చంపినందువలన తొట్రుపాటులేని రాజ్యము నీకు లభించగలదు. చనిపోయిన పిమ్మట మరల సూర్యభగవానుని కుమారుడవై జన్మించి సావర్ణికుడను మనువుగా భూలోకమందు జన్మించగలవు. సమస్తభూమండల రాజ్యాధికారము నీకు లభించగలదు.

వైశ్యవర్య త్వయాస్మత్తో వరో యశ్చాభివాంఛితః ।
తం ప్రయచ్ఛామి సంసిద్ధ్యై తవ జ్ఞానం భవిష్యతి ॥15॥

ఓ వైశ్యశ్రేష్ఠుడా ! నీవు నానుండి ఏ వరమును కోరుకొంటివో దానిని నేను నీకు ఇచ్చుచున్నాను. మోక్షసిద్ధికై నీకు జ్ఞానము సిద్ధించగలదు.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

ఇతి దత్త్వా తయోర్దేవీ యథాభిలషితం వరమ్ ।
బభూవాన్తర్హితా సద్యో భక్త్యా తాభ్యామభిష్టుతా ॥16॥

ఈ విధముగా దేవి వారు వారు కోరుకొన్న వరములను వారిరువురికి ప్రసాదించి, ఆ ఇరువురిచే స్తుతింపబడి వెంటనే అంతర్ధానముచెందెను.

ఏవం దేవ్యా వరం లబ్ధ్వా సురథః క్షత్రియర్షభః ।
సూర్యాజ్జన్మ సమాసాద్య సావర్ణిర్భవితా మనుః ॥17॥

ఈ విధముగా క్షత్రియశ్రేష్ఠుడైన సురథుడు చణ్డికాదేవినుండి వరమును పొంది, సూర్యునివలన జన్మను పొంది సావర్ణిమనువు కాగలడు.

ఇతి శ్రీమార్కండేయమహాపురాణే సూర్యసావర్ణికే మన్వన్తరే దేవీమాహాత్మ్యే సురథవైశ్యయోః దేవీవరదానం నామ నవతితమోఽధ్యాయః ॥ సంపూర్ణం దేవీమాహాత్మ్యమ్ ॥90॥

శ్రీ మార్కండేయమహాపురాణమందలి సూర్యసావర్ణికమన్వంతరమందలి దేవీమాహాత్మ్యమందు సురథవైశ్యులకు దేవీవరప్రదానమను తొంబదియవ అధ్యాయం సమాప్తం. దేవీమాహాత్మ్యం సంపూర్ణం.



ఏకనవతితమో஽ధ్యాయః – తొంబదిఒకటవ అధ్యాయం

దక్షపుత్రాది రౌచ్యాన్తమన్వంతరవృత్తాంతః – దక్షపుత్రుడు మొదలుకొని రౌచ్యునివరకుగల మన్వంతరముల వృత్తాంతం

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

సావర్ణికమిదం సమ్యక్ ప్రోక్తం మన్వన్తరం తవ ।
తథైవ దేవీమాహాత్మ్యే మహిషాసురఘాతనమ్ ॥1॥

ఉత్పత్తయశ్చ యా దేవ్యా మాతౄణాం చ మహాహవే ।
తథైవ సంభవో దేవ్యాశ్చాముణ్డాయా యథా భవః ॥2॥

శివదూత్యాశ్చ మాహాత్మ్యం వధః శుంభనిశుంభయోః ।
రక్తబీజవధశ్చైవ సర్వమేతత్తవోదితమ్ ॥3॥

ఓ మునిశ్రేష్ఠుడా ! నీకు సావర్ణికమన్వంతరమును గూర్చి చెప్పితిని. అట్లే దేవీమాహాత్మ్యమును వర్ణించి చెప్పు సందర్భములో మహిషాసురవధ, మహాయుద్ధమందు దేవినుండి మాతృగణాల ఉత్పత్తి, చాముండాదేవియొక్క ఉత్పత్తి, శివదూతియొక్క మాహాత్మ్యము, శుంభనిశుంభరాక్షసుల వధ, రక్తబీజుని వధ ఈ వృత్తాంతములన్నింటినీ నీకు నేను చెప్పితిని.

శ్రూయతాం మునిశార్దూల సావర్ణికమథాపరమ్ ।
దక్షపుత్రశ్చ సావర్ణిర్భావీ యో నవమో మనుః ॥4॥

ఓ మునిశ్రేష్ఠుడా ! ఇప్పుడు భవిష్యత్తులో జరుగబోవు దక్షపుత్రుడైన తొమ్మిదవ సావర్ణిమనువుయొక్క మన్వంతరమును గూర్చి చెప్పెదను, వినుము.

కథయామి మనోస్తస్య యే దేవా మునయో నృపాః ।
పారా మరీచిభర్గాశ్చ సుధర్మాణస్తథా సురాః ॥5॥

ఏతే త్రిధా భవిష్యన్తి సర్వే ద్వాదశకా గణాః ।
తేషామింద్రో భవిష్యస్తు సహస్రాక్షో మహాబలః ॥6॥

ఆ మనువుయొక్క మన్వంతరమందు ఏఏ దేవతలు, ఏఏ మునులు, ఏఏ రాజులు ఉండెదరో వారినిగూర్చి చెప్పెదను. దేవతలు పార, మరీచిభర్గ, సుధర్మ అను విధముగా మూడు విధములుగా ఉండెదరు. ఈ మూడింటిలో ఒక్కొక్క గణమందు పన్నెండుమంది దేవతలుండెదరు. వారికి అందరికి ఇంద్రుడు (ప్రభువు) మహాబలవంతుడైన సహస్రాక్షుడు ఉండును.

సాంప్రతం కార్తికేయో యో వహ్నిపుత్రః షడాననః ।
అద్భుతో నామ శక్రో஽సౌ భావీ తస్యాన్తరే మనోః ॥7॥

ప్రస్తుతమన్వంతరమందున్న వహ్నిపుత్రుడగు షడాననుడైన కార్తికేయుడు రాబోవు తొమ్మిదవ మన్వంతరమందు అద్భుతుడను పేరుతో ఇంద్రుడు కాగలడు.

మేధాతిథిర్వసుః సత్యో జ్యోతిష్మాన్ ద్యుతిమాంస్తథా ।
సప్తర్షయోఽన్యః సబలస్తథాన్యో హవ్యవాహనః ॥8॥

ఆ మన్వంతరమందు మేధాతిథి, వసువు, సత్యుడు, జ్యోతిష్మంతుడు, ద్యుతిమంతుడు, సబలుడు, హవ్యవాహనుడు ఈ ఏడుగురు సప్తర్షులుగా నుందురు.

దృష్టకేతుర్బర్హకేతుః ఖడ్గహస్తో నిరామయః ।
పృథుశ్రవాస్తథార్చిష్మాన్ భూరిద్యుమ్నో బృహద్భయః ॥9॥

ఏతే నృపసుతాస్తస్య దక్షపుత్రస్య వై నృపాః ।
మనోస్తు దశమస్యాన్యచ్ఛృణు మన్వంతరం ద్విజ ॥10॥

దృష్టకేతువు, బర్హకేతువు, ఖడ్గహస్తుడు, నిరామయుడు, పృథుశ్రవసుడు, అర్చిష్మంతుడు, భూరిద్యుమ్నుడు, బృహద్భయుడు వీరు దక్షపుత్రునియొక్క పుత్రులు ఆ తొమ్మిదవ సావర్ణి మన్వంతరమందు రాజులుగా నుందురు. ఓ బ్రాహ్మణుడా ! ఇక పదియవ మనువుయొక్క మన్వంతరమును గూర్చి చెప్పెదను, వినుము.

మన్వన్తరే చ దశమే బ్రహ్మపుత్రస్య ధీమతః ।
సుఖాసీనా నిరుద్ధాశ్చ ద్విప్రకారాః సురాః స్మృతాః ॥11॥

ధీమంతుడయిన బ్రహ్మపుత్రునియొక్క పదియవ మన్వంతరమందు సుఖాసీనులు, నిరుద్ధులు అని రెండు విధములైన దేవతలు ఉండెదరు.

శతసంఖ్యా హి తే దేవా భవిష్యా భావినో మనోః ।
యత్పుత్రాణాం శతం భావి తద్దేవానాం తదా శతమ్ ॥12॥

భవిష్యత్తులో రాబోవు మనువుయొక్క కాలమందు దేవతలు నూరు సంఖ్యలో ఉండెదరు. ఎందువలననగా అతడి పుత్రులు నూరుగురు కనుక దేవతలు కూడా నూరుగురు ఉండెదరు.

శాన్తిరిన్ద్రస్తథా భావీ సర్వైరిన్ద్రగుణైర్యుతః ।
సప్తర్షీంస్తాన్నిబోధ త్వం యే భవిష్యన్తి వై తదా ॥13॥

ఆపోమూర్తిర్హవిష్మాంశ్చ సుకృతీ సత్య ఏవ చ ।
నాభాగోఽప్రతిమశ్చైవ వాసిష్ఠశ్చైవ సప్తమః ॥14॥

శాంతియనువాడు సమస్త ఇంద్రగుణములతో కూడుకొన్నవాడు ఇంద్రుడు కాగలడు. ఆ రాబోవు పదియవ మన్వంతరమందు సప్తర్షులు ఎవరు ఉండెదరో, వారినిగూర్చి చెప్పెదను వినుము. వారు వరుసగా ఆపోమూర్తి, హవిష్మంతుడు, సుకృతి సత్యుడు, నాభాగుడు, అప్రతిముడు, వాసిష్ఠుడు అనువారలు.

సుక్షేత్రశ్చోత్తమౌజాశ్చ భూరిషేణశ్చ వీర్యవాన్ ।
శతానీకోఽథ వృషభో హ్యనమిత్రో జయద్రథః ॥15॥

భూరిద్యుమ్నః సుపర్వా చ తస్యైతే తనయా మనోః ।
భవిష్యా ధర్మపుత్రస్య సావర్ణస్యాన్తరం శృణు ॥16॥

సుక్షేత్రుడు, ఉత్తమౌజస్వి, భూరిషేణుడు, వీర్యవంతుడు, శతానీకుడు, వృషభుడు, అనమిత్రుడు, జయద్రథుడు, భూరిద్యుమ్నుడు, సుపర్వ అనువారలు ఈ పదియవ మనువుయొక్క కుమారులుగా జన్మించెదరు. ఇక ధర్మపుత్రుడగు సావర్ణుని పదకొండవ మన్వంతరమును గూర్చి చెప్పెదను, వినుము.

విహఙ్గమాః కామగాశ్చ నిర్మాణపతయస్తథా ।
త్రిఃప్రకారా భవిష్యన్తి ఏకైకస్త్రింశకో గణః ॥17॥

మాసర్తుదివసా యే తు నిర్మాణపతయస్తు తే ।
విహఙ్గమా రాత్రయోఽథ మౌహూర్తాః కామగా గణాః ॥18॥

విహంగములు, కామగులు, నిర్మాణపతులు అని మూడు విధములైన దేవతలు ఆ మన్వంతరమందు ఉందురు. ఒక్కొక్క దేవతాగణమందు ముప్పైమంది దేవతలుందురు. మాస, ఋతు, దినములు (పగళ్ళు) నిర్మాణపతిదేవతలు. విహంగములు రాత్రులు. కామగదేవతలు మూహూర్తులు, (ముహూర్తకాలస్వరూపులు).

ఇన్ద్రో వృషాఖ్యో భవితా తేషాం ప్రఖ్యాతవిక్రమః ।
హవిష్మాంశ్చ వరిష్ఠశ్చ ఋషిరన్యస్తథారుణిః ॥19॥

నిశ్చరాశ్చానఘశ్చైవ విష్టిశ్చాన్యో మహామునిః ।
సప్తర్షయోఽన్తరే తస్మిన్నగ్నితేజాశ్చ సప్తమః ॥20॥

ప్రఖ్యాతపరాక్రమముకల్గిన వృషనామధేయుడు ఆ దేవతలకు ఇంద్రుడు అనగా ప్రభువు కాగలడు. హవిష్మంతుడు, వరిష్ఠుడు, ఆరుణియను ఋషి, నిశ్చరుడు, అనఘుడు, మహామునియగు విష్టి, అగ్నితేజస్వి అనువారలు ఆ మన్వంతరమందు సప్తర్షులుగ ఉండగలరు.

సర్వత్రగః సుశర్మా చ దేవానీకః పురూద్వహః ।
హేమధన్వా దృఢాయుశ్చ భావినస్తత్సుతా నృపాః ॥21॥

సర్వత్రగుడు, సుశర్మ, దేవానీకుడు, పురూద్వహుడు, హేమధన్వ, దృఢాయువు అనువారలు ఆ రాజుకు కుమారులుగా జన్మించగలరు.

ద్వాదశే రుద్రపుత్రస్య ప్రాప్తే మన్వన్తరే మనోః ।
సావర్ణాఖ్యాశ్చ యే దేవా మునయశ్చ శృణుష్వ తాన్ ॥22॥

రుద్రపుత్రుడగు పన్నెండవ సావర్ణమనువుయొక్క మన్వంతరము ప్రాప్తించగా, అప్పుడు ఉండే సావర్ణులని పిలవబడే దేవతలు, మునులను గూర్చి చెప్పెదను, వినుము.

సుధర్మాణః సుమనసో హరితో రోహితస్తథా ।
సువర్ణాశ్చ సురాస్తత్ర పఞ్చైతే దశకా గణాః ॥23॥

సుధర్మ, సుమనస్, హరిత, రోహిత, సువర్ణనామధేయులగు అయిదు దేవతాగణములు ఆ మన్వంతరమందు ఉందురు.

తేషామింద్రస్తు విజ్ఞేయ ఋతధామా మహాబలః ।
సర్వైరిన్ద్రగుణైర్యుక్తః సప్తర్షీనపి మే శృణు ॥24॥

ద్యుతిస్తపస్వీ సుతపాస్తపోమూర్తిస్తపోనిధిః ।
తపోరతిస్తథైవాన్యః సప్తమస్తు తపోధృతిః ॥25॥

ఆ దేవతలకు ఇంద్రుడిగా మహాబలవంతుడగు ఋతధామయనువానిని సమస్త ఇంద్రగుణములు కలవానినిగా తెలియవలెను. ఇక ఆ పన్నెండవ మన్వంతరమందు ఉండే సప్తర్షులను గూర్చి చెప్పెదను వినుము. వారు వరుసగా ద్యుతి, తపస్వి, సుతప, తపోమూర్తి, తపోనిధి, తపోరతి, తపోధృతి అను పేర్లు గలవారలు.

దేవవానుపదేవశ్చ దేవశ్రేష్ఠో విదూరథః ।
మిత్రవాన్మిత్రవిన్దశ్చ భావినస్తత్సుతా నృపాః ॥26॥

దేవవంతుడు, ఉపదేవుడు, దేవశ్రేష్ఠుడు, విదూరథుడు, మిత్రవంతుడు, మిత్రవిందుడు అనువారలు ఆ మన్వంతరమందలి రాజుకు పుత్రులుగా జన్మించెదరు.

త్రయోదశస్య పర్యాయే రౌచ్యాఖ్యస్య మనోః సురాన్ ।
సప్తర్షీంశ్చ నృపాంశ్చైవ గదతో మే నిశామయ ॥27॥

రౌచ్యుడను పదమూడవ మనువుయొక్క మన్వంతరమందు ఎవరు దేవతలుగానూ, సప్తర్షులుగానూ, రాజులుగానూ ఉండెదరో చెప్పెదను, వినుము.

సుధర్మాణః సురాస్తత్ర సుకర్మాణస్తథాపరే ।
సుశర్మాణః సురా హ్యేతే సమస్తా మునిసత్తమ ॥28॥

ఓ మునిశ్రేష్ఠుడా ! సుధర్మ, సుకర్మ, సుశర్మ నామధేయులైన వారు ఆ మన్వంతరమందు సమస్తదేవతలుగా ఉందురు.

మహాబలో మహావీర్యస్తేషామిన్ద్రో దివస్పతిః ।
హవిష్మానథ సప్తర్షీన్గదతో మే నిశామయ ॥29॥

మహాబలవంతుడు, మహాపరాక్రమవంతుడూ, హవిష్మంతుడూ అయిన దివస్పతి ఆ దేవతలకు ఇంద్రుడు కాగలడు. ఇక ఆ మన్వంతరమందు ఉండే సప్తర్షులను గూర్చి చెప్పెదను వినుము.

ధృతిమానవ్యయశ్చైవ తత్త్వదర్శీ నిరుత్సకః ।
నిర్మోహః సుతపాశ్చాన్యో నిష్ప్రకంపశ్చ సప్తమః ॥30॥

ధృతిమంతుడు, అవ్యయుడు, తత్త్వదర్శి, నిరుత్సుకుడు, నిర్మోహుడు, సుతపసుడు, నిష్ప్రకంపుడు అను వారు ఏడుగురు ఆ మన్వంతరమందు సప్తర్షులుగా ఉండెదరు.

చిత్రసేనో విచిత్రశ్చ నియతిర్నిర్భయో దృఢః ।
సునేత్రః క్షత్రబుద్ధిశ్చ సువ్రతశ్చైవ తత్సుతాః ॥31॥

చిత్రసేనుడు, విచిత్రుడు, నియతి, నిర్భయుడు, దృఢుడు, సునేత్రుడు, క్షత్రబుద్ధి, సువ్రతుడు అను వారలు ఆ రౌచ్యమనువుయొక్క పుత్రులుగా ఉండగలరు.

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే దక్షపుత్ర, బ్రహ్మపుత్ర, ధర్మపుత్ర, రుద్రపుత్ర, రౌచ్యమన్వంతరాణాం వృత్తాంతో నామ ఏకనవతితమోఽధ్యాయః ॥91॥

శ్రీ మార్కండేయ మహాపురాణమందలి దక్షపుత్ర, బ్రహ్మపుత్ర, ధర్మపుత్ర, రుద్రపుత్ర, రౌచ్యమన్వంతరముల వృత్తాంతమనెడు తొంబదిఒకటవ అధ్యాయం సమాప్తం.



ద్వినవతితమోఽధ్యాయః – తొంబదిరెండవ అధ్యాయం

రుచ్యుపాఖ్యానే పితృకృతగృహస్థధర్మోపదేశః –

రుచ్యుపాఖ్యానమందలి పితృదేవతలు చేసిన గృహస్థధర్మోపదేశం

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

రుచిః ప్రజాపతిః పూర్వం నిర్మమో నిరహంకృతః ।
యత్రాస్తమితశాయీ చ చచార పృథివీమిమామ్ ॥1॥

పూర్వము రుచియను ప్రజాపతి మమతాభావము మరియు అహంకారములు లేనివాడై, ఏ ప్రదేశమందు ఉండగా సూర్యాస్తమయము అగునో ఆ ప్రదేశమందే నిద్రించుచూ ఈ భూమండలమంతయు సంచరించుచుండెను.

అనగ్నిమనికేతం తమేకాహారమనాశ్రమమ్ ।
విముక్తసఙ్గం తం దృష్ట్వా ప్రోచుస్తత్పితరో మునిమ్ ॥2॥

అగ్నులు, నివాసస్థానము లేనివాడై, రోజుకు ఒక్కసారి మాత్రమే భోజనము చేయుచూ, ఆశ్రమము లేనివాడై, ఎవరితోనూ సంగము అనగా సంబంధము లేనివాడై ఉన్న మునియగు ఆ రుచిప్రజాపతిని చూచి పితృదేవతలు ఇట్లు పలికిరి.

పితర ఊచుః – పితృదేవతలు పలికారు.

వత్స కస్మాత్త్వయా పుణ్యో న కృతో దారసంగ్రహః ।
స్వర్గాపవర్గహేతుత్వాద్బన్ధస్తేనానిశం వినా ॥3॥

ఓ కుమారా ! పుణ్యకార్యమైన వివాహమును నీవెందుకు చేసుకొనలేదు? వివాహము స్వర్గము మరియు మోక్షములను సంపాదించుటకు కారణము. వివాహము కానిచో అది ఎల్లప్పుడు బంధమునకే కారణము.

గృహీ సమస్తదేవానాం పితౄణాం చ తథార్హణామ్ ।
ఋషీణామతిథీనాం చ కుర్వంల్లోకానుపాశ్నుతే ॥4॥

గృహస్థుడైనవాడు సమస్తదేవతలకు, పితృదేవతలకు, ఋషులకు, అతిథులకు పూజను ఆచరించుచు స్వర్గాది ఉత్తమలోకాలను పొందుచున్నాడు.

స్వాహోచ్చారణతో దేవాన్ స్వధోచ్చారణతః పితౄన్ ।
విభజత్యన్నదానేన భూతాద్యానతిథీనపి ॥5॥

"స్వాహా" అని ఉచ్చరించుటద్వారా దేవతలను, "స్వధా" అని ఉచ్చరించుటద్వారా పితృదేవతలను, అన్నమును ఇచ్చుటద్వారా భూతాదులను, అతిథులను గృహస్థుడు సేవించుచున్నాడు.

స త్వం దైవాదృణాద్బన్ధం బన్ధమస్మదృణాదపి ।
అవాప్నోషి మనుష్యర్షిభూతేభ్యశ్చ దినే దినే ॥6॥

వివాహమును ఆచరించనట్టి నీవు దైవఋణమువలన, మనుష్య ఋణమువలన, ఋషిఋణమువలన, భూతఋణము వలన నిత్యమూ బంధమును పొందుచున్నావు.

అనుత్పాద్య సుతాన్దేవానసంతర్ప్య పితౄంస్తథా ।
భూతాదీంశ్చ కథం మౌఢ్యాత్సుగతిం గన్తుమిచ్ఛసి ॥7॥

పుత్రులను పొందక పితృదేవతలను మరియు భూతాదులను సంతృప్తిపరచకుండా మూర్ఖత్వముతో నీవు ఏ విధముగా ఉత్తమగతులను పొందవలెనని కోరుకొనుచున్నావు?

క్లేశమేవైహికం పుత్ర మన్యామోఽత్ర భవేత్తవ ।
మృతస్య నరకం తద్వత్ క్లేశమేవాన్యజన్మని ॥8॥

ఓ కుమారా ! ఈ జన్మమందు నీకు క్లేశములు ఒకదాని తరువాత మరొకటి కల్గునని మేము తలచుచున్నాము. అట్లే చనిపోయిన పిమ్మట రాబోవు జన్మమందు నరకమను క్లేశము సంభవించగలదు.

రుచిరువాచ – రుచి చెప్పాడు.

పరిగ్రహోఽతిదుఃఖాయ పాపాయాధోగతేస్తథా ।
భవత్యతో మయా పూర్వం న కృతో దారసంగ్రహః ॥9॥

వివాహము అత్యంతదుఃఖమునకు, పాపమునకు, అధోగతికీ కారణమగును. అందువల్లనే నేను వివాహమును చేసుకొనలేదు.

ఆత్మనః సంయమో యోఽయం క్రియతేఽక్షనియన్త్రణాత్ ।
స ముక్తిహేతుర్న భవత్యసావపి పరిగ్రహాత్ ॥10॥

ఇంద్రియములను నియంత్రించుటద్వారా ఆత్మనిగ్రహము ఏది కలదో అదియే ముక్తికి కారణము. వివాహము ముక్తికి కారణము కాదు.

ప్రక్ష్యాల్యతేఽనుదివసం యదాత్మా నిష్పరిగ్రహైః ।
మమత్వపఙ్కదిగ్ధోఽపి చిత్తాంబోభిర్వరం హి తత్ ॥11॥

మమత్వభావమను బురదతో కూడుకొనియున్ననూ అట్టి ఆత్మ సంసారబంధములు లేని సాధుపురుషులచేత చిత్తమందలి మంచి యాలోచనలను నీటితో ప్రతిదినము శుభ్రము చేయబడుచున్నది. అట్టి కార్యము మిక్కిలి శ్రేష్ఠమైనది కదా !

అనేకభవసంభూతకర్మపఙ్కాఙ్కితో బుధైః ।
ఆత్మా సద్వాసనాతోయైః ప్రక్షాల్యో నియతేంద్రియైః ॥12॥

అనేకజన్మలందు ఆచరించిన కర్మలనెడు బురదచేత చిహ్నితమైన ఆత్మ మంచి సంస్కారములనెడు జలములతో ఇంద్రియనిగ్రహము కలిగిన పండితులచేత ప్రక్షాళనము చేయతగినది.

పితర ఊచుః – పితృదేవతలు పలికారు.

యుక్తం ప్రక్షాలనం కర్తుమాత్మనో నియతేంద్రియైః ।
కిన్తు లేపాయ మార్గోఽయం యత్ర త్వం పుత్ర వర్తసే ॥13॥

ఓ కుమారా ! ఇంద్రియనిగ్రహము కలిగినవారిచేత ఆత్మ ప్రక్షాళనము చేయబడుట యుక్తమే. కాని నీవు ఉన్న ఈ సంసారమందు నీవు స్వీకరించిన మార్గము కర్మలేపముకొరకే కారణమగును కాని కర్మనాశము కొరకు కాదు. (సంసారమందు సంచరిస్తూ ఇంద్రియనిగ్రహము సాధ్యము కాదని ఆశయము.)

పఞ్చర్ణదీనైరశుభం నుద్యతేఽనభిసన్ధితైః ।
ఫలైస్తథోపభోగైశ్చ పూర్వకర్మశుభాశుభైః ॥14॥

దేవఋణము, పితృఋణము మొ॥లగు అయిదు ఋణముల కారణముగా దీనులైనవారు మరియు కర్మఫలాపేక్షలేనివారూ ఎవరు గలరో వారి అశుభమంతయు వారు పూర్వమాచరించిన పాపపుణ్యకర్మల ఫలముచేతనూ, ఆ ఫలముననుభవించుటచేతనూ క్షయమగును.

ఏవం న బన్ధో భవతి కుర్వతః కారణాత్మకః ।
న బన్ధాయ తత్కర్మ భవత్యనభిసన్ధితమ్ ॥15॥

ఈ విధముగా ఫలాపేక్షలేకుండా కర్మను ఆచరించువారికి సంసారకారణమైన బంధము కలుగదు. ఎందువలననగా ఫలాపేక్షలేకుండా చేయబడిన ఆ కర్మ సంసారబంధములకు కారణము కాదు. (ఫలాపేక్షతో ఎవరు కర్మలు చేస్తారో వారికే కర్మలేపమూ, సంసారబంధమూ రెండూ ఏర్పడతాయి. నిష్కామబుద్ధితో కర్మలు ఆచరించువారికి కర్మలేపముగాని సంసారబంధముగాని ఉండదని ఆశయము. ఉపాసనలతో ఆ విధముగా కర్మలను ఆచరించువారికి బ్రహ్మలోకప్రాప్తి కలుగుతుందని ఈశావాస్యోపనిషత్తునందు చెప్పబడినది.)

పూర్వకర్మ కృతం భోగైః క్షీయతేఽహర్నిశం తథా ।
సుఖదుఃఖాత్మకైర్వత్స పుణ్యాపుణ్యాత్మకైర్నృణామ్ ॥16॥

ఓ కుమారా ! పూర్వము (అనగా పూర్వజన్మలందుగాని లేదా ఈ జన్మమందే పూర్వకాలమందుగాని) ఆచరింపబడిన మానవుల కర్మలు అవి సుఖదుఃఖాత్మకములైనా, పాపపుణ్యములైనా రాత్రింబవళ్ళు వాటిని అనుభవించుటచేత మాత్రమే అవి నశించును.

ఏవం ప్రక్షాల్యతే ప్రాజ్ఞైరాత్మా బన్ధాచ్చ రక్ష్యతే ।
నత్వేవమవివేకేన పాపపఙ్కేన లిప్యతే ॥17॥

బుద్ధిమంతులైనవారు ఈ విధముగా ఆత్మను ప్రక్షాళనము చేసుకొందురు, మరియు బంధములనుండి రక్షించుకొందురు. కాని అవివేకులై పాపమను బురదతో ఆత్మను నాశనము చేసుకొనరు. (ఆత్మను అనగా తనను అని అర్థం.)

రుచిరువాచ – రుచి చెప్పాడు.

అవిద్యా పఠ్యతే వేదైః కర్మమార్గః పితామహాః ।
తత్కథం కర్మణో మార్గే భవన్తో యోజయన్తి మామ్ ॥18॥

ఓ తండ్రులారా ! వేదములలో అవిద్యయే కర్మమార్గముగా చెప్పబడుచున్నది. అట్లయినప్పుడు మీరు నన్ను ఎందులకు కర్మమార్గమందు ప్రవర్తింపచేయుచున్నారు?

పితర ఊచుః – పితృదేవతలు చెప్పిరి.

అవిద్యా సత్యమేవైతత్కర్మ నైతన్మృషావచః ।
కిన్తు విద్యాపరిప్రాప్తౌ హేతుః కర్మ న సంశయః ॥19॥

అవిద్యయే కర్మయని చెప్పుట సత్యమే. ఇది అసత్యము కాదు. కాని జ్ఞానప్రాప్తిలో కర్మలు (చిత్తశుద్ధిసంపాదనద్వారా) కారణమనుటలో ఎట్టి సంశయమూ లేదు.

విహితాకరణాత్పుంభిరసద్భిః క్రియతే తు యః ।
సంయమో ముక్తయే నాసౌ ప్రత్యుతాధోగతిప్రదః ॥20॥

శాస్త్రవిహితకర్మలను చేయకుండా అజ్ఞానులైన పురుషులు ఆచరించే ఇంద్రియనిగ్రహము ముక్తికి కారణము కాదు కదా, అది అధోగతికే కారణమగును.

ప్రక్షాలయామీతి భవాన్యత్వాత్మానం తు మన్యతే ।
విహితాకరణోద్భూతైః పాపైస్త్వం తు విలిప్యసే ॥21॥

ఓ కుమారా ! ఆత్మను ప్రక్షాళన చేసెదనని నీవు తలచుచున్నావు. కాని నీవు నీకు విధింపబడిన కర్మలను ఆచరించనందువలన కలిగే పాపములతో సంసర్గము పొందుచున్నావు.

అవిద్యాప్యుపకారాయ విషవజ్జాయతే నృణామ్ ।
అనుష్ఠితాభ్యుపాయేన బన్ధాయాన్యాయతో హి సా ॥22॥

విహితకర్మలను ఆచరించుట అను ఉపాయమువలన, విషము కూడా ఒకప్పుడు ఆరోగ్యమునిచ్చు విధముగా, అవిద్య కూడా ఉపకారమునిచ్చుటకు కారణమగుచున్నది. అన్యాయము అనగా విహితకర్మలను సరిగా ఆచరించకపోవుటవల్లనే ఆ అవిద్య బంధహేతువగుచున్నది.

తస్మాద్వత్స కురుష్వ త్వం విధివద్దారసంగ్రహమ్ ।
మా జన్మ విఫలం తేఽస్తు అసంప్రాప్య తు లౌకికమ్ ॥23॥

ఓ కుమారా ! అందువలన నీవు శాస్త్రోక్తప్రకారము వివాహము చేసుకొనుము. లౌకికమైన విహితకర్మలను ఆచరించకపోవుట ద్వారా నీ జన్మ వ్యర్థము కాకుండుగాక !

రుచిరువాచ - రుచి చెప్పాడు.

> **వృద్ధోఽహం సాంప్రతం కో మే పితరః సంప్రదాస్యతి ।**
> **భార్యాం తథా దరిద్రస్య దుష్కరో దారసంగ్రహః ॥24॥**

ఓ తండ్రులారా ! నేనిప్పుడు ముసలివాడనైతిని. ఎవరు నాకు ఆడపిల్లనిచ్చెదరు? విశేషించి దరిద్రునికి భార్య లభించుట మిక్కిలి కష్టము.

పితర ఊచుః - పితృదేవతలు పలికారు.

> **అస్మాకం పతనం వత్స భవతశ్చాప్యధోగతిః ।**
> **నూనం భావి భవిత్రీ చ నాభినన్దసి నో వచః ॥25॥**

ఓ కుమారా ! మాకు పతనము, నీకు అధోగతీ ఈ రెండూ తప్పక సంభవించగలవు. ఎందువలననగా నీవు మా మాటలను లక్ష్యపెట్టుటలేదు.

మార్కండేయ ఉవాచ - మార్కండేయుడు చెప్పాడు.

> **ఇత్యుక్త్వా పితరస్తస్య పశ్యతో మునిసత్తమ ।**
> **బభూవుః సహసాఽదృశ్యా దీపా వాతాహతా ఇవ ॥26॥**

ఓ మునిశ్రేష్ఠుడా ! ఈ విధముగా పలికి రుచి చూచుచుండగానే పితృదేవతలు, గాలిచే కొట్టబడిన దీపములవలే, వెంటనే అంతర్ధానమయిరి.

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే రుచ్యుపాఖ్యానే పితృకృతగృహస్థధర్మోపదేశో నామ ద్వినవతితమోఽధ్యాయః ॥92॥

శ్రీ మార్కండేయ మహాపురాణమందలి రుచ్యుపాఖ్యానమందు పితృదేవతలు చేసిన గృహస్థధర్మోపదేశమను తొంబదిరెండవ అధ్యాయం సమాప్తం.



త్రినవతితమోఽధ్యాయః – తొంబదిమూడవ అధ్యాయం

రుచ్యుపాఖ్యానే పితృస్తవనమ్ – రుచ్యుపాఖ్యానమందు పితృస్తుతి

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

స తేన పితృవాక్యేన భృశముద్విగ్నమానసః ।
కన్యాభిలాషీ విప్రర్షిః పరిబభ్రామ మేదినీమ్ ॥1॥

బ్రాహ్మణఋషియగు ఆ రుచి ఆ పితృదేవతల మాటలను విని మిక్కిలి ఉద్వేగము చెందిన మనస్సుగలవాడై కన్యను పొందాలనే అభిలాషతో భూమండలమంతా తిరుగసాగెను.

కన్యామలభమానోఽసౌ పితృవాక్యాగ్నిదీపితః ।
చిన్తామవాప మహతీమతీవోద్విగ్నమానసః ॥2॥

పితృదేవతల మాటలతో ఉద్దీపితుడైన రుచిమహర్షి కన్యను పొందనివాడై ఉద్విగ్నమైన మనస్సు కలవాడై మిక్కిలి చింతించెను.

కిం కరోమి క్వ గచ్ఛామి కథం మే దారసంగ్రహః ।
క్షిప్రం భవేత్పితౄణాం యో మమాభ్యుదయకారకః ॥3॥

ఏమి చేయుదును? ఎచ్చటకు వెళ్ళెదను. నా పితృదేవతల అభ్యుదయమును కలిగించు నాయొక్క భార్యాపరిగ్రహము ఎట్లు శీఘ్రముగా నెరవేరును?

ఇతి చిన్తయతస్తస్య మతిర్జాతా మహాత్మనః ।
తపసాఽఽరాధయామ్యేనం బ్రహ్మాణం కమలోద్భవమ్ ॥4॥

ఈ విధముగా ఆలోచించుచున్న మహాత్ముడగు రుచిమహర్షికి "కమలసంభవుడయిన బ్రహ్మదేవుని తపస్సుతో ఆరాధించెదను" అని ఆలోచన కలిగెను.

తతో వర్షశతం దివ్యం తపస్తేపే స వేధసమ్ ।
దిదృక్షుః సుచిరం కాలం పరం నియమమాస్థితః ॥5॥

అంతట ఆ రుచిమహర్షి గొప్ప నియమనిష్ఠలతో కూడుకొన్నవాడై బ్రహ్మదేవుని సందర్శించగోరి నూరు సంవత్సరములు దివ్యమైన తపస్సును ఆచరించెను.

తతః స్వం దర్శయామాస బ్రహ్మా లోకపితామహః ।
ఉవాచ తం ప్రసన్నోఽస్మీత్యుచ్యతామభివాంఛితమ్ ॥6॥

పిమ్మట లోకపితామహుడగు బ్రహ్మదేవుడు తన స్వరూపమును రుచిమహర్షికి చూపించెను. ఇంకను "నేను ప్రసన్నుడనైతిని. నీకిష్టమైనదానిని కోరుకొనుము" అని పలికెను.

తతోఽసౌ ప్రణిపత్యాహ బ్రహ్మాణం జగతో గతిమ్ ।
పితౄణాం వచనాత్తేన యత్కర్తుమభివాంఛితమ్ ॥

బ్రహ్మా చాహ రుచిం విప్ర శ్రుత్వా తస్యాభివాంఛితమ్ ॥7॥

అంతట రుచి జగత్తుకు ఆశ్రయభూతుడైన బ్రహ్మకు నమస్కరించి పితృదేవతల మాట ప్రకారము తన కోరికను బ్రహ్మకు విన్నవించెను. పిమ్మట రుచియొక్క కోరికను విని ఈ విధముగా పలికెను.

బ్రహ్మోవాచ – బ్రహ్మ పలికెను.

ప్రజాపతిస్త్వం భవితా స్రష్టవ్యా భవతా ప్రజాః ।
సృష్ట్వా ప్రజాః సుతాన్విప్ర సముత్పాద్య క్రియాస్తథా ॥8॥

కృత్వా కృతాధికారస్త్వం తతః సిద్ధిమవాప్స్యసి ।
స త్వం యథోక్తం పితృభిః కురు దారపరిగ్రహమ్ ॥9॥

ఓ బ్రాహ్మణుడా ! నీవు ప్రజాపతివి కాగలవు. నీవలన ప్రజలు సృష్టింపబడెదరు. నీవు పుత్రసమానులైన ప్రజలను సృష్టించి, అగ్నికార్యములు మొ॥లగు క్రియలను ఆచరించి, అధికారము సంపాదించినవాడవై కార్యసిద్ధిని పొందగలవు. అట్టి నీవు నీ పితృదేవతలు చెప్పిన విధముగా భార్యాపరిగ్రహణము చేయుము.

కామం చేమమభిధ్యాయ క్రియతాం పితృపూజనమ్ ।
త ఏవ తుష్టాః పితరః ప్రదాస్యన్తి తవేప్సితాన్ ॥
పత్నీం సుతాంశ్చ సంతుష్టాః కిం న దద్యుః పితామహాః ॥10॥

నీ కోరికను మనస్సులో ధ్యానించి నీవు పితృదేవతలను పూజింపుము. వారే సంతుష్టిచెంది నీ కోరికలను నెరవేర్చగలరు. సంతుష్టిచెందిన నీ పితృదేవతలు నీకు భార్యను, పుత్రులను అనుగ్రహించరా ఏమి? తప్పక అనుగ్రహించెదరు.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

ఇత్యృషిర్వచనం శ్రుత్వా బ్రహ్మణోఽవ్యక్తజన్మనః ।
నద్యా వివిక్తే పులినే చకార పితృతర్పణమ్ ॥11॥

తుష్టావ చ పితౄన్ విప్రః స్తవైరేభిస్తథాదృతః ।
ఏకాగ్రః ప్రయతో భూత్వా భక్తినమ్రాత్మకన్ధరః ॥12॥

ఈ విధముగా అవ్యక్తజన్ముడైన బ్రహ్మదేవుని మాటలను విని ఋషియగు రుచి నదికి దూరంగావున్న ఇసుకతిన్నెలపై నిలచి పితృదేవతలకు తర్పణమిచ్చెను. ఇంకనూ ఆ విప్రుడగు రుచి ఆదరముతో, ఏకాగ్రచిత్తముతో, ఇంద్రియములను నిగ్రహించుకొని, భక్తితో శిరస్సు వంచి స్తోత్రములతో పితృదేవతలను సంతోషపరచెను.

రుచిరువాచ – రుచి చెప్పాడు.

నమస్యేఽహం పితౄన్ శ్రాద్ధే యే వసన్త్యధిదేవతాః ।
దేవైరపి హి తర్ప్యన్తే యే చ శ్రాద్ధే స్వధోత్తరైః ॥13॥

శ్రాద్ధకర్మలలో అధిదేవతారూపముగా ఉన్నవారు, దేవతలచేత కూడా స్వధావాక్కులతో శ్రాద్ధకర్మలయందు ఎవరు సంతృప్తి పరచబడుచున్నారో అట్టి పితృదేవతలకు నేను నమస్కరించుచున్నాను.

నమస్యేఽహం పితౄన్ స్వర్గే యే తర్ప్యన్తే మహర్షిభిః ।
శ్రాద్ధైర్మనోమయైర్భక్త్యా భుక్తిముక్తిమభీప్సుభిః ॥14॥

మహర్షులచేత భుక్తిముక్తులను పొందగోరి భక్తితో మనఃపూర్వకశ్రాద్ధకర్మలతో ఎవరు సంతృప్తులు గావింపబడుచున్నారో అట్టి స్వర్గమందలి పితృదేవతలకు నేను నమస్కరించుచున్నాను.

నమస్యేఽహం పితౄన్ స్వర్గే సిద్ధాః సన్తర్పయన్తి యాన్ ।
శ్రాద్ధేషు దివ్యైః సకలైరుపహారైరనుత్తమైః ॥15॥

సిద్ధపురుషులు శ్రాద్ధకర్మలందు దివ్యములైన, శ్రేష్ఠములైన సమస్త ఉపహారములతో (కానుకలతో) ఎవరిని సంతృప్తిపరచుచున్నారో అట్టి స్వర్గమందలి పితృదేవతలకు నేను నమస్కరించుచున్నాను.

నమస్యేఽహం పితౄన్భక్త్యా యేఽర్చ్యన్తే గుహ్యకైరపి।
తన్మయత్వేన వాఞ్ఛద్భిః ఋద్ధిమాత్యన్తికీం పరామ్ ॥16॥

గుహ్యకులచేత కూడా అపారమైన గొప్ప సమృద్ధిని పొందగోరి తన్మయభావముతో భక్తితో ఎవరయితే పూజింపబడుచున్నారో అట్టి పితృదేవతలకు నేను నమస్కరించుచున్నాను.

నమస్యేఽహం పితౄన్ మర్త్యైరర్చ్యన్తే భువి యే సదా ।
శ్రాద్ధేషు శ్రద్ధయాభీష్టలోకప్రాప్తిప్రదాయినః ॥17॥

అభీష్టలోకములను ప్రదానము చేయు ఎవరయితే మానవులచే భూలోకమందు ఎల్లప్పుడు శ్రద్ధగా శ్రాద్ధకర్మలలో పూజింపబడుచున్నారో అట్టి పితృదేవతలకు నేను నమస్కరించుచున్నాను.

నమస్యేఽహం పితౄన్విప్రైరర్చ్యన్తే భువి యే సదా ।
వాంఛితాభీష్టలాభాయ ప్రాజాపత్యప్రదాయినః ॥18॥

కోరుకొన్న అభీష్టములను పొందుటకై ప్రాజాపత్యమును ప్రదానము చేయు ఎవరయితే ఎల్లప్పుడు భూలోకమందు బ్రాహ్మణులచే పూజింపబడుచున్నారో అట్టి పితృదేవతలకు నేను నమస్కరించుచున్నాను.

నమస్యేఽహం పితౄన్ యే వా తర్ప్యన్తేఽరణ్యవాసిభిః ।
వన్యైః శ్రాద్ధైర్యతాహారైస్తపోనిర్ధూతకిల్బిషైః ॥19॥

పరిమితమైన ఆహారమును గ్రహించుచూ, తమ తపస్సులచేత పాపములను పోగొట్టుకొన్న శ్రద్ధావంతులైన అరణ్యవాసులచేత ఎవరయితే తృప్తిపరుపబడుచున్నారో అట్టి పితృదేవతలకు నేను నమస్కరించుచున్నాను.

నమస్యేఽహం పితౄన్ విప్రైర్నైష్ఠికవ్రతచారిభిః ।
యే సంయతాత్మభిర్నిత్యం సన్తర్ప్యన్తే సమాధిభిః ॥20॥

నైష్ఠికవ్రతాచరణపరాయణులు, ఆత్మనిగ్రహముగలవారు అగు విప్రులచేత తమ తపస్సమాధులతో ఎవరయితే సంతృప్తిపరుపబడుచున్నారో అట్టి పితృదేవతలకు నేను నమస్కరించుచున్నాను.

నమస్యేఽహం పితౄన్ శ్రాద్ధై రాజన్యాస్తర్పయన్తి యాన్।
కవ్యైరశేషైర్విధివల్లోకత్రయఫలప్రదాన్ ॥21॥

క్షత్రియులు శ్రాద్ధకర్మలందు అశేషమైన కవ్యపదార్థములతో (పితృదేవతలనుద్దేశించి ఇవ్వబడే అన్నాదులే కవ్యమనగా) శాస్త్రోక్తప్రకారము ముల్లోకముల ఫలములనిచ్చే ఎవరిని అయితే సంతృప్తులను చేయుచున్నారో అట్టి పితృదేవతలకు నేను నమస్కరించుచున్నాను.

నమస్యేఽహం పితౄన్ వైశ్యైరర్చ్యన్తే భువి యే సదా ।
స్వకర్మాభిరతైర్నిత్యం పుష్పధూపాన్నవారిభిః ॥22॥

తమకు విధింపబడిన కర్మలను ఆచరించుటలో ఆసక్తులైన వైశ్యులచేత భూలోకమందు ఎల్లప్పుడు పుష్పములు, ధూపములు, అన్నము, జలములతో ఎవరయితే పూజింపబడుచున్నారో అట్టి పితృదేవతలకు నేను నమస్కరించుచున్నాను.

నమస్యేఽహం పితౄన్ శ్రాద్ధైర్యే శూద్రైరపి భక్తితః ।
సన్తర్ప్యన్తే జగత్యత్ర నామ్నాఖ్యాతాః సుకాలినః ॥23॥

ఈ జగత్తునందు శ్రద్ధాగుణాన్వితులైన శూద్రులచేత కూడా భక్తితో సుకాలియను పేరుతో ప్రసిద్ధులయిన పితృదేవతలను ఎవరయితే సంతృప్తిపరచుచున్నారో అట్టి పితృదేవతలకు నేను నమస్కరించుచున్నాను.

నమస్యేఽహం పితౄన్ శ్రాద్ధైః పాతాలే యే మహాసురైః ।
సన్తర్ప్యన్తే స్వధాహారాస్త్యక్తదమ్భపదైః సదా ॥24॥

పాతాళలోకమందు కపటగుణమును విడిచిపెట్టిన గొప్ప రాక్షసులచేత స్వధాయను పదమును ఉచ్చరించి ఈయబడిన అన్నాదులు, ఆహారముగా కలిగిన ఎవరయితే శ్రద్ధతో ఎల్లప్పుడు తృప్తులు గావింపబడుచున్నారో అట్టి పితృదేవతలకు నేను నమస్కరించుచున్నాను.

నమస్యేఽహం పితౄన్ శ్రాద్ధైరర్చ్యన్తే యే రసాతలే ।
భోగైరశేషైర్విధివన్నాగైః కామానభీప్సుభిః ॥25॥

కోరికలను పొందుటకు కోరుకొనుచున్న సర్పములచేత రసాతలలోకమందు అశేషములైన భోగములతో విధ్యుక్తప్రకారము ఎవరయితే పూజింపబడుచున్నారో అట్టి పితృదేవతలకు నేను నమస్కరించుచున్నాను.

నమస్యేఽహం పితౄన్ శ్రాద్ధైః సర్పైః సన్తర్పితాన్సదా ।
తత్రైవ విధివన్మన్త్రభోగసంపత్సమన్వితైః ॥26॥

ఆ రసాతలలోకమందే మంత్రములు, భోగములు, సంపదలతో కూడుకొన్న శ్రద్ధాగుణాన్వితులైన సర్పములచేత శాస్త్రోక్తప్రకారము ఎవరయితే ఎల్లప్పుడు సంతృప్తులు చేయబడ్డారో అట్టి పితృదేవతలకు నేను నమస్కరించుచున్నాను.

పితౄన్నమస్యే నివసన్తి సాక్షాద్ యే దేవలోకే చ తథాన్తరిక్షే ।
మహీతలే యే చ సురాదిపూజ్యాస్తే మే ప్రతీచ్ఛన్తు మయోపనీతమ్ ॥27॥

ఎవరయితే దేవలోకమందు మరియు అన్తరిక్షమందు ప్రత్యక్షముగా నివసించుచున్నారో, ఇంకనూ భూలోకమందు దేవతాదులచే ఎవరయితే పూజింపబడుచున్నారో అట్టి పితృదేవతలకు నేను నమస్కరించుచున్నాను. వారు నేనిచ్చు ద్రవ్యములను స్వీకరించెదరుగాక !

పితౄన్నమస్యే పరమాత్మభూతా యే వై విమానే నివసన్తి మూర్తాః ।
యజన్తి యానస్తమలైర్మనోభిర్యోగీశ్వరాః క్లేశవిముక్తిహేతూన్ ॥28॥

పరమాత్మస్వరూపులు, శరీరధారులై విమానములో నివసించువారూ అగు యోగీశ్వరులు అస్తమించిన మలములు కలిగిన మనస్సులతో క్లేశములను పోగొట్టే ఎవరిని గూర్చి యజ్ఞయాగాదులను చేయుచున్నారో అట్టి పితృదేవతలకు నేను నమస్కరించుచున్నాను.

పితౄన్నమస్యే దివి యే చ మూర్తాః స్వధాభుజః కామ్యఫలాభిసన్ధౌ ।
ప్రదానశక్తాః సకలేప్సితానాం విముక్తిదా యేఽనభిసంహితేషు ॥29॥

ఎవరయితే స్వర్గలోకమందు శరీరధారులైయున్నారో, కామ్యఫలములను ప్రదానము చేయుటకై స్వధాభోక్తలైయున్నారో, కోరినవాటినన్నింటినీ ఇచ్చుటకై సమర్థులైయున్నారో, నిష్కాములైన వారికి ముక్తిని ప్రదానము చేయుచున్నారో అట్టి పితృదేవతలకు నేను నమస్కరించుచున్నాను.

తృప్యన్తు తేఽస్మిన్పితరః సమస్తా ఇచ్ఛావతాం యే ప్రదిశన్తి కామాన్ ।
సురత్వమిన్ద్రత్వమతోఽధికం వా సుతాన్పశూన్ స్వాని బలం గృహాణి ॥30॥

కోరికలుగలవారికి వారి కోరికలను అనగా దేవత్వముగాని, ఇంద్రత్వముగాని, అంతకంటే అధికమైనదానినిగాని, పుత్రులనుగాని, పశువులనుగాని, సంపదలనుగాని, బలమునుగాని, గృహములను గాని ఎవరు అనుగ్రహించెదరో అట్టివారైన సకల పితృదేవతలు నాయందు తృప్తి చెందెదరు గాక !

సోమస్య యే రశ్మిషు యేఽర్కబింబే శుక్లే విమానే చ సదా వసన్తి ।
తృప్యన్తు తేస్మిన్పితరోఽన్నతోయైర్గన్ధాదినా పుష్టిమితో వ్రజన్తు ॥31॥

చంద్రుని కిరణములందు, సూర్యబింబమందు, తెల్లని విమానమందు ఎవరయితే ఎల్లప్పుడు నివసించుచున్నారో అట్టి పితృదేవతలు నేను ప్రదానము చేయు అన్నజలములతోను, గంధాదులతోను పుష్టిని పొందెదరు గాక !

యేషాం హుతేఽగ్నౌ హవిషా చ తృప్తి ర్యే భుఞ్జతే విప్రశరీరసంస్థాః ।
యే పిణ్డదానేన ముదం ప్రయాన్తి తృప్యన్తు తేఽస్మిన్పితరోఽన్నతోయైః ॥32॥

అగ్నియందు హోమము చేయబడిన హవిస్సులచే ఎవరికి తృప్తి కలుగునో, బ్రాహ్మణుల శరీరములందు ఆవహించి ఎవరయితే భోజనము చేయుదురో, పిండప్రదానముచేత ఎవరయితే సంతోషమును పొందుచున్నారో అట్టి పితృదేవతలు నేనిచ్చు అన్నజలములతో తృప్తిని చెందెదరు గాక !

యే ఖడ్గమాంసేన సురైరభీష్టైః కృష్ణైస్తిలైర్దివ్యమనోహరైశ్చ ।
కాలేన శాకేన మహర్షివర్యైః సంప్రీణితాస్తే ముదమత్ర యాన్తు ॥33॥

ఎవరయితే ఖడ్గమృగముయొక్క మాంసముతోను, దేవతలకిష్టమైనవి, దివ్యములైనవి, మనోహరములైనవీ అయిన నల్లని నువ్వులతోనూ, కాలశాకముతోనూ (శ్రాద్ధమందు వినియోగించే శాకవిశేషము) గొప్ప మహర్షులచే సంతృప్తి చెందినారో అట్టి పితృదేవతలు నా యందు సంతోషమును పొందెదరు గాక !

కవ్యాన్యశేషాణి చ యాన్యభీష్టాన్యతీవ తేషామమరార్చితానామ్ ।
తేషాం తు సాన్నిధ్యమిహాస్తు పుష్పగంధాన్నభోజ్యేషు మయా కృతేషు ॥34॥

దేవతలచేత పూజింపబడిన పితృదేవతలకు అశేషములైన ఏ కవ్యపదార్థములు (శ్రాద్ధమందు పితృదేవతలకిచ్చే పదార్థములు) ఇష్టములో వాటితోనే నేను వారిని తృప్తిపరచెదను. అట్టి పితృదేవతలు నేను సమర్పించే గంధము, అన్నము, భోజ్యపదార్థములందు సాన్నిధ్యమును వహింతురుగాక !

దినే దినే యే ప్రతిగృహ్ణతేఽర్చాం మాసాన్తపూజ్యాం భువి యేఽష్టకాసు ।
యే వత్సరాన్తేఽభ్యుదయే చ పూజ్యాః ప్రయాన్తు తే మే పితరోఽత్ర తృప్తిమ్ ॥35॥

ఎవరయితే భూమండలమందు ప్రతిరోజూ పూజను స్వీకరించుచున్నారో, మాసాంతపూజను స్వీకరించుచున్నారో, అష్టకాతిథియందు (సప్తమి మొ॥కొని మూడురోజులు లేదా అష్టమీతిథి – వాచస్పత్యం) పూజను స్వీకరించుచున్నారో, సంవత్సరాంతమందు మరియు అభ్యుదయకాలమందు ఎవరు పూజ్యులో అట్టి పితృదేవతలు నాయందు సంతృప్తులు అగుదురు గాక !

పూజ్యా ద్విజానాం కుముదేన్దుభాసో యే క్షత్రియాణాం చ నవార్కవర్ణాః ।
తథా విశాం యే కనకావదాతా నీలీనిభాః శూద్రజనస్య యే చ ॥36॥

తేఽస్మిన్ సమస్తా మమ పుష్పగన్ధధూపాన్నతోయాదినివేదనేన ।
తథాగ్నిహోమేన చ యాన్తు తృప్తిం సదా పితృభ్యః ప్రణతోఽస్మి తేభ్యః ॥37॥

ఎవరయితే పూర్ణచంద్రుని కాంతి వంటి కాంతి కలిగి బ్రాహ్మణులకు పూజ్యులో, ఎవరయితే ఉదయించుచున్న సూర్యుని కాంతి వంటి కాంతి కలిగి క్షత్రియులకు పూజ్యులో, అట్లే ఎవరయితే బంగారముయొక్క పీతవర్ణమువంటి వర్ణము కలిగి (అవదాతశబ్దానికి అర్థం పీతవర్ణమని వాచస్పత్యం) వైశ్యులకు పూజ్యులో, ఇంకను ఎవరయితే నీలీ (వృక్షవిశేషము లేదా ఓషధి విశేషము) కాంతివంటి కాంతి కలిగి శూద్రజనులకు పూజ్యులో అట్టి పితృదేవతలు

నేను నివేదన చేసే పుష్పములు, గంధము, ధూపము, అన్నము, జలము మొ॥ వాటిచేతను ఇంకను అగ్నిహోత్రము చేతను తృప్తిని పొందెదరు గాక ! ఎల్లప్పుడు పితృదేవతలకు నమస్కరించుచున్నాను.

యే దేవపూర్వాణ్యతితృప్తిహేతోరశ్నన్తి కవ్యాని శుభాహుతాని ।
తృప్తాశ్చ యే భూతిసృజో భవన్తి తృప్యన్తు తేఽస్మిన్ ప్రణతోఽస్మి తేభ్యః ॥38॥

మిక్కిలి తృప్తిని కల్గించుటకుగాను దేవతలకు పూర్వము ఆహుతులుగా ఇవ్వబడిన మంగళకరమైన హోమద్రవ్యములను ఎవరయితే భుజించుచున్నారో, ఇంకను అట్టి హోమద్రవ్యములను భుజించుటచేత సంతృప్తి చెందినవారై ఎవరయితే మాకు సమృద్ధిని కల్గించుచున్నారో అట్టి పితృదేవతలు నాయందు సంతృప్తి చెందుదురుగాక! వారికి నేను నమస్కరించుచున్నాను.

రక్షాంసి భూతాన్యసురాంస్తదోగ్రాన్ నిర్నాశయన్తస్త్వశివం ప్రజానామ్ ।
ఆద్యాః సురాణామమరేశపూజ్యా తృప్యన్తు తేఽస్మిన్ ప్రణతోఽస్మి తేభ్యః ॥39॥

రాక్షసులను, భూతపిశాచములను, ఉగ్రరాక్షసులను మరియు ప్రజలయొక్క అమంగళములను ఎవరయితే నాశనము చేయుచున్నారో, ఎవరయితే దేవతలకు కూడా ఆద్యులో, ఇంకను ఎవరయితే దేవేంద్రునికి కూడా పూజ్యులో అట్టి పితృదేవతలు నాయందు సంతృప్తిని చెందుదురుగాక ! వారికి నేను నమస్కరించుచున్నాను.

అగ్నిష్వాత్తా బర్హిషద ఆజ్యపాః సోమపాస్తథా ।
వ్రజన్తు తృప్తిం శ్రాద్ధేఽస్మిన్పితరస్తర్పితా మయా ॥40॥

అగ్నిష్వాత్త, బర్హిషద్, ఆజ్యప, సోమప నామధేయులైన పితృదేవతలు నాచేత తర్పణములు ఈయబడి ఈ శ్రాద్ధకర్మయందు తృప్తిని పొందుదురుగాక !

అగ్నిష్వాత్తాః పితృగణాః ప్రాచీం రక్షన్తు మే దిశమ్ ।
తథా బర్హిషదః పాన్తు యామ్యాం యే పితరః స్మృతాః ॥41॥

అగ్నిష్వాత్తపితృగణములు నా కొరకు తూర్పుదిక్కును రక్షింతురుగాక ! బర్హిషద్‌నామధేయులైన పితృదేవతలు దక్షిణదిగ్భాగమును రక్షింతురుగాక !

ప్రతీచీమాజ్యపాస్తద్వదుదీచీమపి సోమపాః ।
రక్షోభూతపిశాచేభ్యస్తథైవాసురదోషతః ॥42॥

సర్వతశ్చాధిపస్తేషాం యమో రక్షాం కరోతు మే ।

ఆజ్యపపితృదేవతలు పశ్చిమదిక్కును, సోమపపితృదేవతలు ఉత్తరదిక్కును, రాక్షసభూతపిశాచములనుండి అట్లే అసురులవల్ల కలిగే బాధలనుండి రక్షింతురుగాక ! దేవపితృగణములందరికీ అధిపతి అయిన యముడు నన్ను రక్షించుగాక!

విశ్వో విశ్వభుగారాధ్యో ధర్మో ధన్యః శుభాననః ॥43॥

భూతిదో భూతికృద్భూతిః పితౄణాం యే గణా నవ ।
కల్యాణః కల్యతాకర్తా కల్యః కల్యతరాశ్రయః ॥44॥

కల్యతాహేతురనఘః షడిమే తే గణాః స్మృతాః ।
వరో వరేణ్యో వరదః పుష్టిదస్తుష్టిదస్తథా ॥45॥

విశ్వపాతా తథా ధాతా సప్తైవైతే తథా గణాః ।
మహాన్మహాత్మా మహితో మహిమావాన్మహాబలః ॥46॥

గణాః పఞ్చ తథైవైతే పితౄణాం పాపనాశనాః ।
సుఖదో ధనదశ్చాన్యో ధర్మదోఽన్యశ్చ భూతిదః ॥47॥

పితౄణాం కథ్యతే చైతత్తథాగణచతుష్టయమ్ ।
ఏకత్రింశత్పితృగణా యైర్వ్యాప్తమఖిలం జగత్ ॥
తే మేఽనుతృప్తాస్తుష్యన్తు యచ్ఛన్తు చ సదా హితమ్ ॥48॥

విశ్వ, విశ్వభుక్, ఆరాధ్య, ధర్మ, ధన్య, శుభానన, భూతిద, భూతికృత్, భూతి అను తొమ్మిది పితృగణములు కల్యాణ, కల్యతాకర్తృ, కల్య, కల్యతరాశ్రయ, కల్యతాహేతు, అనఘ అను ఆరు పితృగణములు, వర, వరేణ్య, వరద, పుష్టిద, తుష్టిద, విశ్వపాతృ, ధాతృ అను ఏడు పితృగణములు, మహత్, మహాత్మన్, మహిత, మహిమావత్, మహాబల అను పాపములను నశింపచేయు అయిదు పితృగణములు, సుఖద, ధనద, ధర్మద, భూతిద అను నాలుగు పితృగణములు మొత్తం ముప్పైఒక్క పితృగణాలచేత ఈ జగత్తంతా వ్యాపించబడినది. వారందరు నాయందు తృప్తిచెంది సంతోషించెదరుగాక! నాకు ఎల్లప్పుడు హితమును ఇచ్చెదరు గాక !

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే రౌచ్యమన్వన్తరే రుచ్యుపాఖ్యానే రుచికృతపితృస్తవనం నామ త్రినవతితమోఽధ్యాయః ॥93॥

శ్రీ మార్కండేయ మహాపురాణమందలి రౌచ్యమన్వంతరమందలి రుచ్యుపాఖ్యానమందలి పితృస్తుతియను తొంబదిమూడవ అధ్యాయం సమాప్తం.

చతుర్నవతితమోఽధ్యాయః – తొంబదినాల్గవ అధ్యాయం
పితృవరప్రదానమ్ – పితృదేవతలు వరమిచ్చుట

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

ఏవం తు స్తువతస్తస్య తేజసో రాశిరుచ్ఛ్రితః ।
ప్రాదుర్బభూవ సహసా గగనవ్యాప్తికారకః ॥1॥

ఈ విధముగా రుచిమహర్షి పితృదేవతలను స్తుతించుచుండగా గొప్ప తేజోరాశి ఆ వెంటనే ఆకాశమందు అంతటా వ్యాపించినదై ఉద్భవించెను.

తద్దృష్ట్వా సుమహత్తేజః సమాసాద్య స్థితం జగత్ ।
జానుభ్యామవనిం గత్వా రుచిః స్తోత్రమిదం జగౌ ॥2॥

ఆ గొప్ప తేజఃపుంజమును జగత్తంతా వ్యాపించినదానిని చూచి రుచి మోకాళ్ళపై భూమిమీద నిలచి ఈ స్తోత్రమును పాడెను.

రుచిరువాచ – రుచి పలికాడు.

అమూర్తానాం చ మూర్తానాం పితౄణాం దీప్తతేజసామ్ ।
నమస్యామి సదా తేషాం ధ్యానినాం దివ్యచక్షుషామ్ ॥3॥

మూర్తామూర్తస్వరూపులు, ప్రకాశించుచున్న తేజస్సుగలవారు, ధ్యానమందు నిమగ్నులైనవారు, దివ్యనేత్రములు కలిగినవారూ అగు పితృదేవతలకు నమస్కరించుచున్నాను.

ఇన్ద్రాదీనాం చ నేతారో దక్షమారీచయోస్తథా ।
సప్తర్షీణాం తథాన్యేషాం తాన్నమస్యామి కామదాన్ ॥4॥

ఇంద్రాదిదేవతలకు, దక్షమారీచులకు, సప్తర్షులకు, ఇంకనూ మిగిలిన ఇతర నాయకులకు మరియు మనంకోరిన కోరికలనిచ్చు వారికి నేను నమస్కరించుచున్నాను.

మన్వాదీనాం మునీన్ద్రాణాం సూర్యాచన్ద్రమసోస్తథా ।
తాన్నమస్యామ్యహం సర్వాన్పితరశ్చార్ణవేషు యే ॥5॥

మన్వాదులు, మునిశ్రేష్ఠులు, సూర్యచంద్రులు వీరి పితృదేవతలకు మరియు సముద్రములందున్న పితృదేవతలకు నేను నమస్కరించుచున్నాను.

నక్షత్రాణాం గ్రహాణాం చ వాయ్వగ్న్యోర్నభసస్తథా ।
ద్యావాపృథివ్యోశ్చ తథా నమస్యామి కృతాఞ్జలిః ॥6॥

నేను చేతులు జోడించి నక్షత్రములకు, గ్రహములకు, వాయువుకు, అగ్నికి, ఆకాశానికి, స్వర్గమునకు, పృథివికి నమస్కరించుచున్నాను.

దేవర్షీణాం గ్రహాణాం చ సర్వలోకనమస్కృతాన్ ।
అక్షయ్యస్య సదా దాతౄన్ నమస్యామి కృతాఞ్జలిః ॥7॥

సమస్తలోకములచే పూజలందుకొన్నవారు, వినాశములేని సంపదలనిచ్చువారూ అగు దేవర్షులకు, గ్రహములకు నేను చేతులు జోడించి నమస్కరించుచున్నాను.

ప్రజాపతేః కశ్యపాయ సోమాయ వరుణాయ చ ।
యోగేశ్వరేభ్యశ్చ సదా నమస్యామి కృతాఞ్జలిః ॥8॥

ప్రజాపతికి, కశ్యపునికి, సోమునికి, వరుణునికి, యోగేశ్వరునికి నేను చేతులు జోడించి ఎల్లప్పుడు నమస్కరించుచున్నాను.

నమో గణేభ్యః సప్తభ్యస్తథా లోకేషు సప్తసు ।
స్వయంభువే నమస్యామి బ్రహ్మణే యోగచక్షుషే ॥9॥

సప్తలోకములందున్న సప్తవిధపితృగణములకు, యోగనేత్రము కలిగిన స్వయంభూబ్రహ్మదేవునికి నమస్కరించుచున్నాను.

సోమాధారాన్ పితృగణాన్యోగమూర్తిధరాంస్తథా ।
నమస్యామి తథా సోమం పితరం జగతామహమ్ ॥10॥

సోమాధారపితృగణములకు, యోగమూర్తిధర పితృగణములకు, అట్లే సమస్తజగములకు తండ్రి అయిన సోమునికి నమస్కరించుచున్నాను.

అగ్నిరూపాంస్తథైవాన్యాన్నమస్యామి పితౄనహమ్ ।
అగ్నీషోమమయం విశ్వం యత ఏతదశేషతః ॥11॥

ఈ విశ్వమంతా అగ్ని మరియు సోమునిచే వ్యాపింపబడినది. అందువలన అగ్నిరూపులైన ఇతర పితృదేవతలకు నేను నమస్కరించుచున్నాను.

యే తు తేజసి యే చైతే సోమసూర్యాగ్నిమూర్తయః ।
జగత్స్వరూపిణశ్చైవ తథా బ్రహ్మస్వరూపిణః ॥12॥

తేభ్యోఽఖిలేభ్యో యోగిభ్యః పితృభ్యో యతమానసః ।
నమో నమో నమస్తే మే ప్రసీదన్తు స్వధాభుజః ॥13॥

ఎవరయితే తేజస్సునందు స్థితులై ఉన్నారో, ఎవరయితే అగ్నిసూర్యచంద్రుల శరీరధారులో, ఎవరయితే జగత్స్వరూపులు మరియు బ్రహ్మస్వరూపులో అట్టి యోగిస్వరూపులైన పితృదేవతలకు ఇంద్రియనిగ్రహముగల మనస్సుతో అనేక నమస్కారములను సమర్పించుచున్నాను. స్వధాభోక్తలైన పితృదేవతలు నాయందు ప్రసన్నులగుదురుగాక !

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

ఏవం స్తుతాస్తతస్తేన తేజసా మునిసత్తమ ।
నిశ్చక్రముస్తేఽపి తతో భాసయన్తో దిశో దశ ॥14॥

ఓ మునిశ్రేష్ఠుడా ! తేజోవంతుడైన ఆ రుచిచేత ఈవిధముగా స్తుతింపబడిన పితృదేవతలు పది దిక్కులను తమ తేజస్సులతో ప్రకాశింపచేయుచూ రుచివద్ద ప్రత్యక్షమైరి.

నివేదితం చ యత్తేన పుష్పగన్ధానులేపనమ్ ।
తద్భూషితానథ స తాన్ దదృశే పురతః స్థితాన్ ॥15॥

పుష్పగంధములను రుచి పితృదేవతలకు నివేదించగా, వాటిచేత అలంకృతులై తన ముందు నిలిచిన ఆ పితృదేవతలను రుచి చూచెను.

ప్రణిపత్య పునర్భక్త్యా పునరేవ కృతాఞ్జలిః ।
నమస్తుభ్యం నమస్తుభ్యమిత్యాహ పృథగాదృతః ॥16॥

తిరిగి అంజలి ఘటించి భక్తితో రుచి తండ్రులకు నమస్కరించి ఆదరముతో కూడుకొన్నవాడై ప్రతి ఒక్క పితృదేవతకు వేరువేరుగా “మీకు నమస్కారము, మీకు నమస్కారము” అని పలికెను.

తతః ప్రసన్నాః పితరస్తమూచుర్మునిసత్తమమ్ ।
వరం వృణీష్వేతి స తానువాచానతకన్ధరః ॥17॥

అంతట ప్రసన్నులైన పితృదేవతలు మునిశ్రేష్ఠుడైన రుచితో “నీ కిష్టమైన వరమును కోరుకొనుము” అని పలికిరి. రుచిమహర్షి శిరస్సు వంచి పితృదేవతలతో ఇట్లు పలికెను.

రుచిరువాచ – రుచి పలికాడు.

సాంప్రతం సర్గకర్తృత్వమాదిష్టం బ్రహ్మణా మమ ।
సోఽహం పత్నీమభీప్సామి ధన్యాం దివ్యాం ప్రజావతీమ్ ॥18॥

ఓ తండ్రులారా ! నన్నిప్పుడు బ్రహ్మదేవుడు క్రొత్తసృష్టిని చేయవలసిందిగా ఆదేశించెను. అట్టి నేను ధన్యురాలు, దివ్యురాలు, ప్రసవయోగ్యురాలు అయిన భార్యను పొందవలెనని తలచుచున్నాను.

పితర ఊచుః – పితృదేవతలు పలికారు.

అద్యైవ సద్యః పత్నీ తే భవత్వతిమనోరమా ।
తస్యాం చ పుత్రో భవితా భవతో మనురుత్తమః ॥19॥

నీకిప్పుడే మిక్కిలి అందమైన భార్య లభించుగాక ! ఆమెయందు నీకు భావికాలమందు ఉత్తమమైన మనువు కాగల పుత్రుడు జన్మించగలడు.

మన్వంతరాధిపో ధీమాంస్త్వన్నామ్నైవోపలక్షితః ।
రుచే రౌచ్య ఇతి ఖ్యాతిం యో యాస్యతి జగత్త్రయే ॥20॥

ఓ రుచీ ! నీకు పుట్టబోయే ఆ కుమారుడు మన్వంతరమునకు అధిపతి, ధీమంతుడు, నీ పేరుతోనే ప్రసిద్ధి చెందువాడు, ముల్లోకములందు రౌచ్యుడను ఖ్యాతిని పొందువాడు కాగలడు.

తస్యాపి బహవః పుత్రా మహాబలపరాక్రమాః ।
భవిష్యన్తి మహాత్మానః పృథివీపరిపాలకాః ॥21॥

ఆ రౌచ్యునికి కూడా గొప్ప బలపరాక్రమములు గలవారు, మహాత్ములు, పృథివీపరిపాలకులూ అయిన చాలామంది పుత్రులు పుట్టగలరు.

త్వం చ ప్రజాపతిర్భూత్వా ప్రజాః సృష్ట్వా చతుర్విధాః ।
క్షీణాధికారో ధర్మజ్ఞ తతః సిద్ధిమవాప్స్యసి ॥22॥

ఓ ధర్మజ్ఞుడా ! నీవు కూడా ప్రజాపతివై నాలుగురకాల ప్రజలను సృష్టించి, అధికారము క్షీణించిన పిమ్మట సిద్ధిని పొందగలవు.

స్తోత్రేణానేన చ నరో యోఽస్మాన్ స్తోష్యతి భక్తితః ।
తస్య తుష్టా వయం భోగానాత్మజ్ఞానం తథోత్తమమ్ ॥23॥

శరీరారోగ్యమర్థం చ పుత్రపౌత్రాదికం తథా ।
ప్రదాస్యామో న సన్దేహో యచ్చాన్యదభివాంఛితమ్ ॥24॥

ఏ మానవుడయితే భక్తితో ఈ స్తోత్రముతో మమ్ములను స్తుతించునో, అతడిపట్ల మేము సంతుష్టులమై ఆ మానవునికి భోగములను, ఉత్తమమైన ఆత్మజ్ఞానమును, శరీరారోగ్యమును, సంపదలను, పుత్రపౌత్రాదులను ఇచ్చెదము. ఈ చెప్పినవేకాక దేనిని కోరుకుంటే దానిని మేము ఇచ్చెదము. ఇందు సందేహము లేదు.

తస్మాత్పుణ్యఫలం లోకే వాంఛద్భిః సతతం నరైః ।
పితౄణాం చాక్షయాం తృప్తిం స్తవ్యాః స్తోత్రేణ మానవైః ॥25॥

అందువలన ఈ లోకమందు పుణ్యఫలమును కోరు మానవులు ఎల్లప్పుడు పితృదేవతలను ఈ స్తోత్రముతో స్తుతించి వారికి క్షయము చెందని తృప్తిని కలిగించవలెను.

వాంఛద్భిః సతతం స్తవ్యాః స్తోత్రేణానేన వై యతః ।
శ్రాద్ధే చ ఇమం భక్త్యా అస్మత్ప్రీతికరం స్తవమ్ ॥26॥

పఠిష్యన్తి ద్విజాగ్ర్యాణాం భుఞ్జతాం పురతః స్థితః ।
స్తోత్రశ్రవణసంప్రీత్యా సన్నిధానే పరే కృతే ॥27॥

అస్మాకమక్షయం శ్రాద్ధం తద్భవిష్యత్యసంశయమ్ ।

ఆ యా కోరికలను కోరుకొనే మానవులు ఈ స్తోత్రముతో మమ్ములను స్తుతించవలెను. శ్రాద్ధకార్యమందు భోజనము చేయుచున్న బ్రాహ్మణశ్రేష్ఠుల ముందు నిలబడి మానవులు మాకు మిక్కిలి ప్రీతికరమైన ఈ స్తోత్రమును పఠించినచో ఆ స్తోత్రమును వినుటయందలి ప్రీతితో మేము ఆ కార్యము సన్నిధికి వచ్చెదము. ఆ విధముగా ఆ శ్రాద్ధము మాకు క్షయములేని తృప్తినిచ్చునది అగును. ఇందు సంశయము లేదు.

యద్యప్యశ్రోత్రియం శ్రాద్ధం యద్యప్యుపహతం భవేత్ ॥28॥

అన్యాయోపాత్తవిత్తేన యది వా కృతమన్యథా ।
అశ్రద్ధార్హైరుపహతైరుపహారైస్తథా కృతమ్ ॥29॥

అకాలేఽ ప్యథవాఽ దేశే విధిహీనమథాపి వా ।
అశ్రద్ధయా వా పురుషైర్దంభమాశ్రిత్య వా కృతమ్ ॥30॥

అస్మాకం తృప్తయే శ్రాద్ధం తథాప్యేతదుదీరణాత్ ।

శ్రోత్రియుడు అనగా వేదము చదివిన బ్రాహ్మణుడు లేకుండా ఆచరింపబడిననూ, శౌచాదులు లేనందువలన దూషితమైననూ, అన్యాయముగా ఆర్జించిన ధనముతో చేయబడిననూ, శ్రద్ధ లేకుండా ఆయా పూజాద్రవ్యములతో నిర్వహింపబడిననూ, దూషితములయిన ఆయా ఉపహారములతో ఆచరింపబడిననూ, కాలముకాని కాలమందు దేశము కాని దేశమందు శ్రాద్ధవిధికి భిన్నముగా ఆచరింపబడిననూ, శ్రద్ధలేకుండాగాని లేక గర్వాహంకారములతో కాని ఆచరింపబడిననూ అట్టి శ్రాద్ధము కూడా ప్రస్తుత పితృస్తోత్రమును పఠించినచో మాకు తృప్తికారకమే అగును.

యత్రైతత్పఠ్యతే శ్రాద్ధే స్తోత్రమస్మత్సుఖావహమ్ ॥31॥

అస్మాకం జాయతే తృప్తిస్తత్ర ద్వాదశవార్షికీ ।
హేమన్తే ద్వాదశాబ్దాని తృప్తిమేతత్ప్రయచ్ఛతి ॥32॥

శిశిరే ద్విగుణాబ్దాంశ్చ తృప్తిం స్తోత్రమిదం శుభమ్ ।
వసన్తే షోడశ సమాస్తృప్తయే శ్రాద్ధకర్మణి ॥33॥

గ్రీష్మే షోడశైవైతత్పఠితం తృప్తికారకమ్ ।
వికలేఽ పి కృతే శ్రాద్ధే స్తోత్రేణానేన సాధితే ॥34॥

వర్షాసు తృప్తిరస్మాకమక్షయా జాయతే రుచే ।
శరత్కాలేఽ పి పఠితం శ్రాద్ధకాలే ప్రయచ్ఛతి ॥35॥

అస్మాకమేతత్పురుషస్తృప్తిం పఞ్చదశాబ్దికీమ్ ।

ఓ రుచీ ! మాకు సుఖమును కలిగించు ఈ స్తోత్రము ఏ శ్రాద్ధకార్యమందు పఠింపబడుతుందో అచ్చట మాకు పన్నెండు సంవత్సరముల వరకు తృప్తి కలుగును. హేమంతఋతువునందు పఠించినచో పన్నెండు సంవత్సరాలు, శిశిర ఋతువునందు పఠించినచో ఇరవైనాలుగు సంవత్సరాలు, వసంత ఋతువునందు పఠించినచో

పదహారు సంవత్సరాలు, గ్రీష్మఋతువునందు పఠించినచో పదహారు సంవత్సరాలు వరకు మాకు తృప్తి కలుగును. వర్షఋతువునందు శ్రాద్ధకార్యము నిర్వహించుటలో కొంత వైకల్యము సంభవించినా ఈ స్తోత్రము ద్వారా శ్రాద్ధమును నిర్వహించినట్లయితే క్షయము లేని తృప్తి మాకు కలుగును. శరదృతువునందు శ్రాద్ధకాలమందు ఈ స్తోత్రమును పురుషుడు పఠిస్తే పదిహేను సంవత్సరాలపాటు మాకు తృప్తిని ఇచ్చును.

యస్మిన్గృహే చ లిఖితమేతత్తిష్ఠతి నిత్యదా ॥36॥
సన్నిధానం కృతే శ్రాద్ధే తత్రాస్మాకం భవిష్యతి ।

ఏ ఇంటియందు వ్రాయబడిన ఈ స్తోత్రపాఠము ఎల్లప్పుడు ఉండునో, ఆ ఇంట శ్రాద్ధకాలమందు మా సాన్నిధ్యము ఉండగలదు.

తస్మాదేతత్త్వయా శ్రాద్ధే విప్రాణాం భుఞ్జతః పురః ॥37॥

శ్రవణీయం మహాభాగ అస్మాకం పుష్టిహేతుకమ్ ।
ఇత్యుక్త్వా పితరస్తస్య స్వర్గతా మునిసత్తమ ॥38॥

ఓ మహాభాగా! ఈ కారణముచేత శ్రాద్ధకార్యమందు భోజనము చేయుచున్న బ్రాహ్మణుల ఎదుట నిలిచి మాకు పుష్టిని కలిగించు ఈ స్తోత్రమును చదివి వినిపించవలెను. ఓ మునిశ్రేష్ఠుడా ! ఈ విధముగా పితృదేవతలు రుచిమహర్షితో పలికి స్వర్గలోకమునకు వెళ్ళిరి.

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే రౌచ్యేమన్వన్తరే రుచేః పితృవరప్రదానం నామ చతుర్నవతితమోఽధ్యాయః ॥94॥

శ్రీ మార్కండేయ మహాపురాణమందలి రౌచ్యమన్వంతరమందలి రుచికి పితృదేవతలు వరమిచ్చుటయను తొంబదినాల్గవ అధ్యాయం సమాప్తం.



పఞ్చనవతితమోఽధ్యాయః - తొంబదిఅయిదవ అధ్యాయం
రుచివివాహః, రౌచ్యమనుజననం చ - రుచివివాహం, రౌచ్యమనుజననం

మార్కండేయ ఉవాచ - మార్కండేయుడు చెప్పాడు.

తతస్తస్మాన్నదీమధ్యాత్ సముత్తస్థౌ మనోరమా ।
ప్రమ్లోచా నామ తన్వఙ్గీ తత్సమీపే వరాప్సరాః ॥1॥

అటు తర్వాత మనస్సుకు ఆహ్లాదమును కలిగించునదీ, అందమైన అవయవములు కలదీ యగు ప్రమ్లోచయను పేరుగల ఒక శ్రేష్ఠురాలైన అప్సరస ఆ నదీమధ్యభాగమునుండి బయటకు వచ్చెను.

సా చోవాచ మహాత్మానం రుచిం సుమధురాక్షరమ్ ।
ప్రశ్రయావనతా సుభ్రూః ప్రమ్లోచా వై వరాప్సరాః ॥2॥

మహాత్ముడు, మధురమైన అక్షరములు కలవాడూ అగు ఆ రుచిమహర్షితో అందమైన కనుబొమలు కలిగిన ఆ శ్రేష్ఠురాలైన అప్సరస వినయముతో వంగినదై ఇట్లు పలికెను.

అతీవ రూపిణీ కన్యా మత్సుతా తపతాంవర ।
జాతా వరుణపుత్రేణ పుష్కరేణ మహాత్మనా ॥3॥

తాం గృహాణ మయా దత్తాం భార్యార్థే వరవర్ణినీమ్ ।
మనుర్మహామతిస్తస్యాం సముత్పత్స్యతి తే సుతః ॥4॥

ఓ తాపసశ్రేష్ఠుడా ! మహాత్ముడైన వరుణపుత్రుడగు పుష్కరుని ద్వారా నాకు మిక్కిలి అందమైన కుమార్తె జన్మించినది. శ్రేష్ఠురాలైన ఆ కన్యను నీకు భార్యగా ఇచ్చుచున్నాను, గ్రహించుము. ఆమెయందు నీకు గొప్ప బుద్ధిమంతుడైన కుమారుడు మనువు జన్మించగలడు.

మార్కండేయ ఉవాచ - మార్కండేయుడు చెప్పాడు.

తథేతి తేన సాప్యుక్తా తస్మాత్తోయాద్వపుష్మతీమ్ ।
ఉజ్జహార తతః కన్యాం మాలినీం నామ నామతః ॥5॥

అట్లేయగుగాక ! అని రుచిమహర్షి పలికిన వెంటనే ఆ అప్సరస ఆ నదీజలమునుండి అందమైన అవయవములు కలిగిన మాలినియను పేరుగల ఒక కన్యను బయటకు తీసుకు వచ్చెను.

నద్యాశ్చ పులినే తస్మిన్స రుచిర్మునిసత్తమః ।
జగ్రాహ పాణిం విధివత్ సమానాయ్య మహామునీన్ ॥6॥

మునిశ్రేష్ఠుడైన ఆ రుచి ఆ నది ఒడ్డున గొప్ప మహామునులను రప్పించి వారి సమక్షములో శాస్త్రోక్తప్రకారము మాలినిని వివాహమాడెను.

తస్యాం తస్య సుతో జజ్ఞే మహావీర్యో మహామతిః ।
రౌచ్యోఽభవత్పితుర్నామ్నా ఖ్యాతోఽత్ర వసుధాతలే ॥7॥

ఆ మాలినియందు రుచిమహర్షికి గొప్ప పరాక్రమవంతుడు, బుద్ధిమంతుడూ అయిన కుమారుడు జన్మించెను. ఆ పుత్రుడు తన తండ్రి పేరుననుసరించి రౌచ్యుడను పేరుతో ఈ భూమండలమందు ప్రసిద్ధినందెను.

తస్య మన్వంతరే దేవాస్తథా సప్తర్షయశ్చ యే ।
తనయాః నృపాశ్చైవ తే సమ్యక్కథితాస్తవ ॥8॥

ఆ రౌచ్యుని మన్వంతరమందు దేవతలు, సప్తర్షులు, అతని కుమారులు, రాజులు ఎవరు ఉండెదరో వారిని గూర్చి నేను నీకు పూర్వము చెప్పితిని.

ధర్మవృద్ధిస్తథాఽరోగ్యం ధనధాన్యసుతోద్భవః ।
నృణాం భవత్యసన్దిగ్ధమస్మిన్మన్వన్తరే శ్రుతే ॥9॥

ఈ రౌచ్యమన్వంతరమందు జరిగిన విషయములను విన్నటువంటి మానవులకు ధర్మవృద్ధి, ఆరోగ్యము, ధనధాన్యాభివృద్ధి జరుగుతుంది. సత్పుత్రులు కలుగుతారు. ఇందులో ఎట్టి సందేహములేదు.

పితృస్తవం తథా శ్రుత్వా పితౄణాం చ తథా గణాన్ ।
సర్వాన్ కామానవాప్నోతి తత్ప్రసాదాన్మహామునే ॥10॥

ఓ మహామునీ ! పితృదేవతలు మరియు పితృగణముల స్తోత్రమును విన్నట్టి పురుషుడు వారి అనుగ్రహమువలన సమస్తవిధములైన కోరికలను పొందును.

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే రుచివివాహః, రౌచ్యమనుజననం నామ పఞ్చనవతితమోఽధ్యాయః ॥95॥

శ్రీ మార్కండేయ మహాపురాణమందలి రుచివివాహం, రౌచ్యమనుజననమను తొంబది అయిదవ అధ్యాయం సమాప్తం.



షణ్ణవతితమోఽధ్యాయః – తొంబదిఆరవ అధ్యాయం
భౌత్యమన్వంతరే అగ్నిస్తోత్రమ్ – భౌత్యమన్వంతరమందు అగ్నిస్తోత్రం

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

తతః పరం తు భౌత్యస్య సముత్పత్తిం నిశామయ ।
దేవానృషీంస్తథా పుత్రాంస్తథైవ వసుధాధిపాన్ ॥1॥

అటు పిమ్మట భౌత్యుని పుట్టుక, అతని మన్వంతరమందలి దేవతలు, ఋషులు, అతడి పుత్రులు, మరియు రాజుల గురించి చెప్పెదను, వినుము.

బభూవాఙ్గిరసః శిష్యో భూతిర్నామ్నాతికోపనః ।
చణ్డశాపప్రదోఽల్పేఽర్థే మునిరాగస్యసౌమ్యవాక్ ॥2॥

అంగిరస్ నామధేయుడైన మునికి భూతియను ఆంగిరసశిష్యుడు ఒకడుండెను. అతడు మిక్కిలి కోపస్వభావముగలవాడు. చిన్న అపరాధములందు కూడా తీవ్రమైన శాపమిచ్చువాడు. ఆ భూతి పరుషముగా మాటలాడు స్వభావముగలవాడు. (అల్పే అర్థే ఆగసి చణ్డశాపప్రదః అని అన్వయం. ఆగస్శబ్దానికి అపరాధమని అర్థం.)

తస్యాశ్రమే మాతరిశ్వా న వవావతినిష్ఠురమ్ ।
నాతితాపం రవిశ్చక్రే పర్జన్యో నాతికర్దమమ్ ॥3॥

నాతిశీతం చ శీతాంశుః పరిపూర్ణోఽపి రశ్మిభిః ।
చకార భీత్యా వై తస్య కోపనస్యాతితేజసః ॥4॥

మిక్కిలి పరాక్రమవంతుడు, కోపస్వభావము కలవాడూ అగు ఆ భూతి వలని భయముతోనే అతడి ఆశ్రమమందు వాయుదేవుడు వేగముగా వీచడు. సూర్యుడు అధికతాపమును ప్రదర్శించడు. మేఘుడు భూమిపై ఎక్కువ బురదను చేయడు అనగా ఎక్కువగా వర్షించడు. చంద్రుడు పరిపూర్ణమైన చల్లని కిరణములు కలవాడైనా అధికశైత్యమును చేయడు.

ఋతవశ్చ క్రమం త్యక్త్వా వృక్షేష్వాశ్రమజన్మసు ।
తస్య పుష్పఫలం చక్రురాజ్ఞయా సార్వకాలికమ్ ॥5॥

ఆ భూతియొక్క ఆజ్ఞననుసరించి ఆరు ఋతువులు తమ క్రమమును విడనాడి ఆశ్రమమందలి వృక్షములందు ఎల్లవేళలా ఆ భూతికొరకు పుష్పఫలములను ఉత్పత్తి చేసినవి.

ఊహురాపశ్చ ఛన్దేన తస్యాశ్రమసమీపగాః ।
కమణ్డలుగతాశ్చైవ తస్య భీతా మహాత్మనః ॥6॥

ఆ భూతియొక్క ఆశ్రమసమీపమునకు చేరిన జలములు అతని ఇష్టానుసారముగా ప్రవహించినవి. అతని కమండలమును పొందిన జలములు ఆ మహాత్మునివలన భయపడినవి. (వహ ప్రాపణే ధాతువు లిట్ ప్రథమపురుషబహువచన రూపము “ఊహుః”)

నాతిక్లేశసహో విప్రః సోఽభవత్కోపనో భృశమ్ ।
అపుత్రశ్చ మహాభాగః స తపస్యకరోన్మనః ॥7॥

విప్రుడగు ఆ భూతి గొప్ప క్లేశములను సహించెడివాడు కాదు. అతడు మిక్కిలి కోప స్వభావముగలవాడు ఆయెను. పుత్రసంతానము లేకపోవుటచే ఆ మహానుభావుడు తపస్సు చేయవలెనని మనస్సులో నిశ్చయించుకొనెను.

పుత్రకామో యతాహారః శీతవాతానలాహతః ।
తపస్యామి విచిన్త్యేతి తపస్యేవ మనో దధే ॥8॥

పుత్రసంతానమందు కోరికగలవాడై, మితాహారమును గ్రహించుచు, చల్లని గాలులు నిప్పులచే కొట్టబడినవాడై అనగా వాటిని సహించుచు, బాగుగా ఆలోచించి "నేను తపస్సును ఆచరించెదను" అని ఆ భూతి తపస్సునందే మనస్సును లగ్నము చేసెను.

తస్యేన్దుర్నాతిశీతాయ నాతితాపాయ భాస్కరః ।
అభవన్మాతరిశ్వా చ వవౌ నాతి మహామునే ॥9॥

ఓ మహామునీ ! ఆ భూతికి చంద్రుడు ఎక్కువ చల్లదనమును కలుగజేయలేదు. సూర్యుడు అధికతాపమును కలుగజేయలేదు. వాయుదేవుడు కూడా వేగముగా వీచలేదు.

ఆపీడ్యమానో ద్వంద్వైశ్చ స భూతిర్మునిసత్తమః ।
అనవాప్యాభిలాషాం తం తపసః స న్యవర్తత ॥10॥

సుఖదుఃఖములు శీతోష్ణములు మొ॥లగు ద్వంద్వములచే పీడింపబడినవాడై మునిశ్రేష్ఠుడగు ఆ భూతి తాను కోరుకొన్నదానిని పొందక తపస్సును విరమించెను.

తస్య భ్రాతా సువర్చాభూద్యజ్ఞే తేనాభిమన్త్రితః ।
యియాసుః శాన్తినామానం శిష్యమాహ మహామతిమ్ ॥11॥

ప్రశాన్తమక్షప్రతిమం వినీతం గురుకర్మణి ।
సదోద్యుక్తం శుభాచారముదారం మునిసత్తమమ్ ॥12॥

ఆ భూతికి సువర్చుసుడను సోదరుడుండెను. సోదరునిచే యజ్ఞమునకు ఆహ్వానింపబడిన భూతి యజ్ఞమునకు వెళ్ళదలచి గొప్ప బుద్ధిమంతుడు, ప్రశాన్తచిత్తుడు, జ్ఞానవంతుడు, వినయముగలవాడు, గురువు చెప్పిన పనులందు ఎల్లప్పుడు ఉద్యమించువాడు, శుభప్రదమైన ఆచారముగలవాడు, ఉదారబుద్ధిగలవాడు, మునిశ్రేష్ఠుడూ అయిన శాంతియను పేరుగల శిష్యునితో ఇట్లు పలికెను. ("సువర్చాభూత్" అనుచోట సంధి ఆర్షప్రయోగము. అట్లే "అక్షప్రతిమం" అనునది క్లిష్టప్రయోగము.)

భూతిరువాచ – భూతి చెప్పాడు.

అహం యజ్ఞం గమిష్యామి భ్రాతుః శాన్తే సువర్చసః ।
తేనాహూతస్త్వయా చేహ యత్కర్తవ్యం శృణుష్వ తత్ ॥13॥

అతిజాగరణం వహ్నేస్త్వయా కార్యం మమాశ్రమే ।
తథా త్వయా ప్రయత్నేన యథాగ్నిర్న శమం వ్రజేత్ ॥14॥

ఓ శాన్తీ ! నా సోదరుడయిన సువర్చసుడు ఆచరించే యజ్ఞమునకు నేను వెళ్ళెదను. నా సోదరునిచే నేను యజ్ఞమునకు ఆహ్వానింపబడినాను. నేను లేని సమయమందు నీవిచ్చట చేయవలసిన పని ఏమో చెప్పెదను, వినుము. నా ఆశ్రమమందు వహ్ని ఎల్లప్పుడు ప్రజ్వలించు విధముగా నీవు చేయవలెను. అగ్ని ఏ విధముగా చల్లారకుండా ఉండునో ఆ విధముగా నీవు ప్రయత్నము చేయవలెను.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

ఇత్యాజ్ఞాప్య తథేత్యుక్తో గురుః శిష్యేణ శాన్తినా ।
జగామ యజ్ఞం తం భ్రాతురాహూతః స యవీయసః ॥15॥

ఈ విధముగా గురువు ఆజ్ఞాపించగా, శిష్యుడగు శాంతి అట్లేయని బదులిచ్చెను. అంతట కనిష్ఠసోదరుడు ఆహ్వానించిన యజ్ఞమునకు భూతి వెళ్ళెను.

స చ శాన్తిర్వనాద్యావత్ సమిత్పుష్పఫలాదికమ్ ।
ఉపానయతి భూత్యర్థం గురోస్తస్య మహాత్మనః ॥16॥

మహాత్ముడగు గురువయిన భూతి చెప్పిన కార్యమును నిర్వహించు నిమిత్తమై శిష్యుడగు శాంతి అడవికివెళ్ళి సమిధలు, పుష్పములు, ఫలములు మొ॥గు వాటిని తీసుకు వచ్చుచుండెను.

అన్యచ్చ కురుతే కర్మ గురుభక్తివశానుగః ।
ప్రశాన్తస్తావదనలో యోఽసౌ భూతిపరిగ్రహః ॥17॥

గురుభక్తికి వశీభూతుడై గురువు చెప్పిన కార్యమునే గాక ఇంకనూ వేరే పనులను గూడా శాంతి చేయుచుండెను. ఈ కార్యములన్నీ చేయునంతలో భూతిచేత గ్రహింపబడిన ఆ అగ్ని చల్లారిపోయెను.

తం దృష్ట్వా సోఽనలం శాన్తం శాన్తిరత్యన్తదుఃఖితః ।
భీతశ్చ భూతేర్బహుధా చిన్తామాప మహామతిః ॥18॥

అగ్ని చల్లారిబోవుటను చూచి శాంతి మిక్కిలి దుఃఖితుడు అయ్యెను. ఇంకను గురువగు భూతి ఏమి చేస్తాడో అని భయపడినవాడై బుద్ధిమంతుడగు శాంతి అనేకవిధముల చింతించెను.

కిం కరోమి కథం వాఽత్ర భవితా గమనం గురోః ।
మయాద్య ప్రతిపత్తవ్యం కిం కృతే సుకృతం భవేత్ ॥19॥

ఇప్పుడు నేనేమి చేయుదును? ఇప్పుడు గురువు వచ్చినచో ఎట్లుండును? నేనిప్పుడు ఈ విషయమును గూర్చి ఆలోచించవలెను. ఏమి చేసిన మంచి జరుగును?

ప్రశాన్తాగ్నిమిమం ధిష్ణ్యం యది పశ్యతి మే గురుః ।
తతో మాం విషమే హ్యద్య వ్యసనే సన్నియోక్ష్యతి ॥20॥

నా గురువు గృహమందుండు ఈ అగ్నిహోత్రము చల్లారిపోయినదని చూచినచో వెంటనే నన్ను ఈరోజు నిస్సందేహముగా విషమదుఃఖములందు నియోగించగలడు.

యద్యన్యమగ్నిమత్రాహమగ్నిస్థానే కరోమి తత్ ।
సర్వప్రత్యక్షదృగ్ భస్మ సోఽవశ్యం మాం కరిష్యతి ॥21॥

ఒకవేళ నేను ఈ అగ్నిస్థానమందు మరొక అగ్నిని స్థాపించినట్లయితే సమస్తమును చూచు సామర్థ్యముగల నా గురువు తప్పక నన్ను భస్మము చేయగలడు.

సోఽహం పాపో గురోస్తస్య నిమిత్తం కోపశాపయోః ।
తథాత్మానం న శోచామి యథా పాపం కృతం గురోః ॥22॥

అట్టి నేను గురువుయొక్క కోపము మరియు శాపముల కారణముగా మరింత పాపములతో కూడుకొన్నవాడిని కాగలను. నేను గురువుపట్ల పాపము చేసినందువలన ఎంత దుఃఖమును పొందుచున్నానో అంత నా గురించి నేను దుఃఖించుట లేదు.

దృష్ట్వా ప్రశాన్తమనలం నూనం శప్స్యతి మాం గురుః ।
యథా వా పావకః క్రుద్ధస్తథా వీర్యో హి స ద్విజః ॥23॥

అగ్ని చల్లబడుట చూచి నా గురువు నన్ను తప్పక శపించగలడు. అగ్నిదేవుని తీవ్రకోపస్వభావము ఎట్టిదో నాగురువగు ఆ బ్రాహ్మణుడు కూడా అంత పరాక్రమము గలవాడు.

యస్య ప్రభావాద్బిభ్యన్తే దేవాస్తిష్ఠన్తి శాసనే ।
కృతాగసం స మాం యుక్త్యా కయా నో ధర్షయిష్యతి ॥24॥

ఎవని ప్రభావముతో దేవతలు కూడా భయపడతారో, ఎవని శాసనమునందు ఆ దేవతలు జీవించుచున్నారో అట్టి నా గురువు నన్ను ఏ యుక్తితో శపించకుండా ఉండును? (శాంతియను శిష్యుడు తన గురువగు భూతి తనను శపించకుండా ఉండటానికి యుక్తిని ఆలోచించుచున్నాడు.)

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

బహుధైవం విచిన్త్యాసౌ భీతస్తస్య సదా గురోః ।
యయౌ మతిమతాం శ్రేష్ఠః శరణం జాతవేదసమ్ ॥25॥

తన గురువువలన నిత్యమూ భయము చెందినవాడై అనేకవిధములుగా ఆలోచించి బుద్ధిమంతులలో శ్రేష్ఠుడైన ఆ శాంతి అగ్నిదేవుని శరణు వేడెను.

స చకార తదా స్తోత్రం సప్తర్చేర్యతమానసః ।
స చైకచిత్తో మేదిన్యాం న్యస్తజానుః కృతాఞ్జలిః ॥26॥

అప్పుడతడు ఇంద్రియములను నిగ్రహించుకొని, చేతులు జోడించుకొని, మోకాళ్ళపై నిలిచి ఏకాగ్రచిత్తము గలవాడై సప్తర్చియగు అగ్నిదేవుని గూర్చి స్తోత్రము చేసెను.

శాన్తిరువాచ – శాన్తి చెప్పెను.

ఓం నమః సర్వభూతానాం సాధనాయ మహాత్మనే ।
ఏకద్విపఞ్చధిష్ణ్యాయ రాజసూయే షడాత్మనే ॥27॥

సమస్తప్రాణులకు రక్షకుడు, మహాత్ముడు, ఒకటి రెండు అయిదు శిఖల స్వరూపుడు, రాజసూయమందు షడ్రూపస్వరూపుడూ అయిన అగ్నిదేవునికి నమస్కారము.

నమః సమస్తదేవానాం వృత్తిదాయ సువర్చసే ।
శుక్రరూపాయ జగతామశేషాణాం స్థితిప్రదః ॥28॥

సమస్తదేవతలకు వారివారి విధులను నిర్దేశించువాడు, కాంతిమంతుడు, శుక్రరూపుడూ అయిన అగ్నిదేవునికి నమస్కారము. నీవే సమస్త జగత్తులకు స్థితికారకుడవు.

త్వం ముఖం సర్వదేవానాం త్వయాత్తం భగవన్హవిః ।
ప్రీణయస్యఖిలాన్దేవాన్ త్వత్ప్రాణాః సర్వదేవతాః ॥29॥

ఓ పూజ్యుడా ! అగ్నిదేవుడా ! నీవు సర్వదేవతలకు ముఖమువంటివాడవు. నీవు తీసుకువెళ్ళి ఇచ్చిన హోమద్రవ్యములతో సమస్తదేవతలను సంతోషపరచుచున్నావు. దేవతల ప్రాణములన్నీ నీ అధీనమందున్నవి.

హుతం హవిస్త్వయ్యనల మేఘత్వముపగచ్ఛతి ।
తతశ్చ జలరూపేణ పరిణామముపైతి యత్ ॥30॥

తేనాఖిలౌషధీజన్మ భవత్యనిలసారథే ।
ఔషధీభిరశేషాభిః సుఖం జీవన్తి జన్తవః ॥31॥

ఓ అగ్నిదేవుడా ! నీయందు హోమము చేయబడిన హవిస్సులు మేఘముగా మారి, అటుపైన జలరూపముగా పరిణామము చెందుచున్నవి. ఓ వాయుసారథీ ! (వాయువు సారథిగా కలిగినవాడా !) అట్లు పరిణామము చెందుటవలన ఓషధులు ఉత్పన్నమగుచున్నవి. అశేషములయిన ఆ ఓషధులచేతనే ప్రాణులు సుఖముగా జీవించుచున్నారు.

వితన్వతే నరా యజ్ఞాన్ త్వత్సృష్టాస్వోషధీషు చ ।
యజ్ఞైర్దేవాస్తథా దైత్యాస్తద్వద్రక్షాంసి పావక ॥32॥

ఆప్యాయన్తే చ తే యజ్ఞాస్త్వదాధారా హుతాశన ।
అతః సర్వస్య యోనిస్త్వం వహ్నే సర్వమయస్తథా ॥33॥

ఓ అగ్నిదేవుడా ! నీవు సృష్టించిన సోమలత మొ॥లగు ఓషధులద్వారా మానవులు యజ్ఞములను చేయుచున్నారు. అట్టి యజ్ఞముల వలన దేవతలు, దైత్యులు, రాక్షసులు వృద్ధిని పొందుచున్నారు. ఓ హుతాశనుడా ! అన్ని యజ్ఞములకు నీవే ఆధారభూతుడవు. ఓ వహ్నీ ! అందువలన సమస్తమునకు నీవే ఉత్పత్తిస్థానము. అట్లే సర్వమయుడవూ నీవే.

దేవతా దానవా యక్షా దైత్యా గన్ధర్వరాక్షసాః ।
మానుషాః పశవో వృక్షా మృగపక్షిసరీసృపాః ॥34॥

ఆప్యాయన్తే త్వయా సర్వే సంవర్ధ్యన్తే చ పావక ।
త్వత్త ఏవోద్భవం యాన్తి త్వయ్యన్తే చ తథా లయమ్ ॥35॥

ఓ అగ్నిదేవుడా ! దేవతలు, దానవులు, యక్షులు, దైత్యులు, గంధర్వులు, రాక్షసులు, మనుష్యులు, పశువులు, వృక్షములు, మృగములు, పక్షులు, సరీసృపములు (వంకరగా పాకుతూ వెళ్ళే సర్పవృశ్చికాది జంతువులు) ఇవియన్నియు నీవల్లనే వృద్ధిని పొందుచున్నవి. నీవల్లనే అవియన్నియు పుట్టుచున్నవి, నీయందే లయమును చెందుచున్నవి.

అపః సృజసి దేవ త్వం త్వమత్సి పునరేవ తాః ।
పచ్యమానాస్త్వయా తాశ్చ ప్రాణినాం పుష్టికారణమ్ ॥36॥

ఓ అగ్నిదేవుడా ! నీవే జలములను సృష్టిచేయుచున్నావు. తిరిగి నీవే వాటిని భుజించుచున్నావు. నీవల్లనే ఆ జలములు ఉడకబడి ప్రాణులకు పుష్టిహేతువులగుచున్నవి.

దేవేషు తేజోరూపేణ కాన్త్యా సిద్ధేష్వవస్థితః ।
విషరూపేణ నాగేషు వాయురూపః పతత్రిషు ॥37॥

నీవే దేవతలందు తేజోరూపముతో, సిద్ధులందు కాంతిస్వరూపముతో, సర్పములందు విషరూపముతో, పక్షులయందు వాయురూపముతో నిలిచియున్నావు.

మనుజేషు భవాన్ క్రోధో మోహః పక్షిమృగాదిషు ।
అవష్టంభోऽసి తరుషు కాఠిన్యం త్వం మహీం ప్రతి ॥38॥

నీవు మనుష్యులలో క్రోధరూపముతో, పక్షిమృగాదులలో మోహరూపముతో, చెట్లలో స్థితిరూపముతో, భూమియందు కాఠిన్యగుణముతోనూ నిలిచియున్నావు.

జలే ద్రవస్త్వం భగవన్ జవరూపీ తథానిలే ।
వ్యాపిత్వేన తథైవాగ్నే నభసి త్వం వ్యవస్థితః ॥39॥

ఓ పూజ్యుడా ! అగ్నిదేవుడా ! నీవు జలమందు ద్రవరూపముగాను, వాయువునందు వేగరూపముగానూ, ఆకాశమందు సర్వవ్యాపకునిగానూ నిలిచియున్నావు.

త్వమగ్నే సర్వభూతానామన్తశ్చరసి పాలయన్ ।
త్వామేకమాహుః కవయస్త్వామాహుస్త్రివిధః పునః ॥40॥

ఓ అగ్నిదేవుడా ! నీవు సమస్తభూతములను పాలించుచూ, వాటి లోపల సంచరించుచున్నావు. కవులు నిన్ను ఏకస్వరూపముగాను, త్రివిధస్వరూపముగానూ కీర్తించుచున్నారు.

త్వామష్టధా కల్పయిత్వా యజ్ఞవాహమకల్పయన్ ।
త్వయా సృష్టమిదం విశ్వం వదన్తి పరమర్షయః ॥41॥

ఓ అగ్నిదేవుడా ! గొప్ప ఋషులు నిన్ను ఎనిమిది రూపములుగా కల్పించి యజ్ఞవాహునిగా (యజ్ఞమందలి హోమద్రవ్యములను తీసుకొని వెళ్ళువానిగా) కల్పించినారు. నీ చేతనే ఈ విశ్వమంతా సృష్టింపబడినదని వారు చెప్పుచున్నారు.

త్వామృతే హి జగత్సర్వం సద్యో నశ్యేద్ధుతాశన ।
తుభ్యం కృత్వా ద్విజాః పూజాం స్వకర్మవిహితాం గతిమ్ ॥42॥

ప్రయాన్తి హవ్యకవ్యాద్యైః స్వధాస్వాహాభ్యుదీరణాత్ ।
పరిణామాత్మవీర్యాణి ప్రాణినామమరార్చిత ॥43॥

ఓ హుతాశనుడా ! నీవు లేనిచో ఈ ప్రపంచమంతా వెంటనే నశించిపోవును. బ్రాహ్మణులు స్వధా, స్వాహా అని ఉచ్చరించుచు హవ్యకవ్యాదులతో (హోమద్రవ్యములు) నీకు పూజచేసి తమకు విధింపబడిన కర్మలను ఆచరించుచున్నారు. దేవతలచే పూజింపబడిన ఓ అగ్నిదేవా ! పూర్వము కంటే మరింత పరిణామము చెందిన అనగా అధికమైన పరాక్రమములను నీవు ప్రాణులకు ఇచ్చుచున్నావు.

దహన్తి సర్వభూతాని తతో నిష్క్రమ్య హేతయః ।
జాతవేదస్త్వయైవేదం విశ్వం సృష్టం మహాద్యుతే ॥44॥

ఓ గొప్ప ప్రకాశముగలవాడా ! నీ వల్ల ఉద్భవించిన అగ్నిజ్వాలలు సమస్తభూతములను దహించివేయుచున్నవి. ఓ సర్వజ్ఞుడా ! నీవల్లనే ఈ విశ్వమంతా సృష్టింపబడినది.

తవైవ వైదికం కర్మ సర్వభూతాత్మకం జగత్ ।
నమస్తేఽనల పిఙ్గాక్ష నమస్తేఽస్తు హుతాశన ॥45॥

వైదికకర్మలు, సర్వభూతాత్మకమైన ఈ ప్రపంచము నీయధీనమందే ఉన్నవి. ఓ పిఙ్గాక్షా ! (పచ్చని కన్నులు గలవాడా!) ఓ హుతాశనా ! (హోమద్రవ్యములను భక్షించువాడా !) నీకు నమస్కరించుచున్నాను.

పావకాద్య నమస్తేఽస్తు నమస్తే హవ్యవాహన ।
త్వమేవ సర్వభూతానాం పావనాద్విశ్వపావనః ।
త్వమేవ భుక్తపీతానాం పాచనాద్విశ్వపాచకః ॥46॥

పవిత్రము చేయువారలలో మొదటివాడా ! ఓ అగ్నిదేవా ! నీకు నమస్కారము. ఓ హవ్యవాహనా ! (అగ్నిలో హోమము చేయబడిన హోమద్రవ్యములను అగ్నిదేవుడు మోసుకొనిపోయి ఆయా దేవతలకిస్తాడు.) నీకు నమస్కారము. నీవే సమస్త భూతములను పవిత్రము చేయువాడవు గావున నీవు విశ్వపావనుడవు. నీవే తిన్నట్టి త్రాగినట్టి పదార్థములను పచనము (వంట లేదా భస్మము) చేయువాడవు గావున నీవు విశ్వపాచకుడవు.

సస్యానాం పాకకర్తా త్వం పోష్టా త్వం జగతస్తథా ।
త్వమేవ మేఘస్త్వం వాయుస్త్వం బీజం సస్యహేతుకమ్ ॥47॥

వరిధాన్యము మొ॥లగు సస్యములకు నీవే పాకకర్తవు. (అగ్నిదేవుని వేడి కారణంగానే గింజలు గట్టిగా మారతాయి.) ప్రపంచమునకంతా నీవే పోషకుడవు. నీవే మేఘము, నీవే వాయువు, సస్యమునకు కారణమైన బీజమూ (విత్తనము) నీవే.

పోషాయ సర్వభూతానాం భూతభవ్యభవో హ్యసి ।
త్వం జ్యోతిః సర్వభూతేషు త్వమాదిత్యో విభావసుః ॥48॥

సమస్త ప్రాణులను పోషించుటకై నీవు భూతభవిష్యద్వర్తమానకాలస్వరూపుడవు అయినావు. సమస్త ప్రాణులందు ఉండే ప్రకాశము నీవే. నీవే సూర్యుడవు, చంద్రుడవు.

త్వమహస్త్వం తథా రాత్రిరుభే సన్ధ్యే తథా భవాన్ ।
హిరణ్యరేతాస్త్వం వహ్నే హిరణ్యోద్భవకారణమ్ ॥49॥

ఓ వహ్నీ ! నీవే పగలు, నీవే రాత్రివి. ఉభయసంధ్యలు నీవే. హిరణ్యరేతస్సువు నీవే. హిరణ్యము (బంగారము) పుట్టుకకు నీవే కారణము.

హిరణ్యగర్భశ్చ భవాన్ హిరణ్యసదృశప్రభః ।
త్వం ముహూర్తం క్షణశ్చ త్వం త్వం త్రుటిస్త్వం తథా లవః ॥50॥

కలాకాష్ఠానిమేషాదిరూపేణాసి జగత్ప్రభో ।
త్వమేతదఖిలం కాలః పరిణామాత్మకో భవాన్ ॥51॥

ఓ జగత్తుకు ప్రభువా ! హిరణ్యగర్భుడవు నీవే. హిరణ్యముయొక్క కాంతివంటి కాంతి కలవాడవు నీవు. కాలపరిమాణవిశేషములైన ముహూర్తము, క్షణము, త్రుటి, లవములు నీవే. ఇంకనూ కాలపరిమాణవిశేషములైన కలా, కాష్ఠా, నిమేషము మొ॥వాటి రూపముతో నీవున్నావు. నీవే ఈ అఖిలకాలస్వరూపుడవు. పరిణామస్వరూపుడవూ నీవే.

యా జిహ్వా భవతః కాలీ కాలనిష్ఠాకరీ ప్రభో ।
తయా నః పాహి పాపేభ్య ఐహికాచ్చ మహాభయాత్ ॥52॥

ఓ ప్రభూ ! కాలనిష్ఠాకరి (కాలముయొక్క ఉత్పత్తివినాశములను చేయునది) అయిన కాలీయను పేరుగల నీయొక్క జిహ్వా (నాలుక) ఏది కలదో దానితో మమ్ములను పాపములనుండి, ఈ లోకమందలి మహాభయమునుండి కాపాడుము.

కరాలీ నామ యా జిహ్వా మహాప్రలయకారణమ్ ।
తయా నః పాహి పాపేభ్య ఐహికాచ్చ మహాభయాత్ ॥53॥

మహాప్రళయమునకు కారణభూతమైన కరాళియను పేరుగల నీ యొక్క ఏ జిహ్వా కలదో దానితో మమ్ములను పాపములనుండి, ఐహికమైన (ఈలోకమందలి) మహాభయమునుండి రక్షించుము.

మనోజవా చ యా జిహ్వా లఘిమాగుణలక్షణా ।
తయా నః పాహి పాపేభ్య ఐహికాచ్చ మహాభయాత్ ॥54॥

లఘిమాగుణముతో కూడుకొన్న మనోజవయను నీయొక్క ఏ జిహ్వాగలదో దానితో మమ్ములను పాపములనుండి ఐహికమైన మహాభయము నుండి కాపాడుము.

కరోతి కామం భూతేభ్యో యా తే జిహ్వా సులోహితా ।
తయా నః పాహి పాపేభ్య ఐహికాచ్చ మహాభయాత్ ॥55॥

ప్రాణులయొక్క కోరికలను సిద్ధింపచేయునట్టి సులోహితయను పేరుగల నీయొక్క ఏ జిహ్వాగలదో దానితో మమ్ములను పాపములనుండి, ఐహికమైన మహాభయమునుండి రక్షించుము.

సుధూమ్రవర్ణా యా జిహ్వా ప్రాణినాం రోగదాయికా ।
తయా నః పాహి పాపేభ్య ఐహికాచ్చ మహాభయాత్ ॥56॥

ప్రాణులకు రోగములను కలుగజేయునట్టి సుధూమ్రవర్ణయను పేరుగల నీయొక్క ఏ జిహ్వాగలదో దానితో మమ్ములను పాపములనుండి, ఐహికమైన మహాభయమునుండి కాపాడుము.

స్ఫులింగినీ చ యా జిహ్వా యతః సకలపుద్గలాః ।
తయా నః పాహి పాపేభ్య ఐహికాచ్చ మహాభయాత్ ॥57॥

పుద్గలములు అనగా పరమాణుద్వ్యణుకాదులు దేనివలన ఉద్భవించుచున్నవో అట్టి స్ఫులింగిని అను నీయొక్క జిహ్వాతో మమ్ములను పాపములనుండి, ఐహికమైన మహాభయమునుండి కాపాడుము.

యా తే విశ్వసృజా జిహ్వా ప్రాణినాం శర్మదాయినీ ।
తయా నః పాహి పాపేభ్య ఐహికాచ్చ మహాభయాత్ ॥58॥

ప్రాణులకు సుఖమును ప్రసాదించు విశ్వసృజయను నీయొక్క ఏ జిహ్వగలదో అట్టి జిహ్వతో మమ్ములను పాపములనుండి, ఐహికమైన మహాభయమునుండి రక్షించుము.

పిఙ్గాక్ష లోహితగ్రీవ కృష్ణవర్త్మ హుతాశన ।
త్రాహి మాం సర్వదోషేభ్యః సంసారాదుద్ధరేహ మామ్ ॥59॥

ఓ పిఙ్గాక్ష ! లోహితగ్రీవ ! కృష్ణవర్త్మ ! హుతాశన ! అగ్నిదేవా ! నన్ను సమస్తదోషములనుండి కాపాడుము. నన్ను ఇచ్చటి సంసారమునుండి ఉద్ధరించుము.

ప్రసీద వహ్నే సప్తార్చిః కృశానో హవ్యవాహన ।
అగ్నిపావకశుక్రాదినామాష్టభిరుదీరితః ॥60॥

ఓ వహ్నీ ! సప్తార్చీ ! కృశానూ ! హవ్యవాహనా ! అగ్ని, పావక, శుక్ర మొ॥ ఎనిమిది నామములతో చెప్పబడుచున్న నీవు మమ్ములను అనుగ్రహించుము.

అగ్నేఽగ్రే సర్వభూతానాం సముత్పత్తిర్విభావసో ।
ప్రసీద హవ్యవాహాఖ్య అభిష్టుత మయావ్యయ ॥61॥

ఓ అగ్నీ ! నీవు మిగిలిన ప్రాణులన్నింటికంటే ముందుగానే పుట్టినావు. ఓ విభావసూ ! నాచేత బాగుగా స్తుతింపబడినవాడా! ఓ నాశము లేనివాడా ! మమ్ములను అనుగ్రహించుము.

త్వమక్షయో వహ్నిరచిన్త్యరూపః సమృద్ధిమాన్దుష్ప్రసహోఽతితీవ్రః ।
తవావ్యయం భీమమశేషలోకసంవర్ధకం హన్త్యథవాఽతివీర్యమ్ ॥62॥

ఓ వహ్నీ ! నీకు నాశము లేదు. నీ రూపమెట్టిదో ఊహించనలవి కాదు. సమృద్ధికలిగినవాడవు. నిన్ను ఎదిరించుట ఎవరికినీ శక్యము కాదు. మిక్కిలి తీవ్రమైన స్వభావము కలిగినవాడవు. నాశములేని నీ గొప్ప పరాక్రమము మిక్కిలి భయంకరమైనది. అది సమస్తలోకాలను పోషించునది, నాశము చేయునదీ కూడా. (సృష్టిస్థితిలయకారకుడు)

త్వముత్తమం తత్త్వమశేషసత్త్వహృత్పుణ్డరీకస్థమనన్తమీడ్యమ్ ।
త్వయా తతం విశ్వమిదం చరాచరం హుతాశనైకో బహుధా త్వమత్ర ॥63॥

ఓ హుతాశనా ! నీవు ఉత్తమమైన తత్త్వము. ఆ తత్త్వము సమస్తప్రాణుల హృదయమనెడు పద్మమందు ఉండునది. అంతము లేనిది. స్తుతింపతగినది. నీ చేతనే స్థావరజంగమాత్మకమైన ఈ ప్రపంచము వ్యాప్తమైనది. నీవు ఒక్కడివే అయిననూ అనేక విధములుగా ఈ ప్రపంచమందు నిలిచియున్నావు.

త్వమక్షయః సగిరివనా వసున్ధరా నభః ససోమార్కమహర్దివాఖిలమ్ ।
మహోదధేర్జఠరగతశ్చ బాడబో భవాన్విభుః పిబతి పయాంసి పావక ॥64॥

ఓ పావకా ! అగ్నిదేవుడా ! నీవు నాశము లేనివాడవు. పర్వతములు అడవులతో కూడిన భూమివి నీవే. సూర్యచంద్రులతో కూడుకొన్న ఆకాశము నీవే. సమస్త రాత్రింబవళ్ళు నీవే. మహాసముద్రమందు, జఠరమందు ఉన్న బడబాగ్నివి నీవే. సర్వవ్యాపకుడవగు నీవు నీటిని త్రాగుచున్నావు అనగా ఆవిరి చేయుచున్నావు.

హుతాశనస్త్వమితి సదాభిపూజ్యసే మహాక్రతౌ నియమపరైర్మహర్షిభిః ।
అభిష్టుతః పిబసి చ సోమమధ్వరే వషట్కృతాన్యపి చ హవీంషి భూతయే ॥65॥

నీవు హుతాశనుడవని అనగా హోమద్రవ్యములను భుజించువాడవని నియమనిష్ఠాపరులైన మహర్షులచేత ఎల్లప్పుడు పూజింపబడుచున్నావు. బాగుగా స్తుతింపబడిన నీవు యజ్ఞమందు సోమరసమును త్రాగుచున్నావు. వషట్కారముతో హోమము చేయబడిన హవిస్సులను నీవు సమృద్ధికొరకు భుజించుచున్నావు.

త్వం విప్రైః సతతమిహేజ్యసే ఫలార్థం వేదాఙ్గేష్వథ సకలేషు గీయసే త్వమ్ ।
త్వద్ధేతోర్యజనపరాయణా ద్విజేన్ద్రా వేదాఙ్గాన్యధిగమయన్తి సర్వకాలే ॥66॥

స్వర్గాది ఫలములను పొందుటకై విప్రులు నిన్ను ఉద్దేశించి యాగములు చేయుచున్నారు. సమస్త వేదాఙ్గములందు నీవు స్తుతింపబడుచున్నావు. నీ కారణముగానే అనగా నీ అనుగ్రహము పొందుట కొరకై ద్విజశ్రేష్ఠులు యాగములు చేయుటయందు ఆసక్తి కలిగియున్నారు, ఎల్లప్పుడు వేదాంగములను అధ్యయనము చేయుచున్నారు.

త్వం బ్రహ్మా యజనపరస్తథైవ విష్ణుర్భూతేశః సురపతిరర్యమా జలేశః ।
సూర్యేన్దూ సకలసురాసురాశ్చ హవ్యైః సన్తోష్యాభిమతఫలాన్యథాప్నువన్తి ॥67॥

యాగములు చేయుటయందు ఆసక్తుడైన బ్రహ్మవు నీవే. నీవే విష్ణువు. నీవే పరమేశ్వరుడివి. నీవే ఇంద్రుడివి. నీవే సూర్యుడివి. జలములకు ప్రభువైన వరుణుడివి నీవే. సూర్యచంద్రులు, సమస్త దేవతలు, అసురులు నీకు హోమద్రవ్యములను ఇచ్చుట ద్వారా నిన్ను సంతోషపరచి తమకు కావలసిన ఫలములను పొందుచున్నారు.

అర్చిభిః పరమమహోపఘాతదుష్టం సంస్పృష్టం తవ శుచి జాయతే సమస్తమ్ ।
స్నానానాం పరమమతీవ భస్మనా సత్సన్ధ్యాయాం మునిభిరతీవ సేవ్యసే తత్ ॥68॥

తత్ కృత్వా త్రిదివమవాప్నువన్తి లోకాః ।
సద్భక్త్యా సుఖనియతాః సమూహగతిమ్ ॥69॥

గొప్ప ఉపఘాతములచే (రోగములు, పాపములు మొ॥నవి ఉపఘాతములు) దుష్టమైన వస్తువులు నీ జ్వాలల స్పర్శచే పవిత్రమగుచున్నవి. అనేకవిధములైన స్నానములందు భస్మముతో స్నానము చేయుటే శ్రేష్ఠము. సంధ్యాకాలములలో మునులచేత ఆ భస్మము ఎక్కువగా సేవింపబడుచున్నది. అట్లు చేయుటవలన ప్రజలు స్వర్గమును పొందుచున్నారు. సద్భక్తితో సుఖమును పొందుచున్నారు.

ప్రసీద వహ్నే శుచినామధేయ ప్రసీద వాయో విమలాతిదీప్తే ।
ప్రసీద మే పావక వైద్యుతాభ ప్రసీద హవ్యాశన పాహి మాం త్వమ్ ॥70॥

యత్తే వహ్నే శివం రూపం యే చ తే సప్తహేతయః ।
తైః పాహి నః స్తుతో దేవ పితా పుత్రమివాత్మజమ్ ॥71॥

ఓ వహ్నీ ! శుచియనుపేరుగలవాడా ! నన్ను అనుగ్రహించుము. ఓ స్వచ్ఛమైన మిక్కిలి ప్రకాశముగలవాడా! ఓ వాయుదేవుడా ! నాపై దయ జూపుము. విద్యుత్తుయొక్క ప్రకాశమువంటి ప్రకాశముగలవాడా ! ఓ పావకా ! నాపై దయజూపుము. హెూమద్రవ్యములను భుజించు ఓ అగ్నిదేవుడా ! నన్ను అనుగ్రహించుము. నన్ను నీవు రక్షించుము. ఓ వహ్నిదేవుడా ! నీయొక్క మంగళకరమైన రూపమేది కలదో, ఏవైతే ఏడు జ్వాలలు గలవో వాటన్నింటిచేత మాచేత స్తుతింపబడిన నీవు మమ్ములను తండ్రి పుత్రుని రక్షించినట్లుగా రక్షించుము.

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే భౌత్యమన్వన్తరే అగ్నిస్తోత్రం నామ షణ్ణవతితమోఽధ్యాయః ॥96॥

శ్రీ మార్కండేయ మహాపురాణమందలి భౌత్యమన్వంతరమందలి అగ్నిస్తోత్రమను తొంబదిఆరవ అధ్యాయం సమాప్తం.



సప్తనవతితమోఽధ్యాయః – తొంబదిఏడవ అధ్యాయం
చతుర్దశమన్వంతరవర్ణనసమాప్తిః – పదునాలుగుమన్వంతరములవర్ణనసమాప్తి

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

ఏవం స్తుతస్తతస్తేన భగవాన్ హవ్యవాహనః ।
జ్వాలామాలావృతతనుస్తస్యాసీదగ్రతో మునే ॥1॥

ఓ మునీ ! శాంతియను పేరుగల విప్రుడు ఈ విధముగా అగ్నిని స్తుతించగా భగవత్స్వరూపుడు, హవ్యవాహనుడూ, జ్వాలలే మాలలుగా మారి వాటిచేత కప్పబడిన శరీరము కలవాడూ అయిన అగ్నిదేవుడు ఆ విప్రుని ఎదుట ప్రత్యక్షమయ్యెను.

దేవో విభావసుః ప్రీతః స్తోత్రేణానేన వై ద్విజ ।
తం శాన్తిమాహ ప్రణతం మేఘగంభీరవాగథ ॥2॥

ఓ బ్రాహ్మణుడా ! శాంతి చేసిన స్తోత్రముతో ప్రీతిచెందిన విభావసువగు అగ్నిదేవుడు మేఘగర్జనవంటి గంభీరవాక్కులతో ఆ శాన్తిని గూర్చి ఇట్లు పలికెను.

అగ్నిరువాచ – అగ్ని పలికాడు.

పరితుష్టోఽస్మి తే విప్ర భక్త్యా యా తే స్తుతిః కృతా ।
వరం దదామి భవతే ప్రార్థ్యతాం యత్తవేప్సితమ్ ॥3॥

ఓ బ్రాహ్మణుడా ! భక్తితో నీవు చేసినస్తుతితో నేను సంతోషించినాను. నీకు వరమిచ్చుచున్నాను. నీకేమి కావలయునో కోరుకొనుము.

శాన్తిరువాచ – శాంతి పలికాడు.

భగవన్ కృతకృత్యోఽస్మి యత్త్వా పశ్యామి రూపిణమ్ ।
తథాపి భక్తినమ్రస్య భవతా శ్రూయతాం మమ ॥4॥

ఓ పూజ్యుడా ! రూపము కలిగియున్న నిన్ను నేను చూచుచున్నాను. అట్లు చూచుటతోడనే నేను కృతకృత్యుడను అయినాను. అయిననూ భక్తితో నమ్రుడనయిన నా మాటలను నీవు వినుగాక !

భ్రాతృయజ్ఞం గతో దేవ మమాచార్యో నిజాశ్రమాత్ ।
ఆగతశ్చాశ్రమం ధిష్ణ్యం త్వత్సనాథం స పశ్యతు ॥5॥

ఓ అగ్నిదేవా ! నా గురువు తన సోదరుని యజ్ఞమును దర్శించుటకై తన ఆశ్రమమునుండి వెళ్ళెను. తన ఆశ్రమానికి తిరిగి వచ్చినప్పుడు నీతో (అగ్నితో) ఉన్నట్టి అగ్నిహోత్రస్థానమును నా గురువు చూడవలయును.

మమాపరాధాత్ సన్త్యక్తం ధిష్ణ్యం యత్తే విభావసో ।
తత్త్వయాధిష్ఠితం సోఽద్య పూర్వవత్పశ్యతు ద్విజః ॥6॥

ఓ విభావసూ ! అగ్నిదేవా ! నా అపరాధమువలన ఆ అగ్నిహోత్రస్థానము అగ్నిచేత విడిచిపెట్టబడినది. (అగ్ని చల్లారిపోయినది) కావున ఆ స్థానము నీచేత అధిష్ఠింపతగినది. బ్రాహ్మణుడగు నా గురువు పూర్వమువలే ఆ స్థానమందు అగ్నిని చూడవలెను.

తథాన్యదపి మే దేవ ప్రసాదం కురుషే యది ।
పుత్రో విశిష్టో భవతు తదపుత్రస్య మే గురోః ॥7॥

ఓ అగ్నిదేవా ! నీవు అనుగ్రహించినచో మరొక ప్రార్థన కూడా ఉన్నది. పుత్రహీనుడయిన నా గురువునకు సద్గుణశాలి అయిన పుత్రుడు కలుగుగాక !

తథా చ మైత్రీం తనయే స కరిష్యతి మే గురుః ।
తథా సమస్తసత్త్వేషు భవత్వస్య మనో మృదు ॥8॥

అట్లు జరిగినచో నా గురువు తన కుమారునియందు స్నేహభావమును చేయగలడు. అట్లే సమస్త ప్రాణులయందు కూడా ఇతని మనస్సు మృదువు అగుగాక !

యశ్చ త్వాం స్తోష్యతేఽనేన ప్రీతిం యాతోఽసి మేఽవ్యయ ।
స్తోత్రేణ తస్య వరదో భవేథా మత్ప్రసాదితః ॥9॥

నాశము లేనివాడా ! ఓ అగ్నిదేవా ! ఈ స్తోత్రముద్వారా నాయందు ప్రసన్నుడవయినట్లుగా, ఎవరేని ఈ స్తోత్రముతో నిన్ను స్తుతించినట్లయిన అతనిపట్ల కూడా నీవు ఇదేవిధముగా వరదాయకునివి కావలెను.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

ఏతచ్ఛ్రుత్వా వచస్తస్య తమాహ ద్విజసత్తమమ్ ।
స్తోత్రేణారాధితస్తేన గురుభక్త్యా చ పావకః ॥10॥

ఈ విధముగా స్తోత్రముచేత పూజింపబడిన అగ్నిదేవుడు గురుభక్తితో శాంతి పలికిన మాటలను విని ద్విజశ్రేష్ఠుడగు అతనితో ఇట్లు పలికెను.

అగ్నిరువాచ – అగ్ని పలికాడు.

గురోరర్థే యతో బ్రహ్మన్యాచితం తే వరద్వయమ్ ।
నాత్మార్థం తేన మే ప్రీతిస్త్వయ్యతీవ మహామునే ॥11॥

ఓ బ్రహ్మస్వరూపుడా ! గురువుకొరకే నీవు రెండు వరములను కోరితివి, నీ కొరకు కాదు. అందువలన ఓ మహామునీ ! నీయందు నాకు మిక్కిలి అధికమైన ప్రీతి కల్గినది.

భవిష్యత్యేతదఖిలం గురోర్యత్ప్రార్థితం త్వయా ।
మైత్రీ సమస్తభూతేషు పుత్రశ్చాస్య భవిష్యతి ॥12॥

గురువుకొరకు నీవు ఏమి కోరితివో అదియంతయు సిద్ధించగలదు. నీ గురువుకు సమస్తప్రాణులయందు మైత్రీభావము, పుత్రుడు సిద్ధించును.

మన్వంతరాధిపః పుత్రో భౌత్యో నామ భవిష్యతి ।
మహాబలో మహావీర్యో మహాప్రాజ్ఞో గురుస్తవ ॥13॥

నీ గురువుకు గొప్ప బలవంతుడు, పరాక్రమవంతుడు, బుద్ధిమంతుడూ అయిన భౌత్యుడను పేరుగల మన్వంతరాధిపతియగు పుత్రుడు ఉదయించును.

అనేన యశ్చ స్తోత్రేణ స్తోష్యతే మాం సమాహితః ।
తస్యాభిలషితం సర్వం పుణ్యం చాస్య భవిష్యతి ॥14॥

ఎవరయితే ఏకాగ్రచిత్తముతో ఈ స్తోత్రముద్వారా నన్ను స్తుతించునో అతడి కోరికలన్నియు నెరవేరును, పుణ్యము కూడా ప్రాప్తించును.

యజ్ఞేషు పర్వకాలేషు తీర్థేజ్యాహోమకర్మసు ।
ధర్మాయ పఠతామేతన్మమ పుష్టికరం పరమ్ ॥15॥

యజ్ఞములందు, పర్వదినములందు, తీర్థములందు, యాగాదులందు, హోమకార్యములందు ధర్మార్థమై ఈ స్తోత్రమును పఠించినచో అది నాకు పుష్టికారకమగును.

అహోరాత్రకృతం పాపం శ్రుతమేతత్సకృద్ద్విజ ।
నాశయిష్యత్యసన్దిగ్ధం మమ తుష్టికరం పరమ్ ॥16॥

ఓ బ్రాహ్మణుడా ! శాంతీ ! నాకు మిక్కిలి సంతోషమును కల్గించు ఈ స్తోత్రమును ఒక్కసారి విన్ననూ అది రాత్రింబవళ్ళు చేసిన పాపమును నిస్సందేహముగా పోగొట్టును.

అహోమకాలదోషాదీనయోగ్యైరపి తత్కృతైః ।
యే దోషాస్తానిదం సద్యః శమయిష్యతి సంశ్రుతమ్ ॥17॥

హోమకాలము దాటిపోయిన తరువాత హోమము చేసిన ఎట్టి దోషములు కలుగునో వాటిని మరియు యోగ్యతలేనివారు హోమాదులను ఆచరించినచో ఎట్టిదోషములు కలుగునో వాటినీ బాగుగా విన్నట్టి ఈ స్తోత్రము వెంటనే నశింపచేయును.

పౌర్ణమాస్యామమావాస్యాం పర్వస్వన్యేషు చ స్తవః ।
మమైష సంశ్రుతో మర్త్యైర్భవితా పాపనాశనః ॥18॥

పూర్ణిమ, అమావాస్య, మిగిలిన పర్వదినములందు నా ఈ స్తోత్రమును విన్న మానవులయొక్క పాపములు నశించును.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

ఇత్యుక్త్వా భగవానగ్నిః పశ్యతస్తస్య వై మునే ।
బభూవాదర్శనః సద్యో దీపస్థో నివృత్తో యథా ॥19॥

ఓ మునీ ! ఈ విధముగా భగవత్స్వరూపుడగు అగ్ని పలికి శాంతి చూచుచుండగనే, దీపపు వెలుగు ఒక్కసారిగా ఎట్లు ఆరిపోవునో, అట్లే వెంటనే అంతర్థానమయ్యెను.

స చ శాన్తిర్గతే వహ్నౌ పరితుష్టేన చేతసా ।
హర్షరోమాఞ్చితతనుః ప్రవివేశాశ్రమం గురోః ॥20॥

ఆ శాంతి కూడా వహ్నిదేవుడు అంతర్ధానమయిన పిమ్మట సంతుష్టమనస్కుడై హర్షముతో నిక్కబొడిచిన రోమములు గలవాడై తన గురువుయొక్క ఆశ్రమమందు ప్రవేశించెను.

జాజ్వల్యమానం తత్రాసౌ గురుధిష్ణ్యే హుతాశనమ్ ।
దదర్శ పూర్వవత్ప్రాప తతః స పరమాం ముదమ్ ॥21॥

ఆ గుర్వాశ్రమమందు అగ్నికుండములో పూర్వమువలెనే ప్రజ్వలించుచున్న అగ్నిని శాంతి చూచెను. అంతట ఆ విప్రుడు గొప్ప సంతోషమును పొందెను.

ఏతస్మిన్నన్తరే సోఽపి గురుస్తస్య మహాత్మనః ।
భ్రాతుర్యవీయసో యజ్ఞాదాజగామ స్వమాశ్రమమ్ ॥22॥

ఇంతలో మహాత్ముడగు ఆ శాంతియొక్క గురువు కూడా తన తమ్ముడు ఆచరించిన యజ్ఞము నుండి తన ఆశ్రమమునకు తిరిగి వచ్చెను.

తస్యాగ్రతశ్చ శిష్యోఽసౌ చక్రే పాదాభివన్దనమ్ ।
గృహీతాసనపూజశ్చ తమాహ స తదా గురుః ॥23॥

అప్పుడా శాంతియను శిష్యుడు గురువుకు ఎదురేగి పాదాభివందనము చేసెను. అప్పుడు ఆసనము, పూజలను గ్రహించి ఆ గురువు శాంతియను శిష్యునితో ఇట్లు పలికెను.

వత్సాతిహార్దం త్వయి మే తథాన్యేషు చ జన్తుషు ।
న వేద్మి కిమిదం త్వం చేద్వేత్స్యే తత్కథయాశు మే ॥24॥

ఓ వత్సా ! నీయందు మరియు మిగిలిన వేరే ప్రాణులయందు నాకు మిక్కిలి ప్రేమభావము కలుగుచున్నది. ఎందువలన ఇట్లు కలుగుచున్నదో నేను ఎరుగను. నీవు ఎరిగినచో వెంటనే నాకు చెప్పుము.

తతః స శాన్తిస్తత్సర్వమాచార్యాయ మహామునే ।
అగ్నినాశాదికం విప్రః సమాచష్టే యథాతథమ్ ॥25॥

ఓ మహామునీ ! అంతట ఆ శాంతి అగ్ని నశించుట మొదలుకొని అన్ని విషయములను తన గురువుగారికి ఉన్నది ఉన్నట్లు చెప్పెను.

తచ్ఛ్రుత్వా స పరిష్వజ్య స్నేహార్ద్రనయనో గురుః ।
శిష్యాయ ప్రదదౌ వేదాన్ సాఙ్గోపాఙ్గాన్ మహామునే ॥26॥

ఓ మహామునీ ! తన శిష్యుడు చెప్పిన విషయమునంతను విని ఆ గురువు స్నేహముతో ఆర్ద్రమైన కన్నులు గలవాడై శిష్యుని ఆలింగనము చేసుకొని అతనికి అంగములు ఉపాంగములతో కూడుకొన్న వేదములను ప్రసాదించెను.

భౌత్యో నామ మనుస్తస్య పుత్రో భూతేరజాయత ।
తస్య మన్వన్తరే దేవానృషీన్భూపాంశ్చ మే శృణు ॥27॥

భవిష్యస్య భవిష్యాస్తు గదతో మమ విస్తరాత్ ।
దేవేన్ద్రో యశ్చ భవితా తస్య విఖ్యాతకర్మణః ॥28॥

అనంతరము గురువుగారైన ఆ భూతికి కుమారునిగా భౌత్యుడను మనువు జన్మించెను. తన మంచి పనులతో ప్రసిద్ధుడైన కాబోయే ఆ మనువుకు ఉండబోయే దేవతలు, ఋషులు, కాబోయే దేవేంద్రుడు ఎవరో వారిని గురించి చెప్పెదను, వినుము.

చాక్షుషాశ్చ కనిష్ఠాశ్చ పవిత్రా భ్రాజిరాస్తథా ।
ధారావృకాశ్చేత్యేతే వై పఞ్చ దేవగణాః స్మృతాః ॥29॥

ఆ భౌత్యుని మన్వంతరమందు చాక్షుషులు, కనిష్ఠులు, పవిత్రులు, భ్రాజిరులు, ధారావృకులు అనువారలు అయిదు దేవతాగణములుగా ఉందురు.

శుచిరిన్ద్రస్తదా తేషాం త్రిదశానాం భవిష్యతి ।
మహాబలో మహావీర్యః సర్వైరిన్ద్రగుణైర్యుతః ॥30॥

మహాబలవంతుడు, మహాపరాక్రమవంతుడు, సమస్తములైన ఇంద్రగుణములతో కూడుకొన్నవాడూ అయిన శుచియను పేరు గలవాడు ఆ భౌత్యుని మన్వంతరమందు దేవతలకు ఇంద్రుడు కాగలడు.

ఆగ్నీధ్రశ్చాగ్నిబాహుశ్చ శుచిర్ముక్తోఽథ మాధవః ।
శుక్రోఽజితశ్చ సప్తైతే తదా సప్తర్షయః స్మృతాః ॥31॥

ఆగ్నీధ్రుడు, అగ్నిబాహువు, శుచి, ముక్తుడు, మాధవుడు, శుక్రుడు, అజితుడు అనువారలు సప్తర్షులుగా ఉండెదరు.

గురుర్గభీరో బ్రధ్నశ్చ భరతోఽనుగ్రహస్తథా ।
శ్రీమానీ చ ప్రతీరశ్చ విష్ణుః సంక్రందనస్తథా ॥32॥

తేజస్వీ సుబలశ్చైవ భౌత్యస్యైతే మనోః సుతాః ।
చతుర్దశం మయైతత్తే మన్వన్తరముదాహృతమ్ ॥33॥

గురువు, గభీరుడు, బ్రధ్నుడు, భరతుడు, అనుగ్రహుడు, శ్రీమాని, ప్రతీరుడు, విష్ణువు, సంక్రందనుడు, తేజస్వి, సుబలుడు అనువారలు భౌత్యమనువుకు పుత్రులుగా జన్మించెదరు. ఈ పదునాల్గవ మన్వంతరమును గూర్చి నీకు వర్ణించి చెప్పితిని.

శ్రుత్వా మన్వన్తరాణీత్థం క్రమేణ మునిసత్తమ ।
పుణ్యమాప్నోతి మనుజస్తథాఽక్షీణాం చ సన్తతిమ్ ॥34॥

ఓ మునిశ్రేష్ఠుడా ! ఈ విధముగా క్రమముగా మన్వంతరములనుగూర్చి విన్న మానవుడు పుణ్యమును మరియు క్షీణము కానట్టి సంతానమును పొందెదరు.

శ్రుత్వా మన్వన్తరం పూర్వం ధర్మమాప్నోతి మానవః ।
స్వారోచిషస్య శ్రవణాత్సర్వకామానవాప్నుతే ॥35॥

మానవుడు మొదటి స్వాయంభువమన్వంతరమును శ్రవణము చేసినచో ధర్మమును పొందును. రెండవదియగు స్వారోచిషమన్వంతరమును విన్నచో అట్టి మానవుడు సమస్తములైన కోరికలను పొందును.

ఔత్తమే ధనమాప్నోతి జ్ఞానమాప్నోతి తామసే ।
రైవతే చ శ్రుతే బుద్ధిం సురూపాం విన్దతే స్త్రియమ్ ॥36॥

మూడవదియగు ఔత్తమమన్వంతరమును విన్నచో ధనమును పొందును. నాల్గవదియగు తామస మన్వంతరమును విన్నచో జ్ఞానమును పొందును. అయిదవదియగు రైవతమన్వంతరమును విన్నచో బుద్ధిని మరియు రూపవతియగు స్త్రీని పొందును.

ఆరోగ్యం చాక్షుషే పుంసాం శ్రుతే వైవస్వతే బలమ్ ।
గుణవత్పుత్రపౌత్రాంస్తు సూర్యసావర్ణికే శ్రుతే ॥37॥

మాహాత్మ్యం బ్రహ్మసావర్ణే ధర్మసావర్ణికే శుభామ్ ।
మతిమాప్నోతి మనుజో రుద్రసావర్ణికే జయమ్ ॥38॥

ఆరవదియగు చాక్షుషమన్వంతరమును విన్న పురుషులకు ఆరోగ్యము సిద్ధించును. ఏడవదియగు వైవస్వతమన్వంతరమును విన్నచో అట్టి పురుషుడు బలమును పొందును. ఎనిమిదవదియగు సూర్యసావర్ణికమన్వంతరమును విన్నచో గుణవంతులగు పుత్రపౌత్రులను పొందును. తొమ్మిదవదియగు బ్రహ్మసావర్ణమన్వంతరమును విన్నచో మహత్త్వమును పొందును. పదియవదియగు ధర్మసావర్ణికమన్వంతరమును విన్నచో మంగళప్రదమైన జ్ఞానమును పొందును. పదకొండవదియగు రుద్రసావర్ణికమన్వంతరమును విన్నచో జయమును పొందును.

జ్ఞాతిశ్రేష్ఠో గుణైర్యుక్తో దక్షసావర్ణికే శ్రుతే ।
నిశాతయత్యరిబలం రౌచ్యం శ్రుత్వా నరోత్తమ ॥39॥

ఓ నరోత్తమా ! పన్నెండవదియగు దక్షసావర్ణికమన్వంతరమును విన్న పురుషుడు జ్ఞాతులందరిలో శ్రేష్ఠుడు మరియు సద్గుణములతో కూడుకొన్నవాడు అగును. పదమూడవదియగు రౌచ్యమన్వంతరమును విన్న పురుషుడు తన శత్రువులందరినీ నాశనము చేయగలడు.

దేవప్రసాదమాప్నోతి భౌత్యే మన్వన్తరే శ్రుతే ।
తథాగ్నిహోత్రం పుత్రాంశ్చ గుణయుక్తానవాప్నుతే ॥40॥

పదునాల్గవదియగు భౌత్యమన్వంతరమును విన్న పురుషుడు దేవతల అనుగ్రహమును పొందును. ఇంకను అగ్నిహోత్రమును, గుణవంతులైన పుత్రులను కూడా పొందును.

సర్వాణ్యనుక్రమాద్యశ్చ శృణోతి మునిసత్తమ ।
మన్వంతరాణి తస్యాపి శ్రూయతాం ఫలముత్తమమ్ ॥41॥

ఓ మునిశ్రేష్ఠుడా ! ఈ పదునాలుగు మన్వంతరములను క్రమానుసారముగా కూడా ఏ పురుషుడైతే వినునో అట్టి పురుషునికి కలుగు ఉత్తమఫలమును గూర్చి కూడా చెప్పెదను, వినుము.

తత్ర దేవానృషీనింద్రాన్ మనూంస్తనయాన్నృపాన్ ।
శ్రుత్వా వంశాంశ్చ సర్వేభ్యః పాపేభ్యో విప్ర ముచ్యతే ॥42॥

ఓ బ్రాహ్మణుడా ! ఆయా మన్వంతరములందలి దేవతలను, ఋషులను, ఇంద్రులను, మనువులను, ఆయా మనువుల కుమారులను, రాజులను, వారి వంశములను గూర్చి విన్న మానవుడు సమస్తపాపములనుండి విముక్తుడగును.

దేవర్షీన్ద్రనృపాశ్చాన్యే యే తన్మన్వన్తరాధిపాః ।
తే ప్రీయన్తే తథా ప్రీతాః ప్రయచ్ఛన్తి శుభాం మతిమ్ ॥43॥

ఇంకను దేవతలు, ఋషులు, ఇంద్రులు, రాజులు ఎవరయితే వేరే మన్వంతరములకు అధిపులుగా ఉన్నారో వారు కూడా మన్వంతరవృత్తాంతములను విన్న మానవుని చూచి సంతోషించెదరు. అట్లు సంతోషించినవారై వారు మంగళప్రదమైన జ్ఞానమును ప్రసాదించెదరు.

తతః శుభాం మతిం ప్రాప్య కృత్వా కర్మ తథా శుభమ్ ।
శుభాం గతిమవాప్నోతి యావదింద్రాశ్చతుర్దశ ॥44॥

ఆ విధముగా మంగళప్రదమైన జ్ఞానమును పొంది, శుభప్రదమైన శాస్త్రవిహితకర్మలను ఆచరించిన మానవుడు పదునాలుగురు ఇంద్రులు ఉన్నంతకాలము శుభకరమైన సద్గతులను పొందును.

సర్వే స్యుర్ఋతవః క్షేమ్యాః సర్వే సౌమ్యాస్తథా గ్రహాః ।
భవన్త్యసంశయం శ్రుత్వా క్రమాన్మన్వన్తరస్థితిమ్ ॥45॥

ఋతువులన్నియు క్షేమమును ప్రసాదించుగాక! గ్రహములన్నియు సౌమ్యములుగా ఉండుగాక ! అవియన్నియు క్రమముగా ఆయా మన్వంతరవృత్తాంతములను విన్న మానవునిపట్ల నిస్సంశయముగ క్షేమప్రదములు, సౌమ్యములు అగును.

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే చతుర్దశమన్వన్తరవర్ణనసమాప్తిర్నామ సప్తనవతితమోஉధ్యాయః ॥97॥

శ్రీ మార్కండేయ మహాపురాణమందలి పదునాలుగుమన్వంతరముల వర్ణనసమాప్తియనెడు తొంబదిఏడవ అధ్యాయం సమాప్తం.



అష్టనవతితమోऽధ్యాయః - తొంబదిఎనిమిదవ అధ్యాయం
వంశానుకీర్తనమ్ - వంశానుకీర్తనం

క్రౌష్టుకిరువాచ - క్రౌష్టుకి చెప్పాడు.

భగవన్ కథితా సమ్యక్త్వయా మన్వన్తరస్థితిః ।
క్రమాద్విస్తరతస్తత్తో మయా చైవావధారితా ॥1॥

ఓ పూజ్యుడా ! పదునాలుగు మన్వంతరముల స్థితి ఎట్టిదో నీవు క్రమముగా విస్తారముగా బాగుగా చెప్పితివి. నేను కూడా ఏకాగ్రతతో వింటిని.

బ్రహ్మాద్యమఖిలం వంశం భూభుజాం ద్విజసత్తమ ।
శ్రోతుం మమేచ్ఛతః సమ్యగ్భగవన్ ప్రబ్రవీహి మే ॥2॥

ఓ బ్రాహ్మణశ్రేష్ఠుడా ! బ్రహ్మ మొ॥కొని రాజుల సమస్త వంశములను గురించి నీ నుండి వినవలెనని కోరుకొనుచున్నాను. ఓ పూజ్యుడా ! బాగుగా నాకు చెప్పుము.

మార్కండేయ ఉవాచ :- మార్కండేయుడు చెప్పాడు.

శృణు వత్స నృపాణాం త్వమశేషాణాం సముద్భవమ్ ।
చరితం చ జగన్మూలమాదౌ కృత్వా ప్రజాపతిమ్ ॥3॥

ఓ వత్సా ! ఈ జగత్తుకు మూలభూతమైన ప్రజాపతిబ్రహ్మనుండి ఆరంభించి సమస్తరాజులయొక్క జన్మ వృత్తాంతములను, వారి చరిత్రలను చెప్పెదను, వినుము.

అయం హి వంశో భూపాలైరనేకక్రతుకర్తృభిః ।
సంగ్రామజిద్భిర్ధర్మజ్ఞైః శతసంఖ్యైరలంకృతః ॥4॥

ఈ వంశము అనేకయజ్ఞములను చేసినవారు, యుద్ధములను జయించినవారు, ధర్మమునెరిగినవారూ అగు వందలకొలదీ ఉన్న రాజులతో అలంకరింపబడియున్నది.

శ్రుత్వా చైషాం నరేన్ద్రాణాం చరితాని మహాత్మనామ్ ।
ఉత్పత్తయశ్చ పురుషః సర్వపాపైః ప్రముచ్యతే ॥5॥

మహాత్ములగు ఈ రాజుల చరిత్రమును, వారి జన్మవృత్తాంతములను విన్న మానవుడు సమస్తపాపముల నుండి విముక్తుడగును.

మనుర్యత్ర తథేక్ష్వాకురనరణ్యో భగీరథః ।
అన్యే చ శతశో భూపాః సమ్యక్పాలితభూమయః ॥6॥

ధర్మజ్ఞా యజ్వినః శూరాః పరమార్థార్థవేదినః ।
శ్రుతే తస్మిన్ పుమాన్వంశే పాపౌఘాద్విముచ్యతే ॥7॥

మనువు, ఇక్ష్వాకువు, అనరణ్యుడు, భగీరథుడు, ఇంకను భూమండలమును బాగుగా పరిపాలించిన ఇతరరాజులు వీరందరు ధర్మమునెరిగినవారు, యాగములను ఆచరించినవారు, పరాక్రమవంతులు, పరమార్థమును బాగుగా ఎరిగినవారు, వారి వంశవృత్తాంతమును విన్న పురుషుడు పాపసమూహము నుండి విముక్తుడగును.

తదయం శ్రూయతాం వంశో యతో వంశాః సహస్రశః ।
భిద్యన్తే మనుజేన్ద్రాణామవరోహా యథా వటాత్ ॥8॥

వటవృక్షమునుండి ఊడలు ఉత్పన్నమై అవి మరల స్వతంత్రవృక్షములుగా పరిణమించినట్లుగా, ఇప్పుడు చెప్పబోయే రాజులవంశములనుండి వేలకొలదీ వంశములు ఉత్పన్నమై అవి మరల వేరువేరుగా భాసించుచున్నవి. అట్టి మూలభూతులైన రాజుల వంశవృత్తాంతమును చెప్పెదను, వినుము.

బ్రహ్మా ప్రజాపతిః పూర్వం సిసృక్షుర్వివిధాః ప్రజాః ।
అంగుష్ఠాద్దక్షిణాద్దక్షమసృజద్ద్విజసత్తమ ॥9॥

ఓ బ్రాహ్మణశ్రేష్ఠుడా ! ప్రజాపతిబ్రహ్మ సృష్టికి పూర్వమందు వివిధములైన ప్రాణులను సృష్టించవలెనని కోరికతో తన కుడిచేయి బొటనవ్రేలునుండి దక్షుని సృష్టించెను.

వామాఙ్గుష్ఠాచ్చ తత్పత్నీం జగత్సూతికరో విభుః ।
ససర్జ భగవాన్బ్రహ్మా జగతాం కారణం పరమ్ ॥10॥

జగత్తును సృష్టించువాడు, సర్వవ్యాపకుడు, భగవత్స్వరూపుడు, జగత్తులకు కారణభూతుడూ అయిన ఆ బ్రహ్మదేవుడు తన ఎడమచేయి బొటనవ్రేలునుండి దక్షుని భార్యను సృష్టించెను.

అదితిస్తస్య దక్షస్య కన్యాఽజాయత శోభనా ।
తస్యాం చ కశ్యపో దేవం మార్తణ్డం సమజీజనత్ ॥11॥

ఆ దక్షప్రజాపతికి అదితియను పేరుగల శోభనురాలైన కుమార్తె జన్మించెను. ఆమె గర్భమునుండి కశ్యపునివలన ఆదిత్యుడు జన్మించెను.

బ్రహ్మస్వరూపం జగతామశేషాణాం వరప్రదమ్ ।
ఆదిమధ్యాన్తభూతం చ సర్గస్థిత్యన్తకర్మసు ॥12॥

ఆ ఆదిత్యుడు బ్రహ్మస్వరూపుడు, సమస్తజగత్తులకు వరములనిచ్చువాడు, సృష్టిస్థితిప్రళయములందు ఆదిమధ్యాన్తస్వరూపుడు.

యతోఽఖిలమిదం యస్మిన్నశేషం చ స్థితం ద్విజ ।
యత్స్వరూపం జగచ్చేదం సదేవాసురమానుషమ్ ॥13॥

ఓ బ్రాహ్మణుడా ! ఎవనివల్లనైతే ఈ సమస్తప్రపంచము ఉత్పన్నమగుచున్నదో, ఎవనియందైతే ఈ అశేష సమస్తప్రపంచము నిలిచియున్నదో, దేవతలు రాక్షసులు మనుష్యులతో కూడుకొన్న ఈ ప్రపంచమంతా ఎవని స్వరూపమో అతడే ఆదిత్యుడు.

యః సర్వభూతః సర్వాత్మా పరమాత్మా సనాతనః ।
అదిత్యామభవద్భాస్వాన్ పూర్వమారాధితస్తయా ॥14॥

ఎవరైతే సమస్త స్థావరజంగమాత్మక ప్రపంచస్వరూపమో, ఎవరైతే అందరికీ ఆత్మస్వరూపుడో, శాశ్వతుడైన పరమాత్మస్వరూపుడో అట్టి సూర్యభగవానుడు పూర్వము అదితిచే ఆరాధించబడి ఆమె గర్భమునుండి జన్మించెను.

క్రౌష్టుకిరువాచ – క్రౌష్టుకి చెప్పాడు.

భగవన్ శ్రోతుమిచ్ఛామి యత్స్వరూపం వివస్వతః ।
యత్కారణం చాదిదేవః సోఽభవత్కశ్యపాత్మజః ॥15॥

ఓ పూజ్యుడా! సూర్యభగవానుని స్వరూపమును గురించి మరియు ఎందువల్లనైతే కశ్యపుని కుమారునిగా పుట్టి ఆదిదేవుడైనాడో ఆ విషయమును గురించి నేను మీ నుండి వినవలెనని కోరుచున్నాను.

యథా చారాధితో దేవ్యా సోఽదిత్యా కశ్యపేన చ ।
ఆరాధితేన చోక్తం యత్తేన దేవేన భాస్వతా ॥16॥

ప్రభావం చావతీర్ణస్య యథావన్మునిసత్తమ ।
భవతా కథితం సమ్యక్ శ్రోతుమిచ్ఛామ్యశేషతః ॥17॥

ఓ మునిశ్రేష్ఠుడా ! అదితికశ్యపుల చేత ఆ సూర్యభగవానుడు ఏ విధంగా ఆరాధింపబడెనో, ఆరాధింపబడిన ఆ భాస్కరుడు ఏమి పలికెనో, అవతరించిన ఆ సూర్యదేవుని మహిమ ఎట్టిదో వీటన్నింటినీ సంపూర్ణముగా నీవు చెప్పగా వినవలెనని కోరుచున్నాను.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

విసృష్టా పరమా విద్యా జ్యోతిర్భా శాశ్వతీ స్ఫుటా ।
కైవల్యం జ్ఞానమావిర్భాః ప్రాకామ్యం సంవిదేవ చ ॥18॥

బోధశ్చావగతిశ్చైవ స్మృతిర్విజ్ఞానమేవ చ ।
ఇత్యేతానీహ రూపాణి తస్యారూపస్య భాస్వతః ॥19॥

శ్రూయతాం చ మహాభాగ విస్తరాద్వదతో మమ ।
యత్ పృష్టవానసి రవేరావిర్భావో యథాఽభవత్ ॥20॥

విస్పష్టా, పరమా, విద్యా, జ్యోతిర్భా, శాశ్వతీ, స్ఫుటా, కైవల్యమ్, జ్ఞానమ్, ఆవిర్భాః, ప్రాకామ్యమ్, సంవిత్, బోధ, అవగతి, స్మృతి, విజ్ఞానమ్ అనునవి రూపములేని సూర్యదేవుని రూపములు. ఆ సూర్యదేవుడు ఎట్లు ఆవిర్భవించెనో చెప్పమని నీవు అడిగితివి. అందువలన విస్తారముగా ఆ వృత్తాంతమును చెప్పెదను, వినుము.

నిష్ప్రభేఽస్మిన్నిరాలోకే సర్వతస్తమసాఽఽవృతే ।
బృహదణ్డమభూదేకమక్షరం కారణం పరమ్ ॥21॥

సృష్టికి పూర్వము ఈ ప్రపంచమంతా కాంతి మరియు ప్రకాశములు లేక అంధకారముచే ఆవరింపబడగా, సృష్టికి కారణభూతమైన ఉత్కృష్టమైన పెద్దదియగు గ్రుడ్డు ఒకటి జన్మించెను.

తద్బిభేద తదన్తఃస్థో భగవాన్ప్రపితామహః ।
పద్మయోనిః స్వయం బ్రహ్మా యః స్రష్టా జగతాం ప్రభుః ॥22॥

ఆ అండమందు లోపల ఉన్నవాడు, పూజ్యుడు, అందరికీ పితామహుడు, పద్మయోని, జగత్తులన్నింటినీ సృష్టించువాడు, ప్రభువూ అయిన బ్రహ్మదేవుడు స్వయముగా ఆ అండమును ఛేదించుకొని బయటకు వచ్చెను.

తన్ముఖాదోమితి మహానభూచ్ఛబ్దో మహామునే ।
తతో భూస్తు భువస్తస్మాత్తతశ్చ స్వరనన్తరమ్ ॥23॥

ఓ మహామునీ! ఆ బ్రహ్మముఖమునుండి మొట్టమొదటిగా "ఓమ్" అను శబ్దము ఉద్భవించెను. ఆ ఓంకారమునుండి భూః అని, తర్వాత భువః అని, అటుపిమ్మట స్వః అని మూడు శబ్దములు ఉత్పన్నమైనవి. (ఈ మూడింటికే వ్యాహృతులని పేరు.)

ఏతా వ్యాహృతయస్తిస్రః స్వరూపం రవేః పరమ్ ।
ఓమిత్యేతస్మాత్స్వరూపాత్తు సూక్ష్మరూపం రవేః పరమ్ ॥24॥

ఈ మూడు వ్యాహృతులు ఆ సూర్యభగవానుని స్వరూపము. "ఓమ్" అను స్వరూపమునుంచే ఆ సూర్యదేవుని సూక్ష్మరూపము ఉద్భవించినది.

తతో మహరితి స్థూలం జనం స్థూలాన్తరం తతః ।
తతస్తపస్తతః సత్యమితి మూర్తాని సప్తధా ॥25॥

అటు పిమ్మట మహః అను స్థూలరూపము, తర్వాత మరియొక స్థూలము జనమ్ అని, అటుపిమ్మట "తపః" అను స్థూలరూపము, అటుపిమ్మట సత్యమ్ అను స్థూలరూపము ఉద్భవించినవి. ఈ ఏడు (భూః, భువః, సువః అనువాటిని కలుపుకొని) మూర్తరూపములు ఉద్భవించినవి. (ఈ ఏడింటికీ భూరాది లోకములని వ్యవహారము కూడా కలదు) మూర్తమనగా ఆకారము కలిగియుండుట అని అర్థము.

స్థితాని తస్య రూపాణి భవన్తి న భవన్తి చ ।
స్వభావభావయోర్భావం యతో గచ్ఛతి సంశయమ్ ॥26॥

ఆ సూర్యభగవానుని చెప్పబడిన ఆ ఏడు రూపములు ఒకప్పుడు ప్రకాశించును, ఒకప్పుడు లేకుండా కూడా ఉండవచ్చును. ఎందువలననగా సూర్యుడు వస్తుతః రూపరహితుడని చెప్పబడినది. అందువలన స్వభావము, భావము (రూపములు) వీటి విషయము సందిగ్ధము.

ఆద్యన్తం యత్పరం సూక్ష్మమరూపం పరమం స్థితమ్ ।
ఓమిత్యుక్తం మయా విప్ర తత్పరబ్రహ్మ తద్వపుః ॥27॥

ఓ బ్రాహ్మణుడా ! ఆ సూర్యభగవానుని ఉత్కృష్టమైన ఏ సూక్ష్మరూపము గలదో అది ఆద్యంతములు గలది. యథార్థముగా సూర్యభగవానునికి రూపము లేదు. నేను చెప్పిన ఆ ఓంకారమే పరబ్రహ్మము, అదియే ఆ సూర్యభగవానుని శరీరము అనగా ఆకారము.

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే వంశానుకీర్తనం నామ అష్టనవతితమోఽధ్యాయః ॥98॥

ఇది శ్రీ మార్కండేయ మహాపురాణమందలి వంశానుకీర్తనమను తొంబదిఎనిమిదవ అధ్యాయము సమాప్తము.



నవనవతితమోఽధ్యాయః - తొంబదితొమ్మిదవ అధ్యాయం
మార్తండమాహాత్మ్యమ్ - సూర్యభగవానుని మాహాత్మ్యం

మార్కండేయ ఉవాచ - మార్కండేయుడు చెప్పాడు.

తస్మాదణ్డాద్విభిన్నాత్తు బ్రహ్మణోఽవ్యక్తజన్మనః ।
ఋచో బభూవుః ప్రథమం ప్రథమాద్వదనాన్మునే ॥1॥

జపాపుష్పనిభాః సద్యస్తేజోరూపా హ్యసంహతాః ।
పృథక్ పృథగ్విభిన్నాశ్చ రజోరూపవహాస్తతః ॥2॥

ఓ మునీ ! పగిలిన ఆ అండమునుండి అవ్యక్తజన్ముడైన బ్రహ్మయొక్క మొదటి ముఖమునుండి మొదటిగా జపాపుష్పముల కాంతివంటి కాంతి కలవి, ప్రకాశరూపములు, అసంహతములు అనగా పరస్పరసంయోగము లైనట్టివి, ఒకదానికంటే మరొకటి భిన్నమైనట్టివి, రజోగుణము కల్గినట్టివీ అయిన ఋక్కులు (ఋగ్వేదమంత్రములు) ప్రాదుర్భవించినవి.

యజూంషి దక్షిణాద్వక్త్రాదనిరుద్ధాని కానిచిత్ ।
యాదృగ్వర్ణం తథా వర్ణాన్యసంహతిధరాణి చ ॥3॥

ఆ బ్రహ్మయొక్క దక్షిణముఖమునుండి అసంహతములైన వర్ణములతో కూడినవీ, అనిరుద్ధములూ అయిన కొన్ని యజుర్వేదమంత్రములు ప్రాదుర్భవించినవి.

పశ్చిమం యద్విభోర్వక్త్రం బ్రహ్మణః పరమేష్ఠినః ।
ఆవిర్భూతాని సామాని తతశ్ఛందాంసి తాన్యథ ॥4॥

సర్వవ్యాపకుడైన ఆ చతుర్ముఖ బ్రహ్మదేవుని పశ్చిమ ముఖమునుండి సామవేదఛందోమంత్రములు ఆవిర్భవించినవి.

అథర్వణామశేషం చ భృఙ్గాఞ్జనచయప్రభమ్ ।
యావద్ఘోరస్వరూపం తదాభిచారికశాన్తికమ్ ॥5॥

ఉత్తరాత్ప్రకటీభూతం వదనాత్తస్య వేధసః ।
సుఖసత్త్వతమఃప్రాయం సౌమ్యాసౌమ్యస్వరూపవత్ ॥6॥

ఆ బ్రహ్మదేవుని ఉత్తరముఖమునుండి తుమ్మెదల కాటుకల కాంతివంటి కాంతిగలదీ, ఘోరస్వరూపమైనదీ, ఆభిచారిక కర్మలకు సంబంధించి శాంతిమంత్రాలతో కూడుకొన్నదీ, సుఖసత్త్వతమస్సులతో కూడుకొన్నదీ, మృదుకఠినస్వరూపమైనదీ అయిన అశేషములైన అథర్వణవేదమంత్రముల సమూహము ప్రాదుర్భవించినది.

ఋచో రజోగుణాః సత్త్వం యజుషాం చ గుణా మునే ।
తమోగుణాని సామాని తమఃసత్త్వమథర్వసు ॥7॥

ఓ మునీ ! ఋక్కులు అనగా ఋగ్వేదమంత్రాలు రజోగుణము కలవి. యజుర్వేదమంత్రాలు సత్త్వగుణము కలవి. సామవేదమంత్రాలు తమోగుణము కలవి. అధర్వణవేదమంత్రాలు తమస్సు సత్త్వములతో కూడుకొన్నవి.

ఏతాని జ్వలమానాని తేజసాఽప్రతిమేన వై ।
పృథక్ పృథగవస్థానభాజ్జి పూర్వమివాభవన్ ॥8॥

ఈ వేదమంత్రములన్నియు అనుపమానమైన తేజస్సుతో జ్వలించుచు పూర్వమువలే వేరువేరు అవస్థానములతో కూడియున్నవి. (ఎల్లప్పుడు క్రొత్తగానే భాసించుచున్నవని ఆశయము.)

తతస్తదాద్యం యత్తేజ ఓమిత్యుక్త్వాభిశబ్ద్యతే ।
తస్య స్వభావాద్యత్తేజస్తత్సమావృత్య సంస్థితమ్ ॥9॥

ఓమ్ అని పలుకుటవలన ఏ తేజస్సయితే వ్యక్తమగుచున్నదో అదియే మొదటి సహజమైన తేజస్సు. ఆ తేజస్సు యొక్క స్వభావమువలన ఉద్భవించిన తేజస్సు ఆ మొదటి తేజస్సును ఆవరించియున్నది.

యథా యజుర్మయం తేజస్తద్వత్సామ్నాం మహామునే ।
ఏకత్వముపయాతాని పరే తేజసి సంశ్రయే ॥10॥

ఓ మహామునీ ! యజుస్సుల తేజస్సు అట్లే సామల తేజస్సు ఆ ఓంకారరూపమైన పరమతేజస్సును ఆశ్రయించి ఏకత్వమును పొందెను.

శాన్తికం పౌష్టికం చైవ తథా చైవాభిచారికమ్ ।
ఋగాదిషు లయం బ్రహ్మంస్త్రితయం త్రిష్వథాగమత్ ॥11॥

ఓ బ్రహ్మస్వరూపుడా ! శాన్తిని కల్గించు కర్మలు, పుష్టిని కల్గించు కర్మలు మరియు ఆభిచారిక కర్మలు ఈ మూడు ఋక్ యజుస్ సామలయందు లయమును పొందినవి.

తతో విశ్వమిదం సద్యస్తమోనాశాత్సునిర్మలమ్ ।
విభావనీయం విప్రర్షే తిర్యగూర్ధ్వమధస్తథా ॥12॥

ఓ విప్రర్షీ ! అంతట శీఘ్రముగా అంధకారము నశించుటచే స్వచ్ఛమైన ప్రపంచము అడ్డముగాను పైకి క్రిందికి వ్యాప్తమైనది.

తతస్తన్మణ్డలీభూతం ఛాన్దసం తేజ ఉత్తమమ్ ।
పరేణ తేజసా బ్రహ్మన్నేకత్వముపగమ్య తత్ ॥13॥

ఆదిత్యసంజ్ఞామగమదాదావేవ యతోఽభవత్ ।
విశ్వస్యాస్య మహాభాగ కారణం చావ్యయాత్మకమ్ ॥14॥

ఓ బ్రహ్మస్వరూపుడా! అటుపిమ్మట ఛాందసమైన ఆ ఉత్తమతేజస్సు మండలాకారముగా ఏర్పడి, పరమతేజోరూపమైన ఓంకారముతో ఐక్యమును పొంది సృష్ట్యాదిలో ఆదిత్యసంజ్ఞను పొందెను. ఓ మహాభాగా ! అట్లు పొందుటవల్లనే అవినాశి అయిన ఆ తేజస్సు ప్రపంచమునకు కారణభూతమయ్యెను.

ప్రాతర్మధ్యన్దినే చైవ తథా చైవాపరాహ్ణికే ।
త్రయీ తపతి సా కాలే ఋగ్యజుస్సామసంజ్ఞితా ॥15॥

ఋగ్యజుఃసామలతో సంజ్ఞితమైన (పేరును పొందిన) ఆ వేదత్రయి ప్రాతఃకాల, మధ్యాహ్నకాల, అపరాహ్ణకాలములందు తాపమును కలుగజేయుచున్నది.

ఋచస్తపన్తి పూర్వాహ్ణే మధ్యాహ్నే చ యజూంషి వై ।
సామాని చాపరాహ్ణే వై తపన్తి మునిసత్తమ ॥16॥

ఓ మునిశ్రేష్ఠుడా! పూర్వాహ్ణకాలమందు ఋక్కులు, మధ్యాహ్నకాలమందు యజుస్సులు, అపరాహ్ణకాలమందు సామలు తాపమును కలుగజేయుచున్నవి.

శాన్తికమృక్షు పూర్వాహ్ణే యజుఃష్వేవ చ పౌష్టికమ్ ।
విన్యస్తం సామ్ని సాయాహ్నే హ్యాభిచారికమన్తతః ॥17॥

పూర్వహ్ణకాలమందు ఋక్కులతో శాంతికర్మలు, మధ్యాహ్నకాలమందు యజుస్సులతో పౌష్టికర్మలు, అపరాహ్ణకాలమందు (సాయాహ్నము) సామలతో ఆభిచారికకర్మలు చేయవలెనని నిశ్చయింపబడినది.

మధ్యన్దినే పరాహ్ణే చ సమే చైవాభిచారికమ్ ।
అపరాహ్ణే పితౄణాం తు సామ్నా కార్యాణి తాని వై ॥18॥

మధ్యాహ్నకాలమందు, అపరాహ్ణకాలమందు సమానముగానే ఆభిచారికకర్మలను నిర్వహించవలెను. కాని పితృకార్యములు మాత్రము అపరాహ్ణకాలమందే సామలతో నిర్వహించవలెను.

విసృష్టౌ ఋఙ్మయో బ్రహ్మా స్థితౌ విష్ణుర్యజుర్మయః ।
రుద్రః సామమయోऽన్తే చ తస్మాత్తస్యాశుచిర్ధ్వనిః ॥19॥

ప్రపంచముయొక్క సృష్టిని చేయు సమయమందు బ్రహ్మ ఋక్కులతో కూడినవానిగాను, ప్రపంచస్థితియందు విష్ణువు యజుస్సులతో కూడినవానిగాను, ప్రపంచసంహారకాలమందు రుద్రుడు సామలతో కూడినవానిగాను ఉండును. అందువలన పితృకార్యములకు సంబంధించిన సామలయొక్క ధ్వని అశుద్ధమై ఉండును.

తదేవం భగవాన్భాస్వాన్వేదాత్మా వేదసంస్థితః ।
వేదవిద్యాత్మకశ్చైవ పరః పురుష ఉచ్యతే ॥20॥

అందువలన భగవత్స్వరూపుడు, తేజోమయుడు, వేదస్వరూపుడు, వేదములందు నిలుచువాడు, వేదవిద్యాస్వరూపుడూ అయిన ఆదిత్యుడు పరపురుషుడిగా చెప్పబడుచున్నాడు.

సర్గస్థిత్యన్తహేతుశ్చ రజఃసత్త్వాదికాన్గుణాన్ ।
ఆశ్రిత్య బ్రహ్మవిష్ణ్వాదిసంజ్ఞామభ్యేతి శాశ్వతః ॥21॥

సృష్టిస్థితిప్రళయకారకుడు, శాశ్వతుడూ అయిన ఆదిత్యుడు సత్త్వరజస్తమోగుణములను ఆశ్రయించి బ్రహ్మవిష్ణు మహేశ్వరుల పేర్లను పొందుచున్నాడు.

దేవైః సదేద్యః స తు వేదమూర్తిరమూర్తిరాద్యోఽఖిలమర్త్యమూర్తిః ।
విశ్వాశ్రయం జ్యోతిరవేద్యధర్మా వేదాన్తగమ్యః పరమః పరేశః ॥22॥

వేదమూర్తి అయిన ఆ ఆదిత్యుడు దేవతలచే ఎల్లప్పుడు పూజింపబడువాడు. మూర్తి అనగా ఆకారములేని ఆ ఆదిత్యుడు సృష్ట్యాదిలో సకల ప్రాణిస్వరూపుడైనాడు. విశ్వమునకంతటికినీ ఆశ్రయభూతుడైన ఆ ఆదిత్యుడు జ్ఞానములందు విషయమైన వాడు కాడు. (జ్ఞానస్వరూపుడే అని ఆశయము.) పరమశ్రేష్ఠుడైన ఆ పరమేశ్వరుడు వేదాంతములచేత తెలియబడువాడు.

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే మార్తండమాహాత్మ్యే నవనవతితమోఽధ్యాయః ॥99॥

శ్రీ మార్కండేయ మహాపురాణమందలి మార్తండమాహాత్మ్యమను తొంబదితొమ్మిదవ అధ్యాయం సమాప్తం.



శతతమోఽధ్యాయః – నూరవ అధ్యాయం
ఆదిత్యస్తవః – ఆదిత్యస్తుతి

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

తస్య సన్తాప్యమానే తు తేజసోర్ధ్వమధస్యథ ।
సిసృక్షుశ్చిన్తయామాస పద్మయోనిః పితామహః ॥1॥

ఆ ఆదిత్యుని తేజస్సుచేత బ్రహ్మాండమంతా పైభాగము క్రిందిభాగము తాపమును పొందుటచే పద్మసంభవుడు, పితామహుడూ అగు బ్రహ్మదేవుడు సృష్టిని చేయదలచి ఇట్లు చింతించెను.

సృష్టిః కృతాపి మే నాశం ప్రయాస్యత్యభితేజసా ।
భాస్వతః సృష్టిసంహారస్థితిహేతోర్మహాత్మనః ॥2॥

నేను ప్రపంచమును సృష్టించినప్పటికీ, సృష్టిస్థితిప్రళయకారకుడూ మహాత్ముడూనగు తేజోమయుడైన సూర్యుని తేజస్సుచే సమస్తము నష్టమే అగును.

అప్రాణాః ప్రాణినః సర్వ ఆపః శుష్యన్తి తేజసా ।
న చామ్భసా వినా సృష్టిర్విశ్వస్యాస్య భవిష్యతి ॥3॥

ఆ ఆదిత్యుని తేజస్సుచే ప్రాణులందరూ ప్రాణహీనులగుదురు. జలములన్నీ ఇంకిపోవును. జలములు లేకుండా ఈ విశ్వముయొక్క సృష్టి సంభవించదు.

ఇతి సంచిన్త్య భగవాన్ స్తోత్రం భగవతో రవేః ।
చకార తన్మయే భూత్వా బ్రహ్మా లోకపితామహః ॥4॥

లోకపితామహుడైన బ్రహ్మదేవుడు ఈ విధముగా ఆలోచించి ఏకగ్రతాభావముతో సూర్యభగవానుని స్తుతించెను.

బ్రహ్మోవాచ – బ్రహ్మ పలికాడు.

నమస్యే యన్మయం సర్వమేతత్సర్వమయశ్చ యః ।
విశ్వమూర్తిః పరం జ్యోతిర్యత్తద్ధ్యాయన్తి యోగినః ॥5॥

ఎవరినయితే ఈ సమస్తప్రపంచము ఆశ్రయించియున్నదో, ఎవరయితే ఈసమస్తప్రపంచస్వరూపుడై యున్నాడో, విశ్వమూర్తి పరంజ్యోతియగు ఏ స్వరూపమునైతే యోగులు ధ్యానించుచున్నారో అట్టి ఆదిత్యదేవుని నేను నమస్కరించుచున్నాను.

య ఋఙ్మయో యో యజుషాం నిధానం సామ్నాం చ యో యోనిరచిన్త్యశక్తిః ।
త్రయీమయః స్థూలతయార్ధమాత్రా పరస్వరూపో గుణపారయోగ్యః ॥6॥

త్వాం సర్వహేతుం పరమం చ వేద్యమాద్యం పరం జ్యోతిరవేద్యరూపమ్ ।
స్థూలం చ దేవాత్మతయా నమస్తే భాస్వన్తమాద్యం పరమం పరేభ్యః ॥7॥

ఎవరయితే ఋగ్వేదస్వరూపుడో, యజుస్సులకు ఆశ్రయభూతుడో, ఊహింపనలవికాని ఎవరయితే సామవేదమునకు ప్రాదుర్భావహేతువో, వేదత్రయీ (ఋగ్యయజుస్సామలు) స్వరూపుడో, స్థూలముగా అర్ధమాత్రాస్వరూపుడో, పరబ్రహ్మస్వరూపుడో, గుణాతీతుడో, సమస్తమునకు కారణభూతుడో, పరమవేద్యుడో, ఆద్యుడో, పరస్వరూపుడో, జ్యోతిస్స్వరూపుడో, తెలియబడని రూపము గలవాడో, దేవతాస్వరూపుడైనందున స్థూలస్వరూపుడో, ప్రకాశవంతుడో, ఆద్యుడో, శ్రేష్ఠులలో శ్రేష్ఠుడో అట్టి సూర్యభగవానునికి నమస్కరించుచున్నాను.

సృష్టిం కరోమి యదహం తవ శక్తిరాద్యా తత్ప్రేరితో జలమహీపవనాగ్నిరూపామ్ ।
తద్దేవతాదివిషయాం ప్రణవాద్యశేషాం నాత్మేచ్ఛయా స్థితిలయావపి తద్వదేవ ॥8॥

ఓ దేవా ! నీ శక్తియే అన్నింటికంటే మొట్టమొదటిది. ఆ శక్తిచేత ప్రేరేపింపబడి నేను నీరు, భూమి, వాయువు, అగ్ని వీటి స్వరూపమైన సృష్టిని చేయుచున్నాను. ఇంకను దేవతాదులు విషయముగా కలిగినదీ, ప్రణవము మొ॥లగు శబ్దములతో కూడుకొన్నట్టిదీ అయిన ఆ సృష్టిని మరియు స్థితిలయములను నేను స్వతంత్రముగా చేయుట లేదు. అదంతయు నీ శక్తిప్రేరేపితమే.

వహ్నిస్త్వమేవ జలశోషణతః పృథివ్యాః సృష్టిం కరోషి జగతాం చ తథాద్య పాకమ్ ।
వ్యాపీ త్వమేవ భగవాన్గగనస్వరూపం త్వం పఞ్చధా జగదిదం పరిపాసి విశ్వమ్ ॥9॥

జలములు ఇంకిపోవుట కారణముగా నీవే వహ్నిస్వరూపుడవు. పృథివిని, సమస్త జగత్తులను సృష్టించుచున్నావు. మరియు వాటిని నశింపచేయుచున్నావు. భగవత్స్వరూపుడవైన నీవే గగనస్వరూపమైన సర్వవ్యాపకుడవు. నీవే పంచమహాభూతముల స్వరూపుడవై ఈ జగత్తునంతా రక్షించుచున్నావు.

యజ్ఞైర్యజన్తి పరమాత్మవిదో భవన్తం విష్ణుస్వరూపమఖిలేష్టిమయం వివస్వన్ ।
ధ్యాయన్తి చాపి యతయో నియతాత్మచిత్తాః సర్వేశ్వరం పరమమాత్మవిముక్తికామాః ॥10॥

ఓ సూర్యభగవానుడా! పరమాత్మజ్ఞానము కలిగినవారు విష్ణుస్వరూపుడవు, సమస్తయజ్ఞస్వరూపుడవు అగు నిన్ను యజ్ఞములతో అర్చించుచున్నారు. ఇంద్రియనిగ్రహము కలవారు, మోక్షమును కోరువారూ అగు యతులు పరమస్వరూపుడవు, సర్వేశ్వరుడవూ అగు నిన్ను ధ్యానము చేయుచున్నారు.

నమస్తే దేవరూపాయ యజ్ఞరూపాయ తే నమః ।
పరబ్రహ్మస్వరూపాయ చిన్త్యమానాయ యోగిభిః ॥11॥

దేవస్వరూపుడవు, పరబ్రహ్మస్వరూపుడవు, యోగులచే చింతింపబడుచున్నవాడవూ అగు నీకు నమస్కారము.

ఉపసంహర తేజో యత్తేజసః సంహతిస్తవ ।
సృష్టేర్విఘాతాయ విభో సృష్టౌ చాహం సముద్యతః ॥12॥

ఓ విభుస్వరూపా ! నీ ఉగ్రమైన తేజస్సును ఉపసంహరించుము. నేను సృష్టి చేయుటకై ఉద్యుక్తుడనై యున్నాను. నీ తేజస్సమూహము సృష్టివిఘాతకారిగా ఉన్నది.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

ఇత్యేవం సంస్తుతో భాస్వాన్ బ్రహ్మణా సర్గకర్తృణా ।
ఉపసంహృతవాంస్తేజః పరం స్వల్పమధారయత్ ॥13॥

ఈ విధముగా సృష్టికర్తయగు బ్రహ్మచేత స్తుతింపబడిన సూర్యభగవానుడు తన ఉగ్రతేజస్సును ఉపసంహరించెను. కేవలము కొద్దిపాటి తేజస్సును మాత్రమే ధరించెను.

చకార చ తతః సృష్టిం జగతః పద్మసంభవః ।
తథా తేషు మహాభాగః పూర్వకల్పాన్తరేషు వై ॥14॥

దేవాసురాదీన్మర్త్యాంశ్చ పశ్వాదీన్వృక్షవీరుధః ।
ససర్జ పూర్వవద్బ్రహ్మా నరకాంశ్చ మహామునే ॥15॥

ఓ మహామునీ! అటుపిమ్మట పద్మసంభవుడైన బ్రహ్మదేవుడు జగత్తుయొక్క సృష్టిని గావించెను. ఇంకనూ ఆ మహానుభావుడు పూర్వకల్పములలో ఉన్నట్లుగానే ప్రస్తుతకల్పమందు కూడా దేవతలను, రాక్షసులను, మానవులను, వృక్షములను, నరకములను సృష్టించెను.

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే ఆదిత్యస్తవో నామ శతతమోఽధ్యాయః ॥100॥

శ్రీ మార్కండేయ మహాపురాణమందలి ఆదిత్యస్తవమను నూరవ అధ్యాయం సమాప్తం.



ఏకాధికశతతమోఽధ్యాయః - నూట ఒకటవ అధ్యాయం

దివాకరస్తుతిః - దివాకరస్తుతి

మార్కండేయ ఉవాచ - మార్కండేయుడు చెప్పాడు.

సృష్ట్వా జగదిదం బ్రహ్మా ప్రవిభాగమథాకరోత్ ।
వర్ణాశ్రమసముద్రాద్రిద్వీపానాం పూర్వవద్యథా ॥1॥

బ్రహ్మదేవుడు ఈ జగత్తును సృష్టించి పూర్వకల్పములందువలే బ్రాహ్మణక్షత్రియాదివర్ణములు, బ్రహ్మచర్యగృహస్థాది ఆశ్రమములు, సముద్రములు, పర్వతములు, ద్వీపములు వీటి విభాగములను చేసెను.

దేవదైత్యోరగాదీనాం రూపస్థానాని పూర్వవత్ ।
వేదేభ్య ఏవ భగవానకరోత్కమలోద్భవః ॥2॥

భగవత్స్వరూపుడు, కమలోద్భవుడూ అగు బ్రహ్మదేవుడు వేదములలో చెప్పిన ప్రకారము పూర్వమువలే దేవతలు, రాక్షసులు, ఉరగములు (సర్పాదులు) మొదలగువానికి రూపములు ఆశ్రయములను కల్పించెను.

బ్రహ్మణస్తనయో యోఽభూన్మరీచిరితి విశ్రుతః ।
కశ్యపస్తస్య పుత్రోఽభూత్కాశ్యపో నామ నామతః ॥3॥

మరీచియను పేరుతో ప్రసిద్ధుడైన బ్రహ్మదేవుని పుత్రునకు కశ్యపుడను పుత్రుడు కలిగెను. అతడే కాశ్యపుడను పేరుతో ప్రసిద్ధిని పొందెను.

దక్షస్య తనయా బ్రహ్మంస్తస్య భార్యాస్త్రయోదశ ।
బహవస్తత్సుతాశ్చాసన్ దేవదైత్యోరగాదయః ॥4॥

ఓ బ్రహ్మస్వరూపుడా ! దక్షునియొక్క పదముగ్గురు కుమార్తెలు ఆ కశ్యపునికి భార్యలైరి. వారి ద్వారా కశ్యపునికి దేవతలు, రాక్షసులు, ఉరగములు మొదలగు అనేకమంది పుత్రులు కలిగిరి.

అదితిర్జనయామాస దేవాంస్త్రిభువనేశ్వరాన్ ।
దైత్యాన్దితిర్దనుశ్చోగ్రాన్ దానవానురువిక్రమాన్ ॥5॥

ఆ పదముగ్గురు భార్యలలో "అదితి" ముల్లోకములకు ప్రభువులైన దేవతలను ప్రసవించెను (కనెను). "దితి" దైత్యులను, మరియు దనువు అనునామె మిక్కిలి పరాక్రమవంతులైన ఉగ్రులైన దానవులను ప్రసవించెను.

గరుడారుణౌచ వినతా యక్షరక్షాంసివై ఖసా ।
కద్రూః సుషావ నాగాంశ్చ గంధర్వాన్ సుషువే మునిః ॥6॥

"వినత" గరుడుడు మరియు అరుణులను, "ఖస" యక్ష, రాక్షసులను, "కద్రువ" నాగులను, "ముని" గంధర్వులను ప్రసవించెను.

క్రోధాయా జజ్ఞిరే కుల్యా రిష్టాయాశ్చాప్సరోగణాః ।
ఐరావతాదీన్మాతఙ్గానిరా చ సుషువే ద్విజ ॥7॥

ఓ బ్రాహ్మణుడా ! "క్రోధ" కుల్యులను, "రిష్ట" అప్సరసలను, "ఇర" ఐరావతము మొదలగు ఏనుగులను ప్రసవించెను.

తామ్రా చ సుషువే శ్యేనీప్రముఖాః కన్యకా ద్విజ ।
యాసాం ప్రసూతాః ఖగమాః శ్యేనభాసశుకాదయః ॥8॥

ఓ బ్రాహ్మణుడా! "తామ్ర" శ్యేని మొ॥లగు కన్యలను ప్రసవించెను. ఆ కన్యలే శ్యేన, భాస, శుక మొదలగు ఆకాశమునందు సంచరించు వాటిని (పక్షులను) ప్రసవించిరి.

ఇలాయాః పాదపా జాతాః ప్రధాయా యాదసాం గణాః ।
అదిత్యాం యా సముత్పన్నా కశ్యపస్యేతి సంతతిః ॥9॥

తస్యాశ్చ పుత్రదౌహిత్రైః పౌత్రదౌహిత్రికాదిభిః ।
వ్యాప్తమేతజ్జగత్సూత్యా తేషాం తాసాం చ వై మునే ॥10॥

ఓ మునీ ! "ఇల" అను భార్యవలన వృక్షములు, "ప్రధ" అను భార్యవలన జలచరప్రాణులు ప్రసవించిరి. కశ్యపునికి అదితియను భార్యయందు కలిగిన సంతానము గూర్చి చెప్పబడినది. ఆమెయొక్క పుత్రదౌహిత్రులచేతను అట్లే పౌత్రదౌహిత్రికాదులచేతను ఈ జగత్తంతా వ్యాపింపబడినది. (పుత్రుల సంతానము పౌత్రులు, దౌహిత్రులు అనగా కూతుళ్ళకు పుట్టిన సంతానము, వారి సంతానము దౌహిత్రికులు).

తేషాం కశ్యపపుత్రాణాం ప్రధానా దేవతాగణాః ।
సాత్త్వికా రాజసాస్త్వేతే తామసాశ్చ మునే గణాః ॥11॥

ఓ మునీ ! కశ్యపుని పుత్రులందరిలో దేవతాగణాలు ప్రధానులు. వారు సాత్త్వికులు, రాజసులు, తామసులు అని మూడు విధాలు.

దేవాన్యజ్ఞభుజశ్చక్రే తథా త్రిభువనేశ్వరాన్ ।
బ్రహ్మా బ్రహ్మవిదాం శ్రేష్ఠః పరమేష్ఠీ ప్రజాపతిః ॥12॥

బ్రహ్మవేత్తలలో శ్రేష్ఠుడు, పరమేష్ఠి మరియు ప్రజాపతి అయిన బ్రహ్మదేవుడు దేవతలను యజ్ఞములందలి హవిస్సులను భుజించువారిగను, ముల్లోకములకు అధిపతులుగాను చేసెను.

తానబాధన్త సహితాః సపత్నా దైత్యదానవాః ।
రాక్షసాశ్చ తథా యుద్ధం తేషామాసీత్సుదారుణమ్ ॥13॥

దివ్యం వర్షసహస్రం తు పరాజీయన్త దేవతాః ।
జయినశ్చాభవన్ విప్ర బలినో దైత్యదానవాః ॥14॥

ఓ విప్రుడా ! సవతితల్లి పుత్రులైన దైత్యులు, దానవులు, రాక్షసులు ఏకమై శత్రుత్వమును పెంచుకొని దేవతలను బాధించిరి. వారిమధ్య దివ్యసహస్ర సంవత్సరముల పర్యంతము గొప్ప భయంకరమైన యుద్ధము జరిగెను. ఆ యుద్ధమందు దేవతలు పరాజయము పాలైరి. బలవంతులైన దైత్యదానవులు విజయమును పొందిరి.

తతో నిరాకృతాన్పుత్రాన్ దైతేయైర్దానవైస్తథా ।
హృతత్రిభువనాన్ దృష్ట్వా హ్యదితిర్మునిసత్తమ ॥15॥

ఆచ్ఛిన్నయజ్ఞభాగాంశ్చ శుచా సంపీడితా భృశమ్ ।
ఆరాధనాయ సవితుః పరం యత్నం ప్రచక్రమే ॥16॥

అంతట తన పుత్రులగు దేవతలు దైత్యులు మరియు దానవులచేత నిరాకరింపబడుటను చూచి, మరియు ముల్లోకములు అపహరింపబడుటను, యజ్ఞభాగములు లేకుండా చేయబడుటను కూడా చూచి శోకముతో అత్యంతపీడితురాలై అదితి సూర్యదేవుని ఆరాధించుటకు గొప్ప ప్రయత్నము చేసెను.

ఏకాగ్రా నియతాహారా పరం నియమమాస్థితా ।
తుష్టావ తేజసాం రాశిం గగనస్థం దివాకరమ్ ॥17॥

ఆమె ఏకాగ్రచిత్తురాలై, పరిమితమైన ఆహారముగలదై, శ్రేష్ఠమైన నియమములను స్వీకరించినదై గగనమందున్న తేజోరాశిస్వరూపుడైన దివాకరుని అనగా సూర్యదేవుని స్తుతించెను.

అదితిరువాచ – అదితి పలికెను.

నమస్తుభ్యం పరాం సూక్ష్మాం సౌవర్ణీం బిభ్రతే తనుమ్ ।
ధామ ధామవతామీశ ధామ్నామాధార శాశ్వత ॥18॥

ప్రకాశవంతులలో మిక్కిలి జ్యోతిస్స్వరూపుడా ! ఈశ్వరుడా ! ప్రకాశములకు ఆధారస్వరూపుడా ! శాశ్వతస్వరూపుడా! శ్రేష్ఠమైనది, సూక్ష్మమైనది, సువర్ణమయమూ అగు శరీరమును ధరించు నీకు నమస్కారము.

జగతాముపకారాయ తథాఽపస్తవ గోపతే ।
ఆదదానస్య యద్రూపం తీవ్రం తస్మై నమామ్యహమ్ ॥19॥

ఓ గోపతీ ! సూర్యభగవానుడా ! లోకముల ఉపకారము కొరకు నీటిని గ్రహించు నీయొక్క తీవ్రమైన ఏ రూపముగలదో దానికి నమస్కరించుచున్నాను.

గ్రహీతుమష్టమాసేన కాలేనేన్దుమయం రసమ్ ।
బిభ్రతస్తవ సద్రూపమతితీవ్రం నతాస్మి తత్ ॥20॥

చంద్రమయమైన రసమును ఎనిమిది మాసముల కాలము గ్రహించుటకై మిక్కిలి తీవ్రమైన సద్రూపమును ధరించు నీకు నమస్కరించుచున్నాను.

తమేవ ముఞ్చతః సర్వం రసం వై వర్షణాయ యత్ ।
రూపమాప్యాయకం భాస్వంస్తస్మై మేఘాయ తే నమః ॥21॥

ఓ ప్రకాశవంతుడా ! నీవు గ్రహించు ఆ రసమును విడిచిపెట్టుటకై, వర్షించునిమిత్తము తృప్తిని కలిగించు మేఘరూపమును గ్రహించు నీకు నమస్కరించుచున్నాను.

వార్యుత్సర్గవినిష్పన్నమశేషం చౌషధీగణమ్ ।
పాకాయ తవ యద్రూపం భాస్కరం తం నమామ్యహమ్ ॥22॥

జలమును వర్షించుటచే ఉత్పన్నమైన అనేక ఓషధులను పండించుటకై నీవు ఎట్టి స్వరూపమును పొందుచున్నావో అట్టి భాస్కరమూర్తికి నేను నమస్కరించుచున్నాను.

యచ్చ రూపం తవాతీతం హిమోత్సర్గాదిశీతలమ్ ।
తత్కాలసస్యపోషాయ తరణే తస్య తే నమః ॥23॥

ఓ తరణీ! సూర్యదేవా! హేమంతకాలమందు సస్యములను (వరి మొ॥ ధాన్యములు) పోషించు నిమిత్తమై మంచును కురిపించుటచే శీతలమైన ఏ నీ శరీరము కలదో దానికి నేను నమస్కరించుచున్నాను.

నాతితీవ్రం చ యద్రూపం నాతిశీతం చ యత్తవ ।
వసన్తర్తే రవే సౌమ్యం తస్మై దేవ నమో నమః ॥24॥

ఓ రవీ! సూర్యదేవా! వసంతఋతువునందు మరీ ఎక్కువ తీవ్రముగానూ, మరీ ఎక్కువ శీతలముగానూ లేనట్టి సౌమ్యమైన ఏ నీ రూపముగలదో అట్టి దానికి నేను నమస్కరించుచున్నాను.

ఆప్యాయనమశేషాణాం దేవానాం చ తథా పరమ్ ।
పితౄణాం చ నమస్తస్మై సస్యానాం పాకహేతవే ॥25॥

సమస్త దేవతలను మరియు పితృదేవతలను తృప్తిపరచునట్టిది, అట్లే పంటలను పండించునట్టిదియు అగు నీ రూపమునకు నమస్కరించుచున్నాను.

యద్రూపం జీవనాయైకం వీరుధామమృతాత్మకమ్ ।
పీయతే దేవపితృభిస్తస్మై సోమాత్మనే నమః ॥26॥

ఆ యా లతలకు జీవనకారణమైన ఏ నీ రూపము అమృతస్వరూపమై దేవతలు మరియు పితృదేవతలచే పానము చేయబడుచున్నదో అట్టి సోమరూపమునకు (సోమశబ్దానికి సోమలతలు, చంద్రుడు అని అర్థం) నేను నమస్కరించుచున్నాను.

ఆప్యాయ దాహరూపాభ్యాం రూపం విశ్వమయం తవ ।
సమేతమగ్నీషోమాభ్యాం నమస్తస్మై గుణాత్మనే ॥27॥

ఒకటి ఆహ్లాదమును కలిగించునది మరొకటి వేడిని కలిగించునదీయగు రెండు రూపములను ధరించి, అగ్ని, చంద్రులను మిళితముగా చేసుకొన్నట్టి విశ్వమయమైన గుణాత్మకమైన నీ రూపమునకు నేను నమస్కరించుచున్నాను.

యద్రూపమృగ్యజుఃసామ్నామైక్యేన తపతే తవ ।
విశ్వమేతత్త్రయీసంజ్ఞం నమస్తస్మై విభావసో ॥28॥

ఓ విభావసూ ! సూర్యదేవా ! ఋక్కులు, యజుస్సులు, సామలు ఈ మూడు మిళితమై త్రయీ అను పేరుతో ఈ విశ్వమంతటినీ భాసింపచేయుచున్న నీ రూపమునకు నేను నమస్కరించుచున్నాను.

యత్తు తస్మాత్పరం రూపమోమిత్యుక్త్వాఽభిశబ్దితమ్ ।
అస్థూలానన్తమమలం నమస్తస్మై సదాత్మనే ॥29॥

పూర్వోక్తరూపములకంటే శ్రేష్ఠమై, "ఓమ్" అను శబ్దోచ్చారణచే తెలియబడిన ఏ నీ రూపము కలదో స్థూలముకానిదీ, నాశములేనిదీ, స్వచ్ఛమైనదీ అయినట్టి సద్రూపమైన ఆ రూపమునకు నేను నమస్కరించుచున్నాను.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

ఏవం సా నియతా దేవీ చక్రే స్తోత్రమహర్నిశమ్ ।
నిరాహారా వివస్వన్తమారిరాధయిషుర్మునే ॥30॥

ఓ మునీ ! ఈ విధముగా ఆ అదితిదేవి ఏకాగ్రచిత్తురాలై ఆహారమును తీసుకొనక వివస్వంతుని (సూర్యదేవుని) ఆరాధించు కోరికగలదై రాత్రింబవళ్ళు ఈ విధముగా స్తుతించెను.

తతః కాలేన మహతా భగవాంస్తపనోఽమ్బరే ।
ప్రత్యక్షతామగాదస్యా దాక్షాయణ్యా ద్విజోత్తమ ॥31॥

ఓ బ్రాహ్మణశ్రేష్ఠుడా ! అనంతరము చాలా కాలము గడచిన పిమ్మట సూర్యభగవానుడు ఆకాశమందు ఈ దాక్షాయణికి (అదితికి) ప్రత్యక్షమయ్యెను.

సా దదర్శ మహాకూటం తేజసోఽమ్బరసంశ్రితమ్ ।
జగాద మే ప్రసీదేతి న త్వాం పశ్యామి గోపతే ॥32॥

ఆకాశమును ఆశ్రయించియున్నట్టి, అవినాశి అయినట్టి ఆ సూర్యతేజస్సును అదితి చూచి ఇట్లు పలికెను. ఓ గోపతీ ! సూర్యభగవానుడా ! నిన్ను నేను చూడలేకున్నాను. నన్ను అనుగ్రహించుము.

యథా దృష్టవతీ పూర్వమంబరస్థం సుదుర్దృశమ్ ।
నిరాహారా వివస్వన్తం తపన్తం తదనన్తరమ్ ॥33॥

సంఘాతం తేజసాం తద్వదిహ పశ్యామి భూతలే ।
ప్రసాదం కురు పశ్యేయం యద్రూపం తే దివాకర ॥

భక్తానుకంపక విభో భక్తాహం పాహి మే సుతాన్ ॥34॥

ఓ సూర్యభగవానుడా ! ఆహారమును స్వీకరించకుండా, ఆకాశమందున్నట్టి, చూడశక్యముగానట్టి, ప్రకాశించుచున్నట్టి ఏ రూపమునైతే నేను పూర్వము చూచితినో, అట్టి తేజస్సమూహరూపమును భూతలమందు నేనిప్పుడు చూచుచున్నాను. నాపై అనుగ్రహము చూపుము. నీ యథార్థరూపమును నేను చూచెదను. భక్తులయందు దయ చూపువాడా ! సర్వవ్యాపకా! ఓ సూర్యదేవా ! నేను నీ భక్తురాలను. నా పుత్రులను రక్షింపుము.

త్వం ధాతా విసృజసి విశ్వమేతత్త్వం పాసి స్థితికరణాయ సంప్రవృత్తః ।
త్వయ్యన్తే లయమఖిలం ప్రయాతి తత్త్వం త్వత్తోఽన్యా న హి గతిరస్తి సర్వలోకే ॥35॥

నీవు బ్రహ్మరూపముతో ఈ జగత్తును సృష్టించుచున్నావు. నీవు ఈ జగత్తుయొక్క స్థితియందు బాగుగా ప్రవర్తించి దానిని రక్షించుచున్నావు. ప్రళయకాలమందు ఈ సమస్తవిశ్వము నీయందు లయమును పొందుచున్నది. నీవు తప్ప నాకు సమస్తలోకములందు వేరే గతి (రక్షించువారు) లేదు.

త్వం బ్రహ్మా హరిరజసంజ్ఞితస్త్వమిన్ద్రో విత్తేశః పితృపతిరప్పతిః సమీరః ।
సోమోఽగ్నిర్గగనపతిర్మహీధరోఽబ్ధిః కిం స్తవ్యం తవ సకలాత్మరూపధామ్నః ॥36॥

ఓ సూర్యదేవా ! నీవే బ్రహ్మవు, హరివి, అజుడవు అనగా పుట్టుక లేనివాడవు, ఇంద్రుడవు, ధనేశ్వరుడగు కుబేరుడవు, పితృదేవపతి అయిన యముడవు, వరుణుడవు, వాయువువు, చంద్రుడవు, అగ్నివి, గగనపతివి, మహీధరుడవు, సముద్రుడవు. నీవు సర్వస్వరూపుడవు. ఏమని నిన్ను స్తుతించెదను?

యజ్ఞేశ త్వామనుదినమాత్మకర్మసక్తాః స్తువన్తో వివిధపదైర్ద్విజా యజన్తి ।
ధ్యాయన్తో వినియతచేతసో భవన్తం యోగస్థాః పరమపదం ప్రయాన్తి మర్త్యాః ॥37॥

ఓ యజ్ఞేశ్వరుడా ! తమకు విధింపబడిన కర్మలను ఆచరించుటయందు ఆసక్తులైన ద్విజులు వివిధ మంత్రములతో నిన్ను స్తుతిస్తూ యజ్ఞాదులను నిర్వహించుచున్నారు. మానవులు మనోనిగ్రహము కలవారై నిన్ను ధ్యానించుచున్నవారై యోగమందు ఉన్నవారై పరమపదమును అనగా మోక్షమును పొందుచున్నారు.

తపసి పచసి విశ్వం పాసి భస్మీకరోషి ప్రకటయసి మయూఖైర్హ్లాదయస్యమ్బుగర్భైః ।
సృజసి కమలజన్మా పాలయస్యచ్యుతాఖ్యః క్షపయసి చ యుగాన్తే రుద్రరూపస్త్వమేకః ॥38॥

ఓ సూర్యభగవానుడా ! నీవు ప్రపంచమును తపింపచేయుచున్నావు, పరిపక్వమును చేయుచున్నావు, రక్షించుచున్నావు, భస్మము చేయుచున్నావు, కిరణములతో ప్రకాశింపచేయుచున్నావు, జలగర్భితములైన కిరణములతో ఆహ్లాదపరచుచున్నావు, బ్రహ్మదేవునివై సృష్టిని చేయుచున్నావు, అచ్యుతుడవైన నీవు రక్షించుచున్నావు, ప్రళయకాలమందు రుద్రరూపుడవై ఒక్కడివై నశింపచేయుచున్నావు.

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే దివాకరస్తుతిర్నామ ఏకాధికశతతమోఽధ్యాయః ॥101॥

శ్రీ మార్కండేయ మహాపురాణమందలి దివాకరస్తుతియను నూటఒకటవ అధ్యాయం సమాప్తం.

ద్వ్యధికశతతమోఽధ్యాయః – నూట రెండవ అధ్యాయం
మార్తండోత్పత్తిః – మార్తండోత్పత్తి

మార్కండేయ ఉవాచ :– మార్కండేయుడు చెప్పాడు.

తతః స్వతేజసస్తస్మాదావిర్భూతో విభావసుః ।
అదృశ్యత తదాదిత్యస్తప్తతామ్రోపమప్రభః ॥1॥

పిమ్మట విభావసుడు తన తేజోమండలము మధ్యభాగమునుండి ఆవిర్భవించెను. అట్లు ఆవిర్భవించిన ఆదిత్యుడు కాలిన రాగియొక్క కాంతివంటి కాంతిగలవాడై ప్రత్యక్షమయ్యెను.

అథ తాం ప్రణతాం దేవీం తస్య సందర్శనాన్మునే ।
ప్రాహ భాస్వాన్ వృణుష్వేష్టవరం మత్తో యమిచ్ఛసి ॥2॥

ఓ మునీ ! ఆ ఆదిత్యుని సందర్శించుటతోడనే నమస్కరించిన అదితిదేవితో భాస్కరుడు “నానుండి నీవు ఏమి కోరుకొనదలచితివో అట్టి నీకిష్టమైన వరమును కోరుకొనుము” అని పలికెను.

ప్రణతా శిరసా సా చ జానుపీడితమేదినీ ।
ప్రత్యువాచ వివస్వన్తం వరదం సముపస్థితమ్ ॥3॥

అప్పుడు అదితి మోకాళ్ళను భూమిపై ఉంచి శిరస్సుతో నమస్కరించి వరమిచ్చుటకు ఉపస్థితుడైన ఆదిత్యునితో ఇట్లు పలికెను.

దేవ ప్రసీద పుత్రాణాం హృతం త్రిభువనం మమ ।
యజ్ఞభాగాశ్చ దైత్యైశ్చ దానవైశ్చ బలాధికైః ॥4॥

ఓ దేవా ! ప్రసన్నుడవగుము. అధిక బలసంపన్నులగు దైత్యులు, దానవులు నా పుత్రులయొక్క ముల్లోకములను మరియు యజ్ఞభాగములను అపహరించిరి.

తన్నిమిత్తం ప్రసాదం త్వం కురుష్వ మమ గోపతే ।
అంశేన తేషాం భ్రాతృత్వం గత్వా నాశయ తద్రిపూన్ ॥5॥

ఓ గోపతీ ! సూర్యదేవా ! అందుచేత నాయందు ప్రసన్నతను చూపుము. నా కుమారులయందు భ్రాతృత్వమును నీ అంశమందు భావించి వారి శత్రువులను నాశము చేయుము.

యథా మే తనయా భూయో యజ్ఞభాగభుజః ప్రభో ।
భవేయురధిపాశ్చైవ త్రైలోక్యస్య దివాకర ॥6॥

తథానుకమ్పాం పుత్రాణాం సుప్రసన్నో రవే మమ ।
కురు ప్రపన్నార్తిహర స్థితికర్తా త్వముచ్యసే ॥7॥

ఓ ప్రభూ ! దివాకరా ! ఏ విధముగా అయితే నా కుమారులు తిరిగి యజ్ఞహవిర్భోక్తలు అగుదురో మరియు ముల్లోకములకు అధిపతులు అగుదురో ఆ విధముగా నా పుత్రులపై దయను చూపుము. ఓ రవీ ! శరణన్నవారి దుఃఖములను పోగొట్టువాడా ! నీవే సమస్తలోకముల స్థితిని చేయువాడవని నీవు చెప్పబడుచున్నావు కదా !

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

తతస్తామాహ భగవాన్ భాస్కరో వారితస్కరః ।
ప్రణతామదితిం విప్ర ప్రసాదసుముఖో విభుః ॥8॥

ఓ బ్రాహ్మణుడా ! అటు పిమ్మట వారితస్కరుడు (నీటిని తస్కరించువాడు), ప్రసన్నుడు, సర్వవ్యాపకుడూ అగు సూర్యభగవానుడు నమస్కరించిన అదితితో ఇట్లు పలికెను.

సహస్రాంశేన తే గర్భే సమ్భూయాహమశేషతః ।
త్వత్పుత్రశత్రూనదితే నాశయామ్యాశు నిర్వృతః ॥9॥

ఓ అదితీ ! నేను నాయొక్క అశేషమైన సహస్రాంశతేజస్సమూహముతో నీ గర్భమందు జన్మించి నీ స్తోత్రముచే సంతృప్తిని పొందిన నేను శీఘ్రముగా నీ పుత్రుల శత్రువులను నశింపచేసెదను.

ఇత్యుక్త్వా భగవాన్భాస్వానన్తర్ధానముపాగమత్ ।
నివృత్తా సాఽపి తపసః సంతృప్తాఖిలవాంఛితా ॥10॥

ఈ విధముగా పలికి భగవంతుడగు భాస్కరుడు అంతర్ధానమయ్యెను. ఆ అదితికూడా సంతృప్తినందిన సమస్తములైన కోరికలుకలదై తపస్సును విరమించుకొనెను.

తతో రశ్మిసహస్రాత్తు సౌషుమ్నాఖ్యో రవేః కరః ।
విప్రావతారం సఞ్చక్రే దేవమాతురథోదరే ॥11॥

ఓ విప్రుడా ! అటుపిమ్మట సూర్యుని సహస్రరశ్ములనుండి సౌషుమ్నమను పేరుగల ఒక కిరణము దేవమాతయగు అదితిగర్భమందు అవతరించెను.

కృచ్ఛ్రచాన్ద్రాయణాదీని సా చ చక్రే సమాహితా ।
శుచిః సంధారయామాస దివ్యం గర్భమితి ద్విజ ॥12॥

ఓ ద్విజుడా ! ఆ అదితి ఏకాగ్రచిత్తురాలై క్లిష్టమైన చాంద్రాయణాదివ్రతములను ఆచరించెను. పరిశుద్ధురాలైన ఆమె గర్భమును దాల్చెను. తాను దాల్చినది దివ్యగర్భమని ఆమె తెలుసుకొనెను.

తతస్తాం కశ్యపః ప్రాహ కిఞ్చిత్కోపప్లుతాక్షరమ్ ।
కిం మారయసి గర్భాణ్డమితి నిత్యోపవాసినీ ॥13॥

అంతట కశ్యపుడు కొద్దిగా కోపముతో తడబాటు కలిగిన అక్షరములతో అదితితో "నీవు నిత్యమూ ఉపవాసముచేయుచూ నీ గర్భమందలి అండమును చంపుదువా ఏమి" అని పలికెను.

సా చ తం ప్రాహ గర్భాణ్డమేతత్పశ్యేతి కోపనా ।
న మారితం విపక్షాణాం మృత్యవే తద్భవిష్యతి ॥14॥

ఆమె కూడా కోపగించి కశ్యపునితో "ఈ గర్భాండమును చూడుము. ఇది చంపబడలేదు. ఇవి శత్రువినాశకారి కాగలదు" అని పలికెను.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

ఇత్యుక్త్వా తం తదా గర్భముత్ససర్జ సురారణిః ।
జాజ్వల్యమానం తేజోభిః పత్యుర్వచనకోపితా ॥15॥

ఈ విధముగా పలికి దేవతల తల్లియగు అదితి తన భర్త పలికిన మాటలకు కోపగించినదై జ్వలించుచున్న గర్భమును విడిచిపెట్టెను.

తం దృష్ట్వా కశ్యపో గర్భముద్యద్భాస్కరవర్చసమ్ ।
తుష్టావ ప్రణతో భూత్వా ఋగ్భిరాద్యాభిరాదరాత్ ॥16॥

ఉదయించుచున్న భాస్కరుని కాంతి కలిగిన ఆ గర్భమును చూచి కశ్యపుడు నమస్కరించుచు ఆద్య ఋఙ్మంత్రములతో ఆదరముతో స్తుతించెను.

సంస్తూయమానః స తదా గర్భాణ్డాత్ప్రకటోఽభవత్ ।
పద్మపత్రసవర్ణాభస్తేజసా వ్యాప్తదిఙ్ముఖః ॥17॥

ఇట్లు కశ్యపునిచే స్తుతింపబడుచున్న ఆ భాస్కరుడు పద్మపత్రముల కాంతి వంటి కాంతి కలిగి, సమస్త దిక్కులకూ వ్యాపించిన తేజస్సు గలవాడై ఆ సమయమందు గర్భాండమునుండి బయల్వెడలెను.

అథాన్తరిక్షాదాభాష్య కశ్యపం మునిసత్తమమ్ ।
సతోయమేఘగంభీరవాగువాచాఽశరీరిణీ ॥18॥

అటుపిమ్మట జలసహితమేఘముయొక్క గర్జనవంటి గంభీరవాక్కుతో అశరీరవాణి అంతరిక్షమునుండి ఇట్లు పలికెను.

మారితం తే యతః ప్రోక్తమేతదణ్డం త్వయా మునే ।
తస్మాన్మునే సుతస్తేఽయం మార్తణ్డాఖ్యో భవిష్యతి ॥19॥

ఓ మునీ ! "నీ గర్భమందలి అండమును చంపుదువా"యని నీవు నీ భార్యతో పలికినందున ఈ అండమునుండి జన్మించిన కుమారుడు మార్తండుడని ఖ్యాతిని పొందగలడు.

సూర్యాధికారం చ విభుర్జగత్యేష కరిష్యతి ।
హనిష్యత్యసురాంశ్చాయం యజ్ఞభాగహరానరీన్ ॥20॥

ఈ నీ కుమారుడు సర్వవ్యాపకుడై సూర్యాధికారమును చేయగలడు. ఇంకను యజ్ఞములందలి హవిస్సులను హరించునట్టి శత్రువులైన అసురులను వధించగలడు.

దేవా నిశమ్యేతి వచో గగనాత్సముపాగమన్ ।
ప్రహర్షమతులం యాతా దానవాశ్చ హృతౌజసః ॥21॥

అశరీరవాణి పలికిన ఈ మాటలను విని దేవతలు ఆకాశమునుండి వచ్చిరి మరియు మిక్కిలి సంతోషమును పొందిరి. దానవులు తేజోవిహీనులైరి.

తతో యుద్ధాయ దైతేయానాజుహావ శతక్రతుః ।
సహ దేవైర్ముదా యుక్తో దానవాశ్చ సమభ్యయుః ॥22॥

పిమ్మట దేవతలతో కూడుకొన్న ఇంద్రుడు సంతోషము కలిగినవాడై దైత్యులను యుద్ధమునకు పిలిచెను. దానవులు కూడా యుద్ధమునకు వచ్చిరి.

తేషాం యుద్ధమభూద్ఘోరం దేవానామసురైః సహ ।
శస్త్రాస్త్రదీప్తిసందీప్తం సమస్తభువనాన్తరమ్ ॥23॥

దేవతలకు అసురులతో భయంకరమైన యుద్ధము జరిగెను. ఆ యుద్ధమందలి శస్త్రములు, అస్త్రముల కాంతితో సమస్తలోకాలు దీప్తిమంతమైనట్టివి అయ్యెను.

తస్మిన్యుద్ధే భగవతా మార్తండేన నిరీక్షితాః ।
తేజసా దహ్యమానాస్తే భస్మీభూతా మహాసురాః ॥24॥

ఆ యుద్ధమందు భగవత్స్వరూపుడగు మార్తండుని చూచినంతనే ఆ ఆదిత్యుని తేజస్సుచేత గొప్ప అసురులు దహింపబడి, భస్మీభూతులైనారు.

తతః ప్రహర్షమతులం ప్రాప్తాః సర్వే దివౌకసః ।
తుష్టువుస్తేజసాం యోనిం మార్తండమదితిం తథా ॥25॥

అప్పుడు దేవతలందరు గొప్ప ఆనందమును పొంది తేజస్సులకు జన్మస్థానమైన మార్తండుని అనగా అదితిదేవుని, అట్లే తల్లియగు అదితిని స్తుతించిరి.

స్వాధికారాంస్తథా ప్రాప్తా యజ్ఞభాగాంశ్చ పూర్వవత్ ।
భగవానపి మార్తండః స్వాధికారమథాకరోత్ ॥26॥

దేవతలు పూర్వమువలే తమ అధికారములను, యజ్ఞభాగములను పొందిరి. భగవంతుడగు మార్తండుడు కూడా తన కార్యములందు నిమగ్నుడయ్యెను.

కదంబపుష్పవద్భాస్వానధశ్చోర్ధ్వం చ రశ్మిభిః ।
వృత్తాగ్నిపిండసదృశో దధ్రే నాతిస్ఫురద్వపుః ॥27॥

కదంబపుష్పమువలే పైకి క్రిందికి వెలుగుచున్న కిరణములచే ప్రకాశవంతుడై గోళాకారమగు అగ్నిపిండమువలే ఆ ఆదిత్యుడు కన్పించసాగెను. అతడు చాలా అధికమైన కాంతి కలిగిన శరీరమును ధరించలేదు.

ఇతి మార్కండేయ మహాపురాణే మార్తండోత్పత్తిర్నామ ద్వ్యధికశతతమోఽధ్యాయః ॥102॥

శ్రీ మార్కండేయ మహాపురాణమందలి మార్తండోత్పత్తియను నూటరెండవ అధ్యాయం సమాప్తం.



త్ర్యధికశతతమోఽధ్యాయః – నూటమూడవ అధ్యాయం
భానుతనులేఖనమ్ – భానుతనులేఖనం (సూర్యుని తేజస్సును తగ్గించుట)

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

అథ తస్మై దదౌ కన్యాం సంజ్ఞాం నామ వివస్వతే ।
ప్రసాద్య ప్రణతో భూత్వా విశ్వకర్మా ప్రజాపతిః ॥1॥

అనంతరము ప్రజాపతియగు విశ్వకర్మ నమస్కారము చేసి వివస్వంతుని ప్రసన్నునిగా చేసుకొని అతనికి సంజ్ఞాదేవియనుపేరుగల తన కుమార్తెనిచ్చెను.

వైవస్వతస్తు సంభూతో మనుస్తస్యాం వివస్వతః ।
పూర్వమేవ తథాఽఖ్యాతం తత్స్వరూపం విశేషతః ॥2॥

వివస్వంతునికి ఆ సంజ్ఞాదేవివలన వైవస్వతుడను పేరుగల పుత్రుడైన మనువు జన్మించెను. అతని వృత్తాంతమును ఇంతకుముందు విశేషముగా నీకు చెప్పియుంటిని.

త్రీణ్యపత్యాన్యసౌ తస్యాం జనయామాస గోపతిః ।
ద్వౌ పుత్రౌ సుమహాభాగౌ కన్యాం చ యమునాం మునే ॥3॥

ఓ క్రౌష్టుకిమునీ ! గోపతియగు సూర్యభగవానుడు సంజ్ఞాదేవి గర్భమునుండి మహాభాగ్యవంతులగు ఇద్దరు కుమారులను యమున అను పేరుగల కుమార్తెను పుట్టించెను.

మనుర్వైవస్వతో జ్యేష్ఠః శ్రాద్ధదేవః ప్రజాపతిః ।
తతో యమో యమీ చైవ యమలౌ సంబభూవతుః ॥4॥

శ్రాద్ధముల దేవుడు, ప్రజాపతి, మనువూ అయిన వైవస్వతుడు జ్యేష్ఠుడు. అటు పిమ్మట యముడు, యమి అను పేర్లుగల కవలలు జన్మించిరి.

యత్తేజోఽభ్యధికం తస్య మార్తండస్య వివస్వతః ।
తేనాతితాపయామాస త్రీన్ లోకాన్స చరాచరాన్ ॥5॥

మార్తండుడగు ఆ వివస్వంతుని ఏ అధికమైన తేజస్సుగలదో దానితో అతడు చరాచరములను, ముల్లోకములను ఎక్కువగా తపింపచేసెను.

గోలాకారం తు తద్దృష్ట్వా సంజ్ఞా రూపం వివస్వతః ।
అసహన్తీ మహత్తేజః స్వాం ఛాయాం ప్రేక్ష్య సాఽబ్రవీత్ ॥6॥

సంజ్ఞాదేవి గోళాకారములో ఉన్న వివస్వంతుని తేజోరూపమును చూచి, అత్యధికమైన ఆ తేజస్సును సహించలేక తన ఛాయను చూచి ఆ ఛాయతో ఇట్లు పలికెను.

సంజ్ఞోవాచ – సంజ్ఞాదేవి పలికింది.

అహం యాస్యామి భద్రం తే స్వమేవ భవనం పితుః ।
నిర్వికారం త్వయాఽ ప్యత్ర స్థేయం మచ్ఛాసనాచ్ఛుభే ॥7॥

ఓ మంగళప్రదురాలా ! నేను నా తండ్రి గృహమునకు వెళ్ళుచున్నాను. నా ఆజ్ఞను పాటించుచూ నీవు ఎట్టి వికారములు లేక ఇచ్చట నివసించుము.

ఇమౌ చ బాలకౌ మహ్యం కన్యా చ వరవర్ణినీ ।
సంభావ్యౌ నైవ చాఖ్యేయమిదం భగవతే త్వయా ॥8॥

ఈ నా ఇరువురు బాలురను, వరవర్ణినియగు కుమార్తెను నా కొరకు జాగ్రత్తగా చూచుకొనవలెను. ఈ విషయమును సూర్యభగవానునికి ఎన్నడూ చెప్పరాదు.

ఛాయోవాచ – ఛాయాదేవి పలికింది.

ఆకేశగ్రహణాద్దేవి ఆశాపాన్నైవ కర్హిచిత్ ।
ఆఖ్యాస్యామి మతం తుభ్యం గమ్యతాం యత్ర వాంఛితమ్ ॥9॥

ఓ దేవీ ! నా జుట్టును పట్టుకోనంతవరకు, నన్ను శపించనంతవరకు నేనీ విషయమును చెప్పను. నీవు ఎచ్చటికి వెళ్ళదలచితివో అచ్చటకు వెళ్ళుము.

ఇత్యుక్తా ఛాయయా సంజ్ఞా జగామ పితృమన్దిరమ్ ।
తత్రావసత్పితుర్గేహే కంచిత్కాలం శుభేక్షణా ॥10॥

ఈ విధముగా ఛాయాదేవి పలుకగా, శుభదర్శనముగల సంజ్ఞాదేవి తన తండ్రి గృహమునకు వెళ్ళి కొంతకాలము అచ్చట నివసించెను.

భర్తుః సమీపం యాహీతి పిత్రోక్తా సా పునఃపునః ।
అగచ్ఛద్వడవా భూత్వా కురూన్విప్రోత్తరాంస్తతః ॥11॥

ఓ విప్రుడా ! భర్త ఇంటికి వెళ్ళమని తండ్రి మాటిమాటికి సంజ్ఞాదేవితో పలుకగా, ఆమె అశ్వరూపమును ధరించి ఉత్తరకురుదేశములకు వెళ్ళెను.

తత్ర తేపే తపః సాధ్వీ నిరాహారా మహామునే ।
పితుః సమీపం యాతాయాః సంజ్ఞాయా వాక్యతత్పరా ॥12॥

తద్రూపధారిణీ ఛాయా భాస్కరం సముపస్థితా ।
తస్యాం చ భగవాన్సూర్యః సంజ్ఞేయమితి చిన్తయన్ ॥13॥

తథైవ జనయామాస ద్వౌ సుతౌ కన్యకాం తథా ।
పూర్వజస్య మనోస్తుల్యః సావర్ణిస్తేన సోఽభవత్ ॥14॥

యస్తయోః ప్రథమం జాతః పుత్రయోర్ద్విజసత్తమ ।
ద్వితీయో యోఽభవచ్చాన్యః స గ్రహోఽభూచ్ఛనైశ్వరః ॥15॥

ఓ మహామునీ ! ఆ ఉత్తరకురుదేశములందు సాధ్వి అయిన సంజ్ఞాదేవి ఆహారమును విడిచి తపస్సునాచరించెను. తండ్రి గృహమునకు వెళ్ళిన ఆ సంజ్ఞాదేవి మాటననుసరించి ఆమె రూపమును ధరించి ఛాయాదేవి భాస్కరుని చేరెను. సూర్యభగవానుడు కూడా ఆమెను సంజ్ఞాదేవిగా భావించి ఆమెయందు కూడా సంజ్ఞాదేవియందువలే ఇద్దరు పుత్రులను, ఒక పుత్రికను పొందెను. ఓ బ్రాహ్మణశ్రేష్ఠుడా ! ఆ ఇద్దరు పుత్రులలో మొదటివాడు సంజ్ఞాదేవి పుత్రులలో మొదటివాడైన వైవస్వతమనువుతో సమానుడైనందున సావర్ణియను పేరుగల మనువు అయ్యెను. ఛాయాదేవి పుత్రులలో రెండవవాడు శనైశ్చరుడను పేరుగల గ్రహమయ్యెను.

కన్యాఽభూత్తపతీ యా తాం వవ్రే సంవరణో నృపః ।
సంజ్ఞా తు పార్థివీ తేషామాత్మజానాం యథాఽకరోత్ ॥16॥

స్నేహాన్న పూర్వజాతానాం తథా కృతవతీ సతీ ।
మనుస్తత్క్షాన్తవాంస్తస్య యమశ్చాస్యా న చక్షమే ॥17॥

ఆ ఛాయాదేవి కుమార్తె అయిన తపతిని సంవరణుడను పేరుగల రాజు వివాహమాడెను. రాణియగు సంజ్ఞాదేవి తన పుత్రులపట్ల ఎట్టి స్నేహమును చూపెనో అట్టి స్నేహమును ఛాయాదేవి వారిపట్ల అనగా సంజ్ఞాదేవి యొక్క ఇద్దరు కుమారులు, కుమార్తె పట్ల చూపలేదు. ఈ విధముగా ప్రేమ చూపించకపోయినా వైవస్వతమనువు సహించెనుగాని, రెండవ పుత్రుడైన యముడు ఆమెను సహించలేకపోయెను.

బహుశో యాచ్యమానస్తు పితుః పత్న్యా సుదుఃఖితః ।
స వై కోపాచ్చ బాల్యాచ్చ భావినోఽర్థస్య వై బలాత్ ॥18॥

పదా సన్తర్జయామాస ఛాయాసంజ్ఞాం యమో మునే ।
తతః శశాప చ యమం సంజ్ఞా సా మర్షిణీ భృశమ్ ॥19॥

ఓ మునీ ! ఈ విధముగా సవతితల్లి చేయు పనులకు దుఃఖితుడై, కోపమువల్లనో, బాలస్వభావమువల్లనో, లేక జరుగవలసినదానియొక్క బలమువల్లనో యముడు తన కాలితో ఛాయాసంజ్ఞను అదిలించెను. అంతట ఆమె మిక్కిలి కోపముచెంది యముని శపించెను.

ఛాయోవాచ – ఛాయాదేవి పలికింది.

పదా తర్జయసే యస్మాత్పితృభార్యాం గరీయసీమ్ ।
తస్మాత్తవైవ చరణః పతిష్యతి న సంశయః ॥20॥

ఎందువల్లనైతే నీ తండ్రిగారి శ్రేష్ఠురాలైన భార్యను కాలితో తన్నుటకై బెదిరించితివో అందువల్ల నీ కాలు తెగి క్రిందపడిపోవునుగాక ! ఇందు సంశయము లేదు.

యమస్తు తేన శాపేన భృశం పీడితమానసః ।
మనునా సహ ధర్మాత్మా సర్వం పిత్రే న్యవేదయత్ ॥21॥

యముడు ఆ శాపముతో మిక్కిలి పీడింపబడిన మనస్సుగలవాడై (మనస్సులో బాధను పొంది) తన అన్నగారైన వైవస్వతమనువుతో కూడి ధర్మాత్ముడగు ఆ యముడు తన తండ్రికి జరిగినదంతయు నివేదించెను.

యమ ఉవాచ :– యముడు చెప్పాడు.

స్నేహేన తుల్యమస్మాసు మాతా దేవ న వర్తతే ।
విసృజ్య జ్యాయసోఽ పృస్మాన్కనీయాంసౌ బుభూర్షతి ॥22॥

ఓ దేవా ! మేము సంతానమందరిలో జ్యేష్ఠులమైనప్పటికీ, మా తల్లి మాయందు చిన్నవారితో సమానముగా స్నేహభావమును చూపుటలేదు. మమ్ములను విడిచి కనిష్ఠులను బాగుగా చూచుకొనుచున్నది.

తస్యాం మయోద్యతః పాదో న తు దేహే నిపాతితః ।
బాల్యాద్వా యది వా మోహాత్తద్భవాన్ క్షన్తుమర్హతి ॥23॥

నా తల్లియందు నేను పాదమును ఎత్తితినేగాని ఆమె దేహమును తాకలేదు. బాల్యము చేతగాని, అజ్ఞానముచేతగాని నేనట్లు ప్రవర్తించితినిగాన నన్ను మీరు క్షమించవలెను.

శప్తోఽ హం తాత కోపేన జనన్యా తనయో యతః ।
తతో న మన్యే జననీమిమాం వై తపతోవర ॥24॥

తపస్విజనులలో శ్రేష్ఠుడైనవాడా ! ఓ తండ్రీ ! తల్లిచేత తనయుడు శపింపబడ్డాడు అంటే ఈమెను తల్లిగా నేను భావించుటలేదు.

విగుణేష్వపి పుత్రేషు న మాతా విగుణా పితః ।
పాదస్తే పతతాం పుత్ర కథమేతత్ప్రవక్ష్యతి ॥25॥

ఓ తండ్రీ ! పుత్రులు చెడు ఆచారముగలవారైననూ, తల్లి ఎన్నడునూ వారిపట్ల వ్యతిరేకముగా ప్రవర్తించదు. "ఓ కుమారా ! నీ కాలు తెగి క్రింద పడిపోవుగాక !" అని తల్లి ఎట్లు పలుకగలదు?

తవ ప్రసాదాచ్చరణో న పతేద్భగవన్యథా ।
మాతృశాపాదయం మేఽ ద్య తథా చిన్తయ గోపతే ॥26॥

ఓ పూజ్యుడా ! ఓ గోపతీ ! సూర్యభగవానుడా ! నీ అనుగ్రహము వలన ఏ విధముగా నా కాలు తల్లి శాపము కారణముగా తెగి క్రిందపడకుండా ఉంటుందో ఆ విధముగా ఆలోచించుము.

రవిరువాచ – సూర్యుడు చెప్పాడు.

అసంశయమిదం పుత్ర భవిష్యత్యత్ర కారణమ్ ।
యేన త్వామావిశత్క్రోధో ధర్మజ్ఞం సత్యవాదినమ్ ॥27॥

ఓ కుమారా ! ధర్మజ్ఞుడవు, సత్యవాదివీయగు నీయందు కోపము ఆవహించిందీ అంటే నిస్సంశయముగా ఇందులో కారణము తప్పక ఉండగలదు.

సర్వేషామేవ శాపానాం ప్రతిఘాతో హి విద్యతే ।
న తు మాత్రాభిశప్తానాం క్వచిచ్ఛాపనివర్తనమ్ ॥28॥

సమస్త శాపములకు ప్రతీకారమున్నదిగాని, తల్లిచేత శపింపబడినవారికి వారి శాపమును నివృత్తి చేయుటకు ఉపాయము లేదు.

న శక్యమేతన్మిథ్యా తు కర్తుం మాతుర్వచస్తవ ।
కిఞ్చిత్తవ విధాస్యామి పుత్రస్నేహాదనుగ్రహమ్ ॥29॥

నీ తల్లి పలికిన మాటలను అసత్యముగావించుట నాకు శక్యము గాదు. అయిననూ పుత్రునిపట్ల ఉన్న అనురాగము కారణముగా నిన్ననుగ్రహించి ఒక ఉపాయమును చెప్పెదను.

కృమయో మాంసమాదాయ ప్రయాస్యన్తి మహీతలమ్ ।
కృతం తస్యా వచః సత్యం త్వం చ త్రాతో భవిష్యతి ॥30॥

కృములు (క్రిములు) నీ కాలినుండి కొంత మాంసమును తీసుకొని భూతలమునకు వెళ్ళగలవు. అంతట ఆమె మాటా సత్యమగును, నీవూ రక్షింపబడెదవు.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

ఆదిత్యస్త్వబ్రవీచ్ఛాయాం కిమర్థం తనయేషు వై ।
తుల్యేష్వప్యధికః స్నేహ ఏకత్ర క్రియతే త్వయా ॥31॥

ఆదిత్యుడు ఛాయాదేవితో ఇట్లు పలికెను. నీ కుమారులందరూ నీకు సమానులే అయిననూ, ఎందువలన కొందరిపైన మాత్రమే నీవు స్నేహమును చూపుచున్నావు?

నూనం నైషాం త్వం జననీ సంజ్ఞా కాపి త్వమాగతా ।
విగుణేష్వపత్యేషు కథం మాతా శపేత్సుతమ్ ॥32॥

నిజముగా నీవు వీరికి తల్లివి సంజ్ఞాదేవివిగాదు. ఎవతెవో నీవు వచ్చితివి. పుత్రులు అపరాధము చేసినప్పటికీ, తల్లి వారినెట్లు శపించగలదు?

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

సా తత్పరిహరన్తీ చ నాచచక్షే వివస్వతః ।
స చాత్మానం సమాధాయ యుక్తస్తత్త్వమపశ్యత ॥33॥

ఛాయాదేవి ఆదిత్యుడు అడిగిన ప్రశ్నను దాటవేస్తూ బదులేమీ ఇవ్వలేదు. అంతట ఆదిత్యుడు ఆత్మను ఏకాగ్రము చేసి యోగమందు నిలిచి నిజమును తెలుసుకొనెను.

తం శప్తుముద్యతం దృష్ట్వా ఛాయాసంజ్ఞా దివస్పతిమ్ ।
భయేన కంపితా బ్రహ్మన్యథావృత్తం న్యవేదయత్ ॥34॥

ఓ బ్రహ్మస్వరూపుడా ! ఛాయాదేవి ఆదిత్యదేవుడు శపించుటకు ఉద్యమించుటను చూచి భయకంపితురాలై జరిగిన వృత్తాంతమంతయు ఆదిత్యునికి చెప్పెను.

వివస్వాంస్తు తతః క్రుద్ధః శ్రుత్వా శ్వశురమభ్యగాత్ ।
స చాపి తం యథాన్యాయమర్చయిత్వా దివాకరమ్ ॥
నిర్దగ్ధుకామం రోషేణ సాన్త్వయామాస సువ్రతః ॥35॥

ఛాయాదేవి పలికిన మాటలను విన్న సూర్యభగవానుడు క్రుద్ధుడై తన మామగారింటికి వెళ్ళెను. కోపముతో దహించుటకు సిద్ధముగా ఉన్న సూర్యదేవుని చూచి సువ్రతుడగు విశ్వకర్మ అతడిని యథావిధిగా పూజించి సమాధానపరచెను.

విశ్వకర్మోవాచ – విశ్వకర్మ పలికాడు.

తవాతితేజసా వ్యాప్తమిదం రూపం సుదుస్సహమ్ ।
అసహన్తీ తతః సంజ్ఞా వనే చరతి వై తపః ॥36॥

నీ తేజస్సుచేత వ్యాప్తమైన సహింపశక్యముగాని ఈ నీ రూపమును సహింపలేక సంజ్ఞాదేవి వనమందు తపస్సునాచరించుచున్నది.

ద్రక్ష్యతే తాం భవానద్య స్వభార్యాం శుభచారిణీమ్ ।
రూపార్థం భవతోఽరణ్యే చరన్తీం సుమహత్తపః ॥37॥

తాను సహింపగలిన రూపము నీకు సిద్ధించుటకై అరణ్యమందు గొప్ప తపస్సును ఆచరించుచున్న శుభాచారము కలిగిన నీ భార్యను నేడే నీవు చూడగలవు.

స్మృతం మే బ్రహ్మణో వాక్యం యది తే దేవ రోచతే ।
రూపం నివర్తయామ్యేతత్తవ కాన్తం దివస్పతే ॥38॥

ఓ దివస్పతీ ! (పగలును చేయువాడా !) పూర్వము బ్రహ్మ పలికిన మాటలు నాకు స్ఫురణకు వచ్చుచున్నవి. నీకు సమ్మతమైనచో నీ ఈ రూపమును ప్రకాశవంతముగా చేసెదను.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

యతో హి భాస్వతో రూపం ప్రాగాసీత్పరిమణ్డలమ్ ।
తతస్తథేతి తం ప్రాహ త్వష్టారం భగవాన్రవిః ॥39॥

పూర్వము తన రూపము మండలాకారముగా ఉండుటచే భగవంతుడగు సూర్యుడు "అట్లేకానిమ్ము" అని త్వష్టతో (శిల్పి అయిన ప్రజాపతి) పలికెను.

విశ్వకర్మా త్వనుజ్ఞాతః శాకద్వీపే వివస్వతః ।
భ్రమిమారోప్య తత్తేజః శాతనాయోపచక్రమే ॥40॥

సూర్యభగవానుడు అనుమతించగా శాకద్వీపమందు విశ్వకర్మ వివస్వంతుని తేజస్సును ఒక చక్రమందుంచి సానపట్టి అతని దుస్సహమైన తేజోరూపమును తగ్గించుటకు ప్రయత్నించెను.

భ్రమతాశేషజగతాం నాభిభూతేన భాస్వతా ।
సముద్రాద్రివనోపేతా సా రురోహ మహీ నభః ॥41॥

సమస్తజగత్తులకు నాభిస్వరూపుడైన ఆదిత్యుడు చక్రమందు గిరగిరా తిరుగుటవలన సముద్రములు, పర్వతములు, అడవులతో కూడుకొన్న భూమి పైకి ఎగురుట ద్వారా ఆకాశమును వ్యాపించెను.

గగనం చాఖిలం బ్రహ్మన్ సచన్ద్రగ్రహతారకమ్ ।
అధోగతం మహాభాగ బభూవాక్షిప్తమాకులమ్ ॥42॥

ఓ బ్రహ్మస్వరూపుడా ! మహాభాగుడా ! ఇంకనూ చంద్రుడు, గ్రహములు, నక్షత్రములతో కూడుకొన్న ఆకాశము స్థానభ్రంశమునొంది వ్యాకులతను చెంది పైనుంచి క్రిందికి పడసాగెను.

విక్షిప్తసలిలాః సర్వే బభూవుశ్చ తథాబ్ధితః ।
వ్యాభిద్యన్త మహాశైలాః శీర్ణసానునిబన్ధనాః ॥43॥

జలచరప్రాణులతోబాటుగా సముద్రజలములు అన్నీ పైకెగిరి చెల్లాచెదరు అయ్యెను. గొప్ప పర్వతములన్నీ సమతలభాగములతో సహా ఛిన్నాభిన్నములయ్యెను.

ధ్రువాధారాణ్యశేషాణి ధిష్ణ్యాని మునిసత్తమ ।
త్రుట్యద్రశ్మినిబన్ధాని హ్యధో జగ్ముః సహస్రశః ॥44॥

ఓ మునిశ్రేష్ఠుడా ! నక్షత్రమండలముల ఆధారభూతములైన స్థానములు వేలకొలదీ రశ్మినిబంధములైనట్టివి (రశ్ములే మూలస్థానములుగా కల్గినవి) స్థానభ్రంశము చెందగా క్రిందికి పడిపోయినవి.

వేగభ్రమణసంజాతవాయుక్షిప్తాః సమన్తతః ।
వ్యశీర్యన్త మహామేఘా ఘోరరావవిరావిణః ॥45॥

సుడిగాలులు వేగముగా తిరుగుటవలన వాయుదేవునిచే విసిరిగొట్టబడిన గొప్ప మేఘములు భయంకరమైన ధ్వనులను చేయుచూ ముక్కలు ముక్కలు చేయబడినవి.

భాస్వద్భ్రమణవిభ్రాన్తం భూమ్యాకాశరసాతలమ్ ।
జగదాకులమత్యర్థం తదాసీన్మునిసత్తమ ॥46॥

ఓ మునిశ్రేష్ఠుడా ! సూర్యభగవానుడు గుండ్రముగా తిరుగుటవలన భూమి, ఆకాశము, పాతాళములతో కూడుకొన్న జగత్తంతా తాను కూడా గుండ్రముగా తిరుగుచు మిక్కిలి వ్యాకులమయ్యెను.

త్రైలోక్యే సకలే విప్ర భ్రమమాణే సురర్షయః ।
దేవాశ్చ బ్రహ్మణా సార్ధం భాస్వన్తమభితుష్టువుః ॥47॥

ఓ విప్రుడా ! ముల్లోకములన్నియూ ఈ విధముగా గుండ్రముగా తిరుగుచుండగా దేవర్షులు, దేవతలు బ్రహ్మతో కూడా సూర్యభగవానుని స్తుతించిరి.

ఆదిదేవోఽసి దేవానాం జ్ఞాతమేతత్స్వరూపతః ।
సర్గస్థిత్యన్తకాలేషు త్రిధా భేదేన తిష్ఠసి ॥48॥

దేవుళ్ళలో ఆదిదేవుడవు నీవే. ఇది నీ స్వరూపమువల్ల తెలిసినది. సృష్టిస్థితిప్రళయకాలములందు నీవు ఆ మూడు విధములుగా స్థితుడవై యున్నావు.

స్వస్తి తేఽస్తు జగన్నాథ ! ఘర్మవర్షాహిమాకర ।
జుషస్వ శాన్తిం లోకానాం దేవదేవ దివాకర ॥49॥

ఓ సూర్యభగవానుడా ! జగన్నాథా ! నీకు మంగళమగుగాక ! వేడిమి, వర్షములు, మంచును చేయువాడా! ఓ దేవదేవా ! ముల్లోకములను శాంతి పరచుటయందు ప్రీతిని పొందుము.

ఇన్ద్రశ్చాగత్య తం దేవం లిఖ్యమానం యథాస్తువత్ ।
జయ దేవ జగద్వ్యాపిన్ జయాశేషజగత్పతే ॥50॥

ఇంద్రుడు సూర్యభగవానుని సమీపించి చక్రమందు గిరగిరా త్రిప్పబడుచున్న ఆ దేవుని ఈ విధముగా స్తుతించెను! ఓ దేవా ! నీకు జయమగుగాక ! జగత్తంతా వ్యాపించినవాడా ! సమస్తజగత్తులకు ప్రభువా ! నీకు జయమగుగాక !

ఋషయశ్చ తతః సప్త వసిష్ఠాత్రిపురోగమాః ।
తుష్టువుర్వివిధైః స్తోత్రైః స్వస్తి స్వస్తీతి వాదినః ॥51॥

వసిష్ఠుడు, అత్రి మొ॥గా గల సప్తర్షులు "నీకు మంగళమగుగాక ! నీకు మంగళమగుగాక !" అని పలుకుచూ వివిధస్తోత్రములతో సూర్యభగవానుని స్తుతించిరి.

వేదోక్తాభిరథాగ్ర్యాభిర్వాలఖిల్యాశ్చ తుష్టువుః ।
భాస్వన్తమృగ్భిరాద్యాభిర్లిఖ్యమానం ముదాయుతాః ॥52॥

సంతోషముతో నిండిన వాలఖిల్యగణాలు వేదోక్తములైన ఆద్యములైనట్టి గొప్ప ఋఙ్మంత్రములతో చక్రమందు త్రిప్పబడుచున్న ఆ తేజస్సును స్తుతించిరి.

త్వం నాథ మోక్షిణాం మోక్షో ధ్యేయస్త్వం ధ్యానినాం పరః ।
త్వం గతిః సర్వభూతానాం కర్మకాణ్డేఽపి వర్తతామ్ ॥53॥

మోక్షమును అభిలషించువారికి నీవు మోక్షస్వరూపుడవు. ధ్యానముచేయువారికి ధ్యేయమగు పరబ్రహ్మస్వరూపము నీవే. కర్మలను ఆచరించు సమస్తప్రాణులకు నీవే ఆధారము.

శం ప్రజాభ్యోఽస్తు దేవేశ శన్నోఽస్తు జగతాంపతే ।
శన్నోఽస్తు ద్విపదే నిత్యం శన్నశ్చాస్తు చతుష్పదే ॥54॥

ఓ దేవేశా ! ప్రజలందరికీ మంగళము కలుగుగాక ! ఓ జగత్ప్రభువా ! మా అందరికీ మంగళము కలుగుగాక! రెండు పాదములుగల మంత్రస్వరూపుడా ! మా కందరికీ ఎల్లప్పుడు మంగళము కలుగుగాక ! నాలుగుపాదములుగల మంత్రస్వరూపుడా ! మాకందరికీ మంగళము కలుగుగాక !

తతో విద్యాధరగణా యక్షరాక్షసపన్నగాః ।
కృతాఞ్జలిపుటాః సర్వే శిరోభిః ప్రణతా రవిమ్ ॥55॥

ఊచురేవంవిధా వాచో మనఃశ్రోత్రసుఖావహాః ।
సహ్యం భవతు తే తేజో భూతానాం భూతభావన ॥56॥

అటుపిమ్మట విద్యాధరగణములు, యక్షులు, రాక్షసులు, పన్నగములు చేతులు జోడించి, శిరస్సు వంచి నమస్కరించి మనస్సు, చెవికి సుఖమును కలిగించు ఈ వాక్కులను పలికిరి. "ప్రాణుల స్థితి మరియు వారి రక్షణలను చేయువాడా ! ఓ సూర్యభగవానుడా ! నీ తేజస్సు ప్రాణులందరికీ సహింపశక్యము అగుగాక !"

తతో హాహా హూహూశ్చైవ నారదస్తుమ్బురుస్తథా ।
ఉపగాయితుమారబ్ధా గాంధర్వం కుశలా రవిమ్ ॥57॥

షడ్జమధ్యమగాన్ధారగ్రామత్రయవిశారదాః ।
మూర్ఛనాభిశ్చ తానైశ్చ సంప్రయోగైః సుఖప్రదమ్ ॥58॥

అటుపిమ్మట సంగీతవిద్యాప్రవీణులు, షడ్జ, మధ్యమ, గాంధారములను మూడు గ్రామములందు విశారదులూ అయిన హాహాగణాలు, హూహూగణాలు, నారదుడు, తుంబురుడు వీరందరు మూర్ఛనలు, తాళములు, సంప్రయోగములతో సుఖము కలుగునట్లుగా సూర్యభగవానుని సమ్ముఖమున గానము చేయుటకు ప్రారంభించిరి.

విశ్వాచీ చ ఘృతాచీ చ ఉర్వశ్యథ తిలోత్తమా ।
మేనకా సహజన్యా చ రమ్భా చాప్సరసాంవరా ॥59॥

ననృతుర్జగతామీశే లిఖ్యమానే విభావసౌ ।
జ్ఞానభావవిలాసాఢ్యాన్ కుర్వన్తోఽభినయాన్బహూన్ ॥60॥

ముల్లోకములకు ప్రభువైన విభావసువగు సూర్యభగవానుని తేజస్సు ప్రజాపతిచేత త్రిప్పబడుచుండగా విశ్వాచి, ఘృతాచి, ఊర్వశి, తిలోత్తమ, మేనక, సహజన్య, అప్సరసలలో శ్రేష్ఠురాలైన రంభ వీరందరు హావభావవిలాసములతో సంపన్నమైన అనేక అభినయములను చేసిరి.

ప్రావాద్యన్త తతస్తత్ర వేణువీణాదిఝర్ఝరాః ।
పణవాః పుష్కరాశ్చైవ మృదఙ్గా పటహానకాః ॥61॥

దేవదున్దుభయః శంఖా శతశో౽థ సహస్రశః ।
గాయద్భిశ్చైవ గాంధర్వం నృత్యద్భిశ్చాప్సరోగణైః ॥62॥

తూర్యవాదిత్రఘోషైశ్చ సర్వం కోలాహలీకృతమ్ ।

అటు తర్వాత వేణువు, వీణ మొదలగు సంగీతవాయిద్యములు, పణవ, పుష్కర, మృదంగ, పటహ, అనక, దేవదుందుభి, శంఖ, మొదలగు వాద్యములు వందలకొలదీ వేలకొలదీ వాయింపబడెను. గాంధర్వమును గానము చేయువారితోనూ, నృత్యము చేయుచున్న అప్సరసల గణములచేతను, తూర్యవాదిత్రముల గొప్ప ధ్వనులచేతనూ జగత్తంతయు కోలాహలముగా చేయబడెను.

తతః కృతాఞ్జలిపుటా భక్తినమ్రాత్మమూర్తయః ॥63॥

లిఖ్యమానం సహస్రాంశుం ప్రణేముః సర్వదేవతాః ।
తతః కోలాహలే తస్మిన్ సర్వదేవసమాగమే ॥
తేజసః శాతనం చక్రే విశ్వకర్మా శనైః శనైః ॥64॥

అప్పుడు చేతులు జోడించుకొని, భక్తితో వంగిన దేహములు గలవారై సమస్తదేవతలు గుండ్రముగా త్రిప్పబడుచున్న సూర్యభగవానునికి నమస్కరించిరి. సమస్త దేవతల రాకతో ఆ కోలాహలమందు విశ్వకర్మ నెమ్మది నెమ్మదిగా ఆ సూర్యభగవానుని తేజస్సును సానపెట్టెను. అనగా ఆ తేజఃప్రభావము శాంతించెను.

ఇతి హిమజలఘర్మకాలహేతోర్హరకమలాసనవిష్ణుసంస్తుతస్య ।
తను పరిలిఖనం నిశమ్య భానోర్వ్రజతి దివాకరలోకమాయుషో౽న్తే ॥65॥

శిశిర, వర్ష, గ్రీష్మకాలములకు హేతువైనవాడూ, హరి, హర, విష్ణువులచే స్తుతింపబడినవాడూ అగు సూర్యభగవానుని తనుపరిలేఖనవృత్తాంతమును విన్నవారు మరణానంతరము సూర్యలోకమును పొందుదురు.

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే భానుతనులేఖనే త్ర్యధికశతతమో౽ధ్యాయః ॥103॥

శ్రీ మార్కండేయ మహాపురాణమందు భానుతనులేఖనమను అనగా సూర్యుని తేజస్సును తగ్గించుటయను నూటమూడవ అధ్యాయం సమాప్తం.



చతురధికశతతమోఽధ్యాయః – నూటనాలుగవ అధ్యాయం

సూర్యస్తవనమ్ – సూర్యస్తుతి

మార్కండేయ ఉవాచ :– మార్కండేయుడు చెప్పాడు.

లిఖ్యమానే తతో భానౌ విశ్వకర్మా ప్రజాపతిః ।
ఉద్భూతపులకః స్తోత్రమిదం చక్రే వివస్వతః ॥1॥

సూర్యభగవానుని తేజస్సును ప్రజాపతియగు విశ్వకర్మ లిఖించుచుండగా (సానపెట్టుచుండగా) పులకించిన శరీరముగలవాడై విశ్వకర్మ సూర్యభగవానుని ఈ విధముగా స్తుతించెను.

వివస్వతే ప్రాణహితానుకంపినే మహాత్మనే సమజవసప్తసప్తయే ।
సుతేజసే కమలకులావబోధినే నమస్తమఃపటలపటావపాటినే ॥2॥

నమస్కరించువారికి హితమును కలుగజేయువాడు, మహాత్ముడు, సమానమైన వేగముగల ఏడు అశ్వములు గలవాడు, గొప్ప తేజస్సుగలవాడు, కమలములను వికసింపచేయువాడు, అంధకారసమూహమును నశింపచేయువాడూ అగు సూర్యభగవానునికి నమస్కరించుచున్నాను.

పావనాతిశయపుణ్యకర్మణే నైకకామవిషయప్రదాయినే ।
భాస్వరానలమయూఖశాయినే సర్వలోకహితకారిణే నమః ॥3॥

పవిత్రమైన పుణ్యకర్మలను ఆచరించువాడు, అనేకములగు కోరికలను తీర్చువాడు, భాస్వరరూపము కలిగిన వహ్నిదేవుని కిరణములమధ్య శయనించువాడు, సమస్తలోకములకు హితమును చేయువాడూ అగు సూర్యదేవుని నమస్కరించుచున్నాను.

అజాయ లోకత్రయకారణాయ భూతాత్మనే గోపతయే వృషాయ ।
నమో మహాకారుణికోత్తమాయ సూర్యాయ చక్షుఃప్రభవాలయాయ ॥4॥

జన్మలేనివాడు, ముల్లోకములకు కారణభూతుడు, సమస్తప్రాణిస్వరూపుడు, గోపతి, వృషభస్వరూపుడు, కరుణామయులలో గొప్పవాడు, చక్షురుత్పత్తికి నిలయమైనవాడు అగు సూర్యభగవానునికి నమస్కరించుచున్నాను.

వివస్వతే జ్ఞానభృతేఽన్తరాత్మనే జగత్ప్రతిష్ఠాయ జగద్ధితైషిణే ।
స్వయమ్భువే లోకసమస్తచక్షుషే సురోత్తమాయామితతేజసే నమః ॥5॥

జ్ఞానవంతుడు, అంతరాత్మ, జగదాధారస్వరూపుడు, జగత్తుకు హితమును కోరువాడు, స్వయంభూస్వరూపుడు, సమస్తలోకములకు నేత్రస్వరూపుడు, దేవతలలో శ్రేష్ఠుడు, అమితమైన తేజస్సు కలవాడూ అగు సూర్యభగవానునికి నమస్కరించుచున్నాను.

క్షణముదయాచలమౌలిమణిః సురగణమహితహితో జగతః ।
త్వము మయూఖసహస్రవపుర్జగతి విభాసి తమాంసి నుదన్ ॥6॥

ఉదయాచలమస్తకమందు నీవు క్షణకాలము మణివై, దేవతలకు, జగత్తుకు హితుడవై, వేలకిరణముల శరీరధారివై, చీకట్లను నశింపచేయుచూ ప్రకాశించుచున్నావు.

భవతిమిరాసవపానమదాద్భవతి విలోహితవిగ్రహతా ।
మిహిర విభాసి యతః సుతరాం త్రిభువనభావనభాసికరైః ॥7॥

ఓ మహిరా ! సూర్యభగవానుడా ! నీవు జగత్తుయొక్క చీకట్లు అను మద్యమును త్రాగివేయుటచేత ఎఱ్ఱబడిన దేహము కలవాడవై, ముల్లోకములను అనునయపరచే ప్రకాశించుచున్న కిరణములు కలవాడవై మిక్కిలి ప్రకాశించుచున్నావు.

రథమధిరుహ్య సమావయవం చారువికమ్పితమురురుచిరమ్ ।
సతతమఖిన్నహయైర్భగవన్ చరసి జగద్ధితాయ వితతమ్ ॥8॥

ఓ భగవత్స్వరూపుడా ! నీవు ఎల్లప్పుడు జగత్తుకు హితమును కలుగజేయుటకు సమానమైన అవయవములు కలది, సుఖమును కలుగజేయు కంపనము (కదలిక) కలది, మిక్కిలి అందమైనది, ఖేదము లేనట్టి గుఱ్ఱములచే లాగబడుచున్నట్టిదీ అగు రథమునధిరోహించి విహరించుచున్నావు.

అమృతమయేన రసేన సమం విబుధపితౄనపి తర్పయసే ।
అరిగణసూదన తేన తవ ప్రణతిముపేత్య లిఖామి వపుః ॥9॥

శత్రుగణములను సంహరించువాడా ! ఓ సూర్యభగవానుడా ! అమృతమయమైన జలములతో నీవు ఒకేవిధముగా దేవతలను, పితృదేవతలనూ తృప్తులను చేయుచున్నావు. నీకు నేను నమస్కరించి నీ తేజశ్శరీరమునకు సాన పట్టుచున్నాను.

శుకసమవర్ణహయప్రథితం తవ పాదపాంసుపవిత్రతమమ్ ।
నతజనవత్సల మాం ప్రణతం త్రిభువనపావన పాహి రవే ॥10॥

నమస్కరించువారిపట్ల వాత్సల్యమును చూపువాడా ! ముల్లోకములను పావనము చేయువాడా ! ఓ సూర్యభగవానుడా! చిలుకల రంగువంటి రంగుగల అశ్వములను సృష్టించి ప్రసిద్ధుడను, నీ పాదరేణువుల స్పర్శచే మిక్కిలి పవిత్రుడను, నమస్కరించుచున్నవాడనూ అగు నన్ను రక్షించుము.

ఇతి సకలజగత్ప్రసూతిభూతం త్రిభువనభావనధామహేతుమేకమ్ ।
రవిమఖిలజగత్ప్రదీపభూతం త్రిదశవర ప్రణతోఽస్మి సర్వదా త్వామ్ ॥11॥

దేవతలందరిలో శ్రేష్ఠుడైనవాడా ! ఓ సూర్యభగవానుడా ! ఈ విధముగా సమస్త జగత్తులసృష్టికి కారణమైనవాడవు, ముల్లోకముల స్థితికి నిలయమైన ఒకే ఒక్కడవు, సమస్తజగత్తులకు దీపము వంటివాడవు, సూర్యదేవుడవూ అగు నిన్ను ఎల్లప్పుడు నమస్కరించుచున్నాను.

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే సూర్యస్తవనం నామ చతురధికశతతమోఽధ్యాయః ॥104॥

శ్రీ మార్కండేయ మహాపురాణమందలి సూర్యస్తుతియను నూటనాలుగవ అధ్యాయం సమాప్తం.

పఞ్చాధికశతతమోఽధ్యాయః - నూట అయిదవ అధ్యాయం
రవిమాహాత్మ్యవర్ణనమ్ - రవిమాహాత్మ్యవర్ణనం

మార్కండేయ ఉవాచ - మార్కండేయుడు చెప్పాడు.

> **ఏవం సూర్యస్తవం కుర్వన్విశ్వకర్మా దివస్పతేః ।**
> **తేజసః షోడశం భాగం మణ్డలస్థమధారయత్ ॥1॥**

ఈ విధముగా సూర్యదేవుని స్తుతిస్తూ విశ్వకర్మ ఆ దివస్పతియొక్క (పగటికి అధిపతి) తేజస్సులో పదహారవ భాగమును మండలమందు ధరింపజేసెను.

> **శాతితైస్తేజసో భాగైర్దశభిః పఞ్చభిస్తథా ।**
> **అతీవ కాన్తిమచ్చారు భానోరాసీత్తదా వపుః ॥2॥**

సానపెట్టబడిన పదిహేను తేజోభాగములు వేరగుట వలన సూర్యుని శరీరము అప్పుడు మిక్కిలి కాంతిమంతమై, సుందరముగా ఉండెను.

> **శాతితం చాస్య యత్తేజస్తేన చక్రం వినిర్మితమ్ ।**
> **విష్ణోః శూలం చ శర్వస్య శిబికా ధనదస్య చ ॥3॥**

> **దణ్డః ప్రేతపతేః శక్తిర్దేవసేనాపతేస్తథా ।**
> **అన్యేషాం చైవ దేవానామాయుధాని స విశ్వకృత్ ॥4॥**

> **చకార తేజసా భానోర్భాసురాణ్యరిశాన్తయే ।**
> **ఇతి శాతితతేజాః స శుశుభే నాతితేజసా ॥5॥**

సూర్యునినుండి వేరుచేయబడిన తేజస్సుచే విష్ణుమూర్తికి చక్రము నిర్మింపబడెను. ఇంకను సూర్యుని ఆ తేజస్సుతో శివునికి త్రిశూలమును, కుబేరునికి పల్లకిని, యమునికి దండమును, దేవసేనాపతియగు కార్తికేయునికి శక్తిని, ఇంకను మిగిలిన దేవతలకు ప్రకాశవంతములైన అనేక ఆయుధములను శత్రువినాశార్థమై ఆ విశ్వకర్మ నిర్మించెను. ఈ విధముగా సానపెట్టబడిన తేజస్సుతో అధికతేజస్సు లేనివాడై ఆ సూర్యుడు ప్రకాశించెను.

> **వపుర్దధార మార్తణ్డః సర్వావయవశోభనమ్ ।**
> **స దదర్శ సమాధిస్థః స్వాం భార్యాం వడవాకృతిమ్ ॥6॥**

> **అధృష్యాం సర్వభూతానాం తపసా నియమేన చ ।**
> **ఉత్తరాంశ్చ కురూన్ గత్వా భూత్వాఽశ్వో భానురాగమత్ ॥7॥**

మార్తండుడు (సూర్యుడు) తీవ్రమైన అధిక తేజస్సును విడుచుటచే అందమైన సమస్తావయవములు కలిగిన శరీరమును ధరించెను. అటుపిమ్మట అతడు సమాధియందుండి తపస్సునందు నియమాచరణయందు స్థిరచిత్తము కలిగినట్టి, ఆడగుర్రము రూపములో ఉన్న తన భార్యను చూచెను. పిమ్మట ఆ మార్తండుడు ఉత్తరకురుదేశములను గూర్చి వెళ్ళి అశ్వరూపమును ధరించెను.

సా చ దృష్ట్వా తమాయాన్తం పరపుంసో విశఙ్కయా ।
జగామ సమ్ముఖే తస్య పృష్ఠరక్షణతత్పరా ॥8॥

ఆడగుర్రము రూపములో ఉన్న ఆ సంజ్ఞాదేవి ఆ వచ్చుచున్నవానిని చూచి పరపురుషుడను శంకతో పృష్ఠరక్షణతత్పరురాలై (వెనుకభాగమందుండు యోనిస్థానము కనిపించకుండా ఉండుటకై) అతనికి ఎదురుగా వెళ్ళెను.

తతశ్చ నాసికాయోగం తయోస్తత్ర సమేతయోః ।
వడవాయాం చ తత్తేజో నాసికాభ్యాం వివస్వతః ॥9॥

దేవౌ తత్ర సముత్పన్నావశ్వినౌ భిషజాంవరౌ ।
నాసత్యదస్రౌ తనయావశ్వావక్త్రాద్వినిర్గతౌ ॥10॥

మార్తండస్య సుతావేతావశ్వరూపధరస్య హి ।

అప్పుడు ఒకరికొకరు సమీపమందుండుటచే ఆ ఇరువురి నాసికలు (ముక్కులు) కలిసెను. అంతట మగగుర్రము రూపములో ఉన్న ఆ సూర్యుని రెండు ముక్కుపుటలనుంచి తేజస్సు బయటకు వెలువడి ఆడగుర్రము రూపములో ఉన్న సంజ్ఞాదేవియందు ప్రవేశించెను. ఆ కారణముగా వైద్యశ్రేష్ఠులు, నాసత్యుడు దస్రుడు అను పేర్లుగల ఇరువురు కుమారులు అశ్విదేవతలు (అశ్వినీదేవతలు) ఆ ఆడగుర్రము ముఖమునుండి జన్మించిరి. ఈ ఇరువురే అశ్వరూపమును ధరించిన సూర్యభగవానుని కుమారులు.

రేతసోఽన్తే చ రేవన్తః ఖడ్గీ ధన్వీ తనుత్రధృక్ ॥11॥
అశ్వారూఢః సముద్భూతో బాణతూణసమన్వితః ।

మగగుర్రము రూపములోనున్న సూర్యభగవానుని వీర్యము యొక్క శేషభాగమునుండి ఖడ్గము, ధనుస్సు, శరీరకవచములను ధరించి, బాణములు అమ్ములపొదితో కూడుకొని అశ్వమును అధిరోహించిన రేవంతుడను కుమారుడు జన్మించెను.

తతః స్వరూపమమలం దర్శయామాస భానుమాన్ ॥12॥

తస్య శాన్తం సమాలోక్య సా రూపం ముదమాదదే ।
స్వరూపధారిణీం చేమాం స నినాయ నిజాలయమ్ ॥13॥

సంజ్ఞాం భార్యాం ప్రీతిమతీం భాస్కరో వారితస్కరః ।
తతః పూర్వసుతో యోఽస్యాః సోఽభూద్వైవస్వతో మనుః ॥14॥

అటుపిమ్మట మగగుర్రము రూపములోనున్న సూర్యభగవానుడు స్వచ్ఛమైన తన యథార్థరూపమును చూపించెను. ఆ సూర్యుని శాంతమైన రూపమును చూచి ఆమె (ఆడగుర్రము రూపములో ఉన్న సంజ్ఞాదేవి)

సంతోషించెను. యథార్థరూపమును ధరించిన తన భార్యయగు సంజ్ఞాదేవిని సూర్యభగవానుడు తన గృహమునకు తీసుకొనిపోయెను. అటు తర్వాత ఈమెయొక్క మొదటి కుమారుడు వైవస్వతుడు మనువు అయ్యెను.

ద్వితీయశ్చ యమః శాపాద్ధర్మదృష్టిరనుగ్రహాత్ ।
యమస్తు తేన శాపేన భృశం పీడితమానసః ॥15॥

ధర్మోఽభిరోచతే యస్మాద్ధర్మరాజస్తతః స్మృతః ।
కృమయో మాంసమాదాయ పాదతస్తే మహీతలమ్ ॥16॥

పతిష్యన్తీతి శాపాన్తం తస్య చక్రే పితా స్వయమ్ ।
ధర్మదృష్టిర్యతశ్చాసౌ సమో మిత్రే తథాఽహితే ॥17॥

సంజ్ఞాదేవియొక్క రెండవ కుమారుడగు యముడు ఛాయాదేవిచేత శపింపబడి, తన తండ్రియగు సూర్యభగవానుని అనుగ్రహమువలన ధర్మదృష్టిగలవాడు అయ్యెను. ఛాయాదేవి శాపము కారణముగా ఇతడు మిక్కిలి మనోవ్యథ కలవాడాయెను. ధర్మమునందుగల ప్రీతి కారణముచే ఇతడు ధర్మరాజుగా కీర్తింపబడెను. "క్రిములు నీ కాలినుండి మాంసమును గ్రహించి భూమిపై పడగలవు" అని శాపాంతమును తండ్రియగు సూర్యభగవానుడు స్వయముగా చేసెను. ధర్మదృష్టి కలవాడగుటచే ఇతడు స్నేహితులందు, శత్రువులందు ఒకే విధముగా ఉండెను.

తతో నియోగే తం యామ్యే చకార తిమిరాపహః ।
తస్మై దదౌ పితా విప్ర భగవాంల్లోకపాలతామ్ ॥18॥

పితౄణామాధిపత్యం చ పరితుష్టో దివాకరః ।
యమునాం చ నదీం చక్రే కలిందాన్తరవాహినీమ్ ॥19॥

ఈ కారణముచే సూర్యుడు అతడిని దక్షిణదిక్కుయొక్క అధికారమందు నియమించెను. ఓ బ్రాహ్మణుడా ! భగవంతుడైన తండ్రియగు సూర్యుడు అతడికి లోకపాలనాధికారమునిచ్చెను. ఇంకనూ సంతోషించిన సూర్యభగవానుడు అతడికి పితృదేవతలపై ఆధిపత్యమునుగూడ ఇచ్చెను. తన కుమార్తెయగు యమునను కలిందపర్వతమునుండి ప్రవహించు యమునానదిగా చేసెను.

అశ్వినౌ దేవభిషజౌ కృతౌ పిత్రా మహాత్మనా ।
గుహ్యకాధిపతిత్వే చ రేవన్తో వినియోజితః ॥20॥

తండ్రియగు మహాత్ముడైన సూర్యభగవానుడు తన ఇరువురు అశ్వికుమారులను దేవతలకు వైద్యులుగా నియమించెను. గుహ్యకులకు అధిపతిగా రేవంతుని నియమించెను.

ఏవమప్యాహ చ తతో భగవాంల్లోకభావితః ।
త్వమప్యశేషలోకస్య పూజ్యో వత్స భవిష్యసి ॥21॥

ఇంకనూ లోకములచే పూజింపబడిన సూర్యభగవానుడు ఆ రేవంతునితో ఇట్లు పలికెను. "ఓ కుమారా ! నీవు కూడా సమస్తలోకములకు పూజనీయుడవు కాగలవు.

అరణ్యాదిమహాదావవైరిదస్యుభయేషు చ ।
త్వాం స్మరిష్యన్తి యే మర్త్యా మోక్ష్యన్తే తే మహాపదః ॥22॥

అడవులు, శత్రువులు, చోరులు మొ॥వాటిచేత భయమునొందిన మానవులు నిన్ను స్మరించినంతనే వారు ఆ ఆపదలనుండి విముక్తులగుదురు.

క్షేమం బుద్ధిం సుఖం రాజ్యమారోగ్యం కీర్తిమున్నతిమ్ ।
నరాణాం పరితుష్టస్త్వం పూజితః సంప్రదాస్యసి ॥23॥

ఇంకనూ మానవులచేత పూజింపబడి, సంతుష్టుడవైన నీవు వారికి క్షేమము, బుద్ధి, సుఖము, రాజ్యము, ఆరోగ్యము, కీర్తి, ఔన్నత్యములను ఇచ్చెదవు.

ఛాయాసంజ్ఞాసుతశ్చాపి సావర్ణిః సుమహాయశాః ।
భావ్యః సోఽనాగతే కాలే మనుః సావర్ణికోఽష్టమః ॥24॥

ఛాయాసంజ్ఞాదేవియొక్క కుమారుడగు సావర్ణి కూడా గొప్ప కీర్తిమంతుడై భవిష్యత్తులో సావర్ణికుడను పేరుతో ఎనిమిదవ మనువు అగును.

మేరుపృష్ఠే తపో ఘోరమద్యాపి చరతి ప్రభుః ।
భ్రాతా శనైశ్చరస్తస్య గ్రహోఽభూచ్ఛాసనాద్రవేః ॥25॥

ఈ సమయమందు ప్రభువగు ఆ సావర్ణి మేరుపర్వతమందు ఘోరతపస్సును ఆచరించుచున్నాడు. అతని సోదరుడగు శనైశ్చరుడు సూర్యుని ఆజ్ఞచే గ్రహమయ్యెను.

యవీయసీ తు యా కన్యాఽదిత్యస్యాభూద్ద్విజోత్తమ ।
అభవత్సా సరిచ్ఛ్రేష్ఠా తపతీ లోకపావనీ ॥26॥

ఓ బ్రాహ్మణశ్రేష్ఠుడా ! అందరిలోనూ చిన్నదియగు ఆ ఆదిత్యుని కుమార్తె యమున తపస్సు ఆచరించుచూ, లోకములను పవిత్రము చేయుచూ శ్రేష్ఠమైన నది ఆయెను.

యస్తు జ్యేష్ఠో మహాభాగః సర్గో యస్యేహ సాంప్రతమ్ ।
విస్తరం తస్య వక్ష్యామి మనోర్వైవస్వతస్య హ ॥27॥

ఇక మహానుభావుడైన జ్యేష్ఠకుమారుడగు వైవస్వతుని వృత్తాంతమును నీకు విస్తారముగా చెప్పెదను. అతని సృష్టియే ప్రస్తుతమున్నది.

ఇదం యో జన్మ దేవానాం శృణుయాద్వా పఠేత వా ।
వివస్వతస్తనూజానాం రవేర్మాహాత్మ్యమేవ చ ॥28॥

ఆపదం ప్రాప్య ముచ్యేత ప్రాప్నుయాచ్చ మహాయశః ।
అహోరాత్రకృతం పాపమేతచ్ఛమయతే శ్రుతమ్ ॥
మాహాత్మ్యమాదిదేవస్య మార్తణ్డస్య మహాత్మనః ॥29॥

సూర్యపుత్రులగు దేవతల జన్మవృత్తాంతమును మరియు సూర్యభగవానుని మాహాత్మ్యమును విన్నవారు, చదివినవారు తమకు సంభవించిన ఆపదలనుండి విముక్తులగుదురు. గొప్ప కీర్తిని పొందెదరు. ఆదిదేవుడగు మహాత్ముడైన మార్తండుని (సూర్యభగవానుని) మాహాత్మ్యమును విన్నంతమాత్రముననే రాత్రింబవళ్ళు చేసిన పాపములు నశించును.

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే రవేర్మాహాత్మ్యవర్ణనం నామ పఞ్చాధికశతతమోఽధ్యాయః ॥105

శ్రీ మార్కండేయ మహాపురాణమందలి రవిమాహాత్మ్యవర్ణనము నూటఅయిదవ అధ్యాయం సమాప్తం.



షడధికశతతమోఽధ్యాయః – నూటఆరవ అధ్యాయం

భానుస్తవః – సూర్యస్తవం

క్రౌష్టుకిరువాచ – క్రౌష్టుకి చెప్పాడు.

భగవన్ కథితః సమ్యగ్భానోః సన్తతిసమ్భవః ।
మాహాత్మ్యమాదిదేవస్య స్వరూపఞ్చాతివిస్తరాత్ ॥1॥

ఓ పూజ్యుడా ! నీవు సూర్యభగవానునికి సంతానము కలుగుటను, మరియు ఆ ఆదిదేవుని మాహాత్మ్యమును, స్వరూపమును చక్కగా అతివిస్తారముగా వర్ణించి చెప్పినావు.

భూయోఽపి భాస్వతః సమ్యఙ్మాహాత్మ్యం మునిసత్తమ ।
శ్రోతుమిచ్ఛామ్యహం తన్మే ప్రసన్నో వక్తుమర్హసి ॥2॥

ఓ మునిశ్రేష్ఠుడా ! ఇంకనూ నేను ఆ సూర్యభగవానుని మాహాత్మ్యమును బాగుగా వినవలెనని కోరుకొనుచున్నాను. కావున నాయందు ప్రసన్నుడవై వర్ణించి చెప్పు.

మార్కండేయ ఉవాచ :– మార్కండేయుడు చెప్పాడు.

శ్రూయతామాదిదేవస్య మాహాత్మ్యం కథయామి తే ।
వివస్వతో యచ్చకార పూర్వమారాధితో జనైః ॥3॥

ఆదిదేవుడగు వివస్వంతుని మాహాత్మ్యమును, జనులచేత ఆరాధింపబడిన ఆ దేవుడు ఏమేమి చేసెనో ఆ విషయములను చెప్పెదను, వినుము.

దమస్య పుత్రో విఖ్యాతో రాజాభూద్రాజ్యవర్ధనః ।
స సమ్యక్పాలనం చక్రే పృథివ్యా పృథివీపతిః ॥4॥

దమునియొక్క పుత్రుడును, కీర్తిమంతుడునూ అగు రాజ్యవర్ధనుడను రాజుండెను. అతడు భూమండలమునకు ప్రభువై, బాగుగా రాజ్యపరిపాలనము చేసెను.

ధర్మతః పాల్యమానం తు తేన రాష్ట్రం మహాత్మనా ।
వవృధేఽనుదినం విప్ర జనేన చ ధనేన చ ॥5॥

ఓ బ్రాహ్మణుడా ! మహాత్ముడగు ఆ రాజు ధర్మబద్ధంగా రాజ్యపరిపాలనము చేయుచుండగా, ప్రతిదినము జనులతోను, ధనముతోను ఆ రాష్ట్రము అభివృద్ధి చెందెను.

హృష్టపుష్టమతీవాసీత్తస్మిన్రాజన్యశేషతః ।
నిర్భయః సకలశ్చోర్వ్యాం పౌరజానపదో జనః ॥6॥

అతడు రాజై ఉండగా సమస్తము హర్షముతోనూ, పుష్టితోనూ కూడియుండెను. గ్రామ, పట్టణములందలి జనులందరూ ఈ భూమండలమందు భయములేనివారై ఉండిరి.

నోపసర్గో న చ వ్యాధిర్న చ వ్యాలోద్భవం భయమ్ ।
న చావృష్టిభయం తత్ర దమపుత్రే మహీపతౌ ॥7॥

దమపుత్రుడగు ఆ రాజ్యవర్ధనుడు రాజై ఉండగా ఆ రాజ్యమందు ఉపద్రవములుగాని, వ్యాధులుగాని, సర్పాది క్రూరజంతువులవల్ల వర్షాభావమువల్లా సంభవించే భయము గాని లేదు.

స ఈజే చ మహాయజ్ఞైర్దదౌ దానాని చార్థినామ్ ।
సుధర్మస్యావిరోధేన బుభుజే విషయానపి ॥8॥

ఆ రాజ్యవర్ధనుడు గొప్ప యజ్ఞములను చేసెను. యాచకులకు దానములను చేసెను. తన ధర్మమునకు విరోధము లేకుండగా విషయములను కూడా అనుభవించెను.

తస్యైవం కుర్వతో రాజ్యం సమ్యక్పాలయతః ప్రజాః ।
సప్త వర్షసహస్రాణి జగ్మురేకమహర్యథా ॥9॥

ఈ విధముగా ఆ రాజు రాజ్యపరిపాలనము చేయుచూ, బాగుగా ప్రజలను రక్షించుచుండగా అతడికి ఏడు వేల సంవత్సరములు ఒక రోజువలె గడిచిపోయెను.

విదూరథస్య తనయా దాక్షిణాత్యస్య భూభృతః ।
తస్య పత్నీ బభూవాథ మానినీ నామ మానినీ ॥10॥

దక్షిణదేశపురాజైన విదూరథుని కుమార్తె మరియు అభిమానవతి అగు మానిని రాజ్యవర్ధనునికి భార్య ఆయెను.

కదాచిత్తస్య సా సుభ్రూః శిరసోఽభ్యఙ్గనాదృతా ।
పశ్యతో రాజలోకస్య ముమోచాశ్రూణి మానినీ ॥11॥

చక్కని కనుబొమలుగల ఆ మానిని ఒకనాడు రాజుయొక్క శిరస్సుకు తైలము పూయుటయందు ఆదరముతో ఉండగా అనగా తైలాదిమర్దనము చేయు సమయమందు అందరూ చూచుండగా కన్నీళ్ళను విడిచెను.

తదశ్రుబిన్దవో గాత్రే యదా తస్య మహీపతేః ।
తదా వీక్ష్యాశ్రువదనాం తామపృచ్ఛత మానినీమ్ ॥12॥

ఆ కన్నీళ్ళు ఎప్పుడయితే రాజుయొక్క శరీరమందు పడినవో అప్పుడు కన్నీళ్ళతో కూడిన ముఖముగల మానినిని అందుకు కారణమడిగెను.

నిశ్శబ్దమశ్రుమోక్షేణ రుదన్తీం తాం విలోక్య వై ।
కిమేతదితి పప్రచ్ఛ మానినీం రాజ్యవర్ధనః ॥13॥

నిశ్శబ్దముగా కన్నీళ్ళు కార్చుచూ ఏడ్చుచున్న ఆమెను చూచి, 'ఎందుకు ఏడ్చుచున్నా'వని రాజ్యవర్ధనుడు ఆ మానినిని అడిగెను.

పృష్టా సా తు తతస్తేన భర్త్రా ప్రాహ మనస్వినీ ।
న కిఞ్చిదితి తాం భూయః పప్రచ్ఛ స మహీపతిః ॥14॥

రాజు ఈ విధముగా ప్రశ్నించగా అభిమానవతియగు ఆమె "ఏమీ లేదు" అని బదులిచ్చెను. తిరిగి ఆ రాజు ఆమెను ఎందుకు ఏడ్చుచున్నావని అడిగెను.

బహుశః పృచ్ఛతస్తస్య భూభృతః సా సుమధ్యమా ।
దర్శయామాస పలితం కేశభారాన్తరోద్భవమ్ ॥15॥

రాజు ఈ విధముగా పెక్కుమార్లు అడుగుచుండగా, అందమైన నడుముగల ఆమె ఆ రాజుయొక్క శిరస్సునందలి కేశములనుండి ఒక తెల్లని కేశమును (వెంట్రుకను) తీసి చూపించెను.

ఏతత్పశ్యేతి భూపాల కిమన్యన్మన్యుకారణమ్ ।
మమాతిమన్దభాగ్యాయా జహాసాథ నృపస్తతః ॥16॥

"ఓ రాజా ! దీనిని నీవు చూడుము. ఇంతకంటే దుఃఖకారణము దురదృష్టవంతురాలనైన నాకు ఇంకేమి ఉండును?" అని ఆమె పలికెను. అది విని రాజు పెద్దగా నవ్వెను.

స విహస్యాహ తాం పత్నీం శృణ్వతాం సర్వభూభృతామ్ ।
పౌరాణాం చ మహీపాలా యే తత్రాసన్సమావృతాః ॥17॥

రాజు నవ్వుతూ అందరు రాజులు, పౌరులు, అచ్చటకు వచ్చిన రాజులు వీరందరు వినుచుండగా ఇట్లు పలికెను.

శోకేనాలం విశాలాక్షి రోదితవ్యం న తే శుభే ।
జన్మర్ద్ధిపరిణామాద్యా వికారాః సర్వజన్తుషు ॥18॥

ఓ విశాలమైన కన్నులుగలదానా ! నీవు దుఃఖించవద్దు. ఓ మంగళస్వరూపురాలా ! నీవు రోదించుట తగదు. పుట్టుట, పెరుగుట, మార్పు చెందుట మొదలగునవి సమస్తప్రాణులయందు ఉండును.

అధీతాః సకలా వేదా ఇష్టాయజ్ఞాః సహస్రశః ।
దత్తం ద్విజానాం పుత్రాశ్చ సముత్పన్నా వరాననే ॥19॥

ఓ అందమైన ముఖముగలదానా ! నేను సమస్తవేదములను అధ్యయనము చేసితిని. వేలకొలది యజ్ఞములను ఆచరించితిని. బ్రాహ్మణులకు దానములను చేసితిని. పుత్రులను పొందితిని.

భుక్తా భోగాస్త్వయా సార్ధం యే మర్త్యైరతిదుర్లభాః ।
సమ్యక్చ పాలితా పృథ్వీ శౌర్యం యుద్ధేష్వనుష్ఠితమ్ ॥20॥

మానవులకు మిక్కిలి దుర్లభములైనట్టి భోగములను నీతోకూడా నేను అనుభవించితిని. బాగుగా భూమండలమును పరిపాలించితిని. యుద్ధములందు పరాక్రమమును ప్రదర్శించితిని.

మిత్రైః సహేష్టైర్హసితం విహృతం చ వనాన్తరే ।
కిమన్యన్న కృతం భద్రే పలితేభ్యో బిభేషి యత్ ॥21॥

ఓ భద్రురాలా ! నాకిష్టమైన స్నేహితులతో కూడి పరిహాసములను వనవిహారములను చేసితిని. ఇక నేను చేయవలసినదేమున్నది? నా నెరసిన వెంట్రుకలను చూచి ఎందుకు భయపడుచున్నావు?

భవన్తు కేశాః పలితా వలయః సన్తు మే శుభే ।
శైథిల్యమేతు మే కాయః కృతకృత్యోఽస్మి మానిని ॥22॥

ఓ మంగళస్వరూపురాలా ! నా కేశములు తెల్లబడితే తెల్లబడనీ ! శరీరము ముడతలుబడితే బడనీ ! నా శరీరము శైథిల్యమును పొందితే పొందనీ! ఓ మానినీ ! నేను సర్వవిధాలా కృతకృత్యుడను అయితిని.

మూర్ధ్ని యద్దర్శితం భద్రే భవత్యా పలితం మమ ।
చికిత్సామేవ తస్యాహం కరోమి వనసంశ్రయాత్ ॥23॥

ఓ భద్రురాలా! నీవు చూపించిన నా నెరసిన జుట్టుకు నేను వనమును ఆశ్రయించి చికిత్సను చేయుదును.

బాల్యే బాలక్రియా పూర్వం తద్వత్కౌమారకే చ యా ।
యౌవనే చాపి యా యోగ్యా వార్ధకే వనసంశ్రయా ॥24॥

ఏవం మత్పూర్వజైర్భద్రే కృతం త్వత్పూర్వజైశ్చ యత్ ।
అతో న తేఽశ్రుపాతస్య కిఞ్చిత్పశ్యామి కారణమ్ ॥25॥

మొదటిగా బాల్యమందు బాలచేష్టలు, తరువాత కౌమారావస్థలోని పనులు, అటుపిమ్మట యౌవనమందు అందుకు తగిన పనులు, వార్ధక్యమందు వనవాసము తగినవి. ఈ విధముగా నా పూర్వజులు, నీ పూర్వజులు అందరు అట్టి పనులను ఆచరించిరి. శరీరధారులకు ఈ విధమైన చేష్టలు సహజమైనవి గావున నీవు కన్నీళ్ళు కార్చుటకు కారణమును దేనినీ నేను చూచుట లేదు.

అలం తే మన్యునా భద్రే నన్వభ్యుదయకారి మే ।
దర్శనం పలితస్యాస్య మా రోదీర్నిష్ప్రయోజనమ్ ॥26॥

ఓ భద్రురాలా ! నీవిక శోకించుట చాలును. వెంట్రుకలు నెరియుట కూడా నాకు అభ్యుదయమును కల్గించదా ఏమి? ప్రయోజనము (కారణము) లేకుండగా నీవు రోదించవలదు.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

తతః ప్రణమ్య తం భూపాః పౌరాశ్చైవ సమీపగాః ।
సామ్నా ప్రోచుర్మహీపాలా మహర్షే రాజ్యవర్ధనమ్ ॥27॥

ఓ మహర్షీ (క్రౌష్టుకిమునీ!) అచ్చట సమావిష్టులైన రాజులు, పౌరులూ అందరు రాజ్యవర్ధనునితో అనునయవాక్యములను ఈ విధముగా పలికిరి.

న రోదితవ్యమనయా తవ పత్న్యా నరాధిప ।
రోదితవ్యమిహాస్మాభిరథవా సర్వజన్తుభిః ॥28॥

ఓ మహారాజా ! నీ భార్య ఈ విధముగా ఏడ్చుట అవసరము లేదు. నీవు మమ్ములను విడిచి అరణ్యములకు వెళ్ళెదనను మాటలను విన్న మేము లేదా సమస్తప్రాణులు రోదించవలెను (దుఃఖించవలెను).

త్వం బ్రవీషి యథా నాథ వనవాసాశ్రితం వచః ।
పతన్తి తేన నః ప్రాణా లాలితానాం త్వయా నృప ॥29॥

ఓ నాథా! వనవాసనమునకు వెళ్ళెదనని నీవు పలుకుచున్నావు. ఓ రాజా ! ఆ మాటలను విన్నందువలన నీచే లాలింపబడిన మా ప్రాణములు పోవుచున్నవి.

సర్వే యాస్యామహే భూప యది యాతి భవాన్వనమ్ ।
తతోఽశేషక్రియాహానిః సర్వపృథ్వీనివాసినామ్ ॥30॥

ఓ రాజా ! నీవు వనవాసముకొరకై అరణ్యములకు వెళ్ళినచో మేము కూడా నీతో వచ్చెదము. నీవు మమ్ములను విడిచి వనవాసమునకు వెళ్ళినచో సమస్త పృథివీవాసులకు సమస్త శ్రౌతస్మార్తాది క్రియలకు హాని కలుగును.

భవిష్యతి న సన్దేహస్త్వయి నాథ వనాశ్రయే ।
స చ ధర్మోపఘాతాయ యది తత్త్వవిముచ్యతామ్ ॥31॥

ఓ నాథా ! నీవు వనములను ఆశ్రయించినచో తప్పక ధర్మమునకు విఘాతము కలుగును. కావున ఆ ఆలోచనను మానుకొనుము.

సప్త వర్షసహస్రాణి త్వయేయం పాలితా మహీ ।
తత్సముత్థం మహాపుణ్యమాలోకయ నరాధిప ॥32॥

ఓ మహారాజా ! ఏడువేల సంవత్సరాలు నీవు ఈ భూమిని పరిపాలించితివి. దానివల్ల నీకు సంభవించిన పుణ్యమును ఒకసారి ఆలోచించుము.

వనే వసన్మహారాజ త్వం కరిష్యసి యత్తపః ।
తన్మహీపాలనస్యాస్య కలాం నార్హతి షోడశీమ్ ॥33॥

ఓ మహారాజా! వనవాసము చేయుచూ నీవు చేయబోవు తపస్సు ఈ పృథివీపరిపాలనముయొక్క పదహారవ భాగమునకు కూడా సమానము కాదు.

రాజోవాచ – రాజు పలికాడు.

సప్త వర్షసహస్రాణి మయేయం పాలితా మహీ ।
ఇదానీం వనవాసస్య మమ కాలోఽయమాగతః ॥34॥

ఏడువేల సంవత్సరాలు నేనీ భూమిని పరిపాలించితిని. ఇప్పుడు నేను వనవాసము చేయుటకు సమయము ఆసన్నమైనది.

మమాపత్యాని జాతాని దృష్ట్వా మేఒపత్యసన్తతీః ।
స్వల్పైరేవమహోభిర్మే హ్యన్తకో న సహిష్యతి ॥35॥

నాకు పుత్రులు కలిగిరి. వారి సంతానమును కూడా నేను చూచితిని. యముడు కొన్ని అల్పమైన రోజులను కూడా సహించదు. అనగా నా ఆయువు పూర్తియగును.

యదేతత్పలితం మూర్ధ్ని తద్విజానీత నాగరాః ।
దూతభూతమనార్యస్య మృత్యోరత్యుగ్రకర్మణః ॥36॥

ఓ ప్రజలారా ! నా శిరస్సుపై తెల్లని వెంట్రుకలను అనార్యుడు (పూజింపతగినవాడు కానివాడు), భయంకరమైన కర్మను చేయువాడూ అగు మృత్యువుయొక్క దూతగా మీరు తెలుసుకొనుడు.

సోఒహం రాజ్యే సుతం కృత్వా భోగాంస్త్యక్త్వా వనాశ్రయః ।
తపస్తప్స్యే సమాయాన్తి న యావద్యమసైనికాః ॥37॥

అట్టి నేను నా కుమారునికి రాజ్యభారమును అప్పగించి, భోగములను విడిచిపెట్టి, వనమును ఆశ్రయించినవాడనై యమభటులు రానంతవరకు తపస్సునాచరించెదను.

మార్కండేయ ఉవాచ :– మార్కండేయుడు చెప్పాడు.

తతో యియాసుః స వనం దైవజ్ఞానవనీపతిః ।
పుత్రరాజ్యాభిషేకాయ దినలగ్నాన్యపృచ్ఛత ॥38॥

అంతట ఆ రాజు వనమునకు వెళ్ళదలచి తన పుత్రుని రాజ్యాభిషిక్తుని గావించుటకై దైవజ్ఞులను దినలగ్నములను (ముహూర్తమును) అడిగెను.

శ్రుత్వా చ తే తు నృపతేర్వచో వ్యాకులచేతసః ।
దినం లగ్నం చ హోరాశ్చ న విదుః శాస్త్రదృష్టయః ॥39॥

శాస్త్రదృష్టి కలిగిన ఆ జ్యోతిషపండితులు రాజు పలికిన మాటలను విని, వ్యాకులము చెందిన చిత్తములు గలవారై ముహూర్తము కొరకైన మంచి దినమును, లగ్నమును, హోరాకాలమును తెలుసుకొనలేకపోయిరి.

ఊచుశ్చ తం మహీపాలం దైవజ్ఞా బాష్పగద్గదమ్ ।
జ్ఞానాని నః ప్రణష్టాని శ్రుత్వైతత్తే వచో నృప ॥40॥

దైవజ్ఞులు కన్నీళ్ళచేత గద్గదస్వరముగలవారై ఆ రాజునుగూర్చి ఇట్లు పలికిరి. 'ఓ రాజా ! మీరు పలికిన మాటలను వినుటతో మా జ్ఞానములన్నియు నశించినవి.'

తతోఽన్యనగరేభ్యశ్చ భృత్యై రాష్ట్రేభ్య ఏవ చ ।
తతస్తస్మాచ్చ నగరాత్ప్రాచుర్యేణాభ్యుపాగమన్ ॥41॥

ఆ సమయమందు ఇతర నగరములనుంచి, రాజ్యవర్ధనుని అధీనములోనున్న ఇతర రాష్ట్రములనుంచి, రాజ్యవర్ధనుని నగరమునుంచి అనేకమంది ప్రజలు అచ్చటకు వచ్చిరి.

సముత్పత్య మహీపాలం తం యియాసుం మునే వనమ్ ।
ప్రకమ్పిశిరసో భూత్వా ప్రోచుర్బ్రాహ్మణసత్తమాః ॥42॥

ఓ మునీ ! వనమునకు వెళ్ళ ఇచ్ఛగించిన ఆ మహారాజును బ్రాహ్మణశ్రేష్ఠులు వేగముగా సమీపించి కంపించుచున్న శిరస్సులు గలవారై ఈ విధముగా పలికిరి.

ప్రసీద పాహి నో రాజన్ పాలితాః స్మ యథా పురా ।
సీదిష్యత్యఖిలో లోకస్త్వయి భూప వనాశ్రయే ॥43॥

ఓ మహారాజా ! మాపై దయ చూపుము. మేమింతవరకు నీచే పాలించబడితిమి. ఓ రాజా ! నీవు వనవాసమునకు వెళ్ళినచో సమస్తలోకము దుఃఖములో మునగగలదు.

త్వం కురుష్వ తథా రాజన్యథా నో సీదతే జగత్ ।
యావజ్జీవామహే వీర స్వల్పకాలమిమే వయమ్ ॥
నేచ్ఛామశ్చ భవచ్ఛూన్యం ద్రష్టుం సింహాసనం విభో ॥44॥

ఓ మహారాజా ! అందువలన ఈ లోకము ఏ విధముగా దుఃఖమును పొందదో అట్టిదానిని మీరు ఆచరింపుడు. ఓ వీరుడా ! అట్లు మీరు ఆచరించినచో మేము మరికొంత అల్పకాలమైనా జీవించగలము. ఓ విభుస్వరూపుడా ! మీరు లేని సింహాసనమును చూచుటకు మేము కోరుకొనుట లేదు.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

ఇత్యేవం తైస్తథాన్యైశ్చ ద్విజైః పౌరపురస్సరైః ।
భూపైర్భృత్యైరమాత్యైశ్చ రాజా ప్రోక్తః పునః పునః ॥45॥

ఈ విధముగా ఆ బ్రాహ్మణశ్రేష్ఠులు, ఇంకా మిగిలిన ద్విజులు, పౌరులు, రాజులు, అమాత్యులు మరల మరల ఆ మహారాజును గూర్చి పలికిరి.

వనవాసవినిర్బన్ధం నోపసంహరతే యదా ।
క్షమిష్యత్యన్తకో నేతి దదౌ స చ తదోత్తరమ్ ॥46॥

వనవాసమునకు వెళ్ళవలెనను నిశ్చయమును ఆ రాజ్యవర్ధనుడు మానుకొనలేదు. మరియు "నన్ను ఆ మృత్యుదేవత క్షమించదు" అని కూడా ఆ రాజు బదులిచ్చెను.

తతో௨మాత్యాశ్చ భూపాశ్చ పౌరవృద్ధాస్తథా ద్విజాః ।
సమేత్య మన్త్రయామాసుః కిమత్ర క్రియతామితి ॥47॥

అంతట మంత్రులు, సామంతరాజులు, పురజనులు, వృద్ధులు, బ్రాహ్మణులు అందరూ కలిసి "ఇప్పుడేమి చేయవలెను" అని ఆలోచించసాగిరి.

తేషాం మన్త్రయతాం విప్ర నిశ్చయో௨యమజాయత।
అనురాగవతాం తత్ర మహీపాలే௨తిధార్మికే ॥48॥

సమ్యగ్ధ్యానపరా భూత్వా ప్రార్థయామః సమాహితాః ।
తపసారాధ్య భాస్వన్తమాయురస్య మహీపతేః ॥49॥

ఓ విప్రుడా ! ఆ విధముగా మిక్కిలి ధార్మికుడైన మహారాజగు రాజ్యవర్ధనునియందు అనురాగము కలిగిన వారందరు పరస్పరము ఆలోచించసాగిరి. అప్పుడు వారికి "మనమందరం కలిసి ఏకాగ్రచిత్తులమై ఈ మహారాజునకు ఆయుర్దాయమును ఇమ్మని సూర్యభగవానుని తపస్సుతో ఆరాధించి ప్రార్థించెదము" అను నిశ్చయము కలిగెను.

తత్రైకనిశ్చయాః కార్యే కేచిద్గేహే చ భాస్కరమ్ ।
సమ్యగర్ఘ్యోపచారాద్యైరుపహారైరపూజయన్ ॥50॥

అంతట వారందరూ ఈ కార్యమందు ఒకే నిశ్చయము కలిగినవారైరి. వారిలో కొందరు అర్ఘ్యములు, ఉపచారములు మొదలగు ఉపహారములతో సూర్యభగవానుని బాగుగా పూజించిరి.

అపరే మౌనినో భూత్వా ఋగ్జాపేన తథా௨పరే ।
యజుషామథ సామ్నాం చ తోషయాఞ్చక్రిరే రవిమ్ ॥51॥

వారిలో కొందరు మౌనమును పాటించి, మరికొందరు ఋగ్యజుస్సామమంత్రములతోనూ సూర్యభగవానుని సంతోషపరచిరి.

అపరే చ నిరాహారా నదీపులినశాయినః ।
తపాంసి చక్రురిచ్ఛన్తో భాస్కరారాధనం ద్విజాః ॥52॥

వారిలో మరికొంతమంది బ్రాహ్మణులు ఆహారమును తీసుకొనక ఆయా నదుల ఇసుకతిన్నెలపై శయనించువారై సూర్యభగవానుని ఆరాధనమును కోరుకొనుచూ తపస్సులను ఆచరించిరి.

అగ్నిహోత్రపరాశ్చాన్యే రవిసూక్తాన్యహర్నిశమ్ ।
జేపుస్తత్రాపరే తస్థుర్భాస్కరే న్యస్తదృష్టయః ॥53॥

మరికొంతమంది అగ్నిహోత్రములను ఆచరించుచూ రాత్రింబవళ్ళు సూర్యసూక్తములను జపించసాగిరి. మరికొంతమంది సూర్యునియందే తదేకదృష్టిగలవారై నిలిచిరి.

ఇత్యేవమతినిర్బన్ధం భాస్కరారాధనం ప్రతి ।
బహుప్రకారం చక్రుస్తే తం తం విధిముపాశ్రితాః ॥54॥

ఈ విధముగా సూర్యుని ఆరాధించుటయందు దృఢసంకల్పము కలిగినవారై ఆయా విధులననుసరించి అనేకవిధముల ప్రయత్నములను చేయసాగిరి.

తథా తు యతతాం తేషాం భాస్కరారాధనం ప్రతి ।
సుదామా నామ గన్ధర్వ ఉపగమ్యేదమబ్రవీత్ ॥55॥

ఈ విధముగా వారందరు భాస్కరుని ఆరాధించుటయందు ప్రయత్నము గలవారై ఉండగా, సుదాముడను గంధర్వుడు వారివద్దకు వచ్చి ఇట్లు పలికెను.

యద్యారాధనమిష్టం నో భాస్కరస్య ద్విజాతయః ।
తదేతత్క్రియతాం యేన భానుః ప్రీతిముపైష్యతి ॥56॥

ఓ బ్రాహ్మణులారా ! మీకు భాస్కరుని ఆరాధించుటయందు ప్రీతియున్నచో అట్టి కార్యమునే ఆచరింపుడు. ఆ కార్యము వలన సూర్యభగవానుడు తప్పక ప్రీతి చెందగలడు.

తస్మాద్గురువిశాలాఖ్యం వనం సిద్ధనిషేవితమ్ ।
కామరూపే మహాశైలే గమ్యతాం తత్ర వై లఘు ॥57॥

అందువలన సిద్ధులచే బాగుగా సేవింపబడిన గురువిశాలమను పేరుగల వనమొకటి గలదు. అచ్చటగల కామరూపమను పర్వతమునకు నెమ్మదిగా మీరు వెళ్ళుడు.

తస్మిన్నారాధనం భానోః క్రియతాం సుసమాహితైః ।
సిద్ధక్షేత్రం హితం తత్ర సర్వకామానవాప్స్యథ ॥58॥

అచ్చట హితమునుగూర్చు సిద్ధక్షేత్రము గలదు. అచ్చట మీరు ఏకాగ్రచిత్తులై భాస్కరుని ఆరాధించి అన్ని కోరికలను పొందగలరు.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

ఇతి తే తద్వచః శ్రుత్వా గత్వా తత్కాననం ద్విజాః ।
దదృశుర్భాస్వతస్తత్ర పుణ్యమాయతనం శుభమ్ ॥59॥

ఈ విధముగా ఆ బ్రాహ్మణులందరూ గంధర్వుడు చెప్పిన మాటలను విని, ఆ వనమునకు వెళ్ళి, సూర్యభగవానుని పవిత్రమందిరమును చూచిరి.

తత్ర తే నియతాహారా వర్ణా విప్రాదయో ద్విజ ।
ధూపపుష్పోపహారాఘ్యాం పూజాం చక్రురతన్ద్రితాః ॥60॥

ఓ బ్రాహ్మణుడా ! ఆ సిద్ధక్షేత్రమందు బ్రాహ్మణులు మరియు ఇతర వర్ణములవారు పరిమితమైన ఆహారమును గ్రహించుచూ, అలసత్వము లేక ధూపము, పుష్పములు, ఉపహారములతో సూర్యభగవానుని పూజించిరి.

పుష్పానులేపనాద్యైశ్చ ధూపగన్ధాదికైస్తథా ।
జపహోమాన్నదానాద్యైః పూజనం తే సమాహితాః ॥
కుర్వన్తస్తుష్టువుర్బ్రహ్మన్ వివస్వన్తం ద్విజాతయః ॥61॥

ఓ బ్రహ్మస్వరూపుడా ! పుష్పములు, అనులేపనాదులు, ధూపగంధాదులు, జపములు, హోమములు, అన్నదానాదులు వీటితో ఆ బ్రాహ్మణాదులందరూ ఏకాగ్రచిత్తులై, ఆ సూర్యభగవానుని ఆరాధించువారై సంతోషమును పొందిరి.

బ్రాహ్మణా ఊచుః – బ్రాహ్మణులు పలికారు.

దేవదానవయక్షాణాం గ్రహాణాం జ్యోతిషామపి ।
తేజసాఽభ్యధికం దేవం వ్రజామ శరణం రవిమ్ ॥62॥

దేవదానవయక్షులు, గ్రహములు, జ్యోతిస్స్వరూపములు వీటన్నింటికంటే తన తేజఃప్రభావముచే గొప్పవాడైన సూర్యభగవానుని మేము శరణు వేడుచున్నాము.

దివి స్థితం చ దేవేశం ద్యోతయన్తం సమన్తతః ।
వసుధామన్తరిక్షం చ వ్యాప్నువన్తం మరీచిభిః ॥63॥

ఆదిత్యం భాస్కరం భానుం సవితారం దివాకరమ్ ।
పూషాణమర్యమాణం చ స్వర్భానుం దీప్తదీధితిమ్ ॥64॥

చతుర్యుగాన్తకాలాగ్నిదుష్ప్రేక్ష్యం ప్రలయాన్తగమ్ ।
యోగీశ్వరమనన్తం చ రక్తం పీతం సితాసితమ్ ॥65॥

ఋషీణామగ్నిహోత్రేషు యజ్ఞదేవేష్వవస్థితమ్ ।
వ్రజామ శరణం దేవం తేజోరాశిం తమచ్యుతమ్ ॥
అక్షరం పరమం గుహ్యం మోక్షద్వారమనుత్తమమ్ ॥66॥

ఆకాశమందుండి సమస్తదిక్కులను ప్రకాశింపచేయు దేవేశుడు, తన కిరణములచే భూమిని, అంతరిక్షమును వ్యాపించియున్న ఆదిత్యుడు, భాస్కరుడు, భానువు, సవిత, దివాకరుడు, పూషదేవుడు, అర్యమన్‌దేవుడు, స్వర్భానువు, దీప్తదీధితి (ప్రకాశించుచున్న కిరణములు గలవాడు), నాలుగుయుగాల చివరిలో సమస్త ప్రపంచమును భస్మముచేయు అగ్నిదేవుడు; చూచుటకు శక్యము కానివాడు, ప్రళయము చివరివరకు ఉండువాడు, యోగీశ్వరుడు, అనంతుడు, రక్తవర్ణముగలవాడు, పీతవర్ణముగలవాడు, శ్వేతకృష్ణవర్ణములు గలవాడు, ఋషుల అగ్నిహోత్రములందలి యజ్ఞదేవులలో ఒకడిగా నిలిచినవాడు, అచ్యుతుడు, నాశములేనివాడు, శ్రేష్ఠుడు, గుహ్యస్వరూపుడు, మోక్షమునకు ద్వారము వంటివాడు, అందరికంటే ఉత్తమమైనవాడు అగు తేజోరాశి అయిన దేవుని మేము శరణు వేడుచున్నాము.

ఛన్దోభిరశ్వరూపైశ్చ సకృద్యుక్తైర్విహఙ్గమమ్ ।
ఉదయాస్తమనే యుక్తం సదా మేరోః ప్రదక్షిణే ॥67॥

అనృతం చ ఋతం చైవ పుణ్యతీర్థం పృథగ్విధమ్ ।
విశ్వస్థితిమచిన్త్యం చ ప్రపన్నాః స్మ ప్రభాకరమ్ ॥68॥

అశ్వముల రూపములో ఉన్నట్టి పరస్పరము సమ్మిళితములైన మంత్రములతో ఆకాశమందు, ఉదయాస్తమయ సమయములందు సంచరించువాడు, ఎల్లప్పుడు మేరుపర్వత ప్రదక్షిణమందు నియుక్తుడై ఉన్నట్టివాడు, అసత్య సత్య స్వరూపుడు, పుణ్యతీర్థస్వరూపుడు, నానావిధస్వరూపుడు, విశ్వస్థితికి కారణస్వరూపుడూ అయిన సూర్యభగవానుని శరణు వేడుచున్నాము.

యో బ్రహ్మా యో మహాదేవో యో విష్ణుర్యః ప్రజాపతిః ।
వాయురాకాశమాపశ్చ పృథివీగిరిసాగరాః ॥69॥

గ్రహనక్షత్రచంద్రాద్యా వానస్పత్యం ద్రుమౌషధమ్ ।
వ్యక్తావ్యక్తేషు భూతేషు ధర్మాధర్మప్రవర్తకః ॥70॥

బ్రాహ్మీ మాహేశ్వరీ చైవ వైష్ణవీ చైవ తే తనుః ।
త్రిధా యస్య స్వరూపం తు భానోర్భాస్వాన్ప్రసీదతు ॥71॥

ఎవరయితే బ్రహ్మ, మహాదేవుడు, విష్ణువు, ప్రజాపతి, వాయువు, ఆకాశము, జలము, పృథివి, పర్వతములు, సముద్రములు, గ్రహములు, నక్షత్రములు, చంద్రాదులు పుష్పఫలములతో నిండిన ఆమ్రాదివృక్షములు, వృక్షములు, ఓషధులు, వ్యక్తావ్యక్తభూతములందు ధర్మాధర్మప్రవర్తకుడు వీటి అన్నింటి స్వరూపుడో మరియు ఎవరి శరీరము బ్రాహ్మి, మాహేశ్వరి, వైష్ణవి అను మూడు విధములో అట్టి భాస్కరుడు మమ్ములను అనుగ్రహించుగాక !

యస్య సర్వమయస్యేదమఙ్గభూతం జగత్ప్రభోః ।
స నః ప్రసీదతాం భాస్వాన్ జగతాం యశ్చ జీవనమ్ ॥72॥

సమస్తస్వరూపుడైన ఏ ప్రభువుకయితే ఈ ప్రపంచము అవయవభూతమో, సమస్తజగత్తులకు ప్రాణస్వరూపుడో అట్టి సూర్యభగవానుడు మమ్ములను అనుగ్రహించుగాక !

యస్యైకమక్షరం రూపం ప్రభామణ్డలదుర్దృశమ్ ।
ద్వితీయమైన్దవం సౌమ్యం స నో భాస్వాన్ప్రసీదతు ॥73॥

ఎవని మొదటి రూపము అక్షర (నాశములేని) స్వరూపమై, ప్రభామండలమందు చూడశక్యము గానట్టిదిగా ఉన్నదో, రెండవ రూపము సౌమ్యమైన చంద్రస్వరూపమో, అట్టి సూర్యభగవానుడు మమ్ములను అనుగ్రహించుగాక!

తాభ్యాం చ తస్య రూపాభ్యామిదం విశ్వం వినిర్మితమ్ ।
అగ్నీషోమమయం భాస్వాన్ స నో దేవః ప్రసీదతు ॥74॥

అట్టి సూర్యభగవానుని రెండు రూపములతో ఆగ్నీషోమమయమైన (అగ్ని, సోములతో కూడుకొన్నట్టి) ఈ ప్రపంచమంతా నిర్మింపబడినది. అట్టి సూర్యభగవానుడు మమ్ములను అనుగ్రహించుగాక !

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

ఇత్థం స్తుత్యా తదా భక్త్యా సమ్యక్పూజావిధానతః ।
తుతోష భగవాన్మాస్వాన్ త్రిభిర్మాసైర్ద్విజోత్తమ ॥75॥

ఓ బ్రాహ్మణశ్రేష్ఠుడా ! ఈ విధముగా మూడు నెలలపాటు ఆచరింపబడిన స్తుతులు, భక్తి, పూజావిధానముల కారణముగా సూర్యభగవానుడు సంతోషించెను.

తతః స మణ్డలాదుద్యన్నిజబింబసమప్రభః ।
అవతీర్య దదౌ తేభ్యో దుర్దృశో దర్శనం రవిః ॥76॥

అంతట తన బింబముయొక్క కాంతితో సమానమైన కాంతితోనూ, చూచుటకు శక్యముకానట్టి రూపముతోనూ ఉన్నట్టి ఆ సూర్యభగవానుడు సూర్యమండలమునుండి బయటకు వచ్చి అచ్చటనున్న వారికందరికీ వారు దర్శించుటకు వీలుగా దర్శనమిచ్చెను.

తతస్తే స్పష్టరూపం తం సవితారమజం జనాః ।
పులకోత్కంపినో విప్రా భక్తినమ్రాః ప్రణేమిరే ॥77॥

అంతట అచ్చట ఉన్న జనులందరూ, బ్రాహ్మణులందరూ స్పష్టమైన రూపము కలిగినట్టి శాశ్వతుడైనట్టి ఆ సూర్యభగవానుని పులకించినవారై భక్తితో వంగినవారై నమస్కరించిరి.

నమో నమస్తేఽస్తు సహస్రరశ్మే సర్వస్య హేతుస్త్వమశేషహేతుః ।
పాతా త్వమీడ్యోఽఖిలయజ్ఞధామ ధ్యేయస్తథా యోగవిదాం ప్రసీద ॥78॥

ఓ వేయి కిరణములుగలవాడా ! సూర్యభగవానుడా ! నీకు నమస్కారము. సమస్తమునకు నీవు కారణభూతుడవు. సమస్త యజ్ఞములకు నిలయమైనవాడా ! నీవు సమస్తమును రక్షించువాడవు. నీవు యోగవేత్తలకు స్తుతింపదగినవాడవు మరియు ధ్యానింపదగినవాడవు, మమ్ములను అనుగ్రహించు.

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే భానుస్తవోనామ షడధికశతతమోఽధ్యాయః ॥106॥

శ్రీ మార్కండేయ మహాపురాణమందలి భానుస్తవమను నూటఆరవ అధ్యాయం సమాప్తం.



సప్తాధికశతతమోఽధ్యాయః – నూటఏడవ అధ్యాయం

భానుమాహాత్మ్యమ్ – భానుమాహాత్మ్యం

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

తతః ప్రసన్నో భగవాన్భానురాహాఖిలాన్ జనాన్ ।
వ్రియతాం యదభిప్రేతం మత్తః ప్రాప్తుం ద్విజాదయః ॥1॥

పిమ్మట సూర్యభగవానుడు ప్రసన్నుడై సమస్తజనులతో ఈ విధముగా పలికెను. "ఓ ద్విజాదులారా ! మీరు నానుండి ఏమి పొందవలెనని కోరుకొనుచున్నారో దానిని కోరుకొనుడు.

తతస్తే ప్రణిపత్యోచుర్విప్రక్షత్రాదయో జనాః ।
ససాధ్వసమశీతాంశుమవలోక్య పరః స్థితమ్ ॥2॥

అంతట భయభక్తులతో కూడుకొన్న బ్రాహ్మణక్షత్రియాది జనులు పరస్పరూపుడై, వేడి కిరణములు కలిగిన సూర్యభగవానుని చూచి నమస్కరించి ఈ విధముగా పలికిరి.

ప్రజా ఊచుః – ప్రజలు పలికారు.

భగవన్యది నో భక్త్యా ప్రసన్నస్తిమిరాపహ ॥3॥

దశ వర్షసహస్రాణి తతో నో జీవతాం నృపః ।
నిరామయో జితారాతిః సుకోశః స్థిరయౌవనః ॥4॥

ఓ అంధకారమును నిర్మూలించువాడా ! సూర్యభగవానుడా ! నీవు మాపట్ల ప్రసన్నుడవైనచో మా మహారాజగు రాజ్యవర్ధనుడు రోగములు లేనివాడై, శత్రువులను జయించినవాడై, ధనసమృద్ధి కలిగినవాడై, స్థిరమైన యౌవనంతో పదివేల సంవత్సరాలు జీవించుగాక !

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

తథేత్యుక్త్వా జనాన్భాస్వానదృశ్యోఽభూన్మహామునే ।
తేఽపి లబ్ధవరా హృష్టాః సమాజగ్ముర్జనేశ్వరమ్ ॥5॥

యథావృత్తం చ తే తస్మై నరేన్ద్రాయ న్యవేదయన్ ।
వరం లబ్ధ్వా సహస్రాంశోః సకాశాదఖిలం ద్విజ ॥6॥

ఓ మహామునీ ! "అట్లే అగుగాక" అని జనులందరితో పలికి సూర్యభగవానుడు అదృశ్యమయ్యెను. వారందరూ కూడా వరమును పొంది సంతుష్టులై మహారాజువద్దకు వచ్చిరి. ఓ బ్రాహ్మణుడా ! వారందరు సూర్యభగవానుని నుండి వరమును పొందిన వృత్తాంతమును రాజుకు ఉన్నది ఉన్నట్లు నివేదించిరి.

తచ్ఛ్రుత్వా జహృషే తస్య సా పత్నీ మానినీ ద్విజ ।
ప్రహర్షం పరమం యాతా హర్షోద్గతతనూరుహా ॥
స చ రాజా చిరం దధ్యౌ నాహ కిఞ్చిచ్చ తం జనమ్ ॥7॥

ఓ బ్రాహ్మణుడా ! వారి మాటలను విని రాజ్యవర్ధనుని భార్యయగు మానిని హర్షాతిరేకముతో శరీరము పులకించినదై గొప్ప సంతోషమును పొందెను. రాజు మాత్రము చాలాకాలము ఏమీ మాట్లాడక నిర్వికారముగా ఉండెను.

తతః సా మానినీ భూపం హర్షాపూరితమానసా ।
దిష్ట్యాయుషా మహీపాల వర్ధస్వేత్యాహ తం పతిమ్ ॥8॥

అంతట హర్షముతో నిండిన హృదయము గలదై ఆ మానిని తన భర్తతో "ఓ మహారాజా ! అదృష్టము కారణముగా సమృద్ధమగు ఆయుర్దాయముతో వర్ధిల్లుము" అని పలికెను.

తథా తయా ముదా భర్తా మానిన్యాథ సభాజితః ।
నాహ కిఞ్చిన్మహీపాలశ్చిన్తాజడమనా ద్విజ ॥9॥

ఓ బ్రాహ్మణుడా ! ఆ విధముగా సంతోషముతో మానిని గౌరవపురస్సరముగా తన భర్తతో పలుకగా, రాజ్యవర్ధనుడు మాత్రము విచారగ్రస్తమనస్కుడై ఏమియూ పలుకలేదు.

సా పునః ప్రాహ భర్తారం చిన్తయానమధోముఖమ్ ।
కస్మాన్న హర్షమభ్యేషి పరమాభ్యుదయే నృప ॥10॥

తిరిగి ఆ మానిని చిన్తాగ్రస్తుడై తల వంచుకొనియున్న తన భర్తతో ఇట్లు పలికెను. "ఓ రాజా ! మీకు గొప్ప అభ్యుదయము లభించినాకూడా మీరు ఎందుకు సంతోషమును పొందుట లేదు?

దశవర్షసహస్రాణి నీరుజః స్థిరయౌవనః ।
భావీ త్వమద్యప్రభృతి కిం తథాపి న హృష్యసే ॥11॥

ఎట్టి రోగములు లేకుండా, స్థిరమైన యౌవనము కలిగి ఈ రోజునుంచి పదివేల సంవత్సరాలు మీరు జీవించి యుండగలరు కదా ! అయిననూ మీరెందుకు సంతోషించుట లేదు?

కిన్తు తత్కారణం బ్రూహి యచ్చిన్తాకృష్టమానసః ।
పరమాభ్యుదయేఽపి త్వం సంప్రాప్తే పృథివీపతే ॥12॥

ఓ భూపతీ ! గొప్ప అభ్యుదయము మీకు లభించినా కూడా చిన్తాగ్రస్తులై మీరు ఉండుటకు గల కారణమేమో చెప్పుడు".

రాజోవాచ – రాజు పలికాడు.

కథమభ్యుదయో భద్రే కిం సభాజయసే చ మామ్ ।
ప్రాప్తో దుఃఖసహస్రాణాం కిం సభాజనమిష్యతే ॥13॥

ఓ కల్యాణీ ! నాకేమి భాగ్యము కలిగినదని నీవు నన్ను అభినందించుచున్నావు? వేలకొలది దుఃఖములను నేను అనుభవించవలసివచ్చినది. ఇట్టి పరిస్థితిలో అభినందనమును ఎవరైనా కోరుకొందురా ఏమి?

దశవర్షసహస్రాణి జీవిష్యామ్యహమేకకః ।
న త్వం తవ విపత్తౌ మే కిన్న దుఃఖం భవిష్యతి ॥14॥

నేను ఒంటరివాడనై పదివేల సంవత్సరాలు జీవించగలను. నిజమే. కాని ఆ కాలమంతా నీవు ఉండవు. నీకు విపత్తి సంభవించినచో నాకు దుఃఖము కలుగదా ఏమి?

పుత్రాన్ పౌత్రాన్ ప్రపౌత్రాంశ్చ తథాన్యానిష్టబాన్ధవాన్ ।
పశ్యతో మే మృతాన్దుఃఖం కిమల్పం హి భవిష్యతి ॥15॥

పుత్రులు, మనుమలు, మునిమనుమలు, ఇంకను నాకిష్టమైన బంధువులు నా కళ్ళముందే చనిపోవుటను చూచిన నాకు తక్కువ దుఃఖము కలుగునా ఏమి?

భృత్యేషు చాతిభక్తేషు మిత్రవర్గే తథా మృతే ।
భద్రే దుఃఖమపారం మే భవిష్యతి తు సన్తతమ్ ॥16॥

ఓ కల్యాణీ ! విశ్వాసపాత్రులైన నా సేవకులు, నా మిత్రవర్గము నా కళ్ళముందే మరణించగా, నాకు ఎల్లప్పుడు దుఃఖము కలుగుచునే యుండును.

యైర్మదర్థం తపస్తప్తం కృశైర్ధమనిసన్తతైః ।
తే మరిష్యన్త్యహం భోగీ జీవిష్యామీతి ధిక్కరమ్ ॥17॥

నాడీ, సిరలు కృశించేటట్లు నాకొరకు తపస్సును ఆచరించినవారు నా కళ్ళముందే మరణించుచుండగా నేను భోగములను అనుభవించుచూ జీవించుచుందును. ఇది నాకు నిందయే కదా !

సేయమాపద్వరారోహే ప్రాప్తా నాభ్యుదయో మమ ।
కథం వా మన్యసే న త్వం యత్సభాజయసేఽద్య మామ్ ॥18॥

ఓ అందమైనదానా ! మానినీ ! పదివేల సంవత్సరముల ఆయుర్దాయము నాకు లభించుట ఆపదయే గాని అభ్యుదయము కాదు. నీవిట్లు ఎందుకు ఆలోచించుట లేదు? పైగా నన్ను నీవు అభినందించుచున్నావు.

మానిన్యువాచ – మానిని పలికింది.

మహారాజ యదాత్థ త్వం తథైతన్నాత్ర సంశయః ।
మయా పౌరైశ్చ దోషోఽయం ప్రీత్యా నాలోకితస్తవ ॥19॥

ఓ మహారాజా ! మీరు చెప్పినది నిజము. ఇందులో సందేహమేమీ లేదు. నీయందలి ప్రీతికారణముగా నేను, పురజనులు ఈ దోషమును గ్రహించలేకపోయితిమి.

ఏవం గతేఽత్ర కిం కార్యం నరనాథ విచిన్త్యతామ్ ।
నాన్యథా భావి యత్ప్రాహ ప్రసన్నో భగవాన్రవిః ॥20॥

ఓ ప్రభూ ! ఈ విషయమిట్లుండగా ఏమి చేయవలెనో ఆలోచించుము. సూర్యభగవానుడు నీయందు ప్రసన్నుడై ఏమి పలికెనో అది అసత్యము గానేరదు.

రాజోవాచ – రాజు చెప్పాడు.

ఉపకారః కృతః పౌరైః ప్రీత్యా భృత్యైశ్చ యో మమ ।
కథం భోక్ష్యామ్యహం భోగాన్ గత్వా తేషామనిష్కృతిమ్ ॥21॥

పౌరులు, సేవకులు నాయందలి ప్రీతితో చేసిన ఉపకారమునకు ప్రత్యుపకారము చేయక భోగములనెట్లు అనుభవించగలను?

సోఽహమద్యప్రభృత్యద్రిం గత్వా నియతమానసః ।
పౌరలోకహితార్థం చ తోషయిష్యామి భాస్కరమ్ ॥
యథా పౌరా మమ కృతే బాన్ధవాశ్చ సమన్తతః ।
ఆరాధనాయ దేవేశం తథాహమపి సాంప్రతమ్ ।
తపస్తప్స్యే నిరాహారో భానోరారాధనోద్యతః ॥22॥

అందువలన నేను ఇప్పటినుండి పర్వతముపైకి వెళ్ళి ఏకాగ్రచిత్తముతో పురజనుల హితమును గోరి తపస్సుతో సూర్యభగవానుని సంతోషపెట్టెదను. ఏ విధముగా అయితే పురజనులు, బంధువులు అందరు నా కొరకు సూర్యభగవానుని ఆరాధించిరో అట్లే నేను కూడా ఇప్పుడు సూర్యభగవానుని ఆరాధించు నిమిత్తమై ఆహారమును విడిచి తపస్సును ఆచరించెదను.

దశవర్షసహస్రాణి యథాఽహం స్థిరయౌవనః ।
తస్య ప్రసాదాద్దేవస్య జీవిష్యామి నిరామయః ॥23॥

తథా యది ప్రజాః సర్వా భృత్యాస్త్వం చ సుతాశ్చ మే ।
పుత్రా పౌత్రా ప్రపౌత్రాశ్చ సుహృదశ్చ వరాననే ॥24॥

జీవన్త్యేవం ప్రసాదం చ కరోతి భగవాన్రవిః ।
తతోఽహం భవితా రాజ్యే భోక్ష్యే భోగాంస్తథా ముదా ॥25॥

ఓ అందమైనదానా ! మానినీ ! పదివేల సంవత్సరములు నేను ఎట్లు యౌవనముతోనే ఉండి రోగములు లేక ఆ సూర్యభగవానుని అనుగ్రహముతో జీవించెదనో అట్లే ప్రజలు, సమస్తసేవకులు, నీవు, పుత్రులు, మనుమలు, మునిమనుమలు, స్నేహితులు నావలే జీవించినచో, ఆవిధంగా సూర్యభగవానుడు నన్ను అనుగ్రహించినచో అప్పుడే నేను సంతోషముతో రాజ్యపరిపాలనము చేసెదను, అట్లే భోగములను అనుభవించెదను.

న చేదేవం కరోత్యర్కస్తదాద్రౌ తత్ర మానిని ।
తపస్తప్స్యే నిరాహారో యావజ్జీవితసంక్షయః ॥26॥

ఓ మానినీ ! సూర్యభగవానుడు ఈ విధముగా చేయకపోయినచో నా ప్రాణములు పోవునంతవరకు నేను ఈ పర్వతమందే ఆహారమును మాని తపస్సును ఆచరించెదను.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

ఇత్యుక్తా సా తదా తేన తథేత్యాహ నరాధిపమ్ ।
జగామ తేన చ సమం సాఽపి తం ధరణీధరమ్ ॥27॥

రాజ్యవర్ధనుడీ విధముగా పలుకగా అతని భార్యయగు మానిని "అట్లే అగుగాక"యని పలికెను. తన భర్తతో ఆమె కూడా ఆ పర్వతప్రదేశమునకు వెళ్ళెను.

స తదాయతనం గత్వా భార్యయా సహ పార్థివః ।
భానోరారాధనం చక్రే శుశ్రూషానిరతో ద్విజ ॥28॥

ఓ బ్రాహ్మణుడా ! తన భార్యతో గూడా రాజు ఆ పవిత్రదేశమునకు వెళ్ళి భాస్కరసేవాతత్పరుడై సూర్యభగవానుని ఆరాధించెను.

నిరాహారా కృశా సా చ యథాసౌ పృథివీపతిః ।
తేపే తపస్తథైవోగ్రం శీతవాతాతపక్షమా ॥29॥

రాజు ఏవిధంగా అయితే ఆహారములేక దినదినము కృశించిపోవుచుండెనో అట్లే రాణియగు మానిని కూడా ఆహారము లేక కృశించినదై, చల్లదనము, గాలి, ఎండలను సహించుచు ఉగ్రతపస్సును ఆచరించెను.

తస్య పూజయతో భానుం తప్యతశ్చ తపో మహత్ ।
సాగ్రే సంవత్సరే యాతే తతః ప్రీతో దివాకరః ॥30॥

ఈ విధముగా రాజు, రాణి ఇరువురు ఆ సూర్యభగవానుని ఆరాధించుచు, గొప్ప తపస్సును ఆచరించుచూ ఉండగా ఒక సంవత్సరముకంటే ఎక్కువ కాలము గడచిన పిమ్మట సూర్యభగవానుడు ప్రీతి చెందెను.

సమస్తభృత్యపౌరాదిపుత్రాణాం చ కృతే ద్విజ ।
దదౌ యథాభిలషితం వరం ద్విజవరోత్తమ ॥31॥

ఓ బ్రాహ్మణశ్రేష్ఠుడా ! సమస్తములగు సేవకులు, పౌరులు, మొ॥వారు, పుత్రులు అందరికీ రాజు కోరుకొన్న విధముగా సూర్యభగవానుడు వరమిచ్చెను.

లబ్ధ్వా వరం స నృపతిః సమభ్యేత్యాత్మనః పురమ్ ।
చకార ముదితో రాజ్యం ప్రజా ధర్మేణ పాలయన్ ॥32॥

రాజగు రాజ్యవర్ధనుడు వరమును పొంది తన నగరమునకు తిరిగివచ్చి ధర్మబద్ధముగా ప్రజలను పరిపాలించుచు సంతోషముతో రాజ్యపరిపాలనము చేసెను.

ఈజే యజ్ఞాన్స చ బహూన్దదౌ దానాన్యహర్నిశమ్ ।
మానిన్యా సహితో భోగాన్ బుభుజే చ స ధర్మవిత్ ॥33॥

రాజ్యవర్ధనుడు అనేక యజ్ఞములను ఆచరించెను. నిరంతరము దానములను చేసెను. తన భార్యయగు మానినితో గూడి ధర్మవేత్తయగు ఆ రాజు అనేకభోగములను అనుభవించెను.

దశవర్షసహస్రాణి పుత్రపౌత్రాదిభిస్సహ ।
భృత్యైః పౌత్రైః ప్రముదితః సోఽభవత్ స్థిరయౌవనః ॥34॥

ఈ విధముగా రాజగు రాజ్యవర్ధనుడు స్థిరమైన యౌవనముగలవాడై పుత్రపౌత్రాదులతోనూ, సేవకులతోనూ ఆనందముతో పదివేల సంవత్సరములు గడిపెను.

తస్యేతి చరితం దృష్ట్వా ప్రమతిర్నామ భార్గవః ।
విస్మయాకృష్టహృదయో గాథామేతామగాయత ॥35॥

ఆ సమయమున భృగువంశోత్పన్నుడగు ప్రమతియనువాడు ఆ రాజుయొక్క చరిత్రను విని, విస్మయమునొందిన హృదయము గలవాడై ఈ గాథను గానము చేసెను.

భానుభక్తేరహో శక్తిర్యద్రాజా రాజ్యవర్ధనః ।
ఆయుషో వర్ధనే జాతః స్వజనస్య తథాత్మనః ॥36॥

సూర్యదేవుని పట్ల భక్తికి ఎంత శక్తిగలదు ! ఏమి యాశ్చర్యము ! ఎందువలననగా రాజగు రాజ్యవర్ధనుడు తనకు, స్వజనులకు ఆయుర్దాయమును వృద్ధి పొందింపచేసెను.

ఇతి తే కథితం విప్ర యత్పృష్టోఽహం త్వయోదితః ।
ఆదిదేవస్య మాహాత్మ్యమాదిత్యస్య వివస్వతః ॥37॥

ఓ బ్రాహ్మణుడా ! నన్ను నీవడుగగా నేను ఆదిదేవుడగు సూర్యభగవానుని గొప్పదనమును వర్ణించి చెప్పితిని.

విప్రైతదఖిలం శ్రుత్వా భానోర్మాహాత్మ్యముత్తమమ్ ।
పఠంశ్చ ముచ్యతే పాపైః సప్తరాత్రకృతైర్నరః ॥38॥

ఓ విప్రుడా ! ఉత్తమమైన ఈ భానుమాహాత్మ్యచరితమును ఏ జనుడయితే వినునో, చదువునో అట్టి మానవుడు సప్తరాత్రులందు చేసిన పాపములనుండి విడిపడును.

అరోగీ ధనవానాఢ్యః కులే మహతి ధీమతామ్ ।
జాయతే చ మహాప్రాజ్ఞో యశ్చైతద్ధారయేద్బుధః ॥39॥

ఏ పండితుడయితే ఈ భానుమాహాత్మ్యవృత్తాంతమును ధారణచేయునో అట్టి నరుడు మహాప్రాజ్ఞుడు, రోగములు లేనివాడు, ధనవంతుడు, సమృద్ధిగలవాడు అయి జ్ఞానుల కులమందు పుట్టును.

యజతే చ మహాయజ్ఞైః సమాప్తవరదక్షిణః ।
శ్రుత్వా చరితమేతద్ధి సమానం లభతే ఫలమ్ ॥
మన్త్రాశ్చ యేఽత్రాభిహితా భాస్వతో మునిసత్తమ ।
జపః ప్రత్యేకమేతేషాం త్రిసన్ధ్యం పాతకాపహః ॥40॥

ఇంకను ఈ సూర్యమాహాత్మ్యచరితమును విన్న మానవుడు ఋత్విక్కులకు తగిన దక్షిణలిచ్చి గొప్పగొప్ప యజ్ఞములను ఆచరించును. మరియు అందుకు తగిన ఫలమును కూడా పొందును. ఓ మునిశ్రేష్ఠుడా ! భాస్కరుని మాహాత్మ్యమును గురించి చెప్పబడిన ఈ ధ్యానశ్లోకాలలో ఒక్కొక్క శ్లోకమును మూడు సంధ్యలలో జపించిన మానవుడు తన పాపములను పోగొట్టుకొన్నవాడగును.

సమస్తమేతన్మాహాత్మ్యం యత్ర చాయతనే రవేః ।
పఠ్యతే తత్ర భగవాన్ సాన్నిధ్యం న విముఞ్చతి ॥41॥

ఈ సూర్యభగవానుని మాహాత్మ్యచరిత్రము ఏ భాస్కరమందిరమందు పఠింపబడునో అచ్చట సూర్యభగవానుడు తన సాన్నిధ్యమును విడిచిపెట్టడు. అనగా అట్టి మందిరమందు సూర్యభగవానుడు ఎల్లప్పుడు కొలువై యుండును.

తస్మాదేతత్త్వయా బ్రహ్మన్ భానోర్మాహాత్మ్యముత్తమమ్ ।
ధార్యం మనసి జాప్యం చ మహత్పుణ్యమభీప్సతా ॥42॥

ఓ బ్రహ్మస్వరూపుడా ! అందువలన గొప్ప పుణ్యమును కోరుకొనుచున్న నీవు సూర్యదేవుని ఈ మాహాత్మ్యవృత్తాంతమును మనస్సునందు ధారణ చేయవలెను మరియు జపించవలెను.

సువర్ణశృఙ్గీమతిశోభనాఙ్గీం పయస్వినీం గాం ప్రదదాతి యో హి ।
శృణోతి చైతత్త్ర్యహమాత్మవాన్నరః సమం తయోః పుణ్యఫలం ద్విజాగ్ర్య ॥43॥

ఓ ద్విజశ్రేష్ఠుడా! బంగారముతో చేసిన కొమ్ములను తొడిగినట్టి, మిక్కిలి అందమైన అవయవములు కలిగినట్టి, సమృద్ధిగా పాలిచ్చునట్టి ఆవును ఎవరయితే దానము చేయునో ఆ జనుడు, మరియు ఇంద్రియనిగ్రహముతో మూడు రోజులపాటు ఈ భానుమాహాత్మ్యచరితమును ఏ జనుడయితే వినునో అట్టి జనుడూ ఎవరుగలరో అట్టి ఆ ఇరువురి పుణ్యఫలము ఒక్కటే అనగా సమానమని ఎరుగవలెను.

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే భానోర్మాహాత్మ్యవర్ణనం నామ సప్తాధికశతతమోఽధ్యాయః ॥107॥

శ్రీ మార్కండేయ మహాపురాణమందలి భానుమాహాత్మ్యవర్ణనమను నూటఏడవ అధ్యాయం సమాప్తం.



అష్టాధికశతతమోఽధ్యాయః – నూటఎనిమిదవ అధ్యాయం

వంశానుక్రమః – వంశానుక్రమం

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

> **ఏవంప్రభావో భగవాననాదినిధనో రవిః ।**
> **యస్య త్వం క్రౌష్టుకే భక్త్యా మాహాత్మ్యం పరిపృచ్ఛసి ॥1॥**

ఓ క్రౌష్టుకీ ! నీవు భక్తితో ఎవరి మాహాత్మ్యమునుగూర్చి అడిగితివో అట్టి సూర్యభగవానుడు ఈ విధమైన ప్రభావము కలిగిన, ఆద్యంతములు లేనివాడై యున్నాడు.

> **పరమాత్మా స యోగినాం యుఞ్జతాం చేతసాం లయమ్ ।**
> **క్షేత్రజ్ఞః సాంఖ్యయోగానాం యజ్ఞేశో యజ్వినామపి ॥2॥**

తమ మనస్సులను ఆ సూర్యభగవానునియందే లయపరచు యోగులకు ఆ సూర్యభగవానుడు పరబ్రహ్మస్వరూపుడు. సాంఖ్యయోగములను అలవరచుకొన్న పండితులకు ఆ సూర్యభగవానుడు క్షేత్రజ్ఞుడు. యాగములను చేయువారికి ఆ సూర్యభగవానుడు యజ్ఞేశ్వరుడు.

> **సూర్యాధికారం వహతో విష్ణోరీశస్య వేధసః ।**
> **మనుస్తస్యాభవత్పుత్రశ్ఛిన్నసర్వార్థసంశయః ॥3॥**
>
> **మన్వన్తరాధిపో విప్ర యస్య సప్తమమన్తరమ్ ।**

బ్రహ్మవిష్ణుమహేశ్వరులు సూర్యదేవుని సర్వాధికారమును వహించుచున్నారు. అనగా సూర్యదేవుని పాలనమందే వారు తమతమ కార్యములను నిర్వహించుచున్నారు. అట్టి సూర్యదేవుని పుత్రుడు సమస్తసంశయములు తొలగినవాడై మనువు అయ్యెను. ఓ బ్రాహ్మణుడా ! అతడే మన్వంతరమునకు ప్రభువు. ఆ మనువుయొక్క ఏడవ తరము ఇప్పుడు జరుగుచున్నది.

> **ఇక్ష్వాకుర్నాభగో రిష్టో మహాబలపరాక్రమః ॥4॥**
>
> **నరిష్యన్తోఽథ నాభాగః పృషధ్రో ధృష్ట ఏవ చ ।**
> **ఏతే పుత్రా మనోస్తస్య పృథగ్రాజ్యస్య పాలకాః ॥5॥**

ఇక్ష్వాకువు, నాభగుడు, గొప్ప బలపరాక్రమములు కలిగిన రిష్టుడు, నరిష్యన్తుడు, నాభాగుడు, పృషధ్రుడు, ధృష్టుడు వీరు ఆ మనువుయొక్క పుత్రులు. వీరందరు వేరువేరు రాజ్యములకు పరిపాలకులైరి.

> **విఖ్యాతకీర్తయః సర్వే సర్వే శస్త్రాస్త్రపారగాః ।**
> **విశిష్టతరమన్విచ్ఛన్మనుః పుత్రం తథా పునః ॥6॥**
>
> **మిత్రావరుణయోరిష్టిం చకార కృతినాం వరః ।**
> **యత్ర చాపహుతే హోతురపచారాన్మహామునే ॥7॥**

ఇలా నామ సముత్పన్నా మనోః కన్యా సుమధ్యమా ।

ఆ మనువుయొక్క ఆ పుత్రులందరూ కీర్తిప్రఖ్యాతులుగలవారు, మరియు వారందరు శస్త్రములందు, అస్త్రములందు నేర్పుగలవారు. అట్టి పుత్రులుగలవాడైననూ, పుణ్యవంతులలో గొప్పవాడైన ఆ మనువు ఇంకనూ గొప్ప పుత్రుని పొందగోరి మిత్రావరుణమను యాగమును చేసెను. ఓ మహామునీ ! ఆ యజ్ఞకార్యమందు హోత (హోమమును నిర్వహించువాడు) శాస్త్రవిరుద్ధముగా హోమద్రవ్యమును సమర్పించుటచే మనువుకు పుత్రుడికి బదులుగా "ఇల" అను పేరుగల అందమైన కుమార్తె జన్మించెను.

తాం దృష్ట్వా కన్యకాం తత్ర సముత్పన్నాం తతో మనుః ॥8॥

తుష్టావ మిత్రావరుణౌ వాక్యం చేదమువాచ హ ।
భవత్ప్రసాదాత్తనయో విశిష్టో మే భవేదితి ॥9॥

కృతే మఖే సముత్పన్నా తనయా మమ ధీమతః ।
యది ప్రసన్నౌ వరదౌ తదియం తనయా మమ ॥10॥

ప్రసాదాద్భవతో పుత్రో భవత్వతిగుణాన్వితః ।

అంతట మనువు ఆ పుట్టిన కన్యకను చూచి మిత్రావరుణదేవతలను స్తుతించి ఇట్లు పలికెను. "మీ యనుగ్రహముచే విశిష్టగుణములు కలిగిన పుత్రుని అభిలషించి నేను యజ్ఞమును చేయగా ధీమంతుడనైన నాకు కుమార్తె జన్మించినది. ఒకవేళ మీరు నాపట్ల ప్రసన్నులైనయెడల నా ఈ కుమార్తె మీ అనుగ్రహముతో అసాధారణగుణములు కలిగిన పుత్రుడగు గాక!

తథేతి చాభ్యాముక్తే తు దేవాభ్యాం సైవ కన్యకా ॥11॥
ఇలా సమభవత్సద్యః సుద్యుమ్న ఇతి విశ్రుతః ।

మిత్రావరుణదేవతలు అట్లేయని పలుకగా కన్యకయగు ఆ ఇల సుద్యుమ్ముడను పేరుగల ప్రఖ్యాతుడైన పుత్రుడుగా మారెను.

పునశ్చేశ్వరకోపేన మృగయామటతా వనే ॥12॥

స్త్రీత్వమాసాదితం తేన మనుపుత్రేణ ధీమతా ।
పురూరవసనామానం చక్రవర్తినమూర్జితం ॥13॥

జనయామాస తనయం యత్ర సోమసుతో బుధః ।

ఒకనాడు ధీమంతుడగు పుత్రుడుగా మారిన ఆ సుద్యుమ్నుడు వేటకొరకు అడవికి వెళ్ళి అచ్చట ఈశ్వరుని కోపము కారణముగా స్త్రీగా మారిపోయెను. ఆమెయందు సోముని కుమారుడైన బుధుడు గొప్పబలవంతుడైన పురూరవుడను పేరుగల చక్రవర్తిని పుట్టించెను. (స్త్రీగా మారిన సుద్యుమ్నునికి సోమసుతుడగు బుధునికి పురూరవుడు జన్మించెను.)

జాతే సుతే పునః కృత్వా సోఽశ్వమేధం మహాక్రతుమ్ ॥14॥

పురుషత్వమనుప్రాప్తః సుద్యుమ్నః పార్థివోఽభవత్ ।
సుద్యుమ్నస్య త్రయః పుత్రా ఉత్కలో వినయో గయః ॥15॥

పురుషత్వే మహావీర్యా యజ్వినః పృథుతేజసః ।

పురూరవుడను పుత్రుడు ఉదయించిన పిమ్మట ఆ సుద్యుమ్నుడు (స్త్రీరూపంలో ఉన్నవాడు) అశ్వమేధమను గొప్ప యజ్ఞమును ఆచరించి మరల పురుషత్వమును పొంది మహారాజు అయ్యెను. అట్లు తిరిగి పురుషాకారమును పొందిన సుద్యుమ్నునికి ఉత్కలుడు, వినయుడు, గయుడు అను ముగ్గురు కుమారులు జన్మించిరి. వారు మిక్కిలి పరాక్రమవంతులు, యజ్ఞయాగాదులను ఆచరించువారు, గొప్ప బలవంతులూ అయిరి.

పురుషత్వే తు యే జాతాస్తస్య రాజ్ఞస్త్రయః సుతాః ॥16॥

బుభుజుస్తే మహీమేతాం ధర్మే నియతచేతసః ।
స్త్రీభూతస్య తు యో జాతస్తస్య రాజ్ఞః పురూరవాః ॥17॥

న స లేభే మహాభాగ యతో బుధసుతో హి సః ।
తతో వసిష్ఠవచనాత్ప్రతిష్ఠానం పురోత్తమమ్ ॥
తస్మై దత్తం స రాజాభూత్తత్రాతీవ మనోహరే ॥18॥

సుద్యుమ్నుడు పురుషుడిగా ఉన్న కాలంలో జన్మించిన ఆ ముగ్గురు పుత్రులు రాజ్యాధికారమును పొంది ధర్మానుసారంగా రాజ్యపరిపాలనము చేసిరి. ఓ మహానుభావుడా ! సుద్యుమ్నుడు స్త్రీగా ఉన్న కాలంలో జన్మించిన పురూరవుడు బుధునియొక్క పుత్రుడగుటచే రాజ్యాధికారమును పొందలేకపోయెను. కాని వసిష్ఠుని ఆజ్ఞచే ప్రతిష్ఠానమను పేరుగల గొప్ప పట్టణము పురూరవునికి ఇవ్వబడెను. అతడు ఆ మనోహరపట్టణానికి రాజయ్యెను.

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే వంశానుక్రమో నామ అష్టాధికశతతమోఽధ్యాయః ॥108॥

శ్రీ మార్కండేయ మహాపురాణమందలి వంశానుక్రమమను నూట ఎనిమిదవ అధ్యాయం సమాప్తం.



నవాధికశతతమోఽధ్యాయః – నూటతొమ్మిదవ అధ్యాయం
పృషధ్రోపాఖ్యానమ్ – పృషధ్రోపాఖ్యానం

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

పృషధ్రాఖ్యో మనోః పుత్రో మృగయామగమద్వనమ్ ।
తత్ర చంక్రమమాణోఽసౌ విపినే నిర్జనే వనే ॥1॥

నాససాద మృగం కఞ్చిద్భానుదీధితితాపితః ।
క్షుత్తృట్తాపపరీతాఙ్గ ఇతశ్చేతశ్చ చంక్రమన్ ॥2॥

స దదర్శ తదా తత్ర హోమధేనుం మనోహరమ్ ।
లతాన్తర్దేహచ్ఛిన్నార్ధం బ్రాహ్మణస్యాగ్నిహోత్రిణః ॥3॥

మనువుయొక్క పుత్రుడగు పృషధ్రుడు ఒకనాడు వేట నిమిత్తమై అడవికి వెళ్ళెను. నిర్జనప్రదేశమగు ఆ అడవియందు అతడు అటునిటు తిరుగాడుచుండగా అతడికి ఏ మృగమూ లభించలేదు. అంతట సూర్యుని వేడి కిరణములచే తాపము పొందినవాడై, ఆకలిదప్పులచే పీడింపబడిన అవయవములు గలవాడై, ఇటునటూ అతడు తిరుగుచుండెను. ఆ సమయమందు ఆ పృషధ్రుడు అగ్నిహోత్రి అయిన ఒక బ్రాహ్మణుని హోమధేనువును (హోమముకొరకు పాలిచ్చు ఆవు) చూచెను. ఆ ఆవుయొక్క సగభాగము లతలచే కప్పబడియుండెను.

స మన్యమానో గవయమిషుణా తామతాడయత్ ।
పపాత సాఽపి తద్బాణవిభిన్నహృదయా భువి ॥4॥

అతడు దానిని గవయమృగమని తలచి, ఆ గోవును బాణముతో కొట్టెను. అంతట ఆ హోమధేనువు ఆ బాణముచే హృదయము ముక్కలై నేలపై బడెను.

తతోఽగ్నిహోత్రిణః పుత్రో బ్రహ్మచారీ తపోరతః ।
శప్తవాన్స పితుర్దృష్ట్వా హోమధేనుం నిపాతితమ్ ॥5॥

గోపాలః ప్రేషితః పుత్రో బాభ్రవ్యో నామ నామతః ।
కోపామర్షపరాధీనచిత్తవృత్తిస్తతో మునే ॥6॥
చుకోప విగలత్స్వేదజలలోలావిలేక్షణః ।

ఓ మునీ ! అంతట అగ్నిహోత్రియొక్క కుమారుడు, బ్రహ్మచారి, తపోనిరతుడు, గోవులను పాలించుటకు నియమింపబడినవాడు, గోవును తీసుకురమ్మని పంపబడినవాడూ, అయిన బాభ్రవ్యుడను మునికుమారుడు తన తండ్రిగారి హోమధేనువు చచ్చి క్రిందపడిపోయి ఉండుటను చూచెను. అంతట ఆ మునికుమారుడు తీవ్రకోపంతో మనఃప్రవృత్తికి లోనై క్రిందకు జారుచున్న చెమటబిందువులచే కప్పబడిన దృష్టిగలవాడై కోపగించెను, శపించెను. (శపించుటకు ఉద్యమించెను.)

తం క్రుద్ధం ప్రేక్ష్య స నృపః పృషధ్రో మునిదారకమ్ ॥7॥

ప్రసీదేతి జగౌ కస్మాచ్ఛూద్రవత్కురుషే రుషమ్ ।
న క్షత్రియో న వా వైశ్య ఏవం క్రోధముపైతి వై ॥
యథా త్వం శూద్రవజ్జాతో విశిష్టే బ్రహ్మణః కులే ॥8॥

అట్లు కోపముతో నిండిన ఆ మునికుమారుని చూచి రాజగు పృషధ్రుడు ఇట్లు పలికెను. "శాంతించుము, శూద్రుని వలె ఎందులకు కోపమును వహించుచున్నావు? క్షత్రియుడుగాని, వైశ్యుడుగాని నీవలె ఎన్నడూ కోపగించడు. గొప్ప బ్రాహ్మణవంశమందు నీవు శూద్రునివలె పుట్టినావు.

మార్కండేయ ఉవాచ :– మార్కండేయుడు చెప్పాడు.

ఇతి నిర్భర్త్సితస్తేన స రాజ్ఞా మౌనినః సుతః ।
శశాప తం దురాత్మానం శూద్ర ఏవ భవిష్యసి ॥9॥

ప్రయాస్యతి క్షయం బ్రహ్మన్యత్తేఽధీతం గురోర్ముఖాత్ ।
హోమధేనుర్మమ గురోర్యదియం హింసితా త్వయా ॥10॥

ఈ విధముగా ఆ రాజుచేత బెదిరింపబడిన మునియగు అగ్నిహోత్రియొక్క కుమారుడు ఆ దుర్మార్గపురాజును ఈ విధముగా శపించెను. "నీవు నా తండ్రియొక్క హోమధేనువును హింసించిన కారణముగా నీవు శూద్రుడివే కాగలవు. అంతేకాక, ఓ బ్రహ్మస్వరూపుడా ! నీవు గురుముఖతః చదివినదంతయు నశించగలదు."

ఏవం శప్తో నృపః క్రుద్ధస్తచ్ఛాపపరిపీడితః ।
ప్రతిశాపపరో విప్ర తోయం జగ్రాహ పాణినా ॥11॥

ఓ బ్రాహ్మణుడా ! ఈ విధముగా మునికుమారుని శాపముచే పీడింపబడిన రాజు క్రుద్ధుడై, ప్రతిశాపమిచ్చుటకు నీటిని చేతిలో గ్రహించెను.

సోఽపి రాజ్ఞో వినాశాయ కోపం చక్రే ద్విజోత్తమః ।
తమభ్యేత్య త్వరాయుక్తో వారయామాస వై పితా ॥12॥

ద్విజశ్రేష్ఠుడగు ఆ మునికుమారుడు కూడా రాజును నాశనము చేయవలెనను తలంపుతో మిక్కిలి కోపమును వహించెను. అంతట వేగముగా అతడి తండ్రియగు అగ్నిహోత్రి అచ్చటకు వచ్చి, తన పుత్రుని వారించి, ఇట్లు పలికెను.

వత్సాలమలమత్యర్థం కోపేనాతీవ వైరిణా ।
ఐహికాముష్మికహితః శమ ఏవ ద్విజన్మనామ్ ॥13॥

ఓ కుమారా ! శత్రువుతో సమానమైన కోపమును బూనుట ఇక చాలును, చాలును. బ్రాహ్మణులకు శమమనెడు గుణమే (ఇంద్రియనిగ్రహము) ఇహలోకపరలోకములందు హితమును కల్గించును.

కోపస్తపో నాశయతి క్రుద్ధో భ్రశ్యత్యథాయుషః ।
క్రుద్ధస్య గలతే జ్ఞానం క్రుద్ధశ్చార్థాచ్చ హీయతే ॥14॥

కోపము తపస్సును నశింపచేయును. కోపముతో కూడుకొన్నవాడు ఆయుర్దాయమునుండి భ్రంశము చెందును. అనగా అట్టివాని ఆయుర్దాయము క్షీణించును. అట్టివాని జ్ఞానము నశించును. అట్టివాడు సంపదలనుండి దూరమగును.

న ధర్మః క్రోధశీలస్య నార్థం చాప్నోతి రోషణః ।
నాలం సుఖాయ కామాప్తిః కోపేనావిష్టచేతసామ్ ॥15॥

క్రోధస్వభావముగలవాడు ధర్మార్థములను సంపాదించలేడు. కోపముతో నిండిన చిత్తముగలవారు సుఖమును పొందుటలో సమర్థులు కారు. వారి కోరికలు నెరవేరవు.

యది రాజ్ఞా హతా ధేనురియం విజ్ఞానినా సతా ।
యుక్తమత్ర దయాం కర్తుమాత్మనో హితబోధినా ॥16॥

అథవాఽజానతా ధేనురియం వ్యాపాదితా మమ ।
తత్కథం శాపయోగ్యోఽయం దుష్టం నాస్య మనో యతః ॥17॥

ఒకవేళ రాజు తెలిసికూడా ఈ ధేనువును చంపినచో అట్టి వ్యక్తిపై ఆత్మహితమును కోరువాడు దయను చూపుట ఉచితము. అట్లుకాక తెలియక ఈ ధేనువును చంపినయెడల ఈ రాజు శాపమును పొందుటకు ఎట్లు యోగ్యుడగును? ఎందువలననగా ఇతని మనస్సు దోషయుక్తము కాదు కదా !

ఆత్మనో హితమన్విచ్ఛన్బాధతే యోఽపరం నరః ।
కర్తవ్యా మూఢవిజ్ఞానే దయా తత్ర దయాలుభిః ॥18॥

ఏ మానవుడు తనకు హితమును కోరుకొనుచు, ఇతరులను బాధించునో అట్టి మూఢబుద్ధి కలవాడిపైన కూడా దయామయులు దయను చూపవలెను.

అజ్ఞానతః కృతే దణ్డం పాతయన్తి బుధా యది ।
బుధేభ్యస్తమహం మన్యే వరమజ్ఞానినో నరాః ॥19॥

ఇంకను తెలియక తప్పు చేసిన వారిని ఏ పండితులు శిక్షించెదరో అట్టి పండితులకంటే అజ్ఞానులయిన మానవులే గొప్పవారని నేను తలచెదను.

నాద్య శాపస్త్వయా దేయః పార్థివస్యాస్య పుత్రక ।
స్వకర్మణైవ పతితా గౌరేషా దుఃఖమృత్యునా ॥20॥

ఓ కుమారా ! అందువలన నీవిప్పుడు ఈ రాజుకు శాపమివ్వవలదు. ఈ హోమధేనువు తన కర్మానుసారముగానే దుఃఖమనెడు మృత్యముఖమందు పడినది.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

పృషధ్రోఽపి మునేః పుత్రం ప్రణమ్యానమ్రకన్ధరః ।
ప్రసీదేతి జగాదోచ్చైరజ్ఞానాద్ఘాతితేతి చ ॥21॥

పిమ్మట రాజగు పృషధ్రుడు కూడా తలవంచి మునికుమారునికి నమస్కరించి ఇట్లు గట్టిగా పలికెను. నాపై దయచూపుము. నేను ఆవని తెలియక చంపితిని.

మయా గవయబుద్ధ్యా గౌరవధ్యా ఘాతితా మునే ।
అజ్ఞానాద్ధోమధేనుస్తే ప్రసీద త్వం చ నో మునే ॥22॥

ఓ మునీ ! నేను ఈ జంతువును గవయమృగమని భావించి, చంపదగని మీ హోమధేనువగు ఈ ఆవును అజ్ఞానముతో చంపితిని. మాపట్ల అనుగ్రహము చూపుము.

ఋషిపుత్ర ఉవాచ – మునికుమారుడు చెప్పాడు.

ఆజన్మనో మహీపాల న మయా వ్యాహృతం మృషా ।
క్రోధశ్చాద్య మహాభాగ నాన్యథా మే కదాచన ॥23॥

ఓ మహారాజా ! నేను పుట్టినది మొదలు ఎన్నడును అసత్యమాడలేదు. నా ఈ కోపము కూడా ఎన్నటికినీ మిథ్య కానేరదు.

తన్నాహమేనం శక్నోమి శాపం కర్తుం నృపాన్యథా ।
యస్తే సముద్యతః శాపో ద్వితీయః స నివర్తితః ॥24॥

ఓ రాజా ! అందువలన నేనిచ్చిన శాపమును వెనుకకు తీసుకొనుటకు (లేకుండా చేయుటకు) నేను సమర్థుడను కాను. నీకు రెండవ శాపమిచ్చుటకు ఉద్యమించితిని కదా ! దానినుండి నివృత్తుడనగుదును. అనగా రెండవ శాపమునివ్వను.

ఇత్యుక్తవన్తం తం బాలమాదాయ స పితా తతః ।
జగామ స్వాశ్రమం సోఽపి పృషధ్రః శూద్రతామగాత్ ॥25॥

ఈ విధముగా పలుకుచున్న తన కుమారుని తీసుకొని ఆ తండ్రి తన ఆశ్రమమునకు వెళ్ళిపోయెను. ఆ పృషధ్రుడు కూడా శూద్రత్వమును పొందెను. అనగా శూద్రునిగా మారెను.

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే వంశానుచరితే పృషధ్రోపాఖ్యానే నవాధికశతతమోఽధ్యాయః ॥109॥

శ్రీ మార్కండేయ మహాపురాణమందలి వంశానుచరితమందలి పృషధ్రోపాఖ్యానమను నూటతొమ్మిదవ అధ్యాయం సమాప్తం.



దశాధికశతతమోఽధ్యాయః - నూటపదియవ అధ్యాయం

నాభాగోపాఖ్యానమ్ - నాభాగోపాఖ్యానం

మార్కండేయ ఉవాచ - మార్కండేయుడు చెప్పాడు.

కారుషాః క్షత్రియాః శూరాః కరుషస్యాభవన్సుతాః ।
తే తు సప్తశతం వీరాస్తేభ్యశ్చాన్యే సహస్రశః ॥1॥

మహాపరాక్రమవంతులైన కారుషక్షత్రియులు కరుషునికి జన్మించినవారు. వారు ఏడువందలమంది ఉన్నారు. వారివలన ఇంకా వేలకొలది వీరులు పుట్టిరి.

దిష్టపుత్రస్తు నాభాగః స్థితః ప్రథమయౌవనే ।
దదర్శ వైశ్యతనయామతీవ సుమనోహరామ్ ॥2॥

దిష్టునియొక్క పుత్రుడయిన నాభాగుడు నవయువకుడై ఉండెను. అతడొకనాడు చాలా అందగత్తె అయిన వైశ్యుని కుమార్తెను చూచెను.

తస్యాం సందృష్టమాత్రాయాం మదనాక్షిప్తమానసః ।
బభూవ భూపతనయో నిశ్వాసాక్షేపతత్పరః ॥3॥

ఆమెను చూచినంతనే నాభాగుడు మన్మథతాపమును పొందినవాడై, వేడినిట్టూర్పులు విడిచెను.

తస్యాః స గత్వా జనకం వవ్రే తాం వైశ్యకన్యకామ్ ।
తతోఽనంగపరాధీనమనోవృత్తిం నృపాత్మజమ్ ॥4॥

తం చాహ స పితా తస్యా రాజపుత్రం కృతాఞ్జలిః ।
బిభ్యత్తస్య పితుర్విప్ర ప్రశ్రయావనతం వచః ॥5॥

అట్టిదశలో నాభాగుడు ఆమె తండ్రివద్దకు వెళ్ళి అతడి కుమార్తెను తనకిమ్మని కోరెను. అంతట కామాసక్తుడగుటచే వశము తప్పిన మనస్సు కలిగిన రాజకుమారునితో ఆ వైశ్యుడు, ఆ రాజకుమారుని తండ్రికి భయపడుచున్నవాడై, చేతులు జోడించి సవినయముగా ఇట్లు పలికెను.

భవన్తో భూభుజో భృత్యా వయం వః కరదాయకాః ।
కథం సంబంధమసమైరస్మాభిరభివాంఛసి ॥6॥

ఆర్యా! మీరు రాజవంశమునకు చెందినవారు. మేము మీకు పన్ను చెల్లించు సేవకులము. అట్టి అసమానులమైన మాతో సంబంధమును నీవు ఎట్లు కోరుకొనుచున్నావు?

రాజపుత్ర ఉవాచ - రాజకుమారుడు పలికాడు.

సామ్యం మానుషదేహస్య కామమోహాదిభిః కృతమ్ ।
తథాఽపి కాలే తైరేవ యోజ్యతే మానుషం వపుః ॥7॥

మనుష్యుల దేహాలలో సామ్యము కామమోహాదులతో చేయబడినది. అనగా అవి అందరి దేహాలలో సమానముగా ఉండును. మానవశరీరము అట్టి గుణములతో తగిన కాలమందు సంబంధించి ఉండును.

తథైవ చోపకారాయ జాయన్తే తస్య తాన్యపి ।
అన్యాని చాన్యే జీవన్తి భిన్నజాతిమతాం సతామ్ ॥8॥

అట్లే ఆ కామమోహాది భావాలు మానవునికి ఉపకారము కొరకు కూడా సంభవించును. పరస్పరము భిన్న భిన్న జాతులు కలిగిన వారి విషయమందు ఆ భావాలు విభిన్నముగా ఉండును.

తథాన్యాన్యప్యయోగ్యాని యోగ్యతాం యాన్తి కాలతః ।
యోగ్యాన్యయోగ్యతాం యాన్తి కాలవశ్యా హి యోగ్యతా ॥9॥

అట్లే వేరువేరైన ఆ కామమోహాదులు ఒకప్పుడు అయోగ్యములయినా కూడా ఆయా కాలములను బట్టి యోగ్యములు కూడా అగును. అట్లే ఒకప్పుడు యోగ్యములయినవి మరొకప్పుడు అయోగ్యములగును. యోగ్యత అనునది స్వాభావికము కాదు. కాలాన్ని అనుసరించి ఉండును.

ఆప్యాయ్యతే యచ్ఛరీరమాహారాదిభిరీప్సితైః ।
కాలం జ్ఞాత్వా తథా భుక్తం తదేవ పరిశిష్యతే ॥10॥

ఇష్టములైన ఆహారాదిపదార్థములతో వృద్ధి చేయబడిన శరీరము తగిన కాలమని తెలుసుకొని అనుభవింపబడినచో వినాశము చెందక స్థిరముగా మిగిలియుండును.

ఇత్థం మమైషాభిమతా తనయా దీయతాం త్వయా ।
అన్యథా మచ్ఛరీరస్య విపత్తిరుపలక్ష్యతే ॥11॥

ఈ విధముగా నీ కుమార్తెయందు నాకిష్టము కలిగినది. కావున నీ కుమార్తెను నాకు ఇమ్ము. లేనిచో నా శరీరము వినాశము చెందగలదు.

వైశ్య ఉవాచ – వైశ్యుడు చెప్పాడు.

పరతన్త్రా వయం త్వం చ పరతన్త్రో మహీభుజః ।
పిత్రా తేనాభ్యనుజ్ఞాతస్త్వం గృహాణ దదామ్యహమ్ ॥12॥

మేము పరాధీనులము. అట్లే నీవు కూడా మహారాజుయొక్క అధీనములో ఉన్నావు గావున పరతంత్రుడవే. స్వతంత్రుడవు కావు. అందువలన నీవు మీ తండ్రిగారి అనుమతి తీసుకొని నా కుమార్తెను తీసుకొనుము. అప్పుడు నేను నా కుమార్తెనిచ్చెదను.

రాజపుత్ర ఉవాచ – రాజకుమారుడు చెప్పాడు.

ప్రష్టవ్యాః సర్వకార్యేషు గురవో గురువర్తిభిః ।
న త్వీదృశేష్వకార్యేషు గురూణాం వాక్యగోచరః ॥13॥

పెద్దల మాటను అనుసరించి నడచుకొనేవారు అన్ని కార్యములందు తప్పక పెద్దలను సంప్రదించవలసిందే. కాని ఇట్టి అయోగ్యకార్యములందు గురువులను సంప్రదించకుండుటే ఉచితము.

క్వ మన్మథకథాలాపో గురూణాం శ్రవణం క్వ చ ।
విరుద్ధమేతదన్యత్ర ప్రష్టవ్యా గురవో నృభిః ॥14॥

ఎక్కడ మన్మథకథాప్రసంగము? ఎచ్చట గురువుల మాటను వినుట? ఈ రెండూ పరస్పరవిరుద్ధమైనవి. కాబట్టి ఇట్టి కార్యములకంటే భిన్నమైన కార్యములందే గురువులను సంప్రదించవలెను.

వైశ్య ఉవాచ – వైశ్యుడు పలికాడు.

ఏవమేతత్స్మరాలాపస్తవాయం పృచ్ఛ మా గురుమ్ ।
అహం పృచ్ఛామి నాలాపో మమ కామకథాశ్రయః ॥15॥

మన్మథపీడితులైనవారి కథాప్రసంగము ఇట్టిదే. నిజము. నీవు పెద్దలను అడుగవద్దు. నేనే మీ పెద్దలను అడిగెదను. నా కథాప్రసంగము మన్మథకథాశ్రయము కాదు కదా !

మార్కండేయ ఉవాచ – మార్కండేయు చెప్పాడు.

ఇత్యుక్తః సోఽభవన్మౌనీ రాజపుత్రః స చాపి తత్ ।
తత్పిత్రే సర్వమాచష్ట రాజపుత్రస్య యన్మతమ్ ॥16॥

ఈ విధముగా వైశ్యుడు పలుకగా ఆ రాజకుమారుడు మౌనము వహించెను. ఆ వైశ్యుడు కూడా రాజకుమారుని తండ్రికి రాజకుమారుని అభిమతమేమో అది అంతయు చెప్పెను.

తతస్తస్య పితా విప్రానృచీకాదీన్ద్విజోత్తమాన్ ।
ప్రవేశ్య రాజపుత్రం చ యథాఖ్యానం న్యవేదయత్ ॥17॥

అటుపిమ్మట రాజకుమారుని తండ్రి మహారాజు ద్విజశ్రేష్ఠులయిన ఋచీకుడు మొదలగు బ్రాహ్మణులను, రాజకుమారుని రప్పించి, జరిగినదంతయు వారందరికీ నివేదించెను.

నివేద్య చ తతః ప్రాహ మునీనేవం వ్యవస్థితే ।
యత్కర్తవ్యం తదాదేష్టుమర్హన్తి ద్విజసత్తమాః ॥18॥

అట్లు మహారాజు వారందరికీ నివేదించి అటుపిమ్మట మునులందరితో ఈ విధముగా పలికెను. "ఓ బ్రాహ్మణశ్రేష్ఠులారా! ఈ విషయమందు నేనేమి చేయవలెనో మీరు ఆదేశించుడు."

ఋషయ ఊచుః – ఋషులు పలికారు.

రాజపుత్రానురాగస్తే యద్యస్యాం వైశ్యసన్తతౌ ।
తదస్తు ధర్మ ఏవైష కిన్తు న్యాయక్రమేణ సః ॥19॥

మూర్ధాభిషిక్తతనయాపాణిగ్రహోత్సవః పురా ।
భవత్వనన్తరం చేయం తవ భార్యా భవిష్యతి ॥20॥

ఓ రాజకుమారా ! నీకు వైశ్యపుత్రియందు అనురాగమున్నచో అట్లే ఉండనీ ! ఇది ధర్మమే. కాని అది న్యాయబద్ధముగా ఉండవలెను. ముందుగా రాజ్యపట్టాభిషేకము కలిగిన రాజుయొక్క కుమార్తెను నీవు వివాహమాడవలెను. అటుపిమ్మట ఈ వైశ్యకన్యతో వివాహమాడవచ్చును. అప్పుడు నీకామె భార్య కాగలదు.

ఏవం న దోషో భవతి తథేమాముపభుఞ్జతః ।
అన్యథాభ్యేతి తే జాతిరుత్కృష్టా బాలికానయాత్ ॥21॥

నీవీ ప్రకారముగా ఈ కన్యను పొందినయెడల దోషముండదు. లేనిచో బాలికనపహరించి తెచ్చిన కారణముగా ఉత్కృష్టమైన నీ క్షత్రియజాతి మచ్చను పొందగలదు.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

ఇత్యుక్తస్తదపాస్యైవ వచస్తేషాం మహాత్మనామ్ ।
వినిష్క్రమ్య గృహీత్వా తాముద్యతాసిరథాబ్రవీత్ ॥22॥

ఋషులీవిధముగా పలుకగా, మహాత్ములైన వారి మాటను ప్రక్కకు పెట్టినాడా అన్నట్లుగా అచ్చటి నుండి బయటకు వెళ్ళి, ఆ కన్యను గ్రహించి, ఖడ్గమును చేతబూని, ఇట్లు పలికెను.

రాక్షసేన వివాహేన మయా వైశ్యసుతా హృతా ।
యస్య సామర్థ్యమత్రాస్తి స ఏతాం మోచయత్వితి ॥23॥

నేను రాక్షసవివాహపద్ధతిలో ఈ వైశ్యకన్యను అపహరించితిని. మీలో ఎవరికైనా సామర్థ్యమున్నచో వచ్చి ఈమెను విడిపించుకొనుడు.

తతః స వైశ్యస్తాం దృష్ట్వా గృహీతాం తనయాం ద్రుతమ్ ।
త్రాహీతి పితరం తస్య ప్రయయౌ శరణం ద్విజ ॥24॥

ఓ బ్రాహ్మణుడా ! తన కుమార్తె రాజకుమారునిచే అపహరింపబడుటను చూచి ఆ వైశ్యుడు శీఘ్రముగా రక్షించుమనుచు ఆ రాజకుమారుని తండ్రిని శరణు వేడెను.

తతస్తస్య పితా క్రుద్ధ ఆదిదేశ బలం మహత్ ।
హన్యతాం హన్యతాం దుష్టో నాభాగో ధర్మదూషకః ॥25॥

అంతట ఆ రాజకుమారుని తండ్రి మిక్కిలి క్రుద్ధుడై “ధర్మమును దూషించే దుష్టుడైన ఈ నాభాగుని వెంటనే చంపుడు” అని తన గొప్ప సైన్యమును ఆజ్ఞాపించెను.

తతస్తద్యుయుధే సైన్యం తేన భూభృత్సుతేన వై ।
కృతాస్త్రేణ తదాస్త్రేణ తత్రాపచుర్యేణ పాతితమ్ ॥26॥

అంతట రాజాజ్ఞచే రాజసైన్యము ఆ రాజకుమారునితో యుద్ధము చేసెను. అస్త్రములను గ్రహించిన రాజకుమారుడు తన అస్త్రములతో సైన్యములోని చాలామందిని చంపివేసెను.

స శ్రుత్వా నిహతం సైన్యం రాజపుత్రేణ భూపతిః ।
స్వయమేవ యయౌ యోద్ధుం స్వసైన్యపరివారితః ॥27॥

రాజకుమారునిచేత తన సైన్యము చంపబడినదని విని ఆ మహారాజు స్వయముగా తన మరికొంత సైన్యమును వెంట తీసుకొని యుద్ధము చేయుటకు వెళ్ళెను.

తతో యుద్ధమభూత్తస్య భూభుజః స్వసుతేన యత్ ।
రాజపుత్రేణ శస్త్రాస్త్రైస్తత్రాతిశయితః పితా ॥28॥

మహారాజుకు రాజకుమారునికీ మధ్య జరిగిన యుద్ధమందు రాజకుమారుని కన్న అతడి తండ్రిదే పైచేయిగా ఉండెను.

తతోఽన్తరిక్షాదాగత్య పరివ్రాట్ సహసా మునిః ।
ప్రత్యువాచ మహీపాలం విరమస్వేతి సంయుగాత్ ॥29॥

ఆ సమయమందు సన్యాసియగు ముని ఒకడు ఆకాశమునుండి ఆ యుద్ధప్రదేశమునకు వచ్చి మహారాజుతో ఈ విధముగా పలికెను. "ఓ మహారాజా ! యుద్ధమునుండి విరమించుము."

త్వత్పుత్రస్య మహాభాగ విధర్మోఽయం మహాత్మనః ।
తవాపి వైశ్యేన సహ న యుద్ధం ధర్మవన్నృప ॥30॥

ఓ మహానుభావుడా ! మహాత్ముడగు నీ కుమారుడు ఆచరించినది విశిష్టమైన ధర్మమే. ఓ మహారాజా ! వైశ్యునితో యుద్ధము నీకు ధర్మము కాదు.

బ్రాహ్మణ్యా బ్రాహ్మణః పూర్వం కుర్వన్దారపరిగ్రహమ్ ।
బ్రాహ్మణ్యాత్సర్వవర్ణేషు న హానిముపగచ్ఛతి ॥31॥

బ్రాహ్మణుడు ముందుగా బ్రాహ్మణస్త్రీని వివాహమాడి అటుపిమ్మట ఇతర వర్ణముల స్త్రీని వివాహమాడినా అతడి బ్రాహ్మణత్వమునకు హాని కలుగదు.

తథైవ క్షత్రియసుతాం క్షత్రియః పూర్వముద్వహన్ ।
ఇతరే చ తతో రాజంశ్చ్యవతే న స్వధర్మతః ॥32॥

ఓ రాజా ! అట్లే క్షత్రియుడు కూడా ముందుగా క్షత్రియస్త్రీని వివాహమాడి, అటు పిమ్మట ఇతర వర్ణముల స్త్రీని వివాహమాడినా అతడికి స్వధర్మము నుండి భ్రంశము కలుగదు.

పూర్వం వైశ్యస్తథా వైశ్యాం పశ్చాచ్ఛూద్రకులోద్భవామ్ ।
న హీయతే వైశ్యకులాదయం న్యాయః క్రమోదితః ॥33॥

అట్లే వైశ్యుడు కూడా ముందుగా వైశ్యకన్యను పరిణయమాడి, అటుపిమ్మట శూద్రకులములో పుట్టిన కన్యను వివాహమాడినా కూడా అతడు వైశ్యకులమునుండి పతితుడు గాడు. ఈ న్యాయము ఈ విధముగా క్రమముగా చెప్పబడినది.

బ్రాహ్మణాః క్షత్రియా వైశ్యాః సవర్ణాపాణిసంగ్రహమ్ ।
అకృత్వాఽన్యభవాపాణేః పతన్తి నృప సంగ్రహాత్ ॥34॥

ఓ రాజా ! బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు వీరు ముందు తమ తమ వర్ణముల వారి కన్యలను వివాహము చేసుకొనక ఇతరకులములలోని కన్యలను వివాహము చేసుకొన్నచో వారు తమ కులములనుండి పతితులగుచున్నారు.

యస్యా యస్యా హి హీనాయాః కురుతే పాణిసంగ్రహమ్ ।
అకృత్వా వర్ణసంయోగం సోఽపి తద్వర్ణభాగ్భవేత్ ॥35॥

తమ కులములలోని కన్యలను వివాహము చేసుకొనక ఇతర వర్ణములలోని కన్యలను వివాహము చేసుకొన్న సందర్భంలో ఏ హీనజాతిస్త్రీని వివాహమాడునో ఆ హీనజాతినే అతడు పొందును.

సోఽయం వైశ్యత్వమాపన్నస్తవ పుత్రః సుమన్దధీః ।
నాస్యాధికారో యుద్ధాయ క్షత్రియేణ త్వయా సహ ॥36॥

మందబుద్ధియగు నీ పుత్రుడు వైశ్యకన్యను వివాహమాడి వైశ్యకులమునకు చెందినవాడాయెను. అందువలన క్షత్రియుడవై నీతో యుద్ధము చేయుటకు నీ పుత్రునికి అధికారము లేదు.

వయమేతన్న జానీమః కారణం నృపనన్దన ।
యథా భవిష్యతీదం చ నివర్త రణకర్మతః ॥37॥

ఓ మహారాజా ! ఇట్లు ఎందుకు జరిగినదో, ఏమి జరగబోతుందో మాకు తెలియదు. నీవు మాత్రము యుద్ధకర్మను విరమించుము.

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే వంశానుచరితే నాభాగోపాఖ్యానం నామ దశాధికశతతమోఽధ్యాయః॥110॥

శ్రీ మార్కండేయ మహాపురాణమందలి వంశానుచరితమందలి నాభాగోపాఖ్యానమను నూటపదియవ అధ్యాయం సమాప్తం.



ఏకాదశాధికశతతమోఽధ్యాయః - నూటపదకొండవ అధ్యాయం

నాభాగచరితమ్ - నాభాగచరిత్రం

మార్కండేయ ఉవాచ - మార్కండేయుడు చెప్పాడు.

నివృత్తోఽసౌ తతో భూపః సంగ్రామాత్స్వసుతేన వై ।
ఉపయేమే చ తాం వైశ్యతనయాం సోఽపి తత్సుతః ॥1॥

అనంతరము మహారాజు తన పుత్రునితో యుద్ధమును విరమించుకొనెను. రాజకుమారుడు కూడా ఆ వైశ్యపుత్రికను వివాహమాడెను.

తతః స వైశ్యతాం ప్రాప్తః సముపేత్యాహ పార్థివమ్ ।
భూపాల యన్మయా కార్యం తన్మమాదిశ్యతాం మమ ॥2॥

అటు పిమ్మట రాజకుమారుడగు నాభాగుడు వైశ్యత్వమును పొంది రాజు దగ్గరకు వచ్చి "ఓ మహారాజా! నేనిప్పుడు ఏమి చేయవలెనో ఆదేశింపుడు" అని పలికెను.

రాజోవాచ - రాజు చెప్పాడు.

ధర్మాధికరణే యుక్తా బాభ్రవ్యాద్యాస్తపస్వినః ।
యదస్య కర్మ ధర్మాయ తద్వదన్తు తథా చర ॥3॥

బాభ్రవ్యుడు మొ॥గా గల తపస్విజనులు ధర్మాధికరణమందు నియోగింపబడి ఉన్నారు. వారు నాభాగునికి ఏ కార్యము ధర్మమని భావించెదరో అట్టి ధర్మమును చెప్పగలరు. వారు చెప్పిన విధముగా నడుచుకొనుము.

మార్కండేయ ఉవాచ :- మార్కండేయుడు చెప్పాడు.

తతస్తే మునయస్తస్య పాశుపాల్యం తథా కృషిమ్ ।
వాణిజ్యం చ పరం ధర్మమాచచఖ్యుః సభాసదః ॥4॥

అప్పుడా సభయందున్న మునులు నాభాగునికి పశుపాలనము, వ్యవసాయము, వాణిజ్యము అను కర్మలే ధర్మమని అనగా చేయదగినవని పలికిరి.

తథైవ చక్రే స సుతస్తస్య రాజ్ఞో యథోదితమ్ ।
తైర్ధర్మవాదిభిర్ధర్మం చ్యుతస్య నిజధర్మతః ॥5॥

తన రాజధర్మమునుండి భ్రంశము చెందిన ఆ రాజకుమారుడు ధర్మవాదులగు బాభ్రవ్యాదిమునులు చెప్పిన విధముగా ధర్మము నాచరించెను.

తస్య పుత్రస్తతో జాతో నామ్నా ఖ్యాతో భలన్దనః ।
స మాత్రా ప్రహితోఽగచ్ఛద్గోపాలో భవ పుత్రక ॥6॥

కొంతకాలమునకు నాభాగునికి పేరుతో ప్రఖ్యాతుడగు భలందనుడను కుమారుడు జన్మించెను. "ఓ కుమారా! నీవు గోవులను పాలించు గోపాలకుడవు అగుము" అని తల్లి పలుకగా, భలందనుడు ఆ కార్యమందు నియుక్తుడయ్యెను.

మాత్రా తథా నియుక్తో౽థ ప్రణిపత్య స్వమాతరమ్ ।
రాజర్షిమగమన్నీపం హిమవత్పర్వతాశ్రయమ్ ॥7॥

తల్లిచేత ఆ విధముగా నియుక్తుడైన భలందనుడు తన తల్లికి నమస్కరించి హిమవత్పర్వతప్రాంతమందు ఆశ్రయము పొందిన నీపుడను రాజర్షివద్దకు వెళ్ళెను.

తం సమేత్య చ జగ్రాహ తస్య పాదౌ యథావిధి ।
ప్రణిపత్యాహ చైవైనం రాజర్షిం స భలన్దనః ॥8॥

ఆ రాజర్షిని సమీపించి భలందనుడు ఆ రాజర్షి పాదములను పట్టుకొని నమస్కరించి ఈ విధముగా పలికెను.

ఆదిష్టో భగవన్మాత్రా గోపాలస్త్వం భవేతి వై ।
మయా చ పాలనీయా క్ష్మా తస్యాః స్వీకరణం కథమ్ ॥9॥

మయా హి గౌః పాలనీయా సా యదా స్వీకృతా భవేత్ ।
ఆక్రాన్తా బలవద్భిః సా దాయాదైః పృథివీ మమ ॥10॥

ఓ పూజ్యుడా ! నా తల్లి నన్ను గోపాలకుడవు అగుము అని ఆజ్ఞాపించెను. నేను ఈ భూమండలమును పరిపాలించవలెను. ఈ పృథివిని నేనెట్లు స్వీకరించగలను? నేను గోపాలనను చేపట్టినచో పృథివీపాలనను ఎట్లు చేయగలను? ఇంకనూ నా రాజ్యము నా దాయాదులచే ఆక్రమింపబడినది.

తాం యథా ప్రాప్నుయాం పృథ్వీం త్వత్ప్రసాదాదహం విభో ।
తథాదిశ కరిష్యామి తవాజ్ఞాం ప్రణతో౽స్మి తే ॥11॥

ఓ ప్రభూ ! ఈ భూమండలమును నీ అనుగ్రహముతో నేనెట్లు పొందగలనో అట్లు నన్ను ఆజ్ఞాపించుము. నీ ఆజ్ఞను నేను పరిపాలించెదను. నీకు నేను నమస్కరించుచున్నాను.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

తతః స నీపో రాజర్షిస్తస్మై నిరవశేషతః ।
భలన్దాయ దదౌ బ్రహ్మన్నస్త్రగ్రామం మహాత్మనే ॥12॥

ఓ బ్రహ్మస్వరూపుడా ! అంతట రాజర్షియగు ఆ నీపుడు మహాత్ముడగు భలందనునికి సంపూర్ణముగా అస్త్రవిద్యలను ప్రసాదించెను.

ప్రాప్తాస్త్రవిద్యః స యయౌ పితృవ్యతనయాన్ద్విజ ।
వసురాతాదికాన్పుత్రానాదిష్టః స మహాత్మనా ॥13॥

ఓ బ్రాహ్మణుడా ! నీపుడను రాజర్షివద్ద అస్త్రవిద్యలను పొందిన భలందనుడు మహాత్ముడగు ఆ రాజర్షి ఆదేశించిన విధముగా వసురాతుడు మొదలగు పితృవ్యపుత్రుల వద్దకు వెళ్ళెను. (తండ్రిసోదరుడు పితృవ్యుడు).

అయాచత స రాజ్యార్ధం కథం భోక్ష్యసి మేదినీమ్ ।
తే చోచుర్వైశ్యపుత్రస్త్వం కథం భోక్ష్యసి మేదినీమ్ ॥14॥

ఆ భలందనుడు తన తండ్రి, తాతగార్లకు సంబంధించిన రాజ్యములోని సగ భాగమును ఇమ్మని వారిని కోరెను. అంతట వారు "నీవు వైశ్యపుత్రుడవు, రాజ్యమునెట్లు అనుభవించెదవు?" అని పలికిరి.

తతస్తైర్యుద్ధమభవద్భలన్దస్యాత్మవంశజైః ।
వసురాతాదిభిః క్రుద్ధైః కృతాస్త్రస్యాస్త్రవర్షిభిః ॥15॥

అంతట అస్త్రములను గ్రహించిన భలందనునికి మరియు అస్త్రములను కురిపించుచున్న క్రుద్ధులైన వసురాతుడు మొ॥లగు దాయాదులకు మధ్య యుద్ధము జరిగెను.

స జిత్వా తానశేషాంస్తు శస్త్రవిక్షతసైనికాన్ ।
జహార పృథివీం తేషాం ధర్మయుద్ధేన ధర్మవిత్ ॥16॥

ఆ యుద్ధమందు ధర్మవేత్త అయిన భలందనుడు ధర్మయుద్ధముతో ఆ సేనలందరను శస్త్రములతో గాయపరచి ఓడించి భూమండలమును ఆక్రమించెను.

స నిర్జితారిః సకలాం పృథ్వీం రాజ్యం తథా పితుః ।
నివేదయామాస తతస్తత్పితా జగృహే న చ ॥
ప్రత్యువాచ స తం పుత్రం భార్యాయాః పురతస్తదా ॥17॥

భలందనుడు ఈ విధముగా శత్రువులను పరాజితులను చేసి భూమండలరాజ్యమంతటిని తన తండ్రియగు నాభాగునికి సమర్పించెను. కాని తండ్రి ఆ రాజ్యమును గ్రహింపక తన భార్య ఎదుటనే ఇట్లు పలికెను.

నాభాగ ఉవాచ – నాభాగుడు చెప్పెను.

భలన్ద రాజ్యమేతత్తే క్రియతాం పూర్వజైః కృతమ్ ॥18॥

ఓ భలందనా ! నీ పూర్వీకులచే పాలింపబడిన ఈ రాజ్యమును నీవే అనుభవించుము.

అహం న కృతవాన్రాజ్యం నాసామర్థ్యయుతః పురా ।
వైశ్యతాం తు పురస్కృత్య తథైవాజ్ఞాకరః పితుః ॥19॥

కృత్వాఽప్రీతిం పితురహం వైశ్యకన్యాపరిగ్రహాత్ ।
న పుణ్యలోకభాగ్రాజా యావదాభూతసంప్లవమ్ ॥20॥

నేను రాజ్యపరిపాలనము చేయకపోవుట సామర్థ్యము లేనందువలన కాదు. మరేమనగా నేను తండ్రిగారి ఆజ్ఞయందుండి కూడా, తండ్రిగారికి ఇష్టము లేకుండగా వైశ్యకన్యను వివాహమాడితిని. అందువలన వైశ్యత్వమును పొందిన కారణముగా ఈ సృష్టి ఉన్నంతవరకూ రాజ్యభోగములకు, పుణ్యలోకములకు అధికారిని కాలేకపోయితిని.

ఉల్లంఘ్యాజ్ఞాం పునస్తస్య పాలయామి మహీం యది ॥
నాస్తి మోక్షస్తతో నూనం మమ కల్పశతైరపి ॥21॥

ఇంకనూ నా తండ్రిగారి ఆజ్ఞను తిరస్కరించి నేను రాజ్యపరిపాలనము చేపట్టినచో నాకు నూరు కల్పముల వరకైననూ మోక్షము లభించదు.

న చాపి యుక్తం త్వద్బాహునిర్జితం మమ మానినః ॥
రాజ్యం భోక్తుమనీహస్య దుర్బలస్యేవ కస్యచిత్ ॥22॥

అంతేకాక అభిమానవంతుడనై, విషయాసక్తిలేని నాకు నీ భుజబలముచే జయింపబడిన రాజ్యమును అభవించుట, దుర్బలునికివలె, ఉచితము కాదు.

రాజ్యం కురు స్వయం పుత్ర దాయాదేభ్యో విముఞ్చ వా ॥
మమాజ్ఞాపాలనం శస్తం పితుర్న క్షితిపాలనమ్ ॥23॥

ఓ కుమారుడా ! నీవే స్వయముగా రాజ్యపరిపాలనము చేయుము. లేదా నీ దాయాదులకు రాజ్యమునిచ్చివేయుము. నాకు నా తండ్రిగారి ఆజ్ఞాపరిపాలనమే ఉచితము, రాజ్యపాలనము కాదు.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

తతః ప్రహస్య తద్భార్యా సుప్రభా నామ భామినీ ।
ప్రత్యువాచ పతిం భూప గృహ్యతాం రాజ్యమూర్జితమ్ ॥24॥

నాభాగుడు అట్లు పలుకగా, అతని భార్యయగు సుప్రభ నవ్వి తన భర్తతో ఇట్లు పలికెను. ఓ రాజా ! సమృద్ధమైన ఈ రాజ్యమును నీవు గ్రహించుము.

న త్వం వైశ్యో న చైవాహం జాతా వైశ్యకులే నృప ।
క్షత్రియస్త్వం తథైవాహం క్షత్రియాణాం కులోద్భవా ॥25॥

ఓ మహారాజా ! నీవు వైశ్యుడవు కాదు. నేను వైశ్యకులమందు జన్మించలేదు. నీవు క్షత్రియుడవు. అట్లే నేను కూడా క్షత్రియవంశమందు జన్మించినదానను.

పూర్వమాసీన్మహీపాలః సుదేవ ఇతి విశ్రుతః ।
తస్యాభూచ్చ సఖా రాజ్ఞో ధూమ్రాశ్వస్య సుతోఽనలః ॥26॥

పూర్వము సుదేవుడను ప్రఖ్యాతి చెందిన రాజుండెను. అతనికి ధూమ్రాశ్వుడను రాజుయొక్క కుమారుడైన నలుడు స్నేహితుడై యుండెను.

స తేన సఖ్యా సహితో జగామామ్రవనం వనమ్ ।
పత్నీభిః స సమం రన్తుం మాధవే మాసి పార్థివ ॥27॥

ఓ రాజా ! ఆ సుదేవుడు తన స్నేహితుడగు నలునితో కూడి వైశాఖమాసమందు తమ భార్యలతో కూడా విహారార్థమై ఆమ్రవనమునకు వెళ్ళెను.

తతః పానాన్యనేకాని భక్ష్యాణి బుభుజే తదా ।
భార్యాభిః సహితస్తాభిస్తేన సఖ్యా సమన్వితః ॥28॥

అటు పిమ్మట తమ భార్యలతో కూడి ఆ సుదేవుడు తన స్నేహితునితో కూడుకొన్నవాడై ఆ ఆమ్రవనమందు అనేకములైన పానద్రవ్యములను, భక్ష్యద్రవ్యములను అనుభవించెను.

తతః పుష్కరిణీతీరే దదర్శాతిమనోరమామ్ ।
పత్నీం చ్యవనపుత్రస్య ప్రమతేః పార్థివాత్మజామ్ ॥29॥

అనంతరము పుష్కరిణీ నదీతీరమందు మిక్కిలి అందగత్తె, చ్యవనమహర్షి కుమారుడగు ప్రమతియొక్క భార్య అయిన రాజపుత్రిని చూచెను.

సఖా తస్య నలో మత్తో జగృహే తాం చ దుర్మతిః ।
పశ్యతస్తస్య రాజ్ఞశ్చ త్రాహి త్రాహీతి వాదినీమ్ ॥30॥

అప్పుడు ఆ సుదేవుని స్నేహితుడయిన నలుడు మదించినవాడై దుర్బుద్ధితో ఆమెను బలాత్కారముగా గ్రహించదలచెను. అంతట ఆమె 'రక్షించుము, రక్షించుము' అని ఆ రాజుకు మొరబెట్టుకొనెను.

ఆక్రన్దితం నిశమ్యైవ స తస్యాః ప్రమతిః పతిః ।
ఆజగామ త్వరాయుక్తః కిమేతదితి వై వదన్ ॥31॥

అంతట ఆమె భర్తయగు ప్రమతిమహర్షి ఆమె ఆక్రందనమును విని "ఏమి జరిగినది" అని పలుకుచూ తొందరగా అచ్చటకు వచ్చెను.

తతో దదర్శ రాజానం సుదేవం తత్ర సంస్థితమ్ ।
గృహీతాం చ తథా పత్నీం నలేన సుదురాత్మనా ॥32॥

పిమ్మట అచ్చటకు బోయి చూడగా సుదేవుడను రాజు అచ్చట ఉండుటను మరియు తన భార్యను నలుడను దుర్మార్గుడు బలాత్కరించుటను చూచెను.

తతః సుదేవం ప్రమతిః ప్రాహాయం శాస్యతామితి ।
త్వం చ శాస్తా భవద్రాజ్యే దుష్టశ్చాయం నలో నృప ॥33॥

అప్పుడు ప్రమతి సుదేవుడను రాజుతో ఇట్లు పలికెను. "ఓ రాజా ! నీవు ఇతనిని శాసించుము (శిక్షించుము). ఈ రాజ్యమందు శాసించదగినవాడవు నీవే. ఈ నలుడు దుష్టస్వభావము గలవాడు.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పెను.

తస్యార్తస్య వచః శ్రుత్వా సుదేవో నలగౌరవాత్ ।
ప్రాహ వైశ్యోఽస్మి గచ్ఛాన్యం క్షత్రియం త్రాణకారణాత్ ॥34॥

ఆర్తుడైన అనగా దుఃఖములో ఉన్న ఆ ప్రమతి మాటలను విని సుదేవుడు నలునియందలి గౌరవముతో ఇట్లు పలికెను. "నేను వైశ్యుడను. నీవు రక్షణకొరకై వేరే క్షత్రియుని శరణు వేడుము."

తతః స ప్రమతిః క్రుద్ధస్తేజసా నిర్దహన్నివ ।
ప్రత్యువాచాథ రాజానం వైశ్యోఽస్మీత్యభిబాషిణమ్ ॥35॥

సుదేవుని మాటలను విని ఆ ప్రమతి మిక్కిలి కోపము గలవాడై తన తేజస్సుతో ఎదుటివారిని దహించువానివలే "నేను వైశ్యుడను" అని పలికిన రాజుతో ఇట్లు పలికెను.

ఏవమస్తు భవాన్ వైశ్యః క్షత్రియః క్షతరక్షణాత్ ।
క్షత్రియైర్ధార్యతే శస్త్రం నార్తశబ్దో భవేదితి ॥
స త్వం న క్షత్రియో భావీ వైశ్య ఏవ కులాధమః ॥36॥

"అట్లే అగుదువు గాక ! ఎందువలననగా కష్టములలోనున్నవారిని రక్షించుటకే క్షత్రియశబ్దము సార్థకనామధేయమై ఉన్నది. ఆర్తశబ్దము లేకుండుట కొరకే క్షత్రియులు శస్త్రమును ధరింతురు. ఇప్పటినుంచి నీవు క్షత్రియుడవు గాకుందువుగాక! కులాధముడగు వైశ్యుడవు అగుదువు గాక !"

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే నాభాగచరితే ఏకాదశాధికశతతమోఽధ్యాయః ॥111॥

శ్రీ మార్కండేయ మహాపురాణమందలి నాభాగచరితమందలి నూటపదకొండవ అధ్యాయం సమాప్తం.



ద్వాదశాధికశతతమోఽధ్యాయః - నూటపన్నెండవ అధ్యాయం

నాభాగచరితమ్ - నాభాగచరిత్రం

మార్కండేయ ఉవాచ - మార్కండేయుడు చెప్పాడు.

తస్మై దత్త్వా తతః శాపం నలం క్రుద్ధోఽబ్రవీద్ద్విజ ।
ప్రమతిర్భార్గవః కోపాత్త్రైలోక్యం నిర్దహన్నివ ॥1॥

ఓ బ్రాహ్మణుడా ! భృగుకుమారుడైన ప్రమతి ఈ విధముగా క్రుద్ధుడై సుదేవునికి శాపమిచ్చి, ముల్లోకములను దహించువానివలె ఉండి నలునితో ఈ విధముగా పలికెను.

మదోన్మత్తో యతో భార్యాం భవానత్ర మమాశ్రమే ।
బలాద్గృహ్ణాతి భస్మత్వం తస్మాద్వ్రజతు మా చిరమ్ ॥2॥

నీవు మదోన్మత్తుడవై నా ఆశ్రమమందు నా భార్యను బలాత్కారముగా గ్రహించితివి. అందువలన నీవిప్పుడే ఆలస్యము లేక భస్మమై పోవుదువు గాక !

తేనోదాహృతమాత్రే చ వాక్యే తస్మింస్తదా నలః ।
దేహజేనాగ్నినా సద్యో భస్మపుఞ్జస్తదాఽభవత్ ॥3॥

ప్రమతిమహర్షి ఇట్లు శపించిన వెంటనే, అతడి దేహమునుండి పుట్టిన అగ్నిచే, ఆ వెనువెంటనే నలుడు భస్మపు సమూహముగా అయ్యెను.

దృష్ట్వా ప్రభావం తం తస్య సుదేవో విమదస్తతః ।
ప్రణామనమ్రః ప్రాహేదం క్షమ్యతాం క్షమ్యతామితి ॥4॥

సుదేవుడు ఆ ప్రమతిమహర్షియొక్క ప్రభావమును (గొప్ప శక్తిని) చూచి మదము తొలగినవాడై నమస్కరించుచు ఇట్లు పలికెను. “నన్ను క్షమించుము, క్షమించుము.

యదుక్తవాంస్త్వాం భగవన్ సురాపానమదాకులమ్ ।
తత్క్షమ్యతాం ప్రసీద త్వం శాపోఽయం వినివర్త్యతామ్ ॥5॥

ఓ పూజ్యుడా ! సురాపానముచే మదించినవాడనై నేనేమేమో పలికితిని. దానినంతయు క్షమించుము. నీవు నాపై అనుగ్రహము చూపుము. నీవిచ్చిన ఈ శాపమును మరలించుము.”

ఏవం ప్రసాదితస్తేన ప్రమతిః ప్రాహ భార్గవః ।
గతకోపో నలే దగ్ధే నావినీతేన చేతసా ॥6॥

ఈ విధముగా సుదేవుడు పలుకగా భార్గవుడగు ప్రమతిమహర్షి నలుడు దహింపబడిన పిమ్మట శాంతించినవాడై, ప్రసన్నమైన మనస్సుతో ఇట్లు పలికెను.

నాన్యథా భావి తద్వాక్యం యన్మయా సముదీరితమ్ ।
తథాఽపి తే కరిష్యామి ప్రసన్నోఽనుగ్రహం పరమ్ ॥7॥

నా మాటలు ఎన్నటికినీ వ్యర్థము కావు. అయిననూ నేను ప్రసన్నుడనై నిన్ను అనుగ్రహించుచున్నాను.

భవితా వైశ్యజాతీయో భవాన్నాస్త్యత్ర సంశయః ।
భవితా క్షత్రియో వైశ్యస్తస్మిన్నేవాశు జన్మని ॥8॥

గ్రహీష్యతి బలాత్కన్యాం యదా తే క్షత్రసంభవః ।
తదా త్వం క్షత్రియో వైశ్యః స్వగృహీతో భవిష్యసి ॥9॥

కొద్దిరోజులు తప్పక నీవు వైశ్యజాతివాడవు అగుదువు. ఇందు సందేహము లేదు. క్షత్రియకులోత్పన్నుడవు అగు నీవు రాబోవు జన్మమందు వెంటనే వైశ్యుడవు కాగలవు. ఎప్పుడయితే ఎవరైనా క్షత్రియకుమారుడు బలవంతముగా నీ కుమార్తెను గ్రహించునో అప్పుడు నీవు వైశ్యజాతిని పోగొట్టుకొని, తిరిగి నీ జాతికి సంబంధించి క్షత్రియుడవు కాగలవు.

ఏవం స వైశ్యో భూపాల సుదేవోఽస్మత్పితాఽభవత్ ।
అహం చ యా మహాభాగ తత్సర్వం శ్రూయతాం త్వయా ॥10॥

ఓ రాజా ! ఈ విధముగా నా తండ్రి సుదేవుడు వైశ్యుడయ్యెను. ఓ మహానుభావా ! నా గురించి కూడా సమస్తవృత్తాంతమును చెప్పెదను, వినుము.

సురతో నామ రాజర్షిః ప్రాగాసీద్గన్ధమాదనే ।
తపస్వీ నియతాహారస్త్యక్తసఙ్గో వనాశ్రయః ॥11॥

పూర్వము గంధమాదనపర్వతమందు సురతుడను రాజర్షి వనములో ఆశ్రమము నిర్మించుకొని, నియమితమైన ఆహారమును తీసుకొనుచూ, ఎవరితోనూ సాంగత్యము లేకుండా, తపస్సును ఆచరించుచుండెను.

తతః శ్యేనముఖభ్రష్టాం దృష్ట్వైకాం శారికాం భువి ।
కృపాఽభూజ్జనితా మూర్ఛా తథా తస్య మహాత్మనః ॥12॥

అంతట ఆకాశమందు డేగనోటినుండి జారి క్రిందపడిన ఒక గోరువంకను చూచి, మహాత్ముడగు ఆ రాజర్షికి జాలి కలిగి, మూర్ఛిల్లెను.

తతో మూర్ఛావసానేఽహం తస్యోత్పన్నా శరీరతః ।
స మాం దృష్ట్వా చ జగ్రాహ స్నిహ్యమానేన చేతసా ॥13॥

యస్మాత్కృపాభిభూతస్య మమ జాతేయమాత్మజా ।
తస్మాత్కృపావతీనామ్నా భవిష్యత్యాహ స ప్రభో ॥14॥

పిమ్మట మూర్ఛ తొలగిన పిమ్మట నేను ఆ రాజర్షిశరీరమునుండి జన్మించితిని. ఆ రాజర్షి నన్ను చూచి స్నేహపూరితమైన మనస్సుతో నన్ను గ్రహించెను. "ఓ ప్రభూ ! కృపతో కూడియున్న నాకు ఈమె జన్మించిన కారణముగా ఈమె ఇప్పటినుంచి కృపావతియను పేరు గలదియగును" అని ఆ రాజర్షి పలికెను.

తతో౽హమాశ్రమే తస్య వర్ధమానా దివానిశమ్ ।
సఖీభిస్సహ తుల్యాభిర్విచరామి వనాని చ ॥15॥

పిమ్మట నేను ఆయన ఆశ్రమమందు పెరిగి పెద్దదానను అగుచుంటిని. నేను నా సమానవయస్కులగు స్నేహితురాండ్రతో ఎల్లప్పుడు స్వేచ్ఛగా విహరించుచుంటిని.

తతో మునేరగస్త్యస్య భ్రాతాగస్త్య ఇతి శ్రుతః ।
స చిన్వన్ కాననే వన్యం సఖీభిః కోపితో౽శపత్ ॥16॥

యస్మాన్మాం వైశ్య ఇత్యాహ భవతీ తేన తే శపే ।
వైశ్యా భవిష్యసీత్యుక్తే ప్రసాద్యోక్తో మయా మునిః ॥
నాపరాధం కృతవతీ తవాహం ద్విజసత్తమ ।
అన్యాసామపరాధేన కిమర్థం శప్తవానసి ॥17॥

ఒకనాడు అగస్త్యుడను ప్రసిద్ధి కలిగిన అగస్త్యభ్రాత ఆ వనములో వనమందు లభించు వస్తువులను ఏరుకొనుచుండెను. ఆ సమయమందు నా స్నేహితురాండ్రు ఆయనకు కోపము కలిగించగా ఆయన కోపగించినవాడై నన్నిట్లు శపించెను. "నీవు నన్ను వైశ్యుడవని ఎగతాళి చేసితివి. అందువలన నిన్ను నేను శపించుచున్నాను. నీవు వైశ్యకన్యవగుదువు గాక !" అని. ఈ విధముగా ఆ ముని నన్ను శపించగా నేను ఆయనను అనుగ్రహింపచేసుకొని ఆ మునితో ఇట్లు పలికితిని. "ఓ బ్రాహ్మణశ్రేష్ఠుడా ! నేనెట్టి తప్పునూ చేయలేదు. ఇతరులు చేసిన అపరాధమునకు నన్నెందులకు శపించినావు" అని.

ఋషిరువాచ – ఋషి పలికెను.

దుష్టతా దుష్టసంసర్గాదదుష్టమపి గచ్ఛతి ।
సురాబిన్దునిపాతేన పఞ్చగవ్యఘటో యథా ॥18॥

పంచ గవ్యములు కలిగిన పాత్రయందు ఒక్క సురాబిందువు పడినను ఎట్లు దుష్టమగుచున్నదో అట్లే దుష్టజనుల సాంగత్యము వలన దోషరహితులు కూడా దుష్టులే అగుచున్నారు.

ప్రణిపత్య హ్యనిష్టో౽పి యత్త్వయాహం ప్రసాదితః ।
తస్మాదనుగ్రహం బాలే శృణుష్వ చ కరోమ్యహమ్ ॥19॥

ఓ బాలా ! నీవు నన్ను నమస్కరించి వేడుకొన్నందువలన ప్రసన్నుడనైన నేను నిన్ను అనుగ్రహించుచున్నాను. వినుము.

వైశ్యయోనౌ యదా జాతా త్వం పుత్రం బోధయిష్యసి ।
రాజ్యాయ జాతిస్మరతాం తదా త్వం సమవాప్స్యసి ॥20॥

నీవు వైశ్యయోనియందు జన్మించి, ఎప్పుడయితే రాజ్యలాభము కొరకు నీ కుమారుని ప్రేరేపించెదవో అప్పుడు నీవు నీ జాతిస్మరణమును పొందెదవు. అనగా పూర్వజన్మలో నీవు వస్తుతః క్షత్రియకన్యవను విషయమును గుర్తుకు తెచ్చుకొనెదవు.

తతో భూయః క్షత్రజాతిం ప్రాప్తా త్వం పతినా సహ ।
దివ్యానవాప్స్యసే భోగాన్గచ్ఛ భీతిరిపైతు తే ॥21॥

అప్పుడు నీవు మరల నీవు క్షత్రియురాలవై నీవు నీ భర్తతోగూడ దివ్యములైన భోగములను అనుభవించెదవు. నీ భయము తొలగుగాక !

ఏవం శప్తాఽస్మి రాజేన్ద్ర తేన పూర్వం మహర్షిణా ।
పితా చ మే పూర్వమేవం శప్తః ప్రమతినాఽభవత్ ॥22॥

ఓ రాజశ్రేష్ఠుడా ! ఈ విధముగా సురతుడను రాజర్షివలన నేను శపింపబడితిని. మరియు నా తండ్రియగు సుదేవుడు కూడా ప్రమతిచేత పూర్వమిట్లే శపింపబడెను.

ఏవం వైశ్యో న రాజంస్త్వం న చ వైశ్యః పితా మమ ।
న త్వం హి మయ్యదుష్టాయామదుష్టో దుష్యసే కథమ్ ॥23॥

అందువలన "ఓ రాజా ! నీవు వైశ్యుడవుగావు. నా తండ్రిగూడ వైశ్యుడుగాడు. నేను గూడ ఎట్టి దోషములు లేనిదానను. అయినను నన్ను వివాహమాడినందువలన ఏ దోషములూ లేని నీవు ఎందువలన దూషింపబడుచున్నావు? అనగా తెలియక నిన్ను దూషించుచున్నారేగాని నీవు యథార్థముగా దుష్టుడవు గావు."

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే నాభాగచరితే ద్వాదశాధికశతతమోఽధ్యాయః ॥112॥

శ్రీ మార్కండేయ మహాపురాణమందలి నాభాగచరితమందలి నూటపన్నెండవ అధ్యాయం సమాప్తం.



త్రయోదశాధికశతతమోఽధ్యాయః – నూటపదమూడవ అధ్యాయం

భలన్దనవత్సప్రీచరితమ్ – భలందనుడు, వత్సప్రీయనువారల చరిత్రం

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

ఇతి తస్యాః వచః శ్రుత్వా పుత్రస్య స చ పార్థివః ।
పునః ప్రోవాచ ధర్మజ్ఞస్తాం పత్నీం తనయం తథా ॥1॥

ధర్మమునెరిగిన రాజు అయిన నాభాగుడు, తన భార్యాపుత్రుల మాటలను విని వారితో తిరిగి ఇట్లు పలికెను. ముందుగా భార్యతో ఇట్లు పలికెను.

యన్మయా పితురాదేశాత్త్యక్తం రాజ్యం న తత్పునః ।
గ్రహీష్యామి వృథోక్తేన కిమాత్మా క్లిశ్యతే త్వయా ॥2॥

నేను నా తండ్రిగారి ఆదేశముతో విడిచిపెట్టిన రాజ్యమును తిరిగి నేను స్వీకరించను. నీవిట్లు వృథావాక్యములను పలికి నిన్ను నీవు ఎందులకు కష్టపెట్టుకొనెదవు? పిమ్మట పుత్రునితో ఇట్లు పలికెను.

అహం తే సంప్రదాస్యామి కరం వైశ్యవ్రతే స్థితః ।
భుంక్ష్వ రాజ్యమశేషం త్వమిచ్ఛయా వా పరిత్యజ ॥3॥

నేను వైశ్యవ్రతమందు ఉంటూ నీకు పన్నులు చెల్లించెదను. నీవీ సమస్తరాజ్యమును అనుభవించుము. లేదా ఇష్టము లేనియెడల విడిచిపెట్టుము.

ఇత్యుక్తః స తదా పిత్రా రాజపుత్రో భలన్దనః ।
చకార రాజ్యం ధర్మేణ తద్వద్దారపరిగ్రహమ్ ॥4॥

ఈ విధముగా తండ్రియగు నాభాగుడు పలుకగా, రాజకుమారుడగు భలందనుడు ధర్మబద్ధముగా రాజ్యపరిపాలన చేయసాగెను. అట్లే తగిన సమయమందు వివాహము చేసుకొనెను.

అవ్యాహతం తస్య చక్రం పృథివ్యామభవద్ద్విజ ।
న చాధర్మే మనో భూపాస్తస్య సర్వేఽభవన్వశే ॥5॥

ఓ బ్రాహ్మణుడా ! అతడి రాజ్యపరిపాలనమను చక్రమునకు ఎట్టి అడ్డూ లేకుండా సాగిపోసాగెను. అతడి మనస్సు ఎన్నడునూ అధర్మమందు ప్రవర్తించలేదు. జనులందరూ అతనికి వశమైయుండిరి.

తేనేష్టో విధివద్యజ్ఞః సమ్యక్పాస్తి వసున్ధరామ్ ।
స ఏవైకోఽభవద్భర్తా పృథివ్యామరిశాసనః ॥6॥

అతడు విధ్యుక్తప్రకారము యజ్ఞములనాచరించెను, భూమిని చక్కగా పరిపాలించెను. భూమండలమందు అతడొక్కడే శత్రువులను నశింపచేసి రాజ్యపరిపాలకుడయ్యెను.

అజాయత సుతస్తస్య వత్సప్రీరితి నామతః ।
పితాతిశయితో యేన గుణౌఘేన మహాత్మనా ॥7॥

ఆ భలందనునికి వత్సప్రీ అను పేరుగల పుత్రుడుదయించెను. సద్గుణసంపత్తి కలిగి మహాత్ముడైన ఆ కుమారుని వలన తండ్రి మరింత గౌరవమును పొందెను.

తస్యాపి భార్యా సౌనన్దా విదూరథసుతాఽభవత్ ।
పతివ్రతా మహాభాగా సా ప్రాప్తా తేన శౌర్యతః ॥8॥

విదూరథుని కుమార్తెయగు సౌనంద అతడికి భార్య అయ్యెను. పతివ్రత మరియు మహానుభావురాలూ అయిన ఆమె అతడి పరాక్రమమువలన అతడికి భార్య అయ్యెను.

క్రౌష్టుకిరువాచ – క్రౌష్టుకి చెప్పాడు.

భగవంస్తేన సంప్రాప్తా కుజృంభనిధనాత్కథమ్ ।
ఏతదాఖ్యానమాఖ్యాహి ప్రసన్నేనాన్తరాత్మనా ॥9॥

ఓ పూజ్యుడా ! వత్సప్రి ఎట్లు కుజృంభుని చంపి సౌనందను భార్యగా పొందెను? ప్రసన్నమైన అంతరాత్మతో ఈ వృత్తాంతమును నాకు వివరింపుము.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

విదూరథో నామ నృపః ఖ్యాతకీర్తిరభూద్భువి ।
తస్య పుత్రద్వయం జాతం సునీతిః సుమతిస్తథా ॥10॥

ఈ భూమండలమందు ప్రసిద్ధకీర్తి కలిగిన విదూరథుడను రాజొకడుండెను. అతనికి సునీతి, సుమతియను ఇరువురు పుత్రులు జన్మించిరి.

ఏకదా తు వనం యాతో మృగయా స విదూరథః ।
దదర్శ గర్తం సుమహద్భూమేర్ముఖమివోద్గతమ్ ॥11॥

ఒకనాడు ఆ విదూరథుడు వేటనిమిత్తమై అడవికి వెళ్ళెను. అచ్చట తెరచుకొన్న భూమి ముఖమా (నోరు) అన్నట్లున్న ఒక పెద్ద గొయ్యిని చూచెను.

తం దృష్ట్వా చిన్తయామాస కిమేతదితి భైరవమ్ ।
పాతాలవివరం మన్యే నైతద్భూమేశ్చిరన్తనమ్ ॥12॥

ఆ పెద్ద గొయ్యిని చూచి "ఈ భయంకరమైన గొయ్యి ఏమై ఉండును? ఇది పాతాళమార్గమైన పెద్ద రంధ్రమని తలచుచున్నాను. ఇది భూమిపై పూర్వకాలమున త్రవ్విన లోయ మాత్రము కాదు" అని తలపోసెను.

చింతయన్నితి తత్రాసౌ దదర్శ విజనే వనే ।
బ్రాహ్మణం సువ్రతం నామ తపస్వినముపాగతమ్ ॥13॥

ఈ విధముగా తలపోయుచుండగా ఆ నిర్జనప్రాంతమైన వనమందు సువ్రతుడను ఒక బ్రాహ్మణతపస్వి వచ్చుచుండుటను చూచెను.

స తం పప్రచ్ఛ చ నృపః కిమేతదితి విస్మితః ।
అతిగంభీరమవనేర్దర్శితాన్తర్గతోదరమ్ ॥14॥

ఆశ్చర్యచకితుడైన ఆ రాజు మిక్కిలి లోతైన భూసంబంధమైన ఆ లోయను చూపించుచు "ఇది ఏమి"యని ఆ బ్రాహ్మణుని అడిగెను.

ఋషిరువాచ – ఋషి చెప్పాడు.

కిన్న వేత్సి మహీపాల వాగర్థస్త్వం హి మే మతః ।
జ్ఞేయం సర్వం నరేన్ద్రేణ వర్తతే యన్మహీతలే ॥15॥

ఓ మహారాజా ! నీవు ఎరుగవా ఏమి? నీవు కేవలము శబ్దార్థములను మాత్రమే ఎరుగుదువే కాని ఆ వస్తువును చూచియుండవు అని తలచుచున్నాను. రాజైనవాడు ఈ భూమండలముమీద ఉన్న సమస్తవస్తువులను ఎరిగి యుండవలెను.

దానవః సుమహావీర్యో వసత్యుగ్రో రసాతలే ।
స జృమ్భయతి యత్పృథ్వీం కుజృమ్భః ప్రోచ్యతే తతః ॥16॥

మహాపరాక్రమవంతుడైన ఉగ్రుడను పేరుగల రాక్షసుడొకడు పాతాళలోకమందు నివసించుచున్నాడు. అతడు భూమినంతటినీ జృంభణము (ఆవలించి తన నోటిలో ఉండునట్లు చేయుట) చేయుటచే కుజృంభుడని పిచవబడుచున్నాడు. (కుశబ్దానికి పృథివియని అర్థము.)

క్రియతే తేన యత్కిఞ్చిద్రత్నభూతం మహీతలే ।
త్రిదివే వా నరపతే తం కథం వేత్తి నో భవాన్ ॥17॥

ఓ రాజా ! ఈ భూమండలమందుగాని, స్వర్గలోకమందుగాని రత్నమువంటి ఏదో ఒకదానిని ఆ రాక్షసుడు చేయుచున్నాడు. నీవెట్లు ఈ విషయమును ఎరుగకుండా ఉన్నావు?

సునన్దం నామ ముసలం త్వష్టా యన్నిర్మితం పురా ।
తజ్జహార స దుష్టాత్మా తేన హన్తి రణే రిపూన్ ॥18॥

పూర్వము త్వష్టప్రజాపతి నిర్మించిన సునందమను పేరుగల ముసల మను ఆయుధమును ఆ దుర్మార్గుడు అపహరించెను. ఆ ఆయుధముతోనే ఆ రాక్షసుడు యుద్ధమందు శత్రువులను సంహరించుచున్నాడు.

పాతాలాన్తర్గతస్తేన భినత్తి వసుధామిమామ్ ।
తతోఽసురాణాం సర్వేషాం ద్వారాణి కురుతేఽసురః ॥19॥

పాతాళలోకమందున్న ఆ ఉగ్రుడను పేరుగల రాక్షసుడు ఈ భూమిని త్రవ్వుచున్నాడు. అటు పిమ్మట రాక్షసులందరికీ ఆ రాక్షసుడు ద్వారములను (మార్గములను) చేయుచున్నాడు.

తేన భిన్నాత్ర వసుధా సునన్దముసలేన తు ।
భోక్ష్యతే వసుధామేతాం తమజిత్వా కథం భవాన్ ॥20॥

ఆ సునందయను ముసలాయుధముతో ఈ భూమి త్రవ్వబడెను. ఆ రాక్షసుని జయించక నీవెట్లు ఈ భూమిని అనుభవించగలవు?

యజ్ఞాన్విధ్వంసయత్యుగ్రో దేవానాముపరోధకః ।
ఆప్యాయయతి దైతేయాన్స బలీ ముసలాయుధః ॥21॥

మిక్కిలి బలశాలియైన ఆ ముసలాయుధము మిక్కిలి భయమును గొల్పునదై దేవతలకు వ్యతిరేకముగా యజ్ఞములను నాశపరచుచున్నది. రాక్షసులకు బలమును చేకూర్చుచున్నది.

యద్యరిం ఘాతయస్యేనం పాతాలాన్తరగోచరమ్ ।
తతః సమస్తవసుధాపతిస్త్వం పరమేశ్వరః ॥22॥

నీవు ఒకవేళ పాతాళలోకమందు లోన ఉన్న శత్రువైన ఈ రాక్షసుని సంహరించినచో సమస్త భూమండలమునకు ప్రభువవు కాగలవు. పరమేశ్వరుడవు అనగా సర్వసమర్ధుడవు కూడా కాగలవు.

ముసలం తస్య బలినం సౌనన్దం ప్రోచ్యతే జనైః ।
తథా బలాబలం చైవ తం వదన్తి విచక్షణాః ॥23॥

జనులు బలశాలియైన ఈ ముసలమును సౌనందమని పిలుచుచున్నారు. అట్లే బుద్ధిమంతులు ఈ ముసలమును గూర్చి బలము కల్గినట్టిదని, బలహీనమైనట్టిదని కూడా చెప్పుచున్నారు.

తత్తు నిర్వీర్యతాం యాతి సంస్పృష్టం యోషితా నృప ।
తస్మిన్దినే ద్వితీయేఽహ్ని వీర్యవత్తదుదీర్యతే ॥24॥

ఓ రాజా ! ఆ ముసలము ఒకవేళ ఏ స్త్రీచేతనైననూ స్పృశింపబడినచో ఆ రోజు అది బలము లేనిదగును. కాని ఆ మరుసటిదినమే అది బలశాలియగునని చెప్పబడుచున్నది.

న స వేత్తి దురాచారః ప్రభావం ముసలస్య తమ్ ।
యోషిత్కరాగ్రసంస్పర్శే దోషం వీర్యవిశాతనమ్ ॥25॥

దురాచారుడైన ఆ కుజృంభుడను రాక్షసుడు ఆ ముసలముయొక్క ప్రభావమెట్టిదో ఎరుగడు. అట్లే స్త్రీచేతి స్పర్శతో ఆ ముసలము బలమును పోగొట్టుకొనునను విషయమును గూడ ఎరుగడు.

ఏవం తస్య బలం భూప దానవస్య దురాత్మనః ।
ముసలస్య చ తే ప్రోక్తం యద్యుక్తం తత్సమాచర ॥26॥

ఓ రాజా ! దుర్గార్గుడైన ఆ రాక్షసుని బలమును గూర్చి యథాతథముగా చెప్పితిని. అట్లే ఆ ముసలమును గూర్చి కూడా నీకు వివరముగా చెప్పితిని. ఇప్పుడు ఏది యుక్తమో దానినాచరించుము.

ఆసన్నమేతద్భవతః పురస్య పృథివీపతే ।
కృతం తేన మహారన్ధ్రం నిశ్చిన్తః కిం భవాన్వృథా ॥27॥

ఓ మహారాజా ! ఈ గొప్ప రంధ్రము నీవుండు పట్టణమునకు సమీపమందే చేయబడినది. నీవు వ్యర్థముగా అనగా ఆలోచన లేకుండగా ఎట్లు నిశ్చింతగా ఉన్నావు?

ఇత్యుక్త్వా తు గతే తస్మిన్పురం గత్వా మహీపతిః ।
మన్త్రయామాస మన్త్రజ్ఞైః పురమధ్యే తు మన్త్రిభిః ॥28॥

ఈ విధముగా ఆ ఋషి పలికి వెళ్ళిపోగా రాజు తన పట్టణమునకు వెళ్ళి మంత్రమునెరిగిన (యుక్తాయుక్తములను చెప్పుటలో సమర్థులైన) మంత్రులతో మంతనములు సాగించెను.

యథాశ్రుతమశేషం తత్కథయామాస మన్త్రిణామ్ ।
ముసలస్య ప్రభావం చ వీర్యశాతనమేవ చ ॥29॥

తాను విన్నది విన్నట్లుగా రాజు సమస్తవృత్తాంతమును, ఆ ముసలముయొక్క ప్రభావమును మరియు ఆ ముసలము బలహీనమగునట్టి విషయమును మంత్రులకు వివరించి చెప్పెను.

తం మన్త్రం క్రియమాణం తు మన్త్రిభిస్తేన భూభృతా ।
తత్పార్శ్వవర్తినీ కన్యా శుశ్రావాథ ముదావతీ ॥30॥

ఈ విధముగా రాజు మంత్రులతో మంతనములు చేయుచుండగా రాజు ప్రక్కనేయున్న ముదావతియను రాజకుమారి ఈ విషయమునంతనూ వినెను.

తతః కతిపయాహే తు తాం కన్యాం వయసాన్వితామ్ ।
జహారోపవనాద్దైత్యః కుజృంభః స సఖీవృతామ్ ॥31॥

ఈ విషయము జరిగిన కొన్ని రోజుల పిమ్మట యౌవనవతి అయిన ముదావతి తన స్నేహితురాండ్రతో కలిసియుండగా ఆమెను ఆ ఉద్యానవన సమీపప్రాంతమునుండి ఆ కుజృంభుడను రాక్షసుడు అపహరించెను.

తచ్ఛ్రుత్వా స మహీపాలః క్రోధపర్యాకులేక్షణః ।
పుత్రావువాచ త్వరితం గచ్ఛతం వనకోవిదౌ ॥32॥

నిర్వింధ్యాయాస్తటే గర్తస్తేన గత్వా రసాతలమ్ ।
స హన్యతాం యోఽపహర్తా ముదావత్యాః సుదుర్మతిః ॥33॥

ఆ విషయమును విన్న రాజు కోపముతో ఎఱ్ఱబడిన కళ్ళను ఇటునటూ త్రిప్పుచూ ఆ వనప్రదేశమునెరిగిన తన ఇద్దరు కుమారులతో "మీరు తొందరగా వెళ్ళండి. నిర్వింధ్యానదీతీరమందు పెద్ద గొయ్యి కలదు. దానిద్వారా మీరు పాతాళలోకమునకు వెళ్ళి ముదావతిని అపహరించిన ఆ దుర్గార్గుడ్ని చంపండి" అని పలికెను.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

తతస్తౌ తత్సుతౌ ప్రాప్య తం గర్తం తత్పదానుగౌ ।
యుయుధాతే కుజృంభేణ స్వసైన్యేనాతికోపితౌ ॥34॥

అంతట ఆ ఇరువురు కుమారులు తమ తమ సైన్యములతో మిక్కిలి క్రుద్ధులై ఆ సొరంగమును చేరుకొని, అచ్చట ఉన్న ఆ రాక్షసుని పాదచిహ్నములను బట్టి ఆ రాక్షసుడున్న పాతాళలోకప్రాంతాన్ని చేరుకొని, కుజృంభునితో యుద్ధము చేసిరి.

తతః పరిఘనిస్త్రింశశక్తిశూలపరశ్వధైః ।
బాణైశ్చావిరతం యుద్ధం తేషామాసీత్సుదారుణమ్ ॥35॥

అప్పుడు ఆయుధవిశేషములైన పరిఘ, నిస్త్రింశ, శక్తి, శూల, పరశ్వధములతోనూ, బాణములతోనూ ఆ రాక్షసుడు మరియు ఆ ఇరువురు కుమారుల మధ్య భయంకరమైన యుద్ధము జరిగెను.

తతో మాయాబలవతా తేన దైత్యేన తావుభౌ ।
రాజపుత్రౌ రణే బద్ధౌ నిహతాశేషసైనికౌ ॥36॥

అంతట మాయాబలముతో కూడుకొన్న ఆ రాక్షసుడు యుద్ధమందు ఆ ఇరువురు రాజకుమారుల సమస్త సైన్యమును సంహరించి వారిని బంధించెను.

తచ్ఛ్రుత్వా స మహీపాలః ప్రాహేదం సర్వసైనికాన్ ।
బద్ధపుత్రః పరమార్తిముపేతో మునిసత్తమ ॥37॥

ఓ మునిశ్రేష్ఠుడా ! తన కుమారులిరువురు బంధింపబడిన విషయమును విన్న ఆ రాజు అమితమైన దుఃఖమును పొంది తన సైనికులందరితో ఇట్లు పలికెను.

యస్తం నిహత్య దైతేయం మోచయిష్యతి మే సుతామ్ ।
తస్యాహం సంప్రదాస్యామి తామేవాయతలోచనామ్ ॥38॥

మీలో ఎవరైతే ఆ రాక్షసుని చంపి నా కుమార్తెను, మరియు నా ఇద్దరు పుత్రులను విడిపించెదరో అతడికి విశాలమైన నేత్రములుగల నా కుమార్తెను భార్యగా ఇచ్చెదను.

ఇత్యేవం ఘోషయాంచక్రే స రాజా స్వపురే తదా ।
నిరాశః పుత్రతనయాబంధమోక్షాయ వై మునే ॥39॥

ఓ క్రౌష్టుకిమునీ ! ఈ విధముగా నిరాశచెందిన ఆ రాజు తన ఇరువురు కుమారులను మరియు కుమార్తెను విడిపించుట కొరకు తన పట్టణమందు చాటింపు వేసెను.

తతః శుశ్రావ వత్సప్రీర్భలన్దనసుతో హి తత్ ।
ఆఘోష్యమాణం బలవాన్ కృతాస్త్రః శౌర్యసంయుతః ॥40॥

భలందనుని కుమారుడగు వత్సప్రీ యనువాడు బలశాలి, అస్త్రములతో కూడుకొన్నవాడు, పరాక్రమవంతుడు. అతడు ఆ చాటింపును వినెను.

స చాగమ్యాభివాద్యైనం ప్రాహ పార్థివసత్తమమ్ ।
వినయావనతో భూత్వా పితుర్మిత్రమనుత్తమమ్ ॥41॥

ఆ చాటింపును విన్న ఆ వత్సప్రీ యనువాడు తన తండ్రిగారికి గొప్ప స్నేహితుడైన రాజశ్రేష్ఠుడగు విదూరథునికి నమస్కరించి, ఇట్లు పలికెను.

ఆజ్ఞాపయాశు మామేవ తనయౌ మోచయామి తే ।
తవైవ తేజసా హత్వా తం దైత్యం తనయాం చ తే ॥42॥

ఓ రాజా ! నన్ను శీఘ్రముగా యుద్ధమునకు వెళ్ళుటకు ఆజ్ఞాపించుము. నీయొక్క తేజోబలముతోనే ఆ రాక్షసుని సంహరించి నీ ఇరువురు కుమారులను, నీ కుమార్తెను విడిపించెదను.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

స తం ముదా పరిష్వజ్య ప్రియసఖ్యురథాత్మజమ్ ।
గమ్యతామితి సంసిద్ధ్యై వత్సేత్యాహ స పార్థివః ॥43॥
స్థానే స్థాస్యతి మే వత్సో యద్యేవం కురుతే విధిమ్ ।
వత్సైతత్క్రియతామాశు యద్యుత్సాహి మనస్తవ ॥44॥

తన స్నేహితుని కుమారుడైన ఆ వత్సప్రీని సంతోషముతో కౌగలించుకొని ఇట్లు పలికెను. "ఓ కుమారా ! కార్యసిద్ధికొరకై వెళ్ళుము. నా స్నేహితుని కుమారుడు (వత్సప్రీ) ఈ విధముగా ఆచరించినచో గొప్పస్థానమందు నిలువగలడు. ఓ కుమారా ! నీ మనస్సు ఉత్సాహముతో కూడుకొనియున్నచో వెంటనే ఈ కార్యమును సాధించుము."

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

తతః సఖడ్గః సధనుర్బద్ధగోధాంగులిత్రవాన్ ।
జగామ వీరః పాతాలం తేన గర్తేన సత్వరః ॥45॥

అంతట వీరుడైన ఆ వత్సప్రీ అనువాడు ఖడ్గము, ధనుస్సు మరియు ఇతర ఆయుధములను ధరించి ఆ సొరంగము ద్వారా పాతాళలోకమునకు వెళ్ళెను.

తతో జ్యాస్వనమత్యుగ్రం స చక్రే పార్థివాత్మజః ।
యేన పాతాలమఖిలమాసీదాపూరితాన్తరమ్ ॥46॥

అటుపిమ్మట రాజకుమారుడగు ఆ వత్సప్రీ అనువాడు భయమును గొల్పు వింటినారి ధ్వనిని చేసెను. ఆ ధనుష్టంకారము పాతాళలోకమంతయు ప్రతిధ్వనించెను.

తతో జ్యాస్వనమాకర్ణ్య కుజృంభో దానవేశ్వరః ।
ఆజగామాతికోపేన స్వసైన్యపరివారితః ॥47॥

రాక్షసాధిపతియగు కుజృంభుడు ఆ ధనుష్టంకారమును విని, మిక్కిలి కోపగించినవాడై తన సైన్యముతోగూడ అచ్చటకు వచ్చెను.

తతో యుద్ధమభూత్తస్య తేన పార్థివసూనునా ।
ససైన్యస్య ససైన్యేన బలినో బలశాలినా ॥48॥

అంతట సైన్యముతో కూడుకొన్న బలవంతుడగు ఆ కుజృంభునికి బలవంతుడు, సైన్యముతో కూడుకొన్నవాడూ అగు రాజకుమారుడగు వత్సప్రీ అనువానితో గొప్ప యుద్ధము జరిగెను.

దినాని త్రీణి స యదా యోధితస్తేన దానవః ।
తతః కోపపరీతాత్మా ముసలాయాభ్యధావత ॥49॥

రాక్షసుడైన కుజృంభుడు మూడు రోజులు వత్సప్రీతో యుద్ధము చేసి మిక్కిలి క్రుద్ధుడై ముసలమును తెచ్చుటకు పరుగెత్తెను.

గంధైర్మాల్యైస్తథా ధూపైః పూజ్యమానః స తిష్ఠతి ।
అన్తఃపురే మహాభాగ ప్రజాపతివినిర్మితః ॥50॥

ఓ మహానుభావుడా ! ప్రజాపతిచే నిర్మింపబడిన ఆ ముసలము గంధ, మాల్య, ధూప, దీపాదులచే పూజింపబడుచూ అంతఃపురమందు ఉండెను.

తతో విజ్ఞాతముసలప్రభావా సా ముదావతీ ।
పస్పర్శ ముసలశ్రేష్ఠమతినమ్రశిరోధరా ॥51॥

ఇంతకుముందు ముదావతి ముసలముయొక్క ప్రభావమును తెలుసుకొనియుండుటచే, ఆమె శిరస్సు వంచి దానిని స్పృశించెను.

పునర్యావత్స గృహ్ణాతి ముసలం తం మహాసురః ।
తావత్సా వన్దనవ్యాజాత్పస్పర్శానేకశః శుభా ॥52॥

మరియు ఆ గొప్ప రాక్షసుడు ఎప్పటిలోగా ఆ ముసలమును తీసుకొనులోగా ఆ మంగళస్వరూపురాలైన ముదావతి దానిని పూజించు నెపముతో మాటిమాటికి దానిని స్పృశించెను.

తతః స గత్వా యుయుధే ముసలేనాసురేశ్వరః ।
వ్యర్థా ముసలపాతస్తే సంజగ్ముస్తేషు శత్రుషు ॥53॥

అటుపిమ్మట ఆ రాక్షసాధిపతి అయిన కుజృంభుడు యుద్ధక్షేత్రమునకు వెళ్ళి, ఆ ముసలాయుధముతో యుద్ధము చేయసాగెను. కాని శత్రువుల పట్ల ఆ ముసలముయొక్క దెబ్బలు వ్యర్థమగుచుండెను.

పరమాస్త్రే తు నిర్వీర్యే సౌనన్దే ముసలే మునే ।
అస్త్రైః శస్త్రైశ్చ దైతేయః సోఽయుధ్యత రణేఽరిణా ॥54॥

సౌనంద అను ఆ గొప్ప ముసలాస్త్రము ప్రభావహీనమగుటచే ఆ రాక్షసాధిపతి యుద్ధమందు తన శత్రువుతో అస్త్రములతోను, శస్త్రములతోను యుద్ధము చేయసాగెను.

శస్త్రాస్త్రైర్న సమస్తస్య రాజపుత్రస్య సోఽసురః ।
ముసలేన బలం తస్య తచ్చ తన్వ్యా నిరాకృతమ్ ॥55॥

రాజపుత్రుని శస్త్రాస్త్రములతో ఆ రాక్షసుడు సమానుడు కాలేకపోయెను. ఆ ముసలాయుధము వలన రాక్షసునికి సంభవించు బలము ఆ ముదావతిచే నిరాకరింపబడినది.

తతః పరాజిత్య స భూపసూనురస్త్రాణి శస్త్రాణి చ దానవస్య ।
చకార సద్యో విరథం తతశ్చ సచర్మఖడ్గః పునరప్యధావత ॥56॥

అంతట ఆ రాజకుమారుడు ఆ రాక్షసుని అస్త్రములను, శస్త్రములను వ్యర్థపరచెను. ఆ వెనువెంటనే ఆ రాక్షసుని రథమును నాశపరచెను. అంతట ఆ రాక్షసాధిపతి చర్మఖడ్గములను గ్రహించి ఆ రాజకుమారుని పైకి ఉరికెను.

తమాపతన్తం రభసాభ్యుదీర్ణం విస్పష్టకోపం త్రిదశేన్ద్రశత్రుమ్ ।
శస్త్రేణ వహ్నేర్భువి రాజపుత్రో జఘాన కాలానలసప్రభేణ ॥57॥

దేవతల శత్రువు, స్పష్టమైన కోపము గలవాడు, ఉద్రిక్తుడు అయిన ఆ రాక్షసుడు తనపైకి వచ్చుచుండగా, ఆ రాజపుత్రుడు కాలాగ్నికాంతివంటి కాంతి కలిగిన ఆగ్నేయాస్త్రముతో ఆ రాక్షసుని చంపివేసెను.

స పావకాస్త్రేణ హృది క్షతో భృశం తత్యాజ దేహం త్రిదశారిరాత్మనః ।
బభూవ సద్యశ్చ మహోరగాణాం రసాతలాన్తేషు మహానథోత్సవః ॥58॥

ఆగ్నేయాస్త్రముచే దేవతల శత్రువైన కుజృంభుడు హృదయము పగిలి ప్రాణములను విడిచెను. ఆ వెనువెంటనే పాతాళవాసులైన సర్పములకు గొప్ప ఉత్సవము కలిగెను.

తతోఽపతత్పుష్పవృష్టిర్మహీపాలసుతోపరి ।
జగుర్గన్ధర్వపతయో దేవవాద్యాని సస్వనుః ॥59॥

పిమ్మట ఆ రాజపుత్రునిపై పుష్పవృష్టి కురియసాగెను. గంధర్వులు గానము చేసిరి. దేవదుందుభులు మ్రోగసాగెను.

స చాపి రాజపుత్రస్తం హత్వా తౌ నృపతేః సుతౌ ।
మోచయామాస తన్వఙ్గీం తాం చ కన్యాం ముదావతీమ్ ॥60॥

రాజకుమారుడగు ఆ వత్సప్రీ అనువాడు ఈ విధముగా రాక్షసుని చంపి సుమతి అను రాజుయొక్క ఇరువురు కుమారులను మరియు కోమలమైన శరీరముగల రాజకన్యయగు ముదావతిని విడిపించెను.

తచ్చాపి ముసలం తస్మిన్కుజ్రుంభే వినిపాతితే ।
జగ్రాహ నాగాధిపతిరనన్తః శేషసంజ్ఞితః ॥61॥

కుజ్రుంభుడు సంహరింపబడగా, ఆ ముసలమును శేషుడను పేరుగల ఆ నాగరాజైన అనంతుడు గ్రహించెను.

తస్యాశ్చ పరితుష్టోఽసౌ శేషః సర్వోరగేశ్వరః ।
ముదావత్యా ముదాధ్యాతమనోవృత్తిస్తపోధనః ॥62॥

సునన్దముసలస్పర్శం యచ్చకార పునఃపునః ।
యోషిత్కరతలస్పర్శప్రభావజ్ఞాతిశోభనా ॥63॥

ముదావత్యాస్తతో నామ నాగరాజస్తదాకరోత్ ।
సునన్దామితి సానన్దం సౌనన్దగుణజం ద్విజ ॥64॥

ఓ బ్రాహ్మణుడా! సమస్తసర్పములకు అధిపతి అయిన ఆ శేషుడు ముదావతిపట్ల సంతుష్టుడాయెను. తపోధనుడైన ఆ శేషుడు ముదావతియొక్క మనోవ్యాపారమును గురించి ఆలోచించసాగెను. ఎందువలననగా ముసలమును స్త్రీ స్పృశించుటవలన కలుగు ప్రభావమును ఎరిగిన ఆ ముదావతి మాటిమాటికి సునంద అను పేరుగల ఆ ముసలమును స్పృశించెను. అందువలన ఆ ఆయుధముయొక్క గుణమగు సౌనందముతో ఉద్భవించిన సునందయను పేరును ఆ రాజు ముదావతికి పెట్టెను.

స చాపి రాజపుత్రస్తాం భ్రాతృభ్యాం సహితాం పితుః ।
సమీపమానినాయాశు ప్రణిపత్యాహ చైవ తమ్ ॥65॥

ఆనీతౌ తనయౌ తాత తథైవేయం ముదావతీ ।
తవాజ్ఞయా మయాన్యద్యత్కర్తవ్యం తత్సమాదిశ ॥66॥

ఆ రాజపుత్రుడగు వత్సప్రీ అనువాడు కూడా ఇరువురు సోదరులతో కూడుకొన్న ముదావతిని విదూరథునివద్దకు తీసుకొనివచ్చి, నమస్కరించి, ఇట్లు పలికెను. ఓ తండ్రీ! మీ ఆజ్ఞానుసారము మీ ఇరువురు కుమారులను మరియు కుమార్తెయగు ముదావతిని మీవద్దకు తీసుకొనివచ్చినాను. మీ ఆజ్ఞ ప్రకారము నేనింకేమి చేయవలెనో చెప్పుడు.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

తతః ప్రహర్షసంపూర్ణహృదయః స మహీపతిః ।
సాధు సాధ్విత్యథాహోచ్చైర్వత్స వత్సేతి శోభనమ్ ॥67॥

అంతట ఆ రాజు సంతోషముతో నిండిన హృదయము గలవాడై, గట్టిగా 'సాధు, సాధు' (మంచిది, మంచిది) అని, 'మంచిది కుమారా ! మంచిది కుమారా' యని పలికెను.

సభాజితోఽస్మి త్రిదశైర్వత్సాహం కారణైస్త్రిభిః ।
త్వం జామాతా చ యత్ప్రాప్తో యచ్చారిర్వినిపాతితః ॥68॥

ఆగతాన్యక్షతాన్యత్ర యచ్చాపత్యాని మే పునః ।
తద్గృహాణాద్య శస్తేఽహ్ని పాణిమస్యా మయోదితమ్ ॥69॥

త్వం రాజపుత్ర చార్వఙ్గ్యాః కన్యాయా దుహితుర్మమ ।
ముదావత్యా ముదా యుక్తః సత్యవాక్యం కురుష్వ మామ్ ॥70॥

ఓ కుమారా ! నేను మూడు కారణములవలన దేవతల ద్వారా కూడా ప్రశంసింపబడుచున్నాను. మొదటిది– నిన్ను నేను అల్లునిగా పొందితిని. రెండవది – శత్రువు సంహరింపబడ్డాడు. మూడవది – నా ఇరువురు కుమారులు మరియు కుమార్తె క్షేమముగా తిరిగి వచ్చినారు. అందువలన ఓ రాజకుమారా ! నేటి శుభదినమందు నేను చెప్పిన విధముగా శుభలక్షణయుక్తురాలు అయిన నా కుమార్తె ముదావతిని సంతోషముతో పాణిగ్రహణము చేయుము. అట్లు చేసి నేను సత్యవాదిని యగునట్లు చేయుము.

రాజపుత్ర ఉవాచ – రాజకుమారుడు చెప్పాడు.

తాతస్యాజ్ఞా మయా కార్యా యద్బ్రవీషి కరోమి తత్ ।
త్వమేవ తాత జానీషే నైవాత్రాధికృతా వయమ్ ॥71॥

ఓ తండ్రీ ! తండ్రిగారు చెప్పినట్లుగా తండ్రిగారి ఆజ్ఞ తప్పక ఆచరించతగినది. ఓ తండ్రీ ! మీరు కూడా ఎరుగుదురు కదా ! పూజ్యులైన మీ ఆజ్ఞను ఎన్నడూ జవదాటను.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

తతస్తయోః స రాజేన్ద్రశ్చక్రే వైవాహికం క్రమమ్ ।
ముదావత్యాశ్చ దుహితుర్భలన్దనసుతస్య వై ॥72॥

అనంతరము రాజేంద్రుడగు విదూరథుడు తన పుత్రికయగు ముదావతికి మరియు భలందనపుత్రుడగు వత్సప్రీ అనువానికి వివాహకార్యమును నిర్వర్తించెను.

తతః స తయా రేమో వత్సప్రీర్నవయౌవనః ।
రమణీయేషు దేశేషు ప్రాసాదశిఖరేషు చ ॥73॥

అనంతరము నవయౌవనము కలిగిన వత్సప్రీ అనువాడు ముదావతితో రమణీయమైన ప్రదేశములందు మరియు మేడల పైభాగములందు విహరించసాగెను.

కాలేన గచ్ఛతా వృద్ధః పితా తస్య భలన్దనః ।
వనం జగామ వత్సప్రీః స బభూవ మహీపతిః ॥74॥

కాలము గడచుకొలదీ వత్సప్రీయొక్క తండ్రి అయిన భలందనుడు వృద్ధుడై అడవులకు వెళ్ళెను. అప్పుడు వత్సప్రీ అను రాజపుత్రుడు మహారాజు అయ్యెను.

ఇయాజ యజ్ఞాన్సతతం ప్రజా ధర్మేణ పాలయన్ ।
పుత్రవత్పాల్యమానాస్తు ప్రజాస్తేన మహాత్మనా ॥75॥

వవృధుర్విషయే తస్య న చాభూద్వర్ణసంకరః ।
న దస్యువ్యాలదుర్వృత్తభయమాసీచ్చ కస్యచిత్ ॥
నోపసర్గభయం చైవ తస్మిన్ శాసతి భూపతౌ ॥76॥

వత్సప్రీయను ఆ మహారాజు ప్రజలను ధర్మమార్గమందు పరిపాలించుచు ఎల్లప్పుడు యజ్ఞములనాచరించెను. మహాత్ముడగు ఆ మహారాజుచేత పుత్రునివలె ప్రజలు పరిపాలింపబడుచూ వృద్ధిపొందిరి. అతని రాజ్యమందు ఎచ్చటా వర్ణసాంకర్యము లేదు. ఆ మహారాజు రాజ్యపరిపాలనము చేయుచుండగా చోరులు, క్రూరజంతువులు, దుర్మార్గుల వలన ఎవరికినీ భయము కలుగలేదు. ఉపద్రవములవలన ఎన్నడూ భయము లేకుండెను.

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే భలన్దనవత్సప్రీచరితం నామ త్రయోదశాధికశతతమోఽధ్యాయః ॥113॥

శ్రీ మార్కండేయ మహాపురాణమందలి భలన్దనుడు వత్సప్రీయనువారల చరిత్రమను నూటపదమూడవ అధ్యాయం సమాప్తం.



చతుర్దశాధికశతతమోఽధ్యాయః – నూటపదునాలుగవ అధ్యాయం

ఖనిత్రచరిత్రమ్ – ఖనిత్రుని చరిత్ర

మార్కండేయ ఉవాచ :– మార్కండేయుడు చెప్పాడు.

తస్య తస్యాం సునన్దాయాం పుత్రా ద్వాదశ జజ్ఞిరే ।
ప్రాంశుః ప్రవీరః శూరశ్చ సుచక్రో విక్రమః క్రమః ॥1॥

బలీ బలాకశ్చణ్డశ్చ ప్రచణ్డశ్చ సువిక్రమః ।
సునయశ్చ మహాభాగాః సర్వే సంగ్రామజిత్తమాః ॥2॥

పిమ్మట ఆ సునందగర్భమునుండి వత్సప్రీకి పన్నెండుమంది పుత్రులు కలిగిరి. వారు వరుసగా ప్రాంశు, ప్రవీర, శూర, సుచక్ర, విక్రమ, క్రమ, బలి, బలాక, చణ్డ, ప్రచణ్డ, సువిక్రమ, సునయ అను పేర్లుగల మహానుభావులు. వీరందరు సంగ్రామమందు విజయము పొందినవారలలో శ్రేష్ఠులు.

తేషాం జ్యేష్ఠో మహావీర్యః ప్రాంశురాసీన్నరాధిపః ।
ఇతరే భృత్యవత్తస్య బభూవుర్వశవర్తినః ॥3॥

ఈ పన్నెండుమంది సోదరులలో పెద్దవాడైన ప్రాంశువు గొప్ప పరాక్రమవంతుడు మరియు మహారాజు అయ్యెను. మిగిలిన సోదరులు అతనికి సేవకులవలె అతనికి లొంగి ఉండిరి.

తస్య యజ్ఞే ద్విజత్యక్తైరనేకైర్ద్రవ్యరాశిభిః ।
న్యూనవర్ణవిసృష్టైశ్చ సత్యనామా వసున్ధరా ॥4॥

ఆ ప్రాంశువు చేసిన యజ్ఞములలో దానములు స్వీకరించిన బ్రాహ్మణులు తమకు ఎక్కువై పోయినందున వారిచే వదిలివేయబడిన ద్రవ్యరాశులతోను, అట్లే ఇతర వర్ణములవారు కూడా వదిలివేసిన ద్రవ్యములతోను ఈ భూమికి వసుంధరయను పేరు (సంపదలను ధరించునది) సార్థకనామమయ్యెను.

సమ్యక్పాలయతస్తస్య ప్రజాః పుత్రానివౌరసాన్ ।
యోఽభూద్ధనచయః కోశే తేన నిష్పాదితాస్తు యే ॥5॥

క్రతవః శతం సహస్రాస్తే తేషాం సంఖ్యా న విద్యతే ।
అయుతాద్యేన కోటీభిర్న చ పద్మాదిభిర్మునే ॥6॥

ధర్మబద్ధముగా ప్రజలను తన కన్నబిడ్డలుగా పరిపాలించుచున్న ఆ ప్రాంశుమహారాజు లెక్కలేనన్ని యజ్ఞములను అనుష్ఠించెను. ఓ మునీ ! పదివేలు, లక్షలు, కోట్లు, పద్మములు మొ॥లగు సంఖ్యలచేతను గూడ ఆ యజ్ఞములు ఇన్ని అని లెక్కబెట్టుట శక్యముగాదు.

ప్రజాతిస్తస్య పుత్రోఽభూద్యస్య యజ్ఞే శతక్రతుః ।
అవాప్య తృప్తిమతులాం యజ్ఞభాగైః సురైః సహ ॥7॥

దానవానాం సువీర్యాణాం జఘాన నవతీర్నవ ।
బలం చ బలినాం శ్రేష్ఠం జంభం చాసురసత్తమమ్ ॥8॥

అన్యాంశ్చ సుమహావీర్యానాజఘానామరద్విషః ।

ఆ ప్రాంశుమహారాజునకు ప్రజాతియను పుత్రుడు కలిగెను. అతడు ఆచరించిన యజ్ఞములందు హోమద్రవ్యములను స్వీకరించుటవలన మిగిలిన దేవతలతోబాటు తృప్తిని పొందిన దేవేంద్రుడు మహాపరాక్రమవంతులైన తొమ్మిది తొంబదులు అనగా ఎనిమిదివందలపదిమంది రాక్షసులను సంహరించెను. అట్లే బలవంతులలో శ్రేష్ఠుడైన బలాసురుని, రాక్షసశ్రేష్ఠుడైన జంభాసురుని, దేవతాశత్రువులై పరాక్రమవంతులైన ఇతర రాక్షసులను గూడా ఆ దేవేంద్రుడు సంహరించెను.

ప్రజాతేస్తనయాః పఞ్చ ఖనిత్రప్రముఖా మునే ॥9॥
తేషాం ఖనిత్రో రాజాఽభూత్ప్రఖ్యాతో నిజవిక్రమైః ।

ఓ మునీ ! ఆ ప్రజాతికి ఖనిత్రుడు మొ॥లగు అయిదుగురు కుమారులు జన్మించిరి వారిలో స్వీయ పరాక్రమములతో ప్రఖ్యాతినందిన ఖనిత్రుడు రాజయ్యెను.

స శాన్తః సత్యవాక్ఛూరః సర్వప్రాణిహితే రతః ॥10॥

స్వధర్మాభిరతో నిత్యం వృద్ధసేవీ బహుశ్రుతః ।
వాగ్మీ వినయసంపన్నః కృతాస్త్రోఽప్యవికత్థనః ॥11॥

సర్వలోకప్రియో నిత్యమువాచైతదహర్నిశమ్ ।

ఆ ఖనిత్రుడు శాన్తస్వభావముగలవాడు, సత్యమునే పలుకువాడు, పరాక్రమవంతుడు, సమస్తప్రాణుల హితమును కోరువాడు, స్వీయధర్మమును ఆచరించుటలో ఆసక్తిగలవాడు, ఎల్లప్పుడు పెద్దలను సేవించువాడు, వేదాధ్యయనసంపన్నుడు, మంచి పలుకువాడు, వినయసంపన్నుడు, అస్త్రవిద్యను ఎరిగినవాడైననూ అహంకారము లేనివాడు, మరియు సమస్తజనుల హితమును కోరువాడు. అతడు ఎల్లప్పుడు ఈ విధముగా పలుకుచుండెడివాడు.

నన్దన్తు సర్వభూతాని స్నిహ్యన్తు విజనేష్వపి ॥12॥

స్వస్త్యస్తు సర్వభూతేషు నిరాతఙ్కాని సన్తు చ ।
మా వ్యాధిరస్తు భూతానామాధయో న భవన్తు చ ॥13॥

మైత్రీమశేషభూతాని పుష్యన్తు సకలే జనే ।
శివమస్తు ద్విజాతీనాం ప్రీతిరస్తు పరస్పరమ్ ॥14॥

సమృద్ధిః సర్వవర్ణానాం సిద్ధిరస్తు చ కర్మణామ్ ।
భో లోకాః సర్వభూతేషు శివా వోఽస్తు సదా మతిః ॥15॥

యథాత్మని యథా పుత్రే హితమిచ్ఛథ సర్వదా ।
తథా సమస్తభూతేషు వర్తధ్వం హితబుద్ధయః ॥16॥

ఏతద్వో హితమత్యన్తం కో వా కస్యాపరాధ్యతే ।
యత్కరోత్యహితం కిఞ్చిత్కస్యచిన్మూఢమానసః ॥17॥

తం సమభ్యేతి తన్నూనం కర్తృగామిఫలం యతః ।
ఇతి మత్వా సమస్తేషు భో లోకా హితబుద్ధయః ॥18॥

సన్తు మా లౌకికం పాపం లోకాః ప్రాప్స్యథ వై బుధాః ।
యో మేఽద్య స్నిహ్యతే తస్య శివమస్తు సదా భువి ॥19॥

యశ్చ మాం ద్వేష్టి లోకేఽస్మిన్సోఽపి భద్రాణి పశ్యతు ।
ఏవం స్వరూపః పుత్రోఽభూత్ఖనిత్రస్తస్య భూపతేః ॥20॥

సమస్తగుణసంపన్నః శ్రీమానబ్జదలేక్షణః ।

సమస్తజనులు పరస్పరము స్నేహభావమును వృద్ధి చేసుకొందురు గాక ! ద్విజాతులందరికీ కల్యాణము సిద్ధించుగాక! వారికి పరస్పరము ఒండొరులయందు ప్రీతి కలుగుగాక ! సమస్తవర్ణములవారికి సమృద్ధి కలుగుగాక! వారు చేయు కర్మలన్నియు సిద్ధించుగాక ! ఓ జనులారా ! సమస్తప్రాణులందు మీ బుద్ధి మంగళస్వరూపమై ఉండుగాక ! మీరు మీయందు మీ పుత్రులందు ఎట్లు హితమును కోరుకొందురో అట్లే ఇతర సమస్త ప్రాణులందు హితమైన బుద్ధి కలవారై ప్రవర్తింతురు గాక ! అట్టి భావమే మీకు మిక్కిలి హితమును కలుగజేయును. ఎవరు ఎవరిపట్ల అపరాధబుద్ధి కలిగియుండునో మరియు అజ్ఞానియై ఎవరు ఎవరికి కీడును కలుగజేయునో అట్టివానికి కర్మఫలములు తక్కువ సిద్ధించును. ఓ జనులారా! మీరీ విధముగా భావించి అందరియెడల హితబుద్ధి కలిగినవారు కండి. మీరు లౌకికమైన పాపములను చేయకండి. ఓ జ్ఞానులారా ! మీరిట్లు భావించి పుణ్యలోకములను పొందండి. ఎవరయితే ఈ సమయమందు నాపట్ల స్నేహభావమును చూపుచున్నారో వారికి ఈ భూలోకమందు ఎల్లప్పుడు కల్యాణము కలుగుగాక ! ఎవరయితే ఈ లోకమందు నన్ను ద్వేషించుచున్నారో వారికికూడా శుభములు కలుగుగాక ! ఈ విధముగా పలికెడి ఖనిత్రుడను పేరుగల కుమారుడు ఆ ప్రజాతియను పేరుగల మహారాజుకు జన్మించెను. అతడు సమస్తసద్గుణసంపన్నుడు, శ్రీమంతుడు మరియు పద్మపురేకులవంటి కన్నులు గలవాడు.

తేన తే భ్రాతరః ప్రీత్యా పృథగ్రాజ్యేషు యోజితాః ॥21॥

స్వయం చ పృథివీమేతాం బుభుజే సాగరామ్బరామ్ ।
ప్రాచ్యాం తేన కృతః శౌరిర్దక్షిణస్యాముదావసుః ॥22॥

దిశి ప్రతీచ్యాం సునయ ఉత్తరస్యాం మహారథః ।

సంతోషముతో ఆ ఖనిత్రుడు తన సోదరులు నల్గురిని వేరు వేరు రాజ్యములందు నియమించెను. తాను స్వయముగా చతుస్సముద్రముల వరకు వ్యాపించిన సమస్త భూమండలమును అనుభవించెను. తూర్పు దిక్కునందు

శౌరిని, దక్షిణదిక్కునందు ఉదావసువును, పశ్చిమదిక్కునందు సునయనుని, ఉత్తరదిక్కునందు మహారథిని రాజులుగా నియమించెను.

తేషాం తస్య చ భూపస్య పృథగ్గోత్రాః పురోహితాః ॥23॥

బభూవుర్మునయశ్చైవ మన్త్రివంశక్రమాగతాః ।
శౌరేరత్రికులోద్భూతః సుహోత్రో నామ వై ద్విజః ॥24॥

ఉదావసోః కుశావర్తో గౌతమాన్వయజోఽభవత్ ।
కాశ్యపః ప్రమతిర్నామ సునయస్య పురోహితః ॥25॥

మహారథస్య వాసిష్ఠః పురోధాఽభూన్మహీభృతః ।
బుభుజుస్తే స్వరాజ్యాని చత్వారోఽపి నరాధిపాః ॥26॥

ఆ ఖనిత్రునికి మరియు అతడి నలుగురు సోదరులకు వేరువేరు గోత్రీకులైన బ్రాహ్మణులు పురోహితులు మరియు మునులుగా నుండిరి. వారందరు మంత్రుల వంశక్రమముతో ప్రాప్తించినవారు. అత్రికులోత్పన్నుడైన సుహోత్రుడను బ్రాహ్మణుడు శౌరికి పురోహితుడు. గౌతమవంశోద్భవుడైన కుశావర్తుడు ఉదావసువుకు పురోహితుడు. గౌతమవంశోద్భవుడైన కుశావర్తుడు ఉదావసువుకు పురోహితుడు. కాశ్యపుడైన ప్రమతియనువాడు సునయుని పురోహితుడు. వాసిష్ఠుడు మహారథుడను రాజుకు పురోహితుడుగా ఉండెను. ఈ నలుగురు రాజులూ కూడా తమ తమ రాజ్యములను అనుభవించిరి. (పురోధాఽభూత్ అనునది ఆర్షప్రయోగము.)

ఖనిత్రశ్చాధిపస్తేషామశేషవసుధాధిపః ।
తేషు భ్రాతృష్వశేషేషు ఖనిత్రః స మహీపతిః ॥27॥

ప్రజాసు చ సమస్తాసు పుత్రేష్వివ సదా హితః ।

సమస్తభూమండలమునకు అధిపతి అయిన ఖనిత్రుడు వారందరికి అనగా ఆ నలుగురు సోదరులకు అధిపతిగా ఉండెను. సమస్తభూమండలాధిపతి అయిన ఆ ఖనిత్రుడు తన నలుగురు సోదరులపట్ల, సమస్తప్రజల పట్లా పుత్రులందు హితమును చూపునట్లు ఎల్లప్పుడు హితమును చేకూర్చువాడై ఉండెను.

ఏకదా మన్త్రిణా శౌరిః స ప్రోక్తో విశ్వవేదినా ॥28॥

వివిక్తే పృథివీపాల కించిద్వక్తవ్యమస్తి నః ।
యస్యేయం పృథివీ కృత్స్నా యస్య భూపా వశానుగాః ॥29॥

స రాజా తస్య పుత్రశ్చ తత్పౌత్రాశ్చాన్వయస్తతః ।
ఇతరే భ్రాతరస్తస్య ప్రాక్స్వల్పవిషయాధిపాః ॥30॥

ఒకనాడు మంత్రి అయిన విశ్వవేది రాజగు శౌరితో ఇట్లు పలికెను. ఓ రాజా ! ఈ ఏకాంతసమయమందు మీకొక విషయము చెప్పవలసియున్నది. ఈ సమస్త భూమండలము, సమస్త రాజులు వీరికి అధీనమందు

ఉండువాడే మహారాజు. అట్లే అతడి పుత్రుడు, పౌత్రులు ప్రధానమైన రాజులగుచుందురు. ఆ మహారాజుయొక్క సోదరులు అల్పరాజ్యమునకు మాత్రమే రాజులగుచుందురు.

తత్పుత్రాశ్చాల్పకాస్తస్మాత్తత్పౌత్రాశ్చాల్పకాల్పకాః ।
కాలేన హ్రాసమాసాద్య పురుషాత్పురుషాన్తరమ్ ॥31॥

కృష్యోపజీవినో భూప భవన్తీతి తదన్వయాః ।
నోద్ధారం కురుతే భ్రాతా భ్రాతృస్నేహబలార్పణః ॥32॥

ఆ విధముగా అల్పరాజ్యమునకు మాత్రమే రాజైన వాని పుత్రులు, మనుమలు తగ్గుతూ తగ్గుతూ మరింత అల్పమైన రాజ్యమునకు రాజులగుచుందురు. ఈ విధముగా కాలక్రమముగా చివరకు ఓ రాజా ! అల్పరాజ్యమునకు మాత్రమే అధిపతి అయిన సోదరుని వంశస్థులు వ్యవసాయము చేసుకొని బ్రతకవలసిన పరిస్థితి ఏర్పడును. అన్నగారి పట్ల స్నేహమును బలమును అర్పించిన సోదరుడు తనను తాను ఉద్ధరించుకొనలేడు.

స్నేహః కః పృథివీపాల పరయోర్భ్రాతృపుత్రయోః ।
తత్పుత్రయోః పరతరా మతిర్భవతి పార్థివ ॥33॥

తత్పుత్రః కేన కార్యేణ ప్రీతియుక్తో భవిష్యతి ।
అథవా యేన తేనైవ సన్తోషం కురుతే నృపః ॥34॥

క్రియతే తత్కిమర్థం తు భూపైర్మన్త్రిపరిగ్రహః ।
భుజ్యతే సకలం రాజ్యం మయా తే మన్త్రిణా సతా ॥35॥

తత్కిం ముధా ధారయసే సన్తోషం కురుషే యది ।
కార్యనిష్పాదకం రాజ్యం కరణం కర్తురిష్యతే ॥36॥

రాజ్యలమ్భశ్చ తే కార్యం త్వం కర్తా కరణం వయమ్ ।
సోఽస్మాభిః కరణై రాజ్యం పితృపైతామహం కురు ॥
ఫలప్రదా భవిష్యామః పరలోకే న తే వయమ్ ॥37॥

ఓ రాజా ! పరస్పరము దూరపు బాంధవ్యము కలిగిన సోదరుల కుమారుల మధ్య స్నేహమెక్కడిది? ఓ రాజా ! ఆ ఇద్దరు సోదరుల కుమారుల మధ్య పరస్పరాన్యత్వభావనే కలుగును. వేరే సోదరుని కుమారుడు మరొకసోదరుని కుమారుని పట్ల సంతుష్టుడై ఏ కార్యమున ఉండును? అట్లుకానిచో, వేరే సోదరుని కుమారులవల్ల కూడా వేరే సోదరుని కుమారుడైన రాజు సంతోషము పొందినట్లైతే అట్టి రాజు మంత్రులను ఆశ్రయించుట ఎందుకు? నావంటివాడు మంత్రియై ఉండగా నీవు సమస్తరాజ్యభోగములను అనుభవించెదవు. అందువలన సమస్తరాజ్యాధికారము లేకుండా నీవెందులకు సంతోషమును సహించుచున్నావు? సమస్తరాజ్యమును నీ అధీనమందు ఉంచుకొనుటయే నీ కర్తవ్యము. అందుకు కర్తవు నీవు. సాధనములు మేము. అట్టి నీవు మాబోటివారు సాధనములై

యుండగా, తండ్రితాతలనుంచి లభించిన రాజ్యమునేలుము. మేము నీకు ఈ లోకమందు ఫలమును సంపాదించిపెట్టువారమేగాని పరలోకమందు కాదు.

రాజోవాచ – రాజు (శౌరి) చెప్పాడు.

జ్యేష్ఠో భ్రాతా మహీపాలో వయం తస్యానుజా యతః ।
తతః స భుఙ్క్తే పృథివీం వయం చాల్పవసున్ధరామ్ ॥38॥

వయం తు భ్రాతరః పఞ్చ పృథ్వీ చైకా మహామతే ।
అతోఽస్యాః పృథగైశ్వర్యం కథం కృత్స్నం భవిష్యతి ॥39॥

సమస్తభూమండలానికి అధిపతి మా జ్యేష్ఠసోదరుడు. మేమందరము అతని తమ్ములము. అందువలన ఆయన ఈ సమస్తభూమిని అనుభవించుచున్నాడు. మేము కొద్ది భాగమును మాత్రమే అనుభవించుచున్నాము. ఓ బుద్ధిమంతుడా ! మేము అయిదుగురు సోదరులము. భూమండలము మాత్రమే ఒక్కటే. అందువలన వేరువేరుగా విభజింపబడిన ఐశ్వర్యము సమస్త ఐశ్వర్యము ఎట్లు కాగలదు?

విశ్వవేద్యువాచ – విశ్వవేది చెప్పాడు.

ఏవమేతద్భవత్వత్ర యద్యేకా వసుధా నృప ।
తాం త్వమేవాభిపద్యస్వ జ్యేష్ఠః శాస్తు యథా భవాన్ ॥40॥

ఓ రాజా ! నీవు చెప్పినట్లు భూమండలము ఒక్కటే అగుగాక ! అందువలన జ్యేష్ఠసోదరునివలె మీరే దానిని గ్రహించి పరిపాలించుడు.

సర్వాధిపత్యః సర్వేభ్యో భవ త్వమఖిలేశ్వరః ।
యతన్తే చ యథాహం తే తేషామపి హి మన్త్రిణః ॥41॥

మీరే సర్వాధిపత్యమును పొంది, సోదరులందరిలో మీరు అఖిలేశ్వరునిగా ఉండుడు. నేను మంత్రిగా మీకొరకు ప్రయత్నించునట్లే, మీ మిగిలిన సోదరుల మంత్రులు కూడా ఇట్లే ప్రయత్నింతురు.

రాజోవాచ – రాజు చెప్పాడు.

జ్యేష్ఠో రాజా యథా ప్రీత్యా భజతేఽస్మాన్సుతానివ ।
కథం తస్య కరిష్యామి మమత్వం జగతీగతమ్ ॥42॥

జ్యేష్ఠుడైన మా అన్నగారు మమ్ములను సంతోషముతో పుత్రులవలె పాలించుచుండగా, నేనెట్లు భూమండలమును నాదిగా చేసుకొనగలను?

విశ్వవేద్యువాచ – విశ్వవేది చెప్పాడు.

రాజ్యం స్థితః పూజయేథా జ్యేష్ఠం భూపార్థ్యైర్ధనైః ।
కనిష్ఠజ్యేష్ఠతా కేయం రాజ్యం ప్రార్థయతాం నృణామ్ ॥43॥

ఓ రాజా ! నీవు సమస్తరాజ్యమునకు అధికారివై, నీ జ్యేష్ఠసోదరుని వివిధసత్కారములతోనూ, సంపదలతోనూ పూజింపుడు.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

తథేతి చ ప్రతిజ్ఞాతే భూభుజా తేన సత్తమ ।
విశ్వవేదీ తతో మన్త్రీ తద్భ్రాతౄననయద్వశమ్ ॥44॥

ఓ మహానుభావుడా ! అనంతరము రాజగు శౌరి అట్లేయని పలుకగా, మంత్రియగు విశ్వవేది ఆ రాజుయొక్క మిగిలిన సోదరులందరినీ తన వశము చేసుకొనెను.

తేషాం పురోహితాంశ్చైవ ఆత్మనః శాన్తికాదిషు ।
నియోజయామాస తతః ఖనిత్రస్యాభిచారికే ॥45॥

మరియు ఆ సోదరుల పురోహితులందరినీ తాను చేయు శాంతికర్మలయందు మరియు ఖనిత్రుని అంతము చేయు ఆభిచారికకర్మలయందు నియమించెను.

బిభేద తస్య నిభృతాన్సామదానాదిభిస్తథా ।
చక్రే చ పరమోద్యోగం నిజదణ్డప్రభావనే ॥46॥

ఖనిత్రునియొక్క విశ్వాసపాత్రులైన భృత్యులను తన సామదానాదియుక్తులతో ఖనిత్రునినుండి వేరుచేసెను. ఇంకనూ తన దండముయొక్క ప్రభావమును పెంచుటయందు వారిని నియమించెను.

ఆభిచారికమత్యుగ్రమహన్యహని కుర్వతామ్ ।
పురోధసాం చతుర్ణాం చ జజ్ఞే కృత్యాచతుష్టయమ్ ॥47॥

వికరాలం మహావక్త్రమతిభీషణదర్శనమ్ ।
సముద్యత మహాశూలం ప్రభూతమతిదారుణమ్ ॥48॥

ఎప్పుడయితే మిగిలిన ఆ నలుగురు సోదరుల నలుగురు పురోహితులు నిత్యము మిక్కిలి భయంకరమైన ఆభిచారిక కర్మయందు ప్రవృత్తులైరో అప్పుడు "కృత్య"యను నాలుగు శక్తులు పుట్టినవి. అవియన్నియు భీకరశరీరములు, భయంకరముఖములు, భయంకారాకారము కల్గినవి, హస్తములందు గొప్ప శూలములను ధరించినవి, మిక్కిలి భయమును గొల్పునవిగానూ ఉండెను.

తతస్తదాగతం తత్ర ఖనిత్రో యత్ర పార్థివః ।
నిరస్తం చాప్యదుష్టస్య తస్య పుణ్యచయేన తత్ ॥49॥

అంతట ఆ నాలుగు కృత్యలు ఖనిత్రమహారాజుచెంతకు వచ్చెను. కానీ అవి ఏ పాపమూ ఎరుగని ఆ రాజుయొక్క పుణ్యబలముచే అతనిని ఏమీ చేయజాలకపోయెను.

కృత్యాచతుష్టయం తేషు నిపపాత దురాత్మసు ।
పురోహితేషు భూపానాం తథా వై విశ్వవేదిని ॥50॥

ఆ కృత్యలు నాలుగు ఖనిత్రునినుండి వెనుదిరిగి ఆ రాజుల నల్గురు పురోహితులపైనా, విశ్వవేదిపైనా పడినవి.

తతో నిహన్యా నిర్దగ్ధాః కృత్యయా తే పురోహితాః ।
విశ్వవేదీ తథా మన్త్రీ స శౌరేర్దుష్టమన్త్రదః ॥51॥

అంతట ఆ నలుగురు పురోహితులు, శౌరియను రాజుకు చెడ్డ సలహాలనిచ్చు విశ్వవేది అను మంత్రియు కృత్యాశక్తిచే చంపబడి భస్మము చేయబడిరి.

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే ఖనిత్రచరిత్రే చతుర్దశాధికశతతమోఽధ్యాయః ॥114॥

శ్రీ మార్కండేయ మహాపురాణమందలి ఖనిత్రచరిత్రమను నూటపదునాలుగవ అధ్యాయం సమాప్తం.



పఞ్చదశాధికశతతమోఽధ్యాయః – నూటపదిహేనవ అధ్యాయం
ఖనిత్రచరిత్రమ్ – ఖనిత్రుని చరిత్ర

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

తతః సమస్తలోకస్య విస్మయః సోఽభవన్మహాన్ ।
యదేకకాలం నేశుస్తే పృథక్పురనివాసినః ॥1॥

అంతట వేరువేరు నగరములందు నివసించు ఆ నలుగురు పురోహితులు ఒకేకాలమందు చనిపోవుట సమస్తజనులకు ఆశ్చర్యమును కలిగించెను.

తతః శుశ్రావ నిధనం యాతాన్భ్రాతృపురోహితాన్ ।
మన్త్రిణం చ తథా భ్రాతుర్దగ్ధం తం విశ్వవేదినమ్ ॥2॥

కిమేతదితి సోఽతీవ విస్మితో మునిసత్తమ ।
ఖనిత్రోఽభూన్మహారాజో నాజానత్తచ్చ కారణమ్ ॥3॥

ఓ మునిశ్రేష్ఠుడా! అంతట తమ సోదరుల పురోహితులందరూ, అట్లే తన సోదరుడైన శౌరియొక్క మంత్రి విశ్వవేదీ దహింపబడుటను విన్న ఖనిత్రమహారాజు "ఇది యేమి"అని ఆశ్చర్యమును పొందెను. అందులకు గల కారణమును కూడా తెలుసుకొనలేకపోయెను.

తతో వసిష్ఠం పప్రచ్ఛ స రాజా గృహమాగతమ్ ।
యత్కారణం వినేశుస్తే భ్రాతృమన్త్రిపురోహితాః ॥4॥

అటు పిమ్మట తన గృహమునకు వచ్చిన వసిష్ఠమహర్షిని తన సోదరుని మంత్రియగు విశ్వవేది మరియు నలుగురు పురోహితులు నాశము చెందుటకు గల కారణమేమని అడిగెను.

తేన పృష్టస్తదా ప్రాహ యథావృత్తం మహామునిః ।
యచ్ఛౌరిమంత్రిణా ప్రోక్తం యచ్చ శౌరిరువాచ తమ్ ॥5॥

యథా చానుష్ఠితం తేన భ్రాతౄణాం భేదకారి వై ।
మన్త్రిణా తేన దుష్టేన యచ్చక్రుశ్చ పురోహితాః ॥6॥

యన్నిమిత్తం వినేశుస్తే అపాపస్యాపకారిణః ।
పురోహితాస్తస్య రాజ్ఞః శత్రావపి దయావతః ॥7॥

ఇట్లు రాజగు ఖనిత్రుడు అడుగగా వసిష్ఠుడు, శౌరికి మంత్రి అయిన విశ్వవేది చెప్పినదీ, ఆ మంత్రితో శౌరి చెప్పినదీ అంతయు చెప్పెను. ఆ దుష్టమంత్రి సోదరులయందు పరస్పరభేదాభిప్రాయము కలిగించుటకు ఏఏ కార్యములను చేసెనో, పురోహితులు ఏమి చేసిరో, పాపము చేయనివానికి అపకారము చేయు ఆ పురోహితులు, శత్రువులపట్ల కూడా దయజూపు రాజుపట్ల ఏమి చేసినందువలన నశించిపోయిరో, దానినంతయు యథాతథముగా చెప్పెను.

స తచ్ఛ్రుత్వా తతో రాజా హా హతోఽస్మీతి వై వదన్ ।
నినిన్దాత్మానమత్యర్థం వసిష్ఠస్యాగ్రతో ద్విజ ॥8॥

ఓ బ్రాహ్మణుడా ! రాజు ఈ విషయములను విని "హా హతోఽస్మి" అని పలుకుచూ వసిష్ఠుని ఎదుట తనను తాను మిక్కిలి నిందించుకొనెను.

రాజోవాచ – రాజు (ఖనిత్రుడు) చెప్పాడు.

ధిఙ్మామపుణ్యసంస్థానమల్పభాగ్యమశోభనమ్ ।
దైవదోషకృతం పాపం సర్వలోకవిగర్హితమ్ ॥9॥

నేను నిందింపతగినవాడను. పుణ్యమును సంపాదించలేదు. కొద్ది భాగ్యము మాత్రమే గలవాడను. శోభనమైన గుణములు గలవాడను కాను. విధి ప్రతికూలముగా ఉండుటచే సమస్తలోకములు నిందింపతగిన పాపమును చేసితిని.

మన్నిమిత్తం వినష్టం తత్తద్బ్రాహ్మణచతుష్టయమ్ ।
మత్తః కోఽన్యః పాపతరో భవిష్యతి పుమాన్భువి ॥10॥

నా కారణముగా ఆ పురోహితబ్రాహ్మణులు నలుగురు మరణించిరి. నన్ను మించిన గొప్ప పాపాత్ముడు ఎవ్వడుండును?

నాభవిష్యం యది పుమానహమత్ర మహీతలే ।
తతస్తే న వినశ్యేయుర్మమ భ్రాతృపురోహితాః ॥11॥

నేనీ భూమిపై పురుషునిగా జన్మించనియెడల నా సోదరుల పురోహితులు నలుగురు మృత్యువాత పడియుండెడివారు కాదు.

ధిగ్రాజ్యం ధిక్చ మే జన్మ భూభుజాం మహతాం కులే ।
కారణత్వం గతో యోఽహం వినాశస్య ద్విజన్మనామ్ ॥12॥

నా దురదృష్టము కొలదీ నాకు రాజ్యము లభించినది. గొప్ప మహారాజుల కులమందు నేను జన్మించుట నిందింపతగినది. ఎందువలననగా నేను నలుగురు బ్రాహ్మణుల చావుకు కారణమైనాను.

కుర్వన్తః స్వామినాం తేఽథ భ్రాతౄణాం మమ యాజకాః ।
నాశం యయుర్న దుష్టాస్తే దుష్టోఽహం నాశకారణే ॥13॥

నా నలుగురు సోదరుల పురోహితులు స్వామిభక్తిని ప్రదర్శించుచూ చనిపోయిరి. వారు ఎంతమాత్రము దుష్టులు కారు. వారి నాశమునకు నేనే కారణము.

కిం కరోమి క్వ గచ్ఛామి నాన్యో మత్తో హి పాపకృత్ ।
పృథివ్యామస్తి హేతుత్వం ద్విజనాశస్య యోగతః ॥14॥

ఇప్పుడు నేనేమి చేయుదును? ఎచ్చటికి వెళ్ళుదును? నాకంటే పాపాత్ముడు మరియొకడుండడు. ఎందువలననగా నా దురదృష్టము కొలదీ నేనే భూమిపై బ్రాహ్మణుల చావుకు కారణమైతిని.

ఇత్థముద్విగ్నహృదయః ఖనిత్రః పృథివీపతిః ।
వనం యియాసుః పుత్రస్య కృతవానభిషేచనమ్ ॥15॥

ఈ విధముగా భూపతి అయిన ఖనిత్రుడు ఉద్వేగము చెందిన హృదయము గలవాడై అడవులకు వెళ్ళగోరి తన పుత్రుని రాజ్యాభిషిక్తుని గావించెను.

అభిషిచ్యం సుతం రాజ్యే క్షుపసంజ్ఞం మహీపతిః ।
భార్యాభిస్తిసృభిః సార్ధం తపసే స వనం యయౌ ॥16॥

క్షుపుడను పేరు కలిగిన తన కుమారుని రాజ్యమందు పట్టాభిషిక్తుని గావించి, తన ముగ్గురు భార్యలతో గూడ తపస్సు ఆచరించుటకై ఆ ఖనిత్రుడు అడవులకు వెళ్ళెను.

తత్ర గత్వా తపస్తేపే వానప్రస్థవిధానవిత్ ।
శతాని త్రీణి వర్షాణాం సార్ధాని నృపసత్తమః ॥17॥

రాజశ్రేష్ఠుడగు ఆ ఖనిత్రుడు వానప్రస్థాశ్రమవిధానముననుసరించి అడవులకు వెళ్ళి అచ్చట మూడువందల ఏబది సంవత్సరములు తపస్సు చేసెను.

తపసా క్షీణదేహస్తు రాజవర్యో ద్విజోత్తమ ।
నిగృహ్య సర్వస్రోతాంసి తత్యాజాసూన్వనేచరః ॥18॥

ఓ బ్రాహ్మణశ్రేష్ఠుడా ! రాజశ్రేష్ఠుడగు ఆ ఖనిత్రుడు క్షీణించిన దేహముగలవాడై, సమస్త ఇంద్రియద్వారములను నిరోధించి, ఆ వనమందే ప్రాణములను వదిలెను.

తతః పుణ్యాన్యయౌ లోకాన్సర్వకామదుహోఽక్షయాన్ ।
అశ్వమేధాదిభిర్యజ్ఞైరవాప్యా యే నరాధిపైః ॥19॥

అశ్వమేధము మొదలగు యజ్ఞములను ఆచరించినందువలన రాజశ్రేష్ఠులగు వారిచే పొందదగిన లోకములెవ్విగలవో అట్టి లోకములు అన్ని కోరికలను ప్రసాదించునవి మరియు నాశరహితమైనవి. అటువంటి పుణ్యలోకములను ఆ ఖనిత్రుడు చేరెను.

భార్యాశ్చ తస్య తాస్తిస్రః సమం తేనైవ తత్యజుః ।
ప్రాణానవాపుః సాలోక్యం తేనైవ సుమహాత్మనా ॥20॥

ఆ ఖనిత్రుని భార్యలు ముప్పురు కూడా ఖనిత్రునితోబాటే ప్రాణములను వదిలి, ఆ మహాత్మునితో బాటే పుణ్యలోకములను చేరిరి.

ఏతత్ఖనిత్రచరితం శ్రుతం కల్మషనాశనమ్ ।
పఠతాం చ మహాభాగ క్షుపస్యాతో నిశామయ ॥21॥

ఓ మహానుభావుడా! ఈ ఖనిత్రచరిత్రము విన్నవారి, చదివినవారి పాపములు నశించును. ఇక ఈపైన క్షుపమహారాజు చరితమును చెప్పెదను, వినుము.

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే ఖనిత్రచరిత్రసమాప్తిర్నామ పంచాదశాధికశతతమోఽధ్యాయః ॥115॥

శ్రీ మార్కండేయ మహాపురాణమందలి ఖనిత్రచరిత్రసమాప్తియను నూటపదిహేనవ అధ్యాయం సమాప్తం.



షోడశాధికశతతమోఽధ్యాయః – నూటపదునారవ అధ్యాయం

వివింశచరితమ్ – వివింశుని చరిత్ర

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

> **క్షుపః ఖనిత్రపుత్రస్తు ప్రాప్య రాజ్యం యథా పితా ।**
> **తథైవ పాలయామాస ప్రజా ధర్మేణ రఞ్జయన్ ॥1॥**

ఖనిత్రుని పుత్రుడగు క్షుపుడు కూడా రాజ్యమునుబొంది తన తండ్రివలె ప్రజల మనస్సులను ఆనందపరచుచూ ధర్మబద్ధముగా ప్రజలను పరిపాలించెను.

> **స దానశీలో యష్టా చ యజ్ఞానామవనీపతిః ।**
> **సమః శత్రౌ చ మిత్రే చ వ్యవహారాదివర్త్మని ॥2॥**

భూపరిపాలకుడగు ఆ క్షుపుడు కూడా దానస్వభావముగలవాడు, యజ్ఞములనాచరించువాడు; శత్రువులందు, మిత్రులయందూ, వ్యవహారముచేయుట మొ॥లగు మార్గములందు సమానస్వభావముగలవాడై ఉండెను.

> **ఏకదా స మహీపాలో నిజస్థానగతో మునే ।**
> **సూతైరుక్తో యథా పూర్వం క్షుపో రాజా తథాఽభవేత్ ॥3॥**

> **బ్రహ్మణస్తనయః పూర్వం క్షుపోఽభూత్పృథివీపతిః ।**
> **యాదృక్చరితమస్యాసీత్తాదృక్తస్యైవ చేష్టితమ్ ॥4॥**

ఓ మునీ ! ఒకనాడు ఆ క్షుపమహారాజు తన ఆసనమందు ఆసీనుడైయుండగా, సూతగణములు ఈ విధముగా పలికిరి. ఓ రాజా ! బ్రహ్మపుత్రుడగు క్షుపుడు పూర్వము మహారాజై ఎట్లు భూమండలమును పరిపాలించెనో, ఎట్లు వాని చరితముండెనో అట్లే నీ చరితము, పరిపాలనగూడ ఉన్నవి.

రాజోవాచ – రాజు చెప్పాడు.

> **శ్రోతుమిచ్ఛామి చరితం క్షుపస్య సుమహాత్మనః ।**
> **యది తాదృఙ్మయా శక్యం చేష్టితుం తత్కరోమ్యహమ్ ॥5॥**

మహాత్ముడగు క్షుపమహారాజు చరితమును వినవనెలని కోరుకొనుచున్నాను. నేను కూడా అతనివలె ప్రవర్తించుటకు సమర్థుడనయినచో అట్లే ప్రవర్తించెదను.

సూత ఊచుః – సూతగణములు పలికిరి.

> **స చకారాకరాన్నృప రాజా గోబ్రాహ్మణాన్పురా ।**
> **షష్ఠాంశేన కృతా చోర్వ్యామిష్టిస్తేన మహాత్మనా ॥6॥**

ఓ రాజా ! మహాత్ముడగు ఆ క్షుపమహారాజు గోబ్రాహ్మణులనుండి పన్నును తీసుకొనెడివాడు కాడు. ప్రజలనుండి ఆరవ భాగమును పన్నుగా తీసుకొని యజ్ఞములను నిర్వహించెడివాడు. (చకార + అకరాన్ = చకారాకరాన్)

రాజోవాచ – రాజు చెప్పాడు.

తేషాం మహాత్మనాం రాజ్ఞాం కోఽనుయాస్యతి మద్విధః ।
తథాప్యుత్కృష్టచేతానాం (చిత్తానాం) చేష్టాసూద్యమవాన్భవేత్ ॥7॥

అట్టి మహాత్ములగు రాజులను అనుసరించి నడచుకొనుటకు నావంటివాడు ఎట్లు సమర్థుడు కాగలడు? అయినప్పటికీ గొప్ప మనస్సుగలవారయిన అట్టివారి చేష్టలను అనుసరించి ప్రవర్తించుట ఉచితమైనది.

తచ్ఛ్రూయతాం ప్రతిజ్ఞా యా సాంప్రతం క్రియతే మయా ।
క్షుపస్యానుకరిష్యామి మహారాజస్య చేష్టితమ్ ॥8॥

అందువలన నేనిప్పుడు చేయు ప్రతిజ్ఞను గూర్చి వినుడు. క్షుపమహారాజును అనుసరించి నేను కూడా నడచుకొందును.

త్రీంస్త్రీన్యజ్ఞాన్కరిష్యామి సస్యాపాతే గతాగతే ।
పృథివ్యాం చతురన్తాయాం ప్రతిజ్ఞేయం కృతా మయా ॥9॥

ధాన్యాది సస్యములు సిద్ధమైనప్పుడు మరియు సిద్ధము కాబోవు సమయమందు చతుస్సముద్రములు హద్దులుగా కలిగిన ఈ భూమండలములో మూడేసి యజ్ఞములను నేను నిర్వర్తించెదనను ప్రతిజ్ఞను చేయుచున్నాను.

యచ్చ గోబ్రాహ్మణాః పూర్వమదదన్భూభృతే కరమ్ ।
తమేవ ప్రతిదాస్యామి బ్రాహ్మణానాం తథా గవామ్ ॥10॥

పూర్వము గోబ్రాహ్మణులనుండి తీసుకొనిన పన్నులను తిరిగి వారికి ఇచ్చి వేసెదను.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

ఇతి ప్రతిజ్ఞాయ వచః క్షుపస్తత్కృతవాంస్తథా ।
సస్యాపాతే స యజ్ఞాంస్త్రీనయజద్యజతాంవరః ॥11॥

ఈ విధముగా క్షుపమహారాజు ప్రతిజ్ఞ చేసి యజ్ఞములు చేయువారిలో శ్రేష్ఠుడగు ఆ రాజు అట్టి ప్రతిజ్ఞారక్షణము చేయుచూ సస్యములు పండిన సమయమందు మూడు యజ్ఞములు చేయుచుండెను.

గోబ్రాహ్మణాః పురా రాజ్ఞామదదద్యం చ వై కరమ్ ।
తావత్సంఖ్యమదాద్విత్తమన్యద్గోబ్రాహ్మణాయ సః ॥12॥

మరియు గోబ్రాహ్మణులనుండి పూర్వము తీసుకొనిన పన్నునంతయు తిరిగి వారికి ఇచ్చివేసెను.

తస్య పుత్రోఽభవద్వీరః ప్రమథాయామనిన్దితః ।
యస్య ప్రతాపశౌర్యాభ్యాం కృతా వశ్యా మహీభృతః ॥13॥

ఆ క్షుపమహారాజుకు ప్రమథయను పేరుగల పట్టపురాణియందు ఎట్టి నిందలు లేనట్టి వీరుడగు కుమారుడు జన్మించెను. అతడు తన శౌర్యపరాక్రమములతో రాజులందరినీ వశపరచుకొనెను.

తస్యాపి నన్దినీ నామ వైదర్భీ దయితాఽభవత్ ।
వివింశం తనయం తస్యాం జనయామాస స ప్రభుః ॥14॥

ఆ కుమారునికి విదర్భరాజకుమారియగు నందిని భార్య అయ్యెను. ఆ రాణి గర్భమునుండి వివింశుడను పేరుగల ఒక కుమారుడుదయించెను.

వివింశే శాసతి మహీం మహీపాలే మహౌజసి ।
మహీతలమభూద్వ్యాప్తం నిరన్తరయా నరైః ॥15॥

మహాపరాక్రమవంతుడైన ఆ వివింశమహారాజు భూపరిపాలన చేయుచుండగా భూమండలము అంతయు ప్రజలతో నిండియుండెను.

వవర్ష కాలే పర్జన్యో మహీ సస్యవతీ తథా ।
సుఫలాని చ సస్యాని రసవన్తి ఫలాని చ ॥16॥

ఆ వివింశమహారాజు రాజ్యపాలనము చేయుచుండగా తగిన కాలమందు మేఘుడు వర్షించెను. భూమిఅంతయు పంటలతో నిండియుండెను. సస్యములన్నియు మంచి ఫలములు కలిగినవి ఆయెను. ఫలములు మధురరసములతో నిండియుండెను.

రసాః పుష్టికరాశ్చాసన్ పుష్టిర్నోన్మాదకారిణీ ।
న విత్తనిచయా నౄణాం ప్రభూతా మదహేతవః ॥17॥

ఆ రసములన్నియు పుష్టికరములయ్యెను. ప్రజలకు కల్గిన ఆ పుష్టి ఉన్మాదమును కలిగించునది కాలేదు. ప్రజలు మిక్కిలి ధనవంతులయిననూ వారు గర్వాహంకారములకు లోను కాలేదు.

తత్ప్రతాపేన రిపవో భయమాపుర్మహామునే ।
స్వాస్థ్యం జనః సుహృద్వర్గో ముదమాప సుపూజితః ॥18॥

ఓ మహామునీ! ఆ వివింశుని పరాక్రమము వలన శత్రువులందరు భయపడిరి. జనులందరూ స్వస్థతను (ఆరోగ్యమును) పొందిరి. మిత్రవర్గమంతయూ బాగుగా గౌరవింపబడి సంతోషమును పొందెను.

ఇష్ట్వా స యజ్ఞాన్సుబహూన్ సమ్యక్సంపాల్య మేదినీమ్ ।
సంగ్రామే నిధనం ప్రాప్య శక్రలోకమితో గతః ॥19॥

ఈ విధముగా ఆ వివింశమహారాజు బాగుగా అనేకయజ్ఞములను ఆచరించి, చక్కగా భూపరిపాలనము చేసి, యుద్ధమందు మరణించి ఇంద్రలోకమునకు వెళ్ళెను.

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే వివింశచరితం నామ షోడశాధికశతతమోఽధ్యాయః ॥116॥

శ్రీ మార్కండేయ మహాపురాణమందలి వివింశచరితమను నూటపదునారవ అధ్యాయం సమాప్తం.



సప్తదశాధికశతతమోఽధ్యాయః – నూటపదునేడవ అధ్యాయం
ఖనీనేత్రచరిత్రమ్ – ఖనీనేత్రుని చరిత్ర

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

తస్య పుత్రః ఖనీనేత్రో మహాబలపరాక్రమః ।
యస్య యజ్ఞేష్వగాయన్త గన్ధర్వా విస్మయాన్వితాః ॥1॥

ఆ వివింశమహారాజుకు ఖనీనేత్రుడను పేరుగల గొప్ప బలపరాక్రమములు కలిగిన కుమారుదుదయించెను. అతడు ఆచరించు యజ్ఞములందు ఆశ్చర్యముతో గంధర్వులు గానము చేసిరి.

ఖనీనేత్రసమో నాన్యో భువి యజ్వా భవిష్యతి ।
తేన యజ్ఞాయుతే పూర్ణే దత్తా పృథ్వీ ససాగరా ॥2॥

ఖనీనేత్రునితో సమానమైన యజ్ఞానుష్ఠాత మరియొకడు లేదు. ఎందువలననగా అతడు పదివేల యజ్ఞములను పూర్తి చేసిన పిమ్మట సాగరసహితముగా భూమినంతటినీ దానము చేసెను.

దత్త్వా చ సకలాం పృథ్వీం బ్రాహ్మణానాం మహాత్మనామ్ ।
తపసా ద్రవ్యమాసాద్య మోదయన్సాధితేన యః ॥3॥

ఆ ఖనీనేత్రుడు సమస్తభూమిని మహాత్ములగు బ్రాహ్మణులకు దానముగా ఇచ్చి, తాను తపస్సుతో ద్రవ్యలాభమును పొంది దానితో సంతుష్టి పొందెను.

యతశ్చ ప్రాప్య విత్తర్ధిమతులాం దాతృసత్తమాత్ ।
జగృహుర్బ్రాహ్మణా విప్ర నాన్యరాజ్ఞః ప్రతిగ్రహమ్ ॥4॥

ఓ విప్రుడా! దాతలలో శ్రేష్ఠుడైన ఆ ఖనీనేత్ర మహారాజునుండి బ్రాహ్మణులు సాటిలేని ధనసంపదను పొంది, ఇక మరియొక రాజునుండి దానమును స్వీకరించలేదు.

సప్తషష్టిసహస్రాణి సప్తషష్టిశతాని చ ।
సప్తషష్టిశ్చ యో యజ్ఞానయజద్భూరిదక్షిణాన్ ॥5॥

ఆ ఖనీనేత్రమహారాజు అరవైఏడువేలు, అరవైఏడువందలు అరవైఏడు (73,767) యజ్ఞములను చేసెను. ఆ అన్ని యజ్ఞములందును విరివిగా దక్షిణలిచ్చెను.

అపుత్రః స మహీపాలో మృగయాముపచక్రమే ।
పుత్రార్థం పితృయజ్ఞాయ మాంసకామో మహామునే ॥6॥

అశ్వారూఢో వినా సైన్యమేక ఏవ మహావనే ।
బద్ధగోధాఙ్గులిత్రాణో బాణఖడ్గధనుర్ధరః ॥7॥

ఓ మహామునీ ! పుత్రులు లేనందున పుత్రులను పొందుటకై ఆ ఖనీనేత్రమహారాజు పితృయజ్ఞము చేయదలచి, అందుకు అవసరమైన మాంసమును పొందగోరి, వేటకు వెళ్ళెను. వేటకు వెళ్ళు సమయమందు ఆ ఖనీనేత్రుడు అశ్వమును అధిరోహించి, సైన్యమును తీసుకొని వెళ్ళక, తానొక్కడే గోధ (చర్మముతో చేసిన మణికట్టు బంధము) మరియు అంగుళిత్రాణములను ధరించి, ఇంకను బాణ, ఖడ్గ, ధనుస్సులను చేతబూని ఉండెను.

తం వాహయన్తం తురమన్యతో గహనాద్వనాత్ ।
వినిష్క్రమ్య మృగః ప్రాహ మాం హత్వాభిమతం కురు ॥8॥

ఆ ఖనీనేత్రుని తీసుకొని వెళ్ళుచున్న గుఱ్ఱమునకు మరొక ప్రక్కన దట్టమైన అడవినుండి ఒక లేడి వచ్చి "నన్ను చంపి నీ అభీష్టమును నెరవేర్చుకొనుము" అని రాజుతో పలికెను.

రాజోవాచ – రాజు పలికాడు.

అన్యే మృగాః పలాయన్తే మహాభీత్యా విలోక్య మామ్ ।
కథమాత్మప్రదానం త్వం మృత్యవే కర్తుమిచ్ఛసి ॥9॥

నన్ను చూచి ఇతర మృగములన్నియు గొప్ప భయముతో పారిపోవుచున్నవి. అటువంటప్పుడు మృత్యుదేవతకు నిన్ను నీవు సమర్పించుకొనుటకు ఎట్లు ఇచ్ఛగించుచున్నావు?

మృగ ఉవాచ – లేడి పలికింది.

అపుత్రోఽహం మహారాజ వృథా జన్మప్రయోజనమ్ ।
విచారయన్న పశ్యామి ప్రాణానామిహ ధారణమ్ ॥10॥

ఓ మహారాజా ! నేను పుత్రసంతానము లేనిదానను. అందువలన నేను జన్మించినందువలన కలుగు ప్రయోజనము వ్యర్థమని తలపోయుచూ ప్రాణములను ధరించరాదని భావించుచున్నాను.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

అథాభ్యేత్య మృగః ప్రాహ తమన్యో వసుధాధిపమ్ ।
మృగస్య తస్య ప్రత్యక్షమలమేతేన పార్థివ ॥11॥

ఘాతయస్వేతి మాం మాంసైర్మమ కర్మ సమాచర ।
యథా కృతార్థతా తే స్యాన్మమ చాప్యుపకారి తత్ ॥12॥

అదే సమయమందు మరియొక మృగము వచ్చి ఆ మొదటి మృగము ఎదుటనే ఆ రాజుతో ఇట్లు పలికెను. "ఓ రాజా ! ఈ మృగమును చంపవలదు. నన్ను చంపి నా మాంసముతో మీ యజ్ఞకార్యమును నిర్వర్తింపుడు. అప్పుడు మీకు కృతార్థత (సార్థకత) సిద్ధించును. నాకది ఉపకారమును కూడా కలిగించును.

పుత్రార్థం త్వం మహారాజ స్వపితౄన్యష్టుమిచ్ఛసి ।
అపుత్రస్యాస్య మాంసేన లప్స్యసే వాంఛితం కథమ్ ॥13॥

ఓ మహారాజా ! మీరు పుత్రులను పొందగోరి మీ పితృదేవతలకు యజ్ఞమును నిర్వర్తించవలెనని తలపోయుచున్నారు. ఈ (మొదటి) మృగము పుత్రసంతానము లేనిది. అప్పుడు మీకు ఈ మృగమాంసముతో మీ కోరిక ఎట్లు సిద్ధించును?

యాదృక్కర్మ వినిష్పాద్యం తాదృగ్ద్రవ్యముపాహరేత్ ।
దుర్గన్ధైర్న సుగన్ధానాం గన్ధజ్ఞానవినిర్ణయః ॥14॥

ఎందువలననగా మీరు నిర్వర్తించు కర్మ ఎట్టిదో, దానికొరకు కావలసిన ద్రవ్యము కూడా అట్టిదైయుండవలెను. దుర్గంధములద్వారా సుగంధద్రవ్యముల సువాసనాజ్ఞానము నిర్ణయింపబడదు కదా !

రాజోవాచ – రాజు పలికాడు.

వైరాగ్యకారణం ప్రోక్తమనేనాపుత్రతా మమ ।
కథ్యతాం ప్రాణసన్త్యాగే యత్తే వైరాగ్యకారణమ్ ॥15॥

మొదటి మృగము తనకు పుత్రులు లేని కారణముగా వైరాగ్యము కలిగినదని చెప్పెను. మరి నీవు ప్రాణములను విడుచుటకు గల కారణమేమో చెప్పుము.

మృగ ఉవాచ – రెండవ మృగము పలికింది.

బహవో మే సుతా భూప బహ్వ్యో దుహితరస్తథా ।
యచ్చిన్తాదుఃఖదావాగ్నిజ్వాలామధ్యే వసామ్యహమ్ ॥16॥

ఓ రాజా ! నాకు పెక్కుమంది పుత్రులు, పుత్రికలు గలరు. వారి కారణముగా అనగా వారికి ఏ కీడు సంభవించునో అని నేను విచారమనెడు దుఃఖదావాగ్నిజ్వాలమధ్య నివసించుచున్నాను.

సర్వసాధ్యా నరేన్ద్రేయం మృగజాతిః సుకాతరా ।
తేష్వపత్యేషు మే చాతిమమత్వం తేన దుఃఖితః ॥17॥

ఓ మహారాజా ! ఈ మా మృగజాతి పిరికితనము కలిగి అన్ని ప్రాణులకు అధీనమైయుండును. నా బహుసంతానమందు నేను మిక్కిలి మమకారమును పెంచుకున్నాను. అందువలననే నేను దుఃఖముననుభవించుచున్నాను.

మనుష్యసింహశార్దూలవృకాదిభ్యో బిభేమ్యహమ్ ।
విహీనాత్సర్వసత్త్వేభ్యః శ్వశృగాలాదపి ప్రభో ॥18॥

ఓ ప్రభూ ! మనుష్యులు, సింహములు, పులులు, తోడేళ్ళు మొ॥వానివల్ల మేము భయపడుచున్నాము. అంతేకాదు, సమస్తప్రాణులకన్న హీనమైనట్టి కుక్కలు, నక్కలవలన కూడా మేము భయపడుచున్నాము.

సోఽహం నిమిత్తం బన్ధూనామిమాం శూన్యాం వసున్ధరామ్ ।
నృసింహాదిభయాత్సర్వామిచ్ఛామి సున్నృశంసకృత్ ॥19॥

అట్టి నేను మా బంధువుల క్షేమముగోరి ఈ భూమినంతటినీ మనుష్యులు, సింహములు మొ॥వాని వలన భయము లేనిదానినిగా కోరుకొనుచున్నాను. అందువలన అవియన్నియు నశించవలెనని కోరుకొనుచున్నాను.

తృణాన్యన్యేఽపి ఖాదన్తి గోఽజావితురగాదికాః ।
తాంస్తేషాం పోషణాయాహమిచ్ఛామి నిధనం గతాన్ ॥20॥

మేము కాక ఆవులు, ఎద్దులు, గొర్రెలు, మేకలు మొ॥ జంతువులు కూడా గడ్డిని తినుచున్నవి. అటువంటప్పుడు ఇక మాకు ఏమి మిగులును? అందువలన నా సంతానమును పోషించుకొనుటకై ఆ జంతువులన్నీ నశించిపోవలెనని కోరుకొనుచున్నాను.

నిష్క్రాన్తేషు తతస్తేషు మమాపత్యేషు వై పృథక్ ।
భవన్తి చిన్తాః శతశో మమత్వావృతచేతసః ॥21॥

కిం కూటపాశం కిం వజ్రం వాగురాం కిం సుతో మమ ।
ప్రాప్తశ్చరన్వనే కిం వా నృసింహాదివశం గతః ॥22॥

నా పుత్రులు, పుత్రికలు వేరువేరు ప్రదేశములకు వెళ్ళినప్పుడు వారియందు మమకారమును పెంచుకొన్న నాకు వందలకొలదీ బాధలు కలుగుచుండును. నా బిడ్డలలో ఎవరైనా వలలలోగాని, ఆయుధములచేతగానీ, మృగబంధన పాశములలోగానీ, మనుష్యసింహాదులకుగానీ చిక్కుకున్నారేమో అని విచారములు కలుగుచుండును.

ప్రాప్తోఽయమేకః సంప్రాప్తాస్తేఽవస్థాం కీదృశీం మమ ।
సాంప్రతం తే చిరాయన్తే యే గతాః సుమహావనమ్ ॥23॥

ఇప్పుడు నా బిడ్డలందరు గొప్ప అడవికి గడ్డి మేయుటకు వెళ్ళినారు. వారికొరకు నిరీక్షించుచున్నాను. వారిలో ఒక్కరు మాత్రమే గృహమునకు వచ్చినచో లేదా అందరూ వచ్చినచో నా పరిస్థితి ఎటులుండునో చూడుము. (ఈ శ్లోకమందలి ప్రథమపాదము క్లిష్టాన్వయముతో కూడుకొన్నది.)

దృష్ట్వా ప్రాప్తాన్సమాభ్యాశమహం తానాత్మజాన్నృప ।
ఈషదుచ్ఛ్వసితః క్షేమమిచ్ఛామి రజనీం పునః ॥24॥

ఓ రాజా ! నా చెంతకు చేరిన బిడ్డలను చూచి కొద్దిగా ఉచ్ఛ్వాసను గ్రహించి, రాత్రి అంతయు వారి క్షేమము కొరకే కోరుకొనుచుందును.

ప్రభాతే దివసం క్షేమమస్తగేఽర్కే నిశామపి ।
వాఞ్ఛామ్యహం కదా క్షేమం సర్వకాలం భవిష్యతి ॥25॥

తెల్లవారిన పిమ్మట పగలంతయు, సూర్యుడస్తమించిన పిమ్మట రాత్రంతయు వారి క్షేమమునే ఎల్లప్పుడు కోరుకొనుచుందును. కాని సర్వకాలములందు క్షేమమెట్లుండును?

ఏతత్తే కథితం భూప మహోద్వేగస్య కారణమ్ ।
అతః ప్రసాదం కురు మే బాణోఽయం పాత్యతాం మయి ॥26॥

ఓ మహారాజా ! నా ఉద్వేగమునకు (తీవ్ర మనోవేదన) గల కారణమును నీకు చెప్పితిని. అందువలన నన్ను అనుగ్రహించి నాపైన బాణమును విడువుము.

ఇతి దుఃఖశతావిష్టః ప్రాణాన్నాహం త్యజామి యత్ ।
తత్కారణం నిబోధ త్వం బ్రువతో మమ పార్థివ ॥27॥

ఓ రాజా ! ఈ విధముగా వందలకొలదీ దుఃఖములతో కూడుకొన్న నేను ఎందులకు ప్రాణములను విడిచిపెట్టకూడదో తగిన కారణమును నీవు చెప్పుము.

అసుర్యా నామ తే లోకా యాన్గచ్ఛన్త్యాత్మఘాతకాః ।
యజ్ఞోపయుక్తాః పశవః సంప్రయాన్త్యుచ్ఛ్రితీః ప్రభో ॥28॥

ఓ ప్రభూ ! ఆత్మహత్యను చేసుకొనువారు అసుర్యనామకమైన నీచ లోకములను పొందెదరు. (అందువలన నేను ఆత్మహత్యకు పాల్పడుట కూడా యుక్తము కాదని ఆశయము). యజ్ఞమందు వినియోగింపబడిన పశువులు ఉన్నతలోకములను పొందును.

అగ్నిః పశురభూత్పూర్వం పశురాసీజ్జలాధిపః ।
భాస్వానథోచ్ఛ్రితీః ప్రాప్తా యజ్ఞే నిష్కాముపాగతాః ॥29॥

పూర్వకాలమందు అగ్ని, వరుణుడు మరియు సూర్యుడు పశువులుగా జన్మించి యజ్ఞమందు వినియోగింపబడిరి. అందువలన వారు సద్గతిని పొందిరి.

తన్మమైతాం కృపాం కృత్వా నయ మాముచ్ఛ్రితిం నృప ।
ఆత్మనశ్చేప్సితం కామం పుత్రలాభాదవాప్స్యసి ॥30॥

కావున ఓ మహారాజా ! నాయందు దయను చూపి నన్ను నీ యజ్ఞమందు వినియోగించి సద్గతిని ప్రసాదించుము. అట్లు చేయుటవలన నీవు పుత్రులను పొంది, నీ కోరికను నీవు సిద్ధింపచేసుకొనగలవు.

పూర్వమృగ ఉవాచ – మొదటి మృగము పలికింది.

రాజేన్ద్ర నైష హన్తవ్యో ధన్యోఽయం సుకృతీ మృగః ।
బహవస్తనయా హ్యస్య హన్తవ్యోఽహమసన్తతిః ॥31॥

ఓ రాజశ్రేష్ఠుడా ! ఈ మృగమునకు బహుసంతానముగలదు కావున అది ధన్యురాలు మరియు పుణ్యాత్మురాలు. అందువలన దానిని చంపుట ధర్మముగాదు. ఇక సంతానహీనురాలనైన నేనే చంపదగినదానను.

ఉత్తరమృగ ఉవాచ – రెండవ మృగము పలికింది.

ఏకదేహభయం యస్య దుఃఖం ధన్యః స వై భవాన్ ।
బహూని యస్య దేహాని తస్య దుఃఖాన్యనేకధా ॥32॥

ఒక్కటే దేహము కారణముగా భయము కలిగి, దుఃఖించుచున్న నీవు ధన్యుడవు. ఇక అనేకదేహముల వలన భయము కలిగినవానికి దుఃఖములు కూడా అనేకములు.

ఏకో యదాహమాసం తు ప్రాక్తదా దేహజం మమ ।
దుఃఖమాసీన్మమత్వే తు భార్యాయాస్తదభూద్ద్విధా ॥33॥

ముందుగా నేనొక్కడినే యుంటిని. అప్పుడు నాకు ఆ ఒక్క దేహమువల్ల మాత్రమే భయం కల్గి, ఒక్క దుఃఖము కలిగినది. ఇక నేను భార్యను పొంది, ఆమెయందు మమత్వభావము (నాదియను భావన) కలిగిన పిమ్మట ఆ దుఃఖము రెండుగా అయినది.

యదా జాతాన్యపత్యాని తదా యావన్తి తాని వై ।
తావచ్ఛరీరభూమీని మమ దుఃఖాన్యథాభవన్ ॥34॥

ఇక ఎప్పుడయితే నాకు ఎంతమంది బిడ్డలు కలిగిరో అప్పుడు నా ఈ దేహము వారియందలి మమతాభావముచే అన్ని విధములయినది. ఆ విధముగా అన్ని బహుదేహముల కారణముగా నా దుఃఖములు కూడా అన్ని అయినవి.

న కృతార్థో భవామ్యస్య నాతిదుఃఖాయ సంభవః ।
ఇహ దుఃఖాయ మత్సూతిః పరత్ర చ విరోధినీ ॥35॥

అందువలన నేను కృతార్థుడను కాను. కానీ ఈ మొదటిమృగముయొక్క జన్మ మాత్రము అనేక దుఃఖములకు హేతువు కాదు. నా జన్మ ఈ లోకమందు, పరలోకమందూ కూడా కృతార్థతకు విరోధము కలిగించునది. అనేక దుఃఖములకు కారణమగునది.

యతో రక్షణపోషార్థమపత్యానాం కరోమి తత్ ।
చిన్తయామి చ సంభూతిస్తేన మే నరకే ధ్రువమ్ ॥36॥

నా బహుసంతానముయొక్క రక్షణపోషణలకొరకై నేను చేయు పనులు మరియు ఆలోచన వారికొరకే ఉన్నవి. ఈ కారణముగా పరలోకచిన్తన లేని కారణముగా నా ఈ జన్మ నరకహేతువే అగును. ఇది నిశ్చయము.

రాజోవాచ – రాజు పలికాడు.

న వేద్మి కిం సన్తతిమాన్ధన్యోఽపుత్రోఽత్ర కిం మృగ ।
పుత్రార్థశ్చాయమారంభో మమ దోలాయతే మనః ॥37॥

ఓ మృగమా ! సంతానము కల్గినవాడు ధన్యుడా లేక సంతానము లేనివాడు ధన్యుడా? అను విషయమును తెలియలేకున్నాను. పుత్రసంతానము కొరకే నా ఈ ప్రయత్నముమంతయు. అందువలన నా మనస్సు డోలాయమాన మగుచున్నది.

దుఃఖాయ సన్తతిః సత్యమైహికాముష్మికాయ తత్ ।
తథాప్యతనయాన్యాన్తి ఋణానీతి శ్రుతం మయా ॥38॥

సంతానము పొందిన పిమ్మట వారి కొరకే ఆలోచన చేయుచు, పరలోకచిన్తన లేనందున ఆ సంతానము ఇహలోకపరలోకములందు దుఃఖహేతువే అగునను మాట సత్యము. అయినప్పటికీ సంతానహీనులకు మూడు ఋణములు అనగా దేవఋణము, పితృఋణము, ఋషి ఋణము కలుగునని నేను వింటిని.

సోఽహం యతిష్యే పుత్రార్థమృతే ప్రాణివధం మృగ ।
తపసైవ ప్రచణ్డేన యథాపూర్వం మహీపతిః ॥39॥

అందువలన ఓ మృగమా ! నేను ప్రాణవధ లేకుండానే, నా పూర్వకాలపు రాజులు ఆచరించినట్లుగానే నేను కూడా తీవ్రమైన తపస్సును ఆచరించి పుత్రసంతానముకొరకై ప్రయత్నించెదను.

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే ఖనీనేత్ర చరితవర్ణనం నామ సప్తదశాధికశతతమోఽధ్యాయః ॥117॥

శ్రీ మార్కండేయ మహాపురాణమందలి ఖనీనేత్రచరితమను నూటపదునేడవ అధ్యాయం సమాప్తం.



అష్టాధికశాధికశతతమోஉధ్యాయః – నూటపద్దెనిమిదవ అధ్యాయం
కరన్ధమచరితమ్ – కరంధముని చరిత్ర

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

తతః స నృపతిర్గత్వా గోమతీం పాపనాశినీమ్ ।
తత్ర తుష్టావ నియతో భూత్వా దేవం పురన్దరమ్ ॥1॥

అనంతరము ఖనీనేత్రమహారాజు పాపనాశినియగు గోమతీనదివద్దకు వెళ్ళి, అచ్చట ఇంద్రియనిగ్రహముతో పురందరదేవుని (దేవేంద్రుని) స్తుతించసాగెను.

తప్యమానస్తపశ్చోగ్రం యతవాక్కాయమానసః ।
తుష్టావ ప్రయతః శక్రమపత్యార్థం మహీపతిః ॥2॥

తపస్సుతో దేహమును కృశింపచేసుకొనుచూ, వాక్కు, శరీరము, మనస్సులను తన అధీనమందుంచుకొని, ఏకాగ్రచిత్తుడై సంతానముకొరకై ఆ మహారాజు దేవేంద్రుని స్తుతించెను.

తస్య స్తోత్రేణ తపసా భక్త్యా చాపి సురేశ్వరః ।
తుతోష భగవానింద్రః ప్రాహ చైనం మహామునే ॥3॥

ఓ మహామునీ ! ఆ ఖనీనేత్రుని తపస్సు, భక్తులను చూసి భగవత్స్వరూపుడగు దేవేంద్రుడు సంతోషించి, ఖనీనేత్రునితో ఇట్లు పలికెను.

అనేన తపసా భక్త్యా స్తోత్రేణోచ్చారితేన చ ।
పరితుష్టోஉస్మి తే భూప వ్రియతాం భవతా వరః ॥4॥

ఓ రాజా ! నీ తపస్సు, భక్తులను మరియు నీవు ఉచ్చరించు స్తోత్రములకు నేను మిక్కిలి సంతసించితిని. వరమేదైననూ కోరుకొనుము.

రాజోవాచ – రాజు చెప్పాడు.

అపుత్రస్య సుతో మేஉస్తు సర్వశస్త్రభృతాం వరః ।
సదా చావ్యాహతైశ్వర్యో ధర్మకృద్ధర్మవిత్కృతీ ॥5॥

పుత్రులు లేని నాకు సమస్తశస్త్రధారులలో శ్రేష్ఠుడు, తరుగులేని ఐశ్వర్యము గలవాడు, ధర్మకర్త, ధర్మవేత్త, పుణ్యవంతుడూ అగు పుత్రుడు కలుగుగాక !

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

తథేతి చోక్తః శక్రేణ రాజా ప్రాప్తమనోరథః ।
ప్రజాః పాలయితుం భూప ఆజగామ నిజం పురః ॥6॥

దేవేంద్రుడు అట్లేయని పలుకగా, రాజు తన మనోరథము తీరి తిరిగి ప్రజలను పరిపాలించుటకు తన పట్టణమునకు వచ్చెను.

తత్రాస్య కుర్వతో యజ్ఞం సమ్యక్పాలయతః ప్రజాః ।
అజాయత సుతో విప్ర తదా శక్రప్రసాదతః ॥7॥

ఓ విప్రుడా ! తన పట్టణమందు యజ్ఞమునాచరించుచూ, బాగుగా ప్రజాపరిపాలన చేయు సమయమందు దేవేంద్రుని అనుగ్రహముతో ఖనీనేత్రునికి పుత్రుడు జన్మించెను.

తస్య నామ పితా చక్రే బలాశ్వ ఇతి భూపతిః ।
అస్త్రగ్రామమశేషం చ గ్రాహయామాస తం సుతమ్ ॥8॥

రాజు ఆ కుమారునికి బలాశ్వుడని పేరు పెట్టెను. మరియు అతనికి సమస్త అస్త్రవిద్యలను నేర్పించెను.

పితర్యుపరతే విప్ర సోఽధిరాజ్యే స్థితో నృపః ।
స బలాశ్వో వనం నిన్యే భువి సర్వమహీక్షితః ॥9॥

తండ్రి మరణించిన పిమ్మట బలాశ్వుడు సామ్రాజ్యమునకు రాజై భూలోకమందలి రాజులందరినీ వశపరచుకొనెను.

కరం చ దాపయామాస సారగ్రహణపూర్వకమ్ ।
స సర్వభూమిపాన్రాజా పాలయామాస చ ప్రజాః ॥10॥

ఆ రాజు మిగిలిన రాజులవద్ద గల వారి ముఖ్యసంపదలను వశపరచుకొని, వారు తనకు పన్ను చెల్లించువిధముగా ఏర్పాటు చేసుకొనెను. ప్రజాపరిపాలనము కూడా చక్కగా చేయుచుండెను.

అథాఖిలనరేన్ద్రాస్తే దాయాదాస్తస్య దుర్మదాః ।
న చాభ్యుత్థాయ సతతం తే చాస్మై ప్రదదుః కరాన్ ॥11॥

అనంతరము దుర్మార్గులైన దాయాదులగు ఆ సమస్తరాజులు మహారాజగు ఖనీనేత్రునికి గౌరవమిచ్చుట, పన్నులను చెల్లించుట పూర్తిగా మానివేసిరి.

వ్యుత్థితాః స్వేషు రాష్ట్రేషు న సన్తోషపరాస్తతః ।
భువం తస్య నరేన్ద్రస్య జగృహుస్తే నరాధిపాః ॥12॥

ఇంకనూ ఆ రాజులు తమ తమ రాజ్యములందు సర్వాధికారములు కలిగియున్ననూ సంతుష్టులు కాలేదు. వారందరు ఆ బలాశ్వమహారాజుయొక్క భూములనన్నింటినీ వశపరచుకొనిరి.

స గృహీత్వా స్వకం రాజ్యం పృథివీశో బలాన్మునే ।
తస్థౌ స్వనగరే భూపైర్విరోధో బహుభిః కృతః ॥13॥

ఓ మునీ ! బలవంతముగా ఆ బలాశ్వమహారాజు స్వీయరాజ్యమును మాత్రము చేజిక్కించుకొని తన పట్టణమందు నివసించుచుండెను. చాలామంది ఇతర రాజులు అతనితో విరోధము కల్గియుండిరి.

సమేత్య సుమహావీర్యాః ససాధనధనాస్తతః ।
రురుధుస్తం మహీపాలం పురే తత్ర నరేశ్వరాః ॥14॥

గొప్ప పరాక్రమవంతులు, సాధనధనసంపత్తిగలవారూ అగు ఆ ఇతరరాజులందరూ ఒక్కటిగా కలిసి బలాశ్వమహారాజును అతడి పట్టణమందే చుట్టుముట్టిరి.

పురరోధేన తేనాథ కుపితః స మహీపతిః ।
స్వల్పకోశోఽల్పదణ్డశ్చ వైక్లవ్యం పరమం గతః ॥15॥

తన పట్టణమును ఆ రాజులందరూ ముట్టడించుటచే బలాశ్వమహారాజు మిక్కిలి కుపితుడయ్యెను. కాని ఆ సమయమందు కొద్ది ధనమూ, కొద్ది సైన్యము మాత్రము కలిగియుండుటచే అతడు మిక్కిలి విషాదము పొందెను.

అపశ్యమానః శరణం సబలో ద్విజసత్తమ ।
కరౌ ముఖాగ్రతః కృత్వా నిశశ్వాసార్తమానసః ॥16॥

ఓ బ్రాహ్మణశ్రేష్ఠుడా ! ఇక తనను రక్షించువారు ఎవరూ కనబడక, ఆ బలాశ్వుడు తన రెండు చేతులు ముఖముపై ఉంచుకొని దుఃఖితహృదయము గలవాడై నిట్టూర్చసాగెను.

తతోఽస్య హస్తవివరాన్ముఖానిలసమాహతాః ।
నిర్జగ్ముః శతశో యోధా రథనాగతురఙ్గమాః ॥17॥

అంతట తన రెండుచేతుల మధ్యభాగమునుండి ముఖవాయువుద్వారా వందలకొలదీ సైనికులు, రథములు, ఏనుగులు, అశ్వములు బయల్వెడలినవి.

తతః క్షణేన తత్సర్వం నగరం తస్య భూపతేః ।
వ్యాప్తమాసీద్బలౌఘేన సారేణాతిబలాన్మునే ॥18॥

ఓ మునీ ! అంతట క్షణకాలములోనే ఆ బలాశ్వమహారాజుయొక్క నగరమంతయు మిక్కిలి బలశాలురైన సైన్యసమూహములతో నిండిపోయెను.

అథ సోఽతిబలౌఘేన మహతా తేన సంవృతః ।
నిర్మథ్య నగరాత్తస్మాత్తాన్విజిగ్యే నరాధిపః ॥19॥

అంతట మిక్కిలి గొప్పవైన బలసమూహములతో కూడుకొన్న ఆ బలాశ్వమహారాజు తన నగరమునుండి శత్రువులందరినీ తరిమివేసి, వారిపై జయమును పొందెను.

జిత్వా చ వశమానీయ చకార కరదాన్నృపః ।
యథాపూర్వం మహాభాగ మహాభాగ్యో నరేశ్వరః ॥20॥

ఓ మహానుభావుడా ! శత్రువులందరినీ ఓడించి, తన వశము గావించుకొని, పూర్వమువలే వారు కప్పములు చెల్లించువిధముగా చేసి ఆ బలాశ్వమహారాజు మిక్కిలి సౌభాగ్యశాలి అయ్యెను.

ధుతయోః కరయోర్జజ్ఞే యతస్తస్యారిదాహదమ్ ।
బలం కరన్ధమస్తస్మాత్స బలాశ్వోఽభిధీయతే ॥21॥

బలాశ్వుని కంపితములగు రెండు చేతులనుండి శత్రువులను వధించునట్టి సైన్యము పుట్టుటచే ఆ బలాశ్వుడు కరంధముడను పేరుతో విఖ్యాతి పొందెను.

స ధర్మాత్మా మహాత్మా చ స మైత్రః సర్వజన్తుషు ।
కరన్ధమోఽభవద్భూపస్త్రిషు లోకేషు విశ్రుతః ॥22॥

ధర్మాత్ముడు, మహాత్ముడూ అగు ఆ కరంధముడు సమస్తప్రాణులందు మైత్రీభావము కలిగి మూడులోకములందు విఖ్యాతిని పొందెను.

సంప్రాప్తస్య పరామార్తిం దదావరివినాశనమ్ ।
బలం ధర్మేణ చాక్షిప్తమభ్యుపేత్య స్వయం నృపమ్ ॥23॥

పూర్వము గొప్ప మనోవ్యధ చెందిన కరంధమమహారాజుకు ధర్మదేవత స్వయముగా ప్రసాదించిన బలము శత్రువినాశమును చేకూర్చిపెట్టెను.

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే కరన్ధమచరితం నామ అష్టాదశాధికశతతమోఽధ్యాయః ॥118

శ్రీ మార్కండేయ మహాపురాణమందలి కరంధమచరితమను నూటపద్దెనిమిదవ అధ్యాయం సమాప్తం.



ఏకోనవింశత్యధికశతతమోఽధ్యాయః – నూటపంతొమ్మిదవ అధ్యాయం
అవీక్షితచరితమ్ – అవీక్షితుని చరిత్ర

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

వీర్యచన్ద్రసుతా సుభ్రూర్వీరా నామ శుభవ్రతా ।
స్వయంవరే సా జగృహే మహారాజం కరన్ధమమ్ ॥1॥

ఓ ద్విజోత్తమా ! వీర్యచంద్రుని కుమార్తె, అందమైన కనుబొమలుగలది, మంగళాచరణ గలదీ యగు "వీర"యను కన్య స్వయంవరమందు కరన్ధమమహారాజును వరించెను.

తస్యాం పుత్రం స రాజేన్ద్రో జనయామాస వీర్యవాన్ ।
అవీక్షితమితి ఖ్యాతిముపేతం జగతీతలే ॥2॥

పరాక్రమవంతుడగు ఆ కరన్ధమమహారాజువలన తన భార్యయగు వీరయందు జగద్విఖ్యాతిగల, వీరుడైన అవీక్షితుడను పుత్రుడుదయించెను.

జాతే తస్మిన్సుతే రాజా స దైవజ్ఞానపృచ్ఛత ।
కచ్చిత్ప్రశస్తనక్షత్రే శస్తలగ్నే సుతో మమ ॥3॥

కచ్చిచ్చాలోకితం జన్మ మమ పుత్రస్య శోభనైః ।
గ్రహైః కచ్చిన్న దుష్టానాం గ్రహాణాం దృక్పథం గతమ్ ॥4॥

తనకు పుత్రుడుదయించగానే ఆ కరన్ధమమహారాజు దైవజ్ఞులగు జ్యోతిశ్శాస్త్ర పండితులను ఇట్లడిగెను. "నా కుమారుడు ప్రశస్తమైన శుభనక్షత్రమందు, శుభలగ్నమందు జన్మించినాడా ? ఈతని లగ్నస్థానమందు శుభగ్రహముల దృష్టియున్నదా? ఈతనిపై దుష్టగ్రహాల దృష్టి పడలేదు గదా?"

ఇత్యుక్తాస్తేన దైవజ్ఞాస్తమూచుర్నృపతిం తతః ।
శస్తే ముహూర్తే నక్షత్రే లగ్నే చైవ సుతస్తవ ॥5॥

సముత్పన్నో మహావీర్యో మహాభాగో మహాబలః ।
భవిష్యతి మహారాజ మహారాజస్తవాత్మజః ॥6॥

ఈ విధముగా కరన్ధమమహారాజు అడుగగా దైవజ్ఞులిట్లు బదులిడిరి. ఓ మహారాజా ! నీ కుమారుడు ప్రశస్తమైన ముహూర్తమందు, నక్షత్రమందు, లగ్నమందు ఉదయించినాడు. ఈతడు మహాపరాక్రమవంతుడు, భాగ్యశాలి, మహాబలవంతుడు కాగలడు. మహారాజు కూడా కాగలడు.

అవైక్షతేమం దేవానాం గురుః శుక్రశ్చ సప్తమః ।
సోమశ్చతుర్థస్తనయం తవైనం సమవైక్షత ॥7॥

ఉపాన్తసంస్థితశ్చైవ సోమపుత్రోఽప్యవైక్షత ।
నావైక్షతేమం సవితా న భౌమో న శనైశ్చరః ॥8॥

తవ పుత్రం మహారాజ ధన్యోఽయం తనయస్తవ ।
సర్వకల్యాణసంపత్తిసమవేతో భవిష్యతి ॥9॥

నీ కుమారుని బృహస్పతి, శుక్రుడు లగ్నమందు సప్తమస్థానమందుండి చూచుచున్నారు. చంద్రుడు చతుర్థస్థానమందుండి చూచుచున్నాడు. చంద్రుని పుత్రుడయిన బుధుడు లగ్నమందు సమీపమందుండి చూచుచున్నాడు. నీ పుత్రునిపై రవి, మంగళ, శనైశ్చరుల దృష్టి పడలేదు. ఓ రాజా ! నీ పుత్రుడు ధన్యుడు. సమస్త కల్యాణసంపదలతో కూడుకొన్నవాడగును.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

ఇతి దైవజ్ఞవచనం నిశమ్య వసుధాధిపః ।
హర్షపూర్ణమనాః ప్రాహ నిజస్థానగతస్తదా ॥10॥

ఈ విధముగా జ్యోతిష్కులు చెప్పిన మాటల విని కరన్ధమమహారాజు సంతోషముతో నిండిన మనస్సు గలవాడై తన స్థానమందు కూర్చుండి ఇట్లు పలికెను.

అవైక్షతేమం దేవానాం గురుః సోమః సితో బుధః ।
నావైక్షతైనమాదిత్యో నార్కసూనుర్న భూమిజః ॥11॥

అవైక్షతేతి యత్ప్రోక్తం భవద్భిర్బహుశో వచః ।
అవీక్షితేతి తేనాస్య ఖ్యాతం నామ భవిష్యతి ॥12॥

"బృహస్పతి, చంద్రుడు, శుక్రుడు, బుధుడు ఈ నా కుమారుని లగ్నమందు చూచుచున్నారు. రవి, మంగళ, శనైశ్చరులు చూచుటలేదు" అని మీరు మాటిమాటికి 'అవైక్షత" అను పదమును ఉచ్చరించిరి. అందువలన ఈ నా కుమారుడు "అవీక్షితు"డను పేరుతో విఖ్యాతిని పొందుగాక !

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

అవీక్షితః సుతస్తస్య వేదవేదాఙ్గపారగః ।
అస్త్రగ్రామమశేషం స కణ్వపుత్రాదథాఽగ్రహీత్ ॥13॥

కరంధమముని కుమారుడగు అవీక్షితుడు వేదవేదాంగవిద్యలలో పాండిత్యముగలవాడాయెను. ఇంకను కణ్వపుత్రుని వలన సంపూర్ణ అస్త్రవిద్యలను గ్రహించెను.

స్వరూపేణాతిభిషజౌ దేవానాం పార్థివాత్మజః ।
బుద్ధ్యా వాచస్పతిం కాన్త్యా శశాఙ్కం తేజసా రవిమ్ ॥14॥

ధైర్యేణాబ్ధిం తథోర్వీం చ సహిష్ణుత్వేన వీర్యవాన్ ।
శౌర్యేణ న సమస్తస్య కశ్చిదాసీన్మహాత్మనః ॥15॥

ఆ అవీక్షితకుమారుడు శరీరసౌందర్యమందు దేవవైద్యులైన అశ్వినీకుమారులను, బుద్ధియందు వాచస్పతిని, కాంతియందు చంద్రుని, తేజస్సునందు సూర్యుని, ధైర్యమునందు సముద్రుని, సహనమందు భూమిని, మంచి పరాక్రమము కలిగియుండెను. మహాత్ముడైన ఆ అవీక్షితకుమారునితో శౌర్యమందు సమానులయిన వారు ఎవరూ లేరు.

స్వయంవరే తం జగృహే హేమధర్మాత్మజా వరా ।
సుదేవతనయా గౌరీ సుభద్రా బలినః సుతా ॥16॥

లీలావతీ వీరసుతా వీరభద్రసుతా నిభా ।
భీమాత్మజా మాన్యవతీ దమ్భపుత్రీ కుముద్వతీ ॥17॥

స్వయంవరమందు హేమధర్ముని కుమార్తెయగు వర, సుదేవుని కుమార్తెయగు గౌరి, బలియొక్క కుమార్తెయగు సుభద్ర, వీరుని కుమార్తెయగు లీలావతి, వీరభద్రుని కుమార్తెయగు నిభ, భీముని కుమార్తెయగు మాన్యవతి, దంభుని కుమార్తెయగు కుముద్వతి అవీక్షితకుమారుని స్వయంవరంలో పాణిగ్రహణం చేశారు.

యాశ్చైనం నాభినన్దన్తి స్వయంవరకృతక్షణాః ।
తాశ్చాపి స బలాద్వీరో జగ్రాహ నృపతేః సుతః ॥18॥

నిరాకృత్య నృపాన్సర్వాంస్తాసాం పితృకులాని చ ।
స్వయం హి వీర్యమాశ్రిత్య బలవాన్స బలోద్ధతః ॥19॥

మరియు స్వయంవరమునకు ఎదురుచూచుచున్న ఏ రాజకుమార్తెలయితే ఆ అవీక్షితుని ఇష్టపడక వరించలేదో ఆ కన్యలను కూడా బలవంతుడు, బలగర్వితుడూ అగు అవీక్షితుడు తన పరాక్రమముతో అట్టి రాజకుమార్తెల తండ్రులగు రాజులను, వారి వంశస్థులను ఓడించి పరిగ్రహించెను.

ఏకదా తు విశాలస్య విశాలాధిపతేః సుతామ్ ।
వైశాలినీం స సుదతీం స్వయంవరకృతక్షణామ్ ॥20॥

పరిభూయాఖిలాన్భూపాన్ స్వేచ్ఛయా న వృతస్తయా ।
బలాజ్జగ్రాహ విప్రర్షే యథాన్యా బలగర్వితః ॥21॥

ఓ విప్రర్షీ ! ఒకనాడు విశాలదేశాధిపతియగు విశాలరాజుయొక్క కన్యయగు అందమైన దంతములుగల వైశాలిని స్వయంవరమందు ఆ రాజును ఇష్టపడలేదు. అప్పుడు అతడు తన బలగర్వముచే ఏ విధముగా ఇతర రాజకన్యలను గ్రహించెనో అట్లే సమస్త రాజులను ఓడించి బలాత్కారముగా ఆమెను కూడా గ్రహించెను.

తతస్తే భూభృతః సర్వే బహుశస్తేన మానినా ।
నిరాకృతాః సునిర్విణ్ణాః ప్రోచురన్యోన్యమాకులాః ॥22॥

అంతట ఆ రాజులందరు గర్వితుడగు అవీక్షితమహారాజుచే పలుమారులు పరాజితులై, నిర్వేదము చెంది వ్యాకులతతో పరస్పరము ఇట్లు చెప్పుకొనసాగిరి.

క్షమతాం వఞ్చనామేతామేకస్మాద్బలశాలినామ్ ।
బహూనామేకవర్ణానాం జన్మ ధిగ్వో మహీభృతామ్ ॥23॥

ఒకే జాతికి చెంది మిక్కిలి బలశాలురైన మీ అందరి రాజులలో ఒక రాజునుండి బలాత్కారముగా కన్యను గ్రహించి వంచించిన ఈ అవీక్షితరాజును మీరు సహించుచుంటిరి. కావున మీ జన్మ నిందింపతగినది.

క్షత్రియో యః క్షతాత్త్రాణం వధ్యమానస్య దుర్మదైః ।
కరోతి తస్య తన్నామ వృథైవాన్యే హి బిభ్రతి ॥24॥

దుర్గార్గులచే చంపబడుచున్నవానిని ఏ క్షత్రియుడయితే అతని కష్టమునుండి రక్షించునో అతడే నిజమైన క్షత్రియుడు. "క్షతాత్ త్రాయతే ఇతి క్షత్రియః" అను అర్థము కలిగిన ఈ పేరు అతనియందే సార్థకమైనది. మిగిలిన రాజులు వ్యర్థముగా ఆ పేరును ధరించుచున్నారు.

ఆత్మనోఽపి క్షతత్రాణం దుష్టాదస్మాదకుర్వతామ్ ।
భవతాం క్షత్రియకులే జాతానాం కీదృశీ మతిః ॥25॥

ఇక తనను తాను లేదా తనవారిని కూడా ఇటువంటి దుష్టుని బారినుండి రక్షించుకోజాలని వారు క్షత్రియకులమందు పుట్టినచో వారి గురించి ఏమి చెప్పవలెను? వారు మిక్కిలి పిరికివారని మరియు వారు క్షత్రియకులమందు పుట్టుట వ్యర్థమని ఆశయము.

ఉచ్చార్యతే స్తుతిర్యా వః సూతమాగధవన్దిభిః ।
సా సత్యా మా వృథా వీరా భవత్వరివినాశనాత్ ॥26॥

ఓ వీరులారా ! సూతమాగధవన్దిగణాలు మీ పరాక్రమములను కొనియాడుచూ చేయు స్తుతి సత్యమగుగాక! వ్యర్థము కాకూడదుగాక ! శత్రునాశనమొనరించి ఆ స్తుతివాక్యములను నిజము చేయుడు.

చరతాం సా తథైవైషా భూపాశ్చారైర్దిగన్తరే ।
పౌరుషాశ్రయిణః సర్వే విశిష్టకులసంభవాః ॥27॥

ఓ రాజులారా ! దిగంతరములవరకు సంచరిస్తూ మీ గూఢచారులు మిమ్ములను స్తుతిస్తూ మీ పరాక్రమములను వ్యాపింపచేయుచున్న స్తుతివాక్యములు యథార్థమే అగుగాక ! మీరందరు పౌరుషముగలవారు, గొప్ప కులమందు పుట్టినవారు.

బిభేతి కో న మరణాత్కో యుద్ధేన వినాఽమరః ।
విచింత్యైతన్న హాతవ్యం పౌరుషం శస్త్రవృత్తిభిః ॥28॥

ఎవరు మృత్యువువలన భయపడరు? మరియు యుద్ధమును పరిత్యజించి ఎవరు అమరులగుదురు? ఈ విధముగా ఆయుధధారులైన మీరు విచారించి పౌరుషమును విడువకూడదు.

ఏతన్నిశమ్య తే భూపా విస్పష్టామర్షపూరితాః ।
ఊచుః పరస్పరం సర్వే సముత్తస్థుశ్చ సాయుధాః ॥29॥

కేచిద్రథానారురుహుః కేచిన్నాగాంస్తథా హయాన్ ।
అన్యేఽమర్షపరాధీనాస్తముపేతాః పదాతయః ॥30॥

ఈ వచనములన్నియు ఆ రాజులందరు అత్యంత క్రోధముతో నిండినవారై పరస్పరము సంభాషించుకొనసాగిరి. ఆయుధములను చేతబూని లేచి నిలబడిరి. కొంతమంది రథములనధిరోహించిరి. కొంతమంది ఏనుగులను, కొంతమంది గుర్రములను అధిరోహించిరి. అత్యంతకోపపూరితులైన మిగిలిన సైన్యగణములన్నియు వారిని అనుసరించిరి.

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే అవీక్షితచరితం నామ ఏకోనవింశత్యధికశతతమోఽధ్యాయః ॥119॥

శ్రీ మార్కండేయ మహాపురాణమందలి అవీక్షితచరితమను నూటపంతొమ్మిదవ అధ్యాయం సమాప్తం.



వింశత్యధికశతతమోఽధ్యాయః – నూటఇరువదవ అధ్యాయం

అవీక్షితచరితమ్ – అవీక్షితచరితం

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

ఇతి సంగ్రామసజ్జాస్తే భూపా భూపసుతాస్తథా ।
నిరాకృతాః సుబహుశస్తత్కాలం చాప్యవీక్షితా ॥1॥

అవీక్షితుని చేతిలో పెక్కుమారులు ఓడిన రాజులు మరియు రాకుమారులు ఈ విధముగా అవీక్షితునితో యుద్ధమునకు సన్నద్ధులైరి.

తతో బభూవ సంగ్రామస్తస్య తైః సహ దారుణః ।
ఏకస్య బహుభిర్భూపైర్భూపపుత్రవరైర్మునే ॥2॥

ఓ మునీ! అంతట చాలామంది రాజులు రాకుమారులతో ఒక్క అవీక్షితునికి భీకరసంగ్రామము జరిగెను.

తేఽసిశక్తిగదాబాణపాణయస్తం సుదుర్మదాః ।
అభిఘ్నన్తో యుయుధిరే తైః సమస్తైరసావపి ॥3॥

కత్తి, శక్తి, గద మరియు బాణములను చేతిలో ధరించి గర్వముతో మదించిన ఆ రాజులు అవీక్షితునితో యుద్ధము చేసిరి. అవీక్షితుడు కూడా ఒంటరిగా వారితో యుద్ధము చేసెను.

స తాఞ్ఛరశతైరుగ్రైర్బిభేద నృపనన్దనః ।
కృతాస్త్రో బలవాన్బాణైస్తే చ తం బిభిదుః శితైః ॥4॥

అస్త్రములను ధరించినవాడు, బలవంతుడూ అయిన రాజకుమారుడగు అవీక్షితుడు వందలకొలదీ బాణములతో వారిని కొట్టసాగెను. వారు కూడా బాణములతో అవీక్షితుని కొట్టసాగిరి.

కస్యచిచ్ఛిచ్ఛిదే బాహుమన్యస్య చ శిరోధరామ్ ।
హృది వివ్యాధ చైవాన్యమన్యం వక్షస్యతాడయత్ ॥5॥

ఆ అవీక్షితుడు కొందరి బాహువులను, కొందరి మెడలను, కొందరి గుండెలను, మరికొందరి వక్షఃస్థలములను విరగకొట్టెను.

కరం చిచ్ఛేద కరిణస్తురగస్య తథా శిరః ।
రథస్యైషాం తథైవాశ్వాన్ రథస్యాన్యస్య సారథిమ్ ॥6॥

ఆ అవీక్షితుడు ఏనుగుల తొండములను, అశ్వముల శిరస్సులను విరగకొట్టెను. అట్లే శత్రువుల రథములందలి గుర్రములను, ఆ రథముల సారథులను చంపివేసెను.

బాణానాపతతశ్చక్రే ద్విధా బాణైస్తథా ద్విషామ్ ।
చిచ్ఛేదాన్యస్య ఖడ్గం చ ధనురన్యస్య లాఘవాత్ ॥7॥

తనపైకి వచ్చుచున్న శత్రువుల బాణములను అవీక్షితుడు తన బాణములతో రెండు ముక్కలుగా చేసెను. కొందరు శత్రువుల ఖడ్గములను, కొందరు శత్రువుల ధనుస్సులను సులభముగా విరగకొట్టెను.

తనుత్రేఽపహృతే తేన ననాశాన్యో నృపాత్మజః ।
అవీక్షితాహతశ్చాన్యః పదాతిః ప్రజహౌ రణమ్ ॥8॥

అవీక్షితుడు కొందరి కవచములను భగ్నముచేసి వారిని చంపివేసెను. అవీక్షితునిచే కొట్టబడిన మరికొందరు సైన్యాధిపతులు రణరంగమును వదిలి పారిపోయిరి.

ఇత్యాకులీకృతే తస్మిన్సమగ్రే రాజమణ్డలే ।
తస్థుః సప్తశతం వీరా మరణే కృతనిశ్చయాః ॥9॥

ఆభిజాత్యవయఃశౌర్యలజ్జాభారసమన్వితాః ।
నిర్జితే సకలే సైన్యే పలాయనపరాయణే ॥10॥

ఈ విధముగా అవీక్షితుడు ఆ సమస్త శత్రురాజులసమూహమును వ్యాకులపరచగా పరాజయమును పొందిన కొద్ది సేనలు పారిపోయెను. కాని ఏడువందలమంది వీరులు మాత్రం తమ కులము, వయస్సు, శౌర్యములను విచారించి సిగ్గుపడినవారై వీరమరణము పొందుటకు నిశ్చయించుకొన్నవారై యుద్ధరంగమందు అట్లే నిలిచియుండిరి.

తైః సమేత్య మహీపాలైః స తు పుత్రో మహీభృతః ।
యుయుధే ధర్మయుద్ధేన తేన తం నాతికోపితః ॥11॥

విచ్ఛిన్నయన్త్రకవచాన్స తానపి మహాబలః ।
కర్తుం వ్యవస్థితస్తే చ తతః క్రుద్ధా మహామునే ॥12॥

ధర్మముత్సృజ్య యుయుధుర్యుధ్యమానేన ధర్మతః ।
నరేన్ద్రపుత్రాః ప్రస్వేదజలక్లిన్నాననాః సమమ్ ॥13॥

ఆ అవీక్షితమహారాజు యుద్ధరంగమందు పారిపోకుండా నిలబడిన ఆ రాజులందరితో మిక్కిలి కోపము వహించక ధర్మయుద్ధము చేసెను. మహాబలవంతుడైన ఆ అవీక్షితుడు అస్త్రశస్త్రకవచాదులను పోగొట్టుకున్న ఆ రాజులందరినీ ఆయుధహీనులైనందున వారిపై ధర్మముగా ఉద్యమించెను. ఓ మహామునీ ! కానీ ఆ రాజులందరూ ఓటమి భయము కారణముగా చెమటలు పట్టిన ముఖములు గలవారై అత్యంతక్రుద్ధులై అవీక్షితుని చుట్టుముట్టి ధర్మమార్గమును విడనాడి, ధర్మబద్ధముగా యుద్ధము చేయుచున్న అవీక్షితునితో అధర్మమార్గముతో యుద్ధము చేసిరి.

వివ్యాధ కశ్చిద్బాణౌఘైః కశ్చిచ్చిచ్ఛేద కార్ముకమ్ ।
ధ్వజమస్యాపరో బాణైశ్ఛిత్త్వా భూమావపాతయత్ ॥14॥

జఘ్నురన్యే తథైవాశ్వాన్ బభఞ్జుశ్చాపరే రథమ్ ।
గదాపాతేనాథ చాన్యే బాణైః పృష్ఠమతాడయన్ ॥15॥

అవీక్షితమహారాజును కొందరు బాణసమూహములతో బాధింపసాగిరి. ఒకడు ధనుస్సును విరగకొట్టెను. మరియొకడు జెండాను బాణములతో త్రుంచివేసి భూమిపై పడవేసెను. కొందరు గుర్రములను చంపిరి. కొందరు రథమును విరగకొట్టిరి. కొందరు గదాయుధముతోను, బాణములతోను అవీక్షితుని పృష్ఠభాగముపై (వీపుపై) దెబ్బలు కొట్టిరి.

ఛిన్నే ధనుషి సక్రోధః స తదా నృపతేః సుతః ।
జగ్రాహాసిం తథా చర్మ తదప్యన్యో న్యపాతయత్ ॥16॥

ధనుస్సు విరుగుటచే క్రోధముతో నిండిన అవీక్షితుడు కత్తి, ఢాలు తీసుకొనెను. కాని వాటిని కూడా మరియొకడు త్రుంచివేసెను.

ఛిన్నాసిచర్మా జగ్రాహ స గదాం గదినాంవరః ।
తామప్యన్యః క్షురప్రేణ చిచ్ఛేద కృతహస్తవత్ ॥17॥

కత్తి, ఢాలు తునాతునకలు కాగానే, గదాయుధధారులలో శ్రేష్ఠుడైన ఆ అవీక్షితుడు గదాయుధమును చేతబూనెను. కాని ఆ వెంటనే బాణప్రయోగమందు ఆరితేరిన ఒకడు తీక్ష్ణమైన బాణముతో ఆ గదను కూడా ముక్కలు ముక్కలు చేసెను.

అన్యే శరసహస్రేణ శతేనాన్యే నరాధిపాః ।
వివ్యధుః కోష్ఠకీకృత్య ధర్మయుద్ధపరాఙ్ముఖాః ॥18॥

ధర్మయుద్ధము చేయుటలో ఇష్టపడని కొంతమంది రాజులు అవీక్షితుని చుట్టుముట్టి వేలకొలదీ బాణములతోను, కొంతమంది వందలకొలదీ బాణములతోనూ అతడిని గాయపరచిరి.

స విహ్వలః పపాతోర్వ్యామేకో బహుభిరర్దితః ।
రాజపుత్రా మహాభాగా బబన్ధుస్తే చ తం తతః ॥19॥

అనేకమంది రాజులచే గాయపరచబడిన ఆ ఒక్కడైన అవీక్షితుడు నేలపై పడిపోయెను. అంతట మహాభాగులైన ఆ రాజపుత్రులందరు అవీక్షితుని బంధించిరి.

తమధర్మేణ తే సర్వే గృహీత్వా నృపతేః సుతమ్ ।
విశాలేన సమం రాజ్ఞా వైదిశం వివిశుః పరమ్ ॥20॥

ఈ విధముగా ఆ రాజులందరు అధర్మయుద్ధమందు అవీక్షితుని ఓడించి, బంధించి విశాలరాజుతో సహితముగా గొప్ప వైదిశరాజ్యమును ప్రవేశించిరి.

హృష్టాః ప్రముదితా బద్ధం సమాదాయ నృపాత్మజమ్ ।
స్వయంవరా చ సా కన్యా న్యస్తా తేన తతః పురః ॥21॥

హర్షప్రమోదములతో కూడుకొన్న ఆ రాజకుమారులందరు బందీగా ఉన్న అవీక్షితుని, ఆ స్వయంవరకన్యను విశాలరాజు సమ్ముఖమున నిలిపిరి.

పునః పునశ్చ పిత్రోక్తా తథాపి చ పురోధసా ।
ఆలమ్బ్యతామితి వరో యస్తే రాజసు రోచతే ॥22॥

తండ్రియగు విశాలరాజు, పురోహితులు ఆ స్వయంవరకన్యతో మాటిమాటికి "నీకీ రాజులలో ఎవరు నచ్చారో వారిని వరింపుము" అని పలికిరి.

యదా సా మానినీ కఞ్చిన్న జగ్రాహ వరం మునే ।
తదా పప్రచ్ఛ దైవజ్ఞం వివాహార్థం నరేశ్వరః ॥23॥

విశిష్టతరమేతస్యా వివాహాయ దినం వద ।
అద్యైతదీదృక్సఞ్జాతం యుద్ధం విఘ్నోపపాదకమ్ ॥24॥

ఓ మునీ! ఎప్పుడయితే అభిమానవతియగు ఆ కన్య ఎవరినీ వరించలేదో, అప్పుడు విశాలరాజు తన కుమార్తె వివాహము విషయమై దైవజ్ఞుని ఇట్లడిగెను. "ఈ నా కుమార్తె వివాహముకొరకు గొప్ప ముహూర్తముగల రోజును చెప్పుడు. ఇప్పుడు విఘ్నకారి అయిన ఇట్టి యుద్ధము సంభవించినది."

మార్కండేయ ఉవాచ - మార్కండేయుడు చెప్పాడు.

ఇతి పృష్టో నరేన్ద్రేణ స దైవజ్ఞో విమృశ్య తత్ ।
దుర్మనాః ప్రాహ విజ్ఞాతపరమార్థో మహీపతిమ్ ॥25॥

భవిష్యన్త్యపరాణీహ దినాని పృథివీపతే ।
ప్రశస్తలగ్నయుక్తాని శోభనాన్యచిరేణ వై ॥26॥

కరిష్యసి వివాహం త్వం తేషు ప్రాప్తేషు మానద ।
అలమేతేన యత్రాయం మహావిఘ్న ఉపస్థితః ॥27॥

ఈ విధముగా విశాలరాజు ప్రశ్నించగా, అప్పుడు దుఃఖితహృదయుడైన ఆ దైవజ్ఞుడు బాగుగా ఆలోచించి ఇట్లు పలికెను. "ఓ రాజా! అచిరకాలమందే ప్రశస్తమైన లగ్నములతో కూడుకొన్న రోజులు రాగలవు. ఓ మానవంతుడా! అట్టి రోజులు వచ్చినప్పుడు నీవు ఈమెకు వివాహము చేయగలవు. గొప్ప విఘ్నము సంభవించిన ఈ రోజును విడిచిపెట్టుము."

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే అవీక్షితచరితం నామ వింశత్యధికశతతమోఽధ్యాయః ॥120॥

శ్రీ మార్కండేయ మహాపురాణమందలి అవీక్షితచరితమను నూటఇరువదవ అధ్యాయం సమాప్తం.



ఏకవింశత్యధికశతతమోఽధ్యాయః – నూటఇరువదిఒకటవ అధ్యాయం
అవీక్షితచరితమ్ – అవీక్షితచరితం

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

తతః శుశ్రావ తం బద్ధం తనయం స కరన్ధమః ।
తస్య పత్నీ తథా వీరా అన్యే చాపి మహీభృతః ॥1॥

తమధర్మేణ తనయం బద్ధం శ్రుత్వా మహీపతిః ।
సమస్తైః పృథివీపాలైశ్చిరం దధ్యౌ మహామునే ॥2॥

ఓ మహామునీ ! కరంధముడు అతని భార్యయగు వీరాదేవి తమ కుమారుడగు అవీక్షితుడు బంధింపబడినాడను విషయమును వినిరి. అట్లే ఇతరరాజులును ఈ వార్తను వినిరి. కరంధమమహారాజు తమ కుమారుడు అధర్మమార్గములో బంధింపబడినాడను విషయమును విని మిగిలిన సామంతరాజులతో చాలాకాలమువరకు చర్చించసాగెను.

కేచిదూచుర్మహీపాలా వధ్యాః సర్వే మహీభృతః ।
యైరేకః సంయుగే బద్ధః సమస్తైస్తైరధర్మతః ॥3॥

"ఏ ఏ రాజులయితే ఏకమై ఒక్కడయిన రాజకుమారుని యుద్ధమందు బంధించిరో ఆ రాజులందరు చంపదగినవారు" అని కొందరు రాజులు పలికిరి.

యుజ్యతాం వాహినీ శీఘ్రమూచురన్యే కిమాస్యతే ।
విశాలో బధ్యతాం దుష్టస్త్ర యేఽన్యే సమాగతాః ॥4॥

"ఇప్పుడు నిశ్చింతగా ఎందుకు కూర్చున్నారు? వెంటనే సేనను సమాయత్తపరచి దుష్టుడగు విశాలరాజును, ఆసమయమందు అచ్చటకు వచ్చిన రాజులను బంధింపుడు" అని మరికొందరు పలికిరి.

అన్యే తథోచుర్ధర్మోఽత్ర త్యక్తః పూర్వమవీక్షితా ।
అన్యాయేన బలాద్యేన గృహీతా తమవాంఛతీ ॥5॥

మరికొందరు రాజులు ఇట్లు పలికిరి. "మొట్టమొదట రాజగు అవీక్షితుడే ధర్మమును తప్పెను. తనను ఇష్టపడని రాజకుమారిని బలవంతముగా రాజు గ్రహించెను.

స్వయంవరేష్వశేషేషు తేన రాజసుతాస్తదా ।
ఖిలీకృతాస్తతః సర్వే సమేత్య స వశీకృతః ॥6॥

అంతేకాక అన్ని స్వయంవరములందును రాజు ఇట్లు ప్రవర్తించి వేరే రాజకుమారులందరినీ విరోధులుగా చేసుకొనెను. ఇప్పుడు వారందరు ఏకమై అవీక్షితుని బందీగా పట్టుకొనిరి."

తేషామేతద్వచః శ్రుత్వా వీరా వీరప్రజావతీ ।
వీరగోత్రసముద్భూతా వీరపత్నీ ప్రహర్షితా ॥7॥

ఉవాచ భర్తుః ప్రత్యక్షమన్యేషాం చ మహీక్షితామ్ ।

ఆ రాజులందరు పలికిన మాటలను విని వీరులను కన్నదీ, వీరగోత్రమందు పుట్టినదీ, వీరపత్నీ అయిన వీరాదేవి ఆనందముతో తన భర్తయగు కరంధముని ఎదుట మరియు వేరే రాజుల ఎదుట ఇట్లు పలికెను.

భద్రం కృతం భద్రభుజా మమ పుత్రేణ పార్థివాః ॥8॥

గృహీతా యద్బలాత్కన్యా జిత్వా సర్వమహీక్షితః ।
తదర్థం యుధ్యమానోఽయం బద్ధ ఏకో న ధర్మతః ॥9॥

ఓ రాజులారా ! సంపూర్ణముగా రాజులందరినీ పరాజితులను చేసి కల్యాణాస్పదుడైన నా పుత్రుడు బలాత్కారముగా కన్యలను గ్రహించుట మంచి పనియే. అందుకొరకే యుద్ధము చేయుచున్న ఒంటరిగా ఉన్న నా పుత్రుని అధర్మరీతిలో బంధించినారు.

తదప్యస్మత్సుతస్యాజౌ మన్యే నాపచయప్రదమ్ ।
ఏతదేవ హి పౌరుష్యం యదమర్షవశాన్నరః ॥10॥

నీతిం న గణయత్యేవం జిఘాంసురివ కేసరీ ।

ఈ విధముగా నా పుత్రుడు యుద్ధములో ప్రవర్తించుట అతడి కీర్తికి ఎంతమాత్రమూ భంగము కాదు. ఇదియే పౌరుషమనగా. మిక్కిలి కోపమునకు వశీభూతుడైన మానవుడు, చంపుటకు ఇష్టపడు సింహమువలే నీతిని ఈవిధముగా లెక్కింపడు.

స్వయంవరాయ విన్యస్తా మమ పుత్రేణ కన్యకా ॥11॥

బహ్వ్యో గృహీతా భూపానాం పశ్యతామతిమానినామ్ ।
క్వ క్షత్రియకులే జన్మ క్వ యాచ్ఞా హీనసేవితా ॥12॥

స్వయంవరనిమిత్తమై ఉపస్థితులైన చాలామంది కన్యలను నా పుత్రుడు మిక్కిలి అభిమానవంతులైన చాలా రాజులు చూచుచుండగనే బలాత్కారముగా గ్రహించెను. ఎక్కడ క్షత్రియకులమందలి జన్మ? ఎక్కడి హీనజనులను సేవించినవారి యాచనకార్యము?

బలాదేవ సమాదత్తే క్షత్రియో బలినాం పురః ।
లోహశృంఖలబద్ధా వా న వశం యాన్తి కాతరాః ॥13॥

కావున క్షత్రియకులమందు పుట్టినవారు బలవంతుల ఎదుటే తమ పరాక్రమమును చూపి యాచన చేయకుండా బలవంతముగానే తమకు నచ్చినదానిని గ్రహించెదరు. అట్టివారు ఇనుపసంకెళ్ళతో బంధింపబడిననూ పిరికివారై ఎవ్వరికీ వశము కారు.

ప్రసహ్యకారిణో యాన్తి రాజానో ధర్మశాలినః ।
తదలం దౌర్మనస్యేన శ్లాఘ్యమేవాస్య బన్ధనమ్ ॥14॥

ధర్మమును అనుసరించు రాజులు వీరోచితకార్యములను చేసెదరు. కావున ఇందులో చెడ్డగా ఆలోచించవలసినదేదీ లేదు. ఈ నా కుమారుడు వీరోచిత కార్యములను చేసి బందీయగుట కొనియాడతగినదే.

యుష్మాకమపి యే పూర్వే కృత్వారీణాం నిపాతనమ్ ।
హృత్వైవ పృథివీశానాం పృథ్వీపుత్రాదికం వసు ॥15॥

భార్యావీర్యనిమిత్తాని తతో యాతాతిగౌరవమ్ ।
తత్త్వర్యతాం రణాయాశు స్యన్దనాన్యధిరోహత ॥16॥

మీ పూర్వీకులు కూడా శత్రునాశనమొనరించి, ఆ రాజులనుండి భూమిపుత్రాదికమగు ధనమును, వారి భార్యలను, సంపదలను అపహరించియే మిక్కిలి గౌరవమును పొందిరి. కావున యుద్ధము కొరకు శీఘ్రముగా త్వరపడండి. రథములను అధిరోహించండి.

సజ్జీకురుత నాగాశ్వమచిరేణ ససారథిమ్ ।
మన్యధ్వం కిం మహీపాలైర్బహుభిః సహ విగ్రహమ్ ॥17॥

ఆలస్యము లేకుండా తొందరగా సారథులతో కూడుకొన్న ఏనుగులను, గుర్రములను సిద్ధపరచుడు. చాలామంది రాజులతోనే యుద్ధము చేయవలెను కదాయని మీరు ఆలోచిస్తున్నారా ఏమి?

ప్రభూతా ఏవ తోషాయ శూరస్యాల్పరణే క్రియాః ।
కస్య నాల్పేషు సామర్థ్యం నరేన్ద్రాదిషు జాయతే ॥18॥

యేభ్యో న విద్యతే భీతిర్విక్రాన్తస్యాపి శత్రుషు ।
వ్యాప్య లోకాన్సమస్తాన్యో హ్యభిభూయ యతో నరః ॥
వ్యరోచతేఽతిశూరః స తమాంసీవ దివాకరః ॥19॥

చిన్న రణరంగమందు కూడా చూపబడిన వీర్యపరాక్రమాదులు సంతోషముకొరకే హేతువగుచున్నవి. చిన్నపాటి యుద్ధములందు కూడా శత్రువులవలని భయము లేక వారిపట్ల పరాక్రమము చూపు రాజుల సామర్థ్యము ఎందుకు లెక్కింపబడదు? ఏ మానవుడయితే లోకములందు అంతటా వ్యాపించి మిక్కిలి శూరుడై శత్రువులను తిరస్కరించి ప్రకాశించునో అట్టివాడు చీకట్లను పోగొట్టు సూర్యునివంటివాడు.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

ఇత్థముద్ధర్షితో రాజాఽనయా పత్న్యా కరన్ధమః ।
చకార స బలోద్యోగం హన్తుం పుత్రాహితాన్మునే ॥20॥

ఓ మునీ ! ఈ విధముగా కరంధమమహారాజు తన భార్యచే ఉత్తేజపరచబడినవాడై, తన పుత్రునియొక్క శత్రువులను చంపుటకై సైన్యములను సిద్ధము చేసెను.

తతస్తస్య సమం భూపైర్విశాలేన చ సఙ్గరః ।
బభూవ బద్ధపుత్రస్య తైరశేషైర్మహామునే ॥21॥

దినత్రయమభూద్యుద్ధం తేన రాజ్ఞా సమం తదా ।
కరన్ధమేన భూపానాం విశాలస్యానుకుర్వతామ్ ॥22॥

ఓ మహామునీ ! అంతట తన కుమారుడు బంధింపబడియుండగానే కరంధమునికి విశాలరాజుతోనూ మరియు అతడిని అనుసరించు ఇతరరాజులతోనూ మూడు రోజులపాటు యుద్ధము జరిగెను.

యదా పరాజితప్రాయం తత్సర్వం భూపమణ్డలమ్ ।
తదా విశాలోఽర్ఘ్యకరః కరన్ధమముపస్థితః ॥23॥

ఎప్పుడయితే ఆ రాజులందరూ ఓడిపోవు సమయము సన్నద్ధమైనదో అప్పుడు విశాలరాజు అర్ఘ్యమును (పూజాద్రవ్యమును) చేతబట్టుకొని కరంధముని వద్దకు వచ్చెను.

కరంధమోఽపి సంప్రీత్యా తేన రాజ్ఞాభిపూజితః ।
విముక్తే తనయే తత్ర నిశాం తాం సుఖమావసత్ ॥24॥

కరంధముడు కూడా సంతోషముతో ఆ విశాలరాజుచేత పూజింపబడి, తన పుత్రుడు బంధవిముక్తుడు కాగా, ఆ రాత్రి అంతయు సుఖముగా అచ్చట గడిపెను.

తాం చ కన్యాముపాదాయ విశాలం సముపస్థితమ్ ।
అవీక్షితః ప్రాహ విప్రర్షే వివాహార్థం పితుః పురః ॥25॥

ఓ విప్రర్షీ ! అటుపిమ్మట విశాలరాజు తన కన్యను అచ్చటకు తీసుకొని రాగా, అవీక్షితుడు తన తండ్రియెదుట ఆ కన్యతో తన వివాహవిషయమును గూర్చి ఇట్లు పలికెను.

నాహమేతాం గ్రహీష్యామి న చాన్యాం యోషితం నృప ।
పరైర్యస్యా నిరీక్షన్త్యాః సంగ్రామేఽహం పరాజితః ॥26॥

ఓ రాజా ! ఏ కన్య అయితే చూచుచుండగానే శత్రువులచేతిలో ఓడిపోయితినో, ఆ కన్యను నేనెప్పటికీ స్వీకరించలేను. ఇతరకన్యలను కూడా గ్రహించను.

అన్యస్మై సంప్రయచ్ఛేమామియం చాన్యం వృణోతు తమ్ ।
అఖణ్డితయశో వీర్యో యః పరైర్నాపమానితః ॥27॥

అందువలన ఎవరయితే శత్రువులచే అవమానింపబడలేదో అట్టి అఖండయశస్సు, వీర్యములుగల మరొకనికి ఈ కన్యను ఇమ్ము. ఈమె కూడా అట్టివానిని వరించునుగాక !

పరైః పరాజితోఽహం యత్కాతరేయం యథాబలా ।
కిమత్ర మానుషత్వం మే నైతస్యా మమ చాన్తరమ్ ॥28॥

పిరికితనముగల అబలయగు కన్యవలే నేను శత్రువులచేతిలో పరాజితుడనైతిని. అందువలన నాకు మనుష్యత్వమేమున్నది? ఈమెకు నాకూ మధ్య భేదమేమీ లేదు.

స్వతంత్రతా మనుష్యాణాం పరతన్త్రా సదాబలా ।
నరోఽపి పరతన్త్రో యస్తస్య కీదృఙ్మనుష్యతా ॥29॥

స్వతంత్రత పురుషుల అధీనము. పరతంత్రత స్త్రీల అధీనము. అందువలన పురుషుడైనప్పటికీ ఎవడు పరాధీనుడగునో అతనికిక మనుష్యత్వమేమున్నది?

సోఽహమస్యా ముఖం భూయో దృష్టం దర్శయితా కథమ్ ।
యోఽహమస్యాః పురో భూమౌ పరైర్భూపైః ఖిలీకృతః ॥30॥

ఏ కన్య ఎదుట అయితే నేను శత్రురాజుల చేతిలో ఓడిపోయితినో అట్టి కన్యకు నా ఈ పూర్వదృష్టముఖమును మరల ఎట్లు చూపించగలను?

ఇత్యుక్తే తేన తనయామువాచ జగతీపతిః ।
శ్రుతం తే వచనం వత్సే వదతోఽస్య మహాత్మనః ॥
వరయాన్యం ప్రతి యత్ర మనస్తే రమతే శుభే ॥31॥

వయం వా సంప్రయచ్ఛామో యస్మింస్తస్మింస్తవాదృతిః ।
ఏతయోర్త్వేకమాతిష్ఠ మార్గయో రుచిరాననే ॥32॥

ఈ విధముగా అవీక్షితుడు పలుకగా, భూపతియగు విశాలరాజు తన కుమార్తెతో ఈ విధముగా పలికెను. "ఓ కల్యాణీ ! ఈ మహాత్ముడు చెప్పినది నీవు విన్నావు కదా ! నీవు ఇష్టపడినచో వేరెవరినయినా పతిగా వరించుము. లేదా నీయందలి ప్రేమతో నేను తగిన వరుని చూచెదను. నీకు నచ్చినచో అతడిని వరించుము. ఓ అందమైన ముఖము గలదానా ! ఈ రెండు మార్గములలో ఏదో ఒక మార్గమును ఎంచుకొనుము.

కన్యోవాచ – కన్య పలికింది.

పరాజితోఽయం బహుభిర్న సమక్సమ్యగాచరన్ ।
సంగ్రామే తద్యశోవీర్యహానికారి న పార్థివ ॥33॥

ఓ రాజా ! చాలామందిచేతిలో ఒక్కడై ఇతడు పరాజితుడయ్యాడు. ఆ చాలామంది ధర్మమార్గములో ప్రవర్తించలేదు. అనగా యుద్ధనీతికి భిన్నంగా ప్రవర్తించారు. ఇట్టి సంగ్రామమందు అట్టి పరాజయము అవీక్షితుని కీర్తిపరాక్రమములకు హానికరము కాదు.

ఏకో బహూనాం యుద్ధాయ గజానామివ కేసరీ ।
యత్సంస్థితః పరం శౌర్యం తేనాస్య ప్రకటీకృతమ్ ॥34॥

సంగ్రామమందు అనేకమంది రాజులతో ఒక్కడే ఏనుగులపైకి సింహమువలే నిలచియుండెను. దీనివల్లనే ఇతని పరాక్రమము తేటతెల్లమగుచున్నది.

న కేవలమయం తస్థౌ యుద్ధే తేఽప్యఖిలా జితాః ।
బహుశోఽనేన యత్నేన విక్రమోఽపి ప్రకాశితః ॥35॥

యుద్ధమందు ఇతడొక్కడే నిలచియుండుట మాత్రమే కాదు, పలుమారులు ఇతడి చేతిలో వారు ఆ రాజులు పరాజయము కూడా పాలయిరి. ఇట్టి యత్నముచేతనే ఇతని పరాక్రమము తెలియుచున్నది.

శౌర్యవిక్రమసంయుక్తమిమం సర్వమహీక్షితః ।
ధర్మయుద్ధమధర్మేణ జితవన్తోఽత్ర కా త్రపా ॥36॥

శౌర్యపరాక్రమములతో కూడుకొన్న ఈ రాజకుమారుడు ధర్మబద్ధముగా యుద్ధము చేయుచుండగా, అధర్మమార్గంలో ఆ రాజులందరు యుద్ధము చేసి అతడిని ఓడించిరి. ఇందులో రాజకుమారుడు సిగ్గుపడవలసిన విషయమేమున్నది?

న చాపి రూపమాత్రేఽహం లోభమస్య గతా పితః ।
శౌర్యవిక్రమధైర్యాణి హరన్త్యస్య మనో మమ ॥37॥

ఓ తండ్రీ ! ఈతని అందమును మాత్రము చూచి ఈతనియందు నేను లోభము చెందుట లేదు. ఈతని శౌర్యపరాక్రమధైర్యములు నా మనస్సును ఆకర్షించుచున్నవి.

తత్కిముక్తేన బహునా యాచ్యతాం మత్కృతే నృపః ।
త్వయా మహానుభావోఽయం నాన్యో మే భవితా పతిః ॥38॥

అందుచే ఇంతకన్న ఎక్కువ నేనేమి చెప్పుదును? నాకొరకై మీరీ మహానుభావుడయిన రాజకుమారుని ప్రార్థింపుడు. ఈతడు కాకుండా మరెవ్వరూ నాకు భర్త కాలేరు.

విశాల ఉవాచ – విశాలరాజు చెప్పాడు.

రాజపుత్ర సుతా ప్రాహ మమైతచ్ఛోభనం వచః ।
ఏవం చైవ త్వయా తుల్యః కుమారో న మహీతలే ॥39॥

ఓ రాజకుమారా ! నా కుమార్తె చెప్పినదంతయు ఉచితముగా ఉన్నది. నీతో సమానుడగు రాజకుమారుడు ఈ భూతలమందు మరెవ్వరునూ నాకు కనిపించుట లేదు.

అవిసంవాదితే శౌర్యమతీవ చ పరాక్రమః ।
పావయాస్మత్కులం వీర దుహితుర్మే పరిగ్రహాత్ ॥40॥

ఓ వీరుడా ! నీ శౌర్యము ఎట్టి వివాదమునకు తావు లేనిది. నీ పరాక్రమము మిక్కిలి గొప్పది. నీవే నా యీ కుమార్తెను గ్రహించి నా వంశమును పవిత్రమొనరించుము.

రాజపుత్ర ఉవాచ – రాజకుమారుడు పలికాడు.

నాహమేతాం గ్రహీష్యామి న చాన్యాం యోషితం నృప ।
ఆత్మన్యేవ హి మే బుద్ధిః స్త్రీమయీ మనుజేశ్వర ॥41॥

ఓ రాజా ! నేను ఈమెనుగాని, మరి యే ఇతరస్త్రీని గాని వివాహమాడను. ఓ మానవేశ్వరా ! నన్ను నేను స్త్రీగా భావించుచున్నాను.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

తతః కరన్ధమః ప్రాహ పుత్రేయం గృహ్యతాం త్వయా ।
విశాలతనయా సుభ్రూస్త్వయి హార్దవతీ దృఢమ్ ॥42॥

అప్పుడు కరన్ధముడు తన కుమారుడగు అవీక్షితునితో ఇట్లు పలికెను. "ఓ కుమారా ! నీవీ కన్యను గ్రహించుము. అందమైన కనుబొమలు గల ఈ విశాలరాజపుత్రి నీయందు మిక్కిలి అనురాగము కలిగియున్నది.

రాజపుత్ర ఉవాచ – రాజకుమారుడు పలికాడు.

నాజ్ఞాభఙ్గః కదాచిత్తే కృతః పూర్వం మయా ప్రభో ।
తథాజ్ఞాపయ మాం తాత యథాజ్ఞాం కరవాణి తే ॥43॥

ఓ ప్రభూ ! నేనెన్నడూ నీ ఆజ్ఞను జవదాటలేదు. ఓ తండ్రీ ! ఇప్పుడుకూడా నేను ఏ విధముగా నీ ఆజ్ఞను పాలించెదనో అట్లు ఆజ్ఞాపింపుడు.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

అత్యన్తనిశ్చితమతౌ తస్మిన్రాజసుతే సుతామ్ ।
తామువాచ విశాలోఽపి వ్యాకులీకృతమానసః ॥44॥

రాజకుమారుడగు అవీక్షితుడు విశాలుని కుమార్తెయందు నిశ్చితాభిప్రాయమును కలిగియుండుటను చూచి విశాలుడు వ్యాకులము చెందిన మనస్సు గలవాడై తన కుమార్తెతో ఇట్లు పలికెను.

నివర్త్యతాం మనః పుత్రి ఏతస్మాచ్చ ప్రయోజనాత్ ।
అన్యం వరయ భర్తారం సన్త్యనేకే నృపాత్మజాః ॥45॥

ఓ పుత్రీ ! నీ మనస్సును అవీక్షితునిపై నుండి మరల్చుకొనుము. అనేకమంది రాజపుత్రులున్నారు. వారిలో ఎవరినైనా పతిగా వరించుము.

కన్యోవాచ – కన్య పలికింది.

వరం వృణోమ్యహం తాత మామేష యది నేచ్ఛతి ।
తపసాఽన్యో న మే భర్తా జన్మన్యస్మిన్భవిష్యతి ॥46॥

ఓ తండ్రీ ! ఈ రాకుమారుడు నన్ను ఇష్టపడనియెడల తపస్సు ఆచరించుటకై నీ అనుమతిని కోరెదను. ఈ జన్మయందు ఇతడు తప్ప వేరొకడు నాకు భర్త కాలేడు.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

తతః కరన్ధమో రాజా విశాలేన సమం ముదా ।
స్థిత్వా దినత్రయం తత్ర నిజమభ్యాయయౌ పురమ్ ॥47॥

అనంతరము కరంధమరాజు మూడురోజులు విశాలరాజుతో సంతోషముతో గడిపి, అటుపిమ్మట తన నగరమునకు తిరిగి వచ్చెను.

సాపి కన్యా వనం గత్వా నిసృష్టా నిజబాన్ధవైః ।
తపస్తేపే నిరాహారా వైరాగ్యం పరమాస్థితా ॥49॥

ఆ విశాలరాజుయొక్క కన్య కూడా తన బంధువులనుండి అనుజ్ఞను పొంది అడవికి వెళ్ళి ఆహారమును తినుట మాని గొప్ప వైరాగ్యమును పొంది తపస్సు ఆచరించెను.

నిరాహారా యదా సా తు మాసత్రయమవస్థితా ।
సంప్రాప పరమామార్తిం కృశా ధమనిసన్తతా ॥50॥

ఈ విధముగా ఆహారమును విడిచి మూడు నెలలపాటు తపస్సును ఆచరించుటచే కృశించినదై, అట్టి ధమనులు కలదై గొప్ప దుఃఖమును పొందెను.

మన్దోత్సాహాతితన్వఙ్గీ ముమూర్షురపి బాలికా ।
దేహత్యాగాయ సా చక్రే తదా బుద్ధిం నృపాత్మజా ॥51॥

అప్పుడు అత్యంతదుర్బలమైన అవయవములు కలదీ, మరణించవలెనని కోరిక కలదీ అయిన ఆ రాజకన్య ప్రాణత్యాగము చేయుటకు కృతనిశ్చయురాలు అయ్యెను.

ఆత్మత్యాగాయ తాం జ్ఞాత్వా కృతబుద్ధిం సురాస్తతః ।
సమేత్య ప్రేషయామాసుర్దేవదూతం తదన్తికమ్ ॥52॥

ఇట్లు ప్రాణత్యాగము చేయుటకు ఆ కన్య స్థిరనిశ్చయురాలు అయిన విషయమును తెలుసుకొని దేవతలందరు ఆమెవద్దకు ఒక దేవదూతను పంపిరి.

సముపేత్య స తాం ప్రాహ దూతోఽహం పార్థివాత్మజే ।
ప్రేషితస్త్రిదశైస్తుభ్యం యత్కార్యం తన్నిశామయ ॥53॥

ఆ దేవదూత వచ్చి ఆమెతో ఇట్లు పలికెను. "ఓ రాజపుత్రీ ! నేను దేవతలు పంపగా వచ్చిన దూతను. ఏ కార్యముమీద దేవతలు పంపిరో దానిని చెప్పెదను, వినుము.

న భవత్యా పరిత్యాజ్యం శరీరమతిదుర్లభమ్ ।
త్వం భవిష్యసి కల్యాణి జననీ చక్రవర్తినః ॥54॥

మిక్కిలి దుర్లభమైన ఈ శరీరమును విడిచిపెట్టుట నీకు తగదు. ఓ కల్యాణీ ! నీవు చక్రవర్తియగు రాజుకు తల్లివగుదువు."

పుత్రేణ చ మహాభాగే భోక్తవ్యాని హతారిణా ।
అవ్యాహతాజ్ఞేన చిరం సప్తద్వీపవతీ మహీ ॥55॥

ఓ మహానుభావురాలా ! తన ఆజ్ఞలు ఎన్నడూ వ్యర్థముకానివాడు, శత్రువులను సంహరించువాడూ అగు నీ కుమారుడు సప్తసముద్రములచే చుట్టబడిన ఈ భూమండలమును అనుభవించును.

హన్తవ్యస్తేన తరుజిద్దేవానాం పురతో రిపుః ।
అయః శంకుస్తథా క్రూరో ధర్మే స్థాప్యాస్తతః ప్రజాః ॥56॥

నీకు పుట్టబోయే ఆ కుమారుడు దేవతల ఎదుట వారి శత్రువైన తరుజిత్తు, అయస్సు మరియు క్రూరుడయిన శంకువు వీరిని చంపవలసియున్నది మరియు ప్రజలను ధర్మమార్గమందు నిలుపును.

పరిపాలనీయమఖిలం చాతుర్వర్ణ్యం స్వధర్మతః ।
హన్తవ్యా దస్యవో మ్లేచ్ఛా యే చాన్యే దుష్టచేష్టితాః ॥57॥

ఇంకను ఆ కుమారుడు స్వధర్మానుసారముగా సమస్తచాతుర్వర్ణ్యమును రక్షించును. చోరులు, మ్లేచ్ఛులు, మరియు దుష్టప్రవృత్తిగలవారు అతనివల్లనే వినాశమును పొందెదరు.

యష్టవ్యం వివిధైర్యజ్ఞైః సమాప్తవరదక్షిణైః ।
వాజిమేధాదిభిర్భద్రే షట్సహస్రైశ్చ సంఖ్యయా ॥58॥

ఓ కల్యాణీ ! ఇంకను ఆ కుమారుడు గొప్ప దక్షిణలను ఋత్విక్కులకు ఇచ్చి అశ్వమేధము మొ॥లగు ఆరువేల యజ్ఞములను అనుష్ఠించవలసియున్నది.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

తం దృష్ట్వా సాఽన్తరిక్షస్థం దివ్యస్రగనులేపనమ్ ।
దేవదూతమువాచేదం రాజపుత్రీ తతో మృదు ॥59॥

అనంతరము దివ్యములైన మాల, అనులేపనములతో కూడుకొనియున్నట్టి, ఆకాశమందు నిలచియున్నట్టి ఆ దేవదూతను చూచి రాజపుత్రి మృదువైన మాటలతో ఇట్లు పలికెను.

సత్యం త్వమాగతః స్వర్గాద్దేవదూతో న సంశయః ।
కిన్తు భర్త్రా వినా పుత్రః స కథం మే భవిష్యతి ॥60॥

నిజముగా నీవు స్వర్గమునుండి వచ్చిన దేవదూతవే. ఇందు సంశయము లేదు. కాని భర్త లేకుండ నాకు పుత్రుడెట్లు కలుగును?

అవీక్షితమృతే భర్తా మమ నాన్యోఽత్ర జన్మని ।
భవితేతి ప్రతిజ్ఞాతం మయైతత్సన్నిధౌ పితుః ॥61॥

అవీక్షితుడు కాకుండా మరెవ్వరును ఈ జన్మయందు నాకు భర్తగా కాలేరు. నేను నా తండ్రియెదుట ఇట్లు ప్రతిజ్ఞ చేసితిని.

స చ నేచ్ఛతి మాం ప్రోక్తో మత్పిత్రా జనకేన చ ।
కరన్ధమేనాథ సమ్యగ్యాచితశ్చ మయా తథా ॥62॥

కాని నా తండ్రి, అతడి తండ్రియగు కరంధముడు, అట్లే నేను బాగుగా యాచించినప్పటికీ ఆ అవీక్షితుడు నన్ను వివాహము చేసుకొనుటకు ఇష్టపడలేదు.

దేవదూత ఉవాచ – దేవదూత చెప్పాడు.

కిమనేన మహాభాగే బహునోక్తేన తే సుతః ।
సముత్పత్స్యతి మా త్యాక్షీస్త్వమాత్మానమధర్మతః ॥63॥

ఓ మహాభాగురాలా ! ఇక అధికముగా మాటలాడుట ఎందులకు? నీకు అవశ్యము పుత్రుడు జన్మించును. నీవు అధర్మాచరణతో ఆత్మత్యాగమును చేసుకొనవలదు.

అత్రైవ కాననే తిష్ఠ తనుం క్షీణాం చ పోషయ ।
తపఃప్రభావాదేతత్తే సర్వం సాధు భవిష్యతి ॥64॥

ఈ అడవియందే ఉండి క్షీణించిన నీ శరీరమును పోషించుకొనుము. నీయొక్క తపఃప్రభావముచే అంతా మంచే జరుగును.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

ఇత్యుక్త్వా దేవదూతోఽసౌ యథాగతమగచ్ఛత ।
చకారానుదినం సుభ్రూః సాప్యాత్మతనుపోషణమ్ ॥65॥

దేవదూత ఈ విధముగా పలికి తానెచ్చటినుంచి వచ్చెనో అచ్చటకు పోయెను. పిమ్మట అందమైన కనుబొమలుగల ఆ రాజకన్య కూడా నిత్యము తన శరీరపోషణను చేసుకొనసాగెను.

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే అవీక్షిచ్చరితం నామ ఏకవింశత్యధికశతతమోఽధ్యాయః ॥121॥

శ్రీ మార్కండేయ మహాపురాణమందలి అవీక్షితచరితమను నూటఇరువదిఒకటవ అధ్యాయం సమాప్తం.



ద్వావింశత్యధికశతతమోఽధ్యాయః – నూటఇరువదిరెండవ అధ్యాయం
అవీక్షిచ్చరితమ్ – అవీక్షిచ్చరితం

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

అథ సాఽవీక్షితో మాతా వీరా వీరప్రజావతీ ।
పుణ్యేఽహని సమాహూయ ప్రాహ పుత్రమవీక్షితమ్ ॥1॥

ఒక పవిత్రదినమందు వీరమాతయగు ఆ వీరాదేవి తన కుమారుడగు అవీక్షితుని బిలచి ఇట్లు పలికెను.

పుత్రాహమభ్యనుజ్ఞాతా తవ పిత్రా మహాత్మనా ।
ఉపవాసం కరిష్యామి దుష్కరోఽయం కిమిచ్ఛకః ॥2॥

ఓ కుమారా ! కిమిచ్ఛకమను మిక్కిలి కష్టసాధ్యమైన వ్రతమును నేను ఉపవసించి చేయతలపెట్టినాను. అందుకు మహాత్ముడగు నీ తండ్రి అనుమతించెను.

స చాయత్తస్తవ పితుస్త్వయా సాధ్యో మయాపి చ ।
ప్రతిజ్ఞాతే త్వయా పుత్ర తతస్త్రత యతామ్యహమ్ ॥3॥

ఈ వ్రతము నీ తండ్రి, నీవు మరియు నేను ఈ ముువ్వురి అధీనములోయున్నది. అందువలన ఎప్పుడు అంగీకారము తెలిపెదవో అప్పుడు నేను ఈ వ్రతము కొరకై యత్నించెదను.

ద్రవ్యస్యార్ధం మహాకోశాత్తవ దాస్యామ్యహం పితుః ।
ధనం తే పితురాయత్తమనుజ్ఞాతాస్మి తేన చ ॥4॥

నీ తండ్రియొక్క ధనాగారము నుండి సగము భాగము నీకు నేనిచ్చెదను. ధనమంతయు నీ తండ్రి అధీనమందున్నది గావున అతనినుండి అనుమతిని పొందితిని.

క్లేశసాధ్యో మదాయత్తః స హి శ్రేయో భవిష్యతి ।
సాధ్యో భవేద్వా యది తే కశ్చిద్బలపరాక్రమైః ॥5॥

స తేఽసాధ్యో హ్యన్యథా వా దుఃఖసాధ్యో భవిష్యతి ।
తత్త్వం ప్రతిజ్ఞాం కురుషే యది పుత్రాత్ర చైవ తే ॥
తదైతదహమవాప్స్యే కథ్యతాం యన్మతం తవ ॥6॥

ఓ కుమారా ! నేను సాధించతగినది మిక్కిలి కష్టమైన తపస్సువల్లనే సిద్ధించను. అది నాపై ఆధారపడియున్నది. ఆ ప్రయోజనము మిక్కిలి శ్రేయస్సును కల్గించునది. ఇక విఘ్నములను పోగొట్టుటవంటి కార్యములు నీచే సాధించతగినవి. ఒకవేళ అసాధ్యమైనదిగాని, మిక్కిలి కష్టములను సహించి సాధించతగినది గాని ఉన్నచో అది నీ బలపరాక్రమములవల్లనే సాధించతగినది. ఒకవేళ అందుకు నీవు ప్రతిజ్ఞ చేసినచో (అంగీకారమును తెలిపినచో) నేను తలపెట్టిన ప్రయోజనమును పొందగలను. నీ అభిప్రాయమేమో చెప్పుము.

అవీక్షిదువాచ – అవీక్షితుడు ఇట్లు పలికెను.

విత్తం మే పితురాయత్తం మత్స్వామిత్వం న తత్ర వై ।
యన్మచ్ఛరీరనిష్పాద్యం తత్కరిష్యే త్వయోదితమ్ ॥7॥

కిమిచ్ఛకం వ్రతం మాతర్నిశ్చిన్తా భవ నిర్వ్యథా ।
రాజ్ఞా పిత్రాభ్యనుజ్ఞాతం యది విత్తేశ్వరేణ మే ॥8॥

ఓ తల్లీ ! ధనమంతయు నా తండ్రి అధీనము. ఇందు నా ప్రభుత్వమేమియూ లేదు. ఇక నా శరీరముచే సాధించతగినది ఏమున్నదో దానిని నేను నీవు చెప్పిన విధముగా సంపన్నము చేసెదను. సమస్త కోశాగారమునకు ప్రభువయిన నా తండ్రి ఆజ్ఞ అయినచో నీవు ఎట్టి చింతలూ, విచారములూ లేకుండా నీవు తలపెట్టిన కిమిచ్ఛకవ్రతమును ఆచరింపుము.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

తతః సా రాజమహిషీ తద్వ్రతం సముపోషితా ।
యథోక్తం సాఽకరోత్పూజాం రాజరాజస్య సంయతా ॥9॥

నిధీనామప్యశేషాణాం నిధిపాలగణస్య చ ।
లక్ష్మ్యాశ్చ పరయా భక్త్యా యతవాక్కాయమానసా ॥10॥

అంతట పట్టపురాణి అయిన ఆ వీరాదేవి ఉపవాసదీక్షతో ఆ వ్రతమును సంయమనముతో వాక్కు, శరీరము, మనస్సులను స్వాధీనమందుంచుకొని పరమభక్తితో సమస్తనిధులకు రాజరాజయిన కుబేరుని, నిధిపాలకగణములను, మరియు లక్ష్మీదేవిని పూజించెను.

వివిక్తే తు గృహస్థోఽయమథ రాజా కరన్ధమః ।
ఆసీన ఉక్తః సచివైర్నీతిశాస్త్రవిశారదైః ॥11॥

అటుపిమ్మట కరంధమరాజు ఒంటరిగా గృహమందుండగా, రాజనీతిశాస్త్ర పండితులయిన మంత్రులు రాజుతో ఇట్లు పలికిరి.

సచివా ఊచుః – మంత్రులు పలికారు.

రాజన్వయః పరిణతం తవైతచ్ఛాసతో మహీమ్ ।
ఏకస్తే తనయోఽవిక్షిత్సత్యక్తదారపరిగ్రహః ॥12॥

ఓ రాజా ! ఈ భూమండలమును పరిపాలన చేయుచూ మీ వయస్సు గడచిపోయినది. మరియు మీ ఏకైకపుత్రుడు అవీక్షిత్తు వివాహము చేసుకొనలేదు.

అపుత్రః స చ తే నిష్ఠాం యదా భూప గమిష్యతి ।
తదారిపక్షం పృథివీ నిశ్చితం తవ యాస్యతి ॥13॥

ఓ రాజా ! అతడును పుత్రులు లేనివాడై మీ స్థితికి అనగా వార్ధక్యస్థితికి ఎప్పుడు వచ్చునో అప్పుడు నిస్సందేహముగా ఈ భూమి మీయొక్క శత్రువుల వశమగును.

వంశక్షయస్తే భవితా పితృపిణ్డోదకక్షయః ।
ఏతన్మహత్తేఽరిభయం క్రియాహాన్యా భవిష్యతి ॥14॥

మీ వంశము కూడా నశించును. పితృదేవతలకు శ్రాద్ధతర్పణాదులు నష్టమగును. యజ్ఞయాగాదిక్రియలు లోపించుటచే మీకు మిక్కిలి శత్రుభయము సంప్రాప్తించును.

తస్మాత్కురు తథా భూప యథా తే తనయః పునః ।
కరోతి సతతం బుద్ధిం పితౄణాముపకారిణీమ్ ॥15॥

ఓ రాజా ! అందువలన ఏ విధముగా నీ కుమారుడు ఎల్లప్పుడు పితృదేవతలకు ఉపకారము చేయు బుద్ధినవలంబించునో అట్టి ఉపాయమును ఆలోచింపుము.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

ఏతస్మిన్నన్తరే శబ్దం శుశ్రావ జగతీపతిః ।
పురోహితస్య వీరాయా గదతో హ్యర్థినం ప్రతి ॥16॥

కః కిమిచ్ఛతి దుస్సాధ్యం కస్య కిం సాధ్యతామితి ।
కరంధమస్య మహిషీ కిమిచ్ఛకముపోషితా ॥17॥

ఇంతలో పట్టమహిషియగు వీరాదేవియొక్క పురోహితుడు యాచకులనుద్దేశించి "కరంధమమహారాజుయొక్క పట్టమహిషి ఉపవసించి కిమిచ్ఛకవ్రతమును ఆచరించుచున్నది. ఎవరేమి కోరుకొనుచున్నారో దానిని చెప్పుడు. దుస్సాధ్యమైనా ఎవరికి ఏమి సాధించిపెట్టవలెనో చెప్పుడు" అని పలికెను. ఈ మాటలను కరంధమమహారాజు వినెను.

రాజపుత్రోఽప్యవిక్షిత్తు శ్రుత్వా పౌరోహితం వచః ।
ప్రత్యువాచార్థినః సర్వాన్ రాజద్వారముపాగతాన్ ॥18॥

మయా సాధ్యం శరీరేణ యస్య కిఞ్చిద్బ్రవీతు సః ।
మమ మాతా మహాభాగా కిమిచ్ఛికముపోషితా ॥19॥

శృణ్వన్తు మేఽర్థినః సర్వే ప్రతిజ్ఞాతం మయా తదా ।
కిమిచ్ఛథ దదామ్యేష క్రియమాణే కిమిచ్ఛకే ॥20॥

రాజపుత్రుడగు అవీక్షిత్తు కూడా పురోహితుడు పలికిన మాటలను విని రాజద్వారము వద్దకు వచ్చిన యాచకులందరితో ఈ విధముగా పలికెను. "నా శరీరముద్వారా మీకు సాధించిపెట్టదగునది ఏమి కలదో దానిని

చెప్పుడు. మహానుభావురాలయిన నా తల్లి ఉపవాసముతో కిమిచ్ఛకవ్రతమును ఆచరించుచున్నది. కావున యాచకులందరు నేను చెప్పు మాటలను వినుడు. నా తల్లి ఆచరించు కిమిచ్ఛకవ్రతమందు మీరేమి కోరుకొనుచున్నారో చెప్పుడు. దానిని నేను మీకు ఇచ్చెదను. ఇట్లు నా తల్లికి నేను ప్రతిజ్ఞచేసియున్నాను."

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

తతో రాజా నిశమ్యైతద్వాక్యం పుత్రముఖాచ్చ్యుతమ్ ।
సముత్పత్యాబ్రవీత్పుత్రమహమర్థీ ప్రయచ్ఛ మే ॥21॥

పిమ్మట కరంధమమహారాజు పుత్రుని నోటివెంట వచ్చిన పలుకులను విని వెనువెంటనే అతని సమీపమునకు వెళ్ళి ఇట్లు పలికెను. "ఓ కుమారా ! నేను అర్థినై వచ్చితిని. నేను కోరినదానినిమ్ము."

అవిక్షిదువాచ – అవీక్షితుడు పలికాడు.

దాతవ్యం యన్మయా తాత భవతే తద్బ్రవీహి మామ్ ।
కర్తవ్యం దుష్కరం వా తే సాధ్యం దుస్సాధ్యమేవ వా ॥22॥

ఓ తండ్రీ ! నేను మీకేమి యివ్వగలను? మీరు ఏమి కోరుచున్నారో దానిని నాకు చెప్పుడు. మీరు అడిగిన వస్తువు సాధ్యము, అసాధ్యము, దుస్సాధ్యము ఏమైనా కానిండు, తప్పక యిచ్చెదను.

రాజోవాచ – రాజు పలికాడు.

యది సత్యప్రతిజ్ఞస్త్వం దదాసి చ కిమిచ్ఛకమ్ ।
పౌత్రస్య దర్శయ ముఖం మమోత్సఙ్గగతస్య తత్ ॥23॥

"నీవు సత్యమైన ప్రతిజ్ఞను చేసినవాడవే అయినచో, నేనడిగినదానిని తప్పక ఇచ్చువాడవే అయినచో నా ఒడిలో కూర్చొనునట్టి పౌత్రుని ముఖమును నాకు జూపుము."

అవిక్షిదువాచ – అవీక్షితుడు పలికాడు.

అహం తవైకస్తనయో బ్రహ్మచర్యం చ మే నృప ।
న మే పుత్రోఽస్తి పౌత్రస్య దర్శయామి కథం ముఖమ్ ॥24॥

ఓ రాజా ! నేను మీకు ఒకే ఒక్క పుత్రుడను. బ్రహ్మచర్యవ్రతమును అవలంబించితిని. అందుచే నాకు పుత్రుడు లేడు. అటులైనప్పుడు మీకు పౌత్రుని ముఖమును ఎట్లు చూపగలను?

రాజోవాచ – రాజు పలికాడు.

పాపాయ బ్రహ్మచర్యం తే యదిదం ధార్యతే త్వయా ।
తస్మాత్త్వం మోచయాత్మానం మమ పౌత్రం చ దర్శయ ॥25॥

నీవు అవలంబించిన బ్రహ్మచర్యము పాపమునకు హేతువు. అందువలన దానిని పరిత్యజించుము. నాకు పౌత్రుని జూపుము.

అవీక్షిదువాచ – అవీక్షితుడు పలికాడు.

విషమం స్యాన్మహారాజ యదన్యత్తత్సమాదిశ ।
వైరాగ్యేణ మయా త్యక్తః స్త్రీసంభోగస్తథాస్తు సః ॥26॥

ఓ మాహారాజా ! నేను వైరాగ్యమునవలంబించి స్త్రీసంభోగమును విడిచిపెట్టితిని. అందువలన వేరొకదానిని ఆజ్ఞాపింపుడు.

రాజోవాచ – రాజు పలికాడు.

బహుభిర్యుధ్యమానానాం దృష్టో వై వైరిణాం జయః ।
తత్రాపి యది వైరాగ్యముపైషి తదపణ్డితః ॥27॥

కిం వా నో బహునోక్తేన బ్రహ్మచర్యం పరిత్యజ ।
మాతుస్త్వమిచ్ఛయా వక్త్రం పౌత్రస్య మమ దర్శయ ॥28॥

చాలామంది శత్రువులతో యుద్ధముచేసి నీవు జయము పొందుటను నేను చూచితిని. అట్టి నీవు వైరాగ్యమునవలంబించుట మూర్ఖత్వమే అగును. ఇక ఎక్కువ మాటలెందులకు? నీ తల్లి కోరిక ప్రకారము నీవు బ్రహ్మచర్యమును విడిచిపెట్టుము. నాకు పౌత్రుని జూపించుము.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

యదా స బహుశస్తేన ప్రోక్తః పుత్రేణ పార్థివః ।
నాన్యత్ప్రార్థయతే కిఞ్చిత్తదా పుత్రోఽబ్రవీత్పునః ॥29॥

ఇట్లు రాజపుత్రుడు మాటిమాటికీ ప్రార్థించిననూ, ఆ రాజు ఎప్పుడయితే వేరొక కోరికను కోరలేదో అప్పుడు రాజపుత్రుడు తిరిగి ఇట్లు పలికెను.

దత్త్వా కిమిచ్ఛకం తుభ్యం ప్రాప్తోఽహం తాత సఙ్కటమ్ ।
తత్కరిష్యామి నిర్లజ్జో భూయో దారపరిగ్రహమ్ ॥30॥

ఓ తండ్రీ ! ఏమి కోరినా ఇచ్చెదనని నేను నీతో మాటలాడి నేను సంకటస్థితియందు పడితిని. అందుచే సిగ్గు విడిచి తిరిగి భార్యను గ్రహించెదను.

స్త్రియాః సమక్షం విజితః పతితో ధరణీతలే ।
స్త్రీ పతిర్భవితా భూయస్త్వైతదతిదుష్కరమ్ ॥31॥

తథాపి కిం కరోమ్యేష సత్యపాశవశజ్గతః ।
కరిష్యామి యదాత్థ త్వం భుజ్యతాం నిజశాసనమ్ ॥32॥

ఓ తండ్రీ ! నేను స్త్రీయెదుటనే పరాజితుడనై నేలపై బడితిని. అందువలన స్త్రీయే నాకు తిరిగి భర్తగా కానున్నది. సహించుటకు ఇది చాలా దుష్కరమైనది. అయినను సత్యమను త్రాళ్ళచేత బంధింపబడిన నేను ఏమి చేయగలను? మీరు చెప్పినట్లే నేను ఆచరించెదను. ఈ విషయములో మీరు మీ శాసనఫలమును అనుభవింపుడు.

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే అవీక్షిచ్చరితం నామ ద్వావింశత్యధికశతతమోఽధ్యాయః ॥122॥

శ్రీ మార్కండేయ మహాపురాణమందలి అవీక్షిచ్చరితమను నూటఇరువదిరెండవ అధ్యాయం సమాప్తం.



త్రయోవింశత్యధికశతతమోఽధ్యాయః - నూటఇరువదిమూడవ అధ్యాయం
అవీక్షిచ్చరితమ్ - అవీక్షిచ్చరితం

మార్కండేయ ఉవాచ - మార్కండేయుడు చెప్పాడు.

కదాచిద్రాజపుత్రోఽసౌ మృగయామచరద్వనే ।
మృగాన్విధ్యన్వరాహాంశ్చ శార్దూలాదీంశ్చ దంష్ట్రిణః ॥1॥

ఒకనాడు రాజకుమారుడు మృగములను, వరాహములను, కోరలుగల శార్దూలము మొ॥లగు జంతువులను సంహరించుచు అడవియందు వేటాడుచున్నవాడై సంచరించెను.

శుశ్రావ సహసా శబ్దం త్రాహి త్రాహీతి యోషితః ।
విక్రోశన్త్యాః సుబహుశో భయగద్గదముచ్చకైః ॥2॥

ఆ సమయమందు హఠాత్తుగా "రక్షింపుడు", "రక్షింపుడు" అని భయముతో బొంగురుపోయిన గొంతుతో బిగ్గరగా అరచుచున్న ఒక స్త్రీయొక్క మాటలను వినెను.

మాభైర్మాభైరితి వదన్రాజపుత్రః స వేగితః ।
చోదయామాస తురగం యతః శబ్దః సమాగతః ॥3॥

ఆ శబ్దమును విన్నవెంటనే రాజకుమారుడు "భయపడవలదు", "భయపడవలదు" అని పలుకుచు, ఆ శబ్దము వినవచ్చిన ప్రదేశమునకు వేగముగా గుర్రమును పరుగెత్తించెను.

తతశ్చ సాపి చుక్రోశ కన్యకా విజనే వనే ।
గృహీతా దనుపుత్రేణ దృఢకేశేన మానినీ ॥4॥

అంతట దనుపుత్రుడగు దృఢకేశునిచే పట్టుకొనబడిన ఆ మానిని నిర్జనవనమందు ఈ విధముగా విలపించెను.

కరన్ధమసుతస్యాహం భార్యా చాహమవిక్షితః ।
హరత్యనార్యో విపినే పృథివీశస్య ధీమతః ॥5॥

యస్య సర్వే మహీపాలాస్తథా గన్ధర్వగుహ్యకాః ।
న సమర్థాః పురః స్థాతుం తస్య భార్యా హృతాస్మ్యహమ్ ॥6॥

యస్య మృత్యోరివ క్రోధః శక్రస్యేవ పరాక్రమః ।
కరన్ధమసుతస్యైషా తస్య భార్యా హృతాస్మ్యహమ్ ॥7॥

నేను కరంధమపుత్రుడు, బుద్ధిమంతుడు, పృథ్వీశ్వరుడూ అగు అవీక్షితుని భార్యను. ఈ దుర్మార్గుడు నన్ను ఈ వనములో అపహరించుచున్నాడు. ఎవనియెదుట సమస్తరాజులు, గంధర్వులు, గుహ్యకులు నిలువలేరో అట్టివాని భార్యనై యుండి కూడా నేను అపహరింపబడుచున్నాను. ఎవని కోపము మృత్యువుతో సమానమో, పరాక్రమము

ఇంద్రునితో సమానమో అట్టివాడు కరంధముని పుత్రుడు. అట్టివాని భార్యనైయుండి కూడా నేను ఈ దుర్మార్గునిచే అపహరింపబడుచున్నాను.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

ఇత్యాకర్ణ్య మహీపాలతనయః సశరాసనీ ।
చిన్తయామాస కిమిదం మమ భార్యాఽత్ర కాననే ॥8॥

ఆ మాటలను విన్న ధనుర్ధారియగు రాజపుత్రుడు ఇట్లు యోచింపసాగెను. "ఏమి విచిత్రము? ఈ వనములో నా భార్యయా?"

మాయేయం రక్షసాం నూనం దుష్టానాం కాననౌకసామ్ ।
అథవా గత ఏవాహం సర్వం వేత్స్యామి కారణమ్ ॥9॥

ఇది నిస్సందేహముగా వనమందు సంచరించు దుష్టులగు రాక్షసుల మాయయే. ఏమయినగాని సమీపమునకు వెళ్ళినచో విషయమంతయు తెలియును.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

త్వరితః స తతో గత్వా దదర్శాతిమనోరమామ్ ।
కాననే కన్యకామేకాం సర్వాలంకారభూషితామ్ ॥10॥

గృహీతాం దనుపుత్రేణ దృఢకేశేన దణ్డినా ।
త్రాహి త్రాహీతి కరుణం విక్రోశన్తీం పునః పునః ॥11॥

అటుపిమ్మట రాజపుత్రుడు వెంటనే అచ్చటకు చేరుకొని ఆ వనమందు సమస్తాలంకారములచే అలంకరింపబడినదియు, మిక్కిలి అందగత్తె అయినదియూ అయిన ఒక కన్యను చూచెను. ఆ కన్య దనుపుత్రుడు, దండధారీ అయిన దృఢకేశునిచే పట్టుకొనబడి, జాలిగా రక్షింపుడు, రక్షింపుడు అని మాటిమాటికీ ఆక్రోశించుచుండెను.

మా భైరితి స తామాహ హతోఽసీతి చ తం వదన్ ।
శాసతీమాం మహీం దుష్టః కో దూయేత కరన్ధమే ॥12॥

యస్య ప్రతాపావనతా భువి సర్వే మహీక్షితః ।

అంతట ఆ అవీక్షితుడు ఆ కన్యతో భయపడవలదని పలికి దానవునితో ఇట్లు పలికెను. "నీకు మృత్యువు మిక్కిలి సమీపమందున్నది. కరంధమమహారాజు ఈ భూమిని పరిపాలించుచుండగా ఏ దుర్మార్గుడూ కూడా ఎవరినీ బాధించలేదు. ఆ కరంధముని ప్రతాపము వల్లనే రాజులందరు తలలు వంచుకొనియున్నారు."

తతస్తమాగతం దృష్ట్వా గృహీతవరకార్ముకమ్ ॥13॥

**మాం త్రాహీత్యాహ తన్వఙ్గీ హృతాఽస్మ్యేషేతి చాఽసకృత్ ।
రాజ్ఞః కరన్ధమస్యాహం స్నుషా భార్యాప్యవిక్షితః ॥
హృతాఽస్మ్యేతేన దుష్టేన సనాథాఽనాథవద్వనే ॥14॥**

అంతట విల్లమ్ములను చేత ధరించి వచ్చుచున్న ఆ రాజకుమారుని చూచి కృశించిన అంగములుగల ఆ కన్య మాటిమాటికీ ఇట్లు పలికెను. "నన్ను రక్షింపుము. ఇతడు నన్ను అపహరించుచున్నాడు. నేను కరంధమమహారాజు యొక్క కోడలిని. అవీక్షితుని భార్యను. నేను నాథుడు గలదానినైననూ, అనాథవలే ఈ వనమందు దుష్టునిచే అపహరింపబడుచున్నాను."

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

**తతో విమమృశే వాక్యమవిక్షిత్స తథోదితమ్ ।
కథమేషా హి మే భార్యా స్నుషా తాతస్య వా కథమ్ ॥15॥**

**అథవా మోచయామ్యేతాం తన్వీం వేత్స్యామి తత్పునః ।
క్షత్రియైర్ధార్యతే శస్త్రమార్తానాం త్రాణకారణాత్ ॥16॥**

అంతట ఆ కన్య పలికిన మాటలను విని రాజపుత్రుడగు అవీక్షితుడు ఇట్లు ఆలోచించుకొనసాగెను. "ఈమె నా భార్య ఎట్లగును? అట్లే నా తండ్రిగారికి కోడలు ఎట్లు కాగలదు? ఏమయినను నేను ఈ కన్యను విడిపించెదను. అటుపిమ్మట అన్ని విషయములను తెలుసుకొనెదను. ఎందువలననగా ఆపదలలో ఉన్నవారిని రక్షించుటకొరకే క్షత్రియులు ఆయుధములను ధరించుచున్నారు."

**తతః క్రుద్ధోఽబ్రవీద్వీరో దానవం తం సుదుర్మతిమ్ ।
జీవన్గచ్ఛ విముచ్యైనామన్యథా న భవిష్యసి ॥17॥**

అటుపిమ్మట కోపముతోకూడిన వీరుడగు అవీక్షితుడు మిక్కిలి దుర్మార్గుడైన ఆ దానవునితో ఇట్లు పలికెను. "జీవించవలెనను కోరిక నీకు యున్నచో ఈమెను వదిలి వెళ్ళిపొమ్ము. లేనిచో నీకు మరణము సంభవించగలదు."

**తతః స తాం విహాయోచ్చైర్దణ్డముత్క్షిప్య దానవః ।
తమప్యధావత్సోఽప్యేనం శరవర్షైరవాకిరత్ ॥18॥**

అంతట దానవుడు రాజకుమారుని మాటలను విని ఆ కన్యను వదలి దండమును పైకెత్తి అతనిపైకి యురికెను. రాజకుమారుడు కూడా దానవునిపై బాణములను కురిపించి అతడిని కప్పివేసెను.

**స వార్యమాణో బాణౌఘైర్దానవోఽతిమదాన్వితః ।
రాజపుత్రాయ చిక్షేప దణ్డం శంకుశతావృతమ్ ॥19॥**

దానవుడు రాజపుత్రుడు ప్రయోగించిన బాణములను నిరోధించి మిక్కిలి అహంకారముతో రాజపుత్రునిపై వందలకొలదీ ముండ్లుగల దండమును విసిరెను.

తమాపతన్తం చిచ్ఛేద శరైర్భూపసుతస్తతః ।
సోఽప్యాసన్నం గృహీత్వోచ్చైర్ద్రుమమాజౌ వ్యవస్థితః ॥20॥

రాజకుమారుడు తనపైకి వచ్చుచున్న ఆ దండమును బాణములతో విచ్ఛిన్నము చేసెను. అప్పుడు దానవుడు కూడా సమీపమందున్న ఒక పెద్ద వృక్షమును తీసుకొని యుద్ధక్షేత్రమందు ప్రవేశించెను.

సృజతః శరవర్షాణి తం చిక్షేప తతో ద్రుమమ్ ।
స చ తం తిలశశ్చక్రే భల్లైః కార్ముకమోచితైః ॥21॥

రాజకుమారుడు దానవునిపై బాణములను వర్షించుచుండగా, దానవుడు రాజకుమారునిపై ఆ చెట్టును విసిరెను. రాజకుమారుడు కూడా తన ధనుస్సునుండి వదులుచున్న బాణములతో ఆ చెట్టును తిలపరిమాణములాగ ముక్కలు ముక్కలు చేసెను.

తతశ్చిక్షేప చ శిలాం రాజపుత్రాయ దానవః ।
సాఽపి మోఘా పపాతోర్వ్యాముజ్ఝితా తేన లాఘవాత్ ॥22॥

అటు పిమ్మట దానవుడు రాజపుత్రునిపై ఒక పెద్ద బండరాయిని విసిరెను. అది కూడా రాజపుత్రునిచే వ్యర్థము చేయబడి రాజపుత్రుని హస్తలాఘవము కారణముగా నేలపైబడెను.

రాజపుత్రాయ కుపితో యద్యచ్చిక్షేప దానవః ।
తత్తచ్చిచ్ఛేద బాణౌఘైర్భూభృత్సూనుః సలీలయా ॥23॥

ఈ విధముగా దానవుడు క్రోధముతో రాజపుత్రునిపై ఏమేమి విసరుచున్నాడో, వాటిన్నింటిని అతడు తన బాణప్రవాహములతో అవలీలగా మధ్యలోనే త్రుంచివేయుచుండెను.

తతో విచ్ఛిన్నదణ్డోఽసౌ విచ్ఛిన్నసకలాయుధః ।
ముష్టిముద్యమ్య సక్రోధో రాజపుత్రమధావత ॥24॥

ఈ విధముగా తాను ప్రయోగించిన దండము మరియు సకలాయుధములు విచ్ఛిన్నము కాగా దానవుడు పిడికిలి బిగించి రాజపుత్రునిపై ఉరికెను.

తస్యాపతత ఏవాసౌ కరన్ధమసుతః శిరః ।
ఛిత్త్వా వేతసపత్రేణ పాతయామాస వై భువి ॥25॥

అతడట్లు వచ్చుచుండగనే కరంధమపుత్రుడగు అవీక్షితుడు వేతసపత్రమను ఆయుధవిశేషముతో ఆ దానవుని తలను నరికివేసి భూమియందు బడవేసెను.

తస్మిన్వినిహతే దేవైర్దానవే దుష్టచేష్టితే ।
కరంధమసుతః సర్వైః సాధు సాధ్వితి భాషితః ॥26॥

ఇట్లు దుష్టుడగు దానవుని చంపగానే కరంధమపుత్రుని అందరు "బాగు", "బాగు" అని పలుకసాగిరి.

వరం వృణీష్వేతి తదా దేవైరుక్తో నృపాత్మజః ।
వవ్రే పుత్రం మహావీర్యం పితుః ప్రియచికీర్షయా ॥27॥

అంతట దేవతలు ఆ రాజకుమారుని వరము కోరుకోమని పలుకగా, అతడు తన తండ్రికి ప్రియము చేయు కోరికతో తనకు గొప్పపరాక్రమవంతుడగు పుత్రుని కోరుకొనెను.

దేవా ఊచుః – దేవతలు పలికిరి.

భవిష్యతి హి తే పుత్రశ్చక్రవర్తీ మహాబలః ।
అస్యామేవ హి కన్యాయాం మోక్షితాయాం త్వయానఘ ॥28॥

ఓ పాపరహితుడా ! నీవు విడిపించిన ఈ కన్యయందే నీకు మహాబలవంతుడయిన చక్రవర్తి కాగల పుత్రుడు జన్మించగలడు.

రాజపుత్ర ఉవాచ – రాజకుమారుడు పలికాడు.

పిత్రాఽహం సత్యపాశేన బద్ధ ఇచ్ఛామ్యహం సుతమ్ ।
రాజభిర్నిర్జితేనాజౌ త్యక్తో మే దారసంగ్రహః ॥29॥

నేను నా తండ్రియెదుట సత్యమను పాశమునకు (బంధమునకు) బద్ధుడనై పుత్రుని పొందవలెనని కోరుకొనుచున్నాను. కాని పూర్వము యుద్ధమందు రాజులచేతిలో ఓడిపోయినందున నేను భార్యను గ్రహించవలెనను కోరికను పరిత్యజించియుంటిని.

స చ మే యావతా త్యక్తా విశాలనృపతేః సుతా ।
తయా చ మత్కృతే త్యక్తో మామృతే నరసఙ్గమః ॥30॥

విశాలరాజుయొక్క కుమార్తె అయిన ఈమెను నేను పరిత్యజించగానే ఈమె కూడా నా కొరకు నేను తప్ప వేరే ఇతరపురుషుల సంగమమును పరిత్యజించెను.

తత్కథం తామపాస్యాద్య విశాలతనయామహమ్ ।
నృశంసాత్మా కరిష్యామి అన్యనారీపరిగ్రహమ్ ॥31॥

ఇప్పుడు నేను విశాలరాజకన్యను వదిలి దుర్మార్గపుబుద్ధితో వేరే ఇతర స్త్రీని ఎట్లు పరిగ్రహించగలను?

దేవా ఊచుః – దేవతలు పలికిరి.

ఇయమేవ హి తే భార్యా శ్లాఘ్యతే యా త్వయా సదా ।
విశాలస్య సుతా సుభ్రూస్త్వత్కృతే యాఽశ్రితా తపః ॥32॥

ఎవరిని నీవు మాటిమాటికీ ప్రశంసించుచున్నావో ఆమెయే ఈమె నీ భార్య. అందమైన కనుబొమలుగల ఈమెయే విశాలరాజుయొక్క కుమార్తె. ఈమెయే నీకొరకు తపస్సు ఆచరించినది.

అస్యాముత్పత్స్యతే వీరః సప్తద్వీపప్రసాధకః ।
యష్టా యజ్ఞసహస్రాణాం చక్రవర్తీ సుతస్తవ ॥33॥

ఈమె గర్భమునుండియే నీకు వీరుడు, సప్తద్వీపములను సాధించువాడు, వేలకొలదీ యజ్ఞములను ఆచరించువాడు, కాబోయే చక్రవర్తీ అయిన కుమారుడు జన్మించగలడు.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

ఇత్యుచ్చార్య యయుర్దేవాః కరన్ధమసుతం ద్విజ ।
సోఽప్యాహ తాం తదా పత్నీం కథ్యతాం భీరు కిన్త్విదమ్ ॥34॥

ఓ బ్రాహ్మణుడా ! దేవతలు కరంధమపుత్రుడగు అవీక్షితునితో ఇట్లు పలికి తమ స్థానములకు వెళ్ళిరి. అటుపిమ్మట ఆ రాజకుమారుడు తన భార్యయగు ఆమెతో ఇట్లు పలికెను. "ఓ ధైర్యములేనిదానా ! ఇది ఎట్లు జరిగినది? చెప్పుము.

సా చాఽస్మై కథయామాస త్యక్తాఽహం భవతా యదా ।
త్యక్తబన్ధుజనారణ్యం నిర్వేదాత్సముపాగతా ॥35॥

ఆ రాజకుమారి రాజకుమారునితో ఇట్లు చెప్పసాగెను. ఎప్పుడయితే మీరు నన్ను వదిలి వెళ్ళితిరో అప్పుడు నేను మిక్కిలి విచారముతో బంధుజనులందరినీ వదిలిపెట్టి ఈ అరణ్యమును ప్రవేశించితిని.

అత్రాహం తపసా వీర క్షీణప్రాయా కలేబరమ్ ।
త్యక్తుకామా సమభ్యేత్య దేవదూతేన వారితా ॥36॥

ఓ వీరుడా ! ఈ వనమందే నేను తపస్సు చేయుటచే దేహము మిక్కిలి క్షీణించెను. నేను ఒకనాడు దేహమును త్యజించవలెననుకొంటిని. కాని అదే సమయమందు ఒక దేవదూత వచ్చి నన్ను వారించెను.

భవిష్యతి చ పుత్రస్తే చక్రవర్తీ మహాబలః ।
ప్రీణయిష్యతి యో దేవానసురాంశ్చ హనిష్యతి ॥37॥

ఇది దేవాజ్ఞయా తేన దేవదూతేన వారితా ।
న సన్త్యక్తవతీ దేహం త్వత్సఙ్గమమనోరథా ॥38॥

ఆ దేవదూత నాతో "నీకు మహాబలవంతుడైన చక్రవర్తి కాగల కుమారుడు జన్మించగలడు. అతడు దేవతలను సంతోషపెట్టును. రాక్షసులను సంహరించును" అని పలికి దేవతల ఆజ్ఞతో నన్ను ప్రాణత్యాగము చేయవలదని వారించెను. అప్పుడు నేను నీ సమాగమమందలి కోరికతో నేను ప్రాణత్యాగము చేయుటను విరమించుకొంటిని.

పరశ్వశ్చ మహాభాగ స్నాతుం గంగాహ్రదం గతా ।
అవతీర్ణా వికృష్టాస్మి వృద్ధనాగేన కేనచిత్ ॥39॥

ఓ మహానుభావుడా ! మొన్నటిరోజున నేను స్నానము చేయుటకు గంగానదిలో స్నానము చేయుటకు నీటిలోనికి దిగితిని. అదే సమయమందు ఒక వృద్ధసర్పము నన్ను లాగుకొనుచూ వెళ్ళినది.

తతో రసాతలం నీతా తేన తత్ర చ మే పురః ।
నాగాః సహస్రశస్తస్థుర్నాగపత్న్యః కుమారకాః ॥40॥

తుష్టువుర్మాం సమభ్యేత్య మామన్యే పూజయంస్తథా ।
యయాచిరే సవినయం నాగా మామఙ్గనాస్తథా ॥41॥

ఆ విధముగా నేను పాతాళలోకమునకు తీసుకొనివెళ్ళబడితిని. అచ్చట నాగులు, నాగపత్నులు, నాగ కుమారులు వేలకొలదీ నా యెదుటకు వచ్చిరి. వారు నన్నుచేరి స్తుతించసాగిరి. కొందరు పూజించసాగిరి. అటుపిమ్మట నాగులు, నాగపత్నులు వినయముతో నన్ను ఇట్లు ప్రార్థించిరి.

ప్రసాదం కురు సర్వేషాం త్వమస్మాకం సుతస్త్వయా ।
అపరాధముపేతానాం సంనివార్యో వధోన్ముఖః ॥42॥

"నీవు మా అందరిపై దయజూపవలెను. మీ పుత్రునియెడల అపరాధము ఒనరించే మమ్ములను చంపుటకు ఉద్యుక్తుడు కాబోయే నీకుమారుని నీవు నివారించవలెను.

అపరాధం కరిష్యన్తి త్వత్పుత్రస్యానిలాశనాః ।
తన్నిమిత్తం నివార్యోఽసౌ ప్రసాదః క్రియతామితి ॥43॥

వాయుభక్షకులగు నాగులు నీ పుత్రునికి అపరాధము చేసిననూ వారిని దండించకుండా నీవు నీ పుత్రుని నివారించి మమ్ములను అనుగ్రహించవలెను."

తథేతి చ మయా ప్రోక్తే దివ్యైః పాతాలభూషణైః ।
భూషితాఽహం తథా పుష్పైర్గన్ధవాసోభిరుత్తమైః ॥44॥

నేను అప్పుడు "అట్లే"యని పలుకగా, అప్పుడు వారు నన్ను దివ్యములగు పాతాళభూషణములచే, మనోహరములైన పుష్పములు, గంధము, వస్త్రములతో అలంకరించిరి.

సమానీతా తథా లోకమిమం తేనాఽనిలాశినా ।
పురా యథా కాన్తిమతీ పూర్వవద్రూపశాలినీ ॥45॥

ఆ వృద్ధనాగుడు తిరిగి నన్ను భూలోకమునకు తీసుకొనివచ్చి, తాను తన లోకమునకు వెళ్ళెను. అప్పుడు నేను పూర్వమువలే కాంతి, రూపములను పొందితిని.

ఇతి రూపవతీం దృష్ట్వా సర్వాలఙ్కారభూషితామ్ ।
జగ్రాహ దృఢకేశోఽయం హర్తుకామః సుదుర్మతిః ॥46॥

ఇట్లు సమస్తాలంకారములతో అలంకరింపబడి, రూపవతినైయున్న నన్నుజూచి అపహరించవలెనను కోరికతో దుర్మార్గుడైన ఆ దృఢకేశుడు నన్ను పట్టుకొనెను.

తత్ప్రసీద మహాబాహో మా ప్రతీచ్ఛ త్వయా సమః ।
భూలోకే రాజపుత్రోఽన్యో నాస్తి సత్యం బ్రవీమ్యహమ్ ॥47॥

అందువలన ఓ గొప్ప బాహువులు గలవాడా ! నన్ను అనుగ్రహించి స్వీకరించుము. ఈ భూలోకమందు నీతో సమానుడైన రాజపుత్రుడు మరి ఎవరూ లేడు. నేను సత్యమును పలుకుచున్నాను.

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే అవిక్షిచ్చరితం నామ త్రయోవింశత్యధికశతతమోఽధ్యాయః ॥123॥

శ్రీ మార్కండేయ మహాపురాణమందలి అవీక్షిచ్చరితమను నూటఇరవైమూడవ అధ్యాయం సమాప్తం.



చతుర్వింశత్యధికశతతమోఽధ్యాయః - నూటఇరువదినాలుగవ అధ్యాయం
మరుత్తపుత్రోత్పత్తిః - మరుత్తపుత్రుని జన్మవృత్తాంతం

మార్కండేయ ఉవాచ - మార్కండేయుడు చెప్పాడు.

ఇతి తస్యా వచః శ్రుత్వా స్మృత్వా పితృవచః శుభమ్ ।
కిమిచ్ఛకే ప్రతిజ్ఞాతే యదుక్తం తేన భూభృతా ॥1॥

ప్రత్యువాచ స తాం కన్యామవిక్షిన్నృపతేః సుతః ।
సానురాగమనాః కన్యాం త్యక్తభోగాం చ తత్కృతే ॥2॥

ఈ విధముగా ఆ కన్య పలికిన మాటలను విన్న అవీక్షితుడు కిమిచ్ఛకవ్రతసమయమందు "మీకేమి కావలయునో కోరుకొనుడు" అని తాను చేసిన ప్రతిజ్ఞను, అప్పుడు తన తండ్రిగారు కోరిన కోరికను స్మరించుకొనెను. కేవలము తన కొరకే ఈ కన్య సమస్తభోగములను త్యాగముచేయుటను చూచి ఆమెయందలి సానురాగచిత్తముతో కరంధమ మహారాజుపుత్రుడయిన అవీక్షితుడు ఆమెతో ఇట్లు పలికెను.

యదాఽహం త్యక్తవాంస్తన్వీం త్వామరాతిపరాజితః ।
విజిత్య శత్రూన్సంప్రాప్తా త్వం మయాఽత్ర కరోమి కిమ్ ॥3॥

శత్రువుల చేతిలో పరాజయము పొందిన నేను నిన్ను పరిత్యజించితిని. ఇప్పుడు తిరిగి శత్రువులను జయించిన పిమ్మట, నాకు నీవు సంప్రాప్తించితివి. ఇప్పుడు నేనేమి చేయవలెను?

కన్యోవాచ - కన్య పలికింది.

మమ పాణిం గృహాణ త్వం రమణీయేఽత్ర కాననే ।
సకామాయాః సకామేన సఙ్గమో గుణవాన్భవేత్ ॥4॥

ఈ అందమైన వనమందు మీరు నన్ను పాణిగ్రహణము చేసుకొనుడు. కామయుక్తమైన స్త్రీకి కామయుక్తుడైన పురుషునితో సంగమమే గుణవంతము అగును.

రాజపుత్ర ఉవాచ - రాజపుత్రుడు పలికాడు.

ఏవం భవతు భద్రం తే విధిరేవాఽత్ర కారణమ్ ।
అన్యథా కథమన్యత్ర త్వామహం సమాగతః ॥5॥

నీవు చెప్పినట్లే జరుగుగాక ! నీకు శుభము కలుగుగాక ! ఈ విషయమందు దైవమే కారణము. అట్లు కానిచో భిన్నభిన్న ప్రదేశములందుండియు, నిన్ను నేను ఎట్లు కలుసుకొనగలను?

మార్కండేయ ఉవాచ - మార్కండేయుడు చెప్పాడు.

ఏతస్మిన్నన్తరే ప్రాప్తో గన్ధర్వతనయో మునే ।
వరాప్సరోభిః సహితో గన్ధర్వైరపరైర్వృతః ॥6॥

ఓ మునీ ! అదే సమయమందు గంధర్వతనయుడు అందమైన అప్సరసస్త్రీలతోను, ఇతర గంధర్వులతోను కూడినవాడై అచ్చటకు వచ్చెను.

గన్ధర్వ ఉవాచ – గంధర్వుడు చెప్పాడు.

రాజపుత్ర సుతేయం మే భామినీ నామ మానినీ ।
అభిశాపాదగస్త్యస్య విశాలతనయాఽభవత్ ॥7॥

ఓ రాజపుత్రుడా ! భామిని అనుపేరుగల ఈ కన్య నా కుమార్తె. అగస్త్యుని శాపము కారణముగా ఈమె విశాలరాజుకు కుమార్తెగా జన్మించినది.

బాలభావేన యోఽగస్త్యః కోపితః క్రీడమానయా ।
తతస్తేన తదా శప్తా మానుషీ త్వం భవిష్యసి ॥8॥

ఒకనాడు భామిని ఆటలాడుచు బాలచేష్టలు కారణముగా అగస్త్యమహర్షికి కోపము కల్గించినది. ఆ కారణముగా ఈమె "నీవు మనుష్యస్త్రీగా పుట్టెదవుగాక !" అని ఆ మహర్షిచే శపింపబడినది.

ప్రసాదితః స చాస్మాభిర్బాలేయమవివేకినీ ।
తవాపరాద్ధా విప్రర్షే ప్రసాదః క్రియతామితి ॥9॥

అంతట నేను "ఓ విప్రర్షీ ! ఈ బాలిక ఏమీ తెలియని వయస్సులో ఉన్నందున తమపట్ల అపరాధము చేసినది. అందువలన ఈమెను అనుగ్రహింపుడు" అని ఆ విప్రర్షిని శాంతపరచితిని.

ప్రసాద్యమానః సోఽస్మాభిరిదమాహ మహామునిః ।
బాలేతి మత్వా శాపోఽల్పో దత్తోఽస్యా నాన్యథైవ తత్ ॥10॥

అప్పుడు మహామునియగు ఆ అగస్త్యుడు శాంతించి ప్రసన్నుడై "ఈమె బాలికయని ఎరిగియే ఈమెకు సామాన్యశాపమునిచ్చితిని. నేను శపించినట్లుగనే జరుగగలదు" అని పలికెను.

ఇతి శాపాదగస్త్యస్య విశాలభవనే శుభా ।
జాతేయం మత్సుతా సుభ్రూర్భామినీ నామ నామతః ॥11॥

అగస్త్యుని ఈ శాపము కారణమువల్లనే అందమైన కనుబొమలుగల మంగళస్వరూపురాలయిన ఈమె విశాలమహారాజుయొక్క భవనమందు భామినియను పేరుతో జన్మించెను.

తదస్యాహం కృతే ప్రాప్తో గృహాణేమాం నృపాత్మజామ్ ।
మమాత్మజాం సుతస్తేఽత్ర చక్రవర్తీ భవిష్యతి ॥12॥

ఇందువల్లనే నేనిచ్చటకు వచ్చితిని. రాజకన్యకయగు ఈ నా కుమార్తెను స్వీకరింపుము. ఈమె గర్భమున నీకు చక్రవర్తి కాగల కుమారుడు జన్మించును.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

తథేత్యుక్త్వేతి తస్యాశ్చ స పాణిం పార్థివాత్మజః ।
జగ్రాహ విధివద్ధోమం చక్రే తత్ర చ తుమ్బురుః ॥13॥

గంధర్వతనయుని వచనములను విని రాజపుత్రుడగు అవీక్షితుడు అట్లేయని పలికి ఆ కన్యను పాణిగ్రహణము చేసుకొనెను. గంధర్వపురోహితుడగు తుంబురుడు యథావిధిగా హోమకార్యమును సంపన్నము చేసెను.

ప్రజగుర్దేవగన్ధర్వా ననృతుశ్చాప్సరోగణాః ।
పుష్పాణి ససృజుర్మేఘా దేవవాద్యాని సస్వనుః ॥14॥

ఆ సమయమందు దేవతలు, గంధర్వులు గానము చేసిరి. అప్సరసలు నాట్యము చేసిరి. మేఘములు పుష్పములను కురిపించినవి. దేవదుందుభులు మ్రోగినవి.

వివాహే రాజపుత్రస్య తయా తత్ర సమేయుషః ।
సమస్తవసుధాత్రాణకర్తృకారణభూతయా ॥15॥

తతో గన్ధర్వలోకం తే సహ తేన మహాత్మనా ।
నిశ్శేషేణ యయుః సా చ స చ రాజసుతో మునే ॥16॥

ఓ మునీ ! సమస్త భూమండలమును రక్షించు పాలకుని జన్మకు కారణభూతురాలగు ఆ భామినితో రాజపుత్రుని వివాహము సంపన్నము కాగా, వివాహమునకు విచ్చేసిన గంధర్వులందరు మహాత్ముడగు ఆ గంధర్వతనయునితో బాటుగా గంధర్వలోకమునకు వెళ్ళిరి. మరియు రాజకుమారుడు, రాజకుమార్తెగూడ వారివెంట వెళ్ళిరి.

భామిన్యా ముముదే సార్ధమవిక్షిన్నృపనన్దనః ।
సా తేన సమం తత్ర భోగసంపత్సమన్వితా ॥17॥

గంధర్వలోకమందు రాజకుమారుడగు అవీక్షితుడు భామినితో ఏ విధముగా ఆనందించెనో, అదేవిధముగా ఆమె కూడా భోగసంపదలతో ఆ రాజకుమారునితో ఆనందముగా కాలము గడిపెను.

కదాచిదతిరమ్యేఽసౌ నగరోపవనే తయా ।
విక్రీడతి సమం తన్వ్యా కదాచిదుపపర్వతే ॥18॥

ఒకప్పుడు ఆ రాజకుమారుడు మిక్కిలి మనోహరములైన నగరసమీపమందలి వనములందు, పర్వతసమీపములందు ఆ రాజకుమారితో విహరించసాగెను.

కదాచిత్పులినే నద్యా హంససారసశోభితే ।
కదాచిద్భవనస్యాన్తే ప్రాసాదే చాతిశోభనే ॥19॥

ఒకప్పుడు ఆ రాజకుమారుడు హంసలతోను, సారసపక్షులతోను శోభితమైన నదీతీరములందు, రాజభవన సమీపములందు, మిక్కిలి మనోహరములైన ప్రాసాదములందు ఆ రాజకుమారితో విహరించసాగెను.

విహారదేశేష్వన్యేషు రమణీయేష్వహర్నిశమ్ ।
స రేమే సహితస్తన్వ్యా సా చ తేన మహాత్మనా ॥20॥

ఒకప్పుడు మనోహరములైన విహారప్రదేశములందు ఆ రాజకుమారుడు రాత్రింబవళ్ళు ఆ సుందరాంగితో విహరించసాగెను. అట్లే ఆమె కూడా ఆ మహానుభావునితో విహరించసాగెను.

భక్ష్యానులేపనం వస్త్రం స్రక్పానాదికముత్తమమ్ ।
ఉపాజహ్రుస్తయోస్తత్ర మునిగన్ధర్వకిన్నరాః ॥21॥

మునులు, గంధర్వులు, కిన్నరులు ఆ ఇరువురికి అచ్చట తినుబండారములను, గంధాది అనులేపనములను, వస్త్రములను, శ్రేష్ఠమైన పూలదండలను, పానీయములను సమకూర్చసాగిరి.

తథా చ రమతస్తస్య భామిన్యా సహ దుర్లభే ।
గన్ధర్వలోకే వీరస్య పుత్రం సా సుషువే శుభా ॥22॥

ఈ విధముగా భామినితోకూడా వీరుడగు ఆ రాజకుమారుడు లభింపశక్యముగాని ఆ గంధర్వలోకమందు విహరించుచుండగా, మంగళస్వరూపుణి అయిన ఆమె పుత్రుని ప్రసవించెను.

తస్మిన్ జాతే మహావీర్యే గన్ధర్వాణాం మహోత్సవః ।
బభూవ మనుజవ్యాఘ్రే తేన కార్యమవేక్షతామ్ ॥23॥

భవిష్యత్కాలమందు కాబోవు గొప్ప పరాక్రమవంతుడు, మనుష్యులతో వ్యాఘ్రసదృశమూ అయిన ఆ బాలుడు జన్మించగానే, ఆ బాలుని ద్వారా తమ కార్యసిద్ధిని ఆశించుచున్న గంధర్వులు గొప్ప ఉత్సవమును జరుపుకొనిరి.

జగుః కేచిత్తథైవాన్యే మృదంగపటహానకాన్ ।
అవాదయన్త చైవాన్యే వేణువీణాదికాంస్తథా ॥24॥

ఆ గంధర్వులలో కొందరు గానము చేసిరి. కొందరు వాద్యములైన మృదంగములు, పటహములు, ఆనకములను ప్రయోగింపసాగిరి. మరికొందరు వేణువు, వీణ మొ॥వాటిని ప్రయోగింపసాగిరి.

ననృతుశ్చ తథా తత్ర బహవోఽప్సరసాం గణాః ।
పుష్పవృష్టిముచో మేఘా జగర్జుర్మృదునిస్వనాః ॥25॥

అట్లే అచ్చట చాలామంది అప్సరసలు నాట్యము చేసిరి. మేఘములు పుష్పవర్షమును కురిపించినవి. ఇంకనూ మృదువైన స్వరముతో గర్జింపసాగినవి.

తథా కోలాహలే తస్మిన్వర్తమానేఽథ తుమ్బురుః ।
ప్రణయేన స్మృతోఽభ్యేత్య జాతకర్మాఽకరోన్మునిః ॥26॥

ఈ విధముగా కోలాహలము జరుగుచున్న సమయమందు గంధర్వతనయునిచే స్మరింపబడిన తుంబురుడు స్నేహముతో అచ్చటకు వచ్చి, ఆ ముని ఆ బాలునికి జాతకర్మలను నిర్వహించెను.

దేవాః సమాయయుః సర్వే తథా దేవర్షయోఽమలాః ।
పాతాలాత్పన్నగేన్ద్రాశ్చ శేషవాసుకితక్షకాః ॥27॥

తథా దేవాసురాణాం చ యే ప్రధానా ద్విజోత్తమ ।
యక్షాణాం గుహ్యకానాం చ వాయవశ్చ తథాఖిలాః ॥28॥

ఓ బ్రాహ్మణశ్రేష్ఠుడా ! ఆ సమయమందు సమస్తదేవతలు, దోషరహితులైన దేవర్షులు, పాతాళలోకమునుండి పన్నగరాజులు, శేషుడు, వాసుకి, తక్షకుడు, ఇంకను దేవతలలోను, రాక్షసులలోను, యక్షులలోను, గుహ్యకులలోను ప్రధానులు, వాయుదేవతలు అచ్చటకు వచ్చిరి.

తదాగతైరశేషర్షిదేవదానవపన్నగైః ।
మునిభిశ్చాకులమభూద్గన్ధర్వాణాం మహత్పురమ్ ॥29॥

ఈ విధముగా అచ్చటకి వచ్చిన సమస్త ఋషులు, దేవతలు, దానవులు, సర్పములు, మునులతో ఆ గొప్ప గంధర్వనగరము నిండిపోయెను.

తతః స తుమ్బురుః కృత్వా జాతకర్మాదికాః క్రియాః ।
చక్రే స్వస్త్యయనం తస్య బాలస్య స్తుతిపూర్వకమ్ ॥30॥

జాతకర్మాది క్రియలను నిర్వహించిన పిమ్మట ఆ తుంబురుడు ఆ బాలునికి స్తుతిపూర్వకముగా స్వస్తివాక్యములను అనగా ఆశీర్వచనములను పలికెను.

చక్రవర్తీ మహావీర్యో మహాబాహుర్మహాబలః ।
మహాన్తం కాలమీశిత్వమశేషాయాః క్షితేః కురు ॥31॥

ఓ వీరుడా ! చక్రవర్తివై, గొప్ప పరాక్రమవంతుడవై, మహాబాహుడవై, గొప్ప బలవంతుడవై చాలాకాలము వరకు సమస్తభూమండలమునకు ప్రభువై ఆధిపత్యమును వహించుము.

ఇమే శక్రాదయస్సర్వే లోకపాలాస్తథర్షయః ।
స్వస్తి కుర్వన్తు తే వీర వీర్యం చారివినాశనమ్ ॥32॥

ఓ వీరుడా ! ఈ సమస్త ఇంద్రాదిలోకపాలకులు, ఋషులు నీకు శత్రువులను నశింపజేయునట్టి పరాక్రమమును ప్రసాదించి శుభమును కలుగజేయుదురుగాక !

మరుత్తవ శివాయాస్తు వాతి పూర్వేణ యోఽరజః ।
మరుత్తే విమలోఽక్షీణోఽవైషమ్యాయాస్తు దక్షిణః ॥33॥

పశ్చిమస్తే మరుద్వీర్యముత్తమం తే ప్రయచ్ఛతు ।
బలం యచ్ఛతు చోత్కృష్టం మరుత్తే చ తథోత్తరః ॥34॥

ఓ వీరుడా ! తూర్పు దిక్కున వీచుచున్న మలరహితమైన వాయువు నీకు శుభమును కలుగజేయుగాక ! స్వచ్ఛము, క్షీణరహితమూ అయిన దక్షిణవాయువు నీకు ఎట్టి వైషమ్యములు లేకుండాజేయుగాక ! పశ్చిమవాయువు నీకు గొప్ప పరాక్రమమును కలుగజేయుగాక ! అట్లే ఉత్తరవాయువు నీకు ఉత్కృష్టమైన బలమును ప్రసాదించుగాక!

ఇతి స్వస్త్యయనస్యాన్తే వాగువాచాఽశరీరిణీ ।
మరుత్తవేతి బహుశో యదిదం గురురబ్రవీత్ ॥35॥

మరుత్త ఇతి తేనాయం భువి ఖ్యాతో భవిష్యతి ।
భువి చాస్య మహీపాలా యాస్యన్త్యాజ్ఞావశా యతః ॥36॥

ఏష సర్వక్షితీశానాం వీరః స్థాస్యతి మూర్ధని ।
చక్రవర్తీ మహావీర్యః సప్తద్వీపవతీం మహీమ్ ॥37॥

ఆక్రమ్య పృథివీపాలానయం భోక్ష్యత్యవారితః ।
ప్రధానః పృథివీశానాం భవిష్యత్యేష యజ్వినామ్ ॥
ఆధిక్యం శౌర్యవీర్యేణ భవిష్యత్యస్య రాజసు ॥38॥

ఈ విధముగా స్వస్తివచనములు ముగిసిన పిమ్మట ఆకాశవాణి ఇట్లు పలికెను. "మరుత్తవ" అని పలుమార్లు గురువు ఉచ్చరించినందువలన ఇతడు మరుత్తనామముతో ఈ భూమండలమందు ప్రఖ్యాతుడు కాగలడు. ఈ భూమండలమందలి రాజులందరు ఇతడి ఆజ్ఞకు కట్టుబడి ఉందురు గావున ఇతడు సమస్తరాజులకు మూర్ధన్యస్థానమందు వీరుడిగా ఉండగలడు. ఇంకనూ ఇతడు గొప్ప పరాక్రమవంతుడైన చక్రవర్తియై, సమస్తరాజులను ఆక్రమించి అనగా జయించి, ఎవరి అడ్డూ లేనివాడై, సప్తద్వీపములతో చుట్టబడిన ఈ భూమండలమును అనుభవించును. సమస్తరాజులకు ప్రధానుడై, యాగకర్తలలో గొప్పవాడు కాగలడు. అందరి రాజులలోనూ శౌర్యవీర్యములందు ఆధిక్యము కలవాడు కాగలడు.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

ఇత్యాకర్ణ్య వచః సర్వే కేనాప్యుక్తం దివౌకసామ్ ।
తుతుషుర్విప్రగన్ధర్వాశ్చాస్య మాతా తథా పితా ॥39॥

దేవతలలో ఒకరైన అశరీరవాణి పలికిన ఈ మాటలను విని బ్రాహ్మణులు, గంధర్వులు, ఆ బాలుని తల్లిదండ్రులు పరమానందమును పొందిరి.

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే మరుత్తపుత్రోత్పత్తివర్ణనం నామ చతుర్వింశత్యధికశతతమోఽధ్యాయః ॥124॥

శ్రీ మార్కండేయ మహాపురాణమందలి మరుత్తపుత్రోత్పత్తివర్ణనమను నూటఇరువదినాల్గవ అధ్యాయం సమాప్తం.



పఞ్చవింశత్యధికశతతమోఽధ్యాయః – నూటఇరువదిఅయిదవ అధ్యాయం
మరుత్తచరితమ్ – మరుత్తుని చరిత్ర

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

తతః స రాజపుత్రస్తమాదాయ దయితం సుతమ్ ।
పత్నీం చానుగతో విప్ర గంధర్వైరాయయౌ పురమ్ ॥1॥

ఓ విప్రుడా ! అటుపిమ్మట ఆ రాజకుమారుడు ప్రియమైన తన కుమారుని తీసుకొని భార్యాసమేతుడై గంధర్వులతోబాటుగా తన పట్టణమునకు చేరుకొనెను.

స పితుర్భవనం ప్రాప్య వవన్దే పితురాదరాత్ ।
చరణౌ సా చ తన్వఙ్గీ హ్రీమతీ నృపతేః సుతా ॥2॥

అతడు తన తండ్రి గృహమునకు చేరుకొని భక్తితో తండ్రి పాదములకు నమస్కరించెను. సుందరాంగి అయిన ఆ రాజకుమారి కూడా లజ్జాభావముతో తన మామగారికి నమస్కారము చేసెను.

తదాఽహ రాజపుత్రోఽసౌ గృహీత్వా బాలకం సుతమ్ ।
ధర్మాసనగతం భూపం రాజ్ఞాం మధ్యే కరన్ధమమ్ ॥3॥

పిమ్మట రాజకుమారుడు బాలుడగు తన పుత్రుని తీసుకొని రాజులమధ్య ధర్మాసనమందు కూర్చొనియున్న తన తండ్రియగు కరంధమునితో ఇట్లు పలికెను.

ముఖం పౌత్రస్య పశ్యైతదుత్సఙ్గస్థస్య యన్మయా ।
కిమిచ్ఛకే ప్రతిజ్ఞాతం తుభ్యం మాతుః కృతే పురా ॥4॥

నేను పూర్వము తల్లి ఆచరించిన కిమిచ్ఛకవ్రతసమయమందు మీతో చేసిన ప్రతిజ్ఞప్రకారము నా ఒడియందున మీ పౌత్రుని (మనవడి) ముఖమును చూడుము.

ఇత్యుక్త్వా పితురుత్సఙ్గే తం కృత్వా తనయం తతః ।
యథావృత్తమశేషం స కథయామాస తస్య తత్ ॥5॥

ఈ విధముగా రాజకుమారుడు పలికి తన తండ్రి ఒడిలో కుమారుని ఉంచి అతనితో జరిగిన వృత్తాంతమంతయు చెప్పెను.

స పరిష్వజ్య తం పౌత్రమానన్దాస్రావిలేక్షణః ।
సభాగ్యోఽస్మీత్యథాత్మానం ప్రశశంస పునః పునః ॥6॥

రాజు ఆనందముతో కూడిన అస్రములతో (నేత్రజలములతో) నిండిన కన్నులుగలవాడై తన పౌత్రుని ఆలింగనము చేసుకొని "భాగ్యవంతుడనయితిని" అని మాటిమాటికి తనను ప్రశంసించుకొనెను.

తతః సోఽర్ఘ్యాదినా సమ్యగ్గన్ధర్వాన్సముపాగతాన్ ।
సమ్మానయామాస ముదా విస్మృతాన్యప్రయోజనః ॥7॥

అటుపిమ్మట ఆనందము కారణముగా ఇతర కార్యములనన్నింటిని మరచి తన గృహమునకు వచ్చిన గంధర్వులనందరిని అర్ఘ్యాది పూజాద్రవ్యములను ఇచ్చుటద్వారా గౌరవించెను.

తతః పురే మహానాసీదానన్దః పౌరవేశ్మసు ।
అస్మాకం సన్తతిర్జాతా నాథస్యేతి మహామునే ॥8॥

ఓ మహామునీ ! ఆ సమయమందు నగరమందలి సమస్తజనుల గృహములందును "మా ప్రభువుకు సంతానము కలిగెనని" గొప్ప ఆనందము కలిగెను.

హృష్టపుష్టే పురే తస్మిన్గీతవాద్యైర్వరాఙ్గనాః ।
విలాసిన్యోఽతిచార్వఙ్గ్యో ననృతుర్లాస్యముత్తమమ్ ॥9॥

ఆనందముతో నిండిన ఆ నగరములో అంగసౌష్ఠవము కలిగిన సుందరవిలాసినీస్త్రీలు గీతవాద్యములతో ఉత్తమమైన లాస్యనృత్యమును అభినయించిరి.

రాజా చ ద్విజముఖ్యేభ్యో రత్నాని చ వసూని చ ।
గావో వస్త్రాణ్యలంకారానదదాద్ధృష్టమానసః ॥10॥

రాజు సంతోషముతో నిండిన చిత్తముగలవాడై ముఖ్యులైన బ్రాహ్మణులకు రత్నములు, ధనము, గోవులు, వస్త్రములు, అలంకారములను దానము చేసెను.

తతః స బాలో వవృధే శుక్లపక్షే యథా శశీ ।
పితౄణాం ప్రీతిజనకో జనస్యేష్టశ్చ సోఽభవత్ ॥11॥

అనంతరము ఆ బాలుడు శుక్లపక్షచంద్రునివలే వృద్ధిచెందెను. ఇంకను ఆ బాలుడు తన తండ్రితాతలకు సంతోషమును కలిగించెను, జనులందరికి ప్రీతిపాత్రుడయ్యెను.

ఆచార్యాణాం సకాశాత్స ప్రాగ్వేదాన్ జగృహే మునే ।
తతః శాస్త్రాణ్యశేషాణి ధనుర్వేదం తతః పరమ్ ॥12॥

ఓ మునీ ! ఆ బాలుడు ముందుగా గురువులవద్ద వేదములను గ్రహించెను. అటుపిమ్మట సమస్తశాస్త్రములను, ధనుర్విద్యను నేర్చుకొనెను.

కృతోద్యోగో యదా సోఽభూత్ఖడ్గకార్ముకకర్మణి ।
అన్యేషు చ తథా వీరః శస్త్రేషు విజితశ్రమః ॥13॥

తతోఽస్త్రాణి స జగ్రాహ భార్గవాత్ భృగుసంభవాత్ ।
వినయావనతో విప్ర గురోః ప్రీతిపరాయణః ॥14॥

ఎప్పుడయితే ఖడ్గవిద్య, ధనుర్విద్యలయందు, ఇతరశస్త్రప్రయోగములందు ఆ వీరుడు పారంగతుడై, అలసటను జయించెనో అప్పుడు భృగుపుత్రుడయిన భార్గవునినుండి ఆయుధములను గ్రహించెను. ఓ బ్రాహ్మణుడా ! ఆ వీరుడు వినయస్వభావముగలవాడై గురువులకు ప్రీతిపాత్రుడయ్యెను.

గృహీతాస్త్రః కృతీ వేదే ధనుర్వేదస్య పారగః ।
నిష్ణాతః సర్వవిద్యాసు న బభూవ తతః పరః ॥15॥

అస్త్రములను గ్రహించిన ఆ వీరుడు వేదములందు, ధనుర్విద్యయందు, సమస్తచతుర్దశవిద్యలయందు ప్రవీణుడయ్యెను. ఆ కాలమందు అతడిని మించిన వారెవరూ లేకుండిరి.

విశాలోఽపి సుతావార్తాముపలభ్యాఖిలామిమామ్ ।
హర్షనిర్భరచిత్తోఽభూద్దౌహిత్రస్య చ యోగ్యతామ్ ॥16॥

విశాలరాజుకూడా తన కుమార్తెను గురించిన అన్ని విషయములను తెలుసుకొని, అట్లే తన దౌహిత్రుని యోగ్యతను తెలుసుకొని సంతోషముతో నిండిన చిత్తము గలవాడయ్యెను.

అథ రాజా సుతసుతం దృష్ట్వా ప్రాప్తమనోరథః ।
యజ్ఞానేకాన్నిష్పాద్య దత్త్వా దానాని చార్థినామ్ ॥17॥

కృతశేషక్రియో యుక్తః సవర్ణైర్ధర్మతో మహీమ్ ।
పరిపాల్యారివిజయీ బలబుద్ధిసమన్వితః ॥18॥

స యియాసుర్వనం పుత్రమవిక్షితమభాషత ।
పుత్ర వృద్ధోఽస్మి గచ్ఛామి వనం రాజ్యం గృహాణ మే ॥19॥

కృతకృత్యోఽస్మి నాస్త్యన్యత్కిఞ్చిత్త్వదభిషేచనాత్ ।
సునిష్పన్నమతో రాజ్యం త్వం గృహాణ మయార్పితమ్ ॥20

అటుపిమ్మట కరన్ధమమహారాజు తన పౌత్రుని ముఖమును చూచి సిద్ధించిన మనోరథములుగలవాడై, అనేక యజ్ఞములను ఆచరించి, యాచకులకు దానములొనర్చి, తాను ఆచరించవలసిన మిగిలిన కార్యములన్నింటిని ఒనర్చి, తన తోటి సామంతరాజులతో భూమండలమును పరిపాలించి, శత్రువులనందరినీ జయించి, బలబుద్ధులతోకూడినవాడై, వానప్రస్థాశ్రమమును పొందుటకై వనమునకు వెళ్ళగోరి తన పుత్రుడైన అవీక్షితునితో ఇట్లు పలికెను. "ఓ కుమారా ! నేను వృద్ధుడనయినందున వనమునకు వెళ్ళుచున్నాను. నా యీ రాజ్యమును స్వీకరింపుము. నేను అన్ని విషయములందు కృతార్థుడనైతిని. నీకు రాజ్యపట్టాభిషేకము చేయుటతప్ప నాకు వేరే ఏ ఇతరకార్యమూ మిగలలేదు. అందుచేత నాచే ఇవ్వబడుచున్న ఈ సుసంపన్నమగు రాజ్యమును గ్రహింపుము.

ఇత్యుక్తః పితరం ప్రాహ సోఽవిక్షిన్నృపనన్దనః ।
ప్రశ్రయావనతో భూత్వా యియాసుస్తపసే వనమ్ ॥21॥

ఈ విధముగా తండ్రియగు కరన్ధమమహారాజు పలుకగా, రాజకుమారుడగు అవీక్షిత్తు తాను కూడా వనములకు వెళ్ళు కోరికగలవాడై వినయముగా తండ్రితో ఇట్లు పలికెను.

నాహం తాత కరిష్యామి పృథివ్యాః పరిపాలనమ్ ।
నాపైతి హ్రీర్మే మనసి రాజ్యేఽన్యం త్వం నియోజయ ॥22॥

ఓ తండ్రీ ! నేను భూమండలపరిపాలనమును చేపట్టలేను. ఇప్పటికీ నా మనస్సులో కలిగిన లజ్జాభావము తొలగలేదు. కావున రాజ్యాధికారమందు వేరొకరిని నియమించుము.

తాతేన మోక్షితో బద్ధో న స్వవీర్యాదహం యతః ।
తతః కియత్పౌరుషం మే పురుషైః పాల్యతే మహీ ॥23॥

నేను శత్రువులచే బంధింపబడి తండ్రిచే విడిపింపబడితిని. నా పరాక్రమముతో కాదు. అటులయినప్పుడు నాకు పౌరుషమేమున్నది? పౌరుషముగలవారిచేతనే రాజ్యము పరిపాలింపబడును.

యోఽహం న పాలనాయాలమాత్మనోఽపి వసున్ధరామ్ ।
స కథం పాలయిష్యామి రాజ్యమన్యత్ర విక్షిప ॥24॥

ఎప్పుడయితే నన్ను నేను రక్షించుకొనుటకు సమర్థుడను కాలేకపోతినో అప్పుడు నేను రాజ్యమునెట్లు పరిపాలించగలను? అందుచే వేరెవరికయినను రాజ్యభారమును అప్పగించుము.

స స్త్రీసధర్మా పురుషో యశ్చాన్యేనావదుహ్యతే ।
ఆత్మాఽమోహాత్ భవతా బన్ధనాద్యేన మోక్షితః ॥25॥

సోఽహం కథం భవిష్యామి స్త్రీసధర్మా మహీపతిః ।
స్త్రియః పుమాన్భవేద్భర్తా యః శూరః స మహీపతిః ॥26॥

ఎవరయితే పరులచే పరాభవింపబడునో అట్టి పురుషుడు స్త్రీసమానుడు. స్నేహముతో నీచేత విడిపింపబడిన నేను ఏ విధముగా రాజ్యమును చేపట్టెదను? (అమోహాత్ = స్నేహాత్, స్నేహముతో అని అర్థము). స్త్రీ సమానుడనయిన నేను ఎట్లు మహారాజును కాగలను? ఎవరయితే పరాక్రమవంతుడో అట్టి పురుషుడే స్త్రీకి భర్త (భరించువాడు) కాగలడు. అతడే భూమండలానికి అధిపతి కాగలడు.

పితోవాచ – తండ్రి పలికాడు.

న భిన్న ఏవ పుత్రస్య పితా పుత్రస్తథా పితుః ।
నాన్యేన మోక్షితో వీర యస్త్వం పిత్రా విమోక్షితః ॥

ఓ వీరుడా ! తండ్రి పుత్రుడికంటే వేరు కాదు. అట్లే పుత్రుడు తండ్రికంటే వేరుకాదు. నీ తండ్రిచేత విడిపింపబడిన నీవు పరాయివానిచే విడిపింపబడినట్లు కాదు.

పుత్ర ఉవాచ – పుత్రుడు పలికాడు.

హృదయం నాన్యథా నేతుం మయా శక్యం నరేశ్వర ॥27॥
హృదయే హ్రీర్మమాతీవ యస్త్వహం మోక్షితస్త్వయా ॥28॥

ఓ ప్రభూ ! నేనిప్పుడు నా మనస్సును వేరొకవిధముగా మార్చుకొనలేను. మీ ద్వారా నేను విడిపింపబడుటచే నా హృదయమందు లజ్జాభావము అట్లేయున్నది.

పిత్రోపాత్తాం శ్రియం భుఙ్క్తే పిత్రా కృచ్ఛ్రాత్సముద్ధృతః ।
విజ్ఞాయతే చ యః పిత్రా మానవః సోఽస్తు నో కులే ॥29॥

ఏ పురుషుడు తండ్రి సంపాదించిన సంపదను అనుభవించునో, ఆపదలయందు తండ్రిచే విడిపింపబడునో, తండ్రిపేరుతోనే పరిచితుడగునో అట్టి పుత్రుని జన్మ వంశమందు లేకుండుటయే మంచిది.

స్వయమార్జితవిత్తానాం ఖ్యాతిం స్వయముపేయుషామ్ ।
స్వయం విస్తీర్ణకృచ్ఛ్రాణాం యా గతిః సాఽస్తు మే గతిః ॥30॥

ఏ పురుషుడయితే స్వయముగా ధనమును సంపాదించునో, స్వయముగా కీర్తిని పొందునో మరియు స్వయముగా దుఃఖములనుండి తనను విడిపించుకొనునో అట్టివాని స్థితి ఎట్టిదో అట్టి స్థితి నాకునూ కలుగుగాక!

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

ఇత్యాహ బహుశః పిత్రా యదాప్యుక్త్వాప్యసౌ మునే ।
తదా తస్య సుతం రాజ్యే మరుత్తమకరోన్నృపః ॥31॥

ఓ మునిశ్రేష్ఠుడా ! ఈ విధముగా తండ్రి పలుమారులు ప్రార్థించినప్పటికీ రాజపుత్రుడు అదే సమాధానమునిచ్చెను. అంతట కరంధమమహారాజు ఆ అవీక్షితుని కుమారుడైన మరుత్తుని రాజ్యమునకు రాజుగా చేసెను.

స పిత్రా సమనుజ్ఞాతం రాజ్యం ప్రాప్య పితామహాత్ ।
చకార సమ్యక్ సుహృదామానన్దముపపాదయన్ ॥32॥

మరుత్తుడు తన తండ్రి అంగీకారముతో తాతగారి నుండి రాజ్యమును స్వీకరించి చక్కగా సుహృజ్జనులను ఆనందింపచేయుచు రాజ్యపాలనమును చేసెను.

రాజా కరన్ధమశ్చాపి వీరామాదాయ తాం తథా ।
వనం జగామ తపసే యతవాక్కాయమానసః ॥33॥

రాజైన కరంధముడు కూడా వాక్కు, శరీరము, మనస్సులను స్వాధీనపరచుకొని తన భార్యయగు వీరాదేవిని తీసుకొని వనములకు వెళ్ళెను.

తత్ర వర్షసహస్రం స తపస్తప్త్వా సుదుశ్చరమ్ ।
విహాయ దేహం నృపతిః శక్రస్యాప సలోకతామ్ ॥34॥

అచ్చట కరంధమరాజు వేయి సంవత్సరములు కఠినమైన తపస్సు ఆచరించి, దేహమును విడిచి ఇంద్రలోకమును పొందెను.

సాఽస్య పత్నీ తదా వీరా వర్షాణామపరం శతమ్ ।
తపశ్చచార విప్రర్షే జటిలా మలపఙ్కినీ ॥35॥

సాలోక్యమిచ్ఛతీ భర్తుః స్వర్గతస్య మహాత్మనః ।
ఫలమూలకృతాహారా భార్గవాశ్రమసంశ్రయా ॥
ద్విజాతిపత్నీమధ్యస్థా ద్విజశుశ్రూషణ తత్పరా ॥36॥

ఓ విప్రర్షీ! కరంధమరాజుయొక్క భార్యయగు వీరాదేవి జటలను పెంచుకొని, మాలిన్యముగల శరీరముగలదై, స్వర్గలోకమును పొందిన మహాత్ముడగు తన భర్తయొక్క సాలోక్యమును కోరుచూ, ఫలములు కందమూలములను భుజించుచూ, ద్విజాతిపత్నుల మధ్య ఉండి, ద్విజులను సేవించుటయందు ఆసక్తిగలదై, భార్గవుని ఆశ్రమమందుండి ఇంకనూ నూరు సంవత్సరములు తపస్సు ఆచరించెను.

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే మరుత్తచరితం నామ పఞ్చవింశత్యధికశతతమోఽధ్యాయః ॥125॥

శ్రీ మార్కండేయ మహాపురాణమందలి మరుత్తచరితమను నూటఇరువది అయిదవ అధ్యాయం సమాప్తం.



షడ్వింశత్యధికశతతమోஉధ్యాయః – నూటఇరువదిఆరవ అధ్యాయం
మరుత్తచరితమ్ – మరుత్తుని చరితం

క్రౌష్టుకిరువాచ – క్రౌష్టుకి చెప్పాడు.

భగవన్విస్తరాత్సర్వం మమైతత్కథితం త్వయా ।
కరన్ధమస్య చరితమవిక్షిచ్చరితం చ యత్ ॥1॥

ఓ భగవత్స్వరూపుడా ! మీరు కరంధముని చరితమును, అవీక్షిత్తు చరితమును విస్తారముగా వర్ణించి చెప్పితిరి.

అవిక్షితస్య నృపతేర్మరుత్తస్య మహాత్మనః ।
శ్రోతుమిచ్ఛామి చరితం శ్రూయతే సోஉతి చేష్టితః ॥2॥

చక్రవర్తీ మహాభాగః శూరః కాన్తో మహామతిః ।
ధర్మవిద్ధర్మకృచ్చైవ సమ్యక్పాలయితా భువః ॥3॥

ఇప్పుడు అవీక్షిత్తుయొక్క కుమారుడు, మహాత్ముడూ అయిన మరుత్తమహారాజు చరితమును వినవలెనని కోరుచున్నాను. అతడు మిక్కిలి ఉద్యమస్వభావముగలవాడు, మహానుభావుడు, పరాక్రమవంతుడు, అందమైనవాడు, గొప్ప బుద్ధిమంతుడు, ధర్మమునెరిగినవాడు, ధర్మమునాచరించువాడు, ఈ భూమండలమును చక్కగా పరిపాలించువాడు అని విని యుంటిని.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

స పిత్రా సమనుజ్ఞాతం రాజ్యం ప్రాప్య పితామహాత్ ।
ధర్మతః పాలయామాస పితా పుత్రానివౌరసాన్ ॥4॥

మరుత్తుడు తండ్రి అనుమతిని పొంది, తన తాతగారినుండి రాజ్యమును పొంది తండ్రి తన కన్నబిడ్డలను పాలించునట్లు ధర్మబద్ధముగా ప్రజలను పుత్రసమానులుగా పరిపాలించెను.

ఇయాజ సుబహూన్యజ్ఞాన్యథావత్స్వాప్తదక్షిణాన్ ।
ఋత్విక్పురోహితాదేశాదనిర్విణ్ణో మహీపతిః ॥5॥

ఋత్విక్కులు మరియు పురోహితుల ఆజ్ఞలను శ్రద్ధతో అనుసరించుచు, ఆ భూపతి భూరిదక్షిణలతో యథావిధిగా అనేక యజ్ఞములను ఆచరించెను.

తస్యాప్రతిహతం చక్రమాసీద్ద్వీపేషు సప్తసు ।
గతిశ్చాప్యనవచ్ఛిన్నా స్వఃపాతాలజలాదిషు ॥6॥

సప్తద్వీపములందు అతని రథచక్రమునకు ఎట్టి అడ్డూ లేదు. మరియు స్వర్గలోక, పాతాళ, జలాదులందు అతని గమనము అవిచ్ఛిన్నమైనది.

తతః ప్రాప్య ధనం విప్ర యథావత్స్వక్రియాపరః ।
అయజత్స మహాయజ్ఞైర్దేవానిన్ద్రపురోగమాన్ ॥7॥

ఓ విప్రుడా ! ఆ మరుత్తుడు స్వధర్మాచరణపరాయణుడై, ధనమును సంపాదించి గొప్పయజ్ఞములతో ఇంద్రాదిదేవతలను జయించెను.

ఇతరే చ యథావర్ణాః స్వే స్వే కర్మణ్యతన్ద్రితాః ।
తదుపాత్తధనాశ్చక్రురిష్టాపూర్తాదికాః క్రియాః ॥8॥

ఇతరవర్ణములవారు కూడా తమకు విధింపబడిన కర్మలను ఎట్టి అలసత్వము లేక ఆచరించుచున్నవారై, అట్టి కర్మలవలన ధనమును సంపాదించి ధర్మకార్యములు, నూతులు తవ్వించుట మొ॥లగు కార్యములను నిర్వహించిరి.

పాల్యమానా మహీ తేన మరుత్తేన మహాత్మనా ।
యోఽస్పర్ధత్త్రిదశావాసవాసిభిర్ద్విజసత్తమ ॥9॥

ఓ బ్రాహ్మణశ్రేష్ఠుడా ! మహాత్ముడగు ఆ మరుత్తమహారాజు భూమండలమును పరిపాలించుచు దేవతలతో పోటీపడుచుండెను.

తేనాతిశయితాః సర్వే కేవలం న మహీక్షితః ।
యజ్వినా దేవరాజోఽపి శతయజ్ఞాభిసన్ధినా ॥10॥

మరుత్తుడు ఈ భూమండలమందలి రాజులను మాత్రమేకాక వందల యజ్ఞములను అనుష్ఠించుచు దేవరాజైన ఇంద్రుని కూడా అతిశయించెను.

ఋత్విక్తస్య తు సంవర్తో బభూవాఙ్గిరసః సుతః ।
భ్రాతా బృహస్పతేర్విప్ర మహాత్మా తపసాం నిధిః ॥11॥

ఓ విప్రశ్రేష్ఠుడా ! ఆంగిరసుని కుమారుడు, బృహస్పతి సోదరుడు, తపోనిధి, మహాత్ముడూ అగు సంవర్తుడనువాడు ఆ మరుత్తమహారాజుకు ఋత్విక్కుగా నుండెను.

సౌవర్ణో ముఞ్జవాన్నామ పర్వతః సురసేవితః ।
పాతితం తేన తచ్ఛృఙ్గం కృతే తస్య మహీపతేః ॥12॥

దేవతలు సేవించునట్టి 'ముంజవత్తు' అను పేరుగల సువర్ణమయమైన పర్వతము ఒకటి ఉండెను. సంవర్తుడు ఆ పర్వతశిఖరమును రాజుకొరకు పెరికి తెచ్చి యిచ్చెను.

తేన యస్యాఖిలం యజ్ఞే భూమిభాగాదికం ద్విజ ।
ప్రాసాదాశ్చ కృతాః శుభ్రాస్తపసా సర్వకాఞ్చనాః ॥13॥

ఓ బ్రాహ్మణశ్రేష్ఠుడా ! అంతియేగాక ఆ సంవర్తుడు తన తపోబలముచే యజ్ఞములందలి సమస్తభూభాగములను, రాజప్రాసాదములను పరిశుభ్రములుగను, కాంచనమయములుగను చేసెను.

గాథాశ్చాప్యత్ర గాయన్తి మరుత్తచరితాశ్రయాః ।
సాతత్యేనర్షయః సర్వే కుర్వన్తోఽధ్యయనం యథా ॥14॥

సమస్త ఋషులు నిర్విరామముగా వేదాధ్యయనము చేయునట్లుగా, గాయకులు ఎల్లప్పుడు మరుత్తచరితమును ఆశ్రయముగా చేసుకొని కథలను గానము చేయుచుండిరి.

మరుత్తేన సమో నాభూద్యజమానో మహీతలే ।
సదః సమస్తం యద్యజ్ఞే ప్రాసాదాశ్చైవ కాఞ్చనాః ॥15॥

అమాద్యదిన్ద్రః సోమేన దక్షిణాభిర్ద్విజాతయః ।
విప్రాణాం పరివేష్టారః శక్రాద్యాస్త్రిదశోత్తమాః ॥16॥

యథా యజ్ఞే మరుత్తస్య తృప్తాః సర్వే మహీపతేః ।
సువర్ణమఖిలం త్యక్తం రత్నపూర్ణగృహే ద్విజైః ॥17॥

ప్రాసాదాదిసమస్తం చ సౌవర్ణం తస్య యత్క్రతౌ ।
త్రయో వర్ణా హ్యలభ్యన్త తస్మాత్కేచిత్తథా దదుః ॥18॥

అట్టి మరుత్తునితో సమానుడగు యజ్ఞశీలుడగు మనుష్యుడు ఈ భూమండలమందు జన్మించలేదు. ఆ మరుత్తుడు ఆచరించు యజ్ఞమందలి భవనము, ప్రాసాదములు కాంచననిర్మితములై యున్నవి. ఇంకను ఆ యజ్ఞమందు ఇంద్రుడు సోమపానముతోను, బ్రాహ్మణులు దక్షిణలతోను చేతనమత్తులైయున్నారు. ఇంద్రాదిదేవతలు తాము స్వయముగా బ్రాహ్మణులకు భోజనమును వడ్డించువారైరి. ఆ బ్రాహ్మణులందరు ఆ మరుత్తుని యజ్ఞమందు సంపూర్ణముగా సంతృప్తులైరి. ఆ బ్రాహ్మణుల గృహములు రత్నములచే పూర్ణములైనందున వారు తమవద్ద ఉన్న బంగారమునంతయు విడిచివేసిరి. ఆ మరుత్తుడు ఆచరించు క్రతువునందు ప్రాసాదములన్నియు సువర్ణమయములై ఉన్నవి. బ్రాహ్మణక్షత్రియవైశ్యులు తాము సంపూర్ణదానములను పొందుటచే వారు ఇతరులకు దానము చేయసాగిరి. ఆ మరుత్తునిచే ఇవ్వబడిన సంపదలను పొందిన శిష్టజనులు పూర్ణమనోరథులై, వారు కూడా వేరు వేరు ప్రదేశములందు యజ్ఞములను చేయుచుండిరి.

తేన త్యక్తేన శిష్టా యే జనాః పూర్ణమనోరథాః ।
తేఽపి యజ్ఞాన్యజన్తే స్మ దేశే దేశే పృథక్పృథక్ ॥19॥

శిష్టజనులు పూర్ణమనోరథులై, వారు కూడా వేరు వేరు ప్రదేశములందు యజ్ఞములను చేయుచుండిరి.

తస్యైవం కుర్వతో రాజ్యం సమ్యక్పాలయతః ప్రజాః ।
తపస్వీ కశ్చిదభ్యేత్య తమాహ మునిసత్తమ ॥20॥

ఓ మునిశ్రేష్ఠుడా ! ఆ మరుత్తుడీ విధముగా ప్రజలను చక్కగా పరిపాలించుచూ, రాజ్యపరిపాలనము చేయుచుండగా ఒక తపోధనుడు అచ్చటకు వచ్చి మరుత్తునితో ఇట్లు పలికెను.

పితుర్మాతా తవాహేదం దృష్ట్వా తాపసమణ్డలమ్ ।
విషాభిభూతమురగైర్మదోన్మత్తైర్నరేశ్వర ॥21॥

ఓ నరేశ్వరా ! మదముచే ఉన్మత్తులైన సర్పముల విషముచే పీడింపబడిన తాపసమండలమునుచూచి నీ పితామహి (తండ్రితల్లి) నీతో చెప్పమని నన్ను ఇచ్చటకు పంపినది.

పితామహస్తే స్వర్యాతః సమ్యక్సంపాల్య మేదినీమ్ ।
పితా తవ తథా శక్తో హిత్వా గ్రామం వనం గతః ॥
తపశ్చరణశక్తాఽహమిహ చౌర్వాశ్రమే స్థితా ॥22॥

నీ పితామహుడు (తండ్రియొక్క తండ్రి, తాతగారు) బాగుగా భూమిని పరిపాలించి స్వర్గమునకు వెళ్ళెను. నీ తండ్రికూడా రాజ్యమును వదిలి వనమునకు వెళ్ళెను. నేనిప్పుడు తపస్సునందలి ఆసక్తిచే ఔర్వాశ్రమమందు నివసించుచున్నాను.

సాఽహం పశ్యామి వైకల్యం తవ రాజ్యం ప్రశాసతః ।
పితామహస్య తే నాభూద్యత్పూర్వేషాం చ తే నృప ॥23॥

ఓ రాజా ! నీ తాతగారు లేదా నీ పూర్వీకులు ప్రజాపరిపాలన చేయుసమయమందు నేను చూడనట్టి లోపమును నీ ప్రజాపరిపాలనలో నేను చూచుచున్నాను.

నూనం ప్రమత్తో భోగేషు సక్తో వా విజితేన్ద్రియః ।
చారాన్ధతా యతోఽస్తీయం దుష్టాదుష్టం న వేత్సి యత్ ॥24॥

నీవు నిజముగా భోగలాలసుడవై ఉన్నావు. ఇంద్రియములను నీవు జయించలేదు. నీవు గూఢచారులను నియమించుకోనందున, ఏది మంచిదో ఏది చెడ్డదో నీవు ఎరుగుట లేదు.

పాతాలాదభ్యుపేతైస్తు భుజగైర్దంశశాలిభిః ।
దష్టా మునిసుతాః సప్త దూషితాశ్చ జలాశయాః ॥25॥

స్వేదమూత్రపురీషేణ దూషితం సుశ్రుతం హవిః ।
అపరాధం సముద్దిశ్య దత్తో నాగబలిశ్చిరాత్ ॥26॥

విషపుకోరలు కలిగిన సర్పములు పాతాళమునుండి వచ్చి ఏడుగురు మునికుమారులను కాటు వేసినవి. జలాశయములన్నియు జలపానమునకు అర్హత లేని విధముగా కలుషితములైనవి. విధ్యనుసారము ఇవ్వబడిన హవిస్సులు చెమట, మూత్రము, పురీషములచే దూషితములైనవి. అపరాధము జరిగెనని తెలుసుకొని, చాలాకాలము పిమ్మట ఆ మునులు నాగులను బలి యిచ్చుట ప్రారంభించిరి.

ఏతే సమర్థా మునయో భస్మీకర్తుం భుజఙ్గమాన్ ।
కిన్త్వేషాం నాధికారోఽత్ర త్వమేవాత్రాధికారవాన్ ॥27॥

ఈ మునులందరు సర్పములను భస్మము చేయుటలో సమర్థులే. కాని అట్లు చేయుటలో వారికి అధికారము లేదు. నీవే ఆ కార్యమును చేయుటలో అధికారివి.

తావత్సుఖం భూపతిజైర్భోగజం ప్రాప్యతే నృప ।
అభిషేకజలం యావన్న మూర్ధ్ని వినిపాత్యతే ॥28॥

ఓ రాజా ! రాజపుత్రులు వారి శిరస్సుపై రాజ్యాభిషేకజలము చల్లకుండా ఉన్నంత వరకు మాత్రమే వారు భోగజనిత సుఖములను అనుభవింపగలరు.

కాని మిత్రాణి కః శత్రుర్మమ శత్రోర్బలం కియత్ ।
కోఽహం కే మన్త్రిణః పక్షే కే వా భూపతయో మమ ॥29॥

కియాన్కోశో బలం కిం వా కోఽనురక్తో జనో మమ ।
విరక్తో వా పరైర్భిన్నః పరేషామపి కీదృశః ॥
కః సమ్యగత్ర నగరే విషయే వా జనో మమ ॥30॥

ధర్మకర్మాశ్రయో మూఢః కః సమ్యగపి వర్తతే ।
కో దణ్డ్యః పరిపాల్యః కః కే చోపాక్ష్యా నరా మయా ॥31॥

సామభేదతయా దమ్యా దేశకాలమవేక్షతా ।
చారాంశ్చ చారయేదన్యైరజ్ఞాతాన్భూపతిశ్చరైః ॥32॥

సచివాదిషు సర్వేషు చారాన్దద్యాన్మహీపతిః ।

నాకు స్నేహితులెవరు? శత్రువెవడు? నా శత్రువుల బలమెంత ఉన్నది? నేనెవరు? మంత్రులెవరు? ఏ ఏ రాజులు నా పక్షమందున్నారు? కోశాగారమెంత ఉన్నది? నా బలమెంత ఉన్నది? నాయందు అనురక్తులైన జనులు ఎవరున్నారు? విరక్తులైన వారెవరు ఉన్నారు? శత్రువులచే తిరస్కరింపబడిన వారెవరున్నారు? శత్రువులపట్ల ఏ విధమైన ప్రవృత్తి కలిగి ఉన్నారు? నగరమందు లేదా రాజ్యమందు నా జనులెవరు మంచి ప్రవర్తన కలిగియున్నారు? ధర్మకర్మపరాయణులై, వాటియందు మాత్రమే మూఢస్వభావము కలిగి ఎవరున్నారు? దండింపతగినవారెవరు? రక్షింపతగినవారెవరు? ఉపేక్షింపతగినవారెవరు? సామభేదోపాయములచే శిక్షింపతగినవారెవరు? ఇట్టి వృత్తాంతములన్నియు ఎవ్వరూ ఎరుగని గూఢచారులవలన తెలుసుకొనవలెను. మంత్రుల స్వభావమును తెలుసుకొనుటకై వారిపట్ల గూడ గూఢచారులను నియమించవలెను.

ఇత్యాదౌ భూపతిర్నిత్యం కర్మణ్యాసక్తమానసః ॥33॥

నయేద్దినం తథా రాత్రిం న తు భోగపరాయణః ।
రాజ్ఞాం శరీరగ్రహణం న భోగాయ మహీపతే ॥34॥

ఈ చెప్పబడిన విషయములన్నింటియందు రాజు ఎల్లప్పుడు ఆసక్తచిత్తుడై రాత్రింబవళ్ళు గడుపవలెనే కాని, భోగలాలసుడై కాదు. ఓ రాజా ! రాజులు దేహమును ధరించుట భోగముకొరకు కాదు.

క్లేశాయ మహతే పృథ్వీం స్వధర్మపరిపాలనే ।
సమ్యక్పాలయతః పృథ్వీం స్వధర్మం చ మహీపతే ॥35॥

ఇహ క్లేశో మహాన్స్వర్గే పరమం సుఖమక్షయమ్ ।
తదేతదవబుధ్యస్వ హిత్వా భోగాన్నరేశ్వర ॥36॥

పాలనాయ క్షితేః క్లేశమఙ్గీకర్తుమిహార్హసి ।

ఓ రాజా ! ఈ భూమండలమును బాగుగా పరిపాలించుచు, స్వధర్మమును పరిపాలించుచు ఉన్న కారణముగా గొప్ప క్లేశములను కూడా రాజు అనుభవించవలసియుండును. ఈ జన్మయందు మిక్కిలి క్లేశములను అనుభవించినప్పటికీ, రాబోవు జన్మమందు స్వర్గలోకమును పొంది రాజు గొప్ప సుఖమును అనుభవించును. కాబట్టి ఓ నరేశ్వరా ! భోగములను విడిచిపెట్టి ఈ విషయములను ఎరుగుము. భూమండలమును పరిపాలించుటకై క్లేశములను అనుభవించుట నీకు తగును.

ఇతివృత్తమృషీణాం యద్వ్యసనం త్వయి శాసతి ॥37॥
భుజఙ్గహేతుకం భూప చారాన్ధో నాపి వేత్సి తత్ ।

నీవు రాజ్యపరిపాలనము చేయుచుండగా ఋషులకు నాగులవలన ఎట్టి కష్టము సంభవించినదో దానిని నీవు గూఢచారులను నియమింపకపోవుటచే ఎరుగలేకపోతివి.

బహునాత్ర కిముక్తేన దుష్టే దణ్డో నిపాత్యతామ్ ॥38॥

శిష్టాన్పాలయ రాజంస్త్వం ధర్మషడ్భాగమాప్స్యసి ।
అరక్షన్పాపమఖిలం దుష్టైరవినయాత్కృతమ్ ॥39॥

సమవాప్స్యస్యసన్దిగ్ధం యదిచ్ఛసి కురుష్వ తత్ ॥

ఇంకను అధికముగా చెప్పుటెందులకు? ఓ రాజా! నీవు దుష్టులను శిక్షించి శిష్టులను రక్షించుము. దీనివలన ధర్మఫలముయొక్క ఆరవభాగము నీకు సంప్రాప్తించును. దుర్గార్గులు గర్వముతో ఇట్టి పాపకార్యములను చేయునపుడు నీవు వారిని శిక్షించక, శిష్టులను రక్షించకపోయినచో, నిస్సందేహముగా నీవు పాపముననుభవించెదవు. ఇప్పుడు ఏది కర్తవ్యమో దానిని విచారించి చేయుము.

ఏతన్మయోక్తం సకలం యత్తవాహం పితామహీ ॥
కురుష్వైవం స్థితే యత్నే రోచతే వసుధాధిప ॥40॥

నేను నీకు పితామహురాలనుగాన నీకిదంతయు చెప్పితిని. ఓ మహారాజా ! ఈ సమయమందు నీకేది ఉచితమని తోచునో దానిని ఆచరింపుము.

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే మరుత్తచరితవర్ణనం నామ షడ్వింశత్యధికశతతమోఽధ్యాయః ॥126॥

శ్రీ మార్కండేయ మహాపురాణమందలి మరుత్తచరితవర్ణనము నూటఇరువదియారవ అధ్యాయం సమాప్తం.

సప్తవింశత్యధికశతతమోఽధ్యాయః - నూటఇరువదిఏడవ అధ్యాయం
మరుత్తచరితమ్ - మరుత్తుని చరితం

మార్కండేయ ఉవాచ - మార్కండేయుడు చెప్పాడు.

ఇతి తాపసవాక్యం స శ్రుత్వా లజ్జాపరో నృపః ।
ధిఙ్మాం చారాన్ధమిత్యుక్త్వా నిశ్శ్వస్య జగృహే ధనుః ॥1॥

తాపసుని మాటలను విని ఆ మరుత్తుడు సిగ్గుపడి, గూఢచారులను నియమించుకొని నేను నిందింపతగినవాడను అని పలికి దీర్ఘముగా నిట్టూర్చి ధనుస్సును చేతబూనెను.

తతః స త్వరితం గత్వా తమౌర్వస్యాశ్రమం ప్రతి ।
వవన్దే శిరసా వీరాం మాతరం పితురాత్మనః ॥2॥

అంతట మరుత్తుడు మిక్కిలి వేగముగా ఔర్వాశ్రమమునకు వెళ్ళి, తనతండ్రి తల్లి అయిన ఆ వీరురాలికి నమస్కరించెను.

తాపసాంశ్చ యథాన్యాయం తైశ్చాశీర్భిరభిష్టుతః ।
దృష్ట్వా చ తాపసాన్సప్త నాగైర్దష్టాన్ మృతాన్భువి ॥3॥

నినిన్దాత్మానమసకృత్పురస్తేషాం మహీపతిః ।
ఉవాచ చైతదద్యాహం మద్వీర్యమవమన్యతామ్ ॥4॥

యత్కరోమి భుజఙ్గానాం దుష్టానాం బ్రాహ్మణద్విషామ్ ।
తత్పశ్యతు జగత్సర్వం సదేవాసురమానుషమ్ ॥5॥

అలాగే తాపసులకందరికీ యథావిధిగా నమస్కరించెను. వారు కూడా అతనిని బాగుగా ఆశీర్వచనములతో స్తుతించిరి. పిమ్మట రాజు పాముకాటుచే భూమిపై మరణించి పడియున్న తాపసులను చూచి వారిముందే తనను తాను మాటిమాటికీ నిందించుకొనెను. మరియు రాజు తాపసులతో ఇట్లు పలికెను. ఈ దుష్టసర్పములు నా బలమును తిరస్కరించి బ్రాహ్మణులను ద్వేషించుచున్నవి. ఆ సర్పములకు నేనిప్పుడు ఏ గతిని పట్టించెదనో దానిని దేవరాక్షసమనుష్యులతో సహా ఈ జగత్తంతయు చూచునుగాక !

మార్కండేయ ఉవాచ - మార్కండేయుడు చెప్పాడు.

ఇత్యుక్త్వా జగృహే కోపాదస్త్రం సంవర్తకం నృపః ।
నాశాయాశేషనాగానాం పాతాలోర్వీవిచారిణామ్ ॥6॥

మరుత్తమహారాజు ఈ విధముగా పలికి, భూలోకపాతాళలోకములలో సంచరించుచున్న సమస్తసర్పములను నాశనం చేయాలి అనే కోపముతో సంవర్తకమను అస్త్రమును చేతబూనెను.

తతో జజ్వాల సహసా నాగలోకః సమన్తతః ।
మహాస్త్రతేజసా విప్ర దహ్యమానోఽనివారితః ॥7॥

ఓ బ్రాహ్మణుడా ! ఆ మహాస్త్రముయొక్క తేజస్సువలన నాగలోకమంతయు అగ్నులతో జ్వలించెను. ఆ నాగలోకమంతయు ఎట్టి అడ్డూ లేకుండా దహించసాగెను.

హా హా తాతేతి హా మాతర్హా హా వత్సేతి సంభ్రమే ।
తస్మిన్నస్త్రకృతే వాచః పన్నగానామథాభవన్ ॥8॥

ఆ మహాస్త్రప్రయోగమువలన సర్పములు "హా తండ్రీ ! హా తల్లీ ! హా వత్సా !" అనువిధముగా భయముతో ఆర్తనాదములు చేయసాగెను.

కేచిజ్జ్వలద్భిః పుచ్ఛాగ్రైః ఫణైరన్యే భుజఙ్గమాః ।
అగృహీతపుత్రదారాశ్చ త్యక్తాభరణవాససః ॥9॥

పాతాలముత్సృజ్య యయుః శరణం భామినీం తదా ।
మరుత్తమాతరం పూర్వం యయా దత్తం తదాఽభయమ్ ॥10॥

కొన్ని సర్పములు మండుచున్న తోకల అగ్రభాగములు కలిగి, మరికొన్ని సర్పములు మండుచున్న పడగలు కలిగి, భార్యాబిడ్డలను వదిలి, వస్త్రాభరణములను వదిలి పాతాళలోకమును విడిచిపెట్టెను. అట్లు విడిచి మరుత్తుని తల్లియగు భామినిని ఆ సర్పములు ఆశ్రయించెను. ఎందుకనగా పూర్వము ఆమె వారికి అభయప్రదానము చేసియుండెను.

తాముపేత్యోరగాః సర్వే సప్రణామం భయాతురాః ।
సగద్గదమిదం ప్రోచుః స్మర్యతాం నః పురోదితమ్ ॥11॥

భయముతో నిండిన ఆ సర్పములు ప్రణామపురస్సరముగా భామినిని చేరి గద్గదస్వరముతో ఇట్లు పలికెను. నీవు పూర్వము మాకిచ్చిన మాటను ఒకసారి గుర్తు చేసుకొనుము.

ప్రణమ్యాభ్యర్థితం పూర్వం యదస్మాభిః రసాతలే ।
తస్య కాలోఽయమాయాతస్త్రాహి వీరప్రజాయిని ॥12॥

ఓ వీరమాతా ! పూర్వము మేము పాతాళలోకమందు నమస్కరించి నిన్ను మేము ఒక విషయమును అభ్యర్థించితిమి. దానికి తగిన సమయమిప్పుడు ఉపస్థితమైనది. మమ్ములను రక్షించుము.

పుత్రో నివర్తతాం రాజ్ఞి ప్రాణైః సంయోజ్యమస్తు నః ।
దహ్యతే సకలో లోకో నాగానామస్త్రవహ్నినా ॥13॥

ఓ రాజ్ఞీ ! నీవు నీ కుమారుని వెనుకకు మరలించి మాకు ప్రాణదానము చేయుము. సర్పముల లోకమైన పాతాళలోకమంతయు నీ పుత్రుని అస్త్రాగ్నిచే దహింపబడుచున్నది.

ఏవం సందహ్యమానానామస్మాకం తనయేన తే ।
త్వామృతే శరణం నాన్యత్కృపాం కురు యశస్విని ॥14॥

ఓ యశస్వినీ ! నీ కుమారునివలన దహించివేయబడుచున్న మాకు నీవు తప్ప మరొకరు రక్షించువారు లేరు. మాయందు దయజూపుము.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

ఇతి శ్రుత్వా వచస్తేషాం సంస్మృత్యాదౌ చ భాషితమ్ ।
భర్తారమాహ సా సాధ్వీ స సంభ్రమమిదం వచః ॥15॥

సాధుస్త్రీయగు ఆ భామిని ఆ సర్పములు పలికిన మాటలను విని, పూర్వము తానిచ్చిన అభయవాక్యములను స్మరించుకొని భర్తతో సంభ్రమముతో (త్వరగా వెనువెంటనే) ఇట్లు పలికెను.

పూర్వమేవ తవాఖ్యాతం పాతాలే యుద్ధజఙ్గమైః ।
ప్రోక్తమభ్యర్థనాపూర్వం మమాసీత్తనయం ప్రతి ॥16॥

పాతాళలోకమందు యుద్ధతత్పరులై ఉన్న నాగులు అభ్యర్థనాపూర్వకముగా మన కుమారుని గురించి పూర్వము ఏమి పలికినవో దానిని మీకు నేను చెప్పియుంటిని.

త ఇమేఽభ్యాగతా భీతా దహ్యన్తే తస్య తేజసా ।
మామేతే శరణం పూర్వం దత్తమేభ్యోఽభయమ్ ॥17॥

ఆ నాగులే ఇప్పుడు కుమారుని తేజస్సుచే దహించివేయబడుచున్నవి. అందువలన అవి నన్ను శరణుజొచ్చినవి. వీటికి పూర్వమే నేను అభయమునిచ్చితిని.

యే మాం శరణమాపన్నాస్తే త్వాం శరణమాగతాః ।
అపృథగ్ధర్మచరణా యాతాహం శరణం తవ ॥18॥

నన్ను శరణుజొచ్చిన వీరు మీకు కూడా శరణాగతులై యున్నారు. నేను నీకంటే వేరుగా ధర్మాచరణ కలిగినదానను కాను. అందువలన మిమ్ము నేను శరణు పొందినాను.

తన్నివారయ పుత్రం త్వం మరుతం వచనాత్తవ ।
మయా చాభ్యర్థితోఽవశ్యం శమమభ్యుపయాస్యతి ॥19॥

అందువలన మీరు పుత్రుడగు మరుత్తుని మీ మాటతో నివారింపుడు. నేను అభ్యర్థించినాను అంటే నా కుమారుడు తప్పక శాంతించగలడు.

రాజోవాచ – రాజు పలికాడు.

మహాపరాధే నియతం మరుత్తః క్రోధమాగతః ।
దుర్నివర్త్యమహం మన్యే తస్య క్రోధం సుతస్య తే ॥20॥

ఈ నాగదేవతలు తప్పనిసరిగా గొప్ప అపరాధమును చేసియున్నందున మరుత్తునికి క్రోధము వచ్చినది. అతడి కోపమును నివారించుట సాధ్యము కాదని తలచెదను.

నాగా ఊచుః – నాగులు పలికినవి.

శరణాగతాస్తవ వయం ప్రసాదః క్రియతాం నృప ।
క్షత్రస్యార్తపరిత్రాణనిమిత్తం శస్త్రధారణమ్ ॥21॥

ఓ రాజా ! మేము మిమ్ములను శరణుజొచ్చినాము. మమ్ములను అనుగ్రహింపుము. దుఃఖములలో ఉన్నవారిని రక్షించుటకొరకే క్షత్రియులు శస్త్రములను ధరించెదరు.

మార్కండేయ ఉవాచ :– మార్కండేయుడు పలికాడు.

నాగానాం తద్వచః శ్రుత్వా భూతానాం శరణైషిణామ్ ।
తయా చాభ్యర్థితః పత్న్యా ప్రాహావీక్షిన్మహాయశాః ॥22॥

గొప్ప కీర్తిమంతుడైన అవీక్షిత్తు శరణార్థులగు నాగుల మాటలను విని మరియు భార్యచే అభ్యర్థింపబడినవాడై ఇట్లు పలికెను.

గత్వా బ్రవీమి తం భద్రే తనయం త్వరయా తవ ।
పరిత్రాణాయ నాగానాం న త్యాజ్యాః శరణాగతాః ॥23॥

ఓ కల్యాణీ ! నేనిప్పుడే నీ పుత్రుని సమీపమునకు వెళ్ళి, నాగులను రక్షించమని, శరణాగతులను విడిచిపెట్టుట ఉచితముగాదని అతనితో చెప్పెదను.

నోపసంహరతే సోఽస్త్రం యది మద్వచనాన్నృపః ।
తదాస్త్రైర్వారయిష్యామి తస్యాస్త్రం తనయస్య తే ॥24॥

ఒకవేళ నీ పుత్రుడు నా మాటప్రకారము అస్త్రమును ఉపసంహరించనిచో అప్పుడు నేను అతడి అస్త్రమును నా అస్త్రములచే వారించెదను.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు పలికాడు.

తతో గృహీత్వా స ధనురవిక్షిత్క్షత్రియోత్తమః ।
భార్యయా సహితః ప్రాయాత్త్వరావాన్భార్గవాశ్రమమ్ ॥25॥

పిమ్మట క్షత్రియశ్రేష్ఠుడగు అవీక్షిత్తు ధనుర్బాణములను గ్రహించి భార్యాసమేతుడై భార్గవాశ్రమమును గూర్చి వెళ్ళెను.

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే మరుత్తచరితవర్ణనంనామ సప్తవింశత్యధికశతతమోఽధ్యాయః ॥127॥

శ్రీ మార్కండేయ మహాపురాణమందలి మరుత్తచరితవర్ణనమను నూటఇరువదిఏడవ అధ్యాయం సమాప్తం.



అష్టావింశత్యధికశతతమోఽధ్యాయః - నూటఇరువదిఎనిమిదవ అధ్యాయం
మరుత్తచరితమ్ - మరుత్తుని చరితం

మార్కండేయ ఉవాచ - మార్కండేయుడు చెప్పాడు.

స తు తత్ర సుతం దృష్ట్వా గృహీతవరకార్ముకమ్ ।
ధనుః శస్త్రం చ తస్యోగ్రం జ్వాలావ్యాప్తదిగన్తరమ్ ॥1॥

ఉద్గిరన్తం మహావహ్నిం దీపితాఖిలభూతలమ్ ।
పాతాలాన్తర్గతం ప్రాప్తమసహ్యం ఘోరభీషణమ్ ॥2॥

స తం దృష్ట్వా మహీపాలం భృకుటీకుటిలాననమ్ ।
మా క్రుధస్త్వం మరుత్తాస్త్రముపసంహ్రియతామితి ॥3॥

ప్రాహాసకృచ్చానులుప్తవర్ణక్రమముదారధీః ।

అవీక్షిత్తు అచ్చటకు చేరుకొని ధనుర్ధారియై శస్త్రమును సంధించియున్న తన కుమారుడగు మరుత్తుని చూచెను. అతడి చేతిలోఉన్న భయంకరమైన శస్త్రము అగ్నిజ్వాలలతో అన్ని దిక్కుల చివరిభాగములవరకు వ్యాపించియుండెను. అతడి అస్త్రమునుండి బయటకు వెలువడుచున్న గొప్ప అగ్ని భూమండలమంతటినీ ప్రకాశవంతము చేసెను. సహింపశక్యముగానిది, మిక్కిలి భయంకరమైనదీ అయిన ఆ అస్త్రాగ్ని పాతాళలోకమువరకు వ్యాపించి ఉండెను. కనుబొమలు ముడివడి క్రోధముతో నిండిన ముఖముగల మరుత్తుని చూచి అవీక్షిత్తు ఇట్లు పలికెను. "ఓ మరుత్తా! నీవు కోపగించవలదు. అస్త్రమును ఉపసంహరించుము. అని ఉదారబుద్ధికలిగిన అవీక్షిత్తు పలుమారులు వర్ణక్రమలోపము కలిగిన మాటలతో మరుత్తునితో పలికెను.

స నిశమ్య గురోర్వాక్యం దృష్ట్వా తం చ పునః పునః ॥4॥

గృహీతకార్ముకః పిత్రోః ప్రణిపత్య సగౌరవమ్ ।
ప్రత్యువాచాపరుద్ధా మే సుభృశం పన్నగాః పితః ॥5॥

మరుత్తుడు మాటిమాటికీ తండ్రిని చూచుచూ, తండ్రి పలికిన మాటలను విని ధనుర్బాణములను చేతనుంచుకొనియే గౌరవముతో తన తల్లిదండ్రులకు నమస్కరించి ఇట్లు బదులు పలికెను. "ఓ తండ్రీ ! ఈ నాగులు నాపట్ల అపరాధము చేసినవారు.

శాసతీమాం మయి మహీం పరిభూయ బలం మమ ।
సప్తాశ్రమముపగమ్య దష్టా మునికుమారకాః ॥6॥

నేను ఈ భూమండలమును పరిపాలించుచుండగా, నా బలమును లెక్కచేయక సర్పములు ఈ ఆశ్రమమందు ప్రవేశించి ఏడుగురు మునికుమారులను కాటువేసినవి.

ఋషీణామాశ్రమస్థానామమీషామవనీపతే ।
మయి శాసతి దుర్వృత్తైర్దూషితాని హవీంషి చ ॥7॥

ఓ మహారాజా ! నేను రాజ్యపరిపాలనము చేయుచుండగా దుష్టమైన ఆచారము కలిగిన ఈ సర్పములు ఈ ఆశ్రమమందు నివసించుచున్న ఋషుల హోమద్రవ్యములను కలుషితము చేసినవి.

జలాశయాస్తథాప్యేతైః సర్వ ఏవ హి దూషితాః ।
తదేతత్కారణం కిఞ్చిన్న వ్యక్తవ్యం త్వయా పితః ॥
న నివారయితవ్యోఽహం బ్రహ్మఘ్నాన్ప్రతి పన్నగాన్ ॥8॥

ఓ తండ్రీ ! ఈ పన్నగములు సమస్త జలాశయములనుగూడ కలుషితము చేసినవి. నేను సర్పములను వధించుటలో కారణమిదియే. ఈ విషయములో మీరు ఏమి చెప్పవలదు. బ్రాహ్మణహంతకులగు ఈ సర్పములను వధించుటనుండి నన్ను నివారించవలదు.

అవిక్షిదువాచ – అవీక్షిత్తు పలికెను.

యద్యేభిర్నిహతా విప్రా యాస్యన్తి నరకం మృతాః ।
మమైతత్క్రియతాం వాక్యం విరమాస్త్రప్రయోగతః ॥9॥

ఈ సర్పములు బ్రాహ్మణులను వధించినయెడల వీరు మరణించిన పిమ్మట నరకమును పొందగలవు. నీవు అస్త్రప్రయోగమును విరమించి నా పలుకులను గౌరవించుము.

మరుత్త ఉవాచ – మరుత్తుడు పలికాడు.

నాహమేషాం క్షమిష్యామి దుష్టానామపరాధినామ్ ।
అహమేవ గమిష్యామి నరకం యది పాపినామ్ ॥
న నిగ్రహే యతామ్యేషాం మాం నివారయ మా పితః ॥10॥

నేనీ దుష్టులగు అపరాధులను క్షమించను. నేనీ పాపులను దండించనిచో నేనే నరకమునకు పోయెదను. అందుచే ఓ తండ్రీ ! నన్ను వారింపవలదు.

అవిక్షిదువాచ – అవీక్షిత్తు పలికెను.

మామేతే శరణం ప్రాప్తాః పన్నగా మమ గౌరవాత్ ।
ఉపసంహ్రియతామస్త్రమలం కోపేన తే నృప ॥11॥

ఓ రాజా ! ఈ నాగులు నన్ను శరణు పొందినవి. నాయందలి గౌరవముతో నీ అస్త్రమును ఉపసంహరించుము. కోపమిక చాలును.

మరుత్త ఉవాచ – మరుత్తుడు పలికాడు.

నాహమేషాం క్షమిష్యామి దుష్టానామపరాధినామ్ ।
స్వధర్మముల్లంఘ్య కథం కరిష్యామి వచస్తవ ॥12॥

దుష్టులగు ఈ అపరాధులను నేను క్షమించను. స్వధర్మమును వదిలిపెట్టి నేనెట్లు మీ మాటను పాలించగలను?

దణ్డ్యే నిపాతయన్దణ్డం భూపః శిష్టాంశ్చ పాలయన్ ।
పుణ్యలోకానవాప్నోతి నరకాంశ్చాప్యుపేక్షణాత్ ॥13॥

దండింపతగినవారిని దండించుచు, శిష్టులను రక్షించుచూ ప్రవర్తించు రాజు పుణ్యలోకములను పొందగలడు. ఆ రెండు కార్యములను ఉపేక్షించినచో నరకలోకములను పొందగలడు.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

ఏవం స బహుశః పిత్రా వార్యమాణోఽమ్బయా సహ ।
నోపసంహరతే సోఽస్త్రం తతోఽసౌ పునరబ్రవీత్ ॥14॥

తల్లితోబాటుగా తండ్రి ఇట్లు మాటిమాటికీ వారించినప్పటికీ, పుత్రుడగు మరుత్తుడు తన అస్త్రమును ఉపసంహరించలేదు. అప్పుడు తిరిగి తండ్రి పుత్రునితో ఇట్లనెను.

హింససే పన్నగాన్భీతాన్మమైతాన్ శరణం గతాన్ ।
వార్యమాణోఽపి తస్మాత్తే కరిష్యామి ప్రతిక్రియామ్ ॥15॥

భయమును పొందిన నాగులు నన్ను శరణుజొచ్చినవి. అట్టివానిని నేనెంత వారించిననూ నీవు హింసించుచున్నావు. కావున ఇందుకు తగిన ప్రతిక్రియను చేసెదను.

మయాప్యస్త్రాణ్యవాప్తాని న త్వమేకోఽస్త్రవిద్భువి ।
మమాగ్రతః సుదుర్వృత్త పౌరుషం చ కియత్తవ ॥16॥

ఓ చెడ్డప్రవర్తనగలవాడా ! నేను కూడా చాలా అస్త్రములను పొందితిని. ఈ భూమిమీద నీవొక్కడివే అస్త్రవేత్తవు గాదు. నాముందు నీ పౌరుషమెంత?

తతః కార్ముకమారోప్య కోపతామ్రవిలోచనః ।
అవిక్షిదస్త్రం జగ్రాహ కాలస్య మునిపుఙ్గవ ॥17॥

ఓ మునిశ్రేష్ఠుడా ! కోపముతో ఎర్రబడిన కన్నులుగలవాడై అవీక్షిత్తు వింటిపై త్రాడును బిగించి కాలాస్త్రము గ్రహించెను.

తతో జ్వాలాపరీవారమరిసంఘఘ్నముత్తమమ్ ।
కాలాస్త్రం తు మహావీర్యం యోజయామాస కార్ముకే ॥18॥

పిమ్మట జ్వాలలతో చుట్టబడినది, శత్రుసమూహమును సంహరించునదియు, ఉత్తమమైనది, గొప్ప వీర్యవంతమూ అయిన కాలాస్త్రమును ధనుస్సుపై ఎక్కుపెట్టెను.

తతశ్చుక్షోభ జగతీ సంవర్తాస్త్రప్రతాపితా ।
సాబ్ధిశైలాఖిలా విప్ర కాలస్యాస్త్రే సముద్యతే ॥19॥

ఓ బ్రాహ్మణుడా ! ఈ కాలాస్త్రమును ప్రయోగించుటకు ఉద్యమించిన సమయమందు మరుత్తుని సంవర్తకాస్త్రముచే తపించినట్టి సముద్రపర్వతములతో కూడుకొన్న సంపూర్ణజగత్తు క్షోభించినది.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

కాలాస్త్రముద్యతం పిత్రా మరుత్తః సోఽపి వీక్ష్య తత్ ।
ప్రాహోచ్చైరస్త్రమేతన్మే దుష్టశాస్తిసముద్యతమ్ ॥20॥

న త్వద్వధాయ కాలాస్త్రం మయి ముఞ్చతి కిం భవాన్ ।
స్వధర్మచారిణి సుతే సదైవాజ్ఞాకరే తవ ॥21॥

మరుత్తుడు కూడా తన తండ్రి ఎక్కుపెట్టిన కాలాస్త్రమును చూచి హెచ్చుస్వరముతో ఇట్లు పలికెను. "నా యొక్క ఈ సంవర్తకాస్త్రము దుష్టులను శిక్షించుటకు ఎక్కుపెట్టబడినది. అంతేగాని నిన్ను వధించుటకుగాదు. అయినను స్వధర్మమును అనుసరించుచు ఎల్లప్పుడు మీ ఆజ్ఞను పరిపాలించు పుత్రనియెడల ఎందువలన మీరు కాలాస్త్రమును ప్రయోగించుచున్నారు?

మయా కార్యం మహాభాగ ప్రజానాం పరిపాలనమ్ ।
త్వయైవం క్రియతే కస్మాన్మద్వధాయాస్త్రముద్యతమ్ ॥22॥

ఓ మహానుభావుడా ! నేను ప్రజలను పరిపాలించుటయను కార్యమును నిర్వర్తించవలసియున్నది. అందువలన మీరు ఏ కారణముచే నన్ను చంపుటకు ఈ విధముగా అస్త్రమును విడుచుచున్నారు?

అవిక్షిదువాచ – అవీక్షిత్తు పలికెను.

శరణాగతసంత్రాణం కర్తుం వ్యవసితా వయమ్ ।
తస్య వ్యాఘాతకర్తా త్వం న మే జీవన్విమోక్ష్యసే ॥23॥

నేను శరణాగతపురుషులను రక్షింపవలెనని సంకల్పించినాను. అట్టి కార్యమునకు నీవు విఘ్నమును కలిగించుచున్నావు. నిన్ను ప్రాణములతో విడిచిపెట్టను.

మాం వా హత్వాస్త్రవీర్యేణ జహి దుష్టాన్మహోరగాన్ ।
త్వాం వా హత్వాఽహమస్త్రేణ రక్షిష్యామి మహోరగాన్ ॥24॥

నీ అస్త్రబలముతో నన్ను చంపిన పిమ్మట దుష్టులైన మహానాగులను సంహరించుము. లేదా నిన్ను నేను అస్త్రముతో చంపి గొప్ప నాగులను రక్షించెదను.

ధిక్తస్య జీవితం పుంసః శరణార్థినమాగతమ్ ।
యో నార్తమనుగృహ్ణాతి వైరిపక్షమపి ధ్రువమ్ ॥25॥

శత్రుపక్షమువారైననూ ఆర్తులై శరణు కోరినయెడల వారిని ఏ మనుష్యుడు రక్షించడో అతని జీవితము వ్యర్థము. ఇది నిశ్చయము.

క్షత్రియోఽహమిమే భీతాః శరణం మాముపాగతాః ।
అపకర్తా త్వమేవైషాం కథం వధ్యో న మే భవాన్ ॥26॥

నేను క్షత్రియుడను. భీతావహులై ఈ సర్పములు నన్ను శరణుబొందినవి. నీవు వీటికి అపకారము చేయుచున్నావు. అట్టి నీవు నాచే వధింపబడుటకు ఎందులకు యోగ్యుడవు కావు?

మరుత్త ఉవాచ – మరుత్తుడు చెప్పాడు.

మిత్రం వా బాన్ధవో వాఽపి పితా వా యది వా గురుః ।
ప్రజాపాలనవిఘ్నాయ యో హన్తవ్యః స భూభృతా ॥27॥

స్నేహితులు, బంధుజనులు, తండ్రి లేదా గురువు ఎవరు ప్రజాపాలనయందు విఘ్నము కలిగించెదరో వారెవరయినను రాజుచేత వధింపబడుటకు అర్హులు.

సోఽహం తే ప్రహరిష్యామి న క్రోద్ధవ్యం త్వయా పితః ।
స్వధర్మః పరిపాల్యో మే న మే క్రోధస్తవోపరి ॥28॥

ఈ కారణముచేతనే ఓ తండ్రీ ! నేను మిమ్ములను సంహరించెదను. నాపై కోపగించవలదు. స్వధర్మము నాచే పరిపాలించదగినది. నాకు మీపై కోపము లేదు.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

తతస్తౌ నిశ్చితౌ దృష్ట్వా పరస్పరవధం ప్రతి ।
సముత్పత్యాన్తరే తస్థుర్మునయో భార్గవాదయః ॥29॥

ఇట్లు తండ్రీకొడుకులు పరస్పరము సంహరించుకొనుటకు కృతనిశ్చయులగుటజూచి భార్గవాదిమునులు వెంటనే అచ్చటకు వచ్చి వారిద్దరి మధ్యన నిలిచిరి.

ఊచుశ్చైనం న మోక్తవ్యం త్వయాఽస్త్రం పితరం ప్రతి ।
త్వయా చ నాయం హన్తవ్యః పుత్రః ప్రఖ్యాతచేష్టితః ॥30॥

ఆ మునులు మరుత్తునితో "నీ తండ్రిపై అస్త్రమును ప్రయోగించరాదు" అని పలికిరి. అట్లే అవీక్షిత్తుతో "ప్రఖ్యాతమైన ధర్మకార్యములాచరించు నీ కుమారుని చంపరాదు" అని పలికిరి.

మరుత్త ఉవాచ – మరుత్తుడు పలికాడు.

మయా దుష్టా నిహన్తవ్యాః సన్తో రక్ష్యా మహీక్షితా ।
ఇమే చ దుష్టా భుజగాః కోఽపరాధోఽత్ర మే ద్విజాః ॥31॥

ఓ బ్రాహ్మణులారా ! నేను ప్రజాపరిపాలకుడనైయుండగా దుష్టులను సంహరించవలెను, సజ్జనులను రక్షించవలెను. ఈ సర్పములు దుష్టప్రవర్తన కలిగినవారు. వీరిని సంహరించుటలో నా తప్పు ఏమున్నది?

అవీక్షిదువాచ – అవీక్షిత్తు పలికాడు.

శరణాగతసన్త్రాణం మయా కార్యమయం చ మే ।
అపరాధ్యః సుతో విప్రా యో హన్తి శరణాగతాన్ ॥32॥

ఓ బ్రాహ్మణులారా ! శరణన్నవారిని రక్షించుట నా కర్తవ్యము. ఈ నా పుత్రుడు శరణాగతులను వధించుచున్న కారణముచే నాచేత వధింపతగినవాడు.

ఋషయ ఊచుః – ఋషులు పలికారు.

ఇమే వదన్తి భుజగాస్త్రాసలోలవిలోచనాః ।
సంజీవయామస్తాన్విప్రాన్యే దష్టా దుష్టపన్నగైః ॥33॥

భయముచే చంచలనేత్రములుగల ఈ నాగులు "దుష్టనాగులచే కాటువేయబడిన మునులను తిరిగి బ్రతికించెద"మని చెప్పుచున్నారు.

తదలం విగ్రహేణోభౌ రాజవర్యౌ ప్రసీదతామ్ ।
ఉభావపి వినిర్వ్యూఢప్రతిజ్ఞౌ ధర్మకోవిదౌ ॥34॥

అందువలన మీరిరువురు ఇప్పుడు యుద్ధము చేయవలసిన అవసరము లేదు. రాజశ్రేష్ఠులగు మీరిరువురూ ప్రసన్నత చెందుదు. మీరివురు నిజముగా ప్రతిజ్ఞాపాలనమునకు కట్టుబడినవారు మరియు ధర్మమునెరిగినవారు.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

సా తు వీరా సమభ్యేత్య పుత్రమేతదభాషత ।
మద్వాక్యాదేష తే పుత్రో హన్తుం నాగాన్ కృతోద్యమ ॥35॥

తన్నిష్పన్నం యదా విప్రాస్తే జీవన్తి తథా మృతాః ।
సంజీవన్తశ్చ ముచ్యన్తే యద్యుష్మచ్ఛరణం గతాః ॥36॥

ఆ సమయమందు వీరాదేవి అచ్చటకు వచ్చి తన పుత్రుడగు అవీక్షిత్తుతో ఇట్లు పలికెను. నా మాట ప్రకారము నీ పుత్రుడు నాగులను చంపుటకు ఉద్యుక్తుడయ్యెను. ఆ కార్యము సంపన్నమయినది. ఎప్పుడయితే మరణించిన బ్రాహ్మణులు తిరిగి జీవించెదరో అప్పుడే నీ శరణుకోరిన నాగులు కూడా ప్రాణములతో విముక్తులు కాగలరు.

భామిన్యువాచ – భామిని (అవీక్షిత్తు భార్య) పలికింది.

అహమభ్యర్థితా పూర్వమేభిః పాతాలసంశ్రయైః ।
తన్నిమిత్తమయం భర్తా మయాత్ర వినియోజితః ॥37॥

తదేతదార్యే నిర్వృత్తముభయోరపి శోభనమ్ ।
మమ భర్తుశ్చ పుత్రస్య త్వత్పౌత్రస్యాత్మజస్య చ ॥38॥

పాతాళలోకవాసులగు ఈ సర్పములు పూర్వము నన్ను ఈ విధముగా అభయమునిమ్మని ప్రార్థించినవి. ఈ కారణముగా నేను నా భర్తను ఈ విషయమును నిర్వర్తించవలసిందిగా అభ్యర్థించితిని. ఓ పూజ్యురాలా ! ఇప్పుడు నా భర్త మరియు నా పుత్రుడు (మరుత్తు) అనగా మీ కుమారుడు మరియు పౌత్రులవలన ఈ కార్యము శోభనమైనరీతిలో సుసంపన్నమయినది.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

తతః సంజీవయామాసుస్తాన్విప్రాంస్తే భుజఙ్గమాః ।
దివ్యైరోషధిజాతైశ్చ విషసంహరణేన చ ॥39॥

అటు పిమ్మట నాగులు విషమును సంహరించు దివ్యములైన ఓషధులతో ఆ బ్రాహ్మణులను బ్రతికించెను.

పిత్రోర్ననామ చరణౌ స తతో జగతీపతిః ।
మరుత్తశ్చ స తం ప్రీత్యా పరిష్వజ్యేదమబ్రవీత్ ॥40॥

అంతట భూపతి అయిన ఆ మరుత్తుడు తన తల్లిదండ్రుల పాదములపైబడి నమస్కరించెను. అవీక్షిత్తు కూడా ఆనందముతో తన కుమారుని కౌగలించుకొని ఇట్లు పలికెను.

మానహా భవ శత్రూణాం చిరం పాలయ మేదినీమ్ ।
పుత్రపౌత్రైశ్చ మోదస్వ మా చ తే సన్తు విద్విషః ॥41॥

నీవు శత్రువుల అభిమానమును (గర్వమును) నశింపచేయువాడవు అగుదువుగాక ! చిరకాలమును రాజ్యపాలనము చేయుము. పుత్రపౌత్రులతో ఆనందించుము. నీకెప్పుడు శత్రువులు లేకుందురుగాక !

తతో ద్విజైరనుజ్ఞాతౌ వీరయా చ నరేశ్వరౌ ।
సమారూఢౌ రథం సా చ భామినీ స్వపురం గతా ॥42॥

అటు పిమ్మట బ్రాహ్మణులచేతను, వీరాదేవిచేతను అనుమతింపబడినవారై ఆ రాజులిరువురు అనగా అవీక్షిత్తు మరియు మరుత్తుడు రథమునధిరోహించిరి. భామిని కూడా తన పట్టణమునకు వెళ్ళెను.

వీరాఽపి కృత్వా సుమహత్తపో ధర్మభృతాం వరా ।
భర్తుః సలోకతాం ప్రాప్తా మహాభాగా పతివ్రతా ॥43॥

పతివ్రత, మహానుభావురాలు మరియు ధర్మాచరణపరాయణులైన వారిలో శ్రేష్ఠురాలూ అయిన వీరాదేవి కూడా గొప్ప తపస్సును ఆచరించి తన భర్త వెళ్ళిన లోకములకు వెళ్ళెను. అనగా దివంగతురాలు అయ్యెను.

మరుత్తోఽపి చకారోర్వ్యాం ధర్మతః పరిపాలనమ్ ।
వినిర్జితారిషడ్వర్గో భోగాంశ్చ బుభుజే నృపః ॥44॥

మరుత్తమహారాజుకూడా ధర్మబద్ధముగా భూపరిపాలనము చేసెను. కామక్రోధాదిశత్రువులను ఆరింటిని జయించి అతడు భోగములను కూడా అనుభవించెను.

తస్య పత్నీ మహాభాగా విదర్భతనయా తథా ।
ప్రభావతీ సువీరస్య సౌవీరీ చాఽభవత్సుతా ॥45॥

సుకేశీ కేతువీర్యస్య మాగధస్యాత్మజాభవత్ ।
సుతా చ సిన్ధువీర్యస్య మద్రరాజస్య కేకయీ ॥46॥

కేకయస్య చ సైరన్ధ్రీ సిన్ధుభర్తుర్వపుష్మతీ ।
చేదిరాజసుతా చాభూద్భార్యా తస్య సుశోభనా ॥47॥

విదర్భరాజకుమారియగు ప్రభావతి అతనికి (మరుత్తునికి) భార్య అయ్యెను. అట్లే సువీరుని కుమార్తెయగు సౌవీరి కూడా అతనికి భార్య అయ్యెను. మగధదేశాధిపతియగు కేతువీర్యుని పుత్రిక సుకేశి, మద్రదేశాధిపతియగు సింధువీర్యుని కుమార్తెయగు కేకయి, కేకయుని కుమార్తెయగు సైరంధ్రి, సింధుదేశాధిపతి కుమార్తెయగు వపుష్మతి, చేదిదేశాధిపతి కుమార్తెయగు సుశోభన ఆ మరుత్తునికి భార్యలయిరి.

తాసాం పుత్రాస్తస్య చాసన్బూభృతోఽష్టాదశ ద్విజ ।
తేషాం ప్రధానో జ్యేష్ఠశ్చ నరిష్యన్తః సుతోఽభవత్ ॥48॥

ఓ బ్రాహ్మణుడా ! ఆ భార్యలవలన ఆ మరుత్తమహారాజుకు పద్దెనిమిదిమంది కుమారులుదయించిరి. వారిలో నరిష్యంతుడు ప్రధానుడు మరియు జ్యేష్ఠకుమారుడయ్యెను.

ఏవం వీర్యో మరుత్తోఽభూన్మహారాజో మహాబలః ।
తస్యాప్రతిహతం చక్రమాసీద్ద్వీపేషు సప్తసు ॥49॥

యస్య తుల్యోఽపరో రాజా న భూతో న భవిష్యతి ।
సత్త్వవిక్రమయుక్తస్య రాజర్షేరమితౌజసః ॥50॥

తస్యైతచ్చరితం శ్రుత్వా మరుత్తస్య మహాత్మనః ।
జన్మ చాగ్ర్యం ద్విజశ్రేష్ఠ ముచ్యతే సర్వకిల్బిషైః ॥51॥

ఈ విధముగా గొప్ప బలవంతుడూ మరియు మహారాజూ అగు మరుత్తుడు మిక్కిలి పరాక్రమవంతుడయ్యెను. సప్తద్వీపములందునూ అతడి రాజ్యపరిపాలనాచక్రమునకు అడ్డు లేకుండెను. అతనితో సాటి అయిన రాజు ఎవరూలేరు, ఉండబోరు. ఓ బ్రాహ్మణశ్రేష్ఠుడా ! సత్త్వపరాక్రమగుణములతో కూడుకొని, అమితమైన ఓజోగుణము కలిగి, మహాత్ముడయిన ఆ మరుత్తమహారాజుయొక్క చరిత్రను విన్నవారు సర్వపాపములను తొలగించుకొని జన్మరాహిత్యమును పొందెదరు.

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే మరుత్తచరితవర్ణనం నామ అష్టావింశత్యధికశతతమోఽధ్యాయః ॥128॥

శ్రీ మార్కండేయ మహాపురాణమందలి మరుత్తచరితవర్ణనమను నూటఇరువదిఎనిమిదవ అధ్యాయం సమాప్తం.



ఏకోనత్రింశదధికశతతమోఽధ్యాయః – నూటఇరువదితొమ్మిదవ అధ్యాయం
నరిష్యన్తచరితమ్ – నరిష్యంతుని చరిత్ర

క్రౌష్టుకిరువాచ – క్రౌష్టుకి చెప్పాడు.

మరుత్తచరితం కృత్స్నం భగవన్ కథితం త్వయా ।
తత్సన్తతిమశేషేణ శ్రోతుమిచ్ఛా ప్రవర్తతే ॥1॥

ఓ పూజ్యుడా ! సంపూర్ణముగా మరుత్తచరితమును నీవు చెప్పితివి. ఇప్పుడు అతడి సంతానమునుగూర్చి వినవలెనను కోరిక ఉదయించుచున్నది.

తత్సన్తతౌ క్షితీశా యే రాజ్యార్హా వీర్యశాలినః ।
తానహం శ్రోతుమిచ్ఛామి త్వయాఽఖ్యాతాన్మహామునే ॥2॥

ఓ మహామునీ ! అతడి సంతానములో రాజ్యమునధిష్ఠించుటకు అర్హులైన రాజులెవరు ఉన్నారో, వారినిగూర్చి నీవు చెప్పగా వినవలెనని కోరుకొనుచున్నాను.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

నరిష్యన్త ఇతి ఖ్యాతో మరుత్తస్యాభవత్సుతః ।
అష్టాదశానాం పుత్రాణాం స జ్యేష్ఠః శ్రేష్ఠ ఏవ చ ॥3॥

మరుత్తునియొక్క పద్దెనిమిదిమంది పుత్రులలో జ్యేష్ఠుడూ, శ్రేష్ఠుడూ అయిన నరిష్యంతుడను పేరుగల కుమారుడు ప్రసిద్ధుడయ్యెను.

వర్షాణాం చ సహస్రాణి సప్తతిం దశ పఞ్చ చ ।
బుభుజే పృథివీం కృత్స్నాం మరుత్తః క్షత్రియర్షభః ॥4॥

క్షత్రియశ్రేష్ఠుడయిన ఆ మరుత్తమహారాజు సమస్తభూమండలమును ఎనభైఅయిదువేల సంవత్సరములు పరిపాలించెను.

కృత్వా రాజ్యం స్వధర్మేణ ఇష్ట్వా యజ్ఞాననుత్తమాన్ ।
నరిష్యన్తసుతం జ్యేష్ఠమభిషిచ్య యయౌ వనమ్ ॥5॥

స్వీయధర్మానుసారముగా రాజ్యపరిపాలనము గావించి, మిక్కిలి ఉత్తములైన యజ్ఞములనాచరించి ఆ మరుత్తమహారాజు తన పెద్ద కుమారుడయిన నరిష్యంతుని రాజ్యాభిషిక్తుని గావించి, తాను అడవులకు వెళ్ళెను.

ఏకాగ్రచిత్తః స నృపస్తప్త్వా తత్ర తపో మహత్ ।
ఆరురోహ దివం విప్ర యశసాఽఽవృత్య రోదసీ ॥6॥

ఓ బ్రాహ్మణుడా ! ఏకాగ్రచిత్తుడై మరుత్తుడు ఆ అడవులలో గొప్ప తపస్సును ఆచరించి, భూమ్యాకాశములందు తన కీర్తిని వ్యాపింపచేసి స్వర్గలోకమునధిరోహించెను.

నరిష్యన్తః సుతః సోఽస్య చిన్తయామాస బుద్ధిమాన్ ।
పితుర్వృత్తం సమాలోక్య తథాఽన్యేషాం చ భూభృతామ్ ॥7॥

అతని పుత్రుడూ, బుద్ధిమంతుడూ అయిన ఆ నరిష్యంతుడు తన తండ్రి మరియు పూర్వజుల వృత్తాంతమునెరిగి ఇట్లు విచారించసాగెను.

అత్ర వంశే మహాత్మానో రాజానో మమ పూర్వజాః ।
యజ్వినో ధర్మతః పృథ్వీం పాలయామాసురూర్జితాః ॥8॥

ఈ నా వంశమందు నా పూర్వీకులు, మహాత్ములూ అయిన రాజులు ధర్మానుసారముగా యాగములననుష్ఠించుచు, బలసంపన్నులై పృథివిని పరిపాలించిరి.

దాతారశ్చాపి విత్తానాం సంగ్రామేష్వనివర్తినః ।
తేషాం కశ్చరితం శక్తస్త్వనుయాతుం మహాత్మనామ్ ॥9॥

వారందరు ధనసంపదలను దానము చేయువారు. యుద్ధములందు వెనుతిరుగువారు కాదు. అట్టి మహాత్ముల చరితమును అనుసరించుటకు ఎవడు సమర్థుడు?

కిన్తు తైర్యత్కృతం కర్మ ధర్మ్యమాహవనాదిభిః ।
తదహం కర్తుమిచ్ఛామి తచ్చ నాస్తి కరోమి కిమ్ ॥10॥

కాని యజ్ఞయాగాది అనుష్ఠానములతో వారెట్టి ధర్మకార్యములను చేసిరో, వాటిని నేను కూడా చేయవలెనని కోరుచున్నాను. వాటిని నేనింతవరకు ఆచరించలేదు. నేనేమి చేయుదును?

ధర్మాత్పాలయతః పృథ్వీం కో గుణోఽత్ర మహీపతేః ।
అసమ్యక్పాలనాత్పాపీ నరేన్ద్రో నరకం వ్రజేత్ ॥11॥

ఈ భూమండలమును ధర్మబద్ధముగా పరిపాలించినంతమాత్రమున గుణమేమున్నది? (అది కర్తవ్యమే అని ఆశయము). అధర్మబద్ధముగా రాజ్యపరిపాలనము గావించు రాజు నరకమునకు వెళ్ళును.

సతి విత్తే మహాయజ్ఞాః కర్తవ్యా ఏవ భూభృతా ।
దాతవ్యం చాత్ర కిం చిత్రం సీదతామీశ్వరో గతిః ॥12॥

ధనమున్నచో రాజు గొప్ప గొప్ప యజ్ఞములను చేయవలెను. ఆ యజ్ఞములలో భూరి దక్షిణలు గూడ ఇవ్వవలెను. ఈ కార్యము రాజుకు కర్తవ్యమే గాన ఇందు చిత్రమేమున్నది? కష్టములలోనున్నవారికి రాజే దిక్కు.

ఆభిజాత్యం తథా లజ్జా కోపశ్చారిజనాశ్రయః ।
కారయన్తి స్వధర్మశ్చ సంగ్రామాదపలాయనమ్ ॥13॥

ఉన్నతవంశములో పుట్టుక, సిగ్గు, శత్రువులపట్ల కోపము, స్వధర్మము ఇవియన్నియు సంగ్రామమందు పలాయనము లేకుండుటకు కారణములు.

ఏతత్సర్వం యథా సమ్యక్ మత్పూర్వైః పురుషైః కృతమ్ ।
పిత్రా చ మే మరుత్తేన తథా తత్కేన శక్యతే ॥14॥

ఈ సమస్తకార్యములను నా పూర్వీకులు, నా తండ్రియగు మరుత్తుడు బాగుగా పరిపాలించిరి. ఆ విధముగా ఆచరించుట ఎవరికి సాధ్యమగును?

తదహం కిం కరిష్యామి యత్తు తైః పూర్వజైః కృతమ్ ।
యే యజ్వినో వరా దాన్తాః సంగ్రామాచ్చానివర్తినః ॥15॥

అందువలన నా పూర్వీకులు యాగములను చేసినవారు, శ్రేష్ఠులు, ఇంద్రియనిగ్రహము కలిగినవారు మరియు యుద్ధములందు వెనుతిరగనివారు, వారెట్లు ఆచరించిరో నేను కూడా అట్లే ఆచరించెదను.

మహత్సంగ్రామసంమర్దేష్వవిసంవాదిపౌరుషాః ।
క్రమేణాహం యతిష్యామి కస్మై తానభిసన్ధితుమ్ ॥16॥

గొప్ప గొప్ప యుద్ధములందు ఎట్టి సంశయము లేని పౌరుషమును నా పూర్వీకులు ప్రదర్శించినారు. క్రమముగా వారు చూపిన మార్గమునందు నడచుటకు నేను కూడా ప్రయత్నించెదను.

అథవా తైః స్వయం యజ్ఞాః కృతాః పూర్వజనేశ్వరైః ।
అవిశ్రమద్భిర్నాన్యైస్తు కారితాస్తత్కరోమ్యహమ్ ॥17॥

అట్లు కానిచో నా పూర్వీకులైన రాజ్ఞులు అవిరతముగా స్వయముగా యజ్ఞములను ఆచరించిరి. ఇతరులెవరు అట్లు ఆచరించలేదు. నేను ఆవిధముగా ఆచరించెదను.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

ఇతి సంచిన్త్య యజ్ఞం స చకారైకం నరేశ్వరః ।
యాదృశం న చకారాన్యో విత్తోత్సర్గోపశోభితమ్ ॥18॥

ఆ నరేశ్వరుడు ఈ విధముగా ఆలోచించినవాడై విస్తారముగా భూరిదక్షిణాదానములతో ఒక యజ్ఞమును నిర్వర్తించెను. అట్టి యజ్ఞమును మునుపెన్నడూ ఎవరూ నిర్వర్తించలేదు.

ద్విజానాం జీవనాయాలం దత్త్వా తు సుమహాధనమ్ ।
తతః శతగుణం తేషాం యజ్ఞార్థమదదాన్నృపః ॥19॥

ద్విజులు జీవనము గడుపుకొనుటకై గొప్ప ధనమును రాజగు నరిష్యంతుడు ఇచ్చెను. అంతకు వందరెట్లు ఎక్కువ ధనమును వారు యజ్ఞములను నిర్వర్తించుటకై ఇచ్చెను.

గావో వస్త్రాణ్యలంకారం ధాన్యాగారాదికం తథా ।
ప్రత్యేకమదదాత్తేషాం సర్వపృథ్వీనివాసినామ్ ॥20॥

గోవులు, వస్త్రములు, అలంకారములు, ధాన్యాగారములు మొ॥వాటిని భూలోకవాసులగు ప్రజలందరికీ ఒక్కొక్కరికీ దానము చేసెను.

తతస్తేన యదా యజ్ఞః ప్రారబ్ధో భూభుజా పునః ।
ప్రారబ్ధే స మఖే యష్టుం తతో నాలభత ద్విజాన్ ॥21॥

అటుపిమ్మట తిరిగి రాజు ఎప్పుడయితే యజ్ఞము ప్రారంభించెనో అప్పుడు ఋత్విక్కులుగా ఉండుటకు బ్రాహ్మణులెవరూ రాజుకు దొరకలేదు.

యాన్యాన్ వృణోతి స నృపో విప్రానార్త్విజ్యకర్మణి ।
తే తే తమూచుర్యజ్ఞాయ వయమప్యత్ర దీక్షితాః ॥22॥

అన్యం వరయ యద్విత్తం త్వయాఽస్మాకం విసర్జితమ్ ।
తస్యాన్తో నాస్తి యజ్ఞేషు దద్యాస్త్వం నృపతే కథమ్ ॥23॥

ఆ రాజు ఏ ఏ బ్రాహ్మణులనయితే ఆర్త్విజ్యమందు (ఋత్విక్కులుగా ఉండుటకై) ఎన్నుకొనెనో, ఆ బ్రాహ్మణులందరు రాజుతో ఇట్లనిరి. మేము కూడా వేరొకచోట యజ్ఞకార్యమందు దీక్షను గ్రహించితిమి. మీరు వేరొకరిని వరణము చేయుడు. ఓ రాజా ! మీరు మీవద్ద యజ్ఞకాలమందు ఎంత ధనమునయితే మాకు దానము చేసితిరో ఆ ధనమింకను తరగలేదు.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

న చాప ఋత్విజో విప్రాంస్తదాశేషక్షితీశ్వరః ।
బహిర్వేద్యాం తదా దానం స దాతుముపచక్రమే ॥24॥

సమస్తభూమండలమునకు ప్రభువైనప్పటికీ ఎప్పుడయితే యజ్ఞకార్యము నిర్వర్తించుటకు బ్రాహ్మణులు దొరకలేదో, అప్పుడు రాజు బహిర్వేదియందు దానము చేయుటకు ప్రారంభించెను.

తథాఽపి జగృహుర్నైవ ధనసంపూర్ణమన్దిరాః ।
ద్విజాయ దాతుం భూయోఽసౌ నిర్విణ్ణ ఇదమబ్రవీత్ ॥25॥

అయినప్పటికీ ధనముతో నిండియున్న గృహములుగల బ్రాహ్మణులు రాజు ఇచ్చే దానమును గ్రహించలేదు. బ్రాహ్మణులకు దానము చేయుటకై ప్రయత్నించినరాజు విఫలుడై నిర్వేదముతో ఇట్లు పలికెను.

అహోఽతిశోభనం పృథ్వ్యాం యద్విప్రో నాధనః క్వచిత్ ।
అశోభనం చ యత్కోశో విఫలోఽయమయజ్వినః ॥26॥

ఆహా ! ఎంత బాగున్నది ! ఈ భూమిమీద నిర్ధనుడైన బ్రాహ్మణుడు ఎచ్చటా లేడు. కాని యజ్ఞములనాచరించనిచో నా ధనాగారమంతయూ వ్యర్థమే.

నార్త్విజ్యం కురుతే కశ్చిద్యజమానోఽఖిలో జనః ।
ద్విజానాం చ నో దానం దదతాం సంప్రతీచ్ఛతే ॥27॥

బ్రాహ్మణులు తాము స్వయంగా యజ్ఞకార్యములను నిర్వర్తించుచున్నందున వారెవరూ మరొకచోట ఋత్విక్కులుగా ఉండుటకు అంగీకరించుట లేదు. బ్రాహ్మణులెవరూ నేను చేసే దానములను స్వీకరించుట లేదు.

మార్కండేయ ఉవాచ :- మార్కండేయుడు చెప్పాడు.

తతః కాంశ్చిద్ద్విజాన్భక్త్యా ప్రణిపత్య పునః పునః ।
స్వయజ్ఞే ఋత్విజశ్చక్రే తే ప్రచక్రుర్మహామఖమ్ ॥28॥

అంతట రాజు కొంతమంది బ్రాహ్మణులను భక్తితో మాటిమాటికీ నమస్కరించి, అభ్యర్థించి తన యజ్ఞమందు ఋత్విక్కులుగా చేసుకొనెను. ఆ ఋత్విక్కులు మహాయజ్ఞమును నిర్వహించిరి.

అత్యద్భుతమిదం చాసీద్యదా తస్య మహీపతేః ।
స యజ్ఞోఽభూత్తదా పృథ్వ్యాం యజమానోఽఖిలో జనః ॥29॥

ద్విజన్మనామభూన్నాసీత్సదస్యస్తత్ర కశ్చన ।
యజమానా ద్విజాః కేచిత్కేచిత్తేషాం తు యాజకాః ॥30॥

అట్టి సమయమందు అత్యంత ఆశ్చర్యకరమైన సంఘటన జరిగినది. ఏమనగా ఆ రాజు మహాయజ్ఞమును ఆరంభించిన సమయమందు జనులందరు యజమానులు (యాగము చేయువారు) అయిరి. అప్పుడు బ్రాహ్మణులలో ఎవరునూ సభాసదులుగా లేరు. అనగా ఆ మహాయజ్ఞమును చూచుటకు ప్రేక్షకులుగా బ్రాహ్మణులు ఎవ్వరూ లేరు. ఎందువలననగా ఆ సమయమందు బ్రాహ్మణులలో కొందరు యజమానులైరి. మరికొందరు వారికి యాజకులైరి.

నరిష్యన్తో నరపతిరియాజ స యదా తదా ।
తత్ప్రదాతుర్ధనైర్యాగం కుర్యుః పృథ్వ్యామశేషతః ॥31॥

నరిష్యన్తమహారాజు యజ్ఞము చేయు సమయమందు అతడిచ్చిన ధనముతో భూమియందలి బ్రాహ్మణులెల్లరు అనేక యజ్ఞములను చేసిరి.

ప్రాచ్యాం కోట్యస్తు యజ్ఞానామాసన్నష్టాదశాధికాః ।
ప్రతీచ్యాం సప్త వై కోట్యో దక్షిణస్యాం చతుర్దశ ॥32॥

ఉత్తరస్యాం చ పఞ్చాశదేకకాలం తదాఽభవన్ ।
మునే బ్రాహ్మణయజ్ఞానాం నరిష్యన్తో యదాఽయజత్ ॥33॥

ఓ మునీ ! నరిష్యంతుడు యజ్ఞము ఆచరించు సమయమందు బ్రాహ్మణులు తూర్పుదిక్కున పద్దెనిమిది కోట్ల కన్నా అధికముగా యజ్ఞములను చేసిరి. పడమర దిక్కున ఏడు కోట్లు మరియు దక్షిణ దిక్కున పదునాలుగు కోట్లు యజ్ఞములను చేసిరి. ఉత్తరదిక్కున ఏబది కోట్ల యజ్ఞములను ఏకకాలమందే చేసిరి.

ఏవం స రాజా ధర్మాత్మా నరిష్యన్తో౽భవత్పురా ।
మరుత్తతనయో విప్ర విఖ్యాతబలపౌరుషః ॥34॥

ఓ విప్రుడా ! ఈ విధముగా పూర్వకాలమందు మరుత్తుని పుత్రుడగు నరిష్యంతుడు ప్రఖ్యాతి చెందిన బలపౌరుషములు గలవాడై ధర్మాత్ముడై యుండెను.

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే నరిష్యన్తచరితం నామ ఏకోనత్రింశదధికశతతమో౽ధ్యాయః ॥129॥

శ్రీ మార్కండేయ మహాపురాణమందలి నరిష్యంతుని చరితమను నూటఇరువదితొమ్మిదవ అధ్యాయం సమాప్తం.



త్రింశదధికశతతమోఽధ్యాయః – నూటముప్పదవ అధ్యాయం

దమచరితమ్ – దముని చరిత్ర

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

నరిష్యన్తస్య తనయో దుష్టాఽరిదమనో దమః ।
శక్రస్యేవ బలం తస్య దయాశీలం మునేరివ ॥1॥

నరిష్యంతుని పుత్రుడు దముడను పేరుగలవాడు. అతడు దుష్టులైన శత్రువులను అణచువాడు, దేవేంద్రునితో సమానమైన బలముగలవాడు. మునులతో సమానమైన దయాస్వభావముగలవాడు.

బాభ్రవ్యామిన్ద్రసేనాయాం స జజ్ఞే తస్య భూభృతః ।
నవవర్షాణి జఠరే స్థిత్వా మాతుర్మహాయశాః ॥2॥

నరిష్యంతునివలన బభ్రుని కుమార్తెయగు ఇంద్రసేన గర్భమునుండి దముడు జన్మించెను. గొప్ప కీర్తి కలిగిన దముడు తొమ్మిది సంవత్సరములు తల్లియొక్క గర్భమందుండెను.

యద్గ్రాహయామాస దమో మాతరం జఠరే స్థితః ।
దమశీలశ్చ భవితా యతశ్చాఽయం నృపాఽత్మజః ॥3॥

తతస్త్రికాలవిజ్ఞానః స హి తస్య పురోహితః ।
దమ ఇత్యకరోన్నామ నరిష్యన్తసుతస్య తు ॥4॥

రాజకుమారుడగు దముడు తల్లి గర్భమందుండగా అతని కారణముగా తల్లి ఇంద్రియనిగ్రహమును అవలంబించవలసి వచ్చెను. ఇంకను ఈ రాజపుత్రుడు ఇంద్రియనిగ్రహము స్వభావముగా గలవాడు అగునని తలచి, త్రికాలజ్ఞుడగు అతని పురోహితుడు ఆ రాజకుమారునికి దముడని నామకరణము చేసెను.

స దత్తో రాజపుత్రస్తు ధనుర్వేదమశేషతః ।
జగృహేఽసురరాజస్య సకాశాద్వృషపర్వణః ॥5॥

రాజపుత్రుడగు ఆ దముడు అసురరాజగు వృషపర్వుని వద్ద సంపూర్ణముగా ధనుర్వేదవిద్యలను గ్రహించెను.

దున్దుభేర్దైత్యవర్యస్య తపోవననివాసినః ।
సకాశాజ్జగృహే కృత్స్నమస్త్రగ్రామం చ తత్త్వతః ॥6॥

తపోవననివాసి, రాక్షసశ్రేష్ఠుడూ అయిన దుందుభివద్దనుంచి సమస్త అస్త్రసమూహమును విధ్యుక్తప్రకారము గ్రహించెను.

శక్తేః సకాశాద్వేదాశ్చ వేదాఙ్గాన్యఖిలాని చ ।
తథార్ష్టిషేణాద్రాజర్షేర్జగృహే యోగమాత్మవాన్ ॥7॥

ఇంకనూ ఆ దముడు శక్తియను మునివద్దనుండి వేదములు, సమస్తవేదాంగములను అధ్యయనము చేసెను. అట్లే రాజర్షియగు అర్ష్టిషేణునివద్దనుండి ఆత్మనిగ్రహము కలిగిన ఆ దముడు యోగవిద్యను గ్రహించెను.

తం సురూపం మహాత్మానం గృహీతాస్త్రం మహాబలమ్ ।
స్వయంవరే కృతా పిత్రా జగృహే సుమనా పతిమ్ ॥8॥

సుతా దశార్ణాధిపతేర్బలినశ్చారువర్మణః ।
పశ్యతాం సర్వభూతానాం యే తదర్థముపాగతాః ॥9॥

దశార్ణదేశాధిపతి, బలవంతుడూ అగు చారువర్మయొక్క కుమార్తె సుమన. తండ్రి ఏర్పాటు చేసిన స్వయంవరమందు సుమనకొరకు వచ్చియున్న మిగిలిన రాజులు చూచుచుండగనే, ఆమె అనగా సుమన అందమైనవాడు, మహాత్ముడు, అస్త్రవిద్యలను గ్రహించినవాడు, మహాబలవంతుడూ అగు దముని భర్తగా గ్రహించెను.

తస్యాం చ సానురాగోఽభూన్మద్రరాజస్య వై సుతః ।
సుమనాయాం మహానన్దో మహాబలపరాక్రమః ॥10॥

తథా విదర్భాధిపతేః పుత్రః సంక్రందనస్య చ ।
వపుష్మాన్ రాజపుత్రశ్చ మహాధనురుదారధీః ॥11॥

మద్రదేశాధిపతియొక్క కుమారుడు, గొప్ప పరాక్రమవంతుడూ అగు మహానందుడు సుమనయందు ఆమెను పొందవలెనని అనురాగము కలిగియుండెను. అట్లే విదర్భదేశాధిపతియొక్క సంక్రందనుడి కుమారుడు కూడా ఆమెయందు అనురాగము కలిగియుండెను. ఇంకనూ రాజకుమారుడు, గొప్ప ధనుస్సును ధరించినవాడు, ఉదారబుద్ధి కలిగినవాడూయగు వపుష్మంతుడుకూడా సుమనయందు అనురాగము కలిగియుండెను.

తే తదా తం వృతం దృష్ట్వా దుష్టారిదమనం దమమ్ ।
మన్త్రయామాసురన్యోన్యం తత్రానఙ్గవిమోహితాః ॥12॥

దుష్టశత్రువులను సంహరించునట్టి దముని సుమన వరించుటను చూచి, మన్మథపీడుతులైన ఆ రాజులు తమలో తాము ఇట్లు పరామర్శించుకొనసాగిరి.

ఏతామస్య బలాత్కన్యా గృహీత్వా రూపశాలినీమ్ ।
గృహం ప్రయామస్తస్యేయమస్మాకం యం గ్రహీష్యతి ॥13॥

భర్తృబుద్ధ్యా వరారోహా స్వయంవరవిధానతః ।
తస్యేచ్ఛయా నో భవిత్రీ భార్యా ధర్మోపపాదితా ॥14॥

మనము రూపవతియగు ఈ కన్యను బలవంతముగా గ్రహించి మన ఇంటికి తీసుకొనిపోయెదము. పిమ్మట వరారోహయగు (అందమైన కటిభాగము కలిగిన స్త్రీ) ఈమె స్వయంవరవిధానానుసారముగా మనలో ఎవరిని భర్తగా గ్రహించునో అప్పుడు వారికి ఆమె ఇష్టానుసారము, ధర్మబద్ధముగా భార్యయగును.

అథ నేచ్ఛతి సా కఞ్చిదస్మాకం మదిరేక్షణా ।
తతస్తస్య భవిత్రీ సా యో దమం ఘాతయిష్యతి ॥15॥

ఒకవేళ మదిరేక్షణయగు ఆమె (మత్తనేత్రములు గల స్త్రీ) మనలో ఎవరినీ కూడా ఇష్టపడనిచో అప్పుడు మనలో ఎవరు దముని సంహరించెదరో వారికి ఈమె భార్యయగును.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

ఇతి తే నిశ్చయం కృత్వా త్రయః పార్థివనన్దనాః ।
జగృహుస్తాం సుచార్వఙ్గీం దమపార్శ్వానువర్తినీమ్ ॥16॥

ఆ రాజకుమారులు ముచ్చురు ఈ విధముగా నిశ్చయము చేసుకొని దముని పార్శ్వభాగమందున్న సుందరాంగియగు ఆమెను గ్రహించిరి.

తతః కేచిన్నృపాస్తేషాం యే తత్పక్షా విచుక్రుశుః ।
చుక్రుశుశ్చాపరే భూపాః కేచిన్మధ్యస్థతాం గతాః ॥17॥

అంతట దముని పక్షమందలి కొంతమంది రాజులు ఇందుకు ఆక్రోశించిరి. మరికొంతమంది రాజులు కూడా ఇందు నిమిత్తమై ఆక్రోశించిరి. కొంతమంది మధ్యస్థులుగా ఉండిరి.

తతో దమస్తాన్భూపాలానవలోక్య సమన్తతః ।
అనాకులమనా వాక్యమిదమాహ మహామునే ॥18॥

ఓ మహామునీ ! అంతట నాలుగువైపులా కూర్చుని ఉన్న రాజులను చూచి దముడు ఎట్టి వ్యాకులత చెందని మనస్సు కలవాడై ఇట్లు పలికెను.

దమ ఉవాచ – దముడు పలికాడు.

భో భూపా ధర్మకృత్యేషు యద్వదన్తి స్వయంవరమ్ ।
దశార్ణపతినా భూపాః కృతే ధర్మ్యే స్వయంవరే ॥
అధర్మో వాఽథ ధర్మో వా యదేభిర్గృహ్యతే బలాత్ ॥19॥

యద్యధర్మో న మే కార్యమన్యభార్యా భవిష్యతి ।
ధర్మో వా తదలం ప్రాణైర్యే రక్ష్యన్తేఽరిలంఘనే ॥20॥

ఓ రాజులారా ! స్వయంవరమును ధర్మకార్యములందు ఒకదానిగా పెద్దలు చెప్పుచున్నారు. దశార్ణదేశాధిపతి ఏర్పాటు చేసిన అట్టి ధర్మబద్ధమైన స్వయంవరమందు ఈ ముచ్చురు రాజులు సుమనను బలవంతముగా అపహరించుకొని వెళ్ళినారు. ఇట్టి పని అధర్మమా లేక ధర్మమా ఏమైనా కానిండు. ఒకవేళ అధర్మమే అయినచో దీనివలన నేను చేయవలసినది ఏమియు లేదు. ఈమె అన్యుల భార్య కావచ్చును. ఒకవేళ ధర్మమే అయినచో

ఈ ప్రాణములిక చాలును. అనగా వాటితో పని లేదు. కేవలము శత్రువులను ఎదుర్కొనక వారినుండి తప్పించుకొన్నప్పుడే ఆ ప్రాణములు రక్షితములగును.

తతో దశార్ణాధిపతిశ్చారువర్మా నరాధిపః ।
నిశ్శబ్దం కారయిత్వా తత్సదః ప్రాహ మహామునే ॥21॥

ఓ మహామునీ ! అనంతరము దశార్ణదేశాధిపతి చారువర్మ సభను నిశ్శబ్దము చేసి ఇట్లు పలికెను.

దమేన యదిదం ప్రోక్తం ధర్మాధర్మాశ్రితం నృపాః ।
తద్వదధ్వం యథా ధర్మో మమాస్య చ న లుప్యతే ॥22॥

ఓ రాజులారా ! ధముడు ధర్మాధర్మములకు సంబంధించి ఏమి పలికెనో ఆ విషయమై నాకు, దమునుకి ధర్మమునకు లోటు కలుగకుండు విధముగా ఉపాయమును చెప్పుడు.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

తతః కేచిన్మహీపాలాస్తమూచుర్వసుధాధిపమ్ ।
పరస్పరానురాగేణ గాన్ధర్వో విహితో విధిః ॥23॥

క్షత్రియాణాం పరమయం న విట్శూద్రద్విజన్మనామ్ ।
దమమాశ్రిత్య నిష్పన్నః స చాస్యా దుహితుస్తవ ॥24॥

ఇతి ధర్మాద్దమస్యైషా దుహితా తవ పార్థివ ।
యోన్యథా వర్తతే మోహాత్కామాత్మా సంప్రవర్తతే ॥25॥

అప్పుడు చాలామంది రాజులు వసుధాధిపుడయిన చారువర్మతో ఇట్లు పలికిరి. పరస్పరానురాగమువలన గాంధర్వవివాహము సంపన్నమగును. ఈ వివాహము క్షత్రియుల పక్షమున శ్రేష్ఠము. శూద్రవైశ్యబ్రాహ్మణులపక్షమందు ఈ విధానము లేదు. అట్టి గాంధర్వవివాహము మీ కుమార్తెకు దమునితో జరిగినది. కాబట్టి ఓ రాజా ! ధర్మముననుసరించి మీ కుమార్తె దమునికి భార్య అయినది. ఇట్టి ధర్మమునకు విరుద్ధధముగా ప్రవర్తించువారు, మోహము కారణముగా కామసక్తులై ప్రవర్తించుచున్నారు.

తథాఽపరే తదా ప్రోచుర్మహాత్మానో హి భూభృతామ్ ।
పక్షే యో భూభృతో విప్ర దశార్ణాధిపతిం వచః ॥26॥

ఓ విప్రుడా ! ఇతర రాజుల పక్షమందలి మహాత్ములైన కొంతమంది దశార్ణదేశాధిపతియగు చారువర్మతో ఇట్లు పలికిరి.

మోహాత్కిమాహుర్ధర్మోఽయం గాన్ధర్వం క్షత్రజన్మనః ।
న త్వేష శాస్తా నాన్యో హి రాక్షసః శస్త్రజీవినామ్ ॥27॥

బలాదిమాం యో హరతి హత్వా తు పరిపన్థినః ।
తస్యైషా స్యాద్రాక్షసేన వివాహేనావనీశ్వరాః ॥28॥

ప్రధానతర ఏషోఽత్ర వివాహద్వితయే మతః ।
క్షత్రియాణామతో ధర్మో మహానన్దాదిభిః కృతః ॥29॥

ఓ రాజులారా ! క్షత్రియులకు గాంధర్వవివాహమే ధర్మబద్ధమైనదని మోహముతో అనగా అజ్ఞానముతో ఈ ముందు పలికిన రాజులు చెప్పుచున్నారు. క్షత్రియుల పక్షమందు ఈ గాంధర్వవివాహముగాని మరి ఏ ఇతర వివాహములు గాని ప్రశస్తములు గావు. ఆయుధధారులకు ఒక్క రాక్షసవివాహమే ప్రశస్తమైనది. ఎవరయితే ఎదుటి పక్షమువారిని నశింపచేసి బలవంతముగా ఈ కన్యను అపహరించెదరో వారికే ఈ కన్య చెందగలదు. గాంధర్వ, రాక్షసవివాహములలో ఈ రాక్షసవివాహమే క్షత్రియులకు మిక్కిలి ప్రధానమైనది. అందువల్లనే మహానందుడు మొ॥లగు రాజులు ఈ విధానమునే అనుసరించిరి.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

అథ ప్రోచుః పునర్భూపా యైః పూర్వముదితో నృపః ।
పరస్పరానురాగేణ జాతిధర్మాశ్రితం వచః ॥30॥

రాజగు చారువర్మతో పరస్పరానురాగముతో జాతిధర్మమును ఆశ్రయించి ముందుగా మాటలాడిన రాజులు తిరిగి ఇట్లు పలికిరి.

సత్యం శస్తో రాక్షసోఽపి క్షత్రియాణాం పరో విధిః ।
కిన్త్వసౌ జనకస్వామ్యే కుమార్యానుమతో వరః ॥31॥

హత్వా తు పితృసంబన్ధం బలేన హ్రియతే హి యా ।
స రాక్షసో విధిః ప్రోక్తో నాత్ర భర్తృకరే స్థితా ॥32॥

పశ్యతాం సర్వభూపానామనయా యద్వృతో దమః ।
గాన్ధర్వస్యేహ నిష్పత్తౌ వివాహో రాక్షసోఽత్ర కః ॥33॥

వివాహితాయాః కన్యాయాః కన్యాత్వం నైవ విద్యతే ।
కన్యాయాశ్చ వివాహేన సంబన్ధః పృథివీశ్వరాః ॥34॥

త ఇమే యే బలాదేనాం దమాదాదాతుముద్యతాః ।
బలినస్తే యది తతః కుర్వన్తు న తు సాధు తత్ ॥35॥

ఓ రాజులారా ! మీరు చెప్పినది నిజమే. క్షత్రియుల పక్షమందు రాక్షసవివాహము ప్రశస్తమైనదే, మరియు శ్రేష్ఠమైనదే. కాని ఈ రాజకన్య తండ్రి అధీనములోనుండి యౌవనావస్థయందు దముని వరించినది. కన్యయొక్క పితృసంబంధము కలిగినవారిని సంహరించి కన్యను అపహరించినచో అది రాక్షసవివాహమగును. కాని భర్తయొక్క

హస్తగతమైన కన్యను హరించుట రాక్షసవివాహము కాదు. రాజులందరూ చూచుచుండగా ఎప్పుడయితే ఈ కన్య సుమనాదేవి దమునిని వరించినదో అప్పుడే గాంధర్వవివాహము నిష్పన్నమైనది. ఇక రాక్షసవివాహమునకు అవకాశమెక్కడిది? వివాహిత అయిన స్త్రీకి కన్యాత్వముండదు. వివాహము చేతనే కన్యకు మరియొకనితో సంబంధమేర్పడును. ఈ రాజులు బలవంతముగా దముని హస్తమునుండి ఈ కన్యను గ్రహించుటకు ఉద్యుక్తులైరి. వారు బలవంతులై అట్లు చేసినా చేయవచ్చును. కాని అది మంచి పని కాదు.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

తచ్ఛ్రుత్వాఽసౌ దమః కోపకషాయీకృతలోచనః ।
ఆరోపయామాస ధనుర్వచనం చేదమబ్రవీత్ ॥36॥

దముడు ఈ మాటలను విని కోపముచే ఎఱ్ఱబడిన నేత్రములు గలవాడై వింటిని ఎక్కుపెట్టి ఇట్లు పలికెను.

మమాఽపి భార్యా బలిభిః పశ్యతో హ్రియతే యది ।
తత్కులేన భుజాభ్యాం వా కో గుణః క్లీబజన్మనః ॥37॥

నేను చూచుచుండగనే బలవంతులైనవారు నా భార్యను అపహరించుచున్నయెడల, నా జన్మ నపుంసకజన్మతో సమానము. నా కులగౌరవము, నా భుజబలము ఇక యేమున్నది?

ధిఙ్మమాస్త్రాణి ధిక్శౌర్యం ధిక్ఛరాన్ ధిక్ఛరాసనమ్ ।
ధిగ్వ్యర్థం మే కులే జన్మ మరుత్తస్య మహాత్మనః ॥38॥

అప్పుడు నా అస్త్రములు, పరాక్రమము, బాణములు, అంబులపొది, అన్నీ నిందింపతగినవి. అట్లే ఆ మరుత్తమహాత్ముని వంశమందు నేను జన్మించుట కూడా వ్యర్థమే.

యది భార్యామిమే మూఢాః సమాదాయ బలాన్వితాః ।
ప్రయాన్తి జీవతో ధిక్తాం మమ వ్యర్థమనుష్యతామ్ ॥39॥

ఒకవేళ బలవంతులైన మూర్ఖులైన ఆ రాజులు నా భార్యను తీసుకొని వెళ్ళిపోయినచో నేను జీవించుట, మనుష్యజన్మ వ్యర్థము.

ఇత్యుక్త్వా తాన్మహీపాలాన్మహానన్దముఖాన్బలీ ।
అథాబ్రవీత్తదా సర్వాన్మహారిదమనో దమః ॥40॥

గొప్ప శత్రువులను అణచివేసినవాడు, బలవంతుడు అగు దముడు మహానందుడు మొ॥లగు రాజులతో ఈ విధముగా పలికి, అనంతరము అచ్చటనున్న వారందరితో ఇట్లు పలికెను.

ఏషాతిశోభనా బాలా చార్వఙ్గీ మదిరేక్షణా ।
కిం తస్య జన్మనా భార్యా న యస్యేయం కులోద్భవా ॥41॥

ఇతి సఞ్చిన్త్య భూపాలాస్తథా యతత సంయుగే ।
యథా నిర్జిత్య మామేతాం పత్నీం కురుత మానినః ॥42॥

ఇత్యాభాష్య తతస్తత్ర శరవర్షమముఞ్చత ।
ఛాదయన్ పృథివీపాలాంస్తమసేవ మహీరుహాన్ ॥43॥

"ఓ రాజులారా ! ఈ బాల మిక్కిలి అందమైనది, అందమైన అవయవములు గలది, మత్తెక్కిన కన్నులు గలది. ఉన్నత వంశమందు జన్మించిన ఈమె ఎవరికి భార్య అవ్వదో వారి జన్మ వ్యర్థము. ఈ విధముగా ఆలోచన చేసి నాతో యుద్ధము చేసి ఈమెను భార్యగా చేసుకొనుటకు ప్రయత్నించుడు. ఓ అభిమానవంతులారా ! నన్ను జయించి ఈమెను భార్యగా చేసుకొనుడు" అని పలికి దమమహారాజు చెట్లను చీకటి ఆవరించినట్లుగా అచ్చట ఉన్న రాజులందరినీ కప్పివేయుచూ బాణవర్షమును కురిపించెను.

తేఽపి వీరా మహీపాలాః శరశక్త్యృష్టిముద్గరాన్ ।
ముముచుస్తత్ప్రయుక్తాంశ్చ దమశ్చిచ్ఛేద లీలయా ॥44॥

వీరులైన ఆ రాజులందరూ కూడా బాణములు, శక్తిఆయుధములు, ఖడ్గవిశేషములు, ముద్గరములను దమునిపై ప్రయోగించిరి. దముడు వాటినన్నింటినీ లీలగా ఛేదించెను.

తేఽపి తత్ప్రహితాన్బాణాంస్తేషాం చాసౌ శరోత్కరాన్ ।
చిచ్ఛేద పృథివీశానాం నరిష్యన్తాత్మజో మునే ॥45॥

ఓ మునిశ్రేష్ఠుడా ! ఆ రాజులు కూడా దముడు ప్రయోగించిన బాణములను ఛేదించిరి. నరిష్యంతుని పుత్రుడగు దముడుకూడా వారందరు ప్రయోగించిన బాణములను ఛేదించెను.

తతో రోషాత్సమారుహ్య తం దమస్య తదా రథమ్ ।
మహానన్దో మహావీర్యో దమేన యుయుధే సహ ॥49॥

పిమ్మట మహాపరాక్రమవంతుడైన మహానందుడు క్రోధముతో దముని రథముపైకి దూకి, దమునితో యుద్ధము చేసెను.

బహుధా యుధ్యమానస్య మహానన్దస్య లాఘవాత్ ।
దమో ముమోచ హృదయే శరం కాలానలప్రభమ్ ॥50॥

మహానందుడు బహుప్రకారములుగా యుద్ధము చేసిన తరువాత అతి సులభముగా దముడు మహానందుని హృదయమునందు కాలాగ్నితో సమానమైన కాంతి కలిగిన బాణమును వదిలెను.

తం లగ్నమాత్మనోత్కృష్య విభిన్నేన తతో హృదా ।
దమం ప్రతి విచిక్షేప మహానన్దోఽసిముజ్జ్వలమ్ ॥51॥

మహానందుడు తన హృదయమునందు గ్రుచ్చుకొనిన బాణమును తనంతట తానే పెకిలించుకొని, చీల్చబడిన హృదయముతో ప్రకాశవంతమైన కత్తిని దమునిపైకి విసిరెను.

పతన్తం చైనముల్కాభం శక్త్యా చిక్షేప తం దమః ।
శిరో వేతసపత్రేణ మహానందస్య చాచ్ఛినత్ ॥52॥

ఉల్కయొక్క (ఆకాశమునుండి భూమిమీదికి పడే రేఖాకారమైన తేజఃపుంజము ఉల్క) కాంతివంటి కాంతి కలిగి, తనమీదికి పడుచున్న ఆ కత్తిని దముడు తన శక్తి ఆయుధముతో ముక్కలు చేసెను. అటుపిమ్మట వేతసపత్రమను ఆయుధముతో దముడు మహానందుని శిరస్సును ఖండించివేసెను.

తస్మిన్హతే మహానన్దే ప్రాచుర్యేణ పరాఙ్ముఖాః ।
బభూవుః పార్థివాస్తస్థౌ వపుష్మాన్ కుణ్డినాధిపః ॥53॥

మహానందుడు హతుడైన పిమ్మట చాలామంది రాజులు యుద్ధమును వదిలి వెళ్ళిపోయిరి. ఇక కుండినదేశాధిపతియగు వపుష్మంతుడు మాత్రం యుద్ధమందు మిగిలెను.

దమేన యుయుధే చాసౌ బలగర్వమదాన్వితః ।
దాక్షిణాత్యమహీపాలతనయో రణగోచరః ॥54॥

బలగర్వమదములతో కూడుకొన్నవాడు, యుద్ధములందు నేర్పరి, దాక్షిణాత్యభూపాలుని కుమారుడూ అయిన ఈ వపుష్మంతుడు దమునితో యుద్ధము చేయనారంభించెను.

తస్మిన్హతే మహానన్దే ప్రాచుర్యేణ పరాఙ్ముఖాః ।
బభూవుః పార్థివాస్తస్థౌ వపుష్మాన్ కుణ్డినాధిపః ॥53॥

మహానందుడు హతుడైన పిమ్మట చాలామంది రాజులు యుద్ధమును వదిలి వెళ్ళిపోయిరి. ఇక కుండినదేశాధిపతియగు వపుష్మంతుడు మాత్రం యుద్ధమందు మిగిలెను.

దమేన యుయుధే చాసౌ బలగర్వమదాన్వితః ।
దాక్షిణాత్యమహీపాలతనయో రణగోచరః ॥54॥

బలగర్వమదములతో కూడుకొన్నవాడు, యుద్ధములందు నేర్పరి, దాక్షిణాత్యభూపాలుని కుమారుడూ అయిన ఈ వపుష్మంతుడు దమునితో యుద్ధము చేయనారంభించెను.

యుధ్యమానస్య తస్యోగ్రం కరవాలం స వై లఘు ।
చిచ్ఛేద సారథేశ్చైవ శిరః సంఖ్యే తథా ధ్వజమ్ ॥55॥

తనతో యుద్ధము చేయుచున్న వపుష్మంతుని ఖడ్గమును, రథసారథియొక్క శిరస్సును, ధ్వజమును (జెండాను) దముడు ఖండించి వేసెను.

ఛిన్నఖడ్గో గదాం సో౽థ జగ్రాహ బహుకణ్టకామ్ ।
తామప్యస్య స చిచ్ఛేద కరస్థామేవ సత్వరః ॥56॥

తన ఖడ్గము ఛిన్నమయిన పిమ్మట వపుష్మంతుడు చాలా ముళ్ళు కలిగిన గదను చేతియందు ధరించెను. చేతియందు ఉండగానే దముడు ఆ గదాయుధమును కూడా ఖండించివేసెను.

యావదన్యత్సమాదత్తే స వపుష్మాన్వరాయుధమ్ ।
తావచ్ఛరేణ తం విద్ధ్వా దమో భూమావపాతయత్ ॥57॥

తిరిగి వపుష్మంతుడు ఒక గొప్ప ఆయుధమును గ్రహించి ప్రయోగించబోవుచుండగనే, దముడు బాణములతో ఖండించి వపుష్మంతుని భూమియందు పడవేసెను.

స పతితస్తతో భూమౌ విహ్వలాఙ్గః సవేపథుః ।
వినివృత్తమతిర్యుద్ధాద్బభూవ క్షితిపాత్మజః ॥58॥

రాజపుత్రుడగు వపుష్మంతుడు భూమియందు పడగానే శక్తిహీనుడై, వణకుచున్నవాడై యుద్ధమునుండి వెనుకకు మరలుటకు నిశ్చయించుకొనెను.

తమాలోక్య తథా భూతమయుద్ధమతిమాత్మవాన్ ।
ఉత్సృజ్యాదాయ సుమనాం సుమనాః ప్రయయౌ దమః ॥59॥

యుద్ధమందు ఆశ వదలుకొన్న వపుష్మంతుని చూచి, అతనిని వదిలిపెట్టి, ఆనందముతో నిండిన హృదయముగలవాడై దముడు సుమనను తీసుకొని బయలుదేరెను.

తతో దశార్ణాధిపతిః ప్రీతిమానకరోత్తయోః ।
దమస్య సుమనాయాశ్చ వివాహం విధిపూర్వకమ్ ॥60॥

అంతట దశార్ణాధిపతియగు చారువర్మ సంతోషించినవాడై శాస్త్రవిధ్యుక్తప్రకారము దమునికి, సుమనాదేవికి వివాహము జరిపించెను.

కృతదారో దమస్తత్ర దశార్ణాధిపతేః పురే ।
స్థిత్వా౽ల్పకాలం ప్రయయౌ సభార్యో నిజమన్దిరమ్ ॥61॥

భార్యాసమేతుడయిన దముడు దశార్ణాధిపతియొక్క పురమందు కొద్దికాలం ఉండి, అటుపిమ్మట తన భార్యతో తన గృహమునకు వెళ్ళెను.

దశార్ణాధిపతిశ్చాసౌ దత్త్వా నాగాంస్తురఙ్గమాన్ ।
రథగో౽శ్వఖరోష్ట్రాంశ్చ దాసీదాసాంస్తథా బహూన్ ॥62॥

వస్త్రాలంకారచాపాదివరోపస్కరమాసనమ్ ।
అన్యైస్తైశ్చ తథా భాణ్డైః పరిపూర్ణం వ్యసర్జయత్ ॥63॥

ఏనుగులు, గుఱ్ఱములు, రథములు, గోవులు, అశ్వములు, ఖరములు, ఒంటెలు, దాసదాసీజనమును, అనేకములైన వస్త్రములు, అలంకారములు, ధనుర్బాణములు, శ్రేష్ఠమైన ఆసనము, వంటింటి సామగ్రి మొ॥వాటిని ఇచ్చి తన కూతురగు సుమనాదేవిని, అల్లుడగు దముని సాగనంపెను.

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే దమచరితే త్రింశదధికశతతమోఽధ్యాయః ॥130॥

శ్రీ మార్కండేయ మహాపురాణమందలి దముని చరితమను నూటముప్పదియవ అధ్యాయం సమాప్తం.



ఏకత్రింశదధికశతతమోఽధ్యాయః – నూటముప్పది ఒకటవ అధ్యాయం
దమచరితమ్ – దముని చరితం

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

స తాం లబ్ధ్వా తథా పత్నీం సుమనాం సుమహామునే ।
ప్రణమ్య స పితుః పాదౌ మాతుశ్చ క్షితిపాత్మజః ॥1॥

సా చ తౌ శ్వశురౌ సుభ్రూర్నామ సుమనా తదా ।
తాభ్యాం తౌ చ తదా విప్ర ఆశీర్భిరభినన్దితౌ ॥2॥

ఓ మహామునీ ! రాజకుమారుడగు దముడు 'సుమన' అను కన్యను భార్యగా పొంది తిరిగి వచ్చి తన తల్లిదండ్రుల పాదములకు నమస్కరించెను. మరియు ఆ సుమనాదేవి కూడా తన అత్తమామలకు నమస్కరించెను. ఓ విప్రుడా! ఆ సమయమందు వారునూ ఆ ఇద్దరిని ఆశీర్వచనములచే అభినందించిరి.

మహోత్సవశ్చ సంజజ్ఞే నరిష్యన్తస్య వై పురే ।
కృతదారే చ సంప్రాప్తే దశార్ణాధిపతేః పురాత్ ॥3॥

భార్యను పొంది దముడు దశార్ణాధిపతియొక్క పట్టణమునుండి తిరిగివచ్చిన పిమ్మట నరిష్యంతుని పురమందు గొప్ప ఉత్సవము జరిగెను.

సంబంధినం దశార్ణేశం జితాంశ్చ పృథివీశ్వరాన్ ।
శ్రుత్వా పుత్రేణ ముముదే నరిష్యన్తో మహీపతిః ॥4॥

భూపాలకుడగు నరిష్యంతుడు దశార్ణాధిపతితో సంబంధమును, అనేకమంది రాజులను జయించిన విషయమును తన పుత్రుని వలన విని మిక్కిలి సంతోషమును పొందెను.

సోఽపి రేమే సుమనయా మహారాజసుతో దమః ।
వరోద్యానవనోద్దేశే ప్రాసాదగిరిసానుషు ॥5॥

మహారాజగు నరిష్యంతుని కుమారుడగు దముడు కూడా శ్రేష్ఠములయిన ఉద్యానవన ప్రదేశములందు, ప్రాసాదములందు, పర్వతశ్రేణులందు సుమనతో విహరించసాగెను.

అథ కాలేన మహతా రమమాణా దమేన సా ।
అవాప గర్భే సుమనా దశార్ణాధిపతేః సుతా ॥6॥

దశార్ణదేశాధిపతి కుమార్తెయగు సుమనాదేవి ఈ విధముగా తన భర్తయగు దమునితో చాలాకాలము విహరించుచూ, కొంతకాలము గడచిన పిమ్మట గర్భమును ధరించెను.

సోఽపి రాజా నరిష్యన్తో భుక్తభోగో మహీపతిః ।
వయఃపరిణతిం ప్రాప్య దమం రాజ్యేఽభిషిచ్య చ ॥7॥

వనం జగామేన్ద్రసేనా పత్నీ చాస్య తపస్వినీ ।
వానప్రస్థవిధానేన స తత్ర సమతిష్ఠత ॥8॥

ఆ నరిష్యంతమహారాజు కూడా భోగములను అనుభవించిన పిమ్మట వార్ధక్యావస్థను పొందినవాడై దముని రాజ్యపట్టాభిషిక్తుని గావించి తపస్విని అయిన తన భార్య అగు ఇంద్రసేనాదేవితో గూడా అడవులకు వెళ్ళెను. అచ్చట ఆ మహారాజు వానప్రస్థాశ్రమవిధానముతో నివసింపసాగెను.

దాక్షిణాత్యః సుదుర్వృత్తః సంక్రందనసుతో వనే ।
వపుష్మాన్స మృగాన్వన్తుం యయావల్పపదానుగః ॥9॥

ఒకనాడు దుష్టప్రవర్తనగలవాడు, సంక్రందనపుత్రుడు, దాక్షిణాత్యుడూ అగు వపుష్మంతుడు వేట నిమిత్తమై కొద్దిమంది అనుచరులతో అచ్చటకు వచ్చెను.

స తం దృష్ట్వా నరిష్యన్తం తాపసం మలపఙ్కినమ్ ।
ఇన్ద్రసేనాం చ తత్పత్నీం తపసాఽతిసుదుర్బలామ్ ॥10॥

పప్రచ్ఛ కస్త్వం భో విప్రః క్షత్రియో వా వనేచరః ।
వానప్రస్థమనుప్రాప్తో వైశ్యో వా మమ కథ్యతామ్ ॥11॥

ఆ వపుష్మంతుడు తపోనిరతుడు, మలపంకితశరీరుడు అయిన నరిష్యంతుని, తపస్సు ఆచరించుటచే మిక్కిలి దుర్బలురాలూ అయిన ఇంద్రసేనాదేవిని చూచి ఇట్లు అడిగెను. "ఓయీ ! మీరెవరు? బ్రాహ్మణులా? క్షత్రియులా? వనేచరులా? వానప్రస్థాశ్రమమును పొందిన వైశ్యులా? చెప్పుడు.

తతో మౌనవ్రతీ భూపో న హి తస్యోత్తరం దదౌ ।
ఇన్ద్రసేనా చ తత్సర్వమాచష్టాస్మై యథాతథమ్ ॥12॥

అంతట మౌనవ్రతమును అవలంబించిన ఆ నరిష్యంతమహారాజు అతడడిగిన ప్రశ్నకు బదులివ్వలేదు. కాని ఇంద్రసేనాదేవి తమ వృత్తాంతమంతయు ఉన్నది ఉన్నట్లుగా చెప్పెను.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

జ్ఞాత్వా తం చ నరిష్యన్తం వపుష్మాన్పితరం రిపోః ।
ప్రాప్తోఽసీతి వదన్కోపాజ్జటాసు పరిగృహ్య చ ॥13॥

హాహేతి ఇన్ద్రసేనాయాం రుదన్త్యాం బాష్పగద్గదమ్ ।
చకర్ష కోపాత్ఖడ్గం చ వాక్యం చేదమువాచ హ ॥14॥

ఇంద్రసేనాదేవి చెప్పిన మాటలవలన అతడిని తన శత్రువుయొక్క తండ్రి నరిష్యంతునిగా తెలుసుకొని వపుష్మంతుడు "దొరికితివి" అని పలుకుచూ నరిష్యంతుని జటలను కోపముతో పట్టుకొనెను. అప్పుడు ఇంద్రసేన హాహాకారములు చేయుచూ గద్గదస్వరముతో రోదింపసాగెను. అప్పుడు దుష్టుడగు ఆ వపుష్మంతుడు కోపముతో తన ఒరనుండి కత్తిని బయటకు లాగి ఇట్లు పలికెను.

నిర్జితః సమరే యేన యేన మే సుమనా హృతా ।
దమస్య తస్య పితరం హనిష్యేఽవతు తం దమః ॥15॥

ఎవడు నన్ను యుద్ధమున ఓడించెనో, ఎవడు నానుండి సుమనను హరించి తీసుకుపోయెనో అట్టి దముని తండ్రిని నేను చంపెదను. అతడిని దముడు రక్షించుగాక !

యేనాఖిలమహీపాలపుత్రాః కన్యార్థమాగతాః ।
అవధూతా హనిష్యేఽహం పితరం తస్య దుర్మతేః ॥16॥

కన్యార్థమై వచ్చిన సమస్తరాజపుత్రులను ఎవడు అవమానించెనో అట్టి దుర్మతియగు దముని తండ్రిని నేడు నేను చంపెదను.

యౌవనాస్త్రస్వరూపేషు మదో యస్య దురాత్మనః ।
స దమో వారయత్యేష హన్మి తస్య రిపోర్గురుమ్ ॥17॥

యౌవనము, అస్త్రములు, తన ఆకారము వీటియందు దుర్గార్గుడైన ఎవనికయితే గర్వము కలదో అట్టి దముడు ఇప్పుడు వారించుగాక ! నేనతని తండ్రిని చంపెదను.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

ఇత్యుక్త్వా స దురాచారో వపుష్మానవనీపతిః ।
క్రందన్త్యామిన్ద్రసేనాయాం శిరశ్చిచ్ఛేద తస్య చ ॥18॥

ఈ విధముగా పలికి దుర్మార్గుడైన రాజగు ఆ వపుష్మంతుడు ఇంద్రసేనాదేవి రోదించుచుండగనే ఆమెయెదుటే నరిష్మంతుని తలను నరికెను.

తతో ధిగ్ధిఙ్మునిజనా అన్యే చ వనవాసినః ।
తమూచుః స చ తం హత్వా జగామ స్వపురం వనాత్ ॥19॥

అంతట మునిజనులు, మిగిలిన వనవాసులు వపుష్మంతుని నిందింపసాగిరి. అతడు కూడా నరిష్యంతుని వధించిన పిమ్మట ఆ అడవినుండి తన పట్టణమునకు వెళ్ళిపోయెను.

గతే తస్మిన్వినిశ్వస్య సేంద్రసేనా వపుష్మతి ।
ప్రేషయామాస పుత్రస్య సమీపం శూద్రతాపసమ్ ॥20॥

ఆ వపుష్మంతుడు అచ్చటినుంచి వెళ్ళిపోగానే ఆ ఇంద్రసేనాదేవి దీర్ఘముగా నిట్టూర్చి తమ కుమారుడగు దమునివద్దకు ఒక శూద్రతాపసుని పంపెను.

గచ్ఛేథా ఆశు మే పుత్రం దమం బ్రూహి వచో మమ ।
అభిజ్ఞో హ్యసి మద్భర్తృవృత్తాన్తం ప్రోచ్యతేఽత్ర కిమ్ ॥21॥

ఆ శూద్రతాపసునితో ఇంద్రసేన ఇట్లు పలికెను. "నీవు శీఘ్రముగా వెళ్ళి నా కుమారుడయిన దమునికి నా మాటగా చెప్పుము. నా భర్త వృత్తాంతమును నీవు ఎరుగుదువు. ఇక నీకు చెప్పవలసినది ఏమున్నది?

తథాఽపి వాచ్యః పుత్రో మే యద్బ్రవీమ్యతిదుఃఖితా ।
లంఘనామీదృశీం ప్రాప్తాం విలోక్యైతాం మహీపతేః ॥22॥

అయినప్పటికీ మహీపతి అయిన నా భర్తకు సంభవించిన ఇట్టి దుర్గతిని చూచుటచే మిక్కిలి దుఃఖమును పొందిన నేను చెప్పునదంతయూ నా పుత్రునితో చెప్పుము.

మద్భర్త్రాధికృతో రాజా చతుర్ణాం పరిపాలకః ।
త్వమాశ్రమణాం కిం యుక్తం తాపసాన్యన్న రక్షసి ॥23॥

నీవు నా భర్తచే నాలుగు ఆశ్రమాలవారిని రక్షించువానిగా రాజుగా నియమింపబడినావు. నీవు తపోజనులను రక్షించుట లేదు. ఇది నీకు న్యాయమా ?

భర్తా మమ నరిష్యన్తస్తాపసస్తపసి స్థితః ।
విలపన్త్యాస్తథాఽనాథో యథా నాథే తథా త్వయి ॥24॥

ఆకృష్య కేశేషు బలాదపరాధం వినా తతః ।
హతో వపుష్మతా ఖ్యాతిమితి తే భూపతిర్గతా ॥25॥

నా భర్త అయిన నరిష్యంతుడు తపస్వియై తపమాచరించుచుండెను. అట్టి సమయమందు నేను విలపించుచుండగనే, నీవు నాథుడవై యుండగానే నా భర్త అనాథుడై, (రక్షించువాడు ఎవరూ లేనట్టివాడై), బలవంతముగా ఎట్టి అపరాధమూ చేయకుండానే జుట్టుపట్టి లాగబడి చంపబడినాడు. ఇట్టి ప్రఖ్యాతిని నీ ప్రభువు (అనగా నా భర్త) పొందినాడు.

ఏవం స్థితే తత్క్రియతాం యథా ధర్మో న లుప్యతే ।
తథా చ నైవ వక్తవ్యం మాతాహం తాపసీ యతః ॥26॥

ఈ పరిస్థితిలో ఏ విధముగా ధర్మమునకు లోపము లేకుండునో అట్లు చేయుము. నీ తల్లి అయిన నేను తాపసిని. ఇంతకు మించి అధికముగా చెప్పుట ఉచితము కాదు.

పితా వృద్ధస్తపస్వీ చ నాఽపరాధేన దూషితః ।
నిహతో యేన యత్తస్య కర్తవ్యం తద్విచిన్త్యతామ్ ॥27॥

నీ తండ్రి వృద్ధుడు మరియు తపస్వి. అతడెట్టి అపరాధమూ చేయకనే దూషింపబడినాడు. కావున నీ తండ్రిని ఎవడు వధించెనో అతని విషయమందు ఏది చేయదగునో దానిని విచారింపుము.

సన్తి తే మన్త్రిణో వీరాః సర్వశాస్త్రార్థవేదినః ।
తైః సహాలోచ్య యత్కార్యమేవంభూతే కురుష్వ తత్ ॥28॥

సర్వశాస్త్రములను తెలిసినవారును, మహావీరులూనగు మంత్రులు నీవద్ద ఉన్నారు. వారితో ఆలోచించి ఈ పరిస్థితిలో ఏది కర్తవ్యమో దానినాచరింపుము.

నాస్మాకమధికారోఽత్ర తాపసానాం నరాధిప ।
కురుష్వైతదితీత్థం త్వమేవం భూయోఽపి భాషితమ్ ॥29॥

ఓ రాజా ! తాపసులమగు మాకు ఈ విషయమందు ఇట్లు చేయుమని గాని, ఈ విధముగా నీవు ఉండుమని గాని చెప్పుటకు అధికారము లేదు.

విదూరథస్య జనకో యవనేన యథా హతః ।
తథాయం తవ పుత్రస్య కులం తేన వినాశితమ్ ॥30॥

విదూరథుని తండ్రి ఏ విధముగా యవనుని చేతిలో మృతిచెందెనో అట్లే నీ తండ్రిని వధించి వపుష్మంతుడు కులగౌరవమును నాశనము చేసినాడు.

జమ్భస్యాసురరాజస్య పితా దష్టో భుజఙ్గమైః ।
తేనాప్యఖిలపాతాలవాసినః పన్నగాః హతాః ॥31॥

రాక్షసరాజయిన జంభుని తండ్రిని పాములు ఎప్పుడయితే కాటు వేసినవో అప్పుడు జంభుడు పాతాలవాసులయిన సర్పములనన్నింటినీ చంపి వేసెను.

పరాశరేణ పితరం శక్తిం తం రక్షసా హతమ్ ।
శ్రుత్వాగ్నౌ పాతితం కృత్స్నం రక్షసామభవత్కులమ్ ॥32॥

రాక్షసులచే తన తండ్రి అయిన శక్తి చంపబడుటను విని పరాశరుడు సంపూర్ణ రాక్షసకులమును అగ్నిలో పడవేసి దగ్ధము చేసెను.

అన్యస్యాపి స్వవంశస్య లంఘనా క్రియతే హి యా ।
తాం నాలం క్షత్రియః సోఢుం కిం పునః పితృమారణమ్ ॥33॥

తన వంశమును ఇతరులు అవమానించుటచేతనే క్షత్రియుడు ఎప్పుడయితే దానిని కూడా సహింపలేకపోయెనో ఇక తండ్రిని వధించిన విషయమున ఏమని చెప్పుదును?

నాయం పితా తే నిహతో నాస్మిన్ శస్త్రం నిపాతితమ్ ।
త్వామత్ర నిహతం మన్యే త్వయి శస్త్రం నిపాతితమ్ ॥34॥

నిజానికి నీ తండ్రి చంపబడలేదు. నీ తండ్రియందు శస్త్రప్రయోగము జరగనూ లేదు. నీవే చంపబడినావని, నీయందే శస్త్రాఘాతము జరిగిందనీ నేను తలపోయుచున్నాను.

బిభేత్యస్య హి కః శస్త్రం న్యస్తం యేన వనౌకసామ్ ।
తవ నృపస్య పుత్రస్య మా బిభేతు బిభేతు వా ॥35॥

తవేయం లంఘనా యుక్తా యదస్మింస్తత్సమాచర ।
వపుష్మతి మహారాజ సభృత్యజ్ఞాతిబాన్ధవే ॥36॥

ఎవడయితే ఆయుధహీనులయిన వనవాసులపై ఆయుధమును ప్రయోగించెనో అతడికి ఎవరు భయపడెదరు? (అట్టివాడు నిజమైన యోద్ధ కాడని ఆశయము.) రాజకుమారుడవయిన నీకు భయపడినా, భయపడకపోయినా ఏమైనా కానిమ్ము. ఈ విషయమందు అవమానము నీకే జరిగినది. ఓ మహారాజా! భృత్యులు, జ్ఞాతులు, బంధుజనము వీరితో కూడిన వపుష్మంతునియందు ఏది ఆచరింపతగినదో దానిని ఆచరింపుము.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

ఇతి సంక్రాన్తసన్దేశమిన్ద్రసేనా విసృజ్య తమ్ ।
పతిదేహముపాశ్లిష్య వివేశాగ్నిం మనస్వినీ ॥37॥

ప్రశస్తమైన మనస్సుగల ఇంద్రసేనాదేవి శూద్రతాపసునికి ఈవిధముగా సందేశము చెప్పి, అతడిని విడిచిపెట్టి, తన భర్త మృతదేహమును ఆలింగనము చేసుకొని అగ్నిప్రవేశము చేసెను.

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే దమచరితవర్ణనం నామ ఏకత్రింశదధికశతతమోఽధ్యాయః ॥131॥

శ్రీ మార్కండేయ మహాపురాణమందలి దముని చరితమను నూట ముప్పదియొకటవ అధ్యాయం సమాప్తం.



ద్వాత్రింశదధికశతతమోఽధ్యాయః – నూటముప్పదిరెండవ అధ్యాయం
దమచరితమ్ – దముని చరితం

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

ఇన్ద్రసేనాసమాజ్ఞప్తః స గత్వా శూద్రతాపసః ।
సమాచష్టు యథాపూర్వం దమాయ నిధనం పితుః ॥1॥

ఆ శూద్రతాపసుడు ఇంద్రసేనాదేవి యొక్క ఆజ్ఞను గైకొని, దముని సమీపమునకు వెళ్ళి ఇంద్రసేనాదేవి చెప్పమనిన వృత్తాంతమును, అతడి తండ్రియగు నరిష్యన్తమహారాజుయొక్క మరణవార్తను చెప్పెను.

తాపసేన సమాఖ్యాతే దమస్తేన పితుర్వధే ।
క్రోధేనాతీవ జజ్వాల హవిషేవాగ్నిరుద్ధతః ॥2॥

తండ్రి వధింపబడిన వృత్తాంతమును తాపసుని ద్వారా విని దముడు, హవిస్సులచే అగ్ని ప్రజ్వలించు విధముగా, మిక్కిలి కోపముతో రగిలిపోయెను.

స తు క్రోధాగ్నినా ధీరో దహ్యమానో మహామునే ।
కరం కరేణ నిష్పిష్య వాక్యమేతదువాచ హ ॥3॥

ఓ మహామునీ ! ధీరుడగు ఆ దముడు క్రోధమనెడు అగ్నితో దహింపబడుచున్నవాడై, ఒకచేతితో మరొకచేతిని గట్టిగా అదిమిపట్టుచు ఇట్లు పలికెను.

అనాథ ఇవ మే తాతో మయి పుత్రే తు జీవతి ।
ఘాతితః సునృశంసేన పరిభూయ కులం మమ ॥4॥

పుత్రుడనైన నేను జీవించియుండగానే దుర్గార్గుడైన వపుష్మంతుడు నా వంశమును అగౌరవపరచుచు అనాథునివలే నా తండ్రిని వధించెను.

తాపం కరోమ్యహం కిం వాఽప్యేష క్లైబ్యాత్క్షమామ్యహమ్ ।
దుర్వృత్తశాన్తౌ శిష్టానాం పాలనేఽధికృతా వయమ్ ॥5॥

నేనీ శత్రువుపై కోపించవలెనా? లేక నపుంసకునివలే క్షమించవలెనా? దుష్టులనణచివేసి సన్మార్గులను పాలించుటకు నేను నియమింపబడితిని.

పితరం చాపి నిహతం దృష్ట్వా జీవన్తి శత్రవః ।
తత్కిమేతేన బహునా హా తాతేతి చ కిం పునః ॥6॥

విలాపేన యత్కృత్యం తదేషోఽత్ర కరోమ్యహమ్ ।
యద్యహం తస్య రక్తేన దేహోత్థేన వపుష్మతః ॥
న కరోమి గురోస్తృప్తిం తత్ప్రవేక్ష్యే హుతాశనమ్ ॥7॥

నా తండ్రిని హతమార్చి కూడా శత్రువు ఇప్పటికీ జీవించియే యున్నాడు. అందువలన ఎక్కువగా మాట్లాడి ప్రయోజనమేమున్నది? ఓ తండ్రీ ! యని విలపించుటవలన ప్రయోజనమేమున్నది? ఇప్పుడు కర్తవ్యము ఏది కలదో, దానిని చేయుదును. నేను వపుష్మంతుని రక్తముతో నా తండ్రికి తృప్తిని కలిగించకపోయినయెడల అగ్నిప్రవేశము చేయుదును.

తచ్ఛోణితేనోదకకర్మ తస్య మాంసేన సమ్యగ్ద్విజభోజనం చ ।
కుర్యాం పితుస్తస్య చ పిండదానం న చేత్ప్రవేక్ష్యామి హుతాశనం తత్ ॥8॥

నేను వపుష్మంతుని చంపి అతడి రక్తముతో నా తండ్రికి ఉదకకర్మ చేసెదను. అతడి మాంసముతో బ్రాహ్మణులకు (రాక్షసకులోత్పన్నులు) భోజనము పెట్టెదను. నా తండ్రికి మరియు ఆ వపుష్మంతునికి పిండప్రదానము చేసెదను. నేనట్లు ఆచరించకపోయినచో అగ్నిప్రవేశము చేసెదను.

సాహాయ్యమస్యాసురదేవయక్షగన్ధర్వవిద్యాధరసిద్ధసంఘాః ।
కుర్వన్తి చేత్తానపి చాస్త్రపూగైర్భస్మీకరోమ్యేష రుషా సమేతః ॥9॥

ఒకవేళ నా శత్రువయిన ఆ వపుష్మంతునికి యుద్ధమందు దేవతలు, యక్షులు, గంధర్వులు, విద్యాధరులు, సిద్ధులు వీరందరూ సహాయము చేసినచో వారిని కూడా కోపయుక్తుడనై నేను నా అస్త్రసమూహములతో భస్మీపటలము చేసెదను.

నిశ్శూరమాధార్మికమప్రశస్తం తం దాక్షిణాత్యం సమరే నిహత్య ।
భోక్ష్యే తతోఽహం పృథివీం చ కృత్స్నాం వహ్నిం ప్రవేక్ష్యామ్యనిహత్య తం వా ॥10॥

శౌర్యహీనుడు, అధార్మికుడు, నింద్యుడు అగు ఆ దాక్షిణాత్యుని సమరమందు చంపి తిరిగి నేను సమస్తభూమిని అనుభవించెదను. ఒకవేళ అతడిని చంపుటయందు అసమర్థుడనయినచో నేను వహ్నిప్రవేశము చేసెదను. (అధార్మిక ఏవ ఆధార్మికః)

సుదర్మతిం తాపసవృద్ధఘాతినం వనస్థగం సాధువిధిం విదగ్ధగమ్ ।
హన్తాహమద్యాఖిలబన్ధుమిత్రపదాతిహస్త్యశ్వబలైః సమేతమ్ ॥11॥

దుష్టబుద్ధి కలిగినవాడు, వృద్ధతాపసుని హతమార్చినవాడు, వనవాసి, సాధువాదములను తిరస్కరించువాడు, సమస్తబంధువులు, స్నేహితులు, సైన్యము, ఏనుగులు, గుర్రముల బలములతో కూడుకొన్నవాడూ అగు వపుష్మంతుని నేడు సంహరించెదను.

ఏషోఽహమాదాయ ధనుః సఖడ్గో రథీ తథైవారిబలం సమేత్య ।
కరోమి వై యత్కదనం సమస్తాః పశ్యన్తు మే దేవగణాః సమేతాః ॥12॥

నేను ఇప్పుడే విల్లమ్ములను ధరించి, ఖడ్గమును చేతబూని, రథమునధిరోహించి, శత్రుసైన్యమును చేరుకొని శత్రువగు ఆ వపుష్మంతుని ఎట్లు సంహరించెదనో ఆ దేవగణములన్నియు చూచునుగాక !

యో యః సహాయో భవితాద్య తస్య మయా సమేతస్య రణాయ భూయః ।
తస్యైవ నిశ్శేషకులక్షయాయ సముద్యతోఽహం నిజబాహుసైన్యః ॥13॥

నాతో యుద్ధము చేయుటకు వచ్చునట్టి ఆ వపుష్మంతునికి ఎవరెవరు సహాయపడెదరో అట్టివారికి సమస్తకులక్షయమును చేయుటకు స్వీయబాహుసైన్యసమన్వితుడనై ఉద్యుక్తుడనయ్యెదను గాక !

యది కులిశధరోఽస్మిన్సంగయుగే దేవరాజః
పితృపతిరథ చోగ్రం దణ్డముద్యమ్య కోపాత్ ।
ధనపతివరుణార్కా రక్షితుం తం యతన్తే
నిశితశరవరైర్ఘాతయిష్యే తథాపి ॥14॥

ఈ యుద్ధమందు వజ్రాయుధధారియగు ఇంద్రుడు, కోపముతో భయంకరమైన దండమును ధరించిన యముడు, లేదా కుబేర, వరుణ, సూర్యులు ఎవరైనా ఆ వపుష్మంతుని రక్షించుటకు ప్రయత్నించినచో వారిని తీక్ష్ణమైన శ్రేష్ఠమైన బాణములతో చంపివేయగలను.

నియతమతిరదోషః కాననాఖణ్డలోకో
నిపతితఫలభక్షః సర్వభూతేషు మైత్రః ।
ప్రభవతి మయి పుత్రే హింసితో యేన తాతః
పిశితరుధిరతృప్తాస్తస్య సన్త్వద్య గృధ్రాః ॥15॥

సమర్థుడనైన పుత్రుడను నేను జీవించియుండగానే సంయమచిత్తుడు, దోషరహితుడు, అడవులే అఖండలోకములుగా కలిగినవాడు, రాలిపడిన పండ్లను మాత్రమే భుజించువాడు, సమస్తప్రాణులందు మైత్రీభావము కలిగినవాడు అయిన నా తండ్రిని ఎవరు చంపితిరో అతడి రక్తమాంసములతో రాబందులు నేడు తృప్తిచెందును గాక!

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే దమచరితే ద్వాత్రింశదధికశతతమోఽధ్యాయః ॥132॥

శ్రీ మార్కండేయ మహాపురాణమందలి దముని చరితమను నూటముప్పదిరెండవ అధ్యాయం సమాప్తం.



త్రయస్త్రింశదధికశతతమోఽధ్యాయః – నూటముప్పదిమూడవ అధ్యాయం
దమచరితే వపుష్మద్వధః – దముని చరితమందు వపుష్మంతుని చంపుట

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

ఇతి ప్రతిజ్ఞాయ తదా నరిష్యన్తసుతో దమః ।
కోపామర్షవివృత్తాక్షః శ్మశ్రుమావృత్య పాణినా ॥1॥

హా హతోఽస్మీతి పితరం ధ్యాత్వా దేవం వినిన్ద్య చ ।
ప్రోవాచ మన్త్రిణః సర్వానానినాయ పురోహితమ్ ॥2॥

నరిష్యంతుని పుత్రుడగు దముడు ఈ విధముగా ప్రతిజ్ఞ చేసి కోపముతో ఎఱ్ఱబడిన నేత్రములు గలవాడై, తనచేతితో మీసములు మెలిత్రిప్పెను. ఇంకను "హా, హతోఽస్మి" అని తన తండ్రినిగూర్చి చింతించుచు దైవమును నిందించెను. పిమ్మట పురోహితులను పిలిపించి, మంత్రులందరితో ఇట్లు పలికెను.

దమ ఉవాచ – దముడు పలికాడు.

యదత్ర కృత్యం తద్బ్రూత తాతే ప్రాప్తే సురాలయమ్ ।
శ్రుతం భవద్భిర్యత్ప్రోక్తం తేన శూద్రతపస్వినా ॥3॥

నా తండ్రి స్వర్గమునకు వెళ్ళెను. ఇప్పుడేమి చేయవలెనో చెప్పుడు. శూద్రతాపసుడు చెప్పినదంతయు మీరు వినియున్నారు.

వృద్ధస్తపస్వీ స నృపో వానప్రస్థవ్రతే స్థితః ।
మౌనవ్రతధరోఽశస్త్రో మన్మాత్రా చేన్ద్రసేనయా ॥4॥

ప్రోక్తం సంపృష్టయా స్వాత్మ్యాద్యాథాతథ్యం వపుష్మతే ।
తేనాపి ఖడ్గమాకృష్య జటాం సవ్యేన పాణినా ॥5॥

ధృత్వా జఘాన దుష్టాత్మా లోకనాథమనాథవత్ ।
మాతా చ సన్దిశ్య హి మాం ధిక్ఛబ్దం బ్రువతీ సతీ ॥6॥

మన్దభాగ్యం చ నిఃశ్రీకం ప్రవిష్టా హవ్యవాహనమ్ ।
తమాలిఙ్గ్య నరిష్యన్తం ప్రయాతా త్రిదశాలయమ్ ॥7॥

నా తండ్రి అయిన నరిష్యన్తమహారాజు వార్ధక్యావస్థయందు తపోనిరతుడై, ఎట్టి శస్త్రములు లేనివాడై మౌనవ్రతమును ధరించియుండెను. వపుష్మంతుడు అడిగినదానికి నా తల్లియగు ఇంద్రసేన అతడికి అంతయు యథార్థమును చెప్పెను. అప్పుడా దుర్మార్గుడు కత్తిని లాగి పట్టుకొని, ఎడమచేతితో నా తండ్రి జుట్టు పట్టుకొని లోకనాథుడైన నా తండ్రిని అనాథునివలే చంపివేసెను. నా తల్లియగు ఇంద్రసేనాదేవి ఈ వృత్తాంతమంతయు సందేశముద్వారా తెలియపరచి, నన్ను నిందార్హునిగాను, దురదృష్టవంతునిగాను, భాగ్యహీనునిగాను పలుకుచు మృతుడైన తన భర్తను కౌగలించుకొని అగ్నిప్రవేశముచేసి స్వర్గలోకమునకు వెళ్ళెను.

సోఽహమద్య కరిష్యామి యన్మే మాతురుదీరితమ్ ।
హస్త్యశ్వరథపాదాతం సైన్యం చ పరికల్ప్యతామ్ ॥8॥

అనిర్వాప్య పితుర్వైరమహత్వా పితృఘాతకమ్ ।
అకృత్వా చ వచో మాతుర్జీవితుం కిమిహోత్సహే ॥9॥

నేనిప్పుడు నా తల్లి చెప్పినవిధంగా ప్రవర్తించెదను. ఏనుగులు, గుర్రములు, రథములు, పాదచారులతో చతురంగబలమును సన్నద్ధము చేయుడు. తండ్రియొక్క వైరమును ఆర్పకుండా, తండ్రిని హతమార్చినవారిని చంపకుండా, నా తల్లిమాటను ఆచరించకుండా నేను జీవించుటకెట్లు ఉత్సాహపడెదను? (పితుః + వైరమ్ + అహత్వా = పితుర్వైరమహత్వా)

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

మన్త్రిణస్తద్వచః శ్రుత్వా హాహేత్యుక్త్వా తథా చ తత్ ।
కృతవన్తో విమనసః సభృత్యబలవాహనాః ॥10॥

నిర్యయుః సపరీవారాః పురస్కృత్య దమం నృపమ్ ।
గృహీత్వా చాశిషో విప్రాత్త్రికాలజ్ఞాత్పురోధసః ॥11॥

మంత్రులు దముడు పలికిన మాటలను విని హాహాకారములను చేయుచు విమనస్కులైరి. భృత్యులు, సైన్యబలము, వాహనములతో కూడుకొని, పరివారముతోసహా, దముని ముందు ఉంచుకొని, త్రికాలజ్ఞుడైన బ్రాహ్మణపురోహితునివద్ద ఆశీస్సులు తీసుకొని మంత్రులందరు యుద్ధమునకు బయలుదేరిరి.

అహిరాడివ నిశ్శ్వస్య దమః ప్రాయాద్వపుష్మతమ్ ।
సీమాపాలాదిసామన్తాన్నిఘ్నన్యామ్యాం దిశి త్వరా ॥12॥

నాగరాజువలే బుసలు కొట్టుచు, సీమలను పాలించునట్టి సామంతులను నాశనము చేయుచు, శీఘ్రముగా వపుష్మంతుని కొరకు దక్షిణదిక్కునకు బోయెను.

నిరీక్ష్య తం సమాయాన్తం వపుష్మాన్మర్షపూరితః ।
సంక్రందనసుతేనాపి దమో జ్ఞాతో వపుష్మతా ॥
ఆయాతః సపరీవారః సామాత్యః సపరిచ్ఛదః ॥13॥

పరివార, కుటుంబ, అమాత్యసహితముగా ఆ వచ్చుచున్న వ్యక్తిని గూర్చి నిరీక్షించి సహనముతో నిండినవాడై సంక్రందనపుత్రుడగు వపుష్మంతుడు ఆ వ్యక్తిని దమునిగా తెలుసుకొనెను.

అకంపితేన మనసా ససైన్యాని దిదేశ హ ।
దూతం చ ప్రేషయామాస నిర్గమ్య నగరాద్బహిః ॥14॥

త్వం శీఘ్రతరమాగచ్ఛ నరిష్యన్తః ప్రతీక్షతే ।
సభార్యక్షత్రబంధో త్వం సమాయాహి మమాన్తికమ్ ॥15॥

ఇమే మద్బాహునిర్ముక్తాః సితా బాణాః పిపాసితాః ।
భిత్త్వా శరీరం సంగ్రామే పాస్యన్తి రుధిరం తవ ॥16॥

చలించని మనస్సుతో, సైన్యములతోసహా అందరినీ యుద్ధము చేయుటకు సిద్ధముగా ఉండవలసిందిగా వపుష్మంతుడు ఆజ్ఞాపించెను. మరియు నగరమునుంచి బయటకు వెళ్ళి ఇట్లు ప్రకటించవలసిందిగా దూతను దమునివద్దకు పంపెను. "భార్యాక్షత్రియబంధువులతోకూడినవాడా ! ఓ దమా ! నీవు శీఘ్రముగా రమ్ము. నరిష్యంతుడు నీకొరకు నిరీక్షించుచున్నాడు. నావద్దకు రమ్ము. ఈ నా వాడియైన బాణాలు నా బాహువులనుండి వెలువడి రక్తమును త్రాగవలెనని కోరుకొనుచున్నవి. అవి నీ శరీరమును ఛేదించి నీ రక్తమును త్రాగగలవు."

శ్రుత్వా దమస్తు తత్సర్వం దూతప్రోక్తం యయౌ త్వరన్ ।
స్మృత్వా ప్రతిజ్ఞాం పూర్వోక్తాం నిఃశ్వసన్నురగో యథా ॥17॥

దూత మాటలాడిన మాటలను అన్నీ విని, దముడు ముందుగా తాను చేసిన ప్రతిజ్ఞను గుర్తుకు తెచ్చుకొని పామువలే వేడి నిట్టూర్పులు విడుస్తూ శీఘ్రముగా వపుష్మంతుడున్న ప్రదేశమునకు వెళ్ళెను.

ఆహూతః సమరే చైవ పుమాన్సేనావికత్థనః ।
తతో యుద్ధమతీవాసీద్దమస్య చ వపుష్మతః ॥18॥

సైన్యబలమును గూర్చి తనను తాను శ్లాఘించుకొనుచున్న వపుష్మంతుని దముడు యుద్ధమునకు ఆహ్వానించెను. అంతట దమవపుష్మంతుల మధ్య గొప్ప యుద్ధము జరిగెను.

రథీ చ రథినా నాగీ నాగినా హయినా హయీ ।
అయుధ్యన్త చ విప్రర్షే తద్యుద్ధం తుములం హ్యభూత్ ॥19॥

ఓ విప్రర్షీ ! రథమునధిరోహించినవారితో రథారూఢులు, గజములను అధిరోహించినవారితో గజారూఢులు, అశ్వములను అధిరోహించినవారితో అశ్వారూఢులు పరస్పరయుద్ధమును చేసిరి. ఆ యుద్ధము పరస్పరసంఘాతముతో సంకులముగా నుండెను.

పశ్యతాం సర్వదేవానాం సిద్ధగన్ధర్వరక్షసామ్ ।
చకమ్పే వసుధా బ్రహ్మన్యుధ్యమానే దమే యుధి ॥20॥

ఓ బ్రహ్మస్వరూపుడా ! సమస్తదేవతలు, సిద్ధులు, గంధర్వులు, రాక్షసులు చూచుచుండగా, దముడు ఆ సంగ్రామమందు యుద్ధము చేయుచుండగా భూమి కంపించెను.

న గజో న రథీ నాశ్వస్తస్య బాణసహస్తు యః ।
తతో దమేన యుయుధే సేనాధ్యక్షో వపుష్మతః ॥21॥

దముడు ప్రయోగించుచున్న బాణములను గజములు, రథారూఢులు, అశ్వములు ఎవ్వరూ కూడా సహింపలేకపోవుచుండిరి. అంతట వపుష్మంతుని సేనాధ్యక్షుడు దమునితో యుద్ధము చేయనారంభించెను.

హృది వివ్యాధ చ దమ ఇషుణాగాద్యమాన్తికమ్ ।
తస్మిన్నిపతితే సైన్యం పలాయనపరం హ్యభూత్ ॥22॥

దముడు బాణప్రయోగముతో ఆ సేనాధ్యక్షుని హృదయమును చీల్చివేసెను. అతడు మరణించి క్రిందకు పడిపోగా వపుష్మంతుని సైన్యమంతయు పారిపోవుటకు సిద్ధమయ్యెను.

స స్వామినం తతః ప్రాహ దమః శత్రుం దమస్తథా ।
క్వ యాసి దుష్ట పితరం ఘాతయిత్వా తపస్వినమ్ ॥23॥

అశస్త్రం చ తపస్యన్తం క్షత్రియోఽసి నివర్తతామ్ ।
తతో నివృత్య స దమం యోధయామాస సానుజః ॥24॥

అంతట శత్రువులనణచునట్టి దముడు తన శత్రుసైన్యమునకు ప్రభువయిన వపుష్మంతునితో ఇట్లు పలికెను. “ఓరీ! దుష్టుడా ! తపస్వి, శస్త్రహీనుడు, తపస్సును ఆచరించుచున్నవాడు అయిన నా తండ్రిని చంపి ఎచ్చటకు పోయెదవు? నీవు క్షత్రియుడవు. పారిపోవుట నీకు తగదు. అందువలన వెనుకకు రమ్ము.” దముడు పలికిన ఆ మాటలను విని వపుష్మంతుడు తిరిగి యుద్ధరంగమునకు వచ్చి తన తమ్మునితో కూడి యుద్ధము చేసెను.

సపుత్రః సహ సంబన్ధిబాన్ధవైర్యుయుధే రథీ ।
తతః శరాసనాన్ముక్తబాణైర్వ్యాప్తాస్తతో దిశః ॥25॥

తన పుత్రులతోను, సంబంధిజనులతోను, బంధుజనముతోను కూడినవాడై, రథమునధిరోహించి వపుష్మంతుడు యుద్ధము చేసెను. అంతట తన అమ్ములపొదినుండి ప్రయోగించిన బాణములతో దిక్కులన్నియు వ్యాపించెను.

దమం చ సరథం చాశు శరజాలైరపూరయత్ ।
తతః పితృవధోత్థేన కోపేన స దమస్తథా ॥26॥

చిచ్ఛేద తాన్ శరాన్తేషాం వివ్యాధాన్యైశ్చ తానపి ।
ఏకేనైకేన బాణేన సప్త పుత్రాంస్తథా ద్విజ ॥27॥

సంబన్ధిబాన్ధవాన్మిత్రాన్నినాయ యమసాదనమ్ ।

ఇంకను వపుష్మంతుడు రథారూఢుడైన దముని శీఘ్రముగా బాణసమూహములతో నింపివేసెను. అంతట తన తండ్రిని వధించుట కారణముగా కలిగిన కోపముతో దముడు వపుష్మంతుడు ప్రయోగించిన బాణములనన్నింటినీ ఛేదించెను. అంతేకాక వపుష్మంతుని సైనికులను బాణములతో చీల్చివేసెను. ఓ బ్రాహ్మణుడా ! ఒక్కొక్క బాణముతో వపుష్మంతుని ఏడుగురు పుత్రులను అతడి సంబంధిజనులను, బంధుజనమును యమసదనమునకు పంపివేసెను.

వపుష్మాన్స రథీ క్రోధాన్నిహతాత్మజబాన్ధవః ॥28॥

యుయుధే చ స తేనాజౌ శరైరాశీవిషోపమైః ।
చిచ్ఛేద తస్య తాన్బాణాన్స దమశ్చ మహామునే ॥29॥

అంతట తన కుమారులు, బంధుజనులు వధింపబడినందున వపుష్మంతుడు కోపముతో రథమునధిరోహించి సర్పవిషతుల్యములైన బాణములతో దమునితో యుద్ధము చేసెను. ఓ మహామునీ ! దముడు కూడా ఆ బాణములనన్నింటినీ ఛేదించి వ్యర్థము చేసెను.

యుయుధాతే చ సంరబ్ధౌ పరస్పరజయైషిణౌ ।
పరస్పరశరాఘాతవిచ్ఛిన్నధనుషౌ త్వరా ॥30॥

గృహీతఖడ్గావుత్తీర్య చిక్రీడాతే మహాబలౌ ।
దమః క్షణం నృపం ధ్యాత్వా పితరం నిహతం వనే ॥31॥

కేశేష్వాకృష్య చాక్రమ్య నిపాత్య ధరణీతలే ।
శిరోధరాయాం పాదేన భుజముద్యమ్య చాబ్రవీత్ ॥32॥

దమవపుష్మంతులు ఇరువురు ఒకరినొకరు జయించవలెనని కోరికగలవారు అయిరి. పరస్పరము ప్రయోగించిన వారి బాణములతో శీఘ్రముగా ఆ ఇద్దరి ధనుస్సులు ముక్కలయినవి. అంతట మహాబలవంతులైన ఆ ఇరువురు ఖడ్గములను చేతబూని పైకి లేచి యుద్ధక్రీడను సల్పుచుండిరి. అడవిలో తన తండ్రి అయిన నరిష్మంతరాజు వపుష్మంతుని చేతిలో హతుడగుటను క్షణకాలము గుర్తు తెచ్చుకొని దముడు అతని కేశములను పట్టి నేలపై పడవేసెను. అట్లు పడవేసి అతని కంఠమును తన కాలితో నొక్కిపట్టి దముడు తన చేతిని పైకెత్తి ఇట్లనెను.

పశ్యన్తు దేవతాః సర్వా మానుషాః పన్నగాః ఖగాః ।
పాట్యమానం చ హృదయం క్షత్రబన్ధోర్వపుష్మతః ॥33॥

క్షత్రియాధముడయిన ఈ వపుష్మంతుని హృదయమును చీలుచున్నాను. సమస్త దేవతలు, మనుష్యులు, సర్పములు, పక్షులు చూచెదరు గాక ! (క్షత్రబంధు శబ్దానికి క్షత్రియాధముడని అర్థం.)

ఏవముక్త్వా చ స దమో హృదయం చ వ్యదారయత్ ।
పాతుకామశ్చ స సురైః క్షతజేన నివారితః ॥34॥

ఇట్లు పలికి దముడు వపుష్మంతుని గుండెలను చీల్చివేసి ఆ రక్తమును త్రాగుటకు ఉద్యుక్తుడయ్యెను. అప్పుడు దేవతలు దముని వారించిరి.

తతశ్చకార తాతస్య రక్తేనైవోదకక్రియామ్ ।
ఆనృణ్యం ప్రాప్య స పితుః పునః ప్రాయాత్స్వమన్దిరమ్ ॥35॥

అప్పుడా రక్తముతో దముడు తన తండ్రికి ఉదకక్రియను గావించెను. ఈ విధముగా దముడు వపుష్మంతుని సంహరించి తన తండ్రిగారి ఋణమునుండి విముక్తుడై తిరిగి తన రాజ్యమునకు మరలి వచ్చెను.

వపుష్మతశ్చ మాంసేన పిణ్డదానం చకార హ ।
బ్రాహ్మణాన్భోజయామాస రక్షఃకులసముద్భవాన్ ॥36॥

వపుష్మంతుని మాంసముతో దముడు పిండప్రదానము చేసెను. మరియు రాక్షసకులోత్పన్నులైన బ్రాహ్మణులకు భోజనము పెట్టెను.

ఏవంవిధా హి రాజానో బభూవుః సూర్యవంశజాః ।
అన్యేఽపి సుధియః శూరా యజ్వినో ధర్మకోవిదాః ॥37॥

వేదాన్తపారగాస్తాఽశ్చ న సంఖ్యాతుమిహోత్సహే ।
ఏతేషాం చరితం శ్రుత్వా నరః పాపైః ప్రముచ్యతే ॥38॥

ఈ విధముగా దమునివంటి ధర్మజ్ఞులైన రాజులు సూర్యవంశమందు జన్మించిరి. ఇంకను అనేకులగు పండితులు, పరాక్రమవంతులు, యజ్ఞముచేయువారు, ధర్మకోవిదులు, వేదాంతమర్మజ్ఞులు సూర్యవంశమందు జన్మించిరి. వారి సంఖ్య ఇంతయని చెప్పజాలము. ఈ సూర్యవంశరాజుల చరితమును శ్రవణము చేసిన మానవుడు అన్ని పాపములనుండి విముక్తుడగును.

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే వపుష్వధో నామ త్రయస్త్రింశదధికశతతమోఽధ్యాయః ॥133॥

శ్రీ మార్కండేయ మహాపురాణమందలి వపుష్మంతుని వధయను నూటముప్పదిమూడవ అధ్యాయం సమాప్తం.



చతుస్త్రింశదధికశతతమోఽధ్యాయః – నూటముప్పదినాలుగవ అధ్యాయం
ఏతత్పురాణమాహాత్మ్యశ్రవణపఠనఫలమ్ –
మార్కండేయపురాణమాహాత్మ్యం, వినుట చదువుట వలన కలిగే ఫలం

పక్షిణ ఊచుః – పక్షులు పలికినవి.

ఏవముక్త్వా జైమినేఽయం మార్కండేయో మహామునిః ।
విసృజ్య క్రౌష్టుకిమునిం చక్రే మాధ్యాహ్నికీం క్రియామ్ ॥1॥

ఓ జైమినిమహర్షీ ! ఈ మార్కండేయమహాముని ఈ విధముగా పలికి క్రౌష్టుకిమునికి బోవుటకు అనుజ్ఞనిచ్చి మాధ్యాహ్నికక్రియను చేసుకొనెను.

అస్మాభిశ్చ శ్రుతం తస్మాద్యత్తే ప్రోక్తం మహామునే ।
అనాదిసిద్ధమేతద్ధి పురా ప్రోక్తం స్వయమ్భువా ॥2॥

మార్కండేయాయ మునయే యత్తేఽస్మాభిరుదాహృతమ్ ।

ఓ మహామునీ ! ఇప్పుడు నీకు మేము చెప్పిన ఈ వృత్తాంతమంతయు బ్రహ్మదేవుడు మార్కండేయమహామునికి చెప్పెను. ఈ పురాణము అనాదిసిద్ధమైనది.

పుణ్యం పవిత్రమాయుష్యం ధర్మకామార్థసిద్ధిదమ్ ॥3॥
పఠతాం శృణ్వతాం సద్యః సర్వపాపప్రమోచనమ్ ।

ఈ పురాణము పుణ్యము, పవిత్రము, ఆయుర్వర్ధకము, ధర్మకామార్థమోక్షములను కలుగజేయునది. ఈ పురాణము చదివినవారి, విన్నవారి పాపములన్నీ తొలగిపోవును.

ఆదావేవ కృతా యే చ ప్రశ్నాశ్చత్వార ఏవ హి ॥4॥

పితుః పుత్రస్య సంవాదస్తథా సృష్టిః స్వయంభువః ।
తథా మనూనాం స్థితయో రాజ్ఞాం చ చరితం మునే ॥5॥

అస్మాభిరేతత్తే ప్రోక్తం కిమద్య శ్రోతుమిచ్ఛసి ।

ఓ మునీ ! నీవడిగిన నాలుగు ప్రశ్నలు 1) తండ్రీ కొడుకుల సంవాదము, 2) స్వయంభూబ్రహ్మయొక్క సృష్టి, 3) మనువంశోద్భవులైన వారి స్థితిగతులు, 4) అట్టి రాజుల చరితము వీటినన్నింటినీ నీకు వివరముగా చెప్పితిమి. ఇంకనూ నీవు ఏమి వినదలచితివి? (ఇక ఏమీ ఉండకపోవచ్చని ఆశయము).

ఏతాన్సర్వాన్నరః శ్రుత్వా పఠతే వా సభాసు చ ॥6॥

విధూయ సర్వపాపాని బ్రహ్మణోఽన్తే లయం వ్రజేత్ ।

ఈ చెప్పబడిన విషయములనన్నింటినీ విన్నవారు లేదా ఆయా సభలందు పఠించినవారు సమస్తపాపములను తొలగించుకొని అంత్యకాలమందు పరబ్రహ్మమందు లయము చెందెదరు.

అష్టాదశపురాణాని యాని ప్రాహ పితామహః ॥7॥
తేషాం తు సప్తమం జ్ఞేయం మార్కణ్డేయం సువిశ్రుతమ్ ।

బ్రహ్మదేవుడు చెప్పిన పద్దెనిమిది పురాణములందు మార్కండేయపురాణమును ఏడవదిగా ప్రసిద్ధిచెందినదానిగా తెలుసుకొనవలెను.

బ్రాహ్మం పాద్మం వైష్ణవం చ శైవం భాగవతం తథా ॥8॥

తథాన్యన్నారదీయం చ మార్కణ్డేయం చ సప్తమమ్ ।
ఆగ్నేయమష్టకం ప్రోక్తం భవిష్యం నవమం తథా ॥9॥

దశమం బ్రహ్మవైవర్తం లైఙ్గమేకాదశం స్మృతమ్ ।
వారాహం ద్వాదశం ప్రోక్తం స్కాందమత్ర త్రయోదశమ్ ॥10॥

చతుర్దశం వామనం చ కౌర్మం పఞ్చదశం తథా ।
మాత్స్యం చ గారుడం చైవ బ్రహ్మాణ్డం చ తతఃపరమ్ ॥11॥

అష్టాదశపురాణానాం నామధేయాని యః పఠేత్ ।
త్రిసన్ధ్యం జపతే నిత్యం సోఽశ్వమేధఫలం లభేత్ ॥12॥

1) బ్రహ్మ, 2) పద్మ, 3) వైష్ణవ, 4) శైవ, 5) భాగవత, 6) నారదీయ, 7) మార్కణ్డేయ, 8) ఆగ్నేయ, 9) భవిష్య, 10) బ్రహ్మవైవర్త, 11) లింగ, 12) వారాహ, 13) స్కాంద, 14) వామన, 15) కూర్మ, 16) మత్స్య, 17) గరుడ, 18) బ్రహ్మాణ్డ. ఈ పద్దెనిమిది పురాణముల నామములను చదివిననూ, త్రికాలములందు జపము చేసిననూ అట్టి మానవుడు అశ్వమేధయాగము చేసినట్టి ఫలమును పొందును.

సర్గశ్చ ప్రతిసర్గశ్చ వంశో మన్వన్తరాణి చ ।
వంశానుచరితం చైవ పురాణం పఞ్చలక్షణమ్ ॥13॥

1) సర్గము, 2) ప్రతిసర్గము, 3) వంశము, 4) మన్వంతరములు, 5) వంశానుచరితము ఈ అయిదింటి సమూహము పురాణలక్షణముగా పేర్కొనబడుచున్నది.

చతుఃప్రశ్నసమోపేతం పురాణం హ్యేతదుత్తమమ్ ।
శ్రుత్వా పునశ్చ తే పాపం కల్పకోటిశతైః కృతమ్ ॥14॥

బ్రహ్మహత్యాదిపాపాని యాన్యన్యాన్యశుభాని చ ।
తాని సర్వాణి నశ్యన్తి తృణం వాతహతం యథా ॥15॥

నాలుగు ప్రశ్నలతో కూడినట్టి ఈ ఉత్తమమైన మార్కండేయపురాణమును విన్నంతనే వందలకోట్ల కల్పములనుండి చేసుకొన్న పాపములు, బ్రహ్మహత్య మొ॥లగు పాపములు, వేరే అమంగళములు అన్నియు గాలిచే గడ్డిపరక ఎగురకొట్టబడినట్లు తొలగిపోవును.

పుష్కరే దానజం పుణ్యం శ్రవణాదస్య జాయతే ।
సర్వవేదాధికఫలం సమాప్త్యా చాధిగచ్ఛతి ॥16॥

పుష్కరక్షేత్రములో దానము చేసినంత ఫలము ఈ పురాణమును విన్నంతమాత్రమునే కలుగును. దీనిని సంపూర్ణముగా విన్నచో సమస్తవేదపారాయణముకంటే అధికముగా ఫలము లభించును.

యః శ్రావయేత్పూజయేత్తం యథా దేవం పితామహమ్ ।
గన్ధపుష్పైస్తథా వస్త్రైర్బ్రాహ్మణానాం చ తర్పణైః ॥17॥
యథాశక్త్యా చ దాతవ్యం నృపైర్గ్రామాదివాహనమ్ ।
ఏతత్పురాణమఖిలం వేదార్థైరుపబృంహితమ్ ॥
ధర్మశాస్త్రైకనిలయం శ్రుత్వా సర్వార్థమాప్నుయాత్ ॥18॥

ఎవరయితే ఈ పురాణమును చదివి వినిపించునో అట్టివానిని బ్రహ్మదేవునితో సమానముగా పూజించవలెను. ఇంకను అట్టివానిని గంధపుష్పవస్త్రములతో సన్మానము చేసి బ్రాహ్మణసమారాధన చేయవలెను. రాజులు యథాశక్తిగా గ్రామములను, వాహనములను దానము చేయవలెను. ఈ మార్కండేయమహాపురాణమంతయు వేదార్థములతో నిండియున్నది. ధర్మశాస్త్రములకు నిలయమై ఉన్నది. అట్టి పురాణమును విన్న మానవుడు సమస్త అభీష్టములను పొందును.

శ్రుత్వా పురాణమఖిలం వ్యాసం సంపూజయేద్బుధః ।
ధర్మార్థకామమోక్షాణాం యథోక్తఫలహేతవే ॥19॥

ఈ పురాణమును పూర్తిగా వినిన పిమ్మట ధర్మార్థకామమోక్షములనెడు చతుర్విధపురుషార్థముల సంపూర్ణఫలమును పొందుటకు పండితుడు వ్యాసపూజ చేయవలెను.

దద్యాద్గాం గురవే స్వర్ణవస్త్రాలంకారసంయుతామ్ ।
శ్రవణస్య ఫలావాప్త్యై దానైః సంతోషయేద్గురుమ్ ॥20॥

ఈ పురాణశ్రవణమువలన కలుగు ఫలమును పొందుటకై సువర్ణవస్త్రాలంకారములతో కూడినట్టి గోవును గురువునకు దానము చేయవలెను. ఇంకనూ వివిధదానములతో గురువును సంతోషపెట్టవలెను.

అపూజ్య పాఠకర్తారం శ్లోకమేకం శృణోతి యః ।
నాసౌ పుణ్యమవాప్నోతి శాస్త్రచోరః స్మృతో హి సః ॥21॥

పురాణము చెప్పువారిని పూజించకుండా ఒక్క శ్లోకము విన్ననూ మానవుడు శ్రవణఫలమును అనగా పుణ్యమును పొందడు. అట్టి మానవుడు శాస్త్రచోరునిగా చెప్పబడుచున్నాడు.

న తస్య దేవాః ప్రీణన్తి పితరో నైవ పుత్రకాన్ ।
దత్తం శ్రాద్ధం తథేచ్ఛన్తి తీర్థస్నానఫలం న చ ॥22॥

అట్టి మానవునిపట్ల దేవతలు సంతోషించరు. పితృదేవతలు అట్టి పుత్రులవల్ల తృప్తిని పొందరు. ఇంకను వారు చేయు శ్రాద్ధమును ఇష్టపడరు. తీర్థములందలి స్నానఫలమును పొందరు.

లభేత శాస్త్రచోరశ్చ నిన్దాం సజ్జనసంసది ।
అవజ్ఞయా న శ్రోతవ్యం శాస్త్రమేతద్విచక్షణైః ॥23॥

ముందు చెప్పబడిన శాస్త్రచోరుడు సజ్జనుల సభలో నిందలను పొందును. బుద్ధిమంతులైనవారు తిరస్కారభావముతో ఈ పురాణమును వినరాదు.

పఠ్యమానే త్వవజ్ఞాతే సాధుభిః శాస్త్ర ఉత్తమే ।
మూకో భవతి జన్మాని సప్త మూర్ఖః ప్రజాయతే ॥24॥

సత్పురుషులు ఈ శాస్త్రమును చదివి వినిపించుచుండగా ఎవరయితే హేళన చేయుదురో అట్టివారు మూగవారిగాను, జ్ఞానములేనివారిగాను ఏడు జన్మలవరకు పుట్టెదరు.

శ్రుత్వా తత్పూజయేద్యస్తు పురాణం సప్తమం పునః ।
సర్వపాపవినిర్ముక్తః పునాత్యేవ నిజం కులమ్ ॥25॥

పూతో యాతి న సన్దేహో విష్ణులోకం సనాతనమ్ ।
చ్యుతస్తతః పునర్నైవ స భవిష్యతి మానవః ॥26॥

సప్తమపురాణమైన ఈ మార్కండేయపురాణమును చదివి ఎవరు పూజించెదరో వారు సమస్తపాపములనుండి వినిర్ముక్తులై తమ వంశమునంతయు పవిత్రము చేసెదరు. అట్టివారు తాము స్వయముగా పవిత్రులై నిస్సందేహముగా శాశ్వతమైన విష్ణులోకమును పొందగలరు. ఇక అచ్చటినుండి చ్యుతులై (జారిపడి) మానవజన్మను పొందరు. అనగా శాశ్వతబ్రహ్మలోకమును పొందెదరు, జన్మరాహిత్యమును పొందెదరని భావము.

పురాణశ్రవణాదేవ పరమయోగమవాప్నుయాత్ ।
నాస్తికాయ న దాతవ్యం వృషలే వేదనిన్దకే ॥27॥

గురుద్విజాతినిన్దాయ తథా భగ్నవ్రతాయ చ ।
మాతాపిత్రోర్నిన్దకాయ వేదశాస్త్రాదినిన్దినే ॥28॥

భిన్నమర్యాదినే చైవ తథా వై జ్ఞాతికోపినే ।
ఏతేషాం నైవ దాతవ్యం ప్రాణైః కంఠగతైరపి ॥29॥

పురాణశ్రవణమువల్లనే మానవుడు గొప్ప యోగమును పొందును. నాస్తికునకు, వేదములను నిందించు దుర్జనునికి, గురువులను బ్రాహ్మణులను నిందించువానికి, వ్రతభంగము చేయువానికి, తల్లిదండ్రులను నిందించువానికి, వేదశాస్త్రములను నిందించువానికి, మర్యాదాభంగము చేయువానికి, జ్ఞాతులపట్ల కోపము ప్రదర్శించువానికి ప్రాణములు కంఠగతములైనప్పటికీ అనగా అంత్యదశలో కూడా ఈ పురాణమునివ్వరాదు. అనగా పురాణము చెప్పరాదు.

లోభాద్వా యది వా మోహాద్భయాద్వాపి విశేషతః ।
పఠేద్వా పాఠయేద్వాపి స గచ్ఛేన్నరకం ధ్రువమ్ ॥30॥

దురాశతోగాని, మోహముతోగాని, విశేషించి భయముతోగాని ఏ మానవుడయినా చదివినా, చదివి వినిపించినా తప్పక అట్టి మానవుడు నరకమునకు వెళ్ళగలడు.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

ఏతత్సర్వముపాఖ్యానం ధర్మ్యం స్వర్గాపవర్గదమ్ ।
యః శృణోతి పఠేద్వాపి సిద్ధం తస్య సమీహితమ్ ॥31॥

ఆధివ్యాధిజదుఃఖేన కదాచిన్నాభియుజ్యతే ।
బ్రహ్మహత్యాదిపాపేభ్యో ముచ్యతే నాత్ర సంశయః ॥32॥

ఈ మార్కండేయపురాణముయొక్క ఉపాఖ్యానమంతయు ధర్మముచేత పొందదగినది. వారి వారి కోరికలను బట్టి స్వర్గమును, మోక్షమును ఇచ్చును. ఏ మానవుడయినా ఈ పురాణమును విన్నా, చదివినా అతని కోరికలన్నియు సిద్ధించును. మనస్సుకు దుఃఖమును కలిగించు వ్యథలు (ఆధి), రోగములు (వ్యాధి) వీటివల్ల కలుగు దుఃఖమును ఎన్నడూ అట్టి మానవుడు పొందదు. బ్రహ్మహత్య మొ॥లగు పాపములనుండి కూడా అట్టి మానవుడు నిస్సంశయంగా విముక్తుడగును.

సన్తః స్వజనమిత్రాణి భవన్తి హితబుద్ధయః ।
నారయః సంభవిష్యన్తి దస్యవో వా కదాచన ॥33॥

ఈ పురాణమును చదివినా, విన్నా అట్టివారికి సత్పురుషులు స్వజనులు మిత్రులు కాగలరు, హితమును చేయువారూ అగుదురు. అట్టివారికి శత్రువులెవరూ ఉండరు, చోరబాధ ఉండదు.

సదర్థో మిష్టభోగీ చ దుర్భిక్షైర్నావసీదతి ।
పరదారపరద్రవ్యపరహింసాదికిల్బిషైః ॥34॥

ఇంకనూ అట్టి మానవుడు మంచి ఆలోచనలు కలిగినవాడు, మధురమైన భోజనము కలవాడు అగును. ఇంకను దుర్భిక్షములతోను, పరుని భార్య, పరద్రవ్యము, పరహింస మొ॥వాటివలన కలుగు పాపములతో బాధపడదు. అట్టి పాపములన్నియు తొలగును.

ముచ్యతేఽనేకదుఃఖేభ్యో నిత్యం చైవ ద్విజోత్తమ ।
బుద్ధిర్వృద్ధిః స్మృతిః శాన్తిః శ్రీః పుష్టిస్తుష్టిరేవ చ ॥
నిత్యం తస్య భవేద్విప్ర యః శృణోతి కథామిమామ్ ॥35॥

ఓ బ్రాహ్మణశ్రేష్ఠుడా ! ఈ పురాణమును చదివినా, విన్నా అట్టి మానవుడు ఎల్లప్పుడు అనేక దుఃఖములనుండి విముక్తుడగును. ఓ విప్రుడా ! ఎవరయితే ఈ పురాణగాథను వింటారో అట్టివారికి ఎల్లప్పుడూ జ్ఞానము, ఐశ్వర్యము, స్మృతి, శాంతి, సంపద, పుష్టి, తుష్టి కలుగును.

మార్కణ్డేయపురాణమేతదఖిలం శృణ్వన్నశోచ్యః పుమాన్ ।
యో వా సమ్యగుదీరయేద్రసమయం శోచ్యో న సోఽపి ద్విజ ॥
యోగజ్ఞానవిశుద్ధసిద్ధిసహితః స్వర్గాదిలోకేఽప్యసౌ ।
శక్రాద్యైశ్చ సురాదిభిః పరివృతః స్వర్గే సదా పూజ్యతే ॥36॥

ఓ బ్రాహ్మణుడా ! ఈ మార్కండేయమహాపురాణమును సంపూర్ణముగా విన్నట్టి మానవునికి దుఃఖించు అవసరము కలుగదు. రసమయమైన ఈ పురాణమును బాగుగా పలికిన మానవుడు కూడా ఎన్నడూ దుఃఖించడు. ఇంకను అట్టి మానవుడు యోగము, జ్ఞానము, పరిశుద్ధమైన సిద్ధి వీటితో కూడుకొన్నవాడై, ఇంద్రాదిదేవతలతో చుట్టబడినవాడై (కూడుకొన్నవాడై) స్వర్గలోకమందు కూడా పూజింపబడును.

పురాణమేతచ్ఛ్రుత్వా చ జ్ఞానవిజ్ఞానసంయుతమ్ ।
విమానవరమారుహ్య స్వర్గలోకే మహీయతే ॥37॥

జ్ఞానవిజ్ఞానములతో కూడుకొన్నట్టి ఈ పురాణమును వినిన పిమ్మట మానవుడు శ్రేష్ఠమైన విమానమునధిరోహించి, స్వర్గలోకమునకు వెళ్ళి అచ్చట పూజింపబడును.

పురాణాక్షరసంఖ్యా చ ప్రఖ్యాతా తత్త్వబుద్ధినా ।
శ్లోకానాం షట్సహస్రాణి తథా చాష్టశతాని చ ॥38॥

శ్లోకాస్తత్ర నవాశీతిరేకాదశ సమాహితాః ।
కథితా మునినా పూర్వం మార్కణ్డేయేన ధీమతా ॥39॥

తత్త్వబుద్ధి కలిగిన ధీమంతుడైన మార్కండేయమహర్షిచే ఈ పురాణమందలి అక్షరసంఖ్య (శ్లోకసంఖ్య) కీర్తింపబడినది. ఆరువేలు మరియు ఎనిమిది వందలు ఇంకను ఎనభైతొమ్మిది మరియు పదకొండు (ఆరువేల తొమ్మిదివందలు) శ్లోకములు మార్కండేయునిచే చెప్పబడినవి.

జైమినిరువాచ – జైమిని మహర్షి చెప్పాడు.

భారతేనాభవద్యన్మే సంశయస్ఫోటనం ద్విజాః ।
తద్భవద్భిః కృతం యన్న కశ్చిదద్య కరిష్యతి ॥40॥

యూయం దీర్ఘాయుషః స్యాత ప్రజ్ఞాబుద్ధివిశారదాః ।
సాంఖ్యయోగే తథా చాస్తు బుద్ధిరవ్యభిచారిణీ ॥41॥

పితృశాపకృతాద్దుఃఖాద్దౌర్మనస్యం వ్యపేతు వః ।
ఏతావదుక్త్వా వచనం జగామ స్వాశ్రమం మునిః ॥
చిన్తయన్పరమోదారం పక్షిణాం వాక్యమీరితమ్ ॥42॥

ఓ పక్షిరూపులగు మునికుమారులారా! బ్రాహ్మణులారా! మహాభారతమందు ఇంతవరకు నాకు కానట్టి సంశయవిస్ఫోటనము (సంశయములు తొలగుట) ఇప్పుడు మీవల్ల సంభవించినది. ఇక ఇట్టి సంశయవిస్ఫోటనమును ఎవ్వరూ చేయలేరు. మీరందరు దీర్ఘాయుష్మంతులు, ప్రజ్ఞాబుద్ధులలో విశారదులు అగుదురు గాక! సాంఖ్యయోగములందు మీ బుద్ధి స్థిరమైనదియగు గాక ! మీ తండ్రి పెట్టిన శాపమువలన కలిగిన దుఃఖముచే మీ మనస్సులలోని దుఃస్థితి తొలగుగాక! ఇట్లు జైమినిమహాముని పలికి, పక్షిరూపులగు ఆ మునికుమారుల పరమోదారమైన మాటలను తలచుకొనుచు తన ఆశ్రమమునకు తిరిగి వెళ్ళెను.

ఇతి శ్రీ మార్కండేయ మహాపురాణే ఏతత్పురాణమాహాత్మ్యశ్రవణపఠనఫలం నామ చతుస్త్రింశదధికశతతమోఽధ్యాయః ॥134॥

శ్రీ మార్కండేయ మహాపురాణమందలి ఈ పురాణమాహాత్మ్యము, శ్రవణపఠనముల ఫలము అను నూటముప్పదినాలుగవ అధ్యాయం సమాప్తం.

సంపూర్ణమిదం మార్కండేయ మహాపురాణమ్ । శ్రీశః పాయాత్ । ఓం తత్సత్ పరమేశ్వరార్పణమస్తు ॥

॥ శ్రీ మార్కండేయ మహాపురాణము సమాప్తం ॥

ఆ శ్రీమహావిష్ణువు మనలనందరిని రక్షించుగాక! ॥
శ్రీనివాసపరబ్రహ్మపాదపద్మములకు సమర్పితము ॥

